బమ్మెర పోతనామాత్య ప్రణీత

# శ్రీమహాభాగవతము

సరళ వ్యాఖ్యానసహితం

## మూడవ సంపుటము

4, 5 స్కంధములు


వ్యాఖ్యాతలు

డా॥ దావులూరి కృష్ణకుమారి

డా॥ ఆర్. అనంతపద్మనాభ రావు

డా॥ శలాక రఘునాథశర్మ

డా॥ కె. సర్వోత్తమ రావు

ప్రధాన సంపాదకులు

డా॥ సముద్రాల లక్ష్మణయ్య



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2021

**Bammera Potanamatya Praneeta**
**SRI MAHABHAGAVATAMU, with Commentary**
**Volume - III (Skandhas - 4 & 5)**

*Author :* **Potana Mahakavi**

*Commentary by*
**Dr. Davuluri Krishna Kumari** ***(Skandha - 4)***
**Dr. R. Anantha Padmanabha Rao** ***(Skandha - 4)***
**Dr. Salaka Raghunatha Sarma** ***(Skandha - 4)***
**Dr. K. Sarvottama Rao** ***(Skandha - 5)***

*Edited by*
**Dr. Samudrala Lakshmanaiah**

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No. 1239

*First Edition :* 2017
*Revised Edition :* 2021

*Copies :*

*Published by*
**Dr.K.S.Jawahar Reddy, I.A.S.,**
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati.

*D.T.P.*
Publications Division
T.T.D., Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507









# తొలిపలుకు

సనాతన ధర్మప్రచారంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానాలు పూర్వంనుంచి విశేషమైన సేవలందిస్తున్నది. హైందవ ధర్మానికి మూలాధారాలైన వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, రామాయణ, భారత, భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తున్నది. ఇదివరకే మతద్వయ వ్యాఖ్యానంతో వాల్మీకి రామాయణాన్ని, మతత్రయ వ్యాఖ్యానంతో వ్యాసభాగవతాన్ని అందించింది. అలాగే శ్రీవేదవ్యాసప్రణీత శ్రీమన్మహాభారత మూలాన్ని సంస్కృత ఆంధ్ర లిపులలో 18 సంపుటాలలో అందించింది. ప్రస్తుతం తాత్పర్యసహితంగా అష్టాదశ పురాణాల తెలుగుసేత మహాయజ్ఞం కొనసాగుతూ ఉంది. వీటిలో ఇప్పటికే 4 పురాణాలు పాఠకలోకానికి అందాయి.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానాలు కవిత్రయ మహాభారతం తరహాలో బమ్మెర పోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవతాన్ని సరళవ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజలకు అందించాలని సంకల్పించి ఈ బృహత్ సాహితీయజ్ఞాన్ని చేపట్టింది. మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారి ప్రధాన సంపాదకత్వ పర్యవేక్షణలో సుప్రసిద్ధులైన 33మంది పండితులచేత 12 స్కంధాల బమ్మెర పోతన భాగవతానికి వ్యాఖ్యానాన్ని వ్రాయించి 8 సంపుటాలుగా వెలువరించింది. పోతన శ్రీమహాభాగవతానికి తెలుగులో సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ శ్రీమహాభాగవత పురాణం 8 సంపుటాలను 2017వ సంవత్సరంలో ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన సీతారామ కల్యాణ మహోత్సవం సందర్భంగా నాటి ఉభయ తెలుగు రాష్ట్రాల రాజ్యపాలకులు (గవర్నర్) గౌ॥ శ్రీ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ గారు ఆవిష్కరించి తెలుగుజాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లుగా చాలా తగ్గింపు ధరకే ఈ భాగవతాన్ని తి.తి.దేవస్థానాలు అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన పోతన శ్రీమహాభాగవతం తొలిముద్రణ ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ పోతన భాగవత పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. కాగా తొలిముద్రణలో దొరలిన దొసగులను పరిశీలించి సవరించుటకు గాను గతంలో భాగవత స్కంధాలను పరిశీలించిన సంపాదకమండలి సభ్యులు లబ్ధప్రతిష్ఠులు అయిన

**మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య**
**ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ**
**డా॥ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి**

**డా॥ కె.వి.సుందరాచార్యులు**

**డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి**

**ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి**

**డా॥ ధూళిపాళ రామకృష్ణ శర్మ** గారలకు ఈ బాధ్యతలు అప్పగించింది.

ఈ పండిత మండలి మరోమారు పరిశీలించి అవసరమైన మార్పులు చేర్పులు చేసిన తరువాత 8 సంపుటాల బమ్మెరపోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవతమును భక్తులైన పాఠకులకు అందజేస్తున్నాము. రసజ్ఞులైన పాఠకులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరనీ, పాఠకులందరికీ ఆ దేవదేవుని ఆశీస్సులందగలవనీ ఆశిస్తున్నాము.

*సదా శ్రీవారి సేవలో*



**కార్యనిర్వహణాధికారి**

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

# సరళవ్యాఖ్యాన సహిత
# బమ్మెర పోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవతం
# ద్వితీయముద్రణ పూర్వాపరాలు

**భా**రతదేశం వేదభూమి, పుణ్యభూమి, కర్మభూమి. ఈ భూమిపై ఎందరో దేవతలు, మహర్షులు, మహాత్ములు అవతరించారు. యావత్ ప్రపంచానికి ఆదర్శమైన ధర్మాలను బోధించారు. ఆచరించి చూపించారు. ఆదర్శప్రాయులైనారు. వైదిక వాఙ్మయంలో వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తులు విశిష్టమైనవి. ధర్మప్రచారంలోనూ, ధర్మప్రబోధంలోనూ వాటి పాత్ర చాలా ప్రముఖమైనది.

తి.తి.దేవస్థానం ధర్మప్రచారంలో భాగంగా వైదికసాహిత్య మణిహారాలైన వేద పురాణేతిహాసాలను పాఠకలోకానికి అందించడం ద్వారా ఆసేతు హిమాచలం ధర్మప్రచారం చేయవచ్చునన్న సంకల్పంతో వేదాలు, రామాయణం, భారత భాగవతాది మహోన్నత గ్రంథాలను ముద్రిస్తున్నది.

ఇందులో భాగంగా వాల్మీకి రామాయణం, వేదవ్యాస ప్రణీత భారత భాగవతాలతోపాటు తొట్టతొలుత తెలుగు ప్రజలకు అత్యంత ప్రీతిపాత్రమైన బమ్మెర పోతన ప్రణీత శ్రీమహాభాగవతాన్ని కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి నేతృత్వంలో 1987లో తాత్పర్య సహితంగా ముద్రించింది. కవిత్రయవిరచిత శ్రీమదాంధ్ర మహాభారతాన్ని 15 సంపుటాలలో సమగ్ర వ్యాఖ్యానంతో 2005లో అందించిన తి.తి.దేవస్థానాలు, పోతన భాగవతాన్ని కూడా కవిత్రయ భారతం తరహాలో అందించాలని సంకల్పించింది. బమ్మెర పోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవత వ్యాఖ్యాన బృహత్ యజ్ఞంలో సుప్రసిద్ధులైన 33 మంది పండితులు ఋత్విక్కుల పాత్రను పోషించారు. ఈ భాగవత వ్యాఖ్యాన యజ్ఞం నిర్వహణకు గాను నాటి తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ కె.వి.రమణాచారి ఐ.ఏ.ఎస్., ఆమోద ముద్రవేయగా 2015లో డా॥ డి. సాంబశివరావు ఐ.ఏ.ఎస్., గారి కార్యనిర్వాహకత్వంలో నాటి సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ పోల భాస్కర్ ఐ.ఏ.ఎస్. గారు భాగవత వ్యాఖ్యాన మహాయజ్ఞం పూర్తికావించడంలో ప్రత్యేకశ్రద్ధ చూపుతూ విశేషంగా శ్రమించారు. 2007లో ప్రారంభమైన ఈ భాగవత వ్యాఖ్యాన బృహత్ యజ్ఞం 2017లో మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారి ప్రధాన సంపాదకత్వంలో సంపూర్తి అయి 12 స్కంధాల శ్రీమహాభాగవతం 8 సంపుటాలలో సరళవ్యాఖ్యానంతో తొలిముద్రణను సంతరించుకుంది.

2017లో ఆంధ్రుల అయోధ్యగా పేరొందిన ఒంటిమిట్టలో వెలిసిన శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవంలో భాగంగా నాటి ఉభయ తెలుగు రాష్ట్రాల రాజ్యపాలకులు (గవర్నర్) అయిన గౌ॥ శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ గారి చేతులమీదుగా అది ఆవిష్కృతమై పాఠకలోకానికి అందింది.

పాఠకుల విశేషాదరణకు పాత్రమైన బమ్మెరపోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవతం తొలిముద్రణ ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి. పాఠకుల ఆసక్తిని గ్రహించి మళ్ళీ భాగవత పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది.

ఈలోపు నిరంతర సాహితీ పరిశోధకులు, వృత్తిరీత్యా ఇంజనీరు అయిన శ్రీ పుత్తా పుల్లారెడ్డిగారు భాగవత తొలిముద్రణను నిశితంగా పరిశీలించి అందులోని సవరణలను విశేషంగా నాటి తి.తి.దే. ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారికి సమర్పించారు. 2019లో తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి వారి సూచనల మేరకు నాటి ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డా॥ తాళ్ళూరి ఆంజనేయులు అదివరకు భాగవతవ్యాఖ్యానాన్ని పరిశీలించిన సంపాదకమండలి సభ్యులైన

**మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య**
**ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ**
**డా॥ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి**
**డా॥ కె.వి.సుందరాచార్యులు**
**డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి**
**ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి**
**డా॥ ధూళిపాళ రామకృష్ణ శర్మ** గారలకు మరోమారు పరిశీలించి శ్రీ పుత్తాపుల్లారెడ్డిగారి సవరణలతో సరిచూడమని బాధ్యతలు అప్పగించారు. శ్రీ పుల్లారెడ్డి గారి సవరణలలో అవసరమైన వాటిని సంపాదకమండలి వారు స్వీకరిస్తూ, తక్కిన అన్వయ దోషాలు, భాషాదోషాలు, భావదోషాలు, ముద్రారాక్షసాలను, శైలీభేదాలను కూడా వీలైనంతవరకు గుర్తించి సవరించారు. సంశోధిత ప్రతిని రూపొందించారు.

సంపాదకమండలి సూచించిన సవరణలను ప్రచురణల విభాగం ఉపసంపాదకులు డా॥ నొస్సం నరసింహాచార్యులు వారి సంయోజకత్వంలో కార్యాలయపండితులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు, డా॥ ముదివేడు ప్రభాకరరావు, విద్వాన్ కట్టా నరసింహులు, డా॥ అంబటిపూడి నాగభూషణం గారలు విశేషంగా శ్రమించి, సవరించి, మలిముద్రణకు సంశోధిత ప్రతిని సిద్ధం చేశారు.

సరళవ్యాఖ్యాన సహిత బమ్మెరపోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవతం ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషంగా కృషిచేసిన నాటి తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులు డా॥ డి.సాంబశివరావు ఐ.ఏ.ఎస్., శ్రీ అనిల్ కుమార్ సింఘాల్ ఐ.ఏ.ఎస్. గార్లకు, ప్రస్తుత శ్రీకార్యనిర్వహణాధికారులు డా॥ కె.ఎస్.జవహర్ రెడ్డి ఐ.ఏ.ఎస్. గారికి, నాటి సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పోల భాస్కర్ ఐ.ఏ.ఎస్., శ్రీ కె.ఎస్.శ్రీనివాసరాజు ఐ.ఏ.ఎస్., శ్రీ బి.లక్ష్మీకాంతం ఐ.ఏ.ఎస్., శ్రీ బసంత్ కుమార్ ఐ.ఏ.ఎస్., గారలకు, ప్రస్తుత అదనపు కార్యనిర్వహణాధికారులు శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

శ్రీమహాభాగవతం ద్వితీయముద్రణలో నాటినుండి నేటివరకు తమ అమూల్య సహకారాలందించిన ఉన్నతాధికారులకు, అధికార ప్రముఖులకు, అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీరు, ప్రవృత్తిరీత్యా నిరంతర సాహితీ కృషీవలులు, సాహితీ పరిశోధకులు అయిన శ్రీ పుత్తాపుల్లారెడ్డి గారు తి.తి.దే. భాగవత ప్రథమ ముద్రణను ఆమూలాగ్రం పరిశీలించి విశేషంగా సవరణలను సూచించి పరోక్షంగా భాగవత సంశోధిత ప్రతి రూపొందించడానికి కారకులైనారు. వారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

సరళవ్యాఖ్యాన సహిత బమ్మెరపోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవతం పునర్ముద్రణలో అవసరమైన సహకారమందించిన సంపాదక మండలి సభ్యులకు, భాగవత ప్రధాన సంపాదకులు, తి.తి.దే. పురాణ ఇతిహాస ప్రాజెక్టు విశ్రాంత ప్రత్యేకాధికారి మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారికి, నాటి ప్రచురణలవిభాగ ప్రత్యేకాధికారి డా॥ తాళ్లూరి ఆంజనేయులు గారికి కృతజ్ఞతలు. భాగవత సంశోధిత ప్రతి పునఃపరిశీలనలో సహకరించిన సంపాదకమండలి సభ్యులు ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ, డా॥ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, డా॥ కె.వి.సుందరాచార్యులు, డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, డా॥ ధూళిపాళ రామకృష్ణ శర్మ గారలకు ప్రత్యేక ధన్యవాదాలు.

భాగవత పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా చేదోడు వాదోడుగా ఉంటూ పూర్తి సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగ ఉపసంపాదకులు డా॥ నొస్సం నరసింహాచార్యులు గారికి, శుద్ధ ప్రతిని సిద్ధం చేయడంలో విశేషంగా కృషిచేసిన కార్యాలయపండితులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు, డా॥ ముదివేడు ప్రభాకరరావు, విద్వాన్ కట్టా నరసింహులు, డా॥ అంబటిపూడి నాగభూషణం గారలకు, కార్యాలయ సిబ్బందికి, కార్యాలయ డి.టి.పి. ఆపరేటర్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు

ఈ బృహద్గ్రంథ ముద్రణలో ఎంతగానో సహకరిస్తున్న దేవస్థానం ముద్రణాలయాధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు.

భగవంతుని దివ్యలీలావిశేషాలను, భగవద్భక్తుల చరిత్రలను తెలిపే వ్యాసభాగవతాన్ని తెలుగువారికి అందించడం పోతనామాత్యుడు తనకు కలిగిన పుణ్యవిశేషంగా భావించాడు. అంతటి శ్రీమహాభాగవతం తెలుగువారికి లభించిన అమృత ఫలం. ఆ భాగవత ఫలరసాన్ని పాఠకులు ఈ వాఖ్యానంద్వారా ఆస్వాదిస్తారనీ, భాగవత సందేశాన్ని పారాయణ శ్రవణాలద్వారా గ్రహించి మోక్షగాములౌతారని ఆశిస్తున్నాను.

*సదా శ్రీవారి సేవలో..*

**పి. రామరాజు**

ప్రత్యేకాధికారి, ప్రచురణల విభాగం

# ముందుమాట

భారతీయ సనాతన వాఙ్మయంలో అద్భుతమైన ఆధ్యాత్మిక గ్రంథాలు చాలా ఉన్నాయి. అందులో అమూల్యమైన రత్నాల్లాగా శ్రీమద్రామాయణ, శ్రీ మహాభారత, శ్రీమద్భాగవత గ్రంథాలు సంస్కృత వాఙ్మయ ప్రపంచంలో ప్రకాశిస్తున్నాయి.

వాటిల్లో శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆదికవి వాల్మీకి మహర్షి ప్రణీతం. కాగా ఇక మిగిలిన భారత భాగవత గ్రంథాలు రెండూ కృష్ణద్వైపాయనుడైన శ్రీవ్యాసమహర్షి రచించినవి.

తి.తి.దేవస్థానం ధార్మిక సాహిత్య ప్రచురణలో భాగంగా ఇప్పటికే సంస్కృత శ్రీమద్రామాయణ కావ్యాన్నీ, తెలుగు కవిత్రయ మహాభారత కావ్యాన్నీ సవ్యాఖ్యానంగా ప్రచురించింది.

అదేవరుసలో పోతన మహాకవి రచించిన తెలుగు భాగవతకావ్యాన్ని కూడా తెలుగువారికి అందించాలన్న సదాశయంతో ప్రముఖ పండితులు డా॥ కరుణశ్రీ గారి ప్రధాన సంపాదకత్వంలో సరళమైన తాత్పర్యంతో పోతన భాగవతగ్రంథాన్ని ఐదుసంపుటాలుగా దేవస్థానం అందించింది. ఈ గ్రంథం పాఠకుల విశేషాదరణకు పాత్రమై పలు ముద్రణలను పొందింది.

ఆ తర్వాత కొందరు పండితుల సలహామేరకు, పాఠకుల అభ్యర్థనలమేరకు, 'కవిత్రయ భారతం' మాదిరిగానే పోతన మహాకవి భాగవతాన్ని కూడా అందరికీ సులభంగా అర్థం అయ్యేట్లు సరళమైనశైలిలో వ్యాఖ్యానాన్ని అందించాలనే లక్ష్యంతో దేవస్థానం ఆ కార్యక్రమాన్ని చేపట్టింది.

ప్రస్తుతం బమ్మెర పోతనగారి భాగవత గ్రంథం, ముప్ఫైమూడు మంది పండితులు సరళవ్యాఖ్యానాన్ని అందించగా ప్రముఖ సాహితీవేత్తలు డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారి ప్రధానసంపాదకత్వంలో తయారయ్యింది. ఈ వ్యాఖ్యానగ్రంథం తయారీలో కృషిచేసిన దేవస్థానం ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి మరియు పోతన భాగవత వ్యాఖ్యాన పర్యవేక్షకులు, సమన్వయకర్త శ్రీ ప్రయాగ రామకృష్ణ గారికీ, వారి సహాయకులు, ఉపసంపాదకులు డా॥ నొస్సం నరసింహాచార్య గారికీ, ఈ పోతన భాగవత వ్యాఖ్యానగ్రంథ ప్రధాన సంపాదకులు డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారికీ, వ్యాఖ్యాతలకూ, సంపాదకమండలి సభ్యులకూ, సహాయసహకారాలందించినవారికీ, కన్సల్టెంట్లందరికీ, ఈ గ్రంథాన్ని చక్కగా ముద్రింపజేసిన తి.తి.దేవస్థానం ప్రెస్సు వారందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నాను. పోతన పద్యాలకు వ్యాఖ్యానాలనదగిన చక్కనైన బాపుగారి రేఖాచిత్రాలను ఈ గ్రంథ సంపుటాల్లో అక్కడక్కడా పొందుపరుచుటకు అనుమతించిన శ్రీ బాపుగారి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఈ సరళవ్యాఖ్యాన గ్రంథం ఎనిమిది సంపుటాలుగా, ఆ యా పుటల్లో అక్కడక్కడ ప్రముఖ చిత్రకారులు బాపుగారి బొమ్మల మెరుపులతో సర్వాంగసుందరంగా, శ్రీ హేమలంబి నామసంవత్సరం తెలుగు ఉగాదినాడు తెలుగువారందరికి శ్రీ తిరుమలేశుడు అనుగ్రహిస్తున్న ప్రసాదంగా స్వీకరించగలరని ఆకాంక్షిస్తూ...

*సదా శ్రీవారి సేవలో...*

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

శ్రీరస్తు

# బమ్మెర పోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవత ప్రాజెక్టు పుట్టుపూర్వోత్తరాలు

**వేదకల్పవృక్షవిగళితమై శుక**
**ముఖసుధాద్రవమున మొనసియున్న,**
**భాగవతపురాణఫలరసాస్వాదన**
**పదవి గనుడు రసికభావవిదులు.**

అని భాగవత రచనకు ఉపక్రమించిన సహజకవి పోతనామాత్యుడు భాగవతప్రాశస్త్యాన్ని ఉగ్గడించాడు.

వాల్మీకి విరచితమైన ఆదికావ్యం రామాయణం. "వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షా ద్రామాయణాత్మనా" అన్నట్లు వేదానికి మారురూపంగా అది ప్రసిద్ధి పొందింది. వ్యాసవిరచితమహాభారతాన్ని పంచమవేదంగా (భారతం పంచమో వేదః) భావిస్తారు. సనాతనధర్మానికి అనల్పమైన వ్యాప్తిని గావించిన ఈ మూడుగ్రంథాలు భారతీయ సాహిత్యంలో సాటిలేని మేటిరచనలుగా ప్రసిద్ధి పొందాయి.

తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచారంకోసం ఆధ్యాత్మికగ్రంథాలను పెద్ద ఎత్తున ప్రచురిస్తోంది. దేశంలో మరే ఇతరదేవస్థానం కూడా ధర్మప్రచారంకోసం గ్రంథముద్రణను ఇంత పెద్ద ఎత్తున చెయ్యడం లేదని చెప్పడం అతిశయోక్తి కాదు. వేదార్థాలను ప్రతిపాదించే వాఙ్మయాన్ని వివిధ భాషల్లో ప్రచురించి ప్రచారం చేయడం తిరుమల తిరుపతి దేవస్థానం తన బాధ్యతగా స్వీకరించింది. అనేకభాషల్లో దేవస్థానం ద్వారా వెలువడుతున్న ధార్మికగ్రంథాలలో రామాయణ, భారత, భాగవతాలు మిక్కిలి ప్రధానమైనవని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.

1982లో జరిగిన భక్తకవి పోతన పంచశతాబ్ది జయంతి ఉత్సవాలలో పోతన భాగవతాన్ని తాత్పర్యంతో ముద్రించాలని దేవస్థానం సంకల్పించింది. **కరుణశ్రీ జంధ్యాలపాపయ్యశాస్త్రి** గారి నేతృత్వంలో 15 మంది పండితులు పోతనభాగవతానికి తాత్పర్యాన్ని సమకూర్చారు. తొలిసారిగా 1987లో తాత్పర్యసహిత పోతన భాగవతాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం పాఠకలోకానికి అందించింది.

కవిత్రయవిరచితమహాభారతానికి ప్రసిద్ధపండితులచేత ప్రతిపదార్థతాత్పర్యవిశేషవివరణలు వ్రాయించి ప్రచురించాలన్న సంకల్పం 1983లో తిరుమల తిరుపతి దేవస్థానానికి కలిగింది. ముప్ఫైమంది పండితులు ఈ పద్ధతిలో భారతానికి వ్యాఖ్యానం రచించారు. 2005వ సంవత్సరంలో మహాభారతం సంపూర్ణంగా సవ్యాఖ్యానంగా వెలువడింది.

ప్రతిపదార్థ, తాత్పర్య, విశేషవ్యాఖ్యానాలతో కవిత్రయభారతం, తాత్పర్యసహితభాగవతం తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలలో అగ్రశ్రేణికి చెందినవిగా రూపొంది అతివిస్తృతమైన ప్రజాదరణకు పాత్రమైనాయి. వేలకొలది ప్రతులు భక్తులకు, పాఠకులకు అందుతున్నాయి.

1981లో డా॥ పన్నాల రాధాకృష్ణశర్మగారి నేతృత్వంలో వ్యాసవిరచితసంస్కృతభాగవతాన్ని ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత సిద్ధాంతాలను సమన్వయించే మూడువ్యాఖ్యానాలతో పరిష్కరించి ప్రచురించాలని దేవస్థానం నిర్ణయించింది. ఆ నిర్ణయం మేరకు భాగవతం ప్రాజెక్టు ఏర్పాటైంది. **డా॥ రాధాకృష్ణశర్మ, డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు, శ్రీ మల్లంపల్లి శరభేశ్వరశర్మ, డా॥ సముద్రాల లక్ష్మణయ్య** గార్ల నేతృత్వంలో శ్రీధరీయం (అద్వైతం), వీరరాఘవీయం (విశిష్టాద్వైతం), విజయధ్వజీయం (ద్వైతం) అన్న మూడువ్యాఖ్యానాలతో సమగ్రంగా 14 బృహత్ సంపుటాలుగా 2006 నాటికి భాగవతం సిద్ధమయింది.

ఈ పరిష్కరణ కార్యక్రమం ముగియగానే పురాణ ఇతిహాస ప్రాజెక్టు ప్రత్యేకాధికారి **డా॥ సముద్రాల లక్ష్మణయ్య** నాటి తితిదే శ్రీకార్యనిర్వహణాధికారి **శ్రీ ఎ.పి.వి.ఎన్. శర్మ** ఐ.ఏ.ఎస్., గారి వద్దకు వెళ్ళి వ్యాసభాగవత పరిష్కరణ పూర్తి అయిందని విన్నవించారు. అప్పుడు కార్యనిర్వహణాధికారిగారు ఎంతో సంతోషించి "పోతన భాగవతాన్ని తాత్పర్యంతో మాత్రమే ముద్రించగలిగాం. తెలుగు ప్రజలందరికీ ఎంతో ప్రియమైన భాగవతాన్ని కూడా అర్థ తాత్పర్య వివరణలతో సిద్ధం చేస్తే బాగుంటుంది. ఇందుకు తగిన ప్రతిపాదనలను సిద్ధం చెయ్యండి" అని నిర్దేశించారు.

ఈ బృహత్కార్యక్రమం భాగవతప్రాజెక్టుద్వారా కాకుండా కవిత్రయ మహాభారతానికి వ్యాఖ్యానం సమకూర్చడంలో అనుభవం గడించిన సప్తగిరి సంపాదక కార్యాలయం ద్వారానే నిర్వహించడం సముచితంగా ఉంటుందని తెలుపుతూ **డా॥ సముద్రాల లక్ష్మణయ్య** వ్యాఖ్యాన రచనకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి కార్యనిర్వహణాధికారివారికి పంపగా వారు ఆమోదించారు.

**డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారి ప్రతిపాదనలో సారాంశం**

- వ్యాఖ్య సామాన్యులకు కూడా అర్థమయ్యే తీరులో ఉండాలి.
- శిష్టవ్యావహారికభాషను ప్రయోగించాలి.
- వ్యాకరణాదివిశేషాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉండరాదు.
- ఆధ్యాత్మిక అంశాలను పరిమితంగా విశేషాంశాలలో చెప్పవచ్చు.
- కార్యనిర్వహణాధికారి వారి అధ్యక్షతన తితిదే ప్రజాసంబంధాధికారి, సప్తగిరి ప్రధాన సంపాదకులు, తితిదే స్థానిక పండితులతో ఒక సంఘాన్ని ఏర్పాటుచేసి వ్యాఖ్యాతలను, సంపాదకమండలిని ఎన్నుకోవాలి.

- వ్యాఖ్యాత లందరితో తిరుపతిలో ఒక కార్యశాలను నిర్వహించి అందరి వ్యాఖ్యానం ఒకే విధంగా ఉండేలా చూడాలి.
- ఇంతకు మునుపు తితిదే ముద్రించిన తాత్పర్యసహిత భాగవతానికి తాత్పర్యం వ్రాసిన పండితులలో సమర్థులైనవారిని ఈ కార్యక్రమంలో వినియోగించుకోవచ్చు.

2007లో కార్యనిర్వహణాధికారి **డా॥ కె.వి.రమణాచారి** ఐ.ఏ.ఎస్., గారి ఆమోదంమేరకు నాటి సప్తగిరి సంపాదకులు **డా॥ సి.శైలకుమార్**, భాగవత ప్రాజెక్టు ప్రధానసంపాదకులుగా **విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** గారిని నియమించారు. ఆ తరువాత ఈ బృహత్కార్యాచరణకు సలహాలు, సూచనలు చేసేందుకు కవిత్రయభారత వ్యాఖ్యాననిర్వహణలాగే తొమ్మిదిమందితో కూడిన సలహామండలిని ఏర్పాటు చేశారు. దీనికి తితిదే కార్యనిర్వహణాధికారి గౌరవ సంపాదకులుగా వ్యవహరించారు.

**సలహామండలి**

| | | |
|---|---|---|
| **శ్రీ కార్యనిర్వహణాధికారి** | **-** | **గౌరవ సంపాదకులు** |
| **విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, తిరుపతి** | **-** | **ప్రధాన సంపాదకులు** |
| **డా॥ సముద్రాల లక్ష్మణయ్య, తిరుపతి** | **-** | **సభ్యులు** |
| **డా॥ దేవళ్ళ చిన్నికృష్ణయ్య, మద్రాసు** | **-** | **సభ్యులు** |
| **డా॥ శలాక రఘునాథశర్మ, రాజమండ్రి** | **-** | **సభ్యులు** |
| **ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి** | **-** | **పదవీ నిమిత్త సభ్యులు** |
| **సప్తగిరి సంపాదకుడు** | **-** | **సి. శైలకుమార్, కన్వీనర్** |
| **తితిదే ప్రజాసంబంధాధికారి** | **-** | **విశేష ఆహ్వానితులు** |
| **తితిదే ప్రెస్ మేనేజర్** | **-** | **విశేష ఆహ్వానితులు** |

ఈ సంపాదక మండలిలోని పండితవర్గమైన **విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, డా॥ సముద్రాల లక్ష్మణయ్య, డా॥ దేవళ్ళ చిన్నికృష్ణయ్య, డా॥ శలాక రఘునాథశర్మ** గార్లతో ప్రధాన సంపాదకమండలిని నెలకొల్పారు. ఆ తరువాత కారణాంతరాలవల్ల **డా॥ దేవళ్ళ చిన్నికృష్ణయ్య** గారి స్థానంలో **డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య** గారు సంపాదక మండలి సభ్యులుగా నియమితులయ్యారు. ఈ ప్రధాన సంపాదక మండలివారు భాగవత

వ్యాఖ్యాన రచనకు ముప్పైమంది పండితులను ఎంపికచేసి ఒక్కొక్కరికి 300 – 350 పద్యగద్యాలకు వ్యాఖ్యాన రచనా బాధ్యతలను అప్పగించారు.

ఆ తరువాత అనుకున్నంత వేగంగా ఈ కార్యక్రమం ముందుకు సాగలేదు.

తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలను, సవ్యాఖ్యాన భాగవతాన్ని త్వరితగతిన వ్యాప్తిలోకి తేవాలన్న ఉద్దేశ్యంతో 2011లో ద్రవిడ విశ్వవిద్యాలయ విశ్రాంత ఉపకులపతి **ఆచార్య రవ్వా శ్రీహరి**గారిని ప్రచురణల విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నియమిస్తూ వీరికి సహాయకులుగా **డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి** గార్లను ప్రచురణల విభాగానికి ఉపసంపాదకులుగా, **విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం** గార్లు కన్సల్టెంట్‌లుగా నియమితులయ్యారు.

అప్పటిదాకా మందకొడిగా సాగుతున్న ప్రచురణ కార్యక్రమంతోపాటు వ్యాఖ్యాన రచనా కార్యక్రమం కూడా **ఆచార్య రవ్వా శ్రీహరి** గారి సారథ్యంలో వేగాన్ని పుంజుకున్నది. వ్యాఖ్యాన రచయితలతో నిరంతరం ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ రాయలేమని తెలిపిన వారి భాగాలను వేరే పండితులకు అప్పగిస్తూ 2013నాటికి దాదాపు పండితులందరినుండి భాగవత వ్యాఖ్యానాలను తెప్పించారు. వెనువెంటనే డి.టి.పి. వగైరా పనులుకూడా ముమ్మరంగా సాగాయి. పుటల సంఖ్య ఆధారంగా 12 స్కంధాల భాగవతాన్ని 8 సంపుటాలుగా ముద్రించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

**ఆచార్య రవ్వా శ్రీహరి**గారి తదనంతరం 2014లో ఎడిటర్–ఇన్–చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన పురాణ ఇతిహాస ప్రాజక్టు ప్రత్యేకాధికారి **డా॥ సముద్రాల లక్ష్మణయ్య** ఈ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేశారు. వ్యాఖ్యాన రచనలను పరిష్కరించడానికి, అక్షర దోషాలను తొలగించడానికి మరి కొందరు పండితులు అవసరం కావడంతో అప్పటికే భాగవతం కన్సల్టెంటుగా ఉన్న **డా॥ గల్లా చలపతి** గారితోపాటుగా **డా॥ ముదివేడు ప్రభాకరరావు, శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు, శ్రీ కట్టా నరసింహులు** గార్లు భాగవతం ప్రాజెక్టు కన్సల్టెంట్‌లుగా నియమితులయ్యారు. భాగవత స్కంధాలను సంపాదకమండలి పరిష్కరణ స్థాయికి వీరు తీసుకువచ్చారు. 2015 ఏప్రిల్ 15వ తేదీన తితిదే కార్యనిర్వహణాధికారి **డా॥ డి.సాంబశివరావు** ఐ.ఏ.ఎస్., మరియు సంయుక్త కార్యనిర్వహణాధికారి (తిరుపతి) **శ్రీ పోల భాస్కర్** ఐ.ఏ.ఎస్., గార్ల ఆధ్వర్యంలో

**విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు**

**డా॥ సముద్రాల లక్ష్మణయ్య**

**డా॥ శలాక రఘునాథశర్మ**

**డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య**గార్లతో కూడిన పోతనభాగవత సంపాదకమండలి తొలి సమావేశం జరిగింది. త్వరితగతిన పరిష్కరణ పూర్తిచేసేందుకు గాను అనుసరించాల్సిన ప్రణాళికను ఈ సమావేశంలో సిద్ధం

చేశారు. ఆ తరువాత **డా॥ సముద్రాల లక్ష్మణయ్య** గారి సంయోజకత్వంలో జరిగిన సంపాదక మండలి సమావేశాలలో మూడుస్కంధాల పరిష్కరణ పూర్తిచేసి ముద్రణార్హమైన ప్రతిని సిద్ధం చేశారు. అనివార్యకారణాలవల్ల సంపాదకమండలిలో కొందరు సభ్యులు తదుపరి సమావేశాలకు హాజరు కాలేకపోయారు.

2016లో ప్రచురణల విభాగానికి **శ్రీ ప్రయాగ రామకృష్ణ**గారు ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. కార్యనిర్వహణాధికారి గారి అమోదం మేరకు వీరు భాగవత పరిష్కరణ కార్యక్రమం త్వరితగతిన పూర్తికావడానికి అంతకు మునుపున్న సంపాదకమండలి స్థానంలో

**డా॥ సముద్రాల లక్ష్మణయ్య (ప్రధాన సంపాదకులు)**

**శ్రీ గరిమెళ్ళ అచ్యుత సత్య శేషగిరి సోమయాజి శర్మ**

**డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి**

**డా॥ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి**

**డా॥ ధూళిపాళ రామకృష్ణ**

**డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య**

**డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి**

**డా॥ కె.వి. సుందరాచార్యులు**

**డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణ**గార్లతో కొత్త సంపాదకమండలిని ఏర్పాటు చేశారు. అప్పటినుంచి వ్యాఖ్యాన పరిష్కరణ కార్యక్రమం వేగవంతం అయింది. కాగా 2017 ఉగాదినాటికి సవ్యాఖ్యాన భాగవతం ముద్రించబడి ప్రజలకు అందుబాటులోకి రావాలన్న తితిదే సంకల్పాన్ని అనుసరించి పరిష్కరణ కార్యక్రమాన్ని మరింత త్వరగా పూర్తి చేసేందుకుగాను కార్యనిర్వహణాధికారి వారి ఆమోదంమేరకు

**డా॥ నిట్టల సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రి**

**డా॥ మరడాన శ్రీనివాసరావు**

**డా॥ గల్లా చలపతి** గార్లకు సంపాదకమండలిలో స్థానం కల్పించారు. 2016 సెప్టెంబరునుండి పండితులందరితో ప్రతినెలా దాదాపు 20 రోజులపాటు తిరుపతి శ్వేత సమావేశ మందిరంలో సమావేశాలు ఏర్పాటుచేసి పండితులందరి ఆమోదంమేరకు పరిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించి శుద్ధప్రతిని ముద్రణకు పంపేందుకు సిద్ధం చేశారు. ఇలా అనుకున్న సమయానికి శ్రీమహాభాగవతాన్ని ప్రకటించగలిగినందుకు సంతోషిస్తున్నాము.

సామాన్య పాఠకులను దృష్టిలో ఉంచుకుని వ్యాఖ్యానం సరళంగా ఉండాలన్న కార్యనిర్వహణాధికారి, సంయుక్త కార్యనిర్వహణాధికారిగార్ల సూచనలమేరకు వ్యాఖ్యాన రచనలో విస్తృతంగా విశేషాలను వ్రాసిన పండితుల రచనల్లోంచి సంపాదకమండలి సూచనల ప్రకారం అవసరమైన మేరకు మాత్రమే విశేషాలను స్వీకరించడమయింది.

**కృతజ్ఞతలు**

ఈ ప్రణాళిక ఫలప్రదం కావడానికి ఆధికారికమైన ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి అధ్యక్షులకు మరియు పాలకమండలి సభ్యులందరికీ కృతజ్ఞతలు.

లోగడ తితిదేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఉండి భాగవత ప్రాజెక్టు ప్రారంభానికి కారకులైన **శ్రీ ఎ.పి.వి.ఎన్.శర్మ** ఐ.ఏ.ఎస్., గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. అదే పరంపరలో తితిదే కార్యనిర్వహణాధికారులుగా బాధ్యతలు నిర్వహించి భాగవత ప్రాజెక్టుకు సంపూర్ణ సహకారాన్ని అందించిన **డా॥ కె.వి.రమణాచార్య** ఐ.ఏ.ఎస్., **శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావు** ఐ.ఏ.ఎస్., **శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం** ఐ.ఏ.ఎస్., **శ్రీ ఎమ్.జి.గోపాల్** ఐ.ఏ.ఎస్., గార్లకు హృదయపూర్వక ధన్యవాదాలు.

పోతనభాగవతం ముద్రణదశకు చేరుకునేందుకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చిన సలహామండలి సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు.

సవ్యాఖ్యాన భాగవత ప్రచురణలో ఆసక్తిని కనబరుస్తూ అన్నివిధాలా అందుకు తగిన ప్రోత్సాహాన్ని అందజేసిన గౌరవ శ్రీ కార్యనిర్వహణాధికారి **డా॥ డి.సాంబశివరావు** ఐ.ఏ.ఎస్., గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారి **శ్రీ పోల భాస్కర్** ఐ.ఏ.ఎస్., గారికి మా హృదయపూర్వక నమోవాకాలు.

భాగవత వ్యాఖ్యాన రచనకు అవసరమైన పండితులను ఎన్నుకొని వారికి వ్యాఖ్యాన బాధ్యతలను అప్పగించడంలో కృషిచేసిన నాటి సప్తగిరి ప్రధాన సంపాదకులు **డా॥ సి.శైలకుమార్** గారికి, సంపాదకులు **డా॥ కె.రాధారమణ** (ప్రస్తుత ప్రధాన సంపాదకులు) గార్లకు కృతజ్ఞతలు.

వ్యాఖ్యాతలందరినుండి వ్యాఖ్యాన భాగాలను రప్పించడంలో శ్రమించి, విశేష కృషిచేసిన నాటి ప్రచురణల విభాగం అధికారి **ఆచార్య రవ్వా శ్రీహరి** గారికి, పరిష్కరణ కార్యక్రమాన్ని వేగవంతంచేసిన తదుపరి అధికారి **డా॥ సముద్రాల లక్ష్మణయ్య** గారికి, కృతజ్ఞతాపూర్వక నమస్కృతులు.

పోతన భాగవత పరిష్కరణలో తమ అమూల్య సహాయసహకారాలనందించి శుద్ధప్రతిని తయారు చేయడంలో సహకరించిన **పోతన భాగవత సంపాదకమండలి సభ్యులందరికీ** పేరుపేరునా ధన్యవాదాలు.

ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ అన్నివిధాలా సంపూర్ణ సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగ ఉపసంపాదకులు **డా॥ నొస్సం నరసింహాచార్య** గారికి, పరిష్కరణ, అక్షరదోష సవరణల్లో సహకరించిన కార్యాలయ పండితులు **విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, డా॥ గల్లా చలపతి, డా॥ ముదివేడు ప్రభాకరరావు, శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు, శ్రీ కట్టా నరసింహులు**గార్లకు, ప్రచురణల విభాగంలో కొంతకాలం ఉపసంపాదకురాలుగా పనిచేసి భాగవత పరిశీలనా కార్యక్రమంలో సహకరించిన **శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి** గారికి నా ప్రత్యేక ధన్యవాదాలు.

సవ్యాఖ్యాన పోతన భాగవత ముద్రణకు సంబంధించిన దస్త్రాలను నడపడంలోను, సంపాదకమండలి సమావేశాలను ఏర్పాటు చేయడంలోను సహకరించిన **ప్రచురణల విభాగ కార్యాలయ సిబ్బందికి** నా ధన్యవాదాలు.

సవ్యాఖ్యాన పోతన భాగవతం ఎనిమిది సంపుటాలలో చివరన ముద్రించిన అకారాదిక్రమ పద్యగద్య సూచికను తయారు చేయడంలో సహకరించిన **శ్రీ వాడపల్లి శేషతల్పశాయి** (ఆంధ్రభారతి.కామ్) గారికి మా కృతజ్ఞతలు.

ఈ పుస్తకాలను అందంగా డి.టి.పి. చేసి చక్కటి వర్ణచిత్రాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో సహకరించిన ప్రచురణల విభాగ కార్యాలయ డి.టి.పి. సిబ్బంది **శ్రీమతి ఎమ్.సుబ్బరత్నమ్మ, శ్రీమతి జె.కరుణ, కుమారి ఎమ్.మానస, శ్రీ ఎమ్.రెడ్డిప్రసాద్** గార్లకు ధన్యవాదాలు.

ఈ గ్రంథంలో ప్రసిద్ధ చిత్రకారులు బాపుగారి అద్భుత వర్ణచిత్రాలను ముద్రించేందుకు అనుమతించిన బాపుగారి కుటుంబసభ్యులకు మా ప్రత్యేకధన్యవాదాలు.

తక్కువ వ్యవధిలో గ్రంథ ముద్రణను పూర్తిచేసి పాఠకులకు అందించేందుకు తోడ్పడిన టిటిడి ముద్రణాలయ ఉపకార్యనిర్వహణాధికారి **శ్రీమతి ఎమ్.గౌతమి** గారికీ, వారి సిబ్బందికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు.

*సదా శ్రీవారి సేవలో...*

**ప్రయాగ రామకృష్ణ**
కన్వీనర్
ప్రత్యేకాధికారి, ప్రచురణల విభాగం
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# సంపాదక మండలి


అధ్యక్షులు

**డా॥ డి.సాంబశివరావు**, ఐ.ఏ.ఎస్,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి

పర్యవేక్షకులు

**శ్రీ పోల భాస్కర్**, ఐ.ఏ.ఎస్,

సంయుక్త కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి

ప్రధాన సంపాదకులు : **డా॥ సముద్రాల లక్ష్మణయ్య**

## సభ్యులు

**శ్రీ గరిమెళ్ళ సోమయాజులు శర్మ**

**డా॥ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి**

**డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి**

**డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణ**

**డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి**

**డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య**

**డా॥ కె.వి.సుందరాచార్యులు**

కన్వీనర్ : ప్రయాగ రామకృష్ణ, ప్రత్యేకాధికారి, ప్రచురణల విభాగం

కో - కన్వీనర్ : డా॥ నొస్సం నరసింహాచార్య, ఉపసంపాదకులు, ప్రచురణల విభాగం

బమ్మెర పోతనామాత్య ప్రణీత

# శ్రీమహాభాగవతము

| వ్యాఖ్యాతలు | స్కంధాలు |
|---|---|
| 1) డా॥ కేసాప్రగడ సత్యనారాయణ | ప్రథమస్కంధము (1-275) |
| 2) డా॥ మల్లెల గురవయ్య | ప్రథమస్కంధము (276-529) |
| 3) డా॥ సముద్రాల లక్ష్మణయ్య | ద్వితీయస్కంధము (1-288) |
| 4) డా॥ కడిమిళ్ళ వరప్రసాద్ | తృతీయస్కంధము (1-388) |
| 5) డా॥ కసిరెడ్డి వెంకటపతిరెడ్డి | తృతీయస్కంధము (389-717) |
| 6) డా॥ గల్లా చలపతి | తృతీయస్కంధము (718-887) |
| 7) డా॥ కసిరెడ్డి వెంకటపతిరెడ్డి | తృతీయస్కంధము (888-1055) |
| 8) డా॥ దావులూరి కృష్ణకుమారి | చతుర్థస్కంధము (1-322) |
| 9) డా॥ ఆర్. అనంతపద్మనాభరావు | చతుర్థస్కంధము (323-636) |
| 10) డా॥ శలాక రఘునాథశర్మ | చతుర్థస్కంధము (637-977) |
| 11) డా॥ కె. సర్వోత్తమరావు | పంచమస్కంధము<br>ప్రథమాశ్వాసము (1-183)<br>ద్వితీయాశ్వాసము (1-167) |
| 12) డా॥ జోస్యుల సూర్యప్రకాశరావు | షష్ఠస్కంధము (1-251) |
| 13) డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణ | షష్ఠస్కంధము (252-346) |
| 14) డా॥ ఆకురాతి పున్నారావు | షష్ఠస్కంధము (347-440) |
| 15) శ్రీ కోట వేంకట లక్ష్మీనరసింహం | షష్ఠస్కంధము (441-530) |
| 16) డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ | సప్తమస్కంధము (1-186) |

| | |
|---|---|
| 17) డా॥ ఆకురాతి పున్నారావు | సప్తమస్కంధము (187-482) |
| 18) డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద | అష్టమస్కంధము (1-391) |
| 19) శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | అష్టమస్కంధము (392-744) |
| 20) డా॥ డి. మీరాస్వామి | నవమస్కంధము (1-364) |
| 21) శ్రీ కోట వేంకట లక్ష్మీనరసింహం | నవమస్కంధము (365-737) |
| 22) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య | దశమస్కంధము పూర్వభాగము (1-288) |
| 23) డా॥ ఎ.ఎస్. గోపాలరావు | దశమస్కంధము పూర్వభాగము (289-610) |
| 24) శ్రీ ప్రభల సుబ్రహ్మణ్యశర్మ | దశమస్కంధము పూర్వభాగము (611-912) |
| 25) డా॥ పి. నరసింహారెడ్డి | దశమస్కంధము పూర్వభాగము (913-1188) |
| 26) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు | దశమస్కంధము పూర్వభాగము (1189-1485) |
| 27) డా॥ పి.ఆర్. హరినాథ్ | దశమస్కంధము పూర్వభాగము (1486-1792) |
| 28) డా॥ నాగళ్ళ గురుప్రసాదరావు | దశమస్కంధము ఉత్తరభాగము (1-245) |
| 29) డా॥ ఎన్.వి.ఎస్. రామారావు | దశమస్కంధము ఉత్తరభాగము (246-537) |
| 30) డా॥ కె. మలయవాసిని | దశమస్కంధము ఉత్తరభాగము (538-764) |
| 31) డా॥ కె.జె. కృష్ణమూర్తి | దశమస్కంధము ఉత్తరభాగము (765-1033) |
| 32) డా॥ సంగనభట్ల నరసయ్య | దశమస్కంధము ఉత్తరభాగము (1034-1343) |
| 33) డా॥ గల్లా చలపతి | ఏకాదశస్కంధము (1-127) |
| | ద్వాదశస్కంధము (1-54) |

**పోతన భాగవతప్రాజెక్టు కన్సల్టెంట్స్**

శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం =¡ =డా॥ గల్లా చలపతి =¡ = డా॥ ముదివేడు ప్రభాకరరావు

శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు =¡ = శ్రీ కట్టా నరసింహులు

# సంకేతాక్షర సూచి

| | | | | | |
|---|---|---|---|---|---|
| క. | - | కందం | య. | - | యగణం |
| ఆ. | - | ఆటవెలది | మ. | - | మగణం |
| తే. | - | తేటగీతి | త. | - | తగణం |
| సీ. | - | సీసపద్యం | ర. | - | రగణం |
| ఉ. | - | ఉత్పలమాల | జ. | - | జగణం |
| చ. | - | చంపకమాల | భ. | - | భగణం |
| మత్త. | - | మత్తకోకిల | న. | - | నగణం |
| మ. | - | మత్తేభవిక్రీడితం | స. | - | సగణం |
| శా. | - | శార్దూలవిక్రీడితం | ల. | - | లఘువు |
| శ్లో. | - | శ్లోకం | గ. | - | గురువు |
| వ. | - | వచనం | వ. | - | వగణం |
| అలం. | - | అలంకారం | | | |

| | | |
|---|---|---|
| అవ. | - | అవతారిక |
| తా. | - | తాత్పర్యం |
| ప్రతి. | - | ప్రతిపదార్థం |
| విశే. | - | విశేషార్థం |
| ప్ర.ఆ. | - | ప్రథమాశ్వాసం |
| ద్వి.ఆ. | - | ద్వితీయాశ్వాసం |
| క్రీ.శ. | - | క్రీస్తుశకం |
| సం. | - | సంవత్సరం |
| మొ. | - | మొదలైన |
| ... | - | తరువాతి పద్యం / వచనంతో అన్వయం |

# చతుర్థస్కంధ ప్రాశస్త్యం

విదురమైత్రేయ సంవాదం తృతీయ స్కంధంతో ఆగ లేదు. చతుర్థ స్కంధం చివరి దాకా సాగింది. కర్దమప్రజాపతి సంతానం, దక్షప్రజాపతి సంతానం, దక్షయజ్ఞం, ధ్రువోపాఖ్యానం, వేనుని చరిత్ర, పృథు చక్రవర్తి చరిత్ర, పురంజనోపాఖ్యానం, తపస్సు చేసిన ప్రచేతసులకు భగవంతుడు వరాలివ్వడం చతుర్థస్కంధంలోని ప్రధానవిషయాలు. ఉపాఖ్యానాలు చతుర్థ స్కంధంతోనే ప్రారంభమైనాయి.

### మనువంశం

స్వాయంభువమనువు భార్య శతరూప. ఈ దంపతులకు 1. ఆకూతి 2. దేవహూతి 3. ప్రసూతి అనే ముగ్గురు కుమార్తెలు 1. ప్రియవ్రతుడు 2. ఉత్తానపాదుఁడు అనే ఇద్దరు కొడుకులు పుట్టారు. ఆకూతిని రుచి ప్రజాపతికిచ్చి పెండ్లి చేశారు. వీరికి శ్రీమహావిష్ణువు శ్రీయజ్ఞుడై పుట్టాడు. శ్రీహరికి నిత్యానపాయిని అయిన శ్రీమహాలక్ష్మి దక్షిణ అనే పేరుతో పుట్టింది. శ్రీయజ్ఞుడు దక్షిణను పరిణయమాడాడు. ఈ దంపతులకు 1. తోషుడు 2. ప్రతోషుడు 3. సంతోషుడు 4. భద్రుడు 5. శాంతి 6. ఇడస్పతి 7. ఇధ్ముడు 8. కవి 9. విభుడు 10. వహ్ని 11. సుదేవుడు 12. రోచనుడు - అనే 12 మంది కొడుకులు పుట్టారు. వీరే తుషితు లనే దేవగణాలు. కర్దమప్రజాపతి భార్య దేవహూతి. దక్షప్రజాపతి భార్య ప్రసూతి.

### కర్దమవంశం

కర్దముని కూతురు కళ. ఈమెను మరీచి పెండ్లాడాడు. ఈ దంపతులకు 1. కశ్యపుడనే కుమారుడు 2. పూర్ణిమ అనే కుమార్తె పుట్టారు. పూర్ణిమ తరువాతి జన్మలో గంగ అయినది. ఈ గంగకు 1. దేవకుల్య అనే కూతురు 2. విరజుడనే కొడుకు పుట్టారు.

అత్రి మహాముని భార్య 'అనసూయ'. ఈ పుణ్యదంపతులకు 1. బ్రహ్మ - చంద్రుడుగా 2. విష్ణువు - దత్తాత్రేయుడుగా 3. శివుడు - దుర్వాసుడుగాపుట్టారు.

అంగిరసుని భార్య శ్రద్ధ. వీరికి 1. సినీవాలి 2. కుహువు 3. రాక 4. సుమతి అనే నలుగురు కుమార్తెలు 1. ఉచథ్యుడు 2. బృహస్పతి అనే ఇద్దరు కొడుకులు పుట్టారు. పులస్త్యమహర్షి భార్య హవిర్భుక్కు. వీరి మొదటి కొడుకు - అగస్త్యమహర్షి. రెండవ కొడుకు విశ్రవసుడు. విశ్రవసుని భార్య-ఇలబిల. వీరికి పుట్టిన కుమారుని పేరు ఐలబిలుడు. ఇతడే తర్వాత కుబేరుడుగా పిలువబడ్డాడు. విశ్రవసుని రెండవ భార్య కైకసి. వీరికి 1. రావణుడు 2. కుంభకర్ణుడు 3. విభీషణుడు అనే ముగ్గురు కొడుకులు పుట్టారు. శూర్పణఖ కుమార్తె. పులహుని భార్యపేరు గతి. వీరికి 1. కర్మశ్రేష్ఠుడు 2. వరీయాంసుడు 3. సహిష్ణుడు - అను ముగ్గురు కొడుకులు పుట్టారు. క్రతువు భార్య క్రియ. ఈ దంపతులకు 60,000 వాలఖిల్యులు పుట్టి మహర్షులైనారు. వసిష్ఠుని భార్య ఊర్జ. వీరికి 1. చిత్రకేతుడు 2. సరోచి 3. విరజుడు 4. మిత్రుడు 5. ఉల్బణుడు 6. వసుభృద్యానుడు

7. ద్యుమంతుడు అనే సప్తఋషులు పుట్టారు. వసిష్ఠుని రెండవ భార్యకు శక్తి మొదలగు పుత్రులు పుట్టారు. శక్తి కొడుకు పరాశరుడు. పరాశరుని కొడుకు వ్యాసుడు. వ్యాసుని కొడుకు శుకుడు. ఈ శుకమహర్షియే పరీక్షిత్తుకు భాగవతం ఉపదేశించిన పుణ్యాత్ముడు.

అథర్వుని భార్య చిత్తి. వీరికి 1. ధృతవ్రతుడు 2. దధ్యంచుడు పుట్టారు. ఈ దధ్యంచుడు గుఱ్ఱం తలతో పుట్టాడు. భృగుమహర్షి భార్య ఖ్యాతి. వీరికి 1. ధాత 2. విధాత అనే కొడుకులు 3. శ్రీ అనే కూతురు పుట్టారు. ధాత భార్య – ఆయతి. వీరి కొడుకు మృకండుడు. విధాత భార్య నియతి. వీరి కొడుకు ప్రాణుడు. మృకండుని కొడుకు మార్కండేయుడు. ప్రాణుని కొడుకు వేదశిరుడు. భృగుమహర్షి భార్య ఉశన. వీరి కుమారుఁడు కవి (శుక్రాచార్యుడు). ఇది కర్దమప్రజాపతి వంశం.

## దక్షప్రజాపతి వంశం

స్వాయంభువమనువు మూడవ కూతురైన ప్రసూతిని దక్షుడు పెండ్లాడాడు. ఈ దంపతులకు 16 మంది కుమార్తెలు పుట్టారు. వారిలో 1. శ్రద్ధ 2. మైత్రి 3. దయ 4. శాంతి 5. తుష్టి 6. పుష్టి 7. ప్రియ 8. ఉన్నతి 9. బుద్ధి 10. మేధ 11. తితిక్ష 12. హ్రీ 13. మూర్తి అనే 13 మంది కుమార్తెలను ధర్ముడు పెండ్లాడాడు.

ధర్మునికీ మూర్తి అనే భార్యకూ నర–నారాయణులనే ఋషులు పుట్టారు. ఈ నరనారాయణులే ద్వాపరయుగంలో అర్జున – శ్రీకృష్ణులై పుట్టారు.

దక్ష పుత్రిక అయిన స్వాహాదేవిని అగ్నిదేవుడు పెండ్లాడాడు. వీరికి 1. పావకుడు 2. పవమానుడు 3. శుచి అను ముగ్గురు కొడుకులు పుట్టారు. వీరి వలన 45 అగ్నులు పుట్టాయి. ఇవియే యజ్ఞాగ్నులు. దక్షుని కూతురైన స్వధకు 1. వయున 2. ధారిణి అనే ఇద్దరు కన్యలు పుట్టి బ్రహ్మనిష్ఠ లైనారు.

## దక్షయజ్ఞం

దక్షప్రజాపతి కూతురైన సతీదేవిని శివుడు పెండ్లాడాడు. పూర్వం విశ్వస్రష్టలైన బ్రహ్మలు సత్త్రయాగం చేశారు. ఆ యాగానికి బ్రహ్మ, శివుడు, దేవతలు, యోగులు, మునులు, ఋషులు, ప్రజాపతులు వెళ్ళారు. యాగం చూడటానికి దక్షప్రజాపతి కూడ వెళ్ళాడు. దక్షుని చూచి బ్రహ్మ, శివుడు తప్ప దక్కిన సభ్యు లందరు లేచి నిలబడి పూజించారు. దక్షుడు బ్రహ్మకు నమస్కరించాడు. శివుడు లేవ లేదు. దక్షుడు కన్నులెఱ్ఱజేశాడు. సభ్యుల్ని చూచి 'శివుడు లేవకపోతే పోనీ! కూర్చునే ఉండనీ. నమస్కరింపక పోతే పోనీ! వదిలేయండి. కనీసం నన్నుచూచి 'బాగున్నారా!' అనైనా పలకరించ వద్దా? అని దక్షుడు శివుణ్ణి ఇలా నిందించాడు.

సీ. **అనయంబు లుప్తక్రియా కలాపుఁడు మానహీనుఁడు మర్యాద లేనివాఁడు**
**మత్తప్రచారుఁ దున్మత్తప్రియుఁడు దిగంబరుఁడు భూతప్రేత పరివృతుండు**
**దామసప్రమథ భూతములకు నాథుండు భూతిలిప్తుం డస్థిభూషణుండు**
**నష్టశౌచుండు నున్మదనాథుఁడును దుష్టహృదయుఁ దుగ్రుఁడును బరేతభూ ని**

**తే. కేతనుఁడు వితతస్రస్తకేశుఁ డశుచి, యయిన యితనికి శివనాముఁ డను ప్రవాద**
**మెటులు గలిగె? నశివుఁడగు నితని నెఱిఁగి, యెఱిఁగి వేదంబు శూద్రున కిచ్చినట్లు. (4-43)**

విధి లేక మా అమ్మాయిని ఈతనికిచ్చి పెండ్లి చేశాను అని అల్లుడనే లోకువతో దక్షుఁడు శివుణ్ణి నిందించి 'వీనికి యజ్ఞంలో హవిర్భాగం లేకపోవుగాక!' అని శపించాడు. వెంటనే నందికేశ్వరుడు లేచి కోపంతో 'దక్షుడు పశుప్రాయుడై స్త్రీ లోలు డగుగాక! కాముకుడై త్వరలోనే మేషముఖుం డగు గాక!' అని శపించాడు. 'హరద్వేషులైన వీరు భక్ష్యాభక్ష్యశూన్యు లవుతారు" అని అచటి బ్రాహ్మణుల్ని శపించాడు, నంది.

అది విని భృగుమహర్షి లేచి 'ఈ శైవులూ, వారి అనుయాయులూ పాషండులై భస్మం, జడలు, ఎముకలు ధరించి నశిస్తారు గాక' అని బదులుగా శపించాడు.

దక్షునికి, శివునికి శత్రుత్వం పెరిగింది. దక్షుడు శివుని పిలువకుండ వాజపేయం, బృహస్పతియజ్ఞం చేశాడు. ఆ యజ్ఞానికి మునులు, ఋషులు, ప్రజాపతులు, దేవతలు వచ్చారు. తండ్రి చేసే యజ్ఞం చూడటానికి సతీదేవి శివుడు వద్దంటున్నా వినక వచ్చింది. దక్షుఁడు సతీదేవిని ఆదరించకుండా అవమానించాడు. సతీదేవి కోపంతో-

**ఉ. నీలగళాపరాధి యగు నీకుఁ దనూభవ నౌట చాలదా!**
**చాలుఁ గుమర్త్య! నీదు తనుజాత ననన్ మది సిగ్గు పుట్టెడి**
**న్నేల ధరన్ మహాత్ములకు నెగ్గొనరించెడి వారి జన్మముల్**
**గాలుపనే? తలంప జనకా! కుటిలాత్మక! యెన్ని చూడఁగన్! (4-94)**

సతీదేవి తండ్రి చేసిన పరాభవం సహింపలేక పోయింది. తత్క్షణమే యోగాగ్నిలోబడి బూడిద అయింది, నారదుడీ విషయం శివునికి చెప్పాడు. శివుడు కోపించి తన జటను నేలపై కొట్టినాడు. ఆ జడనుండి వీరభద్రు డుదయించాడు-

**సీ. అభ్రం లిహా దభ్ర విభ్ర మాభ్ర భ్రమ, కృష్ణీల దీర్ఘ శరీర మమరఁ**
**బ్రజ్వల జ్జ్వలన దీప్తజ్వాలికాజాల, జాజ్వల్యమాన కేశములు మెఱయఁ**
**జండదిగ్వేదండశుండాభదోర్దండ, సాహస్రధృత హేతి సంఘ మొప్ప**
**వీక్షణ త్రయలోక వీక్షణద్యుతిలోక వీక్షణ తతిదుర్నిరీక్షముగను**

**తే.గీ. గ్రకచ కఠిన కరాళదంష్ట్రలు వెలుంగ, ఘనకపాలాస్థి వనమాలికలును దనర**
**నఖిలలోక భయంకరుఁ డగుచు వీర, భద్రుఁ డుదయించె మాఱట రుద్రుఁ డగుచు. (4-107)**

సుదీర్ఘ కఠిన సంస్కృత సమాసాలతో నడచిన ఈసీసపద్యంలో వీరభద్రుఁడు సాక్షాత్కరిస్తున్నాడు.

వీరభద్రుడు దక్షుని యజ్ఞశాలపై దాడి చేశాడు. యజ్ఞం ధ్వంసం చేశాడు. నందీశ్వరుడు భగుని కన్నులు పెకలించాడు. వీరభద్రుడు భృగుని మీసాలు పీకాడు. దక్షుని వక్షఃస్థలం తొక్కి తల ఖండించాడు. దేవతలు

పరాజయం పొందారు. ఈ విషయం బ్రహ్మకు తెలిసింది. వెంటనే దేవతలతో కైలాసానికి వెళ్ళాడు. శివుడు దక్షిణామూర్తిస్వరూపంతో దర్శనమిచ్చాడు. దేవతలు, బ్రహ్మ స్తుతించారు. శివుఁడు కరుణించాడు. దక్షునికి మేషశిరస్సును తగిలించారు. అతడు పునర్జీవితుడై పరమశివుని స్తుతించి యజ్ఞం పూర్తి చేశాడు. శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమయ్యాడు. దక్షుడు మొదలైనవా రంతా విష్ణువును స్తుతించారు. మా ముగ్గురినీ వేరు చేయకుండా అద్వైతభావంతో ఎవరు కొలుస్తారో వారు కృతార్థులవుతా రని చెప్పి దక్షుని 'సుఖంగా జీవింపు' మని ఆశీర్వదించి త్రిమూర్తులు వారి లోకాలకు వెళ్ళారు.

సతీదేవి పూర్వదేహం విడిచి మేనకాహిమవంతులకు కూతురై పుట్టి పార్వతియై మరల శివుని వివాహమాడింది.

**క. ఈ యాఖ్యానముఁ జదివిన, ధీయుతులకు వినిన యట్టి ధీరులకైశ్వ**
**ర్యాయుఃకీర్తులు గలుగును, బాయును దురితములు, దొలఁగు భవబంధంబుల్.**

## కలిపురుషుని వంశవృక్షం

అధర్ముని భార్య మృష. వీరికి దంభు డనే కొడుకు మాయ అనే కూతురు పుట్టి దంపతులయ్యారు. వీరికి లోభుడనే పుత్రుడు, నికృతి అనే పుత్రిక పుట్టి దంపతు లయ్యారు. వీరికి క్రోధు డనే కుమారుడు, హింస అనే కుమార్తె పుట్టి దంపతు లయ్యారు. వీరికి – కలి – దురుక్తి అనే బిడ్డలు పుట్టి దంపతులయ్యారు. వీరికి భయుడు – మృత్యువు పుట్టి దంపతు లయ్యారు. వీరికి నిరయుడు (నరకం) అనే సుతుడు, యాతన (నరకయాతన) అనే సుత పుట్టి దంపతు లయ్యారు. ఇదంతా అధర్మసంతానం. వావివరుసలు పాటించకుండా, ఆదినుండి ఒకేతల్లి కడుపులో పుట్టిన అన్నాచెల్లెళ్లు, భార్యాభర్తలు కావడం, ఈ అధర్మప్రవృత్తి ఆరుతరాలుగా కొనసాగడం, ధర్మగ్లానికి పరాకాష్ఠ. సమాజానికి చేటు. ధర్మానికి గొడ్డలిపెట్టు. ఇదే కలిపురుషుని వంశవృక్షరహస్యం. కలిపురుషుడు నాల్గవతరంలో పుట్టాడు. అతనికి ముందూ వెనుకాకూడా అధర్మమే. అధర్మానికీ అబద్ధానికీ పుట్టిన సంతానం యొక్క అక్రమసంబంధమే కలిపురుషుని వంశవృక్షం. అందరిపేర్లు ప్రతీకాత్మకంగా ఉండటంలో భవిష్యత్ యథార్థస్థితిని తెలియజేస్తున్నది. (విశేష విషయాలకు చూడుడు సంస్కృత కల్కిపురాణం.)

## ధ్రువోపాఖ్యానం

స్వాయంభువమనువుకు శతరూపకు 1. ప్రియవ్రతుడు 2. ఉత్తానపాదుడు అనే నిద్దరు కొడుకులు పుట్టారు. ఉత్తానపాదుడు 1. సునీతి 2. సురుచి అనే నిద్దరు భార్యలను పెండ్లాడాడు. సునీతి కొడుకు ధ్రువుడు. ఒకనాడుత్తానపాదుడు సురుచి కన్న కొడుకును తొడలపై కూర్చుండ బెట్టుకొని లాలిస్తూ ఉండగా, ధ్రువుడు కూడ తండ్రి ఒడిలో కూర్చోవడానికి వచ్చాడు. సురుచి సవతికొడుకైన ధ్రువుని జూచి 'నీవు నాకు పుట్టి ఉంటే తండ్రి ఒడిలో చేరే భాగ్యం కల్గేది. నా సవతికి పుట్టిన నీకు అలాంటి అర్హత లేదు. నీవు శ్రీవిష్ణుమూర్తిని సేవించు. నా కడుపున పుడతావు అని పలికింది. పినతల్లి ఆడిన దుర్భాషలు సహింపరానివికాగా ధ్రువుని హృదయాన్ని కలచి వేశాయి. కన్నీళ్ళు కారుతుండగా ఏడుస్తూ సునీతి దగ్గరకు వచ్చాడు. సునీతి ధ్రువుని తన తొడలమీద కూర్చోబెట్టుకొని విషయం తెలిసికొని 'నేను నీతండ్రికి దాసినే. నిర్భాగ్యురాలైన నా కడుపున నీవు పుట్టావు. సురుచి చెప్పినట్లు

సర్వశరణ్యుడైన శ్రీహరిని సేవించు. నీతండ్రి ఒడిని ఎక్కే భాగ్యం కల్గు" తుందని బోధించింది. ధ్రువుడు నగరాన్ని విడిచిపెట్టి తపస్సుకు బయలుదేరాడు. దారిలో నారదమహర్షి కనబడ్డాడు. ధ్రువుని పట్టుదలకు మెచ్చుకొని విష్ణువిగ్రహాన్ని వర్ణించి ధ్యానమార్గం చెప్పి **'ఓం నమో భగవతే వాసుదేవాయ'** అనే ద్వాదశాక్షరీ మంత్రాన్ని ఉపదేశించి పూజావిధానం వివరించాడు. ధ్రువుడు మధువనానికి వెళ్ళి యమునలో స్నానం చేసి ఐదు మాసాలు నిరాహారుడై ఒంటికాలిపై నిలబడి ఘోరమైన తపస్సు చేశాడు. ఆ తపస్సుకు మూడు లోకాలు కంపించాయి. భూతలం సగం వంగింది. ధ్రువుని తపస్సు మాన్పుమని దేవతలు నారాయణునికి మొర పెట్టుకొన్నారు. మహావిష్ణువు గరుడవాహనం ఎక్కి వచ్చి ధ్రువుని ముందు సాక్షాత్కరించాడు. ధ్రువుడు సాష్టాంగనమస్కారాలు చేసి ఐదేండ్ల బాలుడుకావటంచే స్తోత్రం చేయడానికి సమర్థుడు కాలేదు. భగవంతుడు భక్తుని మనస్సు తెలిసికొని తన శంఖం అతని బుగ్గకు తాకించాడు. ధ్రువునికి జ్ఞానోదయమై వేదాల వంటి వాక్కులలో బ్రహ్మస్వరూపా!

**తే.గీ. నీకు మ్రొక్కెద నత్యంతనియమ మొప్ప, భవ్యచారిత్ర! పంకజపత్రనేత్ర!**
**చిరశుభాకార! నిత్యలక్ష్మీవిహార!, యవ్యయానంద! గోవింద! హరి! ముకుంద!**

అని స్తుతించాడు. విష్ణువు ధ్రువునికి 'నక్షత్రమండలానికి పై ఉండే ధ్రువస్థానం అలంకరిస్తావు. ముందు రాజ్యభోగా లనుభవించి అనేకయజ్ఞాలు చేసి నన్ను పొందుతా' వని ఆశీర్వదించి అదృశ్యమయ్యాడు. విష్ణువు ప్రత్యక్షమైనా మోక్షం కోరలేక పోయాడు. పినతల్లి పలికిన పలుకులు ములుకుల్లా హృదయాన్ని గుచ్చుకోవడమే కారణం. నారదుడు ధ్రువుని తపస్సుసంగతి ఉత్తానపాదునికి చెప్పాడు. ధ్రువుడు తనపట్టణానికి తిరిగి వచ్చాడు. తండ్రి ధ్రువుని ఏనుగుపై ఎక్కించి ఇంటికి తెచ్చాడు. ఉత్తానపాదుడు ముసలివాడై ధ్రువునికి పట్టాభిషేకంచేసి అడవులకు పోయాడు. ధ్రువునకు 1. భ్రమి 2. ఇల అనే ఇద్దరు భార్యలు భ్రమికి 1. కల్పుడు 2. వత్సరుడు అనే పిల్లలు; ఇలకు ఒక కూతురు పుట్టారు. ధ్రువుడు గుహ్యకులతో యుద్ధం చేసి జయించాడు. కుబేరుడు వచ్చి ధ్రువుణ్ణి అనుగ్రహించాడు. ధ్రువుడు అనేక యజ్ఞాలు చేసి చివరికి హరిపదాన్ని చేరుకున్నాడు.

ధ్రువుని తరువాత వత్సరుడు రాజయ్యాడు. వత్సరుని భార్య సర్వర్థి. ఈ దంపతులకు 1. పుష్పార్ణుడు 2. చంద్రకేతుడు 3. ఇషుడు 4. ఊర్జుడు 5. వసువు 6. జయుడు అనే ఆరుగురు కొడుకులు పుట్టారు. పుష్పార్ణునకు 1. ప్రభ 2. దోష అనే భార్యలున్నారు. ప్రభకు 1. ప్రాతసుడు 2. మధ్యందినుడు 3. వ్యుష్టుడు పుట్టారు. వ్యుష్టుని భార్య పుష్కరిణి. వీరి కొడుకు సర్వతేజుడు. సర్వతేజుని భార్య ఆకూతి. వీరి కుమారుడు 'చక్షు' వనే మనువు. చక్షుని భార్య నడ్వల. వీరికి 1. పురువు 2. కుత్సుడు 3. త్రితుడు 4. ద్యుమ్నుడు 5. సత్యవంతుడు 6. ఋతుడు 7. వ్రతుడు 8. అగ్నిష్టోముడు 9. అతిరాత్రుడు 10. సుద్యుమ్నుడు 11. శిబి 12. ఉల్ముకుడు – అనే 12 మంది కొడుకులు పుట్టారు. ఉల్ముకుని భార్య పుష్కరిణి. ఈ దంపతులకు 1. అంగుడు 2. సుమనసుడు 3. ఖ్యాతి 4. క్రతువు 5. అంగిరసుడు 6. గయుడు అనే కొడుకులు పుట్టారు. అంగునిభార్య సునీథ. వీరి కొడుకు వేనుడు.

ఈ వేనుడు మాతామహదోషంచే దుర్మార్గుడయ్యాడు. ఇట్టి కుపుత్రుని జూచి సహింపలేక అంగుడు దుఃఖించి యర్ధరాత్రివేళ నెవరికి జెప్పకుండ రాజధానిని విడిచిపెట్టి పోయాడు. అప్పుడు భృగువు మొదలైన

మహర్షులు వచ్చి సునీథ అనుమతితో వేనునకు పట్టాభిషేకం చేశారు. వేనుడు సజ్జనుల్ని బాధించాడు. యజ్ఞాలను మాన్పించాడు. తానే దేవుడనని చెప్పాడు. విష్ణువును నిందించాడు. దేశ మల్లకల్లోలమయింది. వేనుడు వివాహవ్యవస్థను వ్యతిరేకించాడు. స్త్రీ, పురుషులు తమకిష్టమొచ్చినట్లు స్వతంత్ర జీవనం గడపవచ్చని చెప్పాడు. ప్రజలు పశువులవలె సంచరించారు. అప్పుడు మునులు వచ్చి వేనునికి బుద్ధులు చెప్పి అనేకవిధాల బోధించారు. వేనుడు మునులను అవమానించాడు. మునులు హుంకరించారు. వేనుడు మరణించాడు. సునీథ యోగశక్తితో వేనుని తనువును రక్షించింది. దేశ మరాజక మైంది. అప్పుడు మునులు వేనుని తొడలు మథించారు. నిషాదుడు పుట్టాడు. వాని వంశజులు నిషాదు లయ్యారు. మునులు వేనుని బాహువు మథించారు. అప్పుడు నారాయణాంశంతో పృథుచక్రవర్తి, లక్ష్మీదేవి యంశతో 'అర్చి' అనే కాంత పుట్టారు. పృథుచక్రవర్తి అర్చిని వివాహం చేసికొన్నాడు.

**సీ. అందంద కురియించి రమరులు మునినాథవితతి మోదం బంద విరులవాన!**
**బరమానురక్తి శుంభల్లీలఁ జూపట్టె, సురపతి వీట నచ్చరుల యాట**
**కర్ణరసాయనక్రమమున వీతెంచెఁబఱపైన తేట కిన్నరుల పాట**
**యనిమిషకరహతంబై చాలఁ జెలఁగెను, విభవోత్సవంబు దుందుభిరవంబు**

**తే.గీ. మునినుతి సెలంగె, శిఖిఁ గుండముల వెలింగె, నంత నచటికి సరసీరుహాసనుండు**
**గరుడగంధర్వకిన్నరగణముతోడ, నర్థిఁ జనుదెంచె సమ్మోద మతిశయిల్ల. (4-426)**

బ్రహ్మ దేవతలతో వచ్చాడు. బ్రాహ్మణులు పృథువుకు పట్టాభిషేకం చేశారు. దేవతలందరు తమ తమ ఆయుధాలను బహూకరించారు. వందిమాగధులు కీర్తించారు. పృథుమహారాజు ధర్మం తప్పక రాజ్యం చేయసాగాడు. భూదేవి నీరసించి గోరూపాన్ని ధరించి పారిపోయింది. పృథువు వెంటాడాడు. 'నాకొక దూడను, పాలు పితికే వానిని తెచ్చియిస్తే, సకలపదార్థాలు పాలుగా ఇస్తానని' నని భూదేవి పలికింది. పృథువు మనువును దూడగా జేసి తాను స్వయంగా ఓషధులు అన్నింటిని పితికాడు. ఋషులు బృహస్పతిని దూడగా జేసి వేదాలను పితికారు. దేవతలు ఇంద్రుని దూడగా చేసి అమృతాన్ని పితికారు. ఈవిధంగా భూదేవి గోవై సమస్తవస్తువుల్ని ఇచ్చింది.

పృథుచక్రవర్తి 99 అశ్వమేధాలు చేశాడు. 100వ యజ్ఞము చేస్తూఉండగా ఇంద్రుడు యజ్ఞపశువును అపహరించాడు. బ్రహ్మ ఆనతితో పృథువు ఇంద్రునితో స్నేహం చేశాడు. విష్ణుమూర్తి వచ్చి పృథువును అనుగ్రహించాడు. పృథుచక్రవర్తిని చూడటానికి సనకాదులు వచ్చారు. వారి దగ్గర వేదాంతతత్త్వం తెలిసికొని జ్ఞానవైరాగ్యవంతుడై పృథువు ముక్తి పొందాడు.

పృథుచక్రవర్తి కొడుకు విజితాశ్వుడు. ఈయనకు 1. శిఖండిని 2. నభస్వతి అనే నిద్దరు భార్యలు. శిఖండినికి 1. పావకుడు 2. పవమానుడు 3. శుచి అనే త్రేతాగ్నులు పుట్టారు. నభస్వతికి హవిర్ధానుడు పుట్టాడు. హవిర్ధానుని భార్య హవిర్ధాని. వీరికి 1. బర్హిష్మదుడు 2. గయుడు 3. శుకుడు 4. కృష్ణుడు 5. సత్యుడు 6. జితవ్రతుడు అనే కొడుకులు పుట్టారు. బర్హిష్మదుడు అనేకయజ్ఞాలు చేసి లోకమంతట దర్భలు పరచి ప్రాచీనబర్హి అని పేరుపొందాడు. ఇతడు సముద్రుని కూతురైన శతధృతిని పెండ్లాడాడు. ఈదంపతులకు 10 మంది ప్రచేతసులు పుట్టారు. వీరికి శివుడు యోగాదేశమనే రుద్రగీత ఉపదేశించాడు.

## పురంజనోపాఖ్యానము

పురంజనుడనే రాజు ఉండేవాడు. అతనికి అవిజ్ఞాతుడనే మిత్రుడుండేవాడు. ఆ రాజుకు ఏ పట్టణాలూ నచ్చక చక్కని పట్టణానికై భూతలమంతా వెదకుతూ హిమాలయపర్వతం చేరి దాని శిఖరాలపై ఒక పట్టణాన్ని చూచాడు. దాని ముందు ఉద్యానవనం ఉంది. ఆ పురంలో పెండ్లికాక భర్తకై అన్వేషిస్తున్న ఒక సుందరి (పురంజని) ని చూచాడు. ఆమెకు పది మంది అనుచరులు (కావలివారు) ఉన్నారు. ఒక్కొక్క అనుచరుడు నూరు మందికి నాయకుడు. ఐదు పడగల పాము ఆమెకు తోడుగా ఉంది. పురంజను డామెను పెండ్లాడి సమస్తసుఖాలు అనుభవిస్తూ ఉండిపోయాడు. ఆమె పురానికి తొమ్మిది ద్వారాలున్నాయి. తూర్పుదిక్కున ఐదు, దక్షిణదిక్కున ఒకటి, ఉత్తరదిక్కున ఒకటి, పడమటిదిక్కున రెండు, ఉన్నాయి. ఆ నవద్వారాలలో ఏడు ద్వారాలు పైన; రెండు ద్వారాలు కింద ఉన్నాయి. అటువంటి పురంలో పురంజనుడు ఆ సుందరితో కాపురం చేస్తూ కొంతకాలం గడిపాడు.

ఆయన ఒకరోజు గొప్ప రథమెక్కి వేఁటకు వెళ్ళాడు.

**సీ. పంచాశ్వయుక్తంబుఁ బంచబంధనముఁ జక్రద్వితయమును యుగద్వయంబు**
**నాశువేగంబు నేకాక్షంబుఁ గూబరద్వయముఁ బతాకాత్రితయయుతంబు**
**నేకరశ్మియుతంబు నేకసారథికంబుఁ సప్తవరూథంబు స్వర్ణభూష**
**మును, బంచవిక్రమమును నేకనీడంబుఁ బ్రకటపంచప్రహరణమునయిన**

**తే.గీ. రథము కాంచనరచితవర్మము ధరించి, విలసదక్షయతూణీరకలితుఁ డగుచుఁ**
**గడఁక దీపింప నెక్కి యేకాదశప్ర, సంఖ్యసేనాసమేతుఁడై సరభసముగ. (4-771)**

ఆ రథము ఐదు గుర్రాలు; ఐదు బంధనాలు (కట్లు), రెండు చక్రాలు; రెండు కాడులు; ఒక ఇరుసు; రెండు నొగలు (కాడికర్రలు); మూడు జెండాలు; ఒక పగ్గము; ఒక సారథి; ఏడు చక్రాల లోని మేకులు; ఐదు విక్రమాలు (గతులు); ఒక కూర్చొనే స్థలం; ఐదు ఆయుధాలు, గొప్ప వేగం గలిగింది.

పురంజనుడు 'పంచప్రస్థ' మనే అడవికి వెళ్ళి భార్యను ఒకచోట కూర్చోబెట్టి వేటకుపోయి జంతువుల్ని వధించాడు. తిరిగి వచ్చి భార్యను అనునయించాడు. తన పురానికి వచ్చి రేయింబవళ్ళు భార్యతో క్రీడించాడు. ఆయువు తగ్గుతున్న సంగతి అతనికి తెలియదు. ఆ దంపతులకు 1100 మంది కొడుకులు, 110 మంది కుమార్తెలు పుట్టారు. వారికి పెండ్లిండ్లు చేశాడు. మనుమలు, మునిమనుమలు పుట్టారు. ఆ రాజు లెక్కలేనన్ని పశువుల్ని చంపి చాలా యజ్ఞాలు చేశాడు. చెడ్డ కాలం వచ్చింది. చండవేగు డనే గంధర్వపతి 360 గంధర్వదంపతులతో వచ్చి పురంజనుని పురాన్ని ముట్టడించాడు. కాలకన్య వచ్చి రాజు శక్తిని హరించింది. యవనులు వచ్చి పురాన్ని తగులబెట్టారు. పురంజను డేమి చేయలేక కొడుకులనూ, మనుమలనూ, బంధుకోటినీ చూచి దుఃఖించాడు. భయు డనేవాడు వచ్చి పురంజనుని పశువులాగా కట్టి తీసికొనివెళ్ళాడు. పురం నశించి ప్రకృతిలో కలసిపోయింది. ఆ సమయంలో తనకు పూర్వమిత్రుడైన భగవంతుడు గుర్తుకురాలేదు. పురంజనుడు పరలోకానికి వెళ్ళగా అతడు యజ్ఞంలో జంపిన పశువులు వచ్చి అతణ్ణి చంపాయి. పురంజనుని భార్య తరువాతి జన్మలో విదర్భరాజునకు

కూతురై పుట్టి పాండ్యరాజును పెండ్లాడింది. వారికి సంతానం కలిగింది. పాండ్యరాజు మలయకేతనుఁడు గొప్ప విష్ణుభక్తుఁడు. అతడు బ్రహ్మజ్ఞానంతో మరణించాడు. భార్య సహగమనానికి సిద్ధమయింది. అప్పుడు విజ్ఞానుడనే బ్రాహ్మణుడు వచ్చి – “సృష్టి పూర్వం నుండి నీతో సౌఖ్యాలు అనుభవించిన సఖుణ్ణి. నీవు వైదర్భివి కావు. పురంజనివి కావు. ఇతడు పాండ్యరాజు కాడు. పురంజనుడు కాడు. ఇది అంతా మాయ. మన మిద్దరం పూర్వంనుండి హంసలం. జీవాత్మ పరమాత్మలం. నీవే నేను, నేనే నీవు. (తత్త్వమసి – తత్+త్వమ్+అసి) అని చెప్పాడు.

ఇది ఉపనిషత్తులలోని అద్వైతవేదాంతం అంతరార్థంగా గల ప్రతీకాత్మకకథ. ప్రకృతిలోని జీవుడు, దేహం మొదలైనవి ప్రతీకాత్మకపాత్రలు.

| | |
|---|---|
| పురంజనుఁడు | – పురుషుడు (జీవుఁడు) |
| అవిజ్ఞాతుడు | – సఖుఁడు (నామరూపక్రియలు లేని దేవుడు) |
| పురం | – దేహం |
| భార్య (పురంజని) | – బుద్ధి |
| ఐదు పడగల పాము | – ప్రాణం (ప్రాణ–అపాన–వ్యాన–ఉదాన–సమానములు ఐదు పడగలు.) |
| నవద్వారములు | – తొమ్మిది రంధ్రాలు (రెండు కన్నులు+రెండు ముక్కురంధ్రాలు+రెండు చెవులు+ నోరు+జననేంద్రియం+గుదం) |
| రథం | – దేహం |
| గుర్రాలు | – ఇంద్రియాలు |
| రెండు కాడులు | – సంవత్సరం, వయస్సు |
| రెండు చక్రాలు | – పుణ్యం, పాపం |
| మూడు జెండాలు | – సత్త్వం, రజస్సు, తమస్సు – త్రిగుణాలు |
| పంచబంధనాలు | – ఐదు ప్రాణాలు |
| పగ్గం | – మనస్సు |
| సారథి | – బుద్ధి |
| రథికస్థానం | – హృదయం |
| రెండు నొగలు | – శోకం, మోహం |
| ఐదు ప్రహరణాలు | – (ఆయుధాలు) – ఐదు ఇంద్రియాలు చేసే పనులు |
| ఐదు విక్రమాలు (గతులు) | – ఐదు కర్మేంద్రియాలు |
| ఏడు వరూథంబులు (మేకులు) | – ఏడు ధాతువులు |
| బంగారు రథం | – రజోగుణం |
| అక్షయతూణీరం (అమ్ములపొది) | – పూర్వజన్మవాసనా సమూహం |

| | |
|---|---|
| వేట | - సంసారం |
| విజ్ఞానుడు అనే బ్రాహ్మణుఁడు | - భగవంతుడు |
| హంసలు | - జీవాత్మ - పరమాత్మలు |
| నీవే నేను; నేనే నీవు | - జీవాత్మ పరమాత్మైక్య కైవల్యస్థితి. |

ఈ కథకు మూలం కృష్ణయజుర్వేదం - **'అహం దేవేభ్యో హవ్యం వహామీతి వాగబ్రవీత్। అహం దేవేభ్య ఇతి మనః' (కృ.యజు.2-5-11-4)**

"నేను దేవతలకు హవ్యం తీసికొని వెళ్ళుతానని వాక్కు పలికింది. 'నేనే ఇస్తానని నని మనస్సు పలికింది." ఇక్కడ వాక్కు, మనస్సు పాత్రలు. ఈ పురంజనోపాఖ్యానాన్ని బట్టి సంస్కృతంలో ఎన్నో ప్రతీకాత్మకనాటకాలు వెలిశాయి.

## ప్రతీకాత్మకనాటకములు

| | | | |
|---|---|---|---|
| 1. | శారీపుత్రప్రకరణం | - | అశ్వఘోషుఁడు (1 శ.) - బౌద్ధమతం |
| 2. | ఆగమాడంబరం | - | జయంతిభట్టు (9 శ.) - పాంచరాత్రప్రామాణ్యం |
| 3. | ప్రబోధచంద్రోదయం | - | శ్రీకృష్ణమిశ్రుడు (11 శ.) - అద్వైతం |
| 4. | మోహపరాజయం | - | యశఃపాలుడు (13 శ.) వేదాంతం |
| 5. | సంకల్పసూర్యోదయం | - | వేదాంతదేశికులు (14 శ.) - విశిష్టాద్వైతం |
| 6. | యతిరాజవిజయం | - | వాత్స్యవరదాచార్యులు (14 శ.) - విశిష్టాద్వైతం |
| 7. | చైతన్యచంద్రోదయం | - | కవికర్ణపూరుడు (16 శ.) - కృష్ణభక్తి |
| 8. | ఉభయగ్రహరాహూదయం | - | శ్రీవిజయీంద్రతీర్థులు (16 శ.) - ద్వైతం |
| 9. | భావనాపురుషోత్తమం | - | రత్నఖేటదీక్షితులు (16 శ.) - భాగవతమతం |
| 10. | శివలింగ సూర్యోదయం | - | చాగంటి మల్లనారాధ్యుడు (17 శ.) - శైవం |
| 11. | ధర్మవిజయం | - | భూదేవశుక్లుడు (17 శ.) |
| 12. | జ్ఞానసూర్యోదయం | - | వాదిచంద్రుడు (17 శ.) - జైనమతం |
| 13. | విద్యాపరిణయం | - | ఆనందరాయమఖి (18 శ.) - శివాద్వైతం |
| 14. | జీవానందనం | - | ఆనందరాయమఖి (18 శ.) - వైద్యశాస్త్రం |
| 15. | అమృతోదయం | - | గోకులనాథోపాధ్యాయుడు (18 శ.) - తర్కశాస్త్రం |
| 16. | అనుమితిపరిణయం | - | నృసింహకవి (18 శ.) - తర్కశాస్త్రం |
| 17. | చిత్తవృత్తికల్యాణం | - | సామరాజదీక్షితులు (18 శ.) - వేదాంతం |
| 18. | జీవన్ముక్తి కల్యాణం | - | సామరాజదీక్షితులు (18 శ.) - వేదాంతం |
| 19. | శ్రీరామచరితం | - | సామరాజదీక్షితులు (18 శ.) - వేదాంతము, భక్తి |
| 20. | వివేకచంద్రోదయం | - | శివకవి (18 శ.) - ధర్మశాస్త్రం |

ప్రబోధచంద్రోదయాన్ని నందిమల్లయ - ఘంటసింగయ కవులు పద్యకావ్యంగా (1470); వడ్డాది సుబ్బరాయకవి నాటకంగా (1893) తెనిగించారు. సంకల్పసూర్యోదయాన్ని రాయదప్ప రంగారావు (1790–1830) గారు పద్యకావ్యంగా రచించారు. జీవానంద నాటకాన్ని ఈశ్వర సత్యనారాయణశర్మగారు (1967) నాటకంగా అనువదించారు.

పోతన మహాకవి గొప్పజ్ఞాని కాబట్టి, క్లిష్టమైన పురంజనోపాఖ్యానాన్ని సులువుగా సుందరంగా ఆంధ్రీకరింప గల్గాడు.

పురంజనుని కథను నారదమహర్షి ప్రాచీనబర్హికి చెప్పాడు. ప్రాచీనబర్హి కొడుకులైన ప్రచేతసులు తపస్సుతో శ్రీమహావిష్ణువును మెప్పించి వరాలు పొంది నారదుని దగ్గర విష్ణుకథలు విని ముక్తి పొందారు. ఉత్తానపాదుని (ధ్రువుని తండ్రి) సోదరుడైన ప్రియవ్రతుడు నారదుని వల్ల విజ్ఞానం పొంది ముక్తు డయ్యాడు.

ఈవిధంగా మైత్రేయుఁడు చెప్పిన విష్ణుమాహాత్మ్యాన్ని విని మునికి నమస్కరించి విదురుఁడు హస్తినాపురం చేరాడు.

## అలంకారయోజనం

**1) క్రమాలంకారం (యథాసంఖ్యం)**

**అనఘతపోఽభిరాముఁడగు నత్రిమునీంద్రుఁడు గాంచెఁ దప్తకాం**
**చనఘనచంద్రికారుచిరచారుశరీరుల; హంసనాగసూ**
**దనవృషభేంద్రవాహుల; సుదార కమండలు చక్రశూలసా**
**ధనుల విరించి విష్ణుపురదాహుల వాక్కమలాంబికేశులన్. (4-16)**

త్రిమూర్తులైన బ్రహ్మ–విష్ణు–మహేశ్వరులు;–బంగారం, మేఘం, వెన్నెల వంటి దేహాలు;– హంస, గరుత్మంతుడు, నంది వాహనాలు;– కమండలం, చక్రం, శూలం సాధనాలు;– సరస్వతి, లక్ష్మి, పార్వతి భార్యలు– గలవారని 'క్రమాలంకారం' చక్కగా నిర్వహింపబడింది.

**2) పరికరాలంకారం**

**సీ. దూర్వాంకురంబుల దూర్వాంకురశ్యాము, జలజంబులను జారుజలజనయను**
**తులసీదళంబులఁ దులసికా దాముని.............................. (4-251)**

ఇది విష్ణుపూజావిధానం. గరికగడ్డివలె నల్లని రంగు గల, విష్ణువును గరికపోచలతో; పద్మనేత్రుని పద్మాలతో; తులసిమాల ధరించువానిని తులసీదళాలతో........ పూజించాలని విశేషణాలన్నీ సాభిప్రాయంగా వాడబడినాయికాబట్టి, 'పరికరాలంకారం'.

**3) యమకం**

**క. మను మనుమని మను మను మని, మనమునఁ దలఁచుచును (4-345)**

**4) అంత్యప్రాసలు**

పోతన సీసపద్యాలకుగల ఎత్తుగీతిపద్యాల చివరిపాదాల్లో అంత్యానుప్రాసనువాడి పద్యాలకు సొగసు తెచ్చాడు -

వినుతసుకృతములకు దండ వెండికొండ (4-134)

వలయు సంపదలందు నావటము వటము (4-137)

భక్తజనపోష! రాజితఫణివిభూష! (4-147)

అయ్య! మాధవ! గోవింద! హరి! ముకుంద!

చిన్మయాకార! నిత్యలక్ష్మీవిహార! (4-171)

చారుతరమూర్తి యీ రాజచక్రవర్తి (4-458)

చారుతరమూర్తి! యో పృథుచక్రవర్తి! (4-484)

భక్తజనలోకమందార! భవవిదూర! (4-555)

భక్తిసేవింపుగుణసాంద్ర! పార్థివేంద్ర! (4-629)

అవ్యయానంద! గోవింద! హరి! ముకుంద! (4-714)

నారదుండు వివేకవిశారదుండు (4-946) మొదలగునవి.

## శాస్త్రపరిచయం

**1) అర్థవాదం**

**వ. అర్థవాదంబులయిన వేదంబులచే నష్టమనీషం గలిగిఁ (4-47)**

'అర్థవాద' మనేది మీమాంసాశాస్త్రంలోని పారిభాషికపదం. 1. విధి 2. అర్థవాదం 3. మంత్రం 4. నామధేయం అని వేదము నాల్గువిధాలు. అర్థవాదాలు నిషిద్ధాలైన వానిని (వెండి దానంచేయడం) తప్పుగా పరిగణిస్తాయి. విధుల్ని (యజ్ఞాలను) ప్రశంసిస్తాయి. అర్థవాదవాక్యాలకు స్వార్థంలో తాత్పర్యంఉండదు.

**'వాయుర్వై క్షేపిష్ఠా దేవతా'** వాయువు శీఘ్రగామియైన దేవత అంటే, - 'ఐశ్వర్యాన్ని కోరేవాడు, వాయుదేవతను ఉద్దేశించి యజ్ఞం చేస్తే ఫలితాన్ని వెంటనే పొందుతాడని భావం.

## (2) యోగశాస్త్రం

**సీ. కోరి మడమలచే గుదపీడనము చేసి, పూని ముక్తాసనాసీనుఁడగుచుఁ**
**దనరు మూలాధారముననుండి వాయువు, నొయ్యన నెగయించి యొనరనాభి.... (4-653)**

ఈ పద్యంలో యోగాభ్యాసం చెప్పబడింది.

**(3) పంచభూతలయీకరణం**

**..................................ప్రాణముల్ విడిచియా పవనుఁ బవను**
**నందు నాకాశ మాకాశమందుఁ దేజ, మందుఁ దేజంబు నుదకంబు నందు నుదక**
**మర్థిఁ గాయంబు మేదిని యందుఁ గలిపెఁ బూని వాని యథోచితస్థానములుగ (4-653)**

**వ. మఱియు భూమి నుదకంబునందు, నుదకంబును దేజంబునందు... (4-654)**

మన దేహంలోని పంచభూతాలను, ప్రకృతిలోని పంచభూతాలతో కలపడం యోగులకే సాధ్యం. పృథుచక్రవర్తి మహాయోగి.

**(4) సహగమనం**

ప్రాచీనకాలంలో సతీసహగమనం ఆచారంగా ఉండేది. పృథుచక్రవర్తి భార్య 'అర్చి' సహగమనం చేసినట్లు భాగవతంలో చెప్పబడింది (4-657.... 662),

పాండ్యరాజు భార్య వైదర్భి సహగమనాని కుద్యుక్తురాలై విజ్ఞానసఖునిచే నివారింపబడినట్లు (4-845...851) చెప్పబడింది. ఈ దురాచారం సంఘసంస్కర్తయైన రాజారామమోహనరాయలచే రూపుమాపబడింది.

**ప్రయోగవిశేషాలు**

**1) అశేషజగత్పరికీర్తనీయ 'కీర్తీ' విభవప్రశస్తసుచరిత్రుఁడు (4-263)**

కీర్తిశబ్దం ఇకారాంతం. ఈకారాంతశబ్దంలేదు. 'అశేషజగత్పరికీర్తనీయకీర్తీ!' యని ఉత్తానపాదునికి సంబోధనం చేస్తే దోషం లేదు. అప్పుడు ధ్రువుఁడు విభవప్రశస్తసుచరిత్రుడవుతాడు.

**2) భూరి యమంగళభూతమాయారూపములను (4-524)**

'భూరి యమంగళ' అనేచోట విసంధి. 'భూర్యమంగళ' అని ఉండవలెను. అన్ని ప్రతుల్లో పాఠమిట్లే ఉంది. 'ఉపరి' (మీద) శబ్దం లాగా, 'భూరి' (అధికం) శబ్దం అవ్యయంగా భావించి పోతన ప్రయోగించిఉంటారు.

**సంస్కృతభాషాపద్యములు**

పోతన చతుర్థస్కంధములో4 సంస్కృతభాషాపద్యాలు రచించాడు.

**సీ. పఙ్కజనాభాయ సఙ్కర్షణాయ శాన్తాయ (4-702)**

**సీ. స్వర్గాపవర్గసుద్వారాయ సర్వరసాత్మనే (4-703)**

**సీ. సర్వసత్త్వాయ దేవాయ సన్నియామకాయ (4-704)**

**సీ. తోయరుహోదరాయ భవదుఃఖహరాయ నమోనమః (4-920)**
**వీరభద్రవిజయములోఁ గూడ (3-236.... 239) (4-217)**

ఐదు సంస్కృతపద్యాలు రచించాడు. సంస్కృతంలో తెలుగులో కూడ సమానంగా కవిత్వం చెప్పగల 'ఉభయకావ్యకరణదక్షుడు' పోతనమహాకవి.

## ఛందోవిశేషములు

**'కవిరాజవిరాజిత' అనే విశేషవృత్తం ఈ స్కంధంలో ఉంది. అరయఁగ వైన్యుని దక్షిణహస్తము-నందు రమారమణీసుమనో. (4-439)**

'ప్రతిరస షడ్యతి రా నముషడ్జ్వలు రాఁ గవిరాజవిరాజితమౌ', అని చిత్రకవిపెద్దన లక్షణసారసంగ్రహం. కవిరాజవిరాజితంలో ప్రతిపాదంలో (న-జ-జ-జ-జ-జ-జ-వ) గణాలుంటాయి. కొందఱు లాక్షణికులు 8-14-20 స్థానాలలో మూడు యతుల్ని చెప్పారు. కొందరు లాక్షణికులు పద్నాల్గవ స్థానంలో ఒకయతినే నియమించారు. నన్నయ, పోతన, అల్లసానిపెద్దన మొదలైనవారు పద్నాల్గవచోట ఒక యతినే వాడారు. తిక్కనగారు రెండు విధాలుగాను పద్యాలు రచించారు.

## సీసపద్యశిల్పం

పోతన చతుర్థస్కంధంలో అనేకగతులతో సీసపద్యాలను నడిపారు.

సీ. **తనరారు నవరత్నతాటంకరోచులు, చెక్కుటద్దములతోఁ జెలిమిసేయ.... (4-58)**

ఈ పద్యంలో నాలుగు పాదాల చివర - 'చెలిమిసేయ'; 'ఆవరింప'; 'మేలమాడ'; 'ప్రబ్బికొనఁగ' అని క్రియాపదాలు వాడాడు.

సీ. **మానితశ్యామాయమానశరీరదీ, ధితులు నల్దిక్కుల దీటుకొనఁగ (4-163)**

ఈ పద్యంలో నాల్గుపాదాల చివర - 'దీటుకొనఁగ'; 'చెలిమిసేయ'; 'వన్నెసూప'; 'మేలమాడ' అని క్రియాపదాలు వాడాడు. ఇది శ్రీనాథకవిసార్వభౌముని పద్ధతి.

సీ. **హారకిరీటకేయూరకంకణ, ఘన, భూషణుం డాశ్రితపోషణుండు**
**లాలితకాంచీకలాపశోభితకటిమండలుం డంచితకుండలుండు (4-249)**

ఈ పద్యంలో సీసపద్యంలోని రెండవఖండంలో అనుప్రాసం వేశాడు. ఇది ఒకవిధమైన చమత్కారం.

సీ. **ధాతువిచిత్రితోదాత్తరత్నప్రభా, సంగతోజ్జ్వలతుంగశృంగములను (134)**

సీ. **స్వర్గపరిచ్ఛదస్వచ్ఛకుడ్యద్వార, లాలితగోపురాట్టాలకంబు (315)**

సీ. **కాంచనమయమరకతకుడ్యమణిజాల, సంచయరాజితసౌధములను (319)**

మొదలైన సీసపద్యాల్లోని పాదాలన్నీ ఏకసమాసంతో సాగాయి.

**క. లలితాయతాష్టభుజమం, డలమధ్యస్ఫురితరుచివిడంబితలక్ష్మీ**
**లలనాకాంతిస్పర్ధా, కలిత లసద్వైజయంతికాశోభితుఁడున్. (4-903)**

ఈ కందపద్యమంతా ఏకసమాసం.

## ప్రాచీనకవుల అనుకరణాలు

**1) కాళిదాసు - పోతన**

**శ్లో. ప్రజానామేవ భూత్యర్థం స తాభ్యో బలి మగ్రహీత్ ।**
**సహస్రగుణముత్స్రష్టు మాదత్తే హి రసం రవిః ॥ (రఘు.1-18)**

**కం. జనవినుత! భూమివలనను, ధనముల మర్యాదఁ గొనుచు దాననిమిత్తం**
**బునఁ గ్రమ్మఱఁ దానిచ్చుచు, దిననాయకుఁ బోలి వసుమతీసతి యొప్పెన్ (4-641).**

**2) నాచనసోమన - పోతన**

**చ. చతురవచోవిలాసగుణసాగర! సాగరమేఖలావనీ. (ఉత్తరహరి.1-64)**

**చ. సరసవచోవిలాసగుణసాగర! సాగరమేఖలామహీ. (4 స్క.974)**

పోతన పూర్వకవుల్ని అనుసరించడంకంటే దన పద్యాలను, గద్యాలను, భావాలను తానే ఎక్కువగా అనుకరించుకొనే స్వభావం గలవాడు.

**వ. అది మఱియును మందార పారిజాత సరల తమాల సాల తాల తక్కోల కోవిదార శిరీషార్జున చూత కదంబ నీప నాగ పున్నాగ... (4-135)**

సరిగా ఇటువంటి గద్యాన్ని గజేంద్రమోక్షంలో రచించాడు.

**వ. అది మఱియును మాతులుంగ లవంగ లుంగ చూత కేతకీ భల్లాతి**
**కామ్రాతక సరళ పనస బదరీ వకుళ మంజుళ..... (8-24)**

**తే.గీ. వినుతగుణశీల! మాటలువేయునేల? (3-1033)** అని తృతీయస్కంధంలో వాడాడు.

**తే.గీ. వినుతగుణశీల! మాటలువేయునేల? (4-365) (4-490)**

అని ఈ స్కంధంలో రెండుసార్లు వాడాడు. సప్తమస్కంధంలో (7-150) మరలవాడాడు.

## పోతన ననుకరించిన కవులు

**పోతన-నందితిమ్మన**

**చ. అరదము డిగ్గి ప్రేమ దొలఁకాడ ససంభ్రముఁడై (4 స్క.307)**

**చ. అరదము నెక్కి కేతనపటాంచలచంచలమైన (పారి.1-104)**

## సంస్కృతవాక్యానుకరణములు

**1) నమో నమో దయావననిధయే (4-168)**

**2) అయష్టవ్య మదాతవ్య మహోతవ్యం విప్రాః (4-413)**

**3) పుత్రేణ లోకాన్ జయతి (4-594)**

**4) ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి (4-624) మొదలైనవి.**

## సాధుపాఠనిర్ణయం

**1) తే.గీ. అలఘుమతిఁ బూర్ణిమావాస్యలందు మఱియు (4-382)**

అని తంజనగరం, వావిళ్ళ ప్రతులు. (వేళ) **లను సినీవాలిపూర్ణిమలందు మఱియు** (అకాడమీప్రతి). ఈ పాఠం సరైనది. అఖండయతి పోతనకు సమ్మతమే.

**2) తే.గీ. ఆత్మవ్యతిరిక్తవస్తువులందు వీత (4-619)**

అని తంజనగరం, వావిళ్ళ ప్రతులు. ఈ పాఠంలో సంయుక్తాక్షరానికి ముందున్న 'త్మ' గురువు అవుతుంది. **కన్యములగు వానియందు వీత.** అకాడమీప్రతిపాఠం సాధువు.

**3) సీ. సోమరూపాయ తేజోబలాఢ్యాయ స్వ**
**యం జ్యోతిషే 'దురంతాయ' కర్మ. (4-702)**

అని అకాడమీప్రతి పాఠం. యతిభంగం. 'దురంత్యాయ' తంజనగరం పాఠం. 'దురన్యాయ' - వావిళ్ళపాఠం. ఈ రెండు పాఠాలలోను యతి సరిపోయింది. అందువల్ల ఇవి సాధుపాఠాలు. దుర్+అన్యః= దురన్యః, దుష్టులకు అన్యుఁడైన వాఁడు. దురన్యాయ - చతుర్థీవిభక్తి. శిష్టులకు సహాయుడైన వాడని భావం. ఈ విధంగా చతుర్థస్కంధంలో అనేక శాస్త్రవిషయాలున్నాయి.

విజయవాడ
07-01-2017

ఇట్లు
సకలసుకవిబుధజనవిధేయుడు
**గరిమెళ్ళ సోమయాజులు శర్మ**

# పంచమస్కంధ ప్రాశస్త్యం

సంస్కృతభాగవతంలోని పంచమస్కంధం చంపూగ్రంథం. దీనిలో భూగోళ-ఖగోళశాస్త్రవిషయాలు ఎక్కువగా ఉండటంచేత శ్రీవ్యాసమహర్షి పద్యాలతోపాటు గద్యాలనుకూడా ఎక్కువగా ఉపయోగించాడు.

పోతనభాగవతంలోని పంచమస్కంధంలోగల శిథిలభాగాలను పూరించిన పుణ్యాత్ముఁడు బొప్పరాజు గంగనామాత్యుఁడు.

ప్రియవ్రతునిచరిత్రం, ఋషభావతారం, జడభరతోపాఖ్యానం, భూగోళనిర్ణయం, ఖగోళశాస్త్రం, నరకలోకవర్ణనం-పంచమస్కంధంలోని ప్రధానవిషయాలు.

## ప్రియవ్రతచరిత్ర

శతరూపా స్వాయంభువుల పెద్దకొడుకు ప్రియవ్రతుడు. ఇతడు గొప్పవిష్ణుభక్తుడు. నారదమహర్షిదగ్గర అధ్యాత్మవిద్య నేర్చుకొన్నాడు. బ్రహ్మ వచ్చి, రాజ్యం చేయుమని ఆదేశించాడు. ప్రియవ్రతు డంగీకరించాడు. స్వాయంభువుడు ప్రియవ్రతునికి పట్టాభిషేకంచేసి రాజ్యం అప్పగించారు. ప్రియవ్రతునిభార్య విశ్వకర్మ కూతురైన బర్హిష్మతి. ఈ దంపతులకు 1. ఆగ్నీధ్రుడు 2. ఇధ్మజిహ్వుడు 3. యజ్ఞబాహువు 4. మహావీరుడు 5. హిరణ్యరేతసుడు 6. ఘృతపృష్ఠుడు 7. సవనుడు 8. మేధాతిథి 9. వీతిహోత్రుడు 10. కవి అనే పది మంది కొడుకులు; ఊర్జస్వతి అనే ఒక్క కూతురు జన్మించారు. ప్రియవ్రతునికి మరో భార్యవల్ల 1. ఉత్తముడు 2. తామసుడు 3. రైవతుడు అనే కుమారులు పుట్టారు. ప్రియవ్రతు డెక్కిన రథం నడచినమార్గాలు సప్తసముద్రాలు, సప్తద్వీపాలైనాయి. ప్రియవ్రతుడు తన కూతురైన ఊర్జస్వతిని శుక్రుని కిచ్చి వివాహం చేశాడు. వీరికి దేవయాని పుట్టింది. ప్రియవ్రతుని తరువాత 'ఆగ్నీధ్రుడు' రాజయ్యాడు. అతడు మందరపర్వతం సమీపంలో తపస్సు చేస్తూ 'పూర్వచిత్తి' అనే అప్సరసను చూచాడు.

క. **సతి! నీవెవ్వతె వీ ప,ర్వతమునకే మేనిఁ గోరి వచ్చిన వనదే**
**వతవో? శారదవో? రతి, పతి పంచిన మాయవో? తపస్సారమవో? (27)**

క. **పొంకములగు కుచములపైఁ, గుంకుమపంకంబుఁ బూసికొని, వాసనలం**
**గొంకక వెదచల్లెడు నీ బింకంబగు చన్నుదోయి పెంపో! సొంపో! (34)**

అని సంభాషించి యామెను వివాహం చేసుకొన్నాడు. ఇక్కడ శృంగారరసం చక్కగా పోషింపబడింది.

ఈ దంపతులకు 1. నాభి 2. కింపురుషుడు 3. హరివర్షుడు 4. ఇలావృతుడు 5. రమ్యకుడు 6. హరిణ్మయుడు 7. కురువు 8. భద్రాశ్వుడు 9. కేతుమాలుడు అనే తొమ్మిది మంది పుత్రులు పుట్టారు.

1. నాభిభార్య మేరుదేవి 2. కింపురుషునిభార్య ప్రతిరూప 3. హరివర్షునిభార్య ఉగ్రదంష్ట్ర 4. ఇలావృతునిభార్య లత 5. రమ్యకునిభార్య రమ్య 6. హిరణ్మయునిభార్య శ్యామ 7. కురునిభార్య నారి 8. భద్రాశ్వునిభార్య భద్ర 9. కేతుమాలునిభార్య దేవవీతి.

నాభి అనేకయజ్ఞాలు చేశాడు. నిత్యం శ్రీవిష్ణుమూర్తిని భక్తితో పూజించేవాడు. విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. విష్ణునివంటి కుమారుడు కావలెనని నాభి ప్రార్థించాడు. విష్ణువు, అంగీకరించాడు. మేరుదేవీనాభులకు విష్ణువు సుతుడై జన్మించాడు. ఏకవింశతి అవతారాల్లో (21) ఎన్మిదవ అవతారం ఋషభుడు. ఋషభు దేలిన దేశం–అజనాభం. ఋషభునిభార్య జయంతి. వీరి కుమారుడు భరతుడు. భరతుడు పాలించడంవల్ల మనదేశానికి భరతవర్షం, భరతఖండం, భారతదేశ మనే పేర్లుఏర్పడ్డాయి.

## భరతోపాఖ్యానం

భరతునిభార్య పంచజని. ఈ దంపతులకు 1. సుమతి 2. రాష్ట్రభృత్తు 3. సుదర్శనుడు 4. ఆచరణుడు 5. ధూమ్రకేతువు – అని ఐదు మంది పిల్లలు పుట్టారు. భరతు డొకనాడు గండకీనదిలో స్నానం చేసి నీటిలో నుండి ఓంకారజపం చేస్తూండగా, అదే సమయంలో కడుపుతో నున్న ఒక ఆడుజింక నదిలో దిగి నీళ్ళు తాగుతూ ఉండింది. ఆ సమయంలో ఒక సింహం పెద్దగా గర్జించింది. ఆడుజింక భయపడి ఎగిరింది. కడుపులో నున్న జింకపిల్ల నీళ్ళలోపడింది. భరతుడు దయామయుడై ఆ జింకపిల్లను తన ఆశ్రమానికి తీసుకొని వచ్చి పెంచాడు. ఆ పెంపుడుజింకపై భరతునికి మక్కువ ఎక్కువయింది. పెద్దదయ్యేకొద్దీ దానితో ఆడుకోసాగాడు.

**చ.  గుఱువులు వాఱి బిట్టుఱికి కొమ్ములఁ జిమ్ముచు నంతనంత ద**
**గ్గఱచును గాలు ద్రవ్వుచు నఖంబుల గీఱుచు గాసిచేయుచున్**
**ఒఱగుచు ధారుణీశ్వరునియూరువులన్ శయనించి యంతలో**
**నఱకడ మెక్కుచుం బొదవి యాడుచు నా హరిణంబు లీలతోన్ (5-1-106)**

ఒకనాడు ఆ జింకపిల్ల ఆశ్రమం విడిచి ఎక్కడికో పోయింది. భరతుడు దానికోసం బెంగపెట్టుకొన్నాడు. కొన్నాళ్ళకు తిరిగి వచ్చింది. భరతుడు సంతోషించి, దానితో కాలం గడుపసాగాడు. భరతునకి అంత్యకాలం సమీపించింది. ఆ జింకపై దృష్టి పెట్టుకొని మరణించాడు. మరణించేటప్పుడు దేనిపై జీవునికి ధ్యాస ఉంటుందో ఆ జన్మమే వస్తుంది. భరతుడు తరువాతిజన్మలో జింకగా పుట్టాడు. పూర్వజన్మస్మృతి కలిగింది. మోక్షానికి దూరమయ్యానే అని దుఃఖించాడు. పులస్త్యపులహాశ్రమంచేరి నదిలో స్నానం చేసి, చనిపోయాడు. ఆ తరువాతి జన్మలో ఆంగిరసుడను బ్రాహ్మణునికి పుత్రుడై పుట్టాడు. పూర్వజన్మపరంపరలు జ్ఞాపకం చేసుకొంటూ ప్రపంచంతో సంబంధం లేకుండ పిచ్చివానిలాగా, జడునిలాగా, చెవిటివానిలాగా తిరుగసాగాడు. అతణ్ణి బంధువులు వ్యవసాయంలో నియమించారు. పొలానికి కాపలా కాస్తూ – ఊక, తవుడు, తెలికపిండి, పొట్టు, మాడిన అన్నం తింటూ కాలక్షేపం చేయసాగాడు. ఆ పట్టణంలోని వృషలపతి సంతానంకోసం కాళికాదేవికి బలిపశువుగా భరతుణ్ణి తీసికొని వెళ్ళి గుడిలో చంపడానికై కత్తి ఎత్తాడు. అప్పుడు భద్రకాళి వృషలపతిని భృత్యులను చంపింది. భరతుడు చంపవచ్చినవారిని,

కత్తిని, కాళికాదేవినీ విష్ణుస్వరూపులుగా భావించి, ధ్యానించాడు. భరతుడు కాళికాదేవి గుడినుండి వచ్చి, మరల చేను కాయసాగాడు.

సింధుదేశపురాజైన రహూగణుఁడు – భరతుడు ఉండే ఇక్షుమతీనదిఒడ్డున కపిలుని దగ్గఱకు తత్త్వజ్ఞానం తెలుసుకోవడానికై పల్లకిపై పోతుండగా బోయలు భరతునిచే శిబిక మోయించారు. భరతునికి పల్లకీ మోసే అలవాటు లేక ఎగుడుదిగుడుగా నడవసాగాడు. రాజు బోయీలపై కోపింపగా వారు భరతుణ్ణి చూపి 'వీడు సరిగా పల్లకి మోయడం లేదని" చెప్పారు. రహూగణుడు భరతుణ్ణి నిందించాడు. అప్పుడు భరతుడు "శిబికాభారం శరీరానికే కాని నాకు లే" దని బదులుచెప్పాడు. భరతుడు వేదాంతవాక్యాలు పలుకసాగాడు. ఆ రాజు పల్లకి దిగి భరతునికి నమస్కరించాడు. భరతునికి – రహూగణునికి సంభాషణ జరిగింది. భరతుడు తత్త్వజ్ఞానం నూరిపోశాడు. ఆ రాజుకూడ జ్ఞానియై మోక్షాన్ని పొందాడు. బ్రాహ్మణకుమారరూపంలో ఉన్న భరతుడు శ్రీమన్నారాయణుని ధ్యానించి కైవల్యం పొందాడు.

భరతుడు ఇన్ని జన్మా లెత్తడానికి ప్రపంచసంబంధం కారణం కాబట్టి, ముక్తిని కోరేవారు ప్రాపంచికబంధాలైన వాటిని విడిచి పెట్టాలి.

మన పురాణాలన్నీ విజ్ఞానసర్వస్వాలు. ఇవి చెప్పనిశాస్త్రాలు లేవు. ఈ పంచమస్కంధంలో భూగోళాన్ని గూర్చి, ఖగోళాన్ని గూర్చి విరివిగా చెప్పబడ్డాయి. ద్వీపాలు, పర్వతాలు, సముద్రాలు, గ్రహాలు, నక్షత్రాలు, రాసులు, వీటి పరిమాణం యోజనాలలో చెప్పబడ్డాయి.

## భూగోళశాస్త్రం

**1. ద్వీపాలు**

1. జంబూ 2. ప్లక్ష 3. శాల్మలీ 4. కుశ 5. క్రౌంచ 6. శాక 7. పుష్కరాలు.

**2. వర్షాలు**

1. ఇలావృత 2. రమ్యక 3. హిరణ్మయ 4. కురు 5. హరి 6. కింపురుష 7. భారత 8. కేతుమాల 9. భద్రాశ్వ 10. పురోజవ 11. మనోజవ 12. వేపమాన 13. ధూమ్రానీక 14. చిత్రరథ 15. బహురూప 16. విశ్వచారములు.

**3. పర్వతాలు**

1. మేరు 2. నీల 3. శ్వేత 4. శృంగ 5. నిషధ 6. హేమకూట 7. హిమవత్ 8. మాల్యవత్ 9. గంధమాదన 10. మందర 11. కుముద 12. కురంగ 13. కురర 14. కుసుంభ 15. వైకతంక 16. త్రికూట 17. శిశిర 18. పతంగ 19. రుచక 20. శితివాస 21. కపిల 22. శంఖ 23. పారియాత్ర 24. కైలాస 25. కరవీర 26. త్రిశృంగ 27. మకర 28. మలయ 29. మంగళప్రస్థ 30. మైనాక 31. ఋషభ 32. కూటర 33. కోల్లక 34. సహ్య 35. వేదగిరి 36. ఋశ్యమూక 37. శ్రీశైల 38. వేంకటాద్రి 39. మహేంద్ర 40. వారిధర

41. వింధ్య 42. శుక్తిమత్ 43. ఋక్షగిరి 44. పారియాత్ర 45. ద్రోణ 46. చిత్రకూట 47. గోవర్ధన 48. రైవతక 49. కుకుంభ 50. నీలగిరి 51. కాకముఖ 52. ఇంద్రకీల 53. రామగిరి 54. మణికూట 55. వజ్రకూట 56. ఇంద్రసేన 57. జ్యోతిష్మత్ 58. ధూమ్రవర్ణ 59. హిరణ్యగ్రీవ 60. మేఘమాల 61. స్వరస 62. శతశృంగ 63. వామదేవ 64. ముకుంద 65. పుష్పవర్ష 66. శతస్మృతి 67. బభ్రు 68. చతుఃశృంగ 69. కపిల 70. దేవానీక 71. ఊర్ధ్వరోమ 72. ద్రవిణ 73. క్రౌంచ 74. శుక్ల 75. వర్ధమాన 76. భోజన 77. ఉపబర్హణ 78. ఆనంద 79. నందన 80. సర్వతోభద్ర 81. ఈశాన 82. ఉరుశృంగ 83. బలభద్ర 84. శతకేసర 85. సహస్రస్రోతో 86. దేవపాల 87. లోకాలోకాలు – మొదలైనవి.

**సముద్రాలు**

1. క్షార (ఉప్పు) 2. ఇక్షు (చెఱకురసం) 3. సురా (కల్లు) 4. ఆజ్య (నెయ్యి) 5. క్షీర (పాలు) 6. దధి (పెరుగు) 7. ఉదక (నీళ్ళు) సముద్రాలు.

**నదులు**

1. జంబూ 2. గంగా 3. సీతా 4. చక్షుస్సు 5. భద్రా 6. అలకనందా 7. చంద్రపటా 8. తామ్రపర్ణీ 9. అవటోదా 10. కృతమాలా 11. వైహాయసీ 12. కావేరీ 13. వేణీ 14. పయస్వినీ 15. పయోదా 16. శర్కరావర్తా 17. తుంగభద్రా 18. కృష్ణవేణీ 19. భీమరథీ 20. గోదావరీ 21. నిర్వింధ్యా 22. పయోష్ణీ 23. తాపీ 24. రేవా 25. శిలా 26. సురనదీ 27. చర్మణ్వతీ 28. వేదస్మృతి 29. ఋషికుల్యా 30. త్రిసమా 31. కౌశికీ 32. మందాకినీ 33. యమునా 34. సరస్వతీ 35. దృషద్వతీ 36. గోమతీ 37. సరయూ 38. భోగవతీ 39. సుషమా 40. శతద్రూ 41. చంద్రభాగా 42. మరుద్వృధా 43. వితస్తా 44. అసిక్నీ 45. విశ్వా 46. అరుణా 47. సృమణా 48. ఆంగిరసీ 49. సావిత్రీ 50. సుప్రభాతా 51. ఋతంభరా 52. సత్యంభరా 53. అనుమతీ 54. సినీవాలీ 55. కుహూ 56. రజనీ 57. నందా 58. రాకా 59. రసకుల్యా 60. మధుకుల్యా 61. శ్రుతవిందా 62. మిత్రవిందా 63. దేవగర్భా 64. ఘృతచ్యుతా 65. మంత్రమాలా 66. అభయా 67. అమృతౌఘా 68. ఆర్యకా 69. తీర్థవతీ 70. తృప్తిరూపా 71. పవిత్రవతీ 72. శుక్లా 73. అనఘా 74. ఆయుర్దా 75. ఉభయస్పృష్టి 76. అపరాజితా 77. పంచపదీ 78. సహస్రస్మృతి 79. నిజధృతులు – మొదలైనవి.

ఆధునికభూగోళశాస్త్రజ్ఞులు సప్తద్వీపాలను, సప్తసముద్రాలను గూర్చి యిలా చెబుతున్నారు.

| | | | |
|---|---|---|---|
| 1. | జంబూద్వీపం | – | ఆసియాఖండం (Asia) |
| | క్షార సముద్రం | – | హిందూమహాసముద్రం (Indian ocean) |
| 2. | ప్లక్షద్వీపం | – | ఆసియామైనర్ (Asia Minor) |
| | ఇక్షుసముద్రం | – | ఎఱ్ఱనల్లసముద్రాలు (Red sea & Black sea) |

| | | | |
|---|---|---|---|
| 3. | శాల్మలీద్వీపం | – | ఆఫ్రికా ఖండం (Africa) |
| | సురాసముద్రం | – | మధ్యధరా సముద్రం (Mediterranean) |
| 4. | కుశద్వీపం | – | ఐరోపాఖండం (Europe) |
| | ఘృతసముద్రం | – | ఆర్కిటిక్ సముద్రం (Arctic ocean) |
| 5. | క్రౌంచద్వీపం | – | ఉత్తర అమెరికా (North America) |
| | దధిసముద్రం | – | అట్లాంటిక్ సముద్రం (Atlantic ocean) |
| 6. | శాకద్వీపం | – | దక్షిణ అమెరికా (South America) |
| | క్షీరసముద్రం | – | శాంతమహాసముద్రం (Pacific ocean) |
| 7. | పుష్కరద్వీపం | – | ఆస్ట్రేలియా మొదలైన దీవులు (Australia) |
| | శుద్ధజలసముద్రం | – | అంటార్కిటిక్ సముద్రం (Antarctic) |

(కందూరి ఈశ్వరదత్తు – ప్రాచీనాంధ్రచారిత్రకభూగోళము, పుటలు 4, 5)

## ఖగోళశాస్త్రం

నవగ్రహాలు, వాని స్థితిగతులు, పరిమాణం, దూరం, నక్షత్రాలు, సంవత్సరభేదాలు, సంవత్సరమాసాలు చెప్పబడ్డాయి.

మొసలిఆకారంలో నున్న శింశుమారచక్రానికి (ధ్రువస్థానం) 1. ముఖం – కుజుడు 2. గుహ్యం – శని 3. మేఢ్రం – గురుడు 4. వక్షఃస్థలం – సూర్యుడు 5. నాభి – శుక్రుడు 6. మనస్సు – చంద్రుడు 7. ప్రాణాపానాలు – బుధుడు 8. సర్వాంగాలు – కేతువు 9. కంఠం – రాహువు

ఈ గ్రహాలు తిరగడంవల్లనే కాలం ఏర్పడుతూఉంది.

చంద్రుడు శీఘ్రగమనం గలవాడు. శని మందగమనం గలవాడు. ఈ గ్రహాలన్నీ నక్షత్రమార్గంలో సంచరిస్తాయి.

1. చంద్రు డొక్కొక్క రాశిలో రెండున్నర దినాలుంటాడు. అశ్విని (మేషం)తో మొదలైన చంద్రుడు రేవతి (మీనం) దాక రావడానికి ఒక నెల పడుతుంది. అందువల్లనే చంద్రునికి 'నెల' యని పేరు. చంద్రునిబట్టి తిథులు, నక్షత్రాలు ఏర్పడతాయి. ఇది చాంద్రమానం

2. సూర్యు డొక్కొక్క రాశిలో ఒక నెల ఉంటాడు. పన్నెండు రాసులు తిరగడానికి ఒక సంవత్సరం పట్టుతుంది. సూర్యుణ్ణిబట్టి సంక్రాంతు లేర్పడతాయి. ఇది సౌరమానం.

3. బుధుడు, శుక్రుండు ఒక్కొక్క రాశిలో ఒక నెల ఉంటారు. పన్నెండు రాసులు తిరగడానికి ఒక సంవత్సరం పట్టుతుంది.

4. కుజు డొక్కొక్క రాశిలో ఒకటిన్నర నెలలుంటాడు. పన్నెండురాసులు తిరగడానికి పద్దెనిమిది నెలలు పట్టుతుంది.

5. గురు డొక్కొక్కరాశిలో ఒక సంవత్సరం ఉంటాడు. పన్నెండురాసులు తిరుగడానికి పన్నెండు సంవత్సరాలు పట్టుతుంది. గురునివల్ల పుష్కరా లేర్పడుతాయి. ఇది బార్హస్పత్యమానం.

6. రాహు-కేతువు లొక్కక్క రాశిలో ఒకటిన్నరసంవత్సరాలుంటారు. వీరి సంచారాన్నిబట్టి గ్రహణా లేర్పడుతాయి.

7. శని ఒక్కొక్కరాశిలో రెండున్నరసంవత్సరాలుంటాడు. శనిగతినిబట్టి ఏలినాటి శని మొదలైనవి ఏర్పడుతాయి.

సూర్యుడు మొదలైన ఏడుగ్రహాలు మేషం నుండి వృషభం ఈ విధంగా సవ్యంగా గడియారం తిరిగేటట్లు తిరుగుతారు. రాహు-కేతువు లిద్దరుమాత్రం మేషం, మీనం, కుంభం ఈ విధంగా అపసవ్యంగా తిరుగుతారు.

ఈ భూగోళ - ఖగోళశాస్త్రాలు భాగవతంలో భౌతికవిజ్ఞానానికై చెప్పబడలేదు. విశ్వమంతా విష్ణుని విరాడ్విగ్రహమని భావించి, ధ్యానించడానికై ఉపదేశించబడింది.

## ప్రయోగ విశేషాలు

**1. అలంకార విశేషం**

**క. అట్లె వివాహితుండై యా పంచజని వలన నహంకారంబునం బంచ తన్మాత్రలు జనించిన తెఱంగున**

1. సుమతి 2. రాష్ట్రభృత్ 3. సుదర్శన 4. ఆచరణ 5. ధూమ్రకేతువులనే నేవురు పుత్త్రులం బుట్టించె. (5-1-93) భరతునకు బంచజనియందు ఐదుగురు కొడుకులు పుట్టారు. వారు అహంకారంలో 1. శబ్ద 2. స్పర్శ 3. రూప 4. రస 5. గంధాలు పుట్టినట్లు పుట్టారట! ఇక్కడ భాగవతకవి లౌకికోపమల్ని గ్రహించకుండా శాస్త్రోపమ చెప్పాడు. సామాన్యకవి కిది సాధ్యం కాదు.

**2. ఛందో విశేషం**

**ఉ. అచ్చుట విప్రసూనుఁడు - వచ్చినవారి - అచ్యుతభావము - మచ్చిక (5-1-137)**

ఈ పాఠంలో - 'చ్చ-చ్య' ప్రాసఉంది. **'అచ్చుత భావ'** మని కాని, **'అచ్చుతు భావ'** మని కాని, కవి ప్రయోగించి ఉంటాడు.

అచ్యుతుడు - ప్రకృతి. అచ్చుతుడు - వికృతి.

**ఉ. వచ్చి ప్రభాసతీర్థవనవాటి కడన్ విడి ప్రాణమిత్రుఁడా**
**యచ్చుతుఁ బిల్వఁబంప...(తాలాంకనందినీ పరిణయము 1-226)**

అని ఆసూరి మరింగంటి వేంకటనరసింహాచార్య కవి ప్రయోగం.

**3. వ్యాకరణవిశేషం**

క. ఇ ట్లకుతోభయంబుఁ చిత్ర్యంబు నైన రాజ్యంబు నొల్లక. (5-2-115) అకుతోభయము= దేనివలన కూడా భయంలేనిది. ఇది మయూరవ్యంసకాది (పాణిని-2-1-72) సమాసం. **'నాస్తి కుతోభయం యస్య సోఽకుతో భయః'** - అని సిద్ధాంతకౌముది.

**4. సామెత**

క. నీఱు గప్పిన నిప్పునుంబోలె (5-1-142)

నీఱు= బూడిద

పంచమస్కంధం చివర నరకలోక వర్ణనం, యమకింకరులు పాపుల్ని పెట్టే, బాధలు విస్తారంగా వర్ణింపబడ్డాయి.

బుద్ధిమంతుడైనవాడు పుణ్యాలు చేస్తూ భగవంతుని స్మరించాలి గాని, నాస్తికుడై పాపాలు చేయకూడదని పంచమస్కంధంయొక్క ఉపదేశం.

సంస్కృత భాగవతంలో దేవతామంత్రా లెక్కువగా ఉన్నాయి. ఇది గురువు దగ్గఱ ఉపదేశం పొంది, జపింపవలసిన రహస్యమంత్రాలు కాబట్టి, పోతన (గంగన) తెనిగింపలేదు. ఇది తిక్కనగారిపద్ధతి.

## బొప్పరాజు గంగన

'ఇది సకలసుకవిజనానందకరబొప్పనామాత్యపుత్త్రగంగనార్య ప్రణీతంబైన శ్రీమహాభాగవత పురాణంబునందు... పంచమస్కంధంబునందు ద్వితీయాశ్వాసము' - అను స్కంధాంత గద్యాన్ని బట్టి ఈ స్కంధాన్ని గంగనార్యుడు రచించినట్లు తెలుస్తోంది. ఈ కవి తండ్రి బొప్పనామాత్యు డనే సంగతి తప్ప కవినిగూర్చి ఇంక ఇతర విషయలేవీ తెలియడం లేదు. ఇతడు కూడ వెలిగందల నారయలాగా పోతనామాత్యుని శిష్యుడు కావచ్చు.

## గ్రంథపాతం - శిథిల పూరణాలు

నందిమల్లయ - ఘంటసింగయ అనే జంటకవులు షష్ఠస్కంధాన్ని రచించి, చిక్క తిమ్మరాజుకు అంకిత మిచ్చారు. పోతనభాగవతాన్ని పాషండులు ధ్వంసం చేసినట్లు వీరు చెప్పారు.

**శా. చండాంశుప్రభ! చిక్క తిమ్మయతనూజా! తిమ్మ! విధ్వస్తపా**
**షండంబైన త్రిలింగభాగవతషష్ఠస్కంధకావ్యంబు నీ**
**కుం దక్కెన్ జతురాననత్వ గుణయుక్తుల్ మీఱ వాణీమనో**
**భండారోద్ధతచూరకారబిరుదప్రఖ్యాతి సార్థంబుగన్.**

ఈ షష్ఠస్కంధం నేడు లభించడం లేదు. ఈ పద్యాన్ని ముద్దరాజు రామన కవి సంజీవనిలో (1-35); కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణసారసంగ్రహంలో (1-210) ఉదాహరించారు. 'విధ్వస్తపాషండ' మనునది పోతనగారి 'కైవల్య సంప్రాప్తులు' (3-203; 304) వంటి ప్రయోగం.

పోతన భాగవతాన్ని పూర్తిగా రచించాడనీ, తనకు అంకితం చేయలేదనే కోపంతో సింగభూపాలుడు దాన్ని భూమిలో పాతి పెట్టించినాడనీ అందులో కొంతభాగం శిథిలమైనదనీ శిథిలస్కంధాలను గంగన - నారయాదులు పూరించి రనియు కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణసారసంగ్రహంలో చెప్పాడు.

**సీ. ఘనుఁడు పోతనమంత్రి మును భాగవతము ర,చించి చక్రికి సమర్పించు నెడల**
**సర్వజ్ఞ సింగయక్ష్మావరుం డది తన, కిమ్మని వేఁడిన నిడకయున్న**
**నలిగి యా పుస్తకం బవనిఁ బాఁతించినఁ, జివికి యందొక కొంత శిథిలమయ్యెఁ**
**గ్రమ్మఱ నది వెలిగందల నారప, రాజును మఱి బొప్పరాజు గంగ**

**తే.గీ. రాజు మొదలగు కవివరుల్ తేజ మెసఁగఁ, జెప్పి రాగ్రంథముల యందె తప్పు లొదవెఁ**
**గాని పోతకవీంద్రునికవితయందు, లక్షణం బెందుఁ దప్పదు దక్షహరణ! (సర్వ-3-344)**

శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారీ విషయం యథార్థంగా జరిగిందని విశ్వసించారు.

(రాయల్ & కో. 1954, భాగవతపీఠిక).

కొన్ని తాళపత్ర గ్రంథాలలో పంచమ స్కంధాంతంలో గూడ పోతన గద్యమే ఉంది.

అకాడమీవారిప్రతిలో ఇలా చెప్పబడింది. "ద.2.నెం.40. రాజమహేంద్రవరం, గౌతమీ గ్రంథాలయం వారిది. పెద్దాపురం వత్సవాయి రాజు లిచ్చినది. వత్సవాయి సత్తిపాటి వెంకటపతిరాజుగారికి రేమెళ్ళ పాపయ్య ప్రమాది సంవత్సర కార్తికశుద్ధ పంచమీ శుక్రవారం (క్రీ.శ. 8-11-1792) నాటికి వ్రాసి యిచ్చినది. కోస్తాజిల్లాల ప్రతి. దీనిలో పంచమస్కంధాంతగద్యం పోతనామాత్యునిపేరుతో ఉంది. (అకాడమీ ప్రతి పీఠిక : 162 పుట.)

పోతన స్కంధారంభాలలో శ్రీరామసంబోధనం గల కందపద్యాన్ని వ్రాసే ఆచారం కలవాడు.

**క. శ్రీకర! కరుణాసాగర!, ప్రాకటలక్ష్మీకళత్ర! భవ్యచరిత్రా!**
**లోకాతీతగుణాశ్రయ!, గోకులవిస్తార! నందగోపకుమారా!**

అని ఈ స్కంధం శ్రీకృష్ణసంబోధనంతో ఆరంభమైంది. కానీ, కొన్ని తాళపత్ర ప్రతులలో -

**క. శ్రీ సీతానయనోత్పల, శ్రీసతిసహజన్మ! త్రిదశసేవిత! యాశా**
**వాసప్రకాశ! జయ భా, సాసుర పతిహరణ! రామచంద్ర నృపాలా!**

అని శ్రీరామసంబోధనం గల కందమే ఉంది.

వావిళ్ళ ప్రతిలో పంచమస్కంధం "సకలపురాణార్థ జ్ఞానవిఖ్యాతుండగు సూతుండు శౌనకాది మహామునుల కిట్లనియె" నను వాక్యంతో ఆరంభమైంది. కొన్ని తాళపత్రప్రతులు, తంజనగరంవారి ప్రతి, అకాడమీప్రతి - "మహనీయ గుణగరిష్ఠు లగు నమ్మునిశ్రేష్ఠులకు నిఖిలపురాణ వ్యాఖ్యాన వైఖరీ సమేతుండయిన సూతుండిట్లనియె"అని పోతనవచనంతో ఆరంభమయ్యాయి. పంచమస్కంధాంతంలో -

**చ. జలజభవాదిదేవమునిసన్నుతతీర్థపదాంబుజాత! ని**
**ర్మలనవరత్ననూపురవిరాజిత! కౌస్తుభభూషణాంగ! యు**
**జ్జ్వలతులసీకురంగమదవాసనవాసితదివ్యదేహ! శ్రీ**
**'నిలయశరీర! కృష్ణ! ధరణీధర! భానుశశాంకలోచనా!'**

**క. శ్రీతరుణీహృదయస్థిత!, పాతకహర! సర్వలోకపావన! భువనా**
**తీతగుణాత్రయ! యతివి, ఖ్యాతసురార్జితపదాబ్జ! కంసవిదారీ!**

**మత్తకోకిల**

**దండితారిసమూహ! భక్తనిధాన! దానవిహార! మా**
**ర్తాండమండలమధ్యసంస్థితతత్త్వరూప!' గదాసి కో**
**దండ శంఖసుదర్శనాంక! సుధాకరార్కసునేత్ర! భూ**
**మండలోద్ధరణార్త పోషణ! మత్తదైత్యవిదారణా!**

అని శ్రీకృష్ణపరమైన పద్యాలున్నాయి. ప్రాచీనతాళపత్రగ్రంథాలతో వీనికి బదులుగా –

**'శ్రీనిలయ! నిశాచరేంద్రఘననీరదమారుత! రాఘవేశ్వరా!'**

**'మార్తాండవంశసుధాబ్ధిపూరసుధామయూఖ!'**

అని శ్రీరామపరమైన పాఠాలున్నాయి. తంజనగరంవారు ఈ పాఠాలను – "ఈ యాశ్వాసమున నంత్యపద్యములు నాది పద్యమునఁ బోలె రామాంకితముగాఁ జూపట్టెడి!" అని పాదటిప్పణిలో వ్రాశారు. అకాడమీ ప్రతిలో ఈ పాఠాంతరాలను చూపలేదు. అన్నిటికంటే మిక్కిలి విచిత్రమైన విషయం, మొత్తం 350 పద్యగద్యాలుగల ఈ చిన్న స్కంధం రెండాశ్వాసాలుగా విభజింపబడడం. తాళపత్రప్రతులలో –

**మ. నరదేవాసురయక్షరాక్షసమునీంద్రస్తుత్య...**

**క. పరమపదవాస!...**

**మాలిని. సరసహృదయవాసా! చారులక్ష్మీవిలాసా!**

అను పంచమస్కంధ ప్రథమాశ్వాసాంతపద్యాలుగానీ,

**క. శ్రీకాంతాహృదయప్రియ!**

అను ద్వితీయాశ్వాసాద్య కందపద్యం గాని లేవు. శ్రీపురాణం హయగ్రీవశాస్త్రిగారో, మరొకరో పరిష్కర్తలీ స్కంధాన్ని రెండాశ్వాసాలుగా విడగొట్టి ఈపద్యాలు చేర్చి ఉంటారు. ప్రథమ – ద్వితీయాశ్వాసాంతగద్యాలు కలిపి, ఏకస్కంధంగా పోతనపేరుతో ఉన్నాయి. ఈ విషయాన్ని తంజనగరం తేవప్పెరుమాళ్ళయగా రిట్లు చెప్పినారు.

“ఈ యాశ్వాసాంత గద్య పద్యములు పెక్కు ప్రతులను గానిపింపవు. 178వ గద్యమునఁ ‘బొందుదు రని’ యున్న పిదప ‘సకల పురాణార్థ విజ్ఞాతుం డగు సూతుం డిట్లనియె’ నని యున్నది. కాన, యీ స్కంధ మేకాశ్వాసము గానే కొన్నిటఁ జూపట్టుచున్నది” (తంజనగరం, భాగ-1సం - 412 పుట).

‘మఱియు నీ స్కంధపు రెండాశ్వాసముల గద్యములను నేకగద్యముగాఁ గానిపించుచున్నవి’ (తంజనగరం, భాగ-1సం-443 పుట)

అకాడమీ ప్రతిలో ఈవిధంగా ఉంది. -

త: 2.నెం.4140. కాకినాడ, ఆంధ్రసాహిత్యపరిషత్తువారిది. తంజనగరం తేవప్పెరుమాళ్ళయ్యగారు సంపాదించింది. దీని పంచమస్కంధంలో ఆశ్వాసవిభజనం లేదు (పీఠిక - 160పుట).

పోతన ఏ స్కంధాలనూ ఆశ్వాసాలుగా విభజించలేదు. దశమస్కంధంమాత్రం మిక్కిలి పెద్దదికావటంచేత, వ్యాసభాగవతానుసారంగా పూర్వోత్తరభాగాలుగా విభజించబడ్డాయి.

దీన్నిబట్టి, పంచమస్కంధంలోని ప్రథమాశ్వాసంలోని 183 పద్యాలు పోతన రచించినవి భద్రంగానే ఉన్నాయనీ ద్వితీయాశ్వాసంలోని కొన్ని పద్యాలు శిథిలం కాగా వానిని పూరించి బొప్పరాజుగంగన శ్రీకృష్ణనామాంకిత పద్యాలను చేర్చి తన పేర గద్య వ్రాసికొన్నాడని స్పష్టమతున్నది. అందువల్లనే శేషాద్రిరమణ కవులు “పంచమస్కంధాన్ని బొప్పరాజు గంగయ సంస్కరించి గద్యము వ్రాసికొనెను” (వావిళ్ళ ప్రతిపీఠిక - 82పుట) అని చెప్పినారు.

శ్రీ చాగంటి శేషయ్యగారు కూడ - “పంచమస్కంధమును బూర్తిగా రచియించినట్లు గంగనార్యుఁడు గద్యలో వ్రాసికొని యున్నను, నీ స్కంధమునఁ బోతనామాత్యుని కవిత చాలగా నున్నదని నా యభిప్రాయము. షష్ఠస్కంధమును రచించడానికి హరిభట్టు మొదలైనవారు పూనుకొన్నారు గాని పంచమస్కంధము నెవ్వరు రచించినట్లు కన్పించదు. పోతనామాత్యుడు పంచమ, షష్ఠ స్కంధములను రచింపనే లేదని ఒక వాదమున్నది. కాని, అది యంగీకరింపదగిందికాదు”.

“పంచమస్కంధమునం దేది పోతనకవిత్వమో యేది శిథిలభాగపూరణమో నిర్ణయింపలేము, కాని, దానిని జదివి చూచినవారి కది పూర్తిగా శిథిలము కాలేదనియు నందుఁ బోతన కవిత్వము కూడ నున్న దనియుఁ దోఁపక మానదు” (ఆంధ్రకవితరంగిణి - 6 స్కం. 212, 213 పుటలు) అని చెప్పుచున్నారు.

ఈ స్కంధంలోని కొన్ని ఘట్టాలు నీరసంగా సంగ్రహంగా ఉండటానికి పోతనరచన శిథిలమగుటయే కారణం. పంచమస్కంధంలో కూడ ఎక్కువభాగం పోతనదే అని సారాంశం.

ఇట్లు

విజయవాడ, సకలసుకవివిబుధజనవిధేయుఁడు

9-1-2017 **గరిమెళ్ళ సోమయాజులు శర్మ**

# చతుర్థస్కంధం - కథాసారం

సూతమహర్షి శౌనకాదిమునుల నుద్దేశించి తన ప్రవచనం కొనసాగిస్తూ 'పరీక్షిత్తునకు శుకుడిలా చెప్పాడు' అని తదనంతర వృత్తాంతం ఇలా వివరించాడు.

రాజా! మైత్రేయ మునీంద్రుడు విదురునితో స్వాయంభువునకు కల్గిన సంతానాన్నీ, కర్దమునకు కల్గిన సంతతినీ వివరించాడు. అత్రికీ, అనసూయకూ త్రిమూర్తుల అంశంలో చంద్రుడు, దత్తుడు, దుర్వాసుడు సంభవించిన క్రమాన్ని గూడా తెలిపాడు.

పిదప అంగిరసుని వంశాన్ని ప్రస్తావించి దక్షప్రజాపతి వంశక్రమాన్ని తెలియజేస్తూ ఇలా అన్నాడు "దక్షుడు బ్రహ్మపుత్రుడు. అతనికి ప్రసూతి అను ధర్మపత్నియందు పదహారుమంది కన్యలు పుట్టారు. వారిలో పదుముగ్గురిని అతడు ధర్మరాజుకు ఇచ్చాడు. ఒకతెను అగ్నికీ, మరొకతెను పితృదేవతలకూ, ఇంకొక కుమార్తెను శివునకూ ఇచ్చి పెండ్లి చేశాడు. నరనారాయణులు మూర్తి అనే దక్షపుత్రికకు జన్మించినవారే. వారే తరువాత నరుడు అర్జునుడుగా, నారాయణుడు కృష్ణుడుగా జన్మించి భూభారం తగ్గించారు.

శివుని భార్య సతీదేవి తన భర్తకూ, తండ్రికీ కల్గిన విరోధం కారణంగా తండ్రిపై రోషం పూని యోగశక్తితో శరీరం పరిత్యజించింది".

అది విని విదురుడు సతీదేవి తన దేహాన్ని త్యజించిన వృత్తాంతాన్ని వివరించి చెప్పుమన్నాడు. మైత్రేయుడతనితో ఇలా చెప్పాడు. పూర్వం బ్రహ్మలు ఒక సత్త్రం నిర్వహించారు. దాన్ని చూడాలని ప్రజాపతులు వచ్చారు. దక్షుడు గూడా రాగా అతణ్ణి చూచి బ్రహ్మ, శివుడు తప్ప తక్కినవారంతా లేచి నిలబడ్డారు. దక్షుడు బ్రహ్మకు ప్రణమిల్లాడు. శివుడు లేవకుండడం చూచి ఆగ్రహించాడు. ఆ దేవుణ్ణి పరుషోక్తులతో తూలనాడాడు. యజ్ఞంలో శివుడు హవిర్భాగం లేనివాడగుగాక! అని శపించాడు. అతని చర్యను సదస్యు లాక్షేపించగా దక్షుడు కోపంతో సదస్సునుండి వెళ్ళిపోయాడు.

అప్పుడు నందికేశ్వరుడు దక్షుడు పశుప్రాయు డవుతాడనీ, త్వరలో మేషముఖుడు కాగలడనీ శపించాడు. హరుణ్ణి ద్వేషించే ద్విజులు యాచకు లవుతారని కూడా శపించాడు.

అందుకు భృగువు కోపించి ధూర్జటివ్రతులు పాషండు లవుతా రని ప్రతిశాపం ఇచ్చాడు. ఇది చూచి విమనస్కుడై శివు డటనుండి వెళ్లిపోయాడు. యజ్ఞం పూర్తి కాగానే ఋషులు తమ తమ ఆశ్రమాలకు పయనమైనారు.

దక్షునకూ, శివునకూ క్రమంగా విరోధం పెరిగింది. దక్షుడు రుద్రరహితమైన యాగం చేశాడు. ఆ పై బృహస్పతి సవనం చేయబూనాడు. దీన్ని చూడాలని మునులూ ప్రజాపతులూ వచ్చారు. గగనచరులు ఆ మఖాన్ని స్తుతించారు. అది విని సతీదేవి తానూ ఆ సవనానికి వెళ్లా లనుకొన్నది. భర్త వారించినా వినకుండా ఆమె తండ్రి యాగభూమికి వెళ్ళింది. అక్కడ తల్లి, సోదరులు తప్ప తక్కిన వారెవరూ ఆమె నాదరింపలేదు. ఆమె శివునిపట్ల

ద్రోహం చేశా వని తండ్రిని ఆక్షేపించింది. సతీదేవి మౌనం పూని నేలపై కూర్చొని యోగమార్గంలో శరీరాన్ని పరిత్యజించింది. ఆమె శరీరం యోగాగ్నిలో దగ్ధ మయింది.

అది చూచి రుద్రపార్షదులు దక్షుణ్ణి హతమార్చుట కుద్యమించారు. అందుకు ప్రతిగా భృగువు అభిచారహోమం చేశాడు. ఋభునామకదేవత లావిర్భవించి రుద్రపార్షదులను పారదోలారు.

పిమ్మట నారదుని ద్వారా జరిగిన వృత్తాంతం విన్న శివుడు ఆగ్రహోదగ్రుడై ఒక జటను పెరికి భూమిపై విసరాడు. అందుండి వీరభద్రుడు పుట్టాడు. యజ్ఞంతో సహా దక్షుణ్ణి హతమార్చవలసిందిగా భవుడు వీరభద్రుణ్ణి ఆజ్ఞాపించాడు. ఆ వీరభద్రుడు వెళ్ళి యజ్ఞాన్ని ధ్వంసం చేసి దక్షుని మస్తకం ఖండించాడు. దాన్ని దక్షిణాగ్నిలో వ్రేల్చాడు.

పిదప దేవతలు బ్రహ్మ చెంతకు పోయి శివసైనికులవల్ల తమకు కల్గిన బాధలు వివరించారు. ఆయన శివుణ్ణి తిరస్కరించటం తగదని చెప్పి ఆయనను శరణుపొందుమని వారికి హిత ముపదేశించాడు.

బ్రహ్మ, ఇతరదేవతలు కైలాసం చేరి అభవుని దర్శించి నమస్కరించారు. బ్రహ్మ శివుణ్ణి వినుతించి "దక్షాధ్వరాన్ని మరల ఉద్ధరించి దక్షుణ్ణి బ్రదికించుమని ప్రార్థించాడు. బ్రహ్మ ప్రార్థన మన్నించి శివుడు 'దగ్ధశిరస్కుడైన దక్షుడు అజముఖు డగు గాక!' అని చెప్పి ఆ దేవతల ననుగ్రహించాడు. పిదప శివుడు బ్రహ్మాదులతో గూడి దక్షాధ్వరవాటికకు వెళ్ళాడు. ఆయన అనుగ్రహంతో క్షతగాత్రు లందరూ పూర్వస్థితి పొందారు. దక్షుణ్ణి మేషముఖుణ్ణి చేయగా, అతడు నిద్ర మేల్కొన్నట్లు లేచి రుద్రుని స్తుతించి తన్ను క్షమించుమన్నాడు. ఆ పై యజ్ఞం నిర్విఘ్నంగా జరిగింది. విష్ణుదేవతాకమైన కర్మ చేయగా శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు. అందరూ ఆ దేవునికి భక్తితో మొక్కారు. పెక్కు విధాల స్తుతించారు. శ్రీహరి దక్షాధ్వరాన్ని ఏ కొరత లేకుండా జరుగున ట్లనుగ్రహించాడు.

యజ్ఞానంతరం విష్ణువు మున్నగు వారంతా తమ తమ నెలవులకు వెళ్ళారు.

యోగాగ్ని దగ్ధురాలైన సతి జన్మాంతరంలో హిమవంతుని కూతురుగా పుట్టింది. పూర్వదయితుడైన రుద్రుణ్ణే చేపట్టింది.

ఈ వృత్తాంతాన్ని బృహస్పతి ఉద్ధవునికి చెప్పగా అతడు తనకు చెప్పాడనీ, దానిని నీకు నేను చెప్పాననీ చెప్పి మైత్రేయుడు మరల విదురునితో ఇలా అన్నాడు.

సనకాదులు గృహస్థులు కారు గాన వారి వంశాలు కొనసాగలేదు.

## ధ్రువోపాఖ్యానం

స్వాయంభువునకు శతరూపద్వారా ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే ఇరువురు పుత్రులు కలిగారు. ఉత్తానపాదునికి సునీతి, సురుచి అని ఇరువురు భార్యలు. సునీతి ధ్రువుణ్ణీ, సురుచి ఉత్తముణ్ణీ కన్నారు. రాజుకు సురుచిపై మక్కువ ఎక్కువ.

ఉత్తానపాదు డొకనాడు సురుచిసుతుడగు ఉత్తముణ్ణి తొడలపై ఉంచుకొని లాలిస్తూ ఉన్నాడు. ధ్రువుడు వచ్చి తానూ తండ్రి తొడపై ఎక్కగోరాడు. ప్రక్కనే ఉన్న సురుచి "తండ్రి తొడ ఎక్కాలంటే నీవు నా కడుపున పుట్టి ఉండాలి. ఇతరగర్భజుడ వైన నీ కాభాగ్యం ఎక్కడిది? నీవు విష్ణుపాదసేవ చేస్తే ఆ దేవుడు నా గర్భాన పుట్టిస్తాడు" అని తూలనాడింది.

తండ్రి వింటూ వుండగా పినతల్లి అన్న మాటలు వానికి వ్యథ కల్గించాయి. ఏడుస్తూ వాడు తన తల్లి చెంతకు పోయాడు. ఆమె జరిగిన వృత్తాంతం అంతఃపురవాసుల ద్వారా విన్నది. "నాయనా! దుఃఖించకు. నా కడుపున పుట్టడం వల్లనే నీకీ అవమానం జరిగింది. తండ్రి తొడ ఎక్కా లనుకొంటే సురుచి చెప్పినట్లు హరిచరణాలను దర్శించు, ఆ దేవుణ్ణి సేవించు" అని ఆమె ఆ బిడ్డకు చెప్పింది.

తల్లిమాట విని ధ్రువుడు నగరం వదలి వెళ్లాడు. దారిలో నారదు డతని వృత్తాంతం తెలిసి అతనిచెంతకు వచ్చాడు. సవతితల్లి వాగ్బాణంవల్ల కల్గిన వ్రణాన్ని భగవద్ధ్యాన రసాయనంతో మాపుకుంటా నని ధ్రువుడు నారదునితో అన్నాడు. ధ్యానదీక్షనుండి ఆ బాలుని విరమింపజేయడానికి ఆ ముని యత్నించాడు. కాని ఆ బాలుడు తన నిశ్చయంనుండి మరలలేదు.

అతని పట్టుదలకు సంతసించిన నారదు డతణ్ణి మధువనానికి పోయి ధ్యానం కొనసాగించు మని బోధించాడు. "ఓం నమో భగవతే వాసుదేవాయ" అన్న ద్వాదశాక్షరీమంత్రాన్ని గూడా ఉపదేశించాడు. ధ్రువుడు మధువనం చేరుకొన్నాడు. పిదప నారదుడు ఉత్తానపాదుని చెంతకు పోయి పుత్రవియోగంతో దుఃఖిస్తున్న ఆ రాజును ఓదార్చాడు.

అక్కడ ధ్రువుడు సర్వేశ్వరుణ్ణి ధ్యానిస్తూ ఫలభక్షణతో మొదటిమాసం, జీర్ణతృణపర్ణాలు ఆహారంగా రెండవ మాసం, జలపానంతో మూడవ మాసం, వాయుభక్షణతో నాల్గవ నెల, నిరుచ్ఛ్వాసుడై ఒంటికాలిపై నిలిచి ఐదవ నెల గడపాడు.

అతని దీక్షకు భగవంతుడే కంపించాడు. ప్రాణనిరోధం పొందిన లోకపాలకులు నారాయణుని శరణు పొందారు. ఆ దేవుడు ధ్రువుని విషయం గ్రహించి అతణ్ణి తపోదీక్షనుండి మరలించడానికై మధువనానికి వెళ్ళాడు. ధ్రువుని ఎదుట ప్రత్యక్షమైనాడు. సంతోషాతిశయంవల్ల ధ్రువుడు భగవానుణ్ణి స్తుతించలేకపోయాడు. దేవుడు తన శంఖంతో అతని కపోలతలం అంటాడు. అప్పుడు ఆ బాలుడు భగవంతుణ్ణి పలువిధాల వినుతించాడు.

అందుకు భగవానుడు సంతసించి ఆ బాలునికి 'ధ్రువక్షితి' అన్న స్థానం ప్రసాదించాడు. ఆ స్థానం లభించేవరకూ ధర్మబద్ధంగా రాజ్యం పాలించగల వన్నాడు. ఉత్తముడు వేటకు పోయి అడవిలో మరణిస్తాడని చెప్పాడు. వాని తల్లి వాణ్ణి అన్వేషిస్తూ పోయి అక్కడ దావాగ్నిలో బడి చనిపోతుందని తెలియజేశాడు. నీ వనేక యజ్ఞాలు చేసి నన్ను భజించి తుదకు సప్తర్షిమండలోన్నతమైన నా పదవి పొందగలవని చెప్పి గరుడారూఢుడై ధ్రువుడు చూస్తూ ఉండగా వైకుంఠానికి వెళ్ళాడు.

పిదప ధ్రువుడు భగవదనుగ్రహం పొందినా భగవానుణ్ణి మోక్షం కోరలేకపోయానే అని చింతిస్తూనే తన నగరానికి పయనమయ్యాడు. శ్రీహరి అనుగ్రహం పొంది వస్తున్న కుమారుని వార్త విని ఉత్తానపాదుడు సపరివారంగా ఆ బాలుని కెదురేగి నగరసమీపంలో అతణ్ణి చూచాడు. రథం దిగి తనయుణ్ణి కౌగలించుకొన్నాడు. ధ్రువుడు తండ్రి ఆశీర్వాదం పొంది ఆయన పాదాలకు నమస్కరించాడు. పిమ్మట తల్లులకు ప్రణమిల్లుతూ సురుచికి మొక్కగా ఆమె అతణ్ణి నగుమోముతో ఆలింగనం చేసుకొని ఆశీర్వదించింది. ఉత్తముడూ, ధ్రువుడూ అన్యోన్యంగా కౌగలించుకొని ఆనందాశ్రువులు కార్చారు. సునీతి కుమారుణ్ణి కౌగలించుకొని దుఃఖరహిత అయింది. పురజనులు ధ్రువుణ్ణి ప్రశంసించారు.

ఉత్తానపాదుడు ధ్రువుణ్ణి రాజ్యాభిషిక్తుణ్ణి చేశాడు. ఆపై వనానికి వెళ్ళాడు. ధ్రువుడు 'భ్రమి' అనే కన్యను చేపట్టి ఆమె ద్వారా కల్పుడు, వత్సరుడు అన్న ఇరువురు కొడుకులను కన్నాడు. 'ఇల' అన్న భార్యద్వారా ఉత్కలుడనే కొడుకునూ, ఒక అందమైన కన్యనూ సంతానంగా పొందాడు.

పిమ్మట వివాహం లేకుండానే ఉత్తముడు వేటకు వెళ్ళి అక్కడ యక్షునిచే నిహతు డయ్యాడు. అతని తల్లి వనానికి పోయి అక్కడ దావానలంలో దగ్ధురాలయింది.

ధ్రువుడు సోదరమరణానికి కోపించి రథమెక్కి అలకాపురికి వెళ్ళాడు. అతని శంఖనాదం విని యక్షభటు లతనితో తలపడ్డారు. యుద్ధంలో యక్షులు పరాజితు లయ్యారు. ఇంతలో అసురమాయ వ్యాపించి ధ్రువుణ్ణి చీకాకుపరచింది. అతడు నారాయణాస్త్రం ప్రయోగించి అసురమాయను దూరీకరించాడు.

అప్పుడు స్వాయంభువుడు వచ్చి ధ్రువుణ్ణి శాంతింపజేశాడు. ఆపై కుబేరుడు రాగా ధ్రువు డతనికి నమస్కరించాడు. కుబేరు డతనికి స్థిరమైన హరిస్మరణమనే వరం ప్రసాదించి అంతర్హితు డయ్యాడు.

ధ్రువుడు తిరిగి తన నగరం చేరి పలుయజ్ఞాలు చేశాడు. శ్రీహరిని భక్తితో ఆరాధించాడు. ఇరవైయారు వేలేండ్లు రాజ్యం పాలించాడు. పిదప కొడుకుకు పట్టం గట్టి తాను విరక్తుడై బదరికాభూమికి వెళ్ళాడు. అక్కడ భగవద్ధ్యానం అనుష్ఠించాడు. అప్పుడొక విమానం అక్కడికి వచ్చింది. అందులో వచ్చిన నందసునందులు అనే భగవత్కింకరులు ధ్రువుణ్ణి విమాన మెక్కించుకొని మాధవపదానికి తీసుకుపోయారు. అతని తల్లిగూడ అతనికి ముందే విమానమెక్కి వెళ్ళింది. ఇలా ధ్రువుడు హరిపదం పొందాడు. నారదుడు ప్రచేతసుల సత్త్రంలో ధ్రువుని మహిమను కీర్తించాడు.

ఇలా చెప్పి మైత్రేయముని ధ్రువచరిత్ర విన్నవారికి కలిగే ఫలాన్ని గూడా విదురునికి వివరించాడు. ఆపై ప్రచేతసుల వృత్తాంతం వివరించవలసినదిగా విదురుడు అడుగగా మైత్రేయుడిలా చెప్పాడు –

**ప్రచేతసుల వృత్తాంతం**

ధ్రువుడు వనానికి పోగా అతని సుతుడు ఉత్కలుడు సర్వసంగాలూ వదలి సార్వభౌమపదవి కోరకుండా ఉండడం గమనించి కులవృద్ధులు, మంత్రులు అతణ్ణి ఉన్మత్తుడని భావించారు. అతని తమ్ముడు వత్సరునికి పట్టం

కట్టారు. అతని వంశంలోని అంగు డనువానికి వేను డనే కొడుకు జన్మించాడు. అతడు దుశ్శీలుడు. అతని దౌష్ట్యం చూచి తండ్రి ఒంటరిగా నగరం వీడి ఎక్కడికో వెళ్ళాడు. మునులు కోపించి వేనుణ్ణి శపించగా అతడు మరణించాడు. అరాజకమైన ఆరాజ్యంలో తస్కరబాధ ప్రబలింది.

అప్పుడు మునులు వేనుని కుడిభుజాన్ని మథించారు. అందుండి పృథు డనే రాజు జనించాడు. ఇట్లని మైత్రేయు డనగా విదురుడు వేనుని చరిత్ర వివరంగా చెప్పుమని కోరాడు.

అంతట మైత్రేయు డిలా అన్నాడు.

రాజర్షి అంగుడు అశ్వమేధయాగం చేశాడు. అందు హవిర్భాగం గ్రహించడానికి దేవతలు రాలేదు. అందుకు కారణమేమని అంగుడు సదస్యుల నడిగాడు. వాళ్ళు “రాజా! ఇది పూర్వ జన్మకృత దోషం. నీ వింతవాడవైనా నీకు సంతానం లేకపోవడంవల్ల దేవతలు యాగభాగం స్వీకరించడానికి రాలేదు. పుత్రకామేష్టి చేసి పుత్రుని పొందు” అని వచించారు.

వారు చెప్పినట్లు ఆ రాజు విష్ణుదేవతాకమైన పురోడాశంచే హోమం చేశాడు. హోమ కుండంలో ఒక పురుషు డావిర్భవించి పాయస మిచ్చాడు. రాజు ఆపాయసం భార్య కివ్వగా ఆమెదాన్ని భుజించి గర్భం దాల్చి కుమారుణ్ణి కన్నది. ఆ కుమారుడే అధర్మపరుడై వేనుడన్న పేరుతో చరించాడు, పసిపిల్లలను చంపడం, మృగాలను హింసించడం చేసేవాడు. మాతామహదోషం వల్ల వాడు పాపాత్ము డయ్యాడు. అతణ్ణి చక్కదిద్దలేక అంగుడు రాజ్యం వదలి వెళ్ళాడు.

అంతట వేనుని తల్లి అనుమతితో మునులు అతణ్ణి రాజ్యాభిషిక్తుణ్ణి కావించారు. వాడు దుష్టచర్యలు వీడక నిరంకుశుడై ప్రవర్తించాడు. యజ్ఞయాగాదులను నిషేధించాడు. అతని దుష్ప్రవృత్తి మాన్పలేక మునులు అతణ్ణి క్రోధంతో హుంకారం చేసి వధించారు. అతని తల్లిగూడా యోగశక్తితో తనువు త్యజించింది.

అంత రాజ్యంలో అరాజక పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎట్లైనా రాజవంశాన్ని ఉద్ధరించాలని మునులు మృతుడైన వేనుని ఊరువులు మథించారు. అందుండి ఒక నిషాదుడు పుట్టాడు. పిదప బాహువులను మథించగా ఒక మిథునం ఆవిర్భవించింది. అందు పుట్టిన పురుషుడే పృథుచక్రవర్తి. స్త్రీ ‘అర్చి’ అన్న పేరుగలదై ఆ పృథువునే వరించింది.

బ్రహ్మాదులు పృథునిలో నారాయణాంశకు చెందిన లక్షణాలు చూచి ఆశ్చర్యం పొందారు. బ్రాహ్మణోత్తములు పృథువును రాజ్యాభిషిక్తుణ్ణి చేశారు. వందిమాగధులు అతణ్ణి బహువిధాల స్తుతించారు. వారి స్తుతులలో అతడు భూమిని ధేనువుగా చేసి నిఖిల పదార్థాలను పిదుకుతాడని గూడా వారు చెప్పారు. ఇలా చెప్పి మైత్రేయుడు విదురుని కోరికమేరకు పృథువు భూమిని పిదికిన వృత్తాంతం ఇంకా విస్తృతంగా ఇలా వివరించాడు.

పృథుడు రాజ్యం పాలించేటప్పుడు భూమి నీరస అయింది. ప్రజలు అన్నం లేక నీరసించారు. వారు రాజుతో “మేము ఆకలితో అలమటిస్తున్నాము. మాకు అన్నం లభించేటట్లు చేసి రక్షించు” అని ప్రార్థించారు.

అది విని రాజు కోపంతో ధనుర్ధారియై గోరూపం ధరించి పారిపోయే భూమివెంట పరుగెత్తాడు. అప్పుడు గోరూపభూమి రాజుతో "అయ్యా! నేను ఈ ప్రజల కాధారమై వున్నాను. నన్ను చంపి నీవు ప్రజల నెలా రక్షించగలవు?" అని అడిగింది. ఆ రాజు భూమిని నిందించి సంహరింప బూనుకొన్నాడు. "నన్ను వధించదగదు. నేను నిన్ను శరణు పొందుతున్నాను" అని ఆ గోవు రాజును స్తుతించింది. తనలోని ఓషధులను వెలికి తీసే ఉపాయం కూడా అతనికి తెలిపింది.

గోరూపయగు భూమి చెప్పినట్లు పృథువు మనువును దూడగానూ, తన హస్తతలాన్ని పాత్రగానూ చేసి సకలౌషధులనూ ఆ గోరూపధారిణియగు ధరణినుండి పిదికాడు.

అంతట ప్రజలు సుఖంగా వర్ధిల్లారు. పృథుచక్రవర్తి సరస్వతీ నదీతీరంలో నూరు అశ్వమేధాలు చేయాలని నిశ్చయించాడు. అత డలా చేయడం సహించక దేవేంద్రుడు తొంబదితొమ్మిది యజ్ఞాలు పూర్తి అయి నూరవయజ్ఞానికి ఉపక్రమించేటప్పుడు యజ్ఞపశువును హరించి గగనాని కెగిరిపోయాడు.

పృథుడు ధనుర్ధారియై అతని వెంటబడ్డాడు. ఇంద్రుడు జటాభస్మాస్థికలు గల మాయావేషం దాల్చగా అతనిపై బాణప్రయోగం చేయలేకపోయాడు. అత్రిమహర్షి ఇంద్రుని మాయాప్రయోగం వివరించి అతణ్ణి జయించుమన్నాడు. పృథుడు ఇంద్రునిపై విజృంభించగా అతడు అశ్వాన్ని వదలి అంతర్హితుడయ్యాడు. పృథుడు అశ్వాన్ని తిరిగి తెచ్చి 'జితాశ్వు'డయ్యాడు.

మరలా ఇంద్రుడు మాయోపాయంతో అశ్వాన్ని హరించాడు. అత్రిప్రేరణతో పృథుడు ఇంద్రునిపై కురకగా ఇంద్రుడు మరల అంతర్ధానం చెందాడు. చివరికి ఇంద్రుణ్ణి వధించడానికి, ఉద్యమించిన పృథుచక్రవర్తిని ఋత్విక్కులు వారించారు. మంత్రాలతో ఆహ్వానం మేరకు ఇంద్రుడు వస్తే అతణ్ణి అగ్ని కాహుతి చేస్తామని ఋత్విక్కు లన్నారు. ఇంతలో బ్రహ్మ వచ్చి ఋత్విక్కులను ఆ పని చేయకుండా నివారించాడు. పృథువుకు ఇక యజ్ఞం చాలించుమని బోధించాడు. అంతట ఆరాజు ఇంద్రునితో విరోధం మాని సఖ్యం పాటించాడు. ప్రజ లతణ్ణి వినుతించారు.

ఇంతలో నారాయణుడు ఇంద్రునితో కూడా అచ్చటికి వచ్చి పృథువు ననుగ్రహించాడు. ఇంద్రునిపట్ల పృథుడు ద్వేషం త్యజించాడు. విష్ణుని కీర్తించాడు. ఆ దేవు డతణ్ణి అనుగ్రహించి వైకుంఠానికి వెళ్ళాడు. రాజు వైభవోపేతమైన తన నగరం చేరుకొన్నాడు. రాజ్యం చక్కగా పాలించి తుదకు పరమపదం చేరుకొన్నాడు.

ఇలా మైత్రేయుడు చెప్పగా విదురుడు పృథుచక్రవర్తి ఏయే సత్కార్యా లొనర్చాడో వివరించుమని కోరాడు. మైత్రేయు డతనికి పృథువు కావించిన పలు సత్కార్యాలను వర్ణించి చెప్పాడు. అతడు చేసిన ధర్మబోధలుగూడా వివరించాడు. ఇంకా ఇలా చెప్పాడు –

తదనంతరం సనకాదులు ఆ రాజు చెంతకు వచ్చారు. వారి నతడు యథోచితంగా పూజించాడు. సంసారంలో దేనివల్ల వేగంగా క్షేమం కల్గుతుందో వివరించుడని వారిని ప్రార్థించాడు. సనత్కుమారు డాతనికి మోక్షోపాయం బోధించాడు. ఆపై రాజు 'తన్ను అనుగ్రహించడానికే వారు వచ్చా'రని వారిని శ్లాఘించాడు. రాజుచే సత్కృతులై సనకాదులు ఆకాశగమనంతో వెళ్లారు.

ఆపై పృథువు జ్ఞానవైరాగ్యాలు కల్గి తన భార్యయందు ఐదుగురు సుతులను కన్నాడు. వార్ధక్యదశలో భార్యతో కూడ తపోవనానికి పోయాడు. అక్కడ ఉగ్రతపస్సు అనుష్ఠించాడు. ఆపై యోగనిష్ఠతో శరీరం త్యజించాడు. అర్చి భర్త ప్రాణరహిత శరీరాన్ని చితిపై చేర్చి తాను అనుగమనం చేసిందని చెప్పి మైత్రేయుడు పృథుచక్రవర్తి చరిత్ర శ్రవణఫలాన్ని వర్ణించాడు.

పృథుని తరువాత అతని పుత్రుడు విజితాశ్వుడు రాజైనాడు. వసిష్ఠుని శాపంవల్ల త్రేతాగ్ను లతనికి పుత్రులై జన్మించారు. అతడు 'నభస్వతి' అన్న ద్వితీయ కళత్రంద్వారా 'హవిర్ధానుడు' అనే పుత్రుణ్ణి కన్నాడు. తుదకతడు ఆత్మదర్శనుడై సర్వేశ్వరుణ్ణి దీర్ఘయజ్ఞంతో ఆరాధించి యోగసమాధితో ముక్తిపొందాడు.

హవిర్ధానునికి ఆరుగురు పుత్రులు కలిగారు. వారిలో బర్హిష్మదు డనువాడు పలుయజ్ఞాలు కావించాడు. ప్రాచీనాగ్రమైన దర్భలతో భూతలమంతా కప్పడంవల్ల అతనికి 'ప్రాచీనబర్హి' అన్న పేరు కలిగింది, 'శతధృతి' అనే భార్యవల్ల ఆ రాజుకు ఐదుగురు పుత్రులు సంభవించారు. వారే ప్రచేతసులుగా ప్రసిద్ధులయ్యారు.

ఆ ప్రచేతసులు రుద్రు డుపదేశించినట్లు జపధ్యానాలు చేసి పదివేల దివ్యసంవత్సరాలు శ్రీమన్నారాయణుని అర్చించారు.

ఇలా చెప్పి మైత్రేయుడు విదురునికి రుద్రునితో ప్రచేతసులకు కల్గిన కలయికనూ, ఆ దేవుడు వారి కుపదేశించిన 'యోగాదేశ' మనే స్తోత్రాన్నీ వివరించాడు. ఆ స్తోత్రం పూర్వం బ్రహ్మ సనకాదులకు బోధించింది. అది అందరికీ రక్షకమైంది. ఆ స్తోత్రాన్ని ప్రచేతసులకు బోధించి రుద్రుడు వారి పూజ లందుకొని అంతర్ధానమైనాడు. ప్రచేతసులు రుద్రోపదిష్టమైన మంత్రం జపిస్తూ జలమధ్యంలో పదివేల వత్సరాలు తపోనిష్ఠులై ఉండిపోయారు.

పిదప కర్మాసక్తుడైన ప్రాచీనబర్హి వద్దకు వచ్చి నారదుడు కర్మవల్ల శ్రేయస్సు లేదని బోధించాడు. యజ్ఞంలో హింసింపబడిన పశువులచే పరలోకంలో బాధ తప్పదని చెప్పి జ్ఞానప్రాముఖ్యాన్ని తెలిపే పురంజనోపాఖ్యాన్ని ఇలా వినిపించాడు.

**పురంజనోపాఖ్యానం**

పూర్వం పురంజనుడనే ఒకరాజు ఉండేవాడు. అతని మిత్రుడు విజ్ఞాతుడు. ఆ రాజు నగరాన్ని అన్వేషిస్తూ ధరాచక్రమంతా తిరిగాడు. తగిన పుర మతనికి కనిపించలేదు. ఒకనాడతనికి హిమగిరి దక్షిణ సానువులలో వైభవోపేతమైన ఒకనగరం కనిపించింది. ఆ పురబాహ్యోద్యానంలో కామరూప అయిన ఒక వనితను గూడా అతడు చూచాడు. ఆమె వృత్తాంతమేమిటో చెప్పుమని ఆమెనే అడిగాడు.

ఆమె తన వృత్తాంతం తెలుపుతూ నవద్వార సమేతమైన ఆ పురాన్ని పరిపాలించవలసినదిగా అతణ్ణి అర్థించింది. తన్ను చేపట్టవలసినదిగా కూడా కోరింది. ఆమె నతడు వరించాడు. ఆ పురం ప్రవేశించి నూరు సంవత్సరాలు అందులో క్రీడిస్తూ నివసించాడు. కర్మాసక్తుడు, కామాత్మకుడునై బుద్ధి అనే ఆ మహిషి చేత వంచితుడయ్యాడు.

ఒకనా డతడు ధనుర్ధారియై రథమెక్కి వనానికి వెళ్ళి వేటాడుతూ నానా మృగాలను వధించాడు. తిరిగి పురానికి వెళ్ళి అక్కడ తన గృహిణి కనిపించకపోయే సరికి విమనస్కు డయ్యాడు. ఆమె చెలికత్తెలు “నీ మహిషి వట్టి నేలపై బడి పొరలుతున్నది. కారణం మాకు తెలియదు. నీవే చూడు” అని అతనితో అన్నారు.

రాజు ఆమెను చూచి దుఃఖితుడై ఎంతగానో ఆమె ననునయించాడు. అంతట ఆమె రోషం వీడి అతనిపట్ల అనురాగంతో మెలగింది. వారు రేయింబవళ్ళు రమించారు. ఆ రాజు తన ఆయువు తరిగిపోవడం గమనించలేదు.

వారు పదకొండువందలమంది పుత్రులను, నూటపదిమంది పుత్రికలనూ కన్నారు. కాలక్రమంలో వారికందరికీ వివాహాలు జరిపారు. వారి కుమారులకు ఒక్కొక్కరికీ నూరుగురు చొప్పున కొడుకులు పుట్టారు. వారిపై గల మమకారం ఆ రాజును బంధించింది.

క్రమంగా ఆ రాజుకు ప్రతికూలమైన కాలం దాపురించింది. చండవేగుడైన ఒక గంధర్వాధిపతి సైన్యంతో ఆ నగరాన్ని ముట్టడించాడు. పురాధ్యక్షుడైన ప్రజాగరుడు ఆ గంధర్వులతో పోరాడి క్షీణబలు డయ్యాడు. రాజు చింతాక్రాంతుడైనాడు.

ఈ కథ చెప్పి నారదుడు ‘కాలకన్య’ అనే మరొక వనిత చరిత్ర గూడా వివరించాడు. యవనులు పురంజనుని పురాన్ని పీడించారని గూడా తెలియజేశాడు. ఆ తరువాతి వృత్తాంతం వివరిస్తూ ఇలా వాక్రుచ్చాడు.

ఆ పురంజనుడు గంధర్వులచే ఆక్రాంతుడై తనవారి కొరకై దుఃఖించి ఆ పురాన్ని విడిచిపోవడానికి ఇష్టం లేకున్నా విడువడాని కుపక్రమించాడు. ఇంతలో ప్రజ్వారు డనువాడు వచ్చి ఆ నగరాన్ని దహించాడు. రాజు తన దుఃస్థితికి వగచాడు. అంతట యవనులు బలాత్కారంగా పురంజనుణ్ణి లాక్కుపోయారు. పరలోకం చేరిన అతణ్ణి పూర్వం యజ్ఞంలో హింసించబడ్డ పశువులు కుఠారాలతో నరికాయి.

భార్యను స్మరిస్తూ శరీరం విడిచిన పురంజనుడు మరుజన్మలో విదర్భ రాజగృహంలో ‘ప్రమదోత్తమ’ గా జన్మించాడు. మలయకేతను డాప్రమదోత్తమను వరించాడు. వారి సంతతి బాగా విస్తరించింది.

మలయకేతనుడు చివరికి తపోనిష్ఠ డయ్యాడు. అతడు మరణించగా అతని ధర్మపత్ని శోకాకుల అయింది. ఆమె అనుగమనం చేయడానికి నిర్ణయించుకోగా పూర్వమిత్రుడైన విప్రుడొకడు వచ్చి ఆమె ననునయించాడు. తమ గతజన్మల వృత్తాంతం ఆమెకు తెలియజేశాడు. ఈ వృత్తాంతమంతా రాజకథావ్యాజంతో తెలిపిన అధ్యాత్మ తత్త్వమని గ్రహించాలని నారదుడు ప్రాచీనబర్హికి ఎఱుక పరచాడు.

పిదప నారదుడు ఈ కథలోని అధ్యాత్మతత్త్వాన్ని నిరూపించాడు. కర్మమార్గగమనం కంటే భగవత్స్వరూప పరిజ్ఞానమే శ్రేష్ఠమని వివరించాడు.

ప్రతీకాత్మకంగా సాగిన పురంజనోపాఖ్యానంలోని ఆధ్యాత్మిక తత్త్వాన్ని ఈ గ్రంథంలోని వ్యాఖ్యానంలో పాఠకులు చదువగలరు.

తదుపరి ప్రాచీనబర్హి కర్మగతిని గూర్చి అడిగిన ప్రశ్నకు నారదమునీంద్రుడు తగిన సమాధానం చెప్పాడు. జీవేశ్వరస్వరూపాన్ని నిరూపించి ఆపై సిద్ధగమనంతో అటనుండి వెళ్ళిపోయాడు.

పిమ్మట ప్రాచీనబర్హి ప్రజారక్షణకై తన కుమారుని నియోగించి కపిలాశ్రమానికి పోయాడు. అక్కడ భక్తియోగంతో అవ్యయానందపదవి నందుకొన్నాడని మైత్రేయుడు విదురునికి చెప్పాడు. విదురుడు ప్రచేతసుల వృత్తాంతం వివరించుమనగా మైత్రేయుడు సముద్రజలాలలో ప్రచేతసులు గావించిన తపోనిష్ఠనూ, భగవానుడు వారికి వరాలు ప్రసాదించిన వైనాన్నీ వివరించాడు.

తదుపరి 'ప్రమ్లోచ' అనే అప్సరసపుత్రిక, శైశవంలో వృక్షాలచే పోషించబడిన 'మారిష'ను భార్యగా చేపట్టవలెనని భగవంతుడు ప్రచేతసులకు నిర్దేశించిన వృత్తాంతం చెప్పాడు. ప్రచేతసులు భగవద్దర్శనంచే ధన్యులై ఆ దేవుణ్ణి పలువిధాల స్తుతించారు. శ్రీహరి సంతుష్టుడై వారు కోరిన వరాలు ప్రసాదించాడు.

ప్రచేతసులు సాగరజలాలనుండి వెలికి వచ్చి నాకద్వారాన్ని నిరోధించే వృక్షాలను నశింపజేయబూనారు. అప్పుడు బ్రహ్మదేవుడు సాక్షాత్కరించి వారిని శాంతింపజేశాడు. బ్రహ్మ ఆదేశం మేరకు తమ పుత్రిక మారిషను వృక్షాలు ప్రచేతసుల కిచ్చి పెండ్లి చేశాయి.

దక్షుడు ప్రచేతసుల పుత్రుడుగా ఆ మారిషయందు జన్మించి ప్రజాసర్గరక్షణ కావించాడు. ఆపై ప్రచేతసులు పశ్చిమసాగరతీరం చేరగా వారిచెంతకు నారదుడు వచ్చాడు. వారామునిని ఆత్మతత్త్వం వివరించమని ప్రార్థించారు. వారు కోరినట్లే వారికి ఆత్మతత్త్వం ఉపదేశించి ఆ మునిశ్రేష్ఠుడు బ్రహ్మసదనానికి వెళ్లాడు. నారదుడు చెప్పినట్లు ప్రచేతసులు భక్తిమంతులై శాశ్వతమైన హరిపదం పొందారని మైత్రేయుడు వివరించాడు.

విదురుడు భగవతత్త్వం తెలిసిన మైత్రేయమునికి ప్రణమిల్లాడు. ఆ మునీంద్రుని అనుమతితో బంధుదర్శనాపేక్ష గల్గి హస్తినకు పయనమైపోయాడు.

శుకయోగి పై వృత్తాంతమంతా పరీక్షిత్తునకు వినిపించాడు. ఈ ఉపాఖ్యానం విన్నవాడు ఆయురైశ్వర్యాదిఫలాలను పొందుతాడని శుయోగీంద్రుడు చెప్పినాడని సూతమహర్షి శౌనకాదిమునులకు చెప్పినాడు.

శ్రీమద్భాగవతంలోని చతుర్థస్కంధంలో వున్న వృత్తాంతాలు ఈ కథాసారంలో సంగ్రహించి చెప్పబడ్డాయి.

**– డా।। సముద్రాల లక్ష్మణయ్య**

# పంచమస్కంధం - కథాసారం

పంద్రెండు స్కంధాల భాగవతంలో పంచమస్కంధంలోని ప్రథమాశ్వాసం 183 గద్య పద్యాలతో అలరారుతోంది. ఉత్తరాభిమన్యుల కుమారుడైన పరీక్షిన్మహారాజు మహాజ్ఞానియైన శ్రీశుకుణ్ణి చూచి ఆనందంతో సరసంగా ఇలా ప్రశ్నించాడు. మునిశ్రేష్ఠా! ప్రియవ్రతుడు ఆత్మారాముడు కదా! అటువంటివాడు ఇంట్లోనే ఉంటూ సుఖభోగాదులు ఎలా అనుభవించాడు? ఇల్లూ ఇల్లాలూ పిల్లలూ అంటే మమకారం పెంచుకొన్నవాడికి మోక్షసిద్ధి ఎలా కలిగింది? శ్రీహరిమీద గురి ఎలా కుదిరింది? ఈ నా సందేహాన్ని తీర్చు స్వామీ! అని పరీక్షిత్తు అడిగితే శుకయోగి ఇలా వివరించాడు.

రాజా! విను. ప్రియవ్రతుడు ఒకరాజు. అతడు నారదమహర్షి పాదసేవ చేసుకుంటున్నవాడు. అతడొకసారి అధ్యాత్మసత్త్రయాగం చేపట్టాడు. తండ్రి రాజ్యపాలన చేపట్టమని ఆజ్ఞాపించినా, లౌకిక వ్యవహారాలు తన జ్ఞానానికి ఆటంకాలని ప్రియవ్రతుడు రాజ్యపాలనను అంగీకరించలేదు. అన్నీ తెలుసుకున్న బ్రహ్మదేవుడు ప్రియవ్రతునికి రాజ్యపాలనయందు ఆసక్తి కల్గించడానికి ఇంద్రాదులు తన్ను సేవిస్తుండగా హంసవాహనమెక్కి సత్యలోకం నుండి మానవలోకానికి వచ్చాడు. బ్రహ్మదేవునికి నారద స్వాయంభువ ప్రియవ్రతులు ఎదురేగి పూజించారు.

బ్రహ్మ ప్రియవ్రతునితో "ఓ రాజా! విష్ణుమూర్తి మాటలుగా నీకు చెబుతున్నాను మనమందరం నారాయణుని ఆజ్ఞానుసారం నడిచేవాళ్లం. గృహస్థాశ్రమంలో ఉంటూ నారాయణుని పాదాలు ఆశ్రయించి అరిషడ్వర్గాలను జయించి, భోగాలను అనుభవిస్తూ ముక్తసంగుడవై ముక్తి దక్కించుకోవయ్యా! అన్నాడు. ప్రియవ్రతుడు బ్రహ్మదేవుని మాటలను విని తలవంచి గౌరవపూర్వకంగా అంగీకరించాడు. బ్రహ్మదేవుడు తన లోకానికి వెళ్లాడు. స్వాయంభువ మనువు బ్రహ్మసంకల్పంతో కుమారుడైన ప్రియవ్రతుణ్ణి రాజ్యానికి పట్టాభిషిక్తుణ్ణి చేసి, తాను అరణ్యాలకు వెళ్లిపోయాడు.

ప్రియవ్రతుడు రాజ్యాన్ని పరిపాలిస్తూ విశ్వకర్మప్రజాపతి కుమార్తె అయిన 'బర్హిష్మతి' అనే యువతిని వివాహమాడాడు. ఆమెయందు తనతో సమానులయిన 'ఆగ్నీధ్రుడు, ఇధ్మజిహ్వుడు, యజ్ఞబాహువు, మహావీరుడు, హిరణ్యరేతసుడు, ఘృతపృష్ఠుడు, సవనుడు, మేధాతిథి, వీతిహోత్రుడు, కవి అనే పదిమంది కుమారులను, ఊర్జస్వతి అనే కుమార్తెను కన్నాడు. కుమారులలో కవి, మహావీరుడు, సవనుడు చిన్నతనం నుండే బ్రహ్మచర్యం అవలంబించి బ్రహ్మవిద్యానిష్ణాతులై భక్తియోగ ప్రభావంతో ఈశ్వర తాదాత్మ్యం పొందారు. ప్రియవ్రతుడు మరొక భార్యవల్ల ఉత్తముడు, తామసుడు, రైవతుడు అను ముగ్గుర్ని కన్నాడు. వీరు చాలా గొప్పవారు. వారు మనువులయి మన్వంతరాలకు అధిపతులయ్యారు.

ప్రియవ్రతుడు 'బర్హిష్మతి' మీద అధికమైన అనురాగంతో ఆమెయందే మనస్సు లగ్నంచేసి వివేకం కోల్పోయిన వానిలాగా సమస్త భోగాలూ అనుభవించాడు. 11 కోట్ల సంవత్సరాలు రాజ్యం పరిపాలించాడు. ఒకనాడు మేరు పర్వతానికి ప్రదక్షిణం చేస్తున్న సూర్యునికి ఆవలిభాగంలో కనిపించే చీకటిని పోగొట్టాలని తలచి సూర్యుని రథంతో

సమానమైన రథమెక్కి ఏడుమార్లు సూర్యుని చుట్టూ ప్రదక్షిణాలు చేశాడు. రథచక్రాల గాళ్లు పడిన దారులు సప్త సముద్రాలయ్యాయి. గాళ్ల నడుమ ఉన్న భూమి సప్తద్వీపాలయింది. ప్రియవ్రతుడు, ఆగ్నీధ్రుడు మొదలుగాగల ఏడుగురు కుమారులను జంబూద్వీపమాదిగా గల ఏడు ద్వీపాలకూ పట్టాభిషిక్తుల్ని చేశాడు. ఊర్జస్వతి అనే కుమార్తెను భార్గవుడికిచ్చి పెళ్లి చేశాడు. ఆ దంపతులకు 'దేవయాని' అనే కన్యామణి పుట్టింది. తరువాత ప్రియవ్రతుడు విరక్తుడై శ్రీహరి అనుగ్రహంవల్ల లభించిన ఆత్మవిద్యను అందుకుని, కుమారులను రాజ్యాలలో కుదుటపరిచాడు. భార్యలను పరిత్యజించాడు. నారదుని అడుగుజాడలలో నడచి సూర్యునికి ప్రతిసూర్యునిగా ప్రకాశించాడు. ప్రియవ్రతుని గొప్పతనం తెలుసుకోవడం ఈశ్వరునికే సాధ్యం. కాని మానవ మాత్రులకు సాధ్యం కాదు.

తండ్రియైన ప్రియవ్రతుడు విరక్తుడు కాగా ఆతని కుమారుడు ఆగ్నీధ్రుడు జంబూద్వీపాన్ని పాలిస్తూ ప్రజలందర్నీ కన్నకొడుకుల్లా చూస్తూ వచ్చాడు. ఒకనాడు సంతానంకోసం మందరపర్వత సమీపానికి వెళ్లి అచంచలమైన మనస్సుతో బ్రహ్మదేవుణ్ణి ఆరాధించాడు. ఆగ్నీధ్రుని భక్తి ప్రపత్తులకు మెచ్చి బ్రహ్మదేవుడు తనవద్ద సంగీతమాలపించే 'పూర్వచిత్తి' అనే అప్సరసను ఆయన దగ్గరకు పంపాడు. ఆశ్రమవాటికలో ఆగ్నీధ్రుడు ఆమెను చూచి ఆమె అందచందాలకు మురిసి 'విష్ణుకళ' అని భావించి ఓ తలోదరీ! నాతోపాటు నీవు కూడ తపస్సు సాగించు. నా సంసారాన్ని పెంచు. బ్రహ్మదేవుడు నిన్ను నాకు ప్రసాదించాడు అని అన్నాడు. పూర్వచిత్తి ఆగ్నీధ్రుని ప్రియవాక్కులకు, రూపానికి, శీలానికి, వయస్సుకు, విద్యకూ లొంగిపోయి, ఆగ్నీధ్రునితో కూడ నూరువేల సంవత్సరాలు భూలోకంలో స్వర్గసౌఖ్యాలూ అనుభవించింది. ఆగ్నీధ్రుడు పూర్వచిత్తి వల్ల నాభి, కింపురుషుడు, హరివర్షుడు, ఇలావృతుడు, రమ్యకుడు, హిరణ్మయుడు, కురువు, భద్రాశ్వుడు, కేతుమాలుడు అనే పేర్లుగల తొమ్మిదిమంది కొడుకులను కన్నాడు. తర్వాత పూర్వచిత్తి పిల్లలనూ, ఆగ్నీధ్రుణ్ణీ విడిచి బ్రహ్మలోకానికి వెళ్లిపోయింది. ఆగ్నీధ్రుని కుమారులు తండ్రి అనుమతితో జంబూద్వీపాన్ని వర్షాలుగా విభజించుకొని పరిపాలించారు. వారు పాలించిన తొమ్మిది వర్షాలు వారి వారి పేర్లతో ప్రసిద్ధమయ్యాయి. పూర్వచిత్తితో ఆగ్నీధ్రుడు ఎంతోకాలం కామోపభోగాలు అనుభవించినా అతనికి తృప్తి కలుగలేదు. భార్యను తలచుకొంటూ, వేదోక్త కర్మలు ఆచరిస్తూ, చివరకు భార్య ఉన్న లోకానికి చేరుకున్నాడు. ఈ విధంగా తండ్రి పరలోకగతుడు కాగా, నాభి మొదలైన ఆగ్నీధ్రుని కుమారులు వరుసగా మేరువు "కుమార్తెలయిన మేరుదేవి, ప్రతిరూప, ఉగ్రదంష్ట్ర, లత, రమ్య, శ్యామ, నారి, భద్ర, దేవి అనేవారిని వివాహమాడారు. నరశ్రేష్ఠుడైన నాభి, భార్య అయిన మేరుదేవితో కలిసి సంతానంకోసం యజ్ఞపురుషుడైన వాసుదేవుణ్ణి పూజించాడు. నాభి ప్రవర్గ్యమనే క్రతువును ఋత్విక్కులతో శ్రద్ధగా ఆచరించాడు. లక్ష్మీరమణుడు ఆ దంపతుల ముందు ప్రత్యక్షమైనాడు. ఋత్విక్కులు నారాయణుణ్ణి అనేకవిధాలుగా స్తుతించారు. నాభి నీతో సమానమైన సంతానం తనకు కలగాలనే కోరికతో నిన్ను పూజించాడు అని చెప్పగా నాభిపత్ని అయిన మేరుదేవికి నారాయణుడు తానే కొడుకునై పుడతానని చెప్పి అంతర్ధానమయ్యాడు. శ్రీహరి మేరుదేవికి కుమారుడుగా అవతరించాడు. ప్రజలందరూ సంతోషించారు. పుట్టిన శిశువు వైఖరినిబట్టి అతడు బలవంతుడనీ, పరాక్రమవంతుడనీ, శౌర్యం కలవాడనీ అర్థం చేసుకున్న నాభి ఆ కుమారునికి "ఋషభుడు" అని పేరు పెట్టాడు. అందరూ ఆ ఋషభుని

రాజుగా భావించారు. ఋషభుని మహిమలు విని ఇంద్రుడు లోలోపల కుమిలిపోయి ఋషభుని రాజ్యంలో వానచినుకు పడకుండా చేశాడు. దేవేంద్రుని దుర్బుద్ధికి ఋషభుడు నవ్వుకొని 'అజనాభమనే' పేరుతో వ్యవహరింపబడే తన భూమండలాన్ని యోగబలంతో వానలు కురిపించి సుభిక్షం చేశాడు. తాను కోరుకున్న విధంగా కొడుకు పుట్టడం పెరగడం చూచి, నాభి చాలా సంబరపడి, రాజ్యపాలనకు తగినవాడని భావించి పట్టం కట్టి, నాభిని బ్రాహ్మణులకూ, మంత్రి వర్గానికీ అప్పగించి, భార్య మేరుదేవితో కలిసి నరనారాయణ నిలయమైన బదరికాశ్రమం చేరుకున్నాడు. నరనారాయణ స్వరూపుడూ పురుషోత్తముడూ అయిన వాసుదేవుణ్ణి ధ్యానించి సతీసమేతుడై శ్రీహరితో తాదాత్మ్యం చెందాడు.

రాజైన ఋషభుడు తన రాజ్యాన్ని కర్మభూమిగా భావించాడు. ప్రజలందరికీ కర్మతంత్రం తెలియజేయాలనుకున్నాడు. అందుచేత కర్మలు ఆచరించడానికి తానే స్వయంగా గురువులవద్ద వేదాలు చదివాడు. గురువుల ఆజ్ఞ శిరసావహించి, దేవేంద్రుడిచ్చిన 'జయంతిని' ఋషభుడు వివాహం చేసుకున్నాడు. ఆ జయంతివల్ల ఋషభుడు 'భరతుడు' మొదలుగా గల నూర్గురు కొడుకులను కన్నాడు. భరతుని పేరు మీదుగా ఈ భూమండలం 'భరతవర్ష' మనే ప్రశస్తి పొందింది. భారతవర్షమనే పేరుతో ప్రసిద్ధి పొందిన భూమండలంలోని ఆ యా భాగాలకు తన సోదరులలో కుశావర్తుడు, ఇలావర్తుడు మొదలుగా గల తొమ్మండుగురను ప్రధానులుగా నియమించాడు. కవి మొదలుగా గల తొమ్మండుగురు సోదరులు భాగవతధర్మాన్ని ప్రకాశింపజేశారు. మిగిలిన ఎనభై యొక్క మంది కుమారులు తండ్రియైన ఋషభుని మాట జవదాటనివారు. మహావినయసంపన్నులు. వేదధర్మాలు అనుష్ఠించేవారు. అందుచేత వారు బ్రాహ్మణోత్తములుగా పేరెన్నికగన్నారు. ఋషభుడు ఇహలోక ఫలాన్ని ఏమాత్రం అపేక్షించక కొంతకాలం రాజ్యపాలన సాగించాడు. సంసారవ్యామోహాన్ని వదలిపెట్టాడు. రాజ్యమంతా కొడుకుల కప్పగించాడు. తరువాత మెల్లగా బ్రహ్మావర్త దేశానికి పయనించాడు. కొడుకులూ, మంత్రులూ అతణ్ణి అనుసరించారు. మహాత్ములైన మునుల సమక్షంలో కుమారులనందరినీ దగ్గరకు పిలిచి సంతోషంతో ఋషభుడు వారికి విపులంగా తపస్సు, దానం, దీనజనరక్షణ మున్నగు విషయాలు బోధించాడు. కాముకులతో సహవాసం వద్దన్నాడు. పరమభాగవతుడు పెద్దవాడైన భరతునికి రాజ్యభారం అప్పగించాడు. తరువాత శరీరమాత్ర సహాయుడై దిగంబరుడై బ్రహ్మావర్తదేశాన్ని వదలి, జడునివలె, మూగవానివలె, చెవిటివానివలె, పిచ్చివానివలె అవధూత వేషం ధరించాడు. ఎవరయినా పలుకరించినా బదులు పలుకక మౌనవ్రతం చేపట్టాడు. నగరాలు, గ్రామాలు, కొండలు, తపోవనాలు మొదలగువానిని దాటి దేహాభిమానం లేకుండా నిశ్చలమైన చిత్తంతో ఏకాకిగా సంచరిస్తున్నాడు. ఎన్ని చేసినా ఆతని శరీరసౌందర్యం వన్నె తగ్గలేదు. దివ్యమంగళ విగ్రహంతో ఎవరూ గుర్తుపట్టకుండా అవధూత వేషంలో సంచరించాడు. ఎన్ని సిద్ధులు లభించినా వాటిని ఆతడు స్వీకరించలేదు అని శుకమహర్షి చెప్పగా పరీక్షిత్తు మునివరేణ్యా! యోగాభ్యాసంవల్ల కర్మలు నశించి మహాసిద్ధులు ప్రాప్తిస్తాయి కదా! ఋషభుడు ఎందుకు స్వీకరించలేదు? అని ప్రశ్నించాడు. శుకుడు మనసుగతులు తెలిసినవాడు కాబట్టి తమంత తాముగా సిద్ధులు వచ్చినా ఋషభుడు స్వీకరించలేదు అని కథను కొనసాగించారు. దేహాభిమానాన్ని వదలిపెట్టి, యోగమాయా

వాసనల కారణంగా లౌకికంగా దేహధారిగా చరించాడు. అతడు కోంకణం, వేంకటం, కుటక పర్వతాల సమీపంలోని ఉపవనం చేరుకున్నాడు. పిచ్చివానిలా, దిగంబరుడై సంచరించాడు. దుమ్ముతో కూడిన గాలికి అడవిలో నిప్పంటుకుంది. ఆ కార్చిచ్చులో ఋషభుడు కాలిపోయాడు.

ఋషభుని చేతలను అచటివారు చెప్పుకోగా "అర్హతుండు" అనే పేరుగల ఆ రాష్ట్రాధికారి విన్నాడు. ఆ అర్హతుడు స్వధర్మం వదలిపెట్టి అర్హత, ఆచారానికి ఆమోదం తెలిపాడు. అధర్మజుష్టమైన కలియుగంలో భవిష్యత్తుకు లోబడి తన రాష్ట్రంలోని ప్రజలను అయోగ్యమైన వేదబాహ్య మతంవైపు మొగ్గేటట్లు చేశాడు. ఋషభుడు విష్ణుమూర్తితో తాదాత్మ్యం పొందాడు. అతడే సాక్షాద్విష్ణువు.

పరీక్షిత్తుతో శుకుడు ఇంకా ఇలా చెప్పసాగాడు. రాజా! ఋషభుని అనంతరం పెద్ద కుమారుడైన భరతుడు ఎంతో దీక్షతో భూమండలాన్ని పరిపాలించి "విశ్వరూపుడనే" రాజు కమార్తె "పంచజని"ని కోరి వివాహం చేసుకున్నాడు. అతనికి ఆమెయందు సుమతి, రాష్ట్రభృత్తు, సుదర్శనుడు, ఆచరణుడు, ధూమ్రకేతువు అనే అయిదుగురు కొడుకులు పుట్టారు. ఇంతకుముందు "అజనాభం"గా పిలువబడే ఈ భూభాగానికి భరతుడు పాలించడంవల్ల "భరతవర్షం" అనే పేరు రూఢమైంది. భరతుడు వేదోక్త కర్మలాచరిస్తూ, వాసుదేవునిపట్ల భక్తిశ్రద్ధలతో యాభై లక్షల వేల సంవత్సరాలు రాజ్యపాలన సాగించాడు. తాత తండ్రులనుండి సంక్రమించిన ధనరాశిని తన తనయులకు పంచియిచ్చి, భోగభాగ్యాలనూ, అపారసంపదనూ, రాజసౌధాలనూ వదలిపెట్టి "పులహాశ్రమానికి వెళ్లిపోయాడు. ఆశ్రమ సమీపంలో సాలగ్రామాలకు ఆలవాలమైన "గండకీ" నది ప్రవహిస్తోంది. ఆశ్రమంలో ఒంటరిగా శ్రీహరిని సమస్త పూజాద్రవ్యాలతో తనివి తీరా సేవిస్తున్నాడు. ఒకనాడు గండకీనదిలో స్నానం చేసి ప్రణవం జపిస్తున్నాడు. అపుడు నిండు చూలాలైన ఒక లేడి నీరు తాగడానికి నదీతీరానికి వచ్చింది. నీరు తాగుతుండగా సమీపంలో ఒక సింహం దిక్కులు దద్దరిల్లేటట్లు భయంకరంగా గర్జించింది. నీరు తాగకుండానే హరిణాంగన భయంతో పైకి ఎగిరి ఒక్క దూకు దూకింది. అలా దూకడంతో గర్భంలోని పిల్ల జారి నదిలో పడింది. దూకడంతో తల్లి లేడి మరణించింది. నదీజలాల్లో జారి మునిగి తేలుతున్న లేడిపిల్లను చూచి భరతుని హృదయం కరిగిపోయింది. దయార్ద్ర హృదయంతో లేడిపిల్లను ఆశ్రమానికి తెచ్చి గారాబంతో సాకడం మొదలుపెట్టాడు. ఆ లేడిపిల్లను సాకడంతో భరతుని జపతపాదులు మూలబడ్డాయి. కొంతకాలానికి ఆ లేడిపిల్ల ఆశ్రమం వదలి వెళ్లిపోయింది. భరతుడు దాన్ని గురించి ఎంతో దుఃఖాన్ని పొంది, దానినే తలుస్తూ విలపించి యోగభ్రష్టుడైనాడు. లేడిపిల్లకోసం ఎంతగానో విలపించాడు. ఈ విధంగా భరతుడు బాధపడుతున్న సమయంలో ఆ జింకపిల్ల తిరిగి వచ్చింది. దానిని చూచి భరతుడెంతో సంబరపడ్డాడు. కొంతకాలం గడిచిపోయింది. భరతుడికి చివరి క్షణం రానేవచ్చింది. అంత్యకాలంలో కన్న కొడుకువైపు చూస్తున్నట్లు ఆ జింకవైపు ఆసక్తితో చూస్తూ ఆ జింకనే భావించుకుంటూ, భరతుడు ప్రాణాలు విడిచాడు. తర్వాత జన్మలో జింకగా పుట్టాడు. అయినా అతనికి పూర్వస్మృతి మాత్రం పోలేదు. ఈ విధంగా భరతుడు లేడి కడుపున పుట్టినా పూర్వం చేసిన పుణ్యంచేత తానెందుకు జింకగా పుట్టవలసి వచ్చిందో తెలుసుకుని బాధపడి తల్లిజింకను వదిలి కాలాంజన పర్వతాన్ని వదిలిపెట్టి సాలగ్రామ సమీపంలో ఉన్న

పులస్త్య పులహాశ్రమం చేరుకున్నాడు. ఎవరితోనూ సంబంధం లేకుండా ఒంటరిగా ఉండి, ఎండిన ఆకులూ, గడ్డిపరకలూ తింటూ తన జింక జన్మకు కారణమైన ఆ నదీతీరంలోనే బతుకు ముగించాలని ఆ పుణ్యనదిలో స్నానం చేస్తూనే తన హరిణ శరీరాన్ని వదిలిపెట్టాడు.

పరీక్షిన్మహారాజా! భరతుడు లేడి దేహాన్ని వదిలిపెట్టి తరువాత జన్మలో ఆంగీరసగోత్రుడైన ఒక బ్రాహ్మణునికి కుమారుడుగా పుట్టాడు. ఆ బ్రాహ్మణుడు వేదాధ్యయనసంపన్నుడు, సుగుణగరిష్ఠుడు నీతికోవిదుడు. అట్టి బ్రాహ్మణునకు భరతుడు పుత్రుడుగా జన్మించాడు. పుట్టినది మొదలు సంసారబంధాలకు దూరంగా ఉంటూ అచ్యుతుడూ, సర్వేశ్వరుడూ అయిన విష్ణుమూర్తి పాదాలను నిరంతరం ధ్యానిస్తూ కాలం గడపసాగాడు. ఆ బ్రాహ్మణునికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్యకు తొమ్మిదిమంది పుత్రులు పుట్టారు. చిన్న భార్యకు ఒక కుమార్తె, ఒక కుమారుడు జన్మించారు. ఆ చిన్నభార్య కుమారుడే భరతుడు. పూర్వజన్మ స్మృతులవల్ల భరతుడు బంధవిముక్తికోసం ఉన్మత్తుడుగా, జడుడుగా, అంధుడుగా, జనులకు కనిపిస్తూ జీవితం గడుపుతున్నాడు.

బ్రాహ్మణ కుమారుడైన భరతుడికి కర్మలంటే ఏమాత్రం ఆసక్తి లేకపోయినా, బోధించేవాడు తండ్రి కాబట్టి వాటిని పాటించడం తప్పనిసరి అయింది. తండ్రి వానికి ఉపనయనం చేసి, గాయత్రీ మంత్రోపదేశం చేసి, వేదాధ్యయనం చేయించి వానికి వాటిపట్ల అభినివేశం లేకపోవడం గమనించి తన కోరిక నెరవేరలేదని నిరాశపడ్డాడు. కొంతకాలానికి ఆంగీరసగోత్రుడైన ఆ విప్రుడు ఆకస్మికంగా పరలోకగతుడైనాడు. తండ్రి పోగానే తల్లి సహగమనం చేసింది. సవతి పిల్లలు అవినీతిపరులు. అందువల్ల వారికి భరతుని గొప్పతనం తెలియలేదు. తండ్రి మరణానంతరం సవతితల్లి పిల్లలు భరతుణ్ణి చదువనీయకుండా ఇంటిపనులు, పొలంపనులు చేయుమని శాసించేవారు. ఆ పనులు చేస్తూ భరతుడు ఏ విషయంలోనూ ఆసక్తిలేకుండా ద్వంద్వాలలో సమబుద్ధి కలవాడై, వారేమి తిట్టినా పట్టించుకోకుండా కాలం గడిపాడు. అతడు పనిచేసే పొలానికి సమీపంలో ఒక నగరం ఉంది. దాని నాయకుడు భిల్లరాజు. వానికి సంతానం లేదు. సంతానంకోసం కాళికాదేవిని పూజించి ఆమెకు నరబలి ఇవ్వాలని నిశ్చయించుకున్నాడు. కాళికాదేవికి బలి యివ్వడానికి ఒక మనుష్యుణ్ణి వెంటపెట్టుకొని వెళుతూ ఉంటే ఆ మనిషి తప్పించుకుని పారిపోయాడు. వాడు ఎంత వెతికినా దొరకలేదు. అప్పుడు భిల్లరాజు భటులు పొలంలో వీరాసనంలో ధ్యానం చేస్తున్న భరతుణ్ణి చూచి బలికి బలిపశువు దొరకిందని కాళికాలయానికి తీసుకొనిపోయి బలియివ్వపోగా సాక్షాద్విష్ణుస్వరూపం అయిన భరతుణ్ణి చూచి కాళికాదేవి బోయరాజు మీద, భటులమీద విజృంభించి వారి శిరస్సులు నేలకూల్చింది. తర్వాత భరతుడు పొలం దగ్గరికి వచ్చి పూర్వంలా కాపలా కాస్తున్నాడు. ఇలా సంవత్సరాలు గడిచాయి.

ఒకసారి సింధుదేశాన్ని పరిపాలించే రహూగణుడనే రాజు కపిలముని దగ్గర ఆత్మవిద్య తెలుసుకోవాలని బుద్ధిపుట్టి ఇక్షుమతీ నదీతీరంలోని కపిలమునిని దర్శించడానికి పల్లకీ ఎక్కి వెళుతున్నాడు. పల్లకి మోసేబోయీలకు పొలాన్ని కాపలాకాసే బలవంతుడైన భరతుడు పల్లకి మోయడానికి బాగుంటాడని అతనిని తీసుకువచ్చి పల్లకి

బొంగు ఆతని భుజంమీద పెట్టారు. అలవాటు లేని, ఆసక్తి లేని, భరతుడు నడుస్తున్నాడు. మిగిలిన బోయీలకు ఇతని నడకతో జత కుదరలేదు. ఎగుడు దిగుడుగా పల్లకి నడుస్తుంటే రాజుకు కోపం వచ్చి బోయీలను మందలించాడు. వారు భరతుడు సరిగా నడవటం లేదని చెప్పారు. రహూగణునకు కోపంవచ్చి బ్రహ్మతేజస్సుతో, నివురు గప్పిన నిప్పులా ఉన్న భరతుణ్ణి నిందించాడు. భరతుడు మారు చెప్పకుండా పల్లకి మోస్తూనే ఉన్నాడు. భరతునకు తనకిది చివరి జన్మమని తెలుసు. అహంకార మమకారాలకు మనస్సులో అవకాశం ఇవ్వలేదు. అతడు జ్ఞాని, పరబ్రహ్మ స్వరూపుడు. రహూగణుడు పల్లకి ఎగుడు దిగుడుగా పోతుంటే పిచ్చి కోపంతో అరిచాడు. ఓరీ పొగరుబోతా! నడపీనుగా! నీ కుంటినడకను వదిలించి సరి అయిన మార్గంలో నడిపిస్తాను అని కారుకూతలు కూశాడు. అది విని భరతుడు ఓ రాజా! నీవు చెప్పింది నిజం. బరువు శరీరానికే గాని నా కేమాత్రం కాదు. జీవన్మృతుడను. నేను మాత్రమే కాదు. జననమరణాలు కల్గి ఉండే వారందరూ జీవన్మృతులే. యజమాని సేవకుడు అనే సంబంధం కర్మవల్ల కలిగింది. “నేను రాజును కదా” అనే అభిమానంతో నీవు ఆజ్ఞాపించావు. “నీవు మదోన్మత్తుడవై ఉన్నావు. మూగవాడు, పిచ్చివాడు, గుడ్డివాడు ఎలాగో, నేనూ అంతే. జడుడను, మృతుడను అయిన నాకు శిక్ష విధించిన నీ శ్రమ వ్యర్థం” అని చెప్పి పల్లకి ఎప్పటిలాగే మోయసాగాడు. రహూగణుడు భరతుని శాస్త్రసమ్మతాలైన వాక్యాలను విన్నాడు – అహంకారం తొలగింది. బ్రాహ్మణునకు సాష్టాంగదండప్రణామం చేశాడు. నీవు సామాన్య బ్రాహ్మణుడవు కావు. అవధూతలా కనిపిస్తున్నావు. నిగూఢమైన విజ్ఞాన రహస్యాలు నీకు తెలిసినట్టే ఉంది. నీవు లోకులను పరీక్షించడం కోసం ఎవరూ గుర్తించడానికి వీలుకాని ఆకారంలో తిరుగుతున్న కపిలమహామునీంద్రుడవే అనుకుంటున్నాను. అని రాజు రహూగణుడు బ్రాహ్మణుని ద్వారా ఎన్నో ఆధ్యాత్మిక రహస్యాలు తెలుసుకున్నాడు. భరతుడు రహూగణునితో తాను భరతుడుగా రాజ్యం చేసిన నాటినుండి జరిగిన వృత్తాంతమంతా తెలిపాడు. సంసారమనే అడవిలోని కష్టాలను, దుఃఖాలను సవివరంగా చెప్పగా సింధుదేశాధిపతి రహూగణుడు భరతుడికి నమస్కారం చేశాడు. మీరు జ్ఞానులు, మీ సాంగత్యంతో నాకు తత్త్వం బోధపడింది. దేహమే ఆత్మ అనే భ్రమ నశించింది అన్నాడు. అని ఇలా భరతుడి కథ చెప్పిన శుకయోగీంద్రుడు పరీక్షిత్తుతో ఇలా అన్నాడు. రాజా! భరతుడి పవిత్రమైన చరిత్ర ప్రస్తుతించడం నాకు సాధ్యం కానిపని. భరతుడి చరిత్ర వినిపించినవారినీ, విన్నవారినీ శ్రీమన్నారాయణుడు తప్పక రక్షిస్తాడు. వారు స్వర్గసుఖం అనుభవిస్తారు అంటూ భరతుడి కథ ముగించాడు శుకుడు.

చివరలో కవి, భక్తవత్సలుడూ, కృపాపారీణుడూ, త్రిజగత్కల్యాణుడూ అయిన శ్రీకృష్ణునికి నమస్కరించి ఆశ్వాసాంతంలో మంగళ ప్రదంగా స్వస్తిపలుకులు చెప్పి ముగించాడు.

పంచమస్కంధంలోని ద్వితీయాశ్వాసంలో 166 గద్యపద్యాలున్నాయి. శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజుకు భాగవతాన్ని వినిపిస్తున్నాడు. భరతుని చరిత్రను వర్ణించి ప్రస్తుతం భరతవంశాన్ని వర్ణించడంతో ఆరంభించి నూతనవిషయాన్ని చెప్పడానికి ప్రారంభించాడు. భరతుని కుమారుడైన సుమతి నుంచి విరజునివరకు

భరతవంశంలోని పలుతరాల్ని వర్ణించాడు. అదే వంశంలో జన్మించిన గయమహారాజు సాక్షాత్తూ నారాయణుని అంశమని చెప్పాడు. పరీక్షిన్మహారాజు కోరిక మేరకు ద్వీపాలను, సముద్రాల్ని వర్ణించడానికి పూనుకొన్నాడు.

పరీక్షిన్మహారాజా!

ఈ ద్వీపాలు, సముద్రాలు, భూమి ఇవన్నీ భగవంతుని మాయాగుణవిభూతులే. వీటినన్నిటినీ వర్ణించి చెప్పడం సాధ్యంకాదు. నాకు తెలిసినంతవరకు చెప్తాను. శ్రద్ధగా విను.

భూమి పద్మాకారంగా ఉంది. మధ్యలో జంబూద్వీపం ఉంది. దాని పొడవు లక్షయోజనాలు, వెడల్పు లక్షయోజనాలు. జంబూద్వీపంలో తొమ్మిదివేల యోజనాల విస్తీర్ణం ఉన్న తొమ్మిది వర్షాలు (దేశాలు) ఉన్నాయి. వాటికి సరిహద్దులుగా ఎనిమిది పర్వతాలున్నాయి. తొమ్మిది వర్షాల మధ్యలో ఇలావృతమనే వర్షం ఉంది. దాని మధ్యలో భూపద్మానికి దుద్దులా బంగారు మేరుపర్వతం ఉంది. దాని ఎత్తు లక్షయోజనాలు. దానికి ఉత్తరాన నీలం, శ్వేతం, శృంగవంతం అనే మూడు పర్వతాలున్నాయి. ఈ పర్వతాల మధ్యలో రమ్యకం, హిరణ్మయం, కురు అనే మూడు వర్షాలున్నాయి. ఇలావృతవర్షానికి దక్షిణాన నిషధపర్వతం, హేమకూటపర్వతం, హిమవత్పర్వతం అనే మూడు సరిహద్దు పర్వతాలున్నాయి. వీటి మధ్యలో హరివర్షం, కింపురుషవర్షం, భారతవర్షం అని మూడు భూప్రదేశాలున్నాయి. ఇలావృత వర్షానికి పడమట మాల్యవంతం అని, తూర్పున గంధమాదనం అని సరిహద్దు పర్వతాలున్నాయి. ఈ రెండూ కేతుమాల, భద్రాశ్వవర్షాలకు సరిహద్దు పర్వతాలు. సుమేరుపర్వతానికి తూర్పున మందరపర్వతం, దక్షిణంలో మేరుమందర పర్వతం, పడమట సుపార్శ్వపర్వతం, ఉత్తరాన కుముదపర్వతం ఉన్నాయి. ఈ పర్వతాలపైన పదకొండు వందల యోజనాల పొడవు, నూరు యోజనాల వెడల్పు ఉన్న ప్రదేశంలో మామిడిచెట్లు, నేరేడుచెట్లు, కడిమిచెట్లు, మర్రిచెట్లు ఉన్నాయి. ఈ పర్వతశిఖరాలమీద వందయోజనాల వైశాల్యం ఉన్న నాలుగుసరస్సులు, నందనం, చైత్రరథం, వైభ్రాజకం, సర్వతోభద్రం అనే దేవతల ఉద్యానవనాలు ఉన్నాయి.

మందరపర్వతం మీద ఉన్న మామిడిచెట్లకు కొండ శిఖరాలంత మామిడి కాయలుంటాయి. అవి పండి అమృతంలా తియ్యని రసం కలిగి ఉంటాయి. ఆ ఫలాలు మిగులముగ్గి రాలిపోతే వాటిరసం ఒక మహాప్రవాహమయ్యింది. ఆ ప్రవాహానికి అరుణోదయమని పేరు. ఆ నదిలో పార్వతీదేవి చెలికత్తెలు స్నానం చేస్తూంటారు.

మేరు మందరపర్వతాలమీద నేరేడు చెట్లు ఉన్నాయి. వాటికి ఏనుగంత నేరేడు పండ్లు ఉంటాయి. అవి పగిలి వాటిరసం నదులై ప్రవహిస్తోంది. ఆ నదిపేరు జంబూనది. ఆ నదిలోని నీరు తగిలిన మట్టి బంగారం అవుతుంది. దానితో దేవతలు నగలు చేయించుకుంటారు.

సుపార్శ్వపర్వతం మీదనుండి ఐదు తేనెనదులు ఇలావృతవర్షాన్ని పడమట భాగంలో తడుపుతూ ప్రవహిస్తూ ఉంటాయి. కుముదపర్వతంమీద పెద్దమర్రిచెట్టు ఉంది. దానినుండి పాలు, పెరుగు, నేయి, తేనె, బెల్లం, రుచులుకల అనేక ఆహారపదార్థాలు పుడుతూ ఉంటాయి. ఆ మర్రిచెట్టు కోరిన వాటినల్లా ఇస్తుంది. దేవతలు, మునులు

మొదలైనవారు ఆ పర్వతాన్ని ఆశ్రయించుకుని ఆనందంగా కాలం గడుపుతూ ఉంటారు. మేరుపర్వతమనే దుద్దుకు కేసరాలవలె చుట్టూ అనేక పర్వతాలు ఉన్నాయి. మేరుపర్వతం మీద సువర్ణమయమైన బ్రహ్మపురం ఉంది. ఆ పురానికి ఎనిమిది దిక్కులలో లోకపాలుర పురాలున్నాయి. శ్రీమహావిష్ణువు త్రివిక్రమావతారం ఎత్తినపుడు ఆయన కాలిగోటి దెబ్బకు బ్రహ్మాండం పైభాగం బద్దలయ్యింది. ఒక రంధ్రం ఏర్పడింది. పైనున్న జలధార ఆ రంధ్రంద్వారా లోపలికి ప్రవహిస్తూ శ్రీమహావిష్ణువు పాదాన్ని స్పృశిస్తూ ప్రవహించింది. ఆ ప్రవాహానికి 'భగవత్పాది' అని పేరు. ఆ పాదోదకాన్ని అందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో సేవిస్తారు. ఆ ఆకాశగంగ చంద్రమండలాన్ని ఒరుసుకుంటూ మేరుశిఖరాన్ని చేరుకుంటుంది. అక్కడ బ్రహ్మపట్టణం చేరుకుని దాని నాల్గుద్వారాల గుండా వెలువడుతుంది. నాలుగు ద్వారాల నుండి వెలువడిన నాలుగు ప్రవాహాలకు సీత, చక్షువు, భద్ర, అలకనంద అని పేర్లు. అలకనంద హేమకూట, హిమకూట పర్వతాలను దాటుకుంటూ కర్మక్షేత్రమైన భారతవర్షాన్ని పవిత్రం చేస్తూ సముద్రంలో కలుస్తుంది. జంబూద్వీపంలో భారతవర్షం కర్మభూమి. తక్కిన వర్షాలు భోగభూములు. స్వర్గంనుండి పుణ్యశేషాన్ని అనుభవించడానికి వచ్చినవారు, అక్కడ పుణ్యఫలాలు అనుభవిస్తూంటారు. అక్కడివారు పదివేలసంవత్సరాల ఆయుర్దాయం కలిగి, పదివేల ఏనుగులబలం కలిగి దేవతలతో సమానంగా ఉంటారు. కామసుఖం అనుభవిస్తూ మోక్షాన్ని కూడా కోరుకోరు.

ఇలావృతవర్షానికి శివుడధిదేవత. అక్కడ ఉద్యానవనంలో పార్వతీదేవి విహరిస్తూ ఉంటుంది. అక్కడకు ప్రవేశించిన పురుషులు స్త్రీలుగా మారిపోతారు.

భద్రాశ్వవర్షానికి భద్రశ్రవుడు అధిపతి. అతనికి హయగ్రీవుడు ఇష్టదైవం. హరివర్షం లోని వారికి నరసింహుడు ఇష్టదైవం.

కేతుమాలవర్షంలో శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవికి ప్రీతిని కలిగించడానికి మన్మథరూపంలో ఉంటాడు.

రమ్యకవర్షానికి మత్స్యరూపుడైన హరి అధిదేవత. మనువు అధిపతి. హిరణ్మయవర్షానికి కూర్మరూపుడైన శ్రీహరి అధిదేవత. పితృగణాధిపతి అయిన అర్యముడు అక్కడి ప్రజలతోబాటు ఆ శ్రీహరిని ఆరాధిస్తూ ఉంటాడు. ఉత్తరకురువర్షానికి వరాహరూపశ్రీహరి అధిదేవత. కింపురుషవర్షానికి సీతాలక్ష్మణపరివృతుడైన శ్రీరాముడు అధిదేవత. భారతవర్షానికి బదరికాశ్రమవాసి నారాయణుడు అధిదేవత.

భారతవర్షంలో అనేక పర్వతాలు, వాటినుంచి ప్రవహించే అనేక నదీనదాలు ఉన్నాయి. భారతవర్షంలో జన్మించిన మానవులు తాము చేసే సత్త్వగుణప్రధానకర్మలవల్ల దేవతలుగా, రజోగుణప్రధానకర్మల వల్ల మానవులుగా, తమఃప్రధానకర్మల వల్ల నరకంలో యాతనలు పడేవారుగా జన్మిస్తారు. భక్తియోగంతో శ్రీహరిని కొల్చినవారు అజ్ఞానం నశించి పరమపదాన్ని పొందుతారు. అందువలన వర్షాలలో భారతవర్షం అత్యంతం ప్రశస్తమైంది.

**ఉ. భారతవర్షజంతువుల భాగ్యము లేమని చెప్పవచ్చు? నీ**
**భారతవర్షమందు హరి పల్మఱుఁబుట్టుచు జీవకోటికిన్**

**ధీరతతోడఁ దత్త్వ ముపదేశము సేయుచుఁ జెల్మి సేయుచు**
**న్నారయ బాంధవాకృతిఁ గృతార్థులఁజేయుచు నుండు నెంతయున్.** **భాగ.5 స్కం.2 ఆ 56ప**

అదృష్టమంటే భారతవర్షంలో పుట్టిన జీవులదే.

శ్రీహరి ఎన్నో పర్యాయాలు ఇక్కడ అవతరించాడు. సాక్షాత్తూ తానే ఇచ్చటి జనులకు తత్త్వోపదేశం చేశాడు. ఈ జనులతో స్నేహం చేశాడు, బంధుత్వం నెరపాడు. ఈ జనులను కృతార్థులను చేస్తూ ఉంటాడు.

ఇంతకంటే అదృష్టమంటే ఏమిటి? ఇతరవర్షాలలో అనంతకాలం చస్తూ, పుడుతూ ఉండడం కంటె భారతవర్షంలో జన్మించి సర్వసంగాలను పరిత్యజించి మనస్సును శ్రీహరి పాదపద్మాలయందు నిల్పి అనంత, ఆనందమయమైన పరమపదాన్ని పొందడమే కోరుకోదగింది కదా. శ్రీహరి స్మరణ లేని స్వర్గమైనా పరిత్యజింపదగిందే కదా.

సగరపుత్రులు అశ్వమేధాశ్వం కోసమని భూమిని త్రవ్వడం వలన ఎనిమిది ఉపద్వీపాలు ఏర్పడ్డాయి.

జంబూద్వీపం చుట్టూ లక్షయోజనాల వైశాల్యం ఉన్న ఉప్పుసముద్రం ఉంది. ఇక ప్లక్షద్వీపం రెండులక్షల యోజనాల వైశాల్యం కలిగి ఉంది. అందలి వారలకు అగ్నిదేవుడు అధిదేవత. ఆ ద్వీపాన్ని ప్రియవ్రతుని కుమారుడైన ఇధ్మజిహ్వుడు పరిపాలిస్తున్నాడు. ఆ ఇధ్మజిహ్వుడు ఆ ద్వీపాన్ని ఏడు భూభాగాలుగా విభజించి తన ఏడుగురు కుమారుల్ని వాటికి అధిపతులుగా చేసి తాను తపస్సుకై అరణ్యాలకు వెళ్ళిపోయాడు.

ప్లక్షద్వీపంలో ఏడు కులపర్వతాలు ఏడు మహానదులూ ఉన్నాయి. అక్కడి జనులు సహస్రవర్షాలు ఆయుర్దాయం కలిగి దేవతాసమానులుగా ఉంటారు. ప్లక్షద్వీపం చుట్టూ ఇక్షురససముద్రం ఉంది. ప్లక్షద్వీపంకంటె రెంట్టింపు వైశాల్యం కలది శాల్మలీద్వీపం. ఆ ద్వీపంలో అనేకయోజనాల పొడవున్న బూరుగుచెట్టు ఉండడం వల్ల ఆ ద్వీపాకి ఆ పేరు వచ్చింది. ఆ ద్వీపానికి అధిపతి ప్రియవ్రతుని కుమారుడైన యజ్ఞబాహువు. ఆయన ఆ ద్వీపాన్ని ఏడుభాగాలుచేసి వాటికి తన ఏడుగురు కుమారుల్ని అధిపతులుగా చేశాడు. ఆ ద్వీపంలో ఏడు కులపర్వతాలు, ఏడు మహానదులూ ఉన్నాయి. ఆ ద్వీపం చుట్టూ సురాసముద్రం ఉంది.

ఆ సురాసముద్రానికి చుట్టూ కుశద్వీపం ఉంది. అక్కడ గొప్ప దర్భదుబ్బు ఉన్న కారణంగా ఆ ద్వీపానికి ఆ పేరు వచ్చింది. ప్రియవ్రతుని కుమారుడు హిరణ్యరేతసుడు ఆ ద్వీపానికి అధిపతి. అత డా ద్వీపాన్ని ఏడు భాగాలుగాచేసి తన ఏడుగురు కుమారులను వాటికి అధిపతుల్ని చేశాడు. ఆ ద్వీపంలో సప్త కులపర్వతాలు, సప్త మహానదులూ ఉన్నాయి. ఆ ద్వీపంచుట్టూ నేతిసముద్రం ఉంది.

ఆ సముద్రానికి అవతల క్రౌంచద్వీపం ఉంది. క్రౌంచమనే పర్వతం ఆ ద్వీపంలో ఉండడం చేత ఆ ద్వీపానికి ఆ పేరు వచ్చింది. ఆ ద్వీపానికి అధిపతి ఘృతపృష్ఠుడు. ఆయన ఆ ద్వీపాన్ని ఏడుభాగాలు చేసి తన ఏడుగురు కుమారుల్ని వాటి కధిపతుల్ని చేశాడు. ఆ ద్వీపంలో ఏడు కులపర్వతాలు, ఏడు మహానదులూ ఉన్నాయి. ఆ ద్వీపం చుట్టూ పాలసముద్రం ఉంది.

పాలసముద్రానికి అవతల శాకద్వీపం ఉంది. ఆ ద్వీపంలో శాక మనే వృక్షం ఉంది. దాని వల్ల ఆ ద్వీపం అంతా పరిమళిస్తూ ఉంటుంది. ఆ కారణంచేత ఆ ద్వీపానికి శాకద్వీపం అనేపేరు వచ్చింది. ప్రియవ్రతుని కుమారుడైన మేధాతిథి ఆ ద్వీపానికి అధిపతి. ఆ ద్వీపాన్ని ఏడుభాగాలు చేసి తన ఏడుగురు కుమారుల్ని వాటికి అధిపతుల్ని చేశాడు. ఆ ద్వీపంలో ఏడు కులపర్వతాలు, మహానదులూ ఉన్నాయి. శాకద్వీపం చుట్టూ దధిసముద్రం ఉంది.

దధిసముద్రానికి అవతల పుష్కరద్వీపం ఉంది. ఆ ద్వీపంలో బ్రహ్మదేవునికి పీఠమయిన బంగారురేకుల తామరపువ్వు ఉంది. దానివలన ఆ ద్వీపానికి పుష్కరద్వీపమనే పేరు వచ్చింది. ఆ ద్వీపం మధ్యలో మానసోత్తరం అనే పర్వతం ఉంది. ఆ పర్వతానికి నాలుగుదిక్కులలో నాలుగు లోకపాలకుల పట్టణాలున్నాయి. ఆ పర్వతశిఖరం మీద సూర్యరథచక్రం తిరుగుతూ మేరుపర్వతానికి ప్రదక్షిణం చేస్తుంది. పుష్కరద్వీపాన్ని చుట్టి మంచినీటి సముద్రం ఉంది. సముద్రానికి అవతల లోకాలోక పర్వతం ఉంది. ఆ పర్వతానికి ఆ సముద్రానికి మధ్య రెండుకోట్ల యోజనాల విశాలమయిన నిర్జనభూమి ఉంది. ఆ భూమిని చేరిన వస్తువు తిరిగి దొరకదు. ఆ పర్వతంమీద బ్రహ్మ నాలుగు దిగ్గజాలను లోకరక్షణకోసం నిర్మించాడు.

ఆ పర్వతంమీద శ్రీహరి విష్వక్సేనాదులతోబాటు ఉంటాడు. లోకాలోక పర్వతానికి అవతలివైపు ఎవ్వరూ సంచరించలేరు.

మహారాజా! ఇంతవరకు ధరణీమండలాన్ని గురించి చెప్పాను. ఇక కాంతిమండలాన్ని గరించి చెబుతాను విను. సూర్యుడు బ్రహ్మాండానికి మధ్యలో ఉన్నాడు. సూర్యుడు మేష తులా రాసులలో సంచరించేటప్పుడు పగటికాలం రాత్రికాలం సమానంగా ఉంటాయి. వృషభం, మిథునం, కర్కాటకం, సింహం, కన్య అనే ఐదురాసులలో సంచరించేటప్పుడు రాత్రి ఒక్కొక్క గడియకాలం (24 నిముషాలు) తగ్గుతూ పగటికాలం పెరుగుతూ ఉంటుంది. వృశ్చికం, ధనుస్సు, మకరం, కుంభం, మీనం అనే ఐదురాసులలో సంచరించేటప్పుడు రాత్రి ఒకొక్క గడియ (24 నిముషాలు) పెరుగుతూ, పగటికాలం తగ్గుతూ ఉంటుంది. సూర్యరథం ఒక్క ముహూర్తకాలంలో ముప్పైనాలుగు లక్షల ఎనిమిదివందల యోజనాలు ప్రయాణిస్తుంది.

సూర్యరథచక్రానికి ఒక ఇరుసు ఉంటుంది. దానికి ఒకవైపు మేరుపర్వతం ఒకవైపు మానసోత్తర పర్వతం ఉన్నాయి. సూర్యరథం కాడి ముప్పై ఆరులక్షల యోజనాల పొడవు ఉంటుంది. ఆ సూర్యరథానికి ఏడు ఛందస్సులు, ఏడు గుర్రాలుగా ఉంటాయి. అనూరుడు ఆ రథానికి సారథి. తొమ్మిదికోట్ల ఏభైయొక్క లక్షలయోజనాల వైశాల్యం ఉన్న భూమండలాన్ని ఒకక్షణానికి రెండువేలయాభై యోజనాల చొప్పున సంచరిస్తూ ఒక్క పగలు రాత్రిలో భూమండలాన్నంతా సూర్యుడు చుట్టివస్తాడు.

సూర్యుడు కాలచక్రంతోబాటు తిరుగుతూ ఆ యా రాసులలో కనబడుతుంటాడు. సూర్యుడు పన్నెండు రాసుల్లోనూ ఒకమారు సంచరించే కాలం సంవత్సరం. దాంట్లో ఆరవభాగం ఋతువు. సగభాగం అయనం. ఇదే

విధంగా సూర్యసంచారాన్ని బట్టి సంవత్సరం, అయనం, ఋతువు, మాసం, పక్షం, తిథులు అనే వ్యవహారం ఉంటుంది. సూర్యమండలానికి లక్షయోజనాలపైన చంద్రమండలం ఉంది. చంద్రమండలానికి లక్షయోజనాల ఎత్తులో నక్షత్రమండలం ఉంది. అవన్నీ మేరుపర్వతానికి ప్రదక్షిణం చేస్తూ ఉంటాయి. నక్షత్రమండలానికి రెండులక్షల యోజనాల ఎత్తులో శుక్రుడు ఉండి ప్రజలకు అనుకూలుడై వర్షం కురిపిస్తాడు. శుక్రునికి పైన రెండులక్షల యోజనాల ఎత్తులో బుధుడు ఉంటాడు. కరువు కాటకాలు దోపిడీల భయం కలిగిస్తాడు. బుధునిపైన రెండులక్షల యోజనాల ఎత్తులో కుజుడు ఉంటాడు. అతడు వక్రుడైనా అవక్రుడైనా పీడలు కలిగిస్తాడు. కుజునికి రెండు లక్షలయోజనాల ఎత్తులో గురుడు ఉంటాడు. వక్రుడైనా అవక్రుడైనా బ్రాహ్మణులకు మంచి చేస్తాడు. గురునికి పైన రెండులక్షల యోజనాల ఎత్తులో శని ఉంటాడు. పీడలు కలిగిస్తూ ఉంటాడు. శనికి పైన పదకొండు లక్షల యోజనాల ఎత్తులో సప్తర్షిమండలం ఉంది. దానికి పైన పదమూడులక్షల యోజనాల ఎత్తులో శింశుమార చక్రం ఉంది. శింశుమార చక్రంలో ధ్రువుడు ఉన్నాడు. ఆయన శింశుమారచక్రం తోక చివర ఉంటాడు. ఈ చక్రం శ్రీహరి దివ్యశరీరం. దీనిని భక్తితో ధ్యానిస్తే ఇహలోకంలో సకలసిద్ధులూ లభిస్తాయి.

సూర్యమండలానికి దిగువ పదివేలయోజనాల దూరంలో రాహుమండలం ఉంది. ఈ రాహువు రాక్షసాధముడు. అయినా బ్రహ్మవరంచేత తానొకగ్రహమై ఇతరగ్రహాలలో స్థానం పొందాడు. రాహువు పూర్ణిమనాడు చంద్రుణ్ణీ, అమావాస్యనాడు సూర్యుణ్ణీ కప్పేస్తాడు. వాటినే గ్రహణాలు అంటారు. రాహుగ్రహానికి దిగువన పదివేల యోజనాల దూరంలో సిద్ధచారణ, విద్యాధరులు సంచరిస్తూ ఉంటారు. వారికి దిగువన పదివేలయోజనాల దూరంలో యక్షులూ భూత, ప్రేతాలూ సంచరిస్తూంటాయి. వాటికింద మేఘమండలం ఉంది. భూమండలానికి పదివేల యోజనాలకింద అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళ లోకాలున్నాయి. అవి ఒకదాని కొకటి పదివేలయోజనాల దిగువన ఉన్నాయి. ఇవన్నీ స్వర్గంకంటే ఎంతో గొప్పవి. ఇక్కడ దైత్యులూ, దానవులూ, నాగులూ ఉంటారు. వారు ఐశ్వర్యంతో సుఖభోగాలతో నిరంతరం తులతూగుతూ ఉంటారు. పాతాళంలో విష్ణుచక్రం ప్రవేశిస్తుందనే భయం మాత్రం ఉంటుంది. అతలంలో మయుని కొడుకైన బలాసురుడు స్వేచ్ఛగా విహరిస్తూంటాడు. వితలానికి హాటకేశ్వరుడనే పేరుతో శివుడే అధిపతి. శివుడు పార్వతితో సుఖిస్తుండగా వారి వీర్యం నుండి హాటకి అనే నది పుట్టింది. ఆ నదీజలాలను అగ్ని తాగి ఉమియగా అదే హాటకం (బంగారం) అయ్యింది. వితలం క్రింద సుతలం ఉంది. అక్కడ బలిచక్రవర్తి ఉన్నాడు. ఇంద్రునికోసం ఇంద్రుని కోరిక మేరకు బలిని శ్రీహరి యాచించాడు. నిజానికి శ్రీహరికి ఏం కావాలి కనుక! బలిచక్రవర్తికి విష్ణువు సుతలంలో ఇంద్రపదవిని ఇచ్చాడు. శ్రీహరి బలిచక్రవర్తి నుండి మూడడుగుల ప్రదేశాన్ని దానంగా స్వీకరించి లోకప్రదర్శనార్థం బలికి పాతాళస్వర్గరాజ్యాలు ఇచ్చాడు. శ్రీహరి యాచన అనే మిషతో బలిచక్రవర్తి సకలైశ్వర్యాల్ని హరించాడు. బలికి తాతగారు ప్రహ్లాదుడు. నరసింహావతారంలో శ్రీహరి ప్రహ్లాదుణ్ణి ఏంకావాలో కోరుకొమ్మన్నాడు. ఆయన రాజ్యాలు కోరలేదు శ్రీహరి పాద దాస్యాన్ని కోరాడు.

సుతలలోకంలోని బలిగృహద్వారంలో, శ్రీహరి శంఖచక్రాదులు ధరించి కాపలా కాస్తున్నాడు. రావణుడు లోకాలన్నీ జయించాలనే కోరికతో సుతలంలోకి ప్రవేశించినపుడు శ్రీహరియే రావణుణ్ణి బొటనవ్రేలితో పదికోట్లయోజనాల దూరంలో పడేవిధంగా విసరివేశాడు.

సుతలానికి కింద తలాతలం ఉంది. దానికి మయుడు అధిపతి. ఆయన రాక్షసుల పట్టణాలకు రూపకల్పన చేసిన మహాశిల్పి. అతనికి సుదర్శనచక్రం వల్ల తప్ప మరి దేని వల్లా భయంలేదు. తలాతలానికి క్రింద మహాతలం ఉంది. ఆ లోకంలో కద్రువ కొడుకులయిన సర్పరాజులు ఉన్నారు. మహాతలంక్రింద రసాతలం ఉంది. ఈ లోకంలో దైత్యదానవులయిన నివాతకవచులు, కాలకేయులు అనే వారు నివసిస్తూ ఉంటారు. అన్నిటికన్నా దిగువన పాతాళలోకం ఉంది. ఈ లోకంలో వాసుకి మొదలయిన సర్పరాజులు పలుపడగలతో, పడగలమీద మణులతో ప్రకాశిస్తూ పాతాళంలో చీకటిలేకుండా చేస్తూ విహరిస్తూ ఉంటారు. పాతాళలోకం అడుగున ఆదిశేషుడు ఉన్నాడు. ఆదిశేషుని తలమీద ఉన్న భూమండలం ఆవగింజంత ఉన్నట్లు కనపడుతుంది. ఆదిశేషుడు ప్రళయకాలంలో లోకసంహారంకోసం పదకొండుమంది రుద్రులను సృష్టిస్తాడు. ఆదిశేషుణ్ణి సర్పరాజులందరూ సేవిస్తూ ఉంటారు. నాగకన్యలు తమ విలాసాలతో ఈయనను సంతోషపెడుతూ ఉంటారు. ఈ అనంతుణ్ణి అందరూ ధ్యానిస్తారు. ఈయన వైజయంతీమాలను ధరిస్తాడు. నల్లనివస్త్రాలు ధరించి, నాగలి పట్టుకుని ఉంటాడు. ముక్తిని కోరేవారికి ఈయన ఆరాధ్యుడు. ఎవ్వరైనా ఆయనను స్మరించినంతమాత్రాన అఖిలపాపాల నుండి విముక్తులై సకలశ్రేయస్సులూ పొందుతారు. అనంతుణ్ణి ధ్యానించడంవల్ల భవబంధాలు తొలగిపోతాయి.

ఈ విధంగా శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజుకి వినిపించి, పరీక్షిన్మహారాజు కోరిక మేరకు అనేక నరకాలను గురించి ఈ విధంగా చెప్పసాగాడు.

పరీక్షిన్మహారాజా! మూడులోకాలకు ఆవల దక్షిణదిశలో భూమ్యాకాశాల నడుమ భయంకరమయిన నరకలోకాలు ఉన్నాయి. అక్కడ యముడు జీవులను వారి వారిదుష్కర్మలకు తగినట్లుగా దండిస్తూ ఉంటాడు. నరకాలు అనేకవిధాలు.

1. తామిస్రం 2. అంధతామిస్రం 3. రౌరవం 4. మహారౌరవం 5. కుంభీపాకం 6. కాలసూత్రం 7. అసిపత్రవనం 8. సూకరముఖం 9. అంధకూపం 10. క్రిమిభోజనం 11. సందంశం 12. తప్తోర్మి 13. వజ్రకంటకశాల్మలి 14. వైతరణి 15. పూయోదం 16. ప్రాణరోధం 17. విశసనం 18. లాలాభక్షణం 19. సారమేయాదనం 20. అవీచిరయం 21. రేతఃపానం అనే పేర్లున్న ఇరవైయొక్క మహానరకాలున్నాయి. ఇంతేకాక 1. క్షారకర్దమం 2. రక్షోగణభోజనం 3. శూలప్రోతం 4. దందశూకం 5. అవటనిరోధనం 6. అపర్యావర్తనం 7. సూచీముఖం అనే మరొక ఏడు నరకాలున్నాయి. ఈ విధంగా మొత్తం ఇరవైఎనిమిది నరకాలు.

ఇతరుల భార్యాపుత్రుల్ని అపహరించేవారిని యమభటులు తాళ్ళతో బంధించి పీడిస్తారు. తామిస్రనరకంలో అన్నం పెట్టక, కొండమీదనుండి పడవేసి, కర్రలతో మోది ఆ పాపాత్ముల్ని యమభటులు నరకబాధలకు గురిచేస్తారు.

పరకాంతలను అనుభవించే వారిని అంధతామిస్రం అనే నరకంలో పడవేస్తారు. కుటుంబపోషణం కోసం ఇతరులకు ద్రోహం చేసేవాళ్ళను రౌరవనరకంలో పడవేస్తారు. సాధువులైన పశుపక్షిమృగాదుల్ని బాధించే వ్యక్తుల్ని నల్లచారల దుప్పుల రూపం ధరించి, ఆ మృగాలు హింసిస్తాయి. అవే రౌరవ మహారౌరవనరకాలు. కడుపు నింపుకోవడంకోసం ఎలుకల్ని వాటికన్నాలు మూసి చంపేవారిని కుంభీపాకంలో పడవేస్తారు. తల్లిదండ్రులకు, బ్రాహ్మణులకు బాధ కలిగించిన వాళ్ళకు కాలసూత్ర నరకమేగతి. పెద్ద పెద్ద లోహపాత్రలలో పైన సూర్యుడు కింద నిప్పు మండుతూండగా, ఆకలితో, బాధతో అలమటిస్తూ పరుగులు పెడుతూంటారు ఆ పాపాత్ములు. అదే కాలసూత్రనరకం. వేదమార్గాన్ని వదలిపెట్టి నాస్తికమార్గాన్ని అనుసరించే వాళ్ళను అసిపత్రవనం అనే నరకంలో పడవేస్తారు. అక్కడ కత్తులవంటి ఆకులున్నచెట్ల నడుమ పరుగులు తీయిస్తారు. ఆ ఆకులు తగిలి శరీరం ముక్కలు ముక్కలుగా తెగిపోతూంటుంది. మరొకవైపు కొరడాలతో కొడుతూంటారు. దండించ తగని వారిని దండించినా, బ్రాహ్మణశ్రేష్ఠుల్ని శారీరకంగా హింసించినా, అటువంటివాళ్ళకు కాలసూత్రనరకమే గతి. అక్కడ అటువంటి పాపాత్ముల్ని యమభటులు చెరకుగడను విరిచినట్లు విరుస్తూ, కుయ్యో మొర్రో అంటున్నా లెక్కసేయకుండా మహాబాధలు పెడతారు. తమ బతుకేదో తాము బతుకుతున్న జంతువుల్ని హింసించేవాళ్ళను అంధకూపనరకంలో పడవేస్తారు. అక్కడ తాను వేటిని హింసించాడో ఆ జంతువులచేత హింసింపబడుతూ, నిద్రలేక, దిక్కు మాలినశరీరంతో చచ్చినవానిలా పడి ఉంటాడు. తానుకూడబెట్టిన సొమ్మును తానొక్కడే కాకిలా తినేవాడు క్రిమిభోజనం అనే నరకంలో పడతాడు. అక్కడ వాడు పురుగై పురుగులనే తినవలసి ఉంటుంది. బంగారాన్ని, రత్నాదుల్నీ అపహరించినవాడు అగ్ని తప్తనరకంలో పడతాడు. యమభటులు మండుతున్న ఇనుపగుళ్ళను అతని శరీరం మీద విసిరి, మండుతున్న ఇనుపచువ్వల్ని శరీరంలో గుచ్చుతూ పీడిస్తారు. వావి వరుసలు లేకుండా ప్రవర్తించిన స్త్రీపురుషుల్ని మండే ఉక్కుస్తంభాల్ని కౌగిలించుకొనేటట్లు చేస్తారు.

జంతువులతో సంభోగించే వారిని వజ్రాలమేకుల బూరుగుచెట్లకు కట్టి కొడతారు. నాస్తికులకు వైతరణీనదియే గతి. ఆ నది మాంసం, ఎముకలు, చీము, నెత్తురు మొదలయిన జుగుప్సాకరమైన పదార్థాలతో నిండి ఉంటుంది. నాస్తికులు దానిలో పడి మునుగుతూ తేలుతూ వాటినే తింటూ ఉంటారు. వేటగాళ్ళు పదునైన ఆయుధాలతో చీల్చబడుతూ ఉంటారు. డాబుదర్పాల కోసం యాగాలు చేసి, పశుహింస చేసేవారిని అక్కడ రంపాలతో కోస్తారు. భార్యచేత రేతఃపానం చేయిస్తే నరకంలో రేతస్సుతో నిండిననదిలో మునుగుతూ అదే తాగుతూ ఉండాలి. ఇళ్ళకు నిప్పుపెట్టేవార్ని, విషంపెట్టి చంపేవార్ని అక్కడ కుక్కలు పీక్కు తింటాయి. లంచం పుచ్చుకునే వాళ్ళను దొంగసాక్ష్యాలు చెప్పేవాళ్ళను కొండల మీద నుండి బండరాళ్ళ మీదకు తోస్తారు. సోమపానం పేరుతో మద్యపానం చేస్తే వారిచేత మరిగే ఉక్కునీరు తాగిస్తారు. జంతువులను బలి ఇచ్చేవారిని చురకత్తులతో పొడుస్తారు. ప్రాణుల్ని సూదులు

గుచ్చి బాధించిన వారిని కొరతవేస్తారు. వారక్కడ ఆకలితో అలమటిస్తూ ఉంటే రాబందులూ, గద్దలూ వాళ్ళను పీక్కుతింటూ ఉంటాయి. అతిథుల్ని చీదరించుకొనేవాళ్ళని, రాబందులు ముక్కులతో పొడిచి పీక్కుతింటాయి. పిసినారుల్ని యమకింకరులు నానాబాధలపాలు చేస్తారు. పాపాత్ములకు నరకం తప్పదు. ధర్మాత్ములు స్వర్గం పొందుతారు.

పరీక్షిన్మహారాజా! ఇంతవరకు అనేక లోకాల్ని గురించి నీకు చెప్పాను. ఈ సమస్తభువనాలు శ్రీమన్నారాయణుని స్థూలశరీరం. దీనిని ధ్యానించి, క్రమంగా ఆత్మధ్యానానికి సాగిపోవాలి. అది ముక్తికి మార్గం. అంటూ శుకుడు తరువాతి కథా కథనానికి సాగిపోయాడు.

చివరలో కవి మూడుపద్యాలతో కృష్ణుణ్ణి స్తుతించి పంచమస్కంధంలోని రెండో ఆశ్వాసాన్ని ముగించాడు.

సకలసుకవులసమూహానికి ఎంతో సంతోషం కలిగించేవాడైన బొప్పనామాత్యుని కుమారుడు గంగనార్యుడు రచించిన శ్రీమహాభాగవతపురాణం పంచమస్కంధంలోని ద్వితీయాశ్వాస సారాంశం ఇది.

**– డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణ**

# విషయసూచిక

## చతుర్థస్కంధము


| విషయము | | పుట |
|---|---|---|
| మైత్రేయుండు విదురునకు స్వాయంభువమను పుత్రికల వంశవిస్తారంబు దెలుపుట | ... | 2 |
| కర్దమప్రజాపతి సంతతి | ... | 5 |
| దక్షప్రజాపతి సంతతి | ... | 16 |
| ఈశ్వరునకు దక్షప్రజాపతికిని విరోధము సంభవించుట | ... | 20 |
| దక్షప్రజాపతి యజ్ఞము చేయునపుడు దాక్షాయణి యచ్చటికిఁ బోవుట | ... | 30 |
| శివుఁడు వీరభద్రుచే దక్షయజ్ఞంబు ధ్వంసంబు సేయించుట | ... | 55 |
| దేవతలు వీరభద్రాదులచేఁ బరాజితులై బ్రహ్మతో విన్నవించుట | ... | 64 |
| బ్రహ్మాదులు దక్షిణామూర్తి రూపుండగు నీశ్వరుని స్తుతించుట | ... | 72 |
| ఈశ్వరుండు బ్రహ్మాదులచేఁ బ్రార్థింతుడై దక్షాదుల ననుగ్రహించుట | ... | 80 |
| దక్షాదులు విష్ణువును స్తుతించుట | ... | 89 |
| ధ్రువోపాఖ్యానము | ... | 109 |
| ధ్రువుఁడు నారదోపదేశంబు వడసి తపంబు సేయుట | ... | 114 |
| సాక్షాత్కరించిన భగవంతుని ధ్రువుండు స్తుతించుట | ... | 134 |
| ధ్రువుండు మరల దన పురంబునకు వచ్చుట | ... | 148 |
| ధ్రువుండు కుబేరానుచరులైన గుహ్యకులతో యుద్ధము సేయుట | ... | 158 |
| అంగపుత్రుండగు వేనుని చరిత్ర | ... | 193 |
| పృథుచక్రవర్తి గోరూపిణియగు భూమివలన నోషధులఁ బిదుకుట | ... | 226 |
| పృథుచక్రవర్తి యశ్వమేధంబు సేయునెడ నింద్రుం డశ్వము నపహరించుట | ... | 244 |
| నారాయణుండు ప్రసన్నుండై పృథుచక్రవర్తి ననుగ్రహించుట | ... | 255 |
| పృథుచక్రవర్తి సభాసదులకు సద్ధర్మముల నుపదేశించి బ్రాహ్మణ ప్రశంస సేయుట | ... | 269 |
| పృథుచక్రవర్తి యొద్దకు సనకాదు లరుగుదెంచుట | ... | 286 |

| | | |
|---|---|---|
| పృథుచక్రవర్తి జ్ఞాన వైరాగ్యవంతుండై ముక్తినొందుట | ... | 305 |
| రుద్రుండు ప్రచేతసులకు యోగాదేశమను స్తోత్రముం దెల్పుట | ... | 331 |
| నారదుండు ప్రాచీనబర్హికి జ్ఞానమార్గమును దెలియఁజేయుట | ... | 355 |
| పురంజనోపాఖ్యానము | ... | 357 |
| ప్రచేతసుల తపంబునకు భగవంతుండు మెచ్చి వరంబు లిచ్చుట | ... | 443 |


## పంచమస్కంధము

### ప్రథమాశ్వాసము


| | | |
|---|---|---|
| ప్రియవ్రతుని చరిత్రము | ... | 483 |
| భగవంతుండగు నారాయణుండు ఋషభావతార మెత్తుట | ... | 505 |
| ఋషభుండు పుత్రులకు నీతి యుపదేశించుట | ... | 519 |
| భరతోపాఖ్యానము | ... | 540 |
| వృషల రాజభృత్యులు కాళిబలికి భరతునిఁ గొంపోవుట | ... | 563 |
| భరతుండు రహూగణుని మాటలకుఁ బ్రత్యుత్తరంబు లిచ్చుట | ... | 570 |


### ద్వితీయాశ్వాసము


| | | |
|---|---|---|
| శుకయోగి యుపదేశమునఁ దెల్పు భూగోళ నిర్ణయము | ... | 608 |
| భగణ విషయము | ... | 647 |
| శుకయోగి పరీక్షిత్తునకుఁ దెలిపెడి నరకలోక వర్ణనము | ... | 680 |



# చతుర్థస్కంధము

శ్రీరస్తు

# శ్రీమహాభాగవతము

## చతుర్థస్కంధము

**శ్రీవిలసితధరణీతన, యావదనసరోజవాసరాధిప! సితరా**
**జీవదళనయన! నిఖిలధ, రావరనుత! సుగుణధామ! రాఘవరామా! 1**

**ప్రతిపదార్థం :** శ్రీ= ఐశ్వర్యంతో; విలసిత= ఒప్పినట్టి; ధరణీతనయా= భూపుత్రి సీత యొక్క; వదన= ముఖం అనే; సరోజ= పద్మానికి; వాసర+అధిప= దిన రాజు అయిన సూర్యదేవుని వంటివాడా!; సిత= తెల్లని; రాజీవదళ= తామర రేకులవంటి; నయన!= నేత్రాలు కలవాడా!; నిఖిల= సమస్తమైన; ధరావర= భూపతులచేత; నుత= కొనియాడ బడినవాడా!; సుగుణధామ= ఉత్తమ గుణాలకు నిలయమైన వాడా!; రాఘవ= రఘువంశానికి చెందిన; రామా!= ఓ రామా!

**తాత్పర్యం :** మంచి సిరిగల సీతాదేవిముఖపద్మానికి సూర్యునివంటివాడా! తెల్లతామర పూరేకుల్లా విప్పారిన నేత్రాలు కలవాడా! సమస్త రాజలోకం కీర్తించినవాడా! మంచిగుణాలు రాశిగా కలవాడా! రామా! (అంటూ పోతన శ్రీరాముని సంబోధిస్తున్నాడు).

**అవతారిక :** ప్రధానకథకు శ్రోత పరీక్షిత్తు. కథకుడు శుకయోగి. పరీక్షిత్తుకి శుకమహర్షి చెప్పిన కథను సూతుడు మహర్షులందరికీ వినిపిస్తున్న కథ ఇది. పౌరాణికుడు సూతుడు. శ్రోతలు మునివర్యులు.

**వ. మహనీయగుణగరిష్ఠులగు నమ్మునిశ్రేష్ఠులకు నిఖిలపురాణవ్యాఖ్యాన వైఖరీసమేతుండైన సూతుం డిట్లనియె: నట్లు ప్రాయోపవిష్టుండైన పరీక్షిన్నరేంద్రునకు శుకయోగీంద్రుం డిట్లనియె. 2**

**ప్రతి :** మహనీయ= గొప్ప; గుణ= గుణాలచేత; గరిష్ఠులు+అగు= ఘనులైన; ఆ+మునిశ్రేష్ఠులకున్= ఆ శౌనకాది మహామునులకు; నిఖిల= సమస్తమైన; పురాణ= పురాణాలను; వ్యాఖ్యాన= తెలియజేసే; వైఖరీ= పద్ధతితో; సమేతుండు+ఐన= కూడినవాడైన; సూతుండు= సూతుడు; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= చెప్పాడు; అట్లు= ఆ తీరున; ప్రాయ+ ఉపవిష్టుండు+ఐన= ఉపవాసాలతో ప్రాయోపవేశం చేస్తున్న; పరీక్షిత్+నర+ఇంద్రునకున్= మహారాజైన పరీక్షిత్తునకు; శుకయోగి+ఇంద్రుండు= యోగుల్లో శ్రేష్ఠుడయిన శుకమహర్షి, ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

**తా :** సూతుడు అష్టాదశపురాణాలను విప్పి చెప్పే వైఖరి కలవాడు. శౌనకాది మహామునులంతా గొప్ప గుణవంతులు. ఆ మునివరేణ్యులకు, సూతుడు కథను చెప్పడం ప్రారంభించాడు. ఉపవాసాలతో ప్రాణ పరిత్యాగానికి సిద్ధమవుతున్న మహారాజు పరీక్షిత్తుతో శుకయోగి ఇలా అన్నాడు.

**విశే :** ప్రాయోపవిష్టుడు– సంకల్పపూర్వకంగా అన్ని బంధాలను వదలివేసి దేహాన్ని త్యాగం చేయడం కోసం ఉపవసించేవాడు. దీనిచే పుణ్యలోక ప్రాప్తి కల్గుతుంది – ప్రకృష్టమేతి పుణ్యలోక మనేనేతి ప్రాయః – అని గురుబాల ప్రబోధిక.

a =మైత్రేయుండు విదురునకు స్వాయంభువ మనుపుత్రికల వంశవిస్తారంబు దెలుపుట=a

**సీ. జననాథ! విను విదురునకును మైత్రేయ మునినాథచంద్రుఁడిట్లనియె మరల**
**స్వాయంభువున కర్థి శతరూపవలనను గూఁతులు ముప్వు రాకూతి దేవ**
**హూతి ప్రసూతులు నొనరఁ బ్రియవ్రతోత్తానపాదులు నను తనయయుగము**
**జనియించి రందగ్రసంభవయైన యాకూతిని సుమహితభ్రాతృమతిని**

**తే. దనకు సంతానవిస్తరార్థంబుగాఁగఁ, బుత్త్రికాధర్మ మొంది యా పువ్వుఁబోఁడిఁ**
**బ్రకటమూర్తి రుచిప్రజాపతికి నిచ్చె, మనువు ముదమొంది శతరూప యనుమతింప. 3**

**ప్రతి :** జననాథా!= ఓరాజా!; వినుము= విను; విదురునకును= విదురుడితో; మైత్రేయ= మైత్రేయుడనే; మునినాథచంద్రుఁడు= చంద్రునివలె ఆహ్లాదం కల్గించే మునీశ్వరుడు; మరల= తిరిగి; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= అన్నాడు; స్వాయంభువునకున్= స్వాయంభువ మనువునకు; అర్థిన్= కోరికతో; శతరూపవలనను= శతరూపవల్ల; ఆకూతి, దేవహూతి, ప్రసూతులు= ఆకూతి, దేవహూతి, ప్రసూతి అనే; ముప్వురు= ముగ్గురు; కూఁతులు= పుత్రికలు; ఒనరన్= ఇంపుగా; ప్రియవ్రత+ ఉత్తానపాదులు+అను= ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే పేర్లుగల; తనయ యుగము= ఇద్దరు కొడుకులు; జనియించిరి= పుట్టారు; అందున్= ఆ సంతతిలో; అగ్ర= ముందు; సంభవ+ఐన= పుట్టినదైన; ఆకూతిని= ఆకూతి అనే కన్యను; సుమహిత= గొప్పవారైన; భ్రాతృమతిని= సోదరులున్న ఆమెను, (సోదరులున్న కన్యను వివాహమాడుట సంప్రదాయం); మనువు= స్వాయంభువమనువు; తనకున్= తనకు; సంతాన= పుత్రపౌత్ర వంశరూపమైన; విస్తర= పరంపర (బాహుళ్యం); అర్థంబు= ప్రయోజనం; కాఁగన్= అవునట్లుగా; పుత్రికా ధర్మమున్= పుత్రికా ధర్మాన్ని, (మగ సంతానంలేని తండ్రి ఆడపిల్ల పెళ్ళి సమయంలో ఆమె తొలి చూలు పిల్లవాణ్ణి తనకు ప్రదానం చేయుమని అల్లుడితో ఒప్పందపడడం); ఒంది= అవలంబించి; ఆ, పువ్వు+పోఁడిన్= పూవు వంటి మృదువైన శరీరం కల ఆమెను; ప్రకటమూర్తి= స్ఫురద్రూపం కల; రుచిప్రజాపతికిన్= రుచి అనేపేరుగల ప్రజాపతికి; శతరూప= శతరూప; ముదమున్= సంతోషాన్ని; ఒంది= పొంది; అనుమతింపన్= ఒప్పుకోగా; మనువు= స్వాయంభువుడు; ఇచ్చెన్= అప్పగించాడు.

**తా :** ఓ రాజా! వినండి. విదురుడితో మైత్రేయమునీంద్రుడు తిరిగి ఇలా చెప్పసాగాడు. స్వాయంభువ, శతరూప దంపతులకు ముగ్గురు కూతుళ్లూ, ఇద్దరు కొడుకులూ ప్రీతికరంగా పుట్టారు. వారు ఆకూతి, దేవహూతి, ప్రసూతి, ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు. వీళ్లల్లో తొలిబిడ్డ ఆకూతిని మనువు, రుచి అనే ప్రజాపతికి ధర్మపత్నిగా చేశాడు. మనుమలు, మునిమనుమల పరంపర కోసం కలుపుకుంటున్న ఈ సంబంధాన్ని శతరూప కూడా సంతోషంగా సమ్మతించింది.

**విశే :** సుమహిత భ్రాతృమతిని - శ్రేష్ఠులగు సోదరులుగల దానిని - అని ఆకూతిని వర్ణించడం గమనార్హం.

**పితా న జ్ఞాయతే యస్యా భ్రాతా యది న విద్యతే,**
**నోప యచ్ఛేత్తు తాం కన్యాం ధర్మలోపభయాత్సుధీః ॥** అన్న ధర్మశాస్త్రోక్తి ననుసరించి సోదరుడు గల కన్యను పెండ్లాడడం సముచితమన్న దృష్టితో ఇలా వర్ణించడమైనది.

**వ. అట్లు వివాహంబైన రుచిప్రజాపతి బ్రహ్మవర్చస్వియుఁ బరిపూర్ణ గుణుండును గావునఁ జిత్తైకాగ్రతం జేసి యాకూతి యందు శ్రీవిష్ణుండు యజ్ఞరూపధరుం డగు పురుషుండుగను జగదీశ్వరి యగు నాదిలక్ష్మి**

**యమ్మహాత్మునకు నిత్యానపాయిని గావునఁ దదంశంబున దక్షిణ యను కన్యకారత్నంబుగను మిథునంబు సంభవించె; నందు స్వాయంభువుండు సంతుష్టాంతరంగుం డగుచుఁ బుత్త్రికాపుత్త్రుండును, వితతతేజోధనుండును, శ్రీ విష్ణుమూర్తి రూపుండును నగు యజ్ఞునిఁ దన గృహంబునకుఁ దెచ్చియునిచె; రుచియుఁ గామగమన యైన దక్షిణ యను కన్యకాలలామంబును దన యొద్దన నిలిపె; నంత సకల మంత్రాధిదేవత యగు శ్రీయజ్ఞుండు దనుఁ బతిగం గోరెడు దక్షిణయను కన్యకం బరిణయంబయ్యె; వార లాదిమిథునంబు గావున నది నిషిద్ధంబు గాకుండె నని చెప్పి మైత్రేయుండు వెండియు నిట్లనియె. 4**

**ప్రతి :** అట్లు= ఆ విధంగా; వివాహంబు+ఐన= పెళ్ళి చేసికొన్న; రుచిప్రజాపతి= రుచి అనే ప్రజాపతి; బ్రహ్మవర్చస్వియున్= బ్రహ్మతేజస్సు కలవాడు; పరిపూర్ణ గుణుండును= విశిష్టమైన గుణాలు నిండుగా కలవాడు; కావునన్= కాబట్టి; చిత్త+ఏకాగ్రతన్+ చేసి= సహజ సమాధి నిష్ఠడవడంవల్ల; ఆకూతి+అందున్= ఆకూతి కడుపున; శ్రీవిష్ణుండు= శ్రీవిష్ణువు; యజ్ఞరూపధరుండు+ అగు= యాగరూపాన్ని ధరించినవాడైన; పురుషుండుగను= మగవాడుగాను; జగత్+ఈశ్వరి+అగు= జగత్తుకు నియామకురాలగు; ఆదిలక్ష్మి= లక్ష్మీదేవి; ఆ+మహా+ఆత్మునకున్= ఆ పుణ్యపురుషునకు, (విష్ణువుకు); నిత్య+అనపాయిని= ఎప్పుడూ విడిచి ఉండనిది; కావునన్= కాబట్టి; తద్+అంశంబునన్= ఆ అంశతో; దక్షిణ= దక్షిణ అనే పేరుగల; కన్యకారత్నంబుగను= ఉత్తమ కన్యగను; మిథునంబు= జంటగా; సంభవించెను= పుట్టారు; అందున్= ఆ ఇద్దరిలో; స్వాయంభువుండు= స్వాయంభువమనువు; సంతుష్ట= సంతోషించిన; అంతరంగుండు= మనస్సు కలవాడు; అగుచున్= అవుతూ; పుత్రికాపుత్రుండును= తన కూతురైన ఆకూతి కొడుకున్నూ (మనుమడు); వితత= వ్యాపించిన; తేజస్+ధనుండును= కాంతిసంపన్నుడునూ; శ్రీవిష్ణుమూర్తి రూపుండును= శ్రీమహావిష్ణువు పోలిక కలవాడునూ; అగు= అయిన; యజ్ఞునిన్= యజ్ఞుణ్ణి; తన గృహంబునకున్= తన ఇంటికి; తెచ్చి= తీసుకుని వచ్చి; ఉనిచెన్= ఉంచాడు; రుచియున్= రుచి ప్రజాపతిగూడ; కామగమన+ఐన= కోరుకున్నట్టు ప్రవర్తించేది అయిన, దక్షిణ+అను= దక్షిణ అనే; కన్యకాలలామంబును= కన్యకామణిని; తన+ఒద్దన్+అ= తన దగ్గరే; నిలిపెన్= నిలిపాడు; అంత= ఆ తర్వాత; సకల= అన్ని; మంత్ర= మంత్రాలకు; అధిదేవత+అగు= అధిష్ఠాన దేవత అయిన; శ్రీయజ్ఞుండు= శ్రీయజ్ఞుడు; తనున్= తనను; పతిగన్= మగనిగా; కోరెడు= ఇచ్ఛగించే; దక్షిణ+అను= 'దక్షిణ' అనే; కన్యకన్= పడుచును; పరిణయంబు= వివాహం; అయ్యెన్= చేసుకున్నాడు; వారలు= వాళ్ళిద్దరూ; ఆది మిథునంబు= తొలి జంట; కావునన్= కాబట్టి; అది= (వారిపెళ్ళి); నిషిద్ధంబు= కాదనరానిది; కాక+ఉండెన్= కాకపోయింది; అని చెప్పి; మైత్రేయుఁడు= మైత్రేయ ముని; వెండియున్= మళ్ళీ; ఇట్లు= ఇలా; అనియెన్= పలికాడు.

**తా :** అలా పెళ్లి చేసుకొన్న రుచిప్రజాపతి, బ్రహ్మతేజస్వి, ఉన్నతుడు, పరిపూర్ణమైన రుణములు కలవాడు అయినందున మనస్సును ఏకాగ్రం చేసుకొని ఆకూతి కడుపున విష్ణువు అంశతో యజ్ఞుడనే మగవాడూ, విష్ణుమూర్తిని ఎపుడూ విడిచి ఉండని (ఎడబాటు ఎరుగని) జగన్మాత ఆదిలక్ష్మి అంశతో 'దక్షిణ' అనే పడుచూ జంటగా పుట్టారు. మంచివర్చస్సు కలవాడూ, విష్ణుమూర్తి స్వరూపుడూ, తన దౌహిత్రుడూ అయిన యజ్ఞుణ్ణి, స్వాయంభువమనువు ఎంతో సంతోషపడుతూ తన ఇంటికి తీసుకుని వచ్చి, సత్త్వ ప్రకృతిగల తన కూతురు 'దక్షిణ'ను రుచిప్రజాపతి తనయొద్దనే ఉంచుకున్నాడు. సకల మంత్రాధిదేవత అయిన శ్రీయజ్ఞుడు, తననే వరించాలనే ఉద్దేశంతో ఉన్న 'దక్షిణను' పెళ్లాడాడు. వాళ్లు ఆది దంపతులు కాబట్టి అన్నాచెల్లెళ్ల వరుసగల ఆ ఇద్దరి పెళ్లి ఎవరికీ నిషేధింపదగినది కాలేదు. (సరికాదనిగాని జరుగరానిదని కాని అనిపించనిదని భావం) అని చెప్పి మైత్రేయుడు మళ్లీ ఇలా చెప్పడం మొదలుపెట్టాడు.

**విశే :** ఈ విశిష్టవివాహవిధి నిషేధింపతగినది కాదని భావం. ఎందుకంటే తరువాతతరువాత ఏర్పడిన వధూవర కులగోత్రాల నియమాలు అప్పటికి ఏర్పడినవి కావు.

**క. ధీమహిత! యంతవారల, యామాఖ్యలు గలుగు దేవతావళి గడఁకన్**
**వేమఱు నభినందించుచు, నా మిథునము వలనఁబుట్టె నతిబలయుతమై. 5**

**ప్రతి :** ధీమహిత!= చక్కటిబుద్ధితో ఒప్పే ఓ విదురా!; అంతన్= ఆ తర్వాత; వారలన్= వాళ్లను; యామ= యామములు అనే; ఆఖ్యలు= పేరులు; కలుగు= కల; దేవత+ఆవళి= దేవతలసముదాయం; కడఁకన్= ప్రయత్నపూర్వకంగా; వేమఱు= పలుమార్లు; అభినందించుచున్= ప్రస్తుతిస్తూ; ఆ మిథునమువలనన్= ఆ ఆలుమగల జంటకు; అతి బలయుతము+ఐ= కండపుష్టి కలిగి; పుట్టెన్= జన్మించారు.

**తా :** ఓ విదురా! దేవతలచేత పొగడబడిన పుణ్యదంపతులు దక్షిణాశ్రీయజ్ఞులకు అతిబలవంతులైన "యామ" అనే పేర్లుగల పిల్లలు కలిగారు.

**విశే :** యామములు అంటే జాములు అని అర్థం.

**వ. వారు తోషుండును బ్రతోషుండును సంతోషుండును భద్రుండును శాంతియు నిడస్పతియు నిధ్ముండును గవియు విభుండును వహ్నియు సుదేవుండును రోచనుండును ననం బన్నిద్దఱు సంభవించిరి; వారలు స్వాయంభువాంతరంబునం "దుషితు" లను దేవగణంబులై వెలసిరి; మఱియు మరీచి ప్రముఖులైన మునీశ్వరులును యజ్ఞుండును దేవేంద్రుండును మహాతేజస్సంపన్ను లయిన ప్రియవ్రతోత్తానపాదులుం గలిగి పుత్రపౌత్రనప్తృవంశంబులచే వ్యాప్తంబయి యా మన్వంతరంబు పాలితం బగుచు వర్తిల్లె; మనువు ద్వితీయపుత్రియైన దేవహూతిం గర్దమున కిచ్చి తద్వంశవిస్తారంబు గావించెనని మున్న యెఱింగించితి; వెండియు నమ్మనువు మూఁడవచూలైన ప్రసూతి యను కన్యకను బ్రహ్మపుత్త్రుండగు దక్షప్రజాపతికి నిచ్చె; నా దక్షునకుఁ బ్రసూతివలన నుదయించిన ప్రజాపరంపరలచేత ముల్లోకంబులు విస్తృతంబు లయ్యె; మఱియుఁ గర్దమపుత్రికా సముదయంబు బ్రహ్మర్షి భార్య లగుటం జేసి వారివలనం గలిగిన సంతాన పరంపరల వివరించెద. 6**

**ప్రతి :** వారు= ఆ పిల్లలు; తోషుండును= తోషుడూ; ప్రతోషుండును= ప్రతోషుడూ; సంతోషుండును= సంతోషుడు; భద్రుండును= భద్రుడు; శాంతియున్= శాంతి; ఇడస్పతియున్= ఇడస్పతి; ఇధ్ముండునూ= ఇధ్ముడు; కవియున్= కవి; విభుండునూ= విభుడు; వహ్నియున్= వహ్ని; సుదేవుండును= సుదేవుడు; రోచనుండును= రోచనుడు; అనన్= అనే పేర్లతో; పది+ఇద్దఱు= పన్నెండు మంది; సంభవించిరి= పుట్టారు; వారలు= ఆ పన్నెండుగురు; స్వాయంభువ+అంతరంబునన్= స్వాయంభువ మనువుకాలంలో; తుషితులు+అను= తుషితులనే పేరుతో; దేవగణంబులు+ఐ= దేవజాతులుగా; వెలిసిరి= ప్రసిద్ధి పొందారు; మఱియున్= మరికొంతకాలానికి; మరీచి ప్రముఖులు+ఐన= మరీచి మొదలైన; ముని+ఈశ్వరులును= గొప్ప మునులున్నూ; యజ్ఞుండును= యజ్ఞుడనేపేరుగలవాడూ; దేవ+ఇంద్రుండును= దేవేంద్రుడున్నూ; మహా= గొప్ప; తేజస్+సంపన్నులు+అయిన= కాంతికి నిధులైన; ప్రియవ్రత+ఉత్తాన పాదులు= ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే మనువు కొడుకులున్నూ; కలిగి= పుట్టి; పుత్త్ర= కొడుకులూ; పౌత్త్ర= మనుమలూ; నప్తృ= మునిమనుమలూ అనే;

వంశంబులచే= సంతతి సముదాయంచే; వ్యాప్తంబు+అయి= వ్యాపించబడి; ఆ= నిర్దేశించిన; మను+అంతరంబు= మరొక మనువుచే; పాలితంబు= పెంపొందించుకొనబడింది; అగుచున్= అవుతూ; వర్తిల్లెన్= ఉండసాగింది; మనువు= మనువు; ద్వితీయ పుత్రి+అయిన= రెండో కూతురు అయిన; దేవహూతిన్= దేవహూతిని; కర్దమునకున్= కర్దముడికి; ఇచ్చి= భార్యగా సమర్పించి; తద్= ఆ; వంశవిస్తారంబు= పుత్రపౌత్రాది వరుసలతో పెంపు కలదిగా; కావించెన్= చేశాడు; అని= అని; మున్ను+అ (అవధారణార్థం)= ఇంతకు మునుపే; ఎఱింగించితిన్= తెలియచెప్పాను; వెండియున్= మళ్లీ; ఆ+మనువు= ఆ స్వాయంభువ మనువు; మూఁడవ చూలు+ఐన= మూడవ బిడ్డ అయిన; ప్రసూతి+అను= ప్రసూతి అను పేరుగల; కన్యకను= కన్నెపిల్లను; బ్రహ్మపుత్రుండు+అగు= బ్రహ్మకొడుకు అయిన; దక్షప్రజాపతికిన్+ఇచ్చెన్= దక్షప్రజాపతి కివ్వగా; ఆ+దక్షునకున్= ఆ దక్షునికి; ప్రసూతివలనన్= ప్రసూతి వల్ల; ఉదయించిన= పుట్టిన; ప్రజాపరంపరలచేత= సంతానాల వరుసల చేత; మూడులోకంబులు= స్వర్గమర్త్యపాతాళలోకాలు మూడునూ; విస్తృతంబులు+అయ్యెన్= విస్తరించాయి; మఱియున్= ఇంకనూ; కర్దమ= కర్దమ ప్రజాపతి; పుత్రికా సముదయంబు= కూతుళ్లందరూ; బ్రహ్మ+ఋషి= బ్రహ్మర్షులకు; భార్యలు+అగుటన్+చేసి= గృహిణు లవడంవల్ల; వారివలనన్= వారివల్ల; కలిగిన= పొందిన; సంతానపరంపలన్= పుత్రపౌత్రాది వంశాల తీరులను గూర్చి; వివరించెదన్= విస్తరించి చెప్తాను.

**తా :** తోషుడు, ప్రతోషుడు, సంతోషుడు, భద్రుడు, శాంతి, ఇడస్పతి, ఇధ్మడు, కవి, విభుడు, వహ్ని, సుదేవుడు, రోచనుడు అనే పన్నెండుమంది పిల్లలు పుట్టారు. వీళ్లే స్వాయంభువ మన్వంతర కాలంలో 'తుషితులు' అనే పేరుతో దేవతలుగా ప్రసిద్ధిని పొందారు. ఇంకా ఆ మన్వంతరంలోనే మరీచి మొదలైన మునినాథులూ, యజ్ఞుడూ, ఇంద్రుడూ ఇంకా కాంతిమంతులైన ప్రియవ్రత ఉత్తానపాదులునూ ఆ కొడుకులూ, మనుమలూ, ముని మనుమలతో వ్యాపించి వృద్ధిపొందారు.

మనువు రెండో కూతురైన దేవహూతిని కర్దమునికి అప్పగించి ఆ వంశాన్ని వృద్ధి చేశారని ముందే తెలిపాను. ఇక ఆ మనువు మూడవ సంతానం అయిన 'ప్రసూతి' అనే కన్యకను బ్రహ్మకొడుకు దక్షుడి కిచ్చాడు. ఆ దక్షప్రసూతులకు కల్గిన సంతతి తరతరానికి పెరిగి పోయి ముల్లోకాలకూ వ్యాపించింది. ఇక కర్దముడి ఆడపిల్లలందరూ బ్రహ్మర్షులకు భార్య లయ్యారు. వాళ్ల సంతానక్రమాన్ని వివరిస్తాను.

## a =కర్దమప్రజాపతి సంతతి a

**సీ. ఘనుఁడౌ మరీచికిఁ గర్దమాత్మజయగు కళ యను నంగనవలనఁ గశ్య**
**పుం డను కొడుకును బూర్ణిమ యను నాఁడుబిడ్డయుఁ బుట్టిరి; పేర్చి వారి**
**వలనఁ బుట్టిన ప్రజావళిపరంపరలచే భువనంబు లెల్ల నాపూర్ణ మగుచు**
**జరగెను; బూర్ణిమ జన్మాంతరంబున హరిపదప్రక్షాళితాంబువులను**

**తే. గంగ యనుపేరఁ బుట్టి యక్కన్య "దేవ, కుల్య" యనుదాని నొక్కతెఁ గూఁతు నఖిల**
**విష్టపవ్యాపకుం డగు "విరజుఁ" డనెడి, తనయు నొక్కనిఁ గాంచె మోదంబు తోడ. 7**

**ప్రతి :** ఘనుఁడు+ఔ= గొప్పవాడైన; మరీచికిన్= మరీచి ప్రజాపతికి; కర్దమ = కర్దమ ప్రజాపతి, ఆత్మజ+అగు= కూతురు అయిన; కళ+అను= 'కళ' అని పిలువబడే; అంగన వలనన్= కాంతవల్ల; కశ్యపుండు+అను= కశ్యపుడనే; కొడుకును= కుమారుడూ మగబిడ్డయు; పూర్ణిమ+అను= పూర్ణిమ అనే; ఆఁడుబిడ్డయున్= ఆడబిడ్డా; పుట్టిరి= జన్మించారు; పేర్చి=

మరింతగా; వారి వలనన్= వాళ్లవల్ల; పుట్టిన= ఉద్భవించిన; ప్రజా+ఆవళి= సంతతి సముదాయం యొక్క; పరంపరలచేన్= వరుస క్రమంచేత (తరాలతో); భువనంబులు+ఎల్లన్= అన్ని లోకాలూ; ఆపూర్ణము= నిండియున్నవి; అగుచున్= అవుతూ; జరగెను= ప్రవర్తిల్లాయి; పూర్ణిమ= పూర్ణిమ; జన్మాంతరంబునన్= మరో పుట్టుకలో; హరిపద= విష్ణుపాదాలు; ప్రక్షాళిత= కడిగిన; అంబువులను= నీటితో; గంగ+అను= గంగ అనే; పేరన్= పేరుతో; పుట్టి= జన్మించి; ఆ+కన్య= ఆ గంగ; దేవ కుల్య+అనుదానిన్= 'దేవకుల్య' అను పేరుగల దానిని; ఒకతెన్= ఒక్క; కూఁతున్= పుత్రికనూ; అఖిల= అన్ని; విష్టప= లోకాలలో; వ్యాపకుండు+అగు= ప్రశస్తి పొందినవాడైన; విరజుఁడు+అనెడి= విరజుడనే; తనయున్= కుమారుణ్ణి; ఒక్కనిన్= ఒక్కణ్ణి; మోదంబుతోడన్= సంతోషంతో; కాంచెన్= పొందింది.

**తా :** కర్దమప్రజాపతి కూతురు 'కళ'. 'మరీచికళ'లకు కశ్యపుడనే మగబిడ్డా, పూర్ణిమ అనే ఆడుబిడ్డా పుట్టారు. వీళ్లకు క్రమంగా పుట్టిన తరతరాలసంతతి వల్ల పద్నాలుగు లోకాలూ నిండిపోయాయి. ఈ 'పూర్ణిమే' మరోజన్మలో విష్ణుపాదాలు కడిగిన నీళ్లవల్ల 'గంగ' అనే పేరుతో పుట్టింది. ఈ గంగ 'దేవకుల్య' అనే ఒక కుమార్తెనూ, 'విరజుడ'నే కొడుకునూ పొందింది. ఈ విరజుడు ప్రపంచవ్యాప్తంగా పేరు పొందినాడు.

**విశే :** భూలోక, భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనలోక, తపోలోక, సత్యలోక, అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళ లోకాలు పద్నాలుగు లోకాలు. ఇవే 'భువనంబులు'. వీటిల్లో మొదటి ఏడూ ఊర్ధ్వలోకాలు. తర్వాత ఏడూ అధోలోకాలు.

మూలంలో 'పూర్ణిమ' కొడుకు. తెనిగింపులో కూతురు. ఆ పూర్ణముడికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. అనువాదంలో ఒక కొడుకు. ఒక కూతురు దేవకుల్య గంగ. తెనిగింపులో పూర్ణిమ గంగ; ఈ గంగ కూతురు దేవకుల్య.

**క. అనఘుం డత్రిమహాముని, యనసూయాదేవివలన నజహరిపురసూ**
**దనుల కళాంశంబుల నం, దనులను ముప్వురను గాంచెఁ దద్దయుఁ బ్రీతిన్. 8**

**ప్రతి :** అనఘుండు= పుణ్యవంతుడైన; అత్రిమహాముని= అత్రి మహర్షి; అనసూయాదేవివలనన్= అనసూయాదేవి వల్ల; అజ, హరి, పురసూదనుల= బ్రహ్మ, విష్ణువు, శివుడు అనువారి; కళా+అంశంబులన్= కళల అంశంతో; తద్దయున్= మిక్కిలి; ప్రీతిన్= సంతోషంతో; నందనులను= కొడుకులను; ముప్వురను= ముగ్గురిని; కాంచెన్= పొందాడు.

**తా :** పుణ్యాత్ముడైన అత్రి మహాముని, అనసూయ (కర్దముడి కూతురు) యందు బ్రహ్మ, విష్ణు, శివాంశలతో ముగ్గురు కొడుకులను మిగుల ప్రీతితో కన్నాడు.

**విశే :** అత్రి= ఇతడు సప్తర్షుల్లో మూడవముని. పురసూదనుడు= త్రిపురాలను దహించిన వాడని – మహేశ్వరుడని వ్యుత్పత్తి. చంద్రుడు, దత్తాత్రేయుడు, దుర్వాసుడు అత్రి కొడుకులు.

**క. అనవుడు విదురుఁడు మైత్రే, యునిఁ గనుఁగొని పలికె మునిజనోత్తమ! జగతిన్**
**జననస్థితిలయకారణు, లన వెలసిన పద్మగర్భహరిహరు లెలమిన్. 9**

**ప్రతి :** అనవుడున్= అని చెప్పగా; విదురుఁడు= విదురుడు; మైత్రేయునిన్= మైత్రేయుణ్ణి; కనున్+కొని= చూసి; పలికెన్= మాట్లాడాడు; మునిజన+ఉత్తమ!= మునులలో శ్రేష్ఠుడవైన ఓ మైత్రేయా!; జగతిన్= లోకంలో; జనన= పుట్టుకకు; స్థితి=

ఉనికికి; లయ= ప్రళయానికి; కారణులు+అనన్= కారణమైనవారనగా; ఎలమిన్= ఒప్పినట్లు; వెలసిన= విలసిల్లిన వారుగా వెలుగొందిన; పద్మగర్భ= పద్మంగర్భంలోగల, బ్రహ్మ; హరి= విష్ణువు; హరుడు= శివుడు;

**తా :** విదురుడు మైత్రేయుణ్ణి ఇలా అడిగాడు. ఓ మునివరా! సృష్టికీ, పోషణకూ, లయానికీ కారణమైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు

**క. ఏమి నిమిత్తం బత్రిమ, హాముని మందిరమునందు ననసూయకు ను**
**ద్దామగుణు లుదయమై రన, నా మైత్రేయుండు పలికె నవ్విదురునితోన్. 10**

**ప్రతి :** అత్రిమహాముని= అత్రిమహర్షియొక్క; మందిరము+అందున్= ఇంటిలో; అనసూయకున్= అనసూయకు; ఉద్దామగుణులు= ఆ మహాగుణవంతులు; ఏమి నిమిత్తంబు= ఏమి కారణంగా; ఉదయము+ఐరి= పుట్టారు; అనన్= అనగానే; మైత్రేయుండు= మైత్రేయముని; ఆ+విదురునితోన్= ఆ విదురుడితో; పలికెన్= చెప్పాడు.

**తా :** అత్రిమహాముని ఇంట అనసూయకు త్రిమూర్తులు ఉన్నత గుణవంతులైన చక్కటి కొడుకులుగా పుట్టడానికి అసలు కారణం ఏమై ఉంటుందని విదురుడు ప్రశ్నించాడు. అతడితో మైత్రేయుడు ఇలా చెప్పసాగాడు.

**సీ. సుచరిత్ర! విను విధిచోదితుండై యత్రి దప మాచరింపఁ గాంతాసమేతుఁ**
**దయి ఋక్షనామకులాద్రితటంబున ఘుమఘుమారావసంకులవిలోల**
**కల్లోలజాలసంకలితనిర్వింధ్యానదీజలపరిపుష్టరాజితప్ర**
**సూనగుచ్ఛస్వచ్ఛమానితాశోకపలాశకాంతారస్థలమున కెలమి**

**తే. నరిగి యచ్చట నిర్ద్వంద్వుఁ డగుచుఁ బ్రాణ, నియమమున నేకపదమున నిలిచి గాలిఁ**
**దివుటఁ గ్రోలి కృశీభూతదేహుఁ, డగుచుఁ దపము గావించె దివ్యవత్సరశతంబు. 11**

**ప్రతి :** సుచరిత్ర= మంచి నడవడికల ఓ విదురా!; విను= ఆలకించు; విధి= బ్రహ్మచే, చోదితుండు+ఐ= నడుపబడినవాడై; అత్రి= అత్రిముని; తపమున్= తపస్సును; ఆచరింపన్= చేయడానికి; కాంతాసమేతుండు+అయి= ఇల్లాలితో కూడినవాడై; ఋక్షనామ= ఋక్షమనే; కులాద్రి= కులపర్వతంయొక్క; తటంబున= చరియలో; ఘుమఘుమ; ఆరావ= మోతలతో; సంకుల= వ్యాపించి; విలోల= పొంగి పొర్లిపోయే; కల్లోల= పెద్ద పెద్ద అలలు; జాల= సమూహంతో; సంకలిత= కూడిన (కలిసిన); నిర్వింధ్యానదీజల= నిర్వింధ్య అనే నదినీటిచే; పరిపుష్ట= ఏపుగా పెరిగి; రాజిత= ప్రకాశించే; ప్రసూన గుచ్ఛ= పూలగుత్తుల యొక్క; స్వచ్ఛ= అచ్చమైన; మానిత= ఆదరించబడే; అశోక= అశోక వృక్షాలూ; పలాశ= మోదుగ చెట్లు గల; కాంతార స్థలమునకున్= అటవీ ప్రదేశానికి; ఎలమిన్= ప్రీతితో; అరిగి= వెళ్లి; అచ్చటన్= ఆ చోట; నిర్ద్వంద్వుఁ డు+అగుచున్= శీతోష్ణ సుఖదుఃఖాదులకు అతీతుడిగా వుంటూ; ప్రాణనియమమునన్= ప్రాణాయామంచేత; ఏకపదమునన్= ఒంటి కాలిమీద; నిలిచి= నిలబడి; గాలిన్= వాయువును; తివుటన్= కోరిక కొద్దీ; క్రోలి= పీల్చి; కృశీభూత= కృశించిన; దేహుండు+అగుచున్= శరీరం కలవాడు అవుతూ; దివ్యవత్సర శతంబు= వంద దివ్యసంవత్సరాలు; తపమున్= తపస్సును; కావించెన్= చేశాడు.

**తా :** ఓ సుచరితా! విను. విధిప్రేరణతో అత్రిమహర్షి అనసూయతో కలిసి ఋక్షమనే కులపర్వతానికి వెళ్లి తపస్సు చేశాడు. ఆ కొండచరియల్లో నిర్వింధ్యానది పొంగి ప్రవహిస్తూ ఉంటుంది. దాని అలల రొదలు ఊదినట్లుగా ఉంటాయి. ఆ నీటిలో

ఏపుగా పెరిగిన అశోక చెట్లు, మోదుగు చెట్లు గల ఒక వనం అక్కడ ఉంది. ఆ చెట్లు విరబూసిన పూల గుత్తులతో అందంగా ఉంటాయి. అక్కడనే ఆ ముని ఒంటికాలిమీద నిలబడి గాలి ఆహారంగా ప్రాణాయామంతో సుఖదుఃఖాలను శీతోష్ణాలను జయించినవాడై వంద దివ్యసంవత్సరాలు తపస్సు చేశాడు.

**విశే :** ప్రాణవాయువుని నియమబద్ధంగా నిరోధించడాన్ని 'ప్రాణాయామం' అంటారు.

– మానవులకు ఒక ఏడాది దేవతలకు ఒకరోజు. అలాంటి 30 ఏళ్లు దేవతలకు ఒక నెల. ఇలాంటి 12 నెలలు (1,29,600ల రోజులు) దేవతలకు ఒక ఏడాది. దీనినే 'దివ్యవర్షం' అంటారు.

– మహేంద్రం, మలయం, సహ్యం, మాల్యవంతం, ఋక్షం, వింధ్యం, పారియాత్రం. ఈ ఏడింటిని 'కులపర్వతా'లంటారు.

– కష్టనష్టాలు, నిందాస్తుతులు, ఆకలిదప్పులు, మానావమానాలు, రాగద్వేషాలు, సుఖదుఃఖాలు, శీతోష్ణాలు మొదలైనవి 'ద్వంద్వాలు'. వీనికి లోబడనివాడు 'ద్వంద్వాతీతుడు'.

**వ. ఇట్లతిఘోరంబైన తపంబు సేయుచుఁ దన చిత్తంబున. 12**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; అతి ఘోరంబు+ఐన= చాలా భయంకరమైన; తపంబు+చేయుచున్= తపస్సు చేస్తూ; తన చిత్తంబునన్= తన మనస్సులో...

**తా :** ఇలా భయంకరమయిన తపస్సు చేస్తూ, తన మనస్సులో

**క. ఏ విభుఁడు జగదధీశ్వరుఁ, డా విభుశరణంబు సొత్తు నతఁడాత్మ సమం**
**బై వెలసిన సంతతిని ద, యావరమతి నిచ్చుఁగాక యని తలఁచు నెడన్. 13**

**ప్రతి :** ఏ విభుఁడు= ఏ ప్రభువు; జగద్+అధి+ఈశ్వరుఁడు= లోకనాథుడో; ఆ విభు= ఆ సార్వభౌముని; శరణంబు= రక్షణను; చొత్తున్= ఆశ్రయిస్తాను; అతఁడు= ఆ దైవం; ఆత్మసమంబు+ఐ= తనతో తుల్యమై; వెలసిన= ఒప్పిన; సంతతిని= బిడ్డల్ని; దయావరమతిన్= గొప్పదయాబుద్ధితో; ఇచ్చున్+కాక+అని= ప్రసాదించుగాక యని; తలఁచున్+ఎడన్= ఆలోచించే సమయంలో...

**తా :** జగన్నాథుడయిన ఆ దైవాన్ని శరణు కోరుతాను. అతడు, నామీది గొప్ప దయాబుద్ధితో 'తనకు సమానులైన' సంతతిని ప్రసాదించు గాక, అని అత్రిమహాముని అనుకునేంతలో

**చ. మునుకొని యత్తపోధనుని మూర్ధజమైన తపఃకృశానుచే**
**తనుఁ ద్రిజగంబులుంగరఁగి తప్తములైనను జూచి బంకజా**
**సనమురశాసనత్రిపురశాసను లచ్చటి కేగి రప్సరో**
**జనసురసిద్ధసాధ్యమునిసన్నుతభూరియశోభిరాములై. 14**

**ప్రతి :** మునుకొని= ముందుగా; ఆ+తపోధనుని= ఆ అత్రిమహర్షియొక్క; మూర్ధజము+ఐన= తలనుంచి పుట్టిన; తపస్+కృశానుచేతను= తపోగ్నిచేత; త్రిజగంబులున్= ముల్లోకాలు; కరగి= కరగిపోయి; తప్తములు+ఐనను= తపించగా;

పంకజ+ఆసన= పద్మం గద్దెగాగల బ్రహ్మ; మురశాసన= మురుడనే రాక్షసుని శిక్షించిన విష్ణువు; త్రిపురశాసనులు= త్రిపురాలను అరికట్టిన శివుడు; చూచి= చూచి; అప్సరస్+జన= అచ్చరల గుంపుచేత; సుర= దేవతలచేత; సిద్ధ= సిద్ధులచేత; సాధ్య= సాధ్యులచేత; ముని= మునులచేత; సన్నుత= పొగడబడిన; భూరియశస్= గొప్ప కీర్తిచే; అభిరాములు+ఐ= మనోహరులై; అచ్చటికిన్= అత్రి ఆశ్రమానికి; ఏఁగిరి= వెళ్ళారు.

**తా :** ఆ అత్రిముని శిరస్సుమీది అగ్నిజ్వాలలకు ముల్లోకాలూ ఉడికి పోవడం కళ్లారా చూశారు త్రిమూర్తులు. వారు అప్సరసలు, సురలు, సిద్ధులు, సాధ్యులు తమ కీర్తిని స్తుతిస్తుండగా ఆ మహాముని ఆశ్రమానికి వెళ్ళారు.

**వ. అట్లు మునీంద్రు నాశ్రమంబు డాయంజను నవసరంబున. 15**

**ప్రతి :** అట్లు= ఆ విధంగా; మునీంద్రు= మునివరుని; ఆశ్రమంబు= పర్ణశాలను; డాయన్= సమీపించటానికి; చను= వెళ్లే; అవసరంబునన్= సమయానికి...

**తా :** అలా త్రిమూర్తులు అత్రిమహర్షిఆశ్రమం చేరుకోబోతుండగా

**చ. అనఘతపోభిరాముఁడగు నత్రిమునీంద్రుఁడుఁ గాంచెఁ దప్తకాం**
**చనఘనచంద్రికారుచిరచారుశరీరుల హంసనాగసూ**
**దనవృషభేంద్రవాహుల నుదారకమండలుచక్రశూలసా**
**ధనుల విరించివిష్ణుపురదాహుల వాక్కమలాంబికేశులన్. 16**

**ప్రతి :** అనఘ= గొప్పదైన; తపస్= తపస్సుచే; అభిరాముఁడు+అగు= ఒప్పుతున్న; అత్రిముని+ఇంద్రుఁడు= అత్రి మునీశ్వరుడు; తప్త= పుటంపెట్టిన; కాంచన= బంగారంవలె; ఘన= మబ్బువలె; చంద్రికా= వెన్నెలవలె; రుచిర= ఒప్పిదమైన; చారు= మనోహరమైన; శరీరులన్= శరీరాలు కలవాళ్లను; హంస= హంసను; నాగసూదన= పాములను నశింపచేసే గరుత్మంతుడిని; వృషభ+ఇంద్ర= ఆఁబోతును; వాహులన్= వాహనాలుగా కలవాళ్లను; ఉదార= గొప్పదైన; కమండల= కమండలం; చక్ర= చక్రం; శూల= త్రిశూలం; సాధనులన్= పరికరాలుగా కలవాళ్లను; వాక్= సరస్వతికి; కమలా= లక్ష్మికి; అంబికా= పార్వతికి; ఈశులన్= పతులైన; విరించి= బ్రహ్మను; విష్ణు= విష్ణుమూర్తిని; పురదాహులన్= త్రిపురాలను దహించిన శివుణ్ణి; కాంచెన్= చూశాడు.

**తా :** పసిమిఛాయతో మిలమిల మెరిసిపోతున్న బ్రహ్మ చేతిలో కమండలం ఉంది. ఆయన హంస మీద వచ్చాడు. నల్లటిమబ్బు ఛాయతో ఒప్పుతున్న విష్ణువు చేతిలో సుదర్శనచక్రం ఉంది. ఆయన గరుత్మంతుడిమీద వచ్చాడు. వెన్నెల్లా తెల్లటి ఛాయగల శివుని చేతిలో త్రిశూలం ఉంది. ఆయన ఆబోతుమీద వచ్చాడు. ఇలా త్రిమూర్తులైన వాక్పతినీ, లక్ష్మీపతినీ, పార్వతీపతినీ అత్రిమహాముని కళ్లారా చూశాడు. ఆ ముని మహాతపస్సంపన్నుడు.

**వ. మఱియుఁ గృపావలోకన మందహాస సుందరవదనారవిందంబులుగల మహాత్ముల సందర్శించి యమందానందకందళితహృదయారవిందుండై సాష్టాంగదండప్రణామంబు లాచరించి పుష్పాంజలి గావించి నిటలతటఘటితకరపుటుండై దుర్నిరీక్ష్యం బైన తత్తేజోవిశేషంబుఁ దేఱి చూడంజాలక ముకుళిత నేత్రుండై తత్పదాయత్త చిత్తుం డగుచు సర్వలోకప్రశస్యంబు లైన మృదుమధురగంభీరభాషణంబుల నిట్లని స్తుతియించె. 17**

**ప్రతి :** మఱియున్= ఇంకా; కృపా= దయతోకూడిన; అవలోకన= చూపులుగల; మందహాస= చిరునవ్వులుగల; సుందర= చక్కటి; వదన+అరవిందంబులు+కల= పద్మం వంటి ముఖాలు కల; మహా+ఆత్ములన్= ఆ మహా మనస్కుల్ని; సందర్శించి= చూసి; అమంద= తక్కువకాని; ఆనంద= సంతోషంతో; కందళిత= వికసించిన; హృదయ+అరవిందుండు+ఐ= హృదయ కమలం కలవాడై; స+అష్ట+అంగ= ఎనిమిది అవయవాలతో కూడిన; దండ= సాగిలిపడిన; ప్రణామంబులు= నమస్కారాలు; ఆచరించి= చేసి; పుష్ప= పూలతో; అంజలి= దోసిలిని; కావించి= ఘటించి; నిటలతట= నుదుటి ప్రదేశంలో; ఘటిత+ కరపుటుండు+ఐ= చేర్చిన అరచేతులు కలవాడై; దుర్+నిర్+ఈక్ష్యంబు+ఐన= చూడవీలుకాని; తద్= వారి; తేజస్+విశేషంబున్= దివ్యకాంతుల అతిశయాన్ని; తేఱిచూడన్= పరకాయించి చూడడానికి; చాలక= శక్తిచాలక; ముకుళిత= మోడ్చిన; నేత్రుండు+ఐ= కన్నులున్నవాడై; తద్పద= వారి పాదాలమీద; ఆయత్త= నిలిపిన; చిత్తుండు+ఐ= మనస్సుకలవాడై; సర్వలోక= అన్నిలోకాల్లో; ప్రశస్యంబులు+ఐన= ప్రసిద్ధి కెక్కగల; మృదు= మెత్తనైన; మధుర= కమ్మనైన; గంభీర= లోతైన; భాషణంబులన్= పలుకులతో; ఇట్లు+అని= ఇలా అని; స్తుతియించెన్= ప్రశంసించాడు.

**తా :** చల్లని చూపులతో చిరునవ్వులు చిందించే ముఖాలుగల త్రిమూర్తుల్ని అత్రిమహర్షి కనులారా చూశాడు. మహానందంతో ఎంతో పొంగిపోయాడు. సాష్టాంగపడ్డాడు. పూలదోసిళ్లు పట్టాడు. చేతులెత్తి మొక్కాడు. వాళ్ల కాంతుల ధగధగల్లో కళ్లు చెదరి తేరిపార చూడలేక పోయాడు. ఆ మిలమిలలకు కంటిరెప్పలు మూతపడిపోయాయి. వాళ్ళ పాదాలమీదే ధ్యాస నిలిపాడు. అందరి మెప్పు పొందే చక్కటి కమ్మని లోతైన మాటలతో ఇలా స్తోత్రం చేశాడు.

**సీ. ప్రతికల్పమందు సర్వప్రపంచోద్భవస్థితివినాశంబులఁ జేయునట్టి**
**మహితమాయాగుణమయదేహములఁ బొల్చు నజవాసుదేవశివాభిధాన**
**ములు గల్గు మీ పాదజలజాతములకు నే నతిభక్తి వందనం బాచరింతు;**
**నఖిలచేతనమానసాగమ్య మన నొప్పు మూర్తులు గల్గు మీ మువ్వురందుఁ**

**తే. బరఁగ నాచేతఁ బిలువంగఁబడిన ధీరుఁ,డెవ్వఁడే నొక్కరునిఁబిల్వ నిపుడు మీరు**
**మువ్వు రేతెంచుటకు నాదు బుద్ధి విస్మ,యంబు గదిరెడిఁ జెప్పరే యనఘులార! 18**

**ప్రతి :** అనఘులార= ఓ పుణ్యాత్ములారా!; ప్రతికల్పము+అందున్= వేయి యుగాలకొకసారి; సర్వ= సమస్తమైన; ప్రపంచ= విశ్వంయొక్క; ఉద్భవ= పుట్టుకను; స్థితి= పోషణను; వినాశంబులన్= లయమును; చేయున్+అట్టి= పొందింప చేసే; మహిత= గొప్పది అయిన; మాయాగుణమయ= మాయతో ఏర్పడ్డ త్రిగుణ వికారం అయిన; దేహములన్= శరీరాలతో; పొల్చు= ఒప్పే; అజ= బ్రహ్మ; వాసుదేవ= విష్ణువు; శివ= శివుడనే; అభిధానములు+కల్గు= పేరులు కల; మీపాద జలజాతములకున్= మీ పాదకమలాలకు; ఏన్= నేను; అతిభక్తిన్= మిక్కిలి భక్తితో; వందనంబు= నమస్కారాన్ని; ఆచరింతున్= చేస్తాను; అఖిల= సమస్తమైన; చేతన= జీవులయొక్క; మానస= మనస్సుకి; అగమ్యము= గోచరించనిది; అనన్= అన్నట్లుగా; మూర్తులు+కల్గు= ఆకారాలు కల; మీ= మీ యొక్క; మువ్వురు+అందున్= ముగ్గురిలో; పరఁగన్= ఒప్పునట్లుగా; నాచేతన్= నా చేత; పిలువన్+కన్+పడిన= ఆహ్వానించబడిన; ధీరుడు= బుద్ధిశాలి; ఎవ్వఁడు= ఎవ్వరు; ఏన్= నేను; ఒక్కరునిన్= ఒక్కరిని; పిలువన్= ఆహ్వానించగా; ఇపుడు= ఇపుడు; మీరు మువ్వురు= మీరు ముగ్గురు; ఏతెంచుటకున్= వచ్చుటకు; నా+బుద్ధిన్= నా యొక్క మతిలో; విస్మయంబు= ఆశ్చర్యం; కదిరెడిన్= అలముకుంటున్నది; చెప్పరు+ఏ= చెప్పరా!; చెప్పవలసిందని భావం.

**తా :** ఓ పుణ్యమనస్కులార! ఇది చెప్పవలసింది. మీరు ముగ్గురూ ప్రతికల్పంలోనూ లోకాలన్నిటిని సృష్టిస్తుంటారు. పోషిస్తుంటారు. లయింప చేస్తుంటారు. మాయాగుణములతో కూడిన శరీరాలు ధరిస్తుంటారు. మీరు త్రిమూర్త్యాత్మకులు. అలాంటి మీ పాదపద్మాలకు వినయపూర్వకంగా ప్రణమిల్లుతున్నాను. మీరు సకల జీవుల మనస్సులకు గోచరించనివారు. అందనివారు. మీ ముగ్గురిలో నేను పిలిచిన ఆ ఒక్కరు ఎవ్వరు. ఒక్కరిని పిలిస్తే, మీరు ముగ్గురూ ఒక్కసారిగా ప్రత్యక్షమవడం నాకు చాల ఆశ్చర్యంగా ఉంది.

**విశే :** మానవులలెక్కలో ఒక కల్పం బ్రహ్మకు ఒక దినం.

**వ. అదియునుం గాక సంతానార్థంబు నానావిధ పూజలు గావించి నా చిత్తంబున ధరియించిన మహాత్ముం డొక్కరుండ యనిన నమ్మువ్వురు విబుధశ్రేష్ఠులు నతనిం గనుంగొని సుధామధురంబు లయిన వాక్యంబుల నిట్లనిరి. 19**

**ప్రతి :** అదియునున్+కాక= అంతేకాకుండా; సంతాన+అర్థంబు= సంతతిని ఆశించి; నానావిధ= అనేక రీతుల; పూజలు= అర్చనలు, కావించి= చేసి; నా చిత్తంబునన్= నా మదిలో; ధరియించిన= స్థిరంగా నిలుపుకున్న; మహా+ఆత్ముండు= మహనీయుడు, ఒక్కరుండు+అ= ఒక్కడే; అనినన్= అని పలుకగానే; ఆ+మువ్వురు= ఆ ముగ్గురు; విబుధ శ్రేష్ఠులున్= దేవతోత్తములున్నూ; అతనిన్= ఆ అత్రిమునిని; కనున్+కొని= చూసి; సుధామధురంబులు= అమృతం లాంటి తీపి గల; వాక్యంబులన్= మాటలతో; ఇట్లు= ఈ విధంగా; అనిరి= పలికారు.

**తా :** అంతేకాదు. నేను సంతానంమీద అపేక్షతో ఎన్నోవిధాల పూజలు చేశాను. కాని నామనసులో స్థిరంగా ఉంచుకొన్న మహాత్ముడు ఒక్కడే. అనగానే, ఆ దేవతోత్తములైన త్రిమూర్తులు అత్రిమహామునిని చూస్తూ అమృతమువంటి తీయటి మాటలతో ఇలా అన్నారు.

**క. విను మేము ముగుర మయ్యును, ననుపమమతిఁ దలఁప నేకమై యుందుము; నీ**
**మనమందు నేమి గోరితి, వనయము నా కోర్కి సఫల మయ్యెడుఁజుమ్మీ! 20**

**ప్రతి :** వినుము= విను; ఏము= మేము; ముగురము+అయ్యునున్= ముగ్గురుగా ఉన్నప్పటికి; అనుపమమతిన్= సాటిలేని మనస్సుతో; తలఁపన్= ఆలోచించగా; ఏకము+ఐ= ఒక్కటిగా; ఉందుము= ఉంటాం; నీమనమున్+అందున్= నీ మనస్సులో; ఏమి+కోరితివి= ఏమి కావాలనుకుంటున్నావో; ఆ కోర్కి= ఆ వాంఛ; అనయమున్= అవశ్యము; సఫలము+అయ్యెడున్= ఫలవంతం అవుతుంది; చుమ్మీ= సుమా!

**తా :** అత్రి మునీ! ఆలకించు. మేం ముగ్గురమే అయినా సాటిలేని మనస్సుతో ఆలోచిస్తే మేం ఒక్కరమే. నువ్వు నిత్యమూ మనసులో కోరుకున్న కోరిక నెరవేర్తుంది సుమా!

**క. మా మువ్వుర యంశంబుల, ధీమంతులు సుతులు పుట్టి త్రిభువనములలో**
**నీ మంగళగుణకీర్తిన్, శ్రీమహితము సేయఁగలరు సిద్ధము సుమ్మీ! 21**

**ప్రతి :** మా మువ్వుర= మా ముగ్గురియొక్క; అంశంబులన్= భాగాలవల్ల; ధీమంతులు= మతిమంతులు అయిన; సుతులు= కొడుకులు; పుట్టి= ఉదయించి; త్రిభువనములలోన్= స్వర్గ మర్త్య పాతాళ లోకాల్లో; నీ= నీయొక్క; మంగళ=

శుభప్రదమైన; గుణ= స్వభావం యొక్క; కీర్తిన్= యశస్సును; శ్రీ= సిరితో; మహితము= గొప్పదిగా; చేయన్+కలరు= చేస్తారు; సిద్ధము సుమ్మీ= (ఇది) నిశ్చయం సుమా!

**తా :** మా ముగ్గురి అంశాలతో మతిమంతులైన కొడుకులు పుడతారు. వారు త్రిలోకాల్లో నీ యశస్సును వ్యాప్తి గావించగల సమర్థులై ఉంటారు. ఇది నిశ్చయం సుమా!

**క. అని మునిచంద్రుఁడు తన మన, మునఁ గామించిన వరంబు బుధవరులు ముదం**
**బున నొసఁగి యతనిచేఁ బూ, జనములఁ బరితృప్తు లగుచుఁ జనిరి యథేచ్ఛన్. 22**

**ప్రతి :** అని= ఈ తీరున మాట్లాడి; మునిచంద్రుఁడు= మునీశ్వరుడు; తన= తనయొక్క; మనమునన్= హృదయంలోపల; కామించిన= వాంఛించిన; వరంబున్= కోరికను; బుధవరులు= దేవతాశ్రేష్ఠులు (త్రిమూర్తులు); ముదంబునన్= ఆనందంతో; ఒసఁగి= ప్రసాదించి; అతనిచేన్= అత్రిమునిచే; పూజనములన్= పూజలతో; పరితృప్తులు+అగుచున్= బాగా సంతృప్తిపొందిన వారవుతూ; యథా+ఇచ్ఛన్= ఇష్టానుసారంగా; చనిరి= వెళ్లారు.

**తా :** అని మునిచంద్రుడైన అత్రి తన మనస్సులో కోరుకున్న వరాన్ని దేవతాశ్రేష్ఠులు (త్రిమూర్తులు) ఆనందంగా ఇచ్చి ఆతని పూజలతో బాగా తృప్తులై తమ ఇష్టానుసారం పోయారు.

**ఉ. ఆ సుచరిత్రదంపతు లుదంచితలీలఁ గనుంగొనంగ న**
**బ్జాసను నంశమందు నమృతాంశుఁడు, విష్ణుకళన్ సుయోగ వి**
**ద్యాసుభగుండు దత్తుఁడు, పురాంతకు భూరికళాంశమందు దు**
**ర్వాసుఁడునై జనించి రనవద్యపవిత్రచరిత్రు లిమ్ములన్. 23**

**ప్రతి :** ఆ= ప్రసిద్ధమైన, సుచరిత్ర= మంచినడవడిగల; దంపతులు= భార్యాభర్తలైన అత్రి; అనసూయలు; ఉదంచిత= పూజింపబడిన; లీలన్= విధానంతో; కనున్+కొనన్+కన్= చూడగా; అబ్జ+ఆసను= పద్మం పీటగాగల బ్రహ్మయొక్క; అంశము+అందున్= అంశతో; అమృత+అంశుఁడు= అమృతంవంటి కిరణాలుగల చంద్రుడు; విష్ణుకళన్= విష్ణుమూర్తి అంశచే; సుయోగవిద్యాసుభగుండున్= మంచి యోగవిద్యా సంపన్నుడగు; దత్తుఁడున్= దత్తాత్రేయమహర్షి; పురాంతకు= శివుడియొక్క; భూరి= ఎక్కువైన; కళా+అంశమందు= కళలయందలి భాగంతో; దుర్వాసుఁడున్+ఐ= దుర్వాస మహర్షియును అయి; న+అవద్య= మచ్చలేని; పవిత్ర= శుద్ధమైన; చరిత్రులు= ప్రవర్తనలు కలవారు; ఇమ్ములన్= ఇంపుగా; జనించిరి= అవతరించారు.

**తా :** ఆ సుచరిత్రులు అయిన అత్రి దంపతులు. పూజింపదగురీతిగా చూస్తూండగా వాళ్లకు బ్రహ్మ అంశంచే చంద్రుడు పుట్టాడు. విష్ణ్వంశతో యోగవిద్యావిశారదుడైన దత్తాత్రేయుడు పుట్టాడు. శివుడి గొప్ప అంశతో దుర్వాసుడు పుట్టాడు. ఈ ముగ్గురూ దోషరహితమై పరిశుద్ధమైన చరిత్ర కలవారై ప్రీతిగా జన్మించారు.

**క. అంగిరసుఁ డనెడు మునికిఁ గు, లాంగన యగు శ్రద్ధయందు నంచితసౌంద**
**ర్యాంగులు గూఁతులు నలువురు, మంగళవతు లుదయమైరి మాన్యచరిత్రా! 24**

**ప్రతి :** మాన్యచరిత్రా!= గౌరవించ దగ్గ ప్రవర్తనం కల విదురా!; అంగిరసుఁడు+అనెడు= అంగిరసుడనే; మునికిన్= ఋషికి; కులాంగన+అగు= భార్య అయిన; శ్రద్ధ+అందున్= శ్రద్ధ కడుపున; అంచిత= ఒప్పి ఉన్న; సౌందర్య+అంగులు=

సుందరమైన దేహాలు కలవారు; మంగళవతులు= మిక్కిలి శుభంకలవాళ్లు (అయిన); నలువురు= నల్గురు; కూఁతులు= కుమార్తెలు; ఉదయము+ఐరి= జనించారు.

**తా :** గౌరవింపదగిన చరిత్రగలవాడా! ఓ విదురా! అంగిరసుడు అనే మునికి, శ్రద్ధ అనే కులకాంతకు పుట్టిన పుత్రికలు నల్గురు. వాళ్లు మంచి లక్షణాలుగల పిల్లలు. చక్కటి అందగత్తెలు.

**క. వారు సినీవాలియనఁ గు, హూ రాకానుమతు లనఁగ నొప్పిరి; మఱియుం**
**గోర సుతయుగము గలిగెను, స్వారోచిషమనువువేళ శస్తఖ్యాతిన్. 25**

**ప్రతి :** వారు= ఆ నల్గురూ; సినీవాలియునున్= సినీవాలి అనే పేరుతో; కుహూ= కుహువు అనే పేరుతో; రాకా= రాక అనే పేరుతో; అనుమతులు+అనఁగన్= అనుమతి అనే పేరుతోనూ; ఒప్పిరి= ప్రకాశించిరి; మఱియున్= మళ్లీ; కోరన్= కోరుకోగా; స్వారోచిషమనువు వేళన్= స్వారోచిషమనువుకాలంలో; శస్త= శుభకరమైన; ఖ్యాతిన్= ప్రసిద్ధితో; సుతయుగము= కొడుకుల జంట; కలిగెను= పుట్టింది.

**తా :** ఆ నల్గురు కూతులు పేర్లు సినీవాలి, కుహువు, రాక, అనుమతి. అను పేర్లతో ఒప్పారు. ఆ తర్వాత తిరిగి కోరుకొనగా అంగిరస, శ్రద్ధలకు ఇద్దరు కొడుకులు పుట్టారు. వారు స్వారోచిష మన్వంతరంలో ప్రశస్తమైన ఖ్యాతిని పొందారు.

**విశే :** సినీవాలి= చంద్రకళ కన్పించే అమావాస్య. (కృష్ణచతుర్దశి) అంటే అంతకుముందు వేకువన చంద్రకళ సన్నగా కన్పించగా ఆ రోజు గడచివచ్చిన అమావాస్య రాత్రిని 'సినీవాలి' అంటారు. కిందటి తెల్లవారుజామున చంద్రకళ కనుపించని అమావాస్యను 'కుహువు' అంటారు. రాకా= పూర్ణిమ, అనుమతి= శుక్ల చతుర్దశి. ఇవి దర్శ పూర్ణమాసలు మొదలైన వైదిక కర్మలకు ప్రధానమైన కాలాలకు ప్రతీకలు.

**వ. వార లెవ్వ రనిన భగవంతుం డగు నుచథ్యుండును బ్రహ్మనిష్ఠుండగు బృహస్పతియు ననం బ్రసిద్ధి వహించిరి; పులస్త్యుండు హవిర్భుక్కను నిజభార్యయందు నగస్త్యునిం బుట్టించె; నా యగస్త్యుండు జన్మాంతరంబున జఠరాగ్నిరూపంబై ప్రవర్తించె; వెండియు నా పులస్త్యుండు విశ్రవసునిం గలిగించె; నా విశ్రవసునకు "నిలబిల" యను భార్యవలనం గుబేరుండును, "కైకసి" యను దానివలన రావణ కుంభకర్ణ విభీషణులునుం బుట్టిరి; పులహునకు గతియను భార్యవలనఁ గర్మశ్రేష్ఠుండును వరీయాంసుండును సహిష్ణుండును నను ముష్వురుగొడుకులు జనియించిరి. మఱియుఁ గ్రతువునకుఁ "గ్రియ" యను భార్యయందు బ్రహ్మతేజంబున జ్వలించుచున్న షష్టిసహస్రసంఖ్యులు గల వాలఖిల్యులను మహర్షులు గలిగిరి; వసిష్ఠుం దూర్జయను భార్యయందుఁ జిత్రకేతుండును సురోచియు విరజుండును మిత్రుండును నుల్బణుండును వసుభృద్యానుండును ద్యుమంతుండును నను సప్తఋషులను, భార్యాంతరంబున శక్తి ప్రముఖపుత్రులనుం బుట్టించె; నథర్వుం డనువానికిఁ "జిత్తి" యను భార్యయందు ధృతవ్రతుండు నశ్వశిరస్కుండు నయిన దధ్యంచుండు పుట్టె; మహాత్ముండగు భృగువు "ఖ్యాతి" యను పత్నియందు ధాతయు విధాతయు నను పుత్రద్వయంబును భగవత్పరాయణయగు "శ్రీ" యను కన్యకం బుట్టించె; నా ధాతృవిధాతృలు మేరు వనువాని కూఁతు లయిన "యాయతి" "నియతు" లను భార్యలవలన మృకండుప్రాణు లను కొడుకులం**

**బుట్టించి; రందు మృకండునకు మార్కండేయుండును, బ్రాణునకు వేదశిరుం డను మునియు బుట్టిరి; భార్గవునకు నుశన యను కన్యయందుఁ గవి యనువాఁడు పుట్టె; నిట్లు కర్దమ దుహిత లయిన కన్యకా నవకంబువలనం గలిగిన సంతానపరంపరలచే సమస్తలోకంబులును బరిపూర్ణంబులయ్యె; నట్టి సద్యః పాపహరంబును శ్రేష్ఠతమంబును నైన కర్దమదౌహిత్రసంతాన ప్రకారంబు శ్రద్ధాగరిష్ఠ చిత్తుండవగు నీకుం జెప్పితి; నింక దక్షప్రజాపతివంశం బెఱింగింతు, వినుము. 26**

**ప్రతి :** వారలు= ఆ కుమారులు; ఎవ్వరు+అనినన్= ఎవ్వరనగా; భగవంతుండు+అగు= దేవుడయిన; ఉచథ్యుండును= ఉచథ్యుడూ; బ్రహ్మనిష్ఠుండు+అగు= బ్రహ్మ నిష్ఠగలవాడగు; బృహస్పతియును= బృహస్పతీ, అనన్= అనే పేర్లతో; ప్రసిద్ధి= ప్రశస్తి; వహించిరి= పొందిరి; పులస్త్యుండు= పులస్త్యుడు; హవిర్భుక్కు+అను= 'హవిర్భుక్కు' అనే; నిజభార్య+అందున్= తన భార్యవల్ల; అగస్త్యునిన్= అగస్త్యుణ్ణి; పుట్టించెన్= పుట్టించాడు; ఆ+అగస్త్యుండు= ఆ అగస్త్యుడు; జన్మ+అంతరంబున= మరొక జన్మలో; జఠరాగ్ని రూపంబు+ఐ= కడుపులో అన్నాది పదార్థాల్ని అరిగింప చేసే అగ్నిరూపం కలవాడై; ప్రవర్తించెన్= నడుచుకున్నాడు; వెండియున్= తిరిగి; ఆ పులస్త్యుండు= ఆ పులస్త్యుడు; విశ్రవసునిన్= విశ్రవసుణ్ణి; కలిగించెన్= కన్నాడు; ఆ విశ్రవసునకున్= ఆ విశ్రవసువునికి; ఇలబిల+అను= 'ఇలబిల' అనే పేరుగల; భార్యవలనన్= భార్య గర్భంలో; కుబేరుండును= కుబేరుడు; కైకసి+అనుదానివలనన్= 'కైకసి' అనే స్త్రీవల్ల; రావణ,కుంభ కర్ణ,విభీషణలునున్= రావణుడూ, కుంభకర్ణుడూ, విభీషణుడూ; పుట్టిరి=జన్మించారు; పులహునకున్= పులహుడికి; గతి అను భార్యవలన= గతి అనే కాంతవల్ల; కర్మశ్రేష్ఠుండును= కర్మశ్రేష్ఠుడు; వరీయాంసుండును= వరీయాంసుడు; సహిష్ణుండునున్= సహిష్ణుడు; అను ముప్వురు+కొడుకులు= అనే ముగ్గురు పుత్రులు; జనియించిరి= ఉదయించారు; మఱియున్= మళ్లీ; క్రతువునకున్= క్రతువునకు; క్రియ+అను= 'క్రియ' అనే; భార్యయందు= సతివల్ల; బ్రహ్మతేజంబునన్= బ్రహ్మ వర్చస్సుతో; జ్వలించుచున్న= ప్రకాశిస్తున్న; షష్టిసహస్ర సంఖ్యలు= అరవైవేల సంఖ్యగల; వాలఖిల్యులు+అను= వాలఖిల్యులనే; మహర్షులు= మహామునులు; కలిగిరి= జనించారు; వసిష్ఠుండు= వసిష్ఠుడు; ఊర్జ+అను భార్యయందు= 'ఊర్జ' అనే (అరుంధతి) కులసతి వల్ల!; చిత్రకేతుండును= చిత్రకేతుడు; సురోచియున్= సురోచి; విరజుండును= విరజుడు; మిత్రుండును= మిత్రుడు; ఉల్బణుండును= ఉల్బణుడు; వసుభృద్యానుండును= వసుభృద్యానుడు; ద్యుమంతుడును= ద్యుమంతుడు అనే; సప్తఋషులను= ఏడుగురు మునుల్ని; భార్యా+అంతరంబునన్= మరొక భార్యవల్ల; శక్తి ప్రముఖ= శక్తి మొదలైన; పుత్రులనున్= కుమారుల్ని; పుట్టించెన్= పుట్టించాడు; అథర్వుండు+అనువానికిన్= అథర్వుడనే వానికి; చిత్తి+అనుభార్య+అందున్= 'చిత్తి' అనే భార్యవల్ల; ధృత= ధరించిన; వ్రతుండు= నియమం కలవాడున్నూ; అశ్వశిరస్కుండును+అయిన= గుఱ్ఱం తల కల్గినవాడైన; దధ్యంచుండు= దధ్యంచుడు; పుట్టెన్= పుట్టాడు; మహాత్ముండు+అగు= మహాభాగుడైన; భృగువు= భృగుమహర్షి; ఖ్యాతి+అను పత్ని+అందున్= 'ఖ్యాతి' అనే భార్యవల్ల; ధాతయు= 'ధాత'; విధాతయును= విధాత; అను పుత్రద్వయంబును= అనే ఇద్దరు కొడుకుల్ని; భగవత్పరాయణ+అగు= భగవంతునిపట్ల ఎంతో ఆసక్తి కనబరచే; శ్రీ+అను కన్యకన్= 'శ్రీ' అనే కన్యకను; పుట్టించెన్= పుట్టించాడు; ఆ ధాతృవిధాతృలు; మేరువు అనువాని= మేరువు అనేవాడి; కూఁతులు+అయిన= కూతుర్లయిన; ఆయతి నియతులను= యాయతి, నియతి అనే; భార్యలవలనన్= పత్నులవల్ల; మృకండ+ప్రాణులు+అను= మృకండుడు, ప్రాణుడు అనే; కొడుకులన్= పుత్రుల్ని; పుట్టించిరి= కన్నారు; అందు= వీరిలో; మృకండునకున్= మృకండునికి; మార్కండేయుండును= మార్కండేయుడూ; ప్రాణునకున్= ప్రాణుడికి; వేదశిరుండు+అను= వేదశిరుడనే; మునియున్=

మునీ; పుట్టిరి= జనించారు; భార్గవునకున్= భార్గవునికి; ఉశన+అను= ఉశన అనే; కన్య+అందున్= కన్యవల్ల; కవి+అనువాడు= కవి అనేవాడూ; పుట్టెన్= కలిగాడు; ఇట్లు= ఈ విధంగా; కర్దమదుహితలు+అయిన= కర్దమ ప్రజాపతి కూతుర్లయిన; కన్యకానవకంబువలనన్= తొమ్మిదిమంది కన్యకలవల్ల; కలిగిన= పొందిన; సంతానపరంపరలచేన్= వరుససంతతిచే; సమస్తలోకంబులును= ప్రపంచం అంతా; పరిపూర్ణంబులు+అయ్యెన్= నిండాయి; అట్టి= అలాంటి; సద్యః= ఆ వెంటనే (ఆ మరునిమిషంలోనే); పాపహరంబును= పాపాల్ని తుడిచి పెట్టేది; శ్రేష్ఠతమంబునున్= ఉత్తమోత్తమమును; ఐన= అయినట్టి; కర్దమ= కర్దమముని; దౌహిత్ర= మనుమల (కూతుళ్ల కూతుళ్లు); సంతాన= సంతతియొక్క; ప్రకారంబు= విధానాలను; శ్రద్ధా= శ్రద్ధతో; గరిష్ఠ= ఎంతో మేటి అయిన; చిత్తుండవు+అగు= మనస్సు కలట్టి; నీకున్= నీకు; చెప్పితిన్= చెప్పాను; ఇంకన్= ఇకపై; దక్ష ప్రజాపతి= దక్షబ్రహ్మయొక్క; వంశంబున్= దౌహిత్ర సంతతిని; ఎఱింగింతున్= తెలియచెప్తాను; వినుము= వినవలసింది.

**తా :** ఆ పుత్రసంతానం భగవంతుడైన ఉచథ్యుడూ, బ్రహ్మనిష్ఠుడైన బృహస్పతి అనేవారు. వీళ్లిద్దరూ చాలా ప్రసిద్ధికెక్కినవారు.

పులస్త్యుడు, హవిర్భుక్కు దంపతులకు పుట్టినవాడు అగస్త్యుడు. ఇతడు జన్మాంతరంలో జఠరాగ్నిగా ఉన్నాడు. ఆ తర్వాత ఈ పులస్త్యునికే విశ్రవసుడు అనే మరో కొడుకు పుట్టాడు.

ఆ విశ్రవసుడికి ఇలబిలకు కుబేరుడు పుట్టాడు. మరోభార్య కైకసి కడుపున రావణ, కుంభకర్ణ, విభీషణులు జన్మించారు.

పులహుడివల్ల గతి అనే కాంతయందు, కర్మశ్రేష్ఠుడు, వరీయాంసుడు, సహిష్ణువు అనే ముగ్గురు కుమారులు కలిగారు.

క్రతువుకి క్రియ అనే పత్నికి కల్గిన సంతానం అరవై వేలమంది. వీళ్ళు బ్రహ్మవర్చస్సుగల వాలఖిల్యులనే మహామునులు.

వసిష్ఠుడు ఊర్జ (అరుంధతి మారు పేరు) అనే మునిదంపతులకు కల్గిన సంతానం ఏడుగురు ఋషులు. వారు చిత్రకేతుడు, సురోచి, విరజుడు, మిత్రుడు, ఉల్బణుడు, వసుభృద్యానుడు, ద్యుమంతుడు. ఈయనే మరొక భార్యయందు 'శక్తి' మొదలైన పుత్రుల్ని పుట్టించాడు.

అథర్వుని భార్య చిత్తి గర్భాన దధ్యంచుడు పుట్టాడు. ఇతడు గుర్రం తల కలవాడు. ఇతడు ధృతవ్రతుడు.

భృగుమహర్షికి ఖ్యాతి అనే పత్నివల్ల పొందిన సంతతి ధాత, విధాత అనే ఇద్దరు కుమారులు. శ్రీ అనే ఒక కూతురు. ఈమె భగవత్పరాయణ.

ఈ కొడుకులిద్దరూ మేరువు కుమార్తెలు ఆయతి, నియతులవల్ల మృకండుడు, ప్రాణుడు అనే కుమారుల్ని పొందారు.

మృకండుడి కొడుకే మార్కండేయుడు. ప్రాణుడి కొడుకు వేదశిరసుడు. భృగువు ఉశనల కొడుకు 'కవి'.

ఈ తీరున కర్దమ ప్రజాపతి తొమ్మిదిమంది కూతుర్ల, కుమారుల సంతానపరంపరలతో ఈ భూప్రపంచం నిండిపోయింది. అలాంటి కర్దమముని సంతతి క్షణాల్లో పాపాల్ని తుడిచి పెడ్తుంది. ఉత్తమోత్తమం అయినది. ఆ ముని వరుససంతతి వివరాలు చాల శ్రద్ధపెట్టి వింటున్న నీకు చెప్పాను.

ఇక దక్షప్రజాపతి వంశక్రమాన్ని తెలియచెప్తాను. విను.

## a =దక్షప్రజాపతి సంతతి=a

**క. వనజజునివలన భవ మం, దిన యా దక్షప్రజాపతికి మనునిజనం**
**దన యగు "ప్రసూతి" సతియం, దనఘా! పదియార్వు రుదయ మందిరి కన్యల్. 27**

**ప్రతి :** అనఘా!= ఓ పుణ్యవంతుడా!; వనజజుని వలనన్= పద్మంనుంచి పుట్టిన బ్రహ్మవల్ల; భవము+అందిన= పుట్టిన; ఆ దక్షప్రజాపతికిన్= ఆ దక్ష బ్రహ్మకు; మను= స్వాయంభువ మనువుయొక్క; నిజనందన+అగు= తన కూతురు అయిన; ప్రసూతి= ప్రసూతి అనే; సతి+అందున్= భార్య గర్భంవల్ల; పది+ఆర్వురు= పదహారుమంది; కన్యల్= పడుచులు; ఉదయము+అందిరి= పుట్టారు.

**తా :** అనఘా! విదురా! బ్రహ్మవలన జన్మపొందిన ఆ దక్షప్రజాపతికి మనువు కుమార్తెయగు ప్రసూతియందు పదహారుమంది కన్యలు జన్మించారు.

**వ. ఇట్లావిర్భవించిన కన్యకలందు శ్రద్ధయు మైత్రియు దయయు శాంతియుఁ దుష్టియుఁ బుష్టియుఁ బ్రియయు నున్నతియు బుద్ధియు మేధయుఁ దితిక్షయు హ్రీయు మూర్తియు నను నామంబులు గల పదుమువ్వురను ధర్మరాజున కిచ్చె, నొక్కకన్యక నగ్నిదేవునకును నొక్కతెం బితృదేవతలకును నొక్కతె జన్మమరణాదినివర్తకుండగు నభవునకుం బెండ్లి సేసె; నంత నా ధర్మపత్నులయందు శ్రద్ధవలన శ్రుతంబును, మైత్రివలనఁ బ్రసాదంబును, దయవలన నభయంబును, శాంతివలన సుఖంబును, దుష్టివలన ముదంబును, బుష్టివలన స్మయంబును, గ్రియవలన యోగంబును, నున్నతివలన దర్పంబును, బుద్ధివలన నర్థంబును, మేధవలన స్మృతియు, దితిక్షవలన క్షేమంబును, హ్రీవలనఁ బ్రశ్రయంబును, మూర్తివలన సకలకల్యాణగుణోత్పత్తిస్థానభూతులగు నరనారాయణలను ఋషు లిద్దఱును సంభవించిరి; వారల జన్మకాలంబున. 28**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; ఆవిర్భవించిన= ఉదయించిన; కన్యకల+అందున్= కన్యకల్లో; శ్రద్ధయున్= శ్రద్ధ; మైత్రియున్= మైత్రి; దయయున్= దయ; శాంతియున్= శాంతి; తుష్టియున్= తుష్టి; పుష్టియున్= పుష్టి; ప్రియయున్= ప్రియ; ఉన్నతియున్= ఉన్నతీ; మేధయున్= మేధ; తితిక్షయున్= తితిక్ష; హ్రీయున్= హ్రీ; మూర్తియున్= మూర్తీ; అనునామంబులు+కల= అనే పేర్లు కల్గినట్టి; పదుమువ్వరను= పదమూడుమందిని; ధర్మరాజునకున్= ధర్మువునకు; ఇచ్చెన్= (వివాహంచేసి) అప్పగించాడు; ఒక కన్యకన్= ఒక కన్యకను; అగ్నిదేవునకునున్= అగ్నిదేవుడికిని; ఒక్కతెన్= ఒక్క ఆడపిల్లను; పితృదేవతలకునున్= పితృదేవతలకును; ఒక్కతెన్= ఒకదానిని; జన్మ= పుట్టుక; మరణ= చావు; ఆది= మొదలైన వాటిని; నివర్తకుండు+అగు= మరల్చువాడు అయిన; అభవునకున్= శివుడికి ఇచ్చి; పెండ్లి+చేసెన్= వివాహం చేశాడు; అంతన్= ఆ పిమ్మట; ఆ ధర్ముని= ఆ ధర్మరాజు యొక్క; పత్నుల+అందున్= భార్యల్లో; శ్రద్ధవలనన్= శ్రద్ధవల్ల; శ్రుతంబును= శ్రుతము; మైత్రివలనన్= మైత్రివల్ల; ప్రసాదంబును= ప్రసాదము; దయవలనన్= దయవల్ల; అభయంబును= అభయమూ; శాంతివలనన్= శాంతివల్ల; సుఖంబును= సుఖము; తుష్టివలనన్= తుష్టివల్ల; ముదంబును= ముదము; పుష్టివలనన్= పుష్టివల్ల; స్మయంబును= స్మయమూ; క్రియవలనన్= క్రియవల్ల; యోగంబునన్= యోగమున్నూ; ఉన్నతివలనన్= ఉన్నతివల్ల; దర్పంబును= దర్పము; బుద్ధివలనన్= బుద్ధివల్ల; అర్థంబును= అర్థము; మేధవలనన్= మేధవల్ల; స్మృతియున్= స్మృతి; తితిక్షవలనన్=

తితిక్షవల్ల; క్షేమంబును= క్షేమము; హ్రీవలనన్= హ్రీవల్ల; ప్రశ్రయంబును= ప్రశ్రయము; మూర్తివలనన్= మూర్తివల్ల; సకల= సమస్తమైన; కల్యాణగుణ= శుభగుణాలు; ఉత్పత్తి= పుట్టడానికి; స్థానభూతులు+అగు= తావైనవంటి వారగు; నరనారాయణులు+అను= నరుడు, నారాయణుడు అనే; ఋషులు= మునులు; ఇద్దఱును= ఇద్దరూ; సంభవించిరి= పుట్టారు; వారల= వారిద్దరి యొక్క; జన్మకాలంబున= పుట్టుకవేళ...

**తా :** ఇలా పుట్టిన కన్యల్లో శ్రద్ధ, మైత్రి, దయ, శాంతి, తుష్టి, పుష్టి, ప్రియ, ఉన్నతి, బుద్ధి, మేధ, తితిక్ష, హ్రీ, మూర్తి అనే పదుముగ్గురిని ధర్మరాజునకిచ్చి పెళ్లి చేశాడు. ఒక కుమార్తెను అగ్నిదేవుడికి, ఇంకొక కూతురిని పితృదేవతలకు, మరో అమ్మాయిని జననమరణాదులను తొలగించువాడగు శివునికిచ్చి పెండ్లిచేశాడు.

ఆ తర్వాత ఆ ధర్ముని పత్నులవల్ల పుట్టినవారు వీరు. శ్రద్ధవల్ల శ్రుతమూ, మైత్రివల్ల ప్రసాదమూ, దయవల్ల అభయమూ, శాంతివల్ల సుఖమూ, తుష్టివల్ల ముదమూ, పుష్టివల్ల స్మయమూ, క్రియవల్ల యోగమూ, ఉన్నతివల్ల దర్పమూ, బుద్ధివల్ల అర్థమూ, మేధవల్ల స్మృతీ, తితిక్ష వల్ల క్షేమమూ, హ్రీవల్ల ప్రశ్రయమూ, మూర్తివల్ల నరనారాయణులు అవతరించారు. ఈ నరనారాయణులు అన్ని మంచి గుణాల ఉత్పత్తికి నెలవైనవారు. వీళ్లు పుట్టిన సమయంలో

**సీ. గంధవాహుఁడు మందగతి ననుకూలుఁడై వీచె; నల్దిక్కులు విశద మయ్యెఁ;**
**నఖిలలోకంబులు నానందమును బొందెఁ; దుములమై దేవదుందుభులు మ్రోసెఁ;**
**గర మొప్ప జలధుల కలఁక లడంగెను; మించిన గతిఁ బ్రవహించె నదులు,**
**గంధర్వకిన్నరగానముల్ వీతెంచె; నప్సరోజనుల లాస్యములు సెలఁగె;**

**తే. సురలు గురియించి రందంద విరులవాన, మునిజనంబులు సంతోషమునఁ జెలంగి**
**వినుతు లొనరించి; రవ్వేళ విశ్వమెల్లఁ, బరమమంగళమై యొప్పె భవ్యచరిత! 29**

**ప్రతి :** భవ్య= మంగళకరమైన; చరిత= ప్రవర్తనం కలవాడా!; గంధవాహుఁడు= పరిమళాలు మోసుకుపోయే వాయువు; మందగతిన్= మెల్లమెల్లగా; అనుకూలుఁడు+ఐ= అనుకూలంగా; వీచెన్= వీచింది; నలు+దిక్కులు= నలువైపులూ; విశదము+అయ్యెన్= స్పష్టపడ్డాయి; అఖిలలోకంబులును= అన్నిలోకాలూ; ఆనందమును= సంతోషాన్ని; పొందెను= పొందాయి; తుములము+ఐ= సంకులంగా; దేవదుందుభులు= దేవతల వాద్యాలు; మ్రోసెన్= మోగాయి; కరము+ఒప్పన్= ఎంతో ప్రకాశమానంగా; జలధుల= సముద్రాలయొక్క; కలఁకలు= ఎగిరి పడటాలు; అడంగెను= సమసిపోయాయి; నదులు= ఏరులు; మించినగతిన్= ఉరవడితో; ప్రవహించెన్= పారాయి; గంధర్వ= గంధర్వుల; కిన్నర= కిన్నరుల యొక్క; గానముల్= పాటలు; వీతెంచెన్= ప్రసరించాయి; అప్సరస్+జనములు= దేవస్త్రీల; లాస్యములు= నృత్యాలు; చెలఁగెన్= అతిశయించాయి; సురలు= దేవతలు; అందున్+అందున్+అ= అక్కడక్కడ; విరులవాన= పూలవానను; కురియించిరి= కురిపించారు; మునిజనంబులు= మునులందరూ; సంతోషమునన్= ఉల్లాసంతో; చెలంగి= చెలరేగి; వినుతులు= ప్రస్తుతులు; ఒనరించిరి= చేశారు; ఆ+వేళన్= ఆ సమయంలో (నరనారాయణులు అవతరించే వేళ); విశ్వము+ఎల్లన్= జగం అంతా; పరమ= మిక్కిలి; మంగళము+ఐ= శుభమై; ఒప్పెన్= ప్రకాశించింది.

**తా :** ఓ శుభచరిత్రా! నరనారాయణులు పుట్టినసమయంలో లోకమంతా పరమశుభంగా ఒప్పింది. గాలి మెల్లమెల్లగా అనుకూలంగా వీచింది. నాలుగుదిక్కులూ తేటపడ్డాయి. సమస్తలోకం సంతోషించింది. దేవదుందుభులు సంకులంగా మ్రోగాయి. సముద్రాల క్షోభ తగ్గింది. ఏరులన్నీ పొంగి ప్రవహించాయి. గంధర్వుల, కిన్నరుల గానాలు వినవచ్చాయి.

అప్సరసలు నాట్యాలు చేశారు. దేవతలు అందందు పూలవానలు కురిపించారు. మునులంతా సంతోషంతో చెలగి స్తుతించారు.

**వ. ఆ సమయంబున బ్రహ్మాదిదేవత లమ్మహాత్ముల కడకుం జనుదెంచి యిట్లని స్తుతియించిరి. 30**

**ప్రతి :** ఆ సమయంబునన్= అప్పుడు; బ్రహ్మ+ఆది= బ్రహ్మమొదలైన; దేవతలు= సురలు; ఆ+మహా+ఆత్ములకడకున్= ఆ మహామహుల వద్దకు; చనుదెంచి= వెళ్లి; ఇట్లు+అని= ఈ లాగున; స్తుతియించిరి= ప్రశంసించారు.

**తా :** అదే సమయంలో బ్రహ్మ మొదలైన దేవతలందరు ఆ పుణ్యపురుషులను చేరుకొని ఇలా నుతించారు.

**సీ. గగనస్థలిం దోఁచు గంధర్వనగరాది రూపభేదము లట్టు రూఢిమెఱసి**
**యే యాత్మయందేని నేపారు మాయచే నీ విశ్వమిటు రచియింపఁబడియె**
**నట్టి యాత్మప్రకాశార్థమై మునిరూపముల ధర్మగృహమునఁ బుట్టినట్టి**
**పరమపురుష! నీకుఁ బ్రణమిల్లెద; మదియుఁగాక యీ సృష్టి దుష్కర్మవృత్తి**

**తే. జరగనీకుండు కొఱకునై సత్త్వగుణము, చే సృజించిన మ మ్మిట్లు శ్రీనివాస**
**మైన సరసీరుహప్రభ నపహసించు, నీ కృపాలోకనంబుల నెమ్మిఁజూడు. 31**

**ప్రతి :** గగనస్థలిన్= ఆకాశ ప్రదేశంలో; తోఁచు= కన్పట్టే; గంధర్వ+నగర+ఆది= గంధర్వపురం మొదలైనవాటి; రూపభేదములు+అట్లు= ఆకారాల తేడాలవలె; రూఢిన్+మెఱసి= స్థిరంగా ప్రకాశించి; ఏ+ఆత్మ+అందు+ఏనిన్= ఏ ఆత్మలోనైతే; ఏపారు= శోభిల్లే; మాయచేన్= మాయాశక్తితో; ఈ విశ్వము= ఈ జగత్తు; ఇటు= ఈ తీరున; రచియింపన్+పడియెన్= కూర్చబడిందో; అట్టి= అలాంటి; ఆత్మప్రకాశ+అర్థము+ఐ= మనః ప్రకాశంకోసమై; మునిరూపములన్= మునుల ఆకారాలతో; ధర్మగృహమునన్= ధర్ముని ఇంట; పుట్టిన+అట్టి= అవతరించినట్టి; పరమపురుష!= ఓ ఉత్తముడా!; నీకున్= నీకు; ప్రణమిల్లెదము= నమస్కరిస్తాము; అదియునున్+కాక= అంతే కాకుండా; ఈ సృష్టి= ఈ లోకసృజన; దుష్కర్మవృత్తి= చెడ్డపనుల నడతను; జరగన్+ఈక= ప్రవర్తిల్ల నీయకుండా; ఉండుకొఱకును+ఐ= ఉండడం కోసమై; సత్త్వగుణముచే= సాత్వికత్వంతో; సృజించిన= సృష్టించిన; పుట్టించిన; మమ్మున్= మమ్ములను; ఇట్లు= ఇలా; శ్రీ= లక్ష్మికి; నివాసము+ఐన= గేహం వంటిదైన; సరసీరుహప్రభన్= పద్మశోభను; అపహసించు= గేలిచేసే; నీ= నీయొక్క; కృపా+ఆలోకనంబులన్= దయతోకూడిన (కరుణగల) చూపులతో; నెమ్మిన్= ప్రీతిగా; చూడు= చూడవలసింది.

**తా :** ఆకాశంలో కనిపించే గంధర్వనగరం మొదలుగా రకరకాల రూపాలతో ప్రకాశించే విధంగా మాయతో ఈ ప్రపంచం ఆత్మలో సృష్టింపబడింది. అటువంటి ఆత్మను అందరికీ తెలియజేయడంకోసం ధర్ముడి ఇంట్లో నరనారాయణులనే మునుల రూపంలో పుట్టిన పురుషోత్తమా నీకు నమస్కారం. అంతేకాక ఈ సృష్టిలో చెడుకర్మలు జరుగనీయకుండా ఉండేందుకు సత్త్వగుణంతో మమ్మల్ని పుట్టించావు. అలాంటి మా ఇద్దరికి లక్ష్మీనివాసం అయిన పద్మకాంతిని కూడా పరిహసించు నీ కరుణాకటాక్షాన్ని ప్రసాదించు.

**విశే :** నరనారాయణులిద్దరు. కానీ బ్రహ్మాదులు వారి ఏకాత్ములుగా దర్శించుకుంటున్నారు. అందువలననే పరమపురుషా; నీకు, నీ ఇత్యాదిగా ఏకవచన ప్రయోగం చేయబడింది.

**క. అని యిట్లు దేవగణములు, వినుతింపఁ గృపాకటాక్ష వీక్షణములచేఁ**
**గని వారు గంధమాదన, మున కేగిరి తండ్రి ముదము ముప్పిరిగొనఁగన్. 32**

**ప్రతి :** అని= అని; ఇట్లు= ఈ విధంగా; దేవగణములు= సురగణాలు; వినుతింపన్= స్తుతి చేయగా; కృపా= దయతో కూడిన; కటాక్ష= కడగంటి; వీక్షణములచేన్= చూపులతో; కని= చూసి; వారు= ఆ ఇద్దరు; తండ్రి= తండ్రియొక్క; ముదము= సంతోషం; ముప్పిరి+కొనన్= అతిశయించగా; గంధమాదనమునకున్= గంధమాదన పర్వతానికి; ఏగిరి= వెళ్ళిపోయారు.

**తా :** ఆ తీరుగా దేవతలంతా నరనారాయణుల్ని స్తుతించారు. వారిమీద వారిద్దరి కృపాదృష్టి ప్రసరించింది. అపుడు ఆ నరనారాయణు లిద్దరివల్ల తండ్రియైన ధర్ముని సంతోషం మూడింతలు అయింది. ఆ ఇద్దరూ గంధమాదన పర్వతంవైపు వెళ్ళిపోయారు.

**విశే :** 'ముప్పిరిగొను' ఒక జాతీయం. దారం మూడు పొరలతో పేనగా అది బాగా బలపడుతుంది. మూడును కలసి పటిష్ఠం కావడం, అధికమవడం అనేది ఈ పలుకుబడి పరమార్థం. మూడు+పిరి= ముప్పిరి.

**క. ధరణీభర ముడుపుట కా, నరనారాయణులు భువి జనన మనయము నొం**
**దిరి యర్జునకృష్ణాఖ్యలఁ, గురుయదువంశముల సత్త్వగుణయుతు లగుచున్. 33**

**ప్రతి :** ధరణీ భరమున్= భూమి బరువును; ఉడుపుటకున్= పోగొట్టడానికి; ఆ, నరనారాయణులు= ఆ నరుడూ; నారాయణుడూ; అర్జున+కృష్ణ+ఆఖ్యలన్= అర్జునుడు; కృష్ణుడూ అనే పేర్లతో; కురుయదువంశములన్= కురువంశంలోనూ; యదువంశంలోనూ; సత్త్వగుణయుతులు= సత్త్వగుణంతో కూడినవాళ్లు; అగుచున్= అవుతూ; భువిన్= భూలోకంలో; జననము= పుట్టుకను; అనయమున్= ఎల్లప్పుడూ; ఒందిరి= పొందారు.

**తా :** ఆ నరనారాయణులు భూభారాన్ని తొలగించుటకై లోకంలో నరుడు అర్జునుడుగా కురువంశంలో పుట్టాడు. కృష్ణుడు యదువంశంలో అవతరించాడు. వీళ్లిద్దరూ సత్త్వగుణసంపన్నులు.

**వ. మఱియు నగ్నిదేవునకు దక్షపుత్రియైన "స్వాహాదేవి" యను భార్యయందు హుతభోజనులగు పావకుండును, బవమానుండును, శుచియు నను ముివ్వురుకొడుకులు గలిగిరి: వారివలనం బంచచత్వారింశ త్సంఖ్యగల యగ్ను లుత్పన్నంబులయ్యె; నిట్లు పితృపితామహయుక్తంబుగా నేకోనపంచాశత్సంఖ్యలు గల యగ్నులు బ్రహ్మవాదులచే యజ్ఞకర్మంబులం దగ్నిదేవతాకంబులైన యిష్టులు దత్తన్నామంబులచేతఁ జేయంబడుచుండు; నా యగ్ను లెవ్వరనిన నగ్నిష్వాత్తులు బర్హిషదులు సౌమ్యులుఁ బితలు నాజ్యపులు సాగ్నులు నిరగ్నులు నన నేడుదెఱంగులై యుందురు. దాక్షాయణియగు స్వధ యను ధర్మపత్నియందు వారలవలన "వయున" యు, "ధారిణి" యు నను నిద్దఱు కన్య లుదయించి జ్ఞానవిజ్ఞానపారగ లగుచు బ్రహ్మనిష్ఠ లయి పరఁగిరి; వెండియు. 34**

**ప్రతి :** మఱియున్= ఇంకా; అగ్నిదేవునకున్= అగ్నిదేవుడికి; దక్షపుత్రి+ఐన= దక్షుడి కూతురైన; 'స్వాహాదేవి'= స్వాహాదేవి; అను= అనే పేరుగల; భార్యయందు= సతిగర్భాన; హుత= అగ్నిలో వేల్చబడిన పదార్థాలు; భోజనులు+అగు= ఆహారంగా కలవాళ్లగు; పావకుండును= అగ్ని దేవుడూ; పవమానుండును= పవమానుడూ (గాలివీచడానికి హేతువైనవాడు); శుచియును=

శుచీ (పరిశుద్ధిగలవాడు); అను= అనే; ముప్వురు కొడుకులు= ముగ్గురు పుత్రులు; కలిగిరి= పుట్టారు; వారివలనన్= ఆ ముగ్గురి వల్ల; పంచ చత్వారింశత్‌సంఖ్యగల= నలభైఐదు లెక్కగల; అగ్నులు= అగ్నిదేవతలు; ఉత్పన్నంబులు+అయ్యెన్= పుట్టాయి; ఇట్లు= ఇలా; పితృ= తండ్రి; పితామహ= తాతలతో; యుక్తంబు+కాన్= కలుపగా; ఏక+ఊన= ఒకటి తక్కువ; పంచాశత్సంఖ్యలు+కల= యాభైమందిగా గణన గల; అగ్నులు= అగ్నులు; బ్రహ్మ వాదులచే= వేదవేత్తలచే; యజ్ఞకర్మంబులందు= యాగవిధుల్లో; అగ్నిదేవతాకంబులు+ఐన= అగ్ని దేవతగా కలిగిన; ఇష్టులు= (కోరికలు నెరవేర్చే) యాగాలు; తద్+తద్+నామంబులచేతన్= ఆ యా పేర్లమీద; చేయన్+పడుచున్+ఉండున్= నిర్వర్తించబడుతూ ఉంటాయి; ఆ+అగ్నులు= ఆ అగ్నులు; ఎవ్వరు+అనినన్= ఎవ్వరంటే; అగ్నిష్వాత్తులు= అగ్నిష్వాత్తులు; బర్హిషదులు= బర్హిషదులు; సౌమ్యులున్= సౌమ్యులు; పితలున్= పితలు; ఆజ్యపులున్= ఆజ్యపులు; సాగ్నులు= అగ్నిసహితులు; నిరగ్నులును= అగ్నిరహితులు; అనన్= అని; ఏడు, తెఱంగులు+ఐ= ఏడు విధాలుగా; ఉందురు= ఉంటారు; దాక్షాయణి+అగు= దక్షుడి సంతానానికి చెందిన; స్వధ+అను= 'స్వధ' అనిపిలిచే; పత్ని+అందు= భార్యయందు; వారలవలనన్= ఆ అగ్నులవల్ల; 'వయున' యున్= వయున; ధారిణియున్= ధారిణియు; అను= అనే; ఇద్దఱు కన్యలు= ఇద్దరు ఆడపడుచులు; ఉదయించి= పుట్టి; జ్ఞానవిజ్ఞాన పారగలు+అగుచున్= జ్ఞాన, విజ్ఞానాల్లో తుదముట్టిన వారవుతూ; బ్రహ్మనిష్ఠలు+అయి= బ్రహ్మమునందు నిష్ఠగలవారయి; పరఁగిరి= ఒప్పారు; వెండియున్= మళ్లీ...

**తా :** ఇంకా అగ్నిదేవుడికీ, దక్షుడి కూతురు 'స్వాహాదేవి'కి హుతవహులగు (అగ్నులగు) పావకుడు, పవమానుడు, శుచి అనే ముగ్గురు కొడుకులు కలిగారు. వీళ్లవల్ల నలభై ఐదుగురు అగ్నిదేవులు పుట్టుకొచ్చారు. ఈ విధంగా తండ్రి తాతలతో కలుపుకుంటే ఈ అగ్నులు మొత్తం నలభై తొమ్మిది మంది. యాగ విధుల్లో ఈ అగ్నులు దేవతలుగా ఉంటూ, కోరిన కోరికలు తీరుస్తూ ఆ యా పేర్ల మీద బ్రహ్మనిష్ఠులచే అనుష్ఠించబడుతూ ఉంటారు. ఈ అగ్నులు 'అగ్నిష్వాత్తులు, బర్హిషదులు, సౌమ్యులు, పితలు, ఆజ్యపులు, సాగ్నులు, నిరగ్నులు అని ఏడు రకాలుగా ఉన్నారు. ఈ అగ్నులకు, దక్షుడి కూతురు 'స్వధ'కు వయున, ధారిణి అనే ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. ఈ పిల్లలిద్దరూ జ్ఞానవిజ్ఞానాలను తుదముట్టిన బ్రహ్మవాదినులుగా ఘనత పొందారు.

## a=ఈశ్వరునకు దక్షప్రజాపతికిని విరోధము సంభవించుట=a

**సీ.** **దక్షప్రజాపతితనయ యా భవుని భార్యయు ననఁదగు 'సతి' యను లతాంగి**
**సతతంబుఁ బతిభక్తి సలుపుచుండియుఁ దనూజాతలాభము నందఁజాలదయ్యె;**
**భర్గుని దెసఁ జాలఁ బ్రతికూలుఁ డైనట్టి తమ తండ్రిమీఁది రోషమునఁ జేసి**
**వలనేది తా ముగ్ధవలె నిజయోగమార్గంబున నాత్మదేహంబు విడిచె;**

**తే.** **నని మునీంద్రుండు వినిపింప న మ్మహాత్ముఁ,డైన విదురుండు మనమున నద్భుతంబు**
**గదురఁ దత్కథ విన వేడ్క గడలుకొనఁగ, మునివరేణ్యునిఁ జూచి యిట్లనియె మఱియు. 35**

**ప్రతి :** దక్షప్రజాపతి= దక్షుడి యొక్క; తనయ= కూతురు; ఆ భవుని= ఆ శంకరుడి; భార్యయున్= పత్ని; అనన్= అనదగినట్లు; తగు= ఒప్పే; సతి+అను= 'సతి' అనే పేరుగల; లతా+అంగి= స్త్రీ; సతతంబున్= ఎల్లప్పుడూ; పతిభక్తి= పెనిమిటి సేవను; చలుపుచున్+ఉండియున్= చేస్తూ ఉన్నప్పటికిన్నీ; తనూజాత లాభమున్= సంతానయోగ్యత; అందన్=

పొందుటకు; చాలదు+అయ్యెన్= చాలనిది అయింది; భర్గుని దెసన్= శివుడివైపు; చాలన్= ఎంతగానో; ప్రతికూలుఁడు+ ఐనట్టి= వ్యతిరేకభావం కలవాడైన; తమ తండ్రి మీఁది= తన తండ్రిపై ఏర్పడిన; రోషమునన్+చేసి= ఆగ్రహంవల్ల; వలను= ఉపాయం; యుక్తి; ఏది= నశించి; తాన్= తాను; ముగ్ధవలె= తెలివిలేనిదిగా; నిజయోగ మార్గంబునన్= తనదైన యోగ ఉపాయంతో; ఆత్మదేహంబున్= తన శరీరాన్ని; విడిచెన్= వీడింది; అని= అని; ముని+ఇంద్రుడు= మునిశ్రేష్ఠుడు; వినిపింపన్= వినిపించగా; ఆ+మహా+ఆత్ముఁడు+ఐన= గొప్ప మనస్సుగల; విదురుండు= విదురుడు; మనమునన్= ఆత్మలో; అద్భుతంబు= ఆశ్చర్యం; కదురన్= అతిశయించగా; తద్+కథ= ఆ వృత్తాంతం; వినన్= వినడానికి; వేడ్క= ఉత్సాహం; కడలు+కొనఁగన్= ఉప్పొంగగా; మునివరేణ్యునిన్= మునిసత్తముని; చూచి= చూసి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** దక్షప్రజాపతి కుమార్తె సతి. ఆమె భవుడి భార్య. ఆమె ఎంతో పతిభక్తి కలది. అయినా సంతానయోగం లేదు. తన మగడంటే పడని తన తండ్రిమీది కోపం కొద్దీ మరొకదారి లేక అమాయకంగా యోగమార్గంతో దేహాన్ని చాలించింది అంటూ మైత్రేయుడు విదురుడితో చెప్పాడు. అది విన్న విదురుడికి ఎంతో ఆశ్చర్యం అయింది. ఆ సంగతంతా తెలుసుకోవాలనే ఉబలాటంతో ఆ మైత్రేయుణ్ణి చూసి ఇలా పలికాడు.

**సీ.** **చతురాత్మ! దుహితృవత్సలుఁడైన దక్షుండు దన కూఁతు సతి ననాదరము సేసి**
**యనయంబు నఖిలచరాచరగురుఁడు నిర్వైరుండు శాంతవిగ్రహుఁడు ఘనుఁడు**
**జగముల కెల్లను జర్చింప దేవుండు నంచితాత్మారాముఁ డలఘుమూర్తి**
**శీలవంతులలోన శ్రేష్ఠుండు నగు నట్టి భవునందు విద్వేషపడుట కేమి**

**తే.** **కారణము? సతి దా నేమి కారణమున, విడువరానట్టి ప్రాణముల్ విడిచె? మఱియు**
**శ్వశురజామాతృవిద్వేషసరణి నాకుఁ, దెలియ నానతి యిమ్ము సుధీవిధేయ! 36**

**ప్రతి :** సుధీవిధేయ!= పండితులకు విధేయుడైన వాడా!; చతుర+ఆత్మ!= నేర్పుగల బుద్ధిగలవాడా! ఓ మైత్రేయా!; దుహితృ= కూతురిపట్ల, వత్సలుఁడు+ఐన= ప్రేమ కలిగిన; దక్షుండు= దక్ష ప్రజాపతి; తన కూఁతు= తన పుత్రి అయిన; సతిన్= సతీదేవిని; న+ఆదరము= నిర్లక్ష్యము; చేసి; అనయంబున్= ఎల్లపుడూ; అఖిల= సమస్తమైన; చర+అచర= కదిలేవాటికి; కదలనివాటికి; గురుఁడు= తండ్రి వంటివాడు; నిర్+వైరుండు= వైరం లేనివాడు; శాంత విగ్రహుడు= శాంతమూర్తి; ఘనుఁడు= గొప్పవాడు; జగములకున్+ఎల్లను= అన్నిలోకాలకు; చర్చింపన్= చింతించగా; దేవుండు= భగవత్స్వరూపుడు; అంచిత= ఒప్పుతున్నట్టి; ఆత్మ+ఆరాముండు= తనయందే రమించేవాడు; అలఘుమూర్తి= ఉన్నతాకారుడు; శీలవంతులలోన్= సత్పురుషుల్లో; శ్రేష్ఠుండు= మేలు; అగున్+అట్టి= అయినట్టి; భవునందు= శివుడిమీద; విద్వేషపడుటకున్= ద్వేషించడానికి; కారణము+ఏమి= హేతువు ఏమిటి?; సతి= సతీదేవి; ఏమికారణంబునన్= ఏ హేతువుచే; విడువరాని+అట్టి= వదలించుకోరాని; ప్రాణముల్= ప్రాణాలను; విడిచెన్= విడిచిపెట్టింది; మఱియున్= ఇంకా; శ్వశుర= మామ; జామాతృ= అల్లుడి; విద్వేషసరణి= పగపద్ధతి; నాకున్= నాకు; తెలియన్= తెలిసేలా; ఆనతి= ఆజ్ఞ; ఇమ్ము= ఇయ్యవలసింది.

**తా :** నేర్పరివైన ఓ మైత్రేయ మహర్షీ! దక్షుడికి కూతుళ్లంటే ప్రాణం. అంతటి ప్రేమైక మూర్తి అయిన దక్షుడు 'సతీదేవి'ని మన్నించక పోవడానికి మూలకారణం ఏమై ఉంటుంది. శివుడు చరాచర ప్రపంచాని కంతటికీ తండ్రి. శత్రుభావన లేనివాడు. ప్రసన్నమూర్తి. మహోన్నతుడు. సమస్తలోకాలకు దైవం. ఆత్మారాముడు. సజ్జనుల్లో మేటి. అలాంటి మహాదేవుడి

మీద దక్షుడికి వైరం ఎందుకు కల్గి ఉంటుంది? ఏ కారణంగా సతీదేవి విడువదగని తన ప్రాణాలు విడిచింది? మామ అల్లుళ్ల మధ్యగల ద్వేషభావాన్ని నాకు తెలిసేటట్లు వివరించండి.

**క. అని యడిగిన నవ్విదురునిఁ, గనుఁగొని మైత్రేయుఁడనియెఁ గౌతుక మొప్పన్**
**విను మనఘ! తొల్లి బ్రహ్మలు, జననుతముగఁ జేయునట్టి సత్త్రముఁ జూడన్. 37**

**ప్రతి :** అని+అడిగినన్= అని ప్రశ్నించిన; ఆ విదురునిన్= ఆ విదురుణ్ణి; కనున్+కొని= చూచి; మైత్రేయుఁడు= మైత్రేయుడు; కౌతుకము= కుతూహలం; ఒప్పన్= ప్రకాశించేలా; అనియెన్= పలికాడు; వినుము= ఆలకించు; అనఘ!= ఓ పాప రహితుడా; తొల్లి= మునుపు; బ్రహ్మలు= ప్రజాపతులు; జననుతము+కన్= ప్రజలు మెచ్చేలా; చేయునట్టి= చేసే; సత్త్రమున్= సత్రయాగాన్ని; చూడన్= చూడడానికి...

**తా :** అలా అడిగిన విదురుడితో, మైత్రేయుడు చాల కుతూహలంగా చెప్పసాగాడు. ఓ విదురా! పూర్వకాలంలో నవబ్రహ్మలు సత్రయాగం చేయ తలపెట్టారు. ఆ యజ్ఞాన్ని ప్రజలంతా పొగపడేలా చేయాలని వాళ్ల తలంపు. దాన్ని చూడడానికి

**విశే :** బ్రహ్మలు తొమ్మిదిమంది. భృగువు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, అంగిరసుడు, దక్షుడు, అత్రి, మరీచి, వశిష్ఠుడు అనేవారిని నవబ్రహ్మలంటారు.

**చ. సరసిజగర్భయోగిజనసర్వసుపర్వమునీంద్రహవ్యభు**
**క్పరమఋషి ప్రజాపతులు భక్తిమెయిం జనుదెంచియుండ న**
**త్తరణిసమానతేజుఁడగు దక్షుఁడు వచ్చినఁ దత్సదస్యు లా**
**దరమున లేచి; రప్పుడు పితామహభర్గులు దక్క నందఱున్. 38**

**ప్రతి :** సరసిజగర్భ= పద్మం గర్భంగాగల బ్రహ్మదేవుడు; యోగిజన= యోగులూ; సర్వ= సమస్త; సుపర్వ= దేవతలూ; ముని+ఇంద్ర= మునివర్యులూ; హవ్యభుక్= (యాగహవ్యం భోజనమైన) అగ్నిహోత్రుడు; పరమఋషి= మహర్షులు; ప్రజాపతులు= మరీచి మొదలైన నవబ్రహ్మలు; భక్తిమెయిన్= భక్తితో; చనుదెంచి+ఉండన్= వచ్చి చేరి ఉండగా; ఆ తరణి= ఆ సూర్యుడితో; సమాన= సాటిరాగల; తేజుడు+అగు= కాంతి కల్గినట్టి; దక్షుడు= దక్షబ్రహ్మ; వచ్చినన్= ఆ సత్రయాగానికి రాగా; అపుడు= ఆ సమయంలో; తద్= ఆ; సదస్యులు= సభలోనివారు; పితామహ భర్గులు+తక్కన్= బ్రహ్మ, శివుడు తప్ప; అందఱున్= అంతా; లేచిరి= లేచి నిలబడ్డారు.

**తా :** బ్రహ్మ, శివుడు, యోగులు, దేవతలు, మునులు, మహర్షులు, అగ్ని, నవ బ్రహ్మలు ఆసక్తితో విచ్చేశారు. సూర్య ప్రభలతో సాటి కాగల తేజం గల దక్షప్రజాపతి అరుదెంచాడు. అతడు రాగానే బ్రహ్మ, శివుడు తప్ప సభలోని మిగతా వాళ్లంతా గౌరవంగా లేచి నిలబడ్డారు.

**క. చనుదెంచిన యా దక్షుఁడు, వనజజునకు మ్రొక్కి భక్తివశులై సభ్యుల్**
**దన కిచ్చిన పూజలు గై, కొని యర్హాసనమునందుఁ గూర్చుండి తగన్. 39**

**ప్రతి :** చనుదెంచిన= ఏతెంచిన; ఆ+దక్షుఁడు= ఆ దక్షప్రజాపతి; వనజజునకున్= బ్రహ్మదేవుడికి; మ్రొక్కి= నమస్కరించి; భక్తివశులు+ఐ= సేవాతత్పరులై; సభ్యుల్= సభలోనివారు; తనకున్= తనకు; ఇచ్చిన= అర్పించిన; పూజలు= పూజలను; కైకొని= స్వీకరించి; అర్హ= తగిన; ఆసనమునందున్= పీఠంపై; తగన్= ఒప్పిదంగా; కూర్చుండి= కూర్చుని.

**తా :** అట్లా విచ్చేసిన దక్షుడు బ్రహ్మకు నమస్కరించాడు. భక్తికివశులై సభాసదులంతా తనకుచేసిన పూజలను అందుకున్నాడు. తనకు తగిన పీఠం మీద ఆసీనుడయ్యాడు.

**తే. తన్నుఁ బొడగని సభ్యు లందఱును లేవ, నాసనము దిగనట్టి పురారి వలను**
**గన్ను గొనలను విస్ఫులింగములు సెదరఁ, జూచి యిట్లను రోషవిస్ఫురణ మెఱయ. 40**

**ప్రతి :** తన్నున్= తనను; పొడగని= చూచి; సభ్యులు= సదస్యులు; అందఱును= అంతమంది; లేవన్= లేచినిలబడగా; ఆసనమున్= గద్దెను; దిగనట్టి= దిగనటువంటి; పురారి వలను= శివుడి వైపును; కన్నుకొనలను= కంటి కొనలనుంచి; విస్ఫులింగములు= నిప్పుకణాలు; చెదరన్= వ్యాపించగా; చూచి= కాంచి; రోషవిస్ఫురణ= క్రోధపుకాంతులు; మెఱయన్= తళుక్కుమనగా; ఇట్లు= ఇలా; అనున్= అన్నాడు.

**తా :** తాను రాగానే అందరూ లేచినా శివుడు మాత్రం తన ఆసనం దిగలేదు. అది చూసి దక్షుడు రోషపడ్డాడు. కంటికొనల్లో అలముకొన్న చురచుర చూపులు తళుక్కుమన్నాయి. వాళ్లతో ఇలా సంభాషించాడు.

**తే. వినుఁడు మీరలు రొదమాని విబుధముని హు, తాశనాదిసురోత్తములార! మోహ**
**మత్సరోక్తులు గావు! నా మాట లనుచు, వారి కందఱ కా పురవైరిఁజూపి, 41**

**ప్రతి :** విబుధ= పండితులు, జ్ఞానులూ; ముని= మునులూ; హుతాశన+ఆది= అగ్ని మొదలైన; సుర+ఉత్తములార!= దేవతలారా!; మీరలు= మీరందరూ; రొదమాని= నిశ్శబ్దం పాటించి; వినుఁడు= ఆలకించండి; నా మాటలు= నా పలుకులు; మోహ= అజ్ఞానంతో; మత్సర= అసూయతో కూడిన; ఉక్తులు+కావు= మాటలు కావు; అనుచున్= అంటూ; వారికిన్+ అందఱకున్= వాళ్లందరికీ; ఆ పురవైరిన్= ఆ శివుణ్ణి; చూపి= చూపించి...

**తా :** విబుధులారా! మహర్షులారా! అగ్నిమొదలగు దేవతలారా! మీరంతా మీ రొద మాని వినండి. నా వచనాలు కేవలం మోహంతో, ఈర్ష్యతో పలికేవి కావు అంటూ వారందరికీ ఆ శివుణ్ణి చూపుతూ

**సీ. పరికింప నితఁడు దిక్పాలయశోహాని కరుఁడీ క్రియాశూన్యపరునిచేతఁ**
**గరమొప్ప సజ్జనాచరితమార్గము దూషితంబయ్యె; నెన్న గతత్రపుండు**
**మహితసావిత్రీసమానను సాధ్వి నస్మత్తనూజను మృగశాబనేత్ర**
**సకలభూమీసురజనసమక్షమున మర్కటలోచనుఁడు కరగ్రహణ మర్థిఁ**

**తే. జేసి తా శిష్యభావంబుఁ జెందు టాత్మ, దలఁచి ప్రత్యుద్గమాభివందనము లెలమి**
**నడపకుండిన మాననీ; నన్నుఁ గన్న, నోరిమాటకుఁదన కేమి గోరువోయె. 42**

**ప్రతి :** పరికింపన్= విచారించగా; ఇతఁడు= ఈ శివుడు; దిక్పాల= లోకపాలుర యొక్క; యశస్= కీర్తికి; హానికరుఁడు= చెఱుపు కల్గించేవాడు; ఈ క్రియాశూన్యపరునిచేతన్= ఇలాంటి కర్మానుష్ఠానం లేనివాడితో; కరము+ఒప్పన్= ఎంతో ఒప్పునట్లుగా; సత్+జన= సత్పురుషులచే; ఆచరిత= నడుపబడిన; మార్గము= తోవ; దూషితంబు+అయ్యెన్= నిందలపాలయింది; ఎన్నన్= ఎంచి చూడగా; గత= పోయిన; త్రపుండు= సిగ్గుకలవాడు (కూడా); మహిత= గొప్ప; సాధ్విన్= శీలవతి అయిన; సావిత్రీసమానను= సావిత్రితో తులతూగే; అస్మత్= నాయొక్క; తనూజను= పుత్రికను; మృగశాబనేత్రన్= లేడి కన్నులవంటి కన్నుల కలదాన్ని; సకల= సమస్త; భూమీసురజన= బ్రాహ్మణ సమాజం యొక్క;

సమక్షమునన్= ఎదుట; మర్కటలోచనుఁడు= కోతికన్నుల వంటి కన్నులుగల శివుడు; కరగ్రహణమున్= పాణిగ్రహణాన్ని; అర్థిన్= కోరికతో; చేసి= చేసికొని; తాన్= తాను; శిష్యభావంబున్= శిష్యత్వమును; చెందుట= పొందుట; ఆత్మన్= మనస్సులో; తలఁచి= అనుకొని; ప్రతి+ఉద్గమ= ఎదురురాకతో; అభివందనములు= నమస్కారములు; ఎలమిన్= ప్రీతితో; నడపకన్= ఆచరింపక; ఉండినన్= ఉంటే; మాననీ= మానుకోనీ; నన్నున్= నన్ను; కన్నన్= చూడగానే; నోరిమాటలకున్= చిన్న పలకరింపులకు; తనకున్= తనకు; ఏమి; కోరు+పోయెన్= కొరత గలిగింది?

**తా :** ఆలోచించి చూడగా శివుడు అష్టదిక్పాలకుల ప్రతిష్ఠను మంటగలుపుతున్నాడు. వైదికంగా పనీపాటాలేని ఇతడివల్ల సచ్ఛీలుర పంథా పాడయిపోయింది. పట్టి చూస్తే సిగ్గు లేనివాడు కూడ. మరొక సావిత్రి అనదగిన నా బిడ్డను పెద్దల సమక్షంలో పెళ్లాడాడు. నా కూతురు పరమసాధ్వి. బెదురుచూపులు కలది. అమాయకురాలు. శివుడివి కోతిచూపులు. ఈ రీతి శిష్యుడు కావటాన్ని బట్టి అయినా భావించి ఎదురువచ్చి నమస్కరించకపోతే పోనీ. నన్ను చూడగానే చిన్నపలుకు పలికే మాత్రానికి తన నోరేమైనా కొంకరలు పోయిందా?

**సీ. అనయంబు లుప్తక్రియాకలాపుఁడు మానహీనుఁడు మర్యాద లేనివాఁడు**
**మత్తప్రచారుఁ డున్మత్తప్రియుఁడు దిగంబరుఁడు భూతప్రేతపరివృతుండు**
**దామసప్రమథభూతములకు నాథుండు భూతిలిప్తుం డస్థిభూషణుండు**
**నష్టశౌచుండు నున్మదనాథుఁడును దుష్టహృదయుఁ డుగ్రుఁడును బరేతభూని**

**తే. కేతనుఁడు వితతస్రస్తకేశుఁ డశుచి, యయిన యితనికి శివనాముఁ డను ప్రవాద**
**మెటులు గలిగె? నశివుఁడగు నితని నెఱిఁగి, యెఱిఁగి వేదంబు శూద్రున కిచ్చినటులు. 43**

**ప్రతి :** అనయంబు= నిత్యమూ; లుప్త= లోపించిన; క్రియా కలాపుఁడు= కర్మముల అనుష్ఠానంకలవాడు; మాన= అభిమానం; హీనుఁడు= తక్కువైనవాడు; మర్యాద= కట్టుబాటు; లేనివాఁడు= కొరవడినవాడు; మత్త ప్రచారుఁడు= పిచ్చితిరుగుళ్ళు కలవాడు; ఉన్మత్త= వెఱ్ఱెత్తిన వాళ్లకు; ప్రియుఁడు= ఇష్టుడు; దిగంబరుఁడు= దిస మొలవాడు; భూతప్రేత పరివృతుండు= భూతాలూ, పీనుగులు చుట్టూ ఉన్నవాడు; తామస= తమోగుణం కల; ప్రమథ= ప్రమథగణాలకు; భూతములకున్= భూతగణాలకు; నాథుండు= అధిపతి; భూతి+లిప్తుండు= బూడిద పూసుకున్నవాడు; అస్థి= బొమికెలు; భూషణుండు= నగలుగా ధరించినవాడు; నష్ట= కోల్పోయిన; శౌచుండు= శుద్ధికలవాడు; ఉన్మద= మనసు చలించినవారికి; నాథుఁ డును= ప్రభువును; దుష్ట= చెడ్డ మనస్సు కలవాడు; హృదయుఁడు= పాపాత్ముడు; ఉగ్రుఁడును= భయంకరమైనవాడు; పరేతభూ= వల్లకాడు; నికేతనుఁడు= ఇల్లుగాగలవాడు; వితత= విరబోసుకున్న; స్రస్త= జారిన; కేశుఁడు= జుత్తుకలవాడు; అశుచి= అపవిత్రుడు, శుద్ధిలేనివాడు; అయిన= అయినట్టి; ఇతనికిన్= ఇతడికి; శివనాముఁడు= మంగళ స్వరూపుడనే అర్థంగల శివుడనే పేరు కలవాడు; అను= అనే; ప్రవాదము= వదంతి; ఎటుల= ఎలా; కలిగెన్= ఏర్పడింది; అశివుఁడు+ అగున్= అమంగళుడైన; ఇతనిన్= ఇతణ్ణి; ఎఱిఁగి ఎఱిఁగి= తెలిసి తెలిసి; వేదంబు= వేదాన్ని; శూద్రునకున్= నాల్గవ వర్ణం వాడికి; ఇచ్చినటులు= అప్పగించిన రీతి.

**తా :** ఈ శివుడు యాగక్రియానుష్ఠానాదులు ఎపుడూ చేసి ఎరుగనివాడు. ఆత్మాభిమానం లేనివాడు. మర్యాద లేనివాడు. వెఱ్ఱివాళ్లకు ప్రియుడు. దిసమొలవాడు. భూతములు, ప్రేతములు ఇతడిచుట్టూ ఉంటాయి. తామస ప్రవృత్తిగల శివభటులకూ,

భూతగణాలకూ ఇతడు ఏలిక. ఒళ్లంతా బూడిద పులుముకుంటాడు. ఎముకలే ఇతడి నగలు. శుచిని పాటించనివాడు. పిచ్చివాళ్లకు ఇతడు మారాజు. దుష్టమనస్వి. భీతి పుట్టే ఆకారం కలవాడు. శ్మశానమే ఇతడి నివాసస్థానం. విరియబోసిన (జారిన) జుత్తు కల్గి ఉంటాడు. ఇతడికి శివుడనే (మంగళప్రదుడనే) వదంతి దేశమంతా ఎలా వ్యాప్తి చెందిందో? కాని అమంగళుడైన ఈతనికి, తెలిసి తెలిసి శూద్రుడి చేతిలో వేదం పెట్టినట్లు

**వ. ఇతనికి నస్మత్తనూజను విధిప్రేరితుండనై యిచ్చితి. 44**

**ప్రతి :** ఇతనికిన్= ఇలాంటి శివుడికి; అస్మత్= నా యొక్క; తనూజను= పుత్రికను; విధి= బ్రహ్మచే; ప్రేరితుండును+ఐ= ప్రేరేపించబడిన వాడనై; ఇచ్చితిన్= కట్టబెట్టాను.

**తా :** ఇలాంటివాడికి నా బిడ్డను బ్రహ్మ ప్రేరేపించగా ఇచ్చాను.

**క. అని యిట్టుల ప్రతికూల వ, చనములు దక్షుండు వలికి 'శపియింతును శ**
**ర్వుని' నని జలములు గొని కర, మున, నిలిచిట్లనియె, రోషమున ననఘాత్మా! 45**

**ప్రతి :** అనఘ= పాపబుద్ధిలేని; ఆత్మా= మనస్సుకలవాడా?; అని= అని; ఇట్టులు= ఈ ప్రకారంగా; ప్రతికూల= ఎదురు; వచనములు= మాటలు; దక్షుండు= దక్షప్రజాపతి; పలికి= మాట్లాడి; శర్వునిన్= శివుణ్ణి; శపియింతును= శపిస్తాను; అని= అంటూ; రోషమునన్= ఆగ్రహంతో; కరమునన్= చేతియందు; జలములు+కొని= నీటిని గ్రహించి; నిలిచి= లేచి నిలబడి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** ఓ పుణ్యమనస్కుడా! ఈ తీరున తిరస్కారపుమాటలాడి దక్షుడు శివుణ్ణి శపించడానికి పూనుకున్నాడు. చేత నీళ్లుపట్టి నిలిచి రోషంగా ఇలా అన్నాడు.

**క. ఇతఁ డింద్రోపేంద్రపరీ, వృతుఁడై మఖసమయమున హవిర్భాగము దే**
**వతలం గూడఁగ మహిత ని, యతిఁ బొందక యుండుఁగాక యని శపియించెన్. 46**

**ప్రతి :** ఇతఁడు= ఈ శివుడు; ఇంద్ర+ఉపేంద్ర+పరీవృతుడై= ఇంద్ర, విష్ణువులతో కూడినవాడై; మఖ సమయమునన్= యాగ సమయంలో; హవిస్+భాగమున్= హోమద్రవ్యం పాలు; దేవతలన్+కూడఁగన్= దేవతలతో పాటు; మహిత= గొప్ప; నియతిన్= వ్రతనిష్ఠతో; పొందక= ప్రాప్తించక; ఉండున్+కాక= ఉండుగాక; అని= అని; శపియించెన్= శాపం ఇచ్చాడు.

**తా :** శివుడి చుట్టూ ఇంద్రుడు, విష్ణువులుండగా యజ్ఞసమయంలో మిగతా దేవతలతోపాటు హవిర్భాగం నియమంగా లభించకుండుగాక అని శపించాడు.

**వ. ఇట్లు దక్షుండు పల్కిన గర్హితవాక్యంబులు వినిందితంబులుగ నుండియును నర్థాంతరంబున వాస్తవంబులగుచు భగవంతుండగు రుద్రునందు ననిందితంబులై స్తుతిరూపంబుల నొప్పెఁ; దదనంతరంబ రుద్రునకు శాపంబిచ్చిన కారణంబున దక్షుండు సదస్యముఖ్యులచే నకృత్యంబని నిషేధింపబడి ప్రవృద్ధంబయిన క్రోధంబుతోడ నిజనివాసంబునకుం జనియె; నంత గిరిశానుచరాగ్రేసరుండగు నందికేశ్వరుండు దక్షుండు**

**నిటలాక్షుని శపియించిన శాపంబు, నతనిఁ బల్కిన యనర్హవాక్యంబులును విని కోపారుణిత లోచనుండై యిట్లను; నీ దక్షుండు మర్త్యశరీరంబు శ్రేష్ఠంబు గాఁదలంచి యప్రతిద్రోహియైన భగవంతునందు భేదదర్శియై యపరాధంబు గావించె; నిట్టి మూఢాత్ముండు దత్త్వవిముఖుండగు; మఱియుం గూటధర్మంబు లయిన నివాసంబుల గ్రామ్యసుఖకాంక్షలం జేసి సక్తుండై యర్థవాదంబు లయిన వేదంబులచే నష్టమనీషం గలిగి కర్మతంత్రంబు విస్తృతంబుసేయు; వెండియు దేహాదికంబు లుపాదేయంబులుగాఁ దలంచుచు బుద్ధిచేత నాత్మతత్త్వంబు మఱచి వర్తించుచుఁ బశుప్రాయుండై స్త్రీకాముండు నగు నిదియునుం గాక దక్షుం డచిరకాలంబున మేషముఖుండగు నని మఱియు. 47**

**ప్రతి :** ఇట్లు= ఇలా; దక్షుండు= దక్షుడు; పల్కిన= భాషించిన; గర్హిత= దూషించిన; వాక్యంబులు= వచనాలు; వినిందితంబులుగన్= మరీ తూలనాడినట్లుగ; ఉండియునున్= ఉన్నప్పటికీ; అర్థాంతరంబునన్= మరొక అర్థంలో; వాస్తవంబులు+అగుచున్= యథార్థములైనవి అవుతూ; భగవంతుఁడు+అగు= మహాదేవుడు అయిన; రుద్రుని+అందున్= శివుడిపట్ల; అనిందితంబులు+ఐ= దూషణలేనివై; స్తుతిరూపంబులన్= స్తోత్రాలుగానే; ఒప్పెన్= ఒప్పాయి; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; రుద్రునకున్= శివుడికి; శాపంబు+ఇచ్చిన= శాపం పెట్టిన; కారణంబునన్= నిమిత్తంగా; దక్షుండు= దక్షుడు; సదస్య ముఖ్యులచేన్= సభాప్రముఖులచే; అకృత్యంబు+అని= చేయకూడని పని అని; నిషేధింపన్+పడి= వారించబడి; ప్రవృద్ధంబు+అయిన= పెచ్చుమీరిన; క్రోధంబు తోడన్= కినుకతో; నిజనివాసంబునకున్= తన ఇంటికి; చనియెన్= పోయాడు; అంతన్= ఆ తరువాత; గిరిశ= కైలాసగిరిపతి శివుడియొక్క; అనుచర= సహాయుల్లో; అగ్రేసరుండు+అగు= ప్రథముడగు; నందికేశ్వరుండు= నందికేశ్వరుడు; దక్షుండు= దక్షుడు; నిటల+అక్షునిన్= నుదుట కన్నుగల శివుణ్ణి; శపియించిన= తిట్టిన; అనర్హ= తగని; వాక్యంబులును= మాటలు; విని= ఆలకించి; కోప= కోపంచే; అరుణిత= ఎరుపెక్కిన; లోచనుండు+ఐ= నేత్రాలు కలవాడై; ఇట్లు= ఇలా; అనున్= పలికాడు; ఈ దక్షుండు= ఈ దక్షుడు; మర్త్యశరీరంబు= మృత్యువుపాలిటబడే మానవదేహం; శ్రేష్ఠంబు+కాన్= ఉత్తమమైందిగా; తలఁచి= భావించి; అప్రతిద్రోహి+ఐన= తిరిగి చెరుపు చేయపూనుకొనని; భగవంతుని+అందు= పరమాత్మపట్ల; భేదదర్శి+ఐ= వేరు చూపు కలవాడై; అపరాధంబున్+కావించెన్= తప్పు చేశాడు; ఇట్టి= ఇలాంటి; మూఢ+ఆత్ముండు= మూర్ఖుడు; తత్త్వవిముఖుండు= పరాత్పర జ్ఞానాన్ని ఇష్టపడనివాడు; అగున్= అవుతాడు; మఱియున్= ఇంకా; కూటధర్మంబులు+అయిన= కపట ఆచారాలుగల; నివాసంబులన్= నెలవులయందు; గ్రామ్యసుఖ+కాంక్షలన్+చేసి= స్త్రీ సంభోగపు వాంఛలపట్ల; సక్తుండు+ఐ= ఆసక్తుడై; అర్థవాదంబులు+అయిన= స్తుతి రూపాలైన; వేదంబులచే= శ్రుతులచే; నష్టమనీషన్= పోయిన మతిని; కలిగి= పొంది; కర్మతంత్రంబు= కర్మసిద్ధాంతాల్ని; విస్తృతంబు+చేయున్= వ్యాపింపచేస్తాడు; వెండియున్= మళ్లీ; దేహ+ఆదికంబులు= శరీరం మొదలైనవి; ఉపాదేయంబులు+కాన్= గ్రహింపదగినవిగా; తలంచుచున్= సంకల్పిస్తూ; బుద్ధిచేత= ఆ తెలివివల్ల; ఆత్మతత్త్వంబు= పరమాత్మ స్వరూపాన్ని; మఱచి= విస్మరించి; వర్తించుచున్= తిరుగాడుతూ; పశుప్రాయుడు+ఐ= మూర్ఖుడై; స్త్రీకాముఁడు= స్త్రీలపట్ల ఇచ్ఛకలవాడు; అగు= అవుతాడు; ఇదియునున్+కాక= ఇంతే కాకుండా; అచిరకాలంబునన్= అతిత్వరలోనే; మేష ముఖుండు= మేక మొహం కలవాడు; అగున్+అని= అవుతాడని; మఱియున్= మళ్లీ.

**తా :** ఈ తీరున దక్షుడి దూషణల్లోని వాక్యాలు ఎక్కువగా నిందించినవి అయినప్పటికీ ఆ మహాదేవుడి విషయంగా అర్థాంతరంలో ఆ నిందలు స్తుతులుగానే పరిణమించాయి. ఆ తర్వాత శివుణ్ణి శపించిన కారణంగా దక్షుణ్ణి, సభలో

ముఖ్యమైన వాళ్లందరూ ఇది తగని పని అని వారించారు. ఆ అడ్డగింత దక్షుడిలో కోపాన్ని మరింత హెచ్చించగా ఇంటికి వెళ్ళిపోయాడు.

ఆ పిమ్మట శివుడి కింకరుల్లో మొదట లెక్కించదగ్గ నందికేశ్వరుడు 'శివుణ్ణి శపించడం, శివుణ్ణి గూర్చిన అనుచితవాక్యాలాడడం' విన్నాడు. కోపంతో అతని కళ్లు ఎఱ్రబారగా. ఇట్లా అన్నాడు. ఈ దక్షుడు నశించే స్వభావంగల మానవ శరీరాన్నే ఉత్కృష్టమైందిగా భావించాడు. తిరిగి చెడుచేయ తలపెట్టని శివుడిపట్ల వేర్పాటుధోరణి కలవాడై అతడికి ద్రోహం తలపెట్టాడు. ఇలాంటి జడుడు, పరతత్త్వజ్ఞానం పట్ల అనాసక్తుడవుతాడు. కపటాచారాల నివాసాలలో, స్త్రీ కామనతో విధినిషేధ రూప భేదాలవల్ల మతి తప్పి కర్మసిద్ధాంతాల్ని విస్తరింపచేస్తాడు.

ఇతడు శరీరాదుల్నే మేల్తరంగా యోచించాడు. అందువల్ల ఇతడు పరాత్పరుడి తత్త్వాన్ని గ్రహించుకోలేని పశుతుల్యుడు. స్త్రీవ్యామోహితుడు. ఇతడు మిక్కిలి తొందరలోనే మేకముఖం కలవాడవుతాడు.

**మ. అనయంబుం దన మానసంబున నవిద్యల్ ముఖ్యతత్త్వంబుగాఁ**
**గని గౌరీశుఁ దిరస్కరించిన యసత్కర్మాత్ము నీ దక్షుని**
**న్ననువర్తించినవాడు సంసరణకర్మారంభుడై నిచ్చలున్**
**జననం బందుచుఁ జచ్చుచున్ మరల నోజం బుట్టుచున్ వర్తిలున్. 48**

**ప్రతి :** అనయంబున్= ఎల్లప్పుడునూ; తన మానసంబునన్= తన హృదయంలో; అవిద్యల్= బ్రహ్మ విద్యలు కానివాటిని; ముఖ్య తత్త్వంబు+కాన్= ప్రధానమైన తత్త్వజ్ఞానంగా; కని= చూచి; గౌరీ+ఈశున్= పార్వతీపతియైన శివుణ్ణి; తిరస్కరించిన= అనాదరించిన; అసత్= చెడ్డ; కర్మ+ఆత్మున్= కర్మలయందు బుద్ధిగల; ఈ దక్షునిన్= ఈ దక్షుణ్ణి; అనువర్తించినవాడు= అనుసరించి చరించేవాడు; సంసరణ= సంసారంయొక్క; కర్మ= కర్మల్ని; ఆరంభుడు+ఐ= మొదలుపెట్టినవాడై; నిచ్చలున్= నిత్యమూ, మాటిమాటికి; జననంబు= పుట్టుకను; అందుచున్= పొందుతూ; చచ్చుచున్= కాలధర్మం చెందుతూ; మరల= తిరిగి; ఓజన్= వరుసగా; పుట్టుచున్= జన్మిస్తూ; వర్తిలున్= ఉంటాడు.

**తా :** ఈ దక్షుడు తనలోపలి అవిద్యనే ముఖ్య తత్త్వజ్ఞానంగా ఎపుడూ భావిస్తుంటాడు. ఇతడు శివుణ్ణి అవమానించిన దుష్టుడు. చెడుపనులుచేయు బుద్ధికలిగిన ఇతడి మార్గాన్ని అనుసరించేవాడు. ఎపుడూ సంసారకర్మల్లోపడి పుడుతూ చస్తూ మళ్లీ మళ్లీ పుడుతూ ఉంటాడు.

**వ. అదియునుంగాక యీ హరద్వేషులైన ద్విజు లర్థవాదబహుళంబులైన వేదవాక్యంబులవలన మధుగంధసమంబైన చిత్తక్షోభంబుచేత విమోహితమనస్కులయి కర్మాసక్తులగుదురు; మఱియును భక్ష్యాభక్ష్య విచారశూన్యులై దేహాదిపోషణంబుకొఱకు ధరియింపఁ బడిన విద్యాతపోవ్రతంబులు గలవారలై ధనదేహేంద్రియంబుల యందుఁ బ్రీతిం బొంది యాచకులై విహరింతురని నందికేశ్వరుండు బ్రాహ్మణ జనంబుల శపియించిన వచనంబులు విని భృగుమహాముని మరల శపియింపం బూని యిట్లనియె. 49**

**ప్రతి :** అదియునున్+కాక= అంతేకాకుండా; ఈ హరద్వేషులు+ఐన= శివుణ్ణి ద్వేషించే వారైన; ద్విజులు= విప్రులు; అర్థవాద బహుళంబులు+ఐన= పరమాత్మస్తుతులు అధికంగా గలిగిన; వేదవాక్యంబులవలన= వేద ప్రవచనాలవల్ల

దూరమై; మధు= కల్లు; గంధ= వాసనలతో; సమంబు+ఐన= సాటి అయిన; చిత్త= మనస్సు యొక్క; క్షోభంబుచేతన్= కలతవల్ల; విమోహిత= అధికంగా వికలత్వం పొందిన; మనస్కులు+అయి= హృదయం కలవారై; కర్మ+ఆసక్తులు= కర్మకాండలో చిక్కుకొన్నవారలు; అగుదురు= అవుతారు; మఱియును= ఇంకా; భక్ష్య= తినదగినవి; అభక్ష్య= తినదగనివి అనే; విచార= విచక్షణ; శూన్యులు+ఐ= లేనివారై; దేహ+ఆది= శరీరం మొదలైనవాటి; పోషణంబుకొఱకున్= పెంపుదల కోసం; ధరియింపన్+పడిన= తాల్చబడిన; విద్యా= జ్ఞానం; తపస్= తపస్సు; వ్రతంబులు= పుణ్యకర్మలు; కలవారలు+ఐ= పొందినవాళ్లయి; ధన= ఆస్తియందు; దేహ= మేనునందు; ఇంద్రియంబుల+అందున్= కర్మజ్ఞాన ఇంద్రియాల మీద; ప్రీతిన్= సుఖాన్ని; పొంది= కల్గి ఉండి; యాచకులు+ఐ= తిరిపెం ఎత్తుకొనేవారై; విహరింతురు= తిరుగుతుంటారు; అని= అంటూ; నందికేశ్వరుండు= నందికేశ్వరుడు; బ్రాహ్మణ జనంబులన్= బ్రాహ్మణులను; శపియించిన= శాపం ఇచ్చిన; వచనంబులు= మాటలు; విని= ఆలకించి; భృగుమహాముని= భృగుమహర్షి; మరల= తిరిగి; శపియింపన్+పూని= శపించటానికి ప్రయత్నించి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

**తా :** అంతేకాక ఈ శివద్రోహులు విధినిషేధ రూపంలో ప్రతిపాదితమైన విషయాన్ని బలపరచే, స్తుతి వచనాల నుండి దూరమైనందు వల్ల కల్లు, తేనెల వంటి స్వర్గ సౌఖ్య పురుషులతో మనోవికలురై కర్మకాండల మీద మోజు కల్గిన వారవుతారు. ఇంకా 'ఇవి తినదగ్గవి, ఇవి తినగూడనివి' అనే యోచన లేనివారవుతారు. కేవలం దేహధారణ కోసమే విద్య, తపస్సు, వ్రతాలు ఆచరిస్తారు. ధనం, దేహం, ఇంద్రియాల సుఖాన్నే ప్రీతిగా భావిస్తారు. వేడుకపడి భిక్షాటనం చేస్తారు అంటూ నందికేశ్వరుడు బ్రాహ్మణుల్ని శపించాడు. వీటిని విన్న భృగుడు ప్రతిశాపంపెట్ట పూనుకుని ఇలా అంటాడు.

**తే. వసుధ నెవ్వారు ధూర్జటివ్రతులు వారు, వారి కనుకూలు రగుదు రెవ్వారు వారు**
**నట్టి సచ్ఛాస్త్రపరిపంథు లైనవారు, నవనిఁ"బాషండు" లయ్యెద రని శపించె. 50**

**ప్రతి :** వసుధన్= ఈ నేల మీద; ఏ+వారు= ఎవరు; ధూర్జటివ్రతులు= శివదీక్ష పట్టినవారు; వారున్= వారూ; వారికిన్= ఆ శివవ్రతులకు; ఏ+వారు= ఎవ్వరు; అనుకూలురు= ఒద్దికగా ఉంటారో; వారున్= వాళ్లూ; అట్టి= అటువంటి వాళ్లు; సత్+శాస్త్ర= మంచి శాస్త్రాలకు; పరిపంథులు+ఐనవారు= విరోధులైన వాళ్లు; అవనిన్= లోకంలో; పాషండులు= వేద బాహ్యులు; అయ్యెదరు= అవుతారు; అని= అని; శపించెన్= శాపం పెట్టాడు.

**తా :** భూమిపై శివదీక్షాపరులూ, వీళ్లపక్షం ఉండేవాళ్లూ, ఉత్తమ శాస్త్రాలన్నింటిని వ్యతిరేకించే వాళ్లూ 'పాషండులు' అవుతారు అని శపించాడు.

**విశే :** ధూర్జటి= బరువైన జడలు కలవాడు వ్యుత్పత్తి, శివుడు (అమరకోశం) పాషండుడనగా కర్మభ్రష్టుడు-

**సీ. సకలవర్ణాశ్రమాచారహేతువు లోకమునకు మంగళమార్గమును, సనాత**
**నముఁ, బూర్వఋషి సమ్మతము, జనార్దనమూలమును, నిత్యమును, శుద్ధమును, శివంబు,**
**నార్యపథానుగంబగు వేదమును విప్రగణము నిందించిన కారణమున**
**నే శివదీక్ష యందేని మద్యమపూజ్యుఁడై భూతపతి దైవ మగుచు నుండు**

**తే. నందు మీరలు భస్మజటాస్థిధారణములఁ దగి మూఢబుద్ధులు నష్టశౌచు**
**లై నశింతురు పాషండు లగుచు ననుచు, శాపమొనరించె నా ద్విజసత్తముండు. 51**

**ప్రతి :** ఆ, ద్విజసత్తముండు= ఆ బ్రాహ్మణోత్తముడు (భృగుముని); సకల= అన్ని, వర్ణ+ఆశ్రమ= బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర జాతులవారి; ఆచార= సంప్రదాయాలకు; హేతువున్= కారణమూ; లోకమునకున్= జగత్తుకి, మంగళమార్గమును= శుభదాయకమైన దారి; సనాతనమున్= పురాతనమయిందిన్నీ; పూర్వఋషి సమ్మతమున్= పూర్వమహర్షులకు అభిమతమయిందిన్నీ; జనార్దన= శ్రీమహావిష్ణువే; మూలమును= ప్రమాణముగాగలది; నిత్యమును= శాశ్వతమైనదిన్నీ, శుద్ధమును= శుచి అయినదిన్నీ; శివంబున్= మంగళకరమయిందిన్నీ; ఆర్య= పెద్దల; పథ= త్రోవను; అనుగంబు+అగు= అనుసరించేది అయినట్టి; వేదమును= శ్రుతినీ; విప్రగణమున్= బ్రాహ్మణజాతినీ; నిందించిన కారణమునన్= తూలనాడిన హేతువుచే; ఏ శివదీక్ష+అందు+ఏనిన్= ఎలాంటి శివవ్రతంలో అయినా; మధ్యమ= భూజనులచే; పూజ్యుఁడు+ఐ= గౌరవించదగ్గవాడై; భూతపతి= (భూతగణాలకు నాయకుడైన) శివుడు; దైవము= దైవంగా; అగుచున్+ఉండున్= అవుతాడు; అందున్= ఆ ఆరాధకుల్లో; మీరలు= మీరు; భస్మ= బూడిదను; జటా= జడలను; అస్థి= ఎముకలను; ధారణములన్= ధరించుటచేత; తగి= ఒప్పి; మూఢబుద్ధులు= మూర్ఖమైన మతులూ; నష్ట= పోగొట్టుకోబడిన; శౌచులు+ఐ= శుచికలవారూఅయి; పాషండులు+అగుచున్= వేదనిందకులు అవుతూ; నశింతురు= నశిస్తారు; అనుచున్= అంటూ; శాపమున్= శాపాన్ని; ఒసరించెన్= ఇచ్చాడు.

**తా :** వేదం అన్ని వర్ణాలవారి అన్ని ఆశ్రమాలవారి ఆచారాలకు కారణమైనది. ప్రపంచానికి మేలుకల్గించే మార్గం. సనాతనమయింది. పూర్వపు మునుల సమ్మతి కలది. విష్ణువే ప్రమాణదైవంగా కలది. ఎప్పటికీ నశించనిది. పవిత్రమయింది. శుభకరమైంది. శిష్టులను అనుసరించదగిన మార్గం. అలాంటి వేదాన్నీ, బ్రాహ్మణజాతినీ దూషించిన కారణంగా ఏ శివవ్రతమునందైనా మధ్యమజనులచే పూజింపబడే భూతపతే దైవం అవుతాడు. ఆ వ్రతంలో మీరు బూడిద, జడ, ఎముకలనూ ధరిస్తారు. మూఢులుగా, శుచి పాటించని వేద బాహ్యులుగా అంతం అవుతారు అని భృగుమహర్షి శపించాడు.

**విశే :** జనైః అర్ద్యతే – యాచ్యతే ఇతి జనార్దనః – జనులచే పురుషార్థ విషయమై కోరబడేవాడు, జనాన్ అర్దయతి= పీడయతి= కోరికలు తీర్చేందుకు జనంచే యాచించబడేవాడు, జన్మల్ని నశింపచేసేవాడు.

**వ. ఇట్లన్యోన్యంబును శాపంబులం బొందియు భగవదనుగ్రహంబు గలవార లగుటం జేసి నాశంబు నొందరై; రట్టియెడ విమనస్కుండగుచు ననుచరసమేతుండై భవుండు సనియె నంత. 52**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; అన్యోన్యంబును= ఒకరికొకరు; శాపంబులన్= శాపాలను; పొందియున్= పొందినప్పటికిన్నీ; భగవత్= ఆ పరాత్పరుడి; అనుగ్రహంబు= కనికరం; కలవారలు అగుటన్+చేసి= కల్గినవారు కావడంవల్ల; నాశంబు= నష్టాన్ని; ఒందరు+ఐరి= పొందనివారయ్యారు; అట్టి+ఎడన్= అలాంటి సమయంలో; విమనస్కుండు+అగుచున్= కలత చెందిన మనస్సు కలవాడవుతూ; అనుచరసమేతుండు+ఐ= తోడుగా నడిచే వాళ్లతో కూడిన వాడై; భవుండు= శివుడు; చనియెన్= వెళ్ళిపోయాడు; అంతన్= ఆ పిమ్మట...

**తా :** నందికేశ్వరుడు, భృగుమహర్షి ఈవిధంగా ఒకరినొకరు శపించుకున్నా దైవకృప కలిగినవారైనందున వారు నాశాన్ని పొందలేదు. ఆ సమయంలో శివుడు వికల మనస్కుడై తన అనుచరులతో సహా అక్కణ్ణుంచి వెళ్లిపోయాడు. అప్పుడు

విమనస్కుడు అంటే జరిగిన సంఘటనను మనస్సునకు పట్టించుకోనివాడై అనే అర్థాన్ని సంభావించటం సముచితం.

**సీ. అనఘాత్మ! యే యజ్ఞమందు సర్వశ్రేష్ఠుఁడగు హరి సంపూజ్యుఁడై వెలుంగు**
**నట్టి యజ్ఞంబు సమ్యగ్విధానమున సహస్రవత్సరములు నజుఁడొనర్చెఁ**

గరమొప్ప నమరగంగాయమునా సంగమావనిఁ గలుగు ప్రయాగయందు
నవభృథస్నానంబు లతిభక్తిఁ గావించి గతకల్మషాత్ములై ఘనత కెక్కి

తే. తగ నిజాశ్రమభూములఁ దలఁచి వార, లందఱును వేడ్కతోఁ జని రనుచు విదురు
నకును మైత్రేయుఁడను మునినాయకుండు, నెఱుఁగ వినిపించి వెండియు నిట్టులనియె. 53

**ప్రతి :** అనఘ+ఆత్మా= పుణ్యవంతుడా!; ఏ యజ్ఞము+అందున్= ఏ యాగంలోనైతే; సర్వశ్రేష్ఠుఁడు+అగు= దేవతలందరిలో మేటి అయిన; హరి= మహావిష్ణువు; సంపూజ్యుఁడు+ఐ= ఎన్నో గౌరవాలకు తగినవాడై; వెలుంగున్= ప్రకాశిస్తాడో; అట్టి= అలాంటి; యజ్ఞంబు= (సత్ర) యాగం; సమ్యక్= చక్కటి; విధానమునన్= పద్ధతితో; సహస్రవత్సరములున్= వెయ్యేళ్లు; అజుఁడు= బ్రహ్మ; ఒనర్చెన్= నిర్వహించాడు; కరము= ఎంతో; ఒప్పన్= ఒప్పునట్లుగా; అమరగంగాయమునాసంగమావనిన్= దేవగంగాయమునలు కలసినచోట; కలిగిన= ఉన్న; ప్రయాగ+అందున్= ప్రయాగలో; అవభృథస్నానంబులు= యజ్ఞదీక్షాస్నానాన్ని; అతిభక్తిన్= మిక్కిలి ప్రీతితో; కావించి= చేసి; గత= పోయిన; కల్మష= పాపం కల; ఆత్ములు+ఐ= స్వభావంకలవారై; ఘనతకున్= గొప్పతనంతో; ఎక్కి= అతిశయించి; తగన్= యోగ్యంగా; నిజ+ఆశ్రమ భూములన్= తమవైన ఆశ్రమ ప్రదేశాలను; తలఁచి= ఉద్దేశించి; వారలు+అందఱున్= వాళ్లంతా; వేడ్కతోన్= సంతోషంతో; చనిరి= వెళ్లిపోయారు; అనుచున్= అంటూ; విదురునకునున్= విదురుడికి; మైత్రేయుఁడు+అను= మైత్రేయుడనే; మునినాయకుండు= మునిపతి; ఎఱుఁగన్= తెలిసేలా; వినిపించి= వినేలా చేసి; వెండియున్= తిరిగి; ఇట్టులు= ఇలా; అనియెన్= పల్కాడు.

**తా :** పుణ్యాత్మా! ఏ యాగకర్మకైనా సర్వశ్రేష్ఠుడైన విష్ణువే సర్వపూజ్యుడు. అలాంటి యాగాన్ని బ్రహ్మదేవుడు వెయ్యేళ్లపాటు చక్కగా అనుష్ఠించాడు. 'సురనది గంగానది, యమునానది సంగమ స్థలం' అయిన ప్రయాగలో యజ్ఞసమాప్తి స్నానం ఎంతో భక్తితో చేశారు. అందు పాల్గొన్నవారు గతంలోని పాపాలన్నీ తుడిచేసుకొని నిర్మలులుగా ఘనత పొందారు. వాళ్లంతా తమ తమ ఆశ్రమభూములకు ఎంతో సంతోషంతో వినోదంగా తరలి వెళ్లారు' అంటూ విదురుడికి మైత్రేయుడు తేటతెల్లంగా వినిపించి, మళ్లీ ఇలా అన్నాడు.

## a =దక్షప్రజాపతి యజ్ఞము చేయునపుడు దాక్షాయణి యచ్చటికిఁ బోవుట= a

వ. అంత శ్వశురుండగు దక్షునకు జామాతయైన భర్గునకు నన్యోన్యవిరోధంబు వెరుఁగుచుండ నతిచిరంబగు కాలం బరిగెనంత దక్షుండు రుద్రవిహీనంబగు యాగంబు లేనిది యైనను శర్వుతోడి పూర్వవిరోధంబునను బరమేష్ఠికృతంబైన సకల ప్రజాపతి విభుత్వగర్వంబుననుం జేసి బ్రహ్మనిష్ఠులగు నీశ్వరాదుల ధిక్కరించి యరుద్రకంబుగా వాజపేయసవనంబు గావించి తదనంతరంబ బృహస్పతిసవన నామకంబైన మఖంబు సేయ నుపక్రమించిన నచ్చటికిం గ్రమంబున. 54

**ప్రతి :** అంతన్= ఆ తర్వాత; శ్వశురుండు+అగు= మామ అయినట్టి; దక్షునకు= దక్షప్రజాపతికి; జామాత+ఐన= అల్లుడు అయినట్టి; భర్గునకున్= శివుడికీ, అన్యోన్య= పరస్పరం; విరోధంబు= పగ; పెరుగుచున్+ఉండన్= వృద్ధి పొందుతుండగా; అతిచిరంబు+అగు= చాలా; కాలంబు= కాలం; అరిగెన్= గడచింది; అంతన్= అంతలో; దక్షుండు= దక్షుడు; రుద్రవిహీనంబు+అగు= శివుడు లేనట్టి; యాగంబు= యజ్ఞక్రియ; లేనిది+ఐన= లేకున్నప్పటికీ; శర్వుతోడి= శంకరునితోటి;

పూర్వ= మునుపటి; విరోధంబునను= వైరంవల్లనూ; పరమేష్ఠి= బ్రహ్మచే కృతంబు+ఐన= చేయబడింది అయిన; సకల= సమస్త; ప్రజాపతి= ప్రజాపతుల; విభుత్వ= ఆధిపత్య; గర్వంబునన్+చేసి= అహంకృతి వల్లనూ; బ్రహ్మనిష్ఠులు+అగున్= బ్రహ్మవిదులైనట్టి; ఈశ్వర+ఆదులన్= ఈశ్వరుడు మొదలైన వాళ్లను; ధిక్కరించి= తిరస్కరించి; అరుద్రకంబు+కాన్= శివుడు లేకుండగనే; వాజపేయ సవనంబున్= పదిహేడు మంది ప్రజాపతులతో చేసే వాజపేయ యాగాన్ని; కావించి= చేసి; అనంతరంబు+ఆ= ఆ పిమ్మట; బృహస్పతి సవన నామకంబు+ఐన= 'బృహస్పతి సవనం' అనే పేరు కలది అయిన; మఖంబున్= యాగాన్ని; చేయన్= చేయడానికి; ఉపక్రమించినన్= ప్రారంభించగా; అచ్చటికిన్= ఆ ప్రదేశానికి; క్రమంబునన్= వరుసగా...

**తా :** ఆ తర్వాత మామ దక్షుడికీ, అల్లుడు శివుడికీ ఒకరిపట్ల ఒకరికి పగ వర్ధిల్లుతూనే చాల కాలం దొర్లిపోయింది. అంతట్లో శివుడు లేకుండా యాగం చేసినా చేయనట్లేయని దక్షుడికి తెలుసు. అయినా సరే శివుడితో ముందునుంచి కొనసాగిస్తున్న వైరంవల్లా, బ్రహ్మ, దక్షుణ్ణి 'ప్రజాపతులందరికీ ఏలిక'ను చేయడంవల్ల దక్షుడిలో అహం భావం ఏర్పడింది. బ్రహ్మ నిష్ఠులైన ఈశ్వరాదుల్ని లెక్కచేయక, దక్షుడు శివుడులేని 'వాజపేయయజ్ఞం' చేశాడు. ఆ తర్వాత 'బృహస్పతి సవనం' అనే పేరిట మరోయజ్ఞం చేయ మొదలుపెట్టాడు. ఆ యాగభూమికి క్రమంగా

**విశే :** వాజపేయేనేష్ట్వా బృహస్పతిసవేన యజేత – అని శ్రుతి.

వాజపేయం అంటే నేతిని ఆహారంగా స్వీకరిస్తూ చేసే దైవకార్యం. 'వాజం పేయం అత్ర' అని వ్యుత్పత్తి. ఈ ధర్మకార్యంలో నేయి కేవలం దేహధారణకోసమే కాని, రుచికోసం స్వీకరించేది కాదు.

తిండి, తీర్థం, పలకరింపులు ధర్మార్థకర్మలుగా కాక, స్వార్థ కర్మలుగా ప్రవర్తింపచేసేది బృహస్పతి సవనం. అయినా వీటిని ప్రసాదించే దేవతలు ఈ సవనకర్తను దీవించడం సంప్రదాయం.

**చ. కర మనురక్తి నమ్మఖము గన్గొను వేడుక తొంగలింపఁగా**
**బరమముని ప్రజాపతి సుపర్వ మహర్షి వరుల్ సభార్యులై**
**పరువడి వచ్చి యందఱు శుభస్థితి దీవన లిచ్చి దక్షుచేఁ**
**బొరిఁబొరి నచ్చటన్ విహితపూజల నొందిరి సమ్ముదంబునన్. 55**

**ప్రతి :** కరము= మిక్కిలి; అనురక్తిన్= ఆసక్తితో; ఆ+మఖము= ఆ క్రతువును; కనున్+కొను= చూడాలనే; వేడుక= తహతహ; తొంగలింపన్+కాన్= పుట్టగా; పరమముని= బ్రహ్మర్షులూ; ప్రజాపతి= ప్రజాపతులూ; సుపర్వ= దేవతలు; మహర్షివరుల్= ఋషి పుంగవులూ; స+భార్యులు+ఐ= పత్నులతో కూడినవారై; పరువడి= వేగంగా; వచ్చి= వరుసగా వచ్చి; అందఱున్= అందరునూ; శుభస్థితిన్= మంగళకరమైన (వచనాలతో); దీవనలు= ఆశీర్వాదాలు; ఇచ్చి= ఒసగి; దక్షుచేన్= దక్షునిచేత; పొరిన్+పొరిన్= క్రమంగా; అచ్చటన్= ఆ యాగస్థలంలో; సమ్+ముదంబునన్= చాల సంతోషంతో; విహిత= చేయబడిన, పూజలన్= గౌరవాలను; ఒందిరి= అందుకున్నారు.

**తా :** ఆ బృహస్పతియాగం చూడాలనే కోరికపుట్టగా బ్రహ్మర్షులూ, ప్రజాపతులూ, దేవర్షిశ్రేష్ఠులూ, తమ భార్యలతో కలసి వేగంగా వచ్చారు. అందరూ దక్షుడికి శుభాలు కలగాలని దీవనలు పలికారు. మిక్కిలి ఆనందంగా వచ్చినవారు వచ్చినట్లుగా దక్షునిచేత అక్కడ విహిత (చేసిన) పూజలను పొందారు.

**తే. దక్షతనయ సతీదేవి దవిలి యాత్మ, సదనమున నుండి జనకుని సవనమహిమ**
**గగనచరులు నుతింప నా కలకలంబు, విని కుతూహలిని యయి విన్వీథిఁ జూడ. 56**

**ప్రతి :** దక్షతనయ= దక్షుడి కుమార్తె; సతీదేవి= సతీదేవి; తవిలి= ఆసక్తి చెంది; ఆత్మసదనముననుండి= తన నిలయం నుంచి; జనకుని= తండ్రియొక్క; సవన= యజ్ఞంయొక్క; మహిమన్= మాహాత్మ్యాన్ని; గగనచరులు= ఆకాశంలో తిరిగే గంధర్వులు; నుతింపన్= కొనియాడగా; ఆ కలకలంబున్= ఆ వాక్కుల సందడిని; విని= ఆలకించి; కుతూహలిని+అయి= ఉత్సుకతకలదై; విను+వీథిన్ (విన్వీథిన్)= ఆకాశపు దారిని; చూడన్= చూడగా...

**తా :** దక్షుడి కూతురు సతీదేవి తన నివాసం నుంచే తండ్రి చేసే యాగం గొప్పలను, గగనచరుల స్తోత్రాల కలకలాన్ని ఆసక్తితో విన్నది. ఎంతో ఉత్సాహంగా ఆకాశంవైపు చూడగా

**వ. అయ్యవసరంబునఁ దదుత్సవదర్శనకుతూహలులై సర్వదిక్కులవారును జనుచుండి; రా సమయంబున. 57**

**ప్రతి :** ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; తద్+ఉత్సవ= ఆ యాగం వేడుకను; దర్శన= చూడాలనే; కుతూహలులు+ఐ= ఉత్సాహం కలవారై; సర్వదిక్కుల వారును= అన్నిదిశల ప్రజలు; చనుచున్+ఉండిరి= పోతూ ఉన్నారు; ఆ సమయంబునన్= ఆ వేళ...

**తా :** అదే సమయానికి ఆ దక్షుడు చేసే యాగం వేడుకలను కన్నులారా తిలకించాలనే ఉబలాటంతో అన్నివైపుల నుంచి ప్రజలు వెళ్తూ ఉన్నారు. ఆ వేళలో

**సీ. తనరారు నవరత్నతాటంకరోచులు చెక్కుటద్దములతోఁజెలిమిసేయ**
**మహనీయతపనీయమయపదకద్యుతు లంసభాగంబుల నావరింప**
**నంచితచీనిచీనాంబరప్రభలతో మేఖలాకాంతులు మేలమాడఁ**
**జంచలసారంగచారువిలోచనప్రభలు నల్దిక్కులఁ బ్రబ్బికొనఁగ**

**తే. మించు వేడుక భర్తృసమేత లగుచు, మానితంబుగ దివ్యవిమానయాన**
**లగుచు నాకాశపథమున నరుగుచున్న, ఖచరగంధర్వకిన్నరాంగనలఁజూచి. 58**

**ప్రతి :** తనరారు (శబ్దపల్లవం)= శోభించే; నవరత్న= వజ్రవైదూర్యాది తొమ్మిది రత్నాలు తాపిన; తాటంక= చెవి కమ్మల; రోచులు= వెలుగులు; చెక్కు+అద్దములతోన్= అద్దాల్లాంటి చెక్కిళ్లతో; చెలిమి+చేయన్= స్నేహం కావించగా; మహనీయ= దిట్టమైన; తపనీయమయ= బంగారుమయమైన; పదక= మెడలో వేసుకునే హారంయొక్క; ద్యుతులు= కాంతులు; అంసభాగంబులన్= మూఁపు ప్రదేశాలను; ఆవరింపన్= అలముకోగా; అంచిత= ఒప్పిఉన్న; చీని చీనాంబర= మేలిమిపట్టుబట్టల; ప్రభలతో= మెరుపులతో; మేఖలా= ఎనిమిదిపేటల మొలనూలుయొక్క; కాంతులు= వెలుగులు; మేలము+ఆడన్= ఎక్కసెక్కెము లాడగా; చంచల= చలనంకల; సారంగ= లేడివంటి; చారు= చక్కనైన; విలోచన= చూపులయొక్క; ప్రభలు= కాంతులు; నలుదిక్కులన్= నలువైపులా; ప్రబ్బికొనన్+కన్= విస్తరించగా; మించి= మీరిన; వేడుకన్= అభిలాషతో; భర్తృసమేతలు+అగుచున్= తమతమ పతులతో కూడినవారవుతూ; మానితంబు+కన్=

మన్నింపబడునట్లు; దివ్య= దేవతాసంబంధమైన; విమానయానలు+అగుచున్= విమానంలో బయలుదేరిన వారవుతూ; ఆకాశపథమునన్= విన్వీథిలో; అరుగుచున్+ఉన్న= వెళ్తూ ఉన్న; ఖచర= ఆకాశంలో చరించే; గంధర్వ= గంధర్వుల; కిన్నర= కిన్నరుల; అంగనలన్= కాంతలను; చూచి= కాంచి.

**తా :** మించిన వేడుకతో తమ పతులతో కూడి గగనచరులైన గంధర్వ, కిన్నర స్త్రీలు మన్ననతో దివ్యవిమానాలలో ఆకాశమార్గంలో పోవుచుండుటను సతీదేవి చూచింది. ఆ దివ్య స్త్రీల చెవిపోగుల నవరత్నాల ధగధగలు అద్దములవంటి బుగ్గలతో ప్రతిఫలిస్తున్నాయి. ఘనమైన బంగారుపతకం తళతళలు భుజాగ్రాలను ఆవరిస్తున్నాయి. వాళ్ల కట్టుకున్న చీనీ పట్టుబట్టల తళతళలను మొలనూళ్ల వెలుగులు వేళాకోళం చేస్తున్నాయి. లేళ్ల చూపులవంటి వాళ్ల బెదురుచూపుల కాంతులు నలువైపులకు విస్తరిస్తున్నాయి.

**క. సతి దన పతియగు నా పశు, పతిఁ జూచి సముత్సుకతను భాషించె; ప్రజా**
**పతి మీ మామ మఖము సు, వ్రతమతి నొనరించుచున్న వాఁడఁట వింటే. 59**

**ప్రతి :** సతి= సతీదేవి; తన పతి+అగున్= తనకాంతుడైన; ఆ, పశుపతిన్= ఆ శివుణ్ణి; చూచి= కాంచి; సముత్సుకతను= విశేషమైన కుతూహలంతో; భాషించెన్= మాట్లాడింది; మీ మామ= మీ మామగారు; ప్రజాపతి= దక్షప్రజాపతి; మఖము= యజ్ఞం; సువ్రతమతిన్= దీక్షాబుద్ధితో; ఒనరించుచున్+ఉన్నవాఁడు+అఁట= చేస్తున్నవాడట; వింటి+ఏ= విన్నావా?

**తా :** సతీదేవి తన మగడైన శివుణ్ణి చూచి ఎంతో ఉత్సాహంగా ఇలా మాట్లాడింది. మీ మామగారు దక్షప్రజాపతి సువ్రతం చేయాలనే బుద్ధితో యాగం చేస్తున్నాడట కదా. వింటిరా?

**క. కావున నయ్యజ్ఞమునకు, నీ విబుధగణంబు లర్థి నేగెద; రదిగో;**
**దేవ! మన మిప్పు డచటికిఁ, బోవలె నను వేడ్క నాకుఁ బుట్టెడు నభవా! 60**

**ప్రతి :** దేవ!= ఓ ప్రభూ; అభవా= శివా!; కావునన్= కాబట్టి; ఆ+యజ్ఞమునకున్= ఆ యాగానికి; ఈ విబుధగణంబులు= ఈ వేల్పులంతా; అర్థిన్= ఆసక్తితో; ఏగెదరు= వెళ్తున్నారు; అదిగో= అదిగో చూడండి; మనము= మనమిద్దరమూ; ఇపుడు= ఈ వేళ; అచటికిన్= అక్కడకు; పోవలెన్+అను= వెళ్లాలి అనే; వేడ్క= కుతూహలం; నాకున్= నాకూ; పుట్టెడున్= కలుగుతున్నది.

**తా :** కాబట్టి ఆ యాగానికి దేవతలంతా ఇష్టంగా ఎలా పోతున్నారో చూడండి! ఓ దేవా! ఓ శివా! మనమిద్దరం కూడా ఆ యాగానికి వెళ్లవలెననే కోరిక నాకు కలుగుతున్నది.

**క. ఆ యజ్ఞముఁ గనుఁగొనఁగా, నా యనుజలు భక్తిఁ బ్రాణనాథులతోడం**
**బాయక వత్తురు;మనముం, బోయిన నే వారి నచటఁబొడగనఁగల్గున్. 61**

**ప్రతి :** ఆ యజ్ఞమున్= ఆ బృహస్పతి సవాన్ని; కనున్+కొనన్+కాన్= కాంచడానికి; నా+అనుజలు= నా తోడబుట్టిన చెల్లెళ్లు; ప్రాణనాథులతోడన్= తమ పతులతో కలసి; భక్తిన్= ప్రీతితో; పాయక= తప్పక; వత్తురు= వస్తారు; మనమున్= మనం కూడా; పోయినన్= వెళ్లినట్లయిన; ఏన్= నేను; వారిన్= వాళ్లందరిని; అచటన్= అక్కడ; పొడగనన్+కల్గున్= చూడ వీలు కల్గుతుంది.

**తా :** ఆ మహాయాగాన్ని చూడటానికి నా చెల్లెళ్లలందరూ భక్తితో తమతమ పతులతో సహా తప్పక విచ్చేస్తారు. మనమూ పోయినట్లయితే అక్కడ, వాళ్లందరినీ నేను చూడగల్గుతాను.

**క. జనకుని మఖమున కర్థిం, జని నీతోఁ బారిబర్హ సంజ్ఞికతఁగడుం**
**దనరిన భూషణములఁ గై, కొన వేడ్క జనించె నీశ! కుజనవినాశా? 62**

**ప్రతి :** ఈశ!= శివా!; కుజన వినాశా!= కుత్సితులను నశింప జేసేవాడా!; జనకుని= తండ్రి యొక్క; మఖమునకున్= క్రతువునకు; అర్థిన్= వేడుకతో; నీతోన్= నీతోకూడా; చని= పోయి; పారిబర్హ= పరిబర్హసంబంధంగా; సంజ్ఞికతన్= పేరుపొందిన, కడున్= మిక్కిలి, తనరిన= ఉచితమైన, భూషణములన్= అలంకారాదులను, కైకొనన్= స్వీకరించాలనే, వేడ్క= కౌతూహలం, జనించెన్= కల్గింది.

**తా :** దుష్టసంహారా! శివా! నీతో కలసి నా తండ్రి చేసే యాగానికి పోయి, పారిబర్హం పేరిట తల్లిదండ్రులు ఇచ్చే మిక్కిలి ప్రకాశించెడి భూషణములను తెచ్చుకోవాలనే కోరిక నాలో కల్గింది.

**క. నాతోడను స్నేహము గల, మాతను దత్సోదరీసమాజము ఋషి సం**
**ఘాతకృతమఖసమంచిత, కేతువుఁ గన వేడ్క గగనకేశ! జనించెన్. 63**

**ప్రతి :** గగనకేశ!= శివా!; నాతోడను= నాతోనూ; స్నేహము+కల= ప్రేమము కల్గిన; మాతను= తల్లిని; తద్= ఆ; సోదరీ= తోడబుట్టిన అక్కచెల్లెళ్ల; సమాజమున్= సమూహాన్ని; ఋషి= మునుల; సంఘాత= సముదాయంచేత; కృత= ఆచరించబడిన; మఖ= యాగంలో; సమంచిత కేతువున్= ప్రకాశిస్తున్న పతాకఔన్నత్యాన్ని; కనన్= చూడాలనే; వేడ్క= ఉత్సాహం; జనించెన్= పుట్టింది.

**తా :** ఓ శివా! నామీద అనురాగం చూపే మా అమ్మనూ, ఆమె అక్కాచెల్లెళ్ళనూ, ఋషుల సముదాయం సిద్ధం చేసిన యాగానికి చెందిన ప్రకాశించే ధ్వజాన్నీ చూడాలనే ఉల్లాసం పుట్టుకొస్తోంది.

**విశే :** గగనకేశ= ఆకాశంలో ఎగురుతున్న కేశాలుగలవాడా! (వ్యు) శివుడి అష్టమూర్తుల్లో ఒకరైన సూర్యుడి కిరణాలే ఆకాశంలో ఎగిరే కేశాలు కనక శివుడిని గగనకేశుడంటారు. వ్యోమకేశుడని నామాంతరం.

**వ. అదియునుంగాక! దేవా! మహాశ్చర్యకరంబై గుణత్రయాత్మకంబగు ప్రపంచము భవదీయ మాయా వినిర్మితం బగుటం చేసి నీకు నాశ్చర్యకరంబుగా; దయినను భవదీయ తత్త్వంబెఱుంగఁ జాలక కామినీస్వభావంబు గలిగి కృపణురాలనై మదీయ జన్మభూమిఁగనుంగొన నిచ్చగించితి నని వెండియు నిట్లనియె; 64**

**ప్రతి :** అదియున్+కాక!= అంతే కాకుండా; దేవా!; మహా+ఆశ్చర్యకరంబు+ఐ= గొప్ప ఆశ్చర్యం అన్పించేదై; గుణత్రయ= సత్త్వ, రజ, స్తమోగుణాల యొక్క; ఆత్మకంబు+అగు= స్వభావం కలదై; ప్రపంచము= లోకం; భవదీయ= నీ సంబంధమైన; మాయా= మాయచే; వినిర్మితంబు= సృష్టించబడింది; అగుటన్+చేసి= కావడంవల్ల; నీకున్= నీకు; ఆశ్చర్యకరంబు= వింత గొలుపునది; కాదు= అన్పించదు; అయినను= అయినా; భవదీయ= నీదైన; తత్త్వంబున్= పరమాత్మ స్వరూపమైన, నిజస్థితిని; ఎఱుంగన్+చాలక= తెలుసుకోలేక; కామినీ= ఆడుదాని; స్వభావంబున్= ప్రకృతి సిద్ధమైన గుణాన్ని; కలిగి=

ఉండి; కృపణురాలను+ఐ= దీనురాలనై, మదీయ= నాదైన; జన్మభూమిన్= పుట్టిన ప్రదేశాన్ని; కనున్+కొనన్= చూడడానికి; ఇచ్చగించితిన్= కాంక్షించాను; అని= అనిచెప్పి; వెండియున్= మళ్లీ; ఇట్లు+అనియెన్= ఇలా పల్కింది.

**తా :** అంతేకాదు. ఓ ప్రభూ! ఈ ప్రపంచం సత్త్వరజస్తమోగుణాల స్వభావంకల్గి మహాద్భుతంగా ఉంటుంది. ఈ ప్రపంచం నీ మాయ చేత సృష్టించబడింది. కాబట్టి నీకు అంత విచిత్రంగా అన్పించకపోవచ్చు. కానీ నేను నీ నిజస్థితిని గ్రహించుకునే శక్తిలేని దానిని. స్త్రీ సహజమైన నైజం కల దీనురాలిని. నా పుట్టినింటిని చూడాలని నా కోరిక. అంటూనే మళ్లీ ఇలా చెప్పింది.

**చ. ముదమునఁ దన్మఖోద్భవవిభూతిఁగనుంగొన నన్యకామినుల్**
**పదువులు గట్టి భూషణవిభాసితలై నిజనాథయుక్తలై**
**మదకలహంసపాండురసమంచితదివ్యవిమానయానలై**
**యదె చనుచున్నవారు గను మభ్రపథంబున నీలకంధరా! 65**

**ప్రతి :** నీలకంధరా= నల్లని కంఠంగల ఓ శివా!; ముదమునన్= సంతోషంగా; తత్= ఆ; మఖ= యజ్ఞంలో; ఉద్భవ= పుట్టిన; విభూతిన్= ఐశ్వర్యాన్ని; కనున్+కొనన్= చూడను; అన్యకామినుల్= ఇతర స్త్రీలు; పదుపులు+కట్టి= వరుసలుకట్టి; భూషణ= నగలచే; విభాసితలు+ఐ= మెరుస్తున్న వారలై; నిజనాథ= తమ పతులతో; యుక్తలు+ఐ= కూడినవారై; మద= అమితసంతోషంతో ఉన్న; కలహంస= రాజహంసల్లా; పాండుర= తెల్లగా; సమంచిత= చక్కగా ఒప్పిఉన్న; దివ్య= మహిమగల; విమానయానలు+ఐ= విమానంలో పయనిస్తున్న వారలై; అభ్రపథంబునన్= ఆకాశమార్గంలో; అది+ఎ= అదిగో!; చనుచున్+ఉన్నవారు= పోతూ ఉన్నారు; కనుము= చూడండి.

**తా :** నీలకంధరా! ఏ సంబంధమూలేని అన్య స్త్రీలందరూ కూడ ఆ మహాయాగ వైభోగాన్ని చూడాలని గుంపులుకట్టి ఎంతో సంతోషంగా పోతున్నారు. ఆ స్త్రీలు అలంకరణలతో మెరిసిపోతున్నారు. తమ తమ భర్తలతో కలసి కలహంసల్లాగా తెల్లగా ప్రకాశిస్తున్న విమానాల్లో బయలుదేరి ఆకాశమార్గంలో పోతున్నారు. చూడండి.

**క. అనఘా! విను లోకంబుల, జనకుని గేహమునఁ గలుగు సకలసుఖంబుల్**
**తనయలు సని సంప్రీతిన్, గనుఁగొన కే రీతి నిలుచుఁ గాయము లభవా! 66**

**ప్రతి :** అనఘా!= ఓ పుణ్యాత్ముడా!; అభవా= శివా!; విను= ఆలకించు; లోకంబులన్= స్వర్గమర్త్య పాతాళాది లోకాల్లో; జనకుని= తండ్రియొక్క; గేహమునన్= ఇంట్లో; కలుగు= జరిగే; సకల= అన్ని; సుఖంబుల్= పుణ్యకార్యాల వలని ఆనందాలను; తనయలు= ఆ ఇంటి ఆడపడుచులు; సంప్రీతిన్= నిండు ప్రేమతో; చని= వెళ్లి; కనున్+కొనక= చూడకుండా; కాయములు= శరీరాలు; ఏ రీతిన్= ఏతీరున; నిలుచున్= ఆగి ఉంటాయి.

**తా :** ఓ పుణ్యపురుషుడా! విను, ముల్లోకాల్లోనూ ప్రతి ఆడపిల్ల తమ పుట్టింటి మీది మమకారంతో ఆ ఇంట్లో జరిగే ప్రతి పుణ్యకార్యాలను తానుగా చూచి ఆనందించాలను కుంటుంది. అలా చూడని ఆమె శరీరం నిలకడగా ఎలా ఉంటుంది?

**క. అనయముఁ బిలువకయుండం, జన ననుచిత మంటివేని జనకగురుసుహృ**
**జ్జననాయకగేహములకుఁ, జనుచుందురు పిలువకున్న సజ్జను లభవా! 67**

**ప్రతి :** అభవా= శివా!; అనయమున్= ఎల్లప్పుడూ; పిలువక ఉండన్= ఆహ్వానించకపోయి నట్లయినా; చనన్= వెళ్లడం; న+ఉచితము= ఒప్పనిపని; అంటివి+ఏనిన్= అన్నట్లయితే; సత్+జనులు= సత్పురుషులు; పిలువక+ఉండన్= పిలువనప్పటికీ; జనక= తండ్రి; గురు= ఉపాధ్యాయుడు; సుహృద్= ప్రాణమిత్రుడు; జననాయక= ప్రజలను నడిపే ప్రభువులయొక్క; గేహములకున్= గృహాలకు; జనుచున్+ఉందురు= పోతూ ఉంటారు.

**తా :** ఎపుడూ పిలవని వారింటికి పోవడం తగింది కాదు అని నువ్వు అనుకోవచ్చు. కాని ఉత్తములు 'తండ్రి, గురువు, మిత్రుడు, రాజు' పిలువకపోయినప్పటికీ వాళ్ల ఇళ్లకు వెళ్తూనే ఉంటారు.

**వ. అని మఱియు నిట్లనియె; దేవా! నాయందుఁ బ్రసన్నుండవై మదీయ మనోరథంబుం దీర్ప నర్హుండవు; సమధికజ్ఞానంబు గల నీచేత నేను భవదీయదేహంబునం దర్ధంబున ధరియింప బడితి; నట్టి నన్ను ననుగ్రహింప వలయునని ప్రార్థించిన మందస్మిత వదనారవిందుం డగుచు జగత్స్రష్టల సమక్షంబున దక్షుండు తన్నాడిన మర్మభేదంబులైన కుహకవాక్యసాయకంబులం దలంచుచు నిట్లనియె. 68**

**ప్రతి :** అని= అనిచెప్పి; మఱియున్= మళ్లీ; ఇట్లు+అనియెన్= ఇలా అన్నది; దేవా!= ఓ నాథా!; నా+అందున్= నాపట్ల; ప్రసన్నుండవు+ఐ= దయకలవాడవై; మదీయ= నాదైన; మనోరథంబున్= కోరికను; తీర్పన్= నెరవేర్ప; అర్హుండవు= తగుదువు; సమధిక= ఎంతో ఎక్కువ; జ్ఞానంబుగల= తెలివిగల; నీచేతన్= నీవల్ల; నేను= నేను; భవదీయదేహంబునందు= నీదైన శరీరంలో; అర్ధంబున= సగపాలుగ; ధరియింపన్ పడితిని= తాల్చబడ్డాను; అట్టి= అలాంటి అర్ధాంగిని అయిన; నన్నున్= నన్ను; అనుగ్రహింపవలయును= కనికరించాలి; అని= అని; ప్రార్థించినన్= కోరగా, వేడుకోగా; మందస్మిత= చిరునగవుకల; వదన+అరవిందుండు+అగుచున్= ముఖపద్మం కలవాడవుతూ; జగత్స్రష్టల= ప్రజాపతుల; సమక్షంబునన్= ఎట్టఎదుట; దక్షుండు= దక్షప్రజాపతి; తన్నున్+ఆడిన= తనను గూర్చి తూలనాడిన; మర్మ భేదంబులు+ఐన= జీవస్థానాల్ని చీల్చేవి అయిన; కుహక= దంభపు; వాక్య= మాటలనే; సాయకంబులన్= బాణాలను; తలంచుచున్= స్మరించుకుంటూ; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

**తా :** సతీదేవి శివునితో ఇంకా ఇలా అన్నది. ఓ దేవా! నాపై కనికరించు. నీవు నా కోరిక తీర్చదగుదువు. సర్వజ్ఞుడవైన నీచేత నేను నీ శరీరంలో సగభాగంగా గ్రహించబడ్డాను. అలాంటి నన్ను కరుణించవలసిందని వేడుకుంది. ఆ మాటలకు శివుడు, ముఖపద్మంలో చిరునవ్వు చిందించాడు. ప్రజాపతుల ఎదుట దక్షుడు తన జీవనాడుల్ని చీల్చుతూ పలికిన దంభపు మాటల బాణాలను స్మరిస్తూ శివుడు సతీదేవితో ఇలా అన్నాడు.

**సీ. కల్యాణి! నీ మాట గడునొప్పు; బంధువుల్ పిలువకుండినను సంప్రీతిఁ జనుదు**
**రంటి; విదియు లెస్స యైనను దేహాభిమానమదమున నమర్షమునను**
**గడఁగి యారోపితఘనకోపదృష్టులు గారేనిఁ బోఁదగుఁగాని వినుము**
**వినుతవిద్యాతపోవిత్తవయోరూపకులములు సుజనులకును గుణంబు;**

**తే. లివియ కుజనులయెడ దోషహేతుకంబు, లై వివేకంబు సెఱుచు; మహాత్ములైన**
**వారి మాహాత్మ్య మాత్మగర్వమునఁ జేసి, జడులు పొడగానఁ జాలరు జలజనేత్ర! 69**

**ప్రతి :** జలజనేత్ర= పద్మాలవంటి కన్నులుకలదానా; కల్యాణి= ఓ సతీదేవి!; నీ మాట= నీ పలుకు; కడున్= మిక్కిలి; ఒప్పు= ఒప్పుయినది; బంధువుల్= చుట్టపక్కాలు; పిలువక= ఆహ్వానించక; ఉండినను= ఉన్నా; సంప్రీతిన్= పూర్తి ఇష్టంతో; చనుదురు= వెళ్తారు; అంటివి= అన్నావు; ఇదియున్= ఈ మాట; లెస్స= బాగానే ఉంది; ఐనను= అయినా; దేహాభిమాన= శరీరంమీది అభిమానంవల్ల గల్గిన గర్వం చేతను; మదమునన్= పొగరు చేతనూ; అమర్షమునను= అసహనం చేతనూ; కడcగి= అతిశయించి; ఆరోపిత= లేనిది మోపబడిన; ఘన= అధికమైన; కోప= క్రోధంతో కూడిన; దృష్టులు= చూపులు; కలవారు కారు+ఏనిన్= ఉన్నవారు కాకపోయినట్లయిన; పోన్+తగున్= వెళ్లడం ఉచితమే; కాని= కాకపోతే; వినుము= ఆలకించు; వినుత= ప్రశంసనీయమయిన; విద్యా= జ్ఞానం; తపస్= తపస్సు; విత్త= సొమ్ము; వయస్= యౌవనం; రూప= అందం; కులముల్= గొప్పకులంలో పుట్టడం; సుజనులకును= మంచివాళ్లకు మాత్రమే; గుణంబులు= సుగుణములు; ఇవియున్= ఈ గుణాలే; కుజనుల+ఎడన్= దుష్టలపట్ల; దోష= అపరాధానికి; హేతుకంబులు+ఐ= కారణం కలవియై; వివేకంబున్= విచక్షణను; చెఱుచున్= నశింపచేస్తాయి; మహా+ఆత్ములు+ఐనన్= మహా పురుషులు అయినట్టి; వారి= వారియొక్క; మాహాత్మ్యమున్= గొప్పతనాన్ని; ఆత్మ గర్వమునన్+చేసి= తమ అహంకృతివల్ల; జడులు= మందమతులు; పొడన్+కానన్= చూడడానికి; చాలరు= సమర్థులు కారు.

**తా :** పద్మాలవంటి కన్నులు గల ఓ కల్యాణీ! నీ మాట మిక్కిలి ఒప్పుయినదే. బంధువర్గం ఆహ్వానించక పోయినా వారి మీద తనకు గల గౌరవం కొద్దీ ఇష్టపడి పోయి రావడమూ న్యాయమే. కాని ఆ చుట్టాల బుద్ధి శరీరం మీది దురభిమానం కొద్దీ పొగరు, అసహనం, కోపం పొందనంతవరకూ వెళ్లిరావడం సరి అయిందే అవుతుంది. అయితే ఒకటి విను. జ్ఞానం, తపస్సు, ధనం, ప్రాయం, అందం, ఆభిజాత్యం మంచివాళ్లకు మాత్రమే మంచి గుణాలు. ఇవే గుణాలు చెడ్డవారిలో చెడుగుకు కారణాలవుతాయి. వాళ్ల వివేకాన్ని కోల్పోయేలా చేస్తాయి. ఓ సతీ! ఆత్మాభిమానంవల్ల మందమతులు మహానుభావుల గొప్పను చూడలేని వారవుతారు.

**క. విను; మట్టి కుటిలు లగు దు, ర్జనుల గృహంబులకు బంధుసరణిని బోవం**
**జనదు! వినీతుల కది గడు, ననుచితమైయుండు నింతి! యది యెట్లనినన్. 70**

**ప్రతి :** వినుము= జాగ్రత్తగా విను; అట్టి= అలాంటి; కుటిలులు+అగు= వంకర బుద్ధిగలవారు అయిన; దుర్జనుల= దుర్మార్గులయొక్క; గృహంబులకున్= ఇళ్లకు; బంధుసరణిని= చుట్టరికం వరుసనుబట్టి; పోవన్= వెళ్లడం; చనదు= తగదు; వినీతులకున్= వినయంకలవారికీ; అది= ఆ పోవడం; కడున్= మిక్కిలి; న+ఉచితము= అనుచితము; తగనిదికాదే; ఐ+ఉండున్= అయి ఉంటుంది; అది= ఆ ఒప్పనిది; ఎట్లు+అనినన్= ఏవిధంగా అంటే.

**తా :** సతీ! అలాంటి కపట ప్రవర్తనగల దగ్గరి సంబంధికుల ఇళ్లకు బంధువులమంటూ పోకూడదు. మర్యాదగలవారికి అది ఇంకా తగని పని. అది ఎలా గంటే.

**ఆ. కుటిలబుద్ధు లయిన కుజనుల యిండ్లకు, నార్యు లేగ, వా రనాదరమున**
**బొమలు ముడివడంగ భూరిరోషాక్షులై, చూతు రదియుcగాక సుదతి! వినుము. 71**

**ప్రతి :** సుదతి!= ఓ కాంతా; కుటిల= వంకర అయిన; బుద్ధిగల= ఆలోచనలు కల; కుజనుల= చెడు నడత గలవారి; ఇండ్లకున్= నివాసాలకు; ఆర్యులు= పూజ్యులు; ఏగన్= వెళ్లగా; వారు= ఆ కుజనులు; అనాదరమునన్= అగౌరవంగా;

బొమలు= కనుబొమలు; ముడి+పడన్+కన్= ముడిపడగా; భూరి= ఉగ్రమైన; రోష= కోపంగల; అక్షులు+ఐ= నేత్రాలు కలవారై; చూతురు= చూస్తారు; అదియున్+కాక= అంతే కాకుండా; విను= (ఈ మాటనూ) విను.

**తా :** వక్రబుద్ధి పరులైన చెడ్డవారి ఇళ్లకు మర్యాదాపరులు వెళ్ళినట్లయితే వాళ్లు మన్నించరు. సరికదా కనుబొమలు చిట్లించి మరీ తీవ్రమైన కోపం కలిగిన కనులతో చూస్తారు. ఓ సతీ! ఇంకా విను.

**చ. సమదరిపుప్రయుక్తపటుసాయకజర్జరితాంగుఁ డయ్యు దుః**
**ఖమును దొఱంగి నిద్రఁ గనుఁ గాని కృశింపఁడు మానవుండు; నో**
**యుమ! విను మిష్టబాంధవదురుక్తులు మర్మము లంటనాటఁజి**
**త్తమున నహర్నిశంబుఁబరితాపము నొంది కృశించు నెప్పుడున్. 72**

**ప్రతి :** మానవుడు= మనిషి; సమద= గర్వితుడైన; రిపు= విరోధిచే; ప్రయుక్త= ప్రయోగించబడిన; పటు= బలమైన; సాయక= బాణాలచే; జర్జరిత= సడలించబడిన; అంగుఁడు+అయ్యున్= అవయవాలు కల్గినప్పటికీన్నీ; దుఃఖమును= వెతను; తొఱంగి= వీడి; నిద్రన్+కనున్+కాని= నిద్రను పొందుతాడు కాని; కృశింపఁడు= సన్నగిల్లడు; బాధపడడు; ఓ+ఉమ!= ఓ ఉమా!; వినుము= విను; ఇష్ట= ప్రియమైన; బాంధవ= బంధువుల; దుస్+ఉక్తులు= చెడ్డమాటలు; మర్మములు= ఆయుస్థానాల్ని; అంటనాటన్= తాకి గుచ్చుకోగా; చిత్తమునన్= మనస్సులో; అహస్+నిశంబున్= పగలూ; రాత్రీ; పరితాపమున్= సంతాపాన్ని; ఒంది= పొంది; ఎప్పుడున్= ఎల్లకాలం; కృశించున్= క్షీణిస్తూ ఉంటాడు.

**తా :** మహాగర్వితుడైన పగవాడు గట్టిగా సారించి వదలిన బాణాలచే బాగా దెబ్బతిన్న శరీరంకల మనిషి ఆ బాధనంతా మరచిపోయి హాయిగా కునుకు తీస్తాడు. కాని కృశించడు. ఓ ఉమా! తనకు దగ్గర వాళ్లనుకున్నవారి పుల్లవిరుపు మాటలు గుండెల్లో గుచ్చుకుంటాయి. అవి రాత్రనక పగలనక మనసును బాధపెడుతూ మనుష్యుని క్షీణింపజేస్తుంటాయి.

**విశే :** ఉ= ఓ పార్వతి! మా= తపః మాస్తు (తపస్సు వద్దు) అని తల్లిచే వారించబడుటచే 'ఉమ' అనే పేరు వచ్చింది. (ఉమేతి మాత్రా తపసో నిషిద్ధా పశ్చాదముఖ్యాం జగామ అని కాళిదాసు)

**క. విను లోకోత్కృష్టుఁడు ద, క్షునికిఁ దనూభవలలోనఁ గూరిమిసుత వై**
**నను నా సంబంధంబున, జనకునిచేఁ బూజఁ బడయఁజాలవు తరుణీ! 73**

**ప్రతి :** తరుణీ!= ఓ కాంతా!; విను; లోక+ఉత్కృష్టుఁడు= లోకంలో, సర్వోన్నతుడు (అయిన); దక్షునికిన్= దక్షప్రజాపతికి; తనూభవలలోనన్= పుత్రికల్లో; కూరిమి= అతివాత్సల్యంకల; సుతవు+ఐనను= పుత్రివైనా; నా సంబంధంబునన్= నా భార్యవైనందువల్ల; జనకునిచేన్= (మీ) నాన్నచేత; పూజన్= సమ్మానాన్ని; పడయన్ చాలవు= పొందలేవు.

**తా :** ఓ కాంతా! విను. లోకంలో శ్రేష్ఠుడయిన దక్షప్రజాపతికి పుత్రికాసంతానంలో నీవు అత్యంతప్రీతిపాత్రవైన కుమార్తెవు. కాని నాతో నీకుగల సంబంధం వల్ల మీ తండ్రి నిన్ను మన్నింపజాలడు.

**వ. అదియె ట్లతనిచేత భవత్సంబంధంబునం జేసి పూజఁ బడయమికి నతనికి నీకు విరోధంబునకు హేతు వెట్టిదని యంటివేని. 74**

**ప్రతి :** అది+ఎట్లు= అది ఎలా?; అతని చేతన్= తండ్రి దక్షునిచే; భవత్= మీ యొక్క; సంబంధంబునన్+చేసి= వైవాహిక సంబంధం చేసినందువల్ల; పూజన్= గౌరవాన్ని; పడయమికిన్= పొందక పోవడానికి; అతనికిన్= నా తండ్రికి; నీకున్= నీకు; విరోధంబునకున్= పగకు; హేతువు= కారణం; ఎట్టిది= ఎలాంటిది; అంటివి ఏని= అన్నట్లయితే.

**తా :** నాకు మీతోగల పెళ్లి సంబంధం వల్ల నాతండ్రి నన్ను గౌరవించకపోవడం ఏమిటి? అసలు అతనికీ మీకూగల పగకు కారణం ఎలాంటిది అంటావేమో (విను).

**మ.** **నిరహంకారనిరస్తపాపసుజనానింద్యోల్లసత్కీర్తిఁగొం**
**దఱు కామించి యశక్తులై మనములన్ దందహ్యమానేంద్రియా**
**తురులై యూరక మచ్చరింతురు; మహాత్ముండీశ్వరుండైన యా**
**హరితో బద్ధవిరోధముందొడరు దైత్యశ్రేణిచందంబునన్.** **75**

**ప్రతి :** మహాత్ముండు= పరమపురుషుడు; ఈశ్వరుండు= పరమాత్మ; ఐన= అయినట్టి; ఆ హరితోన్= ఆ మహావిష్ణువుతో; దైత్యశ్రేణి= రక్కసిమూక; బద్ధ= తీవ్రమైన; విరోధమున్= పగను; తొడరు= తాల్చు; చందంబునన్= మాదిరి; నిరహంకార= గర్వం లేని; నిరస్తపాప= పాపం అంటని; సుజన= సజ్జనుల యొక్క; అనింద్య= నింద పొందని; ఉల్లసత్= ప్రకాశిస్తున్న; కీర్తిన్= యశస్సును; కొందఱు= కొంతమంది; కామించి= కోరి; అశక్తులు+ఐ= సమర్థత లేనివారై; మనములన్= హృదయంలో; దందహ్యమాన= మిక్కిలి కాల్చబడుతున్న; ఇంద్రియ= జ్ఞానేంద్రియాలచేత; ఆతురులు+ఐ= తొందరపాటుగలవారై; ఊరక= కారణం లేకనే; మచ్చరింతురు= ద్వేషిస్తారు.

**తా :** గర్వం లేని పాపరహితులైన సజ్జనుల పుణ్యమూ, పేరూ ప్రతిష్ఠల్ని కొంతమంది ఇష్టపడ్తారు. కాని ఆ ఉన్నతిని అందుకోగల సామర్థ్యం వారిలో ఉండదు. అందువల్ల వారి మనస్సు మండిపోతుంటుంది. దానితో ఇంద్రియ దుఃఖితులవుతారు. ఏమీ హేతువు లేకపోయినా ద్వేషిస్తారు. పరమ పురుషుడు, పరమాత్మ స్వరూపుడు అయిన విష్ణుమూర్తితో ద్వేషంకల రాక్షసుల మాదిరిగా కారణంలేని పగపూని ఉంటారు. (ప్రతీకారేచ్ఛకు వారి వారి అశక్తతే మూలస్థానం అని తాత్పర్యం.)

**విశే :** చర్మం, కన్ను, చెవి, నాలుక, ముక్కు – జ్ఞానేంద్రియాలు. వాక్కు, పాణి, పాదం, పాయువు; ఉపస్థ – కర్మేంద్రియాలు. మనస్సు 11వ ఇంద్రియం.

**వ.** **అదియునుం గాక నీ వతనికిం బ్రత్యుత్థానాభివందనంబులు గావింపకుండుటం జేసి యతండు తిరస్కృతుండయ్యె నంటివేని లోకంబున జను లన్యోన్యంబును బ్రత్యుత్థానాభివందనంబులు గావింతు, రదియు బ్రాజ్ఞు లయినవారు సర్వభూతాంతర్యామియైన పరమపురుషుండు నిత్యపరిపూర్ణుండు గావునఁ గాయిక వ్యాపారం బయుక్తంబని తదుద్దేశంబుగా మనంబునంద నమస్కారాదికంబులు గావింతురుగాని దేహాభిమానంబులు గలుగు పురుషులందుఁ గావింపరు, గాన నేనును వాసుదేవ శబ్దవాచ్యుండు, శుద్ధ సత్త్వమయుండు, నంతఃకరణంబునందు నావరణవిరహితుండును నయి ప్రకాశించు వాసుదేవునకు నా హృదయంబున నెల్లప్పుడు నమస్కరించు చుండుదు; నిట్లనపరాధినైన నన్నుఁ బూర్వంబున బ్రహ్మలు సేయు సత్త్రంబునందు దురుక్తులం జేసి పరాభవించి మద్ద్వేషియై దక్షుండు భవజ్జనకుండైన నతఁడును**

**దదనువర్తులయిన వారలును జూడఁదగరు; కావున మద్వచనాతిక్రమంబుం జేసి యరిగితివేని నచట నీకుఁ బరాభవంబు సంప్రాప్తం బగు; లోకంబున బంధుజనంబులవలనఁ బూజ వడయక తిరస్కారంబు వొందుట చచ్చుటయ కాదే; యని పలికి మఱియు నభవుండు పొమ్మని యనుజ్ఞ యిచ్చిన నచ్చట నవమానంబునం జేసి యశుభంబగు ననియు, నిచ్చటఁ బొమ్మనక నివారించిన మనోవేదన యగు ననియు మనంబునం దలపోయుచు నూరకుండె; నంత. 76**

**ప్రతి :** అదియునున్+కాక= అంతేకాక; నీవు= నువ్వు (శివుడు); అతనికిన్= అతడికి (దక్షుడికి); ప్రతి+ఉత్థాన= ఎదురువెళ్లి; అభివందనంబులు= నమస్కృతులు; కావింపక= చేయక; ఉండుటన్+చేసి= ఉండడంవల్ల; అతండు= అతడు (దక్షుడు); తిరస్కృతుండు= తిరస్కారము నొందినవాడు; అయ్యెన్= అయ్యాడు; అంటివి+ఏని= అంటావేమో; లోకంబున= ఈ జగత్తులో; జనులు= ప్రజలు; అన్యోన్యంబును= ఒకరికొకరు; ప్రత్యుత్థాన= ఎదురు వెళ్లి ఆదరించి; అభివందనంబులు= చేమోడ్పులు; కావింతురు= చేస్తారు; అదియున్= అదియునూ; ప్రాజ్ఞులు+అయినవారు= జ్ఞానవంతులైనవాళ్లు; సర్వభూత= జీవులందరిలో; అంతర్యామి+ఐన= మనస్సులోపలసంచరించే; పరమపురుషుండు= పరమాత్ముడు; నిత్యపరిపూర్ణుండు= ఎల్లపుడూ అంతటా నిండి ఉండేవాడు; కావునన్= కాబట్టి; కాయిక= శారీరకమైన; వ్యాపారంబు= (చేతులెత్తి నతులొనరించే) పని; అయుక్తంబు= అర్హమైందికానిది; అని= అనుకుని; తద్+ఉద్దేశంబు+కాన్= అది లక్ష్యంగా; మనంబున్+అందున్+అ= హృదయంలోనే; నమస్కార+ఆదికంబులు= ప్రణామం మొదలుగా కలవి; కావింతురు= ఆచరిస్తారు; కాని= కాకపోతే; దేహ+అభిమానంబులు= శారీరక చర్యలపట్ల అభిలాషలు; కలుగు= ఉన్నట్టి; పురుషుల+అందున్= మనుజులకు; కావింపరు= చేయరు; కానన్= కాబట్టి; ఏనును= నేనున్నూ; వాసుదేవశబ్ద= వాసుదేవుడను పదంచే; వాచ్యుండు= చెప్పదగ్గవాడు; శుద్ధ= పరిశుద్ధమైన; సత్త్వమయుండు= సాత్త్వికుడు; అంతఃకరణంబున్+అందు= మనస్సునందు; ఆవరణ= దాపరికాలు; విరహితుడు= లేనివాడు అయి; ప్రకాశించు= వెలుగు; వాసుదేవునకు= ఆ సర్వవ్యాపి అయిన భగవంతునకు; ఎల్లప్పుడు= నిరంతరం; నమస్కరించు చుండుదున్= నమస్కరిస్తు ఉంటాను; ఇట్లు= ఈ విధంగా; న+అపరాధిని+ఐన+నన్నున్= తప్పులేని నన్ను; పూర్వంబున= మునుపు; బ్రహ్మలు+చేయు= బ్రహ్మాదులు అనుష్ఠించిన; సత్రంబు+అందు= యాగసమయంలో; దుస్+ఉక్తులన్+చేసి= చెడు మాటలతో; పరాభవించి= అవమానించి; మద్= (నా మట్టుకు) నన్ను; ద్వేషి అయిన= ద్వేషించువాడగు; దక్షుండు= దక్షప్రజాపతి; భవత్= నీకు; జనకుండు+ఐనన్= జన్మనిచ్చిన తండ్రి అయినా; అతఁడును= ఆ దక్షుడును, తద్= అతణ్ణి; అనువర్తులు= అనుసరించి నడుచుకునేవారు; అయిన= అయినట్టి; వారలును= వారందరు కూడా; చూడన్= దర్శించుటకు; తగరు= తగినవారు కారు; కావునన్= కాబట్టి; మద్= నా యొక్క; వచన= మాటలను; అతిక్రమంబునన్+చేసి= అతిక్రమించి; అరిగితివి+ఏనిన్= పోయినావంటే; అచటన్= అక్కడ; నీకు; పరాభవంబు= అవమానం; సంప్రాప్తంబు+అగున్= కలుగుతుంది; లోకంబునన్= లోకంలో; బంధుజనంబుల వలనన్= చుట్టాలవల్ల; పూజవడయక= సమ్మానం పొందక; తిరస్కారంబున్= అవమానమును; పొందుట= పొందడం; చచ్చుటయ కాదే= మరణించుటే కదా; అని పలికి= అని చెప్పి; మఱియున్= ఇంకనూ; అభవుండు= శివుడు; పొమ్మని అనుజ్ఞ యిచ్చినన్= వెళ్ళమని అనుమతిస్తే; అచ్చట= అక్కడ; అవమానంబున+చేసి= తిరస్కారం వల్ల; అశుభంబు+అగున్+అనియున్= జరగరానిది జరుగుతుందని భావించినీ; ఇచ్చటన్= ఇక్కడ ఈ సమయంలో; పొమ్ము+అని= వెళ్ళుమని చెప్పక; నివారించిన= ఆపినట్లయిన; మనోవేదన= మనస్తాపం; అగున్+అనియున్= కల్గుతుందనీ; తలపోయుచున్= తలచుకుంటూ; ఊరక= మిన్నక; ఉండెన్= ఉన్నాడు; అంతన్= ఆ తర్వాత…

**తా :** అంతేకాదు నువ్వు 'పెద్దవాడుగా అతడికి నమస్కరించి ఆదరించకపోవడం తక్కువ చేసినట్లుగా అనుకుని ఉండవచ్చు' అంటావేమో. మనుషులు ఒకరికొకరు ఎదురుగా వెళ్లి నమస్కరించుకోవడం లోకసహజం.

పండితులు 'అందరిలో ఆత్మస్వరూపుడై అంతటా నిండి ఉండే ఆ పరమపురుషుడికి చేతులెత్తి నమస్కరించడం అనే కాయికమైన చర్య అనుచితం అయినట్టిది' అనుకుంటారు. మనస్సులోనే నమస్కరిస్తారు. అందువల్ల శారీరకమైన ఈ చేష్టలను కాంక్షించేవాళ్లకు నమస్కరించరు.

కాబట్టి నేను, 'పరమేశ్వరపద ప్రసిద్ధుడూ, శుద్ధ సత్త్వరూపుడు, ఎపుడూ లోపలి మనసును మాత్రమే చుట్టి ఉండే సర్వవ్యాపి అయిన ఆ వాసుదేవ ఆరాధకుణ్ణి.

నన్ను దక్షుడు పూర్వం బ్రహ్మాదులు చేసిన క్రతువులో చెడు మాటలతో అవమాన పరచి నాకు పగవాడయిన నీ తండ్రి దక్షుడు, అతడి అనుయాయులు, దర్శింపదగినవారు కారు.

నా మాటలను కాదని నువ్వు వెళ్లినట్లయితే అక్కడ నీ కన్నవారింట్లో అవమానాల పాలవుతావు. ఈ భూప్రపంచంలో బంధువుల పూజ పొందక తిరస్కారాన్ని పొందడం చావుతో సమానమే అవుతుంది కదా అని చెప్పాడు.

ఆ తర్వాత మళ్లీ ఈవిధంగాను ఆలోచించాడు. తన భార్యను ఆ మహోత్సవానికి వెళ్లిరమ్మని అంటే అక్కడ ఏమైనా అనుకోనిది జరుగుతుందేమో! అలా చెప్పక ఇక్కడే వారించి ఉంచినట్లయితే సతీదేవి, మానసికవేదనకు గురి అవుతుందేమో! అనుకుని శివుడు మౌనంగా ఊరుకున్నాడు. ఆ తర్వాత

**సీ. సతి సుహృద్దర్శనేచ్ఛాప్రతికూల దుఃఖస్వాంత యగుచు నంగములు వడఁక**
**నందంద తొరఁగెడు నశ్రుపూరంబులు గండభాగంబులఁ గదలుకొనఁగ**
**నున్నతస్తనమండలోపరిహారముల్ వేఁడి నిట్టూర్పుల వెచ్చఁ గంద**
**నతిశోకరోషాకులాత్యంతదోదూయమానమై హృదయంబు మలఁగుచుండ**

**తే. మఱియుఁ గుపితాత్మయై స్వసమానరహితు, నాత్మ దేహంబు సగ మిచ్చినట్టి ధవుని**
**విడిచి మూఢాత్మ యగుచు నవ్వేలఁది సనియె, జనకుఁ జూచెడు వేడుక సందడింప. 77**

**ప్రతి :** సతి= సతీదేవి; సుహృత్= ఆప్తుల్ని; దర్శన= చూడాలనే; ఇచ్ఛా= వాంఛకు; ప్రతికూల= ప్రతికూలమగు; దుఃఖ= బాధతోకూడిన; స్వాంత+అగుచున్= మనస్సుకలదవుతూ; అంగములు= అవయవాలు; వడఁకన్= కంపించగా; అందు+అందు+అ= అక్కడక్కడా; తొరఁగెడు= జారిపడే; అశ్రుపూరంబులు= కన్నీటిధారలు; గండభాగంబులన్= చెక్కిలి ప్రదేశాల్లో; కదలుకొనన్+కన్= పరచుకోగా; ఉన్నత= ఎత్తైన; స్తనమండల= వక్షఃప్రదేశం; ఉపరి= మీది; హారముల్= ముత్యాలపేరులు; వేఁడి= వెచ్చటి; నిడు+ఊర్పుల= పెద్దనిశ్వాసాల; వెచ్చన్= సెగకు; కందన్= కమలగా; అతిశోక= ఎక్కువైన దుఃఖంతోనూ; అతిరోష= అధికమైన కోపంతోనూ; ఆకుల= కలతపడి; అత్యంత= మిక్కిలిగా; దోదూయమానము+ఐ= తపించబడినదైన; హృదయంబు= మనస్సు; మలఁగుచున్+ఉండన్= మండిపోవుచుండగా; మఱియున్= మళ్లీ; కుపిత+ఆత్మ+ఐ= కోపించిన స్వభావంకలది అయి; స్వ= తనతో; సమానరహితున్= సాటిలేనట్టి; ఆత్మ= తనయొక్క; దేహంబున్= శరీరాన్ని; సగము= అర్ధభాగం; ఇచ్చినట్టి= పంచి ఇచ్చినటువంటి; భవుని= శివుని; విడిచి= వదిలి;

ఆ+వెలఁది= ఆ కాంత; మూఢ= వివేకం లేని; ఆత్మ+అగుచున్= స్వభావం కలదవుతూ; జనకున్= తండ్రిని; చూచెడు= చూడాలనే; వేడుక= ఉత్సాహం; సందడింపన్= అతిశయించగా; చనియెన్= వెళ్లింది.

**తా :** సతీదేవి తన ఆప్తులను దర్శించాలనే వాంఛకు కలిగిన ప్రతికూలతకు దుఃఖించిన మనస్సు కలిగినదయింది. శరీరావయవాలు వణికాయి. అక్కడక్కడా కారే కన్నీటిధారలు చెక్కిళ్లపై వ్యాపించాయి. ఎత్తైన ఎదపైనుండెడు హారాలు వేడి నిటూర్పుల వేడికి కందిపోయినాయి. అధికమైన శోకంతోనూ, రోషంతోనూ మిక్కిలి తపించబడిన హృదయం మండిపోసాగింది. ఇంకా సతీదేవి మనస్సులో కోపం కలిగి, తనతో సాటి ఇంకొకడు లేనివాడూ, తన దేహంలో సగభాగం ఇచ్చినవాడూ అయిన తన భర్తను వదిలి మూఢాత్మయై తండ్రిని చూడాలనే ఉత్సాహం అతిశయించగా వెళ్లింది.

**వ. ఇట్లతిశీఘ్రగమనంబున. 78**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; అతిశీఘ్రగమనంబునన్= మిక్కిలి వేగవంతమైన ప్రయాణంతో...

**తా :** ఇలా మిక్కిలి వేగవంతమైన ప్రయాణంతో

**సీ. మానిని చనుచుండ మణిమన్మదాదిసహస్రసంఖ్యాతరుద్రానుచరులు**
**యక్షులు నిర్భయులై వృషభేంద్రుని మున్నిడికొనుచు నమ్ముదిత దాల్చు**
**కందుకాంబుజశారికాతాళవృంత దర్పణ ధవళాతపత్ర ప్రసూన**
**మాలికాసౌవర్ణమణివిభూషణ ఘనసార కస్తూరికా చందనాది**

**తే. వస్తువులు గొంచు నేగి శర్వాణిఁ గదిసి, శంఖదుందుభివేణునిస్వనము లొప్ప**
**మానితంబైన వృషభేంద్రయానఁ జేసి, యజ్ఞభూమార్గులై యర్థి నరిగి యరిగి. 79**

**ప్రతి :** మానిని= ఆ సతీదేవి; చనుచున్+ఉండన్= పోతూఉండగా; మణిమత్= మణిమంతుడు; మద= మదుడు; ఆది= మొదలుగా; సహస్ర సంఖ్యాత= వేలకొద్దీ; రుద్ర+అనుచరులు= శివుడి సహాయులు అయిన ప్రమథులూ; యక్షులు= యక్షులూ; నిర్భయులు+ఐ= వెరపు లేనివారై; వృషభ+ఇంద్రునిన్= ఋషభరాజు నందీశ్వరుణ్ణి; మున్ను= ముందు; ఇడికొనుచున్= పెట్టుకుంటూ; ఆ+ముదిత= ఆ మగువ; తాల్చు= ధరించే; కందుక= పూబంతులు; అంబుజ= పద్మాలు; శారికా= గోరువంకలు; తాళవృంత= తాటాకుల విసనకర్రలు; దర్పణ= అద్దాలు; ధవళ= తెల్లటి; ఆతపత్ర= ఛత్రాలు; ప్రసూన మాలికా= పూలదండలు; సౌవర్ణ= బంగారంతో చేసిన; మణి= మణులు పొదిగిన; విభూషణ= ఆభరణాలు; ఘనసార= (ఎక్కువ పరిమళంగల) పచ్చకర్పూరం; కస్తూరికా= కస్తురి; చందన= మంచిగంధం; ఆది= మొదలైన; వస్తువులున్= ద్రవ్యాలను; కొంచున్= వెంట తీసుకునిపోతూ; శర్వాణిన్= శివుడి భార్య సతీదేవిని; కదిసి= చేరుకుని; శంఖ= సంకువులు; దుందుభి= భేరీలు; వేణు= పిల్లనగ్రోవుల; నిస్వనములు= నినాదాలు; ఒప్పన్= అందగించగా; మానితంబు+ఐన= గౌరవింపదగ్గ; వృషభ+ఇంద్రయానన్+చేసి= నందీశ్వరుణ్ణి వాహనంగా చేసి; యజ్ఞభూ= యాగ ప్రదేశ సంబంధమైన; మార్గులు+ఐ= త్రోవకలవారై; అర్థిన్= భక్తితో; అరిగి+అరిగి= వెళ్లి వెళ్లి.

**తా :** ఆ సతీదేవి పోతుండగా, వేల సంఖ్యలో మణిమంతుడూ, మదుడూ మొదలైన శివుడి సహచరులూ, యక్షులూ ఆ వెనుకనే బయలుదేరారు. వీళ్లకుముందు నందికేశ్వరుడు నడక సాగించాడు. ఆమె వహించే పూలబంతులు, పద్మాలు,

గోరువంకలు, తాటాకు విసనకర్రలు, దర్పణములు, తెల్ల గొడుగులు, పూలమాలలు, మణులుతాపిన బంగారునగలు, కర్పూరం, కస్తూరి చందనాది పరిమళద్రవ్యాలు వెంట తీసుకుని వెళ్లారు. నిర్భయంగా ఆమెను చేరుకున్నారు. గొప్పవాడైన నందికేశ్వరుణ్ణి శర్వుడి భార్యకు వాహనంగా చేశారు. సంకువుల, భేరీల, పిల్లనగ్రోవుల మోతల సందడితో యజ్ఞస్థలం దిశగా పయనమై పోయి పోయి.

**వ. ముందట. 80**

**ప్రతి :** ముందట= ఎదుట...

**తా :** ఎదుట

**చ. మనమున మోదమందుచు నుమాతరుణీమణి గాంచె దారు మృ**
**త్కనకకుశాజినాయసనికాయవినిర్మితపాత్రసీమము**
**న్ననుపమవేదఘోష సుమహత్పశుబంధన కర్మభూమమున్**
**మునివిబుధాభిరామము సముజ్జ్వలహోమము యాగధామమున్. 81**

**ప్రతి :** ఉమా తరుణీ మణి= స్త్రీ శిరోమణి అయిన ఆ సతీదేవి; దారు= కొయ్య; మృత్= మన్ను; కనక= బంగారం; కుశ= దర్భలు; అజిన= లేడి చర్మం; ఆయస= ఇనుము; నికాయ= (అనేవాటి) సముదాయంతో; వినిర్మిత= నిర్మించబడిన; పాత్ర= పరికరాలుగల; సీమమున్= ప్రదేశాన్ని; అనుపమ= సాటిలేని; వేదఘోష= వేదమంత్రనినదాలతో; సుమహత్= బాగా గొప్పది అయిన; పశుబంధన= యాగపశువును కట్టే; కర్మ= కర్మలచే; భూమమున్= గొప్పది; ముని= ఋషులచేత; విబుధ= దేవతలచేత; అభిరామము= ఒప్పిదమైనది; సం+ఉత్+జ్వల= చక్కగా ప్రకాశిస్తున్న/మండుతున్న; హోమము= వేలిమిగల; యాగధామమున్= యజ్ఞపుచోటును; మనమునన్= మనస్సులో; మోదమున్= సంతోషాన్ని; అందుచున్= పొందుతూ; కాంచెన్= చూసింది.

**తా :** సతీదేవి ఎంతో సంతోషపడుతూ యజ్ఞవాటికను కళ్లారా చూసింది. ఆ భూమి, చెక్కతో, మట్టితో, బంగారంతో, దర్భలతో, లేడి చర్మంతో, ఇనుముతో చేసిన పాత్రలతో ఒప్పి ఉంది. శుద్ధమైన వేద ధ్వనులు, యాగ పశువును కట్టి పూజ్యమైనది. ఆ ప్రదేశం మహర్షులు, దేవతలచేత ప్రకాశిస్తూ ఉంది. ఉవ్వెత్తు మంటలతో హోమం తేజరిల్లుతూ ఉంది.

**వ. ఇట్లు గనుంగొని యజ్ఞశాలం బ్రవేశించిన. 82**

**ప్రతి :** ఇట్లు= ఈ తీరున; కనున్+కొని= చూసి; యజ్ఞశాలన్= యజ్ఞసభలోకి; ప్రవేశించినన్= ప్రవేశించగా...

**తా :** ఆ సతి ఇట్లు యాగస్థలాన్ని దర్శించి యజ్ఞవాటికలో ప్రవేశించగా

**క. చనుదెంచిన యమ్మగువను, జననియు సోదరులుఁ దక్క సభఁగల జను లె**
**ల్లను దక్షువలని భయమున, ననయము నపు డాదరింపరైరి మహాత్మా! 83**

**ప్రతి :** మహాత్మా!= ఓ మహాపురుషా!; చనుదెంచిన= అలా వచ్చిన; ఆ+మగువను= ఆ కాంతను; జననియున్= తల్లియును; సోదరులున్= చెల్లెండ్రును; తక్క= తప్ప; సభన్+కల= ఆ శాలలో ఉన్న; జనులు+ఎల్లను= మునులు; దేవతలు, మొదలయిన

వారు అందరూ; దక్షువలని భయమునన్= దక్షుడి భయంవల్ల; అనయమున్= తప్పని పరిస్థితిలో; అపుడు= ఆ సమయంలో; ఆదరింపరు+ఐరి= మన్నించరైరి.

**తా :** (అలా చూస్తూ సంతోషంగా) వచ్చిన ఆ సతీదేవిని అమ్మా, తోడపుట్టినవాళ్లు ఆదరించారు. ఆ సభతీర్చి ఉన్న మిగతా వాళ్లందరూ దక్షుడికి భయపడి తప్పనిపరిస్థితుల్లో ఆ సతీదేవిని గౌరవించలేకపోయారు.

**క. నెఱిఁ దల్లియుఁ బినతల్లులుఁ, బరిరంభణ మాచరింపఁ బరితోషాశ్రుల్**
**దొరఁగఁగ దగ్గుత్తికతో, సరసిజముఖి సేమ మరయ సతి దా నంతన్. 84**

**ప్రతి :** నెఱిన్= క్రమంగా; తల్లియున్= తల్లీ; పినతల్లులున్= పిన్నమ్మలూ; పరిరంభణమున్= ఆలింగనాన్ని; ఆచరింపన్= చేయగా నడపగా; పరితోష= మహానందంతో కూడిన; అశ్రుల్= కన్నీళ్లు; తొరఁగన్+కన్= కారగా; దగ్గుత్తికతోన్= బొంగురుపోయిన కంఠంతో; సరసిజముఖి= పద్మంవంటి మోముకల ఆ సతీదేవియొక్క; సేమము= కుశలం; అరయన్= విచారించగా; సతి= సతీదేవి; తాను= తనకు తానే; అంతన్= ఆ తర్వాత...

**తా :** అమ్మా పిన్నమ్మలు వరుసగా ఆమెను దగ్గరకు తీసుకున్నారు. ఆ ఆనందం పట్టలేక కంటనీరు పెట్టుకున్నారు. కంఠం బొంగురు పోయింది. గద్గదస్వరంతో ఆమె క్షేమసమాచారాలు అడిగి తెలుసుకున్నారు. అంతలో ఆ సతీదేవి తానుగా

**క. జనకుం డవమానించుట, యును సోదరు లర్థిఁ దనకు నుచితక్రియఁజే**
**సిన పూజల నందక శో, భన మరసిన మాఱుమాటఁ బలుకక యుండెన్. 85**

**ప్రతి :** జనకుండు= తండ్రి దక్షుడు; అవమానించుటయును= పరాభవించడంవల్ల; సోదరులు= తోబుట్టువులు; అర్థిన్= కోరికతో; తనకు= తనకు; ఉచిత= తగిన; క్రియన్= పద్ధతిలో; చేసిన= ఆచరించిన; పూజలన్= గౌరవాలను; అందక= స్వీకరించక; శోభనము= శుభ సమాచారం గూర్చి; అరసినన్= ప్రశ్నించినప్పటికీ; మాఱుమాట= బదులుమాట; పలుకక= మాట్లాడక; ఉండెన్= ఉండిపోయింది.

**తా :** తండ్రి ఆదరణ కరవుకాగా ఆ సతీదేవి తోబుట్టువులు ఆప్యాయంగా తనకు తగిన విధంగా సమ్మానాలు చేసినప్పటికీ స్వీకరించలేకపోయింది. వారు అడిగిన కుశలప్రశ్నలకు ప్రతి సమాధానం చెప్పకుండా మిన్నకుండిపోయింది.

**వ. ఇట్లు తండ్రిచే నాదరింపబడనిదై విభుండైన యీశ్వరునందు నాహ్వానక్రియాశూన్యత్వ రూపంబైన తిరస్కారంబును, నరుద్రభాగంబైన యజ్ఞంబునుం గనుంగొని నిజరోషానలంబున లోకంబులు భస్మంబు సేయంబూనిన తెఱంగున నుద్రేకించి రుద్రవిద్వేషియుఁ గ్రతుకర్మాభ్యాస గర్విష్ఠుండునగు దక్షుని వధియింతు మనుచు లేచిన భూతగణబుల నివారించి రోషావ్యక్తభాషణంబుల నిట్లనియె; లోకంబున శరీరధారులైన జీవులకుఁ బ్రియాత్మకుండైన యీశ్వరునకుఁ బ్రియాప్రియులును నధికులును లే; రట్టి సకల కారణుండును నిర్మత్సరుండును నైన రుద్రునందు నీవు దక్క నెవ్వండు ప్రతికూలంబాచరించు? నదియునుంగాక మిముబోఁటి వారలు పరులవలని గుణంబులందు దుర్గుణంబులన యాపాదింతురు; మఱియుం గొందఱు మధ్యస్థులైన వారలు పరుల గుణంబులయందు దోషంబుల నాపాదింపరు; గొందఱు సాధువర్తనంబు గలవారలు పరుల దోషంబులనైన గుణంబులుగా ననుగ్రహింతురు. మఱియుం గొంద ఱుత్తమోత్తములు పరులయందు**

**దోషంబుల నాపాదింపక తుచ్ఛగుణంబులు గలిగినను సద్గుణంబులుగాఁ గై కొందు, రట్టి మహాత్ములయందు నీవు పాపబుద్ధి గల్పించితివి అని వెండియు నిట్లను; మహాత్ములగు వారల పాదధూళిచే నిరస్తప్రభావులై జడస్వభావంబు గల దేహంబు నాత్మ యని పల్కు కుజనులగు వారు మహాత్ముల నిందించు టాశ్చర్యంబుగా; దదియు వారి కనుచితం బగు నని వెండియు నిట్లనియె. 86**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; తండ్రిచేన్= తండ్రిచేత; ఆదరింపబడనిది+ఐ= మన్నన పొందనిదై; విభుండు+ఐన= పెనిమిటి అయిన; ఈశ్వరుని+అందున్= శివుడి విషయంలో; ఆహ్వాన= 'పిలుపు' అనే; క్రియా= పని; శూన్యత్వరూపంబు+ఐన= లేనిది అయిన; తిరస్కారంబునున్= అనాదరమూ; అరుద్ర భాగంబు+ఐన= శివుడికి 'పాలు' లేనిది అయిన; యజ్ఞంబునున్= యాగాన్నీ; కనున్+కొని= పరీక్షించి చూసి; నిజరోష+అనలంబునన్= తనదైన కోపాగ్నిచే; లోకంబులు= ప్రపంచాలను; భస్మంబు+చేయన్= బుగ్గి చేయడానికి; పూనిన= ప్రయత్నించిన; తెఱంగునన్= విధాన; ఉద్రేకించి= విజృంభించి; రుద్రవిద్వేషియున్= శివుని విరోధీ; క్రతుకర్మ అభ్యాస= యాగధర్మకర్మాచరణం చేత ఆవృత్తివల్ల; గర్విష్ఠుండును+అగు= అనేక యాగకర్మచేయుటచే గర్వించినవాడు, అహంకరించినవాడు అయిన; దక్షున్= దక్షుని; వధియింతుము= చంపుతాము; అనుచున్= అంటూ; లేచిన= లేచినిలబడిన; భూతగణంబులన్= ప్రమథగణాలను; నివారించి= నిరోధించి; రోష+అవ్యక్త= క్రోధంతో (అస్పష్టమైన); భాషణంబులన్= మాటలతో; ఇట్లు+అనియెన్= ఇలా పల్కింది; లోకంబునన్= ప్రపంచంలో; శరీరధారులు+ఐన= దేహాన్ని ధరించి ఉన్న; జీవులకున్= ప్రాణులకు; ప్రియాత్మకుండు+ఐన= ప్రేమ స్వరూపుడైన; ఈశ్వరునకున్= శివుడికి; ప్రియ= ఇష్టులూ; అప్రియులును= అనిష్టులూ; అధికులును= ఉన్నతులును; లేరు= ఉండరు; అట్టి= అలాంటి; సకల= సమస్తానికీ; కారణుండును= హేతు వైనవాడునూ; నిర్+నిర్మత్సరుండునున్= ద్వేషం లేనివాడును, ఐనన్= అయినట్టి; రుద్రుని+అందు= రుద్రుడిపట్ల; నీవు+తక్కన్= నువ్వుదప్ప; ఎవ్వండు= మరెవ్వడూ; ప్రతికూలంబున్= వ్యతిరేకమగుపని; ఆచరించున్= చేయ పూనుకుంటాడు; అదియునున్+కాక= అంతేకాక; మిముబోటివారలు= మీ యట్టివారు; పరులవలని= ఇతరులలోని; గుణంబులందు= గుణాలలో; దుర్గుణంబులను+అ= దుర్గుణాలనే; ఆపాదింతురు= ఆరోపిస్తారు; మఱియున్ కొందఱు= ఇంకా కొంతమంది; మధ్యస్థులైనవారలు= నడిమివాళ్లు; పరులవలని= ఇతరులవలన; దుర్గుణంబుల+అందున్= చెడుగుణాల్లో; దోషంబులన్= తప్పులను; ఆపాదింపరు= ఆరోపించరు; కొందఱు= మరికొందరు; సాధువర్తనంబు+కలవారలు= మంచినడవడిక గలవాళ్లు; పరుల= అన్యుల; దోషంబులను+ఐన= తప్పులనయినా; గుణంబులుగా= సుగుణాలుగా; అనుగ్రహింతురు= స్వీకరిస్తారు; మఱియున్; కొందఱు= ఇంకొందరు; ఉత్తమ+ఉత్తములు= ఉన్నతుల్లో మేటి అయినవాళ్లు; పరుల+అందున్= ఇతరులలో; దోషంబులన్= తప్పులను; ఆపాదింపక= చూపక; తుచ్ఛగుణంబులన్= నీచగుణాలు; కలిగినను= ఉండిఉన్నా; సద్+గుణంబులు+కాన్= మంచిగుణాలుగా; కైకొందురు= స్వీకరిస్తారు; అట్టి= అలాంటి; మహా+ఆత్ముల+అందున్= మహానుభావుల్లోనూ; నీవు= నువ్వు; పాపబుద్ధిన్= చెడు ఆలోచనను; కల్పించితివి= పుట్టించావు; అని= అంటూ; వెండియున్= మళ్లీ; ఇట్లు+అనున్= ఇలా అన్నది; మహా+ఆత్ములు+అగు+వారల= పుణ్యవంతులైనవారి యొక్క; పాదధూళిచే= అడుగుల దుమ్ముచేత; నిరస్త= పోగొట్టబడిన; ప్రభావులు+ఐ= మహిమగలవాళ్లయి; జడస్వభావంబు+కల= తెలివితక్కువదనంగల; దేహంబున్= శరీరాన్ని; ఆత్మ+అని= ఆత్మ స్వరూపంఅని; పల్కు= వచించే; కుజనులు+అగువారు= దుర్జను లన్పించుకునేవాళ్లు; మహాత్ములన్= గొప్పమహనీయుల్ని; నిందించుట= తెగడుట; ఆశ్చర్యంబు+కాదు= అచ్చెరువైనదికాదు; అదియున్= అదీ; వారికిన్= ఆ దుష్టులకు; అనుచితంబు (న+ఉచితంబు)= యోగ్యం కానిది; అగున్= అవుతుంది; అని= అనిచెప్పి; వెండియున్= మళ్లీ; ఇట్లు+అనియెన్= ఇలా పల్కింది.

**తా :** తండ్రి తాను చేసే యజ్ఞంలో తన మగనికి భాగం కల్పించలేదనీ, ఆహ్వానించక చిన్నచూపు చూశాడని గ్రహించుకుంది. ఈ ముల్లోకాల్ని బుగ్గి చేద్దామన్నంత కోపం తనలో రగులుకొంది. శివుడంటే గిట్టనివాడు, నేనే యజ్ఞకర్మను ఆచరిస్తున్నాననే పొగరుగల దక్షుణ్ణి చంపివేస్తామని శివుడి అనుచరులు పూనుకున్నారు. వాళ్లను వారించి, చాలా కోపంగా తండ్రితో ఇలా పలికింది. మహాదేవుడు, ప్రపంచంలోని శరీరధారులైన సమస్తజీవకోటికి ప్రియమైనవాడు. అలాంటి ఈశ్వరుడికి వీళ్లలో ఇష్టమైనవాళ్లు, ఇష్టంకాని వాళ్లు, అధికులు అనేవారే ఉండరు. సకల జగత్తుకీ కారణస్వరూపుడు, అసూయపడే తత్త్వం లేనివాడు అతడే. నీవు తప్ప మరెవ్వరూ శివుణ్ణి వ్యతిరేకించరు. (కాదనుకోరు)

అంతేకాదు మీబోటివాళ్లు ఇతరుల గుణాల్లో తప్పులు ఎంచుతుంటారు. కొందరు మధ్యస్థులు ఇతరుల దుర్గుణాల్లోని తప్పుల్ని ఎంచరు. కొందరు సత్పురుషులు అన్యుల దోషాలను కూడా సద్గుణాలే అంటారు. వీరిలో సజ్జనులు కొందరు మరీ మంచివాళ్లు ఎదుటివారిలోని దోషాల్ని పట్టించుకోకపోగా వారి నీచగుణాల్నికూడా మంచి గుణాలుగా గుర్తిస్తారు. వీరు మంచివాళ్లల్లో మంచివాళ్లు. అలాంటి సర్వోత్తముల్లో కూడా నీవు చెడ్డ బుద్ధిని ఆపాదించావు అంటూ ఆ సతీదేవి మళ్లీ ఇలా అనడం మొదలు పెట్టింది.

అలాంటి పుణ్యుల అడుగుల దుమ్ముముందు ఎందుకూ పనికిరాని తేజోవంతులూ, మొద్దుతనం గల దేహాన్నే పరమాత్మగా అనుకునే దుష్టులూ, మహాత్ముల్ని తెగడడంలో వింత ఏముంటుంది! అది వారికి అర్థమైంది కాదు. అని మళ్లీ సతీదేవి ఇలా చెప్పింది.

**సీ.** **అనయంబు "శివ" యను నక్షరద్వయ మర్థి వాక్కునఁ బలుక భావమునఁ దలఁప**
**సర్వజీవుల పాపసంఘముల్ సెడు; నట్టి మహితాత్మునందు నమంగళుండ**
**వగు నీవు విద్వేషి వగుట కాశ్చర్యంబు నందెద, వినుము నీ వదియుఁ గాక**
**చర్చింప నెవ్వని చరణపద్మంబుల నరసి బ్రహ్మానంద మను మరంద**

**తే.** **మతులభక్తిని దమ హృదయంబు లనెడి, తుమ్మెదలచేతఁ గ్రోలి సంతుష్టచిత్తు**
**లగుదు రత్యంతవిజ్ఞాను; లట్టి దేవు, నందు ద్రోహంబు సేసి; తే మందు నిన్ను? 87**

**ప్రతి :** అనయంబున్= ఎల్లప్పుడూ; 'శివ' అను= 'శివ' అనే; అక్షరద్వయము= రెండు వర్ణాలను; అర్థిన్= ఆసక్తితో; వాక్కునన్= నోటిమాటతో; పలుకన్= ఉచ్చరిస్తే; భావమునన్= ఆత్మలో; తలఁపన్= భావించుకోగానే; సర్వజీవుల= అన్నిప్రాణుల; పాపసంఘముల్= పాపాల సముదాయం; చెడున్= నశించిపోతుంది; అట్టి= అలాంటి; మహిత= పరమ; ఆత్మునందున్= స్వరూపుడియందు; అమంగళుండవు+అగు= అపవిత్రుడవైన; నీవు= నువ్వు; విద్వేషివి= విరోధివి; అగుటన్= కావడానికి; ఆశ్చర్యంబున్= అచ్చెరువును; అందెదన్= పొందుతున్నాను; వినుము; అదియున్+కాక= అంతేకాక; అతి+అంత= మిక్కిలి; విజ్ఞానులు= విశేష విజ్ఞానవంతులు; చర్చింపన్= ఆలోచింపగా; ఏ+వాని= ఏ శివుడి; చరణపద్మంబులన్= పాదకమలాలను గూర్చి; అరసి= తెలిసికొని; బ్రహ్మానందము+అను= బ్రహ్మరసమను; మరందము= తేనెను; అతుల= ఎనలేని; భక్తిని= అనురాగంతో; తమ= తమయొక్క; హృదయంబులు+అనెడి= మనస్సులనే; తుమ్మెదలచేతన్= షట్పదాలచేత; క్రోలి= ఆస్వాదించి; సంతుష్ట= సంతృప్తి పొందిన; చిత్తులున్= మనస్సుకలవారు; అగుదురు= అవుతారో; అట్టి= అలాంటి; దేవుని+అందున్= ప్రభువుపట్ల; ద్రోహంబున్= కీడును; చేసితి= ఆచరించావు; నిన్నున్= నిన్ను; ఏమి+అందున్= ఏమని అనగలను.

**తా :** నిత్యం 'శివ' అనే రెండక్షరాలు ఇష్టంగా నోటపలికినా, మనసులో అనుకున్నా, సమస్త ప్రాణికోటికి పాపసముదాయాలన్నీ తుడిచి పెట్టుకుపోతాయి. అలాంటి గొప్ప స్వభావం కలవాడు శివుడు. అమంగళుడవైన నీవు అతడికి శత్రువు కావడం నాకు వింతగా ఉంది. కాని ఒక్కమాట విను. బ్రహ్మవేత్తలు యుక్తాయుక్త విచక్షణతో 'బ్రహ్మానందం' అనే తేనెను సాటిలేని భక్తితో, హృదయాలనే తుమ్మెదలతో త్రాగి, శివుడి పాదపద్మాలను గూర్చి తెలిసికొని సంతృప్తులవుతుంటారు. అటువంటి స్వామికి నువ్వు ద్రోహం చేశావు. నిన్ను ఏమని అనగలను. (అనేందుకు ఏమీ లేదని భావం).

**క. మఱియును నమ్మహితాత్మuni, చరణసరోజాతయుగము సకలజగంబుల్**
**నెఱిఁ గొలువఁగోరు కోర్కులు, దరమిడి వర్షించు నతనిఁ దగునే తెగడన్? 88**

**ప్రతి :** మఱియునున్= మళ్లీను; ఆ+మహిత+ఆత్మునిన్= ఆ పరమపురుషునియొక్క; చరణ= పాద; సరస్+జాత= పద్మముల; యుగమున్= జంటను; సకలజగంబుల్= అన్నిలోకాలు; నెఱిన్= నిండుగా; కొలువన్= సేవించగా; కోరు= వాంఛించేవారి; కోర్కులు= కోరికలు; తరము+ఇడి= వరుసపెట్టి; వర్షించున్= కురుస్తుంటాయి; అతనిన్= అతణ్ణి; తెగడన్= దూషించడం; తగును+ఏ= ఒప్పునా?

**తా :** ఇంకా ఆ మహితాత్ముని పాదపద్మాల జంట, లోకాలన్నీ నిండుగా కొలువగా వారు కోరెడి కోర్కులు వరుసపెట్టి వర్షిస్తాయి. అలాంటి శివుణ్ణి దూషించడం తగునా?

**చ. పరఁగఁ జితాస్థిభస్మనృకపాలజటాధరుఁడుం బరేత భూ**
**చరుఁడు పిశాచయుక్తుఁడని శర్వు నమంగళుగాఁ దలంప రె**
**వ్వరు; నొకఁడీవు దక్క, మఱి వాక్పతిముఖ్యులు నమ్మహాత్మ స**
**చ్చరణసరోజరేణువులు సమ్మతిఁ దాల్తురు మస్తకంబులన్. 89**

**ప్రతి :** పరఁగన్= ఒప్పుగా; చితా= చితిపై ఉండే; అస్థి= ఎముకలు; భస్మ= బూడిద; నృ= నరుల; కపాల= పుర్రెలు; జటా= జడలు; ధరుఁడున్= తాల్చినవాడు; పరేతభూ= వల్లకాటిలో; చరుఁడు= తిరిగేవాడు; పిశాచ= భూతాలతో; యుక్తుఁడు= కలసి ఉండేవాడు; అని= అని భావించి; శర్వున్= ఈశ్వరుణ్ణి; ఈవు= నీవు; ఒక్కఁడు+తక్క= ఒక్కడు తప్ప; ఎవ్వరున్= ఏ ఒక్కరూ; అమంగళున్+కాన్= అశుభంకరునిగా; తలంపరు= భావించరు; మఱి= తిరిగి; వాక్పతి ముఖ్యులు= బ్రహ్మాదులుకూడా; ఆ+మహాత్మున్= ఆ మహనీయుడి; సత్+చరణ= యోగ్యమైన పాదాలనే; సరోజ= పద్మాల; రేణువులున్= పరాగపు నలకలను; సమ్మతిన్= మంచిబుద్ధితో; మస్తకంబులన్= తలలందు; తాల్తురు= ధరిస్తారు.

**తా :** చితిలోని ఎముకలు, బూడిద, మానవుల కపాలాలు, జడలు ధరించి శ్మశానంలో తిరుగుతుంటాడు. పిశాచాలతో కలసి ఉంటాడని నువ్వు తప్ప మరెవ్వరూ శివుణ్ణి అమంగళుడని తలంపరు. పైగా బ్రహ్మాది దేవతలంతా శివుని యోగ్యమగు పాదపద్మాల పరాగపు ధూళిని మంచిబుద్ధితో శిరస్సున ధరిస్తారు.

**చ. నెలకొని ధర్మపాలనవినిర్మలు భర్గుఁ దిరస్కరించు న**
**క్కలుషుని జిహ్వఁగోయఁదగుఁ గా; కటుసేయఁగ నోపఁడేని దాఁ**
**బొలియుట యొప్పు; రెంటికిఁ బ్రభుత్వము సాలమిఁ గర్ణరంధ్రముల్**
**బలుపుగ మూసికొంచుఁ జనఁ బాడి యటందురు ధర్మవర్తనుల్. 90**

**ప్రతి :** నెలకొని= కుదురుకొని; ధర్మపాలన= పుణ్యరక్షణలో; వినిర్మలున్= కల్మషంలేని; భర్గున్= శివుని; తిరస్కరించు= దూషించే; ఆ+కలుషుని= ఆ పాపాత్ముని; జిహ్వన్= నాలుకను; కోయన్= త్రెంచడం; తగున్= యోగ్యం; కాక= అగుగాక; అటు= ఆ విధంగా; చేయన్+కన్= చేయడానికి; ఓపఁడు+ఏనిన్= శక్తుడు కాకపోతే; తాన్= తనకు తానుగా; పొలియుట= మరణించడం; ఒప్పు= మేలు; రెంటికిన్= ఈ రెండింటికి; ప్రభుత్వము= దొరతనం; చాలమిన్= తగనిదైతే; కర్ణరంధ్రముల్= చెవుల చిల్లులను; బలుపు+కన్= బలంగా; మూసికొంచున్= కప్పుకుంటూ; చనన్= వెళ్లిపోవడం; పాడి= న్యాయం; అటు= ఆ ప్రకారంగా; ధర్మవర్తనుల్= నీతిమంతులు; అందురు= అంటారు.

**తా :** ధర్మరక్షణలో నిష్కల్మషంగా ఉండే శివుణ్ణి దూషించే దురాత్ముడి నాలుకను తెగకోయడం తగినపనే అవుతుంది. అలా చేయను చేత కాకపోతే మరణించడం ఉత్తమం. ఈ రెంటికీ శక్తి చాలకపోతే చెవులు రెండూ గట్టిగా మూసుకుంటూ వెళ్లడం న్యాయం అని నీతిమంతులు చెప్తుంటారు.

**వ. అది గావున** **91**

**ప్రతి :** అది+కావునన్= ఆ కారణంచేత...

**తా :** అందువల్ల

**మ. జనుఁడజ్ఞానమునన్ భుజించిన జుగుప్సంబైన యన్నంబు స**
**య్యన వెళ్ళించి పవిత్రుఁడైన గతి దుష్టాత్ముండవై యీశ్వరున్**
**ఘను నిందించిన నీ తనూభవ ననంగా నోర్వ, నీ హేయ భా**
**జనమైనట్టి శరీరమున్ విడిచి భాస్వచ్ఛుద్ధిఁ బాటిల్లెదన్.** **92**

**ప్రతి :** జనుఁడు= మానవుడు; అజ్ఞానమునన్= తెలియక పోవడంవల్ల; జుగుప్సంబు అయిన= ఏహ్యం కల్గించే; అన్నంబున్= ఆహార పదార్థాన్ని; భుజించినన్= తిన్నట్లయిన; చయ్యన= వెంటనే; వెళ్లించి= వెడల గక్కించి; పవిత్రుఁడు+ఐ= శుచి అయిన; గతిన్= విధంగా; దుష్ట+ఆత్ముండవు+ఐ= చెడుమతికలవాడవై; ఘనున్= గొప్పవాడైన; ఈశ్వరున్= శివుణ్ణి; నిందించిన= తెగడిన; నీ= నీయొక్క; తనూభవన్= ఆత్మజను; అనన్+కాన్= అన్పించుకోవడాన్ని; ఓర్వన్= సహించను; ఈ హేయ= ఈ రోతకు; భాజనమైన+అట్టి= పాత్రమైనట్టి; శరీరమున్= దేహాన్ని, త్యజించి= విడచి; భాస్వత్= ప్రకాశమానమైన; శుద్ధిన్= పవిత్రతతో; పాటిల్లెదన్= ఉంటాను.

**తా :** మానవుడు తెలియనితనంతో ఏహ్యం పుట్టించే ఇష్టంకాని తిండి పదార్థాల్ని తిన్నపుడు వెంటనే బయటకు కక్కి శుద్ధుడవుతాడు. అట్లే నీవు కుత్సితమతివి. పూజ్యుడైన శివుణ్ణి తిరస్కరించిన వాడివి. నీ బిడ్డగా నన్ను చెప్పడం నేను సహించలేను. నీ వల్ల కల్గిన ఈ నీచమైన శరీరాన్ని వదలిపెట్టి పవిత్రంగా ఉండదలచాను.

**వ. అదియునుం గాక దేవతల కాకాశగమనంబును, మనుష్యులకు భూతలగమనంబును, స్వాభావికంబు లయినట్లు ప్రవృత్తినివృత్తిలక్షణకర్మంబులు రాగవైరాగ్యాధికారంబులుగా వేదంబులు విధించుటం జేసి రాగయుక్తులై కర్మతంత్రులయిన సంసారులకు వైరాగ్యయుక్తులయి యాత్మారాము లయిన యోగిజనులకు విధినిషేధరూపంబు లయిన వైదికకర్మంబులు గలుగుటయు లేకుండుటయు నైజంబు లగుటంజేసి స్వధర్మ**

**నిష్ఠం దగువాని నిందింప జన; దా యుభయకర్మశూన్యుండు బ్రహ్మభూతుండు నయిన సదాశివునిఁ గ్రియాశూన్యుండని నిందించుట పాపంబగు, తండ్రీ! సంకల్పమాత్ర ప్రభవంబు లగుటం జేసి మహాయోగి జనసేవ్యంబు లయిన యస్మదీయంబు లగు నణిమాద్యష్టైశ్వర్యంబులు నీకు సంభవింపవు; భవదీయంబులగు నైశ్వర్యంబులు ధూమమార్గప్రవృత్తులై యాగాన్న భోక్తలైన వారిచేత యజ్ఞశాలయందె చాల నుతియింపంబడి యుండుఁగాన నీ మనంబున నే నధిక సంపన్నుండ ననియుఁ, జితాభస్మాస్థిధారణుండైన రుద్రుండు దరిద్రుం డనియును గర్వింపం జనదని వెండియు నిట్లనియె. 93**

**ప్రతి :** అదియున్+కాక= అంతేకాక; దేవతలకున్= వేలుపులకును; ఆకాశగమనంబును= ఆకాశంలో పయనించడమూ; మనుష్యులకున్= నరులకు; భూతలగమనంబును= నేల మీది పయనమూ; స్వాభావికంబులు= సహజాలు; అయినట్లు= అయినరీతి; ప్రవృత్తి= ప్రవృత్తి అనేది; నివృత్తి= నివృత్తి అనేది; లక్షణ= స్వరూపంగాకల; కర్మంబులున్= కర్మలను; రాగ= అనురాగం; వైరాగ్య= విరక్తి; అధికారంబులుగాన్= యోగ్యతలుగా; వేదంబులు= వేదాలు; విధించుటన్+చేసి= ఆజ్ఞాపించడంవల్ల; రాగయుక్తులు+ఐ= ప్రేమకలవారయి; కర్మతంత్రులు= పనిచేయు విధానం తెలిసినవారు; అయిన= అయినట్టి; సంసారులకున్= గృహస్థులకూ; వైరాగ్యముచే= వైరాగ్యంతో; యుక్తులు+అయి= కూడిఉన్న; ఆత్మారాములు+ అయిన= ఆత్మానందం కల; యోగిజనులకున్= ధ్యాననిష్ఠులైనవారికీ; విధి= చేయడం; నిషేధం= చేయకపోవడం; అనే; రూపంబులు+అయిన= విధాలు కలవి అయిన; వైదిక కర్మంబులు= వేదసంబంధితమైన పనులు; కలుగుటయున్= పొందడం; లేకుండుటయున్= పొందకపోవడమున్నూ; నైజంబులు= సహజాలు; అగుటన్+చేసి= అవడం వల్ల; స్వధర్మ= తన యొక్క; ధర్మ= పుణ్యకార్యాల్లో; నిష్ఠుండు+అగువానిన్= నిలుకడగల వాడిని; నిందింపన్= దూషించడం; చనదు= ఒప్పదు; ఆ ఉభయకర్మ= ఆ రెండు పనులూ; శూన్యుండు= లేనివాడు; బ్రహ్మభూతుండున్= బ్రహ్మస్వరూపుడూ; అయినన్= అయినట్టి; సదాశివునిన్= సదాశివుని; క్రియాశూన్యుండు+అని= కర్మాచరణం లేనివాడు అని; నిందించుట= అవమానించడం; పాపంబు+అగు= పాపం అవుతుంది; తండ్రీ= నాన్నా; సంకల్పమాత్ర= ఉద్దేశం కొద్దీ; ప్రభవంబులు+అగుటన్+చేసి= పుట్టినవి అవడంవల్ల; మహాయోగిజన= మహాధ్యానవంతులైనవారికి; సేవ్యంబులు+అయిన= సేవింపదగినవి అయినట్టి; అస్మదీయంబులు+అగు= మాకు చెందినవి అయిన; అణిమ+ఆది= అణిమ మొదలైన; అష్ట= ఎనిమిది సంఖ్యగల; ఐశ్వర్యంబులు= సంపదలు; నీకున్= నీకు; సంభవింపవు= కలుగనేరవు; భవదీయంబులు+అగున్= నీకు చెందినవి అయినట్టి; ఐశ్వర్యంబులు= భాగ్యాలు; ధూమమార్గ ప్రవృత్తులు+ఐ= ధూమ మార్గంలో ప్రవర్తించేవారై; యాగ= యజ్ఞకర్మల్లో; అన్న= అన్నం మొదలైనవి; భోక్తలు అయినవారి చేతన్= తృప్తిగా తినేవారిచే; యజ్ఞశాల+అందె= యజ్ఞవాటిక అందు మాత్రమే; చాల= ఎక్కువగా; నుతియింపన్+పడి= స్తుతించబడి; ఉండున్+కాన= ఉంటుంది కనక; నీ మనంబున= నీదు చిత్తంలో; నేను= నేను; అధిక సంపన్నుండన్= భూరి సంపదలు కలవాడను; అనియున్= అనీ; చితా= సొదమీది; భస్మ= బూడిద; అస్థి= బొమికెలు; ధారణుండు+అయిన= ధరించేవాడైన; రుద్రుండు= శివుడు; దరిద్రుండు అనియును= పేదవాడు అనీ; గర్వింపన్= అహంకరించడం; చనదు= తగదు; అని= అని పలికి; వెండియున్= మళ్లీ; ఇట్లు= ఇలా; అనియెన్= పల్కింది.

**తా :** అంతేకాదు దేవుళ్లకు ఆకాశసంచారం, మానవులకు భూతలసంచారమూ సహజములైనవి. అదే రీతిగా ప్రవృత్తి రూప కర్మలకు రాగం, నివృత్తి రూప కర్మలకు వైరాగ్యం, తగినవని వేదాలు ఆదేశిస్తున్నాయి. సరాగులై కర్మజ్ఞులయిన

భౌతిక జీవనులకూ, విరాగులై ఆత్మారాములయిన యోగి సముదాయాలకూ విధి, నిషేధరూపంలో వైదికకర్మలు పొందడం పొందకపోవడం అనేది ప్రకృతి ధర్మం. అందువల్ల తన ధర్మనిర్వహణలో స్థిరుడైన వారిని దూషించడం తగనిపని.

ఈ రెండూ కర్మ విధానాలను నిర్వహించనివాడు, బ్రహ్మస్వరూపుడయిన శివుణ్ణి పనీపాటలేనివాడని అవమానించడం గొప్ప పాపం.

నాన్నా! సంకల్ప మాత్రంగా కల్గేవి అణిమాది అష్టసిద్ధులు. వీటిని మహాయోగులందరూ కొలుస్తుంటారు. అవి నీకు సిద్ధించవు. నీకు సంబంధించిన సంపత్తిని యాగాదికర్మలు ఆచరించేవారూ యాగవిధుల్లో ఆ అన్నపానాదులతో తృప్తి పొందేవారూ యజ్ఞశాలలో ఎంతగానో పొగడుతుంటారు. ఆ ప్రశంసలు నీ మనస్సులో భూరి సంపన్నుడననుకొని 'చితి మీది బూడిదను, బొమికల్ని, దండలుగా వేసుకునే శివుడు పేదవాడ'ని విర్రవీగడం నీకు ఒప్పని పని. అని చెప్పి మళ్లీ ఇలా అంది.

**విశే :** 1. అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశిత్వం, వశిత్వం అనేవి అష్టసిద్ధులు.

2. ధూమమార్గం : పుణ్యకార్యాలు చేసినవారు శరీరపతనానంతరం స్వర్గానికి వెళ్ళేమార్గాన్ని ధూమమార్గం అంటారు.

**ఉ. నీలగళాపరాధి యగు నీకుఁ దనూభవ నౌట చాలదా!**
**చాలుఁ గుమర్త్య! నీదు తనుజాత ననన్ మది సిగ్గు పుట్టెడి**
**న్నేల ధరన్ మహాత్ములకు నెగ్గొనరించెడి వారి జన్మముల్**
**గాలుపనే? తలంప జనకా! కుటిలాత్మక! యెన్ని చూడఁగన్! 94**

**ప్రతి :** కుటిలాత్మక= కుత్సితుడవైన; జనకా= ఓ తండ్రీ!; తలంపన్= విచారించగా; నీలగళ= నల్లని కంఠంగల శివుడికి; అపరాధి+అగున్= ద్రోహి అయినట్టి; నీకున్= నీకు; తనూభవన్= శరీరంనుండి పుట్టిన కుమార్తెను; ఔట= అవడం; చాలదా= సరిపోదా; కుమర్త్య= దుష్ట జనుడ!; చాలున్= ఇకచాలు; నీ+తనుజాతన్= నీ శరీరం నుండి పుట్టిన దానను; అనన్= అనడానికి; మదిన్= మనస్సులో; సిగ్గుపుట్టెడిన్= సంకోచం కలుగుతుంది; ధరన్= నేలమీద; మహా+ఆత్ములకున్= పరమాత్ములకు; ఎగ్గు= కీడు; ఒనరించెడి వారి= చేసేవారి యొక్క; జన్మముల్= పుట్టుకలు; ఏల= ఎందుకు; ఎన్ని చూడఁ గన్= ఎంచి చూడగా; కాలుపను+ఏ= కాల్చడానికా ఏమి?

**తా :** ఆ నీలకంఠుడికి ద్రోహం తలపెట్టిన నీ కూతురుగా పుట్టడమే చాలు. ఓ దుష్టాత్ముడా! నీ కుమార్తెనని చెప్పుకోవడానికి బిడియపడ్తున్నాను. జనకా! కుటిలాత్మకా! పరమ పురుషులకు అపకారం తలపెట్టేవారి పుట్టుకలు ఎందుకు? ఎంచి చూడగా కాల్చడానికా?

**చ. వరవృషకేతనుండు భగవంతుఁడు నైన హరుండు నన్ను నా**
**దర పరిహాసవాక్యముల "దక్షతనూభవ!" యంచుఁ బిల్వ నేఁ**
**బురపురఁ బొక్కుచున్ ముదముఁ బొందక నర్మవచస్స్మితంబులం**
**దొఱఁగుదు? నీ తనూజ నను దుఃఖముకంటెను జచ్చు టొప్పగున్. 95**

**ప్రతి :** వర= (జాతికి) ఉత్తమమైన; వృష= ఎద్దు చిహ్నంకల; కేతనుండు= జెండా కలవాడూ; భగవంతుఁడున్= దైవమున్నూ; ఐన= అయినట్టి; హరుండు= శివుడు; నన్నున్= నన్ను; ఆదర= గౌరవంగానో; పరిహాస= వేళాకోళంగానో; వాక్యములన్=

పలికేపలుకుల్లో; దక్షతనూభవ= దక్షుడి పుత్రిక; అంచున్= అంటూ; పిల్వన్= పిలువగా; ఏన్= నేను; పురపురన్= పురపురమని; పొక్కుచున్= దుఃఖిస్తూ; ముదమున్= ఆనందాన్ని; పొందక= అనుభవించక; నర్మవచస్= పరిహాసపు మాటలతో; స్మితంబులన్= చిరునవ్వులను; తొఱఁగుదు= వదలిపెట్టాను; నీ= నీ యొక్క; తనూజను= దేహంవలన పుట్టినదానను; అను= అనే; దుఃఖము కంటెను= శోకంకంటే; చచ్చుట= ప్రాణం పోవడమే; ఒప్పు+అగున్= మంచిది అవుతుంది.

**తా :** శ్రేష్ఠమైన ఎద్దు కేతనముగా కల దైవం అయిన శివుడు నన్ను ఆదరంతోనో, ఎకసక్కెంగానో 'దక్షతనూభవ' అని పిలిస్తే, ఆ మాటలకు నేను పురపురమని దుఃఖిస్తూ ఆ సంతోషాన్ని పొందలేను. ఆ మేలపు మాటల్లోని చిరునవ్వును పోగొట్టుకుంటున్నాను. నీ కూతురును అనే దుఃఖంకంటే చావడం మంచిగా వుంటుంది.

**వ. అని యిట్లు యజ్ఞసభామధ్యంబునం బ్రతికూలుండగు దక్షు నుద్దేశించి పలికి కామక్రోధాది శత్రువిఘాతిని యగు సతీదేవి యుదఙ్ముఖియయి జలంబుల నాచమనంబు సేసి శుచియై మౌనంబు ధరియించి జితాసనయై భూమియం దాసీన యగుచు యోగమార్గంబునం జేసి శరీరత్యాగంబు సేయం దలచి. 96**

**ప్రతి :** అని= అనిభావించి; ఇట్లు= ఈ విధంగా; యజ్ఞసభా మధ్యంబునన్= యజ్ఞశాల మధ్యలో; ప్రతికూలుండు+అగు= విరోధి అయిన; దక్షున్= దక్షుణ్ణి; ఉద్దేశించి= గురించి; పలికి= మాట్లాడి; కామ= కోరిక; క్రోధ= కోపం; ఆది= మొదలు గాగల(అరిషడ్వర్గాలనే); శత్రువిఘాతిని+అగు= శత్రునాశనకారి అయిన; సతీదేవి= సతీదేవి; ఉదక్+ముఖి+అయి= ఉత్తర దిక్కువైపు మొగం ఉంచుకొన్నదై; జలంబులన్= నీటిని; ఆచమనంబు+చేసి= అరచేతిలో నీళ్లు పోసుకుని మంత్రం పలుకుతూ పుచ్చుకుని; శుచి+ఐ= పరిశుద్ధురాలై; మౌనంబు= మాటలను మానడం; ధరియించి= తాల్చి; జిత= అనుకూలమైన; ఆసన+ఐ= ఆసనం వేసిందై; భూమి+అందున్= నేలమీద; ఆసీన+అగుచున్= కూర్చుని; యోగమార్గంబునన్+చేసి= యోగమార్గంలో; శరీర త్యాగంబు+చేయన్= శరీరం వీడాలని; తలంచి= భావించి...

**తా :** అని ఈ విధంగా తీర్చి ఉన్న యాగసభామధ్యలో విరోధియైన దక్షునితో పలికి, అరిషడ్వర్గాల్ని జయించిన ఆ సతీదేవి ఉత్తరంవైపుకి ముఖంపెట్టి నీటిని సమంత్రకంగా స్పృశించి పవిత్రురాలయింది. ఇంకా ఏమీ మాట్లాడదలచుకోనిదై తగిన యోగాసనంలో నేలమీద కూర్చుంది. యోగమార్గంలోనే శరీరాన్ని త్యజించాలని నిర్ణయించుకుని

**సీ. వరుసఁ బ్రాణాపానవాయునిరోధంబు గావించి వాని నేకముగ నాభి**
**తలమునఁ గూర్చి యంతట నుదానము దాక నెగయించి బుద్ధితో హృదయపద్మ**
**మున నిల్పి వాని మెల్లన కంఠమార్గము నను మఱి భ్రూమధ్యమున వసింపఁ**
**జేసి శివాంఘ్రిరాజీవ చింతనముచే నాథునిఁ దక్క నన్యంబుఁ జూడ**

**తే. కమ్మహాత్ముని యంకపీఠమ్మునందు, నాదరంబున నుండు దేహంబు దక్షు**
**వలని దోషంబునను విడువంగఁ దలఁచి, తాల్చెఁ దనువున ననిలాగ్నిధారణములు. 97**

**ప్రతి :** వరుసన్= క్రమంగా; ప్రాణ= ప్రాణం; అపాన= అపానమనే; వాయు= వాయువుల; నిరోధంబు+కావించి= అడ్డగించి; వానిన్= వాటిని; ఏకము+కన్= సమానంగా; నాభితలమునన్= బొడ్డుప్రదేశంలో; కూర్చి= నిలిపిపెట్టి; అంతటన్=

ఆ తర్వాత; ఉదానము దాకన్= బొడ్డుదాకా; ఎగయించి= వ్యాపింపచేసి; బుద్ధితో= తెలివితో; హృదయపద్మమునన్= మనః పద్మంలో; నిల్పి= ఆపి, ఉంచి; వానిన్= వాటిని; మెల్లన= ఒయ్యన; కంఠమార్గమునను= కంఠబిలంనుంచి; మఱి= ఇంకా; భ్రూమధ్యమునన్= కనుబొమల మధ్యన; వసింపన్+చేసి= ఉండేలాచేసి; శివ+అంఘ్రిరాజీవ= పరమేశ్వరుని పాదపద్మాల మీది; చింతనముచే= ధ్యానంచే; నాథునిన్+తక్క= భర్తను తప్ప; అన్యంబున్= ఇతరమైన దానిని; చూడక= చూడకుండా; ఆ+మహా+ఆత్ముని= ఆ మహా పురుషుని; అంకపీఠమ్మున+అందున్= ఒడి అనే పీట మీద; ఆదరంబునన్= మన్ననతో; ఉండు= ఉండే; దేహంబున్= శరీరాన్ని; దక్షువలని= దక్షుడివల్ల కల్గిన; దోషంబునను= అపరాధంచేత; విడువన్+కన్= త్యజించాలని; తలఁచి= నిశ్చయించి; తనువునన్= శరీరం మీద; అనిలాగ్ని ధారణములు= వాయువునూ, అగ్నినీ ఉత్పత్తి చేయుటకవసరమైన ధ్యానమును; తాల్చెన్= ధరించింది.

**తా :** వరుసగా ప్రాణవాయువు, అపానవాయువుల్ని సమానంచేసి, ధ్యానమును నాభిస్థానంలో నిలిపి, ఆ తర్వాత ఉదానవాయువుని బొడ్డుపైకి నెట్టి, క్రమంగా హృదయంలో పట్టి ఉంచింది. వాటిని క్రమంగా కంఠంనుంచి కనుబొమల నడుమకు పంపించింది.

ఆ సతీదేవి, శివుని పాదపద్మాలమీది ధ్యాసతో పతిని తప్ప మరొకటి చూడజాలకపోయింది. ఆ మహాదేవుడి ఒడిలో మన్నన పొందిన దేహాన్ని, దక్షుడి అపరాధ హేతువుగా విడిచిపెట్టాలనుకుంది. శరీరంలో గాలి, అగ్నుల ఉత్పత్తికి తగిన ధ్యానం చేసింది.

**వ. ఇట్లు ధరియించి గత కల్మషంబైన దేహంబుగల సతీదేవి నిజయోగసమాధిజనితం బయిన వహ్నిచేఁ దత్క్షణంబ దగ్ధ యయ్యె నంత. 98**

**ప్రతి :** ఇట్లు= ఇలా; ధరియించి= యోగాగ్నిని తాల్చి; గత= విడచిన; కల్మషంబు+ఐన= మకిల కలది అయిన; దేహంబు= తనువు; కల= కల్గిన; సతీదేవి= శివుడిభార్య; నిజయోగ= స్వకీయ ధ్యాన సంబంధమైన; సమాధి= నియమంవల్ల; జనితంబు+అయిన= పుట్టినట్టి; వహ్నిచేన్= అగ్నిచే; తత్క్షణంబు+అ= ఆ నిమిషమే; దగ్ధ+అయ్యెన్= కాలిపోయింది; అంతన్= ఆ పిమ్మట...

**తా :** ఆ విధంగా ధ్యానంచేయడంవల్ల నిర్మలమైన దేహం కలిగిన సతీదేవి తన యోగసమాధివల్ల పుట్టిన నిప్పుల్లో ఆ మరుక్షణమే కాలిపోయింది. ఆ తర్వాత

**క. అది గనుఁగొని హాహాధ్వని, వొదలఁగ నిట్లనిరి మానవులుఁ ద్రిదశులు నీ**
**మదిరాక్షి యకట! దేహము, వదలెఁగదా! దక్షుతోడి వైరము కతనన్. 99**

**ప్రతి :** అది= ఆ దృశ్యాన్ని; కనున్+కొని= చూసి; మానవులున్= మనుష్యులు; త్రిదశులున్= వేల్పులూ; హాహాధ్వని= హాహాకారాలు; పొదలఁగన్= చుట్టుముట్టగా; ఇట్లు= ఇలా; అనిరి= పల్కారు; అకట!= అయ్యో; మదిర+అక్షి= చక్కని ఇల్లాలైన సతీదేవి; దక్షుతోడి= దక్షుడితో; వైరముకతనన్= విరోధం కారణంగా; దేహము= తనువును; వదలెన్+కదా= వీడింది కదా!.

**తా :** దాన్ని చూసిన మనుష్యులూ, దేవతలూ హాహాకారాలు చేశారు. అయ్యో! మంచి లక్షణవతి అయిన సతీదేవి దక్షుడితో వైరంవల్ల ప్రాణాలు పోగొట్టుకుంది కదా! అంటూ వాపోయారు.

**వ. మఱియు నిట్లనిరి. 100**

**ప్రతి :** మఱియున్= మళ్లీ, ఇట్లు= ఇలా, అనిరి= మాట్లాడారు.

**తా :** మళ్లీ ఇంకా ఇలా అన్నారు.

**సీ. సకలచరాచరజనకుఁడై నట్టి యీ దక్షుండు దన కూర్మితనయ మాన**
**వతి పూజనీయ యీ సతి దనచే నవమానంబు నొంది సమక్షమందుఁ**
**గాయంబు దొఱఁగంగఁ గనుఁగొను చున్నవాఁడిట్టి దురాత్ముఁ డెందేనిఁ గలఁడె?**
**యనుచుఁ జిత్తంబుల నాశ్చర్యములఁ బొంది, రదియునుఁగాక యిట్లనిరి యిట్టి**

**తే. దుష్టచిత్తుఁడు బ్రహ్మబంధుండు నయిన, యీతఁ డనయంబుఁ దా నపఖ్యాతిఁ బొందు**
**నిందఁబడి మీఁద దుర్గతిఁ జెందుగాక, యనుచు జనములు పలుకు న య్యవసరమున. 101**

**ప్రతి :** సకల= సమస్తమైన; చర= కదిలేవి; అచర= కదలనివి అయిన ప్రాణిసంతానానికి; జనకుఁడు= జననకారకుడైన తండ్రి; ఐనట్టి= అయినటువంటి; ఈ, దక్షుండు= ఈ దక్షప్రజాపతి; తన= తానుకన్న; కూర్మి= అత్యంత ప్రియమైన; తనయ= ముద్దులపట్టి; మానవతి= చిత్తఔన్నత్యం కలది; పూజనీయ= గౌరవ పాత్రమైనది అయిన; ఈ, సతి= ఈ భవాని; తనచేన్= తనవల్ల; అవమానంబున్= తిరస్కారాన్ని; ఒంది= పొంది, సమక్షము; అందున్= తన కళ్ల ఎదుటన; కాయంబు= శరీరం; తొఱఁగంగన్= వదలగా; కనుఁగొనుచున్ ఉన్నవాఁడు= కళ్లప్పగించి చూస్తూ ఉన్నట్టివాడు; ఇట్టి= ఇటువంటి; దుర్+ఆత్ముఁడు= చెడుమనసుగలతండ్రి; ఎందున్; ఏనిన్= ఏ లోకంలో అయినా; కలఁడె= ఉన్నాడా!; అనుచున్= అంటూ; చిత్తంబులన్= మనస్సుల్లో; ఆశ్చర్యములన్= అబ్బురపాటులను; పొందిరి= ఒందిరి; అదియునున్, కాక= అంతేకాకుండా; ఇట్లు= ఈ విధంగా; అనిరి= నిష్ఠూరాలాడారు; ఇట్టి= ఇంతటి; దుష్టచిత్తుఁడున్= పాపాత్ముడూ; బ్రహ్మబంధుండున్= భ్రష్టబ్రాహ్మణుడూ; అయిన= ఐన; ఈతఁడు= ఈ దక్షుఁడు; అనయంబున్= అనుదినమూ (అవశ్యం); తాన్= తానుగా; అపఖ్యాతిన్= చెడ్డపేరును; పొందున్= ఒందుతాడు; నిందన్, పడి= అపవాదం పొంది; మీఁద= ఇకపైన; దుస్+గతిన్= నరకాన్ని; చెందున్, కాక= తప్పక చేరుకొనునుగాక; అనుచున్= అంటూ; జనములు= లోకులు; పలుకు= తూలనాడుతున్న; ఆ+అవసరమునన్= ఆ తరుణంలో...

**తా :** స్థావర జంగమాత్మకమైన ఈ సకల ప్రాణిలోకాన్ని పుట్టించేవాడు దక్షుడు. ఇతడి గారాబుపట్టి సతీదేవి. అభిమానంగల బిడ్డ. ఇలాంటి తన కన్న కూతురు తన వల్లనే పరాభవం పొందింది. తన కళ్లముందటే తనువు చాలించింది. అయినా కళ్లు తెరుచుకుని చూస్తూ ఉండిపోయాడు తప్ప కన్నకూతురు చావును అభ్యంతరం పెట్టని ఇలాంటి పాపిష్ఠి తండ్రి ఎక్కడన్నా ఉంటాడా! అనుకుంటూ మనసులో ఆశ్చర్యపడినారు. అంతటితో ఊరుకోలేదు. ఇంతటి దుష్టచిత్తుడు, ఇంతటి భ్రష్టబ్రాహ్మడు అయిన ఈ దక్షుడు నిత్యం అపఖ్యాతి పొందుతాడు. నిందలుపడి ఆపై నరకాన్ని పొందుగాక! అని జనులు పలుకు సమయంలో

**క. దేహము విడిచిన సతిఁ గని, బాహాబల మొప్ప రుద్ర పార్షదులును ద**
**ద్ద్రోహిం ద్రుంచుటకై యు, త్సాహంబున లేచి రసిగదాపాణులునై. 102**

**ప్రతి :** దేహము= తనువు; విడిచిన= వదిలిన; సతిన్= సతీదేవిని; కని= చూసి; బాహాబలము= జబ్బబలుపు; ఒప్పన్= ప్రకాశించగా; రుద్ర= శివుడియొక్క; పార్షదులును= అనుచరులున్నూ; తద్= ఆ; ద్రోహిన్= చెడుతలంపు గల దక్షుని;

త్రుంచుటకున్; ఐ= ఉత్తరించడానికై; అసి గదాపాణులును+ఐ= కత్తులు గదలు చేతబూనినవారై; ఉత్సాహంబునన్= ఒక్క ఊపున; లేచిరి= లేచి నిలబడ్డారు.

**తా :** శివుడి ప్రమథగణాలు అలా సతీదేవి శరీరం వీడడాన్ని కళ్లారా చూశారు. తమరెక్కల పుష్టి బయలుపడేలా ఆ ద్రోహి దక్షుణ్ణి చంపడానికి కత్తులూ గదలూ చేతపట్టారు. పూనికగా ఒక్కపెట్టున లేచి నిలబడినారు.

**విశే :** పార్షదులు= సహచరులు, చండీశ్వరుడు, నంది, భృంగి, వీరభద్రుడు మొ॥ శివుడి అనుచరగణం.

**క. ఆ రవ మపు డీక్షించి మ, హారోషము తోడ భృగుమహాముని క్రతుసం**
**హారకమారక మగు నభి, చారకహోమం బొనర్చె సరభసవృత్తిన్. 103**

**ప్రతి :** అపుడు= అదే క్షణంలో; భృగుమహాముని= భృగుమహర్షి; ఆ రవము= ఆ గందరగోళం; ఈక్షించి= చూసి; మహారోషముతోడన్= పట్టలేనంత ఆగ్రహంతో; క్రతు= యాగాన్ని; సంహారక= ధ్వంసంచేసేవాళ్లకు; మారకము+అగు= మరణం కల్గించేదైన; అభిచారక= (అపహతమ్; రక్ష ఇత్యాది యజుర్వేద మంత్రాలతో వేల్చే;) అభిచారకమను= యజ్ఞనాశనాన్ని చేసేవారిని సంహరించే హోమం; హోమంబు= హోమం; సరభసవృత్తిన్= త్వరితంగా; ఒనర్చెన్= నడిపించాడు.

**తా :** అప్పుడు ఆ ప్రమథగణాల శబ్దాన్ని చూచి (విని) భృగుమహాముని మహాకోపంతో క్రతువులను చెరచువారిని చంపుటకై తత్తరపాటుతో అభిచారకహోమాన్ని చేశాడు.

**విశే :** అభిచార హోమం= క్రతుసంహారమారకహోమం; ఇది యజ్ఞనాశకుల హింసార్థం యాగరక్షణార్థం చేసే హోమం. అపహతమ్, రక్ష మొదలైన యజుర్వేద మంత్రాల్ని పఠిస్తూ దక్షిణాగ్నిలో ఆహుతి చేసేది. యాగధ్వంసకుల శక్తిని క్షీణింపచేయడం, తద్వారా యాగధర్మం కాపాడడం ఈ హోమప్రయోజనం.

**వ. ఇట్లు దక్షిణాగ్ని యందు వ్రేల్చిన నందుఁ దపం బొనర్చి సోమలోకంబున నుండు సహస్రసంఖ్యలు గల "ఋభు" నామధేయులైన దేవత లుదయించి బ్రహ్మతేజంబునం జేసి దివ్యవిమానులై యుల్ముకంబులు సాధనంబులుగా ధరియించి రుద్రపార్షదులయిన ప్రమథగుహ్యగణంబులఁ బాఱందోలిన వారును బరాజితులైరి, తదనంతరంబ నారదువలన నభవుండు దండ్రిచే నసత్కృతురా లగుటం జేసి భవాని పంచత్వంబు నొందుటయుం బ్రమథగణంబులు ఋభునామకదేవతలచేఁ బరాజితు లగుటయు విని. 104**

**ప్రతి :** ఇట్లు= ఇలా; దక్షిణ+అగ్ని, అందున్= దక్షిణాగ్నిలో; వ్రేల్చినన్= నేయి మొదలైన వాటిని అర్పించగానే; అందున్= ఆ హోమకుండంనుంచి; తపంబు= తపస్సు; ఒనర్చి= చేసి; సోమలోకంబునన్= చంద్రలోకంలో; ఉండు= వసించే; సహస్రసంఖ్యలు; కల= వేల అంకెల్లో ఉన్న; ఋభునామధేయులు, ఐన= ఋభువులనే పేరుగల; దేవతలు= దేవులు; ఉదయించి= పొడమి; బ్రహ్మతేజంబునన్, చేసి= బ్రహ్మవర్చస్సు చేత; దివ్య= దేవలోకానికి చెందిన; విమానులు,ఐ= విమానాలు కలవారై; ఉల్ముకంబులు= కొఱవులు; సాధనంబులు+కాన్= పోటుముట్లులుగా; ధరియించి= పట్టి; రుద్ర= శివుడి; పార్షదులు+అయిన= అనుచరులు అయినట్టి; ప్రమథ= ప్రమథులూ; గుహ్యక= గుహ్యకులు అనే; గణంబులన్= సమూహాలను; పాఱన్, తోలినన్= వెంటాడి పరుగులు పెట్టించగా; వారును= ఆ యా జట్టులవారున్నూ; పరాజితులు, ఐరి= ఓటమి పొందినవారయ్యారు; తద్+అనంతరంబ= ఆ పిమ్మట; నారదువలనన్= నారదమునివల్ల; అభవుండు=

(పుట్టుకలు లేని) ఆ శివుడు; తండ్రిచేన్= జనకుడైన దక్షుడి కారణంగా; అసత్కృతురాలు+అగుటన్+చేసి= అవమానితురాలు కావడంవల్ల; భవాని= భవునిదేవి 'సతి'; పంచత్వంబున్= పంచభూతభావాన్ని (మరణాన్ని); ఒందుటయున్= పొందడమున్నూ; ప్రమథగణంబులు= ప్రమథులనే సేనలు; ఋభునామక= ఋభువులని పిలిచే; దేవతలచేన్= దేవతలచేతిలో; పరాజితులు= అపజయం పొందినవారు; అగుటయున్= కావడమున్నూ; విని= విన్న...

**తా :** ఈవిధంగా దక్షిణానలంలో హోమద్రవ్యాలు వేల్చాడు. అందుండి తపస్సుచేసి చంద్రలోకంలో ఉంటున్న ఋభువులనే దేవతలు ఆ హోమగుండంనుంచి వేలలెక్కన పుట్టుకొచ్చారు. వాళ్లంతా బ్రహ్మతేజస్సులతో ఉట్టిపడుతున్నారు. ఈ ఋభువులు దివ్యవిమానాలను ఎక్కి కొఱవులను కొరముట్టులుగా పట్టారు. రుద్రానుచరులైన ప్రమథుల, గుహ్యకుల మూకలను తరిమికొట్టగా ఓడిపోయారు. ఆపైన కన్నతండ్రి వల్ల పొందిన అమర్యాదవల్ల కల్గిన సతీదేవి చావువార్తా, ఋభుదేవతలు ప్రమథసేనలను జయించిన సంగతీ, నారదముని మాటల్లో శివుడు విని

**శా. ఆద్యుం డుగ్రుఁడు నీలకంఠుఁ డిభదైత్యారాతి దష్టోష్ఠుఁడై**
**మాద్యద్భూరిమృగేంద్రఘోషమున భీమప్రక్రియన్ నవ్వుచున్**
**విద్యుద్వహ్నిశిఖాసముచ్చయరుచిన్ వెల్గొందు చంచజ్జటన్**
**సద్యఃక్రోధముతోడఁ బుచ్చి వయిచెన్ క్ష్మాచక్రమధ్యంబునన్. 105**

**ప్రతి :** ఆద్యుండు= ఆదిదేవుడు; ఉగ్రుఁడు= భయంకరుడు; నీలకంఠుడు= నల్లనికంఠం కలవాడు; ఇభదైత్య= గజాసురుని; అరాతి= శత్రువు; దష్ట= కఱచుకొన్న; ఓష్ఠుఁడు+ఐ= పెదవికలవాడూఅయి; మాద్యత్= మత్తిల్లిన; భూరి= పెద్ద; మృగ+ఇంద్ర= మృగరాజైన సింహంయొక్క; ఘోషమునన్= కఠోరమైన గర్జనతో; భీమ= భయంకరమైన; ప్రక్రియన్= పద్ధతిన; నవ్వుచున్= హాసంచేస్తూ; విద్యుత్= తటిత్తు కాంతివంటి; వహ్ని= అగ్నియొక్క; శిఖా= జ్వాలలయొక్క; సముచ్చయ= ప్రోవులయొక్క; రుచిన్= కాంతితో; వెల్గొందు= విలసిల్లుతున్నట్టి; చంచత్= ఊగుతున్నట్టి; జటన్= జడను; సద్యస్+క్రోధము తోడన్= అప్పటి మండిపాటుతో; పుచ్చి= పెరికి; క్ష్మాచక్ర= భూవలయం యొక్క; మధ్యంబునన్= నడుమ; వయిచెన్= విసిరికొట్టాడు.

**తా :** ఆ తొలిదైవం, ఆ ఉగ్రుడు, ఆ నీలగళుడు, ఆ గజాసురసంహారి, పెదవిని కొరికాడు. మత్తుగొన్న పెద్ద సింహంవలె కఠోరంగా గర్జించాడు. అత్యంత భీకరంగా నవ్వాడు. మెరుపులవంటి అగ్ని కీలల పరంపరల కాంతితో ప్రకాశిస్తున్నట్టి, ఊగుతున్నట్టి ఒక జటను అప్పటికప్పుడే పుట్టిన కోపంతో పీకి భూమి మధ్యభాగంలోకి విసరికొట్టాడు.

**వ. ఇట్లు పెఱికివైచిన రుద్రుని జటయందు. 106**

**ప్రతి :** ఇట్లు= అలా క్రోధంకొలది; పెఱికి= పట్టిపీకి; వైచిన= విసరివేసిన; రుద్రుని= శివుడి; జట, అందు= జడలో...

**తా :** అలా పెరికివైచిన శివుడి జటనుంచి

## a=శివుఁడు వీరభద్రుచే దక్షయజ్ఞంబు ధ్వంసంబు సేయించుట=a

**సీ. అభ్రంలిహాదభ్రవిభ్రమాభ్రభ్రమకృన్నీలదీర్ఘశరీర మమరఁ**
**బ్రజ్వలజ్జ్వలనదీప్తజ్వాలికాజాలజాజ్వల్యమానకేశములు మెఱయఁ**

**జండదిగ్వేదండశుండాభదోర్దండసాహస్రధృత హేతిసంఘ మొప్ప**
**వీక్షణత్రయలోకవీక్షణద్యుతిలోకవీక్షణతతి దుర్నిరీక్షముగను**

**తే. గ్రకచకఠినకరాళదంష్ట్రలు వెలుంగ, ఘనకపాలాస్థివనమాలికలును దనర**
**నఖిలలోకభయంకరుఁ డగుచు వీర, భద్రుఁ డుదయించె మఱట రుద్రుఁ డగుచు. 107**

**ప్రతి :** అభ్రంలిహ= ఆకసమంటే; అదభ్ర= ఘనంగా; విభ్రమ= కదలుతున్నట్టి; అభ్ర= మేఘమా అనే; భ్రమకృత్= భ్రాంతినికొల్పేట్టి; నీల= నల్లని; దీర్ఘ= పొడవైన; శరీరము= విగ్రహం; అమరన్= ఒప్పగా; ప్రజ్వలత్= బాగా మండుతున్న; జ్వలన= నిప్పుమంటలచే; దీప్త= ప్రకాశమానమైన; జ్వాలికా= అగ్నిశిఖలయొక్క; జాల= మాలికలతో; జాజ్వల్యమాన= మిక్కిలిగా కాంతులీనుతున్న; కేశములు= వెంట్రుకలు; మెఱయన్= ప్రకాశించగా; చండ= భయంకరమైన; దిక్+వేదండ= అష్టదిగ్గజాలయొక్క; శుండా= తొండాలతో; ఆభ= సమానమైన; దోర్+దండ= కైదండలయొక్క; సాహస్ర= వేనవేలచే; ధృత= పట్టుకోబడిన; హేతి= ఆయుధాలయొక్క; సంఘము= సమూహం; ఒప్పన్= మెరయగా; వీక్షణత్రయ= మూడుకళ్లనే; లోకవీక్షణ= సూర్యుడి; ద్యుతి= వెలుతురు; లోక= జనులయొక్క; వీక్షణతతి= చూపులశ్రేణులకు; దుర్+నిర్+ఈక్ష్యముగను= తేరిచూడ అశక్యంకాగా; క్రకచ= రంపం వలె; కఠిన= కర్కశైన; కరాళ= భయంకరమైన; దంష్ట్రలు= కోరలు; వెలుంగన్= ప్రకాశించగా; ఘన= గట్టి, కపాల= పునుకలు/తలపుర్రెల మాలలు; అస్థి= ఎముకల మాలలు; వనమాలికలును= ఆకులు పూలుకట్టిన మాలలున్నూ; తనరన్= (మెడను) కలిగి ఉండగా; అఖిల= సమస్తమైన; లోక= ప్రపంచానికి; భయంకరుఁడున్+అగుచున్= వెఱపు పుట్టించేవాడు అవుతూ; మఱట= మరొక; రుద్రుడు అగుచున్= శివుడవుతూ; వీరభద్రుఁడు= వీరభద్రుడు; ఉదయించెన్= ఆవిర్భవించాడు.

**తా :** మహోన్నతంగా, నిండుగా, భారీగా ప్రయాణించే కారుమేఘమా అన్పించేటటువంటి నల్లటి నిలువెత్తురూపంతో, కణకణమండే నిప్పుమంటల వరుసల వెలుగులవలె ఒప్పుతున్న తలజుత్తుతో, వేనవేల ఆయుధాల ధారణతో భయంకొల్పే అష్టదిగ్గజాల తొండాల్లాంటి వేయి భుజదండాలతో, లోకుల కళ్లకు మిరుమిట్లు గొలిపే లోకవీక్షణుడి భగభగమండే ఎండవంటి మూడుకళ్ళతో, రంపం పళ్లలా పదనెక్కి ఉగ్రంగా ఉన్న కోరలతో, గట్టి పుచ్చెలదండలూ, ఎముకలపేరులూ, ఆకుల పూలమాలికలూ వేసుకున్న మెడతో వీరభద్రుడు లోకభయంకరుడుగా, మరొక శివుడుగా పుట్టుకొచ్చాడు.

**తే. వీరభద్రుండు విహతవిద్వేషి భద్రుఁ, డగుచుఁ దన వేయిచేతుల మొగిచి వినయ**
**మెసఁగ నే నేమి సేయుదు? నెఱుఁగ నాకు, ఆన తిమ్మన్న నతని క య్యభవుఁ డనియె. 108**

**ప్రతి :** వీరభద్రుండు= ఆ వీరభద్రుడు; విహత= నశింపజేయబడిన; విద్వేషి= శత్రువులయొక్క; భద్రుఁడు+అగుచున్= శుభాలు గలవాడై; తన= తనయొక్క; వేయిచేతులు= సహస్రహస్తాలూ; మొగిచి= జోడించి; వినయము= అణకువ; ఎసఁగన్= అతిశయించగా; నేను= ఏను; ఏమి, చేయుదున్= ఏమి చేయవలయునో; ఎఱుఁగన్= తెలిపేటట్లు; నాకున్= నాకు; ఆనతి= ఆన; ఇమ్ము= ఇవ్వవలసింది; అన్నన్= అని అడుగగానే; అతనికిన్= ఆ వీరభద్రుడికి; ఆ+అభవుడు= ఆ శివుడు; అనియెన్= చెప్పాడు.

**తా :** ఆ వీరభద్రుడు పగవారి శుభాలను హతమార్చి తన వేయిచేతులతో ఒక్కసారిగా దండం పెట్టాడు. అతి వినమ్రతతో నేను ఏమి చేయాలో తెలపండి. సెల విప్పించండి అని అడిగాడు. దానికి శివుడు వీరభద్రుడితో ఇలా అన్నాడు.

**విశే :** వీరభద్రుడు: ప్రతివీరుడుగా భద్రం చేకూర్చేవాడు.

**చ. గురుభుజశౌర్య! భూరిరణకోవిద! మద్భటకోటి కెల్ల నీ**
**వరయ వరూథినీవరుఁడవై చని యజ్ఞము గూడ దక్షునిన్**
**బరువడిఁ ద్రుంపు; మీ వచట బ్రాహ్మణతేజ మజేయ మంటి వే**
**నరిది మదంశసంభవుఁడవై తగు నీకు నసాధ్య మెయ్యెడన్ 109**

**ప్రతి :** గురుభుజశౌర్య!= గొప్పవైన భుజముల పరాక్రమం కలవాడా!; భూరిరణకోవిద!= గొప్ప యుద్ధ పండితుడా!; మద్= నాయొక్క; భటకోటికిన్= వీరుల సముదాయానికి; ఎల్లన్= అంతటికీ; ఈవు= నీవు; అరయన్= విచారించగా; వరూథినీ+వరుఁడవు; ఐ= సేనాగ్రణివి అయి; చని= దక్షయజ్ఞవాటికకు వెళ్లి; యజ్ఞము, కూడ= యాగంతో సహా; దక్షునిన్= దక్షుణ్ణి; పరువడిన్= వేగవంతంగా; త్రుంపుము= చంపు; ఈవు= నువ్వు; అచటన్= ఆ యాగశాలలో; బ్రాహ్మణతేజము= బ్రహ్మవర్చస్సు; అజేయము= జయించశక్యం కానిది; అంటివి+ఏన్= అన్నట్లయితే; మద్= నాయొక్క; అంశ= భాగాన; సంభవుఁడవు+ఐ= జన్మించినవాడవు అయి; తగు= వర్తిల్లే; నీకున్= నీకు; ఏ+ఎడన్= ఏ చోట అయినా; అసాధ్యము= సాధ్యం కానిది; అరిది= ఉండదు.

**తా :** గొప్ప జబ్బపుష్టిగల ఓ వీరభద్ర! యుద్ధకళాకుశల! నా సమస్తశూరగణానికి నువ్వే సైన్యాధిపతివి. ఆ ఆధిపత్యంతో నువ్వు దక్షయాగవాటికకు పో. చాల శ్రద్ధాళువువై యాగంతో సహా దక్షుణ్ణి చంపు. ఆ యాగవాటికలో "బ్రాహ్మణతేజం" ఎదిరించ సాధ్యమా, అని నువ్వు ఏమాత్రం తలంచవద్దు. దుర్లభమైన నా అంశాన జన్మనెత్తిన నీకు సాధ్యంకానిది ఏచోటనైనా ఉంటుందా?

**వ. అని కుపితచిత్తుండై యాజ్ఞాపించిన నట్లకాక యని. 110**

**ప్రతి :** అని= అని; కుపితచిత్తుండు+ఐ= కోపగించిన మనస్సుకలవాడై; ఆజ్ఞాపించినన్= శాసించగా; అట్లకాక= ఆ ప్రకారంగానే జరుగుకాక; అని= అని వచించి...

**తా :** అంటూ శివుడు కోపించిన మనస్సుకలవాడై ఆనతిచ్చిన క్షణాననే ఆ వీరభద్రుడు సరే! అని

**చ. అనఘుఁడు రుద్రుఁజేరి ముదమారఁబ్రదక్షిణ మాచరించి వీ**
**డ్కొని యనివార్యవేగమునఁ గుంభిని గ్రక్కదలన్ ఝుళంఝుళ**
**ధ్వని మణినూపురంబులు పదంబుల మ్రోయఁగ భీషణప్రభల్**
**దనరఁ గృతాంతకాంతకశితస్ఫుటశూలముఁ బూని చెచ్చెరన్. 111**

**ప్రతి :** అనఘుడు= పుణ్యవంతుడైన వీరభద్రుడు; రుద్రున్, చేరి= పగతురను దుఃఖపెట్టే శివుడి దరికిపోయి, ముదము+ఆరన్= నిండుసంతోషంతో; ప్రదక్షిణము= శివుడికి ప్రదక్షిణం, ఆచరించి= నెరపి; వీడ్కొని= సెలవుతీసికొని; అనివార్య= నిలువరించలేని; వేగమునన్= వేగంతో; కుంభిని= భూమి; కదలన్+కదలన్= ఎక్కువప్రకంపించగా; ఝుళంఝుళధ్వని= ఘల్ఘుల్లనే రవళులతో; మణినూపురంబులు= మణులు పొదిగిన అందెలు; పదంబులన్= పాదాలలో; మ్రోయఁగన్= శబ్దించగా; భీషణ= భయంకరమైన; ప్రభల్= కాంతులు; తనరన్= విజృంభించగా; కృత+అంతక= వినాశం చేయగల యముణ్ణి; అంతక= తుదముట్టించగలట్టి; శిత= వాడియైన; స్ఫుట= ప్రకాశించే; శూలమున్= శూలం అనే ఆయుధాన్ని; పూని= (బలంగా) పట్టి, చెరన్+చెరన్= అతి శీఘ్రంగా...

**తా :** పుణ్యాత్ముడైన వీరభద్రుడు శివుడి దగ్గరకు పోయాడు. మహా ఆనందంగా శివుడికి ప్రదక్షిణం చేశాడు. పోయి వస్తానని సెలవు తీసుకున్నాడు. నివారింప వీలుకాని వేగంతో ఒక్క ఊపున కదిలాడు. ఆ వేగానికి నేల ఊగిపోయింది. కాలి మణిమంజీరాలు ఝుళంఝుళల మోతలు పెట్టాయి. భయంకరమైన కాంతులు విజృంభించాయి. యముడిని అంతం చేయగల పదునైన, మెరిసిపోతున్న శూలాన్ని బలంగా పైకెత్తి పట్టి మరింత పుంజుకున్న వేగంతో

**విశే :** ప్రదక్షిణం – దక్షిణం నుండి చుట్టూ తిరుగుట. దక్షిణం అనగా కుడి.

**చ.** **సరభసవృత్తి నట్లరుగు సైన్యపదాహతధూతధూళి ధూ**
**సరితకుబేరదిక్తటము సభ్యులు దక్షుఁడుఁ జూచి "యెట్టి భీ**
**కరతమ?" మంచనం, 'దమము గాదు, రజఃపటలం' బటంచు ని**
**వ్వెఱపడి పల్కి రాత్మల వివేకవిహీనతఁబొంది వెండియున్.** **112**

**ప్రతి :** సరభస= తొందరతో కూడిన; వృత్తిన్= నడకతో; అట్లు= విధంగా; అరుగు= వెళ్తున్న; సైన్య= కాలిబంటులయొక్క; పద= అడుగులచే; ఆహత= నలగగొట్టబడ్డ; ధూత= రేగగొట్టబడిన; ధూళి= దుమ్ము; ధూసరిత= బూడిదవర్ణంగా చేయబడ్డ కుబేర; దిక్+తటము= కుబేరుడి దిశ అయిన ఉత్తరం వైపున నున్న; సభ్యులు= యాగసభలోనివారూ; దక్షుదున్= దక్షప్రజాపతీ; చూచి= కాంచి; ఎట్టి= ఎంతటి; భీకర= భయంకరమైన; తమము= చీకటి; అంచు+అనన్= అని ఊహించే అంతలోనే; తమము, కాదు= అంధకారం కాదు; రజః= ధూళియొక్క; పటలంబు= సమూహం; అటు+అంచున్= కాబోలు అని తలపోస్తూ; నిండు+వెఱగు+పడి= మిక్కిలి బెదరి; ఆత్మలన్= అంతరాల్లో; వివేకవిహీనతన్ పొంది= తెలివిడిని కోల్పోయి; వెండియున్= మళ్లీ; పల్కిరి= చెప్పుకున్నారు.

**తా :** అంతటి వేగిరపాటుతో సాగిపోతూ ఉన్న కాలిబంటుల పదాల తొక్కిడికి రేగిన దుమ్ము, ఉత్తరం పక్కన బూడిదవర్ణంగా అలముకుంది. ఆ ధూళి పొగను కొలువులోని సదస్యులూ, దక్షుడూ ఒక్కసారిగా చూచారు. ఎంత 'భయంకరమగు చీకటి' అనుకున్నారు. అంతలోనే కాదు అది ధూళిసమూహం అంటూ మిక్కిలి బెదరి అదరిపోయారు. తెలివిని కోల్పోయి తిరిగి మనసులో ఇలా అనుకున్నారు.

**సీ.** **ఈ ధూళి పుట్టుట కెయ్యది హేతువో? విలయసమీరమా? పొలయ దిపుడు;**
**ప్రాచీనబర్హి ధరాపతి మహితోగ్రశాసనుఁ డిపుడు రాజ్యంబు సేయఁ**
**జోరసంఘములకో రారాదు; మఱి గోగణాళి రాకకు సమయంబు గాదు;**
**కావున నిప్పుడు కల్పావసానంబు గాఁబోలు; గా కటు గాకయున్న**

**తే.** **నిట్టి యౌత్పాతికరజ మెందేనిఁ గలదె?, యనుచు మనముల భయమంది రచటి జనులు**
**సురలు దక్షుఁడు; నంతఁ బ్రసూతి ముఖ్య, లయిన భూసురకాంత లిట్లనిరి మఱియు.** **113**

**ప్రతి :** ఈ ధూళి= ఈ దువ్వ; పుట్టుటకున్= ఏర్పడడానికి; ఏ+అది= ఏమిటి; హేతువు+ఓ= కారణమో?; విలయ= కల్పాంతంనాటి; సమీరమా= గాలియా?; ఇపుడు= ఈ కాలంలో; పొలయదు= అలమదు; మహిత= బహుళంగా; ఉగ్ర= కఠోరంగా; శాసనుఁడు= దండించే అధికారంకల; ప్రాచీనబర్హి= 'ప్రాచీనబర్హి' అనే ఆకాలంనాటి; ధరాపతి= భూమినేత;

ఇపుడు= ఈ కాలంలో; రాజ్యంబు= పాలనం; చేయన్= చేస్తుండగా; చోరసంఘములకున్+ఓ= ఏదొంగల దండులకో; రాదు+రాదు= రాపనిలేదు; మఱి= పోనీ; గోగణ+ఆళి= ఆలమందల పంక్తుల; రాకకున్= పొద్దుమళ్లిన పోకకు; సమయంబు= సందెవేళ; కాదు= కానే కాదు; కావునన్= అందువల్ల; ఇప్పుడు= ఈవేళ; కల్ప+అవసానంబు= బ్రహ్మ ఒక్కదినానికి, అంత్య సమయం; కాఁబోలున్కాక= కావచ్చునేమో; అటు, కాక, ఉన్నన్= అలా కానిచో; ఇట్టి= ఇంతపెద్ద; ఔత్పాతిక= కీడును శంకింపచేసే; రజము= దుమ్ము; ఎందు+ఏనిన్= ఎక్కడనైనా; కలదే= ఉందా; అనుచున్= అని తలస్తూ; అచటి జనులున్= ఆ ప్రదేశంలో గుమిగూడిన సామాన్యులూ; సురలున్= దేవతలూ; దక్షుఁడున్= దక్షుడూ; మనములన్= లోలోపల; భయము= భీతును; అందిరి= పొందారు; అంతన్= ఈ లోపున; ప్రసూతి= (దక్షపత్ని); ముఖ్యలు అయిన= మొదలైన; భూసురకాంతలు= బ్రాహ్మణ స్త్రీలు; మఱియున్= మళ్లీ; ఇట్లు= ఇలా; అనిరి= పలకసాగారు.

**తా :** ఈ ధూళి పుట్టుటకు కారణమేమిటో? ఇది ప్రళయకాలంనాటి గాలియా, మహోగ్రశాసనుడైన ప్రాచీనబర్హి మహారాజు రాజ్యపాలన చేయుచుండగా ఇప్పుడు ఇట్లు జరుగదు. దొంగల గుంపులు రాలేవు. ఆలమందలు వచ్చే సమయం కాదు. అందుచేత ఇప్పుడు కల్పాంతమే కాబోలు. అట్లు కాకుండిన ఇట్టి ఉత్పాతం కలిగించే దుమ్ము ఎక్కడైనా వుండునా అంటూ అక్కడున్న జనులు మనసులో భయపడ్డారు. అప్పుడు దేవతలు దక్షుడు, ప్రసూతి మొదలగు బ్రాహ్మణస్త్రీలు ఇంకా ఇలా అనుకున్నారు.

**క. తన కూఁతులు సూడఁగ నిజ, తనయను సతి ననపరాధఁదగవతి? యి ట్లె**
**గ్గొనరించిన యీ దక్షుని, ఘనపాపవిపాక మిదియుఁ గాఁదగు ననుచున్. 114**

**ప్రతి :** తన= తన (దక్షుడి) యొక్క; కూఁతులు= (సతి మినహా) పుత్రికలు; చూడన్+కన్= చూస్తుండగానే; నిజతనయను= తనకూతును; న+అపరాధన్= ఏ తప్పూ ఎరుగని దానిని; సతిన్= భవానిని; తగవు+అతి= ధర్మం తప్పి; ఇట్లు= ఈ విధంగా; ఎగ్గు, ఒనరించిన= అవమానం చేసిన; ఈ దక్షుని= ఈ దక్షునియొక్క; ఘనపాప= ఘోరకలియొక్క; విపాకము= పరిణామఫలం; ఇదియున్= ఈ మహాధూళి; కాన్+తగున్= కావచ్చును; అనుచున్= అని తలపోస్తూ...

**తా :** దక్షుడు తన తక్కిన కూతులు చూస్తుండగా ఏ అపరాధం ఎరుగని తన కుమార్తె 'సతి'ని ధర్మం తప్పి ఇలా కీడుచేసిన ఈ దక్షుని పెనుపాపం పండుటయే కాబోలు అని అనుకుంటూ

**వ. వెండియు నిట్లనిరి: కుపితాత్ముండైన దక్షుండు దన కూఁతుతో విరోధంబు సాలక జగత్సంహార కారణుం డయిన రుద్రునిం గ్రోధింపఁజేసె; నమ్మహాత్ముం డెంతటివాఁడన్నం బ్రళయకాలంబున. 115**

**ప్రతి :** వెండియున్= మళ్లీ; ఇట్లు= ఈ రీతిగా; అనిరి= ఇలా చెప్పుకున్నారు; కుపిత= కోపించిన; ఆత్ముండు= స్వభావం కలవాడు; ఐన= అయినట్టి; దక్షుండు= దక్షుడు; తన కూఁతుతోన్= తన కుమార్తెతో; విరోధంబు= మచ్చరం; చాలక= సరిపోక; జగద్సంహార= లోకాల లయానికి; కారణుండు, అయిన= మూలమైనవాడు అయిన; రుద్రునిన్= (దుఃఖాన్ని పోగొట్టే) శివుణ్ణి; క్రోధింపన్+చేసెన్= మండిపడేలా చేశాడు; ఆ+మహా+ఆత్ముండు= ఆ గొప్పమనస్సు కలవాడు, ఎంతటివాడు; అన్నన్= ఎంతపాటి వాడంటే; ప్రళయకాలంబునన్= విలయం సంభవించినపుడు...

**తా :** ఇంకా ఇలా చెప్పుకున్నారు. ఆగ్రహించిన దక్షుడు తన సొంతబిడ్డతో పగ చాలదన్నట్టు విశ్వవినాశకారకుడైన శివుణ్ణి కోపించేలా చేశాడు. ఆ పరమపురుషుడు ఎలాంటి వాడంటే, ప్రళయం ముంచుకొచ్చినపుడు

**సీ. సుమహితనిశితత్రిశూలాగ్రసంప్రోత నిఖిలదిక్కరిరాజనివహుఁడగుచుఁ**
**జటులోగ్రనిష్ఠురస్తనితగంభీరాట్టహాసనిర్భిన్నాఖిలాశుఁడగుచు**
**భూరికరాళవిస్ఫారదంష్ట్రాహతి పతితతారాగణప్రచయుఁ డగుచు**
**వివిధహేతివ్రాతవిపులప్రభాపుంజ మండితచండదోర్దండుఁ డగుచు**

**తే. వికటరోషభయంకరభ్రుకుటి దుర్నిరీక్ష్య దుస్సహతేజోమహిమఁ దనర్చి**
**ఘనవికీర్ణజటాబంధకలితుఁడగుచు, నఖిలసంహారకారణుండయి నటించు. 116**

**ప్రతి :** సుమహిత= అతిగొప్పదైన; నిశిత= వాడి అయిన; త్రిశూల= ముమ్మొనల బల్లెం యొక్క; అగ్ర= అంచున; సంప్రోత= గుచ్చబడ్డ; నిఖిల= సమస్తమైన; దిక్+కరిరాజ= గొప్ప దిగ్గజాలయొక్క; నివహుఁడు, అగుచున్= మంద కలవాడవుతూ; చటుల= కదలెడి; ఉగ్ర= భయంకరమైన; నిష్ఠుర= గట్టిగా; స్తనిత= గర్జన; గంభీర= లోతుగా; అట్టహాస= పెద్దనవ్వు నవ్వడంచే; నిర్భిన్న= చీల్చబడిన; అఖిల= సమస్తమైన; ఆశుఁడు అగుచున్= దిక్కులు కలవాడవుతూ; భూరి; కరాళ= కడు భయానకమైన; విస్ఫార= అదరుచుండిన; దంష్ట్రా= కోరలపంటి; ఆహతి= దెబ్బలవల్ల; పతిత= రాలిన; తారాగణ ప్రచయుఁడు అగుచున్= చుక్కల గుంపుకలవాడు అవుతూ; వివిధ= పెక్కు రకాలైన; హేతి= ఆయుధాలయొక్క; వ్రాత= సమూహం యొక్క; విపుల= విస్తారమైన; ప్రభా= కాంతులయొక్క; పుంజ= ప్రోవులచే; మండిత= అలంకరించబడిన; చండ= తీక్ష్ణమైన; దోర్+దండుఁడు= భుజదండాలు కలవాడు; అగుచున్= అవుతూ; వికట= భయంకరమైన; రోష= క్రోధంవల్ల; భయంకర= బెదరు పుట్టించే; భ్రుకుటి= కనుబొమ ముడిచేత; దుర్+నిర్+ఈక్ష్య= తేరి చూడగ రాని; దుస్+సహ= సహించలేని; తేజః= వర్చస్సుయొక్క; మహిమన్= గొప్పతనంతో; తనర్చి= ప్రకాశించి; ఘన= ఒత్తైన; వికీర్ణ= విరబోసి ఉన్న; జటా= జుట్టును పాయలుగా తీసి అల్లిన జడలయొక్క; బంధ= ముడితో; కలితుఁడు= కూడినవాడు; అగుచున్= అవుతూ; అఖిల= సమస్తమైన; సంహార= ప్రళయానికి; కారణుండు అయి= మూలమైనవాడయి; నటించున్= నర్తిస్తాడు.

**తా :** మంచి పదునుగల తన త్రిశూలం మొనలతో దిగ్గజాలన్నింటిని గుదిగుచ్చుతాడు. అతిభీషణంగా, కర్ణకఠోరంగా ఉరుము గర్జిల్లినట్టు, దిక్కులు బద్దలై పోయేట్టు గంభీరంగా అట్టహాసం చేస్తాడు. వెఱపు పుట్టించేంత వెడల్పుగా విప్పిన కోరల దెబ్బలతో నక్షత్రరాశులను కుప్పలు పడేలా కిందికి జారుస్తాడు. చురుకైన భుజదండాలకు అలంకరణగా తళతళకాంతులు విరజిమ్మే రకరకాల ఆయుధాలు పట్టి ఉంటాడు. మించిన కోపంతో కనుబొమలు ముడివేసినపుడు సహించశక్యంకాని తేజస్సుతో అతిశయించి ఉంటాడు. ఒత్తుగా కిందికి వేలాడుతున్న జుత్తు అల్లిన జడలముడి జారిపోయేంతగా ప్రళయానికి మూలభూతుడై తాండవం చేస్తాడు.

**తే. అట్టి దేవునిఁ ద్రిపురసంహారకరునిఁ, జంద్రశేఖరు సద్గుణసాంద్రు నభవు**
**మనము రోషింపఁ జేసిన మంగళములఁ, బొందవచ్చునె పద్మగర్భునకునైన? 117**

**ప్రతి :** అట్టి= అలా విలయతాండవం చేస్తున్న ; దేవునిన్= మహాదేవుణ్ణి; త్రిపుర= (మయనిర్మితమైన) మూడు పురాలను; సంహారకరునిన్= అంతం చేసినవాణ్ణి; చంద్రశేఖరున్= చంద్రకళ సిగదండగా కలవాణ్ణి; సద్గుణ= నిర్వికారాది మంచిగుణాలు; సాంద్రున్= ఘనంగా కలవాణ్ణి; అభవున్= పుట్టుకలులేని శివుని; మనమున్= ఎదను; రోషింపన్ చేసినన్= క్రోధం

తెప్పింప చేసినట్లయితే; పద్మగర్భునకున్ ఐన= ఆ బ్రహ్మదేవుడికైనా; మంగళములన్= శుభాలను; పొందవచ్చున్+ఎ= అందుకోనగునా?

**తా :** అట్టి దేవుడైన త్రిపురసంహారకుని, చంద్రశేఖరుని సాంద్రమైన సద్గుణములు కలవానిని, అభవుని మనసును కోపింపచేసినయెడల బ్రహ్మదేవుడైనను, మంగళములను పొందగలడా!

**వ. అని యివ్విధంబున భయవిహ్వలలోచనలై పలుకుచున్న సమయంబున మహాత్ముండైన దక్షునకు భయావహంబులై సహస్రసంఖ్యాతంబులైన మహోత్పాతంబులు భూనభోంతరంబులఁ గానంబడు చుండె; నా సమయంబున రుద్రానుచరులు నానావిధాయుధంబులు ధరియించి కపిలపీతవర్ణంబులు గలిగి వామనాకారులు, మకరోదరాననులునై యజ్ఞశాలాప్రదేశంబునం బరువులు వెట్టుచుఁ గదియం జనుదెంచి దక్షాధ్వర వాటంబులు విటతాటంబులు సేయుచుం గొందఱు ప్రాగ్వంశంబు, గొందఱు పత్నీశాలయుఁ, గొందఱు సదస్యశాలయుఁ, గొంద ఱాగ్నీధ్రశాలయుఁ, గొందఱు యజమానశాలయుఁ, గొందఱు మహానస గృహంబును విధ్వంసంబులు గావించిరి; మఱియుఁ గొందఱు యజ్ఞపాత్రంబుల నగ్నులం జెఱచిరి; వెండియుఁ గొందఱు హోమాగ్ను లార్చిరి; పదంపడి కొందఱు హోమకుండంబులయందు మూత్రంబులు విడిచిరి; కొంద ఱుత్తరవేదిక మేఖలలు ద్రెంచిరి; కొందఱు మునుల బాధించిరి; కొందఱు తత్పత్నుల వెఱపించిరి; మరికొందఱు దేవతా నిరోధంబు గావించిరి; అంత మణిమంతుండు భృగువును, వీరభద్రుండు దక్షునిఁ, జండీశుండు పూషుని, భగుని నందీశ్వరుండును బట్టిరి. ఇవ్విధంబున సదస్యదేవర్త్విజ్నికాయంబుల శిలల ఱువ్వియు, జానువులఁ బొడిచియు, నఱచేతుల నడిచియు, కూర్పరంబులఁ బొడిచియు, వివిధబాధలం బఱచిన వారు కాందిశీకులై యెక్కడెక్క డేనియుంజనిరి. మఱియును- 118**

ప్రతి : అని= అని; ఈ+విధంబునన్= ఈ క్రమాన; భయ= భీతితో; విహ్వల= వ్యాకులమైన; లోచనలు+ఐ= కనుగుడ్లు కలవారై; పలుకుచున్; ఉన్న= మాట్లాడుతున్న; సమయంబునన్= కాలంలో; మహా+ఆత్ముండు+ఐన= పెద్దమనస్సు కలవాడైన; దక్షునకున్= దక్షప్రజేశ్వరుడికి; భయ+ఆవహంబులు+ఐ= దడ పుట్టించేవి అయిన; సహస్రసంఖ్యాతంబులు+ఐన= వేలసంఖ్యల్లో లెక్కపెట్టబడేవి అయిన; మహా+ఉత్పాతంబులు= మహా ఉపద్రవముల సూచనలు; భూ= భూమిపైనను; నభస్= ఆకాశంలోను; అంతరంబులన్= వానిమధ్యను; కానంబడుచున్ ఉండెన్= కంటిచూపు మేరకి కనబడినాయి; ఆ సమయంబునన్= అప్పుడు; రుద్ర= శివుడి; అనుచరులు= కూడా తిరిగే ప్రమథ సేవకులు; నానావిధ= పలురకాలైన; ఆయుధంబులు= ఆయుధాలు; ధరియించి= పట్టి; కపిల= పుల్లావు (లేత ఎరుపు); పీత= పసుపు; వర్ణంబులు= చాయలు; కలిగి= ఉన్నట్టి, వామన, ఆకారాలు= పొట్టిరూపులు; మకర+ఉదర+ఆననులు= మొసలి పొట్టవంటి పొట్ట; మకర ఆననులును+ఐ= మొసలి ముఖం (నోరు)వంటి ముఖం (నోరు)న్నూ కలవారై; యజ్ఞశాలా= యాగవేదికలున్న; ప్రదేశంబునన్= స్థలంలో; పరువులు+పెట్టుచున్= పరుగెత్తుతూ; కదియన్= సమీపానికి; చనుదెంచి= వచ్చి; దక్ష+అధ్వరవాటంబులు= దక్షయాగశాలావరణము; విటతాటంబులు= తుమురులు; చేయుచున్= కావిస్తూ; కొందఱు= కొంతమంది; ప్రాక్= తూర్పుముఖంగల ప్రధానహోమగృహం; వంశంబును= నడికొప్పు వెదురుదూలాన్నీ; కొందఱు= కొంతమంది; పత్నీశాలయున్= యాగశాలకు పడమరగా ఉన్న ధర్మపత్నిపాకనూ; కొందఱు= కొంతమంది; సదస్యశాలయున్= ఆ

శాలకు తూర్పున ఉన్న కొలువుకూటాన్నీ; కొందఱు= కొంతమంది; ఆగ్నీధ్రశాలయున్= ఈ సభామంటపానికి ఉత్తరం వేపు ఆగ్నీధ్రుడు (ఋత్విక్) ఉండేపాకనూ; కొందఱు= కొంతమంది; యజమాన శాలయున్= యాగకర్త విహరించే పాకనూ; మహానసగృహంబును= వంటింటినీ; విధ్వంసంబులు; కావించిరి= సర్వనాశనం చేశారు; మఱియున్= ఇంకా; కొందఱు= కొంతమంది; యజ్ఞపాత్రంబులన్= వేలిమి భాజనాలను; అగ్నులన్= నిప్పులను; చెఱచిరి= చెడగొట్టారు; వెండియున్= మళ్లీ; కొందఱు= కొంతమంది; హోమ+అగ్నులు= ఆహుతులనిచ్చే అగ్నులను; ఆర్చిరి= చల్లార్చారు; పదంపడి= ఆవల; కొందఱు= కొంతమంది; హోమకుండంబుల, అందున్= నిప్పులగుండాల్లో; మూత్రంబులు= ఉచ్చలను; విడిచిరి= వదిలారు; కొందఱు= కొంతమంది; ఉత్తరవేదికా= ఉత్తరం దిశన యాగవేదికలకు కట్టిన; మేఖలలు= యాగబలికొరకు వుంచిన జంతువులకు కట్టిన తాళ్ళు; తెంచిరి= తెంపారు; కొందఱు= కొంతమంది; మునులన్= మౌనులను; బాధించిరి= హింసించారు; కొందఱు= కొంతమంది; తద్+పత్నులన్= ఆ మునుల పెళ్లాలను; వెఱపించిరి= జడిపించారు; మఱికొందఱు= మరికొంతమంది; దేవతా నిరోధంబు= వేల్పులను అడ్డగించడం; కావించిరి= చేశారు; అంతన్= ఆ సమయంలో; మణిమంతుండు= మణిమంతుడు; భృగువును= భృగుమహర్షిని; వీరభద్రుండు= వీరభద్రుడు; దక్షునిన్= దక్షుణ్ణి, చండీశుండు= చండీశుడు; పూషునిన్= పూషుణ్ణి; భగునిన్= భగుణ్ణి; నందీశ్వరుండును= నందీశ్వరుడూ; పట్టిరి= బందీచేశారు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; సదస్య= సదస్యులయొక్క; దేవ= దేవతలయొక్క; ఋత్విక్= ఋత్విక్కులయొక్క; నికాయంబులన్= సముదాయాలను; శిలలన్= రాళ్లను; ఉబ్బియున్= విసరీ; జానువులన్= మోకాళ్లతో; పొడిచియున్= కుమ్మీ; అఱచేతులన్= అరచేతులతో; అడిచియు= కొట్టీ; కూర్పరంబులన్= మోచేతులతో; పొడిచియున్= మోదీ; వివిధ బాధలన్= నానా కష్టాలను; పఱచినవారు= పెట్టినవారు కాగా; కాందిశీకులు+ఐ= భయంతో దిక్కుతోచక ఎవరికి వారుగా పారిపోయినవారై; ఎక్కడ+ఎక్కడ+ఏనియున్= ఎటుపడితే అటువేపుకి; చనిరి= వెళ్లారు; మఱియును= ఇంకా...

**తా :** మాటిమాటికి ఆ బ్రాహ్మణ స్త్రీలు ఈ క్రమాన భయంచేత చలిస్తున్న కండ్లతో పలుకుతూనే ఉన్నారు. ఆ తరుణంలో ఉదార స్వభావుడు అయిన దక్షుడికీ దడ పుట్టించేవిధంగా మహోపద్రవాలు నేలనించి నింగిదాకా వేల లెక్కన కంటికి తోస్తున్నాయి. ఆ సమయంలోనే శివప్రమథగణం రకరకాల ఆయుధాలను చేపట్టారు. వాళ్లు రకరకాల వికృత ఆకారాల్లో ఉన్నారు. చామనచాయ, పసిమిచాయవాళ్లు కొందరైతే, మరికొందరు పొట్టిగా ఉన్నారు. కొందరు మొసలి కడుపువలె బాన కడుపుతో ఉన్నారు. ఇంకొందరు మొసలి ముఖం (నోరు) వంటి ముఖం (నోరు)తో ఉన్నారు. వీళ్లంతా దక్షయజ్ఞ వాటికలోకి ఉరుకుతూ దాదాపుగా చేరుకున్నారు. దక్షయాగస్థలం చుట్టూ ఉన్న కంచెలను, నడవలను, ఇళ్లభాగాలను అస్తవ్యస్తం చేసేస్తున్నారు. కొందరు ప్రధాన యాగగృహం వెన్నుగాడిని తన్నేవారు. కొందరు కొందరుగా ధర్మగేహినులుండే పాకను, సభతీర్చేపాకను, అగ్నివహులైన ఋత్విక్కులుండే పాకను, యాగయాజమాని పాకను, వంటశాలలనూ, కూల్చేవారు. కొంచెం ఆగి కొందరు అక్కడి యాగపాత్రలను వహ్నులను పాడుచేశారు. ఇంకా కొంచెం సేపటికి అగ్నిహోత్రాలను ఆర్పేశారు. కొందరు అగ్నిగుండాల్లో మూత్రాలను విసర్జించారు. కొందరు ఉత్తరం పక్కగా తీర్చిన వేదికల సోమసూత్రాలు తెంపేశారు. కొందరు మునుల్ని కష్టపెట్టారు. కొందరు మునిపత్నుల్ని గజగజలాడించారు. ఇంకొందరు దేవతలను నిలువరించారు. ఆ సమయంలో భృగుఋషిని మణిమంతుడూ, దక్షుణ్ణి వీరభద్రుడూ, పూషుణ్ణి చండీశుడు, భగమునిని నందీశ్వరుడూ నిర్బంధించారు. ఇలాగున సభ్యుల, దేవతల, ఋత్విక్కుల, వర్గాలపైకి రాళ్లు విసరీ, మోకాళ్లతో కుమ్మీ, అరచేతులతో చరచీ, మోచేతులతో పొడిచీ పెక్కురకాలుగా పీడించారు. వాళ్లంతా భయంతో దిక్కుతోచక తలకొక దిక్కుకు పరుగు తీశారు. తరువాత

క. మును దక్షుఁ డభవుఁ బలుకఁగఁ, గనుగీఁటిన భగునిఁ బట్టి కన్నులు పెకలిం
చెను నందీశ్వరుఁ డచ్చటి, జనముల హాహారవంబు సందడి గొలుపన్. **119**

**ప్రతి :** మును= వెనక కాలాన; దక్షుఁడు= దక్షప్రజాపతి; అభవున్= శివుని; పలుకన్+కన్= దూషించగా; కనుగీఁటిన= కనుసైగ చేసిన; భగునిన్= భగుణ్ణి; నందీశ్వరుఁడు= నందీశ్వరుడనే ప్రమథుడు; పట్టి= కట్టి; కన్నులు= కనుగుడ్లు రెంటిని; అచ్చటి= యాగవాటికలోని; జనముల= సామాన్యుల యొక్క; హా, హా= అయ్యో; అయ్యో అనే కష్టదశను తెలిపే; రవంబు= ఆర్తనాదం; సందడి= గగ్గోలు; కొలుపన్= పుట్టించగా; పెకలించెను= పెల్లగించాడు.

**తా :** అప్పట్లో యాగవాటికలో దక్షుడు శివుణ్ణి తిట్టిపోశాడు. అప్పుడు కనుసైగచేసిన భగుణ్ణి, ఇపుడు నందీశ్వరుడు పట్టి కట్టేశాడు. రెండుకళ్లూ పెరికి వేశాడు. ఇదంతా చూస్తున్న జనంలో ఆర్తనాదం చెలరేగింది.

తే. కుపితుఁడై నాఁడు భవుని దక్షుఁడు శపింపఁ, బరిహసించిన పూషుని పండ్లు డుల్లఁ
గొట్టె బలభద్రుఁ డాకళింగుని రదంబు, లెలమి డులిచిన పగిదిఁ జండీశ్వరుండు. **120**

**ప్రతి :** కుపితుఁడు+ఐ= కోపించినవాడై; నాఁడు= ఆ నాడు; భవుని= శివుని; దక్షుఁడు= దక్షుడు; శపింపన్= దూఱగా; పరిహసించిన= వెక్కిరింతగా నవ్విన; పూషుని= పూషుడియొక్క; పండ్లు= దంతాలు; బలభద్రుడు= బలరాముడు; కళింగుని= కళింగరాజుయొక్క; రదంబులు= పళ్లు; ఎలమిన్= కుతుకంతో; డులిచిన పగిదిన్= ఊడగొట్టిన తీరుగా; చండీశ్వరుండు= చండీశుడనే ప్రమథుడు; డుల్లన్+కొట్టెన్= రాలగొట్టాడు.

**తా :** కొపించినవాడైన దక్షుడు శివుణ్ణి శపించినపుడు పూషుడు పళ్లికిలిస్తూ నవ్వాడు. ఆకారణంగా ఇపుడు అలనాటి కళింగదేశం రాజు దంతవక్త్రుడి దంతాలు బలరాముడు కుతుకం కొద్దీ రాలగొట్టిన విధంగానే పూషుడి దంతాలను చండీశుడు ఊడపీకాడు.

క. తగవేది దక్షుఁ డా సభ, నగచాపుఁ దిరస్కరించునాఁ డట శ్మశ్రుల్
నగుచుం జూపుట నా భృగు, పగకై శ్మశ్రువులు వీరభద్రుఁడు పెఱికిన్. **121**

**ప్రతి :** దక్షుఁడు= దక్షబ్రహ్మ; తగవు+ఏది= న్యాయం విడచి; ఆ సభన్= ఆ నాటి యాగసదస్సులో; నగచాపున్= మేరు పర్వతం విల్లుగాగల శివుని; తిరస్కరించునాఁడు= తెగడే సమయంలో; అటు= అక్కడ; నగుచున్= నవ్వుతూ; శ్మశ్రుల్= మీసాలనూ గడ్డాన్నీ; చూపుటన్= దువ్వుతూ కనబరచిన కారణంగా; వీరభద్రుఁడు= వీరభద్రుడు; పగకై= ప్రతీకారార్థం; ఆ భృగు శ్మశ్రువులు= ఆ భృగుముని మీసం, గెడ్డం; పెఱికెన్= పీకాడు.

**తా :** దక్షుడు ధర్మం తప్పి ఆనాటి కొలువులో శివుని నిందించేటపుడు అక్కడ భృగుముని నవ్వుతూ మీసం మెలిపెడ్తూ చూపినందున ఆ ద్వేషంతో వీరభద్రుడు ఆతని మీసములను పెరికివేశాడు.

**విశే :** శ్మశ్రువులు అనగా ముఖముమీది వెంట్రుకలు. అనగా గడ్డము, మీసములు కానీ ఈ సందర్భమున మీసములుగానే సంభావింపవలెను.

సీ. అతులదర్పోద్ధతుండై వీరభద్రుండు గైకొన దక్షువక్షంబుఁ ద్రొక్కి
ఘనశితధారాసిఁ గొని మేను వొడిచియు మంత్రసమన్విత మహితశస్త్ర

**జాలావినిర్భిన్న చర్మంబు గల దక్షుఁ జంపఁగా లేక విస్మయము నొంది**
**తద్వధోపాయంబు దన చిత్తమునఁ జూచి కంఠనిష్పీడనగతిఁ దలంచి**

**తే. మస్తకము ద్రుంచి యంచితామర్షణమున, దక్షిణానలమున వేల్చెఁ దదనుచరులు**
**హర్షమును బొంద, నచటి బ్రాహ్మణజనంబు, లాత్మలను జాల దుఃఖంబు లందుచుండ. 122**

**ప్రతి :** వీరభద్రుండు= ఆ వీరభద్రుడు; అతుల= అసమానమైన; దర్ప= అహంకారంతో; ఉద్ధతుండు+ఐ= దుడుకుకాడై; కైకొని= వశపరచుకొని; దక్షువక్షంబున్= దక్షుడి రొమ్మును; త్రొక్కి= పాదంతో నొక్కి; ఘన= గొప్ప; శిత= వాడి అయిన; ధారా= అంచుగల; అసిన్= ఖడ్గాన్ని, కొని= పట్టుకొని; మేను= శరీరాన్ని; పొడిచియున్= కసిగా గుచ్చి; మంత్ర= ఋక్కులతో; సమన్విత= కూడుకొన్న; మహిత= గొప్ప; శస్త్ర= ఆయుధాల; జాల= సమూహంతో; అవినిర్భిన్న= చీల్చబడని; చర్మంబు+కల= తోలుఉన్న; దక్షున్= దక్షుని; చంపన్+కాన్‌లేక= చంపచేతకాక; విస్మయమున్= ఆశ్చర్యాన్ని; ఒంది= పొంది; తద్= ఆ దక్షుని; వధ= చంపునట్టి; ఉపాయంబు= వెరవు; తన చిత్తమునన్= తన మనస్సులో; చూచి= కనుగొని; కంఠ= గొంతును; నిష్పీడన= నులమడం అనే; గతిన్= ఉపాయాన్ని; తలంచి= వివేచించి; మస్తకము= శిరం; త్రుంచి= నరికి; అంచిత= ఒప్పిదమైన; అమర్షణమున= కోపంతో; తద్= ఆ వీరభద్రుడి; అనుచరులు= సహచరప్రమథులు; హర్షమును= సంతోషాన్ని; పొందన్= అనుభవించగా; అచటి= ఆ యాగశాలలోని; బ్రాహ్మణజనంబులు= బ్రాహ్మణులందరు; ఆత్మలను= తమలో; చాల= ఎక్కువ; దుఃఖంబులు= వేదనలు; అందుచున్+ఉండన్= పొందుతూ ఉండగా; దక్షిణానలమునన్= దక్షిణాగ్నియందు; వేల్చెన్= ఆహుతి చేశాడు.

**తా :** సాటిలేని దర్పముచేత ఉద్ధతుడయిన వీరభద్రుడు చేతితోపట్టుకొని దక్షుని రొమ్మునుత్రొక్కి పదునైన అంచులు కలిగిన గొప్ప ఖడ్గాన్ని తీసికొని ఒడలంతయు పొరిచినాడు. మంత్రములతో కూడిన మహిమలు కలిగిన శస్త్రసమూహములతోనైనను చీల్చబడని చర్మము కలిగిన దక్షుని చంపలేక ఆశ్చర్యపడినాడు. ఆతనిని వధించు నుపాయమును మనసులో నాలోచించి, గుర్తించి కంఠాన్ని పీడించుటను గురించి యాలోచించినాడు. పొగడదగిన కోపంతో దక్షుని తలను త్రెంచి దక్షిణానలములో కాల్చివేసినాడు. వీరభద్రుని యనుచరులు ఆనందమును పొందినారు. అక్కడి బ్రాహ్మణజనులు తమ మనసులలో చాల దుఃఖమును పొందారు.

**వ. ఇట్లు వీరభద్రుండు దక్షుని యాగంబు విధ్వంసంబు గావించి నిజవాసంబైన కైలాసంబునకుఁ జనియె న య్యవసరంబున. 123**

**ప్రతి :** ఇట్లు= ఇలా మెలకువగా; వీరభద్రుండు= వీరభద్రుడు; దక్షుని= దక్షునియొక్క; యాగంబున్= యజనాన్ని; విధ్వంసంబు= వినాశనం; కావించి= చేసి; నిజవాసంబు+ఐన= తననివాసం అయిన; కైలాసంబునకున్= కైలాసానికి; చనియెన్= వెళ్లిపోయాడు; ఆ+అవసరంబున= అదే సమయాన...

**తా :** ఇలా భద్రంగా వీరభద్రుండు దక్షుడి అధ్వరాన్ని నాశనంచేసి తన కైలాసవాసానికి తిరిగిపోయాడు. అపుడు

## a=దేవతలు వీరభద్రాదులచేఁ బరాజితులై బ్రహ్మతో విన్నవించుట=a

**చ. హరభటకోటిచేత నిశితాసిగదాకరవాలశూలము**
**ద్గరముసలాదిసాధనవిదారితజర్జరితాఖిలాంగులై**

**సురలు భయాకులాత్ము లగుచున్ సరసీరుహజాతుఁ జేరి త**
**చ్చరణసరోరుహంబులకు సమ్మతిఁ జాఁగిలి మ్రొక్కి నమ్రులై. 124**

**ప్రతి :** హర= శివుడియొక్క; భటకోటి చేతన్= సేవాగణం చేతిలో; సురలు= దేవతలు; నిశిత= వాదరగల; అసి= కత్తి; గదా= గద; కరవాల= కటారి; శూల= బల్లెం; ముద్గర= ఇనుపగుదిగఱ్ఱ; ముసల= రోకలి; ఆది= మొదలైన; సాధన= ఉపకరణాలచేత; విదారిత= చీల్చబడిన; జర్జరిత= నుగ్గునుగ్గు చేయబడిన; అఖిల= సమస్తమైన; అంగులు+ఐ= అవయవాలు కలవారై; భయ= భీతిచేత; ఆకుల= కలవరపడిన; ఆత్ములు అగుచున్= మనసుగలవారు అవుతూ; సరసీరుహజాతున్= పద్మసంజాతుడైన బ్రహ్మను; చేరి= సమీపించి; తద్+చరణ, సరోరుహంబులకున్= ఆయన పాదపద్మాలకు; సమ్మతిన్= అంగీకారంతో; చాఁగిలి= సాష్టాంగపడి; మ్రొక్కి= దండంపెట్టి; నమ్రులు+ఐ= అడకువ కలవారై.

**తా :** శివుడి ప్రమథసేనల వాడియైన కత్తులు, గదలు, ఖడ్గములు, శూలములు, ముద్గరములు, ముసలములు మొదలగు ఆయుధములచే చీల్చబడి నుగ్గచేయబడిన సర్వాంగములతో దేవతలు ఆకులతతో బ్రహ్మను చేరి ఆయన పాదపద్మాలకు సాగిలపడి మొక్కుకున్నారు. పిదప వినయంగా వంగినవారై

**క. తము ధూర్జటి సైనికు లగు, ప్రమథులు దయమాలి పెలుచ బాధించుట స**
**ర్వముఁ జెప్పి రనుచు మైత్రే, యమునీంద్రుఁడు విదురుతోడ ననియెన్; మఱియున్. 125**

**ప్రతి :** తము= దేవతలైన తమను; ధూర్జటి= భారమైన జటలుకల శివుడియొక్క; సైనికులు+అగు= బంటులు అయినట్టి; ప్రమథులు= ప్రమథగణం; దయమాలి= కనికరం కోల్పోయి; పెలుచన్= ఆటోపంతో; బాధించుట= వేధించడం; సర్వమున్= ఆసాంతమున్నూ; చెప్పిరి= మొరపెట్టుకున్నారు; అనుచున్= అంటూ; మైత్రేయ= మైత్రేయుడనే; ముని+ఇంద్రుడు= మునీశ్వరుడు; విదురుతోడన్= విదురుడితో; అనియెన్= చెప్పాడు; మఱియున్= ఇంకాను...

**తా :** శివుడి ప్రమథభటులు నిర్దయతో, కోపంతో తమను బాధించిన తీరునంతా ఆసాంతం దేవతలు వెళ్లగక్కుకున్నారు అని మైత్రేయుడు విదురుడితో చెప్పాడు. మళ్లీ

**తే. ఇంతయును మున్ను మనమున నెఱిఁగి యున్న, కతన విశ్వాత్మకుండును గమలలోచ**
**నుండు నన నొప్పు నారాయణుండు నజుఁడుఁ, జూడ రారైరి తాము దక్షుని మఖంబు. 126**

**ప్రతి :** ఇంతయును= దక్షాధ్వర ధ్వంసం సంగతి మొత్తమున్ను; మున్ను= ముందుగనే; మనమునన్= మనస్సులో; ఎఱిఁగి ఉన్నకతనన్= తెలుసుకొని ఉన్నకారణాన; విశ్వ+ ఆత్మకుండును= సమస్తమూ (తనతేజస్సుతో) ఆవరించి ఉన్నవాడును; కమలలోచనుండున్= పద్మనేత్రుడూ; అనన్= అనగా; ఒప్పు= తగి ఉన్నట్టి; నారాయణుండున్= విష్ణువూ; అజుఁడున్= బ్రహ్మ; తాము= వారికి వారుగా; దక్షుని= దక్షునియొక్క; మఖంబు= యజ్ఞం; చూడన్= కనడానికి; రారు+ఐరి= పోని (వెళ్లని) వారయ్యారు.

**తా :** విశ్వం తానుగా ఉన్నవాడు, తామరసాక్షుడు అని పేర్కొనదగిన విష్ణువూ, బ్రహ్మ, వీళ్లిద్దరూ ఆ యాగం ఇలా భగ్నమవుతుందని ముందే తెలిసినవారు. కాబట్టే వారు దక్షయజ్ఞం చూడటానికి ప్రత్యక్షంగా వెళ్ళలేదు.

**వ. అని చెప్పి సుర లిట్లు విన్నవించినఁ జతుర్ముఖుండు వారల కిట్లనియె. 127**

**ప్రతి :** అని చెప్పి= అని పల్కి; సురలు= దేవతలు; ఇట్లు= ఇలా; విన్నవించినన్= మనవి చేయగా; చతుర్+ముఖుండు= నలుమొగాలవేలుపు (బ్రహ్మ); వారలకున్= ఆ దేవతలతో; ఇట్లు+అనియెన్= ఇలా మారు పలికాడు.

**తా :** దేవతల విన్నపం విని బ్రహ్మ వాళ్లతో ఇలా బదులు మాట్లాడాడు.

**క.** **ఘనతేజోనిధి పురుషుం, డనయంబుఁ గృతాపరాధుఁ డయినను దా మ**
**ల్లన ప్రతికారముఁ గావిం, చిన జనులకు లోకమందు సేమము గలదే?** **128**

**ప్రతి :** ఘన= పరమమైన; తేజస్+నిధి= ఆత్మశక్తి సంపన్నుడైన; పురుషుండు= మానవుడు; అనయంబున్= ఎల్లప్పుడు (మిక్కిలి); కృత= చేయబడ్డ; అపరాధుఁడు= తప్పు కలవాడు; అయినను= అయినప్పటికిన్ని; తాము= అలా చేసినవారు; అల్లన= తిన్నగా; ప్రతికారమున్= మాఱుచేతను; కావించిన= చేసిన; జనులకున్= లోకులకు; లోకము+అందు= జగత్తులో; సేమము= బాగు; కలదు+ఏ= ఉంటుందా? ఉండదని భావం.

**తా :** మహాతేజస్స్వరూపుడైన పురుషుడు పొరపాటున తప్పు దొర్లినవాడు అయి ఉండవచ్చు. అంతమాత్రంచేత వారిపై ప్రతీకారానికి పూనుకుంటే ప్రజలకు లోకంలో మేలు అనేదే మిగులదు. మంచిగా మనలేరని భావం. మళ్ళీ మళ్ళీ తప్పు జరిగినా హాని తలపెట్టక పోవడం పెద్దల లక్షణం.

**వ.** **అని మఱియు నిట్లనియె.** **129**

**ప్రతి :** అని= బ్రహ్మ హితవు చెప్పి; మఱియున్= మరొక తడవు; ఇట్లు= ఈ లాగున; అనియెన్= దేవతలతో మాట్లాడాడు.

**తా :** అని బ్రహ్మ బోధించి, మళ్లీ దేవతల దృష్టిని మరలుస్తూ ఇలా అన్నాడు.

**క.** **క్రతుభాగార్హుం డగు పశు, పతి నీశ్వరు నభవు శర్వు భర్గుని దూరీ**
**కృత యజ్ఞభాగుఁ జేసిన, యతి దోషులు దుష్టమతులు నగు మీరింకన్.** **130**

**ప్రతి :** క్రతు= సవనంయొక్క; భాగ= వంతుకు; అర్హుండు+అగు= తగినట్టి; పశుపతిన్= జీవులకు అధిపతిని; ఈశ్వరున్= ఈశ్వరుని; అభవున్= పుట్టుకలేనివానిని; శర్వున్= లయకారుని; భర్గుని= మన్మథుణ్ణీ, యముణ్ణీ, జయించినవాణ్ణి; మీరు; ఇంకన్= ఇక; దూరీకృత= దూరంచేయబడిన; యజ్ఞభాగున్+చేసిన= యజ్ఞం భాగంకల వానినిగా చేసినట్టి; అతిదోషులున్= పెద్ద తప్పు చేసిన వారలూ; దుష్టమతులున్= హానికి తలపడిన వారలూ; అగున్= అగునట్టి...

**తా :** పశుపతీ, ఈశ్వరుడూ, అభవుడూ, శర్వుడూ అయిన శివుడు యజ్ఞభాగమును పొందతగినవాడు. అయినా యాగాంశ పంపకంలో అతణ్ణి దూరంగా పెట్టారు. ఆ సభలో సభ్యులుగా మీరున్నందువల్ల మహాపరాధకులూ, దుర్బుద్ధులూ అగు మీరు ఇంకా

**సీ.** **పూని యే దేవుని బొమముడి మాత్రాన లోకపాలకులును లోకములును**
**నాశ మొందుదు; రట్టి యీశుండు ఘన దురుక్త్యస్త్రనికాయవిద్ధాంతరంగుఁ**
**డును బ్రియావిరహితుండును నైనవాఁ డమ్మహాత్మునిఁ ద్రిపురసంహారకరుని**
**మఖపునస్సంధానమతి నపేక్షించు మీరలు సేరి శుద్ధాంతరంగు లగుచు**

**తే. భక్తినిష్ఠలఁ దత్పాదపద్మయుగళ, ఘనపరిగ్రహపూర్వంబు గాఁగ నతని**
**శరణమొందుఁ డతండు ప్రసన్నుఁడయినఁ దివిరి మీ కోర్కి సిద్ధించు దివిజులార! 131**

**ప్రతి :** పూని= కదగి; ఏ దేవుని= ఏ దేవుడి; బొమముడిమాత్రాన= కనుబొమలు బిగించినంతనే; లోకపాలకులును= దిక్కుల ఏలికలూ; లోకములును= ప్రజలున్నూ; నాశము= చేటును; ఒందుదురు= పొందుతారో; అట్టి= అటువంటి మహత్తుగల; ఈశుండు= పరమశివుడు; ఘన= ఎక్కువయిన; దుర్+ఉక్తి= చెడ్డమాటలనే; అస్త్ర= అమ్ములయొక్క; నికాయ= సమూహంతో; విద్ధ= గాయపడ్డ; అంతరంగుఁడును= హృదయం కలవాడునూ; ప్రియా= ఇష్టసఖి; విరహితుండును= లేనివాడునూ; ఐనవాడు= అయినట్టివాడు; ఆ+మహాత్మునిన్= ఆ ఘనపురుషుని; మఖ= క్రతువును; పునః= తిరిగి; సంధాన= ఒనగూర్చునట్టి; మతిన్= బుద్ధిని; అపేక్షించు= కోరుకునే; మీరలు= మీరు; త్రిపుర సంహారకరునిన్= మూడు పురాలను మట్టుబెట్టిన శివుని; చేరి= చెంతకువెళ్లి; శుద్ధ= నిర్మలమైన; అంతరంగులు= హృదయులు; అగుచున్= అవుతూ; భక్తిన్= భయంతో కూడిన స్నేహంతోనూ; నిష్ఠలన్= ఎడతెగని శ్రద్ధతోనూ; తద్= ఆతని; పాద పద్మయుగళ= చరణారవిందాల జంటను, ఘన= దృఢంగా; పరిగ్రహ= పట్టుకొనడం; పూర్వంబు+కాగన్= మొదటిది అవునట్లుగా; అతని= ఆ శివుడి; శరణము= రక్షణం; ఒందుఁడు= పొందండి; దివిజులారా!= దేవతలార!; అతండు= ఆ శివుడు; ప్రసన్నుఁడు, అయినన్= దయగలవాడు అయినచో; తివిరి= ప్రయత్నంతో; మీ కోర్కె= మీ అభీష్టం; సిద్ధించున్= ఈడేరుతుంది.

**తా :** పూనుకొని ఏ దేవుని కనుబొమ్మలు ముడిపడినంత మాత్రమున (అనగా కొద్దిగా కోపించినను) లోకముల లోకపాలకులు నశిస్తారో అట్టి ఈశ్వరుడు కడుదురుక్తులను అస్త్రసమూహంచేత గాయపడిన హృదయంకలవాడునూ, భార్యను పోగొట్టుకున్నవాడునూ అయ్యాడు. యజ్ఞమును తిరిగి నిర్వహించుటను కోరుకొను మీరు ఆ మహాత్ముడైన త్రిపుర సంహారకరునిచేరి శుద్ధమైన అంతరంగములతో భక్తినిష్ఠలతో ఆయన పాదపద్మాలను గట్టిగా పట్టుకొనడంతో ప్రారంభించి ఆతనిని శరణు పొందండి. దేవతలారా అతడు ప్రసన్నుడైతే మీ ప్రయత్నంతో మీ కోరిక తీరుతుంది.

**విశే :** విద్యున్మాలి, తారకాక్షుడు, కమలాక్షుడు అను ముగ్గురు రాక్షసులు మూడుపురాలతో లోకానికి హాని కల్గిస్తుండగా వారిని సంహరించి శివుడు త్రిపురసంహారకుడు అయ్యాడు. ఆ కథే ఇక్కడ అనుసంధేయం.

**వ. అని మఱియు నిట్లనియె; న ద్దేవుని డాయం జన వెఱతు మని తలంపకుం; డతనిఁ జేరు నుపాయం బెఱింగింపు మంటిరేని నేను నింద్రుండును మునులును మీరలును మఱియు దేహధారు లెవ్వరేని న మ్మహాత్ముని రూపంబు నతని బలపరాక్రమంబుల కొలఁదియు నెఱుంగం జాల; మతండు స్వతంత్రుండు గావునఁ దదుపాయం బెఱింగింప నెవ్వఁడు సమర్థుండగు? నయిన నిపుడు భక్తపరాధీనుండును శరణాగత రక్షకుండును నగు నీశునిఁ జేరంబోవుద మని పలికి పద్మసంభవుండు దేవ పితృగణ ప్రజాపతులం గూడి కైలాసాభిముఖుండై చని చని. 132**

**ప్రతి :** అని= బ్రహ్మ దేవతలకు చెప్పి; మఱియున్= మళ్లీ; ఇట్లు= ఇలా; అనియెన్= ప్రస్తావించాడు; ఆ+దేవుని= ఆ శివదేవుని; డాయన్+చనన్= దాపుకి వెళ్లడానికి; వెఱతుము= భయపడుతున్నాం; అని= అని; తలంపకుండు= అభిప్రాయపడకండి; అతనిన్= ఆ శివుణ్ణి; చేరు= సమీపించుటకు; ఉపాయంబు= వెరవు; ఎఱింగింపుము= తెలపండి; అంటిరి+ఏనిన్= అన్నట్లయితే; నేనున్= విధాత నయిన నేనూ; ఇంద్రుండును= దేవేంద్రుడూ; మునులును= ఋషులూ;

మీరలును= వేల్పులయిన మీరూ; మఱియున్= ఇంకా; దేహధారులు= శరీరులూ; ఎవ్వరు+ఏనిన్= ఎవ్వరయినా; ఆ+మహా+ఆత్ముని= ఆ శివుడి యొక్క; రూపంబున్= సహజ ఆకారాన్ని; అతని= ఆశివుని యొక్క; బలపరాక్రమంబులన్= సత్తువ, శౌర్యాలయొక్క; కొలఁదియున్= మితినీ; ఎఱుంగన్= తెలుసుకోవడానికి; చాలము= సమర్థులం కాము; అతండు= ఆ శివుడు; స్వతంత్రుండు= తనకునచ్చినట్లు నడచు కొనేవాడు; కావునన్= కాన; తద్= ఆ; ఉపాయంబు= నేర్పును; ఎఱింగింపన్= తెల్పను; ఏ+వాడు= ఏ ఒక్కడు; సమర్థుండు+అగున్= నేర్పరి అవుతాడు?; అయినన్= అయినా సరే; ఇపుడు= ఈ వేళ; భక్తపర+అధీనుండును= భక్తులకు లోబడేవాడూ; శరణ+ఆగత= కాపుదల కోరివచ్చిన వాళ్లను; రక్షకుండునున్= ఆదుకునే వైఖరికలవాడునూ; అగు= అయినట్టి, ఈశునిన్= ఐశ్వర్యయుతుడైన శివుణ్ణి; చేరన్= కలియడానికి; పోవుదము= వెళ్ళివద్దాం; అని పలికి= అని చెప్పి; పద్మసంభవుండు= బ్రహ్మ; దేవగణ= దేవతలను; పితృగణ= పితృదేవతలను; ప్రజాపతులన్= ప్రజాపతులను; కూడి= కలసి; కైలాస అభిముఖుండు+ఐ= కైలాసం వైపు మొగమైనవాడై; చని చని= వెళ్లివెళ్లి...

**తా :** అని బ్రహ్మ, దేవతలకు చెప్పి ఇంకా ఇలా అన్నాడు. ఆ మహామహుని సన్నిధికి పోవడానికి మాకు బెరుకు అని తలపోయకండి. ఆ శివుణ్ణి చేరుకునే ఉపాయం గ్రహించుకోవాలని ఉన్నట్లయితే ఈ మాటలు వినండి. నేను గాని, ఇంద్రుడుగాని, మునులుగాని, మీరుగాని ఇంకా జీవులు మరెవరైనాగాని ఆ పరమాత్ముడి యథార్థమైన రూపునూ, అతడి శక్తి వీర్యాల పరిమితిని తెలుసుకొనజాలము. ఆ శివుడు స్వతంత్రుడు. ఆ వెరవు ఇది అని వెల్లడించుటం ఎవరివల్ల కాని పనే. అయినా సరే భక్తులకు లొంగి, శరణు కోరిన వారిని ఆదుకునే స్వభావం గల ఈశ్వరుణ్ణి కలసి రావడానికి ఈ పూటే బయలుదేరుదాం అని చెప్పి బ్రహ్మ, దేవతలనూ, పితృదేవతలనూ, ప్రజాపతులను అందరిని జట్టులుగా కూడగట్టుకొని నేరుగా కైలాసం దిశగా తరలిపోయాడు. చాలా దూరం సాగినాక

**ఉ. భాసురలీలఁ గాంచిరి సుపర్వులు భక్తజనైకమానసో**
**ల్లాసముఁ గిన్నరీజనవిలాసము నిత్యవిభూతిమంగళా**
**వాసము సిద్ధగుహ్యక నివాసము రాజతభూవికాసికై**
**లాసముఁ గాంతినిర్జితకులక్షితిభృత్సుమహద్విభాసమున్. 133**

**ప్రతి :** సుపర్వులు= దేవతలు; భాసురలీలన్= చక్కగా ప్రకాశించే క్రియలో; భక్తజన= భక్తులకు; ఏక= ముఖ్యంగా; మానస= మనస్సుకు; ఉల్లాసమున్= సంతోషం కూర్చేది; కిన్నరీజన= కిన్నరస్త్రీలోకం యొక్క; విలాసమున్= సొగసు చేష్టల విశేషం కలదీ; నిత్య విభూతిమంగళ= శాశ్వతమైన ఐశ్వర్యానికీ, శుభాలకు; ఆవాసము= నిలయం అయినది; సిద్ధ= (అణిమాది) సిద్ధులు అయినవారిని; గుహ్యక= యక్షులకూ; నివాసము= నిలయమూ; రాజత భూవికాసి= వెండిభూములతో ప్రకాశిస్తున్న; కాంతి= ఆ వన్నెలచే; నిర్జిత= గెలిచిన; కులక్షితిభృత్= కులపర్వతాలతో కూడిన; సుమహత్= మంచిఘనత గల; విభాసమున్= శోభ కలదిన్ని అయిన; కైలాసమున్= కైలాసగిరిని; కాంచిరి= దర్శించారు.

**తా :** దేవతలు కైలాసమును ప్రకాశించు విధంగా చూచారు. ఆ కైలాసమొక్కటే భక్తజనుల మనసులకు ఉల్లాసము కలిగించ కలిగినది. కిన్నరీజనుల విలాసము కలిగినది. శాశ్వతమైన ఐశ్వర్యశుభాలకు నిలయమైనది. సిద్ధులకు, గుహ్యకులకు నివాసస్థానమైనది. వెండి భూములతో ప్రకాశిస్తున్నది. కులపర్వతములను మించిన కాంతిని కలిగినది.

**సీ. ధాతువిచిత్రితోదాత్తరత్నప్రభాసంగతోజ్జ్వలతుంగశృంగములును**
**గిన్నరగంధర్వకింపురుషాప్సరోజననికరాకీర్ణసానువులును**
**మానితనిఖిలవైమానికమిథున సద్విహరణైకశుభప్రదేశములును**
**గమనీయనవమల్లికాసుమనోవల్లికామతల్లీలసత్కందరములు**

**తే. నమరసిద్ధాంగనాశోభితాశ్రమములు, విబుధజనయోగ్యసంపన్నివేశములును**
**గలిగి బహువిధపుణ్యభోగముల నొప్పు వినుతసుకృతములకు దండ వెండికొండ. 134**

**ప్రతి :** వెండికొండ= రజతాద్రి; ధాతు= గైరిక ధాతువులచే; విచిత్రిత= చిత్ర విచిత్రంగా చేయబడిన; ఉదాత్త= గొప్పవైన; రత్నప్రభా= రతనాల కాంతులతో; సంగత= కూడి; ఉజ్జ్వల= బాగా ప్రకాశిస్తున్నట్టి; తుంగ= ఎత్తయిన; శృంగములు= శిఖరాలును; కిన్నర= కిన్నరులు; గంధర్వ= గంధర్వులు; కింపురుష= కింపురుషులు; అప్సరస్+జన= అప్సర స్త్రీల యొక్క; నికర= సమూహంతో; ఆకీర్ణ= అంతటానిండి ఉన్న; సానువులును= చరియలూ; మానిత= గౌరవించబడే; నిఖిల= సమస్తమైన; వైమానిక= విమానాలు ఎక్కి సంచరించే; మిథున= జంటలకు; సద్= యోగ్యంగా; విహరణ= వేడుకపడి తిరుగడానికి; ఏక= ఒకే; శుభప్రదేశములును= క్షేమంకరమైన స్థలాలు; కమనీయ= అందమైన; నవమల్లికా= విరజాజి; సుమనః+వల్లికా మతల్లీ= శ్రేష్ఠమైన పూదీవలతో; లసత్= ప్రకాశిస్తున్న; కందరములున్= గుహలును; అమర= దేవతల; సిద్ధ= సిద్ధుల; అంగనా= కాంతల చేత; శోభిత= శోభిల్లిన; ఆశ్రమములు= ఆశ్రమాలు; విబుధజన= దేవతలకు; యోగ్య= తగ్గ; సంపత్= సిరిగల; నివేశములును= ఇళ్లున్నూ; కలిగి= ఉండి; బహువిధ= పలు ప్రకారాలైన; పుణ్య= పుణ్యకరమైన; భోగములన్= అనుభవములతో; ఒప్పు= ప్రకాశించే; వినుత= కీర్తించబడే; సుకృతములకున్= సత్కార్యాలకు; దండ= స్థానము వంటిది.

**తా :** ఆ కైలాసము గైరిక ధాతువులచేత విచిత్రముగా ఉండెడి ఉదాత్త రత్నకాంతులతో కూడిన ఎత్తైన శిఖరములు కలిగినది. ఆ కొండ సానువులు కిన్నరులు, గంధర్వులు, కింపురుషులు, అప్సరులు వీరి సమూహాలతో క్రిక్కిరిసినవి. గౌరవింపదగిన విమానములపై సంచరించెడి జంటలకు కల ఒకే శుభప్రదమైన మంచి విహార ప్రదేశము అందమైన నవమల్లికా కుసుమముల శ్రేష్ఠమైన తీగలతో ప్రకాశిస్తున్న గుహలు, దేవకాంతలతో, సిద్ధకాంతలతో ప్రకాశించెడి ఆశ్రమములు, దేవతలకు యోగ్యమైన సంపదలుకల గృహములు కలిగిన పెక్కువిధాలైన పుణ్యభోగములచేత ఒప్పెడు పొగడదగిన మంచి పనులకు ఆధారమైనది.

**విశే :** మతల్లి, మతల్లిక, మచర్చిక – పదములు శ్రేష్ఠతా వాచకాలు సమాసంలో ఉత్తరపదంగా వస్తుంటాయి.

**వ. అది మఱియును మందార పారిజాత సరల తమాల సాల తాల తక్కోల కోవిదార శిరీషార్జున చూత కదంబ నీప నాగ పున్నాగ చంపక పాటలాశోక వకుళ కుంద కురవక కన కామ్ర శతపత్ర కింశు కైలా లవంగ మాలతీ మధూక మల్లికా పనస మాధవీ కుటజోదుంబ రాశ్వత్థ ప్లక్ష వట హింగుళ భూర్జ పూగ రాజపూగ జంబూ ఖర్జూ రామ్రాత ప్రియాళు నారికేళేంగుద వేణు కీచక ముఖర తరుశోభితంబును, గలకంఠ కాలకంఠ కలవింక రాజకీర మత్తమధుకర నానా విహంగ కోలాహల నినదబధిరీభూత రోదోంతరాళంబును, సింహ తరక్షు శల్య గవయ శరభ శాఖామృగ వరాహ వ్యాఘ్రకుర్కుర రురు మహిష వృక కారంగ ప్రముఖ**

**వన్యసత్త్వ సమాశ్రయ విరాజితంబును, గదళీషండ మండిత కమల కహ్లార కైరవ కలిత పులినతల లలిత కమలాకర విహరమాణ కలహంస కారండవ సారస చక్రవాక బక జలకుక్కుటాది జలవిహంగకుల కూజిత సంకులంబును, సలిల కేళీవిహరమాణ సతీరమణీ రమణీయ కుచమండల విలిప్తమృగమద మిళిత హరిచందన గంధ సుగంధి జలపూరిత గంగా తరంగిణీ సమావృతంబును నైన కైలాస పర్వతంబు వొడగని యరవింద సంభవ పురందరాది దేవగణంబు లత్యద్భుతానందంబులం బొంది ముందటఁ దారహీర హేమమయ విమాన సంకులంబును; బుణ్యజన మానినీ శోభితంబును నైన యలకాపురంబుఁ గడచి తత్పుర బాహ్య ప్రదేశంబునం దీర్ఘపాదుండైన పుండరీకాక్షు పాదారవింద రజః పావనంబును, రతికేళీ వ్యాసంగ పరిశ్రమ నివారక సలిల కేళీవిలోల దేవ కామినీ పీనవక్షోజ విలిప్తకుంకుమ పంక సంగత పిశంగవర్ణ వారిపూర విలసితంబునునై, నందాలక నందాభిధానంబులు గల నదీద్వితయంబు దాఁటి తత్పురోభాగంబున వనగజసంఘృష్టమలయజపరిమిళితమలయపవనాస్వాదనముహుర్ముహురున్ముదిత మానస పుణ్యజనకామినీకదంబంబును, వైదూర్యసోపాన సమంచిత కనకోత్పల వాపీ విభాసితంబును, గింపురుషసంచారయోగ్యంబును నగు సౌగంధిక వన సమీపంబు నందు.** **135**

**ప్రతి :** అది= ఆ వెండికొండ; మఱియును= ఇంకనూ; మందార= మందార వృక్షాలు; పారిజాత= పారిజాతవృక్షాలు; సరల= తెల్లతెగడచెట్లు; తమాల= చీకటి చెట్లు; సాల= మద్దిచెట్లు; తాల= తాడిచెట్లు; తక్కోల= తక్కులపుచెట్లు; కోవిదార= రక్తకాంచన వృక్షాలు; శిరీష= దిరిసెన చెట్లు; అర్జున= తెల్లమద్ది చెట్లు; చూత= మామిడి చెట్లు; కదంబ= కడిమిచెట్లు; నీప= మంకెనచెట్లు; నాగ= పొన్న చెట్లు; పున్నాగ= సురపొన్నచెట్లు; చంపక= సంపెగ చెట్లు; పాటల= కలిగొట్టుచెట్లు; అశోక= కంకేళి వృక్షాలు; వకుళ= పొగడచెట్లు; కుంద= మల్లెచెట్లు; కురవక= ఎఱ్రగోరంట చెట్లు; కనక= పచ్చసంపెంగచెట్లు; ఆమ్ర= మామిడిచెట్లు; శతపత్ర= తామరలు; కింశుక= మోదుగుచెట్లు; ఏలా= ఏలక్కాయలచెట్లు; లవంగ= కరాపువుచెట్లు; మాలతీ= జాజిచెట్లు; మధూక= ఇప్పచెట్లు; మల్లికా= మల్లె తీగలు; పనస= పనసచెట్లు; మాధవీ= పూలగురివిందతీగలు; కుటజ= కొండమల్లెచెట్లు; ఉదుంబర= మేడిచెట్లు; అశ్వత్థ= రావిచెట్లు; ప్లక్ష= జువ్విచెట్లు; వట= మఱ్ఱిచెట్లు; హింగుళ= ఇంగువచెట్లు; భూర్జ= బుజపత్తిరిచెట్లు; పూగ= పోకచెట్లు; రాజపూగ= రాజపూగ చెట్లు; జంబూ= నేరేడు చెట్లు; ఖర్జూర= ఖర్జూరం చెట్లు; ఆమ్రాత= అంబాళపుచెట్లు; ప్రియాళు= మోరటిచెట్లు; నారికేళ= కొబ్బరిచెట్లు; ఇంగుద= గారచెట్లు; వేణు= వెదురుచెట్లు; కీచక= సన్నవెదురుచెట్లు; ముఖర= మొదలైన; తరు= చెట్లతో; శోభితంబును= అలంకరించబడినదీ; కలకంఠ= కోకిలలు; కాలకంఠ= నెమళ్లు; కలవింక= ఊరపిచ్చుకలు; రాజకీర= రాచిలుకలు; మత్తమధుకర= గండుతుమ్మెదలు; నానావిహంగ= రకరకాల పక్షుల; కోలాహల= కలకలముల; నినద= కూతలతో; బధిరీభూత= చెవుడుపుట్టేలా చేయబడ్డ; రోదస్= ఆకాశం యొక్క; అంతరాళంబును= నడిమిచోటు కలది; సింహ= సింహాలు; తరక్షు= సివంగులు; శల్య= ఏదు పందులు; గవయ= అడవి ఎద్దు; శరభ= మీగండ్ల మెకాలు; శాఖామృగ= కోతులు; వరాహ= అడవిపందులు; వ్యాఘ్ర= పులులు; కుర్కుర= కుక్కలు; రురు= నల్లచారల దుప్పులు; మహిష= దున్నలు; వృక= తోడేళ్లు; సారంగ= లేళ్లు; ప్రముఖ= మొదలైన; వన్యసత్త్వ= అడవి జంతువులకు; సమాశ్రయ= ఆశ్రయమై; విరాజితంబును= మిక్కిలి శోభిల్లుతున్నదీ, కదళీషండ= అరటితోటలతో; మండిత= అలంకృతమైన; కమల= పద్మాలతో; కహ్లార= సౌగంధికాలతో; కైరవ= తెల్లకలువలతో; కలిత= కూడిన; పులినతల= ఇసుక దిన్నె ప్రదేశాలు; లలిత= మనోజ్ఞమైన; కమలాకర= సరోవరాల్లో; విహరమాణ= విహరిస్తున్న;

కలహంస= రాచహంసల; కారండవ= కొంగలు; సారస= బెగ్గురులు; చక్రవాక= జక్కవలు; బక= కొంగలు; జలకుక్కుట= నీటికోళ్లు; ఆది= మొదలైన; జలవిహంగకుల= నీటి పిట్టల గుమియొక్క; కూజిత= కూతలతో; సంకులంబును= ఒకటితో ఒకటి కలసి పోయినదీ; సలిలకేళీ= జలక్రీడలయందు; విహరమాణ= విహరిస్తున్న; సతీరమణీ= భవానీదేవి యొక్క; రమణీయ= సుందరమైన; కుచమండల= స్తనభాగంలో; విలిప్త= బాగా పులుముకోబడిన; మృగమద= కస్తూరిపరిమళంతో; మిళిత= కూడిన; హరిచందన= పసుపు వన్నె గంధంయొక్క; గంధ= వాసనగల; సుగంధి= పరిమళాలతో మిశ్రితమైన; జలపూరిత= నీటితో నింపబడిన; గంగా తరంగిణీ= గంగానదితో; సమావృతంబునున్+ఐన= నలుపక్కలా చుట్టుకొన్నదీ అయిన; కైలాస పర్వతంబు= కైలాసగిరిని; పొడగని= గుర్తించి; అరవిందసంభవ= బ్రహ్మ; పురందర= దేవేంద్రుడు; ఆది= మొదలైన; దేవగణంబులున్= దేవతల వర్గాలు; అతి+అద్భుత= కనీ వినీ ఎరుగనంత ఆశ్చర్యాన్ని; ఆనందంబున్= సంతోషాన్ని; పొంది= అనుభవించి; ముందటన్= ముంగల; తార= ముత్యాలు; హీర= రవ్వలు; హేమమయ= బంగారు నిండిన; విమాన= దివ్యరథాలతో; సంకులంబునున్= పర్యాకులమైన; పుణ్యజన= పుణ్య జనులయొక్క; మానినీ= వెలదులతో; శోభితంబునున్+ఐన= విలసిల్లేది అయిన; అలకాపురంబున్= అలకాపట్టణాన్ని; కడచి= దాటి; తద్+పుర= ఆ అలకానగరానికి; బాహ్యప్రదేశంబునన్= వెలుపలి స్థలంలో; తీర్థపాదుండు+ఐన= పవిత్రపాదాలు కలవాడయిన; పుండరీక+అక్షు= విష్ణువుయొక్క; పాద+అరవింద= పద్మాలవంటి పాదాలయొక్క; రజస్= పరాగంచే; పావనంబును= పవిత్రమైనదీ; రతికేళీ= శృంగార క్రీడలందలి; వ్యాసంగ= అత్యాసక్తి వలని; పరిశ్రమ= అలసటను; నివారక= పోగొట్టునట్టి; సలిలకేళీ= స్త్రీ పురుషుల జలక్రీడల్లో; విలోల= కదల్తున్న; దేవకామినీ= అప్సరసలయొక్క; పీనవక్షోజ= బలిసిన కుచములందు; విలిప్త= ఎక్కువగా అద్దబడిన; కుంకుమపంక= కుంకుమపూవు లేపనంతో; సంగత= కూడిన; పిశంగవర్ణ= గోరోజనం వన్నె కల్గిన; వారిపూర= నీటి వెల్లువతో; విలసితంబునున్+ఐ= ప్రకాశించేది ఐ; నందా, అలకనందా, అభిధానంబులు, కల= నంద అలకనంద అనే పేర్లుగల; నదీ ద్వితయంబున్= జంటనదులను; దాఁటి= కడచని; తద్= అక్కడ; పురస్+భాగంబున= ముందుపట్టున; వనగజ= అడవి ఏనుగులు; సంఘృష్ట= ఒరసు కొనడంవల్ల కల్గిన; మలయజ= చందనం చెట్లయొక్క; పరిమళిత= మనోహరమైన సువాసనలుగల; మలయపవన= దక్షిణం పక్కకొండ గాలిని; ఆస్వాదన= అనుభవించడంవల్ల; ముహుర్+ముహుర్= మాటిమాటికి; ఉత్+ముదిత= ఉప్పొంగింపచేస్తున్న; మానస= మనస్సుగల; పుణ్యజనకామినీ= యక్ష స్త్రీల; కదంబంబును= సమూహమున్ను; వైదూర్య= పచ్చలు పొదిగిన; సోపాన= మెట్లతో; సమంచిత= చక్కగా ఉన్న; కనక= బంగారురంగు గల; ఉత్పల= కలువపువ్వులుగల; వాపీ= బావులతో; విభాసితంబును= శోభించేది; కింపురుష= కింపురుషులకు; సంచారయోగ్యంబునున్+అగు= తిరుగుటకు తగినదీ అయిన; సౌగంధికవన= ఎర్రకలువ పూ మొక్కల తోట; సమీపంబున్+అందు= దగ్గర...

**తా :** అది ఇంకా మందారాలు, పారిజాతాలు, తెల్లతెగడ, చీకటిమాను, మద్ది, తాడి, తక్కల, రక్తకాంచన, దిరిసెన, తెల్లమద్ది, మామిడి, కడిమి, ప్రబ్బలి, పొన్న, సురపొన్న, సంపెగ, పాటలి, అశోక, పొగడ, మల్లె, ఎర్రగోరంట, పచ్చసంపెగ, మామిడి, తామర, మోదుగు, ఏలక, లవంగ, జాజి, ఇప్ప, మల్లియ, పనస, గురివింద, కొండమల్లె, అత్తి, రావి, జువ్వి, మట్టి, ఇంగువ, భుజపత్తిరి, పోక, రాజపూగ, నేరెడు, ఖర్జూరం, అంబాళం, ప్రియాళు, కొబ్బరి, గార, వెదురు, సన్నవెదురు మొదలైన చెట్లతో, శోభిల్లున్నదీ, కోయిలలు, నెమళ్లు, ఊరబిచ్చుకలు, రాచిలుకలు, మదించినతుమ్మెదలు వంటిభిన్న భిన్నపక్షుల కూహూ, కిచకిచ, ఝుంకారాది కూతలు అన్ని వైపులనించి మరేదీ విన్పించనంతగా గింగురుమంటున్న అంతరిక్షమును, సింహాలు, సివంగులు, ఏదుపందులు, ఎద్దులు, మీగండ్లమెకాలు, కోతులు, అడవి పందులు, పెద్ద పులులు, కుక్కలు, దుప్పులు, దున్నలు, తోడేళ్లు, లేళ్లు, మొదలైన అడవిజంతువులకు నెలవై శోభిస్తుంది. అరటి తోపులతోనూ,

విచ్చుకున్న తామరలు, ఎఱ్ఱ, తెల్ల కలువపూల శోభతోనూ తిన్నని ఇసుకప్రదేశాలతోనూ అందగిస్తున్న మంచి కొలనులున్నూ, ఆ సరస్సుల్లో స్వేచ్ఛగా, అటు ఇటు తిరుగాడే రాయంచలు, కొంగలు, బెగ్గురులు, జక్కవ పిట్టలు, కొంగలు, నీటికోళ్లు మొదలుగా పోగయిన నీటి పిట్టల కలకలరవాలు, ఒక దానితో ఒకటి కలిసిపోయి చెవులు చిల్లులు పడేంత రొదలతో విరాజిల్లుతుంది. జలకాలాటల వేడుకల్లో సతీదేవి చక్కటి కుచ మండలాల్లో దట్టంగా పులుముకొన్న కస్తూరిపరిమళంతో పచ్చగంధం పరిమళం మేళవించిన నీటి ప్రవాహంతో గంగానది నిండుగా ఆనందాన్ని అందింపచేస్తోంది. ఆ కైలాస శిఖరాన్ని బ్రహ్మ, ఇంద్రుడు, మొదలైన దేవతలందరూ దర్శించి చెప్పలేనంత ఆశ్చర్యానందాల్లో మునిగి తేలారు. తమ ముందరే ముత్యాలు రవ్వలు పొదిగిన బంగారు విమానాలతో నిండి ఉన్నట్టి, పుణ్యకాంతలతో కళ కళలాడుతున్నట్టి అలకాపట్టణాన్ని దాటారు. ఆ అలకానగరానికి వెలుపలగా నంద, అలకనంద అనే రెండు నదులు జమిలిగా ప్రవహిస్తుంటాయి. అవి పుణ్యప్రదమైన తీర్థపాదుడైన విష్ణుమూర్తి పాదపద్మాల ధూళిరేణువులతో పవిత్రమైనవి. శృంగార క్రీడాసక్తిగల జంటల బడలిక సేద తీర్చే ఓలలాటలకు అనువైనవి. ఆ జలవిహారాల్లో అటు ఇటు కదలాడే ఘనకుచాలమీది కుంకుమపూల/ పూత కలసిపోయి గోరోజనం రంగుకు తిరిగిన నీటి వెల్లువ గల ఆ నదులను దాటి ముందుకు కదిలారు. ఆ తరువాత తెల్ల/ఎఱ్ఱ కలువపూల సౌగంధికవనం తమ ముందర అగపడింది. ఆ పెంపుడు తోటలో అడవి ఏనుగుల రాపిడివల్ల చందనంచెట్ల నుంచి ఘుమఘుమ సువాసనలు మోసుకొస్తున్న కొండగాలిని తడవలు తడవలుగా అనుభవిస్తూ తన్మయులయిపోతున్న యక్షిణుల మూక ఉంది. ఆ వనంలో పచ్చలు తాపిన మెట్లతో, పసిమిపూసిన కలువపూలతో, దిగుడు బావులు నిండుగా ముచ్చటగా ఉన్నాయి. ఆ పూలతోట కింపురుషుల సంచారాలకు అనువుగా ఉంది. ఈ పుష్పవనాన్ని ఆనుకొని

### a =బ్రహ్మాదులు దక్షిణామూర్తి రూపుం డగు నీశ్వరుని స్తుతించుట a

**సీ. ఉజ్జ్వలంబయి శతయోజనంబుల పొడ వొగిc బంచసప్తతియోజనముల**
**పఱపును గల్గి యేపట్టునc దఱుcగని నీడ శోభిల్ల నిర్ణీత మగుచుc**
**బర్ణశాఖాసమాకీర్ణమై మాణిక్యములc బోలcగల ఫలములc దనర్చి**
**కమనీయసిద్ధయోగక్రియామయమయి యనఘముముక్షుజనాశ్రయంబు**

**తే. భూరిసంసారతాపనివారకంబు, నగుచుc దరురాజ మనcగ cబెం పగ్గలించి**
**భక్తజనులకు నిచ్చలుc బ్రమద మెసcగ, వలయు సంపద లందు నావటము వటము. 136**

**ప్రతి :** ఉత్+జ్వలంబు+అయి= ప్రకాశిస్తున్నదై; శతయోజనంబులు= వంద ఆమడల; పొడవు= నిడివి (ఎత్తు); ఒగిన్= చక్కగా; పంచసప్తతి యోజనముల= డెబ్బై అయిదు ఆమడల; పఱపును= వెడల్పును; కల్గి= ఉండి; ఏ+పట్టునన్= ఎటుపక్క నుంచి అయినా (నలువైపులా); పర్ణ= ఆకులతో; శాఖా= కొమ్మలతో; ఆకీర్ణము+ఐ= అలుముకొని ఉన్నదై; తఱుcగని= ఏ కాలమూ వెలితిపడని; నీడన్= ఛాయతో; శోభిల్లన్= వెల్గొందగా; నిర్ణీతము+అగుచున్= అమర్చబడిందిగా అవుతూ; మాణిక్యములన్= కెంపులతో; పోలన్+కల= సాటిరాగల; ఫలములన్= దోర పండ్లతో; తనర్చి= ఒప్పి; కమనీయ= కోరదగిన; సిద్ధయోగ= అణిమాదుల్లో ఒక మహిమ కల్గిన; క్రియామయము+అయి= యోగసాధనలో ఒక్కటైన కర్మయోగరూపం కలదై; అనఘ= పుణ్యమూర్తులైన; ముముక్షు= మోక్షవాంఛగల; జన= సిద్ధ పురుషులకు; ఆశ్రయంబు= ప్రాపు అయినదిన్ని;

భూరి= పెద్దదైన; సంసార= జీవలోకం యొక్క; తాప= బాధను; నివారకంబున్= పోగొట్టేది; అగుచున్= అవుతూ; తరురాజము= పెద్దమాను; అనఁగన్= అనేట్లు; పెంపు= ఏపుదల; అగ్గలించి= అతిశయించి; భక్తజనులకు= భక్తకోటికి; నిచ్చలున్= కలకాలం; ప్రమదము= సంతోషం; ఎసఁగన్= పెంచే విధాన; వటము= మఱ్ఱిమాను; వలయు= అవసరమైన; సంపదలందు= సమృద్ధిలో; ఆవటము= పొందికైనది.

**తా :** ఆ పూలవనం పక్కనే ఒక పెద్ద వటవృక్షం కంటికి ఆనింది. ఆ మఱ్ఱిమాను వందయోజనాల నిడివి, డెబ్బై అయిదు యోజనాల వైశాల్యం కల్గి ఉంది. ఆ చెట్టు పచ్చ పచ్చటి ఆకుల రెమ్మలతో కొమ్మలతో గుబురుగా అల్లుకొని గుమ్మటంగా ఉంది. ఎటుపక్కనుంచి చూచినా ఆ చెట్టు నీడపట్టుకు ఏమీ కొదువ ఉండదు. పక్వానికివచ్చిన కెంపురంగు పండ్లగుత్తులతో ఇంపుగా ఉంది. ఆ నీడ సిద్ధక్రియాయోగాభ్యాసకులకు ఆటపట్టుగాను, పుణ్యస్వరూపులైన మోక్షగాములకు ఉనికి పట్టుగాను, మహాసంసారమనే తాపానికి నివారకంగాను ఉంటుంది. చేవదేఱిన ఆ మఱ్ఱి 'అబ్బ! చాలగొప్పమాను' అని అనేట్లు చేస్తున్నది. భక్తకోటిని ఎపుడూ ఆనందపరుస్తూనే ఉంటుంది. ఆ వటం వలసినంత ఐశ్వర్యప్రాప్తికి పొందికైనది.

**వ. ఆ వృక్షమూలతలంబున. 137**

**ప్రతి :** ఆ వృక్ష= ఆ వటం; మూలతలంబున= మొదలు ప్రదేశంలో...

**తా :** ఆ మఱ్ఱిమాను మూలంలో

**సీ. ఇద్ధసనందాదిసిద్ధసంసేవితు శాంతివిగ్రహుని వాత్సల్యగుణునిఁ**
**గమనీయలోకమంగళదాయకుని శివు విశ్వబంధుని జగద్వినుతయశుని**
**గుహ్యకసాధ్యరక్షోయక్షనాథకుబేరసేవితుని దుర్వారబలుని**
**నుదితవిద్యాతపోయోగయుక్తుని బాలచంద్రభూషణుని మునీంద్రనుతునిఁ**

**తే. దాపసాభీష్టకరు భస్మదండలింగ, ఘనజటాజినధరుని భక్తప్రసన్ను**
**వితతసంధ్యాభ్రరుచివిడంబిత వినూత్ను, రక్తవర్ణు సనాతను బ్రహ్మమయుని. 138**

**ప్రతి :** ఇద్ధ= ప్రసిద్ధులైన; సనంద+ఆది= సనందుడు మొదలైన; సిద్ధ= సిద్ధపురుషులచే; సంసేవితున్= సేవించబడేవాణ్ణి; శాంతి విగ్రహునిన్= శాంతాకారుని; వాత్సల్యగుణునిన్= పుత్రస్నేహధర్మునీ; కమనీయ= కోరదగిన; లోక= విశ్వానికి; మంగళదాయకునిన్= కల్యాణకరునీ; శివున్= ఈశ్వరుని; విశ్వబంధునిన్= లోక బాంధవునీ, జగత్; వినుత యశునిన్= లోకశ్లాఘ్యమైన కీర్తిమంతునీ; గుహ్యక= కుబేరుని నిధులను కాపలా కాయువారు; సాధ్య= గణదేవతలు; రక్షస్= పిశాచులు/ రాక్షసులు; యక్షనాథ= యక్షుల ప్రభువు అయిన; కుబేర= ధనదుడు మున్నగు దేవతలచే; సేవితునిన్= కొలువబడేవాణ్ణి; దుర్వార= వారింప నలవికాని; బలునిన్= శక్తిగలవాణ్ణీ; ఉదిత= పుట్టిన; విద్యా= ఉపాసన జ్ఞానం; తపస్= చిత్త, ఏకాగ్రత; యోగ= ధ్యానంతో; యుక్తునిన్= అన్వితుడైనయోగిని; బాలచంద్ర= చంద్రవంక; భూషణునిన్= తొడవుగా గలవాణ్ణీ; ముని+ఇంద్ర= ఋషి పుంగవులచే; నుతునిన్= స్తుతించబడేవాణ్ణీ; తాపస= తపస్వులకు; అభీష్టకరున్= కోరికలీడేర్చేవాణ్ణీ; భస్మ= విబూదిని; దండ= యోగదండాన్ని; లింగ= లింగాన్ని; ఘన= భారమైన; జటా= జడలను; అజిన= మృగచర్మాన్ని; ధరుని= ధరించిన వాణ్ణి; భక్తప్రసన్నున్= భక్తులయందు కరుణ చూపేవాణ్ణి; వితత= విస్తారమైన;

సంధ్యా= సంజవేళలోని; అభ్రరుచి= మబ్బు వెలుగును; విడంబిత= అనుకరించిన; వినూత్న= సరికొత్త; రక్తవర్ణున్= జేగురు రంగు చాయ కలవాణ్ణి; సనాతనున్= శాశ్వతుని; బ్రహ్మమయుని= తత్త్వ రూపుని...

**తా :** పేరు ప్రఖ్యాతులుపొందిన సనందనాది జ్ఞానులచే ఉపాసితుడు, శాంతమూర్తి, వాత్సల్యముకలవాడు, లోకములకు మంగళములనిచ్చువాడు. ఈశ్వరుడు, జగత్తుకు చుట్టమూ, లోకమంతయు వినుతించు యశస్సుకలవాడు, గుహ్యక, రాక్షస, సాధ్య, కుబేరాది దేవజాతులచే కొలువబడేవాడు, ఎదురులేని శక్తిమంతుడు, జ్ఞాన, భక్తి, కర్మయోగ సాధన నిష్ఠలుకలవాడు, నెలవంకను ఆభరణంగా ధరించినవాడు, మౌనీంద్రస్తుత్యుడు, తపసుల వాంఛలను తీర్చేవాడు, విభూదితో, దండంతో, లింగంతో, గొప్ప జటాజూటంతో, మృగచర్మం ధరించినవాడు, భక్త ప్రసన్నుడు, ముని చీకటి మబ్బుచాయను పోలిన తాజా లోహితవర్ణం కలవాడు, శాశ్వతుడు, తత్త్వస్వరూపుడు.

**వ. మఱియును. 139**

**ప్రతి :** మఱియును= ఇంకాను...

**సీ. అంచితవామపాదాంభోరుహము దక్షిణోరుతలంబున నొయ్య నునిచి**
**సవ్యజానువుమీఁద సవ్యబాహువు సాఁచి వలపలి ముంజేత సలలితాక్ష**
**మాలిక ధరియించి మహనీయతర్కముద్రాయుక్తుఁ డగుచుఁ జిత్తంబులోన**
**నవ్యయం బయిన బ్రహ్మానందకలితసమాధినిష్ఠుఁడు వీతమత్సరుండు**

**తే. యోగపట్టాభిరాముఁడై యుచిత వృత్తి, రోషసంగతిఁబాసి కూర్చున్న జముని**
**యనువునను దర్భరచిత బ్రుస్యాసనమున, నున్న మునిముఖ్యు నంచితయోగనిరతు, 140**

**ప్రతి :** అంచిత= ఒప్పుతున్న; దక్షిణ= కుడిదైన; ఊరుతలంబునన్= తొడమీద; వామ= ఎడమదైన; పాద+అంభస్+ రుహమున్= పాదమనే పద్మాన్ని; ఒయ్యన= తిన్నగా; ఉనిచి= ఉండబెట్టి; సవ్య= ఎడమదైన; జానువు మీఁద= మోకాలి చిప్పపైన; బాహువు= చేతిని; చాఁచి= సాగచాపి; వలపలి= కుడిచేతి; ముందు+చేతన్= మణికట్టున; సలలిత= అందమైన; అక్షమాలికన్= జపమాలను; ధరియించి= పట్టుకొని; మహనీయ= గొప్పదయిన; తర్క= జ్ఞానముయొక్క; ముద్రా= ముద్రతో; యుక్తుఁడు+అగుచున్= కూడినవాడు అవుతూ; చిత్తంబులోనన్= మనస్సులోన; అవ్యయంబు అయిన= క్షీణించనిది అయిన; బ్రహ్మానంద= పరమానందంతో; కలిత= కూడిన; సమాధి నిష్ఠుఁడు= సమాధి స్థితిలో ఉన్నవాడు; వీత= తొలగి పోయిన; మత్సరుండు= ఈసు కలవాడు; యోగపట్ట= యోగపీఠంతో; అభిరాముఁడు+ఐ= ఒప్పినవాడై; ఉచితవృత్తిన్= తగిన నడవడికతో; రోష= కోపావేశంయొక్క; సంగతిన్= పొత్తును; పాసి= వదులుకొని; కూర్చున్న= ఆసీనమై ఉన్న; జముని= యముని; అనువునను= విధాన; దర్భరచిత= కుశలతో అల్లబడిన; బ్రుసీ+ఆసనమునన్= దీక్షావ్రతులయొక్క పీటమీద; ఉన్న= ఉపవిష్టుడైఉన్న; మునిముఖ్యున్= మననశీలురలో ప్రధానుని; అంచిత= తగ్గట్టి; యోగనిరతున్= ఎల్లప్పుడు యోగ అనుష్ఠానంలో వున్నవానిని...

**తా :** కుడితొడపై ఎడమపాదాన్ని తిన్నగా ఉంచి, ఎడమ మోకాలిపైన ఎడమ చేతిని చాపాడు. కుడిచేతి ముంజేతితో జపమాలను చక్కగా పట్టి, గొప్పజ్ఞానముద్రాలక్షితుడై ఉన్నాడు. మనసున తిరుగులేని పరమానందం వల్ల తెలిసిన మనోలయంతో

నిలకడగా ఉన్నాడు. మాత్సర్యాన్ని వదిలించుకున్నాడు. యోగపట్టంతో నొక్కినవాడు. తగినవిధంగా రోషాన్ని తొలగించుకొని ధర్మపీఠం మీద కూర్చున్న యముడివలె దర్భలతో కూర్చిన యోగపీఠం మీద దీక్షావ్రతిలా కూర్చొని ఉన్నాడు. అట్టి మునులలో అగ్రగణ్యుని, యోగ్యుడైన ధ్యాననిష్ఠుని

**క. అలఘుని నభవుని యోగీం, ద్రులు వినుచుండంగ నారదునితోఁ బ్రియభా**
**షలు జరుపుచున్న రుద్రుని, సలలితపన్నగవిభూషు సజ్జనపోషున్. 141**

**ప్రతి :** యోగి+ఇంద్రులు= ధ్యాన నిష్ఠుల్లో శ్రేష్ఠులు; వినుచున్+ఉండంగన్= ఆలకిస్తుండగా; నారదుతోన్= నారద మునితో; ప్రియభాషలు= తియ్యమైన నిండు మాటలు; జరుపుచున్+ఉన్న= సలుపుతున్న; సలలిత= మనోజ్ఞమైన; పన్నగ= సర్పం; విభూషున్= ఆభరణంగాధరించిన వానిని; సద్+జనపోషున్= సౌజన్యుల్ని ప్రోత్సహిస్తున్నవాణ్ని; అలఘునిన్= పెద్దవాణ్ణి; అభవునిన్= పుట్టుకలు లేనివానిని; రుద్రునిన్= శివుణ్ణి.

**తా :** మహాయోగి వర్యులంతా వింటూ ఉండగ నారదమహర్షితో ఇష్టాలాపనలు సాగిస్తున్నవాణ్ణి, పామును ఆభరణంగా కలవాణ్ణి, సాధుపురుషులను పెంపుచేసేవాణ్ణి, ఘనుణ్ణి, జన్మలేనివాణ్ణి, శివుణ్ణి.

**క. కని లోకపాలురును ముని, జనులును సద్భక్తి నతని చరణంబులకున్**
**వినతు లయి, రప్పు డబ్జా సనుఁ, గని యయ్యభవుఁ దధిక సంభ్రమ మొప్పన్. 142**

**ప్రతి :** కని= ఈక్షించి; లోకపాలురును= దిక్పాలకులున్నూ; మునిజనులును= ఋషిలోకమున్ను; సద్+భక్తిన్= మంచిసేవతో; అతని= ఆ శివుడియొక్క; చరణంబులకున్= పాదాలకు; వినతులు+అయిరి= వంగి దండాలు పెట్టారు; అప్పుడు= ఆ సమయంలో; అబ్జ+ఆసనున్+కని= బ్రహ్మను చూచి; ఆ+అభవుడు= ఆ శివుడు; అధిక= హెచ్చయిన; సంభ్రమము= తత్తరపాటు; ఒప్పన్= కూడగా...

**తా :** చూచి లోకపాలురూ, మునిజనులు పరమభక్తితో వంగి పాదప్రణామం చేశారు. అదే సమయంలో శివుడు బ్రహ్మను గమనించాడు. ఒప్పుగా ఎంతో తత్తర పడుతూ

**క. అనఘ! మహాత్ముం డగు వా, మనుఁ డా కశ్యపున కొగి నమస్కారము సే**
**సిన గతి నజునకు నభివం, దన మొగిఁ గావించె హరుఁడు దద్దయుఁ బ్రీతిన్. 143**

**ప్రతి :** అనఘ= ఓ పుణ్యమూర్తీ! విదుర!; మహా+ఆత్ముండు+అగు= గొప్ప ఉదారస్వభావం కల; వామనుడు= వామనమూర్తి; ఆ కశ్యపునకున్= ఆ కశ్యపప్రజాపతికి; ఒగిన్= శ్రద్ధతో; నమస్కారము+చేసినగతిన్= వందనం చేసిన విధంగా; అజునకున్= బ్రహ్మదేవుడికి; ఒగిన్= చక్కగా; హరుఁడు= శివుడు; తద్దయున్= మిగులు; ప్రీతిన్= అభిమానంతో; అభివందనము= ఎదురుపడి నమస్కారం; కావించెన్= చేశాడు.

**తా :** ఓ పుణ్యాత్ముడా! విదురా! బ్రహ్మకు శివుడు ఎంతో శ్రద్ధతో చక్కగా ఎదురువెళ్లి ప్రీతి పూర్వకంగా నమస్కారం పెట్టాడు. ఆ పెట్టిన తీరు పూర్వం కశ్యపబ్రహ్మకు వామనావతారంలో విష్ణువు నమస్కరించినట్లుగా ఉంది.

**తే. అంత రుద్రానువర్తులైనట్టి సిద్ధ, గణమహర్షి జనంబులు గని పయోజ**
**గర్భునకు మ్రొక్కి, రంతన కమలభవుఁడు, శర్వుఁ గని పల్కె మందహాసంబుతోడ. 144**

**ప్రతి :** అంతన్= అలా శివుడు నమస్కరించేటపుడు; రుద్ర+అనువర్తులు+ఐన+అట్టి= శివుడి వెంట ఉండే వారైన; సిద్ధగణ= సిద్ధుల సమూహం; మహర్షి జనంబులు= మహామునులలోకం; కని= చూసి; పయోజగర్భునకున్= బ్రహ్మకు; మ్రొక్కిరి= ప్రణామం చేశారు; అంతన్= ఆవల; ఆ కమలభవుఁడు= ఆ బ్రహ్మ; శర్వున్= శివుని; కని= కాంచి; మందహాసంబుతోడన్= చిరునవ్వుతో; పల్కెన్= పల్కరించాడు.

**తా :** శివుడు బ్రహ్మకు నమస్కరిస్తున్న సమయంలో శివుడి అనుచరులయిన సనందాదిసిద్ధులూ, మహామునిజనం బ్రహ్మను చూశారు. చేతులెత్తి జోతలు పెట్టారు. అప్పుడు ఆ బ్రహ్మ శివుణ్ణి అవలోకించి నవ్వు మొహంతో ఇట్లన్నాడు.

**తే.** **జగములకు నెల్ల యోనిబీజంబులైన, శక్తిశివకారణుండవై జగతి నిర్వి**
**కారబ్రహ్మంబ వగు నిన్నుఁ గడcగి "విశ్వ, నాథుఁ" గా నెఱిఁగెద నామనమున నభవ! 145**

**ప్రతి :** అభవ= ఓ శివ! జగములకున్; ఎల్లన్= సర్వజగత్తులకున్ను; యోనిబీజంబులు+ఐన= జన్య కారణరూపం; విత్తురూపం అయినట్టి; శక్తి= ప్రకృతి (స్త్రీ) పోలికకు; శివ= పురుషుని పోలికకు; కారణుండవు+ఐ= మూలమైన వాడవు అయి; జగతిన్= విశ్వంలో; నిర్వికార= మారుపాటులు లేనట్టి; బ్రహ్మంబవు= పరమాత్మవు; అగు= అయినట్టి; నిన్నున్= నిన్ను; కడcగి= యత్నించి; నా మనమునన్= నాదు చిత్తాన; విశ్వనాథున్+కాన్= జగదీశ్వరుండవని; ఎఱిఁగెదన్= గ్రహించగల్గాను.

**తా :** అభవా! జగాలన్నింటికినీ యోని బీజములైన శక్తి శివులకు కారణుడవై లోకంలో నిర్వికార బ్రహ్మవైన నిన్ను పూనుకొని నా మనస్సులో విశ్వనాథునిగా తెలిసినవాడను

**తే.** **సమత నది గాక తావకాంశంబులైన, శక్తిశివరూపములఁ గ్రీడ సలుపు దూర్ణ**
**నాభిగతి విశ్వజననవినాశవృద్ధి, హేతుభూతుండ వగుచుండు వీశ! రుద్ర! 146**

**ప్రతి :** రుద్ర= ఓ శివా!; ఈశా!= ఈశ్వరా!; అది+కాక= ఆ ఎఱుకేకాక; సమతన్= చెరిసగమైన; తావక= నీ సంబంధి; అంశంబులు+ఐన= భాగాలు అయిన; శక్తి శివ రూపములన్= శక్తి (స్త్రీ) ఆకారంలో; శివ (పురుష) ఆకారంలో అభేదంగా; క్రీడన్= లీలను; సలుపుదు= జరుపుతావు; ఊర్ణనాభిగతిన్= సాలెపురుగు వలె; విశ్వ= జగత్తు యొక్క; జనన= సృష్టికి; వినాశ= లయానికి; వృద్ధి= పెంపుకు/పోషణకు; హేతుభూతుండవు= నిమిత్తమైనవాడవు; అగుచున్+ఉందువు= అవుతుంటావు.

**తా :** ఓ ఈశా! ఈశ్వరుడ! ఆ ఎరిగింపే కాదు, సమమైన నీ అంశలే అయిన శక్తి, శివ ఆకృతులలో క్రీడ సలుపుతుంటావు. సాలెపురుగు వలె ఈ లోకాలసృష్టికి, ప్రళయానికి పాలనకు నువ్వే ప్రధానకారణుడివి అవుతుంటావు.

**విశే :** సాలెపురుగు తననుంచే గూడును సృష్టించి తిరిగి తనలోనే లయం చేసుకుంటుంది.

**సీ.** **అనఘ! లోకంబులయందు వర్ణాశ్రమసేతువు లనఁగఁ బ్రఖ్యాతి నొంది**
**బలిసి మహాజనపరిగృహీతంబులై యఖిలధర్మార్థదాయకములైన**
**వేదంబులును మఱి వృద్ధి నొందించుట కొఱకునై నీవు దక్షుని నిమిత్త**
**మాత్రునిఁ జేసి య మ్మఖముఁ గావించితి; వటుగాన శుభమూర్తివైన నీవు**

**తే.** **గడcగి జనముల మంగళకర్మ లయిన, వారి ముక్తి, నమంగళాచారు లయిన**
**వారి నరకంబు, నొందింతు భూరిమహిమ, భక్తజనపోష! రాజితఫణివిభూష! 147**

**ప్రతి :** అనఘ= ఓ పుణ్యాత్ముడా!; లోకంబుల+అందున్= జగత్తులో; వర్ణ= బ్రాహ్మణులు మొదలైన నాలుగు తెగల సాంఘిక ధర్మాలకు; ఆశ్రమ= బ్రహ్మ చర్యము మొదలైన నాలుగు ఆశ్రమాల క్రమశిక్షణ మర్యాదలకు; సేతువులు= ఆనకట్టల వంటివి; అనcగన్= అనేట్టుగా; ప్రఖ్యాతిన్= ప్రసిద్ధిని; ఒంది= పొంది; బలిసి= వాడుకలో బాగా నాటుకుని; మహాజన= పెద్దలచే; పరిగృహీతంబులు+ఐ= లెస్సగా నేర్చుకొనబడినవి అయి; అఖిల= సమస్తమైన; ధర్మ= ధర్మాలను; అర్థ= ప్రయోజనాలను; దాయకములు+ఐన= ప్రాపింపచేసేవి అయిన; వేదంబులను= శ్రుతులను; మఱి= ఇంకా; వృద్ధిన్= నింపును; ఒందించుట కొఱకున్+ఐ= కల్గించడం కోసరమై; నీవు= నీవే; దక్షుని= దక్షబ్రహ్మను; నిమిత్తమాత్రునిన్= కారణమాత్రుని; చేసి= కావించి; ఆ+మఖమున్= ఆ దక్షయాగాన్ని; కావించితిని= (ధ్వంసం) కావించావు; అటు+కాన= అందుకని; శుభమూర్తివి+ఐన= మంగళమయుడవైన; నీవు= నువ్వు; కడcగి= నిలబడి; భక్తజనపోషా!= ఓ భక్తలోకపోషకుడ; రాజిత= ప్రకాశిస్తున్న; ఫణి విభూషా!= పన్నగం అలంకారంగా కలవాడా!; జనములన్= లోకుల్లో; మంగళ= క్షేమంకరమయిన; కర్ములు= పనులు ఆచరించువారు; అయినవారి= అయినట్టివాళ్లకు; ముక్తిన్= కైవల్యాన్ని; అమంగళ= క్షేమంకాని కర్మలను; ఆచారులు= పాటించేవాళ్లు; అయినవారి= అయినట్టి వాళ్లకు; నరకంబున్= దుర్గతిని; ఒందింతువు= కల్గిస్తావు.

**తా :** ఓ పాపరహితుడా! ప్రకాశించెడి ఫణిని విభూషణముగా కలవాడా! 'వర్ణాశ్రమ ధర్మాలను కట్టడి చేసేవి, శిష్టులచే అమితంగా గ్రహించబడినవి, సకలపుణ్యాలూ సకలఫలాలు లభింపచేసేవి వేదాలు' అని ప్రజల నాలుకల నాని ఉన్నాయి. ఆ ప్రశస్తి సంహితల ధర్మాలను సమృద్ధిగా అలవరచాలని కోరి మరీ నీకు నువ్వే ఆ దక్షబ్రహ్మను ఈ సమస్తానికి కారణ భూతుని చేసి ధ్వంసం కానున్న ఆ యాగాన్ని నడిపావు. అందువల్లనే నువ్వు క్షేమస్వరూపుడివిగా నిలిచిపోయావు. ఓ భక్తలోక పోషకా! పన్నగాలంకారా! నువ్వే మేలుపనులకు పూనుకునేటువంటి వాళ్లకు మోక్షపదాన్నీ అనుగ్రహించగలవు, కీడు పనులకు తలపడే వాళ్లకు దుర్గతినీ అందించగలవు.

**వ.** **అట్లగుటం దత్కర్మంబు లొకానొకనికి విపర్యాసంబ నొందుటకుc గారణం బెయ్యదియో? భవదీయ రోషంబు హేతువని తలంచితినేనిc ద్వదీయపాదారవిందనిహితచిత్తులై సమస్తభూతంబులయందు నినుం గనుంగొనుచు భూతంబుల నాత్మయందు వేఱుగాc జూడక వర్తించు మహాత్ములయందు నజ్ఞులైన వారి యందుంబోలె రోషంబు దఱుచు వొరయ దcట! నీకుc గ్రోధంబు గలదే? యని. 148**

**ప్రతి :** అట్లు= ఆ రీతిగా; అగుటన్= కావడం వల్ల; తద్= ఆ చేసిన; కర్మంబులు= చేతలు; ఒకానొకనికిన్= వ్యక్తికి; విపర్యాసంబున్= అస్తవ్యస్తమున్ను; ఒందుటకున్= పొందడానికీ; కారణంబు= నిమిత్తం; ఏ+అది+ఓ= ఏదికావచ్చునో (ఆ ఒక్కటి); భవదీయ= నీదైన; రోషంబు= ఆగ్రహం; హేతువు+అని= కారణం అని; తలంచితిన్+ఏనిన్= ఊహించాను అన్నట్లయితే; త్వదీయ= నీవైన; పాద+అరవింద= పాదపద్మాలందు; నిహిత= ఉంచబడిన; చిత్తులు+ఐ= మనస్సు కలవారై; సమస్త= సర్వ; భూతంబుల+అందున్= ప్రాణుల్లోనూ; నినున్= నిన్ను; కనుగొనుచున్= దర్శిస్తూ; భూతంబులన్= ప్రాణులను; ఆత్మ+అందున్= అంతఃకరణంలో; వేఱుగా= అన్యమైనవిగా; చూడక= కానక; వర్తించు= సంచరించే; మహాత్ముల+అందున్=

ప్రాజ్ఞుల్లో; రోషంబు= కోపం; అజ్ఞులు+ఐనవారి+అందున్+పోలె= మందమతులలోవలె; తఱచు= అంత అధికంగా; పొరయదు+అంట= చొరబడదు కదా!; నీకున్= ఆ కోవలోని నీకూ; క్రోధంబు= రోషం; కలదే= ఉందా; అని= అని.

**తా :** ఆ విధంగా, చేసినవారికి, చేసినంతలో జరగడానికీ, ఆ జరుగుబాటు ఏ ఒక్కడి విషయంలోనో అటుదిటు కావడానికీ కారణం ఏదో కావచ్చు. ఒక వేళ ఆ ఒక్కటికి నీ రోషం కారణం అని అనుకున్నట్లయితే నీ పాదపద్మాల మీదే మనస్సుపెట్టి, ప్రాణులందరిలోనూ నిన్నే చూస్తూ, ఆ ప్రాణులనూ తనకంటే అన్యమైనవి కాదని లోపల దర్శిస్తూ ప్రవర్తిల్లే గొప్పప్రజ్ఞావంతుల్లో కోపం, మూర్ఖంగా ప్రవర్తించే వాళ్లలో వలె అంత ఎక్కువగా పుట్టదు కదా. అటువంటి పూజ్యుడవే అయిన నీకూ హానికరమైన ఆ రోషం కల్గుతుంటుందా?

**సీ. మతి భేదబుద్ధిఁ గర్మప్రవర్తనముల మదయుతు లయి దుష్టహృదయు లగుచుఁ**
**బరవిభవాసహ్యభవమనో వ్యాధులఁ దగిలి మర్మాత్మభేదకము లయిన**
**బహుదురుక్తులచేతఁ బరుల బీడించుచు నుండు మూఢులను దైవోపహతులుఁ**
**గాఁ దలపోసి య కృపటచిత్తులకు నీ వంటి సత్పురుషుఁ డే వలన నైన**

**తే. హింసఁ గావింపకుండు సమిద్ధచరిత!, నీలలోహిత! మహితగుణాలవాల!**
**లోకపాలన! కలిత గంగాకలాప!, హర! జగన్నుతచారిత్ర! యదియుఁ గాక. 149**

**ప్రతి :** సమిద్ధ చరిత!= చక్కని నడవడి కలవాడా!; నీలలోహిత= నలుపు (కంఠం); ఎరుపు (కేశాలు)= చాయకలవాడా!; మహిత= మేటి; గుణ= సుగుణాలకు; ఆలవాల= పాదు అయిన వాడా!; లోక= విశ్వప్రజల; పాలన= రక్షకుడా!; కలిత= పొందబడిన; గంగా= గంగానది; కలాప= సిగభూషణంగా కలవాడా!; హర= ప్రళయంలో సర్వం హరించగల ఓశివ!; జగత్= లోకంచే; నుత= స్తుతించదగ్గ; చారిత్ర= జీవనవృత్తం కలవాడా; మతి= ఇంకనూ; భేదబుద్ధిన్= వేఱుమతితో; కర్మప్రవర్తనములన్= నిత్యనైమిత్తికాది కార్యాలు జరపడంలో; మదయుతులు+అయి= అహంకరించినవారై; దుష్టహృదయులు అగుచున్= చెడు అభిప్రాయం కలవారవుతూ; పర= ఒరులయొక్క; విభవ= సంపత్తికి; అసహ్య= ఓర్వ లేనందువల్ల; భవ= పుట్టినట్టి, మనస్+వ్యాధులన్= మానసిక ఆధివ్యాధుల యందు; తగిలి= చిక్కి; మర్మ+ఆత్మ= ఆయువుపట్టులకు; భేదకములు+అయిన= చీల్చేవి అయినట్టి; బహుదురుక్తులచేతన్= పలు చెడుమాటలతో; పరుల= బయటివాళ్లను; పీడించుచున్= వేధిస్తూ; ఉండు= ఉండే; మూఢులను= అవివేకులను; దైవ= విధిచేత; ఉపహతులు+కాన్= దెబ్బతిన్న వారినిగా; తలపోసి= ఎంచి; నీవంటి= నిన్ను సరిపోలిన; సత్ పురుషుఁడు= సాధుజనుడు; ఆ+కపట చిత్తులకున్= ఉద్దేశపూర్వకంగా వంచించే స్వభావంగల అట్టివారికి; ఏ వలనన్+ఐన= ఏ విధంగానూ అయినా; హింసను= ద్రోహాన్ని; కావింపక= కల్గించక; ఉండున్= ఉండగలడు; అదియున్+కాక= అంతేకాకుండా...

**తా :** చక్కని నడవడిక కలవాడా! కంఠం నీల వర్ణంగా, కేశాలు రక్తవర్ణంగా కలవాడా! సత్వగుణవంతుడా! జగద్రక్షకా! సిగ నగగా గంగను తాల్చినవాడా! లోకం నచ్చిన నడవడి కలవాడా! ఓహరా! మరొక విషయం. వాళ్లు భిన్నమైన తలంపు కల్గి దైనందిన కార్యక్రమాల అమలులో పొగరుపట్టి పాపమతులై నడచుకుంటారు. అలాంటి వాళ్లు ఒరుల కలిమికి ఓపలేని మచ్చరంవల్ల ఆధివ్యాధి పీడితులవుతారు. ఆయువుపట్టులను సైతం చీల్చి సలుపు పుట్టించే అతిఘోరమైన పెక్కు విరుపుమాటలతో వెలుపలి వారిని వేపుకు తింటుంటారు. ఆ రకం మందబుద్ధుల్నీ నీ వంటి సాధు స్వభావులు విధినిహతులుగా భావించుకొని

ఆ టక్కరులకు ఏలాగున్నూ చెడ్డను చేయరు. మహోపకారి మహాపకారిని దండించక మంచి వైపుకు మరల్చుట అతని కర్తవ్యం అని భావం. అంతేకాక

సీ. అమరసమస్తదేశములందు నఖిలకాలములందుఁ దలఁప దుర్లంఘ్యమహిముఁ
దగు పద్మనాభు మాయామోహితాత్మకు లై భేదదర్శనులైన వారి
వలనను ద్రోహంబు గలిగిన నైనను నది దైవకృత మని యన్యదుఃఖ
ముల కోర్వలేక సత్పురుషుండు దయసేయు గాని హింసింపఁడు గాన నీవు

తే. నచ్యుతుని మాయ మోహము నందకుంటఁ, జేసి సర్వజ్ఞుఁడవు; మాయచేత మోహి
తాత్ములై కర్మవర్తను లయినవారి, వలన ద్రోహంబు గలిగిన వలయుఁ బ్రోవ. **150**

**ప్రతి :** అమరన్= కుదిర్చినట్లుగా; సమస్త= అఖిలమైన; దేశముల+అందున్= దేశాల్లోనూ, అఖిల= అన్ని; కాలముల+అందున్= సమయాల్లోనూ; తలఁపన్= యోచించగా; దుర్+లంఘ్య= జవదాటగ రాని; మహిముఁడు+అగు= మాహాత్మ్యం కలవాడైనట్టి; పద్మనాభు= విష్ణుమూర్తి యొక్క; మాయా= కపటంచే; మోహిత= మోహింప చేయబడిన; ఆత్మకులు+ఐ= బుద్ధికలవారై; భేద= వేరు అయిన; దర్శనులు+ఐన= దృష్టి కలవారైనట్టి; వారివలనను= వాళ్లకారణంగా; ద్రోహంబు= కీడు; కలిగినన్+ ఐననున్= సంభవించినప్పటికినీ; అది= ఆ ముప్పు; దైవకృతము+అని= విధివిహితం అని; అన్య= ఇతరులయొక్క; దుః ఖములకున్= వేదనలకు; ఓర్వలేక= తాళలేక; సత్పురుషుండు= సాధుజీవి; దయ+చేయున్+కాని= జాలి చూపిస్తాడుకాని; హింసింపఁడు= కష్టపెట్టడు; కాన= కాబట్టి; నీవున్= నువ్వు; అచ్యుతుని= విష్ణువుయొక్క; మాయన్= మాయచే; మోహమున్= అజ్ఞానాన్ని; అందక+ఉంటన్+చేసి= పొందకపోవడంవల్ల; సర్వజ్ఞుడవు= సర్వం తెలిసిన వాడవయ్యావు; మాయచేత మోహిత ఆత్ములు+ఐ= మోహంలో పడినవారై, కర్మవర్తనులు= కర్మాచరణంలో ఆసక్తి గలవారు; అయిన వారివలన= అయినట్టి వాళ్లవల్ల; ద్రోహంబు= హాని; కల్గినన్= పొందినప్పటికిన్ని; ప్రోవన్ వలయున్= తప్పక కాపాడాలి.

**తా :** హరి తన గొప్ప ప్రతిభను, ఏ దేశానికి అయినా ఏ కాలానికి అయినా అనువుగా తప్పించుకోలేనిదిగా తీర్చాడు. ఆ విష్ణు మాయ కమ్మి, అజ్ఞానులైన వాళ్లు వేరుచూపు కలవారవుతారు. వీళ్లవల్ల చేటు వాటిల్లినప్పటికిన్ని అది నొసటిరాత అనుకుని ఎదుటివారి నొవ్వును చూసి తట్టుకోలేక సజ్జనుడు కనికరం చూపిస్తాడు తప్ప ఏ మాత్రం బాధించడు. కాబట్టి నువ్వు విష్ణు మాయామోహం పట్టనివాడవు. కనుకనే నువ్వు సర్వజ్ఞుడవు. మాయామోహితులై కర్మపరులైన వారివల్ల ఏమైనా చేటు జరిగినా వాళ్లను నువ్వు రక్షించి తీరాలి. (ద్రోహుల పట్లకూడా అనుగ్రహం చూపే సాధుజనుల తత్త్వం అనుసరణీయం అని భావం.)

వ. అది గావున యజ్ఞభాగార్హుండ వయిన నీకు సవనభాగంబు సమర్పింపని కతన నీచేత విధ్వస్తంబయి పరిసమాప్తి నొందని దక్షాధ్వరంబు మరల నుద్ధరించి దక్షునిఁ బునర్జీవితుం జేయుము; భగుని నేత్రంబులును, భృగుముని శ్మశ్రువులును, బూషుని దంతంబులును గృపసేయుము. భగ్నాంగు లయిన దేవఋత్విజ్ని కాయంబులకు నారోగ్యంబు గావింపుము; ఈ మఖావశిష్టంబు యజ్ఞ పరిపూర్తి హేతుభూతం బయిన భవదీయభాగం బగుంగాక. **151**

**ప్రతి :** అది+కావున= కాబట్టి; యజ్ఞభాగ= యాగభాగానికి; అర్హుండవు+అయినన్= యోగ్యుడవయిన; నీకున్= నీకు, సవనభాగంబున్= యాగాంశను; సమర్పింపని= అప్పగించని; కతనన్= కారణంగా; నీ చేత= నీ వల్ల; విధ్వస్తంబు+అయి= పూర్తిగా నశించింది అయి; పరిసమాప్తిన్= సమాపనం; ఒందని= పొందని; దక్ష+అధ్వరంబు= దక్షుడియాగాన్నీ; మరలన్= మళ్లీ; ఉద్ధరించి= నిలిపి; దక్షునిన్= దక్షుణ్ణి; పునర్+జీవితున్= తిరిగి ఊపిరి అందిన వాణ్ణిగా; చేయుము= చేయవలసింది; భగుని= భగునియొక్క; నేత్రంబులును= రెండు కళ్లున్నూ; భృగుముని= భృగుమహర్షి; శ్మశ్రువులను= మీసాలూ గడ్డాలూ; పూషుని= పూషుడి; దంతంబులను= పళ్లున్నూ; కృపచేయుము= అనుగ్రహించు; భగ్న= విరిగిన; అంగులు+అయిన= అవయవాలుగలవారయినట్టి; దేవ+ఋత్విక్+నికాయంబులకున్= వేల్పుల; ఋగ్వేదవిప్రుల సమూహానికి; ఆరోగ్యంబు= స్వస్థత; కావింపుము= కల్గించు; ఈ+మఖ+అవశిష్టంబు= ఈదక్షయాగంలో మిగిలినట్టిది; యజ్ఞపరిపూర్తి= యాగపరిసమాప్తికి; హేతుభూతంబు+అయిన= కారణమైన; భవదీయ= నీకు చెందాల్సిన; భాగంబు= పంపకం; అగున్+కాక= అవుతుందికాక!

**తా :** అందుచేత ఆ యాగంలో వంతుకు నువ్వు యోగ్యుడవే. అయినా నీ భాగాన్ని నీకు దక్కనీయని కారణంగా నీచేత దక్షయాగం ధ్వంసం చేయబడి సక్రమంగా పూర్తికాని ఆ దక్షయాగాన్ని పునరుద్ధరించు. ఆ దక్షయాగాన్ని పునరుద్ధరించు. దక్షుడికి తిరిగి ప్రాణం పొయ్యి. భగుడికి కళ్లు తెప్పించు. భృగుడి మీసాలు గడ్డాలు మళ్లీ మొలిపించు. పూషుడి దంతాలు పెట్టించు. విరిగి తునాతునకలైన అవయవాల గాయాలనుంచి దేవతలకు, ఋత్విక్కులకూ విముక్తి కల్గించి ఆరోగ్యవంతులను చెయ్యి. ఈ దక్షయాగంలో మిగులు భాగం ఈ యాగ పరిపూర్తికి తగిన కారణమై నీ భాగమే అవుతుంది.

### a =ఈశ్వరుండు బ్రహ్మాదులచేఁ బ్రార్థితుండై దక్షాదుల ననుగ్రహించుట a

**చ.** **అని చతురాననుండు వినయంబున వేఁడిన నిందుమౌళి స**
**య్యనఁ బరితుష్టిఁ బొంది దరహాసమునన్ గృప దొంగలింప ని**
**ట్లను హరిమాయచేత ననయంబును బామరు లైనవారు సే**
**సిన యపరాధ దోషములు చిత్తములో గణియింప నెన్నఁడున్. 152**

**ప్రతి :** అని= అని నుడివి; చతుర్+ఆననుండు= నాలుగు ముఖాలు కలబ్రహ్మ; వినయంబునన్= మర్యాదతో; వేఁడినన్= ప్రార్థించగా; ఇందుమౌళి= శివుడు; చయ్యనన్= వెంటనే; పరితుష్టిన్= సంతుష్టిని; పొంది= ఒంది; దరహాసమునన్= చిరునగవుతో; కృప= దయ; తొంగలింపన్= ప్రకాశించగా; ఇట్లు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు; హరి= విష్ణుమూర్తియొక్క; మాయచేత= మాయవల్ల; అనయంబునున్= మతిమతి; పామరులు+అయినవారు= మూర్ఖులయినవారు; చేసిన= కావించిన; అపరాధదోషములు= తప్పువలని తప్పులను; చిత్తములో= ఉల్లంలో; ఎన్నడున్= ఏనాడూ; గణియింపన్= తలంచను.

**తా :** అని ఇలా చతుర్ముఖుడు వినయంగా శివుణ్ణి వేడుకున్నాడు. ఆ వెంటనే శివుడు ఆనందపడి చిరునవ్వు చిందిస్తూ ప్రసన్నంగా ఇలా మాట్లాడాడు. హరిమాయలో పడిన అమాయకులు మళ్లీ మళ్లీ చేసే తప్పుల మీది తప్పులను నేను ఎప్పుడూ మనసులో గణించను.

**విశే :** ఇందుమౌళి: చంద్రుడు సిగయందు కలవాడు – శివుడు.

**వ. అట్లయ్యును. 153**

**ప్రతి :** అట్లు= ఆ విధంగా; అయ్యును= అయినప్పటికిన్ని.

**తా :** అలా తలంచనప్పటికిన్ని

**క. బలియుర దండించుట దు, ర్బలజన రక్షణము ధర్మపద్ధతి యగుటం**
**గలుషాత్ముల నపరాధము, కొలఁదిని దండించుచుందుఁ గొనకొని యేనున్. 154**

**ప్రతి :** బలియురను= శక్తిమంతులను; దండించుట= శిక్షించడం; దుర్బల= శక్తిహీనమైన; జన= ప్రజలయొక్క; రక్షణము= పాలనం; ధర్మ పద్ధతి= న్యాయవిధానం; అగుటన్= కావడంవల్ల; కలుష+ఆత్ములన్= పాపబుద్ధి కలవారలను; అపరాధము కొలఁదిని= తప్పుకు తగినట్లుగానే; ఏనున్= నేను; కొనకొని= పూని; దండించుచున్+ఉందున్= శిక్షిస్తూ ఉంటాను.

**తా :** బలవంతులను శిక్షించడం, బలహీనులను రక్షించడం న్యాయమార్గం. కాబట్టి దుష్టుల తప్పులను బట్టియే నేను పట్టుబట్టి దండన విధిస్తూ ఉంటాను.

**వ. అని దగ్ధశీర్షుండయిన దక్షుం డజముఖుం డగు! భగుండు బర్హిస్సంబంధ భాగంబులు గలిగి మిత్ర నామధేయచక్షుస్సునం బొడగాంచుఁ; బూషుండు పిష్టభుక్కగుచు యజమానదంతంబులచే భక్షించు; దేవతలు యజ్ఞావశిష్టంబు నా కొసంగుటంజేసి సర్వావయవపూర్ణులై వర్తింతురు. ఖండితాంగులైన ఋత్విగాది జనంబు లశ్వినీదేవతల బాహువులచేతను బూషుని హస్తంబులచేతను లబ్ధబాహుహస్తులై జీవింతురు; భృగువు బస్తశ్మశ్రువులు గలిగి వర్తించు నని శివుం డానతిచ్చిన సమస్తభూతంబులును సంతుష్టాంతరంగంబులై "తండ్రి! లెస్సయ్యె" యని సాధువాదంబుల నభినందించిరి. అంత నా శంభుని యామంత్రణంబు వడసి సునాసీరప్రముఖులగు దేవతలు ఋషుల తోడంగూడి రా నజుండును రుద్రునిం బురస్కరించుకొని దక్షాధ్వరవాటంబునకుం జనియె నంత. 155**

**ప్రతి :** అని= అని చెప్పి; దగ్ధ= కాల్చబడిన; శీర్షుండు+అయిన= తల కల్గినవాడు అయిన; దక్షుండు= దక్షప్రజాపతి; అజముఖుండు+అగున్= మేక మోముకలవాడవుతాడు; భగుండు= భగుడు; బర్హిస్+సంబంధ= నెమలికి చెందిన; భాగంబులు+కలిగి= వంతులు పొంది (నెమలి కన్నులు కలిగి), మిత్రనామధేయ= మిత్రుడనే పేరు గలవాని; చక్షుస్సునన్= నేత్రంతో; పొడకాంచున్= చూస్తాడు; పూషుండు= పూషుడు; పిష్టభుక్కు+అగుచున్= పిండిపదార్థాలు తినేవాడవుతూ; యజమాన= యాగకర్తయొక్క; దంతంబులచే= దంతాల సాయంతో; భక్షించున్= తింటాడు; దేవతలు= వేల్పులు; యజ్ఞ+అవశిష్టంబున్= యాగశేషభాగాన్ని; నాకున్= నాకు; ఒసంగుటన్+చేసి= ఇవ్వడంవల్ల; సర్వ= అన్నీ; అవయవ= కరచరణాది అంగాలతో; పూర్ణులు+ఐ= నిండినవారై; వర్తింతురు= విలసిల్లుతారు; ఖండితాంగులైన= ఖండింపబడిన అవయవాలు గల; ఋత్విక్+ఆది= అధ్వర్యులు మొదలైన; జనంబులు= ఇతరజనులు; అశ్వినీదేవతల= దేవవైద్యుల; బాహువులచేతను= భుజాలచేతా; పూషుని= పూషుడియొక్క; హస్తంబులచేతను= కరముల చేతా; లబ్ధ= తిరిగి పొందిన; బాహుహస్తులు+ఐ= రెక్కలూ చేతులూ కలవై; జీవింతురు= బతుకుతారు; భృగువు= భృగుముని; బస్త= మేకపోతుయొక్క; శ్మశ్రువులు= మీసం, గడ్డం; కలిగి= పొంది; వర్తించున్= ఉంటాడు; అని= అని; శివుండు= ఈశుడు; ఆనతి ఇచ్చినన్= చెప్పగా; సమస్తభూతంబులును= సకలప్రాణులున్ను; సంతుష్ట= సంతోషించిన; అంతరంగంబులు+ఐ= హృదయములు

కలవారై; తండ్రీ!= అయ్యా!; లెస్స+అయ్యె= బాగు జరిగింది; అని= అని; సాధువాదంబులన్= ప్రశంసలతో; అభినందించిరి= శ్లాఘించారు; అంతన్= ఆ పిమ్మట; ఆ శంభుని= ఆ శంకరుని యొక్క; ఆమంత్రణంబు= వీడ్కోలు పలుకును; పడసి= పొంది; సునాసీర= ఇంద్రుడు; ప్రముఖులు+ అగు= మొదలైనట్టి; దేవతలు= వేల్పులూ; ఋషులతోడన్ కూడి= మునులతోనూ కలసి; రాన్= రాగా; అజుండును= బ్రహ్మయు; రుద్రునిన్= శివుణ్ణి; పురస్కరించుకొని= ముందిడుకొని; దక్ష+అధ్వర+వాటంబునకున్= దక్షుని యజ్ఞవాటికకడకు, చనియెన్= వెళ్లాడు, అంతన్= అంతలో.

**తా :** అని తల కాలిపోయి మొండెం మాత్రంగా ఉన్న దక్షుడు మేకముఖం పొందుతాడు. భగుడు నెమలి కన్నులను కలిగి అంది మిత్రుడను పేరుకలవాని కంటితో చూస్తాడు. పూషుడు పిండి ఉండలను యాగకర్తదంతాలతో తింటాడు. యాగశేషభాగాన్ని దేవతలు నాకు ఒప్పగించడం వల్ల దేవతలందరూ యథావిధిగా సంపూర్ణ దేహులవుతారు. విరిగిన అవయవాలుగల ఋత్విక్కులూ, ఇతరులూ అశ్వినీదేవతల భుజాలతోనూ, పూషుని చేతులతోనూ తిరిగి తమ తమ బాహువులనూ చేతులనూ పొంది జీవవంతులవుతారు. భృగుముని మేక మీసాలూ గడ్డాలూ పొందుతాడు. అని చెప్పిన శివుడి మాటలు విని జీవులందరూ అమితంగా ఆనందించారు. తండ్రీ! మేలు అయింది. బాగుంది బాగుంది అనే అరుపులతో ప్రశంసించారు. ఆ పై శివుడి పిలుపు మేరకు ఇంద్రుడు మొదలైన దేవతలు, మునులను కలుపుకుని వచ్చారు. శివుడు ముందరవరుసలో నడుస్తుండగా వేలుపుల పెద్ద 'బ్రహ్మ' వాళ్లందరితో దక్షవాటికకు నడిచాడు.

**క. శర్వుని యోగక్రమమున, సర్వావయవములుఁ గలిగి సన్మునిఋత్వి**
**గ్గీర్వాణముఖ్యు లొప్పిరి, పూర్వతనుశ్రీల నార్యభూషణ! యంతన్. 156**

**ప్రతి :** ఆర్యభూషణ!= పెద్దలకు అలంకారప్రాయమైన విదురా!; అంతన్= ఆ పైన; శర్వుని= శివుడి, యోగ క్రమమున= యోగమతం వరుసను; సర్వ= మొత్తం; అవయవములున్= శరీర భాగాలను; కలిగి= పొంది; సద్+ముని= మంచివారైన మునులు; ఋత్విక్= ఋత్విజులు; గీర్వాణ= దేవతలలో; ముఖ్యులు= ప్రధానులు; పూర్వ= ముందటి; తనుశ్రీలన్= ఒంటిసిరులతో; ఒప్పిరి= ప్రకాశించారు.

**తా :** పెద్దలకే పెద్ద అయిన ఓ విదురుడా! ఆ సమయంలో శివుడి యోగసాధన తీరులో అన్ని అవయవాలతో కూడినవారై మునులూ, ఋత్విక్కులూ, దేవతా ముఖ్యులూ మునుపటివలెనే అదే శరీర సంపదతో శోభిల్లారు.

**విశే :** గీర్వాణులు వాక్కులే బాణంగా గలవారు= వేలుపులు.

**క. విను దక్షు నంత మేషము, ఖునిఁ జేసిన నిద్ర మేలుకొని లేచిన పో**
**ల్కిన నిలిచె దక్షుఁ, డభవుఁడు, గనుఁగొనుచుండంగ నాత్మఁ గౌతుక మొప్పన్. 157**

**ప్రతి :** విను= ఆలకించు; దక్షున్= దక్షుని; అంతన్= అంతలోపున; మేష= మేకయొక్క; ముఖునిన్= మొగంకలవాణ్ణిగా; చేసినన్= కావించగా; అభవుఁడు= శివుడు; ఆత్మన్= లోపల; కౌతుకము= ఉత్సుకత; ఒప్పన్= తనరగా; కనుగొనుచున్= పరికిస్తూ; ఉండంగన్= ఉండగా; నిద్ర= నిద్దుర నుండి; మేలుకొని= తెలివొంది; లేచినపోల్కిన= లేచినట్టుగా; దక్షుఁడు= దక్షుడు; నిలిచెన్= నిలబడ్డాడు.

**తా :** విదురా విను! అప్పుడు దక్షుని మేకముఖము గలవానినిగా చేయగా దక్షుడు నిద్రమేలుకొని లేచినవిధంగా లేచి మనస్సులో కుతూహలం ఒప్పగా శివుడు చూచుచుండగా నిలుచుండినాడు.

వ. ఇట్లు లేచి నిలిచి ముందఱ నున్న శివునిం గనుంగొనిన మాత్రాన శరత్కాలంబున నకల్మషం బైన సరస్సునుంబోలెం బూర్వరుద్రవిద్వేషజనితంబులైన కల్మషంబులం బాసి నిర్మలుండై యభవుని నుతియింపం దొడంగి మృతిం బొందిన సతీతనయం దలంచి యనురాగోత్కంఠబాష్పపూరితలోచనుండును, గద్గదకంఠుండు నునై పలుకంజాలక యెట్టకేలకు దుఃఖంబు సంస్తంభించికొని ప్రేమాతిరేకవిహ్వలుం డగుచు సర్వేశ్వరుండగు హరున కిట్లనియె. **158**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; లేచి= మేలుకొని; నిలిచి= నిలబడి; ముందఱన్= ఎదుటన; ఉన్న= ఉండిన; శివునిన్= శివుణ్ణి; కనుంగొనిన మాత్రాన= చూచినంత మాత్రానికే; శరత్కాలంబునన్= శరదృతువులో; అకల్మషంబు+ఐన= మకిలి లేనిది అయినట్టి; సరస్సునున్+పోలెన్= కొలనును వలె; పూర్వ= గతకాలాన; రుద్ర= శివుడి మీది; విద్వేష= గొప్పద్వేషం వల్ల; జనితంబులు+ఐన= పుట్టినవి అయిన; కల్మషంబులన్= పాపాలను; పాసి= వదలి; నిర్మలుండు+ఐ= తేట తేరినవాడై; అభవుని= శివుని; నుతియింపన్= స్తుతించను; తొడంగి= పూనుకొని; మృతిన్ పొందిన= మరణించిన; సతీతనయన్= కూతురు సతిని; తలంచి= స్మరించి; అనురాగ= ఎనలేని ప్రేమవల్ల; ఉత్కంఠ= ఉత్సుకతతో; బాష్ప= కన్నీళ్లతో; పూరిత= నిండిన; లోచనుండును= నేత్రాలు కలవాడున్నూ; గద్గదకంఠుండునున్+ఐ= డగ్గుత్తిక పడ్డ గొంతుకలవాడున్నూ అయి; పలుకన్= మాటాడను; చాలక= శక్తిలేక; ఎట్టకేలకున్= అతి ప్రయాసతో; దుఃఖంబు= బాధను; సంస్తంభించుకొని= ఉగ్గబట్టుకొని; ప్రేమ= అనురాగంయొక్క; అతిరేక= అతిశయంచే; విహ్వలుండు+అగుచున్= స్వాధీనం తప్పినవాడు అవుతూ; సర్వేశ్వరుండు= అఖిలేశుడు; అగు= అయినట్టి; హరునకున్= శివునకు; ఇట్లు= ఇలా; అనియెన్= అన్నాడు.

**తా :** ఇట్లు లేచి నిలుచున్న దక్షుడు ఎదురుగా ఉన్న శివుణ్ణి దర్శించినంత మాత్రాననే శరత్కాలంలో బురదలేని తేటనీటికొలను వలె ఇతఃపూర్వం శివుడి మీద పగవల్ల కల్గిన వాని పాపాలు ప్రక్షాళితమయ్యాయి. మనస్సు తేరుకుంది. శివుణ్ణి స్తుతించాలనుకునేంతలో చచ్చిపోయిన ముద్దుబిడ్డ సతి తలపులోకి వచ్చింది. ఆ అమితమైన ప్రేమకూ, ఆ వగపుకూ కంటి నిండా నీళ్లు కమ్ముకున్నాయి. గొంతు పూడుకొని పోయింది. నోటి మాట పెగలడంలేదు. అతి కష్టం మీద, పొర్లుకువచ్చే ఆ బాధనంతా బిగబట్టుకున్నాడు. పట్టలేని ప్రేమతో ఎంతో విలవిల లాడుతూ సర్వేశ్వరుడైన శివుడితో ఇలా అన్నాడు.

క. వినుమ! నీ కపరాధుండ నగు, నను దండించు టది దండనము గాదు మది
న్నను రక్షించుటగా మన, మున దలంతును దేవ! యభవ! పురహర! రుద్రా! **159**

**ప్రతి :** దేవ= దేవరా!; అభవ= భవరహితుడా!; పురహర!= త్రిపురనాశకా!; రుద్రా= శివా!; విను= వినవలసింది; నీకున్= నీ విషయంలో; అపరాధుడన్+అగు= తప్పు చేసినవాడను ఐనట్టి; ననున్= నన్ను; దండించుట= శిక్షించడం; అది= ఆ; దండనం కాదు= శిక్షించడం కాదు; మదిన్= మతిలో; ననున్= నన్ను; రక్షించుట+కాన్= కాచుట అని; మనమునన్= నా అంతరంగంలో; తలంతును= అనుకొంటున్నాను.

**తా :** ప్రభూ! అభవా! పురహర! శివ! ఆలకించు. నేను చేసిన తీరని అపరాధానికి నన్ను శిక్షించడం ధర్మమే. నీ అభిప్రాయంలో అది నన్ను మన్నించడానికే అని నా మనస్సు చెప్తుంది.

సీ. అనఘాత్మ! తగ నీవు నబ్జనాభుండును బరికింప బ్రాహ్మణాభాసు లయిన
వారల యెడల నె వ్వలన నుపేక్షింప రంట! దృఢవ్రతచర్యులైనవారి

యెడ నీ కుపేక్ష యెక్కడిది? సర్గాదిని నామ్నాయసంప్రదాయప్రవర్త
నము నెఱింగించుట కమరవిద్యాతపోవ్రతపరాయణులైన బ్రాహ్మణులను

తే. వరుసఁ బుట్టించితివి; కాక వారి నెపుడు, గేల దండంబుఁ బూని గోపాలకుండు
బలసి గోవుల రక్షించు పగిది నీవు, నరసి రక్షించుచుందు గదయ్య రుద్ర! 160

ప్రతి : అనఘ+ఆత్మ!= ఓ పుణ్యరూపుడా!; తగన్= ఒప్పిదంగా; నీవున్= నువ్వు గాని; అబ్జనాభుండును= (పద్మనాభుడు) విష్ణువుగాని; పరికింపన్= పట్టిచూడగా; బ్రాహ్మణ+ఆభాసులు+అయిన= బ్రాహ్మణులుగా కనిపిస్తున్నా బ్రాహ్మణ స్వభావం లేనివారయిన; ఎడన్= వాళ్లపక్షమందు; ఏ వలనన్= ఏ వేపు నించిన్నీ; ఉపేక్షింపరు అఁట= చూసీచూడనట్లు ఉండరట; దృఢ వ్రతచర్యలు ఐనవారి= దృఢమైన నియమం కలవారగు; ఎడన్= విషయాన; నీకున్= నీకు; ఉపేక్ష= ఉదాసీనత; ఎక్కడిది= ఎక్కడ ఉంటుంది; సర్గాదినిన్= సృష్ట్యారంభంలో; ఆమ్నాయసంప్రదాయ= వేదకాలం నాటి నుంచి గురుపరంపరాయాతంగా వాడుకపడ్డ; ప్రవర్తనమున్= ఆచారాన్ని; ఎఱింగించుటకున్= అభ్యసింపచేయడానికి; అమరవిద్యా= వేల్పుల తత్త్వజ్ఞానంలోని; తపః= వర్ణాశ్రమవిహితధర్మంలోని; వ్రత= నియమ నిష్ఠలయందు; పరాయణులు+ఐన= తత్పరులైన; బ్రాహ్మణులను; వరుసన్= పరంపరగా; పుట్టించితివి= ఉదయింపచేసితివి; కాన= కాబట్టి; వారిన్= ఆ బ్రాహ్మలను; ఎపుడు= ప్రతిదినం; కేలన్= చేతియందు; దండంబున్= కర్రను; పూని= పట్టుకొని; గోపాలకుండు= ఆలకాపరి; బలసి= పూని; గోవులన్= ఆవులను; రక్షించుపగిదిన్= కావలికాచే రీతిలో; రుద్ర!= ఓ శివ!; నీవున్= నువ్వు; అరసి= తెలిసి; రక్షించుచున్+ఉందువు+కద+అయ్య= కాస్తూ ఉంటావు కదా తండ్రీ.

తా : పుణ్యాత్మా! పరిశీలించగా నీవును శ్రీహరి బ్రాహ్మణాభాసులైన వారి విషయంలో (బ్రాహ్మణులుగా కనిపిస్తున్న బ్రాహ్మణ స్వభావం లేనివారి విషయంలో) ఏ పరిస్థితిలోనూ ఉపేక్షించదట. అట్లుండగా దృఢవ్రతముల చేసెడివారి విషయంలో నీకు ఉపేక్ష ఎక్కడుంటుంది. సృష్టి ఆరంభంలో వేదసంప్రదాయ ప్రవర్తనను ప్రజలందరికీ తెలియజేయుటకొరకు దేవతలయందు, విద్యలయందు, తపస్సునందు, వ్రతములయందు ఆసక్తి కలిగిన బ్రాహ్మణులను వరుసగా పుట్టించితివి. అంతేకాక వారిని ఎపుడూ చేతిలో దండముతో గోపాలకుడు పూనుకొని గోవులను రక్షించిన విధంగా నీవు కనిపెట్టి రక్షించుచుందువు కదయ్యా! రుద్రా!

సీ. తలపోయ నవిదితతత్త్వవిజ్ఞానుండ నైన నాచేత సభాంతరమున
నతిదురుక్త్యంబకక్షతుఁడ వయ్యును మత్కృతాపరాధము హృదయంబునందు
దలఁపక త్ర్యక్ష! నిందాదోషమున నధోగతిఁ బొందుచున్న దుష్కర్ము నన్నుఁ
గరుణఁ గాచిన నీకుఁ గడఁగి ప్రత్యుపకార మెఱిఁగి కావింప నే నెంతవాఁడ?

తే. నుతచరిత్ర! భవత్పరానుగ్రహాను, రూపకార్యంబుచేత నిరూఢమైన
తుష్టి నీ చిత్తమందు నొందుదువుగాక, క్షుద్రసంహార! కరుణాసముద్ర! రుద్ర! 161

ప్రతి : క్షుద్ర సంహార!= నీచులను హతమార్చేవాడా!; కరుణా సముద్ర!= దయాసాగరుడా!; రుద్ర= శివా!; తలపోయన్= తలచుకోగా; అవిదిత= తెలియబడని; తత్త్వ= మహాబ్రహ్మ స్వరూపంయొక్క; విజ్ఞానుండును= విశేష జ్ఞానం కలవాడను;

ఐనన్= అయినట్టి; నా చేతన్= నా వల్ల; సభా+అంతరమునన్= ఒడ్డోలగం నడిమిని; అతి= మితిమించిన; దుర్+ఉక్తి= విరుపుడు పలుకులనే; అంబక= ములుకులతో; క్షతుఁడవు= గాయపడిన వాడవు; అయ్యును= అయినప్పటికీ; మద్= నా చేత; కృత= చేయబడిన; అపరాధము= తప్పు; హృదయంబునందు= మదిలో; తలఁపక= పెట్టుకొనక; త్రి+అక్ష= ఓ త్రినేత్రుడా!; నిందా= దూఱువలని; దోషమునన్= తప్పువల్ల; అధస్+గతిన్= నీచ స్థితిని; పొందుచున్+ఉన్న= చేరుకుంటున్నట్టి; దుర్+కర్మున్= చెడ్డ పనులు చేసినట్టి; నన్నున్= నన్ను, కరుణన్= జాలితో; కాచిన= రక్షించిన; నీకున్= నీకు; కడఁగి= ప్రయత్నించి; ప్రతి+ఉపకారము= బదులు మేలు; ఎఱిగి= తెలిసి; కావింపన్= చేయను; నేను= నేను; ఎంతవాడ?= ఎంత పాటివాడను; నుత చరిత్ర!= కొనియాడదగిన నడత కలవాడా!; భవద్= నీయొక్క; పర= ఇతరులపై గల; అనుగ్రహ= దయాస్వభావానికి; అనురూప= అనుగుణమైన; కార్యంబుచేత= కర్మచేత; నిరూఢము+ఐన= సంకేత సిద్ధం అయినట్టి; తుష్టిన్= సంతృప్తిని; చిత్తము+అందున్= నీ హృదయంలో; ఒందుదువు+కాక= అనుభవింతువు కాక.

**తా :** నీచుల తుదముట్టించేవాడా! ఆర్ద్ర హృదయుడా! భయంకరుడా! నీ బ్రహ్మమయత్వం అవగతంకాని పరమదుర్వివేకిని అని యోచించగా యోచించగా నాకు తెలియవచ్చింది. నువ్వు ఆనాటి సదస్సు మధ్యలో నా పెళుసు మాటలనే బాణాలచే దెబ్బతిన్నావు. అయినా నేను చేసిన పొరపాటును ఒక మాటైనా కూడా మనస్సులో తలవ లేదు. ఓ ముక్కంటీ! ఆ నిందారోపణం వలని అపరాధం కారణంగా అట్టడుగుకు కూరుకొని పోతున్న నా వంటి పాపిని దయతో కాచావు. అంతటి నీకు నేను ప్రత్యామ్నాయంగా తెలిసి తెలిసి ఉపకారం చేయపూనుకో గలంతవాడినా, ఆదర్శప్రాయమైన వర్తనుడవు నువ్వు. ఎదటివారిపై దయతలచి తలపడి చేయ పూనే పనులచేతనే నీ మనస్సు సంతుష్టి చెందుగాక! “నిస్స్వార్థమైన ద్వేషరహితమైన మంచికార్యం పరమసంతృప్తికి మార్గం” అని హిత భావన.

**వ.** **అని యిట్లు రుద్రక్షమాపణంబు గావించి పద్మసంభవుచేత ననుజ్ఞాతుండై దక్షుం డుపాధ్యాయ ఋత్విగ్గణ సమేతుం డగుచుఁ గ్రతుకర్మంబు నిర్వర్తించు సమయంబున బ్రాహ్మణజనంబులు యజ్ఞంబులు నిర్విఘ్నంబులై సాగుటకుఁ బ్రమథాది వీర సంసర్గకృత దోషనివృత్త్యర్థంబుగా విష్ణుదేవతాకంబును ద్రికపాల పురోడాశ ద్రవ్యకంబును నైన కర్మంబుఁ గావింప నధ్వర్యుకృత్య ప్రవిష్టుండగు భృగువుతోడం గూడి నిర్మలాంతః కరణుం డగుచు దక్షుఁడు ద్రవ్యత్యాగంబుఁ గావింపఁ బ్రసన్నుండై సర్వేశ్వరుండు.** **162**

**ప్రతి :** అని; ఇట్లు= ఈ విధంగా; రుద్ర= శివుణ్ణి; క్షమాపణంబు= క్షమించమని వేడుకొనడం; కావించి= ఒనర్చి; పద్మసంభవుచేతన్= బ్రహ్మచేత; అనుజ్ఞాతుండు+ఐ= అనుమతించబడినవాడై; దక్షుండు= దక్షుడు; ఉపాధ్యాయ= ఒజ్జల యొక్క; ఋత్విక్= యాగం చేయించే పురోహితులయొక్క; గణ= బృందంతో; సమేతుండు+అగుచున్= కూడుకొన్న వాడవుతూ; క్రతుకర్మంబు= యాగ కృత్యం; నిర్వర్తించు= ఆచరించే; సమయంబునన్= వేళలో; బ్రాహ్మణజనంబులు= బ్రాహ్మణవర్గం; యజ్ఞంబులు= యజ్ఞాలు; నిర్విఘ్నంబులు+ఐ= అంతరాయం లేనివై; సాగుటకున్= ప్రవర్తిల్లడానికి; ప్రమథ+ఆది= ప్రమథులు, గుహ్యకులు, ఇతరులు, అయిన; వీర= శూరుల యొక్క; సంసర్గ= సంబంధంచే; కృత= చేయబడిన (ధ్వంసం వలని); దోష నివృత్తి+అర్థంబు+కాన్= దోషనివారణ కొరకు; విష్ణుదేవతాకంబును= విష్ణువును దేవతగా ఉద్దేశించే; త్రికపాల= మూడుకపాల పాత్రల్లో ఇగిరిన అన్నంతోనూ; పురోడాశ= పురోడాశము అనే, (యాగార్పితం కోసమే చేసే అపూపం అనే పిండివంట); ద్రవ్యకంబునున్+ఐన= హోమ పదార్థం కలది అయిన; కర్మంబును= హోమకర్మను; కావింపన్= నిర్వర్తించగా; అధ్వర్యుకృత్య= యజ్ఞంలో యజుర్వేద తంత్రం నడిపే పనికి; ప్రవిష్టుండు+అగు= ప్రవేశించినవాడగు; భృగువుతోడన్= భృగుమునితో; కూడి= కలసి; నిర్మల= నిష్కల్మషం అయిన; అంతః కరణుందు అగుచున్= అంతరంగం

గలవాడు అవుతూ; దక్షుడు= దక్ష బ్రహ్మ; ద్రవ్యత్యాగంబున్+కావింపన్= అన్నం, నేయి మొదలయిన పదార్థాలతో హోమం చేయగా; సర్వ+ఈశ్వరుండు= లోకేశ్వరుడైన విష్ణుడు; ప్రసన్నుండు+ఐ= సంతోషించినవాడై...

**తా :** అని ఇట్లు దక్షుడు రుద్రుణ్ణి క్షమాపణను కోరాడు. బ్రహ్మచేత అనుమతిని పొందినాడు. వేద పండితుల, పురోహితులతో కూడి యాగము చేసే సమయంలో బ్రాహ్మణులందరూ క్రతువు ఏ అడ్డూ లేకుండ సక్రమంగా జరిగిపోవడానికీ, శివదండువల్ల వాటిల్లిన యాగ విధ్వంసదోషాన్నీ ఉపశమింపచేయడానికీ విష్ణుదేవతాసంబంధసంస్కారం కలదీ, "మూడు కపాలాల్లో వండిన అన్నం, అపూపం వంటి పదార్థాలతో తయారు చేసిన పురోడాశం" అనే హవిస్సుతో నిర్వహించదగినదీ అయిన కర్మను చేశారు. ఆ పిమ్మట యాగ అధ్వర్యుడు భృగుముని తోడుగా యజమాని దక్షుడు నిర్మలమైన మనస్సుతో హవిస్సును సమర్పించాడు. అందుచే విష్ణుమూర్తి అనుగ్రహించినవాడై

**సీ. మానితశ్యామాయమానశరీర దీధితులు నల్దిక్కుల దీటుకొనఁగఁ**
**గాంచనమేఖలాకాంతులతోడఁ గౌశేయచేలద్యుతుల్ సెలిమి సేయ**
**లక్ష్మీసమాయుక్తలలితవక్షంబున వైజయంతీప్రభల్ వన్నె సూప**
**హాటకరత్నకిరీటకోటిప్రభల్ బాలార్కరుచులతో మేలమాడ**

**తే. లలితనీలాభ్రరుచిఁ గుంతలములు దనరఁ, బ్రవిమలాత్మీయదేహజప్రభ సరోజ**
**భవభవామరముఖ్యుల ప్రభలు మాప, నఖిలలోకైకగురుఁడు నారాయణుండు. 163**

**ప్రతి :** మానిత= పూజింపదగిన; శ్యామాయమాన= నల్లనైన; శరీర దీధితులు= మేనియొక్క కాంతులు; నల్‌దిక్కులన్= నాలుగువైపులా; దీటుకొనన్+కన్= నిండుకోగా; కాంచన= సువర్ణమయమైన; మేఖలా= ఎనిమిది పేటల మొలనూలియొక్క; కాంతులతోడన్= జిలుగులతో; కౌశేయచేల= పట్టువలువ యొక్క; ద్యుతుల్= శోభలు; చెలిమిచేయన్= స్నేహం కల్పగా; లక్ష్మీ= లచ్చితో; సమాయుక్త= కూర్చబడిన; లలిత= సుందరమైన; వక్షంబునన్= రొమ్మున; వైజయంతీ= వైజయంతీ మాలిక; ప్రభల్= వెలుగులు; వన్నె చూపన్= కాంతిని వెదజల్లగా; హాటక= బంగారుమయమైన; రత్న= రతనాల; కిరీట= మకుటం యొక్క; కోటిప్రభల్= కాంతిప్రోవులు; బాల+అర్క= ఉదయ సూర్యుడి; రుచులతో= కాంతులతో; మేలము+ఆడన్= పరియాచకం చేయగా; లలిత= మనోజ్ఞమైన; నీల= నల్లని; అభ్ర= మేఘం యొక్క; రుచిన్= రంగుతో; కుంతలములు= వెంట్రుకలు; తనరన్= ప్రకాశించగా; ప్రవిమల= స్వచ్ఛమైన; ఆత్మీయ= తనయొక్క; దేహజ= శరీరంనుంచి పుట్టిన; ప్రభ= తేజస్సు; సరోజభవ= బ్రహ్మ; భవ= శివుడు, ఇంద్రుల ; అమరముఖ్యుల= దేవతాప్రముఖుల యొక్క; ప్రభలు= వర్చస్సులు; మాపన్= మాసిపోయేలా చేయగా; అఖిలలోక+ఏక= అఖిలలోకైక; గురుఁడు= విశ్వైక ఆచార్యుడు; నారాయణుండు= విష్ణువు...

**తా :** పూజనీయమైన నీలదేహకాంతులు నాలుగు దిక్కులా వ్యాపించాయి. బంగారు మొలతాడు మెరుపులు, కట్టిన పట్టుపంచె వన్నెలతో జతగూడాయి. లక్ష్మితో కూడిన మనోజ్ఞమైన ఎదమీద వైజయంతిమాల కాంతులు తమ అందాన్ని చూపాయి. నెత్తిన రత్నాలు తాపిన బంగారు కిరీటపుకాంతి పుంజాలు ఉదయసూర్యుని రోచిస్సులతో వేళాకోళాలాడుతున్నాయి. ముందటి కురులు చక్కనైన నీలిమబ్బుల వన్నెలతో శోభిల్లుతున్నాయి. దివ్యమైన తన శరీరం నుంచి పుట్టిన ప్రభ బ్రహ్మ శివ దేవతాముఖ్యులందరి తేజస్సులు వెలవెలపోవునట్లుచేయగా జగదేక గురువు విష్ణుమూర్తి

**చ. సలలితశంఖచక్రజలజాతగదాశరచాపఖడ్గ ని**
**ర్మలరుచులన్ సువర్ణరుచిమన్మణికంకణముద్రికాప్రభా**
**వళులను దేజరిల్లు భుజవర్గ మనర్గళకాంతియుక్తమై**
**విలసితకర్ణికారపృథివీరుహముంబురుడింప బిట్టుగన్. 164**

**ప్రతి :** సలలిత= ముచ్చటపడే; శంఖ= శంఖం; చక్ర= చక్రం; జలజాత= పద్మం; గదా= గద; శర= బాణం; చాప= ధనుస్సు; ఖడ్గ= కత్తుల యొక్క; నిర్మల= స్వచ్ఛమైన; రుచులన్= కాంతులతో; సువర్ణ= కాంచనం వంటి; రుచిమత్= రంగుగల; మణి= మణులుపొదిగిన; కంకణ= కడియాలయొక్క; ముద్రికా= ముద్దుటుంగరాలయొక్క; ప్రభా+ఆవళులను= వెలుగుల చాలుల తోనూ; తేజరిల్లు= ప్రకాశించే; భుజవర్గము= చతుర్బాహువులు; అనర్గళ= ధారాళమైన; కాంతియుక్తము+ఐ= దీప్తితో కూడినదై; విలసిత= ప్రకాశితమైన; కర్ణికార= కొండగోగు; పృథివీరుహమున్= పూలచెట్టును; బిట్టుగన్= మిక్కిలిగా; పురుడింపన్= పోలగా...

**తా :** తీరైన శంఖం, చక్రం, పద్మం, గద, బాణం, విల్లు, కత్తుల అచ్చపు కాంతులతోనూ, కనక కాంతుల మణులు పొదిగిన చేతి కడియాల వేలి ఉంగరాల మెరుగులు చిమ్ముతూ, విరగబూచిన కొండగోగు పూలచెట్టును పోలుచూ భుజాలు మెరుస్తూ ఉన్నవి.

**క. సరసోదారసమంచిత, దరహాసవిలోకనములఁ దగ లోకములం**
**బరితోషము నొందించుచుఁ, బరమోత్సవ మొప్ప విశ్వబంధుండగుచున్. 165**

**ప్రతి :** సరస= ప్రేమతో గూడి; ఉదార= ఔదార్యం గల్గి; సమంచిత= బాగా ఒప్పిఉన్న; దరహాస= చిరునగవు తొణికే; విలోకనములన్= చూపులతో; తగన్= శోభించగా; లోకములన్= జగాలను; పరితోషమున్= మిక్కిలి ఉల్లాసాన్ని; ఒందించుచున్= పొందిస్తూ; పరమ= దివ్యమైన; ఉత్సవము= పండువు; ఒప్పన్= దీపించగా; విశ్వబంధుండు= లోకానికి చుట్టం; అగుచున్= అవుతూ.

**తా :** సరసమై, గంభీరమైన బాగుగా నొక్కిన చిరునవ్వుగల చూపులతో తగినట్లు సమస్త జగత్తును రమింపచేస్తూ పెద్ద పండువుగా ప్రకాశించగా లోకబాంధవుడు అవుతూ

**చ. మఱియును రాజహంసరుచిమద్భ్రమణీకృతతాలవృంత చా**
**మరముల వీవఁగా దివిజమానిను లచ్ఛసుధామరీచివి**
**స్ఫురణసితాతపత్రరుచిపుంజము దిక్కులఁబిక్కటిల్లఁగాఁ**
**గరివరదుండు వచ్చె సుభగస్తుతివర్ణసుపర్ణయానుఁడై. 166**

**ప్రతి :** మఱియును= ఇంకనూ; రాజహంస= రాయంచలయొక్క; రుచిమత్= కాంతులవంటి, కాంతులుగల్గిన; భ్రమణీకృత= విసరబడ్తున్న; తాలవృంత= విసనకర్రలవంటి; చామరములన్= వింజామరలను; దివిజమానినులు= దేవతాకాంతలు; వీవన్+కాన్= వీస్తుండగా; అచ్ఛ= తెల్లని; సుధా= అమృతమయమైన; మరీచి= కిరణాలు గల చంద్రుడివలె; విస్ఫురణ= ప్రకాశమానమైన, సిత= తెల్లని; ఆతపత్ర= గొడుగులయొక్క; రుచి= కాంతులయొక్క; పుంజము= ప్రోవు; దిక్కులన్=

అన్నిదిశలా; పిక్కటిల్లన్+కాన్= వ్యాపించగా; సుభగ= రమ్యమైన; స్తుతి= బృహత్తు, రథంతరం అనే సోమస్తోత్రా; వర్ణ= రూపాలే/అక్షరాలే; సుపర్ణ= చక్కటి రెక్కలుగాగలగరుడపక్షి; యానుఁడు+ఐ= వాహనంగా ప్రయాణిస్తున్నవాడై; కరివరదుండు= గజేంద్రుడికి వరాలిచ్చిన; విష్ణువు= విష్ణుమూర్తి; వచ్చెన్= వేంచేశాడు.

**తా :** దేవకాంతలు విసన కర్రలవలె ఊపుతున్న వింజామరలు తెల్లటి రాజహంసకాంతుల్తో తిరుగాడుతున్నాయి. శ్వేతచ్ఛత్రం తెల్లని చల్లని చంద్రుడివలె వెలుగులు విరజిమ్ముతుంది. బృహత్తు, రథంతరం అనే సోమస్తోత్రాలు రెండూ రెండు రెక్కలుగాగల గరుత్మండుడిపై పయనిస్తూ కరివరదుడు విష్ణువు విచ్చేశాడు.

**చ. ఘనరుచి నట్లు వచ్చిన వికారవిదూరుముకుందుఁజూచి బో**
**రన నరవిందనందనపురందరచంద్రకళాధరామృతా**
**శనముఖు లర్థి లేచి యతిసంభ్రమ మొప్ప "నమో నమో దయా**
**వన నిధయే" యటంచు ననివారణ మ్రొక్కిరి భక్తియుక్తులై. 167**

**ప్రతి :** ఘన= అధికమైన; రుచిన్= ప్రభతో; అట్లు= ఆ రీతిని ప్రయాణంచేసి; వచ్చిన= చేరిన; వికారవిదూరున్= వికారాలకు దూరమైనవానిని; ముకుందున్= మోక్షప్రదుడైన విష్ణువును; చూచి= కాంచి; బోరనన్= హుటాహుటిగా; అరవిందనందన= బ్రహ్మ; పురందర= ఇంద్రుడు; చంద్రకళాధర= శివుడు; అమృతాశన= అమృతం తిండిగాగల దేవతలు; ముఖులు= మొదలైనవారు; అర్థిన్= ప్రీతితో; లేచి= నిలబడి; అతిసంభ్రమము= మిక్కిలి తొట్రుబాటు; ఒప్పన్= కూడుకొనగా; దయావననిధయే= దయాసముద్రునికి; నమస్+నమస్= కైమోడ్పులు, నమస్కారాలు; అటంచున్= అని ఉచ్చరిస్తూ; భక్తియుక్తులు+ఐ= భక్తితో కూడినవారై; అనివారణన్= ఆపకుండా; మ్రొక్కిరి= నమస్కరించారు.

**తా :** మహాతేజస్సు ఉట్టిపడ్తూ అలా వేంచేసిన విష్ణుమూర్తిని, భావ వికారాలకు దూరమైన వానిని, బ్రహ్మ, ఇంద్రుడు, శివుడూ, మిగతా దేవతాముఖ్యులు వెంటనే దర్శించారు. ఆ వెంటనే భక్తితో లేచి నిలబడ్డారు. "దయాసముద్రుడవైన ఓ సామీ! నీకు మా నమస్కారములు" అని నోట పలుకుతూ భక్తితో కూడినవారై మోకరిల్లారు.

**వ. అట్లు కృతప్రణాములైన యనంతరంబ. 168**

**ప్రతి :** అట్లు= ఆ విధంగా; కృత= చేయబడిన; ప్రణాములు+ఐన= అంజలి గలవారైన; అనంతరంబు+అ= వెంటనే...

**తా :** అలా నమస్కరించిన వెనువెంటనే

**ఉ. ఆ నలినాయతాక్షుని యనంతపరాక్రమదుర్నిరీక్ష్య తే-**
**జోనిహతస్వదీప్తులగుచు న్నుతిసేయ నశక్తులై భయ**
**గ్లాని వహించి బాష్పములు గ్రమ్మఁగ గద్గదకంఠులై తనుల్**
**మ్రానుపడంగ న వ్విభుని మన్ననఁ గైకొని యెట్టకేలకున్. 169**

**ప్రతి :** ఆ= ఆ; నలిన= తామరపూలవలె; ఆయత= విరివిగా విరిసిన/విచ్చిన; అక్షుని= నేత్రాలు కలవానిని; అనంత= దరిలేని; పరాక్రమ= వీర్యశక్తిచే; దుర్+నిర్+ఈక్ష్య= తేరిపారచూడరాని; తేజస్= ప్రకాశంచేత; నిహత= కొట్టబడిన; స్వ= తమ; దీప్తులు= ప్రభలు కలవారు; అగుచున్= అవుతూ; నుతిచేయన్= స్తోత్రం చేయుటకు; అశక్తులు+ఐ= సామర్థ్యం

చాలనివారై; భయ= వెరపు చేత; గ్లాని= క్షతి; వహించి= తాల్చి; బాష్పములు= కన్నీరు; క్రమ్మంగా= పైకి ఉబుకగా; గద్గదకంఠులు+ఐ= గద్గదకంఠంతో; తనుల్= శరీరాలు; మ్రానుపడన్+కన్= చేష్టలుడిగినవి కాగా; ఎట్టకేలకున్= చివరకు; ఆ+విభుని= ఆ ప్రభుని; మన్ననన్= ఆదరాన్ని; కైకొని= గ్రహించి...

**తా :** తామరలవంటి పెద్దకన్నులు కలిగిన విష్ణువు అంతులేని పరాక్రమంచేత తేరి చూడరాని తేజస్సు దెబ్బకు వారు తమ తేజస్సులను కోల్పోయి స్తోత్రం చేయుటకు కూడా శక్తిలేక భయంచేత బలహీనులై కన్నీరు క్రమ్ముకొనగా గద్గద కంఠంతో శరీరాలు, చేష్టలుడిగినవి కాగా ఆ విష్ణువు మన్ననను స్వీకరించి, యెట్టకేలకు

## దక్షాదులు విష్ణువును స్తుతించుట

**వ. నిటలతట ఘటిత కరపుటులై య మ్మహాత్ముని యపారమహిమం బెఱింగి నుతియింప శక్తులు గాక యుండియుఁ, గృతానుగ్రహనిగ్రహుం డగుటం జేసి తమ తమ మతులకు గోచరించిన కొలంది నుతియింపఁ దొడంగి, రందు గృహీతంబు లగు పూజాద్యుపచారంబులు గలిగి బ్రహ్మాదులకు జనకుండును, సునందనందాది పరమభాగవతజనసేవితుండును, యజ్ఞేశ్వరుండును నగు భగవంతుని శరణ్యునింగాఁ దలంచి దక్షుం డిట్లనియె. దేవా! నీవు స్వస్వరూపంబునం దున్న యప్పు డుపరతంబులు గాని రాగాద్యఖిల బుద్ధ్యవస్థలచే విముక్తుండవును, నద్వితీయుండవును, జిద్రూపకుండవును, భయరహితుండవును నై మాయం దిరస్కరించి మఱియు నా మాయ ననుసరించుచు లీలామానుషరూపంబుల నంగీకరించి స్వతంత్రుండ వయ్యును మాయా పరతంత్రుండవై రాగాది యుక్తుండునుంబోలె రామకృష్ణాద్యవతారంబులఁ గానంబడుచుందువు; గావున నీ లోకంబులకు నీవ యీశ్వరుండ వనియు నితరులైన బ్రహ్మరుద్రాదులు భవన్మాయావిభూతు లగుటం జేసి లోకంబులకు నీశ్వరులు గారనియును భేదదృష్టి గల నన్ను రక్షింపు; మీ విశ్వకారణులైన ఫాలలోచనుండును బ్రహ్మయు దిక్పాలురును సకలచరాచరజంతువులును నీవ; భవద్వ్యతిరిక్తంబు జగంబున లేదని విన్నవించినఁ దదనంతరంబ ఋత్విగ్జనంబు లిట్లనిరి. 170**

**ప్రతి :** నిటలతట= నుదుటిపై; ఘటిత= కూర్చబడిన; కరపుటులు+ఐ= అంజలులు కలవారై; ఆ+మహాత్ముని= ఆ ఘనమూర్తి విష్ణుని; అపార= తుదలేని; మహిమంబు= గొప్పతనం; ఎఱింగి= తెలిసి; నుతియింపన్= స్తుతించను; శక్తులు+కాక= సమర్థులు కాక; ఉండియున్= ఉన్నప్పటికిన్నీ; కృత= ప్రకటించబడిన; అనుగ్రహ= దయారూపుడు; నిగ్రహుఁడు= దండనరూపుడు; అగుటన్‌చేసి= అవడంవల్ల; తమ తమ= వారి వారియొక్క; మతులకున్= బుద్ధులకు; గోచరించిన కొలంది= తోచినట్లు; నుతియింపన్= పొగడడానికి; తొడంగిరి= పూనుకొన్నారు; అందున్= వాళ్లల్లో; గృహీతంబులు+అగు= స్వీకరించబడినవి అయినట్టి; పూజా= అర్చన; ఆది= మొదలగు; ఉపచారంబులు= సేవలు; కలిగి= పొందినవాడై; బ్రహ్మ+ఆదులకున్= బ్రహ్మమొదలైన వేల్పులకు; జనకుండును= తండ్రి; సునంద= సునందుడు; నంద= నందుడు; ఆది= మొదలైన; పరమ= ఉత్తములైన; భాగవతజన= దైవభక్తులచే; సేవితుండును= పూజించబడినవాడూ; యజ్ఞ+ఈశ్వరుండునున్= యాగానికి అధిపతియూ; అగు= అయినట్టి; భగవంతుని= విష్ణుని; శరణ్యునిన్+కాన్= శరణువేడ దగినవాణ్ణిగా; తలంచి= భావించి; దక్షుండు= దక్షప్రజాపతి; ఇట్లు= ఇలా; అనియెన్= అన్నాడు; దేవా!= ఓ దైవమ!; నీవు= నువ్వు; స్వ= నీ యొక్క; స్వరూపంబున+అందున్= కలరూపుతో; ఉన్న+అప్పుడు= ఉన్నప్పటికాలంలో; ఉపరతంబులు

కాని= నివర్తిల్లని; రాగ+ఆది= అనురాగం మొదలైన; అఖిల= సమస్తమైన; బుద్ధి+అవస్థలచే= అంతఃకరణస్థితులచే; విముక్తుండవునున్= విశేషంగా వదలబడినవాడవును; అద్వితీయుండవును= రెండవది లేనివాడవున్నూ; చిద్+రూపకుండవును= శుద్ధచైతన్యస్వరూపుడవును; భయరహితుండవునున్+ఐ= అభయ స్వరూపుడవు అయిన్ని; మాయను= ప్రకృతిశక్తిని; తిరస్కరించి= అనాదరించి; మఱియున్= మళ్లీ; ఆ+మాయన్= ఆ మాయను; అనుసరించుచున్= అనుసరిస్తూ; లీలామానుషరూపంబులన్= మనుష్య రూపంలో కనపడే దైవరూపాలనూ; అంగీకరించి= పుచ్చుకొని; స్వతంత్రుఁడవు= ఆత్మతంత్రుడవు; అయ్యును= అయికూడా; మాయాపరతంత్రుడవు+ఐ= మాయకు లోబడ్డవాడవై; రాగ+ఆది= ప్రేమ, పగ మొదలైనవాటితో; యుక్తుండునున్+పోలెన్= ఐక్యం కలవాడివలె; రామ+కృష్ణ+ఆది= రాముడు; కృష్ణుడు మొదలుగాగల అవతారంబులన్= అవతారాలలో; కానన్+పడుచున్; ఉందువు= కంటపడుతూ ఉంటావు; కావునన్= కాబట్టి; ఈ లోకంబులకున్= ఈ లోకాలకు; నీవు+అ= నీవే; ఈశ్వరుండవు= ప్రభువవు; అనియున్= అనియూ; ఇతరులు+ఐన= పరులు అయిన; బ్రహ్మ; రుద్ర= శివుడు; ఆదులు= మొదలైనవాళ్లు; భవద్= నీ యొక్క; మాయా; విభూతులు= మాయారూపులు; అగుటన్‌చేసి= అయిన కారణాన; లోకంబులకున్= విశ్వానికి; ఈశ్వరులు= అధిపతులు; కారు+అనియును= కానివారు అనిన్ని; భేద= వేఱు; దృష్టి= చూపు; కల= కల్గి ఉన్న; నన్నున్= నన్ను; రక్షింపుము= మన్నించు; ఈ విశ్వకారణులు+ఐన= ఈ ప్రసిద్ధమైన లోకాలకు మూలాలయిన; ఫాలలోచనుండును= ముక్కంటియు; బ్రహ్మయున్= బ్రహ్మయు; దిక్పాలురు= దిశల ఏలికలూ; సకల= సమస్తమైన; చర= కదిలేవి; అచర= కదలనివీ; అయిన జంతువులును= ప్రాణులు; నీవ= నువ్వే; భవద్= నీకంటే; వ్యతిరిక్తంబు= వేరయినది; జగంబున= లోకాన; లేదు= ఉండదు; అని= అని; విన్నవించినన్= మనవి చేయగా; తద్+అనంతరంబు= ఆ వెంబడినే; ఋత్విగ్+జనంబులు= ఋత్విక్‌వర్గం అంతా; ఇట్లు= ఇలా; అనిరి= కీర్తించారు.

**తా :** బ్రహ్మాదులంతా నొసటిపై దోసిలి ఒగ్గి నమస్కరిస్తూ ఆ ఘనమూర్తి ఘనత అంతూ పొంతూ లేనిదని గ్రహించుకున్నారు. పొగడటం వాళ్లతరం కావడం లేదు. అయినా ఆ స్వామి దయామయ, దండనమయరూపాన్ని కనిపింపచేయడంవల్ల ఎవరికి తోచినంతలో వారు కీర్తించసాగారు. వాళ్లల్లో దక్షుడు పూజాపునస్కారాది అర్చనసేవలను స్వీకరింపచేశాడు. బ్రహ్మాది దేవతలందరికి పరమపిత అయిన, నంద సునందాది అనుచర భక్తశిఖామణుల సేవలు అందుకుంటున్న, తన యజ్ఞానికి, యజమాని అయిన విష్ణుదేవుని శరణుకోర దగ్గవాణ్ణిగా ఊహించుకున్నాడు. ఇలా వర్ణించాడు. ఓ దేవా! నీవు నిజరూపంలో ఉన్నప్పుడు కాలగతినిబట్టి రాగద్వేషాది మనోదశలన్నింటికీ నిత్యమూ అతీతుడుగా ఉంటావు. నీవు సాటిలేనివాడవు. అయినా ఓ పక్కన మాయను కాదంటావు. మరో వైపున మాయను అనుసరిస్తావు. పురుషరూపంలో నటించే దైవరూపంలో స్వచ్ఛందుడివే. అంతలోనే మాయకు పడి పోతుంటావు. అనురాగం, ద్వేషాదులు కూడిన వాడిలా రామకృష్ణాది మానవ అవతారాల్లో ప్రత్యక్షమవుతుంటావు. ఇన్ని కారణాలవల్ల ఈ విశ్వానికంతటికీ అధినాథుడివి నువ్వే. తక్కిన బ్రహ్మరుద్రాదులు నీ మాయలోని ఐశ్వర్యరూపులు. కనుక లోకనాథులు కారనే వేరు భావనగల నన్ను ఆదరించు. విశ్వానికి మూలకారణులయిన శివుడూ, బ్రహ్మ, లోకపాలకులూ, చేతనాచేతన జీవకోటి సర్వస్వమున్నూ నీవే. నీకంటే వేరైనది మరేదీ ఈ లోకంలో ఉండబోదు, అనే దక్షుడి విజ్ఞాపనం ముగిసిన మరుక్షణాననే తక్కిన ఋత్విగాదులందరూ ఇట్లన్నారు.

**సీ.** **వామదేవుని శాపవశమునఁ జేసి కర్మానువర్తులము మే మైనకతన**
**బలసి వేదప్రతిపాద్యధర్మోపలక్ష్యంబైన యట్టి మఖంబునందు**

**దీపింప నింద్రాదిదేవతాకలితరూపవ్యాజమునఁ బొంది పరఁగు నిన్ను**
**యజ్ఞస్వరూపుండ వని కాని కేవలనిష్కించనుండవు నిర్మలుఁడవు**

**తే. నరయ ననవద్యమూర్తివి యైన నీదు, లలితతత్త్వస్వరూపంబుఁ దెలియఁజాల**
**మయ్య! మాధవ! గోవింద! హరి! ముకుంద! చిన్మయాకార! నిత్యలక్ష్మీవిహార! 171**

**ప్రతి :** మాధవ!= లక్ష్మీపతీ!; గోవింద= గోవులను పొందేవాడా!; హరి= వెన్నుడా!; ముకుంద= ముక్తిదాయకా!; చిత్+మయ+ఆకార!= జ్ఞానమయస్వరూపుడా!; నిత్యలక్ష్మీవిహార!= ఎల్లవేళలా లచ్చితో వేడుకగా తిరిగేవాడా!; అయ్యా!= స్వామీ; మేము= ఋత్విక్కులమైన మేమందరం; వామదేవుని= శివునియొక్క; శాపవశమునన్+చేసి= శాపానికి అధీనులం అవడంవల్ల; కర్మ= యాగకర్మకాండను; అనువర్తులము= అనుసరించే వారలం; ఐన+కతన= అయిన మూలాన; బలసి= గట్టినమ్మకంతో; వేద= వేదంలో; ప్రతిపాద్య= నిరూపించబడ్డ; ధర్మ= పుణ్యనిధికి; ఉపలక్ష్యంబు+ఐన+అట్టి= అవలంబనమైనట్టి; మఖంబునందు= యజ్ఞాదికర్మమందు; దీపింపన్= ప్రకాశించగా; ఇంద్ర+ఆది= ఇంద్రుడు మొదలైన; దేవతా= దివిజులచే; కలిత= తెలియబడే; రూప= ఆకారాల; వ్యాజమునన్= మిషచే; పొంది= పడసి; పరఁగు= వర్తించు; నిన్ను= నిన్ను; యజ్ఞస్వరూపుండవు= యాగమూర్తివి; అనికాని= అని తక్క; కేవలనిష్కించనుండవు= పొందదగింది లేనివాడవు మాత్రమే కాదు; నిర్మలుఁడవున్= స్వచ్ఛమైనవాడవుకూడ; అరయన్= విచారించగా; అనవద్యమూర్తివి= అనింద్యస్వరూపుడవు; ఐన= అయినట్టి; నీ+లలిత= నీమనోహరమైన; తత్త్వ= చైతన్యవంతమైన; స్వరూపంబున్= నిజస్వభావం; తెలియన్+చాలము= ఎరుగజాలము.

**తా :** ఈశ్వరుని శాపబద్ధులమై కేవలం యాగకర్మానుసారం మసలుకునే బతుకులు మా ఋత్విక్కులవి. దానివల్ల మా వాళ్లందరం వేదం తెల్పిన ధర్మం ప్రకారం చేపట్టగల యాగాది క్రియలలోనే వర్తిస్తుంటాం. ఇంద్రుడు మొదలైన దేవతాకృతుల వంకతో వర్తించే నిన్ను యజ్ఞస్వరూపుడవనిన్నీ ఎరుగుదుము. కాకపోతే అప్రాప్యుడవే కాదు శుద్ధస్వరూపుడవని కూడా తెలుసును. ఓ లచ్చిమగడ! గోవింద! విష్ణువ! మోక్షప్రదుడ! జ్ఞానమూర్తి! నిచ్చలూ లక్ష్మివెంట విహరించేవాడ! ఇంకా ఇంకా ఆలోచించగా నెపం ఎంచలేని అందమైన నీ అచ్చమైన చేతనాతత్త్వాన్ని తెలుసుకోగల తెలివి మాకు లేదని తెలిసింది.

**విశే:** వ్యాసభాగవతంలోనూ పోతనభాగవతంలోనూ శివుని శాపం అని ఉన్నా శ్రీధరుడూ మొదలగు వ్యాఖ్యాతలు నందీశ్వరుడని చెప్పారు. నందీశ్వరుడు శివస్వరూపుడని తెలుస్తూ ఉంది.

**వ. సదస్యు లిట్లనిరి. 172**

**ప్రతి :** సదస్యులు= సభాసదులు, యజ్ఞవిధి పరీక్షాధికారులు; ఇట్లు= ఇలా; అనిరి= అన్నారు.

**తా :** సభాసభ్యులు ఇలా అన్నారు.

**సీ. శోకదావాగ్నిశిఖాకులితంబు పృథు క్లేశఘనదుర్గదుర్గమంబు**
**దండధరక్రూరకుండలిశ్లిష్టంబు, పాపకర్మవ్యాఘ్రపరివృతంబు**
**గురుసుఖదుఃఖకాకోలపూరితగర్త మగుచు ననాశ్రయ మైనయట్టి**
**సంసారమార్గసంచారులై మృగతృష్ణికలఁ బోలు విషయసంఘము నహమ్మ**

**తే. మేతి హేతుకదేహనికేతనములు, నయి మహాభారవహు లైనయట్టి మూఢ**
**జనము లే నాఁట మీ పదాబ్జములు గానఁ, జాలువారలు? భక్తప్రసన్న! దేవ! 173**

**ప్రతి :** భక్త= భక్తులకు; ప్రసన్న= ప్రసన్నుడైనవాడా!; దేవా!= భగవంతుడా!; శోక= వగ అనే; దావ+అగ్ని= కారుచిచ్చుయొక్క; శిఖా= సెగలచే; ఆకులితంబు= చీకాకుపడినది; పృథు= పెద్ద; క్లేశ= తంటాలు అనే; ఘన= గట్టివైన; దుర్గ= కోటలచే; దుర్గమంబు= దాటిపోరానిది; దండధర= యముడనే; క్రూర= భయంకరమైన; కుండలి= సర్పంతో; శ్లిష్టంబు= మిళితమైంది; పాపకర్మ= దుష్టచేష్టలనే; వ్యాఘ్ర= పులులచే; పరివృతంబు= చుట్టబడినది; గురు= గొప్ప; సుఖదుఃఖ= భోగాలు శోకాలు అనే; కాకోల= విషంచే; పూరిత= నింపబడ్డ; గర్తము= పడియ; అగుచున్= అవుతూ; అనాశ్రయము+ఐన+అట్టి= ఆశ్రయించదగని; సంసార= పుట్టుటగిట్టుటఅనే; మార్గ= బాటవెంట; సంచారులు+ఐ= పోతున్నవారలై; మృగతృష్ణికలన్+పోలు= ఎండమావులను పోలెడి; విషయ= ఇంద్రియార్థాలయొక్క; సంఘమున్= గుమినిగూర్చి; అహమ్= నేను; మమ= నాది; ఇతి= అనే అహంకార; మమకారాదులకు; హేతుక= నిమిత్తాలయిన; దేహనికేతనములున్= శరీరాలు, గృహాలు గలవారు; అయి; మహాభారవహులు= పెద్ద బరువును మోస్తున్నవారు; ఐన+అట్టి= అయినటువంటి; మూఢజనములు= అజ్ఞానులు; ఏనాఁటన్= ఎన్నాళ్లకి; మీ పద+అబ్జములు= మీ పాదపద్మాలను; కానన్+చాలువారలు= చూడగలవారలు అవుతారు.

**తా :** భక్తిపరులయందు దయకల ఓ దేవా! సంసృతిసరణి, 'దుఃఖం అనే కారుచిచ్చుకాకలతో ఎపుడూ కలవరపెట్టుంది. కడు తిప్పలనే కోటలతో దాట నలవి కానిది, యముడనే పెద్దపాముతో కూడుకొని ఉంది. పాపపు పనులనే పులులతో కమ్ముకుని ఉంది. గొప్పసుఖాలు గొప్పదుఃఖాలు అనే గరళంతో నింపిన చెలమలు కల్గిఉంది. ఇలా ఏ అండాదండాలేని ఈ సంసారంలోబడి మోటుజనులు తిరుగుతుంటారు. ఎండమావుల్లా ఆశపెట్టే ఇంద్రియరూప భోగాలన్నిటిని అహంకారహేతువైన ఒళ్లు, మమకారహేతువైన ఇల్లు అనే పెద్ద బండరాళ్లను మోస్తూ ఉంటారు. ఆ మొరకులు నీ పాదపద్మాలను ఎప్పటికి చూడగలుగుతారో కదా!

**వ. రుద్రుండిట్లనియె. 174**

**ప్రతి :** రుద్రుండు= శివుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

**తా :** శివుడు ఇలా అన్నాడు.

**చ. వరద! నిరీహయోగిజనవర్గసుపూజిత! నీ పదాబ్జముల్**
**నిరతము నంతరంగమున నిల్పి సమగ్రభవత్పరిగ్రహ**
**స్ఫురణ దనర్చు నన్ను నతిమూఢులు సంతతము న్నమంగళా**
**చరణుఁడటంచుఁబల్కు నది సమ్మతి నే గణియింప నచ్యుతా! 175**

**ప్రతి :** వరద!= కోరికను ఇచ్చేస్వామీ!; నిర్+ఈహ= కాంక్షను వీడిన; యోగిజన= యోగాభ్యాసకుల యొక్క; వర్గ= తరగతులచే; సుపూజిత= పరమభక్తితో ఆరాధించబడేవాడా!; నీ+పద+అబ్జముల్= నీ పాదపద్మాలు; నిరతమున్= ఎల్లపుడూ; అంతరంగమునన్= ఎదలో; నిల్పి= ప్రతిష్ఠించి; సమగ్ర= నిండుగా; భవద్= నీ వలని; పరిగ్రహ= స్వీకరించడం అనే, స్ఫురణన్= ఆచరణ తోచడంచే; తనర్చు= ఉప్పొంగే; నన్నున్= నన్ను (శివుని); అతిమూఢులు= అతిమూర్ఖులు; సంతతమున్=

అవిచ్ఛిన్నంగా; అమంగళ+ఆచరణుఁడు= అశుభాచారం పాటించేవాడు; అటు+అంచున్= అని అంటూ; పల్కన్= మాటాడగా; అది= ఆ ప్రేలాపనను; సమ్మతిన్= నీ యందుండే ఇచ్ఛవల్ల; నేన్= నేను; అచ్యుతా!= అవినాశా!; గణియింపన్= లక్ష్యపెట్టను.

**తా :** వరదాయకా దేవా! కోరికలులేని యోగులచే పూజింపబడినవాడా! నేను నీ పాదపద్మాలను నా ఎదలో ఎల్లపుడూ నిలుపుకుంటాను. భగవానుడవైన నీ నుంచి సర్వవాంఛలను పుచ్చుకునే స్ఫూర్తి కలిగిన నన్ను పరమమూర్ఖులు 'సదాచారభ్రష్టుడు' అని నిందిస్తుంటారు. ఆ మాటలను నేను అంగీకరించను, లెక్కచేయను.

**వ. భృగుండిట్లనియె. 176**

**ప్రతి :** భృగుండు= భృగుముని; ఇట్లు+అనియెన్= అన్నాడు.

**మ. అరవిందోదర! తావకీనఘనమాయామోహితస్వాంతులై**
**పరమంబైన భవన్మహామహిమముంబాటించి కానంగ నో**
**పరు బ్రహ్మాదిశరీరు లజ్ఞు లయి; యో పద్మాక్ష! భక్తార్తి సం**
**హరణాలోకన! నన్నుఁగావఁదగు నిత్యానందసంధాయివై. 177**

**ప్రతి :** అరవింద+ఉదర= పద్మం నాభియందు కలవాడా!; తావకీన= త్వదీయమైన; ఘన= మిక్కుటమైన; మాయా= వంచనచేత; మోహిత= వలపించబడ్డ; స్వాంతులు+ఐ= మనస్సులు కలవారై; పరమంబు+ఐన= ఉత్కృష్టం అయిన; భవద్= నీయొక్క; మహామహిమమున్= గొప్ప మాహాత్మ్యాన్ని; పాటించి= ఆదరించి; బ్రహ్మ+ఆది= బ్రహ్మాప్రభృతులైన; శరీరులు= జీవులు; అజ్ఞులు+అయి= తెలియలేనివారై; కానంగన్= కనుగొనను; ఓపరు= ఇచ్ఛగించరు; ఓ పద్మ+అక్ష= ఓ నలిననయనా!; భక్త= భక్తులయొక్క; ఆర్తి= చిక్కులను; సంహరణ= చెరిపే; ఆలోకన= కటాక్షం కలవాడా!; నిత్య= శాశ్వతమైన; ఆనంద= పరమసంతోషాన్ని; సంధాయివి+ఐ= కూర్చి పెట్టేవాడివై; నన్నున్= నన్ను; కావన్+తగున్= రక్షించడం ఒప్పవుతుంది.

**తా :** పద్మగర్భుడా! నీ మాయ అతిగా కమ్మిన మనస్సులు కలవారై నీ గొప్ప తత్త్వమహిమను పాటించిన బ్రహ్మాదిదేవతలు దేహధారులై ఆ తత్త్వజ్ఞతను అర్థం చేసుకోలేనివారై నిన్ను చూడలేకపోతున్నారు. తామరసాక్షా! నువ్వు నీ చూపులతోనే భక్తులసంకటాలను హరించగల గొప్పవాడవు. ఎప్పటికీ తరుగని పరమసంతసాన్ని సంఘటింప చేసేందుకు నన్ను అనుగ్రహించవలసింది.

**వ. బ్రహ్మ యిట్లనియె. 178**

**తా :** బ్రహ్మ ఇలా అన్నాడు.

**సీ. తవిలి పదార్థభేదగ్రాహకములైన చక్షురింద్రియముల సరవిఁజూడఁ**
**గలుగు నీ రూపంబు గడఁగి మాయామయం బగు; నసద్వ్యతిరిక్త మగుచు మఱియు**
**జ్ఞానార్థకారణసత్త్వాదిగుణముల కాశ్రయభూతమై యలరుచున్న**
**నిరుపమాకారంబు నీకు విలక్షణ మైయుండు ననుచు నే నాత్మఁదలఁతు**

**తే. నిర్వికార! నిరంజన! నిష్కళంక!, నిరతిశయ! నిష్క్రియారంభ! నిర్మలాత్మ!**
**విశ్వసంబోధ్య! నిరవద్య! వేదవేద్య!, ప్రవిమలానంద! సంసారభయవిదూర! 179**

**ప్రతి :** తవిలి= సంబంధం కల్పించుకొని; పదార్థ= వస్తువుల; భేద= తేడాను; గ్రాహకములు+ఐన= గ్రహించేవి అయిన; చక్షుస్= కన్ను; ఇంద్రియముల= ఇతర ఇంద్రియాల యొక్క; సరవిన్= క్రమంగా; చూడన్+కలుగు= కనగలట్టి; నీ రూపంబు= నీ ఆకారం; కడcగి= ఉత్సహించి; మాయామయంబు+అగున్= మాయతో నిండినది అయిన; అసత్= అసత్పదార్థాలకు; వ్యతిరిక్తము+అగుచున్= విలక్షణం అవుతూ; మఱియున్= ఇంకా; జ్ఞాన= తెలివికి; అర్థ= పదార్థానికి; కారణ= హేతువుఅయిన; సత్త్వ+ఆది= సత్త్వ రజస్తమస్సులనే; గుణములకున్= గుణాలకు; ఆశ్రయభూతము+ఐ= ఆధారమైనదై; అలరుచున్+ఉన్న= ప్రకాశిస్తున్న; నిరుపమ= సాటిలేని; ఆకారంబు= రూపం; నీకున్= నీకంటే; విలక్షణము+ఐ= వేరైనదై; ఉండున్= ఉంటుంది; అనుచున్= అనుకుంటూ; నేన్= నేను (బ్రహ్మ); ఆత్మన్= నాలో; తలcతున్= భావిస్తాను; నిర్వికార!= ఏ మార్పులు లేనివాడా!; నిరంజన= మాలిన్య దోషం అంటని వాడా!; నిష్కళంక!= ఏ మచ్చ పడనివాడా!; నిరతిశయ= నీకన్న అధికులు లేనివాడా!; నిష్క్రియ+ఆరంభ!= ఏ కార్యారంభం లేనివాడా!; నిర్మల+ఆత్మ!= స్వచ్ఛమైన ఆత్మ కలవాడా!; విశ్వసంబోధ్య= జనంచే పిలువదగినవాడా!; నిరవద్య= ఏ దోషం లేనివాడా!; వేదవేద్య= వేదంచేత తెలియదగ్గవాడా!; ప్రవిమల+ఆనంద= నిర్మలమైన ఆనందస్వరూపుడా!; సంసారభయ= సంసారం వలని భయాన్ని; విదూర= తొలగించేవాడా!

**తా :** ఆసక్తితో వస్తుతారతమ్యాది విశేషాలను గుర్తించే కళ్ళతో వరుసగా చూడగలిగిన నీ రూపం మాయామయమైనది. అది లేనిది ఉన్నట్టుగాను, జ్ఞానానికి పదార్థానికి మూలమైన సత్త్వాది త్రిగుణాలకు ఆశ్రయమైనట్టిదిగానూ ఒప్పుతుంటుంది. దీటు లేని రూపం నీ కంటే వేరై ఉంటుంది. అని చెప్పుకుంటూ నాకు నేను గుర్తు చేసుకుంటుంటాను. మానసిక శారీరక పరిణామాలు పొందనివాడా! పరమాత్ముడా! కళంకంలేనివాడా! నిక్కు లేనివాడా! చేయని సంకల్పం కలవాడా! మలినం తాకనివాడా! జనంచే పిలువదగ్గవాడా! శ్రేష్ఠుడా! వేదాలవల్ల తెలియదగ్గవాడా! రమ్యమైన ఆనందరూపుడా! భవభయ విదూరా!

**వ. ఇంద్రుం డిట్లనియె. 180**

**తా :** ఇంద్రు డిలా పలికాడు.

**మ. దితిసంతానవినాశసాధనసముద్దీప్తాష్టబాహాసమ**
**న్వితమై యోగిమనోనురాగకరమై వెల్గొందు నీ దేహ మా**
**యత మైనట్టి ప్రపంచముంబలెను మిథ్యాభూతముంగామి శా**
**శ్వతముంగా మదిలోcదలంతు హరి! దేవా! దైవచూడామణీ! 181**

**ప్రతి :** హరి!= విష్ణువా!; దేవా!= భగవంతుడా!; దైవచూడామణీ= దేవతా శిఖామణీ!; దితి= దితి (అసురులమాత) యొక్క; సంతాన= బిడ్డలైన రాక్షసులను; వినాశ= చంపే; సాధన= పోటు ముట్టులతో; సమ్+ఉత్+దీప్త= చక్కగా ప్రకాశమానమైన; అష్ట= ఎనిమిదైన; బాహా= చేతులతో; సమన్వితము+ఐ= కూడినదై; యోగి= ధ్యాననిష్ఠులయొక్క; మన= హృదయాలకు; అనురాగకరము+ఐ= ప్రేమకల్గించేది అయి; వెల్గొందు= ఒప్పిల్లే; నీ దేహము= నీ ఒడలు;

ఆయతము+ఐనట్టి= విశాలమైనట్టి; ప్రపంచముంబలెను= విశ్వంవలెను; మిథ్యాభూతమున్= అసత్యప్రపంచం; కామి= కాకపోవడంచే; శాశ్వతమున్+కాన్= స్థిరమునుగా; మదిలోన్= మనస్సులో; తలంతున్= ధ్యానిస్తుంటాను.

**తా :** దైవమా! విష్ణువా! దైవతోత్తమా! నీ మేను దైత్యజాతి సంహారంకోసం ఆయుధాన్ని చేపట్టిన ఎనిమిది బాహువులతో గూడి నీ దేహం మెరుస్తూ ఉంటుంది. అది యోగిజనుల అంతరంగప్రేమకు నిధానమైనట్టిది. విపులమైన విశ్వంవలె కల్ల కానిది, సత్యమైనది, శాశ్వతమైనది అనే మనస్సులో యోచిస్తుంటాను.

**విశే :** శ్రీమహావిష్ణువు యొక్క ఎనిమిది చేతుల్లోని శత్రు సంహారక సాధనాలు. 1.శంఖం 2.చక్రం 3.డాలు 4.ఖడ్గం 5.గద 6.బాణాలు 7.చాపం 8.పాశం.

**వ. ఋత్విక్పత్ను లిట్లనిరి. 182**

**ప్రతి :** ఋత్విక్+పత్నులు= ఋత్విక్కుల భార్యలు; ఇట్లు+అనిరి= ఇలా అన్నారు.

**తా :** ఋత్విక్కుల భార్యలు ఇలా అన్నారు.

**చ. కడఁగి భవత్పదార్చనకుఁ గా నిటు దక్షునిచే రచింపఁగాఁ**
**బడి శితికంఠరోషమున భస్మము నొంది పరేతభూమియై**
**చెడి కడు శాంత మేధమునఁ జెన్నఱియున్న మఖంబుఁ జూడు మే**
**ర్పడ జలజాభనేత్రములఁబావన మై విలసిల్లు నచ్యుతా! 183**

**ప్రతి :** అచ్యుతా!= అవినాశా!; కడఁగి= తలపడి; భవత్= నీ పాదాలయొక్క; అర్చనకున్+కాన్= పూజకుగాను; ఇటు= ఈ చందాన; దక్షునిచేన్= దక్షబ్రహ్మచే; రచింపన్+కాన్+పడి= క్రితంలో కల్పించబడి; శితి= నల్లటి; కంఠ= గొంతుగల శివుడియొక్క; రోషమునన్= క్రోధంచే; భస్మమున్+ఒంది= బూడిద కుప్పగామారి; పరేతభూమియై= వల్లకాడై; చెడి= ధ్వంసమై; కడు= మిక్కిలి; శాంతమేధమునన్= పూర్తిగా ఆపివేయబడ్డ కర్మానుష్ఠానంతో; చెన్ను= కాంతి; అఱి= హీనమై; ఉన్న= ఉన్నటువంటి; మఖంబున్= యాగాన్ని; జలజ+ఆభ= పద్మకాంతులతోసమానమైన కాంతిగల; నేత్రములన్= కళ్లతో; ఏర్పడన్= విశదంగా; చూడుము= కాంచుము; పావనము+ఐ= పవిత్రమై; విలసిల్లున్= (యాగం) ఒప్పుతుంది.

**తా :** చ్యుతిలేని ఓ విష్ణూ! కావాలని నీ పాదసేవకోసమే ఇలా ఈ యాగం అప్పట్లో దక్షునిచే కూర్చబడింది. శివుడి ఆగ్రహంవల్ల అదంతా బూడిదయై, వల్లకాడై చెడి నిలిచిపోయి అందం నశించి ఉన్న యాగాన్ని పద్మాలవంటి నేత్రాలతో స్పష్టంగా ఒక్కమారు తేరిపార పరికించు. అది తప్పక పవిత్రకర్మగా ప్రకాశిస్తుంది.

**వ. ఋషు లిట్లనిరి. 184**

**ప్రతి :** ఋషులు+ఇట్లు+అనిరి= మునులు ఇలా అన్నారు.

**తా :** ఋషు లిలా కీర్తించారు.

**మ. అనఘా! మాధవ! నీవు మావలెనె కర్మారంభివై యుండియున్**
**విను తత్కర్మఫలంబు వొంద; వితరుల్ విశ్వంబునన్ భూతికై**

**యనయంబున్ భజియించు నిందిర గరం బర్థిన్ నినుం జేరఁ గై**
**కొన; వే మందుము నీ చరిత్రమునకున్ గోవింద; పద్మోదరా! 185**

**ప్రతి :** అనఘా= పుణ్యపురుషా!; మాధవ!= లక్ష్మీపతీ!; విను= వినవలసింది; నీవు= నువ్వు; మావలెనె= మా శరీరుల మాదిరిగనే; కర్మ= పనులు; ఆరంభివి= మొదలుపెట్టినవాడవు; ఐ+ఉండియున్= అయి ఉండికూడా; తద్= ఆ; కర్మ= చేతలయొక్క; ఫలంబు= ప్రయోజనం; పొందవు= అనుభవించవు; ఇతరుల్= అన్యజనం; విశ్వంబునన్= ఈ జగత్తునందు; భూతికిన్+ఐ= సంపదలకొరకై; అనయంబున్= నిత్యమూ; భజియించున్= సేవించు; ఇందిరన్= సిరిని; కరంబు= కడు; అర్థిన్= ప్రీతితో; నినున్= నిన్ను; చేరన్= ఆశ్రయించగా; కై కొనవు= ఒప్పుకొనవు; గోవింద!= గోపాలక!; పద్మ+ఉదరా= పద్మగర్భుడ!; నీ చరిత్రమునకున్= నీ నడతకు; ఏమి+అందుము= ఏమి చెప్పగలవారం?

**తా :** ఓ సుకృతీ! లక్ష్మీపతీ! విను. నువ్వూ మా లోకుల వలెనే పనులు తలపెడుతూ ఉంటావు. కాని ఆ పని ఫలితాన్ని పొందవు. ఈ లోకంలో నువ్వు తప్ప మిగతావాళ్లు ఐశ్వర్యం కోసరం ఎల్లకాలం లక్ష్మిని అవలంబిస్తుంటారు. అలాంటి లక్ష్మి చాలఇష్టంగా నీ చెంతకు చేరితే నువ్వు సమ్మతించవు. ఓ గోవిందా! ఓ పద్మగర్భా! నీ ప్రవర్తనం గురించి మేం ఏ మనగలం?

**వ. సిద్ధు లిట్లనిరి. 186**

**ప్రతి :** సిద్ధులు+ఇట్లు+అనిరి= సిద్ధులైన యోగులు ఇలా అన్నారు.

**తా :** సిద్ధు లిలా ప్రార్థించారు.

**చ. హరి! భవదుఃఖభీషణదవానలదగ్ధతృషార్తమన్మనో**
**ద్విరదము శోభనంబును బవిత్రము నైన భవత్కథాసుధా**
**సరిదవగాహనంబునను సంసృతితాపము వాసి క్రమ్మఱం**
**దిరుగదు బ్రహ్మముంగనిన ధీరుని భంగిఁ బయోరుహోదరా! 187**

**ప్రతి :** హరి= ఓ విష్ణూ!; భవదుఃఖ= సంసారతాపం అనే; భీషణ= భయంకరమైన; దవ+అనల= అడవి అంటుకున్న మంటచే; దగ్ధ= దహించబడి; తృషా= దప్పితో; ఆర్త= తల్లడిల్లి పోయినట్టి; మద్= మా యొక్క; మనః= ఎడద అనే; ద్విరదము= గజం; భవత్+కథా= నీ కథాచరితమనబడే; సుధాసరిత్= అమృతపుసోనల్లో; అవగాహనంబునను= మునగడంవల్ల; శోభనంబును= శుభమూ; పవిత్రమున్+ఐన= పరిశుద్ధమున్నూ అయినట్టి; సంసృతి= సంసారం వలని; తాపము= బాధ; పాసి= వీడి; పయోరుహ+ఉదరా= పద్మగర్భా!; బ్రహ్మమున్= పరమాత్మను; కనిన= వీక్షించిన; ధీరుని= నిర్వికారచిత్తుని; భంగిన్= పోలె; క్రమ్మఱన్= మళ్లీ; తిరుగదు= మరలిరాదు.

**తా :** ఓ విష్ణూ! మా మనస్సనే మదపుటేనుగు సంసారపీడ అనే దారుణమైన కార్చిచ్చుతో కాలి పోయింది. దప్పికతో అల్లల్లాడింది. మంగళకరమూ పరిశుద్ధమూ అయిన నీ గాథలనే అమృతప్రవాహాల్లో మునిగింది. భవతాపాన్ని తోసేసుకుంది. పద్మగర్భా! పరమాత్మ సాక్షాత్కారం పొందిన నిర్వికారచిత్తుడివలె ఆ మనస్సు తిరిగి వెనక్కి మళ్లిపోదు.

**విశే :** అడవిలో పుట్టే మంటను దావాగ్ని అంటారు. సముద్రంలో పుట్టే మంటను బడబాగ్ని అంటారు.

**వ. యజమాని యగు ప్రసూతి యిట్లనియె. 188**

**ప్రతి :** యజమాని+అగు= యజమానుడి పత్ని అయిన; ప్రసూతి= ప్రసూతి; ఇట్లు+అనియె= ఇలా మాట్లాడింది.

**తా :** యాగ యజమాని ప్రసూతి ఇలా అంది.

**విశే :** యజమానుడు - యజమాని (యజమానుని భార్య).

**చ. కరచరణాదికాంగములు గల్గియు మస్తము లేని మొండెముం**
**బరువడి నొప్ప కున్న గతిఁ బంకజలోచన! నీవు లేని య**
**ధ్వరము ప్రయాజలం గలిగి తద్దయు నొప్పక యున్న దీ యెడన్**
**హరి! యిటు నీదు రాక శుభ మయ్యెఁ రమాధిప! మమ్ముఁగావవే! 189**

**ప్రతి :** కర= హస్తాలు; చరణ= పాదాలు; ఆదిక= మొదలుగాగల; అంగములు= అన్ని శరీరఅవయవాలు; కల్గియున్= తీరుగా ఉండి; మస్తములేని= తలలేని; మొండెమున్= కబంధము, (తలతెగినా తుళ్లిపడే దేహం); పరువడిన్= క్రమంగా; ఒప్పక= శోభిల్లక; ఉన్నగతిన్= ఉన్న విధంగా; పంకజలోచన!= పద్మనేత్ర!; నీవు లేని= నువ్వు నిలబడని; అధ్వరము= మఖం; ప్రయాజలన్+కలిగి= ప్రకృష్టమైన పూజాద్రవ్యపరికరాలు కల్గి; తద్దయున్= మిక్కిలి; ఒప్పక+ఉన్నది= శోభిల్లకుంది; హరి!= ఓ విష్ణు; ఇటు= ఈ వాటిక వైపు; ఈ+ఎడన్= ఇలాంటి సందర్భంలో; నీ+రాక= నీదురాక, నీ ఆగమనం; శుభము= భద్రం; అయ్యెన్= అయింది; రమా+అధిప= లక్ష్మీనాథా!; మమ్మున్= మా భక్తులనందరినీ; కావవే= ఆదుకోవా.

**తా :** చేతులూ, కాళ్లూ వంటి అంగాలు అన్నీ ఉన్నా, తలకాయ లేని మొండెం బాగా శోభించని విధంగా పద్మాక్షా! పూజాద్రవ్యాది యాగాంగాలు ఎన్నో ఉన్నా, శీర్షప్రాయుడవైన నువ్వు లేని యజ్ఞం అందగించదు. ఈ అవసరంలో నువ్విటుగా విచ్చేయడం చాలామేలు అయింది. లక్ష్మీప్రియునిగా భక్తురాంద్రమైన మా అందరినీ ఆదుకో.

**విశే :** యాగోపకారకాలైన దర్శపూర్ణమాసాదులకు ఒక అంగం ప్రయాజం. ఇది అయిదువిధాలు. ప్రయాజాద్యంగాని సమిధో యజతి, ఇడాం యజతి, వహ్నిర్యజతి, తనూనపాతం యజతి, స్వాహాకారం యజతీతి పంచవిధాని (దీపిక).

**వ. లోకపాలకు లిట్లనిరి. 190**

**ప్రతి :** లోకపాలకులు+ఇట్లు+అనిరి= లోకపాలకులు ఇలా అన్నారు.

**తా :** దిక్పాలకులు ఇలా సన్నుతించారు.

**సీ. దేవాదిదేవ! యీ దృశ్యరూపంబగు సుమహితవిశ్వంబుఁ జూచు ప్రత్య**
**గాత్మభూతుండ వైనట్టి నీవు నసత్ప్రకాశరూపంబులై గలుగు మామ**
**కేంద్రియంబులచేత నీశ్వర! నీ మాయ వొందించి పంచభూతోపలక్షి**
**తంబగు దేహివిధంబునఁ గానంగఁ బడుదువు గాని యేర్పడిన శుద్ధ**

**తే. సత్త్వగుణయుక్తమైన భాస్వత్స్వరూప, ధరుఁడవై కానఁబడవుగా? పరమపురుష!**
**యవ్యయానంద! గోవింద! యట్లు గాక, యెనయ మా జీవనము లింక నేమి కలవు? 191**

**ప్రతి :** దేవాదిదేవా!= దేవతలకే తొలిదేవుడా!; ఈ దృశ్యరూపంబు+అగు= ఇలా ఎదుట కనదగ్గవస్తుస్థితి కలట్టి; సుమహిత= పెద్ద గొప్పది అయినట్టి; విశ్వంబున్= ప్రపంచాన్ని; చూచు= కనుగొనే; ప్రత్యక్+ఆత్మభూతుండవు+ఐనట్టి= జీవులకు

ఆత్మరూపుడవైనట్టి; నీవున్= నువ్వు; అసత్= మిథ్యాత్వాన్ని; ప్రకాశ= బయటకు పొక్కింపచేసే; రూపంబులు+ఐ= నామరూపాలై; కలుగు= ఉన్నట్టి; మామక= మావైన; ఇంద్రియంబుల చేతన్= కన్ను మొదలగు వానిచేత; ఈశ్వర!= ప్రభూ!; నీ మాయన్= నీ మాయను; ఒందించి= కలిగించి; పంచభూత= పంచభూతాలచే; ఉపలక్షితంబు+అగు= కూడి ఉన్నట్టి; దేహి= శరీరి; విధంబునన్= రీతిని; కానంగన్+పడుదువు= గోచరిస్తుంటావు; కాని; ఏర్పడిన= విలక్షణం అయిన; శుద్ధ= పవిత్రమైన; సత్త్వగుణ= సత్త్వగుణంతో; యుక్తము+ఐన= కూడినదైన; భాస్వత్= ప్రకాశమానమైన; స్వరూపధరుండవు+ఐ= నీ అసలుమూర్తిని తాల్చినవాడవై; కానన్+పడవుగా= ప్రత్యక్షం కావు కదా!; పరమపురుష= పురుషోత్తమా!; అవ్యయ+ఆనంద!= నిత్యసంతోషరూపుడ!; గోవింద= గోవులకు సంతోషాన్ని కలిగించేవాడా!; అట్లు కాక= అలా కానిపక్షంలో; మా= మా బోటి సామాన్యుల; జీవనములు= బతుకులు; ఎనయన్= సరిపోల్చను; ఇంకన్= ఇంకా; ఏమి కలవు= ఏమి ఉంటాయి.

**తా :** దేవరలకు తొలిదేవరా! కంటితో కానగల సహజస్థితి కలిగి, ఎంతో సువిశాలమైన ఈ సమస్తవిశ్వానికి సాక్షిభూతమైన ప్రాణిస్వరూపుడవు నువ్వు. నీ బహిర్ముఖాలైన నామరూపాలతో మా నేత్రాది ఇంద్రియాలచేత ఓ దేవ! కపటాన్ని పులుముతుంటావు. పంచభూతాత్మకమైన జీవి వలెనె మాకంటికి అగపడుతుంటావు. కాకపోతే తద్భిన్నమైన నీశుద్ధ సత్త్వమూర్తిమత్వంతో మాత్రం మాకు గోచరించవు. ఓ పరబ్రహ్మమా! శాశ్వతసంతోషసంధాయీ!, గోరక్షకా! అలాకాక గోచరించేట్టు కటాక్షించినట్లయిన మా బోటివాళ్ల బతుకులు ఉపమించుటకేమి మిగిలిఉంటాయి. ఎల్లప్పటికీ మాకు అగోచరుడవనే బుద్ధితోనే జీవిస్తుంటాం సుమా!

**వ. యోగీశ్వరు లిట్లనిరి. 192**

**ప్రతి :** యోగి+ఈశ్వరులు= యోగిశ్రేష్ఠులు; ఇట్లు+అనిరి= ఇలా చెప్పారు.

**తా :** యోగిపుంగవులు ఇలా పలికారు.

**సీ. విశ్వాత్మ! నీయందు వేఱుగా జీవులఁ గనఁ డెవ్వఁ; డటు వానికంటెఁ బ్రియుఁడు**
**నీకు లేఁ; డయినను నిఖిలవిశ్వోద్భవస్థితివిలయంబుల కతన దైవ**
**సంగతి నిర్భిన్నసత్త్వాదిగుణవిశిష్టాత్మీయమాయచే నజభవాది**
**వివిధభేదము లొందుదువు స్వస్వరూపంబు నందుండుదువు; వినిహతవిమోహి**

**తే. వగుచు నుందువు గద! నిన్ననన్యభక్తి, భృత్యభావంబు దాల్చి సంప్రీతిఁ గొల్చు**
**మమ్ము రక్షింపవే? కృపామయ! రమేశ! పుండరీకాక్ష! సంతతభువనరక్ష! 193**

**ప్రతి :** విశ్వ+ఆత్మ= విశ్వమే ఆత్మ అయిన ఓ విష్ణుమూర్తి!; నీ యందు= నీ విశ్వరూపంలోగల; జీవులన్= ప్రాణులను; వేఱుగాన్= ఇతరంగా; ఎవ్వఁడు= ఏ జీవి; కనఁడు= చూడడో; అటువానికంటెన్= అలాంటివాడికన్నా; ప్రియుఁడు= ఇష్టుడు; నీకున్ లేఁడు= నీకు ఉండబోడు; అయినను= అయినా; నిఖిల= సమస్తమైన; విశ్వ= జగత్తుయొక్క; ఉద్భవ= ఉత్పత్తి; స్థితి= ఉనికి; విలయంబుల= ప్రళయాలయొక్క; కతనన్= నిమిత్తంచే; దైవ సంగతిన్= దైవ గుణంచేత; నిర్భిన్న= వేర్పాటును పొందిన; సత్త్వ+ఆది= సత్త్వరజస్తమస్సులనే; గుణ= మూడుగుణాలతో; విశిష్ట= కూడుకున్న; ఆత్మీయ= తనదైన (నీదైన); మాయచేన్= మాయవల్ల; అజ= బ్రహ్మ; భవ= శివుడు; ఆది= మొదలైన; వివిధ= రకరకాలుగా;

భేదములు= వేరురూపాలు; ఒందుదువు= పొందుతావు; స్వ+స్వరూపంబున్+అందున్= నీ నిజరూపంలోనూ; ఉందుదువు= ఉంటావు; వినిహత= మొత్తంగా రూపుమాపబడిన; విమోహివి= విశేషమోహం కలవాడవు; అగుచున్= అవుతూ; ఉందుదువు+కద= ఉంటావు కదా; కృపామయ= దయాస్వరూపా!; రమా+ఈశ= లక్ష్మీప్రియుడా!; పుండరీక+అక్ష= తెల్లదామరవంటి కన్నులుకలవాడా!; సంతత= అనిశం; భువన= లోకాలను; రక్షక!= కాపాడేవాడా!; నిన్ను= నిన్ను; అనన్య= అనితరం అయిన; భక్తిన్= స్నేహభావంతో; భృత్యభావంబు= దాసత్వం; తాల్చి= వహించి; సంప్రీతిన్= విశ్వాసంతో; కొల్చు= ఉపాసించే; మమ్మున్= మమ్మల్ని; రక్షింపవే= కాపాడవా!

**తా :** ఓ పరబ్రహ్మరూపా! దయామయుడా! లక్ష్మీపతీ! పుండరీకాక్షా! ఎల్లప్పుడు సమస్తలోకాలనూ రక్షించేవాడా సమస్త విశ్వంయొక్క సృష్టి స్థితి లయలను చేస్తున్న కారణంగా దైవీశక్తితో సత్త్వరజస్తమో గుణాలతో కూడిన నీ మాయచే బ్రహ్మ శివుడు మొదలగు అనేక భేదాలను పొందుతావు. అయినా, నీవు ఎప్పుడూ స్వస్వరూపంలోనే ఉంటావు. నీవు సర్వమోహాలను విడిచిన వాడవు కదా! అట్టి నిన్ను అనన్యభక్తితో దాసభావంతో ప్రేమతో ఆరాధించే మమ్మల్ని రక్షించు.

**వ. శబ్ద బ్రహ్మ యిట్లనియె. 194**

**ప్రతి :** శబ్ద బ్రహ్మ, ఇట్లు+అనియె= ఇలా శబ్ద బ్రహ్మ పలికాడు.

**తా :** శబ్ద బ్రహ్మ ఇలా అన్నాడు.

**విశే :** శబ్దబ్రహ్మ అంటే వేదపురుషుడు.

**చ. హరి భవదీయతత్త్వము సమంచితభక్తి నెఱుంగ నేను నా**
**సరసిజసంభవాదులును జాలము, సత్త్వగుణాశ్రయుండవున్**
**బరుఁడవు నిర్గుణుండవును బ్రహ్మమునై తగు నీకు నెప్డు నిం**
**దఱముఁ జతుర్విధార్థఫలదాయక! మ్రొక్కెద మాదరింపవే! 195**

**ప్రతి :** హరి= ఓ విష్ణుమూర్తి!; భవదీయ= త్వదీయమైన; తత్త్వమున్= యాథార్థ్యాన్ని; సమంచిత= చక్కగా పూజించదగిన; భక్తిన్= శ్రద్ధతో; ఎఱుంగన్= తెలియుటకు; నేనున్= నేనుగాని; ఆ+సరసిజ+సంభవ+ఆదులును= ఆ బ్రహ్మ మొదలైనవాళ్లు గాని; చాలము= శక్తులము కాము; సత్త్వగుణ= సాధు స్వభావానికి; ఆశ్రయుండవున్= అవలంబనుడవూ; పరుఁడవున్= సర్వోత్కృష్టుడవూ; నిర్గుణుండవును= గుణాలు లేనివాడవున్నూ; బ్రహ్మమున్+ఐ= విశ్వాత్ముడవూఅయి; తగు= వర్తించే; నీకున్= నీకు; ఎప్డున్= నిరంతరమున్నూ; ఇందఱమున్= ఇంతమందిమీ; చతుర్+విధ= నాల్గురీతులైన; అర్థ= పురుషార్థాలయొక్క; ఫల= ప్రయోజనాలను; దాయక!= ఇచ్చువాడా!; మ్రొక్కెదము= నమస్కరిస్తుంటాం; ఆదరింపుము+ఏ= మన్నించవా!

**తా :** ఓ వెన్నుడ! నీ నిజసంగతిని శ్రద్ధగా సవ్యంగా ఆకళించుకోవడానికి నేనే కాదు బ్రహ్మాదులు కూడా శక్తిచాలని వారలే. నువ్వు సత్త్వగుణానికి ప్రాపు అయిన వాడవూ తద్విలక్షణుడవూ నిర్గుణుడవున్నూ అయిన పరబ్రహ్మ తత్త్వానివి. ధర్మార్థ కామ మోక్షాలను కటాక్షించేవాడా! నీకు ప్రతినిత్యమూ ఇందరము జోతలుపెడ్తూ ఉన్నాం. మమ్మల్ని కరుణించు.

**విశే :** చతుర్విధార్థములు – ఇవి పురుషార్థాలు. 1. ధర్మం 2.అర్థం 3. కామం 4. మోక్షం.

**వ. అగ్నిదేవుం డిట్లనియె. 196**

**ప్రతి :** అగ్నిదేవుండు= అగ్నిహోత్రుడు; ఇట్లు+అనియెన్= ఇలా వచించాడు.

**తా :** అగ్నిదేవుడు ఇలా అన్నాడు.

**మ. హవరక్షాచరణుండవై నెగడు దీ; వయ్యగ్నిహోత్రాది పం**
**చవిధంబున్ మఱి మంత్రపంచకసుసృష్టంబై తగం బొల్చు నా**
**హవరూపంబగు నీకు మ్రొక్కెదను; నీ యాజ్ఞన్ భువిన్ హవ్యమున్**
**సవనవ్రాతములన్ వహింతు హరి యుష్మత్తేజముం బూనుచున్. 197**

**ప్రతి :** హరి= ఓ విష్ణుడా!; ఈవు= నువ్వు; హవ= యజ్ఞంయొక్క; రక్షా= కాపుగడను; ఆచరణుండవు+ఐ= చేయువాడవై; నెగడుదు= ప్రవర్తించెదవు; ఆ= యాగప్రసిద్ధమైన; అగ్నిహోత్ర+ఆది= అగ్నిహోత్రం మొదలైన; పంచవిధంబున్= అయిదు పద్ధతులనూ; మఱి= ఇంకనూ; మంత్రపంచక= అర్చనామంత్రాలు ఐదింటినీ; సుసృష్టంబు+ఐ= మేలుగా సృజించబడింద్రై; తగన్= యుక్తంగా; పొల్చు= శోభించెడి; ఆహవరూపంబు+అగు= యజ్ఞస్వరూపం అయినట్టి; నీకున్= నీకు; మ్రొక్కెదన్= కైమోడుస్తాను; యుష్మత్= నీ వలని; తేజమున్= దీప్తిని; పూనుచున్= వహిస్తూ; నీ ఆజ్ఞన్= నీ పనుపుతో; భువిన్= అవనిలో; హవ్యముల్= హవిస్సులు (నేయి, అన్నం) సవన వ్రాతములన్= అధ్వర స్తోత్రసముదాయాలను; వహింతున్= ధరిస్తాను.

**తా :** నీవు యజ్ఞరక్షణ చేసేవాడవై ప్రవర్తిస్తావు. ఆ యజ్ఞంలోని అయిదు విధములైన అగ్నిహోత్రములను అయిదు మంత్రములను కల రూపంలో తగినట్లు ప్రకాశించే ఆ యజ్ఞరూపుడవైన నీకు మ్రొక్కెదను. నేను నీ తేజమును ధరించి నీ ఆజ్ఞచేత భూమిపై యజ్ఞసమూహాలలో హవ్యములను ధరిస్తాను.

**విశే :** పంచాగ్నులు : 1. గార్హపత్యం, 2. ఆహవనీయం, 3. దక్షిణాగ్ని, 4. సభ్యం, 5. ఆవసథ్యం

**వ. దేవత లిట్లనిరి. 198**

**ప్రతి :** దేవతలు= సురలు; ఇట్లు+అనిరి= ఇలా అన్నారు.

**తా :** దేవతలు ఇలా అన్నారు.

**మ. మును కల్పాంతమునందుఁ గుక్షి నఖిలంబున్ దాఁచి యేకాకివై**
**జనలోకోపరి లోకవాసులును యుష్మత్తత్త్వమార్గంబు చిం**
**తనముం జేయఁ బయోధియందు నహిరాట్తల్పంబునం బవ్వళిం**
**చిన నీ రూపము నేఁడు సూపితివి లక్ష్మీనాథ! దేవోత్తమా! 199**

**ప్రతి :** మును= ముందటి; కల్ప= కల్పం; అంతము+అందున్= ముగిసేనాటి కాలంలో; కుక్షిన్= ఉదరాన; అఖిలంబున్= (ఖిలం కాని) విశ్వం అంతటిని; దాఁచి= దాచుకొని; ఏకాకివి+ఐ= ఒంటరివై; జనలోక= జనలోకానికి; ఉపరి= తర్వాతి; లోకవాసులును= లోకంలో కాపురం ఉండే వారూ; యుష్మత్= నీ యొక్క; తత్త్వమార్గంబు= సత్యరూపస్థితిని; చింతనమున్+చేయన్= చింతనం చేయగా; పయోధి అందున్= పాలసముద్రంలో; అహిరాట్= సర్పరాజు అయిన

ఆదిశేషుడియొక్క; తల్పంబునన్= పక్కమీద; పవ్వళించిన= పరున్నప్పటి; నీ రూపమున్= నీ ఆదిదేవమూర్తిని; లక్ష్మీనాథ= శ్రీపతీ!; దైవ+ఉత్తమా= ఓ దేవశిఖామణీ!; నేడు= ఈ పొద్దు; చూపితివి= కన్పింప చేశావు.

**తా :** గతంలో కల్పాంతంలో మిగిలిన సర్వజగత్తునూ నీ కడుపులో పదిలపరిచావు. నువ్వు ఒక్కడివిగా ఉన్నపుడు పాలసముద్రంలో శేషశయ్యమీద పవళించావు. జనలోకానికి పైలోకంలో ఉంటున్న సిద్ధజనులు నీ సృష్ట్యవయవ భూతపదార్థ శైలిని పదే పదే ధ్యానించారు. శ్రీకాంత! దైవశ్రేష్ఠమా! అప్పటి నీ ఆదిదేవస్వరూపాన్ని ఈ దినం మాకు సాక్షాత్కరింప చేశావు.

**విశే :** పయస్+ధి= పయోధి= నీటికి నెలవైనది (సముద్రం). జనలోకానికి పైన ఉన్నవి తపోలోకము, సత్యలోకము.

**వ. గంధర్వు లిట్లనిరి. 200**

**ప్రతి :** గంధర్వులు= గానం చేసే దేవజాతులు; ఇట్లు= ఇలా; అనిరి= వర్ణించారు.

**తా :** గంధర్వులు ఇలా వినుతించారు.

**మ. హరపంకేజభవామరాదులు మరీచ్యాదిప్రజానాథు లో**
**యరవిందాక్ష! రమాహృదీశ! భవదీయాంశాంశసంభూతులై**
**పరఁగం దావకలీలయై నెగడు నీ బ్రహ్మాండమున్, దేవ! యీ**
**శ్వర! నీ కే మతిభక్తి మ్రొక్కెదము దేవాధీశ! రక్షింపుమా! 201**

**ప్రతి :** దేవ= దేవా; ఈశ్వర= సామీ; దేవ+అధీశ= దేవాధి దేవా!; ఓ అరవింద+అక్ష= ఓ పద్మంవంటి నేత్రాలు కలవాడా!; రమాహృది+ఈశ= లక్ష్మియొక్క మనోవల్లభా!; హర= శివుడు; పంకేజభవ= బ్రహ్మ; అమర= దేవతలు; ఆదులు= మొదలయినవారు; మరీచి+ఆది= మరీచి మొదలు; ప్రజానాథులు= ప్రజాపతులు; భవదీయ= నీ యొక్క; అంశ= కళలోని; అంశ= భాగంనుంచి; సంభూతులు+ఐ= పుట్టుక కలవారై; పరగన్= పెంపొందగా; తావక లీలయై= నీ విలాసమై; నెగడు= వర్ధిల్లే; ఈ బ్రహ్మాండమున్= ఈ సమస్త విశ్వాన్ని; రక్షింపుము; ఏము= మేము; నీకు; అతిభక్తిన్= మిక్కిలి భక్తితో; మ్రొక్కెదము= మొక్కుతాము.

**తా :** పద్మలోచనా! లక్ష్మీమనోవల్లభా! దేవా! ఈశ్వరా! దేవాధీశా! శివుడు, బ్రహ్మ, దేవతలు మొదలైనవారు మరీచి మొదలయిన ప్రజాపతులు, నీ అంశలోని భాగాలై జన్మించినవారే. నీ విలాసమైన ఈ బ్రహ్మాండాన్ని రక్షించు. నీకు ఎంతో భక్తితో కైమోడ్పులు చేస్తున్నాము. మమ్మల్ని ఏలుకో.

**వ. విద్యాధరు లిట్లనిరి. 202**

**ప్రతి :** విద్యాధరులు; ఇట్లు= ఇలా; అనిరి= అన్నారు.

**తా :** విద్యాధరులు ఇలా అన్నారు.

**సీ. నలినాక్ష! విను భవన్మాయావశంబున దేహంబు దాల్చి తద్దేహమందు**
**నాత్మ "నహ మ్మ" మేత్యభిమానమును బొంది పుత్రజాయాగృహక్షేత్రబంధు**

**ధనపశుముఖ వస్తుతతుల సంయోగవియోగ దుఃఖంబుల నొందుచుండు**
**ధృతివిహీనుఁడు నసద్విషయాతిలాలసుఁ డతిదుష్టమతియు నైనట్టివాఁడు**

**తే. దవిలి భవదీయగుణసత్కథావిలోలుఁ, డయ్యె నేనియు నాత్తమోహంబువలనఁ**
**బాసి వర్తించు విజ్ఞానపరతఁదగిలి, చిరదయాకార! యిందిరాచిత్తచోర! 203**

**ప్రతి :** నలిన+అక్ష= నలినాక్ష!; పద్మాలవంటి కన్నులున్నవాడా!; విను= ఆలకించు; భవద్= నీదైన; మాయా వశంబున= మాయవల్ల; దేహంబున్= తనువును; తాల్చి= పొంది; తద్= ఆ; దేహము+అందున్= కళేబరంపైన; ఆత్మన్= తనలో; అహమ్= నేను; మమ= నాది; ఇతి= ఇలా; అభిమానమును= మమతను; పొంది= తగుల్కొని; పుత్ర= బిడ్డలు; జాయా= భార్య; గృహ= ఇల్లు; క్షేత్ర= పొలం; బంధు= చుట్టాలు; ధన= డబ్బు; పశు= పశుసంపద; ముఖ= ప్రధానమైన; వస్తుతతుల= వస్తువుల సమూహం యొక్క; సంయోగ= కలయికవలని; వియోగ= ఎడబాటువలని; దుఃఖంబులన్= బెడదలను; ఒందుచున్+ఉండున్= పొందుతూ ఉండునట్టి; ధృతి= నిలుకడ; విహీనుఁడున్= లేనివాడూ; అసద్= నిజం కాని; విషయ= ఇంద్రియార్థాలపట్ల; అతిలాలసుఁడు= మిక్కిలి ఆశకలవాడు; అతి దుష్టమతియున్= ఎక్కువ అయిన దుర్బుద్ధికలవాడున్నూ; ఐన+అట్టివాఁడు= అయినట్టి జనుడు; చిర= చాలకాలంగా; దయా= అనుగ్రహం; ఆకార= రూపుగా కలవాడా!; ఇందిరా= లక్ష్మియొక్క; చిత్త= హృదయాన్ని; చోర= దొంగిలినవాడా!; తవిలి= కల్గించుకొని; భవదీయ= నీ సంబంధమైన; గుణ= స్వభావంయొక్క; సద్= మంచి; కథా= చరిత్రల పట్ల; విలోలుఁడు= ఆసక్తిగలవాడు; అయ్యెన్+ఏనియున్= అయినట్లయితే; ఆత్త= పొందబడిన; మోహంబువలనన్+పాసి= మోహమునుండి విడివడి; విజ్ఞాన= విశేషజ్ఞానమందు; పరత= ఆసక్తి; కలిగి= జనించి; వర్తించున్= సంచరిస్తాడు.

**తా :** ఓ పుండరీకాక్ష! జీవుడు నీదైన అవిద్యా ప్రకృతికి లోబడి శరీరం పొందుతాడు. ఆ శరీరంపై నేను, నాది అనే తగులమును ఏర్పరచుకుంటాడు. పెళ్లాం, పిల్లలూ, ఇల్లూ, పొలం, చుట్టం పక్కం, డబ్బూ, గొడ్డూ వంటి విషయ వాంఛల పరంపరలో కలవడం, వీడడం వంటి పీడలు పొందుతుంటాడు. ధైర్యం లేని వాడవుతాడు. అశాశ్వతమైన ఇంద్రియార్థాలపట్ల వల్లమాలిన అపేక్ష కలవాడవుతాడు. దుష్టబుద్ధి కలవాడవుతాడు. అలాంటి మనిషికూడ, దయ గూడుకట్టుకున్నవాడా! లక్ష్మీ మనోహరా! కోరి మరీ నీ నైజాన్ని తెలిపే గాథలకు పరవశుడయితే ఇంతకాలం నుంచి కల్గిన ఒంటిమీది వలపును వదల్చుకో గల్గుతాడు. ఆ ఇచ్చ విశేషజ్ఞానం మీదికి మళ్లి సాధువర్తనుడవుతాడు.

**వ. బ్రాహ్మణజనంబు లిట్లనిరి. దేవా! యీ క్రతువును, హవ్యంబును, నగ్నియు, మంత్రంబులును, సమిద్దర్భపాత్రంబులును, సదస్యులును, ఋత్విక్కులును, దంపతులును, దేవతలును, నగ్నిహోత్రంబులును, స్వధయు, సోమంబును, నాజ్యంబును, బశువును నీవ; నీవు దొల్లి వేదమయ సూకరాకారంబు ధరియించి దంష్ట్రాదండంబున వారణేంద్రంబు నలినంబు ధరియించు చందంబున రసాతలగతయైన భూమి నెత్తితి; వట్టి యోగిజన స్తుత్యుండవును, యజ్ఞక్రతురూపకుండవును నైన నీవు పరిభ్రష్టకర్ములమై యాకాంక్షించు మాకుం బ్రసన్నుండ వగుము; భవదీయనామకీర్తనంబుల సకలయజ్ఞవిఘ్నంబులు నాశంబు నొందు; నట్టి నీకు నమస్కరింతుము. 204**

**ప్రతి :** బ్రాహ్మణజనంబులు= బ్రాహ్మణప్రజలు; ఇట్లు= ఇలా; అనిరి= సన్నుతించారు, దేవా!= దైవమా; ఈ క్రతువునున్= ఈ యజ్ఞము; హవ్యంబునున్= హవిస్సు; అగ్నియున్= అగ్నీ; మంత్రంబులునున్= మంత్రాలూ; సమిత్= సమిధలు; దర్భ= కుశలు; పాత్రంబులునున్= యాగ పాత్రలు; సదస్యులును= యజ్ఞవిధి పరీక్షాధికారులు; ఋత్విక్కులును= యాగపురోహితులు; దంపతులునున్= యజమానుడూ, యజమానీ; దేవతలునున్= వేల్పులు; అగ్నిహోత్రంబులునున్= హవ్యవహులు ఐదున్నూ; స్వధయున్= పితృదేవతలకు అర్పించే ఆహారసమర్పణము; సోమంబునున్= సోమరసము; ఆజ్యంబును= నేయీ; పశువును= (యాగ) జంతువు; నీవ= నువ్వే; నీవు= నువ్వు; తొల్లి= ఆదిలో; వేదమయ= వేదశరీరరూపమైన, సూకర+ఆకారంబున్= పందిరూపాన్ని; ధరియించి= తాల్చి; దంష్ట్రా దండంబునన్= దండము వంటికోరతో; వారణ+ఇంద్రంబు= శ్రేష్ఠమైన ఏనుగు; నలినంబున్= పద్మాన్ని; ధరియించు చందంబునన్= పట్టిన పగిదిని; రసాతల= పాతాళ లోకానికి; గత+ఐన= పోయింది అయిన; భూమిని= నేలను; ఎత్తితివి= పైకి లేపావు; అట్టి= అలాంటి; యోగిజన= యోగిజనులచేత; స్తుత్యుండవును= కీర్తనీయుడవూ; యజ్ఞక్రతురూపకుండవునున్= యాగక్రతుస్వరూపుడవున్నూ; ఐన= అయినట్టి; నీవు= నువ్వు; పరిభ్రష్ట= పూర్తిగా చేజారిపోయిన; కర్మలము+ఐ= వేదకర్మాచరణులం అయి; ఆకాంక్షించు= ఆ యాగకర్మోద్ధరణను అభిలషించే; మాకున్= మాకు; ప్రసన్నుండవు= కటాక్షించినవాడవు; అగుము= కమ్ము; భవదీయ= నీకు చెందిన; నామకీర్తనంబులన్= నామంయొక్క స్తుతులతో; సకల= సమస్తమైన; యజ్ఞ= యాగంయొక్క; విఘ్నంబులు= అంతరాయాలూ; నాశంబున్+ఒందున్= సమసిపోతాయి; అట్టి= అటువంటి ప్రభావం కల; నీకున్= నీకు; నమస్కరింతుము= జోతలు పెట్టుకుంటాం.

**తా :** బ్రాహ్మణప్రజలు ఇట్లా అన్నారు. దేవా ఈ యజ్ఞం, దేవతల కీయదగ్గ అన్నం, అగ్ని, సంహితలూ, సమిధలు, కుశలూ, యాగపాత్రలూ, యజ్ఞవిధి పరీక్షాధికారులు, యాగకర్మలు చేసే బ్రాహ్మణులు, యాగయజమాని, యజమానిభార్య, దేవతలూ, అగ్నిహోత్రాలూ, స్వధాదేవీ, సోమరసం, నేయి, బలిపశువూ ఈ అన్నింటి రూపమూ నువ్వే. పూర్వకాలాన (స్వాయంభువ మన్వంతరం తొలినాళ్లలో) యజ్ఞవరాహస్వామి స్వరూపాన్ని వహించావు. కత్రలవంటి కోరలచే రసాతలానికిపోయిన భూమిని 'పెద్ద ఏనుగు పద్మాన్ని ఎత్తి పట్టినట్టు ఎత్తిపట్టావు. అలాంటి యోగి సముదాయంచే కీర్తించబడేవాడివి, యాగక్రతురూపుడవు అయిన నువ్వు చేజారిపోయిన మా యాగకర్మాచరణలు, సవ్యకర్మాచరణలు సంపూర్తికావాలని వేడుకపడుతున్న మమ్మల్ని కనికరించు. నీ నామసంకీర్తనల చేతనే యాగంలో ఎదురైన అడ్డంకులన్నీ నశించి పోతాయి. అంతటి మహిమాన్వితుడవైన నీకు మా జేజేలు.

**క. అని తన్ను సకలజనములు, వినుతించిన హరి భవుండు విఘ్నము గావిం**
**చిన యా దక్షుని యజ్ఞము, ఘనముగఁ జెల్లించెఁ గొఱఁత గాకుండంగన్. 205**

**ప్రతి :** అని= ఈ లాగున; తన్ను= తనను; సకలజనములు= సమస్తప్రజలు; వినుతించినన్= సంకీర్తించిన; హరి= విష్ణుమూర్తి, భవుండు= శివుడు; విఘ్నము కావించిన= అడ్డుకొన్న; ఆ+దక్షుని= ఆ దక్షుడియొక్క; యజ్ఞమున్= క్రతువును; ఘనముగన్= ఎంతోగొప్పగా; కొఱఁత= వెలితి; కాక+ఉండన్+కన్= లేకుండేట్లుగా; చెల్లించెన్= ప్రవర్తింప చేశాడు.

**తా :** ఈ ప్రకారాన యాగపాలకుడిగా విష్ణుమూర్తిని అన్ని రకాల ప్రజ శ్లాఘించింది. శివుడి అవరోధంవల్ల ఆగిపోయిన దక్షయాగాన్ని ఎంతో పెద్దఎత్తున ఏ లోటూ వాటిల్లని విధంగా శ్రీహరి కొనసాగింప చేశాడు.

**క. సకలాత్ముఁడు దా నగుటను, సకలహవిర్భోక్త యయ్యు జలజాక్షుండుం**
**బ్రకటస్వభాగమున న, య్యకలంకుఁడు దృప్తిఁ బొంది యనె దక్షునితోన్. 206**

**ప్రతి :** సకల= సమస్తవిశ్వానికి, ఆత్ముఁడు= ఆత్మస్వరూపుడు, తాను= తాను, అగుటను= కావడంవల్ల, సకల= అన్నింటి, హవిస్= హవిస్సుల్ని, భోక్త= అనుభవించేవాడు, అయ్యున్= అయినప్పటికిన్ని, జలజ= పద్మాలవంటి, అక్షుండున్= కళ్లుగల విష్ణుడూ, ప్రకట= వెల్లడించిన, స్వభాగమునన్= తనవంతుతోనే, ఆ+అకలంకుఁడు= మచ్చపడని చరితగల ఆ ప్రశస్తుడు, తృప్తిన్+పొంది= తనివిని పొంది, దక్షునితోన్= దక్షుణ్ణి సంబోధిస్తూ, అనెన్= పలికాడు.

**తా :** ఈ జగం అంతటికి ఆత్మరూపుడు తానే కావడంవల్ల ఆ విష్ణుమూర్తి హవ్యపదార్థాలన్నిటిని భుజించేవాడు అయినప్పటికిన్నీ తనకు కేటాయించిన త్రికపాల పురోడాశమంత్రభాగంతోనే తృప్తి పడ్డాడు. దక్షుణ్ణి ఇలా పల్కరించాడు.

**విశే :** యజ్ఞంలో విష్ణువును ఉద్దేశించి సమర్పించే దానిని త్రికపాలపురోడాశం అంటారు.

**వ. అనఘా! యేనును బ్రహ్మయు శివుండును నీజగంబులకుఁ గారణభూతుల; మందు నే నీశ్వరుండను నుపద్రష్టను స్వయంప్రకాశకుండను నై గుణమయం బయిన యాత్మీయమాయం బ్రవేశించి జనన వృద్ధి విలయంబులకు హేతుభూతంబు లగు తత్తత్క్రియోచితంబులైన బ్రహ్మరుద్రాది నామధేయంబుల నొందు చుండుదు; నట్టి యద్వితీయ బ్రహ్మరూపకుండ నైన నాయందు నజభవాదులను భూతగణంబులను మూఢుం డగువాఁడు వేఱుగాఁ జూచు; మనుజుండు శరీరంబునకుఁ గరచరణాదులు వేఱుగాఁ దలంపని చందంబున మద్భక్తుం డగువాఁడు నా యందు భూతజాలంబు భిన్నంబుగాఁ దలంపండు. గావున మా ముష్వర నెవ్వండు వేఱు సేయకుండు వాఁడు కృతార్థుం డని యానతిచ్చిన దక్షుండును. 207**

**ప్రతి :** అనఘా!= ఓ పావనుడవగు దక్షా!; ఏనును= నేనూ; బ్రహ్మయున్= బ్రహ్మా; శివుండునున్= శివుడున్నూ; ఈ జగంబులకున్= ఈ లోకాలకు; కారణభూతులము= మూలకారకులం; అందున్= అందులోనూ; ఏన్= నేను; ఈశ్వరుండను= స్వామిని; ఉపద్రష్టనున్= యాగాది కర్మల మంచి చెడ్డలు కనిపెట్టి చూసేవాడనూ; స్వయంప్రకాశకుండనున్+ఐ= నా అంతట నేనుగా తేజరిల్లేవాడను; అయి+గుణమయంబు+అయిన= త్రిగుణాత్మకమయిన; ఆత్మీయ= నాయొక్క; మాయన్= ప్రకృతిలో; ప్రవేశించి= చొచ్చి; జనన= పుట్టుక; వృద్ధి= పోషణ; విలయంబులకున్= వినాశనాదులకు; హేతుభూతంబులు+ అగు= కారణమయమైనట్టి; తద్+తద్= ఆ యా; క్రియా= యాగాదికృత్యాలకు; ఉచితంబులు+ఐన= యోగ్యాలైనవి అయిన; బ్రహ్మ; రుద్ర; ఆది= మొదలైన; నామధేయంబులన్= పేర్లను; ఒందుచున్+ఉండుదున్= పొందుతూఉంటాను; అట్టి= అలాంటి; అద్వితీయ= రెండవది (సమాన, అసమాన భేదం)లేని; బ్రహ్మరూపకుండన్+ఐన= విశ్వాత్మ స్వరూపుడనైన; నా అందున్= నాలో; అజ= బ్రహ్మ; భవ+ఆదులను= శివుడు మొదలైన వారిని; భూతగణంబులను= ప్రాణిసముదాయాన్ని; మూఢుండు+అగువాడు= మందమతి అయినవాడు; వేఱుగాన్= అన్యంగా; చూచున్= సంభావిస్తాడు; మనుజుండు= మానిసి; శరీరంబునకున్= దేహానికి; కరచరణాదులు= చేతులు, కాళ్లు మొదలైన; వేఱు+కాన్= భిన్నంగా; తలంపని చందంబున= ఊహించని విధంగా; మద్= నాయొక్క; భక్తుండు= భక్తుడు; అగువాఁడు= అయినట్టివాడు; నా+అందున్= నాలోని; భూతజాలంబున్= జీవకోటిని; భిన్నంబుగాన్= ఇతరంగా; తలంపండు= ఎంచడు; కావున= కనక; మా ముష్వరన్= మా ముష్వరిని (విష్ణు శివ బ్రహ్మలు); ఎవ్వండు= ఏ పురుషుడు; వేఱుచేయక ఉండున్= వేరుగా భావింపక ఉంటాడో;

వాడు= అట్టి వ్యక్తి; కృత+అర్థుండు+అని= నెరవేరిన ప్రయోజనం కలవాడని; ఆనతి+ఇచ్చినన్= ఉపదేశించగా; దక్షుండును= దక్షుండూ...

**తా :** ఓ పుణ్యాత్మా! దక్షా! నేనూ, బ్రహ్మ, శివుడూ ముగ్గురం ఈ విశ్వానికి మూలం, అందులో నేను దొరను. నేను కర్మ సాక్షిని. నేను స్వయం ప్రకాశుణ్ణి. నేను సత్త్వరజస్తమోగుణాత్మకమైన మాయలోకి ప్రవేశించి సృష్టి, స్థితి, లయాలకు మూలభూతమైన ఆ యా యాగకృత్యాలకు తగ్గట్టుగా బ్రహ్మ శివాదిపేర్లను పొందుతుంటాను. అలా ఏకరూపమైన బ్రహ్మరూపుడను నేను. నాలోని బ్రహ్మ, శివుడూ ఇతరజీవ సమూహాన్ని అవివేకి నాకంటే ఇతరం అనుకుంటాడు. మానవుడు చేతులూ కాళ్లూవంటి అవయవాలను తన దేహంకంటే వేరైనవని ఊహామాత్రంగా కూడా ఎలా తలవడో ఆ రకంగానే నా భక్తుడు నా లోనిప్రాణి సమూహాన్ని విడిగా యోచించడు. కనుక మా ముగ్గురిని ఏకరూపంగా ఎంచేవాడు ధన్యజీవి అని చెప్పగానే దక్షుడున్నూ

**క. విని విష్ణుదేవతాకం, బనఁగాఁ ద్రికపాలకలిత మగు నా యాగం**
**బునఁ దగ న వ్విష్ణునిపద, వనజంబులు పూజసేసి వారని భక్తిన్. 208**

**ప్రతి :** విని= విష్ణుసందేశం ఆలకించి; విష్ణుదేవతాకంబు= విష్ణువును దేవుడుగా కలది; అనఁగాన్= ప్రసిద్ధమైన; త్రికపాల= మూడుకపాలాల పురోడాశంతో; కలితము= కూడుకున్నది; అగు= అయినా; ఆ యాగంబునన్= ఆ సవనంలో; తగన్= యుక్తంగా; ఆ+విష్ణుని= ఆ వెన్నునియొక్క; పదవనజంబులు= పాదపద్మాలు; పూజ+చేసి= సేవించి; వారని= ఎడతెగని; భక్తిన్= భక్తితో.

**తా :** విష్ణువు పలికిన మాటలు విని, ఆ యాగం 'విష్ణుదేవతకు సంబంధించిన మూడు కపాలాల పురోడాశంతో కూడుకున్నది' అనే తెలివిని పొంది, దానికి తగ్గట్టుగా ఆ విష్ణుమూర్తి చరణారవిందాలకు పూజచేసి ఎడతెగని భక్తితో...

**విశే :** కపాలం అంటే యజ్ఞపాత్ర, పురోడాశం అంటే పిండితో తయారుచేసిన హోమద్రవ్యం.

**వ. మఱియును. 209**

**ప్రతి :** ఇంకా.

**సీ. అంగప్రధానకయాగంబులను జేసి యమరుల రుద్రుని నర్థిఁ బూజ**
**సేసి విశిష్టేష్టశిష్టభాగమున నుదవసానకర్మంబు దవిలి తీర్చి**
**తాను ఋత్విక్కులుఁదగ సోమపులఁగూడి యవభృథస్నానంబు లాచరించి**
**కడఁక నవాప్తసకలఫలకాముఁడై తనరు దక్షునిఁ జూచి ధర్మబుద్ధి**

**తే. గలిగి సుఖవృత్తి జీవింతుకాక యనుచుఁ, బలికి దివిజులు మునులును బ్రాహ్మణులును**
**జనిరి నిజమందిరముల; కా జలజనయన, భవులు వేంచేసి రాత్మీయభవనములకు. 210**

**ప్రతి :** అమరులన్= సురలను; అంగ ప్రధానక= 'అంగ' 'ప్రధానమ'నే; యాగంబులను= యజ్ఞాలను; చేసి= ఆచరించి; విశిష్ట= పవిత్రంగా చేయబడ్డ; ఇష్ట= యాగకర్మలయొక్క; శిష్టభాగమునన్= విశేషభాగంతో; రుద్రునిన్= శివుణ్ణి; అర్థిన్=

కుతూహలంతో; పూజ+చేసి= అర్చించి; ఉదవసాన= యాగం చివరన నీటితో చేయబడే 'ఉదవసానమ'నే; కర్మంబున్= యజ్ఞసమాపక కర్మలో; తవిలి= నిమగ్నమై; తీర్చి= ముగించి; తాను= తాను; ఋత్విక్కులున్= ఋత్విక్కులూ; తగన్= అర్హమైనట్టి; సోమపులన్= సోమంలో పానభాగంకల దేవతలతోనూ; కూడి= కలసి; అవభృథస్నానంబులు= యజ్ఞదీక్షా పరిసమాప్తి స్నానాలు; ఆచరించి= పూర్తి కావించి; కడఁకన్= పూనికతో; అవాప్త= పొందబడ్డ; సకలఫల= అన్ని ప్రయోజనాలను పొందిన; కాముఁడు+ఐ= కోరికలుకలవాడై; తనరు= ప్రకాశించే; దక్షునిన్+చూచి= దక్షుణ్ణి కాంచి; 'ధర్మబుద్ధి= న్యాయచిత్తం; కలిగి= పొంది; సుఖవృత్తిన్= సంతోషవంతమైన నడవడికతో; జీవింతు+కాక= బతికెదవు గాక'; అనుచున్= అంటూ; పలికి= ఆశీర్వదించి; దివిజులున్= దేవతలూ; మునులును= ఋషులూ; బ్రాహ్మణులనున్= విప్రులూ; నిజమందిరములకున్= తమతమ ఇళ్లకు; చనిరి= పోయారు; ఆ జలజనయనుఁడు= ఆ విష్ణుమూర్తీ; ఆ భవుడు= ఆ శివుడూ; ఆత్మీయ భవనములకున్= తమ తమ నివాసములకు; వేంచేసిరి= వెడలి పోయారు.

**తా :** అంగయాగం, ప్రధానయాగం అనే రెండు యాగాలతోనూ దేవతలను పూజించాడు. పవిత్రయాగకర్మయొక్క శిష్ట భాగంతో శివుణ్ణి ఇష్టంగా కొలిచాడు. తదాసక్తంగా 'సమాప్తి ఇష్టి' కర్మ ఉదవసానాన్ని ముగించాడు. తాను, ఋత్విక్కులూ సోమపానం చేసిన వారితోనూ కలసి అవభృథస్నానాలు కానిచ్చాడు. ఇంత పూనికవల్ల సిద్ధించిన సమస్త కార్యాలవల్ల కోరికలు తీరిన దక్షుణ్ణి 'ధర్మమతితో ఆనందంగా జీవనం సాగించు' అని దీవించి దేవతలు, ఋత్విక్కులు, బ్రాహ్మణులు వారి వారి ఇళ్లకు వెళ్లిపోయారు. విష్ణువూ, శివుడూ తమ తమ భవంతులకు తరలిపోయారు.

**వ.  అంత దాక్షాయణి యయిన సతీదేవి పూర్వకళేబరంబు విడిచి హిమవంతునకు మేనకయందు జనియించి విలయకాలంబున బ్రసుప్తం బయిన శక్తి సృష్టికాలంబున నీశ్వరునిఁ బొందు చందంబునఁ బూర్వదయితుండగు రుద్రుని వరియించె నని దక్షాధ్వరధ్వంసకుం డగు రుద్రుని చరిత్రంబు బృహస్పతి శిష్యుడయిన యుద్ధవునకు నెఱింగించె; నతండు నాకుం జెప్పె; నేను నీకుం జెప్పితి నని మైత్రేయుండు వెండియు విదురున కిట్లనియె. 211**

**ప్రతి :** అంతన్= ఆ పిమ్మట; దాక్షాయణి= దక్షుడి తనయ; సతీదేవి= భవానీదేవి; పూర్వ= ముందటి; కళేబరంబు= శరీరం; విడిచి= త్యజించి; హిమవంతునకున్= హిమవంతుడికి; మేనక+అందున్= మేనకాదేవికడుపున; జనియించి= (పార్వతిగా) పుట్టి; విలయకాలంబునన్= కల్పాంతంలో; ప్రసుప్తంబు+అయిన= గాఢనిద్రపోయిన; శక్తి= మాయాశక్తి; సృష్టికాలంబునన్= తిరిగి సృష్టి జరిగే సమయంలో; ఈశ్వరునిన్= మహాబ్రహ్మను; పొందుచందంబునన్= చేరుకునే విధంగా; పూర్వదయితుండు+అగు= గతంలో వల్లభుఁడు అయినట్టి; రుద్రునిన్= శివుణ్ణి; వరియించెన్= పెళ్లాడింది; అని= అని; దక్ష= దక్షుడి; అధ్వర= మఖం యొక్క; ధ్వంసకుండు+అగు= నాశకారి అయిన; రుద్రుని= శివుడియొక్క; చరిత్రంబు= జీవన లీలలగాథ; బృహస్పతి= దేవతలగురువు; శిష్యుండు అయిన= అభ్యాసకుడు అయిన; ఉద్ధవునకున్= ఉద్ధవుడికి; ఎఱింగించెన్= ఎరుక పరచాడు; అతండు= ఆ ఉద్ధవుండు; నాకున్= (మైత్రేయుడనైన) నాకు; చెప్పెన్= బోధించాడు; నేను= నేను; నీకున్= నీకు (విదురునికి); చెప్పితిన్= చెప్పాను; అని= అని పలికి; మైత్రేయుండు= మైత్రేయుడు; వెండియున్= మరల, విదురునకున్= విదురునికి; ఇట్లు= ఇలా; అనియెన్= అన్నాడు.

**తా :** ఆ తర్వాత దక్షుడి కూతురు సతీదేవి తన ముందటి శరీరాన్ని విడిచి హిమవంతుడికి మేనకాదేవి గర్భాన మళ్లీ పుట్టింది. ప్రళయకాలంలో ఆదమరచి నిద్రించిన శక్తి, సృష్టి ఆరంభ సమయంలో భగవంతుణ్ణి చేరుకునే విధంగా ఇదివరలో తనపెనిమిటి అయిన శివుణ్ణి తిరిగి పరిణయమాడింది. దక్షుడి యాగాన్ని ప్రధ్వంసం చేసిన శివుడి జీవనగాథ

నంతా పూర్వం బృహస్పతి తన వద్ద విద్యనేర్చిన ఉద్ధవుడికి చెప్పాడు. ఆ ఉద్ధవుడు నాకు వినిపించాడు. నేను నీకు చెప్పాను. అని మైత్రేయుడు చెప్పి మళ్లీ విదురుడితో ఇలా చెప్పసాగాడు.

**క. ఈ యాఖ్యానముఁజదివిన, ధీయుతులకు వినినయట్టి ధీరుల కైశ్వ**
**ర్యాయుఃకీర్తులు గలుగును, బాయును దురితములు; దొలఁగు భవబంధంబుల్. 212**

**ప్రతి :** ఈ ఆఖ్యానమున్= ఈ చెప్పిన పూర్వచరితను; చదివిన= పఠించిన/పలికిన; ధీయుతులకున్= బుద్ధిమంతులకు; వినిన+అట్టి= ఆలకించినటువంటి; ధీరులకున్= బుద్ధిమంతులకు; ఐశ్వర్య= వైభవం; ఆయుస్= జీవితకాలమూ; కీర్తులు= యశస్సూ; కలుగును= లభిస్తాయి; దురితములు= పాపాలు; పాయును= తొలగుతాయి; భవబంధంబుల్= సంసారతాపత్రయాలు; తొలఁగున్= తెగి పోతాయి.

**తా :** ఈ కథను చదివిన మతిమంతులకూ, చెవిన వేసుకున్న విద్వాంసులకూ సంపదలు, ఆయుస్సు, యశస్సు లభిస్తాయి. పాపాలు తొలగిపోతాయి. సంసారపుకట్టుముళ్లన్నీ విడిపోతాయి.

**వ. అని వెండియు నిట్లనియె. 213**

**ప్రతి :** అని= మైత్రేయుడు ఆఖ్యానఫలం బోధించి; వెండియున్= తిరిగి, ఇట్లు= ఇలా, అనియెన్= చెప్పపూనుకున్నాడు.

**తా :** అని తిరిగి మైత్రేయుడు ఇలా అన్నాడు.

**క. విను సనకాదులు నారదుఁ, డును హంసుఁడు నరుణియు ఋభుఁడు యతియుఁ గమలా**
**సనజులు నైష్ఠికు లనికే, తను లగుటన్ సాగవయ్యెఁదద్వంశంబుల్. 214**

**ప్రతి :** విను= ఆలకించు; సనక+ఆదులు= సనకుడు మొదలైనవారు; నారదుఁడును= నారదమునీ; హంసుఁడున్= హంసుడూ; అరుణియున్= అరుణీ; ఋభుఁడు= ఋభుడు; యతియున్= యతిన్ని అనే; కమలాసనజులు= బ్రహ్మసంతతివారు; నైష్ఠికులు= ఆజన్మబ్రహ్మచారులు; అనికేతనులు= గృహస్థులు కానివారు; అగుటన్= అవడంచేత; తద్+వంశంబుల్= వారివారి తాతముత్తాతల పరంపరలు; సాగవు+అయ్యెన్= ప్రవర్తిల్లనివి అయ్యాయి.

**తా :** విదుర! ఈ మాటవిను. సనకమహర్షి మొదలైన వాళ్లూ, నారదుడు, హంసుడు, అరుణి, ఋభుడు, యతి అనే వాళ్లూ బ్రహ్మ కొడుకులు. కాని వాళ్లంతా గృహస్థాశ్రమం స్వీకరించని ఆజన్మ బ్రహ్మచారులు. కనకనే వాళ్ల వంశ పరంపర కొనసాగలేదు.

**వ. మఱియు నధర్మునకు "మృష" యను భార్యయందు దంభుండును, "మాయ" యను నంగనయుం బుట్టిరి; అధర్మసంతానం బగు వారిరువురును మిథునం బైరి; వారిని సంతానహీనుండగు నిర్మృతి గైకొనియె; వారలకు లోభుండును నికృతియను సతియునుం గలిగి మిథునం బయిరి; ఆ మిథునంబునకుఁ గ్రోధుండు హింస యను నంగనయుం బుట్టి మిథునం బయిరి; ఆ మిథునంబునకుఁ గలియు దురుక్తియను నతివయు జన్మించి దాంపత్యంబు గైకొనిరి; ఆ దంపతులకు భయమృత్యువు లను మిథునంబు గలిగె; దానివలన యాతనయు నిరయంబునుం బుట్టిరి; వీరలు సంసార హేతువగు నధర్మతరుశాఖ లయి నెగడిరి; వీని**

**శ్రేయస్కాముండగు జనుం డీషన్మాత్రంబు ననువర్తింపం జనదు; ఇవ్విధంబునం బ్రతి సర్గంబును సంగ్రహంబున వినిపించితి; ఇప్పుణ్య కథ నెవ్వండేని ముమ్మాఱు వినిన నతండు నిష్పాపుం డగునని చెప్పి మఱియు నిట్లనియె. 215**

**ప్రతి :** మఱియున్= ఇంకా; అధర్మునకున్= (బ్రహ్మకొడుకు) అధర్ముడికి; మృష అను= మృష అనే; భార్య+అందున్= పత్నియందు; దంభుండును= దంభుడూ; మాయ అనున్= మాయ అనే; అంగనయున్= స్త్రీ యునూ; పుట్టిరి= ఉదయించారు; అధర్మసంతానంబు+అగు= అధర్ముడి పిల్లలయిన; వారు+ఇరువురును= వాళ్లిద్దరూ; మిథునంబు+ఐరి= ఆలుమగలయ్యారు; వారిని= ఆ దంభ, మాయలను; సంతానహీనుండు+అగు= బిడ్డలు కలగని; నిర్భృతి= నిర్భృతి; కైకొనియెన్= దత్తత పుచ్చుకొన్నాడు; వారలకున్= ఆ దంభమాయలకు; లోభుండును= లోభుడనే మగపిల్లవాడు; నికృతి అను= నికృతి అనే; సతియునున్= స్త్రీయున్నూ; కలిగి= పుట్టి; మిథునంబు+అయిరి= దంపతులయ్యారు; ఆ మిథునంబునకున్= ఆ ఇద్దరికీ; క్రోధుండు= క్రోధుడూ; హింస= హింస అనే; అంగనయున్= కాంతయున్నూ; పుట్టి= ఉదయించి; మిథునంబు+అయిరి= భార్యా భర్తలయ్యారు; ఆ మిథునంబునకున్= ఆ జంటకు; కలియున్= కలీ; దురుక్తి+అను= దురుక్తి అనే; అతివయున్= వనితయూ; జన్మించి= పుట్టి; దాంపత్యంబు= పెళ్లి చేసుకునిజంట ధర్మాన్ని; కైకొనిరి= గ్రహించారు; ఆ దంపతులకున్= ఆ పతిపత్నులకు; భయమృత్యువులు+అను= భయమూ, మృత్యువూ అనే; మిథునంబు= ద్వయం; కలిగెన్= పుట్టారు; దానివలన= ఆ జతవల్ల; యాతనయున్= యాతనా; నిరయంబునున్= నిరయం అనే జంట; పుట్టిరి= పుట్టారు; వీరలు= వీళ్లిరువురూ; సంసార= భవబంధానికి; హేతువు+అగు= మూలం అయిన; అధర్మతరుశాఖలు+అయి= అధర్ముడనే వంశవృక్ష శాఖలోని వారయి; నెగడిరి= వర్ధిల్లారు; వీనిన్= ఈ కుదుటిలోని వాళ్లను; శ్రేయస్ కాముండు+అగు= శుభం కోరేవాడైనట్టి; జనుండు= మనుష్యుడు; ఈషత్+మాత్రంబున్= కొంచెం కూడా; అనువర్తింపన్= అనుసరించి నడవడం; చనదు= తగదు; ఈ విధంబునన్= ఈ ప్రకారంగా; ప్రతిసర్గంబును= ప్రళయాన్ని; సంగ్రహంబునన్= క్లుప్తంగా; వినిపించితిన్= చెప్పాను; ఈ పుణ్యకథన్= ఈ పవిత్రకథను; ఎవ్వండు+ఏనిన్= ఎవ్వడైనా సరే; మూఁడు+మాఱులు= మూడుపర్యాయాలు; వినినన్= విన్నట్లయిన; అతండు= అతడు; నిస్+పాపుండు= పాపరహితుడు; అగున్= అవుతాడు; అని చెప్పి= అని పలికి; మఱియున్= మళ్లీ; ఇట్లు= ఈ చందాన; అనియెన్= చెప్పాడు.

**తా :** ఇంకనూ అధర్ముడికి మృష అనే అంగన గర్భాన దంభుడు, మాయ అనే స్త్రీ పుట్టారు. ఈ అధర్ముడి బిడ్డలిద్దరూ జంట అయ్యారు. వీళ్లను నిస్సంతువైన నిర్భృతి పెంచుకున్నాడు. ఈ దంభ, మాయ అనే దంపతులకు లోభుడు అనే అబ్బాయి, నికృతి అనే అమ్మాయి పుట్టారు. వాళ్లిద్దరూ జత అయ్యారు. ఈ దంపతులకు క్రోధుడనే కొడుకు, హింస అనే కూతురూ కలిగారు. ఈ అన్నా చెల్లెళ్లూ ఆలూమగ లయ్యారు. వీరి దాంపత్యానికి కలి, దురుక్తి అనే పిల్లలు పుట్టారు. ఈ ఇద్దరూ భార్యాభర్త లయ్యారు. ఈ దంపతులకు భయం, మృత్యువు అనే సంతానం కల్గింది. వీళ్లూ జోడుకట్టారు. వీరికి యాతన, నిరయం అనే ఇద్దరు పిల్లలు పుట్టారు. వీళ్లంతా వంశపరంపరకు కుదురు అయిన అధర్ముడి వంశవృక్షానికి శాఖలుగా ఒప్పారు. శుభం కోరే ప్రతి మనిషి కించిత్తుకూడా ఈ పద్ధతిని అనుసరించకూడదు. ఈ తీరున ప్రతిసర్గనూ సారవంతంగా కుదించి నీ చెవిని వేశాను. ఈ పుణ్య కథను మూడుసార్లు విన్నవాడు ఎవ్వడైనా పాపం తొలగిపోయిన వాడవుతాడు. అని కథా సారాంశం చెప్పాడు. తిరిగి మళ్లీ ఇలా అందుకున్నాడు. **(ఇది ఫలశ్రుతి)**

## a౼ధ్రువోపాఖ్యానము a

**క. విను మఖిలభువనపరిపా, లనమునకై చక్రధరకళాకలితుండై**
**వనజజునకు స్వాయంభువ, మను వపు డుదయించెఁ గీర్తిమంతుం డగుచున్. 216**

**ప్రతి :** విను= ఆలకించు; అఖిల= సమస్తమైన; భువన= లోకాలయొక్క; పరిపాలనమునకు+ఐ= చక్కటి పరిపోషణకై; చక్రధర= సుదర్శనచక్రం ధరించే విష్ణువుయొక్క; కళా= అంశ; కలితుండు+ఐ= కలిగినవాడై; వనజజునకున్= బ్రహ్మకు (వనజ= నీటినుండి పుట్టింది పద్మం. ఆ పద్మం నుంచి పుట్టినవాడు); అపుడు= అదివరలో; స్వాయంభువమనువు= స్వాయంభువమనువు; కీర్తిమంతుండు= యశస్వి; అగుచున్= అవుతూ; ఉదయించెన్= పుట్టాడు.

**తా :** విదురా! విను. అన్ని లోకాల రక్షణార్థం విష్ణు అంశ కలిసిన బ్రహ్మ దేవుడికి పుట్టినవాడు స్వాయంభువమనువు. ఇతడు యశోవంతుడు.

**తే. రూఢి నమ్మనువుకు శతరూపవలన, భూనుతులగు ప్రియవ్రతోత్తానపాదు**
**లనఁగ నిద్దఱు పుత్రులై రందులోన, భవ్యచారిత్రుఁ డుత్తానపాదునకును. 217**

**ప్రతి :** రూఢిన్= నిశ్చయంగా; ఆ+మనువుకున్= ఆ స్వాయంభువునకు; శతరూపవలనన్= శతరూపగర్భాన; భూనుతులు+అగు= ప్రజల పొగడిక పొందినవారయిన; ప్రియవ్రత+ఉత్తానపాదులు= ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు; అనఁగన్= అనే, ఇద్దఱు= ఇరువురు; పుత్రులు+ఐరి= కుమారులు కలిగారు; అందులోనన్= ఆ ఇద్దరిలో; భవ్య= శుభమైన; చారిత్రుఁడు= నడతగల; ఉత్తానపాదునకును= ఉత్తానపాదుడికిన్ని.

**తా :** ఆ స్వాయంభువ మనువుకి శతరూప కడుపున ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే ఇద్దరు కొడుకులు పుట్టారు. వాళ్లిద్దరూ లోకుల పొగడిక కన్నవారు. ఈ పిల్ల లిద్దరిలో ఉత్తానపాదుడు మంచిమనుగడ కలవాడు. ఇతడికి,

**క. వినుము సునీతియు సురుచియు, నను భార్యలు గలరు; వారియందును ధ్రువునిం**
**గనిన సునీతియు నప్రియయును, సురుచియుఁ బ్రియయు నగుచు నున్నట్టి యెడన్. 218**

**ప్రతి :** వినుము= వినవలసింది; సునీతియున్= సునీతి; సురుచియున్= సురుచి; అను= అనే; భార్యలు= పెళ్లాలు; కలరు= ఉన్నారు; వారి+అందును= ఈ భార్యలిద్దరిలోనూ; ధ్రువునిన్= ధ్రువుడనే పేరుగలవాణ్ణి; కనిన= కడుపునకన్న; సునీతియున్= సునీతి; అప్రియయును= ఇష్టం కానిదీ; సురుచియున్= సురుచి; ప్రియయున్= ఇష్టమైనదిన్నీ; అగుచున్= అవుతూ; ఉన్న+అట్టి+ఎడన్= ఉండినట్టి సమయంలో.

**తా :** విదురా! విను. ఆ ఉత్తానపాదుడికి ఇద్దరు భార్యలు. సునీతి, సురుచి. వీళ్లల్లో ధ్రువుడి కన్నతల్లి సునీతి మీద ఉత్తానపాదుడికి అప్రీతియు సురుచి మీద ప్రీతియు కలదు. ఇలాగున ఉంటున్న సమయంలో,

**విశే :** సునీతి చక్కటి నీతి మంతురాలు. సురుచి చక్కటి సొగసరి.

**సీ. ఒకనాఁడు సుఖలీల నుత్తానపాదుండు నెఱిఁ బ్రియురాలైన సురుచి గన్న**
**కొడుకు నుత్తముఁ దన తొడలపై నిడికొని యుపలాలనము సేయుచున్న వేళ**

నర్థిఁ దదారోహణాపేక్షితుం డైన ధ్రువునిఁ గనుంగొని తివక యాద
రింప కుండుటకు గర్వించి యా సురుచియు సవతిబిడ్డండైన ధ్రువునిఁ జూచి

తే. తండ్రి తొడ నెక్కు వేడుక దగిలెనేనిఁ, బూని నాగర్భమున నాఁడు పుట్ట కన్య
గర్భమునఁ బుట్ట గోరినఁ గలదె నేఁడు, జనకు తొడ యెక్కు భాగ్యంబు సవతికొడుక! **219**

**ప్రతి :** ఒకనాఁడు= ఒకానొక ప్రొద్దు; సుఖలీలన్= హాయిగా; ఉత్తానపాదుండు= ఉత్తానపాదుడు; నెఱిన్= చక్కదనంతో; ప్రియురాలు+ఐన= ప్రేయసి అయిన; సురుచి= సురుచి; కన్న= ప్రసవించిన; కొడుకున్= పుత్రుడు అయిన; ఉత్తమున్= ఉత్తముని; తన= తనయొక్క; తొడలపైన్= ఊరువులపై; ఇడికొని= ఉంచికొని; ఉపలాలనము+చేయుచున్= బుజ్జగిస్తూ; ఉన్నవేళన్= ఉన్న సమయంలో; అర్థిన్= అపేక్షతో; తద్= ఆ ఉత్తముడివలె తండ్రితొడను; ఆరోహణ= ఎక్కడానికి; అపేక్షితుండు+ఐన= ముచ్చట పడిన; ధ్రువునిన్= ధ్రువుణ్ణి; కనుంగొని= పరికించి; తివక= చేరదీయక; ఆదరింపక= ముద్దుచేయక; ఉండుటకున్= ఊరకుండడానికి; గర్వించి= గర్వపడి; ఆ సురుచియున్= ఆ సురుచి; సవతిబిడ్డండు+ఐన= సవతి పిల్లవాడు అయినట్టి; ధ్రువునిన్= ధ్రువుణ్ణి; చూచి= ఉద్దేశించి; సవతికొడుక= సవతి కొడుకా!; తండ్రి= జనకుడియొక్క; తొడన్= ఊరువును; ఎక్కు= అధిష్ఠించాలనే; వేడుక= ఉబలాటం; తగిలెన్+ఏనిన్= కలిగి ఉన్నట్లయితే; పూని= తొడగి; నా= నా యొక్క; గర్భమున= కడుపున; నాఁడు= ఆ జన్మకాలాన; పుట్టక= జన్మించక; అన్యగర్భమునన్= మరొకస్త్రీ కడుపున; పుట్టన్= పుట్టగా; నేఁడు= ఇపుడు; జనకు తొడన్= నాన్న తొడపై; ఎక్కు= ఆరోహించే; భాగ్యంబు= అదృష్టం; కోరినన్= కాంక్షించినంతనె; కలదె= దక్కుతుందా?

**తా :** ఒక దినాన ఉత్తానపాదుడు, ప్రేయసియైన సురుచి కన్నకొడుకు ఉత్తముని ఉల్లాసంగా తొడల మీద కూర్చోపెట్టుకుని లాలిస్తూ ఉన్నాడు. అదే వేళలో తానూ తండ్రితొడ ఎక్కాలని ఆసగొన్న ధ్రువుణ్ణి ఉత్తానపాదుడు చూసినా, దగ్గరకు తీయలేదు. ముద్దాడ లేదు. ఉపేక్షించి కిమ్మనక ఉన్నాడు. దానితో పొగరెక్కిన సురుచి, సపత్ని కొడుకు ధ్రువుడితో ఇలా పలికింది. ఓ సవతి కొడుకా! తండ్రి తొడ ఎక్కాలని కుతూహలపడినట్లయితే విను. నువ్వు ఆనాడే నా కడుపున పడక మరొక స్త్రీ గర్భాన పడ్డావు. తండ్రి తొడ ఎక్కి కూర్చుని ఆనందించే అదృష్టం కోరుకున్నంతమాత్రాన చిక్కుతుందా?

క. అది గాన నీ వధోక్షజు, పదపద్మము లాశ్రయింపు; పాయక హరి నా
యుదరమునఁ బుట్టజేయును, వదలక యట్లయిన ముదము వడసెద వనఘా! **220**

**ప్రతి :** అనఘా!= పుణ్యాత్మా!; అది+కాన= సంగతి అదికాబట్టి; నీవు= నువ్వు; అధోక్షజు= ఇంద్రియాల కగోచరుడైన విష్ణుమూర్తి యొక్క; పదపద్మములు= పద్మాలవంటి పాదాలను; పాయక= వదలక; ఆశ్రయింపు= అండగొను; హరి= ఆ విష్ణుమూర్తి; నా ఉదరమునన్= నా గర్భాన; పుట్టన్+చేయున్= జన్మింప చేస్తాడు; అట్లు= అలా; అయినన్= అయితే; వదలక= ఎడతెగక; ముదము= సంతోషం; పడసెదవు= పొందెదవు.

**తా :** పుణ్యాత్మా! అందుకని నువ్వు ఆ వెన్నుని పాదారవిందాల ప్రాపును విడువక పొందు. ఆ దైవం నిన్ను నా కడుపున పుట్టిస్తాడు. ఆ విధంగా వీలుపడితే ఎడతెగని సంతోషం అనుభవిస్తావు.

క. అని యీ రీతి నసహ్య వ, చనములు పినతల్లి యపుడు జనకుఁడు వినఁగాఁ
దను నాడిన దుర్భాషా, ఘనశరములు మనము నాఁటి కాఱియ వెట్టన్. **221**

**ప్రతి :** అని= అని; ఈరీతిన్= ఈ తెరగున; అసహ్య= సహింపరాని; వచనములు= మాటలు; పినతల్లి= చిన్నమ్మ సురుచి; జనకుఁడు= తండ్రి; వినఁగాన్= వింటూ ఉండగా; తనున్= తనగురించి; ఆడిన= చెప్పిన; దుస్+భాషా= చెడు మాటలనే (కారుకూతలనే); ఘన= గట్టి; శరములు= బాణాలు; మనమున్= మనస్సులో; నాఁటి= గుచ్చుకొని; కాఱియ+పెట్టన్= యాతనపెట్టగా.

**తా :** ఈ రకంగా పలికిన పిన తల్లిమాటలు చెవికి ఏవగింపు పుట్టించాయి. తన తండ్రి వినేటట్టుగా తననుగురించి మాట్లాడిన కానిమాటలు ఎదను కెలికి కష్ట పెట్టగా,

**క. తను నట్లుపేక్ష సేసిన, జనకునికడఁ బాసి దుఃఖజలనిధి లోనన్**
**మునుఁగుచును దండతాడిత, ఘనభుజగముఁ బోలె రోషకలితుం డగుచున్. 222**

**ప్రతి :** తనున్= పెద్దకొడుకునైన తనను; అట్లు= అలా ఆదరించక; ఉపేక్ష+చేసిన= ఉదాసీనంగా ఉన్న; జనకుని కడన్= తండ్రి చెంతను; పాసి= వదలి; దుఃఖ= సంకటం అనే; జలనిధి లోనన్= సముద్రంలోపల; మునుఁగుచును= మునకలు వేస్తూ; దండ= దుడ్డుకర్రతో; తాడిత= కొట్టబడిన; ఘనభుజగమున్= పెద్దపామును; పోలెన్= వలె; రోషకలితుండు= క్రోధంతో కూడినవాడు; అగుచున్= అవుతూ...

**తా :** కన్నకొడుకునైన తనను అలా పట్టించుకోనట్లున్న తండ్రినుండి పక్కకు తొలగాడు. దుఃఖసాగరంలో మునిగివుంటూ కర్రదెబ్బ తిన్న పెద్దపామువలె కోపంతో కూడినవాడై

**క. ఘనరోదనంబు సేయుచుఁ, గనుఁగవలను శోకబాష్పకణములు దొరఁగన్**
**జనని కడ కేగుటయు నిజ, తనయునిఁగని యా సునీతి దద్దయుఁబ్రేమన్. 223**

**ప్రతి :** ఘన; రోదనంబు+చేయుచున్= బిగ్గరగా ఏడుస్తూ; కనుఁగవలను= రెండుకళ్లనుంచి; శోక= మనోదుఃఖంతో; బాష్పకణములు= కన్నీటిబొట్టులు; తొరఁగన్= బదబదకారగా; జనని కడకున్= తల్లి ఉన్నచోటుకు; ఏగుటయున్= పోవడమున్నూ; నిజతనయునిన్= తన కన్నబిడ్డను; కని= చూసి; ఆ+సునీతి= ఆ ధ్రువుడి తల్లి; తద్దయున్= మిక్కిలి; ప్రేమన్= వాత్సల్యంతో.

**తా :** పెద్దగా ఏడుస్తున్నాడు. ఆ రెండుకళ్లనుంచి కన్నీటి కణములు జాలువారుతూ ఉన్నాయి. అలా తల్లి దరికి చేరాడు. కన్నబిడ్డను చూసి తల్లి సునీతి ఎంతో ఆప్యాయంగా

**వ. తొడలపై నిడికొని. 224**

**ప్రతి :** తొడలపైన్= తొడలమీద; ఇడికొని= కూర్చుండబెట్టుకుని.

**తా :** ఒళ్లోకి తీసుకొని

**క. కర మనురక్తిని మోము ని, విరి తద్వృత్తాంత మెల్ల వెలఁదులు నంతః**
**పురవాసులుఁ జెప్పిన విని, పఱపుగ నిట్టూర్పు లెసఁగ బాష్పాకులయై. 225**

**ప్రతి :** కరము= మిక్కిలి; అనురక్తిని= కూరిమితో; మోము= మొగం; నివిరి= తడివి; తద్= ఆ జరిగిన; వృత్తాంతము+ఎల్లన్= సమాచారం అంతను; వెలఁదులున్= స్త్రీలూ; అంతఃపురవాసులున్= అంతఃపురంలో ఉండేవారూ; చెప్పినన్= నుడువగా;

విని= ఆలకించి; పఱపుగ= విస్తృతంగా; నిట్టూర్పులు= దీర్ఘశ్వాసలు; ఎసఁగన్= మెండుకాగా; బాష్ప= అశ్రువులతో; ఆకుల+ఐ= కలతపడింద్రై...

**తా :** మిక్కిలి ప్రేమగా మొగం అంతా అరచేతులతో అటూ ఇటూ సవరించింది. జరిగిన సంగతంతా స్త్రీలు, రాణివాసంలో ఉండే పరిచారికలూ చెప్పగా విన్నది. పెద్ద పెద్ద నిట్టూర్పులు వెంట వెంటగా నిగిడించింది. కంట నీరు పెట్టుకుని క్షోభపడింద్రై

**తే. సవతి యాడిన మాటలు సారెఁ దలఁచి, కొనుచుఁ బేర్చిన దుఃఖాగ్నిఁ గుములుచుండె**
**దావపావకశిఖలచేఁ దగిలి కాంతి, వితతిఁ గందిన మాధవీలతికవోలె. 226**

**ప్రతి :** సవతి= సపత్ని; ఆడినమాటలు= అన్న టెక్కు పలుకులు; సారెన్= మాటి మాటికి; తలఁచికొనుచున్= స్మరించుకొంటూ; పేర్చిన= విజృంభించిన; దావపావక= అడవి అంటుకున్న మంటలయొక్క; శిఖలచేన్= సెగలలో; తగిలి= చిక్కి; కాంతి= వెలుగులయొక్క; వితతిన్= సమూహంచే; కందిన= కాగిన; మాధవీలతిక+పోలె= మాధవీలత చందాన; దుఃఖ+అగ్నిన్= శోకం అనే చిచ్చులో; కుములుచున్+ఉండెన్= లోపల తపించిపోతూ ఉంది.

**తా :** సవతి సురుచి పల్కిన నిక్కుమాటలను పదే పదే గుర్తు చేసుకుంటూ దావాగ్ని జ్వాలలచే తగిలి కాంతి సమూహం కందిపోయిన మాధవీలతవలె విజృంభించిన దుఃఖాగ్నిచేత కుములుతూ ఉంది.

**వ. అంత నా సునీతి బాలకునిం జూచి తండ్రీ! దుఃఖింపకుమని యిట్లనియె. 227**

**ప్రతి :** అంతన్= వెంటనే తమాయించుకుని; ఆ సునీతి= ఆ ధ్రువుడి తల్లి; బాలకునిన్= బుడుతణ్ణి; చూచి; తండ్రీ!= నాన్నా!; దుఃఖింపకుము= శోకించకు; అని= అని ఓదార్చి; ఇట్లు= ఇలా; అనియెన్= బోధించింది.

**తా :** అప్పుడు ఆ సునీతి, తన పిల్లవాణ్ణి చూచి తండ్రీ! దుఃఖింపకు అని ఇలా అన్నది.

**క. అనఘా! యీ దుఃఖమునకుఁ, బని లే దన్యులకు సొలయ బలవంతంబై**
**తన పూర్వజన్మదుష్కృత, ఘనకర్మము వెంట నంటఁగా నెవ్వలనన్. 228**

**ప్రతి :** అనఘా!= పాపరహితా!; బలవంతంబు+ఐ= బలంకలద్రై; తన= తనయొక్క; పూర్వజన్మ= వెనకటి పుట్టువునందలి; దుష్కృత= పాపంయొక్క; ఘన= అమితమైన; కర్మము= కర్మ; వెంటనంటన్+కాన్= తరుముకొంటూ రాగా; ఏ+వలనన్= ఎటువైపుననూ/ఏదిక్కువనూ; ఈ దుఃఖమునకున్= ఈ వ్యథకు సంబంధించి; అన్యులకున్= ఇతరులకు; సొలయన్= తిరస్కరించ; పని= అక్కఱ; లేదు= కల్గదు.

**తా :** పుణ్యాత్మా! పూర్వజన్మలలో దుష్టకర్మల ఫలితంగా ఇప్పుడు కలిగిన బాధలను గురించి ఇతరులను నిందించనవసరం లేదు.

**వ. కావున. 229**

**ప్రతి :** కావున= కనుక.

**క. పెనిమిటిచేతను బెండ్లా, మని కాదు నికృష్టదాసి యనియును బిలువం**
**గను జాలని దుర్భగురా, లనఁగల నా కుక్షి నుదయ మందిన కతనన్. 230**

**ప్రతి :** పెనిమిటి చేతను= మగనిచేత; పెండ్లాము= ఆలు; అని కాదు= అనే కాదు; నికృష్ట= అధమ అయిన; దాసి= పరిచారిక; అనియును= అనికూడా; పిలువన్+కను= పేర్కొనడానికి; చాలని= తగని; దుర్భగురాలు= 'మగడొల్లనిస్త్రీ', అనన్+కల= అని చెప్పయోగ్యమైన; నా కుక్షిన్= నా గర్భాన; ఉదయము+అందిన= జన్మ ఎత్తిన; కతనన్= కారణంగా...

**తా :** పుణ్యాత్మా! పూర్వజన్మలలో తానుచేసిన మహాదుష్కర్మలకు ఫలితంగా ఇప్పుడు కలిగిన బాధలను గురించి ఇతరులను నిందించనవసరం లేదు.

**విశే :** దుర్భగ+ఆలు= దుర్భగురాలు – ఇటువంటి పదాలలో 'ఆలు' అనే పదానికి స్త్రీ అని మాత్రమే అర్థం.

**క. నిను నాడిన యా సురుచి వ, చనములు సత్యంబు లగును; సర్వశరణ్యుం**
**డనఁగల హరిచరణంబులు, గను జనకుని యంక మెక్కఁగాఁ దలఁ తేనిన్. 231**

**ప్రతి :** నినున్= నిన్నుగురించి; ఆడిన= మాట్లాడిన; ఆ+సురుచి= ఆ పినతల్లియొక్క; వచనములు= భాషలు; సత్యంబులు= యథార్థమైనవి; అగును= అవుతాయి; జనకుని= నాయనయొక్క; అంకము= ఒడి; ఎక్కన్+కాన్= అధిష్ఠించాలని; తలఁ తు(వు)+ఏనిన్= ఇచ్ఛగింతువేని; సర్వశరణ్యుండు= అందరికీ రక్షకుడు; అనన్+కల= అనిచెప్పగల; హరి= విష్ణుమూర్తియొక్క; చరణంబులు= పదాలు; కను= శరణు పొందు.

**తా :** ఆ సురుచి నిన్ను అన్నమాటల్లో నిజం ఉంది. నీ తండ్రి తొడలపై కూర్చోవాలనేదే నీ ఆకాంక్ష. అయితే నీవు సర్వరక్షకుడగు ఆ హరి పాదాలు ఆశ్రయించు.

**వ. కావునం బినతల్లియైన యా సురుచి యాదేశంబున నధోక్షజు నాశ్రయింపు మని వెండియు నిట్లనియె. 232**

**ప్రతి :** కావునన్= కాబట్టి; పిన్నతల్లి+ఐన= తల్లితర్వాత తల్లి వంటిదైన; ఆ+సురుచి= ఆ సురుచి; ఆదేశంబునన్= చెప్పినట్టుగానే; అధోక్షజున్= ఆ విష్ణుమూర్తిని; ఆశ్రయింపుము= చేరుకో; అని= అని నచ్చపలికి; వెండియున్= తిరిగి; ఇట్లు= ఇలా; అనియెన్= చెప్పింది.

**తా :** కనుక పినతల్లియైన ఆ సురుచి మాటప్రకారంగానే ఆ విష్ణుని ప్రాపు చేరు అని మళ్లీ ఇలా చెప్పింది.

**సీ. పరికింప నీ విశ్వపరిపాలనమునకై యర్థి గుణవ్యక్తుఁడైనయట్టి**
**నారాయణుని పాదనలినముల్ సేవించి తగ బ్రహ్మ బ్రహ్మపదంబు నొందె;**
**ఘనుఁడు మీ తాత యా మనువు సర్వాంతర యామిత్వ మగు నేకమైన దృష్టిఁ**
**జేసి యాగముల యజించి తా భౌమసుఖములను దివ్యసుఖముల మోక్ష**

**తే. సుఖములను బొందె నట్టి యచ్యుతునిఁ బరుని, వితతయోగీంద్రనికరగవేష్యమాణ**
**చరణసరసిజయుగళు శశ్వత్ప్రకాశు, భక్తవత్సలు విశ్వసంపాద్యు హరిని. 233**

**ప్రతి :** పరికింపన్= గమనించి చూడగా; ఈ విశ్వ= ఈ లోకాలయొక్క; పరిపాలనమునకున్+ఐ= కాపుకోసమై; అర్థిన్= ప్రీతితో; గుణ= సత్త్వాది స్వభావరూపంలో; వ్యక్తుఁడు= తెల్లమయ్యేవాడు; ఐన+అట్టి= అయినటువంటి; నారాయణుని= విష్ణునియొక్క; పాదనలినముల్= పాదపద్మాలు; సేవించి= ఆరాధించి; తగన్= ఒప్పిదంగా; బ్రహ్మ= నలువ; బ్రహ్మపదంబున్= ఉత్తమమైన బ్రహ్మపదవిని; ఒందెన్= చేరాడు; ఘనుఁడు= ఉన్నతుడు అయిన; మీ తాత= మీ పితామహుడు; ఆ+మనువు= ప్రసిద్ధుడైన ఆ స్వాయంభువ మనువు; సర్వాంతరయామిత్వము+అగున్= అంతట వ్యాపించి, వాళ్లను ఆ యాకర్మలందు మెలగింప చేసే తనం కల్గినట్టి; ఏకము+ఐన= ముఖ్యమైన; దృష్టిన్+చేసి= జ్ఞానం వల్ల; యాగములన్= క్రతువులతో; యజించి= సేవించి; తాన్= తాను; భౌమసుఖములను= భూలోకసంబంధి భోగాలను; దివ్యసుఖములను= దేవలోక స్వర్గభోగాలను; మోక్షసుఖములను= ముక్తి భోగాలను; పొందెన్= అనుభవించాడు; అట్టి= అలాంటి; అచ్యుతునిన్= అవినాశుని; పరునిన్= పరమాత్మనూ; వితత= విస్తరించిన; యోగి+ఇంద్ర= మేటియోగులయొక్క; నికర= మొత్తంచే; గవేష్యమాణ= వెదుకబడుతున్న; చరణసరసిజ= పాదపద్మాలయొక్క; యుగళున్= జంటగలవాణ్ణి; శశ్వత్= నిరంతరం; ప్రకాశున్= వెలుగువాణ్ణి; భక్తవత్సలున్= భక్తులయందు వాత్సల్యం కలవాణ్ణి; విశ్వసంపాద్యున్= లోకాలను సిద్ధింపచేయగలవాణ్ణి; హరిని= విష్ణుమూర్తిని...

**తా :** నిజానికి ఆలోచించి చూస్తే ఈలోకాల రక్షణకోసం ఇష్టపడి సత్త్వాదిగుణరూపాల్లో గోచరమయ్యే విష్ణుని పాద పద్మాలను కొలిచి ఆ బ్రహ్మ అంతఉన్నత పదవిని అందుకోగల్గాడు. మీ తాత స్వాయంభువమనువు ఔన్నత్యం కలవాడు ప్రఖ్యాతుడు. సర్వాంతర్యామి తత్త్వప్రధానమైన ఎరుకతో ఆ విష్ణువుని సవనరూపంలో అనేకదక్షిణలతో సేవించాడు. తానుగా భూలోకస్వర్గలోక సౌఖ్యాలతోపాటు ముక్తిసౌఖ్యాన్నీ అనుభవించాడు. అటువంటి అచ్యుతుని, పరుని, యోగివర్యుల సమితిచే గాలించబడే పాదపద్మాలజంట కలవాణ్ణి, అవిరామమైన కాంతిమయుణ్ణి, భక్తులయందు వాత్సల్యంకలవాణ్ణి లోకసంధాతను ఆ విష్ణుమూర్తిని (ఆశ్రయించు)

**వ. మఱియును. 234**

**తా :** ఇంకనూ

**క. కరతలగృహీతలీలాం, బురుహ యగుచుఁ బద్మగర్భముఖగీర్వాణుల్**
**పరికింపంగల లక్ష్మీ, తరుణీమణిచేత వెదకఁదగు పరమేశున్. 235**

**ప్రతి :** పద్మగర్భ= బ్రహ్మ; ముఖ= మొదలైన; గీర్వాణుల్= వేలుపులు; పరికింపన్+కల= చూడగల; లక్ష్మీతరుణీమణిచేత= లక్ష్మి అనే కాంతారత్నంచే; కరతల= అరచేత; గృహీత= పట్టుకోబడ్డ; లీలా= సొగసైన; అంబురుహ అగుచున్= పద్మం కలదవుతూ; వెదకన్= అన్వేషించడానికి; తగున్= ఒప్పిన; పరమేశున్= విష్ణుమూర్తిని.

**తా :** చేత లీలాపద్మం పట్టుకొని బ్రహ్మాది దేవతలు చూస్తుండగా లక్ష్మిచేత అన్వేషింపదగిన ఆ మహావిష్ణువును

## a =ధ్రువుఁడు నారదోపదేశంబు వడసి తపంబు సేయుట a

**వ. నిజధర్మపరిశోభితంబైన యేకాగ్రచిత్తంబున నిలిపి సేవింపు; మమ్మహాత్ముని కంటె నీ దుఃఖం బపన యించువాఁ డన్యుం డొక్కరుండు గలండే? యని పలికినఁ బరమార్థప్రాప్తిహేతుకంబులైన తల్లి వాక్యంబులు**

**విని తన్నుఁ దాన నియమించుకొని పురంబు వెడలి చను నవసరంబున నారదుండు దద్వృత్తాంతం బెఱింగి యచ్చటికిం జనుదెంచి యతని చికీర్షితంబుఁ దెలిసి పాపనాశకరంబైన తన కరతలంబున ధ్రువుని శిరం బంటి మానభంగంబునకు సహింపని క్షత్త్రియుల ప్రభావం బద్భుతంబు గదా? బాలకుండయ్యుఁ బినతల్లి యాడిన దురుక్తులు చిత్తంబునం బెట్టి చనుచున్నవాఁడని మనంబున నాశ్చర్యంబు నొంది "యో బాలక! సకల సంపత్సమృద్ధంబగు మందిరంబు దెగడి యొంటి నెందు నేగెదవు? స్వజనకృతం బగు నవమానంబుచే నిను సంతప్తుంగాఁ దలంచెద" ననిన ధ్రువుం డిట్లనియె; సపత్నీమాతృవాగిషుక్షతంబగు వ్రణంబు భగవద్ధ్యానయోగరసాయనంబున మాపికొందు ననిన ధ్రువునికి నారదుం డిట్లనియె. 236**

**ప్రతి :** నిజధర్మ= స్వధర్మంచే; పరిశోభితంబు+ఐన= మిక్కిలి ప్రకాశించేది అయిన; ఏకాగ్రచిత్తంబునన్= ఒకే విషయం మీద ఆసక్తమై మనస్సున; నిలిపి= ఉంచి; సేవింపుము= కొలువుము; ఆ+మహా+ఆత్ముని+కంటెన్= ఆ మహాత్మునికంటే; నీ దుఃఖంబు= నీ వగ;అపనయించువాఁడు= తొలగించేవాడు; అన్యుండు= మరొకడు; ఒక్కరుండు= ఒక్కడైనా; కలండే= ఉన్నాడా; అని= అని; పలికినన్= సునీతి నిశ్చితంగా చెప్పంగానే; పరమ+అర్థ= ముఖ్య కార్యప్రయోజనం యొక్క; ప్రాప్తి= లబ్ధికి; హేతుకంబులు+ఐన= మూలకారణాలైన; తల్లి= అమ్మయొక్క; వాక్యంబులు= సుద్దులు; విని= ఆకర్ణించి; తన్నున్+తాన= తనను తానే; నియమించుకొని= (నిగ్రహించుకొని) ఓదార్చుకొని; పురంబు= పట్టణం; వెడలి= దాటి; చనున్= వెళ్తున్న; అవసరంబునన్= సమయాన; నారదుండు= నారదముని; తద్+వృత్తాంతంబు= ఆ కథను; ఎఱింగి= తెలిసికొని; అచ్చటికిన్= ఆ ప్రదేశానికి; చనుదెంచి= వచ్చి; అతని= ఆ ధ్రువుడి; చికీర్షితంబున్= చేయగోరినదాన్ని; తెలిసి= గ్రహించి; పాపనాశకరంబు+ఐన= చెడును తుడిపేది అయిన; తన కరతలంబునన్= తన అరచేత్తో; ధ్రువునిశిరంబు= ధ్రువుడి తలను; అంటి= తాకి; మానభంగంబునకున్= ఆత్మాభిమానం పాడైనదానికి; సహింపని= తాళలేని; క్షత్రియుల= రాజవంశీకుల; ప్రభావంబు= మహిమ; అద్భుతంబు కదా= విచిత్రం కదా?; బాలకుండు+అయ్యున్= పిన్నవాడే అయినప్పటికిన్ని; పినతల్లి= పిన్నమ్మ; ఆడిన= సంభాషించిన; దుస్+ఉక్తులు= చెడు మాటలు; చిత్తంబునన్= మనసులో; పెట్టి= ఉంచుకొని; చనుచున్+ఉన్నవాఁడు= వెళ్లిపోతున్నట్టివాడు; అని= అని; మనంబునన్= డెందంలో; ఆశ్చర్యంబున్+ఒంది= అచ్చెరువంది; ఓ బాలక= ఓ పిన్నవాడా!; సకల= సమస్తమైన; సంపత్ సమృద్ధంబు+అగు= ఐశ్వర్యాలచే పుష్కలమై ఉన్నట్టి; మందిరంబు= రాచనగరును; తెగడి= తిరస్కరించి; ఒంటిన్= ఒంటరిగా; ఎందున్= ఎక్కడకు; ఏగెదవు= వెళ్తావు; స్వజనకృతంబు+అగున్= నీ దగ్గరి బంధువులచే చేయబడింది అయినట్టి; అవమానంబుచేన్= భంగపాటుచే; నిను= నిన్ను; సంతప్తున్+కాన్= మిక్కిలి బాధ పడ్డవాణ్ణిగా; తలంచెదన్= భావిస్తున్నాను; అనినన్= అనంగానే; ధ్రువుండు= ధ్రువుడు; ఇట్లు= ఇలా; అనియెన్= అన్నాడు; సపత్నీమాతృ= మారుతల్లి యొక్క; వాక్= పలుకు అనే; ఇషు= బాణంచే; క్షతంబు+అగు= గాయం అయిన; వ్రణంబున్= పుండును; భగవత్= దేవుని; ధ్యానయోగ= చిత్తైకాగ్ర్యరూపమైన సాధన అనే; రసాయనంబునన్= తృప్తి పరచే పదార్థంతో; మాపికొందున్= నయం చేసుకుంటాను; అనినన్= అనంగానే; ధ్రువునికిన్= ధ్రువుడికి; నారదుండు= నారదముని; ఇట్లు= ఇలా; అనియెన్= చెప్పాడు.

**తా :** స్వధర్మాన్ని వెల్లడింపచేసే తదేకమైన మతితో సేవించు. ఆ ఘనుడైన విష్ణుమూర్తి కన్న నీ చింతను తీర్చేవారు మరెవ్వరూ ఉండబోరు అని చెప్పగా ఆ తల్లి మాటలు అతనికి నచ్చాయి. అవి ప్రయోజనవంతమైన కార్యసాఫల్యానికి మూలకారణా లన్పించాయి. తనను తానే కట్టడి చేసుకున్నాడు. పట్టణం దాటిపోయి వెళ్తున్నట్టి సమయంలో నారదుడికి

ఈ విషయం మూలముట్టుగా తెలియవచ్చింది. ఆయన ధ్రువుడి దగ్గరకు చేరుకున్నాడు. ఆ ధ్రువుడి అభిలషితకర్తవ్యాన్ని అర్థం చేసుకున్నాడు. పాపనాశనకరమైన తన చేత్తో ధ్రువుడి తలను నిమిరాడు. అహో! తమ ఆత్మగౌరవవిఘాతాన్ని తట్టుకోలేని క్షత్రియుల తేజం అద్భుతం కదా! ఈ చిఱుతవయస్సులో చిన్నతల్లి పరుషమైన మాటలకు బెంగపెట్టుకొని ఇలా వెళ్లి పోతున్నట్లున్నాడని మనసులో ఆశ్చర్యపడి, ఓ బుడుతడా! సర్వ భోగభాగ్యాలతో నిండిన ఇంటిని కాదని ఇలా ఏకాకిగా ఎక్కడికని పోతావు? నీకు కావాల్సిన వాళ్లు చేసిన అవమానం నిన్ను తపింపచేసిందని నాకు అనిపిస్తుంది. అనగానే ధ్రువుడు ఇలా పలికాడు. సవతితల్లి పలుకులనే ములుకుల తాకిడి గాయాన్ని 'దైవధ్యానయోగం' అనే తృప్తికరమైన మందుతో మాన్పుకుంటాను అని అతడనగా నారదుడు ఆ ధ్రువుడితో ఇలా అన్నాడు.

**క. విను పుత్త్రక! బాలుఁడవై, యనయంబును గ్రీడలందు నాసక్తమనం**
**బునఁ దిరిగెడు నిక్కాలం, బున నీ కవమానమానములు లే వెందున్. 237**

**ప్రతి :** పుత్రక!= బిడ్డా!; విను= ఆలకించు; బాలుఁడవు+ఐ= పసిపాపడివి అయి; అనయంబును= నిత్యమూ; క్రీడల+అందున్= ఆటపాటల్లో; ఆసక్త= ఆసక్తి గల; మనంబునన్= ఉల్లంతో; తిరిగెడు= చుట్టబెట్టివచ్చే; ఈ కాలంబునన్= ఈ లేతవయస్సులో; నీకున్= నీకు; అవమానమానములు= అగౌరవం, గౌరవం; ఎందున్= దేనిలోనూ; లేవు= ఉండవు.

**తా :** ఓ పుత్రా! విను. నువ్వు చిఱుతడివి. ఎపుడూ ఆటలమీది అపేక్షతో మనసారా తిరుగుతూ కాలంగడిపే కుర్రవయస్సు నీది. అవమర్యాద, మర్యాదలు ఎందునూలేని చిన్నతనం నీది.

**తే. కాన మనమునఁ దద్వివేకంబు నీకుఁ, గలిగెనేనియు సంతోషకలితు లయిన**
**పురుషు లాత్మీయకర్మ విస్ఫురణఁ జేసి, వితతసుఖదుఃఖము లనుభవింతు రెపుడు. 238**

**ప్రతి :** కానన్= కాబట్టి; మనమునన్= ఆత్మలో; తద్= ఆ అవమాన, మానాలను గూర్చి; వివేకంబు= విప్పి చెప్పగల నేర్పు; నీకున్= నీకు; కలిగెన్+ఏనియున్= ఉండి ఉన్నా కూడా; సంతోషకలితులు+అయిన= సుఖంతో కూడుకున్నట్టి; పురుషులు= మనుజులు; ఆత్మీయ= తమవైన; కర్మ= పూర్వ కర్మలఫలితాన్ని అనుసరించి; విస్ఫురణన్+చేసి= తోచడంచే; ఎపుడున్= నిరంతరమూ; వితత= విరివి అయిన; సుఖమును= సంతోషమూ; దుఃఖమును= కష్టమూ; అనుభవింతురు= పొందుతారు.

**తా :** అవమానం, మానం గూర్చిన విభేదజ్ఞానం నీ కీ చిన్నవయస్సులో ఉండినా ఉండవచ్చు. అయినా సుఖజీవులకు ఆ మంచిచెడు విడమరచి చెప్పే నేర్పు వారివారి పూర్వకర్మానుసారంగా తట్టుతూ ఉంటుంది. అందువల్ల ఎక్కువ సుఖాలు గాని, ఎక్కువ దుఃఖాలుగాని అవిచ్ఛిన్నంగా పొందుతుంటారు.

**వ. కావున వివేకంబు గల పురుషుండు దనకుం బ్రాప్తంబులగు సుఖదుఃఖంబులు దైవవశంబులుగాఁ దలంచి తావన్మాత్రంబునం బరితుష్టుండగు; నీవును దల్లి చెప్పిన యోగమార్గ ప్రకారంబున సర్వేశ్వరానుగ్రహంబుఁ బొందెద నంటివేని. 239**

**ప్రతి :** కావునన్= కాబట్టి; వివేకంబు+కల= విచక్షణగల; పురుషుండు= జీవి; తనకున్= తనకు; ప్రాప్తంబులగు= దక్కునట్టి; సుఖదుఃఖంబులు= సంతసాలూ, శోకాలూ; దైవవశంబులు+కాన్= భగవదిచ్ఛలుగా; తలంచి= యోజించి; తావత్+మాత్రంబునన్= అంతమాత్రంగానే; పరితుష్టుండు+అగున్= సంతసిల్లినవాడవుతాడు; నీవును= నీవుకూడా; తల్లి=

సునీతి; చెప్పిన= బోధించిన; యోగమార్గ= ధ్యాన సమాధినిష్ఠ దారి; ప్రకారంబున= పద్ధతిలో; సర్వ+ఈశ్వర= విశ్వనాథుని యొక్క; అనుగ్రహంబున్= ప్రసన్నతను; పొందెదన్= పొందుతాను; అంటివి+ఏని= అన్నట్లయితే...

**తా :** కాన వివేకి తనకు దక్కిన సుఖదుఃఖాలు ఈశ్వరాధీనం అనుకుంటాడు. ప్రాప్యమైనంతలో సంతుష్టుడవుతుంటాడు. "నీవుకూడా నీ తల్లి చెప్పినట్టి ధ్యానయోగశాస్త్రపద్ధతితో ప్రవర్తించి ఆ జగన్నాథుని దయను సంపాదిస్తాను" అని అంటావనుకో.

**సీ. అనఘాత్మ! యోగీంద్రు లనయంబు ధరఁ బెక్కు జన్మంబులందు నిస్సంగమైన**
**మతిని బ్రయోగ సమాధినిష్ఠలఁ జేసి యైనను దెలియ లే రతని మార్గ;**
**మది గాన యతఁడు దురారాధ్యుఁ డగు నీకు; నుడుగుము నిష్ఫలోద్యోగ మిపుడు**
**గాక నిశ్శ్రేయసకాముండ వగుదేనిఁ దంత్రి వర్తించు తత్కాలమందుఁ**

**తే. బూని సుఖదుఃఖముల రెంటిలోన నెద్ది, దైవవశమునఁ జేకుఱు దానఁజేసి**
**డెందమునఁ జాల సంతుష్టి నొందువాఁడు, విమలవిజ్ఞాని యన భువి వెలయుచుండు. 240**

**ప్రతి :** అనఘ+ఆత్మ!= కల్మషంలేని బిడ్డా!; యోగి+ఇంద్రులు= యోగీశ్వరులు; అనయంబు= సతతం; ధరన్= అవనిలో; పెక్కు= పలు విధాలైన; జన్మంబుల+అందున్= పుట్టుకలందు; నిస్+సంగము+ఐన= సర్వసంగ పరిత్యాగంగల; మతిని= మనస్తత్వంతో; ప్రయోగ= అవలంబించిన; సమాధి= నిరంతరధ్యానయోగాన్ని; నిష్ఠలన్+చేసి+ఐనను= ధర్మాదులందలి శ్రద్ధతో నిలుకడగా సాధన పాటించిన్నీ; అతని= ఆ పరంధాముని; మార్గమున్= ఉపాయాన్ని; తెలియలేరు= ఎరుగలేకున్నారు; అది+కాన= అందుకని; అతఁడు= ఆ విష్ణుమూర్తి; నీకున్= నీకు; దుస్+ఆరాధ్యుఁడు= సేవించ అశక్యుడు; అగున్= అవుతాడు; ఇపుడు= ఈ తగని తరుణంలో; నిష్ఫల= ఫలం దక్కని; ఉద్యోగము= యోగసాధనవలని ప్రయాసను; ఉడుగుము= మానుము; కాక= అలాకాని పక్షంలో; నిస్+శ్రేయస+కాముఁడవు= ముక్తిని అభిలషించే వాడివి; అగుదు(వు)+ఏనిన్= కాదలచినట్లయితే; తంత్రి; వర్తించు= రాబోయే; తద్+కాలము+అందున్= ఆ తఱిలో; పూని= పట్టుపట్టి; సుఖములన్= ఆనందాల్లో; దుఃఖములన్= కష్టాల్లో; రెంటిలోనన్= ఈ ద్వయంలో; ఎద్ది= ఏది; దైవవశమునన్= ఈశ్వరేచ్ఛచే; చేకుఱున్= పట్టుపడుతుందో; దానన్+చేసి= అది కారణంగా; డెందమునన్= హృదిలో; చాలన్= మెండుగా; సంతుష్టిన్= పూర్తి తనివిని; ఒందువాఁడు= పొందువాడు; విమల విజ్ఞాని= 'అచ్ఛమైన విశేషజ్ఞానం కలవాడు'; అనన్= అనేలా; భువిన్= ప్రపంచంలో; వెలయున్= ప్రసిద్ధికెక్కుతూ; ఉండున్= జీవిస్తాడు.

**తా :** పుణ్యాత్మా! మహామహాయోగీశ్వరులంతా తెంపులేని భూలోకజన్మల్లో సంసారం పట్టక సదా మననమతితోనే ఉంటారు. ధర్మబద్ధంగా శ్రద్ధాళువులై యోగసాధన చేస్తారు. నిశ్చలసమాధి యోగస్థితిలోనూ ఆ దైవం తెరవును ఆ యోగులు కనుక్కో లేకున్నారు. అందువల్ల నీకు కేవలం ఆరాధన మాత్రాన ఆ దైవం శక్యుడు గాడు. ఈ అదనులో వృథా అయిపోయే ఆ యోగవిద్యాభ్యాసప్రయత్నాన్ని విరమించు. అలా కాదు ముముక్షువును కాదలచాను అంటే ఆ పూనిక పట్టు. కావడికుండలవంటి సుఖదుఃఖాలు రెంటిలో ఏది ఎంత విధివిహితంగా సంప్రాప్తిస్తుందో అంతే ఆత్మసంతృప్తితో ఈ విశ్వంలో మనగల్గినవాడు నిజమైన విజ్ఞానిగా పేరుపొందుతాడు.

**వ. మఱియు గుణాఢ్యుం డగువానిం జూచి సంతోషించుచు నాభాసుం డగు వానిం జూచి కరుణించుచు సమానునియెడ మైత్రి సలుపుచు వర్తించుచున్నవాఁడు తాపత్రయాదికంబులం దొఱంగునని నారదుండు**

**పలికిన విని ధ్రువుం డిట్లనియె; ననఘా; యీ శమంబు సుఖదుఃఖహతాత్ము లగు పురుషులకు దుర్గమం బని కృపాయత్తుండ వైన నీచేత వినంబడె; నట్లయినం బరభయంకరంబగు క్షాత్త్రధర్మంబు నొందిన యవినీతుండ నగు నేను సురుచి దురుక్తిబాణ వినిర్భిన్న హృదయుండ నగుట మదీయచిత్తంబున శాంతి నిలువదు; కావునం ద్రిభువనోత్కృష్టంబు ననన్యాధిష్ఠితంబు నగు పదంబును బొంద నిచ్ఛించిన నాకు సాధుమార్గంబు నెఱింగింపుము; నీవు భగవంతుండగు నజుని యూరువువలన జనించి వీణావాదన కుశలుండవై జగద్ధితార్థంబు సూర్యుండునుంబోలె వర్తింతు వనిన విని. 241**

**ప్రతి :** మఱియును= ఇంకను ఆ పురుషుడు; గుణ+ఆఢ్యుండు= గుణసంపన్నుందు; అగువానిన్= అయినవాణ్ణి; చూచి= కని; సంతోషించుచున్= సంతసించుచు; ఆభాసుండగువానిన్+చూచి= మిట్టిపడే వానింజూచి; కరుణించుచున్= జాలి కనబరుస్తూ; సమానుని+ఎడన్= సాటివాని పట్టున; మైత్రి= చెలిమిని; సలుపుచున్= కావిస్తూ; వర్తించుచున్+ ఉన్నవాఁడు= ఉంటూ ఉన్నట్టివాడు; తాపత్రయ+ఆదికంబులన్= ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికము మొదలైన తాపాలన్నిటిని; తొఱంగున్= వీడతాడు; అని= అని; నారదుండు= నారదుడు; పలికినన్= మాట్లాడగా; విని= ఆలకించి; ధ్రువుండు= ధ్రువుడు; ఇట్లు= ఇలా; అనియెన్= అన్నాడు; అనఘా= ఓ పుణ్యుడా!; ఈ శమంబు= ఈ శాంతి; సుఖ= భోగం చేతా; దుఃఖ= శోకం చేతా; హత+ఆత్ములు+అగు= కోలుపోయిన మతులుకల; పురుషులకున్= జీవులకు; దుర్గమంబు= దాట వీలు కానిది; అని= అని; కృపా+ఆయత్తుండవు+ఐన= దయకు అధీనుడవైన; నీ చేత= నీ వల్ల; వినంబడెన్= నా చెవిని పడింది; అట్లు+అయినన్= అలాగయితే; పర= పగరకు; భయంకరంబు+అగు= వెరపు కల్గించేది అయిన; క్షాత్రధర్మంబున్= రాచఱికాన్ని; ఒందిన= పడసిన; అవినీతుండన్+అగు= అడకువ లేనివాడను అయిన; నేను= నేను; సురుచి= పినతల్లి; దురుక్తి= హితవుకాని వాక్యాలనే; బాణ= శరాలతో; వినిర్భిన్న= వ్రక్కలయిన; హృదయుండన్+ అగుటన్= గుండె కలవాడను అవడంవల్ల; మదీయ= నా యొక్క; చిత్తంబునన్= అంతఃకరణంలో; శాంతి= శమం; నిలువదు= ఉండదు; కావునన్= కాబట్టి; త్రిభువన= ముల్లోకాల్లో కెల్లా; ఉత్కృష్టంబున్= మెరుగుఅయినది; అనన్య అధిష్ఠితంబును+అగు= ఇతరులచే అధిష్ఠింపబడనిది అగు; పదంబును= స్థానాన్ని; పొందను= ఒందను; ఇచ్ఛించిన= అభిలషించినట్టి; నాకున్= నాకు; సాధుమార్గంబున్= బాగుబాటను; ఎఱింగింపుము= వివరించు; నీవు= నువ్వు; భగవంతుండు అగున్= దైవం అయినట్టి; అజుని= స్వయంభువునియొక్క; ఊరువువలనన్= తొడనుంచి; జనించి= పుట్టి; వీణావాదన= వీణను మీటడంలో; కుశలుండవు+ఐ= నిపుణుడవై; జగత్+హిత+అర్థంబు= లోక క్షేమంకోసం; సూర్యుండునున్+పోలెన్= రవి వలె; వర్తింతువు= సంచరిస్తావు; అనినన్= అనగానే; విని= ఆలకించి...

**తా :** ఇంకా సద్గుణవంతుణ్ణి చూసి మురియాలి. గుణవంతుడివలె నటించేవాళ్లమీద దయతలవాలి. సరిసాటి వారితో చేతులు కలపాలి. ఇలా ఉంటుండేవాడు ఆధ్యాత్మికాది కష్టాలు మూటినీ, విడనాడ గల్గుతాడు అని నారదుడు తెలియచెప్పాడు. అది విని ధ్రువుడు ఇలా అన్నాడు. ఓ పావనుడా! ఈ శమం సుఖదుఃఖ పీడిత మనస్కులకు పొంద వీలుకానిదని అపారదయామయుడవైన నీనోట విన్నాను. అలాంటపుడు శత్రువులకు దడపుట్టించే రాచగుణం నాది. వినమ్రత లేక పోవడం సహజం. అలాంటి నేను సురుచి దురుసు మాటల బాణాలపెట్టువల్ల పగిలిన గుండె కలవాడను. అందువల్ల నా ఎదలో శాంతిపారం నిలకడగా పట్టి ఉండదు. కాన మూడులోకాల్లోకి మేల్తరమైంది, మరొకరిది కానిది, వాసయోగ్యమైనది అయిన చోటును పొందాలని ఆశపడుతున్నాను. నా కొక మంచి దోవ చూపు. నువ్వు పరదైవం అయిన బ్రహ్మ తొడనుంచి

పుట్టినవాడవు. వీణావాదనంలో బహు నేర్పరివి. ఈ లోకం శ్రేయస్సు కోసరమే సూర్యునివలె తిరుగుతూ ఉంటావు. అనగా విని

**క. నారదుఁడిట్లను ననఘ! కు, మారక! విను నిన్ను మోక్షమార్గంబునకున్**
**బ్రేరేచినవాఁ డిప్పుడు, ధీరజనోత్తముఁడు వాసుదేవుం డగుటన్. 242**

**ప్రతి :** నారదుఁడు= బ్రహ్మకుమారుడు; ఇట్లు= ఇలాగున; అనున్= బదులు పలికాడు; అనఘ= పాపరహితుడ!; కుమారక= బాలక!; వినుము= వినవలసింది; ఇపుడు= ఈ సందర్భాన; నిన్నున్= నిన్ను; మోక్షమార్గంబునకున్= ముక్తి పంథాకు; ప్రేరేచినవాఁడు= పురికొల్పినవాడు; ధీరజన+ఉత్తముఁడు= ధీరోత్తముడు; వాసుదేవుండు= వసుదేవపుత్రుడు విష్ణువు; అగుటన్= అవడం వల్లనే.

**తా :** నారదుడు ధ్రువుడితో మళ్లీ ఇలా అన్నాడు. ఓ పుణ్యుడా! ఓ బిడ్డా! విను. నిన్ను ఇపుడు ముక్తి పథానికి ప్రేరేపించినవాడు. ధీరోత్తములలో ముఖ్యుడైన వాసుదేవుడే అందుచేత

**వ. నీవు నమ్మహాత్ముని నజస్రధ్యానప్రవణచిత్తుండవై భజియింపుము. 243**

**ప్రతి :** నీవున్= నీవు; ఆ+మహా+ఆత్మునిన్= ఘనత పొందిన ఆ పురుషుణ్ణి; అజస్ర= అనవరతం (ఏకనిష్ఠమైన); ధ్యాన= చెదరని తలంపునందే; ప్రవణ= ఒరగిన; చిత్తుండవు+ఐ= మనస్సు కలవాడవై; భజియింపుము= సేవించు.

**తా :** నువ్వున్నూ ఆ కీర్తిమంతుణ్ణి తెరపి ఇవ్వని తదేకమైన ధ్యానం వైపుకే మొగ్గు చూపే మనస్సుతో ఆరాధించు.

**క. పురుషుఁడు దవిలి చతుర్విధ, పురుషార్థశ్రేయ మాత్మఁ బొందెద ననినన్**
**ధరఁ దత్ప్రాప్తికి హేతువు, హరిపదయుగళంబు దక్క నన్యము గలదే? 244**

**ప్రతి :** పురుషుఁడు= జనుడు; తవిలి= జోక్యం చేసుకుని; చతుర్+విధ= నాలుగు ప్రకారాలైన; పురుషార్థ= ధర్మార్థ కామ మోక్షాలవలని; శ్రేయము= శుభాన్ని; ఆత్మన్= మనస్సులో; పొందెదను= పొందుతాను; అనినన్= అన్నచో; ధరన్= భువిలో; తద్= ఆ శ్రేయమార్గం యొక్క; ప్రాప్తికిన్= లబ్ధికి; హేతువు= కారణం; హరిపదయుగళంబు= విష్ణు పాదపద్మాల జంట; తక్కన్= తప్ప; అన్యము= వేరైనది; కలదే= ఉందా.

**తా :** 'ఆసక్తితో మనుజుడు ధర్మార్థ కామమోక్షాలవల్ల కలిగే మంచిని పొందవలయునని మనసులో కోరుకుంటే భూమిపై ఆ శ్రేయస్సిద్ధికి మూలం విష్ణుపాదపద్మసేవనం తప్ప మరొకటి ఉన్నదా?

**వ. కావున. 245**

**ప్రతి :** కావునన్= కాబట్టి.

**క. వరయమునానదితటమున, హరిసాన్నిధ్యంబు శుచియు నతిపుణ్యమునై**
**పరఁగిన మధువనమునకును, సరసగుణా! చనుము మేలు సమకుఱు నచటన్. 246**

**ప్రతి :** సరసగుణా= మనోహరాలైన గుణాలు కలవాడా!; వర= ఉత్తమం అయిన; యమునానది= యమునానదియొక్క; తటమున= ఒడ్డున; హరి= విష్ణువుయొక్క; సాన్నిధ్యంబు= సామీప్యం; శుచియున్= పరిశుద్ధమూ; అతిపుణ్యమున్+ఐ=

పావన తమమునూ ఐ, పరఁగిన= ప్రసిద్ధమైన; మధువనమునకును= మధువన క్షేత్రానికి; చనుము= వెళ్లు; అచటన్= ఆ వనంలో; మేలు= శుభం; సమకుఱున్= ఒనగూడుతుంది.

**తా :** గుణమనోహరా! శ్రేష్ఠమయిన యమునానది ఒడ్డున మధువనం ఉంది. అది అతి పవిత్రమైంది. పుణ్యప్రదమైంది. ప్రసిద్ధమైంది. ఈ క్షేత్రం విష్ణు సన్నిధికలది. అక్కడకు వెళ్లు. నీకు శుభం కల్గుతుంది.

**క. ఆ యమునాతటినీ శుభ, తోయములం గ్రుంకి నిష్ఠతో నచ్చట నా**
**రాయణునకును నమస్కృతు, లాయతమతిఁ జేసి చేయు యమనియమములన్. 247**

**ప్రతి :** ఆ= ప్రశస్తమైన; యమునాతటినీ= యమునానదియొక్క; శుభ= స్వచ్ఛమైన; తోయములన్= నీళ్లల్లో; క్రుంకి= మునిగి; నిష్ఠతోన్= శ్రద్ధతో; అచ్చట= ఆ మధువనంలో; నారాయణునకును= శ్రీమన్నారాయణునికి; నమస్కృతులు= జేజేలు; ఆయతమతిన్= సిద్ధమైన నిశ్చయంతో; చేసి= ఒనర్చి; యమనియమములన్= యమము, నియమములను; చేయు= ఆచరించు.

**తా :** శుభ్రమైన ఆ యమునానది జలాల్లో మునుకలు వేసి, ఆ క్షేత్రంలోని నారాయణమూర్తికి అత్యంత శ్రద్ధతో మొక్కుకో. సంసిద్ధమైన తలంపుతో యమనియమాలను ఆచరించు.

**విశే :** పతంజలియోగశాస్త్రం ప్రకారం –

యమములు : అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం.

నియమములు : శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వర ప్రణిధానం.

**వ. మఱియు బాలుండ వగుటంజేసి వేదాధ్యయనాద్యుచితకర్మానర్హుండ వయ్యు నుచితంబులగు కుశాజినంబులం జేసి స్వస్తిక ప్రముఖాసనంబులం గల్పించికొని త్రివృత్ప్రాణాయామంబులచేతం బ్రాణేంద్రియ మనోమలంబు లను చాంచల్య దోషంబుల హరించి స్థిరం బయిన చిత్తంబున. 248**

**ప్రతి :** మఱియున్= ఇంకనూ; బాలుండవు= బుడుతడవు; అగుటన్+చేసి= కావడం వల్ల; వేద= వేదంయొక్క; అధ్యయన= చదవడం; ఆది= మొదలైనవాటికి; ఉచిత= అనుకూలమైనట్టి; కర్మ= చేతలకు; న+అర్హుండవు= అయోగ్యుడవు; అయ్యున్= అయినప్పటికిన్నీ; ఉచితంబులు+అగు= పరిచితాలు అయినట్టి; కుశ= దర్భలను; అజినంబులన్+చేసి= జింకచర్మాలను సిద్ధం చేసి; స్వస్తిక= స్వస్తికం; ప్రముఖ= మొదలైన; ఆసనములన్= యోగపీఠములను; కల్పించుకొని= సృజించుకొని; త్రివృత్= మూడు ఆవృత్తుల; ప్రాణాయామంబులచేతన్= ప్రాణాయామాలచేత; ప్రాణ= ప్రాణాలలోని, ఇంద్రియ= ఇంద్రియాల్లోని; మనస్= మనం లోని; మలంబులను= దోషాలను; చాంచల్య= చపలచిత్తంవలని; దోషంబులన్= తప్పులను; హరించి= నాశనం చేసి; స్థిరంబు+అయిన= దిటవైన; చిత్తంబున= మనస్సుతో.

**తా :** ఇంకా నువ్వు పసివాడవు. వేదం వల్లించడం వంటి తదుచిత కర్మలకు తగని వయస్సువాడవు. అయినా కూడా నీకు యుక్తంగా ఉండే కుశలు, జింక చర్మాలను స్వస్తికం మొదలైన యోగాసనాలను ఏర్పరచుకో. తడవకు మూటి చొప్పున మూడు తడవులు ప్రాణాయామం చెయ్యి. ప్రాణం, ఇంద్రియం, మనస్సు వీటిలోని దోషాల్ని నిలుకడ లేని మనస్సువల్ల దొర్లే పొరపాట్లను తుడిపేసుకో, దిట్టపడ్డ హృదయంతో.

**విశే :** పూరకం, కుంభకం, రేచకం అనేవి మూడూ కలిపి ఒక ప్రాణాయామం. అట్టి దానిని మూడుమారులు చేయటం త్రివృత్ ప్రాణాయామం.

**సీ. ఆశ్రితసత్ప్రసాదాభిముఖుండును నిద్ధప్రసన్నాననేక్షణుండు**
**సురుచిరనాసుండు సుభ్రూయుగుండును సుకపోలతలుఁడును సుందరుండు**
**హరినీలసంశోభితాంగుండుఁదరుణుండు నరుణావలోకనోష్ఠాధరుండు**
**గరుణాసముద్రుండుఁబురుషార్థనిధియును బ్రణతాశ్రయుండు శోభనకరుండు**

**తే. లలితశ్రీవత్సలక్షణలక్షితుండు, సర్వలోక శరణ్యుండు సర్వసాక్షి**
**పురుషలక్షణయుక్తుండుఁబుణ్యశాలి, యసితమేఘనిభశ్యాముఁడవ్యయుండు. 249**

**ప్రతి :** ఆశ్రిత= అండ గొన్నవాళ్లకు; సద్= ఉత్తమం అయిన; ప్రసాద= అనుగ్రహం కల్గించడంలో; అభిముఖుండునున్= సుముఖుడూ; ఇద్ధ= కాంతిమంతమైన; ప్రసన్న= నిర్మలమైన; ఆనన= మొగమూ; ఈక్షణుండున్= చూపులు కలవాడు; సురుచిర= సొబగైన; నాసుండున్= ముక్కు కలవాడూ; సుభ్రూ= చూడ ముచ్చట అయిన వంకలుదీరిన కనుబొమలయొక్క; యుగుండును= జంట కలవాడూ; సుకపోలతలుఁడును= తీరైన చెక్కిలి ప్రదేశాలు కలవాడూ; సుందరుండున్= సొగసుకాడూ; హరినీల= ఇంద్రనీలమణులవంటి; సంశోభిత= అందగించిన; అంగుండున్= శరీరం కలవాడూ; తరుణుండున్= యౌవనవంతుడూ; అరుణ= ఎరుపు గల; అవలోకన= కళ్లూ; ఓష్ఠ= పై పెదవీ; అధరుండు= కింది పెదవీ కలవాడూ; కరుణాసముద్రుండున్= దయాసాగరుడూ; పురుషార్థనిధియును= చతుర్విధ పురుషార్థాలకూ ఆశ్రయమైనవాడూ; ప్రణత= నమస్కృతులు చేసేవారికి; ఆశ్రయుండున్= ఆసరా అయినవాడూ; శోభనకరుండున్= మంగళకరుడూ; లలిత= మనోజ్ఞమైన; శ్రీవత్స= శ్రీవత్సం అనే; లక్షణ= పేరుగల మచ్చచేత; లక్షితుండును= గురుతుపట్టబడేవాడూ; సర్వలోక= యావత్ జగత్తుకూ; శరణ్యుండున్= శరణు కోరదగ్గవాడూ; సర్వ= అన్నింటిని; సాక్షి= చూచేవాడూ; పురుషలక్షణ= జగత్కారణపుంస్త్వస్వభావంతో; యుక్తుండున్= కూడినవాడూ; పుణ్యశాలి= సుకృతంతో ఒప్పారేవాడూ; అసిత= నల్లటి; మేఘ= మబ్బుతో; నిభ= సదృశమైన; శ్యాముఁడు= నీలవర్ణుడు; అవ్యయుండు= వికారశూన్యుడూ...

**తా :** తన రక్షణను అర్థించి వచ్చిన వాళ్లకు మంచి దయను చూపడానికి సంసిద్ధమై ఉండేవాడు, ప్రకాశించే ప్రసన్నమైన ముఖం, చూపులూ కలవాడూ, అందమైన ముక్కు, మంచి రెండు కనుబొమలు, మంచి చెక్కిళ్ళు కలవాడు, అందమైనవాడు, ఇంద్రనీలంపు సొంపులు ఒలికే ఒంటితీరు కలవాడు, మిసమిసలాడే ప్రాయం కలవాడు, ఎర్రని కన్నులూ, పెదవులూ కలవాడు, కరుణకు కడలివంటివాడు, ధర్మార్థకామమోక్షాలకు ఆశ్రయుడు, భక్తులకు ఆశ్రయమైనవాడు మంగళకరుడు, శ్రీవత్సమనే పుట్టుమచ్చ కలిగినవాడు, అందరికీ దిక్కయినవాడు, సర్వానికీ సాక్షి భూతుడు, పురుషలక్షణం కలిగిన పుణ్యశాలి, నీలిమబ్బు చాయవాడు, అవ్యయుడు

**వ. మఱియును. 250**

**ప్రతి :** ఇంకాను.

**సీ. హారకిరీటకేయూర కంకణఘన భూషణుండాశ్రిత పోషణుండు**
**లాలితకాంచీకలాపశోభితకటి మండలుం డంచిత కుండలుండు**

**మహనీయకౌస్తుభమణిఘృణిచారు గ్రైవేయకుం డానందదాయకుండు**
**సలలితఘనశంఖచక్రగదాపద్మహస్తుండు భువనప్రశస్తుండజుఁడు**

**తే. గమ్రసౌరభవనమాలికాధరుండు, హతవిమోహుండు నవ్యపీతాంబరుండు**
**లలితకాంచననూపురాలంకృతుండు, నిరతిశయసద్గుణుఁడు దర్శనీయతముఁడు. 251**

**ప్రతి :** హార= నూటెనిమిది పేటల ముత్యాలదండ; కిరీట= మకుటం; కేయూర= బాహుపురులు; కంకణ= కడియాలు అనే; ఘన= అతిశయం కల; భూషణుండు= ఆభరణాలు కలవాడు; ఆశ్రిత= దరిచేరినవాళ్లను; పోషణుండున్= పోషించేవాడూ; లాలిత= అందమైన; కాంచీ= మొలనూలు అనే; కలాప= అలంకరణంతో; శోభిత= ఒప్పిన; కటిమండలుండు= నడుము ప్రదేశం కలవాడు; అంచిత= ఒప్పిదమైన; కుండలుండు= (మకర) కుండలాలు కలవాడు; మహనీయ= మహత్తరమైన; కౌస్తుభమణి= కౌస్తుభం అనే పచ్చయొక్క; ఘృణి= వెలుగుతో; చారు= అందమైన; గ్రైవేయకుండు= కంఠహారం కలవాడు; ఆనంద= సంతోషాన్ని; దాయకుండు= పంచేవాడు; సలలిత= మంజులమైన; ఘన= శ్రేష్ఠమైన; శంఖం= శంకువు; చక్రం= సుదర్శనం; గదా= గద; పద్మ= పద్మం కల; హస్తుఁడు= చేతులు కలవాడు; భువన= లోకాలలో; ప్రశస్తుఁడు= ప్రసిద్ధికెక్కినవాడు; అజుఁడు= పుట్టువు లేనివాడు; కమ్ర= ఇంపైన; సౌరభ= సువాసన కల; వనమాలికా= అడవిపూల దండను; ధరుండు= తాల్చినవాడు; హత= పోగొట్టబడిన; విమోహుండు= కడు అజ్ఞానంకలవాడు; నవ్య= సరికొత్తదైన; పీత= పసుపుపచ్చని; అంబరుండు= వలువకలవాడు; లలిత= మనోజ్ఞమైన; కాంచన= బంగారు; నూపుర= అందియలచే; అలంకృతుండు= సింగారించబడినవాడు; నిరతిశయ= మరొకచోట ఇంతకంటె మించిలేని; సద్+గుణుఁడు= మంచిస్వభావం కలవాడు; దర్శనీయతముఁడు= చూడాలనిపించేవాళ్లల్లో గొప్పవాడు.

**తా :** నూటెనిమిది పేటల ముత్యాలపేరు, మకుటం, సందికడియాలు, కడియాలు వంటినగలు దిట్టంగా తొడిగినవాడు, ఆలనలో పెనుపరి అయినవాడు, మొలకు అందం తెచ్చే మొలనూలు, చెవుల్లో నప్పిన కుండలాలు, వక్షాన ఘనంగా అగుపించే కౌస్తుభమణి ధగధగలతో మెరిసిపోతున్న కంఠహారం తాల్చినవాడు, ఉల్లాసకరుడు, మనోహరమైన శంఖం, చక్రం, గద, పద్మము పట్టిన చేతులు కలవాడు, విశ్వవిఖ్యాతుడు, పుట్టుకలేనివాడు, గుప్పున గుబాళించే వనమాలికను వేసుకున్నవాడు, అజ్ఞానాన్ని తరిమికొట్టేవాడు, పసుపు పచ్చటి కొత్తదైన పుట్టం కట్టినవాడు, అపరంజి మంజీరాలు పెట్టినవాడు, అత్యంతమైన మంచితనం గూడుకట్టినవాడు, చూడముచ్చటైనవాడు,

**క. సరసమనోలోచన ము, త్కరుఁడును హృత్పద్మకర్ణికానివసిత వి**
**స్ఫురదురునఖమణిశోభిత, చరణసరోజాతుఁ డతులశాంతుఁడు ఘనుఁడున్. 252**

**ప్రతి :** సరస= భావపరిపూర్ణమైన; మనస్+లోచన= మనస్సుకు, కంటికీ; ముత్+కరుఁడును= సంతసం కల్గించేవాడు; హృత్= ఎడద అనే; పద్మ= తామరపూవు యొక్క; కర్ణికా= దుద్దులో; నివసిత= వాసం చేయబడ్డ; విస్ఫురత్= ప్రకాశమాన మైనట్టి, ఉరు= పెద్దవి అయిన; నఖ= గోళ్లనే; మణి= మణులచేత; శోభిత= సొగసుగా చేయబడ్డ; చరణసరస్+జాతుడు= పాదపద్మాలు కలవాడు; అతుల= పోలికలేని; శాంతుఁడు= మృదుస్వభావుడు; ఘనుఁడున్= గొప్పవాడున్నూ.

**తా :** మంచిభావాలు నిండిన మనస్సుకూ, నేత్రాలకూ ఉల్లాసం కలిగించేవాడూ, హృదయమనే పద్మం దుద్దులో నివసించే విరివిగా వెలుగులు చిమ్మే, పెద్ద నఖాలనే మణులు అలంకారంగాగల పదపద్మయుగళుడూ, సాటిలేని మృదుహృదయుడూ మహాపురుషుడూ.

**వ. అయిన పురుషోత్తముం బూజించుచు హృదయగతుండును, సానురాగ విలోకనుండును, వరదశ్రేష్ఠుం డును నగు నారాయణు నేకాగ్రచిత్తంబున ధ్యానంబు సేయుచుఁ బరమ నివృత్తి మార్గంబున ధ్యాతుండైన పురుషోత్తముని దివ్యమంగళస్వరూపంబు చిత్తంబునం దగిలిన మరల మగుడ నేర దదియునుంగాక యే మంత్రంబేని సప్తవాసరంబులు పఠియించిన ఖేచరులం గనుంగొను సామర్థ్యంబు గలుగు; నట్టి ప్రణవయుక్తంబగు ద్వాదశాక్షర కలితంబును దేశకాలవిభాగవేదిబుధానుష్ఠితంబును నయిన వాసుదేవమంత్రంబునం జేసి. 253**

**ప్రతి :** అయిన= అయినట్టి; పురుష+ఉత్తమున్= పురుషప్రముఖుని; పూజించుచున్= అర్చిస్తూ; హృదయగతుండును= మనస్సులో పాదుకున్నవాడూ; స+అనురాగ= ప్రేమతో కూడిన; విలోకనుండును= చూపులు కలవాడూ; వరద+శ్రేష్ఠుండునున్= వరం ఇచ్చే వాళ్లల్లో మేలయినవాడూ; అగు= అయినట్టి; నారాయణున్= విష్ణువును; ఏకాగ్ర= ఏకవిషయలగ్నమైన; చిత్తంబునన్= మనస్సుతో; ధ్యానంబు చేయుచున్= తలపోస్తూ, పరమనివృత్తి మార్గంబున= విషయాల మీదికి తిరిగి ప్రవర్తింపనీయని గొప్ప యోగ గతితో; ధ్యాతుండు+ఐ= ధ్యానించబడేవాడు అయిన; పురుషోత్తముని= ఆ పరమపురుషుడైన నారాయణుడియొక్క; దివ్య= మనోజ్ఞమైన; మంగళ= శుభమైన; స్వరూపంబు= విగ్రహం; చిత్తంబునన్= మనస్సునందు; తగిలినన్= కూడితే; మరలన్= తిరిగి; మగుడన్+నేరదు= వెనక్కి మళ్లిపోదు; అదియునున్+కాక= అంతేకాక; ఏ మంత్రంబు+ఏనిన్= ఏ మంత్రం అయితే; సప్తవాసరంబులు= ఏడు దినాలు; పఠియించినన్= జపించినచో; ఖేచరులన్= ఆకాశసంచారులైన వేల్పుల్ని; కనుంగొను= చూడకలిగే; సామర్థ్యంబు= శక్తి; కలుగున్= అబ్బుతుంది; అట్టి= అలాంటి; ప్రణవయుక్తంబు+అగు= ఓంకారంతో కూడినదైన; ద్వాదశ+అక్షర= **ఓం నమోభగవతే వాసుదేవాయ** అనే పన్నెండు అక్షరాలతో; కలితంబును= కూడి ఉన్నదీ; దేశ= చోటు; కాల= సమయం; విభాగంబును= విభజనమూ; వేది= తెలిసినట్టి; బుధ= విజ్ఞానులచే; అనుష్ఠితంబునున్= ఆచరించబడేదీ; అయిన= అయినట్టి; వాసుదేవ మంత్రంబునన్ చేసి= వాసుదేవమంత్రంతో...

**తా :** అలాంటి పురుషపుంగవుణ్ణి ఆరాధించు. మనసులో నెలకొన్నవాడూ; ప్రీతిగల చూపుకలవాడూ; కోర్కెలు తీర్చే ఉత్తముడూ; అయిన ఆ విష్ణుమూర్తిని ఏకాగ్రచిత్తంతో స్మరించుకో, గొప్ప ముక్తి సాధనమార్గంతో తపస్సు చెయ్యి. అలా ప్రతిష్ఠితం అయిన ఆ దివ్యమంగళరూపం తిరుగు ముఖం పట్టదు. అంతేకాదు ఏ మంత్రాన్ని ఏడు పొద్దులు జపిస్తే దివ్యులను చూడగల శక్తి అలవడుతుందో, అలాంటిది ఓంకారంతో కూడిన పన్నెండక్షరాల వాసుదేవమంత్రం. ఇది ఏ ప్రదేశంలో ఏ వేళలో ఎలా విభక్తమో, తెలిసిన వివేకులు అనుష్ఠించే మంత్రం. ఈ మంత్ర మననంవల్ల

**విశే :** "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనేది ద్వాదశాక్షరీమంత్రం. దీనికే 'వాసుదేవద్వాదశాక్షరి' అని నామాంతరం.

**సీ. దూర్వాంకురంబుల దూర్వాంకురశ్యాము జలజంబులను జారుజలజనయనుఁ**
**దులసీదళంబులఁ దులసికాదాముని మాల్యంబులను వినిర్మలచరిత్రుఁ**
**బత్త్రంబులను బక్షిపత్త్రునిఁ గడు వన్య మూలంబులను నాదిమూలఘనుని**
**నంచితభూర్జత్వగాదినిర్మిత వివిధాంబరంబులను బీతాంబరధరుఁ**

**తే. దనరు భక్తిని మృచ్ఛిలాదారు రచిత, రూపములయందుఁ గాని నిరూఢమైన**
**సలిలములయందుఁ గాని సుస్థలములందుఁ, గాని పూజింపవలయు నక్కమలనాభు. 254**

**ప్రతి :** దూర్వా+అంకుర= గరిక పోచలను పోలిన; శ్యామున్= చామన చాయకలవాణ్ణి; దూర్వా+అంకురంబులన్= గడ్డిపరకలతోనూ; చారు= తీరైన; జలజ= పద్మాల వంటి; నయనున్= కళ్లు గలవాణ్ణి; జలజంబులను= పద్మాలతోనూ; తులసికాదామునిన్= తులసిదళాల హారాలు వేసుకున్నవాణ్ణి; తులసి దళంబులన్= తులసిరెమ్మలతోనూ; వినిర్మల= మాలిన్యంలేని; చరిత్రున్= నడత కలవాణ్ణి; మాల్యంబులను= పూలదండలతోనూ; పక్షిపత్త్రునిన్= గరుడపక్షి వాహనం అయినవానిని; పత్త్రంబులను= పర్ణాలతోనూ; ఆదిమూల= మొదలిఆధారమైన; ఘనునిన్= పరమమూర్తిని; కడు= మిక్కిలి; వన్య= అడవిలోపుట్టినచెట్ల; మూలంబులనున్= మూలికలతోనూ; పీత= పచ్చని; అంబరధరున్= వస్త్రం కట్టినవాణ్ణి; అంచిత= సుందరమైన; భూర్జ= బుజపత్రిచెట్టుయొక్క; త్వక్= బెరడు; ఆది= మొదలుగాగలవాటితో; నిర్మిత= తయారైన; వివిధ= పలురకాలైన; అంబరములను= నారబట్టల చేతనూ; తనరు= ఒప్పారే; భక్తిని= సేవతో; మృత్= మట్టితో; శిలా= పాషాణంతో, దారు= కొయ్యతో; రచిత= కూర్చబడిన; రూపముల అందున్+కాని= విగ్రహాల్లో కాని; నిరూఢము+ఐన= ప్రశస్తమైన; సలిలముల+అందున్+కాని= తీర్థాల్లో కాని; సుస్థలములందున్+కాని= పుణ్యక్షేత్రాల్లోకాని; ఆ+కమలనాభున్= ఆ వెన్నుని; పూజింపవలయున్= సేవించాలి.

**తా :** గడ్డిపరకల బోలిన చామనచాయకల వాసుదేవుణ్ణి గరికపోచలతో అర్చించాలి. చక్కనైన పద్మాలవంటి నేత్రాలు కలవాణ్ణి పద్మాలతో పూజించాలి. తులసిమాలలు తాల్చే వాణ్ణి మూడాకుల తులసిరెమ్మలతో సేవించాలి. నిష్కళంకమైన చరిత్ర కలవాణ్ణి పూలమాలలతో, గరుడపక్షి రెక్కలమీద విహరించేవాణ్ణి ఆకులతో, లోకాలకు మూలదుంపవంటి పరమేశ్వరుణ్ణి వనమూలికలతో, పసుపుపచ్చటి పుట్టం కట్టుకునేవాణ్ణి చెట్టుబెరడుపట్టలతో నేసిన నారబట్టలతోనూ, భజించాలి. మన్నుతో, రాయితో, కొయ్యతో దిద్దిన విగ్రహమూర్తుల్లో గాని, ప్రసిద్ధమైన పుణ్యతీర్థాల్లో గాని, క్షేత్రాల్లో గాని ఆ నారాయణుణ్ణి కొలవాలి.

**క. ధృతచిత్తుఁడు శాంతుండు ని, యతపరిభాషణుఁడు సుమహితాచారుఁడు వ**
**ర్ణితహరిమంగళగుణుఁడును, మితవన్యాశనుఁడు నగుచు మెలఁగఁగవలయున్. 255**

**ప్రతి :** ధృత= పొందబడ్డ; చిత్తుఁడు= మనస్సుగలవాడు; శాంతుండు= నెమ్మది గలవాడు; నియత= నియమితమైన; పరిభాషణుఁడు= సల్లాపంకలవాడూ; సుమహిత= గొప్పదైన; ఆచారుఁడు= సంప్రదాయం కలవాడూ; వర్ణిత= పొగడబడ్డ; హరి= విష్ణువుయొక్క; మంగళ= క్షేమంకరమైన; గుణుఁడును= గుణాలు కలవాడూ; మిత= మితంగా; వన్య= అడవికి చెందినకంద మూలాదుల; అశనుఁడున్= తిండి కలవాడున్నూ; అగుచున్= అవుతూ; మెలఁగఁగ వలయున్= వర్తించుకోవాలి.

**తా :** మనస్సు నిగ్రహించుకోవాలి. మృదుస్వభావం కావాలి. సంభాషణలను కట్టడి చేసుకోవాలి. సదాచారం తెలియాలి. స్తుతిమంతుడైన హరియొక్క శ్రేష్ఠ గుణాలను అలవరచుకోవాలి. అడవిలోని కందమూలాదులను మితంగా తినాలి. ఈ తీరుగా ప్రవర్తిస్తూ ఉండాలి.

**వ. ఉత్తమశ్లోకుండగు పుండరీకాక్షుండు నిజమాయాస్వేచ్ఛావతారచరితంబులచేత నచింత్యంబుగా నెద్ది సేయు నద్ది హృదయగతంబుగా ధ్యానంబు సేయందగు. మఱియుఁ గార్యబుద్ధింజేసి చేయంబడు పూజావిశేషంబులు వాసుదేవమంత్రంబున సర్వేశ్వరునికి సమర్పింప వలయు; నిట్లు మనోవాక్కాయకర్మంబులచేత మనోగతం బగునట్లుగా భక్తియుక్తంబు లయిన పూజలచేతఁ బూజింపంబడి,**

**సర్వేశ్వరుండు మాయాభిభూతులు గాక సేవించు పురుషులకు ధర్మాదిపురుషార్థంబులలోన నభిమతార్థంబు నిచ్చు; విరక్తుం డగువాఁడు నిరంతరభావం బయిన భక్తియోగంబునం జేసి మోక్షంబుకొఱకు భజియించు నని చెప్పిన విని ధ్రువుండు నారదునకుం బ్రదక్షిణ పూర్వకంబుగా నమస్కరించి మహర్షిజనసేవ్యంబై సకలసిద్ధుల నొసంగుచు భగవత్పాద సరోజాలంకృతంబైన మధువనంబునకుం జనియె నంత. 256**

**ప్రతి :** ఉత్తమ= ముఖ్యులచే; శ్లోకుండు+అగు= పొగడ్తకెక్కినవాడు అయిన; పుండరీక+అక్షుండు= అంభోజనేత్రుడు; నిజ= తనదైన; మాయా= ప్రకృతిచే; స్వ+ఇచ్ఛా= తన మనస్సు వచ్చినట్టుగా; అవతార= పుట్టుకలయొక్క; చరితంబులచేత= నడవడికల చేత; అచింత్యంబుగాన్= చింతింపరానట్లుగా; ఎద్ది= ఏది; చేయున్= నడపుతాడో; అద్ది= ఆ నడత; హృదయగతంబు+కాన్= మనస్సును పొందిందిగా; ధ్యానంబు= చింతనం; చేయన్+తగున్= చేయడం యోగ్యం; మఱియున్= ఇంకా; కార్యబుద్ధిన్+చేసి= కర్తవ్యవివేకంతో; చేయన్+పడు= చేసే; పూజావిశేషంబులు= ప్రత్యేక ఉపచారాలు; వాసుదేవ మంత్రంబునన్= వాసుదేవమంత్రంతో; సర్వ+ఈశ్వరునికిన్= ఆ విశ్వప్రభునికి; సమర్పింపవలయున్= అర్పించుకోవాలి; ఇట్లు= ఈ చెప్పినరీతిన; మనస్+వాక్+కాయ= మనసా వాచా కర్మణా చేసే; కర్మంబులచేతన్= నిత్యనైమిత్తికాది కార్యాలచేత; మనస్+గతంబు+అగునట్లు+కాన్= మనస్సున పట్టునట్టుగా; భక్తి+యుక్తంబులు+అయిన= సేవలతో కూడినవి అయిన; పూజలచేతన్= అర్చనలచేత; పూజింపన్+పడి= ఆరాధించబడి; సర్వేశ్వరుండు= పరమాత్ముడు; మాయన్= మాయచే; అభిభూతులు+కాక= ఆక్రాంతులు కాకుండా; సేవించు= భజించే; పురుషులకున్= జనులకు; ధర్మ+ఆది= ధర్మార్థకామమోక్షాలనే; పురుషార్థంబులలోనన్= పురుషార్థాలలో; అభిమత= సమ్మతమైన; అర్థంబున్= ప్రయోజనాన్ని; ఇచ్చున్= కల్గిస్తాడు; విరక్తుండు+అగువాఁడు= విరాగి అయినవాడు; నిరంతరభావంబు+అయిన= ఎడతెంపులేని ధ్యానం కల్గిన; భక్తియోగంబునన్+చేసి= భక్తియోగాభ్యాసంచేత; మోక్షంబు కొఱకు= ముక్తికోసం; భజియించున్అని= కొలుస్తాడు అని; చెప్పిన= నుడివిన; విని= ఆకర్ణించి; ధ్రువుండు= ధ్రువుడు; నారదునకున్= నారదుడికి; ప్రదక్షిణ పూర్వకంబుగాన్= చుట్టువార తిరుగుటతోసహా; నమస్కరించి= చే మోడ్చి; మహర్షిజన= మహామునివర్గంచే; సేవ్యంబు+ఐ= భజించదగ్గదై; సకల= సమస్తమైన; సిద్ధులన్= ఫలాలను; ఒసంగుచున్= ప్రదానంచేస్తూ; భగవత్= భగవానుడి; పాదసరోజ= పాదపద్మాలచే; అలంకృతంబు+అయిన= అలంకరించబడింది అయిన; మధువనంబునకున్= మధువనికి; చనియెన్= వెళ్లాడు.

**తా :** మహాకీర్తనీయుడైన ఆ దైవం తన ప్రకృతితో తన ఇచ్చవచ్చినట్లు అవతారాలు ఎత్తుతాడు. ఊహాతీతంగా కావించే ఆయన లీలలను మనస్సుకు పట్టేటట్లు తలంచుకోవాలి. అంతేకాదు కార్యాచరణ బుద్ధితో చేసే పూజాదిక సేవలన్నింటిని ద్వాదశాక్షర వాసుదేవమంత్రంతోనే ఆ దైవానికి సమర్పించాలి. ఇలా త్రికరణ శుద్ధిగా చేసిన కర్మలతో గుండెల్లో నిలిచిపోయేలా భక్తి పూజలతో ఉపచరించాలి. ఆ భగవన్మాయకు లోనుకాని ఆరాధకులకు, చతుర్విధపురుషార్థాల్లో కోరింది కోరినట్టుగా ప్రసాదిస్తాడు. విరాగి అయినవాడు నిత్యం స్మరిస్తూ భక్తియోగంచేత ముక్తికోసం భజిస్తాడు అని దేవర్షి చెప్పగా విన్నాడు. ఆ ధ్రువుడు నారదుడికి, ప్రదక్షిణలు చేసి నమస్కరించాడు. ఆ తరువాత ఋషిలోకసేవ్యమైనట్టి సకలఫలప్రదమైన, ఆ పరాత్పరుడి పాదపద్మాలచే అలంకరించబడి మధువనానికి వెళ్లాడు. అప్పుడు

**తే. పద్మభవసూనుఁ డుత్తానపాదుకడకు, నరిగి యా రాజుచే వివిధార్చనముల**
**నంది సంప్రీతుఁడై యున్నతాసనమున, నెలమిఁ గూర్చుండి యాతని వలను చూచి. 257**

**ప్రతి :** పద్మభవ= బ్రహ్మయొక్క; సూనుఁడు= పుత్రుడయిన నారదముని; ఉత్తానపాదుకడకున్= ఉత్తానపాదునివద్దకు; అరిగి= చని, ఆ రాజుచేన్= ఆ నృపునిచేత; వివిధ= పలురీతులైన; అర్చనములన్= అర్ఘ్యపాద్యాదిపూజలను; అంది= పొంది; సంప్రీతుఁడు+ఐ= పూర్తిగా తనివి నొందినవాడై; ఉన్నత= ఎత్తయిన; ఆసనమునన్= పీఠాన; ఎలమిన్= ఆనందంతో; కూర్చుండి= ఆసీనుడై; ఆతని= ఆ రాజుయొక్క; వలను+చూచి= వైపుచూసి...

**తా :** బ్రహ్మకుమారుడు నారదుడు ఉత్తానపాదుడి దగ్గరకు పోయాడు. ఆ రాజుచే పరిపరివిధాల గౌరవం పొందాడు. ఎంతో తృప్తిచెందాడు. ఎత్తయిన పీటమీద సుఖోపవిష్టుడై ఆ రాజువంక చూచి

**వ. ఇట్లనియె. 258**

**ప్రతి :** ఇట్లు= ఈ విధాన; అనియెన్= పలికాడు.

**తా :** ఇలా అన్నాడు.

**క. భూనాయక! నీ విపు డా, మ్లానాస్యుఁడ వగుచుఁ జాల మదిలో జింతం**
**బూనుట కేమి కతం? బన, నా నారదుతోడ నాతఁ డనియెన్ మరలన్. 259**

**ప్రతి :** భూనాయక= ఓ భూమినేతా!; నీవు= నువ్వు; ఇపుడు= ఈ సమయాన; మ్లాన= వడలిన; ఆస్యుఁడవు+అగుచున్= ఆ మొగం కలవాడవవుతూ; చాలన్= మిక్కిలి; మదిలో= హృదిలో; చింతన్= విచారాన్ని; పూనుటకున్= పొందడానికి; ఏమి కతంబు= ఏమిటి కారణం?; అనన్= అనంగానే; ఆ నారదుతోడన్= ఆ నారదమునితో; మరలన్= తిరిగి; ఆతఁడు= ఆ మహారాజు; అనియెన్= సమాధానం పలికాడు.

**తా :** ఓ అధిపా! నీ ముఖం వాడిపోయి ఉంది. నువ్వు బాగా చిన్నబోయి ఉండడానికి కారణం ఏమిటి? అన్న నారదుడితో ఆ భూపతి ఇలా బదులు చెప్పాడు.

**క. మునివర! వివేకశాలియు, ననఘుఁడు నైదేండ్ల బాలుఁడస్మత్ప్రియనం**
**దనుఁ డదయుఁడ నగు నాచే, తను బరిభవ మొంది చనియెఁదల్లియుఁదానున్. 260**

**ప్రతి :** మునివర!= ఓ మునిపుంగవ!; వివేకశాలియున్= వివేకంతో అలరారేవాడూ; అనఘుడున్= పుణ్యశాలీ; ఐదు+ఏండ్ల+బాలుఁడు= ఐదేళ్ల పిల్లవాడు; అస్మత్= నాయొక్క; ప్రియనందనుఁడు= కూర్మితనయుండు; అదయుఁడన్= దాక్షిణ్యం లేనివాడను; అగున్= అయినట్టి; నాచేతను= నా చేత; పరిభవము= అవమానం; ఒంది= పొంది; తల్లియున్= తల్లీ; తానున్= తానూ; చనియెన్= వెళ్లిపోయాడు.

**తా :** ఓ నారదా! మంచి వివేకం కలవాడూ, ఏ పాపం పట్టనివాడూ, ఐదేళ్ల అర్భకుడు నా ప్రియపుత్రుడు. ఆ పసివాడి మీదజాలి చూపకపోగా నేను అవమానించాను. తల్లిని తీసుకొని తాను ఎక్కడికో వెళ్లిపోయాడు.

**మ. చని యుగ్రాటవిఁ జొచ్చి యచ్చటఁ బథిశ్రాంతుండు క్షుత్పీడితుం**
**డును సంమ్లానముఖాంబుజుండు ననఘుండున్ బాలకుండైన మ**

**త్తనయున్ ఘోరవృకాహిభల్లముఖసత్త్వశ్రేణి భక్షించెనో**
**యని దుఃఖించెద నాదు చిత్తమున నార్యస్తుత్య! యిట్లౌటకున్. 261**

**ప్రతి :** చని= వెడలి; ఉగ్ర= భయంకరమైన; అటవిన్= అరణ్యంలోకి; చొచ్చి= చొరబడి; అచ్చటన్= ఆ కారడవిలో; పథిశ్రాంతుండున్= దారినడక వలన అలసట పొందినవాడూ; క్షుత్= ఆకలిచే; పీడితుండును= నొప్పినొందిన వాడూ; సంమ్లాన= వసివాడిపోయిన; ముఖ+అంబుజుండున్= ముఖపద్మం కలవాడూ; అనఘుండున్= పాపం తెలియనివాడూ; బాలకుండున్= అర్భకుడూ; ఐన= అయినట్టి; మద్+తనయున్= నా కొడుకును; ఆర్యస్తుత్య= పూజ్యులచే వర్ణనీయుడా!; ఘోర= భయంకరమైన; వృక= తోడేలు; అహి= పాము; భల్ల= ఎలుగుబంటి; ముఖ= మొదలైన; సత్త్వశ్రేణి= జంతు సముదాయం; భక్షించెనో అని= నమిలి మింగాయేమో అని; నా+చిత్తమునన్= నా యొక్క మనమున; ఇట్లు= ఇలా; ఔటకున్= జరుగడానికి; దుఃఖించెదన్= అలమటిస్తున్నాను.

**తా :** ఆర్యులచేత స్తుతించబడేవాడా! నారదా! అలా వెళ్లి వెళ్లి నా కుమారుడు భయంకరమైన అడవుల్లోకి దూరి పోయి ఉంటాడు. నడచినడచి సొలసిపోయి, ఉంటాడు. ఆకలి నొప్పికి మెలికలు తిరిగిపోయి ఉంటాడు. కళకళలాడే ఆ మోము మరీ వాడిపోయి ఉంటుంది. అభం శుభం తెలియని ఆ పసివాడు భయంకరమైన తోడేళ్లు, పాములు, ఎలుగుబంట్లు, ఇత్యాది వన్యప్రాణుల వాతపడ్డాడేమోనని నా మనసులో ఇలా అయినందుకు దుఃఖిస్తున్నాను.

**తే. అట్టి యుత్తమబాలు నా యంకపీఠ, మందుఁ గూర్చుండనీక నిరాకరించి**
**యంగనాసక్తచిత్తుండ నైన యట్టి, నాదు దౌరాత్మ్య మిది మునినాథచంద్ర! 262**

**ప్రతి :** మునినాథచంద్ర!= మునివర్యులలో శ్రేష్ఠా!; అట్టి= అటువంటి; ఉత్తమ= మేటి అయిన; బాలున్= పిల్లవాణ్ణి; నా+అంక= పీఠము; అందున్= నా ఒడి అనే ఆసనంపై; కూర్చుండన్+ఈక= కూచోనీయక; నిరాకరించి= అనాదరించి; అంగనా= కాంతయందు; ఆసక్త= లగ్నమైన; చిత్తుండన్= మనస్సు కలవాడను; ఐన+అట్టి= అయినటువంటి; నా+దౌరాత్మ్యము= నా పాడు మనస్సు; ఇది= ఈ కృత్యం...

**తా :** ఓ మునివర్యా! అంతటి ఉత్తముడయిన బాలుని నా ఒడిలోకి తీసుకోకుండా నిర్లక్ష్యం చేశాను. ఇది నా కాంత మీది ఆసక్తిచేత కలిగిన నా దురాత్మయే

**ఉ. నా విని నారదుండు నరనాథున కిట్లను నీ కుమారుఁడా**
**దేవకిరీట రత్నరుచిదీపితపాదసరోజుఁడైన రా**
**జీవదళాక్షరక్షితుఁడశేషజగత్పరికీర్తనీయకీ**
**ర్తివిభవప్రశస్తసుచరిత్రుఁడు; వానికి దుఃఖ మేటికిన్? 263**

**ప్రతి :** నాన్= అనగానే; విని= ఆలకించి; నారదుండు= నారదమహర్షి; నరనాథునకున్= నృపతికి; ఇట్లు= ఇలా; అనున్= చెప్పాడు; ఆ= (ప్రశస్తులైన); దేవ= వేల్పుల యొక్క; కిరీట= మకుటాలలోని; రత్నరుచి= రతనాల వెలుగుచే; దీపిత= ప్రకాశింపచేయబడ్డ; పాదసరోజుఁడు+ఐన= పదపద్మాలు కలవాడైనట్టి; రాజీవదళ+అక్ష= పద్మపత్రాలవంటి నేత్రాలు కలట్టి శ్రీమహావిష్ణువుచేత; నీ కుమారుఁడు= నీదు సుతుడు; రక్షితుడు= కాపాడబడినవాడు; అశేష= సమస్తమైన; జగత్=

విశ్వముచే; పరికీర్తనీయ= అంతటా పొగడదగ్గ; కీర్తీ విభవ= యశ స్సంపత్తిచే; ప్రశస్త= విఖ్యాతమైన; సుచరిత్రుండు= మేలి జీవనుడు; వానికిన్= ఆ పిల్లవాడి కొఱకు; దుఃఖము= చింత; ఏఁటికిన్= ఎందులకు?

**తా :** అనగా విని నారదుడు ఆ రాజుతో ఇలా అన్నాడు. ఆ విష్ణువు దేవతల కిరీటపు రత్నకాంతులతో విలసిల్లే చరణకమలాలు కలవాడు. పద్మదళనేత్రుడు. అట్టి ఆ భగవానుడు పిల్లవాణ్ణి కాపాడుతున్నాడు. సమస్తలోకాలు మెచ్చే యశస్సంపన్నుడు. శుభప్రవర్తనం కలవాడు. అయిన నీ పిల్లవాడి గురించిన దిగులు నీ కెందుకు?

**విశే :** పోతన 'కీర్తి' శబ్దమును ఈ కారాన్తంగా ప్రయోగించినాడు.

**ఉ. కావున న మ్మహాత్ముఁడు సుకర్మముచేత సమస్తలోకపా**
**లావళి కందరాని సముదంచితనిత్యపదంబునం బ్రభు**
**శ్రీవిల్లసిల్లఁ జెందుఁ దులసీదళదాము భజించి; యా జగ**
**త్పావనుఁడైన నీ సుతు ప్రభావ మెఱుంగవు నీవు భూవరా! 264**

**ప్రతి :** కావునన్= కాబట్టి; ఆ+మహా+ఆత్ముఁడు= అంతటి మహామనీషి; సుకర్మము చేతన్= మంచిపని చేత; తులసీదళ దామున్= తులసిమాలధరించే ఆ విష్ణువును; భజించి= సేవించి; సమస్త= అఖిలమైన; లోకపాల+ఆవళికిన్= దిక్పాలకుల+పంక్తికి; అందరాని= చేరగరాని; సమ్+ఉదంచిత= చక్కగా పూజింపదగిన; నిత్యపదంబునన్= శాశ్వతమైన చోటున; ప్రభుశ్రీ= వైభవ సంపద; విలసిల్లన్= ఒప్పారగా; చెందున్= పొందుతాడు; ఆ+జగత్+పావనుఁడు+ఐన= అలాంటి విశ్వపవిత్రుడు అయిన; నీ సుతుప్రభావము= నీ కుమారుడి మాహాత్మ్యం; భూవరా!= రాజా!; నీవు= నువ్వు; ఎఱుంగవు= తెలియవు.

**తా :** ఆ మహానుభావుడు విష్ణుదేవుని సేవించుటచేత సమస్త దిక్పాలకులెవరూ పొందలేని మహాపూజనీయమైన నిత్యపదానికి వైభవ సంపద యొప్పారగా అధీశ్వరు డవుతాడు. లోకపావను డయిన నీ కొడుకు ప్రభావం నీకు తెలియదు రాజా!

**వ. అదియునుంగాక. 265**

**తా :** అంతేగాక

**క. నీ కీర్తియు జగముల యం, దాకల్పము నొందఁజేయు నంచితగుణ ర**
**త్నాకరుఁడిట కేతెంచును, శోకింపకు మతనిఁగూర్చి సుభగచరిత్రా! 266**

**ప్రతి :** నీ కీర్తియున్= నీ (వంశ) ప్రశస్తిని; జగముల+అందున్= లోకాలన్నింటిలో; ఆ కల్పమున్= ప్రళయం దాకా; ఒందన్+చేయున్= ప్రాప్తింప చేస్తాడు; అంచిత= ఒప్పుతున్న; గుణ= సౌశీల్యాది గుణాలకు; రత్నాకరుఁడు= సముద్రం వంటివాడు; ఇటకున్= ఇక్కడకు; ఏతెంచును= రాగలడు; సుభగచరిత్రా!= చక్కని చరిత్రకలవాడా; అతనిన్+కూర్చి= ఆ ధ్రువుణ్ణి ఉద్దేశించి; శోకింపకుము= చింతిల్లకు.

**తా :** నీ కీర్తినికూడా ఈ జగం అంతా కల్పాంతపర్యంతం నిలుపగలడు. అతడు సద్గుణాల సముద్రుడు. నీ రాజధానికి తప్పక తిరిగి వస్తాడు. ఓ శుభచరితా! ఆ ధ్రువుణ్ణి గూర్చిన దిగులు మానుకో.

**క. అని నారదుండు పలికిన, విని మనమున విశ్వసించి విభుఁడును బ్రియ నం**
**దనుఁ జింతించుచు నాదర, మునఁ జూడం డయ్యె రాజ్యమును బూజ్యముగన్. 267**

**ప్రతి :** అని= అని; నారదుండు= నారదముని; పలికినన్= సంభాషించగా; విని= ఆలకించి; మనమున= ఆంతరంలో; విశ్వసించి= నమ్మి; విభుఁడును= ఆ రాజు; ప్రియనందనున్= ఇష్టసుతుణ్ణి; ఆదరమునన్= ఆసక్తితో; చింతించుచున్= తలపోస్తూ; రాజ్యమును= దొరతనాన్ని; పూజ్యముగన్= మాననీయంగా; చూడండు+అయ్యెన్= ఆదరించని వాడయ్యాడు.

**తా :** అని నారదుడు చెప్పిన మాటలమీద మంచినమ్మకం ఏర్పడింది. ఉత్తానపాదుడి మనసు అంతా కొడుకు తలపోతలతోనే నిండిపోయి రాచరికం శూన్యంగా తోచింది. రాచకార్యాలను అసలు పట్టించుకోవడం మానేశాడు.

**వ. అంత నక్కడ నా ధ్రువుండు. 268**

**ప్రతి :** అంతన్= అంతలో; అక్కడన్= ఆ అరణ్యంలో; ఆ ధ్రువుండు= ఆ ధ్రువకుమారుడు...

**తా :** అటు పై ఆ అడవుల్లో ధ్రువుడు

**క. చని ముందటఁ గనుఁగొనె మధు, వనమును మునిదేవయోగివర్ణితగుణ పా**
**వనమును దుర్భవజలదప, వనమును నిఖిలైకపుణ్యవరభవనంబున్. 269**

**ప్రతి :** చని= వెళ్లి; ముని= మునులచే; దేవ= దేవతలచే; యోగి= యోగాభ్యాసులచే; వర్ణిత= కీర్తించబడ్డ; గుణ= సత్త్వాదిసుగుణాలచే; పావనమును= పవిత్రమూ; దుస్+భవ= పాడు సంసారం అనే; జలద= మొయిలుకు; పవనమును= గాలివంటిదిన్నీ; నిఖిల= సమస్తమైన; ఏక= ముఖ్యమైన; పుణ్య= పుణ్యాలకు; వరభవనంబున్= ఉత్తమమైన నెలవును (అయిన); మధువనమును= మధువనక్షేత్రాన్ని; ముందటన్= ఎదుట; కనున్+కొనెన్= చూశాడు.

**తా :** పోగా పోగా అతడికి మధువనక్షేత్రం ఎదురపడింది. ఆ క్షేత్రం మునులు, దేవతలు, యోగులు స్తోత్రం చేసిన సద్గుణాలతో శుద్ధమైన చోటు. దుష్టజీవలోకమనే మబ్బుల్ని విడగొట్టే వాయువు వంటిది. సుకృతాలకు ముఖ్యస్థావరం వంటిది.

**వ. అట్లు గని డాయంజని యమునానదిం గృతస్నానుండై నియతుండును, సమాహిత చిత్తుండును నై సర్వేశ్వరుని ధ్యానంబు సేయుచుం ద్రిరాత్రంబుల కొక్కమాఱు కృత కపిత్థ బదరీ ఫలపారణుం డగుచు దేహస్థితి ననుసరించి యొక్క మాసంబు హరిం బూజించి, యంతనుండి యాఱేసి దినంబుల కొక్కపరి కృతజీర్ణతృణపర్ణాహారుం డగుచు, రెండవ మాసంబున విష్ణుసమారాధనంబు సేసి, యంతనుండి నవరాత్రంబుల కొకమాఱు ఉదక భక్షణంబు సేయుచు, మూఁడవ మాసంబున మాధవు నర్చించి. యంతనుండి ద్వాదశదినంబుల కొకమాఱు వాయుభక్షణుం డగుచు; జితశ్వాసుండై నాలవమాసంబునం, బుండరీకాక్షుని భజియించి యంత నుండి, మనంబున నలయక నిరుచ్ఛ్వాసుండై యేకపదంబున నిలిచి, పరమాత్మం జింతించుచు, నచేతనంబైన స్థాణువుంబోలె నైదవమాసంబును జరపె నంత. 270**

**ప్రతి :** అట్లు= ఎదురుగా; కని= ఆ వనక్షేత్రాన్ని వీక్షించి; డాయన్+చని= దగ్గరకుచేరి; యమునానదిన్= యమునానదిలో; కృత స్నానుండు+ఐ= స్నానం చేసినవాడై; నియతుండును= నియమం కలవాడూ; సమాహిత= కూడదీసుకున్న;

చిత్తుండునున్+ఐ= మనస్సుకలవాడునూ ఐ; సర్వ+ఈశ్వరుని= ఆ పరమాత్ముని; ధ్యానంబు+చేయుచున్= స్మరించుకుంటూ; త్రిరాత్రంబులకున్= మూడుదినాలకు; ఒక్కమాఱు= ఒక్కతడవ; కృత= ఏర్పాటు అయిన; కపిత్థ= వెలగపండు; బదరీఫల= రేగుపండ్లు; పారణుండు+అగుచున్= పారణగా స్వీకరిస్తూ; దేహస్థితిన్+అనుసరించి= శారీరక అవస్థను బట్టి; ఒక్కమాసంబు= ఒక నెలపాటు; హరిన్= నారాయణుని; పూజించి= సేవించి; అంతన్+ఉండి= ఆ తరువాత; ఆఱు+ఏసి+దినంబులకున్= ఆరు ఆరు దినాలకు; ఒక్కపరి= ఒక పర్యాయం; కృత= చేయబడిన; జీర్ణతృణ= ఎండినగడ్డి; (జీర్ణ) పర్ణ= పండుటాకులు; ఆహారుండు+అగుచున్= తిండికలవాడవుతూ; రెండవమాసంబునన్= ద్వితీయమాసంలో; విష్ణుసమారాధనంబు+చేసి= విష్ణుపూజను కావించి; అంతన్+ఉండి= తరువాత; నవరాత్రంబులకున్= ప్రతి తొమ్మిదిరాత్రులకు; ఒకమాఱు= ఒకసారి; ఉదక= నీటిని; భక్షణంబు+చేయుచున్= ఆహారంగా తింటూ; మూడవమాసంబునన్= మూడవనెల రాగానే; మాధవున్= లక్ష్మీపతిని; అర్చించి= పూజించి; అంతన్+ఉండి= ఆ పయి; ద్వాదశదినంబులకున్= పన్నెండు పన్నెండు పొద్దులకు; ఒకమాఱు= ఒకపరి; వాయుభక్షణుండు+అగుచున్= గాలిని భుజిస్తున్నవాడవుతూ; నాలవమాసంబునన్= నాల్గవ నెలలో; జితశ్వాసుండు+ఐ= నియమించిన శ్వాస గలవాడై; పుండరీకాక్షునిన్= ఆ కమలనయనుణ్ణి; భజియించి= ఆరాధించి; అంతన్+ఉండి= అక్కడనుంచి; మనంబునన్= మనస్సున; అలయక= శ్రమ నొందక; నిస్+ఉచ్ఛ్వాసుఁడు+ఐ= ఊపిరి ఉగ్గబట్టినవాడై; ఏకపదంబునన్= ఒంటి పాదం మీద; నిలిచి= ఉండి; పరమాత్మున్= పరమేశ్వరుని; చింతించుచున్= ధ్యానిస్తూ; అచేతనంబు+ఐన= కదలనిది అయిన; స్థాణువున్ పోలె= కొమ్మలు లేని మోడుమాదిరి; ఐదవమాసంబును= ఐదవనెలను; జరపెన్= గడిపాడు; అంతన్= అంతలో.

**తా :** తన ముందరనే కనపడుతున్న మధువని చేరుకున్నాడు. యమునా నదిలో స్నానం కావించాడు. వ్రతం పట్టినవాడై మనసును కుదుటపరచుకుని ఆ విష్ణుమూర్తిని పదేపదే ధ్యానించాడు. మూడురాత్రులకు ఒక్కసారి వెలగ, రేగు పళ్లను వ్రతసమాప్తి ఆహారంగా తీసుకుంటూ కాలం వెళ్లబుచ్చాడు. శరీరం నిలుకడను బట్టి ఒక్కనెలపాటు ఇలాగే ఆ మధువనస్వామిని ఆరాధించాడు. ఆ పై రెండో నెల ప్రారంభంనుంచి ప్రతి ఆరుదినాలకూ ఎండుగడ్డి పరకలు, పండిరాలిన ఆకులను మాత్రమే నములుతూ ఆ నారాయణుని పూజించాడు. మూడో నెల మొదటినుంచి తొమ్మిది దినాలకొకసారి జలం మాత్రమే పుచ్చుకుంటూ మాధవుణ్ణి సేవించాడు. నాల్గో నెల మొదలైనప్పటి నుంచి పన్నెండేసి దినాలకొక పర్యాయం గాలిని మాత్రమే ఆరగిస్తూ ఊపిరులను అనుకూలపరచుకుంటూ; ఆ పుండరీకాక్షుని సేవలతో తరించాడు. ఐదోమాసం రాగానే శ్వాసను బంధించి మనస్సు అలపు చెందని రీతిన ఒంటి కాలిమీద నిలబడి ఆ పరంధాముణ్ణి ధ్యానిస్తూ జీవంలేని మోడువలె కాలం పుచ్చాడు.

**విశే :** వాయుభక్షణుడు అంటే గాలిని తప్ప ఇతరమైన ఏ ఆహారాన్నీ తీసుకోనివాడని అర్థం.

**సీ.** **సకలభూతేంద్రియాశయ మగు హృదయంబు నందు విషయములఁ జెందనీక**
**మహదాది తత్త్వ సమాజమ్ములకును నాధార భూతమును బ్రధానపూరు**
**షేశ్వరుఁ డైనట్టి శాశ్వతబ్రహ్మంబుఁ దనదైన హృదయపద్మమున నిలిపి**
**హరి రూపమున కంటె నన్యంబు నెఱుఁగక చిత్త మవ్విభునందుఁ జేర్చియున్న**

**తే.** **కతన ముల్లోకములు సాలఁ గంప మొందెఁ, వెండియును బేర్చి యయ్యర్భకుండు ధరణి**
**నొక్క పాదంబు చేర్చి నిల్చున్న వేళఁ, బేర్చి యబ్బాలు నంగుష్ఠపీడఁ జేసి.** **271**

**ప్రతి :** సకల= సమస్తమైన; భూత= సూక్ష్మప్రాణులకు; ఇంద్రియ= పంచేంద్రియాలకూ; ఆశ్రయము+అగు= అవలంబం అయినట్టి; హృదయంబున్+అందు= ఎదలోపల; విషయములన్= ఇంద్రియార్థాల్ని; చెందన్+ఈక= పొందనీక; మహత్+ఆది= మహత్తు మొదలైన; తత్త్వ= స్వరూపాల; సమాజమ్ములకునున్= గుంపులకు; ఆధారభూతమును= ఆశ్రయమైనవాడూ; ప్రధాన= ప్రకృతికీ; పూరుష= పురుషులకూ; ఈశ్వరుండు= అధిపతి; ఐన+అట్టి= అయినట్టి; శాశ్వత= స్థిరుడైన; బ్రహ్మంబున్= పరబ్రహ్మను; తనదైన= తనయొక్క; హృదయపద్మమునన్= పద్మంవంటి మనస్సులో; నిలిపి= ఉంచిపెట్టి; హరిరూపమున కంటెన్= శ్రీహరిమూర్తిని మించి; అన్యంబున్= మరొకరూపాన్ని; ఎఱుంగక= తెలియక; చిత్తము= ఎదదను; ఆ+విభునందున్= ఆ సర్వవ్యాపకుని అందు; చేర్చి+ఉన్న+కతనన్= నిలిపి ఉంచిన కారణంగా; మూడు+లోకములు= స్వర్గమర్త్యపాతాళ లోకాలు మూడున్నూ; చాలన్= ఎక్కువగా; కంపము+ఒందెన్= వణికి పోయాయి; వెండియున్= మరల; పేర్చి= అతిశయించి; ఆ+అర్భకుండు= ఆ కుర్రడు; ధరణిన్= నేలమీద; ఒక్కపాదంబు= ఒక అడుగు; చేర్చి= పెట్టి; నిల్చున్నవేళన్= నిలబడి ఉన్నసమయంలో; పేర్చి= విజృంభించి; ఆ+బాలు= ఆ పిల్లవాని; అంగుష్ఠ= కాలిబొటనవ్రేలియొక్క; పీడన్+చేసి= ఒత్తిడిచేత.

**తా :** సర్వ సూక్ష్మ భూతాలకూ పంచేంద్రియాలకూ ఆధారమైన చిత్తంలో శబ్దాదివిషయాలకు వేటికీ కుదురు కల్పించలేదు. మహత్తు మొదలైన పరతత్త్వస్వరూపాదులకు ఆశ్రయం ఇచ్చే ప్రకృతి పురుషులకు యజమానుడైనట్టి శాశ్వతబ్రహ్మ స్వరూపుడైనట్టి పరబ్రహ్మమును తన డెందంలో లగ్నం చేసుకున్నాడు. విష్ణువుకన్న మరోరూపం గూర్చిన చింతనలేకుండా తన మనస్సును ఆ పరబ్రహ్మమందే నిలిపి ఉంచాడు. ఆ ఘోరతపస్సుకి ముల్లోకాలూ గజగజలాడి పోయాయి. అంతటితో ఆగక మరింత పెచ్చుగా ఆ పిల్లవాడు నేలమీద ఒంటి కాలిమీద నిలుచున్న సమయంలో ఆ బాలుని కాలి బొటనవ్రేలి అధికమైన ఒత్తిడిచేత

**తే.** **వసుమతీతల మర్ధము వంగఁజొచ్చె, భూరిమదదుర్నివారణవారణేంద్ర**
**మెడనుఁ గుడి నొరగఁగ నడుగడుగునకును, జలన మొందుచు నడఁగెడు కలముఁబోలె. 272**

**ప్రతి :** భూరిమద= మిక్కిలి మత్తిల్లినట్టి; దుస్+నివారణ= నిరోధించరాని; వారణ+ఇంద్రము= శ్రేష్ఠమైన ఏనుగు; ఎడనున్= వామ భాగంనుంచి; కుడిన్= కుడివైపునకూ; ఒరగఁగన్= వ్రాలగా; అడుగు+అడుగునకును= ప్రతిపాదానికి; చలనము= కంపం; ఒందుచున్= పొందుతూ; అడఁగెడు= కుంగిపోయే; కలమున్+పోలె= ఓడవలె; వసుమతీతలము= భూభాగం; అర్ధము= సగ భాగం; వంగన్= ఒరగడం; చొచ్చెన్= ప్రారంభించింది.

**తా :** అడ్డూ ఆపూలేని పెద్ద మదగజం పాదం మోపిన ఒకవైపుకు ఒరగిపోయే ఓడవలె నేల సగం సగంగా అటూ ఇటూ వాలిపోతూ ఊగడం మొదలు పెట్టింది.

**చ.** **అతఁడు నన్యదృష్టిని జరాచరదేహి శరీరధారణా**
**స్థితి గల యీశునందుఁ దన జీవితమున్ ఘటియింపఁ జేసి యే**
**కతఁ గనఁ దన్నిరోధమునఁ గైకొని కంపము నొందె నీశ్వరుం;**
**దతఁడు చలింప నిజ్జగము లన్నియుఁ జంచల మయ్యె భూవరా! 273**

**ప్రతి :** భూవరా!= రాజా!; అతఁడు= ధ్రువుడు; అనన్య= వేరుకాని; దృష్టినిన్= చూపుతో; చర= తిరుగునట్టి; అచర= తిరుగనట్టి; దేహి= జీవులయొక్క; శరీరధారణాస్థితి+కల= ప్రాణం నిలుకడ కలట్టి; ఈశునందున్= విభుడైన విశ్వాత్మునిలో; తన= తనయొక్క; జీవితమున్= ప్రాణాన్ని; ఘటియింపన్+చేసి= సంధానింప చేసి; ఏకతన్= ఐక్యాన్ని; కనన్= పొందగా; తద్= ఆ; నిరోధమునన్= నిలుపుదల వలని; కైకొని= కారణంగా; ఈశ్వరుండు= విష్ణువు; కంపమున్= కదలికను; ఒందెన్= పొందాడు; అతఁడు= ఆ హరి; చలింపన్= కంపించగా; ఈ జగములు+అన్నియున్= ఈ లోకాలన్నీ; చంచలము+ అయ్యెన్= వెనకముందులకు ఊగాడి పోయాయి.

**తా :** రాజా! ధ్రువుడు తదేకదృష్టితో చరాచరప్రపంచంలోని సర్వజీవుల ప్రాణాయామపు ఉనికిని పొంది ఉన్న ఆ ఈశ్వరునిలో తన ప్రాణాన్ని చేర్చాడు. ఆ ఐక్యతను పొందడానికి ఊపిరిని స్తంభింప చేసిన కారణంగా విష్ణువూ చలించిపోయాడు. ఆ సర్వేశ్వరుని చలనానికి లోకాలన్నీ తూగాడాయి.

**క. ఆలోకభయంకరమగు, నా లోకమహావిపద్దశాలోకనులై**
**యా లోకపాలు రందఱు, నా లోకశరణ్యుఁ గాన నరిగిరి భీతిన్. 274**

**ప్రతి :** ఆలోక= చూపులకు; భయంకరము+అగు= వెఱపు కల్గించేది అయినట్టి; ఆ+లోక= ముల్లోకాలకూ వాటిల్లిన; మహావిపత్+దశ= పెను ఆపత్కర స్థితిని; ఆలోకనులు+ఐ= విలోకిస్తున్నవారై; ఆ లోకపాలురు= ఆదిక్పాలకులు; అందఱున్= ఎల్లరున్నూ; భీతిన్= భయంతో; ఆలోకశరణ్యున్= ఆ జగద్రక్షకుని; కానన్= ఆలోకించడానికి; అరిగిరి= వెళ్లారు.

**తా :** చూపులకే జడుపు పుట్టించేలా లోకాలకు ఉప్పతిల్లిన ఆ పెద్ద ఉపద్రవస్థితిని పరికించారు దిక్పాలకులు. ఆ పాలకులంతా భయంతో గుంపుగా ఆ విశ్వశరణ్యుని దర్శించాలని బయలుదేరిపోయారు.

**వ. అట్లరిగి నారాయణు నుద్దేశించి కృతప్రణాములై కరంబులు ముకుళించి యిట్లనిరి. 275**

**ప్రతి :** అట్లు= అలా వైకుంఠానికి; అరిగి= వెళ్లి; నారాయణున్= విష్ణువును; ఉద్దేశించి= గురించి; కృత= చేయబడ్డ; ప్రణాములు+ఐ= వందనం కలవారలై; కరంబులు= చేతులు; ముకుళించి= జోడించి; ఇట్లు= ఇలా; అనిరి= చెప్పారు.

**తా :** అలా వెళ్లి ఆ నారాయణునికి మొక్కుకుంటూ అంజలి ఘటించి ఇలా మొరపెట్టుకున్నారు.

**చ. హరి! పరమాత్మ! కేశవ! చరాచర భూతశరీరధారివై**
**పరఁగుదు వీవు, నిట్టులుగఁ బ్రాణనిరోధ మెఱుంగ మెందు ముం**
**దిరవుగ దేవదేవ, జగదీశ్వర! సర్వశరణ్య! నీ పదాం**
**బురుహము లర్థిమై శరణుఁబొందెద మార్తి హరించి కావవే! 276**

**ప్రతి :** హరి!= ఓ నారాయణ!; పరమ+ఆత్మ!= మహాత్మా!; కేశవ= ఓ వెన్నుడ!; చర= చలించేవి; అచర= చలించనివి అయిన; భూత= ప్రాణులయొక్క; శరీర= దేహాలను; ధారివి+ఐ= ధరించినవాడవై; ఈవున్= నువ్వు; పరఁగుదువు= ఒప్పెదవు; దేవదేవ= ఓ దేవాధిదేవ!; ఇట్టులుగన్= ఈ విధంగా; ప్రాణనిరోధమున్= ఊపిరి అందకపోవడాన్ని; ఎందున్= ఎక్కడనూ; ముందు= ఇంతవరకు; ఇరవుగ= నిశ్చయంగా; ఎఱుంగము= తెలియము; జగదీశ్వర!= విశ్వపాలకా!;

సర్వశరణ్య!= సర్వరక్షకా!; నీ= నీ యొక్క; పద+అంబురుహములు= పాదకమలాలు; అర్థిమైన్= ప్రీతితో; శరణున్= రక్షణను; పొందెదము= ఆశ్రయిస్తున్నాం; ఆర్తిన్= దుఃఖాన్ని; హరించి= పోగొట్టి; కావవే= కాపాడవా!

**తా :** ఓ హరీ! ఓ పరమాత్మా! కేశవా! చరాచరప్రాణికోటి శరీరాలను తాల్చి యొప్పెడు వాడవు నువ్వే. కాని ఈ ప్రకారంగా అందరి శ్వాస ఒక్కమారుగా ఆడక పోవడం ఇంతకు మునుపు ఎన్నడూ మేం కని విని ఎరుగం. దేవదేవా! ఓ విశ్వనాథ! సర్వశరణ్య! నీ పాదపద్మాలను అత్యంతప్రీతితో శరణు పొందుతున్నాం. ఈ మా పీడను బాపి కాపాడు.

**విశే :** కేశవ (వ్యు) బ్రహ్మవిష్ణురుద్రులు తనయందు కలవాడు= విష్ణువు.

**వ. అని దేవతలు విన్నవించిన నీశ్వరుండు వారల కిట్లనియె; నుత్తానపాదుం డనువాని తనయుండు విశ్వరూపుండ నయిన నాయందుఁ దన చిత్తం బైక్యంబు సేసి తపంబు గావించుచుండ దానం జేసి భవదీయప్రాణనిరోధం బయ్యె! నట్టి దురత్యయంబైన తపంబు నివర్తింపఁజేసెద; వెఱవక మీ మీ నివాసంబులకుం జనుండని యానతిచ్చిన నా దేవతలు నిర్భయాత్ములై యీశ్వరునకుం బ్రణామంబు లాచరించి త్రివిష్టపంబునకుం జనిరి; తదనంతరంబ. 277**

**ప్రతి :** అని= అని; దేవతలు= వేల్పులు; విన్నవించినన్= మొరపెట్టుకోగా; ఈశ్వరుండు= ఆ ఏలిక; వారలకున్= ఆ దేవతలకు; ఇట్లు= ఇలా; అనియెన్= చెప్పాడు; ఉత్తానపాదుండు= ఉత్తానపాదుండు; అనువాని= అనే క్షత్రియునియొక్క; తనయుండు= కొడుకు (ధ్రువుడు) విశ్వరూపుండన్; అయిన= లోకస్వరూపుడనైన; నా+అందున్= నాలో; తన= తనయొక్క; చిత్తంబు= మనస్సును; ఐక్యంబు+చేసి= ఒక్కటిగా చేర్చి; తపంబు= తపస్సు; కావించుచున్+ఉండన్= ఆచరిస్తుండగా; దానన్+చేసి= ఆ తపంవల్ల; భవదీయ= మీ యొక్క; ప్రాణనిరోధంబు= శ్వాస నిర్బంధం; అయ్యెన్= జరిగింది; అట్టి= అటువంటి; దురత్యయంబు+ఐన= దాటరానిది అయినట్టి; తపంబున్= తపస్సును; నివర్తింపన్+చేసెద= మరలింప చేస్తాను; వెఱవక= భయపడక; మీ మీ నివాసంబులకున్= మీ మీ ఇరవులకు; చనుండు= వెళ్లండి; అని= అని; ఆనతి+ఇచ్చినన్= ఆజ్ఞాపించగా; ఆ+దేవతలు= ఆ వేల్పులు; నిర్భయ+ఆత్ములు+ఐ= భయం తొలగిన మనస్సు కలవారలై; ఈశ్వరునకున్= ఆ విశ్వస్వామికి; ప్రణామంబులు= నమస్కృతులు; ఆచరించి= పెట్టి; త్రివిష్టపంబునకున్= స్వర్గానికి; చనిరి= పోయారు; తద్+అనంతరంబు+అ= ఆ పిమ్మటనే...

**తా :** ఆ నారాయణస్వామి దేవతల మనవిని విన్నాడు. వాళ్ల కిలా ధైర్యం చెప్పాడు. ఆ బుడుతడు ఉత్తానపాదుడనే రాజుబిడ్డ. విశ్వాత్మకుడనైన నా యందు తన మనస్సును లీనం చేసి ఏకాగ్రతతో తపస్సు చేస్తున్నాడు. ఆ ఘోరతపం మూలంగానే మీ ఊర్పుల కదలిక ఆగిపోయింది. అలా అతిక్రమింప వీలులేని ఆతడి తపస్సును వెనక్కి మళ్లింపచేస్తాను. భయపడకుండా మీ గృహాలకు మీరు వెళ్లండి అని ఆజ్ఞాపించాడు. ఆ దేవతలు ఏ జంకూ లేనివారలై ఆ విష్ణుమూర్తికి నమస్కరించి నిశ్చింతగా తమ దివిసీమకు తిరిగి వెళ్లారు. ఆ తరువాత

**సీ. హరి యీశ్వరుండు విహంగకులేశ్వరయానుఁడై నిజభృత్యుఁడైన ధ్రువునిఁ**
**గనుఁగొను వేడుక జనియింప నా మధువనమున కప్పుడు సని ధ్రువుండు**
**పరువడి యోగవిపాకతీవ్రంబైన బుద్ధిచే నిజమనోంబురుహముకుళ**
**మందుఁదటిత్ప్రభాయతమూర్తి యటఁ దిరోధానంబునను నొంది తత్క్షణంబ**

**తే. తన పురోభాగమందు నిల్చినను బూర్వ, సమధికజ్ఞాననయనగోచరసమగ్ర**
**మూర్తిఁ గనుఁగొని సంభ్రమమునను సమ్మ, దాశ్రువులు రాలఁ బులకీకృతాంగుఁ డగుచు. 278**

**ప్రతి :** హరి= విష్ణువు అయిన; ఈశ్వరుండు= విశ్వాల ఏలిక; విహంగకుల= పక్షిజాతిలో; ఈశ్వర= శ్రేష్ఠుడైన గరుడుడు; యానుఁడు+ఐ= వాహనమైనవాడై; నిజ= తనయొక్క; భృత్యుఁడు+ఐన= సేవకుడయిన; ధ్రువునిన్= ధ్రువుణ్ణి; కనున్+కొను= చూడాలనే; వేడుక= కుతూహలం; జనియింపన్= పుట్టగా; ఆ+మధువనమునకున్= ఆ మధువన క్షేత్రానికి; అప్పుడు= దేవతలు వెళ్లిన వెనువెంటనే; చని= వెళ్లి; ధ్రువుండు= ధ్రువుడు; పరువడి= క్రమంగా; యోగ విపాక= భక్తియోగ ఫలంచే; తీవ్రంబు+ఐన= నిశితమైన; బుద్ధిచేన్= జ్ఞానంచే; నిజ= తనయొక్క; మనస్+అంబురుహ= హృదయం అనే పద్మంయొక్క; ముకుళము+అందున్= మొగ్గలో; తటిత్= మెరుపుయొక్క; ప్రభా= కాంతితో; ఆయత= విస్తారమైన; మూర్తి= విగ్రహం; అటన్= ఆవల; తిరోధానంబుననున్= మఱుగుపాటును; ఒంది= చెంది; తద్+క్షణంబ= ఆ నిముసంలోనే; తన= తనయొక్క; పురస్+భాగము అందున్= తనకు ముందువైపున; నిల్చినను= నిల్వగా; పూర్వ= ముందటికంటే; సమధిక= మిక్కిలి పెంపుపొందిన; జ్ఞాన= తెలివి అనే; నయన= కళ్లకు; గోచర= పొడగట్టినట్టి; సమగ్రమూర్తిన్= పూర్తివిగ్రహాన్ని; కనుఁగొని= కాంచి; సంభ్రమమునను= వేగిరపాటుతో; సమ్మద= ఆనందపు; అశ్రువులు= బాష్పాలు; రాలన్= జారగా; పులకీకృత= గగుర్పొడిచిన; అంగుఁడు అగుచున్= అవయవాలు కల్గిన వాడవుతూ.

**తా :** వాళ్లంతా అటు వెళ్లగానే నారాయణుడైన ఆ విశ్వప్రభువు, పక్షుల్లో ఉన్నతుడైన గరుడుని వాహనంగా చేసుకొని తన భక్తుడు ధ్రువుణ్ణి చూడాలని వేడుకపడి ఆ వెంటనే తిన్నగా మధువన క్షేత్రానికి కదలివెళ్లాడు. మిక్కుటం అయిన భక్తి యోగసాధనతో ధ్రువుడి బుద్ధి పదనెక్కింది. తన మనస్సనే విచ్చీవిచ్చని తామరమొగ్గలో మెరుపు మెరిసినట్లు తళుక్కుమన్న ఆ సర్వ వ్యాపకమూర్తిమత్వం అంతరాన అంతర్ధానమయింది. ఆ మరుక్షణంలోనే తన ఎదుట ప్రత్యక్షమైంది. ఆ పూర్వ, అపూర్వజ్ఞాన చక్షువులకు ఇంతదాకా పొడగట్టిన ఆ నిండు రూపాన్ని కళ్లు విప్పి తిలకించాడు. తత్తరపడ్డాడు. ఆనందబాష్పాలు రాల్చాడు. ఒళ్లంతా పులకించి పోయింది.

## a =సాక్షాత్కరించిన భగవంతుని ధ్రువుండు స్తుతించుట a

**తే. నయనముల విభు మూర్తిఁ బానంబుసేయు, పగిదిఁ దన ముఖమునను జుంబనము సేయు**
**లీలఁ దగ భుజములను నాలింగనంబు, సేయుగతి దండవన్నమస్కృతు లొనర్చె. 279**

**ప్రతి :** విభుమూర్తిన్= ఈశ్వరరూపాన్ని; నయనములన్= రెండుకళ్లతోనూ; పానంబు+చేయుపగిదిన్= క్రోలుతున్నట్లుగా; తన ముఖముననున్= తన వదనంతో; చుంబనము+చేయులీలన్= ముద్దుపెట్టుకుంటున్నట్లుగా; తగన్= ఒప్పిదంగా; భుజములనున్= భుజాలతో; ఆలింగనము+చేయుగతిన్= కవుగలించుకుంటున్నట్లుగాతోచి; దండవత్= కర్రవలె సాగిలపడి; నమస్కృతులు= జోతలు; ఒనర్చెన్= పెట్టాడు.

**తా :** ఆ సర్వవ్యాపకమైన ఆ దైవస్వరూపాన్ని కళ్లారా జుర్రుకుంటున్నట్లుగా, ముఖంతో ముద్దుపెట్టుకుంటున్నట్టుగా భావించుకుంటూ చేతులతో కౌగలించుకుంటున్నట్టుగా అనుభూతి పొందుతూ సాగిలపడి నమస్కరించాడు.

**వ. ఇట్లు దండప్రణామంబు లాచరించి కృతాంజలియై స్తోత్రంబు సేయ నిశ్చయించియు స్తుతిక్రియా సమర్థుండు గాక యున్న ధ్రువునకును సమస్తభూతంబులకు నంతర్యామి యైన యాశ్వరుం డాతని తలం**

**పెఱింగి వేదమయంబయిన తన శంఖంబు చేత నబ్బాలుని కపోలతలం బంటిన జీవేశ్వరనిర్ణయజ్ఞుండును, భక్తిభావ నిష్ఠుండును నగు ధ్రువుండు నిఖిలలోకవిఖ్యాతకీర్తి గల యీశ్వరుని భగవత్ప్రతిపాదితంబు లగుచు వేదాత్మకంబులైన తన వాక్కుల నిట్లని స్తుతియించె; దేవా! నిఖిలశక్తి ధరుండవు, నంతఃప్రవిష్టుండవు నైన నీవు లీనంబు లైన మదీయవాక్యంబుల ఘ్రాణేంద్రియంబులం గరచరణ శ్రవణత్వగాదులను జిచ్ఛక్తిచేఁ గృపంజేసి జీవింపం జేసిన భగవంతుడవును, బరమపురుషుం డవును నైన నీకు నమస్కరింతు; నీ వొక్కరుండవయ్యు మహదాద్యంబైన యీ యశేషవిశ్వంబు మాయాఖ్యం బయిన యాత్మీయ శక్తిచేతం గల్పించి యందుం బ్రవేశించి యింద్రియంబు లందు వసించుచుఁ దత్తద్దేవతారూపంబులచే నానాప్రకారంబుల దారువులం దున్న వహ్ని చందంబునం బ్రకాశింతు వదియునుం గాక. 280**

**ప్రతి :** ఇట్లు= ఈ విధాన; దండప్రణామంబులు= సాగిలపడి నమస్కారాలు; ఆచరించి= చేసి; కృత= చేయబడిన; అంజలి+ఐ= దోసిలి కలవాడై; స్తోత్రంబు+చేయన్= నుతించగా; నిశ్చయించియున్= గట్టిగా తలంచి; స్తుతిక్రియా= వర్ణించడానికి; సమర్థుండున్+కాక= శక్తిచాలక; ఉన్న= ఉన్నట్టి; ధ్రువునకును= ధ్రువుడికిన్ని; సమస్తభూతంబులకున్= అన్ని ప్రాణులకున్నూ; అంతర్యామి+ఐన= లోపల సంచరించేవాడైన; ఈశ్వరుండు= విష్ణువు; ఆతని= ఆ ధ్రువుడియొక్క; తలంపు= అభిప్రాయాన్ని; ఎఱింగి= గ్రహించి; వేదమయంబు+అయిన= బ్రహ్మాత్మకమైన; తన శంఖంబుచేతన్= తన శంకువుతో; ఆ+బాలుని= ఆ పిల్లవాడి; కపోలతలంబు= చెక్కిలి భాగాన్ని; అంటినన్= పుణకగా; జీవ+ఈశ్వర= జీవాత్మ, పరమాత్మలయొక్క; నిర్ణయజ్ఞుండును= వేరుపాటు తెలిసినవాడూ; భక్తిభావ= భక్తి తోనిండిన ప్రేమభావమందు; నిష్ఠుండునున్= శ్రద్ధకలవాడును; అగు= అయినట్టి; ధ్రువుండు= ధ్రువుడు; నిఖిలలోక= అన్నిలోకాల్లోనూ; విఖ్యాత= ప్రశస్తమైన; కీర్తిగల= ఖ్యాతిగల; ఈశ్వరుని= విష్ణుని; భగవత్= భగవంతునిచే; ప్రతిపాదితంబులు+అగుచున్= తెలుపబడినవవుతూ; వేద+ఆత్మకంబులు+ఐన= బ్రహ్మమయాలైన; తన వాక్కులన్= తన వచనాలతో; ఇట్లు+అని= ఇలాగున; స్తుతియించెన్= స్తుతించాడు; దేవా!= ఓ దైవమ!; నిఖిలశక్తి= అఖిలజ్ఞాన క్రియాసామర్థ్యాలను; ధరుండవున్= తాల్చినవాడవూ; అంతః= జీవులలోపల; ప్రవిష్టుండవున్= ప్రవేశించినవాడవూ; ఐన= అయినట్టి; నీవు= (నువ్వు); లీనంబులు+అయిన= లయించి పోయిన; మదీయవాక్యంబులన్= నా మాటలను; ప్రాణ+ఇంద్రియంబులన్= (నా) ఊపిరులనూ, (నా) ఇంద్రియాలనూ; కర= చేతులు; చరణ= పాదాలు; శ్రవణ= చెవులు; త్వక్= చర్మం; ఆదులను= మొదలైనవాటిని; చిత్+శక్తిచేన్= జ్ఞానం బలిమిచే; కృపన్+చేసిన= దయ కనుబరచిన; భగవంతుడవును= దైవమవూ; పరమ పురుషుండవునున్= పురుషోత్తముడవును; ఐననీకు= అయినట్టినీకు; నమస్కరింతున్= నమస్కరిస్తాను; నీవు= నువ్వు; ఒక్కరుండవు+అయ్యున్= ఒంటరివే అయినా; మహత్+ఆద్యంబు+ఐన= మహత్తత్వం మొదలుగాకలదైన; ఈ+అశేషవిశ్వంబున్= ఈ సమస్తప్రపంచాన్ని; మాయా+ఆఖ్యంబు+అయిన= మాయ అనే పేరుకలదైన; ఆత్మీయశక్తిచేతన్= నీదైన శక్తిచేత; కల్పించి= పుట్టించి; అందున్ ప్రవేశించి= ఆ మాయలో దూరి; ఇంద్రియంబుల+అందున్= త్వగాది, వాగాది ఇంద్రియాలలో; వసించుచున్= ఉంటూ; తద్+తద్= ఆ యా; దేవతా రూపంబులచే= దేవతల ఆకారాలతో; దారువుల+అందున్+ఉన్న= కట్టెల్లో ఉన్న; వహ్ని చందంబునన్= నిప్పువలె; నానా ప్రకారంబుల= పెక్కు విధాలుగా; ప్రకాశింతువు= వెల్గొందుతుంటావు; అదియునున్+కాక= అంతేకాకుండా.

**తా :** ఇలా అనుభవిస్తూ సాగిలబడి నమస్కరించి రెండు చేతులు జోడించి కీర్తించడానికి సంకల్పించాడు. వర్ణించడానికి ధ్రువుడి చేత కాలేదు. సర్వాంతర్యామి విష్ణువు ధ్రువుడి ఇంగితాన్ని గమనించాడు. వేదాత్మకమైన తన శంఖంతో ధ్రువుడి బుగ్గలను నిమిరాడు. ఆ స్పర్శతో ధ్రువుడికి జీవాత్మ పరమాత్మల వేరుపాటును చక్కగా పసికట్టగల జ్ఞానం కల్గింది. ధ్రువుడు భక్తియందు శ్రద్ధాళువు అయ్యాడు. సమస్తభువనప్రఖ్యాతుడగు నారాయణుని మహత్తరమహిమచే చెప్పబడ్డవై ధ్రువుడి వేదమయవాక్కులుగా వెలువడుతున్నాయి. ఆ విష్ణువును ఆ తన మాటల్లో ఇలా స్తుతించాడు. ఓ దైవమా! అనంతశక్తి సమన్వితుడవు, సర్వాంతర్యామివి ఐన నువ్వు, నాలో సంలీనమై ఉన్న నా మాటలకూ, నా శ్వాసకూ, చేతులు, కాళ్లు, చెవులు, చర్మం మొదలైన ఇంద్రియాలకూ, నీ చైతన్యసామర్థ్యంచే దయ చూపి జీవింపచేసిన దైవమవు, పరమాత్మవు అయిన నీకు నమస్కరిస్తున్నాను. అనన్యుడవయిన నువ్వు మహత్తు మొదలైనవి ప్రధానంగా కల ఈ సకల చరాచర ప్రపంచాన్ని మాయ పేరిట నీ స్వతంత్రమైన ఇచ్ఛతో సృజించావు. ఆ మాయామయ ప్రపంచంలో త్వగాది ఇంద్రియ రూపాల్లో చొచ్చి ఉన్నావు. ఆ యా దేవతల స్వరూపాల్లో అన్నిరకాల కట్టెల్లో దాగి ఉండే నిప్పువలె బహు ప్రకారంగా కనిపిస్తుంటావు.

**విశే :** ప్రాణేంద్రియములు

1. ప్రాణములు. ఇవి ఐదు. 1.ప్రాణము, 2.అపానము, 3.వ్యానము, 4.ఉదానము, 5.సమానము.
2. ఇంద్రియములు – ఇవి కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు – రెండు రకాలు.
   కర్మేంద్రియములు : వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థ.
   జ్ఞానేంద్రియములు : త్వక్కు, చక్షువు, శ్రోత్రము, జిహ్వ, ఘ్రాణము.

**చ.** **వరమతి నార్తబాంధవ! భవద్ఘనబోధసమేతుఁడై భవ**
**చ్చరణముఁ బొంది నట్టి విధి సర్గము సుప్తజనుండు బోధమం**
**దరయఁగఁ జూచురీతిఁ గనునట్టి ముముక్షు శరణ్యమైన నీ**
**చరణములం గృతజ్ఞుఁడగు, సజ్జనుఁ డెట్లు దలంప కుండెడున్.** **281**

**ప్రతి :** ఆర్తబాంధవా!= దుఃఖంలో ఉన్నవాళ్లకు చుట్టమైనవాడా!; వరమతిన్= శ్రేష్ఠమైన బుద్ధితో; భవత్= నీ యొక్క; ఘన= గొప్ప; బోధ= జ్ఞానం; సమేతుడు+ఐ= కూడినవాడై; భవత్= నీయొక్క; చరణమున్= పాదాన్ని; పొందిన= చెందిన; అట్టి= అలాంటి; విధిన్= బ్రహ్మను; సర్గమున్= సృష్టిని; సుప్తజనుండు= నిద్రించినవాడు; బోధము= మెలకువ; అందున్= లో; అరయగన్= విచారించి; చూచురీతిన్= చూసేవిధంగా; కనునట్టి= కనబడే; ముముక్షు= మోక్షేచ్ఛగలవారికి; శరణ్యమైన= దిక్కయిన; నీ చరణములన్= నీ పాదాలను; కృతజ్ఞుడు+అగు= ఉపకారం మరువని; సత్+జనుడు= మంచివాడు; ఎట్లు= ఏవిధంగా; తలంపకన్+ఉండెడు= ధ్యానించకుండ ఉంటాడు...

**తా:** దీనబాంధవా! నిద్రనుంచి లేచినవాడు మళ్లీ ప్రపంచాన్ని చూసినట్లు బ్రహ్మదేవుడు నిన్ను శరణుపొంది నీవు ప్రసాదించిన జ్ఞానం చేత శ్రేష్ఠమైన బుద్ధితో ఈ సమస్త ప్రపంచాన్ని సందర్శించాడు. అట్టి మోక్షం కోరేవాడికి శరణాలయిన నీ పాదాలను ఉపకారం మరువని సజ్జనుడు ఎలా మరచిపోతాడు? (మరచిపోడు)

సీ. మహితాత్మ! మఱి జన్మమరణప్రణాశన హేతుభూతుండవు నిద్ధకల్ప
తరువవు నగు నిన్నుఁదగ నెవ్వరే నేమి పూని నీ మాయావిమోహితాత్మ
లగుచు ధర్మార్థకామాదులకొఱకుఁ దా మర్పించుచును ద్రిగుణాభమైన
దేహోపభోగ్యమై దీపించు సుఖముల నెనయంగ మదిలోన నెంతు; రట్టి

తే. విషయసంబంధజన్యమై వెలయు సుఖము, వారికి నిరయమందును వఱలు దేవ!
భూరిసంసారతాపనివారగుణ క, థామృతాపూర్ణ! యాశ! మాధవ! ముకుంద! **282**

**ప్రతి :** మహిత= గొప్ప; ఆత్మ= మనసు కలవాడా! మఱి= ఇంకనూ; జన్మ= పుట్టుట; మరణ= గిట్టుటల యొక్క; ప్రణాశన= పూర్తి నాశనానికి; హేతుభూతుండవున్= నిమిత్తమై ఉన్నవాడవును; ఇద్ధ= ప్రకాశించే; కల్పతరువున్= కల్పవృక్షం వంటివాడవు; అగు= అయినట్టి; నిన్నున్= నిన్ను; తగన్= ఒప్పునట్లుగా; ఎవ్వరు+ఏన్= ఏ భక్తులయినా; ఏమి= ఏ కోరికనైనా; పూని= ప్రయత్నించి; నీ మాయా= నీ మాయచే; విమోహిత= వశులైన; ఆత్ములు+అగుచున్= చిత్తం కలవాళ్లవుతూ; ధర్మ+అర్థ+కామ+ఆదులకొఱకున్= ధర్మం, అర్థం, కామం మొదలయిన వాటికోసం; తాము; అర్పించుచును= సమర్పించుకుంటూ; త్రిగుణ= (సత్త్వరజస్తమో) గుణాలతో; ఆభమైన= సరికాగల; దేహ= శరీరంచే; ఉపభోగ్యము+ఐ= అనుభవించ తగినదై; దీపించు= ప్రకాశించు; సుఖములన్= సంతోషాల్లో; ఎనయంగన్= ఒప్పారునట్లుగా; మదిలోనన్= మతిలో; ఎంతురు= భావిస్తారు; అట్టి= అటువంటి వాళ్లు; విషయ= ఇంద్రియార్థాల; సంబంధ= కలయికవల్ల; జన్యమై= పుట్టుతున్నదై; వెలయు= ప్రకాశించే; సుఖము= సంతోషం; వారికిన్= వాళ్లకు; నిరయము+అందును= నరకంలోనూ; వఱలున్= ప్రవర్తిల్లుతుంది; భూరి= అధికమైన; సంసార= జీవలోకంవల్ల కలిగే; తాప= పీడను; నివార= నిరోధించే; గుణ= స్వభావంతో కూడిన; కథా= వృత్తాంతాల్లోని ; అమృత= మాధుర్యంతో; ఆపూర్ణ= నిండి ఉన్నవాడా!; ఈశ!= ఈశ్వరా!; మాధవ= లక్ష్మీపతీ!; ముకుంద= విష్ణువా!

**తా :** మహాత్మా! నువ్వు చావుపుట్టుకల విముక్తికి నిమిత్తుడవు. ప్రకాశించే కల్పవృక్షం వంటివాడవు. భక్తులు ఎవ్వరైనా తాము కోరినదాని కోసం ప్రయత్నించే వాళ్లు నీ మాయకు లోనవుతారు. చతుర్విధ పురుషార్థాల భోగాలకోసం తమను తాము అప్పగించుకుంటారు. అది త్రిగుణమయమైన శారీరక సుఖాలకోసంగా మనస్సున సంకల్పించుకుంటారు. సంసార తాపాన్ని పాపే గుణకథన మాధుర్యం గలవాడా! దేవా! ఈశా! మాధవా! ముకుందా! అలాంటివాళ్లకు ఇంద్రియార్థాల వల్ల కల్గే సౌఖ్యం నరకంలోనూ వర్తిల్లుతుంది.

మ. అరవిందోదర! తావకీనచరణధ్యానానురాగోల్లస
చ్చరితాకర్ణనజాతభూరిసుఖముల్ స్వానందకబ్రహ్మ మం
దరయన్ లే వఁట! దండభృద్ధతవిమానాకీర్ణులై కూలు నా
సురలోకస్థులఁజెప్పనేల సుజనస్తోమైకచింతామణీ! **283**

**ప్రతి :** అరవింద+ఉదర= ఉదరంలో పద్మం కలవాడా!; సుజనస్తోమైక చింతామణీ= సత్పురుషుల సమూహానికి ముఖ్యమైన చింతామణి ఐనవాడా; తావకీన= త్వదీయమైన; చరణ= పాదాలయొక్క; ధ్యాన= చింతనం వలని, అనురాగ= అపారమైన కూరిమితో; ఉల్లసత్= అలరిస్తున్న; చరిత= జీవనగాథలను; ఆకర్ణన= వినడం వల్ల; జాత= ప్రాప్తించిన; భూరి= అపారమైన;

సుఖముల్= భోగాలు; స్వ= తనదైన; ఆనందక= ఆనందంగా రూపించే; బ్రహ్మము+అందున్= పరమాత్మ అందుకూడా; అరయన్+లేవు+అఁట= చూడగా లేవట; దండభృత్= దండం పట్టిన యముడిచే; హత= కొట్టబడిన; విమాన= విమానాలనుంచి; ఆకీర్ణులు+ఐ= చెల్లాచెదరుగా; కూలు= జారిపడుతున్న; ఆ సురలోకస్థులన్= ఆ దేవలోక వాసులగూర్చి; చెప్పన్ ఏల= చెప్పడం ఎందుకు?

**తా :** పద్మనాభా! సుజన సమూహానికి ఒకే చింతామణియైనవాడా! నీ చరణాలను స్మరించడంవల్లా, మిక్కిలి ప్రేమతో అలరింపచేసే నీ గాథలను వినడంవల్లా, సమకూడిన ఆనందం, తననే ఆనందంగా భావించే బ్రహ్మానందంలోనూ వెదకినను లేదట. యముడి కాలదండంచే భగ్నమై విరిగిపడే విమానాలనుంచి ఎడం లేకుండా నేలకూలే ఆ సురలోకవాసులను (అనగా పుణ్యాలుచేసి స్వర్గంచేరినవారు పుణ్యాంతంలో తిరిగి నేలకు చేరేవారిని) గూర్చి ఇక చెప్పుకునేది ఏమి ఉంటుంది.

**విశే :** దానధర్మాది పుణ్యకార్యాల వల్ల స్వర్గానికి వెళ్లిన వారు తిరిగి భూలోకానికి వస్తారు. కాని మోక్షం కోసం ప్రయత్నించి వెళ్లినవారు భూలోకానికి తిరిగిరారు. స్వర్గానికి మోక్షానికి ఇది భేదం.

**చ. హరి! భజనీయమార్గనియతాత్మకులై భవదీయమూర్తిపై**
**వఱలిన భక్తియుక్తు లగువారల సంగతి గల్గఁజేయు స**
**త్పురుషసుసంగతిన్ వ్యసనదుస్తరసాగర మప్రయత్నతన్**
**సరసభవత్కథామృతరసంబున మత్తుఁడనై తరించెదన్? 284**

**ప్రతి :** హరి= ఓ విష్ణూ!; భజనీయ= సేవనీయమైన; మార్గ= పద్ధతియందు; నియత= నియమం పొందిన; ఆత్మకులు+ఐ= అంతఃకరణం కలవారలై; భవదీయ= నీదైన; మూర్తిపై= రూపంపై; వఱలిన= పెంపొందిన; భక్తిన్= భక్తితో; యుక్తులు+అగువారల= కూడిన యోగులయొక్క; సంగతిన్= సావాసాన్ని; కల్గన్+చేయు= చేకూర్చే; సత్పురుష= సాధుజనులయొక్క; సుసంగతిన్= మంచి సంసర్గంచేత; సరస= రుచిమంతమైన; భవత్= నీ యొక్క; కథా= వృత్తాంతం అనే; అమృతరసంబునన్= సుధల చవిచేత; మత్తుఁడను+ఐ= పరవశుడనై; వ్యసన= ఆపదలనే; దుస్తర= తరింపరాని; సాగరమున్= (సంసార) సముద్రాన్ని; అప్రయత్నతన్= సునాయాసంగా; తరించెదన్= దాటతాను.

**తా :** ఓ హరి! నీ ఆరాధన విధానంలో నియమంతో మనస్సు పెట్టే వాళ్లయొక్క, నీదు మూర్తిపైనే దృష్టిపెట్టిన భక్తవరుల యొక్క సహవాసాన్ని నాకు సమకూర్చు. ఆ సజ్జన సాంగత్యంచేత రుచికరమైన నీ కథామృతపానంచేత ఉన్మత్తుడ నవుతాను. ఆ పారవశ్యంతో దాటశక్యంకాని కష్టాల కడలిని సులభతమంగా దాటేస్తాను.

**చ. నిరతముఁ దావకీనభజనీయపదాబ్జసుగంధలబ్ధి యె**
**వ్వరి మది వొందఁగాఁ గలుగు, వారలు తత్ప్రియమర్త్యదేహము**
**న్నరయఁ దదీయదార తనయాదిసుహృద్గృహబంధువర్గమున్**
**మఱతురు విశ్వతోముఖ! రమాహృదయేశ! ముకుంద! మాధవా! 285**

**ప్రతి :** విశ్వతోముఖ!= అంతటా వ్యాపించి ఉన్నవాడ!; రమా!= లక్ష్మీదేవియొక్క; హృదయ+ఈశ= మనోనాథ!; ముకుంద!= మోక్షదాతా!; మాధవా= లక్ష్మీపతీ!; నిరతమున్= ప్రతిదినమున్నూ; తావకీన= నీయొక్క; భజనీయ= పూజించదగ్గ;

పద+అబ్జ= పాదపద్మాలయొక్క; సుగంధ= సువాసనలయొక్క; లబ్ధి= ప్రాప్తి; ఎవ్వరి= ఎవ్వరియొక్క; మది= మనస్సు; పొందగాన్+కలుగున్= పొందగలదో; వారలు= వాళ్లు; తద్= ఆ; ప్రియ= ఇష్టమయ్యే; మర్త్య= మరణస్వభావంగల మానవులయొక్క; దేహమున్= శరీరాన్ని గురించి; అరయన్= విచారించుటను; తదీయ= వాళ్లకు చెందిన; దార= పెళ్లాం; తనయ+ఆది= బిడ్డలు మొదలైనవాళ్లను; సుహృద్= మిత్రుల్ని; గృహ= ఇళ్లనూ; బంధువర్గమున్= చుట్టాల సముదాయాన్ని; మఱతురు= మరచిపోతారు.

**తా :** ఓ సర్వాంతర్యామీ! లక్ష్మీవల్లభా! ముక్తిదాయకా! హరీ! ఎప్పుడూ నీ పాదపద్మాల సేవా పరిమళంలో మునిగి తేలే మనస్సు కలవాళ్లు ఎంతో ప్రియమైన తమ శరీరం నశ్వరత్వాన్ని గ్రహిస్తారు. అలాంటి వాళ్లు తమ భార్యల్ని, బిడ్డల్ని, మిత్రుల్ని, ఇంటిని, బంధువుల బలగాన్ని మరచిపోతారు.

**సీ. పరమాత్మ! మర్త్యసుపర్వతిర్యఙ్మృగ దితిజ సరీసృపద్విజగణాది**
**సంవ్యాప్తమును సదసద్విశేషంబును గైకొని మహదాదికారణంబు**
**నైన విరాడ్విగ్రహంబు నే నెఱుఁగుదుఁ గాని తక్కిన సుమంగళము నైన**
**సంతతసుమహితైశ్వర్యరూపంబును భూరిశబ్దాదివ్యాపారశూన్య**

**తే. మైన బ్రహ్మస్వరూప మే నాత్మ నెఱుఁగఁ, బ్రవిమలాకార! సంసారభయవిదూర!**
**పరమమునిగేయ! సంతతభాగధేయ!, నలిననేత్ర! రమాలలనాకళత్ర! 286**

**ప్రతి :** ప్రవిమల= నిర్మలమైన; ఆకార= రూపం కలవాడా!; సంసారభయ= సంసార భయాన్ని; విదూర= దూరం చేసేవాడా!; పరమ మునిగేయ= గొప్ప మునులచే గానం చేయబడేవాడ!; సంతత= ఎప్పటికీ కొనసాగుతూ ఉండే; భాగధేయ= భాగ్యం కలవాడా!; నలిననేత్ర= పద్మపురేకులవంటి కళ్లు కలవాడ!; రమా= లక్ష్మీ అనే; లలనా= కాంత; కళత్ర= భార్యగా కలవాడా!; పరమాత్మ!= పరబ్రహ్మమా!; మర్త్య= మానవులు; సుపర్వ= దివిజులు; తిర్యక్= పశువులు; మృగ= జంతువులు; దితిజ= రాక్షసులు; సరీసృప= పాకే జంతువులు; ద్విజగణ= పక్షుల గుములు; ఆది= మొదలైన పలుప్రాణులతో; సంవ్యాప్తమును= నిండి ఉన్నదిన్ని; సత్= స్థూలపంచభూతాల; అసద్= సూక్ష్మపంచభూతాల; విశేషంబును= భేదాలను; కైకొని= స్వీకరించి; మహత్+ఆది= మహత్తత్త్వం మొదలైనవాటికి; కారణంబున్+ఐన= హేతువు అయిన; విరాట్+విగ్రహంబు= విరాడ్రూపం; ఏన్= నేను; ఎఱుఁగుదున్+కాని= తెలియుదును కాని; తక్కిన= మిగిలిన; సుమంగళమున్+ఐన= శుభకారి అయిన; సంతత= నిరంతరమైన; సుమహిత= ఘనమైన; ఐశ్వర్య= ఐశ్వర్యమహిమగల; రూపంబును= ఈశ్వరస్వరూపాన్ని; భూరి= ఎక్కువైన; శబ్ద+ఆది= శబ్దాదులయొక్క; వ్యాపార= వ్యవహారం; శూన్యము+ఐన= బొత్తిగా లేనిది అయిన; బ్రహ్మస్వరూపమున్= పరబ్రహ్మమూర్తిని; ఏను= నేను; ఆత్మన్= అంతఃకరణంలో; ఎఱుఁగన్= తెలియను.

**తా :** శుద్ధ స్వరూపుడా! పరమాత్మా! భవభయాన్ని దూరంగా తోసేవాడా! పరమముని కీర్తనీయా! నిరంతరం భాగ్యంకలవాడా! పద్మనయనా! లక్ష్మీనాథా! నీ స్థూలమైన విశ్వరూపం మానవులు, దేవతలు, పశువులు, జంతువులు, రాక్షసులు, పాములు, పక్షులు మొదలైన పెక్కు ప్రాణి కోటితో నిండి ఉంటుంది. ప్రకృతి, పురుషుడు వంటి సత్, అసత్ భేదాలు కలది. మహత్తత్త్వాదులకి హేతువైనట్టిది అయిన విరాడ్రూపము నాకు తెలుసును. కాని నిత్యం క్షేమదాయకం అయినదీ, ఎపుడూ ఐశ్వర్యరూపంతో ఉండేదీ, అనేక శబ్దాదుల వ్యవహారం లేనిదీ అయిన మిగిలిన బ్రహ్మరూపం గూర్చి నాకు ఏమీ తెలియదు.

సీ. సర్వేశ! కల్పాంతసమయంబు నందు నీ యఖిలప్రపంచంబు నాహరించి
యనయంబు శేషసహాయుండవై శేషపర్యంకతలమునఁ బవ్వళించి
యోగనిద్రారతి నుండి నాభీసింధుజస్వర్ణలోకకంజాతగర్భ
మందుఁ జతుర్ముఖు నమరఁ బుట్టించుచు రుచి నొప్పు బ్రహ్మస్వరూపివైన

తే. నీకు మ్రొక్కెద నత్యంతనియమ మొప్ప, భవ్యచారిత్ర! పంకజపత్రనేత్ర!
చిరశుభాకార! నిత్యలక్ష్మీవిహార!, యవ్యయానంద! గోవింద! హరి ముకుంద! **287**

ప్రతి : సర్వ+ఈశ= నిఖిలేశా!; కల్ప+అంత= కల్పాంత; సమయంబున్+అందున్= ప్రళయకాలంలో; ఈ+అఖిల ప్రపంచంబున్= ఈ త్రైలోక్యాన్ని; ఆహరించి= లయించి; అనయంబు= నిరంతరం; శేషసహాయుండవు+ఐ= ఆదిశేషుడు చేదోడుగా కలవాడవై; శేషపర్యంక తలమునన్= శేషశయ్యపైన; పవ్వళించి= పరుండి; యోగనిద్రా= యోగనిద్రయందు; రతిన్+ఉండి= అభిలాషతో ఉండి; నాభీ= బొడ్డు అనే; సింధుజ= సముద్రంలో పుట్టిన; స్వర్ణలోక= బంగారులోకమనే; కంజాత= పద్మం యొక్క; గర్భము+అందున్= గర్భంలోనుంచి; చతుర్+ముఖున్= బ్రహ్మను; అమరన్= కుదిరికగా; పుట్టించుచున్= పుట్టిస్తూ; రుచిన్= కాంతితో; ఒప్పు= వెల్గొందే; బ్రహ్మస్వరూపివి+ఐన= పరబ్రహ్మరూపుడవైన; నీకున్= నీకు; భవ్యచారిత్ర= శుభచరిత కలవాడా!; పంకజ పత్ర నేత్ర= తామర రేకులవంటి కన్నులు కలవాడా!; చిర= శాశ్వతమైన; శుభ= క్షేమకరమైన; ఆకార= రూపు దాల్చినవాడా!; నిత్య= ఎల్లకాలం; లక్ష్మీ= లక్ష్మితోనే; విహార= వినోదించేవాడా!; అవ్యయ= తరుగులేని; ఆనంద= సంతోషం కలవాడా!; గోవింద= కృష్ణ!; హరి= విష్ణూ!; ముకుంద= ముకుందా!; అత్యంత= మిక్కిలి; నియమము= వ్రతనిష్ఠ; ఒప్పన్= ప్రకాశించేలా; మ్రొక్కెదను= నమస్కరిస్తాను.

**తా :** కల్పాంతవేళ ఈ బ్రహ్మాండాన్ని నీలో కలుపుకొని శేషుణ్ణి తోడుగా చేసుకొని నిత్యం ఆ శేషతల్పం పైననే పరుంటావు. యోగనిద్రాసక్తిలో ఉంటావు. బొడ్డు అనే సముద్రంలో పుట్టిన బంగరు పద్మం దుద్దునుంచి బ్రహ్మను ఒద్దికగా పుట్టిస్తావు. ఆ పద్మం తేజస్సును బయలుపరచే బ్రహ్మ స్వరూపంలో నువ్వే ఉంటావు. ఓ శుభప్రవర్తనుడా! పద్మదళనయనుడా! నిత్య భద్రకరరూపా! అక్షీణ ఆనందరూపా! గోవిందా! నారాయణా! ముక్తిదాయకా! అట్టి నీకు నియమవంతుడనై మొక్కుతాను.

**వ. అట్లు యోగనిద్రాపరవశుండ వయ్యును జీవులకంటె నత్యంతవిలక్షణుండవై యుండుదు; వది యెట్లనిన బుద్ధ్యవస్థాభేదంబున నఖండితం బయిన స్వశక్తిం జేసి చూచు లోకపాలననిమిత్తంబు యజ్ఞాధిష్ఠాతవు గావున నీవు నిత్యముక్తుండవును, బరిశుద్ధుండవును, సర్వజ్ఞుండవును, నాత్మవును, గూటస్థుండవును, నాది పురుషుండవు, భగవంతుండవు, గుణత్రయాధీశ్వరుండవునునై వర్తింతువు; భాగ్యహీనుండైన జీవునియందు నీ గుణంబులు గలుగ; వే సర్వేశ్వరునం దేమి విరుద్ధగతులై వివిధశక్తి యుక్తంబులైన యవిద్యాదు లానుపూర్వ్యంబునం జేసి ప్రలీనంబు లగుచుండు నట్టి విశ్వకారణంబు నేకంబు ననంతంబు నాద్యంబు నానందమాత్రంబు నవికారంబు నగు బ్రహ్మంబునకు నమస్కరించెద; మఱియు దేవా! నీవ సర్వవిధఫలం బని చింతించు నిష్కాము లయిన వారికి రాజ్యాదికామితంబులలోనఁ బరమార్థం బయిన ఫలంబు సర్వార్థరూపుండవైన భవదీయపాదపద్మ సేవనంబ; యిట్లు నిశ్చితంబ యైనను సకాములైన దీనులను గోవు వత్సంబును స్తన్యపానంబు సేయించుచు వృకాదిభయంబువలన రక్షించు చందంబునం గామప్రదుండవై సంసారభయంబువలన బాపుదు వని యిట్లు**

**సత్యసంకల్పుండును, సుజ్ఞానియు నయిన ధ్రువునిచేత వినుతింపంబడి భృత్యానురక్తుండైన భగవంతుండు సంతుష్టాంతరంగుండై యిట్లనియె. 288**

**ప్రతి :** అట్లు= ఆలాగ; యోగనిద్రా= యోగనిద్రయందు; పరవశుండవు= తన్మయుడవు; అయ్యును= అయినప్పటికిన్నీ; జీవులకంటెన్= ఇతరప్రాణులకన్న; అత్యంత= పూర్తిగా; విలక్షణుండవు+ఐ= భిన్నుడవై; ఉండుదువు= ఉంటావు; అది= ఆ వేరుపాటు; ఎట్లు+అనినన్= ఎలా అంటే; బుద్ధి= జ్ఞానం యొక్క; అవస్థా= దశవలన; భేదంబునన్= విశేషంవల్ల; అఖండితంబు+అయిన= ఏకాకారంగా ఉండే; స్వశక్తిన్+చేసి= తన చైతన్యశక్తివల్ల; చూచు= పరికించే; లోకపాలననిమిత్తంబు= లోకరక్షణకోసం; యజ్ఞ+అధిష్ఠాతవు= యాగానికి అధిదేవతవు; కావునన్= కాబట్టి; నీవు; నిత్యముక్తుండవును= శాశ్వత మోక్షరూపుడవునూ; పరిశుద్ధుండవును= పవిత్రుండవునూ; సర్వజ్ఞుండవునున్= సమస్తమూ ఎరిగి ఉన్నవాడవునూ; ఆత్మవును= ఆత్మస్వరూపుడవూ; కూటస్థుండవునున్= సర్వలోకాల్లోనూ/సర్వకాలాల్లోనూ ఒకే రీతిగా ఉండేవాడవూ; ఆదిపురుషుండవు; భగవంతుడవు= ఐశ్వర్యాదులైన ఆరు మహాలక్షణాలు కలవాడవు; గుణత్రయ= మూడు గుణాలకు; అధి+ఈశ్వరుండవునున్+ఐ= అధిపతివీ అయి; వర్తింతువు= ఉంటావు; భాగ్యహీనుండు+ఐన= స్వయంప్రకాశం లేనివాడైన, దరిద్రుడైన; జీవుని అందున్= ప్రాణిలో; నీ గుణంబులు= నీ గుణాలు; కలుగవు= ఉండవు; ఏ సర్వ+ఈశ్వరున్+అందున్= ఏ అఖిలాధినాథునియందు; ఏమి= ఎట్టి; విరుద్ధగతులు+ఐ= ప్రతికూలగమనం కలవై; వివిధశక్తి= పలువిధనైపుణ్యాలతో; యుక్తంబులు+ఐన= కూడి ఉన్నవి అయిన; అవిద్యా+ఆదులు= అవిద్యాది ఐదుకోశాలు; ఆనుపూర్వ్యంబునన్+చేసి= అనుక్రమం వల్ల; ప్రలీనంబులు+అగుచున్+ఉండున్= విలయం అవుతూ ఉంటాయో; అట్టి= అలాంటి; విశ్వకారణంబున్= లోకవ్యాప్తికి హేతువూ; ఏకంబున్= అద్వితీయమూ; అనంతంబున్= అపారమూ; ఆద్యంబున్= మూలమూ; ఆనందమాత్రంబున్= కేవలం ఆనందమయరూపమూ; అవికారంబున్= స్థితిమార్పులేనిదీ; అగు= అయిన; బ్రహ్మంబునకున్= పరబ్రహ్మమూర్తికి; నమస్కరించెదన్= నమస్కరిస్తాను; మఱియున్= ఇంకా; దేవా!= దేవర!; నీవ= నీవే; సర్వవిధఫలంబు+అని= సర్వతోముఖ ఫలితరూపమని; చింతించు= యోచించే; నిష్కాములు+అయినవారికిన్= నిరీహులైన యోగులకు; రాజ్య+ఆది= పరిపాలనం మొదలైన; కామితంబులలోనన్= వాంఛితాల్లో; పరమార్థంబు అయిన= యథార్థం అయిన; ఫలంబు= ప్రయోజనం; సర్వ+అర్థరూపుండవు+ఐన= సకలవస్తుస్వరూపుడవైన; భవదీయ= నీ యొక్క; పాదపద్మ= పద్మాలవంటి చరణాలను; సేవనంబు+అ= కొలవడమే; ఇట్లు= ఇలా సేవించడం; నిశ్చితంబు+అ+ఐనను= దృఢమైనదే అయినా; సకాములు+ఐన= వాంఛాపరులైన; దీనులను= దరిద్రులను; గోవు= ఆవు; వత్సంబును= లేగదూడను; స్తన్యపానంబు+చేయించుచున్= చనుబాలు కుడిపిస్తూ; వృక+ఆది= తోడేలు మొదలైన మృగాలయొక్క; భయంబువలనన్= భీతినుంచి; రక్షించు చందంబునన్= కాపాడు రీతిగా; కామప్రదుండవు+ఐ= కోరిక లీడేర్చేవాడవై; సంసారభయంబువలనన్= జీవలోకపు జడుపునుంచి; పాపుదువు= తొలగిస్తావు; అని; ఇట్లు= ఈవిధమైన; సత్యసంకల్పుండును= నిజమైన మనోనిశ్చయం కలవాడు; సుజ్ఞానియున్= చక్కటి తత్త్వజ్ఞుడు; అయిన= అయినట్టి; ధ్రువునిచేత= ధ్రువునిచే; వినుతింపన్+పడి= స్తుతించబడి; భృత్యా= బంటులయందు; అనురక్తుడు; ఐన= అనురాగం కలవాడైన; భగవంతుండు= భగవానుడు; సంతుష్ట= సంతృప్తమైన; అంతరంగుండు+ఐ= హృదయంకలవాడై; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అలా యోగనిద్రలో మునిగి ఉన్నప్పటికిన్నీ జీవులకంటే వేరైన వాడవే. అది ఎట్లనగా ఆ విలక్షణం అయిన మతిస్థితి విశేషంవల్ల మొక్కవోని స్వశక్తికలవాడవు. ఆ సామర్థ్యంచే విశ్వపాలనంకోసం యజ్ఞాధిష్ఠాతవు అయ్యావు. నువ్వు నిత్య విమోచనుడివి, నిత్యపావనుడవు, సర్వం తెలిసినవాడవు, సర్వానికి ఆత్మరూపుడవు, పరమాత్ముడవు, మూలపురుషుడవు,

ఐశ్వర్యం, ధర్మం, కీర్తి, ధనం, తెలివి, వైరాగ్యాది లక్షణాలుగల భగవానుడవు. త్రిగుణాధిపతివై వర్తిస్తుంటావు. నిర్భాగ్యుడైన జీవుడిలో ఈ గుణాలకు తావుండదు. పరస్పర విరుద్ధాలైన పలుసామర్థ్యాల యొక్క కలయిక గల సర్వేశ్వరుడవు. దాంట్లో అవిద్యాదుల వరుసలు లయమవుతూ ఉంటాయి. అలాంటి సర్వవ్యాపక కారకమూ, అద్వితీయమూ, అనంతమూ, మూలభూతమూ, ఆనందమయమూ, నిర్వికారమూ అయిన పరబ్రహ్మ స్వరూపుడవు నీవు. నీకు నమస్కారం. ఓ దేవా! నిష్కాములైన వారు నిన్నే సర్వతోముఖఫలంగా భావిస్తారు. వారికి రాజ్యం మొదలయిన వాంఛలలో పరమార్థమైన ఫలం సర్వాంతర్యామివైన నీ పవిత్రపాదసేవనమే, ఇది నిశ్చయం. కాని గోవు లేగదూడను నిత్యం చనుబాలుకుడిపి, తోడేళ్లవంటి వన్యమృగాల బారినుంచి కాపాడినట్లు నీవు కాముకుల కోరికలు తీరుస్తుంటావు. భవభీతినుంచి వాళ్లను దూరం చేస్తుంటావు. ఇలా యథార్థసంకల్పుడు, సద్వివేకి అయిన ధ్రువుడు ఆ దేవదేవుని ప్రస్తుతించాడు. భక్తులపై వాత్సల్యం కురిపించే ఆ భగవంతుడు ఆ స్తుతులకు సంతసించి ఇలా అన్నాడు.

**క. ధీరవ్రత! రాజన్యకు, మారక! నీ హృదయమందు మసలిన కార్యం**
**బారూఢిగా నెఱుంగుదు, నారయ నది వొందరాని దైనను నిత్తున్. 289**

**ప్రతి :** ధీరవ్రత= మనస్సును ఆ కట్టుకునే దీక్ష పట్టినవాడా!; రాజన్యకుమారక!= రాచబిడ్డా!; నీ హృదయము+అందున్= నీ డెందంలో; మసలిన= మెదలిన; కార్యంబు= అక్కఱ; ఆ రూఢిగాన్= ప్రశస్తమైనదిగా; ఎఱుంగుదున్= తెలియుదును; ఆరయన్= విచారించగా; అది= ఆ కార్యం; పొందరానిది+ఐననున్= దుర్లభమే అయినప్పటికిన్నీ; ఇత్తును= ప్రసాదిస్తాను.

**తా :** నిశ్చితమైన నియమం పట్టినవాడా! ఓ క్షత్రియ పుత్రకా! నీ మనస్సులో అట్టిట్టాడే సంకల్పం ఏమిటో నేను పసికట్టాను. నిజానికి అది నెరవేర్చరానిదే అయినా తప్పక నెరవేరుస్తాను.

**వ. అది యెట్టి దనిన నెందేని మేధియందుఁ బరిభ్రామ్యమాణ గోచక్రంబునుంబోలె గ్రహనక్షత్ర తారాగణ జ్యోతిశ్చక్రంబు నక్షత్రరూపంబు లయిన ధర్మాగ్నికశ్యపశక్రులును, సప్తర్షులును, దారకాసమేతులై ప్రదక్షిణంబు దిరుగుచుండుదు; రట్టి దురాపంబును ననన్యాధిష్ఠితంబును లోకత్రయప్రళయకాలంబు నందు నశ్వరంబు గాక ప్రకాశమానంబును నయిన ధ్రువక్షితి యను పదంబు ముందట నరువది యాఱువేలేండ్లు సనం బ్రాపింతువు; తత్పదప్రాప్తిపర్యంతంబు భవదీయజనకుండు వనవాస గతుండైనం దద్రాజ్యంబు పూజ్యంబుగా ధర్మమార్గంబున జితేంద్రియుండవై చేయుదువు; భవదనుజుం డగు నుత్తముండు మృగయార్థంబు వనంబునకుం జని మృతుం డగుఁ; దదన్వేషణార్థంబు తదాహితచిత్తయై తన్మాతయు వనంబునకుం జని యందు దావదహననిమగ్నయగు; వెండియు, 290**

**ప్రతి :** అది= ఆ అలభ్యం; ఎట్టిది+అనినన్= ఎటువంటిది అన్నచో; ఎందు+ఏనిన్= ఎక్కడైతే; మేధి+అందున్= కట్టుగుంజ కేంద్రంగా; పరిభ్రామ్యమాణ= చుట్టూ తిరుగాడుతున్న; గోచక్రంబునున్+పోలె= ఎద్దు గుండ్రటి తిరుగుడువలె; గ్రహ= నవగ్రహాలూ; నక్షత్ర= నక్షత్రాలూ; తారాగణ= చుక్కలగుంపులయొక్క; జ్యోతిస్+చక్రంబు= తేజోమండలం; నక్షత్ర= రిక్క; రూపంబులు+అయిన= ఆకారాలు కలవైన; ధర్మ= ధర్ముడు; అగ్ని= వైశ్వానరుడు; కశ్యప= కశ్యప బ్రహ్మ; శక్రులును= ఇంద్రుడూ; సప్త+ఋషులును= ఏడుగురు మునులూ; తారక= చుక్కలతో; సమేతులు+ఐ= కూడినవారై; ప్రదక్షిణంబు= వలగొంటూ; తిరుగుచున్+ఉండుదురు= పరిభ్రమిస్తూ ఉంటారో; అట్టి= అలాంటి; దుర్+ఆపంబునున్= చేరరానిదిన్నీ;

అనన్య+అధిష్ఠితంబును= వేరొకరిచే ఆశ్రయించబడనిదిన్ని; లోకత్రయ= ముల్లోకాలూ; ప్రళయకాలంబునందు= కల్పాంతంలోనూ; నశ్వరంబు+కాక= నశించక; ప్రకాశమానంబునున్+అయిన= తేజోమయం అయిన; ధ్రువక్షితి= శాశ్వతంగా ఉండే 'ధ్రువక్షితి' అనే; పదంబు= స్థానం; ముందటన్= ఇకపైన; అరువది+ఆరువేల+ఏండ్లు= అరవైఆరువేల వత్సరాలు; చనన్= దాటంగానే; ప్రాపింతువు= చేరతావు; తద్= ఆ ధ్రువమైన; పదప్రాప్తి= స్థానాన్ని పొందే; పర్యంతంబు= అంతదాకా; భవదీయజనకుండు= నీ తండ్రి; వనవాసగతుండు= అడవిలో ఉండను పోయినవాడు (వానప్రస్థుడు), ఐనన్= కాగా; తద్+రాజ్యంబు= ఆ పరిపాలనను; పూజ్యంబుగా= గౌరవంగా; ధర్మమార్గంబున= న్యాయం పోకడన; జిత+ఇంద్రియుండవు+ ఐ= జయించబడిన ఇంద్రియాలు కలవాడవై; చేయుదువు= నిర్వహిస్తావు; భవద్= నీయొక్క; అనుజుండు+అగున్= తమ్ముడైనట్టి; ఉత్తముండు= ఉత్తముడు; మృగయా+అర్థంబు= వేటాడడానికయి; వనంబునకున్= అడవికి; చని= పోయి; మృతుండు+అగున్= మరణిస్తాడు; తద్= ఆతనిని; అన్వేషణ+అర్థంబు= వెదకటం కోసం; తద్= వానియందే; ఆహిత= నిలిపి ఉంచబడ్డ; చిత్త+ఐ= మనస్సుకలదియై; తద్= ఆతని; మాతయున్= తల్లి కూడ; వనంబునకున్= అరణ్యానికి; చని= వెళ్లి; అందున్= ఆ వనంలో; దావ దహన= అడవి మంటల్లో; నిమగ్న+అగున్= పడి చనిపోతుంది; వెండియున్= తిరిగీ.

**తా :** ఆ దుర్లభం ఎట్టాంటిదో విను. కేంద్రస్థానమైనగుంజ చుట్టూ తిరుగుతుండే ఎద్దు వలె గ్రహాలూ నక్షత్రాలూ తారలగుంపులూ అనే కాంతిమండలం, చుక్కలరూపు పొందిన ధర్ముడు, అగ్ని, కశ్యపుడు, శక్రుడు, సప్తర్షులునూ తారకలను కలుపుకుని ఒక ధ్రువకేంద్రం చుట్టు తిరుగుతూనే ఉంటారు. ఆ భాగం మరొకరు చేరరానిది. పొందరానిది ముల్లోకాల ముంపులోనూ చెక్కు చెదరనిది, మహాకాంతిమంతమైంది అది 'ధ్రువక్షితి' అనే స్థానం. ఇక రాబోయే 66,000 ల ఏళ్లు గడిచాక ఈ చోటును నువ్వు పొందుతావు. ఆ పదం ప్రాప్తించే దాకా వనవాసమునకు పోయెడి నీ తండ్రి రాజ్యాన్ని నువ్వు న్యాయవంతంగా ఆదరణీయంగా ఇంద్రియాలకు లోను గానివాడవై పరిపాలిస్తావు. నీ తమ్ముడు వేటకొరకు అరణ్యంలోకి పోయి మరణిస్తాడు. అతణ్ణి వెతుకులాడుతూ అతని మీదే ప్రాణం పెట్టుకుని బ్రతుకుతున్న ఆతని తల్లి ఆ అడవుల్లోకి పోయి కార్చిచ్చుల్లో చిక్కుకొని నాశమవుతుంది. అదియునుగాక

**విశే:** మూలగ్రంథాలు కొన్నింటిలో 26 వేల సంవత్సరాలు, మరి కొన్నింటిలో 36 వేల సంవత్సరాలు ధ్రువుడు రాజ్యపాలన చేశాడని ఉంది.

**సీ. అనఘాత్మ! మఱి నీవు యజ్ఞరూపుం డనఁ దగు నన్ను సంపూర్ణదక్షిణంబు**
**లగు మఖంబులచేత నర్చించి సత్యంబు లగు నిహసౌఖ్యంబు లనుభవించి**
**యంత్యకాలమున నన్నాత్మఁ దలంచుచు మఱి సర్వలోకనమస్కృతమును**
**మహిఁ బునరావృత్తిరహితంబు సప్తర్షిమండలోన్నత మగు మామకీన**

**తే. పదము దగఁ బొందఁగల వని పరమపురుషుఁ, డతని యఖిలషితార్థంబు లర్థి నిచ్చి**
**యతఁడు గనుఁగొను చుండంగ నాత్మపురికి, గరుడగమనుఁడు వేంచేసెఁ గౌతుకమున. 291**

**ప్రతి :** అనఘ+ఆత్మ!= పుణ్యాత్మా!; మఱి= అటుపై; నీవు; యజ్ఞరూపుండు= యజ్ఞస్వరూపుడు; అనన్+తగు= అన యోగ్యమైన; నన్నున్= నన్ను; సంపూర్ణ= నిండైన; దక్షిణంబులు+అగు= దక్షిణలుగల; మఖంబులచేతన్= యాగాలచేత; అర్చించి= పూజించి; సత్యంబులు+అగున్= యథార్థాలయినట్టి; ఇహసౌఖ్యంబులు= భూలోక భోగాలు; అనుభవించి=

పొంది; అంత్యకాలమున= తుది ఘడియలో; నన్నున్= నన్ను; ఆత్మన్= మనసులో; తలంచుచున్= ధ్యానిస్తూ; మతి= మతియు; సర్వలోక= అన్ని లోకాలచే; నమస్కృతమును= నమస్కరించబడేదిన్ని; మహిన్= అవనిలో; పునర్+ఆవృత్తి= మరలిరావడం; రహితంబున్= లేనిదిన్ని; సప్త+ఋషిమండల= సప్తర్షిమండలం కంటె; ఉన్నతము+అగు= ఎత్తున ఉన్నది అయిన; మామకీన= నాదైన; పదము= స్థానం; తగన్= యథోచితంగా; పొందన్+కలవు= చేరగలవు; అని= అని; పరమపురుషుఁడు= ఆ విష్ణువు; అతని= ఆ ధ్రువునిచే; అభిలషిత= కోరబడిన; అర్థంబులు= వరాలు; అర్థిన్= ప్రీతితో; ఇచ్చి= ప్రసాదించి; అతఁడు= ఆ ధ్రువుడు; కనుఁగొనుచున్+ఉండన్= చూస్తూ ఉండగానే; గరుడగమనుఁడు= గరుత్మంతుడి మీద పయనించే విష్ణువు; కౌతుకమునన్= వేడుకగా; ఆత్మపురికిన్= తన నగరికి; వేంచేసెన్= వెళ్లిపోయాడు.

**తా :** పుణ్యశీలీ! ఆ తర్వాత నువ్వు యజ్ఞశరీరధారినైన నన్ను విరివిగా దక్షిణలిచ్చే ఎన్నోయాగాలచేత యజిస్తావు. నిజమైన ప్రాపంచిక సౌఖ్యాలన్నిటిని అనుభవిస్తావు. చివరిక్షణాల్లో నన్నే మనస్సున స్మరించుకుంటావు. సమస్తజనులు చేతులెత్తి మోకరిల్లేది, ఇహలోకంలోకి మళ్లీ తిరిగి రానిది, ఋషిమండలంకంటే పైన ఎత్తున ఉన్న ఆ స్థానాన్ని తగినట్లు చేరుకోగలవు అని ఆ విష్ణుమూర్తి ధ్రువుడు కోరిన కోరికలను తీర్చాడు. అలా ఆ ధ్రువుడి కళ్ల ముందే గరుడ వాహనం ఎక్కి సంతోషంగా తన వైకుంఠపురికి తరలి వెళ్లాడు.

**తే.** **అంత ధ్రువుఁడునుఁ బంకేరుహాక్ష పాద, కమలసేవోపపాదితఘనమనోర**
**థములఁ దనరియుఁ దనదు చిత్తంబులోనఁ, దుష్టిఁ బొందక చనియె విశిష్టచరిత! 292**

**ప్రతి :** విశిష్టచరిత= ప్రత్యేకమైన ప్రవర్తనం కల ఓ విదురా!; అంతన్= అంతలో; ధ్రువుఁడునున్= ధ్రువుడూ; పంకేరుహ+అక్ష= ఆ పుండరీకాక్షునియొక్క; పాదకమల= పద్మాలవంటి చరణాలయొక్క; సేవా= పరిచర్యచే; ఉపపాదిత= చక్కగా పొందచేయబడిన; ఘన= గొప్పవైన; మనస్+రథములన్= కోరికలతో; తనరియున్= ఒప్పి ఉండికూడా; తన+చిత్తంబులోనన్= తన మనస్సులోపల; తుష్టిన్= సంతృప్తిని; పొందక= చెందక; చనియెన్= (తనరాచనగరికి) వెళ్లాడు.

**తా :** ఓ విదుర! విశిష్టచరిత! ఆ ధ్రువుడుకూడా ఆ విష్ణుపాదకమలాల మీది భక్తివల్ల ఉత్తమవరాలు అందుకున్నప్పటికీ మానసిక సంతృప్తిలేకనే తిరిగి వెళ్లిపోయాడు.

**క.** **అని మైత్రేయుఁడు ధ్రువుఁ డ, ట్లనయము హరిచేఁ గృతార్థుఁ డైన విధం బె**
**ల్లను వినిపించిన విదురుఁడు, విని మునివరుఁ జూచి పలికె వినయం బెసఁగన్. 293**

**ప్రతి :** అని= అనిచెప్పి; మైత్రేయుఁడు= మైత్రేయముని; ధ్రువుఁడు= ధ్రువుడు; అట్లు= ఆ మార్గాన; అనయము= మిక్కిలిగా; హరిచేన్= హరివల్ల; కృత+అర్థుఁడు+ఐన+విధంబు= ప్రయోజనం పొందినవాడు అయిన క్రమం; ఎల్లను= ఆసాంతం; వినిపించినన్= వినిపింపజేయగా; విదురుఁడు= విదురుడు; విని= ఆకర్ణించి; మునివరున్= మునిశ్రేష్ఠుడైన మైత్రేయుని; చూచి= ఆలోకించి; వినయంబు= వినమ్రత; ఎసఁగన్= అతిశయించగా; పలికెన్= భాషించాడు.

**తా :** ఇలా మైత్రేయముని ధ్రువుడు భక్తి యోగమార్గాన విష్ణువుచే మిక్కిలి ధన్యుడైన వృత్తాంతం అంతా వినిపించగా విదురుడు అతి వినమ్రంగా మైత్రేయుణ్ణి చూచి ఇలా పలికాడు.

**క.** **మునినాయక! విను కాముక, జనదుష్ప్రాపంబు విష్ణుచరణాంబురుహా**
**ర్చనమునిజనసంప్రాప్యము, నసఁగల పంకేరుహాక్షు నవ్యయపదమున్. 294**

**ప్రతి :** మునినాయక!= మునిసత్తమా!; విను= ఆలకించు; కాముకజన= కామస్వభావంగల లోకులకు; దుస్+ప్రాపంబు= పొంద అలవికానిది; విష్ణు= వెన్నునియొక్క; చరణ+అంబురుహ= పాదకమలాల; అర్చన= పూజించే; మునిజన= మునిలోకంచే; సంప్రాప్యమున్= పొందదగింది; అనన్+కల= అని చెప్పుకోగల; పంకేరుహ+అక్షున్= హరియొక్క; అవ్యయపదమున్= శాశ్వతస్థానాన్ని...

**తా :** మునిశ్రేష్ఠా! విను. కాముకులు పొందలేనిది, విష్ణుపాదసేవకులైన మునులు మాత్రమే చేరకల్గింది అని చెప్పుకునే ఆ నారాయణుని ధామాన్ని

**విశే :** కాముకజనము – భౌతిక సుఖాపేక్షగల మానవసమాజము.

**వ. పెక్కు జన్మంబులం గాని పొందరాని పదంబు దా నొక్కజన్మంబుననే పొందియుం దన మనంబునం దప్రాప్తమనోరథుండ నని పురుషార్థవేది యైన ధ్రువుం డెట్లు దలంచె ననిన మైత్రేయుం డిట్లనియె. 295**

**ప్రతి :** పెక్కు= పలు; జన్మంబులన్+కాని= పుట్టుకలవలన గాని; పొందరాని= అందరాని; పదంబు= స్థానం; తాను= తాను (ధ్రువుడు); ఒక్క+జన్మంబునన్+ఏ= ఒక్కపుట్టువులోనే; పొందియున్= పొందికూడా; తన= తనయొక్క; మనంబునందున్= ఆత్మలో; అప్రాప్త= సిద్ధించని; మనోరథుండన్+అని= కోరిక కలవాడనని; పురుష+అర్థవేది+ఐన= పురుషార్థతత్త్వజ్ఞుడైన; ధ్రువుండు= ధ్రువుడు; ఎట్లు= ఎలా; తలంచెన్= భావించాడు; అనినన్= అని చెప్పగానే; మైత్రేయుండు= మైత్రేయుడు; ఇట్లు+అనియెన్= ఇలా తలంచాడు.

**తా :** ఎన్నో పుట్టుక లెత్తితేగాని పొందరాని ఆ విష్ణుపదాన్ని ధ్రువుడు ఒకే ఒక జన్మలోనే పొందాడు. ఆ ధ్రువుడు పురుషార్థం తెలిసినవాడు. అయినా కోరిక తీరలేదని ఎందుకు అనుకున్నాడు? అనగానే మైత్రేయుడిలా సమాధానం పలికాడు.

**తే. అనఘ! పినతల్లి దన్నుఁ బల్కిన దురుక్తి, బాణవిద్ధాత్ముఁ డగుచుఁ దద్భాషణములు**
**చిత్తమందుఁ దలంచుటఁ జేసి ముక్తిఁ, గోరమికి నాత్మలో వగఁ గూరుచుండె. 296**

**ప్రతి :** అనఘ!= ఓ పుణ్యుడా!; పినతల్లి; తన్నున్= తనను గురించి; పల్కిన= వచించిన; దుస్+ఉక్తి= ప్రల్లదపుమాట లనే; బాణ= శరాలచేత; విద్ధ= దెబ్బతిన్న; ఆత్ముఁడు+అగుచున్= చిత్తం కలవాడవుతూ; తద్= ఆమె; భాషణములు= పలుకులు; చిత్తము+అందున్= ఎదలో; తలంచుటన్+చేసి= తలపోయడంవల్ల; ముక్తిన్= మోక్షాన్ని; కోరమికిన్= కోరనందులకు; ఆత్మలో= అంతరంగంలో; వగన్= దుఃఖంతో; కూరుచుండెన్= కుమిలిపోయాడు.

**తా :** పుణ్యుడా! పినతల్లి తనను ఉద్దేశించి పలికిన చెడుమాటలు అనే అమ్ముల దెబ్బతిన్న మనస్సు కలవాడై వాటినే మనసులో స్మరించు కోవడంచేత, 'మోక్షాన్ని కోరుకోలేక పోయాననే చింతచేత దుఃఖంలో కూరుకొనిపోయాడు.

**వ. అంత నా ధ్రువుండు. 297**

**ప్రతి :** అంతన్= అంతలో; ఆ+ధ్రువుండు= ఆ ధ్రువకుమారుడు...

**తా :** అప్పుడు ఆ ధ్రువుడు

**చ. అనఘ! జితేంద్రియుల్ సుమహితాత్ములు నైన సనందనాదు లెం**
**దనయ మనేకజన్మసముపార్జితయోగసమాధిఁజేసి యె**
**వ్వని చరణారవిందములు వారని భక్తి నెఱుంగుచుందు, రా**
**ఘనుఁ బరమేశు నీశు నవికారు నమేయు నజేయు నాద్యునిన్. 298**

**ప్రతి :** అనఘ!= ఓ పుణ్యాత్మా!; జిత= జయించబడిన; ఇంద్రియుల్= ఇంద్రియాలు కల; సుమహిత= ప్రభావవంతమైన; ఆత్ములును+ఐన= హృదయాలు కల; సనందన+ఆదులు= సనందుడు మొదలైనవాళ్లు; ఎందున్= ఎక్కడనున్న; భక్తిన్= సేవతో; అనయము= ఎల్లప్పుడు; అనేకజన్మ= పలుపుట్టుకల్లో; సముపార్జిత= కూడబెట్టుకొన్న; యోగసమాధిన్+చేసి= ఏకాగ్రమైన ధ్యానయోగం వల్ల; ఎవ్వని= ఏవానియొక్క; చరణ+అరవిందాలు= పాదపద్మాలు; వారని= ఉడుగని; భక్తిన్= భక్తితో; ఎఱుంగుచుందురు= గ్రహించుకుంటారో; ఆ ఘనున్= ఆ ఉన్నతుని; పరమేశున్= ఆ పరమేశ్వరుని; ఈశున్= ఈశ్వరుని; అవికారున్= మారుపాటులు లేనివాణ్ణి; అమేయున్= అపరిమితుని; అజేయున్= గెలువశక్యం కానివానిని; ఆద్యునిన్= తొలిదైవాన్ని...

**తా :** పుణ్యాత్మా! ఇంద్రియ నిగ్రహులు, మహామహిములు అయిన సనందాది మునులు అడ్డులేని భక్తితో ఏ చోటనైనా ఏ కాలంలో అయినా ఏ జన్మలోనైనా కొంతకొంతగా సంతరించి పెట్టుకున్న సమాధి యోగంవల్ల నిరంతరమూ ఎవ్వరి పాదపద్మాల గురించి తెలుసు కోగల్గుతారో అలాంటి ఘనుడగు పరమేశుని, ఈశుని, నిర్వికారుని, అపరిమితుని, అజేయుని, ఆదిదేవుని,

**వ. ఏను షణ్మాసంబులు భజియించి తత్పాదపద్మచ్ఛాయం బ్రాపించియు భేదదర్శనుండ నైతి; నక్కటా! యిట్టి భాగ్యహీనుండనైన యేను భవనాశకుండైన యతనిం బొడఁగనియు నశ్వరంబులైన కామ్యంబు లడిగితి; నిట్టి దౌరాత్మ్యం బెందేనిం గలదే? తమ పదంబులకంటె నున్నత పదంబు నొందుదునో యని సహింపజాలని యీ దేవతలచేత మదీయ మతి గలుషితం బయ్యెంగాక! నాఁడు నారదుం డాడిన మాట తథ్యం బయ్యె; నతని వాక్యంబు లంగీకరింపక యే నసత్తముండనై స్వప్నావస్థలం బొందిన వాఁడు దైవికంబైన మాయం జెంది భిన్నదర్శనుండగు చందంబున నే నద్వితీయుండ నైనను భ్రాతయను శత్రువుచేఁ బ్రాప్తంబైన దుఃఖంబు నొంది జగదాత్మకుండును, సుప్రసాదుండును, భవనాశకుండును నైన యీశ్వరు నారాధించి తత్ప్రసాదంబు వడసియు నాయుర్విహీనుండైన రోగికిం బ్రయోగించు నౌషధంబుం బోలె నిరర్థకంబులైన, నశ్వరంబులైన యీ కామితంబులు గోరితి నని వెండియు. 299**

**ప్రతి :** ఏను= నేను; షట్+మాసంబులు= ఆరునెలల పాటు; భజియించి= కొలిచి; తద్= ఆతని యొక్క; పాదపద్మ+ఛాయన్= చరణసరోజాల నీడను; ప్రాపించియున్= పొందీ; భేద= అన్యమైన; దర్శనుండన్+ఐతిన్= దృష్టి సారించినవాడను అయ్యాను; అక్కటా!= అయ్యో; ఇట్టి= ఇలాంటి; భాగ్యహీనుండను+ఐన= మందభాగ్యుడనైన; ఏను= నేను; భవనాశకుండు+ఐన= సంసారలంపటాన్ని హరింపచేసే; అతనిన్= ఆ ఘనుని; పొడఁగనియున్= దర్శించికూడా; నశ్వరంబులు+ఐన= అశాశ్వతమైన; కామ్యంబులు= వరాలు; అడిగితిన్= కోరాను; ఇట్టి= ఇలాంటి; దౌరాత్మ్యంబు= చెడుగుతనం/దౌర్భాగ్యం; ఎందు+ఏనిన్= ఎక్కడనైనా; కలదే= ఉంటుందా; తమ= తమయొక్క; పదంబులకంటెన్= స్థానాలకంటే; ఉన్నతపదంబున్= ఎత్తైన పదవిని;

ఒందుదునో+అని= పొందుతానో, అని; సహింపన్+చాలని= ఓర్వలేని; ఈ దేవతలచేతన్= ఈ దేవుళ్లచే; మదీయ= నాదైన; మతి= బుద్ధి; కలుషితంబు+అయ్యెన్+కాక= కలగబాఱిపోయిందేమో; నాఁడు= ఆ దినాన; నారదుండు= నారదముని; ఆడినమాట= పల్కినవాక్కు; తథ్యంబు+అయ్యెన్= నిజమయింది; అతని వాక్యంబులు= అతడి వాక్కులు; అంగీకరింపక= ఒప్పుకొనక; ఏన్= నేను; అసత్తముండను+ఐ= అల్పుడినై; స్వప్న+అవస్థలన్= కలల అనుభూతి దశలో; పొందినవాఁడు= చిక్కినవాడు; దైవికంబు+ఐన= దైవసంప్రాప్తం అయినట్టి; మాయన్+చెంది= మాయను పొంది; భిన్నదర్శనుండు+అగు= వేరుచూపు కలవాడగు; చందంబున= విధంగా; నేన్= నేను; అద్వితీయుండను+ఐనను= రెండవది లేని వాడనే అయినా; భ్రాత+అను= సోదరుడు అనే; శత్రువుచేన్= పగవాడిచే; ప్రాప్తంబు+ఐన= లభ్యమైన; దుఃఖంబున్= ఆర్తిని; ఒంది= పొంది; జగద్+ఆత్మకుండునున్= విశ్వాత్మరూపుడూ; సుప్రసాదుండును= సుప్రసన్నుడూ; భవనాశకుండునున్= సంసారాన్ని నశింప చేసేవాడున్నూ; ఐన= అయినట్టి; ఈశ్వరున్= విష్ణుని; ఆరాధించి= భజించి; తద్= ఆ విష్ణుమూర్తి; ప్రసాదంబు= అనుగ్రహం; పడసియున్= సంపాదించిన్ని; ఆయుస్= వయస్సు; విహీనుండు+ఐన= తీరిపోయినవాడైన; రోగికిన్= జబ్బు పడ్డవాడికి; ప్రయోగించు= ఉపయోగించే; ఔషధంబున్+పోలె= మందువలె; నిరర్థకంబులు+ఐన= కొరగానివైన; నశ్వరంబులు+ఐన= రూపు నశించేవైన; కామితంబులు= వాంఛితాలు; కోరితిన్= అభిలషించాను; అని= అనిచెప్పి; వెండియున్= మళ్లీ...

**తా :** నేను ఆరు మాసాలు మాత్రమే సేవించి మహాయోగసాధనతో ఆ హరి పాదపద్మాల నీడను ఆశ్రయించగలిగాను. అయినా అన్యదృష్టితోనే ఉన్నాను. అయ్యో! ఇలాంటి దురదృష్టవంతుణ్ణి నేను. భవబంధాలను తెగ్గొట్టే ఆ నారాయణుని కన్నారా చూచి అశాశ్వతమైన వరా లడిగాను. ఇలాంటి దుర్మార్గం ఎక్కడైనా ఉంటుందా? తమ తమ ఉనికి పట్టుకంటే ఉచ్చదశకు చేరుకుంటా ననే అక్కసుతో దేవతలు నా బుద్ధిని వ్యాకులపరిచారేమో! ఆనాటి నారదముని వాక్కులన్నీ యథార్థ మయ్యాయి. ఆ ముని మాటలు పెడచెవిన పెట్టిన నేను నీచుణ్ణి. స్వాప్నికావస్థానుభూతిలో ఉన్నవాడు, దైవికమైన మాయచేత అన్యదృష్టిని పొందేవిధంగా నేనూ అపరభావం లేదని తెలిసీ అన్నదమ్ముడనే విరోధిత్వంతో వ్యథపొందాను, లోకస్వరూపుడూ, సుప్రసాదుడూ, సంసారతాపం తొలగించేవాడూ, అయిన ఈశ్వరుని కొలిచి ఆ దేవుడిదయను కూడ పొందగలిగాను. ఆయుర్దాయం మూడిన రోగికి ప్రయోగించబడే ఔషధం వలె ఎందుకూ పనికిమాలిన, అస్థిరమైన వరాలడిగాను అని తిరిగి...

**విశే :** భేద దర్శనుడనయి : ధ్రువుడు – తల్లిమీది కోపంతో తపస్సుచేశాడు. తాను వేరు తల్లి వేరు – అనే భేదజ్ఞానం తొలగిపోలేదు. తనయందు సకలభూతములందు – ఒక భంగి అనే సమహితత్వం – ధ్రువునిలో రాలేదు. అందుకు తగ్గట్లే వరం లభించింది. అదీ ధ్రువుని బెంగ.

**మ. ధనహీనుండు నృపాలుఁ జేరి మిగులన్ ధాటిన్ ఫలీకార మి**
**మ్మని యర్థించిన రీతి ముక్తిఫలదుం డైనట్టి పంకేజలో**
**చనుఁడే చాలఁ బ్రసన్నుఁడైన నతనిన్ సాంసారికం బర్థిఁ గో**
**రిన నావంటి విమూఢమానసులు ధాత్రింగల్గిరే యెవ్వరున్? 300**

**ప్రతి :** ధనహీనుండు= బీదవాడు; నృపాలున్= భూపతిని; చేరి= సమీపించి; మిగులన్= మీరిన; ధాటిన్= ఉద్ధతితో; ఫలీకారము= పొట్టుగల ధాన్యపు గింజలను; ఇమ్ము+అని= దానం చేయమని; అర్థించినరీతి= వేడిన చందాన;

ముక్తిఫలదుండు+ఐనట్టి= మోక్షాన్ని ప్రతిఫలంగా ఇచ్చేవాడు అయినట్టి; పంకేజలోచనుఁడు+ఏ= పద్మనేత్రుడైన విష్ణువే; చాలన్= తృప్తికరంగా; ప్రసన్నుఁడు+ఐనన్= సుముఖుడు కాగా; అతనిన్= ఆ భగవానుని; సాంసారికంబు= భవసంబంధాన్ని; అర్థిన్= ప్రీతితో; కోరిన= కామించిన; నా వంటి= నను బోటి; విమూఢ మానసులు= అతిమందమతులు; ఎవ్వరున్= ఎవ్వరైనా; ధాత్రిన్= భూమిమీద; కల్గిరి+ఏ= పుట్టారా?

**తా :** మహారాజును ఆశ్రయించిన నిరుపేద మితిమీరిన అహంతో ధాన్యం గింజల్ని దానం చెయ్యమని కోరినట్లుంది నా స్థితి. మోక్షఫలాన్ని ప్రతిఫలంగా ఇవ్వగల ఆ విష్ణువే తనివితీరా ప్రత్యక్షమయ్యాడు. కాగా ఆ దేవుణ్ణి ప్రాపించికమైన కోరికలు ప్రసాదించమని వేడాను. నా వంటి వట్టి తెలివి తక్కువ దద్దమ్మ ఎవరైనా ఈ మట్టిమీద పుట్టి ఉంటారా? ఉండరని భావం.

## a=ధ్రువుండు మరల దన పురంబునకు వచ్చుట=a

**సీ. అని యిట్లు చింతించె ననుచు నమ్మైత్రేయముని విదురునకు నిట్లనియెఁ దండ్రి!**
**కమనీయహరిపాదకమలరజోఽభిసంస్కృతశరీరులును యాదృచ్ఛికముగ**
**సంప్రాప్తమగు దాన సంతుష్టచిత్తులై వఱలుచు నుండు మీ వంటి వారు**
**దగ భగవత్పాదదాస్యంబు దక్కంగ నితర పదార్థంబు లెడఁదలందు**

**తే. మఱచియును గోర నొల్లరు మనుచరిత్ర!, తవిలి యిట్లు హరిప్రసాదంబు నొంది**
**మరలి వచ్చుచు నున్న కుమారు వార్తఁ, జారుచే విని యుత్తానచరణుఁ డపుడు. 301**

**ప్రతి :** అని= అని; ఇట్లు= ఈ విధంగా; చింతించెన్= పరితపించాడు; అనుచున్= అంటూ; ఆ+మైత్రేయముని= ఆ మైత్రేయమహర్షి; విదురునకున్= విదురుడికి; ఇట్లు= ఇలా; అనియెన్= చెప్పాడు; తండ్రి!= నాయనా!; కమనీయ= ఇంపైన; హరి= విష్ణువుయొక్క; పాదకమల= పాదారవిందాలయొక్క; రజస్= ధూళిచే; అభిసంస్కృత శరీరులును= అలంకరింపబడిన శరీరాలు కలవారు; యాదృచ్ఛికముగన్= ఆకస్మికంగా, అప్రయత్నంగా; సంప్రాప్తము+అగుదానన్= దొరకినదానివల్ల; సంతుష్ట= సంతృప్తిపడ్డ; చిత్తులు+ఐ= మనస్సులు కలవారై; వఱలుచున్+ఉండు= ఒప్పుతూ ఉండే; మీ వంటివారు= మీ బోటివారు; తగన్= తప్పనిసరిగ; భగవత్= శ్రీవిష్ణువుయొక్క, పాదదాస్యంబు= చరణసేవ; తక్కంగన్= మినహాయింపుగా; ఇతర పదార్థంబులు= అన్యవస్తువుల్ని; ఎడఁదలన్+అందున్= ఎదల్లోను; మఱచియున్= పొరపడి; కోరన్= వాంఛించుటకు; ఒల్లరు= ఇష్టపడరు; మనుచరిత్ర= మనువుయొక్కనడవడివంటి నడవడి కలవాడా!; తవిలి= సక్తమయి; ఇట్లు= ఈ రీతిగా; హరిప్రసాదంబున్= విష్ణువు అనుగ్రహాన్ని; ఒంది= పొంది; మరలి= తిరిగి వెనక్కి; వచ్చుచున్+ఉన్న= చనుదెంచుతున్న; కుమారు= కొడుకుయొక్క; వార్తన్= వృత్తాంతాన్ని; చారుచేన్= గూఢచారివల్ల; విని= ఆకర్ణించి; ఉత్తానచరణుఁడు= ఉత్తానపాదుడు; అపుడు= ఆ సమయంలో.

**తా :** అని ఆ ధ్రువుడు దుఃఖపడ్డాడు అంటూ ఆ మైత్రేయముని విదురుడితో ఇలా చెప్పాడు. తండ్రీ! మనోహరమైన శ్రీహరి పదపద్మరేణువులచే సంస్కరింపబడిన శరీరాలు గలవారు, అప్రయత్నంగా లభించిన దానివలన, తృప్తి పడుతూ సంతోషంగా జీవిస్తుంటారు. అలాంటి మీ బోటివాళ్లు ఆ వెన్నుని పాదపద్మసేవ తప్ప మిగతావాటిని తలవనైనా తలవరు సరికదా మరొకదానిని దేనినీ పొరపాటున కూడ ఇచ్ఛగించరు. మనువు వర్తనవంటి నడవడి కలవాడా! ఈ రీతిని విష్ణుదయను పొందిన తన కన్న కొడుకు ధ్రువుడు తిరిగివస్తున్నవార్తను ఉత్తానపాదుడు చారునివల్ల విన్నాడు. ఆ సమయంలో.

**వ. మనమున నిట్లని తలంచె. 302**

**ప్రతి :** మనమునన్= మనస్సున; ఇట్లు+అని= ఇలాగని; తలంచెన్= ఆలోచించాడు.

**తా :** మనసులో ఇలా అనుకున్నాడు.

**క. చచ్చిన వారలు గ్రమ్మఱ, వచ్చుటయే కాక యిట్టి వార్తలు గలవే?**
**నిచ్చలు నమంగళుఁడ నగు, నిచ్చట మఱి నాకు శుభము లేల ఘటించున్. 303**

**ప్రతి :** చచ్చినవారలు= మరణించినవాళ్లు; క్రమ్మఱ= మరల; వచ్చుటయే= రావడమే?; కాక= అలా కానప్పుడు; ఇట్టి= ఇటువంటి; వార్తలు= వృత్తాంతాలు; కలవే= ఉంటాయా?; నిచ్చలున్= ఎల్లకాలం; అమంగళుఁడన్+అగున్= అశుభాన్ని కల్గించే వాడినైన; ఇచ్చటన్= ఇక్కడ; నాకున్= నాకు; ఇచ్చటన్= ఇక్కడ; శుభములు= క్షేమాలు; ఏల ఘటించున్= ఎలా సంభవిస్తాయి.

**తా :** ప్రాణం పోయినవాళ్లు మళ్లీ తిరిగి రావడమా? అదే కాక ఇలాంటి వృత్తాంతాలు ఎక్కడన్నా జరిగి ఉంటాయా? ఎపుడూ మేలు ఎరుగనట్టి నాకు శుభాలు ఎందుకు లభిస్తాయి?

**క. అని విశ్వసింపకుండియు, మనమున నా నారదుఁడు "గుమారుఁడు వేగం**
**బునఁ రాఁగలఁ" డనుచును బలి, కిన పలుకులు దలఁచి నమ్మి కృతకృత్యుండై. 304**

**ప్రతి :** అని= అనియోచించి; విశ్వసింపక= నమ్మక; ఉండియున్= ఉన్నప్పటికిన్నీ; మనమునన్= హృదిలో; ఆ+నారదుఁడు= ఆ నారదముని; కుమారుఁడు= నీ సుతుడు; వేగంబునన్= అతిత్వరలో; రాఁగలఁడు= తిరిగివస్తాడు; అనుచును= అంటూ; పలికిన= మాటాడిన; పలుకులు= వచనాలు; తలఁచి= స్మరించి; నమ్మి= విశ్వసించి; కృతకృత్యుండు+ఐ= ధన్యతనొందినవాడై...

**తా :** అని నమ్మకపోయి కూడా 'అతిత్వరలో నీ కుమారుడు తిరిగి రాగలడు' అన్న నారదముని మాటలు గుర్తుకు వచ్చాయి. ఆ మాటలమీద గురి ఏర్పడింది. కృతార్థత సమకూరిన వాడయ్యాడు.

**క. తన సుతుని రాక సెప్పిన, ఘనునకు ధనములును మౌక్తికపు హారములున్**
**మన మలర నిచ్చి తనయునిఁ, గనుఁగొను సంతోష మాత్మఁ గడలుకొనంగన్. 305**

**ప్రతి :** తన= తనయొక్క; సుతుని= కొమరుని; రాక= ఆగమనవార్త; చెప్పిన= తెలిపిన; ఘనునకున్= ఆ గొప్పవాడికి; ధనములును= ధనాలను; మౌక్తికపుహారములున్= ముత్యాలసరుల్ని; మనము= ఎద; అలరన్= మోదిల్లగా; ఇచ్చి= కానుకలుగా ఇచ్చి; తనయునిన్= పుత్రుని; కనుఁగొను= చూడాలనే; సంతోషం= ఆనందం; ఆత్మన్= అంతరంగంలో; కడలు కొనంగన్= వ్యాపించగా...

**తా :** తన కొడుకు వస్తున్నాడనే వార్తను చెప్పిన ఆ ఘనుడికి (చారుడికి) ధనాన్ని, ముత్యాలపేరులను మనస్సు హర్షిల్లగా ఇచ్చాడు. తన పుత్రుణ్ణి చూడాలనే ఆనందం మనసులో కలుగగా...

**సీ. వలను మీఱిన సైంధవంబులఁ బూన్చిన కనకరథంబు నుత్కంఠ నెక్కి**
**బ్రాహ్మణకులవృద్ధబంధుజనామాత్యపరివృతుం డగుచు విస్ఫురణ మెరసి**

బ్రహ్మనిర్ఘోషతూర్యస్వనశంఖకాహళవేణురవము లందంద చెలఁగ
శిబిక లెక్కియు విభూషితలై సునీతి సురుచు, లుత్తముండు నారూఢి నడవఁ

**తే.** గరిమ దీపింప నతిశీఘ్రగమన మొప్ప, నాత్మనగరంబు వెలువడి యరుగుచుండి
బలసి నగరోపవన సమీపంబునందు, వచ్చు ధ్రువుఁ గని మేదినీశ్వరుఁడు నంత. **306**

**ప్రతి :** వలను మీఱిన= ఒప్పిన; సైంధవంబులన్= మేలుజాతి గుఱ్ఱాలను; పూన్చిన= కట్టిన; కనకరథంబున్= బంగరు రథాన్ని; ఉత్కంఠన్= కొడుకును చూడాలనే ఆత్రంతో; ఎక్కి= అధిరోహించి; బ్రాహ్మణ= భూసురులతోనూ; కులవృద్ధ= వంశపెద్దలతోను; బంధు= చుట్టపక్కాలతోను; అమాత్య= మంత్రులతోనూ; పరివృతుండు+అగుచున్= చుట్టబడినవాడవుతూ; విస్ఫురణన్= ఠీవితో కదలుటచే; మెరసి= ఒప్పి; బ్రహ్మ= వేదమంత్రాలయొక్క; నిర్ఘోష= మహాస్వరాలు; తూర్యస్వన= వాద్యాల మోతలు; శంఖ= శంకువు; కాహళ= బాకా; వేణు= పిల్లనగ్రోవి వంటి ఊదువాద్యాలయొక్క; రవములు= నాదాలు; అందంద= మఱి మఱి; చెలఁగన్= మోగగా; శిబికలు= పల్లకీలు; ఎక్కియున్= ఆరోహించి; విభూషితలు+ఐ= నగలతో విశేషంగా అలంకరించబడినవారై; సునీతి= కన్నతల్లి సునీతిన్ని; సురుచి= సురుచిన్ని; ఉత్తముండున్= ఉత్తముడూ; ఆరూఢిన్= ప్రశస్తంగా; నడవన్= వెంటవెడలగా; గరిమ= గౌరవం; దీపింపన్= ప్రకాశించగా; అతి శీఘ్రగమనము= వడివడిపోక; ఒప్పన్= తగగా; ఆత్మనగరంబున్= తనపురినుంచి; వెలువడి= బయలుదేరి; బలసి= కలియగూడి; అరుగుచున్+ఉండి= పోతూ ఉండి; నగర= పట్టణం యొక్క; ఉపవన= తోటకు; సమీపంబు+అందున్= చేరువన; వచ్చు= వస్తున్నట్టి; ధ్రువున్+కని= ధ్రువుణ్ణి కాంచి; మేదినీ+ఈశ్వరుఁడున్= భూకాంతుడును; అంతన్= అంతట.

**తా :** రథం దిగి ప్రేమ పొంగిపొరలగా సంభ్రమముతో కూడినవాడై తన కుమారుని మిక్కిలి ప్రేమతో సమీపించాడు. ఆ కుమారుడు హరి రెండు పాదాలను అర్చించి పాపములన్నింటినీ తొలగించుకొన్నవాడు. ఈశ్వరుని దయకల చూపులతో అన్ని కోరికలు తీరినవాడు. అట్టి కుమారుని సమీపించి రోమాలు పులకించి మొగ్గ తొడుగగా ఆనందించిన మనస్సు కలవాడై గౌరవం ప్రకాశింపగా మిక్కిలి వేగమైన గమనం ఒప్పుగా నగరం నుండి బయటకు వచ్చి అందరితో కలిసి ముందుకుపోతూ ఉండి నగరసమీపంలోని ఉద్యానవనం దగ్గరగా వస్తున్న ధ్రువుణ్ణి చూచి రాజు అప్పుడు...

**చ.** అరదము డిగ్గి ప్రేమ దొలఁకాడ ససంభ్రముఁడై రమామనో
హరచరణారవిందయుగళార్చననిర్దళితాఖిలాఘు నీ
శ్వరకరుణావలోకనసుజాతసమగ్రమనోరథున్ సుతుం
గర మనురక్తి డాసి పులకల్ ననలొత్తఁబ్రమోదితాత్ముఁడై. **307**

**ప్రతి :** అరదము= రథం; డిగ్గి= దిగి; ప్రేమ= అనురక్తి; తొలఁకాడన్= అతిశయించగా; ససంభ్రముఁడు+ఐ= తత్తరపాటుతో కూడినవాడై; రమామనోహర= లక్ష్మి మనస్సు కొల్లగొట్టిన హరియొక్క; చరణ+అరవింద= పదపద్మాలయొక్క; యుగళ= జంటయొక్క; అర్చన= పూజచే; నిర్దళిత= పూర్తిగా చీల్చబడ్డ; అఖిల= సమస్తమైన; అఘున్= పాపాలు కలట్టి; ఈశ్వర= దేవుడియొక్క; కరుణ= దయతోకూడిన; అవలోకన= దృష్టులతో; సుజాత= సంభవించిన; సమగ్ర= సంపూర్ణమైన; మనోరథున్= కోరికలుగలట్టి; సుతున్= తనయుని; కరము= మిక్కిలి; అనురక్తిన్= కూరిమితో; డాసి= సమీపించి; పులకల్= రోమాంచాలు; ననలు+ఒత్తన్= మొగ్గతొడుగగా; ప్రమోదిత= సంతోషపెట్టబడిన; ఆత్ముఁడు+ఐ= మనస్సు కలవాడై...

**తా :** పొంగిన మమకారంతో ఉత్సహించి గబగబా రథం దిగాడు. విష్ణుపదసేవతో పాపాలన్ని పోగొట్టు కున్నవాడు, ఈశ్వరానుగ్రహంతో అన్ని కోరికలు తీరినవాడు తన కొడుకు అని పులకించి పోయాడు. ఆ ఆనంద పారవశ్యంలో

**తే. బిగియఁగౌఁగిటఁజేర్చి నెమ్మొగము నిమిరి, శిరము మూర్కొని చుబుకంబు చేతఁబుణికి**
**యవ్యయానందబాష్పధారాభిషిక్తుఁ, జేసి యాశీర్వదింప నా చిరయశుండు. 308**

**ప్రతి :** బిగియన్= గట్టిగా; కౌగిటన్+చేర్చి= ఆలింగనంచేసి; నెఱి+మొగము= నిండు మోమును; నిమిరి= తడిమి; శిరము= తలను; మూర్కొని= ఆఘ్రాణించి; చుబుకంబు= గడ్డం; చేతన్= చేతితో; పుణికి= (మునివేళ్లతో) పట్టుకొని; అవ్యయ= క్షయం కాని; ఆనంద= సంతోషంతో కూడిన; బాష్పధారా= అశ్రుప్రవాహంతో; అభిషిక్తున్ చేసి= తడిపివేసి; ఆశీర్వదింపన్= దీవించగా; ఆ+చిరయశుండు= బహుకాలంగా కీర్తిమంతుడైన (ఆ ధ్రువుడు)...

**తా :** ఆ రాజు (కొడుకును) గట్టిగా కౌగిలించుకున్నాడు. ముఖమంతా నిమిరాడు. తలను మూచూచాడు. గడ్డాన్ని చేతి మునివేళ్లతో పట్టుకున్నాడు. అవ్యయమైన ఆనందాన్ని పొందాడు. ఆ ఆనందంతో కారిన కన్నీటి ధారల్లో ముంచెత్తాడు దీవించాడు. అప్పుడు శాశ్వత యశోవంతుడైన ఆ ధ్రువుడు

**క. జనకుని యాశీర్వచనము, లనయముఁ గైకొని ప్రమోదియై తత్పదముల్**
**దన ఫాలతలము సోఁకఁగ, వినతులు గావించి భక్తివిహ్వలుఁ డగుచున్. 309**

**ప్రతి :** జనకుని= తండ్రియొక్క; ఆశీర్వచనములు= దీవనలు; అనయమున్= మరి మరిగా; కైకొని= అందుకొని; ప్రమోది+ఐ= మరింత హర్షించినవాడై; తద్+పదముల్= ఆ తండ్రిపాదాలు; తన= తనయొక్క; ఫాలతలము= నుదుటిభాగం; సోఁకఁగన్= తాకునట్లుగా; వినతులు= ప్రణతులు; కావించి= ఒనర్చి; భక్తిన్= (తండ్రి) అనురక్తిచే; విహ్వలుఁడు అగుచున్= పరవశుడవుతూ.

**తా :** తండ్రి ఆశీస్సులు పదే పదే అందుకున్నాడు. ఆ సంతోషం పట్టలేకపోయాడు. కన్నతండ్రి అడుగులకు తన నొసలు అంటేటట్లుగా నమస్కరించాడు. తండ్రి సేవలో తన్మయుడై పోయాడు.

**విశే :** ధ్రువుడు మునుపు తండ్రివలన పొందిన అవమానాన్ని స్మరింపకపోవటం గమనింపదగిన విషయం.

**తే. అంత నా సజ్జనాగ్రణియైన ధ్రువుఁడు, దల్లులకు భక్తివినతులు దగ నొనర్చి**
**సురుచికిని మ్రొక్క నర్భకుఁ జూచి యెత్తి, నగుమొగంబున నాలింగనంబు సేసి. 310**

**ప్రతి :** అంతన్= ఆ పిమ్మట; ఆ+సద్+జన+అగ్రణి+ఐన= సత్పురుషుల్లో ముందుండేవాడు అయిన; ధ్రువుఁడు= ధ్రువుడు; తల్లులకున్= ఇద్దరు అమ్మలకు; భక్తిన్= వినయంతో; వినతులు= ప్రత్యేకించి నమస్కృతులు; తగన్= యుక్తంగా; ఒనర్చి= కావించి; సురుచికిని= మారుతల్లి అయిన సురుచికి; మ్రొక్కన్= వంగి దణ్ణం పెట్టగా; అర్భకున్+చూచి= ఆ బాలకుణ్ణి చూసి; ఎత్తి= పైకెత్తి; నగుమొగంబునన్= నవ్వు మొగంతో; ఆలింగనంబు+చేసి= కౌగిలించుకొని.

**తా :** పిదప మంచివాళ్లల్లో ముందటివాడైన ధ్రువుడు తల్లులిద్దరికీ వినమ్రుడై మొక్కాడు. సురుచికి వేరుగా నమస్కరించాడు. ఆమె కుమారుణ్ణి అలా చూసి పైకి ఎత్తి, నవ్వు ముఖంతో అక్కున చేర్చుకుంది.

**సీ. కరమొప్ప నానందగద్గదస్వరమున జీవింపు మనుచు నాశీర్వదించె;**
**భగవంతుఁడెవ్వనిపై మైత్రి పాటించు సత్కృపానిరతిఁ బ్రసన్నుఁడగుచు**
**నతనికిఁ దమయంత ననుకూలమై యుండు సర్వభూతంబులు సమతఁ బేర్చి;**
**మహిఁ దలపోయ నిమ్నప్రదేశమునకు ననయంబుఁజేరు తోయములపగిదిఁ**

**తే. గాన ఘను న మ్మహాత్ముని గారవించె, సురుచి పూర్వంబు దలఁపక సుజనచరిత!**
**విష్ణు భక్తులు ధరను బవిత్రు లగుట, వారి కలుగరు ధరణి నెవ్వారు మఱియు. 311**

**ప్రతి :** కరము= మిక్కిలి; ఒప్పన్= ఒప్పినట్టి; ఆనంద= సంతోషంవల్ల; గద్గద= బొంగురుపోయిన; స్వరమునన్= ధ్వనితో; జీవింపుము= నూరేళ్లు బతుకు; అనుచున్= అంటూ; ఆశీర్వదించెన్= ఆశీర్వాదం పలికింది; తలపోయన్= తలచుకోగా; నిమ్నప్రదేశమునకున్= పల్లపుతావునకు; అనయంబున్= ఎప్పుడున్నూ; చేరు= ప్రవేశించే; తోయములపగిదిన్= జలాలమాదిరిగా; భగవంతుఁడు= హరి; ఎవ్వనిపై= ఎవ్వరిమీద; సత్+కృపానిరతిన్= మంచిదయయందలి; నిరతిన్= శ్రద్ధతో; ప్రసన్నుఁడు+అగుచున్= నిర్మలుడు అవుతూ; మైత్రి= చెలిమి; పాటించున్= కావించునో; అతనికిన్= అతనికి; మహిన్= ఈ భూప్రపంచంలోని; సర్వభూతంబులున్= సమస్తజీవసముదాయమున్ను; సమతన్= సమభావనతో; పేర్చి= వర్ధిల్లి; తమ+అంతన్= తమంత తాముగా; అనుకూలము+ఐ+ఉండున్= అనుకూల్యం కలిగి వుంటాయి; కాన= కాబట్టి; ఘనున్= మహనీయుడైన; ఆ+మహా+ఆత్మునిన్= గొప్ప మనస్సుగల ఆ ధ్రువుణ్ణి; సుజన చరిత్ర= సాధుజన ప్రవర్తనుడ!విదుర!; సురుచి= సురుచి; పూర్వంబు= గతం; తలఁపక= స్మరించక; గారవించెన్= (ధ్రువుని) లాలనచేసింది; విష్ణుభక్తులు= దైవభక్తులు; ధరను= క్షితిలో; పవిత్రులు+అగుటన్= వ్రతశౌచాదులచే పరిశుద్ధాత్ము లవడంవల్ల; ఎవ్వారు= ఎవ్వరున్ను; ధరణిన్= భూతలంలో; వారికిన్= ఆ భక్తులకు; అలుగరు= కోపించరు; మఱియున్= మరిన్నీ.

**తా :** ఆ సురుచి సంతోషాతిరేకంవల్ల బొంగురుపోయిన గొంతుతో 'చిరకాలం జీవించు' అంటూ దీవించింది. నీరు పల్లం వైపుకి ప్రవహించే విధాన ఆ భగవంతుడు వాత్సల్యంతో ఎవరిపట్ల మిత్రభావంతో ఉంటాడో, ఎవరిమీద దయ చూపి ప్రసన్నుడవుతాడో వాని పట్ల ఈ భూమిలోని సర్వ ప్రాణికోటి తనంతాతానే మిక్కిలి అనుకూలంగా వుంటుంది. సుజనచరితా అందుచేత ఆమె వెనకటి వృత్తాంతాన్ని తలవకనే ఘనుడైన ధ్రువుని గౌరవించింది. ఈ నేలమీద విష్ణుభక్తి నిండినవారు పరిశుద్ధాత్ము లవడంవల్ల వాళ్లపై ఎవరూ కోపంతో ఉండరు.

**వ. కావున నుత్తముండును ధ్రువుండును బ్రేమవిహ్వలు లగుచు నన్యోన్యాలింగితులై పులకాంకురాలంకృతశరీరులై యానందబాష్పముల నొప్పి; రంత సునీతియుం దన ప్రాణంబుల కంటెఁ బ్రియుండైన సుతు నుపగూహనంబు సేసి తదవయవస్పర్శనంబుచేత నానందంబు నొంది విగతశోక యయ్యె; నప్పుడు సంతోషబాష్పధారాసిక్తంబులై చనుఁబాలునుంగురిసె నంత. 312**

**ప్రతి :** కావునన్= కాబట్టి; ఉత్తముండును= ఉత్తముడూ; ధ్రువుండును= ధ్రువుడూ; ప్రేమన్= అనురాగంతో; విహ్వలులు+అగుచున్= తన్మయులవుతూ; అన్యోన్య= పరస్పరం; ఆలింగితులు+ఐ= కౌగలింతలు కలవారలై; పులక= గగుర్పాటుల; అంకుర= మొలకలతో; అలంకృత= భూషితులైన; శరీరులు+ఐ= దేహంకలవారై; ఆనందబాష్పములన్= సంతోషపు అశ్రువులతో; ఒప్పిరి= తేజరిల్లారు; అంతన్= ఆలోపల; సునీతియున్= కన్నతల్లి సునీతిన్నీ; తన= తనయొక్క

ప్రాణంబులకంటెన్= ఊపిరులకంటే; ప్రియుండు+ఐన= ఇష్టుడైన; సుతున్= కుమారుని; ఉపగూహనంబు+చేసి= ఆలింగనం చేసి; తద్= ఆ ధ్రువుని; అవయవ= అంగాలు; స్పర్శనంబుచేతన్= తాకడంవలని; ఆనందంబున్= సంతోషాన్ని; ఒంది= అనుభవించి; విగత= పోయిన; శోక= దుఃఖంకలది; అయ్యెన్= అయింది; అప్పుడు= ఆ క్షణంలో; సంతోషబాష్ప= ఆనందాశ్రువులయొక్క; ధారా= వెల్లువచే; ఆసిక్తంబులు+ఐ= పూర్తిగాతడుపబడినవై; చనుబాలునున్= స్తన్యమును; కురిసెన్= ధారకట్టింది. అంత= అంతలో.

**తా :** అందుచేత ఉత్తముడూ, ధ్రువుడూ ఎంతో ప్రేమగా ఒకరినొకరు కౌగిలించుకొన్నారు. ఒంటి పులకరింతలతో; అలంకరించబడినవారై ఆనందబాష్పాలతో ఒప్పారారు. అంతలో సునీతి కూడ తన ప్రాణంకంటే ప్రియుడైన తన తనయుని అక్కున చేర్చుకుంది. ఆ తనుస్పర్శానుభూతితో ఎంతో ఆనందపడింది. వెనకటి బాధనంతా వెనక్కి పెట్టింది. ఆ సంతోషపు కన్నీటి ధారలతో తడిసిపోయిన ఆమె పాలిండ్ల నుండి పాలు కారినవి. అప్పుడు

**సీ. ఉన్నతసంతోషముప్పతిల్లఁగఁ బౌర జనము లా ధ్రువుతల్లి నెనయఁ జూచి**
**తొడరిన భవదీయదుఃఖనాశకుఁడైన యిట్టి తనూజుఁ డెందేని పెద్ద**
**కాలంబు క్రిందటఁ గడఁగి నష్టుం డైన వాఁడిప్డు నీ భాగ్యవశము చేతఁ**
**బ్రతిలబ్ధుఁ డయ్యెను; నితఁడు భూమండల మెల్లను రక్షించు నిద్ధమహిమఁ;**

**తే. గమలలోచనుఁ జింతించు ఘనులు లోక, దుర్జయం బైన యట్టి మృత్యువును గెల్తు;**
**రట్టి ప్రణతార్తిహరుఁడైన యబ్జనాభుఁ, దర్థి నీచేతఁ బూజితుండగుట నిజము. 313**

**ప్రతి :** ఉన్నత= గొప్ప; సంతోషము= హర్షం; ఉప్పతిల్లఁగన్= పుట్టగా; పౌరజనములు= పురప్రజలు; ఆ ధ్రువుతల్లిన్= ఆ ధ్రువుడి అమ్మ సునీతిని; ఎనయన్= ఒప్పారగా; చూచి= కనుగొని; తొడరిన= ప్రాప్తించిన; భవదీయ= నీదైన; దుఃఖ= బాధ; నాశకుఁడు+ఐన= పోగొట్టినవాడైన; ఇట్టి= ఇంతటి; తనూజుఁడు= తనయుడు; ఎందు+ఏని= ఎక్కడనైనా ఉంటాడా?; పెద్దకాలంబు క్రిందటన్= బహుకాలం క్రితం; కడఁగి= పట్టుపట్టి; నష్టుండు+ఐనవాఁడు= అదర్శనుడైనట్టివాడు; ఇప్డు= ఈనాడు; నీ భాగ్యవశముచేతన్= నీదు అదృష్టం కొద్దీ; ప్రతిలబ్ధుఁడు= తిరిగి పొందబడ్డవాడు; అయ్యెను= కాగల్గాడు; ఇతఁడు= ఈ ధ్రువుడు; ఇద్ధ= ప్రసిద్ధమైన; మహిమన్= గొప్పప్రభావంతో; భూమండలము+ఎల్లన్= భూఖండాన్నంతా; రక్షించున్= ఏలుతాడు; కమలలోచనున్= పుండరీకాక్షుని విష్ణుని; చింతించు= ధ్యానించే; ఘనులు= మహాసిద్ధపురుషులు; దుర్జయంబు+ఐన+అట్టి= గెలువ నలవి కానట్టి; మృత్యువునున్= చావునున్ను; గెల్తురు= జయిస్తారు; అట్టి= అలాంటి; ప్రణత= నమ్రులయొక్క; ఆర్తి= మనోవ్యథను; హరుఁడు+ఐన= పోగొట్టేవాడుఐన; అబ్జనాభుఁడు= పద్మనాభుడు; అర్థిన్= ప్రీతితో; నీ చేతన్= నీ వల్ల; పూజితుండు+అగుట= సేవింపబడడం; నిజము= తథ్యం.

**తా :** ఆ నగర పౌరులందరూ ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బవుతూ ఆ ధ్రువుడి తల్లిని తృప్తికరంగా దర్శించారు. నీకు వాటిల్లిన ఇన్నాళ్ల దుఃఖాన్ని తొలగించినవాడు నీ కొడుకు. ఎక్కడికో ఏనాడో వెళ్లి, ఇంతవరకు కనపడని నీ కుమారుణ్ణి ఈ దినాన నీ పుణ్యం కొద్దీ తిరిగి పొందగల్గావు. ఈ ధ్రువుడు తన గొప్పమహిమతో ఈ భూభాగాన్నంతా పరిపాలిస్తాడు. ఆ తామరసాక్షుని స్మరించే గొప్ప గొప్ప యోగులు జయింప శక్యంకాని మృత్యువును సైతం జయించగల్గుతారు. అలాంటి వినయశీలుల పీడలను తీర్చే ఆ విష్ణుమూర్తిని కొలువగల్గడం నీ వల్లనే అయింది అనేది సత్యమైన మాట.

**వ. అని ప్రశంసించి, రట్లు పౌరజనంబులచేత నుపలాల్యమానుండగు ధ్రువుని నుత్తానపాదుం డుత్తమ సమేతంబుగా గజారూఢునింజేసి సంస్తూయమానుండును, ప్రహృష్టాంతరంగుండును నగుచు బురాభిముఖుండై చనుదెంచి. 314**

**ప్రతి :** అని= అని; ప్రశంసించిరి= పొగిడారు; అట్లు= ఆ తీరున; పౌరజనంబులచేతన్= పురంలోని జనులచేత; ఉపలాల్యమానుండు+అగు= బుజ్జగించబడినవాడు అయినట్టి; ధ్రువునిన్= ధ్రువుణ్ణి; ఉత్తానపాదుండు; ఉత్తమసమేతంబుగాన్= ఉత్తముడితో కూడా; గజ+ఆరూఢునిన్+చేసి= ఏనుగు నెక్కించి; సంస్తూయమానుండును= పొగడ్తలందుకొంటున్నవాడూ; ప్రహృష్ట+అంతరంగుండునున్= మిక్కిలిగా సంతోషం నింపుకొన్న హృదయం కలవాడున్నూ; అగుచున్= అవుతూ; పుర+అభిముఖుండు+ఐ= పట్టణం వైపుగా తిరిగి; చనుదెంచి= వచ్చి.

**తా :** అని నుతించారు. అలా పౌరజనంచే అనునయించబడ్డ ధ్రువుణ్ణి ఉత్తానపాదుడు ఉత్తముడితోపాటు గజారూఢుని చేశాడు. స్తోత్రపాఠాలు వింటూ ఆనందపడుతూ తన పురం వైపునకు వచ్చి

**సీ. స్వర్ణపరిచ్ఛదస్వచ్ఛకుడ్యద్వారలాలితగోపురాట్టాలకంబు**
**ఫలపుష్పమంజరీకలితరంభాస్తంభపూగపోతాదివిభూషితంబు**
**ఘనసారకస్తూరికాగంధజలబంధురాసిక్తవిపణిమార్గాంచితంబు**
**మానితనవరత్నమయరంగవల్లీవిరాజితప్రతిగృహప్రాంగణంబు**

**తే. శుభనదీజలకుంభసంశోభితంబు, తండులస్వర్ణలాజాక్షతప్రసూన**
**ఫలబలివ్రాతకలితవిభ్రాజితంబు, నగుచు సర్వతోఽలంకృత మైన పురము. 315**

**ప్రతి :** స్వర్ణ= బంగారు మయమైన; పరిచ్ఛద= పైకప్పుభాగాలు; స్వచ్ఛ= స్వచ్ఛమైన; కుడ్య= గోడలు; ద్వార= వాకిళ్లు; లాలిత= ముచ్చటయిన; గోపుర= ముఖ ద్వారాలు; అట్టాలకంబు= మేడలపైన ఉండు గదులు; ఫల= పండ్లు; పుష్పమంజరీ= పూలగుత్తులతో; కలిత= కూడిన; రంభాస్తంభ= అరటికంబాలూ; పూగపోత= లేతపోకచెట్లు; ఆది= మొదలైనవాటిచే; విభూషితంబు= విశేషంగా అలంకరించబడినదీ; ఘనసార= పచ్చకప్పూరం; కస్తూరికా= కస్తూరీద్రవ్యం; గంధ= చందనం; జలబంధుర= కలగలపిన నీరు; ఆసిక్త= చల్లడంచే తడుపబడ్డ; విపణిమార్గ= అంగడి వీధులతో; అంచితంబు= ఒప్పిఉన్నదిన్నీ; మానిత= శ్రేష్ఠమైన; నవరత్నమయ= నవరత్నాలతో తీర్చిన; రంగవల్లీ= ముగ్గులతో; విరాజిత= ప్రకాశిస్తున్న; ప్రతిగృహ= ప్రతి ఇంటి; ప్రాంగణంబున్= ముంగిళ్ళు కలదీ; శుభనదీ= పుణ్య నదులయొక్క; జలకుంభ= నీటికుండలతో; సంశోభితంబు= చక్కగా ఒప్పేదిన్నీ; తండుల= బియ్యం; స్వర్ణ= పసిడిపూలు; లాజ= పేలాలు; అక్షత= అక్షతలు; ప్రసూన= పూలు; ఫల= పండ్లు; బలివ్రాత= మృష్టాన్నంవంటి; పూజోపహారాలతో; కలిత= కూడి; విభ్రాజితంబున్= ప్రకాశితమూ; అగుచున్= అవుతూ; సర్వతః= అన్నివైపులా; అలంకృతము+ఐన= అలంకరించబడిన; పురము= పట్టణం.

**తా :** ఆ నగరం బంగారు తాపడంగల ఇళ్ళ పైకప్పులు, స్వచ్ఛమైన గోడలు, వాకిళ్లు, అందమైనగోపురాలు, మేడలపైన గదులను కలిగి వుంది. పళ్లు, పూలగుత్తులు వేలాడుతున్న అరటిబోదెలు, లేతపోకచెట్లు మొదలైన అలంకరణలతో విశేషంగా ఉంది. కర్పూరం, కస్తురి, చందనంవంటి పరిమళద్రవ్యాలు కలబోసిన నీళ్లతో ఒత్తుగా కలయంపి చల్లిన బాటలుగల అంగళ్లు కలిగి ఉంది. ప్రీతి పుట్టించే నవరత్నఖచిత రంగవల్లులతో ప్రతి ఇంటి ముంగిలి కళకళలాడుతున్నది.

పుణ్యనదీజలంతో నిండిన మంగళ కలశాలతో ఒప్పుతూ ఉంది. బియ్యం, సువర్ణపుష్పాలు, పేలాలు, యవలు/పసుపు కలిపిన బియ్యం, పువ్వులు, పళ్లు, వంటి పూజోపహారాల సముచ్చయంతో విలసిల్లుతూ ఉంది. ఇలా అన్ని ప్రక్కలా అలంకరణలతో ఆ పట్టణం పండుగదనంతో చూడచక్కగా ఉంది.

**వ. ప్రవేశించి రాజమార్గంబునఁ జనుదెంచు నప్పుడు. 316**

**ప్రతి :** ప్రవేశించి= నగరులోకిచొచ్చి; రాజమార్గంబునన్= రాచవీథిని; చనుదెంచున్+అప్పుడు= వస్తున్నప్పుడు...

**తా :** పురంలోకి ప్రవేశించి రాచబాటలో వేంచేస్తూ ఉన్న సమయంలో

**మ. హరిమధ్యల్ పురకామినీతతులు సౌధాగ్రంబులందుండి భా**
**స్వరసిద్ధార్థఫలాక్షతప్రసవదూర్వావ్రాతదధ్యంబువుల్**
**గరవల్లీమణిహేమకంకణఝుణత్కారంబు శోభిల్లఁ జ**
**ల్లిరి యా భాగవతోత్తమోత్తమునిపై లీలానుమేయంబుగన్. 317**

**ప్రతి :** హరిమధ్యల్= సింహాలవంటి సన్నని నడుములుగల; పురకామినీతతులు= పురస్త్రీలశ్రేణులు; సౌధ+అగ్రంబుల+అందున్+ఉండి= మేడల పై ప్రాంతాల్లో నిలుచుండి; కరవల్లీ= పూలతీగెలవంటి సుతిమెత్తటి చేతులందలి; మణి= మణులు పొదిగిన; హేమకంకణ= బంగారుగాజుల; ఝుణత్కారంబు= ఝుణఝుణమనేధ్వని; శోభిల్లన్= వికసిల్లగా; ఆ భాగవత+ఉత్తమ+ఉత్తమునిపైన్= విష్ణుభక్తులలో అందరికంటె గొప్పవారిలో మరింత గొప్పవాడైన ఆ ధ్రువునిపై; లీలా= విలాసంయొక్క; అనుమేయంబుగన్= ఊహకు తగ్గట్టుగ; భాస్వర= కాంతిమంతమైన; సిద్ధార్థ= తెల్ల ఆవాలు; ఫల= పళ్లు; అక్షత= అక్షతలు; ప్రసవ= పువ్వులు; దూర్వా= లేతగడ్డి పోచలయొక్క; వ్రాత= సంచయాలుకల; దధి= పెరుగు కలిపిన; అంబువుల్= నీళ్లను; చల్లిరి= చిలుకరించారు.

**తా :** సింహాలవలె సన్నటి నడుములుగల ఆ నగర రమణుల సమూహాలు మేడలపైన నుండి ఆ భగవద్భక్త పుంగవునిపై మెరుస్తున్న తెల్లఆవాలు, పళ్లు, అక్షతలు పూలు, చల్లుతున్నారు. లేతగడ్డిపరకల కట్టలతో పెరుగు కలిపిన నీటిని చిలుకరిస్తున్నారు. ఆ చిలకరింపుల్లో వాళ్ల తీగలవంటి చేతుల బంగారు గాజుల ఝుణ ఝుణ ధ్వనులు ఇంపుగొల్పుతున్నాయి.

**వ. ఇట్లు వాత్సల్యంబునం జల్లుచు సత్యవాక్యంబుల దీవించుచు సువర్ణ పాత్ర రచితమణి దీప నీరాజనంబుల నివాళింపం బౌరజానపదమిత్రామాత్యబంధుజనపరివృతుండై చనుదెంచి. 318**

**ప్రతి :** ఇట్లు= ఈ ప్రకారంగా; వాత్సల్యంబునన్= పుత్రస్నేహంతో; చల్లుచున్= చల్లుతూ; సత్యవాక్యంబులన్= మంచినిక్కమైన మాటలతో; దీవించుచున్= ఆశీర్వదిస్తూ; సువర్ణపాత్ర= పసిడిగిన్నెల్లో; రచిత= సమకూర్చబడిన; మణి దీప= రత్నదీపాలయొక్క; నీరాజనంబులన్= మంగళహారతులతో; నివాళింపన్= ఆరతిపట్టగా; పౌర= నగరప్రజలు; జానపద= పల్లెప్రజలు; మిత్ర= నేస్తగాళ్లు; అమాత్య= సచివులు; బంధుజన= చుట్టపక్కాల బలగంతో; పరివృతుండు+ఐ= చుట్టబడినవాడై; చనుదెంచి= ఏతెంచి...

**తా :** ఈ విధంగా వాత్సల్యంతో చల్లుతూ నిక్కమైన పలుకులతో ఆ స్త్రీలు ఆశీర్వాదం చేశారు. పసిడిపళ్ళెరాల్లో సమకూర్చిన మణిదీపాలతో హారతులు పట్టారు. పట్టణప్రజలు, పల్లెలప్రజలు, స్నేహితులు, మంత్రులు, బంధువర్గం మొదలైన వాళ్లంతా చుట్టూ నడుస్తుండగా (ధ్రువుడు రాజప్రాసాదానికి వచ్చి)

**సీ. కాంచనమయమరకతకుడ్యమణిజాల సంచయరాజితసౌధములను**
**వరసుధాఫేనపాండురరుక్మపరికరోదాత్త పరిచ్ఛదతల్పములను**
**సురతరుశోభితశుకపికమిథునాళి గానవిభాసితోద్యానములను**
**సుమహితవైదూర్యసోపానవిమల శోభితజలపూర్ణవాపీచయముల**

**తే. వికచకహ్లారదరదరవింద కైర, వ ప్రదీపితబకచక్రవాకరాజ**
**హంససారసకారండవాదిజలవి, హంగనినదాభిరామపద్మాకరముల. 319**

ప్రతి : కాంచనమయ= బంగారు పూత పూసిన; మరకత= పచ్చలు పొదిగిన; కుడ్య= గోడల యందలి; మణిజాల= రత్న సమూహముల; సంచయ= రాసులతో; రాజిత= మెరిసిపోతున్నట్టి; సౌధములను= ప్రాసాదాలతో; వర= ఉత్తమమైన; సుధాఫేన= పాలనురుగువలె; పాండుర= తెల్లనివైన; రుక్మ= బంగారు; పరికర= ఉపకరణలతో; ఉదాత్త= గొప్పవిలువైన; పరిచ్ఛద= బట్టలు పరచిన; తల్పములను= పరుపులతో; సురతరు= అమరవృక్షాలతో; శోభిత= చక్కనివై; శుక= చిలుకలు; పిక= కోయిలలు; మిథున+అళి= తుమ్మెదలజంటలయొక్క; గాన= పాటలతో; విభాసిత= విరాజిల్లుతున్న; ఉద్యానములను= పూలతోటలతో; సుమహిత= మిక్కిలి గొప్పవియైన; వైదూర్య= వైదూర్యాలను పొదిగిన; సోపాన= మెట్లతో; విమల= నిర్మలత్వంతో; శోభిత= తళతళమనే; జలపూర్ణ= నీటితోనిండిన; వాపీ= దిగుడుబావుల; చయములన్= సంగ్రహంతోను; వికచ= బాగావిచ్చుకున్న; కహ్లార= ఎర్రకలువలతో; దరత్= కొంచెంగా వికసించిన; అరవింద= తామరపూలతో; కైరవ= తెల్లకలువలతో; ప్రదీపిత= ప్రకాశిస్తున్నట్టి; బక= కొంగలు; చక్రవాక= జక్కవలు; రాజహంస= రాయంచలు; సారస= బెగ్గురులు; కారండవ= కన్నెలేడిపిట్టలు; ఆది= మొదలైన; జలవిహంగ= నీటి పక్షులయొక్క; నినద= కూతలతో; అభిరామ= ఆహ్లాదకరమైన; పద్మాకరములన్= కొలనులతో.

**తా :** ఆ రాజభవనాలు, పచ్చలు తాపిన బంగారు గోడలతో; రత్నాలరాసుల గుట్టలతో మిలమిల లాడ్తున్నాయి. పాలనురుగులవలె తెల్లనైన, బంగారు పరికరాలతో కూర్చిన, విలువైన వస్త్రాలు పరచిన పరుపులు ఇంపుగా ఉన్నాయి. పూలతోటలు, 'చక్కటి కల్పవృక్షాలతో, చిలుకలు, కోకిలల కలరవాలతో, తుమ్మెదజంటల ఝుంకారాలతో అలరిస్తున్నాయి. దిగుడుబావులు, ఎంతో విలువైన వైదూర్యాలతో కూర్చిన మెట్లతో, తళతళమనే స్వచ్ఛమైన నీటితో నిండుగా ఉన్నాయి. కొలనులు, విరబూసిన ఎర్రకలువలతో, అప్పుడప్పుడే వికసిస్తున్న తామరపూలతో, తెల్లకలువలతోనూ, కొంగలు, జక్కవలు, రాజహంసలు, బెగ్గురులు, కణుజు పిట్టల కిలకిల నాదాలతో ఆహ్లాదింపచేస్తున్నాయి.

**వ. మఱియును. 320**

ప్రతి : మఱియును= ఇంకా...

**తా :** ఇంకా

**తే. చారుబహువిధవస్తువిస్తార మొప్ప, నంగనాయుక్త మగుచుఁ బెంపగ్గలించి**
**యర్థిఁ దనరారు జనకు గృహంబు సొచ్చె, నెలమిఁ ద్రిదివంబు సొచ్చు దేవేంద్రు పగిది 321**

ప్రతి : చారు= మనోజ్ఞమైన; బహువిధ= నానా ప్రకారాలైన; వస్తు= పదార్థాలయొక్క; విస్తార= విరివితో; ఒప్పన్= ఒప్పుగా; అంగనాయుక్తము= స్త్రీజనంతో కూడింది; అగుచున్= అవుతూ; పెంపు= సమృద్ధి; అగ్గలించి= అతిశయించి;

అర్థిన్= ప్రీతికరంగా; తనరారు= ఒప్పుతున్న; జనకు గృహంబు= తమ తండ్రి మందిరంలోకి; స్వర్గంబున్= స్వర్గంలోనికి; చొచ్చు= ప్రవేశించే; దేవ+ఇంద్రు పగిదిన్= దేవేంద్రునిలాగా; చొచ్చెన్= ప్రవేశించాడు.

**తా :** ముచ్చటగొల్పే రకరకాల వస్తువులతో నిండుగా ఉన్నట్టి, స్త్రీ పరిజనంతో కూడుకున్నట్టిది, మిగుల పుష్కలత్వంలో అమిత ప్రీతిదాయకంగా ఒప్పి ఉన్నట్టిది, అయిన తన తండ్రి మందిరాన్ని సంతోషంగా స్వర్గంలో ప్రవేశించే దేవేంద్రుడి వలె ధ్రువుడు తన తండ్రి యింట ప్రవేశించాడు.

**వ.** **ఇట్లు ప్రవేశించిన రాజర్షియైన యుత్తానపాదుండు సుతుని యాశ్చర్యకరంబైన ప్రభావంబు వినియుం జూచియు మనంబున విస్మయంబు నొంది ప్రజానురక్తుండును బ్రజాసమ్మతుండును నవయౌవన పరిపూర్ణుండును నైన ధ్రువుని రాజ్యాభిషిక్తుంజేసి వృద్ధవయస్కుండైన తన్నుం దాన యెఱింగి యాత్మగతిఁ బొంద నిచ్ఛయించి విరక్తుండై వనంబునకుం జనియె; నంత నా ధ్రువుండు శింశుమార ప్రజాపతికూఁతురైన భ్రమి యనుదాని వివాహంబై దానివలనఁ గల్పవత్సరు లను నిద్దఱు గొడుకులం బడసి వెండియు వాయుపుత్రియైన యిల యను భార్య యందు నుత్కలనామకుండైన కొడుకు నతిమనోహర యైన కన్యారత్నంబును గనియె; నంతఁ దద్భ్రాతయైన యుత్తముండు వివాహంబు లేకుండి మృగయార్థంబు వనంబున కరిగి హిమవంతంబున యక్షుని చేత హతుం డయ్యె; నతని తల్లియుఁ దద్దుఃఖంబున వనంబున కేఁగి యందు గహన దహనంబున మృతిం బొందె; ధ్రువుండు భ్రాతృమరణంబు విని కోపామర్ష శోకవ్యాకులిత చిత్తుండై జైత్రంబను రథంబెక్కి యుత్తరాభిముఖుండై చని హిమవద్ద్రోణియందు భూతగణసేవితంబును గుహ్యకసంకులంబును నైన యలకాపురంబు వొడగని యమ్మహాబాహుండు.** **322**

**ప్రతి :** ఇట్లు= ఇలా దేవేంద్రుడిలా; ప్రవేశించినన్= అడుగు మోపగా; రాజర్షి ఐన= రాజఋషి ఐనట్టి; ఉత్తానపాదుండు= ఉత్తానపాదుడు; సుతుని= పుత్రునియొక్క; ఆశ్చర్యకరంబు+ఐన= విస్మయకరమైన; ప్రభావంబు= మహిమను; వినియున్= ఆలకించి; చూచియున్= పరికించి; మనంబున= మనస్సున; విస్మయంబున్= గొప్పవింతను; ఒంది= పొంది; ప్రజా+అనురక్తుండును= జనులయందు అనురాగం కలవాడును; ప్రజాసమ్మతుండును= ప్రజలు ఇచ్ఛగించే వాడును; నవయౌవన= యుక్తవయస్సు; పరిపూర్ణుండునున్+ఐన= నిండుగా నిండినవాడును అయినట్టి; ధ్రువుని= ధ్రువుని; రాజ్య+అభిషిక్తున్+చేసి= యువరాజ పట్టాభిషేకంచేసి; వృద్ధవయస్కుండు+ఐన= వార్ధక్యం పైబడిన వాడైనట్టుగా; తన్నున్ తాన= తన్ను తానే; ఎఱింగి= గ్రహించి; ఆత్మగతిన్= పరమాత్మ తత్త్వాన్ని; పొందన్= గ్రహించడానికి; ఇచ్ఛయించి= ఇష్టపడి; విరక్తుండు+ఐ= విషయ విరాగియై; వనంబునకున్= అడవికి; చనియెన్= వెళ్లిపోయాడు; అంతన్= ఆ పిమ్మట; ఆ ధ్రువుండు= ఆ ధ్రువుడు; శింశుమార ప్రజాపతి= శింశుమారబ్రహ్మయొక్క; కూతురు+ఐన= పుత్రిక అయిన; భ్రమి అనుదానిన్= భ్రమి అనే పేరుగల కన్యను; వివాహంబు+ఐ= పెళ్ళిచేసుకున్నవాడై, దానివలనన్= ఆమె వల్ల; కల్ప+వత్సరులను= కల్పుడు, వత్సరుడు అనే; ఇద్దరు= ఇద్దరు; కొడుకులను= కుమాళ్లను; పడసి= పొంది; వెండియున్= మళ్లీ; వాయుపుత్రి+ఐన= వాయువు కూతురైన; 'ఇల' అను+భార్య+అందున్= ఇల అనే తన భార్యవల్ల; ఉత్కలనామకుండు+ఐన= ఉత్కలుడు అనే నామధేయం కలవాడైన; కొడుకున్= పుత్రుణ్ణి; అతిమనోహర+ఐన= మనస్సును ఆ కట్టుకునే మిక్కిలి అందగత్తె అయిన; కన్యారత్నంబునున్= కన్యకామణిని; కనియెన్= కన్నాడు; అంతన్= ఆ తరువాత; తద్+భ్రాత+ఐన= ఆ ధ్రువుడి సోదరుడైన; ఉత్తముండు= ఉత్తముడు; వివాహంబులేక+ఉండి= పెళ్లాడక ఉండి;

మృగయా+అర్థంబు= వేటకోసమై; వనంబునకున్= అటవికి; అరిగి= వెళ్లి; హిమవంతంబున= మంచుకొండమీద; యక్షునిచేతన్= యక్షుడి చేతిలో; హతుండు+అయ్యెన్= చచ్చాడు; అతని= ఆ ఉత్తముడి; తల్లియున్= తల్లి సురుచియును; తద్+దుఃఖంబునన్= ఆ కడుపుకోతతో; వనంబునకున్= అడవికి; ఏగి= వెళ్లి; అందు= ఆ వనంలో; గహనదహనంబున= కారుచిచ్చున; మృతిన్= చావును; పొందెన్= పొందింది; ధ్రువుండు= ధ్రువుడు; భ్రాతృమరణంబున్= సోదరుడి చావును; విని= ఆకర్ణించి; కోప= రోషం; అమర్ష= అసహనం; శోక= దుఃఖం; అనేవానితో వ్యాకులిత= కలవరం పొందిన; చిత్తుండు+ఐ= మనస్సుకలవాడై; జైత్రంబు+అను= జైత్రం అను పేరుగల; రథంబు+ఎక్కి= అరదం అధిరోహించి; ఉత్తర+అభిముఖుండు+ఐ= ఉత్తరదిక్కువైపుగా; చని= వెళ్లి; హిమవద్+ద్రోణి+అందున్= హిమవత్పర్వత చరియయందు; భూతగణ= భూతగణాలతో; సేవితంబును= సేవించబడేది; గుహ్యక= యక్షులతో; సంకులంబును+ఐన= వ్యాపించిందిన్ని ఐన; అలకాపురంబు= అలకానగరాన్ని; పొడగని= కాంచి; ఆ+మహాబాహుండు= ఆ భుజశాలి ధ్రువుడు...

**తా :** (ధ్రువుడు) ఇట్లు ప్రవేశించగా రాజర్షియగు ఆ ఉత్తానపాదుడు కుమారుడి అద్భుతమైన మహిమను చెవులారా విన్నాడు. కళ్లారా చూచాడు. మనసులో ఎంతో విస్తుపోయాడు. ధ్రువుడికి ప్రజలపైగల మమకారం, ప్రజలకు ధ్రువుడిపట్ల అభిమానం, యువక ప్రాయం పూర్తిగా నిండినవాడునూ అయిన ధ్రువునికి రాజ్య పట్టాభిషేకం చేశాడు. వయస్సుపై బడ్డట్టుగా తనను తానే గమనించుకొని, ఆత్మ తత్వాన్ని తెలుసుకోవాలను కున్నాడు. విరాగియై అడవుల్లోకి వెళ్లిపోయాడు. ఆ తరువాత ఆ ధ్రువుడు శింశుమార ప్రజాపతి కూతురు 'భ్రమి'ని వివాహమాడాడు. ఆమెవల్ల కల్పుడు, వత్సరుడనే ఇద్దరు పుత్రుల్ని కన్నాడు. ఇంకా వాయుపుత్రిక అయిన 'ఇల' వల్ల 'ఉత్కలుడు' అనే పేరుగల కొడుకును, మిక్కిలి సొగసుగల కన్యకను పొందాడు. ఆ లోపల అవివాహితుడిగా ఉన్న తన సోదరుడు ఉత్తముడు వేటకై అడవికి వెళ్లి హిమవత్పర్వతం మీద ఒక యక్షునిచే చంపబడ్డాడు. ఆతడి తల్లికూడా ఆ కడుపుశోకంతో వనంలోకి వెళ్లి ఆ అడవిమంటల్లో చిక్కుకుని చనిపోయింది. ధ్రువుడు సోదరుడి చావువార్త విని రోషపడి ఓర్మిలేనివాడై ఆ దుఃఖంతో కలవరపడి పోయాడు. జైత్రం అనే రథం ఎక్కి ఉత్తరం వైపుకి వెళ్లాడు. హిమవత్పర్వత సానువుల్లోని అలకాపట్టణాన్ని చూశాడు. ఈ పట్టణం భూతగణాలతో కొలువబడ్తుంది. యక్షులతో పరివ్యాప్తమై ఉంది. గొప్ప భుజబలంగల ఆ ధ్రువుడు.

### a =ధ్రువుండు కుబేరానుచరులైన గుహ్యకులతో యుద్ధము సేయుట a

**మ.** **ఘనశౌర్యోన్నతితోడ సర్వకకుబాకాశంబులందుం బ్రతి**
**ధ్వను లోలిన్ నిగుడంగ శంఖము మహోద్యల్లీలఁబూరింపఁ ద**
**న్నినదంబున్ విని యక్షకాంతలు భయాన్వీతాత్మలై; రుగ్ర సా**
**ధనులై యక్షభటుల్ పురిన్ వెడలి రుత్సాహంబు సంధిల్లఁగన్.** **323**

**ప్రతి :** సర్వకకుభ్+ఆకాశంబులు+అందున్= అన్నిదిక్కులు, ఆకాశంబులందు; ఘనశౌర్య+ఉన్నతి తోడన్= గొప్ప పరాక్రమాతిశయంతో; ప్రతిధ్వనులు= ప్రతిశబ్దములు; ఓలిన్= మిక్కిలిగా; నిగుడంగన్= వినిపింపగా; మహా+ఉద్యత్+లీలన్= గొప్పశక్తిమంతమైన విధంగా; శంఖము పూరింపన్= శంఖము ఊదగా; తద్+నినదంబున్ విని= ఆ శబ్దాన్ని విని; యక్షకాంతలు= యక్షస్త్రీలు; భయ+అన్వీత+ఆత్మలు+ఐరి= భయంతో కూడిన చిత్తం కలవారయ్యారు; యక్షభటుల్= రక్షకభటులైన యక్షులు; ఉగ్రసాధనులు+ఐ= భయంకరమైన ఆయుధాలుకలవారై; ఉత్సాహంబు సంధిల్లఁగన్= ఉత్సాహం కలుగగా; పురిన్ వెడలిరి= పట్టణంనుండి బయలుదేరారు.

**తా :** మహాపరాక్రమశాలియైన ధ్రువుడు అన్ని దిక్కులలో ఆకాశంలో అతిశయించిన ఘనపరాక్రమంతో దిక్కులు పిక్కటిల్లున్నట్లు శంఖాన్ని పూరించగా, ఆ శబ్దాన్ని విని యక్షిణులు భయభ్రాంతలైరి. ఆ సమయంలో భయంకరమైన ఆయుధాలతో యక్షభటులు పురం వీడి బయలుదేరారు.

**వ. ఇట్లు వెడలి యా ధ్రువునిందాఁకిన. 324**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా, వెడలి= బయలుదేరి, ఆ ధ్రువునిన్+తాకినన్= ఆ ధ్రువుని ఎదిరించిన

**తా :** ఆ విధంగా బయలుదేరిన సేనలు ధ్రువుని ఎదిరించగా

**చ. కరము మహారథుండు భుజగర్వపరాక్రమశాలియున్ ధను**
**ర్ధరుఁడును శూరుఁడౌ ధ్రువుఁడు దన్ను నెదిర్చిన యక్షకోటిఁ జె**
**చ్చెరఁబదుమూఁడువేల నొకచీరికిఁ గైకొన కొక్కపెట్ట భీ**
**కరముగ మూఁడు మూఁడు శితకాండములందగఁగ్రుచ్చనేసినన్. 325**

**ప్రతి :** మహారథుండు= గొప్పరథంగలవాడు (యోధుడు); కరము= మిక్కిలి; భుజగర్వ పరాక్రమశాలియున్= భుజశక్తిచే విక్రమించినవాడు; ధనుస్+ధరుఁడున్= వింటిని చేపట్టినవాడు; శూరుఁడు+ఔ= వీరోచిత శౌర్యంగల; ధ్రువుడు; తన్నున్+ఎదిర్చిన= తనను ఎదుర్కొనిన; పదమూఁడువేల యక్షకోటిన్= పదమూడువేల యక్షసముదాయాన్ని; చెర+చెరన్= వెంటనే; ఒక, చీరికిన్+కైకొనక= ఏమాత్రమూ లెక్కపెట్టక; ఒక్కపెట్టన్= ఒకేసారి; మూఁడు మూఁడు= మూడేసి; శితకాండములన్= వాడిబాణాలతో; భీకరముగన్= భయంకరంగా; తగన్+క్రువ్వన్+ఏసినన్= మిక్కిలి బాధించునట్లు ప్రయోగించగా.

**తా :** గొప్ప మహారథుడునూ, భుజగర్వముచేత పరాక్రమశాలి అయినవాడునూ, ధనుస్సును ధరించినవాడునూ, శూరుడునూ అయిన ధ్రువుడు తన నెదిరించిన పదమూడువేలమంది యక్షసమూహాన్ని ఏమాత్రం లెక్కచేయక వేగంగా, ఒక్కసారిగా, భయంకరంగా ఒక్కొక్కరిపై మూడేసి వాడి బాణాలను తగినట్లు గ్రుచ్చుకొనునట్లు వేయగా

**విశే :** ధ్రువుడు మహారథుడుగా చెప్పబడినాడు. **మహారథుడంటే – "తన మేను, రథము, రథ్యముల సారథిగాచి యని సేయువాడు మహారథుండు"** అని ధనుర్విద్యావిలాసం (3-83).

**ఉ. వారు లలాటముల్ వగిలి వారక సోలియుఁ దేఱి యమ్మహో**
**దారు పరాక్రమప్రకటధైర్యముఁ దత్కరలాఘవంబుఁ బ**
**ల్మాఱు నుతించుచుం గుపితమానసులై పదతాడితప్రదు**
**ష్టోరగకోటివోలెఁ జటులోగ్రభయంకరరోషమూర్తులై. 326**

**ప్రతి :** వారు= యక్ష వీరులు; లలాటముల్+పగిలి= నొసళ్లు పగిలి; వారక= తప్పనిసరియై; సోలియున్= మూర్ఛిల్లి కూడా; తేఱి= తేరుకొని; ఆ+మహా+ఉదారు= ఆ గొప్ప ఔదార్యమూర్తియైన ధ్రువుని; పరాక్రమప్రకటధైర్యమున్= పరాక్రమం కల ధైర్యమును; తద్+కరలాఘవంబున్= ఆ హస్త నైపుణ్యమును; పల్+మాఱు= పలుతడవలు; నుతించుచున్= పొగడుచు;

పదతాడిత= కాలితో తొక్కబడిన; ప్రదుష్ట+ఉరగకోటివోలెన్= మహావిషసర్పాలవలె; చటుల+ఉగ్ర= మిక్కుటమైన కదలికలు కలిగిన; భయంకర రోషమూర్తులు+ఐ= భయంకరకోపాకారాలతో; కుపితమానసులు+ఐ= రోష మనస్కులై.

**తా :** ఆ యక్షులు లలాటములు పగిలి తప్పనిసరియై మూర్ఛిల్లికూడా (త్వరలోనే) తేరుకొని ఆ మహోదారుడు పరాక్రమంచేత ప్రకటించిన ధైర్యమును ఆతని హస్త లాఘవమును పలుమార్లు నుతించారు. కాని కోపించిన మనస్సులు కలవారై కాలి తన్నులు తిన్న మహాదుష్టమైన విష సర్ప సమూహంవలె, భయంకరమైన రోషాకారంతో

**ఉ. ఆ రథికోత్తముం దొడరి యందఱు నొక్కటఁజుట్టు ముట్టి యా**
**ఱాఱు శిలీముఖంబులఁదదంగములన్ బగిలించి వెండి వి**
**స్ఫారగదాశరక్షురికపట్టిస తోమరశూలఖడ్గముల్**
**సారథియుక్తుఁడైన రథిసత్తముపైఁ గురిపించి రేపునన్. 327**

**ప్రతి :** ఆ రథిక+ఉత్తమున్+తొడరి= ఆ మహాయోధుడైన ధ్రువుని ఎదుర్కొని; అందఱు= యక్షవీరులంతా; ఒక్కటన్+ చుట్టుముట్టి= ఒక్కసారిగా ముట్టడించి; ఆఱు+ఆఱు శిలీముఖంబులన్= ఆరేసి బాణాలతో; తద్+అంగములన్= ధ్రువుని శరీరభాగాలన్నింటిని; పగిలించి= గాయపరచి; వెండి= మరలా; విస్ఫార= ప్రకాశవంతమైన; గదా= గదలు; శర= బాణములు; క్షురిక= చురకత్తులు; పట్టిస= అడ్డకత్తి; తోమర= చిల్లకోలలు; శూల= శూలములు; ఖడ్గముల్= కత్తులు; సారథియుక్తుఁడు+ఐన= సారథితో గూడిన; రథిసత్తముపైన్= రథంలో కూర్చున్న యుద్ధవీరునిపై; ఏపునన్+కురిపించిరి= విజృంభణతో కురిపించారు.

**తా :** యక్షవీరులందరూ ఒక్కుమ్మడిగా మహాశూరుడైన ధ్రువుణ్ణి చుట్టుముట్టారు. ధ్రువుని అవయవాల నన్నిటినీ ఆరు ఆరు బాణాలతో నొప్పించారు. ప్రకాశవంతమైన గదలు, బాణాలు, చురకత్తులు, పట్టిసాలు, చిల్లకోలలు, శూలాలు, ఖడ్గాలు వంటి తీవ్రమైన ఆయుధాలను రథియైన ధ్రువుడిపైనా, ఆయన రథసారథిపైనా వర్షధారల్లా కురిపించారు.

**వ. అట్లు గురియించిన నతండు. 328**

**ప్రతి :** అట్లు= ఆ విధంగా; కురియించినన్= కురిపించగా; అతండు= ఆ ధ్రువుడు.

**తా :** ఆ విధంగా బాణవర్షం కురిపించగా ఆ ధ్రువుడు.

**క. పెంపఱి యుండెను ధారా, సంపాతచ్ఛన్నమైన శైలముభంగిన్**
**గుంపులు గొని యాకసమునఁ, గంపించుచు నపుడు సిద్ధగణములు వరుసన్. 329**

**ప్రతి :** ధారాసంపాత+ఛన్నము+ఐన= ఎడతెగని వర్షధారలతో కప్పబడిన; శైలము భంగిన్= కొండవలె; (అతడు) పెంపు+అఱి+ఉండెను= విజృంభణ తగ్గి ఉండెను; సిద్ధగణములు= సిద్ధులు మొదలైన దేవజాతులవారు; ఆకసమునన్= ఆకాశంలో; గుంపులు+కొని= గుమికూడి; అపుడు వరుసన్= అపుడు వరుసగా; కంపించుచున్= భయంచేత వణుకుతూ...

**తా :** ఆ సమయంలో ధ్రువుడు నిరంతర వర్షధారలతో కప్పబడిన కొండవలె యక్షసమూహం కురిపించిన ఆయుధ వర్షంలో మునిగిపోయినట్లు కనిపించాడు. ఆ సన్నివేశాన్ని చూసి ఆకాశంలోని సిద్ధగణాలు భయకంపితులయ్యారు.

**క. హాహాకారము లెసఁగఁగ, నోహో యీ రీతి ధ్రువపయోరుహహితుఁ డు**
**త్సాహము సెడి యిటు దైత్య స, మూహార్ణవమందు నేఁడు మునిఁగెనె యకటా! 330**

**ప్రతి :** హాహాకారములు+ఎసఁగఁగన్= ఆర్తనాదాలు అతిశయించగా; ఓహో!= అయ్యయ్యో!; ధ్రువ= ధ్రువుడనే; పయోరుహ= జలమునందు పుట్టిన పద్మానికి; హితుఁడు= స్నేహితుడైన సూర్యుడు; ఈ రీతిన్= ఈ విధంగా; ఉత్సాహము+చెడి= యుద్ధంచేయాలనే ఉబలాటాన్ని కోల్పోయి; ఇటు= ఈ విధంగా; దైత్యసమూహ+అర్ణవము+అందు= రాక్షసుల సమూహమనే సముద్రంలో; అకటా!= ఔరా!; నేఁడు మునిగెనె= ఈనాడు మునిగి పోయాడా! (మునిగిపోయినట్లుగా ఉందే!?)

**తా :** ఆ సమయంలో సిద్ధులు మొదలైన దేవగణాలు ఆర్తనాదాలు చేశారు. ధ్రువమహారాజనే సూర్యుడు, రాక్షససైన్యమనే సముద్రంలో మునిగినాడా అయ్యో! అనే సందేహాన్ని పొందారు. (పద్మాలనే ప్రజలకు ఆప్తుడైన సూర్యునివంటి ధ్రువమహారాజు – సముద్రంలో సూర్యుడస్తమించేటట్లు, దైత్యసమూహమనే సాగరంలో మునిగిపోయాడా?)

**వ. అని చింతించు సమయంబున. 331**

**తా :** అని బాధపడుతున్న సమయంలో

**క. తా మాతని గెలిచితి మని, యా మనుజాశనులు వలుక నట నీహార**
**స్తోమము సమయించు మహో, ద్దాముండగు సూర్యుఁబోలి తద్ధయుఁదోఁచెన్. 332**

**ప్రతి :** ఆ మనుజ+అశనులు= నరమాంస భక్షకులైన ఆ రాక్షసులు; తాము+ఆతని గెలిచితిమి+అని= మేము ఆ ధ్రువుని ఓడించామని; పలుకన్= పలుకగా; అటన్= ఆ యుద్ధభూమిలో; నీహారస్తోమము= మంచు సమూహాన్ని; సమయించు= పోగొట్టు; మహా+ఉద్దాముండు+అగు= చాలాగొప్పవాడగు; సూర్యున్+పోలి= సూర్యునివలె; తద్ధయున్+తోఁచెన్= మరింత ప్రకాశిస్తూ కనిపించాడు. (ధ్రువుడు)

**తా :** ఆ యక్షులు తాము ఆ మనువంశంలో పుట్టిన ధ్రువుని నిజముగా కబళించామని భావించి సంతోషించారు. ఇంతలో మంచు పొరలను ఉదయకాలంలో మాయంచేసే సూర్యునివలె ధ్రువుడు రథంపై కనిపించాడు.

**వ. అట్లు దోఁచిన. 333**

**ప్రతి :** అట్లు+తోఁచినన్= ఆ విధంగా కనిపించగా...

**మ. అరి దుఃఖావహమైన కార్ముకము శౌర్యస్ఫూర్తితోఁ దాల్చి భీ**
**కరబాణావళిఁబింజపింజ గరవంగా నేసి ఝంఝానిలుం**
**దురు మేఘావళిఁబాఱఁదోలుగతి నత్యుగ్రాహితక్రూర బం**
**ధురశస్త్రావళి రూపుమాపె విలసద్దోర్లీల సంధిల్లఁగన్. 334**

**ప్రతి :** అరి దుఃఖ+ఆవహము+అయిన= శత్రువులకు దుఃఖాన్ని కలిగించే; కార్ముకము= విల్లును; శౌర్యస్ఫూర్తితోన్= పరాక్రమం తెలియునట్లుగా; తాల్చి= ధరించి; భీకరబాణ+ఆవళి+ఆ= భయంకర బాణపరంపరను; పింజపింజ కరవంగాన్= ముక్కలు ముక్కలై ఛిన్నాభిన్నం కాగా; ఏసి= ప్రయోగించి; ఉరుమేఘ+ఆవళిన్= గొప్పమేఘసముదాయమును; ఝంఝా+అనిలుండు= ఉప్పెనగాలి; పాఱన్+తోలుగతిన్= విసిరివేసినట్లు; అతి+ఉగ్ర+ఆహిత= మిక్కిలి భయంకరంగా

సమీపించిన; బంధుర= దట్టమైన; శస్త్ర+ఆవళి= బాణాలకంటే శక్తిమంతమైన మంత్రపూతమైన శస్త్రాలను; విలసత్+దోస్+లీల= విరాజిల్లుతున్న భుజాల వినోదం; సంధిల్లఁగన్= కూడి రాగా; రూపుమాపెన్= అంతమొందించాడు.

**తా :** శత్రువులకు దుఃఖమును కలిగించే వింటిని శౌర్య ప్రకాశంతో ధరించి భయంకరమైన బాణములను ఒకదాని తోకతో ఇంకొకటిగా కరుచుకొని పోవు విధముగా వేసి ఝంఝానిలుడు (ప్రభంజనుడు/పెనుగాలి) పెద్ద పెద్ద మేఘాల సమూహాన్ని పారద్రోలు విధంగా మహాభయంకరములైన శత్రువుల క్రూరమైన, దట్టమైన శస్త్రసమూహాన్ని ప్రకాశించే భుజముల లీల కలిసిరాగా రూపుమాపినాడు.

**చ. మఱి యపుడమ్మహాత్ముఁడసమానబలుండు మహోగ్రబాణముల్**
**గఱకరిఁ దాఁక నేసి భుజగర్వ మెలర్ప విరోధివర్మముల్**
**పఱియలు సేసి యంగములు భంగమునొందఁగఁ జేసి వ్రేల్మిడిన్**
**గిఱికొని పర్వతంబుల నొగిం దెగఁగొట్టెడు నింద్రుకైవడిన్. 335**

**ప్రతి :** మఱి+అపుడు= ఆ తర్వాత; అసమానబలుండు= సాటిలేనిబలముగల; ఆ+మహాత్ముఁడు= ఆ మహనీయుడైన ధ్రువుడు; మహా+ఉగ్రబాణములు= అత్యంత తీవ్రమైన బాణాలను; గఱకరిన్+తాఁకన్+ఏసి= ఈకలు ఈకలను తాకినట్లుగా కొట్టి; భుజగర్వము+ఎలర్ప= బాహుబల పరాక్రమం తెలిసి వచ్చేవిధంగా; విరోధి వర్మముల్= శత్రువుల (ప్రాణాలున్న) కవచాలను; పఱియలు= తుంపులు తుంపులుగా; చేసి= కావించి; అంగములు= శరీరభాగాలను; భంగము+ఒందఁగన్+చేసి= తునాతునకలుచేసి; వ్రేల్మిడిన్= త్రుటిలో; గిఱికొని= చుట్టుకొని; పర్వతంబులన్+ఒగిన్= కొండలను ఒక్కసారిగా; తెగన్+కొట్టెడు= తెగనరికిన; ఇంద్రుకైవడిన్= ఇంద్రునివలె కనిపించాడు.

**తా :** ఇంకా అసమాన బలశాలియు, మహాత్ముడునూ అయిన ధ్రువుడు మహాభయంకర బాణపరంపరను భుజగర్వం తెలియువిధంగా వేసి విరోధుల కవచాలు పగులకొట్టినాడు. వారి అవయవాలు భంగపడేటట్లు చేసినాడు. ఆ సన్నివేశం ఎలా కనిపించిందంటే, పూర్వం మహేంద్రుడు తన వజ్రాయుధంతో కొండల రెక్కలు తెగగొట్టినట్లుగా కనిపించింది.

**విశే :** ఇంద్రుడు పర్వతాల రెక్కలు విరగగొట్టడంవెనుక కథ :

పర్వతాలు తమయిష్టంవచ్చిన చోటికి ఎగిరిపోయి ఎక్కడంటే అక్కడ వాలుతుండేవి. అలాచేయడంవల్ల ప్రజలకు, భూమికి బాధలు కలిగేవి. ఆ కష్టాన్ని నివారించడానికి ఇంద్రుడు తన వజ్రాయుధంతో పర్వతాల రెక్కలు తెగగొట్టాడు. ఆ రెక్కలే మేఘాలుగా మారాయి. ఇదీ ఐతిహ్యం. ఈ ఐతిహ్యాన్ని పోతన ఇక్కడ సందర్భోచితంగా వాడుకొన్నారు.

**వ. అయ్యవసరంబున. 336**

**ప్రతి :** ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

**చ. అలఘుచరిత్రుఁడమ్మనుకులాగ్రణిచే వికలాంగులైన వా**
**రల సకిరీటకుండలవిరాజితమస్తకకోటిచే సము**
**జ్జ్వలమణికంకణాంగదలసద్భుజవర్గముచేత సంగర**
**స్థలమతిరమ్యమై తనరె సంచితవీరమనోహరాకృతిన్. 337**

**ప్రతి :** అలఘుచరిత్రుఁడు= విశేషమైన నడవడికగలవాడు; ఆ+మనుకుల+అగ్రణిచేన్= ఆ మనువంశనాయకునిచే; వికల+అంగులు+ఐన= అవయవములు విరిగిన, వారల=వారి; సకిరీట= కిరీటాలతో; కుండల విరాజిత= కుండలాలతో మెరిసే; మస్తకకోటిచేన్= అనేకమైన తలలచే; సమ్+ఉజ్జ్వల= మిక్కిలి ప్రకాశించు; మణికంకణ+అంగద= మణులు పొదిగిన మురుగులు, నగలు; లసత్+భుజవర్గముచేత= ప్రకాశించే భుజాలసముదాయంచే; సంగరస్థలము= యుద్ధరంగము; అతిరమ్యము+ఐ= మిక్కిలి ప్రకాశిస్తూ; సంచిత= కలసి ఉన్న; వీరమనోహర+ఆకృతిన్= వీరులకు మనోహర రూపంతో; తనరెన్= ప్రకాశించింది.

**తా :** గొప్ప చరిత్రకలిగి మనుకులంలో శ్రేష్ఠుడైన ధ్రువుని చేతిలో (యక్షులు) వికలాంగులయ్యారు. వారి కిరీట కుండలాలతో ప్రకాశించే తలల సమూహంచేతనూ, బాగుగా ప్రకాశించే మణికంకణాలు, భుజకీర్తులతో కూడిన చేతులగుంపుతోనూ, యుద్ధభూమి వీరులు సాధించిన మనోహరాకారంతో మిగుల రమ్యమై ఒప్పారింది.

**వ. అంత హతశేషులు. 338**

**ప్రతి :** అంతన్= అప్పుడు, హతశేషులు= చనిపోగా మిగిలిన యోధులు.

**క. వరబలుఁడగు మను మనుమని, శరసంఛిన్నాంగు లగుచు సమరవిముఖులై**
**హరిరాజముఁగని పఱచెడు, కరిబృందముఁబోలెఁజనిరి కళవళపడుచున్. 339**

**ప్రతి :** వరబలుడు+అగు= శ్రేష్ఠమైన బలముగల; మను మనుమని= మనువుయొక్క మనుమడైన ధ్రువునివలన; శరసంఛిన్న+అంగులు+అగుచున్= బాణాలతో ముక్కలు ముక్కలైన దేహభాగాలు కలవారవుతూ; హరిరాజమున్+కని= సింహశ్రేష్ఠమును చూసి; పఱచెడు= పరుగెత్తు; కరిబృందమున్+పోలెన్= ఏనుగుల గుంపువలె; సమరవిముఖులు+ఐ= యుద్ధాన్ని వదలి పెట్టినవారై; కళవళపడునున్= భయభ్రాంతులవుతూ; చనిరి= తిరుగు ముఖం పట్టారు.

**తా :** మహాబలశాలయైన స్వాయంభువమనువు మనుమడైన ధ్రువుని బాణములచేత ముక్కలైన శరీరభాగాలు కలవారై యుద్ధమునకు విముఖులై సింహరాజాన్ని చూచి పారిపోయెడు ఏనుగుల సమూహంవలె కళవళపడుతూ పారిపోయారు.

**క. అప్పుడు రాక్షసమాయలు, గప్పిన ధ్రువుఁడసురవరుల కార్యంబెఱుఁగం**
**జొప్పడక వారిఁబొడగన, దెప్పర మగుటయును సారథింగని యంతన్. 340**

**ప్రతి :** అప్పుడు= ఆ సమయంలో; రాక్షసమాయలు+కప్పిన= రాక్షసుల దుశ్చేష్టలతోనిండిన; ధ్రువుఁడు= ధ్రువమహారాజు; అసురవరుల= రాక్షసశ్రేష్ఠుల; కార్యంబు+ఎఱుఁగన్= ఎదురుదాడిని తెలిసికొనటానికి; చొప్పు+పడక= సాధ్యపడక; వారిన్+పొడగనన్= వారిని చూచుట; దెప్పరము= కష్టము; అగుటయును= కాగా; సారథిన్+కని+అంతన్= అంతట సారథిని చూసి.

**తా :** ధ్రువుని అసమాన పరాక్రమం సహించలేక రాక్షసమాయలు ప్రసరింపజేశారు. ధ్రువునికి వారి మాయాజాలం అర్థంకాలేదు. వారి అడుగుజాడలు కనిపెట్టడం కష్టమైంది. ధ్రువుడు తన సారథిని చూసి ఇలా అన్నాడు.

**క. తలపోయఁగ భువి మాయా, వుల కృత్యం బెఱుఁగ నెవరు వోలుదు రనుచుం**
**బలుకుచుఁ దత్పురిఁ జొరఁగాఁ, దలఁపఁగ నదిగాన రాక తద్దయు మానెన్. 341**

**ప్రతి :** తలపోయcగన్= ఊహించగా; భువిన్= లోకంలో; మాయావుల కృత్యంబు= మాయావులైన రాక్షసుల పనిని; ఎఱుcగన్= తెలిసికొనుటకు; ఎవరు+పోలుదురు+అనుచున్= ఎవరు చాలుతారు అంటూ; పలుకుచున్= మాట్లాడుతూ; తద్+పురిన్= ఆ పట్టణాన్ని; చొరcగాన్= ప్రవేశించుటకు; తలcపcగన్= ఆలోచించగా; అది-కానరాక= అది కనిపించకపోగా; తద్దయున్= పూర్తిగా; మానెన్= మానుకున్నాడు.

**తా :** మాయదారి పనులుచేసేవారి విధానాలను ఎంత ఊహించినా, తెలుసుకోవడం ఎవరికి సాధ్యం అని పలుకుతూ ఆ పట్టణాన్ని ప్రవేశించడానికి చాలా ప్రయత్నించి తిరిగాడు. కాని, అది అదృశ్యం కావడంవల్ల ప్రవేశించే ప్రయత్నాన్ని ధ్రువుడు పూర్తిగా మానుకొన్నాడు.

**విశే :** యక్షుల మాయవలన యుద్ధరంగంలో పట్టణమే మాయమైంది.

**వ. అట్లు పురంబున కరుగుట మాని చిత్రరథుండైన యా ధ్రువుండు సప్రయత్నుం డయ్యును బర ప్రతియోగ శంకితుండై యుండె నయ్యెడ మహాజలధి ఘోషంబు ననుకరించు శబ్దంబు వినంబడె; నంత సకలదిక్తటంబుల వాయుజనితంబయిన రజఃపటలంబు దోcచె; దత్క్షణంబ యాకాశంబున విస్ఫురత్తటి త్ప్రభాకలితగర్జారవయుక్తమేఘంబు లమోఘంబులై భయంకరాకారంబులై తోcచెనంత. 342**

**ప్రతి :** అట్లు= ఆ విధంగా; పురంబునకున్= పట్టణానికి; అరుగుట మాని= వెళ్లడం మానుకొని; చిత్రరథుండు+ఐన ఆ ధ్రువుండు= చిత్రమైన రథం గలిగిన ఆ ధ్రువుడు; సప్రయత్నుండు+అయ్యును= ప్రయత్నించినవాడైనా; పరప్రతియోగ శంకితుండు+ఐ= శత్రువుల ఎదురుదాడిని సందేహిస్తూ; ఉండెన్= ఉండెను; ఆ+ఎడ= అప్పుడు అక్కడ; మహాజలధి ఘోషంబున్= మహాసముద్రముయొక్క నిరంతరమైన సవ్వడి; అనుకరించు= పోలిక కలిగిన; శబ్దంబు= రొద; వినంబడెన్= వినిపించెను; అంత, సకలదిక్+తటంబులన్= అన్నిదిక్కుల అంచుల్లో; వాయుజనితంబు= గాలివలన పుట్టిన; రజః పటలంబు= దుమ్ము సమూహం; తోcచెన్= కన్పించెను; తద్+క్షణంబు+అ= ఆ సమయంలోనే; ఆకాశంబున= ఆకాశంలో; విస్ఫురత్= ప్రకాశించే; తటిత్+ప్రభాకలిత= తళుక్కుమనే మెరుపు తీగలతోకూడిన; గర్జారవయుక్త= గర్జనల శబ్దములతోకూడిన; మేఘంబులు= మబ్బులు; అమోఘంబులై= వ్యర్థంకానివై; భయంకర+ఆకారంబులు+ఐ= భయపడే రూపాలు కలిగినవై; తోcచెన్= కనిపించెను; అంతన్= అప్పుడు.

**తా :** చిత్రమైన రథాన్ని ఎక్కి, నగరంలో ప్రవేశించడం మానుకొని తిరుగుతున్న ధ్రువుడు ఎదుటి శత్రువుల ప్రయోగ పద్ధతులను గూర్చి సందేహిస్తూ నిలబడి చూస్తున్నాడు. ఇంతలో మహాసముద్రంనుండి వెలువడే రొదవలె పెద్దపెద్ద శబ్దాలు వినిపించాయి. దిక్కుల నలుమూలలా గాలులు వీస్తూ ధూళి ఎగిసి తెరలుగా కప్పివేసింది. ఇంతలో ఆకాశంలో మేఘాలు కన్పించాయి. అందులో మెరుపులు తళుక్కుమని కనిపించాయి. మేఘాలు భయంకరంగా గర్జించాయి. ఆ మేఘాలు గాలిలో తేలిపోక వర్షం కురిపించాయి.

**మ. అనయంబున్ ధ్రువుమీcద దైత్యకృతమాయాజాల మట్లేcచి బో**
**రన మస్తిష్కపురీషమూత్ర పల దుర్గంధాస్థిమేదశ్శరా**
**సన నిస్త్రింశ శరాసి తోమర గదా చక్ర త్రిశూలాది సా**
**ధన భూభృద్భుజగావళిం గురిసె నుద్దండక్రియాలోలతన్. 343**

**ప్రతి :** ధ్రువుమీఁదన్= యుద్ధము చేసే ధ్రువునిపై; అనయంబున్= ఎడతెరిపి లేకుండా; దైత్యకృతమాయాజాలము= రాక్షసులచే కల్పించబడ్డ శాంబరీ మాయల సముదాయము; అట్లు+ఏఁచి= అలా బాధించి; బోరన= వేగంగా; మస్తిష్క= మెదడును; పురీష= మలమును; పల= మాంసమును; దుర్+గంధ= చెడ్డవాసన గల; అస్థి= ఎముకలను; మేదస్+శర+ఆసన= మెదడులోని మెత్తని తడిపదార్థం 'మేద' – దానితో తడిసిన ధనుస్సులు; నిస్త్రింశ= క్రూరమైన ఖడ్గములు; శర+అసి= బాణాలను, కత్తులను; తోమర= ఇనుప గుదియలను; గదా= గదలను; చక్ర= చక్రములను; త్రిశూల+ఆది= త్రిశూలము మొదలైన; సాధన= ఆయుధములను; భూభృత్= పర్వతాలను (పెద్దరాతి గుండ్లను); భుజగ+ఆవళిన్= పాముల సముదాయాన్ని; ఉద్దండ= భయంకరమైన; క్రియా+ఆలోలతన్= క్రియాటోపంతో; కురిసెన్= కురిపించింది.

**తా :** ఆ విధంగా రాక్షసులచే కల్పింపబడిన మాయలు అలా వేగంగా ధ్రువునిపై నానావిధాలైన దుర్గంధ భూయిష్ఠ పదార్థాలను – పుర్రెలు, ఎముకలు, మెదడు, మలమూత్రాలు – ఎడతెరపిలేకుండా కురిపించాయి. వరుసవరుసగా విండ్లు, అమ్ములు, కత్తులు, బల్లెములు, గదలు, చక్రాలు, త్రిశూలాలు – మొదలైన ఆయుధాలను వర్షించాయి. పర్వతాలముక్కలను, పాములను, ధ్రువునిపై వర్షించాయి.

**వ. మఱియు మత్తగజ సింహవ్యాఘ్ర సమూహంబులును నూర్మిభయంకరంబై సర్వతఃప్లవనం బయిన సముద్రంబును గానంబడియె; వెండియుం గల్పాంతంబునందుంబోలె భీషణంబైన మహాహ్రదంబునుం దోఁచె; న వ్విధంబున నానా విధంబులు ననేకంబులు నవిరళభయంకరంబులు నయిన యసురమాయలు గ్రూరప్రవర్తనులగు యక్షులచేత సృజ్యమానంబులై యదరు నా సమయంబున. 344**

**ప్రతి :** మఱియున్, మత్తగజ= మదపుటేనుగుల; సింహ= సింహముల; వ్యాఘ్ర= పెద్దపులుల; సమూహంబులును= సముదాయాలు; ఊర్మిభయంకరంబు+ఐ= అలలతో భయాన్ని కలిగించునదై; సర్వతస్= అన్నివైపుల; ప్లవనంబు+అయిన= ప్రవహించునట్టి; సముద్రంబును= సముద్రము; కానంబడియెన్= కన్పించెను; వెండియున్= మరియు; కల్ప+అంతంబు నందున్+పోలె= ప్రళయకాలము పూర్తి అయినప్పుడు వలె; భీషణంబు+అయిన= భయంకరమైన; మహాహ్రదంబునున్= గొప్పమడుగు; తోఁచెన్= కనిపించెను; ఆ+విధంబునన్= ఆ విధంగా; నానావిధంబులున్= అనేక ప్రకారాలు; అనేకంబులున్= అనేకాలు; అవిరళభయంకరంబులున్+అయిన= ఎడతెరపిలేక భయాన్ని గొలుపునట్టివి అయిన; అసురమాయలు= రాక్షసమాయలు; క్రూరప్రవర్తనులు+అగు= నొప్పించు నడవడిగలవారైన; యక్షులచేతన్= యక్షులచే; సృజ్యమానంబులు+ఐ= సృష్టించబడుతున్నవై; అదరు= అతిశయించిన; ఆ సమయంబునన్= ఆ సమయంలో.

**తా :** ఇంకా మదించిన ఏనుగులు, సింహాలు, పులులు గర్జిస్తూ మీదికి దుమికాయి. అంతలో నాలుగు ప్రక్కలనుండి సముద్రజలాలు పొంగిపొరలాయి. ప్రళయకాలంలోవలె మొత్తం భీకరమైన పెద్దమడుగు కన్పించింది. ఇలా అనేక విధాలైన భయంకరదృశ్యాలు ఎడతెరిపి లేకుండా వచ్చేలా రాక్షసమాయలు కల్పించి, యక్షులు ధ్రువునిపై ప్రయోగించారు. ఆ సమయంలో

**క. అనయంబును నయ్యక్షుల, ఘనమాయ నెఱింగి మునినికాయము వరుసన్**
**మనుమనుమని మను మను మని, మనమునఁదలఁచుచును దత్సమక్షంబునకున్ 345**

**ప్రతి :** అనయంబును= మరి మరి; ఆ+యక్షుల= ఆ యక్షులుచేసే; ఘనమాయన్+ఎఱింగి= గొప్పమాయను తెలుసుకొని; వరుసన్= వరుసగా; మునినికాయము= ఋషుల సమూహము; మనుమనుమని= స్వాయంభువమనువు యొక్క మనుమని;

మను+మనుము+అని= జీవింపుము; జీవింపుమని (చిరకాలం), మనమునన్= మనస్సులో; తలఁచుచును= ఆలోచిస్తూ; తద్+సమక్షంబునకున్= ఆయన ఎదుటకు...

**తా :** ఆ యక్షుల ఘనమైన మాయను తెలిసికొని మునిసముదాయము నిరంతరాయంగా, వరుసగా, మనువు మనుమడైన ధ్రువుని "మనుము మనుము" అని మనసులలో తలచుకుంటూ ఆ ధ్రువుని ఎదుటకు...

**వ. చనుదెంచి యా ధ్రువుం గని యిట్లనిరి. 346**

**ప్రతి :** చనుదెంచి= వచ్చి, ఆధ్రువున్= ఆ ధ్రువుని; కని= చూసి; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

**తా :** వచ్చి ఆ ధ్రువుని చూచి ఇలా అన్నారు.

**సీ. అనఘాత్మ! లోకు లెవ్వని దివ్య నామంబు సమత నాకర్ణించి సంస్మరించి**
**దుస్తరంబైన మృత్యువునైన సుఖవృత్తిఁదరియింతు; రట్టి యీశ్వరుఁడు పరుఁడు**
**భగవంతుఁడును శార్ఙ్గపాణియు భక్తజనార్తిహరుండును నైన విభుఁడు**
**భవదీయవిమతులఁ బరిమార్చుఁగాక కని పలికిన మునుల సంభాషణములు**

**తే. విని కృతాచమనుఁడు రమావిభుని పాద, కమలముఁదలంచి రిపుభయంకర మహోగ్ర**
**కలిత నారాయణాస్త్రంబుఁగార్ముకమునఁ, బూనఁదడవఁదదీయసంధానమునను. 347**

**ప్రతి :** అనఘ+ఆత్మ= ఓ పుణ్యాత్మా!; ఎవ్వని దివ్యనామంబు= ఎవరి పవిత్రమైన పేరును; లోకులు= జనులు; సమతన్= సమభావంతో; ఆకర్ణించి= విని; సంస్మరించి= జపించి; దుస్తరంబు+ఐన= కష్టమైనదైన; మృత్యువును+ఐన= మరణాన్నికూడా; సుఖవృత్తిన్= సులభంగా; తరియింతురు= దాటుదురో; అట్టి+ఈశ్వరుఁడు= అట్టి భగవంతుడు; పరుఁడు= సర్వోత్కృష్టుడు; భగవంతుఁడును= భగవానుడు; శార్ఙ్గపాణియు= శార్ఙ్గమనే విల్లు చేతియందు కలవాడు; భక్తజన+ఆర్తిహరుఁడు= భక్తుల సముదాయము యొక్క బాధలను పోగొట్టువాడు; ఐన విభుఁడు= అయిన ప్రభువు; భవదీయ విమతులన్= నీ శత్రువులను; పరిమార్చున్+కాక= చంపుగాక; అని పలికిన= అని మాట్లాడిన; మునుల సంభాషణములు= ఋషివచనములు, విని; కృత+ఆచమనుఁడు= ఆచమనం చేసినవాడై; రమావిభుని= విష్ణుని; పాదకమలమున్+తలంచి= పాదపద్మాలను మనస్సులో భావించి; రిపుభయంకర= శత్రువులకు భయము కల్గించు; మహా+ఉగ్రకలిత= అతిభయంకరమైన; నారాయణ+అస్త్రంబున్= నారాయణ నామక అస్త్రాన్ని; కార్ముకమునన్= వింటికి; పూనన్+తడవన్= ధరించుటకు తాకగా; తదీయ సంధానమునను= వింటియందు అమ్ముకూర్చుటతో...

**తా :** మునులంతా వచ్చి ధ్రువుని ఈ విధంగా ప్రబోధించారు. "ఓ పుణ్యాత్మా! శ్రీహరి దివ్య నామాన్ని విన్నా, స్మరించినా తరింపరాని మృత్యువునుకూడా జనం సుఖంగా దాటగలరు. భక్తుల బాధలను పోగొట్టే ఆశ్రీహరి, ఆ భగవానుడు, ఆ పరమాత్మ, ఆ జగన్నాయకుడు, శార్ఙ్గపాణి భక్తజనుల ఆర్తిని తొలగించువాడు, నీ శత్రువులను సంహరించుగాక!" – ఈ విధంగా మాట్లాడుతున్న ఋషుల వచనాలను విని ధ్రువుడు ఆచమనంచేసి శ్రీహరి పాదపద్మాలను స్మరించి శత్రుభయంకరమగు నారాయణాస్త్రాన్ని వింటినారికి సంధించాడు.

**తే. కడఁగి గుహ్యకమాయాంధకార మపుడు, వెరవు సెడి దవ్వుదవ్వుల విరిసిపోయె**
**విమలమైన వివేకోదయమునఁజేసి, సమయు రాగాదికంబుల సరణి నంత. 348**

**ప్రతి :** విమల= స్వచ్ఛమైన; వివేక+ఉదయమునన్+చేసి= వివేకం పుట్టడంవలన; సమయు= నశించే; రాగ+ఆదికంబుల, సరణిన్= రాగం మొదలైనవానివలె; కడఁగి= పూని; గుహ్యక, మాయా+అంధకారము= యక్షుల మాయ అనే చీకటి; వెరవు+చెడి= సమర్థత కోల్పోయి; అపుడు= ఆ సమయంలో; దవ్వుదవ్వులన్= దూరదూరంగా; విరిసిపోయెన్= చెదరిపోయింది.

**తా :** ధ్రువుడు నారాయణాస్త్రాన్ని సంధించగానే వివేకం పొడమినవెంటనే రాగాదులు సమసిపోయినట్లు యక్షమాయలు అనే కారు చీకట్లు సమర్థతను కోల్పోయి చెల్లాచెదరైనాయి.

**మ. వరనారాయణ దైవతాస్త్ర భవదుర్వారప్రభాహేమ పుం**
**ఖ రుచిస్ఫార మరాళరాజసితపక్ష క్రూరధారాపత**
**చ్ఛర సాహస్రము లోలి భీషణ విపక్షశ్రేణిపై వ్రాలె భీ**
**కరరావంబునఁ గానఁ జొచ్చు శిఖిసంఘాతంబు చందంబునన్. 349**

**ప్రతి :** వరనారాయణ= శ్రేష్ఠుడైన నారాయణుడు; దైవత+అస్త్రభవ= దేవతగాగల అస్త్రంనుండి; దుర్వార ప్రభా= వారింపరాని కాంతులుగల; హేమపుంఖ= బంగారు పిడులుగల; రుచిస్ఫార= కాంతులెగయుచున్న; మరాళరాజ= రాజహంసలయొక్క; సిత పక్ష= తెల్లని రెక్కలుగల; క్రూరధారాపతత్= నిర్దాక్షిణ్యమైన అంచులతో వచ్చి పడుతున్న; శరసాహస్రములు= వేనవేలబాణములు; ఓలిన్= వరుసగా; భీషణ= భయంకరమైన; విపక్షశ్రేణిపై= శత్రుసముదాయంపై; కానన్+చొచ్చు= అడవిలో ప్రవేశించే; శిఖిసంఘాతంబు= మంటలసముదాయమువలె; భీకరరావంబునన్= భయంకరమైన ఘోషతో; వ్రాలెన్= పడ్డాయి.

**తా :** శ్రేష్ఠమైన ఆ నారాయణాస్త్రం నుండి పుట్టిన వారించశక్యంకాని బంగారు పిడులు, కాంతులెగయుచున్న రాయంచ తెల్లని రెక్కలవంటి రెక్కలుగల వాడిబాణాలు వేలకొద్దీ పుట్టి అడవినిచుట్టిన అగ్నిజ్వాలలవలె భయంకరధ్వనితో శత్రుసేనలపై ఎడతెగకుండా వచ్చిపడ్డాయి.

**విశే :** అడవిలో రగుల్కొనే కార్చిచ్చు మంటలతో బాణాలు పోల్చబడ్డాయి.

**వ. అట్లేసిన. 350**

**ప్రతి :** అట్లు+ఏసినన్= ఆ విధంగా బాణాలు వేయగా...

**చ. ఖరనిశితప్రదీప్తఘనకాండపరంపర వృష్టిచేఁబొరిం**
**బొరి వికలాంగులై యదరి పుణ్యజనుల్ పృథుహేతిపాణులై**
**గరుడునిఁజూచి భూరిభుజగప్రకరంబు లెదిర్చి పేర్చి చె**
**చ్చెర నడతెంచుచందమునఁజిత్రరథున్ బలుపూని తాఁకినన్. 351**

**ప్రతి :** ఖర నిశిత ప్రదీప్త= కఠినమై, వాడియై, ప్రకాశవంతమైన; ఘనకాండపరంపర= పెద్దబాణాల వరుసల; వృష్టిచేన్= వర్షముచే; పొరిన్+పొరిన్= వరుసలు వరుసలుగా; వికల+అంగులై= అవిటివారై; అదరి= అతిశయించి; పుణ్యజనుల్= రాక్షసులు; పృథుహేతిపాణులు+ఐ= స్థూలములైన ఆయుధాలు చేతులందుగలవారై; గరుడునిన్+చూచి= గరుత్మంతుని జూచి; భూరిభుజగ ప్రకరంబులు= పెద్ద సర్పముల సమూహాలు; ఎదిర్చి= ఎదిరించి; పేర్చి= విజృంభించి; చెర+చెర=

త్వరత్వరగా; నడతెంచు చందమునన్= వచ్చేవిధంగా; చిత్రరథున్= ధ్రువుని; బలుపు+ఊని తాకినన్= గట్టి ప్రయత్నంతో ఎదిరించగా...

**తా :** ధ్రువుడు ప్రయోగించిన దృఢములైన, వాడి ఆయుధాల వర్షంతో యక్షులు వికలాంగులై మళ్లీ పట్టుదలతో పెద్ద ఆయుధాలను ధరించి, మళ్ళీ సైన్యాలను సమీకరించుకొని ధ్రువునితో యుద్ధం చేయడానికి పరుగులెత్తారు. ఆ దృశ్యాన్ని చూస్తే మహాసర్పాలు గుంపులై గరుత్మంతుణ్ణి ఎదిరించడానికి బయలుదేరినట్లున్నది. (హాస్యాస్పదమని భావన)

**ఉ. వారలఁజండతీవ్రశరవర్గముచేత నికృత్తపాద జం**
**ఘోరుశిరోధరాంబకకరోదరకర్ణులఁజేసి యోగి పం**
**కేరుహమిత్రమండలసకృద్భిద నెట్టి పదంబుఁజెందు నా**
**భూరిపదంబునం బెలుచఁ బొందఁగఁ బంపె భుజావిజృంభియై. 352**

**ప్రతి :** వారలన్= ఆ రాక్షసులను; భుజావిజృంభి+ఐ= బాహుబలంతో ఉద్యమించినవాడై; చండతీవ్ర శరవర్గముచేత= భయంకరమైన; వాడియైన బాణాల సమూహంచేత; నికృత్త= కత్తిరింపబడిన; పాద= పాదములు; జంఘా+ఊరు= పిక్కలు, తొడలు; శిరోధర+అంబక= మెడలు, కన్నులు; కర+ఉదర కర్ణులన్= చేతులు, పొట్టలు, చెవులు గలవారిని, చేసి; యోగి= యోగి; పంకేరుహమిత్ర మండల= సూర్యమండలాన్ని; సకృత్+భిదన్= ఒక్కమారు భేదించడంవల్ల; ఎట్టిపదంబుచెందున్= ఏ స్థానాన్ని పొందునో; ఆ భూరిపదంబునన్= ఆ విశిష్ట స్థానాన్ని; పెలుచన్+పొందఁగన్= సులభంగా పొందడానికి; పంపెన్= పంపాడు.

**తా :** ఆ విధంగా మళ్లీ తన మీదకు దండెత్తి వచ్చిన గుహ్యకుల నందరినీ, తన బాణ ప్రయోగంచే పాదాలు, పిక్కలు, తొడలు, మెడలు, కళ్లు, చేతులు, చెవులు, కడుపులు ఎక్కడికక్కడ ముక్కలుగా నరికి పారవైచి యోగి సూర్యమండలాన్ని ఒక్కసారిగా భేదించుకొని ఏ ఉత్తమస్థానం చేరుకొనేటట్లుంటాడో, అట్టి స్థానాన్ని చేరేటట్లువారిని పంపాడు.

**వ. ఇవ్విధంబున నా చిత్రరథుండగు ధ్రువునిచేత నిహన్యమానులును నిరపరాధులును నయిన గుహ్యకులం జూచి యతని పితామహుండైన స్వాయంభువుండు ఋషిగణపరివృతుండై చనుదెంచి ధ్రువునిం జూచి యిట్లనియె; వత్సా! నిరపరాధులైన యీ పుణ్యజనుల నెట్టి రోషంబున వధియించితి, వట్టి నిరయహేతువైన రోషంబు సాలు; భ్రాతృవత్సల! భ్రాతృవధాభితప్తుండవై కావించు నీ యత్నంబుడుగుము. 353**

**ప్రతి :** ఈ+విధంబునన్= ఈ విధంగా; ఆ చిత్రరథుండు+అగు= ఆ విచిత్ర రథంగల, ధ్రువునిచేత; నిహన్యమానులును= చంపబడుతున్నవారును; నిరపరాధులును+అయిన= తప్పుచేయని వారు అయిన; గుహ్యకులన్+చూచి= యక్షులను సేవించే జాతులైన గుహ్యకులను చూచి; అతని పితామహుండు+ఐన= ఆయన తాతగారైన, స్వాయంభువుడు; ఋషిగణపరివృతుండు+ఐ= ఋషి సముదాయంతో కూడి; చనుదెంచి= వచ్చి, ధ్రువునిన్= ధ్రువుణ్ణి చూచి; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు; వత్సా!= బిడ్డా; నిరపరాధులు+ఐన= తప్పు చేయనట్టి; ఈ పుణ్యజనులన్= ఈ రాక్షసులను; ఎట్టిరోషంబునన్= ఎలాంటి కోపంతో; వధియించితివి= చంపావో; అట్టి నిరయహేతువు+ఐన= ఆ విధంగా నరకకారణమైన; రోషంబు+చాలు= కోపం చాలును; భ్రాతృవత్సల!= సోదరునిపై ప్రేమగలవాడా!; భ్రాతృవధ+అభితప్తుండవు+ఐ= సోదరుని చంపడంవలన కలిగిన బాధపడినవాడవై; కావించు= చేయు; నీ యత్నంబు+ఉడుగుము= నీ ప్రయత్నం చాలించు.

**తా :** ఈ విధంగా చిత్రరథుడైన ధ్రువునిచే చంపబడ్డ నిరపరాధులైన గుహ్యకులను చూసి, ధ్రువుని తాత అయిన స్వాయంభవమనువు ఋషిగణాలు తన చుట్టూ ఉండగా వచ్చి ధ్రువునితో ఇలా అన్నాడు. "కుమారా! ఏ తప్పు చేయని ఈ గుహ్యకులను ఎలాంటి రోషంతో వధించావు! అట్టి నరకమునిచ్చెడి కోపం చాలు. సోదరునిపై ప్రేమగలవాడా! ధ్రువా! నీ సోదరుని చంపడంవల్ల కలిగిన బాధతో కాలిపోవుచూ నువ్వు చేసెడి ప్రయత్నం మాను.

**విశే :** గుహ్యకులు : కుబేరుని సేవకులు, అనుచరులను గుహ్యకులని పిలుస్తారు.

**క. అనఘా! మనుకులమున కిది, యనుచిత కర్మంబ; యొకనికై పెక్కం డ్రి**
**ట్టని మొనఁ ద్రుంగిరి; యిది నీ, కనయంబును వలవ; దుడుగు మయ్య కుమారా! 354**

**ప్రతి :** అనఘా!= ఓ పుణ్యాత్ముడా!; మనుకులమునకున్= మనువంశానికి; ఇది, అనుచిత కర్మంబు+అ= తగనిపని; కుమారా!= ఓధ్రువా!, ఒకనికిన్+ ఐ= ఒక్కనికోసం; పెక్కండ్రు= అనేకులు; ఇట్టు= ఇలా; అనిమొనన్= యుద్ధభూమిలో; త్రుంగిరి= చనిపోయారు, ఇది, నీకు; అనయంబును= ఎల్లప్పుడు; వలవదు= కూడదు; ఉడుగుము+అయ్య= చాలించవయ్యా!.

**తా :** పుణ్యాత్మా! మనుకులంలోని వారికిది తగని పని. ఒకరికోసం ఇట్లు అనేకులు మరణించారు. ఇట్టి పనిని నీవు ఎప్పుడూ చేయవలదు. కుమారా మానుకోవయ్యా!

**విశే :** మానవులు మనువంశంలోనివారు. వారెలా నడచుకోవాలో వారవలంబించాల్సిన ధర్మస్వరూప మెలాంటిదో ఇక్కడ చెప్పబడింది.

**వ. అదియునుం గాక దేహాభిమానంబునం బశుప్రాయులై భూతహింస గావించుట హృషీకేశానువర్తనులైన సాధులకుం దగదు; నీవు సర్వభూతంబుల నాత్మభావంబునఁ దలంచి సర్వభూతావాసుండును దురారాధ్యుండును నైన విష్ణుని పదంబులఁ బూజించి తత్పరమపదంబును బొందితి; వట్టి భగవంతుని హృదయంబున ననుధ్యాతుండవు; భాగవతుల చిత్తంబులకును సమ్మతుండవు, మఱియు సాధువర్తనుండ వన నొప్పు నీ వీ పాపకర్మం బెట్లు సేయ సమకట్టితి? వే పురుషుం డైన నేమి మహాత్ములయందుఁ దితిక్షయు, సములయందు మైత్రియు, హీనులయందుఁ గృపయు నితరంబులగు సమస్త జంతువులయందు సమత్వంబును గలిగి వర్తించు వానియందు సర్వాత్మకుండైన భగవంతుండు ప్రసన్నుం డగు; నతండు ప్రసన్నుం డయిన వాఁడు ప్రకృతి గుణంబులఁ బాసి లింగ శరీర భంగంబు గావించి బ్రహ్మానందంబునుం బొందు; నదియునుంగాక కార్యకారణ సంఘాతరూపంబైన విశ్వం బీశ్వరునందు నయస్కాంత సన్నిధానంబు గలిగిన లోహంబు చందంబున వర్తించు; నందు సర్వేశ్వరుండు నిమిత్తమాత్రంబుగాఁ బరిభ్రమించు; నట్టి యీశ్వరుని మాయాగుణ వ్యతికరంబున నారబ్ధంబులైన పంచభూతంబులచేత యోషిత్పురుషవ్యవాయంబు వలన యోషిత్పురుషాదిరూప సంభూతి యగు నవ్విధంబునఁ దత్సర్గంబు దత్సంస్థానంబుఁ, దల్లయంబు నగుచు నుండు; నిట్లు దుర్విభావ్యం బైన కాలశక్తింజేసి గుణక్షోభంబున విభజ్యమానవీర్యుండు ననంతుండు ననాదియు నైన జనంబులచేత జనంబులం బుట్టించుచుండుటం జేసి యాదికరుండును, మృత్యుహేతువున జనంబుల లయంబు నొందించుటం జేసి యంతకరుండును, ననాది యగుటం జేసి యవ్యయుండును**

**నైన భగవంతుండు జగత్కారణుండగుం; గావున నీ సృష్టిపాలన విలయంబులకుం గర్త గానివాని వడువున దానిఁ జేయుచుండు, నిట్లు మృత్యురూపుండును బరుండును సమవర్తియు నైన యీశ్వరునికి స్వపక్ష పరపక్షంబులు లేవు; కర్మాధీనంబులైన భూతసంఘంబులు రజంబు మహావాయువు ననుసరించు చాడ్పున నస్వతంత్రంబు లగుచు నతని ననువర్తించు; నీశ్వరుండును జంతుచయాయు రుపచయాపచయ కరణంబులం దస్పష్టుండును నగు జీవుండు గర్మబద్ధుం డగుటం జేసి కర్మంబు వానికి నాయు రుపచయాపచయంబులం జేయుచుండు;మఱియు సర్వజగత్కర్మసాక్షియగు సర్వేశ్వరుని. 355**

**ప్రతి :** అదియునున్+కాక; దేహాభిమానంబునన్= శరీరంపై మమకారంతో; పశుప్రాయులు+ఐ= జంతువులతో సమానులై; భూతహింస+కావించుట= జీవులను హింసించుట; హృషీకేశ+అనువర్తనులు+ఐన= విష్ణుమూర్తిని అనుసరించేవారైన; సాధులకున్= సజ్జనులకు, తగదు; నీవు సర్వభూతంబులను= సమస్తజీవులను; ఆత్మభావంబునన్+తలఁచి= తాననే ఉద్దేశంతోచూచి; సర్వభూత+ఆవాసుండును= అన్నిజీవులలో నివసించేవాడు; దుస్+ఆరాధ్యుండును= ఆరాధించడానికి కష్టసాధ్యమైనవాడు; ఐన విష్ణుని, పదంబులన్+పూజించి= పాదాలను కొలిచి; తద్+పరమపదంబును= ఆ విష్ణుని ఉత్తమస్థితిని; పొందితి= పొందావు; అట్టిభగవంతుని= ఆ భగవానుని; హృదయంబునన్= మనస్సులో, అనుధ్యాతుండవు= అనుకూలంగా ధ్యానింపబడినవాడవు; భాగవతుల చిత్తంబులకును= భక్తుల మనస్సులకు; సమ్మతుండవు= ఇష్టమైనవాడవు; మఱియు, సాధువర్తనుండవు+అననొప్పు= మంచి ప్రవర్తనగలవాడవైయున్న; నీవు, ఈ పాపకర్మంబు= ఈ పాపపుపని; ఎట్లు+చేయసమకట్టితివి= ఏ విధంగా చేయాలని పూనుకొన్నావు?; ఏ పురుషుండు+ఐననేమి= ఏ మానవుడైతే; మహాత్ములయందు; తితిక్షయు= సహనం; సములయందు= సమానులైన వారిపట్ల;, మైత్రియు= స్నేహం; హీనులయందు= నీచులపట్ల; కృపయు= దయ; ఇతరంబులగు= మిగిలిన; సమస్త జంతువులయందును= అన్ని ప్రాణులపట్ల; సమత్వంబును= సమానత్వాన్ని; కలిగి వర్తించున్= కలిగి ప్రవర్తిస్తాడో; వానియందు= అట్టి వానియందు; సర్వాత్మకుడు+ఐన= సమస్తవ్యాపకుడైన; భగవంతుండు= భగవంతుడు; ప్రసన్నుండు+అగు= ప్రసన్నుడవుతాడు; అతండు, ప్రసన్నుడైన వాడు= భగవంతుడు అనుగ్రహించువాడైన; ప్రకృతిగుణంబులన్= త్రిగుణాల సమ్మేళనం వల్ల పుట్టిన వ్యక్తిగత ప్రత్యేక స్వభావగుణాలను; పాసి= వదలిపెట్టి; లింగ శరీర భంగంబు+కావించి= తన ప్రత్యేక స్వభావసంస్కారంతో నిర్మితమైన దేహాన్ని బద్దలు కొట్టుకొని; బ్రహ్మ+ఆనందంబునున్+ పొందు= అమితానందం పొందుతాడు; అదియునున్+కాక= అంతేకాక; కార్యకారణ సంఘాత రూపంబు+ఐన= కార్యం, కారణం అనబడే భాగాల కూర్పుతో కూడిన మొత్తం రూపమైన; విశ్వంబు= ప్రపంచం; ఈశ్వరుని+అందున్= భగవంతునియందు; అయస్కాంత సన్నిధానంబు+కలిగిన= సూదంటురాయి ప్రభావంతోకూడిన సామీప్యం కలిగిన; లోహంబు చందంబునన్= ఇనుమువలె; వర్తించు= ప్రవర్తిస్తుంది; అందు, సర్వేశ్వరుండు= భగవంతుడు; నిమిత్తమాత్రంబుగా= కేవలం కారణభూతుడై; పరిభ్రమించున్= తిరుగుతాడు, అట్టి ఈశ్వరుని; మాయాగుణవ్యతికరంబునన్= మాయాగుణాల కలయికల వల్ల; ఆరబ్ధంబులు+ఐన= ఆరంభింపబడిన; పంచభూతంబులచేత= పృథివ్యప్తేజోవాయ్వాకాశాల చేత; యోషిత్+పురుషవ్యవాయంబువలన= స్త్రీ పురుషుల కలయికవల్ల; యోషిత్+పురుష+ ఆదిరూపసంభూతి+అగు= స్త్రీలు, పురుషులు మున్నగు రూపాల పుట్టుక జరుగుతుంది; ఆ+విధంబునన్= ఆ విధంగా; తద్+సర్గంబు= ఆ సృష్టిక్రమము; తద్+ సంస్థానంబు= దానిస్థితి; తద్+లయంబు= దాని వినాశం; అగుచుండున్= జరుగుతుంటాయి; ఇట్లు దుర్+విభావ్యంబు+ఐన= ఈ విధంగా భావించడానికి కష్టమైన; కాలశక్తిన్+చేసి= కాలంయొక్క ప్రభావం వల్ల;

గుణక్షోభంబునన్= గుణాల తొక్కిడిచే; విభజ్యమాన వీర్యుండు= విభజింపబడు శక్తిగలవాడు; అనంతుండు= అంతంలేనివాడు; అనాదియున్+ఐనన్= మొదలులేనివాడైనా; జనంబులచేత= మనుష్యులచే; జనంబులన్= మనుష్యులను; పుట్టించుచుండుటన్+చేసి= సృష్టించడంవలన; ఆదికరుండును= మొదలు అనే దానిని కలిగించేవాడు; మృత్యుహేతువున= చంపడమనే కారణంచే; జనంబుల= మనుజులను; లయంబున్+ఒందించుటన్+చేసి= నశింపజేయడంవల్ల; అంతకరుండును= నాశనంచేసేవాడును; న+ఆది అగుటన్+చేసి= మొదలులేని దగుటచేత; అవ్యయుండును= వినాశముగాని మార్పుగాని లేనివాడు; ఐన భగవంతుండు= అయిన పరమాత్మ; జగత్+కారణుండు+అగున్= సృష్టికి మూలభూతమవుతాడు, కావునన్; ఈ సృష్టి పాలన విలయంబులకున్= ఈ పుట్టుక, పోషణ, నాశనములకు; కర్త+కానివానివడువున= కర్త కానివాని వలె; దానిన్+చేయుచుండున్= వాటిని చేస్తుంటాడు; ఇట్లు, మృత్యురూపుండును= నాశనకారియు; పరుండును= అతీతమైనవాడును; సమవర్తియున్+ఐన= సమానంగా భావించేవాడైన; ఈశ్వరునికి= భగవంతునికి; స్వపక్ష= స్వంతవర్గం; పరపక్షంబులు= ఇతరవర్గాలు, లేవు; కర్మ+అధీనంబులు+ఐన= పనులకు లోబడిన; భూతసంఘంబులు= జంతుజాలం; రజంబు= ధూళిరేణువులు; మహావాయువును= పెనుగాలిని; అనుసరించు చాడ్పున= అనుసరించేవిధంగా; అస్వతంత్రంబులు+అగుచు= స్వేచ్ఛలేనివియై; అతనిన్+అనువర్తించున్= అతని ననుసరించి తిరుగుతాయి; ఈశ్వరుండును= భగవంతుడు; జంతుచయ+ఆయుస్+ఉపచయ+అపచయ కరణంబులందున్= జీవసముదాయం యొక్క ఆయుర్దాయాలను సమకూర్చడం, రూపుమాపడం అనే పనుల్లో; అస్పష్టుండును+అగు= గుర్తించడానికి వీలులేనివాడవుతాడు; జీవుండు= మనుజుడు; కర్మబద్ధుండు+అగుటన్+చేసి= కర్మలకు లోబడినవాడు కావడంచే; కర్మంబు= పనులు; వానికిన్, ఆయుస్+ఉపచయ+ అపచయంబులన్= ఆయుర్దాయాలను సమకూర్చడాన్ని, తగ్గించడాన్ని; చేయుచుండున్, మఱియు; సర్వజగత్+కర్మసాక్షి+ అగు= సమస్త సృష్టి గమనాల తీరు తెలిసి చూచేవాడైన; సర్వ+ఈశ్వరుని= అఖిలానికి అధిపతియైన భగవంతుని...

**తా :** అంతేకాక దేహం మీది అభిమానంతో పశువులవలె ప్రాణిహింస చేయడం శ్రీహరిభక్తులైన సజ్జనులకు తగదు. నీవు సర్వప్రాణులను నీవలెనే భావించి సర్వప్రాణులలో నివసించువాడైన దురాధ్యుడైన శ్రీహరిని సేవించి, ఆయన స్థానాన్ని పొందావు. ఆయన మనస్సున నీవు అనుగ్రహింపబడినవాడవు. భక్తుల మనసులకు నచ్చినవాడవు. ఇంకనూ సాధుప్రవర్తన కలవాడవను పేరుతో ఒప్పెడి నీవీ పాపకర్మమును చేయుటకు ఎట్లు పూనితివి. ఎవడైననూ తనకంటె గొప్పవారియందు సహనభావం, (అనగా వారిపై అసూయలేకుండుట) తనతో సమానులయందు స్నేహభావం, తనకంటె తక్కువవారియందు దయ, మిగిలిన సమస్త ప్రాణులయందు సమభావం కలిగి వర్తించేవానిని సర్వాంతర్యామి అయిన ఆ పరమాత్మ అనుగ్రహ భావం కలిగి వాడు ప్రకృతి సహజగుణాలనుండి విముక్తుడై లింగశరీరాన్ని విడిచి బ్రహ్మానందాన్ని పొందుతారు.

అంతేకాక అయస్కాంతం దగ్గర ఇనుము భ్రమించినట్లు భగవత్సాన్నిధ్యంలో కార్యకారణ స్వరూపమైన ప్రపంచం భ్రమిస్తుంటుంది. సర్వేశ్వరుడు కేవలం నిమిత్తమాత్రంగా తిరుగుతుంటాడు. అట్టి భగవంతుని మాయాగుణ సంబంధంవల్ల ఆరంభించబడిన పంచభూతాలవల్ల (దేహాది ఆకారాలను పొందిన) స్త్రీపురుషుల కలయికచే స్త్రీపురుష సంతతి ఉత్పత్తి అవుతుంది. ఈ విధంగా సృష్టిస్థితిలయాలు జరుగుతుంది. ఊహించడానికి అలవిగానంతగా కాలశక్తి ద్వారా గుణాల క్షోభంచేత విభజింపబడు శక్తిగలవాడు తుది మొదళ్ళు లేనివాడు జనాలనుండి జనాలను పుట్టించడంవల్ల ఆద్యుడు, నశింపజేయడంవల్ల అంతకుడు, అనాది కావడంవల్ల అవ్యయుడు అయి పరమాత్మ జగత్కారకు డవుతున్నాడు. అందుచే సృష్టిస్థితిలయాలను ఏమీ చేయనట్లే నటిస్తూంటాడు.

ఇలా మృత్యుస్వరూపుడు, పరుడు, సమవర్తి అయిన భగవంతుడికి తనవారు, పరులు అనే భేదం లేదు. కర్మలకు లోబడిన జీవులు స్వతంత్రతలేనివారై ధూళికణాలు గాలి ననుసరించి వెళ్లినట్లుగా భగవంతుని అనుసరిస్తారు. ఆయుర్దాయాలు సమకూర్చడం, నాశనంజేయడం ఎవరునూ గుర్తించలేని విధంగా భగవానుడు ప్రాణుల ఆయుస్సులకు హానివృద్ధులు సమకూరుస్తాడు. జీవుడు కర్మబద్ధుడు అగుటచేత కర్మయే జీవునికి ఆయుర్వృద్ధియు నాశనము కలిగిస్తుంటుంది. ఇంకనూ లోకంలో కర్మలకన్నింటికినీ సాక్షి అయిన సర్వేశ్వరుని...

**క. కొందఱు స్వభావ మందురు, కొందఱు కర్మం బటంద్రు, కొందఱు కాలం**
**బందురు, కొందఱు దైవం, బందురు కొంద ఱొగిఁ గామ మంద్రు మహాత్మా! 356**

**ప్రతి :** మహాత్మా!= మహానుభావా!; కొందఱు స్వభావము+అందురు= సహజస్వభావమంటారు, కొందఱు, కర్మంబు+అటు+అంద్రు= కర్మమని అంటారు, కొందఱు, కాలంబు+అందురు= కాలమని అంటారు, కొందఱు, దైవంబు+అందురు= దేవుడంటారు, కొందఱు, ఒగిన్= క్రమంగా, కామము+అంద్రు= కోరిక అని అంటారు.

**తా :** మహానుభావా! (కర్మసాక్షియైన సర్వేశ్వరుని) కొందరు 'స్వభావం' అంటారు. కొందరు 'కర్మ' అంటారు. కొందరు 'కాలం' అంటారు. కొందరు 'దైవం' అంటారు. మరికొందరు 'కామం' అంటారు.

**వ. ఇట్టు లవ్యక్తరూపుండును, నప్రమేయుండును, నానాశక్త్యుదయ హేతుభూతుండును నైన భగవంతుండు సేయు కార్యంబుల బ్రహ్మరుద్రాదు లెఱుంగరన నతని తత్త్వంబు నెవ్వరెఱుంగ నోపుదురు? కావునం బుత్రా! యిట్లుత్పత్తి నాశంబులకు దైవంబ కారణంబై యుండుఁ గాన నిద్ధనదానుచరులు భవదీయ భ్రాతృహంత లగుదురే? భూతాత్మకుండు భూతేశుండు భూతభావనుండు సర్వేశ్వరుండు పరాపరుండు నగు నీశుండ మాయాయుక్తుండై స్వశక్తిచే సృష్టి స్థితి లయంబులం జేయు. ఐన ననహంకారంబునంజేసి గుణకర్మంబులచే నస్పృశ్యుం డగుచు వర్తించు. అదియునుం గాక యీ ప్రజాపతులు విశ్వసృణ్ణామంబుల నియంత్రితులై ముకుఁద్రాళ్ళు వెట్టిన పశువులం బోలి యెవ్వని యాజ్ఞాధీనకృత్యులై వర్తింతు రట్టి దుష్టజన మృత్యువు, సుజనామృత స్వరూపుండు, సర్వాత్మకుండు, జగత్పరాయణుండు నైన యీశ్వరుని సర్వ ప్రకారంబుల శరణంబుఁ బొందుము. అదియునుం గాక. 357**

**ప్రతి :** ఇట్టులు= ఈ విధంగా; అవ్యక్తరూపుండును= వ్యక్తంకాని రూపంకలవాడును; అప్రమేయుండును= కొలతలకు లొంగనివాడును; నానాశక్తి+ఉదయహేతుభూతుండును+ఐన= వివిధశక్తుల పుట్టుకకు కారణభూతుడను; ఐన, భగవంతుడు చేయు కార్యంబులన్= భగవంతుడు చేసే పనులను; రుద్ర+ఆదులు= బ్రహ్మ, శివుడు మొదలైనవారు; ఎఱుంగరు+అనన్= తెలుసుకోలేరంటే; అతని తత్త్వంబును= అతని నిజస్వరూపాన్ని; ఎవ్వరు, ఎఱుంగన్+ఓపుదురు= తెలుసుకోగలరు?; కావునన్= కాబట్టి; పుత్రా!= కుమారా!; ఇట్లు+ఉత్పత్తినాశంబులకు= ఈ విధంగా పుట్టడానికి; చనిపోవడానికి, దైవంబు+అ= భగవంతుడే; కారణంబు+ఐ+ఉండున్= కారణమై ఉంటాడు; కానన్= కావున; ఈ+ధనద+అనుచరులు= ఈ కుబేరుని వెంట తిరిగేవారు; భవదీయ= నీ; భ్రాతృహంతలు= సోదరునిచంపినవారు; అగుదురు+ఏ= అవుతారా?; భూత+ఆత్మకుండు= జీవులలో తానైనవాడు; భూత+ఈశుండు= భూతాలకధిపతి; భూతభావనుండు= జీవులను కల్పన చేసేవాడు; సర్వ+ఈశ్వరుండు= భగవంతుడు; పరాపరుండును= అతీతుడును; అగు ఈశుండు+అ= అయిన దేవుడే;

మాయాయుక్తుండు+ఐ= మాయతోకూడినవాడై; స్వశక్తిచే= తనబలంతో; సృష్టి స్థితి లయంబులన్= పుట్టుక, పాలన, నాశాలను; చేయున్= చేస్తాడు; ఐనన్= ఐనా; న+అహంకారంబునన్+చేసి= అహంకారం లేకపోవడంచేత; గుణకర్మంబులచేన్= తనస్వభావానికి అనుగుణమైన పనులచే; అస్పృశ్యుండు+అగుచున్= సంబంధంలేనివాడవుతూ; వర్తించున్=ప్రవర్తిస్తాడు; అదియునున్+కాక= అదీకాక; ఈ ప్రజాపతులు; విశ్వసృట్+నామంబులన్= విశ్వాన్ని సృష్టించువారి పేర్లతో; నియంత్రితులు+ఐ= నియమించబడినవారై; ముకుఁద్రాళ్లు= ముక్కుకుతాళ్లు; పెట్టిన పశువులన్+పోలెన్= పెట్టిన జంతువుల్లాగా; ఎవ్వని, ఆజ్ఞా+అధీనకృత్యులు+ఐ= ఆజ్ఞకు అధీనమైన కర్మలుగలవారై; వర్తింతురు= తిరుగుతారో; అట్టి దుష్టజన మృత్యువు= ఆ విధమైన దుష్టులైనవారికి మృత్యుదేవతయు; సుజన+అమృతస్వరూపుండు= మంచివాళ్లకు అమృతమయుడు; సర్వ+ఆత్మకుండు= అంతటా వ్యాపించినవాడు; జగత్+పరాయణుండు+ఐన= లోకాలకు ఉత్తమగతి అయిన; ఈశ్వరుని= భగవంతుని, సర్వప్రకారంబులన్= అన్ని విధాలుగా; శరణంబున్+పొందుము= శరణుకోరు; అదియునున్+కాక= అదీకాక.

**తా :** అవ్యక్తస్వరూపుడూ, అప్రమేయుడు అనేకశక్తుల పుట్టుకకు హేతుభూతుడు అయిన భగవానుడు చేసే పనులను బ్రహ్మరుద్రాదులుసైతం తెలుసుకోలేరు. ఇక ఆ భగవంతుని తత్త్వాన్ని ఎవరు తెలుసుకోగలరు? కాబట్టి, కుమారా! పుట్టుకకు, చావుకు దైవమే కారణం. అందుచేత ఈ కుబేరుని భటులు నీ తమ్ముని చంపినవారా? భూతాత్మకుడు, భూతేశుడు, భూతభావనుడు, సర్వేశ్వరుడు, పరాత్పరుడు అయిన భగవానుడు తన మాయచే తన స్వశక్తిచే సృష్టి స్థితి లయాలను చేస్తూవుంటాడు. అయినా అహంకార రాహిత్యంవల్ల గుణకర్మలకు అంటరానివాడై ఉంటాడు. ముక్కు తాళ్లతో కట్టివేసిన పశువుల్లాగా, ఈ ప్రజాపతులు విశ్వాన్ని సృష్టించేవారు అనే పేర్లతో నియమింపబడి భగవంతుని ఆజ్ఞకు అధీనులై వర్తిస్తారు. దుష్టులకు మృత్యుస్వరూపుడూ, శిష్టులకు అమృతస్వరూపుడూ, సర్వాత్మకుడూ, జగత్పరాయణుడు అయిన భగవంతుణ్ణి అన్ని విధాలా శరణు పొందు, అంతేకాక

**సీ.** **అనఘాత్మ! నీవు పంచాబ్ద వయస్కుండ వై పినతల్లి నిన్నాడినట్టి**
**మాటల నిర్భిన్నమర్ముండ వగుచును జనయిత్రి దిగనాడి వనము కేఁగి**
**తపమాచరించి యచ్ఛపు భక్తి నీశ్వరుఁ బూజించి మహితవిభూతి మెఱసి**
**రమణఁద్రిలోకోత్తరంబైన పదమును బొందితి, వది గాన భూరిభేద**

**తే.** **రూప మైన ప్రపంచంబు రూఢి నే మ, హాత్మునందుఁబ్రతీతమై యలరు నట్టి**
**యగుణుఁడద్వితీయుండును నక్షరుండు, నైన యీశ్వరుఁబరమాత్ము ననుదినంబు. 358**

**ప్రతి :** అనఘ+ఆత్మ= పుణ్యాత్ముడా!; నీవు, పంచ+అబ్దవయస్కుండవు+ఐ= ఐదేండ్ల వయసులో నున్నపుడు, పినతల్లి; నిన్ను+ఆడినట్టిమాటలన్= నిన్ను అపహసించిన మాటలచేత; నిర్భిన్నమర్ముండవు+అగుచును= మనసు నొచ్చుకున్నవాడవై (ప్రాణాల సంధిబంధాలు తెగినవాడవై); జనయిత్రిన్= తల్లిని; దిగనాడి= వదలిపెట్టి; వనముకున్+ఏగి= అడవులకు వెళ్లి; తపము+ఆచరించి= తపస్సుచేసి; అచ్చము+భక్తిన్= స్వచ్ఛమైన భక్తితో; ఈశ్వరున్+పూజించి= భగవంతుని ధ్యానించి; మహిత విభూతి మెఱసి= మహావైభవంతో ప్రకాశించి; రమణన్= అందంగా; త్రిలోక+ఉత్తరంబు+ఐన పదమును= ముల్లోకాలకంటె మించిన స్థానాన్ని; పొందితివి= సాధించావు, అది+కాన= అందువలన; భూరిభేదరూపము+ఐన= నానావిధ రూపభేదాలతో కూడిన; ప్రపంచంబు= లోకము; రూఢిన్= స్పష్టంగా; ఏ మహాత్మునందు= ఏ మహానుభావునిలో;

ప్రతీతమై అలరున్= పొడగట్టునదై ప్రకాశించునో; అట్టి అగుణుఁడు= ఆ విధంగా గుణాలు లేనివాడు; అద్వితీయుండును= సాటిలేనివాడు; అక్షరుండు+ఐన= నాశంలేనివాడైన; ఈశ్వరున్= భగవంతుని; పరమాత్మున్= పరమేశ్వరుని; అనుదినము= నిత్యం...

**తా :** పుణ్యాత్మా! నీవు ఐదేండ్ల వయస్సులోనే పినతల్లి పలికిన మాటలకు మనస్సు విరిగి, తల్లిని వదలి అడవులకు వెళ్లి తపస్సుజేశావు. స్వచ్ఛమైన భక్తితో ఈశ్వరుణ్ణి పూజించావు. మహావైభవంతో ముల్లోకాల కతీతమైన పదవిని సాధించావు. అనేక రూపాల మార్పుతో ఈ ప్రపంచం ఎవనియందు కనిపిస్తున్నదో, అతణ్ణి గూర్చి ప్రతిదినం (ధ్యానంచేయాలి).

**సీ.** **కైకొని శుద్ధంబు గతమత్సరంబును నమలంబు నగు హృదయంబునందు**
**సొలయ కన్వేషించుచును బ్రత్యగాత్ముండు భగవంతుఁడును బరబ్రహ్మమయుఁడు**
**నానందమాత్రుండు నవ్యయుఁ డుపపన్న సకల శక్తియుతుండు సగుణుఁడజుఁడు**
**నయిన సర్వేశ్వరునం దుత్తమంబైన సద్భక్తిఁ జేయుచు సమత నొప్పి**

**తే.** **రూఢి సోఽహమ్మమేతి ప్రరూఢ మగుచు, ఘనత కెక్కు నవిద్యయన్ గ్రంథి నీవు**
**ద్రెంచి వైచితి; కావున ధీవరేణ్య! సర్వశుభహాని యైన రోషంబు వలదు.** **359**

**ప్రతి :** కైకొని= స్వీకరించి; శుద్ధంబు= స్వచ్ఛము; గతమత్సరంబును= అసూయను తీసివేసినది; అమలంబును+అగు= మలినములేనిదీ అయిన; హృదయంబునందున్= మనస్సులో; సొలయక= బడలిక చెందక; అన్వేషించుచును= వెదకుచు; ప్రత్యక్+ఆత్ముండు= ఎదుట నేరుగా కన్పించే తాను; భగవంతుఁడును= భగవానుడు; పరబ్రహ్మమయుఁడు= పరబ్రహ్మ స్వరూపుడు; ఆనందమాత్రుండు= ఆనందమే రూపముగాగలవాడు; అవ్యయుఁడు= ఆద్యంతాలు తెలియ వీలులేనివాడు ఎల్లప్పుడూ ఒకేవిధంగా ఉండేవాడు; ఉపపన్న= అర్హమైన; సకల శక్తియుతుండు= సమస్తబలసంపన్నుడు; సగుణుఁడు= గుణాత్మకుడు; అజుఁడు= జన్మలేనివాడు; అయిన= అయినటువంటి; సర్వ+ఈశ్వరునందు= పరమాత్మయందు; ఉత్తమంబు+ఐన= గొప్పదైన; సద్భక్తిన్+చేయుచు= మంచి భక్తితో; సమతన్+ఒప్పి= సమదృష్టితో ఒప్పి; రూఢిన్= స్పష్టంగా; స+అహం+మమ+ఇతి= వాడు, నేను, నాది అను భావములు; ప్రరూఢము+అగుచున్= నాటుకొని; ఘనతకున్+ఎక్కున్= గొప్పదనాన్ని, సంతరించుకొన్న; అవిద్యయన్గ్రంథిన్= అజ్ఞానరూపంగా ఉండే చిక్కుముడిని, నీవు; త్రెంచి వైచితి= తెంచుకోగలిగావు, కావున; ధీవరేణ్య= గొప్పవాడా; సర్వశుభహాని+ఐన= అన్ని మంచికార్యాలకు చెడుకలిగించే; రోషంబు= కోపము; వలదు= వద్దు.

**తా :** భగవంతుడు ప్రత్యగాత్మ స్వరూపుడు, పరబ్రహ్మ స్వరూపుడు, ఆనందమయుడు, శాశ్వతుడు, సకలశక్తి సంపన్నుడు, గుణసహితుడు, పుట్టుకలేనివాడు అయిన పరమేశ్వరునియందు శ్రేష్ఠమైన భక్తి కలిగి ఉండాలి. సమభావంతో ఉంటూ అహంకార మమకార సహితమై వృద్ధిపొందిన అవిద్య అనే గ్రంథిని నీవు తెంచివేశావు. కాబట్టి బుద్ధిమంతుడా! మంగళాలను హరించే రోగం వద్దు!!.

**క.** **విను రోషహృదయుచేతను, ననయము లోకము నశించు; నౌషధములచే**
**ఘనరోగములు నశించిన యను, వున నది గాన రోష మడఁపు మహాత్మా!** **360**

**ప్రతి :** మహాత్మా!= మహానుభావా!; విను, ఔషధములచేన్= మందులచే; ఘనరోగములు= పెద్దవ్యాధులు; నశించిన+ అనువునన్= నాశనమైనవిధంగా; రోషహృదయుచేతను= కోపస్వభావంగల వానిచే, అనయము= తప్పక, లోకము నశించున్= ప్రపంచము నాశనమవుతుంది; అదిగాన= అందువలన; రోషము+అడఁపుము= కోపాన్ని అణచుకో!

**తా :** మందులచే పెద్ద రోగాలు ఏ విధంగా నశిస్తాయో, అట్లే రోషహృదయునివల్ల లోకాలు తప్పక నశిస్తాయి. కాబట్టి మహాత్మా! రోషాన్ని అణచుకో!

**తే. అనఘ! నీదు సహోదరహంతలనుచుఁ, బెనచి యీ పుణ్యజనులఁజంపితి కడంగి**
**పరఁగ నిదియె సదాశివభ్రాత యైన, యర్థవిభునకు నపరాధ మయ్యెఁ గాన. 361**

**ప్రతి :** అనఘ!= పాపరహితుడా!; నీదు సహ+ఉదరహంతలు+అనుచున్= నీ సోదరుని చంపినవారని; పెనచి= పెనగులాడి; ఈ పుణ్యజనులన్= యక్షులను; కడంగి= పూని; చంపితి= చంపావు; పరఁగన్= చూడగా; ఇది+ఎ= ఇదే; సదాశివభ్రాత+ ఐన= శివునిసోదరుడైన; అర్థవిభునకున్= కుబేరునికి; అపరాధము+ అయ్యెన్= (చేసిన) దోషమైనది; కానన్= కావున...

**తా :** ఓ పుణ్యాత్మా! నీ తమ్ముని చంపినవారిని పెనుగులాడి ఈయక్షులను నీవు పూనుకొని వధించావు. పరిశీలించిచూడగా శివుని సోదరుడైన కుబేరునిపట్ల అపరాధమయింది. అందుచేత

**విశే :** సదాశివభ్రాతయైన యర్థవిభునకు : శివునితో కైలాసంలో ఉన్న పార్వతీదేవి సౌందర్యాన్ని అసూయాదృష్టితో చూచిన ఐలబిలుని (కుబేరుని అసలుపేరు) పార్వతి కురూపివి కమ్మని శపించింది. దానితో 'ఐలబిలుడు' కుత్సితమైన బేరం (శరీరం)గల కుబేరుడయ్యాడు. పశ్చాత్తాపంతో శివుని శరణాగతి పొందగా శివుడు కుబేరుని తన తమ్మునిగా స్వీకరించాడు. శివునికి తమ్ముడైతే కుబేరునికి పార్వతి వదిన అవుతుంది. మరదికి వదిన తల్లితో సమానం అని మనుస్మృతి. ఆ విధంగా సదాశివభ్రాతయై యర్థవిభుడైన కుబేరుడు దుర్బుద్ధిని మానుకొని సత్ప్రవర్తన గలవాడయ్యాడు.

**క. నతి నుతులచేత నీ విపుడతనిఁ, బ్రసన్నునిఁగఁజేయు మని మనువు దయా**
**మతిఁజెప్పి ధ్రువునిచే స, త్కృతుఁడై నయ మొప్పఁజనియె ఋషియుక్తుండై. 362**

**ప్రతి :** నతి నుతులచేతన్= నమస్కారాలతో, స్తోత్రాలతో, నీవు; ఇపుడు= ఇప్పుడు; అతనిన్= కుబేరుని; ప్రసన్నునిగన్+ చేయుము+అని= శాంతపడేలా చేయుమని; మనువు= మనువు; దయామతిన్+చెప్పి= జాలితో పలికి; ధ్రువునిచే, సత్+ కృతుఁడు+ఐ= సన్మానం పొంది; ఋషియుక్తుండు+ఐ= మునులతోకూడి; నయము+ఒప్పన్= నీతి ప్రకాశించగా; చనియెన్= వెళ్లిపోయాడు.

**తా :** నీవు ఆ కుబేరుణ్ణి వెంటనే నమస్కారాలతో, స్తోత్రాలతో ప్రసన్నుణ్ణి చేసుకొమ్మని చెప్పి, మనువు దయామయుడై కర్తవ్యం ఉపదేశించి, ధ్రువునిచే ప్రశంసింపబడి ఋషులతో కలసి వెళ్లాడు.

**వ. అంత. 363**

**ప్రతి :** అంతన్= ఆ తర్వాత...

**తా :** ఆ తర్వాత

**తే.** **యక్షచారణసిద్ధవిద్యాధరాది, జనగణస్తూయమానుఁడై ధనదుఁడంతఁ**
**బుణ్యజనవైశసనివృత్తు భూరిరోష, రహితుఁడైనట్టి ధ్రువునిఁజేరంగ వచ్చె.** **364**

**ప్రతి :** యక్ష= యక్షులు; చారణ= చారణులు; సిద్ధ= సిద్ధులు; విద్యాధర+ఆది= విద్యాధరులు మొదలుగాగల; జనగణ= జనసముదాయంచే; స్తూయమానుఁడు+ఐ= స్తుతింపబడువాడై; అంతన్= అంతట; ధనదుఁడు= కుబేరుడు; పుణ్యజనవైశస= యక్ష, రాక్షసులను హింసించడంనుండి; నివృత్తున్= మరలినవానిని; భూరిరోషరహితుఁడు+ఐన+అట్టి= మహారోషాన్ని పోగొట్టుకొన్నవాడైన; ధ్రువునిన్= ధ్రువుని; చేరంగన్+వచ్చెన్= దగ్గరకు వచ్చాడు.

**తా :** యక్షులు, సిద్ధచారణులు, విద్యాధరులు మొదలగువారిచే స్తుతింపబడుతూ కుబేరుడును అప్పుడు గుహ్యకులను హింసించడం మానివేసి, మహారోషాన్ని విడిచిపెట్టిన ధ్రువుని చేరవచ్చినాడు.

**సీ.** **చనుదెంచి వెసఁగృతాంజలియైన ధ్రువుఁ జూచి తివుట నిట్లనియె క్షత్రియకుమార!**
**తగ భవదీయపితామహాదేశంబునను దుస్త్యజంబైన ఘనవిరోధ**
**ముడిగితి; వటు గాన నొనరంగ నిపుడు నీ యందుఁబ్రసన్నుండనైతి, భూత**
**జననలయంబుల కనయంబుఁ గాలంబు కర్తయై వర్తించుఁగాన యుష్మ**

**తే.** **దనుజుఁజంపినవార లీ యక్షవరులు, గారు; తలపోయ నీ యక్షగణము నిట్లు**
**నెఱి వధించినవాఁడవు నీవు గావు, వినుతగుణశీల! మాటలు వేయునేల?** **365**

**ప్రతి :** చనుదెంచి= వచ్చి, వెసన్= వెంటనే; కృత+అంజలి+అయిన= నమస్కరించిన; ధ్రువున్+చూచి= ధ్రువుణ్ణిచూసి; తివుటన్= మచ్చికతో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు; క్షత్రియ కుమార= ఓ రాజకుమారా! తగన్; భవదీయ పితామహ+ఆదేశంబునను= మీ తాతగారి ఆజ్ఞచే; దుస్+త్యజంబు+ఐన= విడవడానికి కష్టమైన; ఘనవిరోధము= గొప్ప వైరభావాన్ని; ఉడిగితివి= విడిచిపెట్టావు; అటుగానన్= అందువల్ల; ఒనరంగన్= క్రమంగా; ఇపుఁడు, నీ యందు; ప్రసన్నుండను+ఐతిన్= తప్పుచూడని వాడనయ్యాను; కాలంబు= కాలం; భూతజనన= జీవుల పుట్టుకకు; లయంబులకున్= నశించుటకు; అనయంబున్= ఎల్లప్పుడు; కర్త+ఐ= కారణభూతమై; వర్తించున్+కానన్= ప్రవర్తిస్తుంది కాబట్టి; యుష్మత్+అనుజున్= నీ తమ్ముని; చంపినవారలు= సంహరించినట్టివారు; ఈయక్షవరులు కారు= ఈ యక్షశ్రేష్ఠులు కారు; తలపోయన్= ఆలోచించగా; ఈ యక్షగణమును= ఈ యక్షుల సముదాయాన్ని; ఇట్లు= ఈ విధంగా; నెఱిన్= పూనికతో; వధించినవాఁడవు= చంపినవాడవు; నీవు+కావు= నీవున్నూ కావు; వినుత గుణశీల= కొనియాడబడిన గుణములు, ప్రవర్తన కలవాడా!; మాటలు వేయున్+ఏల= పెక్కుమాట లెందుకు?

**తా :** వచ్చి వేగంగా నమస్కరించి నిలబడ్డ ధ్రువుణ్ణిచూసి, కోరికతో కుబేరు డిలా అన్నాడు. రాజకుమారా! ప్రబలవిరోధాన్ని విడిచిపెట్టడం చాలాకష్టం. అయినా మీ తాతగారి ఉపదేశంతో నీవు దానిని విడిచిపెట్టావు. అందుచేత ఇప్పుడు ఇంపుగా నేను నీయెడ అనుగ్రహపరుణ్ణి అయినాను. జీవుల పుట్టుకకు, నాశనానికి కాలమే కర్తగా ప్రవర్తిస్తుంది. అందుచేత నీ తమ్ముణ్ణి చంపింది ఈ యక్షవరులు కారు. ఆలోచిస్తే యక్షులను పూనికతో చంపింది నీవున్నూ కావు. పొగడదగిన గుణములను, శీలమును కలిగిన ధ్రువా! వేలమాటలెందుకు.

**వ. అదియునుంగాక యే బుద్ధింజేసి కర్మ సంబంధ దుఃఖాదికంబులు దేహాత్మానుసంధానంబునం జేసి సంభవించు, నట్టి యహంత్వమ్మను నపార్థజ్ఞానంబు స్వప్నమందుంబోలెఁ బురుషునకుం దోఁచు నది గావున, సర్వభూతాత్మ విగ్రహుండును, నధోక్షజుండును, భవచ్ఛేదకుండును, భజనీయ పాదారవిందుండును, ననంతామేయ శక్తి యుక్తుండును గుణమయియగు నాత్మమాయచే విరహితుండును నైన యీశ్వరుని సేవింపుము; నీకు భద్రం బయ్యెడు; భవదీయ మనోగతంబైన వరంబుఁ గోరుము; నీ వంబుజనాభ పాదారవింద సేవనంబుఁ దిరంబుగఁ జేయుదు వని యెఱుంగుదు నని రాజరాజుచేత నట్లు మహామతియు, భాగవతోత్తముండునైన ధ్రువుండు ప్రేరేపింపంబడి యే హరిస్మరణంబుచేత నప్రయత్నంబున దురత్యయంబైన యజ్ఞానంబుం దరియింతు రట్టి హరిస్మరణం బచలితం బగునట్లొసంగుమని యడిగిన నట్లకాక యని యంగీకరించి యంతం గుబేరుండును సంప్రీతచిత్తుండయి, ధ్రువునికి శ్రీహరిస్మరణం బట్ల యనుగ్రహించి యంతర్ధానంబు నొందె; నంత ధ్రువుండు యక్ష కిన్నర కింపురుష గణ సంస్తూయమాన వైభవుండగుచు నాత్మీయపురంబునకు మరలి చనుదెంచి. 366**

**ప్రతి :** అదియునున్+కాక= అదీగాక; ఏ బుద్ధిన్+చేసి= ఏ సంకల్పాన్నిబట్టి; కర్మ సంబంధ దుఃఖ+ఆదికంబులు= కర్మవలన కలిగే దుఃఖం మొదలైనవి; దేహ+ఆత్మ+అనుసంధానంబునన్+చేసి= దేహమే ఆత్మ అని భావించినందువల్ల; సంభవించున్= కలుగుతాయి; అట్టి, అహం= నేను; త్వమ్+అను= నీవు అనే; అపార్థజ్ఞానంబు= భ్రాంతి; స్వప్నమందున్+పోలెన్= కలలోవలె; పురుషునకున్= జీవుడికి; తోఁచున్= తోస్తుంది; అదికావున= అందువల్ల; సర్వభూత+ఆత్మ విగ్రహుండును= సర్వభూత స్వరూపమైన శరీరం కలవాడూ; అధస్+అక్షజుండును= అధోముఖానికి స్థూలలోకాలలోకి తన సామర్థ్యంవల్ల జీవుడుగా పుట్టేవాడు; భవత్+ఛేదకుండును= సంసారబంధాలను తెంచేవాడు; భజనీయ= పూజింపదగిన; పాదారవిందుండును= పాదపద్మాలు గలవాడును; అనంత+అమేయశక్తియుక్తుండును= అంతంలేని అధికమైన శక్తిగల వాడును; గుణమయి+అగు= గుణాలతో నిండిన; ఆత్మమాయచే= తనయందు పుట్టిన మాయచే; విరహితుండును= సంబంధం లేనివాడును; ఐన, ఈశ్వరుని= భగవంతుని; సేవింపుము= కొలువుము; నీకు భద్రంబు+అయ్యెడు= నీకు శుభమగుగాక!; భవదీయ= నీయొక్క; మనోగతంబు+ఐన= మనసులోఉన్న; వరంబున్+కోరుము= వరాన్ని కోరుకో!; నీవు, అంబుజనాభ= విష్ణుని; పాద+అరవింద సేవనంబున్= పాదపద్మాలు సేవించడం; తిరంబుగన్= నిశ్చలంగా; చేయుదువు= చేస్తావని; ఎఱుంగుదును= తెలుసును; అని, రాజరాజుచేత= కుబేరునిచే; అట్లు, మహామతియు= గొప్పబుద్ధిగలవాడును; భాగవత+ఉత్తముండును+ఐన= భక్తులలో శ్రేష్ఠుడు అయిన; ధ్రువుండు, ప్రేరేపింపంబడి= ప్రేరేపణచేయబడి; ఏ హరిస్మరణంబుచేతన్= ఏ దేవుని గూర్చి స్మరించడంవల్ల; అప్రయత్నంబున= ప్రయత్నం లేకుండా; దురత్యయంబు+ఐన= దాటుట కసాధ్యమైన; అజ్ఞానంబున్= అజ్ఞానాన్ని; తరియింతురు= దాటుతారో; అట్టి హరిస్మరణంబు= ఆ విధమైన భగవన్నామ స్మరణం; అచలితంబు+అగునట్లు= నిశ్చలంగా ఉండేలా; ఒసంగుమని= ఇమ్మని; అడిగినన్= అడుగగా; అట్లకాక+అని= అలాగేనని; అంగీకరించి= ఒప్పుకొని; అంతన్, కుబేరుండును, సంప్రీతచిత్తుండు+అయి= తృప్తిపడినవాడై; ధ్రువునికి, శ్రీహరి స్మరణంబు= విష్ణునిస్మరించే విధానం; అట్ల+అనుగ్రహించి= ఆ విధంగానే ఉపదేశించి; అంతర్ధానంబు+ఒందెన్= మాయమయ్యాడు, ధ్రువుండు; యక్ష= యక్షుల; కిన్నర= కిన్నరుల; కింపురుష= కింపురుషుల; గణ సంస్తూయమాన వైభవుండు+అగుచున్= సముదాయంచే పొగడబడిన ఐశ్వర్యంగలవాడై; ఆత్మీయపురంబునకు= తన నగరానికి; మరలి= తిరిగి; చనుదెంచి= వచ్చి.

**తా :** దేహాభిమానం కారణంగా స్వప్నంలోవలె 'నేను, నీవు' అనే దేహబుద్ధి పురుషునికి అజ్ఞానంవల్ల కలుగుతుంది. దానివల్ల బంధం, దుఃఖం మొదలైనవి సంభవిస్తాయి. కాబట్టి, అధోక్షజుడు, సర్వభూతస్వరూపుడు, సంసారబంధ విమోచకుడు అయిన భగవంతుణ్ణి సేవించు. ఆయన పాదపద్మాలు భజింపదగ్గవి. ఆయన త్రిగుణాత్మక మాయకు అతీతుడు. నీకు మేలు కలుగుతుంది. నీ మనసులోని కోర్కెను కోరుకో! నీవు శ్రీహరి పాదసేవను స్థిరబుద్ధితో చేస్తావు. కాబట్టి, వరాలు పొందడానికి అర్హుడవు.

కుబేరుని ఆ ప్రోత్సాహవాక్యాలు విని బుద్ధిమంతుడు, భాగవతోత్తముడైన ధ్రువుడు ఏ హరి స్మరణంవల్ల దురంతం, దుస్తరమైన అజ్ఞానాన్ని అవలీలగా తరింపగలుగుతామో ఆ శ్రీహరి స్మరణం నా మనస్సులో స్థిరంగా ఉండేటట్లు వరం ఇమ్మని అర్థించాడు. ధ్రువుడు కోరినట్లే కుబేరు డతనికి శ్రీహరి స్మరణను అనుగ్రహించి ప్రీతాత్ముడై అంతర్ధానం చెందాడు. ఆ తరువాత ధ్రువుడు యక్షులు, కిన్నరులు, కింపురుషులు తన వైభవాన్ని కీర్తిస్తుండగా తన రాజధానికి తిరిగివచ్చాడు.

**సీ. గణుతింప భూరిదక్షిణలచేఁ గడునొప్పు యజ్ఞముల్ సేయ న య్యజ్ఞవిభుఁడు**
**ద్రవ్యక్రియాదేవతాఫలరూప సత్కర్మఫల ప్రదాత యయి యొప్పు**
**పురుషోత్తముని నర్థిఁబూజించి మఱియు సర్వోపాధివర్జితుం డుత్తముండు**
**సర్వాత్మకుఁడు నగు జలజాక్షునందుఁ దీవ్రంబై ప్రవాహరూపంబు నైన**

**తే. భక్తి సలుపుచు నఖిలప్రపంచమందు, నలరఁదనయందు నున్న మహాత్ము హరిని**
**జిదచిదానందమయుని లక్ష్మీవరుఁ బరము, నీశ్వరేశ్వరుఁబొడఁగనె నిద్ధచరిత! 367**

**ప్రతి :** ఇద్ధచరిత!= ప్రకాశించే నడవడి గలవాడా! (విదురా!); గణుతింపన్= కొనియాడదగిన; భూరిదక్షిణలచే= అధికమైన దక్షిణలతో; కడునొప్పు= మిక్కిలి వైభవంతో; యజ్ఞముల్+చేయన్= యాగాలు చేయగా; ఆ+యజ్ఞవిభుఁడు= ఆ యాగాధిపతి; ద్రవ్యక్రియా దేవతాఫల రూప= ద్రవ్యము, పని, దేవత, ఫలితం అనేరూపాలలో; సత్+కర్మఫల ప్రదాత అయి+ఒప్పు= మంచి పనులకు ఫలితాల నిచ్చేవాడుగా ఉన్న; పురుషోత్తమునిన్= భగవంతుని; అర్థిన్+పూజించి, కోర్కెతోపూజచేసి; మఱియు, సర్వ+ఉపాధి వర్జితుండు= అన్ని ఆధారాలను విడిచిపెట్టినవాడు; ఉత్తముండు= సజ్జనుడు; సర్వ+ఆత్మకుఁడు= అంతటావ్యాపించినవాడు; అగు జలజ+అక్షుని+అందున్= అయిన విష్ణువునందు; తీవ్రంబు+ఐ= అధికమై; ప్రవాహరూపంబును+ఐన= ప్రవాహంలాగా ఎడతెగనిదైన ప్రవహించే; భక్తి సలుపుచున్= భక్తిచేస్తూ; అఖిలప్రపంచమందున్= సమస్తలోకంలో; అలరన్+తనయందున్+ఉన్న= ప్రకాశిస్తూ తనలో ఉన్న; మహాత్మున్= భగవానుడైన హరిని; చిత్+అచిత్+ఆనందమయునిన్= చేతనము, జడము అనేవానిని తనమయంగా నింపిన ఆనందస్వరూపుని; లక్ష్మీవరున్= విష్ణుని; పరమున్= శ్రేష్ఠుని; ఈశ్వర+ఈశ్వరునిన్= పరమేశ్వరుని; పొడగనెన్= చూశాడు.

**తా :** ప్రశస్తమైన నడవడిగల విదురా! విను. ఇలా తన నగరానికి మరలి వచ్చి ధ్రువుడు కొనియాడదగిన దక్షిణలతో యజ్ఞాలు చేశాడు. అనేక ద్రవ్యాలు, ఆచరింపబడే క్రియలు విష్ణుమూర్తి రూపాలుగా చూపబడ్డాయి. కాబట్టి అంతర్లీనమై నిర్వహించిన విష్ణువే అధిదేవతయై సత్కర్మఫలాలను పుష్కలంగా పంచిపెట్టాడు. ధ్రువుని బుద్ధి ఇన్నింటిపై నిలవలేదు. ఇవన్నీ ఉపాధులు. వాని కతీతుడైన నారాయణునిపై తనకు గల భక్తి అఖండమై, ప్రవాహరూపమై ప్రకాశించింది. ఈ విధంగా జడము, చేతనము సమ్మిశ్రంగా ఉన్న సృష్టిలో ఆనందమయుడైన లక్ష్మీపతిని ఒక్కడినే చూస్తూ ధ్రువుడు జీవితాన్ని నడిపాడు.

**వ. ఇట్లు సుశీల సంపన్నుండును, బ్రహ్మణ్యుండును, ధర్మసేతురక్షకుండును, దీనవత్సలుండు నయి యవనిఁబాలించు ధ్రువుండు దన్నుఁ బ్రజలు దండ్రి యని తలంప నరువది యాఱువేలేండ్లు భోగంబులచేతం బుణ్యక్షయంబును, నభోగంబులైన యాగాదులచే నశుభక్షయంబునుం జేయుచు బహుకాలంబు దనుకఁ ద్రివర్గసాధనంబుగ రాజ్యంబుసేసి కొడుకునకుం బట్టంబుగట్టి యచలితేంద్రియుండై యవిద్యారచిత స్వప్నగంధర్వ నగరోపమం బయిన దేహాదికంబగు విశ్వంబు భగవన్మాయారచితంబని యాత్మం దలంచుచు వెండియు. 368**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; సుశీల సంపన్నుండును= మంచిగుణాలనే సంపద గలవాడు; బ్రహ్మణ్యుండును= వేదమనే పరబ్రహ్మంపై నిష్ఠగలవాడు; ధర్మసేతురక్షకుండును= ధర్మమనే వంతెనను కాపాడేవాడు; దీనవత్సలుండును= దీనులపై దయగలవాడు; అయి, అవనిన్= భూమిని; పాలించు ధ్రువుండు= పాలనచేసే ధ్రువుడు; తన్నున్= తనను; ప్రజలు, తండ్రియని తలంపన్= తండ్రితో సమానంగా భావింపగా; అరువది ఆఱువేల+ఏండ్లు= అరువది ఆరువేల సంవత్సరాలు; భోగంబులచేతన్= అనుభవించడంచేత; పుణ్యక్షయంబును= పుణ్యాన్ని తగ్గించుకొని; అభోగంబులు+ఐన= ఫలితాలు అనుభవింపబడని; యాగ+ఆదులచే= యజ్ఞాలు మొదలైనవానిచే; అశుభక్షయంబునున్+చేయుచు= పాపాలను తగ్గింపజేస్తూ; బహుకాలంబు దనుకన్= చాలాకాలం వరకు; త్రివర్గసాధనంబుగన్= ధర్మము, అర్థము, కామము సాధించేలా; రాజ్యంబు+చేసి= పరిపాలించి; కొడుకునకున్= కుమారునికి; పట్టంబు+కట్టి= పట్టాభిషేకం చేసి; అచలిత+ఇంద్రియుండు+ఐ= చాంచల్యం లేని ఇంద్రియాలు గలవాడై; అవిద్యారచిత= అజ్ఞానంచే నిర్మితమైన; స్వప్నగంధర్వ నగర+ఉపమంబు+అయిన= కలలో చూసిన గంధర్వుల పట్టణంతో పోల్చదగిన; దేహాదికంబు+అగు= శరీరాదియైన; విశ్వంబు= లోకము; భగవత్+మాయారచితంబు+అని= భగవంతునిమాయచే సృష్టింపబడినదని; ఆత్మన్+తలంచుచు= మనస్సులో భావిస్తూ; వెండియున్= మరియు,

**తా :** ఈ విధంగా సుశీలసంపన్నుడు, పరబ్రహ్మపై నిష్ఠగలవాడు, ధర్మమనే వంతెనను రక్షించేవాడు, దీనులపై దయగలవాడను అయి ధ్రువుడు తనను ప్రజలు తండ్రిగా భావిస్తుండగా, అరువది ఆరువేల సంవత్సరాలు రాజ్యం చేసినాడు. ఆ రాజ్యకాలంలో తన ఐశ్వర్యానుభవాల వల్ల పుణ్యక్షయాన్ని, ఫలితాలనాశించని యాగాదులతో అశుభక్షయాన్ని సాధించాడు. చాలాకాలందాక, ధర్మార్థకామాలను సాధించుచు రాజ్యము పాలించి కుమారునికి రాజ్యపట్టం కట్టాడు. ఇంద్రియ లౌల్యం లేనివాడయ్యాడు. అజ్ఞానంతో నిర్మితమైన కలలో చూచిన గంధర్వుల పట్టణంతో పోల్చదగిన శరీరాదికమగు భౌతికలోకం భగవంతుని మాయచే సృష్టించబడిందని మనస్సులో భావించుచు ఇంకనూ...

**చ. మనునిభుఁడంత భృత్యజనమంత్రిపురోహితబంధుమిత్ర నం**
**దనపశువిత్తరత్నవనితాగృహ రమ్యవిహారశైల వా**
**రినిధిపరీతభూతలహరిద్విపముఖ్యపదార్థజాలముల్**
**ఘనమతిచే ననిత్యములుగాఁ దలపోసి విరక్తచిత్తుఁడై. 369**

**ప్రతి :** మనునిభుఁడు= మనువుతో సమానుడైనవాడు; అంతన్= తర్వాత; భృత్యజన= సేవకులు; మంత్రి= మంత్రులు; పురోహిత= పౌరోహిత్యం వృత్తిగాగల బ్రాహ్మణులు; బంధుమిత్ర= బంధువులు, స్నేహితులు; నందన= కుమారులు; పశు, విత్త, రత్న= పశువులు, ధనము, రత్నాలు; వనితాగృహ= స్త్రీలు; ఇండ్లు, రమ్యవిహారశైల= మనోహరమైన క్రీడా

పర్వతాలు; వారినిధి పరీత= సముద్రంచే చుట్టబడిన; భూతల= భూభాగం; హరి+ద్విపముఖ్య= గుఱ్ఱములు, ఏనుగులు మొదలగు; పదార్థజాలముల్= వస్తు సముదాయాన్ని; విరక్తచిత్తుఁడు+ఐ= వైరాగ్య బుద్ధిగలవాడై; ఘనమతిచేన్= గొప్పమనస్సుతో; అనిత్యములుగాన్= అశాశ్వతాలుగా; తలపోసి= భావించి.

**తా :** అప్పుడు మనువు సమానుడైన ధ్రువుడు సేవకులు, మంత్రి, పురోహితులు, బంధుమిత్రులు, పుత్రులు, పశువులు, ధనము, రత్నాలు, స్త్రీలు, ఇండ్లు, రమ్యమైన విహార ప్రదేశాలైన పర్వతాలు సముద్రాల నడుమ ఉండే భూభాగం, గుఱ్ఱాలు, ఏనుగులు మొదలగు పదార్థాల సమూహాలు గొప్ప మనస్సుచేత అనిత్యాలే అని భావించి విరక్తమైన మనసుకలవాడై..

**సీ. పురము వెల్వడి చని పుణ్యభూ బదరికా ఘనవిశాలానదీకలిత మంగ**
**ళాంబుపూరంబుల ననురక్తిమైఁ గ్రుంకి కమనీయపరిశుద్ధకరణుఁడగుచు**
**బద్మాసనస్థుఁడై పవనుని బంధించి నెలకొని ముకుళితనేత్రుఁడగుచు**
**హరిరూపవైభవధ్యానంబు సేయుచు భగవంతు నచ్యుతుఁబద్మనేత్రు**

**తే. నందు సతతంబు నిశ్చలమైనయట్టి, భక్తిఁబ్రవహింపఁజేయుచుఁబరమమోద**
**బాష్పధారాభిషిక్తుండు భవ్యయశుఁడుఁ, బులకితాంగుండు నగుచు నిమ్ములఁ దనర్చి. 370**

**ప్రతి :** పురము వెల్వడి చని= నగరం బయటకు వెళ్లి; పుణ్యభూ= పవిత్ర ప్రదేశమైన; బదరికా= బదరికాశ్రమంలోని; ఘనవిశాలానదీకలిత= పెద్దదైన, విశాల అనే నదితోకూడిన; మంగళ+అంబుపూరంబులన్= శుభమైన జలాలలో; అనురక్తిమైన్= ప్రేమతో; క్రుంకి= మునిగి; కమనీయ= రమ్యమైన; పరిశుద్ధకరణుఁడు+అగుచున్= మాలిన్యం రహితమైన ఇంద్రియాలు కలవాడై; పద్మాసనస్థుడు+ఐ= పద్మాసనంవేసుకొని కూర్చొని; పవనునిన్= గాలిని; బంధించి= మూసి; నెలకొని= ప్రయత్నించి/పూనుకొని; ముకుళితనేత్రుఁడు+అగుచున్= కన్నులు మూసినవాడై; హరిరూపవైభవ= విష్ణుదేవుని రూపవైభవాన్ని; ధ్యానంబు+చేయుచున్= ధ్యానిస్తూ; భగవంతున్= భగవానుడైన; పద్మనేత్రున్= పద్మాలవంటి కనులుగల; అచ్యుతునందున్= విష్ణునియందు; సతతంబు= నిత్యము; నిశ్చలమైన+అట్టి= దృఢమైన; భక్తిన్= భక్తిని; ప్రవహింపన్+ చేయుచున్= ప్రవహింపజేస్తూ; పరమమోద= పరమానందంతో; బాష్పధారా+అభిషిక్తుండు= బాష్పధారలచే అభిషేకింపబడినవాడు; భవ్యయశుఁడున్= శుభమైన కీర్తిగలవాడు; పులకిత+అంగుండున్= పులకించిన అవయవాలుకలవాడు; అగుచున్= అవుతూ; ఇమ్ములన్= ప్రీతితో; తనర్చి= ఒప్పి

**తా :** అతడు తన నగరంనుండి వెలువడి పుణ్యక్షేత్రాలకు తీర్థయాత్రలు చేశాడు. బదరికాశ్రమాన్ని దర్శించి, విశాలానదీ పుణ్యతీర్థాలలో స్నానంచేసి, ఇంద్రియాలను శుద్ధిచేసుకొని పద్మాసనాసీనుడయ్యాడు. ప్రాణాయామంతో వాయుగతులను నిలిపి పరిపూర్ణుడయ్యాడు. కళ్లుమూసుకొని హరియొక్క రూపవైభవాన్ని ధ్యానం చేశాడు. భక్తి నిశ్చలం కాగా ఆనందబాష్పాలు ప్రవహించాయి. శరీరం పులకించింది.

**విశే :** పవనుని బంధించటం అంటే ప్రాణాయామం చేయటం.

**వ. మఱియు విగతక్లేశుండును, ముక్తలింగుండునునై, ధ్రువుండు తన్నుఁదా మఱచియుండు సమయంబున దశదిక్కుల నుద్యద్రాకానిశానాయకుండునుంబోలె వెలిఁగించుచు నాకాశంబున నుండి యొక్క విమానంబు సనుదేర నందు దేవశ్రేష్ఠులును, జతుర్భుజులును, రక్తాంబుజేక్షణులును, శ్యామలవర్ణులును, గదాధరులును,**

**సువాససుస్సలును, గిరీటహారాంగదకుండలధరులును, గౌమారవయస్కులును, నుత్తమశ్లోకకింకరులు నయినవారల నిద్దఱంగని సంభ్రమంబున లేచి మధుసూదననామంబులు సంస్మరించుచు వారల భగవత్కింకరులంగాఁదలంచి దండప్రణామంబు లాచరించినం గృష్ణపాదారవింద విన్యస్తచిత్తుండును, గృతాంజలియు, వినమితకంధరుండు నైన ధ్రువునిం గనుంగొని పుష్కరనాభభక్తులైన సునందనందులు ప్రీతియుక్తులై మందస్మితు లగుచు నిట్లనిరి. 371**

**ప్రతి :** మఱియు, విగతక్లేశుండును= చిక్కులనుండి బయటపడినవాడు; ముక్తలింగుండును+ఐ= లింగశరీర భాగంనుండి విముక్తుడైనవాడు ; ధ్రువుండు, తన్నున్+తా మఱచియుండు సమయంబునన్= తనను తాను మరిచిపోయివున్న సమయంలో; దశదిక్కులన్= పది దిక్కులను; ఉద్యత్+రాకానిశానాయకుండునున్+పోలెన్= ఉదయిస్తున్న పూర్ణిమాచంద్రునివలె; వెలిఁగించుచున్= ప్రకాశింపజేస్తూ; ఆకాశంబున నుండి= ఆకాశంనుండి; ఒక్క విమానంబు+చనుదేరన్= ఒక విమానం రాగా; అందున్= అందులో; దేవశ్రేష్ఠులును= గొప్పవారైన దేవతలు; చతుర్+భుజులును= నాలుగుభుజాలు కలవారు; రక్త+అంబుజ+ఈక్షణులును= ఎఱ్ఱతామరరేకులవంటి కనులుగలవారు; శ్యామవర్ణులును= నీలిమేఘాలవంటి దేహాలుగలవారు; గదాధరులును= గదలు ధరించినవారు; సువాసస్సులునున్= మంచి వస్త్రాలు ధరించిన వారును; కిరీటహార+అంగదకుండలధరులును= కిరీటములు, హారములు, భుజకీర్తులు, కుండలములు ధరించినవారు; కౌమారవయస్కులును= యుక్తవయస్సులో ఉన్నవారును; నుత్తమశ్లోక కింకరులును= ఉత్తములచే కీర్తింపబడు విష్ణుదేవుని సేవకులును; అయిన వారలన్= అయిన వాళ్లను; ఇద్దఱన్+కని= ఇద్దరిని చూసి; సంభ్రమంబునన్= ఆశ్చర్యంతో, లేచి; మధుసూదననామంబులు= విష్ణుదేవుని పేర్లు; సంస్మరించుచున్= జపిస్తూ; వారలన్= వారిని; భగవత్+కింకరులన్+కాన్= దేవుని సేవకులుగా; తలంచి= భావించి; దండ ప్రణామంబులు+ఆచరించినన్= దండంవలె నేలపై దేహాన్ని ఆన్చి చేసే నమస్కారాలు చేయగా; కృష్ణపాద+అరవింద= శ్రీకృష్ణుని పాదపద్మాలయందు, విన్యస్తచిత్తుండున్= సమర్పించబడిన చిత్తం కలవాడును; కృతాంజలియున్= నమస్కరించినవాడును; వినమిత కంధరుండును+ఐన= మెడను వినయంతో వంచినవాడు అయిన; ధ్రువునిన్+కనుంగొని= ధ్రువుని చూసి; పుష్కరనాభ భక్తులు+ఐన= నాభియందు పద్మంగల విష్ణుని భక్తులైన; సునందనందులు, ప్రీతియుక్తులు+ఐ= ప్రీతిగలవారై; మందస్మితులు+అగుచున్= నవ్వుతూ; ఇట్లు+అనిరి.

**తా :** ఇంకనూ తన సాధనలో క్లేశాలు తొలగి, లింగశరీరం అంతరించియున్న ధ్రువుడు తన్నుతాను మరచిన స్థితిలో ఉన్నాడు. అప్పుడు ఉదయిస్తున్న పూర్ణిమాచంద్రునివలె పదిదిక్కులను వెలిగిస్తూ ఆకాశంనుండి ఒక విమానం వచ్చింది. అందులో ఇద్దరు దేవతా శ్రేష్ఠులు చతుర్భుజులై, ఎఱ్ఱతామరరేకులవంటి కనులతో, నీలమేఘచ్ఛాయతో మెరసిపోతున్నారు. వారు మంచి వస్త్రాలను ధరించి గదలు పట్టుకొని ఉన్నారు. కిరీటాలు, హారాలు, కుండలాలు, భుజకీర్తులు ధరించి యుక్తవయస్సులో కనిపిస్తున్నారు.

వారిని చూచి ఉత్తములచేత కీర్తించబడెడి విష్ణుకింకరుల నిద్దరిని చూచి ధ్రువుడు తొట్రుపాటుతో లేచి భగవంతుని వివిధ నామాలను స్మరిస్తూ వారు భగవత్ కింకరులుగా భావించి సాష్టాంగదండప్రణామాలుచేసి నమస్కరించగా కృష్ణుని పాదపద్మములయందు ఉంచబడిన మనసుకలవాడిని, నమస్కరించుచున్నవాడును, వినయముతో మెడవంచినవాడును అయిన ధ్రువుణ్ణి చూచి హరిభక్తులైన సునందనందులు ప్రీతిగా చిరునవ్వుతో ఇట్లన్నారు.

**ఉ. ఓ నృప! నీకు భద్ర మగు నొప్పుగుచున్న మదీయవాక్యముల్**
**వీనులయందుఁజొన్పుము; వివేకముతో నయిదేండ్లనాఁడు మే**
**ధానిధివై యొనర్చిన యుదాత్తతపోవ్రతనిష్ఠచేతఁ దే**
**జోనయశాలియైన మధుసూదనుఁదృప్తి వహింపఁజేయవే! 372**

ప్రతి : ఓ నృప= ఓ రాజా! నీకున్, భద్రము+అగున్= శుభమగుగాక!; ఒప్పగుచున్న= మంచివైన; మదీయవాక్యముల్= నాపలుకులు; వీనులయందున్= చెవులలో; చొన్పుము= చేర్పుము; ఐదేండ్లనాఁడు= ఐదేళ్లవయస్సులో; వివేకముతోన్= తెలివితో; మేధానిధివి+ఐ= గొప్పతెలివి కలవాడవై; ఒనర్చిన= చేసిన; ఉదాత్త తపస్+వ్రతనిష్ఠచేతన్= గొప్ప తపోదీక్షచే; తేజస్+నయశాలి+ఐన= ప్రకాశవంతమైన, చక్కని ప్రవర్తనగల; మధుసూదనున్= విష్ణుని; తృప్తి వహింపన్+చేయవు+ఏ= సంతృప్తి పరచావుగదా!

**తా :** ఓ మహారాజా! నీకు శుభమగుగాక! ఒప్పిదమైన మా మాటలు చెవులలో ప్రవేశింపనిమ్ము. ఐదేండ్ల వయస్సులోనే నీవు వివేకంతో (జ్ఞానంతో), గొప్ప బుద్ధికి నిధివంటివాడవై ఘోరతపోనిష్ఠచేత, తేజోమూర్తి, ధర్మాత్ముడు అయిన విష్ణుమూర్తిని సంతృప్తిపరచావు కదా?

**ఆ. అట్టి శార్ఙ్గపాణి యఖిలజగత్కర్త, దేవదేవుఁడతులదివ్యమూర్తి**
**మమ్ముఁబనుప మేము మాధవపదమున, కర్థి నిన్నుఁగొనుచు నరుగుటకును. 373**

ప్రతి : అట్టి శార్ఙ్గపాణి= ఆ విష్ణు దేవుడు (శార్ఙ్గమనే విల్లు ధరించినవాడు); అఖిలజగత్+భర్త= సమస్తలోకాధిపతి; దేవదేవుఁడు= పరమాత్ముడు; అతులదివ్యమూర్తి= సాటిలేని దేవతామూర్తి; మమ్మున్+పనుపన్= మమ్ము పంపగా; మేము; మాధవ పదమునకున్= విష్ణుస్థానానికి; అర్థిన్= కోరికతో; నిన్నున్= నిన్ను; కొనుచున్= తీసుకొని; అరుగుటకును= తీసుకొని వెళ్లడానికి...

**తా :** అట్టి శార్ఙ్గమనే విల్లు చేతియందున్నవాడు, అన్ని లోకములకును కారకుడైనవాడు, దేవదేవుడు సాటిలేని దివ్యమూర్తి అయిన హరి మమ్ము పంపగా నిన్ను ఆ మాధవపదమునకు తీసుకువెళ్ళాలనే కోరికతో మేము

**వ. వచ్చితిమి; యే పదంబునేని సూరిజనంబులు సర్వోత్తమంబని పొందుదురు; దేనిఁ జంద్రదివాకర గ్రహనక్షత్రతారాగణంబులు ప్రదక్షిణంబుగాఁ దిరుగుచుండు; మఱియు నీదు పితరులచేతను నన్యుల చేతను ననధిష్ఠితంబును, జగద్వంద్యంబును, నభక్తజనాతిదుర్జయంబును నయిన నట్టి విష్ణుపదంబుం బొందుదువు; రమ్మిదె విమానశ్రేష్ఠం; బుత్తమశ్లోక జనమౌళియైన శ్రీహరి పుత్తెంచె; దీని నెక్క నర్హుండ వనిన నురుక్రమ ప్రియుండయిన ధ్రువుండు తన్మధురవాక్యంబులు విని కృతాభిషిక్తుండయి యచ్చటి మునులకుం బ్రణమిల్లి తదాశీర్వాదంబులు గైకొని విమానంబునకుం బ్రదక్షిణార్చనంబులు గావించి హరి పార్షదులైన సునందనందులకు వందనం బాచరించి భగవద్రూపవిన్యస్త చక్షురంతఃకరణాదికుం డగుచు విమానాధి రోహణంబు గావించుటకు హిరణ్మయరూపంబు ధరియించె నప్పుడు. 374**

ప్రతి : వచ్చితిమి= నిన్ను తీసుకొని వెళ్లడానికి వచ్చాము; ఏ పదంబున్+ఏని= ఏ స్థానాన్నయితే; సూరిజనంబులు= పండితులు; సర్వ+ఉత్తమంబు+అని= అన్నింటికంటె గొప్పదని; పొందుదురు= చేరుకొంటారో; దేనిన్= దేనిని; చంద్రదివాకర=

చంద్రుడు, సూర్యుడు, గ్రహ= గ్రహాలు; నక్షత్రము= నక్షత్రాలు; తారాగణంబులు= తారలు; ప్రదక్షిణంబుగాన్= చుట్టూ; తిరుగుచుండున్= తిరుగుతూ ఉంటాయో; మఱియు, నీదు పితరులచేతనున్= నీ తాత తండ్రులచేతను; అన్యులచేతనున్= ఇతరులచేతను; న+అధిష్ఠితంబును= పొందబడలేదో; జగత్+వంద్యంబును= లోకంచే నమస్కరింపదగినదైన; అభక్తజన+ అతిదుర్జయంబును+అయిన= భక్తులు కానివారిచేత సాధించుటకు అతికష్టమైనది; అయిన, విష్ణుపదంబున్= విష్ణులోకాన్ని; పొందుతావు, రమ్ము= ఇదె; విమానశ్రేష్ఠంబు= ఇదే గొప్పవిమానం; ఉత్తమశ్లోకజనమౌళి+ఐన= ఉత్తమ నడవడిగల జనులకు తలపై, ధరించదగిన; శ్రీహరి, పుత్తెంచెన్= పంపెను; దీనిని+ఎక్కన్= దీనినెక్కుటకు; అర్హుండవు+అనినన్= తగినవాడవు అనగానే, ఉరుక్రమప్రియుండు+అయిన= విష్ణువుకు ప్రియమైనవాడైన; ధ్రువుండు, తద్+మధుర వాక్యంబులు= ఆ తియ్యనిమాటలు; విని, కృత+అభిషిక్తుండు+అయి= స్నానం చేసినవాడై, అచ్చటి మునులకున్= అక్కడున్న ఋషులకు, ప్రణమిల్లి= నమస్కరించి, తద్+ఆశీర్వాదంబులు+కైకొని= వాళ్ల ఆశీస్సులు స్వీకరించి; విమానంబునకున్= విమానానికి; ప్రదక్షిణ+అర్చనంబులు+కావించి= చుట్టూ తిరిగి పూజలుచేసి; హరిపార్షదులైన= విష్ణు సేవకులైన; సునందనందులకు, వందనంబు+ఆచరించి= నమస్కరించి; భగవత్+రూప విన్యస్త= భగవంతుని రూపంలో ఉంచిన; చక్షుస్+అంతః కరణ+అధికుండు+అగుచున్= కన్నులు, మనసు మిక్కిలిగా గలవాడై (కన్నులను మనస్సును నిలిపి); విమాన+ అధిరోహణంబు+కావించుటకున్= విమానం ఎక్కడానికి; హిరణ్మయరూపంబు= బంగారమువలె ప్రకాశవంతమైన రూపాన్ని; ధరించెన్+అప్పుడు= ధరించిన తర్వాత.

**తా :** నిన్ను తీసుకొని వెళ్లడానికి వచ్చాము. ఏ స్థానాన్ని పండితులైనవారు అన్నిటికంటె శ్రేష్ఠమైనదిగా భావించి పొందుతారో, సూర్యచంద్రులు, గ్రహాలు, నక్షత్ర సముదాయం ఏ పదానికి ప్రదక్షిణం చేస్తుంటాయో, దేనిని మీ తండ్రితాతలు, ఇతరులు పొందలేకపోయారో, ఏది సర్వలోకపూజ్యమో, దేనిని భక్తులు కానివారు పొందజాలరో, ఆ విష్ణుపదాన్ని నీవు పొందబోతున్నావు. ఓ ధ్రువా! ఇదుగో! రమ్ము! శ్రేష్ఠమైన ఈ విమానాన్ని నీ కోసం పురుషోత్తముడైన శ్రీహరి పంపాడు. దీని నెక్కడానికి నీవు అర్హుడవని విష్ణుదూతలు తెలుపగా, ధ్రువుడు వారి తియ్యని మాటలకు ఆనందించి, స్నానమాచరించి వచ్చి అక్కడి ఋషులకు నమస్కరించాడు. వారి ఆశీర్వచనాలు పొందాడు. విమానరాజానికి ప్రదక్షిణ చేసి అర్పించాడు. విష్ణుసేవకులైన సునందనందులకు నమస్కారం చేశాడు. భగవత్ స్వరూపంలో తన దృష్టినీ, మనస్సునూ నిలిపి విమానాన్ని ఎక్కడానికి తేజోరూపం తాల్చాడు.

**విశే:** పెద్దగా కనిపించేవి నక్షత్రాలు. చిన్నగా కనిపించేవి తారలు.

**క. సురదుందుభిపణవానక, మురజాదులు మొరసె విరుల ముసురు గురిసెఁ గి**
**న్నరగంధర్వుల పాటలు, భరితములై చెలఁగె నపుడు భవ్యచరిత్రా! 375**

**ప్రతి :** భవ్యచరిత్రా= పుణ్యచరితగలవాడా!; అపుడు= ఆ సమయంలో; సురదుందుభి= దేవదుందుభులు; పణవ+ఆనక, మురజ+ఆదులు= పణవం మద్దెల మురజము మొదలైనవి; మొరసెన్= మోగాయి; విరులముసురు= ఎడతెరపిలేని పుష్పవర్షం; కురిసెన్= కురిసింది; కిన్నర= కిన్నరులు; గంధర్వుల; పాటలు= మంగళ గీతాలు; భరితములు+ఐ= నిండిపోయి; చెలఁగెన్= వ్యాపించాయి.

**తా :** దేవతలు మ్రోగించే దుందుభులు మొదలైన వాద్యాల శబ్దాలు వినిపించసాగాయి. పూలవాన కురిసింది. కిన్నరులు, గంధర్వులు మంగళగీతాలు పాడారు.

**విశే :** దుందుభి/ పణవ/ ఆనక/ మురజ –

ఎ) దుందుశబ్దేన భా తీతి దుందుభిః । భాదీప్తౌ – దుందుం అని శబ్దించేది.

బి) స్తోత్రం చేసేటప్పుడు వాయించేది పణవం.

సి) స్వరవిశేషం ఉజ్జీవింపచేసేది ఆనకం.

డి) ముర్ముర ధ్వని చేసే చర్మవాద్యం మురజం.

**వ. అట్టి సమయంబున ధ్రువుండు దుర్గమంబగు త్రివిష్టపంబునకు నేగువాఁ డగుచు దీనయగు జననిం దిగనాడి యెట్లు వోవుదు? నని చింతించువానిం బార్షదు లవలోకించి యగ్రభాగంబున విమానారూఢయై యేగుచున్న జననిం జూపిన సంతుష్టాంతరంగుండగుచు. 376**

**ప్రతి :** అట్టి సమయంబునన్= ఆ సమయంలో, ధ్రువుండు; దుర్గమంబు+అగు= ప్రవేశించడానికి వీలుకాని; త్రివిష్టపంబునకున్= దేవలోకానికి; ఏగువాఁడు+అగుచున్= వెళుతూ; దీన+అగు= దీనురాలైన; జననిన్= తల్లిని; దిగనాడి= వదలిపెట్టి; ఎట్లు+పోవుదున్+అని= ఎలా పోయేదని; చింతించువానిన్= దిగులుపడేవానిని; పార్షదులు= భటులు; ఆలోకించి= చూచి; అగ్రభాగంబునన్= ముందువైపు; విమాన+ఆరూఢ+ఐ= విమానమెక్కి; ఏగుచున్న= వెళుతున్న; జననిన్+చూపినన్= తల్లిని చూపగా; సంతుష్ట+అంతరంగుండు+అగుచున్= ఆనందపడిన మనస్సుగలవాడై.

**తా :** ఆ సమయంలో ధ్రువుడు ఇతరులకు ప్రవేశించడానికి అసాధ్యమైన దేవలోకానికి వెళుతూ, దీనురాలైన తన తల్లిని వదలి ఎలా వెళ్ళడం అని చింతిస్తూండగా అది గమనించిన విష్ణుభక్తులు ధ్రువునికంటె ముందు వేరే విమానంలో కూర్చొని ముందుగా పోతున్న ఆయన తల్లిని చూపించారు. అప్పుడు ధ్రువుడు పరమానందం చెందాడు.

**క. జనని సునీతిని మును గనుఁ, గొని యవల విమాన మెక్కి గొనకొని విబుధుల్
దనమీఁదఁబుష్పవర్షము, లనయముఁగురియింప ధ్రువుఁడు హర్షముతోడన్. 377**

**ప్రతి :** జనని సునీతిని= తల్లియైన సునీతిని; మును కనుఁగొని= ముందువైపు చూచి; అవల= ఆ పిదప, విమానమెక్కి; గొనకొని= ప్రయత్నపూర్వకంగా; విబుధుల్= పండితులు; తనమీఁదన్= తనపై; పుష్పవర్షములు= పూలవానలు; అనయమున్= నిరంతరంగా; కురియింపన్= కురిపింపగా, ధ్రువుఁడు; హర్షముతోడన్= సంతోషంతో.

**తా :** తల్లియైన సునీతి విమానంలో ముందుగా వెళ్లడం చూచి పిదప ధ్రువుడు విమానమెక్కాడు. పూనుకొని దేవతలతనిపై నిరంతరంగా పూలవాన కురిపించారు. అప్పుడతడు సంతోషంతో

**క. చని చని వెస గ్రహమండల, మునుఁ ద్రైలోక్యంబు సప్తమునిమండలమున్
ఘనుఁడుత్తరించి యవ్వలఁ, దనరెడు హరిపదము నొందెఁదద్దయుఁబ్రీతిన్. 378**

**ప్రతి :** చని చని= వెళ్లి వెళ్లి; వెసన్= శీఘ్రంగా; గ్రహమండలమునున్= గ్రహమండలాన్ని; త్రైలోక్యంబు= ముల్లోకాలు; సప్తమునిమండలమున్= సప్తర్షిమండలాన్ని; ఘనుఁడు= ఆ గొప్పవ్యక్తి అయిన ధ్రువుడు; ఉత్తరించి= దాటి; ఆ+వలన్+తనరెడు= ఆ తర్వాత ప్రకాశించే; హరిపదమున్= హరిస్థానాన్ని; తద్దయున్+ప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; ఒందెన్= పొందాడు.

**తా :** పోయిపోయి శీఘ్రంగా గ్రహమండలాన్ని దాటాడు. ముల్లోకాలు దాటాడు. సప్తర్షిమండలాన్ని దాటి దానికి పైపైపుగా ప్రకాశించెడి హరిపదమును ఎంతో సంతోషంతో పొందాడు.

**వ. అది మఱియు నిజకాంతిచేతం ద్రిలోకంబులం బ్రకాశింపం జేయుచు నిర్దయాగమ్యంబును శాంతులు సమదర్శనులు శుద్ధులు సర్వభూతానురంజనులు నచ్యుత భక్త బాంధవులు నయిన భద్రాచారులకు సుగమ్యంబును నయి గంభీరవేగంబు ననిమిషంబునగు జ్యోతిశ్చక్రంబు సమాహితంబై గోగణంబు మేధియందుంబోలె నెందుఁ బరిభ్రమించుచుండు, నట్టి యచ్యుత పదంబునుం బొంది విష్ణుపరాయణుండైన ధ్రువుండు త్రిలోకచూడామణియై యొప్పుచుండె. అప్పుడు భగవంతుడైన నారదుండు ధ్రువుని మహిమం గనుంగొని ప్రచేతస్సత్త్రంబునందు వీణ వాయించుచు. 379**

**ప్రతి :** అది, మఱియున్; నిజకాంతిచేతన్= తనప్రకాశంచే; త్రిలోకంబులన్= ముల్లోకాలను; ప్రకాశింపన్+చేయుచున్= కాంతిమంతంచేస్తూ; నిర్దయ+అగమ్యంబును= దయలేనివారికి చొరరానిది; శాంతులు= శాంతస్వభావులు; సమదర్శనులు= సమానంగా చూసేవారు; శుద్ధులు= పరిశుద్ధమైనవారు; సర్వభూత+అనురంజనులు= అన్నిజీవులను సంతోషపెట్టేవారు; అచ్యుత, భక్త, బాంధవులు= విష్ణుభక్తుల చుట్టాలు; అయిన, భద్ర+ఆచారులకు= శుభకార్యాలను ఆచరించేవారికి; సుగమ్యంబును+అయి= సులభంగా ప్రవేశించడానికనువై; గంభీరవేగంబును= తెలియరాని వేగముగలది; అనిమిషంబును+అగు= జాగరూకమైనది; జ్యోతిస్+చక్రంబు= గ్రహనక్షత్రతారకాదుల చక్రం; సమాహితంబు+ఐ= చక్కగా కూర్పబడినదై; గోగణంబు= గోవుల సముదాయము; మేధియందున్+పోలెన్= కట్టుగుంజ యందువలె; ఎందున్+పరిభ్రమించుచుండు= ఎక్కడ తిరుగుతూ ఉంటుందో; అట్టి అచ్యుతపదంబునున్+పొంది= ఆ విధమైన విష్ణుపదాన్ని పొంది; విష్ణుపరాయణుండు+ఐ= విష్ణువునందు భక్తిగలవాడై; ధ్రువుండు= ధ్రువుఁడు; త్రిలోకచూడామణి+ఐ= ముల్లోకాలకు మణియై; ఒప్పుచుండెన్= ప్రకాశించాడు; అప్పుడు, భగవంతుడు+ఐన= భగవంతుడైన; నారదుడు, ధ్రువుని మహిమన్+కనుంగొని= ధ్రువుని గొప్పదనాన్నిచూచి; ప్రచేతస్= ప్రచేతసులు అనే దేవఋషుల; సత్త్రంబునందున్= యజ్ఞశాలలో; వీణ వాయించుచున్= వీణ వాయిస్తూ...

**తా :** ఆ విష్ణుపదం ఇంకనూ తన కాంతిచేత మూడు లోకాలను ప్రకాశింపజేస్తోంది. ఆ లోకం దయలేనివారు ప్రవేశించలేనిది. శాంతులు, సమదర్శులు, శుద్ధులు, సర్వజీవులను సంతోషపరచువాడు, అచ్యుతుని భక్తులు, బంధువులు అయిన భద్రాచారులు సులభంగా ప్రవేశించగలిగింది. తెలియరాని వేగం, జాగ్రత్త కలిగింది ఆ హరిపదం జ్యోతిశ్చక్రమంతయును కట్టుగుంజకు చుట్టను తిరుగు గోగణమువలె తిరుగుతుంటుంది. అట్టి హరిపదాన్ని పొంది విష్ణుప్రాణుడైన ధ్రువుడు మూడులోకాలకు తలపైనుండు మణివలె భాసించాడు. అప్పుడు భగవంతుడైన నారదుడు ధ్రువుని మహిమను చూచి ప్రచేతసుల యాగంలో వీణవాయిస్తూ

**సీ. పతియె దైవంబుగా భావంబులోపలఁ దలఁచు సునీతినందను తపః ప్ర**
**భావముక్రియ ధర్మభవ్యనిష్ఠలఁబొందఁజాలరు బ్రహ్మర్షి జనము లనిన**
**క్షత్త్రియకులు నెన్నఁగా నేల? యెవ్వఁడు పంచసంవత్సరప్రాయమునను**
**సురుచి దురుక్త్యుగ్రశరభిన్నహృదయుఁడై మద్వాక్యహితబోధమతిఁ దనర్చి**

**తే. వనమునకు నేగి హరిభక్తివశత నొంది, యజితుఁడగు హరిఁదనవశుఁడై చరింపఁ**
**జేసి వెసఁదత్పదంబును జెందె, నట్టి హరిపదంబును బొంద నెవ్వరికిఁ దరము? 380**

**ప్రతి :** పతియె= భర్తయే, దైవంబుగాన్ భగవంతుడుగా; భావంబులోపలన్+తలఁచు= మనసులో భావించు; సునీతి= ధ్రువుని తల్లి సునీతి; నందను= కుమారుడైన ధ్రువుని; తపస్+ప్రభావము క్రియ= తపస్సుయొక్క ప్రభావశక్తివలె; ధర్మభవ్యనిష్ఠలన్= ధర్మముచే శుభకరమైన నిశ్చల స్వభావాన్ని; బ్రహ్మఋషి+జనములు= బ్రహ్మఋషులు; పొందన్+చాలరు+అనినన్= పొందలేరు అనగా; క్షత్రియకులున్= రాజవంశంలో పుట్టినవారిని గూర్చి; ఎన్నఁగాన్+ఏల?= ఆలోచించనేల?; పంచసంవత్సర ప్రాయమునను= ఐదేళ్ల వయస్సులో; ఎవ్వఁడు= ఎవడు; సురుచి= ఆ పేరుగల పినతల్లి; దురుక్తి+ఉగ్రశరభిన్న హృదయుఁడు+ఐ= చెడుమాటలనే భయంకర బాణాలచే కొట్టబడ్డ హృదయంగలవాడై; మత్+వాక్యహితబోధమతిన్= నా మాటలలోని హితాన్ని మనస్సులో ఎంచుకొని; తనర్చి= నిలబడి; వనమునకున్+ఏగి= అడవికి వెళ్లి; హరిభక్తివశతన్+ఒంది= విష్ణుభక్తి పారమ్యాన్ని పొంది; అజితుఁడు+అగు= ఓటమిలేని; హరిన్= విష్ణువును; తనవశుడు+ఐ= తన అధీనంలో; చరింపన్+చేసి= ఉండేలా చేసి; వెసన్= వెంటనే; తద్+పదంబును= ఆ విష్ణుపదాన్ని చెందెన్= పొందాడో; అట్టిహరిపదంబును= ఆ విధమైన విష్ణుపదాన్ని; పొందన్= చేరుటకు; ఎవ్వరికిన్+తరము= ఎవరికి సాధ్యం?

**తా :** భర్తయే దైవంగా మనస్సులో తలచుకొనే సునీతి కుమారుడైన ధ్రువుని తపఃప్రభావం వంటి ఫలాన్ని బ్రహ్మర్షులు కూడా తమ ధర్మభవ్యనిష్ఠలచేత పొందలేరంటే క్షత్రియవంశంలో జన్మించినవారి మాట చెప్పాల్సిన అవసరంలేదు. ఈ ధ్రువుడు ఐదేండ్ల చిరుప్రాయంలో సవతితల్లి సురుచి పలికిన చెడుమాటలనే బాణాలచేత చీల్చబడిన మనస్సుకలవాడై నా మాటలలోని హితబోధను మనసులో ఉంచుకొని అరణ్యానికివెళ్ళి హరిభక్తివశుడై ఓటమినెరుగని హరి తనవశుడై ఉండునట్లు చేసుకొని వేగంగా విష్ణుస్థానాన్ని పొందాడు. ఆ విధంగా హరిపదం సాధించడం ఎవరికి సాధ్యం.

**క. అని పాడె ననుచు విదురున, కనఘుఁడు మైత్రేయుఁడనియె నంచితభక్తిన్**
**వినుతోద్దామయశస్కుం, డనఁగల యా ధ్రువుని చరిత మార్యస్తుత్యా! 381**

**ప్రతి :** ఆర్యస్తుత్యా= పెద్దలచే పొగడదగినవాడా!; అనిపాడెన్+అనుచున్= ఆ విధంగా నారదుడు గానం చేశాడంటూ; అనఘుఁడు= పుణ్యాత్ముడైన; మైత్రేయుఁడు, విదురునకున్= విదురునితో; అంచితభక్తిన్= గొప్పభక్తితో; వినుత+ఉద్దామ యశస్కుండు+అనగల= ప్రస్తుతింపదగిన ఘనకీర్తి కలవాడనదగిన; ఆ, ధ్రువునిచరితము= ఆ ధ్రువుని గాథను; అనియెన్= చెప్పాడు.

**తా :** ఆర్యస్తుత్యా! అని గానంచేశాడు అంటూ విదురునకు మైత్రేయుడు చెప్పాడు, అంచిత భక్తిచేత ప్రస్తుతించదగిన ఘనకీర్తిశాలియగు ధ్రువుని చరిత్ర.

**సీ. మహితసత్పురుషసమ్మతమును ధన్యంబు స్వర్గప్రదంబు యశస్కరంబు**
**నాయుష్కరంబుఁబుణ్యప్రదాయకమును మంగళకర మఘమర్షణంబు**
**సౌమనస్యముఁ బ్రశంసాయోగ్యమును బాపహరమును ధ్రువపదప్రాపకంబు**
**నై యొప్పు నీ యుపాఖ్యానంబుఁ దగ నీకు నెఱిఁగించితిని దీని నెవ్వఁడేని**

**తే. తివుట శ్రద్ధాగరిష్ఠుఁడై తీర్థపాద, చరణ సరసీరుహద్వయాశ్రయుఁడు నగుచు**
**భవ్యచరితు దినాంతప్రభాతవేళ, లను సినీవాలి పూర్ణిమ లందు మఱియు. 382**

**ప్రతి :** మహిత సత్పురుష సమ్మతమును= గొప్పవారైన మంచివారి కంగీకారమైనది; ధన్యంబు= శ్రేష్ఠమైనది, స్వర్గప్రదంబు= స్వర్గసౌఖ్యాన్ని అందించేది; యశస్కరంబు= కీర్తినందించేది; ఆయుష్+కరంబున్= ఆయుర్దాయాన్ని వృద్ధి పొందించేది; పుణ్యప్రదాయకమును= పుణ్యాన్ని ఇచ్చేది; మంగళకరము= శుభాలను కలిగించేది; అఘమర్షణంబు= పాపాలను పోగొట్టేది; సౌమనస్యము= మంచిమనస్సు కలిగించేది; ప్రశంసాయోగ్యమును= పొగడదగినది; పాపహరమును= పాపాలు పోగొట్టేది; ధ్రువపదప్రాపకంబు= ధ్రువునిస్థానాన్ని పొందజేసేది; ఐ+ఒప్పు= ఐనదైన; ఈ ఉపాఖ్యానంబున్= ఈ గాథను; తగన్+నీకు+ ఎఱింగించితిని= ఉచిత రీతిలో నీకు తెలిపాను; దీనిన్= దీనిని; ఎవ్వఁడు+ఏనిన్= ఎవరైనా; తివుటన్= కోరికతో; శ్రద్ధాగరిష్ఠుఁడు+ఐ= అధికమైన శ్రద్ధగలవాడై; తీర్థపాద= విష్ణువుయొక్క; చరణ సరసీరుహ ద్వయాశ్రయుఁడున్+అగుచున్= పాదపద్మాలజంటను ఆశ్రయించిన వాడవుతూ; భవ్యచరితున్= ఆ పుణ్యచరిత్రుని; దిన+అంత= సాయంకాలాలలోను; ప్రభాతవేళలను= సూర్యోదయాలలోను; సినీవాలి= చంద్రకళ కనిపించే అమావాస్యలు; పూర్ణిమలు+ అందు= పూర్ణిమలలో, మఱియు.

**తా :** గొప్పవారైన సజ్జనులు సమ్మతించేది, ధన్యతనుగూర్చి స్వర్గాన్ని అందించేది, యశస్సును, ఆయుస్సును, పుణ్యాన్ని, శుభాలను కలిగించి పాపాలను తొలగించి మంచి మనస్సును కలిగించేది, ప్రశంసాయోగ్యమైనది, పాపాలను నశింపజేసేది, ధ్రువపదానుగ్రహాన్ని కలిగించేది అయినట్టి ఉపాఖ్యానాన్ని నీకు చెప్పాను. దీనినెవడైనా కోరికతో అధికశ్రద్ధతో తీర్థములను (గంగను) పాదమునందు కలిగిన విష్ణువు పాదపద్మముల నాశ్రయించినవాడై ఆ పుణ్యచరిత్రుడైన ధ్రువుని సాయంకాలాలలోను, సూర్యోదయ సమయాలలోను చంద్రకళతో కూడిన అమావాస్యనాడును పూర్ణిమలయందును ఇంకనూ

**విశే:** ధ్రువుని కథ సత్ప్రవర్తనం, వినయ విధేయతలు, ధర్మస్వరూపం మొదలైన విషయాలను ఉపదేశించే సన్నివేశాలు కలది.

**తే. ద్వాదశిని పద్మ బాంధవ వాసరమున, శ్రవణనక్షత్రమున దినక్షయమునందుఁ**
**బరఁగ సంక్రమణ వ్యతీపాతలందు, సభల భక్తిని వినునట్టి సజ్జనులకు. 383**

**ప్రతి :** ద్వాదశినిన్= ద్వాదశితిథినాడు; పద్మబాంధవవాసరమునన్= ఆదివారమునాడు; శ్రవణ నక్షత్రమునన్= శ్రవణానక్షత్రంనాడు; దినక్షయమునందున్= శూన్యతిథినాడు; పరఁగన్ సంక్రమణ= ఉత్సాహంతో సూర్యుడు రాశిమారిన సంక్రమణం రోజు; వ్యతీపాతలందు= వ్యతీపాత యోగమునాడు; సభలన్= సభలలో; భక్తిన్= భక్తితో; వినునట్టి= వినే; సజ్జనులకు= మంచివారికి.

**తా :** ద్వాదశిరోజు, ఆదివారాలలో, శ్రవణానక్షత్రంలో, శూన్యతిథిలో, సంక్రమణదినాలలో, వ్యతీపాతయోగంతో కూడినరోజు భక్తితో వినే సజ్జనులకు...

**విశే :** యోగము – పంచాగములలో యోగము ఒకటి. ఇవి 27 వీటిలో వ్యతీపాతయోగము ధ్రువచరిత్ర పారాయణానికి శ్రేష్ఠతరమైనది.

**వ. క్లేశనాశంబును మహాప్రకాశంబును నైన భగవద్భక్తియు శీలాదిగుణంబులును గలుగు; మఱియుఁ దేజఃకామునకుఁ దేజంబును, మనఃకామునకు మనంబును, నిష్కామునకుఁ దత్త్వవిజ్ఞానంబును గలుగు. దీని వినిపించు వారికి దేవతానుగ్రహంబు గలుఁగు; నిట్టి యుపాఖ్యానంబు నీ కెఱింగించితి నని మైత్రేయుండు విదురునకుఁ జెప్పిన క్రమంబున శుకయోగి పరీక్షిత్తున కెఱింగించిన తెఱంగున సూతుండు శౌనకాదులకు వినిపించి వెండియు నిట్లనియె; నట్లు సెప్పిన మైత్రేయునింగని విదురుండిట్లనియె. 384**

**ప్రతి :** క్లేశనాశంబును= దుఃఖాన్ని పోగొట్టేది; మహాప్రకాశంబును+ఐన= గొప్ప తేజస్సుగలదైన; భగవత్+భక్తియున్= భగవంతునిపై భక్తి; శీలాదిగుణంబులును కలుగు= మంచినడత మొదలైన గుణాలు కలుగుతాయి; మఱియున్= అంతేకాక; తేజస్+కామునకున్= తేజస్సుకోరినవానికి, తేజంబును; మనస్+కామునకున్= మనస్సును కోరేవానికి, మనంబును; నిస్+కామునకున్= ఏ కోరికలు లేనివానికి; తత్త్వవిజ్ఞానంబును= ఆధ్యాత్మిక జ్ఞానం, కలుగున్, దీని వినిపించువారికి; దేవతా+అనుగ్రహంబు కలుఁగున్= దేవుని దయ లభిస్తుంది; ఇట్టి ఉపాఖ్యానంబు= ఇలాంటి కథను; నీకు+ఎఱింగించితిన్= నీకు చెప్పాను, అని మైత్రేయుండు; విదురునకున్+చెప్పిన క్రమంబునన్= విదురున కుపదేశించినరీతిగా, శుకయోగి; పరీక్షిత్తునకు+ఎఱింగించిన తెఱంగునన్= పరీక్షిన్మహారాజునకు చెప్పిన పద్ధతిలో, సూతుండు; శౌనకాదులకు= శౌనకాది మహర్షులకు, వినిపించి; వెండియున్+ఇట్లు+అనియెన్= మరలా ఇలా అన్నాడు; అట్లు+చెప్పినన్= ఆ విధంగా చెప్పిన; మైత్రేయునిన్+కని= మైత్రేయ మహర్షిని చూచి; విదురుండు+ఇట్లు+అనియెన్= విదురుడిలా అన్నాడు.

**తా :** దుఃఖం తొలగిపోతుంది. మహాప్రకాశం కలిగిన భగవద్భక్తి, శీలాది గుణములు కలుగుతాయి. తేజస్సు కోరుకొనేవానికి తేజస్సు, మనస్సును కోరుకొనేవానికి మనస్సును కోరికలులేనివానికి తత్త్వజ్ఞానం లభిస్తుంది. దీనిని వినిపించే వారికి దైవానుగ్రహం లభిస్తుంది. అట్టి కథను నీకు చెప్పానని మైత్రేయుడు విదురునకు చెప్పిన విధంగా, శుకమహర్షి పరీక్షిన్మహారాజుకు చెప్పిన విధంగా సూతుడు శౌనకాది మహర్షులకు వినిపించి తిరిగి ఇట్లన్నాడు. అలా చెప్పిన మైత్రేయుని చూచి విదురుడిలా అన్నాడు.

**సీ. అనఘాత్మ! నారదమునిపతి ధ్రువచరిత్రము ప్రచేతసుల సత్త్రంబునందు**
**నర్థిమైఁగీర్తించె నంటి; ప్రచేతసులన నెవ్వ రెవ్వరి తనయు? లెట్టి**
**వంశజుల్? సత్త్ర మెవ్వలనను జేసి? రధ్వరమందు నిజకులధర్మశీలు**
**రగు ప్రచేతసులచే యజియింపఁగాఁబడె యజ్ఞపురుషుఁ డెట్టు లచ్యుతాంఘ్రి**

**తే. భక్తియుక్తుఁడు విదితసద్భాగవతుఁడు, దివిరి హరిపాదసేవావిధి ప్రయుక్త**
**దేవదర్శనుఁడగు నట్టి దివ్యయోగి, నారదుండెట్లు గొనియాడె శౌరికథలు? 385**

**ప్రతి :** అనఘ+ఆత్మ!= పుణ్యాత్ముడా!; నారద మునిపతి= నారదముని శ్రేష్ఠుడు, ధ్రువచరిత్రము; ప్రచేతసుల సత్త్రంబునందు= ప్రచేతసుల యజ్ఞంలో; అర్థిమైన్= కోర్కెతో; కీర్తించెన్+అంటివి= కీర్తించాడని చెప్పావు; ప్రచేతసులు+అనన్+ఎవ్వరు= ప్రచేతసులనగా ఎవ్వరు?; ఎవ్వరి తనయులు= ఎవరి కుమారులు?; ఎట్టివంశజుల్= ఏ వంశంలో పుట్టారు?; సత్త్రము+ఏ+వలనను+చేసిరి= యజ్ఞము ఏ దిక్కున చేశారు?; అధ్వరమందున్= యజ్ఞంలో; నిజకులధర్మశీలురు+అగు= తమ వంశధర్మాన్ని

అవలంబించే సత్త్రప్రవర్తనగలవారైన, ప్రచేతసులచే; యజ్ఞపురుషుఁడు= యజ్ఞానికి మూలపురుషుడు; ఎట్టులు= ఏవిధంగా; యజియింపఁగాఁబడెన్= పూజింపబడెను; అచ్యుత+అంఘ్రి భక్తియుక్తుఁడు= విష్ణుపాదాలపై భక్తి నెలకొన్నవాడు; విదిత= విఖ్యాతుడైన; సత్+భాగవతుఁడు= మంచి భక్తుడు; తివిరి= అధికముగా; హరిపాదసేవా= విష్ణుపాదాలను సేవించడంలో; విధిప్రయుక్త= విధానముతో ప్రయోగింపబడిన; దేవదర్శనుఁడు అగునట్టి= భగవద్దర్శనము కలవాడైన; దివ్యయోగి= మహానుభావుడైన ఋషి, నారదుండు; ఎట్లు= ఏ విధంగా; శౌరికథలు= విష్ణుని కథలను; కొనియాడెన్= ప్రస్తుతించెను.

**తా :** ఓ పుణ్యాత్మా! నారదమహర్షి ఈ ధ్రువుని గాథను ప్రచేతసులు నిర్వహించిన సత్త్రయాగంలో అధికంగా కీర్తించాడని చెప్పితిరి. ఈ ప్రచేతసులు ఎవ్వరు? ఎవరి కుమారులు? ఏ వంశంలో జన్మించారు? యజ్ఞాన్ని ఎక్కడ నిర్వహించారు? యజ్ఞపురుషుణ్ణి యజ్ఞంలో ప్రచేతసులు ఎలా కొలిచారు? విష్ణుపదసేవా పరాయణుడు, భాగవతోత్తముడు, దైవదర్శనంగలవాడు అయిన ఆ దివ్యయోగి నారదుడు విష్ణుకథాగానం ఎలా చేశాడు?

**క. నాకిపు డెఱిఁగింపుము సు, శ్లోకుని చరితామృతంబు శ్రోత్రాంజలులం**
**బైకొని జుఱ్ఱియుఁ దనివిం, గైకొనకున్నది మనంబు గరుణోపేతా! 386**

**ప్రతి :** కరుణా+ఉపేతా= దయతోకూడినవాడా!; సుశ్లోకుని= చక్కగా కీర్తింపదగ్గ ప్రవర్తనం గలవాని; చరిత+అమృతంబున్= కథామృతాన్ని; శ్రోత్ర+అంజలులన్= చెవులనే దోసిళ్లతో; పైకొని= అధికంగా; జుఱ్ఱియున్= త్రాగియు; మనంబు= మనస్సు; తనివిన్+కైకొనక+ఉన్నది= తృప్తి పడకుండా ఉంది; నాకు, ఇపుడు+ఎఱిఁగింపుము= ఇప్పుడు తెలుపండి.

**తా :** దయామయా! మైత్రేయ మహర్షీ! కీర్తించదగినవాడైన ధ్రువుని చరిత్ర అనే అమృతాన్ని చెవులనే దోసిళ్ళతో ఎంత త్రాగినా నా మనస్సు తృప్తి చెందకుండా ఉన్నది. ఆ చరిత్ర నా కిప్పుడు చెప్పండి.

**క. అని యడిగిన విదురునిఁ గనుఁ, గొని మైత్రేయుండు పలికె గొనకొని ధ్రువుఁడున్**
**వనమునకుఁజనిన నాతని, తనయుండగు నుత్కలుండు దళితాఘుండై. 387**

**ప్రతి :** అని+అడిగిన, విదురునిన్+కనుఁగొని= విదురుని చూచి, మైత్రేయుండు పలికెన్= మైత్రేయుడు అన్నాడు, గొనకొని= ప్రయత్నించి, ధ్రువుఁడున్, వనమునకున్+చనినన్= అడవికి వెళ్లగా, ఆతని తనయుండు+అగు= ఆయన కుమారుడైన, ఉత్కలుండు= ఉత్కళుడు, దళిత+అఘుండు+ఐ= పాపాలు తొలగినవాడై.

**తా :** అని అడిగిన విదురుని చూచి మైత్రేయుడు ఇలా అన్నాడు. ధ్రువుడు ప్రయత్నపూర్వకంగా అడవికి వెళ్లగా అతని కుమారుడైన ఉత్కళుడు పాపాలు తొలగి

**సీ. చతురుఁడాజన్మప్రశాంతుండు నిస్సంగుఁడును సమదర్శనుండును ఘనుండు**
**నై యాత్మయందు లోకావళి, లోకంబులందు నాత్మను జూచు చనఘమైన**
**యనుపమయోగక్రియాపావకాదగ్ధ కర్మమలాశయకలనఁబేర్చి**
**జడునికైవడి జీఁకుచందంబునను మూకు పగిది నున్మత్తుని భంగిఁజెవిటి**
**తే. వడువునను గానఁబడుచు సర్వజ్ఞుఁడై ప్ర, శాంతకీలహుతాశనుసరణిఁబొల్చి**
**సతతశాంతంబు నంచితజ్ఞానమయము, నైన బ్రహ్మస్వరూపంబు నాత్మఁదలఁచి. 388**

**ప్రతి :** చతురుఁడు= చాతుర్యంగలవాడు; ఆ జన్మ ప్రశాంతుండు= పుట్టుకతో శాంతమూర్తి; నిస్సంగుఁడును= ఏమీ అంటనివాడును; సమదర్శనుండును= అందరిపై సమభావంగలవాడును; ఘనుండును+ఐ= గొప్పవాడై, ఆత్మయందున్= ఆత్మలో; లోకావళి= సమస్తలోకాలను; లోకంబులందున్= లోకాలలో; ఆత్మను+చూచుచున్= ఆత్మను దర్శిస్తూ; అనఘము+ఐన= పాపరహితమైన; అనుపమ= సాటిలేని; యోగక్రియాపావక= యోగాన్ని ఆచరించే అభ్యాసమనే నిప్పుచే; ఆదగ్ధ= పూర్తిగా కాల్చబడిన; కర్మమలాశయకలనన్= కర్మలకున్న మలినాలైన సంకల్పాలకూడికచే; పేర్చి= అతిశయించి; జడునికైవడిన్= మూర్ఖునివలె; చీఁకు చందంబునను= గుడ్డివానివలె; మూకుపగిది= మూగవానివలె; ఉన్మత్తునిభంగిన్= పిచ్చివానివలె; చెవిటివడువునను= చెవిటివానివలె; కానఁబడుచు= కనబడుతూ; సర్వజ్ఞుఁడు+ఐ= సమస్తము తెలిసినవాడై; ప్రశాంతకీల= చల్లారిన జ్వాలగల; హుతాశనుసరణిన్+పొల్చి= అగ్నిదేవునివలె ఒప్పి; సతతశాంతంబున్= ఎల్లప్పుడు శాంతగుణము కలది; అంచితజ్ఞానమయమును+ఐన= తగిన జ్ఞానంతో నిండినది అయిన; బ్రహ్మస్వరూపంబును= బ్రహ్మరూపాన్ని; ఆత్మన్+తలఁచి= మనస్సులో భావించి...

**తా :** చాతుర్యం కలిగినవాడు. పుట్టుకతోనే శాంతమూర్తి. ఏమీ అంటనివాడు. అందరినీ సమభావంతో చూచేవాడు, ఘనుడును అయి తనలో లోకాలను, లోకాలలో తనను చూస్తూ పాపరహితమైన సాటిలేని యోగాభ్యాసం అనే అగ్నిలో కర్మవాసనలను దహింపజేశాడు. అతిశయించి మందబుద్ధివలె, గ్రుడ్డివానివలె, మూగవానివలె, పిచ్చివానివలె, చెవిటివానివలె ప్రవర్తించాడు. అతడు సర్వజ్ఞుడు కావడంవల్ల మంటలు చల్లారిన నిప్పువలె ఉండేవాడు. నిరంతర శాంతమూ, పూజనీయమూ, జ్ఞానమయమైన బ్రహ్మస్వరూపాన్ని మనస్సులో భావిస్తూ...

**క.** **తనకంటె నితర మొక టెఱుఁగ, గని కతమున సార్వభౌమకశ్రీఁబొందన్**
**మనమునఁ గోరక యుండుటఁ, గని కులవృద్ధులును మంత్రిగణములు నంతన్.** **389**

**ప్రతి :** తనకంటెన్= తనకన్న; ఇతరమొకటి+ఎఱుఁగనికతమునన్= మరొకటి తెలియని కారణముచే; సార్వభౌమకశ్రీన్+పొందన్= చక్రవర్తి పదవీ సంపదను పొందడానికి; మనమునన్+కోరక+ఉండుటన్+కని= మనస్సులో కోరకపోవడాన్ని చూచి; కులవృద్ధులును= కులంలో పెద్దలూ; మంత్రిగణములున్= మంత్రి సముదాయం; అంతన్= అప్పుడు.

**తా :** తనకంటె ఇతరం ఎరుగని కారణంచేత సార్వభౌమక సంపదను పొందుటకు మనస్సులో కోరుకోకపోకుండుటను చూచి మంత్రులు, కులవృద్ధులు అప్పుడు.

**వ.** **అతని నున్మత్తునిం గాఁ దెలిసి తదనుజుండైన వత్సరునికిఁ బట్టంబు గట్టి; రా వత్సరునికి సర్వర్ధి యను భార్యయందుఁ బుష్పార్ణుండును జంద్రకేతుండును నిషుండును నూర్జుండును వసువును జయుండును నన నార్వురు తనయులు గలిగి; రందుఁ బుష్పార్ణుండను వానికిఁ బ్రభయు దోషయు నను నిద్దఱు భార్యలై; రందుఁ బ్రభ యనుదానికిం బ్రాతర్మధ్యందిన సాయంబు లను సుతత్రయంబును దోషయను దానికిఁ బ్రదోషనిశీథ వ్యుష్టు లనువారు ముగ్గురును బుట్టి; రందు వ్యుష్టుండను వానికిఁ బుష్కరిణియను పత్నియందు సర్వతేజుండను సుతుండు పుట్టె; వానికి నాకూతి యను మహిషివలనఁ జక్షుస్సంజ్ఞుండయిన మనువు జనియించె; వానికి నడ్వల యను భార్యయందుఁ బురువును, గుత్సుండును, త్రితుండును, ద్యుమ్నుండును, సత్యవంతుండును,**

**ఋతుండును, వ్రతుండును, నగ్నిష్టోముండును, నతిరాత్రుండును, ప్రద్యుమ్నుండును, శిబియును, నుల్ముకుండును నను పన్నిద్దఱు తనయులు గలిగి, రందు నుల్ముకునికిఁ బుష్కరిణియను దానివలన నంగుండును, సుమనసుండును, ఖ్యాతియుఁ, గ్రతువును, నంగిరసుండును, గయుండును నను నార్వురు కొడుకులు పుట్టి; రందు నంగునికి సునీథ యనుధర్మపత్నివలన వేనుండను పుత్రుం డుదయించిన. 390**

**ప్రతి :** అతనిన్= ఉత్కలుని; ఉన్మత్తునిన్‌కాన్+తెలిసి= పిచ్చివానిగా భావించి; తద్+అనుజుండు+ఐన= అతని తమ్ముడైన; వత్సరునికిన్= వత్సరునికి; పట్టంబు+కట్టిరి= పట్టాభిషేకం చేశారు, ఆ వత్సరునికి; సర్వర్థి+అనుభార్యయందున్= సర్వర్థి అనేపేరుగల భార్యద్వారా; పుష్పార్ణుండును, చంద్రకేతుండును, ఇషుండును, ఊర్జుండును; వసువును; జయుండును+అనన్= పుష్పార్ణుడు, చంద్రకేతుడు, ఇషుడు, ఊర్జుడు, వసువు, జయుడు అనే; ఆర్వురుతనయులు= ఆరుగురు కొడుకులు; కలిగిరి= జన్మించిరి; అందున్= వారిలో; పుష్పార్ణుండు+అనువానికిన్= పుష్పార్ణుడు అనే వానికి; ప్రభయు దోషయు+అను= ప్రభ, దోష అనే ఇద్దఱు, భార్యలు+ఐరి= భార్యలయ్యారు; అందున్+ప్రభ+అను, దానికిన్= వారిలో ప్రభ అనే ఆమెకు; ప్రాతస్= ఉదయము, మధ్యందిన= మధ్యాహ్నం, సాయంబులు+అను= సాయంకాలాలనే, సుతత్రయంబునున్= ముగ్గురుకుమారులు, దోష, అను, దానికిన్= దోషఅనే ఆమెకు, ప్రదోషనిశీథవ్యుష్టులు= ప్రదోషము, నిశీథం, వ్యుష్టి అనబడే ముగ్గురును పుట్టిరి, అందు వ్యుష్టుండనువానికి, పుష్కరిణి, అనుపత్నియందు= పుష్కరిణి అనే భార్యద్వారా, సర్వతేజుండు+అను, సుతుండు+పుట్టెన్= కుమారుడు కలిగాడు, వానికిన్, ఆకూతి, అను, మహిషివలన= ఆకూతి అనే రాణిద్వారా, చక్షుస్+సంజ్ఞుండు+అయిన= చక్షుస్సుఅనే పేరుగల, మనువు జనియించెన్= మనువు పుట్టాడు, వానికిన్, నడ్వల అను, భార్య, అందున్= నడ్వల అనుపేరుగల భార్యయందు; పురువును, కుత్సుండును, త్రితుండును, ద్యుమ్నుండును, సత్యవంతుండును, ఋతుండును, వ్రతుండును, అగ్నిష్టోముండును, అతిరాత్రుండును, ప్రద్యుమ్నుండును, శిబియును, ఉల్ముకుండును, అను పన్నిద్దఱు తనయులు= అనబడే పన్నెండుమంది కుమారులు; కలిగిరి= జన్మించిరి; అందు, ఉల్ముకునికిన్, పుష్కరిణి, అను, దానివలనన్= పుష్కరిణి అను భార్యవల్ల; అంగుండును, సుమనసుండును, ఖ్యాతియున్, క్రతువును, అంగిరసుండును, గయుండును – అను ఆర్వురు కొడుకులు; పుట్టిరి; అందున్= వారిలో; అంగునికి, సునీథ, అను= సునీథ అనుపేరుగల; ధర్మపత్నివలన= భార్యద్వారా, వేనుండను పుత్రుండు= వేనుడనే కుమారుడు, ఉదయించినన్= పుట్టగా

**తా :** వారు ఉత్కలుని పిచ్చివానిగా భావించి అతని తమ్ముడైన వత్సరునికి పట్టంగట్టారు. ఆ వత్సరునికి సర్వర్థి అనే భార్యవల్ల పుష్పార్ణుడు, చంద్రకేతుడు, ఇషుడు, ఊర్జుడు, వసువు, జయుడు అనే ఆరుగురు కొడుకులు కలిగారు. వారిలో పుష్పార్ణునకు ప్రభ, దోష అనేవారు ఇద్దరు భార్యలు. అందులో ప్రభకు ప్రాతర్మధ్యందినసాయములు అనే ముగ్గురు కొడుకులు జన్మించారు. దోషకు ప్రదోషుడు, నిశీథుడు, వ్యుష్టుడు అనే ముగ్గురు కొడుకులు పుట్టారు. అందులో, వ్యుష్టుడనే వానికి పుష్కరిణి అనే భార్యవల్ల సర్వతేజుడు అనేకొడుకు పుట్టాడు.

ఆ సర్వతేజునకు 'ఆకూతి' అనే భార్యద్వారా చక్షుస్సు అనేపేరుగల మనువు జన్మించాడు. చక్షుస్సునకు నడ్వల అనే భార్యయందు పురువు, కుత్సుడు, త్రితుడు, ద్యుమ్నుడు, సత్యవంతుడు, ఋతుడు, వ్రతుడు, అగ్నిష్టోముడు, అతిరాత్రుడు, సుద్యుమ్నుడు, శిబి, ఉల్ముకుడు అనే పన్నెండుమంది పుత్రులు జన్మించారు. వారిలో ఉల్ముకునికి పుష్కరిణి అనే భార్యవల్ల అంగుడు, సుమనసుడు, ఖ్యాతి, క్రతువు, అంగిరసుడు, గయుడు అనే ఆరుగురు కొడుకులు కలిగారు. అందులో అంగునికి సునీథ అనే భార్యద్వారా వేనుడు అనే కొడుకు పుట్టాడు.

**మ. క్షితినాథోత్తముఁ డాత్మనందనుని దుశ్శీలంబు వీక్షించి దుః**
**ఖితుఁడై యొంటిగఁ దత్పురిన్ వెడలి యేగెన్ వేగ నెందేని త**
**ద్గతి వీక్షించి మునీశ్వరుల్ గుపితులై దంభోళిసంకాశ వా**
**క్యతతిం జావ శపింప వాఁ డపుడు వీఁకం గూలె, న మ్మేదినిన్. 391**

**ప్రతి :** క్షితినాథ+ఉత్తముఁడు= రాజులలో శ్రేష్ఠుడు; ఆత్మనందనుని= తనకుమారుని; దుస్+శీలంబు= చెడు ప్రవర్తనను; వీక్షించి= చూచి; దుఃఖితుఁడై= బాధపడి (చింతించి); ఒంటిగన్= ఒంటరిగా; తత్+పురిన్= ఆ నగరాన్ని; వెడలి= విడిచి; ఎందు+ఏని= ఎక్కడికో; వేగన్+ఏగెన్= వేగంగా వెళ్లిపోయాడు; తద్+గతి= అలా పోవడం; వీక్షించి= చూచి; ముని+ఈశ్వరులు= ఋషిశ్రేష్ఠులు; కుపితులు+ఐ= కోపించినవారై; దంభోళిసంకాశ= వజ్రాయుధంతో సమానమైన; వాక్యతతిన్= మాటలతో; చావ శపింపన్= మరణింతువు గాక అని శపించగా; ఆ+మేదినిన్= ఆ భూమిపై; వాఁడు+అపుడు= వాడాసమయంలో; వీఁకన్+కూలెన్= దీనుడై కూలిపోయాడు.

**తా :** ఉత్తమ ప్రభువైన అంగరాజు తనకుమారుడైన వేనుని చెడునడవడికను చూచి బాధపడి ఒంటరిగా రాజధాని నగరాన్ని వదలి ఎక్కడికో వేగంగా వెళ్లిపోయాడు. అంగరాజు అట్లు పోవుటను చూచి మునీశ్వరులు కోపించి వజ్రసమానమైన వాక్కులతో వేనుని "చావు"మని శపించగా అతడు దీనుడై నేలపైబడి అశువులు వీడాడు.

**సీ. కైకొని యపుడు లోకంబరాజకమైనఁ బ్రజలు దస్కరపీడఁబల్లటిల్లఁ**
**గనుఁగొని దుఃఖించి మునులు గతాసుఁడై పడిన వేనుని వలపలి భుజంబు**
**నర్థి మథింప నారాయణాంశంబున నాదిరాజన నొప్పునట్టి పృథుఁడు**
**జనియించె ననవుడు విని విదురుఁడు మునిఁ గనుఁగొని పలికె నో యనఘచరిత!**

**తే. సాధువు సుశీలనిధియును సజ్జనుండు, నలఘుబ్రహ్మణ్యుఁడును నైనయట్టి యంగ**
**ధరణివిభునకు దుష్టసంతాన మెట్లు, గలిగె? నయ్యంగపతి యేమి కారణమున. 392**

**ప్రతి :** అపుడు, లోకంబు+అరాజకము+ఐనన్= లోకంలో రాజులేని పరిస్థితి ఏర్పడగా, ప్రజలు, తస్కరపీడన్= దొంగలబాధచే; పల్లటిల్లన్= తల్లడిల్లగా; కనుఁగొని= చూచి; మునులు దుఃఖించి= ఋషులు బాధపడి; కైకొని= పూనిక వహించి; గత+అసుఁడై పడిన= ప్రాణాలు పోయినవాడై పడి ఉన్న; వేనుని వలపలి భుజంబున్= వేనుని కుడిభుజాన్ని; అర్థిన్= కోర్కెతో; మథింపన్= మర్దించగా; నారాయణ+అంశంబునన్= నారాయణుని అంశలో; ఆదిరాజు+అనన్+ఒప్పునట్టి= మొదటి ప్రభువు అన తగినట్టి; పృథుఁడు+జనియించెన్= పృథువు పుట్టాడు; అనవుడు విని= అని అనగా విని, విదురుఁడు; మునిన్+కనుగొని= మునిని చూచి; పలికెన్= ఇలా అన్నాడు; ఓ అనఘచరిత= ఓ పుణ్యచరిత్ర గలవాడా!; సాధువు= మంచినడవడిగలవాడు; సుశీలనిధియును= మంచి స్వభావానికి నిధి వంటివాడు; సజ్జనుండున్= మంచివాడు; అలఘు బ్రహ్మణ్యుఁడును+ ఐన+అట్టి= వేదధర్మాలను అనుష్ఠించివారిలో అధికుడు అయిన; అంగ ధరణివిభునకు= అంగరాజునకు; దుష్టసంతానము= చెడ్డకుమారుడు; ఎట్లు కలిగెన్?= ఎలా పుట్టాడు? ఆ+అంగపతి= ఆ అంగరాజు; ఏమి కారణమునన్= ఏ కారణంతో.

**తా :** ఆ సమయంలో రాజ్యం రాజు లేనిదైంది. ప్రజలు దొంగలబాధచే తల్లడిల్లారు. అదిచూచి దుఃఖించిన మునులు పూనిక వహించి మరణించిన వేనుని కుడిభుజాన్ని మర్దించారు. అప్పుడు నారాయణాంశతో తొలిరాజు అనదగిన పృథువు జన్మించాడు.

విదురు డామాటలు విని మైత్రేయునితో ఇలా అన్నాడు. ఓ పుణ్యాత్ముడా! సత్ప్రవర్తనగలవాడు, సజ్జనుడు, సుశీలుడు, వేదవిదుడు అయిన అంగరాజుకు చెడు సంతానం ఎలా కలిగింది? ఆ అంగరాజు ఏ కారణంతో

**వ. విమనస్కుం డగుచుఁ బురంబు విడిచె? ధర్మకోవిదులైన మునులు దండవ్రతధరుండును, రాజును నగు వేనునియందు నే పాపంబు నిరూపించి బ్రహ్మదండంబొనర్చి రదియునుంగాక లోకంబున రాజులు లోకపాల తేజోధరులుఁ, బ్రజాపాలనాసక్తులుఁ గావునఁ గల్మషంబు గలిగినం బ్రజలచేత నవజ్ఞార్హులై యుందురు గావున నా వేనుని చరిత్రంబు శ్రద్ధాగరిష్ఠుండు భక్తుండునైన నాకుం బరాపరవిదగ్రేసరుండ వయిన నీ వెఱింగింప నర్హుండ వనిన మైత్రేయుం డతని కిట్లనియె. 393**

**ప్రతి :** విమనస్కుండు+అగుచున్= వికలమైన మనస్సుగలవాడై; పురంబు విడిచెన్= ఊరు విడిచి వెళ్లాడు; ధర్మకోవిదులు+ఐన= ధర్మం బాగా తెలిసిన, మునులు; దండవ్రతధరుండును= తప్పు చేసినవారిని దండించడమే వ్రతంగా కలవాడును; రాజును+అగు= రాజును అయిన, వేనునియందున్; ఏ పాపంబు నిరూపించి= ఏ పాపాన్ని చూపి; బ్రహ్మదండంబు+ఒనర్చిరి= శక్తిచే దండించిరి; అదియునుంగాక= అదీగాక; లోకంబునన్= లోకంలో, రాజులు; లోకపాలతేజోధరులున్= లోకపాలకుల తేజస్సు ధరించినవారు; ప్రజాపాలనాసక్తులున్= ప్రజలను పరిపాలించే యోచనగలవారు, కావునన్; కల్మషంబు+కలిగినన్= పాపం కలిగిన, ప్రజలచేతన్= జనులచే; అవజ్ఞా+అర్హులు+ఐ= అవమానానికి తగినవారై; ఉందురు= ఉంటారు; కావునన్= కాబట్టి; ఆ వేనుని చరిత్రంబు= ఆ వేనుని కథ; శ్రద్ధాగరిష్ఠుండు= ఆసక్తి అధికంగాగల; భక్తుండును+ఐన= భక్తుడైన, నాకున్; పరాపరవిత్+అగ్రేసరుండవు+అయిన= పైలోకం, ఇహలోకాలకు సంబంధించిన విషయాలు తెలిసిన వారిలో శ్రేష్ఠుడవైన; నీవు+ఎఱింగింపన్= నీవే చెప్పడానికి; అర్హుండవు+అనినన్= సమర్థుడవని అనగా, మైత్రేయుండు; అతనికి+ఇట్లు+అనియెన్= అతనితో ఇలా అన్నాడు.

**తా :** (అంగరాజు) మనస్సు వికలమై పురం వదలి వెళ్లిపోయాడు. ధర్మం తెలిసిన మునులు దండనను వ్రతంగాగల వారును, రాజును అయిన వేనుని చంపారన్నావు. అతనిపై ఎలాంటి నేరారోపణంచేసి బ్రహ్మదండంతో చంపారు? అంతేకాక రాజులైనవారు, లోకపాలకుల తేజస్సునుకలిగి ప్రజాపాలనలో ఆసక్తిగలవారుగా ఉంటారు. అలాంటివారిలో పాపం వుంటే వారికి తప్పక ప్రజలనుండి అవమానం కలుగుతుంది. ఇహపరలోకాల రహస్యాలు కూలంకషంగా తెలిసిన నీవుమాత్రమే ఇందులో విశేషాలు చెప్పగలవు. కాబట్టి, వేనుని చరిత్రను అధికమైన ఆసక్తిని భక్తిని కలిగిన నాకు వివరంగా చెప్పుమని విదురుడు కోరగా మైత్రేయుడిలా అన్నాడు.

## a =అంగపుత్రుండగు వేనుని చరిత్ర a

**సీ. అనఘాత్మ! రాజర్షి యైనట్టి యయ్యంగ మేదినీవిభుఁడశ్వమేధమఖము**
**గావింప ఋత్విజ్నికాయంబు చేత నా హూత మయ్యును సురవ్రాత మందు**

**నాత్మ హవిర్భాగ మందరాకుండిన నప్పుడు ఋత్విక్కు లద్భుతంబు**
**నందుచు యజమానుఁడైన యయ్యంగ మహీవరుఁ జూచి రాజేంద్ర; యిట్లు**

**తే. త్రిదశులిదె పిల్వఁబడియును దివిరి యాత్మ, భాగములఁ బొంద రారైరి భవ్యచరిత!**
**యేమిహేతువొ యిది మాకు నెఱుఁగఁబడదు;, కనఁగ హోమంబు దుష్టంబు గాదు మఱియు. 394**

**ప్రతి :** అనఘ+ఆత్మ= పుణ్యాత్మా!; రాజర్షి+ఐనట్టి= రాజులలో ఋషియైన; ఆ+అంగమేదినీవిభుఁడు= ఆ అంగరాజు; అశ్వమేధమఖము+కావింపన్= అశ్వమేధ యాగం చేయడానికి; ఋత్విజ్+నికాయంబుచేతన్= యజ్ఞంచేసే పురోహిత సముదాయంచే; ఆహూతము+అయ్యును= పిలువబడినప్పటికినీ; సురవ్రాతము= దేవతలసమూహం; అందున్= ఆ యజ్ఞస్థలికి; ఆత్మహవిస్+భాగము= తమ తమ హవిర్భాగాలను; అందరాకుండినన్= తీసుకోవడానికి రానందున; అప్పుడు, ఋత్విక్కులు= యాగం చేయించే పురోహితులు; అద్భుతంబున్+అందుచున్= ఆశ్చర్యపడుతూ; యజమానుడు+ఐన= యజ్ఞంచేసే ప్రధానవ్యక్తియైన; ఆ+అంగమహీవరున్+చూచి= ఆ అంగరాజునుచూచి; రాజ+ఇంద్ర!= ఓ రాజా!; ఇట్లు, త్రిదశులు= ముప్పదేండ్లకు మించని వయస్సుగలవారు–దేవతలు; ఇది+ఎ= ఈ విధంగా; పిల్వఁబడియును= పిలువబడినప్పటికీ; తివిరి= ప్రయత్నించి; ఆత్మభాగములన్= తమతమ హవిర్భాగాలను; పొందన్+రారు+ఐరి= తీసుకోవడానికి రాలేకపోయారు; భవ్యచరిత= ఓ పుణ్యాత్మా! ఏమిహేతువొ= ఏమికారణమో; ఇది, మాకు ఎఱుఁగన్+పడదు= మాకు తెలియరాలేదు; మఱియున్= అదీగాక; కనఁగన్= ఆలోచిస్తే; హోమంబు= యజ్ఞం; దుష్టంబు+కాదు= చెడ్డది కాదు.

**తా :** మహాత్మా! రాజర్షియైన అంగమహీపతి అశ్వమేధయాగం చేయడం మొదలు పెట్టగా ఋత్విక్కులంతా మంత్రాలతో దేవతల్ని ఆహ్వానించారు. అయితే హవిస్సులు స్వీకరించడానికి దేవతలు దిగిరాలేదు. ఋత్విక్కులు ఆశ్చర్యపోయారు. వారు యజ్ఞకర్త అయిన అంగరాజుతో ఇలా అన్నారు. "రాజా! ఈ దేవతలు మనం పిలిచినా రావడం లేదు. హోమంలో ఏ విధమైన లోపమూ లేదు. వారు రాకపోవడానికి కారణం తెలియటం లేదు. ఈ హోమం చెడ్డది కాదు గదా."

**వ. శ్రద్ధాయుక్తులై ధృతవ్రతులైన యీ బ్రహ్మవాదులచేత సంప్రయుక్తంబులైన యీ ఛందస్సులు వీర్యవంతంబు లయియున్నవి; యిందు దేవతాపరాధం బణుమాత్రం బైన నెఱుంగ; మిట్టిచోటం గర్మసాక్షు లయిన దేవతలు స్వకీయభాగంబు లంగీకరింపకుండుటకుఁ గతం బెయ్యదియో యనిన నయ్యంగుండు దుఃఖితస్వాంతుండై తన్నిమిత్తంబు సదస్యుల నడుగందలంచి వారల యనుమతింబడసి మౌనంబు మాని యిట్లనియె. 395**

**ప్రతి :** శ్రద్ధాయుక్తులు+ఐ= శ్రద్ధతో కూడివారై; ధృతవ్రతులైన= దీక్షవహించినవారైన; ఈ బ్రహ్మవాదులచేత= ఈ బ్రహ్మవేత్తలచే; సంప్రయుక్తంబులు+ఐన= చక్కగా ప్రయోగింపబడిన; ఈ ఛందస్సులు= ఈ వేదాలు; వీర్యవంతంబులు+అయి+ఉన్నవి= శక్తిమంతములయి ఉన్నవి; ఇందు= దీనియందు; దేవతా+అపరాధంబు= దేవతలపట్ల తప్పు; అణుమాత్రంబు+ఐనన్= కొద్దిపాటిదైనా; ఎఱుంగము= మాకు తెలియుటలేదు; ఇట్టిచోటన్= ఇలాంటి ప్రదేశంలో; కర్మసాక్షులు+ఐన= చేసినపనులకు సాక్షులైన, దేవతలు; స్వకీయభాగంబులు= తమతమ భాగాలను; అంగీకరింపకుండుటకున్= తీసుకోకపోవడానికి; కతంబు= కారణము; ఎయ్యదియ+ఓ= ఏమిటో; అనినన్= అనగా; ఆ+అంగుండు= ఆ అంగరాజు; దుఃఖితస్వాంతుండు+ఐ=

మనసులో దుఃఖపడుతూ; తద్+నిమిత్తంబు= దానికి గలకారణాన్ని; సదస్యులన్= సభలోని పండితులను; అడుగన్+తలంచి= అడుగదలచుకొని; వారల, అనుమతిన్= వారి అంగీకారాన్ని; పడసి= పొంది; మౌనంబు మాని= మౌనాన్ని వదలిపెట్టి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

**తా :** ఈ వేదవాదులంతా శ్రద్ధతో దీక్షబూని ప్రయోగించిన వేదాలు శక్తిమంతాలైనవి. ఇందులో, దేవతలపట్ల అణుమాత్రమైనా అపరాధం జరిగినట్లు తెలియడంలేదు. జరిగే ఈ వేదకర్మలన్నిటికీ దేవతలే సాక్షులు. వారు తమ తమ భాగాలను స్వీకరించకపోవడానికి కారణమేమో తెలియడంలేదని ఋత్విక్కులు చెప్పగా అంగరాజు దుఃఖించిన మనసుకలవాడై దానికి కారణమేమిటో సదస్యులను అడుగ దలచి వారి అనుమతిని పొంది మౌనాన్ని వీడి ఇలా అన్నాడు.

**ఆ. అనఘ చరితులార! యాహూతు లయ్యు సు, పర్వగణము లాత్మభాగములను**
**స్వీకరింప; రేను జేసిన యపరాధ, మెట్టి దనిన వార లిట్టు లనిరి. 396**

**ప్రతి :** అనఘ చరితులార!= పవిత్రమైన చరిత్రగలవారలారా!; ఆహూతులయ్యున్= పిలువబడినవారైనా; సుపర్వగణములు= దేవతా సమూహములు; ఆత్మభాగములను= తమ భాగాలను; స్వీకరింపరు= గ్రహింపరు; ఏను చేసిన= నేను చేసిన; అపరాధము= దోషము; ఎట్టిది+అనినన్= ఏమిటి అనగా; వారలు= వారు; ఇట్టులు+అనిరి= ఇలా అన్నారు.

**తా :** ఓ పుణ్యచరితులారా! ఆహ్వానించబడియు దేవతాగణము వారి హవిర్భాగములను స్వీకరించడంలేదు. నేను చేసిన అపరాధమేమిటి? అని అడుగగా వారు ఇలా సమాధానమిచ్చారు.

**క. నరనాథ! యిదియు నిప్పుడు, వొరసిన దుష్కృతము గాదు పూర్వభవమునం**
**బరఁగిన దురితం బిది యా, దరమున నెఱిఁగింతు మింత ధన్యచరిత్రా! 397**

**ప్రతి :** నరనాథ= ఓ అంగరాజా!; ఇదియును= ఇది; ఇప్పుడు+పొరసిన= ఇప్పుడు జరిగిన; దుష్కృతము కాదు= దోషము కాదు; పూర్వభవమునన్= వెనకటిజన్మలో; పరఁగిన= సంభవించిన; దురితంబు+ఇది= పాపమిది; ఆదరమునన్= గౌరవంతో; ధన్యచరిత్రా!= పుణ్యాత్మా! ఎఱిఁగింతుము+ఇంత= సవిస్తరంగా చెబుతాము.

**తా :** ఓ రాజా! ఇది ఇప్పుడు జరిగిన దోషంకాదు. ఇది పూర్వజన్మలో చేసిన పాపము. పుణ్యాత్ముడవైన నీకు ఆదరంతో చెబుతాము అన్నారు ఋత్విజులు.

**క. నీ వింతవాఁడ వయ్యును, భూవర! సంతానలాభమును బొందమి నా**
**దేవతలు యాగభాగము, లీ వేళ భుజింపరైరి యిందుకు నీవున్. 398**

**ప్రతి :** భూవర= ఓ రాజా!; నీవు+ఇంతవాడవు+అయ్యును= నీ వింత గొప్పవాడవైనా; సంతానలాభమును= బిడ్డలను పొందుటను; పొందమిన్= పొందక పోవడంవల్ల; ఆ దేవతలు, ఈ వేళ= ఈ సమయంలో; యాగభాగములు, భుజింపరు+ఐరి= తీసుకోకపోయిరి (తినలేదు) ఇందుకు= దీనికి; నీవున్= నీవు.

**తా :** నీ వింత గొప్పవాడవైనా నీకు సంతానం లేనందువల్ల దేవతలు నీవుచేసిన ఈ యజ్ఞంలో హవిర్భాగాలు స్వీకరించడం లేదు. దీనికి నీవు

**తే. పుత్రకామేష్టిఁగావించి పుత్రుఁబడయు, మట్లొనర్చిన దేవత లాత్మభాగ**
**మర్థి నంగీకరింతు; రయ్యజ్ఞపురుషు, హరి భజించిన సకలకార్యములుఁగలుగు. 399**

**ప్రతి :** పుత్రకామేష్టిన్= పుత్రకామేష్టి అనే యాగాన్ని; కావించి= చేసి; పుత్రున్+పడయుము= కుమారుని పొందుము; అట్లు+ఒనర్చినన్= ఆ విధంగా చేస్తే, దేవతలు; అర్థిన్= కోర్కెతో; ఆత్మభాగము= తమ భాగాన్ని; అంగీకరింతురు= స్వీకరిస్తారు; ఆ+యజ్ఞపురుషున్= ఆ యజ్ఞపురుషుడైన; హరిన్+భజించినన్= హరిని సేవిస్తే; సకలకార్యములు= అన్నిపనులు; కలుగు= నెరవేరుతాయి.

**తా :** "పుత్రకామేష్టి అనే యాగాన్ని చేసి కుమారుని పొందినట్లైతే, దేవతలంతా తమభాగాలను కోరికతో స్వీకరిస్తారు. ఆ యజ్ఞపురుషుడైన శ్రీ మహావిష్ణువును సేవిస్తే నీకు అన్నిపనులు సమకూరుతాయి."

**వ. అనిన నాతండు సంతానార్థంబు శిపివిష్ట దేవతాకంబయిన పురోడాశంబుచే హోమంబు గావించినం దదీయ హోమకుండంబునందు హేమమాల్యాంబరాభరణుండయిన పురుషుండు హిరణ్మయపాత్రంబున సిద్ధపాయసంబు గొనుచు నుదయించిన నప్పుడు విప్రానుమతంబున నా రాజు దత్పాయసంబు నంజలిచే గ్రహించి సంతోషయుక్తుండగుచు భార్యకొసంగె నంత. 400**

**ప్రతి :** అనినన్+ఆతండు= అనిన పిదప అతడు; సంతాన+అర్థంబు= బిడ్డలకొరకు; శిపివిష్ట దేవతాకంబు+అయిన= శిపివిష్టుడనే పేరుగల విష్ణువుకు సంబంధించిన; పురోడాశంబుచేన్= యజ్ఞంలో సమర్పించే వంటకంతో; హోమంబు+కావించినన్= హోమంచేయగా; తదీయ హోమకుండంబునందు= ఆ హోమకుండంనుండి; హేమమాల్య+అంబర+ఆభరణుండు+అయిన= బంగారు మాలలు, వస్త్రాలు, నగలు ధరించిన, పురుషుండు= యజ్ఞపురుషుడు; హిరణ్మయ పాత్రంబునన్= బంగారు పాత్రలో; సిద్ధపాయసంబు+కొనుచున్= వండబడిన పాయసం తీసుకొని; ఉదయించినన్= బయల్వెడలగా, అప్పుడు; విప్ర+అనుమతంబునన్= బ్రాహ్మణుల ఆజ్ఞతో; ఆ రాజు= ఆ అంగుడనే రాజు; తద్+పాయసంబున్= ఆ పాయసాన్ని; అంజలిచే గ్రహించి= దోసిలితో స్వీకరించి; సంతోషయుక్తుండు+అగుచున్= సంబరపడుతూ; భార్యకు+ఒసంగెన్= ధర్మపత్నికిచ్చెను; అంతన్= ఆ తర్వాత.

**తా :** ఋత్విజులు ఇలా చెప్పగా అంగరాజు సంతానం కోసం శిపివిష్టుడనే పేరుగల విష్ణుదేవుణ్ణి ఆహ్వానించి పురోడాశాన్ని హోమంలో అర్పించాడు. ఆ హోమగుండంనుండి జ్యోతిర్మయాలైన బంగారు మాలలు, అంబరాలు, ఆభరణాలు ధరించిన యజ్ఞపురుషుడు బంగారుపాత్రలో సిద్ధంచేసిన పాయసాన్ని తీసుకొని బయల్వెడలాడు. అప్పుడు అంగరాజు బ్రాహ్మణుల అనుమతితో ఆ పాయసాన్ని దోసిలితో స్వీకరించి సంతోషంతో భార్యకిచ్చాడు. ఆ తరువాత

**చ. కమలదళాక్షి పాయసము గౌతుక మొప్ప భుజించి భర్తృ సం**
**గమమునఁజేసి తత్క్షణము గర్భముఁదాల్చి కుమారుఁగాంచె న**
**క్కొమరుఁడు నంత మాతృజనకుండగు మృత్యువుఁబోలి తా నధ**
**ర్మమునఁజరించుచుండె గుణమండన! వేనుఁడనంగ నిచ్చలున్. 401**

**ప్రతి :** గుణమండన= ఓ గుణవంతుడా!; కమలదళాక్షి= పద్మదళములవంటి కన్నులుగలిగిన అంగుని భార్య!; కౌతుకము+ఒప్పన్= కుతూహలంతో; పాయసము భుజించి= పాయసం తాగి; భర్తృసంగమమునన్+చేసి= భర్తతో

దాంపత్యసుఖంచేత; తద్+క్షణము= వెంటనే; గర్భమున్+తాల్చి= గర్భము ధరించి; కుమారున్+కాంచెన్= కుమారుని ప్రసవించింది; ఆ+కొమరుఁడు= ఆ కుమారుడు; అంతన్, మాతృజనకుండగు= తల్లికితండ్రి అయిన; మృత్యువున్+పోలి= మృత్యుదేవతవలె; తాన్= తాను; అధర్మమునన్= అధర్మమార్గంలో; వేనుఁడు+అనంగన్= వేనుడనే పేరుతో, నిచ్చలున్= ఎల్లప్పుడు; చరించుచుండెన్= తిరుగసాగాడు.

**తా :** పద్మములవంటి కన్నులు కలిగిన ఆమె (ఆ అంగుని భార్య) ఆనందంగా ఆ పాయసాన్ని భుజించి భర్తతో సంగమించి వెంటనే గర్భం ధరించి కుమారుని ప్రసవించింది. ఆ కుమారుడు అధర్మమార్గంలో భూమిపై తిరుగుతూ మాతామహుడైన మృత్యువులాగా నిత్యమూ తిరుగసాగాడు. అతడే వేనుడు.

**విశే :** వేనుని తల్లి సునీథ, మృత్యువు పుత్రిక – అందువల్ల వేనునికి మాతామహునిలక్షణాలు కలిగాయి.

**చ. ఎనయఁగ బాల్యమందుఁదన యీడు కుమారులఁగ్రీడఁబోలె నె**
**మ్మనమున భీతి లేక కృపమాలి పశుప్రకరంబు నొంచు పో**
**ల్కిని నరికట్టి చంపుచును గిల్బిషలుబ్ధకవృత్తిమై శరా**
**సనశరముల్ ధరించి మృగజాతి నసాధుగతిన్ వధించుచున్. 402**

**ప్రతి :** ఎనయఁగన్= అతిశయించినట్లు; బాల్యమందు= (వేనుడు) చిన్నతనంలో; తన ఈడు కుమారులన్= తన తోటి వయస్సు బాలురను; క్రీడన్+పోలెన్= ఆటలో వలె, నెఱ+మనమునన్= నిండు మనస్సుతో; భీతిలేక= భయములేక; కృపమాలి= దయతప్పి; పశుప్రకరంబున్= జంతు సమూహాన్ని; నొంచుపోల్కినిన్= బాధించునట్లు; అరికట్టి చంపుచును= అడ్డగించి చంపుతూ; కిల్బిషలుబ్ధక వృత్తిమైన్= పాపాలతో కూడుకొన్న వేటకాని వృత్తితో; శరాసన శరముల్= అమ్ములపొది, అమ్ములు; ధరించి= తాల్చి; మృగజాతిన్= జంతు జాతిని; అసాధుగతిన్= చెడుమార్గంలో; వధించుచున్= చంపుతూ.

**తా :** ఆ వేనుడు బాల్యం నుండి దుష్టస్వభావం కలవాడు. తనయీడు బాలురను ఆటపాటలకని పిలిచి గుంపులు గుంపులుగా చేర్చి విల్లమ్ములు ధరించి వారినందరిని చంపేవాడు. జంతువులను వేటాడు బోయవానివలె వేనుడు అట్టి పాప కృత్యంపై కుతూహలంతో తిరుగుతూ మృగాలను దుష్టమార్గంలో చంపేవాడు.

**వ. ఇట్లు మాతామహ దోషంబునం బాపవర్తనుండై చరియించు కొడుకుం జూచి యంగుండు వివిధ శాసనంబుల దండించియు నతని దుశ్చేష్టితంబులు మానుపంజాలక దుఃఖితాత్ముండై మనంబున. 403**

**ప్రతి :** ఇట్లు, మాతామహదోషంబునన్= తల్లియొక్క తండ్రి (తాత) చేసిన దోషంచేత; పాపవర్తనుండు+ఐ= పాపపనులుచేస్తూ; చరియించు= తిరిగే; కొడుకున్+చూచి= వేనుని చూచి, అంగుండు; వివిధశాసనంబులన్= అనేవిధాలైన శిక్షలద్వారా; దండించియున్= శిక్షించినా; అతని దుః+చేష్టితంబులు= అతని చెడ్డపనులు; మానుపన్+చాలక= మాన్పింపలేక; మనంబునన్= మనస్సులో; దుఃఖిత+ఆత్ముండై= దుఃఖిస్తూ.

**తా :** వేనుని తల్లి సునీథ. ఆమె తండ్రి మృత్యువు చేసిన మహాదోషాల ఫలితంగా వేనుడు ఇలా తయారయ్యాడు. అంగరాజు పాపవర్తనుడైన కుమారుని అనేక విధాలుగా శాసించడానికి, దండించడానికి విఫల ప్రయత్నం చేశాడు. అతని చెడ్డపనులు మాన్పలేక మనసులో చాలా దుఃఖించాడు.

**క. అనయము నిట్టి కుపుత్త్రునిఁ, గని పరితాపంబుఁబొందుకంటెను ధరలో**
**ననపత్యుండగు టొప్పును, వనజాక్షు భజించునట్టి వాఁడగు వాఁడున్. 404**

**ప్రతి :** అనయమున్= ఎల్లప్పుడూ; ఇట్టి కుపుత్రునిన్+కని= ఇలాంటి చెడ్డ కుమారునిపొంది; పరితాపంబున్+ పొందుకంటెను= దుఃఖించుటకంటె; ధరలోన్= లోకంలో; అనపత్యుండు+అగుట= సంతానము లేనివాడై ఉండుట; అగుట+ఒప్పును= కావడం తగును; వనజాక్షున్= విష్ణుని; భజించునట్టి= కొలిచే; వాడైనవాడు; వాడు= అట్టి సంతానం లేనివాడు; వనజాక్షున్= విష్ణువును; భజించునట్టివాడు+అగున్= సేవించునట్టివాడు అవుతాడు.

**తా :** దుష్టుడగు పుత్రునిచూచి నిత్యమూ బాధపడడం కంటే లోకంలో సంతానం లేనివాడు కావడమే మేలు. అలా బాధపడదగిన సంతానం లేనివాడు మహావిష్ణువును సేవించినట్టివాడే అవుతాడు.

**వ. అని వెండియు నిట్లనియె. 405**

**ప్రతి :** అని, వెండియున్= మరలా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

**తా :** అని మరలా ఇలా అన్నాడు.

**సీ. జనులకు దుష్పుత్త్రకునిచేత నపకీర్తియు, నధర్మమును, సర్వజనవిరోధ**
**మును, మనోవ్యథయును, ననయంబుఁ బ్రాప్తించు నట్టి కుపుత్త్రమోహంబు విడువఁ**
**జాలక బహుమానసంగతిఁ గను నెవ్వఁడతని గేహంబు దుఃఖాలయంబు**
**నగునని మఱియు నిట్లను మనుజుండు శోకస్థానమగు పుత్త్రుకతనఁజేసి**

**తే. యనుపమక్లేశభాజనంబయిన గృహము, విడుచుఁగావున నిట్టి వివేకహీనుఁ**
**డగు కుపుత్త్రు సుపుత్త్రుఁగా నాత్మఁదలఁతు, ననుచు నా రాజు బహుదుఃఖితాత్ముఁడగుచు. 406**

**ప్రతి :** జనులకు, దుస్+పుత్త్రకునిచేతన్= చెడ్డకుమారునివలన; అపకీర్తియున్= చెడ్డపేరు; అధర్మమును= అధర్మం; సర్వజనవిరోధమును= జనులందరితోవైరము; మనోవ్యథయును= మానసికబాధ; అనయంబున్= ఎల్లప్పుడు; ప్రాప్తించునట్టి= కలుగునట్టి; కుపుత్త్రమోహంబున్= చెడుకుమారునిపై ప్రేమను; విడువన్+చాలక= వదలిపెట్టలేక; బహుమాన సంగతిన్= ఎక్కువ ప్రేమతో; కనున్+ఎవ్వఁడు= ఎవడు చూస్తాడో; అతనిగేహంబు= అతనిఇల్లు; దుఃఖ+ఆలయంబు= దుఃఖానికి నివాసము; అగును+అని; మఱియున్+ఇట్లు+అను= ఇంకను ఈ విధంగా అన్నాడు; మనుజుండు= మానవుడు; శోకస్థానము+ అగు= దుఃఖకారణమైన; పుత్త్రుకతనన్+చేసి= కుమారుని కారణంగా; అనుపమ= సాటిలేని; క్లేశభాజనంబు+అయిన= దుఃఖకారణమైన; గృహము విడుచున్= ఇల్లు వదలిపెట్టును; కావునన్, ఇట్టి వివేకహీనుఁడు+అగు= ఇటువంటి అవివేకుడయిన; కుపుత్రున్= చెడుపుత్రుని; సుపుత్రుఁగాన్= మంచి కుమారునిగా; ఆత్మన్+తలఁతున్= మనస్సులో భావిస్తాను; అనుచున్= అనుకొంటూ, ఆ రాజు; బహుదుఃఖిత+ఆత్ముఁడగుచున్= మిక్కిలి దుఃఖముతో కూడిన మనస్సుకలవాడై.

**తా :** జనులకు చెడ్డకుమారునివలన అపకీర్తి, అధర్మం కలుగుతాయి. అందరితో విరోధం, మానసిక బాధ తప్పక ప్రాప్తిస్తాయి. అట్టి చెడ్డకుమారునిపై వ్యామోహం విడిచిపెట్టలేక, వానిని ప్రేమగా చూస్తాడో అతని ఇల్లు దుఃఖాలకు స్థానమవుతుంది. అని మళ్లీ ఇలా అనుకొన్నాడు. ‘శోకం కలిగించే పుత్రుని వల్ల అనేక సాటిలేని కష్టాలకు స్థానమైన ఇంటిని

మానవుడు విడిచి వెళ్లిపోతాడు. అందుచేత, ఇట్టి జ్ఞానహీనుడైన చెడ్డకొడుకునే మంచి కొడుకుగా మనసులో భావిస్తున్నాను' అని ఆ రాజు మిక్కిలి దుఃఖించిన మనసుకలవాడై

**క. తగు సుమహైశ్వర్యోదయ, మగు గృహమును బ్రజల నిద్రనందిన భార్యన్**
**దిగవిడిచి యెక్క డేనియు, జగతీశుఁడు సనె నిశీథ సమయమునందున్. 407**

**ప్రతి :** తగు= తగిన; సుమహా+ఐశ్వర్య+ఉదయము+అగు= చాలాగొప్పసంపదలతో అభివృద్ధి చెందునట్టి; గృహమును= ఇంటిని; ప్రజలన్= సంతానమును / ప్రజలను; నిద్ర నందిన భార్యన్= నిద్రపోయే భార్యను; దిగవిడిచి= వదలిపెట్టి; ఎక్కడ+ఏనియున్= ఎక్కడికో; నిశీథసమయమునందున్= రాత్రివేళ; జగతీ+ఈశుఁడు= రాజు; చనెన్= వెళ్లిపోయాడు.

**తా :** తగిన అధికమైన సంపదలతో అభివృద్ధి చెందే తన నివాసాన్ని, ప్రజలను, నిద్రించే భార్యనుకూడ వదలిపెట్టి రాత్రివేళ అంగరాజు ఎక్కడికో వెళ్లిపోయాడు.

**వ. అంతఁ దద్వృత్తాంతం బంతయు సుహృద్బాంధవ పురోహితామాత్య ప్రభృతులయిన ప్రజ లెఱింగి దుఃఖించుచున్న సమయంబున భూమియం దెల్లయెడలఁ దదన్వేషణం బాచరించి గూఢుండయిన పరమ పురుషునిం గానలేని కుయోగి చందంబున నా రాజుం బొడగానలేక విఫలోద్యోగులయి మగిడి పురంబునకు వచ్చిరి. తదనంతరంబ. 408**

**ప్రతి :** అంతన్, తద్+వృత్తాంతంబు+అంతయున్= ఆ విషయమంతా; సుహృత్+బాంధవ= స్నేహితులు, బంధువులు; పురోహిత+అమాత్య ప్రభృతులు+అయిన= పురోహితులు, మంత్రులు మొదలైన; ప్రజలు+ఎఱింగి= జనం తెలుసుకొని; దుఃఖించుచున్న= శోకిస్తున్న; సమయంబునన్= వేళలో; భూమియందు+ఎల్లఎడలన్= భూమిమీద అన్నిచోట్లా; తద్+ అన్వేషణంబు+ఆచరించి= ఆయనకోసం వెదికించి; గూఢుండు+అయిన= రహస్యంగా ఉండే; పరమపురుషునిన్= పరమాత్మను; కానలేని= తెలుసుకొనలేని; కుయోగి చందంబునన్= దుష్టయోగివలె; ఆ రాజున్= అంగరాజును; పొడగానలేక= గుర్తించలేక; విఫల+ఉద్యోగులు+అయి= విఫల ప్రయత్నంకలవారై; మగిడి= తిరిగి; పురంబునకువచ్చిరి= నగరానికి వచ్చారు. తద్+అనంతరంబు+అ= ఆ తర్వాత.

**తా :** అప్పుడు అంగరాజు ఇల్లు వదలి వెళ్లాడనే విషయం తెలిసిన స్నేహితులు, బంధువులు, పురోహితులు, మంత్రులు మొదలైన ప్రజలంతా దుఃఖించారు. లోకమంతా ఆయనను వెదకించారు. కాని ఆయన రహస్యంగా ఉండిపోయాడు. సర్వజీవులలో అంతర్యామి అయిన పరమాత్ముని తెలుసుకోలేని దుష్టయోగివలె రాజును కనిపట్టలేక వారి ప్రయత్నం విఫలమైంది నగరానికి తిరిగివచ్చారు. ఆ తరువాత.

**సీ. సమధిక బ్రహ్మనిష్ఠాతిగరిష్ఠులౌ భృగ్వాదిమౌనీంద్రబృంద మపుడు**
**లోకావనైకావలోకనోత్సుక మౌట జనులు స్వరక్షకజనవిభుండు**
**లేమిఁబశుప్రాయులై మెలంగుటఁగని యంత వేనుని మాత యగు సునీథ**
**యనుమతి నఖిలప్రజావళి కప్రియుండైన న వ్వేనుఁ బట్టాభిషిక్తుఁ**

**తే. జేసి; రంతట మహితోగ్రశాసనుఁడగు, వేనుఁబట్టంబు గట్టుట విని సమస్త**
**తస్కరులు సర్పభీతిచేఁదలఁగు మూష, కముల కైవడి నడఁగిరి గహనములను. 409**

**ప్రతి :** సమధిక= అధికమైన; బ్రహ్మనిష్ఠా+అతిగరిష్ఠులు+ఔ= బ్రహ్మభావనా నిష్ఠలో గొప్పవారైన; భృగు+ఆదిముని+ఇంద్రబృందము= భృగువు మొదలైన మునిశ్రేష్ఠుల సమూహము, అపుడు= అప్పుడు; లోకావన+ఏకావలోకన+ఉత్సుకము+ఔట= లోకాన్ని రక్షించడం ఒక్కటే చూడటంలో కుతూహల పడినదై; జనులు= ప్రజలు; స్వరక్షక= తమను రక్షించు; జనవిభుండు= రాజు; లేమిన్= లేకపోవుటచే; పశుప్రాయులు+ఐ= జంతువులవలె; మెలంగుటన్+కని= తిరగడం చూచి; అంత, వేనునిమాత, అగు= వేనుని తల్లియైన; సునీథ అనుమతిన్= సునీథ సమ్మతితో; అఖిల ప్రజావళికి= సమస్త జనులకు; అప్రియుండు+ఐ= అనిష్టుడైన; ఆ+వేనున్= ఆ వేనరాజును; పట్టాభిషిక్తున్+చేసిరి= రాజునుచేసిరి; అంతట, మహిత+ఉగ్రశాసనుండు+అగు= మిక్కిలి భయంకరమైన అధికారముగల; వేనున్= వేనుని; పట్టంబు+కట్టుట= పట్టాభిషిక్తుని చేయుట; విని= తెలుసుకొని; సమస్తతస్కరులు= దొంగ లందురు; సర్పభీతిచేన్= పామువలన భయంతో; తలంగు= పారిపోయే; మూషకములకైవడిన్= ఎలుకలవలె; గహనములను= అరణ్యాలలో; అడంగిరి= తలదాచుకొన్నారు.

**తా :** తమ్ము రక్షించు రాజులేక జనులు పశుప్రాయులై ప్రవర్తించుటను చూచి బ్రహ్మనిష్ఠాశ్రేష్ఠులైన భృగువు మొదలైన మహర్షుల బృందం అప్పుడు లోకాలను రక్షించాలనే ఒకే చూపుతో ఉత్సహించి వేనుని తల్లియైన సునీథ అనుమతితో ప్రజలకందరికిని అప్రియుడైన వేనుని పట్టాభిషిక్తుని చేశారు. ఆ వార్త విని పాములవల్ల భయంతో పారిపోయే ఎలుకలవలె, దొంగలందరూ అడవులలో తలదాచుకున్నారు.

**విశే :** రాజ్యానికి ప్రభువు లేకుండుట మంచిదికాదు. దుష్టుడైన ప్రభువునైనా తాత్కాలికంగా నియమిస్తే ప్రజలకు కొంత ఊరట.

**వ. అంత నతండు. 410**

**చ. పరువడి నష్టలోకపరిపాలక ముఖ్య విభూతియుక్తుండై**
**పరంగి నృపాసనంబున విభాసితుండౌట స్వభావసిద్ధమై**
**వఱలు మహావలేపమున వారక సంతత మాననీయ స**
**త్పురుషుల నెల్ల నెందుం బరిభూతులం జేయుచునుండె నిచ్చలున్. 411**

**ప్రతి :** పరుపడిన్= వేగంగా; అష్ట= ఎనిమిదిమంది; లోకపరిపాలక= దిక్పాలకులు; ముఖ్య= ప్రధానమైన; భూతియుక్తుండు+ఐ= ఐశ్వర్యంతో కూడినవాడై; పరంగి= ప్రసిద్ధివహించి; నృప+ఆసనంబునన్= రాజసింహాసనంపై; విభాసితుండు+ఔటన్= ప్రకాశించుటచే; స్వభావసిద్ధము+ఐ= సహజ సిద్ధంగా; వఱలు= ప్రవర్తించే; మహా+అవలేపమునన్= మహాగర్వంతో; వారక= బెదరక; సంతత= నిరంతరం; మాననీయ= గౌరవింపదగిన; సత్పురుషులన్+ఎల్లన్= సజ్జనులనందరినీ; ఎందున్= అన్నిచోట్ల; నిచ్చలున్= నిత్యము; పరిభూతులన్= పరాభవం పొందినవారుగా; చేయుచున్+ఉండెన్= చేయసాగాడు.

**తా :** వేగంగా అష్టదిక్పాలకుల వైభవం పొంది రాజసింహాసనంపై ప్రకాశించువాడైనందున తనకు సహజసిద్ధమైన ప్రవర్తనచేత మహాగర్వంతో అడ్డులేకుండా నిత్యం రాజ్యంలో గౌరవభాజనులు అయిన సజ్జనులందరినీ అతడు నిరంతరం పరాభవించసాగాడు.

**విశే: అష్టదిక్పాలకులు :** వీరు ఎనిమిదిమంది. ఎనిమిది దిక్కులకు అధిపతులు 1. ఇంద్రుడు, 2. అగ్ని, 3. యముడు, 4. నిరృతి, 5. వరుణుడు, 6. వాయువు, 7. కుబేరుడు, 8. ఈశానుడు.

**చ. మఱియు నతండు భూగగనమార్గములందొకవేళ నొక్కఁ డే**
**యరదము నెక్కి క్రుమ్మరు నిరంకుశవృత్తిఁజరించు మత్త సిం**
**ధురవిభుపోల్కి సత్పురుషదూషితవర్తన నొప్పుచున్ నిరం**
**తరసుజనాపరాధకృతితత్పరమానసుఁడై క్రమంబునన్. 412**

**ప్రతి :** మఱియున్, అతండు= ఆ వేనరాజు, భూగగనమార్గములందున్= భూమిపైన, ఆకాశంపైన, ఒకవేళన్= ఒక్కొకసారి, ఒక్కఁడు+ఏ= ఒంటరిగా, అరదమున్+ఎక్కి= రథమెక్కి , నిరంకుశవృత్తిన్= విచ్చల విడిగా, క్రుమ్మరున్= తిరుగుతాడు; మత్తసింధురవిభుపోల్కిన్= మదించిన గజరాజువలె, చరించున్= సంచరిస్తాడు, సత్+పురుషదూషిత= సజ్జనులచే నిరసింపబడిన, వర్తనన్+ఒప్పుచున్= ప్రవర్తనకలిగి, నిరంతర= ఎల్లప్పుడు, సుజన+అపరాధకృతితత్పర= సజ్జనులకు అపకారం చేసే ఆసక్తిగల, మానసుఁడు+ఐ= మనస్సుగలవాడై, క్రమంబునన్= వరుసగా.

**తా :** ఇంకనూ ఆ వేనరాజు భూమ్యాకాశ మార్గాలలో ఒకొక్కసారి ఒంటరిగా రథంపై తిరిగేవాడు. నిరంకుశుడై మదగజంవలె సంచరిస్తూ పెద్దలు అసహ్యించుకొనేవిధంగా ప్రవర్తించేవాడు. ఆతడు నిరంతరం సజ్జనుల కపరాధం చేయడంలో మనసు లగ్నం చేసేవాడు.

**క. దివ్యులు వెఱఁగందఁగఁ బృ, థ్వీవ్యోమము లగల భేరి వేయించె "న య**
**ష్టవ్య మదాతవ్య మహో, తవ్యం విప్రా" యనుచునుదాత్త ధ్వనులన్. 413**

**ప్రతి :** దివ్యులు= దేవతలు; వెఱఁగు+అందఁగన్= ఆశ్చర్యపడునట్లు; పృథ్వీవ్యోమములు= భూమి, ఆకాశము; అగలన్= బ్రద్దలయ్యేటట్లు; విప్రా= బ్రాహ్మణులారా!; న+యష్టవ్యమ్= యాగములు చేయకూడదు; న+దాతవ్యమ్= దానాలు చేయకూడదు; న+హోతవ్యమ్= హోమాలు చేయకూడదు; అనుచున్, ఉదాత్త ధ్వనులన్= పెద్ద శబ్దములతో; భేరివేయించెన్= భేరి మోగించాడు.

**తా :** "బ్రాహ్మణులు యజ్ఞాలు చేయకూడదు, దానాలు చేయకూడదు, హోమాలు చేయకూడదు." అని దేవతలు ఆశ్చర్యపడేలా, భూమ్యాకాశాలు బద్దలయ్యేలా పెద్దశబ్దాలతో భేరిని (చాటింపు) వేయించాడు.

**క. అని యిట్టుల భేరీరవ, మునఁజేసి సమస్తధర్మములు వారింపన్**
**మును లవినీతుండగు వే, నుని దుశ్చరితంబు జనమనోభయమగుటన్. 414**

**ప్రతి :** అని; ఇట్టులన్= ఈ విధంగా; భేరీరవమునన్+చేసి= నగారాశబ్దంచే; సమస్త ధర్మములు= ధర్మాకార్యాలన్నీ; వారింపన్= నిషేధింపగా, మునులు; అవినీతుండు+అగు= అవినీతిపరుడైన; వేనుని, దుశ్చరితంబు= చెడుప్రవర్తన; జనమనస్+భయము+అగుటన్= ప్రజల మనస్సులకు భయం కలిగించునది కాగా.

**తా :** అని ఈ విధమైన చాటింపుతో అన్ని ధర్మాలను నిషేధింపగా, అవినీతిపరుడైన వేనుని చెడు ప్రవర్తన ప్రజల మనసులకు భయం కలిగించగా మునులు

**తే. కని కృపాయత్తు లగుచు నిట్లనిరి యిట్టి, రాజచోర భయంబు లీ భూజనులను**
**బలసి యిరువంకలను బాధపఱుపఁ జొచ్చె, దారువందుల వహ్ని చందనమునఁ బెలుచ. 415**

ప్రతి : కని= చూచి; కృపా+ఆయత్తులు= దయగలవారు; అగుచున్, ఇట్లు+అనిరి= ఇలా అన్నారు ఇట్టి= ఇలాంటి; రాజచోరభయంబులు= రాజువల్ల; దొంగలవల్ల కలిగే భయాలు; ఈ భూజనులను బలసి= ఈ రాజ్యంలోని ప్రజలను చుట్టుముట్టి; ఇరువంకలను= రెండువైపులా; దారువందులన్= కట్టెయందు; వహ్నిచందమునన్= (అంటుకొన్న) అగ్నివలె; పెలుచ= మిక్కిలిగా; బాధపరుపన్+చొచ్చెన్= బాధింపసాగింది.

**తా :** (మునులు) చూచి దయతో ఈ విధంగా అనుకున్నారు. రాజువల్ల, చోరులవల్ల కలుగుతున్న భయాలు ఈ భూప్రజలను చుట్టుముట్టి కొయ్యకు ఇరువైపుల ఎక్కువగా అంటుకొన్న అగ్నివలె మిక్కిలి బాధిస్తున్నాయి.

**చ. అరయ నరాజకంబగు మహాభయముం దొలఁగింపఁగోరి యి**
**ట్లెఱుఁగక యీ యనర్హుని మహీపతిఁ జేసినయట్టి దోషముం**
**బరువడిఁ జెందె దుగ్ధరసపానమునం బరివృద్ధి నొందు న**
**య్యురగభయంబు పోషకుని నొందినరీతి ననర్థహేతువై. 416**

ప్రతి : అరయన్= చూడగా; అరాజకంబు+అగు= రాజులేని; మహాభయమున్= గొప్ప భయాన్ని; తొలగింపన్+కోరి= పారద్రోల దలచి; ఇట్లు+ఎరుఁగక= ఈ విధంగా జరుగుతుందని తెలుసుకోకుండా; ఈ+అనర్హునిన్= ఈ అర్హతలేని వానిని; మహీపతిన్= రాజును; చేసిన+అట్టి= చేసినటువంటి; దోషమున్= తప్పు; దుగ్ధరసపానమునన్= పాలుతాగడంవల్ల; పరివృద్ధిన్+ఒందు= పెరిగిన; ఆ+ఉరగభయంబు= ఆ పామువల్ల భయం; అనర్థహేతువు+ఐ= ఆపదగలిగించునదై; పోషకుని= పెంచినవానిని; పొందినరీతిన్= చేరినట్లుగా; పరువడిన్+చెందెన్= మిక్కిలిగా కలిగింది.

**తా :** రాజులేకుండా ఉండటం మహాభయంకరమని భావించి, దానిని నివారించడానికై, తెలియక ఈ నీచుని రాజుగా చేశాము. పాలుపోసి పెంచిన పామువల్ల భయం దానిని పోషించినవానికే కలిగినట్లుగా ఈ దుష్కర్మఫలం ప్రజలకు ప్రాప్తించింది.

**వ. అదియునుంగాక 417**

ప్రతి : అదియునున్+కాక= అంతేగాక

**క. మునుకొని సునీథ గర్భం, బున జనియించియు స్వభావమున దుర్జనుఁడై**
**యెనయఁబ్రజాపాలనమున, కును బాల్పడి ప్రజల మన్నిగొనఁజొచ్చెఁగదే. 418**

ప్రతి : మునుకొని= పూనుకొని; సునీథ గర్భంబునన్= సునీథ కడుపున; జనియించియు= పుట్టికూడా; స్వభావమునన్= స్వభావంలో; దుర్జనుఁడు+ఐ= దుష్టుడై; ఎనయన్= పొందికగా; ప్రజాపాలనమునకునున్= జనులను పాలించడానికి; పాల్పడి= ప్రయత్నించి; ప్రజలన్= జనులను; మన్నిగొనన్+చొచ్చెన్+కదే= మిక్కిలి బాధించుటకు పూనుకొన్నాడు కదా.

**తా :** అంతేగాక, ఈ వేనరాజు పూనుకొని సునీథాదేవి కడుపున పుట్టిన వాడైనా, ప్రవర్తనతో చెడ్డవాడై ఒప్పుగా ప్రజాపాలనకు పూనుకొని ప్రజలను మిక్కిలి బాధింప నారంభించినాడు కదా.

**వ. అదిగాక యీ వేనుండు పూర్వంబున జ్ఞాన సంపన్నులమైన మనచేత రాజుగాఁ జేయంబడియెఁ, గావున నిట్టివాని మన మందఱమును గూడి ప్రార్థింతము; లోకరక్షణార్థంబగుటఁ దద్దోషంబు మనల**

**స్పృశింపదు; సమీచీనోక్తులంజేసి వీని ననునయింప వాని గ్రహింపకుండెనేని మున్న లోకధిక్కారాగ్ని సందగ్ధుండగు వీని మన తేజోమహాగ్ని చేత భస్మీభూతుం జేయుద మని యాలోచించి గూఢమన్యు లగుచు వేనునింగదియంజని యతని కిట్లనిరి. 419**

**ప్రతి :** అదిగాక= అంతేకాక; ఈ వేనుండు, పూర్వంబునన్= గతంలో; జ్ఞాన సంపన్నులము+ఐన= జ్ఞానమే సంపదగాగల, మనచేత; రాజుగాన్+చేయన్+పడియెన్= రాజుగా చెయ్యబడ్డాడు; కావునన్, ఇట్టివానిన్, మనమందరమును+కూడి= మనమందరము కలిసి; ప్రార్థింతము= వేడుకొందాము; లోకరక్షణ+అర్థంబు+అగుటన్= సమాజశ్రేయస్సుకోసంకాబట్టి; తద్+దోషంబు= ఆ పాపము, మనలను; స్పృశింపదు= అంటదు; సమీచీన+ఉక్తులన్+చేసి= తగిన మంచి మాటలతో; వీనిన్+అనునయింపన్= వీనిని చక్కదిద్దితే; వానిన్+గ్రహింపక+ఉండెనేని= వాటిని తెలుసుకోలేకపోతే; మున్ను+అ= ముందే; లోకధిక్కార+అగ్ని+సందగ్ధుండు+అగున్= లోకులచే తిరస్కారమనబడే మంటలో కాల్చివేయబడినవాడగు; వీనిన్= వీనిని; మన, తేజస్+మహా+అగ్నిచేతన్= తేజస్సు అనే గొప్ప అగ్నిచేత; భస్మీభూతున్= బూడిదగా; చేయుదము+అని= చేద్దామని; ఆలోచించి, గూఢమన్యులు+అగుచు= కోపాన్ని దాచుకొన్నవారై; వేనునిన్, కదియన్+చని= సమీపించి; అతనికిన్, ఇట్లు+అనిరి.

**తా :** అంతేకాక ఈ వేనుడు జ్ఞానసంపన్నులమైన మనచేత రాజుగా చేయబడ్డాడు. కాబట్టి, ఇట్టి వేనుని మనమందరమూ కూడుకొని వేడుకుందాము. లోకరక్షణ బుద్ధితో మనం ఆ దుష్టుని ప్రార్థిస్తే ఆ దోషం మనకు అంటదు. సమాధానపడే విధంగా వీనిని మంచిమాటలతో చక్కబరచే ప్రయత్నం చేద్దాం. అతడు వినకుంటే, ఇంతకుముందే ప్రజల తిరస్కారాగ్నికి దగ్ధడగుచున్న వీనిని మన తేజస్సుతో భస్మం చేద్దామని ఆలోచించి పెద్దలు తమ రోషాన్ని దాచుకొని వేనుని దగ్గరికి వెళ్ళి ఇలా అన్నారు.

**క. నరపాలక! నీ కాయువు, సిరియును బలమును యశంబుఁ జేకుఱు, వృద్ధిం**
**బొరయుదుగా కనుచు మనో, హరముగ నాశీర్వదించి యతివినయమునన్. 420**

**ప్రతి :** నరపాలక= రాజా! నీకు, ఆయువు= ఆయుస్సు; సిరియును= సంపద, బలమును; యశంబున్= కీర్తి, చేకుఱున్= కలుగును; వృద్ధిన్= అభ్యుదయాన్ని; పొరయుదుగాక= పొందుదువుగాక; అనుచున్, మనోహరముగన్= ఇంపుగాన్; ఆశీర్వదించి, అతివినయమునన్= మిక్కిలి వినయంతో...

**తా :** వారు ఇంపుగా 'ఓ రాజా! నీకు ఆయువు, సంపద, బలము, కీర్తి సమకూరుగాక! నీవు ఐశ్వర్యంతో వర్ధిల్లెదవుగాక!' అని ఆశీర్వదించి మిక్కిలి వినయంతో...

**వ. ఇట్లనిరి! నరేంద్రా! యే మొక్కటి విన్నవించెద మవధరింపుము; పురుషులకు వాఙ్మనఃకాయ వృత్తుల వలన నాచరించు ధర్మంబు సమస్త లోకంబులను విశోకంబులం జేయు; నసంగులయినవారికి మోక్షంబు నిచ్చు నట్టి ధర్మంబు ప్రజలకు క్షేమకారణంబు గావున నీయందుఁ జెడకుండుంగాక యని పలికి మఱియు ధర్మంబు నాశంబు నొందిన, నైశ్వర్యంబుచే రాజు విడువంబడు నని చెప్పి వెండియు నిట్లనిరి; దుష్టచిత్తులగు సమాత్యులవలనను, దస్కరులవలనను, బ్రజలు నాశంబు నొందకుండ రక్షించుచు, యథాన్యాయంబుగ వారలచేఁ గరంబు గొనుచునుండు మహీపతి యిహపర సౌఖ్యంబుల నందు; నదియునుం గాక, యెవ్వని**

**రాష్ట్రంబున నే పురంబున యజ్ఞేశ్వరుండయిన పురుషోత్తముండు నిజవర్ణాశ్రమోచితంబయిన ధర్మంబుగల వారిచేత యజింపంబడు, నట్టి నిజశాసనవర్తియగు రాజువలన సర్వభూతభావనుండును, మహాభాగుండును, భగవంతుండును నగు సర్వేశ్వరుండు సంతోషించిన రాష్ట్రాధిపతికి సర్వసౌఖ్యంబులుం బ్రాపించు; లోకపాలకు లగువారు సర్వేశ్వరుని కొఱకు బలిప్రదానంబులు సేయుదురు; సమస్తలోక దేవతా యజ్ఞాది సంగ్రహుండును, వేదమయుండును ద్రవ్యమయుండును, దపోమయుండును నగు నారాయణుని విచిత్రంబులైన యజ్ఞంబులచేత యజనంబు నేసిన నీకు నభయంబగు; మోక్షంబునుం గలుగు కావున; నీ రాజ్యంబున మఖంబులు సేయు మని యాజ్ఞాపింపుము. నీ దేశంబునం జేయంబడిన యజ్ఞంబులచేత హరికళాయుక్తంబులగు దేవగణంబులు స్విష్టంబులై, తుష్టంబులగుచు భవదీయవాంఛితార్థంబుల నిత్తురు; కావున దేవతాతిరస్కారంబు నీకు యుక్తంబు గాదు; వేదచోదితంబులగు ధర్మంబులందాసక్తుండవు గమ్మనిన వేనుండిట్లనియె. 421**

ప్రతి : ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు; నర+ఇంద్రా= ఓ రాజశ్రేష్ఠా!; ఏము= మేము; ఒక్కటి; విన్నవించెదము= సవినయంగా చెప్పెదము; అవధరింపుము= వినుము; పురుషులకు= మనుష్యులకు; వాక్+మనసు+కాయవృత్తులవలనన్= వాక్కు, మనస్సు, శరీరము యొక్క ప్రవర్తనలవలన; ఆచరించు ధర్మంబు= చేయునటువంటి ధర్మము; సమస్తలోకంబులను= లోకాలన్నిటిని; విశోకంబులన్+చేయున్= దుఃఖంలేనివానినిగా చేస్తుంది; అసంగులు+అయినవారికిన్= మమకార రహితులకు; మోక్షంబున్+ఇచ్చున్= ముక్తినొసగును; అట్టిధర్మంబు= అలాంటి ధర్మము; ప్రజలకున్= ప్రజలకు; క్షేమకారణంబు+కావునన్= శుభప్రదముకాబట్టి; నీ యందున్= నీ పట్ల; చెడకుండున్+కాక+అని= చెడకుండా ఉండుగాక అని; పలికి= చెప్పి; మఱియున్; ధర్మంబు, నాశంబున్+ఒందినన్= ధర్మము నశిస్తే; ఐశ్వర్యంబుచేన్= భాగ్యాలచేత; రాజు, విడువంబడున్= వదలివేయబడుతాడు; అనిచెప్పి, వెండియున్= మరలా; ఇట్లు+అనిరి= ఇలా అన్నారు; దుష్టచిత్తులు+అగు= చెడ్డమనస్సుగల; అమాత్యులవలనను= మంత్రులవల్ల; తస్కరుల వలనను= దొంగలవల్ల; ప్రజలు నాశంబున్+ఒందకుండ= జనులు నశించకుండా; రక్షించుచు= కాపాడుచు; యథాన్యాయంబుగన్= న్యాయం ఎలా ఉండాలో ఆ పద్ధతిలో; వారలచేన్= వారినుండి; కరంబు= పన్నులు; కొనుచున్+ఉండు= గ్రహిస్తూఉండే; మహీపతి= రాజు; ఇహపరసౌఖ్యంబులన్+అందున్= ఈ లోకంలో, పై లోకంలో సుఖాలు పొందుతాడు; అదియునున్+కాక= అంతేగాక; ఎవ్వని రాష్ట్రంబునన్= ఎవరి దేశంలో; ఏ పురంబునన్= ఏ నగరంలో; యజ్ఞ+ఈశ్వరుండు+అయిన= యజ్ఞాల కధిపతి అయిన; పురుష+ఉత్తముండు= భగవంతుడు; నిజవర్ణ+ఆశ్రమ+ఉచితంబు+అయిన= తన నాలుగు వర్ణములకు; నాలుగు ఆశ్రమాలకు తగిన; ధర్మంబు+కలవారిచేతన్= ప్రవృత్తి గలవారిచే; యజింపన్+పడు= పూజింపబడతాడో; అట్టి నిజశాసనవర్తి+అగు= ఆ విధంగా తన శాసనాన్ని అమలుపరచేవాడైన, రాజువలన; సర్వభూతభావనుండును= సర్వప్రాణికోటిని తనలో భావించేవాడు; మహాభాగుండును= అధిక వైభవముగలవాడు; భగవంతుడును+అగు= పరమాత్మయు అయిన; సర్వ+ఈశ్వరుండు= సమస్తలోకాలకధిపతి; సంతోషించినన్, రాష్ట్ర+అధిపతికి= రాజునకు; సర్వసౌఖ్యంబులున్= అన్ని సుఖాలు; ప్రాపించున్= కలుగును; లోకపాలకులు+అగువారు= రాజులైనవారు; సర్వ+ఈశ్వరునికొఱకు= దేవునికోసం; బలిప్రదానంబులు= బలులు ఇవ్వడం; చేయుదురు, సమస్తలోక దేవతా= అన్నిలోకాలదేవతల; యజ్ఞ+ఆదిసంగ్రహుండును= యజ్ఞాలు మొదలైనవి స్వీకరించేవాడు; వేదమయుండును= వేదాలలో అంతా నిండినవాడు; ద్రవ్యమయుండును= వస్తువులలో నిండినవాడు; తపోమయుండును+అగు= తపస్సులో నిండినవాడు అయిన; నారాయణుని, విచిత్రంబులు+ఐన= ఆశ్చర్యకరాలైన; యజ్ఞంబులచేతన్; యజనంబు+చేసినన్= పూజించిన;

నీకున్+అభయంబు+అగున్= నీకు భయం పోతుంది; మోక్షంబునున్+కలుగున్= ముక్తి లభిస్తుంది; కావున, నీ రాజ్యంబున= నీ రాజ్యంలో; మఖంబులు= యజ్ఞాలు; చేయుము+అని, ఆజ్ఞాపింపుము= ఆదేశించుము; నీదేశంబునన్= నీ రాజ్యంలో; చేయన్+పడిన= చేసిన; యజ్ఞంబులచేతన్, హరికళాయుక్తంబులు+అగు= విష్ణుని కళలతోకూడిన; దేవగణంబులు= దేవతా సముదాయం; సు+ఇష్టంబులు+ఐ= చక్కగా యజ్ఞంతో ఆరాధితులై; తుష్టంబులు+అగుచున్= సంతోషిస్తూ; భవదీయవాంఛిత+అర్థంబులన్= నీవు కోరిన కోర్కెలను; ఇత్తురు= ఇస్తారు; కావున, దేవతా, తిరస్కారంబు= దేవతలను తృణీకరించడం; నీకు యుక్తంబు+కాదు= నీకు మంచిది కాదు; వేదచోదితంబులు+అగు= వేదాలచే చెప్పబడిన; ధర్మంబులందు, ఆసక్తుండవు= అభిలాషకలవాడవు; కమ్ము+అనినన్= అగుము అనిన; వేనుండు= వేనమహారాజు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** ఇలా విన్నవించారు. రాజా! మేమొకటి విన్నవించెదము. శ్రద్ధగా విను. 'మానవుడికి మనస్సు, వాక్కు, శరీరము–అని త్రికరణాలు. ఈ మూడింటిద్వారా పరిశుద్ధంగా చేసేవి ధర్మయుక్తాలైన కర్మలు. అవి అన్నిలోకాలను శోకరహితమైన స్థితిలో నిలుపుతాయి. కోరికలు లేకుండా పనిచేసేవారికి ఈ ధర్మాలే మోక్షాన్ని ఇస్తాయి. ధర్మమే సమస్త ప్రజలకు క్షేమదాయకం. కాబట్టి, అలాంటి ధర్మం నీలో చెడకుండుగాక అని తిరిగి ఆ ధర్మం నశిస్తే ఆ రాజు ఐశ్వర్యం నశిస్తుంది. అని చెప్పి తిరిగి ఇలా అన్నారు. దుష్టమనస్కులైన మంత్రులవల్లగాని, దొంగలవల్లగాని ప్రజలు నశించకుండా రక్షిస్తూ యథాన్యాయంగా పన్ను స్వీకరించే రాజు ఇహపరసౌఖ్యాలు పొందుతాడు.

అంతేకాక, ఎవని రాజ్యంలో, ఏ నగరంలో ఏ రాజు తన శాసనంచేత ప్రజలను తమతమ వర్ణాశ్రమ ధర్మాలను పాటించేట్లు చేసి యజ్ఞాలకు అధిపతి అయిన భగవంతుడు, తమతమ వర్ణాశ్రమధర్మాలను పాటించేవారిచేత పూజింపబడేట్లు చేస్తాడో, ఆ రాజువలన అన్ని భూతాలను తనలో భావించేవాడు, మహావైభవంకలవాడు, భగవంతుడు, అన్ని లోకాలకు అధిపతి అయిన పరమాత్మ సంతోషిస్తే – ఆ రాజుకు అన్ని సుఖాలు కలుగుతాయి. ప్రజాపాలకులైన ప్రభువులు ఆ సర్వేశ్వరుని కొరకు బలిదానాలు చేస్తారు. అన్ని లోకాల దేవతల యజ్ఞాదులను గ్రహించేవాడు, అన్ని వేదాల్లో, అన్ని వస్తువుల్లో, అన్ని తపస్సుల్లో నిండి ఉన్నటువంటివాడు అయిన నారాయణుని, ఆశ్చర్యకరాలైన యజ్ఞాలతో పూజిస్తే నీకు భయంలేని స్థితి ఏర్పడుతుంది. మోక్షం కలుగుతుంది. అందువల్ల నీ రాజ్యంలో యజ్ఞాలు చేయవలసినదని ఆజ్ఞాపించు. ఆ యజ్ఞాలవల్ల విష్ణుకళతో కూడిన దేవతా సమూహాలు ఇష్టంగా సంతుష్టి చెంది నీ కోర్కెలను తీరుస్తారు. దేవతలను తిరస్కరించటం నీకు తగదు. వేదోక్త ధర్మాలపట్ల ఆసక్తి కలవాడవగుము. అని చెప్పగా, ఆ వేనరాజు మహర్షులతో ఇలా అన్నాడు.

**క. మునులార! మీర లిప్పుడు, నను నీగతిఁ బడుచుఁదనమునంబలికితి; రై**
**నను నది యధర్మ; మందుల, నెనయఁగ ధర్మమనఁగలదె? యెచ్చట నైనన్. 422**

**ప్రతి :** మునులార= ఓ తపస్వులారా!; మీరులు= మీరు; ఇప్పుడు, ననున్= నన్ను; ఈ గతిన్= ఈ విధంగా; పడుచు+తనమునన్= పరిపాకంలేని బుద్ధితో; పలికితిరి= బోధచేశారు; ఐననున్, అది అధర్మము= అది ధర్మము కాదు; అందులన్= అందులోనూ; ఎనయఁగ= లెక్కించగా; ధర్మమనన్= ధర్మమనేది; ఎచ్చటనైనన్+కలదె= ఎక్కడైనా ఉందా?

**తా :** మునులారా! మీరు నాకు ఏమేమో బోధించారు. మీ మాటలు బుద్ధి పరిపాకం లేనివిగా ఉన్నాయి. మీ మాటలలో అధర్మముంది. అందులో అసలు ధర్మమనేది ఎక్కడవుందో చెప్పండి?

**వ. అదియునుంగాక. 423**

**ప్రతి :** అదియునున్+కాక; అదీగాక.

**చ. ఎనయఁగ జారకామిని నిజేశుని మ్రుచ్చిలి జారపూరుషుం**
**దనపతిఁ గాఁ దలంచు గతిఁ దద్దయు మూఢమనస్కులై తన**
**ర్చిన నరపాలరూపము ధరించిన యీశ్వరు నన్నెఱుంగ క**
**న్యుని భజియింప మీ రిహపరోన్నత సౌఖ్యము లంద రెన్నఁడున్. 424**

**ప్రతి :** ఎనయఁగన్= అతిశయింపగా; జారకామిని= వ్యభిచారిణి; నిజ+ఈశునిన్= తనభర్తను; మ్రుచ్చిలి= మోసగించి; జారపురుషున్= వ్యభిచరించేవానిని; తనపతిన్+కాన్= తన భర్తనుగా; తలంచుగతిన్= భావించే విధంగా; తద్దయు= మిక్కిలి; మూఢమనస్కులు+ఐ= మూర్ఖచిత్తులై; తనర్చిన= అతిశయించిన; నరపాలరూపము= రాజు రూపం, ధరించిన; ఈశ్వరున్= భగవంతుని; నన్నున్+ఎఱుంగక= నన్ను తెలిసికోలేక; అన్యునిన్= ఇతరుని; భజియింపన్= కొలువగా; మీరు, ఇహపర+ఉన్నత సౌఖ్యములు= ఈ లోకంలోని; పరలోకంలోని సుఖాలను, ఎన్నడున్= ఎప్పటికీ; అందరు= పొందలేరు.

**తా :** మూఢులారా! మీకు ప్రభు రూపంలో వచ్చిన నన్ను భగవంతుడని గుర్తించ లేకపోతున్నారు. వ్యభిచారిణి అయిన స్త్రీ తనభర్త కన్ను గప్పి ఇంకొకనిని భర్తగా భావించి, వ్యభిచరించినట్లు మీ ఎదుట కన్పించే నన్ను గుర్తించక ఎవడో నారాయణుడని ఇంకొకరిని సేవిస్తున్నారు. అలా చేస్తే మీకు ఇహపరసౌఖ్యాలు ఎన్నటికీ ఉండవు.

**వ. అని మఱియు నిట్లనియె; యజ్ఞ పురుషుం దన నెవ్వం; డెవ్వనియందు మీకు భక్తి స్నేహంబు లుదయించె? భర్తృస్నేహవిదూరంబులై కుయోషిద్గణంబులు జారునందుం జేయు భక్తిచందంబునఁ బలికెద; రదియునుంగాక. 425**

**ప్రతి :** అని, మఱియున్+ఇట్లు+అనియె; యజ్ఞపురుషుండు+అనన్+ఎవ్వండు= యజ్ఞాలకు అధిపతి అనగా ఎవ్వడు?; ఎవ్వనియందు= ఎవనిపట్ల; మీకు, భక్తిస్నేహంబులు+ఉదయించెన్?= భక్తి, ప్రేమ పుట్టాయి?; కుయోషిత్+గణంబులు= చెడ్డస్త్రీల సముదాయము; భర్తృస్నేహ విదూరంబులు+ఐ= భర్త ప్రేమకు దూరమై; జారునందున్= వ్యభిచరించేవాని పట్ల; చేయు భక్తిచందంబునన్= చేసేభక్తివలె; పలికెదరు, అదియునున్+కాక= అదీగాక.

**తా :** అని మరీ ఇలా అన్నాడు. యజ్ఞపురుషుడనగా ఎవడు? మీకు ఎవరిపై భక్తి, స్నేహాలు కలిగాయి? భర్తప్రేమకు దూరమై చెడుస్త్రీ సమూహాలు అంకుమగనిపట్ల చూపే భక్తివలె మీరు మాట్లాడుతున్నారు. అదీగాక

**క. హరిహరహిరణ్యగర్భ, స్వరధీశ్వరవహ్నిశమనజలధిపతిమరు**
**న్నరవాహనశశిభూరవి, సురముఖ్యులు నృపశరీరసూచకు లగుటన్. 426**

**ప్రతి :** హరి= విష్ణువు; హర= శివుడు; హిరణ్యగర్భ= బ్రహ్మ; స్వర్+అధీశ్వర= (స్వర్గలోక అధిపతి) ఇంద్రుడు; వహ్ని= అగ్ని; శమన= యముడు; జలధిపతి= వరుణుడు, మరుత్= వాయువు; నరవాహన= నిర్‌ృతి; శశి= చంద్రుడు; భూ= పృథ్వి; రవి= సూర్యుడు; సురముఖ్యులు= దేవతలలో ప్రముఖులు; నృపశరీర సూచకులు= రాజు శరీరాన్ని సూచించేవారు; అగుటన్= కావున.

**తా :** విష్ణువు, ఈశ్వరుడు, బ్రహ్మ, స్వర్గలోకాధిపతి అయిన ఇంద్రుడు, అగ్ని, యముడు, వరుణుడు, వాయువు, నరవాహనుడైన కుబేరుడు, చంద్రుడు, భూమి, సూర్యుడు ఇతర ముఖ్యదేవతలు తమను ప్రజలకు సూచించుటకై రాజు శరీరంలో ఉంటాడు.

**విశే :** నరవాహనులు ఇద్దరు. ఒకడు నిర్ఋతి (నైఋతి దిక్పాలకుడైన ఒక రాక్షసుడు) ఇంకొకడు ఉత్తరదిక్కుకు అధిపతియైన కుబేరుడు. ఇక్కడ వాయవ్యదిశ పిదప చెప్పిన నరవాహనుని కుబేరుడుగా భావించుట యుక్తం. అంతేకాక, ఇక్కడ ప్రస్తావించిన వారందరూ దేవతలే. ఆ కారణంగా ఇక్కడ నరవాహనుడు కుబేరుడే అని భావించవలెను.

**క. పరికించి నను భజింపుఁడు, ధరణీశుఁడు సర్వదేవతామయుఁడగు, మ**
**త్సరముడుగుఁడు నాకంటెను, బురుషుఁడు మఱి యెవ్వఁడగ్రపూజార్హుఁడిలన్? 427**

**ప్రతి :** పరికించి= ఆలోచించి; నను= వేనుని; భజింపుఁడు= కొలువండి; ధరణీ+ఈశుఁడు= రాజ్యాన్ని పాలించేరాజు; సర్వదేవతామయుఁడు+అగు= దేవతలందరి అంశలతో కూడినవాడు అవుతాడు; మత్సరము= ఈర్ష్య; ఉడుగుఁడు= వదలిపెట్టండి; ఇలన్= భూమిలో, నాకంటెను; మఱి యెవ్వఁడు= ఇంకొకడు; పురుషుఁడు= మానవుడు; అగ్రపూజ+అర్హుండు= ప్రథమపూజకు తగినవాడెవడు?

**తా :** ఇదంతా ఆలోచించి నన్నే పూజించండి రాజు దేవతలందరి అంశలుకలవాడు. మత్సరమును మానండి. ఈ భూమిపైన నాకంటె అగ్రపూజార్హుడైన పురుషుడు ఇంకెవడున్నాడు?

**వ. అదిగాక మీరు నాయందు బలివిధానంబులు సేయుండని పాపకర్ముండు నసత్ప్రవర్తకుండు నష్ట మంగళుండు విపరీతజ్ఞానుండు నగు వేనుండు పండితమాని యగుచుం బలికి మునుల వచనంబులు నిరాకరించి యూరకున్న నమ్మునులు భగ్నమనోరథులై తమలో నిట్లని; రీ దారుణకర్ముం డయిన పాతకుండు హతుండగుంగాక! వీఁడు జీవించెనేని వీని చేత నీ జగంబులు భస్మంబులు గాఁగల; విది నిశ్చయంబు; దుర్వృత్తుండగు వీఁడు మహారాజ సింహాసనంబున కర్హుండు గాఁడు; వీఁడు మున్నే సర్వేశ్వరు ననుగ్రహంబున నిట్టి విభూతి యుక్తుం డయ్యె నట్టి యజ్ఞపతియైన శ్రీవిష్ణుని నిందించుచున్నవాడు; గావున నిర్లజ్జుండైన హరిదూషకుని హననంబు సేయవలయునని మునులుద్యోగించి యాత్మప్రకాశితంబైన క్రోధంబునంజేసి హుంకారమాత్రంబున నా యీశ్వర నిందాహతుం డగు వేనునిం బొలియఁ జేసి రంత. 428**

**ప్రతి :** అదిగాక, మీరు, నా+అందు; బలివిధానంబులు= పూజలు బలులు; చేయుండు+అని= సమర్పింపుడని; పాపకర్ముండును= పాపాత్ముడు; అసత్+ప్రవర్తకుండు= చెడుపనులు చేసేవాడు; నష్టమంగళుండు= శుభాలు నశించినవాడు; విపరీతజ్ఞానుండును= జ్ఞానమునకు ఎదురు తిరిగినవాడు (అజ్ఞాని); అగు వేనుండు= అయిన వేనమహారాజు; పండితమాని= తెలిసినవాడిననే అభిమానం కలవాడై; అగుచున్+పలికి= మాట్లాడి; మునుల వచనంబులు= ఋషుల మాటలు; నిరాకరించి= కాదని; ఊరుకున్నన్= మిన్నకుండిన; ఆ+మునులు= ఆ ఋషులు; భగ్నమనోరథులు+ఐ= కోర్కెలు ఫలించనివారై; తమలోన్+ఇట్లు+అనిరి= తమలో తాము ఇలా తలపోశారు; ఈ దారుణకర్ముండు+అయిన= ఈ క్రూరకర్మలు చేసేవాడైన; పాతకుండు= పాపి; హతుండు+అగున్+కాక= చనిపోవునుగాక; వీఁడు జీవించెను+ఏని= వీడు బ్రదికి ఉంటే, వీనిచేతన్; ఈ జగంబులు= ఈ లోకాలు; భస్మంబులు+కాఁగలవు= బూడిద అవుతాయి; ఇదినిశ్చయంబు= ఇది తప్పదు;

దుర్+వృత్తుండు+అగు వీఁడు= చెడ్డ స్వభావముగల వీడు; మహారాజసింహాసనంబునకున్= రాజ్యపట్టానికి; అర్హుండు+ కాఁడు= తగడు; వీఁడు+మున్ను= వీడు ముందుగా; ఏ సర్వ+ఈశ్వరుని= ఏ భగవంతుని; అనుగ్రహంబునన్= దయవలన; ఇట్టి విభూతియుక్తుండు+అయ్యెన్= ఈ విధమైన ఐశ్వర్యాన్ని పొందాడో; అట్టి యజ్ఞపతి+అయిన= అలాంటి యాగభర్తఅయిన; శ్రీవిష్ణుని నిందించుచున్నవాడు, కావున; నిర్లజ్జుండు+ఐన= సిగ్గులేనివాడైన; హరిదూషకుని= హరిని నిందించువానిని; హననంబు+చేయవలయు+అని= చంపాలని; మునులు+ఉద్యోగించి= ఋషులు ప్రయత్నించి; ఆత్మప్రకాశితంబు+అయిన= మనసులో పెల్లుబికిన; క్రోధంబునన్+చేసి= కోపంతో; హుంకారమాత్రంబునన్= హుంకారంచేత; ఆ+ఈశ్వర నిందాహతుండు+అగు= ఈశ్వరుని నిందచే హతుడైన; వేనునిన్+పొలియన్+చేసిరి= ఆ వేనుని చంపిరి; అంతన్= ఆ తర్వాత...

**తా :** కావున, పూజా పునస్కారాలూ, బలులు – అన్నీ నాకే సమర్పించండి – అని పాపాత్ముడు, దుర్మార్గుడు, అమంగళుడు, అజ్ఞాని అయిన వేనుడు తనే పండితుడననే గర్వంతో మునుల మాటలు నిరాకరిస్తూ మాట్లాడి ఊరుకున్నాడు. ఆ మునులు తమ ప్రయత్నం వృథా అయిందని పరస్పరం ఇలా అనుకున్నారు. భయంకరకృత్యాలు చేస్తున్న ఈ పాపాత్ముడు నశించాలి. వీడు బ్రతికివుంటే వీనివల్ల ఈ లోకాలన్నీ బూడిద అయిపోతాయి. ఇది తప్పదు చెడు స్వభావం కలిగిన వీడు రాజ్య సింహాసనం అధిష్ఠించడానికి అర్హుడు కాడు. ఏ భగవంతుని అనుగ్రహంవల్ల వీడు ఇటువంటి భోగభాగ్యాలను పొందాడో ఆ యజ్ఞభర్త అయిన శ్రియఃపతినే వీడు నిందిస్తున్నాడు. కావున, సిగ్గుమాలి శ్రీహరిని నిందించే వీనిని హతమార్చాలని మునులు తమలో పెల్లుబికిన కోపంతో హుంకరించారు. ఆ మహర్షుల హుంకారానికి భగవన్నిందచే మునుపే హతుడైన వేనుని ప్రాణాలు పోయాయి. ఆ తర్వాత

**క. అరసి సునీథయు శోకా, తురయై తన సుతుఁడు దనువుఁదొఱఁగిన దదనం**
**తరమునను యోగశక్తిం, బరువడి నిజ తనయు తనువుఁబరిపాలించెన్. 429**

**ప్రతి :** అరసి= అది చూచి; సునీథయు= వానితల్లి సునీథ; శోక+ఆతుర+ఐ= దుఃఖం చేత వేగిరపాటుగలదై; తనసుతుఁడు= తన కుమారుడు; తనువున్+తొఱఁగినన్= దేహం వదలిపెట్టగా; తద్+అనంతరమునను= ఆ తర్వాత; పరువడి= వెంటనే; యోగశక్తిన్= యోగశక్తితో; నిజతనయు తనువున్= తనకుమారుని శరీరాన్ని; పరిపాలించెన్= చెడిపోకుండా కాపాడింది.

**తా :** అది చూచి (వేనుని తల్లియగు) సునీథ శోకంతో ఆతరురత చెంది కుమారుడు మరణించిన పిదప వేగంగా తన యోగశక్తితో కుమారుని శరీరం చెడిపోకుండా కాపాడింది.

**వ. అంత నొక్కనాఁడు. 430**

**ప్రతి :** అంతన్+ఒక్కనాఁడు= ఆ తర్వాత ఒకరోజు.

**తా :** ఆ తర్వాత ఒకరోజు

**సీ. మునివరేణ్యులు భక్తి దనర సరస్వతీ సలిలంబులను గృతస్నానులగుచు**
**మునుకొని తత్తీరమున నగ్నిహోత్రముల్ విలసిల్ల నియతిఁ గావించి యచటఁ**

**దవిలి సత్పురుషకథా వినోదంబులు సలుపుచు నుండంగ సకలలోక భయదంబులగు మహోత్పాతముల్ దోఁచిన మసలి లోకంబు లమంగళములు**

**తే. పొరయకుండెడుఁగా కని బుద్ధిలోనఁ, దలఁచుచుండఁగఁ బెలుచ నుదగ్ర మగుచు సర్వదిశలను బాంసువర్షంబు గురిసెఁ; దస్కరులు సర్వజనుల విత్తములు గొనిరి. 431**

**ప్రతి :** మునివరేణ్యులు= తపస్సంపన్నులు; భక్తి+తనరన్= భక్తిమీరగా; సరస్వతీ సలిలంబులను= సరస్వతీ నది నీళ్లలో; కృతస్నానులు+అగుచున్= స్నానము చేసినవారై; మునుకొని= ప్రారంభించి; తద్+తీరమునన్= ఆ నది ఒడ్డున; అగ్నిహోత్రముల్= అగ్నికార్యాలు; విలసిల్ల= ప్రకాశింపగా; నియతిన్+కావించి= నియమంతో చేసి; అచటన్+తవిలి= అక్కడ ఆసక్తితో; సత్పురుష కథావినోదంబులు= సజ్జనుల కథలచే కాలక్షేపం; సలుపుచున్+ఉండంగన్= చేస్తుండగా; సకలలోక భయదంబులు+అగు= అన్ని లోకాలకు భయాన్ని కలిగించే; మహా+ఉత్పాతముల్= గొప్ప ఉపద్రవాలు; తోఁచినన్= కనిపించగా; మసలి= పూనుకొని; లోకంబులు= లోకాలు; అమంగళములు= అశుభాలు; పొరయక+ఉండెడుఁగాక+అని= కలుగకుండగాక అని; బుద్ధిలోనన్= మనస్సులో; తలఁచుచు+ఉండంగన్= అనుకొంటుండగా; పెలుచన్= వేగంగా; ఉదగ్రము+అగుచున్= భయంకరమైనది అగుచు; సర్వదిశలను= అన్నిదిక్కులా; పాంసువర్షంబు= ధూళివాన; కురిసెన్= కురిసింది; సర్వజనుల విత్తములు= జనులందరి సంపదలను; తస్కరులు+కొనిరి= దొంగలు దోచుకొన్నారు.

**తా :** మునిశ్రేష్ఠులు భక్తి అతిశయించగా, సరస్వతీ నదీజలాలలో స్నానంచేసి ఆ నదీతీరంలో నియమంగా ముందుగా అగ్నిహోత్రములు మందునట్లుగా చేశారు. అక్కడ ఆసక్తితో సత్పురుషుల కథలు వినే వినోదాలలో కాలక్షేపం చేస్తూండగా లోకాలన్నింటికిని భయం కలిగించే గొప్ప ఉపద్రవాలు కనిపించినాయి. మునులు పూనుకొని లోకాలకు అశుభములు కలుగకుండు గాక! అని మనసులలో తలచుకొంటుండగా వేగంగా అన్ని దిశలలోను భయంకరంగా దుమ్మువర్షం కురిసింది. దొంగలు జనలందరి ధనాలను దోచుకొన్నారు.

**వ. ఇట్టి లోకోపద్రవం బెఱింగి జననాథుం డుపరతుం డగుటంజేసి జనపదంబు లరాజకంబులై యన్యోన్య హింసల నొందుచుం దస్కర బాధితంబు లగుచు నుండుట యెఱింగియుఁ దన్నివారణంబునకు సమర్థ లయ్యును జోరాదిబాధలం గనుంగొనుచు మునులు వారింపక యుండిరి; మఱియు సమదర్శనుండును శాంతుండును మననశీలుండును నగు బ్రాహ్మణుండు దీనుల నుపేక్షించిన నతని తపంబు భిన్నభాండగతం బయిన క్షీరంబు చందంబున స్రవించుం గావున నంగవసుధాధీశవంశోద్భవులు హరిపదాశ్రయులగుటం జేసియు వీరల వంశంబు విచ్ఛిత్తి నొందింప ననర్హంబు గాన స్థాపనీయం బని నిశ్చయించి మృతుండైన వేనుని కళేబరంబు దగ్గఱ వచ్చి తదూరుమథనంబు గావింప నందు. 432**

**ప్రతి :** ఇట్టి= ఈ విధమైన; లోక+ఉపద్రవంబు= లోకాలకు ఆపద కలగడం; ఎఱింగి= తెలుసుకొని; జననాథుండు= రాజు; ఉపరతుండు= మరణించినవాడు; అగుటన్+చేసి= కావడంవల్ల; జనపదంబులు= దేశము లేదా రాజ్యము; అరాజకంబులు+ఐ= రాజులేనివై; అన్య+అన్యహింసలన్+ఒందుచున్= ఒకరినొకరు బాధించుకుంటూ; తస్కరబాధితంబులు+

అగుచున్= దొంగలచేత బాధింపబడుతూ; ఉండుట+ఎఱింగియున్= ఉండడం తెలిసీ; తద్+నివారణంబునకున్= దానిని అరికట్టుటకు; సమర్థులు+అయ్యును= సామర్థ్యం కలవారైనా; చోర+ఆది బాధలన్+కనుంగొనుచు= దొంగలు మొదలైన వారిచే కలిగే బాధలనుచూస్తూ; మునులు= ఋషులు; వారింపక+ఉండిరి= అరికట్ట కుండిరి; మఱియు, సమదర్శనుండును= సమానంగా చూడగలవాడు; శాంతుండును= సహనం గలవాడు; మననశీలుండును+అగు= ఆలోచించే లక్షణం కలవాడైన; బ్రాహ్మణుండు, దీనులన్+ఉపేక్షించినన్= దుఃఖితులైనవారిని నిర్లక్ష్యంచేస్తే; అతని తపంబు= అతని తపస్సు; భిన్నభాండగతంబు+అయిన= పగిలిన కుండలోని; క్షీరంబు చందంబునన్= పాలవలె; స్రవించున్+కావునన్= కారిపోతుందికాబట్టి; అంగవసుధా+అధీశ= అంగదేశపురాజుయొక్క; వంశ+ఉద్భవులు= వంశంలో పుట్టినవారు; హరిపద+ఆశ్రయులు+అగుటన్+చేసియు= హరిపాదాలను ఆశ్రయించినవారు కాబట్టి; వీరలవంశంబు= వీరివంశము; విచ్ఛిత్తిన్+ఒందింపన్= వినాశనం చేయడానికి; అనర్హంబు+కాన= అర్హమైనదికాదు కావున; స్థాపనీయంబు+అని= స్థిరం చేయదగినదని; నిశ్చయించి= నిర్ణయించి; మృతుండు+అయిన= చనిపోయిన; వేనుని కళేబరంబు= వేనరాజుశరీరం; దగ్గఱవచ్చి= దగ్గరకు వచ్చి; తద్+ఊరుమథనంబు+ కావింపన్= అతని తొడను చిలకగా; అందున్= ఆ తొడలో...

**తా :** ఇట్టి లోకానికి కలిగే ఉపద్రవం తెలిసికొని, రాజు మరణించుటచేత రాజ్యమంతయు (పాలించు)రాజు లేక ఒకరినొకరు హింసించుకొనుచు, దొంగలచేత బాధింపబడుటను కూడ తెలిసికొని వానిని వారించుటకు సమర్థులై కూడ దొంగలు మొదలైన వారు ప్రజలకు చేసెడి బాధలను చూస్తూ, మునులు వానిని వారింపకయుండిరి. కాని తిరిగి సమదర్శనుడును, శాంతుడును, మనన శీలుడును అయిన బ్రాహ్మణుడు దీనులను ఉపేక్షించినచో వారి తపస్సు పగిలిపోయిన కుండలోని పాలు కారిపోవు విధంగా నశిస్తాడు. ఆ విషయం నాలోచించి, అంగరాజు వంశములోని పూర్వులందరు విష్ణువు పాదాలను ఆశ్రయించిన వారగుట చేత, వీరి వంశం నశించకుండ స్థాపించదగిన దని నిశ్చయించి మునులు వేనుని శవం దగ్గరకు వచ్చి ఆ శవపు ఊరువును (తొడను) మథింపగా అందుండి

**సీ. ఘన కాక కృష్ణ సంకాశ వర్ణుండును హ్రస్వావయవుఁడు మహాహనుండు**
**హ్రస్వబాహుండును హ్రస్వపాదుండును నిమ్న నాసాగ్రుండు నెఱియు రక్త**
**నయనుండుఁ దామ్రవర్ణ శ్మశ్రుకేశుండు నతిదీనవదనుండు నైన యట్టి**
**యొక్క నిషాదకుం డుదయించి యేమి సేయుదునని పలుకుచునున్నఁ జూచి**

**తే. వరమునులు 'నిషీద' యనుచుఁ బలుకుటయును, దాన వాఁడు నిషాదాభిధానుఁ డయ్యె,**
**నతని వంశ్యులు గిరికాననాళి వేను, కల్మషముఁ దెల్పుచుండిరి కడఁక మఱియు. 433**

**ప్రతి :** ఘన కాక కృష్ణ సంకాశ= మబ్బువలె; కాకివలె నల్లని, వర్ణుండును= రంగుగలవాడు; హ్రస్వ+అవయవుఁడు= పొట్టి అవయవాలు గలవాడు; మహాహనుండు= పెద్దచెక్కిళ్లుగలవాడు; హ్రస్వబాహుండును= కురుచ చేతులు గలవాడు; హ్రస్వపాదుండును= కురుచ కాళ్లు గలవాడు; నిమ్ననాసా+అగ్రుండు= అణగి ఉన్న ముక్కుపైభాగము కలవాడు; నెఱియు= స్పష్టంగా కనిపించే; రక్తనయనుండు= ఎఱ్ఱని కండ్లు ఉండేవాడు; తామ్రవర్ణ= రాగిరంగుగల; శ్మశ్రు కేశుండు= మీసాలు, జుట్టుగలవాడు; అతిదీన వదనుండును+ఐన+అట్టి= మిక్కిలి దయనీయమైన ముఖంగలవాడైనట్టి; ఒక్కనిషాదకుండు= ఒక బోయవాడు; ఉదయించి= పుట్టి; ఏమి+చేయుదున్= ఏం చేయాలి, అని పలుకుచున్+ఉన్నన్+చూచి= అని అంటుండగా

చూచి, వరమునులు= గొప్పఋషులు; 'నిషీద'+అనుచు= 'కూర్చుండు' మని; పలుకుటయును= మాట్లాడగా; దానన్+వాఁడు= ఆ మాటలతోవాడు; నిషాద+అభిధానుఁడు+అయ్యెన్= నిషాదుడు–అనే పేరుగలవాడాయెను; అతని వంశ్యులు= అతని వంశంలో పుట్టినవారు; గిరికానన+ఆళి= కొండలు, అడవుల సమూహంలో; కడఁకన్= పూనికతో; వేను కల్మషమున్= వేనరాజు పాపం; తెల్పుచున్+ఉండిరి= తెలిసేలా (చిహ్నంగా) ఉండిపోయారు; మఱియు.

**తా :** అప్పుడు వేనుని తొడనుండి నల్లని మబ్బురంగు, కాకిరంగుగల ఒకనిషాదుడు పుట్టాడు. మఱుగుజ్జు అవయవాలు, కురచచేతులు, కురచపాదాలు, పొట్టి చేతులు, కాళ్లు, సొట్టముక్కు, ఎఱ్ఱని కండ్లు, రాగిరంగు వెంట్రుకలు, మీసాలు కలిగిన అతని ముఖం నిస్సహాయస్థితిని తెలుపుతోంది. అతడు "నేనేమి చేసే"దని అడుగగా. మునులు వానిని చూసి 'నిషీద' అన్నారు. ఆ మాటతో వాడు నిషాదుడను పేరుగలవాడైనాడు. ఆ నిషాదుని వంశం వారంతా కొండల్లో, అడవుల్లో తిరుగుతూ వేనుని పాపాలకు చిహ్నంగా ఉండినారు.(వారిని చూడగానే వేనుని పాపాలు తెలుస్తూ ఉండేవి) ఆ పిదప

**క. కని వా రనపత్యుం డగు, మనుజేంద్రుని బాహు లంత మథియించిన నం**
**దనఘం బగు నొక మిథునము, జనియించెను సకలజనులు సమ్మదమందన్. 434**

**ప్రతి :** కని= చూచి; వారు= ఆ మహర్షులు; న+అపత్యుండు+అగు= బిడ్డలులేనివాడైన; మనుజ+ఇంద్రుని= రాజుయొక్క; బాహులు= భుజాలు; అంతన్= అప్పుడు; మథియించినన్= చిలుకగా; అందున్, (న+అఘంబు) అనఘంబు+అగు= పాపరహితమైన; ఒక మిథునంబు= ఒక స్త్రీపురుషుల జంట; సకలజనులు= లోకమంతా; సమ్మదము+అందన్= సంతోషించగా; జనియించెను= పుట్టినది.

**తా :** అది చూచి ఆ మునులంతా బిడ్డలులేని ఆ వేనరాజు బాహువులను మథించారు. అందులో నుంచి పవిత్రులైన దంపతులు పుట్టారు. లోకమంతా సంతోషించింది.

**వ. అందు లోకరక్షణార్థంబుగా నారాయణాంశంబున నొక పురుషుండును, హరికి నిత్యానపాయిని యగు లక్ష్మీకళాకలితయు గుణంబులకు భూషణంబులకు నలంకార ప్రదాత్రియు నగు కామినియు జనియించె, నందుఁ బృథుశ్రవుండును పృథుయశుండు నగుట పృథు చక్రవర్తియను పేరం బ్రసిద్ధుం డయ్యె; నయ్యంగనయు నర్చియను నామంబునందనరుచు నతని వరియించె, నా సమయంబున. 435**

**ప్రతి :** అందున్= ఆ బాహువులలో; లోకరక్షణ+అర్థంబుగాన్= లోకాలను కాపాడటంకోసం; నారాయణ+అంశంబునన్= విష్ణు అంశంలో; ఒక పురుషుండును, హరికిన్= విష్ణువునకు; నిత్య+న+అపాయిని+అగు= ఎల్లవేళల శ్రీస్వామివారిని విడిచిపెట్టకుండా ఉండునది – శ్రీలక్ష్మీదేవి; లక్ష్మీకళాకలితయు= లక్ష్మీకళతో కూడినదియు; గుణంబులకున్= మంచి గుణాలకు; భూషణంబులకున్= అలంకారాలకు; అలంకార ప్రదాత్రియును+అగు= శోభను కలిగించేటటువంటిదగు; కామినియున్= అందగత్తె; జనియించెన్= పుట్టెను; అందున్= వారిలో; పృథుశ్రవుండును= పెద్దచెవులుఉండేవాడు; పృథుయశండును+అగుట= గొప్పకీర్తి గలవాడు కావడంవల్ల; పృథుచక్రవర్తి+అనుపేరన్= పృథుచక్రవర్తి అనే పేరుతో; ప్రసిద్ధుండు+అయ్యెన్= పేరుపొందెను; ఆ+అంగనయు= ఆ అంగన కూడా; అర్చి+అనునామంబునన్= 'అర్చి' అనే పేరుతో; తనరుచున్= అతిశయించి; అతనిన్= పృథుచక్రవర్తిని; వరియించెన్= వివాహమాడింది; ఆ సమయంబునన్= అప్పుడు...

**తా :** ఆ బాహువులలో నారాయణుని అంశలో ఒక పురుషుడు, హరిని ఎల్లప్పుడూ వీడని లక్ష్మీదేవి అంశగల ఒక అందగత్తె జన్మించింది. ఆమె సద్గుణాలకు అలంకారాలకు శోభ కల్గించింది. పెద్ద చెవులు, గొప్పకీర్తిగల అతడు 'పృథుచక్రవర్తి' అనే పేరుతో ప్రసిద్ధికెక్కాడు. ఆమె కూడా 'అర్చి' అనే పేరుతో దినదినప్రవర్ధమానయై అతణ్ణి వివాహమాడింది. అప్పుడు

**సీ. అందంద కురియించి రమరులు మునినాథవితతి మోదంబంద విరులవానఁ;**
**బరమానురక్తి శుంభల్లీలఁ జూపట్టె సురపతివీట నచ్చరలయాట;**
**కర్ణరసాయనక్రమమున వీతెంచెఁ బఱపైన తేటకిన్నరులపాట;**
**యనిమిషకరహతంబై చాలఁజెలఁగెను విభవోత్సవంబు దుందుభిరవంబు;**

**తే. మునినుతి సెలంగె శిఖిగుండముల వెలింగె, నంత నచటికి సరసీరుహాసనుండు**
**గరుడగంధర్వకిన్నరగణముతోడ, నర్థిఁజనుదెంచె సమ్మోద మతిశయిల్ల. 436**

**ప్రతి :** అమరులు= దేవతలు; అందు+అందన్= అన్నిచోట్ల; మునినాథ వితతి= ఋషిశ్రేష్ఠుల సమూహం; మోదంబు+అందన్= సంతసించగా; విరులవానన్= పూలవర్షాన్ని; కురియించిరి= కురిపించారు; సురపతివీఁటన్= ఇంద్రుని నగరంలో (అమరావతి); అచ్చరల+ఆట= అప్సరసల నృత్యం; పరమ+అనురక్తిన్= మిక్కిలి ప్రేమతో; శుంభత్+లీలన్= ప్రకాశించే విధంగా; చూపట్టెన్= కన్పించింది; కర్ణరసాయనక్రమమునన్= చెవులను ఆనందపరిచే విధంగా; పఱపు+అయిన= వ్యాపించిన; తేట= ప్రసన్నమైన; కిన్నరులపాట= కిన్నరస్త్రీల సంగీతం; వీతెంచెన్= వ్యాపించింది; అనిమిష కరహతంబు+ఐ= దేవతల చేతులతో మ్రోగించబడిన; విభవ+ఉత్సవంబు= వైభవమైన పండుగగా; దుందుభిరవంబు= నగారాలమోత; చాలన్+చెలఁగెను= అధికంగా వ్యాపించెను; మునినుతి= ఋషుల స్తోత్రాలు; చెలఁగెన్= అధికమయ్యాయి; శిఖి= అగ్ని; గుండములన్= అగ్నిగుండాలలో; వెలింగెన్= ప్రకాశించింది; అంతన్+అచటికి= అప్పుడక్కడికి; గరుడ, గంధర్వ, కిన్నర గణము తోడన్= గరుడులు, గంధర్వులు, కిన్నర బృందంతో; సరసీరుహ+ఆసనుండు= పద్మం ఆసనంగాగల బ్రహ్మ; అర్థిన్= కోర్కెతో; సమ్మోదము= ఆనందం; అతిశయిల్లన్= అధికంకాగా; చనుదెంచెన్= వచ్చినాడు.

**తా :** ఋషిశ్రేష్ఠుల సమూహం సంతోషించే విధంగా దేవతలు అంతటా పూలవాన కురిపించారు. సురపతి నగరంలో (అమరావతి)లో మిక్కిలి ఇష్టంగా చేసిన అచ్చరల నృత్యం ప్రకాశించేవిధంగా కనుపట్టింది. చెవులకు ఆనందం కలిగించే విధంగా వ్యాపించిన ప్రసన్నమైన కిన్నరులపాట వినిపించింది. దేవతలు కొట్టి మ్రోగించగా వైభవోత్సవంవలె దుందుభి శబ్దం అధికంగా వ్యాపించింది. అతిశయించిన సంతోషంతో బ్రహ్మదేవుడు వచ్చాడు.

**వ. అంత. 437**

**ప్రతి :** అంతన్= అప్పుడు.

**కవిరాజవిరాజితము.**

**అరయఁగ వైన్యుని దక్షిణహస్తమునందు రమారమణీసుమనో**
**హరు లలితాయుధచిహ్నము లంఘ్రులయందు సమగ్రహలాంకుశ భా**
**స్వరకులిశధ్వజచాపసరోరుహశంఖవిరాజితరేఖలు వి**
**స్ఫురగతి నొప్పఁబితామహముఖ్యులు చూచి సవిస్మయులైరి తగన్. 438**

**ప్రతి :** అరయఁగన్= పరిశీలించగా; వైన్యుని= వేనుని కుమారుడైన పృథుచక్రవర్తియొక్క; దక్షిణహస్తమునందు= కుడిచేయిపై; రమారమణీసుమనోహరు= లక్ష్మీదేవి భర్తయైన విష్ణునియొక్క; లలిత+ఆయుధచిహ్నములు= సుందరమైన ఆయుధాల గుర్తులు; అంఘ్రులయందున్= పాదాలందు; సమగ్ర హల+అంకుశ= సంపూర్ణమైన నాగలి, ముల్లుకర్ర వంటి వాడి ఇనుప కడ్డి; భాస్వర= ప్రకాశమానమైన; కులిశధ్వజ= వజ్రాయుధము, ధ్వజము; చాప= ధనుస్సు; సరోరుహ= పద్మం; శంఖ= శంఖంచే విరాజిత= ప్రకాశించు; రేఖలు= గుర్తులు; విస్ఫురగతిన్+ఒప్పన్= అధిక ప్రకాశంతో ఒప్పారగా; పితామహముఖ్యులు= బ్రహ్మాదులు; చూచి, తగన్+సవిస్మయులు+ఐరి= తగినట్లు ఆశ్చర్యపోయారు.

**తా :** వేనుని కుమారుడైన పృథుచక్రవర్తి కుడిచేతియందు విష్ణుమూర్తి ఆయుధాల గుర్తులు గల రేఖలు కనిపించాయి. పాదాలలో హల, అంకుశ, ప్రకాశమానమైన వజ్రాయుధముం, ధ్వజం, ధనుస్సు, పద్మ, శంఖరేఖలు ప్రకాశించే విధంగా ఒప్పారుతూ ఉండటం చూచి బ్రహ్మాదులు తగినట్లు ఆశ్చర్యం చెందారు.

**వ. ఇతండు నారాయణాంశ సంభూతుండు నితని యంగన రమాంశ సంభూతయుం గానోపుదురని తలంచి రయ్యవసరంబున బ్రహ్మావాదులగు బ్రాహ్మణోత్తము లతనికి విధ్యుక్త ప్రకారంబున రాజ్యాభిషేకంబు గావించిరి; తదనంతరంబ. 439**

**ప్రతి :** ఇతండు= ఈ పృథుచక్రవర్తి; నారాయణ+అంశసంభూతుండును= విష్ణుని అంశలో పుట్టినవాడూ; ఇతని+అంగన= ఈయన భార్య అర్చియు; రమా+అంశసంభూతయున్= లక్ష్మీదేవి అంశలో పుట్టినది; కాన్+ఓపుదురు= అయి ఉందురు; అని తలంచిరి= అని భావించిరి; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; బ్రహ్మావాదులు+అగు= బ్రహ్మావేత్తలైన; బ్రాహ్మణ+ఉత్తములు= బ్రాహ్మణ శ్రేష్ఠులు; అతనికిన్= పృథువునకు; విధి+ఉక్తప్రకారంబునన్= శాస్త్రాలలో చెప్పిన విధంగా; రాజ్య+అభిషేకంబు= పట్టాభిషేకం; కావించిరి= చేశారు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

**తా :** ఈ పృథుచక్రవర్తి నారాయణుని అంశలో పుట్టాడు. ఈయన భార్య అర్చి లక్ష్మీదేవి అంశలో పుట్టి ఉంటుందని భావించారు. ఆ సమయంలో వేదవేత్తలైన బ్రాహ్మణులు ఆయనకు శాస్త్రోక్తంగా రాజ్యాభిషేకం చేశారు. ఆ తరువాత

**క. సరిదంభోనిధిఖగమృగ, ధరణీసురవర్త్మపర్వతప్రముఖములై**
**పరఁగిన భూతశ్రేణులు, నరవరునకుఁ దగు నుపాయనము లిచ్చె నొగిన్. 440**

**ప్రతి :** సరిత్+అంభస్+నిధి= నదులు, సముద్రాలు; ఖగమృగ= పక్షులు, జంతువులు; ధరణీ= భూమి; సురవర్త్మ= ఆకాశం; పర్వత ప్రముఖములు+ఐ= పర్వతాలు మొదలైన; పరఁగిన= ప్రసిద్ధాలైన; భూతశ్రేణులు= జీవరాశుల సముదాయం; నరవరునకున్= పృథువునకు తగిన; ఉపాయనములు= తగిన కానుకలు; ఒగిన్= క్రమంగా; ఇచ్చెన్= సమర్పించాయి.

**తా :** నదులు, సముద్రాలు, పక్షులు, మృగాలు, భూమి, ఆకాశం, పర్వతాలు మొదలైన ప్రసిద్ధములైన జీవరాశులన్నీ పృథుచక్రవర్తికి క్రమంగా తగిన కానుకలు తెచ్చియిచ్చాయి.

**తే. సమధికఖ్యాతి నా పృథు చక్రవర్తి, దేవియగు నర్చితోఁగూడ దివ్యవస్త్ర**
**గంధమాల్యవిభూషణకలితుఁడగుచుఁ, బావకుఁడుఁబోలె సత్ప్రభాభాసి యయ్యె. 441**

**ప్రతి :** ఆ పృథుచక్రవర్తి= ఆ పృథువు; దేవి+అగు+అర్చితోన్+కూడన్= భార్యయైన అర్చితోగూడి; సమధికఖ్యాతిన్= అధికమైన కీర్తితో; దివ్యవస్త్ర= దివ్యమైన దుస్తులు; గంధమాల్య= గంధము, దండలు; విభూషణ కలితుడు+అగుచు= నగలు ధరించినవాడై; పావకుఁడు+పోలెన్= అగ్నివలె; సత్+ప్రభా, భాసి+అయ్యెన్= చక్కని వెలుగుతో ప్రకాశించిన వాడాయెను.

**తా :** అధికమైన కీర్తిగల ఆ పృథుచక్రవర్తి తన భార్య అర్చితో కలిసి దివ్యవస్త్రాలు, గంధమాల్యాభరణాలు ధరించి అగ్నిహోత్రునివలె ధగద్ధగాయమానంగా ప్రకాశించాడు.

**సీ.** **రాజరా జా పృథురాజుకు హేమమయంబైన వీరవరాసనంబు**
**జలపతి జలకణస్రావకంబగు పూర్ణచంద్రసన్నిభసితచ్ఛత్త్రకమును**
**బవమానుఁడతులశోభన మగు వాలవ్యజన సమంచితసితచామరములు**
**ధర్ముండు నిర్మలోద్యత్కీర్తిమయమగు మహనీయనవ పుష్పమాలికయును**

**తే.** **జంభవైరి కిరీటంబు శమనుఁడఖిల, జననియామకదండంబు జలజభవుఁడు**
**నిగమమయకవచంబు వాణీలలామ, స్వచ్ఛ మగు నవ్యహార మొసఁగిరి మఱియు.** **442**

**ప్రతి :** ఆ పృథురాజుకున్= ఆ పృథుచక్రవర్తికి; రాజరాజు= కుబేరుడు; హేమమయంబు+ఐన= బంగారుతో చేసిన; వీరవర+ఆసనంబు= వీరులు కూర్చునే శ్రేష్ఠమైన సింహాసనం; జలపతి= వరుణుడు; జలకణ స్రావకంబు= నీటి బిందువులు జారిపడుతున్న; అగు= అయినట్టి; పూర్ణ చంద్ర సన్నిభ= పూర్ణిమనాటి చంద్రునితో సమానమైన; సిత+ఛత్త్రకమును= తెల్లని గొడుగును; పవమానుఁడు= వాయువు; అతులశోభనము+అగు= మిక్కిలి శుభప్రదమైన; వాలవ్యజన సమంచిత= చమరీమృగ తోకకుచ్చులతో అలంకరించిన; సితచామరములు= తెల్లని వింజామరలు; ధర్ముండు= ధర్ముడు; నిర్మల+ఉద్యత్+కీర్తిమయము+అగు= స్వచ్ఛమైన అధికకీర్తితోకూడిన; మహనీయ= గొప్పదైన; నవపుష్పమాలికయును= క్రొంగొత్త పూలమాలను; జంభవైరి= జంభాసురుని చంపిన ఇంద్రుడు; కిరీటంబు= కిరీటం; శమనుఁడు= యముడు; అఖిలజన నియామక దండంబు= జనులందరినీ అదుపులో పెట్టే దండాన్ని; జలజభవుఁడు= బ్రహ్మ; నిగమమయ= వేదాలతోనిండిన; కవచంబు= కవచం; వాణీలలామ= సరస్వతీదేవి; స్వచ్ఛము+అగు= నిర్మలమైన; నవ్యహారము= కొత్తదండ; ఒసఁగిరి= ఇచ్చారు.

**తా :** మరియు ఆ పృథుమహారాజుకు కుబేరుడు బంగారుతో జేసిన వీరోచిత సింహాసనాన్ని, వరుణుడు నీటి బిందువులు జాలువారే పూర్ణచంద్రునివంటి గొడుగును, వాయుదేవుడు మిక్కిలి శుభప్రదమైన చామరీ మృగపు తోక కుచ్చులతో కూడిన చామరాలు, ధర్మువు కీర్తిమయ నూత్నపుష్పమాలిక, ఇంద్రుడు కిరీటం, యముడు సర్వజీవులను నియమించే రాజదండం. చతుర్ముఖబ్రహ్మ వేదమయకవచం, సరస్వతి నిర్మలహారాన్ని కానుకలుగా ఇచ్చారు. ఇంకా

**సీ.** **దామోదరుండు సుదర్శనచక్రంబు నవ్యాహతైశ్వర్య మబ్జపాణి**
**చంద్రార్ధధరుఁడర్ధచంద్రరేఖాంకితకమనీయకోశసంకలితఖడ్గ**
**మంబిక శతచంద్ర మను ఫలకముఁజంద్రుఁడమృతమయశ్వేతహయచయంబుఁ**
**ద్వష్ట రూపాశ్రయోదాత్తరథంబును భానుండు ఘృణిమయబాణములును**

**తే. శిఖియు నజగోవిషాణసంచిత మహాజ, గవ మనందగు చాపంబు నవనిదేవి**
**యోగమయమైన పాదుకాయుగము గగన, చరులు గీతంబు లిచ్చిరి సంతసమున. 443**

**ప్రతి :** దామ+ఉదరుండు= విష్ణుమూర్తి; సుదర్శనచక్రంబును= సుదర్శనచక్రాన్ని; అబ్జపాణి= పద్మపాణియైన లక్ష్మి; అవ్యాహత+ఐశ్వర్యము= ఎడతెగని సంపదలు; చంద్ర+అర్ధధరుఁడు= చంద్రరేఖను ధరించిన శివుడు; అర్ధచంద్రరేఖా+అంకిత= అర్ధచంద్రరేఖ గుర్తుగాగల; కమనీయ= అందమైన; కోశసంకలిత= ఒరతోగూడిన; ఖడ్గము= కత్తి; అంబిక= పార్వతి; శతచంద్రము= శతచంద్రం అనే ఆ పేరున్న; ఫలకము= డాలు; చంద్రుడు; అమృతమయ= అమృతంతోకూడిన; శ్వేతహయచయంబున్= తెల్లని గుర్రాల సముదాయాన్ని; త్వష్ట= త్వష్ట అనే దేవత; రూప+ఆశ్రయ+ఉదాత్త రథంబును= అందానికి స్థానమైన గొప్పరథాన్ని; భానుండు= సూర్యుడు; ఘృణిమయ= కిరణాలతోచేసిన; బాణములును= బాణాలను; శిఖియును= అగ్నిదేవుడును; అజగోవిషాణసంచిత= మేకకొమ్ము, ఎద్దుకొమ్ము కలిపి అమర్చిన; మహా+అజగవము= గొప్పదైన (శివుని విల్లు); అనన్+తగు= అనదగిన; చాపంబున్= విల్లును; అవనిదేవి= భూదేవి; యోగమయము+ఐన= యోగంతోకూడిన; పాదుకాయుగము= పాదుకలజంట; సంతసమునన్= సంతోషంతో; గగనచరులు= ఆకాశంలో తిరిగే ఖేచరుల దేవతలు; గీతంబులు= పాటలను; ఇచ్చిరి= ఇచ్చారు.

**తా :** విష్ణువు సుదర్శనచక్రాన్ని, పద్మపాణియైన లక్ష్మీదేవి అధికసంపదలను, శివుడు అర్ధచంద్రరేఖగల అందమైన ఒరగల ఖడ్గాన్ని, అంబిక శత చంద్రమనే డాలును, చంద్రుడు అమృతమయమైన తెల్లనిగుర్రాల సమూహాన్ని, త్వష్ట అందమైన ఉదాత్తరథాన్ని, సూర్యుడు కిరణమయమైన బాణాలను, మేక, ఎద్దుకొమ్ములతో నిర్మితమైన అజగవమనే ధనుస్సును అగ్నిహోత్రుడు, భూదేవి యోగ్యమైన పాదుకలను, ఖేచరులు గీతాలను కానుకలుగా సంతోషంతో అర్పించారు.

**విశే : అజ – గవ – అస్థి వికారత్వాద్ అజగవః** – మేక, ఎద్దు ఎముకలతో చేసిన శివుని ధనుస్సు.

**వ. వెండియుం బ్రతిదివసంబు నాకాశంబు పుష్పంబులు గురియింప, మహర్షులు సత్యంబులైన యాశీర్వచనంబులు సలుప, సముద్రుండు శంఖంబును, నదంబులు పర్వతంబులు నదులును రథమార్గంబు నొసంగెఁ; దదనంతరంబ సూత మాగధ వంది జనంబులు దన్ను నుతియించినం బ్రతాపశాలి యగు నవ్వైన్యుండు మందస్మితసుందరవదనారవిందుండై చతురవచనరచనుండగుచు మేఘగంభీరభాషణంబుల వారల కిట్లనియె. 444**

**ప్రతి :** వెండియున్= మరియు; ప్రతిదివసంబు= ప్రతిరోజూ; ఆకాశంబు= ఆకాశం; పుష్పంబులు= పూలు, కురియింపన్= కురిపించగా, మహర్షులు= ఋషులు, సత్యంబులు+అయిన= సత్యవాక్కులతోకూడిన, ఆశీర్వచనంబులు= ఆశీస్సులు, సలుపన్= అందించగా, సముద్రుండు= సముద్రుడు; శంఖంబును= శంఖాన్ని; నదంబులు= పశ్చిమంగా ప్రవహించేనదులు; పర్వతంబులు= పర్వతాలు, నదులును; రథమార్గంబున్= రథం పోవడానికి త్రోవను; ఒసంగెన్= ఇచ్చినవి; తద్+అనంతరంబు+అ= ఆ తర్వాత; సూత మాగధ వందిజనంబులు= సూతులు, మాగధులు, వందులు; తన్ను నుతియించినన్= తనను పొగడగా; ప్రతాపశాలి యగు= శౌర్యవంతుడైన; ఆ+వైన్యుండు= ఆ పృథుచక్రవర్తి; మందస్మిత= చిరునవ్వుతో వెలసిన; సుందరవదన+అరవిందుండు+ఐ= అందమైన ముఖపద్మంతో కూడినవాడై; చతురవచనరచనుండు+అగుచున్= చాతుర్యంగా మాట్లాడుతూ; మేఘగంభీర భాషణంబులన్= మేఘగర్జనంవంటి గంభీరమైన మాటలతో; వారలకు+ఇట్లు+అనియెన్= వారితో ఇలా అన్నాడు.

**తా :** మరియు ఆకాశం రోజూ పూలు కురిపించింది. ఋషులు సత్యవాక్కులతో ఆశీర్వదించారు. సముద్రుడు శంఖాన్ని ఇవ్వగా నదీనదాలు, పర్వతాలు రథానికి దారి ఇచ్చాయి. ఆ తరువాత వందిమాగధులు, సూతులు కీర్తించారు. ప్రతాపశాలియైన పృథుచక్రవర్తి అరవిందముతో సమానమైన చిరునవ్వుముఖంతో అందంగా కనిపించాడు. చమత్కారభరిత భాషణలతో మేఘగంభీర నిస్వనంతో ఇలా అన్నాడు.

**సీ. వందిమాగధసూతవరులార! నా యందుఁగమనీయగుణములు గలిగెనేని**
**యర్హంబు నుతిసేయ; నవి లేవు నాయందు; నది గాన మీ నుతి వ్యర్థ మయ్యె;**
**నిటమీద గుణముల నేపారి యుండిన నపుడు నుతించెద రగుట మీద**
**సభ్యనియుక్తులై చతురత నుత్తమశ్లోకుని గుణము లస్తోకభూప్ర**

**తే. సిద్ధములు గాన సన్నుతి సేయుఁ డజుని, నతని బహువిధభావంబు లభినుతింప**
**నలవిగాకయె యుండుదు; రదియుఁగాక చతురమతులార! మాగధజనములార! 445**

**ప్రతి :** వందిమాగధ సూతవరులార= వందిమాగధ సూతశ్రేష్ఠులారా!; నా+అందున్= నాలో; కమనీయగుణములు= సద్గుణాలు; కలిగెన్+ఏని= ఉన్నచో, నుతి+చేయన్= పొగడుట; అర్హంబు= తగును; నా+అందున్= నాలో; అవి లేవు; అదిగానన్= అందువలన, మీ నుతి= మీ పొగడ్త; వ్యర్థము+అయ్యెన్= వృథా అయింది; ఇటమీదన్= ఇకపై; గుణములన్+ఏపారి+ఉండినన్+అపుడు= గుణములు అధికంగా ఉన్నపుడు; నుతించెదరు+అగుట= స్తుతిచేస్తారు కనుక; మీద= ఇకపై, సభ్యనియుక్తులు+ఐ= సభలోనివారిచే అనుమతింపబడినవారై; చతురతన్= నిపుణతతో; ఉత్తమశ్లోకుని= గుణవంతుడైన విష్ణుని, గుణములు= గుణాలు; అస్తోక= ఎంతో గొప్పగా; భూప్రసిద్ధములు+కాన= లోకంలో గణుతికెక్కాయి కాబట్టి; సన్నుతి+చేయుఁడు= చక్కగా స్తుతించండి; చతురమతులార!= తెలివిగలవారలారా!; మాగధజనములార!= పొగడేవారలారా!; అదియున్+కాక= అంతేగాక; అజుని= పుట్టుకలేనివానిని (విష్ణుదేవుని); అతని, బహువిధ, భావంబులు= అనేక విధాలైన ఆయన గుణాలను; అభినుతింపన్= పొగడుటకు; అలవి+కాకయె+ఉండుదురు= సాధ్యంకాకుండా ఉందురు.

**తా :** ఓ వందిమాగధ సూతశ్రేష్ఠులారా!, నిపుణబుద్ధులారా! నాలో మెచ్చుకొనే గుణాలు ఉంటే మీరు స్తుతించడం తగును. అలాంటి గుణాలు నాలో లేవు. అందువలన మీ పొగడ్తలు వ్యర్థం. ఇకపై అతిశయించిన గుణాలు నాలో ఉంటే అప్పుడు స్తుతింతురు గాక! మీకు సద్గుణాలను పొగడాలని ఉంటే సభాసదుల అనుమతితో మీ చాతుర్యాన్ని చూపి విష్ణుని స్తుతించండి. ఆయన సుగుణాలు పొగడ శక్యంకానివి.

**వ. మఱియు మహాత్ముల గుణంబులు దనయందు సంభావితంబులు సేయ సామర్థ్యంబు గలిగిన నందు మహాత్ముల గుణంబులు ప్రసిద్ధంబులు గావునం దత్సమంబుగా నెట్లు నుతింపవచ్చు? నెవ్వండే నొకండు శాస్త్రాభ్యాసంబునం దనకు విద్యా తపోయోగ గుణంబులు గలుగు నని పలికిన వానిం జూచి సభ్యులు పరిహసింతు; రది కుమతి యగువాఁడెఱుంగం; దదియునుంగాక. 446**

**ప్రతి :** మఱియు= అంతేకాక; మహాత్ముల గుణంబులు= గొప్పవారి గుణాలు; తన+అందున్= తనలో; సంభావితంబులు+చేయన్= గౌరవింపబడునట్లుచేసే; సామర్థ్యంబు+కలిగినన్= శక్తికలిగినా; అందు మహాత్ముల గుణంబులు=

అందులోనున్న గొప్పవారి లక్షణాలు; ప్రసిద్ధంబులు+కావునన్= పేరుగాంచినవి కాన; తద్+సమంబుగాన్= వాటితో సమానంగా; ఎట్లునుతింపవచ్చున్= ఎలా పొగడవచ్చు; ఎవ్వండు+ఏని+ఒకండు= ఎవడైనాఒకడు; శాస్త్ర+అభ్యాసంబునన్= శాస్త్రాలు చదివినందువలన; తనకు, విద్యాతపస్+యోగగుణంబులు= విద్య, తపస్సువంటి యోగలక్షణాలు; కలుగును+అని పలికినన్= సిద్ధిస్తాయని చెబితే; వానిన్+చూచి= అలాంటివానిని చూచి, సభ్యులు; పరిహసింతురు= నవ్విపోతారు; అది= దానిని; కుమతి యగువాఁడు= చెడ్డస్వభావంగలవాడు; ఎఱుంగఁడు= తెలుసుకోలేదు; అదియునున్+కాక= అదీగాక.

**తా :** ఎవరైనా మహాత్ముల గుణాలను తమయందు ఉన్నట్లు భావించి అలాంటి గౌరవం పొందినా, మహాత్ముల గుణాలు ప్రసిద్ధాలు కాబట్టి వాళ్లతో సమానంగా ఎలా నుతించడానికి సాధ్యం అవుతుంది? శాస్త్రాలు చదవడంవల్ల తనకు విద్యాతపోయోగగుణాలు కలిగాయని ఎవడైనా అన్నా అతనిని చూచి సభ్యులు నవ్వుకొంటారు. చెడ్డస్వభావం కలవాడు ఆ విషయాన్ని తెలుసుకోలేదు.

**క. అతివిశ్రుతులు సులజ్జా, న్వితులు మహోదారు లధికనిర్మలు లాత్మ**
**స్తుతిపరనిందలు దోషము, లతిహేయము లని తలంతు రాత్మల నెపుడున్. 447**

**ప్రతి :** అతివిశ్రుతులు= అధికమైన ప్రఖ్యాతిగలవారు; సులజ్జా+అన్వితులు= మంచితనంతోకూడిన సిగ్గుగలవారు; మహా+ఉదారులు= గొప్ప ఔదార్యంగలవారు; అధికనిర్మలులు= మిక్కిలి స్వచ్ఛస్వభావులు; ఆత్మస్తుతి= తననుతాను పొగడుకొనుట; పరనిందలు= ఇతరులను దూషించుట; దోషములు= తప్పులు; అతి హేయములు+అని= మిక్కిలి నీచాలని; ఆత్మలన్= మనస్సులో; ఎపుడున్= నిత్యమూ; తలంతురు= భావిస్తారు.

**తా :** అధికమైన ఖ్యాతి కలిగి, వినయపూర్వకలజ్జ కలిగిన విశాలహృదయులు, నిర్మలస్వభావులు, ఆత్మస్తుతి, పరనింద మిక్కిలి నీచములైనవని మనసులో ఎప్పుడూ భావిస్తారు.

**క. వందిజనంబులు లోకము, లందు నవిదితవరకర్ములగు భూపతులన్**
**నందించు టవశ్యంబై, నం దగదు నుతింప శిశుజనంబులపగిదిన్. 448**

**ప్రతి :** వంది జనంబులు= స్తోత్రపాఠకులు; లోకముల+అందున్= లోకాలలో; అవిదిత వరకర్ములు+అగు= ఏవి మంచి పనులో తెలియనివారైన; భూపతులన్= రాజులను; నందించుట= సంతోషపరచుట; అవశ్యంబు+ఐనన్= అవసరమే అయినా; శిశుజనంబులపగిదిన్= చిన్నపిల్లలవలె; నుతింపన్+తగదు= పొగడరాదు.

**తా :** లోకంలో వంది జనులకు మంచి పనులంటే ఏమో తెలియని రాజులను సంతోషపెట్టటం అవసరమే అయినా, చిన్నపిల్లలవలె పొగడకూడదు.

**క. అన సూతవందిమాగధ, జను లా నరనాయకుని వచనములు వినియున్**
**మునిచోదితులై క్రమ్మఱ, ననురాగము లుప్పతిల్ల న మ్మనుజేంద్రున్. 449**

**ప్రతి :** అనన్= అని అనగా, సూత, వంది మాగధజనులు= సూతులు, వందిమాగధులు, ఆ నరనాయకుని వచనములు= ఆ పృథుచక్రవర్తిమాటలు, వినియున్= విని, మునిచోదితులు+ఐ= మునులచే ప్రేరేపింపబడినవారై, క్రమ్మఱన్= తిరిగి, అనురాగములు+ఉప్పతిల్లన్= ప్రేమలు మొలకలెత్తగా, ఆ+మనుజ+ఇంద్రున్= ఆ రాజును.

**తా :** పృథుడట్లనగా సూత వందిమాగధజనులు ఆ పృథుచక్రవర్తి మాటలు వినికూడా మునులచే ప్రేరేపింపబడినవారై తిరిగి ప్రేమలు మొలకలెత్తగా ఆ రాజును

**వ. అమృతోపమానంబులయిన మధురవాక్యంబుల నిట్లనిరి. 450**

**ప్రతి :** అమృత+ఉపమానం.బులు+అయిన= అమృతంతో సమానమైన, మధురవాక్యంబులన్= తియ్యనిమాటలతో, ఇట్లు+అనిరి= ఇలా అన్నారు.

**తా :** అమృతంతో సమానమైన తియ్యని మాటలతో ఇలా అన్నారు.

**క. వేనాంగసంభవుండవు, శ్రీనాథకళాంశజుఁడవు చిరతరగుణ స**
**మ్మానార్హుండ వతర్కిత, మైన భవన్మహిమఁబొగడ నలవియె మాకున్. 451**

**ప్రతి :** వేన+అంగ సంభవుండవు= వేనుని దేహంనుండి పుట్టినవాడవు; శ్రీనాథకళా+అంశజుఁడవు= విష్ణుని కళాంశంతో జన్మించినవాడవు; చిరతరగుణ= శాశ్వతమైన గుణాలతో; సమ్మాన+అర్హుండవు= గౌరవింపదగినవాడవు; అతర్కితము+ఐన= ఊహకందని; భవత్+మహిమ= నీ గొప్పతనం; పొగడన్= స్తుతించుటకు; మాకున్= మాకు; అలవియె= శక్యమా!

**తా :** నీవు వేనుని దేహంనుండి పుట్టినవాడవు. విష్ణుని కళాంశంతో జన్మించినవాడవు. శాశ్వత గుణాలతో సన్మానయోగ్యుడవు. ఊహకు కూడ అందని నీ గొప్పతనాన్ని పొగడ మాతరమా!

**క. అని వెండియు నిట్ల ని; రై, నను నొకమార్గంబు గలదు నందింప భవ**
**ద్ఘనచరితామృతపానం, బునఁ జేసియు మునులవచనములఁజేసి తగన్. 452**

**ప్రతి :** అని, వెండియున్= అని మరల, ఇట్లు+అనిరి= ఇలా అన్నారు; ఐననున్= ఐనప్పటికి; నందింపన్= సంతోషించడానికి, ఒకమార్గంబు+కలదు= ఒక మార్గం ఉంది, భవత్+ఘనచరిత+అమృతపానంబునన్+చేసియు= నీ గొప్ప చరిత్ర అనే అమృతాన్ని తాగడంవలన, మునుల వచనములన్+చేసి= మునుల మాటలతో, తగన్= సరిగా...

**తా :** అని, మరల ఈ విధంగా అన్నారు. అయినా, నీ గొప్పచరిత్ర అనే అమృతాన్ని తాగి, ఈ మహర్షుల మాటలు విని మిమ్మల్ని సంతోషపెట్టటానికి ఒకమార్గం ఉంది.

**వ. శ్లాఘ్యంబులైన భవదీయచరిత్రంబుల స్తుతియించెద మని యిట్లనిరి. 453**

**ప్రతి :** శ్లాఘ్యంబులు+ఐన= పొగడదగిన, భవదీయ చరిత్రంబులన్= నీ గాథల్ని, స్తుతియించెదము= పొగడుతాము, అని+ఇట్లనిరి= అని ఇలా అన్నారు.

**తా :** పొగడదగిన నీ గాథలను మేము పొగడుతామని ఇలా అన్నారు.

**సీ. ఈ వైన్యుఁడఖిలలోకావళి ధర్మానువర్తనముల నెప్డు వఱలఁజేసి**
**ఘనధర్మమార్గవర్తనులలో ధన్యుఁడై ధర్మసేతువుఁ బ్రీతిఁదగిలి ప్రోచు;**
**ధర్మశాత్రవులను దండించు నష్టదిక్పాలకమూర్తి సంకలితుఁడగుచు;**
**నయ్యయి కాలంబులందు భాషణదానములఁ బ్రజారంజనములఁదనర్చు;**

**తే. సవనసద్వృష్టి కరణాదిసక్తుఁడగుట, నుభయలోకంబులకుఁబ్రీతి నొదవఁజేయు;**
**న్యాయమార్గంబునను భూజనాళి ధనముఁ, బుచ్చుకొను నిచ్చు సూర్యుండుఁబోలె నితఁడు. 454**

**ప్రతి :** ఈ వైన్యుఁడు= ఈ పృథుచక్రవర్తి; అఖిలలోక+ఆవళిన్= సమస్త లోకాల సముదాయాన్ని; ధర్మ+అనువర్తనములన్= ధర్మాన్ని అనుసరించి నడచుకోవడంలో; ఎప్డు= ఎల్లవేళల; వరలన్+చేసి= ఉండునట్లుజేసి; ఘన ధర్మమార్గ వర్తనులలోన్= ధర్మమార్గంలో నడిచే గొప్పవారిలో; ధన్యుఁడు+ఐ= పుణ్యాత్ముడై; ధర్మసేతువున్= ధర్మమనే వంతెనను; ప్రీతిన్+తగిలిప్రోచున్= ప్రేమతో రక్షిస్తాడు; ధర్మ శాత్రవులను= ధర్మానికి వ్యతిరేకులను; అష్టదిక్పాలక= అష్టదిక్పాలకుల; మూర్తి సంకలితుండు+ అగుచున్= రూపాలతో కూడినవాడై; దండించున్= శిక్షించును; అయి+అయి కాలంబుల+అందున్= ఆయా సమయాలలో; భాషణదానములన్= మంచి మాటల్ని ప్రసాదిస్తూ; ప్రజారంజనములన్+తనర్చున్= ప్రజలను సంతోషపెట్టడంలో అతిశయిస్తాడు; సవన= యజ్ఞాచరణ ద్వారా; సత్+వృష్టికరణ+ఆది సక్తుఁడు+అగుటన్= చక్కని వర్షాలు కురిపించడం మొదలగువాటిలో ఆసక్తిగలవాడగుటచే; ఉభయలోకంబులకున్= ఇహపరలోకాలకు; ప్రీతిన్+ఒదవన్+ చేయున్= ప్రీతి గలిగిస్తాడు; న్యాయమార్గంబునను= సరియైన దారిలో; భూజన+ఆళి= భూమిమీది ప్రజలయొక్క; ధనము= డబ్బు; సూర్యుండున్+పోలెన్= సూర్యునిలాగా; ఇతఁడు= పృథువు; పుచ్చుకొనున్= తీసుకొంటాడు; ఇచ్చున్= ఇస్తాడు.

**తా :** ఈ పృథుచక్రవర్తి అన్ని లోకాలను ఎల్లవేళలా ధర్మమార్గంలో నడుపుతాడు. గొప్ప ధర్మమార్గవర్తనులలో ధన్యుడై ఎంతో ఆసక్తితో ధర్మసేతువును ప్రేమతో, ఆసక్తితో రక్షిస్తాడు. అష్టదిక్పాలుర అంశలు ధరించి ధర్మాన్ని వ్యతిరేకించేవారిని దండిస్తాడు. ఆయాకాలాలలో మంచి మాటలతో దానాలతో ప్రజారంజకుడయి ప్రకాశిస్తాడు. యజ్ఞయాగాలుచేసి చక్కని వర్షాలు కురిపించి ఇహపరలోకాలకు ప్రీతిని కలిగిస్తాడు. సూర్యుడు జలాన్ని పీల్చి మేఘంగా మార్చి వాన కురిపించే విధంగా ఈ రాజు ప్రజలనుండి పన్నురూపంలో ధనం పుచ్చుకొని, అవసర సమయంలో ఆ ధనాన్ని మళ్లీ వాళ్లకిస్తాడు.

**విశే :** సూర్యుడు వేసవికాలంలో జలాలు గ్రహించి మళ్లీ వర్షాలు కురిపిస్తాడు. సూర్యుడే నరజాతికి ఆత్మ తేజస్సుగా అవతరించి ప్రభువై పాలనచేస్తాడు. అష్టదిక్పాలకుల అంశలతో బ్రహ్మదేవుడు, రాజును సృష్టించినాడని మనుస్మృతి (7-3,4) లో చెప్పబడినది.

**వ. మఱియును. 455**

ప్రతి : మఱియును= ఇంకా

**సీ. సర్వభూతములకు సముఁడును బర్యతిక్రమమున లోకాపరాధములను**
**నతిశాంతి సంయుక్తుఁడై సహించుచు నార్తు లగువారి యెడఁ గృపాయత్తుఁ డగుచు**
**నరరూపధారియౌ హరిమూర్తి గావున నింద్రుండు వర్షించి యెల్ల ప్రజల**
**రక్షించుగతిఁ దాను రక్షించు; నమృతాంశు సన్నిభ వదనాబ్జ సస్మితాను**

**తే. రాగ మిళితావలోకన రాజిఁజేసి, సకల జనులకు సంప్రీతి సంభవింపఁ**
**జేయు సంతతమును గూఢచిత్తుఁ డగుచు, శత్రువరుల కగమ్యుఁడై సంచరించు. 456**

**ప్రతి :** సర్వభూతములకున్= అన్నిప్రాణులకు; సముఁడును= సమానుడైనవాడును; పరి+అతిక్రమమునన్= మిక్కిలి వ్యతిరేకంగా; లోక+అపరాధములను= లోకుల దోషాలను; అతిశాంతి సంయుక్తుఁడు+ఐ= మిక్కిలి శాంత స్వభావంతో కూడినవాడై; సహించుచున్= ఓర్చుకొంటూ; ఆర్తులగు వారి+ఎడన్= బాధలలో ఉన్నవారిపట్ల; కృపాయత్తుఁడు+అగుచున్= దయగలవాడై; నరరూపధారి+ఔ= మానవరూపం ధరించినవాడైన; హరిమూర్తి+కావునన్= విష్ణుమూర్తిగావున; ఎల్లప్రజలన్= జనులనందరిని; ఇంద్రుండు= ఇంద్రుడు; వర్షించి రక్షించుగతిన్= వానలు కురిపించి రక్షించునట్లు; తాను; రక్షించున్= కాపాడును; అమృత+అంశుసన్నిభ= అమృతకిరణుడైన చందమామవంటి; వదన+అబ్జ= ముఖ కమలంతో; సస్మిత+అనురాగమిళిత+అవలోకన రాజిన్+చేసి= చిరునవ్వుతో గూడిన ప్రేమాదరాలతో కలిసిన చూపుల వరుసతో; సకలజనులకున్= ప్రజలందరికి; సంప్రీతి= సంతోషాన్ని; సంభవింపన్+చేయున్= కలుగునట్లు చేయును; సంతతమును= ఎల్లప్పుడు; గూఢచిత్తుఁడు+అగుచు= దాచుకొన్న మనస్సుకలవాడై; శత్రువరులకు= శత్రుశ్రేష్ఠులకు; అగమ్యుఁడు+ఐ=అందనివాడై; సంచరించున్= తిరుగాడును.

**తా :** ఇంకా పృథుచక్రవర్తి అన్ని ప్రాణులపట్ల సమానుడుగా వర్తిస్తాడు. ధర్మ వ్యతిరేకులయినవారిని, తప్పులు చేసినవారిని శాంతితో సహిస్తాడు. బాధలలో నున్నవారిని దయతో చూస్తాడు. మానవరూపంలో ఉండే విష్ణుమూర్తి గాబట్టి, వర్షాలతో ఇంద్రుడు ప్రజలను రక్షించినట్లు తాను రక్షిస్తాడు. చంద్రునితో సమానమైన ముఖపద్మంతో, చిరునవ్వుతో ప్రేమాభిమానాలు కలిగిన చూపులతో ప్రజలందరికి సంతోషం కల్గిస్తాడు. ఆయన మనస్సు తెలుసుకోవడం దుష్కరం. నిరంతరం శత్రుశ్రేష్ఠులకు తన మనస్సు తెలియనీయక తిరుగుతాడు.

**విశే :** సూర్యుని లక్షణాలు అందరిని సమానంగా చూడటం. ప్రజలకు సంతోషం కలిగించేవాడు చంద్రుడు. రెండు లక్షణాలు రాజుకుండాలి. సూర్యునివలె తీక్ష్ణంగాను, చంద్రునివలె ప్రజలయెడ ప్రసన్నంగానూ ఉండాలి. సూర్యచంద్రాత్మకుడై పాలించేవాడు ప్రభువు. "నా విష్ణుః పృథివీపతిః" అని ధర్మశాస్త్రం.

**వ. అని వెండియుఁ బ్రవేశ నిర్గమ శూన్యమార్గ నిరూఢ కార్యుండును, నపరిమిత మహత్త్వాది గుణగణైక ధాముండును, సముద్రునిభంగి గంభీర చిత్తుండును, సుగుప్తవిత్తుండును, వరుణుండునుంబోలె సంవృతాత్ముండును శాత్రవాసహ్య ప్రతాప యుక్తుండును, దురాసదుండును, సమీపవర్తియయ్యును దూరస్థునిభంగి వర్తించుచు వేనారణిజనిత హుతాశనుండు గావున హుతాశనుచందంబున ననన్యదుస్స్పర్శనుండునై, చారుల వలన సకలప్రాణి బాహ్యాభ్యంతర కర్మంబులం దెలియుచు; దేహధారులకు నాత్మభూతుండై సూత్రాత్మకుండైన వాయువు భంగి వర్తించుచు, నాత్మస్తుతి నిందలవలన నుదాసీనుం డగుచు, ధర్మపథంబున వర్తించుచు, నాత్మీయ సుహృద్బంధువుల వలనం దప్పు గలిగినను దండించుచు, నాత్మ శత్రువులనైన నదండ్యుల దండింపక ధర్మమార్గ గతుం డగుచుం, దన యాజ్ఞాచక్రం బప్రతిహతం బగుచు మానసాచలపర్యంతంబు వర్తింప సూర్యుండు నిజకిరణంబులచేత నెంత పర్యంతంబు భూమిం బ్రకాశింపంజేయునంత పర్యంతంబు నిజగుణంబులచేత లోకంబుల రంజిల్లంజేయు; నదియునుం గాక ప్రకృతి రంజకంబులైన గుణంబుల చేత దృఢవ్రతుండును, సత్యసంధుండును, బ్రహ్మణ్యుండును, సర్వభూతశరణ్యుండును, వృద్ధసేవకుండును, మానప్రదుండును, దీనవత్సలుండును, బరవనితా**

**మాతృభావనుండును, దన పత్ని నర్ధశరీరంబుగాఁ దలచువాఁడును నగుచుం బ్రజలయెడఁదండ్రివలెఁ బ్రీతి సేయుచు రక్షించుచుండు మఱియును. 457**

**ప్రతి :** అని, వెండియున్= మరలా; ప్రవేశ నిర్గమ శూన్యమార్గ= ప్రవేశించుట; తిరిగివచ్చుట లేని మార్గంలో; నిరూఢ కార్యుండును= నేర్పుతోకూడిన కార్యక్రమాలుగలవాడును; అపరిమిత= పరిమితిలేని; మహత్త్వ+ఆది= గొప్పతనం మొదలైన; గుణగణ+ఏకధాముండును= గుణసమూహాలకు ప్రధానమైన ఆటపట్టైనవాడును; సముద్రునిభంగి= సముద్రుడిలాగా; గంభీర చిత్తుండును= గంభీరమైన మనస్సు గలవాడును; సుగుప్తవిత్తుండును= భద్రంగా దాచి ఉంచిన సంపదగలవాడును; వరుణుండునున్+పోలెన్= వరుణుడిలాగా; సంవృత+ఆత్ముండును= ఆవరణతో కప్పబడిన ఆత్మగలవాడూ; శాత్రవ+అసహ్య= శత్రువులకు సహింపరాని; ప్రతాపయుక్తుండును= పౌరుషంతో కూడినవాడూ; దురాసదుండు= అందనంత ఎత్తైనవాడూ; సమీపవర్తి+అయ్యును= దగ్గరగా ఉన్నప్పటికిని; దూరస్థునిభంగి= దూరంగా ఉన్నవానివలె; వర్తించుచున్= తిరుగుతూ; వేన+అరణిజనిత= వేనుడనే అరణియందు పుట్టిన; హుత+అశనుండు+కావునన్= అగ్నిదేవుడుకాబట్టి; హుత+అశనుచందంబునన్= అగ్నివలె; అనన్యదుస్స్పర్శనుండు+ఐ= ఇంకొకరు స్పృశించడానికి అలవిగానివాడై; చారులవలనన్= వేగులవల్ల; సకలప్రాణిబాహ్య+ఆభ్యంతర కర్మంబులన్+తెలియుచున్= సమస్తజీవుల వెలుపలి, లోపలిపనులను తెలుసుకొంటూ; దేహధారులకున్= శరీరాలు దాల్చిన వారికి; ఆత్మభూతుండు+ఐ= ఆత్మవంటివాడై; సూత్ర+ఆత్మకుండు+ఐన= దారంవలె నిల్చినవాడై; వాయువుభంగిన్= వాయువులాగా; వర్తించుచున్= సంచరిస్తూ; ఆత్మస్తుతి నిందలవలనన్= తన స్తుతినిందలవల్ల; నిందించుకోవడాలలో, ఉదాసీనుండు+అగుచున్= పట్టించుకోనివాడవుతూ; ధర్మపథంబున వర్తించుచున్= ధర్మమార్గంలో ప్రవర్తిస్తూ; ఆత్మీయసుహృత్+బంధువులవలనన్= తన స్నేహితులు, చుట్టాలవలన; తప్పుకలిగినను దండించుచున్= పొరబాటు జరిగితే శిక్షిస్తూ; ఆత్మశత్రువులును+ఐనన్= తన శత్రువులైనా; అదండ్యులన్= శిక్షింపదగనివారిని; దండింపక= శిక్షింపక; ధర్మమార్గగతుండు+అగుచున్= ధర్మమార్గంలో నడుస్తూ, తన+ఆజ్ఞాచక్రంబు= తన శాసనం; అప్రతిహతంబు+అగుచున్= తిరుగలేనిదిఅవుతూ; మానస+అచలపర్యంతంబు= మానసాచలంవరకు; నర్తింపన్= నడువగా; సూర్యుండు= రవి; నిజకరణంబులచేతన్= తన కిరణాలతో; ఎంత పర్యంతంబు= ఎంత దూరం; భూమిన్= భూమిని; ప్రకాశింపన్+చేయున్= కాంతిమంతంచేస్తాడో; అంతపర్యంతంబు= అంతవరకు; నిజగుణంబులచేతన్= తన గుణాలతో; లోకంబులన్= జగాలను; రంజిల్లన్+చేయున్= సంతోషపరచును; అదియున్+కాక= అంతేగాక; ప్రకృతి రంజకంబులు+ఐన= ప్రకృతి జనులను సంతోషపరిచే; గుణంబులచేతన్= లక్షణాలతో; దృఢవ్రతుండును= కఠిన నియమం కలవాడూ; సత్యసంధుండును= సత్యనిష్ఠకలవాడూ; బ్రహ్మణ్యుండును= చక్కగా చదువుకొన్నవాడూ; సర్వభూతశరణ్యుండును= అన్ని ప్రాణులు శరణుకోరదగిన వాడూ; వృద్ధసేవకుండును= పెద్దలను సేవించువాడును, (బ్రహ్మజ్ఞానము కలవాడును); మానప్రదుండును= పెద్దలను గౌరవించేవాడును; దీనవత్సలుండును= దీనులపై దయచూపేవాడూ; పరవనితా= పరస్త్రీలపట్ల; మాతృభావనుండును= తల్లి అనే భావం కలవాడూ; తనపత్నిని= తనభార్యను; అర్ధశరీరంబుగాన్= సగభాగంగా; తలఁచువాడును= భావించేవాడూ; అగుచున్= అవుతూ; ప్రజలయెడన్= జనులపట్ల, తండ్రివలెన్; ప్రీతిసేయుచున్= సంతృప్తి పరుస్తూ; రక్షించుచుండు= కాపాడుతూ ఉంటాడు! మఱియును...

**తా :** రహస్యంగా, నేర్పుగా కార్యక్రమాలు నిర్వహించేవాడు, లెక్కలేనన్ని గొప్పగుణాలు కలవాడు, సముద్రునివలె గంభీరమైన మనస్సు గలవాడు, చక్కగా దాచిన సంపదకలవాడు, వరుణునివలె అగుపించని ఆత్మకలవాడు, శత్రువులకు సహింపరాని శౌర్యంతో కూడినవాడు, సమీపించడానికి సాధ్యంకానివాడు, దగ్గరగా ఉన్నా దూరంగా ఉన్నవానివలె నడచుకొనేవాడు,

వేనరాజు అనే అరణియందు జన్మించిన అగ్నికావటంచేత అన్యులు స్పృశింపసాధ్యం కానివాడు అయిన పృథు చక్రవర్తి – వేగులవలన సకలప్రాణులు బాహ్యంగా, రహస్యంగా జరిపే చర్యలు తెలుసుకొంటూ, దేహధారులకు ఆత్మవంటివాడై, అందరిని ఆడించే సూత్రధారి అయిన వాయువువలె ప్రవర్తిస్తూ, స్తుతి నిందలను పట్టించుకోకుండ, ధర్మమార్గంలో వ్యవహరిస్తూ, తన ఆత్మీయులు, మిత్రులు, బంధువులు తప్పుచేసినా దండిస్తూ, తనకు శత్రువులైనా దండించతగనివారిని దండించకుండా ధర్మమార్గాన నడుస్తూ, తన ఆజ్ఞలు తిరుగులేనివై మానసాచలం వరకు వర్తిల్లగా, సూర్యుడు తన కిరణాలతో ఎంత దూరం భూమిని ప్రకాశింపచేస్తాడో, అంతదూరం తన సుగుణాలచేత లోకాలను సంతోషపరుస్తూ, ప్రజారంజకాలైన గుణాలచేత కఠిన నియమాలుకలవాడై, సత్యాన్నే చెప్పేవాడై, బ్రహ్మజ్ఞానంకలవాడై, సమస్త జీవులు శరణువేడదగినవాడై, పెద్దలను సేవించేవాడుగా, వారికి మర్యాద ఇచ్చేవాడుగా, దీనులపట్ల దయచూపేవాడుగా, పరస్త్రీలయందు మాతృభావన కలవాడుగా, (అర్ధనారీశ్వరునివలె) తన భార్యను తన శరీరంలో సగభాగంగా భావించేవాడుగా, ప్రజలను తండ్రివలె ప్రేమతో రక్షింపసాగాడు. అంతేకాక

**విశే :** 1. సముద్రావరణంచేత వరుణుని లాగా నాల్గు సముద్రాలచే లేక జలప్రాకారాదులచే పరివేష్టిత మూర్తి అని వీరరాఘవ వ్యాఖ్య.

2. సూత్రాధిపుడైన వాయువులాగా – లోపల ప్రవేశించి వాయువులాగా చరించేవాడు.

3. పృథుచక్రవర్తియొక్క ఆజ్ఞాచక్రం, రథచక్రం అప్రతిహతాలై మానసాచలందాకా వ్యాపించి ఉంది. (వీరరాఘవ వ్యాఖ్య)

**సీ.** **తలపోయ బ్రహ్మవిద్యానిష్ఠ జనములకనయంబుఁ గింకరుండైనవాఁడు**
**నఖిలశరీరగుఁడాప్తసుహృజ్జన తానందకరుఁడన నలరువాఁడు**
**సంసారఘనకర్మసంగహీనులయందు సంగసంప్రీతుఁడై జరుగువాఁడు**
**దుర్మార్గమనుజసందోహంబునకు నుగ్ర దండధరుండనఁదనరువాఁడు**

**తే.** **ప్రకృతిపూరుషావేశుఁడై పరఁగువాఁడు, భగవదవతారయుక్తుఁడై నెగడువాఁడు**
**నగుచు వర్తించు సమ్మోద మతిశయిల్లఁ జారుతరమూర్తి యీ రాజచక్రవర్తి.** **458**

**ప్రతి :** ఈ రాజచక్రవర్తి= ఈ పృథుచక్రవర్తి; తలపోయన్= ఆలోచించగా; బ్రహ్మవిద్యానిష్ఠజనములకున్= బ్రహ్మవిద్యలో స్థిరమైన బుద్ధికలవారికి (బ్రాహ్మణులకు); అనయంబున్= ఎల్లప్పుడు; కింకరుండు+ఐనవాఁడు= సేవకునివంటివాడు; అఖిలశరీరగుఁడు= అందరి శరీరాలందున్నవాడు; ఆప్తసుహృత్+జనతా+ఆనందకరుఁడు+అనన్= ఆత్మీయులకు, స్నేహితులకు, ప్రజలకు ఆనందం కలిగించువాడై; అలరువాఁడు= ప్రకాశించేవాడు; సంసారఘనకర్మసంగ= సంసారమనే గొప్పకర్మబంధంతో; సంగహీనుల+అందు= తగులాటం లేనివారిపట్ల; సంగసంప్రీతుఁడు+ఐ= స్నేహం చేయడంలో ఇష్టంగలవాడై; జరుగువాడు= ప్రవర్తించేవాడు; దుర్మార్గ మనుజసందోహంబునకున్= దుష్టులైన మనుష్యసముదాయానికి; ఉగ్రదండధరుండు+అనన్= భయంకరమైన యముడనునట్లు; తనరువాఁడు= ఒప్పువాడు; ప్రకృతిపూరుష+ ఆవేశుఁడై= ప్రకృతిలో, జీవులలో ఆవేశించినవాడై; పరగువాఁడు= ప్రసిద్ధిచెందినవాడు; భగవత్+అవతారయుక్తుఁడు+ఐ= దేవుని అవతారంతో కూడినవాడై; నెగడువాఁడు= వర్ధిల్లువాడు; అగుచున్= అవుతూ; చారుతరమూర్తి= చాల అందమైన రూపంగల పృథువు; సమ్మోదము+అతిశయిల్లన్= సంతోషం అధికంకాగా; వర్తించున్= ప్రవర్తించేవాడు.

**తా :** ఆలోచించగా బ్రహ్మవిద్యాపారంగతులకు ఇతడు నిత్యము దాసుడు. సమస్తజీవుల శరీరాలలో తానే ఉన్నట్లు ఆప్తులకు, మిత్రులకు, జనులకు ఆనందాన్ని కలిగిస్తూ ప్రకాశించేవాడు. సంసార బంధంతోకూడిన కామ్యకర్మలతో సంబంధంలేని మహానుభావుల సత్సాంగత్యాన్ని ఇష్టంగా చూస్తూ ప్రవర్తించేవాడు. దుష్టులకు యమునివలె భయంకరుడుగా నొప్పువాడు. ప్రకృతినీ, జీవులను ఆవేశించి ప్రసిద్ధుడై ఉండేవాడు దేవుని అవతారంగా ప్రసిద్ధుడు. అందంగా ఉన్న పృథువు అలా మిగుల సంతోషంతో తిరుగుతాడు.

**వ. మఱియుం ద్ర్యధీశుండు గూటస్థుఁడుఁ బరమాత్మయు బ్రహ్మకళారూపుండు నగువాఁడునునై యుదయించెం గావున నితనియందు నవిద్యారచితంబైన భేదంబు నిరర్థకం బగు నని పెద్దలగువారలు చూతురు, మఱియును. 459**

**ప్రతి :** మఱియున్, త్రి+అధీశుండు= త్రిగుణాలకు ఆధిపత్యం వహించినవాడు; కూటస్థుఁడు= మూలపురుషుడు; పరమాత్మయు= భగవంతుడును; బ్రహ్మకళారూపుండును= పరబ్రహ్మకళాంశం రూపంగా కలవాడు; అగువాఁడును+ఐ= అయినవాడై; ఉదయించెన్= జన్మించాడు; కావునన్= కాబట్టి; ఇతనియందున్= ఈయనపట్ల; అవిద్యారచితంబు+అయిన= అజ్ఞానంచే నిర్వహింపబడిన; భేదంబు= వేరుభావం; నిరర్థకంబు+అగున్= వ్యర్థమవుతుంది; అనిపెద్దలగువారలు= అనిపెద్దలైనవారు; చూతురు= చూచెదరు; మఱియును.

**తా :** ఇతడు త్రిగుణాలకు అధిపతి. మూలపురుషుడు. పరమాత్మ. పరబ్రహ్మతత్త్వమే రూపుదాల్చినవాడు కనుక ఇతని విషయంలో అవిద్య వల్ల కలిగిన భేదం నిష్ప్రయోజనమని పెద్దలు చూస్తారు.

త్ర్యధీశుడు అనగా త్రిలోకేశుడనీ లేదా త్రివిధచేతనులకధీశుడని – వీరరాఘవవ్యాఖ్య

**సీ. ఉదయాద్రిపర్యంత ముర్వీతలం బేకవీరుఁడై రక్షించి వెలయు నీతఁ**
**డొకనాఁడు విజయ యాత్రోత్సవం బేపార సన్నద్ధుఁడై మణిస్యందనంబు**
**నెక్కి చాపముఁబూని దిక్కుల సూర్యుని పగిదిని శత్రుభూపాలతమము**
**విరియింతు నని చాల వెలుఁగొందుచును ధరా చక్ర ప్రదక్షిణశాలి యగుచుఁ**

**తే. దిరుగునెడ సర్వదిక్పాలవరసమేత, పార్థివోత్తమనికర ముపాయనంబు**
**లిచ్చి తనుఁజక్రపాణికి నెనయు నాది, ధరణివిభుఁడని నుతియించి తలఁతు రెదల. 460**

**ప్రతి :** ఉదయ+అద్రిపర్యంతము= సూర్యుడుదయించే పర్వతం హద్దుగా; ఉర్వీతలంబు= భూమిని; ఈతఁడు= ఈ రాజు; ఏకవీరుఁడు+ఐ= ఒకే ఒక్కవీరుడై; రక్షించి= కాపాడి; వెలయును= ప్రకాశించును; ఒకనాఁడు= ఒకరోజు; విజయయాత్రా+ఉత్సవంబు= దిగ్విజయయాత్రాఉత్సవం; ఏపారన్= అతిశయించగా; సన్నద్ధుఁడు+ఐ= సిద్ధమైనవాడై; మణి స్యందనంబును= మణులు తాపిన రథాన్ని, ఎక్కి; చాపమున్+పూని= విల్లుధరించి; దిక్కులన్= దిక్కులలో; సూర్యునిపగిదిని= సూర్యునివలె; శత్రుభూపాలతమము= శత్రురాజులనే చీకటిని; విరియింతును+అని= తొలగేలా చేస్తానని; చాలవెలుగొందుచును= మిక్కిలి ప్రకాశిస్తూ; ధరాచక్ర= భూమినంతటిని; ప్రదక్షిణశాలి+అగుచున్= చుట్టివచ్చేవాడవుతూ; తిరుగున్+ఎడన్= తిరిగే సమయంలో; సర్వదిక్పాలవర సమేత= శ్రేష్ఠులైన అష్టదిక్పాలురందరితోకూడి; పార్థివ+ఉత్తమ నికరము= రాజశ్రేష్ఠుల సముదాయం; ఉపాయనంబులు+ఇచ్చి= కానుక లిచ్చి; తనున్= తనను; చక్రపాణికిన్= విష్ణువునకు;

ఎనయున్= సమానమైన; ఆది ధరణివిభుండు+అని= మొదటి చక్రవర్తి అని; నుతియించి= పొగడి; ఎదలన్= హృదయాలలో; తలంతురు= భావిస్తారు.

**తా :** ఈ పృథుచక్రవర్తి ఉదయపర్వతం హద్దుగాగొని సమస్త భూతలాన్ని ఏకవీరుడై రక్షిస్తాడు. ఒకనాడు విల్లంబులు ధరించి మణిమయ రథారూఢుడై వింటిని ధరించి శత్రురాజులనే చీకట్లను పారద్రోలుతూ భూప్రదక్షిణ చేస్తాడు. అలా అతడు విజయయాత్ర చేసే సమయంలో సర్వదిక్పాలకులతోకూడిన, రాజులందరూ కానుకలిచ్చి విష్ణుమూర్తితో సమానమైన మొదటి చక్రవర్తివని స్తుతిస్తారు.

**క. ఈ నృపతి ధరాచక్రము, ధేనువుగాఁజేసి పిదుకు ధృతి నఖిలపదా**
**ర్థానీకము విబుధులు స, న్మానింపఁగఁ బ్రజకు జీవనప్రదుఁడగుచున్. 461**

**ప్రతి :** విబుధులు= పండితులు; సన్మానింపఁగన్= గౌరవించగా; ప్రజకున్= జనులకు; జీవనప్రదుఁడు+అగుచున్= జీవితాలు ఇచ్చేవాడగుచూ; ఈ నృపతి= ఈ రాజు; ధరాచక్రమున్= భూమిని; ధేనువుగాన్+చేసి= ఆవుగాచేసి; ధృతిన్= ధైర్యంతో; అఖిల పదార్థ+అనీకమున్= సమస్త వస్తుజాలాన్ని; పిదుకున్= పిండును.

**తా :** ఈ రాజు భూచక్రాన్ని ధేనువుగా చేసి ధైర్యంగా సమస్త వస్తుజాలాన్ని పిండుతాడు. విద్వాంసులు తనను గౌరవింపగా ప్రజలకు జీవనోపాధులు సమకూరుస్తాడు.

**చ. అమరవరేణ్యుఁబోలి యనయంబు నితండును గోత్రభేదన**
**త్వమునఁ జెలంగుఁ దా నజగవప్రదరాసన శింజినీనినా**
**దమున విరోధిభూపతులు దల్లడ మంద నసహ్యసింహవి**
**క్రమమున సంచరించునని కౌతుక మొప్పఁగఁ బల్కి వెండియున్. 462**

**ప్రతి :** ఇతండును= ఈ పృథువు; అనయంబున్= ఎల్లప్పుడు; అమరవరేణ్యున్+పోలి= ఇంద్రునివలె; గోత్రభేదనత్వమునన్= (కొండలను పగులగొట్టి) (శత్రురాజుల వంశాలను నశింపజేసి); చెలంగున్= ప్రకాశిస్తాడు; తాన్= తాను; అజగవ= అజగవమను పేరుగల శివుని వింటితో సమానమైన; ప్రదర+ఆసన= ధనుస్సుయొక్క; శింజినీ నినాదమున= అల్లెత్రాటి శబ్దంతో; విరోధిభూపతులు= శత్రురాజులు; తల్లడమందన్= భయపడగా; అసహ్య= సహింపరాని; సింహవిక్రమమునన్= సింహంవంటి పరాక్రమంతో; సంచరించును+అని= తిరుగును అని; కౌతుకము+ ఒప్పఁగన్= అని సంతోషంతో; పల్కి= మాట్లాడి; వెండియున్= మరియు.

**తా :** ఇతడు ఇంద్రుడు కొండలను కొట్టినట్లు శత్రురాజుల వంశాలను నశింపచేస్తాడు. అజగవమను పేరు గల తన వింటి అల్లెతాటిని ధ్వనింపజేసి, శత్రువులను భయపెట్టి సహించలేని సింహసముద్రై తిరుగుతాడు. అని కుతూహలంతో చెప్పి తిరిగి

**విశే :** పృథువును ఇంద్రునితో పోలుస్తూ గోత్రభేదనము–అనేమాటను కవివాడాడు. ఇక్కడ శ్లేష. పర్వతములు, రాజుల గోత్రములు అని రెండర్థాలు చెప్పవలె. శత్రురాజుల గోత్రాలు బ్రద్దలుగొట్టడంలో ఇంద్రసమానుడు. మేక ఎముకతోను, ఎద్దు ఎముకతోను, తయారుచేయబడిన విల్లు పేరు అజగవం.

**వ. ఇట్లనిరి. 463**

**ప్రతి :** ఇట్లు+అనిరి= ఇలా అన్నారు.

**చ. సకలజగన్నుతుండితఁడు చారుయశోనిధి యశ్వమేధముల్**
**ప్రకటముగా శతంబు దగఁ బావనమైన సరస్వతీతటీ**
**నికటధరిత్రిఁ జేయుతఱి నేర్పున నంతిమయాగమందుఁ గొం**
**జక మఖసాధనాశ్వమును జంభవిరోధి హరించు నుద్ధతిన్. 464**

**ప్రతి :** ఇతఁడు= ఈ పృథువు; సకలజగత్+నుతుండు= సమస్తలోకాలచే స్తుతింపబడువాడు; చారుయశోనిధి= గొప్పయశస్సు గలవాడు; తగన్= తగురీతిలో; పావనము+ఐన= పవిత్రమైన; సరస్వతీ తటీ నికటధరిత్రిన్= సరస్వతీనదీతీర ప్రాంతంలో; అశ్వమేధముల్= అశ్వమేధయాగములు; శతంబు= నూరు; ప్రకటముగాన్= గొప్పగా; చేయుతఱిన్= చేసేటప్పుడు; కొంజక= జంకక; అంతిమయాగమందున్= చివరియాగ సమయంలో; జంభవిరోధి= ఇంద్రుడు; మఖసాధన+అశ్వమును= యజ్ఞసాధనమైన గుర్రాన్ని; నేర్పునన్= చాకచక్యంతో; ఉద్ధతిన్= గర్వంతో; హరించున్= అపహరిస్తాడు. (అపహరించ బోతాడు)

**తా :** ఈ పృథుచక్రవర్తి సమస్తలోకాలచే స్తుతింపబడి గొప్ప యశస్సు గడిస్తాడు. పరమపవిత్రమైన సరస్వతీ నదీతీర ప్రదేశంలో నూరు అశ్వమేధయాగాలు చేస్తాడు. చివరియాగసమయంలో యజ్ఞాశ్వాన్ని దేవేంద్రుడు నేర్పుగా, గర్వంతో హరించివేస్తాడు.

**సీ. ఒకనాఁడు నిజమందిరోపాంత వనముకుఁ జని యందు సద్గుణశాలి యైన**
**ఘనుని సనత్కుమారునిఁగాంచి యమ్మునివరు బ్రహ్మతనయుఁగా నెఱిఁగి భక్తిఁ**
**బూజించి విజ్ఞానమును బొందు నచ్చట బ్రహ్మవేత్తలు మునిప్రవరు వలన**
**మానితలబ్ధవిజ్ఞానులై వర్తింతు, రి మ్మహారాజు మహీతలంబు**

**తే. నందు విశ్రుతవిక్రముఁడగుచు మిగులఁ దన కథావళి భూప్రజాతతి నుతింప**
**నక్కడక్కడ వినుచు శౌర్యమున నఖిల, దిక్కులను గెల్చి వర్తించు ధీరయశుఁడు. 465**

**ప్రతి :** ఒకనాఁడు= ఒకరోజు; నిజమందిర+ఉపాంతవనముకున్= తనయింటి సమీపంలోని తోటకు; చని= వెళ్లి; అందున్= అక్కడ; సత్+గుణశాలియైన= మంచిగుణాలు కలవాడైన; ఘనునిన్= గొప్పవాడైన; సనత్+కుమారునిన్= సనత్కుమారమునిని; కాంచి= చూచి; ఆ+మునివరున్= ఆ మునిశ్రేష్ఠుని; బ్రహ్మతనయున్+కాన్= బ్రహ్మపుత్రునిగా; ఎఱిఁగి= తెలిసికొని; భక్తిన్+పూజించి= భక్తితోకొలిచి; విజ్ఞానమును+పొందును= బ్రహ్మజ్ఞానాన్ని సంపాదిస్తాడు; అచ్చట బ్రహ్మవేత్తలు= అక్కడ వేదాలు చదివినవారు; మునిప్రవరువలనన్= మునిశ్రేష్ఠునివలన; మానిత= గొప్పదైన; లబ్ధవిజ్ఞానులు+ఐ= పొందిన బ్రహ్మజ్ఞానంకలవారై; వర్తింతురు= ప్రవర్తిస్తారు; ఈ+మహారాజు= ఈ చక్రవర్తి; మహీతలంబునందున్= భూమిపై; విశ్రుత, విక్రముఁడు+అగుచున్= మిక్కిలి ప్రసిద్ధినొందిన పరాక్రమంగలవాడై; మిగులన్= అతిశయిల్లగా; తనకథా+ఆవళి= తనకథల సమూహాన్ని; భూప్రజాతతి= భూలోకంలోని జనులు; నుతింపన్= పొగడగా; అక్కడక్కడ వినుచున్= అక్కడక్కడా

వింటూ; శౌర్యమునన్= పరాక్రమంతో; అఖిల దిక్కులను గెల్చి= అన్ని దిక్కులను జయించి; ధీరయశుడు= ధైర్యవంతుడుగా పేరుపొందినవాడు (పృథుచక్రవర్తి) వర్తించున్= సంచరిస్తాడు.

**తా :** ఒకరోజు ఆ పృథువు తన మందిర సమీపంలోని ఉద్యానవనమునకు పోయి మహనీయుడూ, సద్గుణశాలీ ఐన సనత్కుమారుని దర్శించి, ఆయన బ్రహ్మకుమారుడని తెలిసి భక్తితో పూజించి. ఆయన ద్వారా ఉత్తమజ్ఞానాన్ని పొందుతాడు. అక్కడుండిన బ్రహ్మవేత్తలు సనత్కుమారుని ఉపదేశంతో తత్వజ్ఞానం పొంది ప్రవర్తిస్తారు. ఈ మహారాజు భూమిపై ప్రసిద్ధిపొందిన పరాక్రమంగల వీరుడై తన వీరగాథలను లోకులు ప్రస్తుతిస్తూ ఉండగా అక్కడక్కడా వింటూ, శౌర్యంతో అన్ని దిక్కుల్ని జయించి శాశ్వతమైన కీర్తితో ధీరుడై సంచరిస్తాడు.

**విశే :** సనక, సనందన, సనాతన, సనత్కుమారులు నలుగురు బ్రహ్మమానసపుత్రులు.

**వ. ఇట్లు విపాటిత విరోధి శల్యుండు, సురాసుర జేగీయమాన నిజవైభవుండునై ధరాచక్రంబున కితండు రాజయ్యెడి నని యివ్విధంబున స్తోత్రంబు సేసిన వంది మాగధ సూతజనంబులం బృథుచక్రవర్తి పూజించి మఱియుం బ్రాహ్మణ భృత్యామాత్య పురోహిత పౌరజానపద తైలిక తాంబూలిక ప్రముఖాశేష జనంబులం దత్తదుచిత క్రియలం బూజించె నని మైత్రేయుండు సెప్పిన విని విదురుం డిట్లనియె. 466**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; విపాటిత= పెరికి వేయబడిన; విరోధి శల్యుండు= శత్రువులనే శల్యాలుగలవాడు; సుర+అసుర= దేవతలచేత, రాక్షసులచేత; జేగీయమాన= కీర్తింపబడుతున్న; నిజ, వైభవుండును+ఐ= తన వైభవంగలవాడై; ధరాచక్రంబునకున్= భూమండలానికి; ఇతండు= ఈయన; రాజు+అయ్యెడినని= రాజు అవుతాడని; ఈ+విధంబునన్= ఈ విధంగా; స్తోత్రంబు+చేసిన= పొగడిన; వంది మాగధ సూతజనంబులన్= వందిమాగధ సూత జనాలను; పృథుచక్రవర్తి= పృథువు; పూజించి= గౌరవించి; మఱియున్, బ్రాహ్మణ= బ్రాహ్మణులు; భృత్య+అమాత్య= సేవకులు, మంత్రులు; పురోహిత= పురోహితులు; పౌర= పౌరులు; జానపద= జానపదులు; తైలిక= గాండ్లవారు; తాంబూలిక= తాంబూలవాహకులు; ప్రముఖ= మొదలైన; అశేషజనంబులన్= జనులందరినీ; తద్+తద్+ఉచితక్రియలన్= వారి వారికి తగినవిధంగా; పూజించెన్= గౌరవించాడు; అని, మైత్రేయుండు= మైత్రేయుండు; చెప్పినవిని, విదురుండు+ఇట్లు+అనియెన్= విదురుడిలా అన్నాడు.

**తా :** ఈ విధంగా శత్రువులనే శల్యాలను తొలగించినవాడు పృథువు. దేవదానవులచే కీర్తింపబడ్డ తన వైభవంతో పృథుచక్రవర్తి భూమినంతా పరిపాలిస్తాడు. అని తననిట్లు పొగడిన వందిమాగధ సూతజనులను సన్మానించాడు. బ్రాహ్మణులను, సేవకులను, మంత్రులను, పురోహితులను, పురజనులను, జానపదులను అభ్యంగనం చేయించేవారిని, తాంబూలా లందించేవారిని మొదలైనవారిని తగినవిధంగా గౌరవించాడని మైత్రేయుడు విదురునితో చెప్పాడు.

### a =పృథు చక్రవర్తి గోరూపిణి యగు భూమివలన, నోషధులఁ బిదుకుట a

**సీ. ఏమి నిమిత్తమై భూమి గోరూపిణి యయ్యె? దానికి వత్స మయ్యె నెద్ది?**
**గొనకొని దోహనమునకు నర్హంబైన పాత్ర మెయ్యది? దలఁపంగ దోగ్ధ**
**యైన యా పృథు వే పదార్థముల్ పిదికెను? బరికింప నవని స్వభావమునను**
**విషమమై యుండియు వెలయంగ నే రీతి సమగతిఁజెందెను? జంభవైరి**

**తే. క్రతుహయంబును గొనిపోవఁగార్య మెద్ది?, ధీరనిధి యాతఁడు సనత్కుమారువలనఁ గలితవిజ్ఞానుఁడగుచు నే గతిని బొందె?, ననఘచారిత్ర! మైత్రేయ! యదియుఁగాక. 467**

**ప్రతి :** అనఘచారిత్ర= పుణ్యచరిత్రగలవాడా!; మైత్రేయ= మైత్రేయ మహామునీ! భూమి= భూమాత; ఏమి నిమిత్తము+ఐ= ఏ కారణంచేత; గోరూపిణి+అయ్యెన్= గోమాత రూపాన్ని ధరించింది?; ఎద్ది= ఏది?; దానికిన్= ఆ గోమాతకు; వత్సము+ అయ్యెన్= దూడ అయింది; దోహనమునకున్= పాలుపితుకుటకు; కొనకొని= ప్రయత్నించి; అర్హంబు+ఐన= తగిన; పాత్రము+ఏ+అది= పాత్ర ఏది?; తలఁపంగన్= ఆలోచింపగా; దోగ్ధ+ఐన= పాలుపితికేవాడైన; ఆ పృథువు= ఆ పృథుచక్రవర్తి; ఏపదార్థముల్= వేనిని, పిదికెను= పిండాడు; అవని= భూమి; స్వభావమునను= సహజంగా; పరికింపన్= ఆలోచింపగా; విషమమై+ఉండియున్= ఎత్తుపల్లాలతో కూడినదైనా; వెలయంగన్= ప్రకాశింపగా; సమగతిన్= సమమైన రూపాన్ని; ఏగతిన్+చెందెను= ఏ విధంగా పొందింది?; క్రతుహయంబును= యజ్ఞాశ్వాన్ని; జంభవైరి= జంభాసురుని శత్రువైన ఇంద్రుడు; కొనిపోవన్= దొంగిలించవలసిన; కార్యము+ఎద్ది= పనియేమి?; అదియున్+కాక= అంతేగాక; ధీరనిధి= ధైర్యానికి నిధివంటివాడైన; ఆతడు= పృథుచక్రవర్తి; సనత్కుమారువలనన్= సనత్కుమారుడివల్ల; కలిత విజ్ఞానుఁడు+అగుచున్= విజ్ఞానం పొందిన వాడవుతూ; ఏ గతిని= ఎటువంటి గతిని; పొందెన్= పొందినాడు.

**తా :** (విదురుడు మైత్రేయమహర్షిని ఇలా అడిగాడు) ఓ పుణ్యచరిత్రా! మైత్రేయా! గోరూపాన్ని భూమి ఎందుకు ధరించాల్సి వచ్చింది? గోరూపంలోనున్న భూమాతకు ఏది దూడగా అయింది? ఆ ఆవుపాలు పిదకడానికి తగిన పాత్రఏది? పాలుపిండే పృథుచక్రవర్తి ఏయే పదార్థాలను పిండాడు? సహజంగా భూమి మిట్టపల్లాలతో అసమతలంగా ఉంటుందిగదా! మరి అది సమతలరూపాన్ని ఏ విధంగా పొంద గలిగింది? ఆ యజ్ఞాశ్వాన్ని ఇంద్రుడు ఎందుకు దొంగిలించవలసి వచ్చింది? ధీరనిధియైన పృథుడు సనత్కుమారుని ద్వారా సమస్తవిజ్ఞానాన్ని పొంది ఎటువంటి సుగతి పొందినాడు?

**వ. మఱియుఁ బరబ్రహ్మంబును భగవంతుండును బుణ్యశ్రవణకీర్తనుండును సర్వనియామకుండును నగు కృష్ణుని యవతారాంతరాశ్రయం బగు దివ్య కథలను భగవంతుండైన పుండరీకాక్షుండు పృథ్వవతారంబు ధరియించి గోరూపిణి యగు పృథివిం బిదికినది మొదలగు కథలన్నియు నీకు నధోక్షజునకు దాసుండ నయిన నాకు నెఱింగింపు మనిన వాసుదేవ కథాసంప్రీత చేతస్కుండగు విదురుం బ్రశంసించి మైత్రేయుం డిట్లనియె, నట్లు బ్రాహ్మణ జనంబులచే రాజ్యంబునం దభిషిక్తుండై పృథువు రాజ్యంబు సేయుచుండ నంత నీరస యగు ధరిత్రియం దన్నరహితు లగుచుం బ్రజలు క్షుత్పీడా క్షీణదేహులై వైన్యునిం జూచి యిట్లనిరి. 468**

**ప్రతి :** మఱియున్= ఇంకను; పరబ్రహ్మంబును= అందరికీ అధిదేవతయు; భగవంతుండును= పరమాత్మయు; పుణ్యశ్రవణకీర్తనుండును= తననామము విన్నవారికి; ఉచ్చరించినవారికి పుణ్యాన్ని యిచ్చేవాడును; సర్వనియామకుండును+ అగు= సమస్తలోకాలను నిర్దేశించువాడు నయిన; కృష్ణుని, అవతార+అంతర+ఆశ్రయంబు+అగు= వేరే అవతారాలలో కూడుకొన్న; దివ్యకథలను= పుణ్యగాథలను; భగవంతుండు+ఐన= పరమాత్ముడయిన; పుండరీక+అక్షుండు= తెల్లతామరలవంటి కన్నులుకలవాడు విష్ణువు; పృథు+అవతారంబు, ధరియించి= పృథువు రూపాన్ని దాల్చి; గోరూపిణి+అగు= ఆవురూపంలోనున్న; పృథివిన్= భూమిని; పిదికినదిమొదలు+అగు= పిండినది మొదలగు; కథలు+అన్నియున్= గాథలన్నింటిని; నీకున్, అధోక్షజునకున్= విష్ణువునకు; దాసుండను+అయిన= సేవకుడనైన; నాకున్, ఎఱింగింపుము+అనినన్= తెలియజేయుమనగా; వాసుదేవ కథాసంప్రీత చేతస్కుండు+అగు= వాసుదేవుని కథలచేత మిక్కిలి తృప్తిచెందిన

మనస్సుకలవాడైన; విదురున్= విదురుని; మైత్రేయుండు= మైత్రేయుడు; ప్రశంసించి= పొగడి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; బ్రాహ్మణ జనంబులచే= బ్రాహ్మణులచే; అట్లు= ఆ విధంగా; రాజ్యంబునందు= రాజ్యానికి; అభిషిక్తుండు+ఐ= పట్టాభిషేకం పొందినవాడై; పృథువు, రాజ్యంబు+చేయుచుండున్= రాజ్యపాలన కొనసాగిస్తుండగా; అంత, నీరస+అగు= జలాలులేనిదైన (కృశించినదైన), ధరిత్రియందు= భూమిపై; ప్రజలు, అన్నరహితులు+అగుచున్= ఆహారంలేనివారై; క్షుత్+పీడా= ఆకలిబాధచే; క్షీణదేహులు+ఐ= కృశించిన శరీరాలువారై; వైన్యునిన్= వేనుని కుమారుడైన పృథుచక్రవర్తిని; చూచి; ఇట్లు+అనిరి= ఇలా అన్నారు.

**తా :** మైత్రేయమహర్షీ! నీకూ, విష్ణు దేవునికీ భక్తుడనైన నాకు పరబ్రహ్మ స్వరూపుడూ, పుణ్యగాథలను వినేవాళ్లకు పుణ్యం ఇచ్చేవాడూ, సర్వేశ్వరుడూ, భగవంతుడూ అయిన శ్రీకృష్ణుని మిగిలిన అవతార గాథలను తెలియజేయండి. మరియూ ఆ పుండరీకాక్షుడు పృథుచక్రవర్తి అవతారం ధరించి గోరూపధారిణి అయిన భూమిని పిదకడం మొదలైన గాథల నన్నింటినీ వివరంగా చెప్పుమని విదురుడు అడిగాడు. ఆ సమయంలో విష్ణుగాథలపట్ల ఆసక్తిగల భక్తాగ్రేసరుడైన విదురుని పొగడుతూ మైత్రేయుడు ఇలా చెప్పడం మొదలెట్టాడు. బ్రాహ్మణవర్గంచే ఆ విధంగా పట్టాభిషిక్తుడై ప్రజారంజకంగా పరిపాలనలో నియుక్తుడైన పృథుచక్రవర్తి రాజ్యభారం మోస్తున్నాడు. ఆ సందర్భంలో సారవిహీనమైన భూమినుండి అన్నం దొరకక పోవడంవల్ల, ఆకలి బాధలవల్ల ప్రజలు క్రుంగి కృశించి పృథుచక్రవర్తికి ఇలా విన్నవించుకున్నారు.

**క. అరయఁగ నేము బుభుక్షా, పరిపీడం బడితి మయ్య! పైకొని తరు కో**
**టరజనితవహ్నిచేతను, దరికొను వృక్షములఁబోలె ధరణీనాథా! 469**

**ప్రతి :** ధరణీనాథా= ఓ రాజా!; అరయఁగన్= పరిశీలించగా; ఏము= మేము; బుభుక్షా పరిపీడన్= ఆకలిచే ఎక్కువగా బాధింపబడుతూ; పైకొని= ఆక్రమించి; తరుకోటర జనిత= చెట్టు తొర్రలో పుట్టిన; వహ్నిచేతను= అగ్నిచే; దరికొను= దహింపబడుతున్న; వృక్షములున్+పోలె= చెట్లలాగా; పడితిమి+అయ్య= పడి ఉన్నాము.

**తా :** ఓ మహారాజా! మేమంతా ఆకలిబాధలచే అధికంగా పీడింపబడుతున్నాం. మాపని ఎలాఉందంటే, చెట్టు తొర్రను ఆక్రమించి రగిలిన అగ్నిచే అంటుకొని మండే వృక్షాల పరిస్థితివలె ఉంది.

**క. శరణశరణ్యుఁడ వగు నిను, శరణము వేఁడెదము మాకు సత్కృప నన్నం**
**బరసి కృపసేసి ప్రోవుము, నరనాయక! యనుచుఁబ్రజలు నతులై పలుకన్. 470**

**ప్రతి :** నరనాయక= ఓ రాజా!; శరణ శరణ్యుఁడవు+అగు+నిను= దాసులకు రక్షకుడవైన నిన్ను; శరణము వేఁడెదము= శరణుకోరుతున్నాం, మాకు; సత్కృపన్= దయతో; అరసి= చూచి; ఆహారాన్ని, కృప+చేసి= దయచేసి; ప్రోవుము= కాపాడుము; అనుచున్= అంటూ; ప్రజలు= జనులు; నతులు+ఐ= వినయంతో వంగినవారై; పలుకన్= వేడుకోగా...

**తా :** ఓ రాజా! దాసులకు రక్షకుడవైన నిన్ను మేము శరణుకోరుతున్నాం. దయతో మాకు అన్నంపెట్టి రక్షించమని ప్రజలు శిరస్సువంచి వేడుకోగా.

**క. విని దానికి సదుపాయము, జననాయకుఁడాత్మఁదలఁచి సక్రోధుండై**
**ధనువున బాణముఁదొడిగెను, ఘనరౌద్రుండైన త్రిపురఘస్మరుపగిదిన్. 471**

**ప్రతి :** జననాయకుఁడు= రాజు; విని= ఆ మాటలువిని; దానికిన్= అందులకు; సదుపాయము= మార్గాంతరం; ఆత్మన్+తలఁచి= మనసులో భావించి; ఘనరౌద్రుండు+ఐన= మిక్కిలి కోపం వచ్చినవాడైన; త్రిపుర ఘస్మరు పగిదిన్= త్రిపురనాశకుడైన శివుని వలె; ధనువునన్= వింటికి; బాణమున్= బాణాన్ని; తొడిగెను= సంధించాడు.

**తా :** ఆ మాటలువిని పృథుచక్రవర్తి దానికి తగిన ఉపాయం మనసులో ఆలోచించాడు. మహాకోపంతో త్రిపురాసురసంహారం చేసిన రుద్రునివలె వింటికి బాణం సంధించాడు.

**వ. ఇట్లు దొడిగిన. 472**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా, తొడిగిన= సంధించగా (తొడుగగా)

**తా :** ఈ విధంగా బాణము తొడుగగా

**క. మహిపతి నప్పుడు గనుఁగొని, మహి గోరూపమునఁ గంప్యమానయు నగుచుం**
**గుహకుండగు లుబ్ధకుఁగని, గహనంబునఁ బాఱు హరిణికైవడిఁ బాఱెన్. 473**

**ప్రతి :** మహిపతిన్= రాజును; అప్పుడు+కనుంగొని= అప్పుడు చూచి; మహి= భూదేవి; గోరూపమునన్= గోవు రూపంతో; కంప్యమానయున్+అగుచున్= వణకుచున్నదై; కుహకుండు+అగు= వంచనచేసే; లుబ్ధకున్+కని= వేటగానిని చూచి; గహనంబునన్+పాఱు= అడవిలో పరుగెత్తు; హరిణికైవడిన్= జింకవలె; పాఱెన్= పరుగెత్తింది.

**తా :** (ఆ విధంగా విల్లు ఎక్కుపెట్టిన) రాజును అప్పుడు చూచి భూదేవి గోరూపాన్ని ధరించింది. మోసంచేసే వేటగానిని చూచి అడవిలో పరుగెత్తే లేడి వలె వణుకుతూ పరుగు తీసింది.

**వ. ఇట్లు ధరణి పాఱిన నతండు కుపితారుణేక్షణుండై వెంటఁ దగిలి దిక్కులను విదిక్కులను భూభాగ నభోభాగంబుల నెక్కడం జనియె, నక్కడికి వెనుదగిలి యుద్యతాయుధుండై చనుచుండ నవ్వైన్యునిం గని మృత్యు గ్రస్తులగు ప్రజల చందంబున ననన్య శరణ్యయై యతిభయంబునం బరితప్యమాన హృదయ యగుచు వైన్యా! ధర్మవత్సలుండవును, నాపన్న రక్షకుండవును, మహాత్ముండవును, సకల ప్రాణి పరిపాలనావస్థితుం డవును నయిన నీ వీ దీనయుం బాపరహితయుం గామినియు నగు నన్ను వధియింపం బూని యేల వెనుదగులుచున్న వాఁడవు? ధర్మతత్త్వం బెఱుంగువారు సతీజనంబులు గృతాపరాధలైనం దీనవత్సలతం జేసి వధింప రని పలికి మఱియు నా ధరణీదేవి పృథుచక్రవర్తి కిట్లనియె. 474**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; ధరణి+పాఱినన్= భూదేవి పరుగెత్తగా; అతండు= ఆ రాజు; కుపిత+అరుణ+ఈక్షణుండు+ఐ= కోపంతో ఎర్రబడిన కనులుగలవాడై; వెంటన్+తగిలి= వెంబడించి; దిక్కులను= నాలుగు దిక్కులను; విదిక్కులను= దిక్కుల మూలలను; భూభాగ= భూప్రదేశం; నభస్+భాగంబులన్= ఆకాశప్రదేశాలలో; ఎక్కడన్+చనియెన్= ఎక్కడికి వెళ్లెనో; అక్కడికిన్= ఆ చోటికి; వెనుతగిలి= వెంబడించి; ఉద్యత+ఆయుధుండు+ఐ= ఆయుధాలు ఎత్తిపట్టుకొని; చనుచుండన్= వెళ్తుండగా; ఆ+వైన్యునిన్+కని= ఆ వేనపుత్రుడైన పృథుమహారాజునుచూచి; మృత్యుగ్రస్తులు+అగు= మరణంచే కబళించబడినవారైన; ప్రజలచందంబునన్= జనులవలె; అనన్యశరణ్య+ఐ= వేరెవ్వరు దిక్కులేనిదై; అతిభయంబునన్= మిక్కిలి భయంతో; పరితప్యమానహృదయ+అగుచున్= మిక్కిలి తాపం చెందుతున్న హృదయముకలదై; వైన్యా=

ఓ పృథుమహారాజా!; ధర్మవత్సలుండవును= ధర్మం మీద అపేక్ష గలిగినవాడివి; ఆపన్న రక్షకుండవును= ఆపదలో ఉన్నవారిని రక్షించేవాడివి; మహాత్ముండవును= మహానుభావుడవు; సకలప్రాణి= సమస్తజీవులను; పరిపాలన+ అవస్థితుండవును= పాలించడంలో నిశ్చలస్వభావంగలవాడివి; అయిన= అయినట్టి; నీవు= నీవు; ఈ దీనయున్= ఈ దీనురాలు; పాపరహితయున్= పాపంలేనిది; కామినియున్= కోరికగలది; అగునన్ను= అయిన నన్ను; వధియింపన్+పూని= చంపదలచి; ఏల వెను తగులుచున్నవాఁడవు= ఎందుకు వెంబడిస్తున్నావు?; ధర్మతత్త్వంబు= ధర్మంయొక్క స్థితి; ఎఱుంగువారు= తెలిసినవారు; సతీజనంబులు= స్త్రీలు; కృత+అపరాధలు+ఐనన్= తప్పుచేసిన వారైనా; దీనవత్సలతన్+చేసి= దయాస్వభావంతో; వధింపరు= చంపరు; అనిపలికి= అనిచెప్పి; మఱియు, ఆ ధరణీదేవి= ఆ భూదేవి; పృథుచక్రవర్తికి= పృథుమహారాజుతో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నది.

**తా :** ఈ విధంగా భూదేవి పరుగులు తీయగా, పృథువు కోపంతో ఎర్రబడ్డ కనులుగలవాడై వెంబడించాడు. దిక్కులలో, మూలలలో, భూమ్యాకాశాల మధ్య, ఎక్కడికెళ్లినా అక్కడకు వెంబడించి తరుమసాగాడు. విల్లంబులు ఎక్కుపెట్టి పరుగెత్తసాగాడు. ఆ సమయంలో భూదేవి మృత్యువు చేజిక్కిన మనుజులవలె దిక్కులేనిదై హృదయతాపంతో ఇలా అన్నది. "ఓ పృథుమహారాజా! నీ యందు ధర్మం, వాత్సల్యం ఉన్నాయి. ఆపదలో నున్నవారిని రక్షించే స్వభావం ఉంది. జీవుల ప్రాణాలను కాపాడటంలో నిశ్చలత ఉంది. అయినా, దీనురాలను, పాపరహితను, స్త్రీని అయిన నన్ను చంపడానికి పూనుకొని ఎందుకు వెంబడిస్తున్నావు. ధర్మతత్త్వం తెలిసిన వారు స్త్రీలు తప్పుచేసినా దీనవత్సలతచేత వధించరు అని చెప్పి తిరిగి భూదేవి పృథుచక్రవర్తితో ఇట్లన్నది.

**క. జననాథచంద్ర! యీ భూ, జనకోటికి యానపాత్రసదృశస్థితితో**
**ఘనదృఢశరీరయగు నే, ననయము నాధారభూత నగుచుఁ జరింతున్. 475**

**ప్రతి :** జననాథచంద్ర= ఓ రాజచంద్రా! ఈ భూజనకోటికి= ఈ భూమిమీది ప్రజాసమూహమునకు; యానపాత్ర సదృశస్థితితో= నౌకవంటి స్థితితో; ఘనదృఢ శరీర+అగు= గొప్పది, గట్టిది అయిన శరీరం దాల్చిన, నేను, అనయమున్= ఎల్లప్పుడు, ఆధారభూతన్+అగుచున్= ఆధారమవుతూ, చరింతున్= తిరుగుతాను.

**తా :** ఓ రాజచంద్రా! ఈ భూమిమీది జనసమూహానికి నేను నౌకవలె ఉన్నాను. గొప్పదైన, దృఢమైన శరీరాన్ని ధరించిన నేను ఎల్లప్పుడు ఆ జనసమూహానికి ఆధారంగా ఉంటూ తిరుగుతూ ఉంటాను.

**విశే :** ఘనత్వము, దృఢత్వము అనేవి పృథ్వీభూత తత్త్వాలు, ధర్మాలు.

**తే. ఇట్టి నన్నుఁగృపామతి యెడలి యిటు వి, పాటనము సేసి త్రుంచెదు? ప్రజలు నీట**
**మునుఁగకుండంగ నే రీతి ననఘచరిత!, యరసి రక్షింతు వన నతండవని కనియె. 476**

**ప్రతి :** ఇట్టి నన్నున్= ఈ విధమైన నన్ను; కృపామతి+ఎడలి= దయాస్వభావాన్ని వీడి; ఇటు= ఈ విధంగా; విపాటనము+చేసి= ముక్కలుచేసి; త్రుంచెదు= తుంచుతావు; ప్రజలు= జనులు; నీటమునుఁగక= నీళ్లలోమునిగిపోకుండా; ఉండంగన్= ఉండునట్లు; అనఘచరిత!= పాపరహితుడా!; ఏ రీతిన్= ఏ విధంగా; అరసి= చూచి; రక్షింతువు= కాపాడుతావు; అనన్= అనగా; అతండు= పృథువు; అవనికిన్= భూదేవికి; అనియెన్= ఇట్లు చెప్పాడు.

**తా :** ఇలాంటి నన్ను దయతప్పి, ముక్కలుగా తుంచాలని సంకల్పించావు. నేను లేనిచో ఈ సకల జీవరాసులు నీటిలో మునిగిపోకుండా రక్షించడం నీకెలా సాధ్యం? అనగా పృథువు భూమాతకు ఈ విధంగా చెప్పాడు.

**వ. ధరిత్రీ! మదీయాజ్ఞోల్లంఘనంబు సేయు చున్నదాన! వదియునుంగాక నీవు యజ్ఞంబులందు హవిర్భాగంబుల ననుభవించుచు ధాన్యాదికంబుల విస్తరింపం జేయక గోరూపంబు ధరియించి యనయంబుc దృణ భక్షణంబు సేయుచుc బాలం బిదుకక నీయంద యడంచికొంటివి; నీ యందున్న యోషధీ బీజంబులు బ్రహ్మచేతం బూర్వంబునందె కల్పింపంబడినయవి, వానిని నీ దేహంబునంద యడంచికొని యిప్పుడీయక మూఢహృదయవు, మందమతివియునై యపరాధంబు చేసిన దురాత్మురాలవగు నిను నా బాణంబులచే జర్జరీభూత శరీరం జేసి వధియించి నీ మేని మాంసంబునం జేసి క్షుద్బాధితులు దీనులు నగు నీ ప్రజల యార్తి నివారించెద, నీవు కామిని నంటివి, స్త్రీ పురుష నపుంసకులలో నెవ్వరేని భూతదయ లేక స్వమాత్ర పోషకులగుచు నిరనుక్రోశంబుగ భూతద్రోహులై వర్తింతురు, వారిని రాజులు వధించినన్ వధంబు గాదు, గాన దానc బాపంబు వొరయదు, నీవు కామిని వైనను దుర్మదవు స్తబ్ధవు నగుచు మాయాగోరూపంబునం బాతి పోవుచున్న నిన్నుc దిలలంతలు ఖండంబులు సేసి నా యోగ మహిమం బ్రాణికోటి నుద్ధరించెద నని పలికి రోషభీషణాకారంబు ధరియించి దండధరుని వడువున వర్తించు పృథునింజూచి వడంకుచు మేదిని ప్రాంజలియై యిట్లని నుతింపందొడంగె. 477**

ప్రతి : ధరిత్రీ!= ఓ భూదేవీ! మదీయ+ఆజ్ఞా+ఉల్లంఘనంబు= నాయొక్క ఆజ్ఞను అతిక్రమించడం; చేయుచున్నదానవు= చేస్తున్నావు; అదియునున్+కాక= అదీగాక; నీవు, యజ్ఞంబులు+అందు= యజ్ఞాలలో; హవిర్భాగంబులను= దేవతలకు సమర్పించే హవిస్సులను; అనుభవించుచున్= అందుకొంటూ; ధాన్య+ఆదికంబులన్= ధాన్యము మొదలైనవాటిని; విస్తరింపన్+చేయక= పెంచక; గోరూపంబు= ఆవు రూపాన్ని; ధరియించి= దాల్చి; అనయంబున్= ఎల్లప్పుడు; తృణభక్షణంబు+చేయుచున్= గడ్డిని తింటూ; పాలన్+పిదుకక= పాలను ఇవ్వక; నీ+అంద= నీలోన, అడంచికొంటివి= అణచుకొన్నావు; నీ+అందు+ఉన్న+ఓషధీ బీజంబులు= నీలో ఉన్న ఓషధుల విత్తనాలు; బ్రహ్మచేతన్= సృష్టికర్తచే; పూర్వంబునందు+ఎ= ముందుగానే; కల్పింపబడిన+అవి= సృష్టించబడ్డాయి; వానిని= వాటిని; నీదేహంబునందు+అ= నీ శరీరంలో; అడంచికొని= దాచుకొని; ఇప్పుడు+ఈయక= ఇప్పుడివ్వక; మూఢహృదయవు= అవివేకమైన హృదయం కలిగినదానవు; (పృథివీతత్త్వంలో చైతన్యం మాటుపడుతుంది); మందమతివియును+ఐ= తగ్గిన మనోవికాసాలు గలదానవై (మందత్వము, ప్రజ్ఞను స్థూల పరచడం పృథివీతత్త్వ లక్షణాలు); అపరాధంబు+చేసిన= తప్పుచేసిన; దురాత్మురాలవు+అగు నినున్= పాపిష్ఠిదానివైన; నినున్= నిన్ను; నాబాణంబులచే= నాబాణాలతో; జర్జరీభూతశరీరన్+చేసి= శిథిలమైన దేహము కలదానినిగాచేసి; వధియించి= చంపి; నీమేని= నీ శరీరంలోని; మాంసంబునన్+చేసి= మాంసంతో; క్షుద్బాధితులు= ఆకలి గొన్నవారు; దీనులును= దుఃఖానికి లోనైనవారు; అగు= అయిన; ఈ ప్రజల= ఈ జనుల; ఆర్తి= బాధ; నివారించెద= తొలగిస్తాను; నీవు కామినిని+అంటివి= నీవు కోరికగల దాన నంటివి; స్త్రీ, పురుష నపుంసకులలో= స్త్రీలలో, పురుషులలో, నపుంసకులలో; ఎవ్వరు+ఏనిన్= ఎవరైనా; భూతదయలేక= జీవులపట్ల దయలేకుండా; స్వమాత్ర పోషకులు+అగుచున్= తన్ను తాను పోషించుకొన్నవారై; నిరనుక్రోశంబుగన్= దయలేకుండా; భూత+ద్రోహులు+ఐ= జీవులకు ద్రోహం చేసేవారై; వర్తింతురు= తిరుగుతుంటారో; వారిని= అట్టివారిని; రాజులు= ప్రభువులు; వధించినన్= చంపినా; వధంబు+కాదు= చంపినట్లు కాదు; కానన్= కావున; దానన్= దానివలన; పాపంబు+పొరయదు= పాపం కలుగదు; నీవు, కామినివి+ఐనను= కోరికగల దానవైనను; దుర్+మదవు= అధికమైన మదము గలదానవు; స్తబ్ధవు= చలనములేని దానవు; అగుచు, మాయాగోరూపంబునన్= మాయా గోరూపముతో; పాతిపోవుచున్న నిన్నున్= పరుగెత్తిపోతున్న నిన్ను; తిలలు+అంతలు=

నువ్వు గింజలంత; ఖండంబులు+చేసి= ముక్కలుచేసి; నాయోగమహిమన్= నా యోగమహిమతో; ప్రాణికోటిన్= జనులను; ఉద్ధరించెదన్= రక్షిస్తాను; అని పలికి= అని చెప్పి; రోష, భీషణ+ఆకారంబు= కోపముచేత భయంకరమైన రూపాన్ని; ధరియించి= తాల్చి; దండధరుని వడువునన్= యమునివలె; వర్తించు= ప్రవర్తించు; పృథునిన్+చూచి= పృథుని చూచి; మేదిని= భూదేవి; వడంకుచున్= భయపడుతూ; ప్ర+అంజలి+ఐ= దోసిలితో నమస్కరిస్తూ; ఇట్లు+అని= ఈ విధంగా; సుతింపన్+తొడంగెన్= పొగడసాగెను.

**తా :** ఓ భూదేవీ! నీవు నా ఆజ్ఞను అతిక్రమిస్తున్నావు, అంతేకాక, నీవు యజ్ఞాలలో హవిర్భాగాలను అనుభవిస్తూ కూడ ధాన్యాదులను పెంచకుండా ఉన్నావు. గోరూపాన్ని ధరించి, గడ్డిమేస్తూ పాలను ఇవ్వకుండా నీలోనే దాచుకొంటున్నావు. పూర్వం బ్రహ్మ నీలో సృష్టించిన ఓషధీబీజాలను నీ శరీరంలోనే అణచి పెట్టుకొని బయటకు రానీకుండా చేస్తున్నావు. నీవు మూర్ఖురాలవు, మందబుద్ధివి. అపరాధం చేశావు గాబట్టి దురాత్మురాలవు. నిన్ను నా బాణాలతో తూట్లు పొడిచి చంపుతాను. నీ శరీరమాంసంతో ఈ దీనులైన జీవుల ఆకలిబాధ తీర్చి రక్షిస్తాను. "నీవు కామినిని అన్నావు. (స్త్రీలను చంపరాదన్నావు. ధర్మం తెలిసినవారి కది తగదన్నావు.) జీవులపట్ల దయలేక తమని తాము పోషించుకొనేవారు జాలిలేనివారు. అట్టివారు జీవద్రోహులు". వాళ్ల స్త్రీలైనా, పురుషులైనా, నపుంసకులైనా చంపదగ్గవారే. రాజులు వారిని చంపినా అది పాపం కాదు. కాబట్టి, పాపం అంటదు. నీవు కామినివైనా మదంతో ప్రవర్తించావు. స్తబ్ధస్వభావం కలిగివున్నావు. మాయాబలంతో ఇప్పుడు గోరూపంలో పారిపోతున్నావు. నిన్ను నువ్వుగింజలంత చిన్నచిన్న తునియలుచేసి నాయోగమహిమతో ప్రాణికోటిని ఉద్ధరిస్తాను. ఇలా మాట్లాడి రోషంతో కూడిన భయంకర రూపం ధరించి, యమునివలె ప్రవర్తిస్తున్న పృథుచక్రవర్తిని చూచి వణుకుతూ భూదేవి నమస్కరిస్తూ ఆయనను ఇలా స్తుతించింది.

**క. ఓ నాథ! పరమపురుషుఁడ, వై నిజమాయాగుణంబు లందినకతనన్**
**నానావిధదేహములం, బూనుదు సగుణుండ వగుచు బుధనుతచరితా! 478**

**ప్రతి :** ఓనాథ= ఓ నాథా!; బుధనుత చరితా!= జ్ఞానులచే స్తుతింపబడిన నడవడికలవాడా!; పరమపురుషుఁడవు+ఐ= నారాయణుడవై; నిజమాయాగుణంబులు= నీ మాయాస్వభావం; అందిన కతనన్= పొందినకారణంగా; సగుణుండవు+అగుచున్= గుణాలతో కూడినవాడివై; నానావిధదేహములన్= పలురకాల శరీరాలను; పూనుదు= ధరిస్తావు.

**తా :** ఓ నాథా! నీవు నిర్గుణుడవైన నారాయణుడవే అయినా, నీవు నీ మాయాగుణాలు పొందినకారణంగా సగుణుడవై నానావిధ దేహాలు ధరిస్తున్నావు. జ్ఞానులచే స్తుతింపబడుతున్నావు.

**విశే :** పరమాత్మ నిర్గుణుడు; నిరాకారుడు; సర్వవ్యాపి, ఆయన తననే ఆశ్రయించి ఉన్న మాయవల్ల సగుణుడైనపుడు నానారూపాలతో ఈ సృష్టి సమస్తం ఏర్పడుతున్నదని తాత్త్విక వివరణ. ఈ తాత్త్విక స్థితిని దర్శించినవారు జ్ఞానులు.

**వ. అట్టి నీవు. 479**

**ప్రతి :** అట్టినీవు= అలాంటివాడవైన నీవు.

**తా :** అటువంటి నీవు

**క. నను సకలజీవతతికిని, మును నీ వాధారభూతముగ నిర్మింపన్,**
**విను నాయందుఁ జతుర్విధ, ఘనభూతవిసర్గ మర్థిఁ గైకొనవలసెన్. 480**

ప్రతి : ననున్= భూదేవిని; సకల జీవతతికిని= సమస్తప్రాణికోటికి; మును= ముందు; నీవు+ఆధారభూతముగన్= నీవు ఆధారమయ్యేలా; నిర్మింపన్= సృజించగా; విను= వినుము; నాయందున్= నాలో; చతుర్+విధ= నాల్గువిధములైన; ఘనభూత విసర్గము= గొప్పదైన జీవసృష్టి (ఘన పరిమాణముచెందిన భౌతికసృష్టి); అర్థిన్= కోరి; కైకొనవలసెన్= స్వీకరించవలసి వచ్చింది.

తా : నన్ను సకల జీవరాశులకు ఆధారంగా పూర్వం సృజించగా విను. నేను నాలుగు విధాలైన భూతసమూహాన్ని భరించవలసి వచ్చింది.

**వ. అట్లయి యుండ. 481**

ప్రతి : అట్లు+అయి+ఉండన్= అలా ఉండగా.

తా : అలా ఉండగా,

**క. నను నుద్యతాయుధుఁడవై, మనుజేంద్ర! వధింపఁబూని మసలెదు, నీకం**
**టెను నన్యుని నెవ్వని నే, ఘనముగ శరణంబు సొత్తుఁగరుణాభరణా! 482**

ప్రతి : మనుజ+ఇంద్ర= ఓ రాజా!; కరుణా+ఆభరణా!= దయయే అలంకారంగా కలవాడా!; ననున్= నన్ను; ఉద్యత+ఆయుధుఁడవు+ఐ= పైకెత్తిన ఆయుధం కలవాడవై; వధింపన్+పూని= చంపదలచి; మసలెదు= తిరుగు తున్నావు; నీకంటెను= నిన్ను తప్ప; అన్యునిన్= ఇతరుని; ఎవ్వనిన్= ఎవరిని; ఏన్= నేను; ఘనముగ= గొప్పగా; శరణంబు+చొత్తున్= రక్షించమని వేడుకొంటాను?

తా : ఓ రాజా! దయయే అలంకారంగా కలవాడా! ఆయుధాన్ని ఎత్తి నన్ను చంపబూని తిరుగుతున్నావు. నేను నిన్ను తప్ప మరెవరిని శరణువేడేది?

**వ. అదియునుంగాక. 483**

ప్రతి : అదియునున్+కాక= అదీగాక.

**సీ. అనఘ! స్వకీయంబునై యతర్కితమునై మహిమ నొప్పిన భవన్మాయచేత**
**సకలచరాచరసర్గంబు నిర్మించి ధర్మపరుండవై తనరు దీశ!**
**నీ విక్రమము నవనీరజలోచన! సకలలోకులకు దుర్జయము; దలఁపఁ**
**దగు నట్టి నీవు స్వతంత్రుఁడ వగుటను బ్రహ్మఁబుట్టించి యా బ్రహ్మచేత**

**తే. సకలజగములఁజేయింతు సమతఁ బేర్చి, యేక మయ్యు మహాత్మ! యనేకవిధము**
**లగుచు వెలుఁగొందు చుందు వీ యఖిలమందుఁ, జారుతరమూర్తి! యో పృథుచక్రవర్తి! 484**

ప్రతి : అనఘ= పాపంలేని ఓ రాజా!, పుణ్యాత్ముడా!; స్వకీయంబును+ఐ= తనదై; అతర్కితమును+ఐ= తర్కానికి అందనిదై; మహిమన్+ఒప్పిన= గొప్పదైన; భవత్+మాయచేత= నీమాయచే; సకలచరాచర= సమస్తమైన కదిలేవి కదలనివి అయిన; సర్గంబు= సృష్టి; నిర్మించి= ఏర్పరచి; ఈశ= ఓ రాజా!; ధర్మ+అర్థపరుండవు+ఐ= ధర్మాలను, అర్థాలను ఉద్దేశించినవాడవై; తనరుదు= ప్రకాశిస్తావు; నవనీరజలోచన= కొత్తపద్మాలరేకులవంటి కనులు గలవాడా!; నీ విక్రమము= నీ పరాక్రమం;

సకలలోకులకు= అన్ని లోకాలవారికి; దుర్+జయము= జయింపరానిది; నీవు, తలఁపన్+తగునట్టి= ఆలోచింపతగినట్టి; స్వతంత్రుఁడవు+అగుటను= స్వేచ్ఛగలవాడవైనందున; బ్రహ్మన్+పుట్టించి= బ్రహ్మదేవుని సృష్టించి; ఆ బ్రహ్మచేతన్= ఆ బ్రహ్మచే; సమతన్= సమత్వంతో; పేర్చి= అతిశయించి; సకలజగములన్= సమస్తలోకాలను; చేయింతువు= సృష్టింపజేస్తావు; మహాత్మ= ఓ పుణ్యాత్మా; ఓ పృథుచక్రవర్తీ, చారుతరమూర్తి= అందమైన రూపంగలవాడా!; అనేకవిధములు+అగుచు= అనేక రూపాలలో; ఈ+అఖిలము+అందున్= ఈ సమస్త విశ్వంలో; వెలుగొందుచుందువు= ప్రకాశిస్తుంటావు.

**తా :** ఓ పుణ్యపురుషా! ఊహింపరాని మహిమతో కూడిన నీ మాయచే ఈ చరాచరప్రపంచాన్ని సృష్టించావు. నీవు ధర్మపరుడవై ప్రకాశిస్తున్నావు. వికసించే తామరలవంటి కనులుగల ఓ ప్రభూ! నీ పరాక్రమాన్ని లోకు లెవ్వరూ జయించలేరు. నీవు సర్వతంత్ర స్వతంత్రుడవు. బ్రహ్మను పుట్టించావు. ఆ బ్రహ్మచే సకలలోకాలను సృజింపజేశావు. సౌందర్యమూర్తివైన ఓ పృథుచక్రవర్తీ! నీవు ఒక్కడవే అయినా పెక్కువిధాలుగా సమస్తంలో ప్రకాశిస్తావు.

**వ. మఱియు మహాభూతేంద్రియకారక చేతనాహంకారంబులను శక్తులం జేసి యీ జగంబుల కుత్పత్తి స్థితిలయంబులం గావించుచు సముత్కట విరుద్ధ శక్తులు గల పురుషునకు నమస్కరించెద, నట్టి పరమపురుషుండ వయిన నీవు నిజనిర్మితంబును భూతేంద్రియాంతఃకరణాత్మకంబును నైన యీ విశ్వంబు సంస్థాపింపంబూని. 485**

**ప్రతి :** మఱియు= అంతేకాక; మహాభూత+ఇంద్రియకారక= చాలగొప్పవైన పంచభూతాలు, ఇంద్రియాలు కలుగుటకు కారణాలైన; చేతన+అహంకారంబులు+అను= చైతన్యము, అహంకారము అను; శక్తులన్+చేసి= శక్తులవలన; ఈ జగంబులకు= ఈ లోకాలకు; ఉత్పత్తిస్థితిలయంబులన్= పుట్టించుట, పెంచుట, నశింపజేయుటలను; కావించుచున్= చేస్తూ; సముత్కట= మిక్కిలి అధికమైన; విరుద్ధ శక్తులుగల= పరస్పరం పొందికలేని శక్తులుగల; పురుషునకున్= భగవంతునకు నమస్కరిస్తాను; అట్టి= అటువంటి; పరమపురుషుండవు+అయిన= పరమాత్మవైన; నీవు, నిజనిర్మితంబును= నీచే నిర్మింపబడినదియు; భూత+ఇంద్రియ+అంతఃకరణ+ఆత్మకంబును+ఐన= భూతాలు, ఇంద్రియాలు, అంతఃకరణం కలిసి తానుగా ఏర్పడిన; ఈ విశ్వంబున్= ఈ లోకాన్ని; సంస్థాపింపన్+పూని= స్థాపించదలచి...

**తా :** అంతేకాక పంచభూతాలు, ఇంద్రియాలు కలుగుటకు కారణాలైన చైతన్యం, అహంకారం అనే శక్తులవల్ల ఈ లోకాలను సృష్టించి, పెంచి, నశింపచేస్తూ, విరుద్ధశక్తులుగల పురుషునకు నమస్కారం చేస్తాను. అటువంటి పరమాత్మస్వరూపుడివైన నీవు నీచే నిర్మింపబడి పంచభూతాలు, ఇంద్రియాలు, మనస్సుతో నిండిన ఈ లోకాన్ని స్థిరంగా నిలుప ప్రయత్నించి

**సీ. ఆదివరాహంబ వగుచు రసాతలగతనైన నన్ను నక్కటికతోడ**
**నుద్ధరించితి, వట్టి యుదకాగ్రభాగంబు నం దర్థి నున్న నే ననెడి నావ**
**యందున్న నిఖిలప్రజావళి రక్షింపఁ గోరి యీ పృథురూపధారి వైతి,**
**వట్టి భూభరణుండ వైన నీ విపుడు పయోనిమిత్తంబుగా నుగ్రచరుఁడ**

**తే. వగుచు నన్ను వధించెద ననుచు బుద్ధిఁ, దలఁచుచున్నాఁడ, విది విచిత్రంబుగాదె!**
**విశ్వసంపాద్య! నిరవద్య! వేదవేద్య!, భవ్య గుణసాంద్ర! వైన్య భూపాలచంద్ర! 486**

**ప్రతి :** విశ్వసంపాద్య= సృష్టియే సంపాద్యంగా కలవాడా!; నిరవద్య= ఏ విధమైన వంకలుపెట్టడానికి వీలులేనివాడా!; వేదవేద్య= వేదాలచే తెలుసుకొనబడినవాడా; భవ్యగుణసాంద్ర= పుణ్యగుణాలు నిండినవాడా!; వైన్యభూపాలచంద్ర= వేనుని కుమారుడవైన ఓ పృథుమహారాజా!; ఆది వరాహంబవు+అగుచు= తొలుత వరాహావతారాన్ని ధరించినవాడవై; రసాతలగతను+ఐన నన్ను= పాతాళంలో నుండిన నన్ను; అక్కటికతోడన్= జాలితో; ఉద్ధరించితివి= రక్షించావు (పైకి తెచ్చావు); అట్టి+ఉదక+అగ్రభాగంబునందు= అలాంటి నీటి పైభాగంలో; అర్థిన్+ఉన్న= కోరికతోఉన్న; నేను+అనెడినావ+అందున్న= నేననే పడవలోనున్న; నిఖిల ప్రజ+ఆవళి= సమస్త జనసముదాయాన్ని; రక్షింపన్+కోరి= రక్షింపదలచి; ఈ పృథురూపధారివి+ఐతి= ఈ విధంగా 'పృథు' ఆకారాన్ని ధరించావు; అట్టి భూభరణుండవు+ఐననీవు= ఆ విధంగా భూమిని భరిస్తున్న రాజువైన నీవు; ఇపుడు, పయస్+నిమిత్తంబుగాన్= పాలకొరకు; ఉగ్రచరుఁడవు+అగుచున్= భయంకరంగా తిరిగేవాడివై; నన్ను వధించెదను+అనుచున్= నన్ను చంపుతానంటూ; బుద్ధిన్+తలఁచుచున్నాఁడవు= మనసులో ఆలోచిస్తున్నావు; ఇది విచిత్రంబు+కాదు+ఎ= ఇది ఆశ్చర్యంకాదా!

**తా :** ఆదివరాహ రూపాన్ని ధరించి రసాతలంలో నుండిన నన్ను దయతో పైకి లేవనెత్తావు. అలా ఎత్తిపట్టి మహాజలరాశిపై నావవలె నన్ను నిలిపావు. నాపై ప్రాణులను నిలిపావు. ప్రజారక్షణ కోసం నీవు పృథురూపం ధరించావు. ఇలా భూభారాన్ని వహించి ప్రజలను రక్షిస్తున్న నీవు కేవలం పాలకోసం నన్ను చంపాలని మనసులో ఆలోచిస్తున్నావు. ఓ రాజచంద్రా! పుణ్యగుణాలప్రోవా! అనవద్యుడవు, వేదవేద్యుడవు, సకల చరాచరరక్షకుడవైన నీకిది ఆశ్చర్యంగా కనిపించడం లేదా?

**వ. కావున నీశ్వరగుణ సర్గరూపంబైన మాయచే మోహితాంతఃకరణులమైన మా వంటి వారలచేత హరిభక్తుల చేష్టితం బెఱుంగఁ బడదన్న హరిచేష్టితం బెట్లెఱుంగంబడు? నట్టి జితేంద్రియ యశస్కరు లయిన వారలకు నమస్కరింతు ననుచు నవ్విధంబునం గోపప్రస్ఫురితాధరుండైన పృథుని నభినుతించి ధైర్యం బవలంబించి వెండియు నిట్లనియె. 487**

**ప్రతి :** కావునన్, ఈశ్వరగుణ సర్గరూపంబు+ఐన= ఈశ్వరుని గుణాలయొక్క సృష్టిరూపమైన, మాయచే; మోహిత+అంతఃకరణులము+ఐన= మోహంతో కూడిన మనస్సుగలవాళ్లమైన, మావంటివారలచేత; హరిభక్తుల చేష్టితంబు= హరిదాసుల చేష్టలు; ఎఱుంగన్+పడదు+అన్నన్= తెలియదన్నపుడు, హరిచేష్టితంబు= శ్రీహరిచర్యలు; ఎట్లు+ఎఱుంగన్+పడున్= ఏ విధంగా తెలుస్తాయి?; అట్టి, జిత+ఇంద్రియ యశస్కరులు+అయినవారలకు= ఇంద్రియాలను జయించామనే ప్రసిద్ధి కెక్కినవారికి; నమస్కరింతున్+అనుచు= నమస్కరిస్తానని చెపుతూ; ఆ+విధంబునన్= అలా; కోపప్రస్ఫురిత+అధరుండు+ఐన= కోపంచే అదరుతున్న పెదవులు గల; పృథునిన్; అభినుతించి= పొగడి; ధైర్యంబు+అవలంబించి= ధైర్యం తెచ్చుకొని; వెండియున్= మరలా; ఇట్లు+అనియెన్= ఇలా అన్నది.

**తా :** భగవంతుని మహిమోపేతమైన మాయచే మోహం పొందిన మనస్సుగల మావంటి వారికి హరిభక్తుల చేష్టలు తెలుసుకోవడం శక్యం కాదు. అలాంటప్పుడు శ్రీహరి చర్యలను ఎలా తెలుసుకోగలం? అటువంటి యశోనిధులైన జితేంద్రియులకు, మహానుభావులకు మొక్కుతున్నాను – అని, ఈ విధంగా కోపంచే పెదవులు అదరుతున్న పృథుచక్రవర్తిని పొగిడి, ధైర్యం తెచ్చుకొని భూదేవత మళ్లీ ఇలా అన్నది.

**క. విమలాత్మ! నాకు నభయము, సమకూరెడు నట్లుగాఁగ సన్మతి నీ క్రో**
**ధము నుపశమించి కరుణిం, పుము నా విన్నపము వినుము పురుషనిధానా! 488**

**ప్రతి :** విమల+ఆత్మ= నిర్మలమైన మనస్సు కలరాజా!; పురుషనిధానా!= పరమాత్మకు స్థానమైనవంటివాడా!!; నాకున్+అభయము సమకూరెడున్+అట్లుగాఁగ= నాకు భయంలేకుండా ఉండేలా; సత్+మతిన్= మంచి మనస్సుతో; నీక్రోధమును+ఉపశమించి= నీ కోపాన్ని నెమ్మదించి; కరుణింపుము= దయతో చూడుము; నా= నాయొక్క, విన్నపము= విన్నపాన్ని; వినుము= వినుము.

**తా :** ఓ నిర్మలమైన మనస్సుగల రాజా! పరమాత్మా! నాకు భయంలేకుండా ప్రవర్తించు, మంచి మనస్సుతో కోపాన్ని దిగమింగు. దయతో నా మనవిని విను.

**క. ధర విరులు గందకుండఁగ, సరసగతింబూవుఁదేనెఁజవిగొను నిందిం**
**దిరవిభు కైవడి బుధుఁడగు, పురుషుఁడు సారాంశ మాత్మఁబూని గ్రహించున్. 489**

**ప్రతి :** ధరన్= లోకంలో; విరులు కందకుండఁగన్= పూలు నలిగిపోకుండా; సరసగతిన్= రసికతతో; పూవున్+తేనెన్= పుష్పంలోని తేనెను; చవి+కొను= రుచిచూచే; ఇందిందిరవిభుకైవడిన్= గండు తుమ్మెదవలె; బుధుఁడగు పురుషుఁడు= పండితుడైన వ్యక్తి; సారాంశము= విషయాన్ని; ఆత్మన్+పూని= మనస్సులో నిశ్చయించి; గ్రహించున్= పొందుతాడు.

**తా :** లోకంలో పువ్వులు కందిపోకుండా తేనెను మృదువుగా, తాగే గండు తుమ్మెదవలె పండితుడైన మానవుడు దేనినీ నొప్పించకుండా అన్నింటినుండి సారాంశాన్ని నేర్పుగా గ్రహిస్తాడు.

**సీ. వినవయ్య! తత్త్వదర్శనులైన యట్టి స న్మునులచే నైహికాముష్మికంబు**
**లైన ఫలప్రాప్తి కర్థిఁ గృష్యాద్యగ్ని హోత్రాద్యుపాయంబు లుర్విమీఁద**
**దృష్టంబులును నాచరితములు నగుచుఁ దా నెనయంగఁ దదుపాయ మెవ్వఁడాచ**
**రించును వాఁడు ప్రాపించుఁదత్ఫలమును విద్వాంసుఁడైనను వెలయ దీని**

**తే. నాదరింపక తనయంత నాచరించె, నేని నాయాసమే యగుఁ గాని తత్ఫ**
**లమును బొందఁడు బహుళకాలమునకైన, వినుతగుణశీల! మాటలు వేయునేల? 490**

**ప్రతి :** వినుత గుణశీల!= ప్రశంసార్హమైన గుణాలు గలవాడా!; వినవయ్య, తత్త్వదర్శనులు+ఐన= పరమాత్మ స్వరూపం తెలిసినవారైన; అట్టి= అటువంటి; సత్+మునులచే= ఉత్తములైన మునులచే; ఐహిక+ఆముష్మికంబులు+ఐన= ఇహ; పరలోకాలకు సంబంధించిన; ఫలప్రాప్తికిన్= ఫలాన్ని పొందడానికి; అర్థిన్= కోరికతో; కృషి+ఆది= సేద్యం మొదలైన; అగ్నిహోత్ర+ఆది= అగ్నికార్యం మొదలుగాగల; ఉపాయంబులు= లాభాలు కల్గించేపనులు; ఉర్విమీఁదన్= భూమిపై; దృష్టంబులును= చూడబడినవి; ఆచరితములును= చేయబడినవి; అగుచున్= అగుచుండగా; తాన్+ఎనయంగన్= తాను పొందుటకు; తద్+ఉపాయము= ఆ ఉపాయాన్ని; ఎవ్వఁడు+ఆచరించును= ఎవడు చేస్తాడో; వాఁడు, తత్ఫలమును= దాని ఫలితాన్ని; ప్రాపించున్= పొందుతాడు; విద్వాంసుడు+ఐనను= పండితుడైనా; వెలయన్= ప్రసిద్ధంగా; దీనిన్+ఆదరింపక= దీనిని గమనించక; తన+అంతన్= తనకుతానే; ఆచరించెను+ఏనిన్= చేస్తే; ఆయాసమే= శ్రమ; అగుఁగాని= అవుతుందిగాని; మాటలు వేయున్+ఏల= వేయి మాటలెందుకు?; బహుళకాలమునకైనన్= చాలకాలానికి కూడా; తద్+ఫలమును= ఆ ఫలితాన్ని; పొందడు.

**తా :** వినవయ్యా! తత్త్వదర్శనులైన, ఉత్తములైన మునులు ఈ లోకంలోను, పరలోకంలోను, పురుషులకు ఫలం చేకూర్చే కృషి, అగ్నిహోత్రం మొదలైన ఉపాయాలను దర్శించి ఆచరించారు. ఆ విధంగా ఆ ఉపాయాలను ఆచరించేవాడు ఆ ఫలాన్ని పొందుతాడు. అలాంటి ఉపాయాన్ని లెక్కచేయకుండా విద్వాంసుడైనా తనకు తోచినట్లు చేసేవాడు, ఎంతటి పండితుడైనా అతనికి ఆయాసమేగాని ఫలం దక్కదు. పెక్కుమాటలెందుకు?

**వ. అని మఱియు మహి యిట్లనియె. 491**

**ప్రతి :** అని= అంటూ, మఱియున్= మరలా, మహి= భూదేవి, ఇట్లు+అనియెన్= ఇలా అన్నది.

**తా :** అని చెప్తూ భూదేవి మరలా ఈ విధంగా అన్నది.

**చ. జలరుహగర్భుచేత మును చాల సృజింపఁగఁబడ్డ యోషధుల్**
**కలుషమతిన్ ధృతవ్రతులు గాని యసజ్జనభుజ్యమానమై**
**వెలయుటఁజూచి యే నృపతివీరులు మాన్పమిఁజోరబాధలం**
**బలుమఱుఁబొంది యే నపరిపాలితనై కృశియించి వెండియున్. 492**

**ప్రతి :** జలరుహగర్భుచేత= నీటినుండి పుట్టిన పద్మాన్ని జన్మస్థానముగాగల బ్రహ్మచేత; మును= ఇంతకుముందు; చాలసృజింపఁగన్+పడ్డ= అధికంగా సృష్టించబడ్డ; ఓషధుల్= ధాన్యాలమొక్కలు; కలుషమతిన్= పాపబుద్ధితో; ధృతవ్రతులు+కాని= పుణ్యవ్రతాలు చేసినవారు కాని – పుణ్యాత్ములు కానట్టి; అసత్+ జన= దుర్మార్గులచే; భుజ్యమానము+ఐ= అనుభవింపబడుచు; వెలయుటన్+చూచి= ప్రకాశించడంచూచి; ఏ, నృపతివీరులు= ఏ రాజవీరులు; మాన్పమిన్= నివారించకపోవడంవలన; ఏను= నేను; అపరిపాలితను+ఐ= రక్షింపబడనిదాననై; చోరబాధలన్= దొంగలవలన బాధలు; పలుమఱున్+పొంది= అనేకసార్లుపొంది; కృశియించి= క్షీణించి; వెండియున్= మరియు.

**తా :** పూర్వం బ్రహ్మదేవుడు అధికంగా సృజించిన పైర్లను, పాపాత్ములైన దుర్జనులు దుర్బుద్ధితో దోచుకొని అనుభవిస్తుంటే వీరులైన రాజులు వాళ్ళను అడ్డుకోకుండా చూస్తూ ఊరుకుంటే నేను రక్షణలేనిదాననై దొంగలవల్ల పెక్కుమార్లు బాధలకు గురి అయి కృశించిపోయాను. అంతేకాక

**క. అనుపమమఖకర్మక్రియ, లనయము లేకుంట నే ననాదృత నగుచున్**
**జననాయక! యీ లోకము, ఘనచోరీభూత మగుటఁ గనుఁగొని యంతన్. 493**

**ప్రతి :** జననాయక= ఓ రాజా!; అనుపమ= మేలైన; మఖకర్మక్రియలు= యజ్ఞంకోసం చేసేపనులు; అనయము లేకుంట= ఎల్లప్పుడు లేకుండుటచే; నేను, అనాదృతన్+అగుచున్= ఆదరింపబడనిదాననై; ఈ లోకము= ఈ ప్రపంచం; ఘనచోరీభూతము+అగుట= పెద్దదొంగలచే నిండినదగుట; కనుఁగొని= చూచి; అంతన్= ఆ తర్వాత.

**తా :** ఓ రాజా! శ్రేష్ఠాలైన యజ్ఞక్రియలు నిరంతరం లేనందువల్ల నేను నిరాదరణకు గురి అయి, ఈ లోకం పెద్ద పెద్ద దొంగలతో నిండి ఉండటం చూచి

**క. సవనాదిసిద్ధికొఱకై, తవిలి తదీయౌషధీవితతులను ధరణీ**
**ధవ! యే నపుడు గ్రసించితి, నవియును నాయందు జీర్ణమయ్యెఁగడంకన్. 494**

**ప్రతి :** ధరణీధవ= భూమికి భర్త అయిన ఓ రాజా! ఏను= నేను; సవన+ఆదిసిద్ధి కొఱకు+ఐ= యజ్ఞం మొదలయినవి సిద్ధించడానికై; తవిలి= పూనుకొని; తదీయ+ఔషధీవితతులను= ఆ ధాన్యసమూహాలను; అపుడు, గ్రసించితిన్= మింగాను; కడంకన్= ప్రయత్నంతో; అవియును= అవికూడా; నాయందు= నాలో; జీర్ణమయ్యెన్= కలిసిపోయాయి.

**తా :** ఓ రాజా! యజ్ఞాది సత్కార్యాలకు ఉపయోగపడే ఆ ఓషధులను దొంగలు ఎత్తుక పోకుండా నేను వాటిని మింగాను. ప్రయత్నంతో అవికూడా నాలో జీర్ణమైపోయాయి.

**క. వినుు వాని నొక యుపాయం, బునఁ గ్రమ్మఱఁబడయవచ్చు భూవరచంద్రా!**
**విను మది యెఱిఁగించెద నీ, కును వత్సలురాల నగుట గురుతరచరితా! 495**

**ప్రతి :** భూవరచంద్రా= రాజశ్రేష్ఠా!; విను= దయతో వినండి; వానిని= ఆ పంటలను; ఒక ఉపాయంబునన్= ఒక యుక్తితో; క్రమ్మఱన్= తిరిగి; పడయవచ్చు= పొందవచ్చును; నీకును= నీకు; గురుతరచరితా= గొప్పచరిత్రగలవాడా!; వత్సలురాలన్+అగుటన్= వాత్సల్యం పొందిన దానిని గాబట్టి; అది+ఎఱిఁగించెదన్= దానిని చెబుతాను; వినుము

**తా :** ఓ రాజచంద్రా! గొప్ప ప్రవర్తనగల పృథుచక్రవర్తీ! వినుము. మరల ఆ ఓషధులను ఒక ఉపాయంతో పొందవచ్చు. నీ వాత్సల్యం పొందినదానిని గాబట్టి నీకాపద్ధతి చెబుతాను.

**క. అనయము నా కొక వత్సము, ననురూపసుదోహనమ్ము ననురూపక దో**
**గ్ధను గల్పింపుమ యట్లయి, నను నీ భూతముల కవనినాయక! దానన్. 496**

**ప్రతి :** అవనినాయక= భూనాయకా! అనయము= ఎల్లప్పుడు; నాకు+ఒకవత్సమున్= నాకొక దూడను; అనురూప= తగిన; సుదోహనమ్మున్= మంచి పాలచెంబును; అనురూపక= తగినట్టి; దోగ్ధను= పాలుపితికేవానిని; కల్పింపుము+అ= సృష్టించవయ్యా; అట్లు+అయినను= అలా అయితే; ఈ భూతములకు= ఈ జీవులకు; దానన్= దానివలన...

**తా :** రాజా! నీవు తప్పక నాకొక దూడను, చక్కని పాలపాత్రను, పాలుపిదికే వానిని కల్పించుము. అలా అయితే ఈ జీవులకు

**క. పరఁగ నభీప్సితములు బల, కరములు నగు, నన్నదుగ్ధకలితము లగు భా**
**సురకామంబులఁ బిదికెద, నరనాయక చంద్ర! వినుము నా వచనంబుల్. 497**

**ప్రతి :** నరనాయక చంద్ర= రాజులలో శ్రేష్ఠుడా!; పరఁగన్= ఒప్పుగా; అభీప్సితములు= కోర్కెలు; బలకరములున్+అగు= పుష్టినిచ్చేవి; అన్నదుగ్ధకలితములు+అగు= అన్నంతో; పాలతోకూడినవయిన; భాసురకామంబులన్= ప్రసిద్ధాలైన కోరికలను; పిదికెద= పిండుతాను; నా వచనంబుల్= నా మాటలు; విను.

**తా :** రాజచంద్రా! నా మాటలు వినండి. (నీవు నాకు తగిన దూడను, పాలుపిదికేవాడిని సమకూరిస్తే) ఈ ప్రాణులకు ఇష్టమై బలవర్ధకాలై, పాలు, అన్నం రూపంలో ఉండే కోర్కెలను ప్రసాదిస్తాను.

**చ. మనుజవరేణ్య! యేను విషమస్థలినై యిపు డున్నదాన, నొ**
**య్యన జలదాగమోదితపయఃప్రకరంబు తదాగమంబు వో**

**యినను దదంబువుల్ పుడమి నింకక యంతట నిల్చునట్లుగా**
**మనునిభ! నన్ను నిప్పుడు సమస్థలినై పెనుపొందఁజేయవే.** **498**

**ప్రతి :** మనుజవరేణ్యా= ఓ రాజశ్రేష్ఠా!; ఏను= నేను; ఇపుడు= ఇప్పుడు; విషమస్థలిని+ఐ= ఎగుడు దిగుడు ప్రదేశాలు గలదాననై; ఉన్నదానన్= ఉన్నాను; ఒయ్యనన్= ఒప్పుగా; జలదాగమ+ఉదిత= మేఘాల రాకవల్ల పుట్టిన; పయస్+ప్రకరంబు= నీటి ప్రవాహం (క్షీరధారలు); తద్+ఆగమంబు= ఆ నీటిరాక; పోయినను= ఆగిపోయినను; తద్+అంబువులు= ఆ జలాలు; పుడమిన్= భూమిపై; ఇంకకన్= ఇంకిపోకుండా; అంతట నిల్చునట్లుగా= అంతటా నిలిచిఉండేటట్లుగ; మనునిభ= మనువుతో సమానుడా!; నన్నున్, ఇప్పుడు, సమస్థలిని+ఐ= సమతల ప్రదేశం కలదానినిగా; పెనుపొందన్+చేయవే= వర్ధిల్లునట్లు చేయుము.

**తా :** ఓ రాజా! ఇప్పుడు నాది ఎగుడుదిగుడుగా మిట్టపల్లాలుగల ప్రదేశాలు కలిగిన స్థితి. నన్ను నీవు చదునుచేసి సమతల ప్రదేశం కలదానినిగా చేస్తే మేఘాలు వర్షించే సమయంలో మాత్రమే జలం లభించడంగాక, వర్షాకాలం తర్వాత కూడ ఆ జలాలు ఇంకిపోక నిలబడి ఉండేస్థితి ఏర్పడుతుంది.

**క.** **అని యి వ్విధమున నా భూ, వనితామణి వలుకు మధురవచనంబులు దా**
**విని యనురాగము దన మన, మునఁగడలుకొనంగ రాజముఖ్యుండంతన్.** **499**

**ప్రతి :** అని, ఈ+విధమునన్= ఈ విధంగా; ఆ భూవనితామణి= ఆ భూదేవి; పలుకు= మాట్లాడే, మధురవచనంబులు= తియ్యని మాటలు; తా విని= తాను విని; అనురాగము= ప్రేమ; తన మనమునన్= తన మనస్సులో; కడలుకొనంగన్= నిండగా; అంతన్= అంతట; రాజముఖ్యుందు= రాజులలో ముఖ్యుడైన పృథుచక్రవర్తి.

**తా :** భూదేవి ఈ విధంగా పలికిన మధుర వాక్యాలను విని తన మనస్సులో అనురాగం పొందిన పృథుచక్రవర్తి అప్పుడు

**చ.** **మనువును దూడఁజేసి గరిమన్ నిజపాణితలంబు లీల దో**
**హనముగఁజేసి యందు సకలౌషధులంబిదికెంౖగమంబునం**
**దనరఁగఁదద్విధంబునను దత్పృథువత్సల యైన భూమియం**
**దనయము వారువారును బ్రియంబగు కోర్కులు వొంది రున్నతిన్.** **500**

**ప్రతి :** మనువును= స్వాయంభువమనువైన మనుమహారాజును; దూడన్+చేసి= దూడగా చేసికొని; గరిమన్= గొప్పగా; నిజపాణితలంబు= తన చేతిపైభాగము; లీలన్= విలాసంగా; దోహనముగన్+చేసి= చెంబుగా చేసి; అందు, సకల+ఓషధులన్= సమస్త ధాన్యాలను; క్రమంబునన్= వరుసగా; పిదికెన్= పిండెను; తనరఁగన్= అతిశయిల్లగా; తద్+విధంబునను= ఆ విధంగా; తద్+పృథువత్సల+ఐన= ఆ పృథుచక్రవర్తి వాత్సల్యాన్ని పొందినదైన; భూమియందు= భూమిపై; అనయము= ఎల్లప్పుడు; వారువారును= అందరు; ఉన్నతిన్= గొప్పగా; ప్రియంబగు కోర్కులు= ప్రియమైన కోరికలు; పొందిరి= పొందారు.

**తా :** అప్పుడు పృథుచక్రవర్తి మనువును గోవత్సంగాను, తనచేతిని పాత్రగాను చేసి, తాను పిండే వాడుగా భూమినుండి సకలమైన ఓషధులను పిదికాడు. ఈ విధంగా పృథుచక్రవర్తి వాత్సల్యం కలిగి గోరూప ధారిణియైన భూమినుండి అందరు తమ ఇష్టమైన కోర్కెలను పొందారు.

సీ. బలసి ఋషుల్ బృహస్పతి వత్సకంబుగా నర్థించి తమయింద్రియంబులందు
నంచిత ఛ్ఛందోమయ క్షీరమున దేవతలు సురరాజు వత్సంబు గాఁగఁ
గనక పాత్రమునందుఁ దనరు నోజోబల వీర్యామృతంబునై వెలయు పయసు
దైత్య దానవులు దైత్య శ్రేష్ఠుఁడగు గుణశాలిఁ బ్రహ్లాదు వత్సంబుఁ జేసి

తే. ఘన సురాసవరూప దుగ్ధంబు వరుస, నప్సరోజన గంధర్వు లలరి యపుడు
దనర విశ్వావసును వత్సమునుగఁ జేసి, పద్మమయ నిర్మితంబైన పాత్రమందు. **501**

ప్రతి : బలసి= ఒకచో కూడి; ఋషుల్= ఋషులు, బృహస్పతి; వత్సకంబుగాన్= దూడగా; అర్థించి= కోరి; తమ+ఇంద్రియంబుల+అందున్= తమ పంచేంద్రియాలలో; అంచిత= సొగసైన; ఛందస్+మయ క్షీరమునన్= ఛందస్సులతో నిర్మించిన పాలను, దేవతలు; సురరాజు= ఇంద్రుడు; వత్సంబు+కాఁగన్= దూడకాగా; కనకపాత్రమునందున్= బంగారు గిన్నెలో; తనరున్= ప్రకాశించు; ఓజస్+బలవీర్య+అమృతంబును+ఐ= ఓజస్సు, బలము, వీర్యము అనే రూపాలుగల అమృతాన్ని; వెలయు= ప్రకాశించు; పయసు= పాలు; దైత్యదానవులు= దితికుమారులైన రాక్షసులు; దైత్యశ్రేష్ఠుఁడగు= దైత్యులలో గొప్పవాడైన; గుణశాలిన్= సద్గుణ సంపన్నుని; ప్రహ్లాదు= ప్రహ్లాదుని; వత్సంబున్+చేసి= దూడనుచేసి; ఘనసుర+ఆసవరూప దుగ్ధంబు= గొప్ప కల్లు అనే యజ్ఞరూప క్షీరాన్ని; వరుసన్= వరుసగా; అప్సరస్+జన= అప్సరసలు, గంధర్వులు; అలరి+అపుడు= అప్పుడు ప్రకాశించి; తనరన్= ఒప్పుగా; విశ్వావసును= విశ్వావసువనే వ్యక్తిని; వత్సమునుగన్+చేసి= దూడనుచేసి; పద్మమయ నిర్మితంబు+ఐన= తమ్మిపువ్వుతో చేయబడిన; పాత్రమందు= పాత్రలో...

**తా :** ఋషులంతా ఒకచోట చేరి బృహస్పతిని దూడగా చేసి ఆహ్వానించారు. తమ ఇంద్రియాలనే పాత్రలో ఛందోమయమైన క్షీరాన్ని పిండారు. దేవతలు ఇంద్రుని దూడగా బంగారు పాత్రలో ఓజోబల వీర్యామృతమైన క్షీరాన్ని పిండారు. దైత్యదానవులు దైత్యశ్రేష్ఠుడైన గుణశాలి ప్రహ్లాదుని దూడగా గొప్ప సురాసవమైన క్షీరాన్ని పిండారు. అప్సరసలు, గంధర్వులు, విశ్వావసువును దూడగా చేసి పద్మమయమైన పాత్రలో

**వ. మాధుర్య సౌందర్య సహిత గాంధర్వక్షీరంబును బితృదేవతలు సూర్యవత్సకంబుగా నామ పాత్రంబునందుఁ గవ్యంబును దుగ్ధంబును, సిద్ధులు గపిలవత్సకంబుగా నాకాశపాత్రమందు సంకల్పనా రూపాణిమాది సిద్ధియను క్షీరంబును, విద్యాధరాదులు తద్వత్సకంబును తత్పాత్రకంబునుగా ఖేచరత్వాదివిద్యా వ్యాపారరూప క్షీరంబును, గింపురుషాదులు మయవత్సకంబును నాత్మ పాత్రంబునుంగా సంకల్పమాత్ర ప్రభవంబును నంతర్ధానాద్భుతాత్మ సంబంధియు నగు మాయయను క్షీరంబును, యక్షరక్షోభూత పిశాచంబులు భూతేశ వత్సకంబుగాఁ గపాల పాత్రకంబునుగా రుధిరాసవంబను క్షీరంబును, నహిదందశూక సర్పనాగంబులు దక్షకవత్సంబును బిలపాత్రంబునుంగా విషరూపక్షీరంబును, బశువులు గోవృషవత్సకంబు నరణ్య పాత్రంబునుంగాఁ దృణంబును క్షీరంబును, గ్రవ్యాద మృగంబులు మృగేంద్ర వత్సకంబును నాత్మకళేబర పాత్రంబునుంగాఁ గ్రవ్యంబను దుగ్ధంబును, విహంగంబులు సుపర్ణవత్సకంబు నిజకాయ పాత్రంబునుంగాఁ గీటకఫలాదికంబను దుగ్ధంబును, వనస్పతులు వటవత్సకంబుగా భిన్నరోహరూప పయస్సును, గిరులు హిమవద్వత్సకంబును నిజసాను పాత్రకంబునుంగా**

**నానాధాతువులను దుగ్ధంబునుంగా నవ్విధంబున సమస్తచరాచర వర్గంబు స్వముఖ్యవత్సకంబును స్వస్వపాత్రకంబునుంగా భిన్నరూపంబులైన క్షీరంబులం బిదికె నని చెప్పి మఱియును. 502**

**ప్రతి :** పితృదేవతలు, సూర్యవత్సకంబుగాన్= సూర్యుని దూడగా చేసి; మాధుర్య సౌందర్యసహిత= తీయదనం, అందం కలిసిన; గాంధర్వక్షీరంబును= సంగీతమనుపాలను; ఆమపాత్రంబునందున్= ఆమం (వండని ద్రవ్యం ఉంచే) పాత్రలో; కవ్యంబు+అను దుగ్ధంబును= కవ్యమను పాలను– సిద్ధులున్; కపిలవత్సకంబు+కాన్= కపిలవర్ణమైన దూడ కలిగి; ఆకాశ పాత్రమందు= ఆకాశమనే పాత్రలో; సంకల్పనారూప= సంకల్పమనే రూపంచెందిన; అణిమ+ఆదిసిద్ధియను= అణిమ మొదలైన సిద్ధిఅనే; క్షీరంబును= పాలను; విద్యాధరాదులు= విద్యాధరులు మొదలైనవారు; తద్+వత్సకంబును= అదే దూడగాగలది; తద్+పాత్రకంబును+ కాన్= అదే పాత్రగాగలదిగా (ఆకాశమే); ఖేచరత్వ+ఆది= ఆకాశంలో సంచరించేవారు మొదలైనవారు; వ్యాపారరూక్షీరంబును= క్రియారూపమైన పాలను; కింపురుషాదులు= కింపురుషులు మొదలైనవారు; మయవత్సకంబును= మయుడు దూడగా; ఆత్మపాత్రంబునున్+కాన్= తానే పాత్రముగాగలది, (దేహస్వరూపమైన పాత్ర); సంకల్పమాత్ర ప్రభవంబును= తలచినదే తడవుగా జన్మించి; అంతర్ధాన= మాయమగు; అద్భుత+ఆత్మసంబంధియును+అగు= ఆశ్చర్యకరమైన ఆత్మకు చెందిన; మాయ+అనుక్షీరంబును= మాయ అనే పాలను; యక్షరక్షస్+భూతపిశాచంబులు= యక్షులు, రాక్షసులు, భూతాలు, పిశాచాలు; భూత+ఈశ వత్సకంబు+కాన్= భూతాలకధిపతియైన కుబేరుడు దూడగా; కపాలపాత్రకంబును+కాన్= పుర్రె పాత్రగా చేసుకొని; రుధిర+ఆసవంబు+అనుక్షీరంబునున్= రక్తమనేకల్లు పాలుగా; అహి దందశూక సర్ప నాగంబులు= అహి, దందశూకసర్పఅనే పాములు; తక్షకవత్సంబును= తక్షకుడు దూడగా; బిలపాత్రంబునున్+కాన్= బిలమే పాత్రగాగలదిగా; విషరూపక్షీరంబును= విషమురూపంలో పాలను; పశువులు, గోవృషవత్సకంబు= గిత్తను దూడగా గలది; అరణ్యపాత్రంబునున్+కాన్= అడవిని పాత్రగా; తృణంబు+అను క్షీరంబును= గడ్డిఅనేపాలను; క్రవ్య+ఆదిమృగంబులు= మాంసాదులు భుజించే జంతువులు; మృగ+ఇంద్ర వత్సకంబును= సింహము దూడగా; ఆత్మకళేబరపాత్రంబున్+కాన్= తమ శరీరమే పాత్రగా గలదిగా; కీటకఫలాదికంబు+అను దుగ్ధంబును= పురుగులు; చెట్లఫలాలు మొదలయినవి పాలుగా; వనస్పతులు= ఒక జాతి చెట్లు (రావి, మర్రి అత్తి జాతులు); వటవత్సకంబు+కాన్= మర్రిచెట్టు దూడగా కలదిగా; భిన్నరోహరూపపయస్సును= భూమిపై సందుజేసుకొని మొలిచే మహారూపాలు ధరించినపాలు; గిరులు= కొండలు; హిమవత్+వత్సకంబును= హిమవంతుడే దూడగా గలది; నిజసాను పాత్రకంబునున్+కాన్= తన కొండ చరియలే పాత్రగా; నానాధాతువులను= పలువిధాలైన కొండరాతిపొడలు; దుగ్ధంబునున్+కాన్= పాలుగా; ఆవిధంబున= ఆ విధంగా; సమస్తచర+అచరవర్గంబు= కదిలేవి, కదలని అయిన సకల జీవరాశులగుంపులు; స్వముఖ్యవత్సకంబును= తమ జాతిలో ముఖ్యమైన జీవిని; స్వస్వపాత్రకంబునున్+కాన్= తమతమ పాత్రలు గలవిగా; భిన్నరూపంబులు+ఐన= అనేకరకాలైన; క్షీరంబులన్= పాలను; పిదికెను+అని చెప్పి= పిండెనని చెప్పి; మఱియును.

**తా :** ఋషులు బృహస్పతిని దూడగా చేసుకొని ఇంద్రియాలనే పాత్రలో వేదమయమైన క్షీరాన్ని పిదుకుతున్నారు. అలానే దేవతలు ఇంద్రుడు దూడగా బంగారు పాత్రలో ఓజోబల వీర్యామృతమయమైన క్షీరాన్ని, దైత్యదానవులు గుణవంతుడైన ప్రహ్లాదుడు దూడగా, ఇనుప పాత్రలో సురాసమయవమైన క్షీరాన్ని; అప్సరసలు, గంధర్వులు, విశ్వావసువు దూడగా పద్మమయమైన పాత్రలో మాధుర్య సౌందర్యాలతో గూడిన గాంధర్వమనే క్షీరాన్ని పిదుకుకొన్నారు. పితృదేవతలు సూర్యుడు దూడగా ఆమపాత్రలో కవ్యమనే క్షీరాన్ని సిద్ధులు కపిలుడు దూడగా ఆకాశపాత్రలో సంకల్పనారూపమైన 'అణిమాదిసిద్ధి'

అనే క్షీరాన్ని, విద్యాధరులు మొదలైనవారు కపిలుడు దూడగా, ఆకాశపాత్రంలో ఖేచరత్వాది విద్యామయమైన క్షీరాన్ని; కింపురుషాదులు మయుడు దూడగా ఆత్మపాత్రంలో సంకల్పమాత్రంచేత పుట్టడం, అంతర్ధాన రూపం, అద్భుతాత్మకం అయిన 'మాయ' అనే క్షీరాన్ని, యక్షరక్షోభూత పిశాచాలు రుద్రుడు దూడగా, కపాలపాత్రలో రుధిర స్వరూపమైన క్షీరాన్ని, అహి దందశూక సర్పనాగాలు తక్షకుడు దూడగా, బిలపాత్రలో విషరూపమైన క్షీరాన్ని, పశువులు ఆబోతు దూడగా అరణ్యపాత్రలో తృణమనే క్షీరాన్ని; క్రూరమృగాలు సింహం దూడగా స్వకళేబరపాత్రలో మాంసం అనే క్షీరాన్ని, పక్షులు గరుత్మంతుడు దూడగా స్వదేహపాత్రలో కీటకాలు, ఫలాదులు అనే క్షీరాన్ని పిదుకుకొన్నారు. వనస్పతులు మర్రిచెట్టు దూడగా, భూమిని ఛేదించుకొని వచ్చే వృక్షమూలమైన పాలను, పర్వతాలు, హిమవంతుడు దూడగా తన చరియలు పాత్రగా వివిధ ధాతువులనే క్షీరాన్ని ఈ విధంగా సమస్త చరాచర ప్రపంచం తమలో శ్రేష్ఠులు దూడలుగా, తమకు తగిన పాత్రలలో తమకు తగిన క్షీరాలను భూమినుండి పిండుకున్నారు. మరియు

**క. క్రమమున నిటు పృథ్వాదులు, దమతమ కామితము లనఁగఁదగు భిన్న క్షీ**
**రము దోహనవత్సక భే, దమునం దగఁబిదికి, రంత ధరణీధవుఁడున్. 503**

**ప్రతి :** పృథు+ఆదులు= పృథుచక్రవర్తి మొదలైనవారు; ఇటు= ఈ విధంగా; క్రమమునన్= వరుసగా; తమతమ కామితములనఁగన్+తగు= వారి వారికోర్కెలనదగిన; భిన్నక్షీరము= రకరకాల పాలు; దోహన= చెంబులు; వత్సక భేదమునన్= వేరువేరుదూడలతో; తగన్+పిదికిరి= బాగా పిదికిరి; ధరణీధవుఁడున్= రాజు; అంత

**తా :** ఈ ప్రకారం క్రమక్రమంగా పృథువు మొదలైనవారు వేరువేరు వత్సాలను, పాత్రలను కల్పించుకొని తమతమ కోర్కెలనే వేరువేరు క్షీరాలను పితుకుకున్నారు. అప్పుడు రాజు

**తే. సముచితానందమును బొంది సర్వకామ, దుఘ యనందగు భూమిని దుహిత గాఁగఁ**
**గోరి కైకొని నిజధనుఃకోటిచేత, భూరిగిరికూటములఁ జూర్ణములుగఁజేసి. 504**

**ప్రతి :** సముచిత+ఆనందమును= తగిన ఆనందాన్ని; పొంది, సర్వకామదుఘ= అన్నికోర్కెలను పిదికేటటువంటిది; అనన్+తగు భూమిని= అనుటకు తగిన భూమాతను; దుహిత+కాఁగన్= కూతురుగా; కోరికైకొని= కోరి తీసుకొని; నిజధనుస్+కోటిచేతన్= తన ధనుస్సు కొప్పుతో; భూరిగిరి కూటములన్= పెద్దపెద్ద పర్వత సముదాయాలను; చూర్ణములుగన్+చేసి= పిండిపిండిచేసి...

**తా :** ఎంతో సంతోషించి అన్ని కోర్కెలను పిదుకగలదగు భూమాతను పుత్రికగా కోరి స్వీకరించాడు. తన వింటి కొప్పుతో పెద్దపెద్ద పర్వత శిఖరాలను పొడిపొడి చేశాడు. (ఋగ్వేదంలో "భూమాత"యే "కామదుఘా" అని ప్రశంసింపబడింది).

**తే. చండదోర్దండలీల భూమండలంబు, సమతలంబుగఁ జేసి శశ్వత్ప్రసిద్ధి**
**నొంది య వ్విభుఁడీ లోకమందు నెల్ల, బ్రజకుఁదండ్రియు జీవనప్రదుఁడు నగుచు. 505**

**ప్రతి :** చండదోస్+దండలీల= భయంకరమైన భుజ దండముల విలాసాలతో; భూమండలంబు= భూమినంతటిని; సమతలంబుగన్+చేసి= చదునుచేసి; శశ్వత్+ప్రసిద్ధిన్= శాశ్వతకీర్తిని; ఒంది= పొంది; ఆ+విభుఁడు= ఆ ప్రభువు; ఈ లోకము+అందున్= ఈ ప్రపంచంలోని; ఎల్లన్= సమస్త, ప్రజకున్= ప్రజలకు; తండ్రియు, జీవనప్రదుఁడును+అగుచున్= బ్రతుకు తెరువు ప్రసాదించినవాడై...

**తా :** భయంకరమైన తన బాహుబల విలాసంతో భూమండలాన్ని చదునుచేసి ఆ పృథుచక్రవర్తి శాశ్వత కీర్తిని పొందాడు. తన ప్రజలకు తాను తండ్రివలె, జీవన ప్రదాతవలె అవుతూ

**తే. అక్కడక్కడఁ బూర్వంబునందు లేని, గ్రామపట్టణదుర్గఖర్వటపుళింద**
**ఖేటశబరాలయవ్రజవాటఘోష, వివిధనిలయము లర్థిఁగావించె నంత. 506**

**ప్రతి :** అక్కడ+అక్కడన్= అక్కడక్కడా; పూర్వంబునందులేని= అంతకుముందు లేనటువంటి; గ్రామపట్టణ= గ్రామాలు, పట్టణాలు; దుర్గ= కోటలు; ఖర్వట= కొండ పక్కన పల్లెలు; పుళింద+ఖేట+శబర+ఆలయ= బోయలు చెంచుల పల్లెలు, వ్రజవాటఘోష= పసుల కాపరుల వాటికలు, గోశాలలు; వివిధనిలయములు= అనేక నివాసాలు; అర్థిన్+కావించెన్= కోర్కెతో కల్పించాడు. అంతన్= అప్పుడు.

**తా :** క్రమంగా అక్కడక్కడ పూర్వం లేని జనపదాలు, పట్టణాలు, దుర్గాలు, కొండ పల్లెలు, చెంచుపల్లెలు, బోయపల్లెలు, గొల్లపల్లెలు కల్పించాడు. అనేకరకాలైన నివాసస్థానాలు కల్పించాడు.

**క. వారును భయవిరహితులై, బోరనఁ దత్తన్నివాసముల యందు సుఖ**
**శ్రీరుచి నొప్పుచు నుండిరి, వారక యా పృథుని ఁబొగడ వశమె ధరిత్రిన్? 507**

**ప్రతి :** వారును= ఆ ప్రజలు కూడ; భయవిరహితులు+ఐ= భయములేనివారై, బోరనన్= వెంటనే, తద్+నివాసముల+ అందున్= ఆ ఇండ్లల్లో; వారక= ఎల్లప్పుడు; సుఖశ్రీరుచిన్+ఒప్పుచున్= సుఖసంపదలతో ప్రకాశిస్తూ; ఉండిరి, ఆ పృథునిన్= ఆ పృథుచక్రవర్తిని, ధరిత్రిన్= భూమిపై, పొగడవశము+ఎ= ప్రశంసించ తరమా!

**తా :** అందలి ప్రజలు భయము లేకుండా ఆయా నివాసాలలో ఎల్లప్పుడు సుఖసంపదలతో తులతూగుతూ బ్రతుకుతున్నారు. అలాంటి పృథుచక్రవర్తిని కీర్తించటం లోకంలో ఎవరికీ శక్యం కాదు.

**సీ. అని చెప్పి మునినాథుఁడైన మైత్రేయుఁ డవ్విదురున కిట్లను వేడ్కతోడ**
**ననఘాత్మ! రాజర్షి యైన వైన్యుండశ్వమేధశతంబు సన్మేధతోడఁ**
**గావింతు నని దీక్ష గైకొని వ్రతనిష్ఠఁ దివిరి బ్రహ్మావర్తదేశమందు**
**నలరు మనుక్షేత్ర మందు సరస్వతీ నది పొంతఁదా మహోన్నతి నొనర్చు**

**తే. సవనకర్మక్రియకు నతిశయవిశేషఫలము గలిగెడి నని బుద్ధిఁదలఁచి యచట,**
**వరుసఁగావించు నతిశయాధ్వర మహోత్స, వము సహింపక యుండె న య్యమరవిభుఁడు. 508**

**ప్రతి :** అని చెప్పి; మునినాథుడు+ఐన= ముని నాయకుడైన; మైత్రేయుఁడు= మైత్రేయ మహర్షి; ఆ+విదురునకున్= ఆ విదురునితో; వేడ్కతోడన్= సంతోషముతో; ఇట్లు+అనున్= ఇలా చెప్పాడు; అనఘ+ఆత్మ= పుణ్యాత్మా! రాజ+ఋషి+అయిన= రాజులలో తపస్వివంటివాడైన; వైన్యుండు= వేనుని కుమారుడైన పృథువు; అశ్వమేధ శతంబు= నూరు అశ్వమేధ యాగాలను; సత్+మేధతోడన్= సద్బుద్ధితో; కావింతును+అని= చేస్తానని; దీక్షన్+కైకొని= ప్రతిజ్ఞ బూని; వ్రతనిష్ఠన్+తివిరి= నియమపూర్వకమైన వ్రతాన్ని పూని; బ్రహ్మావర్తదేశము+అందున్= బ్రహ్మావర్త దేశంలో; అలరు, మను క్షేత్రము+అందు= ప్రకాశించే మనుభూమిలో; సరస్వతీనది పొంతన్= సరస్వతీనది దగ్గర; తాన్= తాను; మహా+ఉన్నతిన్+ఒనర్చు=

గొప్పగాచేయు; సవనకర్మక్రియకున్= యజ్ఞమనే కర్మకాండకు; అతిశయ విశేషఫలము కలిగెడిన్+అని= అధికమైన గొప్పఫలితం కలుగుతుందని; తలఁచి= భావించి; అచట= అక్కడ; వరుసన్+కావించు= వరుసగా చేయు; అతిశయ+ అధ్వరమహా+ఉత్సవము= అధికమైన యాగమహోత్సవము; సహింపక= ఓర్వలేక; ఆ+అమరవిభుఁడు= ఆ దేవతల ప్రభువు ఇంద్రుడు; ఉండెన్= ఉండినాడు.

**తా :** మైత్రేయుడిలా వివరించి, ఇంకా విదురునితో ఇలా అన్నాడు. పుణ్యాత్మా! రాజర్షియైన పృథుచక్రవర్తి సత్సంకల్పంతో నూరు అశ్వమేధయాగాలను చేస్తానని దీక్షబూనాడు. బ్రహ్మావర్తదేశంలోని మనుక్షేత్రంలో సరస్వతీనదీతీరంలో అతడు గొప్పగా చేయబోయే యజ్ఞఫలితం మహత్తరంగా ఉంటుందని భావించి ఇంద్రుడు సహింపలేక పోయాడు.

సరస్వతి, దృషద్వతి అనే రెండు నదుల నడిమి ప్రదేశాన్నే "బ్రహ్మావర్త"మంటారని మనుస్మృతి. (2-17)

## a =పృథుచక్రవర్తి యశ్వమేధంబు సేయునెడ నింద్రుం డశ్వము నపహరించుట a

**సీ.** **అట్టి యధ్వరకర్మమందు సాక్షాద్భగవంతుఁడు హరి రమేశ్వరుఁడు లోక**
**గురుఁడును సర్వాత్మకుండును విభుఁడును నీరజభవభవాన్వితుఁడు లోక**
**పాలకనిఖిలసుపర్వానుగుండును యజ్ఞాంగుఁడఖిలాధ్వరాదివిభుఁడు**
**గంధర్వమునిసిద్ధగణసాధ్యవిద్యాధరాప్సరో దైత్య గుహ్యాళి దాన**

**తే.** **వాది జేగీయమానుఁ డత్యలఘుయశుఁడు, ప్రకటనందసునందాదిపార్షదుండు**
**కపిలనారదసనకాదికప్రముఖ్య, మహితయోగీంద్రసంస్తూయమానుఁడజుఁడు.** **509**

**ప్రతి :** అట్టి+అధ్వరకర్మము+అందున్= ఆ యజ్ఞకర్మం చేసేటప్పుడు; సాక్షాత్+భగవంతుఁడు= ఆ భగవంతుడే; హరి= విష్ణుమూర్తి; రమా+ఈశ్వరుఁడు= లక్ష్మీదేవిభర్త; లోకగురుఁడును= లోకానికి అధినాయకుడును; సర్వ+ఆత్మకుండును= అన్నింటా వ్యాపించినవాడును; విభుఁడును= ప్రభువును; నీరజభవభవాన్వితుఁడు= బ్రహ్మతో, శివునితో కూడినవాడు; లోకపాలక నిఖిలసుపర్వ+అనుగుండు= లోకాలను పాలించేవారైన, సమస్త దేవతలను అనుసరించువారుగాకలవాడు; యజ్ఞ+అంగుఁడు= యజ్ఞమే దేహంగా కలవాడు; అఖిల+అధ్వర+ఆదివిభుఁడు= సమస్తయజ్ఞాలకు మొట్టమొదటి ప్రభువు; గంధర్వ= గంధర్వులు; ముని= మునులు; సిద్ధగణ= సిద్ధుల సముదాయం; సాధ్య= సాధ్యులు; విద్యాధర= విద్యాధరులు; అప్సరస్= అప్సరసలు; దైత్య= రాక్షసులు; గుహ్య+ఆళి= యక్షులసముదాయం; దానవ+ఆది= రాక్షసులు మొదలైనవారిచే; జేగీయమానుఁడు= కీర్తింపబడేవాడు; అతి+అలఘుయశుఁడు= చాల గొప్పకీర్తిగలవాడు; ప్రకట= ప్రస్ఫుటమైన; నందసునంద+ఆది= నందుడు, సునందుడు మొదలైనవారు; పార్షదుండు= సహచరులుగాగలవాడు; కపిల, నారద, సనకాదిక= కపిలుడు, నారదుడు, సనకుడు మొదలైన; ప్రముఖ్య= మిక్కిలి ముఖ్యులు; మహిత= గొప్పవారు అయిన; యోగి+ఇంద్ర= యోగి శ్రేష్ఠులచే; సంస్తూయమానుఁడు= చక్కగా స్తుతింపబడేవాడు; అజుఁడు= పుట్టుకలేనివాడు.

**తా :** పృథుచక్రవర్తి చేస్తున్న అట్టి యజ్ఞానికి సాక్షాత్తూ భగవంతుడు, హరి, లక్ష్మీవల్లభుడు, విశ్వగురుడు, విశ్వాత్మకుడు, విశ్వవిభుడు, బ్రహ్మశివులతో కూడినవాడు, లోకాలను పాలించే సమస్తదేవతలచే అనుసరింపబడేవాడు, యజ్ఞస్వరూపుడు, అన్ని యజ్ఞాలకు మొదటి ప్రభువు పుట్టువులేనివాడు అయిన విష్ణుదేవుడు – గంధర్వులు, మునులు, సిద్ధులు, సాధ్యులు,

విద్యాధరులు, అప్సరసలు, దైత్యులు, యక్షులు, దానవులు మొదలైనవారు కీర్తిస్తుండగా, గొప్పకీర్తిగలవాడై నందసునందాదులు సహచరులుగా కపిలనారద సనకాది ప్రముఖయోగీంద్రులచే స్తుతింపబడుతూ ప్రత్యక్షమైనాడు.

**వ. మఱియుం బరమ భాగవత సేవితుండును నారాయణాంశ ప్రభవుండును నైన పృథు చక్రవర్తికి భూమి హవిరాదిదోగ్ధ్రియయ్యును సర్వకామదుఘయై సమస్త పదార్థంబులం బిదుకుచుండె, మఱియుఁ దరువులు ఘనతరాకారంబులు గలిగి మకరందస్రావు లగుచు నిక్షుద్రాక్షాది రసంబులును దధిక్షీరాజ్య తక్ర పానకాదికంబులును వర్షింప నవి యెల్ల నదులు వహించె, సముద్రంబులు హీరాది రత్న విశేషంబుల నీనుచుండెఁ, బర్వతంబులు భక్ష్యభోజ్యలేహ్య చోష్యంబు లను చతుర్విధాన్నంబులం గురియుచుండె, లోకపాల సమేతులైన సకలజనంబులు నుపాయనంబులు దెచ్చి యిచ్చుచుండి, రట్టి పరిపూర్ణ విభవాభిరాముండై యధోక్షజ సేవాపరాయణుండగు పృథు చక్రవర్తి యేకోన శతాశ్వమేధంబులు సన్మేధంబునం గావించి నూఱవయాగంబు నందు యజ్ఞపతి యైన పుండరీకాక్షుని యజించుచుండం దదీయ పరమోత్సవంబు సహింపంజాలక. 510**

**ప్రతి :** మఱియున్= ఇంకా; పరమభాగవత సేవితుండును= మిక్కిలి భగవద్భక్తిగలవారిచే కొలువబడినవాడును; నారాయణ+అంశ ప్రభవుండును= విష్ణుని అంశతో పుట్టినవాడును; ఐన, పృథుచక్రవర్తికి, భూమి= భూమాత; హవిస్+ఆది= హవిస్సు మొదలైనవి; దోగ్ధ్రి= పిండనిచ్చునది; అయ్యును, సర్వకామదుఘ+ఐ= అన్ని కోర్కెలు పిదుక నిచ్చేదియై; సమస్త పదార్థంబులన్= అన్ని వస్తువులను; పిదుకుచు+ఉండెన్= పితుకుచూ ఉండెను; మఱియున్, తరువులు= చెట్లు; ఘనతర+ఆకారంబులు+కలిగి= పెద్దరూపాలను కలిగి; మకరంద స్రావులు+అగుచున్= తేనెలు స్రవించేవి అయి; ఇక్షుద్రాక్షా+ఆదిరసంబులును= చెరకు, ద్రాక్ష మొదలైన రాసాలును; దధి= పెరుగు; క్షీర= పాలు, ఆజ్య= నేయి, తక్ర= మజ్జిగ, పానక+ఆదికంబులును= పానకం మొదలైనవి; వర్షింపన్= కురియింపగా; అవి ఎల్ల= వాటినన్నింటిని; నదులు వహించెన్= నదులు భరించాయి; సముద్రంబులు= సముద్రాలు; హీర+ఆది= మణులు మొదలైన; రత్నవిశేషంబులన్= రత్న విశేషాలను; ఈనుచుండెన్= కలిగించుచుండెను; పర్వతంబులు= కొండలు, భక్ష్య, భోజ్య, లేహ్య; చోష్యంబులను చతుస్+విధ+అన్నంబులను= నాలుగు రకాల తినే పదార్థాలను; కురియుచుండెన్= కురిపించుచుండెను; లోకపాల సమేతులు+ఐన= లోకపాలకులతో కూడినవారై; సకలజనంబులు= సమస్త ప్రజలు; ఉపాయనంబులు= కానుకలు, తెచ్చియిచ్చుచుండిరి; అట్టి= ఆ విధంగా; పరిపూర్ణ= సంపూర్ణమైన; విభవ+అభిరాముఁడు+ఐ= వైభవాలతో ఒప్పువాడై; అధోక్షజ= విష్ణుని; సేవాపరాయణుండు+అగు= కొలిచే తత్పరతగలవాడైన, పృథుచక్రవర్తి; ఏక+ఊనశత= ఒకటి తక్కువ నూరు; అశ్వమేధంబులు= అశ్వమేధయాగాలు; సత్+మేధంబునన్= మంచి బుద్ధితో; కావించి= పూర్తిచేసి; నూఱవ యాగంబునందు= నూరవయాగంలో; యజ్ఞపతి+ఐన= యజ్ఞాధిపతియైన; పుండరీకాక్షునిన్= విష్ణుని; యజించుచుండన్= పూజించుచుండగా; తదీయ= ఆ; పరమ+ఉత్సవంబు= గొప్ప సంరంభమును; సహింపన్+చాలక= (చూచి) ఓర్చుకోలేక...

**తా :** ఇంకనూ! పరమభాగవతులచే సేవింపబడేవాడు, నారాయణాంశతో పుట్టినవాడు అయిన పృథుచక్రవర్తికి భూదేవి హవిస్సులు పిండియిస్తూ కూడా కోరినకోర్కెలను, సమస్త పదార్థాలను అందించేది. వృక్షాలు పెద్దగా పెరిగి పూలనుండి తేనెలు వర్షించాయి. చెరకు, ద్రాక్షజాతులు రసాలిచ్చాయి. పెరుగు, పాలు, నేయి, మజ్జిగ, పానకం మొదలైనవాటిని వర్షింపగా అవి నదులయ్యాయి. సముద్రాలు వజ్రాలను, రత్నజాతులను కల్పించాయి. పర్వతాలు నాలుగువిధాలైన

ఆహారాలు (భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యములు) కల్పించాయి. లోకపాలకులతో కలిసి సమస్తజనులు కానుకలు తెచ్చియిచ్చారు. ఇలా పరిపూర్ణవైభవంతో వెలుగొందుతూ అధోక్షజునిసేవయే దీక్షగా ధరించిన పృథుచక్రవర్తి తొంబైతొమ్మిది అశ్వమేధాలు చేశాడు. నూరవయాగంతో యజ్ఞాధిదేవతయైన విష్ణుని అర్చించుచుండగా, దానిని చూచి ఓర్చుకోలేక

**క. అమరేంద్రుఁడు ఘనరోషో, ద్గముఁడై పాషండ వేషకలిత తిరో భా**
**వమునం దన్మఖపశువుం, గ్రమ మేది హరించి చనియె గగనంబునకున్. 511**

**ప్రతి :** అమర+ఇంద్రుఁడు= దేవతల ప్రభువు దేవేంద్రుడు; ఘనరోష+ఉద్గముఁడు+ఐ= అధిక కోపం గలవాడై; పాషండవేషకలిత= వేదబాహ్యుని వేషంతోకూడిన; తిరస్+భావమునన్= అదృశ్యరూపంతో; తద్+మఖపశువున్= ఆ యజ్ఞాశ్వాన్ని; క్రమము+ఏది= సరియైన మార్గాన్ని వదలి – అక్రమంగా; హరించి= దొంగిలించి; గగనంబునకున్= ఆకాశానికి; చనియెన్= వెళ్లెను.

**తా :** దేవేంద్రుడు మిక్కిలి కోపంతో పాషండుని వేషంలో అదృశ్యరూపంతో వచ్చి యజ్ఞాశ్వాన్ని ధర్మంతప్పి హరించి ఆకాశానికి వెళ్లాడు. (చతుర్థస్కంధం – పద్యం 464)

**వ. అట్లు సనునప్పుడు. 512**

**ప్రతి :** అట్లు+చనునపుడు= అలా వెళుతుండగా.

**తా :** అలా వెళుతుండగా

**క. అనఘుండగు నత్రి మహా, మునిచోదితుఁడగుచుఁబృథుని పుత్రుఁడు బాణా**
**సనతూణీరధరుండై, యనిమిషపతి వెనుకఁజనియె నతిదర్పమునన్. 513**

**ప్రతి :** అనఘుండు+అగు= పాపరహితుడైన; అత్రిమహాముని చోదితుఁడు+అగుచున్= అత్రిమహర్షిచే ప్రేరేపితుడై; పృథునిపుత్రుఁడు= పృథుని కుమారుడు; బాణ+ఆసన= వింటిని; తూణీర= అమ్ములను; ధరుండు+ఐ= తాల్చినవాడై; అతిదర్పమునన్= మిక్కిలి పరాక్రమంతో; అనిమిషపతి= దేవేంద్రుని; వెనుకన్+చనియెన్= వెంట వెళ్లాడు.

**తా :** పుణ్యాత్ముడైన అత్రిమహర్షిచే ప్రేరేపితుడై పృథుని కుమారుడు వింటిని, బాణాలను ధరించి మిక్కిలి దర్పంతో దేవేంద్రుని వెంబడించి వెళ్లాడు.

**వ. అట్లు సని చని ముందట. 514**

**ప్రతి :** అట్లు= అలా, చని+చని= వెళ్ళి వెళ్ళి, ముందట= ముందర...

**తా :** అలా వెళ్ళి ముందర

**సీ. యజ్ఞసాధనపశుహరణుని వధియించు ధర్మంబునందు నధర్మమనెడి**
**బుద్ధిఁబుట్టఁగఁజేయ భూరి మాయావేషధారియై యరుగు సుత్రాముఁగదిసి**
**నిలు నిలు మని యార్చి నిజగుణధ్వని సేసి ఘనజటాభస్మాస్థికలిత మయిన**
**మూర్తిఁగనుంగొని మూర్తీభవించిన ధర్మంబ కా బుద్ధిఁదలఁచి యమర**

**తే. నాయకునిమీఁద సాయక మేయఁజాల, కున్నఁగనుఁగొని యత్రి విద్వన్నుతుండు**
**వైన్యజున కనె వాసవువలను సూపి, మనములోపల రోషంబు మల్లడింప. 515**

**ప్రతి :** యజ్ఞసాధన పశుహరణుని= యాగాని కుపయోగించే గుర్రాన్ని దొంగిలించినవానిని; వధియించు ధర్మంబునందున్= చంపెడి రీతిలో; అధర్మము+అనెడి, బుద్ధిన్= మంచిది కాదనే సంకల్పాన్ని; పుట్టఁగన్+చేయన్= కలిగించేలా; భూరి మాయా వేషధారి+ఐ= గొప్పమోసకారి వేషంతో; అరుగు= వెళ్లు; సుత్రామున్+కదిసి= ఇంద్రుని దగ్గరగా వెళ్లి; నిలునిలుము+అని, ఆర్చి= నిలబడు అని గొంతెత్తి పిలిచి; నిజగుణధ్వనిన్+చేసి= తన ధనుష్టంకారంచేసి; ఘనజటా= గొప్పజడలు; భస్మ+అస్థి, కలితము+అయిన= బూడిద, ఎముకలు వీటితో కూడిన; మూర్తిన్+కనుంగొని= రూపాన్నిచూచి; మూర్తీభవించిన= రూపుదాల్చిన; ధర్మంబు+అ, కాన్= ధర్మంగా; బుద్ధిన్+తలఁచి= మనస్సులో ఊహించి; అమరనాయకుని మీఁదన్= ఇంద్రునిపై; సాయకము+ఏయన్+చాలక+ఉన్నన్= బాణం వేయలేకపోగా; కనుఁగొని= చూచి; విద్వత్+నుతుండు= పండితులచే పొగడబడినవాడైన; అత్రి, వాసవు వలను= ఇంద్రుని దిక్కు చూపి; మనములోపలన్= మనస్సులో; రోషంబు= కోపం; మల్లడింప= అధికంకాగా; వైన్యజునకు= వేనవంశజునకు; అనెన్= అన్నాడు;

**తా :** ఈ విధంగా పృథుకుమారుడు యజ్ఞాశ్వాన్ని హరించిన ఇంద్రుని చంపడం ధర్మంగా భావించాడు. ఇంద్రుడు మాయారూప వేషధారియై అది అధర్మం అనిపించేలా చేశాడు. పృథుని పుత్రుడు ఇంద్రుని నిలునిలుమనివారించి వింటినారి శబ్దం చేశాడు. ఎదురుగా జడలు, భస్మము, ఎముకలు ధరించిన మూర్తిని చూచి నిలబడ్డాడు. అతనిని ధర్మమూర్తిగా భావించి పృథుకుమారుడు బాణం వేయలేకపోయాడు. అది చూచి ఇంద్రుని వైపు చూపిస్తూ విద్వన్నుతుడైన అత్రిమహర్షి రోషాతిశయంతో పృథుపుత్రునితో ఇలా అన్నాడు.

**క. విను మితఁడు యజ్ఞహంతయు, ననిమిషనికరాధముండు నగు నింద్రుఁడు గా**
**వున నితని జయింపుము నీ, వని ముమ్మా ఱుచ్చరింప నవ్వైన్యజుఁడున్. 516**

**ప్రతి :** వినుము, ఇతఁడు, యజ్ఞహంతయు= యజ్ఞాన్ని చెడగొట్టినవాడు; అనిమిషనికర= దేవతా సముదాయంలో; అధముండు= నీచుడు; అగు+ఇంద్రుఁడు+కావునన్= అయిన ఇంద్రుడుగాబట్టి; ఇతని జయింపుము= ఈయన్ను ఓడించు; నీవు+అని= నీవని; ముమ్మారు= మూడు మూడుసార్లు; ఉచ్చరింపన్= చెప్పగా; ఆ+వైన్యజుఁడున్= ఆ వేనుని వంశంవాడు.

**తా :** విను. ఇతడు యజ్ఞాన్ని చెడగొట్టినవాడు, దేవతల సమూహంలో అధముడు అయిన ఇంద్రుడు. కావున నీవు ఇతనిని జయించమని అత్రి వేనుని కుమారునితో మూడుమార్లు చెప్పాడు. అంతట, వేన పుత్రుడు

**మ. వినువీథింజను దేవవల్లభునిపై వీరుండు క్రోధాంతరం**
**గ నిరూఢిన్ మృగరాట్కిశోరము మహాగంధద్విపేంద్రంబు మీఁ**
**దను లంఘించువిధంబునంబడిన నాతండశ్వచౌర్యైక సా**
**ధనరూపంబుఁదదశ్వమున్ విడిచి యంతర్ధానముంబొందినన్. 517**

**ప్రతి :** విను వీథిన్+చను= ఆకాశమార్గంలో వెళ్లే; దేవవల్లభునిపైన్= ఇంద్రునిమీద; వీరుండు= పరాక్రమశాలి అయిన పృథుకుమారుడు; క్రోధ+అంతరంగనిరూఢిన్= కోపంతో నిండిన మానసిక స్థైర్యంతో; మృగరాట్+కిశోరము= సింహపుపిల్ల; మహాగంధద్విప+ఇంద్రంబు మీఁదను= పెద్ద ఏనుగుపై; లంఘించు విధంబునన్+పడినన్= దూకేరీతిలో దాడిచేయగా;

ఆతండు= ఇంద్రుడు; అశ్వచౌర్య+ఏకసాధనరూపంబు= గుర్రాన్ని దొంగిలించుట ముఖ్య సాధనమైన రూపాన్ని; తద్+అశ్వమున్= ఆ గుర్రాన్ని; విడిచి= వదలిపెట్టి; అంతర్ధానమున్+పొందినన్= మాయంకాగా.

**తా :** ఆకాశమార్గంలో వెళ్లే ఇంద్రునిపైకి కోపంతో కూడిన చిత్తస్థైర్యంతో పృథుకుమారుడు మహాగజంపై లంఘించే సింహకిశోరంవలె దూకాడు. అప్పుడు యాగాశ్వాన్ని చేజిక్కించుకొన్న ఆ ఇంద్రుడు అశ్వాన్ని హరించడానికే ధరించిన రూపాన్నీ, అశ్వాన్నీ వదలివేసి మాయమయ్యాడు.

**క. వీరుఁడు పృథుభూపాల కు, మారుఁడు నిజయజ్ఞపశువు మరలం గొని దు**
**ర్వారబలుఁ డగుచు జనకుని, భూరి సవనరాజపుణ్యభూమికి వచ్చెన్. 518**

**ప్రతి :** వీరుఁడు= వీరుడైన; పృథు భూపాల కుమారుఁడు= పృథురాజకుమారుడు; నిజయజ్ఞపశువున్= తన యజ్ఞాశ్వాన్ని; మరలన్+కొని= తిరిగి పొంది; దుర్వారబలుఁడు+అగుచున్= ఎదిరింపరాని బలముగలవాడై; జనకుని= తండ్రియొక్క; భూరి సవనరాజపుణ్యభూమికిన్= యజ్ఞము జరుగు గొప్ప పవిత్రస్థలమునకు; వచ్చెన్= వచ్చాడు.

**తా :** వీరుడైన పృథురాజకుమారుడు తన యజ్ఞాశ్వాన్ని బలపరాక్రమాలతో మరల దక్కించుకొని తండ్రిచేసే గొప్ప యాగ పుణ్యప్రదేశానికి వచ్చాడు.

**వ. అయ్యవసరంబున నచ్చట నున్న పరమర్షిపుంగవు లతని యద్భుత కర్మంబు గనుంగొని యాశ్చర్యంబు నొంది యతనికి జితాశ్వుండను నన్వర్థనామంబు వెట్టియున్న సమయంబున. 519**

**ప్రతి :** ఆ+ అవసరంబునన్= ఆ సమయంలో, అచ్చటన్+ఉన్న= అక్కడున్న, పరమ+ఋషిపుంగవులు= శ్రేష్ఠులైన ఋషులు, అతని+అద్భుతకర్మంబున్= ఆయన అద్భుతమైన పనిని, కనుంగొని= చూచి, ఆశ్చర్యంబున్+ఒంది= ఆశ్చర్యపడి, అతనికి, జిత+అశ్వుండు+అను= గుఱ్ఱాన్ని గెలుచుకొన్నవాడై (జితాశ్వుడు); అను= అనే; అన్వర్థనామంబు= సార్థకనామం; పెట్టి+ఉన్న సమయంబునన్= పెట్టినపుడు.

**తా :** అప్పుడు అక్కడచేరిన పరమ ఋషిపుంగవులు అతడు చేసిన అద్భుతకార్యాన్ని చూచి ఆశ్చర్యపడి అతనికి 'జితాశ్వ' డనే సార్థకనామంపెట్టారు. అప్పుడు

**చ. మఱియును దేవతాపతి తమఃపటలంబు జనింపఁజేసి యె**
**వ్వరుఁదనుఁగానకుండ ననివారణఁగాంచనపాశబద్ధమై**
**సురుచిరయూపదారుపరిశోభితమైన హయంబుఁగొంచుఁజె**
**చ్చెర వినువీథి నేగఁగ ఋషిప్రవరుండగు నత్రి సెప్పినన్. 520**

**ప్రతి :** మఱియును= మరల; దేవతాపతి= దేవతలరాజు – ఇంద్రుడు; తమస్+పటలంబున్= చీకటి గుంపును; జనింపన్+చేసి= సృష్టించి; ఎవ్వరున్= ఎవ్వరూ; తనున్= తనను; కానక+ఉండన్= చూడకుండ; అనివారణన్= నివారింపరానిరీతిలో; కాంచనపాశబద్ధము+ఐ= బంగారు పాశంతో కట్టబడినదై; సురుచిరయూపదారు= అందమైన యూపస్తంభంచే; పరిశోభితము+ఐ= మిక్కిలి ప్రకాశించునదైన; హయమున్= గుర్రాన్ని; కొంచు= తీసుకొనుచు; వినువీధిన్=

ఆకాశమార్గంలో; చెర+చెర= త్వరత్వరగా; ఏగఁగన్= వెళ్లగా; ఋషిప్రవరుండు+అగు= యతిశ్రేష్ఠుడైన; అత్రి+చెప్పినన్= అత్రిమహాముని చెప్పగా...

**తా :** దేవేంద్రుడు తిరిగి చీకటిని సృష్టించి ఎవ్వరూ తనను చూడకుండా అడ్డులేని విధంగా బంగారు పాశంతో సురుచిరమైన యూపపుకర్రకు శోభతో కట్టివేసిన గుర్రాన్ని వదిలించుకొని ఆకాశమార్గంలో వేగంగా వెళ్ళసాగాడు. ఆ వృత్తాంతం అత్రిమహర్షి చెప్పగా

**క.** **విని పృథుభూవరతనయుఁడు, ఘనబలమునఁజని కపాలఖట్వాంగము లో**
**లిని ధరియించి రయంబునఁ, జను నింద్రునిఁగాంచి నొంపఁజాలక యంతన్. 521**

**ప్రతి :** విని, పృథుభూవర తనయుఁడు= పృథురాజకుమారుడు; ఘనబలమునన్+చని= అధికమైన శక్తితోవెళ్లి; కపాల ఖట్వాంగములు= పుర్రె, మంచపుకోడువంటి ఆయుధాలను; ఓలిన్ ధరియించి= వరుసగా పట్టుకొని; రయంబునన్= వేగంగా; చను= వెళ్లు; ఇంద్రునిన్+కాంచి= ఇంద్రుని చూచి; నొంపజాలక= బాధించలేక; అంతన్= వెంటనే...

**తా :** విని పృథురాజకుమారుడు మహాబలంతో పోయి కపాలఖట్వాంగాయుధాలను వరుసగా ధరించి వేగంగా వెళ్లే ఇంద్రుని చూచి నొప్పించలేకపోయాడు. అంతలో

**ఉ.** **క్రమ్మఱ నత్రిచేఁదెలుపఁగాఁబడి వైన్యతనూభవుండు రో**
**షమ్మునఁదోఁకఁద్రొక్కిన భుజంగమపుంగవుఁబోలి యుగ్రుఁడై**
**యమ్మరిఁబోసినంగని సురాధిపుఁడెప్పటియట్లఁబాఱె న**
**శ్వమ్మును రూపమున్ విడిచి చాలఁదిరోహితుఁడై రయంబునన్. 522**

**ప్రతి :** క్రమ్మఱన్= మరల; అత్రిచేన్= అత్రిచేత; తెలుపఁగాన్+పడి= తెలియజేయబడి; వైన్యతనూభవుండు= పృథురాజకుమారుడు; రోషమ్మునన్= కోపంతో; తోఁకన్+త్రొక్కిన= తోకతొక్కిన; భుజంగమపుంగవున్+పోలి= సర్పశ్రేష్ఠునివలె; ఉగ్రుఁడై= కోపించి; అమ్ము+అరిన్‌పోసినన్= బాణాన్ని వింటినారికి ఎక్కుపెట్టగా; కని= చూచి; సుర+అధిపుఁడు= దేవేంద్రుడు; ఎప్పటి+అట్లన్= ఎప్పటివలె; అశ్వమ్మును= గుర్రాన్ని; రూపమున్= మాయావేషాన్ని; విడిచి= వదలిపెట్టి; చాలన్ తిరోహితుఁడై= మిక్కిలిగా అదృశ్యుడై; రయంబునన్= వేగంగా; పాఱెన్= పరిగెత్తాడు.

**తా :** మళ్లీ అత్రి మహర్షి చెప్పగా పృథురాజకుమారుడు కోపంతో సర్పశ్రేష్ఠుని వలె భయంకరుడై బాణాన్ని ఎక్కుపెట్టాడు. అదిచూచి దేవేంద్రుడు గుర్రాన్ని, మాయారూపాన్ని వదలి ఎప్పటివలె అదృశ్యుడై పారిపోయాడు.

**వ.** **అట్లు సనినంబశువుంగొని మరలి య వ్వీరోత్తముండు పితృయజ్ఞశాలకుంజనుదెంచె నంత. 523**

**ప్రతి :** అట్లు+చనినన్= అలా వెళ్లగా; పశువున్+కొని= యజ్ఞాశ్వాన్ని తీసుకొని; మరలి= తిరిగి; ఆ+వీర+ఉత్తముండు= ఆ రాజశ్రేష్ఠుడు; పితృయజ్ఞశాలకున్= తండ్రియాగశాలకు; చనుదెంచెన్= వచ్చెను; అంత.

**తా :** ఇంద్రుడు అలా పారిపోగా యాగాశ్వాన్ని తిరిగి తీసుకొని ఆ వీరశ్రేష్ఠుడు పితృయాగశాలకు వచ్చాడు. అప్పుడు

**సీ.** **హరిహయుండధ్వరహయహరణార్థమై మించి కైకొని విసర్జించినట్టి**
**భూరి యమంగళభూతమాయారూపములను ధరించిరి మూఢజనులు,**

**పాషండచిహ్నముల్ పరఁగుట వారలు జగతిపై నగ్నవేషములు గలుగు**
**జైనులు భూరికాషాయవస్త్రంబులు ధరియించు బౌద్ధులుదగ జటాస్థి**

**తే. భస్మధారులు నయిన కాపాలికాదు, లనఁగ వెలసిరి లోకంబులందుఁజాలఁ**
**దలఁప ధర్మోపమంబనఁదగు నధర్మ, మందు నభిరతి వొడమిన యజ్ఞజనులు. 524**

**ప్రతి :** హరిహయుండు= ఇంద్రుడు; అధ్వర హయహరణ+అర్థమై= యాగాశ్వాన్ని దొంగిలించడానికి; మించి కైకొని= అధికంగా ధరించి; విసర్జించినట్టి= వదలిపెట్టిన; భూరి+అమంగళభూత= మిక్కిలి అశుభములైన; మాయారూపములను= మాయారూపాలను; మూఢజనులు= మూర్ఖులు; ధరించిరి= ధరించారు; పాషండ చిహ్నముల్= వేద ధర్మాలను వదలినవారి గుర్తులు; పరఁగుటన్= ఉండటంచేత; వారలు= వారు; జగతిపైన్= లోకంలో; నగ్నవేషములు+కలుగు= దిగంబరరూపాలుకల; జైనులు= జైనమతస్థులు; భూరికాషాయవస్త్రములు= మిక్కిలి కాషాయరంగు దుస్తులు; ధరియించు= ధరించే; బౌద్ధులు= బౌద్ధమతస్థులు; తగన్= తగునట్లుగా; జటా+అస్థిభస్మధారులున్+అయిన= జడలు, ఎముకలు, బూడిద ధరించినవారైన; కాపాలిక+ఆదులు= కాపాలికులు మొదలైనవారు; అనఁగ వెలసిరి= అనే పేర్లతో ప్రసిద్ధిచెందారు; లోకంబుల+అందున్= లోకాలలో; చాలన్+తలఁపన్= మిక్కిలి ఆలోచింపగా; ధర్మ+ఉపమంబు+అనన్+తగు= ధర్మంతో పోల్చదగిన; అధర్మము+నందు= అధర్మవిషయంలో; అభిరతి పొడమిన= ఇష్టం కలిగిన; అజ్ఞజనులు= తెలివిలేనివారు...

**తా :** ఇంద్రుడు యాగాశ్వాన్ని దొంగిలించడానికై ధరించి వదలిన అనేక అమంగళకరాలైన మారురూపాలను మూఢులైన జనులు ధరించారు. పాషండుల గుర్తులు గల దిగంబరవేషధారులు జైనులుగా, మిక్కిలి కాషాయపు రంగుకలిగిన వస్త్రాలను ధరించినవారు బౌద్ధులుగా జడలు, భస్మము, ఎముకలు ధరించిన వారు కాపాలికులుగా పేరుగాంచారు. ధర్మంతో సమానమైన అధర్మంపట్ల ఆసక్తిగల కొందరు అజ్ఞజనులు (తెలివిలేనివారు)

**విశే :** పాషండులు వేదబాహ్యులు. వేదవిహిత ధర్మాలను విడిచినవారు.

పాం షండయతి – పా+షండ+ఘఞ్. రక్షకమైన వేదధర్మమును వమ్ము చేసేవారు. “పాషండ ద్రుమషండ దావదహన శ్చార్వాక శైలాశనిః” పాషండ షండగిరి ఖండన వజ్రదండాః “పాషండసాగర మహాబడబాముఖాగ్నిః” అని దాశరథి మొదలియాండాన్ చెప్పిన ధాటీపంచకంలోని శ్లోకపాదాలు.

పాషండులనగా వేదధర్మాలను ఆచరింపక ఫలహీనం చేసేవారు. దేహమనే యజ్ఞశాలలో అశ్వమనే ప్రాణమయకోశం కాపాడబడటం వేదోక్త ధర్మం.

**వ. తదీయ చిహ్నంబులు పారంపర్యంబుగా ధరియింపం దొడంగిరి, తద్వృత్తాంతంబు భగవంతుం డయిన పృథుచక్రవర్తి యెఱింగి కుపితుండై యుద్యతకార్ముకుండగుచు నింద్రునిమీఁద బాణంబు నేయ నుద్యమించిన ఋత్విక్కులు శక్రవధోద్యుక్తుండు నసహ్యరంహుండు నయిన పృథుచక్రవర్తింగనుంగొని యిట్లనిరి. 525**

**ప్రతి :** తదీయ చిహ్నంబులు= ఆ గుర్తులు; పారంపర్యంబుగా= వరుసక్రమంగా; ధరియింపన్+తొడఁగిరి= ధరించసాగారు; తద్+వృత్తాంతంబు= ఆ సంగతి; భగవంతుండు+ఐన= పరమాత్ముడైన, పృథుచక్రవర్తి; ఎఱింగి= తెలిసికొని; కుపితుండు+ఐ= కోపించి; ఉద్యతకార్ముకుండు+అగుచున్= ఎక్కుపెట్టిన ధనుస్సు కలవాడై; ఇంద్రుని మీఁద, బాణంబున్+ఏయన్= బాణం వేయడానికి; ఉద్యమించినన్= సిద్ధపడగా; ఋత్విక్కులు= వేదపండితులు; శక్రవధ+ఉద్యుక్తుండును= ఇంద్రుని వధించుటకు

పూనుకొన్నవాడును; అసహ్యరంహుండును+అయిన= సహింపరాని వేగం గలవాడును అయిన; పృథుచక్రవర్తిన్= పృథురాజును; కనుంగొని= చూచి; ఇట్లు+అనిరి= ఇలా అన్నారు.

**తా :** ఆ విధంగా ఆయా వేషాలు వరుసక్రమంలో ధరించడం ప్రారంభించారు. వారిని గూర్చి తెలుసుకొన్న పృథుచక్రవర్తి కోపించి విల్లెక్కుపెట్టి ఇంద్రునిపై బాణంవేయడానికి సిద్ధపడగా ఇంద్రుని చంపడానికి వేగంగా బయలుదేరిన అతనిని చూచి ఋత్విక్కులు ఇలా అన్నారు.

**క. జననాయక! యజ్ఞములం, దనుపమవిధిచోదితంబు లనఁదగు పశు బం**
**ధనహింసల కా కితరుల, ఘనదీక్షితునకు వధింపఁగాదండ్రు బుధుల్. 526**

**ప్రతి :** జననాయక!= రాజా! యజ్ఞములందు= యాగాలలో; న+ఉపమ= సాటిలేనివి; విధిచోదితంబులు+అనఁదగు= వేదవిధిచే ప్రేరేపించబడినవి, అనఁదగు; పశుబంధన హింసలకాక= యజ్ఞపశువులను కట్టివేయడం, హింసించడం తప్ప; ఇతరులన్= ఇతరులను; ఘనదీక్షితునకున్= యజ్ఞదీక్ష స్వీకరించినవానికి; బుధుల్= పండితులు; వధింపన్+కాదు+అండ్రు= చంపదగదని చెప్పుదురు.

**తా :** ఓ పృథుచక్రవర్తీ! వేదాలలో చెప్పిన రీతిగా యాగాలలో యాగపశువులను బంధించడం, హింసించడం తప్ప గొప్ప యాగదీక్ష స్వీకరించినవారు ఇతరులను చంపడం శాస్త్రసమ్మతం కాదని పండితులు చెబుతారు.

**వ. కావున నీ విపు డింద్రవధోద్యోగంబుపసంహరింపుము, భవదీయధర్మవిరోధియైన యింద్రుని. 527**

**ప్రతి :** కావునన్= కాబట్టి; నీవు; ఇపుడు= ఇప్పుడు; ఇంద్రవధ+ఉద్యోగంబు= ఇంద్రునిచంపే ప్రయత్నం; ఉపసంహరింపుము= వదలిపెట్టు; భవదీయ= నీ, ధర్మవిరోధి+ఐన= ధర్మానికి వ్యతిరేకిఅయిన; ఇంద్రుని.

**తా :** కాబట్టి, ఇప్పుడు నీవు ఇంద్రుని సంహరించే ప్రయత్నం మానుకో. నీ ధర్మాన్ని వ్యతిరేకించే ఇంద్రుని.

**క. జనపాల! వీర్యవంతము, లనఁదగు మంత్రములచేత నాహ్వానము సే**
**సిన నతఁడిచటికి వచ్చును, జనుదెంచిన యమరవిభుని సరభసతఁదగన్. 528**

**ప్రతి :** జనపాల!= ఓ రాజా!; వీర్యవంతములు+అనన్+తగు= శక్తిమంతాలనబడే; మంత్రములచేతన్= మంత్రాలచేత; ఆహ్వానము+చేసినన్= ఆహ్వానిస్తే; అతఁడు+ఇచటికి వచ్చును= ఆయన ఇక్కడకు వస్తాడు; చనుదెంచినన్= అలావచ్చిన; అమరవిభుని= దేవేంద్రుని; సరభసతన్= వేగంగా; తగన్= తగినవిధంగా.

**తా :** ఓ రాజా! శక్తిమంతాలనదగిన మంత్రాలతో ఆహ్వానిస్తే అతడు ఇక్కడకు వస్తాడు. అలా వచ్చిన దేవేంద్రుని తగినవిధంగా (పట్టుకోవచ్చునని తదుపరి భావం)

**క. ధృతి సెదరఁబట్టి శిఖి కా, హుతిఁగా వేల్చెదము, దాన నుర్వీవర! నీ**
**వితతమహోహత వీర్యో, న్నతుఁడై చెడిపోవు నమరనాథుండంతన్. 529**

**ప్రతి :** ఉర్వీవర= ఓ భూపతీ!; ధృతి+చెదరన్= ధైర్యము చెదిరేలా; పట్టి= బంధించి; శిఖికి= అగ్నికి; ఆహుతిన్+కా= బలిగా; వేల్చెదము= హోమం చేస్తాము; దానన్= దానితో; నీ వితత= నీ విస్తారమైన; మహస్+హత= తేజస్సుచే

కొట్టబడిన; వీర్య+ఉన్నతుఁడై= బలోనత్నిగలవాడై; అంతన్= అంతటితో; అమరనాథుండు= దేవేంద్రుడు; చెడిపోవున్= నశిస్తాడు.

**తా :** రాజా! ధైర్యం చెదిరేలా బంధించి అగ్నికి ఆహుతిగా హోమం చేస్తే నీ విస్తారమైన తేజస్సు దెబ్బచే అతడు సామర్థ్యం కోల్పోయి చెడిపోతాడు.

**వ. అని పృథుని వారించి ఋత్విగ్జనంబులు గుపితస్వాంతులై హస్తంబుల స్రుక్స్రువంబులు ధరియించి వేల్చు సమయంబునం జతుర్ముఖుండు సనుదెంచి ఋత్విజులం గనుంగొని యిట్లనియె; యజ్ఞంబులందు యజింపంబడు దేవత లెవ్వని యంశంబు, లెవ్వండు యజ్ఞనామకంబగు భగవదంశంబగు, నట్టి యింద్రుండు మీచేత వధార్హుండుగాఁ డితండు భగవదంశసంభవుం డగుట నీ యజ్ఞకర్మ విధ్వంసనేచ్ఛుండయి కావించు ధర్మ వ్యతికరంబులు సూచుచుండ వలయుంగాని ప్రతీకారంబులు గర్తవ్యంబులుగా, వీ పృథుకీర్తియగు పృథునకు నేకోనశతంబగు నధ్వర ప్రయోగ ఫలంబు సిద్ధించుం గాక యని పృథుచక్రవర్తి కిట్లనియె. 530**

**ప్రతి :** అని= అని చెప్పి; పృథుని వారించి= పృథునికి అడ్డుపడి; ఋత్విక్+జనంబులు= యజ్ఞం నిర్వహించే పండితులు; కుపితస్వాంతులు+ఐ= కోపించిన మనస్సుగలవారై; హస్తంబులన్= చేతులలో; స్రుక్స్రువంబులు= హోమపాత్ర, కొయ్యగరిటె; ధరియించి= తాల్చి; వేల్చుసమయంబునన్= వేల్చే సమయంలో, చతుర్ముఖుండు; బ్రహ్మ, చనుదెంచి= వచ్చి; ఋత్విజులన్= పురోహితులను; కనుంగొని= చూచి; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు; యజ్ఞంబులందున్= యాగాలలో; యజింపంబడు= పూజింపబడే, దేవతలు; ఎవ్వని+అంశంబులు= ఎవని భాగాలు; ఎవ్వండు= ఎవడు; యజ్ఞనామకంబు+అగు= యాజ్ఞమను పేరుగల; భగవత్+అంశంబు+అగున్= భగవంతునిలో భాగము అవుతాడో; అట్టి, ఇంద్రుండు= ఇంద్రుడు; మీచేత, వధ+అర్హుండు= చంపదగినవాడు; కాఁడు, ఇతండు= ఇతడు; భగవత్+అంశసంభవుండు+అగుటన్= భగవంతుని అంశలో పుట్టినవాడు కావున; ఈ యజ్ఞకర్మన్= ఈ యజ్ఞకాండను; విధ్వంసన+ఇచ్ఛుండు+అయి= నాశముచేసే కోర్కెకలవాడై; కావించు= చేసే; ధర్మవ్యతికరంబులు= ధర్మానికి వ్యతిరేకమైన పనులు; చూచుచుండవలయున్+కాని= చూస్తూఉండాలిగాని; ప్రతీకారంబులు= వాటికి వ్యతిరేకమైన పనులు; కర్తవ్యంబులు+కావు= చేయదగినవి గావు; ఈ పృథుకీర్తియగు= ఈ గొప్ప కీర్తిగల; పృథునకున్= పృథుచక్రవర్తికి; ఏక+ఊనశతంబు+అగు= నూటికి ఒకటి తక్కువయైన (99); అధ్వరప్ర యోగఫలంబు= యాగాలు చేసిన ఫలితం; సిద్ధించున్+కాక= దక్కునుగాక; అని, పృథుచక్రవర్తికి; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అని ఋత్విక్కులు పృథుచక్రవర్తిని వారించి కోపించినవారై స్రుక్కులు స్రువాలు తీసుకొని యజ్ఞంలో వేల్చుటకు పూనుకొనే సమయంలో బ్రహ్మ విచ్చేసి ఋత్విజులను చూచి ఇలా అన్నాడు. యాగాలలో పూజించే దేవతలు ఇంద్రుని అంశాలు. అట్టి ఇంద్రునిది భగవదంశం. కాబట్టి, అతనిని మీరు వధింపరాదు. ఆయన భగవదంశలో పుట్టాడుగాబట్టి, ఇలాంటి యాగాలను నాశనం చేసే ధర్మవ్యతిరేకమైన పనులు ఆయన చేస్తున్నా చూస్తూవుండాలిగాని ప్రతీకారం చేయగూడదు. ఈ గొప్ప కీర్తిగల పృథుచక్రవర్తికి తొంభైతొమ్మిది యాగాల ఫలితం దక్కుతుంది. అని బ్రహ్మ పృథుచక్రవర్తితో ఇలా అన్నాడు.

**సీ. మనుజేంద్ర! మోక్షధర్మము నెఱింగిన నీకు సవనముల్ సేయుట సాలు మఱియు**
**నే విధంబుననైన దేవేంద్రు మనమునఁ గై కొని రోషంబు గదురకుండ**

**వర్తింపవలయును, వాసవుండును నీవుఁ బూని సుశ్లోకులు గాన మీకు మంగళంబగుఁగాక! మానవనాథ! నీ చిత్తంబులోపలఁజింతఁదొఱఁగి**

**తే. మించి మద్వాక్యముల నాదరించి వినుము, దైవహతమగు యజ్ఞంబుఁదగిలి చేయు కొఱకు భవదీయచిత్తంబు గుంది రోష, కలుషితంబైన నజ్ఞానకలిత మగును. 531**

**ప్రతి :** మనుజ+ఇంద్ర= ఓ రాజా!; మోక్షధర్మమున్= మోక్షసాధన ధర్మాన్ని; ఎఱింగిన= తెలిసిన; నీకు, సవనముల్= యాగాలు; చేయుట+చాలు= చేయడం చాలును; మఱియున్, ఏవిధంబునన్+ఐన= ఎలా అయినా; దేవేంద్రు= ఇంద్రుని; మనమునన్= మనస్సులో; కైకొని= భావించి; రోషంబు= కోపం; కదురకుండ= కలుగకుండా; పూని= ప్రయత్నించి; వర్తింపవలయును= మెలగాలి; వాసవుండును= ఇంద్రుడును; నీవున్= నీవు; సుశ్లోకులు+కాన= మంచివారు గాబట్టి; మీకు మంగళంబు+అగున్+కాక= మీకు శుభం కలగాలి!; మానవనాథ= ఓ రాజా!; నీచిత్తంబులోపలన్= నీ మనస్సులో; చింతన్+తొఱఁగి= బాధవదలి; మత్+వాక్యములన్= నా మాటలను; మించి ఆదరించి= ఎక్కువగా గౌరవించి; వినుము, దైవహతము+అగు= దేవునిచే భంగం చేయబడ్డ; యజ్ఞంబున్= యాగాన్ని; తగిలి చేయుకొఱకు= ప్రయత్న పూర్వకంగా చేయడానికి; భవదీయచిత్తంబు= నీ మనస్సు; కుంది= బాధపడి; రోష కలుషితంబు+ఐన= కోపంచే అపవిత్రమైనట్లైతే; అజ్ఞానకలితము+అగును= అజ్ఞానంతో కూడిన దవుతుంది.

**తా :** రాజా! మోక్షధర్మం తెలిసిన నీవింక యజ్ఞాలు చేయనవసరం లేదు. ఎలాగైనా ఇంద్రునితో మంచి చేసుకొని అతనికి కోపం ఎక్కువగాకుండా ప్రవర్తించాలి. మీరిద్దరూ మంచివారు గాబట్టి, కలిసి తిరిగితే శుభమవుతుంది. నీ మనస్సులో చింతవీడి నా మాటలను ఆదరించి వినుము. దైవంచే భంగపరచబడ్డ యాగం మళ్లీ చేయడానికి ప్రయత్నించవద్దు. కోపంతో కలుషితమైన యాగం అజ్ఞాన కలితమవుతుంది – అన్నాడు బ్రహ్మ.

**వ. భవదీయ యజ్ఞహననార్థం బశ్వహరణుండైన యింద్రుండు దేవతలలోనన్ దురాగ్రహుం డగుటం జేసి యతనిచేత నిర్మింపంబడి చిత్తాకర్షకంబులైన యీ పాషండ ధర్మంబులచేత ధర్మ వ్యతికరంబు కలుగుం గాన యీ యజ్ఞంబు సాలింపుమని మఱియు నిట్లనియె. 532**

**ప్రతి :** భవదీయ= నీ యొక్క; యజ్ఞహనన+అర్థంబు= యజ్ఞాన్ని నాశనం చేయడానికి; అశ్వహరణుండు+అయిన= గుర్రాన్ని దొంగిలించిన; ఇంద్రుండు= ఇంద్రుడు; దేవతలలోనన్= దేవతలలో; దురాగ్రహుండు+అగుటన్+చేసి= ఎక్కువ పట్టుదలగలవాడు గాబట్టి; అతనిచేత, నిర్మింపన్+పడి= ఏర్పాటు చేయబడిన; చిత్త+ఆకర్షకంబులు+ఐన= మనస్సు నాకర్షించే; ఈ పాషండధర్మంబులచేత= వేదకర్మలు చేయనివారి; ధర్మంబులచేత= ధర్మాలవలన; ధర్మవ్యతికరంబు= ధర్మానికి క్షోభం; కలుగున్+కాక= అవుతుందిగాబట్టి; ఈ యజ్ఞంబు= ఈ యజ్ఞం; చాలింపుము+అని= వదలిపెట్టుమని; మఱియున్, ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** నీ యాగాన్ని నాశనం చేయడానికి యాగాశ్వాన్ని దొంగిలించిన ఇంద్రుడు దేవతలలో ఎక్కువ కోపం గలవాడుగాన, అతనిచే ఏర్పడిన మనస్సు నాకర్షించే ఈ పాషండధర్మాలతో ధర్మానికి క్షోభం కలుగుతుంది. కాబట్టి, ఈ యాగం చాలించుమని బ్రహ్మ తిరిగి ఇలా అన్నాడు.

**విశే :** ఇంద్రియతృప్తికై ప్రాకులాడటం చిత్తాకర్షకమైన పాషండధర్మం.

**సీ. అది గాక వినుము వేనాపచారంబునఁ బూని విలుప్తంబు లైన యట్టి**
**యలఘు నానాసమయానుధర్మంబులఁ బరిపాలనము సేయఁబరఁగి వేను**
**దేహంబువలనను దివిరి జనించి యున్నాఁడవు, నారాయణాంశజుఁడవు,**
**గావున నీ నరకలితలోకంబునఁ బుట్టిన తెఱఁగు నీ బుద్ధిఁదలఁచి**

**తె. యెవరిచే నేమిటికి సృజియింపఁబడితి, వట్టి యా బ్రహ్మసంకల్ప మవనినాథ!**
**తప్పకుండంగఁ బాలింపు ధర్మగతిని, జారుశుభమూర్తి! యో పృథుచక్రవర్తి! 533**

**ప్రతి :** చారుశుభమూర్తి= మిక్కిలి శుభాకారా! ఓ పృథుచక్రవర్తీ!; అదిగాక= అంతేకాక; వినుము; వేన+అపచారంబునన్= మీ తండ్రి వేనుని దోషంవల్ల; పూని= ప్రయత్నించి; విలుప్తంబులు+ఐన+అట్టి= లోపించినట్టి; అలఘు= గొప్పవైన; నానా సమయ+అనుధర్మంబులన్= వివిధాలైన సిద్ధాంతాలనుబట్టి ఏర్పడిన ధర్మాలను; పరిపాలనంబు+చేయన్+పరఁగి= పాలించడం మొదలుపెట్టి; వేనుదేహంబువలనను= వేనుని శరీరంవల్ల; తివిరి= పూనుకొని; జనించి+ఉన్నాఁడవు= పుట్టి ఉన్నావు; నారాయణ+అంశజుఁడవు= నారాయణుని అంశతో పుట్టావు; కావున, ఈ నర+ కలిత= ఈ మానవులతో కూడుకొన్న; లోకంబునన్= లోకంలో; పుట్టిన తెఱఁగు= పుట్టిన పద్ధతి; నీ బుద్ధిన్+తలఁచి= నీ మనస్సులో ఊహించి; అవనినాథ!= ఓ రాజా!; ఎవరిచేన్= ఎవరిచేత; ఏమిటికి, సృజింపబడితివి= సృష్టించబడినావు; అట్టి+ఆ బ్రహ్మసంకల్పంబు= ఆ విధమైన ఆ బ్రహ్మమనోనిశ్చయం; తప్పకుండంగన్= తప్పిపోకుండ; ధర్మగతిని= ధర్మమార్గంలో; పాలింపు= పరిపాలించు.

**తా :** ఓ పృథుచక్రవర్తీ! శుభాకారా! అదిగాక వినుము. మీ తండ్రి వేనుని దోషంవల్ల లోపించిన అనేక ధర్మాలను రక్షించడానికి నీవు పూనుకొని వేనుని పుత్రుడిగా జన్మించావు. నారాయణాంశంలో జన్మించావు. నీవు మానవలోకంలో పుట్టిన పద్ధతిని కూడా తలంచు. నిన్ను సృష్టించిన బ్రహ్మ కోర్కెను నెరవేర్చు. ధర్మమార్గంలో పాలించు.

**వ. అని మఱియు నిట్లనియె; నుపధర్మ మాతయుం బ్రచండ పాషండ మార్గంబు నైన యీ యింద్రకృతం బగు మాయను జయింపుమని వనజసంభవుండానతిచ్చినం బృథుచక్రవర్తియు దదాజ్ఞాపితుండై దేవేంద్రునితోడ బద్ధ సఖ్యుండయ్యె; నంత నవభృథానంతరంబున. 534**

**ప్రతి :** అని మఱియున్+ఇట్లు+అనియెన్= అని మరల ఇలా అన్నాడు; ఉపధర్మమాతయున్= అప్రధానాలైన ధర్మాలకు తల్లి; ప్రచండ పాషండ మార్గంబును+ఐన= భయంకరమైన వేదబాహ్య జీవితమార్గం (అయిన); ఈ ఇంద్ర కృతంబగు= ఈ ఇంద్రునిచే చేయబడిన; మాయను జయింపుము+అని= మాయను గెలువుమని; వనజభవుండు= బ్రహ్మ; ఆనతి+ఇచ్చినన్= అనుజ్ఞనివ్వగా; పృథుచక్రవర్తియు= పృథుచక్రవర్తికూడా; తద్+ఆజ్ఞాపితుండు+ఐ= ఆయనచే ఆదేశించబడినవాడై; దేవేంద్రునితోడన్= ఇంద్రునితో; బద్ధసఖ్యుండు+అయ్యెన్= మిక్కిలి స్నేహంకలవాడాయెను; అంతన్= ఆ తర్వాత; అవభృథ+అనంతరంబున= యజ్ఞాంత మంగళ స్నానాలు పూర్తికాగా.

**తా :** అని మరీ బ్రహ్మ ఇలా అన్నారు. అప్రధానాలైన ధర్మాలకు మూలం, భయంకరమైన వేదబాహ్య జీవితమార్గము అయిన ఇంద్రుని మాయను గెలవాలి. అని బ్రహ్మ ఆదేశించగా పృథుచక్రవర్తి బ్రహ్మ యానతితో ఇంద్రునితో మిక్కిలి స్నేహం కలవాడైనాడు. తర్వాత యజ్ఞాంత మంగళస్నానాలు పూర్తి కాగా

**చ. సురుచిరలబ్ధదక్షిణల సొంపునఁ బొంపిరివోయి భూసురుల్**
**వరుసను బెక్కు దీవన లవారణ నిచ్చిరి, సర్వదేవతల్**
**భరితముదంతరంగములఁ బాయని వేడ్క వరంబు లిచ్చి రా**
**నరవరుఁడైన వైన్యునకు నందితకీర్తికిఁ బుణ్యమూర్తికిన్. 535**

**ప్రతి :** ఆ నరవరుఁడు+ఐన= ఆ రాజైన; నందితకీర్తికిన్= ప్రశంసార్హమైన కీర్తిగలవానికి; పుణ్యమూర్తికిన్= పుణ్యపురుషుడయిన వానికి; వైన్యునకున్= పృథుచక్రవర్తికి; సురుచిర= మిక్కిలి ప్రకాశమానమైన; లబ్ధదక్షిణల= పొందిన యజ్ఞదక్షిణలయొక్క; సొంపునన్+పొంపిరి+పోయి= సౌభాగ్యంవలన పుష్కలత్వంపొంది; భూసురుల్= బ్రాహ్మణులు; పెక్కుదీవెనలు= అనేక ఆశీర్వచనములు; అవారణన్= అడ్డులేని విధంగా; వరుసను+ఇచ్చిరి= వరుసగా ఇచ్చారు; సర్వదేవతల్= దేవతలందరు; భరిత, ముద్+అంతరంగములన్= నిండిన సంతోషం కల మనస్సులతో; పాయనివేడ్కన్= వదలనివేడుకతో; వరంబులు+ఇచ్చిరి= వరాలు ఇచ్చినారు.

**తా :** ప్రశంసార్హుడు పుణ్యపురుషుడు అయిన ఆ పృథుచక్రవర్తిచే భూరిదక్షిణలు పొందడంవల్ల సంతుష్టులయిన బ్రాహ్మణులు ఆయనకు పెక్కు దీవెనలందించారు. ఆనందభరితులైన దేవతలందరు అనేక వరాలు ఇచ్చారు.

**వ. అంత నచటి జనంబు లిట్లనిరి. 536**

**ప్రతి :** అంతన్= ఆ తర్వాత, అచటి జనంబులు= అక్కడి ప్రజలు, ఇట్లు+అనిరి= ఇలా అన్నారు.

**తా :** తరువాత అక్కడి జనులు ఇలా అన్నారు.

**తే. అనఘ! నీ చేత నాదృతులైరి సర్వ, జనులు మఱి దానమానోపచారములను**
**బితృసుదేవర్షిమానవవితతి పూజ, నొంది యంచితమోదంబు నొందె నయ్య! 537**

**ప్రతి :** అయ్యా!; అనఘ= పుణ్యాత్మా! సర్వజనులు= లోకులంతా; నీచేతన్+ఆదృతులు+ఐరి= నీచే ఆదరించబడ్డారు; మఱి= మఱియు; దానమాన+ఉపచారములను= దానం, గౌరవం మొదలైన సేవలచే; పితృ= పితృదేవతలు; సుదేవ+ఋషి= దేవతలు, ఋషులు; మానవ వితతి= మానవ సమూహము; పూజన్+ఒంది= పూజ పొంది; అంచిత మోదంబున్= మిక్కిలి సంతోషము; ఒందెన్+అయ్య= పొందినది!.

**తా :** పుణ్యాత్మా! ప్రజలందరు నీచేత ఆదరించబడినారు. దానం, గౌరవం పొంది, పితృదేవతలు, దేవతలు, ఋషులు, మానవులు పూజలు పొంది మిక్కిలి సంతోషించారయ్యా!

### a =నారాయణుండు ప్రసన్నుండై పృథు చక్రవర్తి ననుగ్రహించుట a

**వ. అని పలుకు సమయంబున యజ్ఞభోక్తయు యజ్ఞవిభుండును భగవంతుండునైన సర్వేశ్వరుం డింద్రసమేతుండై యచ్చటికిం జనుదెంచి యా పృథున కిట్లనియె. 538**

**ప్రతి :** అని, పలుకు, సమయంబునన్= అని మాట్లాడేటప్పుడు; యజ్ఞభోక్తయు= యజ్ఞంలో హవిస్సులు స్వీకరించేవాడు; యజ్ఞవిభుండున్= యాజ్ఞాధిపతియు; భగవంతుండును+ఐన= దేవుడైన; సర్వ+ఈశ్వరుండు= అన్నింటికి అధిపతి;

ఇంద్రసమేతుండు+ఐ= ఇంద్రునితోగూడి; అచ్చటికిన్+చనుదెంచి= అక్కడకు వచ్చి; ఆ పృథునకున్= ఆ పృథుచక్రవర్తితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అలా మాట్లాడే సమయంలో యాగభాగాలు స్వీకరించేవాడు, యాగాధిపతియైన సర్వేశ్వరుడు ఇంద్రునితోకలిసి అక్కడకు వచ్చి పృథుచక్రవర్తితో ఇలా అన్నాడు.

**క. జనవర! భవదీయంబై, జననుతమగు నశ్వమేధశతమున కిపు డీ**
**యనిమిషపతి భంగము సే, సినకతన క్షమాపణంబు సేసెడిఁగంటే! 539**

**ప్రతి :** జనవర= ఓ రాజా!; భవదీయంబు+ఐ= నీదైన; జననుతము+అగు= లోకులు ప్రశంసించే; అశ్వమేధశతమునకున్= నూరు అశ్వమేధ యాగాలకు; ఇపుడు, ఈ+అనిమిషపతి= ఈ దేవేంద్రుడు; భంగము+చేసినకతనన్= హాని కల్గించినందువల్ల; క్షమాపణంబు= మన్నించుమని వేడుకోలు; చేసెడిన్= చెప్పుకొంటున్నాడు; కంటి+ఏ= చూశావా?

**తా :** ఓ పృథుచక్రవర్తీ! లోకులు మెచ్చేలా నీవు చేసిన నూరో అశ్వమేధయాగానికి ఇప్పుడు ఈ దేవేంద్రుడు భంగం చేసినందువల్ల క్షమాపణ చెబుతున్నాడు చూశావా?

**వ. కావున నితని క్షమింపుము, సత్పురుషులగువారు దేహాభిమానులు గాకుండుటం జేసి భూతంబులయెడ ద్రోహం బాచరింప, రట్లగుటం జేసి నీవంటి మహాత్ములు దేవమాయా మోహితులై పరోపతాపంబులు సేసిరేని దీర్ఘతరంబైన వృద్ధజన సేవ వ్యర్థంబు గాదె! యదియునుం గాక యీ శరీరం బవిద్యాకామ కర్మంబుల చేత నారబ్ధం బని తెలిసిన భూతద్రోహి గాని పరమజ్ఞాని యీ దేహంబునందు ననుషక్తుండు గాకుండుట సహజం బన, దేహోత్పాదితంబులైన గృహదారాదులయందు మమత్వంబు లేకుండుటం జెప్పనేల? యిట్టి దేహంబునందున్న యాత్మ యేకంబును, శుద్ధ స్వరూపంబును, స్వయంజ్యోతియు నిర్గుణంబును, గుణాశ్రయంబును, వ్యాప్య వ్యాపకంబును, నసంవృతంబును, సాక్షిభూతంబును, నిరాత్మంబును నగు, దీని దేహంబుకంటె వేఱుగా నెవ్వండు దెలియు వాఁడు మత్పరుం డగుటం జేసి దేహధారియై యుండియుఁ దద్గుణంబులం బొరయక వర్తించు. మఱియు నెవ్వండేని స్వధర్మాచార పరుండును, నిష్కాముండును, శ్రద్ధాయుక్తుండునై నన్నెల్లప్పుడు భజియించు నట్టివాని మనంబు క్రమంబునఁ బ్రసన్నంబగు, నట్లు ప్రసన్న మనస్కుండును, త్రిగుణాతీతుండును సమ్యగ్దర్శనుండును నైన యతండు మదీయ సమవస్థాన రూపశాంతి నొందు, నదియు కైవల్యపదం బనంబడుఁ, గూటస్థంబైన యీ యాత్మ యుదాసీనభూతం బైనను దీని ద్రవ్యజ్ఞాన క్రియా మనంబులకు నీశ్వరుంగా నెవ్వండు దెలియు, వాఁడు భవంబు నొందకుండు, నీ సంసారంబు ద్రవ్య క్రియాకారక చేతనాత్మకం బగుటం జేసి ప్రభిన్న దేహోపాధికంబు గావునఁ బ్రాప్తంబు లైన యాపత్సంపదలయందు మత్పరులైన మహాత్ములు వికారంబు నొందరు, గావున నీవు సుఖదుఃఖంబుల యందు సమచిత్తుండవును, సమానోత్తమ మధ్యమాధ ముండవును, జితేంద్రియాశయుండవునై వినిష్పాది తాఖిలామాత్యాది సంయుతుండవై, యఖిలలోక రక్షణంబు సేయు మని వెండియు నిట్లనియె. 540**

**ప్రతి :** కావునన్= కాబట్టి; ఇతని క్షమింపుము= ఈయనను మన్నించు; సత్పురుషులు+అగువారు= మంచివారు; దేహ+అభిమానులు= శరీరంపై ప్రేమగలవారు; కాకుండుటన్+చేసి= కారు గాబట్టి; భూతంబులయెడన్= ప్రాణులపట్ల;

ద్రోహంబు+ఆచరింపరు= అపకారం చేయరు; అట్లు+అగుటన్+చేసి= అలా కావడంవల్ల; నీ వంటి మహాత్ములు= నీవంటి సత్పురుషులు; దేవమాయామోహితులు+ఐ= దేవతల మాయలచేత జ్ఞానము కోల్పోయినవారై; పర+ఉపతాపంబులు= ఇతరులకు బాధలు; చేసిరి+ఏని= కలిగిస్తే; దీర్ఘతరంబు+ఐన= చాలాకాలం జరుపు; వృద్ధజనసేవ= పెద్దవారికి చేసేసేవ; వ్యర్థంబు+కాదె= వృథా అవుతుందిగదా!; అదియునున్+కాక= అదీగాక; ఈ శరీరంబు= ఈ దేహము; అవిద్యాకామ కర్మంబులచేత= అజ్ఞానం, కోరిక, కర్మాచరణములచే; ఆరబ్ధంబు= ప్రారంభించబడినది; అని తెలిసిన, భూతద్రోహి కాని= ప్రాణుల కపకారం చేయని; పరమజ్ఞాని= గొప్పయోగి; ఈ దేహంబునందున్= ఈ శరీరంపై; అనుషక్తుండు= అభిమానంగలవాడు; కాకుండుట= కాకపోవడం; సహజంబు+అగ= సాధారణమే అయినప్పుడు; దేహ+ఉత్పాదితంబులు+ అయిన= దేహముచేత ఏర్పరుపబడినవైన; గృహ, దార+ఆదుల+అందు= ఇల్లు; భార్యమొదలగు వానియందు; మమత్వంబు= ప్రీతి; లేకుండుటన్= లేకపోవడం; చెప్పను+ఏల?= చెప్పనవసరమా?; ఇట్టిదేహంబున్+అందు+ఉన్న= ఇలాంటి శరీరంలోఉన్న; ఆత్మ ఏకంబును= ఆత్మ ఒక్కటే అయినది; శుద్ధస్వరూపంబును= స్వచ్ఛమైనది; స్వయంజ్యోతియు= తనంత తానే వెలుగునది; నిర్గుణంబును= గుణంలేనిది; గుణ+ఆశ్రయంబును= గుణాన్ని అనుసరించి నడిచేది; వ్యాప్యవ్యాపకంబును= వ్యాపించేది, వ్యాపింపచేసేది; అసంవృతంబును= మూయబడనిది; సాక్షిభూతంబును= అన్నింటికి సాక్షిగా ఉండేది; నిరాత్మంబును+అగు= ఆత్మలేనిదగు; దీని= దీనిని; దేహంబుకంటె= శరీరంకన్నా; వేఱుగాన్= మరొకటిగా; ఎవ్వండు తెలియు= ఎవడు తెలుసుకోగలడో; వాఁడు, మత్+పరుండు+అగుటన్చేసి= నాయందు ఆసక్తి గలవాడుగాబట్టి; దేహధారి+ఐ+ఉండియు= శరీరం ధరించినవాడైనప్పటికి; తద్+గుణంబులన్+పొరయక= ఆ దేహలక్షణాలును కలిగియుండక; వర్తించు= ప్రవర్తిస్తాడు; మఱియు= ఇంకా; ఎవ్వండు+ఏని= ఇంకెవడైనా; స్వధర్మ+ఆచారపరుండును= తన ధర్మాలను సలిపేవాడు; నిష్కాముండును= కోరికలులేనివాడు; శ్రద్ధాయుక్తుండును+ఐ= శ్రద్ధతో కూడినవాడై; నన్ను, ఎల్లప్పుడు= నిత్యము; భజియించున్= పూజిస్తాడో; అట్టివానిమనంబు= అట్టి వ్యక్తిమనస్సు; క్రమంబునన్= నెమ్మదిగా; ప్రసన్నంబు+అగున్= శాంతమవుతుంది; అట్లు ప్రసన్నమనస్కుండును= ఆ విధంగా శాంతస్వభావం గలిగిన మనస్సుకలవాడును; త్రిగుణ+అతీతుండును= మూడు గుణాలను మించినవాడును; సమ్యక్+దర్శనుండును+ఐన= సముచిత దృష్టి గలిగినవాడును అయిన; అతండు= అతడు; మదీయ సమవస్థాన రూపశాంతిన్= నా యొక్క పరిపూర్ణ అస్తిత్వరూపశాంత స్థితిని; ఒందున్= పొందును; అదియు కైవల్యపదంబు+అనన్+పడున్= అది మోక్షము అనబడుతుంది; కూటస్థంబు+అయిన= అన్ని కాలాల్లో ఒకేవిధంగా ఉండునది – శాశ్వతంగా ఉండునది – అయిన; ఈ, ఆత్మ; ఉదాసీనభూతంబు= దేనిని అంటిపట్టుకోక తటస్థంగా ఉండునది; అయినను= అయినప్పటికి; దీని= దీనియొక్క; ద్రవ్యజ్ఞాన క్రియా మనంబులకున్= ద్రవ్యమునకు; తెలివికి, క్రియకు, మనస్సుకు; ఈశ్వరుంగాన్= అధిపతిగా; ఎవ్వండు తెలియున్= ఎవడు తెలుసుకోగలడో, వాఁడు; భవంబున్+ఒందకుండున్= పుట్టుకలేని వాడగును; ఈ సంసారంబు= ఈ జననమరణాల పరంపర; ద్రవ్యక్రియాకారక చేతన+ఆత్మకంబు+అగుటన్+చేసి= వస్తువునకు, క్రియకు, ప్రేరకులైన జీవులతో కూడినది అయినందువల్ల; ప్రభిన్నదేహ+ఉపాధికంబు= వేరు వేరుగా ఏర్పడ్డ దేహం ఆధారంగాగలది; కావునన్= కాబట్టి; ప్రాప్తంబులు+అయిన= కలిగిన; ఆపత్+సంపదలయందు= ఆపదల్లో, సంపదల్లో; మత్+పరులు+ఐన= నాయందు మనసులగ్నం చేసినవారైన; మహాత్ములు= సత్పురుషులు; వికారంబున్+ఒందరు= మార్పుచెందరు, కావున నీవు; సుఖదుఃఖంబులందు= సుఖ, దుః ఖాలలో; సమచిత్తుండవును= సమానభావంగలవాడవు; సమాన+ఉత్తమ మధ్యమ+అధముండవును= సమానంగా ఉత్తమము, మధ్యమము, అధమము, గొప్పది, మధ్యది, నీచమైనది అయిన స్థితులు కలవాడవై; జిత+ఇంద్రియ+ఆశయుండవును+ఐ= జయించిన ఇంద్రియములు మనస్సు గలవాడవై; వినిష్పాదిత= విశేషంగా లభించిన; అఖిల+అమాత్య+ఆదిసంయుతుండవు+

ఐ= అందరు మంత్రులు మొదలగువారితో కూడినవాడవై; అఖిలలోక రక్షణంబు= అన్నిలోకాలను కాపాడటం; చేయుము+అని= చేయుమని; వెండియున్= మరలా; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** కాబట్టి నీవు ఇతనిని (దేవేంద్రుని) క్షమింపుము. సత్పురుషులు దేహాభిమానంలేనివారు కనుక ప్రాణులకు అపకారం చేయరు. అందువల్ల నీ లాంటి సత్పురుషులు దైవికమైన మాయచేత జ్ఞానాన్ని కోల్పోయి ఇతరులకు బాధ కలిగిస్తే, ఎంతోకాలం నీవు చేసిన వృద్ధజనసేవ వ్యర్థమౌతుంది కదా.

అంతేకాక ఈ దేహం అవిద్య, కోరిక, కర్మ – ఈ మూడింటిచేత మొదలైనదని తెలుసుకొని, ప్రాణిహింసచేయని మహాయోగులు దేహాభిమానం కలవారు కాకుండటం సహజం. అందుచేత, ఇల్లు, భార్య మున్నగు వానియందు వ్యామోహంలేనివారిని వేరే చెప్పాలా?

దేహంతో ఉన్న ఆత్మ సత్యం. స్వచ్ఛం, స్వయంప్రకాశకం. అది నిర్గుణమైనది, సద్గుణాన్ని ఆశ్రయించేది, వ్యాపించేది వ్యాపింపచేసేది, మాయవడనిది, అన్నింటికి సాక్షిగా నిలిచేది. ఇది దేహంకంటే భిన్నమైనదని ఎవడు తెలుసుకుంటాడో, అతడు నాయందు ఆసక్తిగలవాడు. కాబట్టి అతడు దేహాన్ని ధరించినవాడే అయినా, ఆ దేహలక్షణాలు పొందక ప్రవర్తిస్తాడు. అంతేకాదు. ఎవడు తన ధర్మాలను తాను నిర్వర్తిస్తూ, కోరికలులేనివాడై, శ్రద్ధతో కూడుకొన్నవాడై, ఎల్లప్పుడు నన్ను భజిస్తాడో, అతడి మనస్సు ప్రశాంతమౌతుంది. ఆ విధంగా ప్రశాంతమనస్కుడు, సత్త్వరజస్తమోగుణాలకు అతీతుడు, సమదృష్టికలవాడు అయిన వ్యక్తి నా పరిపూర్ణ స్వరూప శాంతస్థితిని పొందుతాడు. దానినే మోక్షమని అంటారు. ఈ ఆత్మ అన్ని కాలాల్లో ఒకే విధంగా ఉంటూ, దేనిని అంటి పట్టుకోకుండ తటస్థంగా ఉండేదే అయినా, దీని ద్రవ్యానికి, జ్ఞానానికి, క్రియకు, మనస్సుకు అధిపతిగా నన్ను ఎవడు తెలుసుకోగలడో వాడు పుట్టుకలేని వాడౌతాడు.

ఈ జననమరణాలపరంపర పదార్థాలు, పని, పనిచేయించునది, ప్రాణం తానే అయి వేరువేరుదేహాలు ఆధారంగా కలది కనుక, ప్రాప్తించిన ఆపదల్లో, సంపదల్లో నాయందు మనస్సు లగ్నం చేసిన మహాత్ములు మార్పుపొందరు. అందువల్ల నీవు సుఖదుఃఖాలను సమానంగా చూచే మనస్సుకలవాడవు, సమానమైన ఉత్తమ, మధ్యమ, అధమ స్థితులు కలవాడవు, జయించిన ఇంద్రియాలు మనస్సు కలవాడవు, విశేషంగా లభించిన మంత్రులందరితో కూడినవాడవు అయి అన్ని లోకాలను కాపాడు – అని, మరల ఇలా అన్నాడు.

**సీ.**    **పార్థివోత్తములకుఁబ్రజల రక్షించుట పరమధర్మం బగు నరవరేణ్య!**
**ధరణీశులకుఁ బ్రజాపరిపాలనంబునఁబూని లోకులు సేయు పుణ్యమందు**
**షష్ఠాంశమర్థిని సంప్రాప్తమగునట్లు ప్రజలఁబ్రోవని రాజు ప్రజలచేత**
**నపహృతసత్పుణ్యుఁడై వారు గావించు ఘనపాపఫలముఁ దా ననుభవించుఁ**

**తే.**    **గాన నీవును విప్రవరానుమతము, సంప్రదాయకవిధమునై జరుగు ధర్మ**
**మహిమఁజేపట్టి యర్థకామములయందు, సమత నమ్మోఁటియందు నాసక్తి లేక.**    **541**

**ప్రతి :** నరవరేణ్య= ఓ రాజా! పార్థివ+ఉత్తములకున్= మంచిరాజులకు; ప్రజల రక్షించుట= జనులను కాపాడటం; పరమధర్మంబు+అగున్= ఉత్తమ కార్యమగును; పూని= ప్రయత్నించి; ప్రజాపరిపాలనంబునన్= ప్రజలను పాలించటంవల్ల; లోకులు+చేయు= ప్రజలు చేసే; పుణ్యమందున్= పుణ్యంలో; ధరణీ+ఈశులకున్= రాజులకు; షష్ఠ+అంశము= ఆరోభాగం;

అర్థిని= కోరికతో; సంప్రాప్తము+అగున్= లభిస్తుంది; అట్లు= ఆ విధంగా; ప్రజలన్; ప్రోవని రాజు= రక్షించని ప్రభువు, ప్రజలచేతన్; అపహృత+సత్+పుణ్యుఁడు+ఐ= అపహరింపబడిన మంచిపుణ్యంకలవాడై; వారు+కావించు= వారు చేసే; ఘనపాప ఫలమున్= పెద్ద పాపఫలాన్ని; తాన్+అనుభవించున్+కాన= తాను పొందును కాబట్టి; విప్రవర+అనుమతము= బ్రాహ్మణ శ్రేష్ఠుల యిష్టప్రకారం; నీవును, సంప్రదాయక విధమును+ఐ జరుగు= సంప్రదాయం ప్రకారం జరిగే; ధర్మమహిమన్+చేపట్టి= ధర్మం గొప్పదనాన్ని స్వీకరించి; అర్థకామములయందు= అర్థంలో, కామంలో; సమతన్= సమానభావంతో; ఆ+మూఁటి+అందున్= ఆ మూడింటిపై; ఆసక్తి లేక= కోరిక లేక.

**తా :** ఓ రాజా! రాజోత్తములకు ప్రజలను కాపాడటం ఉత్తమధర్మం. ప్రజలుచేసే పుణ్యకార్యాలలో ఆరోభాగం లోకపాలకుడైన మహారాజుకు లభిస్తుంది. ప్రజలను కాపాడని రాజు పుణ్యాలు హరించబడతాయి. అంతేకాదు, అతడు ప్రజల పాపఫలాన్ని పొందుతాడు. బ్రాహ్మణశ్రేష్ఠులు చెప్పినట్లు సంప్రదాయప్రకారం ధర్మకార్యాచరణ చేయాలి. ధర్మార్థకామాలపట్ల మెలకువతో మెలగాలి. వాటిపై ఆసక్తి చూపవద్దు.

**వ. ఇవ్విధంబున. 542**

**ప్రతి :** ఈ+విధంబునన్.

**తా :** ఈ విధంగా

**క. జనులకు ననురక్తుఁడవై, జననాయక! నీవు ధరణి సమచిత్తుఁడవై**
**యనయముఁబరిపాలించిన, సనకాదులఁగాంతు వాత్మసదనమునందున్. 543**

**ప్రతి :** జననాయక= ఓ రాజా! జనులకు+అనురక్తుఁడవు+ఐ= ప్రజలపట్ల ప్రేమగలవాడవై; ధరణిన్= భూమిపై; సమచిత్తుఁడవు+ఐ= సమభావముకలవాడవై; నీవు అనయమున్= ఎల్లప్పుడు; పరిపాలించినన్= పాలించినచో; ఆత్మసదనమునందున్= నీయింటిలో; సనక+ఆదులన్= సనకసనందనాదులను; కాంతువు= చూస్తావు.

**తా :** ఓ రాజా! ప్రజలపట్ల ప్రేమగలవాడవై భూమిపై సమభావం కలిగి ఎల్లప్పుడు పరిపాలిస్తే నీయింటియందే సనకాదులను చూస్తావు.

**సీ. భూవర! యోగతపోమఖంబుల చేతఁ, గై కొని సులభుండఁ గాని యేను**
**సమచిత్తులైన సజ్జనుల చిత్తంబుల, వర్తించుచుండెడివాఁడ నగుటఁ**
**జేసి తావకశమశీలవిమత్సర, కీర్తనముల వశీకృతుఁడ నైతి;**
**నే నీకు నొక వరం బిచ్చెద వేఁడుము, నావుడు విని మేదినీవరుండు**

**తే. లోకగురుఁడైన యప్పుండరీకనయనుఁ, డానతిచ్చిన మృదులలితామృతోప**
**మాన వాక్యము లాత్మీయమస్తకమునఁ, దాల్చి సమ్మోదితాత్ముఁడై ధరణివిభుఁడు, 544**

**ప్రతి :** భూవర= ఓ రాజా!; యోగతపోమఖంబులచేతన్= యోగము, తపస్సు, యజ్ఞములచే; కైకొని= స్వీకరించి; సులభుండన్+కాని+ఏను= సులువుగ లభించని నేను; సమచిత్తులు+ఐన= సుఖ దుఃఖాలు సమానంగా భావించేవారైన; సత్+జనుల= సత్పురుషుల (మంచివారి); చిత్తంబులన్= మనస్సులలో; వర్తించుచుండెడివాఁడన్= ఉండేవాడిని;

అగుటన్+చేసి= కావడంచేత; తావక= నీయొక్క; శమశీల= శాంత శీలముచేతను; విమత్సరకీర్తనములన్= మాత్సర్యములేని స్తోత్రాలచేతను; వశీకృతుడన్+ఐతి= లోబరచుకొనబడినవాడిని అయ్యాను; నీకు,నేను; ఒకవరంబు= ఒకవరము; ఇచ్చెద= ఇస్తాను; వేడుము= వేడుకొనుము; నావుడు= అని అనగా; మేదినీ వరుండు= రాజు; విని,లోకగురుఁడు+ఐన= సమస్తలోకాలకు గురువైన; ఆ+పుండరీకనయనుఁడు= ఆ తెల్ల తామరవంటి కన్నులు కలవాడైన విష్ణుమూర్తి; ఆనతి+ఇచ్చిన= ఆజ్ఞాపించిన; మృదులలిత+ అమృతోపమానవాక్యములు= అందమై సున్నితమైన అమృతంవంటి మాటలను; ఆత్మీయమస్తకమునన్= తన తలపై; తాల్చి= ధరించి; ధరణివిభుఁడు= రాజు; సమ్మోదిత+ఆత్ముఁడై= ఆనందించినవాడై.

**తా :** ఓ రాజా! యోగం, తపస్సు, యజ్ఞాలచే సులభుడనుకాని నేను సమభావంగల సత్పురుషుల మనస్సులలో ఉండేవాడిని గాబట్టి నీ శాంతశీలానికి, మత్సరంలేని కీర్తనలకు లోబడ్డాను. నీకు నేనొక వరం ఇస్తాను. వేడుకొమ్మనగా పృథుచక్రవర్తి సమస్తలోకాలకు గురువైన ఆ విష్ణుమూర్తి మృదుమధురవచనాలు శిరసావహించి మనస్సులో ఆనందించినవాడై

**క. తన పాదములకు భక్తిన్, వినతుండై యాత్మకర్మ వితతికి లజ్జం**
**దనరుచు నున్న సురేంద్రుని, గనుఁగొని సత్ప్రేమ మొదవఁగౌఁగిటఁజేర్చెన్. 545**

**ప్రతి :** తనపాదములకున్= తన కాళ్లకు; భక్తిన్ వినతుండు+ఐ= భక్తితో శిరస్సువంచి; ఆత్మకర్మవితతికి= తాను చేసిన పనులకు; లజ్జన్+తనరుచున్= సిగ్గుపడుతూ; ఉన్న సుర+ఇంద్రుని= ఉన్న దేవేంద్రుని; కనుఁగొని= చూచి; సత్+ప్రేమము= మంచి స్నేహభావం; ఒదవన్= కలుగగా; కౌఁగిటన్+చేర్చెన్= కౌగిలించుకొన్నాడు.

**తా :** తాను చేసిన పనులకు సిగ్గిల్లుతూ పృథుచక్రవర్తి కాళ్లకు భక్తితో వినమ్రుడై నమస్కరిస్తున్న దేవేంద్రుని చూచి ప్రేమపూర్వకంగా పృథువు కౌగిలించుకొన్నాడు.

**విశే :** చేసిన తప్పుకు సిగ్గుపడటం, భక్తిభావంతో వినమ్రతను ప్రదర్శించడం ఇంద్రుని పశ్చాత్తాపానికి నిదర్శనం.

**వ. ఇట్లు గౌఁగిటంజేర్చి గతద్వేషుండై యున్న యనంతరంబ. 546**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; కౌఁగిటన్+చేర్చి= కౌగిలించుకొని, గతద్వేషుండు+ఐ= ద్వేషభావం పోయినవాడయి; ఉన్న+అనంతరంబు+అ= ఉన్న తర్వాత.

**తా :** అలా కౌగిలించుకొని పృథువుపై ద్వేషభావం లేనివాడైన తర్వాత.

**మ. భగవంతుండును విశ్వరూపకుఁడునై భాసిల్లు నవ్విష్ణుఁ డా**
**జగతీనాథకృతార్చనా నతులచే సంప్రీతచేతస్కుఁడున్**
**నిగృహీతాంఘ్రిసరోరుహద్వయుఁడునై నిల్చెంబ్రయాణాభి ము**
**ఖ్యగరిష్ఠాత్మకుఁడయ్యు నా పృథునిపైఁగారుణ్య మేపారఁగన్. 547**

**ప్రతి :** భగవంతుండును= షడ్గుణైశ్వర సంపన్నుడయిన దైవం; విశ్వరూపకుఁడును+ఐ= సమస్త లోకాల రూపందాల్చినవాడునై; భాసిల్లున్= ప్రకాశించు; ఆ+విష్ణుఁడు= ఆ విష్ణుమూర్తి; ఆ జగతీనాథకృత= ఆ రాజుచే చేయబడిన; అర్చనానతులచే= పూజలు, నమస్కారాలచే; సంప్రీత చేతస్కుఁడున్= తృప్తిపొందినమనస్సుగలవాడు; నిగృహీత+అంఘ్రిసరోరుహద్వయుఁ డును+ఐ= పట్టుకొనబడిన పాదపద్మములుగలవాడై; ప్రయాణ+అభిముఖ్య గరిష్ఠ+ఆత్మకుఁడు+అయ్యు= బయలుదేరి

వెళ్లడానికి నిశ్చయించుకొన్న మనస్సు గలవాడైనప్పటికీ; ఆ పృథునిపైన్= ఆ పృథుచక్రవర్తిపై; కారుణ్యము+ఏపారఁగన్= దయనిండగా; నిల్చెన్= నిలబడెను.

**తా :** విశ్వరూపుడు, భగవంతుడు అయిన ఆ విష్ణుమూర్తి, ఆ రాజు చేసిన పూజానమస్కారాలచే తృప్తి చెందిన మనస్సుగలవాడై, పృథువు తన కాళ్లకు నమస్కరించగా, ప్రయాణం కొనసాగించాలనుకొన్నప్పటికీ పృథువుపై దయతో నిలిచిపోయాడు.

**వ. ఇట్లు దనమీఁది యనుగ్రహంబునం జేసి విలంబితుం డగుటయు న య్యాది రాజన్యుండైన పృథుచక్రవర్తి యమ్ముకుంద సందర్శనానంద బాష్పజలబిందు సందోహ కందళిత నయనార విందుండై యవ్విభుమూర్తిం గనుంగొని కనుంగొనలేక గద్గదకంఠుండై పలుకలేక యుండియు నెట్టకేలకుఁ దన హృదయంబున నద్దేవుని నుపగూహనంబు గావించి తన్మూర్తి ధరియించి కన్నులం దొరఁగు నానంద బాష్పంబులు దుడిచికొని విలోకనంబు సేయుచు, నతృప్తదృగ్గోచరుండును, గరుడస్కంధవిన్యస్తహస్తుండును, వసుధాతలస్థిత పాదకమలుండును నై యొప్పు న ద్దివ్య పురుషున కిట్లనియె. 548**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; తనమీఁది+అనుగ్రహంబునన్+చేసి= తనమీది దయతో; విలంబితుండు+అగుటయున్= ఆలసించినవాడయినందున; ఆ+ఆదిరాజన్యుండు+ఐన= ఆ మొదటిరాజైన; పృథుచక్రవర్తి, ఆ+ముకుంద= ఆ విష్ణుని; సందర్శన= చూడటంచేత; ఆనందబాష్పజలబిందు= సంతోషంతో కూడిన కన్నీటి బిందువుల; సందోహ= సముదాయంచేత; కందళిత= వికసించిన; నయన+అరవిందుఁడు+ఐ= పద్మనేత్రుడై; ఆ+విభుమూర్తిన్+కనుంగొని= ఆ స్వామి రూపాన్నిచూచి; కనుంగొనలేక= చూడలేక; గద్గదకంఠుండు+ఐ= బొంగురు బోయిన కంఠంగలవాడై; పలుకలేక+ఉండియున్= మాట్లాడలేక పోయినప్పటికీ; ఎట్టకేలకున్= ఎలాగో; తన హృదయంబునన్= తన మనస్సులో; ఆ+దేవునిన్= ఆ భగవంతుని; ఉపగూహనంబు+కావించి= కౌగిలించి; తద్+మూర్తి= ఆ రూపం; ధరియించి= తాల్చి; కన్నులన్+ తొరఁగు= కంటినుండి ప్రవహించు; ఆనందబాష్పంబులు= సంతోషముతో కూడిన కన్నీరు; తుడిచికొని, విలోకనంబు+చేయుచున్= చూస్తూ; అతృప్త దృగ్గోచరుండును= కళ్ళకు తృప్తిదీర కన్పించనివాడును; గరుడస్కంధ విన్యస్తహస్తుండును= గరుత్మంతుని మూపుపై చేయిపెట్టిన వానిని; వసుధాతలస్థిత= నేలపై ఉంచిన; పాదకమలుండును+ఐ= పాదపద్మాలతో; ఒప్పు= ప్రకాశించు; ఆ+దివ్యపురుషునకు= ఆ దివ్యపురుషునితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** ఈ విధంగా తనమీద దయతో ఆలసించడంతో విష్ణుని సందర్శించడంవల్ల కలిగిన ఆనందంతో కన్నీటి పర్యంతమై ఆ పరమేశ్వరుని మూర్తిని చూచి, స్పష్టంగా చూడలేక బొంగురుపోయిన గొంతుతో మాట్లాడలేక, ఎలాగో తన మనస్సులో ఆ దేవదేవుని భావించుకొని కౌగిలించుకొని, కన్నీటిధారలను తుడుచుకొని భగవంతుని దర్శిస్తూ, కళ్ళకు తృప్తి దీర అగుపించనివాడును, గరుడునిమూపుపై చేయిమోపి, నేలపై తన పాదపద్మాలు నిలిపి ఉన్నవాడును అయిన ఆ దేవతామూర్తితో ఆదిరాజైన పృథుచక్రవర్తి ఇలా అన్నాడు.

**క. వరదా! యీశ్వర! నిను స, త్పురుషుఁడు దేహాభిమానభోగములకు నీ**
**వరమెట్లు గోరు నిహసుఖ, వరములు నారకులకైన వఱలవె చెపుమా. 549**

**ప్రతి :** వరదా= వరాలనిచ్చేవాడా!; ఈశ్వర= భగవంతుడా!; నిను= నిన్ను; సత్+పురుషుఁడు= సజ్జనుడు; దేహ+అభిమాన భోగములకున్= దేహంమీది ప్రీతితో సుఖాలు అనుభవించటానికి; నీ వరము; ఎట్లు+కోరున్= ఎలా అడుగుతాడు;

ఇహసుఖవరములు= ఈ లోకంలో సుఖాన్నిచ్చే వరాలు; నారకులకు+ఐనన్= నరకం పొందినవారికైనా; వరలవె= ఉండవా? చెపుమా?= చెప్పవయ్యా!

**తా :** ఓ భగవంతుడా! వరదుడా! నిన్ను సజ్జనుడైనవాడు దేహాభిమానంతో భోగాలు అనుభవించాలని వరమెలా కోరతాడు. ఇహసుఖాలవరాలు నరకంలో ఉన్నవారికి కూడ లభిస్తాయి గదా! చెప్పవయ్యా!

**చ. ఘనమగు దేవ! యీ వరమె కాదు మహాత్మకవాగ్వినిర్గతం**
**బనఁదగు తావకీయచరణాంబుజచారుమరందరూపమై**
**తనరిన కీర్తియున్ విని ముదంబును బొందఁగలేని మోక్షమై**
**నను మదిఁగోర నొల్ల నఘనాశ! రమేశ! సరోజలోచనా! 550**

**ప్రతి :** ఘనము+అగు దేవ= గొప్పవాడవైన ఓ దేవా!; అఘనాశ= పాపాలను పోగొట్టేవాడా!; రమా+ఈశ= లక్ష్మీపతీ!; సరోజలోచనా= పద్మనయనా!; ఈ వరమె కాదు= ఈ వరము మాత్రమేకాక; మహాత్మక= మహానుభావులైనవారి; వాక్+వినిర్+గతంబు+అనన్+తగు= వాక్కులనుండి వెలువడినవైన; తావకీయ= మీ యొక్క; చరణ+అంబుజ= పాదపద్మాలయొక్క; చారుమరందరూపము+ఐ= తేనెరూపంలో ఒప్పిదమైన; తనరిన= విస్తరించిన; కీర్తియున్ విని= పొగడ్తలువిని; ముదంబును+పొందన్+కన్+లేని= సంతోషాన్ని పొందలేని; మోక్షము+ఐనను= ముక్తిని కూడా; మదిన్= మనస్సులో; కోరన్+ఒల్లను= కోరడానికి ఇష్టపడను.

**తా :** ఓ మహాత్మా! ఓ పాపనాశకా! లక్ష్మీపతీ! పద్మనయనా! ఈ వరమే కాదు. మహానుభావులైనవారి వాక్కులనుండి వెలువడే తేనెలవంటి మీ పాదపద్మాలను గూర్చిన పొగడ్తలు విని సంతోషం పొందుతాను. అలా కాకుండ మోక్షాన్ని ప్రసాదించినా నేనంగీకరించను.

**విశే :** భవబంధ విముక్త స్థితియే మోక్షం. అది ఒక విలక్షణ మానసిక పరిపక్వ దశావిశేషమే. అంతేగాని అదొక ప్రదేశం కాదు.

**క. అది గాన పద్మలోచన!, సదమల భవదీయఘనయశము వినుటకునై**
**పదివేల చెవులు కృప ని, మ్మిదియే నా యభిమతంబు నిపుడు ముకుందా! 551**

**ప్రతి :** ముకుందా= శ్రీహరీ!; పద్మలోచన= పద్మనయనా!; అదిగాన= అందువలన; సత్+అమల= స్వచ్ఛమైన; భవదీయ= నీయొక్క; ఘనయశము= గొప్పకీర్తిని; వినుటకును+ఐ= వినడానికి; పదివేల చెవులు, కృపన్+ఇమ్ము= దయతో ప్రసాదించు; ఇపుడు= ఇప్పుడు, ఇదియే; నా+అభిమతంబు= నా కోరిక.

**తా :** అందుచేత ఓ పద్మనయనా! శ్రీహరీ! అందువలన స్వచ్ఛమైన నీ గొప్పకీర్తిని వినడానికి దయతో పదివేల చెవులు ప్రసాదించు. ఇప్పుడు అదే నా కోరిక.

**చ. అనఘ! మహాత్మవాగ్గళితమైన భవత్పదపంకజాత సం**
**జనితసుధాకణానిలవశంబున విస్మృతతత్త్వమార్గ వ**
**ర్తనులగు దుష్టయోగులకుఁగ్రమ్మఱఁదత్త్వముఁజూపఁజాలు ని**
**ట్లొనరుట దక్క నన్యవర మొల్లఁ బయోరుహపత్త్రలోచనా! 552**

**ప్రతి :** అనఘ= పాపరహితుడా!, పయోరుహ పత్రలోచనా!= పద్మపత్రాలవంటి కనులు గలవాడా!, మహాత్మ= మహాపురుషుల; వాక్+గళితమైన= వాక్కులనుండి వెలువడిన, భవత్+పదపంకజాత సంజనిత= నీ పాద పద్మములనుండి పుట్టిన, సుధాకణ+అనిల వశంబునన్= అమృతకణాలనుండి వీస్తున్నగాలి; విస్మృత= మరిచిపోయిన, తత్త్వమార్గవర్తనులు+అగు= పరమాత్మను చేరుకొనే మార్గం కలవారైన, దుష్టయోగులకున్= కపటయోగులకు, క్రమ్మఱన్= తిరిగి, తత్త్వమున్+చూపన్+చాలున్= ఆ పరమాత్మను చేరుకొనే మార్గాన్ని చూపగలుగుతుంది; ఇట్లు+ఒనరుట తక్కన్= ఇలా కలగటం తప్ప, అన్యవరము= ఇతరవరమును, ఒల్లన్= కోరను.

**తా :** పాపరహితా! పద్మనయనా! పెద్దలవాక్కులనుండి నీ పాదపద్మాలనుండి పుట్టిన అమృతకణాల వాయు తత్త్వమార్గం మరచిన దుష్టయోగులను, ఆ అమృతకణాలచే తత్త్వమార్గం వైపు మరలించగలుగుతుంది. అలాంటి వరం అనుగ్రహించు. అది తప్ప ఇతరవరాలు నేను కోరను.

**సీ. వినుతమంగళయశోవిభవ! సర్వేశ్వర! యిందిర గుణసంగ్రహేచ్ఛఁజేసి**
**యే నీదు శివతరంబైన సత్కీర్తిని నర్థియై వరియించె నట్టి కీర్తి**
**చతురసత్పురుషసంగతము గల్గుచునుండ ధృతి నెవ్వఁడేని యాదృచ్ఛికతను**
**జేసియు నొకమాటు చెవులార విన్నవాఁ డనయంబును గుణజ్ఞుఁడయ్యేనేని**

**తే. విరతి నేరీతిఁ బొందును ధరణిఁబశువుఁ, దక్కఁ దక్కిన తద్‌జ్ఞుండు దనుజభేది**
**గాన యుత్సుకమతినైన యేను లక్ష్మి, కరణి నిన్ను భజింతునో పరమపురుష! 553**

**ప్రతి :** ఓ పరమపురుష= ఓ పురుషోత్తమా!; వినుత= ప్రశస్తమైన; మంగళ యశస్‌విభవ= శుభప్రదమైన కీర్తితో వెలిగేవాడా!; సర్వ+ఈశ్వర= ఓ పరమేశ్వరా!; ఇందిర= లక్ష్మీదేవి; గుణసంగ్రహ+ఇచ్ఛన్+చేసియే= గుణాలు చక్కగా గ్రహించేకోర్కెతోనే; నీదు శివతరంబు+ఐన= నీ యొక్క శుభప్రదమైన; సత్+కీర్తిని= గొప్పయశస్సును; అర్థి+ఐ= కోరి; వరియించెన్= వరించింది; అట్టి కీర్తి, చతుర సత్పురుష సంగతము= చతురులైన సజ్జనుల సాంగత్యము; కల్గుచునుండ= లభింపగా; ధృతిన్+ఎవ్వఁడేని= ధైర్యంతో ఎవడైనా; యాదృచ్ఛికతనుచేసియున్= తలవనితలంపుగా; ఒకమాటు= ఒకసారి; చెవులారన్= వీనులవిందుగా; విన్నవాఁడు, అనయంబును= నిరంతరం; గుణజ్ఞుఁడు+అయ్యేనేని= గుణాలను తెలుసుకోగలిగితే; దనుజభేది= రాక్షసులను జంపువాడా; ధరణిన్= భూమిపై; పశువు+తక్క= పశువుగాక; తక్కిన= మిగిలిన; తత్‌జ్ఞుండు= తత్త్వం తెలిసినవాడు; విరతిన్= విరక్తిని; ఏ రీతిన్+పొందును= ఏ విధంగా పొందుతాడు; కాన= కావున; ఉత్సుకమతిని+ఐన+ఏను= తెలుసుకోవాలన్న కోరికగల నేను; లక్ష్మికరణి= శ్రీదేవివలె; నిన్ను భజింతును+ఓ= నిన్ను పూజిస్తాను.

**తా :** రాక్షసాంతకా! పరమపురుషా మంగళకరాలై సుప్రసిద్ధాలైన వైభవాలు కలవాడా! నీ వైభవాలే ఈ సృష్టిలో సద్గుణాలు. అలాంటి గుణాలకై ఆశపడి లక్ష్మీదేవి నిన్నాశ్రయించింది. గుణాలను గ్రహించాలనే కుతూహలం ఆమెకుంది. కనుక నిన్నే వరించింది.

ఈ విధంగా నీ ప్రసిద్ధి శుభప్రదమని ఆమెకు తెలుసు. ఆమె నిన్నుకోరి వరించింది. నీ గుణాల నొకమారు యాదృచ్ఛికంగానైనా చెవులార వినగలిగినవాడు నీ వెంటబడునుగాని, నీ గుణాలపట్ల విరక్తినెలా పొందుతాడు.

నీ గుణాలను నీ గుణాలుగా విన గలగటానికి సత్యదర్శనులైన వారి సాంగత్యం కావాలి. వారి అనుగ్రహమే నీ అనుగ్రహం.

తెలిసి ఒకమారు నీ గుణముల రుచి తెలిసికొన్నవాడు నీ వెంటపడకమానడు. ఎవడైనా మానితే వాడు పశువే. నేనును నీ గుణాలలో ఉత్సాహం చెందినవాడినే కాబట్టి, లక్ష్మీదేవి భజించిన పద్ధతిలోనే నేనూ నిన్ను భజిస్తాను.

**వ. ఇట్లు భవదీయ సేవాతత్పరులమైన యిందిరయు నేను నేక పదార్థాభిలాషం జేసి స్పర్ధమానుల మగుచున్న మా యిద్దఱకును బర్యాయ సేవంజేసి కలహంబు లేకుండ ని మ్మట్లు గాక భవదీయ చరణసరోరుహ సేవాసక్త మనోవిస్తారుల మగుటం జేసి యేన యేన మున్ను భజియింతు నను తలంపులం గలహం బయిననుం గానిమ్ము, దేవా యని వెండియు నిట్లయె. 554**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; భవదీయ సేవాతత్పరులము+ఐన= నీ సేవయందు దృష్టిగల; ఇందిరయున్= లక్ష్మీదేవియు; నేనును= నేను; ఏక పదార్థ+అభిలాషన్+చేసి= ఒకే విషయంపై ఆసక్తిగలిగినందున; స్పర్ధమానులము+అగుచున్న= పోటీపడుతున్న; మా యిద్దరకును= మా ఇద్దరికీ; పర్యాయసేవన్+చేసి= ఒకరి తర్వాత ఒకరు సేవచేసే విధంగాచేసి; కలహంబు లేకుండన్+ఇమ్ము= తగవు లేకుండాచేయి; అట్లు+కాక= అలా గాక; భవదీయచరణసరోరుహ= నీ పాదపద్మాల; సేవా= సేవయందు; ఆసక్త= ఆసక్తమైన; మనోవిస్తారులము= మనస్సుయొక్క విస్తారం కలవారము; అగుటన్+చేసి= కావడంవల్ల; ఏనఏన= నేనే; నేనే, మున్ను= ముందుగా; భజియింతున్= సేవిస్తాను; అను తలంపులన్= అనే కోర్కెలతో; కలహంబు= తగవు; అయిననున్+కానిమ్ము= అయినా కానీ; దేవా!,అని వెండియున్= మరలా; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** ఈ విధంగా నీ సేవాసక్తిగల నేను, లక్ష్మీదేవి ఒకే విషయంపై కోరికతో పోటీ పడతాము గాబట్టి మా యిద్దరికీ ఒకరి తర్వాత ఒకరు తగవులేకుండా నిన్ను సేవించే అవకాశం ఇవ్వు. అలాకాక నీ పాదపద్మాలపై సేవాసక్తి గల మేము నేనంటే నేననే భావంతో తగవు రావచ్చు. దేవా! అయినా అలానే కానీ! అని మరలా ఇలా అన్నాడు.

**సీ. జగదీశ! దేవ! యుష్మత్పదకైంకర్యపరతఁ దనర్చు సాగరతనూజ**
**కృత్యంబునందు నకిల్బిషబుద్ధినేఁ బ్రీతిఁ గోరుట జగన్మాతయైన**
**యా రమాసతితోడి వైర మవశ్యంబుఁ గల్గు నైనను దయాకార! నీవు**
**దీనవత్సలుఁడవు గాన స్వల్పంబైన నధికంబు సేయుదు, వట్లుగాన**

**తే. భవ్యచరిత! నిజస్వరూపంబునందు, నభిరతుఁడవైన నీవు నన్నాదరించు**
**పగిది నిందిర నాదరింపవు మహాత్మ!, భక్తజనలోకమందార! భవవిదూర! 555**

**ప్రతి :** జగత్+ఈశ= లోకాధినాయకా!; దేవ, యుష్మత్+పదకైంకర్యపరతన్= నీ పాదసేవాతత్పరతచే; తనర్చు= శోభించు; సాగర తనూజ= లక్ష్మీదేవి; కృత్యంబునందున్= పనియందు; అకిల్బిషబుద్ధిన్= పాపరహిత మనస్సుతో; ఏన్+ప్రీతిన్+కోరుట= నేను యిష్ట పడటం వలన; జగత్+మాత+అయిన= లోకమాతఅయిన; ఆ రమాసతితోడివైరము= ఆ లక్ష్మీదేవితో తగవు; అవశ్యంబు+కల్గును= తప్పక కలుగుతుంది; ఐనను, దయాకార!= దయాస్వరూపా!; నీవు దీనవత్సలుఁడవు= నీవు దీనులపై వాత్సల్యం చూపించేవాడవు; కాన, స్వల్పంబు+ఐనన్= కొద్దిదైనా; అధికంబు+చేయుదువు= ఎక్కువ జేస్తావు; అట్లు+కానన్= అందువలన; భవ్యచరిత!= పుణ్యచరిత్ర గలవాడా!; నిజస్వరూపంబు+అందున్= నీ మూర్తిలో; అభిరతుఁడవు+ఐన నీవు=

కుతూహలంకల నీవు; నన్ను+ఆదరించుపగిదిన్= నన్ను ఆదరంగా చూసినట్లే; ఇందిరన్= లక్ష్మీదేవిని; మహాత్మ= పుణ్యాత్మా! భక్తజనలోకమందార= భక్తులకు కల్పవృక్షంవంటివాడా; భవవిదూర= పాపాలకు దూరమైనవాడా; ఆదరింపవు= ఆదరంగా చూడవు.

**తా :** దేవాధిదేవా! భక్తలోకమందారా! భవవిదూరా! నీ పాదసేవ చేసే లక్ష్మీదేవి పనులను పాపరహితబుద్ధితో నేను కోరడంవల్ల ఆ లోకమాత అయిన లక్ష్మీదేవితో తగవు తప్పక వస్తుంది. దయాస్వభావుడవైన నీవు దీనులను బ్రోచేవాడివిగాన కొద్దిపాటి దానిని గూడ అధికం చేయగలవు. నీ నిజస్వరూపాన్ని చూపడంలో ఆసక్తిగల నీవు నన్ను ఆదరించినట్లు ఓ మహానుభావా! లక్ష్మీదేవి నాదరింపవు.

**వ. ఇట్లగుటం జేసి సత్పురుషులైనవారలు నిరస్తమాయా గుణ సముదయంబు గల నిన్ను భజియింతురు. వారలు భవత్పాదానుస్మరణరూపంబయిన ప్రయోజనంబు దక్క నితర ప్రయోజనంబుల నెఱుంగరు, దేవా! సేవక జనంబులను వరంబులు వేఁడు మని జగద్విమోహనంబు లైన వాక్యంబులు వలుకుదు, వట్టి భవదీయ వాక్య తంత్రీ నిబద్ధులు లోకులు గాకుండి రేని ఫలకాములై కర్మంబుల నెట్టు లాచరింతు? రీశా! భవదీయ మాయావిమోహితులై జను లేమి కారణంబున నీకంటె నితరంబులఁ గోరుచుందు? రిట్లగుటం జేసి తండ్రి దనంతన బాలహితం బాచరించునట్లు మాకు నీవ హితాచరణంబాచరింప నర్హుండవని పలికిన నాదిరాజర్షియైన పృథుచక్రవర్తి యర్థవంతంబులయిన వచనంబులు విని విశ్వద్రష్టయగు నారాయణుండు సంతుష్టాంతరంగుండై యిట్లనియె? "మహారాజా! దైవ ప్రేరితుండవై నాయెడ నిట్టి బుద్ధి గలుగుటం జేసి యచలాచలంబగు భక్తి వొడము, దానిచే దుస్తరంబగు మదీయమాయం దరింతువు, నీవు నాచే నాదిష్టంబగు కృత్యం బప్రమత్తుండవగుచు నాచరించిన సకలశుభంబులం బొందుదువు, మదీయ భక్తజనంబులు స్వర్గాపవర్గ నరకంబులం దుల్యంబులుగా నవలోకింతురు, గావున నీ యధ్యవసాయంబు నట్టిదియ, మఱియు మదీయాదేశంబున దుస్త్యజంబగు రోషంబును దృజించి నా యెడ భక్తి సలిపితివి గాన నిదియె నాకుఁ బరమహర్షదంబగు, నని యభినందించి యనుగ్రహించి యతండు గావించు పూజలు గయికొని గమనోన్ముఖుండయ్యె, నయ్యవసరంబున. 556**

ప్రతి : ఇట్లు+అగుటన్+చేసి= ఇలా అవడంవల్ల; సత్పురుషులు+ఐనవారలు మంచివారు; నిరస్తమాయా గుణ సముదయంబు+కల= తోసివేయబడిన మాయాగుణ సమూహంగల; నిన్ను, భజియింతురు= పూజిస్తారు; వారలు, భవత్+పాద+ అనుస్మరణరూపంబు+అయిన= మీ పాదములను స్మరించడమనే; ప్రయోజనంబు+తక్కన్= ఉపయోగము తప్ప; ఇతర ప్రయోజనంబులన్= తక్కిన ఉపయోగాలను; ఎఱుంగరు= తెలుసుకోరు; దేవా= స్వామీ!; సేవకజనంబులను= నిన్ను సేవించేవారిని; వరంబులు= కోర్కెలు; వేఁడుము+అని= కోరుమని; జగత్+విమోహనంబులు+ఐన= లోకాలను మోహింపజేసేవైన; వాక్యంబులు= మాటలు; పలుకుదువు= మాట్లాడుతావు; అట్టిభవదీయ= అలాంటి నీ; వాక్యతంత్రీ నిబద్ధులు= మాటలనే లోహపు తీగలతో కట్టివేయబడిన; లోకులు= ప్రజలు; కాకుండిరి+ఏని= కాకపోతే; ఫలకాములు+ఐ= ఫలాలను కోరుకొనువారై; కర్మంబులన్= పనులను; ఎట్టులు+ఆచరింతురు= ఎలా చేస్తారు?; ఈశా= స్వామీ; భవదీయ, మాయా, విమోహితులు+ఐ= నీ మాయచేత జ్ఞానాన్ని కోల్పోయినవారై; జనులు= ప్రజలు; ఏమికారణంబునన్= ఏ

కారణంతో; నీకంటెన్= నీ కన్న; ఇతరంబులన్+కోరుచుందురు= తక్కినవి కోరుతారు; ఇట్లు+అగుటన్+చేసి= ఇలా కావడంవల్ల; తండ్రి= తండ్రియైనవాడు; తనంతన= తనంతట తానే; బాలహితంబు= పిల్లలక్షేమం; ఆచరించునట్లు= అమలుపరచునట్లు; నాకు, నీవు+అ= నీవే; హిత+ఆచరణంబు= మంచిని చేయుటను; ఆచరింపన్= చేయడానికి; అర్హుండవు= తగినవాడవు; అనిపలికిన= అనిచెప్పిన; ఆదిరాజర్షి+అయిన= మొదటి రాజర్షి అయిన; పృథుచక్రవర్తియొక్క, అర్థవంతంబులు+ అయిన= సార్థకములైన; వచనంబులు విని= మాటలు విని; విశ్వద్రష్ట+అగు= లోకాలను దర్శించగలవాడయిన; నారాయణుండు= విష్ణుమూర్తి; సంతుష్ట+అంతరంగుండు+ఐ= సంతోషించిన మనస్సుగలవాడై; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు; మహారాజా!= పృథుచక్రవర్తీ; దైవప్రేరితుండవు+ఐ= దైవముచే ప్రేరేపించబడినవాడై; నాయెడన్= నాపట్ల; ఇట్టిబుద్ధి= ఇలాంటి మనస్సు; కలుగుటన్+చేసి= ఉండటంవల్ల; అచల+అచలంబు+అగు= కదలని కొండవలె; నిశ్చలమైన, భక్తి, పొడమున్= కలుగుతుంది; దానిచేన్= దానివలన; దుస్తరంబు+అగు= తరింపరాని; మదీయ= నాయొక్క; మాయన్+తరింతువు= మాయను దాటుతావు; నీవు నాచే; ఆదిష్టంబు+అగు= ఆదేశించబడిన; కృత్యంబు= పనిని; అప్రమత్తుండవు+అగుచున్= ఏమరుపాటు లేనివాడై; ఆచరించిన= చేసిన; సకలశుభంబులన్= అన్ని శుభాలను; పొందుదువు= అందుకొంటావు; మదీయ భక్తజనంబులు= నా భక్తులు; స్వర్గ+అపవర్గ, నరకంబులన్= స్వర్గాన్ని; మోక్షాన్ని, నరకాన్ని, తుల్యంబులుగాన్= సమానంగా; అవలోకింతురు= చూస్తారు; కావునన్, ఈ అధి+అవసాయము= ఈ పూనిక; అట్టిది+అ= అలాంటిదే; మఱియు, మదీయ+ఆదేశంబున= నా ఆజ్ఞచే; దుస్+త్యజంబు+అగు= విడిచిపెట్టడానికి కష్టమైన; రోషంబును= కోపాన్ని; త్యజించి= వదలిపెట్టి; నాయెడన్= నాపట్ల; భక్తిసలిపితివి+కానన్= భక్తిని ప్రదర్శించావు కాబట్టి; ఇది+ఎ= ఇదే; నాకున్ పరమహర్షదంబు+అగున్= నాకు మిక్కిలి సంతోషకారి అవుతుంది; అని+అభినందించి= అని ప్రశంసించి; అనుగ్రహించి= మన్నించి; అతండు+కావించు= ఆయనచేసే; పూజలు కయికొని= పూజలు స్వీకరించి; గమన+ఉన్ముఖుండు+ అయ్యెన్= ప్రయాణానికి సిద్ధమాయెను; ఆ+అవసరంబున= ఆ సమయంలో.

**తా :** అందువల్ల సత్పురుషులు నిరంతరం మాయాగుణాలు లేని నిన్ను భజిస్తారు. వారు నీపాద సేవనం తప్ప మరొక ప్రయోజనం ఎరుగరు. ఓ దేవా! నీవు నీ సేవకులను వరాలు కోరుకొమ్మని మోహపూరితమైన మాటలు చెబుతావు. అలాంటి నీ మాటలకు లోబడని జనులు కోరికలతో పనులు ఎలా చేస్తారు? దేవా! నీ మాయాజాలంలో పడ్డ ప్రజలు ఏ కారణంతో నీ పాదసేవకంటె భిన్నమైన వాటిని కోరుతారు? అందువల్ల బిడ్డలయోగక్షేమాలను తనంతతానుగా కోరుకొనే తండ్రివలె నీవు నాకు మేలు చేకూర్చేందుకు సమర్థుడవు. అని పలికిన పృథుచక్రవర్తి మాటలు విని జగద్రక్షకుడైన ఆ విష్ణుమూర్తి సంతోషంతో కూడిన మనస్సుతో ఇలా అన్నాడు. "పృథుచక్రవర్తీ! దైవానుగ్రహంవల్ల నా పట్ల నిశ్చలమైన భక్తి నీకు కలిగింది. దానివల్ల నీవు మాయనుండి బయటపడగలవు. నేను ఆదేశించిన విధంగా పనులు ఏమరుపాటులేకుండా చేస్తే నీకు శుభాలు కలుగుతాయి. నా భక్తులంతా స్వర్గమోక్షనరకాలను సమానంగా భావిస్తారు. నీ ప్రయత్నం కూడా అలాంటిదే. నా ఆదేశం ప్రకారం వదలిపెట్టలేని కోపాన్ని వదలుకొని నాపట్ల భక్తిని చూపించావు. అదేనాకు సంతోషం". అని పొగిడి, అనుగ్రహించి, పృథువు చేసిన పూజలు స్వీకరించి విష్ణువు బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. అప్పుడు

**సీ.** **నరసిద్ధచారణసురమునిగంధర్వకిన్నర పితృసాధ్యపన్నగులును**
**నఖిలజనంబులు హరిపార్శ్వవర్తులు నానందమగ్నాంగు లగుచు వేడ్క**
**యజ్ఞేశచింతనుండైన యా పృథువుచే సత్కారమునుఁబొంది సమ్మదమునఁ**
**జనిరి నిజాధివాసములకు, భగవంతుఁ డైన నారాయణుండచ్యుతుండు**

**తే. దగ నుపాధ్యాయసహితుఁడై తనరు పృథుని, విమలమతులయి చూచుచు నమరవరులు**
**దన్ను జయజయకలితశబ్దములఁబొగడఁ, జనియె నప్పుడు వైకుంఠసదనమునకు. 557**

**ప్రతి :** నర= నరులు; సిద్ధ= సిద్ధులు; చారణ= చారణులు; సుర= దేవతలు; ముని= మునులు; గంధర్వ= గంధర్వులు; కిన్నర= కిన్నరులు; పితృ= పితృదేవతలు; సాధ్య= సాధ్యులు; పన్నగులును= నాగులు; అఖిలజనంబులు= అందరు జనులు; హరిపార్శ్వవర్తులును= విష్ణుదేవుని చెంతనున్నవారు; వేడ్కన్= సంతోషంతో; ఆనందమగ్న+అంగులు+అగుచున్= ఆనందంలో మునిగిన శరీరాలు గలవారవుతూ; యజ్ఞ+ఈశ= యాగాలకధిపతిని; చింతనుండు+ఐన= ధ్యానించువాడు అయిన; ఆ పృథువుచే= ఆ పృథుచక్రవర్తిచే; సత్కారమును+పొంది= సమ్మానాన్నిపొంది; సమ్మదమునన్= సంతోషంతో; నిజ+అధివాసములకున్= తమతమ నివాసాలకు; చనిరి= వెళ్లిరి; ఉపాధ్యాయ సహితుఁడు+ఐ= ఋత్విక్కులతో కూడినవాడై; తనరు= ఒప్పు; పృథునిన్= పృథుని; విమలమతులు+అయి= స్వచ్ఛమైన మనస్సులు గలవారై; చూచుచున్= చూస్తూ; తన్ను= విష్ణువును; అమరవరులు= దేవతలు; జయజయ కలిత శబ్దములన్= జయ జయ నినాదాలతో; పొగడన్= పొగడగా; భగవంతుండు+ఐన= భగవంతుడైన; అచ్యుతుండు= నాశములేనివాడైన; నారాయణుండు= ఆ విష్ణుభగవానుడు; అప్పుడు, వైకుంఠసదనమునకున్= వైకుంఠ నివాసమునకు; చనియెన్= వెళ్లాడు.

**తా :** నరులు, సిద్ధ, సాధ్య, కిన్నర, చారణ, గంధర్వ, ముని, నాగాదిజనులు, హరి పార్శ్వవర్తులు ఆనందంలో మునిగిన శరీరాలు కలవారవుతూ వేడుకగా యజ్ఞేశుని (హరిని) చింతించువాడైన పృథుచక్రవర్తి చేసిన సన్మానాలు సంతోషంగా స్వీకరించి తమతమ సెలవులకు వెళ్లారు. ఋత్విక్కులతో కూడిన పృథుచక్రవర్తిని ఆనందంతో చూస్తూ దేవతలందరూ తనను జయజయ నినాదాలతో స్తుతిస్తుండగా విష్ణుభగవానుడు వైకుంఠధామానికి వెళ్లాడు.

**వ. అంతఁ బృథుచక్రవర్తియు నింద్రియాగోచరుండయ్యును దర్శితాత్ముండును దేవదేవుండును నయిన వాసుదేవునకు నమస్కరించి నిజపురంబునకుం జనుదెంచు సమయంబున మౌక్తిక కుసుమ మాలికా దుకూల స్వర్ణతోరణాలంకృతంబును, లలిత సుగంధ ధూపవిలసితంబును, రత్నమయ రంగ వల్లికా విరాజితంబును, ఫలపుష్ప లాజాక్షత దీపమాలికా స్తంభ పూగపోతాభిరామ ప్రతిగృహ ప్రాంగణంబును, మృగమద ఘనసార చందనాగరు వాఃపూర సంసిక్త రథ్యావళీ విభాసితంబును, దరుపల్లవాభి శోభితంబును నైన పురంబుఁ బ్రవేశించి రాజమార్గంబునం జనుదేర మండిత రత్నకుండలమణి మరీచులు గండ ఫలకంబులం దాండవంబులు సలుపం బురకామినులు గనక పాత్ర విరచితంబు లయిన యశేష మంగళ నీరాజనంబుల నివాళింప, శంఖ దుందుభి ప్రముఖ తూర్య ఘోషంబులును, ఋత్విక్సికాయాశీర్వచనంబులును జెలంగ వందిమాగధ జనసంస్తూయమానుం డగుచు విగతగర్వుండై యంతఃపురంబుంబ్రవేశించి యనంతరంబ. 558**

**ప్రతి :** అంతన్= తర్వాత; పృథుచక్రవర్తియును= పృథుచక్రవర్తికూడా; ఇంద్రియ+అగోచరుండు+అయ్యును= ఇంద్రియాలకు కనిపించక పోయినా; దర్శిత+ఆత్ముండును= దర్శింపజేయబడిన ఆత్మకలవాడును; దేవదేవుండును+అయిన= దేవులకు దేవుడైన; వాసుదేవునకున్= విష్ణువునకు, నమస్కరించి; నిజపురంబునకున్= తన పట్టణానికి; చనుదెంచు సమయంబునన్= వస్తున్న వేళ; మౌక్తిక= ముత్యాలతో; కుసుమమాలికా= పూలమాలలతో; దుకూల= వస్త్రాలతో; స్వర్ణతోరణ= బంగారు తోరణాలతో; అలంకృతంబును= అలంకరించబడినదియు; లలిత సుగంధ ధూపవిలసితంబును= సుకుమారమైన

మంచివాసనలుగల ధూపాలతో ప్రకాశించేదియు; రత్నమయ, రంగవల్లికా= రత్నాల ముగ్గులతో; విరాజితంబును= ప్రకాశించినదియు; ఫలపుష్ప= పండ్లు, పూలు; లాజ+అక్షత= పేలాలు; అక్షింతలు దీపమాలికాస్తంభ= దీపమాలలతో విరాజిల్లే స్తంభాలు; పూగపోత= పోకచెట్ల బోదెలతో; అభిరామ= ప్రకాశించే; ప్రతిగృహప్రాంగణంబును= అన్ని వాకిళ్ల ముంగిళ్లు కలదియు; మృగమద= కస్తూరి; ఘనసార= పచ్చకర్పూరం; చందన+అగరు= మంచి గంధం అగరుగల; వాః పూర= నీటి జల్లులతో; సంసిక్త= లెస్సగా తడుపబడిన; రథ్యా+ఆవళీవిభాసితంబు= రాజమార్గ సమూహాలచే వెలుగొందునదియు; తరుపల్లవ+అభిశోభితంబును= చెట్లు; చిగురులతో ప్రకాశించునదియు; అగు-పురంబు= అటువంటి నగరం; ప్రవేశించి= లోనికి వెళ్లి; రాజమార్గంబునన్= ప్రధానమార్గంద్వారా; చనుదేర= రాగా; మండిత రత్నకుండల= ప్రకాశించే రత్నకుండలాల; మణిమరీచులు= మణులకాంతులు; గండఫలకంబులన్= చెక్కిళ్ళపై; తాండవంబులు సలుపన్= నర్తించగా; పురకామినులు= పౌరస్త్రీలు; కనకపాత్ర విరచితంబులు+ఐన= బంగారు హారతి పాత్రలలో విశేషంగా కూర్చబడిన; మంగళనీరాజనంబులు= మంగళహారతులు; నివాళింపన్= సమర్పించగా; శంఖదుందుభిప్రముఖ= శంఖం; దుందుభిమొదలైన; తూర్యఘోషంబులను= వాద్యాల నినాదాలు; ఋత్విక్+నికాయ= పురోహితుల సముదాయంయొక్క; ఆశీర్వచనంబులును= ఆశీస్సులు; చెలంగన్= మారుమ్రోగగా; వందిమాగధజన= పొగడ్తలుచేసేవారిచే; సంస్తూయమానుఁడు+అగుచున్= మిక్కిలిగా పొగడబడుతూ; విగతగర్వుండు+ఐ= గర్వం లేనివాడై; అంతఃపురంబున్= రాచమందిరాన్ని; ప్రవేశించి= లోనికివెళ్లి; అనంతరంబు+అ= తర్వాత.

**తా :** తర్వాత ఇంద్రియాలకు కనిపించకపోయినా, ఆత్మద్వారా దర్శింపగలిగినవాడైన ఆ పరమేశ్వరుడైన వాసుదేవునకు నమస్కరించి పృథుచక్రవర్తి తన నగరానికి వెళ్లిపోయాడు. ఆ సమయంలో నానావిధాలంకారాలతో స్వర్ణతోరణాలతో సుగంధవాసనలతో రత్నాల ముగ్గులతో ప్రకాశిస్తూ, ఫలపుష్పాదులు, అక్షతలు, దీపమాలికస్తంభాలు, పోకచెట్లబోదెలతో అన్ని ఇళ్ల ముంగిళ్లు వెలిగిపోతున్నాయి. కస్తూరి, పచ్చకర్పూరం, చందనం కలయంపిగా చల్లిన రాచమార్గాలు కన్పిస్తున్నాయి. అలా తరుపుష్పాలతో కూడిన నగరం ప్రవేశించాడు. రాజమార్గంలో నడుస్తుండగా రత్నకుండలకాంతులు ధగద్ధగాయమానంగా వెలిగిపోగా పౌరకాంతలు బంగారు పళ్లెరాలతో మంగళహారతులందించారు. శంఖనాదాలు, దుందుభితూర్యనాదాలు మారుమ్రోగాయి. వందిమాగధుల పొగడ్తల మధ్య పృథుచక్రవర్తి నిగర్వియై అంతఃపురంలోకి ప్రవేశించాడు. తర్వాత

**సీ.** **సమధికమతిఁబౌరజనజానపదులచేఁ దనరారు వివిధపూజనము లొంది**
**రాజు సంతుష్టాంతరంగుండుఁ బ్రియవర ప్రదుఁడునై వారల బహువిధములఁ**
**బూజించె, నవ్విధంబున మహత్తరములై నట్టి కర్మంబుల నాచరించు**
**చును నిరవద్యచేష్టుండై మహత్త్వముఁ దన నొప్పు నా పృథుమనుజవిభుఁడు**

**తే.** **మించి భూమండలంబుఁ బాలించి విశద, యశము సర్వధరాచక్రమందు నిలిపి**
**చారుశుభమూర్తి రాజన్యచక్రవర్తి, పరమమోదమునఁబరమపదము నొందె.** **559**

**ప్రతి :** పౌరజానపదులచేన్= పురప్రజలచేతను; పల్లెప్రజలచేతను; సమధికమతిన్= అత్యంత ప్రీతితో; తనరారు= ప్రకాశించే; వివిధపూజనములు+అంది= పలురకాలైన పూజలు స్వీకరించి; రాజు= పృథుచక్రవర్తి; సంతుష్ట+అంతరంగుండున్= సంతోషించిన మనస్సుగలిగినవాడు; ప్రియవరప్రదుఁడును+ఐ= ప్రజలకిష్టమైన కోరికలను తీర్చేవాడును అయి; వారలన్= ప్రజలను; బహువిధములన్= పలురకాలుగా; పూజించెన్= గౌరవించాడు; ఆ+విధంబునన్= ఆ విధంగా; మహత్తరములు+

ఐనట్టి= గొప్పవైన; కర్మంబులన్= పనులను; ఆచరించుచును= చేస్తూ; నిరవద్య చేష్టుండు+ఐ= దోషంలేని పనులుచేయు; మహత్తముఁడు+అనన్= గొప్పవాడని; ఒప్పు= ప్రకాశించే; ఆ పృథుమనుజవిభుఁడు= ఆ పృథుచక్రవర్తి; మించి= అతిశయించి; భూమండలంబున్= భూమిని; పాలించి= పరిపాలించి; విశద యశమున్= స్వచ్ఛమైన కీర్తిని; సర్వధరాచక్రమందు నిలిపి= భూమిపై అంతటా నెలకొల్పి; చారుశుభమూర్తి= మిక్కిలి పుణ్యమూర్తి; రాజన్యచక్రవర్తి= రాజులలో శ్రేష్ఠుడు; పరమ మోదమునన్= అధిక సంతోషంతో; పరమపదమున్+ఒందెన్= వైకుంఠాన్ని పొందాడు.

**తా :** ఆ పృథుచక్రవర్తి పౌరులు, జానపదులు మిక్కిలి ప్రీతితో చేసిన రకరకాల పూజలందుకొని సంతోషించిన మనస్సుగలవాడై ప్రజలకు ఇష్టమైన కోర్కెలు తీర్చి, వారిని అనేకవిధాలుగా గౌరవించాడు. ఆ రకంగా మంచి గొప్ప పనులుచేస్తూ ప్రశస్తిపొంది గొప్పవాడని పేరుగాంచాడు. భూమండలాన్నంతా పరిపాలించి స్వచ్ఛమైన తనకీర్తిని భూలోకమంతా వ్యాపింపజేసి ఆ చక్రవర్తి సంతోషంతో పరమపదమును పొందాడు.

**క. అని మైత్రేయ మహాముని, యనఘుఁడు విదురునకుఁ జెప్పె నని శుకుఁడభి మ**
**న్యుని సుతునకుఁజెప్పిన తెఱఁ, గని సూతుఁడు సెప్పె శౌనకాదులతోడన్. 560**

**ప్రతి :** అని, మైత్రేయమహాముని= మైత్రేయమహర్షి, అనఘుఁడు= పాపరహితుడైన, విదురునకున్+చెప్పెను+అని= విదురునకు చెప్పాడని, శుకుఁడు; అభిమన్యుని సుతునకున్= అభిమన్యుని కుమారుడైన పరీక్షిత్తుకు; చెప్పిన తెఱఁగు+అని= చెప్పిన పద్ధతి అని, శౌనకాదులతోడన్= శౌనకాదిమునులతో, సూతుఁడు+చెప్పెన్= సూతుడు చెప్పెను.

**తా :** ఆ పృథుచక్రవర్తి కథను పుణ్యాత్ముడైన విదురునకు మైత్రేయ మహర్షి చెప్పెనని శుకమహర్షి పరీక్షిత్తునకు చెప్పిన విధానాన్ని శౌనకాదిమునులకు సూతుడు వివరించాడు.

## a =పృథుచక్రవర్తి సభాసదులకు సద్ధర్మముల నుపదేశించి బ్రాహ్మణ ప్రశంస సేయుట=a

**వ. అట్లెఱింగించి వెండియు నిట్లనియె, ని వ్విధంబున నశేష గుణ విజృంభితంబును, నిర్దోషంబును, సత్పురుష సత్కృతంబును నగు పృథుచక్రవర్తి యశంబును బ్రకటంబుగాఁ జేయంజాలు మైత్రేయునింజూచి మహాభాగవతుండైన విదురుండిట్లనియె. 561**

**ప్రతి :** అట్లు+ఎఱింగించి= ఆ విధంగా చెప్పి; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు; ఈ+విధంబునన్= ఈ విధంగా; అశేషగుణ విజృంభితంబును= అనేక సద్గుణాలచేత అతిశయించినదీ; నిర్దోషంబును= దోషంలేనిదీ; సత్+పురుష సత్+కృతంబును+అగు= మంచివారిచేత సమ్మానింపబడినదీ అగు; పృథుచక్రవర్తియశంబును= పృథువు కీర్తిని; ప్రకటంబుగాన్+చేయన్+చాలు= తెలియజేయగలిగిన; మైత్రేయునిన్= మైత్రేయమహర్షిని; చూచి, మహాభాగవతుండు+ఐన= గొప్పభగవద్భక్తుడైన; విదురుండు= విదురుడు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అలా చెప్పి ఇంకా ఇలా అన్నాడు. ఇలా విశేషగుణసంపద గలిగి, దోషరహితమై, సత్పురుషులచే సమ్మానింపబడిన పృథుచక్రవర్తి కీర్తిని తెలియజెప్పే మైత్రేయునితో మహాభాగవతుడైన విదురుడిలా అన్నాడు.

**సీ. మునినాథ! విను పృథుజనపాలచంద్రుండు సొబగొప్ప మేదినీసురులచేత**
**రాజ్యాభిషేకసంపూజ్యుఁడై దేవతా గణముచే లబ్ధార్హ్య గుణుఁడు నగుచు**

వైష్ణవతేజంబు వలనొప్ప ధరియించి యర్థి నే యే కర్మ మాచరించె
నది నాకు నెఱిఁగింపు మనఘాత్మ! భూమి యే రూఢి గవాకృతి రూఢ యెవని

తే. విక్రమోద్దీప్తయై యొప్పి వెలయునట్టి, కర్మమున నిప్డు రాజన్యగణము బ్రదుకు
నట్టి పృథుకీర్తి ధరలోన నతివివేకి, దవిలి యెవ్వఁడు వినకుండు ధన్యచరిత! **562**

**ప్రతి :** మునినాథ= ఓ మునిశ్రేష్ఠా!; విను= వినుము; పృథుజనపాలచంద్రుండు= పృథుచక్రవర్తి; సొబగు+ఒప్పన్= అందంగా; మేదినీసురులచేత= బ్రాహ్మణులచే; రాజ్య+అభిషేక సంపూజ్యుఁడు+ఐ= పట్టాభిషేక గౌరవం పొందినవాడై; దేవతాగణముచే= దేవతల బృందంచే; లబ్ధ+అర్హ్యగుణుఁడు+అగుచు= లభించిన మంచి గుణాలు కలిగి; వైష్ణవతేజంబు వలను+ఒప్పన్= వైష్ణవ తేజస్సును తగినవిధంగా; ధరియించి= తాల్చి; అర్థిన్= కోరికతో; ఏ+ఏ యేకర్మము+ఆచరించెన్= ఏ యే పనులు చేశాడో; అదినాకు+ఎఱిఁగింపు= అదినాకు తెలియజేయవయ్యా!; అనఘ+ఆత్మ= పాపరహితమైన మనస్సుకలవాడా!; భూమి= భూమి, ఏరూఢి= ఏవిధంగా; గో+ఆకృతి రూఢ= గోవురూపమున స్థిరపడినది; ధన్యచరిత= పుణ్యాత్మా; ఎవని విక్రమ+ఉత్+దీప్త+ఐ= ఎవని పరాక్రమంతో మిక్కిలిగ ప్రకాశించినదై; ఒప్పి, వెలయున్= ప్రకాశించునో; అట్టి= అటువంటి; కర్మమునన్= పద్ధతిలో; ఇప్డు= ప్రస్తుతం; రాజన్యగణము= రాజులసమూహం; బ్రదుకున్= జీవిస్తున్నారో; అట్టి పృథుకీర్తి= అట్టి పృథుచక్రవర్తి కీర్తిని; ధరలోనన్= భువిలో; అతివివేకి= మిక్కిలి తెలివిగలవాడు; తవిలి ఎవ్వఁడు వినకుండు= మనసును లగ్నంచేసి ఎవడు వినడు?

**తా :** మునిశ్రేష్ఠా! ధన్యచరితా! విను. పృథుచక్రవర్తి బ్రాహ్మణులచే రాజ్యపట్టాభిషిక్తుడై దేవతలచే సద్గుణాలుపొంది విష్ణుతేజంతో వెలిగిపోయాడు. ఆయన ఏయే పనులు చేశాడో పాపరహితుడా! నాకు తెలియజేయవయ్యా!. భూమి ఏ విధంగా గోరూపంలో స్థిరపడింది. ఎవరి పరాక్రమ దీప్తితో వెలుగొందిన పద్ధతిలో ప్రస్తుత రాజులందరు బ్రతుకుతున్నారో అట్టి పృథుచక్రవర్తి చరితాన్ని భూమిలో వివేకవంతుడైన వాడెవడైనా వినకుండా ఉంటాడా?

క. నావుడు విని మైత్రేయుం, డా విదురునిఁజూచి పలికె నతి వినయమునం
బావనచరితుఁడు పృథుఁడు ధ, రావరనుతుఁడలఘుయశుఁడు ప్రమదంబలరన్. **563**

**ప్రతి :** నావుడు= అనగా, విని, మైత్రేయుండు; ఆ విదురునిన్+చూచి= ఆ విదురుని చూచి; అతివినయమునన్= మిక్కిలి వినయంతో; పలికెన్= మాట్లాడెను; పావనచరితుఁడు= పవిత్ర వృత్తాంతము కలవాడు; ధరావరనుతుఁడు= రాజులచే పొగడ్తలందినవాడు; అలఘుయశుఁడు= గొప్పకీర్తిమంతుడు; పృథుఁడు= పృథుచక్రవర్తి; ప్రమదంబు+అలరన్= సంతోషంతో ఒప్పుతూ.

**తా :** ఆ పలుకులు విని మైత్రేయుడు విదురుని చూచి మిక్కిలి వినయంతో ఇలా అన్నాడు. పవిత్రమైన ప్రవర్తనచే పృథుచక్రవర్తి రాజుల పొగడ్తలు పొంది మహాకీర్తిశాలియై సంతోషంతో

సీ. రంగదుత్తుంగతరంగగంగాయమునామధ్యమందు నున్నతి వసించి
కైకొని ప్రారబ్ధకర్మ క్షయార్థమై యఖిలపుణ్యంబుల ననుభవించు
చును సర్వదేశంబులను దనయాజ్ఞ యప్రతిహతసత్ప్రతాపమునఁజెల్లఁ
బూని సప్తద్వీపములకుఁదానొక్కండ వైష్ణవభూసురావళికిఁ దక్కఁ

**తే. దక్కుఁగల్గిన ప్రజకెల్ల దండధరునిఁ, బోలి వర్తించుచును గొంతకాల మరుగఁ**
**దవిలి యొకనాఁడు దీర్ఘసత్త్రంబు సేయ, నర్థిఁగైకొని దీక్షితుండయ్యె, నందు. 564**

**ప్రతి :** రంగత్+ఉత్తుంగ తరంగ= ఎత్తుగా పడిలేచే అలలుగల; గంగాయమునా మధ్యమందున్= గంగాయమునానదుల మధ్య ప్రదేశంలో; ఉన్నతివసించి= భోగభాగ్యాలతో జీవితాన్ని గడిపి; కైకొని= పూనుకొని; ప్రారబ్ధక్షయ+అర్థము+ఐ= ప్రారబ్ధ కర్మఫలాల నాశంకోసమై; అఖిలపుణ్యంబులన్= సమస్తపుణ్యాలను; అనుభవించుచును= తాననుభవిస్తూ; తన+ఆజ్ఞ= తన ఆదేశం; సర్వదేశంబులను= అన్ని దేశాలలో; అప్రతిహత= ఎదురులేని; సత్+ప్రతాపమునన్= మంచి పరాక్రమంతో; చెల్లన్= చెల్లునట్లుగా; పూని= ప్రయత్నించి, సాగగా; సప్తద్వీపములకున్= ఏడు ద్వీపాలకు; తానొక్కండు+అ= ఏకచ్ఛత్రాధిపతియై; వైష్ణవ భూసుర+ఆవళికి తక్కన్= వైష్ణవులైన బ్రాహ్మణులకు తప్ప; తక్కు+కల్గినప్రజలకెల్లన్= మిగిలిన జనులకందరకు; దండధరుని+పోలి= యమునివలె; వర్తించుచును= ఉంటూ; కొంతకాలము+అరుగన్= కొన్ని సంవత్సరాలు గడువగా, ఒకనాఁడు; తవిలి= ప్రయత్నపూర్వకంగా; అర్థిన్= కోరికతో; దీర్ఘసత్త్రంబు+చేయన్= దీర్ఘసత్రమనే యాగాన్ని చేయుటకు; కైకొని= కంకణధారియై; అందు= ఆ యాగంలో– దీక్షితుండు+అయ్యెన్= యాగదీక్షను స్వీకరించెను;

**తా :** ఎత్తుగా లేచిపడే అలలు కలిగిన ఆ పృథుచక్రవర్తి గంగాయమునల మధ్యప్రదేశంలో నివసించాడు. ప్రారబ్ధ కర్మఫలాలు వ్యయం కావాలని సర్వపుణ్యాలను తాననుభవించాడు. అన్నిదేశాలలో తన ఆజ్ఞకెదురు లేకుండా చేశాడు. సప్తద్వీపాలలో ఏకచ్ఛత్రాధిపత్యం వహించాడు. విష్ణుభక్తులకును, బ్రాహ్మణులకును తప్ప మిగిలినవారి విషయంలో యమునివలె చండశాసనుడయ్యాడు. అలా కొంతకాలం పరిపాలించి ఒకనాడు దీర్ఘసత్రమనే యజ్ఞం చేయడానికి దీక్ష వహించాడు. ఆ దీర్ఘసత్రంలో

**తే. రాజఋషి దేవఋషి పితృ బ్రహ్మ ఋషులు, జనవరునిచేత విహితపూజనము లొంది**
**సమధికైశ్వర్యగతి నున్న సమయమునను, జిరశుభాకారుఁడా రాజశేఖరుండు. 565**

**ప్రతి :** రాజఋషి= రాజర్షులు; దేవఋషి= దేవర్షులు; బ్రహ్మఋషులు= బ్రహ్మర్షులు; పితృ= పితృదేవతలు; జనవరునిచేతన్= రాజుచే; విహితపూజనములు+ఒంది= శాస్త్రాలు విధించిన సమ్మానాలు పొంది; సమధిక+ఐశ్వర్యగతిన్= మించిన ఐశ్వర్యాన్ని పొంది; ఉన్నసమయమునను= ఉన్నప్పుడు; చిరశుభ+ఆకారుఁడు= నిత్య శుభలక్షణాలుగల; ఆ రాజశేఖరుండు= ఆ పృథుచక్రవర్తి.

**తా :** రాజర్షులు, దేవర్షులు, పితృదేవతలు, బ్రహ్మర్షులు విచ్చేసి రాజైన పృథుని నుండి శాస్త్రోక్తంగా సమ్మానాలందుకొని గొప్ప ఐశ్వర్యమును పొంది ఉండగా శుభలక్షణాలుగల ఆ పృథుచక్రవర్తి

**సీ. ఉన్నతోన్నతుఁడు సముత్తుంగభుజుఁడు సన్మహనీయతరశోభమానముఖుఁడుఁ**
**జారుసంపుల్లకంజారుణేక్షణుఁడు సునాసాపుటుండు మందస్మితుండు**
**వక్రసూక్ష్మ స్నిగ్ధ వరనీలకేశుండుఁ గమనీయరుచి కంబుకంధరుండు**
**సుభగవిశాలవక్షుండును త్రివళిశోభితమధ్యభాగుండుఁ బృథునితంబ**

**తే. మండలుండు నావర్తసమాననాభి, వివరుఁడును గాంచనస్తంభవిలసదూరు**
**రాజితుండును నరుణచరణుఁడును ధృత, నవదుకూలోత్తరీయుఁడున్నతయశుండు. 566**

**ప్రతి :** ఉన్నత+ఉన్నతుఁడు= మిక్కిలి పొడవైనవాడు; సముత్తుంగ భుజుఁడు= ఎత్తైన భుజాలు కలవాడు; సత్+మహనీయతర= శుభప్రదం, మిక్కిలి గొప్పదైన; శోభమాన ముఖుఁడు= ప్రకాశించే ముఖంగలవాడు; చారు= అందమైన; సంఫుల్ల కంజ+అరుణ= వికసించిన ఎర్రతామరలవంటి; ఈక్షణుండు= కనులుగలవాడు; సునాసాపుటుండు= మంచి ముక్కుపుటాలు కలవాడు; మందస్మితుండు= చిరునవ్వులు చిందించేవాడు; వక్రసూక్ష్మస్నిగ్ధ= వంకరలు తిరిగి మిక్కిలి మెత్తనైన; వరనీలకేశుండున్= శ్రేష్ఠమైన నల్లనికురులుగలవాడు; కమనీయరుచి= అందమైన ప్రకాశంగల; కంబుకంధరుండు= శంఖం వంటి కంఠం కలవాడు; సుభగ= శ్రేష్ఠమైన; విశాలవక్షుండును= విశాలమైన రొమ్ము భాగం కలవాడు; త్రివళిశోభిత= మూడు ముడుతలు పడి అందంగా భాసించే; మధ్యభాగుండును= నడుముగలవాడు; పృథునితంబ మండలుండును= విశాలమైన పిరుదుభాగం కలవాడు; ఆవర్త సమాననాభి వివరుఁడును= సుడిగుండంవలె లోతైన పొక్కిలి కలవాడు; కాంచనస్తంభ= బంగారు స్తంభాలవలె; విలసత్+ఊరురాజితుండును= ప్రకాశించే తొడలుగలవాడు; అరుణ చరుణుఁడును= ఎర్రని పాదాలు కలవాడు; ధృతనవదుకూల+ఉత్తరీయుఁడు= కొత్త పట్టువలువను ఉత్తరీయంగా ధరించినవాడు; ఉన్నతయశుండు= అధికకీర్తిమంతుడు.

**తా :** బాగా ఎత్తైనవాడు, ఎత్తైన భుజాలుగలవాడు, వికసించేముఖ శోభగలవాడు, బాగా వికసించిన ఎర్రతామరలవంటి అందమైన కనులు గలవాడు, అందమైన ముక్కుపుటాలు గలవాడు, చిరునవ్వులు చిందించేవాడు. వంకరలు తిరిగిన మెత్తని శ్రేష్ఠమైన నల్లని కేశములు కలవాడు అందమైన ప్రకాశముగల శంఖంవంటి కంఠంగలిగి వెడల్పైన, శ్రేష్ఠమైన వక్షఃస్థలం కలిగి, మూడు ముడుతలతో శోభించెడి నడుము భాగంతో విశాలమైన పిరుదుభాగంతో సుడిగుండంవలె నుండు నాభీవివరం కలవాడు, బంగారు స్తంభాలవలె ప్రకాశించే తొడలతో, ఎర్రని పాదాలుకలిగి కొత్త పట్టువలువను ఉత్తరీయంగా ధరించి ఆ మహాకీర్తిమంతుడై వెలిగిపోయాడు.

**వ. మఱియు నియమ నిమిత్తంబునం బరిత్యక్త భూషణుం డగుటం జేసి వ్యక్తాశేష గాత్రశ్రీకుండును, గృష్ణాజినధరుండును, శ్రీమంతుండును, గుశహస్తుండును, గృతోచితుండును, శిశిరస్నిగ్ధ తారాక్షుండును నైన పృథుచక్రవర్తి సభామధ్యంబునం దారాగణ మధ్య విభాసితుండును, సకల జనాహ్లాదకరుండును నగు సుధాకరుండునుంబోలె వెలుంగుచు లేచి నిలుచుండి సదస్య సంతోషదాయకంబులును, జిత్రపదవిరాజితంబులును, బ్రసన్నంబులును, పరిశుద్ధంబులును, గంభీరార్థంబులును, నవ్యాకులంబులును నైన భాషణంబుల నిట్లనియె. 567**

**ప్రతి :** మఱియు, నియమ నిమిత్తంబునన్= వ్రతదీక్షవలన; పరిత్యక్త భూషణుండు+అగుటన్+చేసి= విసర్జించిన అలంకారాలు కలవాడుకావడంవల్ల; వ్యక్త+అశేష గాత్రశ్రీకుండును= ప్రకటించబడిన పూర్తి శరీరసౌందర్యం కలవాడును; కృష్ణ+అజినధరుండును= నల్లని జింకచర్మం ధరించినవాడను; శ్రీమంతుండును= లక్ష్మీశోభతో ఉన్నవాడును; కుశహస్తుండును= చేతిలో దర్భలుధరించినవాడునూ; కృత+ఉచితుండును= తగిన పనులు చేయువాడు; శిశిరస్నిగ్ధతార+అక్షుండును= చల్లనిచూపు; నిగనిగలుగల కనులుగలవాడును; ఐన పృథుచక్రవర్తి= అయిన పృథుమహారాజు; సభామధ్యంబునన్= సభమధ్యలో; తారాగణమధ్య విభాసితుండును= నక్షత్రాల మధ్యలో వెలిగేవాడు; సకలజన+ఆహ్లాదకరుండును+అగు= జనులందరికి ఆందాన్ని కలిగించే; సుధాకరుండునున్+పోలె= చంద్రునివలె; వెలుంగుచున్= ప్రకాశిస్తూ; లేచి నిలుచుండి= లేచి

నిలబడి; సదస్య= సభ్యులకు; సంతోషదాయకంబులును= ఆనందం కలిగించేవి; చిత్రపద విరాజితంబులును= చమత్కారాలైన మాటలతో ప్రకాశించే; ప్రసన్నంబులును= మనోహరములైనవి (అయిన); గంభీర+అర్థంబులును= లోతైన అర్థములు కలిగినవి; అవ్యాకులంబులును ఐన= చింతలేనివి అయిన; భాషణంబులన్= మాటలతో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** మరియు వ్రతదీక్షచేపట్టినందున ఆభరణాలు వదలివేసినప్పటికీ శరీరసౌందర్యంతో ప్రకాశిస్తూ, జింకచర్మం ధరించి, లక్ష్మీశోభతో చేత దర్భలు పట్టుకొని ఉచితకర్మలు చేస్తూ సుందరమైన చూపులుగల పృథుచక్రవర్తి నక్షత్రమధ్యంలో చంద్రునివలె సకలజనులకు ఆహ్లాదం కలిగిస్తూ సభామధ్యంలో లేచి నిలబడి సభ్యులకు ఆనందం కలిగేలా చక్కని మాటలతో ప్రసన్నంగా, పరిశుభ్రంగా, గంభీరంగా మాట్లాడుతూ ఇలాఅన్నాడు.

**క. వినుఁడీ సభ్యులు ధర్మము, ననయము నెఱుఁగంగఁగోరునట్టి జనుఁడు దాఁ**
**దన తలఁపునఁగల యర్థముఁ, జను నెఱిఁగింపంగ ధీరసత్పురుషులకున్. 568**

**ప్రతి :** సభ్యులు= సభ్యులారా!; వినుఁడీ= వినండి; ధర్మమున్= ధర్మాన్ని; అనయమున్= ఎల్లప్పుడు; ఎఱుఁగంగన్+కోరునట్టి= తెలుసుకోదలచినటువంటి; జనుఁడు= మనుష్యుడు; తాన్= తాను; తనతలఁపునన్+కల= తన మనస్సులోఉండే; అర్థమున్= భావమును; ధీరసత్పురుషులకున్= ధీరులు సజ్జనులు అయినవారికి; ఎఱిఁగింపంగన్= తెలుపగా; చనున్= వలయును.

**తా :** ఓ సభ్యులారా! వినండి! ధర్మాన్ని ఎల్లప్పుడూ తెలుసుకోగోరిన మనుష్యుడు తన మనస్సులో ఉండే భావాన్ని ధీరులు, సజ్జనులు అయిన వారికి తెలియజేయవలసిన అవసరం ఉంది.

**సీ. ఏను నీ లోకవితానంబు నెల్లను శాసించి భూప్రజాసంతతులను**
**దత్త ద్విహిత వృత్తి దానంబులను జేసి రక్షింప వివిధమర్యాదఁ దప్పి**
**పోకుండ నిలుపుటకై కమలజుచే నియోగింపఁబడితి, నిట్లొనరియుండ**
**నట్టి ప్రజాపాలనా ద్యనుష్ఠానవశంబునఁ బ్రాక్కర్మ సాక్షి యీశుఁ**

**తే. డెట్టివానికి సంతుష్టి నెసఁగుచుండు, నట్టివానికి నే లోకమంద్రు బుధులు**
**కామదుఘములు నైన లోకములు నాకు, సరవిఁగలుగు ననుష్ఠానపరుఁడ నగుట. 569**

**ప్రతి :** ఏనును= నేనుగూడ; ఈ లోకవితానంబు+ఎల్లను= ఈ లోకాల సమూహాలన్నింటిని; శాసించి= పాలించి; భూప్రజా సంతతులను= భూమిపైఉండే మానవసమూహాలను; తద్+తద్+విహితవృత్తి దానంబులను= ఆయా నిర్ణీత వృత్తులను దానంచేస్తూ; రక్షింప= రక్షించడానికి; వివిధమర్యాదన్+తప్పిపోకుండ= రకరకాలైన కట్టుబాట్లు తప్పిపోకుండా; నిలుపుటకై= కాపాడుటకు; కమలజుచే= బ్రహ్మచే; నియోగింపన్+పడితిన్= నియమించబడ్డాను; ఇట్లు+ఒనరి+ఉండన్= ఇలా అమరియుండగా; అట్టిప్రజాపాలన+ఆది= ఆ విధమైన పరిపాలన మొదలైనవి; అనుష్ఠానవశంబునన్= ఆచరించడంవల్ల; ప్రాక్+కర్మసాక్షి= మొదటి కర్మకు సాక్షి అయిన; ఈశుఁడు= భగవంతుడు; ఎట్టివానికి= ఏలాంటివ్యక్తికి; సంతుష్టిన్+ఎసఁగుచుండున్= సంతోషాన్ని కల్గిస్తాడో; అట్టివానికిన్= అలాంటివానికి; బుధులు= విద్వాంసులు; ఏ లోకము+అంద్రు= ఏ పుణ్యలోకము ప్రాప్తిస్తుందని అంటారో; కామదుఘములు+ఐన= కోరికలు పిదికే; లోకములు= పుణ్యలోకాలు; అనుష్ఠానపరుఁడన్+అగుటన్= నియమవంతుడనుగాబట్టి; నాకు, సరవిన్+కలుగున్= వరుసగా లభిస్తాయి.

**తా :** నేను ఈ లోకాలనన్నింటినీ శాసిస్తున్నాను. ప్రజలకు ఆయావృత్తులను కల్పించాను. దానాలిస్తున్నాను. రక్షిస్తున్నాను. ప్రజలు ఆయా పనులలో హద్దులు మీరకుండా విధివిధానాలు స్థిరపరచడానికి బ్రహ్మచే నేను నియోగింపబడ్డాను. ఇట్లుండగా ప్రజాపాలన నా కర్మానుష్ఠానం. ఈ విధమైన కర్మానుష్ఠానమువలన కర్మసాక్షి అయిన ఆ పరమేశ్వరుడు ఏలాంటివానికి సంతోషం కలిగిస్తాడో, పండితులు అతనికి ఏ పుణ్యలోకం ప్రాప్తిస్తుందని అంటారో, అనుష్ఠానపరుడనైన నాకు కోరికలు పిదికేవి అయిన పుణ్యలోకాలు వరుసగా లభిస్తాయి.

**వ. ఇట్లు ప్రజలను ధర్మంబులయందు ననుశాసింపక యర్థ కాముండై వారివలన నప్పనంబులు గొనెనేని వారల పాపంబు దనకుఁ బ్రాపింపం దేజోహీనుండై భూవిభుండు సెడుం, గావునం బ్రజలు భూపతిహితార్థంబునకు స్వార్థంబునకు నసూయారహితులై వాసుదేవార్పణ బుద్ధిం జేసి ధర్మంబు నెప్పుడు నాచరింపవలయు, నిదియ నన్ను ననుగ్రహించుట, యదియునుం గాక పితృదేవర్షితుల్యులగు మీర లనుమోదించి కర్తయు ననుశాసకుండు ననుజ్ఞాతయు నయిన నాకుఁ బరలోకంబున నే ఫలంబు గలుగు నట్టి ఫలంబునకు సదృశంబైన కర్మం బాచరింపవలయు, నట్లయిన సంతోషంబు నొందుదు ననిన వార లా రాజేంద్రున కిట్లనిరి. 570**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; ప్రజలను, ధర్మంబుల+అందున్= మంచిపనులలో; అనుశాసింపక= శాసించకుండా; అర్థకాముండు+ఐ= ధనమునందు కోర్కె గలవాడై; వారివలనన్= వారివద్దనుండి; అప్పనంబులు= సమర్పింపబడిన కానుకలు; కొనెన్+ఏని= స్వీకరిస్తే; వారల పాపంబు= వారు చేసిన పాపము; తనకున్+ప్రాపింపన్= తనకు సంక్రమించగా; తేజోహీనుండు+ఐ= కాంతిని కోల్పోయి; భూవిభుండు+చెడున్= రాజు చెడిపోతాడు; కావునన్= కాబట్టి; ప్రజలు, భూపతిహిత+అర్థంబునకున్= రాజుమేలుకోరి; స్వార్థంబునకున్= స్వప్రయోజనాలకు; అసూయారహితులు+ఐ= ఈర్ష్యలేనివారై; వాసుదేవ+అర్పణబుద్ధిన్+చేసి= విష్ణుదేవునికి అర్పించే బుద్ధితో; ధర్మంబున్= ధర్మాన్ని; ఎప్పుడున్+ఆచరింపవలయున్= ఎప్పుడూ ఆచరించాలి; ఇది+అ= ఇదియే; నన్నున్+అనుగ్రహించుట= నాపై దయ చూపడం; అదియునున్+కాక= అదీగాక; పితృదేవ+ఋషితుల్యులు+అగు= పితృదేవతలతో, దేవతలతో, ఋషులతో సమానులైన; మీరలు= మీరు; అనుమోదించి= సమ్మతించి; కర్తయును= సృష్టించేవాడిని; అనుశాసకుండును= పరిపాలించేవాడిని; అనుజ్ఞాతయును= అనుమతించువాడు; అయిన నాకు= అయినటువంటి నాకు, పరలోకంబునన్= పరలోకంలో; ఏ ఫలంబు కలుగు= ఎట్టి ఫలితం సిద్ధిస్తుందో; అట్టిఫలంబునకు= ఆ ఫలానికి; సదృశంబు+ఐన= సమానమైన; కర్మంబు+ఆచరింపవలయును= కర్మను చేయాలి; అట్లు+అయినన్= ఆ విధంగా చేస్తే; సంతోషంబున్+ఒందుదున్+అనినన్= సంతోషిస్తాను అని అనగా; వారలు= ఆ సదస్యులు; ఆ రాజ+ఇంద్రునకు= ఆ మహారాజుకు; ఇట్లు+అనిరి= ఇలా అన్నారు.

**తా :** ప్రజలను ధర్మంగా పాలించక, తన ప్రయోజనాలకై పన్నులు తీసుకొంటే, ఆ ప్రభువునకు తన ప్రజల పాపాలు సంక్రమిస్తాయి. కాంతిని కోల్పోయి రాజు నశిస్తాడు. ప్రజలుకూడా తమహితం కోసం రాజుహితం కోరాలి. అసూయలేకుండా వాసుదేవార్పణంగా ధర్మాచరణ చేయాలి. మీరిలా చేస్తే అదే నన్ను అనుగ్రహించినట్లు. అంతేకాక, మీరు పితృదేవతలతో, దేవతలతో, ఋషులతో సమానులు. ఆలాంటిమీరు సమ్మతితో కర్తను, పాలకుడను, బ్రహ్మచే అనుమోదించువాడను

అయిన నాకు పరలోకంలో ఏ ఫలం కలుగుతుందో ఆలాంటి ఫలం కలగటానికి తగిన కర్మను ఆచరించండి. ఆ విధంగా చేస్తే నేను సంతోషిస్తాను. అనగా, ఆ సదస్యులు మహారాజుతో ఇలా అన్నారు.

**క. జననాయక! ప్రజ లిర వొం, దిన ధర్మము లెల్ల వాసుదేవార్పణ బు**
**ద్ధిని జేయవలయు నంటివి, యనయంబును వాసుదేవుఁడనఁగలఁడె మహిన్? 571**

**ప్రతి :** జననాయక= ఓ రాజా!; ప్రజలు= జనులు; ఇరవు+ఒందిన ధర్మములు+ఎల్లన్= చోటుచేసుకొనిన ధర్మాలన్నీ; వాసుదేవ+అర్పణబుద్ధిని= భగవదర్పితమనే సంకల్పంతో; చేయవలయున్+అంటివి= చేయాలి అని అన్నావు; అనయంబును= ఎల్లప్పుడు; మహిన్= భూమిపై; వాసుదేవుఁడు+అనన్+కలఁడె= విష్ణుమూర్తి అనే వాడున్నాడా?

**తా :** ఓ పృథుచక్రవర్తీ! ప్రజలందరు తమ పనులన్నీ భగవదర్పితంగా (వాసుదేవార్పణం) చేయాలని బోధించావు. వాసుదేవుడనేవాడు భూమిపై నిరంతరం ఉన్నాడా?

**విశే :** ఆ భగవంతుని రూపరేఖావిలాసాలు తెలియజేయుమని ప్రజలు ప్రభువును కోరారు.

**సీ. అన విని వారికి మనుజేశుఁడను నర్హ, తములార! వినుఁడయ్య తవిలి మీరు**
**యజ్ఞాధిపతియైన యఖిలేశ్వరుఁడు గొన్ని, మతములఁగలఁడు ధీమంతులార!**
**యట్లైన మీరలు నందుకు విప్రతి, పత్తి గల్గుట నుపపన్న మరయఁ**
**గాదంటిరేని యా ఘనునిచే రచితమై, కాంతిమంతమగు జగంబు గానఁ**

**తే. బడుచునున్నది! యిట్టి ప్రపంచరచిత, కర్మ వైచిత్ర్య మ మ్మేటి గలుగకున్న**
**నమర నది తదుక్తు లుపపన్నములు గావు!, కాన నవ్వాసుదేవుండు గలఁడు మఱియు. 572**

**ప్రతి :** అన విని= అనగా విని; వారికి= ప్రజలతో; మనుజ+ఈశుఁడు+అనున్= రాజు ఇలా అన్నాడు; అర్హతములార= మిక్కిలి యోగ్యులారా!; తవిలి= పూని; మీరు, వినుఁడు+అయ్య= వినండి; యజ్ఞ+అధిపతి+ఐన= యాజ్ఞానికి మూలం అయిన; అఖిల+ఈశ్వరుఁడు= పరమేశ్వరుడు; కొన్నిమతములన్+కలఁడు= కొన్ని సిద్ధాంతాలప్రకారం ఉన్నాడు; ధీమంతులార= బుద్ధిమంతులారా!; అట్లు+అయిన= అలా అయితే; మీరలును= మీరుకూడా; అందుకు విప్రతిపత్తికల్గుటన్= దానికి వ్యతిరేకత కలగడంవల్ల; ఉపపన్నము= సంభవం; అరయన్= చూడగా; కాదు+అంటిరి= కాదనిన పక్షంలో; ఆ ఘనునిచే రచితము+ఐ= ఆ పరమేశ్వరునిచే సృష్టించబడి; కాంతిమంతము+అగు= ప్రకాశవంతమైన; జగంబు= లోకము; కానన్+పడుచున్+ఉన్నది= కన్పిస్తున్నది; ఇట్టి= ఇటువంటి; ప్రపంచ రచిత= ప్రపంచంచే కల్పించబడిన; కర్మవైచిత్ర్యము= కర్మల విచిత్రత; ఆ మేటి= ఆ శ్రేష్ఠుడు; కలుగక+ఉన్నన్= లేనిచో; అమరన్= ఒప్పుగా; అది= ఆ ప్రపంచం; తద్+ఉక్తులు= ఆ మాటలు; ఉపపన్నములు+కావు= పుట్టవు; కానన్= కావున; ఆ వాసుదేవుండు= ఆ విష్ణువు; కలఁడు= ఉన్నాడు; మఱియు= ఇంకా.

**తా :** ఆ మాటలు విని ప్రజలతో పృథుచక్రవర్తి ఇలా అన్నాడు. ఓ యోగ్యులారా! మీరు ఆసక్తితో వినండి! యజ్ఞేశ్వరుడు అయిన అఖిలేశ్వరుడు కొన్ని సిద్ధాంతాల ననుసరించి ఉన్నాడు. అది అట్లుండగా బుద్ధిమంతులారా! దీనికి విరుద్ధంగా మీరు భగవంతుడు లేడంటే ఆ భగవానుడు సృష్టించిన కాంతిమంతమైన ఈ ప్రపంచం కనబడుతూ ఉంది. ఇందలి చిత్రవిచిత్రాలైన కర్మలు ఆయన లేకుంటే అసలు లేవు కదా. అందువల్ల భగవంతుడున్నాడు. ఇంకనూ

**వ. అదియునుం గాక యీ జగద్వైచిత్ర్యంబు కర్తయైన యీశ్వరుండు లేకున్నం గర్మవశంబునం జేసి యుపపన్నంబగు నంటి రేని. 573**

**ప్రతి :** అదియునున్+కాక= అదీగాక; ఈ జగత్+వైచిత్ర్యంబు= ఈ లోకంయొక్క చిత్ర, విచిత్ర స్వరూపస్వభావాలు; కర్త+ఐన= మూలకారకుడైన; ఈశ్వరుండు లేకున్నన్= భగవంతుడు లేకున్నా; కర్మవశంబునన్+చేసి= కర్మఫలితంగా; ఉపపన్నంబు+అగున్+అంటిరి+ఏని= కలుగుతాయి అని మీరు అంటే.

**తా :** అదీగాక, ఈ లోకంలోని చిత్రవిచిత్రాలు వాటికర్తయైన భగవంతుడు లేకున్నా కర్మవశంగా కలుగుతాయని అన్నారనుకోండి.

**విశే :** కర్త అయిన ఈశ్వరుడు లేకున్నా కర్మలు జరుగుతాయనుకొనేవారు నాస్తికులు. శివుని ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదు అనుకొనేవారు ఆస్తికులు.

**సీ. పూని ప్రియవ్రతోత్తానపాద ధ్రువ మనుల కస్మత్పితామహుఁ డనఁగఁ**
**దగు నంగ మేదినీధవునకు మఱియును వినుతి కెక్కిన పృథివీపతులకుఁ**
**బద్మసంభవ భవ ప్రహ్లాద బలిచక్రవర్తి ప్రముఖ భాగవతుల కర్థి**
**వర్గసుస్వర్గాపవర్గంబులకు ననుగతకారణుం డన ఘనత కెక్కి**

**తే. హీను లగు మృత్యుదౌహిత్రుఁడైన వేన, ముఖ దురాత్ములు ధర్మవిమోహితులును**
**దక్కఁ దక్కిన వారికిఁ దాఁ బ్రపన్న, వరదుఁడై యిచ్చు నభిమతావళుల నతఁడు. 574**

**ప్రతి :** పూని= ప్రయత్నించి; ప్రియవ్రత= ప్రియవ్రతుడు; ఉత్తానపాద= ఉత్తానపాదుడు; ధ్రువ= ధ్రువుడు; మనులకు= మనువులకు; అస్మత్+పితామహుఁడు+అనంగన్+తగు= నా తాత అనదగిన; అంగమేదినీధవునకు= అంగరాజునకు; మఱియును= ఇంకా; వినుతికి+ఎక్కిన= ప్రఖ్యాతి గడించిన; పృథివీపతులకున్= రాజులకు; పద్మసంభవ భవ= పద్మంనుండి పుట్టిన బ్రహ్మకు జనించిన నారదుడు; ప్రహ్లాద= ప్రహ్లాదుడు; బలిచక్రవర్తి ప్రముఖ= బలిచక్రవర్తి మొదలైన; భాగవతులకు= భక్తులకు; అర్థివర్గ= కోరేవారికి; సుస్వర్గ+అపవర్గంబులకు= మంచి స్వర్గమోక్షములకు; అనుగతకారణుండు+అనన్= అనువర్తించే కారణం గలవాడుగా; ఘనతకు+ఎక్కి= ప్రసిద్ధుడై; హీనులగు= నీచులైన; మృత్యుదౌహిత్రుఁడు+ఐన= మృత్యువునకు మనుమడైన; వేనముఖదురాత్ములు= వేనుడు మొదలైన దుర్జనులు; ధర్మవిమోహితులును తక్కన్= ధర్మం చెడినవారు తప్ప; తక్కినవారికిన్= మిగిలినవారికి; తాన్= తాను; ప్రపన్నవరదుఁడు+ఐ= ఆశ్రితులకు కోర్కెల నిచ్చువాడై; అతఁడు= ఆ భగవంతుడు; అభిమతావళులన్= కోర్కెల సముదాయాన్ని; ఇచ్చున్= ఇస్తాడు.

**తా :** ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు, ధ్రువుడు, మనువు మొదలైనవారికి మా తాతగారైన అంగరాజునకు, ఇంకనూ వినుతికెక్కిన రాజులకు, నారదుడు, ప్రహ్లాదుడు, బలిమొదలైన భాగవతులకు స్వర్గమోక్షాలు ప్రాప్తించేందుకు కారణభూతుడు అని ప్రసిద్ధుడై హీనులైన మృత్యువు మనుమడు వేనుడు మొదలైన దురాత్ములకు ధర్మము చెడినవారికి తప్ప మిగిలినవారి కందరికీ ప్రసన్నవరదుడైనవాడు ఆ స్వామి. కోరిన కోరికలు ఇస్తాడు.

**వ. ఇట్టి విద్వదనుభవంబున భువనహితుండగు వాసుదేవుండు లేఁడనుట యుపపన్నంబుగా, దదియునుంగాక. 575**

**ప్రతి :** ఇట్టి విద్వత్+అనుభవంబున= ఈ విధంగా పండితులు అనుభవజ్ఞానంవల్ల; భువనహితుండగు+అగు= లోకహితం కోరేవాడైన; వాసుదేవుండు= విష్ణువు; లేఁడు+అనుట= లేడనటం; ఉపపన్నంబు+కాదు= జరగదు; అదియునున్+కాక= అదీగాక.

**తా :** ఈ విధంగా అనుభవజ్ఞాన సంపన్నులైన పండితుల అనుభవాన్నిబట్టి లోకం మేలుకోరే విష్ణువు లేడనడం జరగదు. అదీగాక

**ఉ. భూరితపోభిరామమునిపూజన మెవ్వని పాదపద్మ సే**
**వారతి వృద్ధిఁబొంది యనివారణఁబూర్వభవానుసార సం**
**సారమహోగ్రతాపము భృశంబుగఁబాపఁగ నోపుఁదత్పదాం**
**భోరుహజాతదేవనదిఁబోలి యశేషమనోఘహారియై. 576**

**ప్రతి :** ఎవ్వని పాదపద్మ సేవారతిన్= ఎవరి పాదాలను సేవించడం ద్వారా; భూరి= గొప్పదైన; తపస్+అభిరామ= తపస్సుచే ఒప్పుచున్న; మునిపూజనము= మునులసేవ; వృద్ధిన్+పొంది= అభివృద్ధినిపొంది; అనివారణ= అడగింపసాధ్యం కాని; పూర్వభవ+అనుసార= పూర్వజన్మలననుసరించిన; సంసార మహా+ఉగ్రతాపము= సంసారంలోని తీవ్రమైనబాధను; భృశంబుగన్= అధికంగా; తద్+పద+అంభోరుహజాత= ఆయన పాదపద్మాలనుండి జన్మించిన; దేవనదిన్+పోలి= గంగానదివలె; అశేషమనస్+అఘహారి+ఐ= సమస్తమైన మనస్సులోని పాపాలను పోగొట్టునదియై; పాపఁగన్+ఓపున్= పోగొట్టగల శక్తిగలదా?...

**తా :** గొప్పతపస్సుచే ఒప్పునట్టి మునులపూజ, ఎవని పాదపద్మారాధన వల్ల వృద్ధిపొంది ఆయన పాదపద్మాలనుండి పుట్టిన గంగానదివలె అన్ని మానసిక పాపాలను పోగొట్టేదై పూర్వజన్మల సంసారబాధను పూర్తిగా పోగొట్టగలదు.

**వ. మఱియు. 577**

**ప్రతి :** మఱియు= ఇంకా.

**చ. అనుపమభక్తి నెవ్వని పదాంబుజమూలము మందిరంబుగా**
**ననయముఁబొందు వాఁడు నిహతాఖిల భూరి మనోమలుండు స**
**ద్వినుత విరక్తి బోధ ధృతి వీర్య విశేష సమన్వితుండు దా**
**ననఁ దగి భూరి సంసృతి మహత్తర దుఃఖము నందఁ డెన్నఁడున్. 578**

**ప్రతి :** అనుపమభక్తిన్= సాటిలేని భక్తితో; ఎవ్వని పద+అంబుజమూలము= ఎవని పాదపద్మాలమూలము; మందిరంబుగా= ఇల్లుగా; అనయమున్= ఎల్లప్పుడూ; పొందున్= అందుకొన్నాడో; వాఁడు, నిహత+అఖిల భూరి మనోమలుండు= నశింపచేయబడిన సమస్త మానసిక పాపాలు గలవాడు; సత్+వినుత= సజ్జనకీర్తితమైన; విరక్తి బోధ= వైరాగ్యం, జ్ఞానం; ధృతి= ధైర్యం; వీర్యవిశేషసమన్వితుండు= పరాక్రమ విశేషంతో గూడినవాడు; తాను+అనన్+తగి= తానే అనుటకు తగినవాడై; భూరి= పెద్దదగు; సంసృతి= సాంసారిక; మహత్తర దుఃఖమున్= గొప్పకష్టాన్ని; ఎన్నఁడున్= ఎప్పుడు; అందఁడు= పొందడు.

**తా :** సాటిలేని భక్తితో పరమేశ్వరుని పాదపద్మాలమూలమును మందిరంగా ఎవ్వడు నిరంతరం పొందగలడో వానికి సమస్తమనోమాలిన్యాలు తొలగుతాయి. అతడికి సజ్జనులు కీర్తించిన వైరాగ్యం, జ్ఞానం, ధైర్యం, వీర్యం ప్రాప్తిస్తాయి. ఎన్నడూ సంసారదుఃఖాన్ని పొందదు.

**క. నారాయణుండు జగదా, ధారుండగు నీశ్వరుండు, దలఁప నతనికిన్**
**లే రెండు సములు నధికులు, ధీరోత్తముఁడతఁడు నద్వితీయుండగుటన్. 579**

**ప్రతి :** జగత్+ఆధారుండు+అగు= లోకానికి పునాదివంటివాడైన; ఈశ్వరుండు= ప్రభువు; నారాయణుండు= విష్ణువే; తలఁపన్= ఆలోచించగా; అతనికిన్= ఆయనకు; సములు= సమానులు; అధికులు= గొప్పవారు; లేరు, అద్వితీయుండు+ అగుటన్= రెండవ సమానుడు లేనివాడగుటచేత; అతఁడు, ధీర+ఉత్తముఁడు= ధీరులలో శ్రేష్ఠుడు.

**తా :** లోకాలకు మూలాధారమైన పరమేశ్వరుడు విష్ణువు. ఆయనకు సమానులు గాని, అధికులు గాని లేరు. రెండవ సమానమైనవాడు లేకపోవడంవల్ల ఆ విష్ణువు ధీరులలో శ్రేష్ఠుడు.

**వ. అదియునుంగాక. 580**

**ప్రతి :** అదియునున్+కాక= అదీగాక.

**ఉ. కర్మవశంబునన్ జగము గల్గును హెచ్చు నడంగు నన్నచోఁ**
**గర్మము బుద్ధిఁజూడ జడకార్యము! గాని ప్రపంచకల్పనా**
**కర్మమునందుఁ గర్త యనఁగా విలసిల్లఁగఁజాల, దీ జగ**
**త్కర్మకకార్యకారణము గావున నీశుఁడు విష్ణుఁడారయన్. 581**

**ప్రతి :** జగము= ప్రపంచం; కర్మవశంబునన్= కర్మపరిపాకంచే; కల్గును= కలుగుతుంది; హెచ్చున్= అధికమవుతుంది; అడంగును= నశిస్తుంది; అన్నచోన్= అంటే; బుద్ధిన్+చూడన్= ఆలోచించిచూస్తే; కర్మము= కర్మ; జడకార్యము= చేతనా విహీనమైన పని; కాని= కానీ; ప్రపంచకల్పనా కర్మమునందున్= సృష్టి నిర్మాణ కార్యంలో; కర్త+అనఁగా= కర్త అనడానికి; విలసిల్లఁగన్+చాలదు= ప్రకాశించడానికి సరిపోదు; ఈ జగత్+కర్మక కార్యకారణము= ఈ ప్రపంచ సృష్టి కార్యానికి కారణం, కావున; ఈశుఁడు= అధిపతి; ఆరయన్= ఆలోచించగా; విష్ణుఁడు= విష్ణుమూర్తి.

**తా :** కర్మవలననే లోకం పుట్టి, పెరిగి, నశిస్తుందందామా? కర్మ అనేది ఆలోచించి చూస్తే జడకార్యం, అంతేకాని అది ప్రపంచ సృష్టిలో కర్తగా ప్రకాశింపజాలదు. ఈ లోకంలో జగత్సృష్టి రూపకర్మకు కార్య, కారణ సంబంధం ఆ భగవంతుడైన విష్ణువే.

**వ. కావున మీర ల వ్వాసుదేవుని నధికారానుసారంబున నిశ్చితార్థ ఫలసిద్ధి గలవారలై మనో వాక్కాయ కర్మంబుల నిష్కపటవృత్తిం దగిలి వినుతి నతిపరిచర్యా పూర్వకంబుగాఁ గామదుఘంబు లయిన యతని పాదపంకజంబులు భజియింపుం; డదియునుంగాక. 582**

**ప్రతి :** కావున, మీరలు= మీరు; ఆ+వాసుదేవునిన్= ఆ పరమాత్ముని; అధికార+అనుసారంబున= యోగ్యతననుసరించి; నిశ్చిత+అర్థఫలసిద్ధిగలవారలు+ఐ= నిర్ణయించబడిన కోర్కెలను పొందినవారై; మనస్+వాక్+కాయకర్మంబులన్= మనస్సు; వాక్కు, కాయాలతో త్రికరణశుద్ధిగా; నిష్కపటవృత్తిన్+తగిలి= మోసంలేని పద్ధతిలో ఉండి; వినుతి నతిపరిచర్యాపూర్వకంబుగాన్= కీర్తించుట, నమస్కరించుట, సేవించుకొనుట మొదలుగా; కామదుఘంబులు= కోరిన కోర్కెలు తీర్చునవి; అయిన అతని పాదపంకజంబులు= అయినటువంటి విష్ణుని పాదపద్మాలు; భజియింపుండు= సేవించండి; అదియునున్+కాక= అదీగాక.

**తా :** మీరు ఆ పరమేశ్వరుణ్ణి మీమీ యోగ్యతననుసరించి కోర్కెలు సిద్ధించినవారై త్రికరణ శుద్ధిగా కాపట్యం లేని రీతిలో కీర్తన, నమస్కార సేవలను చేసి కోర్కెలను ఫలింపజేయడానికి ఆ పరమేశ్వరుని పాదపద్మాలు సేవించండి. అదీగాక

**సీ. రూఢి నీశ్వరుఁడు స్వరూపంబునంజేసి పూని విశుద్ధవిజ్ఞానఘనుఁడు**
**నగుణుండు నయినఁ దా నరయని కర్మమార్గమునందు వ్రీహ్యాదిద్రవ్యములను**
**శుక్లాదిగుణము విస్ఫురదవఘాతాదిసత్క్రియలును మంత్రసంచయంబు**
**సంకల్పమును యాగసాధ్యమైనట్టి యఖండోపకారంబు ఘనపదార్థ**

**తే. శక్తియు మఱి జ్యోతిష్టోమసవనముఖ్య, నామత బహు విశేష గుణతను మెఱయు**
**నట్టి యధ్వరరూపమై యఖిల జగము, నందు ననిశంబుఁ బ్రఖ్యాతి నొందుచుండు. 583**

**ప్రతి :** రూఢిన్= నిశ్చయంగా; ఈశ్వరుఁడు= భగవంతుడు; స్వరూపంబునన్+చేసి= ఆకారంచేత; పూని= ప్రయత్నించి; విశుద్ధ విజ్ఞానఘనుఁడు= స్వచ్ఛమైన విజ్ఞానం ఘనీభవించినవాడు (గొప్పవాడు); అగుణుండున్= గుణాలు లేనివాడు; అయినన్+తాను+అరయని= అయినా తాను పరిశీలించని; కర్మమార్గమునందు= కర్మమార్గంలో; వ్రీహి+ఆదిద్రవ్యములను= ధాన్యంకంకులు మొదలైన వస్తువులందు; శుక్లాదిగుణము= తెలుపు మొదలైన గుణము; విస్ఫురత్= స్ఫురించే; అవఘాత+ఆది= దంచుట మొదలైన; సత్+క్రియలును= మంచి పనులు; మంత్రసంచయంబు= మంత్రాల సముదాయం; సంకల్పమును= పూనిక; యాగసాధ్యము+ఐనట్టి= యజ్ఞంచే సాధింపదగిన; అఖండ+ఉపకారంబు= నిరంతరాయ సాధనం; ఘనపదార్థశక్తియు= గొప్పపదార్థాల సామర్థ్యం; మఱి= మరియు; జ్యోతిష్టోమ సవనముఖ్యనామతన్= 'జ్యోతిష్టోమ' మనే ముఖ్యయాగాల పేర్లతో; బహువిశేషగుణతను= మిక్కిలి విశేషమైన గుణాన్ని; మెఱయు+అట్టి= ప్రకాశించే; అధ్వరరూపము+ఐ= యజ్ఞముఖంగా; అఖిలజగమునందున్= సమస్త ప్రపంచంలో; అనిశంబున్= నిరంతరం; ప్రఖ్యాతిన్+ఒందుచుండున్= కీర్తి గడిస్తూ ఉంటుంది.

**తా :** స్వరూపంచే ఈశ్వరుడు నిశ్చయంగా స్వచ్ఛమైన జ్ఞానపు ముద్ద. నిర్గుణుడు. అతనియందు కర్మమార్గం సాగుతుంది గాన అతడు సంకల్పించడు. ధాన్యపు కంకులలోని ధాన్యం తెల్లగా ఉంటుంది. అది పొట్టులో దాగి దంచినపుడు బయటపడుతుంది. అలానే మంత్రాల సామర్థ్యం నిబిడీకృతంగా ఉంటుంది. సత్కర్మవలన అది ప్రకటితమవుతుంది. యజ్ఞాని కుపయోగించే ద్రవ్యాలు అన్నీ, పదార్థ సంచయాలు. అందులో యజ్ఞం ఇమిడిఉంది. అలా ప్రకటితమైనపుడు ప్రత్యేక గుణాలతో వేర్వేరుగా వ్యక్తమవుతుంది. జ్యోతిష్టోమం మొదలైన పేర్లతో యజ్ఞరూపమై సమస్త జగత్తు వెలువడును.

**వ. అదియునుం గాక దారుస్థితంబైన యనలంబు తద్దారు గుణంబులయిన దైర్ఘ్య వక్రత్వాదికంబుల ననుసరించు చందంబున నవ్యక్తంబు తత్క్షోభకంబయిన కాలంబును వాసనయు నదృష్టంబు నను కారణంబులచేతం బుట్టిన శరీరంబునందు విషయాకారంబయిన బుద్ధి నొంది తద్విషయాభివ్యంగ్యంబైన యానందస్వరూపుండగుచుఁ గ్రియాఫలంబునం బ్రసిద్ధి నొందునని చెప్పి వెండియు నిట్లను: మదీయజనంబులి మ్మేదినీ తలంబున దృఢవ్రతులై యజ్ఞభుగీశ్వరుండును గురుండును నయిన సర్వేశ్వరుని, హరిని నిరంతరంబును స్వధర్మయోగంబునం బూజించు చున్నవారలు, వారు నన్నాశ్చర్యకరంబుగా ననుగ్రహించు వారని హరిభక్తిరతులైన య మ్మహాత్ముల నుతియించి వెండియు నిట్లనియె. 584**

**ప్రతి :** అదియునున్+కాక= అదీగాక; దారుస్థితంబు+ఐన= కొయ్యలోఉండే; అనలంబు= నిప్పు; తద్+ దారుగుణంబులు+ అయిన= ఆ కొయ్యకుండే గుణాలయిన; దైర్ఘ్య= పొడవు; వక్రత్వ+ఆదికంబులు= వంకరతనం మొదలైనవానిని; అనుసరించు చందంబునన్= అనుసరించి వెళ్లేవిధంగా; అవ్యక్తంబు= బయటపడని; తద్+క్షోభకంబు+అయిన= దానిని కలచివేసేదైన; కాలంబును= కాలం; వాసనయును= సంస్కారం; అదృష్టంబును= కనిపించనిది; అనుకారణంబులచేతన్= అనే కారణాలతో; పుట్టిన శరీరంబునందు= జన్మించిన శరీరంలో; విషయ+ఆకారంబు+అయిన= విషయరూపమైన; బుద్ధిని+ఒంది= బుద్ధిని కలిగి; తద్+విషయ+అభివ్యంగ్యంబు+అయిన= ఆ లక్ష్యానికి ఎదురుగా నిలబడే; ఆనందస్వరూపుండు+అగుచున్= ఆనందరూపం ధరించినవాడై; క్రియాఫలంబునన్= కార్యరూపంలో; ప్రసిద్ధిన్+ఒందునని చెప్పి= కీర్తిగడిస్తాడని చెప్పి; వెండియున్= మరలా; ఇట్లు+అనున్= ఇలా అన్నాడు; మదీయ జనంబులు= నా ప్రజలు; ఈ+మేదినీ తలంబునన్= ఈ భూమిమీద; దృఢవ్రతులు+ఐ= గట్టిసంకల్పంకలవారై; యజ్ఞభుక్+ఈశ్వరుండును= యజ్ఞాన్ని అనుభవించే అధిపతి; గురుండును+అయిన= గురువు అయిన; సర్వ+ఈశ్వరుని= పరమేశ్వరుని; హరిని= విష్ణుని; నిరంతరంబును= నిత్యం; స్వధర్మయోగంబునన్= తమ తమ ధర్మానుష్ఠానంద్వారా; పూజించుచున్నవారలు= పూజిస్తున్నారు; వారు, నన్ను+ఆశ్చర్యకరంబుగాన్= నన్ను ఆశ్చర్యంగా; అనుగ్రహించువారు+అని= దయతో చూచువారని; హరిభక్తిరతులు+ఐన= విష్ణుభక్తితత్పరులైన; ఆ+మహాత్ములన్= ఆ మహానుభావులను; నుతియించి= కీర్తించి; వెండియున్= తిరిగీ; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అదీగాక కొయ్యలో పుట్టిన అగ్ని ఆ కొయ్య లక్షణాలైన పొడవు, వంకరల నాశ్రయిస్తుంది. దేహంలోని అంతర్యామి దేహధర్మాలను అనుసరించి వ్యక్తమవుతుంది. అవ్యక్తం, కలచేది అయిన కాలం, వాసన, అదృష్టం అయిన ధర్మం అంతర్లీనంగా దేహంలో ఉంటుంది. అని పలికి కొంచెమాగి పృథుచక్రవర్తి మరలా ఇలా బోధించాడు. "నామార్గం అనుసరించే నా ప్రజలు జీవితమే నిశ్చల దీక్షగా మెలగుతూ హరిని భజిస్తారు. ఈ సృష్టియజ్ఞాన్ని అనుభవించే అధిపతి, దాన్ని ఉపదేశించేవాడు నారాయణుడే. ప్రజలు తమతమ ధర్మాలను అనుసరించి ఇలా అర్చిస్తూ యోగస్థులై ఉంటారు. వారు నన్ను అనుగ్రహించే పద్ధతి ఆశ్చర్యకరం–అని పృథుచక్రవర్తి నారాయణ భక్తులను స్తుతించాడు. మరలా ఇలా అన్నాడు.

**మ. వరసంపద్విభవప్రతాపసుమహైశ్వర్యంబులంబొల్చు నీ
ధరణీనాథులతేజ మంచితతపోదాంతిక్షమావిద్యలం
గర మొప్పారు ధరాసుపర్వహరిభక్త శ్రేణులం దెప్పుడున్,
ధరలోనంబ్రభవింప కుందునని యద్ధాత్రీవిభుండిట్లనున్. 585**

**ప్రతి :** వరసంపత్+విభవ= గొప్పదైన సంపదల ఐశ్వర్యంతో, ప్రతాప సుమహా+ఐశ్వర్యంబులన్+పొల్చు= ప్రతాపమనే గొప్ప సంపదతో వెలిగే, ఈ ధరణీనాథుల తేజము= ఈ రాజుల పరాక్రమం, అంచిత= గొప్పదైన, తపస్+దాంతి క్షమావిద్యలన్= తపస్సు, దమం, ఓర్పు, జ్ఞానం అనేవాటితో; కరము+ఒప్పారున్= మిక్కిలి ప్రకాశించే; ధరాసుపర్వ= బ్రాహ్మణులు, హరిభక్తశ్రేణులందు= భాగవతుల సముదాయంలో; ఎప్పుడున్= ఎప్పుడూ; ధరలోనన్= భూమిపై, ప్రభవింపక+ఉండునని= ప్రభావం చూపకుండు గాకయని; ఆ+ధాత్రీవిభుండు= ఆ రాజు; ఇట్లు+అనున్= ఇలా అన్నాడు.

**తా :** గొప్ప సంపదలతోనూ, మహైశ్వర్యమైన ప్రతాపంతోనూ, అఖండమైన వైభవంతోనూ ప్రకాశించే రాజుల తేజస్సు గొప్ప తపస్సుతోనూ, దాంతితోనూ, క్షమాగుణంతోనూ, జ్ఞానంతోనూ మిగుల విరాజిల్లే బ్రాహ్మణులపైనా, విష్ణుభక్తులపైనా ఏ మాత్రం తన ప్రభావాన్ని చూపించకుండు గాక! అని ఆ రాజు ఇలా అన్నాడు.

**విశే :** క్షాత్రధర్మలక్షణాలు సంపద, వైభవం, ఐశ్వర్యం. బ్రహ్మ ధర్మ లక్షణాలు తపస్సు, ఇంద్రియనిగ్రహం, క్షమావిద్యలు. ఆ క్షత్రియుల అధికారం విప్రులపై ఎప్పుడూ ప్రభావం చూడకుండుగాక!

**చ. అరయఁగ నే ధరామరపదాంబుజరేణువు లర్థిఁదాల్చి య**
**ప్పరమపురాణపూరుషుఁడు బ్రాహ్మణదేవుఁడు నైనయట్టి యీ**
**శ్వరుఁడు సదానపాయినిని సాగరకన్యను సర్వలోక వి**
**స్ఫురితపవిత్రకీర్తియును బొంది విభూతిఁదనర్చెఁగావునన్. 586**

**ప్రతి :** అరయఁగన్= పరిశీలించగా; ఏ ధరా+అమరపద+అంబుజరేణువులు= ఏ బ్రాహ్మణుల పాదకమలముల ధూళులను; అర్థిన్+తాల్చి= కోర్కెతో ధరించి; ఆ+పరమపురాణ పూరుషుఁడు= ఆ గొప్పపురాణ ప్రసిద్ధుడు; బ్రాహ్మణదేవుడును= బ్రాహ్మణులే దేవుడుగా గలవాడు; ఐన+అట్టి= ఐనట్టి; ఈశ్వరుఁడు= విష్ణువు; సదా+అనపాయినిని= ఎల్లప్పుడూ తననంటి పెట్టుకొన్న; సాగరకన్యను= లక్ష్మీదేవిని; సర్వలోక విస్ఫురిత పవిత్ర కీర్తియును= అన్ని లోకాలలో ప్రకాశించే పుణ్యకీర్తిని; పొంది= అందుకొని; విభూతిన్= వైభవంతో; తనర్చెన్+కావునన్= విరాజిల్లాడు కావున.

**తా :** పురాణ పురుషుడైన నారాయణుడు బ్రాహ్మణుల పాదపద్మరేణువులను ధరిస్తాడు. అతనికి బ్రాహ్మణులే దేవతలు. ఆ కారణంవల్లనే ఆ భగవంతుడు నిరంతరం తనతో ఉండే లక్ష్మీదేవిని పరిగ్రహించాడు సమస్తలోకాలలో పవిత్రకీర్తినీ, ఐశ్వర్యాన్నీ పొందగలిగాడు.

**విశే :** సదానపాయిని, ఎల్లప్పుడూ విష్ణు వక్షఃస్థలవాసిని లక్ష్మీదేవి.

**సీ. ఏ వసుధామరసేవను జేసి యశేషగుణాన్వితస్థితిఁదనర్చు**
**సర్వేశ్వరుఁడు మతి సంతుష్టుఁడగు నట్టి ధరణిదివిజులఁదద్ధర్మపరులు**
**నలఘువినీతులునై యవశ్యంబును సేవింపరే? ధరాదేవనిత్య**
**సేవచేఁ బురుషుఁడు చిరతర జ్ఞానవిద్యాభ్యాసి గాకున్న నైన నతఁడు**

**తే. వేగమున నంతరంగంబు విశద మగుటఁ, జేసి కైవల్యపదమును జెందు, నట్లు**
**గాన లోకులు భూదేవతానికరముఁ, దగిలి భజియింపవలయు నుదాత్తమతిని. 587**

**ప్రతి :** ఏ వసుధా+అమరసేవను+చేసి= ఏ బ్రాహ్మణ పూజచేసి; అశేష= సకల; గుణ+అన్వితస్థితిన్= గుణ సంపన్నుడైన స్థితితో; తనర్చు= ఒప్పారే; సర్వ+ఈశ్వరుఁడు= భగవంతుడు; మఱి= ఇంకా; సంతుష్టుఁడు+ అగున్= సంతోషిస్తాడో; అట్టి ధరణి దివిజులన్= అట్టి బ్రాహ్మణులను; తద్+ధర్మపరులు= ఆ ధర్మానుసారులు; అలఘువినీతులును+ఐ= గొప్పనీతిగలవారై (గొప్పవినయంగలవారై); అవశ్యంబును= ఎల్లప్పుడు; సేవింపరు+ఏ= పూజించరా? ధరాదేవనిత్యసేవచేన్= బ్రాహ్మణులను నిత్యం సేవించుటచే; పురుషుఁడు= మానవుడు; చిరతర జ్ఞానవిద్య+అభ్యాసి= శాశ్వత జ్ఞానవిద్యను అభ్యసించేవాడు; కాకున్నన్+ఐనన్= కాకపోయినా; అతఁడు= ఆయన; వేగమునన్= త్వరగా; అంతరంగంబు= మనస్సు; విశదము+అగుటన్+చేసి= నిర్మలం అయినందున; కైవల్యపదమును+చెందున్= మోక్షం పొందుతాడు; అట్లు+కాన= అలా కాబట్టి; లోకులు= ప్రజలు; భూదేవతానికరమున్= బ్రాహ్మణ సముదాయాన్ని; తగిలి= అనుసరించి; ఉదాత్తమతిని= ఉన్నతమైన మనస్సుతో; భజియింపవలయున్= పూజించాలి.

**తా :** బ్రాహ్మణసేవచే సమస్తసద్గుణాలు కలుగుతాయి. భగవంతుడు సంతోషిస్తాడు. అట్టి బ్రాహ్మణులను ఆ ధర్మాన్ని పాటించేవారు గొప్ప నీతిమంతులై తప్పక సేవించరా? జ్ఞానవిద్యలో అభ్యాసపరుడు కాకున్నా బ్రాహ్మణ సేవవలన అతని మనస్సు నిర్మలమై మోక్షప్రాప్తికూడా సిద్ధిస్తుంది. అందుచేత ఉదాత్తచిత్తంతో బ్రాహ్మణ బృందాన్ని సేవించాలి.

**వ. మఱియు. 588**

**ప్రతి :** మఱియున్= ఇంకా.

**సీ. విజ్ఞానఘనుఁడన వెలయు నీశ్వరుఁడు త త్త్వజ్ఞానయుతులైన వారిచేత**
**దీపింప నింద్రాదిదేవతోద్దేశంబు నను భూమిసురముఖంబున హుతంబు**
**లగు హవిస్సులఁదృప్తి నందినగతి నచేతనమైన యా హుతాశనముఖంబు**
**వలన వేల్చిన హవిస్సులచేతఁ దృప్తుండు గాకుండు గావున లోకమందు**

**తే. నగ్ని ముఖమునకంటె ధరామరేంద్ర, ముఖము పరిశుద్ధ మత్యంతముఖ్య మనఁగఁ**
**దనరునది గాన భూసురార్చనము సకల, జనులుఁ గావింపఁదగు నార్యజనములార! 589**

**ప్రతి :** ఆర్యజనములార= ఓ పుణ్యపురుషులారా!; విజ్ఞానఘనుఁడు+అనన్= విజ్ఞానసంపన్నుడనగా; వెలయున్= ప్రకాశించు; ఈశ్వరుఁడు= భగవంతుడు; తత్త్వజ్ఞానయుతులు+ఐనవారిచేతన్= భగవత్తత్త్వం తెలిసినవారిచే; దీపింపన్= ప్రకాశించగా; ఇంద్ర+ఆది దేవత+ఉద్దేశంబునను= ఇంద్రాది దేవతలనుద్దేశించి; భూమిసురముఖంబునన్= బ్రాహ్మణుల ద్వారా; హుతంబులగు= వేల్చినటువంటి; హవిస్సులన్= పదార్థాలతో; తృప్తిన్+అందినగతిన్= తృప్తి చెందినట్లుగా; అచేతనము+ఐన= జడమైన; ఆ హుత+అశనముఖంబువలనన్= ఆ అగ్ని దేవుని ద్వారా; వేల్చిన హవిస్సులచేతన్= ఆహుతి చేసిన హవిస్సుచే; తృప్తుండు+కాక+ఉండున్= సంతుష్టినొందదు; కావున, లోకమందు; అగ్నిముఖమున కంటెన్= అగ్నిదేవతా ముఖం కంటే; ధరా+అమర+ఇంద్రముఖము= బ్రాహ్మణ శ్రేష్ఠులముఖం; పరిశుద్ధము= స్వచ్ఛం (పవిత్రం); అతి+అంతముఖ్యము= మిక్కిలి శ్రేష్ఠం; అనఁగన్+తనరునది గాన= అని ఒప్పునది గాన; భూసుర+అర్చనము= బ్రాహ్మణసేవ; సకలజనులున్= సమస్తప్రజలూ; కావింపన్+తగున్= చేయాలి.

**తా :** ఆర్యమహాజనులారా! భగవంతుడు విజ్ఞాననిధి. తత్త్వజ్ఞాన సంపన్నులైనవారు ఇంద్రాది దేవతల్ని ఉద్దేశించి బ్రాహ్మణముఖంగా అర్పించే అన్నంవల్ల (హవిస్సు) తృప్తి చెందినట్లు, అచేతనమైన అగ్నిలో వేల్చిన హవిస్సువల్ల ఈశ్వరుడు తృప్తి పొందడు. కాబట్టి, లోకంలో అగ్ని ముఖంకంటె బ్రాహ్మణుల ముఖం పరిశుద్ధమైంది. అత్యంతప్రధానమైంది. అందువల్ల సకల జనులూ బ్రాహ్మణులను సేవించాలి.

**విశే :** యజ్ఞయాగాదులు దేవతలనుద్దేశించి చేస్తారు. అగ్నిముఖంగా దేవతలకు హవిస్సులు అందుతాయి. తద్వారా పుణ్యలోకప్రాప్తి, ఇష్టఫలసిద్ధి కలుగుతుందని నమ్మకం. ఇక్కడ పృథుచక్రవర్తి బ్రాహ్మణసేవలోని ప్రాధాన్యం వివరించాడు.

**వ. అదియునుంగాక. 590**

**ప్రతి :** అదియునున్+కాక= అదీగాక.

**తా :** అదీగాక

**సీ. ఏ వేదమందేని నీ విశ్వ మెల్లను దర్పణ ప్రతిబింబితమగు వస్తు**
**నివహంబు కైవడిఁదివిరి ప్రకాశించు నట్టి విరజమును నవ్యయంబు**
**నగుచు సనాతనంబగు వేద మే ధరా దేవతాజన మనుదినముఁ దగిలి**
**మహితశ్రద్ధాతపోమంగళమౌన సంయమసమాధులఁబొలుపారుచుండి**

**తే. యర్థి సదసద్విచారులై యధికరింతు, రట్టివారల పదరజంబర్థిఁ దాల్చు**
**నలఘులకు సర్వపాపక్షయంబు నఖిల, సద్గుణావాప్తియును నగుఁజతురులార! 591**

**ప్రతి :** చతురులార= నిపుణులారా!; ఏ వేదమందున్+ఏని= ఏ వేదంలోనైతే; ఈ విశ్వము+ఎల్లను= ఈ లోకమంతా; దర్పణ ప్రతిబింబితమగు= అద్దంలో కనిపించే; వస్తు నివహంబు కైవడిన్= వస్తువుల సముదాయంవలె; తివిరి ప్రకాశించున్= మిక్కిలి వెలిగిపోతాయో; అట్టివిరజమును= అలా కళంకంలేనిది; అవ్యయంబున్+అగుచు= నాశనం లేనిదై; సనాతనంబు+అగు= ప్రాచీనమైన; వేదము= వేదం; ఏ ధరాదేవతాజనము= ఏ బ్రాహ్మణులు; అనుదినమున్= ప్రతిదినం, తగిలి= అనుసంధించి; మహితశ్రద్ధా= అధికమైన ఆసక్తితో; తపోమంగళ= శుభప్రదమైన తపస్సుతో; మౌనసంయమ సమాధులన్= మౌనం; ఇంద్రియ నిగ్రహం; నిశ్చలత్వాలతో; పొలుపారుచుండి= ఒప్పారుతూ; అర్థిన్= కోరికతో; సత్+అసత్+విచారులు+ఐ= సత్యా, సత్యాలను విచారించువారై; అధికరింతురు= అధ్యయనం చేస్తారో; అట్టివారలు+అ= అలాంటివారి; పదరజంబు= పాదధూళి; అర్థిన్+తాల్చు= ధరించే; అలఘులకున్= మహాత్ములకు; సర్వపాపక్షయంబు= సమస్తపాపాల నాశం; అఖిల సద్గుణావాప్తియును+అగున్= సమస్తసద్గుణాలు కలుగుతాయి.

**తా :** ఓ చతురులారా! ఈ లోకమంతా ఏ వేదంలోనైనా అద్దంలో ప్రతిబింబించే వస్తువులవలె బాగా ప్రకాశిస్తుంది. ఆవిధమైన కళంకంలేనిది, నాశరహితమైనది సనాతనవేదం. దానిని శ్రద్ధతో అధ్యయనంచేసి, తపస్సుతో సాధించి, మౌనంతో క్రమబద్ధం చేసుకొని, ఇంద్రియ నిగ్రహంతో నిశ్చలం కావించి, సమాధి స్థితిలో ఉండేవారే బ్రాహ్మణులు. సత్యాసత్య నిర్ణయశక్తి వారికుంది. అలాంటి బ్రాహ్మణుల పాదరజాన్ని ధరించేవారికి సర్వపాపాలు నశించి సద్గుణాలు అలవడుతాయి.

**వ. కావున నట్టి విప్రపాద సరోజరేణువు లేనును గిరీటంబున ధరియింతు, నిట్లు బ్రాహ్మణ భజనంబునం జేసి యవాప్త సకల గుణుండును శీలధనుండును గృతజ్ఞుండును శ్రద్ధాయుక్తుండును నైన మహాత్ము నఖిల సంపదలుఁ బ్రాపించుం గావున గోబ్రాహ్మణ కులంబును ననుచర సమేతుం డయిన జనార్దనుండును నా యెడం బ్రసన్ను లయ్యెదరు గాక యని పలుకుచున్న పృథు చక్రవర్తిం గనుంగొని పితృదేవద్విజ సత్పురుషులు సంతుష్టాంతరంగులై సాధువాదంబుల నభినందించి యిట్లనిరి. 592**

**ప్రతి :** కావునన్= కాబట్టి; అట్టి విప్రపాద సరోజరేణువులు= ఆ బ్రాహ్మణ పాదపద్మాలధూళి; ఏనును= నేనుకూడా; కిరీటంబునన్= (తలపై) కిరీటంపై; ధరియింతున్= ధరిస్తాను; ఇట్లు బ్రాహ్మణ భజనంబునన్+చేసి= ఈ విధంగా బ్రాహ్మణుల పూజచేసి; అవాప్త సకలగుణుండు= పొందిన సమస్త గుణాలు కలవాడు; శీలధనుండును= శీలసంపదగలవాడూ; కృతజ్ఞుండును= చేసినమేలు మరువనివాడూ; శ్రద్ధాయుక్తుండును= శ్రద్ధగలవాడూ; ఐన మహాత్మున్= అయిన మహానుభావుని; అఖిల సంపదలున్= సమస్త ఐశ్వర్యాలు; ప్రాపించున్+కావునన్= పొందుతాయి కాబట్టి; గోబ్రాహ్మణకులంబును= గోవులు, బ్రాహ్మణ సంతతి; అనుచరసమేతుండు+ఐన= శిష్యులతోగూడిన; జనార్దనుండును= విష్ణువు; నాయెడన్= నాపట్ల; ప్రసన్నులు+అయ్యెదరు+కాక+అని= సంతుష్టులగుదురుగాక అని; పలుకుచున్న= మాట్లాడు; పృథుచక్రవర్తిన్+కనుంగొని= పృథుచక్రవర్తిని చూసి; పితృదేవ ద్విజ సత్పురుషులు= పితృదేవతలు; బ్రాహ్మణులు, సజ్జనులు; సంతుష్ట+అంతరంగులు+ఐ= సంతోషించిన మనస్సుగలవారై; సాధువాదంబులన్+అభినందించి= బాగు బాగు అని మెచ్చుకొని; ఇట్లు+అనిరి= ఇలా అన్నారు.

**తా :** అందుచేత అలాంటి బ్రాహ్మణుల పాదధూళిని నేను కిరీటంపై ధరిస్తాను. ఇట్లు బ్రాహ్మణులను సేవించినవానికి సమస్తగుణాలు, శీలం, కృతజ్ఞతాభావం, సిద్ధిస్తాయి. అట్టి శ్రద్ధగల మహానుభావుని ఐశ్వర్యాలు వరిస్తాయి. గోబ్రాహ్మణులు, అనుచరులతోగూడి విష్ణువు నాకు ప్రసన్నుడగుగాక అని చెప్పిన పృథుచక్రవర్తిని చూసి పితృదేవ బ్రాహ్మణులు, సత్పురుషులు సంతోషంతో ప్రసంసించి ఇలా అన్నారు.

**క. మనుజేంద్ర! నీ కతంబున, ననుపమఘనబ్రహ్మదండహతుఁడత్యఘ వ**
**ర్తనుఁడు నగునట్టి వేనుం, డనయము నరకంబువలన నర్థిఁదరించెన్. 593**

**ప్రతి :** మనుజ+ఇంద్ర= రాజా! నీ కతంబున= నీవలన; అనుపమ= సాటిలేని; ఘనబ్రహ్మదండహతుఁడు= గొప్పదైన, బ్రహ్మదండంచే చనిపోయిన; అతి+అఘవర్తనుఁడు= మిక్కిలిపాపి; అగునట్టి వేనుండు= అయినట్టి వేనరాజు; అనయమున్= మిక్కిలి; అర్థిన్= కోరికతో; నరకంబువలనన్= నరకంనుండి; తరించెన్= బయటబడ్డాడు.

**తా :** ఓ పృథుచక్రవర్తీ! నీ పుణ్యవిశేషంవలన ఎన్నడో సాటిలేని గొప్ప బ్రహ్మదండంచే హతుడైన మిగుల పాపవర్తనుడైన వేనరాజు నరకంనుండి సుఖంగా తరించాడు.

**విశే :** వంశంలో ఒక పుణ్యాత్ముడు జన్మిస్తే వారివంశం తరిస్తుందనడానికి పృథుచక్రవర్తి గాథ ఉదాహరణ.

వేనుని పాపాలు పృథువుపవిత్రవర్తనతో నశించాయి. పుత్రుడంటే తండ్రియే మరొక రూపంలో జన్మిస్తాడు గాబట్టి పాపప్రవర్తనుడు సత్పుత్రునివల్ల పవిత్రుడవుతాడు.

**వ. కావునం'బుత్రేణ లోకాన్ జయతి' యను వేదవచనంబు నిశ్చయం, బదియునుంగాక 594**

**ప్రతి :** కావునన్, పుత్రేణ= కుమారునిచేత, లోకాన్= లోకాలను, జయతి= జయిస్తాడు, అను వేదవచనంబు= అనే వేదవాక్యం, నిశ్చయంబు= తప్పదు, అదియునున్+కాక= అదీగాక.

**తా :** అందుచేత కుమారునివలన తండ్రి సర్వలోకాలను జయిస్తాడనే వేదవాక్యం నిశ్చయం.

**చ. పురుషవరేణ్య! హేమకశిపుండు రమాలలనేశు నిందచే**
**నరకమునొందఁగోరియు గుణజ్ఞుఁడు భాగవతుండునైన యా**
**వరతనయప్రభావమున వాసికి నెక్కి విధూతపాపుఁడై**
**నిరయముఁబొందఁడయ్యె, నతి నిర్మలకీర్తిఁదనర్చెఁగావునన్. 595**

**ప్రతి :** పురుషవరేణ్యా= ఓరాజా! హేమకశిపుండు= హిరణ్యకశిపుడను రాక్షసరాజు; రమాలలనా+ఈశునిందచే= లక్ష్మీధవుని నిందించుటచే; నరకమున్+ఒందన్+కోరియు= నరకాన్ని పొందదలచుకొన్నప్పటికీ; గుణజ్ఞుఁడు= గుణజ్ఞానంకలవాడు; భాగవతుండున్+ఐన= భక్తుడు అయిన; ఆ వరతనయ ప్రభావమున= అట్టి శ్రేష్ఠుడైన కుమారుని ప్రభావంచే; విధూత పాపుఁడు+ఐ= పాపాలు నశించినవాడై; వాసికిన్+ఎక్కి= ప్రసిద్ధి గడించి; అతి నిర్మలకీర్తిన్= శుభ్రమైనకీర్తిని; తనర్చెన్+ కావునన్= విలసిల్లాడు కాబట్టి; నిరయమున్= నరకాన్ని; పొందఁడు+అయ్యెన్= పొందలేదు;

**తా :** ఓ రాజా! హిరణ్యకశిపుడనే రాక్షసరాజు విష్ణునిందచేసి, నరకానికి వెళ్లాలని సంకల్పించినా, గుణవంతుడు, భాగవతుడు, అయిన సత్పుత్రుడు ప్రహ్లాదుని ప్రభావంవలన ప్రసిద్ధికెక్కి మిక్కిలి నిర్మలమైన కీర్తితో విలసిల్లినందున పాపాలు తొలగడంచేత నరకానికి వెళ్లలేదు.

**క. అని పలికి వీరవర్యుం, డనఁదగు పృథుచక్రవర్తి నయుతాబ్దంబుల్**
**దనరఁగ జీవింతువు గా, కని తగ నాశీర్వదించి యభిమత మొప్పన్. 596**

**ప్రతి :** అని పలికి= అనిచెప్పి; వీరవర్యుండు+అనదగు= వీరశ్రేష్ఠుడనదగిన; పృథుచక్రవర్తిన్= పృథుచక్రవర్తిని; అయుత+అబ్దంబుల్= పది వేలసంవత్సరములు; తనరఁగ= గొప్పగా; జీవింతువు+కాక+అని= జీవిస్తావు కాక అని; తగన్+ఆశీర్వదించి= తగిన విధంగా ఆశీస్సులందించి; అభిమతము+ఒప్పన్= ఇష్టము కలుగునట్లు.

**తా :** అని చెప్పి వీరుడనదగిన పృథుచక్రవర్తిని పది వేలసంవత్సరాలు గొప్పగా జీవిస్తావని తగినట్లు ఆశీర్వదించి మరీ ఇష్టం కలిగేలా

**వ. వెండియు నిట్లనిరి, దేవా! నీకు సకలలోక భర్తయగు నారాయణునందు నిట్టి భక్తి వొడముటం జేసియు బ్రహ్మణ్య దేవుండు నుత్తమ శ్లోకుండునైన సర్వేశ్వరుని సత్కథాజాలంబు వ్యక్తంబు సేయుచున్న నీవు మాకు నాథుండ వగుటం జేసియు నేము ముకుంద దాసులమైతిమి, భవదీయ ప్రజానుశాసనంబు ప్రజానురాగంబు కారుణ్యమూర్తులైన మహాత్ములకు స్వభావంబులు, గావున నాశ్చర్యంబు గాదు, దైవసంజ్ఞితంబులయిన కర్మంబులచేత వినష్టజ్ఞానులమై పరిభ్రమించు మాదగు తమఃపారంబుఁ గంటి, మే సర్వేశ్వరుండు బ్రాహ్మణజాతి నధిష్ఠించి క్షత్త్రియులను, క్షత్త్రియజాతి నధిష్ఠించి బ్రాహ్మణులను నీ యుభయంబు**

**నధిష్ఠించి విశ్వంబును భరియించు, నట్టి వివృద్ధ సత్త్వుండు సర్వరూపుండు మహాపురుషుండునైన పృథునకు నీశ్వర బుద్ధింజేసి యేము నమస్కరింతు మను సమయంబున. 597**

**ప్రతి :** దేవా= ఓ రాజా!; వెండియున్= మరలా; ఇట్లు+అనిరి= ఇలా అన్నారు; నీకు; సకలలోక భర్తయగు= ప్రపంచానికి అధిపతి అయిన; నారాయణు+అందున్= విష్ణువుపట్ల; ఇట్టి భక్తి+పొడముటన్+చేసియు= ఈ విధమైన అనన్యభక్తి ఉండటం చేత; బ్రహ్మణ్యదేవుండు= వేదాలలో గణుతికెక్కినదేవుడు; ఉత్తమశ్లోకుండు= ఉత్తమ చరిత్రుడు; అయిన సర్వేశ్వరుని= అయిన విష్ణుని; సత్+కథాజాలంబు= మంచికథా సముదాయం; వ్యక్తంబు+చేయుచున్న= తెలియజేస్తున్న; నీవు, మాకు నాథుండవు+అగుటన్+చేసియున్= మాకు రాజువు కావడంవల్ల; ఏము= మేము; ముకుంద దాసులము+ ఐతిమి= విష్ణుభక్తుల మయ్యాము; భవదీయ= నీయొక్క ప్రజా+అనుశాసనము= ప్రజాపరిపాలనం; ప్రజా+అనురాగంబు= జనులపై ప్రేమ; కారుణ్యమూర్తులు+ఐన= దయాస్వభావంగలవారైన; మహాత్ములకు= మహానుభావులకు; స్వభావంబులు= సహజమైనవి; కావునన్= కాబట్టి; ఆశ్చర్యంబు+కాదు= అబ్బురం కాదు; వినష్టజ్ఞానులము+ఐ= నశించిన తెలివిగలవాళ్లమై (బుద్ధిహీనులమై); పరిభ్రమించు= తిరుగు; మాదగు= మాయొక్క; తమస్+పారంబున్= అజ్ఞానంయొక్క అంచును; దైవసంజ్ఞితంబులు+అయిన= దైవంపేర వెలసిన; కర్మంబులచేత= పనులచే; కంటిమి= చూడగలిగాము; ఏ సర్వేశ్వరుండు= ఏ భగవంతుడు; బ్రాహ్మణజాతిన్= బ్రాహ్మణ కులంలో; అధిష్ఠించి= నిలిచి; క్షత్రియులను= రాజులను; క్షత్రియజాతిన్= రాజవంశంలో; అధిష్ఠించి= నిలిచి; బ్రాహ్మణులను, ఈ ఉభయంబును= ఈ రెండు జాతులను; అధిష్ఠించి= నిలచి; విశ్వంబును= ప్రపంచాన్ని; భరియించున్= భరిస్తాడో; అట్టి వివృద్ధసత్త్వుండు= ఆవిధమైన అధికబలం గల్గినవాడు; సర్వరూపుండు= అన్నిరూపాలు తాల్చినవాడు; మహాపురుషుండును+ఐన= మహోన్నత పురుషుడు అయిన; పృథువునకున్= పృథుచక్రవర్తికి; ఈశ్వరబుద్ధిన్+చేసి= భగవంతుడన్న భక్తిభావంచేత; ఏము= మేము; నమస్కరింతుము= నమస్కరిస్తాము; అను సమయంబునన్= అని చెప్పేవేళ...

**తా :** మరలా ఇలా అన్నారు, ఓరాజా! నీకు పరమేశ్వరుడైన విష్ణుపై భక్తిఉండటంవల్ల పరమోత్తముడు వేదవేద్యుడయిన ఆయన నుంచి కథలు మాకు తెలియజేస్తున్న నీవు మాకు రాజువు కావున మేము కూడా విష్ణుభక్తుల మయ్యాము. నీ ప్రజారంజక పరిపాలనం, ప్రజలపై అనురాగం దయాస్వభావులయిన మీవంటి వారికి సహజం. అందులో ఆశ్చర్యం లేదు. జ్ఞానాన్ని కోల్పోయి సంచరించేమేము దైవం పేర చేసే కర్మల వల్ల మా అజ్ఞానపుటవధిని తెలుసుకున్నాము. ఆ మహానుభావుడు బ్రాహ్మణుల నధిష్ఠించి క్షత్రియులను, వారిద్వారా బ్రాహ్మణులను, వారుభయుల ద్వారా ప్రపంచాన్ని భరిస్తాడు. అలాంటి బలసంపన్నుడు, సమస్తరూపుడు, మహోన్నతుడు అయిన పృథుచక్రవర్తికి విష్ణుడన్న భక్తితో నమస్కరిస్తున్నాము. అని చెప్పే సమయంలో

### a =పృథు చక్రవర్తి యొద్దకు సనకాదు లరుగుదెంచుట a

**క. వినువీథినుండి మెల్లన, చనుదెంచిరి బాలసూర్యసంకాశతనుల్**
**జనవినుత! సిద్ధవర్యులు, సనకాదులు శేముషీవిచక్షణు లంతన్. 598**

**ప్రతి :** జనవినుత= ప్రజలచే ప్రశంసించబడే ఓరాజా!; అంతన్= అప్పుడు; మెల్లన= నెమ్మదిగా; వినువీథినుండి= ఆకాశమార్గం నుండి; బాలసూర్య సంకాశతనుల్= ఉదయ సూర్యుని కాంతితో సమానమైన శరీరంకలవారు; సిద్ధవర్యులు=

శ్రేష్ఠులైన మునులు; శేముషీ విచక్షణులు= బుద్ధికౌశల్యం ఉండేవారయిన; సనకాదులు= సనకసనందాది ఋషులు; చనుదెంచిరి= వచ్చారు.

**తా :** ప్రజల పొగడ్తలందిన ఓ మహారాజా! అప్పుడు ఆకాశమార్గం నుండి నెమ్మదిగా ఉదయసూర్యప్రకాశతేజులు, మునిశ్రేష్ఠులు, శేముషీధురంధరులు, బుద్ధిమంతులు అయిన సనకాదిమునులు వచ్చారు.

**వ. ఇట్లు సనుదెంచి 599**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా, చనుదెంచి= వచ్చి.

**తా :** ఈ విధంగా వచ్చి

**క. అనఘాత్ము లతిథిరూపం, బున రా గృహమేధి ప్రాణములు నుద్గతి చేఁ**
**దనరినఁ బ్రత్యుద్గతి వం, దనముల మరలం బ్రతిష్ఠితము లగు ననుచున్. 600**

**ప్రతి :** అనఘాత్ములు= పుణ్యాత్ములు; అతిథిరూపంబునరాన్= అతిథులరూపంలో రాగా; గృహమేధి ప్రాణములు= గృహస్థుని ప్రాణాలు; ఉద్గతిచే తనరినన్= ఉద్గమనంచే ఒప్పగా; ప్రత్యుద్గతి వందనములన్= లేచి ఎదురేగి నమస్కరించుట చేత; మరలన్= మళ్లీ; ప్రతిష్ఠితములగున్+అనుచున్= ప్రతిష్ఠింపబడతాయని అంటూ...

**తా :** పుణ్యాత్ములు అతిథుల రూపంలో రాగా గృహస్థుని ప్రాణాలు (పోవడానికి) పైకి లేస్తాయి. వారికి ఎదురేగి నమస్కరించడం చేత మళ్లీ లేచిన ప్రాణాలు యథాస్థానంలో చేరుకుంటాయని

**క. వినఁబడు వచనన్యాయం, బున నుద్గతములగు ప్రాణములఁ గ్రమ్మఱఁ బొం**
**దను గోరువాఁడునుంబలె, ననుచరఋత్విక్సదస్యుఁడై పృథుఁ డంతన్. 601**

**ప్రతి :** వినన్+పడు= వినిపించే; వచన న్యాయంబునన్= మాటల ప్రకారం; ఉద్గతములు+అగు= లేచిన; ప్రాణములన్= జీవములను; క్రమ్మఱన్= తిరిగి; పొందను+కోరువాఁడునున్+వలె= పొందాలనుకొనేవానివలె; పృథుఁడు= పృథుమహారాజు; అంతన్= అప్పుడు; అనుచర= పరివారం; ఋత్విక్= యజ్ఞంచేయువారు; సదస్యుఁడు+ఐ= సభ్యులు కలవాడై; అంతన్= అంతలో...

**తా :** అలా వినబడే మాటలప్రకారం పైకిపోయే ప్రాణాలను తిరిగి పొందగోరేవానివలె పృథుచక్రవర్తి తన అనుచరులతోను, ఋత్వికగణంతోను సదస్యులతోను గూడినవాడై అంతలో

**తే. ఇంద్రియేశుఁడు గంధాదికేష్ట గుణము, గూర్చి యుద్గమన క్రియఁ గోరి చేయు**
**పగిదిఁ బృథుచక్రవర్తి సంభ్రమముతోడ, మహితభక్తిని బ్రత్యుద్గమంబు సేసె. 602**

**ప్రతి :** ఇంద్రియ+ఈశుఁడు= ఇంద్రియాలకు ప్రభువైన జీవుడు; గంధాదిక+ఇష్టగుణమున్+కూర్చి= గంధం మొదలగు ఇష్టమైన గుణమును గురించి; ఉద్గమనక్రియన్= లేచి ఎదురు నడచునట్లు; కోరిచేయుపగిదిన్= కోరిచేసినట్లు; సంభ్రమముతోడన్= ఉత్సాహంతో; మహితభక్తిని= అధికమైన భక్తితో; ప్రత్యుద్గమంబు= ఎదురుకోలు సన్నాహం; చేసెన్= చేశాడు.

**తా :** జీవుడు గంధాది గుణాలనుద్దేశించి చేయునట్లే సంభ్రమంతో రాజు వారికి స్వాగతసన్నాహం చేయగోరి ఉత్సాహంతో భక్తితో ఎదురుకోలు నడిపాడు.

**క. ఘనగౌరవమున న మ్మునిజనచిత్తవశీకృతుండు సభ్యుఁడుఁ బ్రియుఁడున్**
**వినయానతకంధరుఁడై, జనవరుఁ డా పరమయోగిచంద్రుల నెలమిన్. 603**

**ప్రతి :** ఘనగౌరవమునన్= అధికమైన ఆదరంతో; జనవరుఁడు= రాజు; ఆ+మునిజనచిత్తవశీకృతుఁడు= ఆ మునులయొక్క చిత్తంచే వశీకరింపబడినవాడు; సభ్యుఁడు; ప్రియుఁడున్= ఇష్టుడైన అతడు; వినయ+ఆనతకంధరుఁడు+ఐ= వినయంతో వంగిన కంఠంకలవాడై; ఎలమిన్= ప్రీతితో; పరమయోగిచంద్రులన్= పరమయోగీశ్వరుల్ని...

**తా :** అత్యంత గౌరవంతో మునిజనుల మనస్సులచే ఆకర్షింపబడిన ఆరాజు సభ్యతతో వారికిష్టుడై వినయ వినమితమైన కంఠంగలవాడై ఆ పరమయోగీశ్వరుల్ని ప్రీతితో (ఆహ్వానించి)

**సీ. పూని యర్హాసనాసీనులఁగావించి కర మర్థి విధివత్ప్రకారమునను**
**బూజించి తత్పదాంభోరుహక్షాళనసలిలంబు లాత్మమస్తమునఁ దాల్చి**
**హాటకకలితసింహాసనాసీనులై విహితాగ్నులను బోలి వెలుఁగుచున్న**
**శర్వాగ్రజన్ముల సనకాదులను జూచి యతులశ్రద్ధాసంయమాన్వితుండుఁ**

**తే. బరమసంప్రీతమతియునై పలికె రాజు, గోరి 'యో మంగళాయనులార! పూర్వ**
**భవమునందెద్ది మంగళప్రద సుకర్మ, మేను జేసితి? మిముఁజూడ నిపుడు గలిగె'. 604**

**ప్రతి :** పూని= ప్రయత్నించి; అర్హ+ఆసీనులన్+కావించి= ఉచితాసనాలపై కూర్చుండబెట్టి; కరము+అర్థిన్= మిక్కిలి కోర్కెతో; విధివత్+ప్రకారమునను= వైదికోక్తంగా; పూజించి; తద్+పాద+అంభోరుహ= వారి పాదపద్మాలు; క్షాళనసలిలంబులు= కడిగిన నీరు; ఆత్మమస్తమునన్+తాల్చి= తన శిరస్సుపై ధరించి; హాటక కలిత సింహాసన+ఆసీనులై= బంగారు సింహాసనాలపై కూర్చొన్నవారై; విహిత+అగ్నులను+పోలి= వేదికమీది అగ్నులవలె; వెలుఁగుచున్న= ప్రకాశించే, శర్వ+అగ్రజన్ములన్= శివునికంటే ముందే బ్రహ్మమానస పుత్రులైన; సనకాదులను+చూచి= సనకాదులనుచూచి; అతులశ్రద్ధాసంయమ+అన్వితుఁడు= సాటిలేని శ్రద్ధ, నిగ్రహం కలిగినవాడై; పరమసంప్రీతమతియును+ఐ= మిక్కిలి సంతోషించినవాడై; కోరి= సత్సంకల్పంతో నిండిన అభిలాషతో; రాజు, పలికెన్= ఇలా అన్నాడు; ఓమంగళ+అయనులార!= ఓ మంగళ మూర్తులారా!; పూర్వభవమునందు= తొలిజన్మలో; ఎద్ది= ఎటువంటి; మంగళప్రద సుకర్మ= శుభప్రదమైన పుణ్యమును; ఏను చేసితి= నేను చేశాను?; ఇపుడు మిమున్+చూడన్+కలిగెన్= ఇప్పుడు మిమ్మల్ని చూడగలిగాను.

**తా :** పూనుకొని పృథుమహారాజు వారిని ఉచితాసనాలపై కూర్చుండబెట్టి వారికి వైదికోక్తంగా పూజలుచేసి వారి పాదప్రక్షాళన జలాలు శిరస్సుపై జల్లుకొన్నాడు. బంగారు సింహాసనాలపై కూర్చొని వేదికమీది అగ్నులవలె వెలిగే బ్రహ్మమానసపుత్రులైన, శివునికి అగ్రజన్ములైన సనకాదిమునులను చూసి మిక్కిలి శ్రద్ధాసక్తులతో పరమసంతుష్టుడై ఇలా అన్నాడు.

'ఓ శుభవర్తనులార! నేను చేసిన పూర్వపుణ్యకర్మచే ఇప్పుడు మిమ్మల్ని చూడగలిగాను'.

**విశే :** సనక, సనందన, సనాతన, సనత్కుమారులు – ఈ నలుగురు బ్రహ్మమానస పుత్రులు. వారెప్పుడూ ఐదేండ్లప్రాయంలోనే ఉంటారు. విష్ణుభక్తులు. వైకుంఠంలో నివసిస్తుంటారు. విష్ణువు అంతరంగ అభిలాష ననుసరించి ప్రవర్తించేవారు. బాలభావంతో ఉంటారు గనుక అవధూత సంప్రదాయం వీరినుండే పుట్టింది. శివునికి కూడా వారు అగ్రజులుగా ఉన్నారు.

**వ. అని వెండియు. 605**

**ప్రతి :** అని వెండియు= మరియు

**క. భువి నెవ్వని యెడ విప్రులు, భవుఁడును విష్ణుఁడు దదీయభక్తులును బ్రస**
**న్నవదను లగుదురు వానికి, భువి దివిని నసాధ్యకర్మములు లే వరయన్. 606**

**ప్రతి :** అని, వెండియున్= మరియు; భువిన్= ప్రపంచంలో; ఎవ్వని+ఎడన్= ఎవని విషయంలో; విప్రులు= ప్రసన్నమైన ముఖం కలవాడు, బ్రాహ్మణులు; భవుఁడును= శివుడు; విష్ణుఁడు= విష్ణువు; తదీయభక్తులును= విష్ణుభక్తులు; ప్రసన్నవదనులు+అగుదురు= అనుగ్రహిస్తారో; వానికి= అట్టివానికి; భువి= ఈ ప్రపంచంలో; దివిని= స్వర్గంలో; అసాధ్యకర్మములు= సాధ్యం కాని పనులు; అరయన్= ఆలోచించగా; లేవు= లేవు.

**తా :** మరియు ఈ లోకంలో బ్రాహ్మణులు, శివుడు, విష్ణుదేవుడు, ఆయన భక్తులు ఎవరిపట్ల ప్రసన్నమవుతారో వారికి ఈ లోకంలో, స్వర్గంలో సాధ్యం కాని పనులంటూ ఉండవు.

**వ. అని మఱియు ననఘాత్ములార! లోకంబుల నీక్షించుచుం బర్యటనంబు సేయు మిమ్ము సర్వదర్శనుం డయిన యాత్మనుం గనుంగొనం జాలని సర్వదృశ్యంబు చందంబున నీ లోకంబు గనుంగొనంజాలకుండు నట్టి మహాత్ములరయిన మీ దర్శనంబునం జేసి యేను ధన్యుండనైతి, నదియునుం గాక. 607**

**ప్రతి :** అని మఱియున్= అంటూ మరలా; అనఘ+ఆత్ములార= ఓ పుణ్యాత్ములారా!; లోకంబులన్= లోకాలన్నింటిని; ఈక్షించుచున్= చూస్తూ; పర్యటనంబు+చేయు= తిరిగే; మిమ్ము, సర్వదర్శనుండు+అయిన= అన్నింటిని చూడగలిగిన; ఆత్మనున్= ఆత్మను; కనుగొనం జాలని= చూడనేరని; సర్వదృశ్యంబు చందంబున= సమస్తమైన దృశ్యపదార్థాలన్నిటివలె; ఈ లోకంబు= ఈ ప్రపంచం; కనుంగొనన్+చాలక+ఉండున్= చూడలేదు; అట్టిమహాత్ములరు+అయిన= అట్టిమహానుభావులైన; మీ దర్శనంబునన్+చేసి= మిమ్ముచూడటంవల్ల; ఏను= నేను; ధన్యుండను+ఐతిన్= అదృష్టవంతుడనయ్యాను; అదియునున్+కాక= అదీగాక.

**తా :** అని ఇంకనూ పుణ్యాత్ములారా! అన్నింటినీ చూడగలిగిన ఆత్మను చూడలేని చూపువలె అన్ని లోకాలను చూస్తూ తిరిగే మిమ్ము లోకం చూడలేదు. అట్టి మీ దర్శనంచేత నేను ధన్యుడనయ్యాను. అంతేకాక

**చ. అరయ ధరిత్రి నెవ్వనిగృహంబు మహోర్జ్వనోపయోగ్య వి**
**స్ఫురితతృణాంబుభృత్యగృహభూముల సారెఁదనర్చు నట్టి మం**
**దిరపతి పేద యైన జగతింగడు ధన్యుఁడటంద్రు గాన సు**
**స్థిరమతి మీరు వచ్చుట నశేషశుభంబుల నేను బొందెదన్. 608**

**ప్రతి :** అరయన్= ఆలోచింపగా; ధరిత్రిన్= లోకంలో; ఎవ్వని గృహంబు= ఎవని ఇల్లు; మహా+అర్హజన+ఉపయోగ్య= పూజనీయులైనవారిచే ఉపయోగించదగినవై; విస్ఫురిత= వెలుగొందు; తృణ+అంబు= గడ్డి, నీళ్లు; భృత్య= సేవకులు; గృహ= ఇల్లు; భూములన్= భూములతో; సారెన్= మాటిమాటికి; తనర్చున్+అట్టి= పొలుపొందే; మందిరపతి= ఇంటి యజమాని; పేదయైనన్= పేదవాడైనా; జగతిన్= లోకంలో; కడు ధన్యుఁడు+అటంద్రు= మిక్కిలి పుణ్యజీవి అంటారు; కానన్= కాబట్టి; సుస్థిరమతిన్= నిశ్చయబుద్ధితో; మీరు వచ్చుటవల్ల= మీరు రావటంతో; నేను= నేను; అశేష శుభంబులన్= శుభాలను; పొందెదన్= పొందగలను.

**తా :** ఆలోచించగా లోకంలో ఎవని ఇంటికి పూజనీయులు, మహానుభావులు అయిన వ్యక్తులు వచ్చి ఆ ఇంటిలోని వారి సేవలను అంగీకరిస్తారో, ఆ ఇంటిలో యథేచ్ఛగా సంచరిస్తారో, అల్పమైన ఆహారాన్నీ, జలాన్నీ స్వీకరిస్తారో ఆ ఇంటియజమాని పేదవాడైనా లోకంలో అతడే ధన్యాత్ముడు. మీవంటి పెద్దల రాకచే నాకు విశేషశుభాలు లభిస్తాయి అన్నాడు పృథువు.

**వ. అదియునుంగాక. 609**

**ప్రతి :** అదియునున్+కాక= అదీగాక.

**తా :** అదీగాక

**చ. వరమతులార! యెవ్వని నివాసముఁదీర్థపదాంతరంగులై**
**పరఁగినయట్టి భాగవతపాదజలంబులు సోఁకవేని త**
**త్పురుషుఁడు భూరిసంపదలఁబొంపిరిపోయిననైన వాని మం**
**దిర మురగప్రకీర్ణజగతీజముఁబోలు నటంద్రు కోవిదుల్. 610**

**ప్రతి :** వరమతులార= శ్రేష్ఠమైన ధిషణ గలవారలారా!; ఎవ్వని నివాసమున్= ఎవరి ఇంటిని; తీర్థపద+అంతరంగులు+ఐ= విష్ణుమూర్తిని మనస్సులోగలవారై; పరఁగిన+అట్టి= విలసిల్లునట్టి; భాగవత పాదజలంబులు= భాగవతుల కాళ్లుకడిగిననీరు; సోఁకవు+ఏని= సోకనిచో; తద్+పురుషుఁడు= ఆ యజమాని; భూరిసంపదలన్= గొప్ప సంపదలతో; పొంపిరి పోయినన్+ఐనన్= నిండినప్పటికీ; వాని మందిరము= వాని ఇల్లు; ఉరగప్రకీర్ణ= పాములతో నిండిన; జగతీజమున్+పోలున్= చెట్లను పోలి ఉంటుంది; కోవిదులు+అటన్ అంద్రు= పండితులు అని అంటారు.

**తా :** ఓ శ్రేష్ఠమైన ధిషణగలవారలారా! ఎవని ఇంటిని విష్ణువును మనస్సులో గలవారై విచ్చేసిన భాగవతుల పాదజలాలు సోకవో ఆ యజమాని మహాధనవంతుడైనప్పటికీ అతని ఇల్లు పాములు చుట్టుకొన్న చెట్టును పోలి ఉంటుందని విజ్ఞులు చెపుతారు.

**వ. అని పలికి వెండియు నిట్లనియె. 611**

**ప్రతి :** అని, పలికి, వెండియున్= మరలా, ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.

**సీ. పరమపావనులార! బాల్యంబునందుండి, మానితశ్రద్ధాసమన్వితులును**
**గుణనిధుల్ ధైర్యయుక్తులు ముముక్షువులునై, యధికవ్రతంబుల నాచరింతు**

**రట్టి పుణ్యులు భవదాగమనంబు స్వా, గతమయ్య! సత్కృపాకలితులార!**
**యనివారితవ్యసనార్ణవం బయినట్టి, భూరిదుర్లంఘ్యసంసారమందు**

**తే. మతివిహీనస్వకీయకర్మములఁ జేసి, యడరి మగ్నులమై యింద్రియార్థములనె**
**తివిరి పురుషార్థములు గాఁగఁదెలియు మాకుఁ, గుశలమున్నదె లోకైకకుశలులార! 612**

**ప్రతి :** పరమపావనులార= అతిపవిత్రులార!; బాల్యంబునన్+అందుండి= చిన్ననాటినుండి; మానితశ్రద్ధాసమన్వితులును= ఆదరముతో, శ్రద్ధతో కూడినవారు; గుణనిధుల్= సద్గుణ సంపన్నులు; ధైర్యయుక్తులు= ధైర్యముకలవారు; ముముక్షువులును+ఐ= మోక్షాన్ని కోరినవారై; అధికవ్రతంబులన్= ఎక్కువ వ్రతాలను; ఆచరింతురు= చేస్తారు; అట్టిపుణ్యులు= మీరు అంతటి పుణ్యశీలురు; భవత్+ఆగమనంబు= మీరాక; స్వాగతము+అయ్య= శుభాగమనమయ్యా; సత్+కృపాకలితులార= ఉత్తమదయావంతులార!; అనివారిత= అడ్డుకోలేని; వ్యసన+అర్ణవంబు+అయినట్టి= వ్యసనమనే సముద్రమైన; భూరిదుస్+లంఘ్య= మిక్కిలి దాటరాని; సంసారము+అందు= సంసారంలో; మతివిహీన= బుద్ధిలేని; స్వకీయకర్మములన్+చేసి= తాను చేసిన పనులతో; అడరి= అతిశయించి; మగ్నులము+ఐ= మునిగి; ఇంద్రియ+అర్థములను+ఎ= ఇంద్రియాలు కోరే కోరికలనే (శబ్దాదులనే); తివిరి= పూనుకొని; పురుష+అర్థములు గాఁగన్= ధర్మార్థకామములని; తెలియు మాకు= భావించేమాకు; లోక+ఏకకుశలులార!= లోకానికంతటికీ క్షేమకారకులారా!; కుశలము+ఉన్నదె?= కుశలం ఎక్కడిది?

**తా :** అతి పవిత్రములైన మునులారా! సత్కృపతో కూడిన వారలారా! లోకైకకుశలులారా! మీరు బాల్యంనుండి మానితమైన, శ్రద్ధ మొదలైన సద్గుణాలుగలవారు. ధైర్యం, మోక్షబుద్ధితో అధికంగా వ్రతాలు చేస్తారు అట్టి పుణ్యులైన మీ రాకకు స్వాగతం. నిరంతరం తరింపరాని సంసారంలో బుద్ధిలేని మేము చేసే కర్మలవలన అధికంగా మునిగి ఇంద్రియార్థములనే పురుషార్థములుగా భావించెడి మాకు కుశలమున్నదా!

**విశే :** సంసారలంపటులైనవారు విషయసుఖవాంఛాభోగులవుతారు. ముముక్షువుల దర్శనం, సజ్జన సాంగత్యం వారిని ఆ దారి నుండి మళ్లిస్తుంది. ఇక్కడ సనకసనందనుల ఆగమనం పృథువునకు శుభసూచకం.

**వ. మీర లాత్మారాము లగుటం జేసి మీయందుఁ గుశలాకుశల రూపంబులయిన మతివృత్తులు సంభవింపవు గావునం గుశల ప్రశ్నం బుపపన్నంబు గాదు, కాన నేను గృతవిశ్వాసుండనై సంతప్తులయిన వారలకు సుహృత్తులైన మిమ్ము నాకు నీ సంసారంబునందు నేమిట వేగంబ క్షేమంబు గలుగు నని యడిగెద! నాత్మవంతులకు నాత్మయు నాత్మభావనుండు నయిన యీశ్వరుండు భక్తానుగ్రహంబు కొఱకు నీ లోకంబుల మీ వంటి సిద్ధరూపంబున వర్తించుచుండు నని పలికిన యతని గంభీరార్థ గౌరవంబులును, శుభకరంబులును, న్యాయ సహితంబులును, మితాక్షరంబులును, శ్రోత్ర ప్రియంబులును నయిన వచనంబులు విని సంప్రీత చేతస్కుండును, మందస్మితుండునై సనత్కుమారుండిట్లనియె. 613**

**ప్రతి :** మీరలు= మీరు; ఆత్మారాములు+అగుటన్+చేసి= ఆత్మయందు ఆనందంతో రమించేవారు కావడంవల్ల; మీ+అందున్= మీపట్ల; కుశల+అకుశల రూపంబులు+అయిన= మంచిచెడులనే విధానాలయిన; మతివృత్తులు= మానసిక ప్రవృత్తులు; సంభవింపవు+కావునన్= ఉండవు కాబట్టి; కుశలప్రశ్నంబు= మీకు కుశలమా? అనే ప్రశ్న; ఉపపన్నంబు కాదు= తగదు;

కానన్= కాబట్టి; నేను కృత విశ్వాసుండను+ఐ= నేను నమ్మకం కలిగినవాడనై; సంతప్తులు+అయిన వారలకున్= బాధపడేవారికి; సుహృత్తులయిన మిమ్ము= స్నేహితులైన మిమ్ము; నాకు+ఈ+సంసారంబునందు= నాకు ఈ సంసారంలో; ఏమిట= ఏ పనిచేస్తే; వేగంబు+అ= త్వరగానే; క్షేమంబు కలుగునని= శుభం కల్గుగుతుందని; అడిగెదన్= అడుగుతున్నాను; ఆత్మవంతులకున్= ఆత్మజ్ఞానం గలవారికి; ఆత్మయు= ఆత్మ; ఆత్మభావనుండు= ఆత్మభావన కలవాడు; అయిన ఈశ్వరుండు= అయిన భగవంతుడు; భక్త+అనుగ్రహంబుకొఱకున్= భక్తుల అనుగ్రహం కోసం; ఈ లోకంబులన్= ఈ లోకాలలో; మీవంటి సిద్ధరూపంబునన్= మీవలె సిద్ధులరూపంలో; వర్తించుచుండున్+అని పలికిన= తిరుగుతుంటాడని చెప్పగా; అతని, గంభీర+అర్థగౌరవంబులును= లోతైన అర్థగౌరవం కలవి; నిందుతనం గలవి; శుభకరంబులును=క్షేమాన్ని కలుగజేసేవి; న్యాయసహితంబులును= ధర్మసమ్మతాలు; మిత+అక్షరంబులును= కొద్దిమాటలు గలవి; శ్రోత్రప్రియంబులును= వినసొంపైనవి, అగు; వచనంబులు విని= మాటలు విని; సంప్రీతచేతస్కుండును= ఆనందించిన మనస్సుగలవాడు; మందస్మితుండును+ఐ= మందహాసం కలవాడై; సనత్కుమారుండు+ఇట్లు+అనియెన్= సనత్కుమారుడిలా అన్నాడు.

**తా :** మీరు ఆత్మానందం పొందినవారు. మీకు కుశలాకుశలములైన మానసిక ప్రవృత్తులు కలుగవు. కాన మీపట్ల యోగక్షేమాల ప్రశ్న ఉదయించదు. నేను మిక్కిలి నమ్మకంతో బాధాతప్తులకు స్నేహితులైన మిమ్ము సంసారంలో నాకు త్వరగా ఏ విధంగా క్షేమం కలుగుతుందని అడుగుతున్నాను. ఆత్మజ్ఞానంగల మీవంటివారు ఈ లోకంలో తిరిగే భగవంతులుగా సిద్ధరూపంలో ఉంటారు అన్నాడు పృథువు. అతని మాటలలోని అర్థగౌరవం, క్షేమప్రసక్తి, ధర్మసమ్మత మితభాషణం, వినసొంపైన మాటలు విని ఆనందించిన హృదయంతో నవ్వుమోముతో సనత్కుమారు డిలా అన్నాడు.

**మ.** **ధరణీశోత్తమ! సర్వభూతహితచేతస్కుండవై ధర్మ సు**
**స్థిరభాగ్యోదయశాలివై యెసఁగు నీచే సాధులోకోత్తరో**
**త్తరసంప్రశ్నము సేయఁగాఁబడె మహాత్మా! సాధులోకైకస**
**చ్చరితంబున్ దలపోయ నిట్టిద కదా! చర్చింప లోకత్రయిన్.** **614**

**ప్రతి :** ధరణి+ఈశ+ఉత్తమ= ఓ రాజశ్రేష్ఠా!; సర్వభూతహిత= సమస్త ప్రాణుల మంచికోరే; చేతస్కుండవు+ఐ= మనస్సుగలవాడవై; ధర్మసుస్థిర భాగ్య+ఉదయశాలివి+ఐ= ధర్మంలో నిశ్చలబుద్ధిగల సంపద, ఐశ్వర్యం కలిగినవాడవై; ఎసఁగు= అతిశయించే; నీచేన్= నీ ద్వారా; సాధులోక+ఉత్తర+ఉత్తర= మంచివారి సముదాయంనుండి, ఒకదాని తరువాత మరొక; సంప్రశ్నము+చేయన్+కాఁబడెన్= ప్రశ్నించడం జరిగింది; మహా+ఆత్మా= ఓ పుణ్యపురుషా!; లోకత్రయిన్= ముల్లోకాలలో; చర్చింపన్= ఆలోచించగా; సాధులోక+ఏక సత్+చరితంబున్= మంచివారి కొక్కరికే సంబంధించిన మంచి చరిత్ర; తలపోయన్= ఆలోచింపగా; ఇట్టిద కదా!= ఇటువంటిదేగదా!

**తా :** ఓ రాజశ్రేష్ఠా! సమస్తప్రాణుల మంచికోరే ధర్మబుద్ధి, ధర్మంలో నిశ్చలమైన బుద్ధీ, భాగ్యమూ కలిగినవాడవై అతిశయించు నీవంటి మంచివారినుండి వెలువడే సాధులోకోత్తరమైన ప్రశ్నలు వస్తున్నాయి.

**తే.** **ధరణి సజ్జనసంగంబు దలఁప నుభయ, సమ్మతంబగు వారలు సలుపునట్టి**
**సరససంభాషణప్రశ్నసరణి నిఖిల, జనములకు సుఖకర మగు జనవరేణ్య!** **615**

**ప్రతి :** జనవరేణ్య= ఓ రాజా! ధరణిన్= భూమిపై; సత్+జనసంగంబు= సత్పురుషుల తోడి చెలిమి; తలఁపన్= ఆలోచింపగా; ఉభయసమ్మతంబు+అగు= ఇరువురికీ ఆమోదయోగ్యమవుతుంది; వారలు సలుపు+అట్టి= వారుచేసే; సరస సంభాషణ ప్రశ్నసరణి= చక్కని సంభాషణాధోరణిలోసాగే ప్రశ్నలవరుస; నిఖిల జగములకున్= సమస్తలోకాలకు; సుఖకరము+అగున్= సంతోషదాయకం అవుతుంది.

**తా :** ఓ రాజా! భూమిపై సత్పురుషులతో చెలిమి ఇరువురికీ సమ్మతమవుతుంది. వారు చేసే సరసమైన ప్రశ్నల ధోరణి సమస్తలోకాలకు సుఖదాయక మవుతుంది.

**వ. అని యభినందించి మోక్షసాధనోపదేశకాముండైన పృథుచక్రవర్తికి వెండియు నిట్లనియె. 616**

**ప్రతి :** అని+అభినందించి= అని ప్రశంసించి, మోక్షసాధన+ఉపదేశకాముండు+ఐన= మోక్షాన్ని పొందేవిధానాన్ని తెలుసుకోగోరిన, పృథుచక్రవర్తికి, వెండియున్= మరలా, ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అని ప్రశంసించి మోక్షసాధనోపాయాన్ని తెలుసుకోగోరిన పృథుచక్రవర్తితో ఇలా అన్నాడు.

**సీ. ధరణీశ! మధునిషూదనుఁడైనయట్టి నారాయణు లలితపాదారవింద**
**వరగుణధ్యాన ధీపరిణతత్వంబున సకలాత్మ మలవిమోచనములైన**
**రతియును నిత్యవైరాగ్యంబు మొదలుగా లోకోత్తరుఁడవైన నీకుఁగలవు;**
**సమ్యగ్విచారశాస్త్రములందు జనులకు సేమంబునకును నిశ్చితములయిన**

**తే. ఆత్మ కన్యంబులగు వానియందు వీత, రాగతఁదలంప నిర్గుణబ్రహ్మ మయిన**
**యాత్మయందుల రతియును ననఁగ నివియ, హేతువులు బుద్ధిఁజింతింప నిద్ధచరిత!. 617**

**ప్రతి :** ధరణి+ఈశ= ఓ రాజా!; మధు+ని+సూదనుడు+ఐన+అట్టి= మధువు అనే రాక్షసుని చంపిన; నార+అయను= నారాయణుడైన విష్ణువుయొక్క; లలితపాద+అరవింద= లలితములైన పాదపద్మాలయొక్క; వరగుణధ్యాన= శ్రేష్ఠమైన గుణాల ధ్యానంతో; ధీపరిణతత్వంబునన్= బుద్ధిపరిణామంచే; సకల+ఆత్మ మలవిమోచనములు+ఐన= సమస్త ఆత్మసంబంధ దోషాలు తొలగించినవైన; రతియును= ఆసక్తి; నిత్యవైరాగ్యంబు= ఎల్లప్పుడు విరక్తి; మొదలుగా= మొదలైనవి; లోక+ఉత్తరుఁడవు+ఐన= ప్రపంచంలో శ్రేష్ఠుడవైన; నీకున్+కలవు= నీకున్నాయి; సమ్యక్+విచారశాస్త్రములందు= చక్కని ఆత్మవిమర్శచేసే శాస్త్రాలలో; జనులకు= ప్రజలకు; సేమంబునకును= క్షేమానికి; నిశ్చితములు+అయిన= నిర్ణయించబడిన; ఆత్మ కన్యంబులగు వానియందు= ఆత్మజ్ఞానానికి వ్యతిరేకమైన విషయాలపై; వీతరాగతన్= అనురక్తిలేకుండుట; నిర్గుణబ్రహ్మము+అయిన= గుణాతీతబ్రహ్మమైన; ఆత్మయందుల= ఆత్మలో; రతియును= ఆసక్తి; ఇద్ధచరిత= పుణ్యాత్మా! బుద్ధిన్+చింతింపన్= ఆలోచింపగా; ఇవియ హేతువులు= ఇవే కారణాలు.

**తా :** ఓ రాజా! విష్ణుని పాదపద్మాలపై ధ్యానంచేత దోషాలను తొలగించుకొనే వైరాగ్యబుద్ధి లోకోత్తరుడవైన నీలో కనిపిస్తోంది. నీవు నిజంగా మహనీయుడవు. చక్కని ఆత్మవిమర్శ, శాస్త్రచర్చ జనులకు క్షేమకరం. ఆత్మజ్ఞానానికి వ్యతిరేకమైన వస్తువులపట్ల అనురాగం పనికిరాదు. ఆత్మయందు ఆసక్తి ఉండాలి. జనక్షేమానికి ఇవే కారణాలు.

**వ. కావున శ్రద్ధయు భగవద్ధర్మ చర్యయుఁ దద్విశేష జిజ్ఞాసయు నాధ్యాత్మిక యోగనిష్ఠయు యోగేశ్వరోపాస్తియుఁ బుణ్యోపాశ్రయుండును, బుణ్యశ్రవణుండునునైన నారాయణకథాలాపంబులు నర్థేంద్రియారాములైన వారలతోడి సంగతియందు విరక్తియు వారల కభిమతంబులైన యర్థకామంబులందు ననాకాంక్షయు, సర్వేశ్వరుని గుణకీర్తనామృతపానంబు దక్క నితర పదార్థంబులందు వైరాగ్యంబు నొంది యాత్మారామత గలిగి విజనస్థలంబులందుల రుచి గలుగుటయు, నహింసయు, శమాది ప్రధాన వృత్తియు నాత్మహితానుసంధానంబును భగవత్కథానుస్మరణంబును నకామ్యంబు లయిన యమనియమంబులును, నితరభక్తిమార్గాగర్హణంబును, యోగక్షేమార్థక్రియారాహిత్యంబును, శీతోష్ణాది ద్వంద్వసహిష్ణుతయు, భాగవత కర్ణాలంకార భూతంబులగు భగవద్గుణాభిధానంబులు నను వీనిచేత విజృంభమాణంబయిన భక్తి యోగంబునం జేసి యనాత్మయందు నసంగంబును, గార్యకారణరూపంబగు నిర్గుణబ్రహ్మము నందు రతియును, నెప్పుడు గలుగు నప్పుడ సదాచార్యానుగ్రహ వంతుండయిన పురుషుండు బ్రహ్మనిష్ఠులతోడఁ జెలిమిసేయుచు నీషణత్రయంబు వర్జించి ప్రకృతింజేరక జ్ఞానవైరాగ్యవేగంబునంజేసి. 618**

ప్రతి : కావున, శ్రద్ధయు= ఆసక్తి, భగవత్+ధర్మచర్యయు= భగవంతునికి చెందిన ధర్మాలననుష్ఠించడమూ; తద్+విశేష జిజ్ఞాసయు= దానిలో విశేషాలు తెలుసుకోవాలనే కోరిక; ఆధ్యాత్మికయోగనిష్ఠయు= ఆత్మతో యోగస్థితి చెందే ప్రయత్నంలో దీక్ష; యోగ+ఈశ్వర+ఉపాస్తియు= యోగేశ్వరుడగు భగవానుని ఉపాసించుట; పుణ్య+ఉపాశ్రయుండును= పుణ్యకర్మలకు ఆధారమైనవాడు; పుణ్యశ్రవణుండును+ఐన= తనగాథలు విన్నవారిని పవిత్రం చేయువాడును అయిన; నారాయణకథ+ ఆలాపంబులున్= విష్ణుని కథలు చెప్పడం; అర్థ+ఇంద్రియ+ఆరాములు+ఐన= సంపదల్లో, ఇంద్రియాలలో ఆసక్తులైన, వారలతోడి సంగతియందు= వారితో స్నేహంలో; విరక్తియు= వైరాగ్యం; వారలకు= వారికి; అభిమతంబులు+ఐన= ఇష్టములైన; అర్థకామంబుల+అందున్= సంపదలు, సుఖాలలో; అనాకాంక్షయు= కోరిక లేకుండుట; సర్వ+ఈశ్వరుని= శ్రేష్ఠుడైన భగవంతునియొక్క; గుణకీర్తన+అమృతపానంబు+తక్క= గుణగణాలను పొగడడమనే అమృతాన్ని తాగడం తప్ప; ఇతరపదార్థంబులందున్= మిగిలిన వస్తువులపై; వైరాగ్యంబును+ఒంది= విరక్తిపొంది; ఆత్మారామత కలిగి= తన ఆత్మయందే ఆసక్తి గలిగి; విజనస్థలంబుల+అందులన్= ఏకాంత ప్రదేశాలలో; రుచిగలుగుటయు= ఇష్టం కల్గుటయు; అహింసయు= హింసలేకుండుట; శమాదిప్రధానవృత్తియు= శమదమాదులు ప్రధానమైన చిత్తవృత్తి; ఆత్మహిత+ అనుసంధానంబును= తనమేలు ననుసరించి పరిస్థితులు చక్కదిద్దుకొనుట; భగవత్+కథా+అనుస్మరణంబును= భగవంతుని కథలు గుర్తుకు తెచ్చుకొనుట; అకామ్యంబులు+అయిన= ఇంద్రియ నిగ్రహంతో కూడిన; యమనియమంబులునున్= అష్టాంగయోగంలో గల యమ, నియమాదుల్ని; ఇతర భక్తిమార్గ+అగర్హణంబును= ఇతరభక్తిమార్గాలను నిందింపకుండుట; యోగక్షేమ+అర్థక్రియారాహిత్యంబును= యోగం, క్షేమం అనేవానిపై కోరికతోడి క్రియలను పట్టించుకోకపోవడం; శీత+ఉష్ణ+ఆది ద్వంద్వసహిష్ణుతయు= చలి, వేడివంటి ద్వంద్వాలను ఓర్చుకొనగలుగుట; భాగవతకర్ణ+అలంకార భూతంబులు+అగు= భక్తుల చెవులకు వినసొంపైన; భగవత్+గుణ+అభిధానంబును= దేవుని కల్యాణగుణాలను వివరించి చెప్పడం; వీనిచేత= వీటితో; విజృంభమాణంబు+అయిన= అధికమైన; భక్తియోగంబునన్+చేసి= భక్తిమార్గంతో; అనాత్మ+ అందున్= ఆత్మకాని దానియందు; అసంగంబును= అంటుకొనుబుద్ధి లేకుండుట; కార్యకారణరూపంబగు= కార్యకారణ రూపమైన; నిర్గుణ బ్రహ్మము+అందున్= గుణరహితుడైన బ్రహ్మపట్ల; రతియును= ఆసక్తి; ఎప్పుడు కలుగున్= ఎప్పుడు

కలుగుతాయో; అప్పుడు= అప్పుడే; సత్+ఆచార్య+అనుగ్రహవంతుండు+అయిన= మంచిగురువుల అనుగ్రహం పొందినవాడైన; పురుషుండు= మానవుడు; బ్రహ్మనిష్ఠులతోడన్= బ్రహ్మంలో నిశ్చలభావం కలవారితో; చెలిమి+ చేయుచున్= స్నేహంచేస్తూ; ఈషణత్రయంబు= ధనము, భార్యా, బిడ్డలయందు ఎడతెగని ఆసక్తి; వర్జించి= వదలిపెట్టి; ప్రకృతిన్+చేరక= ప్రకృతిలో లీనం కాక; జ్ఞాన వైరాగ్య వేగంబునన్+చేసి= బుద్ధితో కలిగిన విరక్తిభావంతో...

**తా :** నీవు చేయవలసిన పనియందు ఆసక్తి, భగవద్ధర్మాచరణ, అందులోని విశేషాలు తెలుసుకోవాలనే కోరిక, ఆత్మయోగస్థితిని చెందే ప్రయత్నంలో దీక్ష, యోగమునకు ఈశ్వరుడైన భగవంతుని ఉపాసించుట, పుణ్యకర్మలు ఆచరించడం ప్రధానం. వారియందలి దైవాన్నిగూర్చి వింటున్నానని తెలుసుకోవాలి. అట్టి నారాయణుని గాథల్ని నోరార కీర్తించాలి. ధనంతోను, ఇంద్రియాలతోను చెలగాటమాడే వారితో స్నేహం విసర్జించాలి. భగవంతుని గుణాలను కీర్తించడం అమృతపానం వంటిది. దానిని అభ్యసించి ఇతరపదార్థాలపై వైరాగ్య మభ్యసించాలి. అంతర్యామిపై మనసు నిలపాలి. ఏకాంత ప్రదేశాలపై అభిలాషపడాలి. అహింస, శమదమాదిగుణాలు ప్రధానంగా పాటించి జీవించాలి. తనకేది మేలో తెలిసినపుడు దానిని అవలంబించాలి. భగవంతుని కథలను మరల మరల స్మరించుకోవాలి. యమనియమాలు అభ్యసించాలి. యోగక్షేమ పరమైన అనవసరకార్యాలను మానుకోవాలి. చల్లదనం, వేడి మొదలైన ద్వంద్వాలు సహించే స్వభావం అలవరచుకోవాలి. భక్తులతో వారి చెవి కింపైన భగవద్గుణాల ప్రసక్తి తేవాలి. తద్వారా భక్తియోగాలు. దానివలన ఆత్మకాని వస్తువులపట్ల సంగం తొలగుతుంది. కార్యకారణరూపంలో ఉన్నది అంతర్యామియైన నిర్గుణ బ్రహ్మమే. దానిలో నిశ్చలత సాధన వలన కలుగుతుంది. అది కలిగిననాడు నిజమైన గురువు లభించి అనుగ్రహప్రసారం జరుగుతుంది. ఈషణత్రయం తొలగిపోతుంది. అప్పుడు సాధకుడు ప్రకృతిని చేరక తాను వేరుగా నిలుస్తాడు. అలాంటి అనుభవమే జ్ఞానం. జ్ఞానంతో వైరాగ్యం వేగమై సాధన పూర్తికాగలదు.

**విశే :** 1) ఈషణత్రయం–దారేషణ, ధనేషణ, పుత్రేషణ. భార్య, ధనం, పుత్రులపైగల కోరిక ఈషణత్రయం. (ఏషణత్రయం – సరైన వ్యాకరణ సమ్మతమైన రూపం. కాని, వ్యవహారంలో ఈషణత్రయమనే రూఢికెక్కింది.)

2) యమం, నియమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధ్యానం, ధారణం, సమాధి – ఇవి అష్టాంగయోగం.

**సీ.** **అనఘ! సాక్షాత్కార మగు భక్తి యోగాగ్నిఁగడఁగి జీవాధారకమును బంచ**
**భూతాత్మకంబునై పొలుచు హృద్గ్రంథిని బూని స్వకారణభూత మయిన**
**యరణి దహించు హుతాశను కైవడి నిర్దహించిన నిట్లు నెఱపి దగ్ధ**
**చిత్తుఁడై ముక్తనిశ్శేషాత్మగుణుఁడు సద్ధర్ముఁడు నైన యతండు మిగుల**

**తే.** **నర్థి బాహ్యంబు లయిన ఘటాదికములు, నాంతరములైన సౌఖ్యదుఃఖాదికములు**
**నను విభేదము లాత్మభేదనము లగుట, న య్యుపాధివినాశంబు నందఁగలఁడు** **619**

**ప్రతి :** అనఘ= పాపరహితుడా; సాక్షాత్కారము+అగు= కనిపించే; భక్తియోగ+అగ్నిన్= భక్తి అనే యోగాగ్నిలో; కడఁగి= పూని; జీవ+ఆధారకమును= జీవుడు ఆధారంగా గలది; పంచభూత+ఆత్మకంబును+ఐన= పంచభూతాలతో కూడినదై; పొలుచు హృద్గ్రంథిని (హృద్+గ్రంథిని)= నిలిచిన హృదయంలోని ముడిని; పూని= ప్రయత్నించి; స్వకారణభూతము+అయిన= తనకు కారణమైన; అరణి= కొయ్యను; దహించు హుత+అశనుకైవడి= కాల్చివేసే అగ్నివలె; నిర్దహించినన్= పూర్తిగా

కాల్చివేయగా; ఇట్లు నెఱపి= ఇలా నెరవేర్చి; దగ్ధచిత్తుఁడు+ఐ= కాల్చబడిన చిత్తవృత్తి గలవాడై; ముక్త+నిస్+శేష+ ఆత్మగుణుఁడు= ఆత్మయొక్క గుణాలు మిగలకుండా విడిచిపెట్టినవాడు; సత్+ ధర్ముఁడు+ఐన+అతండు= సత్యమే తన ధర్మముగా గలిగిన అతడు; మిగులన్+అర్థి= మిక్కిలి కోర్కెతో; బాహ్యంబులు+అయిన= బయటి ప్రపంచంలోని; ఘట+ ఆదికములును= కుండ మొదలైనవి; ఆంతరములు+ఐన= లోపలనున్న; సౌఖ్యదుఃఖ+ఆదికములున్= సుఖదుఃఖాదులు; అను విభేదములు= అనే తేడాలు; ఆత్మభేదనములు+అగుటన్= ఆత్మజ్ఞానాన్ని భేదించేవి కాబట్టి; ఆ+ఉపాధి= ఆ దేహం ఉపాధియొక్క; వినాశంబున్+అందన్+కలఁడు= నాశనం పొందును.

**తా :** ఇలా సాధన చేసిన వారికి భక్తియోగం కుదురుతుంది. అందులోంచి యోగాగ్నిగా జ్ఞానం పుడుతుంది. జీవునితో ముడిపడిన హృదయగ్రంథి దగ్ధమవుతుంది. ఆత్మ భాసిస్తుంది. అరణిని కూడా తన పుట్టుటకు కారణమైన అగ్ని దహించినట్లు జ్ఞానాగ్నిలో హృదయగ్రంథి కాలిపోతుంది. చిత్తవృత్తులు దహించబడతాయి. గుణాలు మాయమై, 'తాను' మిగులుతుంది. లోపల, వెలుపల అనే తెర తొలగిపోతుంది. కుండలలో, వెలుపలి, లోపలి సుఖదుఃఖాలలోను తానే నిండియున్నాడని తెలుస్తుంది. దానితో దేహంలో దేహబుద్ధి నశిస్తుంది. దేహం తనకు ఆధారం అనే భ్రమ తొలగిపోతుంది.

**విశే :** దేహం ఆధారమనే భ్రమ తొలగిపోతే, మట్టియందు కల్పింపబడిన కుండ అనేది మట్టికంటె వేరుగా ఉందనే భ్రమ తొలగిపోతుంది. మట్టియే కుండకు ఆధారమని తెలుస్తుంది. ఈ తెలివియే ఉపాధివినాశం. **జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః ॥** – గీత.

**వ. అది యెట్లనిన. 620**

**చ. పురుషుఁడు నిద్రవోఁగలలఁబొందిన యాత్మసుఖైకహేతువై**
**పరఁగిన రాజభృత్యజనభావగుణంబులు సంప్రబోధమం**
**దరయఁగ మిథ్య యైనగతి నాంతరబాహ్యగుణప్రభేదముల్**
**పరువడిఁగానకుండు జనపాలనశీలన! నిత్యఖేలనా! 621**

**ప్రతి :** జనపాలనశీలన= ప్రజలను పరిపాలించే మంచి స్వభావివైన రాజా!; నిత్యఖేలనా= సదా ఆనందించేవాడా!; పురుషుఁడు= మానవుడు; నిద్రవోన్= నిద్రించగా; కలలన్+పొందిన= కలలలో అనుభవించిన; ఆత్మసుఖ+ఏకహేతువు+ఐ పరఁగిన= తన సుఖానికిగల ఒకే ఒక కారణమైన; రాజభృత్యజనభావగుణంబులు= రాజు, బంటు అనే అభిప్రాయాలు కలిగించే గుణాలలోనే; సంప్రబోధము+అందు= బుద్ధి ప్రవర్తిస్తున్నప్పుడు; అరయఁగన్= ఆలోచించగా; మిథ్యయైనగతిన్= అవి అసత్యమనిపించినట్లుగా; ఆంతర బాహ్యగుణ ప్రభేదముల్= లోపల, వెలుపల అనే తేడాలు; పరువడిన్= క్రమంగా; కానకుండున్= కన్పించవు.

**తా :** జనపాలన స్వభావా! నిత్యక్రీడారతా! ఆత్మ జీవుని అంతర్గతంగా మరుగునబడిపోగా ఏది కంటికి కనబడుతున్నదో అదే సత్యమనే భ్రమను కల్పించే భౌతిక దృష్టియే జీవులను మోసగిస్తూ ఎల్లప్పుడూ ఆడే ఆట! ఈ ఆట తత్త్వం తెలుసుకోవాలి. కనబడేదంతా సత్యం కాదు. తత్త్వం లోపల దాగి ఉన్నది. దాన్ని పట్టుకోవాలి. మానవుడు నిద్రలో కనిన కలలలో తాను రాజైనట్లు, రాజ్యాలేలినట్లు, సిరిసంపదలతో తూగినట్లు ఆనందాలు అనుభవిస్తాడు. అప్పుడు రాజు, భృత్యుడు అనే గుణాలు తెలుస్తాయి. కలలు కరిగిపోయి తెలివిగలిగి లేచినపుడు ఆ తేడాలు లేనట్లుగా మిథ్యగా తోస్తాయి. అట్లే వెలుపల, బయట అనే ఆంతర్యాలు జ్ఞానదశలో కన్పించవు.

**వ. మఱియును ద్రష్టయైన యాత్మయు దృశ్యంబయిన యింద్రియార్థంబు నను వీనికి నహంకారంబు సంబంధ హేతువగుటం జేసి యది యంతఃకరణంబునం గలుగుచుండు జాగ్రత్స్వప్నంబులయం దీ భేదంబు గనుంగొను చుండు, నిట్టి యంతఃకరణంబు లేనిది యగు సుషుప్తికాలంబునం బురుషుండు జలదర్పణాది నిమిత్తాభావం బగునప్పుడు బింబప్రతిబింబ భేదంబు గనుంగొనని చందంబున దృశ్యభేదంబు గనుంగొనకుండు, గావున నంతఃకరణవిలయంబు నొందిన బాహ్యాంతరభేదంబు కనకుండుట నిశ్చయం బని వెండియు నిట్లనియె. 622**

**ప్రతి :** మఱియును= ఇంకా; ద్రష్టయైన+ఆత్మయున్= చూచునట్టి ఆత్మ; దృశ్యంబు+అయిన= కన్పించే; ఇంద్రియ+అర్థంబున్+ అను= ఇంద్రియాలకు కన్పించే లక్ష్యం అనే; వీనికి= ఈ రెండిటికి; అహంకారంబు= అహంభావం; సంబంధహేతువు+ అగుటన్+చేసి= దానికి ముడివడిన కారణంకాన; అది అంతఃకరణంబునన్+కలుగుచుండు= మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం – వీటి సమాహార స్వరూపమైన అంతఃకరణంలో ఏర్పడిన ఆ భేదం; జాగ్రత్+స్వప్నంబులయందు= మేలుకొన్నపుడు, కలగన్నపుడు; ఈ భేదంబు= ఈ తేడా; కనుంగొనుచుండున్= చూస్తుంది; ఇట్టి అంతఃకరణంబు= ఇలాంటి మనస్సు; లేనిది+అగు= లేనిదైన; సుషుప్తికాలంబునన్= గాఢ నిద్రాసమయంలో; పురుషుండు= మానవుడు; జల, దర్పణ+ఆది నిమిత్త+అభావంబు+అగునప్పుడు= నీరు, అద్దం మున్నగు కారణాలు లేకుండా; బింబప్రతిబింబభేదంబు= వస్తువు, దాని నీడ అనే తేడా; కనుంగొనని చందంబునన్= తెలిసికొనలేనట్లే; దృశ్యభేదంబు= చూడబడునది తనకంటెవేరని; కనుంగొనకుండున్= తెలుసుకోలేడు, కావునన్; అంతఃకరణవిలయంబున్+ఒందిన= మనస్సు లీనమైన; బాహ్య+ అభ్యంతరభేదంబు= లోపల వెలుపల అనే తేడా; కనకుండుట నిశ్చయంబు= చూడలేకుండుట తప్పనిసరి; అని, వెండియున్= మరలా; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** చూచువాడు తాను. చూడబడేది తనకంటె వేరగు దృశ్యం, అహంకారం ఈ రెంటికి సంబంధించిన హేతువు. అది అంతఃకరణంలో జాగ్రత్ స్వప్న దశల్లో ఈ భేదాన్ని చూస్తుంది. సుషుప్తిలో అంతఃకరణం ఉండదు. అందువల్ల జలమో, అద్దమో లేనప్పుడు బింబ ప్రతిబింబాలకు భేదం తెలియదు. సుషుప్తిలో దృశ్యభేదం లేదు. అంతఃకరణం లేకపోవడమే ఇందుకు కారణం. అని తిరిగి ఇట్లన్నాడు.

**విశే :** 1. శ్రీవిద్యారణ్యుల దృక్ – దృశ్యవివేకములో ఈ అంశాలన్నీ విపులంగా చర్చింపబడినవి. యద్దృష్టం – తన్నష్టమ్। యద్దృశ్యతి – తన్నశ్యతి. అనేవి ప్రాథమిక సత్యాలు.

**సీ. భువి విషయాకృష్టభూతంబు లయిన యింద్రియములచేతను దివిరి మనము**
**దగ విషయాసక్తిఁదగిలి యాంతరమైన మహితవిచారసామర్థ్యమెల్ల**
**శరకుశాదిస్తంబజాలంబు హ్రదతోయములు గ్రోలుగతిఁగ్రమంబున హరించు**
**నీ రీతి నంతర్విచారసామర్థ్యంబు నపహృతంబయినఁబూర్వాపరాను**

**తే. మేయ సంధానురూపసంస్మృతి నశించు, నది నశించిన విజ్ఞాన మంతఁ దొలఁగు,**
**నట్టి విజ్ఞాననాశంబు నార్యజనులు, స్వాత్మ కది సకలాపహ్నవంబటంద్రు, 623**

**ప్రతి :** భువిన్= లోకంలో; విషయ+ఆకృష్టభూతంబులు+అయిన= ఇంద్రియార్థాలచే ఆకర్షింపబడిన; ఇంద్రియములచేతను= ఇంద్రియాలద్వారా; తివిరి= పూని; మనము= మనస్సు; తగన్= తగినట్లుగా; విషయ+ఆసక్తిన్= ఇంద్రియార్థాలపై లంపటాన్ని; తగిలి= అంటుకొని; ఆంతరము+ఐన= లోపలిదైన; మహిత విచార సామర్థ్యము+ఎల్లన్= గొప్ప వేదాంత విచారణ శక్తి అంతా; శరకుశ+ఆది= రెల్లు, దర్భలు మొదలైన; స్తంబజాలంబు= కాడల సమూహం; హ్రదతోయములు= మడుగులోని నీరు; క్రోలుగతిన్= పీల్చివేసినట్లుగా; క్రమంబునన్= వరుసగా; హరించున్= నశింపజేస్తుంది; ఈ రీతిన్= ఈ విధంగా; అంతర్+విచారసామర్థ్యంబున్= లోపల భావించేశక్తి; అపహృతంబు+అయినన్= దొంగిలించబడినచో; పూర్వ+అపర+అనుమేయ= ముందు వెనుకలచే ఊహించుకొనదగిన; సంధానురూప= అతుకుతో సమానమైన; సంస్మృతి= స్మరించడం; నశించున్= నాశనమగును; అది నశించినన్= అది చెడిపోతే; విజ్ఞానము= తెలివితేటలు; అంతన్+ తొలఁగున్= ఆపై తొలగిపోతుంది; అట్టివిజ్ఞాననాశంబున్= ఆ విధమైన తెలివితేటలు నశించడాన్ని; స్వ+ఆత్మకు= తనయందలి తనకు; అది సకల+అపహ్నవంబు= అది మొత్తాన్ని మరుగు పరచేది; అటు+అంద్రు= అని అంటారు; ఆర్యజనులు= పెద్దలు.

**తా :** విషయసుఖాలతో ఆకర్షించబడిన ఇంద్రియాలలో మనస్సు తగులుకొని విచారణాశక్తిని కోల్పోతుంది. నీటిమడుగులో ఉండే రెల్లు, దర్భలు, అందులో నీటిని పీల్చివేసినట్లే అటువంటి మనస్సు దేహమందలి విచారశక్తిని క్రమంగా హరిస్తుంది. దానిచే లోపలి భావనా సామర్థ్యము తరిగిపోతుంది. ముందువెనుకలను అనుసంధానంచేసే స్మరణశక్తి నశిస్తుంది. అది నశిస్తే తనలో విజ్ఞానం తొలగిపోతుంది. అంతట యథార్థజ్ఞానం నశిస్తుంది. దానినే ఆత్మ మరుగున పడిపోతుందని పెద్దలు అంటారు.

**వ. అదియునుం గాక "ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి"యను వేదవచనంబునం జేసి విషయంబులకుం బ్రియతమత్వంబై యాత్మోపాధికంబు నొంది యాత్మాపహ్నవంబునం బాటిల్లు స్వార్థనాశం బెద్ది గలుగు దాని కంటె లోకంబున నధికంబైన స్వార్థనాశంబు లే, దది యెట్లనిన సర్వార్థనాశంబునకు స్థైర్యంబు నొందించునట్టి యర్థకామాభిధ్యానంబునం దద్ధేతుకంబైన స్వార్థనాశంబునం బరోక్షాపరోక్షరూప జ్ఞానంబు నశించుం గావున నాత్మాపహ్నవంబునకంటె నధికతరంబైన సర్వార్థనాశంబు లేదని వెండియు నిట్లనియె. 624**

**ప్రతి :** అదియునున్+కాక= అదీగాక; ఆత్మనః+తు= ఆత్మయొక్క; కామాయ= కామం కొరకు; సర్వం= అంతా; ప్రియం భవతి= తన కంటే వేరుకాదు అనే ప్రియభావన కల్గుతుంది; అను వేదవచనంబునన్+చేసి= అనే వేదవాక్యాన్నిబట్టి; విషయంబులకున్= విషయ వాంఛలకు; ప్రియతమత్వంబు+ఐ= మిక్కిలి ప్రీతిగలిగి; ఆత్మ+ఉపాధికంబున్+ఒంది= ఆత్మ విషయంలో ధర్మచింతనపొంది; ఆత్మ+అపహ్నవంబునన్= తన్ను మరుగు పరచడంవల్ల; పాటిల్లు= కలిగే; స్వార్థనాశంబు= తనది లేకుండుట; ఎద్దికలుగు= ఏది ఉంటుందో; దానికంటె= దానికి మించినది; లోకంబున= లోకంలో; అధికంబు+ఐన= గొప్పదైన; స్వార్థనాశంబు లేదు= స్వార్థం నశించిపోదు; అది ఎట్లు+అనినన్= అది ఎలా అంటే; సర్వార్థనాశంబునకు (సర్వ+అర్థ)= సమస్త సంపదలు నశించడానికి; స్థైర్యంబున్+ఒందించునట్టి= ధైర్యాన్ని కలిగించే; అర్థకామ+అభిధ్యానంబునందు= ధనం, కోరికలకు చెందిన; తద్+హేతుకంబు+ఐన= అదికారణముగాగల; స్వార్థనాశంబునన్= తనకు మాత్రమే ఉపయోగపడేదాన్ని విడిచిపెట్టడంచే; పరోక్ష+అపరోక్ష రూపజ్ఞానంబు= ఎదుట కనిపించేది, కనిపించనిది

అనే జ్ఞానం; నశించున్= నశించిపోతుంది; కావునన్, ఆత్మన్+ అపహ్నవంబునకంటెన్= తనను మరుగు పరచడం కంటె; అధికతరంబు+ఐన= మిక్కిలి అయిన; సర్వ+అర్థనాశంబు= సమస్త ప్రయోజనాలు నశించుట; లేదు+అని= మరొకటి లేదని చెప్పి; వెండియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అంతేకాక బాహ్యాభ్యంతర తత్త్వసమన్వయం పొంది అద్వయమైన జ్ఞానంలో జీవుడు నిమగ్నమైనప్పుడు సమస్త జగత్తూ యోగ్యియైన జ్ఞానికీ ప్రియమే అవుతుంది. అనే వేదవాక్యాన్నిబట్టి విషయవాంఛలపై ప్రీతి ఆత్మజ్ఞానాన్ని మరుగు పరుస్తుంది. ఆత్మజ్ఞానం మరుగు కావడంవల్ల కలిగే స్వార్థనాశనాన్ని మించిన ఆత్మనాశం మరొకటి లేదు. అది ఎలా అంటే సమస్తసంపదలు నశించడానికి స్థైర్యాన్ని కల్గించే అర్థకామాలచింతచే ప్రత్యక్ష పరోక్ష రూపజ్ఞానం నశిస్తుంది. తనను మరుగు పరచడం కంటె గొప్పదగు సమస్త సంపదలనాశం మరొకటి లేదు. అని ఇంకా ఇలా అన్నాడు.

**సీ. అనఘ! యీ సంసార మతిశయంబునఁ దరియింపంగ మది నిశ్చయించువాఁడు**
**గైకొని ధర్మార్థకామమోక్షములకు నతివిఘాతుక మెద్ది యట్టి దాని**
**వలన సంగము సేయ వలవ; దా ధర్మాదులందుఁద్రివర్గంబు నంతకోగ్ర**
**భయయుతంబగుటను బరమమోక్షంబె ముఖ్యార్థమై విలసిల్లునంద్రు బుధులు,**

**తే. భువి గుణవ్యతికరమునఁ బుట్టి నట్టి, యబ్జజాతాదులకు నస్మదాదులకును**
**గాల విధ్వంసితాఖిలక్రమము గల్గుఁ, గలుగ దెన్నఁడు సేమంబు గాన వినుము. 625**

**ప్రతి :** అనఘ= ఓ పుణ్యాత్మా! ఈ సంసారము= భవమున; అతిశయంబునన్= విశేషించి; తరియింపంగన్= దాటడానికి; మది, నిశ్చయించువాఁడు= నిర్ణయించుకొన్నవాఁడు; కైకొని= ప్రయత్నించి; ధర్మ+అర్థకామమోక్షములకున్= ధర్మానికి, ధనానికి, కోరికలకు, మోక్షానికి; అతివిఘాతుకము+ఎద్ది= అత్యంతహానికరమేదో; అట్టిదాని వలనన్= అలాంటి దాని వలన; సంగము= బంధం; చేయవలవదు= కలిగించుకొనరాదు; ఆ ధర్మ+ఆదులందు= అట్టి ధర్మం మొదలైన వానిలో; త్రివర్గంబు= ధర్మార్థకామాలు; అంతక+ఉగ్రభయయుతంబు+అగుటను= యమునివలె భయంకరమైనది కావడంవల్ల; పరమమోక్షంబు+ఎ= శ్రేష్ఠమైన మోక్షమే; ముఖ్య+అర్థము+ఐ= ముఖ్యమైన ప్రయోజనంగా; విలసిల్లున్= ప్రకాశిస్తుందని; బుధులు+అంద్రు= పెద్దలు పేర్కొంటారు; భువిన్= ప్రపంచంలో; గుణవ్యతికరమునన్= గుణాల కలయిక వల్ల; పుట్టినట్టి= జన్మించిన; అబ్జజాత+ఆదులకున్= బ్రహ్మమొదలైనవారికి; అస్మత్+ఆదులకును= మావంటివారికి; కాలవిధ్వంసిత= కాలగతిచే నశింపజేయబడిన; అఖిలక్రమము= అన్నింటి వరుస; కల్గున్= కలుగును; సేమంబు= క్షేమం; ఎన్నఁడు= ఎప్పుడూ; కలుగదు, కానన్= కనుక; వినుము= విను.

**తా :** ఓ పుణ్యాత్మా! ఈ సంసారాన్ని దాటడానికి నిశ్చయించుకున్నవాడు ధర్మార్థకామమోక్షాలకు విఘాతం కలిగించే అంశంతో పొత్తుపెట్టుకోరాదు. అలాంటి ధర్మార్థ కామమోక్షాలలో మొదటి మూడు యముని కోపానికి గురి కావడంవల్ల మోక్షమార్గమే ముఖ్యప్రయోజనకారియని పెద్దలు పేర్కొంటారు. భూమిపై గుణాల కలయికవలన జన్మించిన బ్రహ్మమొదలైన వారికి, మా వంటి వారికి గూడ కాలగతిచే వినాశం తప్పదు. క్షేమం కలుగదు. విను. అందుచేత విను.

**విశే :** మోక్షమార్గమే ఉత్తమ లక్ష్యమని తెలిసినవారు చెబుతారు. బ్రహ్మాదులు కూడా త్రిగుణాల కలయికతో పుట్టినవారే. త్రివర్గాలలో ఏదీ క్షేమాన్ని కూర్చలేదు. ధర్మార్థకామమోక్షాలకు భంగం కలిగించే పనులు చేయరాదు. అర్థకామాలకోసం ధర్మాన్ని ఆచరించేవాడు మోక్షాన్ని పొందదు.

**వ. మోక్షంబె పరమ పురుషార్థం బని చెప్పి వెండియు నిట్లనియె. నరేంద్రా! దేహేంద్రియ ప్రాణ బుద్ధ్యహంకార పరివృతంబులయిన యీ స్థావరజంగమంబుల హృదయంబులందు వ్యాపకుండుఁ బ్రత్యక్షభూతుండుఁ బ్రత్యగ్రూపుండు భగవంతుండు నయిన యీశ్వరుం డంతర్యామిరూపంబునం బ్రకాశించుచుండు, నిది నారాయణుని సద్రూపంబుగాఁ దెలియు మని వెండియు నిట్లనియె. 626**

**ప్రతి :** మోక్షంబు+ఎ= మోక్షమే; పరమపురుష+అర్థంబు= మిక్కిలి శ్రేష్ఠమైన పురుషార్థం అనిచెప్పి; వెండియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు; నర+ఇంద్రా= ఓ రాజా! దేహ+ఇంద్రియ ప్రాణబుద్ధి+అహంకార పరివృతంబులు+అయిన= దేహము, దాని ఇంద్రియాలు, ప్రాణం, బుద్ధి, అహంకారం అనే వాటితో ఏర్పడిన; ఈ స్థావర జంగమంబుల= ఈ కదలని, కదిలే; హృదయంబులు+అందు= మనస్సులలో; వ్యాపకుండును= వ్యాపించినవాడు; ప్రత్యక్షభూతుండును= కంటికెదురుగా కనిపించేవాడు; ప్రత్యక్+రూపుండు= ఎదుట నిలచినవాడు; భగవంతుండును+అయిన= పరమాత్మ అయిన; ఈశ్వరుండు= దేవుడు; అంతర్యామిరూపంబునన్= లోపలి నివసించే వాని రూపంలో; ప్రకాశించుచుండున్= వెలుగుతుంటాడు; ఇది= దీనిని; నారాయణుని= భగవంతుడైన విష్ణుని; సత్+రూపంబుగా= సత్యమైన రూపంగా; తెలియుము+అని= తెలిసికోవాలని; వెండియున్= మరియు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** మోక్షమే పురుషార్థాలలో శ్రేష్ఠమైనదని చెబుతూ ఇంకా ఇలా అన్నాడు. ఓ రాజా! దేహం, ఇంద్రియ ప్రాణాలు, బుద్ధి, అహంకారం అనే వాటితో ఏర్పడిన చరాచరప్రాణుల హృదయాలలో నిండి కంటికి కనిపించే రూపంగల భగవంతుడు మన లోపల నివసిస్తూ వెలుగుతూ ఉంటాడు. విష్ణుని ఈ సత్యరూపం తెలుసుకొమ్మని మరలా ఇలా అన్నాడు.

**ఉ. భూవర! యే మహాపురుషభూషణునందుల నీ సమస్త వి**
**శ్వావళి లీనమై సదసదాత్మకభావము నొంది భూరి మా**
**యావిభవంబులందగి సమగ్రవివేకనిరోధిస్రఘ్నా**
**శీవిషబుద్ధి దోఁచుచు విశేషగతిన్ వెలుఁగొందు నెప్పుడున్. 627**

**ప్రతి :** భూవర= ఓ రాజా!; ఏ, మహాపురుషభూషణున్+అందులన్= మహామహులకు ఆభరణప్రాయమైన వానిలో; ఈ సమస్త విశ్వ+ఆవళి= ఈ మొత్తం ప్రపంచాలు; లీనము+ఐ= కలిసిపోయి; సత్+అసత్+ఆత్మక= ఉండుట లేకుండుట అనే; భావమున్+ఒంది= ఆలోచననుపొంది; భూరిమాయా విభవంబులన్+తగి= విస్తారమైన మాయావిశేషాలతోకూడి; సమగ్ర వివేక నిరోధి= సంపూర్ణమైన వివేకానికి వ్యతిరేకతగల; స్రక్+ఘన+ఆశీవిషబుద్ధిన్= పూలమాలనుచూచి విషసర్పమనే భ్రాంతితో; తోఁచుచున్= కనిపిస్తూ; విశేషగతిన్= ప్రత్యేకతతో; ఎప్పుడున్+వెలుగొందున్= ఎల్లప్పుడూ ప్రకాశిస్తుంది.

**తా :** రాజేంద్రా! ఈ సమస్త విశ్వమూ ఆ పరమేశ్వరునియందు లీనాలీనభావంతో, మాయాప్రభావంతో, వివేకాన్ని నిరోధించే సర్పమాలాభ్రాంతితో విశేషంగా ప్రకాశిస్తూ ఉంటుంది.

**చ. సుమహితనిత్యముక్తపరిశుద్ధవిబుద్ధసుతత్త్వుఁడై యురు**
**క్రముఁడభిభూతసత్ప్రకృతికర్మకళంకుఁడు నైనయట్టి యు**
**త్తమచరితుంగృపాకరు నుదాత్తగుణోన్నతు నీశ్వరేశుఁ జి**
**త్తమునఁదలంపుమయ్య! జనతాపరిరక్షణ! దుష్టశిక్షణా! 628**

ప్రతి : దుష్టశిక్షణా= దుష్టులను శిక్షించేవాడా!; జనతా పరిరక్షణ= ప్రజలను రక్షించువాడా!; సుమహిత= మిక్కిలి గొప్పదైన; నిత్యముక్త= ఎల్లప్పుడు బంధంలేని; పరిశుద్ధ= పరిశుభ్రమైన; విబుద్ధ= చక్కగా గ్రహించిన; సుతత్త్వుఁడు+ఐ= సత్యరూపమైనవాడై; ఉరుక్రముఁడు= విష్ణుమూర్తి; అభిభూత= తిరస్కరింపబడిన; సత్+ప్రకృతి కర్మకళంకుడున్= సత్యమూ, ప్రకృతి యొక్క కర్మల మాలిన్యంగలవాడు; ఐన+అట్టి= ఐనటువంటి; ఈశ్వర+ఈశున్= పరమేశ్వరుని; చిత్తమునన్= మనస్సులో; తలంపుము+అయ్య= భావించవయ్యా!

తా : దుష్టులను శిక్షించి, ప్రజలను రక్షించే ఓ రాజా! అంతర్యామిత్వం, నిత్యముక్తత్వం, తత్త్వజ్ఞత, సర్వవ్యాపిత్వం అనే లక్షణాలతో కూడినవాడై విష్ణుమూర్తి ఉన్నాడు. ఆయన ప్రకృతి కర్మలను, వాటిఫలాలను తిరస్కరించే ఉత్తమప్రవర్తన, దయ, సద్గుణాలు కలిగి ఉన్నాడు. అట్టి భగవంతుని మనస్సులో స్మరించు.

విశే : అంతటా వ్యాపించినవాడు ఉరుక్రముడు.

**సీ. వసుమతీనాథ! యెవ్వని పాదపద్మపలాశవిలాససల్లలితభక్తి**
**సంస్మరణంబుచే సజ్జనప్రకరంబు ఘనకర్మసంచయగ్రథితమగు న**
**హంకారమను హృదయగ్రంథిఁజెఱుతురు; వివరింప నిట్లు నిర్విషయమతులు**
**మహి నిరుద్ధేంద్రియమార్గులు నైనట్టి యతులకుఁజేరంగ నలవి గాని**

**తే. యట్టి పరమేశుఁగేశవు నాదిపురుషు, వాసుదేవుని భువనపావనచరిత్రు**
**నర్థి శరణంబుగాఁ దత్పదాంబుజములు, భక్తి సేవింపు గుణసాంద్ర! పార్థివేంద్ర! 629**

ప్రతి : పార్థివ+ఇంద్ర= ఓ రాజా! గుణసాంద్ర= సద్గుణ సమున్నతా!; వసుమతీనాథ= ఓ రాజా!; ఎవ్వని పాదపద్మ పలాశ విలాస= ఎవరి పద్మపలాశాలవంటి పాదాల సౌందర్యంపై; సత్+లలితభక్తిన్= చక్కని ఉత్తమభక్తితో; సంస్మరణముచేన్= భావించడంవల్ల; సత్+జనప్రకరంబు= మంచివారి సమూహముయొక్క; ఘనకర్మసంచయ గ్రథితము+అగు= గట్టి కర్మలసమూహంచే ముడిపెట్టబడు; అహంకారము+అను= అహంకారమనే; హృదయగ్రంథిన్= హృదయంలోని ముడిని; చెఱుతురు= తొలగింతురో; వివరింపన్= విస్తరించగా; ఇట్లు= ఈ విధంగా; నిర్విషయమతులు= విషయ చింతలేని మనస్సుగలవారు; మహిన్= లోకంలో; నిరుద్ధ+ఇంద్రియమార్గులు= ఇంద్రియాల ప్రవర్తనకు అడ్డుకట్టవేసినవారు; ఐన+అట్టి= అయినటువంటి; యతులకున్= మునులకు; చేరంగన్+అలవి+కాని= చేరడానికి శక్యంగాని; అట్టిపరమ+ఈశున్= అలాంటి భగవంతుని; కేశవున్= విష్ణుని; ఆదిపురుషున్= తొలిపురుషుని; వాసుదేవునిన్= భగవంతుడైన విష్ణుని; భువనపావనచరిత్రున్= లోకంలో పవిత్రమైన చరిత్రగలవానిని; అర్థిన్= కోరికతో; శరణంబుగాన్= శరణన్నభావంతో; తద్+పద+అంబుజములు= ఆయన పాదపద్మాలు; భక్తిన్= భక్తితో; సేవింపుము= కొలువుము.

తా : గుణసాంద్రా! రాజా! సజ్జనులు భగవానుని పాదపద్మాలపై భక్తిగలిగి ఆ భక్తిస్మరణ ప్రభావంచే కర్మలతో ముడివడిన అహంకారమనే హృదయ గ్రంథిని నశింపజేసుకొంటారు. విషయ చింతలేనివారు, ఇంద్రియాలనరికట్టినవారు నగు యతులకు చేరరాని ఆది పురుషుడను పరమేశ్వరుణ్ణి శరణుసొచ్చి ఆ దేవుని పాదపద్మాలు భక్తితో సేవించు.

**మ. అరిషడ్వర్గమహోర్మినక్రనికరవ్యాకీర్ణసంసారసా**
**గర మబ్జోదరకీర్తనాతరణిసాంగత్యంబునంబాసి తా**

**మరుదారంగనఘాపహప్రకటయోగాదిక్రియాయు క్తిచేఁ**
**దరియింపన్ మదిఁగోరువారలకు దుర్దాంతంబగుంగావునన్.** **630**

**ప్రతి :** అరిషట్+వర్గ= ఆరుగురు శత్రువులు అనే; మహా+ఊర్మినక్రనికర= గొప్ప తరంగాలు అనే మొసళ్ల గుంపుతో; వ్యాకీర్ణ= కల్లోలమైన; సంసారసాగరము= సంసారమనే సముద్రం; అబ్జ+ఉదరకీర్తనా= పద్మనాభుని స్తుతించడమనే; తరణి సాంగత్యంబునన్= నౌకా సంబంధంతో ; పాసి= వదలి; తాము; అరుదారంగన్= ఆశ్చర్యకరంగా; అఘ+అపహా= పాపాలను పోగొట్టే; ప్రకటయోగాది క్రియాయుక్తిచేన్= విస్తృతమైన యోగాభ్యాసాది క్రియలను అవలంబించడం ద్వారా; తరియింపన్= దాటడానికి; మదిన్+కోరువారలకు= మనస్సులో భావించేవారికి; దుర్దాంతంబు= వశపరచుకోవడానికి వీలుకానిది; అగున్+కావునన్= అవుతుంది కాబట్టి.

**తా :** అరిషడ్వర్గం అనే పెద్ద అలలు, మొసళ్ల సముదాయం తిరుగుతుండటంవల్ల కల్లోలంగా ఉన్న సముద్రం వంటిది సంసారం. దానిని దాటడానికి హరినామ సంస్మరణం అనే నావ లేకుండా సాధ్యం కాదు. దానిని ఆశ్రయించడం మాని పాపాలు పోగొట్టుకోవడానికై ఆశ్చర్యకరంగా తీవ్రయోగాభ్యాసాదులు చేసేవారికి ఈ మహాసాగరాన్ని తరించడం అసంభవం.

**విశే :** కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం – అనే ఆరు దుర్గుణాలను అరిషడ్వర్గ మంటారు.

**మ. ధరణీశోత్తమ! నీవు కేవలసముద్యద్భక్తి ధీయుక్తిమై**
**వరగోవిందపదారవిందయుగభాస్వన్నావ సంధించి దు**
**స్తరభూరివ్యసనాకరోల్లసితదుర్దాంతోగ్రగంభీర సం**
**సరణాంభోధిఁదరింపవయ్య పరమోత్సాహంబు దీపింపఁగన్.** **631**

**ప్రతి :** ధరణి+ఈశ+ఉత్తమ= ఓ రాజేంద్రా!; నీవు, కేవల సముద్యత్+భక్తి ఇంకొకటి ఎరుగని అచంచల స్థితిలో గలిగేభక్తి; ధీయుక్తిమైన్= బుద్ధి సాంగత్యంతో; వరగోవిందపద+అరవిందయుగ= శ్రేష్ఠమైన విష్ణుని పాదపద్మముల జంట అనే; భాస్వత్+నావ సంధించి= ప్రకాశించే తెప్పను కూర్చుకొని; దుస్తర= దాటరాని; భూరివ్యసన= గొప్పబాధలకు; ఆకర+ఉల్లసిత= నివాసమై తనరారు; దుర్దాంత+ఉగ్రగంభీర= దమింపరాక భయంకరమైలోతైన; సంసరణ+అంభోధిన్= సంసారమనే సముద్రాన్ని; పరమ+ఉత్సాహంబు= అధికమైన సంతోషం; దీపింపఁగన్= ప్రకాశించగా; తరియింపవయ్యా= దాటు.

**తా :** ఓ రాజేంద్రా! నీవు కేవలము అత్యంత భక్తి ప్రపత్తులతో శ్రీమహావిష్ణు పాదపద్మాలనే నావను సమకూర్చుకొని దుర్భరమైన బాధలకు నెలవై భయంకరమై దాటరాని సంసారసముద్రాన్ని ఉత్సాహంతో దాటు.

**క. అని యీ గతిఁబంకరుహా, సనసుతుఁడును బ్రహ్మబోధశాలియు నగు నా**
**ఘనయోగివల్లభునిచే, తను దెలియఁగఁబడిన బ్రహ్మతత్త్వుండగుచున్.** **632**

**ప్రతి :** అని, ఈగతిన్= ఈ విధంగా; పంకరుహ+ఆసనసుతుఁడును= బ్రహ్మకుమారుడు; బ్రహ్మబోధశాలియు= బ్రహ్మజ్ఞానియు, అగు= అయిన; ఆ ఘనయోగివల్లభునిచేతను= ఆ గొప్ప తత్త్వవేత్తచే; తెలియఁగన్+పడిన= గ్రహించబడిన; బ్రహ్మతత్త్వుండు+అగుచున్= బ్రహ్మతత్త్వం గలవాడవుతూ.

**తా :** అని ఇలా బ్రహ్మకుమారుడు, బ్రహ్మజ్ఞుడు అయిన సనత్కుమారుడు మహాతత్త్వవేత్తయైన పృథువునకు బ్రహ్మతత్త్వాన్ని గూర్చి బోధించాడు. ఆ రాజు ఆ తత్త్వం గ్రహించాడు.

**క. జనపతి మునిఁబొగడి ముదం, బున నిట్లనుఁబూర్వజన్మమున నే దీనా**
**వనుఁడైన యీశ్వరుని చే, తను నిక్క మనుగ్రహింపఁదగితి మునీంద్రా! 633**

**ప్రతి :** మునీంద్రా= ఓ మునిశ్రేష్ఠా!; జనపతి= రాజైన పృథువు; మునిన్= సనత్కుమారుని; పొగడి= స్తుతించి; ముదంబునన్= సంతోషంతో; ఇట్లు+అనున్= ఇలా అన్నాడు; నే= నేను; పూర్వజన్మమునన్= గతజన్మలో; దీనావనుఁడు+ఐన= (దీన+అవన) దీనులను రక్షించేవాడైన; ఈశ్వరునిచేతను= భగవంతునిచే; నిక్కము+అనుగ్రహింపన్+తగితిన్= నిజంగా అనుగ్రహింపదగిన వాడనయ్యాను.

**తా :** పృథుచక్రవర్తి సనత్కుమారుని స్తుతించి ఆనందంగా ఇలా అన్నాడు. మునీంద్రా! "నేను గతజన్మలో నిజంగా దీనజన రక్షకుడైన ఈశ్వరునిచే అనుగ్రహింపబడదగిన వాడనయ్యాను.

**క. వినుఁడట్టి యనుగ్రహ సా, ధనమునకై మీర లిపుడు దగ నిచ్చటికిం**
**జనుదెంచితిరి దయాళురు, ననఘులు భాగవతవరులు నగు నుత్తములున్. 634**

**ప్రతి :** వినుఁడు= వినండి; అట్టి+అనుగ్రహ సాధనమునకు+ఐ= ఆ విధమైన దయను సంపాదించడానికై; మీరలు= మీరు; ఇపుడు= ఇప్పుడు; తగన్+ఇచ్చటికిన్= తగినవిధంగా ఇక్కడికి; దయాళురు= దయాస్వభావులు; అనఘులు= పుణ్యాత్ములు; భాగవతవరులు= భగవద్భక్తశ్రేష్ఠులు; అగు ఉత్తములున్= అయిన శ్రేష్ఠులు; చనుతెంచితిరి= వచ్చారు.

**తా :** విను. ఆ విధమైన అనుగ్రహం సాధించుకొనేందుకు దయాస్వభావులు, పుణ్యాత్ములు, భాగవతశ్రేష్ఠులు, ఉత్తములు అయిన మీరు ఇప్పుడు ఇచటకు తగినట్లు సమయానికి వచ్చారు.

**సీ. నిరతంబు నాయందు నిష్పాదితములగు దేహసమేతమదీయరాజ్య**
**సర్వసంపదలును సద్ద్విజదత్తముల్ గావునఁబ్రాణకాంతావిభూతి**
**మందిరసుతరాజ్య మహి బల కోశ పరిచ్ఛదంబుల నెల్ల ధృతిఁదలంప**
**రాజుకు భృత్యుండు రాజకీయములగు తాంబూలముఖపదార్థములఁజేసి**

**తే. రమణ సంతర్పణోపచారములు నడపు, గతిని వారల కవి నివేదితము లయ్యెఁ!**
**గాన మీ కుపచార మేగతి నొనర్తు, నతులగుణసాంద్ర! యోగికులాబ్ధి చంద్ర! 635**

**ప్రతి :** అతులగుణసాంద్ర= సాటిలేని మేటిగుణాలచే నిండినవాడా!; యోగికుల+అబ్ధిచంద్ర= మునివంశ సముద్రానికి చంద్రుడా!; నిరతంబు= నిత్యం; నా+అందున్= నాపట్ల; నిష్పాదితములు+అగు= కల్పింపబడిన; దేహసమేత= శరీరంతోకూడిన; మదీయరాజ్యసర్వసంపదలును= నా రాజ్యం సమస్త సంపదలు; సత్+ద్విజ దత్తముల్= మంచి బ్రాహ్మణులచే ఒసంగబడినవి; కావునన్, ప్రాణకాంతా విభూతి= ప్రాణం, భార్య, ఐశ్వర్యాలు; మందిర= గృహములు; సుత= బిడ్డలు, రాజ్య= రాజ్యం, మహి= భూసంపద, బలకోశపరిచ్ఛదంబులన్= సైన్యబలం, ధనాగారం, పరివారం; ఎల్లన్= అన్నియు; ధృతిన్+తలంపన్= ధైర్యంగా ఆలోచించగా; రాజుకు, భృత్యుండు= సేవకుడు; రాజకీయములగు= రాజమర్యాదలతోగూడిన;

తాంబూలముఖ పదార్థములన్+చేసి= తాంబూలం మొదలైన ద్రవ్యాలతో; రమణన్= వైభవంగా; సంతర్పణ+ఉపచారములు= తృప్తిపరచే సేవలు; నడుపుగతిని= నడిపించే విధంగా; వారలకున్= వారికి; అవి, నివేదితములు+అయ్యెన్+కాన= సమర్పితమైనవి కాబట్టి; మీకు+ఉపచారము= మీసేవ; ఏగతిన్+ఒనర్తు= ఏవిధంగా చేయగలను.

**తా :** సాటిలేని గుణసాంద్రా! మునివంశచంద్రా! నిరంతరం నాకు లభించిన రాజ్యంతో, దేహంతో సహా సర్వసంపదలునూ మంచి బ్రాహ్మణులు అనుగ్రహించినవే. కాబట్టి ప్రాణులు, కాంతలు, ఐశ్వర్యం, గృహాలు, పుత్రులు, రాజ్యం, భూమి, బలం, ధనాగారం, పరివారం నావి అని ధైర్యంగా అనుకోలేను. రాజమర్యాదలైన తాంబూలాదులు ఆహారతృప్తి మొదలైన ఉపచారాలు రాజుకు సేవకులు ఏవిధంగా సమర్పిస్తారో అలా నేను భక్తిభావంతో విప్రులకు సమర్పిస్తున్నాను. మరి అలాంటి నేను మీకు ఎలా ఉపచారాలు, మర్యాదలు చేయగలను.

**విశే :** సర్వం రాజ్యాదికం మదీయం సాధూచ్ఛిష్టం సత్ మహ్యం ప్రసాదరూపేణ దత్తం. అతస్తత్ర మమస్వత్వాభావాత్ గురుదక్షిణార్థం కిం దదే - శ్రీధరీయం (4-22-23).

నివేదనం తదీయస్యైవ తస్మై సమర్పణం - శ్రీధరీయ వ్యాఖ్య (4-22-44)

రాజు యాచకుడికి చేసిన దానం వేరు. సేవకుడు ప్రభువుకు చేసిన సేవవలె పృథువు దానంచేశాడు. దానస్వీకర్త ఆదినారాయణుడని తెలిసి, గౌరవంగా చేసేదే దానం.

దానగుణమాహాత్మ్యాన్ని పృథువు ఇందులో వివరంగా చెప్పాడు.

**వ. అది యెట్లు బ్రాహ్మణాధీనం బంటిరేని సేనాధిపత్య రాజ్యదండనేతృత్వ సర్వలోకాధిపత్యంబులు వేదశాస్త్రవేది యైన బ్రాహ్మణునక కాని యితరులకు యోగ్యంబులు గావు! కావున బ్రాహ్మణులకు భోజన వసనదానంబులు స్వకీయంబులై యుండు, క్షత్రియాదులకు బ్రాహ్మణానుగ్రహంబున నన్న మాత్రంబు దక్కం దక్కిన వస్తుస్వాతంత్ర్యంబు లేదు, గావున మీకు గురుదక్షిణ యేమి సమర్పించు వాఁడ? నదియునుం గాక స్వాతంత్ర్యంబు గలిగిన నిట్టి యధ్యాత్మవిచారులు వేదాంతవేదులు నై భగవద్భక్తి నుపదేశించెడు, మీ వంటి పుణ్యాత్ములకుం బరిహాసాస్పదుండు దక్కఁ దక్కినవా డెవ్వం డంజలి మాత్రంబు దక్కఁ దక్కిన ప్రత్యుపకారంబు సేయం దలంచు? నది గావున దయాళువులైన మీరలు స్వకృతోపచారంబులం జేసి సంతుష్టాంతరంగు లగుదురు గా కని పలుకుచున్న యాదిరాజయిన పృథుచక్రవర్తిచేతం బూజితులై యాత్మయోగనిష్ఠులైన సనకాదు లతని స్వభావంబుం బ్రశంసించుచు సమస్తజనంబులుఁజూచుచుండ నాకాశగమనంబునంజని రయ్యవసరంబున.** **636**

**ప్రతి :** అది, ఎట్లు= ఏవిధంగా; బ్రాహ్మణ+అధీనంబు+అంటిరి+ఏని= బ్రాహ్మణుల స్వాధీనమంటారా?; సేనా+ఆధిపత్య= సేనలకధిపతికావడం; రాజ్యదండనేతృత్వ= రాజశాసనమునకు నాయకత్వం వహించడం; సర్వలోక+ఆధిపత్యంబులు= సమస్త లోకాలకు అధికారము; వేదశాస్త్రవేది+ఐన= వేదశాస్త్రములు తెలిసిన; బ్రాహ్మణునక కాని= బ్రాహ్మణునకు తప్ప, ఇతరులకు; యోగ్యంబులు కావు= తగవు; కావునన్ బ్రాహ్మణులకున్= కాబట్టి భూసురులకు; భోజన వసనదానంబులు= అన్నం, వస్త్రం దానంచేయడం; స్వకీయంబులు+ఐ+ఉండు= స్వంతమై ఉంటాయి; క్షత్రియ+ఆదులకు= రాజులు

మొదలైనవారికి; బ్రాహ్మణ+అనుగ్రహంబునన్= బ్రాహ్మణుల దయచే; అన్నమాత్రంబున్‌తక్కన్= భోజనముతప్ప; తక్కిన, వస్తుస్వాతంత్ర్యంబు లేదు= స్వేచ్ఛ వస్తువుల పట్ల లేదు; కావున, మీకు గురుదక్షిణ= మీకు కానుక; ఏమి సమర్పించువాఁడు+అ= ఏమి ఇవ్వగలవాడను; అదియునున్+కాక= అదీగాక; స్వాతంత్ర్యంబు కలిగినన్= స్వేచ్ఛఉన్నట్లైతే; ఇట్టి అధ్యాత్మవిచారులు= ఈ విధంగా అధ్యాత్మ విద్యనుగూర్చి ఆలోచించేవారు; వేదాంతవేదులును+ఐ= వేదాంత విద్యను తెలిసినవారై; భగవత్+భక్తిన్= భగవంతునిపట్ల భక్తిని; ఉపదేశించెదు= తెలియజేసే; మీ వంటిపుణ్య+ఆత్ములకున్= మీ వంటి సజ్జనులకు; పరిహాస+ఆస్పదుండు తక్కన్= నవ్వుటాలకు లోనైనవాడుతప్ప; తక్కినవాడు= మిగిలినవారిలో ఇతరుడు; ఎవ్వండు= ఎవడు; అంజలి మాత్రంబుతక్కన్= నమస్కరించుట తప్ప; తక్కిన ప్రతి+ఉపకారంబు= మిగిలిన ఇతర సహాయం; చేయన్+తలంచున్= చేయడానికి తలపెడతాడు; అది+కావున= అందువలన; దయాళువులు+ఐన= కృపాస్వభావులైన; మీరలు= మీరు; స్వకృత+ఉపచారంబులన్+చేసి= నాచే చేయబడ్డ సేవలతో; సంతుష్ట+అంతరంగులు= సంతోషించిన మనస్సు గలవారు; అగుదురు+కాక= అవుతారు కాక; అని పలుకుచున్న= అని మాట్లాడుతున్న; ఆదిరాజు+అయిన= తొలిరాజు అయిన; పృథుచక్రవర్తిచేతన్= పృథువుచేత; పూజితులు+ఐ= పూజించబడ్డవారై; ఆత్మయోగనిష్ఠులు+ఐన= ఆత్మలో యోగస్థితిని పొందినవారైన; సనకాదులు= సనకుడు మొదలైనవారు; అతనిస్వభావంబున్= ఆయన గుణగణాలను; ప్రశంసించుచు= పొగడుతూ; సమస్తజనంబులున్= ప్రజలందరూ; చూచుచుండన్= చూస్తూ ఉండగా; ఆకాశగమనంబునన్= ఆకాశంలో; చనిరి= వెళ్లారు; ఆ+అవసరంబున= ఆ సమయంలో.

**తా :** రాజ్యమంతా బ్రాహ్మణుల అధీనం ఎలా అయిందంటారా? సేవలను నడిపించడం, రాజ్యపాలన, దండనాధికారం, మూడులోకాలకు ఆధిపత్యం, వేదశాస్త్రాలు తెలిసినవానికే సాధ్యం. అవి తెలిసినవాడే బ్రాహ్మణుడు. అందువల్ల వారి సొత్తుగా సమస్తరాజ్యసంపద భావించబడటంవల్ల లోకానికి మేలు చేకూరుతుంది. రాజ్యంలో అన్నవస్త్రాదులు సద్బ్రాహ్మణుల సొంతవస్తువులు. క్షత్రియాదులకు బ్రాహ్మణానుగ్రహంచేత అన్నం మాత్రమే సొంతంగా భావించాలి. మిగతా విషయాలలో వారికి స్వాతంత్ర్యం లేదు. కాబట్టి మీకు గురుదక్షిణగా ఇవ్వడానికి నా వద్ద ఏమీ లేదు. మీరు సర్వస్వతంత్రులు. ఆధ్యాత్మవిద్యాగురువులు, వేదాంతం తెలిసినవారు. భగవద్భక్తి నుపదేశించేవారు. మీవంటివారికి దక్షిణ ఇవ్వాలనుకొన్నవాడు హాస్యాస్పదుడు మాత్రమే అవుతాడు. నేను నమస్కారం మాత్రమే సమర్పించుకోగలను. మీకు ప్రతిఫలంగా ఈయగలిగినది ఏమీ లేదు. అందుచేత దయాళువులు అయిన మీరు నా ఉపచారాలచేత సంతుష్టాంతరంగులగుదురుగాక! ఇలా మాట్లాడుతున్న ఆదిరాజయిన పృథుచక్రవర్తిచే పూజితులై యోగనిష్ఠులైన సనకాదులు అతని స్వభావాన్ని గూర్చి ప్రశంసిస్తూ అక్కడున్న జనులందరునూ, చూచుచుండగా ఆకాశంలోనికి పోయారు. ఆ సమయంలో

## a =పృథు చక్రవర్తి జ్ఞానవైరాగ్య వంతుండై ముక్తి నొందుట a

**ఆ. వినుమహాత్మ, ముఖ్యుఁడన నొప్పు వైన్యుఁ డే, కాగ్రచిత్తుఁ డగుచు నాత్మనిష్ఠుఁ**
**డైనయట్టి తను నవాప్త కామునిఁ గాఁగ, బుద్ధిలోనఁ దలఁచె భూవరుండు. 637**

**ప్రతి :** మహాత్మ= దొడ్డబుద్ధిగల ఓ విదురా!; విను= ఆలకించు; ముఖ్యుఁడు= గొప్పవాడు; అనన్= అనగా; ఒప్పు వైన్యుఁడు= ఒప్పారెడు వేనుని కుమారుడైన పృథువు; భూవరుండు= రాజు; ఏక+అగ్రచిత్తుఁడు= చెదరని మనస్సుకలవాడు; అగుచున్= అవుతూ; ఆత్మనిష్ఠుఁడు= పరమాత్మయందు నిష్ఠ కలవాడు; ఐన+అట్టితనున్= అయిన తన్నును; అవాప్తకామునిన్= పొందబడిన కోరికలుగలవానిని; కాఁగన్= అయినట్లుగా; బుద్ధిలోనన్= బుద్ధిలో; తలఁచెన్= భావించాడు.

**తా :** మహాత్మా! విదురా! విను. ప్రసిద్ధుడైన ఆ పృథువు చెదరని మనస్సుతో పరమాత్మపట్ల నిష్ఠకలవాడైన తనను సంపాదించిన సర్వమైన కాంక్షలు కలవానినిగా సంభావించాడు.

**విశే :** వైన్యుడు – వేనుని కుమారుడు – పృథువు; నిష్ఠ అంటే నియతమైన స్థితి – ఒకదానికి కట్టుబడి ఉండటం: అవాప్తకాముడు అంటే కోరికలు తీరినవాడు. ఇది వేదాంత విషయంలో ఒక పరిభాష వంటిది. ఏది పొందిన తరువాత పొందవలసింది మరొకటి ఉండదో అది పొందినవాడు అని భావం. అది పరమాత్మజ్ఞానం. ఏకాగ్రచిత్తుడు ఒకదానియందే లగ్నమైన చిత్తం కలవాడు. ఇది సాధనతో మాత్రమే కలుగుతుంది. ప్రకృతంలో ఏక శబ్దానికి పరమాత్మ అనే అర్థం తీసుకోవాలి. పరమాత్మలో నిలిచిన చిత్తం కలవాడని అర్థం; ముఖ్యుడు అంటే దేహంలో ముఖానికున్న స్థానంవంటి స్థితి కలవాడని అర్థం. తరువాత వివరిస్తున్న అతని ప్రవృత్తినిబట్టి ఈ పదం సాభిప్రాయంగా ప్రయోగించినట్లు తెలుస్తుంది.

**వ. అంత. 638**

**ప్రతి :** అంతన్= అటుపిమ్మట.

**తా :** తరువాత

**సీ. కర్మంబులను యథాకాల దేశోచిత బలవిత్తములు గాఁగఁ బరఁగు ధర్మ**
**ములను బ్రహ్మార్పణ బుద్ధిని జేసి కర్మాసక్తుఁ డగుచు సమాహితుండు**
**ప్రకృతికంటెను దన్నుఁ బరమైన యాత్మను గర్మసంచయ సాక్షిగాఁగ బుద్ధి**
**నర్థిఁ దలంచుచు నాచరించుచు నట్ల మెఱసి సామ్రాజ్యలక్ష్మీ సమేత**

**తే. మందిరోద్యాన వనభూములందు రాజ్య, గరిమ వర్తింపఁగా నహంకార రహితుఁ**
**డగుచుఁ దన చిత్తమున నింద్రియార్థములను, దగులకయ యుండె సన్మహోదారుఁ డగుచు. 639**

**ప్రతి :** కర్మంబులను= యజ్ఞం మొదలైన క్రియలను; యథాకాల= కాలానికి తగినవిధంగా; దేశ= ఉన్న తావునకు; ఉచిత= తగినట్లు; బల+విత్తములు= శక్తిధనం కలవి; కాఁగన్= అగునట్లుగా; పరఁగు= ప్రవర్తిల్లిన; ధర్మములను= చేయవలసిన విధులను; బ్రహ్మ+అర్పణబుద్ధిన్= బ్రహ్మానికి సమర్పించే భావనతో; చేసి= ఆచరించి; కర్మ+ ఆసక్తుఁడు= కర్మములందు తగులుకొన్నవాడు; అగుచున్= అవుతూ; సమాహితుండు= శ్రద్ధతో కూడినవాడు; తన్నున్= తనను; ప్రకృతికంటెను= ప్రకృతికంటె; పరము= ఆవలిది, మించినది; ఐన ఆత్మను= అయినట్టి ఆత్మ అనే దానిని; కర్మసంచయసాక్షి కాఁగన్= కర్మల సముదాయాలకు సాక్షి అగునట్లుగా; బుద్ధిన్= బుద్ధిలో; అర్థిన్= కోరికతో; తలంచుచున్= తలపోస్తూ; ఆచరించుచున్= చేస్తూ; అట్లు+అ= అదేవిధంగా; మెఱసి= ఒప్పారి; సామ్రాజ్యలక్ష్మీ= చక్రవర్తిత్వానికి సంబంధించి సర్వభూమియొక్క సంపదతో; సమేత= కూడిఉన్న; మందిర= భవనాలలో; ఉద్యాన= విహరించే తోటలలో; వనభూములు+అందున్= అరణ్యప్రదేశాలలో; రాజ్యగరిమ= ఏలుబడికి చెందిన గొప్పతనం; వర్తింపఁగాన్= నడుస్తూ ఉండగా; అహంకార రహితుఁడు= మిడిసిపాటులేనివాడు; అగుచున్= అవుతూ; తనచిత్తమునన్= తన మనస్సులో; ఇంద్రియ+అర్థములను= ఇంద్రియాలకు సంబంధించిన విషయాలందు; తగులక+అ= అంటు సొంటులు లేకుండానే; సత్+మహా+ఉదారుఁడు= సచ్ఛీలం, ఔదార్యం కలవాడు; అగుచున్= అవుతూ; ఉండెను= ఉన్నాడు.

**తా :** దేశానికీ కాలానికీ తగినవిధంగా బలాన్నీ, ధనాన్నీ ఉపయోగిస్తూ యజ్ఞాలను, ఇతరధర్మాలను, ఫలాన్ని బ్రహ్మానికి సమర్పించే బుద్ధితో కర్మలయందు శ్రద్ధకలవాడై చేస్తూ ఉన్నాడు. ప్రకృతికంటె ఆవలిదైన పరమాత్మనుగా తననూ కర్మల సమూహాలకు సాక్షిగా బుద్ధిలో ప్రయత్నంతో భావిస్తూ కర్మలను ఆచరిస్తున్నాడు. అదేవిధంగా సామ్రాజ్య సంపదలైన దివాణాలల్లో, ఉద్యానవనాలల్లో, అరణ్యభూములల్లో రాజ్యమహిమ మెలగుతూ ఉండగా అహంకారాన్ని వదలిపెట్టి, మనస్సులో ఇంద్రియాల విషయాలైన శబ్దాదులల్లో తగులం పెట్టుకోకుండా మిక్కిలి గొప్ప ఉదారబుద్ధి కలిగి ఉన్నాడు.

**విశే :** కర్మాసక్తుడు – నిజానికి కర్మలలో ఆసక్తి గుణం కాదు. కానీ బ్రహ్మార్పణబుద్ధితో చేయటంవల్ల అది గుణం అవుతుంది. ఇది శ్రద్ధను తెలియజేస్తుంది.

ప్రకృతి అంటే అవ్యక్తపరతత్త్వంనుండి వ్యక్తంగా రూపొందిన నామరూపాత్మకమైన విశ్వం. దానికి పరమైనది పరమాత్మ. "అహం బ్రహ్మాఽస్మి" నేను ఆ బ్రహ్మమనే జ్ఞానంతో ప్రవర్తించాడు పృథుచక్రవర్తి అని తాత్పర్యం. పరమాత్మ సాక్షిమాత్రంగా ఉంటాడు. సాక్షాత్తుగా చూచువానిని సాక్షి అంటారు. సాక్షి అయినా ఫలం మొదలైనవాని సంబంధం లేకుండా కేవలుడుగా ఉండే తత్త్వాన్ని పరమాత్మ అంటారు. ఆ విధంగా పరమాత్మను సంభావించటమే జ్ఞానం.

అహంకార రహితుఁడు – పరమాత్మకంటె వేరుగా దేహం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి మొదలైన వానితో అదే నేను అనేభావన కలిగి ఉండటం అహంకారం. అది అజ్ఞానం. దానివలన పరమాత్మను సాధకుడు పొందడు. కనుక పృథువు అహంకారరహితుడైనాడు.

సన్మహా+ఉదారుఁడు – ఉదారుడు అంటే ఇతరుల విషయంలో ఆర్ద్రమైన చిత్తంతో వ్యవహరించేవాడు. ఆ లక్షణం మంచిగా, గొప్పగా ఉన్నవాడు పృథువు. ఇది కూడా తాత్త్వికంగా పరమాత్మను అన్నింటిలో అందరిలో దర్శించే మహా విషయం.

ఇంద్రియ+అర్థాలు= చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు అనేవి ఇంద్రియాలు. అవి గ్రహించే, శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అనేవి విషయాలు. ఇంద్రియాలను బంధిస్తాయి కట్టిపడవేస్తాయి కనుక వీనికి విషయాలు అనే వ్యవహారం కలిగింది.

**వ. ఇట్లధ్యాత్మయోగనిష్ఠుండై కర్మంబుల నాచరించుచు నర్చి యను భార్యయందు విజితాశ్వుండు, ధూమ్రకేశుండు, హర్యశ్వుండు, ద్రవిణుండు, వృకుండు నను నాత్మసములైన పుత్త్రుల నేవురం గనియె నంత. 640**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; అధ్యాత్మ= దేహమున నెలకొనియున్న తత్త్వానికి సంబంధించిన; యోగ= యోగంలో; నిష్ఠుండు= చెదరని స్థితికలవాడు; ఐ= అయి; కర్మంబులన్= దేహానికి, మనస్సుకూ, చేష్టకూ సంబంధించిన పనులను; యజ్ఞం మొదలైనవాటిని; ఆచరించుచున్= చేస్తూ; అర్చి+అను, భార్య+అందున్= అర్చి అనే పేరుగల ఇల్లాలియందు; విజితాశ్వుండు= విజితాశ్వుడు; ధూమ్రకేశుండు= ధూమ్రకేశుడు; హర్యశ్వుండు= హర్యశ్వుడు; ద్రవిణుండు= ద్రవిణుడు; వృకుండున్= వృకుడునూ; అను= అన్నట్టి; ఆత్మసములు= తనతో సమానులు; ఐన; పుత్త్రులన్= కొడుకులను; ఏవురన్= అయిదుగురిని; కనియెన్= పొందాడు; అంతన్= అటుపిమ్మట.

**తా :** ఈ విధంగా ఆ పృథుచక్రవర్తి అధ్యాత్మమనే యోగంలో నిష్ఠకలవాడై కర్మలను శ్రద్ధతో చేస్తూ అర్చి అనే భార్యయందు విజితాశ్వుడు, ధూమ్రకేశుడు, హర్యశ్వుడు, ద్రవిణుడు, వృకుడు అనే తనతో సమానులైన కుమారులను ఐదుగురిని పొందాడు తరువాత

**విశే :** అధ్యాత్మయోగనిష్ఠుండు – ఆత్మ అంటే ఇక్కడ దేహం. అధ్యాత్మ అంటే దేహమునందున్న అని అర్థం. యోగం అంటే కర్మములందు కౌశలం= నేర్పు. నిష్ఠ అంటే ఎన్ని విఘ్నాలు కలిగినా చెదరకుండటం. కనుక ఆత్మవిద్యలో గట్టిపట్టు సాధించినవాడు అని ఈ పదానికి తాత్పర్యం.

ఆత్మవిద్య కర్మలకంటె పైస్థాయికి చెందినది. అయినా కర్మ ఆత్మవిద్యకు అత్యవసరమైన చిత్తశుద్ధిని కలిగిస్తుంది. చిత్తశుద్ధిలేని ఆత్మవిద్య ఫలాన్నివ్వదు. చిత్తశుద్ధి నిరంతరంగా ఉండాలి కనుక కర్మలను నిరంతరంగా చేస్తూ ఉండవలసిందే.

**క. జనవినుత! భూమివలనను, ధనముల మర్యాదఁ గొనుచు దాననిమిత్తం**
**బునఁ గ్రమ్మఱఁ దా నిచ్చుచు, దిననాయకుఁ బోలి వసుమతీపతి యొప్పెన్. 641**

**ప్రతి :** జనవినుత!= జనులచేత కొనియాడబడువాడా!; భూమివలనను= భూమినుండి; ధనములన్= సొమ్ములను; మర్యాదన్= ఒకపద్ధతి ననుసరించి; కొనుచున్= గ్రహిస్తూ; వసుమతీపతి= భూమికి ఏలిక అయిన ఆ పృథువు; దాననిమిత్తంబునన్= దానం అనేది కారణంగా పెట్టుకొని; క్రమ్మఱన్= మరల; తాను= ఆ రాజు; ఇచ్చుచున్= ఇస్తూ; దిననాయకున్= పగటిని ప్రవర్తింపజేసేవాడయిన సూర్యుని; పోలి= వలె అయి; ఒప్పెన్= ప్రకాశించాడు.

**తా :** విదురా! ఆ మహారాజు రాజనీతి ననుసరించి భూమి(యందలి ప్రజల)నుండి క్రమపద్ధతిలో ధనాలు గ్రహించి మళ్లీ దానమనే నెపంతో వారికే ఇస్తూ సూర్యునివలె ప్రకాశించాడు.

**విశే :** పృథువుకు సూర్యునితో పోలికను కవి ఇక్కడ చెప్పాడు. రాజు పన్నుల పేరుతో ప్రజలనుండి గ్రహించే ధనాన్ని వారి సంక్షేమానికే వెచ్చిస్తాడు. సూర్యుడు సముద్రం మొదలైన మహాజలాశయాలనుండి నీటిని తీసుకొని మేఘాలుగా రూపొందించి మళ్లీ పంటలకోసం వర్షరూపంతో ఇచ్చివేస్తూ ఉంటాడు. ఈ పోలికవల్ల పృథుచక్రవర్తి తన సుఖంకోసం, తనవారి సుఖంకోసం కాక ప్రజల సుఖంకోసమే పన్నులను గ్రహిస్తున్నాడు, తనకోసం ఏమీ మిగుల్చుకోలేదు అనే అర్థం ధ్వనిరూపంలో తెలియ వస్తున్నది.

**వ. అతండు మఱియు నగ్ని చందంబునం దేజోదుర్ధర్షుండును, మహేంద్రుని పగిది దుర్జయుండును, ధరణి కరణి సతతక్షమా యుక్తుండును, స్వర్గంబునుం బోలె నభీష్టదుండును, బర్జన్యుని భాతిఁ గామిత ప్రవర్షణుండును, సముద్రు రీతి గాంభీర్య యుక్తుండును, మేరువు పోలికి సత్త్వవంతుండును, ధర్మరాజు కైవడి ననుశాసకుండును, మహేంద్రుని విధంబున నైశ్వర్య వంతుండును, గుబేరుని మాడ్కి ధనవంతుండును, వరుణుని సరణి గుప్తార్థుండును, సర్వాత్మకుండగు వాయువు చెలువున బలౌజస్తేజోయుక్తుండును, రుద్రుని పగిది నసహ్యతేజుండును, గందర్పుని యనువున సౌందర్యవంతుండును, మృగరాజు నోజ నధిక శౌర్యోపేతుండును, మనువు ననువున వాత్సల్య యుక్తుండును, నజుని చందంబునం బ్రభుత్వ సమేతుండును, బృహస్పతి గరిమ బ్రహ్మవాదియు, సర్వేశ్వరుని జాడ జితేంద్రియుండునునై విష్వక్సేనానువర్తనులైన గో గురు విప్రజనంబులందు భక్తి గలిగి లజ్జావినయశీలంబులందును, బరోపకారంబు నందును నిరుపముండై యివ్విధంబున సర్వలోక పాలక పృథగ్విధ గుణంబుల నన్నింటినిం దానొక్కరుండు ధరియించి. 642**

**ప్రతి :** అతండు= ఆ పృథుచక్రవర్తి; మఱియున్= ఇంకా; అగ్నిచందంబునన్= అగ్నివిధంగా; తేజస్+దుర్ధర్షుండును= కాంతిచేత అణచేటందుకు అలవికానివాడూ; మహా+ఇంద్రుని పగిదిన్= గొప్పవాడైన ఇంద్రునివలె; దుర్జయుండును=

గెలువ శక్యంకానివాడూ; ధరణి కరణిన్= భూమివలె; సతత= సర్వకాలమూ; క్షమా= సహనంతో; యుక్తుండును= కూడియున్నవాడూ; స్వర్గంబునున్+పోలెన్= దేవలోకంలాగా; అభీష్టదుండును= కోరినవాటిని అన్నింటినీ ఇచ్చేవాడూ; పర్జన్యుని భాతిన్= వానదేవునివలె; కామిత ప్రవర్షణుండును= కోరికలను గొప్పగా కురిపించేవాడూ; సముద్రురీతిన్= సాగరంవలె; గాంభీర్య యుక్తుండును= తెలియరాని లోతుతో కూడిన (సముద్రంవలె) చాలా ఎక్కువ గంభీరమైన హృదయంతో కూడినవాడూ; మేరువు పోలికిన్= బంగారు కొండలాగా; సత్త్వవంతుండును= దేహబలం కలవాడూ; ధర్మరాజుకైవడిన్= యమునివలె; అనుశాసకుండును= శిక్షించువాడూ; మహా+ఇంద్రుని విధంబునన్= దేవతా ప్రభువువలె; ఐశ్వర్యవంతుండును= ప్రభువు లక్షణం కలవాడూ; కుబేరుని మాడ్కిన్= ఉత్తరదిక్కు ఏలిక అయిన కుబేరునివలె; ధనవంతుండును= గొప్ప ధనసంపదకలవాడూ; వరుణుని సరణిన్= పడమటి దిక్కునకు రాజైన వరుణునివలె; గుప్త+అర్థుండును= దాచుకున్న సంపదలు కలవాడూ; సర్వ+ఆత్మకుండు= అందరికి ప్రాణం; అగు= అయిన; వాయువు చెలువునన్= వాయుదేవునివలె; బల+ఓజస్+తేజస్+యుక్తుండును= బలం, ఉత్సాహం, కాంతి అనువానితో కూడినవాడూ; రుద్రునిపగిదిన్= శివునివలె; అసహ్యతేజుండును= సహించేటందుకు అలవికాని దేహకాంతి కలవాడూ; కందర్పుని+అనువునన్= మన్మథునివలె; సౌందర్యవంతుండును= అందచందాలు కలవాడూ; మృగరాజు+ఓజన్= మృగములకు రాజైన సింహంలాగా; అధిక – శౌర్య+ఉపేతుండును= గొప్పదైన పరాక్రమంతో కూడినవాడూ; మనువు+అనువునన్= మనువువలె; వాత్సల్య – యుక్తుండునున్= బిడ్డలమీది అనురాగంవంటిది కలవాడూ; అజుని చందంబునన్= బ్రహ్మవలె; ప్రభుత్వసమేతుండును= రక్షించే లక్షణంతో కూడినవాడూ; బృహస్పతి గరిమన్= దేవతల గురువైన బృహస్పతివలె; బ్రహ్మవాదియున్= బ్రహ్మమును – పరబ్రహ్మమును గూర్చి చెప్పుతూ ఉండేవాడు; సర్వ+ఈశ్వరునిజాడన్= అందరకు ప్రభువైన పరమేశ్వరుని విధంగా; జిత+ఇంద్రియుండునున్= గెలిచిన ఇంద్రియాలు కలవాడూ; ఐ= అయి; విష్వక్సేన+అనువర్తనులు= శ్రీమహావిష్ణువును అనుసరించి నడచుకొనేవారు (గొప్ప విష్ణుభక్తులు) ఐన= అయిన; గో= ఆవులయందు; గురు= విద్యను బోధించేవారియందు; విప్ర జనంబుల+అందున్= విద్యతో రాణించే బ్రాహ్మణులపట్ల; భక్తి= గొప్ప అనురాగం; కలిగి= పెట్టుకొని; లజ్జా= చెడు పనులకు సిగ్గుపడటంలోను; వినయ= అణగిమణగి ఉండటంలోను; శీలంబులందును= మంచి ప్రవర్తనలోను; పర+ఉపకారంబునందును= ఇతరులకు మేలు చేయటంలోను; నిరుపముండు= సాటిలేనివాడు; ఐ= అయి; ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; సర్వ= అన్ని; లోక= లోకాల; పాలక= సంరక్షకుల; పృథక్= వేరుగా ఉండే; విధ= పద్ధతులుగల; గుణంబులన్= లక్షణాలను; అన్నింటినిన్= అన్నిటినీ; తాను= అతడు; ఒక్కరుండు= ఒక్కడూ; ధరియించి= తాల్చి.

**తా :** ఆ పృథుచక్రవర్తి అగ్నిదేవుని విధాన అణచరాని తేజస్సుకలవాడు. దేవేంద్రునిలాగా గెలువరానివాడు. భూదేవివలె అన్ని కాలాలలో సహనం కలవాడు, స్వర్గంలాగా కోరినవాటిని ఇచ్చేవాడు. వర్షదేవతవలె కోరికలను కురిపించేవాడు. సముద్రునివలె లోతెరుగురాని లక్షణం కలవాడు. సువర్ణపర్వతంవలె గొప్ప దేహబలం కలవాడు. యమధర్మరాజువలె ప్రజలను శిక్షించేవాడు. స్వర్గలోకపు ప్రభువువలె మహాప్రభుత్వంతో అలరారేవాడు, కుబేరునివలె గొప్పధనసంపద కలవాడు, వరుణ దేవునివలె గుట్టుగా దాచుకొన్న సంపదలు కలవాడు. సర్వాత్మకుడగు వాయుదేవునివలె బలం, ఉత్సాహం, దేహకాంతి మిన్నగా గలవాడు. రుద్రునివలె సహించశక్యం తేజస్సు కలవాడు. మన్మథునివలె సౌందర్యం కలవాడు. సింహంవలె మిక్కుటమైన విక్రమంతో కూడినవాడు. మనువువలె ప్రజలందరియందు కన్నబిడ్డయందలి ప్రేమ కలవాడు. బ్రహ్మవలె ప్రభుత్వంతో కూడినవాడు. బృహస్పతివలె వేదవిద్యలో ఆరితేరినవాడు, పరమేశ్వరునివలె ఇంద్రియాలను తన అదుపులో ఉంచుకొన్నవాడు. ఇటువంటివాడై విష్ణువునందే మనస్సు ఉంచి ప్రవర్తించే గోవులందూ, గురువులందూ,

విద్యాసంపదగల బ్రాహ్మణులందు భక్తి కలిగి, సిగ్గుతో, వినయంతో, మంచి స్వభావంతో మెలగటంలో ఇతరులకు ఉపకారం చేయటంలో సాటిలేనివాడై ఈ విధంగా లోకపాలుర వేరువేరుగుణాలన్నింటినీ తానొక్కడే తాల్చి (ఉన్నాడు)

**విశే :** ఈ వచనంలో చెప్పినదానిని బట్టి లోకపాలురలో ఉన్న ఒక్కొక్కగుణం ఇతనిలో కలిసి ఉండటంవలన లోకపాలురందరికంటె మహామహిమ కలవాడని చెప్పినట్లయింది. రాజు అష్టదిగ్రాజుల అంశ గలవాడు.

**క. అనఘాత్మక! లోకత్రయ, మున సజ్జన కర్ణరంధ్రముల వినఁబడు నా**
**వినుత యశోమహనీయుఁడు, జనవినుతుం డైన రామచంద్రుని మాడ్కిన్. 643**

**ప్రతి :** అనఘ+ఆత్మక!= పాపరహితమైన మనస్సు కలవాడా!; ఆ వినుత యశస్+మహనీయుఁడు= కొనియాడబడే కీర్తిచేత గొప్పవాడైన ఆ రాజు; లోకత్రయమునన్= లోకాలు మూడింటియందూ; జనవినుతుండు= జనులచేత ప్రశంసించబడినవాడు; ఐన= అయినట్టి; రామచంద్రుని మాడ్కిన్= శ్రీరామునివలె; సత్+జన కర్ణరంధ్రములన్= మంచి స్వభావం కల మనుష్యుల చెవులచేత; వినన్+పడున్= ఆలకించబడుతూ ఉన్నాడు.

**తా :** పుణ్యాత్ముడా! కొనియాడబడు గొప్పకీర్తితో మహానుభావుడైన ఆ పృథుచక్రవర్తి జనులు కొనియాడే శ్రీరామచంద్రునివలె మూడులోకాల్లో మంచితనం గల జనుల చెవులకు వినవస్తూ ఉండేవాడు.

**చ. సరస వచోఽర్థ సత్పురుష సంఘ సమంచిత గీయమాన సు**
**స్థిర వరకీర్తిపూరము సుధీజన కర్ణములందు నించి తా**
**నిరుపమ సౌమ్యభాషణమనీషల చేతఁ బ్రజానురక్తుఁడై**
**ధరణిని రాజనామమునఁ దాఁదగు రెండవ చంద్రుఁడో యనన్. 644**

**ప్రతి :** తాన్= తాను – ఆ రాజు; సరస= మిక్కిలి రుచితో కూడిన; వచస్= మాటల; అర్థ= అర్థాలుగల; సత్= మంచి; పురుష= జనుల; సంఘ= గుంపులచేత; సమంచిత= మిక్కిలి మన్ననతో కూడునట్లు; గీయమాన= పాడబడే; సుస్థిర= చెదురుపాటులేని; వర= మేలైన; కీర్తిపూరమున్= యశస్సు అనే కొలమాను; సుధీజన కర్ణములందున్= మంచిబుద్ధిగల జనుల చెవులలో; నించి= నింపి; నిరుపమ= సాటిలేని; సౌమ్య= చక్కని; భాషణ= పలుకులచేతా; మనీషల చేతన్= బుద్ధిచేతా; ప్రజా+అనురక్తుఁడు= ప్రజలయెడ అనురాగం కలవాడు; ఐ= అయి; తాన్= ఆ రాజు; ధరణిని= భూమిమీద; రాజనామమునన్= రాజు అనే పేరుతో; రెండవ చంద్రుఁడు+ఓ= మరియొక్క జాబిల్లియో; అనన్= అనునట్లు; తగున్= ఒప్పెను.

**తా :** సరసాలైన మాటల అర్థాలు గల మంచివారి సముదాయాలు ఒప్పైనవిధంగా ఆయన గానం చేసిన సుస్థిరమైన కీర్తిసరోవరం బుద్ధిమంతుల చెవులలో చొచ్చుకొనిపోతూ ఉంది. అతని పలుకులలో, భావనలలో మంచితనమే గోచరిస్తూ ఉంటుంది. ఆ విధంగా ప్రజలందరియందు అనురాగం కలవాడై అతడు భూమిపై రెండవ చంద్రుడా అన్నట్లు రాజనుపేరునకు తాను తగినట్లున్నాడు.

**వ. మఱియు న మ్మహాత్ముండు విజ్ఞానియు, వర్ధితాశేష స్వానుసర్గుండును, ప్రజాపాలకుండును. స్థావర జంగమ వృత్తి దాయకుండును, సత్పురుష ధర్మవర్తనుండును, నిష్పాదితేశ్వరాదేశుండును నైన పృథుం**

**డొక్కనాఁడు దన వార్ధకంబు వీక్షించి నిజాత్మజ నాత్మజుల యందు నిలిపి ప్రజలు చింతాతురచిత్తు లగుచుండ నిజభార్యాసమేతుండై యప్రతిహత నియమంబున వైఖానససమ్మతంబైన యుగ్రతపంబు నందుఁ బూర్వంబున దిగ్విజయప్రవృత్తుండగు చందంబునం బ్రవృత్తుండై తపోవనంబునకుం జని యందు. 645**

**ప్రతి :** మఱియున్= ఇంకా; ఆ+మహాత్ముండు= దొడ్డబుద్ధిగల అతడు; విజ్ఞానియున్= విశేషమైనజ్ఞానం కలవాడూ, వర్ధిత= పెంపొందించబడిన; అశేష= మిగులులేని; స్వ= తనదైన; అనుసర్గుండును= అన్నం మొదలగుదాని (లేక) పురాలు, గ్రామాలు అనువాని సృష్టికలవాడూ; ప్రజాపాలకుండును= ప్రజలను పాలించువాడూ; స్థావర= కదలని వాటికి; జంగమ= కదలెడువాటికి; వృత్తి= బ్రదుకును; దాయకుండును= ఇచ్చేవాడూ; సత్పురుష ధర్మ వర్తనుండును= మంచినడవడికల మనుష్యుల ధర్మాన్ని నడిపేవాడూ; నిష్పాదిత= కలుగజేయబడిన; ఈశ్వర= భగవంతుని; ఆదేశుండును= ఆజ్ఞలు కలవాడూ; ఐన= అయిన; పృథుండు= పృథువు; ఒక్కనాడు= ఒకరోజున; తన వార్ధకంబున్= తన ముసలితనాన్ని; వీక్షించి= బాగుగా పరికించి; నిజ+ఆత్మజన్= తనబిడ్డ అయిన భూమిని; ఆత్మజులయందున్= కొడుకులయందు; నిలిపి= ఉంచి; ప్రజలు= తన జనులు (కొడుకులు); చింతా+ఆతురచిత్తులు= విచారంతో పొగులుతున్న హృదయాలుకలవారు; అగుచున్+ఉండన్= అవుతూ ఉండగా; నిజ భార్యా సమేతుండు= తన ఇల్లాలితో కూడినవాడు; ఐ= అయి; అప్రతిహత నియమంబునన్= ఆటంకాలులేని నియమాలతో; వైఖానస సమ్మతంబు= వానప్రస్థులకు ఇష్టం; ఐన= అయిన; ఉగ్ర తపంబునందున్= ఘోరమైన తపస్సులో; పూర్వంబునన్= వెనుకటి కాలంలో; దిక్+విజయ ప్రవృత్తుండు= దిక్కులన్నింటినీ గెలవటంలో గొప్పకార్యవిధానంకలవాడు; అగు చందంబునన్= అయిన విధంగా; ప్రవృత్తుండు= మెలగెడివాడు; ఐ= అయి; తపస్+వనంబునకున్= తపస్సుకోసమై అడవికి; చని= వెళ్లి; అందున్= అక్కడ.

**తా :** ఇంకనూ ఆ మహాత్ముడు పండిన జ్ఞానసంపదకలవాడు. చక్కగా పెంపొందించిన తాను పండించిన పంటలు, నిర్మించిన గ్రామాలూ పట్టణాలూ కలవాడు. ప్రజలను చక్కగా ఏలినవాడు. చరాచరాలకు కూడా స్థితిని కల్పించినవాడు. మంచివారి ధర్మాలను ఆచరించేవాడు, భగవంతుని శాసనాలను పొల్లుపోకుండా అమలుపరచినవాడు. అట్టి పృథుచక్రవర్తి ఒకనాడు తనముదిమిని గమనించాడు. తనబిడ్డ అయిన పృథ్విని తనకొడుకులకు అప్పగించాడు. ప్రజలందరు తన యెడబాటునకు కుమిలిపోతూ ఉండగా తనభార్యతో కలిసి, ఎట్టి విఘ్నాలకు చెడని నియమాలు కలవాడై వైఖానసులకు ఆదరించదగిన ఘోరమైన తపస్సులో, మునుపు దిగ్విజయం నడపేసమయంలో ఎలా ఉత్సాహంతో ప్రవర్తించాడో ఆ విధంగా ప్రవర్తిస్తూ తపస్సుకోసం అడవులకు పోయాడు. అక్కడ

**విశే :** ఇందులో పృథువు ప్రవృత్తి ధర్మంలోనూ, నివృత్తి ధర్మంలోను సాధించిన పరిణతిని చక్కగా తెలియజెప్పాడు కవి. సాధారణంగా ఇహలోకసుఖాలను మరగినవాడు వాటినుండి తొలగటానికి ఇష్టపడడు. కానీ అతడు ఉదాత్తచిత్తుడు కనుక ముసలితనం వచ్చినట్లు గుర్తించిన వెంటనే ఇహలోక సుఖాలకు విముఖుడు కాగల్గాడు.

వైఖానస సమ్మతంబు – బ్రహ్మచర్యం, గృహస్థధర్మం, వాన ప్రస్థధర్మం, సన్యాసధర్మం అని నాలుగు జీవనదశలలో మూడవదానిని వైఖానసం అనికూడా అంటారు. సంసారంనుండి విరక్తుడై కేవలం పరలోకసుఖాన్ని అపేక్షిస్తూ ధర్మపత్నితో కలిసిఉండి నియమబద్ధ జీవితాన్ని గడపటం వానప్రస్థధర్మం. దానినే ఇక్కడ 'వైఖానసం' అన్నారు.

పృథువు భూమిని పంటలకు యోగ్యమైనదిగా తనవింటి కొప్పుతో చేశాడు. కనుక అతనిపేరుతో దానికి పృథ్వి అనేపేరు కలిగింది. ఆ విధంగా భూమి అతనిపుత్రిక.

**మత్త. కందమూల ఫలాశియై బహుకాల ముగ్ర తపః పరి**
**స్పందుఁడై యటమీఁదటం దృణపర్ణ భక్షణసేసి యా**
**చంద మేది జలాశి యై నృపసత్తముం డది మాని తా**
**మంద గంధవహాశి యయ్యెఁ గ్రమంబునన్ దృఢచిత్తుఁడై** **646**

**ప్రతి :** నృప – సత్తముండు= రాజులలో మిక్కిలి గొప్పవాడైన; ఆ పృథువు; దృఢ – చిత్తుఁడు= గట్టిమనస్సుకలవాడు; ఐ= అయి; బహుకాలము= పెద్దకాలం; కంద – మూల –ఫల+ఆశి= దుంపగడ్డలు, పండ్లు తినేవాడు; ఐ= అయి; ఉగ్రతపస్+పరిస్పందుఁడు= మిక్కిలి కఠినమైన తపస్సు కదలికలు కలవాడు; ఐ= అయి; అట – మీదటన్= ఆ పయిని; తృణ – పర్ణ – భక్షణ= గడ్డిపరకలు, ఆకులు తినటం; చేసి= కావించి; ఆ చందము= ఆ పద్ధతిని; ఏది= వదలి; జల+ఆశి= నీరు త్రావేవాడు; ఐ= అయి; అది= దానిని (కూడా); మాని= వదలి; తాన్= తాను; క్రమంబునన్= వరుసగా; మంద – గంధవహ+ఆశి= మెల్లని గాలిని తినేవాడు; అయ్యెన్= అయ్యాడు.

**తా :** ఆ మహారాజు పెద్దకాలం దుంపలు, వేళ్లు, పండ్లుతింటూ చాలాకాలం తపస్సు అతికఠినంగా చేశాడు. తరువాత గడ్డిపరకలు, ఆకులు తిన్నాడు. ఆ పద్ధతిని మానుకొని నీరుమాత్రమే తాగుతూ తపస్సు చేశాడు. చివరకు అది కూడా మానివేసి క్రమంగా దృఢచిత్తుడై గాలినిమాత్రం లోపలికి తీసుకుంటూ తపస్సు చేశాడు.

**విశే :** తపస్సు అంటే కాలిపోవటం, గాఢమైన భావన అని రెండర్థాలు. ఏమేమి చేస్తే అది ఫలాన్నిచ్చేదవుతుందో ఈ పద్యంలో కవి వర్ణించాడు.

“అన్నమయం హి సౌమ్య మనః” మనస్సు అన్నాన్నిబట్టి ఏర్పడుతుంది అని ఉపనిషత్తు అంటున్నది. కనుక అన్నం విషయంలో లౌల్యం లేకపోతే మనస్సు నిలుకడగా ఉంటుంది. నిలుకడగల మనస్సే తపస్సుకు యోగ్యతను కలిగిస్తుంది. ఆ అన్నలౌల్యాన్ని చెదరని మనస్సుతో గెలవటాన్ని ఈ పద్యంలో చెప్పారు.

**వ. ఇట్లు వర్తించుచు.** **647**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; వర్తించుచున్= మెలగుతూ;

**తా :** ఈ తీరున ప్రవర్తిస్తూ.

**సీ. మెండుగా మిటమిట మండు వేసవి యందుఁ, దప్త పంచాగ్నిమధ్యమున నిలిచి**
**మానక జడిగొన్న వానకాలంబునఁ, బైఁగోక వేయక బయట నిలిచి**
**జనులు హూహూ యను చలివేళఁ గుత్తుక, బంటి తోయముల లోపల వసించి**
**శిశిరంబు సాల నల్దిశలఁ బర్వినవేళ, వెలయ భూశయనుఁడై విశ్రమించి**

**తే. మహిత నియతిఁ దితిక్షాసమన్వితుండు, నియత పరిభాషణుఁడు జితానిలుఁడు దాంతుఁ**
**డిద్ధమతి యీశ్వరార్పిత బుద్ధి యనఘుఁ, డూర్ధ్వరేతస్కుఁడునునై క్రమోచితముగ.** **648**

**ప్రతి :** మెండుగాన్= చాల ఎక్కువగా; మిటమిట – మండు – వేసవియందున్= మిటమిటలాడుతూ మండే గ్రీష్మకాలంలో; తప్త – పంచ+అగ్ని – మధ్యమునన్= మండించబడిన అయిదు మంటలనడుమ; నిలిచి= ఉండి; మానక= ఆగక;

జడి+కొన్న - వాన - కాలంబునన్= ముసురుపట్టిన వానలకాలంలో; పైన్= ఒంటిమీద; కోక= వస్త్రం; వేయక= వేసుకోక; బయటన్= వెలుపల; నిలిచి= నిలబడి; జనులు= ప్రజలు; హూ హూ+అను= హూ, హూ అంటూ వణికిపోయే; చలివేళన్= శీతకాలంలో; కుత్తుకబంటి= గొంతుదాకా మునిగిపోయే; తోయములలోపలన్= నీళ్లలో; వసించి= ఉండి; శిశిరంబు= మంచు; చాల= ఎక్కువగా; నల్ - దిశలన్= నాలుగు దిక్కులందు; పర్వినవేళన్= వ్యాపించిన సమయంలో; వెలయన్= ప్రకాశంగా; భూ - శయనుఁడు= నేలయే పాన్పుగాగలవాడు; ఐ= అయి; విశ్రమించి= తీరికగా ఉండి; మహిత నియతిన్= గొప్పనిష్ఠతో; తితిక్షా - సమన్వితుండు= అన్నింటినీ సహించే భావంతో కూడినవాడూ; నియత - పరిభాషణుడు= అదుపులో పెట్టుకొనిన మాటల తీరుకలవాడూ; జిత+అనిలుఁడు= గెలువబడిన ఊర్పులు కలవాడూ; దాంతుఁడు= బాహ్యేంద్రియ నిగ్రహంకలవాడు; ఇద్ధమతి= ప్రకాశిస్తున్న బుద్ధిగలవాడూ; ఈశ్వర+అర్పిత - బుద్ధి= పరదైవానికి నిండుగా ఇచ్చుకొన్నబుద్ధి కలవాడూ; అనఘుఁడు= పాపపు వాసనకూడా లేనివాడూ; ఊర్ధ్వ - రేతస్కుఁడును= పైవైపుగా ప్రయాణించే వీర్యంకలవాడూ; ఐ= అయి; క్రమ+ఉచితముగన్= క్రమానికి తగినట్లుగా...

**తా :** ఆ రాజు ఘోరమైన మండు వేసవికాలంలో బాగుగా దరికొల్పబడిన అయిదు మంటలమధ్యలో ఉండి, ఆగకుండా ముసురుపట్టి కురిసే వానలకాలంలో ఒడలిమీద వస్త్రం కప్పుకోకుండా ఆరుబయట నిలబడి, జనులు తట్టుకోలేక ఉహ్హూహ్హూ అంటూ వణకిపోయే చలివేళలో గొంతుక/పీక మునిగేదాకా ఉండే నీళ్లలో నివసించి, మంచు పెల్లుగా నలుదిక్కులా వ్యాపించే సమయంలో వట్టి నేలమీద దేహాన్ని నిలిపి విశ్రాంతి తీసుకొని గొప్పనిష్ఠతో, చలి ఎండ మొదలైన ప్రకృతి బాధలను సహించే లక్షణంకలవాడై, మాటలయందు జారుపాటులేనివాడై, ప్రాణాయామం సాధించినవాడై, బాహ్యేంద్రియాల కదలికలను నిలుపుచేసుకొన్నవాడై, బుద్ధిని వెలుగొందజేస్తూ భగవంతునియందే కట్టిపడవేసినవాడై, పాపాలు లేనివాడై, పైకి ప్రసరించే విధంగా వీర్యాన్ని పట్టుకోగలవాడై క్రమానికి తగినట్లుగా

**వ. అతిఘోరం బయిన తపం బాచరించె, నివ్విధంబునం గ్రమానుసిద్ధం బయిన తపంబున విధ్వస్తాశేష కర్మమలాశయుండును బ్రాణాయామంబులచే జితారిషడ్వర్గుండును ఛిన్నబంధనుండునునై పురుషశ్రేష్ఠుండైన పృథుచక్రవర్తి భగవంతుండైన సనత్కుమారుం డెఱింగించిన యోగ మార్గంబున సర్వేశ్వర భజనంబు గావించె, నిట్లు భగవద్ధర్మపరుండును సాధువర్తనుండును శ్రద్ధాసమన్వితుండును నైన పృథునకు నారాయణునందు భక్తి, యనన్యవిషయంబై ప్రవృద్ధం బయ్యె, న వ్విధంబున. 649**

**ప్రతి :** అతిఘోరంబు= మిక్కిలి కఠినం; అయిన= అయినట్టి; తపంబు= తపస్సును; ఆచరించెన్= చేశాడు; ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; క్రమ+అనుసిద్ధంబు= వరుసతో నడుమ విఘ్నాలు లేని పంటకు వచ్చినది; అయిన తపంబునన్= అయిన తపస్సుతో; విధ్వస్త= మొత్తంగా నశింపజేయబడిన; అశేష= మిగులులేని; కర్మ= ఆయాపనులవలన కలిగిన; మల= పాపాల; ఆశయుండును= తావులు కలవాడు; ప్రాణ+ఆయామంబులచేన్= ప్రాణవాయువును నిలపడం చేత (ఉచ్ఛ్వాస నిశ్వాసాలను మిక్కిలి పొడవుగా సాధించడంచేత); జిత+అరిషట్ - వర్గుండును= గెలువబడిన పగవారైన ఆరుగురి మూక కలవాడును; పురుష శ్రేష్ఠుండును= పురుషులలో అందరికంటె గొప్పస్థితి కలవాడును; ఐన పృథు చక్రవర్తి= అయిన పృథువనే సార్వభౌముడు; భగవంతుడు= ఐశ్వర్యం మొదలైన ఆరు మహాలక్షణాలను సాధించినవాడు; ఐన, సనత్కుమారుండు= అయిన సనత్కుమారుడు; ఎఱింగించిన= తెలిపిన; యోగమార్గంబునన్= యోగమనే పద్ధతితో; సర్వ+ఈశ్వర - భజనంబు= అన్నిటికీ ప్రభువైన పరమాత్మను సేవించుటను; కావించెన్= చేశాడు; ఇట్లు= ఈ విధంగా; భగవత్+ధర్మ -పరుండును=

భగవంతుని ధర్మాలందే నిండైన భావన కలవాడును; సాధు – వర్తనుండును= మంచినడవడి కలవాడును; శ్రద్ధా – సమన్వితుండును= శ్రద్ధతో కూడినవాడును; ఐన; పృథునకున్= అయిన పృథువునకు; నారాయణునందున్= నారాయణుని మీద; భక్తి= పరమప్రేమ రూపమయిన భావం; అనన్య – విషయంబు= ఇతర విషయాల సంబంధం లేనట్టిది; ఐ= అయి; ప్రవృద్ధంబు= మిక్కిలి పెంపొందినది; అయ్యెన్= కలిగింది; ఆ+విధంబునన్= ఆ తీరుగా...

**తా :** మిక్కిలి కఠోరమైన తపస్సు చేశాడు. ఈ విధంగా వరుసగా, క్రమంగా సిద్ధించిన తపస్సుతో చేసిన అన్ని పాపాలను రూపుమాపుకొని ప్రాణాయామాలచేత లోపలి పగవారిని ఆరుగురిని గెలిచి, బంధాలన్నింటిని తెంచుకొని పురుషులలో అత్యుత్తముడైన పృథువనే చక్రవర్తి పరమపూజ్యుడైన సనత్కుమారుడు తెలిపిన యోగమార్గంతో పరమేశ్వరభజనం చేశాడు. ఇట్లు భగవద్ధర్మాలమీద మాత్రమే నిష్ఠ గలవాడై చక్కని ప్రవర్తన, శ్రద్ధ గలవాడయిన ఆ పృథువునకు శ్రీమహావిష్ణువునందు భక్తి ఏకనిష్ఠతో కూడినదై వృద్ధిపొందింది. ఆ విధంగా

**క. నరలోకోత్తర భగవ, త్పరిచర్యారాధనమునఁ బరిశుద్ధాంతః**
**కరణుండగు నా పృథునకు, సరసిరుహోదరు కథానుసంస్మరణమునన్. 650**

**ప్రతి :** నరలోక+ఉత్తర= మానవలోకంలో శ్రేష్ఠుడైన విదురా; భగవత్= భగవంతుని; పరిచర్యా= సేవ అనే; ఆరాధనమునన్= అర్చనతో; పరిశుద్ధ+అంతఃకరణుఁడు= నిండుగా నిర్మలమైన అంతరంగం (హృదయం) కలవాడు; అగు= అయిన; ఆ పృథునకున్= ఆ పృథుమహారాజునకు; సరసిరుహ+ఉదర – కథా – అను సంస్మరణమునన్= పద్మం (కడుపులో దాగిన) విష్ణువు కథలను విడువకుండా తలపులో ఉంచుకొనటంచేత...

**తా :** నరలోకోత్తరా! విదురా! భగవంతుని పరిచర్య అనే పూజ చేయటంచేత నిర్మలమైన హృదయం కలవాడయ్యాడు. అట్టి ఆ పృథువునకు విష్ణువు కథల నిరంతర స్మరణంచేతను

**విశే :** చెడ్డ భావాలు కదలాడుతూ ఉండటాన్ని మనోమాలిన్యం అంటారు. అది ఏ కొంచెం ఉన్నా భగవంతుని ఆరాధన సఫలం కాదు. మిక్కిలి శ్రేష్ఠమైన పరిచర్యా విధానంతో పృథువు దానిని రూపుమాపుకున్నాడు. శుద్ధమైన అంతఃకరణం కలవాడయ్యాడు. దానిచేత విష్ణుకథలు అతని హృదయంలో మరొక భావన అడ్డుపడకుండా నిలిచిపోతున్నాయి. సాధకుడు ఈ స్థితిని సాధించాలని వ్యంగ్యమైన ఉపదేశం.

**క. పరిపూర్ణంబగు భక్తిని, గర మనిశము సంశయాత్మకంబై చాలన్**
**వఱలిన హృదయగ్రంథిని, నిరసించు విరక్తియుత మనీష జనించెన్. 651**

**ప్రతి :** పరిపూర్ణంబు= మిక్కిలిగా నిండినది; అగు భక్తిని= అయిన పరమ ప్రేమ రూపభావనతో; కరము= మిక్కిలి; అనిశమున్= ఎల్లవేళల; సంశయ+ఆత్మకంబు= సంశయమే స్వరూపంగా గలది; ఐ= అయి; చాలన్= ఎక్కువగా; వఱలిన= వ్యాపించిన; హృదయగ్రంథిని= హృదయానికి సంబంధించిన ముడిని; నిరసించు= తొలగించే; విరక్తి – యుత – మనీష= వైరాగ్యంతో కూడిన బుద్ధి; జనించెన్= పుట్టింది.

**తా :** ఆ సంపూర్ణమైన భక్తివలనను, అంతకుముందు నిరంతరం సందేహాలతో నిండినదై పెరిగిపోయిన హృదయపుముడిని తొలగించివేసే వైరాగ్యంతో కూడినబుద్ధి అతనికి కలిగింది.

వ. దానంజేసి యతండు సంఛిన్న దేహాత్మజ్ఞానుండు నధిగతాత్మస్వరూపుండునై గదాగ్రజుం డయిన శ్రీకృష్ణుని కథాసక్తి నొంది సమస్తయోగసిద్ధులందు నిస్పృహుం డగుటను హృదయగ్రంథివిచ్ఛేదకం బయిన జ్ఞానయోగంబును విడిచి యాత్మయందు నాత్మయోగంబుఁ గావించి బ్రహ్మభూతుండయి నిజకళేబరంబు విడువ నిశ్చయించి **652**

**ప్రతి :** దానన్+చేసి= వైరాగ్యబుద్ధి పుట్టడంవల్ల; అతండు= పృథుమహారాజు; సంఛిన్న= తెగిపోయిన; దేహ+ఆత్మజ్ఞానుండును= దేహమే ఆత్మ అనే జ్ఞానం కలవాడును; అధిగత+ఆత్మస్వరూపుండును+ఐ= ఆత్మ స్వరూపం బాగా తెలిసినవాడై; గద+అగ్రజుండు+అయిన= గదుని అన్నయైన; శ్రీకృష్ణుని; కథాసక్తిన్+ఒంది= కథలలో ఆసక్తి కలిగి; సమస్తయోగసిద్ధులందున్= యోగసిద్ధులన్నింటిలో; నిస్పృహుండు+అగుటను= స్పృహలేనివాడు కావడంవల్ల; హృదయ గ్రంథి విచ్ఛేదకంబు+అయిన= హృదయ గ్రంథి విచ్ఛేదకమైన; జ్ఞానయోగంబును= జ్ఞానమనే యోగాన్ని; విడిచి= వదలిపెట్టి; ఆత్మయందున్= ఆత్మలో; ఆత్మయోగంబున్= ఆత్మను కలిపివేయటం అనే ప్రక్రియను; కావించి= చేసి; బ్రహ్మభూతుండు= బ్రహ్మం అయిపోయినవాడు; అయి; నిజకళేబరంబున్= తనదైన ప్రాణంలేని దేహాన్ని; విడువన్= వదలి వేయటానికి; నిశ్చయించి= నిర్ణయించుకొని.

**తా :** అతనికి వెనువెంటనే దేహమే ఆత్మ అనే జ్ఞానం పూర్తిగా తెగిపోయింది. ఆత్మస్వరూపం ఏమిటో తెలియవచ్చింది. అప్పుడు శ్రీకృష్ణుని కథలయందు ఆసక్తి పొందినాడు. యోగసిద్ధులన్నింటియందూ కోరిక వదలినాడు. హృదయంలోని అజ్ఞానమనే ముడిని పటాపంచలుచేసే చక్కగా కలిగిన జ్ఞానమనే యోగాన్ని కూడా వదలివేశాడు. జీవుడుగా ఉన్న ఆత్మను, పరమాత్మతో కలిపివేశాడు. అప్పుడతడు బ్రహ్మమే అయిపోయాడు. ఇంక రక్తమాంసాదులతో ఉన్న దేహమనే కట్టెతో పనిలేదు కనుక దానిని వదలివేయాలని నిశ్చయించుకున్నాడు.

సీ. కోరి మడమలచే గుదపీడనము సేసి పూని ముక్తాసనాసీనుఁ డగుచుఁ
దనరు మూలాధారమున నుండి వాయువు నొయ్యన నెగయించి యొనర నాభి
కలితంబు గావించి క్రమమున హృద్వత్స కంఠ శిరః కోష్ఠకములఁ జేర్చి
కైకొని మూర్ధభాగములకు నెగయించి ప్రాణముల్ విడిచి యా పవనుఁ బవనుఁ

తే. నందు నాకాశ మాకాశమందుఁ దేజ, మందుఁ దేజంబు నుదకంబునందు నుదక
మర్థిఁ గాయంబు మేదినియందుఁ గలిపెఁ, బూని వాని యథోచితస్థానములుగ. **653**

**ప్రతి :** కోరి= పూనిక వహించి; మడమలచేన్= కాలిమడమలతో; గుద, పీడనము= ముడ్డిభాగమును గట్టిగా నొక్కుటను; చేసి= కావించి; పూని= ప్రయత్నంతో; ముక్త+ఆసన+ఆసీనుఁడు= వదలబడిన ముడ్డిభాగంకల విధంగా కూర్చున్నవాడు; అగుచున్= అవుతూ; తనరు= ఒప్పారు; మూల+ఆధారముననుండి= మూలాధారంనుండి; వాయువున్= గాలిని; ఒయ్యనన్= మెల్లగా; ఎగయించి= పైకి వెళ్ళునట్లుచేసి; ఒనరన్= పొసగేవిధంగా; నాభికలితంబున్= బొడ్డు దగ్గర కూడుకొనేవిధంగా; కావించి= చేసి; క్రమమునన్= వరుసగా; హృద్, వత్స, కంఠ, శిరస్+కోష్ఠములన్= గుండె, రొమ్ము, కుత్తుక, తల అనే తావులలోనికి; చేర్చి= చొనిపి; కైకొని= పట్టుకొని; మూర్ధభాగమునకున్= నడినెత్తిమీదికి; ఎగయించి= చేరునట్లుచేసి; ప్రాణముల్= ప్రాణవాయువులను; విడిచి= వదలివేసి; ఆ పవనున్= దేహంలోని ఆ గాలిని; పవనునందున్= వెలుపలి మహావాయువులోనికే; ఆకాశమున్= ఆకాశమును; ఆకాశమందున్= మహాకాశంలోనికీ; తేజమున్= అగ్నిని; తేజమందున్=

మహాగ్నియందు; ఉదకమున్= నీటిని; ఉదకంబునందున్= వెలుపలి మహాభూతమైన జలంలోను; అర్థిన్= పూనికతో; కాయంబున్= దేహాన్ని; మేదినియందున్= భూమియందూ; వాని= ఆ గాలి మొదలగువాని; యథా+ఉచితస్థానములుగన్= వెనుకటి తగినతావులు ఏర్పడగా; పూని= ప్రయత్నించి; కలిపెన్= కలిపి వేశాడు.

**తా :** ఆ రాజు మడమలతో ముడ్డిదగ్గరితావును గట్టిగా నొక్కాడు. తరువాత ఆసనభాగాన్ని వదలివేసి కూర్చున్నాడు. (ఆసనానికి మడమలు తాకకుండా పైకి శరీరాన్ని ఎత్తి నిలిపాడని అర్థం). వెన్నుపూస ప్రారంభమయ్యే మొదటి భాగాన్ని మూలాధారం అంటారు. అక్కడినుండి వాయువును మెల్లగా పైకి పాకేట్లు చేశాడు. బొడ్డుదగ్గరకు చేర్చాడు. వరుసగా హృదయం, దానికి కొంచెం పైభాగం, కంఠదేశం, తల అనే స్థానాలకు ప్రసరింపజేశాడు. అక్కడినుండి నడినెత్తిమీదికి – అంటే సహస్రారపద్మంలోనికి చొనిపాడు. ప్రాణం, అపానం మొదలైన ఐదు వాయువుల పనులను ఆపివేశాడు. తనలోని గాలిని గాలిలో, ఆకాశాన్ని ఆకాశంలో, అగ్నిని అగ్నిలో, నీటిని నీటిలో, మిగిలిన మాంసం మొదలైన ధాతువులతో కూడిన కట్టెను భూమిలో – అవి వానికి తగిన స్థానాలు కనుక కలిపివేశాడు.

**విశే :** యోగవిధానంలో ఇలా ప్రాణాలు వదలటం ఒక మహావిషయం. మన దేహం అయిదు భూతాలపదార్థాలతో కూడి ఉంటుంది. వెలుపల అయిదు మహాభూతాలు ఉన్నాయి. మనలో ఉన్నవి కొంచెంపాటివి. వెలుపల ఉన్నవి కొలతలకు అందనివి. అందువలన వాటిని మహాభూతాలు అంటారు. మనదేహాలలో ఉన్న మట్టి, నీరు, నిప్పు, గాలి, నింగి అనేవాని మొదటి తావులు ఆ పంచమహాభూతాలే.

ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం అనేవి అయిదు ప్రాణాలు. వానిని సాధనతో ఆయా పనులనుండి విరమింపజేయటం అనే ప్రక్రియను ఇక్కడ 'ప్రాణముల్ విడిచి' అన్న పదబంధంతో తెలియజేస్తున్నారు.

**వ. మఱియు భూమి నుదకంబునందును, నుదకంబును దేజమందు, దేజంబును వాయువున, వాయువు నాకాశంబునందు, నాకాశంబును మనంబున, మనంబు నింద్రియంబుల, నింద్రియంబులఁ దన్మాత్రల, దన్మాత్రల భూతాదియైన యహంకారంబునందు, నహంకారంబు మహత్తత్త్వంబునందును గూర్చి జీవోపాధి భూతంబయిన ప్రకృతియందుఁ గలిపి జీవభూతుం డయిన పృథుండు జ్ఞానవైరాగ్యంబుల చేత బ్రహ్మనిష్ఠుండై మాయోపాధిం బాసి ముక్తుం డయ్యె నని చెప్పి వెండియు నిట్లనియె. 654**

**ప్రతి :** మఱియున్= అటుమీద; భూమిన్= మట్టిని; ఉదకంబు+అందున్= నీటిలోను; ఉదకంబును= నీటిని; తేజమందును= అగ్నిలోను; తేజంబున్= అగ్నిని; వాయువునన్= గాలిలోను; వాయువున్= గాలిని; ఆకాశంబు+అందును= ఆకాశంలోను; ఆకాశంబును= ఆకాశాన్ని; మనంబునన్= మనస్సులోను; మనంబున్= మనస్సును; ఇంద్రియంబులన్= ఇంద్రియాలలోను; ఇంద్రియతద్+మాత్రలన్= ఇంద్రియాలకు సంబంధించిన శబ్దం మొదలైన విషయాలను; భూత+ఆది= భూతాలకు మొదటి కారణం; ఐన= అయిన; అహంకారంబునన్= అహంకారం అనే తత్త్వంలోను; అహంకారంబున్= ఆ అహంకారాన్ని; మహత్తత్త్వంబునందును= మహత్తు అనే తత్త్వంలోను; కూర్చి= కూడుకొనే విధంగాచేసి; అట్టి= ఆ విధమైన; సర్వ, కార్య, హేతుభూతంబు= అన్ని పనులకు కారణరూపం; ఐన= అయిన; మహత్+తత్త్వంబును= మహత్తు అనే తత్త్వాన్ని; జీవ+ఉపాధిభూతంబు= జీవునకు ఆధారరూపం; అయిన; ప్రకృతియందున్= ప్రకృతియందూ; కలిపి= చేర్చి; జీవభూతుండు= జీవుడు అనే వ్యవహారం కలవాడు; ఐన= అయినట్టి; పృథుండు= పృథుచక్రవర్తి; జ్ఞాన, వైరాగ్యంబులచేతన్= జ్ఞానం, వైరాగ్యం అనే వానిచేత; బ్రహ్మనిష్ఠుండు= బ్రహ్మంలో నిశ్చలంగా నెలకొన్నవాడు; ఐ= అయి; మాయా+ఉపాధిన్=

మాయతో ఏర్పడిన ఆధారవస్తువును; పాసి= వదలివైచి; ముక్తుండు= మోక్షం పొందినవాడు; అయ్యెన్= అయ్యాడు; అని, చెప్పి= ఈ విధంగా తెలియజేసి; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** ఆ సాధకుడైన పృథుచక్రవర్తి భూపదార్థాన్ని నీటిలో, నీటిని నిప్పులో, నిప్పును గాలిలో, గాలిని నింగిలో, నింగిని మనస్సులో, మనస్సును ఇంద్రియాలలో, ఇంద్రియాలను విషయాలలో, వాటిని అహంకారంలో, దానిని మహత్తులో ఆ సర్వకార్యాలకూ కారణమైన మహత్తును జీవునకు ఆధారంగా అయిన ప్రకృతిలో చేర్చి జీవుడుగా మాత్రం మిగిలిన అతడు జ్ఞానం, వైరాగ్యం అనే లక్షణాలచేత బ్రహ్మంలో ఎట్టి కదలికలూ, భేదాలూలేని స్థితిని పొందినవాడై మాయకు ఆధారభూమి అయిన జీవత్వాన్ని వదలివేసి ముక్తిని పొందాడు. అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.

**విశే :** సృష్టి ప్రారంభంనుండి పరిసమాప్తి దాకా అనులోమ విధానంలో ఉంటుంది. సృష్టి ఉపసంహారక్రమం ప్రతిలోమ విధానంలో ఉంటుంది.

**సీ. అంత నా పృథుని భార్యామణి యగు నర్చి పుడమిపై వడి నడుగిడినఁ గందు**
**సుకుమారపాదాబ్జ సుందరీరత్నంబు నతుల పతివ్రత యగుటఁజేసి**
**యాత్మేశకృత సువ్రతాచరణంబును సుమహిత భక్తి శుశ్రూషణమును**
**నార్షేయ మగు దేహయాత్రయు నను వీని చేత మిక్కిలి కృశీభూత దేహ**

**తే. యయ్యుఁ బ్రియనాథ కృత కరుణావలోక, కరతల స్పర్శనాది సత్కారములను**
**నబల సుఖవృత్తిఁ జెంది య య్యడవులందుఁ, గృశత మదిఁ దోఁపకుండఁ జరించు నపుడు. 655**

**ప్రతి :** అంతన్= అప్పుడు; ఆ పృథుని= ఆ పృథుచక్రవర్తి; భార్యామణి= ఉత్తమురాలైన భార్య అయిన; అర్చి= అర్చి అనే పేరుగల వ్యక్తి; పుడమిపైన్= నేలమీద; తన అడుగు= తన పాదం; ఇడినన్= ఉంచితే; కందు= కందిపోయే; సుకుమార, పాద+అబ్జ= మిక్కిలి మెత్తదనంగల పాదములనే పద్మాలు కలది; సుందరీరత్నంబు= అందచందాలుగల వారిలో శ్రేష్ఠురాలు; అతుల, పతివ్రత= సాటిలేని భర్తృవ్రత; అగుటన్+చేసి= కావటంవలన; ఆత్మ+ఈశ, కృత, సువ్రత+ఆచరణంబును= తన మగడు చేసిన చక్కని వ్రతమూ; సుమహిత, భక్తి, శుశ్రూషణమును= మిక్కిలి గొప్పదైన భక్తితో కూడినసేవా; ఆర్షేయము= ఋషులు విధించిన ఆచారాలను పాటించేది; అగు= అయిన; దేహయాత్రయున్= జీవితపు నడవడీ; అను వీని చేతన్= అనే ఈ లక్షణాలచేత; మిక్కిలి= చాలా; కృశీభూతదేహ= చిక్కిపోయిన దేహం కలది; అయ్యున్= అయినా; ప్రియ, నాథ, కృత, కరుణా+అవలోక కరతల= దయగలచూపు; స్పర్శన+ఆది, సత్కారములను= ఇష్టుడైన పతిచేసిన అరచేతి స్పర్శ మొదలైన సమ్మానములతో; అబల= ఆయమ; సుఖవృత్తిన్= సుఖమైన పద్ధతిని; చెంది= పొంది; ఆ+అడవులయందున్= ఆ అడవులలో; కృశత= చిక్కిపోవటం; మదిన్= మనస్సులో; తోపక+ఉండన్= తెలియకుండునట్లుగా; చరించు+అపుడు= అపుడు చరిస్తూ ఉన్నది.

**తా :** పృథుని ధర్మపత్ని అర్చి. వేగంగా నేలకు తాకితే కందిపోయే సుకుమారమైన పాదాబ్జములు కలిగినది. గొప్ప అందచందాలు కలది. సాటిలేని పతివ్రత. కాబట్టి, తనభర్త చేసిన గొప్పవ్రతమూ, తన గొప్పభక్తి, సేవ, ఋషులు నిర్దేశించిన జీవనవిధానాన్ని ఆచరించటం అనే లక్షణాలచే చాలా చిక్కిపోయింది. అయినా తనమగని దయగలచూపు, చేతిస్పర్శ మొదలైన సమ్మానాలవలన సుఖమైన అనుభవాన్నే పొందింది. అలా ఉండి ఆ అడవులలో తన చిక్కిపోవటాన్ని మనస్సులో తలపకుండా తిరుగుతూ ఉన్నది.

**క. తన మనమున నే దుఃఖము, ననయంబు నెఱుంగనట్టి యర్చి నిజాధీ**
**శుని ప్రాణరహిత దేహము, గనుంగొని విలపించి విగతకౌతుక యగుచున్. 656**

**ప్రతి :** తన మనమునన్= తన మనస్సులో; ఏ దుఃఖంబున్= ఏ విధమైన శోకాన్నీ; అనయంబున్= ఏ సమయంలోనూ; ఎఱుంగనట్టి= తెలియనట్టి; అర్చి= పృథుచక్రవర్తి ఇల్లాలు అర్చి; నిజ+అధీశుని= తన భర్తకు చెందిన; ప్రాణరహిత దేహమున్= ప్రాణంలేని దేహాన్ని; కనుగొని= చూచి; విలపించి= ఏడ్చి; విగత, కౌతుక= పోయిన వేడుకకలది; అగుచున్= అవుతూ;

**తా :** ఆ పృథుని ఇల్లాలు అర్చి తన మనసులో ఇంతకుముందెప్పుడూ ఏ దుఃఖమూ ఎరుగనిది. ఇప్పుడు తన భర్త ప్రాణాలు లేని దేహాన్ని చూచి చాలా విలపించింది. ఆ దుఃఖంతో ఆమెకు ప్రపంచసంబంధమైన దేనియందూ ఆసక్తిలేని స్థితి కలిగింది.

**సీ. మానిత మందర సానుప్రదేశంబు నందుఁ జితారోప మర్థిఁజేసి**
**లలితమహానదీసలిలసుస్నాతయై కలితమహోదారకర్ముఁడయిన**
**నాథున కుదకదాన క్రియల్ గావించి యతిభక్తి సురలకు నతు లొనర్చి**
**వహ్నికి ముమ్మాటు వలగొని పతిపాదకమలయుగంబుఁ జిత్తమున నిలిపి**

**తే. వీరవరుఁడైన పృథు పృథివీతలేశు, నందు ననుగమనము సేయునట్టి సాధ్వి**
**నర్చిఁ గనుఁగొని దేవాంగనా సహస్ర, మాత్మనాథులఁ గూడి నెయ్యంబుతోడ. 657**

**ప్రతి :** మానిత, మందర, సాను, ప్రదేశంబునందున్= అందరి ఆదరానికి పాత్రమైన మందరపర్వతం చరియలో; చితా+ఆరోపము= చితియందు కళేబరముంచుట; అర్థిన్= కోరికతో; చేసి= ఒనరించి; లలిత, మహానదీ, సలిల, సుస్నాత= చక్కని, మహానది నీటియందు చక్కగా స్నానం చేసినది; ఐ= అయి; కలిత, మహా+ఉదార, కర్ముఁడు= కూడుకొన్న గొప్పవి, ప్రజలకు ఉపయోగపడేవీ అయిన పనులుగలవాడు; ఐన, నాథునకున్= అయినట్టి మగనికి; ఉదక, దానక్రియల్= నీటిని వదలుట మొదలగు పనులను; కావించి= చేసి; అతిభక్తిన్= మిక్కిలి భక్తితో; సురలకున్= దేవతలకు; నతులు= నమస్కారాలు; ఒనర్చి= కావించి; వహ్నికిన్= అగ్నికి; మూడు+మాటులు= ముమ్మాటు – మూడుమారులు; వలగొని= ప్రదక్షిణంచేసి; పతి, పాద, కమలయుగంబున్= మగని పద్మములవంటి పాదాల జంటను; చిత్తమునన్= మనస్సులో; నిలిపి= నిలుకడగా ఉంచుకొని; వీరవరుఁడు= వీరులలో మేటి; ఐన= అయినట్టి; పృథు, పృథివీతల+ఈశునందు= పృథువు అనే భూమిపతియందు; అనుగమనము= వెంటనంటి పోవుట (సహగమనం) చేయు+అట్టి= చేసే; సాధ్విన్= పతివ్రతను; అర్చిన్= అర్చి అను నామెను; కనుగొని= చూచి; దేవ+అంగనా, సహస్రము= వేలకొలది దేవతలకాంతలు; ఆత్మనాథులన్= తమ భర్తలను; కూడి= కలసికొని; నెయ్యంబుతోడన్= చెలిమితో...

**తా :** ప్రసిద్ధిగల మందరపర్వతం చరియమీద చితిపై శవారోపణం ఏర్పాటు చేసుకొని, అందమైన మహానదీ జలాలలో చక్కగా స్నానంచేసి, చాలా గొప్ప పనులు ఆచరించిన మగనికి జలతర్పణం మొదలైన పనులు కావించి, గొప్పభక్తితో దేవతలకు ప్రణమిల్లి, అగ్నిదేవునకు మూడుమారులు ప్రదక్షిణంచేసి (చుట్టూతిరిగి) భర్తపద్మాలవంటి పాదాలను మనస్సులో

కుదుర్చుకొని, వీరులలో శ్రేష్ఠుడు మహారాజు అయిన పృథువువెంట పరలోకాలకు పోవటానికి సిద్ధంగా ఉన్న అర్చిని చూచి వేలకొలది దేవతా స్త్రీలు తమభర్తలతో కూడి చెలిమితో

**విశే :** ప్రదక్షిణం అంటే తన కుడిభాగాన్ని పూజించదగిన దానివైపు ఉండే తీరున చుట్టిరావటం. మూడుమారులు చేయటంలో మూడు కరణాల – మనస్సు, మాట, చేష్ట అనేవాటి ఏకరూపస్థితి తెలియవస్తుంది. లేదా స్థూలదేహం, సూక్ష్మదేహం, కారణదేహం అనే మూడింటితో ప్రదక్షిణం చేయటం అనికూడా సంభావించవచ్చు. జాగ్రత్, స్వప్న, సుషుప్తి దశలు మూడింటియందూ నాకు ఒకే భావన ఉంది అని తెలియజెప్పటాన్ని కూడా ఇది సూచిస్తుంది.

**క. పరమోత్కంఠమున న్మం, దరగిరి సాను ప్రదేశతలమున వరుసం**
**గురియించిరి నవ సురభిత, వర మందార ప్రసూన వర్షము లంతన్. 658**

**ప్రతి :** పరమ+ఉత్కంఠమునన్= అత్యంతం వేడుకతో; మందర, గిరి, సాను, ప్రదేశతలమునన్= మందరమనే పర్వతపు చరియల తావునందు; వరుసన్= ఎడతెగని విధంగా; నవ, సురభిత, వర, మందార, ప్రసూన, వర్షములు= క్రొత్తవీ, కమ్మనివాసనలుకలవి, మేలైనవి అయిన మందారపుష్పాల, వానలను; అంతన్= ఆ సమయంలో; కురియించిరి= కురిపించారు.

**తా :** (అర్చి సహగమనం చేయబోతూ ఉంటే దేవకాంతలు) అప్పుడు గొప్పఉత్సాహంతో మందరపర్వతం చరియలమీద అప్పుడప్పుడే వికసించిన, పరిమళాలను వెదజల్లే మేలుజాతి మందారకుసుమాలను ఆపకుండా వర్షించారు.

**క. తరమిడి యచ్చర లాడిరి, మొరయించిరి శంఖతూర్యములు దివిజులు పా**
**డిరి కిన్నరజనులు పర, స్పరనుతు లొనరించి రా సుపర్వాంగనలున్. 659**

**ప్రతి :** అచ్చరలు= దేవలోకపు స్త్రీలు; తరము+ఇడి= వరుసపెట్టి; ఆడిరి= నృత్యాలు చేశారు; దివిజులు= దేవతా పురుషులు; శంఖ, తూర్యములు= శంఖాలు, వాద్యాలు; మొరయించిరి= వాయించారు; కిన్నరజనులు= కిన్నరులనే జాతివారు; పాడిరి= పాటలు పాడారు; ఆ సుపర్వ+అంగనలున్= ఆ దేవతల ఇల్లాండ్రుకూడా; పరస్పరనుతులు= ఒకరితో ఒకరు ఆమె గొప్పతనాన్ని స్తుతులు; ఒనరించిరి= చేశారు.

**తా :** వరుసపెట్టి అప్సరసలు నృత్యాలు చేశారు. దేవతలు శంఖాలను ఊదారు. వాద్యాలను మ్రోయించారు. కిన్నరజనులు పాటలు పాడారు. దేవతల వనితలు అందరూ సముదాయంగా ఏర్పడి స్తోత్రాలు చేశారు.

**వ. మఱియు నిట్లనిరి. 660**

**ప్రతి :** మఱియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనిరి= అన్నారు.

**తా :** ఇంకా ఈ విధంగా అన్నారు.

**సీ. చర్చింప నిట్టి యాశ్చర్య మెందేనియుఁ, గనుఁగొంటిరే యర్చి యను లతాంగి**
**ధన్యాత్మురాలు గదా తన విభుఁ గూడి, యిందిరా రమణి యజ్ఞేశుఁ గూడి**
**వెనుచను కైవడి ననుగమనము సేసె, ని య్యమ నిజహృదయేశుఁ డయిన**
**ఘను వైన్యు నూర్ధ్వలోకమ్మును బొందును, నేఁ డింతవట్టును నిశ్చితంబు**

**తే. పరమ యోగీంద్రులకు దుర్విభావ్యమైన, దృఢ సుకర్మమువలన నతిక్రమించి**
**వైన్య భూమీశు వెనుచని వరుస నూర్ధ్వ, గామినియు నయ్యె నీ యింతి ఘనత నొంది. 661**

**ప్రతి :** చర్చింపన్= విచారించగా; ఇట్టి= ఈ విధమైన; ఆశ్చర్యము= అచ్చెరువును; ఎందేనియున్= ఎక్కడైనా; కనుగొంటిరే= చూచారా?; అర్చి అను లతాంగి= అర్చి అనే అతివ; ధన్యాత్మురాలు కదా= పుణ్యశీలంగల వ్యక్తికదా; తనవిభుతోన్= తన భర్తతో; కూడి= కలసి; ఇందిరారమణి= లక్ష్మీదేవి; యజ్ఞ+ఈశున్= యజ్ఞాలకు ప్రభువైన శ్రీహరిని; కూడి= కలసి; వెను, చను, కైవడిన్= వెనుకనే పోయేవిధంగా; అనుగమనమున్= అనుసరించి వెళ్ళటాన్ని; చేసెన్= చేసింది; ఈ+అమ= ఈమె; నేడు= ఈనాడు; నిజ, హృదయ+ఈశుఁడు= తన హృదయానికి ప్రభువు (భర్త) ఐన; ఘనున్= అయినట్టి మహాత్ముని; వైన్యున్= వేనుని కుమారుడైన పృథుచక్రవర్తిని; ఊర్ధ్వలోకంబును= ఉన్నతమైన లోకాన్ని; పొందును= చేరుకుంటుంది; ఇంతవట్టును= ఇదంతా; నిశ్చితంబు= నిజం; ఈ+ఇంతి= ఈ వనిత; ఘనతన్= గొప్పతనాన్ని; ఒంది= పొంది; పరమ, యోగి+ఇంద్రులకున్= మిక్కిలి గొప్పవారైన యోగులలో శ్రేష్ఠులకును; దుర్విభావ్యము= ఊహలకును అందనిది; ఐన= అయినట్టి, దృఢసుకర్మం; వలనన్= గట్టిదైన పుణ్యకార్యాన్నిబట్టి; అతిక్రమించి= బంధాలన్నింటినీ దాటుకొని; వైన్య; భూమి+ఈశున్= వేనుని కుమారుడనే రాజును; వెనుచని= వెంట వెళ్లి; వరుసన్= క్రమంగా; ఊర్ధ్వగామినియున్= ఊర్ధ్వలోకాలకు పోయేది; అగున్= అవుతుంది

**తా :** ఆలోచించి చూస్తే ఇటువంటి ఆశ్చర్యం ఎక్కడైనా చూచారా? అర్చి అనే వనిత గొప్ప పుణ్యం మూటకట్టుకొన్న వ్యక్తికదా! శ్రీలక్ష్మీదేవి తనభర్త అయిన శ్రీమహావిష్ణువువెంట వెళ్ళేవిధంగా ఈమె తన పతితో కలసి సహగమనం చేసింది. ఈమె తన హృదయనాథుడైన పృథుచక్రవర్తినీ, ఊర్ధ్వలోకాన్ని కూడ చేరుకుంటుంది. ఇది తప్పని మాట. ఈమె గొప్పతనంతో ఈమె మహాయోగివర్యులకు కూడ ఊహించటానికి వీలుకాని దృఢమైన సత్కర్మంవలన, బంధాలన్నింటినీ దాటుకొని పృథుచక్రవర్తి వెంట వెళ్ళి ఊర్ధ్వలోకానికి వెళ్ళేది అవుతుంది.

**విశే :** సహగమనంవలన ప్రధానంగా పుణ్యలోకాలకు చేరుకోవటం జరుగుతుందని ఒకనాటి విశ్వాసం. దానిని దేవతల వాక్యాలనుబట్టి ఇందులో నిరూపిస్తున్నారు.

**వ. కాన పతివ్రతలకు నసాధ్యం బెందునుం గలదే యని మఱియును. 662**

**ప్రతి :** కానన్= కాబట్టి; పతివ్రతలకున్= పతియందు వ్రతం గల స్త్రీలకు; అసాధ్యంబు= సాధించరానిది; ఎందునున్= ఎందైనా; కలదు+ఎ= కలదా; అని= అని; మఱియున్= ఇంకా

**తా :** కాబట్టి పతివ్రతలు సాధించలేనిది ఎక్కడైనా ఉన్నదా? అని ఇంకా

**క. పరికింపఁగ నే మనుజుఁడు, హరిపదమును బొందఁ జేయు నట్టి వివేక**
**స్ఫురణం దనర్చు వానికిఁ, బరువడి నిలఁ బొందరాని పదముం గలదే! 663**

**ప్రతి :** పరికింపఁగన్= మెలకువతో విచారిస్తే; మనుజుఁడు= మానవుడు; హరిపదమును= శ్రీమహావిష్ణువు స్థానాన్ని; పొందన్+చేయు+అట్టి= కలిగించే; వివేకస్ఫురణన్= వివేకం స్ఫురించటంతో; తనర్చున్= ఒప్పుతాడో; వానికిన్= అట్టివానికి; పరువడిన్= వరుసగా; ఇలన్= భూమియందు; పొందరాని పదమున్= పొందటానికి శక్యంకాని స్థానం; కలదు+ఏ= ఉంటుందా?

**తా :** బాగుగా ఆలోచించిచూస్తే మనుష్యుడు శ్రీమహావిష్ణువు స్థానాన్ని పొందే వివేకం ఎప్పుడూ హృదయంలో కదలుతూ ఉండేవిధంగా చేసుకుంటే భూమిమీద అతడు పొందరాని స్థానం ఏదీ ఉండదు.

**తే. అట్టి యపవర్గ సాధన మైన మనుజ, భావ మొందియు విషయ సంబద్ధు డగుచు**
**వసుధ నెవ్వఁడు వర్తించు వాఁడు ధరణి, ననయము నిజాత్మ వంచకుఁ డనఁగఁ బరఁగు. 664**

**ప్రతి :** అట్టి= ఆ విధమైన; అపవర్గ, సాధనము= మోక్షాన్ని సాధించే; ఐన= అయినట్టి; మనుజభావము= మనుజుడుగా అగుటను; ఒందియున్= పొందికూడా; విషయ, సంబద్ధుఁడు= విషయాలచేత గట్టిగా కట్టబడినవాడు; అగుచున్= అవుతూ; వసుధన్= భూమియందు; ఎవ్వఁడు= ఎవడు; వర్తించున్= మెలగుతాడో; వాఁడు= ఆతడు; ధరణిన్= భూమియందు; అనయమును= ఎల్లప్పుడు; ఆత్మ, వంచకుఁడు= తన్ను తాను మోసగించుకొనువాడు; అనఁగన్= అనే విధంగా; పరఁగున్= ఒప్పుతాడు.

**తా :** ఆ విధమైన మోక్షాన్ని సాధించే మనుష్యస్థితిని పొందికూడా విషయాలలో చిక్కుకొని భూమిపై మెలగేవాడు భూమిపై నిత్యమూ తన్ను తాను మోసగించుకొనేవాడవుతాడు.

**క. అని వారలు ద న్నర్థిని, వినుతింపఁగ నర్చి యాత్మవిభుఁడగు పృథుఁ డొం**
**దిన యచ్యుతలోకంబున, ననుపమ విభవమును బొందె నని విదురునకున్. 665**

**ప్రతి :** అని= అలా పలికి; వారలు= ఆ దేవతలు; తన్నున్= తనను; అర్థినిన్= ఇష్టపడి; వినుతింపఁగన్= కొనియాడగా; అర్చి= పృథుచక్రవర్తి ఇల్లాలు అయిన అర్చి; ఆత్మవిభుఁడు= తనభర్త; అగు= అయిన; పృథుఁడు= పృథుచక్రవర్తి; ఒందిన= పొందినట్టి; అచ్యుతలోకంబునన్= జారుపాటులేని (విష్ణు) లోకంలో; అనుపమవిభవమును= సాటిలేని గొప్పస్థితిని; పొందెన్= పొందినది; అని= అని; విదురనకున్= విదురునికి...

**తా :** ఈ విధంగా ఆ దేవతలు తనను ఇష్టంగా ప్రశంసించగా అర్చి తన పతి అయిన పృథుచక్రవర్తి పొందిన అచ్యుతమైన పుణ్యలోకాన సాటిలేని మహిమను పొందింది అని విదురునకు (మైత్రేయుడు చెప్పాడు.)

**విశే :** అర్చి తన పతి అయిన పృథునితోపాటు అచ్యుత (విష్ణు) లోకం పొందింది. అంటే వారిరువురూ పొందింది పుణ్యం క్షీణించిన తరువాత మరల భూమికి తిరిగి వచ్చే లోకం కాదన్నమాట. అందుకనే అనుపమ విభవం. సాటిలేని గొప్పతనం.

**క. మునివరుఁడగు మైత్రేయుఁడు, వినయంబున నెఱుఁగఁ జెప్పి వెండియుఁ దగ ని**
**ట్లను న మ్మహాను భావుం, డనఘుఁడు భగవత్తముండు నగుఁ బృథుఁ డనఘా! 666**

**ప్రతి :** మునివరుఁడు= మునులలో గొప్పవాడు; అగు; మైత్రేయుడు= అయిన మైత్రేయ మహర్షి; వినయంబునన్= మిడిసిపాటు లేకుండా; ఎఱుఁగన్; చెప్పి= తెలిసేవిధంగా చెప్పి; వెండియున్= ఇంకా; తగన్= సముచితంగా; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; అనఘా= పుణ్యాత్ముడా!; ఆ+మహానుభావుండు= ఆ మహిమగలవ్యక్తి; పృథుడు= పృథువు; అనఘుఁడు= పాపంలేనివాడు; భగవత్తముండు= ఐశ్వర్యాదులు ఆరింటిని కలవారిలో మిక్కిలి శ్రేష్ఠుడు; అగున్= అయ్యాడు;

**తా :** మునిశ్రేష్ఠుడైన మైత్రేయుడు (విదురునకు) వినయంగా తెలిసేట్లు చెప్పి ఇంకా తగినట్లు ఇలా అన్నాడు. పుణ్యాత్మా! మహానుభావుడైన ఆ పృథువు ఎట్టిపాపాలు లేనివాడు. భగవంతులలో అందరికంటె మిన్న.

**విశే :** మహానుభావుడు గొప్పవాడైన పరమాత్మ అనుభూతిని పొందినవాడు; అట్టివానికి కూడ పాపస్పర్శ ఉంటే మళ్ళీ సంసారబంధనం తప్పదు. అటువంటి పాపస్పర్శలేనివాడిని అనఘుడు అంటున్నారు.

ఇక్కడ భగవత్తముడు అంటే షడ్గుణైశ్వర్యాలుకలిగిన పూజ్యులందరికంటె గొప్పవాడు అని తాత్పర్యార్థం.

**క. ఏ నీ కిప్పుడు సెప్పితి, మానుగ నీ పుణ్యకథను మహితశ్రద్ధా**
**ధీనుండై విస్ఫుర దవ, ధానుండై యెవ్వఁడేని తనరిన భక్తిన్. 667**

**ప్రతి :** ఏన్= నేను; నీకున్= నీకు; ఇప్పుడు; మానుగన్= చక్కగా; ఈ పుణ్యకథను= పుణ్యమైన ఈ కథను; చెప్పితిన్= చెప్పాను; ఎవ్వఁడు+ఏనిన్= ఎవ్వడైనా; మహిత, శ్రద్ధా+అధీనుండు= గొప్పశ్రద్ధకు వశమైనవాడు; ఐ= అయి; విస్ఫురత్+అవధానుండు= మరపులేని ధారణకలవాడు; ఐ= అయి; తనరిన భక్తిన్= ఒప్పారెడు భక్తితో...

**తా :** విదురా! నేను నీకు ఇప్పుడు చెప్పితిని. చక్కగా ఈ పుణ్యకథను మహాశ్రద్ధతో ప్రకాశించే అవధానం కలవాడై ఎవడైనా భక్తితో

**క. వినినఁ బఠించిన వ్రాసిన, వినిపించిన వాఁడు పృథుఁడు విమల గతిం బొ**
**దిన క్రియ హరిపద మొందెడు, ననయము నిర్ధూతపాపుఁ డగుచు మహాత్మా! 668**

**ప్రతి :** మహాత్మా!= దొడ్డబుద్ధిగల ఓ విదురా!; (దీనిని) వినినన్= ఆలకించినా; పఠించినన్= శ్రద్ధతో చదివినా; వ్రాసినన్= వ్రాసినా; వినిపించినన్= ఇతరులకు వినిపించినా; వాఁడు= అట్టివాఁడు; పృథుఁడు= పృథుచక్రవర్తి; విమలగతిన్= నిర్మలమైన స్థితిని; పొందిన క్రియన్= పొందినవిధంగా; అనయమున్= ఎల్లప్పుడు; నిర్ధూతపాపుఁడు= దూరంగా తొలగిపోయిన పాపాలు కలవాడు; అగుచున్= అవుతూ; హరిపదమున్= విష్ణువు స్థానాన్ని; ఒందెడున్= పొందుతాడు.

**తా :** విన్నా, చదివినా, వ్రాసినా, ఇతరులకు వినిపించినా, అట్టివాడు పృథుచక్రవర్తి ఉత్తమగతి పొందినట్లుగా ఎల్లవేళలా సర్వపాపాలూ నాశనమైపోగా విష్ణుపదానికి చేరుకుంటాడు మహాత్మా!

**విశే :** ఇదొక సోపానక్రమం. ముందు గురువుల వలన వినాలి. అభ్యాసంకోసం తాను స్వయంగా చదువుకోవాలి. గట్టిపడటంకోసం వ్రాయాలి. ఇంకా చెదరకుండా నిలిచిందో లేదో పరీక్షించుకోవటానికి ఇతరులకు వినిపించాలి. విద్య ఈ నాలుగుమెట్లద్వారా పరిణతస్థితికి చేరుకుంటుంది.

**సీ. బ్రాహ్మణుం డంచిత భక్తిఁ బఠించిన బ్రహ్మవర్చసము సంప్రాప్త మగును,**
**క్షత్త్రియుం డర్థిమైఁ జదివిన విన్నను జగతీవిభుత్వంబు సంభవించు,**
**వైశ్యుండు విని ధనవంతుఁడై యొప్పును శూద్రుండు వినిన సుశ్లోకుఁ డగును**
**మఱియును భక్తి ముమ్మాఱు పఠించిన విత్తవిహీనుండు విత్తపతియు**

**తే. నప్రసిద్ధుఁడు ప్రఖ్యాత యశుఁడు ప్రజలు లేని యధముఁడు వితత సంతానయుతుఁడు**
**మూర్ఖచిత్తుండు విజ్ఞాన బోధమతియు, నగుచు నుతి కెక్కుదురు మహితాత్మ! మఱియు. 669**

**ప్రతి :** మహిత+ఆత్మ= దొడ్డబుద్ధిగల ఓ విదురా!; బ్రాహ్మణుండు= విప్రకులంలో పుట్టినవాడు; అంచితభక్తిన్= ఒప్పారే భక్తితో; పఠించినన్= చదివితే; (అతనికి) బ్రహ్మవర్చస్సు= వేదాధ్యయనం చేసినందువలన కలిగే ముఖతేజస్సు; సంప్రాప్తము=

చక్కగా లభించినది; అగును= అవుతుంది; క్షత్రియుండు= క్షత్రియకులంలో పుట్టినవాడు; అర్థిమైన్= కోరికతో; విన్నను= వింటే; జగతీ, విభుత్వంబు= భూమి అంతటికి పాలకుడయ్యేస్థితి; సంభవించున్= కలుగుతుంది; వైశ్యుండు= మూడవ వర్ణంవాడు; విని= ఆలకించి; ధనవంతుఁడు= ధనం సమృద్ధిగా గలవాడు; ఐ= అయి; ఒప్పును= అలరారుతాడు; శూద్రుండు= నాలుగవ వర్ణంవాడు; వినినన్= వింటే; సుశ్లోకుఁడు= గొప్పయశస్సు కలవాడు; అగును= అవుతాడు; మఱియున్= ఇంకా; భక్తిన్= భక్తితో; మూడు+మాఱులు= మూడుమారులు; పఠించినన్= చదివితే; విత్తవిహీనుండు= ధనంలేని దరిద్రుడు; విత్తపతియున్= ధనాధిపతియగు కుబేరుడు; అప్రసిద్ధుఁడు= పేరు ప్రఖ్యాతులు లేనివాడు; ప్రఖ్యాతయశుఁడు= అన్ని దేశాలలో అందరూ కొనియాడే కీర్తికలవాడు; ప్రజలు= కొడుకులు; లేని అధముఁడు= లేనట్టి నీచుడు; వితత; సంతానయుతుఁడు= పెద్దగా సంతానంతో కూడినవాడు; మూర్ఖచిత్తుఁడు= ఏ కొంచెమూ తెలివిలేని చిత్తం కలవాడు; విజ్ఞానబోధమతియున్= విజ్ఞానంతో బోధించగల బుద్ధిగలవాడు; అగుచున్= అవుతూ; నుతికిన్= ప్రశంసకు; ఎక్కుదురు= పాత్రులవుతారు; మఱియున్= ఇంకా;

**తా :** మహితాత్మా! విదురా! నాలుగు వర్ణాలలో మొదటివాడైన బ్రాహ్మణుడు ఈ పృథుచరిత్రను భక్తితో చదివితే అతనికి బ్రహ్మవర్చస్సు సంప్రాప్తిస్తుంది. క్షత్రియుడు ఆసక్తితో చదివినా, విన్నా ఆతనికి సామ్రాజ్యాధిపత్యం కలుగుతుంది. శూద్రుడు వింటే గొప్పకీర్తి కలవాడౌతాడు. ఇంతేకాదు మూడుమారులు భక్తితో ఈ కథను చదివితే దరిద్రుడు కుబేరుడైపోతాడు. పేరు ప్రఖ్యాతులులేనివాడు గొప్పకీర్తి కలవాడౌతాడు. సంతానంలేని అధముడు చాలమంది పిల్లలు కలవాడవుతాడు. ఏమీ తెలియని మూర్ఖుడు విజ్ఞాన బుద్ధిగలవాడౌతాడు. వీరందరునూ గొప్పకీర్తి ప్రతిష్ఠలు కలవారుకూడా అవుతారు.

**వ. ఈ లోకంబునం బురుషులకు స్వస్త్యయనంబును నమంగళ నివారణంబును ధనప్రదంబును యశస్కరంబును నాయుష్కరంబును స్వర్గదాయకంబును గలిమలాపహంబును నైన యీ పుణ్యచరిత్రంబు చతుర్విధ పురుషార్థ కాములైన వారికిఁ జతుర్విధ పురుషార్థ కారణం బగుం గావున వినం దగు, సంగ్రామాభిముఖుండైన రా జీ చరిత్రంబు ననుసంధించి విరోధి నెదిర్చిన న వ్విరోధి పృథునకుం బోలెఁ గప్పంబు లిచ్చు, ముక్తాన్యసంగుండును భగవద్భక్తుండును నైన వాఁడు పుణ్యంబును వైన్యమాహాత్మ్య సూచకంబును నైన యీ చరిత్రంబు వినుచుం బఠియించుచుం గృతమతియై దినదినంబును నాదరంబునం బ్రకటంబు సేయువాఁడు భవసింధు పోత పాదుండైన సర్వేశ్వరుని యందు నచలం బయిన భక్తి గలిగి పృథుచక్రవర్తి వొందిన విష్ణుపదంబుం బొందునని యిప్పుణ్య చరిత్రంబు మైత్రేయుండు విదురున కెఱింగించి వెండియు నిట్లనియె. 670**

**ప్రతి :** ఈ లోకంబునన్= ఈ లోకంలో; పురుషులకున్= మానవులకు; సు+అస్తి+అయనంబున్= శుభానికి మార్గమైనదియు; అమంగళ నివారణంబును= అశుభాన్ని రాకుండ చేసేది; ధనప్రదంబును= ధనాన్ని అధికంగా ఇచ్చేది; యశస్+కరంబును= కీర్తిని కలిగించేది, ఆయుష్+కరంబును= ఆయువును పెంపొందించేది; స్వర్గదాయకంబును= స్వర్గాన్ని కూర్చేది; కలిమల+అపహంబున్= కలిదోషాన్ని తొలగించేది; ఐన, ఈ పుణ్యచరిత్రంబు= అయిన ఈ పుణ్యమైనకథ; చతుర్విధ పురుష+అర్థకాములు= నాలుగు విధాలైన పురుషార్థాలను కోరేవారు; ఐనవారికిన్= అయిన మానవులకు; చతుర్విధ, పురుషార్థకారణంబు= నాలుగు విధాలైన పురుషార్థాలకు హేతువు; అగున్= అవుతుంది; కావునన్= కాబట్టి; వినన్; తగున్= వినదగినది; రాజు= పాలకుడు; సంగ్రామ+అభిముఖుండు= రణం చేయటానికి సిద్ధంగా ఉన్నవాడు; ఐ= అయి;

ఈ చరిత్రంబున్= ఈ కథను; అనుసంధించి= మనసులో కుదురుకొల్పుకొని; విరోధిన్= పగవానిని; ఎదిర్చినన్= ఎదిరించినట్లైతే; ఆ+విరోధి= ఆ పగవాడు; పృథునకున్ పోలెన్= పృథుచక్రవర్తికి వలె; కప్పంబులు= పన్నులు; ఇచ్చున్= ఇస్తాడు; ముక్త+అన్య, సంగుండును= విడువబడిన ఇతరమైన తగులములుకలవాడు; భగవద్+భక్తుండునున్= భగవంతునియందు భక్తికలవాడు; ఐనవాడు= అయిన వ్యక్తి; పుణ్యంబును= పవిత్రమైనది; వైన్య, మాహాత్మ్య సూచకంబునున్= వేనుని కుమారుడైన పృథుని గొప్పబుద్ధిని తెలియజేసేది; ఐన+ఈ చరిత్రంబు= అయిన ఈ కథను; వినుచున్= వింటూ; పఠించుచున్= చదువుకుంటూ; కృత, మతి+ఐ= బుద్ధిని సరిగా చేసికొన్నవాడై; దినదినంబునును= ప్రతిదినమూ; ఆదరంబునన్= ఆసక్తితో; ప్రకటంబు చేయువాఁడు= పదిమందికి తెలియజేసేవాడూ; భవ, సింధు, పోతపాదుండు= సంసారమనే సముద్రానికి నావవంటి పాదాలుకలవాడు; ఐన= అయిన; సర్వ+ఈశ్వరునియందున్= సర్వులకూ ప్రభువైన పరమాత్మయందు; అచలంబు+అయిన= చెదరుపాటులేని; భక్తి= సేవించేబుద్ధి; కలిగి; పృథుచక్రవర్తి= పృథువనే సార్వభౌముడు; పొందిన విష్ణుపదంబు= పొందినట్టి విష్ణువుస్థానాన్ని; పొందున్= పొందుతాడు; అని= అని; ఈ+పుణ్యచరిత్రంబు= ఈ పుణ్యమైన కథను; మైత్రేయుండు= మైత్రేయుడనే మహర్షి; విదురునకున్= విదురుడనేవానికి; ఎఱింగించి= తెలియజెప్పి; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** ఈ లోకంలో మానవులకు శుభాన్ని కలిగించేది, అశుభాన్ని రాకుండా చేసేది, సంపదను ఇచ్చేది, కీర్తిని కలిగించేది, ఆయువును పెంపొందించేది, స్వర్గాన్ని అనుగ్రహించేది, కలిదోషాలను తొలగించేది అయిన ఈ పుణ్యచరిత్ర నాలుగుతీరులైన పురుషార్థాలను కోరేవారికి, నాలుగు పురుషార్థాలు కలగటానికి కారణం అవుతుంది. కాబట్టి దీనిని వినాలి. యుద్ధానికి పోయేరాజు ఈ చరిత్రను మనస్సులో గట్టిగా నిలుపుకొని శత్రువును ఎదిరిస్తే, ఆ శత్రువు, పృథుచక్రవర్తికి తక్కిన రాజులందరూ కప్పాలు చెల్లించినట్లుగా, కప్పాలు చెల్లిస్తాడు. మరొక తగులు లేని భగవద్భక్తుడు పుణ్యమూ, పృథువు మాహాత్మ్యాన్ని తెలియజెప్పేది అయిన ఈ కథను వింటూ, చదువుతూ బుద్ధిని చక్కగా రూపొందించుకొని ప్రతిదినం ఆదరంతో దీనిని అందరకూ తెలియజెపుతూ ఉంటే, సంసారసముద్రం దాటించటానికి నావగా అయిన పాదాలుగల పరమాత్మయందు చెక్కుచెదరని భక్తి పెంపొందుతుంది. అట్టివాడు పృథుచక్రవర్తి పొందిన విష్ణుపదాన్ని పొందుతాడు. అని ఈ పుణ్యకథను మైత్రేయమహర్షి విదురునకు తెలియజెప్పాడు. ఇంకా ఇలా అన్నాడు.

**క. పృథునకు నర్చికిఁ బుట్టిన, పృథు కీర్తిధనుండు ఘనుఁడు పృథుతుల్యుండై**
**పృథుశౌర్య ధైర్య ధుర్యుఁడు, పృథివిన్ విజితాశ్వుఁ డొప్పెఁ బృథివీపతియై. 671**

**ప్రతి :** పృథునకున్= పృథువనేవానికి; అర్చికిన్= అర్చి అనే వనితకు; పుట్టిన= పుట్టినవాడు; పృథు, కీర్తిధనుండు= గొప్పది అయిన కీర్తియే ధనం అయినవాడు; ఘనుఁడు= గొప్పవాడు; పృథుతుల్యుండు= పృథువునకు సమానుడు; ఐ= అయి; పృథు, శౌర్య, ధైర్య, ధుర్యుఁడు= గొప్ప శూరత్వం; ధీరత్వం అనువాని భారాన్ని మోయగలవాడు; పృథివిన్= భూమియందు; విజితాశ్వుఁడు= విజితాశ్వుడనే పేరుగలవాడు; పృథివీపతి+ఐ= రాజై; ఒప్పెన్= విరాజిల్లినాడు.

**తా :** పృథువుకు అతని భార్య అర్చికి పుట్టిన కుమారుడు విజితాశ్వుడు. అతనికి గొప్పకీర్తియే మహాధనం. గొప్పవాడు. తండ్రికి తగిన తనయుడు. అతనిలో గొప్పగా శౌర్యధైర్యాలు ఉన్నాయి. అట్టివాడు పృథుచక్రవర్తి తరువాత భూమికి ఏలిక అయ్యాడు.

**విశే :** శూరుడు= పరాక్రమించే భావసంపద పెల్లుగా కలవాడు; ధీరుడు= పరాక్రమించే సందర్భంలో బుద్ధిసంపదను నిండుగా వినియోగించగలవాడు.

**క. విను మంతర్ధానగతిం, దనరు సునాసీరు వలనఁ దగ విజితాశ్వుం**
**డును మతి యంతర్ధానుం, డనుపేరఁ బ్రసిద్ధుఁ డయ్యె నతి చతురుండై. 672**

**ప్రతి :** వినుము= విను; అంతర్ధాన, గతిన్= ఎవరికీ కనపడని గమనంతో; తనరు= ఒప్పు; సునాసీరువలనన్= దేవేంద్రుని వలన; విజితాశ్వుండు= విజితాశ్వుడనే ఆ రాజు; తగన్= తగువిధంగా; అతిచతురుండు= మిక్కిలి నేర్పుకలవాఁడు; ఐ= అయి; మతి; అంతర్ధానుండు= అంతర్ధానుడు; అనుపేరన్= అనే పేరుతో; ప్రసిద్ధుండు= ప్రఖ్యాతి కలవాడు; అయ్యెన్= అయ్యాడు.

**తా :** ఆ విజితాశ్వుడు దేవేంద్రునివలన ఎవరికీ కనపడకుండా నడిచే ఒక విద్యను మిక్కిలి నేర్పుతో సాధించాడు. కాబట్టి అతను అంతర్ధానుడు అనేపేరుతో ప్రసిద్ధికెక్కాడు.

**విశే :** సునాసీరుడు అంటే నాగళ్ళను మిక్కిలిగా కదిలించేవాడు, వర్షాలు కురిపించి పంటలు పండించటానికి కారణం అవుతాడు కనుక అది సార్థకం.

**సీ. స్థిరమతి రాజ్యాభిషిక్తుఁడై య మ్మేటి సమమతి న య్యనుజన్ములైన**
**హర్యశ్వునకు సమాదరమునఁ దూర్పు, దక్షిణదిశఁ దగ ధూమ్రకేశునకును,**
**బరఁగంగ వృకునకుఁ బశ్చిమభాగంబు ద్రవిణున కర్థి నుత్తరపు దిశను,**
**గొమ రొప్ప నలువురకును బంచి యిచ్చి స్వకాంత యైనట్టి శిఖండినికిని**

**తే. మనుజ యోనిని జనియింపుఁ డనుచు మున్ను, పలికినట్టి వసిష్ఠు శాపమునఁ జేసి**
**పూని త్రేతాగ్ను లతనికిఁ బుత్త్రు లగుచు, జనన మొందిరి సజ్జనస్తవ్య చరిత! 673**

**ప్రతి :** ఆ+మేటి= ఆ మహానుభావుడు; స్థిరమతిన్= చెదరని బుద్ధికలవాడై; రాజ్య+అభిషిక్తుఁడు= రాజ్యసింహాసనం కోసం పట్టాభిషేకం పొందినవాడు; ఐ= అయి; సమమతిన్= సమమైన బుద్ధితో; ఆ+అనుజన్ములు+ఐన= ఆతని తమ్ములైన; హర్యశ్వునకున్= హర్యశ్వుడనేవానికి; సమాదరమునన్= చక్కని ఆదరభావంతో; తూర్పున్= తూర్పుదిక్కును, తూర్పుదిక్కున ఉన్న రాజ్యభాగాన్ని; తగన్= తగువిధంగా; ధూమ్రకేశునకును= ధూమ్రకేశుడు అనేవానికి; దక్షిణదిశన్= దక్షిణంగా ఉన్న రాజ్యభాగాన్ని; పరఁగంగన్= ఒప్పునట్లుగా; పశ్చిమభాగంబున్= పడమటి రాజ్యభాగాన్ని; వృకునకున్= వృకుడు అనే తమ్మునికి; అర్థిన్= కోరికతో; ఉత్తరము+దిశను= ఉత్తరదిక్కును; కొమరు+ఒప్పన్= చక్కగా; నలువురకును= నలుగురికీ; పంచి= పంపకంచేసి; ఇచ్చెన్= ఇచ్చాడు; సజ్జన స్తవ్యచరిత= ఉత్తమపురుషులు కొనియాడే ప్రవర్తనగల ఓ మహానుభావా!; మున్ను= పూర్వం; మనుజయోనిని= మానవ గర్భంలో; జనియింపుఁడు= పుట్టండి; అని; వసిష్ఠుశాపమునన్+చేసి= వసిష్ఠుని శాపంవలన; పూని= పూనుకొని; త్రేతాగ్నులు= మూడైన అగ్నులు; స్వకాంత= తన ఇల్లాలు; ఐన+అట్టి; శిఖండినికిన్= శిఖండిని అనే ఆమెకు; అతనికిన్= ఆ విజితాశ్వునకు; పుత్త్రులు= కొడుకులు; అగుచున్= అయి; జననము+ఒందిరి= పుట్టారు;

**తా :** సజ్జన స్తుతిపాత్ర చరితా! విదురా! ఆ మహానుభావుడు విజితాశ్వుడు చెదరని బుద్ధితో రాజ్యానికి అధిపతి అయ్యాడు. సమబుద్ధికలవాడు కనుక తన తమ్ములు నలుగురికి నాలుగుదిక్కుల రాజ్యాన్ని పంచిపెట్టాడు. హర్యశ్వునికి ఆదరంతో తూర్పుభాగం, ధూమ్రకేశునికి తగినట్లు దక్షిణభాగం, ఒప్పునట్లుగా వృకునకు పడమటిభాగం, ద్రవిణునకు కోరికతో

ఉత్తరభాగం ఏర్పాటు చేశాడు. అతని భార్య శిఖండిని. వారిద్దరికి వసిష్ఠుడు మనుష్యస్త్రీకి పుట్టమని ఇచ్చిన శాపంవలన మూడగ్నులు ముగ్గురు పుత్రులుగా జన్మించారు.

**వ. వారలు పావకుండుఁ బవమానుండు శుచియు నను నామంబుల మనుష్య యోనిం బుట్టియు నాత్మప్రభావంబునం గ్రమ్మఱ నగ్నులయి చనిరి తదనంతరంబ. 674**

**ప్రతి :** వారలు= ఆ కొడుకులు; పావకుండును= పావకుడు; పవమానుండు= పవమానుడు; శుచియున్= శుచి; అనునామంబులన్= అనే పేరులతో; మనుష్యయోనిన్= మనుష్య కాంత కడుపున; పుట్టియున్= పుట్టికూడా; ఆత్మప్రభావంబునన్= తమమహిమచేత; క్రమ్మఱన్= మరల; అగ్నులు= అగ్ని స్వరూపం పొందినవారు; ఐ= అయి; చనిరి= తమ వెనుకటి స్థితికి చేరుకున్నారు; తత్+అనంతరంబు+అ= అటు పిమ్మట.

**తా :** ఆ విజితాశ్వునకు శిఖండినికి పుట్టిన కుమారులు పావకుడు, పవమానుడు, శుచి అనే పేర్లు కలవారు. వారు మనుష్యగర్భంలో పుట్టినా తమ గొప్పతనంచేత మళ్ళీ అగ్నిస్వరూపం పొంది తమతావుకు వెళ్ళిపోయారు. అటుపిమ్మట

**క. అతఁడు నభస్వతి యనియెడి, ద్వితీయ పత్ని వలనను హవిర్ధానుఁడు నా**
**సుతుఁగని విజితాశ్వుం డా, నతవిమతుఁడు రాజ్యవర్తనము దలపోయన్. 675**

**ప్రతి :** అతడు= ఆ విజితాశ్వుడు; నభస్వతి, అనియెడి, ద్వితీయపత్నివలనను= నభస్వతి అనేపేరుగల రెండవ భార్యవలన; హవిర్ధానుడు= హవిర్ధానుడు; నాన్= అనగా; సుతున్= కొడుకును; కని= పొంది; ఆనత, విమతుఁడు= మొత్తంగా లొంగిపోయిన పగవారు కలవాడై; విజితాశ్వుండు= విజితాశ్వుడు; రాజ్యవర్తనమున్= రాజ్యమును నడపుటను; తలపోయన్= భావించగా;

**తా :** ఆ విజితాశ్వునకు రెండవభార్య నభస్వతి. ఆమెవలన అతనికి హవిర్ధానుడు అనే కుమారుడు పుట్టాడు. ఆ విజితాశ్వుడు శత్రువుల నందరిని తనకు లొంగిపోయేవిధంగా చేసికొని రాజ్యపరిపాలనంగురించి ఆలోచించగా

**క. విమలాత్మ! కరాదానము, దమశుల్కాదికము గరము దారుణ మని ధై**
**ర్యమునన్ దీర్ఘమఖ వ్యా, జమునం దద్వర్తనంబు సమమతి విడిచెన్. 676**

**ప్రతి :** విమల+ఆత్మ= చెడు తలపులురాని బుద్ధిగలవాడా!; కర+ఆదానము= కప్పం గ్రహించటం; దమ, శుల్క+ఆదికము= దండం ప్రయోగించటం, పన్నులు ప్రజలపైరుద్దటం మొదలైనపని; కరము= మిక్కిలి; దారుణము= క్రూరమైన విషయం; అని= అని తలచి; ధైర్యమునన్= బుద్ధిశక్తితో; దీర్ఘ, మఖ, వ్యాజమునన్= చాలకాలం ఆచరించే యజ్ఞం నిమిత్తంగా; తద్+వర్తనంబున్= రాజ్యపాలన అనే ప్రవృత్తిని; సమమతిన్= సమమైన బుద్ధితో; విడిచెన్= వదలివేశాడు.

**తా :** స్వచ్ఛమైన బుద్ధి విశేషంగల ఓ విదురా! కప్పం పుచ్చుకోవటం, దండనను నిర్వహించటం, ప్రజలనుండి ఆయాదోషాలకు పరిహారంగా ధనం రాబట్టటం మొదలైనవి చాలా క్రూరమైన పనులు అని భావించి మనస్సును దిటవుచేసికొని పెద్దకాలం చేయవలసిన ఒక యజ్ఞాన్ని నిమిత్తంగా చేసికొని సమబుద్ధియై రాజ్యపాలన అనే దానిని వదలివేశాడు.

**వ. ఇట్లు విడిచి. 677**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; విడిచి= వదలివేసి.

**తా :** ఇలా రాజ్యపాలన అనేదానిని వదలివేసి

**క. అతఁ డాత్మదర్శనుం డయి, చతురతఁ బరమాత్ము హంసు సర్వేశ్వరుఁ ద**
**త్క్రతువున యజించి కుశలా, ద్భుత యోగసమాధి ముక్తిఁ బొందె మహాత్మా! 678**

**ప్రతి :** మహాత్మా= మహానుభావా!; అతఁడు= ఆ విజితాశ్వుడు; ఆత్మదర్శనుండు= ఆత్మయందే చూపు నిలిపినవాడు; ఐ= అయి; చతురతన్= మిక్కిలి నేర్పుతో; పరమ+ఆత్మున్= పరమాత్మను; హంసున్= హంస అనే వ్యవహారం కలవానిని; సర్వ+ఈశ్వరున్= అన్నింటికి, అందరికి ప్రభువు అయినవానిని; తత్+క్రతువునన్= ఆ యజ్ఞంలో; యజించి= ఆరాధించి; కుశల+అద్భుత, యోగ, సమాధిన్= నేర్పుగలది, ఆశ్చర్యం కలిగించేది అయిన యోగసంబంధమైన సమాధిలో; ముక్తిన్= ముక్తిని; పొందెన్= పొందాడు.

**తా :** మహాత్మా! ఆ విజితాశ్వుడు ఆత్మయందే చూపునిలిపి మిక్కిలి నేర్పుతో హంస, పరమాత్మ, అయిన సర్వేశ్వరుని ఆ యజ్ఞంలో ఆరాధించి గొప్ప నైపుణ్యంతోకూడిన ఆశ్చర్యం కలిగించే యోగసమాధిద్వారా ముక్తి పొందాడు.

**వ. అంత విజితాశ్వుండు పరలోకగతుం డయిన హవిర్ధానుండు హవిర్ధాని యను భార్యవలన బర్హిష్మదుండు గయుండు శుక్లుండుఁ గృష్ణుండు సత్యుండు జితవ్రతుండు నను పుత్రుల నాఱ్వురం గాంచె, నందు బర్హిష్మదుండు. 679**

**ప్రతి :** అంతన్= అటు పిమ్మట; విజితాశ్వుండు= విజితాశ్వ మహారాజు; పరలోకగతుండు= పరుడైన పరమాత్మలోకానికి చేరుకున్నవాడు; ఐనన్= కాగా; హవిర్ధానుండు= అతని రెండవభార్య కుమారుడైన హవిర్ధానుడు; హవిర్ధాని అను= హవిర్ధాని అనే పేరుగల; భార్యవలన= ధర్మపత్ని వలన; బర్హిష్మదుండు, గయుండు, శుక్లుండు, కృష్ణుండు, సత్యుండు, జితవ్రతుండు అనే పేర్లుగల; పుత్రులన్= కొడుకులను; ఆఱ్వురున్= ఆరుగురిని; కాంచెన్= పొందాడు; అందున్= వారిలో; బర్హిష్మదుండు= బర్హిష్మదుడు అనేవాడు.

**తా :** విజితాశ్వుడు పరలోకాలకు వెళ్ళిన తరువాత అతని కుమారుడు హవిర్ధానుడు హవిర్ధాని అనే తన భార్యవలన ఆరుగురు కుమారులను పొందాడు. వారు బర్హిష్మదుడు, గయుడు, శుక్లుడు, కృష్ణుడు, సత్యుడు, జితవ్రతుడు అనేవారు. వారిలో బర్హిష్మదుడు

**విశే :** ఇక్కడ పరలోకం అంటే స్వర్గం మొదలైనవి అని భావించరాదు. ముక్తి పొందినట్లుగా చెప్పిన కారణంగా పరమాత్మతో తాదాత్మ్యం అని భావించాలి.

**సీ. సంతత సవన దీక్షాశాలి యగుచు ధరాతలం బెల్లను గ్రతువులకును**
**విలసిల్లు యజనశాలలు వేఱువేఱ కల్పించి యజ్ఞములు గావించుచుండి**
**చిరకీర్తి యతఁడు ప్రాచీనాగ్రకుశలచే క్షితితలం బెల్ల నాస్తృతము సేయ**
**వసుధ యెల్లను యజ్ఞవాటమై విలసిల్ల సత్క్రియాకాండ నిష్ణాతుఁ డగుచు**

**తే. సుభగయోగ సమాధి నిష్ఠుఁడు ప్రజాప, తి యగునని తన్ను జనము నుతింప వెలయు**
**నట్టి ఘనుఁడు హావిర్ధాని యఖిల జగతిఁ, బఱపి కుశలను బ్రాచీనబర్హి యయ్యె. 680**

**ప్రతి :** సంతత, సవన, దీక్షా, శాలి= ఎల్లవేళల యజ్ఞాల దీక్షలతో ఒప్పారేవాడు; అగుచున్= అగుచూ; ధరాతలంబు= భూమి; ఎల్లను= అంతా; క్రతువులకును= యజ్ఞాలకు; విలసిల్లు, యజ్ఞశాలలు= చక్కగా అమరే యజ్ఞాలశాలలను; వేఱువేఱు+అ= విడివిడిగా; కల్పించి= ఏర్పాటుచేసి; యజ్ఞములు= జన్నాలు; కావించుచు+ఉండి= చేస్తూ ఉండి; చిరకీర్తి= పెద్దకాలం నిలిచి ఉండే ఖ్యాతికలవాడగు; అతఁడు= ఆ రాజు; ప్రాచీన+అగ్రకుశలచేన్= తూర్పునకు కొనలు ఉండు దర్భలతో; క్షితితలంబు= భూమి పైభాగం; ఎల్లన్= అంతా; ఆస్తృతము+చేయన్= పరచినదిగా చేయగా; వసుధ= భూమి; ఎల్లను= సమస్తం; యజ్ఞవాటము= యజ్ఞాల శాల; ఐ= అయి; విలసిల్లన్= ఒప్పారగా; సత్క్రియా, కాండ, నిష్ణాతుఁడు= మంచి పనుల సముదాయమునందు నేర్పుకలవాడు; అగుచున్= అగుచు; సుభగ, యోగ, సమాధి, నిష్ఠుఁడు= మనోజ్ఞమైన యోగానికి సంబంధించిన చెదరని స్థితియందు నిష్ఠ కలవాడు; ప్రజాపతి= బ్రహ్మ; అగున్= అగును; అని; జనము= జనుల సముదాయం; తన్నున్= తనను; నుతింపన్= కొనియాడగా; వెలయున్= ప్రకాశించాడు; అట్టి; ఘనుఁడు= ఆ విధమైన గొప్పవాడు; హావిర్ధాని= హవిర్ధానుని కుమారుడు బర్హిష్మదుడు; అఖిల జగతిన్= మిగులులేని భూమి అంతటా; కుశలను= దర్భలను; పఱపి= పరచి; ప్రాచీనబర్హి= ప్రాచీనబర్హి అనే ప్రఖ్యాతి కలవాడు; అయ్యెన్= అయ్యాడు.

**తా :** (హవిర్ధానుని కుమారుడు బర్హిష్మదుడు.) ఎల్లవేళల యజ్ఞదీక్షలతోనే విరాజిల్లేవాడు. భూమినంతటినీ యజ్ఞాలకు యోగ్యమైన శాలలను వేరువేరుగా ఏర్పాటు చేశాడు. యజ్ఞాలు మానకుండా చేస్తూ చిరమైన కీర్తిని సంపాదించాడు. తూర్పుదిక్కునకు కొనలు ఉండేవిధంగా దర్భలను భూతలమంతా పరచాడు. ఆ విధంగా భూమి అంతా యజ్ఞశాలయే అయి విలసిల్లింది. ఇంకా అనేకమైన మంచి పనులను చేయటంలో మిక్కిలి నేర్పుకలవాడై హృదయంగమమైన యోగసమాధియందు నిష్ఠకలవాడై ఇతడే ప్రజాపతి అని ప్రజలందరూ తన్ను కొనియాడుతుండగా చెలువొందిన మహానుభావుడు. అట్టి ఘనుడైన హవిర్ధానుని కుమారుడైన బర్హిష్మదుడు తూర్పుదిక్కునకు కొనలు ఉండే విధంగా బర్హిస్సులను దర్భలను పరచి యాగాలు చేశాడు. కనుక అతనికి ప్రాచీనబర్హి అనే ప్రఖ్యాతి కలిగింది.

**విశే :** యజ్ఞప్రక్రియ దేవతలను తృప్తిపరుస్తుంది. దానితో వారు భూలోకానికి కావలసిన వర్షాదులద్వారా పంటలను సమృద్ధిగా పండిస్తారు. ప్రజలు కరవుకాటకాదులు లేక సుఖశాంతులతో బ్రదుకు గడుపుతారు. దీనిని భగవంతుడు గీతలో ప్రత్యేకంగా ప్రకటించాడు.

హవిర్ధానుని కుమారుడు 'హావిర్ధాని' తద్ధిత ప్రత్యయం చేరినరూపం.

**వ. మఱియు నతండు. 681**

**ప్రతి :** మఱియున్= ఇంకా; అతండు= ఆ ప్రాచీనబర్హి

**తా :** ఇంకా ఆ ప్రాచీనబర్హి

**చ. అలవడ నే సతీమణి సమంచితలీల వివాహవేళ ను**
**త్కలికఁ బ్రదక్షిణంబు లిడఁగాఁ గని హవ్యవహుండు దొల్లి యి**
**మ్ముల శుకిఁజూచి మోహమును బొందినరీతి విమోహి యయ్యె నా**
**లలిత వినూత్న భూషణ యలంకృత చారు శుభాంగి వెండియున్. 682**

**ప్రతి :** ఏ సతీమణి= ఉత్తమశీలంగల ఏ వనిత; అలవడన్= పొందిక అగునట్లుగా; సమంచితలీలన్= ఒప్పారే విలాసంతో; వివాహవేళన్= పెండ్లి సమయంలో; ఉత్కలికన్= తహతహతో; ప్రదక్షిణంబులు= చుట్టివచ్చుటలు; ఇడఁగాన్= పెట్టగా, చేయగా; కని= చూచి; హవ్యవహుండు= అగ్నిదేవుడు; తొల్లి= మునుపు; ఇమ్ములన్= సుఖంగా; శుకిన్= చిలుకరూపంలోఉన్న తన భార్యయే అయిన స్వాహాను; చూచి= కని; మోహమునున్= కామభావాన్ని; పొందినరీతిన్= పొందినట్లు; విమోహి= గొప్ప కామావేశం కలవాడు; అయ్యెన్= అయ్యాడో; ఆ లలిత; వినూత్న భూషణ= సుకుమారములు; మిక్కిలి క్రొత్తవి అయిన నగలుకలది; అలంకృత, చారు, శుభ+అంగి= అలంకరించుకొన్న సుందరం, శుభం, అయిన రమణీయదేహం కలది; వెండియున్= మఱియు...

**తా :** ప్రాచీనబర్హి ఒక సుందరిని వివాహమాడాడు. ఆమె గొప్పసౌందర్యం కలది. వివాహ సమయంలో ఆమె వేగిరంగా అగ్నికి ప్రదక్షిణలు చేస్తూ ఉంటే అగ్నిదేవుడే మునుపు శుకిని చూచి కామోద్రేకం పొందిన విధంగా ఈమెను చూచికూడా గొప్ప వ్యామోహం పొందాడు. అట్టి ఆ వనిత లలితములైన, మిక్కిలి కొత్త ఆభరణాలతో చక్కగా అలంకరించుకొన్న మనోజ్ఞమైన మంగళమైన దేహం కలది. అంతేకాదు

**విశే :** శుకిన్ చూచి – పూర్వం అగ్నిదేవుడు సప్తర్షుల భార్యలను చూచి మోహించాడు. అది గమనించింది అతని భార్య స్వాహాదేవి. తన పతికి పాపం అంటకుండా ఆ సప్తమహర్షుల భార్యలలో ఒక్క అరుంధతిని వదలి తక్కిన అందరి రూపాలను తానే తాల్చి అగ్నిదేవునితో రమించింది. ఆ సందర్భంగా జారిన రేతస్సును చిలుకరూపంలో గ్రహించి రెల్లుతోటలో నిక్షేపించింది. దీనిని ఈ పద్యంలో స్మరిస్తున్నారు.

**చ. సురుచిర భంగి నా సతి కిశోర వయఃపరిపాకయై రణ**
**ద్వరమణి హేమనూపురరవంబు సెలంగఁగ నాడుచున్ దివా**
**కరరుచి రేఖ నొప్పెసఁగఁ గాంచి వినిర్జితులైరి దేవ కి**
**న్నర నర సిద్ధ సాధ్య ముని నాగ నభశ్చరముఖ్యు లందఱున్. 683**

**ప్రతి :** సురుచిర భంగిన్= మిక్కిలి మనోహరమైన తీరుతో; ఆ సతి= ఆ భామిని; కిశోర, వయః, పరిపాక= యౌవన దశనిండుగా ఏర్పడినది; ఐ= అయి; రణత్, వర, మణి, హేమ నూపుర రవంబు= మొరయుచున్న, మణుల కూర్పుగల బంగారు కాలి అందెల; చెలంగఁగన్= ఒప్పారగా; ఆడుచున్= విహరిస్తూ; దివాకర, రుచి, రేఖన్= సూర్యుని కాంతిచారలతో; ఒప్పెసగఁగన్= అలరారగా; కని= చూచి; దేవ, కిన్నరవర, సిద్ధ, సాధ్య, ముని, నాగ, నభశ్చర, ముఖ్యులు= దేవతలు, కిన్నర శ్రేష్ఠులు; సిద్ధులు, సాధ్యులు, మునులు, నాగజాతివారు, ఆకసంలో సంచరించే పక్షిజాతులవారు, వీరిలో ప్రఖ్యాతి కలవారు; అందఱున్= అందరూ; నిర్జితులు= ఓడిపోయినవారు; ఐరి= అయ్యారు.

**తా :** ఆ యువతి పిల్ల వయస్సు పాకానికి వచ్చిన సమయంలో (అనగా యౌవనవతి అయిన సమయంలో) చక్కగా నాదం చేస్తున్న మణులు తాపిన బంగారు కాలి అందెలు రవం ఒప్పారునట్లు విలాసంగా ఆడుతూ (నాట్యంచేస్తూ) ఉంటే సూర్యుని కాంతిరేఖ కదలాడుతున్నట్లుగా అనిపించేది. అట్టి ఆమెను చూచి దేవతలు, కిన్నరులు, నరులు, సిద్ధులు, సాధ్యులు, మునులు, నాగులు, పక్షులు మొదలగు జాతులలో గొప్పవారు కూడా (మోహపడేవారు)

**వ. అట్టి సౌందర్యఖనియు సముద్రపుత్త్రియు నయిన శతధృతి యను కన్యం బ్రహ్మోదేశంబునం బాణిగ్రహణంబు సేసె, నా శతధృతి వలనం బ్రాచీనబర్హికిఁ బదుగురు కొడుకులు జనియించిరి, వారలు**

**తుల్యనామ వ్రతులును ధర్మపారగులును నయిన ప్రచేతసులు, వారు ప్రజాసర్గంబునందుఁ దండ్రిచేత నాజ్ఞాపితులయి తపంబు గావింప వనంబునకుం జను సమయంబునం దన్మార్గంబునఁ బ్రసన్నుం డగుచు దృశ్యమానుండైన రుద్రునిచేత నేది యుపదేశింపంబడె దాని జపధ్యాన పూజా నియమంబుల సేవించుచుఁ దపఃపతి యైన నారాయణుం బదివేల దివ్య వత్సరంబులు పూజించి రని చెప్పిన విని విదురుండు మైత్రేయున కిట్లనియె.** **684**

**ప్రతి :** అట్టి సౌందర్యఖనియున్= ఆ విధమైన అందచందాల ప్రోవును; సముద్ర పుత్రియున్= సముద్రుని బిడ్డయు; ఐన= అయిన; శతధృతి – అను కన్యన్= శతధృతి అనే పేరుగల కన్యను; బ్రహ్మ+ఆదేశంబునన్= బ్రహ్మదేవుని ఆనతిమేరకు; పాణిగ్రహణంబు= పెండ్లి; చేసెన్= చేసుకున్నాడు (ప్రాచీనబర్హి); ఆ శతధృతివలనన్= ఆశతధృతి అనే భార్య ఆధారంగా; ప్రాచీనబర్హికిన్= ప్రాచీన బర్హి అనే రాజునకు; పదుగురు= పదిమంది; కొడుకులు= పుత్రులు; జనియించిరి= పుట్టారు; వారలు= ఆ కుమారులు; తుల్యనామవ్రతులును= ఒకే విధమైన పేరులు, పుణ్యకార్యాలు కలవారూ; ధర్మపారగులును= ధర్మమును తుదిముట్టా తెలిసి ఆచరించేవారూ; ఐన= అయినట్టి; ప్రచేతసులు= ప్రచేతసులు అనేవారు; వారు; ప్రజాసర్గంబునందున్= ప్రజలను సృష్టిచేసే విషయంలో; తండ్రిచేన్= తమ నాయనచేత; ఆజ్ఞాపితులు= ఆదేశించబడినవారు; అయి= అయి; తపంబు= తపస్సు; కావింపన్= చేయటానికి; వనంబునకున్= అరణ్యానికి; చనుసమయంబునన్= వెళ్ళే సందర్భంలో; తద్+మార్గంబునన్= వారి దారిలో; ప్రసన్నుండు= అనుగ్రహంకలవాడు; అగుచున్= అగుచూ; దృశ్యమానుండు= కానవచ్చినవాడు; ఐన, రుద్రుని చేతన్= అయినట్టి రుద్రునిచేత; ఏది; ఉపదేశింపన్+పడెన్= మంత్రపూర్వకంగా; ఉపదేశించబడిందో; దానిన్= దానిని; జప, ధ్యాన, పూజానియమంబులన్= జపం, ధ్యానం, పూజ అనేవాటికి సంబంధించిన కట్టుబాటులతో; సేవించుచున్= భజిస్తూ; తపస్+పతి= తపస్సులను పాలించువాడు; ఐన, నారాయణుని= అయినట్టి శ్రీమహావిష్ణువును; పదివేల దివ్యవత్సరంబులు= పదివేల దేవతల యేండ్లు; పూజించిరి= పూజ చేశారు; అని, చెప్పినన్= అని చెప్పగా; విని= ఆలకించి; విదురుండు= విదురుడు; మైత్రేయునకున్= మైత్రేయ మహర్షితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** చక్కదనాల గనీ, సముద్రుని బిడ్డా అయిన ఆ శతధృతి అనే కన్యను బ్రహ్మశాసనాన్నిబట్టి ప్రాచీనబర్హి పెండ్లి చేసుకున్నాడు. ఆమె యందు అతనికి పదిమంది కొడుకులు పుట్టారు. వారందరూ ఒకేపేరు, ఒకేతీరు కలవారు. ధర్మం సాంతం తెలిసినవారు అయిన ప్రచేతసులు అను పేరుకలవారు. తండ్రి నాయనలారా! మీరు ప్రజలను సృష్టిచేయండి అని ఆదేశించాడు. ఆ ఆదేశమును పాటించక వారు తపస్సు చేసుకొనే బుద్ధితో అరణ్యాలకు బయలుదేరారు. దారిలో వారికి శ్రీపరమేశ్వరుడు ప్రసన్న బుద్ధితో కనపడి ఒక మంత్రాన్ని ఉపదేశించాడు. ఆ మంత్రాన్ని జపంతో, ధ్యానంతో, పూజతో నియమం చెడకుండా వారు సేవిస్తూ పదివేల దివ్యవత్సరాలు తపస్సులకు పతి అయిన శ్రీమన్నారాయణుని సేవించుకున్నారు. అని చెప్పగా విదురుడు మైత్రేయునితో ఇలా అన్నాడు.

**విశే :** సౌందర్యరాశి, సముద్రునిబిడ్డ అనటంచేత ఆమె శ్రీమహాలక్ష్మివంటిది అని తెలుస్తున్నది.

జపము – వాక్కులతో సేవ; ధ్యానము – మానసమైన సేవ; పూజ – కాయికమైనసేవ – ఇలా వారు మూడు కరణాలను ఏకం చేసుకొని పూజించారు.

రుద్రుడు – జ్ఞానదాత.

సీ. తాపసోత్తమ! ప్రచేతసులకు నా వన మార్గంబునందు నా భర్గుతోడ
సంగ మెట్లయ్యెఁ? బ్రసన్నుఁడై హరుఁ డెద్ది తివుట వారల కుపదేశ మిచ్చె?
జీవరాశులకు నా శివుతోడి సంగంబు గడు దుర్లభం, బీ జగంబునందుఁ
జర్చింప న మ్మేటి సన్మునీంద్రులకును సంచిత ధ్యానగోచరుఁడు గాని

తే. పుడమిఁ బ్రత్యక్షమునఁ గానఁ బడఁడు, మఱియు, నంచితాత్మ సదారాముఁ డఖిల లోక
రక్షణార్థంబుగా విరూపాక్షుఁ డాత్మ, శక్తితోఁ గూడి జగతిపై సంచరించు. 685

**ప్రతి :** తాపస+ఉత్తమ= తపస్సు చేసేవారిలో శ్రేష్ఠుడా!; ప్రచేతసులకున్= ప్రచేతసులనేవారికి; ఆ వనమార్గంబునందున్= ఆ అడవి దారిలో; ఆ భర్గుతోడన్= ఆ శివునితో; సంగము= కలయిక; ఎట్లు= ఏ విధంగా; అయ్యెన్= అయింది? ప్రసన్నుఁడు= అనుగ్రహం గలవాడు; ఐ= అయి; హరుఁడు= పరమేశ్వరుడు; ఎద్ది= ఏ; తివుట= కోరిక; వారలకున్= ఆ ప్రచేతసులకు; ఉపదేశము= హితమైన మంత్రమును; ఇచ్చెన్= ఇచ్చినాడు?; చర్చింపన్= విచారించగా; ఈ జగంబునందున్= ఈ లోకంలో; జీవరాశులకున్= ప్రాణంగల వారి సముదాయాలకు; ఆ శివుతోడి సంగంబు= ఆ శివునితో కలయిక; కడున్= మిక్కిలిగా; దుర్లభంబు= పొందుటకు అలవికానిది; ఆ+మేటి= ఆ మహానుభావుడు; సత్+ముని+ఇంద్రులకును= సాధుస్వభావంగల మునులలో గొప్ప అయినవారికిని; సంచిత, ధ్యాన, గోచరుఁడు= ఎంతో అధికంగా కూడబెట్టుకొన్న ధ్యానానికి కనపడేవాడు; కాని; పుడమిన్= భూమిమీద; ప్రత్యక్షమునన్= ఇంద్రియాలకు తెలియవచ్చేవిధంగా; కానఁబడఁడు= కనుపించడు; మఱియున్= ఇంకా; అంచిత+ఆత్మసత్+ఆరాముడు= గొప్పగా అలరారే బుద్ధియే గొప్పతావుగా కలవాడు; విరూప+అక్షుఁడు= వికారమైన రూపంగల కన్నులున్నవాడు; అఖిల, లోక, రక్షణ+అర్థంబుగాన్= అన్ని లోకాలను కాపాడటమే ప్రయోజనంగా; ఆత్మశక్తితోన్= తనదైన శక్తితో; కూడి= కలసి; జగతిపైన్= భూమిపై; సంచరించున్= తిరుగాడుతూ ఉంటాడు.

**తా :** ఓయి తాపసశ్రేష్ఠా! ప్రచేతసులకు ఆ అడవి దారిలో ఆ శివునితో సమావేశం ఎలా అయింది? దయగల శివుడు వారి కోరికతో ఉపదేశం చేశాడు? ఈ జగత్తులో ప్రాణాలున్నవారికి ఆ శివునితో కలయిక మిక్కిలి దుర్లభమైనది. గట్టిగా విచారించి చూస్తే ఆ మహాత్ముడు గొప్పమునివర్యులకు కూడా ధ్యానంలో మాత్రమే కనిపిస్తాడు. అంతేకానీ భూమిమీద సాధారణమైన కన్నులకు కనబడడు. అంతేకాదు, ఆయన ప్రపంచవాసనలులేని ఆత్మయందే నిరంతరం నెలకొని ఉంటాడు. విరూపాక్షుడు తన దైవశక్తితత్త్వంతో కలిసి సర్వలోకాలను రక్షించటంకోసం సంచరిస్తూ ఉంటాడు.

**విశే :** భర్గుడు - అజ్ఞానాన్ని చీల్చివేసేవాడు; అంచిత ధ్యానం - ప్రపంచభావన ఏమాత్రమూ లేక నిరంతరం పరమాత్మయందే లగ్నమైన మనస్సు కలిగి ఉండటం. విరూపాక్షుడు - సూర్యుడు, చంద్రుడు, అగ్ని అనే మూడు మూడు కన్నులుగా, ఒకే స్వరూపంతో లేనివై, ఉన్నవాడు. ఆత్మశక్తి - ఇక్కడ శక్తి ఉమాదేవి. సర్వప్రపంచాన్ని కదిలించే ఒకానొక మహాతత్త్వం.

### a =రుద్రుండు ప్రచేతసులకు యోగాదేశ మను స్తోత్రముం దెల్పుట=a

క. కావున భగవంతుండును, దేవాధీశుండు నయిన దేవుని సంగం
బే వెరవున ఘటియించెనొ, యా విధ మంతయును దెలియ నానతి యీవే. 686

**ప్రతి :** కావునన్= కాబట్టి; భగవంతుండును= భగవంతుడూ; దేవ+అధీశుండును= దేవతలకును ప్రభువునూ; ఐన= అయినట్టి; దేవుని సంగంబు= దేవునితో కలయిక; ఏ వెరవునన్= ఏ విధంగా; ఘటియించెనొ= కలిగెనో; ఆ విధము= ఆ తీరు; అంతయున్= అంతటినీ; తెలియన్= తెలిసేవిధంగా; ఆనతి+ఈవే= చెప్పుమా!

**తా :** కాబట్టి భగవంతుడు, దేవదేవుడు అయిన ఆ పరమేశ్వరునితో కలయిక ఆ ప్రచేతసులకు ఏ విధంగా కలిగిందో ఆ తీరునంతటినీ నాకు చక్కగా తెలియజెప్పు.

**క. అనవుడు విదురున కమ్ముని, జననాయకుఁ డనియె నట్టి సాధుమనీషం**
**దనరు ప్రచేతసులును నిజ, జనకుని సద్భాషణములు సమ్మతి తోడన్. 687**

**ప్రతి :** అనవుడున్= అని పలుకగా; విదురునకున్= విదురునికి; ఆ+మునిజననాయకుఁడు= మహర్షులందరకు మార్గం చూపగల మహాత్ముడగు ఆ మైత్రేయుడు; అనియెన్= అన్నాడు; అట్టి సాధుమనీషన్= ఆ విధమైన మంచిదైన బుద్ధివిశేషంతో; తనరు, ప్రచేతసులును= ఒప్పునట్టి ప్రచేతసులు; నిజజనకుని= తమ తండ్రి యొక్క; సత్+భాషణములు= మంచి మాటలు; సమ్మతితోడన్= అంగీకారంతో

**తా :** అని పలుకగా విదురునికి మహర్షిశ్రేష్ఠుడగు మైత్రేయుడు ఇలా చెప్పాడు. ఆ ప్రచేతసులు సాధువైన బుద్ధి కలవారు. తమ తండ్రి చెప్పిన మంచిమాటలకు సమ్మతించారు.

**క. శిరమున వహించి పడమటి, కరిగెడి సమయమున నెదుర నంబుధికంటెం**
**బఱ పగు నొక సరసి మనో, హర నిర్మల సలిల పూర్ణయై యది మఱియున్. 688**

**ప్రతి :** శిరమునన్= తలలో; వహించి= నిలుపుకొని; పడమటికిన్= పడమటి దిక్కువైపు; అరిగెడు సమయమునన్= వెళ్ళే వేళలో; ఎదురన్= ఎదురుగా; అంబుధికంటెన్= సముద్రంకంటె; పఱపు= వైశాల్యం కలది; అగు+ఒక సరసి= అయిన ఒక పెద్దసరస్సు; మనోహర, నిర్మల, సలిల, పూర్ణయై= అందచందాలు కలది; శుద్ధమైనది అయి నీటితో నిండినదై; అది; ఆనది; మఱియున్= ఇంకా...

**తా :** తండ్రి ఆజ్ఞను తలదాల్చి పడమటి దిక్కుగా బయలుదేరారు. ఆ సమయంలో వారికి ఎదురుగా ఒక పెద్దసరస్సు కనపడినది. అందులో నిండుగా మనోహరం, నిర్మలం, సుందరం అయిన నీరు ఉన్నది. అది సముద్రంకంటె మిక్కిలి వైశాల్యం కలిగి ఉంది.

**సీ. రక్తోత్పలేందీవరప్రఫుల్లాంభోజ కమనీయ కహ్లార కలిత మగుచుఁ**
**గంజాత కింజల్క పుంజ విక్షేపక మందగంధానిలానంద మగుచు**
**రమణీయ హంస సారస చక్రవాక కారండవ నినదాభిరామ మగుచు**
**వర మత్త మధుప సుస్వర మోద పల్లవాంకురిత లతా తరు భరిత మగుచు**

**తే. సిద్ధచారణ గంధర్వ సేవ్య మగుచుఁ, బుణ్యముల కాలయం బయి పొలుపు మిగిలి**
**లలితమై చూడ నొప్పగు లక్షణములఁ, బరఁగి శుచి లఘు మధురాంబు భవ్య మగుచు. 689**

**ప్రతి :** రక్త= ఎర్ర; ఉత్పల= కలువలు; ఇందీవర= నల్లకలువలు; ప్రఫుల్ల= వికసించిన; అంభోజ= కమలాలు; కమనీయ= అందమైన; కహ్లార= కల్హారాలచే (సౌగంధికాలు); కలితము-అగుచు= కూడినదై; కంజాత= పద్మాలలోని; కింజల్క= కేసరములయొక్క; పుంజ= గుంపును; విక్షేపక= కదిలించెడు; మంద+గంధ+అనిల= మెల్లగావీస్తున్న పరిమళానిలముచే; ఆనందము+అగుచు= ఆనందాన్ని కలిగిస్తూ; రమణీయ= అందమైన; హంస= అంచలు; సారస= బెగ్గురు పక్షుల; చక్రవాక= జక్కవల; కారండవ= కన్నెలేడి పిట్టల; నినద= ధ్వనులచేత; అభిరామము+అగుచు= మనోజ్ఞమౌతూ; వర-మత్త= బాగా మదించిన; మధుప= తుమ్మెదల; సుస్వర= మంచి ధ్వనులకు; మోద= సంతోషంతో; పల్లవ+అంకురిత= చిగురులు తొడిగిన (పొదమిన); లతా= తీగలు; తరు= చెట్లచే, భరితమగుచున్= నిండినదై; సిద్ధ= సిద్ధులు; చారణ= చారణులు; గంధర్వ= గంధర్వులు మొదలయినవారిచే; సేవ్యము+అగుచు= సేవితమై (విహరించబడుతూ); పుణ్యములకు= పుణ్యాలకు; ఆలయంబు+అయి= ఆలవాలమై; చూడన్= చూడగానే; పొలుపు మిగిలి= అందంగా; లలితమై= మనోజ్ఞమై; ఒప్పగు= ఒప్పిదమైన; లక్షణములన్-పరగి= గుర్తులతో వెలసి; శుచి= శుచిగా; లఘు-మధుర+అంబు= తేటగా తియ్యగా ఉండే నీళ్లతో; భవ్యము-అగు= (కొలను) భవ్యంగా ఉంది.

**తా :** ఆ కొలనిలో ఎర్రకలువలు, నల్లకలువలు, కమలాలు, అందమైన సౌగంధికాలు చక్కగా వికసించి ఉన్నవి. పద్మాలలోని కేసరాలను ఇటు అటు కదిలిస్తూ ఆనందంగా మందపరిమళానిలాలు వీస్తున్నవి. అందమైన హంసలూ, బెగ్గురుపక్షులూ, చక్రవాకాలూ, కన్నెలేడిపిట్టలూ వీనులవిందుగా కూస్తున్నవి. బాగా మదించిన తుమ్మెదల మధురధ్వనులకు సంతోషంతో పులకరించినట్లుగా ఒడ్డున ఉన్న తీగలూ, చెట్లూ చిగురు తొడిగాయి. సిద్ధులు, చారణులు, గంధర్వులు అక్కడ విహరిస్తున్నారు. పుణ్యాలకు ఆలవాలమైన అందంగా చూచుటకు ఒప్పగు లక్షణాలతో ప్రకాశిస్తూంది. ఆ కొలనులోని నీరు శుచిగా కొంచెం తియ్యగా ఉంది.

**తే. సజ్జనుని హృదయముఁ బోలి స్వచ్ఛ మగుచు, హరిపదాకృతి దివిజవిహార మగుచు**
**ఘనుని సిరి భంగి నర్హజీవనము నగుచు, మానవతి వృత్తి గతిని నిమ్నంబు నగుచు. 690**

**ప్రతి :** సత్+జనుని= మంచిమానవుని; హృదయమున్= హృదయాన్ని; పోలి; స్వచ్ఛము= మచ్చలేనిది, మలినం లేనిది; అగుచున్= అగుచు; హరి పద+ఆకృతిన్= ఆకాశం ఆకారంతో; దివిజ విహారము= దేవతలకు విలాసంగా తిరిగే స్థలం; అగుచున్= అగుచు; ఘనుని= గొప్పవాని, మేఘుని; సిరిభంగిన్= సంపదవలె; అర్హ జీవనము= యోగ్యమైన నీరుకలది, యోగ్యమైన నీరంకలది; అగుచున్= అగుచు; మానవతి వృత్తి గతిని= అభిమానం అధికంగా ఉన్న స్త్రీ ప్రవర్తనవలె; నిమ్నంబు= గంభీరమైనది, లోతైనది; అగుచున్= అగుచు.

**తా :** ఆ సరస్సు సజ్జనుని హృదయంలాగా నిర్మలంగా ఉన్నది. ఆకాశం ఆకారం కలిగి దేవతలు సంచరించేదిగా ఉన్నది. గొప్పవాని భాగ్యంలాగా యోగ్యమైన నీటిని కలిగి ఉన్నది. అభిమానవతి ప్రవర్తనలాగా గంభీరంగా ఉన్నది.

**తే. శశికరంబులుఁ బోలి విశదము లగుచు, హరికథలఁ బోలి కల్మషహరము లగుచు**
**వహ్నులనుబోలి భువనపావనము లగుచుఁ, బొగడఁదగు నీరములచేఁ బ్రపూర్ణ మగుచు. 691**

**ప్రతి :** శశికరంబులున్= చంద్రుని కిరణాలను; పోలి; విశదములు= స్వచ్ఛములు; అగుచున్= అగుచు; హరికథలన్= విష్ణుకథలను; పోలి; కల్మషహరములు= పాపాలను (మాలిన్యాలను) పోగొట్టేవి; అగుచున్= అగుచు; వహ్నులను=

అగ్నులను; పోలి; భువన పావనములు= లోకాలను పవిత్రం చేసేవి; అగుచున్= అగుచు; పొగడన్+తగునీరములచేన్= కొనియాడటానికి వీలయిన నీటిచేత; ప్రపూర్ణము= బాగుగానిండినది; అగుచున్= అగుచు.

**తా :** (ప్రచేతసులు ముందుకు పోవుచుండగా వారికొక పెద్దసరస్సు కానవచ్చింది.) అందులోని జలాలు చంద్రకిరణాలలాగా స్వచ్ఛంగా ఉన్నాయి. విష్ణుకథలలాగా పాపాలను హరించే విధంగా ఉన్నాయి. అగ్నుల లాగా లోకాలను పవిత్రం చేసేవిగా ఉన్నాయి. అటువంటి పొగడదగిన నీళ్ళతో అది నిండి ఉన్నది.

**వ. ఒప్పునట్టి సరోవరంబుఁ బొడగని యందు నొక్క దివ్యపురుషునిం గని రతండును. 692**

**ప్రతి :** ఒప్పు+అట్టి= ఒప్పారునట్టి; సరోవరంబున్= ఒక గొప్ప సరస్సును; పొడగని= చూచి; అందున్= దానిలో; ఒక్కదివ్యపురుషునిన్= ఒక దేవజాతికి చెందిన మనుజుని; కనిరి= చూచారు; అతండును= ఆ పురుషుడునూ...

**తా :** ఆ విధంగా అందాలుచిందే ఆ గొప్ప సరస్సును చూచి అందులో ఒక్క దివ్యపురుషుని చూచారు. అతడు

**మ. సమద శ్రీక మృదంగ వేణుముఖ భాస్వన్నాదమై దివ్య మా**
**ర్గ మనోరంజకమై తనర్చు విలసద్గాంధర్వగానంబు నె**
**య్యము సంధిల్లఁగ వించుఁ దన్మహిమ కత్యాశ్చర్యముం బొంద వే**
**గమునం దత్కమలాకరంబు వెడలెం గౌతూహలోల్లాసియై. 693**

**ప్రతి :** సమద= మదంతో కూడిన; శ్రీక= సొంపుగల; మృదంగ= మద్దెల; వేణు= పిల్లన గ్రోవి; ముఖ= మొదలైనవానియొక్క; భాస్వత్= ఒప్పారుచున్న; నాదము= ధ్వనికలది; ఐ= అయి; దివ్య మార్గ మనస్+రంజకము= దివికి చెందిన వారి మనస్సుల్ని రంజింపజేయునది; ఐ= అయి; తనర్చు= ఒప్పారే; విలసత్+గాంధర్వ గానంబు= చాలా గొప్పగా అలరారే గంధర్వులకు సంబంధించిన గానం; నెయ్యము= ప్రీతి; సంధిల్లఁగన్= కూడునట్లుగా; వించున్= వింటూ; తత్+మహిమకున్= దాని గొప్పతనానికి; అతి+ఆశ్చర్యమున్= మిక్కిలి ఆశ్చర్యాన్ని; పొంది= పొంది; వేగమునన్= వేగంతో; తత్+కమలాకరంబున్= ఆ సరస్సును; కౌతూహల+ఉల్లాసి= వేడుకగా పొంగిపోవువాడు; ఐ= అయి; వెడలెన్= వెలికి వచ్చాడు.

**తా :** ప్రచేతసులు ఆనంద సంపదనిచ్చే మద్దెల, పిల్లనగ్రోవీ మొదలైన వాద్యాల ఒప్పారుచున్న నాదంకలదీ, దివ్యుల మార్గాలలో (సంచరించేవారి) మనస్సులను రంజింపజేసేదీ అయి ఒప్పుచున్న మహనీయమైన గాంధర్వగానాన్ని ప్రీతితో వింటూ దాని మహిమకు మిగుల అబ్బురం చెందుతూ ఆ సరస్సునుండి వేగంగా కుతూహలం పొంగిపోతుండగా వెలుపలికి వచ్చాడు.

**వ. ఇట్లు వెడలివచ్చిన. 694**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; వెడలి వచ్చినన్= వెలుపలికి రాగా

**తా :** ఇలా బయటికి రాగా

**మ. కని రా తాపసపుంగవుల్ దివిజలోక శ్రేష్ఠునిం దప్తకాం**
**చన వర్ణున్ సనకాది యోగిజన భాస్వద్గీయమానుం ద్రిలో**

**చను భక్తానుగుణానుగున్ సుమహితైశ్వర్యుం బ్రసాదాభిశో**
**భనవక్త్రున్ నిహతాఘకర్తృజన సంపద్భద్రునిన్ రుద్రునిన్. 695**

**ప్రతి :** ఆ తాపసపుంగవుల్= ఆ తాపసశ్రేష్ఠులు; దివిజ లోక శ్రేష్ఠునిన్= దేవలోకంలో మిక్కిలి గొప్పవానిని; తప్త కాంచన వర్ణున్= పుటంలో బాగా వేడి ఎక్కిన బంగారంవంటి వన్నె కలవానిని; సనక+ఆది యోగి జన భాస్వత్+గీయమానున్= సనకుడు మొదలైన యోగనిష్ఠగల జనులతో గొప్పగా కీర్తించబడేవానిని; త్రిలోచనున్= మూడు కన్నులవానిని; భక్త+అనుగుణ+అనుగున్= భక్తుల తీరుతెన్నులను అనుసరించి వెంటబడి వెళ్ళేవానిని; సుమహిత ఐశ్వర్యున్= మిక్కిలి గొప్పదైన ఈశ్వరభావం కలవానిని; ప్రసాద+అభిశోభన వక్త్రున్= ప్రసన్నతతో మిక్కిలిగా విరాజిల్లే మోము గలవానిని; నిహత+అఘ కర్తృ జనసంపత్+భద్రునిన్= పూర్తిగా నశింపజేయబడిన పాపాలకు కర్తలైన జనుల సంపదలకు శుభాలను కూర్చువానిని; రుద్రునిన్= రుద్రుని; కనిరి= చూచారు.

**తా :** ఆ తాపస శ్రేష్ఠులైన ప్రచేతసులు అలా సరస్సునుండి వెలువడి వచ్చిన దివ్యపురుషుని చూచారు. ఆయన రుద్రుడు, పరమేశ్వరుడు, దేవతల లోకాలలో శ్రేష్ఠుడు; పుటంలో కాగిన బంగారంవంటి వన్నె కలవాడు. సనకాది యోగిజనులు ఆయనను గొప్పగా కీర్తిస్తున్నారు. మూడుకన్నులతో అలరారుతున్నాడు. భక్తులగుణాలను అనుసరించివారిని చేరుకుంటాడు. చాలా గొప్ప ఐశ్వర్యం కలవాడు. భక్తులను అనుగ్రహించే ప్రసన్నతతో విరాజిల్లే ముఖం కలవాడు. పాపాలను పటాపంచలు చేసుకొనేవారి సంపదలను కాపాడేవాడు.

**క. కని వారలు దమ మనముల, ననురాగము నద్భుతంబు ననయము వొడమన్**
**వినయము దోఁపఁగఁ దత్పద, వనజములకు మ్రొక్కి భక్తి వశగతు లగుచున్. 696**

**ప్రతి :** కని= చూచి; వారలు= ఆ తాపసశ్రేష్ఠులు; తమమనములన్= తమ హృదయాలలో; అనురాగమున్= ప్రీతి; అద్భుతంబున్= అచ్చెరువు; అనయము= నిరంతరంగా; పొడమన్= పుట్టగా; వినయము= అణకువ; తోఁపఁగన్= తెలియ వచ్చే విధంగా; తత్+పద+వనజములకున్= అతని పాదాలనే పద్మాలకు; మ్రొక్కి= ప్రణమిల్లి; భక్తి+వశ+గతులు= భక్తికి వశమైన భావనలు కలవారు; అగుచున్= అవుతూ.

**తా :** ఆ తాపసవరులు ఆ రుద్రుని చూచి తమ మనసులలో ప్రీతి, ఆశ్చర్యం ఎడతెరపి లేకుండా కలుగగా వినయం తెలియ వచ్చే తీరున ఆయన పాదాలనే పద్మాలకు మొక్కి భక్తికి వశమైన గతులుగలవారు. అవుతూ

**వ. భగవంతుండును నఖిల ధర్మజ్ఞుండును గృపాళుండును భక్తవత్సలుండును దర్శనంబున నఖిల పాపహారుండును నయిన హరుండు ప్రీతుం డగుచుఁ బ్రసన్నాంతఃకరణులు ధర్మజ్ఞులు శీల సంపన్నులు సంప్రీతులు నయిన వారల కిట్లనియె. 697**

**ప్రతి :** భగవంతుండును= భగవల్లక్షణం నిండుగా కలవాడూ; అఖిల+ధర్మజ్ఞుండును= సమస్తమైన ధర్మాలనూ ఎరిగినవాడూ; కృపాళుండును= దయకలవాడూ; దర్శనంబునన్= చూచిన మాత్రాన; అఖిల+పాప+హరుండును= మిగులు లేకుండా పాపాలన్నింటినీ తొలగించేవాడూ; భక్త+వత్సలుండును= భక్తులయందు గొప్ప ప్రేమకలవాడూ; ఐన= అయిన; హరుండు= పరమేశ్వరుడు; ప్రీతుండు= ప్రీతికలవాడు; అగుచున్= అవుతూ; ప్రసన్న+అంతః కరణులు= ఏ మాలిన్యమూలేని హృదయం

కలవారూ; ధర్మజ్ఞులు= ధర్మతత్త్వం తెలిసినవారూ; శీల సంపన్నులు= శీలమే సంపదగాకలవారూ; సంప్రీతులున్= మిక్కిలి ప్రీతి పొందినవారూ; ఐన+వారలకున్= అయినట్టి ఆ తాపసులకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** భగవంతుడు, సర్వధర్మాలూ తెలిసినవాడూ, దయగలవాడూ, దర్శనమాత్రం చేత సర్వపాపాలనూ తొలగించివేసేవాడూ, భక్తులయందు పుత్రత్వప్రేమ కలవాడూ అయిన పరమేశ్వరుడు ప్రీతుడై, ప్రసన్నమైన అంతఃకరణం కలవారూ, ధర్మాలను ఎరిగినవారూ, శీల సంపదతో అలరారేవారూ, మిక్కిలి ప్రీతి పొందినవారూ అయిన ఆ తాపసులతో ఇలా అన్నాడు.

**సీ. వినుఁడు నృపాలనందనులార! మీ మదిఁ గల తలం పెల్లను గానవచ్చె,**
**మీకు భద్రం బగు, మీ యెడ నే ననుగ్రహబుద్ధిచే నిటు గానఁబడితిఁ,**
**గైకొని యిపుడు సూక్ష్మముఁ ద్రిగుణాత్మకము నగు నా ప్రకృతి కంటెను ధరణిని**
**బరఁగు జీవుని కంటెఁ బరుఁడైన వాసుదేవుని చరణాబ్జముల్ దనరు భక్తి**

**తే. నర్థి నెవ్వరు భజియింతు రట్టివారు, నాకుఁ బ్రియతముల్, వారికి నయచరిత్రు**
**లార! యేను బ్రియుండనై భూరిమహిమ, వెలయు చుండుదు, నది గాక వినుఁడ మీరు. 698**

**ప్రతి :** నృపాలనందనులార= రాజకుమారులారా!; వినుఁడు= వినండి; మీ మదిన్= మీ హృదయంలో; కల+తలంపు= ఉన్న ఆలోచన; ఎల్లను= అంతా; కానవచ్చెన్= తెలిసింది; మీకున్= మీకు; భద్రంబు= మేలు; అగున్= అవుతుంది; మీ+ఎడన్= మీ విషయంలో; అనుగ్రహబుద్ధిచేన్= దయగలబుద్ధితో; ఇటు= ఈ విధంగా; కానన్+పడితిన్= కన్పించాను; కైకొని= చేకొని; ఇపుడు= ఇప్పుడు; సూక్ష్మమున్= అత్యంత స్వల్పమున్ను; త్రిగుణ+ఆత్మకమున్= మూడుగుణాలే స్వరూపంగా కలదీ; అగు= అయిన; ఆ ప్రకృతికంటెను= ఆ ప్రకృతి అనే తత్త్వంకన్నా; ధరణిని= భూమిమీద; పరఁగు జీవునికంటెన్= ఉండే జీవునికన్నా; పరుఁడు= వేరైనవాడు; ఐన= అయిన; వాసుదేవుని= వాసుదేవుడనే తత్త్వంగలవాని; చరణ+అబ్జముల్= పాదాలనే పద్మాలను; తనరు+భక్తిన్= ఒప్పారే భక్తితో; అర్థిన్= కోరికతో; ఎవ్వరు= ఏ జనులు; భజియింతురు= పూజిస్తారో; అట్టివారు= అటువంటివారు; నాకున్= నాకు; ప్రియతముల్= మిక్కిలి ఇష్టమైనవారు; నయచరిత్రులార= నీతిగల నడవడికల ఓ ఉత్తములారా!; వారికిన్= అట్టివారికి; ఏను= నేను; ప్రియుండను= ప్రియమైనవాడను; ఐ= అయి; భూరిమహిమన్= గొప్పమహిమతో; వెలయుచుండుదున్= ఏర్పడుతూ ఉంటాను; అది+కాక= అంతేకాక; మీరు= మీరలు; వినుఁడు= వినండి.

**తా :** రాజకుమారులారా! వినండి. మీ మనస్సులో ఉన్న భావన అంతా నాకు తెలియ వచ్చింది. మీకు మేలు కలుగుతుంది. మీ యందు దయగలబుద్ధితో నేను మీకు దర్శనం ఇచ్చాను. సూక్ష్మమైనదీ, మూడుగుణాలే స్వరూపంగా కలదీ అయిన ఆ ప్రకృతికంటె, భూమి మీద ప్రవర్తించే జీవునికంటే వేరైనవాడు వాసుదేవుడు. అతని పాదపద్మాలను ఒప్పారుభక్తితో కోరికోరి భజించేవారు నాకు చాలా ఇష్టులు. నీతి నడవడి కల ఓ సజ్జనులారా! వారి విషయంలో నేను కూడా ప్రీతికలవాడనై గొప్పమహిమతో ఒప్పారుతూ ఉంటాను. ఇంతేకాదు. మరొక్కమాట కూడా మీరు వినండి.

**వ. స్వధర్మ నిరతుండైన పురుషుం డనేక జన్మాంతరసుకృత విశేషంబులం జతుర్ముఖత్వంబు నొంది, తదనంతరంబునం బుణ్యాతిరేకంబున నన్నుం బొంది యధికారాంతంబున నేనును దేవతాగణంబులును నవ్యాకృతంబైన యే హరిపదంబును బొందుదు, మట్టి పదంబు భాగవతుండు దనంతనె పొందుం, గావున మీరు భాగవతత్వంబు నొందుటం జేసి నాకు బ్రియంబు ఘటియింపుఁడు, భాగవత జనంబులకు నా**

**కంటె నధిక ప్రియుండు లేఁడు, గాన వివిక్తంబును జప్యంబును బవిత్రంబును మంగళంబును నిశ్శ్రేయస కరంబును నైన నా వచనంబు నాకర్ణింపుఁడు, సర్గాదిని బ్రహ్మ నిజనందనుల కెఱింగించిన శ్రీహరి స్తోత్రంబు మీకు నెఱింగింతు, వినుం డది యెట్టిదనిన. 699**

**ప్రతి :** స్వధర్మనిరతుండు= తన ధర్మమునందు నిష్ఠకలవాడు; ఐన= అయిన; పురుషుండు= మానవుడు; అనేక+జన్మ+అంతర+ సుకృత+విశేషంబులన్= ఎన్నో పూర్వపు పుట్టుకలయందలి పుణ్యాల గొప్పతనాలవలన; చతుర్ముఖత్వంబున్= నాలుగుమొగాలుగల దేవుడైన బ్రహ్మతనాన్ని; ఒంది= పొంది; తద్+అనంతరంబునన్= దాని తరువాత; పుణ్య+ అతిరేకంబునన్= పుణ్యాధిక్యంచేత; నన్నున్= నన్ను (రుద్రుని); పొంది= చేరుకొని; అధికార+అంతంబునన్= ఆ పదవి ముగిసిన కడపట; నేనున్= నేనూ; దేవతాగణంబులున్= దేవతల గుంపులున్నూ; అవ్యాకృతంబు= స్వరూపం మారకుండా ఉండేది; ఐన= అయిన; ఏ హరిపదంబులు= ఏ విష్ణువు పాదాలను; పొందుదుము= చేరుకుంటామో; అట్టి పదంబున్= అట్టి స్థానాన్ని; భాగవతుండు= భగవంతునియందు అచంచలమైన భక్తికలవాడు; తన+అంతన్+ఎ= స్వయంగానే; పొందున్= చేరుకుంటాడు; కావునన్= కాబట్టి; మీరు= మీరు; భాగవతత్వంబున్= భగవద్భక్తుల భావాన్ని; ఒందుటన్+చేసి= పొందటంవలన; నాకున్= నాకు; ప్రియంబు; ఘటియింపుఁడు= కలిగించండి; భాగవతజనంబులకున్= భగవంతునియందు భక్తిగల మానవులకు; నాకంటెన్= నాకంటె; అధికప్రియుండు= ఎక్కువ ఇష్టమైనవాడు; లేఁడు= ఉండడు; కానన్= కాబట్టి; వివిక్తంబును= ఏకాంతమైనదీ; జప్యంబును= జపించటానికి యోగ్యమైనదీ; పవిత్రంబును= పరిశుద్ధమైనదీ; మంగళంబును= శుభమైనదీ; నిశ్శ్రేయసకరంబును= పరమశ్రేయస్సును కలిగించేది; ఐ= అయినటువంటి; నా వచనంబున్= నా పలుకును; ఆకర్ణింపుఁడు= శ్రద్ధగా వినండి; సర్గ+ఆదినిన్= సృష్టి ప్రారంభంలో; బ్రహ్మ= సృష్టికర్త; నిజనందనులకున్= తన కుమారులకు; ఎఱింగించిన= తెలిపిన; శ్రీహరి స్తోత్రంబున్= శ్రీమహా విష్ణువు స్తుతిని; మీకున్= మీకు; ఎఱింగింతున్= తెలుపుతాను; వినుండు= వినండి; అది= ఆ స్తోత్రం; ఎట్టిది+అనినన్= ఎట్టిదంటే...

**తా :** తన ధర్మంలో నిష్ఠగల పురుషుడు పెక్కు పూర్వజన్మల పుణ్యవిశేషాలచేత బ్రహ్మగా అవుతాడు. ఆ తరువాత పెరిగిపోయిన పుణ్యంతో నన్ను చేరుకుంటాడు. మా మా పదవీ బాధ్యతలు ముగిసినప్పుడు నేనూ, ఇతర దేవతల సముదాయాలూ ఆదిలో ఎట్టి వికారాలూ పొందని శ్రీహరి స్థానాన్ని పొందుతాము కదా! అట్టి స్థానాన్ని భగవద్భక్తుడు స్వయంగా పొందుతాడు. మీరు భగవద్భక్తులయినవారు కనుక నాకు ప్రీతిని కలిగించండి. భగవంతునియందు భక్తి పండినవారికి నాకంటె ప్రియమైనవాడు లేడు. కాబట్టి ఏకాంతమైనదీ, జపించదగినదీ, పవిత్రమైనదీ, శుభమైనదీ, మోక్షాన్ని ప్రసాదించేదీ అయిన నా మాటను ఆలకించండి. సృష్టి మొదట బ్రహ్మ తన కుమారులకు తెలియజేసిన శ్రీహరి స్తోత్రాన్ని మీకు తెలియజేస్తాను. వినండి. అది ఎటువంటిదంటే

**క. వనజాసనుఁ డాత్మజు లగు, సనకాదులఁ జూచి పలికె సమ్మతితోడన్**
**వినుఁడు కుమారకులారా!, వనజోదరు మంగళ స్తవం బెఱిఁగింతున్. 700**

**ప్రతి :** వనజ+ఆసనుడు= పద్మం కూర్చునే తావుగాకలవాడు అయిన బ్రహ్మ; ఆత్మజులు= తననుండి పుట్టినవారు; అగు= అయిన; సనక+ఆదులన్= సనకుడు మొదలైన వారిని; చూచి= కనుగొని; పలికెన్= అన్నాడు; కుమారకులారా= ఉత్తములైన పుత్రులారా!; వనజ+ఉదరు మంగళ స్తవంబు= విష్ణువునకు సంబంధించిన శుభమైన స్తోత్రాన్ని; ఎఱిగింతున్= తెలుపుతాను; సమ్మతితోడన్= మంచి బుద్ధితో; వినుఁడు= వినండి.

**తా :** బ్రహ్మదేవుడు తనకుమారులైన సనకుడు మొదలైన వారిని చూచి సమ్మతితో నాయనలారా! శ్రీ మహావిష్ణువునకు సంబంధించిన శుభప్రదమైన స్తోత్రాన్ని మీకు తెలుపుతాను. వినండి అన్నాడు.

**వ. అని హరి నుద్దేశించి వారలు విన నిట్లనియె, ' నో యీశా! యాత్మవేదులైన వారలకు భవదీ యోత్కర్షంబు స్వానందలాభకరంబు గావున నట్టి స్వానందలాభంబు మాకుం గలుగ వలయు, నీవు పరిపూర్ణానంద స్వరూపుండ, విట్టి సర్వాత్మకుండవైన నీకు నమస్కరింతు నని వెండియు నిట్లనియె. 701**

**ప్రతి :** అని= ఇలా అని; హరిన్= విష్ణువును; ఉద్దేశించి= లక్ష్యంగా చేసుకొని; వారలు= ఆ సనకాదులు; వినన్= వింటూ ఉండగా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; ఓ ఈశా!= ఓ ప్రభూ; ఆత్మవేదులు= ఆత్మతత్త్వాన్ని తెలిసికొన్నవారు; ఐన వారలకున్= అయినవారికి; భవదీయ+ఉత్కర్షంబు= నీదయిన గొప్పతనం; స్వ+ఆనందలాభకరంబు= ఆత్మానందం అనే లాభాన్ని చేయునది; కావునన్= కనుక; అట్టి= ఆ విధమైన; స్వానందలాభంబు= ఆత్మానందం అనేది లభించటం; మాకున్= మాకు; కలుగవలయు= కలగాలి; నీవు; పరిపూర్ణ+ఆనంద స్వరూపుఁడవు= నిండైన ఆనందమే స్వరూపంగా కలవాడవు; ఇట్టి= ఈ విధమైన; సర్వాత్మకుండవు= సర్వమూ నీ ఆత్మయే అయిన వాడవు; ఐన= అయిన; నీకున్= నీకు; నమస్కరింతున్= నమస్కారం చేస్తాను; అని; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** ఇలా పలికి విష్ణువును గూర్చి వారలు వింటూ ఉండగా ఇలా పలికాడు. స్వామీ! ఆత్మతత్త్వం తెలిసినవారికి నీ మహిమ ఆత్మానందం అనే లాభాన్ని కలిగిస్తుంది; అట్టి ఆత్మానందం మాకు దొరకాలి. నీవు నిండైన ఆనందమే స్వరూపం అయినవాడవు. ఇట్టి సమస్తమూ స్వరూపంగా అయిన నీకు నమస్కారం చేస్తాను అని ఇంకా ఇలా పలికాడు.

**విశే :** పరిపూర్ణానంద స్వరూపుడు– సత్తు, చిత్తు, ఆనందం అనేవి మూడూ పరమాత్మ స్వరూపాలు; ఏది సత్తో, ఏది చిత్తో, అదే ఆనందం అనే అనుభవమే పరిపూర్ణానందం. అట్టి ఆనందం తప్ప మరే ఇతర భావమూ లేనివాడు పరిపూర్ణానంద స్వరూపుడు.

నమస్కరించటం అంటే అయిదు జ్ఞానేంద్రియాలనూ, అయిదు కర్మేంద్రియాలనూ, మనస్సుతో పాటుగా కలిపి స్వామికి సమర్పించుకుంటున్న భావాన్ని చేతిముద్రద్వారా ప్రకటించటం.

**సీ. పంకజనాభాయ సంకర్షణాయ శాం, తాయ విశ్వప్రబోధాయ భూత**
**సూక్ష్మేంద్రియాత్మనే సూక్ష్మాయ వాసుదే, వాయ పూర్ణాయ పుణ్యాయ నిర్వి**
**కారాయ కర్మనిస్తారకాయ త్రయీ, పాలాయ త్రైలోక్యపాలకాయ**
**సోమరూపాయ తేజోబలాఢ్యాయ స్వ, యం జ్యోతిషే దురన్యాయ కర్మ**

**తే. సాధనాయ పురాపురుషాయ యజ్ఞ, రేతసే జీవతృప్తాయ పృథ్వీరూప**
**కాయ లోకాయ నభసేఽన్తకాయ విశ్వ యోనయే విష్ణవే జిష్ణవే నమోఽస్తు. 702**

**ప్రతి :** పంకజనాభాయ= పద్మం బొడ్డునందుగలవానికి; సంకర్షణాయ= సంకర్షణ తత్త్వం గలవానికి; శాంతాయ= ఇంద్రియాల ఉద్వేగం లేనివానికి; విశ్వప్రబోధాయ= విశ్వాన్ని మేలు కొలిపేవానికి; భూతసూక్ష్మ+ఇంద్రియ+ఆత్మనే= అయిదు భూతాలూ, వాని తన్మాత్రలూ, ఇంద్రియాలూ స్వరూపంగాగల వానికి; సూక్ష్మాయ= సూక్ష్మస్వరూపంగలవానికి; వాసుదేవాయ= అంతటా తానుండి, అన్నీ తనలో ఉండి వెలుగొందేవానికి; పూర్ణాయ= కొరతలు ఏవీ లేనివానికి; పుణ్యాయ=

పుణ్య స్వరూపునకు; నిర్వికారాయ= ఏ వికారములూ లేనివానికి; కర్మ+నిస్తారకాయ= ప్రాణులను కర్మబంధాలనుండి పూర్తిగా వెలుపలికి తెచ్చేవానికి; త్రయీపాలాయ= మూడువేదాలను కాపాడేవానికి; త్రైలోక్యపాలకాయ= మూడులోకాల సముదాయాన్నీ పాలించేవానికి; సోమరూపాయ= చంద్రుడే స్వరూపం అయినవానికి; తేజస్+బల+ఆఢ్యాయ= వెలుగుబలంతో అంతటా కీర్తించబడేవానికి; స్వయంజ్యోతిషే= తనంత తాను వెలుగొందేవానికి; దురన్యాయ= దుష్టుడుకాని వానికి; కర్మసాధనాయ= యజ్ఞాది కర్మములకు సాధనాలైన స్రుక్కుస్రువం మొదలైనవానికి; పురాపురుషాయ= ఆదిపురుషునకు; యజ్ఞరేతసే= యజ్ఞానికి బీజభూతమైన వానికి; జీవతృప్తాయ= ప్రాణశక్తితో తృప్తి నందువానికి; పృథ్వి రూపకాయ= భూమియే స్వరూపంగా గలవానికి; లోకాయ= లోకములే స్వరూపమైనవానికి; నభసే= ఆకాశతత్త్వం అయినవానికి; అంతకాయ= ప్రళయకాలంలో సర్వాన్నీ రూపుమాపే వానికి; విశ్వయోనయే= విశ్వాని కంతటికీ జన్మస్థానం అయినవానికి; విష్ణవే= అంతటా వ్యాపించి ఉండేవానికి; జిష్ణవే= అన్నింటినీ జయించే శీలంకలవానికి; తే= నీకు; నమః= నమస్సు; అస్తు= అగుగాక!

**తా :** స్వామీ! నీవు నాభిలో పద్మంగలవాడవు. సంకర్షణుడవు. శాంతుడవు. విశ్వానికి జ్ఞానాన్ని ఇచ్చేవాడవు. భూతాలూ, సూక్ష్మతత్త్వాలూ, ఇంద్రియాలూ స్వరూపంగా గలవాడవు; సూక్ష్మ దేహం ఆత్మగా అయినవాడవు. వాసుదేవుడవు. పూర్ణుడవు. పుణ్యుడవు. ఏ వికారాలూ లేనివాడవు. కర్మబంధంనుండి జీవులకు మోక్షం కలిగించేవాడవు. వేదాలను సంరక్షించేవాడవు. మూడు లోకాలను పాలించేవాడవు. చంద్రునివంటి రూపం కలవాడవు. తేజస్సుతో, బలంతో అంతటా పేరుపొందినవాడవు. నీ అంత నీవు వెలుగొందే వాడవు. దుష్టదూరుడవు. యజ్ఞాది కర్మల సాధనాలుగా అయ్యేవాడవు. సనాతనుడవు. యజ్ఞాలకు బీజం అయినవాడవు. ప్రాణశక్తితో తృప్తి పొందేవాడవు. భూమి, లోకాలూ, ఆకాశమూ నీ స్వరూపాలే. నీవు ప్రళయ కారుడవు. విశ్వాలు నీ నుండియే పుట్టాయి. నీవు విష్ణుడవు, జిష్ణుడవు. అట్టి నీకు నమస్కారం.

**విశే :** ఇది గొప్పవిష్ణుస్తుతి. ఛందస్సు దేశీయమైనా భావన అంతా వేదాంతతత్త్వంలో నిండినది కనుక సంస్కృత వాక్యంగా పోతనగారు రచించారు. ఇందులో 'పంకజనాభాయ' అనేది మొదలుకొని 'జిష్ణవే' అన్నంతవరకుగల ఇరవై ఎనిమిది పదాలు సంస్కృత భాషలో చతుర్థీ విభక్తి అంతమందుగల పదాలు. "నమః" అనేది ఎవరినుద్దేశించి చేయబడుతుందో అట్టివ్యక్తిని తెలిపేపదానికి చతుర్థీ విభక్తి కలగటం వ్యాకరణ నియమం. 'అస్తు' అనేది విధ్యర్థకక్రియ- అగుగాక! అనిదాని అర్థం.

**సీ. స్వర్గాపవర్గ సుద్వారాయ సర్వ ర, సాత్మనే పరమహంసాయ ధర్మ**
**పాలాయ సద్ధిత ఫలరూపకాయ కృ, ష్ణాయ ధర్మాత్మనే సర్వశక్తి**
**యుక్తాయ ఘన సాంఖ్య యోగీశ్వరాయ హి, రణ్య వీర్యాయ రుద్రాయ శిష్ట**
**నాథాయ దుష్ట వినాశాయ శూన్య ప్ర, వృత్తాయ కర్మణే మృత్యవే వి**

**తే. రాట్చరీరాయ నిఖిల ధర్మాయ వాగ్వి, భూతయే నివృత్తాయ సత్పుణ్య భూరి**
**వర్చసేఽఖిల ధర్మదేహాయ చాత్మ, నేఽ నిరుద్ధాయ నిభృతాత్మనే నమోఽస్తు. 703**

**ప్రతి :** స్వర్గ+అపవర్గ సుద్వారాయ= స్వర్గానికీ, మోక్షానికీ మంచి ద్వారం అయినవానికి; సర్వరస+ఆత్మనే= అన్నిరసాల స్వరూపం అయినవానికి; పరమహంసాయ= పరమాత్మకు; ధర్మపాలాయ= ధర్మాన్ని పాలించేవానికి; సత్+హిత ఫల

రూపకాయ= సత్పురుషులకు మేలైన ఫలం రూపంగా కలవానికి; కృష్ణాయ= కృష్ణునకు; ధర్మ+ఆత్మనే= ధర్మస్వరూపునికి; సర్వ శక్తి యుక్తాయ= అన్ని శక్తులతో కూడియున్నవానికి; ఘన సాంఖ్య యోగి+ఈశ్వరాయ= గొప్పవారైన సాంఖ్య యోగులకు ప్రభువైనవానికి; హిరణ్యవీర్యాయ= బంగారురూపమైన వీర్యం కలవానికి; రుద్రాయ= రుద్రునికి; శిష్టనాథాయ= సజ్జనులకు రక్షకుడైనవానికి; దుష్టవినాశాయ= చెడుశీలం కలవారిని నశింపజేసేవానికి; శూన్యప్రవృత్తాయ= ఆది, అంతంలేని ప్రవృత్తి కలవానికి; కర్మణే= కర్మస్వరూపునికి; మృత్యువే= మృత్యుదేవతకు; విరాట్+శరీరాయ= విరాట్టయిన శరీరం కలవానికి; నిఖిలధర్మాయ= సర్వధర్మాలూ తానే అయినవానికి; వాక్+విభూతయే= వాక్కుల వైభవం తానే అయినవానికి; నివృత్తాయ= జగత్తనే సంసార భావంనుండి మరలినవానికి; సత్+పుణ్య భూరి వర్చసే= శ్రేష్ఠమైన పుణ్యంతో గొప్ప దేహకాంతి కలవానికి; అఖిల ధర్మ దేహాయ= అఖిలమైన ధర్మములూ దేహం అయినవానికి; చ= ఇంకా; ఆత్మనే= అంతటా వ్యాపించియున్నవానికి; అనిరుద్ధాయ= ఎందునూ అడ్డులేని గతికలవానికి; నిభృత+ఆత్మనే= నిండైన ఆత్మకలవానికి; నమః= నమస్కారం; అస్తు= అగుగాక!

**తా :** స్వామీ! నీవు స్వర్గానికీ, మోక్షానికీ మంచి ద్వారం అయినవాడవు. అన్ని రసాలూ స్వరూపం అయినవాడవు. పరమహంసవు. ధర్మపాలకుడవు. శ్రేష్ఠం, హితమూ అయిన ఫలమే రూపం అయినవాడవు. కృష్ణుడవు. ధర్మాత్ముడవు. సర్వశక్తులతో కూడిన వాడవు. గొప్పది అయిన సాంఖ్యయోగం పండించుకొన్నవారికి ప్రభుడవు. సువర్ణం నీ వీర్యం. రుద్రుడవు. ఉత్తమ శీలం కలవారికి రక్షకుడవు. దుష్టులకు శిక్షకుడవు. శూన్యమైన ప్రవృత్తి కలవాడవు. యజ్ఞాది కర్మలు నీవే. మృత్యుదేవతవు. విరాట్టు నీ శరీరం. సర్వధర్మస్వరూపుడవు. వాగ్వైభవమంతా నీవే. నివృత్తి నీతత్త్వం. గొప్ప పుణ్యంతో గొప్పది అయిన వర్చస్సు కలవాడవు. నీ దేహం అఖిల ధర్మాల స్వరూపం. ఆత్మవు. ఏ అడ్డూ ఆటంకమూ లేనివాడవు. పరిపూర్ణ స్వరూపుడవు. అట్టి నీకు నమస్కారం.

**తే.** **సర్వ సత్తాయ దేవాయ సన్నియామ, కాయ బహిర న్తరాత్మనే కారణాత్మ**
**నే సమస్తార్థలిఙ్గాయ నిర్గుణాయ, వేధసే జితాత్మక సాధవే నమోఽస్తు.** **704**

**ప్రతి :** సర్వసత్తాయ= సమస్తమైన ప్రాణిజాతము తానే అయినవానికి; దేవాయ= దేవునకు; సత్+నియామకాయ= తన ఉనికిచేత విశ్వాన్నంతటినీ నియమించేవానికి; బహిస్+అంతర్+ఆత్మనే= వెలుపల; లోపల వ్యాపించి ఉన్న తత్త్వస్వరూపునకు; కారణ+ఆత్మనే= సర్వానికి కారణమైన పరమాత్మకు; సమస్త+అర్థ లింగాయ= సర్వవిషయాలనూ అభివ్యక్తం చేసేవానికి; నిర్గుణాయ= గుణాల అంటు లేనివానికి; వేధసే= సృష్టికర్త అయినవానికి; జిత+ఆత్మక సాధవే= గెలువబడిన మనస్సు కల్గడంచేత సత్స్వరూపుడయినవానికి; నమః= నమస్కారం; అస్తు= అగుగాక!

**తా :** సర్వప్రాణి స్వరూపుడవు, దేవుడవు, అన్నింటి ఉనికినీ అధీనంలో పెట్టుకొన్నవాడవు, వెలుపల, లోపల వ్యాపించి ఉన్నవాడవు; కారణాత్ముడవు, సమస్తమైన విషయాలను అభివ్యక్తం చేసేవాడవు, నిర్గుణుడవు, స్రష్ట, మనోనిగ్రహం కలవాడవు, సాధువైనవాడవు అయిన నీకు నమస్కారం.

**వ.** **అని మఱియుఁ బ్రద్యుమ్నుం డవు నంతరాత్మవు సమస్త శేషకారణుండవు చాతుర్హోత్రరూపుండవు నంతకుండవు సర్వజ్ఞుండవు జ్ఞాన క్రియా రూపుండవు నంతఃకరణ వాసివియు నైన నీకు నమస్కరింతునని.**
**705**

**ప్రతి :** అని= ఇట్లు పలికి; మఱియున్= ఇంకా; ప్రద్యుమ్నుండవు= చాలా గొప్ప తేజస్సుతో ప్రకాశించేవాడవు; అంతరాత్మవు= సర్వజీవులలో లోపల వెలుగొందే ఆత్మవు; సమస్త శేషకారణుండవు= అన్ని విశేషములకు కారణమైనవాడవు; చాతుర్+హోత్రరూపుండవు= యజ్ఞాలలో నలుగురు హోతల రూపంతో ఉండేవాడవు; అంతకుండవు= అన్నింటినీ నీలో కలుపుకొనేవాడవు; సర్వజ్ఞుండవు= అన్నింటినీ తెలిసినవాడవు; జ్ఞాన+క్రియారూపుండవు= తెలియటం, చేయటం అనేవి రూపంగా కలవాడవు; అంతఃకరణ వాసివియును= జీవుల హృదయాలలో ఉండే శీలం కలవాడవు; ఐన= అయిన; నీకున్= నీకు; నమస్కరింతును= నమస్కారం చేస్తాను; అని= అనిపలికి.

**తా :** అని ఇంకా ఇలా అంటున్నాడు. నీవు ప్రద్యుమ్నుడవు (గొప్ప తేజస్సుతో ప్రకాశించేవాడవు), అంతరాత్మవు. సృష్టిలోని సర్వపదార్థాలూ నీ అంశలు. అవి ఏర్పడటానికి కారణమైనవాడవు. యజ్ఞాలలో నాలుగు విధాలుగా ఆయా కార్యాలు నిర్వహించే ఋత్విక్కులుగా అయ్యేవాడవు. సర్వాన్నీ లయం చేసేవాడవు. సర్వజ్ఞానమూర్తివి. జ్ఞాన క్రియలుగా గోచరించేవాడవు. సర్వజీవుల హృదయాలలో నివసించేవాడవు అయిన నీకు నమస్కరిస్తాను.

**క. అనఘా! దేవ! భవత్పద, వనరుహ సందర్శనేచ్ఛ వఱలిన మాకున్**
**విను వైష్ణవసత్కృతమై, యెనయు భవద్దర్శనంబు నీవె మహాత్మా! 706**

**ప్రతి :** అనఘా!= పుణ్యాత్ముడా; దేవ= ప్రభూ!; విను= ఆలకించు; భవత్+పద+వనరుహ+సందర్శన+ఇచ్ఛ= నీ పాదాలనే పద్మాలను చక్కగా చూడాలనే కోరిక; వఱలిన మాకున్= పెంపొందిన మాకు; వైష్ణవ+సత్+కృతము+ఐ= విష్ణుభక్తులలో ఉత్తములచే చక్కగా ఆచరించబడినదై; ఎనయు= ఒప్పారు; భవత్+దర్శనంబు= నీ సాక్షాత్కారాన్ని; మహాత్మా= పరమాత్మా; ఈవె= ఇవ్వు.

**తా :** స్వామీ! పుణ్యపురుషా! మహాత్మా! నీ పాదాలను తృప్తిగా చూడాలనే కోరిక అధికమైన, వైష్ణవులు గొప్పగా సంభావించే నీ దర్శనాన్ని మాకు అనుగ్రహించవయ్యా!

**వ. అది యెట్టి దనిన. 707**

**ప్రతి :** అది= ఆ సందర్శనం; ఎట్టి+అది= ఏ విధమైనది; అనినన్= అంటే...

**తా :** ఆ నీదర్శనం ఎటువంటిదంటే

**క. అనఘ! సకలేంద్రియగుణాం, జనమును భక్త ప్రియంబు జలదశ్యామం**
**బును సౌందర్య సమగ్రము, ననుపమమును నిత్య మంగళావహ మగుచున్. 708**

**ప్రతి :** అనఘ!= పాపస్పర్శ కూడా లేని మహానుభావా!; సకల+ఇంద్రియ+గుణ+అంజనమును= అన్ని ఇంద్రియాల గుణాల పూతకలది; భక్త ప్రియంబు= భక్తులకు ఇష్టమైనది; జలద+శ్యామంబునున్= మేఘంవలె నీలవర్ణంకలదియు; సౌందర్య సమగ్రము= సుందరత్వం నిండుగా గలది; అనుపమమును= పోలిక చెప్పనలవి కానిది; నిత్య మంగళ+ఆవహము= అన్ని వేళల శుభాలను కూర్చేది; అగుచున్= అవుతూ...

**తా :** పుణ్యాత్మా! అది ఇంద్రియాలన్నింటి గుణాలైన శబ్దం మొదలగువాని స్పర్శ కలది, భక్తులకు ప్రియమైనది, నీలమేఘంవలె శ్యామలవర్ణం కలది, అందచందాలతో అలరారుతూ ఉండేది, పోలిక లేనిది, నిత్యమంగళాలను కూర్చేది.

**వ. మఱియును. 709**

ప్రతి : మఱియును= ఇంకా.

**సీ. అళికులోపమ లసదలక శోభిత మగు, నమృతాంశు రేఖానిభాననమును**
**సమకర్ణ దివ్య భూషా ప్రభాకలితంబు, సుందర భ్రూనాస సురుచిరంబు**
**సలలిత కుంద కుట్మల సన్నిభ ద్విజ, పూరిత స్నిగ్ధ కపోల యుగముఁ**
**బద్మ పలాశ శోభన లోచనంబును, మందస్మితాపాంగ సుందరమును**

**తే. సస్మితాలోక సతత ప్రసన్న ముఖముఁ, గంబు సుందర రుచిర మంగళ గళంబు**
**హారమణి కుండల ప్రభాపూర కలిత, చారు మృగరాజ సన్నిభ స్కంధ యుతము. 710**

ప్రతి : అళికుల+ఉపమ లసత్+అలక శోభితము= తుమ్మెదల గుంపును పోలి ఒప్పారే ముంగురులతో విరాజిల్లునది; అగు= అయిన; అమృతాంశు= చంద్రుని; రేఖా= రేఖతో; నిభ= సదృశమైన; ఆననమును= మోము కలదీ; సమ= ఒకే రూపంతో ఉంటే; కర్ణ భూషా= చెవి ఆభరణాల; ప్రభా= కాంతులతో; కలితంబు= కూడినది; సుందర= అందమైన; భ్రూ= కనుబొమలతోను; నాస= ముక్కుతోను; సురుచిరంబు= మిక్కిలి మనోహరమైనది; సలలిత= విలాసంతోకూడిన; కుంద= మొల్లల; కుట్మల= మొగ్గలతో; సన్నిభ= పోలికవచ్చు; ద్విజ= దంతాలతో; పూరిత= నించబడిన; స్నిగ్ధ= నిగనిగలాడు; కపోలయుగము= చెక్కిళ్ళ జంటకలది; పద్మ పలాశ శోభన లోచనంబును= తామర రేకువలె సుందరమైన కన్నులుకలది; మంద స్మిత+అపాంగ సుందరమును= చిఱునగవుతో కూడిన కంటి కొనలతో అందమైనదియు; సస్మిత= చిరునవ్వుతో కూడిన; ఆలోక= చూపులతో; సతత= ఎల్లవేళల; ప్రసన్న= నిర్మలమైన కాంతిగల; ముఖము= మోముకలదియు; కంబు= శంఖంవలె; సుందర= చూడముచ్చట అయిన; రుచిర= కాంతిగల; మంగళ= శుభమైన; గళంబు= కంఠం కలది; హార= మాలల; మణికుండల= మణులు పొదిగిన కర్ణాభరణాల; ప్రభా= కాంతియొక్క; పూర= వెల్లువతో; కలిత= కూడియున్న; చారు= అందమైన; మృగరాజ= సింహంతో; సన్నిభ= పోలికగల; స్కంధ= శరీరంతో; యుతము= కూడినదియు.

**తా :** దేవా! నీ సుందరమైనమూర్తి తుమ్మెదల గుంపువలె ఒప్పారే ముంగురులతో అలరారే చంద్రరేఖనుపోలెడు ముఖం కలది. ఒకే విధంగా ఉండే కర్ణభూషణాల కాంతులతో కూడి ఉన్నది. తీర్చిదిద్దినట్లున్న కనుబొమలతో, నాసికతో సుందరంగా ఉన్నది. చాలా సుకుమారమైన మల్లెమొగ్గలవంటి పలువరుసతో నిండి నిగనిగలాడుతున్న చెక్కిళ్ళ జంటతో ఒప్పుతున్నది. తామర రేకులవంటి అందమైన కన్నులు విరాజిల్లుతున్నాయి. చిరునగవుతో ఒప్పారే కంటికొనలతో సుందరంగా ఉన్నది. చిరునవ్వుతో కూడిన చూపులతో నిరంతరం ప్రసన్నంగా ఉంది మోము. శంఖంవలె సుందరమైన కాంతికలిగిన శుభమైన కంఠం కుదురుకొని ఉన్నది. సువర్ణమయహారాల, మణికుండలాల కాంతుల వెల్లువతో కూడిన అందమైన సింహంవంటి శరీరం కలిగి ఉన్నది.

**వ. వెండియు శంఖ చక్ర గదా పద్మ కలితాయత బాహు చతుష్టయంబును, వైజయంతీ వనమాలికా కౌస్తుభమణి శ్రీవిరాజితంబును, నిత్యానపాయిని యయిన యిందిరా సుందరీరత్న పరిస్పందంబునం దనరి తిరస్కృత నికషోపల వక్షస్థలంబును, నుచ్ఛ్వాస నిశ్శ్వాసంబులం జంచలంబులైన వళిత్రయ రుచిర ప్రకాశమాన దళోదరంబును, బూర్వవినిర్గత నిఖిల విశ్వంబునుం బ్రవిష్టంబుఁ జేయురీతి నొందు సలిలావర్త సన్నిభ**

**గంభీరనాభీ వివరంబును, బంకజ కింజల్క విభాసిత దుకూలనిబద్ధకనక మేఖలాకలాప శోభితశ్యామ పృథు నితంబ బింబంబును, నీల కదళీ స్తంభరుచిరోరు యుగళంబును, సమచారు జంఘంబును, నిమ్నజాను యుగళంబును, బద్మపత్త్ర భాసుర పాదద్వయంబును, మదీయాంతరంగ తమోనివారక నిర్మల చంద్రశకల సన్నిభ నఖంబును, గిరీట కుండల గ్రైవేయహార కేయూర వలయ ముద్రికా మణి నూపురాది వివిధ భూషణ భూషితంబును, నిరస్త సమస్త నతజన సాధ్వసంబును, భక్తజన మనోహరంబును సర్వమంగళాకరంబును నైన భవద్దివ్య రూపంబుఁ దామసజన సన్మార్గ ప్రదర్శకుండవైన నీవు మాకుఁ జూపి మమ్ముఁ గృతార్థులం జేయుమని వెండియు నిట్లనియె. 711**

ప్రతి : వెండియున్= ఇంకా; శంఖ= పాంచజన్యమనే శంఖంతో; చక్ర= సుదర్శనం అనే చక్రంతో; గదా= కౌమోదకి అనే గదతో; పద్మ= పద్మంతో; కలిత= కూడిన; ఆయత= పొడవైన; బాహు= చేతులు; చతుష్టయంబును= నాలుగింటి సముదాయం కలది; వైజయంతీ= వైజయంతి అనే పేరుగల వనమాలయొక్క; కౌస్తుభమణి= కౌస్తుభమనే మణియొక్క; శ్రీ= శోభతో; విరాజితంబును= ప్రకాశిస్తున్నదియు; నిత్య+అనపాయిని= నిరంతరం విడిచిపెట్టి ఉండనిది; ఐన= అయిన; ఇందిరా సుందరీ రత్న పరిస్పందంబునన్= లక్ష్మీదేవి అనే సుందరి అయిన ఇల్లాలి కదలికతో; తనరి= ఒప్పి; తిరస్కృత నికష+ఉపల వక్షస్ స్థలంబునున్= వెనుకకు త్రోసివేసిన ఒరగల్లువంటి రొమ్ముభాగంకలది; ఉచ్ఛ్వాస నిఃశ్వాసంబులన్= పీల్చేగాలీ, వదలేగాలీ అనే వానితో; చంచలంబులు+ఐన= అందంగా కదలాడుతున్న; వళిత్రయ, రుచిర, ప్రకాశమాన దళ+ఉదరంబును= మూడుముడుతలతో అందమైన ప్రకాశిస్తున్న పెద్దది అయిన పొట్ట గలదియు; పూర్వ వినిర్గత నిఖిల విశ్వంబును= వెనుక వెలువడిన సమస్త ప్రపంచ సముదాయాన్ని; ప్రవిష్టంబున్+చేయు= చొప్పించే; రీతిన్= విధాన్ని; ఒందు= పొందే; సలిల+ఆవర్త, సన్నిభ, గంభీర, నాభీవివరంబును= నీటి సుడివలె మిక్కిలిలోతైన బొడ్డురంధ్రం గలదియు; పంకజ= పద్మపు; కింజల్క= కేసరాలవలె; విభాసిత= చక్కగా ప్రకాశిస్తున్న; దుకూల= పట్టువస్త్రం మీద; నిబద్ధ= చక్కగా కట్టిన; కనకమేఖలా= బంగారు మొలతాటి; కలాప= పేటలతో; శోభిత= అందగించిన; శ్యామ= నీలివన్నెగల; పృథు= పెద్దదైన; నితంబ+బింబమున్= పిరుదుల భాగం కలదీ; నీల= నల్లని; కదళీ= అరటి; స్తంభ= బోదెలవంటి; రుచిర= చక్కనికాంతిగల; ఊరు+యుగళంబును= తొడలజంట గలదీ; సమ చారు జంఘంబును= ఎక్కువ తక్కువలులేని అందమైన పిక్కలు గలదీ; నిమ్న జాను యుగళంబును= గంభీరమైన మోకాళ్ళజంట గలదియు; పద్మ= తామరల; పత్త్ర= రేకులవలె; భాసుర= కాంతితో విరాజిల్లుతున్న; పాద ద్వయంబును= కాలిజంటయును; మదీయ= నాదైన; అంతరంగ= హృదయంలోని; తమః = చీకటిని; నివారక= తొలగించి వేసే; నిర్మల= పరిశుభ్రమైన; చంద్రశకల= చంద్రుని ముక్కలతో; సన్నిభ= సాటియైన; నఖంబును= గోళ్ళు కలది; కిరీట= మకుటం; కుండల= కర్ణాభరణాలు; గ్రైవేయహార= మెడలోనిహారాలు; కేయూర= భుజకీర్తులు; వలయ= కంకణాలూ; మణినూపుర= మణులతో కూర్చిన కాలిఅందెలు; ఆది= మొదలైన; వివిధ భూషణ భూషితంబును= పెక్కువిధాలైన ఆభరణాలతో అలంకరించబడినది; నిరస్త= పోగొట్టబడిన; సమస్త= సకల; నతజన= భక్తజనుల; సాధ్వసంబును= వెరపుగలదియు; భక్త జన మనోహరంబును= భక్తులైన జనుల మనస్సులను ఆకట్టుకొనేది; సర్వ మంగళ+ఆకరంబును= సర్వశుభాలకు నెలవైనది; ఐన= అయిన; భవత్+దివ్యరూపంబున్= నీదైన దేవ సంబంధమైన రూపాన్ని; తామస= తమోగుణం అధికంగాగల; జన= జనులకు; సత్+మార్గ= మంచిదారిని; ప్రదర్శకుండవు= చూపువాడవు; ఐన+నీవు= అయినట్టి నీవు; మాకున్= మాకు; చూపి= కన్పట్టజేసి; మమ్మున్= మమ్ములను; కృత+అర్థులన్= నెరవేరిన ప్రయోజనం కలవారినిగా; చేయుము; అని= అని పలికి; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** ఆ భగవంతుని దివ్యరూపం ఈ విధంగా ఉన్నది. శంఖం, చక్రం, గద, పద్మాలతో విరాజిల్లుతున్న నాలుగు చేతులు, వైజయంతి అనే వనమాలతో, కౌస్తుభం అనే మణియొక్క శోభతో ప్రకాశిస్తున్నదీ, ఎప్పుడూ తన్ను వదలి ఉండని లక్ష్మీదేవి అనే సుందరీమణితో కూడిన చైతన్యంతో ఒప్పారుతున్నదీ, ఒరగంటిని కాదనగల్గినదైన రొమ్ము ప్రదేశంతో విరాజిల్లుతున్నదీ, పీల్చేగాలీ, వదలేగాలీ అనే వానితో అందంగా కదులుతున్న మూడుముడుతలతో సుందరంగా ప్రకాశిస్తున్న సన్నని నడుముతో అలరారుతున్నది. మునుపు వెలుపలికి వచ్చిన సమస్తమైన విశ్వాన్నీ మళ్లీ లోపలికి తీసుకుంటున్నదా అనిపించే నీటి సుడిలాగా ఉన్న, లోతైన బొడ్డు ఒప్పారుతున్నది. పద్మంలోని కేసరాలవలె చక్కగా వెలుగొందుతన్న పట్టుబట్ట మీద కట్టబడిన బంగారు మొలతాటి పేటలతో అందగించిన నీలవర్ణంకలదీ, పెద్దదీ అయిన పిరుదుల భాగం శోభిల్లుతూ ఉన్నది. నల్లని అరటి బోదెలవంటి సుందరమైన రెండుతొడలతో అలరారుతున్నది, సమంగా సుందరంగా ఉన్న పిక్కలు కలిగి ఉన్నది. గంభీరమైన మోకాళ్ళ జంటతో ప్రకాశిస్తున్నది. తామరరేకువలె వెలుగొందుతున్న పాదాలజంటతో ప్రకాశిస్తున్నది. నాదైన మనస్సులోని చీకటిని ఆపివేసే నిర్మలమైన చంద్రకళలవలె ఉన్నట్టి గోళ్ళు కలిగి ఉన్నది. కిరీటం, కుండలాలు, మెడలోని హారాలు, భుజకీర్తులు, వలయాలు, ఉంగరాలూ, మణినూపురాలు మొదలైన పెక్కుతీరులైన ఆభరణాలతో అలంకృతమై ఉన్నది. జనులందరి, అన్ని విధాలైన భయాలను తొలగించి వేస్తున్నది. భక్తజనులకు మనోహరంగా ఉన్నది, సర్వశుభాలకూ నిలయమై ఉన్నది. స్వామీ! అటువంటి నీ దివ్యమైన స్వరూపాన్ని తామసగుణంతో నీచస్థితికి జారిపోయే జనాలకు కూడా సన్మార్గాన్ని చూపించేవాడవైన నీవు మాకు చూపి మమ్ములను నెరవేరిన ప్రయోజనం కలవారినిగా చెయ్యి అని ఇంకా ఇలా అన్నాడు.

**సీ.** **ఆత్మకుఁ బరిశుద్ధి నర్థించు వారికి ధ్యేయ వస్తువు భవద్దివ్యమూర్తి!**
**యంచిత స్వర్గరాజ్యాభిషిక్తున కైన సమధిక స్పృహణీయతముఁడ వీవు,**
**సద్భక్తియుత భక్తజన సులభుండవు దుష్టాత్ములకుఁ గడు దుర్లభుండ**
**వాత్మదర్శనులకు నరయ గమ్యుండవు నై యర్థి విలసిల్లు దనఘచరిత!**

**తే.** **యిట్టి నిఖిల దురారాధ్యు నీశు నిన్ను, నెఱయ సుజనులకైన వర్ణింపరాదు,**
**వఱల నెవ్వఁడు పూజించుఁవాఁడు విడువఁ, జాలునే పద్మదళ నేత్ర! సచ్చరిత్ర!** **712**

**ప్రతి :** ఆత్మకున్= మనస్సునకు; పరిశుద్ధిన్= నిర్మలత్వాన్ని; అర్థించువారికిన్= కోరేవారికి; ధ్యేయ+వస్తువు= ధ్యానించ తగిన పదార్థం; భవత్+దివ్య+మూర్తి= నీదైన దేవసంబంధమైన ఆకృతి; అంచిత+స్వర్గ+రాజ్య+అభిషిక్తునకున్= గొప్పదైన స్వర్గ రాజ్యానికి అభిషేకం పొందిన వానికి; ఐనన్= అయినా; సమధిక+స్పృహణీయతముఁడవు= చాలా ఎక్కువగా కోరదగినవాడవు; ఈవు= నీవు; సద్+భక్తి యుత భక్త జన సులభుండవు= స్థిరంగా నిలిచి ఉండే భక్తితో కూడిన భక్తులైనవారికి కష్టపడ నక్కరలేకుండా దొరకేవాడవు; దుష్ట+ఆత్ములకున్= చెడుబుద్ధి కలవారికి; కడు= మిక్కిలి; దుర్లభుండవు= ఎంత కష్టపడినా దొరకనివాడవు; అనఘచరిత= పుణ్యప్రవృత్తి కలవాడా!; ఆత్మ దర్శనులకున్= ఆత్మను జ్ఞానంతో చూడగలవారికి; అరయన్= పరిశీలించగా; గమ్యుండవును= చేరుకోదగినవాడవు; ఐ= అయి; అర్థిన్= కోరికతో; విలసిల్లుదు= ఒప్పారుతూ ఉంటావు; ఇట్టి= ఈ విధమైన; నిఖిల దుర్+ఆరాధ్యున్= సర్వులకు సులభంగా ఆరాధించరాని; ఈశున్= స్వామిని; నిన్నున్= నిన్ను; నెఱయన్= ఒప్పునట్లుగా; సుజనులకు= మంచి స్వభావం కలవారికి; ఐనన్= అయినా; వర్ణింపరాదు= వర్ణించటం శక్యంకాదు; ఎవ్వడు= ఎవడు; వఱలన్= ప్రకాశించేటట్లుగా; పూజించు= పూజిస్తాడు;

వాడు= అవ్వాడు; విడువన్+చాలునే= విడువగలడా (విడువలేడు); పద్మదళనేత్ర= తామర రేకులవంటి కన్నులు కలవాడా!; సత్+చరిత్ర= మంచి చరిత్రకలవాడా!;

**తా :** ఓ పాపభావనలేని ప్రవృత్తి కలవాడా! తామర రేకులవంటి కన్నులున్నవాడా! అందరకు అలవరచుకోవలసిన మంచి చరిత్ర కలవాడా! స్వామీ! ఆత్మకు నిర్మలత్వాన్ని కోరేవారు ధ్యానించతగినది నీ దివ్యమూర్తి. గొప్పదైన స్వర్గరాజ్యానికి అభిషేకం పొందిన వానికైనా చాలా ఎక్కువగా ఆశపడదగినవాడవు నీవు. మంచి భక్తితో కూడిన భక్తజనులకు నీవు సులభుడవు. దుష్టబుద్ధులకు నీవు దుర్లభుడవు. పరిశీలించగా ఆత్మను దర్శించవలె ననుకొనేవారికి పొందదగిన వాడవై నీవు కోరికతో ఒప్పారుతూ ఉంటావు. ఈ విధంగా ఎంతో శ్రమతో కానీ ఆరాధించటానికి వీలుకాని స్వామిని నిన్ను బాగుగా వర్ణించటం సుజనులకు కూడా సాధ్యం కాదు. ప్రకాశమానంగా నిన్ను పూజించేవాడు నిన్ను విడువగలడా?

**విశే :** ఆత్మకు పరిశుద్ధి అంటే నశించే ప్రపంచ సంబంధమైన భోగాల మీద భావన లేకుండటం.

ఆత్మదర్శనులు – పరమాత్మ తత్త్వసంబంధం అయిన జ్ఞానం కలవారు.

**చ. ఎనసిన భక్తి యోగమున నే భవదీయపదాబ్జ మొందఁగా**
**ననయముఁ గోరువాఁడు చటులాగ్రహభీషణ వీర్యశౌర్య త**
**ర్జనములచే ననూనగతి సర్వజగంబులు సంహరించు న**
**య్యనుపముఁడైన కాలుని భయంబును బొందఁడు సుమ్ము కావునన్. 713**

**ప్రతి :** ఎనసిన+భక్తి యోగమునన్+ఏ= అతిశయించిన భక్తి అనే యోగంతోనే; భవదీయ+పద+అబ్జమున్= నీవైన పాదాలనే పద్మాలను; ఒందఁగాన్= పొందాలని; అనయమున్= ఎల్లప్పుడూ; కోరువాడు= కోరే మనిషి; చటుల= భయంకరమైన; ఆగ్రహ= కోపంతో; భీషణ= వెరపుగొలిపే; వీర్య= దేహబలంతో; శౌర్య= మనోబలంతో; చేసే; తర్జనములచేన్= బెదరింపుపనులతో; అనూనగతిన్= మిక్కిలి ఎక్కువ అయిన తీరుతో; సర్వజగంబులు= అన్ని లోకాలనూ; సంహరించు ఆ+అనుపముఁడు= నాశనం చేసే ఆ సాటిలేనివాడు; ఐన కాలుని భయంబును= అయినట్టి మృత్యుదేవతవలన కలిగే భీతిని; పొందఁడు= అనుభవించడు; సుమ్ము= సుమా!; కావునన్= కాబట్టి...

**తా :** భక్తియోగంతో నీ పాదపద్మాలను నిరంతరమూ పొందకోరేవాడు వెరపుగొలిపే కోపమూ, భయం పుట్టించే వీర్య శౌర్యాలతో కూడిన బెదరింపు చేష్టలు అనే వాటితో లోకాలన్నింటినీ నాశనం చేసే ఆ సాటిలేని యమునివలన కలిగే భయాన్ని కూడా పొందడు. సుమా! కాబట్టి

**తే. ఇట్టి నీ పాదమూలంబు లెవ్వఁడేని, పొంది ధన్యాత్ముఁడౌ నట్టి పుణ్యుఁ డొండు**
**మనము లోపలఁ గోరునే మఱచియైన, నవ్యయానంద! గోవింద! హరి! ముకుంద! 714**

**ప్రతి :** ఇట్టి= ఈ విధమైన; నీ పాదమూలంబులు= నీ పాదాల మొదలును; ఎవ్వఁడు+ఏని= ఎవ్వడైనా; పొంది= చేరుకొని; ధన్య+ఆత్ముఁడు= పుణ్యమైన హృదయంకలవాడు; ఔన్= అగునో; అట్టి పుణ్యుఁడు= అటువంటి పుణ్యంకలవాడు; మఱచి= స్మృతిని కోల్పోయి; ఐనన్= అయినా; మనములోపలన్= మనస్సులో; ఒండు= మరొకదానిని; కోరునే= కోరునా? అవ్యయ+ఆనందా!= తరుగుపోని ఆనందంకలవాడా!; గోవింద= గోవిందా!; హరి= ఓ విష్ణూ!; ముకుంద= ఓ ముక్తిప్రదాతా!

**తా :** ఎక్కువ తక్కువలులేని ఆనందం కలవాడా! భూమినీ, గోవులనూ, వేదాలనూ, వాక్కులనూ సంతోషపెట్టేవాడా! అజ్ఞానాన్ని హరించేవాడా! ముక్తిని ప్రదానం చేసేవాడా! ఈ విధమైన మీ పాదాలను ఎవ్వడైనా పొంది పుణ్యాత్ముడైతే వాడు పొరపాటున కూడా మరొక దానిని వాంఛిస్తాడా? ఎన్నటికినీ వాంఛించడు.

**క. హరి! నీ భక్త జనులతోఁ, నిరుపమగతిఁ జెలిమిసేయు నిమిషార్ధముతోఁ**
**సరిగాదు మోక్ష మనిన న, చిరశుభ మగు మర్త్య సుఖముఁ జెప్పఁగ నేలా? 715**

**ప్రతి :** హరి= ఓ విష్ణూ!; నీ భక్తజనులతోన్= నీ యందు భక్తిగలజనాలతో; నిరుపమగతిన్= పోలిక చెప్పటానికి వీలులేని తీరున; చెలిమి+చేయు= స్నేహంచేసే; నిమిష+అర్ధముతోన్= కనురెప్పపాటులో సగం కాలంతో కూడా; మోక్షము= ముక్తి; సరికాదు= తూగదు; అనినన్= అంటే; అచిర శుభము= కొద్దిపాటికాలంలో మేలైనది; అగు మర్త్యసుఖము= అయిన మానవలోక సుఖాన్ని గూర్చి; చెప్పగన్= చెప్పటం; ఏలా?= ఎందుకు?

**తా :** హరీ! మోక్షం మీ భక్తులతో సాటిలేని విధంగా చెలిమిచేసే అరనిముసం మాత్రంతోనైనా సరికాదు. అంటే క్షణభంగురమైన మానవ సుఖం సంగతి చెప్పటం ఎందుకు?

**క. దురిత వినాశక పదపం, కరుహ! భవత్కీర్తి తీర్థకణచయ బాహ్యాం**
**తర సేక ధూత కల్మష, పురుషులు ధరమీఁదఁ దీర్థభూతులు గారే! 716**

**ప్రతి :** దురిత= పాపాలను; వినాశక= పూర్తిగా నశింపజేసే; పద= పాదాలనే; పంకరుహ= పద్మాలుగలవాడా!; భవత్= నీదైన; కీర్తి= యశస్సు అనే; తీర్థ= పవిత్రజలంయొక్క; కణ+చయ= బొట్టుల సముదాయంచేత; బాహ్య+ఆంతర= వెలుపలి, లోపలి; సేక= తడుపుటచేత; ధూత= కడిగి వేయబడిన; కల్మష= పాపాలుగల; పురుషులు= మానవులు; ధరమీఁదన్= భూమిమీద; తీర్థభూతులు= తీర్థాలుగా అయినవారు; కారే= కారా!

**తా :** పాపాలను పటాపంచలు చేసే పాదాలనే పద్మాలుగల ఓ స్వామీ! నీ కీర్తి అనే తీర్థపు నీటి బొట్టులతో వెలుపలలోపల తడిసిన స్థితి కలుగుటచేత రూపుమాసిన పాపాలుగల మానవులు భూమిమీద తీర్థాలుగా అయినవారే కాకుంటారా?

**విశే :** తీర్థభూతులు – తీర్థం అంటే తరింపజేసేది. సంసారదుఃఖంనుండి గట్టెక్కించేవారు.

**వ. అట్టి భూతదయా సమేతులును రాగాది విరహిత చిత్తులును నార్జవాది గుణ యుక్తులును నయిన భాగవత జనుల సంగంబు మాకుం గలుగంజేయు, మిదియ మమ్మనుగ్రహించుట యని వెండియు నిట్లనియె. 717**

**ప్రతి :** అట్టి భూతదయా సమేతులు= ఆ విధమైన ప్రాణికోటియందు కృపతో కూడి ఉండేవారు; రాగ+ఆది+విరహచిత్తులు= అనురాగం మొదలైనవి లేని హృదయాలు కలవారు; ఆర్జవ+ఆది గుణయుక్తులుకున్= కల్లా కపటాలు లేకుండటం మొదలైన గుణాలతో కూడి ఉండేవారు; ఐన భాగవతజనుల సంగంబు= అయినటువంటి భక్తజనులను అంటి పెట్టుకొని ఉండటం; మాకున్= మాకు; కలుగన్+చేయుము= కలుగునట్లు చెయ్యి; ఇది+అ= ఇదే; మమ్మున్= మమ్ములను; అనుగ్రహించుట= దయజూడటం; అని= అని పలికి; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** ఆ విధంగా అన్ని ప్రాణులయందు అనురాగం ఉన్నవారు, రాగం మొదలైనవి లేని హృదయాలు కలవారు, వక్రబుద్ధులు లేకుండటం మొదలైన గుణాలతో కూడినవారు అయిన భగవంతునికి సర్వసమర్పణ చేసికొన్న భక్తజనులతో మాకు మైత్రి ఉండే స్థితిని కలిగించు ఇదే మమ్ము అనుగ్రహించుట అని ఇంకా ఇలా పలికాడు. (బ్రహ్మ).

**చ. సరసిజనాభ! సత్పురుష సంగసమంచిత భక్తి యోగ వి**
**స్ఫురణ ననుగ్రహింపఁబడి శుద్ధము నొందినవాని చిత్త మ**
**స్థిర బహిరంగముం గనదు, చెందదు భూరితమస్స్వరూపసం**
**సరణ గుహం జిరంబు గనఁజాలు భవన్మహనీయతత్త్వమున్ 718**

**ప్రతి :** సరసిజనాభ= పద్మం బొడ్డునకలవాడా!; సత్+పురుష= యోగ్యతగల పురుషుల; సంగ= కలయికతో ఏర్పడిన; సమంచిత= మిక్కిలి ఒప్పారునట్టి; భక్తి యోగ= భక్తికి సంబంధించిన యోగంయొక్క; విస్ఫురణన్= విశేషమైన స్ఫూర్తితో; అనుగ్రహింపన్+పడి= అనుగ్రహం పొంది; శుద్ధమున్= పరిశుద్ధతను; ఒందినవాని చిత్తము= పొందినవాని హృదయం; అస్థిర బహిర్+అంగమున్= కుదురులేని వెలుపలి దేహాన్ని (వెలుపలి ప్రపంచాన్ని); కనదు= చూడదు; భూరి= పెద్దది అయిన; తమస్= చీకటే; స్వరూప= తన రూపంగాగల; సంసరణ= సంసారమనే; గుహన్= కొండబిలాన్ని; చెందదు= ప్రవేశించదు; భవత్+మహనీయ తత్త్వమున్= నీదైన, గొప్పదైన పరమాత్మ తనాన్ని; చిరంబు= పెద్దకాలం; కనన్+చాలున్= చూడగలదు.

**తా :** పద్మనాభా! సత్పురుషుల స్నేహంతో గొప్పగా ఏర్పడిన భక్తియోగ ప్రకాశంతో అనుగ్రహించబడి నిర్మలమైన చిత్తం చంచలమైన వెలుపలి దేహాన్ని కానీ, ప్రపంచాన్ని కానీ చూడదు. పెద్దదైన చీకటే స్వరూపంగాగల సంసారమనే గుహలో ప్రవేశించదు. నీదైన మహిమగల తత్త్వాన్ని ఎల్లప్పుడూ చూడ గలుగుతుంది.

**విశే :** సజ్జనుల సంగతివలన మూడు ప్రయోజనాలు. 1. అది పొందినవారికి ప్రపంచ సంబంధం తొలగిపోతుంది. 2. గాఢమైన అజ్ఞానం అతనిని లోగొనజాలదు. 3. పరమాత్మ దర్శనం శాశ్వతంగా లభిస్తుంది.

**వ. అది యెట్టిదనిన. 719**

**ప్రతి :** అది= ఆ స్థితి; ఎట్టిది= ఏ విధమైనది; అనినన్= అంటే.

**తా :** ఆ స్థితి ఏ విధమైనదంటే.

**సీ. అరయంగ నేమిటి యందు నీ విశ్వంబు విదితమై యుండు నీ విశ్వమందు**
**నేది ప్రకాశించు? నెప్పుడు నట్టి స్వయంజ్యోతి నిత్యంబు నవ్యయంబు**
**నాకాశమును బోలి యవిరళ వ్యాపక మగు నాత్మతత్త్వంబు నధిక మహిమ**
**నమరు పరబ్రహ్మ మగు నని పల్కి యి ట్టనియె నవిక్రియుండైన వాఁడు**

**తే. నెవ్వఁ డాతఁడు దనయందు నెపుడు నాత్మ, కార్యకరణ సమర్థంబు గాని భేద**
**బుద్ధి జనకంబు నాఁదగు భూరిమాయఁ, జేసి విశ్వంబు సత్యంబుగా సృజించె. 720**

**ప్రతి :** అరయంగన్= చక్కగా చూడగా; ఏమిటియందున్= దేనియందు; ఈ విశ్వంబు= ఈ సర్వలోకాల, గ్రహాల సముదాయం; విదితము= తెలియవచ్చేది; ఐ= అయి; ఉండున్= ఉంటుందో; ఈ విశ్వమందున్= ఈ అన్ని లోకాల సముదాయంలో; ఏది= ఏ తత్త్వం; ఎప్పుడున్= అన్ని కాలాలలో; ప్రకాశించున్= వెలుగొందుతూ ఉంటుందో; అట్టి= ఆ విధమైన; స్వయంజ్యోతి= తనంత ప్రకాశించువెలుగు; నిత్యంబున్= శాశ్వతం; అవ్యయంబున్= ఏ వికారాలూ లేని

ఏకరూపమైనది; ఆకాశమును= ఆకాశమనే మొదటి పదార్థాన్ని; పోలి; అవిరళ వ్యాపకము= అవకాశం లేకుండా వ్యాపించునది; అగు= అయిన; ఆత్మతత్త్వంబున్= పరమాత్మతనంతో; అధికమహిమన్= ఎక్కువ ప్రభావంతో; అమరు= ఒప్పారెడు; పరబ్రహ్మము+అగు= అన్నింటికి ఆవలిదైన మహావస్తువు; అగున్= అగును; అని= ఇలా అని; పల్కి= చెప్పి; యిట్టు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అవిక్రియుండు+ఐన= ఏవికారములూ లేనివాడైనవాడు; ఎవ్వఁడు= ఎవ్వడో; ఆతఁడు= ఆ వ్యక్తి; ఆత్మ కార్య కరణ సమర్థంబు= తన పనులు చేసుకొనటానికి శక్తి కలది; కాని= కానట్టిది; భేద బుద్ధి జనకంబున్= పరమాత్మకంటె వేరైనది అనే బుద్ధి పుట్టించేది; నాన్= అనగా; తగు= తగునట్టి; భూరిమాయన్= గొప్పదైన మాయ అనే మరొక పేరుగల ప్రకృతిని; ఎప్పుడు= ఎల్ల వేళలా; తనయందున్= తన లోపలనుండియే; చేసి= రూపొందించి; విశ్వంబున్= విశ్వాన్ని; సత్యంబు+కాన్= ఎప్పుడూ ఉండేదానినిగా; సృజించెన్= సృష్టి చేశాడు.

**తా :** పరిశీలించి చూడగా దేనియందు విశ్వం స్పష్టంగా తెలుస్తూ ఉంటుందో, ఈ విశ్వంలో ఏది ఎప్పుడూ ప్రకాశిస్తూ ఉంటుందో అట్టి స్వయంజ్యోతి నిత్యమును అవ్యయమును ఆకాశమును పోలి నిండుగా వ్యాపించి ఉండెడి అధిక మహిమతో అమరి ఉండెడి ఆత్మతత్త్వమే పరబ్రహ్మము అయిన తాను (అనగా విష్ణువే) అని పలికి యిట్లనెను ఏ వికారములును లేనివాడు అయిన విష్ణువు తన యందు ఎప్పుడూ ఆత్మకు చెందిన విషయాలలో సమర్థతలేక పరమాత్మకంటే వేరైనది అనుబుద్ధిని పుట్టించగల్గిన మహామాయతో విశ్వాన్ని సృష్టించినాడు.

**ఆ. మరల మరలఁ బెక్కుమాఱు లీ విశ్వంబు, జనన వృద్ధి విలయ సంగతులను**
**నందఁ జేయుచుండు నట్టి యీశ్వరుఁడవై, తనరు నిన్ను నాత్మ తత్త్వముగను. 721**

**ప్రతి :** మరలన్+మరలన్= మళ్ళీ మళ్ళీ; పెక్కుమాఱులు= చాలా పర్యాయాలు; ఈ విశ్వంబున్= ఈ విశ్వాన్ని; జనన వృద్ధి విలయ సంగతులనున్= ఏర్పడటం, పెంపొందటం, రూపు మాసిపోవటం అనే విధానాలను; అందన్+చేయుచుండు+ అట్టి= పొందజేసేటటువంటి; ఈశ్వరుఁడవు= ప్రభువవు; ఐ= అయి; తనరు నిన్నున్= ఒప్పేనిన్ను; ఆత్మ+తత్త్వముగను= ఆత్మతత్త్వంగా...

**తా :** మరల మరల అనేక పర్యాయాలు ఈ విశ్వం పుట్టుకకూ, పెరుగుదలకూ, ప్రళయానికీ కారణమైన ఈశ్వరుడవై ప్రకాశించే నిన్ను ఆత్మతత్త్వంగా

**వ. తెలియుదు మని వెండియు నిట్లనియె, యోగపరాయణు లగువారు శ్రద్ధా సమన్వితులై క్రియాకలాపంబుల నంతఃకరణోపలక్షితం బయిన భవదీయ రూపంబు యజింతురు, వారు వేదాగమతత్త్వ జ్ఞానులు, నీ వాద్యుండవును ననాదియు నద్వితీయుండవును మాయాశక్తి యుక్తుండవునునై విలసిల్లుచుండుదు వట్టి మాయాశక్తిచేత. 722**

**ప్రతి :** తెలియుదుము= తెలుసుకుంటాము; అని= ఇలాచెప్పి; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; యోగ పరాయణులు= యోగమునందే చెదరని దీక్షగల వ్యక్తులు; అగువారు= అయినవారు; శ్రద్ధా సమన్వితులు= శ్రద్ధతో కూడినవారు; ఐ= అయి; క్రియా కలాపంబులన్= యజ్ఞం మొదలైన క్రియల సముదాయాలచేత; అంతః కరణ+ఉపలక్షితంబు= అంతరంగంతో సూచించినది; ఐన= అయిన; భవదీయరూపంబున్= నీదయిన రూపాన్ని; యజింతురు= పూజిస్తారు; వారు= ఆ వ్యక్తులు; వేద+ఆగమ తత్త్వజ్ఞానులు= వేదాల, ఆగమాల తత్త్వాలను తెలిసినవారు; నీవు; ఆద్యుండవు=

మొదటివాడవు; అనాదియున్= మొదలు లేనివాడవు; అద్వితీయుండవు= నీ వంటిది మరొకటి లేనివాడవు; మాయాశక్తి+యుక్తుండవును= మాయకు సంబంధించిన శక్తితో కూడిన వాడవు; ఐ= అయి; విలసిల్లుచుందువు= గొప్పగా ప్రకాశిస్తూ ఉంటావు; అట్టి= ఆ విధమైన; మాయాశక్తి చేతన్= మాయయొక్క శక్తిచేత.

**తా :** (నిన్ను ఆత్మతత్త్వంగా) తెలుసుకుంటాము అని ఇంకా ఇలా అన్నాడు. యోగంపట్ల నిష్ఠగలవారు శ్రద్ధతో కూడినవారై యజ్ఞం మొదలైన క్రియల సముదాయంతో సూక్ష్మదేహంతో గుర్తింపదగిన నీ రూపాన్ని ఆరాధిస్తూ ఉంటారు. వారు వేదాల ఆగమాల తత్త్వాల జ్ఞానం కలవారు. నీవు సమస్త సృష్టికంటె ముందే ఉన్నవాడవు. నీవు ఆది లేనివాడవు. నీ వంటితత్త్వం మరొకటి లేదు. మాయాశక్తితో కూడినవాడవై విరాజిల్లుతూ ఉంటావు. ఆ మాయాశక్తి చేత

**సీ.** **చతురాత్మ! సత్త్వరజస్తమోగుణములు వరుస జనించెను, వాని వలన**
**మహదహంకార తన్మాత్రనభోమరు దనల జలావని ముని సుపర్వ**
**భూతగణాత్మక స్ఫురణ నీ విశ్వంబు భిన్నరూపమున నుత్పన్న మయ్యె,**
**దేవ! యీ గతి భవదీయ మాయను జేసి రూఢిఁ జతుర్విధరూపమైన**

**తే.** **పురము నాత్మాంశమునఁ జెందు పురుషుఁ డింద్రి, యములచే విషయ సుఖము లనుభవించు**
**మహిని మధుమక్షికాకృత మధువుఁ బోలి, యతనిఁ బురవర్తి యగు జీవుఁ డంద్రు మఱియు. 723**

**ప్రతి :** చతుర+ఆత్మ= నేర్పుగల బుద్ధి విశేషం కలవాడా!; వరుసన్= క్రమంగా; సత్త్వ రజస్+తమస్+గుణములు= సత్త్వం, రజస్సు, తమస్సు అనే లక్షణాలు; జనించెను= పుట్టాయి; వానివలనన్= ఆ మూడు గుణాలవలన; మహత్= మహత్తు అనే తత్త్వమూ; అహంకార= 'అహం' నేను అనే స్ఫురణ; తత్+మాత్ర= శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అనే విషయాలూ; నభస్= ఆకాశం; మరుత్= గాలి; అనల= అగ్ని; జల= నీరు; అవని= భూమి; ముని= మహర్షులు; సుపర్వ= దేవతలు; భూత= ప్రాణులు; అనువాని; గణ= సముదాయం అనే; ఆత్మక= స్వరూపం కలదిగా; స్ఫురణన్= తోచటంచేత; ఈ విశ్వంబు= ఈ విశ్వం; భిన్నరూపమునన్= వేరువేరు స్వరూపంతో; ఉత్పన్నము= పుట్టినది; అయ్యెన్= అయినది; దేవ= ప్రభూ!; ఈ గతిన్= ఈ విధంగా; భవదీయ మాయను+చేసి= నీ దైన మాయచేత; రూఢిన్= స్పష్టంగా; చతుర్+విధరూపము+ ఐన= నాలుగు తీరులైన రూపంగల; పురమున్= దేహాన్ని; ఆత్మ+అంశమునన్= ఆత్మకు సంబంధించిన అంశంతో; చెందు= పొందే; పురుషుఁడు= జీవుడు; ఇంద్రియములచేన్= ఇంద్రియాలద్వారా; విషయ+సుఖములు= శబ్దం మొదలైనవాని వలన కలిగే సుఖాలను; అనుభవించున్= అనుభవిస్తాడు; మహినిన్= భూమిపై; మధుమక్షికా కృత మధువున్= తేనెటీగ చేసిన తేనెతో; పోలి= సమానమై; జీవుఁడు= జీవుడు అనే తత్త్వం; అతనిన్= అతనిని; పురవర్తి= శరీరమున ప్రవర్తించేవాడు; అగున్= అగును; అంద్రు= అంటారు; మఱియున్= ఇంకా.

**తా :** (మాయాశక్తిచేత) దేవా! సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడుగుణాలు వరుసగా ఏర్పడ్డాయి. వాటి వలన మహత్తు, అహంకారం, తన్మాత్రలైన శబ్దం మొదలైన విషయాలు, ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి అనే అయిదు మహాభూతాలు కలిగాయి. మహర్షులు, దేవతలు, ప్రాణుల సముదాయాలుగా కలుగగా ఈ విశ్వమంతా వేరు వేరు రూపాలు కలది అయినది. నీ మాయ చేతనే స్పష్టంగా నాలుగు విధాలైన రూపాలుగల దేహమను పురుషుడు ఆత్మాంశతో ప్రవేశిస్తున్నాడు. ఇంద్రియాలతో విషయసుఖాలను భూమిమీద తేనెటీగ రూపొందించిన తేనెలాగా అనుభవిస్తాడు. అతనినే ఆ శరీరంలో ఉండే జీవుడు అంటారు.

**విశే :** తేనెటీగ తేనెను తానే సిద్ధం చేసుకొని తానే ఆరగించు విధంగా జీవుడు విషయసుఖాలను తానే సిద్ధం చేసుకొని అనుభవిస్తాడు.

**వ. ఇట్టి జగత్సర్జకుండవైన నీవు. 724**

**ప్రతి :** ఇట్టి= ఈ విధమైన; జగత్+సర్జకుండవు= జగత్తును సృష్టించినవాడవు; ఐన+నీవు= అయిన నీవు.

**తా :** ఈ విధమైన జగత్తును సృష్టించిన నీవు.

**క. భూత గణంబుల చేతనె, భూతగణంబులను మేఘ పుంజంబుల ని**
**ర్ధూతముగఁ జేయు ననిలుని, భాతిని జరియింపఁ జేసి పౌరుష మొప్పన్. 725**

**ప్రతి :** భూత గణంబులచేతనె= భూతాల సముదాయాల చేతనే; భూతగణంబులను= భూతాల సముదాయాలను; మేఘపుంజంబులన్= మేఘాల సముదాయాలతో; నిర్ధూతముగన్= పూర్తిగా ఎగురగొట్టినట్లుగా; చేయు= చేసే; అనిలుని భాతిన్= వాయువువలె; చరియింపన్+చేసి= కదలాడునట్లొనర్చి; పౌరుషము= పురుషశక్తి; ఒప్పన్= ఒప్పునట్లుగా.

**తా :** నీవు వాయుదేవుడు మేఘాల గుంపులను చెదరగొట్టినట్లుగా, భూతాల సముదాయాలను భూతాల సముదాయాలతోనే కదలాడిపోయే విధంగా చేస్తూ ఉంటావు. ఆ విధంగా పౌరుషం ప్రకాశించగా

**విశే :** గాలి ఒక భూతం. అది పొగ, కాంతి, నీరు, గాలి అనే వాని సముదాయమైన మేఘాన్ని దూరంగా పోయేటట్లు చేస్తున్నది. ఈ విధంగా భూతాల సముదాయాలే భూతాల సముదాయాలను కదలిస్తూ ఉంటాయి. అయితే ఆ అన్నింటికి మూలపురుషుడు పరమాత్మ.

**తే. రూఢిఁ దత్తత్క్రియాలబ్ధ రూపుఁ డవును, సుమహిత స్ఫురదమిత తేజుఁడవుఁ జండ**
**వేగుఁడవు నయి ఘనభుజావిపులమహిమ, విశ్వసంహార మర్థిఁ గావింతు వీశ! 726**

**ప్రతి :** ఈశ= సర్వలోకాలను పాలించేప్రభూ!; రూఢిన్= స్పష్టంగా; తత్+తత్+క్రియా లబ్ధ రూపుఁడవును= ఆయా పనులకోసం పొందిన రూపాలు కలవాడవునూ; సుమహిత స్ఫురత్+అమిత తేజుఁడవున్= మిక్కిలి గొప్పదిగా వెలుగొందుతూ ఉన్న హద్దులు లేని తేజస్సు కలవాడవునూ; చండ+వేగుఁడవును= తీవ్రమైన వేగం కలవాడవునూ; అయి; ఘన భుజా విపుల మహిమన్= పెద్దవి అయిన భుజాల విస్తారమైన మహిమతో; అర్థిన్= కోరికతో; విశ్వసంహారము= లోకాల సముదాయాన్ని లోపలకు తీసుకోవటం అనే పనిని; కావింతువు= చేస్తావు.

**తా :** ప్రభూ! నీవు ఆయా పనులకోసం స్పష్టంగా ఏర్పడిన వేరువేరు రూపాలు కలవాడవు, గొప్పగా వెలుగొందు అమిత తేజుడవు, తీవ్రమైన వేగంగలవాడవూ అయి విస్తృతంగా వ్యాపించి ఉన్న భుజాల అతిశయమైన మహిమతో ఈ విశ్వాన్నంతా ఉపసంహరిస్తావు.

**వ. అది యెట్లనిన. 727**

**ప్రతి :** అది= ఆ సంహారం అనే పని; ఎట్లు= ఏ విధంగా; అనినన్= అంటే.

**తా :** ఆ సంహారకార్యం ఏ విధమైనది అంటే

**క. ఇతి కర్తవ్య విచారక, మతిచేఁదగ నెప్పుడుం బ్రమత్తంబును సం**
**చిత విషయ లాలసము నూ, ర్జిత లోభము నైన యట్టి సృష్టి గడంకన్. 728**

**ప్రతి :** ఇతి కర్తవ్యవిచారకమతిచేన్= ఇట్టిది చేయవలసిన పని అనే ఆలోచనగల బుద్ధితో; తగన్= తగు విధంగా; ఎప్పుడున్= ఎల్లవేళలా; ప్రమత్తంబును= ఒడలెరుగనిదియు; సంచిత విషయ లాలసము= కూడబెట్టుకొన్న విషయసుఖములయందు రమించే స్వభావం కలదీ; ఊర్జిత+లోభము= గొప్ప శక్తిగల అత్యాశ కలదీ; ఐన+అట్టి= అయినట్టి; సృష్టిన్= సృష్టిని; కడంకన్= ప్రయత్నంతో; (ముందుకు అన్వయం).

**తా :** ఈ సృష్టి అంతా ఇప్పుడిది చేయదగినపని అనే విచారం విషయంలో ఒడలు తెలియనిదవుతుంది. సంపాదించుకొన్న విషయాల అనుభవం మీదకు ఎగబ్రాకుతూ ఉంటుంది. అత్యధికమైన శక్తి గల లోభం కలది అవుతుంది. అటువంటి సృష్టిని నీవు (లోపలికి తీసుకుంటావు).

**తే. అప్రమత్తుండ వగుచుఁ బద్మాక్ష! నీవు, మ్రింగుదువు చాల నాఁకట వ్రేఁగు చుండి**
**నాలుకలు ౘగోయు భూరిపన్నగము వాతఁ, బడిన యెలుకను భక్షించు పగిది ననఘ! 729**

**ప్రతి :** పద్మాక్ష= పద్మాలవంటి కనులుగలవాడా!; అనఘ= పుణ్యాత్ముడా!; అప్రమత్తుండవు= ఏ విధమైన పొరపాటులులేని వాడవు; అగుచున్= అవుతూ; నీవు= నీవు; చాలన్= ఎక్కువ అయిన; ఆఁకటన్= ఆకలితో; వ్రేఁగుచుండి= మాడిపోతూ; నాలుకలు= జిహ్వలు; క్రోయు= చాచుతూ ఉండే; భూరి పన్నగంబు= పెద్దసర్పం; వాతన్= నోటిలో; పడిన+ఎలుకను= పడ్డ ఎలుకను; భక్షించుపగిదిన్= తినే విధంగా; మ్రింగుదువు= లోపలికి తీసుకుంటావు.

**తా :** పద్మనయనా! పుణ్యాత్మా! చాలా ఆకలితో కడుపు కాలిపోతూ ఉన్న మహాసర్పం తననోటి దగ్గరకు వచ్చిన ఎలుకను తినే విధంగా నీవు ఏమరుపాటులేని వాడవై ఈ సృష్టినంతా లోపలికి తీసుకుంటావు.

**చ. అనిశము నస్మదీయగురుఁడైన సరోరుహసంభవుండు న**
**మ్మనువులు నాత్మసంశయము మాని భజించు భవత్పదాబ్జముల్**
**మనమున నిల్పి యుష్మదవమాన మహావ్యథఁ జెందునట్టి స**
**జ్జనుఁడు పరిత్యజించునె? భుజంగమతల్పక! భక్త కల్పకా! 730**

**ప్రతి :** భుజంగమతల్పక= సర్పం పానుపు అయినవాడా!; భక్త కల్పకా= భక్తులకు కల్పవృక్షం అయినవాడా!; అస్మదీయ గురుఁడు= మాకు తత్త్వాన్ని ఉపదేశించేవాడు, ఐన= అయినట్టి; సరస్+రుహ సంభవుండున్= పద్మంలో పుట్టిన బ్రహ్మ; ఆ+మనువులున్= స్వారోచిషుడు మొదలైన మనువులునూ; ఆత్మన్= బుద్ధిలో; సంశయము= సందేహాన్ని; మాని= వదలిపెట్టి; అనిశమున్= సర్వకాలాలలో; భజించు భవత్+పద+అబ్జముల్= సేవించే నీ పాదాలనే పద్మాలను; మనమునన్= మనస్సులో; నిల్పి= చక్కగా ఉంచుకొని; యుష్మత్+అవమాన మహావ్యథన్= నీ అవమానం అనే గొప్ప వేదనను; చెందు+అట్టి+సత్+జనుఁడు= పొందే ఉత్తముడైన వ్యక్తి; పరిత్యజించునె?= వదలిపెట్టునా?

**తా :** ఆది శేషతల్పం మీద శయనించే స్వామీ! భక్తులకు కల్పవృక్షం అయినవాడా! మాకు గురువైన బ్రహ్మదేవుడు, ఆ సుప్రసిద్ధులైన మనువులూ, తమ బుద్ధిలో ఏ మాత్రమూ సంశయాలు లేకుండా నీ పాదపద్మాలను మనస్సులో

నిల్చుకొని సేవిస్తూ ఉంటారు. అటువంటి నిన్ను అవమానించడం వల్ల గొప్పవ్యథ పొందే సజ్జనుడు నీ పాదపద్మాలను విడువగలడా?

**క. కావున నాకును సూరి జ, నావళికిని సర్వసంశయంబులు వాపం**
**గావను బ్రోవను దగు గతి, నీవని వినుతించు నట్టి యీ స్తవ మెలమిన్. 731**

ప్రతి : కావునన్= కాబట్టి; నాకును= నాకూ; సూరిజన+ఆవళికినిన్= జ్ఞానసంపద కల పండితుల వరుసలకును; సర్వసంశయంబులు= అన్ని సందేహాలనూ; పాపన్= పోగొట్టటానికీ; కావను= రక్షించటానికీ; ప్రోవను= పెంపొందించటానికీ; తగుగతి= తగిన దిక్కు; నీవు= నీవు; అని= అని; వినుతించు+అట్టి ఈ+స్తవము= కొనియాడినట్టి ఈ స్తోత్రాన్ని; ఎలమిన్= ప్రీతితో...

**తా :** కాబట్టి నాకూ వివేకశీలం కల పండితుల సముదాయానికీ పుట్టే అన్ని సంశయాలనూ తొలగించటానికీ, రక్షించటానికీ, అభివృద్ధి కలిగించటానికీ సరి అయిన దిక్కు నీవే అని కొనియాడునట్టి ఈ స్తోత్రాన్ని ప్రీతితో (రుద్రుడు ప్రచేతసులకు తెలియజేశాడు)

**వ. రుద్రుండు ప్రచేతసుల కెఱింగించి వెండియు నిట్లనియెఁ, బ్రచేతసులారా! యిట్టి యోగాదేశ నామకంబైన యీ స్తోత్రంబు బహువారావృత్తిచేఁ బఠించి మనంబున ధరియించి సమాహిత చిత్తులై మీరందఱు నాదరంబున విశ్వాసయుక్తులును, స్వధర్మాచారవంతులును భగవదర్పితాశయులును నై జపియించుచు సర్వభూతావస్థితుండు నాత్మారాముండు నైన సర్వేశ్వరుని నుతించుచు ధ్యానయుక్తంబుగాఁ బూజించుచుండుఁడు, తొల్లి యీ స్తోత్రంబు భగవంతుండైన పద్మసంభవుండు సిసృక్షు వగుచు నాత్మజులమైన మాకును సృజియింప నిచ్చగించు భృగ్వాదులకును నెఱింగించె, మేము నా భృగ్వాదులును ప్రజాసర్గంబునందు బ్రహ్మ చోదితులమై యీ స్తోత్రంబునం జేసి విధ్వస్త సమస్త తమోగుణులమై వివిధ ప్రజాసర్గంబు గావించితిమి, కావున నీ స్తోత్రంబు నెల్లప్పుడు నేకాగ్ర చిత్తుండును వాసుదేవ పరాయణుండునై యెవ్వండు జపియించు, వాఁడు వేగంబె శ్రేయస్సును బొంది తదీయ జ్ఞాన ప్లవంబున వ్యసనార్ణవ రూపంబయిన సంసారంబును సుఖతరంబుగఁ దరియించు, నిట్టి మదుపదిష్టంబయిన శ్రీహరి స్తవంబు నెవ్వండు సదువుచు దురారాధ్యుండైన శ్రీహరిం బూజించు వాఁడు మదుక్త స్తోత్ర గాన సంతుష్టుండును శ్రేయస్సులకు నేకాశ్రయ భూతుండును నగు, శ్రీమన్నారాయణుని వలన సమస్తాభీష్టంబులం బొందు, నెవ్వండు ప్రభాతంబున లేచి ప్రాంజలియు శ్రద్ధా సమన్వితుండునై యీ మంగళస్తవరాజంబును విను, వినుపించు వాఁడు కర్మబంధ విముక్తుండగు నని మఱియు నిట్లనియె. 732**

ప్రతి : రుద్రుండు= పరమశివుడు; ప్రచేతసులకున్= ప్రచేతసులు అనేవారికి; ఎఱింగించి= తెలియజేసి; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; ప్రచేతసులారా!; ఇట్లు= ఈ విధంగా; యోగ+ఆదేశ నామకంబు= యోగమును ఉపదేశించునది అనే అర్థం కల 'యోగాదేశం' అనే పేరుగలది; ఐన= అయిన; ఈ స్తోత్రంబు= ఈ స్తుతి;

బహు+వార+ఆవృత్తిచేన్= పెక్కుమార్లు మరలమరల తిప్పుకొనటంచేత; పఠించి= చదివి; మనంబునన్= హృదయంలో; ధరియించి= పట్టుగా నిలుపుకొని; సమాహిత చిత్తులు= చక్కగా కుదురు కొల్పుకొన్న భావనలు కలవారు; ఐ= అయి; మీరు; అందఱున్= అందరూ; ఆదరంబునన్= మన్ననతో; విశ్వాస+యుక్తులు= నమ్మకంతో; కూడినవారు; స్వధర్మ+ఆచారవంతులును= మీదైన ధర్మాన్ని ఆచరించే స్థితికలవారు; భగవత్+అర్పిత+ఆశయులును= భగవంతుని యందు సమర్పించిన హృదయం కలవారూ; ఐ= అయి; జపియించుచున్= జపిస్తూ; సర్వ భూత+అవస్థితుండును= అన్ని భూతాలయందునూ ఉన్నవాడునూ; ఆత్మారాముండును= తనయందే తాను రమించే శీలం కలవాడూ; ఐన= అయిన; సర్వ+ఈశ్వరునిన్= అందరకు, అన్నింటికి పాలకుడైనవానిని; నుతించుచున్= కొనియాడుచు; ధ్యానయుక్తంబుగాన్= చెదరని హృదయం కలుగు విధంగా; పూజించుచున్+ఉండుఁడు= అర్చనలు చేస్తూ ఉండండి; తొల్లి= వెనుక; ఈ స్తోత్రంబున్= ఈ స్తోత్రాన్ని; భగవంతుఁడు= మహానుభావుడు; ఐన; పద్మసంభవుండు= పద్మమునందు పుట్టిన బ్రహ్మ; సిసృక్షువు= సృష్టిచేయగోరినవాడు; అగుచున్= అగుచు; ఆత్మజులము= కొడుకులము; ఐన; మాకును= మాకూ; సృజియింపన్= సృష్టి చేయటానికి; ఇచ్ఛగించు= కోరు; భృగువు+ఆదులకును= భృగువు మొదలైన వారలకును; ఎఱింగించెన్= తెలియజేశాడు; మేమును= మేమును; ఆ భృగువు+ఆదులును= ఆ భృగువు మొదలైనవారును; ప్రజాసర్గంబునందు= ప్రజలను సృష్టిచేసే విషయంలో; బ్రహ్మచోదితులము+ఐ= బ్రహ్మచేత ప్రేరణపొందిన వారమై; ఈ స్తోత్రంబునన్+చేసి= ఈ స్తోత్రంవలన; విధ్వస్త, సమస్త, తమస్+గుణులము+ఐ= మొత్తముగా నశించిన అన్ని విధములైన తమస్సునకు సంబంధించిన గుణాలు కలవారమై; వివిధ ప్రజాసర్గంబున్= పెక్కు తీరులైన ప్రజల సృష్టిని; కావించితిమి= చేశాము; కావునన్= కాబట్టి; ఈ స్తోత్రంబున్= ఈ స్తుతిని; ఎల్ల+అప్పుడున్= అన్ని వేళలా; ఏక+అగ్ర+చిత్తుండును= చెదరని మదికలవాడు; వాసుదేవ పరాయణుండును= వాసుదేవుడే పరమం అని భావించేవాడూ; ఐ= అయి; ఎవ్వండు= ఏ మనిషి; జపియించున్= జపం చేస్తాడో; వాఁడు= ఆ వ్యక్తి; వేగంబు+ఎ= వెనువెంటనే; శ్రేయస్సునున్= మోక్షాన్ని; పొంది= అందుకొని; తదీయ జ్ఞానప్లవంబునన్= ఆ పరమాత్మకు సంబంధించిన తెలివి అనే తెప్పతో; వ్యసన+అర్ణవ రూపంబు= కష్టాలకడలి అనే స్వరూపంగల; సంసారంబును= చావుపుట్టుకల రూపమైన సంసారాన్ని (అజ్ఞానాన్ని); సుఖతరంబుగన్= మిక్కిలి సుఖంగా; తరియించున్= దాటుకుంటాడు; ఇట్టి= ఈ విధమైన; మత్+ఉపదిష్టంబు= నాచేత ఉపదేశించబడినది; ఐన= అయినట్టి; శ్రీహరి స్తవంబున్= శ్రీమన్నారాయణుని స్తోత్రాన్ని; ఎవ్వండు= ఏమానవుడు; చదువుచున్= పఠనం చేస్తూ; దురారాధ్యుండు= సులభంగా ఆరాధించటానికి అలవి కానివాడు; ఐన= అయిన; శ్రీహరిన్= లక్ష్మీనారాయణుని; పూజించున్= సేవించుకుంటాడో; వాఁడు= ఆవ్యక్తి; మదుక్త= నా చేత చెప్పబడిన; స్తోత్ర= స్తోత్రంయొక్క; గాన= పాటచేత; సంతుష్టుండును= మిక్కిలి పరితోషం పొందినవాడూ; శ్రేయస్సులకున్= పరలోక సంబంధమైన మేలులకు; ఏక+ఆశ్రయ భూతుండును= ఒకే ఒక్క ఆశ్రయం అయినవాడూ; అగు= అయిన; శ్రీమత్+నారాయణునివలనన్= లక్ష్మితో కూడియుండు నారాయణుని వలన; సమస్త+అభీష్టంబులన్= అన్ని కోరికలను; పొందున్= పొందుతాడు; ఎవ్వండు= ఏ మానిసి; ప్రభాతంబునన్= వేకువజామున; లేచి= మేల్కొని; ప్రాంజలియున్= దోసిలి యొగ్గినవాడు; శ్రద్ధా సమన్వితుండును= శ్రద్ధతో కూడినవాడూ; (శ్రద్ధ= అంతఃకరణాన్ని కుదురుగా ఒకచోట నిలిపి ఉంచటం); ఐ= అయి; ఈ మంగళ స్తవ రాజంబును= శుభమైన, గొప్పదియైన ఈ స్తోత్రాన్ని; వినున్= వింటాడో; వినిపించున్= ఇతరులకు వినిపిస్తాడో; వాఁడు= ఆ వ్యక్తి; కర్మ, బంధ, విముక్తుండు= కర్మల కట్టులనుండి విడుదల పొందినవాడు; అగున్= అవుతాడు; అని; మఱియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

**తా :** పరమేశ్వరుడు ప్రచేతసులకు ఈ స్తోత్రాన్ని చెప్పి ఇంకా ఇలా అన్నాడు. ప్రచేతసులారా! ఇది 'యోగాదేశం' అనే పేరుగల స్తోత్రం. పెక్కుమారులు దీనిని జపించి మనస్సులో నిలుపుకోవాలి. చెదరని చిత్తంతో మీరందరూ మన్ననతో నమ్మకం కలిగి, మీ మీ ధర్మాలు ఆచరిస్తూ, భగవంతునియందు సమర్పించిన భావనలు కలవారై దీనిని జపించండి. సర్వభూతాల యందూ ఉన్నవాడు, తనయందే తాను రమించేవాడూ అయిన సర్వస్వామిని నుతిస్తూ ధ్యానంతో పూజించండి. పూర్వం ఈ స్తోత్రాన్ని భగవంతుడైన బ్రహ్మ సృష్టి చేయగోరినవాడై కుమారులమైన మాకూ, భృగువు మొదలైన మహర్షులకూ తెలియజేశాడు. మేమూ, భృగువు మొదలైనవారూ బ్రహ్మప్రేరణ పొంది ఈ స్తోత్రంతో సమస్తమైన తమోగుణాలు నశించిపోయినవారమై పెక్కుతీరులైన ప్రజల సృష్టిని చేశాము. అందుచేత చెదరని బుద్ధితో, వాసుదేవుడే పరమగతి అనే భావనతో ఈ స్తోత్రాన్ని ఏకాగ్రచిత్తంతో జపించేవాడు శీఘ్రంగా శ్రేయస్సు పొందుతాడు. ఆ శ్రీహరికి సంబంధించిన జ్ఞానం అనే తెప్పతో కష్టాలకడలి (సముద్రం) అయిన సంసారాన్ని చాలా తేలికగా దాటుకుంటాడు. నేను ఉపదేశించిన ఈ స్తోత్రాన్ని పఠిస్తూ, సులభంగా ఆరాధించరాని శ్రీహరిని పూజించేవాడు, నేను చెప్పిన సోత్ర గానంతో సంతోషం పొందేవాడూ, శ్రేయస్సులకు ఒకే ఒక్క ఆశ్రయం అయినవాడూ అయిన శ్రీమన్నారాయణుని వలన కోరికలన్నింటినీ తీర్చుకొన్న వాడవుతాడు. వేకువజామున నిద్రనుండి లేచి చేతులు జోడించి, శ్రద్ధకలవాడై ఈ శుభమైన శ్రేష్ఠమైన స్తోత్రాన్ని వినేవాడూ, ఇతరులకు వినిపించేవాడూ కర్మబంధాల నుండి విడుదల పొందుతాడు. అని ఇంకా ఇలా చెప్పాడు.

**క. నరదేవతనయులారా!, పురుషాధీశుండుఁ బరమపురుషుఁడు నగు నీ**
**శ్వరు సుస్తోత్రము మీ కా, దరమునఁ దెలిపితిని, మీరు దద్దయు భక్తిన్. 733**

**ప్రతి :** నరదేవతనయులారా!= రాజకుమారులారా!; పురుష+అధీశుండు= సర్వదేహ ధారులకు మహాప్రభువు; పరమ పురుషుఁడు= సర్వోత్తముడైన దేవుడు; అగు= అయిన; ఈశ్వరు సుస్తోత్రమున్= పరమాత్మయొక్క మంచి స్తుతిని; ఆదరమునన్= ప్రీతితో; మీకున్= మీకు; తెలిపితిని= తెలియజేశాను; మీరున్= మీరు కూడా; తద్దయున్= అధికమైన; భక్తిన్= భక్తితో...

**తా :** రాజకుమారులారా! సర్వదేహధారులకును స్వామీ, పరమపురుషుడూ అయిన ఈశ్వరుని మంచి స్తోత్రాన్ని మీకు ఆదరంతో చెప్పాను. మీరు కూడా గొప్ప భక్తితో

**క. ఏకాగ్రచిత్తులును సు, శ్లోకులునై జపము సేయుచును ఘనతపముం**
**గైకొని చేసిన మీకును, జేకుఱు మహితేప్సితార్థ సిద్ధి గడంకన్. 734**

**ప్రతి :** ఏకాగ్రచిత్తులును= చెదరని భావనలు కలవారూ; సుశ్లోకులును= అందరిచేత గొప్పగా కొనియాడబడేవారూ; ఐ= అయి; జపము+చేయుచును= జపం చేస్తూ; ఘనతపమున్= గొప్పది అయిన తపస్సును; కైకొని= దీక్షతో స్వీకరించి; చేసినన్= చేస్తే; మీకును= మీకు కూడా; కడంకన్= ఆపూనిక వలన; మహిత+ఈప్సిత+అర్థసిద్ధి= గొప్పది, కోరినది అయిన ప్రయోజనం నెరవేరటం అనేది; చేకుఱున్= కలుగుతుంది.

**తా :** మీరు కూడా భావనలను చెదరకుండా నిగ్రహించుకొని జపం చేస్తూ ఒక దీక్షతో గొప్ప తపస్సును చేసినట్లైతే మీరు కోరిన మహాఫలం లభిస్తుంది.

**క. అని యీ గతి నుపదేశం, బొనరించి సదాశివుండు నొగి వారలచే**
**తను బూజితుఁడై వారలు, గన నంతర్ధానుఁ డయ్యెఁ గౌతుక మొప్పన్. 735**

ప్రతి : అని; ఈ గతిన్= ఈ విధంగా; ఉపదేశంబు= బోధను; ఒనరించి= చేసి; సదాశివుండు= సదాశివుడైన పరమేశ్వరుడు; ఒగిన్= క్రమంగా; వారలచేతను= వారిచేత; పూజితుఁడు= పూజించబడినవాడు; ఐ= అయి; వారలు= ఆ ప్రచేతసులు; కనన్= చూస్తూ ఉండగా; కౌతుకము= వేడుక; ఒప్పన్= అలరారగా; అంతర్ధానుఁడు= అదృశ్యుడు; అయ్యెన్= అయ్యాడు.

తా : అని ఈ విధంగా ఉపదేశంచేసి సదాశివుడు వారలు భక్తితో పూజలు చేయగా కైకొని వారు చూస్తూ ఉండగా కౌతుక మొప్పారగా అదృశ్యుడయ్యాడు.

**వ. అంత. 736**

ప్రతి : అంతన్= అప్పుడు.

**తే. తివుట వారలు రుద్రోపదిష్టమైన, యచ్యుత స్తవము జపించు చయుతసంఖ్య**
**వత్సరము లుగ్రతపము దుర్వార వారి, మధ్యమునఁ జేయుచున్న సమయమునందు. 737**

ప్రతి : తివుటన్= కోరికతో; వారలు= ఆ ప్రచేతసులు; రుద్ర+ఉపదిష్టము= రుద్రునిచే ఉపదేశించబడినది; ఐన; అచ్యుత+స్తవమున్= శ్రీమహావిష్ణువు స్తోత్రాన్ని; జపించుచున్= జపం చేస్తూ; దుర్వార వారిమధ్యమునన్= వారించటానికి అలవికాని నీటినడుమ; అయుత సంఖ్యవత్సరములు= పదివేలయేండ్లు; ఉగ్రతపమును= భయంకరమైన తపస్సును; చేయుచున్= చేస్తూ; ఉన్న సమయమునందున్= ఉన్నకాలంలో.

తా : (సదాశివుడు అదృశ్యం అయిపోయిన తరువాత) ఆ ప్రచేతసులు కోరికతో రుద్రుడు ఉపదేశించిన విష్ణుస్తోత్రాన్ని జపిస్తూ పదివేలయేండ్లు నీటిలో నిలిచి వారించరాని ఘోరమైన తపస్సు చేస్తూ ఉన్న సమయంలో

## a=నారదుండు ప్రాచీన బర్హికి జ్ఞాన మార్గమును దెలియఁ జేయుట=a

**వ. ఘనకర్మాసక్త చిత్తుండై యున్న ప్రాచీనబర్హి కడకు నధ్యాత్మవేదియుం గృపాళువు నైన నారదుండు సనుదెంచి యా రాజునకు జ్ఞాన బోధంబు సేయుకొఱకు నతనితో నిట్లనియె, రాజా! యీ కర్మంబునం జేసి యెట్టి శ్రేయస్సు నభిలషించుచున్న వాఁడవట్టి యనిష్ట నిరసనంబును నభీష్ట ప్రాప్తి కరంబు నయిన శ్రేయం బీ కర్మంబు వలన లభింప దనినం బ్రాచీనబర్హి నారదున కిట్లనియె. 738**

ప్రతి : ఘన= గొప్పవియగు; కర్మ= యజ్ఞం మొదలైన కర్మలందు; ఆసక్త= బాగుగా తగులుకొన్న; చిత్తుండు= మనస్సుకలవాడు; ఐ+ఉన్న ప్రాచీనబర్హికడకున్= అయి ఉన్న ప్రాచీనబర్హి దగ్గరకు; అధ్యాత్మవేదియున్= దేహమునందు ఉన్నపరమాత్మను తెలిసినవాడూ; కృపాళువును= దయయే శీలం అయినవాడూ; ఐన; నారదుండు= అయిన నారదమహర్షి; చనుదెంచి= వచ్చి; ఆ రాజునకున్= ఆ ఏలికకు; జ్ఞానబోధంబు= జ్ఞానాన్ని తెలుపుట అనే పనిని; చేయుకొఱకున్= చేయటంకోసం; అతనికిన్= అతనితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; రాజా!; ఈ కర్మంబునన్+చేసి= ఈ క్రియతో; ఎట్టి శ్రేయస్సున్= ఏ విధమైన పరమసుఖాన్ని; అభిలషించుచున్నవాఁడవు= కోరుతున్నావో; అట్టి= ఆ విధమైన; అనిష్ట నిరసనంబును= కీడును తొలగించేదీ; అభీష్ట ప్రాప్తికరంబును= ఇష్టాన్ని పొందించేదీ; అయిన+శ్రేయంబు= అయిన ఉత్తమమైన శుభం; ఈ కర్మంబువలనన్= ఈ కర్మకారణంగా; లభింపదు= దొరకదు; అనినన్= అనగా; ప్రాచీనబర్హి నారదునకున్= నారదునితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** ప్రాచీనబర్హి అనే రాజు గొప్పవి అయిన యజ్ఞం మొదలైన కర్మలలో తగులుకొన్న చిత్తంతో ఉన్నాడు. అతని దగ్గరకు తత్త్వం తెలిసినవాడు, దయగలవాడూ అయిన నారదుడు వచ్చి అతనికి జ్ఞానాన్ని బోధించటం కోసం ఇలా అన్నాడు. రాజా! ఈ కర్మలవల్ల నీవు కోరుకొనే శ్రేయస్సు, కీడులను తొలగించేదీ, ఇష్టాన్ని సమకూర్చేదీ కావాలి. కానీ అది ఈ కర్మలవలన కలుగదు అని పలుకగా ప్రాచీనబర్హి అతనితో ఇలా అన్నాడు.

**సీ. అనఘ! మునీంద్ర! మహాభాగ! యేను గర్మాపహత జ్ఞాని నగుచు మోక్ష**
**మెఱుఁగంగ లే నైతి నిట్టి నా కిప్పుడు గడు విమలంబును గర్మబంధ**
**నాశకంబును నగు జ్ఞానోపదేశంబు గావింపు మతిదయాకార! కూట**
**ధర్మంబులగు గేహతతులందుఁ జెంది జా, యా తనూజాత ధనాదికములె**

**తే. భూరి పురుషార్థములు గాఁగ బుద్ధిఁ దలఁచు, మతివిహీనుండు సంసార మార్గములను**
**దగఁ బరిభ్రామ్యమాణుఁడై మొగిని మోక్ష, పదము నొందంగఁ జాలఁడు భవ్యచరిత! 739**

**ప్రతి :** అనఘ= పాపాలులేనివాడా!; ముని+ఇంద్ర= మునివర్యుఁడా; మహాభాగ= మహానుభావా!; ఏను= నేను; కర్మ+అపహత+జ్ఞానిని= కర్మలచేత దెబ్బకొట్టబడిన జ్ఞానం కలవాడను; అగుచున్= అగుచూ; మోక్షము= మోక్షాన్ని గురించి; ఎఱుఁగంగలేను+ఐతి= తెలియలేక పోయాను; ఇట్టి నాకు= ఈ స్థితిలో ఉన్ననాకు; ఇప్పుడు= ఈ సమయంలో; కడున్= మిక్కిలి; విమలంబును= నిర్మలమైనదియు; కర్మ బంధ నాశకంబును= కర్మలవల్ల కలిగే బంధాలను నాశనం చేసేదీ; అగు= అయిన; జ్ఞాన+ఉపదేశంబున్= జ్ఞానబోధ; కావింపుము= చేయుము; అతిదయాకార= మిక్కిలి దయయే ఆకారమైనవాడా!; భవ్యచరిత= శుభకరమైన ప్రవృత్తికలవాడా!; కూట ధర్మంబులు= కపటాలైన ధర్మాలు; అగు= అయిన; గేహతతలందు= ఇండ్లు వాకిళ్ళూ మొదలయిన వాటియందు; చెంది= తగులుకొని; జాయా= భార్య; తనూజాత= పుత్రులు, ధన= సొమ్ములు; ఆదికములె= మొదలైనవియే; భూరిపురుషార్థములు= గొప్పవీ, పురుషుడు సాధించవలసినవీ; కాఁగన్= కాగా; బుద్ధిన్= బుద్ధియందు; తలంచు మతి విహీనుండు= భావించే బుద్ధిలేనివాడు; సంసారమార్గములను= సంసారపు దారులలో; తగన్= బాగుగా; పరిభ్రామ్యమాణుఁడు+ఐ= మిక్కిలిగా తిరుగాడుతూ ఉన్నవాడై; మొగిని= పూని; మోక్షపదమున్= ముక్తితావును; ఒందంగన్+చాలఁడు= పొందలేడు.

**తా :** పుణ్యాత్మా! మునివరా! మహాభాగా! భవ్యచరితా! దయాస్వరూపా! నేను కర్మలచే నశించిన జ్ఞానం కలవాడనై మోక్షమంటే ఏమిటో తెలియని వాడనయ్యాను. ఇట్టి నాకు ఇప్పుడు కడు స్వచ్ఛమైనదీ, కర్మబంధాలను నాశనం చేసేదీ అయిన జ్ఞానబోధచెయ్యి. కపటధర్మాలైన ఇల్లూ వాకిలీ, ఆలూ, కొడుకూ, ధనమూ మొదలైనవన్నీ గొప్పపురుషార్థాలుగా తలపోసే బుద్ధిహీనుడు సంసారపుదారులలోనే తగిన గమ్యంలేక తిరుగుతూ ఉంటాడు. ప్రయత్నించి మోక్షపదాన్ని పొందలేడు.

**క. అనవుఁడు నతనికి నతఁ డను, ననఘా! యీ యధ్వరంబులందును గృప మా**
**లిన నీచే విశసింపం, జని కూలిన పసుల వేల సంఖ్యలఁ గనుమా! 740**

**ప్రతి :** అనవుడున్= అనిపలుకగా; అతనికిన్= ఆరాజునకు; అతఁడు= నారదుడు; అనున్= ఇలా చెప్పాడు; అనఘా= పుణ్యాత్మా!; ఈ అధ్వరంబులందును= ఈ యజ్ఞాలలో; కృపమాలిన, నీచేన్= జాలిలేని నీ చేత; విశసింపన్+చని= హింసించబడి; కూలిన పసుల= కూలిపోయిన పశువుల; వేలసంఖ్యలు= వేలకొలదిగా ఉన్నాయి; కనుమా= చూడు.

**తా :** అన్నంతనే ప్రాచీనబర్హితో నారదుడిలా అన్నాడు. పుణ్యాత్మా! ఈ యజ్ఞాలలో దయాదాక్షిణ్యాలు లేక నీవు చంపిన పశువులు వేలకొలదిగా ఉన్నాయి. చూడు.

**వ. కావునం బశువ్రాతంబులు త్వదీయవైశసంబును స్మరించు చున్నవై లోహయంత్రమయ శృంగంబులచేత నెప్పుడు నీవు పరలోకంబు నొందెద వప్పుడు నిన్ను హింసింతు మని భవదీయమృతికి నెదురుచూచు చున్న, విట్టి సంకటంబు నొందం గల నీకు నిస్తారకం బయిన యొక్క యితిహాసంబు గల దెఱింగింతు విను మని యిట్లనియె. 741**

**ప్రతి :** కావునన్= కాబట్టి; పశువ్రాతంబులు= పశువులమందలు; త్వదీయ+వైశసంబును= నీ వల్ల కల్గిన హింసను; స్మరించుచున్నవి= భావిస్తూ ఉన్నవి; ఐ= అగుచూ; లోహ యంత్ర మయ శృంగంబులచేతన్= ఇనుపయంత్రాలతో ఏర్పడిన కొమ్ములతో; ఎపుడు= ఏ సమయంలో; నీవు; పరలోకంబున్= మరొక లోకాన్ని; ఒందెదవు= చేరుకుంటావో; అపుడు= అప్పుడు; నినున్= నిన్ను; హింసింతుము= బాధింతుము; అని= అనుకుంటూ; భవదీయ+మృతికిన్= నీ చావునకు; ఎదురు+చూచుచున్నవి= ఎదురు చూస్తున్నాయి; ఇట్టి సంకటంబున్= ఇటువంటి పెద్దహానిని; ఒందన్+కల+నీకు= పొందబోయే నీకు; నిస్తారకంబు= దాటజేసేది; అయిన; ఒక్క+ఇతిహాసంబు= ఒక పాతకాలపు వృత్తాంతం; కలదు= ఉన్నది; ఎఱింగింతున్= తెలియజేస్తాను; అని; ఇట్లు= ఇలా; అనియెన్= అన్నాడు.

**తా :** కాబట్టి, నీవు యజ్ఞాలలో హింసించిన పశువులన్నీ నీ వల్ల కల్గిన హానిని స్మరిస్తూ నిన్ను చంపటానికి ఇనుపయంత్రాల కొమ్ములతో, నీవు ఎప్పుడు చనిపోతావో అని యెదురు చూస్తున్నాయి. ఇటువంటి పెద్ద ఆపద నీకు రాబోతున్నది. దీనినుండి దాటుకోవటానికి వీలు కలిగించే ఒక పాతకాలపుకథను నీకు చెబుతాను విను. అని ఇలా అన్నాడు.

## a **=పురంజనోపాఖ్యానము** a

**సీ. భూమీశ! వినుమయ్య పూర్వకాలమునఁ బురంజనుం డను నొక్క రాజు గలఁడు,**
**అతని కవిజ్ఞాతుఁ డనుపేరఁ దగిలి విజ్ఞాత చేష్టితుఁ డగు సఖుఁడు కలఁడు,**
**ఆ పురంజనుఁడు పురాన్వేషియై ధరాచక్రంబుఁ గలయంగ సంచరించి**
**తన కనురూపమై పెనుపొందు పుర మెందు వీక్షింపఁ జాలక విమనుఁ డగుచు**

**తే. నే పురము లుర్విఁ బొడఁగనె నా పురములు, గామములఁ గోరు తనకు న క్కామములను**
**బొందుటకు వానిని ననర్హములుగఁ దన మ, నమునఁ దలఁచి యొకానొకనాఁ డతండు. 742**

**ప్రతి :** భూమి+ఈశ= రాజా; వినుమయ్య= ఆలకించు; పూర్వకాలమునన్= వెనుకటి కాలంలో; పురంజనుండు= పురంజనుడు; అను ఒక్క రాజు= అనే పేరుగల ఒకరేడు; కలఁడు= ఉన్నాడు; అతనికిన్= ఆ రాజునకు; అవిజ్ఞాతుఁడు; అనుపేరన్= అనే పేరుతో; తగిలి= వెంటనుండి; విజ్ఞాత చేష్టితుఁడు= అందరకు తెలియ వచ్చే చేష్టలుగలవాడు; అగు సఖుఁడు= అయిన చెలికాడు; కలఁడు= ఉన్నాడు; ఆ పురంజనుఁడు= ఆ పురంజనమహారాజు; పుర+అన్వేషి= ఒక నగరాన్ని వెదకికొనేవాడు; ఐ= అయి; ధరా చక్రంబున్= చక్రంవంటి భూమిని; కలయంగన్= అంతాకూడి వచ్చేవిధంగా; సంచరించి= తిరిగి; తనకున్= తనకు; అనురూపము= తగినది; ఐ= అయి; పెనుపు+ఒందు పురము= గొప్పదిగా ఉండు

నగరం; ఎందున్= ఎక్కడా; వీక్షింపన్+చాలక= చూడలేక; విమనుఁడు= కలతచెందినవాడు; అగుచున్= అగుచు; ఉర్విన్= భూమియందు; ఏ పురములు= ఏ పట్టణములను; పొడఁగనెన్= చూచెనో; ఆ పురములు= ఆ నగరాలు; కామములన్= కోరికలను; కోరు= అపేక్షించే; తనకున్= తనకు; ఆ+కామములను= ఆ కోరికలను; పొందుటకున్= పొందటానికి; వానినిన్= ఆ పురాలను; అనర్హములుగన్= తగనివిగా; తన మనమునన్= తన మనస్సులో; తలఁచి= భావించి; ఒకానొకనాఁడు= ఒక దినాన; అతండు= అతడు.

**తా :** రాజా! విను. వెనుకటి కాలంలో పురంజనుడనే ఒక రాజు ఉండేవాడు. అతనికి అవిజ్ఞాతుడు అనే మిత్రుడొకడు ఉన్నాడు. అతని చేష్టలు అందరికీ తెలుస్తూ ఉంటాయి. ఆ పురంజనునకు ఒక పురం (నగరం) కావలసి వచ్చింది. దాని కోసం వెదకి భూమండలమంతా కలయదిరిగాడు. తనకు తగిన పురం అతనికి ఎక్కడా కనిపించలేదు. కనిపించిన పురాలు తాను కోరే కోరికలను తీర్చుకోవటానికి తగినవిగా లేవు. ఆ స్థితిలో అతడొకనాడు

**వ. చనుచున్న సమయంబున హిమవత్పర్వత దక్షిణ సానువులందు. 743**

**ప్రతి :** చనుచున్+ఉన్న సమయంబునన్= వెళ్తూ ఉన్న సమయంలో; హిమవత్+పర్వత దక్షిణ సానువులందున్= హిమాలయం అనే కొండల దక్షిణ భాగంలో ఉండే చరియలలో.

**తా :** వెళ్తూ ఉండగా హిమాలయపర్వతం దక్షిణపు చరియలలో

**సీ. వరనవ ద్వార కవాట గవాక్ష తోరణ దేహళీగోపురముల నొప్పి**
**ప్రాకార యంత్రవప్రప్రతోళీ పరిఖాట్టాల కోపవనాళిఁ దనరి**
**సౌవర్ణ రౌప్యాయస ఘన శృంగంబుల రమణీయ వివిధ గేహముల మించి**
**రథ్యాసభా చత్వరధ్వజ క్రీడాయతన సుచైత్యాపణతతిఁ దనర్చి**

**తే. మరకత స్ఫటిక విదూర మణి వినూత్న, మౌక్తికాయుత ఖచిత హర్మ్యములు గలిగి**
**విద్రుమ ద్రుమ వేదుల వెలయు నొక్క, పురముఁ గనియె భోగవతినిఁ బోలు దాని. 744**

**ప్రతి :** వర= మేలైన; నవ= తొమ్మిది అయిన; ద్వార= వాకిళ్ళు; కవాట= తలుపులు; గవాక్ష= కిటికీలు; తోరణ= తోరణాలు; దేహళీ= గడపలు; గోపురములన్= ఎత్తైన శిఖరంవంటి గృహభాగాలు అనువానితో; ఒప్పి= అందగించి; ప్రాకార= ప్రహరులు; యంత్ర= యంత్రాలు; వప్ర= కోటలు; ప్రతోళీ= రాజమార్గాలు; పరిఖా= అగడ్తలు; అట్టాలక= బురుజులు; ఉపవన= తోటలు; ఆళిన్= మొదలగు వాని వరుసలతో; తనరి= ఒప్పారి; సౌవర్ణ= బంగారంతో; రౌప్య= వెండితో; ఆయస= ఇనుముతో రూపొందిన; ఘన= ఎత్తైన; శృంగంబులన్= కొమ్ములతో (శిఖరాలవంటి వాటితో); రమణీయ వివిధ+గేహములన్= అందమైన, అనేకమైన తీరులుగల ఇండ్లతో; మించి= అధికమై; రథ్యా= బాటలు; సభా= కొలువు కూటములు; చత్వర= కూడలులు; ధ్వజ= పతాకములు; క్రీడా+ఆయతన= ఆటలతావులు; సు+చైత్య= మంచి దేవాలయాలు; ఆపణ= వర్తకశాలలయొక్క; తతిన్= సముదాయముతో; తనర్చి= ఒప్పి; మరకత= గరుడపచ్చలు; స్ఫటిక= పటికరాలు; విదూరమణి= వైడూర్యమణులు; వినూత్న మౌక్తిక= క్రొంగొత్త ముత్యాలు అనునని; అయుత= వేలకొలదిగా; ఖచిత= పొదిగిన; హర్మ్యములు= పెద్ద భవనాలు; కలిగి; విద్రుమ ద్రుమ వేదులన్= పగడాలచెట్లు నాటిన అరుగులతో;

వెలయున్= ప్రకాశించు; ఒక్కపురమున్= ఒక నగరాన్ని; భోగవతినిన్= భోగవతి అనే దానిని; పోలుదానిన్= పోలెదుదానిని; కనియెన్= చూచాడు.

**తా :** ఆ పురంజనుడు ఒక గొప్పనగరాన్ని చూచాడు. దానికి మేలైన తొమ్మిది వాకిళ్ళు, తలుపులు, కిటికీలు, తోరణాలు (పూలమాలలు, మామిడాకుల దండలు మొదలైనవి కట్టుకోవటానికి రెండు వైపుల స్తంభాలతో ఏర్పాటు చేసే కట్టడాలు) గడపలు, గోపురాలు అనే వాటితో అలరారుతున్నది. పెద్దచుట్టుగోడలు, శతఘ్ని మొదలైనయంత్రాలు, కోటలు, రాచబాటలు, అగడ్తలు, బురుజులు, పూలతోటల సముదాయాలు అనేవానితో ఒప్పారి ఉన్నది. బంగారంతో, వెండితో, ఇనుముతో నిర్మించిన పెద్ద గోపురాలతో చూడముచ్చట అయిన పెక్కుతీరుల ఇండ్లు అక్కడ ఉన్నాయి. పెద్దవీథులు, శాలలు, కూడలులు, పతాకలు, ఆటస్థలాలు, మంచి దేవాలయాలు మొదలైనవి కళకళలాడుతూ ఉన్నాయి. వేలకొలదిగా ఉన్న గరుడపచ్చలతో, స్ఫటికాలతో, వైడూర్యాలతో, కొంగ్రొత్తముత్యాలతో కూర్చిన పెద్దభవంతులు ఉన్నాయి. పగడాల చెట్లతో అల్లుకొని ఉన్న అరుగులు విరాజిల్లుతున్నాయి. అటువంటి ఒకపురాన్ని, భోగవతిని తలపించేదానిని, ఆ పురంజనుడు చూచాడు.

**వ. ఇట్లు గనుంగొని యనంతరంబ ముందటం బురబాహ్యాంతరంబున దివ్యద్రుమ లతాకుంజ పుంజంబును, సమద నదద్విహంగ మత్త మధుకర కుల కోలాహల సంకుల జలాశయ శోభితంబును, హిమనిర్ఝర బిందుసందోహ పరిస్పంద కందళిత మందమలయ మరుదుచ్చలిత ప్రవాళ విటప నళినీ తటంబును, బాంథజన మనోరంజనాహ్వాన బుద్ధిజనక కలహంస రాజకీర కోకిలాలాప విరాజమానంబును, మునివ్రత నానావిధ వనమృగవ్రాతబాధా రహితంబును, నైన పురబాహ్యోద్యాన వనంబునందు యాదృచ్ఛికంబుగ నేకైక శతనాయకంబైన యనుచరదశకంబును, బంచమస్తకసర్ప ప్రతీహారుండును దోడరా! జనుదెంచుచున్న భర్తృన్వేషిణియుం గామరూపిణియు నప్రౌఢయు నయినయట్టి. 745**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; కనుంగొని= చూచి; అనంతరంబు+అ= వెనువెంటనే; ముందటన్= ముందుభాగంలో; పురబాహ్య+అంతరంబునన్= నగరం వెలుపలి అంతరంలో (ప్రదేశంలో); దివ్య= దేవలోకానికి సంబంధించిన; ద్రుమ= చెట్లయొక్క; లతా కుంజ= తీగల అల్లికలయొక్క; పుంజంబును= సముదాయాలు కలదీ; సమద= పొగరుతో కూడి; నదత్= కూస్తున్న; విహంగ= పక్షుల; మత్త= మదించిన; మధుకర= తుమ్మెదల; కుల= గుంపుల; కోలాహల= కలకల ధ్వనులతో; సంకుల= నిండిన; జల+ఆశయ= సరస్సులతో; శోభితంబును= విరాజిల్లుతున్నదీ; హిమ= మంచునీటి; నిర్ఝర= సెలయేరుల; బిందు= బొట్టుల; సందోహ= సముదాయపు; పరిస్పంద= కదలికలచేత; కందళిత= మొలకెత్తిన (ఏర్పడిన); మంద= మెల్లని; మలయ మరుత్= మలయపర్వతంనుండి వచ్చేగాలిచేత; ఉత్+చలిత= పెద్దగా కదలిన; ప్రవాళ= పగడాల; విటప= చిగుళ్ళతో కూడిన; నళినీ= తామరకొలనుల; తటంబును= ఒడ్డులు కలదీ; పాంథజన= బాటసారుల; మనస్+రంజన= మనస్సులను అలరించే; ఆహ్వాన= పిలుపులా అన్నట్టి; బుద్ధి= భావనను; జనక= పుట్టించే; కలహంస= మనోహరమైన హంసలయొక్క; రాజకీర= ఉత్తమజాతికి చెందిన చిలుకలయొక్క; కోకిల= కోకిలలయొక్క; ఆలాప= కూతలతో; విరాజమానంబును= ఒప్పారుతున్నదీ; ముని= మునుల; వ్రత= నియమాలను పాటించే; నానావిధ= పెక్కుతీరులైన; వన+మృగ= అడవిజంతువుల; వ్రాత= గుంపులతో; బాధా రహితంబును= బాధలేనిదీ; ఐన= అయినట్టి; పుర బాహ్య ఉద్యానవనంబునందున్= నగరం వెలుపలి వినోదంగా జనులు సంచరించే పూలతోటలో; యాదృచ్ఛికంబునన్= అనుకోని విధాన; ఏక+ఏక శత నాయకంబు= ఒక్కొక్కడు వందమందికి చొప్పున నాయకులుగా ఉన్నవారలు; ఐన= అయిన; అనుచర దశకంబును= సేవకుల పదులు కలుగునట్లుగా; పంచ మస్తక సర్ప ప్రతీహారుండును= అయిదుతలల

పాము అనే ద్వారపాలకుడును; తోడన్= తనతో; రాన్= రాగా; చనుదెంచుచున్న= వస్తున్న; భర్తృ+అన్వేషిణియున్= మగని వెదకుచున్నదీ; కామ రూపిణియున్= కోరిన రూపాలు పొందగలదీ; అప్రౌఢయున్= ముదరని వయస్సు కలదీ; అయిన+అట్టి= అయినట్టి...

**తా :** ఆ పురంజనుడు నగరాన్ని చూచాడు. తరువాత అక్కడ ఒక ఉద్యానవనం అతనికి కనబడింది. దాని చుట్టూ గొప్పచెట్లు లతలూ దట్టంగా అల్లుకొని ఉన్న, పొగరెక్కి కూస్తున్న పక్షుల, తుమ్మెదల గుంపుల కలకలనాదంతో శోభిల్లే సరస్సు ఒకటి ఉన్నది. చల్లని సెలయేరులు నీటితుంపరలు బొట్లుబొట్లుగా పడుతుంటే చక్కగా కదలుతున్న తామరలుగల కొలనులు ఉన్నాయి. బాటసారుల మనస్సులను ఆకట్టుకుంటూ స్వాగతం చెబుతున్నాయా అన్నట్లున్న కలహంసల, గొప్ప చిలుకల, కోకిలల కమ్మని కూతలలో విరాజిల్లుతూ ఉన్నదీ, మునుల వ్రతాలను పాటిస్తున్న పెక్కువిధాలైన అడవి మృగాలమందలవలన ఎట్టి బాధలూ లేకుండా ఉన్నదీ అయిన నగరం వెలుపల ఉన్న పూలతోటయందు ఒక ఇంతిని చూచాడు. ఆమె వెనుక పదిమంది అనుచరులు ఉన్నారు. ఒక్కొక్క అనుచరునకూ నూరుగురు పరిచారకులు ఉన్నారు. అయిదు తలల పాము అనే ద్వారపాలకుడు వెంట వస్తున్నాడు. ఆమె భర్తగా పొందటానికి తగిన వానిని వెదకుకుంటూ వస్తున్నది. కోరిన రూపం పొందగల సామర్థ్యం ఆమెకు ఉన్నది. యౌవనంలో ఉన్నది కానీ ఆ దశ ఇంకా పరిణతికి రాలేదు. అటువంటి ఒక స్త్రీని పురంజనుడు చూచాడు.

**సీ. ఘన సమవిన్యస్త కర్ణ కుండల రుచుల్ గండభాగంబుల నిండి పర్వఁ**
**దమ్మిరేకులసిరిఁ దటమటింపఁగ జాలు మెఱుఁగుఁ గన్నులు దలఁ దిరిగి రాఁగ**
**జఘన సంకలిత పిశంగ నీవీద్యుతి కనక కాంచీరుచిఁ గరము పెనుపఁ**
**జరణ సరోజ భాసుర చలన్నూపుర ఝణ ఝణ ధ్వని నర్మ సరణిఁ జూప**

**తే. లలిత యౌవన లక్ష్మీ విలాస భాసు, రోదయ వ్యంజిత ప్రభాయుక్త పీన**
**సమ నిరంతర కుచకుట్మలముల వ్రీడఁ, జెంది పయ్యెదఁ గప్పు బాలేందుముఖిని. 746**

**ప్రతి :** ఘన= పెద్దగా; సమ= సమానంగా; విన్యస్త= చక్కగా పెట్టుకొన్న; కర్ణ= చెవులకు సంబంధించిన; కుండల= కుండలాలనే ఆభరణాల; రుచుల్= కాంతులు; గండ భాగంబులన్= చెక్కిళ్ళమీద; నిండి= నిండుగా ఏర్పడి; పర్వన్= వ్యాపించగా; తమ్మి రేకుల సిరి= తామరపూల రేకుల సొబగును; తటమటింపఁగన్+చాలు= వంచన చేయగలిగే; మెఱుఁగు+కన్నులు= కాంతులను చిమ్మే కన్నులు; తలన్= తలను; తిరిగి రాఁగన్= చుట్టిరాగా; జఘన= పిఱుదుపై; సంకలిత= చక్కగా అంటి పెట్టుకొని ఉన్న; పిశంగ= గోరోచనం వంటి వన్నెగల; నీవీ= పోకముడియొక్క; ద్యుతి= కాంతి; కనక కాంచీరుచిన్= బంగారు మొలనూలి కాంతిని; కరమున్= మరింతగా; పెనుపన్= పెంపొందించగా; చరణసరోజ= పద్మాలవంటి పాదాలందు; భాసుర= వెలుగొందుతున్న; చలత్= కదలుతున్న; నూపుర= అందెల; ఝణఝణధ్వని= ఝణఝణనాదం; నర్మసరణిన్= మేలమాడుతున్న తీరును; చూపన్= ప్రదర్శించగా; లలిత= సుకుమారమైన; యౌవన= పరువానికి చెందిన; లక్ష్మీ= శోభయొక్క; విలాస= విలాసంయొక్క; భాసుర= ప్రకాశిస్తున్న; ఉదయ= పుట్టుకతో; వ్యంజిత= తెలియజేయబడిన; ప్రభా= కాంతితో; యుక్త= కూడిన; పీన= చక్కగా పెంపొందిన; సమ= సమంగా ఉన్న; నిరంతర= నడుమ వ్యవధానం లేని; కుచ= చన్నులనే; కుట్మలముల= మొగ్గలను; వ్రీడన్= సిగ్గును; చెంది= పొంది; పయ్యెదన్= పైటతో; కప్పు= కప్పే; బాల+ఇందుముఖిని= అప్పుడే ఉదయిస్తున్న చంద్రునివంటి మోము కలదానిని.

**తా :** ఆ తరుణి చక్కగా సమంగా ఉండేవిధంగా పెట్టుకొన్న గొప్ప కర్ణకుండలాల కాంతులు చెక్కిళ్ళమీద నిండి వ్యాపిస్తూ ఉన్నాయి. తామరపూల రేకుల శోభను మించిపోయే మెరుగు కన్నులు తలచుట్టివస్తున్నాయా అన్నంత విశాలంగా ఉన్నాయి. పిరుదుల మీద చక్కగా అతుకుకొని ఉన్న గోరోచనం వన్నెగల పోకముడి వెలుగు బంగారు మొలనూలికాంతిని మరింత ఎక్కువ చేస్తున్నది. పద్మాలవంటి పాదాలమీద వెలుగొందుతూ కదలాడుతున్న అందెల కమ్మని నాదం తక్కిన నాదాలను వెక్కిరిస్తున్నదా అన్నట్లు ఉన్నది. అప్పుడప్పుడే ఏర్పడిన పరువంయొక్క శోభతో విరాజిల్లుతూ కాంతులను విరజిమ్ముతున్న బలిసిన, సమంగా ఉన్న, నడుమ సందు ఏమాత్రమూలేని పాలిండ్ల మొగ్గలను సిగ్గుతో పైటతో కప్పుతూ ఉన్నది. అటువంటి లేతచందురుని వంటి మోముగల ఆ యువతిని...

**వ. మఱియును బాలయు సుదతియు గజగామినియు నయిన యొక్క ప్రమదోత్తమం గాంచి. 747**

**ప్రతి :** మఱియును= ఇంకా; బాలయున్= చిన్నివయసున నున్నదీ; సుదతియున్= చక్కని పలువరుసకలదీ; గజగామినియున్= ఏనుగు నడకవంటి నడక కలదీ; అయిన; ఒక్క= ఒక; ప్రమదా+ఉత్తమన్= ఆడువారిలో మిన్న అయినదానిని; కాంచి= చూచి.

**తా :** ఆమె చిన్నవయస్సులో ఉన్నది. తెల్లని కాంతులతో విరాజిల్లుతున్న పలువరుసతో అలరారుతున్నది. ఏనుగు నడకవంటి నడకతో ఒప్పారుతున్నది. అటువంటి మేలుజాతి స్త్రీని పురంజనుడు చూచి.

**క. తరమిడి ప్రేమోద్గమమై, మరువిండ్లం బోలు కన్బొమలు గల తరుణీ**
**సరసాపాంగ విలోకన, శరపరివిద్ధాంగుఁ డగుచు జనవిభుఁ డనియెన్. 748**

**ప్రతి :** తరము+ఇడి= వెనువెంటనే; ప్రేమ+ఉద్గమము= ఇష్టభావం పుట్టటం; ఐ= అయి; మరువిండ్లన్= మన్మథుని విల్లులను; పోలు= పోలునట్టి; కన్+బొమలు= కంటి పై భాగాలు; కల= కలిగిన; తరుణీ= ఆ యువతియొక్క; సరస= ప్రీతిభావంతో కూడిన; అపాంగ= కడకంటి; విలోకన= చూపులనే; శర= బాణాలచేత; పరివిద్ధ= బాగుగా తూటులుపడిన; అంగుఁడు= దేహంకలవాడు; అగుచున్= అవుతూ; జనవిభుఁడు= జనుల ఏలిక అయిన రాజు; అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** (అతనికి) వెంటనే ప్రేమ పుట్టుకొని వచ్చింది. మన్మథుని వింటిబద్దలలాగా ఉన్న కనుబొమ్మలు కలిగిన ఆ ఇంతి సరసమైన చూపులనే బాణాలు తన దేహంలో బాగా గుచ్చుకొన్నాయి. అటువంటి స్థితిలో ఆ రాజు ఆమెతో ఇలా అన్నాడు.

**క. 'ఎవ్వరి దానవు? జనకుం, డెవ్వఁడు? పేరేమి? భృత్యు లీ పది యొక రిం**
**దెవ్వరు? సతు లెవ్వరు? మఱి, యివ్వనమున నుండఁ గార్య మెద్ది మృగాక్షీ! 749**

**ప్రతి :** మృగ+అక్షీ= లేడి కన్నులవంటి కన్నులు కలదానా!; ఎవ్వరిదానవు= నీవు ఎవరికి చెందినదానవు; జనకుండు= తండ్రి; ఎవ్వఁడు= ఎవరు; పేరు= నామం; ఏమి= ఏది?; ఇందు= ఇక్కడ; ఈ పదియొకరు= ఈ పదిమంది; భృత్యులు= సేవకులు; ఎవ్వరు= ఎవరు; సతులు= ఈ ఆడువారు; ఎవ్వరు= ఎవరు; మఱి= ఇంకా; ఈ+వనమునన్= ఈ అడవిలో; ఉండన్= ఉండటానికి; కార్యము= పని; ఎద్ది= ఏది?

**తా :** మృగాక్షీ! నీవెవ్వరిదానవు? తండ్రి ఎవరు? నీ పేరేమిటి? ఈ సేవకులు పదుగురు ఎవరు? ఈ ఆడువారెవ్వరు? ఈ అడవిలో ఉండటానికి కారణం ఏమిటి?

**క. భవదీయ పురస్సరుఁ డగు, పవనాశనుఁ డెవ్వఁ డతికృపామతి నాకున్**
**వివరింపు మనుచు వెండియు, ధవళేక్షణఁ జూచి ధరణిధవుఁ డిట్లనియెన్. 750**

**ప్రతి :** భవదీయ+పురస్సరుఁడు= నీ ముందు నడచివస్తున్నవాడు; అగు= అయిన; పవన+అశనుఁడు= గాలియే తిండిగాగల పాములరాజు; ఎవ్వఁడు= ఎవడు; అతికృపామతిన్= మిక్కిలి దయగలబుద్ధితో; నాకున్= నాకు; వివరింపుము= చక్కగా తెలిసే విధంగా చెప్పు; అనుచున్= అంటూ; వెండియున్= ఇంకా; ధవళ+ఈక్షణన్= తెల్లని కన్నులుగల ఆమెను; చూచి= కనుగొని; ధరణిధవుఁడు= రాజు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** నీ ముందు నడచివస్తున్న ఆ పాపరాజు ఎవడు? మిక్కిలి దయగల బుద్ధితో నాకు వివరించి చెప్పు అని మళ్ళీ తెల్లని కాంతుల కన్నులుగల ఆమెతో పురంజనుడు ఇలా అన్నాడు.

**సీ. తరళాక్షి! పతి యగు ధర్ము నన్వేషింపఁ జరియించు హ్రీ యను సతివొ, కాక**
**రుద్రు నన్వేషించు రుద్రాణివో కాక బ్రహ్మను వెదకు భారతివొ, కాక,**
**నారాయణుని భక్తిఁ గోరి యన్వేషించు నిందిరవో, కాక యెవ్వరీవు?**
**త్వత్పాద కామనత్వమునను సంప్రాప్తసకలకాముండగు సరసు నెట్టి**

**తే వాని వెదకెదు? తరుణీ? భవత్కరాగ్ర, పద్మకోశంబు నేఁడెందుఁ బతిత మయ్యె?**
**నాకు నెఱిఁగింపఁ దగుదు వివేక చరిత, యని నృపాలుఁడు మఱియు నిట్లనియె సతికి. 751**

**ప్రతి :** తరళ+అక్షి= చంచలమైన కన్నులున్న ఓ బాలా!; పతి= భర్త; అగు= అయిన; ధర్మున్= ధర్ముడనే ప్రజాపతిని; అన్వేషింపన్= వెదకటానికి; చరియించు= తిరుగాడే; హ్రీ= 'హ్రీ' అను; సతివొ= అనే సాధ్వివా?; కాక= అదికాక; రుద్రున్= పరమేశ్వరుని; అన్వేషించు= వెదకుతున్న; రుద్రాణివో= రుద్రుని ఇల్లాలివగు పార్వతీదేవివా?; కాక= అదీకాక; బ్రహ్మను= నాలుగు మొగాలదేవర అయిన బ్రహ్మను; వెదకు= అన్వేషిస్తున్న; భారతివొ= సరస్వతీదేవివా?; కాక= అదీకాక; నారాయణునిన్= శ్రీమహావిష్ణువును; భక్తిన్= భక్తితో; కోరి= ఇష్టపడి; అన్వేషించు= వెదకే; ఇందిరవో= లక్ష్మీదేవివా?; కాక= అదికాక; ఈవు= నీవు; ఎవ్వరు?= ఎవరు?; త్వత్+పాద కామనత్వమునను= నీ పాదాలను ప్రీతితో కోరుకోవటం చేత; సంప్రాప్త సకల కాముండు= లభించిన అన్ని కోరికలు కలవాడు; అగు= అయిన; సరసున్= రసహృదయంగల; ఎట్టివానిన్= ఎటువంటివానిని; వెదకెదు= వెదకుతున్నావు; తరుణీ= యువతీ; భవత్+కర+అగ్ర పద్మ కోశంబు= నీ చేతి చివర ఉండే పద్మం మొగ్గ; నేఁడు= ఈనాడు; ఎందున్= ఎక్కడ; పతితము+అయ్యెన్= పడిపోయింది?; వివేకచరిత!= మంచిచెడులను నిర్ణయించగల బుద్ధితో కూడిన నడవడి కలదానా?; నాకున్= నాకు; ఎఱిగింపన్+తగుదు= తెలియజెప్పగలవు; అని= అని పలికి; నృపాలుఁడు= రాజు; మఱియున్= ఇంకా; సతికిన్= ఆ ఇంతికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** ఓ యువతీ! నీవు భర్తయగు ధర్ముని వెదకుతూ తిరుగుతున్న హ్రీదేవివా? రుద్రుని వెదకుతున్న రుద్రాణివా? బ్రహ్మను వెదకుతున్న భారతీదేవివా? నారాయణుని భక్తితో కోరి వెదకుతున్న లక్ష్మీదేవివా? కాక ఎవ్వరు నీవు. నీ పాదాలను కోరటంచేత అన్ని కోరికలను తీర్చుకొన్న ఎలాంటి సరసుని వెదకుతున్నావు? నీ చేతి చివర విలాసంగా ఉండే పద్మంమొగ్గ ఎక్కడ పడిపోయింది? వివేక ప్రవృత్తిగల ఓ ఇంతీ! నాకు చెప్పాలి – అని రాజు ఆమెతో ఇంకా ఇలా అన్నాడు.

**క. కర మొప్పఁగ నీ విటు భూ, చర వగుటను హ్రీవి శివవు శారదవును సా**
**గర కన్యవుఁ గాకుండుటఁ, దరుణీ? పొడగంటి నని పదంపడి పలికెన్. 752**

**ప్రతి :** తరుణీ= ఓ యువతీ; కరము= చాలా; ఒప్పఁగన్= ప్రకాశిస్తూ; నీవు; ఇటు= ఈ విధంగా; భూచరవు= నేలమీద తిరుగాడుచున్న దానవు; అగుటన్= అవటంచేత; హ్రీవి= ధర్మని పత్నివి; శివవు= పార్వతివి; శారదవును= సరస్వతీదేవివి; సాగరకన్యవున్= సముద్రరాజతనయ అయిన లక్ష్మివి; కాక+ఉండుటన్= కాకపోవటం; పొడగంటిని= గుర్తించాను; అని= అని పలికి; పదంపడి= తరువాత; పలికెన్= అన్నాడు.

**తా :** తరుణీ! నీవు విలాసంగా నేలమీద తిరుగాడుతూ ఉండటం వలన హ్రీ, శివ, శారద, లక్ష్మీదేవి అనేవారలలో ఒకతెవు కావు అని గుర్తించాను. అని ఇంకా ఇలా పలికాడు.

**సీ. మొనసి యదభ్రకర్ముఁడ నైన నాచేత నిపుడు పాలితమైన యీ పురంబు**
**సరసిజోదరుని భుజాపాలితోదాత్త లలిత వైకుంఠ మలంకరించు**
**నిందిరా సుందరి చందంబునను నీ వలంకరింపఁ గడంగు పంకజాక్షి!**
**యది గాక తావకీనాపాంగరుచి మోహితాంతరంగుండ నైనట్టి నన్ను**

**తే. మహిత సవ్రీడ భావ సన్మందహాస, చారు విభ్రమ భ్రూలతా ప్రేరితుఁడుగఁ**
**దనరు భగవంతుఁ డగునట్టి మనసిజుండు, పడఁతి! యుడుగక పీడింపఁ దొడఁగె నిపుడు. 753**

**ప్రతి :** మొనసి= పూనుకొని; అదభ్ర+కర్ముఁడను= గొప్పవి అయిన పనులు గలవాడను; ఐన= అయిన; నాచేతన్= నాచేత; ఇపుడు; పాలితము= పాలింపబడుచున్నది; ఐన= అయిన; ఈ పురంబున్= ఈ నగరాన్ని; సరసిజ+ఉదరుని= పద్మం బొడ్డుభాగంలో కల విష్ణువుయొక్క; భుజా= భుజాలతో; పాలిత= ఏలబడుచున్న; లలిత= అందచందాలుగల; వైకుంఠము= వైకుంఠమనే నగరాన్ని; అలంకరించు= భూషించే; ఇందిరా సుందరి చందంబునను= లక్ష్మీదేవి విధంగా; పంకజ+అక్షి= పద్మాలవంటి కన్నులున్న ఓయువతీ; నీవు= నీవు; అలంకరింపన్+కడంగు= అలంకరించటానికి పూనుకో; అది+కాక= అంతేకాక; తావకీన= నీదయిన; అపాంగ= కడకంటి; రుచి= కాంతిచేత; మోహిత= మోహం పొందిన; అంతరంగుండను= హృదయం కలవాడను; ఐన+అట్టి= అయినట్టి; నన్నున్= నన్ను; మహిత= గొప్పదైన; సవ్రీడ భావ= సిగ్గుతో కూడిన భావంతో; సత్= చక్కని; మందహాస= చిరునవ్వుతో; చారు= అందమైన; విభ్రమ= విలాసం కల; భ్రూ లతా= కనుబొమలనెడి లతలతో; ప్రేరితుఁడుగన్= పురికొల్పబడుతున్నవాడుగా; తనరు= ఒప్పారు; భగవంతుఁడు= మిక్కిలిగా పూజించదగినవాడు; అగు+అట్టి= అయినట్టి; మనసిజుండు= మనస్సులో పుట్టే మన్మథుడు; పడతి= ఓ మగువా!; ఉడుగక= వదలక; ఇపుడు= ఈ సమయంలో; పీడింపన్+తొడఁగెన్= బాధించటానికి పూనుకున్నాడు.

**తా :** పద్మాక్షీ! నేను ఇపుడు గట్టి ప్రయత్నంతో నీచమైన పనులు లేకుండా ఈ పురాన్ని ఏలుతూ ఉన్నాను. ఇట్టి పురాన్ని శ్రీమహావిష్ణుని భుజాలచే పాలింపబడు వైకుంఠాన్ని లక్ష్మీదేవిలాగా నీవు అలంకరించు. అంతేకాదు. నీ కడకంటిచూపులు నన్ను మోహపెడుతున్నాయి. గొప్పదైన సిగ్గుతో కూడిన చిరునవ్వుల అందమైన కదలికలుగల నీ కనుబొమలు పురికొల్పుతుండగా భగవంతుడైన మన్మథుడు నన్ను ఇప్పుడు వదలకుండా బాధిస్తున్నాడు.

**వ. కావున** **754**

**ప్రతి :** కావునన్= కాబట్టి

**చ. తరుణి! సుతారలోచనయుతంబును మంజుసుధాసమాన భా**
**సుర మృదువాక్యయుక్తమును శోభిత కోమల లంబమాన సుం**
**దర చికురాభిరామము నుదారము నైన భవన్ముఖాబ్జమున్**
**సురుచిరలీల నెత్తి ననుఁ జూడుము, సిగ్గును జెంద నేటికిన్?** **755**

**ప్రతి :** తరుణి= చిన్నదానా!; సుతారలోచనయుతంబును= అందమైన కనుగుడ్లు కల కన్నులతో కూడినది; మంజు= విన సొంపైన; సుధా= అమృతంతో; సమాన= సమానమైన; భాసుర= ప్రకాశించే; మృదు= మెత్తని; వాక్య= పలుకులతో; యుక్తంబును= కూడినదియు; శోభిత= విరాజిల్లుచున్న; కోమల= సుకుమారమైన; లంబమాన= వేలాడుతున్న; సుందర= అందమైన; చికుర= ముంగురులతో; అభిరామమును= సొగసుగా ఉన్నది; ఉదారమును= గొప్పది అయినది; ఐన= అయిన; భవత్+ముఖ+అబ్జమున్= నీ ముఖమనే పద్మాన్ని; సురచిర లీలన్= మిక్కిలిగా కాంతులు చిమ్మే విలాసంతో; ఎత్తి= పైకి ఎత్తి; ననున్= నన్ను; చూడుము= చూడు; సిగ్గును= లజ్జను; చెందన్= పొందటం; ఏటికిన్= ఏల?

**తా :** చిన్నదానా! నీమోము చక్కని కనుపాపలతో కూడిన కన్నులతో అలరారుతున్నది. చాలా అందమైన, అమృతంవంటి మెత్తని పలుకులతో కూడి ఉన్నది. సుకుమారంగా వ్రేలాడుతున్న అందమైన ముంగురులతో అలరారుతున్నది. గొప్పగా ఉన్నది. అటువంటి నీ మోము అనే పద్మాన్ని చూడముచ్చట అయ్యే విధంగా ఎత్తి నన్ను చూడు. నీవు ఇప్పుడు సిగ్గుపడడమెందుకు?

**వ. అని యివ్విధంబున నధీరుండై పలుకు పురంజనుం జూచి యా ప్రమదోత్తమ వీరమోహితయై సస్మితానన యగుచు నానందంబు నొంది యిట్లనియె.** **756**

**ప్రతి :** అని= ఈ+విధంబునన్= ఈ తీరున; అధీరుండు= గుండెనిబ్బరం లేనివాడు; ఐ= అయి; పలుకు= మాట్లాడు; పురంజనున్= పురంజనుని; చూచి= కనుగొని; ఆ+ప్రమదా+ఉత్తమ= స్త్రీలలోమేలుబంతి అయిన ఆ కాంత; వీర+మోహిత= వీరునిచేత మోహింపబడినదై; ఐ= అయి; సస్మిత+ఆనన= చిరునగువుతో కూడిన మోము కలది; అగుచున్= అవుతూ; ఆనందంబున్= ఆనందాన్ని; ఒంది= పొంది; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నది.

**తా :** ఆ పురంజనుడు గుండె దిటవులేనివాడై పలుకుతున్నాడు. ఆమె కాంతలలో మేలుబంతి అయినది; వీరుడు వరించినది. కనుక చిరునవ్వు మోముపై చిందులాడుతూ ఉండగా ఆనందం పొంది ఇలా పలికింది.

**క. పురుషవర! నాకు నీకును, గురువును నామమును గులముఁ గోరి యెఱుఁగ నీ**
**పురమున నుండుదుఁగా కీ, పురమును నిర్మించి నట్టి పురుషు నెఱుంగన్.** **757**

**ప్రతి :** పురుషవర= ఉత్తముడవయిన ఓ మానవా!; నాకున్= నాకూ; నీకును= నీకూ; గురువును= మార్గం బోధించేవానినీ; నామమును= పేరును; కులమున్= కులాన్నీ; కోరి= తెలుసుకోగోరికూడా; ఎఱుగను= తెలియను; ఈ పురమునన్= ఈ

నగరంలో; ఉండుదున్= ఉంటాను; కాక; ఈ పురమును= ఈ పురాన్ని; నిర్మించిన+అట్టి= రూపొందించినట్టి; పురుషున్= పురుషుని; ఎఱుంగన్= తెలియను.

**తా :** పురుష శ్రేష్ఠా! నాకూ నీకూ గురువైన వానినీ, పేరునూ కులాన్నీ నేనెరుగను. ఈ పురంలో ఉంటాను కానీ దీనిని కట్టించిన పురుషుడు యెవడో నాకు తెలియదు.

**విశే :** ఈ పురంజనోపాఖ్యానం ఒక తాత్త్వికార్థాన్ని ప్రతీకగా చెబుతున్న కథా భాగం. 'పురం' ఇక్కడ దేహమే. పురంజనుడు దేహి, అనగా జీవుడు. ఈ పలుకుతున్న స్త్రీ వ్యక్తిని 'బుద్ధి'గా సంభావించాలి. దేహంలో ఉన్న జీవునకూ, బుద్ధికీ ఆ దేహం ఎలా ఏర్పడిందో, అజ్ఞానం వలన తెలియదు. 'గురువు' ఇక్కడ పరమాత్మయే. అతని తత్త్వం తెలియకుండానే జీవుడు దేహంలో కాలక్షేపం చేస్తూ ఉంటాడు.

**క. వీరలు నా సఖు లీలల, నారత్నము లార్యవినుత! నా చెలు! లీ వృ**
**ద్ధోరగ మే నిద్రింపఁగ, ధీరత మేల్కాంచి పురము ధృతిఁ బాలించున్. 758**

**ప్రతి :** వీరలు= ఈ కనపడేవారు; నా సఖులు= నా చెలికత్తెలు; ఈ లలనారత్నములు= మేలుబంతులైన ఈ స్త్రీలు; ఆర్యవినుత= గొప్పవారిచేత కొనియాడబడేవాడా!; నాచెలులు= నాతో స్నేహం చేసేవారు; ఈ వృద్ధ+ఉరగము= ఈ ముసలిపాము; ఏన్= నేను; నిద్రింపఁగన్= నిద్రపోతూఉంటే; ధీరతన్= ధైర్యంతో; మేల్కాంచి= మేల్కొని; పురమున్= ఈ నగరాన్ని; ధృతిన్= ధైర్యంతో; పాలించున్= రక్షిస్తూ ఉంటుంది.

**తా :** ఆర్యవినుతా! ఈ స్త్రీలూ, ఇంకా కనపడుతున్న మగువలూ నా చెలికత్తెలు. ఈ ముసలిపాము నేను నిద్రపోతున్నప్పుడు ధైర్యంతో, పట్టుదలతో ఈ పట్టణాన్ని కాపాడుతూ ఉంటుంది.

**విశే :** ఇందులోని ప్రతీకల నన్నింటినీ ముందు విడబరచి చెప్తారు.

**వ. వెండియు నిట్లనియె. 759**

**ప్రతి :** వెండియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇలా అన్నది.

**తా :** ఇంకా (ఆ ఇంతి) ఇలా అన్నది.

**సీ. మనుజ నాయక! నీవు మద్భాగ్య వశమున నిటకు నేతెంచితి, విపుడు నీకు**
**మంగళంబగు, నీవు మహితేంద్రియగ్రామ భోగ్యంబు లగు కామపుంజములను**
**నర్థి సంపాదింతు వనఘాత్మ! యీ నవ ద్వార ప్రయుక్తమై తనరు పురము**
**నీవు గైకొని యేలు, నీ కంటె దీనికి నధిపుఁ డన్యుండు లేఁ డనఘ! యందు**

**తే. మదుపనీతములైన కామముల ననుభ, వింపఁగా సమాశత మధిష్ఠింపు మెలమిఁ,**
**గోరి నీకంటెఁ బ్రియులు నెవ్వారు నాకు? నరసి చూడంగ మనుజేంద్ర! యదియుఁగాక. 760**

**ప్రతి :** మనుజనాయక= ప్రజలను ఏలువాడా!; మద్+భాగ్యవశమునన్= నా భాగ్యంకొద్దీ; నీవు; ఇటకున్= ఇక్కడకు; ఏగు+తెంచితివి= వచ్చావు; ఇపుడు= ఇప్పుడు; నీకున్= నీకు; మంగళంబు= శుభం; అగున్= అవుతుంది; అనఘ+ఆత్మ=

పాపబుద్ధిలేనివాడా!; నీవు; మహిత+ఇంద్రియ గ్రామ భోగ్యంబులు= గొప్పవి అయిన ఇంద్రియాల సముదాయం చేత అనుభవించదగినవి; అగు= అయిన; కామ పుంజములను= కోరికల మొత్తాలను; అర్థిన్= కోరికతో; సంపాదింతువు= పొందుతావు; ఈ నవ ద్వార ప్రయుక్తము= ఈ తొమ్మిది వాకిళ్ళ ఏర్పాటుకలది; ఐ= అయి; తనరు= ఒప్పారు; పురమున్= నగరాన్ని; నీవు; కైకొని= స్వీకరించి; ఏలు= పాలించు; దీనికిన్= ఈ పనికి; నీకంటెన్= నీ కన్నా; అధిపుండు= రాజు; అన్యుండు= మరొకడు; లేఁడు= లేడు; ఇందున్= ఇక్కడ; మత్+ఉప నీతములు= నాచే సమకూర్చబడినవి; ఐన= అయిన; కామములన్= ఇష్టపడిన భోగాలను; అనుభవింపఁగాన్= అనుభవించడానికి; సమాశతము= నూరేండ్లు; ఎలమిన్= ప్రీతితో; అధిష్ఠింపు= ఉండు; మనుజ+ఇంద్ర= రాజా!; అరసిచూడంగన్= పరిశీలించి చూస్తే; నాకున్= నాకు; నీ కంటెన్= నిన్ను తప్ప; కోరి= ఇష్టపడిన; ప్రియులు= ఇష్టమైనవారు; ఎవ్వారు= ఎవరు?; అదియున్+కాక= అంతేకాక...

**తా :** రాజా! నీవు నా అదృష్టం కొద్దీ ఇక్కడకు వచ్చావు. ఇప్పుడు నీకు శుభం కలుగుతుంది. నీవు చాలా గొప్పవి అయిన ఇంద్రియవర్గం తృప్తిపడే సుఖాలను పొందుతావు. ఇది తొమ్మిది వాకిళ్ళతో ఏర్పడిన నగరం. దీనిని నీవు స్వాధీనం చేసుకొని పాలించు. ఇందుకు నీకంటె తగినరాజు మరొకడు లేడు. పుణ్యాత్మా! ఈ నగరంలో నేను సమకూర్చే సౌఖ్యాల నన్నింటినీ అనుభవిస్తూ ఇక్కడ నూరేండ్లు ఉండు. రాజా! పరిశీలించి చూస్తే కోరుటకు నీ కంటె నాకు ఇష్టులయినవారు లేరు.

**విశే :** ఈ పురం దేహమే. ఇందులోని తొమ్మిది వాకిళ్ళు, రెండు కన్నులు, రెండు చెవులు, రెండు ముక్కులు, ఒకనోరు, మలమూత్ర విసర్జకావయవాలు రెండు. మాయారూప అయిన బుద్ధి వీటికి కోరినవన్నీ అందిస్తూ సుఖం కలిగిస్తున్నట్టు ఉంటుంది. ఈ ప్రతీకలన్నింటినీ ముందుముందు పూర్తిగా వివరించి సమన్వయిస్తారు.

**వ. మఱియు రతిజ్ఞాన విహీనుండు నకోవిదుండు నిహపరచింతాశూన్యుండుఁ బశుప్రాయుండుఁ ద్వదన్యుండు నైన వాని నెవ్వని వరియింతు? గృహస్థాశ్రమమందు ధర్మార్థ కామ మోక్ష ప్రజానందంబులును యశంబును యతి వేద్యంబులు గాని రజస్తమో విహీన పుణ్యలోకంబులును గలుగుఁ, బితృదేవర్షి మర్త్యభూత గణంబులకుం దనకు నీ లోకంబున గృహస్థాశ్రమంబు సర్వక్షేమార్థం బయిన యాశ్రమం బండ్రు, గావున వదాన్యుండవు, వీర విఖ్యాతుండవు, ప్రియదర్శనుండవు, స్వయంప్రాప్తుండవు నయి భోగి భోగ సదృశ భుజాదండంబులచే నొప్పు భవాదృశుం దగిలి మాదృశయగు కన్య వరియింపకుండునే యని వెండియు. 761**

**ప్రతి :** మఱియున్= ఇంకా; రతిజ్ఞాన విహీనుండును= శృంగార జ్ఞానం లేనివాడు; అకోవిదుండును= పండితుడు కానివాడూ; ఇహ పర చింతా శూన్యుండును= ఇహలోకపు, పరలోకపు స్థితినీ గురించిన భావనలేనివాడూ; పశుప్రాయుండును= వివేకంలేని గొడ్డువంటివాడూ; త్వత్+అన్యుండును= నీ కంటె వేరైనవాడూ; ఐనవానిన్= అయినవానిని; నేను; ఎవ్వనిన్= ఎవరిని; వరియింతున్= భర్తగా ఎన్నుకుంటాను?; గృహస్థ+ఆశ్రమమందున్= నాలుగింటిలో రెండవది అయిన సంసార ప్రవృత్తికి సంబంధించిన నియమాలతో కూడిన నడవడిలో; ధర్మ+అర్థ కామ మోక్ష ప్రజా+ఆనందంబులును= ధర్మం, అర్థం, కామం, మోక్షం, సంతానం వలన కలిగే ఆనందం; యశంబును= కీర్తియు; యతి+వేద్యంబులు= సన్యాసులకు తెలియదగినవి; కాని= కానట్టి; రజస్+తమస్+విహీన పుణ్యలోకంబులును= రజోగుణం, తమోగుణం అనేవి లేని పుణ్యలోకాలున్నూ; కలుగున్= ఏర్పడతాయి; పితృ= పితృదేవతలు; దేవ= స్వర్గదేవతలు; ఋషి= ఋషులు; మర్త్య= మానవులు; భూత= ప్రాణులు అనేవాని; గణంబులకున్= సంఘాలకు; తనకున్= తనకూ; ఈ లోకంబునన్= ఈ ప్రపంచంలో; గృహస్థ+ఆశ్రమంబు= గృహస్థుడు ప్రవర్తించే తీరుతెన్నుల విధానం; సర్వక్షేమ+అర్థంబు= అన్ని విధములైన

భద్రతలకూ యోగ్యం; అయిన; ఆశ్రమంబు= ఆశ్రమం; అంద్రు= అంటారు; కావునన్= కాబట్టి; వదాన్యుండవు= గొప్పగా దానాలు చేసేవాడవు; వీర విఖ్యాతుండవు= వీరులలో పేరు ప్రతిష్ఠలు కలవాడవు; ప్రియదర్శనుండవు= చూడ ముచ్చట అయినవాడవు; స్వయంప్రాప్తుండవు= నీఅంతట నీవై నాకు ప్రాప్తించినవాడవు; అయి; భోగి= మహాసర్పంయొక్క; భోగ= పడగల; సదృశ= వంటి; భుజా= బాహువులనే; దండంబులచేన్= దుడ్డు కర్రలచేత; ఒప్పు= అలరారు; భవాదృశున్= నీ వంటి వానిని (తో); తగిలి= సంగం పెట్టుకొని; మాదృశ= నావంటిది; అగు= అయిన; కన్య= పెండ్లికాని పిల్ల; వరియింపక= ఇష్టపడక; ఉండునే= ఉంటుందా?; అని; వెండియున్= ఇంకా...

**తా :** కామభావాలు లేనివాడు, శాస్త్రరహస్యాలు తెలియనివాడూ, ఈలోకపు, పరలోకపు భావాలులేనివాడూ, గొడ్డువంటివాడూ అయిన మరొక్కనిని నేను వరిస్తానా? గృహస్థ ఆశ్రమంలో ధర్మార్థకామమోక్షాలతోపాటు సంతానసౌఖ్యం కూడా లభిస్తుంది. కీర్తియు, యతులకు తెలియరాని రజస్తమోగుణాల సంపర్కంలేని పుణ్యలోకాలు కలుగుతాయి. ఈ ఆశ్రమంలో పితృదేవతలకు, దేవతలకు, ఋషులకు, మానవులకూ, ఇతర జంతువులకూ, తనకూ ఈ ప్రపంచంలో అన్ని క్షేమాలను కలిగించ కలిగిన ఆశ్రమం అంటారు. కాబట్టి గొప్పదాతవు, వీరుడని పేరు పొందినవాడవు, చూడముచ్చటగా నున్నవాడవూ, నీ అంత నీవై నాకు ప్రాప్తించినవాడవూ, భోగి భోగములవంటి, గొప్పదండములవంటి దృఢమైన బాహువులతో అలరారుతున్నవాడవూ అయిన నీ వంటివానితో సంగం ఏర్పరచుకొని నా వంటిది వరింపకుంటుందా? అని ఇంకా ఇలా అన్నది.

**క. కరుణారస పరిపూర్ణ, స్ఫురిత స్మిత రుచి విలోక పుంజముచేతం**
**గర మర్థి దీన జన భయ, హరణుఁడవై సంచరింపు మఖిల జగములన్. 762**

**ప్రతి :** కరుణా= దయఅనే; రస= రసంతో; పరిపూర్ణ= ఎక్కువగా నిండిన; స్ఫురిత= వెలుపలికి తెలియవస్తున్న; స్మిత= చిరునగవుయొక్క; రుచి= కాంతిగల; విలోక= చూపుల; పుంజము చేతన్= ప్రోవుచేత; కరము= మిక్కిలిగా; అర్థి= కోరునట్టి; దీన= దరిద్రులైన; జన= జనుల; భయ= భీతిని; హరణుఁడవు= పోగొట్టువాడవు; ఐ= అయి; అఖిలజగములన్= అన్ని లోకాలలోనూ; సంచరింపుము= తిరుగుతూ ఉండు.

**తా :** రాజా! నీ కన్నులలో జాలిభావం నిండుగా వెలుగొందుతూ ఉన్నది. అది నీ చిరునగవులో తెలియవస్తున్నది. అటువంటి చూపులు నిరంతరం వెలుగొందుతూ ఉండగా యాచకులగు దీనుల భయాలన్నింటిని పోగొడుతూ అన్ని లోకాలలో తిరుగుతూ ఉండు.

**క. అని యీ గతిఁ బలికిన యా, వనజాక్షిఁ బురంజనుండు వరియించి ముదం**
**బున నన్యోన్య ప్రీతిం, దనరుచుఁ దత్పురము సొచ్చి ధన్యుం డగుచున్. 763**

**ప్రతి :** అని; ఈ గతిన్= ఈ విధంగా; పలికినన్= పలుకగా; పురంజనుండు= పురంజనమహారాజు; ఆ+వనజ+అక్షిన్= పద్మాలవంటి కనులుగల ఆ ఇంతిని; వరియించి= భార్యగా స్వీకరించి; ముదంబునన్= సంతోషంతో; అన్యోన్య ప్రీతిన్= ఒకరియందొకరికి ఏర్పడిన ప్రీతితో; తనరుచున్= ఒప్పారుతూ; తత్+పురము= ఆ నగరాన్ని; చొచ్చి= ప్రవేశించి; ధన్యుండు= పుణ్యాత్ముడు; అగుచున్= అవుతూ...

**తా :** అని ఆమె ఇలా పలికిన ఆ వనజాక్షిని పురంజనుడు వరించి ఆనందముగా పరస్పరప్రీతితో ఒప్పుతూ ఆ పురంలోనికి ప్రవేశించి ధన్యుడైనాడు.

**విశే :** 1) అన్యోన్య ప్రీతిన్ – భార్యాభర్తల అనురాగం రెండు వైపులా నిండి ఉండాలి. అదే సరియైన దాంపత్యలక్షణం.

2) ధన్యుడు – ధనం అంటే పుణ్యం. అది కలవాడు ధన్యుడు. సర్వసమయాలలో పుణ్యకార్యాలు మాత్రమే చేస్తూ ఉండేవాడని తాత్పర్యం.

**చ. శతసమకాల మప్పురి నజస్రము భూరి సమస్త సౌఖ్య సం**
**గతులఁ దనర్చి వందిజన గాయక సద్వినుతోరు గాన మో**
**దిత మతి నొప్పి సుందరసతీ జనసేవితుఁడై నృపాల కో**
**చిత లలితస్థలంబుల వసించుచుఁ గ్రీడలు సల్పుచుండఁగన్. 764**

**ప్రతి :** ఆ+పురిన్= ఆ నగరంలో; శతసమకాలము= నూరేండ్లకాలం; అజస్రమున్= ఎడతెగకుండా; భూరి= చాలా ఎక్కువ అయిన; సమస్త= అన్ని విధములైన; సౌఖ్య= ఇంద్రియాలకు తృప్తిని కలిగించే; సంగతులన్= పొందులతో; తనర్చి= అతిశయించి; వంది జన= స్తుతించటం వృత్తిగాగలవారి; గాయక= పాటలు పాడి ఆనందపెట్టేవారి; సత్= మంచి; వినుత= పొగడ్తలచేత; ఉరుగాన= పెద్ద పాటలచేత; మోదిత= ఆనందం పొందిన; మతిన్= బుద్ధితో; ఒప్పి= తనరి; సుందరసతీజన సేవితుఁడు= అందగత్తెలయిన ఇంతులచేత సేవించబడువాడు; ఐ= అయి; నృపాలక+ఉచిత లలిత స్థలంబులన్= రాజులకు యోగ్యములైన ఆకర్షణగల తావులలో; వసించుచున్= ఉంటూ; క్రీడలు= ఆటలు; సల్పుచుండఁ గన్= చేస్తూ ఉండగా...

**తా :** ఆ రాజు నూరేండ్లు ఆ నగరంలో ఎడతెరపి లేకుండా చాలా గొప్పవీ, అన్ని విధాలయినవీ అయిన సుఖాల పొందులతో ఒప్పారుతున్నాడు. వందుల స్తుతిపాఠాలూ, గాయకుల సంగీత కాలక్షేపాలతో ప్రమోదం పొందుతూ ఉన్నాడు. అందగత్తెలయిన సుందరులెందరో అతనిని సేవిస్తున్నారు. రాజులకే యోగ్యాలయిన చక్కని తావులలో క్రీడలు సలుపుతూ ఉండగా

**క. నరనాథుఁడు లోకభయం, కరగతి వర్తించు గ్రీష్మకాలము దోఁపం**
**దరళ లహరీ మనోహర, వరహ్రదిని సలిలమందు వసియించెఁ దగన్. 765**

**ప్రతి :** లోక+భయంకరగతిన్= లోకులకు భయాన్ని కలిగించే తీరులో; వర్తించు= సాగే; గ్రీష్మకాలము= ఎండలకాలం; తోఁపన్= రాగా; నరనాథుఁడు= రాజు; తరళ= కదలాడుతున్న; లహరీ= తరంగాలతో; మనోహర= మనస్సును కొల్లగొట్టే; హ్రదిని= కొలనులోని; సలిలమందున్= నీళ్ళలో; తగన్= చక్కగా; వసియించెన్= ఉన్నాడు.

**తా :** ఇంతలో లోకభయంకరంగా వేసవికాలం వచ్చింది. అప్పుడా రాజు తరంగాలు కదలాడుతూ ఉన్న మనోహరమైన మేలైన కొలను నీటిలో ఉన్నాడు.

**వ. ఇట్లు వసియించి కతిపయదినంబు లగు సమయంబున. 766**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; వసించి= ఉండి; కతిపయదినంబులు= కొన్నిరోజులు; అరుగుసమయంబునన్= సాగిన వేళలో...

**తా :** ఈ విధంగా ఉండి కొన్ని రోజులు గడచిన తరువాత

**సీ. అవనీశ్వరోత్తమ! య ప్పురంబున నాల్గు వంకలనున్న గవcకులు వినుము**
**తూర్పు దిక్కునను నై దును దక్షిణోత్తరంబుల రెండుc బశ్చిమంబునను రెండుc**
**గాcగ నా తొమ్మిది గవcకుల నుపరి దిక్కున నేడుc గ్రింది దిక్కునను రెండు**
**నయి యుండు, మఱి వానియందుc బృథగ్విధ విషయ గత్యర్థమై వెలయు నీశ్వ**

**తే. రుం డొకం డరయc గలండు రూఢిc దత్పు, రంబుc బాలించునట్టి పురంజనుండు**
**నా పురద్వార నవకంబు, నందులోన, నర్థిc బ్రాగ్ద్వార పంచకమందు వరుస. 767**

**ప్రతి :** అవనీశ్వర+ఉత్తమ= రాజులలో శ్రేష్ఠుడైనవాడా!; ఆ+పురంబునన్= ఆ నగరంలో; నాల్గువంకలన్= నాలుగు వైపులా; ఉన్న= ఉన్నట్టి; గవcకులు= కోటద్వారాలు; వినుము= విను; తూర్పుదిక్కునన్= తూర్పుదిక్కులో; ఐదును= ఐదూ; దక్షిణ+ఉత్తరంబులన్= దక్షిణ దిక్కునందు; ఉత్తర దిక్కునందు; రెండు= రెండూ; పశ్చిమంబునన్= పడమటిదిక్కునందు; రెండు= రెండూ; కాcగన్= కాగా; ఆ తొమ్మిది గవcకులన్= ఆ తొమ్మిది ద్వారాలలోను; ఉపరిదిక్కునన్= పై భాగాన; ఏడున్= ఏడూ; క్రింది దిక్కునన్= కిందివైపున; రెండున్= రెండూ; అయి; ఉండున్= ఉన్నాయి; మఱి= ఇంకా; వానియందున్= వానిలో; పృథక్ విధ విషయ గతి+అర్థము= వేరు వేరు తీరుల విషయాల సంచారంకోసం; వెలయు= ఒప్పారు; ఈశ్వరుండు= ప్రభువు; ఒకండు= ఒక్కడు; కలండు= ఉన్నాడు; రూఢిన్= ప్రసిద్ధితో; తత్పురంబున్= ఆ పట్టణాన్ని; పాలించు+అట్టి= పాలించే; పురంజనుండు= పురంజనుడు; ఆ పుర ద్వార నవకంబున్= ఆ పురం వాకిళ్ళు తొమ్మిదింటినీ ఏలుతూ ఉంటాడు; అందులోనన్= అందులో; అర్థిన్= కోరికతో; ప్రాక్+ద్వార పంచకమందున్= తూర్పువాకిళ్ళు ఐదింటిలో; వరుసన్= క్రమంగా...

**తా :** రాజా! విను. ఆ నగరానికి నాలుగువైపులా నాలుగు కోటద్వారాలు ఉన్నాయి. అందులో తూర్పుదిక్కున అయిదు, దక్షిణ ఉత్తరదిక్కులలో రెండూ, పడమట రెండూ ఉన్నాయి. వానిలో ఏడు పైభాగాన, రెండు క్రింది భాగాన ఉన్నాయి. వానిలో వేరు వేరు విషయాలు పొందడానికి ఈశ్వరుడొకడు ఉన్నాడు. అట్టి పురాన్ని పాలిస్తున్నవాడు పురంజనుడు. అందులో తూర్పు ద్వారంలో ఉన్న అయిదింటిలో వరుసగా

**విశే :** ఈ పురానికి తొమ్మిదివాకిళ్ళు ఉన్నాయి. పురమంటే ఇక్కడ దేహమే. అందులో తూర్పువైపున అయిదు ఉన్నాయి. అవి రెండు కన్నులు, రెండు ముక్కురంధ్రాలు, ఒక నోరు అనేవి. దక్షిణంగా ఒకటీ, ఉత్తరంగా ఒకటీ అయిన రెండూ రెండువైపులా ఉన్న చెవులు. వానిలో వేరు వేరు విధంగా ప్రవేశించే విషయాలంటే 1. రూపం 2. గంధం 3. రసం 4. శబ్దం, 5. స్పర్శ అనేవి. పురరూపంలో అంతటానిండి ఉన్న చర్మాన్ని ఒక ద్వారంగా ఇక్కడ ప్రత్యేకించి పేర్కొనలేదు. దానిని కూడా మనం గ్రహించి 'స్పర్శ' అనే దానిని కూడా లెక్కించుకోవాలి.

ఈ తొమ్మిదింటిలో పురానికి పై వైపుగా ఏడూ, క్రింది వైపుగా రెండూ ఉన్నాయి. పై వైపుగా అంటే ముఖభాగంలో అని అర్థం. కన్నులు, ముక్కులు, నోరూ, చెవులూ అనేవి ఆ ఏడూ. క్రింది భాగంలో అంటే నడుం కింద రెండు ఉన్నాయి. మొదటిది పాయువు – మలవిసర్జన ద్వారం. రెండవది ఉపస్థ. జననేంద్రియం.

**వ. ఖద్యోతయు హవిర్ముఖియు నను నామంబులు గల ద్వార యుగంబున ద్యుమత్సఖుcడై విభ్రాజితాఖ్య జనపదంబును బొందు, వెండియు నళినియు నాళినియు నను పేళ్లు గల వాకిళ్లు రెంటియందు**

**నవధూతసఖుండై సౌరభరూపంబులయిన విషయంబులం బొందు, మఱియు ముఖ్యనామకం బైన ప్రధానప్రాగ్ద్వారంబున రసజ్ఞ విపణాన్వితుండై యాపణబహూదనంబులను విషయంబులనొందుఁ, బితృహూ నామకం బయిన దక్షిణద్వారంబున శ్రుతధరాన్వితుండై దక్షిణ పాంచాలంబను రాష్ట్రంబు నొందు, దేవహూ నామకం బైన యుత్తరపు వాకిట శ్రుతధరాన్వితుండై యుత్తర పాంచాలంబను రాష్ట్రంబు నొందు, వెండియుం బడమటి వాకిళ్లు రెంటియందు నాసురీ నామకంబైన వాకిట దుర్మద సమేతుండై గ్రామక నామకంబైన విషయంబును, నిరృతి నామకం బయిన వాకిటియందు లుబ్ధకయుక్తుండై వైశసంబను విషయంబు నొందుచుండు, వెండియుం బురంజను డప్పురంబునం బౌరజనంబులందు నిర్వా క్పేశస్కరులను నిద్దఱంధులు గలరు. వారలచేత గమన కరణంబులను క్రియలనొందుచు నంతః పురగతుండగు నప్పుడు విషూచీన సమన్వితుండై జాయాత్మ జోద్భవంబులైన మోహ ప్రసాద హర్షంబుల నొందుచుండు, నివ్విధంబునం గర్మాసక్తుఁడు గామాత్మకుండునై బుద్ధియను మహిషిచేత వంచితుం డయ్యె, న క్కామినియు. 768**

ప్రతి : ఖద్యోతయున్= ఖద్యోత అనీ; హవిర్ముఖియున్= హవిర్ముఖి అనీ; అనునామంబులు= అనే పేర్లు; కలద్వార యుగంబునన్= వాకిళ్ళజంటలో; ద్యుమత్సఖుండు= ద్యుమత్తు అనే సఖుడు కలవాడు; ఐ= అయి; విభ్రాజిత జనపదంబును= విభ్రాజితమనే జనపదాన్ని; పొందున్= పొందుతాడు (పురంజనుడు); వెండియున్= తరువాత; నళినియున్= నళిని; నాళినియున్= నాళినీ; అనుపేళ్లు= అనే పేర్లు; కల= ఉన్న; వాకిళ్లు రెంటియందున్= వాకిళ్ళు రెండింటిలో; అవధూతసఖుండు= అవధూత అనే చెలికాడు కలవాడు; ఐ= అయి; సౌరభరూపంబులు= మంచిపరిమళం స్వరూపంగాగలవి; అయిన; విషయంబులన్= విషయాలను; పొందున్= గ్రహిస్తాడు; మఱియున్= ఇంకా; ముఖ్యనామకంబు= ముఖ్యం అనే పేరుగలది; ఐన= అయినట్టి; ప్రధాన ప్రాక్+ద్వారంబునన్= మొట్టమొదటిది అయిన తూర్పు వాకిలిలో; రసజ్ఞ విపణ+అన్వితుండు= రసజ్ఞ అనే అంగడితో కూడి ఉన్నవాడై; ఆపణ బహూదనంబులు= ఆపణం, బహూదనం; అను= అనే; విషయంబులను= విషయాలను; ఒందున్= పొందుతాడు; పితృహూ నామకంబు= పితృహువు అనే పేరుగల; దక్షిణ ద్వారంబునన్= దక్షిణపు వాకిలిలో; శ్రుతధర+అన్వితుండు+ఐ= శ్రుతధరుడనువానితో కూడినవాడై; దక్షిణపాంచాలంబు= దక్షిణపాంచాలం; అను= అనే; రాష్ట్రంబున్= ప్రదేశాన్ని; పొందున్= పొందుతాడు; దేవహూ నామకంబు= దేవహువు అనే పేరుగలది; ఐన= అయిన; ఉత్తరము+వాకిటన్= ఉత్తర ద్వారంలో; శ్రుతధర+అన్వితుండు+ఐ= శ్రుతధరునితో కూడినవాడై; ఉత్తరపాంచాలంబు= ఉత్తరపాంచాలం; అను= అనే; రాష్ట్రంబున్= భూ భాగాన్ని; ఒందున్= పొందుతాడు; వెండియున్= ఇంకా; పడమటివాకిళ్ళు= పడమరవైపు ద్వారాలు; రెంటియందున్= రెండింటిలోనూ; ఆసురీ నామకంబు= ఆసురి అనే పేరుగలది; ఐన= అయిన; వాకిటన్= వాకిటియందు; దుర్మద సమేతుండు= దుర్మదుడనే వానితో కూడినవాడు; ఐ= అయి; గ్రామకనామకంబు= గ్రామకం అనే పేరుగలది; ఐన= అయిన; విషయంబును= విషయాన్నీ; నిరృతి నామకంబు= నిరృతి అనే పేరుగలది; అయిన వాకిటియందున్= అయిన వాకిలిలో; లుబ్ధక యుక్తుండు= లుబ్ధకునితో కూడినవాడు; ఐ= అయి; వైశసంబు+అను= వైశసం అనే; విషయంబును= విషయాన్ని; ఒందుచున్+ఉండున్= పొందుతూ ఉంటాడు; వెండియున్= ఇంకా; పురంజనుండు= పురంజనుడు; ఆ+పురంబునన్= ఆ నగరంలో; పౌరజనంబులందు= పురానికి చెందినవారిలో; నిర్వాక్+పేశస్కరులు= నిర్వాక్కు, పేశస్కరుడు; అను= అనే; ఇద్దఱు; అంధులు= గుడ్డివారు; కలరు= ఉన్నారు; వారలచేతన్= వారి ద్వారా; గమన కరణంబులు= పోవటం, చేయటం; అను= అనే; క్రియలన్= పనులను; ఒందుచున్= పొందుతూ; అంతఃపుర గతుండు= రాణివాసాన్ని చేరుకున్నవాడు; అగు+అప్పుడు= అయినప్పుడు; విషూచీన సమన్వితుండు= విషూచీనంతో

కూడినవాడు; ఐ= అయి; జాయా+ఆత్మజ+ఉద్భవంబులు= భార్య; పిల్లలు అనేవారివలన పుట్టినవి; ఐన= అయిన; మోహ ప్రసాద హర్షంబులన్= మోహం, ప్రసాదం, సంతోషం అనే వానిని; ఒందుచున్+ఉండున్= పొందుతూ ఉంటాడు; ఈ+విధంబునన్= ఈ తీరుగా; కర్మ+ ఆసక్తుఁడు= కర్మల తగులం కలవాడూ; కామ+ఆత్మకుండును= కోరికలే స్వరూపంగా అయినవాడూ; ఐ= అయి; బుద్ధి= ధీ; అను= అనే; మహిషిచేతన్= పట్టపురాణిచేత; వంచితుండు= మోసగించబడినవాడు; అయ్యెన్= అయ్యాడు; ఆ+కామినియున్= ఆ కోరికలపుట్ట అయిన స్త్రీ కూడ.

**తా :** పురంజనుడు తూర్పుద్వారంలో ఉన్న అయిదువాకిళ్ళలో ఖద్యోత, హావిర్ముఖి అనే రెండింటిలో ద్యుమత్తు అనే చెలికానితో కలిసి విభ్రాజితం అనే జనపదాన్ని పొందుతాడు. నళిని, నాళిని అనే మరొకరెండు వాకిళ్ళ దగ్గర అవధూత అనే మిత్రునితో కూడి పరిమళసంబంధమైన విషయాలను పొందుతాడు. ఆ తూర్పుదిక్కు వాకిళ్ళలో ప్రధానమైనది ముఖ్యం. అందులో రసజ్ఞ, విపణ అనేవారితో కలిసి ఆపణం, బహూదనం అనే విషయాలను పొందుతాడు. దక్షిణంవైపు వాకిలియైన పితృహువునందు శ్రుతధరునితో కలిసి దక్షిణపాంచాలాన్నీ ఉత్తరంవైపు ఉన్న దేవహువునందు శ్రుతధరునితో కలిసి ఉత్తరపాంచాలం అనే రాష్ట్రాన్నీ పొందుతాడు. అంతేకాదు. పడమటివాకిళ్ళు రెండు ఉన్నాయికదా! అందులో ఒకటి ఆసురి. అక్కడ దుర్మదుడనే వానితో కూడి గ్రామకం అనే పేరుగల విషయాన్నీ రెండవదైన నిరృతియందు, లుబ్ధకునితో కలసి వైశసం అనే విషయాన్నీ పొందుతాడు. ఇంతేకాక పురంజనుని ఆ పురంలోని నగరవాసులలో నిర్వాక్కు, పేశస్కరుడు అనే ఇద్దరు గుడ్డివారున్నారు. వారి ద్వారా గమనం, కరణం అనే క్రియలను పొందుతూ ఉంటాడు. ఆ సమయంలో రాణివాసానికి చేరుకొని విషూచీనునితో కూడి ఆలు బిడ్డల వలన కలిగిన మోహం, ప్రసాదం, హర్షం అనే భావాలను పొందుతాడు. ఈ విధంగా కర్మల తగులమూ, కోరికలే తన స్వరూపమూ కాగా బుద్ధి అనే పట్టపురాణి చేత వంచితుడై పోయాడు. ఆ వనిత కూడా!

**విశే :** ఈ వచనం అంతా అద్భుతమైన ప్రతీకలతో విరాజిల్లుతున్నది. దీనిని కవియే తరువాత విప్పి చెబుతాడు. అయినా రేఖా మాత్రంగా ఇక్కడ వివరించుకోవాలి. జాగ్రదవస్థలోని దేహస్థితిని ప్రతీకలతో వివరిస్తున్నారు.

1. తూర్పుదిక్కున ఉన్నవాకిళ్ళు అయిదు. ఇక్కడ పురం అంటే దేహమే కనుక, దేహంలో ప్రధానావయవం ముఖం. దానిలోని అయిదు వాకిళ్ళు 2 కన్నులు, 2 ముక్కులు, 1 నోరు. అందులో మొదటగా రెండు కన్నులను చెబుతున్నారు. 1. ఖద్యోత 2. హావిర్ముఖి

   ఖద్యోతం అంటే మిణుగురుపురుగు – దానివలె కొంచెం పాటి వెలుగుకలది ఎడమకన్ను

   ఆవిర్ముఖి – మూలంలో ఆవిర్ముఖి అని ఉన్నది. తెలుగులో హావిర్ముఖి అని పాఠం. ఏమైనా ప్రకటమైన ముఖంకలది. గొప్ప వెలుగుకలది అని అర్థం. అది కుడికన్ను.

2. విభ్రాజిత మనే జనపదం – రూపమనే ఊరు. కంటికి రూపం విషయం కదా!

3. ద్యుమత్సఖుడు – రూపాన్ని గ్రహించే శక్తితో కూడినవాడు.

4. నళిని, నాళిని – నలం, నాలం అనేవి రంధ్రం అనే అర్థం కలవి. రంధ్రం కలవి నళిని, నాళిని – అంటే ముక్కురంధ్రాలు. ఎడమ, కుడి ముక్కులు. ఇందులో కూడా ఎడమదానికంటె, కుడిదానికి శక్తి ఎక్కువ. కనుక దానిని తెలియజేస్తే 'న', 'నా' అనే హ్రస్వదీర్ఘాక్షరాలను ప్రయోగించారు.

5. అవధూత అంటే వాయువు అధిష్ఠానంగాగల ఘ్రాణేంద్రియం.

6. సౌరభం అంటే గంధం. ఘ్రాణేంద్రియానికి విషయం.

7. ముఖ్య అంటే ప్రధాన – ముఖంలో ఉండేది నోరు అని అర్థం.

8. రసజ్ఞం అంటే నాలుక

9. ఆపణము – పలకటం

10. బహూదనం – చిత్రమైన అన్నం. నిజానికి బహ్వోదనం అనాలి. కానీ గూఢభాషణం కనుక అలా అనలేదు.

11. దక్షిణద్వారం – కుడిచెవి.

12. శ్రుతధరుడు – శాస్త్రాన్ని పట్టుకొనేవాడు. పట్టుకొనే కుడిచెవికి సంబంధించిన ఇంద్రియాంశం.

13. దక్షిణ పాంచాలం – అయిదు విషయాలు. అవి మరొక మార్గంతో తెలియరావు. శాస్త్రంతో మాత్రమే తెలుస్తాయి. కనుక అయిదింటి ప్రకాశానికి చాలినది (అలమ్) పంచాలమ్ అంటే శాస్త్రం. శాస్త్రమునందు కూడా మొదట వినదగినది కర్మకాండం కనుక దానికి సంబంధించిన మంత్రాలు కుడి చెవియందే గురువులు నిక్షేపిస్తారు కనుక అది దక్షిణ పాంచాలం అయినది.

14. కర్మకాండ మంత్రాలను కుడి చెవిద్వారా విని వాటి అర్థాలను చక్కగా తెలుసుకొని పితృదేవతలను ఆహ్వానిస్తారు కనుక కుడిచెవి పితృహువు.

15. పితృహువు కంటె వేరైనది దేవహువు అంటే ఎడమచెవి. దీనిని ముందు ఇలా వ్యాఖ్యానించనున్నారు.

"పితృహూ ర్దక్షిణః కర్ణః ఉత్తరో దేవహూః స్మృతః ప్రవృత్తం చ నివృత్తం చ శాస్త్రం పఞ్చాలసంజ్ఞితమ్, పితృయానం దేవయానం శ్రోత్రాచ్ఛ్రుతధరా ద్వ్రజేత్"– భాగ. 4. 29. 12,13శ్లో.

'పితృహువు కుడిచెవి. దేవహువు ఎడమచెవి. ప్రవృత్తం, నివృత్తం అయిన శాస్త్రం పంచాలం. పితృయాన దేవయానాలను శ్రుతధరమైన శ్రోత్రం వలన పొందాలి.'

16. పడమటి వాకిళ్ళు – ఉపస్థ, పాయువు – జననేంద్రియం, మలవిసర్జనేంద్రియం.

17. ఆసురి – అసురములు అంటే ఇంద్రియముల నెలవులు. వానికి సంబంధించినది ఆసురి. శిశ్నద్వారం.

18. దుర్మదుడు – గుహ్యమనే ఇంద్రియం.

19. గ్రామకం – గ్రామంలో ఉన్న జనాలకు కం – అంటే సుఖం ఇచ్చేది. రతికి సంబంధించిన ఆనందం. గ్రామం అంటే సముదాయం అని అర్థం.

20. నిర్ఋతి అంటే గుదం. అది మృత్యుద్వారం.

21. వైశసమంటే మలవిసర్జనం.

22. లుబ్ధకం అంటే పాయువు - మల విసర్జనావయవం.

23. నిర్వాక్కు - పాదం

24. పేశస్కృత్తు - చేయి.

ఈ రెండూ గుడ్డివి అంటే ఛిద్రాలు - రంధ్రాలు లేనివి. ఈ రెండూ నడకకూ, పనులకూ ఉపయోగపడతాయి. జ్ఞానక్రియాశక్తి వీటికి లేదు.

వీటిలో త్వగింద్రియం చర్మం గురించి చెప్పలేదు. ఎందుకంటే అది అన్నింటిలో అంతర్భవించి ఉంటుంది కనుక.

**సీ. పానంబు సేసినఁ దానుఁ బానముఁ జేయుఁ గుడిచినఁ దానును గుడుచు మఱియు**
**భక్షింపఁ దానును భక్షించు, నడచిన నడచును, నవ్విన నవ్వు, నేడ్వ**
**నేడుచుఁ, బాడినఁ బాడు, విన్నను వినుఁ, జూచినఁ జూచు, గూర్చున్న నుండు,**
**దుఃఖింప దీనుఁడై దుఃఖించు, నిలిచిన నిలుచు, నిద్రింపఁగ నిద్రవోవు**

**తే. ముట్టినను ముట్టు, మూర్కొన్న మూరుకొనును, బలుకఁ బలుకును, బవళింపఁ బవ్వళించు**
**హర్షమును బొంద నాత్మను హర్ష మొందు, మోదమును బొంద దానును మోద మందు. 769**

**ప్రతి :** ఆ కామిని; పానంబున్= తాగటాన్ని; చేసినన్= చేస్తే; తాను= తాను; పానమున్= తాగటం అనే పనిని; చేయున్= చేస్తాడు; కుడిచినన్= తింటే; తానును; కుడుచున్= తింటాడు; మఱియున్= ఇంకా; భక్షింపన్= చిరుతిండివంటి దానిని తింటే; తానును; భక్షించున్= తింటాడు; నడచినన్= నడిస్తే; నడుస్తాడు; నవ్వినన్= నవ్వితే; నవ్వున్= నవ్వుతాడు; ఏడ్వన్= ఏడిస్తే; ఏడుచున్= ఏడుస్తాడు; పాడినన్= పాటలు పాడితే; పాడున్= పాడుతాడు; విన్నను= వింటే; వినున్= వింటాడు; చూచినన్= చూస్తే; చూచున్= చూస్తాడు; కూర్చున్నన్= కూర్చుంటే; ఉండున్= కూర్చుంటాడు; దుఃఖింపన్= దుఃఖపడితే; దీనుఁడు= జాలిగొలుపువాడు; ఐ= అయి; దుఃఖించున్= దుఃఖపడతాడు; నిలిచినన్= నిలిస్తే; నిలుచున్= నిలుస్తాడు; నిద్రింపఁగన్= నిద్రపోతే; నిద్ర+పోవున్= నిద్రపోతాడు; ముట్టినను= తాకితే; ముట్టున్= తాకుతాడు; మూర్కొన్నన్= వాసన చూస్తే; మూరుకొనును= వాసన చూస్తాడు; పలుకన్= పలికితే; పలుకున్= పలుకుతాడు; పవళింపన్= దేహాన్ని శయ్యమీద వాలేటట్లు చేస్తే; పవ్వళించున్= తాను కూడా పవళిస్తాడు; హర్షమును= మనస్సులో ఉల్లాసాన్ని; పొందన్= పొందితే; తానును; హర్షమును+ఒందున్= ఉల్లాసం పొందుతాడు; మోదమును= మోదాన్ని; పొందన్= పొందగా; తానును; మోదము+ఒందున్= మోదం పొందుతాడు.

**తా :** (ఆ పురంజనుడు ఆ కామిని చేతిలో కీలుబొమ్మ అయిపోయాడు. ఆమె ఏమి చేస్తే అదే చేస్తూ తన కొక వ్యక్తిత్వం ఉన్నదని మరచిపోయి ప్రవర్తించాడు. అంటే సర్వవిషయాలలో తన ఇష్టం ఇష్టం కాదు. ఆమె కదలికలే సర్వమూ అయిపోయాడు.) ఆమె త్రావితే త్రావటం, ఆమె తింటే తినటం, ఆమె చిరుతిండికి పూనుకుంటే తానూ పూనుకోవటం, నడిస్తే నడవటం, నవ్వితే నవ్వటం, ఏడిస్తే ఏడవటం, వింటే వినటం, చూస్తే చూడటం, కూర్చుంటే కూర్చుండటం, దుఃఖిస్తే దీనుడై దుఃఖించటం, నిలిస్తే నిలవటం, నిద్రిస్తే నిద్రించటం, తాకితే తాకటం, వాసన చూస్తే వాసన చూడటం, పలికితే పలకటం, వాలితే వాలటం, హర్షం పొందితే పొందటం, మోదం పొందితే మోదం పొందటం చేశాడు.

**విశే :** పురంజనుడు ఒక ప్రాణం ఉన్న మరబొమ్మలాగా అయిపోవటాన్ని ఈ పద్యం తెలియజేస్తున్నది. దీనినే పతనావస్థ అంటారు.

1. కుడుచుట, భక్షించుట అనే రెంటికీ స్థూలంగా అర్థం ఒకటే. రెండూ ఇక్కడ ఉన్నాయి కాబట్టి కుడవటమంటే ప్రధాన భోజనం తినటమనీ, భక్షించటం అంటే మధ్యమధ్య తీసుకొనే చిరుతిండి తినటం అనీ భావించాలి.

2. అలాగే నిదురించు, పవ్వళించు అనేవానికి కూడా నిద్రపోవటం, ఊరకే మేనును వాల్చటం అనే అర్థాలను భావించాలి.

3. హర్షం అంటే ఏదైనా కోరినది సిద్ధిస్తే కలిగే తృప్తి, మోదం అంటే నిలువెల్లా కలిగే ఆనందం.

**వ. ఇవ్విధంబున నతండు మహిషీ విప్రలబ్ధుండును వంచిత స్వభావుండునునై పారవశ్యంబునం జేసి యజ్ఞుండును నితరేచ్ఛా విరహితుండునునై క్రీడామృగంబు చాడ్పున వర్తించుచు నా పురంబునఁ గాపురం బుండఁ గొన్ని దినంబుల కా పురంజనుం డొకానొక దినంబున ధనుర్ధరుండై. 770**

**ప్రతి :** ఈ+విధంబునన్= ఈ తీరుగా; అతండు= ఆ పురంజనుడు; మహిషీవిప్రలబ్ధుండును= పట్టపురాణిచేత ఎక్కువగా మోసపోయినవాడు; వంచిత స్వభావుండును= తన దైన ప్రవృత్తి తీరును తానే వంచించుకొన్నవాడును; ఐ= అయి; పారవశ్యంబునన్+చేసి= తన వశంలోలేని తనంతో; అజ్ఞుండును= ఏమియు ఎరుగనివాడూ; ఇతర+ఇచ్ఛా విరహితుండును= వేరొక కోరిక లేనివాడూ; ఐ= అయి; క్రీడా మృగంబు చాడ్పునన్= పెంపుడు ఆటజంతువులాగా; అనుకరింపుచున్= చేసినట్లే చేస్తూ; వర్తింపుచున్= మెలగుతూ; ఆ పురంబునన్= ఆ నగరంలో; కాపురంబు= జీవితం గడపటం చేస్తూ; ఉండన్= ఉండగా; ఒకానొక దినంబునన్= ఒకరోజున; ఆ పురంజనుండు= ఆ పురంజనుడు; ధనుర్ధరుండు= విల్లుపట్టుకొన్నవాడు; ఐ= అయి.

**తా :** ఈ విధంగా అతడు తనరాణి చేసిన మోసానికి బలి అయిపోయాడు. తన స్వభావం మీద తనకు అదుపాజ్ఞలు లేనివాడయ్యాడు. తెలివి మాలినవాడయ్యాడు, ఇతరమైన కోరికలు లేనివాడయ్యాడు. ఆటల కొరకు పెంచుకొను పెంపుడు జంతువులాగా తిరుగుతూ ఆ పురంలో కాపురం ఉంటున్నాడు. ఒక రోజున ఆ పురంజనుడు విల్లుపట్టుకొని బయలుదేరాడు.

**విశే :** జీవుడు వివేకంతో తన మీద తనకు అధికారం కలవాడైతే సద్గతికి చేరుకుంటాడు. పరాధీనుడైతే ఎవరో తిప్పే యంత్రం లాగా అయిపోతాడు. అది దుర్గతి.

**సీ. పంచాశ్వయుక్తంబుఁ బంచబంధనముఁ జక్రద్వితయమును యుగద్వయంబు**
**నాశువేగంబు నేకాక్షంబుఁ గూబర ద్వయముఁ బతాకాత్రితయయుతంబు**
**నేకరశ్మియుతంబు నేకసారథికంబు సప్తవరూథంబు స్వర్ణభూష**
**మును బంచవిక్రమమును నేక నీడంబుఁ బ్రకట పంచప్రహరణము నయిన**

**తే. రథము కాంచన రచిత వర్మము ధరించి, విలస దక్షయ తూణీర కలితుఁ డగుచుఁ**
**గడఁక దీపింప నెక్కి యేకాదశ ప్ర, సంఖ్య సేనాసమేతుఁడై సరభసముగ. 771**

**ప్రతి :** పంచ+అశ్వయుక్తంబు= అయిదు గుర్రాలతో కూడినది; పంచబంధనము= అయిదు కట్లుకలది; చక్ర ద్వితయమును= రెండు చక్రాలు గలది; యుగద్వయంబున్= రెండు కాడులు కలది; ఆశువేగంబును= గొప్పవడికలది; ఏక+అక్షంబున్=

ఒక బండికన్ను కలది; కూబర ద్వయమున్= రెండు నొగలు కలది; పతాకా త్రితయయుతంబున్= మూడు పతాకలతో కూడినది; ఏక రశ్మి యుతంబున్= ఒక పగ్గంతో కూడినది; ఏకసారథికంబున్= ఒక్క సారథి కలది; సప్తవరూథంబు= ఏడు సాయమేకులు కలది; స్వర్ణ భూషమును= బంగారు నగలు కలది; పంచ విక్రమమును= అయిదు విధాలైన గమనాలు కలది; ఏక నీడంబున్= ఒక గూడు కలది; ప్రకట పంచ ప్రహరణమును= బాగుగా తెలియవస్తున్న అయిదు ఆయుధాలు కలది; ఐన= అయిన; రథమున్= బండిని; కాంచనరచిత వర్మమున్= బంగారంతో చేసిన కవచాన్ని; ధరించి= తాల్చి; విలసత్+అక్షయ తూణీర కలితుఁడు= ఒప్పారుచున్న తరుగువోని అమ్ముల పొదితో కూడినవాడు; అగుచున్= అవుతూ; కడcక= పూనిక; దీపింపన్= విరాజిల్లుతుండగా; ఎక్కి; ఏకాదశ ప్రసంఖ్య సేనా సమేతుఁడు= పదకొండు లెక్కగల సేనల విభాగాలతో కూడినవాడు; ఐ= అయి; సరభసముగన్= ఆర్భాటంగా

**తా :** ఐదు గుర్రాలూ, అయిదు కట్లూ, రెండు చక్రాలూ, రెండు కాడులూ, గొప్ప వేగమూ, ఒక ఇరుసూ, రెండు నొగలూ, మూడు పతాకలు, ఒక పగ్గమూ, ఒక సారథీ, ఏడు సాయమేకులూ, బంగారు నగలూ, అయిదు విధాలైన గతులూ, ఒక గూడూ, బాగా కన్పిస్తున్న అయిదు ఆయుధాలూ కలది అయిన రథం ఎక్కి బంగారు మైతొడుగును తాల్చి, ఒప్పారుతున్న తరుగువోని అంపపొదిని కూర్చుకొని గట్టి పట్టుదల ప్రకాశిస్తూ ఉండగా పదకొండు విధాలైన గొప్ప సేనలు వెంటరాగా ఆర్భాటంగా బయలుదేరాడు.

**విశే :** ఈ రథం మామూలు రథం కాదు. దేహమే ఇచట రథం. దానిని బట్టి అయిదు గుర్రాలూ మొదలైనవానిని వివరించుకోవాలి.

**వ. పురంబు వెడలి పంచప్రస్థంబను వనంబునకుం జని యందు విడువరాని మహిషిని విడిచి మృగయాసక్తుండై దృప్తుండగుచు ధనుర్బాణంబులు ధరియించి సంచరించుచు నాసురవర్తనంబునం దగిలి ఘోరాత్ముండు నదయుండునై నిశాతసాయకంబుల చేత నమ్మృగ వ్రాతంబులం బరిమార్చె, రాజులకు మృగయా వినోదంబు విహితానుష్ఠానం బగుచుండ నాసురవృత్తి యెట్లయ్యె? నని యంటి వే? నిది రాగప్రాప్తం బగుటను విహితంబు గాదు, వినుము. శ్రాద్ధాదులందే ప్రఖ్యాత శ్రాద్ధ దివసంబుల యందే, రాజైన వాఁడే, మేధ్యంబులయిన పశువులనే, వనంబునందే యథోపయుక్తంబుగానే వధియింపం జను నను నియమ మాత్రంబు గలదు, గావున జ్ఞానియైన విద్వాంసుం డాచరింపండు గాన యాచరించినం గర్మానుష్ఠానజనితం బయిన జ్ఞానంబునంజేసి యందుఁ బొరయం, డట్టుగాక నియమోల్లంఘనంబునం గర్మాచరణుం డగువాఁ డభిమానంబు నొంది కర్మబద్ధుండై గుణప్రవాహ పతితుండును, నష్టప్రజ్ఞుండునునై యధోగతిం గూలు, నిట్లగుటం జేసి సాధుజనులకు సర్వప్రకారంబుల నాసురవృత్తి మానందగు నని వెండియు నిట్లనియె. నంతం బురంజనుం దవ్వనంబున. 772**

**ప్రతి :** పురంబున్= నగరంనుండి; వెడలి= వెలుపలికి వచ్చి; పంచప్రస్థంబు= పంచప్రస్థం; అను= అనే; వనంబునకున్= అడవికి; చని= వెళ్ళి; అందున్= అక్కడ; విడువరాని= వదలగూడని; మహిషిని= పట్టపురాణిని; విడిచి= వదలి; మృగయా+ఆసక్తుండు= వేటయందు ఆసక్తికలవాడు; ఐ= అయి; దృప్తుండు= పొగరు కలవాడు; అగుచున్= అగుచు; ధనుర్+బాణంబులు= విల్లూ, అమ్ములూ; ధరియించి= పట్టుకొని; సంచరించుచున్= తిరుగుతూ; ఆసురవృత్తిన్=

రాక్షసులవంటి వర్తనము నందు; తగిలి= తగులుకొని; ఘోర+ఆత్ముండున్= భయంకరమైన మనస్సుకలవాడు; అదయుండును= దయలేని వాడును; ఐ= అయి; నిశాత సాయకంబులచేతన్= వాడి అమ్ములతో; ఆ+మృగ వ్రాతంబులన్= అక్కడ ఉన్న జంతువుల మందలను; పరిమార్చెన్= చంపాడు; రాజులకున్= పాలకులకు; మృగయావినోదంబు= వేట అనే కాలక్షేపపు పని; విహిత+అనుష్ఠానంబు= శాస్త్రం ఏర్పరచిన పవిత్రమైన పని; అగుచున్+ఉండన్= అవుతుండగా; ఆసురవృత్తి= రాక్షసంగా మెలగటం; ఎట్లు= ఏ విధంగా; అయ్యెన్= అయినది; అని; అంటివి+ఏని= నీ వంటావేమో; ఇది= ఈ నడవడి; రాగ ప్రాప్తంబు= రాగంతో ఏర్పడినది; అగుటను= అయినది కాబట్టి; విహితంబు= శాస్త్రం ఏర్పరచినది; కాదు= కాదు; వినుము= విను; శ్రాద్ధాదుల+అందు+ఏ= శ్రాద్ధాదులలోనే; ప్రఖ్యాత శ్రాద్ధ దినంబులయందున్+ఏ= ప్రసిద్ధమైన శ్రాద్ధం చేయవలసిన దినాలలోనే; రాజు= ఏలిక; ఐనవాడు+ఏ= అయినవాడే; మేధ్యంబులు= యజ్ఞాదులకు పనికి వచ్చేవి; అయిన పశువులను+ఏ= అయిన జంతువులనే; వనంబునందున్+ఏ= అడవిలోనే; యథా+ఉపయుక్తంబు గాన్+ఏ= ఉపయోగానికి తగినట్లుగానే; వధింపన్= చంపగా; చనున్= ఒప్పుతుంది; అను నియమమాత్రంబు= అనే విధానం మాత్రమే; కలదు= ఉన్నది; కావునన్= కనుక; జ్ఞాని= పరమాత్మకు సంబంధించిన తెలివికలవాడు; ఐన= అయిన; విద్వాంసుడు= ఎరుక కలవాడు; ఆచరింపండు= వేటాడడు; కాన= కాబట్టి; ఆచరించినన్= చేస్తే; కర్మ+అనుష్ఠాన జనితంబు= యజ్ఞం మొదలైన పుణ్యకర్మలను శ్రద్ధతో చేయటంవలన; పుట్టేది; అయిన; జ్ఞానంబునన్+చేసి= జ్ఞానంచేత; అందున్= దానిలో; పొరయండు= తగులం పొందడు; అట్టు= ఆ విధం; కాక= కాక; నియమ+ఉల్లంఘనంబునన్= కట్టుబాటులను దాటుకొనటంచేత; కర్మ+ఆచరణుండు= యజ్ఞం మొదలైన కర్మలు చేసేవాడు; అగువాఁడు= అయినవాడు; అభిమానంబున్= నేను కర్తను అనే భావాన్ని; ఒంది= పొంది; కర్మబద్ధుండు= కర్మలలో చిక్కుకొన్నవాడు; ఐ= అయి; గుణ ప్రవాహ పతితుండును= గుణాల వాగులో పడినవాడూ; నష్టప్రజ్ఞుండును= పోయిన ప్రజ్ఞ (తెలివి) కలవాడును; ఐ= అయి; అధోగతిన్= కింది వైపునకు పోవటం అనే దానిలో; కూలున్= పడిపోతాడు; ఇట్లు= ఈ విధం; అగుటన్+చేసి= అయిన కారణంగా; సాధుజనులకున్= మంచితనం కలవారికి; సర్వప్రకారంబులన్= అన్ని విధాలా; ఆసురవృత్తి= రాక్షసులనడవడి; మానన్+తగున్= మాని వేయాలి; అని= అని చెప్పి; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అంతన్= అప్పుడు; పురంజనుండు; ఆ+వనంబునన్= ఆ అడవిలో.

**తా :** ఆ పురంజనుడు నగరంనుండి వెలుపలికి వచ్చి పంచప్రస్థం అనే పేరుగల అడవిలోనికి చేరుకున్నాడు. అక్కడ విడవరాని తన పట్టమహిషిని విడిచిపెట్టాడు. విల్లమ్ములు పట్టుకొని వేటమీది తమకంతో పొగరెక్కినవాడై ఆసుర ప్రవర్తనతో క్రూరమైన మనస్సుతో దయలేనివాడై వాడిబాణాలతో అక్కడ జంతుసమూహాలను చంపి వేశాడు.

రాజులకు వేటను శాస్త్రం ఏర్పరచినదియే కదా! మరి అది రాక్షసవృత్తి ఎందుకవుతుంది అంటావేమో, విను. ఇక్కడ ఇతని ఈ వేట రాగం అంటే మమకారంతో ఏర్పడింది. కాబట్టి శాస్త్రం విధించింది కాదు. శ్రాద్ధాలలోనే, ప్రసిద్ధమైన శ్రాద్ధ దినాలలోనే రాజైనవాడే యజ్ఞాలకు పనికి వచ్చే పశువులనే అడవియందే, అవసరానికి తగినంతగానే చంపాలి అనే నియమం మాత్రమే ఉన్నది. కాబట్టి జ్ఞానంగల విద్వాంసుడు ఇట్టి వేటను చేయడు. అట్లు కాక చేసినా, కర్మలను అనుష్ఠించగా పుట్టిన జ్ఞానం చేత అందులో తగులం పొందడు. అలా కాక నియమాలను కాదని కర్మానుష్ఠానం చేసేవాడు నేను చేస్తున్నాను అని తానే కర్తను అనుకొని కర్మలందు చిక్కుకొని, గుణాల ప్రవాహాలలో పడిపోతాడు. అతని తెలివి నశించిపోతుంది. చివరికి నరకలోకంలోనికి పడిపోతాడు. కాబట్టి సత్పురుషులకు అన్నివిధములుగాను రాక్షసవర్తనం పనికిరాదు. అని పలికి ఇంకా ఇలా అన్నాడు. అప్పుడా పురంజనుడు ఆ అడవిలో

విశే : పంచప్రస్థము – అయిదు కొండచరియలు కలది;

**క. వర చిత్ర పక్ష సునిశిత, శరములచే శశ వరాహ చమరీ రురు కా**
**సర గవయ శల్య హరిణీ, కరి హరి వృక పుండరీక కపి ఖడ్గములన్. 773**

ప్రతి : వర= మేలైన; చిత్రపక్ష= రంగుల ఈకలు గల; సు+నిశిత= మిక్కిలివాడి అయిన; శరములచేన్= బాణాలతో; శశ= కుందేళ్ళు; వరాహ= అడవిపందులు; చమరీ= ఆడు సవరపుమృగాలు; రురు= ఒక విధమైన లేళ్ళు (నల్లచారల దుప్పులు); కాసర= అడవి దున్నలు; గవయ= గురుపోతులు; శల్య= ముళ్ళ పందులు; హరిణీ= ఆడులేళ్ళు; కరి= ఏనుగులు; హరి= సింహాలు; వృక= తోడేళ్ళు; పుండరీక= బెబ్బులులు; కపి= కోతులు; ఖడ్గములన్= ఖడ్గమృగాలు అనే వాటిని...

తా : ఆ రాజు వింత వింతరంగుల ఈకలు కల వాడిబాణాలతో కుందేళ్ళను, అడవిపందులను, చమరీమృగాలను, నల్లచారల దుప్పులను, అడవిదున్నలను, గురుపోతులను, ముండ్ల పందులను, లేళ్ళను, ఏనుగులను, సింహాలను, తోడేళ్ళను, బెబ్బులులను, కోతులను, ఖడ్గమృగాలను

**వ. వధియించి మఱియును. 774**

ప్రతి : వధియించి= చంపి; మఱియున్= ఇంకా...

తా : చంపి ఇంకా

**సీ. వరుస మేధ్యామేధ్య వనమృగంబుల ఘృణ సన దుస్సహ క్రీడ సంహరించి**
**శ్రమయుక్తుఁడై వేఁట సాలించి మరలి మందిరమున కర్థి నే తెంచి యందు**
**సముచిత స్నాన భోజన కృత్యములు దీర్చి యతి పరిశ్రాంతి శయానుఁ డగుచుఁ**
**బరిమళ మిళిత ధూపవ్రాత వాసిత సర్వాంగుఁ డగుచు స్రక్చందనములు**

**తే. వివిధ భూషణ చేలముల్ వెలయఁ దాల్చి, తుష్టుఁడును హృష్టుఁడున్ మఱి ధృష్టుఁడై య**
**నన్యజాకృష్ట చిత్తుండునై రతి ప్ర, సంగ కౌతుక మాత్మను దొంగలింప. 775**

ప్రతి : వరుసన్= వరుసగా; మేధ్య+అమేధ్య వనమృగంబులన్= పవిత్రమైనవీ, కానివీ అయిన అడవిమృగాలను; ఘృణ= జాలి; చనన్= పోగా; దుస్సహ+క్రీడన్= సహించటానికి అలవికాని ఆటతో; సంహరించి= చంపి; శ్రమ యుక్తుఁడు= అలసటతో కూడినవాడు; ఐ= అయి; వేఁటన్= వేటను; చాలించి= ఆపి; మరలి= తిరిగి; మందిరమునకున్= తనభవనానికి; అర్థిన్= ఇష్టంతో; ఏతెంచి= వచ్చి; అందున్= అక్కడ; సముచిత= తగిన; స్నాన= నీళ్ళు పోసుకోవటం; భోజన= అన్నం తినటం అనే; కృత్యములు= పనులు; తీర్చి= కావించి; అతి+పరిశ్రాంతిన్= చాలా అధికమైన అలసటతో; శయానుఁడు= పడుకొన్నవాడు; అగుచున్= అవుతూ; పరిమళ= కమ్మని వాసనతో; మిళిత= కలిసియున్న; ధూప వ్రాత= అగరుమొదలయిన సుగంధద్రవ్యాల పొగలతో; వాసిత= వాసనలుగల; సర్వ+అంగుఁడు= అన్ని దేహభాగాలూ కలవాడు; అగుచున్= అగుచూ; స్రక్= పూలమాలలు; చందన= మంచిగంధపుపూతలు; ఆది= మొదలైన; వివిధ= అనేక విధాలైన; భూషణ= నగలు; చేలముల్= వస్త్రాలు; వెలయన్= ఒప్పారగా; తాల్చి= ధరించి; తుష్టుఁడును= తృప్తి కలవాడును; హృష్టుఁడున్= సంతోషం కలవాడును; మఱి= ఇంకా; ధృష్టుఁడున్= గుండెదిటవు కలవాడూ; అనన్యజ+ఆకృష్ట చిత్తుండును= మన్మథునిచేత

లాగబడిన హృదయం కలవాడు; ఐ= అయి; రతి ప్రసంగ కౌతుకము= మైథునానికి సంబంధించిన వేడుక మాటలతో కూడిన సంభాషణ; ఆత్మను= మనస్సులో; తొంగలింపన్= పెంపొందగా.

**తా :** క్రమంగా మేలుజాతికి చెందినవీ, హీనమైనవీ అయిన మృగాలను జాలి లేకుండా సహించుటకు అలవికాని ఆటతో వరుసగా చంపివేశాడు. అలసట పొందాడు. వేటను చాలించాడు. భవనానికి ఇష్టంగా తిరిగి వచ్చాడు. తగు విధంగా స్నానం, భోజనం మొదలైన పనులను ముగించాడు. అధికమైన బడలిక తీరటం కోసం పడుకున్నాడు. సువాసనలు వెదజల్లే సాంబ్రాణి మొదలగు వాని వాసనలను అన్ని అవయవాలకూ పట్టించుకున్నాడు. పూలదండలు, గంధపు మైపూతలు, పెక్కువిధాలైన ఆభరణాలు, వస్త్రాలు ఒప్పుగా ధరించాడు. తృప్తి, ఆనందము, గుండె దిటవు కలవాడయ్యాడు. మన్మథుని భావం పైకొనగా రతిక్రీడకు చెందిన మాటలు మనస్సులో తొంగలింపగా

**విశే :** ఇందులో వివరించిన కార్యాలన్నీ భౌతిక సుఖాలకు సంబంధించినవి. వీటిని సవిస్తరంగా వర్ణించటంచేత పురంజనునిలో పరమార్థభావన ఏమాత్రమూ అంకురించలేదనే విషయం తెలియవస్తున్నది.

**వ. అంత స్వకీయ ప్రాణవల్లభ యగు మహిషియందు మనంబు నునిచిన యా వరారోహయు గృహమేధినియు నయిన గృహిణిం గానక విమనస్కుండై నిజాంతఃపుర కామినులం గనుంగొని యిట్లనియె. 776**

**ప్రతి :** అంతన్= అటుపైన; స్వకీయ ప్రాణ వల్లభ= తనదైన ప్రాణ ప్రియ; అగు= అయిన; మహిషియందున్= రాణియందు; మనంబున్= భావనను; ఉనిచి= ఉంచి; ఆ+వరారోహయున్= ఆ అందమైన పిరుదులు కలదీ; గృహ+మేధినియున్= తన సుఖానుభవానికి ఆధారమైనదియు; ఐన= అయిన; గృహిణిన్= ఇల్లాలిని; కానక= చూడక; విమనస్కుండు= చెదరిన మనస్సు కలవాడు; ఐ= అయి; నిజ+అంతఃపురకామినులన్= తన రాణివాసంలోని కాంతలను; కనుంగొని= చూచి; ఇట్లు= ఇలా; అనియెన్= అన్నాడు.

**తా :** అప్పుడు తన ప్రాణప్రియ అయిన రాణియందు మనస్సుపెట్టి, సుందరాంగి, తన భోగాలకు ఆధారం అయినదీ అయిన ఇల్లాలు కనబడకపోతే మనస్సు మనస్సులో లేనివాడై తన అంతఃపురకాంతలను చూచి ఇలా అన్నాడు.

**క. రామాజన సంఘము లా, రా! మానవతీ లలామ రామామణి నా**
**రామకృప వడసి మెలఁగుదు, రా? మానుగఁ గుశలమా? పరామర్శింపన్. 777**

**ప్రతి :** రామా జన సంఘములారా!= గుంపులుగా ఉన్న ఇంతులారా!; మానవతీలలామ= అభిమానవతులలో మిన్న అయినదీ; రామామణి= స్త్రీలలో శ్రేష్ఠ అయినదీ; అయిన; నా రామ కృప= నా ఇల్లాలిదయ; పడసి= పొంది; మెలఁగుదురా?= తిరుగుతూ ఉంటారా; పరామర్శింపన్= పరిశీలించగా; మానుగన్= చక్కగా; కుశలమా?= క్షేమమా?

**తా :** గుంపులుగా తిరుగుతున్న కాంతలారా! ఉత్తమ వనితయు, స్త్రీలలో మణివంటిదియును అయిన నాభామ దయపొంది మెలగుతూ ఉంటారా? ఆమెకు కుశలమేనా?

**ఉ. సార వివేకలార! గృహసంపద లీ యెడఁ బూర్వరీతిచే**
**నారయఁగా రుచింపవు గృహస్థునకుం గృహమందు మాతగా**
**నీ రమణానుకూల రమణీ మణియై తనురారు భార్య గా**
**నీ రుచి నొందకున్నఁ గన నేర్చునె తద్గృహమేధి సౌఖ్యముల్. 778**

ప్రతి : సారవివేకలార= శక్తితో నిండిన వివేకంకల ఓ కాంతలారా!; ఈయెడన్= ఇప్పుడు; గృహసంపదలు= ఇంటికి సంబంధించిన సంపదలు; పూర్వరీతిచేన్= వెనుకటి మాదిరిగా; ఆరయన్ కాన్= పరిశీలించగా; రుచింపవు= ప్రీతిని కల్గించటం లేదు; గృహస్థునకున్= సంసారంలో సంచరించేవానికి; గృహమందున్= ఇంటిలో; మాత= తల్లి; కానీ= కాని; రమణ+అనుకూల రమణీమణి= సంసార సుఖానికి సహకరించే అందాలభామ; ఐ= అయి; తనరారు= ఒప్పే; భార్య= ధర్మపత్ని; కానీ; రుచిన్= ప్రీతిని; పొందక+ఉన్నన్= పొందకపోతే; తత్+గృహమేధి= ఆ గృహస్థుడు; సౌఖ్యముల్= సుఖాలను; కనన్+నేర్చునె= పొందగలడా!

**తా :** మంచివివేకం కల ఓ కాంతలారా! నా కీ సంసారంలో భోగభాగ్యాలు మునుపటిలాగా రుచించటం లేదు. గృహస్థాశ్రమంలో అమ్మ గానీ, సంసారసుఖానికి అనుకూలంగా వ్యవహరించే భార్య గానీ తన పట్ల ఇష్టంగా లేకపోతే ఆ గృహస్థుడు సౌఖ్యాలు పొందగలడా?

**వ. అదియునుం గాక. 779**

ప్రతి : అదియునున్+కాక= అంతే కాకుండా...

**క. పొగ డొందు జనని గానీ, తగవున వర్తించునట్టి దయితయ కానీ**
**తగ నుండని గృహమున నుం, టగుఁ జక్ర విహీన రథమునందుం టరయన్. 780**

ప్రతి : పొగడు+ఒందు= ప్రశస్తికెక్కే; జనని= తల్లి; కానీ= కాని; తగవునన్= న్యాయబుద్ధితో; వర్తించు+అట్టి= మెలగునట్టి; దయిత+అ= ప్రియురాలైన భార్యయే; కానీ; తగన్= తగు విధంగా; ఉండని= లేనట్టి; గృహమునన్= ఇంటిలో; ఉంట= ఉండటం; చక్రవిహీన+రథమునందున్= చక్రాలులేని రథంలో (బండిలో); ఉంట= ఉండటం; అరయన్= చూడగా; అగున్= అవుతుంది.

**తా :** పిల్లలను చక్కగా తీర్చి దిద్దింది అని నలుగురూ కొనియాడే తల్లిగానీ, ధర్మమార్గంలో మెలగే ఇల్లాలు కానీ లేని ఇంటిలో ఉండటం, చక్రాలు లేని బండిలో ఉండటం వంటిది అవుతుంది.

**వ. కావున. 781**

ప్రతి : కావున= కాబట్టి...

**చ. తలకొని నాకుఁ దానసుపదంబును బ్రజ్ఞ జనింపఁజేసి సం**
**చల దురు దుర్భర వ్యసన సాగరమగ్నుఁడ నైన నన్ను ని**
**శ్చలమతి నుద్ధరించి యనిశంబును మత్ప్రియయైన భార్య యే**
**వలనఁ జరించుచున్న దనివారణ నా కెఱిఁగింపరే దయన్. 782**

ప్రతి : తలకొని= పూనుకొని; నాకున్= నాకు; తాను= తాను; అనుపదంబును= అడుగడుగునా; ప్రజ్ఞ= తెలివిని; జనింపన్+చేసి= కలిగించి; సంచలత్= ఎక్కువగా కదలాడుతున్న; ఉరు= గొప్పది అయిన; దుర్భర= భరించటానికి అలవి కాని; వ్యసన= కష్టాల; సాగర= సముద్రంలో; మగ్నుఁడను= మునిగినవాడను; ఐన= అయినట్టి; నన్నున్= నన్ను;

నిశ్చలమతిన్= స్థిరంగా ఉన్నబుద్ధితో; ఉద్ధరించి= లేవనెత్తి; అనిశంబును= ఎల్లవేళలా; మత్+ప్రియ= నాకు ప్రియమును కలిగించేది; ఐన= అయినట్టి; భార్య= ఇల్లాలు; ఏవలనన్= ఏ దిక్కునందు; చరింపుచున్నది= తిరుగుతున్నదో; అనివారణన్= ఏ సంకోచమూ లేకుండా; దయన్= నా మీది జాలితో; నాకున్= నాకు; ఎఱిఁగింపరే= తెలుపండి.

**తా :** ఆ నా భార్య నాకు అడుగడుగునా తెలివి కలిగించి స్థిరత్వం లేనిది, గొప్పదీ, భరించటానికి అలవికానిదీ అయిన దుఃఖాల కడలిలో మునిగి ఉన్న నన్ను స్థిరమైన బుద్ధితో పైకి లేవనెత్తింది. ఆ విధంగా నాకు ఎల్లవేళలా ప్రియురాలైనది. అట్టి నా భార్య ఇప్పుడు ఎక్కడ తిరుగుతున్నదో దయతో సంకోచం లేకుండా చెప్పండి.

**విశే :** ఇందులో భార్యయొక్క ధర్మం ఏమిటో వ్యంగ్య రూపంలో చెప్పారు.

**క. అనవుడు విని య క్కాంతలు, జనపతి కిట్లనిరి రాజసత్తమ! యిదిగోఁ**
**దన కొంగైనను బఱపుగ, నొనరింపక నేలఁ బొరలుచున్నది వగలన్. 783**

**ప్రతి :** అనవుడున్= అనగా; విని= విని; ఆ+కాంతలు= ఆ స్త్రీలు; జనపతికిన్= రాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనిరి= అన్నారు; రాజసత్తమ= రాజశ్రేష్ఠా; ఇదిగో; తనకొంగు= తాను కట్టిన చీరచెరగు; ఐనను= అయినా; పఱపుగన్= విశాలంగా; ఒనరింపక= చేసుకోకుండా; వగలన్= దుఃఖాలతో; నేలన్= నేలమీద; పొరలుచున్నది= ఊగులాడిపోతున్నది.

**తా :** అప్పుడు రాజు అలా అనగా విని ఆ స్త్రీలు ఇలా ఆ రాజుకు చెప్పారు. రాజశ్రేష్ఠా! ఇదిగో నీ ఇల్లాలు చీరచెరగైనా పరచుకోకుండా దుఃఖాలతో నేలమీద పొరలుతున్నది.

**తే. ఏమి కతమున నున్నదో యెఱుఁగ మేము, నీవు సూడు మటన్న నా భూవరుండు**
**నేలఁ బడి పొరలెడు భార్యఁ బోలఁ జూచి, మనములో దుఃఖ తాపంబు మల్లడింప. 784**

**ప్రతి :** ఏమి కతమునన్= ఏమి కారణంగా; ఉన్నదో= ఆ విధంగా ఉన్నదో; ఏము= మేము; ఎఱుఁగము= తెలియము; నీవు; చూడుము= చూడు; అటు+అన్నన్= అని చెప్పగా; ఆ భూవరుండు= ఆ రాజు; నేలన్= వట్టి నేలమీద; పడి= వ్రాలి; పొరలెడు భార్యన్= దుఃఖంతో కుమిలిపోతున్న ఇల్లాలిని; పోలన్+చూచి= పరికించి; మనములోన్= మనస్సులో; దుఃఖతాపంబు= శోకం చేత జనించిన హృదయవేదన; మల్లడింపన్= అధికం కాగా.

**తా :** ఆమె ఏ కారణంగా అలా ఉన్నదో మాకు తెలియదు. నీవే చూడు అనగా ఆ రాజు నేలమీద పడి పొరలుతున్న తన ఇల్లాలిని పరికించి చూచి గుండెలో శోకతాపం ఎక్కువ కాగా.

**వ. అంత. 785**

**ప్రతి :** అంతన్= అంతట...

**ఆ. జలజనేత్రి! ప్రణయ సంజాత రోష భా, వమున నయిన యట్టి వక్రదృష్టి**
**జన విభుండు సూచి యనునయ కోవిదుఁ, డగుచు నప్పయోరుహాక్షిఁ జేరి. 786**

**ప్రతి :** జలజనేత్రి= తామరలవంటి కన్నులుగల ఆ ఇంతియొక్క; ప్రణయ సంజాత రోష భావమునన్= ప్రేమవలన కలిగిన తీవ్రమైన కోపభావంతో; అయిన+అట్టి= అయినట్టి; వక్రదృష్టిన్= వంకర చూపును; జనవిభుండు= రాజు; చూచి=

కనుగొని; అనునయ కోవిదుఁడు= ఊరడించుటలో గొప్ప తెలివిగలవాడు; అగుచున్= అవుతూ; ఆ+పయోరుహ+అక్షిన్= తామరలవంటి కన్నులుగల ఆమెను; చేరి= సమీపించి

**తా :** జలజనేత్రికి ప్రేమవలన కలిగిన రోష భావంతో ఏర్పడిన వంకర చూపును చూచి బతిమాలటంలో గొప్ప తెలివికలవాడై రాజు ఆమె దగ్గరకు వచ్చాడు.

**క. పొలఁతుకఁ దన యుత్సంగం, బుల నిడి తత్పాద యుగళమును నంటుచు మం**
**జుల మృదు భాషణముల నా, లలనామణిఁ జూచి పలికె లాలన మొప్పన్. 787**

**ప్రతి :** పొలఁతుకన్= ఆ స్త్రీని; తన+ఉత్సంగంబులన్= తన ఒడులలో; ఇడి= ఉంచుకొని; తత్+పాద యుగళమునున్= ఆమె కాళ్ళ జంటను; అంటుచున్= తాకుతూ; మంజుల మృదు భాషణములన్= మనస్సునకు ఇంపైన, మెత్తని మాటలతో; ఆ లలనామణిన్= ఉత్తమ వనిత అయిన ఆమెను; చూచి= కనుగొని; లాలనము= బుజ్జగింపు; ఒప్పన్= అతిశయించగా; పలికెన్= పలికాడు.

**తా :** ఆమెను తన ఒడిలో పెట్టుకున్నాడు. ఆమె పాదాల జంటను మెల్లగా నిమిరాడు. ఇంపైన మెత్తని మాటలతో ఆమెను బుజ్జగిస్తూ ఇలా అన్నాడు.

**చ. రమణిరో! భృత్యులందు నపరాధము గల్గిన నాయకుల్ స్వప**
**క్షముఁ దలపోసి యుగ్రతర శాసనముం దెగిచేయ రట్లు గా**
**క మనసులోని కిన్కఁ దమకంబున నాజ్ఞ యొనర్చి రేని ని**
**క్కముగ ననుగ్రహించుటయ కాక తలంపగ నాజ్ఞ సేయుటే? 788**

**ప్రతి :** రమణిరో= ఓ రమణీ!; భృత్యులందున్= సేవకులందు; అపరాధము= తప్పు; కల్గినన్= కల్గితే; నాయకుల్= వారిని ఏలేవారు; స్వపక్షమున్= తనవైపువారే అని; తలపోసి= ఆలోచించి; ఉగ్రతర శాసనమున్= మిక్కిలి భయంకరమైన శిక్షను; తెగి= సాహసించి; చేయరు; అట్లు= ఆ విధం; కాక= కాకుండా; మనములోని కిన్కన్= మనస్సులోని కోపంతో; తమకంబునన్= తొందరపాటుతో; ఆజ్ఞన్= శిక్షను; ఒనర్చిరి+ఏని= చేసిన వారైతే; నిక్కముగన్= నిజంగా; అనుగ్రహించుట+అ= ప్రసన్నత చూపటమే; కాక; తలంపఁగన్= భావిస్తే; ఆజ్ఞ+చేయుటే= శిక్షించటమా?

**తా :** ఓ సుందరాంగీ! సేవకులు ఏవో తప్పులు చేస్తూ ఉంటారు. వారిని ఏలేవారు వీరు మనవారలే అని వారికి మిక్కిలి భయంకరమైన శిక్ష సాహసించి వేయరు. అలాకాక ఒకవేళ మనస్సులో విజృంభించిన కోపంతో శిక్షవేస్తే, అది అనుగ్రహించటమే అవుతుంది కానీ శిక్షించటం కాదుకదా!

**క. కమలానన! బాంధవ కృ, త్యముఁ దలఁపక రోషచిత్తుఁడగు కుటిలాత్మున్**
**సమదామర్షుఁడు నీతి, క్రమరహితుఁడు నైన బాలుఁగా నెన్నఁదగున్. 789**

**ప్రతి :** కమల+ఆనన= పద్మంవంటి ముఖంకలదానా!; బాంధవకృత్యమున్= చుట్టరికం పనిని; తలఁపక= భావించక; రోషచిత్తుఁడు= కోపం పైకొన్న చిత్తం కలవాడు; అగు= అయిన; కుటిల+ఆత్మున్= వంకరబుద్ధి వానిని; సమద+

అమర్షుఁడు= అహంకారంతో కూడిన కోపం కలవాడు; నీతి క్రమ రహితుఁడు= వినయ ప్రవృత్తిలేనివాడూ; ఐన= అయిన; బాలుగాన్= పసివానినిగా; ఎన్నన్+తగున్= భావించాలి.

**తా :** పద్మముఖీ! చుట్టాలయందు చూపవలసిన ప్రేమాదరాలు చూపకుండా కోపంతో నిండిన కుటిల బుద్ధిని, అహంకారిని, వినయప్రవృత్తి లేనివానిని పసివాడుగా భావించాలి. అనగా అజ్ఞాని అనుకోవాలి.

**వ. అని వెండియు నిట్లనియె. సుదతీ హృదయేశ్వరి వైన నీవు. 790**

**ప్రతి :** అని= ఇలా పలికి; వెండియున్= ఇంకా; ఇట్లు= ఇలా; అనియెన్= అన్నాడు; సుదతీ= చక్కని పలువరుస కలదానా; హృదయ+ఈశ్వరివి+ఐన= హృదయానికి దేవతవైన; నీవు

**తా :** అని ఇంకా ఇలా పలికాడు. (సుదతీ హృదయేశ్వరివైన నీవు)

**మ. సరసోదార సుధా రసోపమ వచశ్చాతుర్య సౌభాగ్యమై**
**హరినీలోపమ కోమలాలక యుతంబై విభ్రమ భ్రూలతా**
**పరిజుష్ట స్మిత సద్విలోకనమునై భాసిల్లు యుష్మన్ముఖాం**
**బురుహంబున్ భవదీయ దాసునకుఁ బూఁబోఁడీ, కృపం జూపవే! 791**

**ప్రతి :** పూబోడీ= పూవువలె సుకుమారమైన దేహంకలదానా!; సరస= ప్రీతిభావనతో కూడిన; ఉదార= తిన్నదనముగల; సుధా రస= అమృతరసంతో; ఉపమ= పోలునట్టి; వచస్+చాతుర్య= మాటలనేర్పు అనే దానితో; సౌభాగ్యము= గొప్ప భాగ్యంకలది; ఐ= అయి; హరి; నీల= ఇంద్రనీలమణులే; ఉపమ= సాటిగాగల; కోమల= సుకుమారమైన; అలక= ముంగురులతో; యుతంబు= కూడినది; ఐ= అయి; విభ్రమ= అందంగా కదలాడుతున్న; భ్రూ= కనుబొమలనెడి; లతా= తీగలతో; పరిజుష్ట= చక్కగా పెంపొంది ఉన్న; స్మిత= చిరునవ్వుతో కూడిన; సద్= మంచి; విలోకనము= చూపులుకలది; ఐ= అయి; భాసిల్లు= ఒప్పారెడు; యుష్మత్+ముఖ+అంబురుహంబు= నీ మోము అనే పద్మాన్ని; భవదీయదాసునకున్= నీ ఈ సేవకునకు; కృపన్= దయతో; చూపవే= చూపుమా!

**తా :** విరిబోణీ! నీ మోము సరసాలు, ఉదారాలు అమృతానితో పోలిక చెప్పదగినవి అయిన మాటల నేర్పుల సౌభాగ్యం కలది. ఇంద్రనీలమణులవంటి కోమలములైన ముంగురులు కలది. అందంగా కదలాడుతున్న తీగలవంటి కనుబొమలు గలది. చక్కని చిరునవ్వుతో కూడిన చూపులు కలది. అట్టి పద్మంవంటి నీ ముఖాన్ని నీ సేవకుడనైన నాకు దయతో చూపించవా?

**క. విను వీరపత్ని నీ యెడ, ననయంబును బ్రాహ్మణులును హరి భక్తులుఁ ద**
**క్కను నితరు లెగ్గు సేసిన, వనితా! శిక్షింతు నెంతవారల నయినన్. 792**

**ప్రతి :** వీరపత్ని= వీరుని ఇల్లాలా!; విను= ఆలకించు; నీయెడన్= నీ విషయంలో; బ్రాహ్మణులును= బ్రహ్మజ్ఞానం కలవారూ; హరిభక్తులున్= విష్ణువునందు భక్తి కలవారూ; తక్కన్= తప్ప; ఇతరులు= అన్యులు; అనయంబును= సతతమూ (మిక్కిలిగా); ఎగ్గు= కీడు; ఒనరించినన్= చేస్తే; వనితా= ఓ ఇంతీ!; ఎంతవారలను= ఎంతగొప్పవారిని; ఐనన్= అయినా; శిక్షింతున్= శిక్షిస్తాను.

**తా :** వీరపత్నీ! వనితా! విను. బ్రాహ్మణులు, హరిభక్తులు కాక ఇతరులు ఎంతవారైనా నీ విషయంలో పెద్దగా తప్పు చేస్తే వారిని కఠినంగా దండిస్తాను.

**క. ఈ ముల్లోకము లందును, నా మనమున రోష మొదవినన్ భయరహితుం**
**డై మదిలోఁ బరితోషము, తో మెలఁ గెడువానిఁ గానఁ దోయజనేత్రా! 793**

**ప్రతి :** తోయజనేత్రా!= పద్మాలవంటి కన్నులున్నదానా!; ఈ; మూడు+లోకములందున్= స్వర్గం, మర్త్యం, పాతాళం అనే మూడైన ఈ లోకాలలో; నామనమునన్= నా మనస్సులో; రోషము= తీవ్రమైన కోపం; ఒదవినన్= కలిగితే; భయరహితుండు= భయం లేనివాడు; ఐ= అయి; మదిలోన్= మనస్సులో; పరితోషముతోన్= నిండైన సంతోషంతో; మెలగెడువానిన్= ప్రవర్తించేవానిని; కానన్= చూడను.

**తా :** పద్మాక్షీ! నాకు కోపం వస్తే భయంలేకుండా సంతోషంగా ఉండగలవాడు ఈ మూడు లోకాలలోనూ లేదు.

**సీ. ఇందీవరేక్షణ! యే నెందు భవదీయ తిలక విరహితము మలినయుతము**
**హర్ష శూన్యంబు నపాస్తరాగంబును యత్యమర్షయుతంబు నయిన ముఖము**
**గళితాశ్రుబిందు సంకలిత సంచిత శోభ మాన పీనస్తన మండలమును**
**రమణీయ తాంబూలరాగ విహీన మై నట్టి సుపక్వ బింబాధరంబుఁ**

**తే. గాన నిట్లుంట కిపుడేమి కతము? నాకు, నర్థి నెఱిఁగింపవే మృగయాతిసక్తి**
**నబల! నీ కెఱిఁగింపక యరిగి నట్టి, తప్పు సైరించి కావంగఁ దగుదు నేను. 794**

**ప్రతి :** ఇందీవర+ఈక్షణ!= పద్మాలవంటి కన్నులున్న ఓ అతివా!; ఏను= నేను; ఎందున్= ఎప్పుడూ, ఎక్కడా; భవదీయ తిలక విరహితము= నీదైన బొట్టులేనిది; మలినయుతము= మాసినది; హర్షశూన్యంబు= ఆనందంలేనిదీ; అపాస్త రాగంబును= తొలగిపోయిన అనురాగం కలదీ; అతి+అమర్ష యుతంబును= మిక్కిలి కినుకతో కూడినదీ; ఐన= అయిన; ముఖమున్= మోమును; గళిత= జారిపోయిన; అశ్రు= కన్నీటి; బిందు= బొట్టులతో; సంకలిత= కూడుకొని ఉన్న; సంచిత= పోసగి ఉన్న; శోభమాన= విరాజిల్లుతున్న; పీన= బలిసిన; స్తన= పాలిండ్ల; మండలమును= ప్రదేశాన్నీ; రమణీయ= మరులు గొలుపు; తాంబూల= తమ్ములపు; రాగ= ఎర్రదనం; విహీనము= లేనిది; ఐన+అట్టి= అయిన; సుపక్వ బింబ+అధరంబున్= బాగా పండిన దొండపండు వంటి క్రింది పెదవిని; కానన్= చూడలేదు; ఇట్లు= ఈ విధంగా; ఉంటకున్= ఉండటానికి; ఇపుడు= ఈ సమయంలో; ఏమి కతము= కారణం ఏమి?; నాకున్= నాకు; అర్థిన్= కోరికతో; ఎఱింగింపవే= తెలుపుమా; అబల= సుకుమార దేహంగల ఓ ఇంతీ; మృగయా+అతిసక్తిన్= వేటయందలి మిక్కిలి తమకంతో; నీకున్= నీకు; ఎఱిఁ గింపక= తెలియజేయక; అరిగిన+అట్టి తప్పున్= వెళ్ళిన అపరాధాన్ని; సైరించి= సహించి; కావంగన్= కాపాడటానికి; నేను; తగుదున్= తగుతాను.

**తా :** పద్మాలవంటి కన్నులున్న ఓ కాంతా! నేనెప్పుడూ బొట్టులేనిదీ, మాసినది, సంతోషం లేనిది, అనురాగం లేనిదీ, మిక్కిలి కోపంతో ఉడికిపోయేది అయిన నీ మోమునూ, కన్నీటి బొట్టులు నిండి చక్కగా ఒప్పారుతున్న నీ చిక్కని చక్కని బలిసిన పాలిండ్ల ప్రదేశాన్నీ, సుందరమైన తాంబూలపు ఎర్రదనం లేని బాగాపండిన దొండపండువంటి క్రిందిపెదవినీ

ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు ఇట్లా ఉండటానికి కారణం ఏమిటి? నాకు ప్రేమతో తెలుపు. ఓ అబలా! వేట తమకంతో నీకు చెప్పకుండా వెళ్ళిన నా అపరాధాన్ని సహించు. నన్ను కాపాడు.

**క. వనితాజన పరవశుఁడై, మనసిజశరబాధ్యమానమానసుఁ డగు వా**
**నిని దగఁ గర్తవ్యార్థము, లను భజియింపక తొలంగు లలనలు గలరే? 795**

**ప్రతి :** వనితా జన పరవశుఁడు+ఐ= స్త్రీ వ్యక్తులకు వశమైపోయినవాడై; మనసిజ= మన్మథుని; శర= బాణాలతో; బాధ్యమాన= బాధించబడుచున్న; మానసుఁడు= మనస్సుకలవాడు; అగువానినిన్= అయిన వానిని; తగన్= తగువిధంగా; కర్తవ్య+అర్థములను= చేయవలసిన పనులను; భజియింపక= చేయించుకొనక; తొలంగు లలనలు= తొలగిపోయే స్త్రీలు; కలరే= ఉంటారా?

**తా :** స్త్రీలకు దాసుడైపోయి, మన్మథుని బాణాల బాధలను పొందుతున్న మనస్సుగల వానినుండి తగిన సేవలు పొందకుండా తప్పించుకొనిపోయే వనితలు ఉంటారా?

**వ. అనుచుం దదీయ విభ్రమ వశంగతుండై పలికిన విని. 796**

**ప్రతి :** అనుచున్= అంటూ; తదీయ విభ్రమ వశంగతుండు= ఆమె శృంగార చేష్టలకు వశమై పోయినవాడు; ఐ= అయి; పలికినన్= పలుకగా; విని.

**తా :** అంటూ ఆమె విలాసచేష్టలకు వశమై పోయినవాడై పలుకుతున్న వాని మాటలు విని.

**క. కంజాతపత్రనేత్ర పు, రంజను దెస రోష ముడిగి రమణీయశ్రీ**
**మంజుల మృదూక్తుల మనము, రంజించుచుఁ బలికె సదనురాగ మెలర్పన్. 797**

**ప్రతి :** కంజాతపత్ర నేత్ర= పద్మపు రేకులవంటి కన్నులతో అలరారుతున్న ఆమె; పురంజనుదెసన్= పురంజనుని వైపు; రోషము= కోపాన్ని; ఉడిగి= మానివేసి; రమణీయ శ్రీమంజుల మృదు+ఉక్తులన్= శోభతో వెలుగొందే అందమైన మెత్తని పలుకులతో; మనమున్= అతని హృదయాన్ని; రంజింపుచున్= ఉల్లాసపరుస్తూ; సత్+అనురాగము= మంచి ప్రేమ; ఎలర్పన్= వృద్ధి పొందగా; పలికెన్= పలికింది.

**తా :** పద్మపురేకులవంటి కన్నులు కలిగిన ఆ వనిత పురంజనుని మీద కోపం మానుకొని, ఇంపుగా, భాగ్యం తొణికిసలాడే, సుందరమైన మెత్తని పలుకులతో అతని హృదయాన్ని అలరిస్తూ అనురాగపూర్వకంగా మాట్లాడింది.

**వ. అంత. 798**

**ప్రతి :** అంతన్

**తా :** అంతలో

**సీ. అ మ్మహాదేవి నెయ్యంబున మంగళ, స్నాతయై మృదుల వస్త్రములు గట్టి**
**స్రక్చందనాది భూషణములు ధరియించి, కమనీయ మోహనాకార యగుచుఁ**
**బతికడ నిలిచిన నతఁడు సంతుష్టాంత, రంగుఁడై యభ్యంతరమున నుండి**
**యన్యోన్య సరస గాఢాలింగనంబులు, గావించి గోప్య వాక్యముల చేత,**

**తే. నతఁడు ప్రమదా పరిగ్రహ వ్యసనమునకు, గడఁక నపకృష్టఘన వివేకంబు గలిగి**
**పగలు రేయని ప్రొద్దు లేర్పఱుప రాక, యెనసి యాయుర్వ్యయంబు దా నెఱుఁగఁ డయ్యె. 799**

**ప్రతి :** ఆ+మహాదేవి= గొప్పదేవేరియైన ఆ కాంత; నెయ్యంబునన్= చెలిమితో; మంగళ స్నాత= శుభమైన స్నానం చేసినది; ఐ= అయి; మృదుల వస్త్రములన్= మెత్తనివలువలను; కట్టి= ధరించి; స్రక్+చందన+ఆది భూషణములు= పూలమాలలు, గందపు పూతలు మొదలుగా పెక్కునగలను; ధరియించి= తాల్చి; కమనీయ మోహన+ఆకార= మనస్సును హరించే మిక్కిలి సుందరమైన ఆకారం కలది; అగుచున్= అవుతూ; పతి కడన్= మగని దగ్గర; నిలిచినన్= నిలవగా; అతఁడు= ఆ పురంజనుడు; సంతుష్ట+అంతరంగుఁడు= మిక్కిలి సంతోషించిన మనస్సుకలవాడు; ఐ= అయి; అభ్యంతరమునన్= అంతఃపురంలో; ఉండి; అన్యోన్య సరస గాఢ+ఆలింగనంబులు= ఒకరికొకరి పై ఒకరికి; ప్రేమరసంనిండారే గట్టి కౌగిలింతలు; కావించి; గోప్యవాక్యములచేతన్= పైకి చెప్పుకొనరాని మాటలతో; అతఁడు= ఆ పురంజనుడు; ప్రమదా పరిగ్రహ వ్యసనమునకు= స్త్రీని చేపట్టుట అనే తగులంచేత; కడఁకన్= పూనికతో; అపకృష్ట ఘన వివేకంబు= గుంజి వేయబడిన గొప్ప తెలివి కలిగి; పగలు= దినభాగం; రేయి= రాత్రి; అని= అనే; ప్రొద్దులు= కాలవిశేషాలు; ఏర్పఱుపరాక= విడివిడిగా చూడలేక; ఆయుః+వ్యయంబు= జీవితప్రమాణం తరిగిపోవటం; ఎనసి= పొంది; తాను; ఎఱుఁగఁడు+అయ్యెన్= తెలియనివాడైనాడు.

**తా :** ఆ మహాదేవి చక్కగా మంగళస్నానం చేసింది. మెత్తని వస్త్రాలు కట్టింది. పూలమాలలు, గంధపుపూతలు, ఆభరణాలు ధరించింది. గొప్ప సౌందర్యంతో మోహం కలిగించే ఆకారం తాల్చింది. భర్త దగ్గర నిలిచింది. అతని అంతరంగం పరమసంతోషం పొందింది. అంతఃపురంలో నిరంతరంగా సరసాలైన గట్టి కౌగిలింతలతో వాళ్లిద్దరు కాలం గడుపుతున్నారు. రాగంతో కూడి పైకి చెప్పటానికి వీలులేని మాటలు ఆడుకుంటున్నారు. అలా స్త్రీ సంగమం అనే తగులంతో అతని వివేక మంతా జారిపోయింది. ఇది రాత్రి, ఇది పగలు అనే భేదం కూడా వారికి తెలియకుండా పోయింది. ఇలా ఆయువు తరిగిపోతూ ఉండటం కూడా అతడు గమనించలేదు.

**వ. మఱియు నతం డున్నద్ధమదుండును మహామనుండును నర్హశయ్యాశయానుండును మహిషీ భుజోపధానుండునునై యజ్ఞానాభిభూతుం డగుటం జేసి స్వరూప భూత పరమపురుషార్థంబు నెఱుంగక నిజమహిషియె పరమపురుషార్థంబుగాఁ దలంచుచు రమించుచుం గామ కశ్మలచిత్తుండైన యతనికి నవయౌవనంబైన కాలంబు క్షణార్థంబునుం బోలె గతం బయ్యె, నంత. 800**

**ప్రతి :** మఱియున్= ఇంకా; అతండు= ఆ పురంజనుడు; ఉన్నద్ధమదుండును= ఎక్కువైన మదం కలవాడూ; మహామనుండును= గొప్ప జీవనం కలవాడూ; అర్హ శయ్యా శయానుండును= తగిన పాన్పులమీద పడుకొనేవాడూ; మహిషీ భుజ+ఉపధానుండును= పట్టపురాణి భుజమే దిండుగా గలవాడును; ఐ= అయి; అజ్ఞాన+అభిభూతుండు= అజ్ఞానంచేత ఆక్రమింపబడినవాడు; అగుటన్+చేసి= అయినవాడు కాబట్టి; స్వరూపభూత పరమ పురుష+అర్థంబున్= తనదైన, చిట్టచివరి పురుషార్థమైన మోక్షాన్ని; ఎఱుంగక= తెలియక; నిజ+మహిషి+ఎ= తనరాణియే; పరమ పురుష+అర్థంబుగాన్= గొప్పగా పురుషుడు సాధించవలసిన దానినిగా; తలంపుచున్= భావిస్తూ; రమింపుచున్= క్రీడిస్తూ; కామ కశ్మల చిత్తుండు= కామంతో మలినమైన మనస్సుకలవాడు; ఐనన్= కాగా; అతనికిన్= ఆతనికి; నవ యౌవనంబు= కొత్త యౌవనం; ఐన కాలంబు= అయిన

సమయం; క్షణ+అర్ధంబునన్= అరఘడియ (విఘడియ) కాలంలో; గతంబు+అయ్యెన్= గడచిపోయింది; అంతన్= అప్పుడు.

**తా :** అతడు జారిపోవటానికి వీలులేని మదం కలవాడయ్యాడు. అదే గొప్ప జీవితం అనుకున్నాడు. గొప్ప పానుపుల మీద పడి దొరలాడు. రాణి భుజమే దిండుగా చేసుకున్నాడు. అజ్ఞానం పైకొన్న కారణంగా తన స్వరూపమే అయిన ముక్తి అనే పురుషార్థం తెలియనివాడయ్యాడు. తన రాణినే పరమపురుషార్థంగా భావించాడు. ఆమెతోనే ఆనందం పొందుతూ కామంతో మలినమైన మనస్సు కలవాడయ్యాడు. ఆ విధంగా ఆతనికి నవ యౌవనానికి చెందిన కాలం అర క్షణంలా గడచిపోయింది. అప్పుడు.

**క. విశద యశోజలనిధి యా, శశిముఖి యగు భార్య వలన సమ్మతి నేకా**
**దశ శత పుత్రుల రణక, ర్కశ దేహులఁ గాంచి కౌతుకంబున మఱియున్. 801**

**ప్రతి :** విశద యశః+జలనిధి= స్వచ్ఛమైన కీర్తికి సముద్రం వంటివాడు; ఆ+శశిముఖి= చంద్రునివంటి మోముకల ఆ యింతి; అగు= అయిన; భార్యవలనన్= ఆలివలన; సమ్మతిన్= ఇష్టపూర్వకంగా; ఏకాదశ శత పుత్రులన్= పదకొండు వందల కుమారులను; రణ కర్కశ దేహులన్= యుద్ధాలలో రాటుదేలిన దేహాలు కలవారిని; కాంచి= పొంది; కౌతుకంబునన్= వేడుకతో; మఱియున్= ఇంకా...

**తా :** ఆ రాజు సముద్రమంత స్వచ్ఛమైన కీర్తి కల ఆ చంద్రముఖి అయిన భార్యవలన ఇష్టపూర్వకంగా పదకొండు వందలమంది యుద్ధాలలో రాటుదేలిన దేహములు కలిగిన కొడుకులను పొందాడు. ఇంకా ఉత్సాహంతో

**క. గురు శీలౌదార్య గుణో, త్తరలను సల్లలిత గుణ కదంబలఁ బ్రియలన్**
**వరకుల పావనల దశో, త్తర శత దుహితలను గాంచెఁ దత్సతి వలనన్. 802**

**ప్రతి :** గురు= గొప్పదైన; శీల= మంచినడవడి; ఔదార్య= ఇచ్చేస్వభావం; మొదలైన; గుణ+ఉత్తరలను= గుణాలతో మేలుబంతి అనదగినవారిని; సత్+లలిత+గుణకదంబలన్= చక్కని సుకుమారమైన గుణసముదాయంకల వారిని; ప్రియలన్= ఇష్టమైన వారిని; వర కుల పావనలన్= మేలైన కులాన్ని పవిత్రం చేసేవారిని; దశ+ఉత్తర శత దుహితలను= నూటపదిమంది కూతుండ్రను; తత్+సతి వలనన్= ఆ భార్యవలన; కాంచెన్= పొందాడు.

**తా :** ఆ పురంజనుడు గొప్పశీలమూ, ఉదారత్వమూ అనే గుణాలతో మేలుబంతులన దగినవారూ, సుకుమార గుణాల సముదాయాలు కలవారూ, శ్రేష్ఠమైన వంశాన్ని పవిత్రం చేసేవారూ అయిన నూటపదిమంది కూతుండ్రను ఆ సతి వలన పొందాడు.

**వ. ఇట్లు పుత్త్ర పుత్త్రికా జనంబు గని యున్నంత. 803**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; పుత్ర పుత్రికా జనంబులన్= కొడుకులను, కూతుండ్రను; కని= పొంది; ఉన్న+అంతన్= ఉండగా...

**తా :** ఈ విధంగా కొడుకులను, కూతుండ్రను పొంది ఉండగా

**క. విను మాతని యాయువులో, నను నర్ధం బరిగె, నంత నరపతి కుల వ**
**ర్ధను లగు సుతులకుఁ బరిణయ, మొనరించెన్ సదృశ లయిన యువిదల తోడన్. 804**

**ప్రతి :** వినుము= వినవయ్యా; ఆతని ఆయువులోనను= అతని జీవితకాలంలో; అర్ధంబు= సగం; అరిగెన్= కడచిపోయింది; అంతన్= అటు పిమ్మట; నరపతి= ఆ రాజు; కులవర్ధనులు+అగు= కులాన్ని పెంపొందించేవారైన; సుతులకున్= కొడుకులకు; సదృశలు= తగినవారు; ఐన= అయిన; ఉవిదలతోన్= ఆడువారితో; పరిణయము= పెండ్లి; ఒనరించెన్= చేశాడు.

**తా :** వినవయ్యా! ఇలా ఆ రాజు ఆయువులో సగభాగం కడచిపోయింది. అప్పుడు ఆ రాజు కులాన్ని పెంపొందించే కుమారులకు ఈడూజోడైన ఇంతులతో పెండ్లిండ్లు చేశాడు.

**క. నరనాథుఁ డాదు బిడ్డల, వరరూప వయో విలాస వైభవములచేఁ**
**బరఁగిన నిజతనయల సమ, వరులకు సంప్రీతితో వివాహము చేసెన్. 805**

**ప్రతి :** నరనాథుఁడు= రాజు; ఆడుబిడ్డలన్= కుమార్తెలను; వర= కోరదగిన; రూప= అందచందాలు; వయస్= ఈడూ; విలాస= సొగసుల; వైభవములచేన్= సంపదలచేత; పరఁగిన= ఒప్పుతున్న; నిజ= తన; తనయల= కూతుళ్లను; సదృశ= సాటిరాగల; వరులకున్= పెండ్లి కొడుకులకు; (ఇచ్చి); సంప్రీతితోన్= మిక్కిలి ప్రీతితో; వివాహము= పెండ్లి; చేసెన్= చేశాడు.

**తా :** ఆ రాజు తన కూతుంద్రను చక్కని రూపం, ప్రాయమూ, దేహసంబంధమైన ముచ్చట గొలిపే సొగసులూ కల తన కుమార్తెలతో అన్ని విధాలా సాటి వచ్చే వరులకు ఇచ్చి మిక్కిలి ప్రీతితో పెండ్లిండ్లు చేశాడు.

**వ. అట్లు వివాహంబులు గావించి యున్న సమయంబున. 806**

**ప్రతి :** అట్లు= ఆ తీరున; వివాహంబులు= పెండ్లిండ్లు; కావించి= చేసి; ఉన్న సమయంబునన్= ఉన్నవేళ...

**తా :** ఆ విధంగా ఆ రాజు కొడుకులకూ, కూతుంద్రకూ పెండ్లి చేసి ఉన్న సమయంలో

**క. విను, తత్సుతు లొక్కొకనికి, ననయముఁ బాంచాల దేశమందులఁ బౌరం**
**జన కులవర్ధను లగుచున్, జనియించిరి నూర్వురేసి శౌర్య బలాఢ్యుల్. 807**

**ప్రతి :** విను= ఆలకించు; తత్సుతులు= ఆ కొడుకులు; ఒక్కొకనికిన్= ఒక్కొక్కనికి; పాంచాలదేశమందులన్= పాంచాల దేశంలో; అనయమున్= మీద మీద; పౌరంజన కుల వర్ధనులు= పురంజనునికి సంబంధించిన కులాన్ని పెంపొందించేవారు; అగుచున్= అవుతూ; శౌర్య+బల+ఆఢ్యుల్= పరాక్రమమూ, దేహబలం అనే వానిలో ప్రసిద్ధి కన్న; నూర్వురు+ఏసి= నూరుగురు చొప్పున; (కొడుకులు) జనియించిరి= పుట్టారు.

**తా :** విను. ఆ కొడుకులు పాంచాలదేశంలో ఉన్నారు. వారికి ఒక్కొక్కరికీ గొప్పబల పరాక్రమాల ప్రసిద్ధిగల కులాన్ని పెంపొందింపచేయగల కొడుకులు నూరుగురు చొప్పున పుట్టారు.

**విశే :** పాంచాలదేశం అంటే ఇక్కడ శబ్ద స్పర్శ రూప రస గంధాలనే ఇంద్రియవిషయాలు. అవి విహరించే భూమి – దేహమే.

**ఆ. అనఘ! యట్టి రిక్థహారులు గేహకో, శానుజీవయుతులు నయిన యట్టి**
**నందనాదులందుఁ జెందిన మమత ని, బద్ధుఁడయ్యె నంతఁ బార్థివుండు. 808**

**ప్రతి :** అనఘ= పుణ్యాత్మా!; ఇట్టి= ఈ విధమైన; రిక్థహారులు= ధనాన్ని కొల్లగొట్టేవారూ; గేహ కోశ+అనుజీవ= ఇల్లూ, ధనపుముల్లెలూ, సేవకులు అనేవానితో; యుతులు= కూడుకొన్నవారూ; అయిన+అట్టి= అయిన; నందన+ఆదులందున్= కొడుకులు మొదలైనవారి యందు; చెందిన మమతన్= కూడుకొన్న మమకారంతో; పార్థివుండు= పురంజనుడనే రాజు; అంతన్= అప్పుడు; నిబద్ధుఁడు= కట్టుపడినవాడు; అయ్యెన్= అయ్యాడు.

**తా :** పుణ్యాత్మా! ఈ విధంగా దాయభాగాన్ని తీసుకొనేవారు ఇల్లూ, ధనాగారాలూ, పరిచారకులూ అనేవారితో లంకె పెట్టుకొన్నవారూ అయిన కొడుకులు మొదలగువారి యందు ఏర్పడిన మమకారంతో అప్పుడు ఆ పురంజనుడు కట్టుబడిపోయాడు.

**చ. తిరమగు నిష్ఠతో నతఁడు దీక్షితుఁడై పశుమారకంబులున్**
**సరవి భయంకరంబులగు సన్మఖముల్ దగఁ బెక్కు సేసి యా**
**దరమున నీవునుం బలెను దత్తదనూన ఫలాప్తి కాముఁడై**
**సురపితృ భూత సంఘము నసూయ దనర్ప భజించె భూవరా! 809**

**ప్రతి :** భూవరా= రాజా! (ప్రాచీనబర్హీ); తిరము= స్థిరం; అగు+నిష్ఠతోన్= అయిన పూనికతో; అతఁడు= ఆ పురంజనుడు; దీక్షితుఁడు= యజ్ఞసంకల్పాన్ని మంత్ర పూర్వకంగా పొందినవాడు; ఐ= అయి; పశుమారకంబులన్= పశువులను చంపునట్టివి; సరవిన్= క్రమంగా; భయంకరంబులు+అగు= వెరపు గొలుపునవీ; సత్+మఖంబులు= మంచి యజ్ఞాలు; పెక్కు= అనేకంగా; చేసి; ఆదరమునన్= ఆదరంతో; నీవునున్+బలెను= నీలాగా; తత్+తత్ అనూన ఫల+ ఆప్తి కాముడు+ఐ= ఆ యా తక్కువకాని ఫలాలను గట్టిగా కోరుతున్నవాడై; సుర పితృ భూతసంఘమున్= దేవతలు, పితృదేవతలు, ప్రాణులు అనువాని సముదాయాన్ని; అసూయ తనర్పన్= అసూయ ఏర్పడగా; భజించెన్= సేవించెను.

**తా :** ప్రాచీనబర్హీ! ఆ పురంజనుడు గట్టి నిష్ఠతో యజ్ఞసంకల్పాన్ని నిర్వహిస్తాననే ప్రతిజ్ఞవంటి దానిని చేపట్టి వరుసగా పశువులను చంపేవీ, చాలా భయంకరమైనవీ అయిన యాగాలనెన్నింటినో క్రమంగా చేసి, నీలాగా ఆ యా యజ్ఞాల వలన కలిగే గొప్ప ఫలాలను కాంక్షిస్తూ దేవతలను, పితృదేవతలనూ, ప్రాణికోటినీ సేవిస్తూ వచ్చాడు. ఇందులో కొట్ట వచ్చినట్లుగా కనపడేది అసూయ.

**విశే :** అసూయ అంటే గుణాలను దోషాలుగా లెక్కగట్టేబుద్ధి.

**వ. ఇట్లాత్మహితంబు లైన కర్మంబులయం దనవహితుండును గుటుంబాసక్త మానసుండునునై యున్న యతనికి విరోధియై ప్రియాంగనాజనంబులకు నప్రియంబగు కాలంబు సంభవించినం జండవేగ విఖ్యాతుండును గంధర్వాధీశుండు షష్ట్యుత్తర శతత్రయ సంఖ్యాకులైన గంధర్వులును నందఱ గంధర్వీజనంబులును సితాసిత వర్ణంబులు గలిగి మిథునీభూతు లగుచు ననుగమింపం జనుదెంచి స్వపరిభ్రమణంబుచేతనే సర్వకామంబుల నిర్మితంబగు నా పురంబు నిరోధించిన నప్పు డా**

**చండవేగానుచరులైన గంధర్వు లా పురంజను పురంబు వ్యాకులత్వంబు నొందించుచు నపహరింప నుపక్రమించు సమయంబునఁ బురంజన పురాధ్యక్షుండైన ప్రజాగరుండనువాఁడు వింశత్యుత్తర సప్తశతంబులైన గంధర్వ గంధర్వీ జనంబుల నివారించి బలవంతుడై సంవత్సరశతంబు యుద్ధంబు గావించి యొక్కరుండయ్యు నప్పెక్కండ్రతో నిట్లు పోరి క్షీణుండైనం బురంజనుండు దాన నిలిచి తత్పురంబున నల్పసుఖంబు లనుభవించుచుం బాంచాల దేశంబులందు నిజపార్షదులచేత నానీతంబులైన పదార్థంబుల నొందుచుం గామినీ జన సమేతుండై భయపర్యాలోచనంబు సేయ నేరక రాష్ట్ర పురబాంధవ సమేతుండై యార్తి నొంది చింతాక్రాంతుండై యుండె నంత. 810**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; ఆత్మ హితంబులు= తనకు మేలు చేసేవి; ఐన= అయినట్టి; కర్మంబులందున్= పనులయందు; అనవహితుండును= శ్రద్ధలేనివాడూ; కుటుంబ+ఆసక్త మానసుండును= ఆలుబిడ్డలూ మొదలగువారి యందే తగులుకొన్న మనస్సు కలవాడూ; ఐ= అయి; ఉన్న+అతనికిన్= ఉన్న ఆ పురంజనునకు; విరోధి+ఐ= శత్రువై; ప్రియ+అంగనా జనంబులకున్= ఇష్టమైన స్త్రీ జనాలకు; అప్రియంబు= ఇష్టం కానిది; అగు= అయిన; కాలంబు= సమయం; సంభవించినన్= ఏర్పడగా; చండవేగ+విఖ్యాతుండును= చండవేగుడనే ప్రసిద్ధిగల; గంధర్వ+అధీశుండు= గంధర్వులరాజు; షష్టి+ఉత్తర శత త్రయ సంఖ్యాకులు= మూడువందల అరవై లెక్కగల; గంధర్వులును= గంధర్వులనే దేవజాతివారునూ; అందఱు+అ= అంతే సంఖ్యగల; గంధర్వీజనంబులును= గంధర్వ స్త్రీ జనాలునూ; సిత+అసిత వర్ణంబులు= తెల్లని, నల్లని రంగులు; కలిగి; మిథునీభూతులు= జంటలుగా నయినవారు; అగుచున్= అవుతూ; అనుగమింపన్= వెంటనంటి రాగా; చనుదెంచి= వచ్చి; స్వ పరిభ్రమణంబు చేతనే= తన చుట్టివచ్చుట చేతనే; సర్వకామంబుల= అన్ని సౌకర్యాలతో; నిర్మితంబు+అగు= నిర్మితమైన; ఆ పురంబు= ఆతని నగరాన్ని; నిరోధించినన్= అడ్డుకోగా; అప్పుడు= ఆ సమయంలో; ఆ చండవేగ+అనుచరులు= ఆ చండవేగుని వెంటనున్న సేవకులు; ఐన= అయిన; గంధర్వులు; ఆ పురంజను పురంబున్= ఆ పురంజనుని పట్టణాన్ని; వ్యాకులత్వంబున్= కలతచెందిన దానిని; ఒందింపుచున్= చేస్తూ; అపహరింపన్= తమవశంలోనికి తీసుకోవటానికి; ఉపక్రమించు సమయంబునన్= ప్రారంభించే వేళలో; పురంజన పుర+అధ్యక్షుండు= పురంజనుని పురానికి కాపుగాడు; ఐన+ప్రజాగరుండు= అయిన ప్రజాగరుడు; అనువాడు= అనేవాడు; వింశతి+ఉత్తరసప్తశతంబులు= ఏడువందలఇరవై సంఖ్యగలవి; ఐన గంధర్వ గంధర్వీ జనంబులన్= అయిన మగ గంధర్వులను, ఆడుగంధర్వులను; నివారించి= అడ్డుకొని; బలవంతుండు= గొప్పశక్తి కలవాడు; ఐ= అయి; సంవత్సరశతంబు= నూరేండ్లు; యుద్ధంబు= పోరు; కావించి= చేసి; ఒక్కరుండు= ఒక్కడు; అయ్యున్= అయినా; ఆ+పెక్కండ్రతోన్= ఎక్కువ సంఖ్యలో నున్నవారితో; ఇట్లు= ఈ విధంగా; పోరి= పోరాడి; క్షీణుండు= శక్తి తరిగిపోయినవాడు; ఐనన్= కాగా; పురంజనుండు= పురంజనుడు; తాను+అ= తానే; నిలిచి= స్థిరంగా ఉండి; తత్+పురంబునన్= ఆ నగరంలో; అల్ప సుఖంబులు= చిన్ని సుఖాలను; అనుభవించుచున్= అనుభవిస్తూ; పాంచాల దేశంబులందులన్= పాంచాలం అనే పేరుగల దేశాలలో; నిజపార్షదులచేతన్= తన పరిచారకులచేత; ఆనీతంబులు+ఐన= తేబడినవైన; పదార్థంబులన్= వస్తువులను; ఒందుచున్= గ్రహిస్తూ; కామినీ జన సమేతుండు= కోరికలు అధికంగా ఉన్న ఆడువారితో కూడినవాడు; ఐ= అయి; భయ పర్యాలోచనంబు= వెరపును గూర్చిన సంపూర్ణమైన విచారాన్ని; చేయన్+నేరక= చేయలేక; రాష్ట్ర పుర బాంధవ సమేతుండు= రాష్ట్రంతో, నగరంతో, చుట్టాలతో కూడినవాడు; ఐ= అయి; ఆర్తిన్= వేదనను; ఒంది= పొంది; చింతా+ఆక్రాంతుండు= పెద్ద దుఃఖం పై కొన్నవాడు; ఐ= అయి; ఉండెన్= ఉండెను; అంతన్= అప్పుడు...

**తా :** ఈ విధంగా ఆ పురంజనుడు తనకు మేలుకూర్చే పనులయందు శ్రద్ధ లేనివాడూ; సంసారమునందే తగులం పొందిన చిత్తం కలవాడూ అయిఉండగా అతనికి విరోధి, అతనికి ప్రియకాంతలకు ఇష్టం కానిది అయిన కాలం దాపురించగా చండ వేగుడనే ప్రసిద్ధిగల గంధర్వరాజు మూడువందల అరవై సంఖ్యగల గంధర్వులూ, అంతే సంఖ్యగల గంధర్వ స్త్రీలూ తెల్లని, నల్లని రంగులతో జంటలుగా ఏర్పడి వెంటరాగా వచ్చి, తాను తిరుగుతూ అన్ని విధాలైన కామాలతో నిర్మింపబడిన ఆపురాన్ని ముట్టడించాడు. అప్పుడు ఆ చండవేగుని సేవకులైన గంధర్వులు ఆ పురంజనుని పురాన్ని గందరగోళంగా చేసి వేశారు. దానిని కొల్లగొట్టటానికి పూనుకున్నారు. అప్పుడు పురంజనుని పురానికి రక్షకులైన ఉద్యోగుల అధ్యక్షుడు ప్రజాగరుడు ఆ ఏడువందలఇరవై సంఖ్యగల గంధర్వులను, గంధర్వస్త్రీలనూ నిలువరించాడు. బలం పుంజుకొన్నవాడై నూరేండ్లు యుద్ధం చేశాడు. తాను ఒక్కడే అయినా పెద్ద సంఖ్యగల ఆ అందరితో పోరాడి నీరుగారిపోయాడు. పురంజనుడు తన్ను తాను నిలుపుకొని ఆపురంలో చిన్ని చిన్ని సుఖాలనుభవిస్తూ పాంచాల దేశాలలో తన సేవకులు తెచ్చి అందిస్తున్న పదార్థాలను తీసుకుంటూ కామినులతో కూడి, భయానికి కారణం ఏమిటో విచారణ చేయలేక రాష్ట్రంతో, పురంతో చుట్టపక్కాలతో వేదన పొంది కుమిలిపోతూ ఉన్నాడు. అప్పుడు

**క. అనయంబుఁ గాల పుత్రిక, యను నొక కామిని వరేచ్ఛ నఖిల జగంబుం**
**దనయంతఁ గలయఁ దిరుగుచుఁ, జని చని యొకనాఁడు రాజసత్తమ! వింటే. 811**

**ప్రతి :** అనయంబున్= ఎల్లవేళలా; కాలపుత్రిక; అను+ఒకకామిని= అనే ఒక స్త్రీ; వర+ఇచ్ఛన్= వరుని మీది కోరికతో; అఖిలజగంబున్= లోకమంతా; తన+అంతన్= స్వయంగా; కలయన్+తిరుగుచున్= అన్ని వైపులా తిరుగుతూ; చని= వెళ్ళి; ఒకనాడు; రాజసత్తమ= రాజశ్రేష్ఠా; వింటే= విన్నావా?

**తా :** రాజశ్రేష్ఠా! విను. కాలపుత్రిక అనే ఒక కామిని వరుని కోసం తిరుగుతూ లోకమంతటినీ తనంత తానే చుట్టబెడుతూ ఉన్నది. అట్లు తిరుగుతూ ఒకనాడు పోయి

**సీ. అనఘాత్మ! రాజర్షి యైన యయాతి కుమారకుం డయినట్టి పూరుచేత**
**వరియింపఁగాఁ బడి వలనొప్ప నతనికి వర మిచ్చి దౌర్భాగ్యవశత నొంది**
**ప్రఖ్యాతి గనుట దుర్భగ యనుపేరను బరఁగు న క్కాంత నే పురుషవరుఁడు**
**వరియింపఁ డయ్యె, నా తరుణియు నొక నాఁడు గర మొప్ప బ్రహ్మలోకమున నుండి**

**తే. వసుధ కేతెంచి విను బృహద్వ్రతుఁడ నయిన, నన్ను వరియింపఁ గోరి మనమునఁ గామ**
**శరవిమోహిత యై వేఁడఁ గరము నేను, సమ్మతింపక యున్న రోషమున నలిగి. 812**

**ప్రతి :** అనఘ+ఆత్మ!= పుణ్యాత్ముడా; విను= వినుము; రాజ+ఋషి+ఐన= రాజులలో ఋషి అయిన; యయాతి కుమారకుండు= యయాతి కొడుకు; ఐన+అట్టి పూరుచేతన్= అయిన పూరుడనేవానిచేత; వరియింపఁగాన్+పడి= కోరబడి; వలను+ఒప్పన్= వీలు కలుగునట్లుగా; అతనికిన్= ఆ పూరునకు; వరమున్= వరాన్ని; ఇచ్చి; దౌర్భాగ్యవశతన్= భాగ్యం కోల్పోయిన స్థితికి వశం కావటాన్ని; ఒంది= పొంది; ప్రఖ్యాతిన్= అందరకూ తెలిసిన స్థితిని; కనుటన్= పొందటంచేత; దుర్భగ= దుర్భగ (అదృష్టంలేనిది); అనుపేరను= అనే పేరుతో; పరఁగు ఆ+కాంతన్= ఒప్పిన ఆ స్త్రీని; ఏ

పురుషవరుఁడు= ఏ ఉత్తమ మనుజుడూ; వరియింపఁడు+అయ్యెన్= భార్యగా గ్రహించటానికి ఇష్టపడలేదు; ఆ తరుణియున్= ఆ అమ్మాయికూడా; ఒకనాఁడు= ఒక దినాన; కరము= మిక్కిలి; ఒప్పన్= తగు విధం కలుగునట్లుగా; బ్రహ్మలోకముననుండి= బ్రహ్మగారిదైన సత్యలోకంనుండి; వసుధకున్= భూమికి; ఏతెంచి= వచ్చి; బృహత్+వ్రతుఁడను= గొప్ప వ్రతాలు అనుష్ఠించే వాడనగు; నన్నున్= నన్ను (నారదుని); వరియింపన్= మగనిగా ఎంచుకొనటాన్ని; కోరి= అపేక్షించి; మనమునన్= హృదయంలో; కామ శర విమోహిత ఐ= మన్మథుని బాణాలచేత మూఢురాలై; వేఁడన్= కోరగా; నేను (నారదుడను); కరము= గట్టిగా; సమ్మతింపక= ఇష్టపడక; ఉన్నన్= ఉండగా; రోషమునన్= తీవ్రమైన మనోభావంతో; అలిగి= కోపగించి.

**తా :** పుణ్యాత్మా! ప్రాచీనబర్హీ! వినండి. ఆ కాలపుత్రికను మునుపు రాజర్షియైన యయాతి కుమారుడు పూరుడు వరించాడు. ఆమె అతనికి అనుకూలంగా వరం ఇచ్చింది. అతడు తండ్రి ముసలితనాన్ని తీసుకున్నాడు కనుక వారి దాంపత్యం ఫలం లేనిదయింది. ఆ విధంగా ఆమె 'దుర్భగ' – అని ప్రసిద్ధి కెక్కింది. ఆమెను మగసిరి కలవాడెవడూ పరిగ్రహించలేదు. ఒకనాడు ఆమె బ్రహ్మలోకం నుండి తిరిగివచ్చి గొప్పవ్రతాలలో మునిగి తేలుతున్న నన్ను భర్తగా పొందగోరింది. మన్మథుని బాణాలు ఆమెను ఎక్కువగా బాధించాయి. దానితో వివేకం పోయినదై నన్ను మిక్కిలి బతిమాలింది. నేను ఒప్పుకోలేదు. ఆమెకు నా మీద కోపం వచ్చి.

**విశే :** యయాతి నిజానికి రాజులలో ఉత్తముడు. ఋషి అయినవాడు. కానీ భార్య దేవయాని వలన శుక్రుని శాపంతో ముసలితనం పొందవలసి వచ్చింది. శుక్రుడు శాపం తప్పించుకోవటానికి ఒక మార్గం చెప్పాడు. తన కొడుకులలో ఎవరైనా ముసలితనం కొంతకాలంపాటు తీసుకుంటే ఇతనికి వార్ధక్యంనుండి విడుదల కలుగుతుంది. అతనికొడుకులలో పూరుడు దానికి ఒప్పుకున్నాడు.

**వ. ఇట్లను, మునీంద్రా! మదీయాశా విముఖుండవైన నీకు నేకత్రావస్థానంబు లేక యుండుంగాక! యని శపించి విహత సంకల్పయై మదుపదేశంబునం జని యవనేశ్వరుండును భయనామకుండును నయిన వానిం గదిసి యిట్లనియె. 813**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నది; ముని+ఇంద్రా= మునులలో గొప్పవాడవైన నారదా!; మదీయ+ఆశా విముఖుండవు= నాదైన ఆశవిషయంలో పెడమొగం పెట్టినవాడవు; ఐన+నీకున్= అయిన నీకు; ఏకత్ర+అవస్థానంబు= ఒకచోట నిలవటం; లేక; ఉండున్+కాక= లేకుండుగాక; అని= అని; శపించి= శాపంపెట్టి; విహత సంకల్ప+ఐ= ఫలించని కోరిక కలదై; మత్+ఉపదేశంబునన్= నా బోధతో; చని; యవన+ఈశ్వరుండును= యవనులకు ప్రభువు; భయనామకుండును= భయుడు అనే పేరుగలవాడు; అయిన+వానిన్= అయిన వానిని; కదిసి= చేరుకొని; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికింది.

**తా :** ఆ కాలపుత్రిక నాతో ఇలా అన్నది. 'మునివరా! నా ఆశను చెడగొట్టావు కనుక నీకు ఒకచోట ఉండే స్థితి కలుగకుండా పోతుంది.' ఇలా శపించి తన కోరిక తీరక నామాట మీద యవన ప్రభువు భయుడనే పేరుగల వాని దగ్గరకు వెళ్ళి ఇలా అన్నది.

**విశే :** నారదుడు ఒకచోట నిలుకడలేనివాడు. త్రిలోకసంచారి. దక్షుని శాపంవల్ల అతనికాస్థితి యేర్పడిందని మరొక కథ. ఇక్కడ దుర్భగవల్ల కల్గిన శాపమని కల్పన.

**క. అవనీపతి! భయనామక, యవనకులాధీశ్వరుండ వగు నినుఁ బతిఁగాఁ**
**దవిలి వరింపఁగ వచ్చితి, సవినయముగ వినుము భూత సంకల్పమునన్. 814**

**ప్రతి :** అవనీపతి!= భూమికి పాలకుడవైన ఓ రాజా!; భయనామక= భయుడనే పేరుగలవాడా; యవన కుల+అధీశ్వరుండవు= యవనులనే జాతివారికి గొప్ప ఏలికవు; అగు+నినున్= అయిన నిన్ను; పతిఁగాన్= మగనిగా; తవిలి= కోరి; వరింపఁగన్= వరించడానికి; సవినయముగన్= వినయంతో; భూతసంకల్పమునన్= పంచభూతాల భావనలననుసరించి; వచ్చితిన్= వచ్చాను; వినుము= విను.

**తా :** రాజా! భయా! విను. యవనులకు గొప్పపాలకుడవైన నిన్ను మగనిగా కోరి, పంచభూతాలు అలా సంకల్పించాయి కనుక వినయంతో వరించుటకు వచ్చాను.

**వ. కలుగు మత్కామితంబు వృథ గాదు, లోకంబున వేదంబులందు దేయగ్రాహ్యరూపం బైన వస్తువు యాచ్యమానం బగుచుండ నెవ్వం డొసంగం, డెవ్వం డిందు దీయమానం బగు చుండం గోరం డట్టి వీర లిద్దఱును జడ స్వభావు లని సత్పురుషులు శోకంబు నొందుదురు! గావున నిన్ను భజియించుచున్న నన్నుం గరుణార్ద్ర చిత్తుండవై భజియింపు మిట్టి యార్తానుకంపయుఁబురుషధర్మం బని పలికిన నక్కాలపుత్త్రిక వచనంబులు విని యవనేశ్వరుండు దేవగుహ్యచికీర్షు వగు దానిం గనుంగొని మందస్మిత వదనుం డగుచు నిట్లనియె. 815**

**ప్రతి :** కలుగు= పంచభూతాల సంకల్పంవలన ఏర్పడే; మత్+కామితంబు= నా కోరిక; వృథ= ఫలం లేనిది; కాదు= కారాదు; లోకంబునన్= లోకంలోనూ; వేదంబులయందున్= వేదాలలోనూ; దేయ గ్రాహ్య రూపంబు= ఇవ్వటానికి వీలయినదీ, పుచ్చుకోవటానికీ వీలయినదీ; ఐన వస్తువు= అయిన పదార్థం; యాచ్యమానంబు= బిచ్చంగా కోరబడుతున్నది; అగుచు+ఉండన్= అవుతుండగా; ఎవ్వండు= ఏ మనిషి; ఒసంగండు= ఇవ్వడో; ఎవ్వండు= ఏ వ్యక్తి; ఇందున్= ఈ లోకంలో; దీయమానంబు= ఇవ్వబడుచున్నది; అగుచుండన్= అవుతుండగా; కోరండు= కావాలి అనుకోడో; అట్టి= ఆ విధమైన; వీరలు+ఇద్దఱును= ఈ ఇద్దరూ; జడ స్వభావులు= మొద్దుబారిన స్వభావం కలవారు; అని; సత్పురుషులు= మంచి శీలం కల మనుష్యులు; శోకంబున్= దుఃఖాన్ని; ఒందుదురు= పొందుతారు; కావునన్= అందువలన; నిన్నున్= నిన్ను; భజింపుచున్+ఉన్న= సేవించుకుంటూ ఉన్న; నన్నున్= నన్ను; కరుణా+ఆర్ద్రచిత్తుండవు+ఐ= జాలితో చెమ్మగిల్లిన మనస్సు కలవాడవై; భజియింపుము= చేపట్టు; ఇట్టి= ఈ విధమైన; ఆర్త+అనుకంపయున్= మనోవేదన కలవారియందు జాలియును; పురుష ధర్మంబు= మానవుడు తప్పక చేయవలసినపని; అని; పలికినన్= పలుకగా; ఆ+కాలపుత్రిక వచనంబులు= ఆ కాలపుత్రిక మాటలు; విని= ఆలకించి; యవన+ఈశ్వరుండు= యవనుల ప్రభువు; దేవ గుహ్య చికీర్షువు= దేవతల రహస్యాలను చేసే కోరిక గలది; అగుదానిన్= అయిన ఆమెను; కనుంగొని= చూచి; మంద స్మిత వదనుండు= చిఱునవ్వు మోము కలవాడు; అగుచున్= అవుతూ; ఇట్లు= ఇలా; అనియెన్= అన్నాడు.

**తా :** అయ్యా! నా కోరిక పంచభూతాల సంకల్పం వలన కలిగినట్టిది. లోకం ధర్మం, వేదం ధర్మం ప్రకారం ఇవ్వటానికీ, పుచ్చుకోవటానికీ యోగ్యమైన పదార్థాన్ని కోరినప్పుడు ఇవ్వనివాడూ, ఇస్తానంటే వద్దనేవాడూ ఈ ఇద్దరూ మొద్దుబారిన స్వభావం కలవారయ్యారే అని ఉత్తములు దుఃఖిస్తూ ఉంటారు. కాబట్టి నీ దగ్గరకు చేరుకుంటున్న నన్ను జాలిగల

మనస్సుతో స్వీకరించు. ఇటువంటి దీనులమీది జాలి కూడా పురుషులకు ధర్మమే అవుతుంది. అని ఆ కాలపుత్రిక పలుకగా విని యవనరాజు దేవతల రహస్యాన్ని (మరణాన్ని) చేయబూనిన ఆమెను చూచి చిరునవ్వు మోమునందు చిందులాడుతుండగా ఇలా అన్నాడు.

**విశే :** దేవగుహ్యము అంటే ఇక్కడ మరణం. దానిని దేవతలు వైరాగ్యం పుట్టనివానికి రహస్యంగా ఉంచుతారు.

**క. విను తరుణి! యాచ్యమానం, బనఁదగు నీ లోకమందు నత్యశుభవు స**
**జ్జనముల కసమ్మతవు నగు, నిను నభినందింపకుండ్రు నెఱి నెవ్వారున్. 816**

**ప్రతి :** తరుణి= ఓ ఇంతీ!; విను= ఆలకించు; యాచ్యమానంబు= కోరబడునది; అనన్+తగు= అనటానికి తగిన; ఈ లోకమందున్= ఈ లోకంలో; అతి+అశుభవు= మిక్కిలిగా శుభలక్షణాలు లేనిదానవు; సత్+జనులకున్= ఉత్తములగు మానవులకు; అసమ్మతవును= ఇష్టంకాని దానవూ; అగు= అయిన; నినున్= నిన్ను; ఏ+వారున్= ఎవ్వరూ; నెఱిన్= చక్కగా; అభినందింపక+ఉండ్రు= మెచ్చుకొనరు.

**తా :** ఓ తరుణీ! కోరదగినదే అయిన ఈ లోకంలో నీవు శుభలక్షణాలు లేనిదానవు. ఉత్తములకు ఇష్టం కానిదానవు. కాబట్టి ఎవ్వరూ నిన్ను ప్రీతితో ఆదరించరు.

**వ. కావున నేను జ్ఞానదృష్టిం జేసి నీకుం బతి నిరూపణంబు సేసెద, నది యెట్లనిన మదీయసేనా సాహాయ్యంబు వడసి ప్రజానాశం బొనరించునట్టి నీ వవ్యక్తగతివై కర్మనిర్మితంబైన లోకంబు ననుభవింపు, మీ ప్రజ్వారుం డనువాఁడు నాకు సహోదరుండు, నీవు మదీయ భగినివి. మీ యిద్దఱుం గూడి యీ లోకంబునందు నవ్యక్తుండును భీమసైనికుండును నై యేను వర్తింతు ననిన నా భయనామకుం డయిన యవనేశ్వరుని దిష్టకారులైన సైనికులు ప్రజ్వార కాలకన్యాయుక్తులై భూమండలం బెల్ల దిరుగుచు నొక్కనాఁ డతివేగంబున భౌమ భోగాఢ్యంబును జరత్పన్నగ పాలితంబును నయిన బురంజను పురంబు నావరించి యున్నంత స్వాభిభూతుం డయిన పురుషునకు నిస్సారత్వంబు గలిగించునట్టి కాలకన్యక బలాత్కారంబున నా పురంజను పురంబు ననుభవించె, నట్లు కాలకన్య కోపభుజ్యమానంబైన పురంబు సర్వద్వారంబులందును సర్వతోఽధికంబుగా న య్యవనులు ప్రవేశించి తత్పురంబు సమస్తంబును బీడింప నిట్లు పురంబు ప్రపీడ్యమానం బగుచుండ నభిమానియైన పురంజనుండు. 817**

**ప్రతి :** కావునన్= కాబట్టి; నేను; జ్ఞానదృష్టిన్+చేసి= భావనాసంబంధమైన చూపుతో; నీకున్= నీకు; పతి నిరూపణంబు= మగనిని సూచించటం అనే పనిని; చేసెదన్= చేస్తాను; అది= ఆ విషయం; ఎట్లు= ఏ విధం; అనినన్= అంటే; మదీయ సేనా సాహాయ్యంబు= నాదైన సేనతోడ్పాటు; పడసి= పొంది; ప్రజానాశంబు= ప్రజలను రూపుమాపటం; ఒనరించు+అట్టి= చేసే; నీవు; అవ్యక్త గతివి+ఐ= తెలియరాని రాకపోకలు కలదానవై; కర్మనిర్మితంబు+ఐన= కర్మలతో ఏర్పడినదైన; లోకంబున్= లోకాన్ని; అనుభవింపుము= అనుభవించు; ఈ ప్రజ్వారుండు అనువాడు= ప్రజ్వారుడనే పేరుగలవాడు; నాకున్= నాకు; సహోదరుండు= తోబుట్టినవాడు; నీవు; మదీయ భగినివి= నా తోబుట్టువవు; మీ యిద్దఱన్= మీ ఇద్దరినీ; కూడి= కలసి; ఈ లోకంబునందున్= ఈ లోకంలో; అవ్యక్తుండును= తెలియరానివాడు; భీమసైనికుండును= వెరపు గొలిపే సేనలు

కలవాడును; ఐ= అయి; నేను; వర్తింతును= మెలగుతూ ఉంటాను; అనినన్= అనగా; భయనామకుండు= భయనామం కలవాడు; అయిన యవన+ఈశ్వరుని= అయిన యవనరాజునకు సంబంధించిన; దిష్టకారులు+ఐన= అదృష్టాన్ని కలిగించే అధికారులైన; సైనికులు= యుద్ధభటులు; ప్రజ్వార కాలకన్యా యుక్తులు= ప్రజ్వారుడు, కాలకన్య అనేవారితో కూడినవారు; ఐ= అయి; భూమండలంబు+ఎల్లన్= భూమి భాగాన్నంతటినీ; తిరుగుచున్= సంచరిస్తూ; ఒక్కనాఁడు= ఒక దినాన; అతివేగంబునన్= మిక్కిలి వడితో; భౌమ భోగ+ఆఢ్యంబు= భూమియందలి భోగాలతో పేరు గాంచినది; జరత్+పన్నగ పాలితంబున్= ముసలి దగుచున్న సర్పంచేత రక్షించబడుతున్నదీ; అయిన; పురంజనుపురంబున్= పురంజనుని పట్టణాన్ని; ఆవరించి= చుట్టుముట్టి; ఉన్న+అంతన్= ఉండగా; స్వ+అభిభూతుండు= తన్ను దాను అవమానించుకొన్నవాడు; అయిన పురుషునకున్= అయిన మనిషికి; నిస్సారత్వంబు= సత్తువలేని స్థితిని; కలిగించు+అట్టి= కలుగజేసే; కాలకన్యక= కాలకన్యక అనే ఆమె; బలాత్కారంబునన్= బలాన్ని ప్రయోగించటంచేత; ఆ పురంజనుపురంబున్= ఆ పురంజనుని నగరాన్ని; అనుభవించెన్= అనుభవించింది; అట్లు= ఆ విధంగా; కాలకన్యకా+ఉపభుజ్యమానంబు+ఐన= కాల కన్యకచేత అనుభవించబడుతున్నదైన; పురంబున్= నగరాన్ని; సర్వద్వారంబులందును= అన్ని వాకిళ్ళలోను; సర్వతః= అన్ని వైపులనుండి; అధికంబుగాన్= అ సంఖ్యాకంగా; ఆ+యవనులు= యవనులనే పేరుగలవారు; ప్రవేశించి= చొరబడి; తత్పురంబున్= ఆ నగరాన్ని; సమస్తంబును= అంతటినీ; పీడింపన్= బాధించగా; ఇట్లు; పురంబు= తన నగరం; ప్రపీడ్యమానంబు= చాలా ఎక్కువగా బాధించబడుతున్నది; అగుచున్+ఉండన్= అవుతుండగా; అభిమాని= ఆత్మగౌరవం కలవాడు; ఐన+పురంజనుండు= అయిన పురంజనుడు.

**తా :** కాబట్టి నేను నీకు జ్ఞానదృష్టితో పతి ఎవరో నిరూపిస్తాను. ఆ తీరు ఏట్లంటే నీవు నా సేనల తోడ్పాటును పొంది ప్రజలను రూపుమాపుతూ, తెలియరాని రాకపోకలు కలదానవై, కర్మలతో ఏర్పడిన లోకాన్ని అనుభవిస్తూ ఉండు. ఈ ప్రజ్వారుడనేవాడు నాకు సోదరుడు. నీవు నాకు సోదరివి. మీ ఇద్దరితో కలసి నేను లోకంలో ఎవరికీ తెలియరాకుండా, భయం కలిగించే సైనికులు కలవాడనై మెలగుతూ ఉంటాను.

అని పలుకగా భయనామం కల యవనరాజు అదృష్టానికి కారకులైన సైనికులు ప్రజ్వారునితోను, కాల కన్యకతోను కూడి భూభాగమంతా తిరుగుతూ ఒక్కనాడు తీవ్రమైన వేగంతో భూలోకభోగాలలో ప్రసిద్ధి కెక్కినదీ, ముసలిపాము రక్షణలో ఉన్నదీ అయిన పురంజనుని పురాన్ని చుట్టుముట్టారు. తన అభిమానాన్ని తానే తక్కువ చేసుకొనే మగవానికి నీరసాన్ని కలిగించే కాలకన్యక బలత్కారముగా ఆ పురంజనుని పురాన్ని అనుభవించింది. కాలకన్య అనుభవిస్తున్న ఆ పురపు వాకిళ్ళన్నింటినుండీ, అన్ని వైపులనుండీ అసంఖ్యాకంగా యవనులు పురంలోనికి చొరబడినారు. పురాన్నంతటిని పీడించారు. ఆ విధంగా ఆ పురము పీడ పొందుతుండగా ఆత్మాభిమానం గల పురంజనుడు (ముందుకు అన్వయం).

**విశే :** (1) దిష్టకారులు - మృత్యువు ఆ దేశాన్ని పాలించేవారు.

(2) ముసలిసర్పం - సత్తువలేని ప్రాణం.

(3) కాలకన్యక - ముసలితనం.

(4) యవనులు - రోగాదులు.

(5) వాకిళ్ళు - కన్ను మొదలైన ఇంద్రియగోళాలు.

(6) పురంజనుని పురం - జీవుని దేహం.

**సీ. అనఘ! యెంతయు మమతాకుల చిత్తుఁడై బహువిధ భూరితాపములఁ బొందె,**
**ఘనకుటుంబియుఁ గాలకన్యోపగూఢుండు నష్టసంపదుఁడు వినష్టమతియు**
**విషయాత్మకుండును వినిహతైశ్వరుండుఁ గృపణుండు సాల నకించనుండు**
**నగు పురంజనుఁడు శోకావిలభావుఁడై, గంధర్వ యవన సంఘములచేత**

**తే. నోజ సెడి వికలత నొందు నైజపురముఁ, దవిలి ప్రతికూలురును ననాదరణయుతులు**
**నయిన పుత్త్రులఁ బౌత్త్రుల ననుచరులను, సచివ పౌరోహితుల నిజసతినిఁ జూచి. 818**

**ప్రతి :** అనఘ= పుణ్యాత్మా!; ఈతఁడు= ఈ పురంజనుడు; మమతా+ఆకుల చిత్తుఁడు= నాది, నాది అనే భావనలతో కలతచెందిన హృదయం కలవాడు; ఐ= అయి; బహు విధ భూరి తాపములన్= పెక్కుతీరులయిన ఎక్కువ బాధలను; పొంది; ఘన కుటుంబియున్= పెద్ద సంసారంకలవాడూ; కాలకన్యా+ఉపగూఢుఁడున్= కాలకన్య అనే వ్యవహారంగల ముసలితనంచేత కౌగిలించుకోబడినవాడూ; నష్ట సంపదుఁడు= పోయిన సంపదలు కలవాడూ; వినష్ట మతియున్= ఇంకా పెద్దగా నశించిన బుద్ధి కలవాడూ; విషయ+ఆత్మకుండును= విషయములే ఇంద్రియముల గుణాలే, స్వరూపంగా అయిపోయినవాడూ; వినిహత+ఐశ్వర్యుండున్= మొత్తంగా దెబ్బతిన్న పాలకధర్మం కలవాడూ; కృపణుండున్= దీనుడూ; చాలన్= ఎక్కువగా; అకించనుండున్= దరిద్రుడూ; అగు; పురంజనుండు= పురంజనుడు; శోక+ఆవిల భావుఁడు ఐ= దుఃఖంతో తీరూతెన్నూలేని ఆలోచనలు కలవాడై; గంధర్వ యవన సంఘములచేతన్= గంధర్వులు, యవనులు అనే వారిచేత; ఓజ+చెడి= మంచిస్థితి పాడయి; వికలతన్= చెల్లాచెదరయిన స్థితిని; ఒందు= పొందిన; నైజపురమున్= తనదైన నగరాన్ని; తవిలి= ముట్టడిచేసి; ప్రతికూలురును= పగవారూ; అనాదరణయుతులు= తన మీద ఆదరణలేనివారు; అయిన; పుత్రులన్= కొడుకులను; పౌత్రులన్= పుత్రుల పుత్రులైన మనుమలను; అనుచరులను= తనవెంట తిరుగాడే సేవకులను; సచివ పౌరోహితులను= మంత్రులు, పురోహితులు అయినవారినీ; నిజసతినిన్= తన ఇల్లాలినీ; చూచి= కనుగొని.

**తా :** పుణ్యాత్మా! ప్రాచీనబర్హీ! పురంజనుడు మమకారంతో చెదరిపోయిన చిత్తం కలవాడయ్యాడు. పెక్కు బాధలు పొందాడు. కుటుంబం చాలా పెరిగిపోయింది; ముసలితనం దేహమంతా ఆవరించింది; సంపదలు పోయాయి. బుద్ధి నిలువటం లేదు. ఎటు చూచినా ఇంద్రియగుణాలు అల్లుకొని పోయాయి. పాలించే అధికారం నాశనమై పోయింది. దీనుడూ, దరిద్రుడూ అయ్యాడు, దుఃఖం నిలువెల్లా ఏర్పడి మనస్సును నిలుకడగా ఉండనీయటం లేదు. ఇంద్రియాలూ, రోగాలూ చెదరగొట్టిన అతని నగరం అస్తవ్యస్తం అయిపోయింది. తనను పట్టించుకోనివారూ, తన యందు ద్వేషం కలవారూ అయిన కొడుకులనూ, మనుమలనూ, పరిచారకులనూ, మంత్రులనూ, పురోహితులనూ, తన ఇల్లాలినీ చూచాడు.

**విశే :** ప్రతికూలురు – తనకు హాని కలిగించే విషయ సుఖాలను కూర్చేవారు; అనాదరణయుతులు – తనపై ఆదరణ లేనివారు; అనుచరులు – తన వెంట తగిలి ఉండే ఇంద్రియాలు; సచివులు – ఇంద్రియదేవతలు;

**వ. మఱియుఁ గాలకన్యాగ్రస్తుం డయిన తన్నును నరిదూషితంబులైన పాంచాల బలంబులనుం జూచి యపార చింత నొంది తత్ప్రతీకారంబు సేయ నెఱుంగక కాలకన్యాపహృతవీర్యంబు లయినం గామంబుల నభిలషించుచు దీనుండును విగతాత్మగతికుండును స్నేహంబునం జేసి పుత్రదారోపలాలన పరుండునునై**

**కాలకన్యోపమర్దితంబును గంధర్వ యవనాక్రాంతంబును నైన పురంబు విడువ నిచ్ఛ లేకయు విడువ నుపక్రమించె, నప్పుడు. 819**

**ప్రతి :** మఱియున్= ఇంకా; కాలకన్యాగ్రస్తుండు+అయిన= కాలకన్య అనే ముదిమి పై కొన్నవాడయిన; తన్నును= తనను; అరి దూషితంబులు= శత్రువులు చెడగొట్టినవి; ఐన పాంచాల బలంబులను= అయిన పాంచాలానికి చెందిన సైనికులను; చూచి; అపార చింతన్= అంతులేని వేదనను; ఒంది= పొంది; తత్+ప్రతీకారంబు= దానికి విరుగుడు; చేయన్+ఎఱుంగక= చేయటం తెలియక; కాలకన్యా+అపహృత వీర్యంబులు= ముసలితనం చేత కొల్లగొట్టబడిన శక్తికలవి; అయినన్= అయినా; కామంబులన్= ఇంద్రియసుఖాలను; అభిలషింపుచున్= కోరుచూ; దీనుండును= జాలిగొలిపేవాడూ; విగత+ఆత్మగతికుండునూ= దిక్కుతోచనివాడూ; స్నేహంబునన్+చేసి= అనురాగంచేత; పుత్ర దార+ఉపలాలన పరుండును= కొడుకులను, భార్యను లాలించే ఆసక్తి కలవాడూ; ఐ= అయి; కాలకన్యా+ఉపమర్దితంబును= కాలకన్యచేత నలుగగొట్టబడినదీ; గంధర్వ యవన+ఆక్రాంతంబును= ఇంద్రియాల, రోగాల అదుపులోనికి వెళ్ళిపోయినదీ; ఐన పురంబున్= అయిన దేహం అనే నగరాన్ని; విడువన్= వదలటానికి; ఇచ్ఛ= ఇష్టం; లేకయున్= లేకపోయినా; విడువన్= వదలి వేయటానికి; ఉపక్రమించెన్= మొదలుపెట్టాడు; అప్పుడు= ఆ సమయంలో.

**తా :** కాలకన్య తన్ను ఆక్రమించుకొని ఉన్నది. తన ఇంద్రియాల బలాలన్నీ పగవారిచేత పాడయిపోయాయి. తన దుఃఖానికి ఒక తీరం కానరావటం లేదు. ఏమి చేస్తే ఈ దుఃఖం పోతుందో తెలియటం లేదు. కోరికలు కామకన్య దెబ్బకు సత్తువలేని వయ్యాయి. అయినా వానినే కోరుతూ ఉన్నాడు. పొందలేక జాలితో కుంగిపోతున్నాడు. మమకారంతో కొడుకులనూ, భార్యనూ ముద్దు చేయటమే పనిగా పెట్టుకున్నాడు. తన పురం అనే ఒడలిని కాలకన్య తుక్కు దూగరగా నలుగగొట్టింది. దానిని ఇంద్రియాలూ, రోగాలూ వశం చేసుకున్నాయి. అయినా విడవటానికి మనసొప్పటం లేదు. కానీ తప్పక విడిచిపెట్టగోరాడు. ఆ సమయంలో;

**క. అనఘా! భయనామాగ్రజుఁ, డనఁగల ప్రజ్వారుఁ డపుడ యరుదెంచి పురం**
**బును సకలంబును భయనా, మునికిం బ్రీతిగ దహించె మునుకొని యంతన్. 820**

**ప్రతి :** అనఘా!= పుణ్యాత్మా; భయనామ+అగ్రజుడు= భయుడు అనేవాడికి అన్న; అనన్+కల= అనటానికి వీలైన; ప్రజ్వారుఁడు; అపుడు= ఆ సమయంలో; అరుదెంచి= వచ్చి; పురంబును= నగరాన్ని; సకలంబును= మొత్తాన్ని; భయనామునికిన్= భయుడు అనే పేరుగలవానికి; ప్రీతిగన్= ప్రీతి కలుగునట్లుగా; మునుకొని= మునుముపెట్టి; దహించెన్= కాల్చివేశాడు; అంతన్= అప్పుడు.

**తా :** పుణ్యాత్మా! భయుడు అనే పేరుగల వాని అన్న ప్రజ్వారుడు అప్పుడు వచ్చి నగరాన్ని ఒక వరుసగా పెట్టుకొని, భయునికి ప్రీతి కలిగే విధంగా కాల్చివేశాడు.

**విశే :** భయము- చావు; ప్రజ్వారుడు- కాలస్వరూపుడైన యముడు; పురము= దేహం; కాల్చివేయటం అంటే దేహం లేకుండా చేయటం.

**వ. అట్లు పురంబు దహ్యమానం బగుచుండఁ బౌరభృత్యవర్గాది సమన్వితుండును, గౌటుంబికుండును, పుత్త్రాది సమన్వితుండును, యవనోపరుద్ధాలయుండును, గాలకన్యాగ్రస్తుండును నయిన పురంజనుం**

**దప్పురంబునందుఁ బ్రజ్వార సంస్పృష్టుండై యనుతాపంబునొంది తత్పురపాలనంబు నందు సమర్థుండు గాక పురకృచ్ఛ్రోరువేపథుండయి యం దుండ నశక్తుం డయ్యె, నంత 821**

**ప్రతి :** అట్లు= ఆ విధంగా; పురంబు= నగరం; దహ్యమానంబు= కాల్చివేయబడుచున్నది; అగుచున్+ఉండన్= అగుచుండగా; పౌర, పురంలోనివారల; భృత్య= సేవకుల; వర్గ= మూకలు; ఆది= మొదలైన వానితో; సమన్వితుండును= కూడిన వాడును; కౌటుంబికుండును= కుటుంబం కలవాడును; పుత్ర+ఆది సమన్వితుండును= కొడుకులు మొదలైనవారితో కూడియున్న వాడును; యవన+ఉపరుద్ధ+ఆలయుండును= యవనులు ఆక్రమించిన నివాసాలు కలవాడూ; కాలకన్యా గ్రస్తుండును= కాలకన్యకు చిక్కినవాడునూ; అయిన; పురంజనుండు= పురంజనమహారాజు; ఆ+పురంబునందున్= ఆ నగరంలో; ప్రజ్వార సంస్పృష్టుండు+ఐ= ప్రజ్వారుని చేత నిలువెల్లా తాకబడినవాడై; అనుతాపంబున్= ఎడతెగని వేదనను; ఒంది= పొంది; తత్పుర పాలనంబునందున్= ఆ నగరాన్ని ఏలటంలో; సమర్థుండు= చాలినవాడు; కాక; పురు కృచ్ఛ్ర+ఉరు వేపథుండు= ఎక్కువైన, భరించరాని, గొప్పదైన వణకు కలవాడు; అయి; అందున్= ఆ నగరంలో; ఉండన్= నిలువటానికి; అశక్తుండు= శక్తిలేనివాడు; అయ్యెన్= అయ్యాడు.

**తా :** ఇలా నగరం కాలిపోతుండగా పౌరుల, పనివారల మూకలతో కూడి, కుటుంబం అంటి పెట్టుకొని ఉండగా, కొడుకులు మొదలగువారు తనతో ఉండగా, యవనులు ఆక్రమించిన నివాసాలు కలవాడై, కాలకన్యకు చిక్కి ఆ నగరంలో ప్రజ్వారుడు తన్ను నిలువెల్లా కాల్చివేస్తూ ఉండగా వేదనతో, దానిని కాపాడుకొనే శక్తి లేక భయంకరమైన గొప్పవణకు కలవాడై ఆ నగరంలో ఉండలేక పోయాడు.

**క. దవశిఖియుత తరుకోటర, నివసిత పన్నగము పగిది నిజపురి వెడలం,**
**దివురుచు నతఁడు శిథిల దవ, యవుఁడును గంధర్వ గణ విహత శౌర్యుండున్. 822**

**ప్రతి :** దవశిఖియుత= కారుచిచ్చుతో కూడిన; తరు= చెట్టుయొక్క; కోటర= తొర్రలో; నివసిత= ఉంటున్న; పన్నగము= పాము; పగిదిన్= వలె; నిజపురిన్= తన నగరాన్ని; వెడలన్= వదలి పోవటానికి; తివురుచున్= ప్రయత్నం చేస్తూ; అతఁడు= ఆ పురంజనుడు; శిథిలత్+అవయవుఁడును= పట్టు సడలిపోతున్న శరీరభాగాలు కలవాడూ; గంధర్వ గణ విహత శౌర్యుండున్= గంధర్వుల గుంపులతో దెబ్బతిన్న మనోబలం కలవాడూ (అయ్యాడు).

**తా :** దావాగ్ని చుట్టుకొన్న చెట్టు తొర్రలో ఉండే పాములాగా తన నగరాన్ని వదలిపోవటానికి ప్రయత్నం చేస్తూ పట్టుసడలిన అవయవాలు కలవాడు అయ్యాడు. పైగా తన పరాక్రమాన్ని గంధర్వుల మూకలచేత చిత్తుచిత్తుగా చేయబడినవాడు.

**సీ. అయి చాల ఘుర ఘుర మనుశబ్ద మడరంగ మనమునఁ జింతానిమగ్నుఁ డగుచుఁ**
**గొడుకులఁ గోడండ్రఁ గూఁతుల నల్లుర మనుమల నాప్తుల ననుచరాళి**
**ననయంబు నల్పమాత్రావశిష్టం బైన గృహకోశనివహపరిచ్ఛదముల**
**మసలు నహంకారమమకారములఁ జేసి మతిహీనుఁ డగుచు నెమ్మనములోనఁ**

**తే. గడఁకఁ దలఁచుచు విప్రయోగమునఁ దాను, గటకటా! యిట్లు పరలోక గతుఁడ నైన**
**నిట్టి భార్య యనాథయై యీ కుమార, వరుల నేరీతిఁ బ్రోచునో యరసి యనుచు. 823**

**ప్రతి :** అయి; చాల= ఎక్కువగా; ఘుర ఘురమను శబ్దంబు= గురగురా అనే ధ్వని; అడరంగన్= అధికం కాగా; మనమునన్= మనస్సులో; చింతా+నిమగ్నుఁడు= విచారంలో మునిగినవాడు; అగుచున్= అవుతూ; కొడుకులన్= కుమారులను; కోడండ్రన్= కోడళ్ళను; కూఁతులన్= బిడ్డలను; అల్లుండ్రన్= అల్లుళ్ళను; మనుమలన్= మనుమలను; ఆప్తులన్= దగ్గరి చెలికాండ్రను; అనుచర+ఆళిన్= సేవకుల గుంపును; అనయంబున్= ఎల్లవేళలా; అల్పమాత్ర+అవశిష్టంబు= కొద్దిపాటి మాత్రమే మిగిలినది; ఐన= అయినట్టి; గృహ= ఇల్లు; కోశ= ధనాగారం అనువాని; నివహ= సముదాయాల; పరిచ్ఛదములన్= పరిచారకుల గుంపులందు; మసలు= తిరుగాడే; అహంకార మమకారములన్+చేసి= నేను, నాది అనే భావాలతో; మతిహీనుఁడు= బుద్ధిలేనివాడు; అగుచున్= అగుచు; నెఱ+మనములోనన్= నిండు మనస్సులో; కడఁకన్= పూనికను; తలఁచుచున్= భావిస్తూ; విప్రయోగమునన్= ఎడబాటుచేత; తాను; కటకటా= అయ్యయ్యో; ఇట్లు= ఈ విధంగా; పరలోకగతుఁడను= వేరులోకానికి చేరుకొన్నవాడను; ఐనన్= అయితే; ఇట్టి భార్య= ఈ తీరున ఉన్న నా ఆలు; అనాథ+ఐ= దిక్కుమాలినదై; ఈ కుమారవరులన్= ఉత్తములైన ఈ కొడుకులను; అరసి= రక్షించుకొంటూ; ఏరీతిన్= ఏ విధంగా; ప్రోచునో= కాపాడునో; అనుచున్= అని భావిస్తూ

**తా :** అయి ఆ పురంజనునకు గొంతులో పెద్దగా గురగుర సవ్వడి ఏర్పడింది. హృదయంలో కుమిలిపోతున్నాడు. కొడుకులను, కోడళ్ళను, కూతుండ్రను, అల్లుండ్రను, మనుమలను, ఆత్మీయులను, పరిచారకులను తలచుకుంటున్నాడు. వెనుక మహావైభవంగా ఉన్న తన ఇల్లూ, బొక్కసమూ, పరిచారకవర్గమూ అంతా ఇప్పుడు ఏదో ఉన్నది అన్నట్లయిపోయింది. మనస్సులో తపన ఎక్కువ అయిపోయింది. అయ్యయ్యో! నేను చస్తే నా భార్య దిక్కులేని దవుతుంది. కుమారులను ఎలా కాపాడుతుంది? అని కుమిలిపోతున్నాడు.

**వ. మఱియు నిట్లని తలంచు. 824**

**ప్రతి :** మఱియున్= ఇంకా; ఇట్లు+అని= ఈ విధంగా; తలంచున్= అనుకొంటున్నాడు.

**తా :** ఇంకా ఇలా అనుకొంటున్నాడు.

**సీ. పడఁతి యే మును భుజింపక భుజింపదు నేను, నిద్ర వోవక మఱి నిద్ర వోదు,**
**నేను నీళ్లాడక నీళ్లాడ నొల్లదు పదరి యేఁ గోపింప భయము నొందు,**
**భర్జించినను మాఱుపలుకక వాయోదు బుద్ధిహీనుఁడనైన బుద్ధి సెప్పు!**
**లలి మీఱ నిట్టి కళత్రంబుతో నేను గడఁగి దేహాంతరగతుఁడ నైన**

**తే. ననయమును దాను బుత్త్రిణి యగుటఁ జేసి, యాత్మశోచిని యగుచు గృహస్థధర్మ**
**మాచరించుచు నుండునో? యనుగమనము, సేయునో యని మనమునఁ జింత నొంది. 825**

**ప్రతి :** పడఁతి= నా భార్య అయిన ఇంతి; ఏన్= నేను; మును= ముందు; భుజింపక= తినక; భుజింపదు= తినదు; నేను; నిద్ర+పోవక= నిదురించక; మఱి; నిద్ర+పోదు= నిద్రించదు; నేను; నీళ్ళు+ఆడక= నేను స్నానం చేయకుండా; నీళ్ళాడన్+ఒల్లదు= స్నానం చేయటానికి ఇష్టపడదు; ఏన్= నేను; పదరి= తిట్టి; కోపింపన్= కోపం చూపగా; భయమున్+ఒందున్= భయపడుతూ ఉంటుంది; భర్జించినను= బెదరించినా; మాఱు పలుకక= మాటకు మాటా అనకుండా;

వా+ఓడున్= మాట్లాడడానికి భయపడుతూ ఉంటుంది; బుద్ధిహీనుఁడను= తెలివి తక్కువవాడను; ఐనన్= అయితే; బుద్ధిన్+చెప్పున్= మంచి బుద్ధిని ఉపదేశిస్తుంది; లలి+మీఱన్= ప్రేమ పొంగారగా; ఇట్టి కళత్రంబుతోన్= ఇట్టి ఇల్లాలితో; నేను; కడఁగి= పూనుకొని; దేహ+అంతర గతుఁడను= మరొక దేహంలోనికి పోయినవాడను; ఐనన్= అయితే; అనయమును= తప్పనిసరిగా; తాను; పుత్త్రిణి= సంతానము కలది; అగుటన్+చేసి= అయిన కారణంగా; ఆత్మశోచిని= తనలో తాను కుమిలిపోయేది; అగుచున్= అగుచు; గృహస్థ ధర్మము= ఇల్లాలి కర్తవ్యాన్ని; ఆచరింపుచున్= నిర్వహిస్తూ; ఉండున్+ఓ= ఉంటుందో; అనుగమనము= మగని అనుసరించి చనిపోవటం అనే పనిని; చేయున్+ఓ= చేస్తుందో; అని; మనమునన్= మనసులో; చింతన్+ఒంది= విచారాన్ని పొంది.

**తా :** నా ఇల్లాలు నేను తినకముందు తినదు. నేను నిద్రపోకముందు నిద్రపోదు. నేను స్నానం చేయకుండా స్నానం చేయడానికి ఇష్టపడదు. నేను కోపంతో కసరితే భయపడుతుంది. కొట్టినా తిట్టినా మారుమాట్లాడడానికి భయపడుతుంది. నేను ఆయా పనులలో ఒక్కొక్కప్పుడు సరైన నిర్ణయం తీసుకోలేకపోతే నాకు చక్కని నిర్ణయాన్ని ఉపదేశించేది. ఇటువంటి ప్రియభార్యను వదలి నేను మరొక బొందిలోనికి పోతే ఈమె సంతానం కలది కాబట్టి నిరంతరం వారి సంరక్షణ కోసం తనలో తాను కుమిలిపోతూ బదికి ఉంటుందా? లేక నా వెంట సహగమనం చేస్తుందా? అని మనస్సులో దిగులుపడ్డాడు.

**క. తన పుత్త్రులుఁ దన పౌత్త్రులు, ననయముఁదాఁ జనినయెడ నిరాశ్రయు లగుచున్**
**వననిధి మధ్యంబున నవి, సిన కలముం బోలి యెట్లు జీవించెదరో? 826**

**ప్రతి :** తన పుత్రులున్= తన కొడుకులూ; తన పౌత్రులు= తన మనుమలు; అనయమున్= తప్పని సరిగా; తాన్= తాను; చనిన యెడన్= వెళ్ళిపోయినప్పుడు; నిరాశ్రయులు= ఏ ఆధారమూ లేనివారు; అగుచున్= అవుతూ; వననిధి మధ్యంబునన్= సముద్రం నడుమ; అవిసిన కలమున్+బోలి= పగిలిపోయిన నావను పోలి; ఎట్లు= ఏ విధంగా; జీవించెదరో= బ్రదుకుతారో!

**తా :** నా కొడుకులు; మనుమళ్లూ నేను తప్పని సరిగా వెళ్ళిపోతే ఏ ఆధారమూ లేనివారై నట్టనడి సంద్రంలో పగిలిపోయిన నావలాగా ఎలా బ్రతుకుతారో కదా!

**క. అని యి వ్విధమునఁ గృపణుని, యనువున ఘనదుఃఖ విహ్వలానర్హుం ద**
**య్యును దుఃఖించు పురంజను, ననయముఁ గొనిపోవ నిశ్చితాత్ముం డగుచున్. 827**

**ప్రతి :** అని; ఈ+విధమునన్= ఈ తీరున; కృపణుని+అనువునన్= దీనునివలె; ఘన= పెద్దది అయిన; దుఃఖ= శోకంతో; విహ్వల= వణకిపోతూ (శోకించటానికి శక్తిలేకపోయినా) దుఃఖిస్తూ; అదుపులోనున్న శరీరభాగాలు కలగటానికి; అనర్హుండు= తగనివాడు; అయ్యును= అయి కూడా; దుఃఖించు పురంజనున్= కుమిలిపోతున్న పురంజనుని; అనయమున్= తప్పని సరిగా; కొనిపోవన్= తీసుకొని పోవటానికి; నిశ్చిత+ఆత్ముండు= నిర్ణయించుకొన్న మనస్సుకలవాడు; అయ్యెన్= అయ్యాడు.

**తా :** ఇలా దిక్కుమాలినవానివలె పెనుశోకంతో వణకిపోతూ శోకించే శక్తి లేకపోయినా దుఃఖిస్తూ ఉన్న పురంజనుని తీసుకొని పోవటానికే (భయుడు) నిర్ణయించుకొన్నాడు.

**క. చనుదెంచెను భయనాముం, డనువాఁ డప్పుడు పురంజనాఖ్యుఁడు పెలుచన్**
**వినుతాత్మ! పశువు భంగిని, మనము గలఁగ యవనసీయమానుం డయ్యెన్. 828**

ప్రతి : అప్పుడు= ఆ సమయంలో; భయనాముండు= 'భయ' అనే పేరుగలవాడు; చనుదెంచెను= వచ్చాడు; వినుత+ఆత్మ= స్తుతి పాత్రమైనవాడా!; పురంజన+ఆఖ్యుఁడు= పురంజనుడనే పేరుగలవాడు; పెలుచన్= పెద్దగా; మనము= మనస్సును; కలఁగన్= కలతపడగా; పశువు భంగిని= గొడ్డువలె; యవన నీయమానుండు= యవనునితో గుంజుకొనిపోబడుతున్నవాడు; అయ్యెన్= అయ్యాడు.

**తా :** ఆ సమయంలో భయనాము డక్కడకు వచ్చాడు. పురంజనుని గుండె గుభేలుమన్నది. యవనుడు ఆతనిని బలికోసం గుంజుకొని పోయే పశువులాగా తీసుకొని వెళ్లాడు.

**విశే :** భయుడు= యముడు; యవనుడు= యమునికింకరుడు.

**వ. అనుచరవర్గంబు భృశాతురులును దుఃఖితులునై వెనుచనుచుండ నుపరుద్ధంబగు భుజంగమం బప్పురంబు నెప్పుడు వాసె నప్పు డాపురంబు పురంజనుం బాసి విశీర్ణంబై ప్రకృతిం బొందె, బలవంతుం డయిన యవనునిచేత బలాత్కారంబున వికృష్యమాణుండైన పురంజనుండు దమఃపిహితుండై పూర్వ సుహృత్తగు సఖు నీశ్వరు నెఱుంగకుండె, నంతం బరలోకగతుండైన పురంజనుం గదిసి పూర్వంబున నదయుండైన యతనిచేత హింసింపంబడిన యజ్ఞపశువులు క్రోధోద్రేకంబునఁ గుఠారంబుల నతని నఱకె, న వ్విధంబునఁ బ్రమదా సంగ దోష దూషితుండును, నపార తమోనిమగ్నుండును, నష్ట జ్ఞానుండును నయి పురంజనుం డనేక కాలంబు పరలోకంబున నార్తి ననుభవించి తద్భార్యయైన ప్రమదోత్తమం జిత్తంబున నశ్రాంతంబును దలంచుచుండం దదీయ సంస్మరణంబునం జేసి తరువాతి జన్మంబున విదర్భరాజ గృహంబునం బ్రమదో త్తమయై జన్మించె నంత. 829**

ప్రతి : అనుచరవర్గంబు= వెన్నంటి ఉండే కుటుంబంవారు; భృశ+ఆతురులు= ఎక్కువగా కుమిలిపోతున్నవారు; దుఃఖితులును+ఐ= ఏడుస్తున్నవారూ అయి; వెనుచనుచున్+ఉండన్= వెంటబడిపోతూ ఉండగా; ఉపరుద్ధంబు= కదలకుండ చేయబడినది; అగు= అయిన; భుజంగమంబు= పాము; ఎపుడు; ఆ+పురంబున్= ఆ నగరాన్ని; పాసెన్= వదలినదో; అప్పుడు; ఆ పురంబు= ఆ నగరం; పురంజనున్= పురంజనుని; పాసి= వదలి; విశీర్ణంబు+ఐ= ఎక్కడికక్కడ పట్టుతప్పిపోయినదై; ప్రకృతిన్= సహజస్థితిని; పొందెన్= పొందినది; బలవంతుండు+అయిన= ఎక్కువ బలంకల; యవనునిచేతన్= యవనునిచేత; బలాత్కారంబున= బలప్రయోగంతో; వికృష్యమాణుండు= గుంజుకొని పోబడుతున్నవాడు; ఐన= అయిన; పురంజనుండు; తమస్+పిహితుండు= చీకటి కమ్ముకొన్నవాడు; ఐ= అయి; పూర్వసుహృత్తు= మునుపటి చెలికాడు; అగు= అయిన; సఖున్= ప్రాణమిత్రమైన; ఈశ్వరున్= ఈశ్వరుని; ఎఱుంగక+ఉండెన్= తెలియకున్నాడు; అంతన్= అప్పుడు; పర లోక గతుండు+ఐన= మరొక లోకానికి చేరుకొన్నవాడైన; పురంజనున్= పురంజనుని; కదిసి= సమీపించి; పూర్వంబునన్= మునుపు; అదయుండు+ఐన= జాలిలేనివాడైన; అతని చేతన్= అతని వలన; హింసింపన్+పడిన= చంపబడిన; యజ్ఞపశువులు= యజ్ఞంలో బలియిచ్చే జంతువులు; క్రోధ+ఉద్రేకంబునన్= పెల్లు రేగిన కోపంతో; కుఠారంబులన్= గొడ్డళ్ళతో; అతనిన్= ఆ పురంజనుని; నఱకెన్= ముక్కలు చేశాయి; ఆ+విధంబునన్= ఆ ప్రకారంగా; ప్రమదా సంగ దోష దూషితుండును= స్త్రీ తగులం అనే తప్పు చేత మలినమైనవాడూ; అపార తమః+నిమగ్నుండును= అంతులేని అజ్ఞాన తమస్సులో మునిగినవాడూ; నష్టజ్ఞానుండును= నశించిన జ్ఞానం కలవాడూ; అయి; పురంజనుండు= పురంజనుడు; అనేక కాలంబు= చాలాకాలం; పరలోకంబునన్= వేరులోకంలో; ఆర్తిన్= పీడను; అనుభవించి= పొంది; తద్+భార్య+ఐన=

తన భార్య అయిన; ప్రమదా+ఉత్తమన్= స్త్రీలలో మేలుబంతియైన ఆమెను; చిత్తంబునన్= హృదయంలో; అశ్రాంతంబును= నిరంతరం; తలంచుచున్+ఉండన్= భావిస్తూ ఉండగా; తదీయ సంస్మరణంబునన్+చేసి= ఆమెనే తలచుకుంటూ ఉండటంవలన; తరువాతి జన్మంబునన్= మరుసటిపుట్టుకలో; విదర్భరాజ గృహంబునన్= విదర్భరాజు ఇంట; ప్రమదా+ఉత్తమ+ఐ= మేలుజాతి ఆడుదియై; జన్మించెన్= పుట్టాడు; అంతన్= అప్పుడు.

**తా :** తన వారందరూ వెంటబడి గుండెలు బాదుకుంటూ ఏడుస్తున్నారు. నిలువరించబడిన పాముస్థానంనుండి పోయిన వెంటనే పురం పురంజనుని పోగొట్టుకొని ఛిన్నాభిన్నమై ప్రకృతిలో కలిసిపోయింది. గొప్ప బలంగల యవనుడు బలమంతా ఉపయోగించి గుంజుకొని పోతూఉండగా పురంజనుడు చీకటి కమ్ముకొన్నవాడై వెనుకటి చెలియైన ఈశ్వరుణ్ణి గుర్తించ లేకపోయాడు. అప్పుడు పరలోకానికి ఏగిన పురంజనుని సమీపించి తాను దయలేక హింసించిన యజ్ఞపశువులన్నీ గొడ్డళ్ళతో అతనిని ముక్కలు ముక్కలు చేశాయి. ఈ అనర్థం అంతా స్త్రీతగులం అనే తప్పువలన కలిగింది. గాఢమైన అజ్ఞానమనే చీకటి అతనిని అలముకొన్నది. జ్ఞానం నశించింది. ఈ విధంగా పరలోకంలో పురంజనుడు పడరానిపాట్లు పడ్డాడు. అయినా తన భార్య అయిన ఆ గొప్ప ఇల్లాలినే నిరంతరం భావిస్తూ ఉన్నాడు. ఆ స్మరణ వలన తరువాతి పుట్టువులో విదర్భరాజు గృహంలో ఉత్తమకాంతగా జన్మించాడు.

**విశే :** ఇక్కడ శ్రీధరీయ వ్యాఖ్యాన తాత్పర్యం ఇలా ఉన్నది.

1. ప్రకృతి- మహాభూతాత్మతలో, ప్రాణవాయువు మహావాయువులో కలిసిపోయిందని భావం.
2. వెనుక సఖుడుగా ఉన్నవాడు ఈశ్వరుడే.
3. మరణకాలంలో ఆ భార్యనే మనస్సులో నిలుపుకోవటం వలన విదర్భరాజగృహంలో స్త్రీగా పుట్టాడు.
4. పతివ్రతాధ్యానం చేతను, వెనుకటి అదృష్టం చేతను ధార్మికుడైన విదర్భరాజునకు కూతురై పుట్టాడు. ఆమె ఉత్తమ స్వభావం కలది.

**సీ. అవనీశ! వీర్యపణాత్త యైనట్టి వైదర్భిని మలయకేతనుఁ డనంగఁ**
**బరపురంజయుఁడైన పాండ్య భూమీశుండు దారుణ సంగర స్థలమునందు**
**శక్తి ననేక రాజన్యుల నిర్జించి పరిణయం బయ్యె, నా గురుభుజుండు**
**నా విదర్భాత్మజయం దసితేక్షణ యైన కూఁతును ద్రావిడాధినాథు**

**తే. లైన కొడుకుల నేడ్వుర నర్థిఁ గనియె, వారలకు నెల్ల నొక్కొక్క వరుస నర్బు**
**దార్బుద సుతులు సంజాతు లైరి యతని, సుత ధృతవ్రత నా యగస్త్యుఁడు వరించె. 830**

**ప్రతి :** అవనీశ!= రాజా; వీర్యపణాత్త+ఐన= పరాక్రమమనే మూల్యంతో పొందబడిన; అట్టి వైదర్భిని= ఆ విదర్భరాజ తనయను; మలయకేతనుఁడు= మలయకేతనుడు అనే పేరుగలవాఁడు; పర పురంజయుఁడు+ఐన= శత్రువుల పురాలను గెలిచే శక్తికలవాడైన; పాండ్య భూమి+ఈశుండు= పాండ్యదేశరాజు; దారుణ సంగరస్థలమునందున్= చాలా ఘోరమైన యుద్ధభూమిలో; శక్తిన్= తన శక్తితో; అనేక రాజన్యులన్= పెక్కండ్రు రాజకుమారులను; నిర్జించి= గెలిచి; పరిణయంబు+ అయ్యెన్= పెండ్లి చేసుకొన్నాడు; ఆ గురుభుజుండు= ఆ గొప్ప భుజబలంగల అతడు; ఆ విదర్భ+ ఆత్మజయందున్=

విదర్భరాజు పుత్రికయందు; అసిత+ఈక్షణ+ఐన= నల్లని కాంతుల కన్నులుగలదైన; కూఁతును= కుమార్తెను; ద్రావిడ+అధినాథులు+ఐన= ద్రావిడ దేశానికి మహాప్రభువులు అయిన; కొడుకులన్= కొడుకులను; ఏడ్వురన్= ఏడుగురిని; అర్థిన్= కోరికోరి; కనియెన్= కన్నాడు; వారలకున్+ఎల్లన్= వారందరికీ; ఒక్కొక్కవరుసన్= ఒక్కొక్కరికి; అర్బుద+అర్బుద సుతులు= పదేసికోట్ల సంఖ్యగల; సుతులు= కొడుకులు; సంజాతులు+ఐరి= పుట్టినారు; అతని= ఆ మలయకేతుని; సుత= బిడ్డ; ధృతవ్రతను= ధృతవ్రత అనే పేరుగల వనితను; ఆ+అగస్త్యుఁడు= ప్రసిద్ధిగల అగస్త్యమహర్షి; వరించెన్= భార్యగా చేసుకొన్నాడు.

**తా :** రాజా! ఆ విదర్భరాజతనయకు స్వయంవరం ఏర్పాటు చేశారు. వరుని బలపరాక్రమాలే అక్కడ మూల్యం. పాండ్యదేశపురాజు మలయకేతనుడు అప్పటికే శత్రువుల పురాలను పెక్కింటిని గెలిచినవాడు. తక్కిన రాజులనందరినీ ఓడించి ఆమెను పెండ్లి చేసుకున్నాడు. మహాభుజబలంగల ఆ రాజు విదర్భరాజతనయయందు నీలికన్నులతో అలరారుతున్న ఒక కన్యను కూతురుగా పొందాడు. అలాగే ద్రవిడదేశాలకు రాజులైన ఏడుగురు కొడుకులను పొందాడు. వారికి ఒక్కొక్కరికీ పదికోట్లమంది చొప్పున పుత్రులు పుట్టారు. అతని కూతురు ధృతవ్రతను అగస్త్యుడు వరించి పెండ్లి చేసుకొన్నాడు.

**విశే :** పురంజనుడు పుణ్యవశంచేత విదర్భరాజు కూతురుగా పుట్టాడు. ధార్మికులతో చక్కని అనుబంధం గలవాడు కావటంవలన భగవద్భక్తుడైన మలయకేతనునితో ఆమెకు వివాహం అయినది. భాగవత సంబంధంచేత విష్ణుభక్తి ఏర్పడింది. దానివలన వైరాగ్యం కలిగింది. భర్తనే గురువుగా నిష్ఠతో కొలిచి పాతివ్రత్య ధర్మంచేత జ్ఞానం పొంది తత్ఫలంగా మోక్షాన్ని పొందింది. తక్కిన దంతా కథానిర్మాణం కోసం ఏర్పడిన విషయం.

**క. అతఁ డా కన్యక వలనను, జతురుండై యిధ్మవాహజనకుఁ డగు దృఢ**
**చ్యుతుఁడను మునీంద్రుఁ గనియెను, మఱి నంత విరక్తుఁ డగుచు మలయధ్వజుఁడున్. 831**

**ప్రతి :** అతఁడు= ఆ అగస్త్యుడు; ఆ కన్యకవలనన్= ఆ స్త్రీ వలన; చతురుండు+ఐ= బుద్ధి సంపదకలవాడై; ఇధ్మవాహ జనకుఁడు= ఇధ్మవాహు డనేవానికి తండ్రి; అగు= అయిన; దృఢచ్యుతుఁడు= దృఢచ్యుతుడు అనే పేరుగలవాడు; అను ముని+ఇంద్రున్= అనే మునిశ్రేష్ఠుని; కనియెన్= కన్నాడు; అంతన్= అటుపిమ్మట; మలయధ్వజుఁడున్= మలయధ్వజుడునూ; మతిన్= బుద్ధియందు; విరక్తుఁడు= వైరాగ్యం పొందినవాడు; అగుచున్= అగుచు.

**తా :** ఆ అగస్త్యుడు విదర్భరాజతనయ యందు దృఢచ్యుతుడు అనే గొప్పమహర్షిని పొందాడు. అతని కొడుకు ఇధ్మవాహుడు. తరువాత మలయధ్వజునకు బుద్ధిలో వైరాగ్యం కలిగింది.

**తే. క్ష్మాతలం బెల్ల నిజతనూజాతులకును, బంచి యిచ్చి సరోజాక్ష పాదపంక**
**జార్చనాయత్తుఁ డగుచుఁ గులాద్రి కరుగ, నంత మదిరాక్షి సతి యగు నా విదర్భి 832**

**ప్రతి :** క్ష్మాతలంబు+ఎల్లన్= భూమినంతటినీ; నిజ తనూజాతులకున్= తన కొడుకులకు; పంచి+ఇచ్చి= సమభాగాలుగా చేసి ఇచ్చి; సరోజ= పద్మాలవంటి; అక్ష= కన్నులున్న శ్రీమహావిష్ణుని; పాద= పాదాలనే; పంకజ= పద్మాల; అర్చన= పూజయందు; ఆయత్తుఁడు= నిండుగా తగులుకొన్నవాడు; అగుచున్= అగుచు; కుల+అద్రికిన్= కులపర్వతానికి; అరుగన్= వెళ్ళగా; అంతన్= పిమ్మట; మదిర+అక్షి= మత్తెక్కినట్లు ఉన్న కన్నులుగల; సతి= ఉత్తమశీలం గల; ఆ విదర్భి= ఆ విదర్భుని బిడ్డ...

**తా :** ఆ మలయధ్వజుడు తనవశంలో ఉన్న భూమినంతటినీ భాగాలుగా చేసి కొడుకులకు ఇచ్చివేశాడు. విష్ణుని పాదపద్మాలను ఆరాధించటానికి అన్ని ఏర్పాటులు చేసుకొని కులపర్వతాన్ని చేరుకున్నాడు. మత్తెక్కినట్లున్న కన్నులు గల ఉత్తమశీలం గల ఆ విదర్భరాజ తనయ

**తే. కడఁక గృహములు నఖిల భోగములు విడిచి, చంద్రు వెనుచను చంద్రిక చందమునను**
**భక్తి దళుకొత్తఁబాండ్య భూపాలుఁడయిన, మలయకేతను వెనుకొని మగువ సనియె. 833**

**ప్రతి :** మగువ= ఆ ఇల్లాలు; కడఁకన్= పూనికతో; గృహములు= ఇండ్లూ; అఖిలభోగములున్= అన్ని విధాలైన సుఖాలూ; విడిచి= వదలివేసి; చంద్రు వెను చను= చందురుని వెనుక సాగే; చంద్రిక చందమునను= వెన్నెలవలె; భక్తి= పరమమైన ప్రేమ; తళుకు+ఒత్తన్= మెరుస్తూ ఉండగా; పాండ్య భూపాలుఁడు+అయిన= పాండ్య దేశపాలకుడయిన; మలయకేతనున్= మలయకేతన మహారాజును; వెనుకొని= వెంటనంటి; చనియెన్= వెళ్ళినది.

**తా :** ఆ ఇల్లాలు పూనికతో ఇళ్ళనూ, సర్వ భోగాలనూ వదలివేసి చంద్రుని వెంట వెళ్ళే వెన్నెలలాగా, భక్తి ప్రకాశిస్తుండగా ఆ మలయకేతనమహారాజు వెంటనంటి వెళ్ళింది.

**వ. ఇట్లు ధర్మపత్ని వెంట రాఁ జని యందుఁ జంద్రమసా తామ్రపర్ణీ నవోదక లను నదుల పుణ్యజలంబుల సుస్నాతుండయి ప్రక్షాళిత బాహ్యాభ్యంతరుండును గందమూల ఫలబీజ పుష్ప పర్ణ తృణ తోయాహారుండునై కాయకర్శనంబైన తపం బాచరించుచు శీతోష్ణ వర్ష వాతంబులు క్షుత్పిపాసలుఁ బ్రియా ప్రియంబులు సుఖదుఃఖంబులు నను ద్వంద్వంబుల సమదర్శనుండై జయించి తపోవిద్యా యమ నియమంబులం జేసి పక్వకషాయుండై బ్రహ్మంబునందు నిజాత్మ ననుసంధించి విజితేంద్రియ ప్రాణచిత్తుండై స్థాణువుంబోలె దివ్యవర్షశతంబు దపంబు సేసి భగవంతుం డయిన వాసుదేవుని యందుఁ బ్రీతి వహించుచు నన్యం బెఱుంగక వర్తించుచుఁ దన్ను స్వప్నమందు 'మమేదం శిర శ్ఛిన్నమిత్యాది' ప్రతీతియందుం బలె వ్యతిరిక్తునిఁగ వ్యాపకునిఁగ నంతఃకరణవృత్తి సాక్షిగా నెఱింగి. 834**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; ధర్మపత్ని= ధర్మకార్యాలయందు పాలుపంచుకొనే ఇల్లాలు; వెంటన్= తనతోపాటు; రాన్= రాగా; చని= వెళ్ళి; అందున్= ఆ ప్రదేశంలోని; చంద్రమసా తామ్రపర్ణీ నవోదకలు= చంద్రమస, తామ్రపర్ణి, నవోదక అను పేర్లుకలవి; అనునదుల పుణ్యజలంబులన్= అనే నదుల పుణ్యం కలిగించే నీటిలో; సుస్నాతుండు= బాగా స్నానం చేసినవాడు; అయి; ప్రక్షాళిత బాహ్య+అభ్యంతరుండును= బాగుగా కడిగి వేయబడిన, వెలపలి, లోపలి చెడులక్షణాలు కలవాడూ; కంద= దుంపలు; మూల= వేరులకు ఏర్పడే కాయలు; ఫల= పళ్ళూ; బీజ= గింజలు; పుష్ప= పూవులు; పర్ణ= ఆకులూ; తృణ= గడ్డిపరకలూ; తోయ= నీరూ అనేవి; ఆహారుండును= ఆహారంగా కలవాడూ; ఐ= అయి; కాయ కర్శనంబు= ఒడలిని ఎండగట్టేది; ఐన= అయిన; తపంబు= తపస్సును; ఆచరించుచున్= శ్రద్ధతో చేస్తూ; శీత+ఉష్ణ వర్ష వాతంబులు= చలి, వేడి, వాన, గాలి అనేవి; క్షుత్+పిపాసలున్= ఆకలి దప్పులు; ప్రియ+అప్రియంబులు= ఇష్టం, అనిష్టం అయినవీ; సుఖ దుఃఖంబులున్= సుఖాలు, దుఃఖాలూ; అను ద్వంద్వంబులన్= అనే జంటలయందు; సమ దర్శనుండు= సమభావం కల్గినవాడు; ఐ= అయి; జయించి= గెలిచి; తపస్+విద్యా యమ నియమంబులన్+చేసి= తపస్సు, విద్య, ఇంద్రియాలపై అదుపు, దేహాన్ని అధీనంలో ఉంచుకొనే కట్టుబాటులు అనే వానిచేత; పక్వ కషాయుండు= కాలిబూడిద అయిన పుణ్యపాపాత్మకమయిన వాసనలు కలవాడు; ఐ= అయి; బ్రహ్మంబునందున్= పరబ్రహ్మమునందు; నిజ+ఆత్మన్=

తనదైన ఆత్మను; అనుసంధించి= చక్కగా కూర్చి; విజిత= తనకు వశంలో నిలుపుకొన్న; ఇంద్రియ= ఇంద్రియాలు; ప్రాణ= ప్రాణాది వాయువులు; చిత్తుండు= మనస్సుకలవాడై; స్థాణువున్+పోలె= మొద్దు వలె ఉండి; దివ్య వర్ష శతంబు= దేవతల నూరేండ్లు; తపంబు+చేసి= తపస్సుచేసి; భగవంతుండు= జ్ఞానం మున్నగు ఆరు మహాలక్షణాల సముదాయం కలవాడు; అయిన; వాసుదేవుని+అందున్= వాసుదేవుడనే పరమాత్మయందు; ప్రీతిన్= అనురాగాన్ని; వహించుచున్= పెట్టుకొంటూ; అన్యంబు= వేరైనదానిని; ఎఱుంగక= తెలియక; వర్తించుచున్= మెలగుతూ; తన్నున్= తనను; స్వప్నమందున్= కలలో; మమ= నాది అయిన; ఇదమ్= ఈ; శిరః= తల; ఛిన్నమ్= కొట్టి వేయబడినది; ఇతి+ఆది= ఈ మొదలైన; ప్రతీతియందున్+వలెన్= ఎరుకయందు వలె; వ్యతిరిక్తునిఁగన్= వేరైన వానినిగా; వ్యాపకునిఁగన్= అంతటా వ్యాపించి ఉన్న వానినిగా; అంతః కరణ వృత్తి సాక్షిగాన్= మనస్సు మొదలయినవాని వర్తనం సాక్షిగా; ఎఱింగి= తెలిసికొని.

**తా :** పాండ్యరాజు మలయధ్వజుడు తన ధర్మపత్ని వెంటరాగా చంద్రమస, తామ్రపర్ణి, నవోదక అనే నదుల పుణ్యజలాలలో స్నానమాడి, లోపలి వెలుపలి మలాలను కడిగి వేసికొని, దుంపలు, పండ్లు, గింజలు, పువ్వులు, ఆకులు, గడ్డిపరకలు, నీరు అనే వానినే ఆహారంగా తీసుకుంటూ; శరీరాన్ని ఎండగట్టే తపస్సును చేస్తూ వచ్చాడు. చలి, వేడి, వాన, గాలి, ఆకలి దప్పి, ఇష్టమైనది ఇష్టం కానిది, సుఖం దుఃఖం మొదలైన జంటలలో ఒకే భావనకలవాడై వాని త్రిప్పులకు లోబడక తపస్సు, విద్య, యమనియమాలతో పక్వ కాషాయుడై పరబ్రహ్మము నందు తన ఆత్మను కూర్చి ఇంద్రియాలను ప్రాణాదివాయువులను జయించిన మనస్సుకలవాడై ఒక మొద్దువలె వేయిదేవతా సంవత్సరాలు తపస్సు చేశాడు. భగవంతుడైన వాసుదేవునియందే ప్రీతిని నిలుపుకొన్నాడు. మరియొకటి ఉన్నది అనే భావన కూడా లేనివాడై మెలగుతూ ఉన్నాడు. కలలో ఇదిగో నాతల తెగిపడింది అన్న స్థితిలో తాను తనకంటె వేరైనవాడనీ, పరమాత్మ అంతటా వ్యాపించి ఉన్నాడని అంతఃకరణపు కదలికయే సాక్షిగా తెలిసి ఉన్నాడు.

**విశే :** ఆ మలయధ్వజుడు చాలా కఠోరమైన తపస్సు చేశాడు. అందులో అతని స్థితిని ఇందు వర్ణిస్తున్నారు.

1. సమదర్శనుడు– సమమనగా పరమాత్మ– దానిని చూడ గలిగినవాడు.
2. అంతఃకరణ, వృత్తి, సాక్షిగాన్– అంతఃకరణం అంటే మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం అనే నాలుగు అంతరింద్రియాలు; వాని వృత్తి అంటే కదలిక, అదియే సాక్షిగా కలవాడు.

**సీ. సాక్షాత్కృతుండును సర్వేశ్వరుండును భగవంతుఁడును గృపాపరుఁడునైన**
**హరి యను లోకైక గురునిచే నుక్తమై సర్వతోముఖమును స్వప్రకాశి**
**తము నగు మహిత శుద్ధ జ్ఞానదీప ప్రభాతతిచేఁ బరబ్రహ్మమందుఁ**
**దన్నును, దనయందుఁ దగఁ బరబ్రహ్మంబు నెనయఁ గన్గొనుచు దగ్ధేంధనాగ్ని**

**తే. భంగి నీషణములఁ, బెడఁబాసి భూరి, వ్యసన సాగర సంసృతి వలనఁ జాల,**
**నుపరతుం డయ్యె, నా మహితోన్నతుండు, నవని నాయక! విను మప్పు డతని భార్య. 835**

**ప్రతి :** అవనినాయక= రాజా!; సాక్షాత్కృతుండును= అతనికి తన స్వరూపాన్ని చక్కగా తెలియజేసినవాడూ; సర్వ+ఈశ్వరుండును= అందరికీ, అన్నింటికీ ప్రభువునూ; భగవంతుఁడును= ఆరు మహాగుణాలు నిండుగా కలవాడూ; కృపాపరుఁడును= భక్తులయందు నిండైన జాలికలవాడూ; ఐన= అయిన; హరి+అను= హరి అనే; లోక+ఏక గురునిచేన్= లోకాలన్నింటికీ

ఒకే ఒక్క జ్ఞానదాత అయిన వానిచేత; ఉక్తము+ఐ= పలుకబడినదై; సర్వతః+ముఖమును= అన్ని వైపులకూ వ్యాపించేది; స్వ ప్రకాశితమును= తన చేతనే వెలుగు పొందినదీ; అగు= అయిన; మహిత= గొప్పదైన; శుద్ధ= స్వచ్ఛమైన; జ్ఞాన= జ్ఞానమనే; దీప= దీపపు; ప్రభా= కాంతుల; తతిచేన్= సముదాయం చేత; పరబ్రహ్మమందున్= పరమైన బ్రహ్మంలో; తన్నునున్= తననూ; తనయందున్= తనలో; తగన్= తగువిధంగా; పరబ్రహ్మంబున్= పరమాత్మను; ఎనయన్= కలిసి పోవటాన్ని; కన్గొనుచున్= చూస్తూ; దగ్ధ+ఇంధన+అగ్నిభంగిన్= మొత్తంగా కాలిపోయిన కట్టెలు కల నిప్పు విధంగా; ఈషణములన్= తగులములను; పెడన్+బాసి= దూరంగా తొలగించుకొని; భూరి= గొప్పదైన; వ్యసన= కష్టాలనే; సాగర= సముద్రం వంటి; సంసృతివలనన్= సంసారంనుండి; చాలన్= మిక్కిలిగా; ఆ మహిత+ఉన్నతుండు= మహిమతో గొప్పవాడైన అతడు; ఉపరతుండు= ప్రవృత్తి లేనివాడు; అయ్యెన్= అయ్యాడు; వినుము= ఆలకించు; అప్పుడు= ఆ సమయంలో; అతని భార్య= ఆ మలయధ్వజుని ఇల్లాలు...

**తా :** రాజా! ఆ మలయధ్వజుడు చేసిన తపస్సునకు పరమాత్మ, సర్వేశ్వరుడు, భగవంతుడు, కృపకలిగినవాడూ అయిన హరి సాక్షాత్కరించాడు. ఆయన అతనికి పరబ్రహ్మతత్త్వాన్ని ఉపదేశించాడు. అది అన్ని వైపులకు వెలుగులను ప్రసరించగలది, తనంత తాను వెలుగొందునట్టిది. గొప్పది, శుద్ధ జ్ఞానరూపమైనది. అట్టి దీపప్రకాంతుల సముదాయంతో తనయందు పరమాత్మనూ, పరమాత్మయందు తన్నూ కలిసిపోవటాన్ని తెలుసుకున్నాడు. కాలిబూడిద అయిన కట్టెలుగల అగ్నిలాగా ఈషణాలను వదలివైచి, అనేక మహాకష్టాల కడలి అయిన సంసారమందు తగులం లేనివాడయ్యాడు. కనుకనే అతడు మహిమ కలవాడూ ఉన్నతుడుగా పరిగణనకు వచ్చాడు. విను అప్పుడతని భార్య

**విశే :** 1. శుద్ధ జ్ఞానదీపము-నిర్గుణపరబ్రహ్మమును తెలిపే జ్ఞానమనే దీపం.

2. ఈషణములు- తొందరలు; ఏషణములు సరియైనపదం. గాఢమైన కోరికలు అని అర్థం. అవి మూడుగా ప్రసిద్ధములై ఉన్నాయి. దారేషణ- భార్యయందలి కోరిక; ధనేషణ- ధనం గడించాలనే గాఢవాంఛ; పుత్రేషణ- కొడుకులు కావాలి అనే తీవ్రమైన కోరిక

**క. పతిదైవత శీల సమం, చిత వేణీ భూత చికుర చీరాంబర సు**
**వ్రత చర్యా క్షామాంగి వి, గతదోష విదర్భరాజ కన్యక యచటన్. 836**

**ప్రతి :** పతి దైవత శీల= భర్తయే దైవం అనే భావన శీలంగా కలది; సమంచిత= చక్కగా ఒప్పారే; వేణీభూత= సన్నని పాయగా అయిన; చికుర= వెండ్రుకలుకలది; చీర+అంబర= నారచీరలు వస్త్రాలుగా కలది; సువ్రత= మంచినోముల; చర్యా= ఆచరణచేత; క్షామ+అంగి= చిక్కిపోయిన అవయవాలు కలది; విగత దోష= పోయిన దోషాలు కలది అయిన; విదర్భరాజ కన్యక= విదర్భరాజు బిడ్డ; అచటన్= అక్కడ...

**తా :** ఆ మలయధ్వజుని భార్య పతియే దైవం అని భావించటమే శీలంగా కలది. సన్నని పాయగా అయిన జుట్టుకలది. నారచీరలు ధరించి ఉన్నది. మంచి నోములు ఆచరిస్తూ దేహాన్ని కృశింపజేసినట్టిది. ఏ దోషాలూ లేనిది.

**విశే :** విగతదోష-రజస్సు మొదలైన దేహంలోని దోషాలు పోయినట్టిది.

**తే. కమలలోచన నిఖిలభోగముల దొఱఁగి, మలయకేతనుఁ బరమ ధర్మజ్ఞుఁ జేరి**
**నిరుపమైక పతివ్రతా నియమ మొప్ప, సాధ్వియై భక్తిఁ బరిచర్య సలుపుచుండె. 837**

**ప్రతి :** కమలలోచన= కమలాలవంటి కన్నులు కలది అయిన ఆ ఇల్లాలు; నిఖిల భోగములన్= అన్ని ఇంద్రియాల సుఖాలనూ; తొఱఁగి= వదలివైచి; పరమ ధర్మజ్ఞున్= పరముడైన భగవంతుని ధర్మాలను ఎరిగినవాడైన; మలయకేతనున్= మలయధ్వజుడు అనే తన భర్తను; చేరి= ఆశ్రయించి; నిరుపమ= సాటిలేని; ఏక= ముఖ్యమైన; పతివ్రతా= పతియందే వ్రతం కలిగిన స్త్రీకి సంబంధించిన; నియమము= కట్టుబాటు; ఒప్పన్= ప్రకాశించగా; సాధ్వి= ఉత్తమశీలం కల ఇల్లాలు; ఐ= అయి; భక్తిన్= భక్తితో; పరిచర్యన్= సేవను; సలుపుచున్+ఉండెన్= చేస్తూ ఉన్నది.

**తా :** ఆ కమలాక్షి సర్వభోగాలనూ వదలివేసింది. పరమాత్మ ధర్మాన్ని చక్కగా ఎరిగిన మలయధ్వజుని చేరుకొన్నది. సాటిలేని పతివ్రతానియమాలను పాటిస్తూ ఉత్తమవనితయై అతనికి సేవచేస్తూ ఉండిపోయింది.

**క. విమలమతి నిజేశు సమీ, పమునన్ సతి ధూమరహిత పవమానసఖా**
**గ్రమున వెలుఁగొందు కీల వి, ధమునఁ బ్రకాశించు చుండెఁ దద్దయు వేడ్కన్. 838**

**ప్రతి :** సతి= ఆ పతివ్రత; విమల మతిన్= మంచి బుద్ధితో; నిజ+ఈశు సమీపమునన్= తన భర్త దగ్గర; ధూమ= పొగతో; రహిత= కూడికలేని; పవమాన సఖ= వాయువు చెలికాడైన అగ్నియొక్క; అగ్రమునన్= చివర; వెలుఁగు+ఒందు= ప్రకాశించే; కీల విధమునన్= జ్వాలవలె; తద్దయున్= అధికమైన; వేడ్కన్= ప్రీతిభావంతో; ప్రకాశించుచు+ఉండెన్= విరాజిల్లుతూ ఉన్నది.

**తా :** ఆమె పతివ్రత. స్వచ్ఛమైన బుద్ధితో భర్త దగ్గర, పొగలేని అగ్నిజ్వాలవలె మిక్కిలి ప్రీతితో ప్రకాశిస్తూ ఒప్పారి ఉన్నది.

**విశే :** ఈ ఉపమానంచేత ఆమె తన భర్తతో తాదాత్మ్యం పొందినదని తెలియవస్తున్నది.

**క. సతి దన ప్రాణేశ్వరుఁ డుప, రతుఁ డగుట మనంబులో నరయకయె పూర్వ**
**స్థితి నుపచార క్రియ లం, చితమతిఁ గావింపఁ దలఁచి చిరతరభక్తిన్. 839**

**ప్రతి :** పతి= భర్త అయిన; తన ప్రాణ+ఈశ్వరుఁడు= తన ప్రాణాలపై సర్వాధికారాలు కలవాడైన మలయధ్వజుడు; ఉపరతుఁడు= మరణించినవాడు; అగుటన్= కావటాన్ని; మనంబులోన్= మనస్సులో; అరయకయె= చూడకుండా; పూర్వ స్థితిన్= వెనుకటి విధంగానే; ఉపచార క్రియలు= సేవకు సంబంధించిన పనులు; అంచిత మతిన్= తగిన బుద్ధితో; కావింపన్+తలఁచి= చేయగోరి; చిరతరభక్తిన్= పెద్దకాలానికి కూడా తరగని భక్తితో

**తా :** తన ప్రాణేశ్వరుడైన భర్త చేష్టలు ఉడిగినవాడు (మరణించినవాడు) అయ్యాడని మనస్సులో తెలిసికొనలేక వెనుకటి తీరుననే ఎన్నటికీ చెదరని భక్తితో మంచి బుద్ధితో సేవలు చెయ్యాలి అని తలచింది.

**క. అనుపమ సుస్థిర నియమా, సనుఁడగు నిజనాథు డాయఁ జని పూర్వగతిన్**
**వినమితయై సతి తత్పద, వనజము లర్చించునపుడు వరుపాదములన్. 840**

**ప్రతి :** అనుపమ= సాటిలేని; సుస్థిర= ఏ కొంచెమూ చెదరని; నియమ= నిష్ఠతోకూడిన; ఆసనుఁడు= కూర్చున్న భంగిమకలవాడు; అగు= అయిన; నిజనాథున్= తనపతిని; డాయన్+చని= సమీపించి; పూర్వగతిన్= వెనుకటి తీరున; వినమిత+ఐ= వినయంతో వంగి; సతి= ఆ ఇల్లాలు; తత్+పద వనజములు= అతని పాదాలనే పద్మాలను; అర్చించు+అపుడు= పూజించే సమయంలో; వరు పాదములన్= మగని కాళ్ళయందు.

**తా :** ఆయన సాటిలేని నియమంతో కూర్చుని ఉన్నాడు. ఆమె అతని దగ్గరకు చేరుకొని వెనుకటి మాదిరిగానే వినయపూర్వకంగా సేవచేయగోరి అతని పద్మాలవంటి పాదాలను అంటి సేవచేస్తూ ఉండగా అతని పాదాలలో

**క. విను మూష్మత లేకున్నను, గని యూథభ్రష్ట హరిణి కైవడి సతి నె**
**మ్మనమున బెగడుచు దీనత, ననయంబును బంధురహితయై శోకించెన్. 841**

**ప్రతి :** వినుము= ఆలకించు; ఊష్మత= వేడి; లేక+ఉన్నను= లేకపోవటాన్ని; కని= తెలిసికొని; సతి= ఆ ఉత్తమశీల; యూథ భ్రష్ట హరిణి= గుంపునుండి వేరుగా పోయిన ఆడులేడి; కైవడిన్= వలె; నెర+మనమునన్= నిండు మనస్సులో; బెగడుచున్= బెదరిపోతూ; దీనతన్= జాలి కలుగునట్టుగా; అనయంబున్= ఎక్కువగా; బంధు రహిత= చుట్టాలు లేనిది; ఐ= అయి; శోకించెన్= ఏడ్చింది.

**తా :** విను (పాదాలకు) వేడిలేకపోవడాన్ని చూచి గుంపు నుండి వేరుపడిన హరిణివలె ఆ సతి నిండుమనస్సులో బెదిరిపోతూ దీనంగా బంధువులు లేనిదై శోకించింది.

**చ. అనయము నిట్లు శోకవిపులాశ్రుపయః కణసిక్త మానిత**
**స్తనయుగయై వియోగపరితాపమునన్ హృదయంబు మాఁడ శో**
**భన లలితాధరోష్ఠ నవపద్మము గందఁగ సుస్వరంబుగా**
**వనజదళాక్షి యేడ్చె ననివారణఁ దద్విపినాంతరంబునన్. 842**

**ప్రతి :** అనయమున్= ఎడతెగకా; ఇట్లు= ఈ విధంగా; వనజ+అక్షి= తామరరేకులవంటి కన్నులుగల ఆ వనిత; శోక= దుఃఖంచేత; విపుల= ఎక్కువ అయిన; అశ్రు పయః= కన్నీటి; కణ= తుంపురులచేత; సిక్త= తడుపబడిన; మానిత= మన్నన కెక్కిన; స్తన= పాలిండ్ల; యుగ= జంటకలది; ఐ= అయి; వియోగ పరితాపమునన్= ఎడబాటువల్ల కలిగిన వేదనచేత; హృదయంబు= గుండె; మాఁడన్= మిక్కిలి వేడిఎక్కగా; శోభన= అందమైన; లలిత= సుకుమారమైన; అధర+ఓష్ఠ= కింది పెదవి అనే; నవ= అప్పుడే విచ్చుకొన్న; పద్మము= తామరపూవు; కందఁగన్= ఉడుకెక్కగా; సుస్వరంబుగాన్= చక్కని నాదం కలుగునట్లుగా; తద్+విపిన+అంతరంబునన్= ఆ అడవిమధ్యలో; అనివారణన్= ఆపుదల లేకుండా; ఏడ్చెన్= ఏడ్చింది.

**తా :** కమలాల రేకులవంటి కన్నులుగల ఆ ఇంతి ఈ తీరున ఎడతెగని దుఃఖంతో పొంగుకొనివస్తున్న కన్నీటి బిందువులతో తడిసిన, మన్ననకెక్కిన పాలిండ్ల జంటకలదియై ఎడబాటు కలిగించిన దుఃఖంచేత హృదయం మాడిపోగా, చక్కని కోమలమైన నూతన తామరవంటి కిందిపెదవి కందిపోగా గొంతెత్తి చక్కని శబ్దంతో ఆ అడవిలో ఆపేవారు లేనిదై ఏడ్చింది.

**ఉ. హా! నరనాథ! హా! సుమహితాత్మక! హా! గుణశాలి! యింక నం**
**భోనిధి మేఖలాకలిత భూమి యధార్మిక రాజ చోర పీ**
**డా నిరతిం గృశింప నకటా! తగునయ్య యుపేక్షసేయ! శో**
**భా నయశాలి! నీవు పరిపాలన సేయుము, లెమ్ము భూవరా! 843**

**ప్రతి :** హా= అయ్యో; నరనాథా= ప్రజా పాలకుడా!; హా= అయ్యో!; సుమహిత+ఆత్మక= మిక్కిలి గొప్పదైన మనస్సు కలవాడా; హా= అయ్యో!; గుణశాలి= మంచిగుణాలతో అలరారే మహాత్ముడా!; భూవరా= రాజా!; ఇంకన్= ఇటుపై;

అంభస్+నిధి= సముద్రమనే; మేఖలా= మొలనూలితో; కలిత= కూడుకొన్న; భూమి= ధరణి; అధార్మిక= ధర్మప్రవృత్తిలేని; రాజ= రాజుల; చోర= దొంగల; పీడా= బాధల; నిరతిన్= తగులంచేత; కృశింపన్= చిక్కిపోగా; అకటా= అయ్యో!; ఉపేక్ష+చేయన్= పట్టించుకోకపోవటం; తగునయ్య= తగునా?; శోభా నయ శాలి= మనస్సునకు ఆనందం కలిగించే నీతితో విరాజిల్లేవాడా!; నీవు; పరిపాలన= ప్రజలను కాపాడటం అనే పనిని; చేయుము= చెయ్యి; లెమ్ము= లే.

**తా :** అయ్యో రాజా! దొడ్డబుద్ధి గలమహానుభావా! ఉత్తమగుణాలతో అలరారే పుణ్యపురుషా! ఇటుపై సముద్రమే మొలనూలుగా గల ఈ భూమి ధర్మభావన లేని రాజుల, దొంగల పీడలు ఆగకుండా జరుగుతూ బక్కచిక్కిపోతుండగా. దానిని పట్టించుకోవద్దా? నీవు ఉత్తమనీతితో విరాజిల్లేవాడవు. ప్రజలకు ఏలికవు. లే దీనిని ఏలుకో.

**చ. అని విలపించుచున్ సరసిజాక్షి నిజేశు పదారవిందముల్**
**దన నిటలంబు సోఁకఁ బరితాపమునం బడి బిట్టు చాల రో**
**దన మొనరించుచుం దగిలి దారువులం జితిఁబేర్చి యందులోఁ**
**బెనుపగు తత్కళేబరముఁ బెట్టి శిఖిం దరికొల్పి యిమ్ములన్. 844**

**ప్రతి :** అని; విలపించుచున్= ఏడుస్తూ; సరసిజ+అక్షి= పద్మాలవంటి కన్నులున్న ఆ ఇంతి; నిజ+ఈశు పద+అరవిందముల్= తన పతి పాదాలనే పద్మాలు; తన నిటలంబున్= తన నుదురును; సోఁకన్= తాకునట్లుగా; పరితాపమునన్+పడి= మిక్కిలి దుఃఖంలో మునిగి; బిట్టు= పెద్దగా; చాల= ఎక్కువగా; రోదనము+ఒనరించుచున్= ఆర్తనాదం చేస్తూ; తగిలి; దారువులన్= కట్టెలతో; చితిన్= చితిని; పేర్చి= ఏర్పరచి; అందులోన్= దానిలో; పెనుపు+అగు= గొప్పది అయిన; తత్+కళేబరమున్= ఆ ప్రాణంలేని దేహాన్ని; పెట్టి= ఉంచి; ఇమ్ములన్= తీరైన విధంగా; శిఖిన్= అగ్నిని; దరికొల్పి= రగులజేసి...

**తా :** ఇలా ఆర్తనాదం చేస్తూ ఆ కాంత తన భర్త పాదపద్మాలను తన నుదురు తాకునట్లుగా చేసి పరమదుఃఖంతో పెద్దగా, ఎక్కువగా ఏడుస్తూ కట్టెలతో చితిని పేర్చి దానిపై అతని గొప్ప దేహాన్ని ఉంచి అగ్నిని రగులుకొల్పింది.

**క. తా ననుగమనము సేయం, బూనుటయును నంతలోనఁ బూర్వసఖుఁడు వి**
**జ్ఞాన స్వరూపకుండును, నైన ధరాదివిజుఁ డొక్కఁ డబలం గదియన్. 845**

**ప్రతి :** తాను= ఆ కాంత; అనుగమనము= భర్తతోపాటు పరలోకానికి పోవటం; చేయన్= చేయుటకు; పూనుటయునున్= పూనుకోగా; అంతలోనన్= అంతలోనే; పూర్వసఖుఁడు= వెనుకటి మిత్రుడు; విజ్ఞాన స్వరూపకుండును= విజ్ఞానమే తన తీరు అయిన వాడును; ఐన= అయిన; ధరా దివిజుఁడు= భూమియందలి దేవస్వరూపుడు (బ్రాహ్మణుడు); ఒక్కఁడు= ఒకడు; అబలన్= ఆ ఇంతిని; కదియన్= సమీపించటానికి...

**తా :** ఆమె భర్తతోపాటు పరలోకాలకు వెళ్ళిపోవటానికి నిశ్చయించుకొన్నది. అంతలోనే వెనుకటి మిత్రుడు, విజ్ఞానమే స్వరూపం అయినవాడూ అయిన ఒక బ్రాహ్మణుడు ఆమె దగ్గరకు చేరుకున్నాడు.

**క. చనుదెంచి య త్తలోదరి, సునయోక్తుల ననునయించుచుం దగ ననియెన్**
**వనితా! నీ వెవ్వతె? వె, వ్వని దాన? వితం డెవండు? వగచెద వేలా?' 846**

ప్రతి : చనుదెంచి= వచ్చి; ఆ+తలోదరిన్= సన్నని నడుముగల ఆ కాంతను; సునయ+ఉక్తులన్= మంచి నీతిమాటలతో; అనునయించుచున్= ఓదార్చుతూ; తగన్= తగువిధంగా; అనియెన్= ఇలా అన్నాడు; వనితా= ఓ ఇంతీ!; నీవు; ఎవ్వతెవు?= ఎవ్వరు; ఎవ్వనిదానవు= ఎవనికి చెందినదానవు; ఇతండు= ఈ వ్యక్తి; ఎవండు= ఎవ్వడు; ఏలా?= ఏ కారణంగా; వగచెదవు?= దుఃఖపడుతున్నావు?

**తా :** (ఆ పూర్వసఖుడైన బ్రాహ్మణుడు) వచ్చి మంచి వివేకంగల పలుకులతో ఆమెను అనునయిస్తూ ఇలా అన్నాడు. 'అమ్మా! నీవు ఎవరు? ఎవరికి సంబంధించిన దానవు? ఇతడెవరు? ఎందుకు దుఃఖిస్తున్నావు'?

**క. అని యడిగి వెండియును ని, ట్లనియెను నీ సృష్టి పూర్వమందును నీ వె**
**వ్వనితోడ సఖ్య సౌఖ్యము, లనవరతము ననుభవించి తట్టి సఖుండన్. 847**

ప్రతి : అని; అడిగి; వెండియున్= మరల; ఇట్లు= ఈ విధంగా; అనియెను= అన్నాడు; ఈ సృష్టిపూర్వమందును= ఈ సృష్టికి ముందుకూడా; నీవు; ఎవ్వనితోడ= ఎవరితో కలసి; సఖ్య సౌఖ్యంబు= చెలిమికి సంబంధించిన సుఖాన్ని; అనవరతమున్= ఎల్లవేళలా; అనుభవించితి= మనోభావనతో పొందావో; అట్టి సఖుండన్= అటువంటి చెలిమికాడను.

**తా :** అని అడుగుతూ అతడు ఇంకా ఇలా అన్నాడు. 'సృష్టికి ముందుకూడా నీవు ఎవనితో నిరంతరం స్నేహసుఖాన్ని అనుభవించావో అటువంటి సఖుడను నేను'.

**క. న న్నెఱుఁగు దేని మనమున, న న్నెఱుఁగక యున్న నై న నలినదళాక్షీ!**
**నన్నుఁ బురాతన సఖుఁగా, నెన్నంగలదాన; వై న నెఱుఁగవె చెపుమా! 848**

ప్రతి : నలిన దళ+అక్షీ= పద్మపురేకులవంటి కన్నులున్న ఓ కాంతా; నన్నున్= నన్ను; ఎఱుఁగుదు+ఏని= తెలిసిన దానవైనా; మనమునన్= మనస్సులో; నన్నున్= నన్ను; ఎఱుఁగక= తెలియక; ఉన్నన్+ఐనన్= ఉన్నప్పటికీ; నన్నున్= నన్ను; పురాతనసఖున్+కాన్= పాతకాలపు స్నేహితునిగా; ఎన్నన్+కలదానవు= గుర్తించగలదానవు; ఐనన్= అయినా; ఎఱుఁగవె= తెలియవా?; చెపుమా= చెప్పు.

**తా :** ఓ పడతీ! ఇప్పుడు నేనెవరో నీకు తెలిసినా తెలియకపోయినా నీకు నేను పాతకాలపు మిత్రుడనుగా గుర్తించుము ఇంకా తెలియుట లేదా? చెప్పు

**వ. కావున నీవును నేనునుం బూర్వంబునందు మానసనివాసులమైన హంసలమై యుండి గృహంబుఁ బాసి సహస్రవత్సరంబులు సఖులమై వర్తించు నంత నీవు ననుం బాసి భౌమభోగరతుండవై పదంబు నిచ్చగించుచు మహీమండలంబు గలయం గ్రుమ్మరునప్పు డొక్క కామినీ నిర్మితంబుం బంచారామంబు నవద్వారసమేతంబు నేకపాలకంబుఁ ద్రికోష్ఠంబు షట్కులంబుఁ బంచవిపణంబుఁ బంచ ప్రకృతియు స్త్రీ నాయకంబు నైన యొక్క పురంబు వొడగంటి, వది యెట్టి దనినం బంచారామంబు లనం బంచేంద్రి యార్థంబులు, నవద్వారంబు లన నాసికాది ద్వారంబు, లేకపాలకం బనం బ్రాణపాలనంబు, త్రికోష్ఠంబు లనం దేజోభిన్నంబులు, షట్కులంబు లన నింద్రియ సంగ్రహంబు, విపణంబులనం గర్మేంద్రియంబులు, పంచ ప్రకృతి యనం బంచ భూతంబులు, ప్రకృతి యను కామిని యన బుద్ధి, యిట్టి పురంబునం బ్రవిష్టుండైన**

**పురుషం డంగనా పరతంత్రుండును, నజ్ఞుండును నైన నీవ య ప్పురంబునం గామినీ సంస్పృష్టుండవై రమియించుచుఁ దత్సంగమంబున నష్టస్మృతివై వైదర్భీ జనసంభావిత సుఖాభాసంబులగు దుఃఖంబులచే నిట్టి పాపిష్ఠంబైన దశం బొందితివి, గావున. 849**

**ప్రతి :** కావునన్= కనుక; నీవున్= నీవూ; నేనునున్= నేనూ; పూర్వంబునందున్= వెనుకటి కాలంలో; మానస నివాసులము+ఐ= మానససరోవరంలో కలసి ఉన్నవారమై; హంసలము+ఐ= అంచలమై; ఉండి; గృహంబున్= ఇంటిని; పాసి= వదలి; సహస్ర వత్సరంబులు= వేలయేండ్లు; సఖులము+ఐ= చెలిమికలవారమై; వర్తించు+అంతన్= మెలగుతూ ఉండగా; నీవు; ననున్= నన్ను; పాసి= వదలి; భౌమ భోగ రతుండవు+ఐ= భూమికి సంబంధించిన సుఖాల అనుభవంమీద తగులం కలవాడవై; పదంబున్= ఒకస్థానాన్ని; ఇచ్ఛగించుచున్= కోరుతూ; మహీమండలంబున్= భూచక్రాన్ని; కలయన్= మొత్తంగా; క్రుమ్మరు+అప్పుడు= తిరిగే సమయంలో; ఒక్క కామినీ నిర్మితంబు= ఒక్క కాంతచేత ఏర్పాటు చేయబడినది; పంచ+ఆరామంబు= అయిదు తోటలు కలది; నవ ద్వార సమేతంబు= తొమ్మిది వాకిళ్ళతో కూడినది; ఏక పాలకంబున్= ఒక్క ఏలిక కలది; త్రికోష్ఠంబు= మూడు ప్రాకారాలు కలది; షట్+కులంబున్= ఆరు వర్తకుల గుంపులుకలది; పంచవిపణంబున్= అయిదు అంగళ్ళు కలది; పంచ ప్రకృతియున్= అయిదు మహావస్తువులు కలది; స్త్రీ నాయకంబున్= ఒక ఆడుది నాయకురాలుగా గలది; ఐన ఒక్క పురంబున్= అయిన ఒక నగరాన్ని; పొడగంటివి= చూచినావు; అది= ఆ నగరం; ఎట్టిది+అనినన్= ఎలాంటిదంటే; పంచ+ఆరామంబులు+అనన్= అయిదు ఉద్యానవనాలు అంటే; పంచ+ఇంద్రియ+అర్థంబులు= అయిదు ఇంద్రియాల విషయాలు; నవద్వారంబులు= తొమ్మిది వాకిళ్ళు; అనన్= అనగా; నాసికా+ఆదిద్వారంబులు= ముక్కు మొదలైన ఇంద్రియాలరంధ్రాలు; ఏకపాలనంబు= ఒక పాలకుడు కలది; అనన్= అంటే; ప్రాణ+పాలకంబు= ప్రాణమే పాలించేదిగా కలది; త్రికోష్ఠంబులు= మూడు ప్రాకారాలు; అనన్= అంటే; తేజస్+ అభిన్నంబులు= అగ్నికంటె వేరుకానివి; (అగ్ని, జలం, భూమి అనునవి అన్న అర్థాన్ని గ్రహించాలి. అప్పుడు పాఠం తేజోభిన్నంబులు మూలపాఠం ఇదే). షట్కులంబులు= ఆరు అంగళ్ళు; అనన్= అంటే; ఇంద్రియ సంగ్రహంబు= ఇంద్రియాల సముదాయం (అయిదు జ్ఞానేంద్రియాలు+మనస్సు); విపణంబులు= అంగళ్ళు; అనన్= అంటే; కర్మ+ఇంద్రియంబులు= ఆ యాపనులను చేసే కాళ్ళూ మొదలైనవి; పంచ ప్రకృతి= అయిదు ప్రకృతులు కలది; అనన్= అంటే; పంచ భూతంబులు= నేల మొదలైన భూతాలు; ప్రకృతి అను కామిని= ప్రకృతి అనే స్త్రీ; అనన్= అంటే; బుద్ధి= ధీ శక్తి; ఇట్టి; పురంబునన్= నగరంలో; ప్రవిష్టుండు= చొచ్చినవాడు; ఐన పురుషుండు= అయిన నరుడు; అంగనా పర తంత్రుఁడును= స్త్రీకి వశమైపోయిన ప్రవృత్తి కలవాడును; అజ్ఞుండును= తెలివిలేనివాడును; ఐన నీవు+అ= అయిన నీవే; ఆ+పురంబునన్= ఆ పట్టణంలో; కామినీ= ఆడువారిచేత; సంస్పృష్టుండవు= గట్టిగా తాకబడినవాడవు; ఐ= అయి; రమియించుచున్= ఆడుకుంటూ; తత్+సంగమంబునన్= వారి కూడికవలన; నష్ట స్మృతివి+ఐ= పోయిన స్మరణశక్తి కలవాడవై; వైదర్భీ= విదర్భరాజకన్య అని; జన= జనులచేత; సంభావిత= చక్కగా భావించబడిన; సుఖ+ఆభాసంబులు+అగు= సుఖాలుగా కన్పట్టే; దుఃఖంబులచేన్= దుఃఖాలచేత; ఇట్టి= ఈ విధమైన; పాపిష్ఠంబు= మిక్కిలి పాపాలతో కూడినది; ఐన దశన్= అయిన స్థితిని; పొందితివి= పొందావు; కావునన్= కాబట్టి...

**తా :** అందుచేత నీవూ నేనూ వెనుక మానససరోవరంలో నివసించే హంసలం. ఇల్లు వదలి వేలసంవత్సరాలు ప్రాణమిత్రులమై మెలగినాము. ఇంతలో నీవు నన్ను వదలి భూమికి సంబంధించిన భోగాల తగులం పొంది ఒక స్థానం కావాలని కోరి

భూమండలమంతా తిరిగినావు. అప్పుడు ఒక కామిని ఏర్పరచిన తావు నీకు దొరికింది. అందులో అయిదు పూలతోటలు, తొమ్మిది వాకిళ్ళు, ఒకే తోటమాలి, మూడు ప్రాకారాలూ, ఆరు అంగడి వీథులూ, అయిదు అంగళ్ళూ, అయిదు మూలద్రవ్యాలూ, నాయిక అయిన ఒక ఆడుదీ ఉన్నాయి. అది ఒక పురం. అంటే ఏమిటో తెలియజేస్తాను విను. అయిదు తోటలంటే అయిదు ఇంద్రియవిషయాలు. తొమ్మిది వాకిళ్ళంటే తొమ్మిది నాసికాది ఇంద్రియాదుల రంధ్రాలు. ఒకే పాలకుడు ప్రాణం. మూడు ప్రాకారాలంటే అగ్ని, నీరు, అన్నం అనేవి. ఆరు అంగళ్లు అంటే అరిషడ్వర్గాల సముదాయం. అంగళ్ళు అంటే ఆయా కర్మలు చేసే ఇంద్రియాలు. అయిదు ప్రకృతులు అంటే అయిదు భూతాలు. ప్రకృతి అనే పడతి బుద్ధి. ఇట్టి పురంలో ప్రవేశించినవాడు ఆడువారి చేతిలో కీలుబొమ్మ అయి, తెలివిమాలిన వాడవుతాడు. ఆ విధంగా అయిన నీవు ఆ పురంలో కాముల తగులంలో వినోదంగా రమిస్తూ వారుపెట్టే త్రిప్పులకు లోబడి స్మృతి శక్తిని కోల్పోయావు. కొన్నాళ్ళు పురంజనుడు, కొన్నాళ్ళు వైదర్భి అని జనులు నిన్ను వ్యవహరించారు. నీకు పైకి సుఖాలుగా అనిపించిన వన్నీ కానీ నిజానికి అవి దుఃఖాలే. అందువలన అది ఘోరమైన పాపాలతో కూడిన స్థితి. దానిని నీవు అనుభవించావు. కాబట్టి

**సీ. నీవు వైదర్భివి గావు, వీరుఁ డితండు వివరింపఁగాఁ గాఁడు విభుఁడు నీకు**
**నొగి మున్ను పురమున నుపరుద్ధుఁ జేసిన యా పురంజనపతి వరయఁ గావు**
**మఱియు నీ వన్య సీమంతిని యనియును జర్చింపఁగాఁ బూర్వ జన్మమందు**
**బురుషుండ వనియును బుద్ధిఁ దలంచుట యరయంగ నీ యుభయము నసత్య**
**తే. మింతయును మామకీనమై యెసఁగు మాయఁ జేసి కల్పిత మయ్యెఁ జర్చింప మనము**
**పూర్వమున హంసలమ యని పూని యెఱుఁగఁ, బలికితిఁ దెలియు మనల రూపంబుఁ జూడు. 850**

**ప్రతి :** నీవు; వైదర్భివి= విదర్భరాజపుత్రికవు; కావు; వీరుఁడు= పరాక్రమం కల; ఇతండు= ఇతడు; వివరింపగాన్= వివేకంతో గుట్టుమట్టులు తెలియజేస్తే; నీకున్= నీకు; విభుఁడు= పతి, ఏలిక; కాఁడు= కాడు; ఒగిన్= క్రమంగా; మున్ను= పూర్వం; పురమునన్= నగరంలో; ఉపరుద్ధున్= వెలుపలికి పోకుండా; చేసిన= నిలిపి ఉంచిన; ఆ పురంజన పతివి= ఆ పురంజనుడనే పాలకుడవు; అరయన్= భావిస్తే; కావు= కాదు; మఱియున్= ఇంకా; నీవు; అన్య సీమంతిని= మరొక స్త్రీవి; అనియును= అనీ; చర్చింపగాన్= విచారించగా; పూర్వజన్మమందున్= వెనుకటిపుట్టువులో; పురుషుండవు= మగవాడవు; అనియును= అనీ; బుద్ధిన్= బుద్ధియందు; తలంచుట= అనుకోవటమూ; అరయంగన్= వివేకంతో భావిస్తే; ఈ ఉభయంబున్= ఈ రెండూ; అసత్యము= సత్యం కాదు; ఇంతయును= ఇదంతా; మామకీనము+ఐ= నాకు సంబంధించినదై; ఎసఁగు= ఒప్పారే; మాయన్+చేసి= మాయచేత; కల్పితము= కల్పించబడినది; అయ్యెన్= అయినది; చర్చింపన్= విచారించగా; మనము= నీవూ, నేనూ; పూర్వమునన్= వెనుకటికాలంలో; హంసలము+అ= అంచలుగా ఉన్నవారమే; అని= అని కూడా; పూని= నిశ్చయించి; ఎఱుఁగన్= తెలియునట్లుగా; పలికితిన్= చెప్పినాను; తెలియుము= తెలుసుకో; మనల= మనయొక్క; రూపంబున్= వెనుకటి రూపాన్ని; చూడు.

**తా :** నీవు విదర్భరాజతనయవు కావు. ఈ మలయధ్వజుడు నీ భర్త కాడు. నీవు వెనుక పురంలో బంధించినప్పటి పురంజనుడవు కావు. ఇప్పుడు ఇతని అంగననని, వెనుకజన్మలో మగవాడననీ అనుకోవటం కూడా అబద్ధమే. ఇదంతా నేను చేసిన మాయతో ఏర్పడినది. చక్కగా విచారిస్తే మనం పూర్వం హంసలమే అని నీకు తెలియజెప్పాను. ఇప్పుడు తిరిగి ఆ వెనుకటి రూపం చూపుతాను. చూచి తెలుసుకొనుము.

**వ. నేనే నీవు గాని యన్యుండవు గావు, నీవే నేఁ గాని యన్యుండం గా, నిట్లని యెఱుంగుము, విద్వాంసులు మన యిద్దఱయందు నంతరంబు నీక్షింపరు, పురుషుండు ద న్నొక్కనినె యాదర్శ చక్షువులందు భిన్న రూపునింగాఁ దలంచు చందంబున మన యిద్దఱికిని భేదంబు గలిగిన యట్ల దోఁచు, నని యివ్విధంబున నతం డతని చేత నీవు పూర్వంబున మదీయసఖుండవైన హంస వని తెలుపం బడి స్వస్థుండై తద్వియోగ నష్టంబైన జ్ఞానంబు గ్రమ్మఱం బొందె నని చెప్పి నారదుండు ప్రాచీన బర్హిం జూచి యీ యధ్యాత్మ తత్త్వంబు రాజకథామిషంబున నీకు నెఱింగించితి ననిన. 851**

**ప్రతి :** ఏను+ఏ= నేనే; నీవు; కాని; అన్యుండవు= వేరువాడవు; కావు; నీవు+ఏ= నీవే; నేన్= నేను; కాని; అన్యుండన్= వేరువాడను; కాను; ఇట్లు+అని= ఈ విధమని; ఎఱుంగుము= తెలుసుకో; విద్వాంసులు= జ్ఞానం తెలిసినవారు; మన+ఇద్దఱయందున్= మన ఇద్దరిలో; అంతరంబున్= భేదాన్ని; ఈక్షింపరు= చూడరు; పురుషుండు= మానవుడు; తన్నున్= తనను; ఒక్కనిన్+ఎ= ఒక్కనినే; ఆదర్శ చక్షువులందున్= అద్దమునందూ, ఇతరుల కన్నులయందు; భిన్నరూపునిన్+కాన్= వేరు వేరు రూపాలుగలవానినిగా; తలంచు చందంబునన్= భావించేతీరున; మన ఇద్దఱికిని= మన ఇద్దరికీ; భేదంబు= వేరైన లక్షణం; కలిగిన+అట్లు+అ= కలిగినట్లే; తోఁచున్= అనిపిస్తుంది; అని; ఈ+విధంబునన్= ఈ విధంగా; అతండు= ఆ పురంజనుడు, ఇప్పుడు వైదర్భీరూపంలో ఉన్నవాడు; అతని చేతన్= ఆ బ్రాహ్మణునిచేత; నీవు; పూర్వంబున= వెనుక; మదీయసఖుండవు+ఐన= నా చెలికాడవైన; హంసవు= అంచవు; అని; తెలుపన్+పడి= తెలిసేటట్లుగా చేయబడి; స్వస్థుండు+ఐ= తన సహజస్థితి యందు ఉన్నవాడై; తద్+వియోగ నష్టంబు= అతని ఎడబాటుచేత చెడిపోయినది; ఐన+జ్ఞానంబున్= అయిన వివేకాన్ని; క్రమ్మఱన్= మరల; పొందెన్= గ్రహించినాడు; అని చెప్పి; నారదుండు= నారదమహర్షి; ప్రాచీనబర్హిన్= ప్రాచీనబర్హిని; చూచి; ఈ అధ్యాత్మ తత్త్వంబున్= ఈ దేహాత్మ సంబంధమైన మూలజ్ఞానాన్ని; రాజ కథా మిషంబునన్= రాజుకథ నెపంతో; నీకున్= నీకు; ఎఱింగించితిన్= తెలియజెప్పాను; అనినన్= అనగా

**తా :** నీవే నేను, నేనే నీవు. మనం ఒకరికంటె ఒకరం వేరైనవారం కాము. జ్ఞానతత్త్వం తెలిసినవారు మన ఇద్దరిలో తేడాను చూడరు. ఒక మనిషి తనొక్కనినే అద్దంలో ఇతరుల కన్నులలో మరొక విధంగా చూస్తాడు. అలాగే మన ఇద్దరికీ భేదం ఉన్నట్లుగా అనిపిస్తుంది. అని ఈ విధంగా ఆ బ్రాహ్మణుడు అప్పుడు స్త్రీ రూపంలో ఉన్న పురంజనునకు 'అతడు మునుపు నాకు చెలికాడైన హంసయే' అనే జ్ఞానం కలిగించాడు. పురంజనుడు అజ్ఞానమనే రోగంనుండి తేరుకున్నాడు. ఆ సఖుని ఎడబాటు వలన పోయిన జ్ఞానాన్ని తిరిగి పొందాడు– అని చెప్పి నారదుడు ప్రాచీనబర్హిని చూచి ఈ పరమార్థతత్త్వాన్ని నీకు రాజకథావ్యాజంతో తెలియజేశానయ్యా! అన్నాడు.

**విశే :** అధ్యాత్మ తత్త్వంబు– ఆత్మ అనగా దేహం– దానియందుండే తత్త్వం అధ్యాత్మ తత్త్వం. అంటే పరమాత్మకు సంబంధించిన శుద్ధ జ్ఞానం.

**క. విని భూమీశుఁడు నారద, ముని కను భవదీయ వచనములు సూరులు ద**
**క్కను గర్మ మోహితులమై, వనరెడు నే మెట్లు దెలియు వారము చెపుమా! 852**

**ప్రతి :** విని= ఆలకించి; భూమి+ఈశుఁడు= రాజు; నారదమునికిన్= నారదమహర్షితో; అనున్= ఇలా అన్నాడు; భవదీయవచనములు= నీ వయిన వాక్కులు; సూరులు= పండితులు; తక్కను= కాక; కర్మ మోహితులము+ఐ= కర్మలచేత

మోహం పొందినవారమై; వనరెదు+ఏము= శోకిస్తూ ఉండే మేము; ఎట్లు= ఏ విధంగా; తెలియువారము= తెలుసుకోగలవారం; చెపుమా= చెప్పండి.

**తా :** ఆ మాటలు విని ప్రాచీనబర్హి నారదమహర్షితో ఇలా అన్నాడు. 'అయ్యా! మీ మాటలు పండితులు మాత్రమే తెలుసుకో గలుగుతారు. కానీ కర్మల వలన అజ్ఞానంలో చిక్కుకొని దుఃఖిస్తూ ఉండే మావంటివారు ఎలా తెలుసుకోగలరు?' చెప్పు.

**వ. అనిన యోగీంద్రుండు రాజేంద్రున కిట్లనియె. నరేంద్రా! యేమి కతంబున నాత్మచేత నేక ద్విత్రి చతుష్పాదం బును బహుపాదంబును నపాదంబు నగుచుఁ బురంజను దేహంబు ప్రకటం బగుచుండు, నా కతంబునం బురంజనుండును బురుషుం డయ్యె, నట్టి పురుషునకు నామ క్రియా గుణంబుల విజ్ఞాతుండు గాకుండుటం జేసి యవిజ్ఞాత శబ్దంబునం జెప్పంబడు సఖుం డీశ్వరుండు, పురుషుండు సాకల్యంబునం జేసి దేహపరిగ్రహంబు సేయ నిచ్చయించునప్పుడు నవద్వార కలితంబును ద్విహస్తచరణ యుక్తంబును నయిన పురం బేది గల, దదియ లెస్స యని తలంచి య ప్పురంబను దేహంబునందుఁ బురుషుం డింద్రియంబులం జేసి యే బుద్ధి నధిష్ఠించి విషయంబుల ననుభవించు, నహంకార మమకారంబులకు నే బుద్ధితత్త్వంబు గారణంబగు నట్టి బుద్ధి ప్రమదోత్తమ యనంబడె, దానికి సఖులు జ్ఞానకర్మ కారణంబులైన యింద్రియ గుణంబులు, సఖీజనంబులు దదీయ వృత్తులు, పంచముఖోరగం బనం బంచవృత్తియైన ప్రాణంబు, నేకాదశ మహాభటులన బృహద్బలుండు నుభయేంద్రియ నాయకుండునైన మనంబు, నవద్వార సమేతంబైన యప్పురంబు చుట్టివచ్చిన పాంచాలదేశంబు లనం బంచ విషయంబులు, నవద్వారంబులన నక్షి నాసికాకర్ణముఖ గుదశిశ్నంబులు, నందు నక్షినాసాస్యంబు లైదునుం బ్రాగ్ద్వారపురస్కృతంబులు, దక్షిణోత్తర కర్ణంబులు దక్షిణోత్తర ద్వారంబులు, గుద శిశ్నంబులు పశ్చిమ ద్వారంబు, లందు నేకస్థల నిర్మితంబు లయిన ఖద్యోతావిర్ముఖులు నేత్రంబులు, విభ్రాజితంబన రూపంబు, ద్యుమంతుం డనం జక్షురింద్రియంబు, నళినీ నాళిను లన నాసికా ద్వారంబులు, సౌరభం బనం గంధంబు, నవధూత యన ఘ్రాణేంద్రియంబు, ముఖ్య యన నాస్యంబు, విపణం బనవాక్కు, రసజ్ఞుం డన రసనం, బాపణం బన వ్యవహారంబు, బహూదనం బన వివిధాన్నంబు, పితృహూ వన దక్షిణ కర్ణంబు, దేవహూ వన నుత్తర కర్ణంబు, చండవేగుం డనం గాలోపలక్షకంబైన సంవత్సరంబు, గంధర్వు లన దివంబులు, గంధర్వీ జనంబు లన రాత్రులు, పరీవర్తనం బన నాయుర్హరణంబు, గాలకన్యక యన జర, యవనేశ్వరుం డన మృత్యు, వతని సైనికులన నాధివ్యాధులు, ప్రజ్వారుం డనం బ్రాణిహింసయందు శీఘ్రవేగంబు గలిగి శీతోష్ణభేదంబులం ద్వివిధంబైన జ్వరంబు, దక్షిణ పాంచాలం బనం బితృలోక ప్రాపకంబును బ్రవృత్తి రూపకంబునైన శాస్త్రం, బుత్తర పాంచాలం బన దేవలోక ప్రాపకంబు నివృత్తి సంజ్ఞికంబు నయి శాస్త్రంబు, శ్రుతధరుం డన శ్రోత్రంబు, నాసురీ నామకం బనం బశ్చాద్ద్వారంబయిన మేఢ్రంబు, గ్రామకం బన సురత సుఖంబు, దుర్మదుం డన గుహ్యేంద్రియంబు, నిర్ఋతినామకంబైన పశ్చిమ ద్వారం బన గుదంబు, వైశసం బన నరకంబు, లుబ్ధకుం డనం బాయువు, నంధు లన హస్తపాదంబు, లంతఃపురం బన హృదయంబు, విషూచి యన మనం బని వెండియు నిట్లనియె. 853**

**ప్రతి :** అనినన్= అనగా; యోగి+ఇంద్రుండు= యోగ విద్యలో ఆరితేరినవారిలో శ్రేష్ఠుడు అయిన నారదుడు; రాజ+ఇంద్రునకు= రాజులలో మేటి అయిన ప్రాచీనబర్హికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; నర+ఇంద్రా= రాజా!; ఏమి-కతంబునన్= ఏ కారణంగా; ఆత్మచేతన్= ఆత్మ అనే తత్త్వం చేత; ఏక ద్వి త్రి చతుస్ పాదంబు= ఒకటి, రెండు, మూడు, నాలుగు పాదాలు కలది; బహుపాదంబును= పెక్కుపాదాలు కలది; అపాదంబున్= పాదాలే లేనిది; అగుచున్= అగుచు; పురంజను దేహంబు= పురంజనుడనేవాని దేహం; ప్రకటంబు+అగుచుండున్= వ్యక్తమవుతూ ఉంటుందో; ఆ కతంబునన్= ఆ కారణంవలననే; పురంజనుండును= పురంజనుడు; పురుషుండు= 'పురుష' అనే వ్యవహారం కలవాడు; అయ్యెన్= అయ్యాడు; అట్టి పురుషునకున్= అటువంటి పురుషునకు; నామ క్రియా గుణంబులన్= పేరు, పనులు, గుణాలు అనే వానిచేత; విజ్ఞాతుండు= తెలియవచ్చేవాడు; కాక+ఉండుటన్+చేసి= కాక పోవటంచేత; అవిజ్ఞాత శబ్దంబునన్= అవిజ్ఞాతుండు అనే పేరుతో; చెప్పన్+పడు సఖుండు= చెప్పబడే చెలికాడు; ఈశ్వరుండు= సర్వలోకాలను పాలించే ప్రభువు; పురుషుండు= జీవుడు; సాకల్యంబునన్+జేసి= అన్ని విధాలైన కళల సముదాయంతో; దేహ పరిగ్రహంబు= దేహాన్ని తీసుకోవటం; చేయన్= చేయటానికి; ఇచ్ఛయించు+అప్పుడు= కోరే సమయంలో; నవ ద్వార కలితంబు+అన= తొమ్మిది వాకిళ్ళతో కూడినదీ; ద్వి హస్త చరణ యుక్తంబును= రెండు చేతులు, రెండు కాళ్ళు అనే వానితో కూడినదీ; అయిన పురంబు= అయిన పురంవంటిదైన దేహం; ఏది; కలదు= ఉన్నదో; అది+అ= అదియే; లెస్స= మేలైనది; అని; తలంచి= భావించి; ఆ+పురంబు+అను= ఆ పురం అనే; దేహంబున్= దేహాన్ని; ఒందున్= చేరుకుంటాడు; పురుషుండు= ఆ జీవుడు; ఇంద్రియంబులన్+చేసి= ఇంద్రియాలవలన; ఏ బుద్ధిన్= బుద్ధి అనే వ్యవహారంగల దేనిని; అధిష్ఠించి= ఆధారంగా చేసుకొని; విషయంబులన్= శబ్దం మొదలైన విషయాలను; అనుభవించున్= అనుభవిస్తాడో; అహంకార మమకారంబులకున్= నేను, నాది అనే భావాలకు; ఏ బుద్ధితత్త్వంబు= ఏ బుద్ధి అనే మూలవస్తువు; కారణంబు= హేతువు; అగున్= అవుతుందో; అట్టి+బుద్ధి= ఆ విధమైన బుద్ధి అనేది; ప్రమదా+ఉత్తమ= కథగా చెప్పిన ఈ ఉపాఖ్యానంలోని ఉత్తమ స్త్రీ; అనన్+పడున్= అనబడుతుంది; దానికిన్= ఆ బుద్ధికాంతకు; సఖులు= చెలికత్తెలు; జ్ఞాన కర్మ కారణంబులు= తెలియటం, పనులు చేయటం అనేవానికి కారణాలు; ఐన ఇంద్రియ గుణంబులు= అయిన పది ఇంద్రియాల లక్షణాలు; సఖీ+జనంబులు= చెలికత్తెలయిన వ్యక్తులు; తదీయవృత్తులు= ఆ ఇంద్రియాల కదలికలు; పంచ ముఖ+ఉరగంబు= అయిదు తలల పాము; అనన్= అంటే; పంచవృత్తి+ఐన= అయిదు రకాల పనితీరులు గలదైన; ప్రాణంబు= ప్రాణం అనే తత్త్వం; ఏకాదశ మహాభటులు+అనన్= పదునొకండు గొప్ప బంటులు అనగా; బృహద్+బలుండును= చాలా ఎక్కువ బలంకలవాడూ; ఉభయ+ఇంద్రియ నాయకుండును= రెండు విధాలైన జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలనే పదింటిని నడుపుతూ ఉండేవాడు; ఐన మనంబు= అయిన మనస్సు; నవ ద్వార సమేతంబు+ఐన= తొమ్మిది వాకిళ్ళతో కూడినదైన; ఆ+పురంబు= అయిన ఆ నగరాన్ని; చుట్టి వచ్చిన= అన్ని వైపులా తిరిగి వచ్చిన; పాంచాల దేశంబులు= పాంచాలం అనే పేరుగల భూభాగాలు; అనన్= అంటే; పంచ+విషయంబులు= అయిదు ఇంద్రియాలు గ్రహించే శబ్దం మొదలైన అంశాలు; నవద్వారంబులు= తొమ్మిది వాకిళ్ళు; అనన్= అంటే; అక్షి= కన్నులు; నాసికా= ముక్కురంధ్రాలు; కర్ణ= చెవులు; ముఖ= నోరు; గుద= మలాన్ని వెలువరించే అవయవమూ; శిశ్నంబులు= మూత్రాన్ని వెలువరించే అవయవం అనేవి; అందున్= వానిలో; అక్షి నాసా+ఆస్యంబులు= రెండు కన్నులూ, రెండు ముక్కురంధ్రాలూ, నోరూ అనే; ఐదునున్= అయిదున్నూ; ప్రాక్+ద్వార పురస్కృతంబులు= తూర్పువాకిళ్ళుగా మన్నన కెక్కినవి; దక్షిణ+ఉత్తర కర్ణంబులు= కుడి, ఎడమ చెవులు; దక్షిణ+ఉత్తర ద్వారంబులు= దక్షిణం వైపుగా, ఉత్తరం వైపుగా ఉన్న వాకిళ్ళు; గుద శిశ్నంబులు= ముడ్డి, లింగం అనేవి; పశ్చిమద్వారంబులు= పడమటి వాకిళ్ళు; అందున్= వానిలో; ఏక స్థల నిర్మితంబులు= ఒక తావునందే ఏర్పాటు చేయబడిన; ఖద్యోత ఆవిర్ముఖులు=

ఖద్యోతం, ఆవిర్ముఖం అనేవి; నేత్రంబులు= కన్నులు; విభ్రాజితంబు= మిక్కిలిగా ప్రకాశించేది; అనన్= అంటే; రూపంబు= రూపం అనే విషయం; ద్యుమంతుండు= కాంతికలవాడు అనే అర్థం కల ద్యుమంతుడు; అనన్= ఈ కథలో అనబడే తత్త్వం; చక్షుస్ ఇంద్రియంబు= కన్ను అనే ఇంద్రియం; నళినీ నాళినులు= నళిని, నాళిని అనేవి; నాసికా ద్వారంబులు= ముక్కురంధ్రాలు అనే ద్వారాలు; సౌరభంబు= సౌరభం; అనన్= అంటే; గంధంబు= వాసన; అవధూత= అవధూత అని ఉపాఖ్యానంలో చెప్పబడినది; అనన్= అంటే; ఘ్రాణ+ఇంద్రియంబు= వాసనను తెలిసికొనే ఇంద్రియం; ముఖ్య+అనన్= ముఖ్య అంటే; ఆస్యంబు= నోరు; విపణంబు= అంగడి; అనన్= అంటే; వాక్కు= మాట; రసజ్ఞుండు= వాక్కు (కావ్యం) యొక్క రసతత్త్వం తెలిసినవాడు; అనన్= అంటే; రసనంబు= రుచిని తెలిసికొనే తత్త్వం; ఆపణంబు= అంగడి; అనన్= అనగా; వ్యవహారంబు= రుచిని గ్రహించటం మొదలైన పనితీరు; బహు+ఉదనంబు= బహూదనం; అనన్= అంటే; వివిధ+అన్నంబు= పెక్కువిధాలైన తినబడే పదార్థం; పితృహువు= అనే పేరుగలది; దక్షిణకర్ణంబు= కుడిచెవి; దేవహువు= అనే పేరుగలది; ఉత్తరకర్ణంబు= ఎడమచెవి; చండవేగుండు= తీవ్రమైన వేగంకలవాడు అనే అర్థంకల చండవేగుడు; అనన్= అంటే; కాల+ఉపలక్షకంబు= కాలాన్ని తెలియజేసేది అయిన; సంవత్సరంబు= సంవత్సరం; గంధర్వులు; అనన్= అంటే; దినంబులు= పగళ్ళు; గంధర్వీజనంబులు= గంధర్వి అని వ్యవహారంగల స్త్రీలు; అనన్= అంటే; రాత్రులు= రాత్రి అనే వ్యవహారంగల కాల విభాగాలు; పరీవర్తనంబు; అనన్= అంటే; ఆయుర్+హరణంబు= ఆయువును తగ్గించివేయటం; కాలకన్యక; అనన్= అంటే; జర= ముసలితనం; యవన+ఈశ్వరుండు= యవనప్రభువు; అనన్= అంటే; మృత్యువు= చావు; అతని సైనికులు= అతని యుద్ధభటులు; ఆధి వ్యాధులు= మనస్సునకూ, దేహానికీ సంబంధించిన రోగాలు; ప్రజ్వారుండు; అనన్= అంటే; ప్రాణి హింసయందున్= ప్రాణులను బాధించే పనిలో; శీఘ్ర వేగంబు= మిక్కిలివడి; కలిగి; శీత+ఉష్ణ భేదంబులన్= చల్లదనం, వెచ్చదనం అనే భేదాలతో; ద్వివిధంబు+ఐన= రెండురకాలైన; జ్వరంబు= జబ్బు; దక్షిణపాంచాలంబు+అనన్= దక్షిణ పాంచాలమంటే; పితృలోక ప్రాపకంబును= పితృలోకాన్ని పొందించేది; ప్రవృత్తి రూపకంబు+ఐన= ప్రవృత్తి రూపకమూ అయిన; శాస్త్రంబు= శాస్త్రం; ఉత్తర పాంచాలంబు= ఉత్తరం పాంచాలం; అనన్= అనగా; దేవ లోక ప్రాపకంబును= దేవలోకాన్ని పొందించేదీ; నివృత్తి సంజ్ఞికంబును= నివృత్తి అనే పేరుకలదీ; ఐన+శాస్త్రంబు= అయిన శాస్త్రం; శ్రుతధరుండు= శ్రుతధరుడు; అనన్= అంటే; శ్రోత్రంబు= చెవి; ఆసురీ నామకంబు= ఆసురి అనే పేరుకలది; అనన్= అంటే; పశ్చాత్+ద్వారంబు+ఐన= దేహం క్రింది భాగంలోని వాకిలియైన; మేఢ్రంబు= లింగం; గ్రామకంబు= గ్రామకం; అనన్= అంటే; సురత సుఖంబు= స్త్రీ పురుషులు సంగమించే సమయంలో కలిగే సుఖం; దుర్మదుండు= ఆ పేరుగలవాడు; అనన్= అంటే; గుహ్య+ఇంద్రియంబు= గుట్టుగా ఉంచుకొనే అవయవం; నిరృతి నామకంబు= 'నిరృతి' అనే పేరు గలది; ఐన పశ్చిమ ద్వారంబు= అయిన వెనుకటి వాకిలి; అనన్= అంటే; గుదంబు= ముడ్డి; వైశసంబు– అనే పేరున కలది; అనన్= అంటే; నరకంబు= ఎడతెగని బాధలు అనుభవించేచోటు; లుబ్ధకుండు= ఆ పేరుగలవాడు; అనన్= అంటే; పాయువు= మలవిసర్జన అవయవం; అంధులు= గ్రుడ్డివారు; అనన్= అంటే; హస్త పాదంబులు= చేతులు, కాళ్ళు; అంతఃపురంబు= నగరు; అనన్= అనగా; హృదయంబు= గుండెకాయ; విషూచి+అనన్= విషూచి అనే పేరుగలది; అనన్= అనగా; మనంబు= మనస్సు; అని= ఇలా చెప్పి; వెండియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** ప్రాచీనబర్హి పలుకు విని నారదుడతనితో ఇలా అంటున్నాడు. రాజా! ఆత్మ ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఇంకా ఎక్కువ పాదాలు కలదీ, అసలు పాదాలే లేనిదీ అయిన పురంజనుని దేహంలోనికి ప్రవేశించింది. ఆ కారణంగా అతనికి పురుషుడు అనే పేరు కలిగింది. ఆతనినే మనం జీవుడు అని వ్యవహరిస్తున్నాం. పేరుగానీ, పనిగానీ, గుణాలుగానీ లేని

కారణంగా తెలియరానివాడగు ఈశ్వరుడు అతని మిత్రుడు. తెలియరానివాడు అగుటచేత అతనిని అవిజ్ఞాతుడు అంటారు. జీవుడు అన్ని లక్షణాలతో కలిసి దేహాన్ని గ్రహించే సంకల్పం కలవాడైతే తొమ్మిది వాకిళ్ళూ, రెండేసి చేతులూ, కాళ్ళూ కల నగరం ఒకటి ఉన్నది. అది మేలైనది అని భావించాడు. అందులోనికి ప్రవేశించాడు. ఆ పురుషుడు బుద్ధికారణంగా ఇంద్రియాల ద్వారా శబ్దం మొదలైన విషయాలను అనుభవిస్తున్నాడు. దానిలోనే అహంకారమమకారాలను పొందుతున్నాడు. ఆ బుద్ధియే ఈ ఉపాఖ్యానంలోని స్త్రీ. దానికి చెలులే జ్ఞానాలకూ, కర్మలకూ కారణాలైన ఇంద్రియాల గుణాలు. చెలికత్తెలు వానివృత్తులు. అయిదు తలల పామంటే అయిదుతీరులైన గతులు గల ప్రాణం. పదకొండు మంది భటులు గలది, గొప్పబలం కలది, రెండు విధాల ఇంద్రియాలను నడిపించేది అయిన మనస్సు. తొమ్మిది వాకిళ్ళుగల ఆ పురాన్ని చుట్టి వచ్చిన పాంచాల దేశం అంటే అయిదు విషయాలు– శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం అనేవి. తొమ్మిది ద్వారాలు రెండు కన్నులు, రెండు ముక్కులు, రెండు చెవులు, ముఖం, ముడ్డి, లింగం అనేవి. వానిలో కన్నులు, ముక్కులు, నోరు అనే అయిదూ తూర్పు వాకిళ్ళుగా మన్నన పొందినవి. కుడి ఎడమ చెవులు దక్షిణంవైపు, ఉత్తరం వైపూ ఉన్న ద్వారాలు. మల, మూత్ర విసర్జనావయవాలు పడమటి వాకిళ్ళు. అందు ఒక తావులో ఏర్పడ్డ ఖద్యోతమూ, ఆవిర్ముఖమూ అనేవి కన్నులు. నళిని, నాళిని అనేవి ముక్కురంధ్రాలు. ముఖ్య అంటే నోరు. అంగడి అనేది వాక్కు. రసజ్ఞుడు రసం. ఆపణం అంటే వ్యవహారం. బహూదనం అంటే పెక్కుతీరులైన వంటకం. పితృహువు కుడిచెవి. దేవహువు అంటే ఎడమచెవి. చండమైన వేగం కలవాడు అంటే కాలానికి సూచకమైన సంవత్సరం. గంధర్వులు పగళ్ళు. గంధర్వీజాతిస్త్రీలు అంటే రాత్రులు. అవి తిరుగుతూ ఉండటం అంటే ఆయువును తగ్గిస్తూ ఉండటం. కాలకన్యక అనేది ముసలితనం. యవనేశ్వరుడనేవాడు మృత్యువు. అతని సేనాభటులే మనోరోగాలు, దేహరోగాలు. ప్రజ్వారుడు అంటే జ్వరం. ఇది రెండు విధాలు. శీతజ్వరం, ఉష్ణజ్వరం. వానికి గొప్పవేగం ఉంటుంది. దక్షిణ పాంచాలం అంటే పితరుల లోకాన్ని పొందించేదీ, ప్రవృత్తి రూపకమూ అనే పేరుగలదీ అయిన శాస్త్రం. ఉత్తరపాంచాలమంటే దేవలోకాన్ని పొందించేది, నివృత్తి రూపకమూ అయిన శాస్త్రం. శ్రుతధరుడంటే చెవి. ఆసురి అనే పేరుగల పడమటి వాకిలియే లింగం. గ్రామకం అంటే మిథున సుఖం. దుర్మదుడు అంటే యోని. 'నిర్ఋతి' అనే పేరుగల పడమటి ద్వారం గుదం (ముడ్డి). వైశసం అంటే నరకం. లుబ్ధకుడు అంటే మలద్వారం. గుడ్డివారు కాళ్ళూ చేతులు. అంతఃపురం హృదయం. విషూచి అంటే మనస్సు – అని ఇంకా ఇలా చెప్పాడు.

**విశే :** ప్రాచీనబర్హి ఉపాఖ్యానంలోని వ్యక్తులుగా చెప్పిన అవయవాదుల స్వరూపాన్ని వివరించవలసినదిగా నారదుని ప్రార్థించాడు. ఆ రూపకార్థాన్ని నారదుడు ఒక్కొక్కటిగా విడదీసి ఏది ఏ అవయవానికి గుర్తుగా చెప్పారో ఈ వచనంలో స్పష్టం చేసి చెబుతున్నారు.

1. **పురం –** కథలో నగరం – తత్త్వంలో దేహం.
2. **పురంజనుడు కథలో రాజు –** తత్త్వంలో జీవుడు.
3. **పురంజనుడు** అంటే పురాన్ని రూపొందించేవాడు.
4. **అవిజ్ఞాతుడు** అనే సఖుడు ఈశ్వరుడు. లోకంలోలాగా పేర్లు మొదలైన భేదాలచేత తెలియరానివాడు అని ఆ పదానికి అర్థం.
5. **పంచ వృత్తులు** కలది కనుక అయిదు తలలు గలది అనీ, సర్పంవలె ప్రాకుతూ పోతూ ఉంటుంది కనుక పాము అనీ అన్నారు. ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం అనేవి అయిదు విధాలైన వాయువులే ఇక్కడ ప్రాణానికి చెందిన వృత్తులు.

6. **ప్రాక్.ద్వార, పురస్కృతంబులు –** తూర్పు వాకిళ్ళుగా చేయబడినవి.

7. **ఖద్యోత.ఆవిర్ముఖులు –** ఖద్యోతం అంటే మిణుగురుపురుగు. దానివలె కొంచెంపాటి ప్రకాశంకలది; ఆవిర్ముఖం– ఆవిః అంటే ప్రకటమైన ముఖం కలది. అంటే అధిక ప్రకాశం కలది.

8. **విభ్రాజితం –** అంటే బాగా ప్రకాశించేది – రూపం.

9. **నలము, నాలము** అంటే రంధ్రాలు. అవి కలవి నళిని, నాళిని

10. **అవధూత –** వాయువును చెదరగొడుతూ ఉండే లక్షణం కలది – ముక్కు

11. **బహూదనం –** బహు+ఓదనం – బహ్వోదనం అనాలి. కానీ గూఢంగా చెప్పటం కోసం బహూదనం అన్నారు. “పరోక్షప్రియా ఇవ హి దేవాః” అని శ్రుతి. దేవతలు పరోక్షప్రియులు. ఆ దృష్టితో ఈ మాట ఏర్పడినది.

12. **పితృహువు –** పితృదేవతల ఆహ్వానం దీనిచేత అవుతుంది కనుక పితృహువు.

13. **దేవహువు –** పితృహువు కంటె వేరైనది. అంటే ప్రవృత్తి మార్గానికి సంబంధించినదని శాస్త్రం చెబుతున్నది.

14. **ఆసురి –** అసురం అంటే ఇంద్రియాలతో రమించే శీలం. వానికి సంబంధించినది ఆసురి. అది శిశ్నద్వారం.

15. **గ్రామకం –** గ్రామంలో ఉన్నజనులకు సుఖాన్ని కలిగించేది. రతిక్రీడ.

16. **దుర్మదము =** గుహ్యేంద్రియం.

17. **నిర్‌ఋతి** అంటే ఆసనం. అది మృత్యుద్వారమని చెబుతారు.

18. **వైశసం –** మలవిసర్జనం.

19. **పాయువు** అనే అవయవాన్ని లుబ్ధకుడు అన్నారు. దానినుండి వెలువడే పదార్థానికి దుఃఖం కలుగుతుంది. కనుక అది వేటకాని వంటిది.

20. **అంధులు –** చేతులు, కాళ్ళు తక్కిన అవయవాలలాగా రంధ్రాలు లేనివి కనుక అంధులుగా పరిగణన.

21. **విషూచి –** అంటే మనస్సు. అన్ని వైపులకు ప్రసరించేది అని శబ్దార్థం.

**సీ. అనఘాత్మ! వినుము జాయాత్మజులును గుణాక్తం బగు మతి బుద్ధితత్త్వ మర్థి**
**వెలయ నే యే గతి వికృతి సేయం బడు నే యే తెఱంగుల నింద్రియములు**
**వికృతిని బొందు నా విధమునఁ దద్గుణాన్వితుఁడును వరుసఁ దద్వృత్తులకును**
**ఘనుఁడు నుపద్రష్టయును దగు నాత్మయుఁ దద్వృత్తులను బలాత్కారముననను**

**తే. ననుకరింపంగ నర్థిఁ జేయంగఁ బడుట, ననయమును నాత్మమహిషిని ననుసరించు**
**టయు నెఱుఁగఁ జెప్పి యిట్టు లనియెను మఱియు, జనవరేణ్యునితో యోగిసత్తముండు. 854**

**ప్రతి :** అనఘ+ఆత్మ= పుణ్యబుద్ధి కలవాడా!; వినుము= విను; జాయా+ఆత్మజులును= ఆలుబిడ్డలును; గుణ+అక్తంబు= గుణాలతో స్పష్టమైనది; అగున్= అయిన మతి; బుద్ధితత్త్వము= బుద్ధి అనే విషయం; అర్థిన్= కోరికతో; వెలయన్=

ప్రకాశించగా; ఏ గతిన్= ఏ విధంగా; వికృతిన్= వికారాన్ని; చేయన్+పడున్= చేయబడుతుందో; ఏయేతెఱంగులన్= ఏయే పద్ధతులతో; ఇంద్రియములు= కన్ను మొదలైన ఇంద్రియాలు; వికృతిని= వికారాన్ని; పొందున్= పొందుతాయో; ఆ విధమునన్= ఆ తీరున; తద్+గుణ+అన్వితుఁడును= ఆ యా గుణాలతో కూడినవాడూ; వరుసన్= క్రమంగా; తద్+వృత్తులకును= వాని కదలికలకునూ; ఘనుఁడు= గొప్పవాడు; ఉపద్రష్టయును= కేవలం సాక్షిమాత్రంగా చూస్తూ ఉండేవాడు; అగు+ఆత్మయున్= అయిన ఆత్మ అనే వ్యవహారంగల జీవుడు; తద్+వృత్తులను= ఆ ఇంద్రియాల ప్రవృత్తులను; బలాత్కారమునను= బలప్రయోగంతో; అనుకరింపంగన్= అది చేసినట్లు చేయటానికి; అర్థిన్= కోరికతో; చేయంగన్+పడుటను= చేయబడటాన్నీ; అనయమును= ఎల్ల వేళల; ఆత్మ మహిషిని= తన పట్టపురాణిని; అనుసరించుటయు= అనుసరించి ప్రవర్తించటాన్నీ; ఎఱుఁగఁగన్= తెలిసే విధంగా; చెప్పి; మఱియున్= ఇంకా; యోగిసత్తముండు= యోగులలో గొప్పవాడైన నారదుడు; ఆ జనవరేణ్యుతోన్= ఆ రాజశ్రేష్ఠునితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** పుణ్యాత్మా! విను. యోగులలో గొప్పస్థితిగల ఆ నారదుడు పురంజనునకు భార్యగా అయిన బుద్ధిని గురించి, కొడుకులుగా చెప్పబడిన బుద్ధివికారాలను గురించి వివరించి, ఆ బుద్ధితత్త్వం ఎలా వికారాలను కలిగిస్తుందో; ఇంద్రియాలు ఏవిధంగా వికారాలను పొందుతాయో; ఆ గుణాలసంపర్కం వలన ఆ బుద్ధికి, ఇంద్రియాలకూ సంబంధించిన కదలికలకు జీవుడు గొప్పస్థితి కలవాడైనా సాక్షిమాత్రంగా ఎలా ఉంటాడో; తన పట్టపురాణి అయిన బుద్ధి ఆ కదలికలను తాను అనుకరించే విధంగా బలాత్కారం చేయగా అతని ప్రవృత్తి ఎలా ఉంటుందో; ఆ విషయాన్నంతా చక్కగా తెలిసేవిధంగా చెప్పి మళ్ళీ ఇలా అన్నాడు.

**విశే :** **'జాయ'** అంటే పురుషునకు సంతానాన్ని ప్రసాదించేది. ఇక్కడ **జాయ** – బుద్ధి. దానివలన కలిగిన పుత్రులు ఇంద్రియాలు. జీవుడు ఈ రెండింటితో సంసారంలో ప్రవృత్తి పొందుతున్నాడు. దానివలననే బంధం కలుగుతున్నది. ఆ విషయాల నన్నింటినీ నారదుడు ప్రాచీనబర్హికి తెలియజెప్పాడు.

**వృత్తులు** అంటే కదలికలు. ఇంద్రియాలు విషయాలపై ప్రసరించటం. వానివలన అనుభూతులు పొందటం మొదలైనవి. ఇవన్నీ భార్య స్థానంలో ఉన్న బుద్ధివలన కలిగేవి.

ముక్తిని కాంక్షించేవాడు ఈ అన్నింటినీ తత్త్వరూపంగా తెలుసుకొని వదలివేయాలి. దానినే శాస్త్రాలు సంన్యసనం అంటాయి. దీనిని పై పద్యం స్థూలంగా నిరూపిస్తున్నది.

**వ. మఱియు నరదం బన దేహంబు, దురంగంబులన నింద్రియంబు, లీషాద్వయం బన సంవత్సరంబును దత్కృత వయస్సును, జక్రద్వయం బనం బుణ్యపాప కర్మద్వయంబు, వేణుత్రయం బన గుణత్రయంబు, పంచబంధనం బనం బంచప్రాణంబులు, రశ్మి యన మనంబు, సారథి యన బుద్ధి, రథికోపవేశస్థానం బన హృదయంబు, గూబరంబు లన శోకమోహంబులు, పంచప్రహరణంబు లనం బంచేంద్రియార్థప్రక్షేపంబు, పంచవిక్రమం బనం గర్మేంద్రియంబులు, సప్తవరూథంబు లన ధాతువులు, హైమోపస్కరం బన రజోగుణం, బక్షయతూణీరం బన ననంతవాసనాహంకారోపాధి, యేకాదశ చమూపతి యన నేకా దశేంద్రియంబైన మనం, బాసురీవృత్తి యనం బాహ్యవిక్రమంబు, పంచేంద్రియంబులచేత మృగయా వినోదంబు చందంబున హింసాదులం జేసి విషయంబు లనుభవించుటయ మృగయాచరణం, బీ విధంబున నుండ జీవుండు**

**దేహంబున స్వప్న సుషుప్తి జాగ్రదవస్థలయందు నాధ్యాత్మికాధిదైవికాధిభౌతికంబులైన బహువిధ దుఃఖంబులం జేసి క్లేశంబుల ననుభవించుచు నజ్ఞానావృతుండయి వర్షశతంబు నిర్గుణుం డయ్యును ఘ్రాణేంద్రియ మనోధర్మంబులం దనయందు నధ్యవసించి కామలవంబుల ధ్యానంబు సేయుచు నహంకార మమకార సహితంబుగాఁ గర్మాచరణంబు సేయుచుండు. 855**

**ప్రతి :** మఱియున్= ఇంకా; అరదంబు= రథం; అనన్= అంటే; దేహంబు= శరీరం; తురంగంబులు+అనన్= గుర్రాలు అంటే; ఇంద్రియంబులు= విషయాలను గ్రహించే సాధనాలు; ఈషా ద్వయంబు= రథంలోని రెండు ఏడికోలలు; అనన్= అంటే; సంవత్సరంబును= ఏడాది కాలమున్నూ; తత్+కృత వయస్సును= అది చేసే వయస్సూ; చక్ర ద్వయంబు= చక్రాల జంట; అనన్= అంటే; పుణ్య పాప కర్మ ద్వయంబు= ఉత్తమగతినీ, నీచగతినీ కలిగించే పుణ్యపాప కర్మలజంట; వేణు త్రయంబు= బొంగులు అనే మూడింటి సముదాయం; అనన్= అంటే; గుణత్రయంబు= మూడుగుణాలు– సత్త్వం, రజస్సు, తమస్సు అనేవి; పంచ+బంధనంబు= అయిదు బంధాలుకలది; అనన్= అంటే; పంచప్రాణంబులు= అయిదు ప్రాణాలు; రశ్మి= పగ్గం; అనన్= అంటే; మనంబు= మనస్సు; సారథి= బండినడిపించువాడు; అనన్= అంటే; బుద్ధి= బుద్ధి అనే సూక్ష్మదేహంలోని భాగం; రథిక+ఉపవేశ స్థానంబు= రథంతో గమ్యానికి చేరటానికి సిద్ధపడినవాడు, కూర్చుండే చోటు; అనన్= అంటే; హృదయంబు= హృదయం అనే అవయవం– గుండెకాయ; కూబరంబులు= బండి ముందు భాగాలు; అనన్= అంటే; శోక మోహంబులు= దుఃఖమూ, ఒడలు తెలియని తనం; పంచ+ప్రహరణంబులు= అయిదు ఆయుధాలు; అనన్= అంటే; పంచ+ఇంద్రియ+అర్థ ప్రక్షేపంబు= అయిదు ఇంద్రియాల విషయాలు తగలటం; పంచ విక్రమంబు= అయిదింటి తీవ్రమైన కదలిక; అనన్= అంటే; కర్మ+ఇంద్రియంబులు= ఆ యా పనులను చేసే అయిదు ఇంద్రియాలు; సప్తవరూథంబులు= ఏడుకవచాలు; అనన్= అంటే; ధాతువులు= దేహంలోని ఏడు మూలపదార్థాలు. 1. వస 2. రక్తం 3. మాంసం 4. మెదడు 5. ఎముక 6. మజ్జ (ఎముకలలో ఉండే నూనెవంటిది) 7. శుక్లం (రేతస్సు); హైమ+ఉపస్కరంబు= బంగారు సామగ్రి; అనన్= అంటే; రజస్+గుణము= రజస్సు అనే గుణం; అక్షయతూణీరంబు= తరుగువోని అంపపొది; అనన్= అంటే; అనంత వాసనా+అహంకార+ఉపాధి= అంతులేని వాసనలతోకూడిన అహంకారమనే భావాన్ని పట్టి ఉంచేది; ఏకాదశ చమూపతి= పదకొండు సేనా విభాగాలకు నాయకుడు; అనన్= అంటే; ఏకాదశ+ఇంద్రియంబు+ఐన= పదకొండు ఇంద్రియాలు గలదైన; మనంబు= మనస్సు; ఆసురీవృత్తి= అసురసంబంధమైన కదలిక; అనన్= అంటే; బాహ్యవిక్రమంబు= వెలుపలి పరాక్రమం; పంచ+ఇంద్రియంబులచేతన్= అయిదు ఇంద్రియాలచేత; మృగయా వినోదంబు చందంబునన్= వేటతో మనస్సును ఉల్లాస పరచేవిధంగా; హింసా+ఆదులన్+చేసి= హింస మొదలైన వానితో; విషయంబులు= శబ్దాదుల వలన కలిగే సుఖాదులను; అనుభవించుట+అ= అనుభవించటమే; మృగయాచరణంబు= వేటాడటం; ఈ విధంబునన్= ఈ తీరుగా; ఉండన్= ఉండగా; జీవుండు= శరీరంలో ప్రధానతత్త్వం అయిన జీవుడు; దేహంబునన్= ఒడలిలో; స్వప్న+సుషుప్తి+జాగ్రత్+అవస్థలయందున్= కల, గాఢనిద్ర, మెలకువ అనే దశలలో; ఆధ్యాత్మిక+ఆధిదైవిక+ఆధి భౌతికంబులు+ఐన= దేహం ఆధారంగా కలిగేవి, దైవం ఆధారంగా కలిగేవి, భూతాలు (ప్రాణులు మొదలైనవి) ఆధారంగా కలిగేవి అయిన; బహువిధ+దుఃఖంబులన్+చేసి= పెక్కుతీరులుగల దుఃఖాలతో; క్లేశంబులన్= కష్టాలను; అనుభవించుచున్= అనుభవిస్తూ; అజ్ఞాన+ఆవృతుండు+అయి= అజ్ఞానంతో కప్పబడినవాడై; వర్షశతంబు= నూరేండ్లు; నిర్గుణుండు= గుణాల అంటు సొంటులు లేనివాడు; అయ్యును= అయికూడా; ప్రాణ+ఇంద్రియ మనస్+ధర్మంబులన్= ప్రాణాలు, ఇంద్రియాలూ, మనస్సు అనేవాని లక్షణాలను; తనయందున్= తనలో; అధ్యవసించి= నిలుపుకొని; కామ లవంబుల ధ్యానంబు= కొంచెంపాటి కోరికలను నిరంతరంగా భావించటాన్ని; చేయుచున్= చేస్తూ;

అహంకార మమకార సహితంబుగాన్= నేను, నాది అనే భావాలతో కూడుకొని; కర్మ+ఆచరణంబు= ఆయాపనుల నిర్వహణను; చేయుచున్+ఉండు= చేస్తూ ఉంటాడు.

**తా :** రాజా! రథమంటే దేహం. గుఱ్ఱాలు ఇంద్రియాలు. ఏడికోలలు ఏడాది, దానితో కలిగే వయస్సు. రెండు చక్రాలు పుణ్య పాపకర్మములు. మూడుబొంగులు అంటే మూడుగుణాలు. అయిదు బంధాలు అంటే అయిదు ప్రాణాలు. పగ్గం మనస్సు. సారథి బుద్ధి. రథికుడు కూర్చుండేచోటు హృదయం. రథికుడంటే ఇక్కడ జీవుడు. బండినొగలు అనేది శోకం, మోహం. అయిదు ఆయుధాలు అంటే అయిదు ఇంద్రియాల ప్రసారాలు. అయిదు విక్రమాలు అంటే కర్మేంద్రియాల ప్రవృత్తి. ఏడుకవచాలు అంటే ఏడు ధాతువులు. బంగారు సామగ్రి అనేది రజోగుణం. తరుగువోని అంపపొది అంటే అంతులేని వాసనలతో ఏర్పడిన అహంకారమనే ఆధారభూమి. ఏకాదశచమూపతి అంటే పదకొండు ఇంద్రియాల సముదాయమైన మనస్సు. ఆసురీవృత్తి అంటే జీవుడు దేహం వెలుపల చూపించే పరాక్రమం. జీవుడు అయిదు ఇంద్రియాలతో వేటకాడు వేటవినోదం పొందినట్లుగా హింసమొదలైన పనులవంటి శబ్దాదుల అనుభవాలను పొందటం మృగయాచరణం. జీవుడు ఇలా ఉండి దేహంలో కల, గాఢనిద్ర, మెలకువ అనే దశలలో ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతికాలైన పెక్కుతీరుల దుఃఖాలతో కష్టాలనుభవిస్తూ అజ్ఞానం కమ్ముకోగా నూరేండ్లు కర్మలనాచరిస్తూ బదుకుతున్నాడు. నిజానికి అతనికి ఈ గుణాలు లేని లక్షణమే పరమాత్మకు వలె ఉన్నది. కానీ ప్రాణాలూ, ఇంద్రియాలూ మనస్సూ అనే వాని ధర్మాలను తనయందు ఉన్నవిగా భావించటంచేత ఇట్టి దుఃస్థితి కలిగింది. వానివలన అల్పాలైన కోరికలనే నిరంతరమూ భావిస్తూ నేను, నాది అనే భావనలను నిండా నింపుకోవటం వలన ఈ దశ కలిగింది.

**విశే :** పుణ్య, పాప, కర్మ, ద్వయంబు– పుణ్యాన్ని కలిగించే దానాదులు పుణ్యకర్మలు. పాపాన్ని కలిగించే హింసాదులు పాపకర్మలు – ఈ రెండూ దేహం అనే రథానికి రెండు చక్రాలు.

**క. పురుషుఁడు నిజప్రకాశతఁ, బరఁగియు నలఘుఁడుఁ బరుండు భగవంతుండున్**
**గురుఁడును నగు న య్యాత్మను, బరువడి నెఱుఁగంగ లేక ప్రకృతిగుణములన్. 856**

**ప్రతి :** పురుషుఁడు= నరజన్మం పొందిన జీవుడు; నిజ ప్రకాశతన్= తనదైన వెలుగుతో; పరఁగియున్= ఒప్పారికూడా; అలఘుఁడు= ఏ కొలతలకు అందనివాడు; పరుండు= అన్ని జీవరాశులకంటె వేరయినవాడు; సర్వోత్కృష్టుడు; భగవంతుండున్= ఆరు మహాగుణాలు కలవాడు; గురుఁడును= సర్వలోకాలకూ జ్ఞానం ప్రసాదించే ఉపదేశకుడు; అగు; ఆ+ఆత్మను= ఆ పరమాత్మను; పరువడిన్= క్రమంగా; ఎఱుఁగంగన్ లేక= తెలియలేక; ప్రకృతి గుణములన్= ప్రకృతిగుణాలచేత...

**తా :** జీవుడు నిజానికి తనంత తాను ప్రకాశించే పరమాత్మ లక్షణం కలవాడే. కానీ అప్రమేయుడూ, అనంతుడూ, కర్మఫలాల అంటులు లేనివాడూ, భగవంతుడూ సర్వలోకాలకూ గురువూ అయిన ఆ పరమాత్మను తెలిసికోలేక ప్రకృతిగుణాలలో...

**క. విను మెపుడు దగులు నప్పుడ, యొనరంగ గుణాభిమానియును గర్మవశుం**
**డనఁ దగు నా పురుషుఁడు దా, ఘనమగు త్రైగుణ్య కర్మకలితుం డగుచున్. 857**

**ప్రతి :** వినుము= విను; ఎపుడు= ఏ సమయంలో; తగులున్= సంగం పొందుతాడో; అప్పుడు+అ= అప్పుడే; ఒనరంగన్= క్రమంగా; గుణ+అభిమానియున్= గుణాలలో అభిమానం కలవాడూ; కర్మ వశుండు= కర్మలకు వశమైనవాడూ; అనన్+తగు=

అనటానికి వీలైన; ఆ పురుషుఁడు= ఆ జీవుడు; తాన్= తాను; ఘనము= గట్టిది; అగు= అయిన; త్రైగుణ్య కర్మ కలితుండు= మూడు గుణాల కలయికవలన ఏర్పడే కర్మలతో కూడినవాడు; అగుచున్= అవుతూ...

**తా :** ఎప్పుడు తగులుకుంటాడో అప్పుడు క్రమంగా గుణాలయందు అభిమానం కలవాడవుతాడు. కర్మలకు వశమైపోతాడు. ఆ విధంగా మూడు గుణాలవలన కలిగిన పరమాత్మ లక్షణాలకు విరుద్ధమైన కర్మలతో కూడిన వాడై

**విశే :** గుణాలు సత్త్వం, రజస్సు, తమస్సు అనేవి ఘనం అనటంచేత అవి సులభంగా వదలించుకోవటానికి సాధ్యం కానివనే భావం కలుగుతుంది. గుణ అభిమానం అంటే సత్త్వరజస్తమస్సులనే నిజమైనవిగా భావిస్తూ వానినుండి విడివడాలి అనే భావం కలగకుండా ఉండటం.

**సీ. ధృతి నొప్పుచున్న సాత్త్విక కర్మమునను బ్రకాశ భూయిష్ఠ లోకముల భూరి**
**రాజస ప్రకట కర్మమున దుఃఖోదర్క లోలక్రియాయాస లోకములను**
**గైకొని తామస కర్మంబునను దమ శ్శోక మోహోత్కట లోకములను**
**బొందుచుఁ బుంస్త్రీ నపుంసక మూర్తుల దేవతిర్యఙ్మర్త్య భావములను**

**తే. గలుగుఁ గర్మానుగుణములు గాఁగ జగతిఁ, బుట్టి చచ్చుచుఁ గ్రమ్మఱఁ బుట్టు చిట్లు**
**దివిరి కామాశయుండైన దేహి యెప్డు, నున్నతానతపదముల నొందుచుండు. 858**

**ప్రతి :** ధృతిన్= ధైర్యంతో; ఒప్పుచున్+ఉన్న= ఒప్పారుతున్న; సాత్త్విక కర్మమునను= సత్త్వగుణంచేత ఏర్పడిన కర్మంవలన; ప్రకాశ భూయిష్ఠ లోకములన్= అత్యంతం వెలుగుగల లోకాలను; భూరి రాజస ప్రకట కర్మమునన్= మిక్కిలి అధికమైన రజోగుణంతో ఏర్పడిన కర్మంచేత; దుఃఖ= దుఃఖమే; ఉదర్క= రాబోయే ఫలంగా కలది; లోల= ఊగులాటతో కూడిన; క్రియా= పనులచేత; ఆయాస= పాటులుగల; లోకములను= లోకాలను; కైకొని= గ్రహించి; తామసకర్మంబునను= తమోగుణంవలన కలిగిన కర్మంచేత; తమస్= చీకటి; శోక= దుఃఖం; మోహ= తెలివిలేక పోవటం అనేవి; ఉత్కట= అధికంగా ఉన్న; లోకములను= లోకాలను; పొందుచున్= చేరుకుంటూ; పుం స్త్రీ నపుంసక మూర్తులన్= మగ, ఆడ, పేడి అనే దేహలక్షణాలతో; దేవ తిర్యక్+మర్త్యభావములను= దేవతలు, పశువులు, పక్షులు, మానవుల భావాలతో; కలుగున్= జన్మిస్తాడు; కర్మ+అనుగుణములు= కర్మలకు తగిన తీరులు; కాఁగన్= అగునట్లుగా; జగతిన్= లోకంలో; పుట్టి; చచ్చుచున్= మరణిస్తూ; క్రమ్మఱన్= మరల; పుట్టుచు= పుట్టే విధంగా; ఇట్లు= ఇలా; తివిరి= యత్నపడి; కామ+ఆశయుండు= కోరికలతో నిండిన మనస్సుకలవాడు; ఐన దేహి= అయిన జీవుడు; ఎప్డున్= ఎల్లవేళలా; ఉన్నత+ఆనత పదములన్= ఉన్నత, నీచ స్థానాలను; ఒందుచున్+ఉండున్= పొందుతూ ఉంటాడు.

**తా :** సత్త్వగుణ సంబంధంకల కర్మల నాచరించాలి అంటే ధృతి-పట్టుదల కావాలి. అట్టివానిచేత గొప్పవెలుగులతో నిండిన లోకాలను జీవుడు పొందుతాడు. రజోగుణం ఎక్కువగా కల పనులవలన దుఃఖమే కలుగబోయే ఫలం అయినవీ, ఊగులాటతో కూడినవీ, ఆయాసం కలిగించేవీ అయిన లోకాలను చేరుకుంటాడు. తమోగుణానికి సంబంధించిన కర్మవలన చీకటి (అజ్ఞానం), శోకం, మోహం అధికంగాగల లోకాలను పొందుతాడు. ఇలా కర్మలకు తగినవిధంగా జన్మ లెత్తుతూ పుట్టి చస్తూ, మళ్ళీ జన్మిస్తూ కోరికలతో నిండిన మనస్సు కలవాడై జీవుడు ఉన్నత, అధమ స్థానాలకు చేరుకుంటూ ఉంటాడు.

**విశే :** సత్త్వగుణానికి ప్రకాశ శక్తీ, రజోగుణానికి విక్షేపశక్తీ, తమోగుణానికి ఆవరణశక్తీ ఉన్నాయి.

**వ. అని మఱియు నిట్లనియె. 859**

**ప్రతి :** అని+మఱియున్+ఇట్లనియె= అని ఇంకా ఇలా అన్నాడు.

**తా :** అని ఇంకా ఇలా అన్నాడు.

**మ. ఎనయన్ క్షుత్పరిపీడఁ గుంది శునకం బింటింటికిం బోవఁ బూ**
**నినఁ దద్దైవిక మైన దండహతి గానీ, కాక చౌర్యాన్నమై**
**నను గానీ తగఁ బొందు చందమున నెన్నన్ దైవయోగంబు పెం**
**పున నీ జీవుఁడు దాఁ బ్రియా ప్రియములం బొందుం ద్రిలోకంబులన్. 860**

**ప్రతి :** ఎనయన్= ఎక్కువ అయిన; క్షుత్+పరిపీడన్= ఆకలివలన కలిగిన బాధతో; కుంది= కుంగిపోయి; శునకంబు= కుక్క; ఇంటికిన్+ఇంటికిన్= అన్ని ఇండ్లకూ; పోవన్= పోవడానికి; పూనినన్= పూనుకోగా; తత్+దైవికము+ఐన= అదృష్టాన్ని బట్టి కలిగిన; దండహతిన్= కఱ్ఱదెబ్బను; కానీ; కాక= లేక; చౌర్య+అన్నము+ఐనను= దొంగతిండి అయినా; కానీ; తగన్= తగు విధంగా; పొందుచందమునన్= పొందే విధంగా; ఎన్నన్= భావిస్తే; జీవుడు= సంసారంలో చిక్కుకొన్న జీవుడు; దైవయోగంబుపెంపునన్= ఎక్కువ అదృష్టం కూడటంవల్ల; ఈ జీవుడు; త్రిలోకంబులన్= మూడు లోకాలలో; తాన్= తాను; ప్రియ+అప్రియములన్= ప్రియమైన వానినీ, ప్రియంకాని వానినీ; పొందున్= అందుకుంటాడు.

**తా :** ఒక కుక్క ఆకలిబాధను తట్టుకోలేక ఇల్లిల్లూ తిరుగుతూ ఉంటుంది. ఒక్కొక్కచోట అదృష్టం లేకపోవటంవలన కఱ్ఱదెబ్బ తగులుతుంది. అదృష్టం బాగుంటే దొంగతిండి లభిస్తుంది. ఇదంతా దైవయోగం. అలాగే జీవుడు కూడా తన అదృష్టాన్ని బట్టి ప్రియాన్నీ, అప్రియాన్నీ మూడులోకాలలో పొందుతూ ఉంటాడు.

**విశే :** ఇక్కడ దైవికం, దైవయోగం అనేవానికి తాను చేసుకున్న కర్మల ఫలితంగా ఏర్పడిన అదృష్టం, దురదృష్టం అనేవాని సంబంధం అని అర్థం.

**చ. గొనకొని యిట్టి దుఃఖములకుం బ్రతికారము మానవేంద్ర! క**
**ల్గిన విను తత్ప్రతిక్రియ నకించనవృత్తి జనుండు మస్తకం**
**బున నిడుమోపు మూఁపునను బూనినఁ దద్భర దుఃఖ మాత్మఁ బా**
**యని గతి జీవుఁడుం ద్రివిధమై తగు దుఃఖముఁ బాయఁ డెన్నఁడున్. 861**

**ప్రతి :** మానవ+ఇంద్ర= రాజా!; జనుండు= జీవుడు; గొనకొని= ప్రయత్నించి; ఇట్టి+దుఃఖములకున్= ఇటువంటి బాధలకైనా; ప్రతికారము= అది పోవటానికి చేసే మరొకపని; కల్గినన్= ఉంటే; విను= ఆలకించు; తత్+ప్రతిక్రియన్= దానికి ప్రతిక్రియను; అకించన వృత్తిన్= ఏ మాత్రమూలేని స్థితిలో; మస్తకంబునన్= తలమీద; ఇడుమోపున్= పెట్టుకొన్న బరువును; మూఁపునను= బుజంమీద; పూనినన్= పెట్టుకుంటే; తద్+భరదుఃఖము= ఆ బరువువలన కలిగే దుఃఖం; ఆత్మన్= మనస్సులో; పాయనిగతిన్= వదలిపోని విధంగా; జీవుఁడున్= జీవుడుకూడా; త్రివిధము+ఐ= మూడు విధాలుగలదై; తగుదుఃఖమున్= నిలిచి ఉండే దుఃఖాన్ని; ఎన్నఁడున్= ఎప్పటికీ; పాయఁడు= తొలగించుకోలేడు.

**తా :** రాజా! జీవుడు ప్రయత్నపడి కలిగే దుఃఖాలను పోగొట్టుకోవటానికి మారుపనులు చేస్తూ ఉంటాడు. తలమీద ఒక పెద్ద మోపు పెట్టుకున్నాడు. బరువును తట్టుకోలేక ఆమోపును భుజంమీదికి దింపుకోవటం ప్రతిక్రియ. కానీ అలాచేసినా బరువు వల్ల కలిగిన దుఃఖం మనస్సు నుండి తొలగిపోదుకదా! అలాగే జీవుడు మూడు విధాలైన దుఃఖాలను ఎప్పటికీ తొలగించుకోలేడు.

**విశే :** ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మికములనే తాపత్రయాలే త్రివిధదుఃఖాలు.

**క. ఘన దుఃఖ హేతుకర్మం, బును దత్ప్రతికార కర్మమును నివి మాయా**
**జననము లగుటను బురుషుఁడు, గనుఁ గలలోఁ దోఁచి నట్టి కల చందమునన్. 862**

**ప్రతి :** ఘన దుఃఖ హేతు కర్మంబును= గొప్పదైన దుఃఖానికి కారణమైన కర్మమూ; తత్ ప్రతికార కర్మంబును= దానిని తొలగించుకోవటానికి చేసే మరొక కర్మమూ; ఇవి; మాయాజననములు= మాయవలన పుట్టేవి; అగుటను= కావటంచేత; పురుషుఁడు= జీవుడు; కలలోన్= స్వప్నంలో; తోఁచినట్టి కల చందమునన్= కానవచ్చినట్టి మరొక కలలాగా; కనున్= చూస్తాడు.

**తా :** ఒక కర్మ గొప్ప దుఃఖాన్ని కలిగిస్తుంది. దానిని తొలగించుకోవటానికి జీవుడు ప్రతిక్రియగా ఏదో చేస్తూ ఉంటాడు. ఈ రెండూ మాయవలన ఏర్పడినవే. అది కలలో కల వచ్చినట్టి వ్యవహారం.

**వ. సవాసనోచ్ఛేదకంబు గా దని వెండియు నిట్లనియె. 863**

**ప్రతి :** సవాసనా+ఉచ్ఛేదకంబు= వాసనలతో పాటు తెగగొట్టునది; కాదు; అని; వెండియున్= ఇంకా; ఇట్లు; అనియెన్= అన్నాడు.

**తా :** ఆ కర్మ వ్యవహారం వాసనలతోపాటు తెగి నాశనమైపోయేది కాదు. అని ఇంకా ఇలా అన్నాడు.

**విశే :** వాసనలు-కర్మలకు సంబంధించిన జ్ఞాపకాలు. ఇవి దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసన – అని మూడు విధాలు.

**సీ. నరనాథ! వినుము స్వప్నంబు చందంబున నజ్ఞానవిలసితం బగుటఁ జేసి**
**తివిరి మిథ్యాభూత దేహాదికమునకు నరయ నివర్తనాయాస మేటి**
**కని యంటివేనియు నర్థంబు లేకున్న నర్థి సోపాధికం బైన మనము**
**వాంఛతో స్వప్నము వర్తింపఁ బురుషునిఁ బూని జాగ్రద్బోధచే నుపాధి**

**తే. చెడక స్వాప్నిక సంసృతి విడువనట్లు, తత్త్వ విజ్ఞానమున నవిద్యానివృత్తి**
**దారదేహాదిక నివృత్తి దగులకున్నఁ, దివుట సంసృతి దా నివర్తింప కుండు. 864**

**ప్రతి :** నరనాథ= రాజా; వినుము= ఆలకించు; స్వప్నంబు చందంబునన్= కలవలె; అజ్ఞాన విలసితంబు= పరమార్థంతో సంబంధంలేని అజ్ఞానంతో కూడి గొప్పగా కనపడేది; అగుటన్+చేసి= కావటంవలన; తివిరి= ప్రయత్నపడి; మిథ్యా భూత దేహ+ఆదికమునకున్= లేనివిగా అయ్యే దేహం మొదలైనవానికి; అరయన్= చూడగా; నివర్తన+ఆయాసము= మరల తిరిగి కలుగుట అనే పాటు; ఏటికని= ఎందుకని; అంటివి+ఏనియున్= అంటావేమో; అర్థంబు= కోరబడేవస్తువు; లేక+ఉన్నన్= లేకపోతే; అర్థి= కోరేది అయిన; స+ఉపాధికంబు+ఐన= ఆధారంగా అయిన దానితో కలసి ఉన్నదైన;

మనము= మనస్సు; వాంఛతోన్= కోరికతో; స్వప్నము= కల; వర్తింపన్= కలుగగా; పురుషునిన్= జీవుని; పూని= ఆశ్రయించి; జాగ్రత్+బోధచేన్= మెలకువ కలిగినప్పటి తెలివిచేత; ఉపాధి= ఆధారమైనది; చెడక= పాడైపోక; స్వాప్నిక సంసృతిన్= కలలోని సంసారాన్ని; విడువని+అట్లు= వదలని విధంగా; తత్త్వవిజ్ఞానమునన్= తత్త్వానికి సంబంధించిన విశేషమైన తెలివిచేత; అవిద్యా నివృత్తి= అజ్ఞానం తొలగిపోవటం; దార దేహ+ఆదిక నివృత్తిన్= భార్య, దేహం, మొదలైనవి మరలిపోవటం; తగులక+ఉన్నన్= కలగకపోతే; తివుటన్= కోరికతో; సంసృతి= సంసారం; తాన్= తాను; నివర్తింపక= మరలక; ఉండున్= ఉంటుంది.

**తా :** రాజా! కలలాగా అజ్ఞానంచేత భాసిల్లే అబద్ధం అనదగిన దేహంమొదలైన మళ్ళీ సంభవించడం మొదలైన శ్రమతో పనియేమి అంటావేమో! దానినిగూర్చి విను. కోరదగిన పదార్థం లేకపోతే ఏదో ఒక ఆధారంలో చిక్కుకొన్న మనస్సు కోరికోరి కలలలో తేలియాడుతూ ఉంటుంది. దానివలన జీవుడు మెలకువ పొందిన తరువాత ఆధారమైనది అలాగే ఉంటుంది కాబట్టి స్వప్నంలోని సంసారాన్ని వదలిపెట్టడు. అంటే కలలోని సంసారం అలానే ఉంటుంది. తత్త్వజ్ఞానంచేత అజ్ఞానం మరలిపోయినట్లు భార్యాబిడ్డలు, శరీర వ్యామోహం మొదలైనది తననుండి తొలగిపోకపోతే సంసారం మరలిపోదు. కాబట్టి నివృత్తిని ఆ ప్రయోజనంకోసం పాటించాలి.

**చ. ఘన పురుషార్థభూత మనఁగాఁ దగు నాత్మకు నే నిమిత్తమై**
**యొనర ననర్థహేతు వన నూల్కొను సంసృతి సంభవించు న**
**ట్లనయముఁ దన్నిమిత్త పరిహారక మర్థి జగద్గురుండు నాఁ**
**దనరిన వాసుదేవ పద తామరస స్ఫుటభక్తి యారయన్. 865**

**ప్రతి :** ఘన పురుష+అర్థ భూతము= గొప్పదైన పురుషార్థంగా అయినది; అనఁగాన్= అనటానికి; తగున్+ఆత్మకున్= తగినట్టి జీవునకు; ఏ నిమిత్తము+ఐ= ఏ కారణంగా; ఒనరన్= సరిపడునట్టి; అనర్థ హేతువు= కీడునకు కారణం; అనన్= అనగా; నూల్కొను= ఏర్పడే; సంసృతి= సంసారం; సంభవించు+అట్లు= కలుగు విధంగా; అనయమున్= ఎల్ల వేళలా; తత్+నిమిత్త పరిహారకము= ఆ కారణాన్ని తొలగించేది అయిన; అర్థిన్= కోరికతో; జగత్+గురుండు= జగత్తులన్నింటికీ జ్ఞానం కలుగజేసేవాడు; నాన్= అనగా; తనరిన= ఒప్పిన; వాసుదేవ= సర్వమయుడైన పరమాత్మయొక్క; పద= పాదాలనే; తామరస= కమలాలయందలి; స్ఫుట= చక్కగా తెలియవచ్చే; భక్తి= పరమ ప్రేమరూపమైన భావం; ఆరయన్= విచారింపగా; సంభవించున్= కలుగుతుంది.

**తా :** నిజానికి జీవుడు పరమపురుషార్థ రూపమైన ఆత్మయే; కానీ అన్ని అనర్థాలకు కారణమైన సంసారం జీవునకు ఏ కారణంవలన కలుగుతుందో ఆకారణం చేతనే ఆ అనర్థాన్ని తొలగించే జ్ఞానంవలన, వాసుదేవపదభక్తి కూడా కలుగుతుంది.

**క. పూనిన తద్భక్తి సమీ, చీనగతిం దెలియ ననఘ! చిరవైరాగ్య**
**జ్ఞాన జనక మగు భక్తి ని, ధానము గోవింద వరకథాశ్రయమ యగున్. 866**

**ప్రతి :** అనఘ= పుణ్యాత్ముడా!; పూనిన= ఆవేశించిన; తద్+భక్తి= ఆ విష్ణువునందలి భక్తి; సమీచీన గతిన్= సరైన తీరుతో; తెలియన్= తెలుసుకోవాలంటే; చిర= పెద్దకాలంసాగే; వైరాగ్య= సంగం లేకుండటం అనే; జ్ఞాన= జ్ఞానాన్ని; జనకము=

పుట్టించేది; అగు భక్తి నిధానము= భక్తికి పెన్నిధి అయిన; గోవింద వర కథా+ఆశ్రయము+అ= గోవిందుని గొప్పకథలను పట్టుకోవటమే; అగున్= అవుతుంది.

**తా :** పుణ్యాత్ముడా! భక్తితత్త్వం సరైన తీరులో తెలియాలి అంటే పెద్దకాలంసాగే విష్ణుభక్తిని పెంపొందించే భక్తికి ఆలవాలమైన గోవిందుని మేలైన కథలను పట్టుకోవటమే గతి.

భక్తి తీరుతెన్నులు గోవిందభక్తుల కథలద్వారా సరిగా తెలుసుకోవచ్చు అని భావం.

**వ. కావున నది తత్కథాకర్ణన గాన నిరతుండు, విశ్వాస సంయుక్తుండు నైన వానికి సంభవించు, మఱియును 867**

**ప్రతి :** కావునన్= కాబట్టి; అది= ఆ భక్తి; తత్+కథావర్ణన= గోవిందుని కథలను చెప్పుకొనటం; గాన= పాడుకోవటం అనే పనులలో; నిరతుండు=మిక్కిలి శ్రద్ధ కలవాడు; విశ్వాససంయుక్తుండున్= నమ్మకంతో కూడి ఉండేవాడు; ఐన వానికిన్= అయిన వ్యక్తికి; సంభవించున్= కలుగుతుంది; మఱియును= ఇంకా

**తా :** కాబట్టి భగవంతుని కథలను ఎల్లవేళలా చెప్పుకొనేవాడూ, పాడుకొనేవాడూ అయిన వ్యక్తికి భక్తి కలుగుతుంది.

**క. ధర సాధులు విమలాంతః, కరణులు భగవద్గుణానుకథన శ్రవణ**
**స్ఫురిత స్వాంతులు ననఘులు, వరధిషణులు నైన భాగవత జనుల సభన్. 868**

**ప్రతి :** ధరన్= భూమిపై; సాధులు= సత్పురుషులు; విమల+అంతఃకరణులు= నిర్మలమైన మనస్సు కలవారు; భగవత్= భగవంతుని; గుణ= గుణాల; అనుకథన= పలుకుతూ ఉండటం; శ్రవణ= వింటూ ఉండటం అనేవానిచేత; స్ఫురిత= చైతన్యంతో కూడినదైన; స్వాంతులు= హృదయం కలవారు; అనఘులున్= పాపభావనలు లేనివారూ; ఐన= అయినట్టి; భాగవత జనుల సభన్= భగవద్భక్తుల సభలో...

**తా :** భూమిపై మంచివారు, నిర్మలమైన మనస్సుకలవారు, భగవంతుని గుణాలకు సంబంధించిన కథలను ఒకదాని తరువాత ఒకటిగా పలుకుతూ ఉండటం, వింటూ ఉండటంతో ప్రకాశించే హృదయం కలవారు, పాప స్పర్శ ఏ మాత్రమూ లేనివారూ అయిన భక్తుల సభలో

**విశే :** అనుకథనం అంటే వ్యవధానం లేకుండా చెప్పుకొంటూ ఉండటం.

**క. సరసోదార మహాత్మ ము, ఖరితము లగు మధువిరోధి కమనీయ గుణో**
**త్కర సురుచిర చరితామృత, పరిపూరిత వాహినులను బరమ ప్రీతిన్. 869**

**ప్రతి :** సరస= రసంతో నిండిన; ఉదార= గొప్పతనంకల; మహాత్మ= దొడ్డబుద్ధికల వ్యక్తులచేత; ముఖరితములు= నాదంకలదిగా చేయబడినవి; అగు= అయిన; మధువిరోధి= మధువనెడు రక్కసునికి పగవాడైన విష్ణుని; కమనీయ= కోరదగిన; గుణ= గుణాల; ఉత్కర= సముదాయంచేత; సురుచిర= ఎంతో హృదయంగమమైన; చరిత= ప్రవృత్తి అనే; అమృత= అమృతంతో; పరిపూరిత= పూర్తిగా నిండిన; వాహినులను= నదులను (వాక్కుల తీరులను); పరమప్రీతిన్= మిక్కిలి ఎక్కువ అయిన ప్రీతితో

**తా :** సరసులు, ఉదారులు అయిన మహాత్ములు చక్కగా పలికే శ్రీమహావిష్ణుని మనోహరమైన గుణాల సముదాయంచేత చాలా రుచికలదిగా చేయబడిన కథలనే అమృతంతో నిండిన నదులను మిక్కిలి ప్రీతితో.

**విశే :** సరసులు- రసగ్రహణంలో నిండైన ఆసక్తి కలవారు.

**క. మన మలరఁగ శ్రోత్రాంజలు, లను బానము సేయు పుణ్యులకు క్షుత్తృష్ణా**
**ఘన భయ శోకవిమోహము, లనయంబును సోఁకకుండు నవనీనాథా! 870**

**ప్రతి :** అవనీనాథా= రాజా; మనము= మనస్సు; అలరఁగన్= తృప్తిచెందగా; శ్రోత్ర+అంజలులను= చెవులు అనే దోసిళ్ళతో; పానము= త్రాగుటను; చేయు పుణ్యులకున్= చేసే పుణ్యాత్ములకు; క్షుత్= ఆకలి; తృష్ణా= దప్పి; ఘన+భయ= గొప్పభయం; శోక= దుఃఖం; విమోహములు= సరైన జ్ఞానంలేకపోవటం అనేవి; అనయంబును= అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో; సోఁకక= తాకక; ఉండున్= ఉంటాయి.

**తా :** రాజా! మనస్సు ఆనందించు విధంగా చెవులనే దోసిళ్ళతో భగవంతుని చరితామృతాన్ని త్రావే పుణ్యాత్ములను ఆకలి, దప్పి, గొప్ప భయం, దుఃఖం, ఒడలు తెలియనితనం మొదలైనవి ఎన్నటికీ తాకవు.

**వ. కావున నిట్టి భాగవత సహవాసంబు లేక తనంతన భగవద్భాగవత గుణాభివర్ణన కథానుచింత నాదులయందుం బ్రవర్తించిన నాలస్యాది దోషంబు లొంది యీ జీవలోకంబు సహజక్షుధాదికంబున నుపద్రుతంబై సర్వేశ్వరకథామృత వాహిని యందు రతిం జేయ, దిది నిశ్చితం బని మఱియు నిట్లనియె. 871**

**ప్రతి :** కావునన్= కాబట్టి; ఇట్టి భాగవత సహవాసంబు= ఈ విధమైన భగవద్భక్తులతో కలసి ఉండటం; లేక; తనంతన్+అ= తానొక్కడే అయి; భగవత్= భగవంతుని; భాగవత= భక్తులయొక్క; గుణ= లక్షణాల; అభివర్ణన= కొనియాడటం; కథా+అనుచింతన+ఆదులయందున్= ధ్యానించటం మొదలగు పనులలో; ప్రవర్తించినన్= మెలగితే; ఆలస్య+ఆది దోషంబులు= అలసత మొదలైన చెడులక్షణాలు; ఒంది= పొంది; ఈ జీవ లోకంబు= ఈ ప్రాణుల సముదాయం; సహజక్షుధా+ఆదికంబునన్= తనతోపాటు ఏర్పడిన ఆకలి మొదలైనదానిచేత; ఉపద్రుతంబు+ఐ= ఆపదలు పొందినదై; సర్వ+ఈశ్వర= అందరకు ప్రభువైన నారాయణుని; అమృత+వాహినియందున్= కథలనే అమృత నదియందు; రతిన్= ప్రీతిని; చేయదు; ఇది= ఈ విషయం; నిశ్చితంబు= సిద్ధాంతం; అని; మఱియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** కాబట్టి, భక్తులతో కలసిమెలసి ఉండక తనకు తానై భగవంతునికీ, భాగవతులకూ సంబంధించిన కథలను చెప్పుకుంటూ ధ్యానం చేస్తూ ఉంటే ఆలస్యం మొదలైన దోషాలు కలుగుతాయి. ఆ పరిస్థితిలో ఈ ప్రాణిలోకం తనతోపాటు ఏర్పడిన ఆకలి మొదలైన వానిచేత ఆపదలు పొందినదై భగవంతుని కథలు అనే అమృత ప్రవాహం విషయంలో ఆసక్తి పొందదు. ఇది సందేహం లేని మాట అని ఇంకా ఇలా అన్నాడు.

**విశే :** శ్రీశంకరులు దీనినే 'సత్సంగత్వే నిస్సంగత్వం' ఇత్యాదిగా చెప్పారు. సజ్జనుల కలయిక వలన ప్రాపంచికమైన తగులాలు నశిస్తాయి. దానితో మోహం-అంటే అజ్ఞానం రూపుమాసిపోతుంది. దానివలన నిశ్చలమైన భక్తి కలుగుతుంది. అది జీవన్ముక్తికి సోపానం అవుతుంది.

సీ. పద్మసంభవుఁడును భవుఁడును మనుకుల సమితి దక్షాది ప్రజాపతులును
నైష్ఠికులైన సనకముఖ్య మునులుఁ బులస్త్యుండు భృగువుఁ బులహుఁడుఁ గ్రతువు
నత్రి మరీచియు నంగిరసుండు నరుంధతీ విభుఁడును రూఢి మెఱయఁ
బహుపుణ్యు లే గడపల cగాcగc గల బ్రహ్మ వాదులు నందఱు వాక్కులకును

తే. నెనయ నీశ్వరులై యుండియును సమగ్ర, మతిఁ దపో యోగ విద్యా సమాధి వర వి
చారులై యుండియును సర్వసాక్షి యైన, యాశ్వరుని వెదకియుఁ గాన రిద్ధచరిత! 872

**ప్రతి :** ఇద్ధచరిత= గొప్పనడవడి కలవాడా!; పద్మసంభవుఁడును= తామరపూవులో పుట్టిన బ్రహ్మదేవుడు; భవుఁడును= శివుడును; మనుకులసమితి= మనువుల సముదాయమూ; దక్ష+ఆది ప్రజాపతులును= దక్షుడు మొదలైన ప్రజాపతులును (బ్రహ్మలునూ); నైష్ఠికులు+ఐన= నిష్ఠకలవారైన; సనక ముఖ్య మునులున్= సనకుడు మొదలైన మహర్షులూ; పులస్త్యుండున్= పులస్త్యమహర్షీ; భృగువు= భృగుమహర్షీ; పులహుఁడున్= పులహుడనే మహర్షీ; క్రతువున్= క్రతువు అనే మహర్షీ; అత్రి= అత్రిమహర్షీ; మరీచియున్= మరీచిమహర్షీ; అంగిరసుండు= అంగిరసుడనే మహర్షీ; అరుంధతీ విభుఁడును= అరుంధతికి పతి అయిన వశిష్ఠమహర్షీ; రూఢి= ప్రసిద్ధి; మెఱయన్= ఒప్పారగా; బహుపుణ్యులు= గొప్ప పుణ్యంగలవారు; ఏన్= నేను; కడపలన్= చివరివాడుగా; కల= ఉన్న; బ్రహ్మవాదులు= బ్రహ్మాన్ని గూర్చే మాట్లాడేవారు; అందఱు; వాక్కులకున్= మాటలకు; ఎనయన్= భావించగా; ఈశ్వరులు+ఐ= ప్రభువువై; ఉండియును= ఉండికూడా; సమగ్రమతిన్= నిండైనబుద్ధితో; తపస్= తపస్సు; యోగ= యోగం; విద్యా= జ్ఞానం; సమాధి= నియమం అనే వానికి సంబంధించిన; వర= మేలైన; విచారులు+ఐ= భావించే శక్తికలవారై; ఉండియునున్= ఉండికూడా; సర్వసాక్షి+ఐన= అన్నింటినీ స్వయంగా చూస్తున్నవాడైన; ఈశ్వరునిన్= పరమాత్మను; వెదకియున్= వెదకికూడా; కానరు= చూడలేరు.

**తా :** గొప్పగా కొనియాడదగిన శీలం కలవాడా! బ్రహ్మ, శివుడు, మనువులు, దక్షుడు మొదలైన ప్రజాపతులు; పరమనిష్ఠగల సనకుడు మొదలైన జ్ఞానసంపన్నులు; పులస్త్యుడు, భృగువు, పులహుడు, క్రతువు, అత్రి, మరీచి, అంగిరసుడు, వసిష్ఠుడు ఇంకా ప్రసిద్ధికెక్కిన గొప్ప పుణ్యాలపంట పండించుకొన్నవారు; నేను తుదిగా ఉన్న బ్రహ్మవాదులందరూ వాక్కుల సమితికి ప్రభువులై కూడా సమస్తమైన బుద్ధితో తపస్సు, యోగం, విద్య, మనోనియమం మొదలైన వానిని గూర్చి తర్కించి నిగ్గు తేల్చుకొన్నవారై ఉండికూడా ఎంతవెదకినా సర్వసాక్షి అయిన ఈశ్వరుని కానలేరు.

**విశే :** మోక్షసాధన సామగ్రియందు భక్తియే గరీయసి అనే విషయాన్ని ఇందులో నిరూపిస్తున్నారు. భక్తి లేకపోతే ఎన్ని ఉన్నా భగవంతుని పొందటం సాధ్యం కాదని పద్యతాత్పర్యం.

వ. అది యెట్లంటేని. 873

**ప్రతి :** అది= ఆ విషయం; ఎట్లు= ఏ విధం; అంటేని= అంటివేని

**తా :** అది ఎలాగయ్యా అంటావేమో!

మ. ఘనవిస్తార మపార మద్వయ మనంగా నొప్పు వేదంబు దా
మనువర్తించుచు మంత్రయుక్తి వివిధంబై నట్టి దేవాఖ్య శో

**ఘనసామర్థ్యముచేత నింద్రముఖరూపం బిష్టదైవంబుగాఁ**
**గని వేడ్కన్ భజియించువారలు గనంగా నేర్తురే యీశ్వరున్. 874**

**ప్రతి :** ఘనవిస్తారము= గొప్పది, అతివిశాలమైనదీ; అపారము= అంతులేనిది; అద్వయము= అటువంటిది మరొకటి లేనిది; అనంగాన్= అనగా; ఒప్పు= విరాజిల్లే; వేదంబున్= వేదాన్ని; తాము; అనువర్తించుచున్= వల్లెవేస్తూ; మంత్రయుక్తిన్= మంత్రాల జోడింపుతో; వివిధంబు+ఐన= పెక్కుతీరులు కలదైన; అట్టి= అటువంటి; దేవ+ఆఖ్య శోభన సామర్థ్యం చేతన్= దేవుడు అనే పేరుతో మంగళాన్ని కలిగించే సమర్థతచేత; ఇంద్ర ముఖ రూపంబు= ఇంద్రుడు మొదలైన రూపాలుగల దానిని; ఇష్ట దైవంబుగాన్= ఇష్టమైన దైవస్వరూపంగా; కని= చూచి; వేడ్కన్= మిక్కిలి ప్రీతితో; భజియించువారలు= పూజించేవారు; ఈశ్వరున్= పరమాత్మను; కనంగాన్+నేర్తురే= చూడగలరా?

**తా :** వేదం చాలా గొప్పది. ఎంతో వ్యాప్తి కలది. దానికి అంతం లేదు. అటువంటిది మరొకటి లేదు. అటువంటి దానిని వల్లెవేస్తూ వేరువిధాలైన మంత్రాలను జోడించి దే నామం గల శుభాన్ని కూర్చే సామర్థ్యంగల ఇంద్రుడు మొదలైన నానా దేవతలను ఇష్టదైవంగా ఎంచుకొని ప్రీతితో పూజిస్తూ ఉంటారు. అట్టివారికి నిజమైన పరమాత్మతత్త్వం ఎలా తెలిసివస్తుంది?

**విశే :** వేదాలలో చాలాభాగం అర్థవాదం. అది లక్ష్యం ఏర్పడటం కోసం మహిమను విస్తృతంగా ప్రశంసిస్తూ ఉంటుంది. అలా పూజ్యతను పొందినవారు ఇంద్రాది దేవతలు. వారు దేవతలే కానీ వారికి కూడా ఆరాధించదగిన తత్త్వం ఒకటి ఉంది. ఆ పరమాత్మస్థాయికి పోలేక కిందిస్థాయిలోనే నిలిచి పోయేవారు గమ్యాన్ని చేరుకోలేరు అని చెప్పటం ఈ పద్యం ఉద్దేశం.

**క. విను మాత్మ భావితుం డన, నెనసిన భగవంతుఁ డెప్పు డెవ్వనిఁ గరుణం**
**దనరుచు ననుగ్రహించును, మనుజేశ్వర! యపుడు వాఁడు మహితాత్మకుఁడై, 875**

**ప్రతి :** మనుజ+ఈశ్వర!= మానవుల ప్రభువా!; వినుము= ఆలకించు; ఆత్మ భావితుండు= ఆత్మగా భావనకు వచ్చినవాడు; అనన్= అనగా; ఎనసిన భగవంతుఁడు= ఒప్పారిన భగవంతుడు; ఎప్పుడు= ఏ సమయంలో; ఎవ్వనిన్= ఏ వ్యక్తిని; కరుణన్= దయతో; తనరుచున్= ఒప్పుచూ; అనుగ్రహించును= ఏలుకొంటాడో; అపుడు= అప్పుడే; వాఁడు= ఆ భక్తుడు; మహిత+ఆత్మకుఁడు+ఐ= మహిమతో కూడిన ఆత్మకలవాడై.

**తా :** రాజా! విను. ఆత్మగా భావించబడే ఆ భగవంతుడు ఎప్పుడు ఎవరిని అనుగ్రహిస్తాడో అప్పుడు ఆ భాగవతుడు పూజ్యమైన ఆత్మకలవాడై

**విశే :** ఆత్మ భావితుడు- ఆత్మయందు భావించబడినవాడు అని శ్రీధరీయం. జీవుడు తన హృదయంలో ఏ చైతన్యాన్ని భావిస్తాడో ఆ చైతన్యమే 'ఆత్మ' అని తాత్పర్యం.

**క. ధీరత నీ లోకవ్యవ, హారంబును వైదికంబు ననఁదగు కర్మా**
**చారములందు వినిష్ఠిత, మై రూఢిఁ దనర్చు బుద్ధి నర్థిన్ విడుచున్. 876**

**ప్రతి :** ధీరతన్= బుద్ధిచేత రమించే లక్షణంచేత; ఈ లోక వ్యవహారంబును= ప్రాపంచికమైన పనులుచేస్తూ ఉండటాన్ని; వైదికంబున్= వేదసంబంధమైనది; అనన్+తగు= అనటానికి వీలైన; కర్మ+ఆచారములందున్= యజ్ఞాలు మొదలైన

కర్మలను చేయటంలో; వినిష్ఠితము+ఐ= స్థిరపడినదై; రూఢిన్+తనర్చు= ప్రసిద్ధి పొందిన; బుద్ధిన్= బుద్ధిని; అర్థిన్= ప్రయత్నంతో; విడుచున్= వదలివేస్తాడు.

**తా :** (భగవదనుగ్రహం పొందిన జీవుడు మహాత్ముడై) ధీరబుద్ధితో ఈ లోకవ్యవహారాన్ని, వైదికములైన యజ్ఞాదులైన కర్మాచరణలతో గట్టి నిలుకడ కలదై దృఢపడిన బుద్ధిని ప్రయత్నంతో విడిచి వేస్తాడు.

**సీ. కావున రాజేంద్ర! నీవును బరమార్థ, రూపంబు లగుచుఁ బ్రరోచమాన**
**ములును గర్ణప్రియంబులును నస్పృష్ట వ, స్తువులును నైన యీ వివిధ కర్మ**
**ములయందుఁ బురుషార్థ బుద్ధి గావింపకు, మతిఘన స్వాంతు లైనట్టివారు**
**పరఁగు జనార్దన ప్రతిపాదకంబైన, శ్రుతిఁ గర్మపర మని చూపుచుండు**

**తే. వారు వేదజ్ఞు లనఁదగువారు గారు, రూఢి మతివారు నిత్యస్వరూపభూత**
**మైన యీ యాత్మతత్త్వంబు నలరు వేద, కలిత తాత్పర్యమని యాత్మఁ దెలియలేరు. 877**

**ప్రతి :** రాజ+ఇంద్ర= రాజులలోమేటి అయినవాడా!; కావునన్= కాబట్టి; నీవునున్= నీవుకూడా; పరమ+అర్థ రూపంబులు= మేలైన అర్థంలాగా కనిపించేవి; అగుచున్= అవుతూ; ప్రరోచమానములును= రుచి పుట్టించేవి; కర్ణ ప్రియంబులును= చెవికి ఇంపైనవి; అస్పృష్ట వస్తువులునున్+ఐన= ఎల్లప్పుడూ ఏక రూపంగా ఉండే పరమాత్మను తాకనివి అయిన; ఈ+వివిధకర్మములయందున్= ఈ పెక్కుతీరులుగల యజ్ఞాలు మొదలయిన కర్మలందు; పురుష+అర్థ+బుద్ధిన్= పురుషార్థాలు అయిన ధర్మాదులు ఫలించటం అనే బుద్ధిని; కావింపకు= చేసుకోకు; అతి ఘన స్వాంతులు= చాలా గొప్ప భావనకలవారు; పరఁగు= ఒప్పారే; జనార్దన ప్రతిపాదకంబు+ఐన= మహావిష్ణువును నిరూపించేదైన; శ్రుతిన్= వేదాన్ని; కర్మపరము= కర్మలకు మాత్రమే చెందినది; అని; చూపుచున్+ఉండువారు= వక్కాణిస్తూ ఉండేవారు; వేదజ్ఞులు= వేదతత్త్వం తెలిసినవారు; అనన్+తగువారు= అనదగినవారు; కారు; రూఢిన్= చక్కగా నెలకొని ఉన్న తాత్పర్యంతో; మతి వారు= అట్టివారు; నిత్య, స్వరూప, భూతము+ఐన= ఎల్లప్పుడూ చెడకుండా ఉండే స్వరూపం కలదైన; ఈ ఆత్మతత్త్వంబున్= ఈ ఆత్మకు సంబంధించిన తత్త్వాన్ని; అలరు= ఒప్పునట్టి; వేద కలిత తాత్పర్యము= వేదనిర్దిష్టమైన తాత్పర్యం అని; ఆత్మన్= బుద్ధితో; తెలియలేరు= తెలుసుకోలేరు.

**తా :** రాజేంద్రా! కాబట్టి నీవు కూడా పరమార్థాలుగా కనిపించేవీ, మనస్సును ఆకర్షించేవీ, వినటానికి ఇంపుగా ఉండేవీ, పరమాత్మను తాకనివీ అయిన పెక్కు విధాలయిన యజ్ఞాది కర్మలందు అవే పురుషార్థాలు అనే బుద్ధిని పెట్టుకోకు. మరి గొప్ప తెలివితేటలు గలవారు శ్రీమహావిష్ణువును మాత్రమే నిరూపించే వేదాన్ని కర్మపరంగా వక్కాణిస్తూ ఉంటారు. వారిని వేదతత్త్వం తెలిసినవారు అనటానికి వీలులేదు. వారు నిత్యం సత్యం అయిన పరమాత్మతత్త్వాన్ని పట్టుకొనే సామర్థ్యం కలవారు కారు.

**విశే :** ప్రరోచమానంబులు - కేవలం చెవికి మాత్రమే రుచిని పుట్టించేవి; అస్పృష్ట వస్తువులు- వస్తువు అంటే ఇక్కడ పరమాత్మ అనే అర్థాన్ని గ్రహించాలి. పరమాత్మను తాకనివి. అంటే అనిత్యమైన ప్రపంచాన్ని మాత్రమే తాకేవి అని తాత్పర్యం.

**వ. కావునం బ్రాగగ్రంబులైన దర్భలచేత సకలక్షితిమండలాస్తరణంబు గావించి యహంకార యుక్తుండవు నవినీతుండవు పెక్కుపశువులం జంపనే కాని కర్మస్వరూపంబును విద్యాస్వరూపంబును నెఱుంగ, వా కర్మ విద్యాస్వరూపంబు లెట్టి వనిన సర్వేశ్వర పరితోషకం బేది, యదియ కర్మం, బా సర్వేశ్వరునియందు నేమిట మతి సంభవించు నదియ విద్య, యతండే దేహులకు నాత్మయు నీశ్వరుండు నగుచుండుఁ, గావునఁ బురుషులకు క్షేమకరంబైన యాశ్రయంబు తద్పాదమూలంబ, యతండు ప్రియతముండును సేవ్యమానుండును నగుచుండ నణుమాత్రం బయిన దుఃఖంబులే, దట్టి యా భగవత్స్వరూపం బెవ్వం డెఱుంగు, వాఁడు విద్వాంసుండును గురుండును హరియు నని చెప్పి వెండియు నిట్లనియె. 878**

ప్రతి : కావునన్= కాబట్టి; ప్రాక్+అగ్రంబులు+ఐన= తూర్పునకు చివళ్ళు కలవైన, దర్భలచేతన్= దర్భలచేత; సకల, క్షితి, మండల+ఆస్తరణంబు= మొత్తం భూమండలమంతా పరచటం; కావించి= చేసి, అహంకారయుక్తుండవు= నేనింతవాడను అనే భావంతో కూడియున్నవాడవు; అవినీతుండవు= వినయం లేనివాడవు; పెక్కుపశువులన్= చాలా జంతువులను; చంపన్+ఏ, కాని= చంపడానికే కానీ; కర్మస్వరూపంబును= కర్మల నిజమైన స్థితినీ; విద్యా స్వరూపంబునున్= విద్యతత్త్వాన్నీ; ఎఱుంగవు= తెలియవు; ఆ, కర్మ, విద్యా, స్వరూపంబులు= ఆ కర్మం, విద్య అనే వాటి స్వభావాలు; ఎట్టివి= ఏ విధమైనవి; అనినన్= అంటే; సర్వ+ఈశ్వర, పరితోషకంబు= అన్నింటికీ అందరికీ ప్రభువైన భగవంతుని గొప్పగా సంతోషపెట్టేది; ఏది= ఏదో; అదియ= అదే; కర్మంబు= యజ్ఞం మొదలైన కర్మం; ఆ, సర్వేశ్వరునియందున్= సర్వానికి ప్రభువైన ఆ పరమాత్మయందు; ఏమిటన్= దేనివలన; మతి= బుద్ధి; సంభవించున్= ఏర్పడుతుందో; అదియ= అదే; విద్య; అతండు+ఎ= ఆ పరమాత్మయే; దేహులకున్= శరీరులకు; ఆత్మయున్= ఆత్మయును; ఈశ్వరుండున్= పాలకుడును; అగుచున్+ఉండున్= అవుతూ ఉంటాడు; కావునన్= కనుక; పురుషులకున్= మానవులకు; క్షేమకరంబు+ఐన= క్షేమాన్ని చేసేదైన; ఆశ్రయంబు= ఆధారం; తద్+పాద, మూలంబు+అ= అతనిపాదాల మొదలే; అతండు= ఆ భగవంతుడు; ప్రియతముండును= చాలా ఇష్టమైనవాడూ; సేవ్యమానుండును= అందరిచేతను పూజింపబడుతున్నవాడునూ; అగుచున్+ఉండన్= అవుతుండగా; అణుమాత్రంబు+అయిన= అణువంత అయినా; దుఃఖంబు= శోకం; లేదు; అట్టి, ఆ, భగవత్స్వరూపంబు= అటువంటి ఆ భగవంతుని తత్త్వాన్ని; ఎవ్వండు= ఏ మనుజుడు; ఎఱుంగున్= తెలుసుకుంటాడో; వాఁడు= ఆ వ్యక్తి; విద్వాంసుండును= పండితుడు; గురుండును= గురువు; హరియును= శ్రీమహావిష్ణువు; అని; చెప్పి; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** కాబట్టి, నీవు తూర్పునకు చివళ్ళు కలుగునట్లుగా దర్భలను పరచి, భూమండలాన్నంతా యజ్ఞవేదికగా చేసి నేనింతవాడను అనుకొంటూ, వినయాన్ని వదలివేసి చాలా పశువులను చంపటం తెలుసుకున్నావు, కానీ నిజమైన కర్మతత్త్వం ఏమిటి? విద్యాస్వభావం ఏమిటి? అనేది తెలిసికోలేదు. ఆ కర్మ, విద్యా స్వభావాలు ఏమిటంటే సర్వేశ్వరుని సంతోషపెట్టేదే కర్మం. సర్వేశ్వరునియందు బుద్ధిపుట్టించేదే విద్య. ఆ సర్వేశ్వరుడే దేహం ధరించిన జీవులకు ఆత్మయు పాలకుడున్నూ. కాబట్టి, మానవులకు క్షేమాన్ని కలిగించేది ఆయన పాదాలను ఆశ్రయించటమే. అతడు మిక్కిలి ప్రియమైనవాడూ, మనసేవలందుకొనేవాడూ అయితే దుఃఖం అణువంత కూడా కలుగదు. అటువంటి **ఆ భగవంతుని తత్త్వాన్ని తెలుసుకొని బోధించగలవాడే పండితుడు, గురువు, హరి** – అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.

**విశే :** హరియందు బుద్ధిపుట్టించేదే విద్య. ఎందుకంటే దానివలన కలిగేది మహాఫలం కనుక.

క. అవనీశ! యీ విధంబున, భవదీయ ప్రశ్న మిట్లు పరిహృత మయ్యెం,
దవిలి యింక నొక్క గోప్యము, వివరించెదఁ జిత్తగింపు విమలచరిత్రా! 879

**ప్రతి :** అవనీ+ఈశ= భూమికి ఏలికవైన ఓ రాజా!; విమలచరిత్రా= స్వచ్ఛమైన నడవడికలవాడా! భవదీయ, ప్రశ్నము= నీదైన సందేహం; ఇట్లు= ఈ విధంగా; పరిహృతము+అయ్యెన్= తొలగించబడినది; తవిలి= పూనుకొని; ఇంకన్= ఇంకా; ఒక్క, గోప్యము= ఒకరహస్యాన్ని; వివరించెదన్= తెలియజేస్తాను; చిత్తగింపుము= హృదయంలో నిలుపుకో.

**తా :** స్వచ్ఛమైన శీలంకల ఓరాజా! నీ సందేహాన్ని ఈ విధంగా తీర్చాను. చాలా పూనికతో మరొక్క రహస్యమైన విషయాన్ని నీకు తెలియజేస్తాను. మదిలో నిలుపుకో.

సీ. లలి సుమనో వాటికల యందు నల్ప ప్రసూన మరంద గంధానుమోద
సంచారియును మృగీసహితముఁ దన్నివేశిత చిత్తమును మధువ్రత నినాద
మేదుర శ్రవణానుమోదితమును బురోభాగ చరన్నిజ ప్రాణహారి
దీపిత వృక గణాధిష్ఠితమును లుబ్ధక క్రూర ఘన సాయక ప్రభిన్న

తే. పృష్ఠభాగంబునై తగ నెదను మృత్యు, భీతి వాటిల్ల నొండు దప్పింప వెరవు
గాన కడవిఁ జరించు మృగంబు పగిది, భూవరోత్తమ! వినవయ్య! పురుషుఁ డెపుడు. 880

**ప్రతి :** భూవర+ఉత్తమ= రాజవర్యా; వినవయ్య= వినుమా!; లలిన్= క్రమంగా; సుమనస్+వాటికలయందున్= పూలతోటలయందు; అల్ప= కొంచెంపాటి; ప్రసూన= పూవుల; మరంద= తేనె యొక్క; గంధ+అనుమోద= సువాసనచే గల్గిన ఆనందంతో; సంచారియును= తిరుగుతూ ఉండేదీ; మృగీ సహితము= ఆడులేళ్ళతో కూడినదీ; తత్+నివేశిత చిత్తమునున్= అందే ఉంచబడిన మనస్సుతో; మధువ్రత= తుమ్మెదల; నినాద= ఝుంకారాలతో; మేదుర= దట్టమైన; శ్రవణ= చెవులయందు; అనుమోదితమును= విడువని ఆనందం కలదియు; పురస్= ముందు ఉన్న; భాగ= ప్రదేశంలో; చరత్= తిరుగుచున్న; నిజ= తన; ప్రాణ= ప్రాణాలను; హారి= హరించే; దీపిత= చక్కగా కానవస్తున్న; వృక= తోడేళ్ళ; గణ= మందచేత; అధిష్ఠితమును= ఆక్రమించబడినదీ; లుబ్ధక= వేటగాండ్ర; క్రూర= దయలేని; ఘన= పెద్దవి అయిన; సాయక= బాణాలచేత; ప్రభిన్న= బాగుగా చీలిపోయిన; పృష్ఠ భాగంబును+ఐ= పిరుదుల ప్రదేశం కలదీ అయి; తగన్= తగునట్లుగా; ఎదను= హృదయంలో; మృత్యు భీతి= చావు భయం; వాటిల్లన్= కలుగగా; తప్పింపన్= తొలగించటానికి; ఒండు= మరొక; వెరవు= ఉపాయం; కానక= చూడక; అడవిన్= అడవిలో; చరించు మృగంబు పగిదిన్= తిరిగే లేడిలాగా; పురుషుఁడు= మానవుడు; ఎపుడున్= ఎల్లవేళలా...

**తా :** రాజా! విను. ఒక జింక పూలతోటలలో తిరుగుతూ ఉంటుంది. కొద్దిపాటి పూలవాసన వెంటబడి మనస్సులో పొంగిపోతూ తిరుగుతూ ఉంటుంది. వెంటకొన్ని ఆడుజింకలు ఉంటాయి. దాని మనసంతా వాని మీదనే అంటి పెట్టుకొని ఉంటుంది. తుమ్మెదలు ఝుంకారాలతో చెవులకు విందు చేస్తూ ఉంటాయి. దాని ముందు తన ప్రాణాలను లాగివేయటానికి తోడేళ్ళ మంద ఉత్సాహంతో నిలబడి ఉంటుంది. వేటకాడు మిక్కిలి వాడిబాణాలతో పిరుదులను చీల్చివుంటాడు. గుండెలో చావుభయం కలుగుతూ ఉంటుంది. తప్పించటానికి ఒక్క ఉపాయం కూడా కానరాక అడవిలో తిరుగుతూ అతలాకుతలమయ్యే ఆ మృగంలాగా జీవుడు సర్వకాలాలలో

**వ. అంగనా నివాసంబుల యందు క్షుద్రతమంబగు కామ్య కర్మ పరిపాక జనితంబైన జిహ్వోపస్థాది కామజనిత సుఖలేశంబుల నన్వేషించుచుఁ, గామినీయుక్తుండును, దన్నివేశిత మానసుండును నతిమనోహర వనితాజనాలాప శ్రవణ తత్పర చిత్తుండును, బ్రత్యక్షంబున నాయుర్హరణ కార ణాహోరాత్రాది కాలవిశేషగణనా పరుండునుగాక పరోక్షంబునం గృతాంత శరనిర్భిన్న గాత్రుండును నగుచు నీ జీవుండు విహరించు చుండుం, గావున నీవు నీ జీవుని మృగచేష్టితునిఁగా విచారించి శ్రోత్రాదులందున్న శబ్దాదులం బోలె బాహ్య వృత్తులగు శ్రౌతస్మార్తాది రూప కర్మంబును హృదయంబునందు నియమించుచు నసజ్జనయూథ వార్తాసహితం బైన గృహాశ్రమంబు విడువుము, సకల జీవాశ్రయుండైన యీశ్వరుని భజియింపు, మిట్లు సర్వతో విరక్తుండవు గమ్మని నారదుండు పలికినం బ్రాచీనబర్హి యిట్లనియె. 881**

ప్రతి : అంగనా నివాసంబులయందున్= అందగత్తెల ఇండ్లలో; క్షుద్ర తమంబు+అగు= మిక్కిలి నీచమైనదగు; కామ్య, కర్మ, పరిపాక, జనితంబు+ఐన= కోరికలకు సంబంధించిన పనుల, పంటవలన పుట్టినది అయిన; జిహ్వా= నాలుక; ఉపస్థా= గుహ్యమగు అవయవం; ఆది= మొదలైన; కామ= కోరికలవలన; జనిత= పుట్టిన; సుఖలేశంబులన్= అల్పసుఖాలను; అన్వేషించుచున్= వెదకుతూ; కామినీ యుక్తుండును= కోరికలను రేకెత్తించు స్త్రీలతో కూడిన వాడును; తత్+నివేశిత మానసుండును= వారియందు నిలిపి ఉంచిన మనస్సు కలవాడును; అతిమనోహర= చాలా ఎక్కువగా మనస్సును ఆకర్షించే; వనితా జన= ఆడువారి; ఆలాప= ఇంపైన పలుకులను; శ్రవణ= వినుటయందు; తత్పర= తగులుకొనిన; చిత్తుండును= మనస్సు కలవాడును; ప్రత్యక్షంబునన్= కన్నులకు కనపడే స్థితిలో; ఆయుః= ప్రాణాలతో ఉండే కాలాన్ని; హరణ= తీసికొనిపోవటానికి; కారణ= హేతువైన; అహస్= పగలు; రాత్ర+ఆది= రాత్రి మొదలైన; కాల= కాలపు; విశేష= ప్రత్యేకదశలను; గణనా= లెక్కించుటలో; పరుండును= శ్రద్ధకలవాడును; కాక; పరోక్షంబునన్= చాటుమాటుగా; కృత+అంత= యముని; శర= బాణాలతో; నిర్భిన్న= చీల్చివేయబడిన; గాత్రుండును= దేహం కలవాడును; అగుచున్= అవుతూ; ఈ జీవుండు= 'జీవుడు' అనే వ్యవహారంగల ఈ ప్రాణి; విహరించుచున్= తిరుగుతూ; ఉండున్= ఉంటాడు; కావునన్= కాబట్టి; నీవును= నీవుకూడా; ఈ జీవునిన్= ఈ జీవుని; మృగచేష్టితునిన్+కాన్= పశువు వంటి చేష్టలు కలవానినిగా; విచారించి= భావించి; శ్రోత్ర+ఆదులందున్+ఉన్న= చెవి మొదలైన వానియందు ఉన్నట్టి; శబ్ద+ఆదులన్+పోలె= శబ్దం మొదలైన వానివలె; బాహ్య వృత్తులు+అగు= వెలుపలి వ్యాపారాలు అయిన; శ్రౌత+స్మార్త= వేదాన్ని బట్టి చేసేవి, స్మృతులను బట్టి ఆచరించేవీ; ఆది= మొదలైన; రూప= స్వరూపంగా ఉన్న; కర్మంబును= యజ్ఞం మొదలైన కార్యవిశేషాన్ని; హృదయంబునందున్= మనస్సులో; నియమించుచున్= అదుపులో ఉంచుకొంటూ; అసత్= చెడ్డ; జన= జనుల; యూథ= మందల; వార్తా= వార్తలతో; సహితంబు+ఐన= కూడినదైన; గృహ+ఆశ్రమంబున్= ఇంటివానిదైన ఆశ్రమాన్ని; విడువుము= వదలిపెట్టు; సకల జీవ+ఆశ్రయుండు+ఐన= అన్ని విధాల ప్రాణులకు ఆధారభూమియైన; ఈశ్వరునిన్= సర్వలోకాలకూ ప్రభువైనవానిని; భజియింపుము= సేవించు; ఇట్లు= ఈ విధంగా; సర్వతః+విరక్తుండవు= అన్ని వైపులనుండి తగులం లేనివాడవు; కమ్ము= అగుము; అని; నారదుండు= నారదమహర్షి; పలికినన్= పలుకగా; ప్రాచీనబర్హి= ప్రాచీనబర్హి అనే పేరుగలరాజు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** స్త్రీల నివాసాలలో చాలా నీచమైన కోరికల చేత చేసిన పనులు ఫలించుటచేత లభించిన నాలుక, ఉపస్థ మొదలగు వాని వలన కలిగెడి స్వల్ప సుఖములను వెదుకుచూ స్త్రీలతో కలసి ఉన్నవాడూ, వారియందే ఉంచిన మనస్సు కలవాడూ అయి, చాలా ఇంపుగా ఉండే ఆడువారి మాటలను వినటమే పని అయినవాడై, ఎదురుగా ఆయువును దొంగిలించే పనికి

కారణాలైన రాత్రిబవళ్లను లెక్కించటం అనే పని పెట్టుకోకుండా, చాటుమాటుగా వచ్చిపడే యముని ఆయుధాలకు ఒడలంతా చీలిపోగా, వినోదంగా తిరుగుతూ ఉంటాడు. ఇదంతా ఒక మృగపు చేష్టవంటిది. నీవు దానిని బాగా మనస్సుకు పట్టించుకొని చెవులు మొదలైన ఇంద్రియాలలో ఉన్న శబ్దం మొదలైన వానినిలాగా, వేదాలూ స్మృతిగ్రంథాలూ చెప్పిన వెలుపలి విషయాల వంటివి అయిన యజ్ఞం మొదలైన కర్మలను హృదయంలోనే అణచి ఉంచుకొంటూ మంచివారు కాని మానవుల మందల మాటలకు సంబంధించిన గృహాశ్రమాన్ని విడిచిపెట్టు. జీవులన్నింటికీ ఆశ్రయించదగినవాడయిన ఈశ్వరుని సేవించుకో. క్రమక్రమంగా భౌతికమైన సర్వవిషయాలనుండీ విరక్తిని పొందు– అని నారదుడు ఉపదేశించగా ప్రాచీనబర్హి ఇలా అన్నాడు.

**విశే :** దీనినే యుక్త, అయుక్త వివేకజ్ఞానం అంటారు. సాధారణంగా జీవుడు తనకు శాశ్వత ప్రయోజనాన్ని కలిగించేదానిని పట్టించుకోడు. అప్పటికి సుఖంగా ఉన్నట్లు కనిపించే దాని వెంటబడతాడు. దానితో రెండు వైపులా నష్టమే కలుగుతుంది. సంసారం ఎన్ని జన్మలకైనా పెరుగుతూనే ఉంటుంది. ఇది పెద్ద అనర్థం.

**క. మునివర! భగవంతుండవు, ననుపమ విజ్ఞాననిధివి ననఁదగు నీచే**
**తను వివరింపంగాఁ దగి, యెనసిన యీ యాత్మతత్త్వ మిట నా చేతన్. 882**

**ప్రతి :** మునివర!= మునులలో శ్రేష్ఠుడా!; భగవంతుండవు= మిక్కిలి భగవానునివలె పూజ్యుడవు; అనుపమ విజ్ఞాననిధివి= సాటిలేని విజ్ఞానానికి గనివంటి వాడవు; అనన్+తగు= అనటానికి యోగ్యత గల; నీచేతను= నీచేత; వివరింపన్+కాన్= వివరించగా; తగి= ఒప్పారి; ఎనసిన= ప్రకాశిస్తున్న; ఈ ఆత్మ తత్త్వము= ఈ ఆత్మకు సంబంధించిన జ్ఞానం; ఇట= ఇక్కడ; నా చేతన్= నా చేత...

**తా :** మహర్షివరేణ్యా! నీవు సాక్షాత్తు భగవంతు డనదగినవాడవు, సాటిలేని విజ్ఞానమంతటికీ నిధి అనదగిన వాడవు. ఇట్టి నీవు వివరించగా ఒప్పారిన ఈ ఆత్మతత్త్వం ఇక్కడ నాచేత

**వ. శ్రుతంబును విచారితంబును నయ్యెఁ, గర్మనిష్ఠ లగు నుపాధ్యాయు లైనవార లీ యాత్మతత్త్వంబును నెఱుంగ, రెఱింగిరేని యుపదేశింపరు. కావునఁ దత్కృతంబయిన మహాసంశయంబు నీ చేత నివృత్తం బయ్యెనని వెండియు నిట్లనియె. 883**

**ప్రతి :** శ్రుతంబు= వినబడినది; విచారితంబునున్= బుద్ధిబలంతో భావించబడినది; అయ్యెన్= అయినది; కర్మ నిష్ఠలు= కర్మలయందే చెదరని నిష్ఠకలవారు; అగు= అయిన; ఉపాధ్యాయులు= గురువులు; ఐన వారలు= అయినవారు; ఈ ఆత్మ తత్త్వంబునున్= ఆత్మకు సంబంధించిన ఈ జ్ఞానాన్ని; ఎఱుంగరు= తెలియరు; ఎఱింగిరి+ఏనిన్= ఒక వేళ తెలిసినా; ఉపదేశింపరు= తక్కినవారికి దీనిని నేర్పరు; కావునన్= కాబట్టి; తద్+కృతంబు= దానిచేత చేయబడినది; అయిన= అయినట్టి; మహాసంశయంబు= చాలా గొప్పది అయిన సందేహం; నీ చేతన్= నీ వలన; నివృత్తంబు= మరలిపోయినది; అయ్యెన్= అయినది; అని; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** వినబడినది. చక్కగా విచారించబడినది. కర్మలయందే స్థిరంగా నిలిచి ఉన్న వారయిన గురువులు ఈ ఆత్మకు సంబంధించిన తత్త్వాన్ని ఎరుగరు. తెలిసి ఉండినా ఇతరులకు ఉపదేశించరు. కాబట్టి, దానివలన కలిగే సంశయం చాలా గొప్పది. దానిని నీవు తీర్చావు! అని ఇంకా ఇలా అన్నాడు.

విశే : ఇక్కడ శ్రుతం అంటే శ్రవణం అనీ, విచారితం అంటే మననం అనీ భావించాలి.

**సీ. అనఘాత్మ! యేమిటి యందు నీ యింద్రియ వృత్తులు దగఁ బ్రవర్తింపకుండు**
**టను జేసి ఋషులైన ఘనముగ మోహింతు రట్టి యర్థము నందు నాత్మ సంశ**
**యము గల్గుచున్నది, యది యెట్టి దనినను బురుషుఁ డే యే దేహమునను జేసి**
**కర్మముల్ సేసి తత్కాయంబు నీ లోక మందునే విడిచి తా నన్యదేహ**

**తే. మర్థితో ఘటియించి లోకాంతరమును, బొంది తత్కర్మఫలమును బొందు ననుచుఁ**
**బ్రకటముగ వేదవేత్తలు వలుకు చుందు, రన్న నది యెట్లు విన నుపపన్న మగును? 884**

ప్రతి : అనఘ+ఆత్మ= పుణ్యం పండిన బుద్ధికల ఓ మహర్షీ; ఏమిటి+అందున్= దేనియందు; ఈ ఇంద్రియ వృత్తులు= ఇంద్రియాలకు సంబంధించిన ఈ వ్యాపారాలు; తగన్= తగువిధంగా; ప్రవర్తింపక+ఉండుటను+చేసి= మెలగకుండా ఉండటంవలన; ఋషులు+ఐనన్= మంత్రాలను దర్శించేవారైనా; ఘనముగన్= పెద్దగా; మోహింతురు= పొరపాటుపడతారో; అట్టి అర్థమునందున్= అటువంటి విషయంలో; ఆత్మన్= మనస్సులో; సంశయము= సందేహం; కల్గుచున్నది= ఏర్పడుతున్నది; అది; ఎట్టిది= ఏ విధమైనది; అనినను= అంటే; పురుషుఁడు= జీవుడు; ఏయే దేహమునను+చేసి= ఏయే శరీరంతో; కర్మముల్= కర్మలు; చేసి= కావించి; తత్+కాయంబున్= ఆ దేహాన్ని; ఈ లోకమందున్+ఏ= ఈ లోకంలోనే; విడిచి= వదలిపెట్టి; తాను; అన్యదేహము= మరొక శరీరాన్ని; అర్థితోన్= కోరికతో; ఘటియించి= కూర్చుకొని; లోక+అంతరమును= మరొక లోకాన్ని; పొంది= చేరుకొని; తత్+కర్మ ఫలమున్= ఆ కర్మ ఫలాన్ని; పొందున్= అనుభవిస్తాడు; అనుచున్= అంటూ; వేదవేత్తలు= వేదాల తత్త్వం తెలిసినవారు; ప్రకటముగన్= ప్రసిద్ధంగా; పలుకుచున్+ఉందురు= మాట్లాడుతూ ఉంటారు; అన్నన్= అంటే; అది= ఆ మాట; వినన్= వినడానికి; ఎట్లు= ఏ విధంగా; ఉపపన్నము= చక్కగా పొందిక కలది; అగును= అవుతుంది?

తా : పుణ్యాత్మా! గొప్పతపస్సు చేసిన మహర్షులకైనా పరమాత్మయందు ఇంద్రియాల ప్రవృత్తులు ప్రవర్తించక పోవటం వలన వారుకూడా మోహపడుతూ ఉంటారు. అటువంటి తత్త్వవిషయంలో ఒక సంశయం కలుగుతుంది. అది ఏమంటే జీవుడు ఏ దేహంతో చేసిన కర్మలు ఆ దేహంలోనే ఇక్కడ– ఈ లోకంలో– విడిచివేసి మరొక దేహం ఏర్పాటు చేసుకొని మరొక లోకంలో ఆ కర్మఫలాన్ని అనుభవిస్తాడు అని వేదం తెలిసినవారు ప్రకటంగా పలుకుతూ ఉంటారు. అది ఎలా కుదురుతుంది?

**వ. అదియునుం గాక యాచరితంబైన కర్మంబు తత్క్షణంబు వినష్టం బగుటంజేసి జీవుండు దేహాంతర లోకాంతర భావి యయిన ఫలం బెట్లు సంభవించు ననిన ప్రాచీనబర్హికి నారదుం డిట్లనియె. నరేంద్రా! స్వప్నావస్థయందు లింగశరీరాధిష్ఠాతయైన జీవుండు జాగ్రద్దేహాభిమానంబు విడిచి తాదృశంబ కాని యతాదృశంబ కాని యైన శరీరాంతరంబు నొంది మనంబునందు సంస్కార రూపంబున నాహితంబైన కర్మంబు ననుభవించు చందంబునం బురుషుం డే లింగశరీరంబునం జేసి కర్మంబు నాచరించు, నా లింగశరీరంబుననే లోకాంతరంబున దేహవిభేదంబు నొందక తత్ఫలం బనుభవించు, నదియునుం గాక దాన ప్రతిగ్రహాదుల యందు స్థూలదేహంబునకుం గర్తృత్వంబు గల దంటివేని నహంకార మమకార**

**యుక్తుండైన పురుషుండు మనంబునం జేసి యే యే దేహంబు పరిగ్రహించు, నా యా దేహంబున సిద్ధంబైన కర్మం బా జీవుం డనుభవించు, నట్లు గాకున్నఁ గర్మంబు పునర్భవ కారణం బగుట యుపపన్నంబు గాకుండుఁ, గావున మనఃప్రధానం బైన లింగశరీరంబునకే కర్తృత్వం బుపపన్నం బగునని వెండియు నిట్లనియె. 885**

**ప్రతి :** అదియునున్+కాక= అంతేకాక; ఆచరితంబు+ఐన= చేయబడినదైన; కర్మంబు= కర్మ; తత్ క్షణంబునన్= ఆ క్షణంలోనే; వినష్టంబు= పూర్తిగా నశించినది; అగుటన్+చేసి= అయినందువలన; జీవుండు= జీవుడు; దేహాంతర లోకాంతర భావి= మరొక దేహంలో, మరొక లోకంలో కలిగేది; అయిన; ఫలంబు= ఫలాన్ని; ఎట్లు= ఏవిధంగా; అనుభవించున్= అనుభవిస్తాడు?; అనినన్= అని ప్రశ్నించగా; ప్రాచీనబర్హికిన్= ప్రాచీనబర్హికి; నారదుండు= నారదమహర్షి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; నరేంద్రా!= రాజా!; స్వప్న+అవస్థయందున్= కలల దశలో; లింగ శరీర+అధిష్ఠాత+ఐన= సూక్ష్మ దేహమందు నెలకొని ఉన్నవాడైన; జీవుండు= జీవుడు; జాగ్రత్+దేహ+అభిమానంబున్= మేలుకొని ఉన్నప్పటి దేహంమీది అభిమానాన్ని (నేను ఇప్పుడు ఈ దేహంలో ఉండి ఏదో అనుభవిస్తున్నాను అనే భావాన్ని); విడిచి= వదలి; తాదృశంబు+అ= అటువంటిదే; కాని= కానట్టి; అతాదృశంబు+అ= అటువంటిదే కానిది; కాని= కానట్టు; ఐన శరీర+అంతరంబున్= మరొక దేహాన్ని; ఒంది= ఏర్పరచుకొని; మనంబునందున్= మనస్సులో; సంస్కారరూపంబునన్= మునుపు ఏర్పడిన స్మృతి, బలంమొదలైన వాని రూపంతో; ఆహితంబు+ఐన= ఉంచబడినదైన; కర్మంబున్= కర్మను; అనుభవించు చందంబునన్= అనుభవించే విధంగా; పురుషుండు= జీవుడు; ఏ లింగ శరీరంబునన్+చేసి= ఏ కారణదేహంతో; కర్మంబున్= ఆ యా కర్మను; ఆచరించున్= చేస్తాడో; ఆ లింగశరీరంబునన్+ఏ= ఆ కారణ దేహం చేతనే; లోక+అంతరంబునన్= మరొకలోకంలో; దేహవిభేదంబున్= మరొక దేహం అనే భేదాన్ని; ఒందక= పొందకుండా; తత్+ఫలంబున్= ఆ ఫలాన్ని; అనుభవించున్= అనుభవిస్తాడు; అదియునున్+కాక= అంతేకాకుండ; దాన ప్రతిగ్రహ+ఆదులయందున్= ఇవ్వటం, పుచ్చుకోవటం మొదలైన వాటియందు; స్థూలదేహంబునకున్= స్థూలమైన దేహానికి; కర్తృత్వంబు= చేసేది అనే భావం; కలదు= ఉంది; అంటివి+ఏని= అంటే; అహంకార మమకార యుక్తుండు+ఐన= నేను, నాది అనే భావాలతో కూడుకొన్నవాడైన; పురుషుండు= జీవుడు; మనంబునన్+చేసి= మనస్సుతో; ఏయే దేహంబున్= ఏయే శరీరాన్ని; పరిగ్రహించున్= చక్కగా తీసుకుంటాడో; ఆయా దేహంబునన్= ఆయా దేహంలో; సిద్ధంబు+ఐన= ఏర్పడి ఉన్న; కర్మంబు= కర్మాన్ని; ఆ జీవుండు= ఆ జీవుడు; అనుభవించున్= అనుభవిస్తాడు; అట్లు= ఆ విధం; కాక+ఉన్నన్= కాకపోతే; కర్మంబు= కర్మము; పునర్భవ కారణంబు= మరల పుట్టటానికి కారణం; అగుట= కావటం; ఉపపన్నంబు= కుదిరేది; కాక+ఉండున్= కాకపోతుంది; కావునన్= కాబట్టి; మనః ప్రధానంబు= మనస్సు ముఖ్యమైనది; ఐన= అయినట్టి; లింగశరీరంబునకున్+ఏ= సూక్ష్మ దేహానికే; కర్తృత్వంబు= చేసేది అనే భావన; ఉపపన్నంబు= కుదురునది; అగున్= అవుతుంది; అని; వెండియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అంతేకాదు. చేసిన పని ఆ క్షణంలోనే నశిస్తుంది. కాబట్టి, జీవుడు మరొకదేహంతో, మరొకలోకంలో ఏర్పడే ఫలాన్ని ఎలా అనుభవిస్తాడు – అని ప్రాచీనబర్హి తన సంశయాన్ని నారదునకు తెలియజేశాడు. అప్పుడు నారదుడు ఇలా చెప్పాడు. రాజా! కలవచ్చిన స్థితిలో జీవుడు లింగదేహాన్ని ఆశ్రయించి ఉన్నాడు. అప్పుడు అతనికి మేలుకొని ఉన్నప్పటి దేహం నాది అనే భావన ఉండదు. అటువంటిదో, అటువంటిది కానిదో అయిన మరొక శరీరాన్ని పొందుతాడు. అంతకు ముందు చేసిన కర్మలన్నీ సంస్కార రూపంలో అతని మనస్సులో ఉంటాయి. (ఇసుకలో వేసిన వెనుకటి పాదపుగుర్తుల వంటివి

సంస్కారాలు). వానినే కలలో అనుభవిస్తూ ఉంటాడు. అదేవిధంగా జీవుడు ఏ లింగదేహంతో కర్మం చేస్తాడో ఆ దేహంతోనే మరొకలోకంలో ఇంకొక దేహం అనే దానితో భేదాన్ని పొందకుండా ఆ ఫలాన్ని అనుభవిస్తాడు. అది సరేనయ్యా! దానం ఇవ్వటం, పుచ్చుకోవటం మొదలైన పనులు ఉన్నాయి. వానికి స్థూలశరీరంతోనే కదా సంబంధం అంటావేమో! నేను, నాది అనే భావాలతో కూడిన జీవుడు మనస్సుతో ఏ దేహాన్ని గ్రహిస్తాడో ఆ దేహంతోనే ఏర్పడి ఉన్న కర్మాన్ని అనుభవిస్తాడు. అలా కాకపోతే కర్మం పునర్జన్మకు కారణం కావటం కుదరదు. కాబట్టి, మనస్సు ప్రధానం అయిన కారణశరీరానికే కర్తృత్వం కుదురుతుంది అని ఇంకా ఇలా అన్నాడు.

**క. క్షితి నుభయేంద్రియ కర్మ, స్థితు లనుభవ మందఁబడిన చిత్తము పగిదిన్**
**ధృతిఁ జిత్తవృత్తులను ల, క్షిత మగుఁ దత్పూర్వ దేహకృత కర్మంబుల్. 886**

**ప్రతి :** క్షితిన్= భూమిమీద; ఉభయ+ఇంద్రియకర్మ స్థితులు= రెండు విధాలైన ఇంద్రియాల పనుల దశలు; అనుభవము+ అందన్+పడిన= అనుభవంపొందిన; చిత్తముపగిదిన్= చిత్తంలాగా; ధృతిన్= నిలుకడతనంతో; చిత్తవృత్తులను= మనః ప్రవృత్తులయందు; తత్+పూర్వ దేహ కృత కర్మంబుల్= అంతకు ముందు ఉన్న దేహం చేసిన కర్మలు; లక్షితము= గుర్తించబడినవి; అగున్= అవుతాయి.

**తా :** భూమిపై జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు చేసిన పనులన్నీ మనస్సులో ముద్రపడినట్లుగానే వెనుకటి దేహాలతో చేసిన కర్మలు చిత్తపు కదలికలలో నిలకడగా గుర్తించబడుతూ ఉంటాయి.

**వ. అది యెట్లనిన నీ దేహంబునం జేసి యే రూపంబు నే ప్రకారంబున నెప్పు డెచట నగు, నది యనను భూతంబును నదృష్టంబును నశ్రుతంబునునై యుండు, నట్టిది యొకానొక కాలంబున వాసనాశ్రయుం డయిన పురుషునకుఁ దదనుభవాది యుక్తం బగు పూర్వదేహంబున ననుభూతంబును దృష్టంబును శ్రుతంబును నని విశ్వసింపు, మీ మనంబున ననుభూతార్థంబు గోచరింపఁజాల, దీ మనంబు పురుషులకు శుభాశుభ నిమిత్తంబులైన పూర్వాపర దేహంబులం బ్రకాశింపం జేయుచుండు, నీ మనంబునందు నదృష్టంబు నశ్రుతంబు నైన యర్థంబు స్వప్నాదికమందుం దోఁచు నంటివేని నది దేశకాల క్రియాశ్రయంబని తలంపం దగు, నీ సమస్త విషయంబులఁ గ్రమానురోధంబున మనంబునం జేసి భోగ్యంబులగు నని మఱియు నిట్లనియె. 887**

**ప్రతి :** అది; ఎట్లు; అనినన్= అంటే; ఈ దేహంబునన్+చేసి= ఈ దేహంతో; ఏ రూపంబునన్= ఏ రూపంతో; ఏ ప్రకారంబునన్= ఏ విధంగా; ఎప్పుడు= ఏ సమయంలో; ఎచటన్= ఏ దేశంలో; అగున్= అవుతుందో; అది= ఆ కర్మం; అననుభూతంబును= అనుభవించినది కానిది; అదృష్టంబును= చూడబడనిది; అశ్రుతంబును= వినబడనిది; ఐ= అయి; ఉండును= ఉంటుందో; అట్టి+అది= అటువంటిది; ఒకానొకకాలంబునన్= ఒక కాలంలో; వాసనా+ఆశ్రయుండు+అయిన= వాసనలను ఆధారంగా చేసికొనినవాడైన; పురుషునకున్= జీవునకు; తద్+అనుభవ+ఆది యుక్తంబు= ఆ అనుభవం మొదలైన వానితో కూడినది; అగు= అయిన; పూర్వదేహంబునన్= వెనుకటి దేహంతో; అనుభూతంబును= అనుభవించబడినది; దృష్టంబును= చూడబడినది; శ్రుతంబును= వినబడినది; అని; విశ్వసింపుము= నమ్ము; ఈ మనంబునన్= ఈ మనస్సులో; అననుభూత+అర్థంబు= అనుభవించని విషయం; గోచరింపన్+చాలదు= ఇంద్రియాలకు తోచేది కాదు; ఈ మనంబు=

ఈ మనస్సే; పురుషులకు= జీవులకు; శుభ+అశుభ నిమిత్తంబులు+ఐన= మేలైనవి, కీడైనవి అయిన వానికి కారణాలై; పూర్వ+అపర+దేహంబులన్= వెనుకటివి, తరువాతివి అయిన దేహాలలో; ప్రకాశింపన్+చేయుచున్+ఉండున్= వెలుగును పొందే విధంగా చేస్తూ ఉంటుంది; ఈ మనంబునందున్= ఈ మనస్సులో; అదృష్టంబును= కానరానిది; అశ్రుతంబును= వినరానిది; ఐన అర్థంబు= అయిన విషయం (ఏదైనా); స్వప్న+ఆదికమందున్= కల మొదలైన దశలలో; తోఁచున్= ఊహలో కదులుతుంది; అంటివి+ఏని= అన్నావంటే; అది= అలా తోచటం; దేశ కాల క్రియా+ఆశ్రయంబు= ప్రదేశం, కాలం, కర్మం అనే వానినాశ్రయించినది; అని; తలంపన్+తగున్= భావించాలి; ఈ సమస్త విషయంబులన్= ఈ అన్ని విషయాలు; క్రమ+అనురోధంబునన్= క్రమాన్ని అనుసరించి; మనంబునన్+చేసి= మనస్సులో; భోగ్యంబులు= భోగించబడేవి; అగున్= అవుతాయి; అని= అని చెప్పి; మఱియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

**తా :** అది ఎలాగంటే ఈ దేహంలో ఇది వరకు అనుభవించనిదీ, కనబడనిదీ, వినబడనిదీ అయిన ఒక విషయం ఎప్పుడో, ఎక్కడనో ఏ రూపంతోనో, ఏ విధానంగా జరిగి ఉంటుందో. అది వాసనలను బట్టి పూర్వదేహంలో అనుభవానికి వచ్చినది అనుకోవాలి. ఈ మనస్సులో అనుభవించనిది ఎప్పుడూ కానరాదు. ఈ మనస్సు జీవులకు మంచివీ, చెడువీ అయిన ఫలాలకు కారణమైన వాటి వెనుకటి, ఇప్పటి దేహాలలో ప్రకాశింపజేస్తూ ఉంటుంది. ఈ మనస్సునందు కనబడని, వినబడని విషయం కలలో అనుభవానికి వస్తున్నది కదా అంటే అది దేశాన్ని, కాలాన్ని, కర్మనూ అనుసరించినదని ఊహించాలి. ఇవన్నీ మనస్సులో క్రమాన్ననుసరించి భోగించదగినవి. అని ఇంకా ఇలా చెప్పాడు.

**చ. సుమహిత శుద్ధ సత్త్వగుణ శోభితమున్ సరసీరుహోదరో**
**త్తమ గుణచింతనాపరము ధన్యము నైన మనంబునందు భూ**
**రమణ! సుధాంశునందు నుపరాగమునన్ దివిఁ దోఁచు రాహు చం**
**దమునను గోచరంబగు నుదారత నీ యఖిల ప్రపంచమున్. 888**

**ప్రతి :** భూరమణ= రాజా!; సుమహిత= మిక్కిలి గొప్పది అయిన; శుద్ధ= రజస్సు, తమస్సుల అంటులేని; సత్త్వగుణ= సత్త్వగుణంచేత; శోభితమున్= వెలుగొందేది; సరసీరుహ= పద్మం; ఉదర= బొడ్డునందుగల; విష్ణువుయొక్క; ఉత్తమ= మేలైన; గుణ= గుణములయొక్క; చింతనా= భావమే; పరము= పరమలక్ష్యం అయినది; ధన్యం= భాగ్యవంతమైనది; ఐన+మనంబునందున్= అయిన మనస్సులో; ఈ+అఖిల ప్రపంచమున్= ఈ సమస్తమైన ప్రపంచమూ; సుధాంశునందున్= చంద్రునిలో; ఉపరాగమునన్= గ్రహణంలో; దివిన్= ఆకాశంలో; తోఁచు= కన్పట్టు; రాహు చందమునను= రాహువు విధంగా; ఉదారతన్= గొప్పగా; గోచరంబు= స్ఫురించేది; అగున్= అవుతుంది.

**తా :** రాజా! మిక్కిలి గొప్పదైన మనస్సు శుద్ధమైన సత్త్వగుణంతో అలరారుతున్నది. శ్రీమహావిష్ణువు ఉత్తమగుణాలను భావించటమే ఏక లక్ష్యం అయినదీ, భాగ్యవంతమైనదీ అయినప్పుడు అందులో ఈ సమస్తప్రపంచమూ గోచరిస్తుంది. అది ఎలాగంటే గ్రహణ సమయంలో చంద్రునిలో రాహువు కనబడినట్లు.

**వ. అని వెండియు నిట్లనియె. లింగదేహమునకు గర్తృత్వ భోక్తృత్వంబులు స్థూలదేహద్వారకంబు లగుటంజేసి స్థూలదేహ వినాశంబు గలుగం జీవునకుఁ గర్తృత్వ భోక్తృత్వంబులు లేకుండుటం జేసి ముక్తి గలుగు నంటివేని నీ స్థూలదేహ సంబంధంబు జీవునియందు బుద్ధి మనోమోక్షార్థ గుణవ్యూహరూపాది లింగ శరీరభంగ**

**పర్యంతంబు గలుగుచుండును, సుషుప్తి మూర్ఛాదులందు నిష్టవియోగాది దుఃఖమందు నహంకారంబు గలిగియుండు, నది యింద్రియోపహతింజేసి యమావాస్య యందలి చంద్రుండునుంబోలెఁ దరుణపురుషునకు గర్భ బాల్యావస్థలయందు నింద్రియ పౌష్కల్యంబు లేకుండుటం జేసి యేకాదశేంద్రియ స్ఫురణ సమర్థం బయిన యహంకారంబు గర్భాదులకుఁ బ్రకాశింపని చందంబుం దోఁపకుండుఁ గావున స్థూలదేహ విచ్ఛేదంబు లేకుండుటం జేసి వస్తుభూతార్థంబు లేకున్న నీ సంసారంబు విషయంబులయం దాసక్తుండగు జీవునకు స్వాప్ని కానర్థాగమనంబునుంబోలె నివర్తింప, దీ తీరునం బంచతన్మాత్రాత్మకంబును త్రిగుణాత్మకంబును షోడశ వికారాత్మకంబునునై విస్మృతంబు నయిన లింగ శరీరంబు నధిష్ఠించి చేతనాయుక్తుండైన జీవుండని చెప్పంబడు, మఱియును. 889**

ప్రతి : అని; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; లింగదేహమునకున్= సూక్ష్మ శరీరానికి; కర్తృత్వ భోక్తృత్వంబులు= కర్త కావటం, అనుభవించేది కావటం అనేవి; స్థూల దేహ ద్వారకంబులు= స్థూలదేహం ద్వారంగా కలవి; అగుటన్+చేసి= అయిన కారణంగా; స్థూల దేహ వినాశనంబు= స్థూలదేహం నశించటం; కలుగన్= కలుగగా; జీవునకున్= జీవునకు; కర్తృత్వ భోక్తృత్వంబులు= చేసేవాడు, అనుభవించేవాడూ అనే భావాలు; లేక+ఉండుటన్+చేసి= లేకపోవటంవలన; ముక్తి= మోక్షం; కలుగున్= కలుగుతుంది; అంటివి+ఏని= అంటే; ఈ స్థూల దేహ సంబంధంబు= ఈ స్థూలదేహం తోడి సంబంధం; జీవునియందు= జీవునిలో; బుద్ధి; మనస్= మనస్సు; మోక్ష= మోక్షం; అర్థ= విషయాలు; గుణ= గుణాలు; వ్యూహ= కూర్పులు; రూప= ఆకారం; ఆది= మొదలైన; లింగ శరీరభంగ= సూక్ష్మ శరీరపతనం; పర్యంతంబును= జరిగేవరకును; కలుగుచుండును= ఏర్పడుతూ ఉంటాయి; సుషుప్తి మూర్ఛా+ఆదులయందున్= గాఢనిద్ర, మూర్ఛ మొదలగువానియందు; ఇష్ట, వియోగ+ఆది= ఇష్టులైన వారి ఎడబాటు మొదలైన; దుఃఖమందున్=దుఃఖంలో అహంకారంబు= నేను అనే భావం; కలిగియుండున్= ఏర్పడి ఉంటుంది; అది; ఇంద్రియ+ఉపహతిన్+చేసి= ఇంద్రియాల వినాశంచేత; అమావాస్యయందలి= అమావాస్యనాటి; చంద్రుండునున్+పోలెన్= చంద్రుని విధంగా; తరుణపురుషునకు= యౌవనంలో ఉన్న మానవునకు; గర్భ బాల్య+అవస్థలయందున్= తల్లి కడుపులో ఉన్నప్పటి, పసితనంనాటి స్థితియందును; ఇంద్రియ పౌష్కల్యంబు= ఇంద్రియాల నిండుతనం; లేక+ఉండుటన్+చేసి= లేకపోవటం వలన; ఏకాదశ+ఇంద్రియ స్ఫురణ సమర్థంబు+అయిన= పదకొండు ఇంద్రియాలు తోచటానికి శక్తి కలది అయిన; అహంకారంబు= అహంకారం; గర్భ+ఆదులకున్= కడుపు మొదలైన వానికి; ప్రకాశింపని చందంబున్= వెలుగొందని విధంగా; తోఁపక+ఉండున్= తెలియరాక ఉంటుంది; కావునన్= కాబట్టి; స్థూల దేహ విచ్ఛేదంబు= స్థూలదేహం తెగిపోవటం; లేక+ఉండుటన్+చేసి= లేకపోవటం చేత; వస్తు భూత+అర్థంబు= వస్తువుగా అయిన స్థితి; లేక+ఉన్నన్= లేకపోతే; ఈ సంసారంబు= ఈ సంసారం; విషయంబులయందున్–శబ్దం మొదలైన ఇంద్రియవిషయాలయందు; ఆసక్తుండు+అగు= తగులు కొన్నవాడగు; జీవునకున్= జీవునకు; స్వాప్నిక+అనర్థ+ఆగమంబునున్+పోలె= కలలో వచ్చే కీడువలె; నివర్తింపదు= మరలదు; ఈ తీరునన్= ఈ విధంగా; పంచ తన్మాత్ర+ఆత్మకంబును= అయిదు తన్మాత్రల స్వరూపం కలదియును; త్రిగుణ+ఆత్మకంబును= మూడుగుణాల స్వరూపం కలదియును; షోడశ= పదహారు విధాల; వికార+ఆత్మకంబును+ఐ= ఆత్మ వికారాలు కలిగినదై; విస్మృతంబును+అయిన= మరుపు పొందినదైన; లింగశరీరంబున్= సూక్ష్మదేహాన్ని; అధిష్ఠించి= స్థానంగా చేసుకొని; చేతనా యుక్తుండు+ఐన= చైతన్యంతో కూడినవాడైన; జీవుండు= జీవుడు; అని; చెప్పంబడున్= చెప్పబడతాడు; మఱియున్= ఇంకా

**తా :** ఇంకా నారదుడు ఇలా అన్నాడు. సూక్ష్మదేహానికి కర్తృత్వం, భోక్తృత్వమూ అనేవి స్థూలదేహం ద్వారా కలిగేవి కాన స్థూలదేహం నశిస్తే జీవునకు కర్తృత్వ భోక్తృత్వాలు ఉండవు. కాబట్టి, ముక్తి కలుగుతుంది అంటావేమో అది కాదు. ఎందుకంటే స్థూలదేహంతో సంబంధం కల బుద్ధి, మనస్సు, మోక్షం, గుణం, వ్యూహం, రూపం మొదలైనవి లింగశరీరం పాడైపోయేదాకా ఉంటాయి. నిద్ర, మూర్ఛ మొదలైనవాటి యందు, ఇష్టులైనవారితో, ఇష్టమైనవస్తువులతో ఎడబాటువలన కలిగిన దుఃఖమందూ 'అహంకారం' అనేది ఉంటుంది. ఇంద్రియాలు నశించిపోతాయి కాబట్టి, అహంకారం అమావాస్యనాటి చంద్రునిలా కళాకాంతులు లేకుండా పోతుంది. పసివానికి, తల్లికడుపులో ఉన్నప్పుడు ఇంద్రియాలు తగినంత నిండుదనం లేకుండా ఉంటాయి కనుక, పదకొండు ఇంద్రియాల వికాసానికి సమర్థమైన అహంకారం ప్రకాశించదు. కాబట్టి, స్థూలదేహం నశించటం ఉండదు. వస్తువు వెనుకటిది అయింది అనే భావం లేకపోతే, విషయాలమీద ఆసక్తి ఉన్న జీవునకు సంసారం మరలిపోదు. ఈ విధంగా పంచతన్మాత్రలూ, మూడుగుణాలూ, పదునారు వికారాలూ స్వరూపంగా అయిన లింగదేహాన్ని ఆశ్రయించి చైతన్యంతో కూడి ఉన్నవానికి జీవుడు అని వ్యవహారం. ఇంకనూ

**సీ.** **తివిరి యప్పురుషుండు దేహంబుననుజేసి, యనయంబుఁ బెక్కు దేహాంతరముల**
**నంగీకరించుచు నవి విసర్జించుచు, సుఖ దుఃఖ భయ మోహ శోకములను**
**బొలుపొందు తద్దేహములనె పొందుచు నుండు, నది యెట్టు లన్నను నగ్రభాగ**
**తృణ మూఁది మఱి పూర్వతృణ పరిత్యాగంబు, గావించు తృణజలూకయును బోలె**

**ఆ.** **జీవుఁడవనిఁ గొంత జీవించి మ్రియమాణు, డగుచు నొండు దేహ మర్థిఁ జెంది**
**కాని పూర్వమైన కాయంబు విడువఁడు, గాన మనమె జన్మకారణంబు.** **890**

**ప్రతి :** తివిరి= ప్రయత్నించి; ఆ+పురుషుండు= ఆ జీవుడు; దేహంబునను+చేసి= ఒక దేహంతో; అనయంబున్= ఎల్లవేళలా; పెక్కు దేహ+అంతరములన్= చాలా ఇతరమైన దేహాలను; అంగీకరించుచున్= గ్రహిస్తూ; అవి= అటువంటి కొత్త దేహాలను; విసర్జించుచున్= వదలి వేస్తూ; సుఖ= ఇంద్రియాల పరితృప్తి; దుఃఖ= అది లేకపోవటం వలన కలిగే వేదన; భయ= భీతి; మోహ= అజ్ఞానం; శోకములను= ఏవేవో కారణాలుగా మనస్సులో కుమిలిపోతూ ఉండటం అను వానిచేత; పొలుపొందు= ఒప్పారెడు; తత్+దేహములను+ఎ= ఆ శరీరాలనే; పొందుచున్+ఉండును= గ్రహిస్తూ ఉంటాడు; అది= ఆగ్రహించటం; ఎట్టులు= ఏ విధమైనది; అన్నను= అంటే; అగ్ర భాగ తృణము= ఎదురుగా ఉన్న గడ్డిపరకను; ఊఁది= గట్టిగా పట్టుకొని; మఱి= ఆ తరువాత; పూర్వ తృణ పరిత్యాగంబున్= మునుపుతానున్న గడ్డికాడను వదలి వేయటాన్ని; కావించు= చేసే; తృణ జలూకయును+పోలెన్= గడ్డిపరకల మీద తిరుగాడే జలగలాగా; జీవుఁడు; అవనిన్= భూమిమీద; కొంత= కొంతకాలం; జీవించి= బతికి; మ్రియమాణుఁడు= చనిపోతున్నవాడు; అగుచున్= అవుతూ; అర్థిన్= కోరికతో; ఒండు దేహమున్= మరొక దేహాన్ని; చెందికాని= చేరుకొని కానీ; పూర్వము+ఐన= వెనుకటిదైన; కాయంబున్= శరీరాన్ని; విడువఁడు= వదలిపెట్టడు; కానన్= కాబట్టి; మనము+ఎ= మనస్సే; జన్మ కారణంబు= మరుజన్మకు కారణమైనది.

**తా :** జీవుడు ఒక దేహం నుండి పెక్కు దేహాలలోనికి నిరంతరం పయనిస్తూ ఉంటాడు. ఒక వానిని వదలి సుఖం, దుఃఖం, భయం, మోహం, శోకం అనే లక్షణాలతో కూడిన అటువంటి దేహాలనే గ్రహిస్తూ ఉంటాడు. అది ఎలాగంటే, గడ్డిపరకలమీద తిరుగుతూ ఉండే జలగ ఒక పరకమీద చివరి భాగానికి చేరుకొంటుంది. అటుమీద ఉన్న గడ్డి పరకను అందుకుంటుంది.

పూర్తిగా అది తనకు దొరికింది అన్న స్థితిలోనే వెనుక తానున్న గడ్డి పరకను వదలివేస్తుంది. అలా వదలటమే మరణం. పట్టుకోవటమే మరుజన్మ. జీవుని ప్రయాణం కూడా అటువంటిదే. జన్మకు మనస్సే కారణం.

**తరలము**

**నరవరోత్తమ! యట్లు గాన మనంబె జీవులకెల్ల సం**
**సరణకారణ, మట్టి కర్మవశంబునన్ సకలేంద్రియా**
**చరణుఁడౌట నవిద్య గల్గును, సంతతంబు నవిద్యచేఁ**
**బరఁగుటన్ బహుదేహకర్మనిబంధముల్ గలుగుం జుమీ!** **891**

**ప్రతి :** నరవర+ఉత్తమ= పాలకులలో శ్రేష్ఠుడా!; అట్లు= ఆ విధం; కాన= కాబట్టి; మనంబు+ఎ= మనస్సే; జీవులకు+ఎల్లన్= జీవులందరికీ; సంసరణ కారణము= సంసారానికి హేతువు; అట్టి కర్మవశంబునన్= అటువంటి కర్మకు లోబడి ఉండటంచేత; సకల+ఇంద్రియ+ఆచరణుఁడు= అన్ని ఇంద్రియాల చర్యలు కలవాడు; ఔటన్= అగుటచేత; అవిద్య= అజ్ఞానం; కల్గును= ఏర్పడుతుంది; సంతతంబున్= ఎల్ల వేళలా; అవిద్యచేన్= అజ్ఞానంచేత; పరఁగుటన్= వర్తించటంవలన; బహు దేహ కర్మ నిబంధముల్= పెక్కు దేహాలూ కర్మలూ అనేవాని గట్టి బంధాలు (స్వేచ్ఛగా తిరుగలేక పడి ఉండే దశలు); కలుగున్+చుమీ= కలుగుతాయి సుమా!

**తా :** రాజశ్రేష్ఠా! అందుచేత జీవులందరికీ మనస్సే సంసారానికి కారణమైనది. అటువంటి కర్మబంధంచేత ఇంద్రియాలు తిప్పినట్లు జీవుడు తిరుగుతూ ఉంటాడు. దాని వలన అజ్ఞానం కలుగుతుంది. ఎడతెగని ఆ అజ్ఞానం విజృంభించటం వలన పెక్కు జన్మలూ, దేహాలూ, వానికి సంబంధించిన కర్మములు చుట్టుకొని పెనవేసుకొని ఉంటాయి సుమా!

**చ. వినుము మది గాన భూవర! యవిద్య లయించుటకై రమాపతిన్**
**ఘనజనన స్థితి ప్రళయకారణ భూతునిఁ బద్మపత్త్ర లో**
**చనుఁ బరమేశు నీశ్వరుని సర్వజగంబుఁ దదాత్మకంబుగాఁ**
**గనుఁగొనుచుం దదీయపదకంజము లర్థి భజింపు మెప్పుడున్.** **892**

**ప్రతి :** భూవర= రాజా!; వినుము= శ్రద్ధగా ఆలకించు; అది కాన= అలా జన్మకర్మలు కలుగుతున్న కారణంగా; అవిద్య= అజ్ఞానం; లయించుటకు+ఐ= నశించిపోవటానికి; ఘన జనన స్థితి ప్రలయ కారణ భూతునిన్= అధికమగు, పుట్టుక, ఉనికి, నశించటం అనేవానికి కారణమైనవానిని; పద్మపత్రలోచనున్= తామరపూవు రేకులవంటి కన్నులున్నవానిని; పరమ+ఈశున్= ఉత్కృష్టమైన ప్రభువైన వానిని; ఈశ్వరునిన్= అందరినీ, అన్నింటినీ కాపాడే వానిని; రమాపతిన్= లక్ష్మీదేవికి పతియైన శ్రీమన్నారాయణుని; సర్వజగంబున్= లోకమంతటిని; తద్+ఆత్మకంబుగాన్= అతనికంటె వేరుకానిదిగా; కనుఁగొనుచున్= దర్శిస్తూ; తదీయ పదకంజములు= అతని పాదములు అనే పద్మములను; ఎప్పుడున్= సర్వకాలాలలో; అర్థిన్= కోరికతో; భజింపుము= సేవించు.

**తా :** రాజా! అంతేకాక విను. ఈ ఘోరమైన ఆపదకు మూలకారణం అవిద్య – అంటే అజ్ఞానం. అది లయించిపోవాలి. అంటే అది అంటూ ఒకటి ఉన్నది అనే భావన కూడా లేకుండా నశించిపోవాలి. దానికి శ్రీపతి అయిన నారాయణుని పాదపద్మాలను నిరంతరమూ సేవించుకోవాలి. ఆయన జీవుల పుట్టుకకు, ఉనికికీ, సంపూర్ణంగా నశించిపోవటానికి

కారణమైనవాడు. ఇంద్రుడు మొదలైన ప్రభువులకు కూడా ప్రభువు. అందరినీ కాపాడే ఈశ్వరుడు. జగత్తంతా అతని స్వరూపమే అనే భావంతో దర్శించుకుంటూ ఎల్లప్పుడు సేవించు.

**క. అని యీ గతి భగవంతుం, డనఘుఁడు భాగవతముఖ్యుఁడగు నారదుఁ డా**
**ఘనునకు జీవేశ్వర గతి, ఘనకృప నెఱిఁగించి సిద్ధ గతిఁ జనిన యెడన్. 893**

**ప్రతి :** అని; ఈ గతిన్= ఈ పద్ధతితో; భగవంతుండు= అందరకూ పూజించదగినవాడు; అనఘుఁడు= ఏ కొంచెం పాపస్పర్శలేనివాడు; భాగవత ముఖ్యుఁడు= భగవద్భక్తులలో శ్రేష్ఠుడు; అగు= అయిన; నారదుఁడు= నారద మహర్షి; ఆ ఘనునకున్= గొప్పవాడైన ఆ ప్రాచీనబర్హికి; జీవ+ఈశ్వరగతిన్= జీవుడు, ఈశ్వరుడు అనువారి ఇద్దరి తత్త్వాన్ని; ఘనకృపన్= గొప్పకరుణతో; ఎఱిఁగించి= తెలిపి; సిద్ధగతిన్= యోగవిద్యలో సిద్ధిపొందిన వారి గమనంతో; చనిన యెడన్= వెళ్ళగా.

**తా :** అని ఈ విధంగా భగవంతుడు, పాపం ఏ మాత్రమూ లేనివాడు, భక్తులలో శ్రేష్ఠుడు అయిన నారదుడు గొప్ప కృపతో గొప్పవాడైన ప్రాచీనబర్హిని జీవ, ఈశ్వరుల గతిని తెలియజెప్పి సిద్ధగతితో వెళ్ళిపోగా

**సీ. రాజర్షి యైనట్టి ప్రాచీనబర్హి దాఁ దగఁ బ్రజాపాలనార్థంబు సుతుల**
**ధరకు నియోగించి తపము సేయుటకునై కపిలాశ్రమంబున కపుడు వోయి**
**యచ్చట నియతి నేకాగ్రచిత్తుండును ముక్తసంగుండును భూరిధైర్య**
**యుక్తుండు నగుచు సద్భక్తి యోగంబున ననఘ! గోవిందపదారవింద**

**తే. చింతనామృత పాన విశేషచిత్తుఁ, డగుచు విధిరుద్ర ముఖ్యుల కందరాని**
**యవ్య యానందమయ పద మందె నప్పు, డనుచు మైత్రేయముని విదురునకుఁ జెప్పి. 894**

**ప్రతి :** అనఘ= పుణ్యాత్మా; రాజ+ఋషి= రాజులలో ఋషి; ఐన+అట్టి= అయిన; ప్రాచీనబర్హి; తాన్= తాను; తగన్= తగు విధంగా; ప్రజాపాలన+అర్థంబు= ప్రజలను ఏలటంకోసం; సుతులన్= కొడుకులను; ధరకున్= భూమికి; నియోగించి= ఏర్పాటు చేసి; తపము= తపస్సు; చేయుటకున్+ఐ= చేయటంకోసం; కపిల+ఆశ్రమంబునకు= కపిలమహర్షి ఆశ్రమానికి; అపుడు; పోయి= వెళ్లి; అచ్చటన్= ఆ ఆశ్రమంలో; నియతిన్= నియమంతో; ఏక+అగ్ర చిత్తుండును= పరమాత్మయే గురిగా ఉన్న మనస్సుకలవాడూ; ముక్తసంగుండును= వదలివేసిన తగులములు కలవాడూ; భూరి ధైర్య యుక్తుండును= గొప్ప ధైర్యంతో కూడినవాడూ; అగుచున్= అవుతూ; సద్భక్తి యోగంబునన్= భక్తితో ఎడతెగని సంబంధంతో; గోవింద= గోవిందుని; పద= పాదములనే; అరవింద= పద్మాల; చింతన= భావన అనే; అమృత= అమృతం యొక్క; పాన= తాగటంచేత; విశేష= విశిష్టమైన; చిత్తుఁడు= హృదయం కలవాడు; అగుచున్= అవుతూ; విధి రుద్ర ముఖ్యులకున్= బ్రహ్మ, రుద్రుడు మొదలగువారికి; అందరాని= అందుకోరాని; అవ్యయ+ఆనందమయ పదము= ఎన్నటికీ నశించని ఆనందమే సర్వం అయిన స్థానాన్ని; అప్పుడు= ఆ సమయంలో; అందెను= చేరుకొన్నాడు; అనుచున్= అంటూ; మైత్రేయముని= మైత్రేయుడనే మహర్షి; విదురునకున్= విదురుడు అనే మేధావికి; చెప్పి= బోధించి.

**తా :** రాజర్షియైన ప్రాచీనబర్హి చక్కగా ప్రజలను పాలించటానికి కొడుకులను భూమికి ఏర్పాటు చేసి, తపస్సు చేసుకోవటానికి కపిలమహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడ నియమాలు పాటిస్తూ మనస్సును పరమాత్మయందే నిలిపి, తగులముల

నన్నింటినీ వదలివైచి, గొప్పధైర్యం అలవరచుకొని మంచి భక్తి యోగంతో శ్రీమహావిష్ణువు పదారవిందాలను భావించటమే అమృతం కాగా దానితో విశిష్టమైన చిత్తం కలవాడై బ్రహ్మరుద్రాదులైన మహాత్ములకు కూడా అందరాని తరుగువోని ఆనందమయస్థానానికి చేరుకొన్నాడు అని మైత్రేయముని విదురునకు తెలియజెప్పి,

**విశే :** కర్తవ్య నిర్వహణ, తపస్సు, తగులములకు బానిస కాకపోవటం, నియమపాలన, ఏకాగ్రత, ధైర్యం, భక్తియోగం, భగవద్భావన అనేవి సిద్ధికి వరుసమెట్లు అని ఈ పద్యం నిరూపిస్తుంది.

**వ. వెండియు నిట్లనియె, నిట్లు ముకుందయశంబునం జేసి భువనపావనంబు, మనశ్శుద్ధికరంబు సర్వోత్కృష్ట ఫలప్రదాయకంబు, దేవర్షివర్య ముఖ వినిస్సృతంబునైన యీ యధ్యాత్మ పారోక్ష్యంబు నెవ్వండు పఠియించు, నెవ్వఁడు విను, నట్టివాఁడు లింగ శరీర విధూననంబు గావించి ముక్తసమస్త బంధుండయి విదేహకైవల్యంబు నొంది సంసారంబునందుఁ బరిభ్రమింపం డనిన మైత్రేయునకు విదురుం డిట్లనియె. 895**

**ప్రతి :** వెండియున్= ఇంకా; ఇట్లు; అనియెన్= చెప్పాడు; ఇట్లు= ఈ విధంగా; ముకుందయశంబునన్+చేసి= ముకుందుని కీర్తి కారణంగా; భువన పావనంబు= లోకాలను పవిత్రంచేసేది; మనస్+శుద్ధికరంబు= మనస్సును నిర్మలంగా చేసేది; సర్వ+ఉత్కృష్ట ఫల ప్రదాయకంబు= అన్నింటికంటె గొప్పది అయిన ఫలాన్ని తప్పక ఇచ్చేది; దేవ+ఋషివర్యముఖ వినిస్సృతంబును+ఐన= దేవతల ఋషియైన నారదుని ముఖంనుండి వెలువడినదైన; ఈ అధ్యాత్మ పారోక్ష్యంబున్= ఈ వేదాంతరహస్యాన్ని; ఎవ్వండు= ఏ వ్యక్తి; పఠియించున్= చదువుతాడో; ఎవ్వండు= ఏ వ్యక్తి; వినున్= వింటాడో; అట్టివాఁడు= అట్టివ్యక్తి; లింగ శరీర విధూననంబున్= సూక్ష్మదేహాన్ని అంటులేకుండా దులిపివేసుకోవడాన్ని; కావించి= చేసి; ముక్త సమస్త బంధుండు+అయి= అన్నివిధాలైన బంధాలనుండి విడివడిన వాడై; విదేహకైవల్యంబున్= దేహంతో సంబంధంలేని మోక్షాన్ని; ఒంది= పొంది; సంసారంబునందున్= చావుపుట్టుకల ఎడతెగనిబంధంలో; పరిభ్రమింపండు= పిచ్చితిరుగుళ్ళు తిరుగడు; అనినన్= అని చెప్పగా; మైత్రేయునకున్= మైత్రేయమహర్షికి; విదురుండు= విదురుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** ఇంకా ఇలా అన్నాడు. ఇట్లు ముకుందుని కీర్తితో కూడిన ఈ కథ లోకాలను పవిత్రం చేస్తుంది. మనస్సును శుద్ధంగా చేస్తుంది. అన్నింటికంటె గొప్ప ఫలాన్నిస్తుంది. దేవఋషి అయిన నారదుని ముఖంనుండి వెలువడినది. ఇది అధ్యాత్మవిద్యారహస్యం. దీనిని పఠించినవాడు, వినినవాడు లింగదేహాన్ని వదలించుకుంటాడు. దానితో బంధాలన్నీ ఊడిపోతాయి. అతనికి విదేహ ముక్తి కలుగుతుంది; సంసారచక్రంలో పిచ్చి తిరుగుళ్ళు తిరుగడు అని మైత్రేయుడు చెప్పగా విదురుడిలా అన్నాడు.

**క. మునినాథ! ప్రచేతసు లా, ఘన మగు రుద్రోపదిష్ట కమలోదర కీ**
**ర్తనమున నే గతిఁ బొందిరి, వనజాక్షుఁడు సంతసింప వా రనఘాత్మా! 896**

**ప్రతి :** మునినాథ= మునులకు ప్రభువైనవాడా!; అనఘ+ఆత్మా= పాపంలేని బుద్ధికలవాడా!; ప్రచేతసులు; ఆ ఘనమగు= ఆ గొప్పదైన; రుద్ర+ఉపదిష్ట= రుద్రునిచే ఉపదేశించబడిన; కమల+ఉదర= పద్మం బొడ్డులో ఉండే విష్ణువుయొక్క; కీర్తనమునన్= స్తుతిచేత; వనజ+అక్షుఁడు= పద్మములవంటి కన్నులుగల నారాయణుడు; సంతసింపన్= పరితుష్టి పొందగా; వారు= ఆ ప్రచేతసులు; ఏగతిన్= ఏ స్థానాన్ని; పొందిరి= చేరుకొన్నారు?

**తా :** మునీశ్వరా! పుణ్యాత్మా! ప్రచేతసులనువారు శివుడు ఉపదేశించిన విష్ణుస్తుతితో ఆ కమలాక్షుడు సంతోషించగా ఏ స్థానాన్ని చేరుకొన్నారు?

**విశే :** ప్రచేతసులు ప్రాచీనబర్హికి శతధృతి అను స్త్రీ యందు కలిగిన పుత్రులు. వీరు పదుగురు. (చూ:పద్యం 4- 684) వీరు తపస్సుతో రుద్రుని మెప్పించి యోగాదేశం అనే రుద్రగీతను ఉపదేశంగా పొందిన విషయం పురంజనోపాఖ్యానానికి ముందు ఉంది. (686-737 పద్యాలు - చతుర్థస్కంధం)

## a =ప్రచేతసుల తపంబునకు భగవంతుండు మెచ్చి వరంబు లిచ్చుట a

**తే.** **కడఁగి మఱివారు యాదృచ్ఛికమునఁ జేసి, హరికి నిత్యప్రియుండగు హరునిఁ గాంచి**
**యతని వలన ననుగ్రహ మంది మోక్ష, మంది రని చెప్పి, తది నిశ్చయంబు మఱియు.** **897**

**ప్రతి :** కడఁగి= పూనుకొని; మఱి= తరువాత; వారు= ఆ ప్రచేతసులు; యాదృచ్ఛికమునన్+చేసి= దైవేచ్ఛననుసరించి; హరికిన్= విష్ణువునకు; నిత్య+ప్రియుండు+అగు= ఎల్లవేళల ఇష్టుడు అగు; హరునిన్= శివుని; కాంచి= చూచి; అతనివలనన్= అతనినుండి; అనుగ్రహము= దయను; అంది= పొంది; మోక్షము; అందిరి+అని= పొందిరని; చెప్పితి= చెప్పినావు; అది= ఆ మాట; నిశ్చయంబు= నిజము; మఱియున్= ఇంకా.

**తా :** ఇంకను వారు పూనుకొని అప్రయత్నంగా శ్రీమహావిష్ణువునకు ఎల్లవేళలా ప్రియుడైన మహేశ్వరుని దర్శించి అతని దయవలన మోక్షం పొందారని నీవు చెప్పి ఉన్నావు. అది నిజం. ఇంకా.

**క.** **హరి దర్శన పూర్వం బిహ, పరలోకములందు నా నృపాల తనయు లం**
**దిరి యే ఫలముల నందఱు, నిరతి నెఱింగింపు మన మునివరుఁడు పలికెన్.** **898**

**ప్రతి :** ఆ నృపాల తనయులు= ఆ రాజుగారి కొడుకులు; అందఱు= అందరూ; హరి దర్శన పూర్వంబు= విష్ణువును దర్శించటానికి ముందు; ఇహ పర లోకములందున్= ఈ లోకంలో, పరలోకంలో; ఏ ఫలములన్= ఏ ప్రయోజనాలను; నిరతిన్= మిక్కిలి ఆసక్తితో; పొందిరి= అందుకొన్నారు; ఎఱింగింపుము= తెలుపుము; అనన్= అనగా; మునివరుఁడు= మునిశ్రేష్ఠుడైన మైత్రేయుడు; పలికెన్= ఇలా చెప్పాడు.

**తా :** ఆ రాజకుమారులందరూ శ్రీహరిని దర్శించు కొనటానికి ముందు ఈ లోకంలో, పరలోకంలో ఏ గొప్ప ప్రయోజనాలను మిక్కిలి ఆసక్తితో పొందారు? మహర్షీ! మైత్రేయా! నాకు తెలియజెప్పు. అనగా మునిశ్రేష్ఠుడు ఇట్లా అన్నాడు.

**క.** **విను జనకాదేశము ముద, మునఁ దాల్చి నృపాత్మజులు సముద్రోదరమం**
**దనుపమ జపయజ్ఞంబున, నొనరఁ దపం బూని ముదము నొందుచు నుండన్.** **899**

**ప్రతి :** విను= ఆలకించు; జనక+ఆదేశమున్= తండ్రి ఆజ్ఞను; ముదమునన్= సంతోషంతో; తాల్చి= చేకొని; (గ్రహించి) నృప+ఆత్మజులు= రాజకుమారులు (ప్రచేతసులు); సముద్ర+ఉదరమందు= సముద్రంలోపల; అనుపమ జప యజ్ఞంబునన్= సాటిలేని జపంచేయటం అనే యజ్ఞంతో; ఒనరన్= చక్కని తీరుతో; తపంబు= తపస్సును; ఊని= పట్టుకొని; ముదమున్= సంతోషాన్ని; ఒందుచున్= పొందుతూ; ఉండన్= ఉండగా...

**తా :** విదురా! విను. రాకుమారులు తండ్రి ఆజ్ఞను సంతోషంతో స్వీకరించి సముద్రగర్భంలో ఉండి సాటిలేని జపయజ్ఞాన్ని అవలంబించి చక్కగా తపస్సు చేస్తూ సంతోషంగా ఉండగా

**క. పదివే లేఁడులు నిష్ఠను, వదలక తప మాచరింప వారల కర్థిన్**
**సదయాంతరంగుఁ డభయ, ప్రదుఁడు సనాతనుఁడు నైన పద్మోదరుఁడున్. 900**

**ప్రతి :** పదివేల+ఏఁడులు= పదివేల సంవత్సరాలు; నిష్ఠను= నిలుకడను; వదలక= విడిచిపెట్టక; తపము= తపస్సును; ఆచరింపన్= చేయగా; వారలకున్= వారికి; అర్థిన్= కోరికతో; సదయ+అంతరంగుఁడు= కరుణతో నిండిన మనస్సు కలవాడు; అభయ ప్రదుఁడు= భయంలేని స్థితిని చక్కగా ప్రసాదించేవాడు; సనాతనుఁడు= సృష్టికి ముందునుండి ఉండువాడు; ఐన= అయిన; పద్మ+ఉదరుఁడున్= పద్మం బొడ్డునందుగల శ్రీహరి...

**తా :** వారు చెదరనిస్థితితో పదివేల సంవత్సరాలు తపస్సు చేశారు. అప్పుడు దయతోనిండిన హృదయం కలవాడు, అభయం ఇచ్చేవాడూ, శాశ్వతుడూ అయిన శ్రీమహావిష్ణువు కోరికతో

**విశే :** సనాతనుడు– సర్వకాలాలలో 'ఉండుటయే' లక్షణం అయినవాడు – నిత్యుడు – జీవులకులాగా చావు పుట్టుకలు లేని వాడు పరమాత్మ – అని అర్థం.

**క. అనుపమ శాంతము లగు నిజ, తను రశ్ములచే నృపాల తనయ తపో వే**
**దనలు శమింపఁగఁ జేయుచు, ననయముఁ బ్రత్యక్ష మయ్యె, నచ్యుతుఁ డంతన్. 901**

**ప్రతి :** అంతన్= ఆ సమయంలో; అచ్యుతుఁడు= విష్ణువు; అనుపమ శాంతములు= సాటిలేనివి, శాంతమైనవి; అగు= అయిన; నిజ తను రశ్ములచేన్= తన దేహ కాంతులచేత; నృపాల= రాజుయొక్క; తనయ= కుమారుల; తపః= తపస్సుచేత కలిగిన; వేదనలు= దుఃఖాలు; శమింపఁగన్= అణగిపోవునట్లు; చేయుచున్= చేస్తూ; అనయమున్= చాటుమాటులేని విధంగా; ప్రత్యక్షము+అయ్యెన్= కానవచ్చాడు.

**తా :** అచ్యుతుడు తన సాటిలేని, శాంతములైన దేహప్రభలతో ఆ రాజకుమారుల తపస్సువలన కలిగిన దుఃఖాలను పోగొడుతూ స్పష్టంగా వారికి కానవచ్చాడు.

**సీ. ఘనమేరుశృంగసంగతనీలమేఘంబు, నెఱి గరుడస్కంధ నివసితుండుఁ**
**గమనీయ నిజదేహకాంతి విపాటితాఖిలాఖి లాశాంతరాళ తముఁడు**
**సుమహితాష్టాయుధ సుమనో మునీశ్వర, సేవక పరిజన సేవితుండు**
**మండిత కాంచన కుండల రుచిరోప, లాలిత వదన కపోలతలుడుఁ**

**తే. జారు నవరత్న దివ్య కోటీరధరుఁడుఁ, గౌస్తుభప్రవిలంబ మంగళ గళుండు**
**లలిత పీతాంబర ప్రభాలంకృతుండు, హారకేయూర వలయ మంజీర యుతుఁడు. 902**

**ప్రతి :** ఘన= గొప్పది అయిన; మేరు= బంగారుకొండయొక్క; శృంగ= శిఖరంతో; సంగతము= కూడియున్న; నీలమేఘంబు నెఱిన్= నల్లని మబ్బు అందంతో; గరుడ స్కంధ నివసితుండు= గరుత్మంతుని మూపుమీద నెలకొనియున్నవాడు; కమనీయ=

మిక్కిలి సుందరమైన; నిజ= తనది అయిన; దేహ= ఒడలియొక్క; కాంతి= వెలుగుచేత; విపాటిత= చీల్చివేయబడిన; ఆభీల= భయముకలిగించే; అఖిల= సమస్తమైన; ఆశా= దిక్కుల; అంతరాళ= మధ్యనున్న; తముఁడు= చీకట్లు కలవాడు; సుమహిత= మిక్కిలి గొప్పవి అయిన; అష్ట+ఆయుధ= ఎనిమిది ఆయుధాలతో; సుమనస్= దేవతలతో; ముని+ఈశ్వర= మునులలో శ్రేష్ఠులైన వారితో; సేవక= సేవించే భక్తులతో; పరిజన= పనివాండ్రతో; సేవితుండు= సేవింపబడుతున్నవాడు; మండిత= అలంకరించబడిన; కాంచన= బంగారపు; కుండల= చెవుల ఆభరణములచే; రుచిర= అందంగా; ఉపలాలిత= బుజ్జగించబడిన; వదన= మోమునందలి; కపోల తలుఁడు= చెక్కిళ్ళ పక్కభాగాలు కలవాడు; చారు= అందమైన; నవ రత్న= తొమ్మిది రత్నాలుగల; దివ్య= దేవలోకానికి చెందిన; కోటీర= కిరీటమును; ధరుఁడు= ధరించినవాడు; కౌస్తుభ= కౌస్తుభ మణియొక్క; ప్రవిలంబ= వేలాడుటచే; మంగళ= శుభమైన; గళుండు= మెడ కలవాడు; లలిత= మిక్కిలి మెత్తగా ఉండే; పీత+అంబర= పసుపుపచ్చవన్నెతో విరాజిల్లే వస్త్రపు; ప్రభా= కాంతులతో; అలంకృతుండు= అలంకరించబడినవాడు; హార= దండలు; కేయూర= బాహుపురులు; వలయ= కంకణాలు; మంజీర= అందియలు అనువానితో; యుతుఁడు= కూడినవాడు.

**తా :** గొప్పదైన మేరుపర్వత శిఖరంతో కూడియున్న నీలమేఘం సొంపులతో గరుత్మంతుని మూపుపై ఉన్నవాడూ, చాలా అందమైన తన దేహకాంతితో భయంగొలిపే, సర్వదిక్కులమధ్యనున్న అంధకారాన్ని చీల్చివేసినవాడూ; చాలా గొప్పవి అయిన ఎనిమిది ఆయుధాలతో, దేవతలతో, మహర్షులతో, భక్తులతో, పరిజనులతో సేవించబడుచున్నవాడూ, అలంకరించబడిన సువర్ణ కుండలాలు బుజ్జగిస్తున్న చెక్కిళ్ళ తావులు కలవాడూ, సుందరమైన నవరత్నాలు గల దివ్యమైన కిరీటం ధరించినవాడూ, కౌస్తుభమణి వేలాడుతున్న శుభమైన కంఠంకలవాడూ, సుకుమారమైన పచ్చని వస్త్రపుకాంతితో అలంకరించబడినవాడూ, హారాలూ, అంగదాలు, కంకణాలు, అందెలు అనే ఆభరణాలతో అలరారుతున్నవాడూ.

**విశే : అష్టాయుధాలు :** 1. శంఖం, 2. చక్రం, 3. డాలు, 4. ఖడ్గం, 5. గద, 6. బాణాలు, 7. విల్లు, 8. పాశం – ఈ ఎనిమిదింటినీ, ఎనిమిది చేతులలో ధరించి ఉన్నవాడు.

**క. లలితాయతాష్ట భుజ మం, డల మధ్య స్ఫురిత రుచి విడంబిత లక్ష్మీ**
**లలనా కాంతి స్పర్ధా, కలిత లసద్వైజయంతికా శోభితుఁడున్. 903**

**ప్రతి :** లలిత= సుకుమారములైన; ఆయత= పొడవైన; అష్ట= ఎనిమిది; భుజ= చేతుల; మండల= సమూహం యొక్క; మధ్య= నడుమ; స్ఫురిత= తళతళలాడుతున్న; రుచి= కాంతులతో; విడంబిత= మోసపుచ్చుతున్న; లక్ష్మీ= లక్ష్మి అనే; లలనా= వనితయొక్క; కాంతి= వెలుగులతో; స్పర్ధా= పోటీతో; కలిత= కూడిన; లసత్= విరాజిల్లుతున్న; వైజయంతికా= వైజయంతి అనే వనమాలతో; శోభితుఁడున్= ప్రకాశిస్తున్నవాడు.

**తా :** ఆయన ఎనిమిది చేతులు సుకుమారంగా, పొడవుగా అలరారుతున్నాయి. ఆ చేతుల మధ్యభాగంలో శ్రీదేవి అలరారుతున్నది. ఆమె కాంతులతో పోటీపడుతున్నదా అన్నట్లు ప్రకాశిస్తున్న వైజయంతి అనే వనమాలతో ఆ స్వామి వెలుగొందుతున్నాడు.

**విశే :** వనమాల– ఆకులు, పువ్వులు కలిపికూర్చిన పెద్దమాల. అది కంఠసీమనుండి పాదాలవరకు వ్యాపించి ఉంటుందని ప్రసిద్ధి.

**క. సురగరుడ యక్షకిన్నర, నిరుపమ జేగీయ మాన నిఖిలాశా సం**
**భరిత యశోమహనీయ, స్ఫురణుఁడు నగు న ప్పురాణ పురుషుం డెలమిన్. 904**

**ప్రతి :** సుర= దేవతలతో; గరుడ= గరుడులతో; యక్ష= యక్షులతో; కిన్నర= కిన్నరులతో; నిరుపమ= సాటిలేని విధంగా; జేగీయమాన= గొప్పగా పాటలతో కొనియాడబడుతున్న; నిఖిల= సమస్తమైన; దిశా= దిక్కులందు; సంభరిత= నిండిపోయిన; యశః= కీర్తితో; మహనీయ= గొప్పది అయిన; స్ఫురణుఁడు= ప్రకాశవంతమైనవాడు; అగు= అయిన; ఆ+పురాణ పురుషుండు= ఆ సనాతనుడైన పురుషుడు; ఎలమిన్= ప్రీతితో.

**తా :** ఆయన కీర్తిని దేవతలు, గరుడులు, యక్షులు, కిన్నరులు, సాటిలేని విధంగా పాటలరూపంతో కొనియాడుతున్నారు. ఆ సవ్వడి అన్ని దిక్కులను నింపివేస్తున్నది. అది ఆయన కీర్తిని మనస్సునకు తెలియజేస్తున్నది. అట్టి సనాతన పురుషుడు విష్ణువు ప్రీతితో

**క. కరుణావలోకనంబుల, నిరవొంద నృపాలసుతుల నీక్షించి రమా**
**వరుఁ డంబుద గంభీర మ, ధుర భాషలఁ బలికెఁ బ్రియము దూఁకొనుచుండన్. 905**

**ప్రతి :** రమా వరుఁడు= లక్ష్మీపతి అయిన నారాయణుడు; కరుణా+అవలోకనంబులన్= దయ పొంగివచ్చు చూపులతో; ఇరవు+ఒందన్= నిలుచునట్లు చేసి; నృపాలసుతులన్= రాజ కుమారులను; వీక్షించి= చక్కగా చూచి; అంబుద= మేఘంవంటి; గంభీర= నిండైన; మధుర= కమ్మని; భాషలన్= పలుకులతో; ప్రియము= ప్రేమానురాగాలు; దూఁకొనుచు+ఉండన్= పొంగివచ్చుచుండగా; పలికెన్= అన్నాడు.

**తా :** లక్ష్మీపతి అయిన నారాయణుడు దయను వెలార్చే చూపులు ఒప్పగా ఆ రాజకుమారులను చక్కగా చూచి మేఘంవంటి గంభీరంగా ఉండే తీయని మాటలను ప్రేమానురాగాలు ఉట్టిపడే విధంగా ఇలా పలికాడు.

**విశే :** అంబుదగంభీరం అనటంచేత వరాలు కురుస్తాయి అనే అర్థం స్ఫురిస్తుంది.

**తే. తాపసోత్తములగు ప్రచేతసులు! వేడ్క, వినుఁడు మీరలు సౌహార్దమున నభిన్న**
**ధర్ము లగుట భవత్సౌహృదమున కేను, జాలఁ బరితోష మందితి సమత నేఁడు. 906**

**ప్రతి :** తాపస+ఉత్తములు+అగు= తపస్సు పండించుకొన్న వారిలో మేలు జాతివారగు; ప్రచేతసులు= ప్రచేతసులారా!; వేడ్కన్= సంతోషంతో; వినుఁడు= వినండి; మీరలు= మీరు; సౌహార్దమునన్= చెలిమితో; అభిన్న ధర్ములు= ఏకరూపమైన ధర్మం కలవారు; అగుటన్= అయిన కారణంగా; భవత్+సౌహృదమునకున్= మీమంచితనానికి; ఏను= నేను; చాలన్= మిక్కిలిగా; పరితోషము= నిండైన ఆనందాన్ని; సమతన్= సమభావంతో; నేఁడు= ఈనాడు; అందితిన్= పొందాను.

**తా :** తాపస శ్రేష్ఠులైన ప్రచేతసులారా! సంతోషంగా వినండి. మీరు భేదభావం లేని చెలిమి కలవారు. అటువంటి మీ సమతకు నాకు చాలా ఆనందం కలిగింది.

**విశే :** సమతన్ – ఆత్మసామ్యంతో – తనయందు తనకు ఎంత ప్రీతి ఉంటుందో అటువంటి ప్రీతితో అని తాత్పర్యం.

**క. అనయమును మీ మనోరథ, మొనరింతు, నెఱుంగఁ బలుకుఁ దుత్తములగు మి**
**మ్మనుదినము నెవ్వఁడు సుఖశ, యనుఁడై మదిలోనఁ దలఁచు నా నరుఁ డెపుడున్. 907**

**ప్రతి :** అనయమును= తప్పనిసరిగా; మీ మనోరథము= మీ కోరికను; ఒనరింతున్= సఫలం చేస్తాను; ఎఱుంగన్= తెలిసేవిధంగా; పలుకుఁడు= చెప్పండి; ఉత్తములు+అగు= మిక్కిలి గొప్పవారలగు; మిమ్మున్= మిమ్ములను; అనుదినము= ప్రతిదినం; ఎవ్వఁడు= ఏ మనుష్యుడు; సుఖ+శయనుఁడు+ఐ= మంచిగా శయనించినవాడై; మదిలోనన్= మనస్సులో; తలఁచున్= స్మరణకు తెచ్చుకుంటాడో; ఆ నరుఁడు= ఆ మానవుడు; ఎపుడున్= ఎల్లవేళలా...

**తా :** నేను తప్పక మీ కోరికను తీరుస్తాను. స్పష్టంగా చెప్పండి. ఉత్తములగు మిమ్ములను ప్రతిదినము సుఖంగా శయనించి మనస్సులో తలచుకొనే ఆ నరుడు ఎల్లవేళలా

**క. భ్రాతృజన సౌహృదంబును, భూతదయాగుణము విమల బుద్ధియు సుజన**
**ప్రీతియుఁ గల్గి సుఖించును, వీత సమస్తాఘుఁ డగుచు విశ్వములోనన్. 908**

**ప్రతి :** భ్రాతృ జన సౌహృదంబును= అన్నదమ్ముల యెడ చెలిమియు; భూత దయా గుణము= ప్రాణులన్నింటి యందు దయ అనే లక్షణం; విమల+బుద్ధియున్= చెడు భావనలులేని బుద్ధి, సుజన ప్రీతియున్= మంచివారియందు ప్రేమ; కల్గి= ఏర్పడి; విశ్వములోనన్= విశ్వమంతటా; వీత సమస్త+అఘుఁడు= పోయిన అన్ని పాపాలు కలవాడు; అగుచున్= అగుచు; సుఖించును= సుఖం పొందుతాడు.

**తా :** అన్నదమ్ములయందు చెలిమీ, భూతదయాగుణం, స్వచ్ఛమైనబుద్ధీ, మంచివారియందు ప్రీతీ కలిగి, సమస్త పాపాలూ పోయినవాడై విశ్వంలో సుఖిస్తాడు.

**వ. మఱియు రుద్రగీతం బయిన మదీయస్తవం బెవ్వ రనుదినంబును స్తోత్రంబు సేయుదురు, వారల కభిమత వరంబులు, శోభన కరంబగు ప్రజ్ఞయు నిత్తు, మీరలు ముదన్వితులై జనకాదేశం బంగీకరించుటం జేసి మీ కీర్తి లోకంబుల విస్తరిల్లు, మీకు ననూన బ్రహ్మగుణుండు నాత్మసంతతింజేసి లోకత్రయ పరిపూర్ణ గుణాకరుండు నైన పుత్రుండు సంభవింపంగలండు, కండు మహాముని తపోవినాశార్థంబుగా నింద్రునిచేతఁ బ్రేషిత యగు ప్రమ్లోచయను నప్సరస గర్భంబు దాల్చి య మ్మునీంద్రుని వీడ్కొని దివంబునకుం జను సమయంబునం బ్రసూతయై తత్పుత్రిని వృక్షంబులందుఁ బెట్టి చనిన. 909**

**ప్రతి :** మఱియున్= ఇంకా; రుద్రగీతంబు+అయిన= రుద్రుడుగానం చేసినదైన; మదీయ స్తవంబు= నాకు సంబంధించిన స్తోత్రాన్ని; ఎవ్వరు= ఏ నరులు; అనుదినంబును= ప్రతి దినమూ; స్తోత్రంబు+చేయుదురు= పాడుకొంటూ ఉంటారో; వారలకున్= అట్టివారికి; అభిమత వరంబులు= కోరినవరాలను; శోభన కరంబు+అగు= మేలు కలిగించేదైన; ప్రజ్ఞయున్= తెలివినీ; ఇత్తున్= ఇస్తాను; మీరలు= మీరు; ముదన్వితులు+ఐ= మోదంతో కూడిన వారై; జనక+ఆదేశంబు= తండ్రి ఆజ్ఞను; అంగీకరించుటన్+చేసి= ఒప్పుకొనటం చేత; మీ కీర్తి= మీ యశస్సు; లోకంబులన్= అన్ని లోకాలలో; విస్తరిల్లున్= వ్యాపిస్తుంది; మీకున్= మీకు; అనూన బ్రహ్మ గుణుండు= తక్కువకాని (గొప్పదియగు) బ్రహ్మముయొక్క గుణాలు కలవాడు; ఆత్మ సంతతిన్ చేసి= తన సంతానంతో; లోక త్రయ పరిపూర్ణ గుణ+ఆకరుండు+ఐన= లోకాల మూడింట నిండిన గుణాలకు నెలవు అయినవాడైన; పుత్రుండు= కొడుకు; సంభవింపంగలండు= జన్మిస్తాడు; కండు మహాముని తపస్ వినాశ+అర్థంబుగాన్= కండువనే మహర్షి తపస్సును నాశనం చేయటం ప్రయోజనంగా; ఇంద్రునిచేతన్= దేవేంద్రుని చేత; ప్రేషిత+అగు= పంపబడినదగు; ప్రమ్లోచ+అను= ప్రమ్లోచ అనే; అప్సరస= అచ్చర; గర్భంబు+తాల్చి= గర్భం

ధరించి; ఆ+ముని+ఇంద్రునిన్= ఆ మహర్షిని; వీడ్కొని= వదలి; దివంబునకున్= స్వర్గానికి; చను సమయంబునన్= వెళ్ళే సమయంలో; ప్రసూత+ఐ= ప్రసవించినదై; తత్+పుత్రిని= ఆమె కూతురిని; వృక్షంబులందున్= చెట్లమీద; పెట్టి= ఉంచి; చనినన్= వెళ్ళగా...

**తా :** ఇంకను, రుద్రుడు గానం చేసిన నా స్తోత్రాన్ని ప్రతిదినం చదివిన వారికి కోరిన వరాలిస్తాను. శుభాలను కలిగించే బుద్ధి విశేషాన్ని కూడా ఇస్తాను. మీరు సంతోషంతో కూడినవారై మీ తండ్రి ఆజ్ఞను అనుసరించటంవలన మీ కీర్తి లోకాలలో వ్యాపిస్తుంది. మీకు గొప్ప బ్రహ్మగుణాలు కలవాడూ, తన సంతతివల్ల మూడులోకాలను నిండించే మంచిగుణాలకు గనియైనవాడూ అయిన కుమారుడు జన్మిస్తాడు. కండుమహాముని తపస్సును పాడుచేయటానికి ఇంద్రుడు పంపిన ప్రమ్లోచ అనే అప్సరః కాంత గర్భం ధరించి ఆ మునివరుని వీడ్కొని స్వర్గానికి పోయేసమయంలో పుట్టిన ఆమె పుత్రికను చెట్లలో ఉంచి పోగా

**సీ. ఆ శిశు వపుడు పేరాఁకలిచేఁ గుంది వావిచ్చి బిట్టు వాపోవుచుండ**
**నాలించి యటకు రాజైన సోముఁడు వచ్చి వలనొప్ప నవసుధావర్షి యైన**
**యాత్మీయ తర్జని నర్థిఁ బానమ్ము సేయింపంగఁ బెరిఁగి య య్యిందువదనఁ**
**గన్య వరారోహఁ గడఁక మారిషయను చెలువఁ బుణ్యుండు ప్రాచీనబర్హి**

**తే. యన్నృపునిచేఁ బ్రజావిసర్గావసరము, నందు వేడ్కఁ దదాదిష్టు లైన మీర**
**లందఱును నెయ్యమున వివాహంబు గండ, యని సరోరుహనయనుఁ డిట్లనియె మఱియు. 910**

**ప్రతి :** ఆ శిశువు= ఆ పసిబిడ్డ; అపుడు= ఆ సమయంలో; పేరు+ఆఁకలిచేన్= పెద్ద ఆకలితో; కుంది= బాధపడి; వావిచ్చి= నోరు తెరచి; బిట్టు= పెద్దగా; వాపోవుచుండన్= ఏడ్చుచుండగా; ఆలించి= విని; అటకున్= ఆ ప్రదేశానికి; రాజు+ఐన= పాలకుడైన; సోముఁడు= చంద్రుడు; వచ్చి= ఏ తెంచి; వలను+ఒప్పన్= నేర్పుగా; నవ సుధా వర్షి+ఐన= క్రొత్త అమృతాన్ని కురిసేదైన; ఆత్మీయ తర్జనిన్= తన చూపుడు వేలిని; అర్థిన్= ఇష్టంగా; పానమ్ము+చేయింపంగన్= తాగునట్లు చేయగా; పెరిగి= పెద్దదైన; ఆ ఇందువదనన్= ఆ చంద్రుని వంటి మోముకలదైన; కన్యన్= కన్నియను; వరారోహన్= గొప్ప పిరుదులుగల స్త్రీని; కడఁకన్= పూనికతో; మారిష+అను= మారిష అనే; చెలువన్= అందగత్తెను; పుణ్యుండు= పుణ్యాత్ముడు; ప్రాచీనబర్హి; అన్+నృపునిచేన్= అనేరాజుచేత; ప్రజా విసర్గావసరమునందున్= సంతానాన్ని కలిగించే పనిలో; వేడ్కన్= వేడుకతో; తద్+ఆదిష్టులు+ఐన= అతనిచేత ఆదేశించబడినవారైన; మీరలు= మీరు; అందఱును; నెయ్యమునన్= ప్రీతితో; వివాహంబు+కందు+అ= పెండ్లి చేసుకొనుడు; అని; సరోరుహ నయనుఁడు= పద్మాలవంటి కన్నులున్న శ్రీహరి; మఱియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** ఆ బిడ్డ అప్పుడు ఆకలితో బాధపడి నోరు తెరిచి ఏడుస్తుండగా విని అక్కడకు వచ్చి రాజైన చంద్రుడు చక్కగా కొత్త అమృతాన్ని కురిపించే తన చూపుడు వేలిని ప్రేమతో త్రాగించగా పెరిగింది. చంద్రునివంటి మోముతో అలరారుతున్న ఆ కన్యను, ఉత్తమస్త్రీని మారిష అను కన్యను పుణ్యశాలి అయిన ప్రాచీనబర్హి అను రాజుచేత సంతానాన్ని పెంపొందించే పనియందు వేడుకతో మిమ్ము ఆదేశించినందున మీరందరూ ప్రేమగా పెండ్లి చేసుకోండి అని చెప్పి, పద్మనయనుడైన విష్ణువు ఇంకా ఇలా అన్నాడు.

**వ. అనఘాత్ములారా! యభిన్న ధర్మశీలు రయిన మీకు నందఱకు నా సుమధ్యమయైన కన్య యభిన్న ధర్మశీలయు భవ దర్పితాశయయు నయిన భార్య యగు, మీర లప్రతిహత తేజస్కులై దివ్యవర్ష సహస్రంబులు భౌమ దివ్యభోగంబులు మదనుగ్రహులై యనుభవించెద, రంత నా యందుల భక్తిం జేసి నిర్మలాంతః కరణులై యీ భోగంబులు నిరయ ప్రాయంబులుఁ గాఁ దలంచి మదీయ స్థానంబు నొందెద రని వెండియు నిట్లనియె. 911**

**ప్రతి :** అనఘ+ఆత్ములారా!= పుణ్యాత్ములారా!; అభిన్న ధర్మ శీలురు+అయిన= ఏకరూపమైన ధర్మం శీలంగా కలవారైన; మీకు= మీకు; అందఱకున్= అందరికీ; ఆ సుమధ్యమ+ఐన= సన్నని నడుముగలదైన; కన్య= పడుచు; అభిన్న ధర్మ శీలయున్= వేరుకాని ధర్మం శీలంగా కలదీ; భవత్+అర్పిత+ఆశయయున్= మీకు సమర్పించుకొన్న మనస్సుకలదీ; అయిన; భార్య= ఇల్లాలు; అగున్= అవుతుంది; మీరలు= మీరు; అప్రతిహత తేజస్కులు+ఐ= ఎదురులేని తేజస్సు కలవారై; దివ్య వర్ష సహస్రంబులు= వేలకొలది దేవతలసంవత్సరాలు; భౌమ దివ్య భోగంబులు= భూమికి, దేవలోకానికి సంబంధించిన సుఖాలు; మత్+అనుగ్రహులు+ఐ= నా అనుగ్రహంకలవారై; అనుభవించెదరు= అనుభవిస్తారు; అంతన్= అటుపైన; నాయందుల భక్తిన్+చేసి= నా మీది భక్తితో; నిర్మల+అంతఃకరణులు+ఐ= చెడు భావనలు లేని హృదయాలు కలవారై; ఈ భోగంబులు= ఈ సుఖాలు; నిరయప్రాయంబులు+కాన్= నరకంవంటివిగా; తలంచి= భావించి; మదీయస్థానంబున్= నాకు చెందిన స్థానాన్ని; ఒందెదరు= పొందుతారు; అని= అని చెప్పి; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

**తా :** పుణ్యాత్ములారా! మీరు ఒకే విధమైన ధర్మాన్ని పాటించే శీలం కలవారు. కనుక మీకందరికీ ఈసన్నని నడుముగల సుందరి ఏకధర్మశీల, మీకు అర్పించుకొన్న మనస్సు కలదీ అయిన భార్య అవుతుంది. మీ తేజస్సుకు ఎదురు ఉండదు. పెక్కువేల దివ్యవత్సరాలు నా అనుగ్రహంతో భూలోక, దేవలోక సుఖాలు అనుభవిస్తారు. అటుపిమ్మట నా యందలి భక్తితో ఈ సుఖాలన్నీ నరకంవంటివి అని మీరు భావించి నిర్మలమైన మనస్సు కలవారై నా స్థానాన్ని చేరుకొంటారు అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.

**విశే :** భగవంతుని మీద భక్తి హృదయాన్ని మాలిన్యం లేనిదిగా చేస్తుంది. దానితో వారు సంసారంనుండి విముక్తి పొందుతారని తాత్పర్యం.

**చ. అరయ గృహస్థు లయ్యును మదర్పిత కర్ములు నస్మదీయ సుం**
**దర చరితామృత శ్రవణ తత్పరమానస యాతయాములున్**
**సరస గుణాఢ్యులై తనరు సాధుల కీ గృహముల్ దలంప దు**
**ష్కరభవబంధ హేతువులు గావు, నృపాత్మజులార! యెన్నఁడున్. 912**

**ప్రతి :** నృప+ఆత్మజులార!= రాజకుమారులారా!; అరయన్= విచారించి చూచినట్లైతే; గృహస్థులు= సంసారబంధం కలవారు; అయ్యును= అయినా; మత్+అర్పిత కర్ములున్= నాకు సమర్పించిన కర్మలు (కర్మఫలాలు) కలవారూ; అస్మదీయ= నాకు సంబంధించిన; సుందర= మనోహరమైన; చరిత+అమృత= అమృతంవంటి కథలను; శ్రవణ= వినుటయందు; తత్పర= శ్రద్ధకల; మానస యాతయాములున్= మనస్సుతో గడపిన జాములు కలవారు; సరసగుణ+ఆఢ్యులు+ఐ=

సరసములైన గుణాలతో ప్రసిద్ధి కెక్కినవారై; తనరు= ఒప్పారు; సాధులకున్= ఉత్తమస్వభావంకలవారికి; ఈ గృహముల్= ఈ ఇండ్లు; తలంపన్= భావించగా; దుష్కర= ఆచరించటానికి అలవికాని; భవ= సంసారానికి చెందిన; బంధ= బంధనాలకు; హేతువులు= కారణాలు; ఎన్నఁడున్= ఎన్నటికీ; కావు.

**తా :** రాజకుమారులారా! సంసారంలో ఉన్నవారయినా కర్మలను, కర్మఫలాలను నాకు సమర్పించుకొని మిక్కిలి మనోహరాలైన, అమృతం వంటి నాకథలను వినటంలో ఆసక్తి కల మనస్సుతో కాలం గడిపేవారయితే వారికి సంసారాలు తెంచుకోరాని భవబంధాలకు కారణాలు కావు.

**వ. అది యెట్లంటిరేని. 913**

**ప్రతి :** అది; ఎట్లు= ఏవిధమైనది; అంటిరి+ఏని= అంటే.

**చ. అనుపమ బ్రహ్మవాదు లగు నంచిత యోగిజనానుగీయమా**
**న నిజకథా సముత్సుకుఁ డనందగు నేను మదీయులంద నూ**
**తనముగ నుందుఁ గావున నుదారత వారికి నీ గృహావళుల్**
**ఘనభవబంధ హేతువులు గా, విది యంతయు నిక్కమారయన్. 914**

**ప్రతి :** అనుపమ బ్రహ్మ వాదులు= సాటిలేని పరబ్రహ్మమును గూర్చి బోధించేవారు; అగు= అయిన; అంచిత= పూజ్యులైన; యోగి= యోగులు అనే; జన= జనులచేత; అనుగీయమాన= నిరంతరంగా కొనియాడబడే; నిజ= నాదైన; కథా= మాటలయందు; సముత్సుకుఁడు= మిక్కిలి వేడుకకలవాడు; అనన్= అనటానికి; తగు= తగిన; నేను; మదీయులందు+అ= నా వారి యందే; నూతనముగన్= ఎప్పటికప్పుడు కొత్తవాడను అన్నట్లుగా; ఉందున్= ఉంటాను; కావునన్= కాబట్టి; ఉదారతన్= గొప్పతనంతో; వారికిన్= అట్టిభక్తులకు; ఈ గృహ+ఆవళుల్= ఈ ఇల్లూ వాకిలీ మొదలైనవి; ఘన భవ బంధ హేతువులు= గొప్ప సంసారబంధాలకు కారణాలు; కావు; ఇది= ఈ విషయం; అంతయున్= అంతా; ఆరయన్= విచారించగా; నిక్కము= సత్యం.

**తా :** నాయనలారా! ప్రచేతసులారా! బ్రహ్మమును గూర్చి మాత్రమే నిరంతరం వాక్కులను ఉపయోగించే మహాత్ములైన యోగిజనులు నిరంతరంగా నా కథలను గానం చేస్తూ ఉంటారు. అందు నాకు వేడుక ఎక్కువ. కాబట్టి, వారు నా వారు. నేను ఎప్పటికప్పుడు నవీనంగా వారిలో నివసిస్తాను. ఆ మహిమవలన వారికి ఈ ఇళ్ళూ వాకిళ్ళూ మొదలైనవి సంసారబంధానికి కారణాలు కావు. ఇదంతా విచారించి చూస్తే సత్యం.

**క. సరసుఁడ నగు ననుఁ బొందిన, పురుషులు ఘనశోక మోహమోదంబులఁ బొం**
**దరు, గావున నెనయఁగను త్రి, పురుషాధీశ్వరుఁడ బ్రహ్మభూతుఁడ నగుదున్. 915**

**ప్రతి :** సరసుఁడను= రసస్వరూపుడను; అగు+ననున్= అయిన నన్ను; పొందిన పురుషులు= చేరుకొన్న మానవులు; ఘన= గొప్పవి అయిన; శోక= దుఃఖాన్ని; మోహ= తెలివితప్పినతనాన్ని; మోదంబులన్= భౌతికసుఖాలను; పొందరు; కావునన్= కాబట్టి; ఎనయన్+కను= విచారించి చూస్తే; త్రిపురుష+అధి+ఈశ్వరుఁడను= ముగ్గురు పురుషులకు ప్రభువును; బ్రహ్మభూతుడు= బ్రహ్మము అయిన వాడను; అగుదున్= అయి వున్నాను.

**తా :** నేను రసస్వరూపుడను. కాబట్టి, నన్ను చేరుకొన్న మానవులకు శోకం, మోహం, సంతోషం మొదలైన భావాలు కలుగవు. కనుక పరిశీలిస్తే నేను ముగ్గురు పురుషులకు ప్రభుడను. బ్రహ్మము అయిన వాడను.

**వ. అని యిట్లు పలుకుచున్న పురుషార్థ భాజనుండగు జనార్దనుని దర్శించి తద్దర్శన విధ్వస్త రజస్తమోగుణు లయిన ప్రచేతసులు. 916**

**ప్రతి :** అని; ఇట్లు; పలుకుచున్న; పురుష+అర్థ భాజనుండు+అగు= పురుషార్థాలను పొందించువాడగు; జనార్దనునిన్= శ్రీమహావిష్ణువును; దర్శించి= దర్శనం చేసుకొని; తద్= ఆతని; దర్శన= దర్శనంచేత; విధ్వస్త= పూర్తిగా నశించిపోయిన; రజస్= రజస్సు; తమస్= తమస్సు; అనే; గుణులు+ఐన= గుణాలు కలవారైన; ప్రచేతసులు;

**తా :** అని ఈ విధంగా మాట్లాడుతున్న పురుషార్థాలను మానవులకు అందించే జనార్దనుని దర్శించి, ఆదర్శనంచేత మొత్తంగా నశించిన రజస్తమోగుణాలు కలవారైన ప్రచేతసులు

**చ. కరసరసీరుహంబు లెసకం బెసఁగన్ ముకుళించి గద్గద**
**స్వరములఁ జేసి యిట్లనిరి, సర్వశరణ్యు నగణ్యు నిందిరా**
**వరు నజితున్ గుణాఢ్యు ననవద్య చరిత్రుఁ బవిత్రు నచ్యుతుం**
**బరుఁ బరమేశు నీశు భవబంధవిమోచనుఁ బద్మలోచనున్. 917**

**ప్రతి :** సర్వశరణ్యున్= అందరికి రక్షకుడైనవానిని; అగణ్యున్= లెక్కలకు అందనివానిని; ఇందిరావరున్= ఇందిరాదేవికి పతియైనవానిని; అజితున్= ఎక్కడా ఎప్పుడూ ఓటమిలేనివానిని; గుణాఢ్యున్= గుణసంపన్నుని; అనవద్య చరిత్రున్= దోషం లేని నడవడి కలవానిని; పవిత్రున్= పరిశుద్ధుని; అచ్యుతున్= జారుపాటు లేనివానిని; పరున్= లోకాలకంటె వేరైనవానిని; పరమ+ఈశున్= మహాప్రభుని; ఈశున్= సర్వలోకాలకు పాలకుడైన వానిని; భవ బంధ విమోచనున్= సంసారమనే బంధాలను విడిపించేవానిని; పద్మలోచనున్= తామరపూవులవంటి కన్నులు కలవానిని; కరసరసీరుహంబులు= పద్మాలవంటి చేతులను; ఎసకంబు+ఎసఁగన్= అతిశయం ఒప్పారగా; ముకుళించి= మోడ్చి; గద్గదస్వరములన్+చేసి= డగ్గుత్తికపడిన కంఠస్వరాలతో; ఇట్లు= ఈ విధంగా; అనిరి= స్తుతించారు

**తా :** అందరికి రక్షకుడు, అప్రమేయుడు, లక్ష్మీపతి, ఎక్కడా ఓటమి లేనివాడు, గుణసంపన్నుడు, దోషాలు లేని చరిత్రకలవాడు, పరిశుద్ధుడు, అచ్యుతుడు, పరుడు, పరమేశుడు, ఈశుడు, సంసారబంధాలనుండి జీవులకు విముక్తి కలిగించేవాడు, పద్మాలవంటి కన్నులున్నవాడు అయిన శ్రీహరిని ఆ ప్రచేతసులు పద్మాలవంటి చేతులను దగ్గరకు చేర్చుకొని గొంతుకనుండి స్వరం ఆనందపారవశ్యంతో చక్కగా రానిస్థితితో తెమల్చుకొంటూ ఇలా స్తుతించారు.

**సీ. కేశవ! సంతత క్లేశనాశనుఁడవు కోరి మనో వాగగోచరుఁడవు**
**నిద్ధమనోరథ హేతుభూతోదార గుణనాముఁడవు సత్త్వగుణుఁడ వఖిల**
**విశ్వోద్భవ స్థితి విలయార్థ ధారిత విపుల మాయాగుణ విగ్రహుఁడవు**
**మహితాఖిలేంద్రియ మార్గ నిరధిగత మార్గుండ వతిశాంతమానసుఁడవు**

**తే. తవిలి సంసార హారిమేధస్కుఁడవును, దేవదేవుఁడవును వాసుదేవుఁడవును**
**సర్వభూత నివాసివి సర్వసాక్షి, వైన నీకు నమస్కారమయ్య! కృష్ణ! 918**

**ప్రతి :** కేశవ; సంతత క్లేశ నాశనుఁడవు= ఎల్లవేళల కష్టాలను నశింపజేసేవాడవు; కోరి= వాంఛించి; మనస్+వాక్+అగోచరుఁడవు= మనస్సునకు మాటలకు అందనివాడవు; ఇద్ధ= వెలుగొందెడి; మనోరథ= కోరికలకు; హేతు భూత= కారణాలయిన; ఉదార= గొప్పవి అయిన; గుణ= లక్షణాలు; నాముఁడవు= పేర్లుకలవాడవు; సత్త్వగుణుఁడవు= సత్వగుణం కలవాడవు; అఖిల విశ్వ= అన్నిలోకాల; ఉద్భవ= పుట్టుక; స్థితి= ఉనికి; విలయ= నాశం; అనే; అర్థ= విషయాలతో; ధారిత= పట్టుకోబడిన; విపుల= చాలా విస్తృతమైన; మాయాగుణ= మాయ అనే గుణంతో కూడిన; విగ్రహుఁడవు= ఆకారవిశేషం కలవాడవు; మహిత= గొప్పవి అయిన; అఖిల= సమస్తమైన; ఇంద్రియ= విషయాలను గ్రహించే అవయవాల; మార్గ= దారులచేత; నిరధిగత= పొందరాని; మార్గుండవు= మార్గంకలవాడవు; అతి శాంతమానసుఁడవు= మిక్కిలి శాంతమైన మనస్సుకలవాడవు; తవిలి= పూనుకొని; సంసార హారి మేధస్కుఁడవును= సంసారాన్ని రూపుమాపే బుద్ధిశక్తి కలవాడవు; దేవ దేవుఁడవును= దేవతలైన ఇంద్రుడు మొదలైన వారికి కూడా దేవుడవు; వాసుదేవుఁడవును= వసుదేవతనయుడవు; సర్వ భూత నివాసివి= ప్రాణులన్నింటిలో నివసించేవాడవు; (ప్రాణులన్నింటికి నెలవు అయినవాడవు) సర్వసాక్షివి= అన్నింటినీ, అందరినీ చూచువాడవు; అయిన కృష్ణ= కృష్ణా; నీకున్= నీకు; నమస్కారమయ్య= నమస్కారం స్వామీ.

**తా :** కేశవా! నీవు ఎల్లప్పుడు ప్రాణులకు కలిగే కష్టాల నన్నింటిని నశింపజేసేవాడవు. ఎవరి మనస్సులకు, మాటలకు అందనివాడవు. నీ గుణాలు, నీ పేర్లూ, పెక్కు విధాలైన గొప్ప కోరికలకు కారణం అవుతూ ఉంటాయి. అన్నిలోకాల పుట్టుక, పెరుగుట, గిట్టుట అనే విషయాలను పట్టినిలిపే గొప్పది అయిన మాయా గుణం నీమూర్తి. ఇంద్రియ మార్గాలకు చిక్కని చక్కని దారి నీది. మిక్కిలి శాంతమైన మనస్సు కలవాడవు. సంసారమనే అజ్ఞానాన్ని హరించే మేధా సంపద నీది. నీవు దేవదేవుడవు. వాసుదేవుడవు. అన్ని నీలో నివసిస్తూ ఉంటాయి. నీవు సకల ప్రాణులలో ఉంటావు. సర్వసాక్షివి. అటువంటి కృష్ణా! నీకు నమస్కారం.

**వ. మఱియును. 919**

**ప్రతి :** మఱియును= ఇంకా

**ఉ. తోయరుహోదరాయ! భవదుఃఖహరాయ! నమో నమః పరే**
**శాయ! సరోజకేసర పిశంగ వినిర్మల దివ్య భర్మ వ**
**స్త్రాయ! పయోజ సన్నిభ పదాయ! సరోరుహ మాలికాయ! కృ**
**ష్ణాయ! పరాపరాయ! సుగుణాయ! సురారిహరాయ! వేధసే! 920**

**ప్రతి :** తోయరుహ+ఉదరాయ= పద్మం బొడ్డునందుగలవానికి; భవ దుఃఖ హరాయ= సంసారం దుఃఖాన్ని పోగొట్టే వానికి; పర+ఈశాయ= పరుడైన ఈశ్వరుడైన వానికి; సరోజ= పద్మంలోని; కేసర= కింజల్కములవంటి; పిశంగ= పచ్చని; వినిర్మల= మిక్కిలి స్వచ్ఛమైన; దివ్య= దేవలోక సంబంధమైన; భర్మవస్త్రాయ= బంగారు వస్త్రంగల వానికి; పయోజ సన్నిభ పదాయ= పద్మంవంటి పాదాలుగల వానికి; సరోరుహ మాలికాయ= పద్మాలమాలగల వానికి; పర+అపరాయ= పరుడు,

అపరుడు ఐన వానికి; సుగుణాయ= మంచిగుణాలుగల వానికి; సురారి హరాయ= దేవతల పగవారైన రక్కసులను నశింపజేయు వానికి; వేధసే= సర్వమునకు సృష్టికర్త అయిన వానికి; కృష్ణాయ= నల్లని వన్నెతో అలరారు శ్రీమహావిష్ణువునకు; నమః+నమః= మరల మరల నమస్కారం.

**తా :** స్వామి బొడ్డులో పద్మం ఉంది. స్వామి సంసార దుఃఖాన్ని రూపుమాపువాడు. పరులకు ఈశ్వరుడు, (పరుడైన ఈశ్వరుడు). తామర పూవులోని కేసరాలవంటి పచ్చనిది, స్వచ్ఛమైనది, దివ్యమైనది అయిన బంగారు వస్త్రం ధరించినవాడు. పద్మాలవంటి పాదాలు కలవాడు; పద్మమాలను తాల్చినవాడు, పరుడు, అపరుడు, మంచిగుణాలు కలవాడు; రక్కసులను సంహరించేవాడు, సృష్టికి కారణమైనవాడు అయిన మనోహరమైన నల్లని వన్నెతో అలరారుతున్న శ్రీమహావిష్ణువునకు నమస్కారం, నమస్కారం.

**వ. అని వినుతించి. 921**

**ప్రతి :** అని; వినుతించి= కొనియాడి...

**తా :** ఈ విధంగా స్తుతిచేసి

**చ. కమలదళాక్ష! దుఃఖలయ కారణమై తగు తావకీన రూ**
**పము ననివార్య దుర్భర విపద్దశ దుఃఖము నొందు మాకు నీ**
**సుమహిత సత్కృపాగరిమఁ జూపుట కంటె ననుగ్రహంబు లో**
**కమునఁ దలంప నొండొకటి గల్గునె? భక్త ఫల ప్రదాయకా! 922**

**ప్రతి :** కమల దళ+అక్ష= తామరరేకులవంటి కన్నులుగల స్వామీ!; భక్త ఫల ప్రదాయకా= భక్తులకు గొప్పప్రయోజనాలను చక్కగా ఇచ్చే దేవా!; దుఃఖ లయ కారణము+ఐ= దుఃఖాలు రూపుమాసిపోవటానికి హేతువై; తగు= ఒప్పారే; తావకీన రూపమున్= నీదయిన రూపాన్ని; అనివార్య= ఆపుటకు వీలుకాని; దుర్భర= భరింపనలవికాని; విపత్= ఆపదల; దశన్= అవస్థతో; దుఃఖమున్= దుఃఖాన్ని; ఒందు మాకున్= పొందే మాకు; నీ= నీదయిన; సుమహిత= మిక్కిలి గొప్పది అయిన; సత్= మేలైన; కృపా= దయయొక్క; గరిమన్= గౌరవాన్ని; చూపుటకంటెన్= చూపటంకంటె; అనుగ్రహము= ఏలుకోవటం; లోకమునన్= లోకంలో; తలంపన్= భావిస్తే; ఒండు+ఒకటి= మరొక్కటి; కల్గునె= ఉండునా?

**తా :** పద్మదళనయనా! భక్తుల ప్రయోజనాలను చక్కగా అనుగ్రహించే స్వామీ! నీ దర్శనం మా దుఃఖాలన్నీ రూపుమాసి పోవటానికి కారణమైంది. తొలగించుకొనరానివీ, భరించటానికి అలవి కానివీ అయిన కష్టాల అవస్థతో దుఃఖం పొందుతున్న మాకు నీ గొప్పదైన మంచి కరుణాగౌరవాన్ని చూపటం కంటె మించిన అనుగ్రహం భావిస్తే లోకంలో మరొకటి ఏముంటుంది?

**ఉ. భూరి శివేతరాపహవిభూతి సమేత! మహాత్మ! దీన ర**
**క్షా రతి నొప్పు నీవు చిరకాలమునన్ సుఖవృత్తి వీరు మా**
**వార లటంచు బుద్ధి ననవద్య! తలంచిన యంతమాత్ర స**
**త్కారమె చాలు నట్లగుట గా కిటు సన్నిధి వైతి వీశ్వరా! 923**

**ప్రతి :** భూరి= ఎక్కువ; శివ+ఇతర= మంగళంకాని భావాన్ని; ఆపహ= తొలగించునట్టి; విభూతి= ఐశ్వర్యంతో; సమేత= కూడినవాడా!; మహాత్మ= పరమాత్మా; అనవద్య= ఏ కొంచెం దోషమూలేని దేవా; ఈశ్వరా= సర్వానికి పాలకుడైనవాడా!;

దీన రక్షా రతిన్= దిక్కులేనివారిని కాపాడుటయందు ప్రీతితో; ఒప్పు= ప్రకాశించే; నీవు; చిరకాలమునన్= పెద్దకాలానికి; సుఖవృత్తిన్= ఆనందంతో; వీరు= ఈ వ్యక్తులు; మావారు= మాకు సంబంధించినవారు; అట+అంచున్= అనుకొంటూ; బుద్ధిన్= బుద్ధిలో; తలంచిన అంత మాత్ర సత్కారమె= భావించటం అన్న కొంచెంపాటి ఉత్తమమైన పనియే; చాలున్= సరిపోతుంది; అట్లు= ఆవిధంగా; అగుట= కావటం; కాక= కాకుండా; ఇటు= ఈ విధంగా; సన్నిధివి= సాక్షాత్కరించినవాడవు; ఐతివి= అయ్యావు.

**తా :** స్వామీ! నీవు అశుభాలను తొలగించే వైభవంతో కూడిన వాడవు; మహాత్ముడవు. లోకాలనన్నింటినీ ఏలే దేవరవు. అట్టి నీవు దీనులను కాపాడుటయే పనిగా పెద్దకాలానికి ఆనందంతో వీళ్ళు మావాళ్ళు అని బుద్ధిలో అనుకొనటమే మాకు గొప్ప సత్కారం. అదే చాలు. కానీ, దానితో ఆగక స్వయంగా మాకు సాక్షాత్కరించావు.

**చ.** **అరయఁగ క్షుద్రభూత హృదయంబుల యందుల నంతరాత్మవై**
**తిరముగ నుండు నీవు భవదీయ పదాంబురుహ ద్వయార్చనా**
**పరమతు లైన మాకును శుభప్రద భూరి మనోరథంబు లీ**
**వెఱుఁగవె? భక్తలోక హృదయేప్సిత దాయక! ముక్తినాయకా!** **924**

**ప్రతి :** భక్త= భక్తుల; లోక= సముదాయాల; హృదయ= మనస్సులలో ఉండే; ఈప్సిత= కోరికలను; దాయక= ఇచ్చేస్వామీ!; ముక్తి నాయకా= మోక్షానికి చేర్చేదేవా!; అరయఁగన్= భావించగా; క్షుద్ర= చాలా చిన్నవి అయిన; భూత= ప్రాణుల; హృదయంబులయందులన్= అంతరంగాలలో కూడా; అంతర్+ఆత్మవు+ఐ= లోపల ఉన్న ప్రత్యగాత్మస్వరూపుడవై; తిరముగన్= స్థిరంగా; ఉండు నీవు= ఉండే నీవు; భవదీయ= నీయొక్క; పద= పాదాలనే; అంబురుహ= పద్మాల; ద్వయ= జంటయొక్క; అర్చనా= పూజించటమే; పర= చివరిలక్ష్యమైన; మతులు= బుద్ధిగలవారు; ఐన= అయిన; మాకును= మాకు సంబంధించిన; శుభ= మంగళములను; ప్రద= అనుగ్రహించే; భూరి= గొప్పవి అయిన; మనస్+రథంబులు= కోరికలను; ఈవు= నీవు; ఎఱుఁగవె= తెలియవా?

**తా :** ప్రభూ! నీవు భక్తుల సముదాయాల హృదయాలలో ఉండే కోర్కెల నన్నింటినీ తీర్చేవాడవు. మోక్షానికి నడపించేవాడవు. భావన చేయగా చిన్నిప్రాణుల హృదయాలలో కూడా అంతరాత్మవై స్థిరంగా ఉంటావు. కాగా నీ పాదపద్మాల జంటను పూజించటం తప్ప మరొక పనిలేని మాకు శుభాలను కూర్చే నీవు మాకోరికలేవో తెలియనివాడవా?

**సీ.** **అయినను విను సరోజాయత లోచన! వర మోక్ష మార్గ ప్రవర్తకుఁడవుఁ**
**బురుషార్థ భూత విస్తరుఁడవు నగు నీవు దగిలి ప్రసన్నుఁడ వగుట మాకు**
**నర్థి మనోభీష్టమైన వరం బయ్యె నైనను నాథ! పరాపరుండ**
**వైన నిన్నొక వరం బర్థింతు మనినను భువిఁ దావకీన విభూతు లెన్న**

**తే.** **నంత మెఱుఁగంగ రామి ననంతుఁ డనుచుఁ, బలుకుదురు నిన్ను, నది గానఁ బరమ పురుష!**
**యే వరం బని కోరుదు మేము? దప్పి, గొన్న బాలకుఁ డబ్ధి నీ ళ్లెన్ని గ్రోలు?** **925**

**ప్రతి :** సరోజ+ఆయత లోచన= పద్మాలవంటి విశాలమైన నేత్రాలుగల దేవా!? అయినను= అయినా; విను= ఆలకించు; వర= మిక్కిలి శ్రేష్ఠమైన; మోక్ష= ముక్తికి సంబంధించిన; మార్గ= దారియందు; ప్రవర్తకుఁడవు= నడపేవాడవు; పురుష+అర్థ

భూత విస్తరుఁడవును= మానవులు సాధించవలసిన ధర్మం మొదలయినవాని వ్యాప్తియే స్వరూపమైనవాడవు; అగు; నీవు; తగిలి= పూనుకొని; ప్రసన్నుఁడవు= స్పష్టమైన అనుగ్రహం కలవాడవు; అగుట= కావటం; మాకున్= మాకు; అర్థిన్= కోరికను అనుసరించే; మనస్+అభీష్టము+ఐన= మనస్సులకు మిక్కిలి ఇష్టమైన; వరంబు= వరం; అయ్యెన్= అయినది; ఐనను= అయినప్పటికీ; నాథ= ఈశ్వరా!; పర+అపరుండవు+ఐన= పరుడవు, అపరుడవు అయిన; నిన్నున్= నిన్ను; ఒక వరంబు= ఏదో ఒక ఇష్టమైనదానిని; అర్థింతుము= కోరుకొందుము; అనినను= అంటే; భువిన్= ప్రపంచంలో; తావకీన విభూతులు= నీవి అయిన వైభవాలు; ఎన్నన్= లెక్కపెట్టటానికి; అంతము= తుది; ఎఱుఁగంగరామిన్= తెలియకపోవటం వలన; పరమపురుష= ఓ పరమాత్మా; నిన్నున్= నిన్ను; అనంతుఁడు= అంతం లేనివాడు; అనుచున్= అంటూ; పలుకుదురు= జ్ఞానులు వక్కాణిస్తారు; అది+కానన్= అందువలన; ఏము= మేము; ఏవరంబు= ఏ కోరిక; అని; కోరుదుము= అడుగుతాము?; దప్పిగొన్న= దాహం పొందిన; బాలకుఁడు= పిల్లవాడు; అబ్ధి నీళ్ళు= సముద్రపు నీళ్ళను; ఎన్ని= ఎంతగా; క్రోలును= తాగగలడు?

**తా :** వనజాక్షా! అయినా విను. నీవు మోక్షమార్గంలో భక్తులను నడిపించేవాడవు. పురుషార్థాల గొప్ప వ్యాప్తియే నీ స్వరూపం. అటువంటి నీవు మా యందు అనుగ్రహం చూపుతున్నావు. అదే మా మనస్సులలో ఇష్టమైన వరమయ్యింది. అయినా ప్రభువు నీవు పరాపరుడవు. అట్టి నిన్ను ఏదైనా ఒక వరం కోరదామంటే లోకంలో నీ విభూతులకు అంతం లేదు. అందువలననే నిన్ను అనంతుడు అని తత్త్వం తెలిసినవారు అంటారు. పరమపురుషా! అట్టి నిన్ను ఏ వరం కోరగలం? దాహం కలిగిన పిల్లవాడు సముద్రజలాన్ని ఎంత తాగగలడు.

**వ. ఇదియునుం గాక. 926**

**ప్రతి :** ఇదియునుం గాక= ఇంతేకాక.

**ఉ. పూని భవత్పదాంబురుహ మూల నివాసులమైన మేము మే**
**ధానిధి! నీ విలోకనముఁదక్కఁగ నన్యముఁ గోర నేర్తుమే?**
**మానిత పారిజాత కుసుమ స్ఫుట నవ్యమరందలుబ్ధ శో**
**భా నయశాలి యైన మధుపంబు భజించునె యన్యపుష్పముల్? 927**

**ప్రతి :** పూని= ప్రయత్నపడి; భవత్= నీ; పద= పాదాలనే; అంబురుహ= పద్మాల; మూల= మొదళ్ళయందు; నివాసులము+ఐన= నివసించేవారమైన; మేము; మేధానిధి= బుద్ధికి పెన్నిధివైన దేవా!; నీ విలోకనమున్= నీచూపును; తక్కఁగన్= కాక; అన్యమున్= మరొకదానిని; కోరన్+నేర్తుమే= కోరగలమా?; మానిత= మన్ననకెక్కిన; పారిజాత= పారిజాతమనే దేవ తరువునకు సంబంధించిన; కుసుమ= పూవుల; స్ఫుట= నిర్మలమయిన; నవ్య= కొత్తది అయిన; మరంద= తేనెయందు; లుబ్ధ= మిక్కుటమైన ఆశగల; శోభా= అందాల; నయశాలి+ఐన= నేర్పుతో ప్రకాశించేదైన; మధుపంబు= తుమ్మెద; అన్యపుష్పముల్= వేరుపూవులను; భజించునె= పొందుతుందా?

**తా :** స్వామీ! మేము నీ పాదపద్మాల పాదులను ఆశ్రయించి ఉండేవారం. బుద్ధిసంపదకు నెలవైన ఓ దేవా! నీ చూపు కాక మరొక్క దానిని కోరగలమా? మన్నన కెక్కిన పారిజాతపుష్పమకరందాన్ని పేరాసతో క్రోలి శోభతో విరాజిల్లే తుమ్మెద వేరు పుష్పాలను చేరుతుందా?

**చ. హరి! భవదీయమాయ ననయంబును జెందిన నేము నిచ్చలుం**
**గర మనురక్తి నేది తుదిగా భవకర్ములమై ధరిత్రి పైఁ**
**దిరుగుదు, మంతదాఁక భవదీయజనంబులతోడి సంగతిన్**
**గురుమతి జన్మజన్మములకున్ సమకూరఁగఁజేయు మాధవా! 928**

**ప్రతి :** హరి= శ్రీవిష్ణుదేవా!; మాధవా= లక్ష్మీపతీ!; భవదీయమాయన్= నీ దయిన మాయను; అనయంబును= ఎల్లవేళల; చెందిన నేము= పొందిన మేము; నిచ్చలున్= ఎల్లవేళల; కరము= మిక్కిలి; అనురక్తిన్= ప్రేమతో; ఏది= ఏది; తుదిగాన్= చివరి లక్ష్యంగా; భవ కర్ములము+ఐ= సంసారపు కర్మలు కల వారమై; ధరిత్రిపైన్= భూమిపై; తిరుగుదుము= తిరుగుతూ ఉంటామో; అంత దాఁక= అంతవరకు; భవదీయజనంబులతోడి సంగతిన్= నీవారైన జనుల కలయికను; గురుమతిన్= గొప్పభావనతో; జన్మజన్మములకున్= అన్ని పుట్టుకలయందును; సమకూరఁగన్+చేయుము= ఏర్పడేటట్లు చేయవయ్యా!

**తా :** స్వామీ! లక్ష్మీపతీ! మేము నీదైన మాయకు లోబడి ఎన్నో పనులు సంసారం కొరకు చేస్తున్నాం. మిక్కిలి ఆసక్తితో ఏది చివరి లక్ష్యంగా మేము తిరుగుతున్నామో అది లభించే వరకూ మాకు దొడ్డబుద్ధితో నీ పరమభక్తుల చెలిమిని జన్మజన్మలకు ప్రసాదించు.

**మ. కమలాధీశ్వర! తావకీన వర భక్త వ్రాత సంసర్గ లే**
**శముతోడన్ సరిగాఁ దలంప, మెలమిన్ స్వర్గాపవర్గాది సౌ**
**ఖ్యము లన్నన్ విను మానుషంబు లగు నీ కామంబులం జెప్ప నే**
**ల! మునీంద్ర స్తుత పాదపద్మ! సుజనాలాపానుమోదాత్మకా! 929**

**ప్రతి :** కమలా+అధీశ్వర= లక్ష్మీదేవికి ప్రభువైన స్వామీ!; ముని+ఇంద్ర స్తుత పాద పద్మ= మునిశ్రేష్ఠులు స్తుతించే పాదాలనే పద్మాలు గలదేవా!; సుజన+ఆలాప+అనుమోద+ఆత్మకా= ఉత్తములగు మానవుల పలుకులను ఇష్టపడే బుద్ధిగల ఈశ్వరా!; తావకీన= నీవారయిన; వర= శ్రేష్ఠులైన; భక్త= భక్తుల; వ్రాత= సముదాయంయొక్క; సంసర్గ= చెలిమియొక్క; లేశముతోడన్= కొంచెంతోనయినా; స్వర్గ+అపవర్గ+ఆది సౌఖ్యములు= స్వర్గం, మోక్షం మొదలయిన సుఖాలు; ఎలమిన్= ఇష్టముతో; సరిగాన్= సమానంగా; తలంపము= భావించము; అన్నన్= అంటే; విను= ఆలకించు; మానుషంబులు= మనుష్యలోకసంబంధాలు; అగు ఈ కామంబులన్= అయిన ఈ సుఖాలను గూర్చి; చెప్పన్+ఏల= చెప్పటమెందుకు?

**తా :** లక్ష్మీపతీ! మునిశ్రేష్ఠులు స్తుతించే పాద పద్మాలు కలవాడా! ఉత్తముల రసవంతములైన మాటలకు ఆనందించే బుద్ధికల దేవా! నీ శ్రేష్ఠ భక్తుల సమూహంతో చెలిమి ఎంత కొంచెమైనది అయినా, దానితో సమానంగా స్వర్గం, మోక్షం మొదలైన సుఖాలను కూడా మేము భావించం. ఇక మానవలోక సుఖాలమాట చెప్పటం ఎందుకు?

**వ. మఱియు భగవద్భక్త సంగంబుల యందుఁ దృష్ణాప్రశమనంబులైన మృష్ట కథలు చెప్పంబడుటచే భూతంబులయందు వైరంబును నుద్వేగంబును లేకుండు నని. 930**

**ప్రతి :** మఱియున్= ఇంకా; భగవత్+భక్త సంగంబులయందున్= భగవంతుని భక్తులతోడి కలయికలలో; తృష్ణా ప్రశమనంబులు+ఐన= దప్పికను అణచివేసేవైన; మృష్ట కథలు= పవిత్రతను కలిగించే చరిత్రలు; చెప్పన్+పడుటచేన్=

చెప్పబడటంవలన; భూతంబులయందున్= అన్నివిధాలైన ప్రాణులయందును; వైరంబును= పగయును; ఉద్వేగంబును= ఉడికిపోయే స్థితీ; లేక+ఉండున్= ఉండవు; అని;

**తా :** అంతేకాదు, భగవంతుని భక్తుల తోడి సాంగత్యమందు దాహాన్ని రూపుమాపేవి అయిన పవిత్రతను కలిగించే కథలు ఉంటాయి. కాబట్టి, వానిని వినటం వలన ఏ ప్రాణి యందూ పగగానీ, ఉడుకుమోతుతనంగానీ ఉండవు.

**చ.** **వనముల ముక్తసంగు లగువారు నుతింపఁ దనర్తు వీవు, గా**
**వున నిలఁ బుణ్యతీర్థములఁ బోలఁ బవిత్రము సేయఁ బూని య**
**ర్థిని బదచారులై ధరఁ జరించు భవత్పదభక్తసంగమం**
**బనుపమభూరిసంసృతిభయస్థుని బుద్ధి రుచింపకుండునే? 931**

**ప్రతి :** ఈవు= నీవు; వనములన్= అడవులలో; ముక్త సంగులు= అంటుకొనిపోయేతనాన్ని వదలినవారు; అగువారు= అయినవారు; నుతింపన్= కొనియాడగా; తనర్తువు= విరాజిల్లుదువు; కావునన్= కాబట్టి; ఇలన్= భూమిపై; పుణ్యతీర్థములన్= పవిత్రమైనవి, తరింపజేసేవీ అయిన నదులు మొదలగు వానియందు; పోలన్= వలె; పవిత్రం; చేయన్+పూని= చేయటానికి పూనుకొని; అర్థిని= కోరికతో; పదచారులు+ఐ= కాలినడకతో పోవువారై; చరించు= తిరుగునట్టి; భవత్+పద భక్త సంగమంబు= నీ పాదాలయందు భక్తి కలవారి కలయిక; అనుపమ= సాటిలేని; భూరి సంసృతి భయస్థుని= చాలా ఎక్కువది అయిన సంసార విషయంలో భయంతో ఉండేవానియొక్క; బుద్ధి= భావనలో; రుచింపక+ఉండునే= ఇష్టపడక ఉంటుందా?

**తా :** స్వామీ! నీవు అడవులలో భౌతిక సంబంధాల అంటు సొంటులు లేకుండా తిరిగే మునులు కొనియాడుతూ ఉండగా ప్రకాశిస్తూ ఉంటావు. కాబట్టి, భూమిమీద పుణ్యతీర్థాలలాగా పవిత్రం చేయబూని కాలి నడకతో తిరుగాడుతూ భూమిపై సంచరించే నీ భక్తులతో సహవాసం సాటిలేని ఘోరమైన సంసారభయంలో ఉన్నవాని బుద్ధికి రుచించకుండా ఉంటుందా?

**వ.** **కావున. 932**

**ప్రతి :** కావున= కాబట్టి

**చ.** **వనరుహ పత్త్రలోచన! భవత్సఖుఁడైన సుధాంశుమౌళి తో**
**డి నిమిషమాత్ర సంగతిఁ గడింది వ్రణంబును దుశ్చికిత్సము**
**న్ననఁ దగు జన్మరోగమున కర్మిలి వైద్యుఁడ వైన నిన్ను నే**
**మనయముఁ జూడఁ గంటిమి, కృతార్థులమై తగ మంటి మీశ్వరా! 933**

**ప్రతి :** వనరుహ పత్ర లోచన= పద్మం రేకులవంటి కన్నులున్న స్వామీ!; ఈశ్వరా= ప్రభూ!; భవత్+సఖుఁడు+ఐన= నీ ప్రాణమిత్రుడైన; సుధాంశు మౌళితోడి= చంద్రుడు తలపూవుగాగల శివునితో; నిమిష మాత్ర సంగతిన్= రెప్పపాటు కాలమంత కలయిక వలన; కడింది వ్రణంబును= పెద్దపుండును; దుశ్చికిత్సమున్= కష్టంతో కూడా మాన్పరానిదీ; అనన్+తగు= అని చెప్పదగిన; జన్మరోగమునకు= జన్మమనే రోగానికి; అర్మిలి+వైద్యుఁడవు+ఐన= రోగులయందు ప్రీతిగల వైద్యుడవైన; నిన్నున్= నిన్ను; ఏము= మేము; అనయమున్= మిక్కిలిగా; చూడన్+కంటిమి= చూడ గలిగితిమి; కృతార్థులము= నెరవేరిన ప్రయోజనం కలవారం; ఐ= అయి; తగన్= బాగుగా; మంటిమి= బ్రదికితిమి.

**తా :** తామర రేకులవంటి చక్కని కన్నులున్న స్వామీ! ప్రభూ! నీమిత్రుడైన పరమేశ్వరునితోడి నిమిషమాత్రమైన చెలిమి కలిగిన సమాగమం వలన పెద్దపుండు అనదగినదై చికిత్సకు అసాధ్యమైనదనదగిన జన్మరోగాన్ని మానిపే ప్రీతికల వైద్యుడవైన నిన్ను మేము దర్శించి కృతార్థులమయ్యాం. బాగా బతుకుతున్నాం.

**విశే :** నీ సందర్శనం వల్ల మా సంసారజాడ్యం రూపుమాసిపోతుందని ప్రచేతసుల హృదయం. వారికి ఈ భాగ్యం పరమేశ్వరుని వలన కలిగింది. శివకేశవులు పరస్పరం సఖులు అంటే ఏకప్రాణులు. వారియందు భేదబుద్ధిని పెట్టుకోవటం ఆత్మవినాశన కారణం అవుతుందని ఇక్కడ ధ్వని.

**వ. దేవా! మదీయ స్వాధ్యాయాధ్యయనంబులును, గురుప్రసాదంబును, విప్రవృద్ధానువర్తనంబును, నార్యజన నమస్కరణంబును, సర్వభూతానసూయయు, నన్నవిరహితంబుగా ననేకకాలం బుదకంబులయందు సుతప్తంబయిన తపంబు సేయుటయు, నివి యన్నియును బురాణ పురుషుండవైన భవదీయ పరితోషంబు కొఱకు నగుంగాక యని విన్నవించెద మని వెండియు నిట్లనిరి. 934**

**ప్రతి :** దేవా= ప్రభూ!; మదీయ స్వాధ్యాయ+అధ్యయనంబులును= మా వేదశాఖల పఠనము; గురు ప్రసాదంబును= గురువుల అనుగ్రహమును; విప్ర వృద్ధ+అనువర్తనంబును= విద్యావంతులగు పెద్దలను అనుసరించటం; ఆర్య జన నమస్కరణంబును= గొప్ప శీలసంపదగలవారికి ప్రణమిల్లడం; సర్వభూత+అనసూయయున్= సకల ప్రాణులయందునూ అసూయ లేకపోవటం; అన్న విరహితంబుగాన్= ఆహారం లేకుండా; అనేక కాలంబు= పెద్దకాలం; ఉదకంబులయందున్= నీళ్ళలో; సుతప్తంబు+అయిన= చాలా నిష్ఠగా చేసినదైన; తపంబు+చేయుటయున్= తపస్సు చేయటమూ; ఇవి+అన్నియున్= ఇవన్నీ; పురాణపురుషుండవు= సనాతనుడవైన; భవదీయ పరితోషంబుకొఱకున్= నీదయిన పరితృప్తికోసం; అగున్+కాక= అవ్వాలి; అని; విన్నవించెదము= విన్నపం చేసుకుంటున్నాం; అని; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనిరి= అన్నారు.

**తా :** దేవా! మా వేదాల అధ్యయనం, గురువుల అనుగ్రహమూ, విప్రులైన జ్ఞానవృద్ధుల నడవడిని బట్టి మెలగటమూ, మహాత్ములకు నమస్కరించటమూ, సకల ప్రాణులయందు అసూయ లేకుండుటయూ, ఆహారం తీసుకోకుండా చాలాకాలం నీళ్ళలో నిలిచి శరీరాన్ని ఎండగట్టి తపస్సు చేయటమూ అనే ఇవన్నీ సనాతనుడవైన నీకు సంతోషాన్ని కలిగించుట కోరకే అగుగాక అని విన్నవించుకుంటున్నాం - అని ఇంకా ఇలా అన్నారు.

అసూయ అంటే గుణాలను దోషాలుగా చెప్పటం. అది బుద్ధిని పాడుచేస్తుంది. కాబట్టి, అసూయను మూలముట్టుగా రూపుమాపుకోవాలి.

**మ. మను పద్మాసన ధూర్జటి ప్రముఖ ధీమంతుల్ తపోజ్ఞాన స**
**త్త్వ నిరూఢిం దగువారు నీ మహిమమున్ వర్ణింపఁ బారం బెఱుం**
**గని వారయ్యును నోపినంత వినుతుల్ గావింతు, రట్లౌట నే**
**ము నిన్నర్థి నుతింతు మీశ! వరదా! బుద్ధ్యాది మూలంబుగన్. 935**

**ప్రతి :** ఈశ= పాలకుడా!; వరదా= వరముల నొసగే స్వామీ!; మను= మనువు; పద్మ+ఆసన= పద్మము నెలవుగాగల బ్రహ్మ; ధూర్జటి= పరమశివుడు; ప్రముఖ= మొదలైన; ధీమంతుల్= ప్రజ్ఞ పండిన గొప్పవారు; తపస్= తపస్సు; జ్ఞాన=

ఎరుక; సత్త్వ= సత్త్వం అనేవాని; నిరూఢిన్= గట్టిది చెదరనిది అయిన స్థితి యందు; తగువారు= యోగ్యతకలవారు; నీ మహిమమున్= నీ దైన గొప్పతనాన్ని; వర్ణింపన్= కొనియాడటానికి; పారంబు= అంతం; ఎఱుంగని+వారు= తెలియనివారు; అయ్యును= అయి కూడా; ఓపిన+అంతన్= శక్తి ఉన్నమేరకు; వినుతుల్= స్తోత్రాలను; కావింతురు= చేస్తూ ఉంటారు; అట్లు= ఆ విధం; ఔటన్= అయిన కారణంగా; ఏమున్= మేము కూడా; నిన్నున్= నిన్ను; అర్థిన్= కోరికతో; బుద్ధి+ఆది= బుద్ధిమొదలైనవాటి; మూలంబుగన్= శక్తి ననుసరించి; నుతింతుము= కొనియాడుతూ ఉంటాం.

**తా :** దేవా! వరదా! మనువు, బ్రహ్మ, శివుడు మొదలైన గొప్ప ప్రజ్ఞకల మహానుభావులు, తపస్సు, జ్ఞానం, సత్త్వం అనే మహాగుణాలు పుష్కలంగా ఉన్నవారు కూడా పూర్వం నీ మహిమను తుది దాకా స్తుతించలేకపోయారు. అయినా శక్తి ననుసరించి స్తుతించారు. అందుచేత మేము కూడా కోరికోరి మా బుద్ధి శక్తుల ననుసరించి నిన్ను స్తుతించుకుంటూ ఉంటాము.

**విశే :** భగవంతుని మహిమను తుదిముట్టా తెలిసినవాడు భగవంతుడు మాత్రమే. అయితే అమృతభాండం నుండి ఒక బొట్టు పుచ్చుకున్నా అమృతఫలం సిద్ధిస్తుంది.

**వ. అని మఱియు సముండవు, నాదిపురుషుండవుఁ, బరుండవు, శుద్ధుండవు, వాసుదేవుండవు, సత్త్వమూర్తివి, భగవంతుండవు నైన నీకు నమస్కరించెద మని యిట్లు ప్రచేతసుల చేత నుతింపంబడి శరణ్యవత్సలుం డగు హరి సంతుష్టాంతరంగుండై వారలు కోరినయట్ల వరంబు లిచ్చిన. 936**

**ప్రతి :** అని; మఱియున్= ఇంకా; సముండవు= అందరియందు ఒకే విధమైన భావనతో ఉండే వాడవు-లేదా, లక్ష్మీదేవితో కూడియుండే వాడవు; ఆదిపురుషుండవు= మొట్టమొదటివ్యక్తివి; శుద్ధుండవు= దోషం లేశమైనా లేనివాడవు; పరుండవు= శ్రేష్ఠుడైనవాడివి; వాసుదేవుండవు= అంతటా, అన్నిటా ఉండి ప్రకాశించే వాడవు; సత్త్వ మూర్తివి= సత్త్వగుణమే లక్షణం అయిన వాడవు; భగవంతుండవు= సమగ్రమైన ఐశ్వర్యం మొదలైన ఆరు లక్షణాలు కలవాడవు; ఐన నీకున్= అయిన నీకు; నమస్కరించెదము= సర్వసమర్పణ భావనతో ఉంటాం; అని; ఇట్లు= ఈ విధంగా; ప్రచేతసులచేతన్= ప్రచేతసులు అనే తత్త్వ వేత్తల చేత; నుతింపన్+పడి= స్తుతించబడి; శరణ్య వత్సలుండు= రక్షణకోరిన వారియందు మిక్కిలి అనురాగం గలవాడు; అగు= అయిన; హరి= శ్రీమహావిష్ణువు; సంతుష్ట+అంతరంగుండు+ఐ= మిక్కిలి పరితృప్తి పొందిన భావనకలవాడై; వారలు= ఆ ప్రచేతసులు; కోరిన+అట్లు+అ= కోరిన విధంగానే; వరంబులు= వరాలను; ఇచ్చినన్= ఇవ్వగా.

**తా :** అని ఇంకా! స్వామీ నీవు అందరియందూ ఏకరూపంగా ప్రవర్తించేవాడవు. సనాతనుడవు, పరుడవు, పరిశుద్ధుడవు, వాసుదేవుడవు, సత్త్వమే మూర్తి అయిన వాడవు, భగవంతుండవు- అట్టి నీకు నమస్కరించెదము. అని యిట్లు ఆ ప్రచేతసులు స్తుతించగా శరణుకోరినవారియందు వాత్సల్యంగల మహావిష్ణువు తృప్తి పొందిన భావనకలవాడై వారు కోరినవరాలు ఇచ్చాడు.

**విశే :** 1. సముడు- 'మా' అంటే లక్ష్మి. ఆమెతో కూడినవాడు అని విశేషార్థం.

2. ఆదిపురుషుడు- సృష్టికి పూర్వం నుండి ఉన్న 'సత్' పదవాచ్యుడు.

3. శుద్ధుడు- పుట్టుక, ఉండటం, గిట్టటం అనేవి ప్రాణులకు కర్మబంధదోషాలవలన ఏర్పడేవి. అట్టి దోషాలు లేనివాడు.

4. పరుడు– లోకాలు, లోకేశులు, లోకస్థులు అయిన వారికి అతీతంగా పెనుచీకటికి ఆవల ఉండేవాడు.
5. వాసుదేవుడు– వస్ అంటే ఉండటం, దివ్ అంటే విరాజిల్లటం– అందరిలో ఉంటూ విరాజిల్లే వాడు. అందరూ అతనిలో ఉంటారు అని వాసుదేవపదానికి అర్థం అని శ్రీమహాభారతం.
6. 'సత్త్వం' అంటే ఉండటం. రజస్సు తమస్సు అనే గుణాలు లేని నిర్మలతత్త్వం. అదే ఆయనమూర్తి.

**తరలము.**

**అనయ మా నృపనందనుల్ ముదమార సన్నుతిఁజేయఁగా**
**మనములోఁబరితోషమంది రమాహృదీశుఁడు భక్త పా**
**లన కరుండు తదీయ దర్శన లాలసాత్మకు లాత్మలం**
**దనివి సాలక చూడ నాత్మపదంబు కేఁగె రయంబునన్. 937**

**ప్రతి :** అనయము= మరిమరీ; ఆ నృపనందనులు= ఆ ప్రాచీనబర్హి కుమారులైన ప్రచేతసులు; ముదము+ఆరన్= సంతోషం విప్పారగా; సత్+నుతిన్= సత్స్వరూపుడైన భగవంతుని స్తోత్రాన్ని; చేయగాన్= చేయగా; రమా హృత్+ఈశుడు= లక్ష్మీదేవి హృదయాధినాథుడు విష్ణువు; మనములోన్= మనస్సులో; పరితోషము= నిండుసంతోషం; అంది= పొంది; భక్త పాలన కరుండు= భక్తులను ఏలుకోవటం చేసేవాడు; తదీయ దర్శన లాలస+ఆత్మకులు= అతనిని చూడటంలో మిక్కిలి కోరికగల హృదయాలు ఉన్న ఆ ప్రచేతసులు; ఆత్మలన్= అంతరంగాలలో; తనివి= తృప్తి; చాలక= పొందక; చూడన్= చూస్తూ ఉండగా; రయంబునన్= వడివడిగా; ఆత్మపదంబుకున్= తనస్థానానికి; ఏఁగెన్= వెళ్ళాడు.

**తా :** ఆ రాజకుమారులు సంతోషం పొంగి పొరలగా మరిమరీ సన్నుతి చేయగా లక్ష్మీపతి అయిన శ్రీమన్నారాయణుడు మనస్సులో నిండుమోదం పొంది భక్తులను పాలించే శీలం కలవాడు కనుక ఆ పని ముగించి, తన్ను చూడటమందే గొప్ప కోరికగల ఆభక్తులు తృప్తి తీరని వారై చూస్తూ ఉండగా తన స్థానానికి వడివడిగా పోయాడు.

**విశే :** ఇది 'తరళమ'నే వృత్తం. ఉత్సాహాదిభావాలను వ్యక్తం చేయటానికి సాధారణంగా ఉపయోగిస్తారు. న భ ర స జ జ గ లు-గణాలు. 12 వ అక్షరం యతి.

**వ. తదనంతరంబ ప్రచేతసులు భగవదాజ్ఞ శిరంబుల ధరియించి సముద్ర సలిల నిర్గతు లయి. 938**

**ప్రతి :** తద్+అనంతరంబు+అ= ఆ పిమ్మట వెనువెంటనే; ప్రచేతసులు; భగవత్+ఆజ్ఞన్= భగవంతుని ఆనతిని; శిరంబులన్= తలలపై; ధరియించి= తాల్చి; సముద్ర సలిల నిర్గతులు= సాగరం నీటినుండి వెలువడినవారు; అయి...

**తా :** పిమ్మట ఆలస్యం చేయకుండా ప్రచేతసులు భగవంతుని ఆజ్ఞను భక్తితో పాటించి సముద్రజలాల నుండి వెలుపలికి వచ్చి

**క. భూరి సమున్నతి నాక, ద్వార నిరోధంబు గాఁగఁ దగఁ బెరిఁగిన యా**
**భూరుహ సంఛన్నాఖిల,ధారుణి నీక్షించి రాజతనయులు వరుసన్. 939**

**ప్రతి :** భూరి సమున్నతిన్= మిక్కిలి ఎత్తుగా; నాక ద్వార నిరోధంబు= స్వర్గం వాకిలిని అడ్డుకొనేది; కాఁగన్= అగునట్లుగా; తగన్= బాగుగా; పెరిగిన= వృద్ధి పొందిన; ఆ; భూరుహ= చెట్లతో; సంఛన్న= పూర్తిగా కప్పబడిన; అఖిల= సమస్తమైన; ధారుణిన్= భూమిని; రాజతనయులు= రాజకుమారులు; వరుసన్= క్రమంగా; వీక్షించి= చూచి...

**తా :** ఆ రాజకుమారులు స్వర్గద్వారానికి అడ్డం వచ్చే విధంగా పెద్ద ఎత్తున బాగుగా పెరిగినవి, భూమినంతటినీ కప్పివేసినవీ అయిన ఆ చెట్లను చూచి.

**చ. ఘనకుపితాత్ములై విలయకాల భయంకర హవ్యవాహ లో**
**చను గతి నుగ్రులై ధరణి చక్రము నిర్వసుధారుహంబుగా**
**ననయముఁ జేయఁ బూనిన జనాధిపసూనుల మోముఁదమ్ముల**
**న్ననల సమీరముల్ జనన మంది కుజంబులఁ గాల్పఁ జొచ్చినన్. 940**

**ప్రతి :** ఘన కుపిత+ఆత్ములు+ఐ= పెద్దగా కోపం పొందిన బుద్ధి గలవాడై; విలయ= ప్రళయానికి సంబంధించిన; కాల= సమయంలో; భయంకర= భయాన్ని పుట్టించే; హవ్యవాహలోచనుగతిన్= అగ్నియే కన్నులుగాగల శివుని విధంగా; ఉగ్రులు+ఐ= భయంకరులై; ధరణి చక్రమున్= చక్రం వంటి ఆకారంగల భూమిని; నిర్+వసుధారుహంబుగాన్= చెట్లు లేనిదిగా; అనయమున్= పట్టుదలతో; చేయన్+పూనిన= చేయటానికి సిద్ధపడిన; జన+అధిప సూనుల= రాజకుమారుల; మోము+తమ్ములన్= ముఖాలనే పద్మాలనుండి; అనల సమీరముల్= అగ్నిగాలులు; జననము+అంది= పుట్టి; కుజంబులన్= చెట్లను; కాల్పన్+చొచ్చినన్= దహించ నారంభించగా...

**తా :** (ఆ చెట్లను చూచిన ఆ ప్రచేతసులకు చాలా తీవ్రమైనకోపం వచ్చింది.) పెద్దగా కోపగించిన మనస్సు కలవారై ప్రళయ కాలపు శివుని వలె భయంకరులయ్యారు. పట్టుదలతో భూచక్రాన్నంతటినీ చెట్లు లేనిదిగా చేయాలని సంకల్పించారు. అప్పుడా రాకుమారుల పద్మాలవంటి ముఖాలనుండి అగ్నిని చిమ్మే గాలులు పుట్టుకొని వచ్చాయి. ఆ చెట్ల నన్నింటినీ దహించ నారంభించగా

**విశే :** కుజము- కు అంటే భూమి- దానినుండి పుట్టినది- చెట్టు.

**క. నలినభవుఁ డా మహీజ, ప్రళయముఁ గని వచ్చి ధరణిపాల తనూజా**
**తుల మధురోక్తుల నుపశాం, తులఁ గావించుచును బ్రియము దూఁకొనఁ బలికెన్. 941**

**ప్రతి :** నలినభవుఁడు= తమ్మిచూలి అయిన బ్రహ్మ; ఆ మహీజ ప్రళయమున్= ఆ చెట్లకు కలిగిన సర్వనాశనాన్ని; కని= చూచి; వచ్చి= అక్కడకు ఏతెంచి; ధరణి పాల తనూజాతులన్= రాజకుమారులను; మధుర+ఉక్తులన్= చెవికి ఇంపైన మాటలతో; ఉపశాంతులన్= ఆ ప్రయత్నం నుండి మానుకొనేవారినిగా; కావింపుచును= చేస్తూ; ప్రియము= ప్రేమ; దూఁకొనన్= పొంది వచ్చేవిధంగా; పలికెన్= పలికినాడు.

**తా :** అప్పుడు బ్రహ్మదేవుడు ఆ చెట్లకు కలుగబోతున్న ఘోరమైన వినాశనాన్ని గమనించాడు. అక్కడికి వచ్చి ఆ రాజకుమారులను మంచి మాటలతో శాంతింపజేస్తూ ప్రేమతో అన్నాడు.

**వ. అట్లు పలికి వారల నుపశమితక్రోధులం జేసిన యనంతరంబ. 942**

**ప్రతి :** అట్లు= ఆవిధంగా; పలికి; వారలన్= ఆ రాజకుమారులను; ఉపశమిత క్రోధులన్= అణగిపోయిన తీవ్రకోపం కలవారినిగా; చేసిన+అనంతరంబు+అ= చేసిన పిమ్మట.

**తా :** ఇలా మాట్లాడి ఆ రాజకుమారుల కోప తీవ్రతను పోగొట్టిన తరువాత.

**సీ.** **అవశిష్ట ధరణీరుహంబులు భయ మంది తివిరి చతుర్ముఖాదేశమునను**
**మారిష యను సతీమణిఁ దమ కూఁతును నా ప్రచేతసులకు నర్థి నిచ్చె,**
**నా నరపాలక సూనులు దక్షున కరయంగ మున్నీశ్వరాపరాధ**
**మునఁ బ్రాప్త మైనట్టి జనపాల జన్మంబునకుఁ గారణం బైన నలిననయన**

**తే.** **నాదరంబునఁ గమలజు నాజ్ఞఁ జేసి, కడఁక దీపింప విధివత్ప్రకారమునను**
**వరుస నందఱుఁ గూడి వివాహ మైరి, గడవ వచ్చునె దైవ సంకల్ప మెందు?** **943**

**ప్రతి :** అవశిష్ట ధరణీరుహంబులు= మిగిలిన చెట్లు; భయము+అంది= భయపడి; తివిరి= ప్రయత్నపడి; చతుర్ముఖ+ఆదేశమునను= నాలుగుమోములుగల బ్రహ్మ ఆజ్ఞప్రకారం; మారిష+అను సతీమణినిన్= మారిష అనే పేరుగల స్త్రీ రత్నాన్ని; తమ కూఁతునున్= తమ బిడ్డను; ఆ ప్రచేతసులకున్= ఆ ప్రచేతసులనేవారికి; అర్థిన్= కోరికతో; ఇచ్చెన్= భార్యగా ఇచ్చినవి; మున్ను= పూర్వము; ఈశ్వర+అపరాధమునన్= ఈశ్వరుని విషయంలో చేసిన తప్పు కారణంగా; దక్షునకున్= దక్షప్రజాపతికి; అరయంగన్= భావింపగా; ప్రాప్తము= ఏర్పడినది; ఐన+అట్టి= అయిన; జనపాల జన్మంబునకున్= రాజుగా పుట్టుటకు; కారణంబు= హేతువు; ఐన= అయిన; నలిననయనన్= పద్మాలవంటి కన్నులుగల ఆ యింతిని; ఆ నరపాలక సూనులు= ఆ రాజకుమారులు; ఆదరంబునన్= ప్రీతితో; కమలజు+ఆజ్ఞన్+చేసి= బ్రహ్మదేవుని ఆజ్ఞచేత; కడఁక= పూనిక; దీపింపన్= వెలుగొందగా; విధివత్+ప్రకారంబునన్= పద్ధతి ననుసరించి; వరుసన్= క్రమంగా; అందఱున్= అందరూ; కూడి= కలసి; వివాహము+ఐరి= పెండ్లియాడినారు; ఎందున్= ఎక్కడనైనా; దైవ సంకల్పమున్= దైవం తలచినదానిని; కడవన్+వచ్చునె= దాట శక్యమగునా?

**తా :** మిగిలిన చెట్లన్నీ భయపడి బ్రహ్మ ఆజ్ఞననుసరించి మారిష అనే ఉత్తమురాలైన తమకూతురిని ఆ ప్రచేతసులకు భార్యగా ఇచ్చినవి. మునుపు దక్షుడు ఈశ్వరుని విషయంలో చేసిన అపరాధానికి అతడు రాజుగా పుట్టవలసి వచ్చినది. దానికి కారణం అయినది యీ మారిషయే. అట్టి ఆ కాంతను ప్రచేతసులందరూ వరుసగా శాస్త్రవిధానాన్ని అనుసరించి పెండ్లి చేసుకున్నారు. దైవసంకల్పాన్ని ఎవరూ ఎక్కడా దాటలేరు కదా?

**విశే :** పూర్వం దక్షుడు ఒక యాగం చేసి అందులో శివుణ్ణి అవమానించాడు. ఆ కారణంగా బ్రహ్మపుత్రుడైన దక్షుడు ఈ మారిష అనే స్త్రీయందు రాజుగా పుట్టవలసి వచ్చింది- ఇది పూర్వగాథను

**క.** **కలదే జగతిం బదురు నృ, పుల కిల నొక భార్య యందుఁ బొసఁగునె? వినఁగా**
**నలినోదరు ఘనమాయా, కలితాద్భుతములకు నతులు గావింపఁదగున్.** **944**

**ప్రతి :** జగతిన్= జగత్తులో; పదురు= పదిమంది; నృపులకున్= రాజులకు; ఇలన్= భూమిపై; ఒక భార్యయందున్= ఒక్క ఇల్లాలియందు; పొసఁగునె= చెలిమి కుదురుతుందా?; వినఁగాన్= వినగా; కలదే= ఇట్టిది ఎక్కడైనా ఉన్నదా?; నలిన+ఉదరు= తామరనుండి పుట్టిన బ్రహ్మయొక్క; ఘన మాయా కలిత+అద్భుతములకున్= గొప్పమాయకు చెందిన ఆశ్చర్యాలకు; నతులు= నమస్కారాలు; కావింపన్+తగున్= చేయవలసిందే.

**తా :** లోకంలో వినటానికైనా ఇటువంటిది ఎక్కడైనా ఉన్నదా? ఒక స్త్రీ విషయంలో పదిమంది రాజులకు పొంతన కుదురుతుందా? ఇదంతా బ్రహ్మదేవుని గొప్పమాయ. దాని వలన కలిగే ఆశ్చర్యాలకు నమస్కారాలు చేయవలసినదే.

**వ. అంతఁ జాక్షుషమన్వంతరంబున దైవచోదితుండై యిష్ట ప్రజాసర్గంబు గావించుచుఁ బ్రతిశుద్ధుండైన దక్షుండు పూర్వ దేహంబు గాల విద్రుతం బగుచుండం బ్రచేతసులకు న మ్మారిష యను భార్యయందు సంభవించి నిజకాంతిం జేసి సమస్త తేజోధనుల తేజంబును బిహితంబుగాఁ జేయుచుఁ గర్మ దాక్ష్యంబున దక్షుండను నామంబు వహించి బ్రహ్మచేతం బ్రజాసర్గ రక్షయందు నియోగింపంబడి మరీచ్యాదులం దత్త ద్వ్యాపారంబులందు నియోగించి యుండె, నంత. 945**

**ప్రతి :** అంతన్= అప్పుడు; చాక్షుషమన్వంతరంబునన్= చాక్షుషుడనే మనువు కాలప్రమాణంలో; దైవ చోదితుండు+ఐ= దైవంచేత ప్రేరణ పొందినవాడై; ఇష్ట ప్రజా సర్గంబు= కోరినట్లు ప్రజలను సృష్టించటం; కావింపుచున్= చేస్తూ; ప్రసిద్ధుండు+ఐన= కీర్తి పొందినవాడైన; దక్షుండు= దక్షప్రజాపతి; పూర్వదేహంబు= వెనుకటి శరీరం; కాల విద్రుతంబున్= కాలంచేత నశించినది; అగుచుండన్= అవుతూ ఉండగా; ప్రచేతసులకున్= ప్రచేతసులు అనే పేరుగలవారికి; ఆ+మారిష+అను భార్యయందున్= ఆ మారిష అనే ఇల్లాలియందు; సంభవించి= పుట్టి; నిజ కాంతిన్+చేసి= తన కాంతితో; సమస్త తేజస్+ధనుల తేజంబును= మిక్కిలి ప్రకాశశక్తియే ధనంగా గల వారి అందరి తేజస్సును; పిహితంబుగాన్= కప్పబడేవిధంగా; చేయుచున్= చేస్తూ; కర్మ దాక్ష్యంబునన్= పనులయందలి సమర్థతచేత; దక్షుండు; అను నామంబు వహించి= అనే పేరు పొంది; బ్రహ్మచేతన్= సృష్టికర్తచేత; ప్రజా సర్గ రక్షయందున్= ప్రజలను సృష్టించి రక్షించటం అనే కార్యంలో; నియోగింపంబడి= నియమింపబడి; మరీచి+ఆదులన్= మరీచి మొదలైనవారిని (ప్రజాపతులను); తత్+తత్+వ్యాపారంబులందున్= ఆ యా పనులయందు; నియోగించి= ఏర్పాటుచేసి; ఉండెన్= ఉన్నాడు; అంతన్= అప్పుడు...

**తా :** చాక్షుషమన్వంతరంలో దైవం ఏర్పాటు చేయగా తనకు ఇష్టమైన విధంగా ప్రజలను సృష్టిస్తూ ప్రసిద్ధుడైన దక్షుడు వెనుకటిదేహం కాలాన్ననుసరించి జారిపోగా ప్రచేతసులకు ఆ మారిష అనే ఇల్లాలియందు మళ్ళీ పుట్టాడు. అతని తేజస్సులో గొప్పగొప్పవారి తేజస్సులు అణగిపోయాయి. కార్యాలను దక్షతతో చేస్తాడు కనుక దక్షుడు అయ్యాడు. అతనిని బ్రహ్మ సృష్టికార్యంలో నియోగించాడు. అతడు మరీచి మొదలైన ప్రజాపతులను ఆయా పనులలో నియోగించి ఉన్నాడు. అప్పుడు

**విశే :** మరీచి మొదలైనవారు తొమ్మండుగురు. వీరిని నవబ్రహ్మలు అంటారు– భృగువు, పులస్త్యుడు, పులహుడు, అంగిరసుడు, అత్రి, క్రతువు, దక్షుడు, వసిష్ఠుడు, మరీచి.

**సీ. ఒనరఁ బ్రచేతసు లుత్పన్న విజ్ఞాను లగుచు వేగంబ నారాయణోక్తిఁ**
**దలఁచుచు నాత్మనందను కడ నిజభార్య నిడి వనవాసులై కడఁగి మున్ను**
**జాబాలి యను మునీశ్వరుఁడు సిద్ధుండైన భూరి పశ్చిమ వార్ధి తీరమునను**
**సర్వభూతాత్మ విజ్ఞానంబు గల యాత్మ ఘన విమర్శకృత సంకల్పులైరి**

**తే. యంత నచటికి సమ్మోద మతిశయిల్ల, నరసురాసుర యక్ష కిన్నర వరేణ్య**
**మానితోన్నత సంపూజ్య మానుఁడైన, నారదుండు వివేక విశారదుండు. 946**

**ప్రతి :** ఒనరన్= సరియైన విధంగా; ప్రచేతసులు= ప్రచేతసులు అనేవారు; ఉత్పన్న విజ్ఞానులు= పుట్టిన విశేషజ్ఞానం కలవారు; అగుచున్= అగుచు; వేగంబు+అ= వడిగా; నారాయణ+ఉక్తిన్= శ్రీమన్నారాయణుని పలుకును; తలఁపుచున్=

భావిస్తూ; ఆత్మ నందను కడన్= తమ కొడుకైన దక్షుని యొద్ద; నిజభార్యన్= తమ ఇల్లాలిని; ఇడి= ఉంచి; వనవాసులు+ఐ= అడవిలో ఉండువారై; కడcగి= పూనుకొని; మున్ను= పూర్వం; జాబాలి; అను= అనే పేరుగల; ముని+ఈశ్వరుcడు= మునిశ్రేష్ఠుడు; సిద్ధుండు= తపస్సిద్ధిని పొందినవాడు; ఐన= అయినట్టి; భూరి పశ్చిమ వార్ధి తీరమునను= పెద్దది అయిన పడమటి సముద్రం ఒడ్డున; సర్వ భూత+ఆత్మ విజ్ఞానంబు= అన్ని వస్తువులకు సంబంధించిన విశేష జ్ఞానం; కల= ఉన్న; ఆత్మ ఘన విమర్శన్= ఆత్మకు సంబంధించిన గొప్ప భావన యందు; కృత సంకల్పులు+ఐ= చేసికొన్న ఆలోచనకలవారు; అయ్యారు; అంతన్= అప్పుడు; అచటికిన్= ఆ తావునకు; సమ్మోదము= గొప్ప ఆనందం; అతిశయిల్లన్= వృద్ధి పొందుచుండగా; నర= మానవుల; సుర= దేవతల; అసుర= రక్కసుల; యక్ష= యక్షుల; కిన్నర= కిన్నరుల; వరేణ్యా= విశిష్టవ్యక్తుల; మానిత= మన్నన యొక్క; ఉన్నత= గరిమతో; సంపూజ్యమానుcడు= భక్తి విశేషంతో పూజించబడుతున్నాడు; ఐన= అయిన; వివేక విశారదుండు= వివేకంలో ఆరితేరినవాడు; నారదుండు= నారదుడు.

**తా :** ఆ ప్రచేతసులకు విజ్ఞానం నిండుగా కలిగింది. వెంటనే నారాయణుని పలుకును స్మరించారు. తమ కొడుకు దగ్గర ఇల్లాలిని ఉంచారు. అడవులలో నివాసం ఏర్పరచుకొన్నారు. పూర్వం జాబాలి అనే మునిశ్రేష్ఠుడు తపస్సిద్ధి పొందిన పడమటి సముద్రం తీరంలో ఆత్మవిజ్ఞానం గురించి విశేషంగా భావన చేయటానికి సంకల్పించారు. అప్పుడు వారి దగ్గరకు ఆనందం అతిశయించగా వివేకం పండించుకొన్నవాడు, నరులు, దేవతలు, రక్కసులు, యక్షులు, కిన్నరులు మొదలగువారిచే గొప్పగా పూజించబడుతున్నవాడు, వివేకశీలి అయిన నారదుడు (ఏతెంచాడు).

**వ. చనుదెంచి నిర్జితప్రాణ మనో వాగ్దర్శనులును జితాసనులును శాంతులును నసమాన విగ్రహులును నిర్మలంబైన పరబ్రహ్మంబు నందు నియోజితంబైన యంతఃకరణంబును గలవారును నైన రాజనందనుల కడ నిలిచిన. 947**

**ప్రతి :** చనుదెంచి= నారదుడు వచ్చి; నిర్జిత= నిండుగా తమ అదుపులో ఉంచుకొన్న; ప్రాణ= ప్రాణాలను; మనస్= మనస్సును; వాక్ దర్శనులును= ప్రాణానికి, మనస్సుకు, వాక్కుకుగల సమన్వయాన్ని దర్శించినవారు; జిత+ఆసనులును= కూర్చుండుట యందలి నిష్ఠను సాధించినవారును; శాంతులును= లోపలి, వెలుపలి ఇంద్రియాల వికారాలు లేని వారును; అసమాన విగ్రహులు= సాటిలేని ఆకారం కలవారును; నిర్మలంబు+ఐన= స్వచ్ఛమైన; పరబ్రహ్మంబునందున్= పరమాత్మ యందు; నియోజితంబు+ఐన= నిశ్చలంగా కుదురుకొల్పుకొన్న; అంతః కరణంబును= మనస్సును; కలవారును+ఐన= కలవారైన; రాజనందనుల+కడన్= రాజ కుమారుల దగ్గర; నిలిచినన్= నిలువగా.

**తా :** ఆ రాజకుమారుల దగ్గరకు వచ్చాడు. వారు ప్రాణ, మనో, వాక్కులను దర్శించి పూర్తిగా తమ అదుపులో ఉంచుకొనిన ఋషులు. ఆసననిష్ఠకల శాంతులు. సాటిలేని ఆకారం గలవారు. నిర్మలమైన పరబ్రహ్మమునందు నెలకొల్పిన అంతః కరణం కలవారు.

**క. చనుదెంచిన నారదమునిc, గనుcగొని నృపసుతులు లేచి కౌతుక మొప్పన్**
**వినమితులై సముచిత పూ, జనములc బరితుష్టుc జేసి సద్వినయమునన్. 948**

**ప్రతి :** చనుదెంచిన నారదమునిన్= వచ్చిన నారదమహర్షిని; కనుcగొని= చూచి; నృపసుతులు= రాజకుమారులైన ప్రచేతసులు; లేచి; కౌతుకము= సంతోషం; ఒప్పన్= ఒప్పగా; వినమితులు+ఐ= కొంచెం వంగినవారై; సత్+వినయమునన్=

మంచి వినయంతో; సముచిత పూజనములన్= మంచివి, తగినవి అయిన అర్చనలతో; పరితుష్టున్= మిక్కిలి సంతోషం కలవానినిగా; చేసి.

**తా :** వచ్చిన నారదమునిని చూచి రాజకుమారులు లేచి వేడుకతో నమ్రులై చక్కని వినయంతో మిక్కిలి యోగ్యమైన పూజనములతో అతనికి సంతోషం కలుగజేశారు. మంచి వినయంతో

**విశే :** పూజ్యులు వచ్చినపుడు లేచి ఎదురువెళ్ళి మంచిమాటలు మొదలైన వానితో సత్కరించి కూర్చుండబెట్టటం సదాచారం.

**చ. అనఘ! మునీంద్ర చంద్ర! భవదాగమనంబు సమస్త లోక శో**
**భన మగు, నస్మదీయమగు భాగ్యవశంబున నేఁడు విశ్వ పా**
**వన! నినుఁ జూడఁగంటి మనివార్య భవద్భ్రమణంబు లోక లో**
**చనుగతి వోలెఁ బ్రాణులకు సర్వ భయాపహరంబు గావునన్. 949**

**ప్రతి :** అనఘ= పాపాలులేనివాడా!; ముని+ఇంద్ర చంద్ర= మహర్షి శ్రేష్ఠులలో చంద్రునివంటివాడా!; విశ్వపావన= సర్వలోకాలనూ పవిత్రం చేయువాడా!; భవత్+ఆగమనంబు= తమరి రాక; సమస్త లోక శోభనము= అన్ని లోకాలకూ మంగళమైనది; అగున్= అవుతుంది; అస్మదీయము+అగు= మాకు సంబంధించినదైన; భాగ్యవశంబునన్= అదృష్ట విశేషంచేత; నేఁడు= ఈనాడు; నినున్= నిన్ను; చూడన్+కంటిమి= చూడగలిగితిమి; అనివార్య భవత్+భ్రమణంబు= ఎట్టి నిలువరింతలు లేని మీ సంచారం; లోక లోచను గతిన్= లోకాలకు కన్నైన సూర్యుని గమనాన్ని; పోలి; ప్రాణులకున్= జీవులకు; సర్వ భయ+అపహరంబు= అన్ని భయాలను తొలగించేది; కావునన్= కాబట్టి...

**తా :** పుణ్యాత్మా! మునిశ్రేష్ఠా! లోకపావనా! పూజ్యులైన తమరి రాక అన్ని లోకాలకూ మంగళాన్ని కలిగించేది. మా అదృష్ట వశంచేత ఈనాడు తమరిని చూడగలిగితిమి. తమరు లోకాలలో సంచరిస్తూ ఉంటారు. సూర్యుని గమనం లాగా ప్రాణులందరి అన్ని భయాలను అది తీసివేస్తుంది. కాబట్టి దానిని అడ్డుకొనే శక్తి ఎవరికిని లేదు.

**వ. అని మఱియు నిట్లనిరి. 950**

**ప్రతి :** అని మఱియు నిట్లనిరి= అని ఇంకా ఇలా అన్నారు.

**సీ. 'అనఘాత్మ! భగవంతులైన కేశవ వామదేవులచే నుపదిష్టమైన**
**యాత్మతత్త్వంబు గృహస్థుల మగు మాకు ననయంబు విస్మృతం బయ్యె నట్టి**
**కలిత తత్త్వార్థ ప్రకాశకంబును భూరి ఘోర సంసారాబ్ధి తారకంబు,**
**నై కర మొప్పారు నాత్మతత్త్వము నేఁడు చిరదయామతిఁ బ్రకాశింపఁ జేయు'**

**తే. మని ప్రచేతసు లర్థిఁ బల్కినఁ జెలంగి, భగవదాయత్త చిత్తుండు భవ్యగుణుఁడు**
**నఖిలలోక విహారుండు నైన యట్టి, నారదుఁడు వల్కె నా రాకుమారులకును. 951**

**ప్రతి :** అనఘ+ఆత్మ= పాపస్పర్శలేని బుద్ధిగల ఓమహర్షీ; భగవంతులు+ఐన= పూజ్యులైన; కేశవ వామదేవులచేన్= విష్ణువు, శంకరుడు అనువారిచేత; ఉపదిష్టము+ఐన= ఉపదేశించబడినదైన; ఆత్మ తత్త్వంబు= పరబ్రహ్మ తత్త్వం;

గృహస్థులము+అగు= సంసారంలో ఉన్నవారమగు; మాకున్= మాకు; అనయంబున్= మిక్కిలిగా; విస్మృతంబు= మరువబడినది; అయ్యెన్= అయినది; అట్టి; కలితతత్త్వ+అర్థ ప్రకాశకంబును= పొందబడిన తత్త్వార్థాన్ని ప్రకాశింపజేసేది; భూరి= పెద్దది; ఘోర= భయంకరమైనది; అయిన; సంసార= జనన మరణాత్మకస్థితి అనే; అబ్ధి= సముద్రంనుండి; తారకంబు= దాటించేది; ఐ= అయి; కరము= మిక్కిలి; ఒప్పారు ఆత్మతత్త్వమున్= వెలుగొందే ఆత్మస్వరూపాన్ని; నేఁడు= ఈనాడు; చిర దయా మతిన్= స్థిరంగా ఉండే దయగలబుద్ధితో; ప్రకాశింపన్+ చేయుము= మాహృదయాలలో స్పష్టంగా కానవచ్చేదిగా చెయ్యి; అని; ప్రచేతసులు; అర్థిన్= కోరికతో; పల్కినన్= పలుకగా; చెలంగి= ఉత్సాహపడి; భగవత్+ఆయత్త చిత్తుండు= భగవంతుని యందు సమర్పించుకొన్న హృదయం గలవాడు; భవ్య గుణుఁడు= మంగళకరమైన గుణాలు కలవాడు; అఖిల లోక విహారుండున్= అన్ని లోకాలయందూ తిరుగుతూ ఉండేవాడు; ఐన+అట్టి= అయిన అలాంటి; నారదుఁడు= నారదమహర్షి; ఆ రాకుమారులకున్= ఆ రాజపుత్రులతో; పల్కెన్= ఇలా పలికాడు.

**తా :** 'పుణ్యాత్మా! భగవంతులైన విష్ణువు శంకరుడు ఉపదేశించిన ఆత్మతత్త్వం సంసారంలో ఉన్న మాకు మిక్కిలి మరపునపడింది. అట్టి తత్త్వార్థాన్ని ప్రకాశింపజేసేదీ, పెద్దదీ, భయంకరమైనదీ అయిన సంసారసముద్రాన్ని తరింపజేసేదీ అయి మిక్కిలి ఒప్పారే ఆత్మతత్త్వాన్ని ఇప్పుడు సుస్థిరమైన దయాబుద్ధితో మాలో వెలుగొందునట్లు చేయండి' అని ఇట్లు పలుకగా నిరంతరం భగవంతునియందే సమర్పించిన హృదయం కలవాడు, మిక్కిలి ఉత్తమములైన గుణాలు కలవాడు, సర్వలోకాలలో లోకకల్యాణంకోసం సంచరిస్తూ ఉండేవాడు అయిన నారదుడు ఆ రాజకుమారులతో ఇలా పలికాడు.

**సీ. చర్చింప నరుల కే జన్మ కర్మాయుర్మనో వచనంబుల దేవదేవుఁ**
**దఖిల విశ్వాత్మకుం డైన గోవిందుండు విలసిల్లు భక్తి సేవింపఁబడెడు**
**నవియ పో, జన్మ కర్మాయుర్మనో వచనములని ధరణి నెన్నంగఁ దగును**
**వనరుహనాభ సేవా రహితము లైన జననోపనయన దీక్షాకృతంబు**

**తే. లైన జన్మంబు లేల? దీర్ఘాయు వేల? వేద చోదిత యగు కర్మవితతి యేల?**
**జప తపశ్శ్రుత వాగ్విలాసంబు లేల?, మహిత నానావధాన సామర్థ్య మేల? 952**

**ప్రతి :** చర్చింపన్= విచారించగా; నరులకున్= మానవులకు; ఏ జన్మ కర్మ+ఆయుస్+మనస్+వచనంబులన్= ఏ పుట్టుక, కర్మలు, ఆయువు, మనస్సు, మాట అనువానిచేత; దేవ దేవుఁడు= దేవతలకు దేవుడు; అఖిల విశ్వ+ఆత్మకుండు= సమస్తమైన విశ్వమునకు ఆత్మ అయినవాడు; ఐన= అయిన; గోవిందుండు= విష్ణువు; విలసిల్లు భక్తిన్= గొప్పది అయిన భక్తితో; సేవింపబడెడును= కొలువబడుతాడో; అవి+అ పో= అవే సుమా!; జన్మ కర్మ+ఆయుస్+మనస్ వచనములని, పుట్టుక, పని, ఆయువు, మనస్సు, మాట; అని; ధరణిన్= భూమిలో; ఎన్నంగన్+తగును= భావించాలి; వనరుహ నాభ సేవా రహితములు+ఐన= పద్మనాభుని సేవ లేనివైన; జనన+ఉపనయన దీక్షా కృతంబులు+ఐన= జాతకర్మం, వడుగు మొదలైన సంస్కారాలకు సంబంధించిన కర్మలు, దీక్షలు చేయటం అనే వానితో కూడినవైన; జన్మంబులు= పుట్టుకలు; ఏల= ఎందుకు?; దీర్ఘ+ఆయువు= పెద్దకాలం బ్రతికి ఉండటం; ఏల= ఎందుకు?; వేదచోదిత+అగు= వేదం ఆచరించమని పురికొల్పుతున్నదైన; కర్మ వితతి= యజ్ఞాదికర్మల సముదాయం; ఏల= ఎందుకు?; జప, తపస్+శ్రుత, వాక్, విలాసంబులు= జపం, తపస్సు, వేదవిద్య, ప్రసంగాలయందు నైపుణి అనేవి; ఏల= ఎందుకు?; మహిత...సామర్థ్యము= గొప్పది అయిన; నానా+అవధాన= పెక్కు విషయాల మీద మనస్సు నిలుపగల; సామర్థ్యము= సమర్థత; ఏల= ఎందుకు?

**తా :** నాయనలారా! మానవులకు భగవంతుడు పుట్టుక, సంస్కారాలు, ఆయువు, మనస్సు, మాట ఇచ్చాడు. వానిని దేవదేవుడైన గోవిందుని సేవకు వినియోగించినపుడే సార్థకత కలుగుతుంది. బ్రహ్మపుట్టుకకు కారణమైన పద్మం నాభియందు గల శ్రీమహావిష్ణువు సేవకు కాని జాతకర్మం, ఉపనయనం మొదలైన సంస్కారకార్యాలతో ఏర్పడిన పుట్టుకలు వ్యర్థం. పెద్దకాలం బ్రదకటం వృథా. వేదం చేయమంటున్న యజ్ఞాది కర్మలు పనికిమాలినవి అవుతాయి. జపం, తపం, విద్య, చక్కగా మాట్లాడగలగటం మొదలైనవన్నీ ప్రయోజనం లేనివి. పెక్కింటి మీద ఏక కాలంలో బుద్ధి నిలపడంలో నేర్పు వ్యర్థం.

**వ. మఱియు హరి విరహితంబైన యింద్రియ పాటవంబును నిపుణయైన బుద్ధియుఁ బ్రాణాయామాది యోగంబును దేహాది వ్యతిరిక్తాత్మ జ్ఞానంబును సన్న్యాసాధ్యయనంబులును దక్కిన వ్రతవైరాగ్యాది శ్రేయస్సాధనంబులును నేల? సర్వేశ్వరుండు సమస్త శ్రేయస్స్వరూపుండును సమస్త శ్రేయోఽవధిభూతుండును సర్వభూతావాసుండును సర్వభూతాత్మప్రదుండును సర్వభూత ప్రియుండును సర్వవ్యాపకుండునుం గావున. 953**

**ప్రతి :** మఱియున్= ఇంకా; హరి విరహితంబు+ఐన= విష్ణు భావన లేనిదైన; ఇంద్రియ పాటవంబును= ఇంద్రియాల పటుత్వమూ; నిపుణ= గొప్పనేర్పుగలది; ఐన= అయిన; బుద్ధియున్= మేధాశక్తీ; ప్రాణాయామ+ఆది యోగంబును= ప్రాణాయామం మొదలైన యోగపద్ధతీ; దేహ+ఆది= దేహం మొదలైన వానికంటె; వ్యతిరిక్త= వేరైన; ఆత్మ జ్ఞానంబును= ఆత్మజ్ఞానమూ; సన్న్యాస+అధ్యయనంబులును= సన్న్యాసం, వేదశాస్త్రాలను అభ్యసించటమూ; తక్కిన= ఇతరాలైన; వ్రత వైరాగ్య= వ్రతాలూ, భౌతికమైన విషయాలందు తగులం లేకపోవటం; ఆది= మొదలైన; శ్రేయస్= శ్రేయస్సునకు సంబంధించిన; సాధనంబులును= సాధించే ప్రక్రియలునూ; ఏల= ఎందుకు?; సర్వ+ఈశ్వరుండు= సర్వమునకు ప్రభువైనవాడు; సమస్త= అన్ని విధాలైన; శ్రేయస్+స్వరూపుండును= శ్రేయస్సే రూపంగా కలవాడును; సమస్త= అన్ని విధాలైన; శ్రేయస్+ అవధిభూతుండును= శ్రేయస్సులకు హద్దు అయినవాడును; సర్వ భూత+ఆవాసుండును= ప్రాణులన్నింటిలోను; నెలకొని ఉండేవాడూ; సర్వ భూత+ఆత్మ ప్రదుండును= ప్రాణులన్నింటికీ ఆత్మస్థానంలో ఉండేవాడు; సర్వభూత ప్రియుండును= ప్రాణులందరికీ, అన్నింటికీ ప్రియమైనవాడు; సర్వ వ్యాపకుండును= అన్నింటియందు, అందరియందూ వ్యాపించి ఉండేవాడు; కావునన్= కాబట్టి.

**తా :** విష్ణుభావనలేని ఇంద్రియాల గొప్పశక్తీ, ఆరితేరిన బుద్ధీ, ప్రాణాయామం మొదలైన యోగమూ, దేహం మొదలైన వానికంటె వేరయిన జ్ఞానమూ, సన్న్యాసమూ, వేదాల పఠనమూ, తక్కిన వ్రతాలు, వైరాగ్యాలూ మొదలైన శ్రేయస్సును సాధించే కార్యాలూ పనికి మాలినవి. భగవంతుడు సర్వశ్రేయస్సుల స్వరూపమైనవాడు. సమస్తశ్రేయస్సులకు చిట్ట చివరిహద్దు. సర్వభూతాలకు నెలవైనవాడు. సర్వభూతాలకు బుద్ధి శక్తులను ప్రసాదించేవాడు. సర్వభూతాలకు ప్రియమైనవాడు. అంతటా వ్యాపించి ఉండేవాడు. కాబట్టి

**మ. కమలాధీశ్వరుఁ బూజ సేయుట సమగ్ర ప్రీతిఁ బ్రాణోపహా**
**రము సర్వేంద్రియ తృప్తి హేతువును సర్వక్ష్మాజమూలాభిషే**
**కము శాఖాభుజపుష్టిదంబు నగు రేఖన్ సర్వదేవార్చన**
**క్రమమై యొప్పు ధరావరేణ్య సుతులారా! బుద్ధి నూహించినన్. 954**

**ప్రతి :** కమలా+అధి+ఈశ్వరున్= లక్ష్మీపతిని; పూజ+చేయుట= అర్చించటం; సమగ్రప్రీతిన్= నిండైన ప్రీతితో; ప్రాణ+ఉపహారము= ప్రాణాలను సమర్పించుకోవటం; సర్వ+ఇంద్రియ తృప్తి హేతువును= ఇంద్రియాలన్నిటి తృప్తికి కారణమైనది; ధరా వరేణ్య సుతులారా= భూపాలకుని పుత్రులారా!; బుద్ధిన్= బుద్ధితో; ఊహించినన్= భావిస్తే; సర్వ క్ష్మాజ మూల+అభిషేకము= మొత్తమైన, చెట్టు, మొదట (పాదులో) నీటితో బాగుగా తడపటం; శాఖా భుజ పుష్టి+దంబున్= కొమ్మలనే భుజాలకు పుష్టిని ఇచ్చేది; అగు రేఖన్= అయిన విధంగా; సర్వ దేవ+అర్చణ క్రమము= అందరు దేవతల పూజావిధానం; ఐ ఒప్పున్= అయి ఒప్పారుతుంది.

**తా :** రాజకుమారులారా! నిండైన ప్రీతితో శ్రీమహావిష్ణువును పూజ చేయటం ప్రాణాలను సమర్పించుకోవటం తృప్తికి కారణం. బుద్ధితో భావనచేస్తే చెట్టు పాదులో నీరు నింపటం ఎక్కడనో పై భాగాన ఉన్న కొమ్మల పుష్టికి కారణమైన విధంగా ఆ విష్ణుపూజ సర్వదేవతా సమర్చన విధానమై అలరారుతుంది.

**విశే :** కొమ్మలకు పుష్టి కావాలంటే పాదులో నీళ్ళు నిండుగా పోయాలి. అలాగే దేవతలందరు కొమ్మలవంటివారు. శ్రీమహావిష్ణువు ఆలవాలం. కాబట్టి అతడు తృప్తి పొందితే దేవతలందరూ తృప్తి పొందుతారు.

**వ. అదియునుం గాక. 955**

**ప్రతి :** అదియునున్+కాక= అంతేకాక.

**క. పెను పగు వర్షాకాలం, బున దిననాయకుని వలనఁ బొడమిన సలిలం**
**బనయముఁ గ్రమ్మఱ గ్రీష్మం, బున సూర్యునియందు డిందుపోలిక మఱియున్. 956**

**ప్రతి :** పెనుపు= పెంపొందినది; అగు= అయిన; వర్షాకాలంబునన్= వానలకాలంలో; దిననాయకుని వలనన్= సూర్యుని వలన; పొడమిన సలిలము= ఏర్పడిన నీరు; అనయమున్= తప్పక; క్రమ్మఱన్= మరల; గ్రీష్మంబునన్= ఎండలకాలంలో; సూర్యుని యందున్= భాస్కరుని యందు; చెందు పోలికన్= చేరే విధంగా; మఱియున్= ఇంకా...

**తా :** వర్షాకాలంలో సూర్యునివలన ఆవిరై మేఘంగా మారిన నీరు భూమికి వస్తుంది. తిరిగి ఆ నీరే ఎండలకాలంలో మరల సూర్యుని యందే లయమవుతుంది. ఆ విధంగా

**క. ధరణిఁ జరాచర భూతము, లరయఁగ జనియించి యందె యణఁగిన పగిదిన్**
**హరిచేఁ బుట్టిన విశ్వము, హరియందె లయంబు నొందు, నది యెట్లన్నన్. 957**

**ప్రతి :** ధరణిన్= భూమిపై; చర+అచరభూతములు= కదలునవీ, కదలనివి అయిన పదార్థాలు/వ్యక్తులు; అరయఁగన్= విచారించి చూడగా; జనియించి= పుట్టి; అందు+ఎ= ఆ భూమిలోనే; అణఁగిన పగిదిన్= కలిసిపోయిన విధంగా; హరిచేన్= విష్ణువు వలన; పుట్టిన విశ్వము= ఏర్పడిన లోకాల సముదాయం; హరియందు+ఎ= విష్ణువునందే; లయంబున్= కలసిపోవటం; ఒందున్= పొందుతుంది; అది= ఆ పని; ఎట్లు= ఏ విధం; అన్నన్= అంటే-

**తా :** భూమి నుండి పుట్టిన చరాచర ప్రాణికోట్లు భూమిలోనే కలసిపోవు విధంగా శ్రీహరినుండి పుట్టిన విశ్వమంతా శ్రీహరియందే లయం పొందుతుంది. అది ఎలా అంటే-

**విశే :** సృష్టి అంతా చరాచరాలైన ప్రాణికోటితో నిండి ఉన్నది.

**మ. అరయన్నభ్రతమః ప్రభల్ మును నభంబం దొప్పఁగాఁ దోఁచి క్ర**
**మ్మఱ వీక్షింపఁగ నందె లేనిగతి బ్రహ్మంబందు నీ శక్తులుం**
**బరికింపం ద్రిగుణ ప్రవాహమున నుత్పన్నంబులై క్రమ్మఱన్**
**విరతిం బొందుచు నుండుఁ గావున హరిన్ విష్ణున్ భజింపం దగున్. 958**

**ప్రతి :** అరయన్= పరిశీలింపగా; అభ్ర తమస్ ప్రభల్= మేఘాల చీకటి కాంతులు; మును= ఒకప్పుడు; నభంబు+అందున్= గగనంలో; ఒప్పఁగాన్= చాలా స్పష్టంగా; తోఁచి= కన్పట్టి; క్రమ్మఱన్= మరల; వీక్షింపఁగన్= పరికింపగా; అందు+ఎ= అక్కడనే; లేని గతిన్= లేని విధంగా; ఈ శక్తులున్= ఈ విధమైన శక్తులు కూడా; బ్రహ్మంబందున్= పరమాత్మలో; పరికింపన్= విచారించి చూడగా; త్రి గుణ ప్రవాహంబునన్= మూడుగుణాల సాగుదలలో; ఉత్పన్నంబులు+ఐ= పుట్టినవై; క్రమ్మఱన్= మరల; విరతిన్= అణగిపోవటాన్ని; పొందుచున్+ఉండున్= పొందుతూ ఉంటాయి; కావునన్= కనుక; హరిన్= హరించేవాడైన; విష్ణున్= సర్వమున వ్యాపించి ఉండే వాడయిన విష్ణువును; భజింపన్+దగున్= సేవించుకుంటూ ఉండాలి.

**తా :** చూడగా చూడగా ఆకాశంలో దట్టంగా మబ్బులు పట్టినప్పుడు చీకట్లు కమ్ముకుంటాయి. కొంచెం సేపట్లో ఆ చీకట్లు అక్కడనే అణగిపోతాయి. అలాగే సత్త్వం, రజస్సు, తమస్సు అనే గుణాలు ప్రవాహాలలాగా సాగిపోతూ ఉండగా వాని శక్తులు కూడా బ్రహ్మంనుండి ఏర్పడతాయి. మళ్ళీ హరియైన విష్ణువులో కలసిపోతాయి. అందుచేత సర్వవ్యాపి అయిన విష్ణువును పూజిస్తూ ఉండాలి.

**వ. మఱియును సమస్త దేహులకు నాత్మయు, నిమిత్త భూతుండును, నద్వితీయుండును శశ్వత్ప్రకాశుండును, బ్రధాన పురుషుండును, స్వతేజో విధ్వస్త గుణప్రవాహుండును, మానస బుద్ధి సుఖేచ్ఛా ద్వేషాది వికల్పరహితుండును, నగుణుండును దేహాత్మ భ్రమ నివృత్త్యుపలభ్యుండును, నాది మధ్యాంత రహితుండును, నిత్యానంద స్వరూపుండును, సర్వజ్ఞుండును, బరమేశ్వరుండు నైన నారాయణు నభేదబుద్ధింజేసి భజింపుం, డతండు సర్వభూత దయయు నెంతమాత్రంబు సంభవించు నంతమాత్రంబున సంతుష్ట చిత్తులును, సర్వేంద్రియోపశాంతులును నగు పురుషులయెడ సంతుష్టుం డగు నని వెండియు నిట్లనియె. 959**

**ప్రతి :** మఱియును= ఇంకా; సమస్త దేహులకున్= దేహం ఉన్నవారందరికీ; ఆత్మయున్= స్వరూపమైనవాడు; నిమిత్త భూతుండును= కారణంగా అయినవాడు; అద్వితీయుండును= రెండవది లేనివాడు; శశ్వత్+ప్రకాశుండును= ఎల్లప్పుడు ప్రకాశించేవాడు; ప్రధాన పురుషుండును= ప్రధానీకరింపబడిన తత్త్వానికి చెందిన పురుషుడు; స్వ= తనదైన; తేజస్= కాంతిచేత; విధ్వస్త= మొత్తంగా నశింపజేయబడిన; గుణ= గుణాల; ప్రవాహుండును= ప్రవాహాలు కలవాడు; మానస బుద్ధి= మనస్సునకు బుద్ధికి చెందిన; సుఖ+ఇచ్ఛా= సుఖాల కోరికలు; ద్వేష+ఆది= ద్వేషం మొదలైనవి; వికల్ప= తీరకపోవడం అనే వానితో; రహితుండును= కలయికలేనివాడు; అగుణుండును= సంసారబంధకారణాలైన సత్త్వం, రజస్సు, తమస్సు అనే గుణాలు లేనివాడు; దేహ= శరీరమే; ఆత్మ= ప్రాణి తత్త్వం; అనే; భ్రమ= భ్రాంతియొక్క; నివృత్తి= తొలగుటచేత; ఉపలభ్యుండును= పొందబడేవాడు; ఆది మధ్య+అంత రహితుండును= మొదలు, నడుమ, తుది అనే

దశలు లేనివాడు; నిత్య+ఆనంద స్వరూపుండును= నిరంతరం ఏకవిధంగా ఉండే ఆనందమే తన రూపం అయినవాడు; సర్వజ్ఞుండును= అందరిని, అన్నింటిని తెలిసినవాడు; పరమ+ఈశ్వరుండును= పరమాత్మ అయినవాడు; ఐన= అయిన; నారాయణున్= విష్ణువును; అభేద బుద్ధిన్+చేసి= ఇంత కంటె వేరయిన ఆత్మ మరొకటి ఉన్నది అనే భేద భావం లేకుండా; భజింపుండు= సేవించండి; అతండు= ఆ స్వామి; సర్వ భూత దయయు= అన్ని ప్రాణులయందు దయ; ఎంత మాత్రంబు= ఎంత పరిమితిలో; సంభవించున్= లభిస్తుందో; అంతమాత్రంబునన్= అంతటిదానితోనే; సంతుష్ట చిత్తులును= సంతోషించే చిత్తం కలవారు; సర్వ ఇంద్రియ+ఉపశాంతులునున్= ఇంద్రియాలన్నింటి విషయంలో చక్కగా అణచుకొన్న వికారాలు కలవారును; అగు పురుషుల+ఎడన్= అయిన మానవుల విషయంలో; సంతుష్టుండు= మిక్కిలి ఆనందం పొందేవాడు; అగున్= అవుతాడు; అని; వెండియున్= ఇంకా; ఇట్లు; అనియెన్= అన్నాడు.

**తా :** నాయనలారా! ఆ పరమాత్మ అన్ని విధాల దేహాలు కలవారికి ఆత్మ అయినవాడు, అన్నింటికి కారణమైనవాడు, అతనికి పోలిక చెప్పటానికి వీలయిన మరొక వ్యక్తి కానీ వస్తువు కానీ లేదు. ఎల్లవేళల ప్రకాశిస్తూ ఉంటాడు. అతడు ప్రధానమనే తత్త్వం అయిన పరమపురుషుడు. తన తేజస్సు చేత రూపు మాసిపోయిన గుణాలప్రవాహం కలవాడు. మనస్సు, బుద్ధి, సుఖం, కోరిక, ద్వేషం మొదలైన వ్యవహారాలు లేనివాడు. జీవులను బంధించి నిలిపే గుణాల అంటుసొంటులు అతనికి లేవు. దేహమే ఆత్మ అనేది భ్రమ. అంటే సత్యం కాని జ్ఞానం. దానిని తొలగించుకోవటమే అతనిని పొందటానికి సాధనం. ఆయనకు జీవులకు వలె పుట్టుక, ఉనికి, చావు అనే వికారాలు లేవు. ఎల్లవేళలా ఆనందంగా ఉండటమే ఆయన స్వరూపం. సర్వమును సర్వులను ఎఱిగిన జ్ఞానస్వరూపుడు. పరమప్రభువు. అట్టి నారాయణుని భేదం లేని బుద్ధితో సేవించండి. సర్వప్రాణులయందు గొప్ప దయగలవారూ, ఏది దొరికితే దానితో మాత్రమే సంతోషపడేవారూ, ఇంద్రియవికారాల నన్నింటినీ అణచివేసుకొన్నవారూ అయిన మానవులవిషయంలో ఆ స్వామి సంతుష్టుడై ఉంటాడు– అని పలికి ఇంకా ఇలా అన్నాడు.

**చ. చతురత నట్టి యీశ్వరుఁడు సజ్జనలోక నిరస్త సర్వ కా**
**మిత విమలాంతరంగమున మిశ్రిత భావనఁ జేసి సన్నిధా**
**పితుఁ డగుచున్ దయాకర గభీర గుణంబులఁ జాల నొప్పి యా**
**శ్రిత జన పారతంత్ర్యమును జేకొని పాయక యుండు నిచ్చలున్. 960**

**ప్రతి :** అట్టి ఈశ్వరుఁడు= ఆవిధమైన లక్షణాలుగల ప్రభువు; చతురతన్= నేర్పుతో; సత్= ఉత్తములైన; జన= మానవుల; లోక= సముదాయంచేత; నిరస్త= తొలగించబడిన; సర్వ= అన్ని విధాలైన; కామిత= కోరికలు కలుగుటచేత; విమల= మిక్కిలి పరిశుద్ధమైన; అంతరంగమునన్= హృదయంలో; మిశ్రిత భావనన్+చేసి= కలసిపోయిన భావనతో; సన్నిధాపితుఁడు= మిక్కిలి దగ్గరగా ఉంచుకోబడినవాడు; అగుచున్= అవుతూ; దయా+ఆకర గభీర గుణంబులన్= దయకు ప్రధాన స్థానాలైన, లోతైన గుణాలతో; చాలన్= ఎక్కువగా; ఒప్పి= అలరారి; ఆశ్రిత జన పారతంత్ర్యమును= తనను ఆశ్రయించినవారిపట్ల పరతంత్రభావాన్ని; చేకొని= తాను స్వీకరించి; నిచ్చలున్= సర్వకాలాలలో; పాయక= వదలక; ఉండున్= ఉంటాడు.

**తా :** ఆ భగవంతుడు సజ్జనులు తొలగించుకొన్న కోరికలన్నింటి చేత స్వచ్ఛమైన అంతరంగంలో కలసిపోయి ఉంటాడు. ఇదిగో నీకు దగ్గరలోనే నీలోనే ఉన్నాను అన్నట్లు ఉంటాడు. ఆయన గుణాలన్నీ అంత సులభంగా అర్థమయ్యేవి కావు.

అందుకే గంభీరమైనవి. అయినా దయకు గనులవంటివి. అంటే భక్తులకు అర్థంకావటానికి అయిన అనుగ్రహం కలిగినవి. ఇవి గమనించి తనను ఆశ్రయించిన భక్తులకు పరతంత్రుడై ఉంటాడు. ఎల్లవేళల భక్తుల యందే విడువకుండా ఉంటాడు.

**క. శ్రుత ధన కుల ధర్మ సము, న్నత మదములఁ జేసి సజ్జన ప్రతతికి సం**
**తతమును నెగ్గొనరించు కు, మతు లర్థిం జేయు పూజ మతిఁ గొనఁ డెందున్. 961**

**ప్రతి :** శ్రుత= విద్య; ధన= సొమ్ము; కుల ధర్మ= వృత్తి ధర్మం అనువానిచేత; సమున్నత= పెద్దగా పెరిగిపోయిన; మదములన్+చేసి= ఒడలెరుగ నీయని దోషాలతో; సత్+జన ప్రతతికిన్= ఉత్తములైన వ్యక్తుల సముదాయానికి; సంతతమును= ఎల్లవేళల; ఎగ్గు= కీడు; ఒనరించు= చేసే; కుమతులు= చెడుబుద్ధిగలవారు; అర్థిన్= ప్రయత్నపడి; చేయు పూజన్= చేసే అర్చనను; ఎందున్= ఎక్కడా, ఎప్పుడూ; మతిన్= బుద్ధిచేత; కొనఁడు= గ్రహింపడు.

**తా :** కొందరికి విద్యవలన, మఱికొందరికి ధనంవలన, ఇంకా కొందరికి కులధర్మాలవలన పొగరు పెరిగిపోయి ఉంటుంది. దానితో ఉత్తములైన భగవద్భక్తులకు కీడు చేస్తూ ఉంటారు. ఆ విధంగా బుద్ధిని పాడు చేసుకొన్న నీచులు ఒకవేళ ఆ విష్ణువునకు కోరికోరి పూజలు చేసినా స్వామి ఎప్పుడూ, ఎక్కడా వానిని పట్టించుకోడు.

**వ. అది యెట్లనిన. 962**

**ప్రతి :** అది యెట్లనిన= అది ఏవిధంగా అంటే.

**సీ. వలనొప్పఁ దను ననువర్తించు నిందిరా కామినీ మణిఁ దదాకాంక్షు లగుచు**
**ధృతి ననువర్తించు దేవేంద్రముఖ్యుల నే ననువర్తింప కెప్పు డాత్మ**
**నిత్య స్వతంత్రుని నిజభక్త వరదుని దీనవత్సలు గుణాధీశు నజునిఁ**
**బురుషోత్తముని జగద్భరితు సర్వేశ్వరు నారాయణునిఁ జిదానందమయుని**

**తే. నఱితు నచ్యుతుఁ బుండరీకాయతాక్షుఁ, దవిలి సేవింపకుండునే? ధర కృతజ్ఞుఁ**
**డైన పురుషుండు సమ్మోదితాత్ముఁ డగుచుఁ, జారుమతులార! రాజకుమారులార! 963**

**ప్రతి :** చారుమతులార!= చక్కని బుద్ధిమంతులారా!; రాజకుమారులార= రాజపుత్రులారా!; ధరన్= భూమియందు; కృతజ్ఞుఁడు= చేసిన మేలును గుర్తించువాడు; ఐన పురుషుండు= అయిన మానవుడు; సమ్మోదిత+ఆత్ముఁడు= నిండైన ఆనందంకల అంతరంగం కలవాడు; అగుచున్= అవుతూ; వలను+ఒప్పన్= నేర్పుతో; తనున్= తనను; అనువర్తించు= తన వెంటనంటి మెలగే; ఇందిరా కామినీమణిన్= లక్ష్మీదేవి అనే స్త్రీరత్నాన్ని; తద్+ఆకాంక్షులు= ఆమె యందలి గాఢమైన కోరిక కలవారు; అగుచున్= అవుతూ; ధృతిన్= నిలుకడగల బుద్ధితో; అనువర్తించు= వెంటపడి తిరిగే; దేవ+ఇంద్ర ముఖ్యులన్= దేవతాసార్వభౌముడైన ఇంద్రుడు మొదలైనవారిని; ఏన్= అయినా; అనువర్తింపక= వెంటపడి తిరుగక; ఎప్పుడున్= అన్నికాలాలలో; ఆత్మన్= బుద్ధిలో; నిత్య స్వతంత్రుని= ఎల్లవేళల తన వ్యవహారానికే కట్టుబడి ఉండేవానిని; నిజ భక్త వరదుని= తన భక్తుల కోరికలను తీర్చేవానిని; దీన వత్సలున్= దిక్కులేదని అలమటించు వారియందు మిక్కిలి ప్రేమకలవానిని; గుణ+అధి+ఈశున్= గుణాలన్నింటికి గొప్పప్రభువును; అజునిన్= పుట్టుకలేనివానిని; పురుష+ఉత్తమునిన్= ఉత్తమపురుషుడైన పరమాత్ముని; జగత్+భరితున్= జగత్తులన్నిలు నిండినవానిని; సర్వ+ఈశ్వరునిన్= సమస్తమునకును

ప్రభువైనవానిని; నారాయణునిన్= నారాయణుని; చిత్+ఆనందమయునిన్= జ్ఞానంతో కూడిన ఆనందమే నిలువెల్లా నిండినవానిని; అజితున్= ఎందును ఓటమి యెఱుగనివాడు; అచ్యుతున్= ఎందును జారు పాటులేనివానిని; అయిన పుండరీక+ఆయత+అక్షున్= తెల్లని తామరల వంటి వెడద కన్నులు గలవానిని; తవిలి= తగులుకొని; సేవింపక= భజించకుండా; ఉండును+ఏ= ఉంటాడా?

**తా :** నాయనలారా! మీ బుద్ధి చాలా రమణీయమైనది. రాజపుత్రులారా! ఆ లక్ష్మీదేవి సర్వకాలాలలో శ్రీమహావిష్ణువును వదలక మెలగుతూ ఉంటుంది. ఆమెకు సంబంధించిన సంపదలను గట్టిగా కోరుతూ దేవేంద్రుడు మొదలగువారు ఆమె వెంటబడి తిరుగుతూ ఉంటారు. కృతజ్ఞతగల భక్తుడు వారిని అనుసరించడు. (ఎందుకంటే బిచ్చగాణ్ణి వేడుకొనే బిచ్చగాని ప్రవృత్తి వంటిది అది) కనుక నిరంతరం తన బుద్ధిలో శ్రీమన్నారాయణుని సేవించక ఉండలేడు. ఆయన సర్వస్వతంత్రుడు. తన భక్తులకు కోరినది ఇస్తాడు. దీనులయందు తల్లిలాగా వ్యవహరిస్తాడు. గుణాలన్నింటికి మహాప్రభువు. ఎందును పుట్టుక అనేది లేనివాడు. ఉత్తమపురుషుడు అయి పరమాత్మగా తెలియువాడు. లోకాలన్నింటినీ తనలో నింపుకొన్నవాడు. సర్వేశ్వరుడు. నారాయణుడు. పండిన జ్ఞానమే ఆనంద స్వరూపం అయినవాడు. అపజయంలేనివాడు. చ్యుతి లేనివాడు. తెల్లతామరలవంటి వెడదకన్నులుకలవాడు. కనుక నిజమైన భక్తిరసం రుచిమరగినవాడు నిలువెల్లా ఆనందమే కాగా ఆయనను సేవించక ఎలా ఉంటాడు?

**వ. అని మఱియు నిట్లనియె, భవదీయ వంశ ధుర్యుండుఁ జిత్రరథుండు నగు ధ్రువుండు సపత్నీమాతృ వాగ్బాణ భిన్న హృదయుండై పంచవర్షార్భకుం డగుచుఁ దపోవనంబున కరుగు నపుడు మార్గంబున నాచే నుపదిష్టంబైన క్రమంబున భగవంతుండగు పుండరీకాక్షు నారాధించి యితరులచే నొందరాని సర్వోత్తమంబగు పదంబు నొందెఁ గాన మీరును రుద్రోపదేశ క్రమంబున సర్వభూతాంతర్యామి యగు నీశ్వరు భవచ్ఛేదంబునకై భజియింపుడు. 964**

**ప్రతి :** అని; మఱియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు (నారదుడు); భవదీయ వంశ ధుర్యుండును= మీదయిన వంశానికి గౌరవాన్నంతటినీ తెచ్చి పెట్టినవాడును; చిత్ర రథుండును= చిత్రమైన రథాలు కలవాడును; అగు= అయిన; ధ్రువుండు= ధ్రువుడనేవాడు; సపత్నీ= సవతి; మాతృ= తల్లి; వాక్= మాటలనే; బాణ= ములుకులచేత; భిన్న= విరిగిపోయిన (దెబ్బతిన్న); హృదయుండు+ఐ= హృదయం కలవాడై; పంచవర్ష+అర్భకుండు= అయిదేండ్ల పసివాడు; అగుచున్= అగుచు; తపస్+వనంబునకున్= తపస్సునకు అనువైన అడవికి; అరుగు+అపుడు= వెళ్ళే సమయంలో; మార్గంబునన్= దారిలో; నాచేన్= నాచేత; ఉపదిష్టంబు+ఐన= శాస్త్రపద్ధతితో బోధించబడినదైన; క్రమంబునన్= వరుసలో; భగవంతుండు+అగు= ఐశ్వర్యాదులయిన ఆరులక్షణాలు నిండుగా ఉన్నవాడగు; పుండరీక+అక్షున్= పద్మాక్షుని– విష్ణువును; ఆరాధించి= అర్చన చేసి; ఇతరుల చేన్= వేరువ్యక్తుల చేత; ఒందన్+రాని= పొందరాని; సర్వ+ఉత్తమంబు+అగు= అన్నింటికంటె మేలయినదగు; పదంబున్= స్థానాన్ని; ఒందెన్= పొందినాడు; కానన్= కాబట్టి; మీరును= మీరు కూడా; రుద్ర+ఉపదేశ క్రమంబునన్= రుద్రుడు ఉపదేశించిన పద్ధతిలో; సర్వ భూత+అంతర్యామి= సమస్త జీవులను లో నుండి నియమించువాడు; అగు ఈశ్వరున్= అయిన పరమాత్ముని; భవ+ఛేదంబునకై= సంసారం ముడి తెగిపోవటం కోసం; భజియింపుడు= సేవించండి.

**తా :** అని నారదుడు ఇంకా ఇలా చెప్పాడు. మీ వంశ గౌరవాన్ని చక్కగా పెంపొందించిన చిత్రరథుడనే ధ్రువుడు సవతి తల్లి పలుకుల ములుకులకు వికలమైన మనస్సు కలవాడై అయిదేండ్ల పసితనంలోనే తపోవనానికి పోతుండగా దారిలో నేను ఉపదేశించిన విధంగా భగవంతుడైన పుండరీకాక్షుని ఆరాధించాడు. దానివలన ఇతరులకెవ్వరకు అందరాని సర్వోన్నతమైన పదానికి చేరుకున్నాడు. కాబట్టి, మీరుకూడా రుద్రదేవుడు ఉపదేశించిన పద్ధతితో సర్వభూతాలలో సంచరించే పరమాత్మను సంసారబంధాలు తెగిపోవటం కోసం ఆరాధించండి.

**క. అని యివ్విధమున నారద, ముని రాజకుమారులకును ముదము దలిర్పన్**
**వనజోదరు సచ్చరితము, వినిపించి సరోజభవుని వీటికిఁ జనియెన్. 965**

**ప్రతి :** అని; ఈ+విధమునన్= ఈ విధంగా; నారద ముని= నారదుడనే మహర్షి; రాజకుమారులకును= ప్రాచీనబర్హి అనే నృపాలుని తనయులకు; ముదము= నిండైన ప్రీతి; తలిర్పన్= వ్యాపించునట్లుగా; వనజ+ఉదరు= పద్మం బొడ్డులోగల హరియొక్క; సత్+చరితము= మంచి చరిత్రను; వినిపించి; సరోజ భవుని= పద్మంలో పుట్టిన బ్రహ్మయొక్క; వీటికిన్= నెలవైన సత్యలోకానికి; చనియెన్= వెళ్ళాడు.

**తా :** అని ఈ విధంగా నారదమహర్షి రాజకుమారులకు సంతోషం అతిశయించగా శ్రీమహావిష్ణువు మెలగిన గొప్ప విధానాన్ని వినిపించి తన తండ్రియగు బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు.

**వ. అట్లు నారదుండు సనిన యనంతరంబ. 966**

**ప్రతి :** అట్లు= అలా చెప్పి; నారదుండు= నారదమహర్షి; చనిన+అనంతరంబు+అ= వెళ్ళిన వెంటనే...

**తా :** అలా చెప్పి నారదుడు వెళ్ళిన వెంటనే

**చ. నరవర నందనుల్ గడఁక నారద వక్త్ర వినిర్గతంబు సుం**
**దరమును మంగళావహము ధన్యము లోకమలాపహంబునై**
**పరఁగిన విష్ణుసద్యశము భక్తి నుతించి ముకుందచింతనా**
**నిరుపమ భక్తిఁజెంది హరినిత్యపదంబును బొంది రున్నతిన్. 967**

**ప్రతి :** నరవరనందనుల్= రాజ కుమారులైన ప్రచేతసులు; కడఁకన్= పూనికతో; నారద వక్త్ర వినిర్గతంబు= నారదుని నోటినుండి వెలువడినది; సుందరమును= మనోజ్ఞమైనది; మంగళ+ఆవహము= శుభాలను కలిగించేది; ధన్యము= పుణ్యమైనది; లోక మల+అపహంబును+ఐ= లోకంలోని దోషాలను తొలగించి వేసేదై; పరఁగిన= ఒప్పిన; విష్ణు= విష్ణువుయొక్క; సద్యశమున్= కీర్తిమహిమను; భక్తిన్= భక్తితో; నుతించి= స్తుతించి; ముకుంద చింతనా= ముకుందుని స్మరణతో కూడిన; నిరుపమ= సాటిలేని; భక్తిన్= భక్తిని; చెంది= పొంది; ఉన్నతిన్= గొప్పతనంతో; హరి నిత్యపదంబును= విష్ణువునకు సంబంధించిన శాశ్వతస్థానాన్ని; పొందిరి= చేరుకున్నారు.

**తా :** రాజకుమారులు ప్రచేతసులు నారదుని మోమునుండి వెలువడిన మనోహరం, మంగళకరం, పుణ్యం, లోకుల అజ్ఞానం అనే మాలిన్యాన్ని తొలగించేదీ అయిన శ్రీమహావిష్ణువు గొప్ప యశస్సును భక్తితో స్తోత్రం చేసి, నారాయణునే భావించటం అనే సాటిలేని భక్తిని పొంది, గొప్పగా శ్రీహరి శాశ్వతస్థానాన్ని చేరుకున్నారు.

**వ. అని మైత్రేయుండు విదురున కిట్లనియె. మహాత్మా! నీవు నన్నడిగిన ప్రచేతో నారద సంవాద రూపంబైన హరికీర్తనంబు మను పుత్త్రుండైన యుత్తానపాదుని వంశప్రకారంబును జెప్పితి నని వెండియు నిట్లనియె. నారదు వలనం బ్రియవ్రతుం డాత్మ విజ్ఞానంబు నొంది మహీమండలంబుఁ బరిపాలించి యనంతరంబునఁ బుత్త్రులకు రాజ్యంబుఁ బంచి యిచ్చి పరలోకగతుం డయ్యె, ననిన. 968**

**ప్రతి :** అని; మైత్రేయుండు; విదురునకున్; ఇట్లు; అనియెన్= అన్నాడు; మహాత్మా!= గొప్పబుద్ధిశక్తి కలవాడా!; నీవు; నన్ను; అడిగిన; ప్రచేతస్+నారద సంవాద రూపము= ప్రచేతసులకు నారదునకు నడుమ జరిగిన సంభాషణగా; ఐన= అయిన; హరి కీర్తనంబున్= విష్ణుని గుణకథనాన్ని; మను+పుత్త్రుండు+ఐన= మనువుకొడుకైన; ఉత్తానపాదుని వంశ ప్రకారంబును= ఉత్తానపాదుని వంశం తీరును; చెప్పితిన్= చెప్పాను; అని; వెండియున్= ఇంకా; ఇట్లు; అనియెన్= అన్నాడు; నారదువలనన్= నారదునిద్వారా; ప్రియవ్రతుండు= ప్రియవ్రతుడు; ఆత్మవిజ్ఞానంబున్= పరమాత్మకు సంబంధించిన విశేషమైన జ్ఞానాన్ని; ఒంది= పొంది; మహీమండలంబున్= భూమిని; పరిపాలించి= ఏలి; అనంతరంబునన్= పిమ్మట; పుత్త్రులకున్= కొడుకులకు; రాజ్యంబు= తన యేలుబడిలో ఉన్న భూమిని; పంచి= విభజించి; ఇచ్చి= ఒసగి; పరలోకగతుండు= ఊర్ధ్వలోకాన్ని చేరుకొన్నవాడు; అయ్యెన్= అయ్యాడు; అనినన్= అని చెప్పగా...

**తా :** ఇలా మైత్రేయుడు విదురునకు తెలియజెప్పి ఇంకా ఇలా అన్నాడు. మహాత్మా! నీవు నన్నడిగిన ప్రచేతసులకు నారదునితో సంవాదంగా అయిన శ్రీహరి మాహాత్మ్యాన్నీ, మనువు కుమారుడైన ఉత్తానపాదుని వంశం వరుసనూ నీకు చెప్పాను. అని ఇంకా ఇలా అన్నాడు. నారదుడు ఉపదేశించగా ప్రియవ్రతుడు ఆత్మవిజ్ఞానం పొంది భూవలయాన్ని పాలించి తరువాత రాజ్యం భాగాలుగా చేసి కొడుకులకు ఇచ్చి పరలోకానికి వెళ్ళాడు అని చెప్పగా

**విశే :** "ఆత్మవిజ్ఞానం పొంది, మహీమండలంబు పరిపాలించి" అనటంలో ఒక విశేషం ఉన్నది. ఎంత జ్ఞాన సంపన్నునికైనా 'స్వధర్మం' విధ్యుక్తంగా నిర్వహించకపోతే కలిగేది దుర్గతియే అని చెప్పటం ఇక్కడ తాత్పర్యం.

**క. విని విదురుం డా మునివరు, ఘన చరణము లాత్మమస్తకంబున మధు సూ**
**దను చరణాంభోరుహములు, మనమునఁ దగఁ దాల్చి పలికె మైత్రేయునితోన్. 969**

**ప్రతి :** విని= ఆలకించి; విదురుండు= విదురుడు; ఆ మునివరు ఘన చరణములు= ముని శ్రేష్ఠుడగు ఆ మైత్రేయుని మహిమగల పాదాలను; ఆత్మ మస్తకంబునన్= తన తల మీదను; మధుసూదను= మధువను రాక్షసుని రూపు మాపిన శ్రీహరియొక్క; చరణ+అంభోరుహములు= పద్మాలవంటి పాదాలను; మనమునన్= హృదయంలోనూ; తగన్= చక్కగా; తాల్చి= ఉంచుకొని; మైత్రేయునితోన్= మైత్రేయమహర్షితో; పలికెన్= ఇలా అన్నాడు.

**తా :** విదురుడు తాపసులలో గొప్పవాడైన మైత్రేయుని మహిమగల పాదాలను తన తలమీదా, శ్రీమహావిష్ణుని పాదపద్మాలను హృదయంలోనూ నిలుపుకొని మైత్రేయునితో ఇలా అన్నాడు.

**క. మునినాథ చంద్ర! కరుణా, వననిధి! నీ చేత భక్త వత్సలుఁడగు నా**
**వనజాక్షు తత్త్వ మెఱిఁగితి, నని తత్పదములకు వినతుఁడై వినయమునన్. 970**

**ప్రతి :** మునినాథచంద్ర= మహర్షులలో శ్రేష్ఠులకు ఆహ్లాదం కలిగించేవాడా!; కరుణా వననిధి= దయకు సముద్రం అయినవాడా!; నీ చేతన్= నీ వలన; భక్త వత్సలుఁడు+అగు= భక్తులయెడ తల్లిప్రేమవంటి ప్రేమకలవాడగు; ఆ వనజ+అక్షు=

పద్మాలవంటి కన్నులుగల ఆ విష్ణువుయొక్క; తత్త్వమున్= తత్త్వాన్ని; ఎఱిఁగితిని= తెలుసుకున్నాను; అని; తత్+పదములకున్= అతని పాదాలకు; వినతుఁడు= నమస్కారం చేసినవాడు; ఐ= అయి; వినయమునన్= అణకువతో...

**తా :** మహర్షి వరేణ్యా! దయాశాలీ! భక్తవత్సలుడైన శ్రీమన్నారాయణుని తత్త్వాన్ని నీ వలన తెలుసుకున్నాను అని ఆయన పాదాలకు మరొకసారి నమస్కరించి వినయంతో

**క. ఆ మునిచే నా మంత్రితుఁ, డై మనమున బంధు దర్శనాకాంక్షితుఁడై**
**ధీ మహితుఁడైన విదురుఁడు, సామజపురమునకుఁ జనియె సమ్మద మొప్పన్. 971**

**ప్రతి :** ఆ మునిచేన్= ఆ మహర్షిచేత; ఆమంత్రితుఁడై= వీడ్కోలు పొందినవాడై; మనమునన్= మనస్సులో; బంధు దర్శన+ఆకాంక్షితుఁడు+ఐ= చుట్టాలను చూడాలనే గొప్ప కోరిక కలవాడై; ధీమహితుఁడు= గొప్ప బుద్ధి శక్తి కలవాడు; ఐన విదురుఁడు= అయిన విదురుడు; సమ్మదము= మిక్కిలి సంతోషం; ఒప్పన్= కలుగగా; సామజపురమునకున్= హస్తిపురానికి; చనియెన్= వెళ్ళాడు.

**తా :** ఆ మహర్షిచేత వీడ్కోలు పొందినవాడై ఆనందం నిండుగా కలుగగా బుద్ధిశాలి అయిన విదురుడు బంధుజనులను చూడాలి అనే కోరికతో హస్తినాపురానికి వెళ్ళాడు.

**క. అని శుకుఁడు పరీక్షిత్తున, కనుకంపం జెప్పె నీ యుపాఖ్యానంబున్**
**వినువాఁ డైశ్వర్యాయు, ర్ధన కీర్తి స్వస్తి గతులఁ దగఁ బ్రాపించున్. 972**

**ప్రతి :** అని; శుకుఁడు= శుకమహర్షి; పరీక్షిత్తునకున్= పరీక్షిన్మహారాజునకు; అనుకంపన్= దయతో; ఈ ఉపాఖ్యానంబున్= ఈ కథను; చెప్పెన్= చెప్పాడు; వినువాఁడు= ఆకర్ణించే వ్యక్తి; ఐశ్వర్య= ఐశ్వర్యాన్ని; ఆయున్= గొప్పజీవిత కాలాన్ని; ధన= ధనాన్నీ; కీర్తి= యశస్సును; స్వస్తి= శుభాన్నీ; గతులన్= ఉత్తమగతులనూ; తగన్= బాగుగా; ప్రాపించున్= పొందగలడు.

**తా :** అని శుకమహర్షి దయతో పరీక్షిన్మహారాజునకు ఈ ఉపాఖ్యానాన్ని తెలియజెప్పాడు. దీన్ని విన్నవానికి ఐశ్వర్యం, ఆయువు, సంపద, కీర్తి, శుభం, సద్గతి కలుగుతాయి.

**క. అని శుకయోగి పరీక్షి, జ్జనపాల సుధాపయోధి చంద్రున కర్థిన్**
**వినిపించిన కథ మోదం, బున సూతుఁడు శౌనకాది మునులకుఁ జెప్పెన్. 973**

**ప్రతి :** అని; శుకయోగి= శుకుడనే మహర్షి; పరీక్షిత్= పరిక్షిత్తు అనే పేరుగల; జనపాల= రాజు అనే; సుధాపయోధి= అమృత సముద్రమునందలి; చంద్రునకున్= చందమామకు; అర్థిన్= కోరికతో; వినిపించిన కథన్= చెప్పిన కథను; సూతుఁడు= సూత మహర్షి; శౌనక+ఆది మునులకున్= శౌనకుడు మొదలైన మహర్షులకు; మోదంబునన్= సంతోషంతో; చెప్పెన్= చెప్పినాడు.

**తా :** ఈ విధంగా శుకమహర్షి పరీక్షిన్మహారాజునకు చెప్పిన కథను సూతమహర్షి పరమానందంతో శౌనకుడు మొదలైన మహర్షులకు తెలియజేసినాడు.

**చ. సరస వచో విలాస! గుణసాగర! సాగర మేఖలా మహీ**
**భరణ ధురంధర ప్రకట భవ్య భుజా భుజగేంద్ర! రాజ శే**

**ఖర! ఖర దూషణ ప్రముఖ గాఢ తమః పటల ప్రచండ భా**
**స్కర! కఱకంఠ కార్ముక విఖండన ఖేలన! భక్త పాలనా! 974**

**ప్రతి :** సరసవచస్+విలాస= రసవంతములైన పలుకులతో విలసిల్లేవాడా!; గుణ సాగర= గుణాలకు సముద్రమైనవాడా!; సాగర= సముద్రమనే; మేఖలా= మొలనూలుగల; మహీ= భూమిని; భరణ= భరించటంలో; ధురంధర= భారాన్ని వహించగల; భవ్య= గొప్పది అయిన; భుజా= భుజం అనే; భుజగ+ఇంద్ర= సర్పరాజు కలవాడా!; రాజశేఖర= రాజులకు శిరోమణి వంటివాడా! ఖర= ఖరుడు; దూషణ= దూషణుడు; ప్రముఖ= మొదలైన వారు అనే; గాఢ= దట్టమైన; తమస్= చీకట్లు; పటల= సమూహానికి; ప్రచండ= మిక్కిలి తీవ్రతగల; భాస్కర= సూర్యుడు అయినవాడా!; కఱకంఠ= నీలకంఠుడైనశివుని; కార్ముక= వింటిని; విఖండన= విరుగగొట్టటం; ఖేలన= ఆటగా గలవాడా!; భక్తపాలనా= భక్తులను పరిపాలించువాడా!

**తా :** రసవంతాలైన వాక్కులతో విరాజిల్లు స్వామీ! గుణాలకు సముద్రమైనవాడా! సాగరమే మొలనూలుగాగల భూమిని భరించే ఎట్టి బరువునైనా అలవోకగా తాల్పగల మేలైన భుజం అనే సర్పరాజు (శేషుడు) కలవాడా! రాజులలో శ్రేష్ఠుడా! ఖరుడు దూషణుడు మొదలైన రాక్షసులు అనే దట్టమైన చీకట్లకు మిక్కిలి తీవ్రమైన కాంతికిరణాలుగల సూర్యుడా! శివుని వింటిని విరవటం క్రీడగా అయినవాడా! భక్తులను కాపాడే ప్రభూ!

**విశే :** ఇందులో భగవంతుని మూడు కర్తవ్యాలైన శిష్టరక్షణ, దుష్టశిక్షణ, ధర్మస్థాపన అనేవి ప్రసక్తాలయ్యాయి. శివధనుర్భంగం మొదలైనవి లీలలు. భుజాన్ని శేషునితో అభిన్నంగా చెప్పటం వలన రూపకం. అలాగే ఖరదూషణాదుల విషయంలో దట్టమైన చీకట్లను, రాముని విషయంలో భాస్కరత్వాన్నీ రూపించారు.

**క. శర విదళిత సారంగా!, సరస దయాపాంగ! భక్త జలధితరంగా!**
**దురిత ధ్వాంత పతంగా!, వర జనకసుతానుషంగ! వననిధి భంగా! 975**

**ప్రతి :** శర విదళిత సారంగా= బాణంతో చీల్చివేయబడిన లేడి కలవాడా!; సరస దయా+అపాంగ= రసంతో ఆర్ద్రమైన దయగల కడకంటి చూపు కలవాడా!; భక్త జలధి తరంగా= భక్తులనే సముద్రానికి అల అయినవాడా!; దురిత ధ్వాంత పతంగా= పాపాలనే చీకట్లకు భాస్కరుడైనవాడా!; వర జనకసుతా+అనుషంగ= శ్రేష్ఠురాలైన జానకీదేవితో కూడినవాడా!; వననిధి భంగా= సముద్రుని అహంకారాన్ని అణచినవాడా!

**తా :** స్వామీ! శ్రీరామచంద్రా! నీవు ఒక బాణంతో మారీచుడనే మాయలేడిని మట్టుబెట్టావు. నీ కంటికొనలో కారుణ్యం ఎల్లవేళలా జాలువారుతూ ఉంటుంది. భక్తులు ఒక పెద్ద సముద్రం అయితే దాని అలవు నీవు. పాపాలనే చీకట్లకు నీవు భాస్కరుడవు. దొడ్డ ఇల్లాలు సీతాదేవితో సంగం కలవాడా! సముద్రుని అహంకారాన్ని అణచినవాడా!

**విశే :** తరంగం సముద్రాన్ని విడిచి ఉండనట్లే భగవంతుడు భక్తులను వదలి ఉండడు.

**మాలిని.**

**సుర విమత విదారీ! సుందరీ శంబరారీ!**
**సరస వినుత సూరీ! సర్వలోకోపకారీ!**
**నిరుపమ గుణ హారీ! నిర్మలానంద కారీ!**
**గురుసమర విహారీ! ఘోర దైత్య ప్రహారీ! 976**

**ప్రతి :** సుర విమత విదారీ= దేవతలకు పగవారైన రక్కసులను చీల్చి చెండాడువాడా!; సుందరీ శంబరారీ= సుందరియైన జానకీదేవికి మన్మథుడైనవాడా! సరస వినుత సూరీ= రసహృదయులు కొనియాడే విద్వాంసుడా!; సర్వ లోక+ఉపకారీ= లోకాలన్నింటికీ మేలు చేయుస్వామీ!; నిరుపమ గుణహారీ= సాటి చెప్పరాని మంచి లక్షణాలే హారాలుగా అయినవాడా!; నిర్మల+ఆనంద కారీ= మాలిన్యంలేని ఆనందాన్ని కలిగించేవాడా!; గురు సమర విహారీ= మహాఘోర సంగ్రామంలో విహరించేవాడా!; ఘోర దైత్య ప్రహారీ= అతిక్రూరులైన రక్కసులను చంపివేసినవాడా!

**తా :** స్వామీ శ్రీరామచంద్రా! నీవు పెక్కండ్రు రక్కసులను మట్టుపెట్టిన వాడవు. సుందరి అంటే సీతగా అవతరించిన లక్ష్మియే. ఆమెకు నీవే మన్మథుడవు. రసహృదయులైన విద్వాంసులు నిన్ను మహావిద్వాంసునిగా కొనియాడుతారు. సర్వలోకాలకూ ఉపకారం చేసే శీలం నీది. నీ గుణాలవంటి గుణాలు లోకంలో మరెందూ లేవు. వానితో నీవు చక్కగా అలంకరించబడిన వాడవు. (మహోదాత్తగుణాలతో అందరి హృదయాలను ఆకట్టు కొంటావు). నిర్మలమైన ఆనందాన్ని భక్తులకు కలిగిస్తావు. గొప్పయుద్ధంలో విలాసంగా సంచరించగల మహిమ నీకు ఉన్నది. అతిభయంకరులైన రక్కసులను చంపివేశావు.

**గద్యము.**

**ఇది శ్రీ పరమేశ్వర కరుణాకలిత కవితా విచిత్ర కేసన మంత్రిపుత్ర సహజ పాండిత్య పోతనామాత్య ప్రణీతంబైన శ్రీ మహాభాగవతం బను మహాపురాణంబునందు స్వాయంభువ మనువునకు నాకూతి, దేవహూతి, ప్రసూతి, ప్రియవ్రతోత్తాన పాదులు జన్మించుటయు, నందు నాకూతిని రుచి ప్రజాపతికి నిచ్చుటయు, నా రుచి ప్రజాపతికి నాకూతి దేవియందు శ్రీ విష్ణు మూర్త్యంశజుండైన యజ్ఞుండును, లక్ష్మీ కళాంశజ యగు దక్షిణ యను కన్యకయు నుద్భవించుటయు, మనుపుత్రియైన దేవహూతిని గర్దమున కిచ్చుటయుఁ, బ్రసూతిం దక్ష ప్రజాపతి కిచ్చుటయుఁ, బ్రసూతి దక్షుల వలనం బ్రజాపరంపరలు గలుగుటయు, మఱియుం గర్దమ ప్రజాపతి పుత్రికా సముదయంబును క్షత్త్ర బ్రహ్మర్షుల కిచ్చుటయుఁ గర్దమ పుత్త్రి యైన కళవలన మరీచికిం గశ్యపుం డను పుత్రుండును బూర్ణిమ యను కూఁతురుం బుట్టుటయును, బూర్ణిమవలన గంగయు విరజుం డనెడు కుమారుండును జన్మించుటయు, గశ్యపప్రజాపతివలన నయిన ప్రజా పరంపరలచే ముల్లోకంబు లాపూర్ణంబు లగుటయు, నత్రిమహాముని తపంబును, నతనికి హరిహర బ్రహ్మలు ప్రత్యక్షం బగుటయు, ననసూయా పాతివ్రత్య మాహాత్మ్యంబు వలన ననసూయాత్రులకుం ద్రిమూర్తుల కళాంశజు లయిన చంద్ర దత్తాత్రేయ దుర్వాసుల జన్మంబును, దక్షాత్మజల జన్మంబును, భృగువువలన ఖ్యాతి యను నంగనకు శ్రీమహాలక్ష్మి జన్మించుటయును, భృగుపౌత్రుం డయిన మార్కండేయు జన్మంబును, ధర్మునకు మూర్తివలన నర నారాయణులు సంభవించుటయును, సత్త్రయాగంబునందు దక్షుండు శివుని నిందించుటయును, దక్షాధ్వర ధ్వంసంబును, బ్రహ్మచేఁ బ్రార్థితుండై శివుండు దక్షాదుల ననుగ్రహించుటయును, దక్షాదికృత శ్రీహరి స్తవంబును, శ్రీహరి ప్రసన్నుండై దక్షుని యజ్ఞంబు సఫలంబుగా ననుగ్రహించుటయును, సతీదేవి హిమవంతునకు జనించి హరునకుం బ్రాప్తించుటయు, నుత్తానపాదుని వృత్తాంతంబును, ధ్రువోపాఖ్యానంబును, ధ్రువుండు దండ్రిచేత నవమానితుండై నారదోపదేశంబున మధువనంబునకుం జని తపంబు సేయుటయును, హరి ప్రసన్నుండై యతని మనోరథంబు లిచ్చుటయును, నతండు మరలఁ**

**బురంబునకు వచ్చుటయు, గుబేరానుచరులైన యక్షులతోడి యుద్ధంబును, ధ్రువుండు యజ్ఞంబులు సేయుచు రాజ్య భోగంబులం దనిసి తనయు నుత్కలునిం బట్టంబు గట్టి హరియనుగ్రహంబున ధ్రువక్షితిని నిలుచుటయు, నుత్కలుండు వత్సరుం డను తన సుతనిఁ బట్టంబు గట్టి హరిం జేరుటయు, వత్సరుని వంశపరంపరయు, నందు నంగుని సుతుండయిన వేను కళేబరంబున లక్ష్మీనారాయణుల యంశంబున నర్చియు బృథుండును జన్మించుటయుఁ, బృథుండు భూమిం గామధేనువురీతి నఖిల వస్తువులుం బిదుక నియమించి నిమ్నస్థలిం జేసి యింద్రుండు వశవర్తియై యుండ బహు యజ్ఞంబులు సేసిన నతనికి హరి ప్రత్యక్షం బగుటయు, నధ్యాత్మ ప్రబోధంబును, నింద్రుని వలనఁ బాషండ సంభవంబును, నింద్రుని జయించిన విజితాశ్వుని నతని తమ్ములను బృథివీపాలనంబునకు నిలిపి పృథుండు నర్చియుం బరమపదప్రాప్తు లగుటయు, విజితాశ్వునకు వసిష్ఠ శాపంబునం ద్రేతాగ్నులు దనయులై జనించుటయుఁ, బృథుని పౌత్రుండయిన ప్రాచీనబర్హి రాజ్యంబును నతని యజ్ఞంబు లసంఖ్యాతంబులైన నారదుండు మాన్పం దలంచి పురంజనుకథ నధ్యాత్మ ప్రపంచంబుగాఁ దెలుపుటయుఁ, బ్రాచీనబర్హి సుతులయిన ప్రచేతసులు పదువురకు శ్రీ మహాదేవుండు ప్రత్యక్షంబై హరి స్తవంబుపదేశించుటయుఁ, బ్రచేతసుల తపంబునకు మెచ్చి హరి ప్రత్యక్షం బగుటయు, వారికి మారిష వలన దక్షుండు పూర్వకాలంబున శివవిద్వేష ప్రయుక్త శాపంబునం బుత్త్రుండై జనియించుటయును, బ్రచేతసులు ముక్తికిం జనుటయును, విదురుండు మైత్రేయుని వీడ్కొని హస్తి పురంబున కరుగుటయు నను కథలు గల చతుర్థ స్కంధము. 977**

**ప్రతి :** ఇది; శ్రీ= సంపదతో కూడియున్న; పరమ+ఈశ్వర= భగవంతుని; కరుణా= దయతో; కలిత= కూడిన; కవితా= కవిత్వంతో; విచిత్ర= ఆశ్చర్యం కలిగించేవాడు; కేసన మంత్రి పుత్ర= కేసన మంత్రి కుమారుడు; సహజ పాండిత్య= పుట్టుకతో వచ్చిన జ్ఞానసంపదకలవాడు; అయిన; పోతన+అమాత్య= పోతనామాత్యుని చేత; ప్రణీతంబు= రచించబడినది; ఐన= అయిన; శ్రీమహాభాగవతంబు= పరమభాగవతులు, మహాభక్తుల చరిత్రలు గల్గి మోక్షప్రదాయమైన మహాభాగవతం; అను= అనే; మహాపురాణంబునందున్= దశలక్షణ సమన్వితమైన గొప్పపురాణంలో; స్వాయంభువమనువునకున్= స్వాయంభువుడు అనే మనువునకు; ఆకూతి దేవహూతి ప్రసూతి ప్రియవ్రత ఉత్తానపాదులు= ఆకూతి, దేవహూతి, ప్రసూతి, ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనేవారు; జన్మించుటయున్= పుట్టటం; అందున్= వారిలో; ఆకూతిని= ఆకూతి అనే ఆమెను; రుచి ప్రజాపతికిన్= రుచి అనే ప్రజాపతికి; ఇచ్చుటయున్= (భార్యగా) ఇవ్వటమూ; ఆ రుచి ప్రజాపతికిన్= ఆ రుచి అనే బ్రహ్మకు; ఆకూతియందున్= ఆకూతి అనే ధర్మపత్నియందు; శ్రీ విష్ణుమూర్తి అంశజుండు= శ్రీ విష్ణువు అంశంతో పుట్టినవాడు; ఐన యజ్ఞుండును= అయిన యజ్ఞుడూ; లక్ష్మీ కళా+అంశజ= లక్ష్మీదేవి కళ అంశంతో పుట్టినది; అగు దక్షిణ= అయిన దక్షిణ; అను కన్యకయున్= అనే బిడ్డ; ఉద్భవించుటయున్= పుట్టటమూ; మను పుత్రి+ఐన= మనువు కూతురైన; దేవహూతిని= దేవహూతి అనే ఆమెను; కర్దమునకున్= కర్దముడనే ప్రజాపతికి; ఇచ్చుటయున్= భార్యగా ఒసగుట; ప్రసూతిన్= ప్రసూతి అనే ఆమెను; దక్షప్రజాపతికిన్= దక్షుడు అనే ప్రజాపతికి; ఇచ్చుటయున్= ఇల్లాలుగా చేయటమూ; ప్రసూతి దక్షులవలనన్= ప్రసూతి, దక్షుడు అనే దంపతుల వలన; ప్రజా పరంపరలు= అనేక ప్రజలు; కలుగుటయున్= ఏర్పడటమూ; మఱియున్= ఇంకా; కర్దమప్రజాపతి= కర్దముడనే ప్రజాపతియొక్క; పుత్రికా

సముదయంబును= కూతుండ్ర సమూహాన్ని; క్షత్ర బ్రహ్మ+ఋషులకున్= రాజర్షులకు, బ్రహ్మర్షులకును; ఇచ్చుటయును= భార్యలనుగా ఇవ్వటమూ; కర్దమపుత్రి+ఐన= కర్దముని కూతురైన; కళవలనన్= కళ అనే ఆమె వలన; మరీచికిన్= మరీచి అనే ప్రజాపతికి; కశ్యపుండు+అను పుత్రుండును= కశ్యపుడు అనే కుమారుడును; పూర్ణిమ; అను కూఁతురున్= అనే బిడ్డయూ; పుట్టుటయును= పుట్టటమూ; పూర్ణిమవలన= పూర్ణిమ నుండి; గంగయున్= గంగ; విరజుండు= విరజుడు; అనెడి= అనే; కుమారుండును= కొడుకూ; జన్మించుటయు= కలగటమూ; కశ్యప ప్రజాపతివలనన్= కశ్యపుడనే బ్రహ్మవలన; అయిన; ప్రజాపరంపరలచేన్= సంతాన శ్రేణులచే; మూడు+లోకంబులు= స్వర్గం, భూలోకం, పాతాళం అనే మూడులోకాలు; ఆపూర్ణంబులు= వెలితి లేకుండా నిండినవి; అగుటయున్= కావటమూ; అత్రి మహాముని తపంబును= అత్రి అనే మహర్షి చేసిన తపస్సూ; అతనికిన్= ఆ మహర్షికి; హరి హర బ్రహ్మలు= విష్ణువు, శివుడు, బ్రహ్మ అనే దేవుళ్ళు; ప్రత్యక్షంబు+ అగుటయున్= కనబడటమూ; అనసూయా పాతివ్రత్య మాహాత్మ్యంబువలనన్= అనసూయ పతిభక్తి గొప్పతనంవలన; అనసూయా+అత్రులకున్= అనసూయ, అత్రి అనే దంపతులకు; త్రిమూర్తుల= త్రిమూర్తుల యొక్క; కలా+అంశజులు= కళల భాగాల వలన పుట్టినవారు; అయిన; చంద్రదత్తాత్రేయ దుర్వాసుల జన్మంబును= చంద్రుడు, దత్తాత్రేయుడు, దుర్వాసుడు అనే వారి పుట్టుకయు; దక్ష ఆత్మజల జన్మంబును= దక్షుని కూతుండ్ర పుట్టుకయు; భృగువువలనన్= భృగుమహర్షివలన; ఖ్యాతి; అను+అంగనకున్= అనే వనితకు; శ్రీమహాలక్ష్మి= సంపత్స్వరూపయు, మహిమగలదియు అగు లక్ష్మీదేవి; జన్మించుటయున్= కలుగుటయు; భృగు పౌత్రుండు+అయిన= భృగుమహర్షి కొడుకుకొడుకైన; మార్కండేయు జన్మంబును= మార్కండేయమహర్షి పుట్టుకయు; ధర్మునకున్= ధర్ముడు అనే ప్రజాపతికి; మూర్తివలనన్= మూర్తి అనే ఇల్లాలి వలన; నర నారాయణులు= నరుడు, నారాయణుడు అనే ఆది మునులు; సంభవించుటయును= పుట్టటమూ; సత్త్రయాగంబునందున్= సత్రము అనే ఒక విధమైన యజ్ఞంలో; దక్షుండు= దక్షప్రజాపతి; శివునిన్= శివుని; నిందించుటయున్= తూలనాడటమూ; దక్ష+అధ్వర ధ్వంసంబునున్= దక్షుని యాగం నాశనం కావటమూ; బ్రహ్మచేన్= బ్రహ్మచేత; ప్రార్థితుండు+ఐ= కోరబడిన వాడయి; శివుండు= శివుడు; దక్ష+ఆదులన్= దక్షుడు మొదలైనవారిని; అనుగ్రహించుటయును= ఆదరంతో స్వీకరించటమూ; దక్ష+ఆది కృత శ్రీహరి స్తవంబును= దక్షుడు మొదలైనవారిచే చేయబడిన, శ్రీమహావిష్ణువు స్తుతి; శ్రీహరి= శ్రీమహావిష్ణువు; ప్రసన్నుండు+ఐ= దయగల హృదయం కలవాడై; దక్షుని యజ్ఞంబున్= దక్షునియాగాన్ని; సఫలంబు= ఫలం కలది; కాన్= అయ్యే విధంగా; అనుగ్రహించుటయున్= దయజూడటమూ; సతీదేవి= దక్షుని బిడ్డ అయిన సతీ అనే దేవి; హిమవంతునకున్= హిమవంతుడు అనే పర్వతరాజునకు; జనించి= పుట్టి; హరునకున్= మహాశివునకు; ప్రాప్తించుటయున్= భార్యగా లభించటమూ; ఉత్తానపాదుని వృత్తాంతంబును= ఉత్తానపాదుని చరిత్ర; ధ్రువ+ఉపాఖ్యానంబును= ధ్రువుని కథ; ధ్రువుండు= ధ్రువుడు; తండ్రి చేతన్= తండ్రివలన; అవమానితుండు+ఐ= అవమానం పొందినవాడై; నారద+ఉపదేశంబునన్= నారదుని బోధవలన; మధువనంబునకున్= మధువనం అనే చోటికి; చని= వెళ్ళి; తపంబు= తపస్సు; చేయుటయున్= చేయటమూ; హరి= విష్ణువు; ప్రసన్నుండు+ఐ= అనుగ్రహం కలవాడై; అతని= ఆ ధ్రువునియొక్క; మనోరథంబులు= కోరికలు; ఇచ్చుటయున్= తీర్చటమూ; అతండు= ఆ ధ్రువుడు; మరలన్= పిమ్మట; పురంబునకున్= తన నగరానికి; వచ్చుటయున్= రావటమూ; కుబేర+అనుచరులు+ఐన= (ఉత్తరదిక్పాలుడైన) కుబేరుని సేవకులైన; యక్షులతోడి= యక్షులు అనే దేవజాతివారితో; యుద్ధంబును= పోరును; ధ్రువుండు= ధ్రువుడు; యజ్ఞంబులు= యాగాలు; చేయుచున్= చేస్తూ; రాజ్య భోగంబులన్= రాజసంబంధమైన సుఖానుభవాలతో; తనిసి= తృప్తిపడి; తనయున్= కొడుకైన; ఉల్కలునిన్= ఉల్కలుడు అనే వానిని; పట్టంబు+కట్టి= రాజ్యాధికారిగా చేసి; హరి

అనుగ్రహంబునన్= విష్ణువు దయతో; ధ్రువ క్షితిని= ధ్రువమైన స్థానమందు; నిలుచుటయున్= నెలకొనుటయు; ఉల్కలుండు= ఉల్కలుడు; వత్సరుండు; అను= అనే పేరుగల; తన సుతునిన్= తన కుమారుని; పట్టంబు+కట్టి= రాజుగా చేసి; హరిన్= విష్ణువును; చేరుటయున్= చేరుకోవటమూ; వత్సరుని వంశ పరంపరయున్= వత్సరుని కొడుకులు, మనుమలు మొదలైన తరువాతి వారి వరుసయు; అందున్= ఆ వరుసలో; అంగుని+సుతుండు= అంగుని కుమారుడు; అయిన; వేను కళేబరంబునన్= వేనుని దేహంనుండి; లక్ష్మీ నారాయణుల అంశంబునన్= లక్ష్మి, నారాయణుడు అనే వారి అంశతో; అర్చియున్= అర్చి అనే ఇంతియు; పృథుండును= పృథువనే కుమారుడును; జన్మించుటయున్= పుట్టటమూ; పృథుండు= పృథుచక్రవర్తి; భూమిన్= ధరణిని; కామధేనువురీతిన్= కామధేనువులాగా; అఖిల వస్తువులన్= అన్ని పదార్థాలను; పితుకన్= వెలుపలికి తేవటానికి (పిండటానికి); నియమించి= ఏర్పాటుచేసి; నిమ్నస్థలిన్+చేసి= ఎగుడుదిగుళ్ళులేని తావుగా చేసి; ఇంద్రుండు= దేవపతి; వశవర్తి+ఐ= తన వశంలో మెలగువాడై; ఉండన్= ఉండగా; బహుయజ్ఞంబులు= పెక్కుయాగాలు; చేసినన్= చేయగా; అతనికిన్= అతనికి; హరి= విష్ణువు; ప్రత్యక్షంబు+అగుటయున్= సాక్షాత్కరించటమూ; అధ్యాత్మ+ప్రబోధంబును= జ్ఞానవిద్యను ఉపదేశించటమూ; ఇంద్రుని వలనన్= ఇంద్రుని వలన; పాషండ సంభవంబును= పాషండుల పుట్టుకయు; ఇంద్రునిన్= ఇంద్రుణ్ణి; జయించిన= గెలిచిన; విజితాశ్వునిన్= విజితాశ్వుడు అనే వానిని; ఆతని తమ్ములను= అతని తమ్ముళ్ళను; పృథివీ పాలనంబునకున్= భూమిని ఏలటానికి; నిలిపి= ఏర్పాటుచేసి; పృథుండున్= పృథుచక్రవర్తియును; అర్చియున్= అర్చియు; పరమ పద ప్రాప్తులు= పరమమైన స్థానం పొందినవారు; అగుటయున్= కావటమూ; విజితాశ్వునకున్= విజితాశ్వునికి; వసిష్ఠ శాపంబునన్= వసిష్ఠమహర్షి శాపంచేత; త్రేతాగ్నులు= మూడు విధములైన అగ్నులు; తనయులు+ఐ= కుమారులై; జనియించుటయున్= పుట్టటమూ; పృథుని పౌత్రుండు= పృథుచక్రవర్తి కొడుకు కొడుకు; ఐన ప్రాచీనబర్హి= ప్రాచీనబర్హి అనే వాని; రాజ్యంబును= రాజ్యమూ; అతని యజ్ఞంబులు= అతని యాగాలు; అసంఖ్యాతంబులు= లెక్కపెట్టజాలనివి; ఐనన్= కాగా; నారదుండు= నారదమహర్షి; మాన్పన్+తలంచి= మానిపించటం సంభావించి; పురంజను కథన్= పురంజనుని కథను; అధ్యాత్మ ప్రపంచంబుగాన్= ఆత్మతత్త్వాన్ని వివరించి చెప్పేదిగా; తెలుపుటయున్= చెప్పటమూ; ప్రాచీనబర్హిసుతులు= ప్రాచీనబర్హి కొడుకులు; అయిన; ప్రచేతసులు= ప్రచేతసులు అనువారు; పదువురకున్= పదిమందికి; శ్రీమహాదేవుండు= జ్ఞానలక్ష్మీ సహితుడైన పరమశివుడు; ప్రత్యక్షంబు+ఐ= కానవచ్చి; హరిస్తవంబు= విష్ణుస్తోత్రాన్ని; ఉపదేశించుటయున్= బోధించటమూ; ప్రచేతసుల; తపంబునకున్= వారి తపస్సునకు; మెచ్చి= మిక్కిలి సంతోషించి; హరి= విష్ణువు; ప్రత్యక్షంబు+అగుటయున్= సాక్షాత్కరించటమూ; వారికిన్= ఆ ప్రచేతసులకు; మారిషవలనన్= మారిష అనే ఇంతి వలన; దక్షుండు= దక్షప్రజాపతి; పూర్వకాలంబునన్= వెనుకటి కాలంలో; శివవిద్వేషప్రయుక్తశాపంబునన్= శివుని మీది పెద్ద పగవలన కలిగిన శాపంతో; పుత్త్రుండు+ఐ= కుమారుడై; జనియించుటయున్= పుట్టటమూ; ప్రచేతసులు; ముక్తికిన్= మోక్షానికి; చనుటయున్= పోవటమూ; విదురుండు= విదురుడు; మైత్రేయునిన్= మైత్రేయుని; వీడ్కొని= సెలవు తీసుకొని; హస్తిపురంబునకున్= హస్తిపురానికి; అరుగుటయున్= వెళ్ళటమూ; అను కథలు= అనే వృత్తాంతాలు; గల, చతుర్థస్కంధము= నాలుగవ స్కంధం.

**తా :** (ప్రతి స్కంధం పూర్తి అయిన తరువాత అందులోని కథలనూ, ప్రత్యేకించి చెప్పుకోదగిన అంశాలనూ పట్టికలాగా చెప్పటం ఒక సంప్రదాయం. ఆ విధంగా ఆ అంశాలతో ఈ సుదీర్ఘ వచనం ఏర్పడినది. ఇందులోని కథలూ, కథాంశాలూ ఇలా ఉన్నాయి. దీనిని తెలుగులో రచించిన పోతనామాత్యుడు భాగవతరచనకు తనకు గల యోగ్యతను గురించి ఇలా తెలియజేస్తున్నాడు.)

తనకు పరమేశ్వరుని దయవలన మేలైన కవితాశక్తి అలవడినది. తన తండ్రి కేసనమంత్రి. తనది సహజంగా ఏర్పడిన పాండిత్యం. ఆ శక్తితో తాను రచిస్తున్న శ్రీభాగవత మహాపురాణంలో ఇది నాలుగవ భాగం. భాగవతం కల్పవృక్షం కనుక అందులోని భాగాలకు కొమ్మలు అనే అర్థంగల స్కంధ శబ్దాన్ని ఉపయోగించారు. కథాంశాలు.

1. స్వాయంభువమనువు వంశక్రమం. ఆ మనువునకు ఆకూతి, దేవహూతి, ప్రసూతి అనే కూతుండ్రు, ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే కొడుకులు పుట్టారు.

2. ఆకూతిని రుచి అనే ప్రజాపతికి మనువు భార్యగా ఇచ్చాడు. వారికి విష్ణుకళతో యజ్ఞుడు, లక్ష్మీకళతో దక్షిణ పుట్టారు.

3. దేవహూతిని కర్దమప్రజాపతికి భార్యగా మనువు ఇచ్చాడు.

4. ప్రసూతిని దక్షప్రజాపతికి పత్నిగా ఇచ్చాడు. ప్రసూతి దక్షులకు పెద్దసంఖ్యలో ప్రజలు కలిగారు.

5. దేవహూతి కర్దములకు చాలామంది కూతుళ్ళు కలిగారు. వారందరినీ రాజర్షులకు, బ్రహ్మర్షులకు ఇచ్చి పెండ్లిండ్లు చేశారు. కర్దముని ఒక కొమరిత కళ. ఆమెకు, మరీచికి కశ్యపుడు ఉదయించాడు. అలాగే, పూర్ణిమ అనే పుత్రిక కూడా పుట్టింది. పూర్ణిమకు గంగ, విరజుడు అనేవారు సంతానం. ఈ విధంగా కశ్యపప్రజాపతివలన ప్రజల సముదాయాలు మూడులోకాలనూ నింపివేశాయి.

6. అత్రిమహాముని గొప్ప తపస్సు చేశాడు. అతనికి బ్రహ్మవిష్ణుమహేశ్వరులు సాక్షాత్కరించారు. అతని సతి అనసూయ. ఆమె గొప్ప పతివ్రత. ఆ దంపతులకు ఆమె పాతివ్రత్య మహిమచేత త్రిమూర్తుల అంశాలతో చంద్రుడు, దత్తాత్రేయుడు, దుర్వాసుడు అనే మహాత్ములు జనించారు.

7. దక్షులకు కూతుళ్ళు కలిగిన వృత్తాంతం ఈ స్కంధంలో ఉన్నది. అందులో భృగువు భార్య అయిన ఖ్యాతికి శ్రీమహాలక్ష్మి పుట్టినది. (అందువలననే ఆమెను భార్గవి అంటారు). భృగుని మనుమడు మార్కండేయుడు.

8. ధర్ముడనే ప్రజాపతికి మూర్తి అనే ఇంతివలన నరనారాయణులు పుట్టారు.

9. సత్రయాగం చేసి దక్షుడు శివుని దూషించాడు. దాని ఫలితంగా యాగం నాశనమై పోయింది. బ్రహ్మ ప్రార్థించగా శివుడు దక్షాదులను అనుగ్రహించాడు. దక్షాదులు శ్రీహరిని స్తుతించారు. శ్రీహరి అనుగ్రహం చూపి దక్షుని యజ్ఞం సఫలమయ్యే విధంగా అనుగ్రహించాడు.

   సతీదేవి హిమవంతుని పుత్రికగా పుట్టి శ్రీమహాదేవుని మరల చేరుకొన్నది.

10. ఉత్తానపాదుని కథ, ధ్రువోపాఖ్యానాలు ఈ స్కంధంలో తరువాత వచ్చిన కథలు. ధ్రువుణ్ణి తండ్రి అవమానించాడు. ఇల్లు వదలి వెళ్ళిపోతున్న ధ్రువునకు దారిలో నారదుడు కనపడి శ్రీమన్నారాయణమంత్రోపదేశం చేశాడు. ధ్రువుడు మధువనంలో గొప్ప తపస్సు చేశాడు. శ్రీహరి అనుగ్రహం కలిగింది. ఆ దేవుడు అతని కోరికలను తీర్చాడు. అతడు తిరిగి తన పట్టణానికి వచ్చాడు. కుబేరుని సేవకులైన యక్షులతో అతనికి యుద్ధం జరిగింది. ధ్రువుడు అనేక యజ్ఞాలు చేశాడు. రాజ్య భోగాలు తృప్తితీరా అనుభవించాడు. కుమారుడు ఉల్కలునికి పట్టాభిషేకం చేసి శ్రీమన్నారాయణుని అనుగ్రహం వలన "ధ్రువక్షితి" యందు శాశ్వతంగా నిలిచి ఉన్నాడు.

ధ్రువుని కుమారుడు ఉల్కలుడు. అతని కొడుకు వత్సరుడు. వత్సరునికి రాజ్యం ఇచ్చి ఉల్కలుడు దివ్యధామం చేరుకున్నాడు. వత్సరుని వంశం శాఖోపశాఖలుగా విస్తరిల్లినది.

11. ఆ వంశంలోని వాడే అంగుడు. అతని కొడుకు వేనుడు. అతని దేహం నుండి లక్ష్మి అంశంతో అర్చి, నారాయణుని అంశంతో పృథువూ పుట్టారు.

పృథుచక్రవర్తి భూమాతను కామధేనువుగా చేసి ప్రజలకు కావలసిన అన్ని వస్తువులను వెలుపలికి తీయించినాడు. భూమిని ఎగుడు దిగుళ్ళులేని దానినిగా చేశాడు. ఇంద్రుని కూడా తన వశంలో ప్రవర్తిల్లునట్లు చేసికొన్న మహానుభావుడు పృథువు. చాలా యజ్ఞాలు చేశాడు. అతనికి శ్రీహరి ప్రత్యక్షమై వేదాంతతత్త్వాన్ని ఉపదేశించాడు.

అతని యజ్ఞాలకు విఘ్నం చేయగోరి ఇంద్రుడు పాషండులను సృష్టించాడు. పృథువు కొడుకు విజితాశ్వుడు. అతడు ఇంద్రుణ్ణి గెలిచాడు. అతనినీ, అతని తమ్ములనూ రాజులనుగా చేసి పృథువు, అర్చి పరమపదానికి చేరుకున్నారు.

విజితాశ్వునకు, వసిష్ఠుని శాపంవలన మూడు అగ్నులు పుత్రులుగా పుట్టారు.

12. పృథుని మనుమడు (కొడుకు కొడుకు) ప్రాచీనబర్హి. అతడు లెక్కలేనన్ని యజ్ఞాలు చేశాడు. నారదమహర్షి అతని యజ్ఞాలను మాన్పించటంకోసం జ్ఞాన విద్యను వివరించి చెప్పే పురంజనుని కథను బోధించాడు.

13. ప్రాచీనబర్హి కొడుకులు ప్రచేతసులు. వారికి పరమశివుడు ప్రత్యక్షమై శ్రీహరిస్తోత్రాన్ని ఉపదేశించాడు. వారి తపస్సునకు సంతోషించి శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు.

14. ప్రచేతసులు మొత్తం పది సంఖ్యలో ఉన్నవారు. పూర్వం శివుణ్ణి ద్వేషించిన దక్షుడు శాపవశం వలన ఆ పదిమందికి మారిష అనే కాంతవలన కుమారుడై పుట్టాడు. ప్రచేతసులు ముక్తులయ్యారు.

ఈ విధమైన కథా విశేషాలను విదురునకు మైత్రేయుడు వివరించాడు. విదురుడు అతనిదగ్గర సెలవు తీసుకొని హస్తిపురానికి చేరుకున్నాడు.

*:: శ్రీ కృష్ణార్పణమస్తు ::*



# పంచమస్కంధము

శ్రీరస్తు

# శ్రీమహాభాగవతము

## పంచమస్కంధము - ప్రథమాశ్వాసము

**క. శ్రీకర! కరుణాసాగర!, ప్రాకటలక్ష్మీకళత్ర! భవ్యచరిత్రా!**
**లోకాతీతగుణాశ్రయ!, గోకులవిస్తార! నందగోపకుమారా! 1**

**ప్రతిపదార్థం :** శ్రీకర= సంపదలను కలిగించేవాడా!; కరుణాసాగర= దయకు సముద్రమా!; ప్రాకట= ప్రసిద్ధమయిన; లక్ష్మీకళత్ర= లక్ష్మీదేవి భార్యగా కలవాడా!; భవ్య= మంగళకరమయిన; చరిత్రా!= నడవడిక కలవాడా!; లోక+అతీత= లోకంలో దుర్లభమయిన; గుణ+ఆశ్రయ= గుణాలకు నివాసమయినవాడా!; గోకుల= గోవుల మందలను; విస్తార= విస్తరింపజేసినవాడా!; నందగోప= నంద నామకుడయిన గోపాలకుని; కుమారా= కుమారుడవయిన కృష్ణా!

**తాత్పర్యం :** సంపదలను ప్రసాదించేవాడవూ, దయాసముద్రుడవూ, లక్ష్మీదేవిని గృహలక్ష్మిగా కలవాడవూ; భక్తులకు శుభ పరంపరలను ప్రసాదించు సుసంపన్నమయిన ప్రవర్తనలు కలిగినవాడవూ; ఆలమందలను పెంచినవాడవూ, నందగోపుని కుమారుడవూ అయిన కృష్ణా! అవధరించు.

**విశేషం :** ఈ స్కంధాన్ని బొప్పరాజు గంగనార్యుడు రచించాడు. పోతనలాగే గంగనార్యుడు ఆశ్వాసాదిలో శ్రీకృష్ణుని నుతించాడు. అవతారాలలో శ్రీకృష్ణుడు పూర్ణావతారుడు. అతడే భాగవత నాయకుడు. అతడే జగద్గురువు. **'కృష్ణం వందే జగద్గురుమ్'** అనడం పరిపాటి. కనుకనే 'కృష్ణస్తుతి'.

**వ. సకలపురాణార్థజ్ఞానవిఖ్యాతుండగు సూతుండు శౌనకాదిమహామునుల కిట్లనియె. 2**

**ప్రతి :** సకలపురాణ= అన్ని పురాణాలలోని; అర్థజ్ఞాన విఖ్యాతుండు+అగు= పరమార్థ జ్ఞానంచేత ప్రఖ్యాతుడైన; సూతుండు= సూతమహర్షి; శౌనక+ఆదిమహామునులకున్= శౌనకుడు మొదలుగా గల్గిన గొప్ప మునులకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** అన్ని పురాణాల్లోని పరమార్థ జ్ఞానాన్ని గ్రహించి విఖ్యాతుడయిన సూతుడు శౌనకాది మహామునులతో ఈ విధంగా చెప్పాడు.

### a =ప్రియవ్రతుని చరిత్రము=a

**క. భూనాథుఁడుత్తరాత్మజుఁ, డైన పరీక్షిన్నరేంద్రుఁడభిమన్యు సుతుం**
**డానందమంది ఘన సు, జ్ఞానుండగు శుకునిఁగాంచి సరసతఁబలికెన్. 3**

**ప్రతి :** భూనాథుఁడు= భూమికి అధిపతి అయినవాడు; అభిమన్యుసుతుండు= అభిమన్యుని పుత్రుడు; ఉత్తరా+ ఆత్మజుఁడు+ఐన= ఉత్తరయొక్క కుమారుడు అయిన; పరీక్షిత్+నర+ఇంద్రుఁడు= పరీక్షిత్తు అనే పేరుగల మనుజేశ్వరుడు; ఆనందము+అంది= సంతోషం చెంది; ఘనసుజ్ఞానుండు+అగు= మహాజ్ఞాని అయిన; శుకునిన్+కాంచి= శుకమహర్షిని చూచి; సరసతన్= సరసభావంతో; పలికెన్= అన్నాడు.

**తా :** పరీక్షిత్తు హస్తినకు అధీశుడు. ఉత్తరాభిమన్యుల కుమారుడు. విష్ణుకథాశ్రవణానందానుభూతి కలవాడు. అట్టి పరీక్షిత్తు మహాజ్ఞాని అయిన శుకమహర్షిని చూచి సరసంగా ప్రశ్నించాడు.

**వ. మునీంద్రా! పరమభాగవతుండు నాత్మారాముండునైన ప్రియవ్రతుండు గృహంబున నుండి యెట్లు రమించెఁ? గర్మ బంధంబు లయిన పరాభవంబులు గల గృహంబులయందు ముక్త సంబంధులైన పురుషులకు సంతోషంబు గా నేర; దుత్తమ శ్లోకుండైన పుండరీకాక్షుని పాదచ్ఛాయం జేసి నిర్వృత చిత్తులైన మహాత్ములు కుటుంబంబునందు నిస్పృహత సేయుదురు; గాన ప్రియవ్రతునికి సంసారంబునందుఁ దగులంబు గలుగు టెట్లు? దారాగారసుతాదులందుఁ దగులంబు గలవానికి నెట్లు సిద్ధి గలుగు? శ్రీహరియం దస్ఖలితమతి యెట్లు గలుగు? నీ సంశయంబుఁ దేట పఱుపు మని పరీక్షిన్నరేంద్రుఁ డడిగిన శుక యోగీంద్రుం డిట్లనియె. 4**

**ప్రతి :** ముని+ఇంద్రా= మునులలో శ్రేష్ఠుడా!; పరమభాగవతుండును= ఉత్తముడైన భగవద్భక్తుడును; ఆత్మారాముండును+ఐన= ఆత్మనిష్ఠుడునైన; ప్రియవ్రతుండు= ప్రియవ్రతుడనే పేరుగల రాజు; గృహంబునన్+ఉండి= ఇంటిలోనే ఉండి; ఎట్లు= ఏ విధంగా; రమించెన్= ఆనందించాడు?; కర్మబంధంబులు+అయిన= కర్మరూపంలో కలిగే బంధనాలైన; పరాభవంబులు+కల= అవమానాదులు గల; గృహంబులయందున్= గృహములందు; ముక్తసంబంధులు+అయిన= సంబంధులను విడిచిపెట్టిన; పురుషులకున్= పురుషులకు; సంతోషంబు+కానేరదు= సంతోషం కలుగదు; ఉత్తమ శ్లోకుండు+అయిన= పెద్దలచే కీర్తింపబడినవాడయిన; పుండరీకాక్షుని= తెల్లదామరలవంటి కన్నులు గల ఆ విష్ణువుయొక్క; పాద+ఛాయన్+చేసి= అడుగునీడలనాశ్రయించడంవల్ల; నిర్వృతచిత్తులు+ఐన= ఆనందచిత్తులైన; మహాత్ములు= గొప్పవారు; కుటుంబంబునందున్= గృహస్థ జీవితంపట్ల; నిస్పృహత= కోరిక లేకుండేరీతిని; చేయుదురు= పాటిస్తారు; కానన్= కాబట్టి; ప్రియవ్రతునికిన్= ప్రియవ్రతునకు; సంసారంబునందున్= గృహస్థ జీవితంలో; తగులంబు= ఆసక్తి; కలుగుట+ఎట్లు?= ఎలా కలుగుతుంది?; దార+అగారసుత+ఆదులందున్= భార్య, ఇల్లు, బిడ్డలు మున్నగువాటియందు; తగులంబు= బంధము; కలవానికిన్= కలిగిన గృహస్థునకు; ఎట్లు= ఏ విధంగా; సిద్ధి= మోక్షప్రాప్తి; కలుగున్= సిద్ధించును?; శ్రీహరి+అందున్= లక్ష్మీయుక్తుడయిన విష్ణువుపట్ల; అస్ఖలితమతి= చెదరని మనస్సు; ఎట్లు+కలుగున్?= ఎలా సిద్ధిస్తుంది?; ఈ సంశయంబున్= నాకు కలిగిన ఈ సందేహాన్ని; తేటపఱుపుము= (తీరేవిధంగా) స్పష్టం చేయండి; అని= అంటూ; పరీక్షిత్+నరేంద్రుఁడు+అడిగినన్= పరీక్షిన్మహారాజు ప్రశ్నించగా; శుకయోగి+ఇంద్రుండు= యోగులలో శ్రేష్ఠుడయిన శుకమహర్షి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా జవాబు చెప్పాడు.

**తా :** మునీంద్రా! ప్రియవ్రతుడు పరమ భాగవతుడు, పైగా, ఆత్మారాముడు. అటువంటివాడు ఇంట్లో ఉంటూ సుఖభోగాదుల్ని ఎలా అనుభవించాడు? గృహస్థధర్మం పాటించేవారికి కర్మబంధాలూ, వాటివల్ల కలిగే అవమానాదులు తప్పవుకదా. బంధాలను తెంచుకొనేవారు గృహాలలో సంతోషంగా ఎలా ఉంటారు? విష్ణు భగవానుని నిరంతరం కీర్తిస్తూ ఆ స్వామి అడుగుజాడల్లో పయనిస్తూ చిత్తశాంతిని పొందినవారు కుటుంబజీవితం పట్ల అనాసక్తులుగా ఉంటారు. అందుచేత ప్రియవ్రతునికి సంసారంపైన ఆసక్తి ఎలా కలిగింది. ఇల్లు, ఇల్లాలు, పిల్లలంటే మమకారం పెంచుకొన్నవాడికి మోక్షసిద్ధి ఎలా కలుగుతుంది? శ్రీహరిమీద నిశ్చయబుద్ధి ఎలా నిలుస్తుంది? నా యీ సందేహాలన్నిటిని తీర్చు స్వామీ! అని పరీక్షిత్తు అడుగగా శుకయోగి ఈ విధంగా వివరించాడు.

**క. హరిచరణాంబుజమకరం, ద రసావేశితమనఃప్రధానుండగు స**
**త్పురుషుఁ డొకవేళ విఘ్నముఁ, బొరసినఁ దన పూర్వమార్గమును విడువఁడిలన్. 5**

**ప్రతి :** హరి= పాపాలను హరింపజేసే విష్ణువుయొక్క; చరణ+అంబుజ= పాదపద్మాలందలి; మకరందరస+ఆవేశిత= తేనె రుచియందే నెలకొన్న; మనఃప్రధానుండు= మనస్సే ముఖ్యంగా కలవాడయిన; సత్పురుషుఁడు= సజ్జనుడు; ఒకవేళన్= ఏదయినా ఒక సందర్భంలో; విఘ్నమున్+పొరసినన్= ఆటంకం కలిగినా; తన= తనయొక్క; పూర్వమార్గమును= తొలినాటి జీవనసరళిని; ఇలన్= లోకవ్యవహారంలో; విడువఁడు= వదలిపెట్టడు.

**తా :** రాజా! విను. శ్రీహరి పాదపద్మాలలోని మకరంద రసపానంలో లీనమై పరవశించిన మనసుగల మంచి మానవుడు, ఒకవేళ ఆటంకాలు కలిగినా తన పూర్వమార్గాన్ని వదలిపెట్టడు.

**క. ధరణీవల్లభ! విను మా, నరవరుఁడు ప్రియవ్రతుండు నారదముని స**
**చ్చరణోపసేవఁజెందుచు, నరుదుగ నధ్యాత్మసత్త్రయాగంబందున్. 6**

**ప్రతి :** ధరణీవల్లభ!= పరీక్షిన్మహారాజా!; వినుము= వినవయ్యా!; ప్రియవ్రతుండు= ప్రియవ్రతుఁడనే పేరుగల; ఆ నరవరుఁడు= ఆ రాజు; నారదముని= భక్తులకు జ్ఞానాన్ని ప్రసాదిస్తూ తాను మననంచేత గొప్పవాడైన నారదునియొక్క; సత్+చరణ+ఉపసేవన్= పవిత్రమయిన పాదసేవను; చెందుచున్= చేయుచూ; అరుదుగన్= అపూర్వంగా జరిగే; అధ్యాత్మ= ఆత్మకు సంబంధించిన విద్యాబోధనగల; సత్త్రయాగంబందున్= సత్త్రయాగంలో...

**తా :** ఓ రాజా! విను. ప్రియవ్రతుడు నరవరుడు. అతడు నారద మహర్షియొక్క పాదసేవ చేసుకుంటున్నవాడు. అతడొకసారి అధ్యాత్మసత్త్రయాగం చేపట్టాడు.

**సీ. దీక్షితుండై ధరిత్రీపాలనముఁదండ్రి పనిచిన సుజ్ఞానభంగ మనుచు**
**నంగీకరింపమి నంతయుఁ దెలిసి పద్మాసనుఁడతనికి నతుల రాజ్య**
**మందుల మిక్కిలి యాసక్తిఁబుట్టింతు ననుచును దన చిత్తమందుఁ దలఁచి**
**తారకాద్యనుసృతతారాధిపుని మాడ్కి శ్రుతులతోఁగూడి యచ్యుతవిభూతి**

**తే. హంసవాహనుఁడగుచు నింద్రాదు లెల్లఁ, గదిసి సేవింప బ్రహ్మలోకమున నుండి**
**సన్మునీంద్రులు దన్నుఁబ్రశంససేయ, నల్ల నల్లన యుడువీథి నరుగు దెంచె. 7**

**ప్రతి :** దీక్షితుండు+ఐ= దీక్ష చేపట్టినవాడై; తండ్రి= తండ్రియైన మనువు; ధరిత్రీపాలనమున్= భూమిని పాలించడానికి; పనిచినన్= ఆజ్ఞాపించగా; సుజ్ఞానభంగము+అనుచున్= ఆత్మ జ్ఞాన సంపాదనకు ఆటంకమని; అంగీకరింపమిన్= ఒప్పుకోకపోవడాన్ని; అంతయున్+తెలిసి= తండ్రి మాటపట్ల కుమారుని అనంగీకారం మొదలైన వార్తావిశేషాలను తెలిసికొని; పద్మాసనుఁడు= పద్మముపై ఆసీనుడైన బ్రహ్మ; అతనికిన్= ఆ ప్రియవ్రతునకు; అతుల= సాటిలేని; రాజ్యము+అందులన్= రాచరిక సంబంధ సుఖోపభోగాదులందు; మిక్కిలి; ఆసక్తిన్+పుట్టింతున్= ఎక్కువ ఆసక్తిని కలిగింతును; అనుచును= అంటూ; తన చిత్తమందున్= తన మనస్సునందు; తలఁచి= భావించి; తారకా+ఆది+అనుసృత= చుక్కలు మొదలైనవానిచే చుట్టబడిన; తారా+అధిపునిమాడ్కిన్= నక్షత్రాలకు అధిపతి అయిన చంద్రునివలె; శ్రుతులతోన్+కూడి= వేదాలతోకూడి; అచ్యుతవిభూతిన్= చ్యుతిలేని వైభవంతో; హంసవాహనుఁడు+అగుచున్= హంసవాహనం ఎక్కినవాడై; ఇంద్రాదులు+ఎల్లన్+కదిసి= ఇంద్రాది దేవతలందరు చెంతజేరి; సేవింపన్= కొలువగా; బ్రహ్మలోకమునన్+ఉండి= సత్యలోకముననుండి;

సత్+మునీంద్రులున్= గొప్ప మునీంద్రులును; తన్నున్= ఆ సత్యలోక వాసుడయిన బ్రహ్మను; ప్రశంస+చేయన్= ప్రస్తుతించుచుండగా; అల్లన+అల్లన= మెల్లమెల్లగా; ఉడువీథిన్= నక్షత్రవీథిలో (తారాపథంలో); అరుగుదెంచెన్= వచ్చెను.

**తా :** దీక్షితుడై రాజ్యపాలన చేపట్టవలసిందిగా తండ్రి ఆజ్ఞాపించినా అటువంటి లౌకిక వ్యవహారాలు తన సుజ్ఞానానికి ఆటంకాలని ప్రియవ్రతుడు భావించుకొని రాజ్యపాలనకు అంగీకరించలేదు. ఇవన్నీ తెలుసుకొన్న బ్రహ్మదేవుడు ప్రియవ్రతునికి రాజ్యపాలనంపట్ల ఆసక్తి కలిగించడానికి సంకల్పించాడు. ఇంద్రాదులు తన్ను సేవిస్తుండగా చుక్కలతోకూడిన సుధాకరునిలాగా, వేదాలతోకూడి వెలిగిపోతూ బ్రహ్మదేవుడు హంసవాహన మెక్కినవాడై సత్యలోకం నుండి మెల్లమెల్లగా తారాపథంలో వచ్చాడు.

**వ. మఱియు నయ్యై మార్గంబులయందు సిద్ధ సాధ్య గంధర్వ చారణ గరుడ కింపురుషు లిరు దెసల స్తోత్రంబులు సేయుచుండ గంధమాదనద్రోణులం బ్రకాశంబు నొందించుచుఁ జనుదెంచిన పద్మాసనునకు నారదుండు స్వాయంభువ ప్రియవ్రతులతోఁ గూడి ముకుళిత కరకమలుండై యెదురు చనుదెంచి సంస్తుతి స్తబకంబులం బూజించిన; విరించి సంతసించి ప్రియవ్రతునింజూచి నవ్వుచు నిట్లనియె. 8**

**ప్రతి :** మఱియున్; అయ్యై మార్గంబుల+అందున్= ఆయా దారులలో; సిద్ధ సాధ్య గంధర్వచారణ గరుడ కింపురుషులు; ఇరుదెసలన్= రెండుప్రక్కల; స్తోత్రంబులు+చేయుచు+ఉండన్= స్తోత్రాలు పఠిస్తుండగా; గంధమాదనద్రోణులన్= గంధమాదన పర్వతంయొక్క పల్లపు ప్రదేశాలను; ప్రకాశంబున్+ఒందించుచు= ప్రకాశవంతం చేస్తూ; చనుదెంచినన్= దిగివచ్చిన; పద్మాసనునకున్= బ్రహ్మదేవునికి, నారదుండు; స్వాయంభువ ప్రియవ్రతులతోన్+కూడి= స్వాయంభువ మనువు ప్రియవ్రతులతోకూడి; ముకుళిత= మోడ్చిన; కరకమలుండు+ఐ= హస్తపద్మాలు కలవాడై; ఎదురు చనుదెంచి= ఎదురేగి; సంస్తుతిస్తబకమ్ములన్= స్తోత్రాలనే పూలగుత్తులతో; పూజించినన్= అర్చించగా; విరించి= బ్రహ్మదేవుడు; సంతసించి= సంతోషాన్ని పొంది; ప్రియవ్రతునిన్+చూచి= ప్రియవ్రతుని చూచి; నవ్వుచున్= నవ్వుతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

**తా :** చతుర్ముఖుడు మానవలోకంవైపు వస్తున్నప్పుడు ఆయా మార్గాలలో అటూ ఇటూ నిలుచుండిన సిద్ధులూ, సాధ్యులూ, గంధర్వులూ, చారణులూ, గరుడులూ, కింపురుషులూ స్తుతించడం మొదలుపెట్టారు. గంధమాదనపర్వతపు లోయలు కాంతు లీనేటట్లు చేస్తూ బ్రహ్మదేవుడు వస్తుండగా నారదుడు స్వాయంభువ ప్రియవ్రతులతోపాటు చేతులు జోడిస్తూ ఎదురేగాడు. వారు ముగ్గురూ స్తుతులు అనే పూలగుత్తులతో చతుర్ముఖుణ్ణి పూజించారు. బ్రహ్మ సంతోషించి ప్రియవ్రతుని వీక్షించి నవ్వుతూ ఇలా అన్నాడు.

**క. హరి నా ముఖమున నీకును, గర మెఱిఁగింపంగఁ బనిచెఁగావున నిదె సు**
**స్థిరమతి విను మంతయు శ్రీ, హరివాక్యముగా నెఱింగి యవనీనాథా! 9**

**ప్రతి :** అవనీనాథా= ఓ రాజా!; హరి= మహావిష్ణువు; నాముఖమునన్= నాద్వారా; నీకును= రాజ్యపాలనకు వైముఖ్యం ప్రదర్శించే నీకూ; కరము= మిక్కిలి; ఎఱిఁగింపంగన్+పనిచెన్= చెప్పవలసిందిగా ఆజ్ఞాపించాడు; కావునన్= కనుక; ఇదె= దీనిని; సుస్థిరమతిన్= నిశ్చలమయిన మనస్సుతో; శ్రీహరి వాక్యముగాన్= శ్రీహరి మాటగా; ఎఱింగి= తెలుసుకొని; అంతయున్= పూర్తిగా; వినుము= వినవయ్యా!

**తా :** ఓ రాజా! విష్ణుమూర్తి నీకు చెప్పుమన్న విషయాన్ని చెబుతున్నాను. అందుచేత, నా మాటలు శ్రీహరి పలుకులుగానే భావించి నిశ్చలమైన మనస్సుతో ఆలకించు.

**ఆ. కోరి వేడ్క నీవు నారదుండును నేను, నందఱమును నీశ్వరాజ్ఞఁబూని**
**యుడుగ కెపుడు సేయనున్న వారము గాన, నతని యాజ్ఞఁదప్ప నలవి గాదు. 10**

**ప్రతి :** కోరి= ఆకాక్షించి; వేడ్కన్= వేడుకతో; నీవు= ప్రియవ్రతుడవయిన నీవు; నారదుండును= నీకు ఆత్మతత్త్వోపదేశం చేసిన నారద మహర్షితోసహా; నేనును= హరి ఆజ్ఞావర్తినయిన నేనుకూడా; అందఱమును= సకల జీవకోటిలోనివారమంతా; ఈశ్వర+ఆజ్ఞన్= రక్షకుడయిన మహావిష్ణువుయొక్క ఆజ్ఞను; పూని= ప్రయత్నించి; ఉడుగక= మానక; ఎపుడు+ చేయనున్నవారము= ఎప్పుడూ చేయడానికి సిద్ధంగా ఉన్నాము; కానన్= కాబట్టి; అతని= ఆ విష్ణుని; ఆజ్ఞన్= ఆదేశాన్ని; తప్పన్= తప్పుటకు; అలవికాదు= సాధ్యం కాదు.

**తా :** నీవుగానీ, నారదుడుగానీ, నేను గానీ అందరం ఆ నారాయణుని ఆనతి మేరకు నడిచేవాళ్ళమే. అందువల్ల, ఆయన ఆదేశాన్ని కాదని స్వతంత్రంగా ప్రవర్తించడం మనకు సాధ్యం కాని పని.

**వ. మఱియు శ్రీహరి యాజ్ఞను జీవుండు తపోవిద్యలను యోగవీర్యజ్ఞానార్థ ధర్మంబులను దనచేత నొరులచేతం దప్పింప సమర్థుండు గాఁ; దుత్పత్తి స్థితి నాశంబులకు శోకమోహభయ సుఖదుఃఖంబులకు నీశ్వరాధీనుండె కాని జీవుండు స్వతంత్రుండు గాఁడు; శ్రీహరివాగ్రూపంబు లయిన శ్రుతులందు గుణత్రయంబను రజ్జువున బంధింపంబడిన యస్మదాదులము ముకుఁద్రాటిచేఁ బశువు మనుష్యులకు వశంబయిన చందంబున నీశ్వరాజ్ఞం బ్రవర్తించుచుందుము; నరుండు సుఖదుఃఖానుభవంబులకు నీశ్వరాధీనుండు; నేత్రంబులు గలవానిచేతఁ దివియంబడిన యంధుండునుం బోలె నీశ్వరుం డిచ్చిన సుఖదుః ఖంబు లనుభవించుచున్న వారము; స్వప్నంబునం గన్న పదార్థంబు మేల్కాంచి మిథ్యగాఁ దలంచిన చందంబున మోక్షార్థియైన సుజ్ఞానవంతుండు ప్రారబ్ధ సుఖ దుఃఖంబు లనుభవించుచు దేహాంతరారంభ కర్మంబులం బాయనొల్లఁడు; వనవాసి యైనను జితేంద్రియుండు గాకుండెనేనిఁ గామాదిసహితుం దగుటంజేసి సంసారబంధంబులు గలుగు; గృహస్థాశ్రమంబందును జితేంద్రియుండై యాత్మ జ్ఞానంబుగల పురుషునకు మోక్షంబు సిద్ధించు, శత్రువులఁ గెలువ నిచ్చయించిన పురుషుండు దుర్గం బాశ్రయించి శత్రువుల జయించిన మాడ్కిని మోక్షార్థియగు నీవును గృహాశ్రయుండ వగుచు శ్రీ నారాయణ చరణారవిందంబు లను దుర్గం బాశ్రయించి యరిషడ్వర్గంబు జయించి ముక్తసంగుండవై యీశ్వర కల్పితంబులగు భోగంబుల ననుభవించి ముక్తిం జెందు మనినఁ బ్రియవ్రతుండు త్రిభువనగురుం డయిన చతురాననునివాక్యంబు లవనతమస్తకుండై బహుమానపూర్వకంబుగ నంగీకరించె నంత. 11**

**ప్రతి :** మఱియున్; శ్రీహరి+ఆజ్ఞను= శ్రీహరి ఆదేశాన్ని; జీవుండు= జీవుడు; తపోవిద్యలను= తపస్సుచేత, విద్యచేత; యోగ= యోగంచేత; వీర్య= సామర్థ్యంచేత; జ్ఞాన= జ్ఞానంచేత; అర్థధర్మంబులను= సంపదచేత, ధర్మంచేత; తనచేతన్= తనచేతను; ఒరులచేతన్= ఇతరుల చేతను; తప్పింపన్= తప్పించుటకు; సమర్థుండు+కాఁడు= సామర్థ్యము కలిగినవాడు

కాదు; ఉత్పత్తి= పుట్టుట; స్థితి= జీవించుట; నాశంబులకున్= వినాశనములకు; శోక= శోకం; మోహ= మోహం; భయ= భయం; సుఖ= సుఖం; దుఃఖంబులకున్= దుఃఖాలకు; ఈశ్వర+అధీనుండె= ఈశ్వరునికి వశుడే; కాని; జీవుండు= జీవుడు; స్వతంత్రుండు+కాఁడు= తన ఆనలో తాను నడిచేవాడు కాదు; శ్రీహరి= శ్రీహరియొక్క; వాగ్రూపంబులు+అయిన= మాటల రూపాలయిన; శ్రుతులందున్= వేదాలలో; గుణత్రయంబు+అను= మూడు గుణాలను; రజ్జువునన్= త్రాటిచేత; బంధింపన్+పడిన= కట్టబడిన; అస్మద్+ఆదులము= మనమందరం; ముకుఁ+త్రాటిచేన్= ముక్కునుండి దూర్చి కట్టిన త్రాటిచేత; పశువు= జంతువు; మనుష్యులకున్; వశంబు+అయిన= వశమయిన; చందంబునన్= విధంగా; ఈశ్వర+ఆజ్ఞన్= ఈశ్వరుని ఆజ్ఞమేరకు; ప్రవర్తించుచుందుము= లోబడి మెలగుతుంటాం; నరుండు= మానవుడు; సుఖదుఃఖ+ అనుభవంబులకున్= సుఖంగాని, దుఃఖంగాని అనుభవించే విషయంలో; ఈశ్వర+అధీనుండు= ఈశ్వరునికే వశమైనవాడు; నేత్రంబులు గలవానిచేతన్= కన్నులుండే వానిచేత; తివియన్+పడిన= లాగబడిన; అంధుండునున్+పోలెన్= గ్రుడ్డివానిలాగా; ఈశ్వరుండు+ఇచ్చిన= భగవంతుడు ప్రసాదించిన, సుఖదుఃఖంబులు= సౌఖ్యం, క్లేశం; అనుభవించుచున్నారము= అనుభవిస్తున్నాము; స్వప్నంబునన్+కన్న= కలలో దర్శించిన; పదార్థంబు= వస్తువు; మేల్కాంచి= మేలుకొని; మిథ్య+కాన్= అబద్ధంగా; తలంచిన చందంబునన్= భావించిన విధంగా; మోక్ష+అర్థి+అయిన= మోక్షం కోరినవాడైన; సుజ్ఞానవంతుండు= మంచి జ్ఞానం కలవాడు; ప్రారబ్ధ సుఖదుఃఖంబులు+అనుభవించుచున్= అనుభవంలోకి రావడం మొదలుపెట్టిన సుఖదుఃఖాలు పొందుతూ; దేహ+అంతర+ఆరంభ+కర్మంబులన్= మరియొక దేహానికి ఆరంభక కర్మలచేత; పాయన్+ఒల్లఁడు= వదలిపెట్టడానికి ఇష్టపడడు; వనవాసి+ఐనను= అడవిలో నివసించేవాడైనా; జిత+ఇంద్రియుండు+కాక+ఉండెన్+ఏని= ఇంద్రియాలను జయించినవాడు కాకుంటే; కామ+ఆదిసహితుండు+అగుటన్+చేసి= కామక్రోధ లోభమోహ మదమాత్సర్యాలతో కూడినవాడు కావడంవల్ల; సంసారబంధంబులు+కలుగున్= సంసార రూపమైన బంధనాలు సిద్ధిస్తాయి; గృహస్థ+ఆశ్రమంబు+అందును= సాంసారిక జీవిత మనుభవించే గృహస్థుని ఆశ్రమంలోగూడ; జిత+ఇంద్రియుండు+ఐ= ఇంద్రియ వాంఛలను జయించినవాడై; ఆత్మజ్ఞానంబు+కల= తనను తాను తెలుసుకొనే జ్ఞానంగల; పురుషునకున్= జీవికి; మోక్షంబు= ముక్తి; సిద్ధించున్= కలుగుతుంది; శత్రువులన్= విరోధులను; గెలువన్= గెలువడానికి; ఇచ్ఛయించిన= కోరిన; పురుషుండు= జీవి; దుర్గంబు+ఆశ్రయించి= కోటనే ఆశ్రయించుకొని; శత్రువులన్= విరోధులను; జయించిన= గెలిచిన; మాడ్కిని= విధంగా; మోక్ష+అర్థి+అగు= మోక్షాన్ని కోరిన; నీవును= నీవున్నూ; గృహ+ఆశ్రయుండవు+అగుచున్= గృహస్థాశ్రమాన్ని ఆశ్రయించుకొన్నవాడవవుతూ; శ్రీ= ఐశ్వర్యవంతమైన; నారాయణ= హరియొక్క; చరణ+అరవిందంబులు+అను= పద్మాలవంటి పాదా లనే; దుర్గంబు+ఆశ్రయించి= కోటను ఆశ్రయించి; అరిషడ్వర్గంబు= కామక్రోధాది విరోధివర్గాన్ని; జయించి= గెలుపొంది; ముక్తసంగుండవు+ఐ= సంసారబంధాల నుండి విడివడినవాడవై; ఈశ్వర కల్పితంబులు+అగు= భగవంతుడు జీవికోసం ఏర్పరచినటువంటి; భోగంబులన్= భోగాదులను, అనుభవించి; ముక్తిన్+చెందుము= మోక్షాన్ని పొందవయ్యా!; అనినన్= అని ఉపదేశం చేయగా; ప్రియవ్రతుండు= రాజ్యపాలనకు విముఖుడయిన మనుపుత్రుడు; త్రిభువనగురుండు+అయిన= ముల్లోకాలకు గురువయిన; చతురాననుు= నాల్గు మొగాలుగల బ్రహ్మదేవునియొక్క; వాక్యంబులు= ఉపదేశవాక్యాలను; అవనత= వంచిన; మస్తకుండు+ఐ= శిరస్సు గలవాడై; బహుమానపూర్వకంబుగన్= గౌరవపూర్వకంబుగా; అంగీకరించెన్= అంగీకరించాడు; అంతన్= ఆ తరువాత...

**తా :** శ్రీహరి ఆజ్ఞానుసారం జీవుడు తపస్సు చేయడం, విద్యలు నేర్చుకోవడం, యోగాన్ని అభ్యసించడం, శౌర్యాన్ని ప్రదర్శించడం, జ్ఞానాన్ని ఆర్జించడం, ఆర్థిక వసతులను సమకూర్చుకోవడం, ధర్మం పాటించడం వంటి కర్మలు చేస్తాడు.

అలాంటప్పుడు వీటినుండి ఎవడయినా తప్పుకోవడంగానీ మరొకరిని తప్పించడం గానీ శక్యం కాని పని. పుట్టడానికిగానీ, జీవించడానికి గానీ, చావడానికి గానీ, శోకానికి గానీ, మోహానికి గానీ, భయానికి గానీ, సుఖానికి గానీ, దుఃఖానికి గానీ, జీవుడు ఈశ్వరునికి వశుడు. స్వతంత్రుడు కాడు.

శ్రీహరి వాక్కులే వేదాలు. మనమందరం సత్త్వరజ స్తమోగుణాలనే ముప్పేటల తాటితో కట్టబడినవాళ్ళం. ముకుతాడు వేసిన పశువులు యజమాని చెప్పుచేతల్లో ఎలా ఉంటాయో, అలాగే మన మందరమూ ఈశ్వరాజ్ఞకు లోబడి ఉంటాము. ఈశ్వరవశుడై మనిషి సుఖదుఃఖాల ననుభవిస్తాడు. కళ్ళున్నవాడు గుడ్డివాణ్ణి ఎలా నడిపిస్తాడో, అలాగే ఈశ్వరుడు మనల్ని నడిపిస్తాడు. ఆయనకు లోబడి, ఆయన ప్రసాదించిన సుఖదుఃఖాలను అనుభవిస్తున్నాము. కలలో చూచిన పదార్థాలను నిద్ర మేల్కొన్న తర్వాత అంతా అబద్ధమని అనుకున్నట్టు, ముక్తికోసం ప్రయత్నించే జ్ఞాని తాను సుఖదుఃఖాలను అనుభవిస్తూ మరొక దేహమును (జన్మను) కలిగించు కర్మలు చేయకుండుటకు ఇష్టపడడు. ఇక రాబోయే కర్మఫలాలకు దూరంగా ఉంటాడు. అడవికి పోయినా ఇంద్రియ వ్యాపారాలను జయించలేక కామాదులకు లోనయిన వాడికి సంసారబంధాలే మిగులుతాయి. గృహస్థాశ్రమంలో ఉన్నా ఇంద్రియాలను జయించి ఆత్మజ్ఞానం కలిగిన పురుషునికి మోక్షం తప్పక సిద్ధిస్తుంది.

విరోధులను గెలవడానికి సిద్ధమయిన మేటి కోటలోనే ఉండి శత్రువులను జయించినట్టుగా మోక్షం కోరే నీవు గృహస్థాశ్రమంలో ఉంటూ శ్రీమన్నారాయణుని చరణారవిందాలనే కోటను ఆశ్రయించి కామక్రోధాదులనే అరిషడ్వర్గాన్ని జయించు. అలాగే ముక్తసంగుడవై నీవు కూడా ఈశ్వరకల్పితాలయిన భోగాదులను అనుభవించి ముక్తి దక్కించుకోవయ్యా' అన్నాడు. అపుడు ప్రియవ్రతుడు ముల్లోకాలకూ గురువయిన బ్రహ్మదేవుడి వాక్యాలను తలవంచి గౌరవపూర్వకంగా అంగీకరించాడు.

**ఆ. సరసిజాసనుండు స్వాయంభువునిచేత, నధికమైన పూజలంది నార**
**దుండు నా ప్రియవ్రతుండును జూడంగఁ, జనియెఁదనదు పూర్వసదనమునకు. 12**

**ప్రతి :** స్వాయంభువునిచేతన్= స్వాయంభువమనువుచేత; అధికము+ఐన= శ్రద్ధాభక్తులతో చేసిన గొప్పవయిన; పూజలు+అంది= పూజల్ని స్వీకరించి; నారదుండు; ఆ ప్రియవ్రతుండును= తనమాట విన్న ప్రియవ్రతుండును; చూడంగన్= చూస్తుండగా; సరసిజ+ఆసనుండు= పద్మంపై ఆసీనుడైన బ్రహ్మ; తనదు= తనయొక్క, పూర్వసదనమునకున్= తొలుతటి నివాసానికి; చనియెన్= వెళ్ళాడు.

**తా :** చతుర్ముఖుడు స్వాయంభువమనువు శ్రద్ధాభక్తులతో చేసిన పూజలందుకొన్నాడు. అనంతరం ప్రియవ్రతుడూ, నారదుడూ చూస్తుండగా బ్రహ్మదేవుడు తన సత్యలోకానికి వెళ్ళిపోయాడు.

**ఆ. సత్యసంధుఁడైన స్వాయంభువుండను, మనువు బ్రహ్మచేత మన్ననఁదగ**
**నంది యంత నారదానుమతంబునఁ, దనదు సుతుని రాజ్యమునను నిలిపె. 13**

**ప్రతి :** సత్యసంధుఁడు+ఐన= సత్య ప్రతిజ్ఞకల; స్వాయంభువుండు+అను= స్వాయంభువుడు అనే పేరుగల; మనువు= మనువు; బ్రహ్మచేతన్= బ్రహ్మవలన; తగన్= తగినవిధంగా; మన్ననన్= గౌరవాన్ని; అంది= పొంది; నారద+అనుమతంబునన్= నారదుని అనుమతితో; తనదుసుతునిన్= తన కుమారుడయిన ప్రియవ్రతుని; రాజ్యమునను= రాజ్యాధిపత్యంలో; నిలిపెన్= నిలిపాడు.

**తా :** బ్రహ్మదేవుని మన్ననలను పొంది నారదుని అనుమతితో సత్యసంధుడైన స్వాయంభువమనువు తన కుమారుడైన ప్రియవ్రతునికి రాజ్యభారాన్ని అప్పగించాడు.

**వ. ఇట్లు స్వాయంభువ మనువు భూచక్ర పరిపాలనంబునకుఁ బ్రియవ్రతునిఁ బట్టంబు గట్టి విషమంబులగు విషయంబులవలన విముక్తుండై వనంబునకుంజనియె; నంత. 14**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; స్వాయంభువమనువు= ప్రియవ్రతుని తండ్రి అయిన మనువు; భూచక్రపరిపాలనంబునకున్= భూమండలం పరిపాలించడానికి; ప్రియవ్రతునిన్= కుమారుడయిన ప్రియవ్రతుని; పట్టంబు+కట్టి= పట్టాభిషిక్తుని చేసి; విషమంబులు+అగు= క్లిష్టమైనవగు; విషయంబులవలనన్= ఇంద్రియార్థములయిన కోరికల వలన; విముక్తుండు+ఐ= విడుదల పొందినవాడై; వనంబునకున్+చనియెన్= ఆశ్రమవాస నిమిత్తం అడవులకు వెళ్ళాడు; అంతన్= ఆ తర్వాత.

**తా :** ఇట్లు స్వాయంభువమనువు భూపరిపాలనకోసం ప్రియవ్రతునికి పట్టాభిషేకం చేసి జంజాటాలనుండి బయటపడి తాను అరణ్యాలకు వెళ్ళిపోయాడు.

**మ. ధరణీవల్లభుఁ డా ప్రియవ్రతుఁడు మోదంబందుచున్ లీల నీ**
**శ్వరవాక్యంబునఁగర్మతంత్రపరుఁడై సంగంబులంబాపు శ్రీ**
**హరిపాదాంబుజచింతనందగిలి నిత్యానందముంబొంది దు**
**ర్భరరాగాదులఁబాఱఁదోలి ప్రజలంబాలించె నత్యున్నతిన్. 15**

**ప్రతి :** ధరణీవల్లభుఁడు= భూపతి అయిన; ఆ ప్రియవ్రతుఁడు= మనువు కుమారుడయిన ప్రియవ్రతుడు; మోదంబు+ అందుచున్= ఆనందిస్తూ; లీలన్= అలవోకగా; ఈశ్వరవాక్యంబునన్= ఈశ్వర ఆదేశంవల్ల; కర్మతంత్రపరుఁడు+ఐ= కర్మకలాపాలు నిర్వహించువాడై; సంగంబులన్= బంధాలను; పాపు= తొలగించు; శ్రీహరి= మహావిష్ణువుయొక్క; పాదాంబుజచింతనన్= పద్మాలవంటి పాదాలయొక్క చింతనలో; తగిలి= ఆసక్తి కలిగి; నిత్య+ ఆనందమున్= ఎడతెగని ఆనందాన్ని; పొంది= పొందుచు; దుర్భర రాగ+ఆదులన్= భరింపరాని రాగ, ద్వేషాదులను; పాఱన్+తోలి= వదలిపెట్టి; అతి+ఉన్నతిన్= మిక్కిలి ఔన్నత్యంతో; ప్రజలన్+పాలించెన్= జనులను చక్కగా పాలించాడు.

**తా :** ధరణీవల్లభుడైన ప్రియవ్రతుడు భగవంతుని ఆదేశంతో కర్మలను ఆచరిస్తూనే సంగాన్ని తొలగించే, శ్రీహరి పాదపద్మాలను స్మరిస్తూ, రాగద్వేషాలను వదలిపెట్టి అనుదినమూ శాశ్వతమయిన ఆనందం అనుభవిస్తూ ప్రజలను చాల చక్కగా పరిపాలించాడు.

**వ. ఇట్లు ప్రియవ్రతుండు రాజ్యంబు సేయుచు విశ్వకర్మ ప్రజాపతి పుత్త్రిక యగు బర్హిష్మతి యనుదానిం బత్నిగాఁ బడసి, యా సతివలన శీల వృత్త గుణ రూప వీర్యౌదార్యంబులం దనకు సమానులైన యాగ్నీధ్రేధ్మజిహ్వ, యజ్ఞబాహు, మహావీర, హిరణ్యరేతో, ఘృతపృష్ఠ, సవన, మేధాతిథి, వీతిహోత్ర, కవులను నామంబులు గల పుత్త్రదశకంబును, నూర్జస్వతి యను నొక్క కన్యకను గాంచె నందుఁ గవి మహావీర సవనులు బాలకులయ్యు నూర్ధ్వ రేతస్కులై బ్రహ్మవిద్యా నిష్ణాతులై యుపశమనశీలు రగుచుం బారమహంస్య**

**యోగం బాశ్రయించి, సర్వ జీవనికాయావాసుండును, భవభీతజన శరణ్యుండును, సర్వాంతర్యామియు భగవంతుండునగు వాసుదేవుని చరణారవిందావిరత స్మరణానుగత పరమభక్తి యోగానుభావంబున విశోధితాంతఃకరణు లగుచు నీశ్వరు తాదాత్మ్యంబుఁబొంది రంత. 16**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; ప్రియవ్రతుండు= సర్వజనులకూ మంచి చేయడమే వ్రతంగా కలిగిన సార్థకనామధేయుడైన ప్రభువు; రాజ్యంబు+చేయుచున్= రాజ్యపరిపాలనం కావిస్తూ; విశ్వకర్మ= దేవలోకపు శిల్పి అయిన విశ్వకర్మ అనే; ప్రజాపతి= బ్రహ్మయొక్క; పుత్రిక+అగు= కుమార్తె అయిన; బర్హిష్మతి+అనుదానిన్= బర్హిష్మతి అనుపేరుగల దానిని; పత్నిగాన్+పడసి= భార్యగా స్వీకరించి; శీలవృత్త= స్వభావం, ప్రవర్తనం; గుణ= సద్గుణాలు; రూప= సుందరరూపం; వీర్య+ఔదార్యంబులన్= పరాక్రమంలో, వితరణంలో; తనకున్= తనకు (ప్రియవ్రతునికి); సమానులు+ఐన= తుల్యులయిన ఆగ్నీధ్ర; ఇధ్మజిహ్వ; యజ్ఞబాహు; మహావీర; హిరణ్యరేతః; ఘృతపృష్ఠ; సవన; మేధాతిథి; వీతిహోత్ర; కవులు+అను= కవులనునట్టి; నామంబులు+కల= పేర్లు కల్గిన; పుత్రదశకంబునున్= పదిమంది కుమారులను, ఊర్జస్వతి+అను= ఊర్జస్వతి అను పేరుగల; ఒక్కకన్యకను కాంచెన్= ఒక కుమార్తెను పొందాడు; అందున్= వారిలో; కవి మహావీర సవనులు= చివరివాడగు కవి, నాల్గవాడైన మహావీరుడు, ఏడవవాడైన సవనుడును; బాలకులు+అయ్యున్= పసిబాలురైనా; ఊర్ధ్వరేతస్కులు+ఐ= వీర్యాన్ని ఓజస్సుగా మార్చినవారై; బ్రహ్మవిద్యానిష్ణాతులు+ఐ= బ్రహ్మవిద్యయందు నేర్పరులై; ఉపశమనశీలురు+అగుచున్= శాంతంగా జీవించడమే స్వభావంగా కలవారవుతూ; పారమహంస్యయోగంబు+ఆశ్రయించి= పరమహంసమనబడే యోగమార్గాన్ని ఆశ్రయించి; సర్వ= సమస్తమైన; జీవనికాయ= జీవుల సమూహంలో; ఆవాసుండును= వసించేవాడును; భవ భీతజన= సంసారభీతులైన వారికి; శరణ్యుండును= రక్షకుడైనవాడును; సర్వ+అంతర్యామియున్= చరాచరాలలో ఉండేవాడును; భగవంతుండున్+అగు= షడ్గుణ సంపత్తిగల; వాసుదేవుని= శ్రీమన్నారాయణునియొక్క; చరణ+అరవింద= పద్మాలవంటి పాదాలందు; అవిరత= ఎడతెగని; స్మరణ+అనుగత= మననంతో కూడుకున్న; పరమ భక్తియోగ= ఉత్కృష్టమైన భక్తి, యోగంయొక్క; అనుభావంబునన్= ప్రభావంచేత; విశోధిత= బాగుగా శోధింపబడిన; అంతఃకరణులు= మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం అని నాల్గు విధాలుగా ఉన్న సంపుటియగు అంతఃకరణం గలవారు; అగుచున్= అగుచు; ఈశ్వరున్= ఈశ్వరునితో; తాదాత్మ్యంబునన్= భేదభావంలేని ఏకత్వాన్ని; పొందిరి= పొందారు; అంతన్= ఆ మీదట.

**తా :** ఈ విధంగా ప్రియవ్రతుడు రాజ్యాన్ని పరిపాలిస్తూ విశ్వకర్మ ప్రజాపతి కుమార్తెయైన 'బర్హిష్మతి' అనే యువతిని పెళ్ళాడినాడు. ఆమెవల్ల గుణశీలరూప పరాక్రమాలలో తనతో సమానులైన పదిమంది కొడుకులనూ, ఒక కుమార్తెనూ కన్నాడు. వారు ఆగ్నీధ్రుడు, ఇధ్మజిహ్వుడు, యజ్ఞబాహువు, మహావీరుడు, హిరణ్యరేతసుడు, ఘృతపృష్ఠుడు, సవనుడు, మేధాతిథి, వీతిహోత్రుడు, కవి అనేవారు. కుమార్తె పేరు ఊర్జస్వతి. వారిలో కవి, మహావీరుడు, సవనుడు అనేవారు ముగ్గురూ చిన్నవారయినా బ్రహ్మచర్యం అవలంబించి బ్రహ్మవిద్యానిష్ణాతులైనారు. వారు శాంతమే తమ స్వభావంగా కలిగి **'పరమహంస యోగం'** అవలంబించి, సమస్త జీవులకూ, ఆవాసమయిన వాడూ, సంసారభయభ్రాంతులకు శరణ్యమైనవాడూ, సర్వాంతర్యామీ భగవంతుడూ అయిన వాసుదేవుని పద్మాలవంటి పాదాలను సర్వదా సంస్మరిస్తూ అందువల్ల ప్రాప్తించిన భక్తియోగప్రభావంతో అంతఃకరణం మరింత పరిశుద్ధం కాగా, ఈశ్వరతాదాత్మ్యం పొందారు. అప్పుడు

**సీ. వసుధేశ! యా ప్రియవ్రతుఁ డొందు కాంతయం దధికుల మన్వంతరాధిపతుల**
**మఱియు నుత్తముఁడు తామసుఁడు రైవతుఁ డను సుతులను బుట్టించె సుమహితులను;**

**మున్ను జన్మించిన ముప్వురు పుత్త్రులు నవ్యయపదవికి నరుగుటయును**
**నంతఁబ్రియవ్రతుఁడఖిలశాత్రవకోటిఁ దన బాహుబలముచేతను జయించి.**

**తే. యతఁడు బర్హిష్మతీకాంతయందుఁ బ్రీతి, గలిగి యౌవనలీలావికాసహాస**
**హేలనాదులఁజిత్తంబు గీలుకొల్పి, గతవివేకుండువోలె భోగములఁబొందె. 17**

**ప్రతి :** వసుధా+ఈశ= భూనాథుడవైన ఓ పరీక్షిన్మహారాజా!; ఆ ప్రియవ్రతుఁడు= ఆ ప్రియవ్రతుడనే రాజు; ఒందుకాంత+అందున్= మఱియొక స్త్రీయందు; అధికులన్= గొప్పవారలయిన; మను+అంతర+అధిపతులన్= మన్వంతరాలకు అధిపతులైనవారిని; మఱియున్= మఱియు; ఉత్తముఁడు= ఉత్తముడు; తామసుఁడు= తామసుడు; రైవతుఁడు+అను= రైవతుడు అను; సుమహితులను= మిక్కిలి గొప్పవారైన; సుతులను+పుట్టించెన్= కుమారులను కన్నాడు; మున్ను= ముందు; జన్మించిన= పుట్టిన; మువ్వురు పుత్త్రులున్= కవి, మహావీర, సవనులనువారు; అవ్యయపదవికిన్+అరుగుటయును= శాశ్వతస్థితికి చేరుకోవడంతో; అంతన్= ఆపైన; ప్రియవ్రతుఁడు; అఖిలశాత్రవకోటిన్= సమస్త శత్రువుల సమూహాన్ని; తన= తనయొక్క; బాహుబలముచేతను= భుజబలంచేత; జయించి= గెలిచి; అతఁడు= ఆ ప్రియవ్రతుడు; బర్హిష్మతీ కాంతయందున్= బర్హిష్మతిపట్ల; ప్రీతిన్+కలిగి= సాంసారికానుగతమయిన అనురాగం చెంది; యౌవన= మంచిప్రాయపు; లీలావికాస= శృంగార విలాసాలలో; హాస= ఉల్లాసం; హేలన+ఆదులన్= భ్రూనేత్రాది వికారాలలో; చిత్తంబున్+కీలుకొల్పి= మనస్సును సంలగ్నంచేసి; గతవివేకుండు+పోలెన్= వివేకాన్ని కోల్పోయిన వానిలాగా; భోగములన్= సుఖాలను; పొందెన్= అనుభవింపసాగాడు.

**తా :** రాజా! ప్రియవ్రతుడు ఇంకొక భార్యవల్ల ముగ్గురు కుమారులను కన్నాడు. వారలే ఉత్తముడు, తామసుడు, రైవతుడు. వారందరూ చాలా గొప్పవారు. వారు మనువులై మన్వంతరాలకు అధిపతులయ్యారు. ముందుపుట్టిన కవి, మహావీర, సవనులు అక్షయమైన మోక్షపదాన్ని అందుకున్నారు. అనంతరం ప్రియవ్రతుడు తన బాహుబలంతో శత్రుసమూహాన్ని జయించాడు. బర్హిష్మతి మీద అతిశయించిన అనురాగంతో యౌవనవికాసాలైన హాసలీలావిలాసాలలో మనస్సు లగ్నంచేసి వివేకం గోల్పోయిన వానిలాగా సుఖాలు అనుభవించసాగాడు.

**వ. ఇట్లు ప్రియవ్రతుం డేకాదశార్బుద పరివత్సరంబులు రాజ్యంబుసేసి యొక్కనాఁడు మేరునగ ప్రదక్షిణంబు సేయు సూర్యునకు నపరభాగంబునం బ్రవర్తించు నంధకారంబు నివర్తింపంబూని భగవదుపాసనా జనితాతిపురుష ప్రభావుండై సవితృరథసదృక్ష వేగంబు గలిగి తేజోమయంబైన రథంబు నారోహణంబు సేసి రాత్రుల నెల్ల దినంబు లొనర్తునని సప్తవారంబులు ద్వితీయ తపనుండునుం బోలె నరదంబు వఱపుటయు నా రథనేమి మార్గంబులు సప్తసముద్రంబులును నా మధ్య భూసంధులు సప్తద్వీపంబులు నయ్యె నందు. 18**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; ప్రియవ్రతుండు; ఏకాదశ+అర్బుద పరివత్సరంబులు= పదకొండు కోట్ల సంవత్సరాలు; రాజ్యంబు+చేసి= పరిపాలన గావించి; ఒక్కనాఁడు= ఒకరోజు; మేరునగ ప్రదక్షిణంబు+చేయు= మేరు పర్వతానికి ప్రదక్షిణం గావిస్తున్న; సూర్యునకున్= భాస్కరునికి; అపర భాగంబునన్= అవతల వైపున; ప్రవర్తించు= ఒప్పునటువంటి; అంధకారంబున్= చీకటిని; నివర్తింపన్+పూని= పూర్తిగా లేకుండా చేయవలెననే సంకల్పం వహించి; భగవత్+ఉపాసనాజనిత= భగవంతుని ఉపాసించడం వలన పుట్టిన; అతిపురుష ప్రభావుండు+ఐ= జీవునికి అతీతమైన ప్రభావం కలవాడై; సవితృరథ= సూర్యరథానికి; సదృక్ష= సమానమైన; వేగంబు+కలిగి= వేగంతో కూడి; తేజోమయంబు+ఐన= వెలుగులతో నిండినదయిన;

రథంబున్= రథాన్ని; ఆరోహణంబు+చేసి= అధిరోహించి; రాత్రులను+ఎల్లన్= చీకటి రాత్రులంతా; దినంబులు= పగళ్ళు; ఒనర్తున్+అని= చేయగలనని; సప్తవారంబులు= ఏడుమార్లు; ద్వితీయ తపనుండునున్+పోలెన్= రెండవ సూర్యునివలె; అరదంబు+పఱపుటయున్= రథాన్ని పరుగెత్తించడం చేయగా; ఆ రథనేమి మార్గంబులు= ఆ రథ చక్రపు అంచులచేత ఏర్పడిన దారులు; సప్తసముద్రంబులును= ఏడు సాగరాలుగా; ఆమధ్య= వానిమధ్య; భూసంధులు= భూమితో కలుపబడిన భాగాలు; సప్తద్వీపంబులును= ఏడు దిబ్బలుగా; అయ్యెన్= అయ్యాయి; అందున్= అక్కడ.

**తా :** ఈ విధంగా ప్రియవ్రతుడు పదకొండు కోట్ల సంవత్సరాలు రాజ్యం పాలించాడు. ఒకనాడు మేరుపర్వతానికి ప్రదక్షిణం చేస్తున్న సూర్యుని రథంతో సమానమై తేజోమయమయిన రథాన్నెక్కాడు. సూర్యునికి అవతలివైపు వ్యాపించిన చీకటిని తొలగించబూనాడు. అతనికి ఆ శక్తి భగవంతుణ్ణి నిరంతరం ధ్యానించడంవల్లనే కలిగింది. రాత్రులను పగళ్ళుగా మారుస్తానని ప్రియవ్రతుడు సూర్యుని రథంతో సమానమైన వేగంకలిగిన తేజస్సుతో నిండిన రథాన్ని అధిరోహించి రెండవ సూర్యునిలాగా వెలిగిపోతూ ఏడుమార్లు రథం నడిపాడు. ప్రియవ్రతుని రథచక్రాల గాళ్లు పడ్డదారులు సప్తసముద్రాలు అయ్యాయి. ఆ గాళ్ళకు నడుమనున్న భూమి, సప్తద్వీపాలయింది.

**సీ. సరసజంబూప్లక్ష శాల్మలిద్వీప కుశక్రౌంచశాకపుష్కరము లనఁగ**
**నలరు నా ద్వీపంబులందు జంబూద్వీప మొనరంగ లక్షయోజనము లయ్యె;**
**నట యుత్తరోత్తరాయతసంఖ్యఁ దా ద్విగుణిత మయి యొండొంటి కతిశయిల్లు**
**క్షారేక్షురస సురాజ్యక్షీర దధ్యుదకంబులు గలుగు సాగరము లేడు.**

**తే. ద్వీపపరిమాణములు గల్గి విస్తరిల్లు, సంధిసంధిని బరిఖల చందమునను**
**గ్రమము దప్పక యొండొంటిఁ గలయకుండు, సకలజీవుల కెల్ల నాశ్చర్యముగను. 19**

**ప్రతి :** సరస= రసయుక్తమయిన; జంబూ= జంబు అను పేరుగల; ప్లక్ష= ప్లక్షమను పేరుగల; శాల్మలి= శాల్మలి అను పేరుగల; ద్వీప= ద్వీపములు; కుశ= కుశ అను పేరుగల; క్రౌంచ= క్రౌంచ అను పేరుగల; శాక= శాక అను పేరుగల; పుష్కరములు+అనఁగన్= పుష్కరమనే పేర్లతో; అలరు= ఒప్పునట్టి; ఆ ద్వీపములందున్= ఆ ద్వీపాలలో; జంబూద్వీపము= 'జంబు' అను పేరుగల ద్వీపం; ఒనరంగన్= తగినవిధంగా ఉండగా; లక్షయోజనములు+అయ్యెన్= లక్ష యోజనాల వైశాల్యం కలదిగా అయింది; అటన్= అక్కడ; ఉత్తర+ఉత్తర+ఆయత సంఖ్యన్= ఒకదానితో నొకటి విస్తారమయిన సంఖ్యతో; తాన్= ఆయా ద్వీపాలు; ద్విగుణితము+అయి= రెట్టింపయి; ఒండు+ఒంటికిన్= పరస్పర మొకదానికొకటి; అతిశయిల్లున్= మించి ఉంటాయి; క్షార= ఉప్పు కడలి; ఇక్షు= చెఱకురసపు సముద్రం; సురా= కల్లు కడలి; ఆజ్య= నేతి కడలి; క్షీర= పాలకడలి; దధి= పెరుగు కడలి; ఉదకంబులున్= మంచినీటి సముద్రాలు; కలుగు= కలిగిన; సాగరములు+ఏడు= ఏడు సముద్రాలు; ద్వీపపరిమాణములు= దిబ్బల కొలతలు; కలిగి= కలిగి; విస్తరిల్లున్= విస్తరించి వున్నాయి; సంధి సంధినిన్= ఒకదానికి మరొకదానికి నడుమ; పరిఖల చందమునను= అగడ్తల విధంగా; క్రమము+తప్పక= ఏమాత్రం క్రమం తప్పకుండ; ఒండు+ఒంటిన్= ఒకదానితో మరొక్కటి; సకలజీవులకున్+ఎల్లన్= సకల జీవులకూ; ఆశ్చర్యముగను= వింత గొలిపే విధంగా; కలయక+ఉండున్= కలిసిపోకుండా ఉంటాయి.

**తా :** జంబూ, ప్లక్ష, శాల్మలీ, కుశ, క్రౌంచ, శాక, పుష్కరాలనేవి సప్తద్వీపాలు. వీటిలో మొదటిదయిన జంబూద్వీపం ఒక లక్ష యోజనాల విస్తీర్ణం కలిగి ఉంటుంది. ఈలాగే ఒకదానికొకటి రెట్టింపు వైశాల్యం కలిగి వరుసగా ఏడుద్వీపాలున్నాయి.

వాటి నడుమ ఉప్పు కడలి, చెరకు రససముద్రం, మద్యసాగరం, ఘృత సముద్రం, పాలకడలి, పెరుగు కడలి, మంచినీటి కడలి అనే ఏడు సముద్రాలున్నాయి. ఒక ద్వీపంతో ఇంకొక ద్వీపం కలిసిపోకుండా ఉండడానికి సముద్రాలు ఏర్పడ్డాయి. అవి ద్వీపాలచుట్టూ అగడ్తలలాగా ఉన్నాయి. ఈ ద్వీపసముద్ర నిర్మాణాలు సకలజీవులకూ ఆశ్చర్యం గొలిపే అద్భుత దృశ్యాలు.

**విశే :** యోజనం= ఆమడ= నాలుగు క్రోసుల దూరం= 16 కిలోమీటర్లు.

**వ. అట్టి ద్వీపంబుల యందుఁ బరిపాలనంబునకుం బ్రియవ్రతుం డాత్మభవులు నాత్మసమాన శీలురునైన యాగ్నీ ధ్రేధ్మజిహ్వ యజ్ఞబాహు హిరణ్యరేతో ఘృతపృష్ఠ మేధాతిథి వీతిహోత్రుల నొక్కొక్కని నొక్కొక ద్వీపంబునకుం బట్టంబు గట్టి యూర్జస్వతి యను కన్యకను భార్గవున కిచ్చిన నా భార్గవునకు నూర్జస్వతి యందు దేవయాని యను కన్యారత్నంబు జనించె; నట్టి బలపరాక్రమవంతుండైన ప్రియవ్రతుండు విరక్తుండై యొక్కనాఁడు నిజ గురువగు నారదుని చరణానుసేవానుపతిత రాజ్యాది ప్రపంచ సంసర్గంబుఁ దలంచి యిట్లనియె. 20**

**ప్రతి :** అట్టిద్వీపంబుల+అందున్= ఆ విధంగా ఏర్పడిన జంబూద్వీపాదులలో; పరిపాలనంబునకున్= రాజ్య పాలనానికి; ప్రియవ్రతుండు= ప్రియవ్రతుడు; ఆత్మభవులు= తన వలన కలిగిన బర్హిష్మతి కుమారులు; ఆత్మసమానశీలురున్+ఐన= తనతో సమానమయిన శీల, వృత్త, గుణ, రూప, వీర్య, ఔదార్యాలుగల; ఆగ్నీధ్ర; ఇధ్మజిహ్వ; యజ్ఞబాహు; హిరణ్యరేతస్; ఘృతపృష్ఠ, మేధాతిథి, వీతిహోత్రులన్ అను పేర్లుగలవారిలో; ఒక్కొక్కనిన్= ఒక్కొక్కని; ఒక్కొక ద్వీపంబునకున్= ఒక్కొక్క ద్వీపానికి; పట్టంబున్+కట్టి= రాజుగా పట్టాభిషిక్తులను చేసి; ఊర్జస్వతి+అను కన్యకను= ఊర్జస్వతి అను పేరుగల పుత్రికను; భార్గవునకున్+ఇచ్చినన్= భార్గవ నామధేయునకు పత్నిగా చేయగా; ఆ భార్గవునకున్= ఆ భార్గవునకు; ఊర్జస్వతియందున్= ఊర్జస్వతియందు; దేవయాని+అను= దేవయాని అనే పేరుగల; కన్యారత్నంబు= శ్రేష్ఠురాలగు కన్య; జనించెన్= జన్మించింది; అట్టి= అటువంటి; బలపరాక్రమవంతుండు+ఐన= బుద్ధిబల, భుజబల, ఆత్మబలాదులు మరియు విక్రమం గలిగిన; ప్రియవ్రతుండు= ప్రియవ్రతుడు; విరక్తుండు+ఐ= ప్రాపంచిక సుఖాదులపట్ల వైరాగ్యభావం కలవాడై; ఒక్కనాఁడు= ఒకరోజు; నిజగురువు+అగు= తన గురువయిన; నారదుని= నారద మహర్షి యొక్క; చరణసేవా+అనుపతిత= పాదసేవచేసి అనుసరించిన; రాజ్య+ఆది= రాజ్యం మొదలుగాగల; ప్రపంచసంసర్గంబున్= ప్రాపంచికమైన భౌతిక లంపటత్వాన్ని; తలంచి= మనసులో తలచుకొని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

**తా :** ప్రియవ్రతుడు తనంతటివారైన తన కుమారులను, ఆగ్నీధ్రుడు, ఇధ్మజిహ్వుడు, యజ్ఞబాహువు, హిరణ్యరేతసుడు, ఘృతపృష్ఠుడు, మేధాతిథి, వీతిహోత్రుడు అనేవారిని ఒక్కొక్క ద్వీపానికి ఒక్కొక్కరిని పట్టం కట్టించాడు. ఊర్జస్వతి అనే కన్యను భార్గవునకిచ్చి పెళ్లిచేశాడు. ఆ దంపతులకు 'దేవయాని' అనే కన్యారత్నం పుట్టింది. ఆ తరువాత మహాపరాక్రమవంతుడయిన ప్రియవ్రతుడు విరక్తుడై, నారదుని పాదసేవనంవల్ల ప్రాప్తించిన రాజ్యసంపదలనూ, సంసార బంధాలనూ తలచుకొని ఇలా విచారించాడు.

**సీ. అక్కట! యే నింద్రియములచేఁ గట్టంగఁ బడియుండి యందులఁబాయలేక**
**యజ్ఞానవిరచితంబగు సర్వవిషయములను నంధకూపంబులందు నడఁగి**

**తరుణుల కే వినోదమృగంబనై యుండి యవి యెల్ల నే నొల్ల ననుచు రోసి**
**హరికృపచే నప్పు డబ్బిన యాత్మ విద్యను గల్గి తనవెంట నరుగుదెంచు**

**తే. కొడుకులకు నెల్ల రాజ్యము గుదురుపఱిచి, తనదు పత్నుల దిగనాడి ధనము విడిచి**
**హరివిహారంబు చిత్తంబునందు నిలిపి, పరఁగ నల్లన నారదపదవి కరిగె. 21**

**ప్రతి :** అక్కట= అయ్యో!; ఏను= నేను; ఇంద్రియములచేన్= అయిదు ఇంద్రియములతో; కట్టంగన్+పడియుండి= బంధింపబడి; అందులన్= ఆ బాధలనుండి; పాయన్+లేక= బయటపడలేక; అజ్ఞాన విరచితంబు+అగు= మాయచే కల్పింపబడినదయిన; సర్వ విషయములు+అను= సమస్త ఇంద్రియార్థములనెడి; అంధకూపంబులు+అందున్+అడఁగి= చీకటి బావులందు అణగిపోయి; తరుణులకున్+ఏన్= వయస్సులోనున్న స్త్రీలకు; నేను; వినోదమృగంబను+ఐ= కాలక్షేపంబునకై పెంచుకొను జంతువువలె; ఉండి= ప్రవర్తించి; అవి+ఎల్లన్= ఆ జీవనసరళిని అంతా; నేను+ఒల్లన్+ అనుచున్= నేను ఇష్టపడనని; రోసి= అసహ్యించుకొని; హరికృపచేన్= మహావిష్ణువు కరుణతో; అప్పుడు+అబ్బిన= ఆ క్షణమున నేర్పడిన; ఆత్మవిద్యను+కల్గి= ఆత్మవిద్యను పొంది; తనవెంటన్= తన్ను అనుసరించి; అరుగుదెంచు= వెంబడించి వస్తున్న; కొడుకులకున్= కుమారులకు; ఎల్ల+రాజ్యమున్= సమస్త రాజ్యాన్ని; కుదురుపఱిచి= వారివారికి స్వాధీనమయ్యేలా స్థిరపరచి; తనదుపత్నులన్= తన ఇద్దరి భార్యలను; దిగనాడి= వదలిపెట్టి; ధనమున్‌విడిచి= సిరి సంపదలను వదలిపెట్టి; హరివిహారంబున్= శ్రీహరి సంచారాలను; చిత్తంబునందున్= మనసులో; నిలిపి= కుదురుకొనునట్లు చేసి; పరఁగన్= ఒప్పునట్లుగా; అల్లనన్= మెల్లమెల్లగా; నారదపదవికిన్= నారదుడు ఉపదేశించిన మార్గానికి; అరిగెన్= చేరుకొన్నాడు.

**తా :** అయ్యో! నేను పంచేంద్రియాలకు బందీనై ఆ బంధనాలనుండి తప్పించుకోలేక అజ్ఞానంతో నిండిన విషయసుఖాలనే చీకటినూతిలో పడిపోయాను. విలాసవతులైన యువతులకు నేనొక వినోదమృగంలా అయినాను. ఇక, ఇటువంటి సుఖాలకు నేనేమాత్రం ఇష్టపడను అని అసహ్యించుకొని శ్రీహరి అనుగ్రహంవల్ల అబ్బిన ఆత్మవిద్యను అందుకున్నాడు. తన వెంటవచ్చిన కుమారులందరినీ రాజ్యంలో కుదురుకొనునట్లు పదిలపరిచాడు. భార్యలను పరిత్యజించాడు. ధనాన్ని వదులుకొన్నాడు. చిత్తంలో శ్రీహరిని నిలుపుకొన్నాడు. నారదుడు ఉపదేశించిన మార్గానికి చేరాడు.

**వ. ఇట్లు తన రథమార్గంబులు సప్తద్వీపసాగరంబులుగాఁ జేసి సూర్యునకుఁ బ్రతిసూర్యుండై సరిద్గిరివనాదులచే భూతనిర్వృతి కొఱకుఁ బ్రతిద్వీపంబునకు నవధులు గల్పించి ద్వీపవర్ష నిర్ణయంబులం బుట్టించి పాతాళ భూ స్వర్గాది సుఖంబులు నరకసమానంబులుగాఁ దలంచి విరక్తిం బొంది నిరంతర భగవద్ధ్యాన విమలీకృతాశయుం డగుచు హరిభక్తి ప్రియుండయిన ప్రియవ్రతు చరిత్రంబు లీశ్వరునకుఁ దక్క నన్యుల కెఱుంగఁ దరంబుగా; దతని మహిమంబులు నేఁడునుం గొనియాడుదురని శుకుండు మఱియు నిట్లనియె. 22**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; తన= తనయొక్క; రథమార్గంబులు= సూర్యరథ వేగంతో సమానంగా తేజస్సుతో కూడిన రథం పోయే త్రోవలు; సప్తద్వీపసాగరంబులుగాన్+చేసి= ఏడు దిబ్బలుగా, ఏడు సముద్రాలుగా చేసి; సూర్యునకున్= దినకరునికి; ప్రతిసూర్యుండు+ఐ= రెండవ సూర్యుడై; సరిత్= నదులు; గిరివన= కొండలు, అడవులు; ఆదులచేన్= మొదలగువానిచే; భూతనిర్వృతి కొఱకున్= జీవుల తృప్తికొఱకు; ప్రతిద్వీపంబునకున్= జంబూద్వీపమాది సప్తద్వీపాలకు; అవధులు= హద్దులు;

కల్పించి= ఏర్పరచి; ద్వీప= ద్వీపాల; వర్ష= వర్షముల; నిర్ణయంబులన్= విభాగాలుగా నిర్ణయించడాన్ని; పుట్టించి= సిద్ధంచేసి; పాతాళ= పాతాళలోకం; భూ= భూలోకం; స్వర్గ+ఆది= స్వర్గాదులకు చెందిన; సుఖంబులు= భోగాలు; నరకసమానంబులుగాన్= నరకప్రాయాలుగా; తలంచి= భావించి; విరక్తిన్+పొంది= వైరాగ్యం పొంది; నిరంతర= ఎల్లప్పుడు; భగవత్+ధ్యాన= భగవంతునికి సంబంధించిన ధ్యానంచే; విమలీకృత+ఆశయుండు+అగుచున్= నిర్మలత్వం పొందిన భావాలు కలవాడవుతూ; హరిభక్తిప్రియుండు+అయిన= శ్రీహరిపై ప్రీతి గలవాడయిన; ప్రియవ్రతుచరిత్రంబులు= ప్రియవ్రతుని పుణ్యచరిత్రలు; ఈశ్వరునకున్+తక్కన్= సర్వరక్షకుడయిన పరమేశ్వరునికి తప్ప; అన్యులకున్= ఇతరులకు; ఎఱుంగన్+తరంబు+కాదు= తెలియుటకు వీలుగాదు; అతని= ఆ ప్రియవ్రతుని; మహిమంబులు= ప్రభావాలు; నేఁడునున్= ఈ రోజుకూడా; కొనియాడుదురు+అని= పొగడుతారని; శుకుండు= శుకమహర్షి; మఱియున్= మఱల; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

**తా :** ఈ విధంగా ప్రియవ్రతుడు తన రథమార్గాలను ఏడుద్వీపాలుగా, ఏడు సముద్రాలుగా ఏర్పరచాడు. సూర్యునికి ప్రతిసూర్యుడుగా ప్రకాశించాడు. నదులను, కొండలను, వనాలను సరిహద్దులుగా నిర్ణయించి, జీవరాసులకు తృప్తి కలిగించాడు. ద్వీపాల, వర్షాల విభాగం కల్పించాడు. భూలోక, స్వర్గలోక, నాగలోక సుఖాలను నరకసమానంగా భావించాడు. విరక్తి పొందాడు. నిరంతరం భగవంతుని ధ్యానించడంతో, నిర్మలమయిన ఆశయాలు కలిగినవాడయ్యాడు. అలాంటి హరిభక్తి పరాయణుండయిన ప్రియవ్రతుని పవిత్రచరిత్ర తెలుసుకోవడం ఈశ్వరునికి తప్ప మరెవ్వరికీ శక్యంకాదు. ఆ ప్రియవ్రతుని మహిమలను జనులు నేటికీ కొనియాడుతున్నారు అని చెప్పి శుకమహర్షి ఇంకా ఇలా అన్నాడు.

**క. హరిసేవనాప్రియవ్రతుఁ, డరయఁగఁగైవల్యపదవి నందుట యరుదే?**
**ధరఁజండాలుండైనను, హరినామస్మరణఁజెందు నవ్యయపదమున్. 23**

**ప్రతి :** హరి= శ్రీహరియొక్క; సేవనా= సేవించుటయే; ప్రియవ్రతుఁడు= ఇష్టమైన వ్రతంగా కలవాడు; అరయన్+కన్= పరిశీలించి చూడగా; కైవల్యపదవిన్+అందుట= మోక్షస్థితిని పొందటం; అరుదు+ఏ= ఆశ్చర్యమా?; ధరన్= లోకంలో; చండాలుండు+ఐనను= చండాలుడయినా; హరినామస్మరణన్= హరినామస్మరణచే; అవ్యయపదమున్= శాశ్వతమైన స్థితిని; చెందున్= పొందుతాడు.

**తా :** ప్రియవ్రతుడు హరిసేవాప్రభావంవల్ల ముక్తి పొందినాడనడంలో ఆశ్చర్యం ఏముంది? చండాలుడయినా సరే, హరిచరణ స్మరణం వల్ల అక్షరమైన మోక్షాన్ని పొందగలడు.

**వ. అని పలికి శుకుండు మఱియు నిట్లనియె. 24**

**ప్రతి :** అని పలికి= ఇలా చెప్పి; శుకుండు= శుకమహర్షి; మఱియున్= ఇంకనూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** హరినామస్మరణ కైవల్యదాయకం. ఈ స్మరణ చేసేవా రెవరైనా ముక్తి పొందుతారు. అని శుకుడు విశదీకరించి ఆపై పరీక్షిత్తుతో ఇలా అన్నాడు.

**మ. జనకుండిట్లు విరక్తుఁడైనను దదాజ్ఞంజేసి యాగ్నీధ్రుఁ డే**
**పున ధర్మప్రతిపాలనుండగుచు జంబూద్వీపము న్నేలుచుం**
**దన సత్పుత్రులమాడ్కి నెల్ల ప్రజలం దాత్పర్యచిత్తంబునన్**
**ఘనతంబ్రోచె ననేకకాల మిలఁబ్రఖ్యాతంబుగా భూవరా! 25**

**ప్రతి :** భూవరా= ఓ పరీక్షిన్మహారాజా!; జనకుండు+ఇట్లు= తండ్రియైన ప్రియవ్రతుడు ఈ ప్రకారంగా; విరక్తుఁడు+ఐననున్= భౌతిక భోగాలపట్ల వైరాగ్య భావం కలిగినవాడు కాగా; తద్+ఆజ్ఞన్+చేసి= ప్రియవ్రతుని ఆనతి మేరకు; ఆగ్నీధ్రుఁడు= బర్హిష్మతి పెద్ద కుమారుడయిన ఆగ్నీధ్రుడు; ఏపునన్= అతిశయంతో; ధర్మప్రతిపాలనుండు+అగుచున్= రాజ్యధర్మాన్ని పాలించేవాడవుతూ; జంబూద్వీపమున్+ఏలుచున్= జంబూద్వీపాన్ని పాలించుచూ; తన= తనయొక్క; సత్పుత్రులమాడ్కిన్= మంచిబుద్ధి గల కొడుకులవలె; ఎల్లప్రజలన్= ప్రజలనందరిని; తాత్పర్యచిత్తంబునన్= నిష్ఠతోకూడిన మనస్సుతో; ప్రఖ్యాతంబుగాన్= ప్రసిద్ధిగా; అనేకకాలము= చాలకాలం; ఇలన్= ఈ జంబూద్వీపాన్ని; ఘనతన్+ప్రోచెన్= గొప్పగా రక్షించాడు.

**తా :** రాజా! తండ్రి అయిన ప్రియవ్రతుడు విరక్తుడు కాగా, ఆతని ఆజ్ఞప్రకారం అతని కుమారుడు ఆగ్నీధ్రుడు జంబూద్వీపాన్ని ధర్మమార్గంలో పరిపాలించాడు. అతడు ప్రజలందరినీ మంచిగా కొడుకులలాగా లాలిస్తూ చాలాకాలం రాజ్యం చేశాడు. ఎనలేని ప్రఖ్యాతి గడించాడు.

**వ. ఇట్లాగ్నీధ్రుండు రాజ్యంబు సేయుచు, నొక్కనాఁడు పుత్త్రకాముండై మందరాద్రి సమీపంబున నఖిలోపచారంబుల నేకాగ్రచిత్తుండై యర్చించినం, గమలసంభవుండు సంతసిల్లి, తన సమ్ముఖంబున సంగీతంబు సేయు పూర్వచిత్తియను నప్సరోంగనం బంపుటయు, నా యప్సరోంగన చనుదెంచి రమణీయ వివిధ నిబిడ విటపి విటప సమాశ్లిష్ట సమీప సువర్ణ లతికారూఢస్థల విహంగమ మిథునోచ్చార్యమాణ షడ్జాది స్వరంబులచే బోధ్యమాన సలిల కుక్కుట కారండవ బక కలహంసాది విచిత్ర కూజిత సంకులంబు లయిన నిర్మలోదక కమలాకరంబులు గల తదాశ్రమోపవనంబు నందు విహరించుచు విలాస విభ్రమ గతి విశేషంబులం జలనంబు నొందు స్వర్ణ చరణాభరణస్వనం బ న్నరదేవ కుమారుం దాలించి యోగసమాధింజేసి ముకుళితనేత్రుండై యుండి యల్లన కనువిచ్చి చూచి తన సమీపంబున మధుకరాంగనయుంబోలెఁ బుష్పాఘ్రాణంబు సేయుచు దేవమానవుల మనోనయనంబుల కాహ్లాదంబు పుట్టించుచున్న గతి విహార వినయావలోకన సుస్వరావయవంబుల మన్మథ శరపరంపరల నొందించుచు ముఖకమల విగళితామృత సమానహాస భాషణామోద మదాంధంబు లయిన మధుకర మిథునంబుల వంచించి, శీఘ్ర గమనంబునం జలించు కుచకచమేఖలలు గల దేవిం గనుంగొని చిత్తచలనంబు నొంది మన్మథపరవశుండై జడుని చందంబున నిట్లనియె. 26**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; ఆగ్నీధ్రుండు; రాజ్యంబు+చేయుచున్= రాజ్యపాలనము చేయుచూ; ఒక్కనాఁడు= ఒకరోజు; పుత్రకాముండు+ఐ= పుత్రుని పొందాలనే కోర్కె కలవాడై; మందర+అద్రి సమీపంబునన్= మందరమనే పేరుగల కొండసమీపంలో; అఖిల+ఉపచారంబులన్= సకల విధాలైన సేవలతో; ఏక+అగ్ర+చిత్తుండు+ఐ= ఒకే ఒక లక్ష్యంతో

కూడిన మనస్సు కలవాడై; అర్చించినన్= అర్చన చేయగా; కమలసంభవుండు= కమలంలో పుట్టిన బ్రహ్మదేవుడు; సంతసిల్లి= సంతోషించి; తనసమ్ముఖంబునన్= తన ఎదుట; సంగీతంబు+చేయు= చక్కని గీతాలాపన చేసే; పూర్వచిత్తి+అను= పూర్వచిత్తి అను పేరుగల; అప్సరస్+అంగనన్= అచ్చర పడతిని; పంపుటయున్= పంపగా; ఆ+అప్సరస్+అంగన= ఆ పూర్వచిత్తియను ఆ దేవతాస్త్రీ; చనుదెంచి= ఆగ్నీధ్రుని కడకువచ్చి; రమణీయ= మనోజ్ఞమైన; వివిధ= అనేక విధాలైన; నిబిడ= దట్టమయిన; విటపి విటప= చెట్ల కొమ్మలచే; సమాశ్లిష్ట= కౌగిలించబడిన; సమీప= దగ్గరి; సువర్ణలతికా+ఆరూఢస్థల= రంగురంగుల పూలతీగలల్లు కొన్న ప్రదేశాలలో విహరించే; విహంగమ మిథున= పిట్టల జంటలచేత; ఉచ్చార్యమాణ= పలుకబడుచున్న; షడ్జ+ఆది= (షడ్జము= నాసిక, కంఠం, వక్షస్సు, తాలువు, జిహ్వ, దంతం అను నాఱు స్థలములందును బుట్టిన స్వరవిశేషము) షడ్జం మొదలైన; స్వరంబులచేన్= స్వరాలతో; బోధ్యమాన= మేల్కొల్పబడుతున్న; సలిల కుక్కుట= నీటికోళ్ళు; కారండవ= పొట్టి బాతులు; బక= కొంగలు; కలహంస+ఆది= కలహంసలు మున్నగువాటి; విచిత్ర కూజిత సంకులంబులు+అయిన= చిత్రమైన కూతల సందడితో కూడినవైన; నిర్మల+ఉదక= స్వచ్ఛమయిన నీరుగల; కమల+ఆకరంబులుగల= కోనేళ్ళుగల; తద్+ఆశ్రమ= ఆ ఆశ్రమంయొక్క; ఉపవనంబునందున్= తోటలో; విహరించుచున్= విహారంచేస్తూ; విలాస గతివిశేషంబులన్= ఒయ్యారం ఒలకబోసే నడకలతో; చలనంబున్+ఒందు= చలించునట్టి; స్వర్ణ చరణ+ఆభరణ స్వనంబు= బంగారు అందెల రవళిని; ఆ నరదేవకుమారుండు= ఆ ప్రియవ్రతుని కుమారుడు; ఆలించి= విని; యోగసమాధిన్+చేసి= యోగసమాధిలో ఉండటంవల్ల; ముకుళితనేత్రుండు+ఐ= కనులుమూసి కొన్నవాడై; ఉండి= ఉండి; అల్లన= మెల్లగా; కనువిచ్చిచూచి= కనులు తెరచిచూచి; తన సమీపంబునన్= తనకు దగ్గరగా; మధుకర+అంగనయున్+పోలెన్= ఆడు తేనెటీగవలె; పుష్ప+ఆఘ్రాణంబు+చేయుచున్= పూలవాసనను పీల్చుచు; దేవ= దివిలో సంచరించేవారి; మానవుల= భూలోకవాసులైన వారి; మనస్+నయనంబులకున్= మనస్సులకు, కన్నులకు; ఆహ్లాదంబున్+పుట్టించుచున్నగతిన్= సంతోషం కలిగించేవిధంగా; విహార= విహారంతో; వినయ+అవలోకన= వినయంతోడి చూపులతో; సుస్వర= మంచి కంఠధ్వనితో; అవయవంబుల= అంగములతో; మన్మథ శరపరంపరలన్= మన్మథుని బాణ పరంపరలను; ఒందించుచు= సృష్టిస్తూ; ముఖకమల విగళిత= ముఖ పద్మంనుండి వెలువడిన; అమృతసమాన= అమృతంతో సాటియైన; హాసభాషణ= నవ్వుల, మాటల; ఆమోదమద+అంధంబులు+అయిన= పరిమళంతో మదించి కన్నుగాననివయిన; మధుకరమిథునంబులన్= తేనెటీగల జంటలను, వంచించి= మోసగించి; శీఘ్రగమనంబునన్= తొందరతో కూడిన నడకతో; చలించు= కదలాడు, కుచకచమేఖలలు గల= స్తనములు, జుట్టుముడి, ఒడ్డాణముగల; దేవిన్+కనుంగొని= పూర్వచిత్తిని దర్శించి; చిత్తచలనంబున్+ఒంది= మనస్సు చలించినవాడై; మన్మథపరవశుండు+ఐ= మన్మథునకు లొంగినవాడై; జడునిచందంబునన్= మూర్ఖునివలె; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

**తా :** ఈ విధంగా ఆగ్నీధ్రుడు జంబూద్వీపాన్ని పరిపాలిస్తూ ఒకనాడు సంతానంకోసం మందరపర్వత సమీపానికి వెళ్ళి అక్కడ అచంచలమైన మనస్సుతో అఖిలోపచారాలతో బ్రహ్మదేవుణ్ణి ఆరాధించాడు. ఆగ్నీధ్రుని భక్తిప్రపత్తులకు బ్రహ్మదేవుడు పరమానందభరితుడై సత్యలోకంలో తన సమక్షంలో సంగీతం ఆలపించే 'పూర్వచిత్తి' అనే అప్సరసను ఆయన దగ్గరకు పంపాడు. ఆ అమరకాంత ఆగ్నీధ్రుడు ఉన్న ఆశ్రమవాటికకు వచ్చింది. అక్కడ వివిధ పుష్పజాతుల రంగురంగుల పూలతీగెలు దట్టమైన చెట్లకొమ్మలను గట్టిగా పెనవేసుకొని ఉన్నాయి. ఆ తీగెలమీద ఊగే నెమళ్ళు మొదలైన పక్షుల జంటలు షడ్జాది స్వరాలతో సందడి చేస్తున్నాయి. ఆ ధ్వనులకు మేల్కొన్న నీటికోళ్ళూ, బాతులూ, కొంగలూ కలకల ధ్వనులు చేస్తున్నాయి. అటువంటి విహంగాలతో నిర్మలజలాలతోనూ నిండిన సరస్సులు కన్నులవిందు చేస్తున్నాయి.

ఆశ్రమవాటికను ఆనుకొని ఉన్న ఉపవనంలో ఆ అప్సరస విహరించడం మొదలుపెట్టింది. వంపు సొంపులతో ఒయ్యారంగా నడిచే ఆ సురసుందరి నడకలకు తగినట్టుగా కదలుతున్న ఆమె బంగారు అందియల రవళిని ఆగ్నీధ్రుడు ఆలకించాడు. యోగసమాధిలో కన్నులు మోడ్చి ఉన్న అతడు మెల్లగా కన్నులు విప్పి ఆ వన్నెలాడిని చూచాడు. ఆ సమయంలో ఆడుతుమ్మెదవలె 'పూర్వచిత్తి' పూలసౌరభాన్ని ఆఘ్రాణిస్తున్నది. ఆమె అందచందాలు దేవతలకూ, మానవులకూ కనువిందై మనస్సులను పరవశింప చేస్తున్నాయి. పూర్వచిత్తి ఒయ్యారపు నడకలూ, విభ్రమ విహారాలూ, వాలుచూపులూ కంఠమాధుర్యమూ, అంగసౌష్ఠవమూ మన్మథుని శరపరంపరలను కురిపించసాగాయి. ఆమె ముఖపద్మంనుండి మకరందంవంటి మందహాసం చిందుతున్నది. ఆమె పలుకులు పరిమళాలు విరజిమ్ముతున్నాయి. ఆ సుగంధాలకు ముసురుకొని మైమరచిన తుమ్మెద జంటలను తప్పించుకొని ఆ సురసుందరి చరచరా నడుస్తుంటే ఆ గమన వేగానికి ఆమె చనుగవ, జుట్టుముడి, మొలనూలు చలిస్తున్నాయి. అటువంటి పూర్వచిత్తిని చూచి ఆగ్నీధ్రుడు కామపరవశుడై చలించిన చిత్తంతో మూర్ఖునిలాగా ఆవిడతో ఈ విధంగా సంభాషణ మొదలెట్టాడు.

**క. సతి! నీ వెవ్వతె వీ ప, ర్వతమున కేమేనిఁగోరివచ్చిన వన దే**
**వతవో, శారదవో రతి, పతి పంచిన మాయవో, తపస్సారమవో! 27**

**ప్రతి :** సతి= సత్ప్రవర్తనగల కాంతా!; నీవు+ఎవ్వతెవు= నీవు ఎవరవు?; ఈ పర్వతమునకున్= మందరమను పేరుగల; ఈ కొండకు; ఏమి+ఏనిన్= ఏమయినా; కోరి= అపేక్షించి; వచ్చిన= అరుదెంచిన; వనదేవతవో= వనదేవతవా?; శారదవో= సరస్వతివా?; రతిపతి= మన్మథుడు; పంచిన= ఆజ్ఞాపించగా వచ్చిన; మాయవో= మాయారూపిణివా?; తపస్+సారమవో= తపస్సుయొక్క పరమార్థమైనదానివా?

**తా :** సతీ! ఎవరు నీవు? ఈ కొండదగ్గరకు ఏ పనిమీద వచ్చావు? నీవు వనదేవతవా? సరస్వతీదేవివా? లేకపోతే మన్మథుడు పంపిన మాయామూర్తివా? కాకపోతే ఫలించిన నా తపస్సంపదవా?

**ఉ. అంగజుఁడెక్కుడించిన శరాసనమున్ ధరియించి యంత నా**
**యంగజు వేఁట మానవమృగావళిఁజూచుచు నున్న దానవో!**
**రంగగు నీ నిజాకృతి తెఱంగెఱుఁగంగ నిజంబు వల్కుమా**
**యంగన నిన్నుఁగన్గొనిన యంత ననంగుఁడు సందడించెడున్. 28**

**ప్రతి :** అంగజుఁడు= మన్మథుడు; ఎక్కుడించిన= ఎక్కుపెట్టిన; శర+ఆసనమున్= విల్లును; ధరియించి= పట్టుకొని; అంతన్= ఆ పిమ్మట; ఆ+అంగజు= ఆ మన్మథుని; వేఁటన్= క్రీడకై; మానవ= నరులనే; మృగ+ఆవళిన్= జంతువుల గుంపును; చూచుచున్+ఉన్నదానవో= దర్శిస్తున్నావా?; రంగు+అగు= మేలైన; నీనిజ+ఆకృతి= నీ సహజమైన స్వరూపం; తెఱంగు+ఎఱుఁగంగన్= విధానము తెలిసేటట్లు; నిజంబు+పల్కుమా= నిజాన్ని చెప్పు; అంగన= సుందరాలైన అంగాలు కలదానా!; నిన్నున్= నిన్ను; కన్గొనిన+అంతన్= చూచినంతనే; అనంగుఁడు= మన్మథుడు; సందడించెడున్= గోల చేయుచున్నాడు.

**తా :** ఓ మగువా! మదనుడు ఎక్కుపెట్టిన విల్లును నీవు చేతబట్టుకొని మన్మథు వేటకై ఈ అడవిలోని నరమృగాలను (మానవ మృగాలను) వేటాడుతున్నావా? నీ అసలు స్వరూపం నాకు స్పష్టంగా తెలిసేలాగా చెప్పు. నిన్ను చూస్తుంటే మదనుడు నాలో కోలాహాలం చేస్తున్నాడు.

**క. పొలుపగుచున్న విలాసం, బుల నంగజు బాణములను బోలెడి నీ చం**
**చల సత్కటాక్షవీక్షణ, ముల నెవ్వని నింతి! చిత్తమునఁగలఁచెదవే! 29**

**ప్రతి :** ఇంతి= ఓ మగువా!; పొలుపు+అగుచున్న= అందం ప్రకటిస్తున్న; విలాసంబులన్= విలాసాలతో; అంగజు బాణములను+పోలెడి= మన్మథుని బాణాలేమో అన్నట్లున్న; నీ= నీయొక్క; చంచల= కదలికతో కూడిన; సత్+కటాక్ష+ వీక్షణములన్= చక్కని కడగంటి చూపులతో; ఎవ్వని= ఎవనియొక్క; చిత్తమునన్= మనసును; కలఁచెదవే= చీకాకు పరుస్తున్నావు.

**తా :** ఓ ఇంతీ! నీ అందమైన విలాసాలతో మన్మథుని వాడి తూపులవంటి కడగంటి చూపులతో ఎవరి మనసును చీకాకు పరుస్తున్నావు?

**చ. చెదరఁగ వేదముల్ సదువు శిష్యులపైఁ దగఁ బుష్పవృష్టి స**
**మ్మదమున నంతలోఁగురియుమాడ్కిని మన్మథసామగానముల్**
**సదివెడు శిష్యులో యనఁగ షట్పదపంక్తులు సేరి మ్రోయఁగాఁ**
**బదపడి మీఁద రాలు గచభారమునందుల జాఱు క్రొవ్విరుల్. 30**

**ప్రతి :** వేదముల్+చదువు= వేదాధ్యయనం చేసే; శిష్యులపైన్= ఛాత్రులపై; తగన్= ఒప్పిదంగా; పుష్పవృష్టి= పూలవాన; సమ్మదమునన్= సంతోషంతో; అంతలోన్= అంతలో; కురియు మాడ్కిని= కురిసేవిధంగా; మన్మథసామగానముల్= మన్మథుని సామవేదాల సంగీతం; చదివెడు= అధ్యయనం చేసే; శిష్యులో యనఁగన్= శిష్యులా అనేటట్లు; షట్పదపంక్తులు= తుమ్మెదల వరుసలు; చేరి= సమీపించి; మ్రోయఁన్+కాన్= రొద చేయఁగా; పదపడి= అటుపైన; కచభారమునందులన్= క్రొమ్ముడినుండి; జాఱు= జారే; క్రొత్త+విరుల్= కొత్తవయిన సుమములు; చెదరఁగన్= వెదజల్లినట్లు; మీఁదన్ రాలున్= తుమ్మెదలపై రాలుతున్నాయి.

**తా :** మన్మథ సామగానాలు ఆలపించే శిష్యులేమో అన్నట్లు తుమ్మెదల గుంపు నీకు వంత పాడుతున్నాయి. వేదాలు చదివే శిష్యులపైన విరులవాన కురిసే విధంగా ఆ తుమ్మెదల మీద నీ వాలుజడనుండి పూలు జలజల రాలుతున్నాయి.

**క. అందియల వెలయు రత్నము, లందంబుగ లలిత పదములన్ సుభగములై**
**యందంద మ్రోయుచును నా, డెందంబునఁ దగిలి సందడించెడిఁ దరుణీ! 31**

**ప్రతి :** తరుణీ= ఓ పడతీ!; అందియలన్= అందియలందు; వెలయు= ప్రకాశించు; రత్నములు= నవరత్నాలు; అందంబుగన్= అందంగా; లలితపదములన్= సుకుమారమయిన చరణాలందు; సుభగములు+ఐ= సుందరములై; అందు+అంద= అక్కడక్కడ; మ్రోయుచున్= మ్రోగుతూ; నాడెందంబునన్= నా మనస్సునందు; తగిలి= లగ్నమై; సందడించెడిన్= సందడించెను.

**తా :** ఓ పడతీ! అందియలలో ప్రకాశించే రత్నాలు నీ సుకుమారమైన పాదాలలో సుందరములై అక్కడక్కడ మ్రోగుతూ నా మనసులో లగ్నమై సందడి చేస్తున్నాయి.

**క. పాయక కదంబ పుష్ప, చ్ఛాయం గల వస్త్రకాంతి సల్లెడుఁగంటే**
**యా యెడ నితంబరోచులు, గాయుచు నెడతెగక తటిమి కప్పెడుఁదన్వీ! 32**

**ప్రతి :** తన్వీ= ఓ తరుణీ!; పాయక= విడువక; కదంబ పుష్పచ్ఛాయన్+కల= కడిమిపువ్వులచాయ వలెనున్న; వస్త్రకాంతి= ధరించిన వస్త్రముల కాంతి; చల్లెడున్= విరజిమ్మియుండుటను; కంటే= చూచినావు గదా!; ఈ+ఎడన్= ఇప్పట్టున; నితంబరోచులు= పిరుదుల కాంతులు; కాయుచున్= ప్రసరిస్తూ; ఎడతెగక= సంతతం; తఱిమి కప్పెడున్= కప్పివేస్తున్నాయి.

**తా :** ఓ తన్వీ! కడిమి పువ్వుల కాంతులను పుణికి పుచ్చుకొనే నీ చీర నిగనిగలను ఎడతెగకుండా బయటకు ప్రసరించే నీ కటికాంతులు కప్పి వేస్తున్నవి గదా!

**క.** **నిరతము నీ తనుమధ్యముఁ, గర మరుదుగ నరసి చూడఁగానంబడ, దీ**
**కరికుంభంబులఁబోలెడి, గురుకుచముల నెట్లు నిలుపుకొంటి లతాంగీ!** **33**

**ప్రతి :** లతా+అంగీ= తీగెవంటి దేహముగలదానా!; నిరతము= ఎల్లప్పుడు; నీ= నీయొక్క; తనుమధ్యమున్= సన్నని నడుమును; కరము+అరుదుగన్= మిక్కిలి వింతగా; అరసి= పరిశీలించి; చూడన్= చూడగా; కానన్+పడదు= దృగ్గోచర మగుటలేదు; ఈ కరికుంభంబులన్= ఈ ఏనుగుల కుంభస్థలాలను; పోలెడి= సరిపోలునట్టి; గురుకుచములన్= గబ్బిగుబ్బలను; ఎట్లు= ఏ రీతి; నిలుపుకొంటి= నిలుపుకొన్నావు?

**తా :** ఓ లతాంగీ! చూద్దామన్నా నీ నడుము కనబడదు. అలాంటప్పుడు ఏనుగు కుంభస్థలం లాంటి స్తనద్వయాన్ని ఎలా మోస్తున్నావు?

**క.** **పొంకములగు కుచములపైఁ, గుంకుమపంకంబుఁబూసికొని వాసనలం**
**గొంకక వెదచల్లెడు నీ, బింకంబగు చన్నుదోయి పెంపో సొంపో.** **34**

**ప్రతి :** పొంకములు+అగు= తీరయినట్టి; కుచములపైన్= స్తనాలపై, కుంకుమపంకంబున్= కుంకుమపువ్వు లేపనమును; పూసికొని= అలదుకొని; వాసనలన్= పరిమళాలను; కొంకక= వెనుదీయక; వెదచల్లెడు= వెదచల్లుతున్న; నీ= నీయొక్క; బింకంబు+అగు= గట్టివైన; చన్నుదోయి= కుచాల జంట; పెంపో= పెరుగుదలయో; సొంపో= అందమో కదా!

**తా :** ఓ పూబోణీ! పొంకమైన నీ స్తనాలమీద కుంకుమలేపనం పూసుకొన్నావు. పరిమళాలు వెదచల్లే బింకమైన నీ చందోయి పెంపునూ, సొంపునూ వర్ణించడం నాకు చేతనౌతుందా?

**శా.** **ఏ లోకంబుననుండి వచ్చితివి? నీ విచ్చోటికిన్ మున్ను నే**
**నే లోకంబునఁ జెప్పఁజూప నెఱుఁగన్ నీ సుందరాకారమున్**
**నీ లాలిత్యము లీ వినోదములు నీ కిట్లొప్పునే? కామినీ?**
**భూలోకంబున కెట్టు వచ్చితివి నా పుణ్యంబగణ్యంబుగన్?** **35**

**ప్రతి :** కామినీ= ఓ లలనా! నీవు= నీవు; ఈ+చోటికిన్= ఈ మందరపర్వత సమీప ప్రదేశానికి; ఏ లోకంబునన్+ఉండి వచ్చితివి= ఏ లోకంనుండి వచ్చావు; మున్ను= ముందు; నేను; ఏ లోకంబునన్= ఏ లోకంలోగాని; చెప్పన్= నీవంటి అందగత్తె గలదని చెప్పగాగాని; చూపన్+ఎఱుఁగన్= ఇదిగో ఆ సుందరి అని ఇతరులు నిర్దేశించడం కూడా తెలియనివాణ్ణే; నీ సుందర+ఆకారమున్= నీ అందచందాలు గల రూపాన్ని; నీ లాలిత్యములు= నీ సరస సౌందర్య విలాసాలు; ఈ

వినోదములు= ఈ వింతలు; నీకున్+ఇట్లు+ఒప్పునే?= నీకు ఎంతగానో తగి ఉన్నాయి; భూలోకంబునకున్= భూలోకానికి; నా పుణ్యంబు+అగణ్యంబుగన్= లెక్కింపశక్యం గాని నా పుణ్యఫలమన్నట్లుగా; ఎట్టు= ఏ రకంగా; వచ్చితివి= వచ్చావు.

**తా :** కామినీ! ఏ లోకంనుండి ఇక్కడికి వచ్చావు? నీలాంటి అందగత్తెను గురించి ఎవరూ ఎక్కడా చెప్పుకోవడం నేను వినలేదు. లోకంలో ఎవరూ నీలాంటి సుందరిని చూపలేదు. అందమైన నీ ఆకారమూ, నీ లావణ్యమూ, నీ లీలావిలాసమూ ఎంత గొప్పగా ఉన్నాయో వర్ణించలేను. నేను చేసుకొన్న అంతులేని పుణ్యం ఫలించినట్లు ఈ భూలోకానికి ఎలా దిగి వచ్చావు?

**క. హాసావలోకనంబుల, భాసిల్లెడు నీ ముఖంబు పలుమఱు నిపు డే**
**యాసలు పుట్టింపఁగ నే, నాసగొనెద నిన్నుఁజూచి యంబుజనేత్రా! 36**

**ప్రతి :** అంబుజనేత్రా!= పద్మాలవంటి నేత్రాలు కలదానా!; హాస+అవలోకనంబులన్= చిరునవ్వుతో కూడిన వాల్చూపులతో; భాసిల్లెడు= ప్రకాశించెడి; నీ ముఖంబు= నీ వదనం; పలుమఱున్= పెక్కుసారులు; ఇపుడే= ఈ క్షణంలోనే; ఆసలు+ పుట్టింపఁగన్= కోరికలు కలిగిస్తుండగా; నిన్నున్+చూచి= నిన్ను కనుగొని; నేన్= నేను; ఆస+కొనెదన్= ఆశపడుతున్నాను.

**తా :** తామరపూలవంటి కన్నులు కలదానా! చిరునవ్వుతోకూడిన వాల్చూపులతో శోభిల్లే నీ సుందరవదనాన్ని చూస్తున్నకొద్దీ నాలో ఎన్నో కోరికలు చివురిస్తున్నాయి. నీ పొందుకోసం నేను ఆశపడుతున్నాను.

**ఆ. కందులేని యిందుకళ మించి నెఱ్మోము, కాంతియుక్త మగుచుఁగానుపించెఁ**
**గాన విష్ణుకలయుఁగాఁబోలు నని నా మ, నంబునందుఁదోఁచె నళిననేత్ర! 37**

**ప్రతి :** నళిననేత్ర= పద్మాలవంటి నయనాలు కలదానా; కందులేని= మచ్చలేని; ఇందుకళన్= చంద్రకళను; మించి= అతిశయించి; నెఱ+మోము= నిండు మొగం; కాంతియుక్తము+అగుచున్= కాంతితో కూడినదై; కానుపించెన్= కనిపిస్తున్నది; కానన్= ఆ కారణాన; నా మనంబునందున్= నా మనసులో; విష్ణుకలయున్+కాఁబోలున్= విష్ణుకళయేమో అని, తోఁచెన్= భావం కలిగింది.

**తా :** నళిననయనా! నీ ముద్దుల మొగం మచ్చలేని చంద్రకళనుమించి వెలుగులు వెదజల్లుతున్నది. ఆహా! అందుకనే కాబోలు అది నిజంగా 'విష్ణుఅంశ' అని మనస్సులో భావిస్తున్నాను.

**మ. పటుతాటంకరథాంగయుగ్మమునకుంబల్మాఱు భీతిల్లుచున్**
**నటనంబందెదు గండుమీనములతో నాసన్న నీలాలకో**
**త్కటభృంగావళితో ద్విజావళి లసత్కాంతిన్ విడంబించు మా**
**ఱట కాసారముఁబోలి నెమ్మొగము దా రంజిల్లు నత్యున్నతిన్. 38**

**ప్రతి :** పటుతాటంక= పటువైన చెవి కమ్మలు అనే; రథాంగ యుగ్మమునకున్= చక్రవాకాల జంటకు; పల్మాఱు= పెక్కుసార్లు; భీతిల్లుచున్= భయపడుతూ; నటనంబు+అందెదు= నటిస్తున్న; గండుమీనములతోన్= గండు చేపలతో; ఆసన్న= సమీపంలో ఉన్న; నీల+అలక= నల్లని ముంగురులనే; ఉత్కటభృంగ+ఆవళితోన్= మదించిన తుమ్మెదల గుంపులతో; ద్విజ+ఆవళి= దంతాల వరుసలయొక్క (పక్షులయొక్క); లసత్= ప్రకాశించే, కాంతిన్= కాంతిని; విడంబించు= అనుకరించు;

మాఱట కాసారమున్+పోలి= దానికి సమానమైన మరొక సరోవరాన్ని అనుకరించిందై; అతి+ఉన్నతిన్= మిక్కిలి ఔన్నత్యంతో; నెఱ+మొగము= నిండుమోము; తాన్; రంజిల్లున్= శోభిల్లుతూ ఉంది.

**తా :** ఓ ముద్దుగుమ్మా! నీ చెవుల దుద్దులు రెండూ చక్రవాకాలయితే, నీ కన్నులు వాటిని చూసి భయపడుతూ నాట్యంచేసే గండుచేపల్లాగ కదలుతుంటే, నీ నల్లని ముంగురులు కమ్ముకొన్న తుమ్మెదల గుంపులయితే, దంతాల వరుసలు హంసలయితే వీటితో తేజరిల్లుతున్న నీ ముద్దుమోగం చక్కని సరోవరంలాగా ఉంది.

**చ. కరువలిఁబాయువస్త్రమును గట్ట నెఱుంగవు, చూడ్కి దిక్కులం**
**బఱపుచుఁజంచరీకముల భాతిఁజెలంగెడు కంధరంబునం**
**బొరలెడు ముక్తకేశభరముందుఱుమంగఁదలంప, విప్పు డి**
**ట్లరుదుగ రత్నకందుకవిహారము సల్పెదు సంభ్రమంబునన్. 39**

**ప్రతి :** కరువలిన్= గాలికి; పాయు= తొలగు; వస్త్రమునున్= వస్త్రాన్ని; కట్టన్+ఎఱుంగవు= సరి చేసుకోవడం తెలియని దానిలా ఉన్నావు; చూడ్కి= చూపు; దిక్కులన్+పఱపుచున్= దిక్కుల ప్రసరింపజేస్తూ; చంచరీకముల భాతిన్= తుమ్మెదలవలె; చెలంగెడు= అలరారునట్టి; కంధరంబునన్= మెడలపై; పొరలు+ఎడు= పొరలునట్టి; ముక్తకేశభరమున్= విడిపోయిన జుట్టుముడిని; తుఱుమంగన్= ముడుచుకోవలెనని; తలంపవు= తలచుకోవడమే లేదు; ఇప్పుడు= ఈ దశలో; ఇట్లు= ఈ వేషంతో; అరుదుగన్= వింతగా; రత్నకందుక విహారము= రతనాల బంతితో ఆడుకోవడాన్ని; సంభ్రమంబునన్= వేగిరపాటుతో; సల్పెదు= చేస్తున్నావు.

**తా :** ఓ యువతీ! నవరత్నాల బంతితో ఆడుకొనే సంబరంలో నీవు కట్టుకున్న చీర గాలికి తొలగినా సవరించి కట్టుకోవడం లేదు. దిక్కులు పరికిస్తూ తుమ్మెదలవంటి శిరోజాల ముడి విడిపోయి మెడపై పడుతున్నా నీవు చక్కదిద్దుకోవడం లేదు. ఎంత సంభ్రమమో!

**వ. మఱియు నిట్లనుఁ దపోధనులగు వారల తపంబులను నీ రూపంబున నపహ్నవించిన దాన, వీ చక్కఁదనం బేమి తపంబున సంపాదించితివి? నా తోడం గూడి తపంబు సేయుము; సంసారంబు వృద్ధిఁ బొందం జేయుము; పద్మాసనుండు నాకుం బ్రత్యక్షంబై నిన్ను నిచ్చిన వాఁడు; గావున నిన్ను విడువంజాలను; నీ సఖీజనంబులు నా వాక్యంబులకు ననుకూలింతురు గాక! నీవు చను చోటికి నన్నుం దోడ్కొని చను మని స్త్రీలకు ననుకూలంబుగాఁ బలుక నేర్చిన యాగ్నీధ్రుండు పెక్కుభంగులం బలికిన నా పూర్వచిత్తియు నతని యనునయ వాక్యంబులకు సమ్మతించి వీర శ్రేష్ఠుండగు నా రాజవర్యుని బుద్ధిరూపశీలౌదార్య విద్యావయశ్శ్రీలచేఁ బరాధీనచిత్త యగుచు జంబూద్వీపాధిపతి యగు నా రాజశ్రేష్ఠునితోడం గూడి శతసహస్ర సంవత్సరంబులు భూస్వర్గభోగంబు లనుభవించె; నంత నాగ్నీధ్రుం డా పూర్వచిత్తివలన నాభి కింపురుష హరివర్షేలావృత రమ్యక హిరణ్మయ కురు భద్రాశ్వ కేతుమాల సంజ్ఞలు గల కుమారులఁ బ్రతిసంవత్సరంబు నొక్కొక్కనిగఁ దొమ్మండ్రం గాంచె; నంత నా పూర్వచిత్తి యా యర్భకుల గృహంబున విడిచి యాగ్నీధ్రుం బాసి బ్రహ్మలోకంబునకుం జనిన నా యాగ్నీధ్రపుత్రులు మాతృసామర్థ్యంబునం జేసి స్వభావంబునన శరీరబలయుక్తు లగుచుఁ దండ్రిచేత ననుజ్ఞాతులై తమ నామంబులఁ బ్రసిద్ధంబు లయిన జంబూద్వీపాది**

**వర్షంబులం బాలించు చుండి; రంత నాగ్నీధ్రుండు నా పూర్వచిత్తి వలనం గామోపభోగంబులం దృప్తి బొందక పూర్వచిత్తిం దలంచుచు వేదోక్తంబులగు కర్మంబులం జేసి తత్సలోకంబగు బ్రహ్మలోకంబునకుం జనియె; నిట్లు దండ్రి పరలోకంబునకుం జనిన నాభిప్రముఖులగు నాగ్నీధ్రకుమారులు దొమ్మండ్రును మేరుదేవియుఁ బ్రతిరూపయు, నుగ్రదంష్ట్రయు, లతయు, రమ్యయు, శ్యామయు, నారియు, భద్రయు, దేవవతియు నను నామంబులు గల మేరు పుత్త్రికలగు తొమ్మండ్రు కన్యకలను వివాహంబై రంత. 40**

ప్రతి : మఱియున్= పూర్వచిత్తి సౌందర్యాన్ని పదే పదే ప్రశంసిస్తూ, ఆశ్చర్యపడుతూ; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; తపోధనులు+అగువారల= తపస్సే ధనంగా గలవారియొక్క; తపంబులను= తపఃఫలితాలను; ఈ రూపంబునన్= ఈ రూపంతో; అపహ్నవించిన దానవు= చెడగొట్టినదానవు; ఈ చక్కదనంబున్= ఈ అందచందాలను; ఏమితపంబునన్= ఎలాంటి తపశ్చర్య వలన; సంపాదించితివి= సంపాదించుకోగలిగావు; నాతోడన్+కూడి= నాతో చేరి (నాకు జతగా); తపంబున్+చేయుము= తపస్సు చేయి; సంసారంబున్= సంసారాన్ని; వృద్ధిన్+పొందన్+చేయుము= పెరిగేలా చేయి; పద్మ+ఆసనుండు= పద్మాన్ని ఆసనంగా గల బ్రహ్మ; నాకున్= నాకు; ప్రతి+అక్షంబు+ఐ= సాక్షాత్కరించి; నిన్నున్= అపూర్వ సౌందర్యవతి అయిన నిన్ను; ఇచ్చినవాఁడు= ప్రసాదించాడు; కావునన్= కనుక; నిన్నున్= నా కంటబడిన నిన్ను; విడువన్+చాలను= వదలిపెట్టలేను; నీ సఖీజనంబులు= నీతో నెయ్యము గలిగిన యువతులు; నా వాక్యంబులకున్= నా దృఢనిశ్చయానికి; అనుకూలింతురు+కాక= అనుకూలంగా వ్యవహరిస్తారు; నీవు= పూర్వచిత్తివయిన నీవు; చనుచోటికిన్= వెళ్ళదలచుకొన్న ప్రదేశానికి; నన్నున్+తోడ్కొని చనుము= నన్ను వెంటబెట్టుకొని వెళ్ళు; అని= పై విధంగా అభ్యర్థించి; స్త్రీలకున్+అనుకూలంబు+కాన్= స్త్రీల మనస్తత్త్వానికి తగినట్లుగా; పలుక నేర్చిన= సంభాషించగల నేర్పుగల్గిన; ఆగ్నీధ్రుండు= ఆగ్నీధ్రుడు; పెక్కుభంగులన్+పలికినన్= పలు రీతులుగా తన భావాలను ప్రకటింపగా; ఆ పూర్వచిత్తియున్= ఆ పూర్వచిత్తి కూడా; అతని= ఆగ్నీధ్రుని; అనునయ వాక్యంబులకున్= బుజ్జగింపు మాటలకు; సమ్మతించి= ఒప్పుకొని; వీరశ్రేష్ఠుండు+అగు= వీరులలో శ్రేష్ఠుడయిన; ఆ రాజవర్యుని= రాజన్యులలో శ్రేష్ఠుడయిన ఆగ్నీధ్రుని; బుద్ధిరూపశీల+ఔదార్య విద్యావయస్+శ్రీలచేన్= బుద్ధి, రూపము, స్వభావము, ఔదార్యము, విద్య, వయస్సు, సంపదలచేత; పర+అధీనచిత్త+అగుచున్= లోబడిన చిత్తం కలదవుతూ; జంబూద్వీప+అధిపతి+అగు= జంబూద్వీపమనే పేరుగల ద్వీపానికి ఆధిపత్యం వహించే; ఆ రాజశ్రేష్ఠుని తోడన్+కూడి= ఆ ఆగ్నీధ్రునితోచేరి; శతసహస్ర సంవత్సరంబులు= నూరువేల సంవత్సరాలు; భూస్వర్గభోగంబులు+అనుభవించెన్= భూమిపై స్వర్గసుఖాలను అనుభవించినది; అంతన్= ఆపై, ఆగ్నీధ్రుండు; ఆ పూర్వచిత్తివలనన్= బ్రహ్మదత్త అయిన పూర్వచిత్తి వలన, నాభి, కింపురుష, హరివర్ష, ఇలావృత, రమ్యక, హిరణ్మయ, కురు, భద్రాశ్వ, కేతుమాల అనే; సంజ్ఞలు+కల= పేర్లు కలిగిన; కుమారులన్= కుమారులను; ప్రతి సంవత్సరంబున్= క్రమం తప్పక ప్రతి సంవత్సరమూ; ఒక్క+ఒక్కనిగన్= ఒక్కొక్కనిగా; తొమ్మండ్రన్= తొమ్మిదిమందిని కన్నాడు; అంతన్= ఆపై, ఆ పూర్వచిత్తి= నిర్దిష్ట కార్యార్థం వచ్చిన పూర్వచిత్తి; ఆ+అర్భకులన్= ఆ తొమ్మండుగురు పిల్లలను; గృహంబునన్+విడిచి= ఇంటిలో వదలిపెట్టి; ఆగ్నీధ్రున్+పాసి= ఆగ్నీధ్రుని వదలిపెట్టి; బ్రహ్మలోకంబునకున్+చనినన్= సత్యలోకానికి వెళ్ళగా; ఆ ఆగ్నీధ్రపుత్రులు= ఆ ఆగ్నీధ్రునియొక్క నాభి మొదలయిన పుత్రులు; మాతృసామర్థ్యంబునన్+చేసి= తల్లి సమర్థతవలన; స్వభావంబునన్= స్వభావంచేతనే; శరీరబలయుక్తులు+అగుచున్= శారీరకంగా బలవంతులై; తండ్రిచేతన్= ఆగ్నీధ్రునిచేత; అనుజ్ఞాతులు+ఐ= సమ్మతిని పొందినవాళ్లై; తమ నామంబులన్= తమ తమ పేర్లతో; ప్రసిద్ధంబులు+అయిన= ప్రఖ్యాతి వహించిన; జంబూద్వీప+ఆదివర్షంబులన్= జంబూద్వీపం మొదలయిన భూభాగాలను; పాలించుచుండిరి= పరిపాలించ సాగారు;

అంతన్= అటుపిమ్మట; ఆగ్నీధ్రుండు= పుత్రులబడసిన ఆగ్నీధ్రుండు; ఆ పూర్వచిత్తి వలనన్= తనను అంతగా మోహింపజేసిన పూర్వచిత్తి వలన; కామ+ఉపభోగంబులన్= సురతకేళీ సుఖానుభవాలతో; తృప్తిన్+పొందక= సంతృప్తిచెందక; పూర్వచిత్తిన్+ తలంచుచున్= ఆ పూర్వచిత్తినే మనసులో తలచుకొంటూ; వేద+ఉక్తంబులు+అగు= వేదములయందు చెప్పబడిన; కర్మంబులన్+ చేసి= కర్మలను చేసి; తత్+సలోకంబగు= ఆమె ఉండు లోకమగు; బ్రహ్మలోకంబునకున్+చనియెన్= బ్రహ్మలోకమునకు వెళ్ళెను; ఇట్లు= ఈ విధంగా; తండ్రి= జనకుడైన ఆగ్నీధ్రుడు; పరలోకంబునకున్+చనినన్= సత్యలోకమునకు వెళ్ళిపోగా; నాభిప్రముఖులు+అగు= నాభి మొదలయిన; ఆగ్నీధ్రకుమారులు= ఆగ్నీధ్రుని కుమారులు; తొమ్మండ్రును= నాభి, కింపురుష, హరివర్ష మొదలయిన తొమ్మిదిమందియు; మేరుదేవియున్; ప్రతిరూపయున్; ఉగ్రదంష్ట్రయున్; లతయున్; రమ్యయున్; శ్యామయున్; నారియున్; భద్రయున్; దేవవతియున్ అను నామంబులు గల= అనే నామధేయములతో కూడిన; మేరుపుత్రికలు+అగు= మేరు కుమార్తెలయిన; తొమ్మండ్రు కన్యకలను= తొమ్మిదిమంది కన్యలను; వివాహంబు+ఐరి= వివాహమాడిరి; అంతన్= ఆ మీద.

**తా :** ఆగ్నీధ్రుడు ఆ అప్సరసతో ఇంకా ఇలా అన్నాడు. 'తలోదరీ! తపస్సు చేస్తున్న తపోధనుల తపస్సునంతా నీవు నీ అందచందాలతో భగ్నం చేస్తున్నావు. ఈ చక్కదనమంతా ఏ తపస్సువల్ల దక్కించుకున్నావు? నాతోపాటు నీవుకూడ తపస్సు సాగించు. నా సంతానాన్ని పెంచు, బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై నిన్ను నాకు ప్రసాదించాడు. అందుచేత నిన్ను వదలిపెట్టను. నీ చెలికత్తెలు నేను చెప్పే మాటలను తప్పక అంగీకరిస్తారు. నీవు వెళ్ళేచోటికి నన్నుకూడా పిలుచుకొని పో అంటూ స్త్రీల మనస్తత్వానికి అనుగుణంగా పలుకనేర్చిన ఆగ్నీధ్రుడు పరిపరివిధాల తన భావాన్ని ప్రకటించాడు. పూర్వచిత్తి కూడా అతని అనునయవాక్యాలకు సమ్మతించింది. వీరశ్రేష్ఠుడయిన ఆ రాజేంద్రుని బుద్ధికీ, రూపానికీ, శీలానికీ, ఔదార్యానికీ, విద్యకూ, వయస్సుకూ, సంపదకూ లొంగిపోయింది. జంబూద్వీపాధిపతియైన ఆ ఆగ్నీధ్రునితోగూడి నూరువేల సంవత్సరాలు భూలోకంలో స్వర్గసౌఖ్యాలు అనుభవించింది.

ఆగ్నీధ్రుడు పూర్వచిత్తివలన వరుసగా నాభి, కింపురుష, హరివర్ష, ఇలావృత, రమ్యక, హిరణ్మయ, కురు, భద్రాశ్వ, కేతుమాల అనే నామధేయాలు గల తొమ్మండుగురు కుమారులను కన్నాడు. ఆ తరువాత పూర్వచిత్తి పిల్లలను ఇంట్లో వదలిపెట్టి ఆగ్నీధ్రుణ్ణి విడిచి బ్రహ్మలోకానికి వెళ్ళిపోయింది. ఆగ్నీధ్రుని కుమారులు తల్లి సామర్థ్యంవల్ల స్వభావసిద్ధంగానే గొప్ప బలిష్ఠులయ్యారు. తండ్రి అనుమతితో జంబూద్వీపంలోని వర్షాలను విభజించుకొని పరిపాలించారు. వారు పరిపాలించిన ప్రదేశాలు వారి వారి నామాలతోనే ప్రసిద్ధమయినాయి.

పూర్వచిత్తితో ఆగ్నీధ్రుడు ఎంతోకాలం కామోపభోగాలు అనుభవించినా అతనికి తృప్తి కలుగలేదు. ఆ తరువాత ఆగ్నీధ్రుడు భార్యను తలచుకొంటూ వేదోక్తకర్మలు ఆచరిస్తూ చివరకు భార్య ఉన్న లోకానికి చేరుకున్నాడు. ఈ విధంగా తండ్రి పరలోకగతుడు కాగా నాభి మొదలైన ఆగ్నీధ్రుని కుమారులు మేరుకుమార్తెలయిన మేరుదేవి, ప్రతిరూప, ఉగ్రదంష్ట్ర, లత, రమ్య, శ్యామ, నారి, భద్ర, దేవి అనువారిని వరుసగా వివాహమాడారు.

### a:::భగవంతుండగు నారాయణుండు ఋషభావతార మెత్తుట::: a

**ఆ. నరవరేణ్యుఁడైన నాభి సంతానార్థ, మంగనయును దాను యజ్ఞపురుషుఁ**
**డయిన వాసుదేవు నతులభక్తి శ్రద్ధ, లను జెలంగి పూజ లొనరఁజేసి. 41**

**ప్రతి :** నరవరేణ్యుఁడు+ఐన= నరులలో శ్రేష్ఠుడయిన; నాభి= ఆగ్నీధ్రుని ప్రథమపుత్రుడు (మేరువుకు భర్తయు నయిన నాభినామకుడు); సంతాన+అర్థము= సంతానంకోసం; అంగనయును= ధర్మపత్నియగు మేరుదేవియు; తానున్= తాను; యజ్ఞపురుషుఁడు+అయిన= యజ్ఞపతి అయిన; వాసుదేవున్= వాసుదేవుని; అతులభక్తిశ్రద్ధలను= సాటిలేని భక్తిశ్రద్ధలతో; చెలంగి= పూనుకొని; పూజలు+ఒనరన్+చేసి= పూజలను వరుసగా నిర్వర్తించి.

**తా :** నరవరేణ్యుడైన నాభి సంతానార్థం భార్యాసమేతంగా, శ్రద్ధాభక్తులతో యజ్ఞపురుషుడయిన వాసుదేవుని పూజించాడు.

**వ. మఱియుం బ్రవర్గ్యసంజ్ఞికంబు లగు ధర్మంబులు శ్రద్ధా విశుద్ధ ద్రవ్యదేశకాల మంత్రర్త్విగ్దక్షిణా విధాన యోగంబులం బరమేశ్వరుని మెప్పించిన, నెవ్వరికిం బ్రసన్నుండు గాని పుండరీకాక్షుండు భక్తవత్సలుండై సురుచిరావయవంబులతో యజనశీలం బయిన యాతని హృదయంబునందుఁ బాయని రూపంబు గలిగి మనోనయనానందకరావయవంబులు గల తన స్వరూపంబాతనికిఁజూపందలంచి. 42**

**ప్రతి :** మఱియున్= పూజలు చేయడం మాత్రమేగాక; ప్రవర్గ్యసంజ్ఞికంబులు+అగు= ప్రవర్గ్యములు అను పేరుగల; ధర్మంబులు= ధర్మకార్యంబులు; శ్రద్ధా= శ్రద్ధచే; విశుద్ధ= పరిశుద్ధమైన; ద్రవ్య= కావలసిన పదార్థాలను; దేశ= దేశానికి తగిన; కాల= కాలానుగుణమయిన; మంత్ర+ఋత్విక్+దక్షిణావిధాన యోగంబులన్= మంత్రాలు, యజ్ఞాలు చేసేవారు, యజ్ఞం చివర పంచిపెట్టే దక్షిణల విధానంతో; పరమ+ఈశ్వరునిన్= వాసుదేవుని; మెప్పించినన్= మెప్పించగా; ఎవ్వరికిన్= సామాన్యులయిన వారెవ్వరికిని; ప్రసన్నుండు+కాని= సాక్షాత్కరించని; పుండరీక+అక్షుండు= తెల్లదామరలవంటి కన్నులు కలవాడు; భక్తవత్సలుండు+ఐ= భక్తులపట్ల వాత్సల్యగుణం కలవాడై; సురుచిర+అవయవంబులతోన్= చక్కని అవయవ విన్యాసాలతో; యజనశీలంబు+అయిన= యజ్ఞ నిర్వహణ స్వభావం కలదైన; ఆతని హృదయంబునందున్= ఆ 'నాభి' హృదయంలో; పాయని= వదలిపెట్టని; రూపంబున్+కలిగి= రూపంతో ఉండి; మనస్= మనస్సుకు; నయన= కనులకు; ఆనందకర= ఆనందాన్ని కలిగించు; అవయవంబులు+కల= అంగాలు గల; తన= తనయొక్క; స్వరూపంబు= ఆకారాన్ని; ఆతనికిన్+చూపన్= ఆతనికి చూపింప; తలంచి= భావించి.

**తా :** ఇంకనూ నాభి ప్రవర్గ్యమనే ధర్మములను శ్రద్ధతో పరిశుద్ధమయిన ద్రవ్యాలతో ఉచిత ప్రదేశంలో దేశకాలానుగుణంగా, విధివిహితంగా, మంత్రవేత్తలయిన ఋత్విక్కులతో భూరిదక్షిణలతో ఆరంభించాడు. సాధారణంగా ఎవరికీ ప్రసన్నుడుకాని భక్తవత్సలుడయిన పుండరీకాక్షుడు పరమాత్ముడు ప్రకాశవంతమయిన అవయవ సౌష్ఠవంతో నాభి హృదయంలో తాను సదా నెలకొని ఉన్నప్పటికినీ ప్రత్యక్షరూపంతో కనులకు పండువుగా మనసుకు నిండుగా తన స్వరూపాన్ని అతనికి చూపాలనుకొన్నాడు.

**సీ. అంత నావిష్కృతకాంత చతుర్భుజంబులును బీతాంబరంబును వెలుంగ**
**శ్రీవత్సకౌస్తుభశ్రీరమాచిహ్నంబు లురమందు రమ్యమై యిరవుపడఁగ**
**శంఖచక్రగదాంబుజాతఖడ్గాదిదివ్యాయుధంబులు సేతులందు మెఱయ**
**నతులితనవరత్నహాటకాంకితనూత్న ఘనకిరీటద్యుతుల్ గడలుకొనఁగఁ**

**తే. గర్ణకుండలకటిసూత్రకనకరత్న, హారకేయూరవరనూపురాదిభూష**
**ణముల భూషితుఁడైన శ్రీనాయకుండు, దంపతుల కప్పు డెదురఁబ్రత్యక్షమయ్యె. 43**

**ప్రతి :** అంతన్= అంతట; ఆవిష్కృత= ప్రత్యక్షం చేయబడిన; కాంత= మనోహరమైన; చతుర్భుజంబులును= నాలుగు చేతులును; పీతాంబరంబును= పచ్చని బట్టయు; వెలుంగన్= ప్రకాశింపగా; శ్రీవత్స= శ్రీవత్సమనే పుట్టుమచ్చ; కౌస్తుభ= కౌస్తుభమనే మణి; శ్రీరమాచిహ్నంబులు= లక్ష్మీదేవి అనే గుర్తులు; ఉరము+అందున్= వక్షఃస్థలంపై; రమ్యము+ఐ= రమణీయమై; ఇరవు+పడన్+కన్= నెలకొనగా; శంఖ= పాంచజన్యమనే శంఖం; చక్ర= సుదర్శనమనే చక్రం; గదా= కౌమోదకి అనే గద; అంబుజాత= పద్మం; ఖడ్గ+ఆది+దివ్య+ఆయుధంబులు= నందకం అనే ఖడ్గం మొదలయిన దివ్యాయుధాలు; చేతులందున్= ఆయా చేతుల్లో; మెఱయన్= ప్రకాశింపగా; అతులిత= సాటిలేని; నవరత్న= వజ్రాది నవరత్నాలు; హాటక+అంకిత= బంగారు గుర్తులుగల; నూత్న= కొత్తదయిన; ఘనకిరీట= గొప్పదైన కిరీటంయొక్క; ద్యుతుల్= కాంతులు; కదలుకొనన్+కన్= దిక్కులలో వ్యాపింపగా; కర్ణకుండల= చెవికమ్మలు; కటిసూత్ర= మొలనూలు; కనకరత్నహార= బంగారంతో గూడి మణులు తాపిన హారాలు; కేయూర= భుజకీర్తులు; వర= శ్రేష్ఠమయిన; నూపుర+ఆది= అందెలు మొదలయిన; భూషణములన్= నగలచే; భూషితుఁడు+ఐన= అలంకృతుడైన; శ్రీనాయకుండు= లక్ష్మీపతి; దంపతులకున్= మేరునాభి దంపతులకు; ఎదురన్= కళ్లముందు; ప్రత్యక్షము+అయ్యెన్= కనబడ్డాడు.

**తా :** ప్రకాశించే చతుర్భుజాలతో, పీతాంబరాలతో, రమణీయమైన శ్రీవత్సం, కౌస్తుభమణి, శ్రీదేవి విరాజిల్లే వక్షఃస్థలంతో, శంఖం, చక్రం, గద, పద్మం, ఖడ్గం మొదలయిన దివ్యాయుధాలతో, సాటిలేని నవరత్నాల కాంతులు వెదజల్లే బంగారు కిరీటంతో మకరకుండలాలూ, మొలనూలూ, మణులు చెక్కిన స్వర్ణహారాలూ, బాహుపురులూ, కాలి అందెలు ప్రకాశింపగా లక్ష్మీరమణుడు ఆ దంపతుల ముందు ప్రత్యక్షమైనాడు.

**తే.** **ఇట్లు ప్రత్యక్ష మగు పరమేశ్వరునకుఁ, బెన్నిధానంబుఁగనుఁగొన్న పేదమాడ్కి**
**హర్షమున ఋత్విగాదికు లవనతాస్యు, లగుచు నభినుతి సేసి రిట్లనుచు నపుడు.** **44**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; ప్రత్యక్షము+అగు= సాక్షాత్కరించిన; పరమేశ్వరునకున్= మహావిష్ణువునకు; అవనత+ఆస్యులు+అగుచున్= వంచిన మొగాలు కలవారై; ఋత్విక్+ఆదికులు= ఋత్విక్కులు మున్నగువారు; పెన్నిధానంబున్= పెద్ద నిధిని; కనుగొన్న= చూచిన; పేదమాడ్కి= నిరుపేదలాగా; హర్షమునన్= సంతోషంతో; ఇట్లు= ఈ రీతిని; అభినుతి+చేసిరి= స్తోత్రాలు చేశారు.

**తా :** ఈ విధంగా ప్రత్యక్షమయిన భగవంతుణ్ణి ఋత్విక్కులు మున్నగువారు చూచారు. పెన్నిధిని దర్శించిన పేదవారివలె సంతోషంతో వారందరూ తలలు వంచి ఈ విధంగా స్తోత్రాలు చేశారు.

**క.** **పరిపూర్ణుఁడవై యుండియు, మఱవక మా పూజ లెల్ల మన్నింతువు; నీ**
**చరణారవిందసేవయు, ధరఁ బెద్దలు వినిచినటులు దగఁ జేసెదమౌ.** **45**

**ప్రతి :** పరిపూర్ణుఁడవు= పరిపూర్ణత కలిగినవాడివి; ఐ+ఉండియున్= అయి ఉన్నను; మఱవక= మఱచిపోకుండా; మాపూజలు+ఎల్లన్= మేము చేసే పూజలన్నీ; మన్నింతువు= ఆదరిస్తావు; నీచరణ+అరవింద సేవయున్= నీ పాదపద్మాలను సేవించడానికి; ధరన్= లోకంలో; పెద్దలు= సంప్రదాయజ్ఞులు; వినిచినటులన్= ఉపదేశించినట్లు; తగన్= సరైన మార్గంలో; చేసెదము= చేసుకొంటాము; ఔన్= నిశ్చయము.

**తా :** స్వామీ! నీవు పరిపూర్ణుడవు. అయినా మమ్మల్ని మరచిపోకుండా మా పూజలను స్వీకరిస్తున్నావు. పెద్దలు మాకు చెప్పినట్లు నీ చరణారవిందాలను సేవిస్తాము.

**క. ఏ మిపుడు సేయు సంస్తుతి, నీ మహిమ నెఱింగి కాదు; నిరతముఁబెద్దల్**
**దా మెది యుపదేశించిరొ, యా మతమునఁబ్రస్తుతింతు మయ్య మహాత్మా! 46**

**ప్రతి :** మహాత్మా= గొప్ప ఆత్మకలవాడా!; ఏము= మేము; ఇపుడు+చేయు= ప్రస్తుతం కావించే; సంస్తుతి= ప్రకృష్టమయిన స్తుతి; నీ మహిమన్= నీ ప్రభావాన్ని; ఎఱింగికాదు= తెలిసికాదు; నిరతమున్= ఎల్లప్పుడూ; పెద్దల్= పెద్దలైనవారు; తాము+ఎది+ఉపదేశించిరొ= మాకు ఏది ఉపదేశించారో; ఆ మతమునన్= ఆ అభిప్రాయంతో; ప్రస్తుతింతుము+ అయ్య= స్తోత్రం చేస్తున్నామయ్యా!

**తా :** మహాత్మా! మేము నీ మహిమలు తెలిసి సంస్తుతి చేయడం లేదు. పెద్దలు మాకు ఏ విధంగా ఉపదేశించారో ఆ విధంగా ప్రస్తుతి చేస్తున్నాము.

**వ. మఱియు నీవు సంసారాసక్త మతి గలిగిన వారికి వశ్యుండవు గా; వీశ్వరుండవును బ్రకృతి పురుష వ్యతిరిక్తుండవును బరమ పురుషుండవును నయిన నిన్నుఁ బొందని ప్రపంచాంతర్గతంబు లయిన నామరూపంబులు గల యస్మదాదులచేత నిరూపింప నశక్యం బగుఁ; సర్వజీవులం జెందిన దురిత సంఘంబుల నిరసించు స్వభావంబు గల నీ యుత్తమ గుణంబులయందు నేకదేశంబ గాని సర్వగుణ నిరూపణంబు సేయ శక్యంబు గా నేరదు; నీ భక్తులు మిక్కిలి భక్తింజేసి సంస్తుతించు గద్గదాక్షరంబులను సలిల శుద్ధ పల్లవ తులసీదళ దూర్వాంకురంబులను సంపాదించిన పూజచే సంతసిల్లెడి నీకు బహువిధ ద్రవ్య సంపాదనంబు గలిగి విభవ యుక్తంబు లయిన యశ్వమేధాదులును దృప్తికరంబులు గా నేరవు; స్వభావంబున సర్వకాలంబులందును సాక్షాత్కరించి యతిశయంబై వర్తించుచు నశేషపురుషార్థ స్వరూపంబు బరమానంద రూపంబు నైనవాఁడ వగుటం జేసి యజ్ఞాదుల యందు నీకుఁ దృప్తి లేకయున్న నస్మదాదుల కోరికల నాపాదించు కొఱకు యజ్ఞాదుల నొనరింతు మని మఱియు నిట్లనిరి. 47**

**ప్రతి :** మఱియున్= ఇంకను; నీవు= భగవంతుడవైన నీవు; సంసార+ఆసక్తమతి= సంసారంలో ఆసక్తి చెందిన మనస్సు; కలిగిన వారికిన్= కలవారికి; వశుండవు+కావు= అధీనమైనవాడవు కావు; ఈశ్వరుండవును= అన్నిటికీ ప్రభువైనవాడవు; ప్రకృతి పురుష వ్యతిరిక్తుండవును= ప్రకృతికన్న జీవునికన్న వేరైనవాడవు; పరమపురుషుండవును+అయిన= పరమపురుషుడయిన; నిన్నున్+పొందని= నిన్ను చేరుకోలేని, అందుకోలేని, నీలో ఐక్యంకాలేని; ప్రపంచ+అంతర్గతంబులు+అయిన= పంచభూతాదుల సృష్టిలోపలివి అయిన; నామరూపంబులుగల= పేరు, ఒక ఆకారాన్ని గల; అస్మద్+ఆదులచేతన్= మాబోటి వారలచేత; నిరూపింపన్= నిరూపించుటకు; అశక్యంబు+అగు= సాధ్యం కానిదవుతుంది; సర్వజీవులన్+చెందిన= సమస్త జీవరాసులకు సంబంధించిన; దురితసంఘములన్= పాపసమూహాలను; నిరసించు= తిరస్కరించు; స్వభావంబుగల= స్వభావం కలిగిన; నీ+ఉత్తమగుణంబుల+అందున్= గొప్పవైన నీ మంచిగుణాలలో; ఏకదేశంబగాని= ఒక భాగం లేక అంశంగాని; సర్వగుణ నిరూపణంబు+చేయన్= అన్ని గుణాలను స్పష్టపరచడం; శక్యంబు+కానేరదు= సాధ్యపడదు; నీభక్తులు= నీయెడ భక్తి కలిగినవారు; మిక్కిలి భక్తిన్+చేసి= ప్రగాఢ భక్తివలన; సంస్తుతించు= పలుమారు నుతులు చేయు; గద్గద+అక్షరంబులను= భక్తితో వణకుచున్న గొంతు నుండి వెలువడిన అక్షరాలను; సలిల= నీటితో; శుద్ధ= శుభ్రం చేయబడిన; పల్లవ= చిగురాకు; తులసీదళ= తులసీదళం; దూర్వాంకురంబులను= లేత గడ్డిపరకల్ని; సంపాదించిన పూజచేన్= సమకూర్చుకొని చేసిన

అర్చనతో; సంతసిల్లెడినీకున్= సంతోషపడెడి నీకు; బహువిధ= అనేకానేకములయిన; ద్రవ్యసంపాదనంబు+కలిగి= సామగ్రిని సేకరించడం; విభవయుక్తంబులు+అయిన= వైభవంతో కూడిన; అశ్వమేధ+ఆదులును= అశ్వమేధాది యాగాలు; తృప్తికరంబులు+కానేరవు= సంతృప్తిని కల్గించవు; స్వభావంబునన్= స్వభావంచే; సర్వకాలంబులందును= అన్నికాలాల్లోను; సాక్షాత్కరించి= ప్రత్యక్షమై; అతిశయంబు+ఐ= అతిశయించినదై; వర్తించుచున్= తిరుగాడుచూ; అశేష= సమస్తమైన; పురుషార్థస్వరూపంబు= చతుర్విధ పురుషార్థాలకు కూడలి; పరమ ఆనందరూపంబును+ఐనవాఁడవు= గొప్ప ఆనందమే రూపంగా కలవాడవు; అగుటన్+చేసి= కావడంవల్ల; యజ్ఞ+ఆదులందున్= యాగాదులందు; నీకున్= నీకు; తృప్తిలేక+ఉన్నన్= తృప్తిలేకపోయినా; అస్మద్+ఆదుల= మావంటివారల; కోరికలన్= కోరికలను; ఆపాదించుకొఱకున్= నెరవేర్చు కొఱకై; యజ్ఞ+ఆదులన్= యజ్ఞం మొదలైన కార్యాలను; ఒనరింతుము+అని= చేయుచున్నామని; మఱియున్= ఆపై; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

**తా :** ఇంకనూ సంసారంలో మునిగి తేలేవారికి నీవు పట్టువడవు. నీవు ఈశ్వరుడవు. ప్రకృతికన్నా, జీవునికన్నా భిన్నమైనవాడవు. పరమపురుషుడవు. అయితే మేము పంచభూతాల సృష్టికి లోనయిన నామరూపాలు ధరించిన వాళ్లం. అటువంటి మాకు నీ తత్త్వాన్ని నిరూపించడం సాధ్యం కాదు. సకల జీవరాసుల పాపసమూహాలను తొలగించడం నీ స్వభావం. అటువంటి నీ ఉత్తమగుణాలలో ఏదో ఒక అంశమేగాని సమస్తగుణాలను నిరూపించడం ఎవరికీ ఏ మాత్రం శక్యంకాదు. నీ భక్తులు భక్తితో డగ్గుత్తికతో సంస్తుతిస్తూ, నీకర్పించే నీళ్లతో కడగబడిన, చిగురుటాకులు, తులసీదళాలు గరికమొలకలు మొదలైన వాటితో నీవు సంతృప్తి పడతావు. అంతేకాని, నానావిధ ద్రవ్యాలు సంతరించుకొని మహావైభవంతో చేసే అశ్వమేధాది యాగాలు కూడా నీకు సంతృప్తి కలిగించవు. స్వాభావికంగానే నీవు సర్వకాలాలలోనూ సాక్షాత్కరిస్తావు. నీవు సర్వాతిశాయివి. సమస్తపురుషార్థాలు నీవే. పరమానందస్వరూపుడవైన నీకు యజ్ఞయాగాదులవల్ల తృప్తి లేకున్నా మా కోరికలను తీర్చుకోవడంకోసం మేము యజ్ఞాలు చేస్తున్నాము.

**క. బాలిశుల మగుచు మిక్కిలి, మే లెఱుఁగని మమ్ము నీదు మించిన దయచేఁ**
**బాలించి యిత్తు వెప్పుడుఁ, జాలఁగ నిహపరములందు సకలసుఖంబుల్. 48**

**ప్రతి :** బాలిశులము+అగుచున్= మూర్ఖులమైన మేము; మిక్కిలిమేలు+ఎఱుఁగని= గొప్ప శుభాన్ని ఎరుగని; మమ్మున్= మమ్ము; నీదు= నీయొక్క; మించిన దయచేన్= అమితమయిన కరుణతో; పాలించి= పాలనంచేసి; ఇహపరములందున్= ఇహలోక, పరలోకాలలో; సకలసుఖంబుల్= సమస్త సుఖాలను; చాలఁగన్= లెస్సగా, మిక్కిలిగా; ఎప్పుడున్= ఎల్లకాలం; ఇత్తువు= ప్రసాదిస్తావు.

**తా :** దయానిధీ! మేము మూర్ఖులం. మాకేది మంచిదో ఏది కాదో మాకే తెలియదు. అయినా ఎంతో దయతో మమ్మల్ని కాపాడి ఇహపరాలకు తగిన సకలసుఖాలను నీవు మాకు ప్రసాదిస్తున్నావు.

**ఆ. ఇపుడు మేము నీకు నిష్టంబు లగు పూజ, లాచరింపకున్న నైన నధిక**
**మయిన నీ కృపాకటాక్ష వీక్షణములఁ, జక్కఁజూచి తగఁబ్రసన్నుఁడగుచు. 49**

**ప్రతి :** ఇపుడు= ఇప్పుడు; మేము= అల్పజ్ఞులమైన మేము; నీకున్= ప్రత్యక్షమైన నీకు; ఇష్టంబులు+అగు= సంప్రీతికరమైన; పూజలు+ఆచరింపక+ఉన్నన్+ఐనన్= విశేష పూజలు చేయకపోయినా; అధికము+అయిన= ఎంతో గొప్పవైన; నీ

కృపాకటాక్షవీక్షణములన్= నీ దయతో కూడిన క్రీగంటి చూపులతో; చక్కన్+చూచి= సూటిగా చూచి; తగన్= తగినట్లు; ప్రసన్నుఁడు+అగుచున్= అనుకూలుడగుచు...

**తా :** ఇపుడు మేము నీకు సంతుష్టి కలిగేటట్లు ఇష్టమైన పూజలు చేయకపోయినా మామీద కరుణాకటాక్ష వీక్షణాలను ప్రసరింపజేసి ప్రసన్నుడవైనావు.

**క. వర మీయఁదలఁచి మమ్ముం, గరుణించితి గాక! నిన్నుఁగనుఁగొనుటకునై**
**యరసి నుతింపఁగ మాకుం, దర మగునే? వరద! నీరదశ్యామాంగా! 50**

**ప్రతి :** నీరదశ్యామ+అంగా= మేఘంవంటి నల్లని దేహం కలవాడా!; వరద= వరాలను ప్రసాదించేవాడా!; వరము+ ఈయన్+తలఁచి= మాకు వరములీయాలని సంకల్పించి; మమ్ములన్= అల్పులమైన మమ్మల్ని; కరుణించితి+కాక= అనుగ్రహించావు కాని; నిన్నున్= నిన్ను; కనుగొనుటకున్+ఐ= చూడటానికై; అరసి= ప్రయత్నించి; నుతింపన్+కన్= కొనియాడడానికి; మాకున్+తరము+అగునే= మాకు సాధ్యమా?

**తా :** నీలమేఘంలాంటి శరీరచ్ఛాయ కలవాడా! కోరిన కోరికలు అనుగ్రహించేవాడా! నీవే మాకు వరమివ్వడంకోసం మాముందు సాక్షాత్కరించావు. నిన్ను సందర్శించడానికి గానీ, మరి సంస్తుతించడానికి గానీ మాకు సాధ్యమవుతుందా!

**వ. మఱియు నిస్సంగులై నిశితజ్ఞానంబునం జేసి దోషరహితులై భగవత్స్వభావులు నాత్మారాములు నగు మునులకు స్తుతియింపఁ దగిన గుణంబులు గలవాఁడ వగుచుండియుఁ బ్రసన్నుండవు, స్ఖలన క్షుత పతన జృంభణాది దురవస్థలందును జరామరణాది దుర్దశలందును వివశుల మగు మాకుఁ గల్మష నాశకరంబులయిన భవ ద్దివ్యనామంబులు మా వచనగోచరంబు లగుంగాక, మఱియు నీ రాజర్షి పుత్త్రకాముండై నీ తోడ సమానుండయిన కుమారునిం గోరి కామంబుల స్వర్గాపవర్గంబుల నీ నోపిన నినుం బూజించి ధనకాముం డైనవాఁడు ధనవంతునిం జేరి తుషమాత్రం బడిగిన చందంబున మోక్షనాథుండవైన నీవలన సంతానంబు గోరుచున్న వాఁడు; జయింపరాని నీ మాయచేత నెవ్వండు మోహంబు నొంది విషయాసక్తుండుగాక యుండు? నర్థకాములము మదాంధులము నగు మేము నిన్ను నాహ్వానంబు సేసిన యపరాధంబు సర్వాత్మకుండ వగుటంజేసి సామ్యంబుచే మన్నింపం దగుదువు; మమ్ము దయఁ జూడుమని ప్రణమిల్లిన దేవతాశ్రేష్ఠుండైన సర్వేశ్వరుండు వర్షాధిపతియగు నాభిచేతను, ఋత్విక్కుల చేతను వంద్యమానుండై దయాకలితుండగుచు నిట్లనియె. 51**

**ప్రతి :** మఱియున్= ఇంతియేగాక; నిస్సంగులు+ఐ= సంగంలేనివారై; నిశిత జ్ఞానంబునన్+చేసి= చురుకైన వాడియైన తెలివిచేత; దోషరహితులు+ఐ= దోషం లేనివారై; భగవత్+స్వభావులు= భగవంతుని తత్త్వమే తమ స్వభావమైన వారు; ఆత్మ+ఆరాములున్+అగు= తాను అనే వెలుగే విహారస్థానంగా కలవారైన; మునులకున్= మౌనులకు; స్తుతియింపన్+ తగిన= పొగడదగిన; గుణంబులు= సద్గుణాలు; కలవాఁడవు+అగుచుండియున్= కలిగినవాడవగు చుండియు; ప్రసన్నుండవు= అనుగ్రహశీలివి; స్ఖలన= జారుట; క్షుత= తుమ్మడం; పతన= పడడం; జృంభణ+ఆది= ఆవులింత మొదలగు; దుర్+ అవస్థలందును= కడగండ్ల కాలంలో; జరామరణ+ఆది= ముసలితనం, మరణం మొదలగు; దుర్దశలందును= కష్టకాలాలలో;

వివశులము+అగు= వశం తప్పినవారమైన; మాకున్= మాకు; కల్మషనాశకరంబులు+అయిన= పాపాలను నశియింపజేయునవైన; భవత్+దివ్యనామంబులు= నీయొక్క పవిత్ర నామధేయాలు; మా వచనగోచరంబులు= మా మాటలకందినవి; అగున్+కాక= అగుగాక; మఱియున్= మఱియును; ఈ రాజ+ఋషి= ఆగ్నీధ్రుడనే రాజర్షి; పుత్రకాముండు+ఐ= కుమారుని కోరినవాడై; నీతోడన్= భగవంతుడవయిన నీతో; సమానుండు+అయిన= తుల్యుడయిన; కుమారునిన్+కోరి= పుత్రుని పొందగోరి; కామంబులన్= కోరికలను; స్వర్గ+అపవర్గంబులన్= స్వర్గ, మోక్షాలను; ఈన్+ఓపిన= ఇవ్వడానికి సమర్థుడవయిన; నినున్+పూజించి= నిన్ను అర్చించి; ధనకాముండు+ఐనవాఁడు= డబ్బును కోరినవాడు; ధనవంతునిన్+చేరి= కలిమిగలవాని పొంతచేరి; తుషమాత్రంబు= వట్టి పొట్టును; అడిగిన చందంబునన్= అడిగిన రీతిలో; మోక్షనాథుండవు+ఐన= మోక్షానికి అధిపతివయిన; నీవలనన్= నీచేత; సంతానంబున్= సంతతిని; కోరుచున్నవాఁడు= అపేక్షించుచున్నవాడు; జయింపన్+రాని= జయించడానికి వీలుకాని; నీమాయచేతన్= నీ మాయచేత; ఎవ్వండు= ఎవడు; మోహంబున్+ఒంది= బహువిధాలైన మోహాలను పొంది; విషయ+ఆసక్తుండు+కాకయుండున్= ఇంద్రియార్థాలలో ఆసక్తుడు కాకుండా ఉంటాడు?; అర్థకాములము= ధనాన్ని, భౌతికసుఖాలను కోరే వాళ్లం; మద+అంధులము+అగు= పొగరుచే గ్రుడ్డివారమైన; మేము= మేము; నిన్నున్+ఆహ్వానంబు+చేసిన= నిన్ను యాగరూపంలో (వ్యాజమున) ఆహ్వానించిన, మంత్రరూపంతో ఆవాహనం చేసిన; అపరాధంబున్= తప్పిదాన్ని; సర్వ+ఆత్మకుండవు+అగుటన్+చేసి= సకల జనుల ఆత్మలలో ఉండేవాడు కావడంవల్ల; సామ్యంబుచేన్= పోలికచేత; మన్నింపన్+తగుదువు= క్షమించ అర్హుడవు; మమ్మున్= సామాన్యులైన మమ్ము; దయన్+చూడుము+అని= దయతో కనుగొనుమని; ప్రణమిల్లినన్= నమస్కరించగా; దేవతాశ్రేష్ఠుండు+ఐన= దేవతలలో ఉత్తముడవయిన; సర్వ+ఈశ్వరుండు= చరాచర జీవరాశికి ప్రభువయిన స్వామి; వర్ష+అధిపతి+అగు= వర్షం అనే భూభాగానికి రాజుగా; నాభిచేతను= నాభిచేత; ఋత్విక్కులచేతను= యజ్ఞాలు చేసేవారిచేతను; వంద్యమానుండు+ఐ= నమస్కరింపబడుచున్నవాడై; దయాకలితుండు+అగుచున్= దయావంతుడవుతూ; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా పలికాడు.

**తా :** మునులు కోరికలు లేనివారు. సునిశితమైన జ్ఞానం కలవారు. దోషరహితులు. భగవంతుని ప్రతిరూపాలు. ఆత్మారాములు. అలాంటి మునులకు స్తోత్రార్హుడ వయినప్పటికి నీవు అందరిపట్ల అనుగ్రహం చూపుతున్నావు. కాలు జారినప్పుడూ, క్రిందపడ్డప్పుడూ, తుమ్మినప్పుడూ, ఆవులించినప్పుడూ, ముసలితనంతో పీడింపబడుతున్నప్పుడూ, చావుకు చేరువ అయినప్పుడూ, మామీద మాకే అధికారం తప్పినప్పుడూ మా పాపాలను పోగొట్టే నీ దివ్యనామాలు మా నోటివెంట వెడలునట్లు అనుగ్రహించు.

ఈ రాజర్షి అయిన నాభి నీతో సమానమైన కొడుకు కావాలని నిన్ను పూజించాడు. కోరిన కోరికలనూ, స్వర్గాన్నీ, మోక్షాన్నీ సైతం ఇవ్వగల నిన్ను ఇలా అడగడం ధనంకోసం ధనవంతుని దగ్గరికివెళ్లి ఊక అడిగినట్టుంది. మోక్షప్రదాతవయిన నిన్ను సంతానంకోసం ప్రార్థిస్తున్నాడు. నీ మాయ దాటరానిది. అలాంటి మాయలకు లోబడి ఇంద్రియకాంక్షలకు లోనుకాని వాడెవడు? ప్రతి పనిని ప్రయోజనం దృష్టిలో పెట్టుకొని చేసేవాళ్ళం మేము. గర్వాంధులం నిన్ను ఆహ్వానించిన మా అపరాధాన్ని మన్నించు. మమ్ము అనుగ్రహించు అని నమస్కరించారు. అపుడు సర్వేశ్వరుడు జంబూద్వీపంలోని ఒక వర్షానికి అధిపతి అయిన నాభి, ఋత్విక్కులతో కలిసి చేసిన వందనాలు అందుకొంటూ దయతో ఇలా అన్నాడు.

**క. మునులార! వేదవాక్యము, లను బ్రస్తుతి సేసి సర్వలక్షణముల నా**
**కెన యగు పుత్త్రుని నిమ్మని, వినఁబలికితి రిపుడు మిగుల వేడుకతోడన్. 52**

**ప్రతి :** మునులార!= ఋత్విక్కులార!; వేదవాక్యములను= ఋగ్వేదాది వేదాలలోని పద్యగద్యములచే; ప్రస్తుతి+చేసి= స్తోత్రంచేసి; సర్వలక్షణములన్= అన్ని లక్షణాలతో; నాకున్+ఎనయగు= నాకు సమానమైన; పుత్రునిన్+ఇమ్ము+అని= కుమారుని ప్రసాదించమని; మిగులన్ వేడుకతోడన్= మిక్కిలి కుతూహలంతో; వినన్= నేను వినుచుండగా; పలికితిరి= విన్నవించారు.

**తా :** మునులారా! నన్ను వేదమంత్రాలతో ప్రస్తుతి చేశారు. సకల శుభలక్షణాలు కలిగి నాకు సాటి రాదగిన కొడుకును ప్రసాదించవలసిందిగా ఎంతో కుతూహలంతో మీరు నన్ను కోరారు.

**విశే :** భగవంతుడు వేదగోచరుడు అందువల్ల వేదవాక్కులతో ప్రస్తుతి చేయడం సమంజసమే.

**క. నాకాదిలోకములలో, నాకున్ సరివచ్చునట్టి నందను నెటు నా**
**లోకింపలేరు; గావున, నాకున్ సరి నేన కా మనమున నెఱుఁగుఁడీ! 53**

**ప్రతి :** నాక+ఆదిలోకములలోన్= స్వర్గం మొదలగు లోకాలలో; నాకున్= నాకు; సరివచ్చునట్టి= సాటియైన; నందనున్= కుమారుని; ఎటున్= ఎటగాని; ఆలోకింపన్‌లేరు= చూడలేరు; కావునన్= అందువల్ల; నాకున్= నాకు; సరి= సాటియైనవాడు; నేనకా= నేనే అని; మనమునన్= మనసులో; ఎఱుఁగుఁడు+ఈ= తెలుసుకొనండి.

**తా :** స్వర్గాదిలోకాలలో నాకు సాటిరాదగ్గ కుమారుడు ఎక్కడా కనిపించదు. నాకు సాటి నేనే. ఈ విషయం మీరు తెలుసుకొండి.

**వ. అదియునుంగాక భూసురోత్తములు నా ముఖం బగుటంజేసి విప్రవాక్యంబు దప్పింపరాదు; మీరు నా యీడు కుమారు నడిగితిరి గావున నాభిపత్ని యగు మేరుదేవియందు నేన పుత్రుండనై జనియించెద నని పలికి పరమేశ్వరుం డాగ్నీధ్రీయపత్ని యగు మేరుదేవి సూచుచుండ నా యజ్ఞంబున నంతర్ధానంబు నొంది యా నాభి మీఁది దయంజేసి దిగంబరులును దపస్వులును జ్ఞానులును నూర్ధ్వరేతస్కులును నగు నైష్ఠికులకు యోగధర్మంబుల నెఱింగింపం దలంచి పుండరీకాక్షుండు నాభి పత్ని యగు మేరుదేవి గర్భాగారంబునంబ్రవేశించె నంత. 54**

**ప్రతి :** అదియున్+కాక= అంతమాత్రమేగాక; భూసుర+ఉత్తములు= సర్వశ్రేష్ఠులైన బ్రాహ్మణులు; నా ముఖంబు+అగుటన్+చేసి= నా ముఖంనుండి ఉదయించిన వారగుటవలన; విప్రవాక్యంబున్= బ్రాహ్మణుల వాక్యాన్ని; తప్పింపన్+రాదు= తప్పింపరాదు అనగా అసత్యం చేయరాదు; మీరు= ఋత్విక్కులైన మీరు; నా+ఈడు= నాతో సమానుడైన; కుమారున్= పుత్రుని; అడిగితిరి= కోరుకొన్నారు; కావునన్= ఆ కారణమున; నాభిపత్ని+అగు= నాభి భార్య అయిన; మేరుదేవియందున్= మేరుదేవి గర్భంలో; నేను+అ= నేనే; పుత్రుండను+ఐ= కుమారుడనై; జనియించెదను+అని= పుట్టెదను అని; పలికి= వచించి; పరమ+ఈశ్వరుండు= ఆ మహావిష్ణువు; ఆగ్నీధ్రీయపత్ని+అగు= ఆగ్నీధ్రుని భార్య అయిన; మేరుదేవి+చూచుచుండన్= మేరుదేవి చూస్తుండగా; ఆ యజ్ఞంబునన్= ఆ యజ్ఞంలో; అంతర్ధానంబున్+ఒంది= మాయమైపోయి; ఆ నాభిమీఁదిదయన్+చేసి= ఆ నాభిపట్ల కరుణ కలవాడై; దిగంబరులును= వస్త్రాలు లేనివారూ; తపస్వులును= తపం చేసేవారూ; జ్ఞానులును= పరమాత్మ సంబంధి జ్ఞానం కలవారూ; ఊర్ధ్వరేతస్కులును+అగు= బ్రహ్మచారులైన; నైష్ఠికులకున్= నిష్ఠ గలవారికి; యోగధర్మంబులన్= యోగానికి చెందిన ధర్మాలను; ఎఱింగింపన్+తలంచి= తెలుపదలచి; పుండరీక+

అక్షుఁడు= పద్మపత్రాలవంటి కన్నులు కలవాడు; నాభిపత్ని+అగు= నాభి భార్య అయిన; మేరుదేవిగర్భ+అగారంబునన్= మేరుదేవి గర్భమనే గృహంలో; ప్రవేశించెన్= ప్రవేశించాడు; అంతన్= ఆ తరువాత.

**తా :** అంతేగాక, బ్రాహ్మణులు నాకు ముఖంలాంటివారు. బ్రాహ్మణవాక్యం దాటడానికి వీలుకానిది. నాతో సమానుడైన కుమారుణ్ణి మీరు కోరారు. అందుచేత, నాభి పత్ని అయిన మేరుదేవికి నేనే కొడుకునై పుడతాను అని రాజదంపతులు చూస్తుండగా ఆ యజ్ఞంలోనే అంతర్ధానమయ్యాడు. ఆ తర్వాత దిగంబరులూ, తాపసులూ, జ్ఞానులూ, ఊర్ధ్వరేతస్కులూ అయిన నైష్ఠికులకు యోగధర్మాలు బోధించడం కోసం నాభిమీది దయతో నారాయణుడు మేరుదేవి గర్భంలో ప్రవేశించాడు. తరువాత

**విశే :** **'బ్రాహ్మణోஉస్య ముఖ మాసీత్'** అని పురుషసూక్తం. అందువల్ల 'నా ముఖంబగుటం జేసి' అని చెప్పబడింది.

**ఆ. మేరుదేవియందు మేరుధీరుం డగు, హరి సమస్త లక్షణాన్వితుండు**
**శమదమాది గుణ విశారదుం డుదయించె, సకలజనుల కపుడు సంతసముగ. 55**

**ప్రతి :** మేరుదేవియందున్= నాభిపత్ని అయిన మేరుదేవియందు; మేరుధీరుండు+అగు= మేరుపర్వతంలాగ ధైర్యం గలిగిన; సమస్తలక్షణ+అన్వితుండు= సాముద్రిక శాస్త్రానుగుణమైన లక్షణాలతో కూడినట్టివారును; శమదమ+ఆది+గుణ విశారదుండు= శమదమాది గుణాలలో ఆరితేరినవాడయిన; హరి= శ్రీ మహావిష్ణువు; సకల జనులకున్= సమస్త ప్రజలకు; సంతసముగన్= సంతోషించేటట్లుగా; అపుడు= ఆ సమయాన; ఉదయించెన్= పుట్టాడు.

**తా :** సమస్త శుభలక్షణాలు కలవాడూ, శమదమాది గుణసంపన్నుడూ, మేరుధీరుడైన శ్రీహరి సమస్త జనులూ సంతోషించేటట్లు మేరుదేవికి కుమారుడుగా అవతరించాడు.

**విశే :** సమస్త శుభలక్షణాలు అన్నప్పుడు సాముద్రిక లక్షణాలు, భగవల్లక్షణాలు అన్నీ చేరుతాయి. చక్కని శరీరం, శౌర్యం, బలం, సౌందర్యం, నామం, యశస్సు, ప్రభావం, ఉత్సాహం, అలాగే సర్వసమత్వం, పరమశాంతత్వం, భౌతిక భోగసుఖాలపట్ల వైరాగ్యం లాంటివి కూడా శుభలక్షణాలు. అలాగే పాదాదులందు ధ్వజ, వజ్ర, పద్మచిహ్నాలు.

**ఆ. ధవళకాంతియుక్తిఁ దనరు దేహంబును, మహితబలపరాక్రమంబు వీర్య**
**మును దలంచి చూచి జనకుండు పేరిడె, సుతుని ఋషభుఁడనుచు సొంపుతోడ. 56**

**ప్రతి :** ధవళకాంతియుక్తిన్+తనరు= తెల్లనయిన కాంతితో కూడిన; దేహంబును= శరీరాన్ని; మహిత= గొప్పదైన; బలపరాక్రమంబున్= బలపరాక్రమాన్ని; వీర్యమును= వీరత్వమనే లక్షణాన్ని; తలంచి= భావించి; చూచి= ఆ లక్షణాలను చూచి; జనకుండు= తండ్రియైన నాభి; సొంపుతోడన్= సొంపుతో; సుతునిన్= కొడుకును; ఋషభుఁడు+అనుచున్= శ్రేష్ఠుడను అర్థముగల ఋషభుడని; పేరు+ఇడెన్= పేరు పెట్టెను.

**తా :** తెల్లని కాంతితో కూడిన దేహంకలవాడని, బలిష్ఠమైనవాడని, పరాక్రమవంతుడని, ధైర్యశౌర్యాలు కలవాడనే లక్షణాలనుబట్టి నరనాథుడయిన నాభి తన కుమారునికి 'ఋషభుడు' అని పేరు పెట్టాడు.

**విశే :** సర్వశ్రేష్ఠుడు, మహాపురుషుడు అనడాన్ని ఋషభ అనే శబ్దం సూచిస్తుంది.

**క. ధరణీసురులును మంత్రులుఁ, బరివారము హితులుఁ బ్రజలు బాంధవులును సు**
**స్థిరమతి నా బాలకునిం, గర మనురాగమున రాజుగాఁ జూచి రిలన్. 57**

**ప్రతి :** ధరణీసురులును= బ్రాహ్మణులును; మంత్రులున్= మంత్రులును; పరివారమున్= పరిజనమూ; హితులున్= మేలు కోరేవారును; ప్రజలున్= ప్రజలును; బాంధవులును= చుట్టాలును; సుస్థిరమతిన్= నిశ్చలమైన మనస్సుతో; ఆ బాలకునిన్= ఆ ఋషభుని; కరము+అనురాగమునన్= మిక్కిలి ప్రేమతో; ఇలన్= ఈ లోకానికి; రాజుగాన్= రాజుగా; చూచిరి= దర్శించారు.

**తా :** బ్రాహ్మణులు, మంత్రులు, రాజపరివారం, హితులు, ప్రజలు, చుట్టాలు అనురాగాతిశయంతో ఋషభుని రాజుగానే భావించారు.

**క. పురుహూతుఁడతని మహిమలు, సరగున విని చిత్తమునకు సహ్యము గామిం**
**బరికించి ఋషభుఁడేలెడి, ధరణి ననావృష్టి మిగుల దట్టము సేసెన్. 58**

**ప్రతి :** పురుహూతుఁడు= ఇంద్రుడు; అతని మహిమలు= ఋషభుని మహిమల్ని; సరగునన్ విని= వేగంగా తెలుసుకొని; చిత్తమునకున్= మనసునకు; సహ్యము+కామిన్= ఓర్వరానివి కావటంవల్ల; పరికించి= బాగుగా పరిశీలించి; ఋషభుఁడు+ఏలెడి ధరణిన్= ఋషభుడు పాలించే రాజ్యంలో; అనావృష్టిన్= వర్షాభావాన్ని; మిగుల= మిక్కిలి; దట్టము+చేసెన్= ఎక్కువ చేసెను, మెండు గావించెను.

**తా :** ఇంద్రుడు ఋషభుని మహిమలు విన్నాడు. అతడు అసూయాపరుడు కనుక సహించలేకపోయాడు. ఋషభుని రాజ్యంలో వర్షాభావ పరిస్థితి కల్పించాడు.

**ఆ. అది యెఱింగి ఋషభుఁడంతట యోగ మా, యా బలంబుకతన నఖిలరాజ్య**
**మందుఁగురియఁజేసె నత్యంతసంపూర్ణ, వృష్టి దినదినంబు వృద్ధిఁబొంద. 59**

**ప్రతి :** అది= ఇంద్రుని దౌష్ట్యాన్ని; ఎఱింగి= తెలిసికొని; ఋషభుఁడు= నాభి కుమారుడైన ఋషభుడు; అంతటన్= అంతట; యోగమాయా బలంబు కతనన్= యోగమాయాశక్తియొక్క కారణంతో; అఖిలరాజ్యము+అందున్= రాజ్యమంతటా; దినదినంబున్= నానాటికి; అతి+అంత సంపూర్ణవృష్టి= సర్వసమృద్ధియైన వర్షము; వృద్ధిన్+పొందన్= అధికంకాగా; కురియన్+చేసెన్= వర్షించేటట్లు చేశాడు.

**తా :** ఇంద్రుని దౌష్ట్యం తెలుసుకొని ఋషభుడు యోగమాయాబలంతో రాజ్యమంతటా నానాటికీ సమృద్ధిగా వర్షం కురిసేటట్లు చేశాడు.

**విశే :** ఇంద్రుడు వర్షాధిదేవత. త్రిలోకాధిపతి. తనకు సాటిగా మరొకరు వృద్ధి పొందడాన్ని సహించలేనివాడు. అందువల్ల ఋషభుని సాధింప తలపెట్టాడు. **'యజ్ఞాత్ భవతి పర్జన్యః'** – యజ్ఞం చేయడంవల్ల వర్షాలు కురుస్తాయి అని భావం. మూలంలో **'భగవాన్ ఋషభదేవః యోగేశ్వరః'** అని చెప్పబడ్డాడు. ఇందువల్ల ఆధ్యాత్మికశక్తి కలవాడని భావం.

**వ. ఇట్లు ఋషభుండు పురందరుండు సేయు దౌష్ట్యంబునకు నవ్వి యజనాభం బను తన మండలంబు సుభిక్షంబుగాఁ జేసె, నాభియుం దన కోరిన చందంబునం బుత్త్రుండు జనియించి వర్ధిల్లుటకు సంతసిల్లి తనచేత నంగీకరింపంబడు నరలోక ధర్మంబు గల పుండరీకాక్షుని మాయావిలసిత మతింజేసి బాలకు, నా తండ్రి యని మోహంబున నుపలాలించుచుఁ బ్రజానురాగంబున సర్వసమ్మతుం డయిన పుత్త్రుని (సమయసేతు**

**రక్షణంబునకుఁ) బూజ్యం బైన రాజ్యంబునం దభిషిక్తుంజేసి భూసురులకుఁ బ్రధానవర్గంబునకు నప్పగించి మేరుదేవిం గూడి నరనారాయణ స్థానంబయిన బదరికాశ్రమంబునకుం జని, యచ్చట మహాయోగ సమాధిచే నర (నారాయణాఖ్యుండుఁ బురుషోత్తముండు నగు వాసుదేవు నారాధించి) క్షీణదేహుండై యా నాభి హరి తాదాత్మ్యంబు నొందె నంత. 60**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; ఋషభుండు= నాభి కుమారుడయిన ఋషభుడు; పురందరుండు+చేయు= దేవేంద్రుడు ఈర్ష్యతో చేసే; దౌష్ట్యంబునకున్= దుష్టస్వభావానికి తగిన చేతలకు; నవ్వి= నవ్వుకొని; అజనాభంబు+అను= అజనాభమనే పేరుగల; తనమండలంబు= తన భూభాగంబును; సుభిక్షంబు+కాన్+చేసెన్= కరువు కాటకాలు లేకుండా చేశాడు; నాభియున్= నాభిమహారాజు; తనకోరిన చందంబునన్= తాను కోరిన ప్రకారంగా; పుత్త్రుండు= కుమారుడు; జనియించి= పుట్టి; వర్ధిల్లుటకున్= దినదినాభివృద్ధి గావించుటకు; సంతసిల్లి= సంతోషించి; తనచేతన్= తనచే; అంగీకరింపన్+పడు= సమ్మతింపబడునట్టి; నరలోక ధర్మంబుగల= భూలోకధర్మంగల; పుండరీక+అక్షునిన్= తెల్లతామరల రేకులవంటి విశాలములైన రెండు కన్నుల గలవాడు - మహావిష్ణువుయొక్క; మాయావిలసితమతిన్+చేసి= మాయచే ప్రకాశిస్తున్న బుద్ధితో; బాలకున్= బాలుని!; నాతండ్రి= నాయనా; అని= అంటూ; మోహంబునన్= పుత్రవ్యామోహంతో; ఉపలాలించుచున్= బుజ్జగిస్తూ; ప్రజా+అనురాగంబునన్= ప్రజలయొక్క అనురాగంతో; సర్వసమ్మతుండు+అయిన= అందరికి అంగీకారమయినవాడయిన; పుత్త్రునిన్= పుత్రుడైన ఋషభుని; (సమయసేతురక్షణంబునకున్= నియమాలనే వంతెనలను రక్షించుటకై;) పూజ్యంబు+అయిన= పరమ పూజ్యమయిన; రాజ్యంబునందున్= అజనాభమనే రాజ్యమందు; అభిషిక్తున్+చేసి= పట్టాభిషిక్తుని చేసి; భూసురులకున్= బ్రాహ్మణులకు; ప్రధానవర్గంబునకున్= మంత్రుల సమూహానికి; అప్పగించి= అప్పగించి; మేరుదేవిన్+కూడి= భార్య అయిన మేరుదేవితోకూడ; నరనారాయణ స్థానంబు+అయిన= నరనారాయణులకు ఆవాసమైన; బదరికా+ఆశ్రమంబునకున్+చని= బదరిక అను పేరుగల ఆశ్రమ స్థానానికి వెళ్ళి; అచ్చటన్= ఆ ఆశ్రమంలో; మహాయోగ సమాధిచేన్= గొప్పదైన యోగసమాధిచేత; (నరనారాయణ+ఆఖ్యుండున్= నరనారాయణుడనే పేరుగల; పురుష+ఉత్తముండున్+అగు= పురుషులలో సర్వశ్రేష్ఠుడైన; వాసుదేవున్= శ్రీమన్నారాయణుని; ఆరాధించి= నియమనిష్ఠలతో కొలిచి;) క్షీణదేహుండు+ఐ= శుష్కించిన శరీరం కలవాడై; ఆ నాభి= మహారాజైన 'నాభి'; హరి తాదాత్మ్యంబున్= హరిలో లీనమైపోవడాన్ని; ఒందెన్= యోగవిద్యచే సాధించి సిద్ధి పొందాడు; అంతన్= ఆ తరువాత.

**తా :** దేవేంద్రుని దుర్బుద్ధికి ఋషభుడు నవ్వుకొని, అజనాభమనే పేరుతో వ్యవహరింపబడే తన భూమండలాన్ని సుభిక్షం చేశాడు. తాను కోరినట్టు కొడుకు పుట్టడం, పెరగడం చూచి నాభి చాల సంబరపడ్డాడు. పుండరీకాక్షుని మాయ కారణంగానూ, భూలోకధర్మాల కనుగుణంగానూ నాభి తన ప్రియనందనుణ్ణి 'నాయనా! నా తండ్రీ! అంటూ మోహంతో లాలించేవాడు. ప్రజల అభిమానం చూరగొన్న వాడున్నూ, అన్నివర్గాల వారికి ఆమోదయోగ్యుడూ అయిన తన కుమారునికి పట్టం కట్టాడు. బ్రాహ్మణులకూ, మంత్రి వర్గానికీ అతణ్ణి అప్పగించాడు. ఆ తరువాత భార్య మేరుదేవితోకూడ నరనారాయణులకు నిలయమైన బదరికాశ్రమం చేరుకొన్నాడు. అక్కడ నారాయణస్వరూపుడూ, పురుషోత్తముడూ అయిన వాసుదేవుని యోగసమాధితో ఆరాధించాడు. చివరకు నాభి శుష్కించిన దేహంకలవాడై శ్రీహరిలో లీనమయ్యాడు.

**చ. సరసత నే నృపాలకుని జన్మమునందును భూసురోత్తముల్**
**సరసిజనాభునిందగఁబ్రసన్నతఁబెట్టిన నంత మెచ్చి యా**

**శ్వరుఁడు దనంత గర్భమున వచ్చి తనూభవుఁడై జనించె, నా**
**నరపతి నాభికిన్ సరి యనందగునే నరనాథ! యన్యులన్.** **61**

**ప్రతి :** సరసతన్= రసస్వరూపుడు భగవంతుడనే భావంతో; భూసుర+ఉత్తముల్= బ్రాహ్మణశ్రేష్ఠులు; ఏ నృపాలకుని= ఏ రాజుయొక్క; జన్మమునందును= యజ్ఞమునందు; సరసిజనాభునిన్= విష్ణుమూర్తిని; తగన్+ప్రసన్నతన్= తగిన అనుగ్రహం కలిగేటట్లు; పెట్టినన్= వేడుకొనగా; అంతన్+మెచ్చి= అపుడు సంతోషించి; ఈశ్వరుఁడు= సర్వసమర్థుడయిన విష్ణుమూర్తి; తనంతన్= తనకు తాను; గర్భమునన్ వచ్చి= మేరువు గర్భాగారంలో ప్రవేశించి; తనూభవుఁడు+ఐ= కుమారుడై; జనించెన్= పుట్టెనో; ఆ నరపతి= అటువంటి రాజైన; నాభికిన్= నాభికి; అన్యులన్= ఇతరుల్ని; సరి+అనన్+తగునే= సాటి అని చెప్పుట యుక్తమా? కాదనిభావం.

**తా :** ఏ మహారాజు యజన సమయంలో బ్రాహ్మణోత్తములైన ఋత్విక్కులు విష్ణుమూర్తిని ప్రార్థించి ప్రసన్నం చేసుకొన్నారో, ఏ రాజు భార్య గర్భంలో ప్రవేశించి ఈశ్వరుడు తనంత తాను కొడుకుగా పుట్టాడో, అలాంటి మహారాజుకు సాటిరాగల రాజు లెవరూ భూమండలంలో లేరు.

**వ.** **అంత** **62**

**ప్రతి :** అంతన్= ఆ తరువాత

**తా :** ఆ తరువాత కథ విను.

**సీ.** **భూవరుఁడగు ఋషభుఁడు దన రాజ్యంబుఁ గర్మభూమిగ నాత్మఁగాంచి జనుల**
**కందఱకును బ్రియం బగునట్లు కర్మతంత్రంబెల్లఁదెలుపంగఁదలఁచి కర్మ**
**ములు సేయుటకు గురువుల యొద్ద వేదంబు సదివి వారల యనుజ్ఞను వహించి**
**శతమన్యుఁడిచ్చిన సతి జయంతీకన్యఁ బరిణయంబై యట్టి పడఁతివలన**

**తే.** **భరతుఁడాదిగ సుతుల నూర్వురను గాంచె, నట్టి భరతుని పేరను నవనితలము**
**పురవరాశ్రమగిరితరుపూర్ణ మగుచు, నమరి భారతవర్షనామమున మించె.** **63**

**ప్రతి :** భూవరుఁడు+అగు= భూమికి భర్త అయిన; ఋషభుఁడు= ఋషభచక్రవర్తి; తన రాజ్యంబున్= తన సామ్రాజ్యాన్ని; కర్మభూమిగన్= సత్కర్మలాచరించు లోకంగా; ఆత్మన్= మనసులో; కాంచి= దర్శించి; జనులకున్+అందఱకునున్= తన ప్రజలందరికి; ప్రియంబు+అగునట్లు= సంప్రీతి కలిగేటట్లు; కర్మతంత్రంబు+ఎల్లన్= కర్మసిద్ధాంతాన్నంతా; తెలుపంగన్+తలఁచి= తెలియజేయాలని భావించినవాడై; కర్మములు+చేయుటకున్= కర్మనిర్వహణానికి; గురువుల+ఒద్దన్= అజ్ఞానాంధకారాన్ని పోగొట్టే గురువుల దగ్గర; వేదంబు+చదివి= ఋగ్యజురాది వేదాలను అధ్యయనం చేసి; వారల= ఆ గురువులయొక్క; అనుజ్ఞను= అనుమతిని; వహించి= పొంది; శతమన్యుఁడు= శతమన్యు నామధేయుడు; ఇచ్చిన= కన్యాదానం చేసిన; సతి జయంతీకన్యన్= జయంతి అనే పేరు గలిగిన సతిని; పరిణయంబు+ఐ= పెండ్లాడి; అట్టి పడతివలనన్= ఆ జయంతి వలన; భరతుఁడు+ఆదిగన్= భరతుడు మొదలయిన; సుతుల నూర్వురనున్= నూర్గురు కుమారులను; కాంచెన్= పొందాడు; అట్టి భరతుని పేరను= అలాంటి భరతుని పేరుతో; అవనితలము= భూప్రదేశం; పురవర= శ్రేష్ఠాలైన పట్టణాలతో;

ఆశ్రమ= ఆశ్రమాలతో; గిరితరుపూర్ణము+అగుచున్= కొండలతో, చెట్లతో నిండినదగుచు; అమరి= ఒప్పి; భారతవర్షనామమునన్= భారతవర్షమనే పేరుతో; మించెన్= అతిశయించింది.

**తా :** రాజైన ఋషభుడు తన రాజ్యాన్ని కర్మాచరణకు తగిన భూమిగా భావించాడు. జనుల కందరికీ ప్రియమయ్యేటట్లు కర్మతంత్రం తెలియజేయాలనుకొన్నాడు. అందుచేత, కర్మలు ఆచరించడానికి తానే స్వయంగా గురువులవద్ద వేదాలు చదివాడు. వారి ఆజ్ఞ శిరసావహించి శతమన్యుడు ఇచ్చిన జయంతిని వివాహం చేసుకున్నాడు. ఆ జయంతివల్ల భరతుడు మొదలయిన నూర్గురు కొడుకులను కన్నాడు. పట్టణాలతో, ఆశ్రమాలతో, కొండలతో, చెట్లు చేమలతో నిండిన భూమండలం ఆ భరతుని పేరు మీదుగా భరతవర్షమనే ప్రశస్తి గడించింది.

**విశే :** ఋషభుడు భగవంతుడే. సర్వజ్ఞుడు. గురువువల్ల నేర్వవలసినది ఏదీ లేకపోయినప్పటికినీ గురువునుండి ఏ విధంగా విద్యార్జన చేయాలో జనసామాన్యానికి బోధించే నిమిత్తం తానే గురువు దగ్గరికి వెళ్ళాడు. అలాగే, ఆదర్శవంతుడయిన గృహస్థుడయ్యాడు. ఋషభుని కుమారుడైన భరతుని వల్లనే ఈ దేశానికి భారతదేశమనే పేరు ఏర్పడింది.

**వ. ఆ మహాభారతవర్షంబునందుఁ దమతమ పేరంబరఁగు భూములకుఁ గుశావర్తేలావర్త బ్రహ్మావర్తార్యావర్త మలయకేతు భద్రసే నేంద్రస్పృ గ్విదర్భ కీకటులను తొమ్మండ్రు కుమారులను దక్కంగల తొంబండ్రు పుత్త్రులకుఁ బ్రధానులంజేసె; నంతం గవి హర్యంతరిక్ష ప్రబుద్ధ పిప్పలాయ నావిర్హోత్ర ద్రమీళ చమస కరభాజను లను వారు దొమ్మండ్రును భాగవత ధర్మప్రకాశకులైరి; భగవ న్మహిమోపబృంహితంబు లగు వారల చరిత్రంబులు ముంద రెఱింగించెదఁ; దక్కిన యెనుబది యొక్కకుమారులు పిత్రాదేశకరులు నతివినీతులు మహాశ్రోత్రియులు యజ్ఞశీలురుఁ గర్మనిష్ఠులు నయిన బ్రాహ్మణోత్తము లైరి; ఋషభుండు స్వతంత్రుండై సంసారధర్మంబులం బొరయక కేవలానందానుభవుం డయిన యీశ్వరుండై యుండియు బ్రాకృతుండునుం బోలెఁ గాలానుగతంబులగు ధర్మంబుల నాచరించుచు ధర్మ ప్రవర్తకులకు సముండును నుపశాంతుండును మైత్రుండును గారుణికుండునునై ధర్మార్థయశః ప్రజానందామృతావరోధంబుచే గృహస్థాశ్రమంబులం బ్రజల నియమించుచుఁ గొంత కాలంబు నీతి మార్గంబు దప్పక ప్రజాపాలనంబు సేయుచు, వేద రహస్యంబులగు సకల ధర్మంబులును స్వవిదితంబులైనను బ్రాహ్మణోపదేశ పూర్వకంబుగా ద్రవ్యదేశకాల వయశ్శ్రద్ధర్త్విగ్విధోద్దేశోపచితంబులుగా నొక్కొక్క క్రతువును శతవారంబు యథావిధిగఁ జేసి సుఖంబుండె నంత. 64**

**ప్రతి :** ఆ మహాభారతవర్షంబునందున్= మహాభారతమనే పేరుగల భూభాగంలో; తమ తమ పేరన్+పరఁగు= తమ తమ పేర్లతో ప్రసిద్ధిబడసిన; భూములకున్= భూభాగాలకు; కుశావర్త; ఇలావర్త; బ్రహ్మావర్త; ఆర్యావర్త; మలయకేతు; భద్రసేన; ఇంద్రస్పృక్కు; విదర్భ; కీకటులు+అను= కీకటులు అనే పేర్లుగల; తొమ్మండ్రు కుమారులను= తొమ్మిదిమంది కుమారులను; తక్కన్+కల= మిగిలిన; తొంబండ్రు పుత్త్రులకున్= తొంభైమంది పుత్రులకు; ప్రధానులన్+చేసెన్= ప్రధానులుగా నియమించాడు; అంతన్= ఆ తరువాత; కవి; హరి; అంతరిక్ష; ప్రబుద్ధ; పిప్పలాయన; ఆవిర్హోత్ర; ద్రమీళ; చమస; కరభాజనులు+అను; తొమ్మండ్రును= తొమ్మిదిమంది; భాగవత ధర్మప్రకాశకులు+ఐరి= భగవంతుని మార్గం అవలంబించినవారైనారు; భగవత్= దేవునియొక్క; మహిమ= గొప్పతనంచే; ఉపబృంహితంబులు= విస్తృతంగా వ్యాప్తి

చేయబడినవి; అగు= అయిన; వారల= వారియొక్క; చరిత్రంబులు= చరితలు; ముందర+ఎఱింగించెదన్= తర్వాత చెబుతాను; తక్కిన= తక్కినటువంటి; ఎనుబదియొక్క కుమారులు= ఎనభై ఒక్క మంది కుమారులు; పితృ+ఆదేశకరులును= తండ్రి ఆజ్ఞను పాలించేవారు; అతివినీతులు= మిక్కిలి వినయం కలవారు; మహాశ్రోత్రియులు= గొప్ప వేదమార్గనిష్ఠులు; యజ్ఞశీలురున్= యజ్ఞం చేయు స్వభావం కలవారు; కర్మనిష్ఠులును+అయిన= వేదకర్మలయందు దీక్ష కలిగినవారయిన; బ్రాహ్మణ+ఉత్తములు+ఐరి= ఉత్తమ బ్రాహ్మణులయ్యారు; ఋషభుండు= ఋషభుడు; స్వతంత్రుండు+ఐ= స్వకార్యాలయందు తన ఇచ్ఛ వచ్చిన రీతి చేయువాడయి; సంసార ధర్మంబులన్+పొరయక= లౌకికమయిన సాంసారిక ధార్మిక జీవితంలో చిక్కువడక; కేవల+ఆనంద+అనుభవుండు+అయిన= పరమానందమనుభవించినవాడైన; ఈశ్వరుండు+ఐ+ఉండియున్= భగవానుడై ఉన్నప్పటికిని; ప్రాకృతుండునున్+పోలెన్= పామరునివలె; కాల+అనుగతంబులు+అగు= కాలముననుసరించినవైన; ధర్మంబులన్= ధర్మాలను; ఆచరించుచున్= నిర్వర్తిస్తూ; ధర్మప్రవర్తకులకున్= ధర్మాన్ని వర్తింపజేయు వారికి; సముండునున్= సమమైనవాడును; ఉపశాంతుండును= శాంతగుణంతో సహించువాడును; మైత్రుండును= మిత్ర ధర్మం గలవాడును; కారుణికుండునున్+ఐ= దయాస్వభావము కలిగినవాడై; ధర్మార్థ= ధర్మం, సంపద; యశస్= కీర్తి; ప్రజానంద= సంతానం కొరకైన భోగం; అమృత= మోక్షం; అవరోధంబుచేన్= సంగ్రహించుటచే; గృహస్థ+ ఆశ్రమంబులన్= గృహస్థాశ్రమాలందు; ప్రజలన్= ప్రజలను; నియమించుచున్= నియమిస్తూ; కొంతకాలంబు= కొంతకాలం; నీతిమార్గంబు+తప్పక= నైతిక మార్గాన్ని విడువకుండా; ప్రజాపాలనంబు+చేయుచున్= ప్రజలను పాలించుచు; వేదరహస్యంబులగు= వేదాలలో నిగూఢంగా చెప్పబడిన; సకల ధర్మంబులును= అన్ని ధర్మాలను; స్వవిదితంబులైనను= తనకు బాగా తెలిసినవేయైనప్పటికీ; బ్రాహ్మణ+ఉపదేశ పూర్వకంబుగా= వేదపండితులైన విప్రుల ఉపదేశాన్ని అనుసరించి; ద్రవ్యదేశకాల= యజ్ఞ హోమద్రవ్యాలు, దేశపరిస్థితి, కాలపరిస్థితులను; వయస్+శ్రద్ధా+ఋత్విక్+విధి+ఉద్దేశ+ ఉపచితంబులుగాన్= వయస్సు, శ్రద్ధ, ఋత్విక్కు, శాస్త్రోక్త ఉపదేశవిధి, బ్రాహ్మణుల అభిప్రాయానుగుణంగా, పెంపొందినట్లు; ఒక్క+ఒక్క= ఒక్కొక్క; క్రతువును= యజ్ఞాన్ని; శతవారంబు= నూరుసార్లు; యథావిధిగన్+చేసి= శాస్త్రోచితంగా సల్పి; సుఖంబు+ఉండెన్= సుఖజీవనం సాగించారు; అంతన్= ఆ పిదప...

**తా :** భారతవర్షమనే పేరుతో ప్రసిద్ధి పొందిన భూమండలంలోని ఆయా భాగాలకు తొంబది తొమ్మిదిమంది పుత్రులలో కుశావర్తుడు, ఇలావర్తుడు, బ్రహ్మావర్తుడు, ఆర్యావర్తుడు, మలయకేతువు, భద్రసేనుడు, ఇంద్రస్పృక్కు, విదర్భుడు, కీకటుడు అనే తొమ్మిదిమందిని తక్కిన తొంబైమంది పుత్రులకు ప్రధానులుగా నియమించాడు. వారి కప్పగించిన భూభాగాలు వారి వారి పేర్లతో ప్రసిద్ధి పొందాయి. కవి, హరి, అంతరిక్ష, ప్రబుద్ధ, పిప్పలాయన, అవిర్హోత్ర, ద్రమీఢ, చమన, కరభాజనులనే తొమ్మందుగురు భాగవత ధర్మాన్ని ప్రకాశింపజేశారు. దేవుని మహిమల్ని వ్యాప్తిచేసే వారి చరిత్రలు నీకు తర్వాత చెబుతాను. తక్కిన ఎనభైయొక్క మంది కుమారులు తమ తండ్రి అయిన ఋషభుని మాట జవదాటనివారు. వారందరు మహావినయ సంపన్నులు. వేదధర్మాలు అనుష్ఠించేవారు. యాగాలన్నా, ధర్మాలన్నా శ్రద్ధగలవారు. అందుచేత వారు బ్రాహ్మణోత్తములుగా పేరెన్నికగన్నారు.

ఋషభుడు సాంసారిక బంధాలలో చిక్కుకోలేదు. స్వతంత్రుడయి మెలిగాడు. తాను ఆనందానుభూతి కలిగిన ఈశ్వరుడయినా సామాన్యునిలా ప్రవర్తించాడు. ఆయాకాలాలలో చేయవలసిన ధర్మాలను ఆచరించేవాడు. ధర్మప్రవర్తకులపట్ల సమబుద్ధి కలిగి ఉండేవాడు. శాంతస్వభావంతో జీవులపట్ల కరుణ కలిగి మైత్రీభావంతో ఉండేవాడు. ధర్మం, అర్థం, కీర్తి, సంతతి, ఆనందం, అమృతత్వం చక్కగా సాగడంకోసం గృహస్థాశ్రమం పాటించవలసిందిగా ప్రజలను అనుశాసించేవాడు.

ఈ విధంగా ఋషభుడు నీతిమార్గం తప్పకుండా ప్రజాపాలనం చేశాడు. వేదాలలోని ధర్మరహస్యాలు తనకు అవగతమయినా బ్రాహ్మణులు బోధించినట్లు ఋత్విక్కులు ఉపదేశించినట్లు వస్తుసంభారాలతో, దేశకాలానుగుణంగా శ్రద్ధాపూర్వకంగా, తన వయస్సుకు తగినట్టు ఒక్కొక్క యాగాన్ని నూరు పర్యాయాలు యథావిధిగాజేసి సుఖజీవనం సాగించాడు.

**విశే :** ప్రజానందామృతావరోధంబుచేన్= ఇచ్చుటి ప్రజానంద పదమునకు ప్రజార్థోభోగః; అమృతం అను పదమునకు మోక్షః అనియు, అవరోధము అనగా సంగ్రహము అని శ్రీధరీయమునందు వివరింపబడినది. వృషభుని పుత్రులు వందమంది. వారిలో భరతుడు ఒకడు. మిగిలినవారు 100-1= 99; 99-9= 90; 90-9= 81.

**క. జనవర! ఋషభుని రాజ్యం, బున నైహిక ఫలముఁగోరు పురుషుని నొకనిం**
**గనుఁగొన నెఱుంగ మెన్నఁడు, నినతేజుండతని మహిమ లేమని చెప్పన్. 65**

**ప్రతి :** జనవర= జనుల్లో శ్రేష్ఠుడవైన ఓ రాజా!; ఋషభుని రాజ్యంబునన్= ఋషభ మహారాజు రాజ్యంలో; ఐహికఫలమున్= ఇహలోక ఫలాన్ని; కోరు= అపేక్షించే; పురుషునిన్+ఒకనిన్= ఒక్క వ్యక్తినైనను; ఎన్నఁడున్= ఏ నాడును; కనుఁ గొనన్+ఎఱుంగము= చూచినవాళ్లము కాము; ఇనతేజుండు= సూర్యతేజస్సు వంటి తేజస్సు కలవాడు; అతని మహిమలు= ఆ ఋషభరాజు ప్రభావాలు; ఏమి+అని+చెప్పన్= ఏమని చెప్పగలం?

**తా :** రాజా! ఆ ఋషభ దేవుని రాజ్యంలో పారలౌకిక ఫలమే తప్ప ఇహలోకఫలం కోరేవాడు ఒక్కడూ కనబడడు. అతడు సూర్యుని తేజస్సు వంటి తేజస్సు కలవాడు. అతని మహిమలను ఏమని వర్ణించేది?

**a:::ఋషభుండు పుత్రులకు నీతి నుపదేశించుట::: a**

**సీ. ఆ ఋషభుండు రాజ్యంబు సేయుచునుండి యంతట నొక్కనాఁడాత్మయందుఁ**
**దలపోసి భూలోకఫల మపేక్షింపక మోహంబు దిగనాడి పుత్త్రులకును**
**దన రాజ్యమెల్ల నప్పన చేసి వెనువెంటఁగొడుకులు మంత్రులుఁగొలిచి రాఁగ**
**నల్లన యరిగి బ్రహ్మావర్తదేశంబు నందుల నపుడు మహాత్ములయిన**

**తే. యట్టి మునిజనసమ్ముఖంబందుఁ జేరి, తనదు పుత్రుల నందఱ దాయఁబిలిచి**
**పరమపుణ్యుండు ఋషభుండు ప్రణయ మొప్ప హర్షమందుచు నప్పు డిట్లనుచుఁబలికె. 66**

**ప్రతి :** ఆ ఋషభుండు= ఆ ఋషభమహారాజు; రాజ్యంబు+చేయుచున్+ఉండి= రాజ్యపాలన కొనసాగిస్తూ; అంతటన్= ఆపైన; ఒక్కనాఁడు= ఒకరోజు; ఆత్మయందున్= అంతఃకరణాత్మకమయిన ఆత్మయందు; తలపోసి= తీవ్రంగా ఆలోచించి; భూలోకఫలమున్+అపేక్షింపక= భూలోకంలో పొందుతున్న భౌతిక సుఖాలను కోరక; మోహంబున్+దిగనాడి= భోగమే పరమావధిగా గల మోహాన్ని విడిచిపెట్టి; పుత్త్రులకును= కుమారులకు; తన రాజ్యము+ఎల్లన్= తన రాజ్యమంతటనీ; అప్పనచేసి= అర్పించి; వెనువెంటన్= ఆపై; కొడుకులు= కుమారులు; మంత్రులున్= సచివులు; కొలిచిరాఁగన్= సేవించి వస్తుండగా; అల్లన+అరిగి= మెల్లగా కదలి; బ్రహ్మ+ఆవర్త దేశంబు+అందులన్= బ్రహ్మావర్తమనే పేరుగల దేశంలో; అపుడు= ఆ సమయంలో; మహా+ఆత్ములు+అయిన= గొప్పవారైనట్టి; మునిజన సమ్ముఖంబు+అందున్+చేరి= మునిజనుల ఎదుట చేరి; తనదుపుత్రులన్= తన కుమారులైన వారిని; అందఱన్= అందరిని; దాయన్+పిలిచి= దగ్గరికి పిలిచి;

పరమపుణ్యుండు= మహాపుణ్యాత్ముడయిన; ఋషభుండు= ఋషభ మహారాజు; ప్రణయము+ఒప్పన్= ప్రేమానురాగాలు ఉట్టిపడగా; హర్షము+అందుచున్= సంతోషం పొందుతూ; అప్పుడు= ఆ సమయంలో; ఇట్లు+అనుచున్= ఈ విధంగా అంటూ; పలికెన్= చెప్పాడు.

**తా :** ఋషభుడు ఈ ప్రకారంగా కొంతకాలం రాజ్యపరిపాలనం సాగించాడు. అతడు ఇహలోక ఫలాన్ని ఏ మాత్రం అపేక్షించలేదు. సంసార వ్యామోహాన్ని వదలిపెట్టాడు. కొడుకులకు రాజ్యమంతా అప్పగించాడు. ఆ తరువాత మెల్లగా బ్రహ్మావర్త దేశానికి పయనించాడు. కొడుకులూ, మంత్రులూ ఆ ఋషభుని అనుసరించారు. అక్కడ బ్రహ్మావర్త దేశంలో మహాత్ములైన మునిజనుల సమక్షంలో కుమారులనందరినీ దగ్గరికి పిలిచాడు. మహాపుణ్యాత్ముడైన ఆ ఋషభదేవుడు సంతోషంతో ఇలా అన్నాడు.

**విశే :** బ్రహ్మావర్తం అంటే ఢిల్లీకి వాయవ్యభాగంలో ఉండే దేశ విశేషం.

**ఆ. తనయులార! వినుఁడు ధరలోనఁ బుట్టిన, పురుషులకును శునకములకు లేని**
**కష్టములను దెచ్చుఁగానఁగామంబుల, వలన బుద్ధి సేయవలదు మీరు. 67**

**ప్రతి :** తనయులార!= బిడ్డలార!; వినుఁడు= ఆలకించుడు; ధరలోనన్+పుట్టిన= ఈ పుడమిలో జనించిన; పురుషులకును= మనుష్యులకును; శునకములకున్= కుక్కలకు; లేని కష్టములను+తెచ్చున్= రాని కష్టాలు ఎదురవుతాయి; కానన్= అందువలన; కామంబులవలనన్= కోరికలకు; మీరు= కుమారులయిన మీరు; బుద్ధి+చేయన్+వలదు= అనుభవించాలనే కోరికలకు దూరంగా ఉండాలి.

**తా :** బిడ్డలారా! ఈ గడ్డమీద పుట్టిన మనుష్యులు కామానికి లొంగిపోతే కుక్కలకు కూడా రాని కష్టాలు వారికి ఎదురవుతాయి. అందువల్ల కోరికలకు మీరు దూరంగా ఉండాలి.

**విశే :** ఈ పద్యం మానవాళికంతా సందేశం. మానవజన్మ వచ్చాక జీవుడు జంతువులకు భిన్నంగా వ్యవహరించాలి. ఆధ్యాత్మిక జీవన పురోగతికై స్వచ్ఛందంగా దేహపరమయిన కష్టాలు స్వీకరించడమే మానవ జన్మకు అర్థం. శునక సూకరాదులకు కూడా లభించే జీవనానికి మానవజీవితం ఉద్దేశింపబడలేదు.

ఈ పద్యంలో మరో అంశం కూడా ఉంది. సహజ సంరక్షకుడయిన తండ్రి తమపై ఆధారపడిన వారికి బోధ కావించడం అవసరమని చెప్పక చెప్పడం.

**చ. నరులకు నే తపంబున ననంతసుఖంబులు గల్గుచుండు, శ్రీ**
**కరమతి నా తపంబుఁదగఁగైకొని చేసిన బ్రహ్మసౌఖ్యముం**
**దిరముగఁ గల్గు, వృద్ధులను దీనులఁ బ్రోవుఁడు; దుష్టవర్తనన్**
**జరుగుచునుండు కాముకుల సంగతిఁబోకుఁడు; మీఁద మేలగున్. 68**

**ప్రతి :** నరులకున్= మానవులకు; ఏ తపంబునన్= ఏ తపస్సువల్ల; అనంతసుఖంబులు= తరగని సుఖాలు; కల్గుచున్+ఉండున్= కలుగుతూ ఉంటాయో; శ్రీకరమతిన్= సంపద కలిగించే మనస్సుతో; ఆ తపంబున్= ఆ తపంబును; తగన్= తగినరీతిలో; కైకొని= స్వీకరించి; చేసినన్= నిర్వహించినచో; బ్రహ్మసౌఖ్యమున్= బ్రహ్మానందం; తిరముగన్+కల్గున్= తప్పక సిద్ధిస్తుంది;

వృద్ధులను= వయసు మళ్లినవారిని; దీనులన్= దైన్యావస్థలోని వారిని; ప్రోవుఁడు= రక్షించండి; దుష్టవర్తనన్ జరుగుచున్+ ఉండు= దుష్టమయిన జీవన విధాన వర్తనములు కలవారగు; కాముకులసంగతిన్= కాముకులతో సహవాసంవైపు; పోకుఁడు= వెళ్ళకండి; మీఁదన్= ఇలా ప్రవర్తిస్తే, ఇకపైన; మేలు+అగున్= మీకు శుభం కలుగుతుంది.

**తా :** తపస్సువల్ల మానవులకు తరగని సుఖం కలుగుతుంది. అలాంటి తపస్సు అవలంబించితే బ్రహ్మానందం తప్పక సిద్ధిస్తుంది. వృద్ధులనూ, దీనులనూ దయతో కాపాడండి. చెడుమార్గాలలో నడిచే కాముకుల తోడి సహవాసం పూర్తిగా వదలిపెట్టండి. మీకు శుభం కలుగుతుంది.

**వ.** **మఱియు నంగనాసక్తులగు కాముకుల సంగంబు నిరయరూపం బయిన సంసారంబగు; మహత్సంగంబు మోక్షద్వారం బగు; నట్టి మహాత్ము లెవ్వరనిన శత్రు మిత్రవివేకంబు లేక సమచిత్తులును శాంతులును క్రోధరహితులును సకలభూత దయాపరులును సాధువులును నగు వారలు మహాత్ము లనం దగుదు; రట్టి మహాత్ములు నా యందలి స్నేహంబె ప్రయోజనంబుగాఁ గలిగి యుండుటం జేసి విషయవార్తా ప్రవృత్తులగు కుజనులందుఁ దమ దేహగృహమిత్ర దారాత్మజాదులందుఁ బ్రీతిలేక యుండుదురు; విషయాసక్తుఁ డయినవాఁడు వ్యర్థ కర్మంబులం జేయు; నట్టి దుష్కృత కర్మంబులం జేయువాఁ డెప్పుడును బాపకర్ముం డగుచుం గ్లేశదంబగు దేహంబు నొందుచుండుఁ; గావునఁ బాపమూలంబు లయిన కామంబులు గోరకుఁ; డీ జ్ఞానం బెంతకాలంబుఁ లేకయుండు నంతకాలంబు నాత్మతత్త్వం బెఱుంగంబడ; దా తత్త్వం బెఱుంగ కుండుటం జేసి దేహికి దుఃఖం బధికంబై యుండు; లింగదేహం బెంత తడవుండు నంత తడవును మనంబు కర్మ వశంబై జ్ఞానవంతంబుగాక యవిద్యం బాయకుండు, శరీరంబు గర్మమూలం బగుటవలనఁ గర్మంబులు సేయఁజనదు; వాసుదేవుం డగు నాయందుఁ బ్రీతి యెంతతడవు లేక యుండు నంతతడవును దేహ ధర్మంబులు బాధించు, విద్వాంసుడైనను దేహేంద్రియాదులయందుఁ బ్రీతిసేసిన మిథునీభావసుఖ ప్రధానంబగు గృహస్థాశ్రమంబు నంగీకరించి స్వరూప స్మృతిశూన్యుండై మూఢుం డగుచు, నందు సంసార తాపంబులఁ బొందు; పురుషుండు స్త్రీతోడం గూడి యేకీభావంబు నొందుట తనకు హృదయ గ్రంథియై యుండు; నందు జనునకు గృహ క్షేత్ర సుతాప్త విత్తంబులందు 'నేను నాయది' యనియెడి మోహంబు గలుగు; నట్టి స్త్రీ పురుష మిథునీ భావంబుచే సంతానంబు గలుగు; నా సంతాన కారణంబున గృహ క్షేత్ర విత్తాదులు సంపాదింపఁబడు; నందు మోహం బధికం బగుటంజేసి మోక్షమార్గంబు దవ్వగు; నిట్లు సంసారంబునం దుండియు మనంబున నెప్పుడు ముక్తిచింతం జేయు నప్పుడు సంసారంబును బాయు; పరమ గురుండనైన నా యందుల భక్తి సేయుటయు విగతతృష్ణయు, ద్వంద్వ తితిక్షయు, సర్వలోకంబులందుల జంతు వ్యసనావగతియు, నీశ్వరవిషయక జ్ఞానాపేక్షయుఁ, దపంబును, విగతేచ్ఛయు, మత్కృతకర్మంబులు, మత్కథలు వినుటయు, నన్నె దైవంబుగా నెఱుంగుటయు, నస్మద్గుణ కీర్తనంబులును, నిర్వైరత్వ సామ్యోపశమంబులును, దేహ గేహంబులందు నాత్మ బుద్ధి జిహాసయు, నధ్యాత్మ యోగంబును, నేకాంత సేవయుఁ, బ్రాణేంద్రియాత్మల గెలుచుటయుఁ, గర్తవ్యాపరిత్యాగంబును, సచ్ఛ్రద్ధయు, బ్రహ్మచర్యంబును, గర్తవ్యకృత్యంబులందుల నప్రమత్తుం డగుటయు, వాఙ్నియమనంబును, సర్వంబు నన్న కాఁదలంచుటయు,**

**జ్ఞానంబును, విజ్ఞాన విజృంభితంబైన యోగంబును, ధృత్యుద్యమంబును, సాత్త్వికంబును నాదిగాఁ గల తెఱంగులచేత లింగదేహంబు జయించి దేహి కుశలుం డగుచు నుండవలయు. 69**

**ప్రతి :** మఱియున్= అంతమాత్రమేగాక; అంగనా+ఆసక్తులు+అగు= స్త్రీలయందు కోరిక గల్గిన; కాముకుల సంగంబు= కాముకులయొక్క సహవాసం; నిరయరూపంబు+అయిన= నరకరూపమయిన; సంసారంబు+అగున్= సంసారమే అగును; మహత్+సంగంబు= పెద్దల సాంగత్యం; మోక్షద్వారంబు+అగున్= మోక్ష భవనానికి వాకిలి అవుతుంది; అట్టి= అలాంటి; మహా+ఆత్ములు+ఎవ్వరు+అనినన్= అటువంటి మహాత్ములు ఎవరంటేను; శత్రుమిత్ర వివేకంబులేక= వీడు శత్రువు; వీడు మిత్రుడు అనే విభాగ దృష్టిలేక; సమచిత్తులును= సమానమయిన చిత్తం కలవారూ; శాంతులును= శాంతగుణం కలవారూ; క్రోధరహితులును= కోపమే తెలియనివారూ; సకల భూతదయాపరులును= సమస్త ప్రాణులపట్ల కారుణ్యం గలవారూ; సాధువులును= సాత్త్విక స్వభావులును; అగువారలు= అయినట్టివారు; మహా+ఆత్ములు+అనన్+తగుదురు= మహాపురుషులనుటకు తగిన వారగుదురు; అట్టిమహా+ఆత్ములు= అలాంటి మహానుభావులు; నాయందలి= నాపట్లగల; స్నేహంబు+ఎ= చెలిమియే; ప్రయోజనంబు+కాన్= ప్రయోజనంగా; కలిగియుండుటన్+చేసి= కలవారగుటవలన; విషయవార్తాప్రవృత్తులు+అగు= ఇంద్రియార్థముల ప్రవర్తనాలలో జీవించేవారైన; కుజనులందున్= చెడ్డవాళ్లలో; తమ= తమయొక్క; దేహగృహ మిత్రదార+ఆత్మజులందున్= ఇల్లు, మిత్రులు, భార్య, బిడ్డలు మొదలైనవాళ్లలో; ప్రీతిలేక+ఉందుదురు= ప్రీతిలేనివారై ఉంటారు; విషయ+ఆసక్తుఁడు+అయినవాఁడు= ఇంద్రియార్థమందు మనస్సు నిల్పినవాడు; వ్యర్థకర్మంబులన్+ చేయున్= అక్కరలేని పనులు చేస్తాడు అట్టి; దుష్కృతకర్మంబులు= అలాంటి చెడ్డపనులు; చేయువాఁడు= చేసేవాడు; ఎప్పుడును= ఎప్పటికయినాగాని; పాపకర్ముండు+అగుచున్= పాపకర్మలు చేసేవాడవుతూ; క్లేశదంబు+అగు= చిక్కులను కలిగించే; దేహంబున్+ఒందుచున్+ఉండున్= శరీరం పొందుతాడు; కావునన్= కనుక; పాపమూలంబులు+అయిన= పాపాలకు కారణమైన; కామంబులు= కోరికలను; కోరకుండు= కోరవలదు; ఈ జ్ఞానంబు= ఈ తెలివి; ఎంతకాలంబు లేకయుండున్= ఎంతకాలం ఉండదో; అంతకాలంబున్= అంతకాలం; ఆత్మతత్త్వంబు+ఎఱుంగన్+పడదు= ఆత్మతత్త్వం తెలియ వీలుగాదు; ఆ తత్త్వంబు+ఎఱుంగక+ఉండుటన్+చేసి= ఆ తత్త్వం తెలియని కారణంవల్ల; దేహికిన్= దేహం ధరించినవారికి; దుఃఖంబున్= దుఃఖంగూడా; అధికంబు+ఐ+ఉండున్= ఎక్కువగా ఉంటుంది; లింగదేహంబు= సూక్ష్మ శరీరం; ఎంత+తడవు+ఉండున్= ఎంతకాలం ఉంటుందో; అంత తడవును= అంతకాలం; మనంబు= మనసు; కర్మవశంబు+ఐ= కర్మకు లొంగినదై; జ్ఞానవంతంబు+కాక= జ్ఞానం కలిగినది కాక; అవిద్యన్= అజ్ఞానాన్ని; పాయక+ ఉండును= వదలిపెట్టక ఉంటుంది; శరీరంబు= దేహం; కర్మమూలంబు+అగుటవలనన్= కర్మలే కారణంగా గలది కావడంచేత; కర్మంబులు= కర్మలు; చేయన్+చనదు= చేయుట తగదు; వాసుదేవుండు+అగు+నాయందున్= వాసుదేవుడనైన నాయందు; ప్రీతి= సంప్రీతి; ఎంతతడవు= ఎంతకాలం; లేక+ఉండున్= ఉండదో; అంతతడవును= అంతకాలం కూడా; దేహధర్మంబులు= దేహంవల్ల సాగించవలసిన ధర్మాలు; బాధించున్= బాధపెడుతూ ఉంటాయి; విద్వాంసుండు+ఐననున్= అన్నీ తెలిసినవాడైనా; దేహ+ఇంద్రియాదులయందున్= దేహంపట్ల; ఇంద్రియములపట్లను; ప్రీతి+చేసినన్= ప్రీతి వహించినచో; మిథునీభావ సుఖప్రధానంబు= దాంపత్య భావంలోని సుఖమే ముఖ్యంగా కలది అయిన; గృహస్థ+ ఆశ్రమంబున్= గృహస్థాశ్రమాన్ని; అంగీకరించి= సమ్మతించి; స్వరూపస్మృతిశూన్యుండు+ఐ= తన తత్త్వమేమిటో జ్ఞప్తి లేనివాడయి; మూఢుండు+అగుచున్= మూర్ఖుడగుచు; అందున్= అందే; సంసార తాపంబులన్+పొందున్= సాంసారిక తాపాలను; పొందున్= పొందుతాడు; పురుషుండు= మానవుడు; స్త్రీతోడన్+కూడి= స్త్రీతో జతగూడి; ఏకీభావంబున్=

ఒకటిగా నుండుట; తనకున్= తనకు; హృదయగ్రంథి+ఐ+ఉండున్= హృదయంలోని ముడిగానుండును; అందున్= అందులో; జనునకున్= సామాన్య మానవునికి; గృహక్షేత్రసుత+ఆప్త+విత్తంబులందున్= ఇల్లు, పొలం, కొడుకులు, ఆప్తులు, డబ్బు, అనువానియందు; నేను= నేను; నా+అది= నాది; అనియెడి= అనునట్టి; మోహంబు+కలుగున్= మోహం కలుగుతుంది; అట్టి స్త్రీపురుష మిథునీ భావంబుచేన్= అటువంటి ఆడుది; మగవాడు జంటగా జీవించడమనే భావం కారణంగా; సంతానంబున్+కలుగున్= సంతానం సంభవిస్తుంది; ఆ సంతాన కారణంబునన్= ఆ సంతతి కారణంవల్ల; గృహక్షేత్రవిత్త+ఆదులు= ఇల్లు, పొలం, ధనం మొదలైనవి; సంపాదింపన్+పడున్= సంపాదించబడతాయి; అందున్= వాటియందు; మోహంబు= మోహం; అధికంబు+అగుటన్+చేసి= ఎక్కువ కావడంతో; మోక్షమార్గంబు= ముక్తిపథం; దవ్వు+అగున్= దూరమవుతుంది; ఇట్లు= ఈ రకంగా; సంసారంబునందున్+ఉండియున్= సంసారంలో జీవించికూడ; మనంబునన్= మనసులో; ఎప్పుడు= ఏ సమయంలో అయితే; ముక్తిచింతన్+చేయున్= ముక్తికి సంబంధించిన ఆలోచన చేస్తాడో; అప్పుడు= ఆ వేళ; సంసారంబును+పాయు= సంసారము తొలగిపోతుంది; పరమగురుండను+ఐన= పరమగురుడనయిన; నా+అందులన్= నాపట్ల; భక్తి+చేయుటకున్= భక్తి పుట్టడానికి; విగతతృష్ణయున్= ఆశ వదలడం; ద్వంద్వ తితిక్షయున్= సుఖదుఃఖాది ద్వంద్వాలను సహించడం; సర్వలోకంబులందుల= సమస్త లోకాలందలి; జంతువ్యసన+అవగతియున్= జీవులకు కలిగే బాధలు గ్రహించుట; ఈశ్వర విషయక= ఈశ్వరుడే లక్ష్యంగా గలిగిన; జ్ఞాన+అపేక్షయున్= జ్ఞానాన్ని సంపాదించాలనే కోరిక గలిగియుండటం; తపంబును= తపమును; విగత+ఇచ్ఛయున్= కోరికలు లేకుండటం; మత్+కృత+కర్మంబులు= నేను చేయు పనులు; మత్+కథలు= నా కథలు; వినుటయున్= శ్రవణం చేయడం; నన్ను+ఎ= నన్నే; దైవంబు+కాన్+ఎఱుంగుటయున్= దేవునిగా భావించడం; అస్మద్+గుణకీర్తనంబులును= నా గుణములను కీర్తించుటయును; నిర్వైరత్వ= ఎవరితోను విరోధం లేకుండుట; సామ్య= సమబుద్ధి; ఉపశమంబులును= శాంతంగా జీవించుటయు; దేహగేహంబులందున్= శరీరం; ఇల్లు మొదలగు వానిపట్ల; ఆత్మబుద్ధి జిహాస= తాను; తనది అను బుద్ధిని విడిచిపెట్టుటయు; అధ్యాత్మయోగంబును= అధ్యాత్మ సంబంధమూ; ఏకాంతసేవయున్= ఒంటరిగా దేవుని సేవించుటయు; ప్రాణ+ఇంద్రియ+ఆత్మలన్+గెలుచుటయున్= ఇంద్రియాలు, దేహం, ప్రాణాలను గెలవడం; కర్తవ్య+అపరిత్యాగంబును= చేయవలసిన పనులను మానకుండా ఉండటం; సత్+శ్రద్ధయున్= మంచిపనులపట్ల శ్రద్ధ కలిగి ఉండటం; బ్రహ్మచర్యంబును= బ్రహ్మచర్యమూ; కర్తవ్యకృత్యంబులందులన్= చేయవలసిన పనుల్లో; అప్రమత్తుండు+అగుటయున్= ఏమరుపాటు లేకుండా ఉండటం; వాక్+నియమనంబును= వాక్కులను జాగరూకతతో నియమించడం; సర్వంబు= అంతా; నన్ను; కాన్+తలంచుటయున్= నేనే అని తలచడం; జ్ఞానంబును= జ్ఞానం; విజ్ఞాన విజృంభితంబు+ఐన= విజ్ఞానంచే ప్రకాశింపబడిందైన; యోగంబును= యోగం; ధృతి+ఉద్యమంబున్= ధైర్యం వహించి ఉండడం; సాత్త్వికంబును= సత్త్వగుణమూ; ఆది+కాన్+కల+తెఱంగులచేతన్= మొదలైన విధాలచే; లింగదేహంబున్= సూక్ష్మదేహాన్ని; జయించి= గెలిచి; దేహి= దేహం కలవాడు, జీవి; కుశలుండు+అగుచున్+ఉండన్వలయున్= నేర్పరియై ఉండాలి.

**తా :** ఆడువారంటే మోజుపడి కామవాంఛ తీర్చుకోవడమే ప్రధానమనుకొన్నవారితో సహవాసం నరక రూపమైన సంసారం అవుతుంది. పెద్దల సహవాసం మోక్షానికి దారి తీస్తుంది. పెద్దలయిన మహాత్ములు ఎవరని అంటారా? వినండి. వీడు విరోధి, వీడు స్నేహితుడు అనే భేదభావం లేకుండా సమదృష్టి కలవారూ, శాంతస్వభావులూ, ఏ మాత్రం కోపం లేనివారూ, సమస్త జీవులపట్ల పరమ కారుణ్య స్వభావం కలవారూ, కపటం లేనివారూ, మహాత్ములని పిలువబడతారు. అలాంటి

మహానుభావులకు నాయందే పరిపూర్ణ భక్తి ఉంటుంది. అందువల్ల వారు విషయలంపటులయిన దుర్మార్గులపట్ల ప్రీతి గలిగి ఉండరు. తమ ఇల్లన్నా, దేహమన్నా, మిత్రులన్నా, భార్యాపుత్రులన్నా వారికి వ్యామోహం ఏ మాత్రం ఉండదు.

ఇంద్రియసుఖాలకు లోనయినవాడు పనికిరాని పాడుపనులు చేస్తుంటాడు. చెడ్డపనులు చేసేవాడు పాపం కొనితెచ్చుకొంటాడు. దుఃఖకారణమయిన దేహాన్ని మోస్తుంటాడు. అందువల్ల మీరు పాపాలకు మూలమయిన కోరికలను కోరకండి. యథార్థ జ్ఞానం ప్రాప్తించనంతవరకూ మీకు ఆత్మతత్త్వం బోధపడదు. ఆ తత్త్వం తెలియని కారణం వల్ల దేహికి దుఃఖం మిక్కుటమవుతుంది. లింగదేహ మెంతకాలం ఉంటుందో అంతకాలం మనస్సు కర్మవశమై ఉంటుంది. జ్ఞానం లభించదు. అవిద్య వదలదు. శరీరం కర్మమూలం. అందుచేత మోక్షార్థులైన మీకు కర్మలు చేయడం తగదు. వాసుదేవుడినైన నామీద ఆసక్తి కుదరనంతవరకూ మిమ్మల్ని దేహధర్మాలు బాధిస్తాయి. ఎంత చదువుకున్నవాడయినా, దేహేంద్రియ సుఖములందు ఆసక్తుడై సంభోగసుఖప్రధానమయిన గృహస్థాశ్రమం స్వీకరిస్తాడు. ఆ ఆశ్రమంలో ఆత్మస్మృతి కోల్పోవడం తథ్యం. అటువంటివాడు మూఢుడై సంసారక్లేశాలకు లోనౌతాడు.

సంసారికి ఇల్లన్నా, పొలాలన్నా, కొడుకులన్నా, ఆప్తులన్నా, ధనమన్నా నేను, నాది అనే వ్యామోహం పెరుగుతుంది. స్త్రీపురుషుల కలయికవల్ల సంతానం కలుగుతుంది. ఆ సంతానంకోసం ఇల్లు కట్టడమో, పొలాలు కొనడమో, ధనం సంపాదించడమో జరుగుతుంది. వాటివల్ల మోహం పెంచుకోవడంతో వానికి మోక్షమార్గం దూరమవుతుంది. సంసారంలో మునిగి ఉన్నవారికి ఎపుడయితే మోక్షాసక్తి కలుగుతుందో అపుడే వారికి సంసారం తొలగిపోతుంది.

పరమేశ్వరుడనైన నా మీద భక్తి కలిగి ఉండడం, కోరికలు లేకపోవడం, సుఖదుఃఖాలలో సహనం, సమస్తజీవుల కష్టాలపట్ల సానుభూతి కలిగి ఉండడం, భగవద్విషయమైన జ్ఞానమునందు ఆసక్తి, తపస్సు, నా కథలనూ, లీలలనూ ఆలకించడం, నన్నే దైవంగా భావించడం, నా గుణాలను కీర్తించడం, ఎవరితోనూ విరోధభావం లేకుండడం, సర్వత్ర సమబుద్ధి కలిగి ఉండడం, శాంతంతో జీవించడం, నా గేహం, నా దేహం అనే బుద్ధిని వదలిపెట్టడం, అధ్యాత్మయోగం అవలంబించడం, ఏకాంత భక్తిభావం, ప్రాణాలను, ఇంద్రియాలను, మనస్సును జయించడం, కర్తవ్య పరాయణత్వం, సత్కార్యములందు శ్రద్ధ, బ్రహ్మచర్యం, జాగరూకత, వాక్కులను సంయమనంతో వాడడం, అన్నిటిలో నన్నే చూడడం – జ్ఞానం విజ్ఞాన విజృంభితమయిన యోగం, గుండెదిటవు, సాత్త్విక ప్రవృత్తి మున్నగు విధానాలతో లింగదేహాన్ని జయించి మానవుడు శాశ్వత సుఖం సంపాదించాలి.

**విశే :** ఈ వచనంలో భక్తిమార్గం, మోక్షమార్గం విశదం చేయబడ్డాయి.

లింగదేహము= సూక్ష్మశరీరము= అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు, అయిదు ప్రాణములు, బుద్ధి, మనస్సు అను ఈ పదిహేడు కలిసి లింగదేహమనబడుతుంది.

**ఆ. అరయఁగర్మరూప మగు నవిద్యాజన్మ, మైన హృదయబంధనాది లతల**
**నప్రమత్తయోగ మను మహాఛురికచేఁ, ద్రెంపవలయు నంతఁదెంపుతోడ. 70**

**ప్రతి :** అరయన్= పరిశీలింపగా; కర్మరూపము+అగు= కర్మరూపమైన; అవిద్యాజన్మము+ఐన= అజ్ఞానం నుండి పుట్టినదైన; హృదయబంధన+ఆదిలతలన్= హృదయంలోని ముడి అయిన అహంకారం మున్నగు తీగలను; అప్రమత్తయోగము+అను= ఏమరుపాటు లేని యోగమనే; మహాఛురికచేన్= గొప్ప చురకత్తితో; అంతన్= అటుపిమ్మట; తెంపుతోడన్= సాహసంతో; త్రెంపవలయున్= కోసివేయాలి.

**తా :** అజ్ఞానంనుండి పుట్టిన హృదయబంధనమనే తీగెను యోగం అనే చురకత్తితో ధైర్యంగా తెంపివేయాలి.

**విశే :** కర్మలను త్రెంపడమంటే పనులు ఎగగొట్టడం కాదు. ఆలుబిడ్డలను బంధుమిత్రాదులను వదలడం కాదు. వారితో తమకుగల వ్యామోహ బంధాలను త్రెంపడమే. కర్తవ్యాలు మిగలకుండా ఆచరించడమే.

**ఆ. ఒనర నిట్లు యోగయుక్తుండు గురుఁడైన, భూపుఁడైన శిష్యపుత్రవరుల**
**యోగయుతులఁజేయ నొప్పుగా వలయును, గర్మపరులఁజేయఁగాదు కాదు. 71**

**ప్రతి :** ఒనరన్= తగినట్లు; ఇట్లు= ఈ రీతిగా; యోగయుక్తుండు= యోగాభ్యాసమనే సత్కర్మ చేసేవాడు; గురుఁడు+ఐనన్= గురువే అయినప్పటికీ; భూపుఁడు+ఐనన్= రాజే అయినా; శిష్యపుత్రవరులన్= శిష్యులను, కుమారులను; యోగయుతులన్+ ఒప్పుగాన్+చేయన్+వలయును= యోగాభ్యాసమనే సత్కర్మ చేయువారిగా తీర్చిదిద్దాలి; కర్మపరులన్= వ్యామోహాదులు కలిగించే కర్మలను చేసేవానిగా; చేయన్+కాదు కాదు= ఏమాత్రం చేయకూడదు (ఆకర్మలలో దింపరాదు అని భావం).

**తా :** అటువంటి యోగం అనుష్ఠించే వ్యక్తి గురువయితే శిష్యులనూ, తండ్రి అయితే బిడ్డలనూ, రాజయితే ప్రజలనూ తాను నేర్చిన యోగమార్గంలో పెట్టవలెనే గాని కర్మఫలాలపై ఆసక్తులను చేయకూడదు.

**సీ. జనులెల్ల నర్థ వాంఛలఁజేసి యత్యంత మూఢులై యైహికంబులు మనంబు**
**లందును గోరుదు; రల్ప సౌఖ్యములకు నన్యోన్యవైరంబు లంది దుఃఖ**
**ములఁబొందుదురు; గాన మునుకొని గురుఁడైనవాఁడు మాయామోహవశుఁడు నెంత**
**జడుఁడు నైనట్టి యా జంతువులందును దయ గల్గి మిక్కిలి ధర్మబుద్ధిఁ**

**ఆ. గన్నులున్నవాఁడు గానని వానికి, దెరువుఁజూపి నట్లు దెలియఁబలికి**
**యతుల మగుచు దివ్యమైన యా మోక్ష మా, ర్గంబుఁజూపవలయు రమణతోడ. 72**

**ప్రతి :** జనులు+ఎల్లన్= ప్రజలందరు; అర్థవాంఛలన్+చేసి= ఏవో ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని; అతి+అంత+ మూఢులు+ఐ= మిక్కిలి మూర్ఖులై; ఐహికంబులు= ఇహలోకానికి సంబంధించిన వానిని; మనంబులందును+కోరుదురు= మనసులో కోరుకొంటారు; అల్పసౌఖ్యములకున్= క్షణికమయిన స్వల్ప సౌఖ్యాలకుగాను; అన్య+అన్య+వైరంబులు+అంది= ఒకరిపై మరొకరు విరోధం పెంచుకొని; దుఃఖములన్+పొందుదురు= దుఃఖాలను పొందుతారు; కానన్= కావున; మునుకొని= ముందునడచుచు; గురుఁడు+ఐనవాఁడు= గురువైనవాడు; మాయామోహవశుఁడు= మాయామోహాలకు లోబడి, ఎంత; జడుఁడును+ఐనట్టి= ఎంతో మూర్ఖుడయినట్టి; ఆ జంతువులందును= ఆ జీవులపట్ల; దయన్+కల్గి= కరుణకల్గి; మిక్కిలి ధర్మబుద్ధిన్= గొప్పదయిన ధర్మబుద్ధితో; కన్నులు+ఉన్నవాఁడు= కనులుకలవాఁడు; కానని వానికిన్= చూపులేనివానికి; తెరువున్+చూపినట్లు= మార్గం చూపినట్లు; తెలియన్+పలికి= తెలుసుకొనే విధంగా పలికి; అతులము+అగుచున్= సాటిలేని దయి; దివ్యము+ఐన= దివ్యమయినదయిన; ఆ మోక్ష మార్గంబున్= ఆ మోక్షానికి మార్గాన్ని; రమణతోడన్= సంప్రీతితోడ; చూపన్వలయున్= దర్శింపజేయాలి.

**తా :** ప్రజలందరు ఏవో ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పనులు చేస్తూంటారు. మూర్ఖులయి ఎల్లప్పుడూ మనసులో ఐహికఫలాలు కోరుతుంటారు. అల్పసౌఖ్యంకోసం ఒకరిపై మరొకరు వైరం పెంచుకొంటారు. అంతులేని దుఃఖంలో

మునిగిపోతారు. అందుచేత గురువయినవాడు తానే ముందు నడిచి మాయామోహాలకు లోబడి మూర్ఖులయిన జీవులపట్ల సానుభూతి చూపాలి. కళ్లున్నవాడు గ్రుడ్డివారికి దారి చూపిన విధంగా అజ్ఞానులకు బోధించి సహాయపడాలి. సాటిలేనిదీ, దివ్యమయినదీ అయిన మోక్షానికి మార్గం చూపాలి.

**వ. మఱియుఁ బితృ గురుజననీ బంధు పతి దైవతంబులలో నెవ్వరైనను సంసార రూప మృత్యురహితం బైన మోక్షమార్గంబుం జూపకుండిరేని వా రెవ్వరును హితులు గానేరరు; నాదు శరీరంబు దుర్విభావ్యంబు; నాదు మనంబు సత్త్వయుక్తంబును, ధర్మసమేతంబును, బాపరహితంబు నగుటంజేసి పెద్దలు నన్ను ఋషభుం డండ్రు; గావున శుద్ధ సత్త్వమయంబైన శరీరంబునం బుట్టిన కుమారులైన మీర లందఱును సోదరుండును మహాత్ముండును నగ్రజుండును నైన భరతు నన్నెకాఁ జూచి యక్లిష్టబుద్ధిచే భజింపుం; డదియ నాకు శుశ్రూషణంబు; ప్రజాపాలనంబు సేయుట మీకును బరమధర్మంబని మఱియు నిట్లనియె. 73**

**ప్రతి :** మఱియున్= ఇంకనూ; పితృ గురు జననీ బంధుపతి దైవతంబులలోన్= తండ్రి, గురువు, తల్లి, చుట్టాలు, భర్త, దేవుడు మొదలయిన వారిలో; ఎవ్వరు+ఐననున్= ఎవ్వరైననూ; సంసారరూపమృత్యురహితంబు+ఐన= సంసారమనే పేరుగల మృత్యువులేనిదయిన; మోక్షమార్గంబున్= ముక్తి మార్గాన్ని; చూపక+ఉండిరి+ఏని= చూపకున్నట్లైతే; వారు+ఎవ్వరును= వారెవ్వరూ, హితులు; కాన్+నేరరు= మేలు కోరేవారు కారు; నాదు శరీరంబు= నా దేహం; దుర్విభావ్యంబు= భావించడానికి శక్యంకానిది; నాదు మనంబు= నా మనసు; సత్త్వయుక్తంబును= సత్త్వగుణంతో కూడినది; ధర్మసమేతంబును= ధర్మంతో కూడినదీ; పాపరహితంబున్+అగుటన్+చేసి= పాపం లేనిదగుట కారణంగా; పెద్దలు= ఆర్యులు; నన్నున్= నన్ను; ఋషభుండు+అండ్రు= ఋషభుడు అంటారు; కావునన్= ఆ కారణంబువలన; శుద్ధసత్త్వమయంబు+ఐన= శుద్ధ సాత్త్వికమయిన; శరీరంబునన్+పుట్టిన= శరీరం నుండి జన్మించిన; మీరలు+అందఱును= మీరందఱు; సోదరుండును= తోడ పుట్టినవాడు; మహా+ఆత్ముండును= గొప్ప మనస్సు గలవాడును; ఐన= ఐనటువంటి; భరతున్= భరతుని; నన్నెకాన్+చూచి= నన్నుగా దర్శించి; అక్లిష్ట బుద్ధిచేన్= చిక్కులు తెచ్చు కొనని బుద్ధితో చీకాకు చెందని మనస్సుతో; భజింపుండు= సేవింపుడు; అది+అ= అదే; నాకున్= నాకు; శుశ్రూషణంబు= సేవ; ప్రజాపాలనంబు= ప్రజలను పాలించుట; మీకునున్= మీకు కూడా; పరమధర్మంబు= ఉత్కృష్ట ధర్మం; అని= అంటూ; మఱియున్= ఆపై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** అంతేగాదు. తండ్రిగానీ, తల్లిగానీ, గురువుగానీ, బంధువుగానీ భర్తగానీ, దేవతగానీ అక్షయమైన మోక్షమార్గం చూపలేకపోతే వారెవరూ హితులుకారు.

నా శరీరంఎలా ఏర్పడిందో మీరేమాత్రం ఊహించలేరు. నా మనస్సు సత్త్వగుణంతో కూడింది. ధర్మంతో కూడింది. పాపరహితమైంది. అందు వల్లనే ఆర్యులు నన్ను 'ఋషభు'డన్నారు. శుద్ధసాత్త్వికమయిన నా శరీరం నుండి పుట్టిన వారే మీరందరూ. కుమారులారా! తోడ బుట్టినవాడూ, మీ అందరికీ పెద్దవాడూ, మహాత్ముడూ అయిన భరతుణ్ణి నాలాగే భావించి సద్బుద్ధితో సేవించండి. అదే మీరు నాకు చేసే శుశ్రూష. ప్రజలను పాలించడమే మీకు ధర్మం అని బోధించి ఋషభదేవుడు మరల ఇలా అన్నాడు.

**సీ. భూతజాలములందు భూజముల్ వర్యముల్ భూరుహములకంటె భోగికులము**
**భోగిసంతతికన్న బోధనిష్ఠులు బోధమాన్యులకన్నను మనుజవరులు**

**వీరికన్నను సిద్ధవిబుధగంధర్వులు వారి కన్న ను సురల్ వారికన్న**
**నింద్రాదిదేవత లిందఱికన్నను దక్షాది సన్మునుల్ దలఁప నెక్కు**

**తే. దంతకన్నను భర్గుఁ డా యభవుకన్నఁ, గనులభవుఁడెక్కుఁ; డాతనికంటె విష్ణుఁ**
**డధికుఁడాతఁడు విప్రుల నాదరించుఁ, గాన విప్రుండు దైవంబు మానవునకు. 74**

**ప్రతి :** భూతజాలములందున్= జీవుల సమూహాలలో; భూజముల్= చెట్లు; వర్యముల్= శ్రేష్ఠములు; భూరుహముల కంటెన్= వృక్షములకంటె; భోగి కులము= పాముల సమూహం (సుఖదుఃఖాలు అనుభవించే జీవులు); భోగిసంతతికన్నన్= పాముల సంతతికన్నా; బోధనిష్ఠులు= తెలివితేటలు గలిగినవారు; బోధమాన్యులకన్నను= తెలివిచే గౌరవింపబడేవారికన్నా; మనుజవరులు= శ్రేష్ఠులయిన మానవులు; వీరికన్నను= ఆ మానవులకంటె; సిద్ధ విబుధ గంధర్వులు= సిద్ధులు, పండితులు, గంధర్వులు; వారి కన్నను= సిద్ధాదులకంటె; సురల్= దేవతలు; వారికన్నన్= వారికంటె; ఇంద్ర+ఆది+దేవతలు= ఇంద్రుడు మొదలయినవారు; ఇందఱికన్నను= వీరందరికంటె; దక్ష+ఆది+సత్+మునుల్= దక్షుడు మొదలయిన గొప్ప మునులు; తలఁపన్= ఆలోచింపగా; ఎక్కుడు= అధికం; అంతకన్నను= దక్షాదులకన్నను; భర్గుఁడు= శివుడు; ఆ+అభవుకన్నన్= ఆ శివునికన్నా; కమలభవుఁడు= బ్రహ్మ; ఎక్కుడు= ఎక్కువ; ఆతనికంటెన్= ఆ బ్రహ్మకంటె; విష్ణుఁడు= శ్రీహరి; అధికుఁడు= గొప్పవాడు; ఆతఁడు= ఆ విష్ణువు; విప్రులన్= బ్రాహ్మణులను; ఆదరించున్= ఆదరిస్తుంటాడు; కానన్= అందువల్ల; మానవునకున్= మనుజునికి; విప్రుండు= బ్రాహ్మణుడు; దైవంబు= సాక్షాత్తు భగవంతుని వంటివాడు.

**తా :** సమస్త జీవరాసులలో వృక్షాలు శ్రేష్ఠమైనవి. చెట్లకంటె సర్పాలు శ్రేష్ఠమైనవి. పాములకంటె మేధావులు ఉత్తములు, బుద్ధిమంతులకంటె భూపతులు గొప్పవారు. రాజుల కంటె సిద్ధులు, పండితులు, గంధర్వులు శ్రేష్ఠులు. వారి కంటె దేవతలు గొప్పవారు. వారిని మించి ఇంద్రాది దిక్పాలకులు, వీరికంటె దక్షుడు మొదలయిన ప్రజాపతులు ఉత్తములు. ప్రజాపతులకంటె రుద్రుడు; రుద్రుని కంటె బ్రహ్మ; బ్రహ్మకంటె విష్ణువు అధికులు. విష్ణుడు బ్రాహ్మణులను ఆదరిస్తాడు. అందుచేత మానవులకు బ్రాహ్మణుడే దైవం.

**క. భూసురులకు సరిదైవం, బీ సచరాచరమునందు నెఱుఁగను; నాకున్**
**భూసురులు గుడుచునప్పటి, యా సంతోషంబు దోఁప దగ్నులయందున్. 75**

**ప్రతి :** భూసురులకున్= బ్రాహ్మణులకు; సరి= సమానమయిన; దైవంబు= దైవతం; ఈ సచారచరమునందున్= చేతనాచేతనాత్మకమైన ఈ సమస్త సృష్టియందు; ఎఱుఁగను= తెలియను; నాకున్= నాకు; భూసురులు= బ్రాహ్మణులు; కుడుచు+అప్పటి= భోజనం చేస్తున్నప్పుడు కలిగే; ఆ సంతోషంబు= ఆ హర్షం; అగ్నుల+అందున్= విధివిహితంగా అగ్నులలో వేల్చే హవిస్సులవల్ల కలిగే సంతోషం; తోఁపదు= కలుగదు.

**తా :** ఈ చరాచరప్రపంచంలో నాకు తెలిసినంతవరకు బ్రాహ్మణులకు సాటి అయిన దైవంలేదు. విధి విహితంగా అగ్నులలో వేల్చే హవిస్సుకంటె బ్రాహ్మణులు భోజనం చేస్తూండేటప్పుడు నాకు ఎక్కువ సంతోషం కలుగుతుంది.

**సీ. మంగళంబైన బ్రహ్మస్వరూపంబును వేదరూపంబు ననాదిరూప**
**మగుచున్న నాదు దేహము బ్రాహ్మణోత్తముల్ ధరియింతు రెప్పుడుఁదత్త్వబుద్ధి**

**శమదమానుగ్రహసత్యతపస్తితిక్షలు గల్గు విప్రుండు సద్గురుండు;**
**గాన మిక్కిలి భక్తి గల్గి యకించను లైన భూసురుల దేహములవలన**

**తే. నందుచుండును నాదు దేహంబు గాఁగ, నెఱిఁగి వరులగు విప్రులనెల్ల భక్తిఁ**
**బూజసేయుటయే నన్నుఁబూజసేయు, టనుచు వినిపించి మఱియు నిట్లనుచుఁ బలికె. 76**

**ప్రతి :** మంగళంబు+ఐన= శుభప్రదమయిన; బ్రహ్మస్వరూపంబును= పరబ్రహ్మస్వరూపాన్ని; వేదరూపంబున్= వేదస్వరూపాన్ని; అనాది= ఆదిలేనిదయిన; రూపము+అగుచున్+ఉన్న= రూపము కలిగినదయిన; నాదుదేహము= నాయొక్క శరీరాన్ని; బ్రాహ్మణ+ఉత్తముల్= బ్రాహ్మణులలో శ్రేష్ఠులు; తత్త్వబుద్ధిన్= యథార్థస్వరూపం తెలుసుకోవాలనే బుద్ధితో; ఎప్పుడున్= నిరంతరం; ధరియింతురు= ధరిస్తారు; శమ= అంతరింద్రియ నిగ్రహం అనగా కామక్రోధాదులు లేకుండుట; దమ= బహిరింద్రియ నిగ్రహం; అనుగ్రహ= ఎదుటివారిపట్ల దయచూపడం; సత్యతపస్తితిక్షలు+కల్గు= సత్యంపలకడం, తపస్సు చేయడం, ఎదుటివారి తప్పులు సహించడం అనగా ఓర్పు, మొదలయినవి కలిగిన; విప్రుండు= బ్రాహ్మణుడు, సద్గురుండు= మంచిగురువు; కానన్= ఆ కారణంవల్ల; మిక్కిలి భక్తికల్గి= ప్రగాఢమయిన భక్తి భావం కలిగి; అకించనులు+ఐన= తనకు వేరేగతి లేదు శ్రీహరి పాదాలే దిక్కు అనుకొనేవారైన; భూసురుల దేహములవలనన్= బ్రాహ్మణుల దేహముల మూలమున; అందుచున్+ఉండును= చేరడానికి వీలుగా ఉంటుంది; నాదుదేహంబు+కాఁగన్= వారి దేహాలనే నాదేహాలుగా; ఎఱిఁగి= తెలుసుకొని; వరులు+అగు= శ్రేష్ఠులయిన; విప్రులన్+ఎల్లన్= బ్రాహ్మణులనందరిని; భక్తిన్= భక్తితో; పూజ+చేయుటయే= అర్చించడమే; నన్నున్+పూజ+చేయుట+అనుచున్= నన్ను పూజ చేయడమని; వినిపించి= స్పష్టంచేసి; మఱియున్= ఆ తరువాత; ఇట్లు+అనుచున్= ఈ విధంగా; పలికెన్= పలికెను.

**తా :** నా దేహం పరబ్రహ్మ స్వరూపం, వేదమయం, దీనికి ఆదిలేదు. ఆలాంటి వేదరూపమైన నా దేహన్ని బ్రాహ్మణోత్తములు ధరిస్తారు. సత్త్వగుణం కలవాడు, జితేంద్రియుడూ, దయాళువూ, సత్యసంధుడూ, తపస్వీ, సహనశీలీ అయిన బ్రాహ్మణుడే మంచి గురువు. అందుచేత నేను పరమభక్తులూ, మహానుభావులూ అయిన బ్రాహ్మణుల దేహంతో కనిపిస్తుంటాను. పైన చెప్పిన గుణాలు కలిగిన బ్రాహ్మణులను నా రూపంగా భావించుకుని పూజచేయడం నన్ను పూజించడమే అవుతుంది అని మళ్ళీ ఇలా అన్నాడు.

**క. ఈ తెఱఁగు దెలిసి భూసుర, జాతింబూజించునట్టి జనుఁడును మాయా**
**తీతుండై నిక్కంబుగ, భూతలమున మోక్షమార్గమును బొడగాంచున్. 77**

**ప్రతి :** ఈ తెఱఁగు= ఈ విధాన్ని; తెలిసి= అర్థం చేసుకొని; భూసుర జాతిన్= బ్రాహ్మణ జన్మమెత్తినవారిని; పూజించు+అట్టి= పూజచేసేటటువంటి; జనుఁడును= మానవుడు; మాయా+అతీతుండు+ఐ= మాయను దాటినవాడై; నిక్కంబుగన్= సత్యంగా; భూతలమునన్= భూమిపైన; మోక్షమార్గమును= ముక్తిమార్గాన్ని; పొడ+కాంచున్= చూడగలడు.

**తా :** ఈ రహస్యం తెలుసుకొని బ్రహ్మవేత్తలయిన విప్రులను పూజించే మానవుడు మాయాతీతుడవుతాడు. భూలోకంలో మోక్షానికి మార్గం గుర్తిస్తాడు.

**వ. ఇట్లు సదాచారు లగు కుమారులకు లోకానుశాసనార్థం బాచారంబు లుపదేశించి మహాత్ముండును బరమసుహృత్తును నగు భగవంతుండు ఋషభాపదేశంబునం గర్మత్యాగంబు సేసి యుపశమశీలురగు**

**మునులకు భక్తిజ్ఞానవైరాగ్య లక్షణంబులు గల పారమహంస్య ధర్మం బుపదేశింపగలవాఁ డగుచుఁ బుత్రశతంబునం దగ్రజుండును బరమ భాగవతుండును భగవజ్జన పరాయణుండును నగు భరతుని ధరణీపాలనంబునకుఁ బట్టంబు గట్టి తాను గృహమందె దేహమాత్రావలంబనంబు సేసి దిగంబరుండై యున్మత్తాకారుం డగుచుం బ్రకీర్ణ కేశుండై యగ్నుల నాత్మారోపణంబు సేసి బ్రహ్మావర్తదేశంబును బాసి జడాంధ బధిర మూక పిశాచోన్మాదులుం బోలె నవధూత వేషంబు నొంది జనులకు మాఱు పలుకక మౌన వ్రతంబునం బుర గ్రామాకర జనపదారామ శిబిర వ్రజఘోష సార్థగిరి వనాశ్రమాదుల యందు వెంటంజనుదెంచు దుర్జన తర్జన తాడనావమాన మేహన నిష్ఠీవన పాషాణశకృద్రజః ప్రక్షేపణపూతి వాత దురుక్తులం బరిభూతుం డయ్యును గణనం బెట్టక వనమదేభంబు మక్షికాది కృతోపద్రవంబునుం బోలెఁ గై కొనక దేహాభిమానంబునం జిత్త చలనంబు నొందక యేకాకియై చరియించు చుండ నతి సుకుమారంబులగు కరచరణోరస్థ్సలంబులు విపులంబులగు బాహ్వంసకంఠ వదనాద్యవయవ విన్యాసంబులుం గలిగి ప్రకృతి సుందరం బగుచు స్వతస్సిద్ధదరహాసరుచిర ముఖారవిందంబై, నవ నళిన దళంబులంబోలి శిశిర కనీనికలం జెలువొంది, యరుణాయతంబులగు నయనంబులచే నొప్పి యన్యూనాధికంబులగు కపోల కర్ణ కంఠ నాసాదండంబులచేఁ దేజరిల్లుచు నిగూఢస్మితవదన విభ్రమంబులం బ్రకాశించు తన దివ్య మంగళ విగ్రహంబుచేఁ బుర సుందరుల మనంబుల కత్యంత మోహంబు గలుగఁజేయుచు. 78**

ప్రతి : ఇట్లు= ఈ విధంగా; సత్+ఆచారులు+అగు= మంచి ఆచారాలను పాలించువారయిన; కుమారులకున్= కొడుకులకు; లోక+అనుశాసన+అర్థంబు= లోకాన్ని శాసించడానికి; ఆచారంబులు+ఉపదేశించి= ఆచరించవలసిన విధానాలను ఉపదేశంచేసి; మహా+ఆత్ముండును= గొప్ప ఆత్మగలవాడును; పరమసుహృత్తును= ఉత్తమస్నేహితుడును; అగు= అయినటువంటి; భగవంతుండు= భగవానుడు; ఋషభ+అపదేశంబునన్= ఋషభుడనే మిషతో; కర్మత్యాగంబు+చేసి= కర్మలు ఆచరించడంపట్ల త్యాగబుద్ధిని ప్రకటించి; ఉపశమశీలురు+అగు= శాంతస్వభావంతో ప్రవర్తించేవారైన; మునులకున్= మునులకు; భక్తిజ్ఞానవైరాగ్యలక్షణంబులుగల= భక్తి, జ్ఞానం, విరక్తి అను లక్షణములు కల్గిన; పారమహంస్యధర్మంబు= పరమహంసల ధర్మాన్ని; ఉపదేశింపన్+కలవాఁడు+అగుచున్= ఉపదేశము చేయగలవాడగుచు, పుత్రశతంబునన్= నూరుగురు కొడుకులందు; అగ్రజుండును= తొలుత పుట్టినవాడును; పరమభాగవతుండును= భాగవతులలో శ్రేష్ఠుడును; భగవత్+జనపరాయణుండును+ అగు= భగవంతునిపై ఎల్లప్పుడు భక్తి గలవాడయిన; భరతునిన్= భరతుని; ధరణీపాలనంబునకున్= భూమిని పరిపాలించడానికి; పట్టంబు+కట్టి= పట్టాభిషిక్తుని జేసి; తాను= తాను (ఋషభుడు); గృహము+అందె= ఇంటియందె; దేహమాత్ర+అవలంబనంబు= దేహం మాత్రం నిలుపుకొనేప్రయత్నం; చేసి= చేసి; దిక్+అంబరుండు+ఐ= నగ్నదేహుడై; ఉన్మత్త+ఆకారుండు+అగుచున్= పిచ్చి వానివంటి ఆకారం కలవాడై, ప్రకీర్ణకేశుండు+ఐ= చెదరిన జుట్టుకలవాడై; అగ్నులను; ఆత్మ+ఆరోపణంబు+చేసి= తన యందు ఆపాదించుకొని, బ్రహ్మ+ఆవర్తదేశంబును+పాసి= బ్రహ్మావర్తదేశాన్ని వదలి పెట్టి; జడ+అంధ+బధిర+మూకపిశాచ+ఉన్మాదులున్+పోలెన్= మూర్ఖులవలె, గ్రుడ్డివాడిలాగా, చెవిటివాడిలాగా, దయ్యంపట్టినవాడిలాగా, పిచ్చివాడిలాగా; అవధూత వేషంబున్+ఒంది= దిగంబర సన్యాసి రూపంతో; జనులకున్= తన్ను సమీపించి అడిగే జనులకు; మాఱు+పలుకక= ప్రత్యుత్తరమీయకుండా; మౌనవ్రతంబునన్= మౌనంగా ఉండడమనే నియమపూర్వక వ్రతంతో; పుర= నగరాలు; గ్రామ= పల్లెలు; ఆకర= నివాస స్థానాలైన ఇండ్లు; జనపద= చిన్న గ్రామాలు;

ఆరామ= తోటలు; శిబిర= గుడారములు; వ్రజ= పసులకొట్టములు; ఘోష= గొల్లపల్లెలు; సార్థ= ప్రయాణికులు విడిదిచేసే చోట్లు; గిరి= కొండ; వన= అడవి; ఆశ్రమ+ఆదులయందున్= ఆశ్రమాలు మొదలైన ప్రదేశాలయందు; వెంటన్= తనవెంట; చనుదెంచు= వచ్చేటటువంటి; దుర్జన= చెడ్డవారియొక్క; తర్జన= బెదరించడం; తాడన= కొట్టడం; అవమాన= అవమానించడం; మేహన= మూత్రం పోయడం; నిష్ఠీవన= ఉమ్మివేయడం; పాషాణ= రాళ్ళు; శకృత్= పేడ; రజస్+ప్రక్షేపణ= దుమ్మెత్తి పోయడం; పూతివాత= కుళ్ళిన వస్తువులు విసరడం; దురుక్తులన్= చెడ్డమాటలచే; పరిభూతుండు+అయ్యును= అవమానింపబడినవాడయినా; గణనన్+పెట్టక= లెక్కపెట్టక; వనమద+ఇభంబు= అడవి యేనుగు; మక్షిక+ఆదికృత+ ఉపద్రవంబునున్+పోలెన్= ఈగలు మున్నగువానిచే కలిగే కీడునువలె; కైకొనక= లెక్క చేయకుండా; దేహ+అభిమానంబునన్= దేహముపట్ల అభిమానంచేత; చిత్తచలనంబున్+ఒందక= ఎలాంటి చిత్త చాంచల్యం పొందక; ఏకాకియై= ఒంటరియై; చరియించుచుండన్= తిరుగుచుండగా; సంచరించుచుండగా; అతిసుకుమారంబులు+అగు= మిక్కిలి మృదుత్వం కలిగిన; కరచరణ+ఉరస్స్థలంబులు= చేతులు, కాళ్ళు, రొమ్ము మొదలైనవి; విపులంబులు+అగు= విశాలమయిన; బాహు+అంసకంఠ= భుజాలు, మూపులు, కంఠం; వదన+ఆది= ముఖం మొదలయిన; అవయవ విన్యాసంబులున్+కలిగి= అవయవాల విస్పష్టత ఏర్పడి; ప్రకృతి సుందరంబు+అగుచున్= సహజంగా అందమైన దగుచు; స్వతస్సిద్ధ= సహజమయిన; దరహాసరుచిర= చిరునవ్వుతో వెలిగే; ముఖ+అరవిందంబు+ఐ= పద్మంవంటి ముఖం కలిగినదై; నవ= కొత్తదయిన; నళినదళంబులన్+పోలి= కొత్తవయిన పద్మములరేకులను పోలిన; శిశిరకనీనికలన్= చల్లని కనుపాపలతో; చెలువు+ఒంది= ప్రకాశించి; అరుణ+ ఆయతంబులు+అగు= ఎర్రనై విశాలములగు; నయనంబులచేన్= కనులతో; ఒప్పి= ప్రకాశించి; అన్యూన+అధికంబులు+ అగు= తక్కువ ఎక్కువ కానివి అయిన; కపోల= బుగ్గలు; కంఠ= గొంతు; కర్ణ= చెవులు; నాసాదండంబులచేన్= ముక్కు దూలముచే; తేజరిల్లుచున్= ప్రకాశించుచు; నిగూఢ= లోపలదాగిన; స్మితవదన= చిరునవ్వుతో కూడిన; విభ్రమంబులన్= ముఖశోభలతో; ప్రకాశించు= వెలిగే; తనదివ్యమంగళవిగ్రహంబుచేన్= తన దివ్యమంగళ స్వరూపముతో; పురసుందరుల మనంబులకున్= నగరమందలి స్త్రీల మనసులకు; అతి+అంత= మిక్కిలి; మోహంబున్+కలుగన్+చేయుచున్= మోహం కలిగిస్తూ...

**తా :** సదాచార సంపన్నులయిన కుమారులకు, లోకానికి వెల్లడించు నిమిత్తం అవసరమైన ఆచారాలను ఋషభదేవుడు ఉపదేశించాడు. మహానుభావుడూ, లోకబాంధవుడూ అయిన భగవంతుడు ఋషభుని రూపంలో కర్మసన్యాసం కావించి శాంతస్వభావులైన మునులకున్నూ, భక్తి జ్ఞాన వైరాగ్యాదులతో కూడిన పరమహంస ధర్మాలను ఉపదేశించాలని ఎంచాడు. ఆయన తన నూరుమంది కొడుకులలో పెద్దవాడు, పరమభాగవతుడైన భరతునికి పట్టంగట్టి రాజ్యభారం అప్పగించాడు. అనంతరం అతడు ఇంట్లోనే శరీర మాత్రసహాయుడై, దిగంబరుడై, చింపిరిజుట్టుతో, పిచ్చివానిలాగా ప్రవర్తిస్తూ అగ్నుల్ని తనలో ఆరోపించుకొని కొంతకాలంగడిపాడు. తర్వాత బ్రహ్మావర్తదేశాన్ని వదలిపెట్టి వెళ్ళిపోయాడు. జడునిలాగా, చెవిటివానిలాగా, మూగవానిలాగా, పిశాచం ఆవహించినవాడుగా, పిచ్చివాని విధంగా అవధూత వేషం ధరించాడు. ఎవరయినా పలకరించినా బదులు చెప్పకుండా మౌనవ్రతం చేపట్టాడు.

నగరాలు, గ్రామాలు, పల్లెలు, తోటలు, శిబిరాలు, బిడారులు, గొల్లపల్లెలు, గొడ్లపాకలు, కొండలు, తపోవనాలు, ఋష్యాశ్రమాలు దాటిపోసాగాడు. అక్కడక్కడ కొందరు వెంటపడేవారు. దుండగులు కొడుతున్నా, తిడుతున్నా, రాళ్ళువిసురుతున్నా, దుమ్ముచల్లుతున్నా, తనపై మూత్రవిసర్జనం చేసినా, ఉమ్మివేసినా, కుళ్ళినవస్తువులు పైకి విసరివేసినా, బూతుకూతలు కూస్తున్నా ఏ మాత్రం పట్టించుకోకుండా జోరీగలను లెక్కపెట్టని, అడవి యేనుగులాగా ముందుకు నడచి పోతున్నాడు. ఏ మాత్రం దేహాభిమానం లేకుండా, నిశ్చలమైన చిత్తంతో ఏకాకిగా సంచరిస్తున్నాడు.

అతని చేతులు, కాళ్ళు, ఉరోభాగం చాలా సుకుమారంగా ఉన్నాయి. భుజాలు, మూపులు, కంఠసీమ, ముఖంమొదలయిన అవయవాలు విశాలంగా తీర్చినట్లున్నాయి. అతని రూపం సహజ సుందరంగా ఉంది. పద్మం వంటి ముఖంలో స్వతస్సిద్ధమైన చిరునవ్వులు చిందుతున్నాయి. కొంగ్రొత్త తామర రేకులలాగ చల్లని కనుపాపలు కనిపిస్తున్నాయి. విప్పారిన కళ్ళల్లో ఎర్రదనం ప్రకాశిస్తున్నది. చెక్కిళ్ళుగాని, చెవులుగాని, మెడభాగంగాని ముక్కుదూలంగాని ఏ మాత్రం లోపం లేకుండా దిద్ది తీర్చినట్లున్నాయి. అతని పెదవుల లోపలి చిరునవ్వు ఇతరులను భ్రమింపజేసేవిధంగా ఉంది. అటువంటి ఆతని దివ్యమంగళ విగ్రహం ముద్దుగుమ్మలను మోహంలో ముంచెత్తుతున్నది.

**విశే :** అవధూత= అ అంటే అక్షరస్వరూపం తెలిసి, వ= సర్వజీవుల్లోనూ శ్రేష్ఠుడై, ధూ= సర్వబంధాలను త్రోసివేసి, త= నేనే పరమాత్మనను అనుభూతి పొంది ఆనందస్వరూపుడై ఉండేవాడు.

**శ్లో॥ అక్షరత్వా ద్వరేణ్యేత్వాత్ ధూతసంసార బంధనాత్।**
**తత్త్వమస్యాది లక్ష్యత్వాత్ అవధూత ఇతీర్యతే ॥** (అవధూత గీత)

**ఆ. ధూళిచేత మిగుల ధూసరితంబునై, జడలు గట్టి కడుఁబిశంగవర్ణ**
**ము నగు కేశపాశమును వెలిఁగించుచు, నితరు లెవరుఁదన్ను నెఱుఁగకుండ. 79**

**ప్రతి :** ధూళిచేతన్= దుమ్ముచేత; మిగులన్= మిక్కిలి; ధూసరితంబున్+ఐ= బూడిదరంగు గలదై; జడలు+కట్టి= పిడుచలు కట్టి; కడున్= మిక్కిలి; పిశంగవర్ణమున్+అగు= నలుపుతో కలిసిన పసుపురంగు కలిగినదయిన; కేశపాశమును= వ్రేలాడుచున్న జుట్టును; వెలిఁగించుచున్= ప్రకాశింపజేయుచు; ఇతరులు+ఎవరున్= సామాన్యులెవరును; తన్నున్= తనను; ఎఱుఁగక+ఉండన్= గుర్తుపట్టకుండా ఉండేటట్లు తిరుగుతున్నాడని పూరణ.

**తా :** ధూళి కొట్టుకొని ఋషభుని జుట్టు ధూసరవర్ణం ధరించింది. వెంట్రుకలు జడలుకట్టి గోరోచన వర్ణంతో మెరిసిపోతున్నాయి. అటువంటి వేషంతో అతడు ఎవరూ తనను గుర్తుపట్టకుండా -

**విశే :** ప్రాపంచిక అనుబంధం పోగొట్టుకోనివాడు, ఆ అనుబంధాన్ని ఆనందంగా భావించేవాడు అందరూ తన్ను గుర్తుపట్టాలని కోరుకొంటాడు. కాని, ఈ అనుబంధాన్ని తెంచుకొన్నవాడు కోరడు. పైగా తన్ను గుర్తు పట్టకూడదని భావిస్తాడు.

**క. అవధూతవేషమున ని, ట్లవనిన్ మలినంబులైన యవయవములతోఁ**
**దవిలి చరించుచునుండును, భువి భూతాక్రాంతుఁడయిన పురుషునిమాడ్కిన్. 80**

**ప్రతి :** అవధూతవేషమునన్= అవధూతరూపంతో; ఇట్లు= ఈ ప్రకారం; అవనిన్= భూమిలో; మలినంబులు+ఐన= మురికి పట్టినవయిన; అవయవములతోన్= అంగాలతో; తవిలి= పూని; భువిన్= భూలోకంలో; భూత+ఆక్రాంతుఁడు+ అయిన= దయ్యం పట్టిన; పురుషుని మాడ్కిన్= మనుష్యునిలాగా; చరించుచున్+ఉండును= తిరుగుతుంటాడు.

**తా :** ఆ ఋషభుడు దయ్యం పట్టిన వానిలాగా, మురికిపట్టిన అవయవాలతో అవధూత వేషంతో సంచరించ సాగాడు.

**ఆ. జనుల కిట్లు యోగసంచార మెల్ల వి, రుద్ధ మనుచు నాత్మబుద్ధిఁజూచి**
**యజగరంబు మాడ్కి నవనిపై నుండె బీ, భత్సకర్మమునకుఁబాలుపడుచు. 81**

**ప్రతి :** జనులకున్= రాజ్యంలోని జనులకు; ఇట్లు= ఈ రీతిగా; యోగసంచారము+ఎల్లన్= యోగస్థితిలో తిరగడమంతా; విరుద్ధము+అనుచున్= సక్రమం కాదని; ఆత్మబుద్ధిన్= తన బుద్ధితో; చూచి= క్షుణ్ణంగా పరిశీలించి; అజగరంబుమాడ్కిన్= కొండ చిలువవలె; బీభత్స కర్మమునకున్= ఏహ్యమయిన పనికి; పాలు+పడుచున్= పూనుకుంటూ; అవనిపైన్+ఉండెన్= నేలపై ఉండెను.

**తా :** తన అవధూత వేషం, తన యోగవిధానం ప్రజలకు విరుద్ధంగా ఉంటుందని ఋషభుడు గ్రహించి అసహ్యమైన పనులుచేస్తూ కొండచిలువలాగా నేలపై పడివుండి లభించినవాటినే ఆహారంగా తీసుకుంటూ ఉండేవాడు.

**విశే :** తన ప్రవర్తన లోకవిరుద్ధమని ఋషభుడు తెలుసుకొన్నాడు. నగరం వదిలాడు. అడవుల్లో తిరిగాడు. జనసంచార స్థలాలు వర్జించాడు. చివరకు నిలబడి సంచరిస్తే ఎవరి దృష్టికైనా బాధగాని, వింతగాని కలుగుతుందేమోనని నేలపై పడుకొని కొండచిలువలాగా ఉండసాగాడు.

**వ. ఇట్లు బీభత్సరూపంబున వసుంధరం బడియుండి యన్నంబు భుజించుచు నీరు ద్రావుచు మూత్రపురీషంబులు విడుచుచు నవి శరీరంబున నంటం బొరలుచుండు, మఱియుఁ దత్పురీష సౌగంధ్య యుక్తంబగు వాయువు దశదిశలన్ దశయోజన పర్యంతంబు పరిమళింపం జేయుచుండ గోమృగకాక చర్యలం జరియించుచు భగవదంశంబైన ఋషభుండు మహానందంబు ననుభవించుచుం దనయందు సర్వభూతాంతర్యామి యగు వాసుదేవునిం బ్రత్యక్షంబుగాఁ గనుంగొనుచు సిద్ధిం బొందిన వైహాయస మనోజవ పరకాయ ప్రవేశాంతర్ధాన దూర గ్రహణ శ్రవణాది యోగ సిద్ధులు దమంత వచ్చినం గైకొనక యుండె నని పలికిన శుకయోగీంద్రునకుంబరీక్షిన్నరేంద్రుం డిట్లనియె. 82**

**ప్రతి :** ఇట్లు= ఈ రీతిగ; బీభత్సరూపంబునన్= జుగుప్స కలిగించే ఆకారంతో; వసుంధరన్+పడియుండి= భూమిపై పడివుండి; అన్నంబున్= అన్నమును; భుజించుచున్= తింటూ; నీరు+త్రావుచున్= జలపానం చేస్తూ; మూత్ర పురీషంబులు= ఉచ్చ, మలములను; విడుచుచున్= వదలిపెడుతూ; అవి= ఆ మలమూత్రాలు; శరీరంబునన్= దేహానికి; అంటన్= అంటుకొనగా; పొరలుచుండున్= దొర్లుతుంటాడు; మఱియున్= అంతేగాక; తద్+పురీష సౌగంధ్యయుక్తంబు+అగు= అతని మలమున పుట్టిన మంచి పరిమళముతో కూడిన; వాయువు= గాలి; దశదిశలన్= పదిదిక్కుల; దశయోజన పర్యంతంబు= పది ఆమడల వరకు; పరిమళింపన్+చేయుచున్+ఉండన్= సువాసన కలిగించుచుండగా; గోమృగకాక చర్యలన్= ఎద్దువలె, జింకవలె, కాకులవలె; చరియించుచున్= ప్రవర్తిస్తూ; భగవత్+అంశంబు+ఐన= నారాయణాంశమైన; ఋషభుండు= ఋషభుడనే అవధూత; మహా+ఆనందంబున్= గొప్ప ఆనందాన్ని; అనుభవించుచున్= అనుభవిస్తూ; తన+అందున్= తనలోన; సర్వభూత+అంతర్యామి+అగు= అన్ని ప్రాణులలో అంతర్యామిగానుండు; వాసుదేవునిన్= శ్రీమన్నారాయణుని; ప్రతి+అక్షంబుగాన్= ఎట్టయెదుట; కనుంగొనుచున్= దర్శించుచు; సిద్ధిన్+పొందినన్= సిద్ధి పొందగా; వైహాయస= ఆకాశంలో సంచరించడం; మనోజవ= మనసుతో సమానమయిన వేగంతో తిరగడం; పరకాయ ప్రవేశ= ఇతర శరీరంలో ప్రవేశించడం; అంతర్ధాన= మాయంకావడం; దూరగ్రహణ= దూరంగా ఉన్నవాటిని దర్శించడం; శ్రవణ+ఆది= వినడం మొదలయిన; యోగసిద్ధులు= యోగంవల్ల; తమంత తాము లభించే సిద్ధులు; తమంత= తమకు తాముగా; వచ్చినన్= ఆశ్రయించినా; కైకొనక+ఉండెన్= స్వీకరించలేదు; అని పలికిన= అని చెప్పగా; శుకయోగి+

ఇంద్రునకున్= యోగులలో శ్రేష్ఠుడయిన శుకునితో; పరీక్షిత్+నర+ఇంద్రుండు= నరశ్రేష్ఠుడయిన పరీక్షిత్తు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** ఈ విధంగా ఆయన జుగుప్స కలిగించే తీరున నేలమీద పరుండి ఉండేవాడు. అన్నం తింటూ, నీరు తాగుతూ, మలమూత్రాలు విసర్జిస్తూ మలమూత్రాదులలో పొరలుతుండేవాడు. అతని మలసుగంధంతో కూడిన వాయువు పది దిక్కులలోనూ పది ఆమడల దూరం పరిమళిస్తుండగా; భగవదంశ సంభూతుడైన ఋషభుడు ఎద్దువలె, జింకవలె, కాకివలె ప్రవర్తిస్తూ మహానందం పొందేవాడు. సర్వాంతర్యామి అయిన వాసుదేవుణ్ణి తనలో ప్రత్యక్షంగా దర్శించుకొంటూ యోగసిద్ధుడైనాడు. అపుడు ఆకాశగమనం, మనోవేగం, పరకాయ ప్రవేశం, అంతర్ధానం, దూరదర్శనం, దూరశ్రవణం మొదలయిన సిద్ధులు తమంత తాము ఋషభుణ్ణి ఆశ్రయించాయి. అయినా ఆ ఋషభుడు ఆ సిద్ధులను స్వీకరించలేదు అని శుకయోగి ఋషభుని వృత్తాంతం చెప్పగా పరీక్షిత్తు తన సందేహం ఇలా వెలిపుచ్చాడు.

**క. మునివర! యోగజ్ఞానం, బునఁ జెఱుపంబడ్డ కర్మములు గల పెద్దల్**
**గని యుండెడి యైశ్వర్యం, బును ఋషభుం డెఱిఁగి యేల పొందకయుండెన్? 83**

**ప్రతి :** మునివర= మునులలో శ్రేష్ఠుడా; యోగజ్ఞానంబునన్= యోగంతోపొందిన జ్ఞానంవల్ల; చెఱుపన్+పడ్డ= రూపుమాపబడిన; కర్మములు కల= కర్మలుగల్గిన; పెద్దల్= మహనీయులు; కని+ఉండెడి= దర్శించెడి; ఐశ్వర్యంబును= ఈశ్వర మహిమలను; ఋషభుండు= అవధూత అయిన ఋషభుడు; ఎఱిఁగి= తెలిసినవాడయ్యు; ఏల= ఎందుకు; పొందక+ఉండెన్= స్వీకరింపక విడిచిపెట్టాడు.

**తా :** మునివరేణ్యా! యోగంవల్ల జ్ఞానం కలుగుతుంది. కర్మలు నశిస్తాయి. అలాంటి మహనీయులకు మహాసిద్ధులు ప్రాప్తిస్తాయి. అయినా తమంత తాము వచ్చిన ఐశ్వర్యాలను ఋషభుడెందుకు స్వీకరించలేదు స్వామీ!

**వ. అనిన శుకుండిట్లనియె. 84**

**ప్రతి :** అనినన్= అని పరీక్షిత్తు సందేహం ప్రకటించగా, శుకుండు= శుకమహర్షి, ఇట్లు= ఇలా, అనియెన్= సమాధానం ఇచ్చాడు.

**తా :** అని పరీక్షిన్మహారాజు అడుగగా ఆ శుకమహర్షి ఇలా చెప్పాడు.

**మ. ధరణీవల్లభ! నీదు వాక్యములు దథ్యంబింతయుందప్పు, దె**
**ట్లరయన్ వన్యమృగంబు పట్టువడి తా నా వేళ నా లుబ్ధకున్**
**ధర వంచించినమాడ్కి నింద్రియములన్ దండించి చిత్తంబు ని**
**ర్భరకామాదుల కాస యిచ్చుఁగడుసంరంభంబుతోఁగ్రమ్మఱన్. 85**

**ప్రతి :** ధరణీవల్లభ= భూపతీ!; నీదువాక్యములు= నీయొక్క వాక్యాలు; తథ్యంబు= నిజమే; ఇంతయున్+తప్పదు= కాసంతకూడ తప్పదు; ఎట్లు+అరయన్= ఏ రీతి పరిశీలించినా; వన్యమృగంబు= అడవిలోని జంతువు; పట్టు+పడి= బంధనానికి లోనయి; తాను+ఆవేళన్= తాను ఆ సమయంలో; ఆ లుబ్ధకున్= ఆ వేటగానిని; ధరన్= లోకంలో; వంచించినమాడ్కిన్= కన్నుగప్పి తప్పించుకొన్నట్లు; ఇంద్రియములన్= దేహేంద్రియాలను; దండించి= శిక్షించి; చిత్తంబు=

మనస్సు; క్రమ్మఱన్= మఱల; నిర్భరకామ+ఆదులకున్= భరించడానికి వీలుకాని కోరికలకు; కడు సంరంభంబుతోన్= మిక్కిలి విజృంభణంతో; ఆస+ఇచ్చున్= అవకాశమిస్తుంది.

**తా :** ఓ రాజా! నీవన్నది నిజమే. అడవిలోని మృగాలు వేటగానికి పట్టువడుతాయి. అయినా ఏదోవిధంగా వాణ్ణి వంచించి తప్పించుకొని బయటపడతాయి. అలాగే ఇంద్రియాలను లొంగదీసుకున్నా మనస్సు మరల ఏదోవిధంగా విజృంభించి కోరికలకు అవకాశమిస్తుంది. (మనస్సనే వేటగానికి ఇంద్రియాలనే మృగాలు లొంగినట్లే లొంగి మనస్సును వంచించి తప్పించుకుపోతాయి).

**క. చిరకాలతపము నైనను, హరియింపఁగ నోపుఁజిత్త మని పెద్దలు న**
**మ్మరు జారులకున్ జారిణి, కరణిని నదరించు మనసు కామాదులకున్. 86**

**ప్రతి :** చిరకాలతపమున్+ఐనను= చాలాకాలం చేసిన తపస్సునయినా; చిత్తము= మనస్సు; హరియింపఁగన్= అణచివేయుటకు; ఓపున్= సమర్థమైనది; అని= అనుచూ; పెద్దలు= విజ్ఞులు; నమ్మరు= విశ్వసించరు; జారులకున్= విటులకు; జారిణికరణిన్= ఱంకుటాలివలె, స్వైరిణి మాదిరి; మనసు= చిత్తము; కామ+ఆదులకున్= కోరికలు మున్నగువాటికి; అదరించున్= వశపరుస్తుంది.

**తా :** మహీనాథ! మనసు చాల చిత్రమయింది. చాలకాలం శ్రమపడి సాధించుకున్న తపస్సునయినా అది హరిస్తుంది. అందుచేత పెద్దలు మనసును నమ్మరు. జారిణి తన భర్తకు హాని చేయుటకై జారులకు అప్పగించినట్లు మనస్సు యోగిని కామాదులకు అప్పగిస్తుంది.

**క. కామక్రోధాదికముల్, భూమీశ్వర! కర్మబంధములు మఱియును జే**
**తోమూలము లగుటను దా, రీ మహిలో మనసు నమ్మ రెప్పుడుఁబెద్దల్. 87**

**ప్రతి :** మరియును= ఇంకా; భూమీశ్వర= నరేంద్రా; కామక్రోధ+ఆదికముల్= కామక్రోధాది అరిషడ్వర్గాలు; కర్మబంధములు= కర్మబంధాలు; చేతస్+మూలములు= మనస్సే హేతువుగా గలవి; అగుటను= అగుటవల్ల; పెద్దల్ తారు= తాము; మహిలోన్= లోకంలో; మనసున్= మనసును; ఎప్పుడున్= ఏ వేళనూ; నమ్మరు= విశ్వసించరు.

**తా :** నరేంద్రా! కామక్రోధాది అరిషడ్వర్గాలకూ, కర్మబంధాలకూ మనస్సే మూలకారణం. అందుచేత ఆర్యులు మనస్సును సుతరామూ విశ్వసింపరు.

**సీ. అదిగాన నెన్నఁడు నైశ్వర్యములను జే పట్టఁజూడఁడు, లోకభవ్యులైన**
**వారలచే నభివందనంబులు వొంది వెలయంగ నవధూతవేష భాష**
**ణంబుల నెఱిఁగికొనఁగరాని భగవత్స్వరూపంబు గలిగి యా రూపమందుఁ**
**బరమయోగధ్యానపరులకు నెల్ల దేహత్యాగసమయంబు నంతలోనఁ**

**తే. జూపుచుండియు దేహంబుఁబాప నిశ్చయించె; నచ్చట దివ్యయోగీంద్రుఁ డాద్యుఁ**
**డతుల దివ్యప్రకాశకుఁ డమరగురుఁడు, పరమపురుషుండు ఋషభుండు పార్థివేంద్ర! 88**

**ప్రతి :** పార్థివ+ఇంద్ర= ఓ రాజా!; అది+కానన్= అందుచేత; ఎన్నఁడున్= ఏ నాడును; ఐశ్వర్యములను= ఈశ్వరత్వంవల్ల కలిగే మహిమలను; చేపట్టన్+చూడఁడు= గ్రహించుటకు యత్నించడు; లోకభవ్యులు+ఐనవారలచేన్= లోకంలో శుభమార్గం

అవలంబించే వారలచేత, అభివందనంబులు+పొంది= నమస్కారాలు పొంది; వెలయన్+కన్= ప్రకాశించే రీతిలో; అవధూత వేషభాషణంబులన్= దిగంబర సన్యాసియొక్క వేషం; సంభాషణంబులచేత; ఎఱిఁగి కొనఁగరాని= తెలిసికొనుటకు వీలులేని; భగవత్+స్వరూపంబు+కలిగి= భగవత్స్వరూపం పొంది; ఆరూపము+అందున్= ఆ అవధూతరూపంలో; పరమ యోగధ్యానపరులకున్+ఎల్లన్= ఉత్కృష్టమయిన యోగాన్ని ధ్యానించే వారికందరికి; దేహత్యాగ సమయంబు+అంతలోనన్= శరీరాన్ని త్యజించు సేపటిలోనే; చూపుచున్+ఉండియున్= సూచిస్తూ; దివ్యయోగి+ఇంద్రుండున్= మహాయోగులలో సర్వశ్రేష్ఠుడయినవాడును; ఆద్యుఁడు= మహాత్ములలో అగ్రేసరుడయినవాడును; దివ్యప్రకాశకుఁడు= సాటిలేని దివ్యతేజస్సుతో ప్రకాశించేవాడును; అమరగురుఁడు= దేవతలకు గురువయినవాడు; పరమపురుషుండు= ఉత్కృష్ట పురుషుడయిన; ఋషభుండు= ఋషభుడు; దేహంబున్= దేహాన్ని; అచ్చటన్= అక్కడ; పాపన్+ఇచ్చగించెన్= విడవడానికి నిశ్చయించాడు.

**తా :** ఓ రాజా! మనసు గతి తెలిసినవాడు కావడంవల్ల తమంత తాము వచ్చినను యోగసాధనచే లభించిన సిద్ధులను ఋషభుడు చేపట్టలేదు. కనీసం వాటివంక చూడనయినా చూడలేదు. లోకంలో శుభం కోరేవారి అభివందనాలను ఆ మహాత్ముడు అందుకున్నాడు. వేషంలోగాని, మాటల్లోగాని ఋషభుడని గుర్తు పట్టడానికి వీలు లేనట్టుగా భగవత్స్వరూపంతో ఋషభుడు వెలిగిపోతున్నాడు. పరమయోగాన్ని ధ్యానించేవారికందరికీ దేహత్యాగం చేయదగ్గ సమయాన్ని ఋషభుడు సూచిస్తున్నాడు. మహాయోగులలో శ్రేష్ఠుడయినవాడు, మహాత్ములలో అగ్రేసరుడు, సాటిలేని దివ్యతేజస్సులో ప్రకాశించేవాడు, దేవతలకు గురువయినవాడు, పరమపురుషుడయిన ఋషభుడు శరీరం విడవడానికి నిశ్చయించాడు.

**వ. అంత విముక్తలింగుండు భగవంతుండునగు ఋషభుండు మనంబున దేహాభిమానంబు విసర్జించి కులాల చక్రంబు కులాలుని చేత భ్రమియింపంబడి విసృష్టంబయ్యు భ్రమియించు గతిం బ్రాచీన సంస్కార విశేషంబగు నభిమానాభాసంబున దేహచలనాదికంబుల నొప్పి యుండియు, యోగమాయా వాసనచే యుక్తుండయ్యెఁ; మఱియు నా ఋషభుం డొక్క దినంబునం గోంకణవంక పట కుటకంబులను దక్షిణ కర్ణాట దేశంబులకు యదృచ్ఛం జని కుటకాచలోపవనంబున నిజాస్యకృతశిలా కబళుం దగుచు నున్మత్తుని చందంబున వికీర్ణ కేశుండు, దిగంబరుండునై సంచరింప, వాయువేగ విధూత వేణుసంఘర్షణ సంజాతంబగు నుగ్రదావానలంబు తద్వనంబు దహింప నందు దగ్ధుండయ్యెఁ; నంత నతని కృత్యంబులు తద్దేశవాసులగు జనంబులు సెప్ప నర్హన్నామకుండగు తద్రాష్ట్రాధిపతి విని, నిజధర్మంబులం బరిత్యజించి స్వదేశస్థులతోడం గూడి, దా నా యాచారంబుల నంగీకరించి, యధర్మ బహుళం బగు కలియుగంబున భవితవ్యతచే విమోహితుండై మనుజుల నసమంజసం బగు పాషండ మతాభినివేశులం జేసె; మఱియును గలియుగంబునందు మనుజాధములు దేవమాయా మోహితులై శాస్త్రోక్త శౌచాచారంబులు విడిచి నిజేచ్ఛం జేసి దేవతా హేళనంబులు సేయుచు, నస్నానానాచమనాశౌచ కేశోల్లుంఛనాది కాపవిత్ర వ్రతంబులం జేయుచు నధర్మ బహుళం బగు కలియుగంబునం జెఱుపంబడ్డ బుద్ధి ధర్మంబులం గలిగి వేద బ్రాహ్మణ యజ్ఞపురుషుల దూషించుచు లోకంబులం దమ తమ మతంబులకుం దామే సంతసిల్లుచు నవేద మూలంబగు స్వేచ్ఛం జేసి ప్రవర్తించి యంధపరంపరచే విశ్వాసంబు సేసి తమంతన యంధతమసంబునం బడుచు**

**నుండుదు; రీ ఋషభుని యవతారంబు రజోవ్యాప్తులగు పురుషులకు మోక్ష మార్గంబు నుపదేశించుటకు నయ్యె; నదియునుంగాక సప్త సముద్ర పరివృతంబులగు నీ భూద్వీప వర్షంబులందలి జనంబులు దివ్యావతార ప్రతిపాదకంబు లతిశుద్ధంబులు నగు నెవ్వని కృత్యంబులం గీర్తింతురు, మఱియు నెవ్వని వంశంబున నతికీర్తిమంతుండగు ప్రియవ్రతుండు గలిగె, నెందు జగదాద్యుండగు పురాణపురుషుం డవతారంబు నొంది కర్మహేతుకంబులుగాని మోక్ష ధర్మంబులం దెలిపె, వెండియు నెవ్వండు యోగమాయా సిద్ధుల నసద్భూతంబు లగుటం జేసి నిరసించె, నట్టి ఋషభునితోడఁ దత్సిద్ధికృత ప్రయత్నులగు నితర యోగీశ్వరులు మనోరథంబుననైన నెట్లు సరియగుదు? రిట్లు సకల వేదలోక దేవబ్రాహ్మణులకు గోవులకుం బరమ గురుండు, భగవంతుండు నగు ఋషభుని చరిత్రంబు వినినవారలకు దుశ్చరితంబులు దొలంగు; మంగళంబులు సిద్ధించు; మిక్కిలి శ్రద్ధతోడ నెవ్వండు విను, వినిపించు, వానికి హరిభక్తి దృఢం బగు; నట్టి హరి భక్తి తాత్పర్యంబునం బెద్దలు భాగవతు లగుటం జేసి సంప్రాప్త సర్వపురుషార్థు లగుచు వివిధ వృజిన హేతుకంబగు సంసారతాపంబును బాసి యవిరతంబుఁ దద్భక్తియోగామృత స్నానంబు సేసి పరమ పురుషార్థంబయిన మోక్షంబును జెందుదురని సప్తద్వీపంబులవారు నేఁడునుం గొనియాడుచుండుదురు. 89**

**ప్రతి :** అంతన్= అటుపిమ్మట; విముక్తలింగుండు= లింగదేహము తొలగిపోయినవాడు; భగవంతుండును+అగు= జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తి తేజస్సులనే షాడ్గుణ్య సంపత్తి గలిగిన పరమాత్ముడయిన; ఋషభుండు= ఋషభనాముడైన అవధూత; మనంబునన్= మనస్సునందు; దేహ+అభిమానంబున్= దేహంమీది అభిమానాన్ని; విసర్జించి= వదలిపెట్టి; కులాల చక్రంబు= కుమ్మరివాని సారె; కులాలుని చేతన్= కుమ్మరివానిచేత; భ్రమియింపన్+పడి= త్రిప్పబడి; విసృష్టంబు+అయ్యున్= విడిచిపెట్టబడినదయిననూ; భ్రమియించుగతిన్= తిరిగే రీతిలో; ప్రాచీన సంస్కార విశేషంబు+అగు= పూర్వ కర్మ సంస్కారాల ప్రత్యేకతతో కూడినదైన; అభిమాన+ఆభాసంబునన్= అభిమానము కాని అభిమానమనిపించు చిత్తవృత్తి చేత; దేహచలన+ ఆదికంబులన్= శరీరం కదలించడం మొదలయిన వానిచేత; ఒప్పి+ఉండియున్= ప్రకాశించియు; యోగమాయా వాసనచేన్= యోగమాయా ప్రభావంచేత; యుక్తుండు+అయ్యెన్= కూడినవాడయ్యాడు; మఱియున్= ఇంకనూ; ఆ ఋషభుండు= ఆ అవధూత అయిన ఋషభుడు; ఒక్కదినంబునన్= ఒకరోజు; కోంకణ+వంక, పట కుటకంబులు+అను= కోంకణము, వంకము, పటము, కుటకము అనే ప్రదేశాలుగల; దక్షిణ కర్ణాటదేశంబులకున్= దక్షిణ కర్ణాట భూభాగాలకు; యదృచ్ఛన్+చని= అప్రయత్నంగావెళ్ళి; కుటక+అచల+ఉపవనంబునన్= కుటక పర్వత సమీపంలో; నిజ+ఆస్యకృతశిలా కబళుండు= తన నోటిలో రాళ్ళను కబళించి పట్టినవాడు; అగుచున్= అగుచు; ఉత్+మత్తుని చందంబునన్= పిచ్చివానివలె; వికీర్ణకేశుండు= చెదరిన జుట్టు కలవాడు; దిక్+అంబరుండున్+ఐ= దిస మొలవాడయి; సంచరింపన్= సంచరింపగా; వాయువేగవిధూత= గాలివేగంతో కదల్చబడిన; వేణుసంఘర్షణ సంజాతంబు+అగు= వెదుళ్ళు ఒకదానితో ఒకటి ఒరసికోవడంవల్ల పుట్టిన; ఉగ్రదావానలంబు= భయంకరమయిన కార్చిచ్చు; తద్వనంబున్= ఆ అడవిని; దహింపన్= కాల్చగా; అందున్= ఆ కార్చిచ్చులో; దగ్ధుండు+అయ్యెన్= కాలిపోయాడు; అంతన్= అంత; అతని కృత్యంబులు= ఆ ఋషభదేవుని చేతలు; తత్+దేశవాసులు+అగు= ఆ కర్ణాటక ప్రాంతనివాసులైన; జనంబులు+చెప్పన్= ప్రజలు చెప్పగా; అర్హత్+నామకుండు+అగు= అర్హతుడు అనే పేరు కలిగినవాడయిన; తద్‌రాష్ట్ర+అధిపతి= ఆ రాష్ట్రానికి ఏలిక అయినవాడు; విని= ఆలించి; నిజధర్మంబులన్= తనయొక్క ధర్మాలను; పరిత్యజించి= వదలిపెట్టి; స్వదేశస్థులతోడన్+కూడి=

తన దేశంలోని వారితో సంప్రదింపులు జరిపి; తాను+ఆ+ఆచారంబులన్= ఏలికయైన తానుగా ఆ ఆచారాలను; అంగీకరించి= సమ్మతించి; అధర్మబహుళంబు+అగు= లెక్కలేనన్ని అధర్మ కృత్యాలకు మూలమయిన; కలియుగంబునన్= కలియుగంలో; భవితవ్యతచేన్= విధి విధానముచేత (జరుగువలసియున్నవానిచే); విమోహితుండు+ఐ= భ్రాంతిపడినవాడై; మనుజులన్= మానవులను; అసమంజసంబు+అగు= ఉచితముకాని; పాషండమత+అభినివేశులన్+చేసెన్= వేదనిందకమైన మార్గమున కుతూహలపడినవారుగా చేసాడు; మఱియును= అంతమాత్రమేగాక; కలియుగంబు+అందున్= నాల్గవదయిన కలియుగంలో; మనుజ+అధములు= నీచులయిన మానవులు; దేవమాయామోహితులు+ఐ= దైవమాయ కారణంగా మోహంలో మునిగినవారై; శాస్త్ర+ఉక్త+శౌచ+ఆచారంబులు= శాస్త్రంలో చెప్పబడిన శుచిత్వం మొదలయిన ఆచరణ మార్గాలు; విడిచి= వదలిపెట్టి; నిజ+ఇచ్ఛన్+చేసి= తమ ఇష్టం వచ్చినట్లు చేసి, ప్రవర్తించి; దేవతా హేళనంబులు+ చేయుచున్= దేవతలను అపహాస్యం చేస్తూ; అస్నాన= స్నానం చేయకపోవడం; అనాచమన= ఆచమింపకుండడం, అశౌచ= శుచిత్వం లేకపోవడం; కేశ+ఉల్లుంఛన+ఆది= జుట్టుపీక్కోవడం మొదలయిన, అపవిత్ర వ్రతంబులన్= పవిత్రం కానివానిని ఆచరించే నిష్ఠను; చేయుచున్= పాటిస్తూ, అధర్మబహుళంబు+అగు= ధర్మవ్యతిరేక కార్యక్రమములనేకములు గలదయిన; కలియుగంబునన్= కలియుగంలో; చెఱుపన్+పడ్డ= నాశనం చేయబడ్డ; బుద్ధి ధర్మంబులన్+కలిగి= స్వబుద్ధి నిర్ణయించినదే ధర్మమనే భావన కలిగి; వేదబ్రాహ్మణ యజ్ఞపురుషులన్= వేదాలనూ; బ్రాహ్మణులనూ; యజ్ఞపురుషులనూ; దూషించుచున్= నోటికి వచ్చినట్టు అనరాని మాటలు ఆడుతూ; లోకంబులన్= ఇహలోకంలో; తమతమ మతంబులకున్= తమ తమ అభిప్రాయాలకు; తాము+ఏ= తాము మాత్రమే; సంతసిల్లుచున్= సంతోషపడుతూ; అవేదమూలంబు+అగు= వేదంలో ప్రమాణ వాక్యాలు లేనిదయిన; స్వ+ఇచ్ఛన్+చేసి= తన కోరిక ప్రకారం నిర్వర్తించి; అంధపరంపరచేన్= గుడ్డివారి వరుసచే; విశ్వాసంబు+చేసి= నమ్మకం కలిగించుకొని; తమ+అంతన= తమంత తాము; అంధ తమసంబునన్+పడుచున్= కన్నుగానని చీకటిలో పడుతూ; ఉండుదురు= ఉంటారు; ఈ ఋషభుని అవతారంబు= ఈ అవధూత అయిన ఋషభుని జన్మము; రజస్+వ్యాప్తులు+అగు= రజోగుణం ఎక్కువ కలవారయిన; పురుషులకున్= పురుషులకు; మోక్షమార్గంబున్+ ఉపదేశించుటకున్+అయ్యెన్= మోక్షమార్గం బోధించుటకయినది; అదియునున్+కాక= అంతేగాక; సప్తసముద్ర పరివృతంబులు+అగు= ఏడు సముద్రాలచే ఆవరింపబడినవగు; ఈ భూద్వీపవర్షంబులు+అందలి= ఈ భూగోళము, దీవులు, వర్షములు అనబడు విభాగాలలో; జనంబులు= మనుజులు; దివ్య+అవతార ప్రతిపాదకంబులు= దివ్యమయిన అవతారాన్ని చెప్పునవి; అతిశుద్ధంబులును+అగు= మిక్కిలి మాలిన్యరహితములయిన; ఎవ్వని= ఎవ్వాని; కృత్యంబులు= లీలావినోదములు; కీర్తింతురు= కీర్తిస్తారో; మఱియున్= అంతేగాక; ఎవ్వని వంశంబునన్= ఎవరియొక్క వంశంలో; అతికీర్తిమంతుండు+అగు= ఎంతో కీర్తి గడించినవాడు అయిన; ప్రియవ్రతుండు= ప్రియవ్రతుడు; కలిగెన్= కలిగెనో; ఎందున్= ఎక్కడ; జగత్+ఆద్యుండు+అగు= లోకాలకు ఆది అయిన; పురాణపురుషుండు= పురాణాలలో విఖ్యాతుడయినవాడు; అవతారంబున్+ఒంది= అవతరించి; కర్మహేతుకంబులు+కాని= కర్మసంబంధంలేని; మోక్ష ధర్మంబులన్= మోక్షధర్మాన్ని, తెలిపెన్= తెలిపెనో; వెండియున్= మఱల; ఎవ్వండు= ఎవడు; యోగమాయాసిద్ధులన్= యోగ మాయవలన లభించే సిద్ధులను; అసత్ భూతంబులు+అగుటన్+చేసి= అసత్య స్వరూపములగుట వలన; నిరసించెన్= తిరస్కరించాడో; అట్టి= అటువంటి; ఋషభునితోడన్= ఋషభుడనే అవధూతతోడ; తత్సిద్ధికృత ప్రయత్నులు+అగు= అతడు పొందిన సిద్ధికై ప్రయత్నించువారైన; ఇతర యోగి+ఈశ్వరులు= ఇతర యోగాధీశులు; మనోరథంబునన్+ఐనన్= కాంక్షలతోనైన; ఎట్లు= ఏ రకంగా; సరి+అగుదురు= సరిపోలుదురు?; ఇట్లు= ఈ రకంగా; సకల వేదలోక దేవబ్రాహ్మణులకున్= అన్ని వేదాలకూ, అన్ని లోకాలకూ, సమస్త దేవతలకూ, బ్రాహ్మణులకూ; గోవులకున్= ధేనువులకు; పరమగురుండు= ఉత్కృష్టుడయిన

గురువు; భగవంతుండున్+అగు= భగవంతుడయిన; ఋషభుని చరిత్రంబున్= ఋషభుని గాథను; వినినవారలకున్= విన్నవారలకు; దుశ్చరితంబులు+తొలంగున్= చెడ్డ ప్రవర్తనలు తొలగును; మంగళంబులు సిద్ధించున్= శుభములు సిద్ధించును; మిక్కిలి శ్రద్ధతోడన్= ఎంతో శ్రద్ధతోడ; ఎవ్వండు వినున్= ఎవడు వినునో; వినిపించున్= ఎవడు వినిపించునో; వానికిన్= అటువంటి వానికి; హరిభక్తి= విష్ణువుపట్ల భక్తి; దృఢంబు+అగున్= గట్టిదగును; అట్టి హరిభక్తి తాత్పర్యంబునన్= అలాంటి హరిభక్తి నిష్ఠతో; పెద్దలు= పెద్దలయిన; భాగవతులు+అగుటన్+చేసి= భగవద్భక్తులను గావించి; సంప్రాప్త సర్వపురుష+అర్థులు+అగుచున్= అన్ని పురుషార్థాలను పొందినవారు అగుచు; వివిధ వృజిన హేతుకంబు+అగు= నానావిధ పాపాలు కారణముగా కల; సంసార తాపంబును+పాసి= సంసార తాపాన్ని వదలిపెట్టి; అవిరతంబున్= ఎడతెగక; తద్+భక్తియోగ+అమృత+స్నానంబు+చేసి= హరిభక్తి యోగమనే అమృత స్నానంచేసి; పరమపురుష+అర్థంబు+అయిన= ధర్మాది పురుషార్థాలలో శ్రేష్ఠమైన; మోక్షంబును= మోక్షపదవిని; చెందుదురు+అని= పొందుతారని; సప్తద్వీపంబులవారు= సప్త ద్వీపాలలోనివారు; నేఁడునున్= ఈనాడుకూడా; కొనియాడుచున్+ఉండుదురు= పొగడుతుంటారు.

**తా :** భగవంతుని అవతారమైన ఋషభుడు మనసులో దేహాభిమానాన్ని వదలుకొన్నాడు. కుమ్మరివాడు సారెను వేగంగా త్రిప్పి విడిచిపెట్టిన తర్వాత కూడా ఆ చక్రం కొంతసేపు తిరుగుతున్నట్లే, పూర్వ సంస్కార విశేషంవల్ల ఆయన దేహ సంచలనం పూర్తిగా ఆగిపోదు. ఋషభుడు లింగదేహాన్ని వదలిపెట్టినా యోగమాయావాసనల కారణంగా లౌకికంగా దేహధారిగా చరించాడు. అతడు కొంకణం, వంకం, పటం, కుటకం అనే పేర్లతో పిలువబడే దక్షిణ కర్ణాటక దేశాలవైపు కదిలాడు. కుటక పర్వత వనసమీపం చేరుకున్నాడు. అక్కడ శిలాఖండాలను నోటిలో పెట్టుకొని పిచ్చివానిలాగా జుట్టు విరియబోసుకొని దిగంబరుడై సంచరించాడు. అపుడు వీచిన సుడిగాలి విసురుకి దుమ్ము రేగింది. గాలికి వెదుళ్ళు రాసుకుని అడవిలో నిప్పంటుకుంది. ఆ నిప్పు కార్చిచ్చులాగా అడవినంతా అలముకొనింది. ఆ కార్చిచ్చుమంటలలో ఋషభుడు కాలిపోయాడు. ఋషభుని చేతలను ఆ ప్రాంతంవారు చెప్పుకోగా అర్హతుడు అను పేరుగల ఆ రాష్ట్రాధికారి ఆలకించాడు. అతడు స్వధర్మం వదలిపెట్టి స్వదేశస్థులతో ఆ ఆచారానికి ఆమోదం తెలిపాడు. అధర్మ బహుళమయిన కలియుగంలో భవితవ్యతకు లోబడిపోయి తన రాష్ట్రంలోని మానవులను అయోగ్యమయిన వేద బాహ్యమతంపట్ల మొగ్గేటట్లు చేశాడు.

కలియుగంలో అధములైన మానవులు దేవమాయవల్ల మోహితులవుతారు. శాస్త్రాలలో ప్రవచనం చేయబడ్డ శౌచాలనూ, ఆచారాలనూ వదలిపెడతారు. తమకు ఇష్టం వచ్చినట్లు దేవతలను పరిహసిస్తారు. స్నానం చేయరు. ఆచమనం అసలు లేదు. శుచిత్వం సున్న. జుట్టుతెంచుకొంటారు. అపవిత్ర వ్రతాలను పాటిస్తారు. అధర్మాలు పెచ్చు పెరిగిన కలియుగంలో బుద్ధి చెడిపోగా వేదాలనూ, బ్రాహ్మణులనూ, యజ్ఞపురుషులనూ నోటికి వచ్చినట్టు అనరాని మాటలంటారు. తమ తమ అభిప్రాయాలకు తామే తెగ మురిసిపోతారు. వేదవిరుద్ధంగా ప్రవర్తిస్తారు. గుడ్డిగా వ్యాపించే దురాచారాలపట్ల నమ్మకం పెంచుకుంటారు. చివరకు అంధతమసంలో పతనమవుతారు.

రజోగుణంతో నిండిన పురుషులకు మోక్షమార్గం ఉపదేశించడం కోసమే ఋషభుని అవతారం. ఏడు సముద్రాలతో కూడిన ఈ ద్వీపాలలోని జనులు దివ్యమైన ఎవని అవతార లీలలను కీర్తిస్తారో, ఎవడు ఎంతో కీర్తి గడించిన ప్రియవ్రతుని వంశంలో జన్మించాడో, ఎవడు లోకాలకు ఆది అయిన పురాణపురుషుడో అలాంటి ఋషభదేవుడు భూలోకంలో అవతరించి

కర్మసంబంధంలేని మోక్షధర్మాన్ని ప్రబోధించాడు. యోగమాయవల్ల తనకు తామై లభించిన సిద్ధులన్నిటినీ గడ్డిపరకలనువలె తిరస్కరించాడు. అలాంటి మహావ్యక్తికి సిద్ధులకోసం ప్రయత్నించే యోగీశ్వరులు ఏ విధంగా సాటి అవుతారు?

అన్ని వేదాలకూ, అన్ని లోకాలకూ, సమస్త దేవతలకూ, బ్రాహ్మణులకూ, గోవులకూ పరమ గురువయినవాడు, భగవంతుడయినవాడు ఋషభుడు. ఆయన చరిత్రం వింటే చెడునడతలు తొలగిపోతాయి. శుభాలు చేకూరుతాయి. ఎవరయితే ఋషభుని చరిత్రం మిక్కిలి శ్రద్ధతో వింటారో, ఎవరు ఇతరులకు వినిపిస్తారో వారికి సుదృఢమైన హరిభక్తి లభిస్తుంది. అటువంటి హరిభక్తిపట్ల తత్పరత కలిగిన పెద్దలైన భాగవతులు హరికృపవల్ల ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే పురుషార్థాలను సాధించుకొంటారు. నానావిధ పాపకారణమయిన సంసారతాపాన్ని పోగొట్టుకుంటారు. హరిభక్తి యోగమనే అమృతస్నానం చేసి పవిత్రులవుతారు. పరమపురుషార్థమైన మోక్షాన్ని సిద్ధింపచేసుకొంటారు. ఈ విధంగా సప్తద్వీపాలలోని జనులు నేడు కూడా ఋషభుని మహిమను పొగడుతుంటారు.

**విశే :** ఈ వచనంలో ప్రధానంగా నాల్గు అంశాలున్నాయి. మొదటిది దేహత్యాగ విధానం. రెండవది 'కలియుగవర్తన' కథనం. మూడవది కర్మసంబంధం లేని మోక్షధర్మోపాయం. నాల్గవది భాగవత మార్గం.

**ఆ. యాదవులకు మీకు నత్యంతకులగురు, వైన కృష్ణుఁడెచట నైనఁ గలఁడు;**
**కొలుచువారి కెల్ల సులభుఁడై మోక్షంబు, నిచ్చుఁజింతసేయ నేల నీకు? 90**

**ప్రతి :** యాదవులకున్= యదువంశంలో పుట్టినవారికి; మీకున్= పాండవ వంశంబులో జన్మించినవారికి; అతి+అంత+ కులగురువు+ఐన= యాదవకుల, కురుకులాలకు మిక్కిలి గురువైన; కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; ఎచటన్+ఐనన్= సర్వే సర్వత్ర; కలఁడు= ఉన్నాడు; కొలుచువారికిన్+ఎల్లన్= సేవించే వారికంతా; సులభుఁడు+ఐ= చేరుటకు దగ్గరివాడై; మోక్షంబున్+ ఇచ్చున్= ముక్తిని ప్రసాదించును; నీకున్= నీకు; చింత+చేయన్+ఏల= చింతించుట ఎందుకు?

**తా :** పరీక్షిన్మహారాజా! యాదవులకున్నూ, మీకున్నూ (పాండవులకు) కులగురువయిన శ్రీకృష్ణుడు ఆచోట ఈచోట అనక అన్నిచోట్లా ఉన్నాడు. కొలిచేవారికి అతడు కొంగుబంగారమై తప్పక మోక్షం ప్రసాదిస్తాడు. నీవేమాత్రం దిగులుపడవద్దు.

**సీ. నిత్యానుభూతమై నిజరూపలాభ నివృత్తమై తగు మహాతృష్ణ గలిగి**
**యతులిత విపుల మాయారచితంబైన లాభంబునకుఁ దగులంబు లేని**
**మతి గల్గి లోకుల నతి వేడ్కఁ గరుణించి యభయదానంబిచ్చి యందఱ కిల**
**నవ్యయంబై దివ్యమై మహానందమై యత్యంతసేవ్యమై యతులమైన**

**తే. తనదు లోకంబు చూపంగఁదగిన యట్టి, మోక్షమార్గంబు నెఱిఁగించి ముక్తదేహుఁ**
**దగుచుఁదాదాత్మ్య మొందెఁ బ్రత్యక్ష విష్ణు, వైన ఋషభుండు జనులకు నద్భుతముగ. 91**

**ప్రతి :** నిత్య+అనుభూతము+ఐ= ఎల్లప్పుడు అనుభవింపబడుతున్నదై; నిజరూప లాభనివృత్తము+ఐ= తన సహజస్థితి ప్రాప్తిచేత తొలగినదై; తగు= తగినట్టి; మహాతృష్ణ కలిగి= మిక్కిలి దప్పిక (తరుగని కోరిక కలిగి); అతులిత= సాటిలేని; విపుల= విస్తారమయిన; మాయారచితంబు+ఐన= మాయచే కల్పింపబడినదయిన; లాభంబునకున్= లబ్ధికి; తగులంబులేని=

కోరికలేని; మతి+కల్గి= మనసు కల్గి; లోకులన్+అతివేడ్కన్= లోకులను మిక్కిలి వేడుకతో; కరుణించి; అందఱకున్= ఎల్లరకు; అభయ దానంబున్+ఇచ్చి= భయంలేదని నమ్మకం కల్గించి; ఇలన్= లోకంలో; అవ్యయంబు+ఐ= తరుగనిదై; దివ్యము+ఐ= దివ్యమై; మహా+ఆనందము+ఐ= ఆనందప్రదమై; అతి+అంత+ సేవ్యము+ఐ= మిక్కిలి సేవింపదగినదై; అతులము+ఐన= సాటిలేనిదైన; తనదు లోకంబు= తన లోకమును; చూపన్+కన్+ తగిన= దర్శింప చేయుటకు తగిన; అట్టి= అలాంటి; మోక్షమార్గంబున్+ఎఱిఁగించి= మోక్షోపాయమును తెలియజేసి; ముక్తదేహుఁడు+అగుచున్= దేహాన్ని వదలిపెట్టినవాడగుచు; ప్రత్యక్ష విష్ణువు+ఐన= సాక్షాత్కరించిన విష్ణువువంటివాడయిన; ఋషభుండు= ఋషభుడు; జనులకున్= మనుజులకు; అద్భుతముగన్= అత్యాశ్చర్యకరంగా; తాదాత్మ్యము+ఒందెను= తాదాత్మ్యం పొందాడు.

**తా :** ఋషభదేవుడు నిత్యానుభూతమైన స్వస్వరూప లాభంవల్ల తృష్ణను నివారింపజేశాడు. యోగమాయవల్ల లభించిన మహాసిద్ధులచేత ఆయన బుద్ధి ఆకర్షింపబడలేదు. ఆ మహానుభావుడు లోకులందరినీ కనికరించి అభయమిచ్చాడు. నిత్యమయినదీ, దివ్యమయినదీ, ఆనందప్రదమైనదీ, సేవింపదగినదీ, సాటిలేనిదీ అయిన వైకుంఠలోకాన్ని అందింపగల మోక్షమార్గాన్ని అందరికీ ఉపదేశించాడు. ఆ తరువాత దేహం వదలి జనులంతా ఆశ్చర్యచకితులయ్యేటట్లు విష్ణుమూర్తితో తాదాత్మ్యం పొందాడు. ఋషభుడు సామాన్యుడు కాడు. ఆయన సాక్షాత్తు విష్ణువు.

## a ═భరతోపాఖ్యానము═ a

**మ. భరతుండంత ధరాతలంబుఁగడఁకంబాలించుచున్ ధారుణీ**
**శ్వరచంద్రుండగు విశ్వరూపునకు మున్ సంజాతయై యుండి ని**
**ర్భరకాంతిన్ విలసిల్లు పంచజని పేరంగల్గు కాంతామణిం**
**గర మర్థిన్ ధరఁబెండ్లియాడె శుభలగ్నంబందు భూవల్లభా! 92**

**ప్రతి :** భూవల్లభా= భూపతీ; భరతుండు= ఋషభుని కుమారుడయిన భరతుడు; అంతన్= ఋషభావతార సమాప్తి ఐన తరువాత; ధరాతలంబున్= భూభాగాన్ని; కడఁకన్= పూనికతో; పాలించుచున్= పరిపాలించుచు; ధారుణీ+ ఈశ్వరచంద్రుండు+అగు= రాజులలో శ్రేష్ఠుడైన; విశ్వరూపునకున్= విశ్వరూప నామధేయునికి; మున్= ముందు; సంజాతయై+ఉండి= పుట్టినదై; నిర్భరకాంతిన్= అత్యంత కాంతితో; విలసిల్లు= ప్రకాశించే; పంచజనిపేరన్+కల్గు= పంచజని అనే పేరుతో పిలువబడేదైన; కాంతామణిన్= కాంతలలో శ్రేష్ఠురాలయినదానిని; కరము= మిక్కిలి; అర్థిన్= కోరికతో; ధరన్= లోకమున; శుభలగ్నంబు+అందున్= మంచిలగ్నంలో; పెండ్లి+ఆడెన్= పెండ్లి చేసుకొన్నాడు.

**తా :** రాజా! భరతుడు భూమండలాన్ని ఎంతో దీక్షతో పరిపాలించాడు. అతని కాలంలో విశ్వరూపుడనే రాజుండేవాడు. అతడు రాజులలో శ్రేష్ఠుడు. అతనికి పంచజని అనే కొమార్తె ఉంది. ఆమె అత్యంత కాంతిమతి అయిన కాంతామణి. అటువంటి పంచజనిని భరతుడు సుముహూర్తంలో కోరి పెళ్ళి చేసుకున్నాడు.

**విశే :** ఋషభుని వందమంది కుమారులలో భరతుడు జ్యేష్ఠుడు. మహాభాగవతుడు. భక్తజనపరాయణుడు. అందువల్ల ఋషభుడు అతనిని రాజుగా చేశాడు. భరతుడు పాలనాధికారి అయ్యాడు.

**వ. ఇట్లు వివాహితుండై యా పంచజని వలన నహంకారంబునం బంచతన్మాత్రలు జనించిన తెఱంగున సుమతి రాష్ట్ర భృత్సుదర్శనాచరణ ధూమ్రకేతువులను నేవురు పుత్రులం బుట్టించె; నటమున్న యజనాభంబను పేరం బరఁగు వర్షంబు భరతుండు పాలించుకతంబున భారతవర్షంబు నాఁబరఁగె నంత. 93**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; వివాహితుండు+ఐ= వివాహమాడినవాడై; ఆ పంచజనివలనన్= విశ్వరూపుని కూతురు పంచజని వలన; అహంకారంబునన్= అహంకారమువలన; పంచతన్మాత్రలు= శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం; జనించిన తెఱంగునన్= పుట్టినట్లుగా; సుమతి= సుమతి నామధేయుడును; రాష్ట్రభృత్= రాష్ట్రభృత్తు అనే పేరుగలవాడు; సుదర్శన= సుదర్శనుడనే పేరుగలవాడు; ఆచరణ= ఆచరణాఖ్యుడు; ధూమ్రకేతువులు+అను= ధూమ్రకేతువు అనే; ఏవురుపుత్రులన్+పుట్టించెన్= ఐదుగురు కుమారులను జన్మింపజేశాడు; అటమున్ను+అ= అంతకుముందు; అజనాభంబు+అనుపేరన్+పరఁగు= అజనాభమనే పేరుతో పిలువబడే; వర్షంబున్= భూభాగాన్ని; భరతుండు= భరతుడు; పాలించుకతంబునన్= పాలించడంవల్ల; భారతవర్షంబునాన్= భరతవర్షం అనే పేరుతో; పరఁగెన్= రూఢమయింది; అంతన్= అటు తరువాత...

**తా :** అహంకారానికి శబ్ద స్పర్శ రూప రస గంధాలనే పంచతన్మాత్రలు పుట్టినట్లు భరతునికి పంచజనివల్ల సుమతి, రాష్ట్రభృత్తు, సుదర్శనుడు, ఆచరణుడు, ధూమ్రకేతువులనే అయిదుగురు కొడుకులు పుట్టారు. ఇంతకుముందు అజనాభమనే పేరుతో పిలువబడే ఈ భూభాగాన్ని భరతుడు పాలించడంవల్ల దీనికి భరతవర్షం అనే పేరు రూఢమయింది.

**క. భరతుఁడు నిజపిత లేలిన, కరణినిఁ గర్మముల నెల్లఁగైకొని ప్రజలన్**
**హరికృప నొందుచు నేలెను, ధరణీసురవరులు వొగడ ధరణీనాథా! 94**

**ప్రతి :** ధరణీనాథా= భూపతీ!; భరతుఁడు= ఋషభ తనయుడైన భరతుడు; నిజపితలు= తన తండ్రులు; ఏలిన కరణిన్= పాలించిన రీతిలో; కర్మములన్+ఎల్లన్+కైకొని= సత్కర్మలు అన్నింటిని ఆచరిస్తూ; హరికృపన్+ఒందుచున్= హరి అనుగ్రహం పొందుతూ; ధరణీసురవరులు+పొగడన్= బ్రాహ్మణోత్తములు నుతించగా; ప్రజలన్= ప్రజలను; ఏలెను= పాలించాడు.

**తా :** భరతుడు పరమాత్ముని కరుణతో, తన తాతతండ్రులు పరిపాలించిన రీతిలోనే సత్కర్మలు ఆచరిస్తూ, బ్రాహ్మణులు పొగడేవిధంగా ప్రజలను పరిపాలించాడు.

**సీ. భగవంతుఁడగు జగద్భరితు నల్పంబులు నధికంబులైనపెక్కధ్వరముల**
**దర్శపూర్ణిమలచేఁదగను జాతుర్మాస్యముల నగ్నిహోత్రమువలనఁగడఁకఁ**
**బశుసోమములచేతఁబలుమాఱుఁ బూజించి వేదోక్తమైన యా విమలకర్మ**
**ములఁగల్గు ధర్మంబుఁ బురుషోత్తమార్పణంబుగఁ జేయుచును మఖంబులను మంత్ర**

**తే. ములను బలికెడు నా దైవములను శ్రీశు, నవయవంబులు గాఁగ భూధవుఁడు ప్రేమ**
**ననుదినంబును బాయక ఘనత దలఁచి యఖిలరాజ్యానుసంధానుఁడగుచు నుండె. 95**

**ప్రతి :** భగవంతుఁడు+అగు= భగవంతుడయిన; జగత్+భరితున్= లోకాలను భరించువానిని; అల్పంబులు= కొద్దివి; అధికంబులు+ఐన= ఎక్కువవి అయిన; పెక్కు+అధ్వరములన్= అనేక యజ్ఞాలచే (అనేక గ్రహాదుల దారులు;

కాలమానములును); దర్శ, పూర్ణిమలచేన్= అమావాస్యకు, పూర్ణిమకు చేసే యజ్ఞాలచేత; తగను= తగినట్టి; చాతుర్మాస్యములన్= నాలుగు మాసముల దీక్షలచేతను; అగ్నిహోత్రముల వలనన్= యజ్ఞమునందు జరుగు హోమములచేతను; కడఁకన్= ప్రయత్నంతో; పశు, సోమములచేతన్= జంతువులను బలి ఇచ్చు సోమయాగములచేతను; పలుమాఱున్= పెక్కుమార్లు; పూజించి= పూజచేసి; వేద+ఉక్తము+ఐన= వేదంలో చెప్పబడిన; ఆ విమలకర్మములన్+కల్గు= నిర్మలమైన సృష్టి కార్యాల వలన కలిగే; ధర్మంబున్= పుణ్యాన్ని; పురుష+ఉత్తమ+అర్పణంబుగన్= నారాయణునకు సమర్పితంబుగా; చేయుచును= నిర్వహిస్తూ; మఖంబులను= యజ్ఞాలలో; మంత్రములను+పలికెడు= మంత్రాలలో ఉచ్చరించబడే; ఆ దైవములనున్= ఆయా మంత్రాధి దేవతలను; శ్రీ+ఈశు+అవయవంబులున్+కాఁగన్= విరాట్పురుషుని అవయవాలుగా; భూధవుఁడు= రాజు; ప్రేమన్= నిర్వ్యాజమయిన భక్తిరూపంలో; అనుదినంబును= ప్రతిదినమూ; పాయక= వదలిపెట్టక; ఘనతన్+తలఁచి= గొప్పతనాన్ని తలచుకొని; అఖిలరాజ్య+అనుసంధానుఁడు+అగుచున్= సమస్త రాజ్యభాగాన్ని పరిపాలనతో జోడించినవాడవుతూ; ఉండెన్= ఉండినాడు.

**తా :** భరతుడు అండపిండ బ్రహ్మాండాది లోకాలను భరించే భగవంతుణ్ణి చిన్నవీ, పెద్దవీ అయిన యజ్ఞాలతో ఆరాధించాడు. అమావాస్య పూర్ణిమలతో చేసే సత్కార్యాలనూ, చాతుర్మాస్యల కాలంలో చేసే అగ్నిహోత్రాదులనూ ఆచరించాడు. ఇంకా పశుయాగాలు, సోమయాగాలు నిర్వర్తించాడు. వేదోక్తంగా నిర్వహించిన ఆ సత్కర్మఫలాన్ని పరమేశ్వరార్పణం చేశాడు. యాగాలలోను, మంత్రాలలోను పలికే దేవతలను వాసుదేవుని అవయవాలుగా భావించాడు. ఆ మహారాజు భగవంతుని గొప్పతనాన్ని తలచుకొంటూ భక్తిమయమైన హృదయంతో, శ్రద్ధతో సమస్తరాజ్యాన్ని పరిపాలించాడు.

**విశే : చాతుర్మాస్యము :** "ప్రతి సంవత్సరం ఆషాఢశుద్ధం మొదలుకొని కార్తికశుద్ధం వరకు నాలుగునెలలు, చేసే వ్రతం చాతుర్మాస్యం. దీనికే వార్షిక చాతుర్మాస్యమని పేరు.

**క. ఈ రీతిఁగర్మసిద్ధుల, నారయ నత్యంతశుద్ధమగు చిత్తముతో**
**నారాచపట్టి భరతుఁడు, ధారుణిఁబాలించె నధికధర్మాన్వితుఁడై. 96**

**ప్రతి :** ఈ రీతిన్= ఈ విధంగా; కర్మసిద్ధులన్= పని చేయడం, ఫలితం కలగడం; ఆరయన్= పరిశీలించగా; అత్యంతశుద్ధము+అగు= మిక్కిలి పరిశుద్ధమయిన; చిత్తముతోన్= మనస్సుతో; ఆ రాచపట్టి= ఆ రాజకుమారుడయిన; భరతుఁడు= భరత రాజేంద్రుడు; అధిక ధర్మ+అన్వితుఁడు+ఐ= మిక్కిలి ధర్మంతో కూడినవాడై; ధారుణిన్= లోకాన్ని; పాలించెన్= పరిపాలించాడు.

**తా :** ఇట్లు నిర్మల మనస్సుతో కర్మలను ఆచరించి సిద్ధులను పొంది మిక్కిలి ధర్మంతో భరతుడు రాజ్యపరిపాలన చేశాడు.

**వ. మఱియు నా భరతుండు శ్రీవత్స కౌస్తుభ వనమాలాలంకృతుండును, సుదర్శనాద్యాయుధోపలక్షితుండును, నిజభక్తజన హృదయారవింద నివాసుండును, బరమ పురుషుండును నైన వాసుదేవుని యందు నధికభక్తి ననుదినంబును జేయుచుఁ నేఁబది లక్షల వేలేండ్లు రాజ్యంబు సేసి పితృ పితామహాద్యాయాతంబగు నా ధనంబును యథార్హంబుగఁ బుత్త్రులకుఁ బంచియిచ్చి బహువిధ సంపదలు గల గృహంబును బాసి పులహాశ్రమంబున కరిగె; నంత. 97**

**ప్రతి :** మఱియున్= రాజ్యపాలన గావిస్తున్న వాడైన; ఆ భరతుండు= ధర్మదీక్ష కలవాడైన భరతుడు; శ్రీవత్సకౌస్తుభ వనమాలా+అలంకృతుండును= పుట్టుమచ్చ అయిన శ్రీవత్సం; మణి అయిన కౌస్తుభం; వైజయంతి అను పేరుగల

వనమాల అను వాటితో అలంకరించబడినవాడూ; సుదర్శన+ఆది+ఆయుధ+ఉపలక్షితుండును= సుదర్శనం మొదలయిన పంచాయుధాలను ధరించినవాడునూ; నిజభక్తజన= ఆత్మీయ భక్తుల; హృదయ+అరవింద నివాసుండును= హృదయ పద్మాలలో నివసించేవాడును; పరమపురుషుండును+ఐన= పురుషోత్తముడూ అయిన; వాసుదేవుని+అందున్= వాసుదేవునిపట్ల; అధికభక్తిన్= ప్రగాఢమయిన భక్తిని; అనుదినంబును+చేయుచున్= ప్రతి దినమును ప్రదర్శించుచు; ఏఁబదిలక్షల వేల+ఏండ్లు= యాభై లక్షల వేల సంవత్సరాలు; రాజ్యంబు+చేసి= పరిపాలన గావించి; పితృపితామహ+ఆది+ఆయతంబు+అగు= తాత తండ్రుల కాలంనుండి తరతరాలుగా సంక్రమించిన; ఆ ధనంబును= ఆ అపారసంపదను; యథా+అర్హంబుగన్= వారివారికి తగినట్లు; పుత్రులకున్= తన తనయులకు; పంచి+ఇచ్చి= పంచిపెట్టి; బహుసంపదలు గల= అనేక రూపాలయిన సంపదలు గలిగిన; గృహంబును+పాసి= ఇంటిని వదలిపెట్టి; పులహ+ఆశ్రమంబునకున్= పులహాశ్రమానికి; అరిగెన్= వెళ్ళిపోయాడు; అంతన్= తరువాత...

**తా :** శ్రీవత్సం, కౌస్తుభం, వనమాల అనువానితో శోభిల్లువాడూ, సుదర్శనం మొదలైన పంచాయుధాలను ధరించినవాడూ, ఆత్మీయ భక్తుల హృదయాలలో నివసించేవాడూ, పరమపురుషుడూ అయిన వాసుదేవునిపట్ల భక్తిప్రపత్తులతో భరతుడు యాభైలక్షల వేల సంవత్సరాలు రాజ్యపరిపాలన గావించాడు. తాతతండ్రుల కాలంనుండి తరతరాలు సంక్రమించిన ధనరాశిని తగినట్లు తన తనయులకు పంచిపెట్టి భోగభాగ్యాలనూ, అపారసంపదనూ, రాజసౌధాలనూ వదలిపెట్టి తాను పులహాశ్రమానికి వెళ్ళిపోయాడు.

**విశే :** పులహాశ్రమం సాలగ్రామాలు లభించే స్థలం.

**సీ. ఏ యాశ్రమంబున నిందిరాధీశ్వరుఁ డచ్చటివారల నాదరించి**
**ప్రత్యక్షమున నుండుఁబాయక యెప్పుడు నట్టి రమ్యంబైన యాశ్రమమున**
**నిలిచి సాలగ్రామములు గల గండకీ నది యెందు నెంతయుఁగదిసి యుండు**
**నచ్చోట నేకాకి యగుచును భరతుండు బహువిధనవపుష్పపల్లవముల**

**తే. నతుల తులసీ దళంబుల నంబువులను, గందమూలాదిఫలములఁగంజములను**
**ఘనత నర్పించు నిచ్చలుఁదనివి లేక, సేవ సేయుచునుండె నా శ్రీశు హరిని. 98**

**ప్రతి :** ఏ+ఆశ్రమంబునన్= ఏ పులహాశ్రమంలో; ఇందిరా+అధి+ఈశ్వరుఁడు= లక్ష్మీపతి; అచ్చటివారలన్= ఆ ఆశ్రమంలోని వారిని; ఆదరించి= వాత్సల్యంతో ఆదరిస్తూ; పాయక= విడువక; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; ప్రతి+అక్షమునన్+ఉండున్= కనులముందు ఉంటాడో; అట్టి= అటువంటి; రమ్యంబు+ఐన= చూడచక్కనిదయిన; ఆశ్రమమునన్= పులహాశ్రమంలో; నిలిచి= అధివసించి; సాలగ్రామములు+కల= సాలగ్రామ శిలలకు ఆలవాలమయిన; గండకీ నది= గండకి అని పేరుగల నది; ఎందున్= ఎక్కడ; ఎంతయున్= మిక్కిలి; కదిసి+ఉండున్= చెంతజేరి ప్రవహిస్తూ ఉంటుందో; ఆ+చోటన్= ఆ తావులో; ఏకాకి+అగుచును= ఒంటరిగా ఉంటూ; భరతుండు= భరతుడు; బహువిధ= నానావిధములయిన; నవపుష్ప పల్లవములన్= కొత్తవయిన పూలతో, చిగుళ్ళతో; అతుల= సాటిలేని; తులసీదళంబులన్= తులసీ పత్రాలతో; అంబువులను= జలాలతో; కందమూల+ఆదిఫలములన్= కందమూలాది ఫలాలతో; కంజములను= కమలాలతో; ఘనతన్+అర్పించున్= గొప్పగా అర్పిస్తూంటాడు; నిచ్చలున్= ఎల్లప్పుడూ; తనివిలేక= సంతృప్తి అన్నది లేక; ఆ శ్రీ+ఈశున్= ఆ లక్ష్మీశుని; హరినిన్= పాపహారిని; సేవ+చేయుచున్+ఉండెన్= సేవిస్తూ ఉన్నాడు.

**తా :** ఆ ఆశ్రమంలో శ్రీమన్నారాయణుడు ఆశ్రమవాసులను వాత్సల్యంతో ఆదరిస్తూ కనులముందు నిలిచి ఉంటాడు. సాలగ్రామాలకు ఆలవాలమైన గండకీనది ఆ ఆశ్రమసమీపంలో ప్రవహిస్తూ ఉంటుంది. అటువంటి రమణీయమైన ఆశ్రమంలో భరతుడు ఒంటరిగా ఉంటూ శ్రీహరిని నానావిధాలయిన పువ్వులతో, చిగుళ్ళతో, తులసీదళాలతో, జలాలతో, కమలాలతో, కందమూలఫలాలతో అర్చిస్తూ తనివితీరా సేవ చేస్తున్నాడు.

**వ. దానం జేసి విగత విషయాభిలాషుండై శమదమాది గుణంబులు గలిగి యథేచ్ఛం జేసి యెడతెగక పరమపురుషుని పరిచర్యాభక్తి భరంబున శిథిలీకృత హృదయగ్రంథిం గలిగి సంతోషాతిశయంబునం బులకితాంగుండు, నానంద బాష్పనిరుద్ధావలోక నయనుండు నగుచు నిజస్వామియైన హరిచరణారవిందానుధ్యాన పరిచిత భక్తి యోగంబునం బరమానంద గంభీర హృదయంబను నమృత హ్రదంబున నిమగ్నుం డగుచుఁ దా నపుడు పూజించు పూజ నెఱుంగక యిట్లు భగవద్వ్రతంబు ధరియించి యేణాజిన వాసస్త్రిషవణ స్నానంబుల నార్ద్రకుటిల కపిశవర్ణ జటాకలాపంబులు గలిగి మార్తాండాంతర్గతుం డయిన పరమేశ్వరుని హిరణ్మయపురుషునిగాఁదలంచుచు నిట్లనియె. 99**

**ప్రతి :** దానన్+చేసి= అందువల్ల; విగతవిషయ+అభిలాషుండు+ఐ= ఇంద్రియార్థాలయందు వాంఛ తొలగినవాడై; శమదమ+ఆదిగుణంబులు+కలిగి= శమం; దమం మొదలైన గుణాలు గలిగి; యథా+ఇచ్ఛన్+చేసి= ఇష్టప్రకారమునననుసరించి; ఎడతెగక= విరామం లేకుండా; పరమపురుషుని= ఉత్కృష్ట పురుషునియొక్క; పరిచర్యాభక్తిభరంబునన్= సేవ చేయడమనే భక్తిభావంతో; శిథిలీకృత హృదయగ్రంథిన్+కలిగి= హృదయంలోని ముడి విడిపోయినట్టిదికాగా; సంతోష+అతిశయంబునన్= ఆనందాతిశయంతో; పులకిత+అంగుండున్= పులకించిన దేహం కలవాడును; ఆనంద బాష్పనిరుద్ధ+అవలోకనయనుండున్+అగుచున్= ఆనంద బాష్పాలచేత చూచుటకు అడ్డగింపబడిన, కన్నులు కలవాడు అగుచు; నిజస్వామి+అయిన= తన ప్రభువు అయినటువంటి; హరిచరణ అరవింద= హరియొక్క పద్మాలవంటి పాదాలయొక్క; అనుధ్యాన పరిచిత భక్తియోగంబునన్= అనుసరించి ధ్యానించడంవల్ల అలవాటయిన భక్తియోగంతో; పరమ+ఆనంద గంభీరహృదయంబు+అను= ఉత్కృష్టమయిన ఆనందంచే లోతయిన హృదయమనే; అమృత హ్రదంబునన్= అమృతపు మడుగులో; నిమగ్నుండు+అగుచున్= మునిగిన వాడవుతూ; తాన్+అపుడు= తాను అపుడు; పూజించు పూజన్+ఎఱుంగక= పూజించే పూజనుకూడా తెలిసికొనక; ఇట్లు= ఈ రీతిగా; భగవత్+వ్రతంబున్+ధరియించి= భగవంతుని సేవించడమనే వ్రతాన్ని పూనికతో నిర్వహిస్తూ; ఏణ+అజినవాసన్= లేడి చర్మపు వస్త్రము (ధరించుట); త్రి+సవన స్నానంబులన్= మూడుసంధ్యా వేళల్లో చేసే స్నానాలచే; ఆర్ద్ర= తడిసిన; కుటిల= మెలి తిరిగిన; కపిశవర్ణ= కపిలవర్ణంగల; జటాకలాపంబులున్+కలిగి= జడల చుట్టలు కలిగి; మార్తాండ+అంతర్గతుండు+అయిన= సూర్యమండల మధ్యభాగంలోనున్నవాడైన; పరమ+ఈశ్వరుని= భగవంతుని; హిరణ్మయ పురుషుని కాన్+తలంచుచున్= బంగారుమూర్తి (తేజోమయుని) తలంచుచు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** ఇటువంటి హరిసేవవల్ల భరతునికి విషయవాంఛలు నశించాయి. శమదమాది గుణసంపత్తి అలవడింది. పరమ పురుషుణ్ణి భక్తిభావంతో ఎడతెగకుండా భజిస్తుంటే అహంకారమనే ముడి విడిపోయి ఆనందానుభూతి కలిగింది. ఆయన మేను పులకించింది. ఆయన కన్నులలో ఆనందాశ్రువులు పొంగి పొరలాయి.

ఇష్టమయిన పరంధాముని పాదపద్మాలను ధ్యానించడం వల్ల ప్రాప్తమైన భక్తియోగం కారణంగా ఆయన హృదయం పరమానందంతో నిండిపోయింది. ఆ ఆనందానుభవం అమృతసరోవరంలో స్నానం చేసినట్టుగా అనిపించింది. భరతునికి

తాను చేస్తున్న పూజకూడా తనకు తెలియనంత తన్మయత్వం కలిగించింది. ఈ విధంగా భగవంతుని సేవావ్రతంలో మునిగిపోయిన భరతుడు జింక చర్మం ధరించాడు. మంత్రపూర్వకంగా మూడువేళలా స్నానం ఆచరించాడు. నిత్యమూ స్నానం చేయడం మూలాన తలవెంట్రుకలు తడిసి వంపులు తిరిగి జడలుగట్టి రాగిరంగుతో మెరవసాగాయి.

మార్తాండమండల మధ్యవర్తి అయిన పరమేశ్వరుణ్ణి హిరణ్మయ పురుషునిగా భావిస్తూ భరతుడు ఇలా ప్రస్తుతించాడు.

**విశే :** **'ధ్యేయ స్సదా సవితృమండల మధ్యవర్తీ'** ఇత్యాది సూర్యనారాయణ ధ్యానశ్లోకంచేతను, **'ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్'** అనే గాయత్రి మంత్రంచేతను అర్చింపబడు దేవత సూర్యమండలస్థుడయిన శ్రీమన్నారాయణుడు.

**త్రిషవణస్నానంబులన్=** మూడుపూటల చేయు స్నానము

త్రి+సవన= త్రిషవణ (త్రిసవన స్నాయీ= మూడుపూటల స్నానము చేయువాడు)

**సీ. కర్మఫలంబులఁగడఁక నిచ్చుచు మనోవ్యాపారమున నిట్టి యఖిలలోక**
**ములఁజేసి యా లోకములకు నంతర్యామి యగుచుఁబ్రవేశించి యంతమీఁద**
**నానందరూప మైనట్టి బ్రహ్మముఁగోరు చున్న జీవునిఁదనలోని యోగ**
**శక్తిచేఁదగ ననిశంబుఁబాలన సేయు చుండి యంతటను మార్తాండమధ్య**

**ఆ. వర్తి యగుచు నిట్లు వఱలుచు జగముల, యందు నుండి ప్రకృతిఁబొంద కంత**
**నతులదివ్యమూర్తియైన యానంద రూ, పమును శరణ మొందె భరతవిభుఁడు. 100**

**ప్రతి :** కర్మఫలంబులన్= ఆయా జీవులు గావించే ఆయా కర్మలకు తగిన ఫలములను; కడఁకన్= పూనికతో; ఇచ్చుచున్= ప్రసాదించుచు; మనోవ్యాపారమునన్= మనోవ్యాపారంతో; ఇట్టి= ఇటువంటి దృశ్యమానమయిన; అఖిలలోకములన్+చేసి= సమస్త లోకాలను సృష్టించి; ఆ లోకములకున్= ఆ లోకములందు; అంతర్యామి+అగుచున్ ప్రవేశించి= అంతర్యామియై చొచ్చి; అంతమీఁదన్= ఆపై; ఆనందరూపము+ఐనట్టి= ఆనందస్వరూపమయిన; బ్రహ్మమున్= బ్రహ్మసాయుజ్యమును; కోరుచున్న= కోరేటటువంటి; జీవునిన్= జీవుని; తనలోని= తనయందు గల; యోగశక్తిచేన్= యోగశక్తితో; తగన్= ఒప్పిదముగా; అనిశంబున్= ఎల్లప్పుడు; పాలన+చేయుచున్+ఉండి= పరిపాలించుచుండి; అంతటను= అంతట; మార్తాండమధ్యవర్తి+అగుచున్= సూర్యమండల మధ్యమందు ఉన్నవాడగుచు; ఇట్లు= ఈ రకంగా; వఱలుచున్= ఒప్పుతూ; జగముల+అందునుండి= లోకములందుండి; ప్రకృతిన్+పొందక= గుణములంటక; అంతన్= ఆపై; అతులదివ్యమూర్తి+ఐన= సాటిలేని వెలుగు రూపు అయిన; ఆనందరూపమును= సచ్చిదానంద స్వరూపమును; భరతవిభుఁడు= భరతనామకుడయిన రాజు; శరణము+ఒందెన్= శరణుజొచ్చెను.

**తా :** పరమేశ్వరా! జీవులకు కర్మఫలాలను ప్రసాదించేవాడవు. కేవలం సంకల్పమాత్రంతో ఈ లోకాలను సృష్టించావు. నీవే ఈ లోకాలలో అంతర్యామివై ఉన్నావు. ఆనందస్వరూపమైన బ్రహ్మాన్ని అందుకోవాలనే జీవులను నీయందలి యోగశక్తితో కాపాడుతున్నావు. సూర్యమండల మధ్యభాగంలో ప్రకాశిస్తూ సమస్త లోకాలలో నిండి ప్రకృతికి అందకుండా ప్రకాశిస్తున్నావు అంటూ ఆనందమయుడూ, దివ్యమంగళ స్వరూపుడూ అయిన భగవానుణ్ణి భరతుడు శరణు వేడాడు.

**వ. అంత నాభరతుం డొక్కనాఁ డా మహానదిం గృతాభిషేకుండయి ముహూర్త త్రయం బంతర్జలంబు లందుఁ బ్రణవోచ్చారణంబు సేయుచుండు సమయంబున నిర్భరగర్భిణియగు నొక్క హరిణి జలార్థినియై యొంటి జలాశయ సమీపంబునకు వచ్చి, జలపానంబు సేయునెడ నా సమీపంబున మృగపతి గర్జించి లోకభయంకరంబుగ నాదంబు సేయ నా హరిణి స్వభావంబున భీత యగుటం జేసి బెగ్గడిలి హరివిలోకనవ్యాకుల చిత్తయై దిగ్గన నదరి గగనంబునకు నెగిరి, యపగత తృష యగుచు నది నుల్లంఘించు నెడ నధిక భయంబునం జేసి యా గర్భంబు యోనిద్వారంబున గళితంబై జలంబులం బడియె; నా హరిణి యుల్లంఘనాది భయంబునం జేసి తత్తీరంబున నుండు గిరిదరింబడి శరీరంబుఁ బాసె; నంత నా హరిణపోతంబు జలంబులం దేలుచున్న భరతుండు గనువిచ్చి చూచి కరుణార్ద్రచిత్తుండై మృతజనని యగు నా హరిణపోతంబును దన యాశ్రమంబునకుం గొంపోయి మిక్కిలి ప్రీతిం జేసి యుపలాలనంబు సేయుచుండఁ బోషణ పాలన ప్రీణన లాలనానుధ్యానంబుల భరతునకు నాత్మనియమంబు లైన అష్టాంగయోగంబులును బరమ పురుష పూజా పరిచర్యాదులు నొక్కొక్కటిగఁ గ్రమక్రమంబునం గొన్ని దినంబులకు సమస్తంబును నుత్సన్నం బయ్యె; నంత. 101**

ప్రతి : అంతన్= భరతుడు ఆనందరూపాన్ని శరణమొందిన తరువాత; ఆ భరతుండు= పులహాశ్రమంలోని భరతుడు; ఒక్కనాఁడు= ఒకరోజు; ఆ మహానదిన్= ఆ గండకీనదిలో; కృత+అభిషేకుండు+అయి= స్నానం చేసినవాడయి; ముహూర్తత్రయంబు= మూడు ముహూర్తాల కాలం; అంతర్జలంబులు+అందున్= జలంబుల లోపల; ప్రణవ+ ఉచ్చారణంబు+చేయుచున్+ఉండుసమయంబునన్= ఓంకారోచ్చారణ చేస్తున్న సమయంలో; నిర్భరగర్భిణి+అగు= నిండుచూలాలయిన; ఒక్కహరిణి= ఒక్క ఆడులేడి; జల+అర్థిని+ఐ= దప్పిక తీర్చుకోవడానికి; ఒంటిన్= ఒంటరిగా; జల+ఆశయ సమీపంబునకున్+వచ్చి= నదీ తీరానికి వచ్చి; జలపానంబు+చేయు+ఎడన్= నీరు త్రాగుతుండగా; ఆ సమీపంబునన్= ఆ నదీసమీపంలో; మృగపతి= సింహం, గర్జించి; లోకభయంకరంబు+కన్= లోకాలన్నిటికి భయం కలిగించే విధంగా; నాదంబు+చేయన్= గర్జనం చేయగా; ఆ హరిణి= ఆ జింక; స్వభావంబునన్= స్వభావం చేతనే; భీత+అగుటన్+చేసి= భయపడునది అగుటవల్ల; బెగ్గడిలి= అదరిపడి; హరివిలోకనవ్యాకులచిత్త+ఐ= సింహాన్ని చూచి కలత పొందిన మనస్సుకలదై; దిగ్గనన్= తటాలున; అదరి= భయపడి; గగనంబునకున్+ఎగిరి= నింగికి ఎగిరి; అపగత తృష+అగుచున్= దప్పిక మరచి; నదిన్= గండకీ నదిని; ఉల్లంఘించు+ఎడన్= దూకే సమయంలో; అధికభయంబునన్+చేసి= ఎక్కువ భయంవల్ల; తత్+తీరంబునన్+ఉండు= ఆ నదీతీరంలో ఉండు; గిరిదరిన్+పడి= కొండ పక్కన పడి; శరీరంబున్+పాసెన్= దేహాన్ని వదలిపెట్టింది; అంతన్= ఆ హరిణి ప్రాణం గాలిలో కలిసిపోగా; ఆ హరిణపోతంబు= ఆ జింకపిల్ల; జలంబులన్+తేలుచున్నన్= నీటిలో తేలుతుండగా; భరతుండు= ప్రణవోచ్చారణ చేస్తున్న భరతుడు; కనువిచ్చి= ఆ దద్దరిల్లే నాదానికి కనులు తెరచి; చూచి= దర్శించి; కరుణా+ఆర్ద్రచిత్తుండు+ఐ= దయాహృదయం కలవాడై; మృతజనని+అగు= చనిపోయిన తల్లి కలదైన; ఆ హరిణపోతంబును= ఆ జింకపిల్లను; తన+ఆశ్రమంబునకున్+కొనిపోయి= తన ఆశ్రమానికి తీసుకువెళ్ళి; మిక్కిలి ప్రీతిన్+చేసి= ఎక్కువ గారాబంవల్ల; ఉపలాలనంబు+చేయుచున్+ఉండన్= బుజ్జగింపులు చేయుచుండగా; పోషణ= దానిని పోషించుట; పాలన= రక్షించుట; ప్రీణన లాలన+అను ధ్యానంబులన్= తృప్తిపరచడం, ముద్దాడడం, దానినే స్మరించడం మొదలయిన క్రియలతో; భరతునకున్= భరతునికి; ఆత్మనియమంబులు+ఐన=

తనదైన నియమములయిన; అష్ట+అంగ యోగంబులును= ఎనిమిది భాగముల యోగాభ్యాసాలును; పరమపురుష పూజాపరిచర్యా+ఆదులున్= భగవంతుని పూజాకైంకర్యాదులు; ఒక్కొక్కటి+కన్= ఒక్కొక్కటిగా; క్రమక్రమంబునన్= క్రమక్రమంగా; కొన్ని దినంబులకున్= కొన్ని రోజులకే; సమస్తంబును= పూజాదులన్నీ; ఉత్సన్నంబు+అయ్యెన్= పెల్లగించబడ్డాయి; అంతన్= ఆ మీదట...

**తా :** ఒకనాడు భరతుడు గండకీ నదిలో స్నానంచేసి మూడు ముహూర్తాలకాలం నీటిలో ప్రణవం జపిస్తున్నాడు. అపుడు నిండుచూలాలయిన లేడి ఒకటి నీరు తాగాలని ఒంటరిగా నదీ తీరానికి వచ్చింది. అది నీరు త్రాగుతుండగా ఆ నదీసమీపంలో ఒక సింహం దిక్కులు దద్దరిల్లేటట్లు భయంకరంగా గర్జించింది. పుట్టుకతోనే భయస్వభావం కలిగిన ఆ లేడి ఆ ధ్వనిని విని అదరిపడింది. ఆ హరిణాంగన తత్తరపాటుతో దప్పిక తీర్చుకోకుండానే ఆకాశంవైపు అమాంతం ఎగిరి ఆవలికి ఒక్క దూకు దూకింది. అలా అకస్మాత్తుగా కలిగిన భయంతో లంఘించడంలో దాని గర్భంలోని పిల్ల జారి నదీజలాలలో పడింది. ఆందోళనతో ఒక్కసారిగా దూకటంలో తల్లి జింక ఆ నదీతీరంలోని కొండ రాతిమీద పడి ప్రాణాలు విడిచింది. అపుడు ఆ నదీజలాలలో విలవిలలాడుతూ మునిగి తేలుతున్న లేడిపిల్లను చూచిన భరతుని హృదయం తల్లడిల్లింది. దయార్ద్రచిత్తుడైన భరతుడు ఆ తల్లిలేని పిల్లను తన ఆశ్రమానికి తీసుకువచ్చాడు. ఆ బాల కురంగాన్ని ఎంతో గారాబంతో సాకడం మొదలుపెట్టాడు. దానిని లాలించడం, పాలించడం ముద్దుగా పెంచి పెద్ద చేయడంలో ఆసక్తుడై క్రమంగా భరతుడు తన అష్టాంగయోగాలనూ, భగవంతుని పూజాకైంకర్యాలను మరచిపోయాడు. క్రమక్రమంగా అతని నిత్య నైమిత్తిక క్రియాకలాపాలు ఒక్కొక్కటి మూలబడసాగాయి.

**విశే : యోగం యొక్క అష్టాంగాలు :** 1) యమం 2) నియమం 3) ఆసనం 4) ప్రాణాయామం 5) ప్రత్యాహారం 6) ధ్యానం 7) ధారణం 8) సమాధి.

**క. ఘనతపము చలన మొందుట, యును భరతుండెఱుఁగ కాత్మయోగంబునఁ జ**
**య్యనఁబాసె హరిణపోతముఁ, దన మదిలో నిల్పి ప్రీతిఁదప్పక పలికెన్. 102**

**ప్రతి :** ఘనతపము= గొప్పదైన తపస్సు; చలనము+ఒందుటయును= చెదరిపోవడం; భరతుండు+ఎఱుఁగక= భరతుడు తెలుసుకొనలేక; ఆత్మయోగంబునన్= ఆత్మయోగం నుండి; చయ్యనన్= వెనువెంటనే; పాసెన్= దూరమయ్యాడు; తనమదిలోన్= తన చిత్తంలో; హరిణపోతమున్= జింకపిల్లను; నిల్పి= నిలుపుకొని; ప్రీతిన్= సంప్రీతిని; తప్పక= వదలిపెట్టక; పలికెన్= అనుకొన్నాడు.

**తా :** తాను తపస్సుకు దూరం కావడాన్ని అతడు గుర్తించడం లేదు. రాత్రింబవళ్లు ఆ జింకపిల్లతో ఆడుతూ పాడుతూ దానిమీది గారాబంతో తన మనస్సులో ఇలా అనుకొన్నాడు.

**ఉ. అక్కట! తల్లిఁబాసి హరిణార్భక మాప్తులు లేమిఁజేసి యే**
**దిక్కును లేకయున్న నిటఁదెచ్చితి, నాయెడ నీ మృగార్భకం**
**బెక్కుడు ప్రేమఁజేసి చరియించుచు నున్నది నాదు సన్నిధిన్;**
**మక్కువ చేసి దీనిఁగడు మన్ననలం దగఁబ్రోతు నెంతయున్. 103**

**ప్రతి :** అక్కట= అయ్యో!; తల్లిన్+పాసి= తల్లిని కోల్పోయి; హరిణ+అర్భకము= జింకపిల్ల; ఆప్తులు= తనవారు; లేమిన్+చేసి= లేని కారణంవల్ల; ఏ దిక్కును లేకయున్నన్= శైశవావస్థలో చూచేవారు, కాపాడేవారు లేకపోవడంచేత; ఇటన్= ఈ పులహాశ్రమానికి; తెచ్చితిన్= తీసుకువచ్చాను; నా+ఎడన్= నాపట్ల; ఈ మృగ+అర్భకంబు= ఈ జింకపిల్ల; ఎక్కుడుప్రేమన్+చేసి= అత్యధికమయిన ప్రేమవల్ల; నాదు+సన్నిధిన్= నా ఎదుటనే; చరియించుచున్+ఉన్నది= తిరుగుతూ ఉన్నది; మక్కువ+చేసి= ప్రీతిని కనుబరచి; దీనిన్= ఈ జింకపిల్లను; కడుమన్ననలన్= మిక్కిలి గారాబంతో, లాలనతో; ఎంతయున్= మిక్కిలి; తగన్= తగినవిధంగా; ప్రోతున్= కాపాడుతాను.

**తా :** పాపం ఈ జింకపిల్లకు తల్లి లేదు. ఆప్తులా అసలే లేరు. దిక్కెవ్వరూ లేని కారణంవల్ల ఈ జింకపిల్లను ఇక్కడికి తీసుకొని వచ్చాను. నేనంటే దీనికి ఎంతో ప్రేమ. నా దగ్గరే నన్నంటిపెట్టుకొని తిరుగుతోంది. అందుచేత నేను నాచేతనయినంత వరకూ ఈ తల్లిలేని పిల్లను తప్పక కాపాడుతాను.

**క. శరణని వచ్చిన జంతువుఁ, గరుణంగను విచ్చి చూచి కాచినఁబుణ్యం**
**బరయఁగ నధికం బని మున్, కర మెఱిఁగించెను మునీంద్రగణములు ప్రేమన్. 104**

**ప్రతి :** శరణు+అని= నీవే దిక్కంటూ; వచ్చిన; జంతువున్= ప్రాణిని; కరుణన్= దయతో; కనువిచ్చి= కనులార చూచి; కాచినన్= కాపాడితే; పుణ్యంబు= పుణ్యం; అరయఁగన్= పరిశీలించగా; అధికంబు+అని= ఎక్కువని; మున్= పూర్వం; మునీంద్ర గణములు= మునీశ్వరుల సమూహాలు; ప్రేమన్= ప్రీతితో; కరము= మిక్కిలి; ఎఱిఁగించెను= తెలియజేశారు.

**తా :** నీవే దిక్కంటూ వచ్చిన ఏ జంతువునయినా సరే కనికరంతో కన్నెత్తిచూచి కాపాడడంకంటె మహాపుణ్యం మరేదీ లేదని సన్మునీంద్రులు చెప్పారు.

**వ. అని యిట్లు హరిణపోతంబుం దన యాశ్రమంబున నత్యాసక్తిం జేసి యాసన శయనాటనస్నాన సమిత్కుశ కుసుమ ఫల పలాశ మూలోదకాహరణ దేవపూజాజపాదుల యెడం దన యొద్దన యునిచి కొనుచు, వృక సాలా వృకాది క్రూరమృగంబుల వలని భయంబున వనంబుల వెనువెంటం దిరుగుచు నధిక ప్రణయభర పరీతహృదయుం డగుచు నతి స్నేహంబునం జేసి కొంతసేపు స్కంధంబుల వహించుచు, మఱి కొంతతడ వురంబున నుత్సంగంబున నుంచికొని లాలించుచు సంతసంబు నొందు; మఱియు నా భరతుండు నిత్య నైమిత్తికాది క్రియాకలాపంబు నిర్వర్తించునెడ నంత నంత లేచి హరిణకుణకంబుం జూచుచుఁ గించిత్స్వస్థహృదయుండై దాని నాశీఃపరంపరల నభినందించుచుఁ జుంబనాదులం బ్రీతి సేయుచు నతిమోహంబునం బెంచుచుండునెడ. 105**

**ప్రతి :** అని= ఈ విధంగా మునులు చెప్పగా విని; ఇట్లు= ఈ రకంగా; హరిణ పోతంబున్= జింకపిల్లను; తన+ఆశ్రమంబునన్= తన ఆశ్రమంలో; అతి+ఆసక్తిన్+చేసి= మిక్కిలి ఆసక్తితో; ఆసన శయన+అటన స్నానసమిత్+కుశకుసుమఫలపలాశమూల+ఉదక+ఆహరణ= కూర్చోవడం, పడుకోవడం, తిరగడం, స్నానం చేయడం, సమిధలు, దర్భలు, పువ్వులు తేవడం, పండ్లు, ఆకులు, దుంపలు, నీళ్ళు తేవడంలోనూ పనులలోను; దేవపూజా జప+ఆదులయెడన్=

దేవతార్చన చేసేటప్పుడు, జపాదులు చేసేటప్పుడును; తన+ఒద్దన= తన దగ్గరే; ఉనిచికొనుచున్= అట్టిపెట్టుకొంటూ; వృక= తోడేలు; సాలావృక= నక్క; ఆది= మొదలయిన; క్రూర మృగంబులవలని భయంబునన్= క్రూర స్వభావం కలిగిన జంతువులవల్ల కలిగే భయం కారణంగా; వనంబులన్ వెనువెంటన్= అడవులలో వెంబడి; తిరుగుచున్= త్రిమ్మరుచు; అధిక= మిక్కిలి; ప్రణయభర= ప్రేమభారంతో; పరీత= కూడుకొన్న, చుట్టబడిన; హృదయుండు+అగుచున్= హృదయము కలవాడగుచు; అతిస్నేహంబునన్+చేసి= ఎక్కువ స్నేహభావమువల్ల; కొంతసేపు= కాసింతసేపు; స్కంధంబులన్= మూపులపై, వహించుచున్= మోయుచు, మఱి కొంతతడవు= మరికొంతసేపు; ఉరంబునన్= రొమ్మున; ఉత్సంగంబునన్= ఒడిలో; ఉంచికొని లాలించుచున్= నిలుపుకొని బుజ్జగించుచు; సంతసంబున్+ఒందున్= సంతోషాన్ని పొందసాగాడు; మఱియున్= ఇంకనూ; ఆ భరతుండు= జింకపై ప్రీతి గలిగిన భరతుడు; నిత్య నైమిత్తిక+ఆది క్రియాకలాపంబున్= ప్రతిదినము చేయునవి, మరియు ప్రత్యేక సందర్భములందు చేయదగినవి అయిన కార్యక్రమములను; నిర్వర్తించు+ఎడన్= నిర్వహించేవేళ; అంతన్+అంతన్+లేచి= అప్పుడప్పుడు లేచి; హరిణకుణకంబున్+చూచుచున్= జింకపిల్లను చూచుచు; కించిత్= కొంచెము; స్వస్థ హృదయుండు+ఐ= కుదుటపడిన మనసు కలవాడై, దానిన్= ఆ జింకపిల్లను; ఆశీఃపరంపరలన్= దీవెనల వరుసలతో; అభినందించుచున్= మెచ్చుకొనుచు; చుంబన+ఆదులన్= ముద్దు మురిపాలతో; ప్రీతి+చేయుచున్= ప్రీతిని ప్రకటిస్తూ; అతి మోహంబునన్= ఎక్కువ వ్యామోహంతో; పెంచుచున్+ఉందున్+ఎడ= పెంచి పోషించుచుండగా...

**తా :** ఇలా భావించినవాడై భరతు డెంతో ఆసక్తితో ఆనందంతో లేడిపిల్లను సాకడం మొదలుపెట్టాడు. కూర్చున్నప్పుడు, పడుకున్నప్పుడు, ఎక్కడికయినా వెళ్ళినప్పుడు, స్నానం చేసేటప్పుడు, సమిధలు ఏరి తెచ్చుకొనేటప్పుడు, దర్భలు, పూలు, పళ్ళు, ఆకులు కోసేటప్పుడు, దుంపలు త్రవ్వి తెచ్చుకొనేటప్పుడు, నీళ్లు తెచ్చుకొనేటప్పుడు, దేవతార్చన చేసేటప్పుడు చివరకు జపం చేసేటప్పుడు కూడా అతడు ఆ బాలహరిణాన్ని తనపక్కనే అట్టిపెట్టుకొనేవాడు. తోడేళ్లు, నక్కలు మొదలైన మృగాలు జింకపిల్లను ఏం చేస్తాయో అని దానివెనువెంట అడవులకు వెళ్ళేవాడు. రాను రాను ఆ జింకపై మమకారం ఎక్కువవుతుంటే దాన్ని భుజాలపైకి ఎక్కించుకొనేవాడు. గుండెలపై పడుకోబెట్టుకొని ఒడిలో చేర్చుకొని బుజ్జగించేవాడు. నిత్యనైమిత్తిక కర్మలు ఆచరించేటప్పుడు కూడా అప్పుడప్పుడు లేచి జింకపిల్ల ఏమయిందో అని చూచేవాడు. ఆ జింకపిల్ల కనబడగానే మనసు కుదుటపరచుకొనేవాడు. ఒక్కొక్కప్పుడు ఆ లేడిపిల్లను దీవించేవాడు. నానాటికి ముద్దుమురిపాలతో పెంచుకుంటూ దానిమీద మోహం పెంచుకున్నాడు భరతుడు.

**విశే :** చదివే వారికి ఈ వచనం భరతునిపట్ల జాలి కలిగిస్తుంది. జింకపట్ల పెంచుకున్న ప్రేమ ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది.

**చ. గురువులు వాఱి బిట్టుఱికి కొమ్ములఁజిమ్ముచు నంత నంత ద**
**గ్గఱుచును గాలు ద్రవ్వుచు నఖంబుల గీఱుచు గాసి సేయుచున్**
**నొఱగుచు ధారుణీశ్వరుని యూరువులన్ శయనించి యంతలో**
**నఱకడ యెక్కుచుంబొదలి యాడుచు నా హరిణంబు లీలతోన్. 106**

**ప్రతి :** గురువులు వాఱి= పరుగులు పెట్టి; బిట్టు+ఉఱికి= గభాలున దూకి; కొమ్ములన్+చిమ్ముచున్= కొమ్ములతో గోకుతూ; అంతన్+అంతన్= అంతంత; దగ్గఱుచును= దూరంనుండి సమీపానికి వస్తూ; కాలు+త్రవ్వుచున్= కాలురాస్తూ; నఖంబులన్= గోళ్ళతో; గీఱుచున్= గోకుతూ; గాసి+చేయుచున్= ఇబ్బందిపెడుతూ; ఒఱగుచున్= పైకి వాలుతూ; ధారుణి+ఈశ్వరుని= భూపతియొక్క; ఊరువులన్= తొడలపై; శయనించి= పడుకొని; అంతలోన్= ఆ వెంటనే; అఱకడ=

భుజాలమీద; ఎక్కుచున్= ఎక్కుతూ; పొదలి+ఆడుచున్= సంతోషంగా ఆడుతూ; ఆ హరిణంబు= ఆ జింకపిల్ల; లీలతోన్= కేళీవిలాసంతో...

**తా :** ఆ బాలకురంగం చెంగుచెంగున పరుగులు తీస్తూ దుముకుతూ ఉన్నట్టుండి ఆ రాజర్షిని రాచుకొనేది. కొమ్ములతో గోకేది. దగ్గరికివస్తూ కాళ్ళు రాస్తూ గిట్టలతో గీకుతూ మారాం చేసేది. ఒక్కోసారి భరతుని తొడలపై హాయిగా పడుకొని అంతలో చెంగుమంటూ లేచి భుజాలమీదికి ఎక్కి ఆడుకొనేది.

**తే. గరిమ నీ రీతి మెల్లన కెరలు వొడిచి, చెలఁగి యాడంగ భరతుండు చిత్తమందు**
**సంతసిల్లుచునుండె నాశ్రమముఁ బాసి, హరిణడింభక మంతలో సురిఁగి చనిన. 107**

**ప్రతి :** గరిమన్= గొప్పగా; ఈ రీతిన్= ఈ విధంగా; మెల్లన= నెమ్మదిగా; కెరలు+పొడిచి= పెంపొందుతూ; చెలఁగి= ఆశ్రమ ప్రాంతంలో చెలరేగి; ఆడంగన్= తిరుగుచుండగా; భరతుండు= జింకపట్ల ప్రేమానురాగాలు పెంచుకొనిన భరతుడు; చిత్తము+అందున్= మనసులో; సంతసిల్లుచున్+ఉండెన్= సంతోషపడుతూ ఉన్నాడు; ఆశ్రమమున్+పాసి= పులహాశ్రమమును వదలిపెట్టి; హరిణ డింభకము= జింకపిల్ల; అంతలోన్= అంతలోనే; సురిఁగిచనినన్= కనిపించకుండాపోగా...

**తా :** పరీక్షిన్నరేంద్రా! ఆ జింకపిల్ల ఈ విధంగా తనపైబడి ఆటలాడుతున్నా రాజర్షి భరతుడు సంతోషించేవాడేగాని ఏమాత్రం ఆగ్రహించేవాడు కాడు. పైగా ఎంతో మురిసిపోయేవాడు. ఇలా ఉండగా ఒకనాడు ఆ లేడిపిల్ల ఆశ్రమం విడిచి ఎటో పారిపోయింది.

**వ. భరతుండంతం దన్మృగశాబకంబు గానంబడమికి వ్యాకులచిత్తుం డగుచు నష్టధనుండునుం బోలె నతిదీనుండై కరుణతోడంగూడి తద్విరహవిహ్వల మతియై దానిన తలంచుచు నతిశోకంబుతో మనంబున దుఃఖించి యిట్లనియె. 108**

**ప్రతి :** అంతన్= అంత; భరతుండు= జింకమీద వ్యామోహం పెంచుకొనిన భరతుడు; తద్+మృగశాబకంబు= ఆ జింకపిల్ల; కానన్+పడమికిన్= కనబడకపోవడంతో; వ్యాకులచిత్తుండు+అగుచున్= కలత చెందిన మనస్సు కలవాడగుచు; నష్టధనుండున్+పోలెన్= డబ్బు పోగొట్టుకొనినవాని రీతి; అతిదీనుండు+ఐ= మిక్కిలి దైన్యం పొందినవాడై; కరుణతోడన్+కూడి= జాలియైన స్థితిని పొంది; తత్+విరహ+విహ్వలమతి+ఐ= దాని ఎడబాటుకు విలవిలపోయిన మనస్సుకలవాడై; దానిన్+అ= ఆ జింకనే; తలంచుచున్= తలచుకొంటూ; అతిశోకంబుతోన్= మిక్కిలి దుఃఖంతో; మనంబునన్= మనసులో; దుఃఖించి= చింతించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** ఆ లేడిపిల్ల కనిపించకపోయేసరికి భరతునికి మనసు చెదిరిపోయింది. ధనం పోగొట్టుకొన్న వానిలాగ అతడు దిగులుపడ్డాడు. బెంగతో బాధతో మనస్సులో తహతహలాడుతూ మాటిమాటికీ ఆ జింకను తలచుకొంటూ ఇలా వాపోయాడు.

**తే. హరిణపోతంబ! నీకు వనాంతమందుఁ, గ్రూరమృగబాధ లేకుండఁ గోరుచుండఁ,**
**దలఁగి పోయితె యనుచుఁ జిత్తంబునందు, రాజవృషభుఁడు భరతుఁ డారాట మొంది. 109**

**ప్రతి :** హరిణపోతంబు+అ= ఓ జింకపిల్లా!; నీకున్= అసహాయ స్థితిలోనున్న నీకు; వన+అంతమందున్= అడవులలో; క్రూరమృగ బాధ లేకుండన్= క్రూరమృగాల బాధలు లేకుండా వుండేవిధంగా; కోరుచున్+ఉండన్= నేను వాంఛిస్తూండగా;

తలఁగిపోయితి+ఎ= కనులు గప్పి వెళ్ళిపోయావా?; అనుచున్= అనుచు; చిత్తంబు+అందున్= మనసులో; రాజవృషభుఁడు= రాజులలో శ్రేష్ఠుడైన; భరతుఁడు= భరతుడు; ఆరాటము+ఒంది= పరితాపమును పొంది...

**తా :** ఓ జింకపిల్లా! అడవిలోని క్రూరమృగాల బాధ నీకేమాత్రం లేకుండా నేను జాగ్రత్తపడ్డాను. అయినా నీవు నా కనులు గప్పి వెళ్ళిపోయావా అంటూ భరతుడు ఎంతగానో ఆరాటపడసాగాడు.

**తే.** **తల్లి చచ్చిన హరిణపోతంబు వచ్చి, పుణ్య హీనుండనగు నన్నుఁబొంది పాసె,**
**నేమి సేయుదు? నే నింక నెట్లు గందుఁ?, జేరి యే రీతిఁగాంచి రక్షించుకొందు? 110**

**ప్రతి :** తల్లిచచ్చిన= తల్లి మరణించిన; హరిణపోతంబు= జింకపిల్ల; వచ్చి= నా ఆశ్రమంలో చేరి; పుణ్యహీనుండన్+అగు= దౌర్భాగ్యుడయిన; నన్నున్= నన్ను; పొంది= చేరి; పాసెన్= వదలివెళ్ళిపోయింది; ఏమి+చేయుదున్= ఏమి చేయగలను?; నేను+ఇంకన్+ఎట్లు+కందున్= నేను ఇంకా ఆ జింకపిల్లను ఏ విధంగా చూడగలను?; చేరి= సమీపించి; ఏ రీతిన్= ఏ రకంగా; కాంచి= దానిని కళ్లారా చూచి; రక్షించుకొందున్= కాపాడుకొందును?

**తా :** అయ్యో! తల్లి చచ్చిన ఆ జింకపిల్ల దురదృష్టవంతుడనయిన నన్ను చేరింది. ఇప్పుడు తప్పించుకొనిపోయింది. ఇంక నేనేమి చేయాలి? అసలు ఆ జింకపిల్లను ఈ జన్మలో మళ్ళీ చూస్తానా? దాన్ని ఇదివరకులాగా గారాబంగా కాపాడుకోగలనా?

**క.** **కట్టా! యీ యాశ్రమమునఁ, బుట్టిన తృణచయము మేసి పొదలిన హరిణం**
**బిట్టట్టుఁదిరుగుచుండఁగఁ, బట్టి మృగేంద్రుండు గొట్టి బాధించె నొకో! 111**

**ప్రతి :** కట్టా!= అయ్యో!; ఈ ఆశ్రమమునన్= ఈ ఆశ్రమ ప్రాంగణంలో; పుట్టిన= మొలిచిన; తృణచయముమేసి= గడ్డిపరకలు మేసి; పొదలిన= బాగుగా పెరిగిన; హరిణంబు= జింకపిల్ల; ఇట్టు+అట్టున్= ఈవలకు ఆవలకూ; తిరుగుచు+ఉండన్+కన్= సంచరిస్తుండగా; పట్టి= ఆ జింకపిల్లను పట్టి; మృగ+ఇంద్రుండు= మృగాలకు రాజైన సింహం; కొట్టి= పంజాతోకొట్టి; బాధించెన్+ఒకో= హింసించెనో ఏమో!

**తా :** అయ్యో! ఈ అశ్రమంలో మొలచిన పచ్చిగడ్డి పరకలు తిని నవనవలాడుతూ అటునిటు తిరుగుతున్న నా లేడిపిల్లను ఏ సింహం తన పొట్టనబెట్టుకుందో కదా!

**వ.** **ఇట్లు భరతుండు హరిణకుణక క్షేమంబు గోరుచు నెప్పుడు వచ్చి నన్ను సంతోషపఱచు? నానా ప్రకారంబులైన తన గతులచేత నన్ను నెప్పుడానందంబు నొందించు? ధ్యానసమాధి నున్నప్పుడు నన్నుఁ గొమ్ముల గోకుచు నుండు; నట్టి వినోదంబు లెప్పుడు గనుఁగొందు? దేవ పూజా ద్రవ్యంబులు ద్రొక్కి మూర్కొనినం గోపించి చూచినం గుమారుండునుంబోలె దూరంబునకుం జని నిలిచి మరల నేఁ బిలిచిన వెనుక నిలిచియుండు; నిట్టి మెలఁకువ స్వభావంబు గలుగుట యెట్టు? లీ భూదేవి యెంత తపంబు చేసినదియో? ఏ హరిణ పాదస్పర్శంబులం బవిత్రమైన భూమి స్వర్గాపవర్గకాములైన మునులకు యజ్ఞార్హయగు నట్టి హరిణ పోతంబు నెట్లు గనుఁగొందు? నదియునుంగాక భగవంతుండగు చంద్రుండు మృగపతిభయంబున మృత జననియు, స్వాశ్రమపరిభ్రష్టంబునైన మృగశాబకంబును గొనిపోయి పెంచుచున్నవాఁడో! మున్ను పుత్ర వియోగతాపంబును జంద్రకిరణబులం బాపుదు; నిపుడు హరిణపోతంబు**

**దన శరీర స్పర్శంజేసి చంద్రకిరణంబులకన్న నధికం బగుచుం బుత్ర వియోగతాపంబు నివర్తింపఁజేసె ననుచుం బెక్కు భంగుల హరిణ నిమిత్తంబులైన మనోరథంబుల చేతం బూర్వకర్మవశంబున యోగభ్రష్టుండగు భరతుండు భగవదారాధనంబు వలన విభ్రంశితుం డగుచు నితరజాతింబుట్టిన హరిణపోతంబు మీఁది మోహంబగ్గలంబగుచుండ నుండెనని పలికి శుకయోగీంద్రుండు మఱియు నిట్లనియె. 112**

**ప్రతి :** ఇట్లు= ఈ రకంగా; భరతుండు= హరిణవిరహంతో కల్లోలిత మనస్కుడయిన భరతుడు; హరిణ కుణక క్షేమంబున్+ కోరుచున్= జింకపిల్ల సేమవార్తను కోరుకొంటూ; ఎప్పుడు వచ్చి= ఆ జింక ఏ వేళవచ్చి; నన్నున్= నన్ను; సంతోషపఱచున్= ఆనందపరుస్తుంది?; నానాప్రకారంబులు+ఐన= నానావిధాలయిన; తనగతులచేతన్= తన నడకల హొయలుతో; నన్నున్= నన్ను; ఎప్పుడు= ఏ వేళ; ఆనందంబున్+ఒందించున్= సంతోషింప చేస్తుందో?; ధ్యానసమాధిన్+ఉన్నప్పుడు= ధ్యానం చేసుకొనేటప్పుడు; నన్నున్= నన్ను; కొమ్ములన్= తన నిశితమైన కొమ్ములతో; గోకుచున్+ఉండున్= గోకుచునుండును; అట్టి వినోదంబులు+ఎప్పుడు= ఆ వినోదాలు ఏ వేళ; కనుగొందున్= చూడగలను; దేవపూజాద్రవ్యంబులు= దేవపూజకని తెచ్చిన వస్తువులను; త్రొక్కి= పాదాలతో త్రొక్కి; మూర్కొనినన్= వాసనచూడగా; కోపించి చూచినన్= నేను కోపంతో చూడగా; కుమారుండునున్+పోలెన్= కన్నబిడ్డలాగా; దూరంబునకున్+చని= దూరంగాపోయి; నిలిచి= నిలబడి; మరలన్= ఆపై; నేన్= నేను; పిలిచిన వెనుకన్= పిలిచిన తరువాత; నిలిచియుండున్= (వెనుక) నిలిచియుంటుంది, ఇట్టి మెలఁకువ= ఇంత జాగరూకమైన; స్వభావంబు= మసలుకొనే శీలము; కలుగుట+ఎట్టులు= ఎలా అబ్బిందో; ఈ భూదేవి= ఈ భూమాత; ఎంత తపంబు చేసినదియో= ఎంత పుణ్యం చేసుకొనిందో?; ఏ హరిణ పాదస్పర్శంబులన్= ఏ జింకపిల్ల పాదసంస్పర్శవల్ల; పవిత్రము+ఐన భూమి= పావనమయిన ఆశ్రమ ప్రాంతము; స్వర్గ+అపవర్గకాములు+ఐన= స్వర్గమోక్ష కాములయిన; మునులకున్= మునులకు; యజ్ఞ+అర్హ+అగు= యాగమునకు తగినదగునో; అట్టి= అటువంటి; హరిణ పోతంబున్+ఎట్లు+కనుఁగొందున్= జింకపిల్లను ఎలా చూడగలను; అదియునున్+కాక= అంతేగాక; భగవంతుండు+అగు= పరమాత్ముడయిన; చంద్రుండు= చంద్రుడు; మృగపతి భయంబునన్= సింహంవలని భీతితో; మృతజననియున్= చనిపోయిన తల్లి కలదియు; స్వ+ఆశ్రమ పరిభ్రష్టంబును+ఐన= తనయొక్క ఆశ్రమంనుండి పారిపోయి వచ్చినదయిన; మృగశాబకంబును= జింకపిల్లను; కొనిపోయి= ఎత్తుకొనిపోయి; పెంచుచున్నవాఁడు+ఓ= పెంచుకుంటున్నాడేమో; మున్ను= ఇంతకుమునుపు; పుత్రవియోగతాపంబును= పుత్రులనుండి విడిపోవడంవల్ల కలిగిన వేదనను; చంద్రకిరణంబులన్= చంద్రుని కిరణాలతో; పాపుదున్= తొలగించుకొందును; ఇపుడు= ఈ వేళ; హరిణపోతంబు= ఈ జింకపిల్ల; తన శరీర స్పర్శన్+చేసి= తన దేహముయొక్క తాకుడుచేత; చంద్రకిరణంబులకన్నన్= చంద్రకిరణాల కంటెకూడా; అధికంబు+అగుచున్= అత్యంత ప్రభావం కలదగుచు; పుత్ర వియోగతాపంబున్= పుత్రులను ఎడబాయడంవల్ల కలిగిన పరితాపాన్ని; నివర్తింపన్+చేసెన్= నివృత్తి గావించెను; అనుచున్= అనుచు; పెక్కుభంగులన్= అనేక విధంబుల; హరిణనిమిత్తంబులు+ఐన= హరిణశాబకం హేతువుగా గల్గిన; మనోరథంబులచేతన్= కోరికలచేత; పూర్వకర్మవశంబునన్= మునుపు చేసుకున్న కర్మ విశేషంవలన; యోగభ్రష్టుండు+అగు= యోగనిష్ఠ నుండి భ్రష్టుడయిన; భరతుండు= భరతుడు; భగవత్+ఆరాధనంబువలనన్= భగవంతుని ఆరాధించుటవలన; విభ్రంశితుండు+అగుచున్= జారుకొన్నవాడగుచు; ఇతర జాతిన్+పుట్టిన= మానవేతర జాతిలో జనించిన; హరిణపోతంబుమీఁది= జింకపిల్లమీది; మోహంబు+అగ్గలంబు+అగుచుండన్+ఉండెన్+అని= మమకారం పెంచుకొన్నవాడైయున్నాడని; పలికి= వచించి; శుకయోగి+ఇంద్రుండు= శుకనామకుడయిన యోగివరేణ్యుడు; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఈ రకంగా చెప్పాడు.

**తా :** ఇలా అనుకొంటూ లేడిపిల్ల క్షేమంగా ఉండాలని భరతుడు మనసులో కోరుకొంటూ మళ్ళీ ఈ విధంగా తహతహలాడాడు. ఆ జింకపిల్ల ఎపుడు నా దగ్గరికి వచ్చి నన్ను సంతోషపెడుతుందో! నానావిధాలయిన తన నడకల హొయలుతో నన్నెపుడు మురిపిస్తుందో! నేను ధ్యానం చేసుకొనేటప్పుడు నన్ను కొమ్ములతో గోకేది కదా! మరల అలాంటి మనోవినోదాలు నే నెపుడు అనుభవిస్తానో! దేవపూజకని తెచ్చిన వస్తువులను త్రొక్కి వాసన చూసినపుడు నేను కోపంగా చూస్తే చప్పున చిన్నబిడ్డలాగ దూరంగా పోయి, ఆ తరువాత నేను పిలువగానే మెల్లగా వచ్చి నావెనుక నిలుచుండేది. ఇంత తెలివితేటలతో మసలుకొనే స్వభావం దానికెలా అబ్బిందో! ఈ భూదేవి ఎంత పుణ్యం చేసుకుందో! ఇటువంటి జింకపిల్ల పాదస్పర్శవల్ల స్వర్గముక్తికాములైన మునుల యజ్ఞవాటిక కావటానికి యోగ్యత సంపాదించుకొంది.

ఇప్పుడా హరిణశాబకంకోసం నేనెక్కడని వెదకను? తల్లిని పోగొట్టుకుందనీ, ఆశ్రమంనుండి పారిపోయి వచ్చిందనీ, జాలిపడి సింహాల నోట్లో పడకుండా భగవంతుడయిన చంద్రుడు ఆ జింకపిల్లను ఎత్తుకొనిపోయి పెంచుకుంటున్నాడేమో?

పూర్వం నేను పుత్రవియోగ తాపాన్ని చంద్రకిరణాలతో శాంతింప జేసుకునేవాణ్ణి. తర్వాత ఆ జింకపిల్ల చంద్రకిరణాల కంటె చల్లనైన తన శరీరస్పర్శతో ఆ సంతాపాన్ని పోగొట్టింది అని హరిణశాబకాన్ని గురించి పరిపరి విధాలుగా భావించి పరితపిస్తున్న భరతుడు యోగభ్రష్టుడయ్యాడు. భగవంతుణ్ణి ఆరాధించడం మానుకున్నాడు. మృగజాతిలో పుట్టిన జింకపిల్లమీద మమకారం పెంచుకున్నాడు అని శుకయోగీంద్రుడు పరీక్షిన్నరేంద్రునికి భరతుని కథ చెబుతూ మళ్ళీ ఇలా అన్నాడు.

**సీ. జననాథ! మున్ను మోక్షవిరోధ మని పాయఁగా రాని పుత్రాదికంబునెల్లఁ**
**బాసి తపస్వియై భరతుండు హరిణశాబకపోషణంబునఁబాలనమున**
**నతిలాలనప్రీణనానుషంగంబుల మూషకబిల మతిరోషమునను**
**సర్పంబు సొచ్చిన చందంబునను యోగవిఘ్నంబు మిక్కిలి విస్తరిల్లెఁ**

**ఆ. గాన నెంతవానికైనను గాలంబు, గడవ రామి నట్లు గాక పోదు**
**పరమమునుల కైనఁబాయవు కర్మంబు, లొరు లనంగ నెంత? నరవరేణ్య! 113**

**ప్రతి :** జననాథ!= ఓ రాజా!; మున్ను= ముందు, మోక్షవిరోధము+అని= మోక్షలక్ష్యానికి విరోధమని, పాయన్+కాన్+రాని= విడిచిపెట్టుటకు వీలుకాని; పుత్ర+ఆదికంబున్+ఎల్లన్= పుత్రులు, భార్యలు మొదలయిన సంబంధ బాంధవ్యములన్ని, పాసి= వదలిపెట్టి; తపస్వి+ఐ= తపము సల్పుతున్నవాడై; భరతుండు= రాజ్యపాలనాదులు వదలిపెట్టిన భరతుడు, హరిణశాబక పోషణంబునన్= జింకపిల్లను పోషించడంలో; పాలనమున్= పాలించడంలో; అతిలాలన ప్రీణన+అనుషంగంబులన్= లాలించడం, సంతోషపెట్టడం, పెంచడం, సహవాసం చేయడంలాంటి పనులతో; మూషకబిలమున్= ఎలుకల కలుగును; అతిరోషమునను= మిక్కిలి రోషంతో; సర్పంబు+చొచ్చిన చందంబునను= పాము తన రక్షణకు ప్రవేశించిన రీతిలో; యోగవిఘ్నంబు= మోక్షోపాయ సంసిద్ధయోగానికి ఆటంకం; మిక్కిలి= అత్యధికంగా; విస్తరిల్లెన్= చోటు చేసుకొనింది; కానన్= కాబట్టి; ఎంతవానికిన్+ఐననున్= ఎలాంటి వారికయినా; కాలంబు+కడవరామిన్= విధిని దాటడం; అట్లు+కాకపోదు= ఏ మాత్రం సాధ్యం కాదు; పరమమునులకున్+ఐనన్= మహర్షులకైనను; కర్మంబులు= కర్మబంధాలు; పాయవు= వదలవు; ఒరులు+అనంగన్+ఎంత= సామాన్యుల సంగతి చెప్పేదేముంది?; నరవరేణ్యా= రాజా!.

**తా :** ఓ రాజా! పూర్వం భరతుడు ముక్తిమార్గానికి ఆటంకమనే భావనతో ఇల్లు, ఇల్లాలు, పిల్లలు మొదలైన సమస్తమూ వదలిపెట్టి తపస్వి అయ్యాడు. అయితే ఇంతలో ఒక జింకపిల్ల అతనికి తటస్థపడింది. దానిని లాలించి పాలించడం,

బుజ్జగించడం, పెంచడంలో నిమగ్నమైనాడు. కోడెత్రాచు ఎలుక కన్నంలో ప్రవేశించినట్లు వారింపరాని తపోవిఘ్నం అతనిలో చోటు చేసుకుంది. భ్రష్టుణ్ణి చేసింది. ఎటువంటివారికయినా విధిని దాటడం ఏమాత్రం సాధ్యం కాదు. మహర్షులకయినా కర్మబంధాల నుండి తప్పుకోవడం శక్యం కాదు. అటువంటప్పుడు సామాన్యుల సంగతి చెప్పేదేముంది రాజా!

**వ. ఇట్లు భరతుండు మృగవియోగ తాపంబు నొందుచుండు నెడ నా మృగశాబకంబు సనుదెంచిన సంతసిల్లుచుండె; నంత నొక్కనాఁడు. 114**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; భరతుండు= భరతుడు; మృగవియోగతాపంబున్= జింక ఎడబాటు వలన; ఒందుచున్= కలిగిన; ఉండు+ఎడన్= తాపముచే పరితపించు సందర్భంలో; ఆమృగ శాబకంబు= ఆ జింకపిల్ల; చనుదెంచినన్= మరలిరాగా; సంతసిల్లుచున్+ఉండెన్= సంతోషభరితుడయ్యాడు; అంతన్= అంత; ఒక్కనాఁడు= ఒకరోజు...

**తా :** ఈ విధంగా భరతుడు బాధపడుతున్న సమయంలో ఆ జింకపిల్ల తిరిగి వచ్చింది. దానిని చూచి భరతుడెంతో సంబరపడ్డాడు. ఇలా కొంతకాలం గడచిపోయింది.

**మ. భరతుండల్లన నంత్యకాలము వెసం బ్రాపింపఁగా నప్పు డా**
**హరిణంబుంగడుభక్తిఁబుత్రుగతి నత్యాసక్తి వీక్షింప నా**
**హరిణంబుందన యాత్మలో నిలిపి దేహంబంతటంబాసి తా**
**హరిణీగర్భమునన్ జనించి హరిణంబై యొప్పెఁబూర్వస్మృతిన్. 115**

**ప్రతి :** భరతుండు= జింకను మరల చూడడంవలన సంతోషభరితుడైన భరతుడు; అల్లనన్= మెల్లగా; అంత్యకాలము= చివరిక్షణం; వెసన్= వేగంగా; ప్రాపింపన్+కాన్= సంప్రాప్తించగా; అప్పుడు+ఆ= ఆ సమయంలో; హరిణంబున్= జింకపిల్లను; కడుభక్తిన్= మిక్కిలి ప్రేమతో; పుత్రుగతిన్= కుమారునివలె; అతి+ఆసక్తిన్= అధికమైన ఆసక్తితో; వీక్షింపన్= చూడగా; ఆ హరిణంబున్= ఆ జింకను; తన+ఆత్మలోన్= తన మనసులో; నిలిపి= నిలుపుకొన్నవాడై; దేహంబు+ అంతటన్+పాసి= భౌతికదేహాన్ని వదలిపెట్టి; తాన్= తాను; హరిణీగర్భమునన్= జింక కడుపులో; జనించి= పుట్టి; పూర్వస్మృతిన్= గత జన్మస్మృతితో; హరిణంబు+ఐ= జింకయై; ఒప్పెన్= ప్రకాశించాడు.

**తా :** భరతునికి చివరిక్షణం రానేవచ్చింది. ఆ అంత్యకాలంలో కన్నకొడుకువైపు చూస్తున్నట్టు ఆ జింకవైపు ఆసక్తితో చూస్తూ మనసులో ఆ జింకనే భావించుకుంటూ భరతుడు ప్రాణాలు విడిచాడు. అట్టి స్మృతి కారణంచేత ఆతడు జింక కడుపున పుట్టి జింకయై ప్రకాశించాడు.

**విశే :** గీతలో (8-6) మరణవేళా స్మృతిని గురించి **'యం యం వాపి స్మరన్ భావం త్యజంత్యన్తే కలేబరమ్, తం తమేవైతి కౌన్తేయ సదా తద్భావభావితః'** అని చెప్పబడింది. దేహం త్యజించేవేళ మానవుడు ఏ భావాన్ని స్మరిస్తాడో అదే భావం అతడు నిశ్చయంగా పొందగలడు అని భావం. భగవదర్చన మరచినవాడు, హరిణపోతంపై మమకారం పెంచుకున్నవాడు, హరిణాన్ని చూస్తూ మరణించినవాడు హరిణ జన్మ ఎత్తడం సహజం. కాని, భగవదారాధన ఫలితముంది కనుక గత జన్మ విషయాలను మరచిపోలేదు. ఉద్దేశపూర్వకంగా భక్తిని నిర్లక్ష్యం చేసినందున భక్తుడు కొంతకాలం శిక్షకు గురికావలసివచ్చింది. **'మృతమను న మృతజన్మానుస్మృతి రితరవన్మృగ శరీరమవాప'** అని మూలం. మరణ సమయంలో జింకనే స్మరిస్తూండడంవల్ల మరుజన్మలో జింకదేహాన్ని పొందాడని భావం.

**వ. ఇట్లు భరతుండు హరిణీగర్భంబునం బుట్టియు భగవదారాధన సామర్థ్యంబునం దన మృగత్వకారణంబుఁదెలిసి కడుందాపంబు నొందుచు నిట్లనియె. 116**

**ప్రతి :** ఇట్లు= ఈ రకంగా; భరతుండు= భరతుడు; హరిణీగర్భంబునన్+పుట్టియున్= జింక కడుపున జన్మించినా; భగవత్+ఆరాధన= పూర్వజన్మంలో భగవంతుణ్ణి ఆరాధించిన; సామర్థ్యంబునన్= శక్తితో; తన= తనయొక్క; మృగత్వకారణంబున్= జింకగా పుట్టవలసిన హేతువును; తెలిసి= తెలుసుకొని; కడున్= మిక్కిలి; తాపంబున్+ఒందుచున్= పరితపించుచు; ఇట్లు+అనియెన్= ఈ లాగున అనుకొన్నాడు.

**తా :** ఈ విధంగా భరతుడు లేడి కడుపున పుట్టినా, పూర్వజన్మంలో భగవంతుణ్ణి ఆరాధించిన పుణ్యపరిపాకంచేత తానెందుకు జింకగా పుట్టవలసి వచ్చిందో తెలుసుకొని బాధపడుతూ ఈ లాగున అనుకున్నాడు.

**ఉ. రాజులు ప్రస్తుతింప సురరాజసమానుఁడనై తనూజులన్**
**రాజులఁజేసి తాపసులు రాజఋషీంద్రుఁడటంచుఁబల్కఁగాఁ**
**దేజము నొంది యా హరిణ దేహమునందలి ప్రీతిఁజేసి నా**
**యోజ సెడంగ నేఁజెడితి యోగిజనంబులలోన బేలనై. 117**

**ప్రతి :** రాజులు= పాలకులయిన ప్రభువులు; ప్రస్తుతింపన్= పొగడగా; సురరాజ సమానుఁడను+ఐ= దేవేంద్రునితో సమానమయినవాడనై; తనూజులన్= కుమారులను; రాజులన్+చేసి= పాలకులను గావించి; తాపసులు= మునులు; రాజఋషి+ఇంద్రుఁడు+అటంచున్= రాజర్షులలో సర్వశ్రేష్ఠుడని; పల్కన్+కాన్= పలుకగా; తేజమున్+ ఒంది= తేజస్సు కలవాడనై; ఆ హరిణదేహమునందలి= ఆ జింక దేహంపై గల; ప్రీతిన్+చేసి= ప్రీతి కారణంగా; నా+ఓజ= నా తపో విధానము; చెడన్+కన్= చెడిపోగా; నేన్= నేను; యోగిజనంబులలోనన్= యోగులగుంపులో; బేలను+ఐ= మూఢుడనై; చెడితిన్= చెడిపోయాను.

**తా :** రాజులందరూ నన్ను తెగ పొగిడారు. నేను దేవేంద్రవైభవాలను తనివితీరా అనుభవించాను. నా కుమారులను రాజులుగా చేసి రాజ్యభారం వారికి అప్పగించి అడవికి వచ్చి తపస్వినైనాను. తాపసులందరూ నన్ను గొప్ప రాజర్షి అని గౌరవించారు. చివరకు ఒక జింకపిల్ల మీద మోహం పెంచుకుని నా గత వైభవమంతా పోగొట్టుకొని సాటియోగులలో ఎందుకూ కొరగాని వాడనయిపోయాను.

**విశే :** ఈ పద్యంలో భరతుని పశ్చాత్తాపం ప్రకటితం. పశ్చాత్తాపం సగం పాపహారకం. భక్తియోగసాధనలో ఏర్పడే మమకారవాంఛలను తొలగించుకోవడం అవసరమని బోధ. కనుకనే గీతలో **'దృఢవ్రతాః'** అని **'సతతం కీర్తయన్తో మాం యతంతశ్చ దృఢవ్రతాః'** అని చెప్పారు.

**వ. ఇట్లు శ్రీహరి శ్రవణ మనన సంకీర్తనారాధనానుస్మరణాభియోగంబులం జేసి యశూన్య సకలయామంబగు కాలంబు గల నాకు హరిణపోతస్మరణంబు కతంబున యోగవిఘ్నంబు ప్రాప్తంబయ్యె; మోక్షదూరుండనైతి నని నిగూఢ నిర్వేదుం డగుచుఁ దల్లిం బాసి క్రమ్మఱ నుపశమశీల మునిగణ సేవితంబయి భగవత్క్షేత్రంబైన సాలతరునిబిడ తమ గ్రామసమీపపులస్త్య పులహాశ్రమంబునకుం గాలాంజన పర్వతంబు వలనఁ జనుదెంచి యందు మృగదేహత్యాగావసానంబు గోరుచు సంగంబు విడిచి యేకాకి యగుచు శుష్క**

**పర్ణ తృణవీరు దాహారుండై మృగత్వనిమిత్తం బగు నా నదీతీర్థంబు నందుఁదత్తీర్థోదక క్లిన్నంబగుచు నుండు శరీరంబు విడిచె నని శుక యోగీంద్రుండు పరీక్షిన్నరేంద్రునకు వినిపించి మఱియు నిట్లనియె. 118**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; శ్రీహరి= నారాయణుని గూర్చి; శ్రవణ= వినడం; మనన= తలచుకోవడం; సంకీర్తన= స్తుతి చేయడం; ఆరాధన= పూజలు చేయడం; అనుస్మరణ= ధ్యానించడం అనే; అభియోగంబులన్+చేసి= గొప్ప కలయికలవల్ల; అశూన్యసకలయామంబు+అగు కాలంబు+కల నాకున్= ఎల్ల ప్రొద్దులు వ్యర్థం చేయని నాకు; హరిణపోతస్మరణంబు కతంబునన్= జింకపిల్లను అదేపనిగా తలచుకోవడం, తపించడం కారణంగా; యోగవిఘ్నంబు= మోక్ష సంప్రాప్తికరమైన యోగప్రయత్నానికి ఆటంకం; ప్రాప్తంబు+అయ్యెన్= సంభవించింది; మోక్షదూరుండన్+ఐతిన్+అని= మోక్షానికి దూరమయ్యానని; నిగూఢ నిర్వేదుండు+అగుచున్= లోలోపల దుఃఖపడుచు, తల్లిన్+పాసి= తన జన్మకు కారణమయిన హరిణిని వదలిపెట్టి; క్రమ్మఱన్= మరల; ఉపశమశీల మునిగణ సేవితంబు+ఐ= భౌతికమైన ఆసక్తినుండి పూర్తిగా విడివడిన మునులచే సేవింపబడినదియు; భగవత్+క్షేత్రంబు+ఐన= భగవంతుని పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి వడసినదియు అగు; సాలతరునిబిడతమ= సాలవృక్షములచే దట్టమైన; గ్రామసమీప= గ్రామం సమీపంలో ఉన్న; పులస్త్య పులహ+ఆశ్రమంబునకున్= పులస్త్య పులహాశ్రమమునకు; కాల+అంజన పర్వతంబువలనన్+చనుదెంచి= కాలాంజన పర్వతం నుండి వచ్చి; అందున్= అక్కడ; మృగదేహత్యాగ+అవసానంబున్= హరిణదేహాన్ని వదలిపెట్టడానికి; కోరుచున్= అభిలషిస్తూ; సంగంబున్ విడిచి= పొత్తులను వదలిపెట్టి; ఏకాకి+అగుచున్= ఒంటరిగానుండి; శుష్కపర్ణ తృణవీరుత్+ఆహారుండు+ఐ= ఎండిన ఆకులూ, గడ్డిపరకలూ, తీగదుబ్బలు ఆహారంగా స్వీకరిస్తూ; మృగత్వనిమిత్తంబు+అగు= తన జింక జన్మకు కారణమయిన; ఆ నదీతీర్థంబు+అందున్= ఆ నదీ తీర్థంలోనే; తద్+తీర్థ+ఉదక క్లిన్నంబు+అగుచున్+ఉండు= ఆ పుణ్యనదీ జలాలలో తడిసినట్టి; శరీరంబున్+విడిచెన్= దేహాన్ని వదలిపెట్టాడు; అని= అని; శుకయోగి+ఇంద్రుండు= శుకమహర్షి శ్రేష్ఠుడు; పరీక్షిత్+నర+ఇంద్రునకున్= పరీక్షిన్మహారాజునకు; వినిపించి= వృత్తాంతం తెలియజేసి; మఱియున్= మఱల; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** శ్రీమన్నారాయణుని గూర్చి వినడం, హరిని తలచుకోవడం, హరినామ సంకీర్తన చేయడం, హరిపూజ గావించడం, హరిభక్తులను అనుసరించడం మొదలయిన సత్కర్మలతో క్షణకాలం కూడా వ్యర్థం చేయని నాకు ఈ లేడిపిల్లవల్ల తపో విఘ్నం కలిగింది. మోక్షానికి దూరమయ్యానంటూ లోలోపల కుమిలిపోయాడు. ఆ తర్వాత తన జన్మకు కారణమయిన తల్లిజింకను వదలి కాలాంజనపర్వతాన్ని విడిచిపెట్టి దట్టమైన సాలవృక్షాలచే నిండిన సాలగ్రామ సమీపంలో ఉన్న పులస్త్యపులహాశ్రమం చేరుకున్నాడు. ఆ ఆశ్రమంలో శాంతస్వభావులైన మునీశ్వరులున్నారు. అది ఒక భగవత్ క్షేత్రం. అక్కడికి వచ్చి తనకు ప్రాప్తించిన హరిణదేహాన్ని వదలిపెట్టడానికి తగిన సమయంకోసం ఎదురుచూడ సాగాడు. ఎవరితో సంబంధం లేకుండా ఒంటరిగా ఉండి ఎండిన ఆకులూ, గడ్డిపరకలూ, తీగదుబ్బలూ తింటూ తన జింకజన్మకు కారణమయిన ఆ నదీతీర్థంలోనే బతుకు ముగించాలని కోరుతూ కాలం గడిపాడు. చివరకు ఆ పుణ్యనదిలో స్నానం చేస్తూనే తన హరిణశరీరం వదలిపెట్టాడు అని శుకయోగీంద్రుడు పరీక్షిత్తుకు చెప్పి ఆ తరువాతి వృత్తాంతం ఇలా వినిపించాడు.

**సీ. హరిణదేహముఁబాసి యంత నాంగిరసాహ్వయుండు శుద్ధుఁడుఁ బవిత్రుండు ఘనుఁడు**
**శమదమఘనతపస్స్వాధ్యాయనిరతుండు గుణగరిష్ఠుఁడు నీతికోవిదుండు**
**నైన బ్రాహ్మణునకు నాత్మజుండై పుట్టి సంగంబువలనను జకితుఁడగుచుఁ**
**గర్మబంధంబుల ఖండింపఁజాలు నీశ్వరుని నచ్యుతు నజు శ్రవణమనన**

**తే. ములను హరిచరణధ్యానములను విఘ్న, భయమునను జేసి మనమందుఁబాయనీక**
**నిలిపి సంస్తుతి సేయుచు నిలిచియుండె, భరితయశుఁడైన భరతుండు పార్థివేంద్ర! 119**

**ప్రతి :** పార్థివ+ఇంద్ర= ఓ రాజా!; హరిణదేహమున్+పాసి= జింక శరీరాన్ని వదలిపెట్టి; అంతన్= ఆ తరువాత; ఆంగిరస+ఆహ్వయుండు= ఆంగిరసుడను పేరుగలవాడు; శుద్ధుఁడు= నిర్మలుడు; పవిత్రుండు= పావనుడు; ఘనుఁడు= గొప్పవాడును; శమదమ ఘనతపస్+స్వాధ్యాయ నిరతుండు= అంతరింద్రియ నిగ్రహము, బహిరింద్రియ నిగ్రహము; గొప్ప తపస్సు, వేదాధ్యయనము అనువానితో ఎడతెగనివాడు, తపోనిరతుడు, వేదాధ్యయనం చేసేవాడును; గుణగరిష్ఠుఁడు= సుగుణ గరిష్ఠుడును; నీతికోవిదుండును= నీతి పరిజ్ఞానంలో శ్రేష్ఠుఁడును; ఐన= అయినటువంటి; బ్రాహ్మణునకున్= విప్రునికి; ఆత్మజుండు+ఐ+పుట్టి= పుత్రుడుగా జనించి; సంగంబువలనను= సంసార బంధాల విషయమై; చకితుఁడు+అగుచున్= భయపడినవాడగుచు; కర్మబంధంబులన్= కర్మపు కట్లను; ఖండింపన్+చాలు= త్రెంపివేయడానికి సమర్థుడు; ఈశ్వరునిన్= సర్వేశ్వరుని; అచ్యుతున్= నాశనం లేనివానిని; అజున్= జననము లేనివానిని; శ్రవణ మననములను= శ్రవణము, మననములచేత; హరిచరణ ధ్యానములను= పాపముల హరించు దేవుని పాదముల ధ్యానమును; విఘ్నభయమునను+చేసి= ఆటంకాలు కలుగుతాయేమో అనే భయంతో ముందేచేసి; మనము+అందున్= మనసులో; పాయనీక= వదలిపెట్టక; నిలిపి= హరిని మనసున నిలిపి; సంస్తుతి+చేయుచున్= స్తోత్రం చేస్తూ; నిలిచియుండెన్= కాలము గడుపసాగాడు; భరితయశుఁడు+ఐన= కీర్తితో నిండినవాడయిన; భరతుఁడు= బ్రాహ్మణ పుత్రుడై జనించిన భరతుడు.

**తా :** మహారాజా! భరతుడు లేడి దేహాన్ని వదలిపెట్టి తరువాతి జన్మలో ఆంగిరసగోత్రుడైన ఒక బ్రాహ్మణునికి కుమారుడుగా పుట్టాడు. ఆ బ్రాహ్మణుడు పవిత్రుడు. గొప్పవాడు. శమదమాదిగుణసంపన్నుడు. తపోనిరతుడు. వేదాధ్యయనం చేసేవాడు. సుగుణగరిష్ఠుడు. నీతికోవిదుడు. అటువంటి బ్రాహ్మణునికి భరతుడు పుత్రుడుగా జన్మించాడు. పుట్టింది మొదలు సంసారబంధాలకు దూరంగా ఉన్నాడు. కర్మబంధాలను తెంపివేసేవాడూ, సర్వేశ్వరుడూ, అచ్యుతుడూ, జననం లేనివాడూ అయిన విష్ణుమూర్తి పాదాలను నిరంతరం ధ్యానిస్తూ ఆయన కథలను ఆలకిస్తూ మళ్ళీ ఎటువంటి ఆటంకం రాకుండా ఆయనను సంస్తుతిస్తూ యశోభరితుడైన భరతుడు కాలం గడపసాగాడు.

**విశే :** భరతుడు క్షత్రియకులంలో జన్మించాడు. అయితే ఆధ్యాత్మిక కర్మలను నిర్లక్ష్యం చేశాడు. అందువల్ల జింక జన్మ ఎత్తాడు. అయినా గత జన్మస్మృతి అతనిని రక్షించింది. **'శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే'** 6.4.1 యోగభ్రష్టుడు పవిత్రులైన శ్రీమంతుల గృహంలో పుడతాడు అన్నట్లుగా ఉత్తమ బ్రాహ్మణ వంశంలో పుట్టాడు.

**వ. ఇట్లాంగిరసుండు ప్రథమభార్యయందుఁ బుత్రనవకంబును, గనిష్ఠ భార్యయందు స్త్రీపురుషుల నిద్దఱను గలుగఁ జేసిన నందుఁ బురుషుండు పరమ భాగవతుండును రాజర్షి ప్రవరుండును నుత్సృష్ట మృగశరీరుండును జరమశరీరంబునం బ్రాప్తవిప్రశరీరుండును నగు భరతుండయ్యె; నతం డా జన్మంబున నన్యజన సంగంబు జన్మపరంపరలకుఁ గారణం బని యత్యంత భయంబు నొంది కర్మబంధ విధ్వంసన శ్రవణస్మరణాదుల శ్రీహరి యనుగ్రహంబునం బూర్వజన్మపరంపరల సంస్మరించుచుఁ దన స్వరూపంబు నున్మత్తజడాంధబధిర రూపంబుల లోకులకుం జూపుచుండె, నంత. 120**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; ఆంగిరసుండు= ఆంగిరస నామకుడయిన బ్రాహ్మణుడు; ప్రథమభార్య+అందున్= పెద్ద భార్యయందు; పుత్రనవకంబును= తొమ్మిదిమంది కొడుకులను; కనిష్ఠ భార్యయందున్= చిన్నభార్యయందు; స్త్రీ పురుషులన్+ఇద్దఱను= ఒక ఆడ, ఒక మగ సంతానాన్ని; కలుగన్+చేసి= పుట్టించి; అందున్= వారిలో; పురుషుండు= మగవాడును; పరమ భాగవతుండును= భగవద్భక్తి కలవారిలో శ్రేష్ఠుడును; రాజ+ఋషి ప్రవరుండును= రాజర్షులలో శ్రేష్ఠుడును; ఉత్+సృష్ట మృగశరీరుండును= జింక శరీరాన్ని వదలివేసినవాడై; చరమశరీరంబునన్= చివరి శరీరంలో; ప్రాప్తవిప్రశరీరుండును+అగు= పొందబడిన బ్రాహ్మణ శరీరం కలవాడైన; భరతుండు+అయ్యెన్= భరతుడయ్యాడు; అతండు= ఆ భరతుడు; ఆ జన్మంబునన్= ఆ విప్రజన్మలో; అన్యజన సంగంబు= ఇతరులతో సాంగత్యం; జన్మపరంపరలకున్= అనేక జన్మలకు; కారణంబు+అని= కారణమౌతుందని; అతి+అంతభయంబున్+ఒంది= మిక్కిలి భీతిని పొందినవాడయి; కర్మబంధ విధ్వంసన= కర్మబంధాలను విధ్వంసం చేయగల; శ్రవణస్మరణ+ఆదులన్= వినడం; స్మరించడం మొదలయిన భక్తివిభేదాలవల్ల, శ్రీహరి+అనుగ్రహంబునన్= శ్రీహరి అనుగ్రహంవల్ల; పూర్వజన్మ పరంపరలన్= పూర్వజన్మల వరుసలను; సంస్మరించుచున్= మాటిమాటికి స్మరించుకొనుచు; తన స్వరూపంబున్= తనయొక్క బాహ్యాకారాన్ని; ఉన్మత్త= పిచ్చివాని; జడ= జడుని; అంధ= గుడ్డివాని; బధిర= చెవిటివాని; రూపంబుల= రూపాలతో; లోకులకున్= సామాన్య ప్రజాళికి; చూపుచుండెన్= ప్రదర్శించుచుండెను; అంతన్= ఆపై.

**తా :** ఆ బ్రాహ్మణునికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్యకు తొమ్మిదిమంది పుత్రులు. చిన్నభార్యకు ఒక కొమార్తె, ఒక కుమారుడు. ఆ చిన్న భార్య కుమారుడే భరతుడు. పరమభాగవతుడూ, రాజర్షి పుంగవుడూ అయిన భరతుడు తన హరిణ శరీరాన్ని పరిత్యజించి ఈ జన్మలో బ్రాహ్మణుని ఇంట జన్మించాడు. ఇతరులతోడి సాంగత్యం జన్మపరంపరలకు కారణమౌతుందని భయపడిన భరతునికి శ్రీహరి అనుగ్రహంవల్ల పూర్వజన్మ స్మృతి కలిగింది. అందువల్ల అతడు కర్మబంధవిముక్తికోసం ఉన్మత్తుడుగా, జడుడుగా, అంధుడుగా, చెవిటివాడుగా లోకులకు కనిపిస్తూ జీవితం గడుపుతున్నాడు.

**విశే :** భరతుడు జడుడుగా, అంధుడుగా, చెవిటివాడుగా లోకులకు కనిపించడానికి కారణం తన్ను దుష్టసాంగత్యం నుండి రక్షించుకోవడానికే. అభక్తుల దాడినుండి తన్ను తాను రక్షించుకోవడానికే.

**మ. జనకుండాంగిరసుండు నాత్మజుని వాత్సల్యంబునంబెంచుచుం**
**దనరం జౌలముఖాగ్ర్యకర్మములచేతన్ సంస్కృతుంజేసి పా**
**యని మోహంబున నిచ్చలుంగడఁక శౌచాచారముల్ సెప్పినన్**
**ఘనుఁ డా భాగవతుండసమ్మతిని దత్కర్మంబులంగైకొనెన్. 121**

**ప్రతి :** జనకుండు= తండ్రి అయిన; ఆంగిరసుండున్= ఆంగిరసుడును; ఆత్మజునిన్= కుమారుడైన భరతుని; వాత్సల్యంబునన్= వాత్సల్యంతో; పెంచుచున్= పోషించుచు; తనరన్= ఒప్పునట్లుగా; చౌలముఖ+అగ్ర్య కర్మములచేతన్= పుట్టినదాది ఆయా వయస్సులలో చేయవలసిన చౌలాది సంస్కారములచేత; సంస్కృతున్+చేసి= సంస్కారవంతునిచేసి; పాయని మోహంబునన్= వదలి పెట్టబడని మోహంతో; నిచ్చలున్= ఎల్లప్పుడు; కడఁకన్= ప్రయత్నంతో; శౌచ+ఆచారముల్+చెప్పినన్= శారీరక సంబంధములైన పరిశుద్ధత మున్నగు ఆచారాలు చెప్పగా; ఘనుఁడు= గొప్పవాడయిన; ఆ భాగవతుండు= భగవద్భక్తి పరాయణుడయిన భరతుడు; అసమ్మతినిన్= తనకు ఇష్టం లేకపోయినా; తద్+కర్మంబులన్= ఆయా కర్మలను; కైకొనెన్= స్వీకరించాడు.

**తా :** భరతుని తండ్రి తన చిన్న కుమారుణ్ణి ఎంతో గారాబంగా పెంచాడు. పుట్టు వెంట్రుకలు తీయించడం మొదలైన సంస్కారాలు చేయించాడు. కుమారునిమీద ఉన్న అనురాగాతిశయంతో నిత్యమూ శౌచ సదాచారములు నేర్పాడు. అవి ఏమాత్రం తనకు ఇష్టం లేకున్నా భరతుడు విధేయతతో వాటిని అవలంబించాడు.

**వ. ఇట్లు బ్రాహ్మణకుమారుండు గర్మంబులయందు నిచ్చలేక యుండియును బితృనియోగ నిర్బంధంబునం బితృసన్నిధి యందె యసమీచీనంబుగా వ్యాహృతి ప్రణవ శిరస్సహితం బగునట్లు గాయత్రీ మంత్రోపదేశంబు నొంది చైత్రాది చతుర్మాసంబుల సమవేతంబుగ వేదంబుల నధ్యయనంబు సేయుచుండె; జనకుండాత్మజుని శిష్టాచారంబుచే శిక్షింపవలయు నను లోకాచారంబు ననువర్తించి యాత్మభూతుండగు నాత్మజునందు నభినివేశిత చిత్తుం డగుచు శౌచాచమనాధ్యయన వ్రత నియమగుర్వనల శుశ్రూషణాదికంబుల ననభియుక్తంబు లయినంబుత్త్రునిచే నొనరింపించుచు నప్రాప్తమనోరథుండయ్యె; నంత. 122**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; బ్రాహ్మణకుమారుండు= ఆంగిరసుని కుమారుడయిన భరతుడు; కర్మంబుల+అందున్= నిత్య కర్మలయందు; ఇచ్చలేక యుండియును= కోరికలేకున్నా; పితృనియోగ నిర్బంధంబునన్= తండ్రి ఆదేశ నిర్బంధంవల్ల; పితృసన్నిధి+అందున్+ఏ= తండ్రి దగ్గరే; అసమీచీనంబుగాన్= అనుకూలం కానిదైన; వ్యాహృతిప్రణవ శిరస్+సహితంబు+ అగునట్లు= ప్రణవం మొదలుగా వ్యాహృతులు తరువాతివిగా కలది అగునట్లు; గాయత్రీమంత్ర+ఉపదేశంబున్+ఒంది= పవిత్ర గాయత్రీమంత్రోపదేశం స్వీకరించి; చైత్ర+ఆదిచతుర్మాసంబులన్= చైత్రం మొదలుగా నాలుగునెలలు; సమవేతంబు+కన్= ఇతరులతో గూడి; వేదంబులన్= చతుర్వేదాలను; అధ్యయనంబు+చేయుచున్+ఉండెన్= అధ్యయనం చేస్తున్నాడు; జనకుండు= తండ్రి; ఆత్మజుని= కుమారుని; శిష్ట+ఆచారంబుచేన్= శిష్టులు పాటించే ఆచారాలతో; శిక్షింపవలయున్= శిక్షించాలనే; లోక+ఆచారంబున్= లౌకికాచారమును; అనువర్తించి= పాటించి; ఆత్మభూతుండు+అగు= తానే అయినవాడగు; ఆత్మజు+అందున్= కుమారునియందు; అభినివేశిత చిత్తుండు+అగుచున్= కుతూహలముగల మనస్సుతో కూడిన వాడగుచు; శౌచ+ఆచమన+అధ్యయన+వ్రత+నియమగురు+అనల+శుశ్రూషణ+ఆదికంబులన్= పరిశుభ్రతకై నీరు పుక్కిలించుట, వేదము చదువుట, గొప్ప అగ్నిహోత్రము సేవించుట మొదలగు; అనభియుక్తంబులు+అయినన్= అంగీకారము లేనివయిననూ; పుత్రునిచేన్= కుమారునితో; ఒనరింపించుచున్= చేయించుచు; అప్రాప్తమనోరథుండు+ అయ్యెన్= తన ప్రయత్నం యావత్తూ సత్ఫలం ఇవ్వలేదనే మనసు కలవాడయ్యాడు; అంతన్= అటుతరువాత...

**తా :** బ్రాహ్మణకుమారుడయిన భరతునికి కర్మలంటే ఏమాత్రం ఆసక్తి లేకపోయినా బోధించేవాడు తండ్రి కావడం వల్ల వాటిని పాటించడం తప్పనిసరి అయింది. తండ్రిదగ్గర ప్రణవం, వ్యాహృతులతో కూడిన గాయత్రీ మంత్రోపదేశం పొందాడు. ప్రతిసంవత్సరం, తప్పకుండా చైత్ర, వైశాఖ, జ్యేష్ఠాషాఢ మాసాలలో ఇతరులతో కలిసి వేదాధ్యయనం చేశాడు. తండ్రి కుమారునకు శిష్టాచారం నేర్పాలనే లోకాచారం మేరకు తన కుమారుడైన భరతునికి అతని తండ్రి శౌచవిధి, ఆచమనవిధి, అధ్యయన విధి, వ్రతవిధి మొదలైన నియమాలను అగ్ని ఆరాధనం గురుశుశ్రూషవంటి సత్కార్యాలను నేర్పాడు. అయినా కుమారునికి వాటిపట్ల అభినివేశం లేకుండడం గుర్తించి తన ప్రయత్నం యావత్తూ వ్యర్థమయిందనీ, తన కోరిక నెరవేరలేదనీ నిరాశ పడ్డాడు.

**విశే :** ఈ జన్మలో భరతుడు కర్మకాండలకు అతీతుడు. ఇప్పుడతడు గుణాతీతస్థితిని కోరుకుంటున్నాడు.

**క. ఈ రీతిని గొడుకున కా, చారంబులు గఱపి చింత సద్గృహమున సం**
**సారి యగుచుండి విప్రుఁడు, బోరన దేహంబుఁబాసి పోయినమీఁదన్. 123**

**ప్రతి :** ఈ రీతినిన్= ఈ తీరులో; కొడుకునకున్= కుమారునికి; ఆచారంబులు+కఱపి= శిష్టాచారములు నేర్పి (నేర్పడంలో అశక్తుడు కావడమనే); చింతన్= చింతతో; సత్+గృహమునన్= మంచి ఇంటియందు; సంసారి+అగుచుండి= సంసార జీవితం సాగించి; విప్రుఁడు= బ్రాహ్మణుడయిన ఆంగిరస గోత్రజుడు; బోరన= శీఘ్రముగా; దేహంబున్+పాసి= దేహాన్ని వదలిపెట్టి; పోయినమీఁదన్= పరలోకగతుడయిన తరువాత.

**తా :** ఈ విధంగా తన తనయునికి సదాచారాలు నేర్పే ప్రయత్నంచేసి తన ప్రయత్నం సఫలంకాలేదని చింతిస్తూనే కొంతకాలం సంసారజీవితం సాగించి ఆంగిరస గోత్రజుడైన ఆ విప్రుడు ఆకస్మికంగా పరలోకగతుడైనాడు.

**ఆ. తల్లి తండ్రితోడఁదా నగ్నిఁజొచ్చిన, నతని మహిమ లెఱుఁగ కంతలోన**
**సవతితల్లి కొడుకు లవినీతు లగుచును, శాస్త్రవిద్య లతనిఁజదువనీక. 124**

**ప్రతి :** తండ్రితోడన్= ఆంగిరసునితో; తల్లి= తల్లి; తాను+అగ్నిన్+చొచ్చినన్= తాను సహగమనం చేయగా; అతని= భరతుని; మహిమలు+ఎఱుఁగక= మహిమలు తెలుసుకోకుండా; అంతలోనన్= అప్పుడే; సవతితల్లి కొడుకులు= సవతితల్లి కుమారులు; అవినీతులు+అగుచును= అవినీతిపరులగుచు; అతనిన్= ఆ భరతుని; శాస్త్రవిద్యలు= శాస్త్రసంబంధములైన చదువులు; చదువనీక= చదువనీయక...

**తా :** తండ్రి చనిపోగానే తల్లి భర్తతో సహగమనం చేసింది. సవతితల్లి కొడుకులు అవినీతిపరులు. అందుచేత వారు భరతుని గొప్పతనాన్ని తెలుసుకోలేకపోయారు. వారు భరతుని శాస్త్రాదులుకూడా చదువనీయలేదు.

**విశే :** ఈ పద్యంలో మూడు అంశాలున్నాయి. మొదటిది 'సహగమనం' ఆనాటి ఆచారం. రెండవది తండ్రికి భరతుని గురించి తెలిసినంత సోదరులకు తెలియకపోవడం. మూడవది వారు అవినీతిపరులు కావడం.

**వ. ఇట్లు బ్రాహ్మణకుమారుని సవతితల్లి కొడుకులు వేద విద్యల వలనం బాపి గృహకర్మంబుల నతని నియమించిన. 125**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; బ్రాహ్మణ కుమారుని= భరతుని; సవతితల్లి కొడుకులు= ఆంగిరసుని రెండవ భార్య కుమారులు; వేదవిద్యల వలనన్+పాపి= వేదవిద్యలు చదువనీయకుండా చేసి; గృహకర్మంబులన్= ఇంటిపనులు చేయవలసిందిగా; అతనిన్= భరతుని; నియమించినన్= నియమించగా.

**తా :** ఈ విధంగా తండ్రి మరణానంతరం సవతితల్లి కొడుకులు భరతుణ్ణి వేదవిద్యలు చదువనీయకుండా ఇంటిపనులు చేయుమని శాసించారు.

**విశే :** తల్లి తండ్రి లేనివారి జీవితం ఎంత దుర్భరమో భరతుని కథలో ఈ సన్నివేశం స్పష్టం చేస్తుంది.

**క. ధరణీసురోత్తముఁడు దా, నరుదుగఁదమవారు సెప్పినవి యెల్లను నే**
**మఱ కందుఁబ్రీతిసేయక, నిరతము గృహకర్మ మట్లు నెఱపుచు నుండెన్. 126**

**ప్రతి :** ధరణీసుర+ఉత్తముఁడు= బ్రాహ్మణులలో శ్రేష్ఠుడయినవాడు; తాన్+అరుదుగన్= క్వాచిత్కంగా; తమవారు+చెప్పినవి+ ఎల్లనున్= తమవారు చెప్పిన పనులన్నింటిని; ఏమఱక= ఏమరుపాటులేక; అందున్= ఆ పనులపట్ల; ప్రీతిన్+చేయక= ఆసక్తిని కనబరచక; నిరతమున్= ఎల్లప్పుడు; గృహకర్మము= ఇంటిపనులు; అట్లు= ఆ విధంగా; నెఱపుచున్+ఉండెన్= నిర్వహిస్తూ ఉన్నాడు.

**తా :** అయినా భరతుడు వారు చెప్పిన పనులను ఏ మాత్రం కాదనకుండా పనులలో ఏమాత్రం ఏమరుపాటు లేకుండా చేస్తున్నాడు. అయితే ఆ పనులపట్ల అతనికి ఆసక్తి మాత్రం లేకపోయింది. నిరంతరం అలా ఇంటిపనులు చేస్తూ వుండేవాడు.

**వ. ఇట్లు గృహకర్మ ప్రవర్తనుం డగుచు నుండ మూఢులగు ద్విపాత్పశువులచే నున్మత్త! జడ! బధిర! యని యాహూయమానుం డగునపుడు తదనురూపంబులగు సంభాషణంబుల నొనర్చుచుఁ బరేచ్ఛా యదృచ్ఛలం జేసి విష్టి వేతన యాచ్ఞాదులవలన నియుక్తకర్మంబులంబ్రవర్తించుచు. 127**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; గృహకర్మప్రవర్తనుండు+అగుచున్+ఉండన్= ఇంటి పనులయందు మెలగుచున్నవాడగుచుండగా; మూఢులు+అగు= మూర్ఖులయిన; ద్విపాత్+పశువులచేన్= రెండుకాళ్ళు గల పశువులచేత; ఉన్మత్త= పిచ్చివాడా; జడ= మొద్దూ; బధిర= చెవిటివాడా; అని= అని; ఆహూయమానుండు+అగునపుడు= పిలువబడేటప్పుడు; తత్+అనురూపంబులు+ అగు= అందుకు తగ్గట్టు; సంభాషణంబులన్+ఒనర్చుచున్= సంభాషణలు కొనసాగించుచు; పర+ఇచ్ఛాయదృచ్ఛలన్+చేసి= ఇతరుల కోరికల వలన, అప్రయత్న సిద్ధముల వలన; విష్టి= వెట్టిచాకిరి; వేతన= కూలిపని; యాచ్నా+ఆదులవలనన్= యాచించడం మొదలయినవాని వలన; నియుక్తకర్మంబులన్= నియమింపబడిన పనులయందు; ప్రవర్తించుచున్= మెలగుచు.

**తా :** భరతుడు ఇంటి పనులన్నీ చెప్పినట్లు చేస్తున్నాడు. నీచస్వభావులూ, మూర్ఖులూ, పశుప్రాయులూ అయిన జనులు భరతుని చిత్తవృత్తిని తెలుసుకోలేక 'ఓరీ పిచ్చివాడా! మొద్దూ! చెవిటివాడా! అని పిలిచేవారు. ఈసడించుకొనేవారు. భరతుడు కూడా అందుకు తగినట్టు వారితో సంభాషిస్తూ తలవంచుకొని వారి ఆజ్ఞమేరకు నడుచుకునేవాడు. వెట్టిచాకిరీ చేసేవాడు. కూలిపని చేసేవాడు. బిచ్చమెత్తేవాడు. ఇలాగా భరతుడు కాలం గడపసాగాడు.

**తే. అతుల మృష్టాన్నమైనఁ గదన్నమైన, నెద్ది వెట్టిన జిహ్వకు హితముగానె**
**తలఁచి భక్షించుఁగా; కొండు దలఁచి మిగులఁ, బ్రీతి సేయఁడు రుచులందుఁబెంపుతోడ. 128**

**ప్రతి :** అతుల= సాటిలేని; మృష్ట+అన్నము+ఐనన్= శుభ్రమైన భోజనమైనా; కదన్నము+ఐనన్= పాసిపోయిన భోజనమైనను; ఎద్ది+పెట్టినన్= ఏది పెట్టినను; జిహ్వకున్= నాలుకకు; హితముగానె తలఁచి= ఇష్టంగా భావించి; భక్షించున్+కాక= తినెడువాడేగాని; ఒండు= వేరొకవిధంగా; తలఁచి= భావించి; మిగులన్= మిక్కిలి; రుచులందున్= షడ్రుచులందలి; పెంపుతోడన్= ఆధిక్యము వలన; ప్రీతి+చేయఁడు= ప్రీతిని ప్రకటించడు.

**తా :** శుభ్రమైన అన్నం పెట్టినా, పాసిపోయిన కూడుపెట్టినా కాదనకుండా ఒకేవిధంగా స్వీకరించేవాడు. అదీ ఇదీ కావాలని రుచులకోసం అర్రులు సాచేవాడు కాదు.

**వ. మఱియు నా విప్రుం డాత్మనిత్యానంద సుఖలాభంబు గలిగి సుఖదుఃఖంబులందు దేహాభిమానంబు సేయక శీతోష్ణ వాత వర్షాతపంబులకు నోడి పై చీరగప్పక వృషభంబునుం బోలెఁ బీనుందును గఠినాంగుండును నగుచు స్థండిలశాయియై రజఃపటలంబునం గప్పంబడిన దివ్యమాణిక్యంబునుం బోలె**

**ననభివ్యక్త బ్రహ్మవర్చసుండై మలినాంబర పరీతకటితటుండు నతి మషీలిప్త యజ్ఞోపవీతుండు నగుటం జేసి యజ్ఞజనంబు లతండు బ్రాహ్మణాభాసుండు మందుండునని పలుక సంచరించుచుండం గర్మమూలంబునం బరులవలన నాహారంబు గొనునపుడు దమవారును వ్యవసాయకర్మంబునందు నియమించిన క్షేత్ర విహిత సమ విషమ న్యూనాధికంబుల నెఱుంగక ప్రవర్తిల్లుచు నూఁక తవుడు తెలికపిండి పొట్టు మాఁడు ద్రబ్బెడ యాదిగాఁ గల ద్రవ్యంబుల యందు నమృతంబు పగిది రుచిసేసి భక్షించుచుం జేని కావలి యుండునెడ నొక్కనాఁడు. 129**

**ప్రతి :** మఱియున్= అంతేకాకుండగా; ఆ విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ఆత్మనిత్య+ఆనంద సుఖలాభంబున్+కలిగి= ఆత్మజ్ఞానమున నెల్లప్పుడు నిశ్చలత్వము చెందిన సుఖంబునే అనుభవించుచు; సుఖదుఃఖంబుల+అందున్= సుఖంపట్ల దుఃఖంపట్ల; దేహ+అభిమానంబు+చేయక= దేహంపట్ల కించిత్తు అభిమానం ప్రదర్శించకుండ; శీత+ఉష్ణ+వాత వర్ష+ఆతపంబులకున్+ఓడి= చలి, వేడి, గాలి, వాన, ఎండలకు జంకి; పైచీరన్+కప్పక= పై పంచెకూడా లేక; వృషభంబునున్+పోలెన్= ఎద్దువలె; పీనుండును= బలిసినవాడును; కఠిన+అంగుండును= కఠినమైన దేహముగలవాడును; అగుచున్= అగుచు; స్థండిలశాయి+ఐ= మట్టి నేలపై పడుకొన్నవాడయి; రజఃపటలంబునన్= ధూళి మొత్తముచే; కప్పన్+పడిన= ఆచ్ఛాదింపబడిన; దివ్యమాణిక్యంబునున్+పోలెన్= శ్రేష్ఠమయిన మాణిక్యమువలె; అనభివ్యక్త బ్రహ్మవర్చసుండు+ఐ= వెలువడనట్టి బ్రహ్మవర్చస్సు కలవాడై; మలిన+అంబర+పరీత కటి తటుండును= మురికియైన వస్త్రము చుట్టుకొనిన మొలభాగము కలవాడును; అతిమషీలిప్తయజ్ఞ+ఉపవీతుండును= ఎక్కువ మసిపట్టిన జందెము కలవాడును; అగుటన్+చేసి= కావడంవలన; అజ్ఞజనంబులు= మూఢజనులు; అతండు= ఆ భరతుండు; బ్రాహ్మణ+ఆభాసుండు= బ్రాహ్మణుడుగా కనిపించినా బ్రాహ్మణుడు కానివాడు; మందుండున్+అని= తెలివి తక్కువవాడని; పలుకన్= వాకొనుచుండగా; సంచరించుచుండన్= సంచరించుచుండగా; కర్మమూలంబునన్= కర్మము కారణంగా; పరులవలనన్= ఇతరులవలన; ఆహారంబున్+కొనునపుడు= తిండిని స్వీకరించేవేళ; తమవారును= తమవారును; వ్యవసాయ కర్మంబు+అందున్= పొలము పనులందు; నియమించినన్= మెలగుమని చెప్పగా; క్షేత్రవిహిత= పొలమునందుగల సమవిషమ= సరియైనవి, సరికానివి; న్యూన+అధికంబులన్= తక్కువ ఎక్కువలను; ఎఱుంగక= తెలియక; ప్రవర్తిల్లుచున్= మెలగుతూ; నూఁకతవుడు= నూకలు, తవుడు; తెలికపిండి= గానుగపిండి; పొట్టు= ఉముక; మాడు= మాడుచెక్కలు; ద్రబ్బెడ= రొట్టె; ఆదిగాన్+కల= మొదలయిన; ద్రవ్యంబుల+అందున్= వస్తువులయందు; అమృతంబు పగిదిన్= అమృతంలాగా; రుచి+చేసి= రుచిగా భావించి; భక్షించుచున్= తింటూ; చేనికావలియుండు+ఎడన్= పొలానికి కావలి కాస్తుండగా; ఒక్కనాఁడు= ఒకనాడు.

**తా :** భరతుడెప్పుడూ ఆత్మానుభూతి పొంది ఆనందంగా ఉండేవాడు. అతనికి సుఖదుఃఖాలు తెలియవు. దేహంపై ఏమాత్రం శ్రద్ధలేదు. చలి, వేడి, గాలి, వాన, ఎండలకు భయపడేవాడు కాదు. ఒంటిమీద బట్ట కప్పుకునేవాడు కాదు. ఆబోతులాగా బలిసి గట్టిపడిన దేహంతో వట్టి కటికనేలపై పడుకొనేవాడు. మట్టి గొట్టుకొన్న మాణిక్యంలాగా ప్రకాశింపని బ్రహ్మవర్చస్సుతో కనిపించేవాడు. ఒక్కొక్కసారి మాసిన బట్టలతో, మలినమైన యజ్ఞోపవీతంతో తిరిగేవాడు. ఒక్కొక్కసారి అతనిని చూచి అజ్ఞానులైనవారు వీడు జన్మానికి బ్రాహ్మణుడుగాని వట్టి పనికిమాలిన మొద్దని అనుకొనేవారు. ఏదయినా పనిచేసి భరతుడు ఇతరులనుండి ఆహారం స్వీకరించేవాడు. అంతేగాని, అయాచితంగా ఏదీ తీసుకునేవాడు కాదు.

ఇదంతా చూచి సవతితల్లి కొడుకులు కొంతకాలం అతనికి పొలం పనులు అప్పజెప్పారు. అయినా ఆ పనులేవీ అతనికి తెలియవు. మంచివా, చెడ్డవా, చిన్నవా, పెద్దవా అనే ఆలోచన లేకుండా చెప్పిన పనులు చేసేవాడు. అతని సోదరులు నూకలు, తవుడు, తెలికపిండి, ఊక, పొట్టు, మాడుచెక్కలు ఏవి పెట్టినా వద్దనకుండా తినేవాడు. వాటిని అమృతంలాగా భావిస్తూ ఆప్యాయంగా భక్షిస్తూ పొలానికి కాపలా కాస్తుండేవాడు.

**విశే :** భరతుడు అమృతత్వానికి అర్హుడయ్యాడని చెప్పవచ్చు. **"సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే".** సుఖదుఃఖాలలో నిర్వికారుడయినప్పుడు మనుజుడు అమృతత్వానికి అర్హుడవుతాడని గీత (2-15). మంచిచెడులు, సుఖదుఃఖాలు విస్మరించుటయే అమృతత్వసిద్ధికి మార్గం!

**శ్లో॥ తుల్యనిందా స్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ ।**
**అనికేతః స్థిరమతిః భక్తిమాన్ మే ప్రియోనరః ॥ - భగవద్గీత - భక్తియోగం**

"ఎవరైనా తిట్టినా, పొగడినా దానిని సమానంగా భావించేవాడూ, మౌనంగా ఎల్లప్పుడూ సంతోషంగా ఉండేవాడు, ఇల్లూవాకిలీ లేకుండా పరివ్రాజకుడుగా సంచరించేవాడు, స్థిరనివాసం లేకపోయినా బుద్ధి భగవద్భావనలో స్థిరీకరించినవాడూ, భక్తిపరుడూ అయిన మానవుడే నాకు ఇష్టమైనవాడు. జడభరతుడు అట్టివాడు.

## a:::వృషల రాజభృత్యులు కాళిబలికి భరతునిఁ గొంపోవుట::: a

**క. పురిలోన వృషలపతి దా, నరుదుగ సంతానకాముఁడై వేడుకతోఁ**
**పురుషుఁడగు పశువుఁగాళికిఁ, దఱుముక కొనిపోవఁబశువు దలఁగిన భృత్యుల్. 130**

**ప్రతి :** పురిలోనన్= పట్టణములోన; వృషలపతి= శూద్రుల నాయకుడు; తాన్= తాను; అరుదుగన్= అపురూపంగా; సంతానకాముఁడు+ఐ= సంతానం కోరినవాడయి; వేడుకతోన్= కుతూహలముతో; పురుషుఁడు+అగు= మనుజుడైన; పశువున్= పశువును; కాళికిన్= కాళికాదేవికోసం (బలిగా); తఱుముక కొనిపోవున్= శీఘ్రముగా తీసుకుపోతుండగా; పశువు= నరరూప బలిపశువు; తలఁగినన్= తప్పించుకొనగా; భృత్యుల్= సేవకులు.

**తా :** భరతుడు కాపలా కాస్తున్న పొలానికి దగ్గర్లో ఒక నగరం ఉంది. ఆ నగరంలోని ఒక శూద్రనాయకునకు పిల్లలు లేరు. అందుచేత ఆయన కాళికాదేవికి నరబలి ఇవ్వడంకోసం ఒక మనుష్యుణ్ణి వెంటబెట్టుకొని పోతున్నాడు. అయితే మార్గమధ్యంలో ఆ బలిపశువు తప్పించుకొని పారిపోయాడు. సేవకులు వానికోసం గాలించారు.

**ఆ. అరసి కానలేక యా రాత్రి వీరాస, నమునఁ జేనికాఁపు విమలబుద్ధి**
**నున్న విప్రయోగి నొయ్యనఁబొడగాంచి, పశువు మంచి దనుచుఁబట్టి రతని. 131**

**ప్రతి :** అరసి= వెదకి వెదకి; కానలేక= కనుగొనలేక; ఆ రాత్రి= ఆ రాత్రివేళ; వీర+ఆసనమునన్= వీరాసనంలో; చేనికాఁపు= పొలానికి కాపలాకాస్తున్న; విమలబుద్ధిన్+ఉన్న= నిర్మల మనస్సుతోనున్న; విప్రయోగిన్= బ్రాహ్మణాకారంతోనున్న యోగిని; ఒయ్యనన్= తిన్నగా; పొడ+కాంచి= దర్శించి; పశువు= నరపశువు; మంచిది+అనుచున్= శ్రేష్ఠమైనదని; అతనిన్= అతనిని; పట్టిరి= బంధించిరి.

**తా :** ఆ రాత్రి ఎంత వెదకినా ఆ వ్యక్తి కనబడలేదు. చేనిలో ఒకచోట వీరాసనం వేసికొని పొలానికి కావలి కాస్తున్న బ్రాహ్మణకుమారుడు భరతుడు భటులకు కన్పించాడు. నరబలికి తగిన పశువు దొరికింది కదా అని భటులు ఆ బ్రాహ్మణయోగిని పట్టుకున్నారు.

**విశే :** వీరాసనమనగా – కుమారసంభవము 3వ సర్గ 45 శ్లో. వ్యాఖ్యయందు మల్లినాథునిచే ఉట్టంకితం.

**శ్లో॥ ఏకపాదమ థైకస్మి న్విన్య స్యోరౌ తు సంస్థితమ్ ।**
**ఇతరస్మిం స్త థై వోరుం వీరాసన ముదాహృతమ్ ॥** – అని.

ఒక తొడమీద రెండవ పాదము నుంచి, మఱియొక తొడక్రింద మరియొక పాదముంచి కూర్చుండుట.

**క. ఆ రీతిని భూసురవరు, నారయ నా కాళికాగృహమునకు భృత్యుల్**
**బోరనఁ గొని చని సల్పిరి, చారుతరాభ్యంజనాది సంస్కారంబుల్. 132**

**ప్రతి :** ఆ రీతినిన్= ఆ ప్రకారంగా; భూసురవరున్= బ్రాహ్మణులలో శ్రేష్ఠుడయిన భరతుని; ఆరయన్= పరిశీలించగా; ఆ కాళికా గృహమునకున్= ఆ కాళికాలయానికి; భృత్యుల్= సేవకులు; బోరనన్= శీఘ్రంగా; కొనిచని= వెంటపెట్టుకొని వెళ్ళి; చారుతర= మనోహరమైన; అభి+అంజన+ఆది= తలంటుట మొదలగు; సంస్కారంబుల్= సంస్కారాలు; సల్పిరి= చేశారు.

**తా :** ఆ సేవకులు ఆ బ్రాహ్మణశ్రేష్ఠుని వెంటనే కాళికాలయమునకు గొని పోయారు. బాగా తలంటిపోశారు.

**వ. ఇట్లభ్యంజనాది కృత్యంబులు దీర్చి నూతన వసనంబు గట్టనిచ్చి గంధ పుష్పాభరణాక్షతాలంకృతునిం జేసి మృష్టాన్నంబులు భుజియింపంబెట్టి ధూపదీప మాల్యలాజకిసలయాంకుర ఫలోపహారాదులు సమర్పించి పంచ మహావాద్య ఘోషంబులతోడ నా పురుషపశువుం గాళికాదేవి సమ్ముఖంబున నాసీనుం గావించి యా వృషలపతి పురుషపశువు రక్తంబున భద్రకాళి సంతోషపెట్టం దలంచి కాళికామంత్రాభిమంత్రితంబు నతికరాళంబు నైన ఖడ్గంబంది నిజాభీష్టసిద్ధికి హింసింపందలంచిన. 133**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; అభి+అంజన+ఆదికృత్యంబులున్+తీర్చి= తలంటిపోయుట మొదలగు స్నానసంబంధి కార్యములను పూర్తిచేసి; నూతనవసనంబు= కొత్త వస్త్రమును; కట్టన్+ఇచ్చి= ధరింపజేసి; గంధపుష్ప+ఆభరణ+అక్షత+అలంకృతునిన్+చేసి= గంధము, పూలు, నగలు, అక్షతలతో అలంకారం గావించి; మృష్ట+అన్నంబులు= శుభ్రమైన భోజనములు; భుజియింపన్+పెట్టి= తినబెట్టి; ధూప దీప మాల్యలాజ కిసలయ+అంకురఫల+ఉపహార+ఆదులు= ధూపం, దీపం, పూలదండలు, పేలాలు, చిగురుటాకులు, మొలకలు, పండ్లు, కానుకలు; సమర్పించి= అమ్మవారికి నివేదనం గావించి; పంచమహావాద్య ఘోషంబులతోడన్= ఐదు రకాలయిన వాద్యఘోషలతో; ఆ పురుషపశువున్= ఆ నరపశువును, కాళికాదేవి సమ్ముఖంబునన్= కాళికాదేవి సమక్షంలో; ఆసీనున్+కావించి= కూర్చోబెట్టి; ఆ వృషలపతి= ఆ శూద్రనాయకుడు; పురుష పశువు రక్తంబునన్= వధకు సిద్ధం చేసిన నరపశువు నెత్తుటితో; భద్రకాళిన్= భద్రకాళిని; సంతోషపెట్టన్+తలంచి= ఆనందింపజేయాలని భావించి; కాళికామంత్ర+అభిమంత్రితంబున్= కాళికామంత్రంతో మంత్రించబడినది; అతికరాళంబున్+ఐన= మిక్కిలి భయంకరమైనది ఐన; ఖడ్గంబు+అంది= కత్తిని గైకొని; నిజ+అభీష్ట సిద్ధికిన్= తన కోరిక నెరవేరడానికోసం; హింసింపన్+తలంచినన్= బలి ఇవ్వాలని భావించగా...

**తా :** ఈ విధంగా భరతుడికి అభ్యంజనస్నానం చేయించి కొత్త బట్టలు కట్టించారు. ఒంటినిండా గంధం పూశారు. మెడనిండా పూలదండలు వేశారు. ఆభరణాలతో అలంకరించారు. అక్షతలు చల్లారు. విందుభోజనం పెట్టారు. అమ్మవారికి ధూపం వేశారు. దీపం వెలిగించారు. పుష్పమాలలు, పేలాలు, చివుళ్ళు, పండ్లు, ఉపహారాలు సమర్పించారు. డప్పులు, డోళ్ళు, తప్పెటలు మోగించారు. బలిపశువును కాళికాదేవికి ఎదురుగా కూర్చోపెట్టారు. శూద్రనాయకుడు నరబలితో వేడిరక్తంతో అమ్మవారిని సంతోషపెట్ట తలచాడు. కాళికామంత్రంతో అభిమంత్రించి భయంకరమయిన కత్తి పట్టుకొని తన కోరిక నెరవేరడంకోసం భరతుణ్ణి నరికి బలి ఇవ్వడానికి సిద్ధమయ్యాడు.

**విశే :** పంచమహావాద్యములు - భేరీ శంఖ కాహళ పటహ జయఘంటలు.

**సీ.** **సర్వభూతములకు సఖుఁడును బ్రహ్మభూతాత్ముఁడు నిర్వైరుఁడయిన బ్రహ్మ**
**సుతుని తేజంబంతఁజూడ దుస్సహమైన భయమంది వడఁకుచు భద్రకాళి**
**క్రోధంబు ముమ్మడి గొనఁగ హుంకారంబు సలుపుచు నట్టహాసంబు సేసి**
**పాపాత్ములును దౌష్ట్యపరులును రాజసతామసకర్మసంధాను లగుచు**

**తే.** **విప్రవరు నట్లు హింసించు వృషలపతిని, భృత్యవర్గంబుతోఁదలల్ పృథ్విఁగూల్చి**
**యపుడు వృషలాధిపుని శిరమంది లీలఁ, బాడి యాడుచు నందంద క్రీడ సలిపె.** **134**

**ప్రతి :** సర్వభూతములకున్= సమస్త ప్రాణులకు; సఖుఁడును= మేలు కోరువాడును; బ్రహ్మభూత+ఆత్ముఁడున్= పరబ్రహ్మగా మారిన జీవప్రజ్ఞ కలవాడును; నిర్+వైరుఁడు+అయిన= ఎవ్వరితోను విరోధం లేనివాడును అగు; బ్రహ్మసుతునిన్= బ్రాహ్మణ కుమారుని; తేజంబు= ప్రకాశం; అంతన్= అంతట; చూడన్= దర్శింప; దుస్సహము+ఐనన్= భరింపరానిదికాగా; భయము+అంది= భయపడి; వడఁకుచున్= వణకుతూ; భద్రకాళి= భద్రకాళికాదేవి; క్రోధంబు= కోపము; ముమ్మడి+ కొనఁగన్= మూడు రెట్లుకాగా; హుంకారంబున్+సలుపుచున్= హుంకారం చేస్తూ; అట్టహాసంబున్+చేసి= బిగ్గరగా వికృతంగా నవ్వి; పాప+ఆత్ములును= పాప హృదయులును; దౌష్ట్యపరులును= దుష్టులును; రాజస తామస కర్మసంధానులు+అగుచున్= రజోగుణ, తమోగుణ ప్రధానములైన కర్మలనుసరించువారు అవుతూ; విప్రవరున్+అట్లు= బ్రాహ్మణశ్రేష్ఠుని ఆవిధంగా; హింసించు= హింసించే; వృషలపతినిన్= కాపునాయకుని; భృత్యవర్గంబుతోన్= సేవకుల సమూహంతో; తలల్= వారి శిరస్సులను; పృథ్విన్= నేలపై; కూల్చి= పడవేసి; అపుడు= ఆ సమయంలో; వృషల+ అధిపునిశిరము+అంది= ఆ కాపునాయకుని తలను పట్టుకొని; లీలన్= విలాసంతోను; పాడి+ఆడుచున్= పాడుతూ ఆడుతూ; అందున్+అందున్= ఆ చోటనే; క్రీడన్+ సలిపెన్= స్వేచ్ఛావిహారం చేసింది.

**తా :** భరతు డే మాత్రం తొణకలేదు. బెదరలేదు. అతడు పరబ్రహ్మ స్వరూపుడు. సర్వజీవరాసులకు మిత్రుడయినవాడు. ఎవరిపట్ల కూడా వైరభావం లేనివాడు. అటువంటి బ్రాహ్మణోత్తముడైన భరతుని తేజస్సు చూడలేక కాళికాదేవి భయపడింది. వెంటనే కాళికాదేవి ముప్పిరిగొన్న క్రోధంతో కంపించిపోతూ హుంకారంతో వికటాట్టహాసం చేసింది. పాపాత్ముడూ, దౌష్ట్యానికి తలపడినవాడూ, రజోగుణ తమోగుణాల ప్రేరణలతో బ్రాహ్మణహింసకు పూనుకొన్నవాడూ అయిన ఆ బోయరాజు మీద అతని పరిచారకుల మీదా విజృంభించింది. వారి శిరస్సులు నేలకూల్చింది. నాయకుడైన భిల్లరాజు శిరస్సును చేతపట్టుకొని ఆడుతూ పాడుతూ ఆనందతాండవం చేసింది.

**క. ధరలోన నెవ్వరేనియు, ధరణీసురవరుల కెగ్గు దగఁ దలఁచిన వా**
**రరయఁగఁ జెడుదురు, నిక్కము, హరి ధరణీసురవరేణ్యులం దుండుటచేన్. 135**

**ప్రతి :** ధరలోనన్= లోకంలో; ఎవ్వరు+ఏనియున్= ఎవ్వరయినా; ధరణీసురవరులకున్= పుడమిలో భూదేవతలైన బ్రాహ్మణులకు కీడు; ఎగ్గు= నష్టాన్ని; తగన్= తగినట్లు; తలఁచినన్= అనుకొంటే; వారు= అలాంటి మనస్తత్వం గలవారు; అరయన్+కన్= విచారించగా; చెడుదురు= చెడిపోతారు; నిక్కము= ఇది సత్యం; హరి= శ్రీమహావిష్ణువు; ధరణీసురవరేణ్యులందున్= భూదేవతలగు బ్రాహ్మణ శ్రేష్ఠులలో; ఉండుటచేన్= ఉండడంవలన.

**తా :** బ్రాహ్మణోత్తములలో అంతర్యామిగా విష్ణువు ఉంటాడు. కనుక లోకంలో ఎవరయినా సరే బ్రాహ్మణోత్తములకు అపకారం తలపెడితే వారు తప్పక చెడిపోతారు.

**వ. మఱియును. 136**

**ప్రతి :** మఱియును= ఇంకనూ.

**తా :** ఇంకనూ

**ఉ. అచ్చట విప్రసూనుఁడు భయం బొకయించుక లేక చంపఁగా**
**వచ్చిన వారియందుఁ గరవాలమునందును గాళియందుఁ దా**
**నచ్చుతుభావ ముంచి హృదయంబునఁ బద్మదళాక్షు నెంతయున్**
**మచ్చికతోడ నిల్పి యనుమానము నొందక యుండె నత్తఱిన్. 137**

**ప్రతి :** అచ్చటన్= ఆ కాళికాలయంలో; ఆ+తఱిన్= ఆవేళ; విప్రసూనుఁడు= బ్రాహ్మణ కుమారుడు; భయంబు+ఒక ఇంచుకలేక= ఏమాత్రం భయంలేక; చంపన్+కాన్= సంహరించడానికై; వచ్చినవారి+అందున్= ఎగబడినవారిపట్లను; కరవాలమునందును= కత్తిపట్లను; కాళి+అందున్= కాళికాదేవిపట్లను; తాన్= తాను; అచ్చుతుభావమున్+ఉంచి= హరిభావమును నిలిపి; హృదయంబునన్= ఎదలో; పద్మదళ+అక్షున్= తామరరేకులవంటి కన్నులుగల శ్రీహరిని; ఎంతయున్= మిక్కిలి; మచ్చికతోడన్= స్నేహముతో; చనవుతో నిల్పి= నిమగ్నంచేసి; అనుమానమున్= సందేహమును; ఒందక+ఉండెన్= పొందకయుండెను.

**తా :** జడభరతుడు ఏమాత్రమూ భయపడక తనను చంపడానికి వచ్చిన వారిని, వారి చేతుల్లో తళతళ మెరిసే కత్తులనూ, మహాభీకరమైన కాళికను, విష్ణుస్వరూపులుగా భావించి, గుండెలో అచ్యుతుడైన విష్ణువును పదిలపరచి, ఎటువంటి అనుమానమూ లేక నిశ్చింతగా ఉండిపోయాడు.

**విశే :** 'అచ్యుత' శబ్దమునకు తెలుగులో అచ్చుతుడు అనుట కలదు.

**వ. మఱియు నా విప్రవరుండు చండికాగృహంబు వెలువడి క్రమ్మఱం జని కావలి యుండు నెడ. 138**

**ప్రతి :** మఱియున్= ఆపై; ఆ విప్రవరుండు= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు; చండికా గృహంబున్= కాళికాలయం; వెలువడి= వదలిపెట్టి; క్రమ్మఱన్= మరల; చని= వెళ్ళి; కావలి+ఉండు+ఎడన్= పొలందగ్గర కావలి కాస్తుండగా...

**తా :** ఆ తర్వాత ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు కాళికాలయాన్ని వదలి మళ్లీ కావలిగా ఉండగా

**సీ.** **అంతటఁగొన్ని హాయనములు సన సింధుభూపాలనము సేయు భూవరుండు**
**ధీరత నిక్షుమతీతీరమున నున్న కపిలమహామునిఁగాంచి తత్త్వ**
**విజ్ఞాన మెఱిఁగెడు వేడ్క తోడుత శిబికారోహణము సేసి యరుగుచుండ**
**నాలోన నా శిబికావహు లా చేనఁ గాఁపున్న విప్రునిఁగాంచి తెచ్చి**

**తే.** **శిబిక మోపింత మీతని చేత ననుచుఁ, బట్టి మూఁపునఁబల్లకిఁబెట్టి మోవు**
**మనుచు మోపించునంత ధరామరుండు, శిబిక మూఁపున నిడి యందుఁజింత లేక. 139**

**ప్రతి :** అంతటన్= ఆపైన; కొన్ని హాయనములు+చనన్= కొన్ని సంవత్సరములు గడువగా; సింధుభూపాలనము+చేయు= సింధు దేశాన్ని పాలించే; భూవరుండు= రాజు; ధీరతన్= ధైర్యంతో; ఇక్షుమతీతీరమునన్+ఉన్న= ఇక్షుమతి అనే నదీ తీరంలోగల; కపిలమహామునిన్= మహాముని అయిన కపిలుని; కాంచి= దర్శించి; తత్త్వవిజ్ఞానము+ఎఱిఁగెడు వేడ్క తోడుతన్= తాత్త్విక విజ్ఞాన రహస్యాలను తెలుసుకోవాలనే కోరికతో; శిబికా+ఆరోహణము+చేసి+అరుగుచున్+ఉండన్= పల్లకి ఎక్కి వెళుతుండగా; ఆ లోనన్= ఆ సమయమందు; ఆ శిబికావహులు= ఆ పల్లకి మోసేవారు; ఆచేనన్= ఆ పొలంలో; కాపున్న= కావలి కాస్తున్న; విప్రునిన్+కాంచి= బాపణ్ణిచూచి; తెచ్చి= వెంటబెట్టుకొని వచ్చి; ఈతనిచేతన్= ఈతనిచేత; శిబికమోపింతము+అనుచున్= పల్లకి మోయించుదము అంటూ; పట్టి= గట్టిగా అతనినిపట్టి; మూపునన్= భుజాలమీద; పల్లకిన్+పెట్టి= పల్లకిని పెట్టి; మోవుము+అనుచున్= మోయవయ్యా అనుచు; మోపించు+అంతన్= మోపిస్తుండగా; ధరా+అమరుండు= పుడమియందలి వేలుపు అనగా బ్రాహ్మణుడు; శిబికన్= పల్లకిని; మూఁపునన్+ఇడి= భుజాలమీద ఉంచి; అందున్= ఆ భారవాహకత్వంలో; చింతలేక= ఏమాత్రం ధ్యాసలేక...

**తా :** ఇలా కొన్ని సంవత్సరాలు గడచిపోయాయి. ఒకసారి సింధుదేశాన్ని పరిపాలించే రహూగణుడనే రాజుకు అధ్యాత్మ విద్య తెలుసుకోవాలని బుద్ధి పుట్టింది. అందువల్ల ఇక్షుమతీ నదీతీరంలోని కపిలమహామునిని దర్శించడానికి పల్లకి ఎక్కి బయలుదేరాడు. పల్లకిమోసే బోయీలు పొలానికి కావలి ఉన్న భరతుణ్ణి చూశారు. పల్లకీ మోయడానికి వీడు చాల బలంగా ఉన్నాడు అనుకున్నారు. భరతుని తీసుకువచ్చి ఒకవైపు పల్లకి బొంగును అతని భుజంమీద పెట్టారు. అయినా భరతుడు ఎదురు చెప్పకుండా చీకూ చింతా లేకుండా మోస్తున్నాడు.

**క.** **తన మనసు కొలఁది నప్పుడు, మునుకొని య ట్లప్రయత్నమున నడవఁగ నా**
**జనపతి నిమ్నోన్నతమై, చనుట యెఱిఁగి శిబిక మోయు జనులకు ననియెన్. 140**

**ప్రతి :** తనమనసు కొలఁది= తన మనసుకు తోచినట్టుగా; అప్పుడు= ఆ పల్లకి మోసేవేళ; మునుకొని= ముందుపడి; అట్లు+అప్రయత్నమునన్= మామూలు ప్రకారం; నడవన్+కాన్= నడవగా; ఆ జనపతి= ఆ రాజు; నిమ్న+ఉన్నతము+ఐ+ చనుట+ఎఱిఁగి= ఎగుడుదిగుడుగా పల్లకి కదలడం గుర్తించి; శిబికన్= పల్లకిని; మోయు= మోసే; జనులకున్= జనులతో, వాహకులతో; అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** అలవాటులేని భరతుడు మనసుకు తోచినట్టు మామూలు ప్రకారం నడుస్తున్నాడు. అందువల్ల తక్కిన బోయీల నడకతో అతని నడక జతపడలేదు. పల్లకి సరైన పద్ధతిలో సాగడంలేదు. పల్లకి ఎగుడుదిగుడుగా ఊగుతుంటే రాజు బోయీలను చూచి ఇలా అన్నాడు.

**ఆ. మీర లిప్పు డిచటఁ జేరి మిక్కిలి ప్రయ, త్నంబుతోడఁదగిలి నడుచుచుండ**
**విషమ మగుచు గమనవేగంబు నను బాధఁ, బెట్టుచున్న దనిన బెస్త లనిరి. 141**

**ప్రతి :** మీరలు= సహజరీతిలో పల్లకిమోసే బోయీలయిన మీరు; ఇప్పుడు+ఇచటన్+చేరి= ఇపుడు శ్రమతో ఈ ప్రదేశం చేరుకొని; మిక్కిలి ప్రయత్నంబు తోడన్= ఎంతో ప్రయత్నంతో; తగిలి= ఆసక్తి కలిగి; నడచుచున్+ఉండన్= మోస్తుండగా; విషమము+అగుచున్= సరికానిదగుచు, ఎగుడు దిగుడగుచు; గమనవేగంబునను= కదలివెళ్ళే వేగంవల్ల; బాధపెట్టుచున్నది= బాధ కలిగిస్తున్నది; అనినన్= అనగా; బెస్తలు= బోయీలు; అనిరి= ఈ విధంగా చెప్పారు.

**తా :** మీరేమో ఎంతో శ్రమ తీసుకొని పల్లకి మోస్తున్నారు. కాని, మీ నడకలలో కుదురు కనిపించడం లేదు. మీ ఎగుడు దిగుడు నడకలవల్ల కుదుపు ఎక్కువై నాకు బాధగా ఉన్నది అని అనగానే బోయీలు రాజుగారికి ఇలా సమాధానమిచ్చారు.

**వ. దేవా! యీ విషమగమనంబు మావలన నైనది గా; దీ తురీయవాహకుండు సుఖగమనంబుగా నడువ నేరండు; వీనితోడ మేమును నడువనేర మనిన రహూగణుండను నా రా జుపాసితవృద్ధజనుండైనను బలాత్కారంబునం బుట్టిన కోపంబునం గోపించి విమర్శ దప్పి నీఱు గప్పిన నిప్పునుం బోలె నెఱుంగ రాని బ్రహ్మతేజంబు గల బ్రాహ్మణునికిం గంటకంబుగా నిష్ఠురవాక్యంబుల నిట్లనియె. 142**

**ప్రతి :** దేవా!= ప్రభూ!; ఈ విషమగమనంబు= ఈ సరిలేని నడక; మావలనన్ ఐనదికాదు= మా నడకలవలన కలిగినది కాదు; ఈ తురీయవాహకుండు= పల్లకిమోసే ఈ నాలుగవవాడు; సుఖగమనంబు+కాన్= సుఖంగా కుదుపులేకుండా; నడవన్+నేరండు= నడవలేకపోతున్నాడు; వీనితోడన్= ఇటువంటి వానితో; మేమును= మేముకూడా; నడువన్+నేరము+ అనినన్= నడవలేకపోతున్నాము అనగా; రహూగణుండు+అను+ఆరాజు= రహూగణుడనే పేరుగల ఆ రాజు; ఉపాసిత వృద్ధజనుండు+ఐనను= పెద్దలను కొలుచువాడైనను; బలాత్కారంబునన్= బలవంతంగా; పుట్టిన= జనించిన; కోపంబునన్= కోపంతో; కోపించి= ఆగ్రహించి; విమర్శ+తప్పి= ఇది యుక్తము అయుక్తము అనుటను వదలిపెట్టి; నీఱు+కప్పిన= బూడిదకప్పిన; నిప్పునున్+పోలెన్= నిప్పులాగా; ఎఱుంగన్+రాని= తెలుసుకోవడానికి సాధ్యపడని; బ్రహ్మతేజంబు+కల= బ్రహ్మ తేజస్సుగల్గిన; బ్రాహ్మణునికిన్= బ్రాహ్మణునితో; కంటకంబుగాన్= ముల్లులాగా; నిష్ఠురవాక్యంబులన్= కఠినమైన పలుకులతో; ఇట్లు+అనియెన్= ఇలా గద్దించాడు.

**తా :** మహాప్రభూ! ఈ ఎగుడుదిగుడు నడక మాది కాదు. ఈ నాల్గవ బోయవాడు సరిగా నడవడం లేదు. వీనితోపాటు మేము సరిగా నడవలేకున్నాం అన్నారు. ఆ మాటలు వినగానే సింధురాజయిన రహూగణునికి ఉన్నట్టుండి కోపం కట్టలు తెంచుకొని ప్రవహించింది. అతడు మంచివాడే. పెద్దలను సేవించినవాడే. అయినా కోపాన్ని దిగమింగుకోలేకపోయాడు. నివురుగప్పిన నిప్పులాగా కనిపించని బ్రహ్మతేజస్సుతో ఉన్న బ్రాహ్మణుని చూచి పరుషవాక్కులతో ఇలా గద్దించాడు.

**చ. అలసితి, వెంతయున్ ముసలి, వాఁకట దస్సితి, వెన్ను మిక్కిలిం**
**బలుచన యున్న దీ శిబిక భారము; దూరము మోసి తేగతిన్**

**నిలిచెద? వంచు భూవరుఁడు నిష్ఠురముల్ దగఁబల్క నా యెడం**
**బలుకక మోసె నా శిబిక బ్రాహ్మణవర్యుఁడు పార్థివేశ్వరా! 143**

**ప్రతి :** పార్థివ+ఈశ్వరా= ఓ రాజా!; అలసితివి= బాగా అలసిపోయావు; ఎంతయున్ ముసలివి= ఎంతో ముసలివాడవు; ఆఁకటన్= ఆకలితో; డస్సితి= బడలి ఉన్నావు; వెన్ను= వీపేమో (వెన్నెముక); మిక్కిలిన్= చాలా; పలుచనయున్నది= పలుచగా ఉన్నది; ఈ శిబిక భారమున్= ఈ పల్లకీ బరువును; దూరము= చాలదూరము; మోసితి= మోశావు; ఏ గతిన్ నిలిచెదవు= ఏలానిలబడగలుగుతున్నావో; అంచున్= అనుచు; భూవరుఁడు= రాజు; నిష్ఠురముల్+తగన్+పల్కన్= ఎత్తిపొడుపుగా మాటలాడగా; ఆ+ఎడన్= ఆ సమయాన; ఆ శిబికన్= ఆ పల్లకిని; పలుకక= మాటలాడకుండా; బ్రాహ్మణవర్యుఁడు= బ్రాహ్మణులలో శ్రేష్ఠుడు; మోసెన్= మోశాడు.

**తా :** పరీక్షిన్మహారాజా! ఆ రాజు బ్రాహ్మణునితో ఓయీ! నీవు బాగా అలసిపోయావు. పైగా ముసలివాడివి. పాపం ఆకలితో నకనకలాడుతున్నావు. నీ వెన్నెముక చాలా పలుచగా ఉంది. ఈ పల్లకి ఏమో బరువయింది. ఎంతో దూరం మోశావు. ఎలా నిలబడగలుగుతున్నావో అని ఎత్తిపొడుపుగా మాట్లాడినా బ్రాహ్మణకుమారుడు భరతుడు ఏమీ బదులాడకుండా పల్లకిని అలా మోస్తూనే ఉన్నాడు.

**వ. అప్పు డావిప్రవరుండు దనకుం గడపటిదియగు కళేబరంబునందు నహంకార మమకారంబులం బొరయక మిథ్యాజ్ఞానరహితుండై బ్రహ్మభూతుండై మౌనవ్రతంబున నా శిబిక మోయుచున్న విషమగమనంబుఁ జూచి యతికుపితుండగుచు నా భూవరుండు వెండియు నిట్లనియె. 144**

**ప్రతి :** అప్పుడు= ఆ సమయంలో; ఆ విప్రవరుండు+తనకున్= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు తనకు; కడపటిది+అగు కళేబరము+అందున్= చివరిదయిన దేహంబునందు; అహంకార మమకారంబులన్+పొరయక= నేను అనే గర్వము; నాది అనే భావాలను పొందక; మిథ్యాజ్ఞానరహితుండు+ఐ= భ్రాంతి వదలిపెట్టినవాడయి; బ్రహ్మభూతుండు+ఐ= పరబ్రహ్మ స్వరూపుడై; మౌనవ్రతంబునన్= ఏమియు పలుకకుండుట అను వ్రతాన్ని పాటిస్తూ; ఆశిబికన్= ఆ పల్లకిని; మోయుచున్నన్= మోస్తుండగా; విషమగమనంబున్+చూచి= సక్రమమైన నడకతో సాగకుండుటను కనుగొని; అతికుపితుండు+అగుచున్= మిక్కిలి కోపముగొన్న వాడవుతూ; ఆ భూవరుండు= ఆ రాజు; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** భరతునికి ఇదే తన కడపటి జన్మమని తెలుసు. అందువలన అహంకారమమకారాలకు మనసులో అవకాశం ఇవ్వలేదు. పైగా అతడు జ్ఞాని. పరబ్రహ్మస్వరూపుడు. అందుచేత ఏమీ ఎదురుచెప్పక మౌనంగా పల్లకిని మోస్తూనే ఉన్నాడు. పల్లకి యథాతథంగా ఎగుడుదిగుడుగా సాగుతూ ఉంటే రహూగణుడు పిచ్చికోపంతో ఇలా అరిచాడు.

**సీ. ఓరి దుర్మద! విన రోరి జీవన్మృత! నా యాజ్ఞఁదప్పించి నడిచె దీవు,**
**ఈ వక్రమార్గంబు లిన్నియు విడిపించి నడపింతు నిన్ను సన్మార్గమందు**
**నని రాజగర్వాంధుఁ డగుచు గుణత్రయంబున వృద్ధిఁబొందిన భూవరుం డ**
**బద్ధ ప్రలాపముల్ పల్కు చుండినఁజూచి శమదమాదులచేఁబ్రశస్తుఁ డగుచు**

తే. జగతి బ్రహ్మస్వరూపమై సకల భూత, ములకు నత్యంతహితుఁడైన భూసురుండు
యోగివర్తన దెలియ లేకున్న రాజు, నంత వీక్షించి యల్ల ని ట్లనుచుఁబలికె. **145**

**ప్రతి :** ఓరి దుర్మద= ఓరి పొగరుపోతా!; వినర+ఓరి జీవత్+మృత= వినర ఓరి నడపీనుగా!; నా+ఆజ్ఞన్= నా ఆదేశాన్ని; తప్పించి= పాటించకుండా; నడిచెదవు+ఈవు= ప్రవర్తిస్తున్నావు; ఈ వక్రమార్గంబులు+ఇన్నియున్= నీ కుంటినడకలు అన్నింటిని; విడిపించి= వదలించి; నిన్నున్= నిన్ను; సన్మార్గము+అందున్= మంచిదారిలో; నడపింతున్= నడిపిస్తాను; అని= అంటూ; రాజగర్వ+అంధుండు+అగుచున్= రాజుననే గర్వం కారణంగా గ్రుడ్డివాడవుతూ; గుణత్రయంబునన్= గుణములలో మూడవదయిన తమోగుణంతో; వృద్ధిన్+పొందిన= చెలరేగిన; భూవరుండు= రాజు; అబద్ధప్రలాపముల్= కారుకూతలు; పల్కుచుండినన్+చూచి= పలుకగా చూచి; శమదమ+ఆదులచేన్= శమము, దమము మున్నగు గుణములచే; ప్రశస్తుఁడు+అగుచున్= ప్రఖ్యాతి గడించిన వాడగుచు; జగతిన్= లోకంలో; బ్రహ్మస్వరూపము+ఐ= బ్రహ్మ స్వరూపుడయి; సకల భూతములకున్= సమస్త జీవరాసులకు; అతి+అంతహితుఁడు+ఐన= మిక్కిలి హితం కోరేవాడయిన; భూసురుండు= బ్రాహ్మణుడు; యోగివర్తన+తెలియలేకున్న= యోగుల స్వభావం బొత్తిగా తెలియలేని; రాజున్= భూపతిని; అంతన్= అంతట; వీక్షించి= చూచి; అల్లన్+ఇట్లు+అనుచున్+పలికెన్= మెల్లగా ఇలా అన్నాడు.

**తా :** ఓరీ పొగరుబోతా! నడపీనుగా! నేను చెప్పింది అసలు వినిపించుకోకుండా నడుస్తున్నావు. నీ కుంటినడకలను వదిలించి సరి అయిన మార్గంలో నిన్ను నడిపిస్తాను అని అధికారమదంతో తమోగుణ ప్రకోపంతో కారుకూతలు కూశాడు రాజు. అపుడు శమదమాది గుణసంపన్నుడూ, బ్రహ్మస్వరూపుడూ, సమస్త జీవరాసుల హితంకోరేవాడూ అయిన ఆ బ్రాహ్మణుడు యోగులస్వభావం బొత్తిగా తెలియని ఆ రాజును చూచి ఇలా అన్నాడు.

## a:::భరతుండు రహూగణుని మాటలకుఁ బ్రత్యుత్తరంబు లిచ్చుట::: a

**వ. నరేంద్రా! నీవు సెప్పినది సత్యంబు; భారం బీ శరీరంబునకే కాని నాకుం గలుగనేర; దైనను స్థౌల్యకార్శ్యంబులు వ్యాధులు నాధులు క్షుత్తృష్ణలు నిచ్ఛావిరోధభయంబులు జరామరణంబులు రోషనిద్రా జాగరణంబులు నహంకార మమకార మదశోషణాదులును దేహంబు తోడన జనియించుంగాని నాకుం గలుగనేరవు; జీవన్మృతుండ నేన కా దాద్యంతంబులు గలుగుటం జేసి యందఱియందును గలిగియుండు; స్వామిభృత్య సంబంధంబులు విధికృతంబు లగుచు వ్యవహారంబులం జేసి శరీరంబులకుం గలుగుంగాని జీవునికి లేక యుండు; నదియునుం గాక రాజాభిమానంబున నీవు నన్నాజ్ఞాపించెద వేనియుం బ్రమత్తుండవైన నీకుం బూర్వస్వభావం బెట్లుండె నట్లుగాక యే నేమి సేయుదు? నెఱింగింపు; మున్మత్తమూకాంధ జడులుంబోలె సహజ స్వభావంబునుం బొందిన నా యందు నీ శిక్షయేమి లాభంబుఁ బొందింప నేర్చు? నదియునుంగాక స్తబ్ధుండు మత్తుండునైన నాకు నీ శిక్ష వ్యర్థంబగు నని పలికి యుపశమ శీలుండైన మునివరుండు పూర్వకర్మ శేషంబునం గల్గు భారవాహకత్వంబుం దలంగం ద్రోయుటకు భారంబు వహించి శిబిక మోచుచుం జనునెడ నా రాజవల్లభుండు దత్త్వజ్ఞానాపేక్షితుండై చనియెడి వాఁడగుటం దన హృదయ గ్రంథి విమోచకంబులును బహుయోగగ్రంథ సమ్మతంబులును నగు బ్రాహ్మణవాక్యంబులను విని యా శిబిక దిగ్గన డిగ్గ నుఱికి యా విప్రునికి సాష్టాంగదండప్రణామంబు లాచరించి సర్వగర్వవర్జితుండై ముకుళితహస్తుండగుచు నిట్లనియె. 146**

**ప్రతి :** నరేంద్రా!= ఓ రాజా!; నీవు+చెప్పినది= నీవు చెప్పినమాట; సత్యంబు= నిజము; భారంబు= బరువు; ఈ శరీరంబునకే కాని= ఈ దేహనికే గాని; నాకున్+కలుగనేరదు= నాకేమాత్రం కలుగజాలదు; ఐననున్= ఐనప్పటికిని; స్థౌల్య కార్శ్యంబులు= బలియడం, చిక్కిపోవడం; వ్యాధులున్+ఆధులు= శరీరానికీ, మనసుకూ సంబంధించిన జబ్బులు; క్షుత్తృష్ణలు= ఆకలిదప్పులు; ఇచ్ఛావిరోధభయంబులు= ఇష్టపడడం, ద్వేషించడం, భయపడడం, జరామరణంబులు వార్ధక్యం, మరణాలు; రోషనిద్రాజాగరణంబులు= రోషం, నిద్ర, మెలకువలు; అహంకారమమకార మదశోషణ+ఆదులును= నేననేభావం, నాదనే భావం, మదం వీడిపోవుట మున్నగునవి; దేహంబుతోడన జనియించున్+కాని= దేహంతోనే పుడతాయి తప్పు; నాకున్= ఆత్మస్వరూపుడనైన నాకు; కలుగన్+నేరవు= ఏర్పడవు (నాకులేవు); జీవత్+మృతుండన్+ఏన+కాదు= బ్రతికి చచ్చినవాడను నేను మాత్రము కాదు; ఆది+అంతంబులున్= (మొదలు, చివర) జననమరణాదులు, కలుగుటన్+చేసి= కలుగుటవలన; అందఱి+అందును= అందరిలోను; కలిగియుండున్= జీవన్మృత భావము అందరికీ సహజమే; స్వామిభృత్య సంబంధములు= యజమానుడు, సేవకుడనే అనుబంధాలు; విధికృతంబులు+అగుచున్= దైవ నిర్దిష్టములై; వ్యవహారంబులన్+చేసి= లోకమున పెట్టుకొను సంబంధములవల్ల; శరీరంబులకున్+కలుగున్+కాని= భౌతిక శరీరానికి సంభవించును గాని; జీవునికిన్= జీవునకు; లేక+ఉండును= ఉండవు; అదియునున్+కాక= అంతమాత్రముగాక; రాజ+అభిమానంబునన్= నేను రాజును అనే అభిమానం కారణంగా; నీవు= అధికారమదంతో నీవు; నన్నున్= నన్ను; ఆజ్ఞాపించెదవు+ఏనియున్= ఆజ్ఞాపించదలచుకొంటే; ప్రమత్తుండవు+ఐన= (అధికార మదంచేత మత్తుండవైన) పొర కమ్మినవాడవయిన; నీకున్= నీకు; పూర్వస్వభావంబు+ఎట్లు+ఉండెన్+అట్లుగాక= పుట్టుకతోవచ్చిన స్వభావం ఏలా ఉండెనో అట్లే ఉన్నది; ఏను+ఏమి+చేయుదున్= నేనేమి చేయగలను?; ఎఱింగింపుము= తెలియజేయుము; ఉన్మత్త+మూక+ అంధజడులున్+పోలెన్= పిచ్చివాడు, మూగవాడు, గుడ్డివాడు, జడత్వము కలిగినవానివలె; సహజస్వభావంబునున్+పొందిన= నైసర్గిక స్వభావంతో వర్తించే; నా+అందున్= నాపట్ల; నీ శిక్ష= నీవు విధించే దండన; ఏమి లాభంబున్+పొందింపన్+నేర్చున్= ఏలాంటి ప్రయోజనాన్ని సాధించగలుగుతుంది?; అదియునున్+కాక= అంతమాత్రమేగాక; స్తబ్ధుండు= జడుదును, చలనం లేనివాడు; మత్తుండును+ఐన= మత్తస్వభావం కలవాడయిన; నాకున్= నాకు; నీ శిక్ష= నీవు విధించే దండన; వ్యర్థంబు+అగున్= రిత్తవోతుంది; అనిపలికి= అని సమాధానమిచ్చి; ఉపశమశీలుండు+ఐన= శాంతస్వభావుడయిన; మునివరుండు= మునులలో శ్రేష్ఠుడయినవాడు; పూర్వకర్మ శేషంబునన్+కల్గు= పూర్వజన్మలో చేసిన కర్మలశేషంవల్ల అనుభవించవలసిన; భారవాహకత్వంబున్= బరువుమోయడమనే పనిని; తలంగన్= పోవునట్లుగా; త్రోయుటకున్= తొలగద్రోయడానికి; భారంబువహియించి= బరువును భరించి; శిబికన్= పల్లకిని; మోచుచున్= మోయుచు; చను+ఎడన్= వెళ్ళే సమయంలో; ఆ రాజవల్లభుండు= రాజులలో సర్వశ్రేష్ఠుడయిన రహూగణుడు; తత్త్వజ్ఞాన+అపేక్షితుండు+ఐ= తత్త్వాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాస కలవాడయి; చనియెడివాఁడు+అగుటన్= వెళ్ళేవాడగుట వలన; తన హృదయగ్రంథి విమోచకంబులును= తనయొక్క ఎదముడి అను అహంకారాన్ని విడదీయునవి (విముక్తం చేసేవి); బహుగ్రంథ సమ్మతంబులును+అగు= ప్రామాణికమయిన గ్రంథాంశాలకు సమ్మతమయిన, బ్రాహ్మణ వాక్యంబులను= విప్రవాక్యములను; విని= ఆలకించి; ఆ శిబికన్= ఆ పల్లకినుండి; దిగ్గనన్= గభాలున; డిగ్గన్+ఉఱికి= నేలకు దూకి; ఆ విప్రునికిన్= ఆ బ్రాహ్మణునికి; స+అష్ట+అంగదండప్రణామంబులు+ ఆచరించి= ఎనిమిది అవయవాలు నేల తాకునట్లు నమస్కారాలు చేసి అత్యంత; సర్వగర్వ వర్జితుండు+ఐ= తనకుగల అన్నిరకాలయిన అహంకారాలను విడిచినవాడై; ముకుళిత హస్తుండు+అగుచున్= జోడించిన చేతులు కలవాడగుచు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** ఓ రాజా! నీవు చెప్పింది ముమ్మాటికి నిజం. బరువు శరీరానికే గాని నాకేమాత్రం కాదు. మనిషి బలిసిపోవడం చిక్కిపోవడం, శరీరానికి మనసుకూ సంబంధించిన జబ్బులు, ఆకలిదప్పులూ, ఇష్టపడడం, ద్వేషించడం, భయపడడం, వార్ధకం, మరణం, రోషం, నిద్ర, మెలకువ, అహంకారమమకారాలు, మదం, శుష్కించడం దేహంతో పుడతాయి. కాని, నాకు లేవు. జీవన్మృతుడను నేను మాత్రము కాదు. జననమరణాలు కలిగి ఉన్న వారందరూ జీవన్మృతులే. యజమానుడు సేవకుడు అనే సంబంధం కర్మవల్ల కలిగినది కనుక అది శరీరానికి గాని జీవునికి సంబంధించినది కాదు. "నేను రాజును కదా" అనే అభిమానంతో నీవు నన్ను ఆజ్ఞాపించావు. అంటే నీవు మదోన్మత్తుడవై ఉన్నావన్నమాట. అది నీ స్వభావం గాని మరేంకాదు. అందుకు నేనేం చేయగలను? పిచ్చివాడూ, మూగవాడూ, గుడ్డివాడూ, తెలివిలేనివాడూ ఎంతో నేనూ అంతే. అందుచేత నన్ను శిక్షించడంలో నీకు కలిగే లాభం ఏమీ లేదు. అంతేగాకుండా జడుడనూ, మత్తుడనూ అయిన నాకు శిక్ష విధించిన నీ శ్రమ వ్యర్థం. ఇలా పలికి శాంతస్వభావుడయిన ఆ మునిశ్రేష్ఠుడయిన భరతుడు పూర్వ కర్మఫలాన్ని అనుభవించక తప్పదనే భావంతో దండె వదలిపెట్టకుండా ఎప్పటిలాగే పల్లకిని మోయసాగాడు. శాస్త్రసమ్మతాలైన బ్రాహ్మణుని వాక్యాలను రాజు విన్నాడు. ఆ మాటలు తత్త్వజ్ఞానాపేక్షతో పోతున్న ఆ రాజేంద్రుని హృదయానికి సూటిగా తగిలాయి. అతనిలోని అహంకారం తొలగింది. ఆ రాజు వెంటనే పల్లకి నుండి దిగాడు. బ్రాహ్మణునికి సాష్టాంగ దండ ప్రణామం చేశాడు. వినయవినమ్రుడై చేతులు జోడిస్తూ ఇలా అన్నాడు.

**విశే :** దేహానికి ఆత్మకు తేడా ఉంది. దేహానికి సంబంధించిన సుఖదుఃఖాదులచే ఆత్మప్రభావితం కాదు. జడభరతుడు ఆత్మస్వరూపుడు. అతనికి లౌకిక సుఖదుఃఖ భావన లేదు.

పరమప్రభువు దేవుడు ఒక్కడే. ఇతరులు కాదు. ప్రకృతి అధీనంలో భౌతిక జగత్తులో ఎవడూ ప్రభువు కాడు. **దైవీహ్యేషాగుణమయీ మమమాయా దురత్యయా** 7-14 ప్రకృతిమాయచే ప్రభువులు, భృత్యులమనే భావన. ఇది మిథ్యాపూర్వక భావన

భరతుడు ఒక్కడే 'ధర్మాధికారి'

**తత్తేఽనుకమ్పాం సుసమీక్ష్యమాణో భుంజాన ఏ వాత్మకృతం విపాకమ్,**
**హృద్వాగ్వపుర్భి ర్విదధ న్నమ స్తే జీవేత యో ముక్తిపదే సదాయభాక్.** **భాగ 10-148**

'గతకర్మలు అనుభవిస్తూ ఏ నిర్హేతుక కరుణకై వేచియుండి హృదయకుహరమున సదా వందనములను కావించువాడు మోక్షపదమునకు నిశ్చయంగా అర్హుడగును. అది అతని ధర్మయుతమను అధికారమే యగును' అని భావం.

**1. వ్యాధులు, ఆధులు :** 'ఆధి అంటే మనస్సుకు సంబంధించిన జబ్బు. 'వ్యాధి' అంటే శరీరానికి చెందిన జబ్బు.

**2. సాష్టాంగ దండ ప్రణామంబులాచరించి :** స+అష్ట+అంగ+దండ ప్రణామం ఆచరించే పద్ధతి.

శరీరంలోని ఎనిమిది అంగాలు నేలకు తగిలేటట్లుగా చేసే నమస్కారం.

**కం. కరయుగములు, చరణంబులు**
**ఉరము, లలాటస్థలము, నున్నత భుజముల్**
**ధరఁదగుల నరుఁడుమ్రొక్కఁగఁ**
**బరువడి సాష్టాంగమంద్రు పరమమునీంద్రుల్.**

శ్లో. ఉరసా శిరసా దృష్ట్యా మనసా వచసా తథా ।
పద్భ్యాం కరాభ్యాం కర్ణాభ్యాం ప్రణామోఽష్టాంగ ఉచ్యతే ॥

**సీ. ధరణీసురులలోనఁదలఁప నెవ్వఁడవు నీ వవధూతవేషివై యవని యందు**
**నేమిటికై చరియింపంగ వచ్చి? తిచ్చటికి నొక్కఁడ వొంటి సనుట నేఁడు**
**ననుఁగృతార్థునిఁజేయ ననుకూలుఁ డగుచున్న యట్టి యా కపిలమహామునీంద్రుఁ**
**డవొ? నీ మహత్త్వంబు దవిలి విచారింప నెఱుఁగక చేసితిఁ; గరుణఁజూడు**

**తే. తప్పు సైరింపు; నే యమదండమునకు, హరుని శూలంబునకును వజ్రాయుధమున**
**కనల చంద్రార్క ధనద శస్త్రాస్త్రములకు వెఱవ విప్రుని కే మది వెఱచినట్లు. 147**

ప్రతి : తలఁపన్= ఆలోచించగా; ధరణీసురులలోనన్= బ్రాహ్మణులలో; నీవు; ఎవ్వఁడవు?= ఎవడవు; అవధూతవేషివి+ఐ= అవధూతవేషంతో; అవని+అందున్= లోకంలో; ఏమిటికి+ఐ= ఎందుకోసం; చరియింపంగన్+వచ్చితి= సంచరించడానికి వచ్చావు; ఇచ్చటికిన్= ఈ ప్రదేశంలో; ఒక్కఁడవు= ఒంటరివి; ఒంటిన్= ఇతరులతో సంబంధం లేకుండ; చనుట= వెళ్ళడం; నేఁడు= ఈరోజు; ననున్= నన్ను; కృత+అర్థునిన్+చేయన్= నాకేది అవసరమో దానిని తీర్చగలగడానికి; అనుకూలుఁడు+అగుచున్న+అట్టి= అనుకూలుడయినట్టి; ఆ కపిల మహాముని+ఇంద్రుఁడవొ= ఆ కపిలమహాముని శ్రేష్ఠుడవో; నీ మహత్త్వంబు= నీ మహిమను; తవిలి= పూనుకొని; విచారింపన్+ఎఱుఁగక చేసితిన్= ఆలోచింపక అపచారం చేశాను; కరుణన్+చూడు= నన్ను దయతో వీక్షింపుము; తప్పు+సైరింపు= దోషాన్ని క్షమించు; నేన్= నేను; విప్రునికిన్= బ్రాహ్మణునికి; మదిన్= మనసులో; వెఱచినట్లు= భయపడినట్లు; యమదండమునకున్= యమపాశానికి గాని; హరుని శూలంబునకును= శివుని త్రిశూలాయుధానికిగాని; వజ్ర+ఆయుధమునకున్= ఇంద్రుని వజ్రయుధానికిగాని; అనలచంద్ర+అర్క+ధనదశస్త్ర+అస్త్రములకున్= అగ్ని, చంద్ర, సూర్య, కుబేరుల మంత్రపూతములైన అస్త్రప్రయోగానికి గాని; వెఱవన్= భయపడను.

**తా :** నీవు సామాన్యబ్రాహ్మణుడవు కావు. అవధూతలా కనిపిస్తున్నావు. అయితే ఎందుకు ఈ వేషంలో ఒంటరిగా తిరుగుతున్నావు? నన్ను ధన్యుణ్ణి చేయడంకోసం దయతోవచ్చిన కపిల మహామునీంద్రుడవు కావు గదా? నీ మహిమలు తెలుసుకోలేక నేను అపచారం చేశాను. నన్ను దయతో చూడు. నా తప్పును క్షమించు. నేను బ్రాహ్మణునకు భయపడినట్లు యమదండానికి గానీ, శివుని శూలాయుధానికి గానీ, ఇంద్రుని వజ్రాయుధానికిగానీ, అగ్ని, చంద్ర, సూర్య, వరుణుల శస్త్రాస్త్రాలకుగానీ ఏ మాత్రం భయపడను సుమా!

**వ. మఱియు నిస్సంగుండవయి జడుఁడుంబోలె నిగూఢ విజ్ఞానంబు గలిగి చరియించుచున్న వాఁడవు; నీ వచనంబులు యోగశాస్త్ర సమానంబులై వాఙ్మానసంబులకు నభేద్యంబులయి యున్నవే; నవ్విష్ణుకళావతీర్ణుండు సాక్షాద్ధరియునగు కపిలమహామునివలన బ్రహ్మవిద్య దెలియంగోరి చనుచున్నవాఁడ; నీవు లోక నిరీక్షణార్థం బవ్యక్తలింగుండవై చరియించుచున్న కపిల మహామునీంద్రుండవు గాఁబోలుదువు; మందుండైన గృహస్థుండు యోగీశ్వర చరిత్రంబు లెట్టు లెఱుంగనేర్చుఁ? గర్మవశంబున దృష్టంబై శ్రాంతి వహించుచు నడుచుచున్న యీ యాశ్రమంబు నాకునుంబోలె నీకు నగునని తోఁచుచున్న; దది యెట్లనిన**

**ఘటంబు లేక జలంబులు దేనేరని తెఱంగున లేనిది గలుగ నేరదు; గావునం బ్రమాణమూలం బయిన లోకవ్యవహారంబు సత్పథంబున సమ్మతంబై యుండుటం జేసి నీ వాడు వాక్యంబులు నాకు సమ్మతంబు గానేర వని సింధు దేశాధీశ్వరుండు వినిపించిన నా విప్రుండు లోక వ్యవహారంబునకు నిత్యత్వం బౌపాధికం బగుఁ గాని నిత్యంబు గా నేరదని దృష్టాంతనిదర్శనంబుగా నిట్లనియె. 148**

**ప్రతి :** మఱియున్= అంతమాత్రమేగాక; నిస్సంగుఁడవు+అయి= సంగం లేనివాడవై; జడుఁడున్+పోలెన్= జడునిలాగ; నిగూఢ విజ్ఞానంబు+కలిగి= నిగూఢమయిన విజ్ఞానరహస్యాలు కలిగి; చరియించుచున్+ఉన్నవాఁడవు= సంచరిస్తున్నావు; నీ వచనంబులు= నీ మాటలు; యోగశాస్త్ర సమానంబులు+ఐ= యోగశాస్త్రంలోని వాక్యాలకు తుల్యములై; వాక్+మానసంబులకున్= వాక్కుకు మనసుకు; అభేద్యంబులు+అయి ఉన్నవి= విడదీయడానికి వీలు లేనట్టుగా ఉన్నాయి; ఏను= నేను; విష్ణుకళా+అవతీర్ణుండున్= విష్ణుదేవుని అంశతో అవతరించినవాడు; సాక్షాత్+హరియున్+అగు= సాక్షాత్ విష్ణుస్వరూపుడును అగు; కపిలమహామునివలనన్= కపిల మహామునివలన; బ్రహ్మవిద్య= బ్రహ్మవిద్యను; తెలియన్+కోరి+ చనుచున్+ఉన్నవాఁడన్= తెలుసుకోవాలని వెళుతున్నవాడిని; నీవు= నీవు; లోక+నిర్+ఈక్షణ+అర్థంబు= లోకులను దయతో చూచి రక్షించడంకోసం (పరిశీలించుటకోసం); అవ్యక్త లింగుండవు+ఐ= ఇతరులు గుర్తించడానికి వీలుకాని ఆకారంలో; చరియించుచున్+ఉన్న= తిరుగుతున్న; కపిలమహాముని+ఇంద్రుండవు= కపిల మహామునీంద్రుడవే; కాన్‌పోలుదువు= అయి ఉంటావు; మందుండు+ఐన= మూర్ఖుడైన; గృహస్థుండు= సాంసారిక జీవితం గడిపేవాడు; యోగి+ఈశ్వర చరిత్రంబులు= యోగీశ్వరుల నడివడికలు; ఎట్టులు+ఎఱుంగన్+నేర్చున్= ఎలా తెలుసుకోగలుగుతాడు; కర్మవశంబునన్= కర్మవశంతో; దృష్టంబు+ఐ= కనబడినదై; శ్రాంతి వహించుచున్= బడలిక పొందుతూ; నడచుచున్+ఉన్న= సాగుతున్న; ఈ+ఆశ్రమంబు= ఈ గృహస్థాశ్రమం; నాకునున్+పోలెన్= నాకువలె; నీకున్+అగున్+అని= నీకును అగును అని; తోఁచుచున్+ఉన్నది= కనబడుతున్నది; అది+ఎట్లు+అనినన్= అదేలాగంటే; ఘటంబులేక= కుండ లేకుండా; జలంబులు= నీటిని; తేన్+నేరని= తీసుకురావడం కుదరని; తెఱంగునన్= పద్ధతిలో; లేనిది= అసలులేనిది; కలుగన్ నేరదు= అనుభవానికి రాదు; కావునన్= అందువల్ల ప్రమాణమూలంబు+అయిన= ప్రమాణాలు హేతువుగా గల్గిన; లోకవ్యవహారంబు= లోకపుతీరు; సత్+పథంబునన్= మంచిమార్గంలో; సమ్మతంబు+ఐ= అంగీకృతమై; ఉండుటన్+చేసి= ఉండడంవల్ల; నీవు+ ఆడువాక్యంబులు= నీవు పల్కిన వాక్యాలు; నాకున్= నాకు; సమ్మతంబు కానేరవు= సరిపడుట లేదనిపిస్తుంది; అని= అని; సింధుదేశ+అధీశ్వరుండు= సింధు దేశాధిపతి ఐన రహూగణుడు; వినిపించినన్= చెప్పగా; ఆ విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; లోకవ్యవహారంబునకున్= లోకవ్యవహారమునకు; నిత్యత్వంబు= ఎల్లప్పుడూ ఉండుట; ఔపాధికంబు+అగున్+కాని= ఉపాధిపై ఆధారపడి ఉంటుంది కాని; నిత్యంబు+కానేరదు= శాశ్వతంగా ఉండటం కుదరదు; అని= అని; దృష్టాంత నిదర్శంబు+కాన్= ఉదాహరణ పూర్వకంగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** నీవు కోరికలు లేనివాడవై పైకి జడునివలె కనిపిస్తున్నావు. నిగూఢమయిన విజ్ఞానరహస్యాలు నీకు తెలిసినట్టే ఉంది. నీ మాటలు యోగశాస్త్రాలలోని వాక్యాలకు దీటుగా ఉన్నాయి. నీ వాక్యాలు వాక్కుకు గాని మనసుకు గాని విడదీయడానికి వీలు లేనట్లుగా ఉన్నాయి.

నే నిపుడు విష్ణుదేవుని అంశతో అవతరించినవాడూ, సాక్షాత్ విష్ణుస్వరూపుడూ అయిన కపిలమహాముని వల్ల బ్రహ్మవిద్యోపదేశం పొందాలని వెళుతున్నాను. నీవు లోకులను పరీక్షించడంకోసం, ఇతరులు గుర్తించడానికి వీలులేని

ఆకారంలో తిరుగుతున్న సాక్షాత్ కపిలమహామునీంద్రుడవే అని అనుకొంటున్నాను. మూర్ఖుడైన నావంటి గృహస్థుడు మీవంటి యోగీశ్వరుల చరిత్రలను ఎలా తెలుసుకోగలుగుతాడు? ఈ గృహస్థాశ్రమం బాదరబందీ నాకులాగా నీకు ఉన్నట్టుంది. కుండలేకపోతే నీరు తీసుకురావడం కుదరదు. అందువల్ల అసలు లేనిది అనుభవానికి రానేరాదు. ప్రమాణాలను బట్టి లోకవ్యవహారాన్ని నమ్ముతున్నాము. అందువల్ల నీ మాటలు నాకు సరిపడుట లేదనిపిస్తున్నది అని సింధు దేశానికి అధిపతి అయిన రహూగణుడు అన్నాడు. ఆ మాటలు విని బ్రాహ్మణకుమారుడైన భరతుడు **లోకవ్యవహారంలోని నిత్యత్వం ఉపాధిపై ఆధారపడి ఉంటుందేగాని అది నిత్యం కానేకాదు** అని ఉదాహరణలతో ఇలా విశదీకరించాడు.

**విశే :** జడభరతుడు పరిపూర్ణ యోగి. మునులలో శ్రేష్ఠుడు. యోగేశ్వరుడు గీతలో -

**యోగినా మపి సర్వేషాం మద్గతే నాన్తరాత్మనా ।**
**శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః ॥ 6-47**

అత్యంత శ్రద్ధతో నా భావనయందే నిలిచియుండేవాడును, నన్నే తనయందు సదా స్మరించువాడును మరియు నాకు దివ్యమైన ప్రేమయుతమైన సేవను ఒనరించినవాడును అగు యోగి యోగులందరికన్నను అత్యంత సన్నిహితంగా నాతో యోగమునందు కూడినట్టివాడైయున్నాడు. సర్వులలో అతడే అత్యున్నతుడు. ఇక్కడరాజు రాజుకాదు. భరతుడు జడుడు కాదు. ఇవి ఉపాధులు. ఆత్మకు అచ్ఛాదనలు తొడుగులు మాత్రమే.

ఇక్కడ శరీరమే 'ఉపాధి'.

**సీ. పావకశిఖలచే భాండంబు దాఁ దప్త మగుఁ; దప్తఘటముచే నందు నున్న**
**జలము తపించు; నా జలముచేఁ దండులంబులు తప్తమొంది యప్పుడు విశిష్ట**
**మైన యన్నం బగు; నా చందమునను దా దేహేంద్రియంబులఁదెలివితోడ**
**నాశ్రయించుక యున్న యట్టి జీవునకు దేహంబునఁబ్రాణేంద్రియాదికమున**

**ఆ. జరుగుచుండు నిట్లు సంసారఘట శిక్ష, రక్షకుండు నయిన రాజు దుష్ట**
**కర్మములకుఁబాసి కంజాక్షపదసేవఁ, జేసెనేని భవముఁజెందకుండు. 149**

**ప్రతి :** పావకశిఖలచేన్= అగ్ని జ్వాలలతో; భాండంబు= కుండ; తాన్= తాను; తప్తము+అగున్= కాలుతుంది; తప్తఘటముచేన్= కాలిన కుండ కారణంగా; అందున్+ఉన్న= ఆ కుండలోవున్న; జలము= నీరు; తపించున్= వేడెక్కుతుంది; ఆ జలముచేన్= ఆ నీటికారణంగా; తండులంబులు= బియ్యం; తప్తము+ఒంది= వేడెక్కి; అప్పుడు= ఆ సమయంలో; విశిష్టము+ఐన= శ్రేష్ఠమయిన; అన్నంబు+అగును= అన్నమగును; ఆ చందముననున్= ఆ విధంగా; తాన్= తాను; దేహ+ఇంద్రియంబులన్= దేహాన్ని ఇంద్రియాల్ని; తెలివితోడన్= జ్ఞానంతో; ఆశ్రయించుక+ఉన్న+అట్టి= ఆశ్రయించియున్నట్టి; జీవునకున్= ప్రాణికి; దేహంబునన్= దేహంలోనే; ప్రాణ+ఇంద్రియ+ఆదికమునన్= ప్రాణం ఇంద్రియాలు మొదలైనవాటి రూపంలో; జరుగుచుండున్= సాగుతుంటాయి; ఇట్లు= ఈ రకంగా; సంసారఘట శిక్ష రక్షకుండున్+అయిన= సంసారమనే ఘటమును శిక్షించువాడును, రక్షించువాడునూ అగు (దుష్టశిక్షకుడు శిష్టరక్షకుడునూ అగు) రాజు అలా ఉండాలి అంటున్నాడు; రాజు= ప్రభువు; దుష్టకర్మములకున్+పాసి= చెడుకర్మలను వదలిపెట్టి; కంజ+అక్ష+పదసేవన్+ చేసెన్+ఏని= పద్మములవంటి కన్నులుగల విష్ణుపాదాలను సేవిస్తే; భవమున్+చెందక+ఉండున్= పుట్టుకనుండి విముక్తుడవుతాడు.

**తా :** అగ్నిజ్వాలలతో కుండ కాలుతుంది. కాలిన కుండ కారణంగా అందులో పోసిన నీరు వేడెక్కుతుంది. ఆ నీటిలో వేసిన బియ్యం బాగా ఉడికి పక్వమయి అన్నం సిద్ధమవుతుంది. అలాగే దేహాన్ని ఇంద్రియాలను ఆశ్రయించుకొని జీవుడున్నాడు. దేహంలోనే ప్రాణం ఇంద్రియాలున్నాయి. అందువల్ల దేహేంద్రియాలకు సంబంధించినవన్నీ జీవునకూ సంక్రమిస్తాయి. దేహం కుండవంటిది. ప్రాణేంద్రియాలు నీటివంటివి. జీవుడు బియ్యంలాంటివాడు.

ప్రజల శిక్షణ, రక్షణలకోసం రాజున్నాడు. ఆ రాజు చెడుకర్మలు వదలిపెట్టి విష్ణుపాదాలను సేవిస్తే, సంసార బంధాలనుండి విముక్తుడవుతాడు.

**ఆ. అనుచు ధారుణీసురాత్మజుఁ డీ రీతిఁ, బలుకుటయును రాజు పరిణమించి**
**వినయవాక్యములను వినుతించి క్రమ్మఱఁ, బుణ్యుఁడైన సింధుభూవరుండు. 150**

**ప్రతి :** అనుచున్= అని విశదం చేస్తూ; ధారుణీసుర+ఆత్మజుఁడు= బ్రాహ్మణ కుమారుడయిన భరతుడు; ఈ రీతిన్= ఈ విధంగా; పలుకుటయును= బదులివ్వగా; రాజు= రహూగణమహారాజు; పరిణమించి= మానసికంగా మార్పుచెంది; వినయవాక్యములను= వినయం ప్రదర్శించే వాక్యసమూహాలతో; వినుతించి= పొగడి; క్రమ్మఱన్= వెంటనే; పుణ్యుఁడు+ఐన= పుణ్యాత్ముడయిన; సింధుభూవరుండు= సింధుదేశాధిపతి...

**తా :** బ్రాహ్మణకుమారుడయిన భరతుడు ఇలా పలుకగానే రాజులో మార్పు కలిగింది. ఆ తరువాత వినయోక్తులతో స్తుతించి భరతునితో సింధురాజు ఇలా అన్నాడు.

**వ. మహాత్మా! నేను రాజు ననియెడి యభిమాన మదాంధుండనై మహాత్ములం దిరస్కరించిన నన్నుం గరుణింపుము; నీ వార్తబంధుండవు; నీ కృపాదృష్టింజేసి మహాత్ముల నవమానంబు సేసిన దురితంబువలన విముక్తుండ నయ్యెద. విశ్వసుహృత్త వైన నీకుం గోపంబు గలుగనేర; దసమర్థు లయిన మాబోఁటి వారలు మహాజనావమానంబున శీఘ్రంబె నశింతురు; గావున నీవు దయాళుండ వయి నన్ను మన్నింపు మనిన నా విప్రుండిట్లనియె. 151**

**ప్రతి :** మహా+ఆత్మా= గొప్ప మనస్సుగలవాడా; నేను= నేను; రాజును+అనియెడి= రాజుననే; అభిమాన మద+అంధుండను+ఐ= దురహంకారంతో కనుగాననివాడనై; మహాత్ములన్= మహాత్ములను; తిరస్కరించిన= లెక్కపెట్టని; నన్నున్= నన్ను; కరుణింపుము= దయతో చూడుము; నీవు= అవధూతగా కనిపించే నీవు; ఆర్తబంధుండవు= మోక్షచింతన గల ఆర్తులైన తత్త్వజిజ్ఞాసువులకు దగ్గరి చుట్టానివి; నీకృపాదృష్టిన్+చేసి= నీ కృపాకటాక్ష వీక్షణంవల్ల; మహాత్ములన్+అవమానంబు+చేసిన= గొప్పవారిపట్ల అవమానం చేసిన; దురితంబువలనన్= పాపంవల్ల; విముక్తుండను+అయ్యెదన్= విడివడినవాడనవుతాను; విశ్వసుహృత్తవు+ఐన= లోకానికి ఆప్తమిత్రుడవయిన; నీకున్= నీకు; కోపంబు+కలుగన్‌నేరదు= అసలు కోపమనేది ఉండదు; అసమర్థులు+అయిన= ఏమాత్రం సామర్థ్యంలేని; మాబోఁటివారలు= మావంటివారు; మహాజన+అవమానంబునన్= గొప్పవారిని అవమానించడమనే పాపకర్మవలన; శీఘ్రంబు+ఎ= తొందరగా; నశింతురు= వినాశం చెందుతారు; కావునన్= అందువల్ల; నీవు= అవధూతవయిన నీవు, తత్త్వవేత్తవయిన నీవు; దయాళుండవు+అయి= దయాస్వభావం కలవాడవై; నన్నున్= నన్ను; మన్నింపుము= క్షమించుము; అనినన్= అనగా; ఆ విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** మహాత్మా! నేను రాజుననే దురహంకారంతో కన్నులు గానక మహాత్ముడవైన నిన్ను తిరస్కరించాను. అపరాధినైన నన్ను కరుణించు. నీవు నావంటి మోక్షచింతనచే ఆర్తులైన తత్త్వజిజ్ఞాసువులకు దగ్గరి చుట్టానివి. నీవు నాపై నీ కృపాకటాక్షవీక్షణం ప్రసరింపజేస్తే, మహాత్ములకు అవమానం చేసిన పాపం నుండి నేను విముక్తుణ్ణి అవుతాను. నీవు లోకానికి ఆప్తమిత్రుడవు. అందువల్ల నీకు అసలు కోపమనేదే ఉండదు. మేము ఏమీ చేతగాని వాళ్ళం. గొప్పవారిని అవమానించడమనే పాపకర్మంవల్ల తొందరగా వినాశం కొని తెచ్చుకుంటాము. అందువల్ల దయాదృష్టితో నన్ను క్షమించు అని క్షమాభిక్ష వేడిన రాజును జూచి బ్రాహ్మణుడైన భరతుడు ఇలా అన్నాడు.

**క.** **కడువేడ్క నీ వవిద్వాం, సుఁడవై యుండియును మిగులఁజోద్యము విద్వాం**
**సుఁడుఁబోలెను బలికెద వి, ప్పుడు మే లనవచ్చుఁగొంత పురుషులలోనన్.** **152**

**ప్రతి :** కడువేడ్కన్= మిక్కిలి వేడ్కతో; నీవు= నీవు; అవిద్వాంసుఁడవు+ఐ+ఉండియును= పండితుడవు కాకపోయినను; ఇప్పుడు= ఇపుడు; మిగులన్= మిక్కిలి; విద్వాంసుఁడున్+పోలెను= విద్వాంసునిలాగా; పలికెదవు= మాటలాడుతున్నావు; చోద్యము= మిక్కిలి వింత, అయినా; కొంత= కొంతవరకు; పురుషులలోనన్= పురుషులలో; మేలు+అనవచ్చున్= నిన్ను మెచ్చుకోవచ్చును.

**తా :** నీవు విద్వాంసుడవు కావు. అయినా విద్వాంసునిలాగా మాట్లాడుతున్నావు. ఇది చాలా చిత్రంగా ఉంది. అయినా నిన్ను కొంత మెచ్చుకోవచ్చు.

**ఆ.** **పరఁగఁబెద్ద లీ ప్రపంచమంతయుఁ దథ్య, మనరు; నీవు తథ్య మనుచుఁబలికి;**
**తట్లుగాన నిన్ను నధికుండ వని పల్క, రాదు నాకుఁజూడ రాజచంద్ర!** **153**

**ప్రతి :** రాజచంద్ర!= ఓ రాజశ్రేష్ఠుడా!; పరఁగన్= ఒప్పుగా; పెద్దలు= తెలిసినవారు; ఈ ప్రపంచము+అంతయున్= ఈ విశ్వమంతా; తథ్యము+అనరు= పరమ సత్యమని అంగీకరింపరు; నీవు= నీవు (నీవేమో); తథ్యము+అనుచున్= నిజమని; పలికితి= మాటలాడితివి; అట్లు కానన్= అందువలన; నిన్నున్= నిన్ను; నాకున్+చూడన్= నాకు చూడగా; అధికుండవు+అని పల్కన్+రాదు= గొప్పవాడవని చెప్పదగదు.

**తా :** రాజచంద్రా! పెద్దలెవరు గాని ఈ ప్రపంచం సత్యమని చెప్పరు. అయితే నీవు సత్యమంటున్నావు. (వ్యవహారసత్యం అసలు సత్యం కాదు.) అందువల్ల నీ ఆధిక్యాన్ని అంగీకరించడానికి వీలు లేదు.

**సీ.** **యజ్ఞాదికములందు నామ్నాయములయందుఁ దఱచుగాఁదత్త్వవాదంబు లేదు**
**స్వప్నంబునందుల సౌఖ్య మాకారంబు నందుల నిత్యమై యంత లేని**
**యట్టి చందమున వేదాంతవాక్యంబులు తత్త్వంబు నెఱిఁగించి తలఁగుఁగాని**
**నిత్యంబులై యుండనేరవు; పురుషుని చిత్తంబు గుణములఁజెంది యెంత**

**తే.** **కాలముండును మఱి యంత కాలమందు, నరయ విజ్ఞానకర్మేంద్రియములచేత**
**మరగి ధర్మంబులును నధర్మంబులట్లు, దగిలి పుట్టించుచుండు నత్యంతమహిమ.** **154**

**ప్రతి :** యజ్ఞ+ఆదికములు+అందున్= యజ్ఞం మొదలయిన కర్మలయందుగాని; ఆమ్నాయముల+అందున్= వేదములయందు గాని; తఱచు+కాన్= అధికంగా; తత్త్వవాదంబు లేదు= పరమార్థతత్త్వమును చెప్పవు; స్వప్నంబులందులన్= కలలలో; సౌఖ్యము+ఆకారము= సుఖముయొక్క అనుభూతి; అందులన్= ఆ కలలలో; నిత్యము+ఐ= శాశ్వతమై; అంతన్= మెలకువ గల్గినప్పుడు; లేని+అట్టి+చందమునన్= లేనివిధంగా; వేదాంతవాక్యంబులు= వేదాంత స్వరూపవాక్యాలు; తత్త్వంబున్+ఎఱిఁగించి= నిజస్వరూపం స్థాపించి; తలఁగున్= తొలగిపోవును కాని; నిత్యంబులు+ఐ+ఉండన్+నేరవు= నిత్యంబుగా ఉండజాలవు; పురుషునిచిత్తంబు= జీవుని చిత్తము; గుణములన్+చెంది= గుణములను పొంది; ఎంతకాలము+ఉండును= ఎంత కాలముంటుందో; మఱి+అంత+కాలము+అందున్= మరి అంతకాలమునందు; ఆరయన్= పరిశీలింపగా; విజ్ఞానకర్మ+ఇంద్రియములచేతన్= జ్ఞాన కర్మేంద్రియాలతో; మరగి= అలవాటుపడి; ధర్మంబులునున్= ధర్మములుకూడా; అధర్మంబులు+అట్లు= అధర్మంవలె; తగిలి= బంధితమై; అత్యంతమహిమన్= మిక్కిలి సామర్థ్యంతో; పుట్టించుచున్+ఉందున్= కలిగించుచుండును.

**తా :** యజ్ఞాల్లో గాని, వేదాలలోగాని, పరమార్థతత్త్వం తరచుగా చెప్పబడదు. కలలో అనుభవించిన సౌఖ్యాలకు ఆకారాలు ఉన్నాయి. కలలో అవి సత్యాలే. అయితే మెలకువలో అవి అసత్యాలు. అలాగే వేదాంత వాక్యాలనేవి తత్త్వస్వరూపం అనుభవమయ్యేవరకూ సత్యాలుగా భాసిస్తాయి. కాని అవి నిత్యాలు కావు. జీవుని చిత్తం ఎంతకాలం త్రిగుణాలతో కూడి ఉంటుందో అంతకాలం జ్ఞానేంద్రియాలతోనూ, కర్మేంద్రియాలతోనూ సన్నిహితత్వం కలిగి ఉంటుంది. ఈ అలవాటువల్ల ధర్మాలో, అధర్మాలో మనసులో పుడుతుంటాయి.

**వ.** **మఱియు ధర్మాధర్మ వాసనాయుక్తంబు, విషయానురక్తంబునైన చిత్తంబు గుణ ప్రవాహంబులచేత వికారంబు నొంది దేవతిర్యఙ్మనుష్యరూపంబు లయిన దేహంబులం బుట్టించుచుఁ గాల ప్రాప్తంబులైన సుఖదుఃఖ తదుభయ ఫలంబుల ననుభవించుచు ననవరతంబు జీవునికిం బ్రత్యక్షం బగుచు స్థూల సూక్ష్మరూపంబుల నుండు; స్వాంతంబు గుణరహితంబైన ముక్తి కారణంబగు; ఘృతవర్తులు గల దీపంబు సధూమశిఖలం బుట్టించు; ఘృతవర్తులు నాశంబు నొందిన స్వరూపంబుఁ బొందు; నీ తెఱంగున మనంబు గుణకర్మానుబంధంబైన జన్మాదులం బుట్టించు, గుణకర్మంబులం బాసెనేనిం బరతత్త్వంబు నొందు; జ్ఞానేంద్రియంబు లేనును విషయంబుల మీఁదఁ దోఁచు బుద్ధి లేనును నభిమానంబు నను నేకాదశవృత్తులం గూడిన మనంబు జీవుని నసంఖ్యంబు లయిన జన్మంబులం బొందించు; మనోవృత్తుల నతిక్రమించిన జీవుండు పరంజ్యోతియైన నారాయణ స్వరూపంబుగా నెఱుంగుము; స్థావర జంగమంబు లయిన జీవులకుం బవనుండు ప్రాణంబై యున్న చందంబున నీశ్వరుండు సర్వభూతాంతర్యామి యగుచు జీవాత్మ స్వరూపంబున నుండు; జీవాత్ముండు జ్ఞానోదయంబునం జేసి మాయ నెంత కాలంబు గెలువకుండు నంతకాలంబు ముక్తసంగుండు గాఁ; దరిషడ్వర్గంబును జయించి పరతత్త్వంబు నెఱింగిన నీశ్వరుం డగుఁ; జిత్తం బెంతకాలంబు విషయాసక్తం బగు నంతదడవు సంసారచక్రంబునందు సంచరించుం గావున మహావీరుం డయినను దనకు శత్రువైన మనంబు నప్రమత్తుండయి యుపేక్షా బుద్ధిం జేసి యిచ్ఛా విహారంబున జరగనీక పరమగురుండైన శ్రీహరి చరణోపాసనాస్త్రంబునం జిత్తంబు గెలిచినం బరతత్త్వంబు నొందునని విప్రుండు వలికిన నతని మహిమకు వెఱఁగంది బ్రాహ్మణునకు నమస్కారంబు సేయుచు భూవరుండిట్లనియె. 155**

**ప్రతి :** మఱియున్= అంతేగాక; ధర్మ+అధర్మ+వాసనాయుక్తంబు= ధర్మాధర్మముల సంస్కారంతో కూడినది; విషయ+అనురక్తంబును+ఐన= ఇంద్రియార్థాలందు అనురాగం చెందినదయిన; చిత్తంబు= మనస్సు; గుణ ప్రవాహంబుచేతన్= సత్త్వరజస్తమో గుణప్రవాహం కారణంగా; వికారంబున్+ఒంది= వికారాలను పొంది; దేవతిర్యక్+మనుష్య+రూపంబులు+అయిన= దేవతలు, జంతువులూ, నరులూ అనురూపంగల; దేహంబులన్= శరీరములలో; పుట్టించుచున్= జన్మింపజేయుచు; కాలప్రాప్తంబులు+ఐన= ఆయా కాలాలలో ప్రాప్తించే; సుఖదుఃఖ తద్+ఉభయ ఫలంబులన్= సుఖాలైన ఫలాలను; దుఃఖాలైన ఫలాలు రెండును గలిసిన ఫలాలు; అనుభవించుచున్= అనుభవించుచు; అనవరతంబున్= ఎల్లప్పుడు; జీవునికిన్= జీవునికి; ప్రత్యక్షంబు+అగుచున్= ప్రత్యక్షమగుచు; స్థూలసూక్ష్మ రూపంబులన్+ఉండున్= స్థూల; సూక్ష్మరూపాలతోనుండును; స్వాంతంబు= మనస్సు; గుణరహితంబు+ఐనన్= గుణాలు లేనిది అయితే; ముక్తి కారణంబు+అగున్= ముక్తికి హేతువవుతుంది; ఘృతవర్తులు+కల= నేయి వత్తులుగల; దీపంబు= దివ్వె; సధూమశిఖలన్+పుట్టించున్= పొగలతో కూడిన మంటలను జనింపజేయును; ఘృతవర్తులు= నేయివత్తులు; నాశంబున్+ఒందినన్= నశించినట్లయితే; స్వరూపంబున్+ఒందున్= స్వస్వరూపాన్ని పొందుతుంది; ఈ తెఱంగునన్= ఈ విధంగా; మనంబు= మనస్సు; గుణకర్మ+అనుబంధంబు+ఐనన్= గుణములతో, కర్మలతో సంబంధించినది అయితే; జన్మ+ఆదులన్= రకరకాలయిన జన్మలను; పుట్టించున్= జనింప చేస్తుంది; గుణకర్మంబులన్= గుణకర్మలను; పాసెన్+ఏనిన్= వదలిపెడితే; పరతత్త్వంబున్+ఒందున్= ఉత్తమ తత్త్వమునొందును; జ్ఞాన+ఇంద్రియంబులు+ఏనును= జ్ఞానేంద్రియాదులైదును; విషయంబులమీఁదన్= శబ్దస్పర్శరూపరస గంధములనే విషయాదులమీద; తోఁచు= పోయే; బుద్ధులు+ఏనును= ఐదురకాల బుద్ధులునూ; అభిమానంబునను= అభిమానమనే; ఏకాదశవృత్తులన్+కూడిన= పదకొండు ప్రవర్తనములతోకూడిన; మనంబు= చిత్తము; జీవునిన్= జీవుని; అసంఖ్యంబులు+అయిన జన్మంబులన్+పొందించున్= లెక్కకు మిక్కిలి జన్మాలకు కారణమవుతుంది; మనోవృత్తులన్= మనో వ్యాపారాలను; అతిక్రమించిన= దాటినట్లైతే; జీవుండు= జీవుడు; పరంజ్యోతి+ఐన= శ్రేష్ఠము, అఖండజ్యోతి స్వరూపమయిన; నారాయణ స్వరూపంబు+కాన్= శ్రీమన్నారాయణుని స్వరూపంగా; ఎఱుంగుము= తెలిసికొనుము; స్థావరజంగమంబులు+అయిన= కదలనివి, కదలునవి అయిన; జీవులకున్= జీవులకు; పవనుండు= వాయువు; ప్రాణంబు+ఐ= ప్రాణమై; ఉన్నచందంబునన్= ఉండే విధాన; ఈశ్వరుండు= పరమాత్మ; సర్వభూత+అంతర్యామి+అగుచున్= సర్వభూతములయందు అంతర్యామి అవుతూ; జీవ+ఆత్మస్వరూపంబునన్+ఉండున్= జీవాత్మ స్వరూపంగా ఉంటాడు; జీవ+ఆత్ముండు= జీవుడు; జ్ఞాన+ఉదయంబునన్+చేసి= విశిష్ట జ్ఞానోదయంతో; మాయన్= మాయను; ఎంతకాలంబు= ఎంతకాలం; గెలువక+ఉండున్= గెలువలేక ఉండునో; అంతకాలంబున్= అంతకాలము; ముక్తసంగుండు+కాఁడు= సంసారబంధం విడిచినవాడు కాదు (ముక్తసంగుడనగా జీవన్ముక్తుడు); అరిషడ్వర్గంబును= ఆరుగురు అంతశ్శత్రువులగుంపును (కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యములనే ఆరింటి సమూహమును); జయించి= గెలిచి; పరతత్త్వంబున్+ఎఱింగినన్= పరతత్త్వం గ్రహిస్తే; ఈశ్వరుండు+అగున్= తానే ఈశ్వరుడగును; చిత్తంబు= మనసు; ఎంతకాలంబు= ఎంతకాలము; విషయ+ఆసక్తంబు+అగున్= ఇంద్రియార్థములందు ఆసక్తి కలది అవుతుందో; అంత+తడవు= అంతవరకు; సంసార చక్రంబు+అందున్= సంసార చక్రబంధంలో; సంచరించున్= సంచరించును; కావునన్= అందువలన; మహావీరుండు+అయినను= గొప్ప వీరుడయినా; తనకున్= తనకు; శత్రువు+ఐన= విరోధియైన; మనంబున్= మనస్సును; అప్రమత్తుండు+అయి= ఏమరుపాటులేనివాడయి; ఉపేక్షాబుద్ధిన్+చేసి= పట్టించుకోని బుద్ధితో; ఇచ్ఛావిహారంబునన్= తోచిన విధంగా తిరగడం; జరగనీక= కాకుండజేసి; పరమగురుండు+ఐన= ఉత్కృష్టగురువయిన;

శ్రీహరిచరణ+ఉపాసనా+అస్త్రంబునన్= విష్ణుని పాదములను ధ్యానించడమనే బాణముచే; చిత్తంబున్= మనస్సును; గెలిచినన్= జయించినట్లయితే; పరతత్త్వంబున్+ఒందున్+అని= పరతత్త్వం అందుకుంటాడని; విప్రుండు= బ్రాహ్మణుడు; పలికినన్= పలుకగా; అతని మహిమకున్= అతని ప్రభావమునకు; వెఱఁగు+అంది= నివ్వెరపడి; బ్రాహ్మణునకున్= భరతునికి; నమస్కారంబు+చేయుచున్= తన విధేయతను నమస్కార రూపంలో ప్రకటిస్తూ; భూవరుండు= రాజయిన రహూగణుడు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** మనసుకు ఒక సంస్కారం ఉంది. ఆ సంస్కారం ధర్మాధర్మ రూపాలలో ఉంటుంది. ఆ మనస్సు ఇంద్రియ వ్యసనాలపట్ల అనురక్తి కలిగి ఉంటుంది. సత్త్వరజస్తమోగుణాల ప్రవాహాలతో వికారం పొందుతుంది. ఈ సంస్కారాన్నిబట్టి జీవుడు దేవతలు, జంతువులు, మానవులు అనే రూపాలను ధరిస్తుంటాడు. అటువంటి దేహాలలోని మనస్సు ఆయా కాలాలలో ప్రాప్తించే సుఖదుఃఖఫలాలను అనుభవిస్తూ జీవునికి ఎల్లప్పుడూ ప్రత్యక్షమవుతూ స్థూలసూక్ష్మరూపాలతో ఉంటుంది.

మనసు గుణరహితమైనప్పుడు కలిగే అనుభవమే ముక్తి. నేతిలో వత్తులు ముంచి దీపం వెలిగిస్తే పొగలతో కూడిన జ్యోతి పుడుతుంది. నేయీ వత్తీ రెండూ లేకపోతే స్వస్వరూపాన్ని పొందుతుంది. అలాగే గుణకర్మల సంబంధం కలిగిన మనస్సు ఆయా గుణాలకూ, కర్మలకూ తగిన జన్మలకు కారణమవుతుంది. గుణాలూ, కర్మలూ అనేవే లేకపోతే మనసు అనేది ఉండదు. కేవలం పరతత్త్వంగా మిగులుతుంది.

జ్ఞానేంద్రియాలు ఐదు. ఇంద్రియార్థాల మీద పనిచేసే ప్రజ్ఞలైదు. అభిమానం అనే పదకొండున్నూ మనస్సుకు ఏర్పడే వృత్తులు. ఈ పదకొండు వృత్తులతో కూడినది మనస్సు. ఈ జీవునికి లెక్కలేనన్ని జన్మలను కలిగిస్తుంది. పైని చెప్పిన మనోవృత్తులను దాటిన జీవుడు అఖండపరంజ్యోతి అయిన నారాయణస్వరూపమే అవుతాడు. చరములూ, అచరములూ అయిన జీవులకు వాయువు ప్రాణంగా ఉన్నట్టు, ఈశ్వరుడు అన్ని ప్రాణులలోనూ ఉంటూ జీవాత్మ స్వరూపుడుగా గోచరిస్తాడు. జీవుడు జ్ఞానోదయం కలిగి మాయను గెలువనంతవరకూ ఇంద్రియాలతో సాంగత్యం విడువలేడు. కామక్రోధాది అరిషడ్వర్గాన్ని జయించి పరతత్త్వాన్ని తెలుసుకొన్నట్లయితే అతడే ఈశ్వరుడవుతాడు. మనస్సు ఎంతకాలం ఇంద్రియ లోలుపమై సంచరిస్తుందో అంతకాలం సంసారచక్రంలో తిరగడం తప్పదు. అందుచేత మహావీరుడయిన వాడెవ్వడైననూ తనకు శత్రువయిన మనోవృత్తులపట్ల ఏమాత్రం ఏమరుపాటు లేకుండా ఉండాలి. మనస్సును తోచినట్లు తిరుగనీయరాదు. జీవుడు శ్రీహరి పాదధ్యానమనే ఆయుధంతో మనస్సును గెలిచినట్లయితే పరతత్త్వాన్ని అందుకుంటాడు అని బ్రాహ్మణుడయిన భరతుడు పలుకగానే, అతని మహిమకు ఆశ్చర్యపడి అతనికి నమస్కారంచేసి రాజయిన రహూగణుడు ఇలా అన్నాడు.

**విశే :** 1) 16 తత్త్వాలంటే పంచమహాభూతాలు, దశేంద్రియాలు, మనస్సు. మనస్సు బద్ధ జీవనానికి కారణం. ప్రబలమయిన మనస్సు జీవుని కప్పివైచి సంసార సాగరమనే తరంగాలలో తోసివేస్తుంది.

**ఉ.** **కారణవిగ్రహంబు నురుకాయము నీ యవధూతవేషమున్**
**భూరిధరామరత్వమును బూర్వసమాగమ మాత్మభావముం**
**జారువిహార మత్యతుల శాంతి గుణంబును గూఢవర్తనం**
**బారయఁగల్గు నీకు ననయంబును మ్రొక్కెదఁబెక్కుభంగులన్.** **156**

ప్రతి : ఆరయన్= పరిశీలింపగా; కారణవిగ్రహంబున్= కారణ జన్మమైన శరీరం; ఉరుకాయమున్= నిండైన దేహం; ఈ అవధూతవేషమున్= ఈ అవధూతవేషం; భూరిధరా+అమరత్వమును= ఈ గొప్ప బ్రాహ్మణత్వం; పూర్వసమాగమము= పూర్వపు కలయిక; ఆత్మభావమున్= ఆత్మజ్ఞానం; చారు= అందమైన; విహారము= ప్రవర్తన; అతి+అతుల= మిక్కిలి సాటిలేని; శాంత గుణంబును= శాంతిగుణమూ; గూఢవర్తనంబు= రహస్యంగా వర్తించుట; కల్గు= కలిగిన; నీకున్= నీకు; అనయంబునున్= ఎల్లప్పుడును; పెక్కుభంగులన్= అనేకరీతుల; మ్రొక్కెదన్= నమస్కరిస్తాను.

**తా :** కారణజన్మమైన ఈ నిండైన విగ్రహం, ఈ అవధూతవేషం, ఈ బ్రాహ్మణత్వం, జన్మాంతర సమాగతమైన ఈ ఆత్మజ్ఞానం, ఈ స్వేచ్ఛావిహారం, సాటిలేని ఈ శాంతగుణం, ఈ విధమైన రహస్య ప్రవర్తనం కలిగిన నీకు సదా నమస్కరిస్తున్నాను.

**మ. జ్వరితార్తుండగు రోగి కౌషధ మతీష్టంబైన చందంబునన్**
**ధరలో నాతపతప్తదేహి గడుశీతంబైన తోయంబునున్**
**గరిమంగోరినరీతి నెంతయు నహంకారాహిదష్టుండనై**
**పరఁగున్ నాకును నీ వచోఽమృతము దప్పన్ మందు వేఱున్నదే? 157**

ప్రతి : జ్వరిత+ఆర్తుండు+అగు= జ్వరంతో బాధపడేవాడైన; రోగికిన్= జబ్బు కలవాడికి; ఔషధము= మందు; అతి+ఇష్టంబు+ఐన= మిక్కిలి ప్రీతికరమైన; చందంబునన్= విధంగా; ధరలోన్= లోకంలో; ఆతపతప్తదేహి= ఎండలో తాపం చెందినవాడు; కడు= మిక్కిలి; శీతంబు+ఐన= చల్లనిదయిన; తోయంబునున్= నీటిని; గరిమన్= అధికంగా; కోరినరీతిన్= కోరుకొన్న విధంగా; ఎంతయున్= మిక్కిలి; అహంకార+అహిదష్టుండను+ఐ= అహంకారమనే పాముచే కరవబడినవాడనై; పరగున్+నాకును= ప్రవర్తిల్లు నాకు; నీవచస్+అమృతము= నీ పలుకులనే అమృతం; తప్పన్= తప్ప; మందు= ఔషధం; వేఱు+ఉన్నదే= మఱొకటి ఉన్నదా?

**తా :** జ్వరంతో బాధపడే రోగికి రుచికరమైన మందు దొరికినట్లు, ఎండలో తపించిన వానికి చల్లని నీరు సమకూరినట్లు అహంకారమనే పాముకాటుకు గురి అయిన నాకు నీ మాటలనే అమృతం ప్రాప్తించింది. ఇంతకంటె నాకు ఇంకో ఔషధ ఎందుకు?

**ఆ. విప్రవర్య! నేను వేడ్కతో నా సంశ, యంబులెల్ల నిన్ను నడిగి తెలియఁ**
**దలఁచి యున్నవాఁడఁ; దప్పక యెఱిఁగింపు, ముచితవృత్తిఁదత్త్వయోగమెల్ల. 158**

ప్రతి : విప్రవర్య= బ్రాహ్మణులలో శ్రేష్ఠుడా; నేను= రహూగణుడను పేరుగల నేను; వేడ్కతోన్= కుతూహలంతో; నాసంశయంబులు+ఎల్లన్= నా సందేహాలన్నింటిని; నిన్నున్+అడిగి= నిన్నడిగి; తెలియన్+తలఁచి+ఉన్నవాఁడన్= నివారించుకోవాలని కుతూహలపడుతున్నాను; తప్పక= కాదనకుండా; ఉచితవృత్తిన్= తగినరీతిలో; తత్త్వయోగము+ఎల్లన్= అధ్యాత్మతత్త్వమంతా; ఎఱిఁగింపుము= తెలియజెప్పుము.

**తా :** బ్రాహ్మణశ్రేష్ఠుడా! నా సందేహాలన్నిటినీ నిన్ను అడిగి తెలుసుకొని నివారించుకోవాలని కుతూహలపడుతున్నాను. దయచేసి నాకు అధ్యాత్మతత్త్వాన్ని సమగ్రంగా వివరించు.

**వ. అని యడిగిన యా రాజునకు విప్రుండిట్లనియె. 159**

**ప్రతి :** అని+అడిగినన్= అని అడుగగా; ఆ రాజునకున్= రహూగణుడనే ఆ రాజుకు; విప్రుండు= బ్రాహ్మణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** ఈ విధంగా అడిగిన ఆ రాజుతో భరతుడు ఇలా అన్నాడు.

**తే. కానవచ్చిన ఫలములు కర్మమూల, ము లగుటను జేసి సంసారములను జిత్త**
**మెపుడు వర్తించుచుండఁగా నెఱుఁగలేవు, తత్త్వయోగంబు మిగుల నిత్యంబటంచు. 160**

**ప్రతి :** కానవచ్చిన ఫలములు= కనిపించే ఫలితాలు; కర్మమూలములు+అగుటను+చేసి= పూర్వకర్మల కారణం కలిగినవి అగుట వలన; సంసారములను= సంసార బంధాలను; చిత్తము+ఎపుడు= మనసెపుడూ; వర్తించుచుండన్+కాన్= అనుసరిస్తున్న కారణంగా; తత్త్వయోగంబు= తత్త్వయోగం; మిగులన్= మిగుల; నిత్యంబున్+అట+అంచున్= నిత్యమని; ఎఱుఁగలేవు= తెలుసుకోలేవు.

**తా :** రాజా! పూర్వజన్మలలో చేసిన కర్మలనుబట్టి ఫలితాలు కలుగుతుంటాయి. మనస్సు సంసారబంధంలో చిక్కుకొని ఉన్నంతవరకు తత్త్వయోగం నిత్యమైనదని తెలుసుకోలేవు.

**వ. మఱియు నీ వసుంధర నున్న చరణంబులకు నెక్కుడు జంఘలు నా మీఁద జానువులా పొదవున నూరువు లందులకు నుపరిప్రదేశంబున మధ్యం బట మీఁద నుర మందులకు నెక్కువ కంఠం బఁట మీఁద స్కంధం బందుల దారు వా దారువున శిబిక శిబిక యందు రాజు ననియెడి యభిమానంబు గలిగి నీ వున్న వాఁడ విట్టి శోచ్యులై కష్టదశం బొందిన జనుల దయలేక నిగ్రహించి నీవు ప్రజాపాలనంబు సేయుచున్నవాఁడ; నను గర్వంబున మా వంటి మహాత్ముల సభలలోనం బూజ్యుండవుగాక యున్నవాఁడ; వీ స్థావరజంగమంబులకు నివాసస్థానంబు వసుంధరయైన చందంబున సత్క్రియలచేత నెఱుంగం దగిన జగత్కారణంబైన తత్త్వంబు నెఱింగించెదఁ; బరమాణు సముదయం బీ ధరిత్రియైన చందంబున నవిద్యామనంబులచేతం గల్పితంబయిన కృశస్థూల బృహ దణుసద సజ్జీవాజీవ ద్రవ్య స్వభావాశయ కాలనామబుద్ధి రూపంబైన మాయచే జగత్తు రెండవదియై కల్పింపంబడియె; బాహ్యాభ్యంతరంబులం గలిగి స్వప్రకాశంబై భగవచ్ఛబ్ద వాచ్యంబును విశుద్ధంబును బరమార్థంబును జ్ఞానరూపంబునునైన బ్రహ్మం బొకటియే సత్యంబు; జగత్తసత్యం బగు నని పలికి మఱియును. 161**

**ప్రతి :** మఱియున్= అంతేగాక; ఈ వసుంధరన్+ఉన్న= ఈ భూమి ఆధారంగా ఉన్న; చరణంబులకున్= పాదాలకు; ఎక్కుడు= పైభాగంలో; జంఘలు= పిక్కలు; ఆ మీఁదన్= ఆ పిక్కలమీద; జానువులు= మోకాళ్లు; ఆ పొదవునన్= ఆపై ఊరువులు= తొడలు; అందులకున్+ఉపరిప్రదేశంబునన్= దానికి పై ప్రదేశంలో; మధ్యంబు= నడుము; అటమీఁదన్= దానిపై; ఉరము= వక్షం; అందులకున్+ఎక్కువ= దానికి పైభాగాన; కంఠంబు= కంఠము (గొంతు); అటమీఁదన్= దానిపై; స్కంధంబు= మూపు; అందులన్= దానిపై; దారువు= కఱ్ఱ; ఆ దారువునన్, శిబిక= పల్లకి; శిబిక+అందున్= పల్లకియందు; రాజున్+అనియెడి= రాజుననే; అభిమానంబు+కలిగి= అహంకారం కలిగి; నీవు+ఉన్నవాఁడవు= నీవున్నావు; ఇట్టి= ఈ విధమైన; శోచ్యులు+ఐ= దుఃఖపడువారై; కష్టదశన్+పొందిన= కష్టస్థితిని చెందిన; జనులన్= జనులను;

దయలేక= ఏమాత్రము కరుణలేక; నిగ్రహించి= త్రోపాడి; నీవు= నీవు; ప్రజాపాలనంబు+చేయుచున్నవాఁడన్= ప్రజలను పరిపాలిస్తున్నాను; అను= అనే; గర్వంబునన్= గర్వంతో; మావంటి మహాత్ముల సభలలోనన్= మాలాంటివారున్న సభలలో; పూజ్యుండవు+కాక= పూజ్యత్వంలేక; ఉన్నవాఁడవు= ఉంటున్నావు, ఈ స్థావరజంగమంబులకున్= ఈ సమస్త జీవరాసులకు; నివాసస్థానంబు= ఉనికిపట్టు; వసుంధర+ఐన చందంబునన్= భూమి అయిన విధంగా; సత్క్రియలచేతన్= మంచి పనులచేత; ఎఱుంగన్+తగిన= తెలియదగిన; జగత్+కారణంబు+ఐన= సృష్టికి కారణమయిన; తత్త్వంబున్= తత్త్వాన్ని; ఎఱింగించెదన్= తెలియజేస్తాను; పరమాణు సముదాయంబు= పరమాణువుల సమూహం; ఈ ధరిత్రి+ఐన చందంబునన్= ఈ భూమి అయినట్లు; అవిద్యామనంబులచేతన్= అవిద్య మనసు కారణంగా; కల్పితంబు+అయిన= కల్పింపబడిన; కృశ= సన్నము; స్థూల= లావు; బృహత్= పెద్దది; అణు= చిన్నది; సత్= ఉన్నది; అసత్= లేనిది; జీవ= జీవుడు; అజీవ= అజీవులు; ద్రవ్య= ద్రవ్యము; స్వభావ= వేరు వేరు స్వభావాలు; ఆశయ= ఆశయాలు; కాల= కాలభేదాలు; నామ= నామభేదాలు; బుద్ధి= బుద్ధి భేదాల; రూపంబు+ఐన= రూపం ధరించిన; మాయచేన్= మాయవల్ల; జగత్తు= జగము; రెండవది+ఐ= రెండవదిగా; కల్పింపన్+పడియెన్= కల్పింపబడినది; బాహ్య+అభ్యంతరంబులన్+కలిగి= లోపల; వెలుపల అనే భేదాలు కలిగి; స్వప్రకాశంబు+ఐ= తనంత తాను ప్రకాశించేదియై; భగవత్+శబ్ద వాచ్యంబును= భగవంతుడనే మాటతో పిలువబడేది; విశుద్ధంబును= పరిశుద్ధమయినది; పరమార్థంబును జ్ఞానరూపమయినదియు; ఐన= ఐనటువంటి; బ్రహ్మంబు+ఒకటి+ఏ= బ్రహ్మమొకటే; సత్యంబు= సత్యమయినది; జగత్తు= మాయచే నిండిన ఈ ప్రపంచము; అసత్యంబు+అగున్+అని= అసత్యమవుతుందని; పలికి= తెలియజేసి; మఱియును= ఆపై.

**తా :** ఈ భూమి ఆధారంగా నా పాదాలు ఉన్నాయి. పాదాలకు పై భాగంలో పిక్కలు, ఆ పైన మోకాళ్లు, ఆ పైన తొడలు, ఆ పైన నడుము, ఆ పైన వక్షం, ఆ పైన కంఠం, ఆ దాపున మూపు, ఆ మూపుపైన పల్లకి బొంగు ఉన్నది. ఆ బొంగు ఆధారంగా పల్లకి ఉన్నది. పల్లకిలో నీవున్నావు. నేను రాజుననే అహంకారం నీలో ఉన్నది. కష్టపడేవారిని చూచి వారిపట్ల దయ చూపడం మాని వారిని బెదరించి, పీడించి ప్రజాపాలనం చేస్తున్నావు. నేను పరిపాలిస్తున్నాను. ఇతరులందరు నాచేత పరిపాలింపబడుతున్నారనే అహంకారం నీకుండడంవల్ల మావంటి వారున్న సభలలో నీకు పూజ్యత లేదు.

ఈ సమస్త జీవరాసులకు భూమి నివాసస్థానం. అందువల్ల ప్రపంచసృష్టికి కారణమయిన తత్త్వం తెలియజేస్తున్నాను. ఈ భూమి పరమాణువుల సమూహంతో ఏర్పడింది. అవిద్య మనస్సుల కలయికచే ఈ జగత్తు పుట్టింది. ఈ అవిద్య కారణంగా జగత్తు రెండవది అయింది. ఇట్లా ఒకటి రెండుగా కల్పింపబడడం మాయ. ఈ కల్పన అనేకవిధాలు. సన్నం, లావు, పెద్దది, చిన్నది, ఉన్నది, లేనిది. ఇట్లే జీవుడు, అజీవుడు, ద్రవ్యములను భేదాలూ, నామభేదాలూ, వేరు వేరు స్వభావాలూ, ఆశయాలూ ఈ మాయవల్లనే కాలభేదాలు కలిగాయి. తనంతట తాను ప్రకాశించేదీ, భగవంతుడనే మాటతో పిలువబడేదీ, పరిశుద్ధమయినదీ, జ్ఞానరూపమయినదీ బ్రహ్మమొక్కటే సత్యం. జగత్తు అసత్యం అని విశదీకరించి మరల భరతుడు ఈ లాగున అన్నాడు.

**విశే :** ఈ వచనం చాలా గంభీరమైనది. ఇది అద్వైతతత్త్వాన్ని ప్రతిపాదించే పరిభాషలుగల వచనం.

**సీ.** **ధరలోన బ్రహ్మంబుఁదపమున దానంబు లను గృహధర్మంబులను జలాగ్ని**
**సోమసూర్యులచేత శ్రుతులచే నైనను బరమభాగవతుల పాదసేవఁ**
**బొందినమాడ్కిని బొందంగరాదని పలుకుదు రార్యులుఁబరమమునులు**
**ఘనతపోబాహ్యసౌఖ్యములకు విముఖులునై పుణ్యులు హరిగుణానువాద**

**తే. మోదితాత్ములు నగు బుధపాదసేవ, ననుదినంబును జేసిననంతమీఁద**
**మోక్షమార్గంబునకును బద్మాక్షునందుఁ, బట్టువడి యుండు నెప్పుడుఁబరఁగ బుద్ధి. 162**

**ప్రతి :** పరమభాగవతుల పాదసేవన్= పరమ భాగవతుల పదసేవలచే; పొందినమాడ్కిని= పొందిన విధంగా; ధరలోనన్= భూమియందు; బ్రహ్మంబున్= బ్రహ్మమును; తపమునన్= తపంవల్ల; దానంబులను= దానంవల్ల, గృహధర్మంబులను= గృహస్థా శ్రమధర్మముల చేతను; జల+అగ్ని సోమసూర్యులచేతన్= నీరు, నిప్పు, చంద్రుడు, సూర్యుడు మొదలగువానిచేత; శ్రుతులచేన్+ఐననున్= వేదములచేతను; పొందంగన్‌రాదు= పొందుటకు సాధ్యపడదు; అని= అని; ఆర్యులున్= పెద్దలును; పలుకుదురు= వచింతురు; పరమమునులు= మహనీయులయిన మునులు; ఘన తపో బాహ్య సౌఖ్యములకున్= గొప్పది అయిన తపస్సుకాక ఇతర విషయాలలో సుఖాలనుభవించుటకు; విముఖులు+ఐ= ఇష్టపడనివారయిన; పుణ్యులు= పుణ్యస్వభావులు; హరిగుణ+అనువాదమోదిత+ఆత్ములును+అగు= నారాయణుని గుణకీర్తనముల నానందము పొందువారయిన; బుధపాదసేవన్= భాగవతుల పాదసేవను; అనుదినంబును+చేసిన= ప్రతిరోజు చేసిన; అంతమీఁదన్= ఆపై; మోక్షమార్గంబునకును= ముక్తిపథానికి; పద్మాక్షునందున్= పద్మములవంటి కన్నుల వానియందు; బుద్ధి= బుద్ధి; పరఁగన్= ఒప్పుచుండగా; ఎప్పుడు= సతతము; పట్టువడి+ఉండున్= మనస్సులో నాటుకొని ఉంటుంది.

**తా :** పరమ భాగవతుల పాదసేవవల్ల లాభించినంత సులభంగా బ్రహ్మం తపస్సువలనగానీ, దానంవల్లగానీ, గృహస్థాశ్రమ ధర్మంవల్లగానీ, స్నానాలవల్లగానీ, హోమాలవల్ల గానీ, సూర్యచంద్రోపాసనంవల్లగానీ, వేదాధ్యయనంవల్ల గానీ లభించదు. భగవద్భక్తుల చరణసేవయే పరమబ్రహ్మప్రాప్తికి సులభమార్గం అని ఆర్యులంటారు. ఘనతపోబాహ్యసౌఖ్యాలకు విముఖులై శ్రీమన్నారాయణుని సద్గుణ కీర్తనలో సంతోషమనుభవించే భాగవతులను అనుదినమూ ఆరాధిస్తే మన బుద్ధి మోక్షమార్గంవైపు పయనిస్తుంది. నారాయణునిలో నెలకొని ఉంటుంది.

**వ. నరేంద్రా! యేను పూర్వంబున భరతుండను రాజను; సర్వసంగపరిత్యాగంబు సేసి భగవదారాధనంబు సేయుచు మృగంబుతోడి స్నేహంబు కతన మృగంబనై పుట్టియు నందును హరిభక్తి దప్పకుండిన కతంబున నిప్పుడు మనుష్యుండనై మనుష్య సంసర్గంబును బాసి యేకాకినై చరియించుచున్నవాఁడ; నరుండు వృద్ధసంసేవం జేసి సంసారమోహంబును బాసి హరిధ్యాన కథలచే లబ్ధజ్ఞానుండై పుండరీకాక్షునిం బూజించుచుం బరలోకంబునుంబొందునని పలికి విప్రుండు మఱియు నిట్లనియె. 163**

**ప్రతి :** నర+ఇంద్రా!= రాజా!; ఏను= నేను; పూర్వంబునన్= పూర్వజన్మంబున; భరతుండు+అను= భరతుడనే పేరుగల; రాజను= నీలాగా ప్రజాపాలకుడను; సర్వసంగపరిత్యాంబు+చేసి= అన్నిరకాల సాంగత్యాలను వదలిపెట్టి; భగవత్+ ఆరాధనంబు+చేయుచున్= భగవంతుని ఆరాధించుటలో నిమగ్నుడనై; మృగంబుతోడి స్నేహంబుకతనన్= జింకపట్ల గల సంప్రీతిచేత; మృగంబను+ఐ= జింకపిల్లనై; పుట్టియున్= జన్మించియు; అందునున్= ఆ జన్మలో; హరిభక్తిన్+తప్పకుండిన కతంబునన్= విష్ణుభక్తిని వదలకుండిన కారణంబున; ఇప్పుడు= ఈ జన్మంలో; మనుష్యుండను+ఐ= మానవరూపం దాల్చినవాడనయి; మనుష్య సంసర్గంబును+పాసి= మానవులతోడి సంబంధాన్ని వదలిపెట్టి; ఏకాకిని+ఐ= ఒంటరివాడనై; చరియించుచున్+ఉన్నవాఁడన్= తిరుగుతున్నవాడను; నరుండు= మానవుడు; వృద్ధసంసేవన్+చేసి= పెద్దవారికి సేవలు చేసి; సంసార మోహంబును+పాసి= సంసారంపట్ల వ్యామోహాన్ని వదలిపెట్టి; హరిధ్యాన కథలచేన్= విష్ణు ధ్యానకథలతో;

లబ్ధ జ్ఞానుండు+ఐ= పొందిన జ్ఞానం కలవాడై; పుండరీక+అక్షునిన్= పద్మాలవంటి కన్నులుగలవానిని; పూజించుచున్= అర్చించుచు; పరలోకంబునున్= పరలోకాన్ని; పొందును= చేరుకొనును; అని పలికి= అంటూ సమాధానం చెప్పి; విప్రుండు= బ్రాహ్మణాకారుడయిన భరతుడు; మఱియున్= ఆపై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** నరేంద్రా! నేను పూర్వజన్మలో భరతుడనే రాజును. నేను సర్వసంగపరిత్యాగం చేశాను. తరువాత భగవంతుని భక్తితో భజించాను. చివరకు ఒకానొక జింకపిల్ల మీద మమత పెంచుకున్నాను. ఆ కారణంగా లేడిగా జన్మనెత్తాను. అయితే ఈ జన్మలో కూడా హరిభక్తి విడనాడలేదు. ఆ పుణ్యవిశేషంతో నాకు మరల మానవజన్మ లభించింది. నేను సర్వసంగ పరిత్యాగినై ఇపుడు ఒంటరిగా తిరుగుతున్నాను. నరుడయినవాడు పెద్దలను సేవించడంవల్ల క్రమంగా సంసారం మీది వ్యామోహాన్ని వదలిపెడతాడు. శ్రీహరిని సదా ధ్యానించడం వల్లనూ, శ్రీహరికథలు వినడం వల్లనూ అతడు జ్ఞానవంతుడవుతాడు. చివరకు శ్రీమన్నారాయణుని పూజిస్తూ పరమపదం చేరుకొంటాడు అని పలికి పరమభాగవతుడైన భరతుడు మరలా ఈ లాగున అన్నాడు.

**విశే :** ఈ పద్యంలో వర్ణితమయిన సన్నివేశం మహత్తరమైనది. **'వినా మహత్ పాదరజోఽభిషేకమ్'** మహాభాగవతుని పాదపద్మధూళిని శిరస్సుపై దాల్చనిదే మనుజుడు పూర్ణత్వం పొందజాలడు. భరతుడు నిష్ఠాపూర్వకమయిన భక్తియుత జీవనం గడిపేవాడయినా జింకపట్ల అమితాసక్తుడయినప్పుడు గురుదేవుని ఆశ్రయించలేదు. అందువల్లనే, జింకపట్ల గాఢానురక్తి ఏర్పడింది. ఆధ్యాత్మిక విధులను మరవడంవల్ల పతనం తప్పలేదు. దుష్టసాంగత్య భయంతో నేను ప్రచ్ఛన్నంగా జీవిస్తున్నానని చెప్పాడు. హరిసేవవల్లే పూర్వజన్మస్మృతి తనకు కలిగిందని భరతుడు చెప్పడం సరియైనదే. మహాభక్తుల సాంగత్యంవల్ల పూర్ణజ్ఞానం, ఆ జ్ఞానం కారణంగా మిథ్యాసాంగత్య ఖండనం. ఆపై భక్తుల సాంగత్యం ద్వారా శ్రవణ కీర్తనాదుల కారణంతో భగవత్సేవానురక్తి కలుగుతుంది.

**సీ. ధరణీశ! మాయచేతను దాఁటఁగా రాని పథమునఁ బెట్టంగఁ బడ్డ జీవుఁ**
**డెలమిమై గుణకర్మములఁ జేయుచును లాభ మాశించి తిరుగు బేహారి మాడ్కి**
**ఫల మపేక్షించుచుఁ బాయక జీవుండు సంసారగహన సంచారి యగుచు**
**ననవరతము నుండు నా మహావనమందుఁ గామలోభాది తస్కరులు గూడి**

**తే. ధరణి విజితేంద్రియుఁడు గాని నరునిఁబట్టి, ధర్మ మనియెడి యా మహాధనము నెల్ల**
**నరసి కొనిపోవుచుండుదు రనుదినంబుఁ, గాన సంసారమందు నాకాంక్ష వలదు. 164**

**ప్రతి :** ధరణీ+ఈశ= భూపతీ!; మాయచేతను= మాయచేత; దాఁటన్+కాన్‌రాని= దాటడానికి వీలుకాని; పథమునన్= మార్గంలో; పెట్టంగన్+పడ్డ= నిలకడగా ఉండేలా చేయబడ్డ; జీవుఁడు= జీవుడు; ఎలమిమైన్= ప్రీతితో; గుణకర్మములన్+ చేయుచును= సత్త్వాది గుణములతో గూడిన పనులు చేయుచు; లాభమున్+ఆశించి= ప్రయోజనం కోరి; తిరుగు= సంచరించే; బేహారిమాడ్కిన్= వాణిజ్యం చేసేవానిలా; ఫలము+అపేక్షించుచున్= ఫలాసక్తి కలవాడై; పాయక= మానక; జీవుఁడు= జీవుడు; సంసారగహన సంచారి+అగుచున్= సంసారమనే అడవిలో తిరిగేవాడగుచూ; అనవరతమున్= ఎల్లప్పుడూ; ఉండున్= ఉండును; ఆ మహావనమందున్= ఆ మహావనంలో; కామలోభ+ఆది+తస్కరులు+కూడి= కామం, లోభం మొదలయిన దొంగలు కలిసి; ధరణిన్= లోకంలో; విజిత+ఇంద్రియుఁడు+కాని= ఇంద్రియాలను జయించలేని; నరునిన్+పట్టి= మనిషిని పట్టి; ధర్మము+అనియెడి= ధర్మమనే; ఆ మహాధనమున్+ఎల్లన్= ఆ ధనాన్ని అంతయు;

అనుదినంబున్= ప్రతిరోజూ; అరసికొనిపోవుచున్+ఉండుదురు= దోచుకొని పోతూ ఉంటారు; కానన్= కావున; సంసారము+అందున్= సంసారంపట్ల; ఆకాంక్ష= కోరిక; వలదు= వద్దు.

**తా :** భూపాల! మాయవల్ల దృఢమైన సంసారబంధాలలో బంధింపబడిన జీవుడు ప్రయోజనం ఆశించి వర్తకునిలాగా లాభదృష్టితో కర్మలు ఆచరిస్తూ సంచరిస్తాడు. సంసారం ఒక పెద్ద అడవి వంటిది. ఆ అడవిలో కామం, లోభం మొదలయిన దొంగలు తిరుగుతుంటారు. వారు ఇంద్రియాలను జయించలేని మనిషిని చుట్టుముట్టి పట్టుకుంటారు. దాచుకొన్న ధర్మమనే మహాధనాన్ని వాడు దోచుకుపోతాడు. అందువల్ల సంసారంపట్ల కోరికలు పెంచుకోకూడదు.

**విశే :** ఈ పద్యం ఆధునిక జీవితానికి అద్దం పడుతుంది. సుఖపడడంకోసం ధనసంపాదన. ఆ సంపాదనలో కష్టపరంపరలు. ఆ పరంపరలోనే చనిపోవడం. సుఖపడడానికి సమయంలేదే అని పరితాపం. సంసారమనే అడవిలో భ్రమణం. కామాదులు కోరికల్ని ప్రేరేపించి అల్పమైన శారీరక సుఖానికి దారి తీస్తాయి. ఇంద్రియాలు ప్రకోపిస్తాయి. ధర్మధనం కరిగిపోతుంది. అందువల్ల సంసారాపేక్ష తగదని సారాంశం.

**క. అరయఁగ సంసారాటవిఁ, దరలక యీ పుత్త్రమిత్త్రదారాదు లనం**
**బరఁగుచు నుండెడు వృకములు, పరువడి నరబస్తములను భక్షించువడిన్. 165**

**ప్రతి :** అరయన్+కన్= పరిశీలించగా; సంసార+అటవిన్= సంసారమనే అడవిలో; తరలక= వెనుదిరగక; ఈ పుత్రమిత్రదార+ఆదులు+అనన్= కొడుకులు, స్నేహితులు, భార్య మొదలయిన వారనగా; పరఁగుచున్= ఒప్పుచు; ఉండెడు= ఉన్నట్టి; వృకములు= తోడేళ్ళు; పరువడి= క్రమంగా; నరబస్తములను= నరులనే మేకపోతులను; వడిన్= శీఘ్రముగా; భక్షించున్= తింటాయి.

**తా :** సంసారం అడవివంటిదని చెప్పాను. ఆ అడవిలో కొడుకులూ, స్నేహితులూ, భార్యలూ మొదలయిన వారందరునూ, తోడేళ్ళు మేకలను భక్షించే విధంగా పురుషుని పీక్కుతింటారు.

**తరల. మలసి సంసృతిఘోరకాననమందిరమ్ముల నెల్లచోఁ**
**జెలఁగి గుల్మలతాతృణాదులచేత గహ్వరమైన ని**
**శ్చలనికుంజములందు దుర్జనసంజ్ఞలం గల మక్షికం**
**బుల నిరోధము దన్ను సోఁకినఁబొందుచుందురు దుర్దశన్. 166**

**ప్రతి :** మలసి= వ్యాపించి; సంసృతి ఘోరకానన మందిరమ్ములన్= సంసారమనే భయంకరమయిన అరణ్యమందిరాలలో; ఎల్లచోన్= అన్నియెడల; చెలఁగి= విజృంభించి; గుల్మలతాతృణ+ఆదులచేతన్= పొదలు, తీగలు, గడ్డి మొదలయిన వాటితో; గహ్వరము+ఐన= చొరరానిదైన; నిశ్చలనికుంజములందున్= కదలని పొదరిండ్లయందు; దుర్జనసంజ్ఞలన్+కల= దుష్టులనే పేళ్ళుగల; మక్షికంబుల= ఈగలయొక్క; నిరోధము= అడ్డగింపు; తన్ను సోఁకినన్= తన్ను స్పృశించగా; దుర్దశన్= మిక్కిలి చెడ్డదైన దశను; పొందుచుందురు= లోనవుతుంటారు.

**తా :** సంసారం భయంకరమయిన అడవిలోని మందిరం వంటిది. ఆ మందిరం చుట్టూ తీగలూ, పొదలూ దట్టంగా అల్లుకుని ఉన్నట్లు జీవి చుట్టూ ఆపదలుంటాయి. దుర్జనులనే ఈగలు జీవులను బాధిస్తుంటాయి. ఆ కారణంగా జీవులు ఆపదలకు లోనవుతారు.

**ఆ. మఱియు నీ గృహస్థమార్గంబునందెల్ల, విషయములను బొంది విశ్వమెల్లఁ**
**గడఁకతోడ నిట్లు గంధర్వనగరంబుఁ, గాఁదలంచి మిగుల మోదమందు. 167**

**ప్రతి :** మఱియున్= అంతేగాక; ఈ గృహస్థ మార్గంబునందున్= ఈ గృహస్థాశ్రమంలో; ఎల్ల విషయములను+పొంది= అన్నివిధాలైన సుఖాలకు అలవాటుపడి; విశ్వము+ఎల్లన్= ప్రపంచమంతా; కడఁకతోడన్= ఉత్సాహంతో; ఇట్లు= ఈ విధంగా; గంధర్వనగరంబున్+కాన్= గంధర్వనగరంగా; తలంచి= భావించి; మిగులన్= మిక్కిలి; మోదమున్+అందున్= సంతోష పడుతుంటాడు.

**తా :** గృహస్థాశ్రమంలో ఉన్నవాడు ఇంద్రియ సుఖాలకు అలవాటుపడతాడు. వాడికి విశ్వమంతా ఒక గంధర్వనగరంగా కనిపిస్తుంది. ఆ సుఖాలన్నీ శాశ్వతం అనుకొంటూ సంతోషపడుతుంటాడు.

**విశే :** ఆకాశంలో మబ్బులున్నప్పుడు తదేకదృష్టితో చూస్తుంటే అనేక ఆకారాలు కనబడతాయి. మిద్దెలు, గోపురాలు, ఆలయాలు, కోటలు కనబడతాయి. అవన్నీ మబ్బుల ఆకారాలే. నిజం కావు. భార్యలు, బిడ్డలు మబ్బుల ఆకారాలే. వీటిని చూచి సంతోషపడడం నైజం.

**ఆ. మరగి కాననమునఁగొఱవిదయ్యముఁగాంచి, యగ్నిఁగోరి వెంట నరుగు మాడ్కిఁ**
**గాంచనంబు గోరి కలవారి యిండ్ల పం, చలను దిరుగు నరుఁడు చలనమంది. 168**

**ప్రతి :** మరగి= ఆసక్తితో; కాననమునన్= అడవిలో; కొఱవిదయ్యమున్+కాంచి= కొరవి దయ్యాన్నిచూచి; అగ్నిన్+కోరి= నిప్పును కోరి; వెంటన్= దానివెంబడి అరుగు మాడ్కిన్= వెళ్ళేవిధంగా; కాంచనంబు+కోరి= ధనంకోసం; కలవారి యిండ్ల పంచలను= ధనవంతుల ఇళ్లచుట్టూ; నరుఁడు= మానవుడు; చలనము+అంది= వణుకుతూ; తిరుగున్= సంచరిస్తాడు, పరిభ్రమిస్తాడు.

**తా :** అడవిలో రాత్రిపూట కొరవి దయ్యాన్ని చూచి ఏదో నిప్పు అనే భ్రాంతితో దానికోసం దానివెంటబడి తిరిగినట్లు ధనంకోసం భాగ్యవంతుల ఇళ్లచుట్టూ వణకుతూ ఊరకే రాకపోకలు చేస్తూ ఉంటాడు.

**విశే :** అడవిలో రాత్రిపూట కొరవి దయ్యాలు తిరుగుతుంటాయి. కంటికి నిప్పురవ్వలవలె భ్రాంతి కలిగిస్తాయి. నిప్పుకోసం వాటి వెంబడి తిరిగితే దారి తప్పడం, శ్రమపడడం సంభవిస్తుంది. ఆపదలే మిగులుతాయి. ధనవంతుల దగ్గర గొడ్డుచాకిరి తప్ప ఇతర లాభములు లేవు. వారి ఎత్తుగడలు కాలాంతరంలో తెలుస్తాయి.

**ఆ. బహుకుటుంబి యగుచు బహుధనాపేక్షచే, నెండమావులఁగని యేఁగు మృగము**
**కరణిఁబ్రేమఁజేసి పరువులు వాఱుచు, నొక్కచోట నిలువకుండు నెపుడు. 169**

**ప్రతి :** బహుకుటుంబి+అగుచున్= పెద్ద కుటుంబం కలవాడవుతూ; బహుధన+అపేక్షచే= ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆరాటంతో; ఎండమావులన్+కని= ఎండమావులను చూచి; ఏఁగు= పరువెత్తే; మృగము కరణిన్= మృగంలాగా (లేడిలాగ); ప్రేమన్+చేసి= ప్రేమ కారణంగా; పరువులు+పాఱుచున్= పరుగెత్తుతూ; ఒక్కచోటన్= ఒక తావులోకూడ; ఎపుడున్= సంతతం; నిలువక+ఉండున్= నిలువకుండా పరుగెత్తుతుంటారు.

**తా :** కుటుంబాన్ని పెంచుకుని దానిని పోషించడంకోసం ధనం సంపాదించాలనే ఆరాటంలో ఎండమావుల వెంబడి పరుగెత్తే మృగంలాగా నరుడు పరుగులు పెడుతూ తిరుగుతుంటాడు.

విశే : ఎండమావులలో నీరుండదు. ఆ ఎండమావుల వెంట పరువెత్తడం వల్ల అలసట, దప్పిక అధికమగునే గాని దప్పిక తీరదు.

**ఆ. మఱియు నొక్క చోట మత్తుఁడై పవన ర, జో హతాక్షుఁడగుచుఁజూపు దప్పి**
**దిక్కెఱుంగ కొండుదిశ కేగు పురుషుని, కరణిఁదిరుగు నరుఁడు నరవరేణ్య! 170**

ప్రతి : నరవరేణ్య!= రాజేంద్రా!; మఱియున్= మరియు; ఒక్కచోటన్= ఒకతావులో; మత్తుఁడు+ఐ= మైమరచి; పవన రజస్‌హత+అక్షుఁడు+అగుచున్= సుడిగాలి వలన రేగిన దుమ్ము కొట్టబడిన కన్నులు కలవాడగుచు; చూపు+తప్పి= కంటిచూపు చెదరిపోగా; దిక్కు+ఎఱుంగక= దిక్కు తెలియక; ఒండుదిశకున్+ఏగు= మరొక దిక్కుకు వెడలే; పురుషుని కరణిన్= నరునివలె; నరుఁడు= మానవుఁడు; తిరుగున్= తిరుగుతుంటాడు.

తా : రాజశ్రేష్ఠా! నరుడు ఒకచోట మత్తుడై గాలికి రేగిన దుమ్ముచే కొట్టబడిన కన్నులు కలవాడై చూపు తప్పి దిక్కుతెలియక వెళ్లవలసిన దిక్కు కాక మరో దిక్కుకు వెళ్లేవానిలా తిరుగుతాడు.

**వ. మఱియు నొక్కచోట నులూక ఝిల్లీస్వనంబులతోడ సమానంబు లయిన శత్రురాజి తిరస్కారంబులకు దుఃఖపడుచు, నొక్క చోట క్షుధార్దితుండై యపుణ్య ఫలవృక్షంబుల నాశించు మాడ్కిఁ బాపకర్ములు ద్రవ్యహీనులు నగు వారి నాశ్రయించుచు, నొక్క యెడం బిపాసాతురుండై జలహీనంబయిన నదికిఁ జనినరీతి నిహపరదూరులైన పాషండుల సేవించుచు, మఱియు నొక్క ప్రదేశంబునం దగ్నిచేతం దప్తుండయిన వాఁడు దావాగ్నిం జేరి వ్యథ నొందురీతి నన్నార్థి యగుచు దాయాదులం జేరి దుఃఖించుచు, మఱియు నొక్కచోట పరబాధం జేసి మున్ను గానక రాజ్యాభిలాషం బ్రాణసఖులైన పితృపుత్త్రభ్రాతృ జ్యేష్ఠుల నైనను వధియించుచు, మఱియు శూరులచేతం గొట్టువడి సర్వధనంబును బోనాడి చింతాపరవశుండై దుఃఖించుచు నున్నంత గంధర్వనగర ప్రాయంబైన సంసార సుఖంబు ననుభవించి మోదించుచు, మఱియు నగారోహణంబు సేయు నరుండు కంటక పాషాణాదుల వలనం బాధాపీడితుం డగుచు దుఃఖించు చందంబున గృహాశ్రమోచిత మహానుష్ఠానంబునకు నుపక్రమించి వ్యసన కంటక శర్కరాపీడితుండై దుఃఖించుచు, నొక్కచోటన్ జఠరాగ్ని పీడితుండై కుటుంబంబు మీఁద నాగ్రహించుచు వనంబున నజగర గృహీతుండై నిగీర్ణుండైన చందంబున రాత్రి గృహాటవియందు నిద్రాపరవశుండై యెఱుంగక వర్తించుచు మఱియును వనంబునఁ దృణచ్ఛన్న కూపపతితుం డగుచు సర్పదష్టుండైన తెఱంగున సంసారియై దుర్జనుల చేత వ్యథిత హృదయుం డగుచు నంధుండై యజ్ఞానాంధ కూపంబునం బడుచు, నొక్కయెడ జుంటి తేనియకునై మక్షికాబాధ నత్యంత దుఃఖితుండయిన మాడ్కిని సంసారకాముండై పరదార ద్రవ్యాభిలాషి యగుచు భూపాలకుల చేతనైనను గృహపతిచేతనైనం దాడితుండయి నరకంబునం బడుచు, యౌవనంబున సంపాదించిన ద్రవ్యంబులు పరులచేతం బోనాడిన విధంబున శీతవాతాద్యనేక ప్రయాసలబ్ధంబైన ధనంబు వోనాడి సంసారి యతిచింతా క్రాంతుండై యుండు; మఱియును వనంబున లుబ్ధకులు సంసృష్టంబయిన యల్పామిషంబునకు నన్యోన్య వైషమ్యంబునం గలహించిన విధంబున సంసృష్టవ్యవహారియై యల్పద్రవ్యంబులకుం బోరాడుచుండు నని భూపాలునకు విప్రుండు సంసారాటవి తెఱంగెఱింగించి వెండియు నిట్లనియె. 171**

**ప్రతి :** మఱియున్= మరల; ఒక్కచోటన్= ఒకచోట; ఉలూక ఝిల్లీస్వనంబులతోడన్= గుడ్లగూబల, కీచురాళ్ళ కూతలతో; సమానంబులు+అయిన= సమానమయిన; శత్రురాజి తిరస్కారంబులకున్= విరోధుల తిరస్కారాలకు; దుఃఖపడుచున్= వగ చెందుచు; ఒక్కచోటన్= ఒకచోట; క్షుధా+అర్దితుండై= ఆకలిచే పీడింపబడినవాడై; అపుణ్య ఫలవృక్షంబులన్= మంచి ఫలములనీయని పిచ్చిచెట్లను; ఆశించు మాడ్కిన్= కోరిన విధంగా; పాపకర్ములు= పాపమే కృత్యంగా కలవారు; ద్రవ్యహీనులును+అగు= డబ్బులేనివారలగు; వారిన్+ఆశ్రయించుచున్= వారిని ఆశ్రయించుచు; ఒక్క+ఎడన్= ఒకచోట; పిపాసా+ఆతురుండు+ఐ= దప్పికగొన్నవాడయి; జలహీనంబు+అయిన= నీరులేని; నదికిన్+చనినరీతిన్= నదికి వెళ్ళినవిధంగా; ఇహపరదూరులు+ఐన= ఈ లోకానికి పరలోకానికి కానివారయిన; పాషండులన్= వేదబాహ్యులను; సేవించుచున్= కొలుచుచు; మఱియున్= అంతేగాక; ఒక్కప్రదేశంబునందు= ఒకచోట; అగ్నిచేతన్= నిప్పుచేత; తప్తుండు+అయినవాఁడు= కాల్చబడినవాడు; దావ+అగ్నిన్+చేరి= కార్చిచ్చును సమీపించి; వ్యథన్+ఒందురీతిన్= బాధపడేవిధంగా; అన్న+అర్థి+అగుచున్= అన్నంకోరేవాడై; దాయాదులన్+చేరి= జ్ఞాతులనుచేరి; దుఃఖించుచున్= వ్యథనొందుచు; మఱియున్= అంతేగాక; ఒక్కచోటన్= ఒకచోట; పరబాధన్+చేసి= ఇతరులు కలిగించే బాధల కారణంగా; మున్ను+కానక= ముందు తెలుసుకోలేక; రాజ్య+అభిలాషన్= రాజ్యమందలి కోరికతో; ప్రాణసఖులు+ఐన= ప్రాణమిచ్చే స్నేహితులయిన; పితృపుత్ర భ్రాతృజ్యేష్ఠులను+ఐనను= తండ్రిని, కొడుకును, అన్నను మొదలైన కులశ్రేష్ఠులందరిని; వధియించుచున్= చంపుచు; మఱియున్= ఆపై; శూరులచేతన్+కొట్టువడి= బలవంతులయిన వారిచేత చావుదెబ్బలు తిని; సర్వధనంబునున్+పోనాడి= డబ్బు యావత్తూ పోగొట్టుకొని; చింతాపరవశుండు+ఐ= దిగులునకు లోబడినవాడై; దుఃఖించుచున్+ఉన్నంతన్= దుఃఖపడుతుండగా; గంధర్వనగర ప్రాయంబు+ఐన= గంధర్వ నగరంతో సమానమయిన; మిథ్య అయిన; సంసారసుఖంబున్= సాంసారిక సౌఖ్యమును; అనుభవించి= అనుభవిస్తూ; మోదించుచున్= సంతోషపడుతూ; మఱియున్= ఇంకను; నగ+ఆరోహణంబు+చేయు= కొండనెక్కు; నరుండు= మనుజుడు; కంటక పాషాణాదులవలనన్= ముండ్లు, కఠినశిలల వలన; బాధాపీడితుండు+అగుచున్= బాధల కారణంగా నొచ్చినవాడగుచు; దుఃఖించు చందంబునన్= విలపించు విధంగా; గృహ+ఆశ్రమ+ఉచిత+మహా+అనుష్ఠానంబునకున్= గృహస్థాశ్రమంలో చేపట్టవలసిన సముచిత కార్యక్రమాలకు; ఉపక్రమించి= పూనుకొని; వ్యసన= కామక్రోధములను; కంటక= ముళ్ళు; శర్కరా= మొరపరాళ్ళు అనువానిచే; పీడితుండు+ఐ= బాధింపబడినవాడై; దుఃఖించుచున్= ఆక్రోశిస్తూ; ఒక్కచోటన్= ఒకచోట; జఠర+అగ్నిపీడితుండు+ఐ= ఆకలిమంటలచే పీడితుడయినవాడై; కుటుంబంబుమీఁదన్= సంసారముపై; ఆగ్రహించున్= కోపపడుతూ; వనంబునన్= వనమునందు; అజగరగృహీతుండు+ఐ= కొండచిలువచే పట్టువడి; నిగీర్ణుండు+ఐన చందంబునన్= మ్రింగబడిన వానివిధంగా; రాత్రిన్= రాత్రివేళ; గృహ+అటవి+అందున్= ఇల్లు అనెడు అడవిలోపల; నిద్రాపరవశుండు+ఐ= నిద్రలో మైమరచినవాడై; ఎఱుంగక= ఏమియు తెలియక; వర్తించుచున్= తిరుగుతూ; మఱియును= అంతేగాక; వనంబునన్= అడవిలో; తృణచ్ఛన్నకూపపతితుండు+అగుచున్= గడ్డితో కప్పబడిన బావిలో పడినవాడగుచు; సర్పదష్టుండు+ఐన తెఱంగునన్= పాముకాటుకు గురి అయిన చందాన; సంసారి+ఐ= గృహస్థుడై; దుర్జనులచేతన్= దుర్మార్గులచేత; వ్యథితహృదయుండు+అగుచున్= కల్లోలపరచబడిన మనసు కలవాడగుచు; అంధుండు+ఐ= గుడ్డివాడై; అజ్ఞాన+అంధకూపంబునన్+పడుచున్= అజ్ఞానమనే చీకటి బావిలో కూలుతూ; ఒక్క+ఎడన్= ఒకచోట; జుంటితేనియకున్+ఐ= తేనెకోసం; మక్షికాబాధన్= తేనెటీగల బాధలతో; అతి+అంత+దుఃఖితుండు+అయిన మాడ్కిని= మిక్కిలి దుఃఖం పొందినవిధంగా; సంసారకాముండు+ఐ= సంసారంపట్ల కోరికకలవాడై; పరదార ద్రవ్య+అభిలాషి+అగుచున్= ఇతరుల భార్యలను, ఇతరుల ధనమును కోరుకున్నవాడై; భూపాలకుల చేతన్+ఐననున్= రాజులచేతనైనా; గృహపతిచేతను+ఐనన్= ఇంటి యజమానులచేతనైనా; తాడితుండు+ఐ=

తన్నులు తిన్నవాడై; నరకంబునన్+పడుచున్= ఘోరనరకములో పడుతూ; యౌవనంబునన్= యుక్తవయసులో; సంపాదించిన= గడించిన; ద్రవ్యంబులు= వస్తువులు; పరులచేతన్+పోన్+ఆడిన= పరులపాలు చేసిన; విధంబునన్= చందముగా; శీతవాత+ఆది+అనేక ప్రయాసలబ్ధంబు+ఐన= చలి, గాలి, వాన మొదలగు శ్రమలచే సమకూడిన; ధనంబున్= సొమ్మును; పోనాడి= పరులపాలు చేసి; సంసారి= సాంసారిక జీవనం గడిపేవాడు; అతిచింతా+ఆక్రాంతుండు+ఐ+ఉండున్= క్రుంగిపోతూ ఉంటాడు; మఱియును= అంతేగాక; వనంబునన్= అరణ్యంలో; లుబ్ధకులు= బోయలు; సంస్పృష్టంబు+అయిన= కలిసి సంపాదించిన; అల్ప+ఆమిషంబునకున్= కొద్దిపాటి మాంసానికి; అన్య+అన్య వైషమ్యంబునన్= పరస్పర విభేదాల కారణంగా; కలహించిన విధంబునన్= కలహించుకొనే తీరులో; సంస్పృష్ట వ్యవహారి+ఐ= భాగస్వామ్యంతో కూడిన వ్యవహారం కలవాడై; అల్పద్రవ్యంబులకున్= స్వల్పవిత్తంకోసం; పోరాడుచుండున్= కొట్లాడుకొంటారు; అని; భూపాలునకున్= రహూగణునికి; విప్రుండు= భరతుడు; సంసార+అటవి తెఱంగు= సంసారమనెడు అరణ్య స్వరూపం; ఎఱింగించి= తెలియజేసి; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఇట్లు చెప్పెను.

**తా :** అయ్యో! నరుడు పడే నానావిధాలైన పాట్లు ఎన్నని చెప్పను? అడవిలో సంచారం చేసేటప్పుడు గుడ్లగూబల కూతలకు, కీచురాళ్ల రొదలకూ మాదిరిగా విరోధుల తిరస్కారాలకు దుఃఖపడతాడు, బాధపడతాడు. అడవిలో ఏమీ దొరక్కపోతే చివరకు ఏ పిచ్చి చెట్లపళ్ళనో తినడానికి సిద్ధమయినట్లు పాపాత్ములైన ధనవంతులను ఆశ్రయిస్తూ జీవితం గడుపుతాడు. దప్పికకు ఏమాత్రం తట్టుకోలేక విసిగి వేసారి చివరకు ఎక్కడయినా కాసంత నీరు దొరుకుతుందేమోనని ఆశతో వట్టిపోయిన నది దగ్గరికి వెళ్ళినట్లు ఇహానికి పరానికి దూరులయిన పాషండులను సేవిస్తుంటాడు.

మంటలు చుట్టుకోగా తప్పించుకొందామని ప్రయత్నించి కారుచిచ్చులో చిక్కుకొన్నట్టు అన్నంకోసం దాయాదుల పంచజేరి వంచింపబడుతుంటాడు. ఒక్కొక్కసారి ఇతరులు తనకు కలిగించే బాధలకు తట్టుకోలేక రాజ్యాభిలాషతో తండ్రినీ, కొడుకునూ, అన్ననూ చివరకు ప్రాణమిచ్చిన మిత్రుణ్ణి కూడా నామరూపాలు లేకుండా చేస్తాడు. చివరకు బలవంతులయిన వారిచేత చావుదెబ్బలు తిని, డబ్బు యావత్తూ పోగొట్టుకొని దిగులుతో కుంగిపోతాడు.

గగనంలోని గంధర్వ నగరంవంటి గాలిమేడలను ఊహించుకొని మురిసిపోయినట్లు సారంలేని సంసారసుఖాలు అనుభవిస్తూ అందులో ఏదో ఆనందాన్ని జుర్రుతూ జీవిస్తాడు. కొండలెక్కేవాడు ముళ్ళూ, రాళ్ళూ గుచ్చుకొని పాదాలు బొబ్బలెక్కి బాధపడుతున్నట్టుగా గృహస్థాశ్రమంలో చేపట్టవలసిన కార్యక్రమాలలో నానావిధాలైన బాధలతో వ్యసనాలతో పీడింపబడతాడు. ఒక్కొక్కసారి ఆకలిమంటలకు తట్టుకోలేక ఇంట్లో అందరిమీదా అనవసరంగా విసుగుకొని కసురుకుంటాడు. అడవిలో కొండచిలువ నోట్లోబడి మెలికలు తిరిగి స్పృహగోల్పోయినట్టుగా గృహం అనే అడవిలో రాత్రివేళ దిక్కుతోచక నిద్రలో మైమరచి పొరలుతుంటాడు.

అరణ్యంలో గడ్డితో కప్పబడిన పాడుబావిలో పడిపోయి పాముకాటుకు గురి అయినట్టు సంసారంలో దుర్జనులు పెట్టే బాధలకు మనస్సు కల్లోలపడి కనులు గానక అజ్ఞానమనే చీకటిగోతిలో పడతాడు. ఒక్కొక్కసారి తేనెకోసం తేనెతెట్టెను రేపి తేనెటీగల బారినపడినట్లు సంసారసుఖాన్ని కోరి ఇతరుల భార్యలనూ, ఇతరుల వస్తువులనూ అభిలషించి ఇంటి యజమానుల చేతనో లేదా రాజుల చేతనో తన్నులు తిని నరకయాతన అనుభవిస్తాడు. యౌవనంలో ఎంతో కష్టపడి సంపాదించిన ఆస్తిని ముసలితనంలో పరులపాలు చేసినట్లు సంసారి అయినవాడు చలికీ, గాలికీ, వానకూ ఓర్చుకొని సంపాదించిన సొమ్ము ఇతరులు హరింపగా దిగులుతో కుంగిపోతాడు. అంతేగాకుండా, అడవిలో కలిసి సంపాదించిన

అల్పజంతువుల మాంసానికి బోయలు కొట్లాడుకొన్నట్లు భాగస్వామ్యవ్యవహారంలో ఉండి అల్పవిత్తాలకోసం తన్నులాడుకొంటారు.

ఈ విధంగా రహూగణుడనే రాజుకు పరమ భాగవతుడైన భరతుడు సంసారమనే అడవిలోని అగచాట్లను విశదపఱచి మళ్లీ ఇలా అన్నాడు.

**విశే : పాషండులు : యే తు సామాన్యభావేన మన్యంతే పురుషోత్తమమ్ ।**
**తే పాషండినః జ్ఞేయాః సర్వకర్మబహిష్కృతాః ॥**

"ఎవరు పురుషోత్తముడైన విష్ణుమూర్తిని లోకసామాన్యుడైన మానవునిగా చూస్తారో వారిని పాషండులని పిలుస్తారు. అటువంటివారు వైదికమైన సకల కార్యకలాపాల నుండి వెలివేయబడుచున్నారు?' అనగా 'పాషండులు వేదబాహ్యులు' అని అర్థం.

**ఆ. అల్పధనుఁడు విశ్రమాస్థానములఁ దృప్తిఁ, బొంద కొరుల ధనముఁబొందఁగోరి**
**యరిగి వారివలన నవమానములఁబొంది, యధికమైన దుఃఖ మనుభవించు. 172**

**ప్రతి :** అల్పధనుఁడు= కొద్దిపాటి డబ్బు కలవాడు; విశ్రమ+ఆస్థానములన్= విశ్రమించడానికి స్థానాలైన శయ్య, ఆసనం మొదలైనవాటితో; తృప్తిన్+పొందక= సంతోషపడక (అధికసుఖాలకోసం); ఒరులధనమున్= ఇతరుల డబ్బును; పొందన్+కోరి= కాజేయాలని తలచి; అరిగి= వారి దగ్గరికి వెళ్ళి; వారివలనన్= వారిమూలంగా; అవమానములన్+పొంది= పరాభవాలను చెంది; అధికము+ఐన= ఎంతో ఎక్కువయిన; దుఃఖమున్+అనుభవించున్= విషాదమును కొనితెచ్చుకొంటాడు.

**తా :** ఏదో కొంత ధనం సంపాదించుకున్నవాడు తనకు ఉన్న ఆసనశయ్యాదులతో తృప్తిపడక ఇంకా భోగాలనుకోరుతూ ఇతరుల ధనం కాజేయాలని ప్రయత్నం చేస్తాడు. ఈ దుశ్చర్యవల్ల వాడు చివరకు చీవాట్లు తిని అవమానం పొంది ఎంతో దుఃఖాన్ని కొని తెచ్చుకొంటాడు.

**ఆ. అంతఁగొందఱల్ల నన్యోన్యవిత్తాది, వినిమయమునఁగడుఁబ్రవృద్ధమైన**
**వైరములను బొంది పోరాట నొందుదు, రాత్మచింత లేక యనుదినంబు. 173**

**ప్రతి :** అంతన్= అంత; కొందఱు= కొందరు; అల్లన్= తిన్నగా; అన్యః+అన్యవిత్త+ఆది+వినిమయమునన్= వస్తువులు; డబ్బు మార్పిడి చేసుకోవడంలో; కడున్= మిక్కిలి; ప్రవృద్ధము+ఐన= మిక్కిలి పెరిగిన; వైరములను+పొంది= పగలను పెంచుకొని; ఆత్మచింతలేక= ఆత్మచింత ఏమాత్రం లేకుండ; అనుదినంబు= ప్రతిరోజు; పోరాటన్+ఒందుదురు= కలహిస్తూ ఉంటారు.

**తా :** ఇంకా కొందరు వస్తువులనూ, డబ్బునూ, ఇచ్చి పుచ్చుకోవడంలో పట్టుదలలు పెంచుకొని వైరభావంతో ఆత్మచింత లేక అనుదినమూ కలహించుకొంటూ ఉంటారు.

**సీ. సంసారమార్గసంచారుఁడై యధికప్రయాసంబునన గూర్చు నర్థములను**
**విహరించుచును గొంద ఱిహలోక ఫలములఁగోరుచు మోక్షంబుఁగోర కంతఁ**
**జెడిపోవుచుందు; రెప్పుడు గాని యందుకుఁ గడపటి యోగంబుఁగానలేరు;**
**మానవంతులు నసమానశౌర్యులు నగు వారు మిక్కిలియైన వైరబుద్ధి**

**తే. నాహవంబున మడియుదు; రంతెకాని, మోక్షమార్గంబు గానరు మూఢవృత్తి**
**ననుచు సంసారగహనవిహారమెల్లఁ, దెలిపి క్రమ్మఱ ననియె ధాత్రీసురుండు. 174**

ప్రతి : సంసారమార్గ సంచారుఁడు+ఐ= సంసార పథంలో సంచరిస్తూ; అధిక ప్రయాసంబునన్+అ= ఆ సంసార పోషణకు అంతులేని ప్రయాసతోనే; అర్థములను= వస్తుసంభారాలను; కూర్చున్= సమకూరుస్తాడు; విహరించుచును= స్వేచ్ఛావిహారం చేస్తూ; కొందఱు= మరికొందరు; ఇహలోకఫలములన్+కోరుచున్= ఈ లోకపు ఫలములనే కోరుతూ; మోక్షంబున్ కోరక= మోక్షాన్ని కోరక, అంతన్= అటుపిమ్మట; చెడిపోవుచుందురు= పాడయి పోతుంటారు; ఎప్పుడు+కాని= ఎపుడుగాని; అందుకున్= దానికి సంబంధించిన; కడపటి యోగంబున్= ఆధ్యాత్మికయోగాన్ని; కానన్‌లేరు= చూడలేరు; మానవంతులు= అభిమానవంతులయినవారు; అసమానశౌర్యులును+అగువారు= సాటిలేని శౌర్యవంతులైనవారు; మిక్కిలి+ఐన= అత్యధికమయిన; వైరబుద్ధిన్= విరోధభావంతో; ఆహవంబునన్= యుద్ధంలో; మడియుదురు= మరణిస్తారు; అంతెకాని= అంతేదప్ప; మోక్షమార్గంబున్= ముక్తిమార్గాన్ని; మూఢవృత్తిన్= మూర్ఖవృత్తితో; కానరు= చూడరు; అనుచున్= అనుచు; సంసార గహనవిహారమున్+ఎల్లన్= సంసారమనే అరణ్యంలో విహరించేవారి వృత్తాంతాన్నంతా; తెలిపి= విశదంచేసి; ధాత్రీసురుండు= బ్రాహ్మణుడు; క్రమ్మఱన్= మరల; అనియెన్= ఇలా చెప్పసాగాడు.

**తా :** మరికొందరు సంసారంలో సంచరిస్తూ ఆ సంసారపోషణకు అంతులేని ప్రయాసపడుతూ అందుకుగాను వస్తుసంభారాలను సమకూర్చుకొంటూ ఇహలోక సుఖాలకే అలవాటుపడతారు. అవే ఇంకా కావాలని కోరుతారు. అంతేకాని మోక్షమనేదొకటుందని ఆ ముక్తివల్ల కలిగే ఆనందం శాశ్వతమని తెలుసుకోలేరు. అందుకు అవసరమైన ఆధ్యాత్మయోగాన్ని అవలంబించక చెడిపోతుంటారు. అభిమానవంతులయినవారూ, సాటిలేని శౌర్యవంతులైనవారూ పరస్పరం వైరం పెంచుకొని సమరంలో ఒకరినొకరు చంపుకొంటారు. అంతేకాని, ఆ మందబుద్ధులు మోక్షమార్గాన్ని దర్శించనే లేరు. ఈ విధంగా సంసారమనే అరణ్యంలో విహరించేవారి వృత్తాంతాన్ని భరతుడు తెలియజేసి మరలా సింధురాజుతో ఇలా అన్నాడు.

**వ. మఱియుం గాలచక్రనియంత్రితుండై చక్రాయుధునిం గొల్వక కాక గృధ్ర బకసమానులైన పాషండులతోడి సఖ్యంబునం జేసి వారలచేత వంచితుండై బ్రాహ్మణకులంబునం జేసి శ్రౌతస్మార్త కర్మానుష్ఠానపరుండై విషయసుఖంబులందుఁ దగులువడి కాలంబుతుద నెఱుంగక వృక్షంబులుంబోలె నైహికార్థంబుల యందుఁ దృష్ణ గలిగి మైథున నిమిత్తంబు సుతదారాదుల యందు స్నేహంబు సేయుచుఁ బథికుండు మాతంగంబులయందు భయంబున దీర్ఘనిమ్న కూపంబునం బడిన తెఱంగున సంసారమృత్యుగజ భయంబున గిరికందర ప్రాయంబయిన యజ్ఞాన తమంబునం బడుం గావున మాయచేత సంసార మార్గంబైన రాజభావంబు విడిచి సర్వభూతమైత్రి గలిగి జితేంద్రియుండవై జ్ఞానాసిచే మార్గంబు కడపల గనుమని పలికిన భూపాలుం డిట్లనియె. 175**

ప్రతి : మఱియున్= అంతేగాక; కాలచక్రనియంత్రితుండు+ఐ= కాలచక్ర భ్రమణమునకు కట్టువడినవాడై; చక్రాయుధునిన్+కొల్వక= సుదర్శన చక్రాయుధుని సేవింపక; కాక గృధ్ర బకసమానులు+ఐన= కాకుల్లాంటివారు; గ్రద్దలాంటివారు; కొంగల్లాంటి వారయిన; పాషండులతోడి సఖ్యంబునన్+చేసి= వేదబాహ్యులతోటి స్నేహం కారణంగా;

వారలచేతన్= ఆ పాషండులచేత; వంచితుండు+ఐ= మోసగించబడినవాడయి; బ్రాహ్మణకులంబునన్+చేసి= బ్రాహ్మణకులంలో జన్మించడంవల్ల; శ్రౌతస్మార్తకర్మ+అనుష్ఠానపరుండు+ఐ= శ్రౌతం, స్మార్తం మొదలయిన వైదిక కర్మలు చేయడంతో నిష్ఠ కలవాడయి; విషయసుఖంబులందున్= విషయ సుఖాలలో; తగులువడి= బంధితుడై; కాలంబుతుదన్+ఎఱుంగక= తమకాలం అంతమవుతుందని తెలుసుకోలేక; వృక్షంబులున్+పోలెన్= చెట్లలాగా; ఐహిక+అర్థంబుల+అందున్= ఇహలోక వాంఛలయందు; తృష్ణన్+కలిగి= ఆసక్తిని కనబరచి; మైథున నిమిత్తంబు= స్త్రీ సంగమ అభిలాషకు లోనై; సుతదార+ఆదుల+ అందున్= కొడుకు, భార్య మొదలగువారియందు; స్నేహంబు+చేయుచున్= ప్రేమ పెంచుకొంటూ; పథికుండు= బాటసారి; మాతంగంబుల+అందున్= ఏనుగుల వలన భయంతో; దీర్ఘ నిమ్నకూపంబునన్= విశాలమయినది లోతయినది అయిన బావిలో; పడిన తెఱుంగునన్= పడినవిధంగా; సంసారమృత్యు గజభయంబునన్= సంసార కారణమయిన మరణమనే ఏనుగు భయంతో; గిరికందర ప్రాయంబు+అయిన= కొండ గుహలాంటి; అజ్ఞానతమంబునన్= అజ్ఞానమనే చీకటిలో; పడున్= పడును; కావునన్= కాబట్టి; మాయచేతన్= మాయవల్ల; సంసారమార్గంబు+ఐన= సంసార కారణమయిన; రాజభావంబున్ విడిచి= రాజభావాన్ని వదలిపెట్టి; సర్వభూతమైత్రి+కలిగి= అన్ని ప్రాణులపట్ల మైత్రిని పెంచుకొని; జిత+ఇంద్రియుండవు+ఐ= ఇంద్రియాలను జయించువాడవై; జ్ఞాన+అసిచేన్= జ్ఞానమనే కత్తితో; మార్గంబు కడపలన్= జీవితమార్గంయొక్క చరమదశను; కనుము+అని= చూడుమని; పలికినన్= పలుకగా; భూపాలుండు= రాజయిన రహూగణుడు; ఇట్లు+అనియెన్= భరతునితో ఇలా అన్నాడు.

**తా :** కొందరు కాలచక్ర భ్రమణమునకులోనై ఆ చక్రాయుధుని కొలువక కాకుల్లాంటివారూ, గద్దల్లాంటివారూ, కొంగల్లాంటివారూ అయిన పాషండులతో స్నేహం పెంచుకొంటారు. వారి వలలోబడి వంచింపబడతారు. కొందరు బ్రాహ్మణకులంలో పుట్టి శ్రౌతం, స్మార్తం మొదలయిన వైదికకర్మలు నియమనిష్ఠలతో చేస్తున్నా విషయసుఖాలకు లోబడి ఉంటారు. చెట్టులాగా ఐహిక విషయాలపై ఆశకలిగి ఉంటాడు. అంత్యకాలం సమీపిస్తున్నా ఇహలోక సుఖాలమీద ఆశ పెంచుకుంటాడు. స్త్రీ సంగమాభిలాషకు లోనై భార్యాపుత్రులందు స్నేహం పెంచుకుంటాడు. ఏనుగులకు భయపడ్డ బాటసారి తెలియక ఏనుగులకోసం త్రవ్విన గోతులలో పడ్డట్టు సంసారమందలి మృత్యువనే ఏనుగు భయంతో కొండ గుహలాంటి అజ్ఞానమనే చీకటిలో పడతాడు. అందుచేత మాయను తొలగించుకొని సంసార కారణమయిన నీ రాజభావాన్ని వదలిపెట్టు. అన్ని ప్రాణులపట్ల మైత్రిని పెంచుకొని, ఇంద్రియాలను జయించు, జ్ఞానమనే కత్తి చేబట్టి జీవిత ప్రయాణ మార్గాన్ని ముగించడం తెలుసుకో! భయంకరమైన ఆ అడవినుండి బయటపడు అని బోధించగా రహూగణుడు భరతునితో ఇలా అన్నాడు.

**క.** **అక్కట! మానుషజన్మము, పెక్కువయై యుండు నెపు డభేదమతిం బెం**
**పెక్కిన యోగిసమాగమ, మక్కజముగఁగలిగెనేని యఖిలాత్ములకున్.** **176**

**ప్రతి :** అక్కట= అయ్యో!; ఎపుడున్= ఎల్లవేళలా; అభేదమతిన్= భేదభావంలేని చిత్తంతో; పెంపు+ఎక్కిన= అతిశయించిన; యోగిసమాగమము= యోగుల సంసర్గం; అక్కజముగన్= ఆశ్చర్యంగా; కలిగెన్+ఏని= కలిగినట్లయితే; అఖిలాత్ములకున్= సర్వాత్ములకు; మానుషజన్మము= మానవజన్మం; పెక్కువ+ఐ+ఉండున్= శ్రేష్ఠమై ఉంటుంది.

**తా :** అకటా! భేదభావంలేని బుద్ధితో అతిశయించిన యోగుల సమాగమం లభించినప్పుడే అన్ని జీవుల్లోనూ మానవజన్మ శ్రేష్ఠం అవుతుంది.

**విశే :** ఎనభై నాల్గు లక్షల జన్మల తరువాత సిద్ధించేది మానవజన్మ. అటువంటి మానవజన్మ పొందినవారు యోగులతో చేరిక గలిగినవారయితే అంతకంటె శ్రేష్ఠత్వం మరొకటి లేదు.

**క. ధరణీసురవర! నీ శ్రీ, చరణాంబుజయుగళరేణుసంస్పర్శము నా**
**దురితంబు లడఁచె; నింతట, హరిభక్తియు నంతకంత కధికంబయ్యెన్. 177**

**ప్రతి :** ధరణీసురవర= బ్రాహ్మణశ్రేష్ఠుడా!; నీ= నీయొక్క, శ్రీచరణ+అంబుజయుగళరేణు సంసర్శము= మంగళకరములైన పాదపద్మ పరాగాల సంస్పర్శనం; నా దురితంబులు= నా పాపాలను; అడఁచెన్= అణచెను; ఇంతటన్= ఇంతకంతకూ; హరిభక్తియున్= విష్ణువుపట్ల భక్తి; అంతకంతకున్= అంతకంతకు; అధికంబు+అయ్యెన్= అతిశయించింది.

**తా :** భూసురశ్రేష్ఠా! నీ పాదపద్మపరాగాల సంస్పర్శనం నా పాపాలన్నింటినీ పటాపంచలు చేసింది. అంతకంతకూ నాలో హరిభక్తి అతిశయించింది.

**వ. మఱియు విప్రవరులయందు యోగీశ్వరు లవధూత వేషంబునం జరియింపు చుందురు; గావున విప్రులు పిన్నలు పెద్దలనక యందఱకు నమస్కారం బని స్తుతియించిన నా యోగీశ్వరుండును సింధుపతికిఁ గరుణాన్వితుం డగుచుఁ దత్త్వజ్ఞానం బుపదేశించి యా రాజుచేత వందితచరణుండై పూర్ణార్ణవంబునుం బోలె సంపూర్ణకరుణారసపూరితస్వాంతుండై వసుంధరం జరియించు చుండె; సింధుభూపతియును సుజనసమాగమంబున లబ్ధతత్త్వజ్ఞానుండయి దేహాత్మ భ్రమం బాసె నని పలికిన శుకయోగీంద్రునకుం బరీక్షిన్నరేంద్రుండిట్లనియె. 178**

**ప్రతి :** మఱియున్= అంతేగాక; విప్రవరుల+అందున్= బ్రాహ్మణశ్రేష్ఠులయందు; యోగ+ఈశ్వరులు= యోగులలో సర్వశ్రేష్ఠులు; అవధూత వేషంబునన్= పరివ్రాజకుని వేషంలో; చరియింపుచున్+ఉందురు= సంచరిస్తూ ఉంటారు; కావునన్= అందువల్ల; విప్రులు= బ్రాహ్మణులు; పిన్నలు= చిన్నవారు; పెద్దలు+అనక= పెద్దవారనక; అందఱకున్= అందరికి; నమస్కారంబు+అని= వందనమని; స్తుతియించినన్= స్తోత్రం చేయగా; ఆ యోగి+ఈశ్వరుండును= ఆ భరతుడును; సింధుపతికిన్= సింధుపతియైన రహూగణునికి (పట్ల); కరుణా+అన్వితుండు+అగుచున్= కరుణతో కూడినవాడగుచు; తత్త్వజ్ఞానంబున్+ఉపదేశించి= తత్త్వ జ్ఞానోపదేశంచేసి; ఆ రాజుచేతన్= ఆ రాజుచే, వందిత చరణుండు+ఐ= నమస్కరింపబడిన పాదములు కలవాడై; పూర్ణ+అర్ణవంబునున్+పోలెన్= నిండు సముద్రంలాగా; సంపూర్ణ= నిండిన; కరుణారసపూరిత స్వాంతుండు+ఐ= దయయను రసంతో నిండిన మనస్సు కలవాడై; వసుంధరన్= భూమిపై; చరియించుచున్+ఉండెన్= తిరుగుతూ ఉండెను; సింధు భూపతియును= రహూగణుడును; సుజన సమాగమంబునన్= మంచివారి సాంగత్యంతో; లబ్ధతత్త్వ జ్ఞానుండు+అయి= పొందబడిన యథార్థజ్ఞానం కలవాడై; దేహ+ఆత్మభ్రమన్+పాసెన్= దేహమే తాననే భ్రాంతిని వదలిపెట్టాడు; అని= అని; పలికినన్= పలుకగా; శుకయోగి+ఇంద్రునకున్= శుకమహర్షికి; పరీక్షిత్+నరేంద్రుండు= పరీక్షిన్మహారాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

**తా :** యోగీశ్వరులు పరివ్రాజక వేషంతో బ్రాహ్మణరూపంలో తిరుగుతుంటారు. వారికి వయసుతో నిమిత్తం లేదు. అందుచేత చిన్నపెద్ద తేడాలు చూడకుండా బ్రాహ్మణులైన వారికందరికీ నా నమస్కారం అంటూ సింధు దేశాధిపతి భరతుణ్ణి స్తుతించాడు. కరుణాసముద్రుడైన ఆ యోగీశ్వరుడు సింధుపతి అయిన రహూగణునికి తత్త్వజ్ఞానం ఉపదేశించాడు.

సింధుపతి మ్రొక్కులు అందుకొని భరతుడు నిండైన మహాసముద్రంలో దయారసపరిపూర్ణమైన హృదయంతో భూమిమీద సంచరిస్తున్నాడు. సింధు భూపతి కూడ సత్పురుష సాంగత్యం కారణంగా తత్త్వజ్ఞానం పొందాడు. అతనికి దేహమే ఆత్మ అనే భ్రమ నశించింది అని చెప్పిన శుకయోగీంద్రునితో పరీక్షిన్నరేంద్రుడు ఈ విధంగా అన్నాడు.

**చ. అరయఁగ మక్షికంబు వినతాత్మజుఁగూడఁగలేని రీతి యీ**
**భరతుని సచ్చరిత్రములు ప్రస్తుతి సేయఁగ నీ వసుంధరన్**
**నరపతు లెల్ల నోపరు మనంబున నైనను నెంచ, నింక నా**
**భరతుని పుణ్యవర్తనముఁ బ్రస్తుతి సేయఁగ నాకు శక్యమే? 179**

**ప్రతి :** అరయన్+కన్= పరిశీలించి చూడగా; మక్షికంబు= ఈగ; వినతా+ఆత్మజున్= గరుత్మంతుని; కూడఁగన్+లేని రీతిన్= చేర గలుగని రీతిలో; ఈ భరతుని= జడభరతుని; సత్+చరిత్రములు= మంచి వర్తనములు; ప్రస్తుతి+చేయన్+కన్= పొగడగా; ఈ వసుంధరన్= ఈ లోకంలో; నరపతులు+ఎల్లన్= అందరు రాజులు; మనంబునన్+ఐననున్+ఎంచన్= మనసులోనయినా ఊహించుటకు; ఓపరు= సమర్థులు కారు; ఇంకన్= ఇంకా, అటువంటి; ఆ భరతుని= ఆ జడభరతుని; పుణ్యవర్తనమున్= పవిత్రచరిత్రను; ప్రస్తుతి+చేయఁగన్= పొగడగా; నాకున్= నాకు; శక్యమే= సాధ్యమా?

**తా :** నరేంద్రా! ఈగ ఎంత ఎగిరినా గరుత్మంతుని చేరుకోగలదా? అలాగే రాజులందరూ కలసినా భరతుని సచ్చరిత్రను కొనియాడడం సాధ్యమా? మనస్సుతోకూడా ఊహించలేరు. అందువల్ల భరతుని పవిత్ర చరిత్రం ప్రస్తుతించడం నాకు సాధ్యంకాని పని.

**వ. నరేంద్రా! భరతుండు సుతదారరాజ్యాదులను బూర్వకాలంబునంద విడిచి భగవత్పరుండగుచు యజ్ఞరూపంబును ధర్మస్వరూపంబును సాంఖ్యయోగంబును బ్రకృతి పురుష స్వరూపంబునైన నారాయణునకు నమస్కారం బనుచు మృగరూపంబునుంబాసె, నట్టి భరతుని చరిత్రం బెవ్వరు సెప్పిన, నెవ్వరు వినిన, నట్టివారలఁ బుండరీకాక్షుండు రక్షించు, నాయు రభివృద్ధియు; ధనధాన్య సమృద్ధియు నగుచుండ స్వర్గోపభోగంబులంబొందుదు రని. 180**

**ప్రతి :** నరేంద్రా!= రాజా!; భరతుండు= జడభరతుడు; సుత, దార, రాజ్య+ఆదులను= కొడుకు, భార్య, రాజ్యం మొదలయిన వాటిని; పూర్వకాలంబునందు+అ= మహారాజుగా వర్తించిన కాలమునందే; విడిచి= వదలిపెట్టి, భగవత్+పరుండు+అగుచున్= భగవంతునిపట్లి నిష్ఠ పెంచుకొన్నవాడై; యజ్ఞరూపంబును= యజ్ఞమయుడూ; ధర్మస్వరూపంబును= ధర్మస్వరూపుడూ; సాంఖ్య యోగంబును= సాంఖ్య యోగీశ్వరుడూ; ప్రకృతి పురుష స్వరూపంబును+ఐన= ప్రకృతి పురుషాత్మకుడయిన; నారాయణునకున్= శ్రీమన్నారాయణునకు; నమస్కారంబు+అనుచున్= నమస్కారమంటూ, మృగరూపంబునున్+పాసెన్= మృగరూపాన్ని పరిత్యజించాడు; అట్టి= అటువంటి; భరతుని చరిత్రంబున్= భరతుని కథను; ఎవ్వరు+చెప్పినన్= ఎవరు ప్రవచనం చేసినా; ఎవ్వరువినినన్= ఎవ్వరు శ్రవణం చేసినా; అట్టివారలన్= ఆలాంటి వారిని; పుండరీక+అక్షుండు= పద్మముల వంటి కన్నులు కలవాడయిన నారాయణుడు; రక్షించున్= కాపాడును; ఆయుః+అభివృద్ధియున్= ఆయుస్సు పెరుగుట; ధనధాన్య సమృద్ధియున్+అగుచు+ఉండన్= ధనము, ధాన్యము ఇబ్బడిముబ్బడిగా పెరుగుచుండగా; స్వర్గ+ఉపభోగంబులన్= స్వర్గసౌఖ్యాలను; పొందుదురు+అని= అనుభవిస్తారు అని.

**తా :** నరేంద్రా! భరతుడు పూర్వమందే పుత్రులనూ, భార్యను, రాజ్యవైభవాన్ని వదలిపెట్టాడు. భగవంతునిపట్ల నిష్ఠ పెంచుకొన్నాడు. యజ్ఞమయుడూ, ధర్మస్వరూపుడూ, సాంఖ్య యోగీశ్వరుడూ, ప్రకృతిపురుషాత్మకుడూ అయిన నారాయణునికి నమస్కారమంటూ హరిణరూపాన్ని పరిత్యజించాడు. అటువంటి పుణ్యపురుషుడైన భరతుని చరిత్రాన్ని వినిపించిన వారినీ, విన్నవారినీ శ్రీమన్నారాయణుడు తప్పక రక్షిస్తాడు. వారికి ఆయురభివృద్ధీ, ధనధాన్య సమృద్ధీ సిద్ధిస్తుంది. ఆ తరువాత వారు స్వర్గ సౌఖ్యాలనుభవిస్తారు.

**విశే :** ఒక కథకు ఫలశ్రుతి చెప్పడం పురాణసంప్రదాయం. ఈ దృష్టితో భరతుని కథకు ఫలం చెప్పబడింది. ఫలం రెండు రకాలు. ఇహం పరం. పరం చెప్పడమే కథాఫలం. కాని సామాన్యులకు ఆసక్తి కలగడానికోసం ఇహఫలాలు చెప్పడం పౌరాణిక సంప్రదాయం. అన్నింటికంటె 'పుండరీకాక్షుండు రక్షించున్' అనడం మేలుబంతిలాంటిది.

**మ. నరదేవాసురయక్షరాక్షసమునీంద్రస్తుత్య! దివ్యాంబరా**
**భరణాలంకృత! భక్తవత్సల! కృపాపారీణ! వైకుంఠ మం**
**దిర! బృందావనభాసుర! ప్రియధరిత్రీనాథ! గోవింద! శ్రీ**
**కర! పుణ్యాకర! వాసుదేవ! త్రిజగత్కల్యాణ! గోపాలకా! 181**

**ప్రతి :** నర= నరులు; దేవ= దేవతలు; అసుర= రాక్షసులు; యక్ష= యక్షులు; రాక్షస= రాక్షసులు; ముని+ఇంద్ర= మునిశ్రేష్ఠులచే; స్తుత్య= స్తుతింపదగినవాడా!; దివ్య+అంబర+ఆభరణ+అలంకృత= దివ్యములయిన వస్త్రములచేతను; ఆభరణములచేతను అలంకరింపబడినవాడా!; భక్తవత్సల= భక్తులయందు వాత్సల్యము కలవాడా!; కృపాపారీణ= దయయొక్క పారము ముట్టినవాడా; వైకుంఠమందిర= వైకుంఠమే నివాసముగా కలవాడా!; బృందావన భాసుర= బృందావనమునందు వెలుగొందుచున్నవాడా!; ప్రియధరిత్రీనాథ= ప్రియురాలగు భూదేవికి అధిపతియైనవాడా!; గోవింద= కిరణమార్గంచేత పొందదగినవాడా!; శ్రీకర= సంపదనిచ్చేవాడా!; పుణ్య+ఆకర= పుణ్యములకు స్థానమయినవాడా!; వాసుదేవ= వసుదేవుని పుత్రుడా!; త్రిజగత్+కళ్యాణ= ముల్లోకాలకు శుభములు చేకూర్చువాడా!; గోపాలకా= గోవులను కాపాడువాడా!

**తా :** నరులు, దేవతలు, అసురులు, యక్షులు, రాక్షసులు, మునీంద్రులు మున్నగువారి స్తోత్రమునకు గమ్యమైనవాడా! అప్రాకృతములయిన వస్త్రములచే, నగలచే అలంకరింపబడినవాడా! భక్తులయందు వాత్సల్యం గలవాడా! అపరిమితమైన దయగలవాడా! వైకుంఠమే నివాసముగా కలిగినవాడా, భూదేవి భార్యగా కలిగినవాడా, బృందావనమందు వెలుగొందుచున్నవాడా, సంపత్కరుడా, పుణ్యములకు నివాసమా, గోవులను కాచువాడా, మూడులోకములకు శుభముల నిచ్చువాడా, వాసుదేవా!

**క. పరమపదవాస! దుష్కృత, హర!కరుణాకర! మహాత్మ! హతదితిసుత! భా**
**సురగోపికామనోహర!, సరసిజదళనేత్ర! భక్తజననుతగాత్రా! 182**

**ప్రతి :** పరమపదవాస!= అన్నిటికన్న ఉత్తమమైన స్థానమే నివాసంగా కలవాడా!; దుష్కృతహర!= పాపములను హరించువాడా!; కరుణా+ఆకర!= దయకు స్థానమైనవాడా!; మహాత్మ!= అందరి రూపంలో వ్యాపించిన గొప్ప ఆత్మకలవాడా!; హతదితిసుత!= చంపబడిన దైత్యులు గలవాడా!; భాసుర= ప్రకాశించు; గోపికామనోహర!= గోపికల మనస్సులను హరించువాడా!;

సరసిజదళనేత్ర!= పద్మపత్రములవంటి కన్నులు కలవాడా!; భక్తజననుతగాత్రా!= భక్తజనులచే నుతింపబడిన దేహము కలవాడా!

**తా :** ఉత్తమమయిన వైకుంఠమే నివాసంగా కలవాడా! పాపహరా! దయకు నిధియైనవాడా! మహాత్మా! రాక్షసులను చంపినవాడా! ప్రకాశించే గోపికల మనస్సులను హరించినవాడా! పద్మపత్రాలవంటి కన్నులు కలవాడా! భక్తజనులచే నుతింపబడే దివ్యదేహం కలవాడా!

**మాలిని. సరసహృదయవాసా! చారులక్ష్మీవిలాసా!**
**భరితశుభచరిత్రా! భాస్కరాబ్జారినేత్రా!**
**నిరుపమఘనగాత్రా! నిర్మలజ్ఞానపాత్రా!**
**గురుతరభవదూరా! గోపికాచిత్తచోరా! 183**

**ప్రతి :** సరసహృదయవాసా!= సరసులయొక్క హృదయమందు వసించువాడా!; చారులక్ష్మీవిలాసా!= అందమైన లక్ష్మీకళ కలవాడా!; భరితశుభ చరిత్రా!= నిండైన శుభప్రవర్తనము గలవాడా!; భాస్కర+అబ్జ+అరినేత్రా!= సూర్యచంద్రులను నేత్రాలుగా కలవాడా!; నిరుపమఘనగాత్రా!= సాటిలేని నీలమేఘమువంటి దేహం కలవాడా!; నిర్మలజ్ఞానపాత్రా= స్వచ్ఛమైన జ్ఞానమునకు నిలయమైనవాడా!; గురుతరభవదూరా!= మిక్కిలి బరువైన జన్మబాధను తొలగించేవాడా!; గోపికాచిత్తచోరా!= గోపికల చిత్తములను దొంగలించేవాడా!

**తా :** సరసుల హృదయాలలో నివసించేవాడా! అందమైన లక్ష్మీకల కలవాడా! శుభప్రదమయిన చరిత్ర కలవాడా! సూర్యచంద్రులు కన్నులుగా కలవాడా! సాటిలేని నీలమేఘంవంటి శరీరం గలవాడా! స్వచ్ఛమయిన జ్ఞానముచే ఒప్పువాడా! భారమైన సంసార బాధలను దూరం చేసేవాడా! గోపికల హృదయాలను అపహరించేవాడా!

**గ. ఇది సకల కవిజనానందకర బొప్పనామాత్యపుత్ర గంగనార్య ప్రణీతంబైన శ్రీమహాభాగవత పురాణంబు నందుఁ బ్రియవ్రతుని సుజ్ఞానదీక్షయు, బ్రహ్మదర్శనంబును, నాగ్నీధ్రాదుల జన్మంబును, నుత్తమతామస రైవతుల జన్మంబును, బ్రియవ్రతుండు వనంబునకుం జనుటయు, నాగ్నీధ్రుం డప్సరసం బరిగ్రహించుటయు, వర్షాధిపతుల జన్మంబును, నాగ్నీధ్రుండు వనంబునకుం జనుటయును, నాభిప్రముఖుల రాజ్యంబును, నాభియజ్ఞంబును, ఋషభుని జన్మంబును, ఋషభుని రాజ్యాభిషేకంబును, భరతుని జన్మంబును, ఋషభుండు తపంబునకుంజనుచు సుతులకు నతులజ్ఞానం బుపదేశించుటయు, భరతుని పట్టాభిషేకంబును, భరతుండు వనంబునకుఁ జనుటయు, భరతుండు హరిణపోతంబునందలి ప్రీతింజేసి హరిణగర్భంబున జనియించుటయు, మఱల విప్రసుతుండై జనియించుటయు, విప్రుండు చండికా గృహంబున బ్రదికి వచ్చుటయు, సింధుపతి విప్రసంవాదంబును నను కథలు గల పంచమ స్కంధంబునందుఁ బ్రథమాశ్వాసము. 184**

**ప్రతి :** ఇది= ఈ పంచమస్కంధ ప్రథమాశ్వాసం; సకలకవిజన+ఆనందకర= కవిజనులందరికీ ఆనందాన్ని కల్గించే; బొప్పన+అమాత్యపుత్ర= బొప్పన అనే పేరుగల మంత్రి కుమారుడు; గంగన+ఆర్య= గంగన అనే పేరుతో ప్రసిద్ధి పొందినవానిచే; ప్రణీతంబు+ఐన= రచించబడిన; శ్రీమహాభాగవత పురాణంబునందున్= శ్రీ మహాభాగవతమనే పేరుగల

పురాణంలో; ప్రియవ్రతుని= ప్రియవ్రత మహారాజుయొక్క; సుజ్ఞానదీక్షయున్= మంచిజ్ఞానాన్ని సంపాదించుకోవడంకోసం చేపట్టిన వ్రతదీక్షను; బ్రహ్మ దర్శనంబును= బ్రహ్మదేవుని సాక్షాత్కారాన్ని; ఆగ్నీధ్ర+ఆదుల జన్మంబును= ఆగ్నీధ్రుడు మొదలైనవారి పుట్టుకయు; ఉత్తమ, తామస, రైవతుల జన్మంబును= ఉత్తమ మనువు, తామస మనువు, రైవత మనువుల పుట్టుకను; ప్రియవ్రతుండు= ప్రియవ్రత మహారాజు; వనంబునకుంజనుటయున్= వానప్రస్థానశ్రమాన్ని స్వీకరించి భార్యతో అడవులకు వెళ్లుటయు; ఆగ్నీధ్రుండు= ప్రియవ్రతుని కుమారుడైన ఆగ్నీధ్రుడు; అప్సరసన్+పరిగ్రహించుటయున్= అప్సరస అనే స్త్రీని వివాహమాడుటయు; వర్ష+అధిపతుల జన్మంబును= భారతదేశంలో వివిధ వర్షములకు రాజులైన వారి పుట్టుకయు; ఆగ్నీధ్రుంఁడు వనంబునకుంజనుటయున్= ఆగ్నీధ్ర మహారాజు వానప్రస్థాశ్రమం స్వీకరించి భార్యతో అడవులకు వెళ్లడం; నాభిప్రముఖుల రాజ్యంబును= ఆగ్నీధ్రుని కుమారులైన నాభి తదితర కుమారుల రాజ్యపరిపాలనను; నాభియజ్ఞంబును= నాభి మహారాజు చేసిన యజ్ఞాన్ని; ఋషభుని జన్మంబును= నాభి కుమారుడైన ఋషభుని పుట్టుకయు; ఋషభుని రాజ్యాభిషేకంబును= ఋషభ మహారాజు రాజ్యసింహాసన పట్టాభిషేకాన్ని; భరతుని జన్మంబును= ఋషభుని కుమారుడైన భరతుని పుట్టుకయు; ఋషభుండు తపంబునకుం జనుచున్= ఋషభ మహారాజు వానప్రస్థాశ్రమం స్వీకరించి తపస్సుకోసం అడవులకు వెళ్ళుతూ; సుతులకున్= కుమారులకు; అతులజ్ఞానంబు= సాటిలేని జ్ఞానాన్ని; ఉపదేశించుటయున్= వివరించి చెప్పుటయు; భరతుని పట్టాభిషేకంబును= భరత మహారాజు సింహాసనమెక్కి పట్టము కట్టుకొనుటయు; భరతుండు వనంబునకుఁజనుటయున్= భరత మహారాజు వానప్రస్థానం చేయుటయు; భరతుఁడు= భరతరాజు; హరిణపోతంబునందలి= జింక పిల్లమీదగల; ప్రీతిన్+చేసి= ప్రేమ, అనురాగంవలన; హరిణ గర్భంబున= ఒక ఆడుజింకకు పిల్లగా జన్మించుటయు; మఱలన్= తర్వాత కొంత కాలానికి; విప్రసుతుండై= బ్రాహ్మణ కుమారుడై; జనియించుటయున్= పుట్టుటయు; విప్రుండు= బ్రాహ్మణుడైన వేదపండితుడు; చండికాగృహంబున= 'చండికా' శక్తి ఆలయంలోనుండి; బ్రదికి వచ్చుటయున్= మరణగండం గడిచి వెలుపలికి వచ్చుటయు; సింధుపతి విప్రసంవాదంబును= సింధు రాజైన రహూగణునికి భరతునికి జరిగిన సంభాషణయు; అను కథలుగల= ఈ మొదలైన కథలు ఉన్నటువంటి; పంచమస్కంధంబునందు= ఐదవ స్కంధంలో; ప్రథమాశ్వాసము= మొదటి ఆశ్వాసము.

**తా :** సకల సుకవుల సమూహానికి ఎంతో సంతోషం కలిగించేవాడయిన బొప్పనామాత్యుని కుమారుడగు గంగనార్యుడు రచించిన శ్రీ మహాభాగవతపురాణం పంచమస్కంధంలోని ప్రథమాశ్వాసమిది.

ఈ ఆశ్వాసంలో ప్రియవ్రతుడు పొందిన సుజ్ఞానదీక్ష, బ్రహ్మదేవుని సాక్షాత్కారం, ఆగ్నీధ్రుడు మొదలయిన వారి జన్మ వృత్తాంతం, ఉత్తమ తామస రైవత మనువుల పుట్టుక, ప్రియవ్రతుడు వనములకు వెళ్ళడం, ఆగ్నీధ్రుడు అప్సరసను వివాహమాడడం, వర్షాధిపతుల జననం, ఆగ్నీధ్రుడు అడవికి వెళ్ళడం, నాభిరాజు మొదలయినవారి రాజ్యపరిపాలనం, నాభిరాజు యజ్ఞం, ఋషభుని జననం, ఋషభుని రాజ్యపాలనం, భరతుని పుట్టుక, ఋషభుడు తపస్సు నిమిత్తం వనాలకు వెళ్ళుతూ కుమారులకు విశిష్ట జ్ఞానం ఉపదేశించడం, భరతుని పట్టాభిషేకం, భరతుడు అరణ్యాలకు పోవడం, భరతుడు జింకపిల్ల మీద మమకారం పెంచుకొని జింక కడుపున పుట్టడం, అనంతరం బ్రాహ్మణునికి కుమారుడై జన్మించడం, బలిపశువుగా బంధితుడై కాళికాలయానికి కొనిరాబడి శక్తిమాత కరుణాకటాక్షాలచే రక్షింపబడి, సింధుదేశాధిపతి అయిన రహూగణుని ప్రశ్నలకు సమాధానం చెప్పడం మొదలయిన సన్నివేశాలు వర్ణించబడ్డాయి.

శ్రీరస్తు

# శ్రీమహాభాగవతము

## పంచమస్కంధము - ద్వితీయాశ్వాసము

**క. శ్రీకాంతాహృదయప్రియ!, లోకాలోకప్రచార! లోకేశ్వర! సు**
**శ్లోక! భవభయనివారక!, గోకులమందార! నందగోపకుమారా! 1**

**ప్రతిపదార్థం :** శ్రీకాంతాహృదయప్రియ= లక్ష్మీదేవి హృదయానికి ప్రియమైనవాడా!; లోకాలోకప్రచార= లోకాలోక పర్వతంలో సంచరించేవాడా!; లోక+ఈశ్వర= లోకాలకు ప్రభువా!; సుశ్లోక= మంచి కీర్తిగలవాడా!; భవభయనివారక= పుట్టుక భయం నివారించేవాడా!; గోకులమందార= గోకులానికి కల్పవృక్షం వంటివాడా!; నందగోపకుమారా= నందగోపుని కుమారుడా!

**తాత్పర్యం :** లక్ష్మీదేవి మనసు మెప్పు పొందినవాడవూ, చక్రవాళ పర్వతంలో సంచరించేవాడవూ, లోకాలన్నింటికి ప్రభువయినవాడవూ, మంచి యశస్సు కలవాడవూ, సంసారభయాలను నివారించేవాడవూ, గోకులంలోని వారికి కల్పవృక్షం వంటి వాడవూ, నందగోపుని కుమారుడవూ అయిన శ్రీకృష్ణా! అవధరించు.

**విశేషం :** లోకాలోక పర్వతానికే చక్రవాళ పర్వతమని పేరు. ఈ పర్వతం భూమిని చుట్టి ఉంటుంది. ఇక్కడ లోపలి భాగం వెలుతురుతోను వెలుపలి భాగం చీకటితోను నిండి ఉంటుంది. శ్రీమద్భాగవతం – పంచమస్కంధం – 20వ అధ్యాయంలో 34 నుండి 42 శ్లోకాల వరకు (8 శ్లోకాలు) లోకాలోక పర్వత వర్ణనమున్నది.

**వ. సకలపురాణార్థజ్ఞానవిఖ్యాతుండయిన సూతుండిట్లనియె. 2**

**ప్రతి :** సకలపురాణ+అర్థజ్ఞాన విఖ్యాతుండు+అయిన= సకల పురాణముల అర్థవిశేషములను తెలుసుకోవడంలో విశిష్టమైన ఖ్యాతి కలవాడయిన; సూతుండు= సూతుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** సమస్త పురాణ గాథల రహస్యాలను తెలుసుకోవడంలో విఖ్యాతుడయిన సూతుడు శౌనకాది మహామునులతో ఈ విధంగా చెప్పాడు.

**క. మునులార! బాదరాయణి, యనఘాత్మకుఁడైన యుత్తరాత్మజునకు స**
**ద్వినయోక్తి భరతుచరితము, వినిపించుచు మఱియు నిట్లు వినిపించెఁదగన్. 3**

**ప్రతి :** మునులార!= శౌనకాది మునులార!; బాదరాయణి= బాదరాయణుని (వ్యాసుని) కుమారుడైన శుకుడు; అనఘ+ఆత్మకుఁడు+ఐన= పాపరహితమయిన – పుణ్యాత్మకుడయిన; ఉత్తరా+ఆత్మజునకున్= ఉత్తరయొక్క కుమారుడయిన పరీక్షిత్తునకు; సత్+వినయ+ఉక్తిన్= చక్కని వినయంతో కూడిన మాటతో; భరతుచరితమున్= భరతుని చరిత్రను, వినిపించుచున్= ఆలకింపజేయుచు; మఱియున్= ఇంకనూ; ఇట్లు= ఈ విధంగా; తగన్= ఒప్పిదంగా; వినిపించెన్= వినిపించాడు.

**తా :** మునులార! బాదరాయణుని కుమారుడయిన శ్రీ శుకుడు పుణ్యాత్ముడూ, ఉత్తరానందనుడూ అయిన పరీక్షిత్తుకు భరతునిచరిత్ర చక్కగా వినిపించి ఆ తర్వాత తగినరీతిలో ఇలా అన్నాడు.

**విశే :** వేదవ్యాసునికే పరాశరాత్మజుడు, కృష్ణద్వైపాయనుడు, బాదరాయణుడు, శుకతాత అనే పేర్లున్నాయి.

**శ్లో॥ వ్యాసం, వశిష్ఠ నప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్ ।**
**పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్ ॥**

బ్రహ్మ – వశిష్ఠుడు – శక్తి – పరాశరుడు – వ్యాసుడు – శుకుడు. ఇది వ్యాసుని వంశవృక్షం. వ్యాసుడు వశిష్ఠునికి మునిమనుమడు. శక్తికి మనుమడు. పరాశరునికి పుత్రుడు. తపోనిధి. శుకుని తండ్రి.

**ఆ. పార్థివేంద్ర! యట్లు భరతాత్మజుండైన, సుమతి, ధర్మవర్తనమునఁదిరుగ**
**నది యెఱింగి దుష్టులైన పాషండులు, దమమతంబు మిగులఁదలఁచి పొగడి. 4**

**ప్రతి :** పార్థివ+ఇంద్ర!= రాజులలో శ్రేష్ఠుడా!; అట్లు= ఆ విధంగా; భరత+ఆత్మజుండు+ఐన= భరతుని కుమారుడయిన; సుమతి= సుమతి అనువాడు; ధర్మవర్తనమునన్= ధర్మప్రవర్తనంతో; తిరుగన్= పరిపాలన సాగిస్తుండగా; అది= ఆ పాలనవిధానాన్ని; ఎఱింగి= తెలుసుకొని; దుష్టులు+ఐన= దుర్మార్గులయిన; పాషండులు= వేదమార్గాన్ని నిందించేవారు; తమ మతంబున్= తమయొక్క మతాన్ని; మిగులన్+తలఁచి= మిక్కిలిగా భావించి; పొగడి= సుమతిని పొగడి.

**తా :** భరతుని కుమారుడయిన సుమతి ధర్మయుక్తంగా పరిపాలన సాగిస్తున్న సమయంలో, దుర్మార్గులయిన పాషండులు తమ మతాన్ని స్థాపించాలని అతని దగ్గరకు వచ్చి ఈ విధంగా పొగడసాగారు.

**క. ధరణీవల్లభ! నిన్నును, నిరతంబును బుద్ధదేవునింగొలిచిన యా**
**తెఱఁగునఁగొలిచెద మని భా, సురమతి బోధించి రపుడు సుమతింబ్రీతిన్. 5**

**ప్రతి :** ధరణీవల్లభ= భూపతీ!; నిన్నునున్= నిన్నుకూడా; నిరతంబును= ఎల్లప్పుడును; బుద్ధదేవునిన్+కొలిచిన+ఆ తెఱఁగునన్= బుద్ధ భగవానుని సేవించిన విధంగా; కొలిచెదము+అని= సేవించగలమని; అపుడు= అప్పుడు; ప్రీతిన్= ప్రీతితో; సుమతిన్= భరతకుమారుడైన సుమతిని; భాసురమతిన్= ప్రకాశించు నిండు మనస్సుతో; బోధించిరి= తమ ధర్మాలను బోధింపసాగారు.

**తా :** ఓ రాజా! 'మేము నిత్యమూ బుద్ధభగవానుని కొలిచినట్టుగా నిన్ను కూడా సేవిస్తాము' అంటూ ప్రియోక్తులతో తమ ధర్మాలను సుమతికి బోధింపసాగారు.

**వ. ఇట్లు పాషండబోధితుండైన సుమతికి ధ్రువసేనయందు దేవతాజిత్తను పుత్త్రుండు జనించె. వానికి దేవద్యుమ్నుండను సత్పుత్రుం డాసురియం దుదయించె; న మ్మహాత్మునకు ధేనుమతియందుఁ బరమేష్ఠి జనియించె; నతనికి సువర్చలయందుఁ బ్రతీహుం డనువాఁడు సుతుండయ్యె; నప్పరమ పురుషుండు సకల జనులకు బ్రహ్మోపదేశంబు సేసి తాను శుద్ధాత్ముండై హరి స్మరణ సేయుచు యజ్ఞకరణ నిపుణులగు ప్రతిహర్త ప్రస్తోత ఉద్గాత యను సత్పుత్రులం గాంచె, నా ప్రతిహర్తకు స్తుతి యందు వ్యోమభూమనామక పుత్త్రద్వయం బుత్పన్నంబయ్యె; నందు భూమునకు ఋషికుల్యయందు నుద్గీథుం డను సుతుండు జనియించె, నతనికి దేవకుల్య యందుఁ బ్రస్తోత గలిగె; నా ప్రస్తోతకు వరరుత్సయందు విభుండను తనయుం డుద్భవించె;**

**నతనికి భారతియందుఁ బృథుషేణుం డుదయించె; నతనికి నాకూతియందు నక్తుండు గలిగె; నా నక్తునకు రాజర్షిశ్రేష్ఠుండగు గయుండను మహాకీర్తిసంపన్నుం డుదయించె. 6**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; పాషండ బోధితుండు+ఐన= వేదనిందకులయిన వారిచే ప్రోత్సహింపబడిన; సుమతికిన్= సుమతి మహారాజుకు; ధ్రువసేవ+అందున్= ధ్రువసేన అనే పేరుగల భార్యయందు; దేవతాజిత్+అను= దేవతాజిత్తను పేరుగల; పుత్త్రుండు= పున్నామ నరకంనుండి రక్షించువాడయిన కుమారుడు; జనించెన్= పుట్టాడు; వానికిన్= ఆ దేవతాజిత్తుకు; ఆసురి+అందున్= ఆసురి అనే భార్యవల్ల; దేవద్యుమ్నుండు+అను= దేవద్యుమ్నుడు అను పేరుగలవాడు; ఉదయించెన్= జన్మించాడు; ఆ+మహా+ఆత్మునకున్= ఆ మహానుభావునకు, ధేనుమతి+అందున్= ధేనుమతి అనే ఇల్లాలియందు, పరమేష్ఠి= పరమేష్ఠి అను పేరుగలవాడు; జనియించెన్= పుట్టాడు; అతనికిన్= ఆ పరమేష్ఠికి; సువర్చల+అందున్= సువర్చల అనే గృహిణియందు; ప్రతీహుండు+అనువాఁడు= ప్రతీహుడు అను పేరుగలవాడు; సుతుండు+అయ్యెన్= కొడుకు అయ్యాడు; ఆ+పరమపురుషుండు= ఆ ఉత్కృష్టుడయిన పురుషశ్రేష్ఠుడు; సకలజనులకున్= సమస్త ప్రజలకు; బ్రహ్మ+ఉపదేశంబు+చేసి= బ్రహ్మోపదేశం చేసి; తాను= ఆ ప్రతీహుడు; శుద్ధ+ఆత్మకుండు+ఐ= పరిశుద్ధాత్ముడై; హరిస్మరణ+ చేయుచున్= హరిని స్మరిస్తూ; యజ్ఞకరణనిపుణులు+అగు= యజ్ఞములాచరించడంలో నేర్పు కలవారయిన, ప్రతిహర్త; ప్రస్తోత; ఉద్గాత+అను; సత్+పుత్రులన్+కాంచెన్= మంచి కుమారులను పొందాడు; ఆ ప్రతిహర్తకున్= వారిలో మొదటివాడయిన ప్రతిహర్తకు; స్తుతి+అందున్= స్తుతి అనే పేరుగల భార్యయందు; వ్యోమ భూమనామక= ఆకాశము, భూమి అనే పేరుగల; పుత్రద్వయంబు+ఉత్పన్నంబు+అయ్యెన్= ఇద్దరు కుమారులు కలిగారు; అందున్= వారిలో; భూమునకున్= భూమనామునికి; ఋషికుల్య+అందున్= ఋషికుల్య అనే పేరుగల భార్యయందు; ఉద్గీథుండు+అను= ఉద్గీథనామకుడయిన; సుతుండు= పుత్రుడు; జనియించెన్= పుట్టాడు; అతనికిన్= అతనికి; దేవకుల్య+అందున్= దేవకుల్యానామక స్త్రీయందు; ప్రస్తోత కలిగెన్= ప్రస్తోతుడు పుట్టాడు; ఆ ప్రస్తోతకున్= ఆ ప్రస్తోతనామకునికి; వరరుత్స+అందున్= వరరుత్స నామక యువతియందు; విభుండు+అను= విభుడనే పేరుగల; తనయుండు+ఉద్భవించెన్= కుమారుడు పుట్టాడు; అతనికిన్= అతనికి; భారతి+అందున్= భారతి నామక తరుణియందు; పృథుషేణుండు= పృథుషేణుడను పేరుగలవాడు; ఉదయించెన్= జన్మించాడు; అతనికిన్= ఆ పృథుషేణునికి; ఆకూతి+అందున్= ఆకూతి అను అబలయందు; నక్తుండు కలిగెన్= నక్తుడు జనించాడు; ఆ నక్తునకున్= ఆ నక్తనామకునికి; రాజ+ఋషిశ్రేష్ఠుండు+అగు= రాజర్షులలో గొప్పవాడయిన; గయుండు+అను= గయుడనువాడు; మహాకీర్తి సంపన్నుండు= గొప్ప కీర్తి సంపద కలవాడు; ఉదయించెన్= కలిగాడు.

**తా :** వేదనిందకులయిన పాషండులు క్రమంగా సుమతిని ప్రోత్సహిస్తూనే ఉన్నారు. అటువంటి సమయంలోనే సుమతి భార్య అయిన ధ్రువసేనకు దేవతాజిత్తు అనే కొడుకు పుట్టాడు. అతడికి ఆసురి అనే భార్యయందు దేవద్యుమ్నుడనే సుపుత్రుడు జన్మించాడు. మహాపురుషుడైన ఆ దేవద్యుమ్నునికి ధేనుమతియందు పరమేష్ఠి పుట్టాడు. సత్యసంధుడయిన అతనికి సువర్చలయందు ప్రతీహుడు కలిగాడు. అతడు చాల గొప్పవాడు. అందువల్ల జనులకందరికి బ్రహ్మోపదేశం చేశాడు. అతడు పరిశుద్ధమయిన మనస్సుతో హరిస్మరణ చేస్తుండేవాడు. ఆ ప్రతీహుడికి ప్రతిహర్త, ప్రస్తోత, ఉద్గాత అనే ముగ్గురు కుమారులు పుట్టారు. వారు ముగ్గురూ యజ్ఞాలు చేయడంలో నిపుణులు. వారిలో ప్రతిహర్తకు స్తుతి అనే భార్యయందు వ్యోముడు, భూముడు అనే ఇద్దరు కొడుకులు పుట్టారు. వారిలో భూమునికి ఋషికుల్య అనే భార్యయందు 'ఉద్గీథుడు' అనే కొడుకు పుట్టాడు. అతనికి దేవకుల్యయందు 'ప్రస్తోత' అనే కుమారుడు జనించాడు. ఆ ప్రస్తోతకు

'వరరుత్స' యందు విభుడనే కొడుకు పుట్టాడు. అతనికి భారతియందు పృథుషేణుడు కలిగాడు. పృథుషేణునికి 'ఆకూతి' యందు 'నక్తుడు' జన్మించాడు. ఆ నక్తుని కుమారుడే గయుడు. ఆ గయుడు రాజర్షులలో చాలా గొప్పవాడై ఎంతో కీర్తి గడించాడు.

**విశే :** ప్రతిహర్త, ప్రస్తోత, ఉద్గాత, ఉద్గీథ అనే పేర్లు వైదికమైన యజ్ఞానికి సంబంధించిన ఋత్విజుల పేర్లు.

**ఋత్విజుడు :** యజ్ఞం చేయించేవానిని యాజకుడు అంటారు. అంటే యజ్ఞకర్తయైన యజమానుని వద్ద దక్షిణ పుచ్చుకొని యజ్ఞం చేయించే బ్రాహ్మణుడు.

ఋత్విజులు నలుగురు. 1) హోత 2) ఉద్గాత 3) అధ్వర్యువు 4) బ్రహ్మ – వీరిలో ఒక్కొక్కరికి ముగ్గురు చొప్పున సహాయక ఋత్విజులుంటారు. (4×3=12) ఆ పన్నెండు ఋత్విజుల పేర్లివి – 1) బ్రాహ్మణాచ్ఛంసి 2) ప్రస్తోత 3) మైత్రావరుణుడు 4) ప్రతిప్రస్థాత 5) పోత 6) ప్రతిహర్త 7) అచ్ఛావాకుడు 8) నేష్ఠ 9) ఆగ్నీధ్రుడు 10) సుబ్రహ్మణ్యుడు 11) గ్రావాస్తుతుడు 12) ఉన్నేత.

**i) అధ్వర్యుడు :** యజుర్వేదంలో చెప్పబడిన మంత్రాలను పఠిస్తూ యజ్ఞంలో చేయవలసిన హోమాది ప్రధాన కృత్యాలను ఆచారించే ఋత్విక్కు.

**ii) హోత :** ఋగ్వేద మంత్రాలతో హోమకాలంలో, ఆయా దేవతలను పిలిచే ఋత్విక్కు. అందుకే **ఋగ్వేదానికి 'హౌత్రవేద'**మని పేరు.

**iii) ఉద్గాత :** సామవేద మంత్రాలతో హోమాది కాలాలలో ఆయా దేవతా సంతుష్టికోసం గానం చేసే ఋత్విక్కు కాబట్టి **సామవేదానికి 'ఉద్గాతృవేద'**మని నామాంతరం.

**iv) బ్రహ్మ :** పై ఋత్విక్కులు చేసేదీ, యజమానుడు చేసే, సకల కృత్యాలను పరీక్షిస్తూ సాక్షిభూతుడై అనుజ్ఞ ఇచ్చే ఋత్విక్కు. **అధర్వవేదానికి 'బ్రహ్మవేద'**మని పేరు.

**v) ఆగ్నీధ్రుడు :** దేవతలకు సమర్పించే చరు, పురోడాశాది హవిస్సులు చేయడానికి, తదితర క్రియాకలాపాల్లో సహాయం చేసే ఋత్విక్కు ఆగ్నీధ్రుడు. **'చరువు'** అంటే బియ్యంతో వండిన హోమద్రవ్యం. పురోడాశమంటే బియ్యపు పిండితో కపాలంలో / కుండ పెంకుమీదగాని చక్కగా కాచి పక్వం చేయబడిన పిండిముద్ద.

**vi) ఉద్గీథ :** సామవేదము (ఉద్గాతృవేదము)

**ఆ. అట్టి గయునివలన నఖిలజీవులఁబ్రోవఁ, దలఁచి సాత్త్వికప్రధాన మయిన**
**యట్టి మేను దాల్చి యాత్మతత్త్వ జ్ఞానుఁ, డగుచు నుండె హరి నిజాంశమునను, 7**

**ప్రతి :** అట్టి= అటువంటి; గయునివలనన్= గయునిమూలమున; అఖిల జీవులన్+ప్రోవన్+తలఁచి= సమస్త జీవులను కాపాడదలచి; సాత్త్విక ప్రధానము+అయిన= సత్త్వగుణం ప్రధానంగా గల్గిన; అట్టి= అటువంటి; మేనున్+తాల్చి= దేహాన్ని ధరించి; హరి= నారాయణుడు; నిజ+అంశమునను= తన అంశతో, ఆత్మతత్త్వజ్ఞానుఁడు+అగుచున్+ఉండెన్= ఆత్మతత్త్వం తెలిసినవాడుగా ఉండెను.

**తా :** అటువంటి గయునివలన సకల జీవరాసులను రక్షించడానికి విష్ణువు సత్త్వ ప్రధానమయిన దేహం ధరించి ఆత్మతత్త్వాన్ని తెలిసినవాడుగా (గయుని రూపంలో) ఉన్నాడు.

**వ. ఇట్టి మహనీయ సుగుణాకరుండగు గయుని గాథానువర్ణనంబు పురావిదులగు మహాత్ములచే నీ తెఱంగున నుతింపఁబడుచున్నది, సావధానమనస్కుండవై యాలకింపు మని యిట్లనియె. 8**

**ప్రతి :** ఇట్టి= ఇటువంటి; మహనీయ సుగుణ+ఆకరుండు+అగు= మహాగుణసంపన్నుడైన; గయుని= గాథా+అనువర్ణనంబు= కథల వృత్తాంతాలు; పురావిదులు+అగు= పురాణవేత్తలగు; మహా+ఆత్ములచేన్= గొప్పవారిచే; ఈ తెఱంగునన్= ఈ విధంగా; నుతింపఁబడుచున్నది= పొగడబడుతున్నది; స+అవధానమనస్కుండవు+ఐ= శ్రద్ధ కల మనస్సు కలవాడవై; ఆలకింపుము+అని= వినుమని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** గయుడు మహాసద్గుణ సంపన్నుడు. ఆ మహానుభావుని కథలన్నీ పురాణవేత్తలయిన మహాత్ములకు బాగా తెలుసు. వారందరు గయుణ్ణి ఏ విధంగా స్తుతిస్తున్నారో చెబుతాను. నీవు శ్రద్ధగా విను.

**సీ. ధర్మమార్గంబున ధారుణీ జనులను బ్రేమతోఁబోషణ ప్రేషణోప**
**లాలన శాసన లక్షణాదులచేతఁబోషించుచును యజ్ఞములను యజ్ఞ**
**పురుషు నీశ్వరుఁజిత్తమున నిల్పి సేవించి స్వాంతమందున్న యీశ్వరునిఁగాంచి**
**యఖిలజీవతతికి నానంద మొసఁగుచు నిరభిమానతమెయి ధరణినేలె**

**ఆ. సత్యమందు మిగుల సత్సేవయందును, ధర్మమందు యజ్ఞకర్మమందు**
**గయుఁడు వసుధలోనఁ గంజాక్షుఁడే కాని, మానవుండు గాఁడు మానవేంద్ర! 9**

**ప్రతి :** ధర్మమార్గంబునన్= ధర్మమార్గానుసారంగా; ధారుణీ జనులను= భూప్రజలను; ప్రేమతోన్= అనురాగంతో; పోషణ= పోషించుట; ప్రేషణ= నియమించుట; ఉపలాలన= బుజ్జగించుట; శాసన లక్షణ+ఆదులచేతన్= శాసించుట అను స్వభావాదులచేత; పోషించుచును= పోషిస్తూ; యజ్ఞములను= యజ్ఞసమయాలలో; యజ్ఞపురుషున్= యజ్ఞపురుషుడైన; ఈశ్వరున్= ఈశ్వరుని; చిత్తమునన్= మనసులో; నిల్పి= సేవించి; స్వాంతము+అందున్+ఉన్న= హృదయంలోనున్న; ఈశ్వరునిన్= భగవంతుని; కాంచి= తిలకించి; అఖిలజీవతతికిన్= సకల జీవరాశికి; ఆనందమున్+ఒసఁగుచున్= ఆనందాన్ని ప్రసాదిస్తూ; నిరభిమానతమెయిన్= స్వాభిమానం లేకుండా; ధరణిన్+ఏలెన్= భూమిని పాలించాడు; సత్యమందున్= నిజం చెప్పడంలో; మిగుల సత్సేవయందును= ఎక్కువగా మంచివారిని సేవించడంలోను; ధర్మమందున్= ధర్మ సంబంధమందును; యజ్ఞకర్మమందున్= యజ్ఞకర్మల విషయంలోనూ; వసుధలోనన్= భూమిలో; గయుఁడు= గయుడు; కంజ+అక్షుఁడు+ఏ కాని= విష్ణుస్వరూపుడే కాని; మానవుండు+కాఁడు= మానవమాత్రుడు కాడు.

**తా :** పరీక్షిన్నరేంద్రా! గయుడు ధర్మమార్గానుసారంగా ప్రజలను సత్కర్మలలో నియోగిస్తూ, మంచిమాటలతో బుజ్జగిస్తూ మంచి పనులను ప్రోత్సహిస్తూ, అవసరమయినపుడు గట్టిగా మందలిస్తూ, పోషిస్తూ పరిపాలించాడు. యజ్ఞాలు నియమాలతో నిర్వర్తించేవేళ తన మనస్సులో యజ్ఞపురుషుడయిన ఈశ్వరుని నిలిపి సేవించాడు. హృదయస్థుడైన ఈశ్వరుని సందర్శించాడు. సకల జీవరాశికి ఆనందం కలిగేలాగా స్వాభిమానం లేకుండా భూమిని పరిపాలించాడు. సత్యవిషయంలో, మంచివారిని

సేవించడంలో, ధర్మసంబంధంలో, యజ్ఞకర్మల విషయంలో గయుడు సాక్షాత్తు విష్ణుస్వరూపుడేగాని మానవమాత్రుడు కానే కాదు.

**వ. అట్టి మహాపురుషగుణగణ పరిపూర్ణుండగు గయునికి దక్ష కన్యకలగు శ్రద్ధామైత్రిదయాదులు దమయంతన వచ్చి కోరిక లొసంగ, నతని ప్రజలకు వసుంధర కామధేనువై పిదుక, వేదంబులు సకల కామంబుల నిచ్చుచుండ, సంగరమున భంగంబు నొందిన రాజు లప్పనంబు సేయ, విప్రులు ధర్మం బాఱవపాలు పంచియిడ, నిరంతర సోమపానంబును శ్రద్ధాభక్తి యోగంబులు గలిగి యొనర్చు యజ్ఞంబుల నింద్రాదిదేవతలు తృప్తులై యజ్ఞఫలంబుల నొసంగ, బ్రహ్మాది తృణగుల్మలతా పర్యంతంబు సకల లోకంబుల వారినిం దృప్తిం బొందించుచు, శ్రీహరిం దృప్తిం బొందఁజేయుచు, గయుండు పెక్కుకాలంబు రాజ్యంబు సేసె; నట్టి గయునికి జయంతి యందుఁ జిత్రరథ స్వాత్యవరోధను లను మువ్వురు కొడుకులు పుట్టిరి; నా చిత్రరథునికి నూర్ణయందు సమ్రాట్టును, వానికి నుత్కళయందు మరీచియు, నా మేటికి బిందుమతియందు బిందుమంతుండును, నా బిందుమంతునకు సరఘయందు మధువును, మధువునకు సుమనస యను దాని యందు వీరవ్రతుండును, నా వీరవ్రతునకు భోజయందు మన్యు ప్రమన్యువులను నిరువురును, నందు మన్యువునకు సత్యయందు భువనుండును, నతనికి దోషయందుఁ ద్వష్టయు, నా త్వష్టకు విరోచనయందు విరజుండనువాఁడును జనియించిరంత.** **10**

**ప్రతి :** అట్టి= అటువంటి; మహాపురుషగుణ గణ పరిపూర్ణుండు+అగు= మహాపురుషులకు ఎటువంటి గుణాలు ఉండవలెనో అటువంటి గుణసమూహంతో నిండినట్టి; గయునికిన్= గయునికి; దక్షకన్యకలు+అగు= దక్ష ప్రజాపతి కొమార్తెలగు; శ్రద్ధామైత్రి దయా+ఆదులు= శ్రద్ధ, మైత్రి, దయ మొదలగు దేవతలువారు; తమ+అంతన వచ్చి= తమంత తాముగా వచ్చి; కోరికలు+ఒసంగన్= వరాలు ప్రసాదింపగా; అతని ప్రజలకున్= ఆ గయుని ఏలుబడిలోని జనులకు, వసుంధర= భూమి; కామధేనువు+ఐ= దేవతల ఆవై; పిదుకన్= పిదుకగా; వేదంబులు= ఋగ్వేదాది వేదంబులు; సకల కామంబులన్+ ఇచ్చుచున్+ఉండన్= అన్నిరకాల కోరిన కోరికలు ప్రసాదిస్తూ ఉండగా; సంగరమునన్= సమరంలో; భంగంబున్+ఒందిన= ఓడిపోయి అవమానపడిన; రాజులు= పాలకులు; అప్పనంబు+చేయన్= కప్పంబులు అర్పింపగా; విప్రులు= బ్రాహ్మణులు; ధర్మంబు+ఆఱవపాలు= తాము చేసే ధర్మకార్యాల ఫలంలో ఆరవభాగం; పంచి+ఇడన్= పంచిపెట్టగా; నిరంతర సోమపానంబును= ఎడతెగని సోమపానం చేస్తూ; శ్రద్ధాభక్తి యోగంబులు గలిగి; ఒనర్చు= నెరవేర్చు; యజ్ఞంబులన్= యాగాలందు; ఇంద్ర+ఆదిదేవతలు= ఇంద్రుడు మొదలైన దేవతలు; తృప్తులు+ఐ= సంతృప్తిపడిన వారలగుచు; యజ్ఞ ఫలంబులన్+ఒసఁగన్= నిర్వర్తింపబడే యాగోద్దిష్టమయిన ఆయా ఫలాలు ప్రసాదించగా, బ్రహ్మ+ఆది= బ్రహ్మ మొదలయిన దేవతాగణం మొదలు; తృణ= గడ్డి; గుల్మ= పొద; లతాపర్యంతంబు= తీగెలదాకా; సకల లోకంబులవారినిన్= అన్ని లోకాలలో నివసించువారిని; తృప్తిన్+పొందించుచున్= సంతృప్తిపరచుచు; శ్రీహరిన్= నారాయణుణ్ణి; తృప్తిన్+పొందన్+ చేయుచున్= సంతృప్తిపరచుచు; గయుండు= గయుడు; పెక్కుకాలంబున్= చాలకాలం; రాజ్యంబు+చేసెన్= పాలన గావించెను, అట్టి గయునికిన్; జయంతి+అందున్= జయంతి నామక భార్యయందు; చిత్రరథ స్వాతి+అవరోధనులు+అను= చిత్రరథుడు; స్వాతి, అవరోధనులనే; మువ్వురు కొడుకులు= ముగ్గురు కుమారులు; పుట్టిరి= జన్మించారు; ఆ చిత్రరథునికిన్= ఆ చిత్రరథనామధేయునికి; ఊర్ణయందున్= ఊర్ణ అనే ఇల్లాలియందు; సమ్రాట్టును= సమ్రాట్టు అనువాడును; వానికి=

ఆ సమ్రాట్టునకు; ఉత్కళ+అందున్= ఉత్కళనామక గృహిణియందు; మరీచియున్= మరీచి నామకుడును; ఆ మేటికిన్= ఆ సర్వసమర్థుడయిన మరీచికి; బిందుమతి+అందున్= బిందుమతి అనే భార్యయందు; బిందుమంతుండును= బిందుమంతుడు అను పేరుగలవాడును; ఆ బిందుమంతునకున్= ఆ బిందుమంతునికి; సరఘ+అందున్= సరఘ నామక భార్యయందు; మధువును= మధువు అనువాడును; మధువునకున్= మధువునకు; సుమనస+అను దాని+అందున్= సుమనస అనే యువతియందు; వీరవ్రతుండును= వీరవ్రతనామడును; ఆ వీరవ్రతునకు; భోజ+అందున్= భోజ అను పత్నియందు; మన్యు ప్రమన్యువులు+అను= మన్యువు, ప్రమన్యువులు అను; ఇరువురును= ఇద్దరును; అందున్= వారిలో; మన్యువునకున్= మన్యువునకు; సత్య+అందున్= సత్య అనే ఇల్లాలియందు, భువనుండును; అతనికిన్; దోష+అందున్= దోషయను భార్యయందు; త్వష్టయున్= త్వష్ట అనే పేరుగలవాడును; ఆ త్వష్టకున్= ఆ త్వష్టనామకునికి; విరోచన+అందున్= విరోచన అనే ఇల్లాలియందు; విరజుండు+అనువాఁడును= విరజుడనే పేరుగలవాడును; జనియించిరి= జన్మించారు; అంతన్= అటుతర్వాత

**తా :** మహాపురుషులకు ఎటువంటి గుణాలు ఉండవలెనో అటువంటి గుణాలు కలవాడు గయుడు. ఆ కారణంవల్ల దక్షప్రజాపతి పుత్రికలయిన శ్రద్ధ, మైత్రి, దయ మొదలయిన దేవతలు తమంత తాముగా వచ్చి వరాలు ప్రసాదించారు. భూదేవి ఆయనకు కామధేనువయింది. వేదాలు కోరిన కోరికలు అనుగ్రహిస్తున్నాయి. యుద్ధంలో పరాజయం పొందిన రాజులు కప్పం చెల్లిస్తున్నారు. బ్రాహ్మణులు తమ పుణ్యసంపదలలో ఆరవభాగం పంచియిస్తున్నారు. ఎడతెగని సోమపానంతో, శ్రద్ధాభక్తులతో నిర్వహింపబడే యజ్ఞాలతో ఇంద్రాది దేవతలు సంతృప్తిపడుతూ ఆయా యాగాల ఫలాలను ప్రసాదిస్తున్నారు. బ్రహ్మ మొదలు గడ్డిపరక పర్యంతం అన్నిరకాల ప్రాణులను గయుడు సంతృప్తిపరిచాడు. ఇందువల్ల శ్రీహరికూడా సంతుష్టుడైనాడు. ఈ విధంగా గయుడు చాలకాలం రాజ్యపరిపాలన గావించాడు.

అలాంటి గయునికి జయంతియందు ముప్వురు కొడుకులు పుట్టారు. వారే చిత్రరథ, స్వాతి, అవరోధనులు. చిత్రరథునికి ఊర్ణయందు సమ్రాట్టు. సమ్రాట్టుకు ఊర్మిళయందు మరీచి, మరీచికి బిందుమతియందు బిందుమంతుడు జన్మించారు. ఆ బిందుమంతునికి సరఘయందు మధువు, మధువుకు సుమనసయందు వీరవ్రతుడు, వీరవ్రతునికి భోజయందు మన్యుప్రమన్యులనే ఇద్దరు కుమారులు కలిగారు. వారిలో మన్యువుకు సత్యయందు భువనుడు, భువనునికి దోషయందు త్వష్ట, ధర్మాత్ముడయిన త్వష్టకు విరోచనయందు విరజుడనేవాడు జన్మించాడు.

**విశే :** రాజ్యపరిపాలన చేసేవారికి నాలుగు అంశాలు ముఖ్యం. పోషణం మొదటిది. రెండవది ప్రీణనం, మూడవది ఉపలాలనం, నాల్గవది అనుశాసనం. ప్రజలకు తగినంత ఆహారం సమకూర్చడం, సంతృప్తిపరచడానికి ప్రియవస్తువులు ఇవ్వడం, కొన్నిమార్లు సమావేశపరచి ప్రియమయిన వాక్కులతో అనునయించడం, ఉత్తమ పౌరులు కావడానికి తగిన ఉపదేశం ఇవ్వడం.

**క.** **ఆ విరజున కుదయించిరి, భూవినుత విషూచియందుఁబుత్త్రశతంబు**
**న్నావల నొక కన్యకయు, న్నావేళ సమస్తజనులు హర్షంబందన్.** **11**

**ప్రతి :** భూవినుత= భూలోకంలోని వారలచే విశేషరీతులలో స్తుతింపబడినవాడా!; ఆ విరజునకున్= త్వష్టా విరోచనల కుమారుడయిన విరజునకు; విషూచి+అందున్= విషూచి నామక గృహిణివల్ల; పుత్రశతంబున్= నూరుగురు కొడుకులును; ఆవలన్= ఆపై; ఒక కన్యకయున్= ఒక కూతురును (కలుగగా; ఆవేళన్= ఆ సమయమందు; సమస్తజనులు= విరజుని పాలనలోని సకలప్రజలు; హర్షంబు+అందన్= మిక్కిలి సంతోషపడగా; ఉదయించిరి= జన్మించారు.

**తా :** ఓ రాజా! ఆ విరజునికి విషూచియందు నూరుగురు కుమారులు పుట్టారు. ఆపై ఒక కన్యక కూడా జనించింది. తమ భూపతికి కలిగిన సంతానసంపత్తికి సకలజనులు సంతోషించారు.

**క. ఘనుఁడు ప్రియవ్రతు వంశం, బునకుం దుదయై విరజుఁడు భూవిభువంశం**
**బును దా నలంకరించెను, విను మింద్రావరజుఁడయిన విష్ణునిమాడ్కిన్. 12**

**ప్రతి :** వినుము= వినవయ్యా; ఇంద్ర+అవరజుఁడు+అయిన= ఇంద్రుని తమ్ముడయిన; విష్ణునిమాడ్కిన్= ఉపేంద్రుని లాగున; ఘనుఁడు= గొప్పవాడయిన; ప్రియవ్రత వంశంబునకున్= ప్రియవ్రతుని వంశమునకు; తుద+ఐ= చివరివాడై; విరజుఁడు= విరజుడనువాడు; భూవిభువంశంబును= రాజవంశమును; తాను+అలంకరించెను= తాను అధిష్ఠించెను.

**తా :** ప్రియవ్రతుని వంశంలో విరజుడు చివరివాడు. ఇంద్రుని తమ్ముడైన ఉపేంద్రుని లాగున అతడు రాజవంశంలో రాణించాడు.

**క. అని పలికిన శుకయోగిం, గనుఁగొని యభిమన్యుసుతుఁడు గడు మోదముతో**
**వనజదళాక్షుని మహిమలు, విని సంతస మంది యనియె వేడుక మఱియున్. 13**

**ప్రతి :** అని పలికినన్= అని విరజుని వృత్తాంతం చెప్పగా; శుకయోగిన్+కనుఁగొని= శుక యోగీంద్రుని చూచి; అభిమన్యుసుతుఁడు= అభిమన్యుని కుమారుడయిన పరీక్షిత్తు; కడుమోదముతోన్= మిక్కిలి సంతోషంతో; వనజదళ+అక్షుని మహిమలు= పద్మదళముల వంటి కన్నులుగల శ్రీహరియొక్క మహిమలను; విని= ఆలించి; సంతసము+అంది= సంతోషపడి; వేడుకన్= కుతూహలంతో; మఱియున్= మరల; అనియెన్= అనెను.

**తా :** ఈ విధంగా పలికిన శుకమహర్షి మాటలకు అభిమన్యు కుమారుడయిన పరీక్షిత్తు చాల సంతోషించాడు. ఇంకా విష్ణు మహిమలను వినాలనే కుతూహలంతో మరల ఈ విధంగా ప్రశ్నించాడు.

**వ. మునీంద్రా! సూర్యరశ్మి యెందాఁకం బ్రవర్తిల్లు, నక్షత్ర యుక్తంబులైన చంద్రకిరణంబు లెంతమేరఁ దిరుగు, నంత దూరంబు ప్రియవ్రతుని రథనేమి ఘట్టనలచేత సప్తద్వీపంబులును, సప్తసముద్రంబులు నయ్యెనని పలికితి వా ద్వీపసముద్రంబుల పరిమాణంబులు సవిస్తరంబులుగా నెఱింగింపుము; గుణమయంబును స్థూలరూపంబును నయిన శ్రీహరి శరీరంబగు నీ లోకంబునందు నిలిపిన చిత్తం బగుణంబును, సూక్ష్మంబును, నాత్మ జ్యోతియు బ్రహ్మంబును నైన వాసుదేవుని యందు నిల్చుం గావున, ద్వీపవర్షాదివిస్తారంబు వినిపింపు మనిన శుకయోగీంద్రుం డిట్లనియె. 14**

**ప్రతి :** ముని+ఇంద్రా= మునులలో శ్రేష్ఠుడయినవాడా!; సూర్యరశ్మి= సూర్యుని కాంతి, వెలుగు; ఎంత+దాఁకన్= ఎంతవరకు; ప్రవర్తిల్లున్= ప్రసరిస్తుందో; నక్షత్రయుక్తంబులు+ఐన= నక్షత్రాలతో కూడిన; చంద్రకిరణంబులు= చంద్రుని కిరణాలు; ఎంతమేరన్+తిరుగున్= ఏ హద్దుదాకా తిరుగునో; అంతదూరంబు; ప్రియవతుని రథనేమి ఘట్టనలచేతన్= ప్రియవ్రతునియొక్క రథచక్రాల ఒరపిడివల్ల; సప్తద్వీపంబులును= ఏడు దీవులును; సప్తసముద్రంబులును= ఏడు సముద్రాలును; అయ్యెన్+అని= ఏర్పడ్డాయని; పలికితివి= చెప్పితివి; ఆ ద్వీపసముద్రంబుల= నీవు చెప్పిన ఏడుద్వీపాలు; సప్తసముద్రాల యొక్క, పరిమాణంబులు= కొలతలు; సవిస్తరంబులు+కాన్= విశదంగా; ఎఱింగింపుము= తెలియజేయుము;

గుణమయంబును= త్రిగుణాలతో కూడినదీ; స్థూలరూపంబునున్+అయిన= స్థూలస్వరూపమయిన; శ్రీహరి శరీరంబు+అగు= శ్రీహరియొక్క దేహమయిన; ఈ లోకంబు+అందున్= ఈ లోకంలో; నిలిపిన= నిలిపినటువంటి; చిత్తంబు= మనసు; అగుణంబును= గుణరహితమయినదియు; సూక్ష్మంబును= స్థూలము కానిదియు; ఆత్మజ్యోతియున్= స్వయం ప్రకాశమును; బ్రహ్మంబునున్+ఐన= బ్రహ్మస్వరూపమయిన; వాసుదేవుని+అందున్ నిల్చున్= వాసుదేవతత్త్వంలో నిలుచును; కావునన్= అందువలన; ద్వీపవర్ష+ఆది విస్తారంబున్= ద్వీపాలకు, వర్షాలకు, సముద్రాలకు సంబంధించిన పరిమాణ విశేషాలను; వినిపింపుము+అనినన్= తెలియజేయుమనగా; శుకయోగి+ఇంద్రుండు= యోగులలో శ్రేష్ఠుడయిన శుకమహర్షి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** మునీంద్రా! ఎందాక సూర్యరశ్మి ప్రసరిస్తుందో, ఎందాక నక్షత్రాలతో కూడిన చంద్రుని కిరణాలు వ్యాపిస్తుంటాయో, అందాక ప్రియవ్రతుని రథచక్రాల ఒరిపిడులవల్ల సప్తద్వీపాలు, సప్తసముద్రాలు ఏర్పడ్డాయని చెప్పారు గదా! ఆ ద్వీపాల పరిమాణాలనూ, సముద్రాల పరిమాణాలను సవిస్తరంగా తెలియజెప్పు. ఈ లోకమంతా గుణమయమయిన శ్రీహరి స్థూల స్వరూపమే. అందువల్ల అటువంటి భావనను లోకమందు నిలిపినట్లయితే నిర్గుణమూ, సూక్ష్మమూ, స్వయంప్రకాశమూ, బ్రహ్మస్వరూపమూ అయిన వాసుదేవునియందు మనస్సు సుస్థిరంగా లగ్నమవుతుంది. అందుచేత ద్వీపాలకూ, వర్షాలకూ, సముద్రాలకూ సంబంధించిన విశేషాలను సవిస్తరంగా తెలుపవలసింది అని ప్రార్థించగా శుకయోగి పరీక్షిత్తుతో ఇలా అన్నాడు.

**క. ధరణీవల్లభ! విను శ్రీ, హరిమాయాగుణవిభూతు లగు జలనిధులుం**
**బరఁగిన దీవులు వర్షము, లరయంగాఁగొలఁది వెట్ట నలవియె జగతిన్? 15**

**ప్రతి :** ధరణీవల్లభ!= భూపతీ; విను= ఆలకించు; శ్రీహరిమాయా గుణవిభూతులు+అగు= శ్రీహరి మాయవలన జనించిన మాయాజనిత గుణాల వైభవాలయిన; జలనిధులున్= సాగరాలు; పరఁగిన= ఒప్పిన; దీవులు= ద్వీపాలు, వర్షములు= భూభాగాలు (అవాంతర ఖండాలు); అరయంగాన్= పరిశీలింపగా; జగతిన్= లోకంలో; కొలఁది+పెట్టన్= కొలవడానికి (లెక్కపెట్టడానికి); అలవియె= సాధ్యమా?

**తా :** రాజా! (నీవడిగిన దానికి సమాధానం చెబుతాను.) విను. ఈ సముద్రాలు, ఈ ద్వీపాలు, ఈ వర్షములు అన్నీకూడా శ్రీహరి మాయవల్ల పుట్టిన వైభవాలే. వాటిని సంపూర్ణంగా కొలిచి చెప్పడం ఎవరికి చేతనవుతుంది?

**ఆ. తెలిసినంత వట్టుదెలిపెద సంక్షేప, మునను జిత్తగించి వినుము దెలియ**
**ననుచుఁజెప్పఁదొడఁగె నభిమన్యుసుతునకు, నింపుగాను శుకమునీంద్రుఁడిట్లు. 16**

**ప్రతి :** తెలిసినంత+పట్టు= నాకు తెలిసినంతవరకు; తెలియన్= తెలిసేవిధంగా; సంక్షేపమునను= సంగ్రహంగా; తెలిపెదన్= చెప్పెదను; చిత్తగించి వినుము= మనసును కేంద్రీకరించి ఆలకించుము; అనుచున్= అనుచు; ఇట్లు= ఈ విధంగా; ఇంపు+కాన్= ఆసక్తి కలిగేవిధంగా; శుకముని+ఇంద్రుఁడు= మునిశ్రేష్ఠుడయిన శుకుడు; ఇట్లు= ఈ విధంగా; చెప్పన్+తొడఁగెన్= చెప్పసాగెను.

**తా :** 'నాకు తెలిసినంతవరకు సంక్షిప్తంగా చెబుతాను. నీవు ఏకాగ్రచిత్తంతో వినుము' అని శుకమునీంద్రుడు పరీక్షిత్తుకు చెప్పసాగాడు.

## a =శుకయోగి యుపదేశమునఁ దెల్పు భూగోళ నిర్ణయము= a

**వ. నరేంద్రా! జంబూద్వీపంబు భూపద్మంబునకు మధ్యప్రదేశంబున లక్షయోజనంబుల వెడల్పు నంతియ నిడుపునుం గలిగి కమలపత్త్రంబునుం బోలె వర్తులాకారంబయి నవసహస్రయోజన పరిమితాయామంబు గల నవవర్షంబులు నష్టమర్యాదాగిరులునుం గలిగి విభక్తంబయి యుండు; నందు మధ్యవర్షం బిలావృతవర్షంబగు; నందు మధ్యప్రదేశంబున సువర్ణమయంబయి. 17**

**ప్రతి :** నర+ఇంద్రా= రాజా!; జంబూద్వీపంబు= జంబువు అనే పేరుగల ద్వీపం; భూపద్మంబునకున్= పద్మాకారంలోనున్న భూమికి; మధ్యప్రదేశంబునన్= నడిమి భాగాన; లక్షయోజనంబుల వెడల్పున్; అంతి+అ= అంతే; నిడుపును+కలిగి= పొడవుగల్గి; కమలపత్రంబును+పోలెన్= తామరాకువలె; వర్తుల+ఆకారంబు+అయి= గుండ్రటి ఆకారం కలదై; నవసహస్ర యోజనపరిమిత+ఆయామంబుగల= తొమ్మిది వేల యోజనాల విస్తీర్ణం గల; నవవర్షంబులున్= వర్షాలనబడే తొమ్మిది విభాగాలును; అష్టమర్యాదాగిరులునున్+కలిగి= సరిహద్దులుగా పని చేస్తున్న ఎనిమిది కొండలు కలిగి; విభక్తంబు+అయి+ ఉండున్= విభజింపబడినవై ఉంటాయి; అందున్= వానిలో; మధ్యవర్షంబు= నడుమనున్న వర్షభూవిభాగము; ఇలావృతవర్షంబు+అగున్= ఇలావృతనామక వర్షమగును; అందున్= ఆ వర్షభూభాగంలో; మధ్య ప్రదేశంబునన్= నడిమి ప్రదేశంలో; సువర్ణమయంబు+అయి= బంగారంతో నిండినదై.

**తా :** నరేంద్రా! భూమి పద్మాకారంగా ఉంది. ఆ పద్మాకారమయిన భూమిమధ్యలో జంబూద్వీపం తామరాకు లాగున గుండ్రంగా కనిపిస్తుంది. అది లక్షయోజనాల పొడవూ, లక్ష యోజనాల వెడల్పూ కలిగి ఉంటుంది. అందులో గుండ్రటి ఆకారాలతో తొమ్మిదివేల యోజనాల విస్తీర్ణం గల తొమ్మిది వర్షాలున్నాయి. వాటినన్నింటిని విభజించే సరిహద్దులుగా ఎనిమిది పర్వతాలున్నాయి. ఆ తొమ్మిది వర్షాలలో నట్టనడుమ 'ఇలావృతమనే' వర్షం ఉంది. దాని నడుమ బంగారురంగుల పర్వతం ఉంది.

**క. భూపద్మమునకు మేరువు, దీపించుచుఁగర్ణికాకృతిని బెంపగుచుం**
**బ్రాపై కులగిరిరాజుగఁ, జూపట్టును సురగణాళి చోద్యంబందన్. 18**

**ప్రతి :** భూపద్మమునకున్= పద్మాకృతితోనున్న భూమికి; కర్ణికా+ఆకృతిన్= పువ్వుయొక్క బొడ్డులాంటి ఆకారంతో; మేరువు= మేరు పర్వతం; పెంపు+అగుచున్= విస్తరించుచు; ప్రాపు+ఐ= ఆధారమై; కులగిరి రాజుగన్= కులపర్వతాలలో శ్రేష్ఠమయినదై; సురగణ+ఆళి= దేవగణాల సమూహం; చోద్యంబు+అందన్= అచ్చెరువందునట్లు; దీపించుచున్= ప్రకాశించుచు; చూపట్టును= కనిపిస్తూ ఉంటుంది.

**తా :** అదే సువర్ణమయమైన సుమేరుపర్వతం. భూమి పద్మమయితే సుమేరు పర్వతం దాని కర్ణిక. సుమేరు పర్వతం కులగిరులకే రాజు. దేవతలందరు ఆ పర్వతాన్ని చూచి ఆశ్చర్యచకితులవుతుంటారు.

**విశే :** భూమిని పద్మంగా ఊహిస్తే దానిమధ్య జంబూద్వీపమున్నదని భావం. ఇలావృతమంటే భూమిచే ఆవృతమని గ్రహించవలసి ఉంటుంది. మేరువనగా ఇరుసు. భూపరిభ్రమణానికి కేంద్రమని అర్థం. ఏడు దీవులకు ఏడు కులగిరులున్నాయి. వాటిలో మేరువు ముఖ్యమయినది. జంబూద్వీపం డెబ్భైలక్షల మైళ్ళు.

సీ. మతియును నా మేరుగిరి లక్షయోజనోన్నత మగుచుండి యానడిమిదళము
విదితమై పదియాఱువేల యోజనములు నంతియ పొంతునై యతిశయిల్లు;
నా మీఁద విస్తారమరయ ముప్పదిరెండువేలయోజనముల వెలసియుండు;
నా గిరి కుత్తరంబందు నీల శ్వేత శృంగపర్వతములు నింగి ముట్టి

ఆ. యుండు; రెండువేల యోజనంబుల దాఁకఁ, బఱపు గలిగి పూర్వపశ్చిమాయ
తంబు దక్షిణోత్తరంబును విస్తార, మగుచు మిగుల రమ్యమై నరేంద్ర! **19**

**ప్రతి :** మతియునున్= అంతేగాక; ఆ మేరుగిరి= ఆ మేరుపర్వతం; లక్షయోజన+ఉన్నతము+అగుచున్+ఉండి= లక్ష ఆమడల ఎత్తు గలిగివుండి; ఆ నడిమిదళము= ఆ మధ్యభాగం; విదితము+ఐ= తెలియబడినదై; పదియాఱువేల యోజనములున్; అంతి+అ= అంతే; పొంతును+ఐ= లోతుకలదై; అతిశయిల్లున్= అతిశయించివుంటుంది; ఆ మీఁదన్= ఆపై; విస్తారము= విస్తృతి; అరయన్= పరిశీలింపగా; మూడు+పది రెండువేల యోజనములన్= ముప్పై రెండువేల ఆమడలతో; వెలసి+ఉండున్= ప్రకాశిస్తూ ఉంటుంది; ఆ గిరికిన్= ఆ కొండకు; ఉత్తరంబు+అందున్= ఉత్తరాన, నీల, శ్వేత, శృంగ, పర్వతములు; నింగిముట్టి+ఉండున్= ఆకాశాన్ని అంటుతూ నిలిచివున్నాయి; రెండువేల యోజనంబులదాఁకన్; పఱపు+కలిగి= విస్తారం కలిగి; పూర్వ పశ్చిమ+ఆయతంబు= తూర్పునుండి పడమరదాక వ్యాపించిన; దక్షిణ+ ఉత్తరంబును= ఉత్తరం నుండి దక్షిణందాక; విస్తారము+అగుచున్= విస్తరించి; మిగులన్= మిక్కిలి; రమ్యము+ఐ= రమణీయమై; ఉండున్= ఉంటుంది.

**తా :** రాజా! ఆ మేరుగిరి లక్ష యోజనాల ఎత్తు కలిగి ఉంటుంది. దాని పాదప్రదేశం పదారువేల యోజనాల విస్తృతి కలిగి అంతే కొలత గల లోతు కలిగి ఉంటుంది. పైన విస్తృతి ముప్పది రెండువేల యోజనాలు. దానికి ఉత్తరపు దిక్కులో నీలం, శ్వేతం, శృంగం అనే మూడు పర్వతాలు ఆకాశాన్ని అంటుతూ వున్నాయి. వీని విస్తారం రెండువేల యోజనాలు. ఇవి తూర్పునుండి పడమర వరకు, ఉత్తరం నుండి దక్షిణానికి విస్తరించి ఉంటాయి. ఈ దృశ్యం చాల రమణీయం.

వ. ఇట్లు పూర్వపశ్చిమంబులు లవణ సాగరాంతంబులై యున్న సీమాపర్వతంబులయందు నీలశ్వేతశృంగవత్పర్వతంబులు నిడివిని యథాక్రమంబున దశమాంశ న్యూనప్రమాణ యోజనంబులు గలవిగా నుండు; వీని మధ్య ప్రదేశంబున రమ్యక హిరణ్మయ కురువర్షంబు లను నామంబులు గల వర్షంబు లుండు; వాని విస్తారంబులు నవ సహస్ర యోజనంబులు గలిగి లవణ సముద్రాంతంబులై క్రమంబున నీలాది పర్వత దీర్ఘ పరిమాణంబుల నుండు; నిలావృత వర్షంబునకు దక్షిణంబున నిషధ హేమకూట హిమవత్పర్వతంబులును సీమా పర్వతంబులును, బూర్వ పశ్చిమంబులు నిడుపును, దక్షిణోత్తరంబులు విశాలంబును నగుచు, నా నీలాదిపర్వతంబుల తీరున నుండు; నా గిరుల మధ్య ప్రదేశంబున హరివర్ష కింపురుషవర్ష భారతవర్షంబులను నామంబులు గల వర్షంబు లుండు; నా యిలా వృతవర్షంబునకుఁ బశ్చిమంబున మాల్యవత్పర్వతంబును, బూర్వ భాగంబున గంధమాదనంబును సీమా పర్వతంబులు; పూర్వపశ్చిమంబులు నిడుపును, దక్షిణోత్తరంబులు విశాలంబులు నగుచు నీలపర్వత నిషధపర్వతంబులం గదిసి, ద్విసహస్ర యోజనంబుల విస్తారంబై యుండు; మాల్యవత్పర్వతంబు పశ్చిమ సముద్రాంతంబై కేతుమాలవర్షంబును, గంధమాదన

**పర్వతంబునకుఁ బూర్వ భాగంబున సముద్రాంతం బగుచు భద్రాశ్వవర్షంబును, మేరువునకుం దూర్పున మందరపర్వతంబును, దక్షిణంబున మేరుమందర పర్వతంబులును, బడమటి పార్శ్వంబుల నుత్తరమునం గుముద పర్వతంబులను నామంబులు గలిగి యయుత యోజనోన్నతంబు లయి మేరునగం బను మధ్యోన్నత మేధిస్తంభంబునకుం జతుర్ముఖంబుల హ్రస్వస్తంభంబులను బోలియుండు; నా చతుస్స్తంభంబుల యందును బర్వతశిఖరంబుల వెలుఁగొందు కేతువులునుంబోలెఁ జూత జంబూ కదంబ న్యగ్రోధంబు లను వృక్షరాజంబులు గ్రమంబున నొండొంటికి నేకాదశశతయోజనాయతంబును శతయోజనవిస్తారంబును గలిగియుండు; మఱియు నా పర్వత శిఖరంబులం గ్రమంబునం బయో మ ధ్విక్షురస మృష్ట జలంబులు గలిగి శతయోజన విస్తారంబు లయిన సరోవరంబులు దేజరిల్లు; నందు సుస్నాతు లగువారలకు యోగైశ్వర్యంబులు స్వభావంబునం గలుగు; మఱియు నందన చైత్రరథ వైభ్రాజిక సర్వతోభద్రంబు లను నామంబులు గల దేవోద్యానంబు లా పర్వత శిఖరంబుల వెలుఁగొందుచుండు; నందు దేవతాగణంబులు దేవాంగనలం గూడి గంధర్వుల గీతనృత్యంబులు గనుంగొనుచు విహరింతు రంత. 20**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; పూర్వపశ్చిమంబులు= తూర్పుపడమరలు; లవణసాగర+అంతంబులు+ఐ+ఉన్న= ఉప్పు కడలితో అంతమొందియున్న; సీమాపర్వతంబుల+అందున్= హద్దులకు చివరనున్న కొండలయందు; నీల శ్వేత శృంగవత్పర్వతంబులు= నల్లని, తెల్లని శిఖరములు గల కొండలు, నిడివిని; యథాక్రమంబుగన్= వరుసగా; దశమ+అంశన్యూన ప్రమాణ యోజనంబులు= పదియవ వంతు తక్కువగా యోజనముల, కొలఁతలు; కలవిగాన్+ఉండున్= కలిగినవిగా ఉండును; వీని మధ్యప్రదేశంబునన్= ఈ పర్వతాల నడిమిప్రదేశంలో, రమ్యక, హిరణ్మయ; కురు వర్షంబులు+అను; నామంబులుగల; వర్షంబులుండున్= వర్షభూభాగాలుంటాయి; వాని విస్తారంబులు= వాని విస్తృతి; నవసహస్ర యోజనంబులు గలిగి= తొమ్మిదివేల యోజనంబులు గలిగి; లవణసముద్ర+అంతంబులు+ఐ= ఉప్పు కడలితో అంతమగుచు, క్రమంబునన్; నీల+ఆదిపర్వత దీర్ఘ పరిమాణంబులన్+ఉండున్= నల్లనికొండ మొదలుగా సుదీర్ఘమయిన పరిమాణాలు కలిగి ఉంటాయి; ఇలావృతవర్షంబునకున్; దక్షిణంబునన్; నిషధ, హేమకూట; హిమవత్ పర్వతంబులును; సీమాపర్వతంబులును= సరిహద్దుల కొండలును; పూర్వ పశ్చిమంబులు= తూర్పుపడమరలు, నిడుపును; దక్షిణ+ఉత్తరంబులు= ఉత్తరదక్షిణములు; విశాలంబునున్+అగుచున్= విశాలమగుచు; ఆ నీల+ఆదిపర్వతంబుల తీరునన్+ఉండున్; ఆ గిరుల మధ్యప్రదేశంబునన్= ఆ కొండల మధ్యభాగంలో, హరి వర్షకింపురుష వర్ష, భారతవర్షంబులు+అను, నామంబులున్+కల= పేర్లుగల్గిన; వర్షంబులుండున్= వర్ష భూభాగాలుంటాయి; ఆ+ఇలావృత వర్షంబునకున్= ఆ ఇలావృతనామక వర్ష భూభాగానికి; పశ్చిమంబునన్= పడమటి దిక్కున, మాల్యవత్ పర్వతంబును; పూర్వభాగంబునన్= తూర్పు దిక్కున; గంధమాదనంబును; సీమాపర్వతంబులు= సరిహద్దులు గల పర్వతాలు; పూర్వపశ్చిమంబులు= తూర్పుపడమరలు, నిడుపును; దక్షిణ+ఉత్తరంబులు= ఉత్తరదక్షిణములు; విశాలంబునున్+అగుచు, నీలపర్వత నిషధపర్వతంబులన్+కదిసి, ద్విసహస్రయోజనంబుల= రెండువేల యోజనాల; విస్తారంబు+ఐ+ఉండున్; మాల్యవత్+పర్వతంబు, పశ్చిమసముద్ర+అంతంబు+ఐ= పడమటి సముద్రంతో అంతమై, కేతుమాల వర్షంబును; గంధమాదన పర్వతంబునకున్; పూర్వభాగంబునన్= తూర్పుభాగాన; సముద్ర+అంతంబు+అగుచున్= సముద్రమే సరిహద్దుగా గలిగి; భద్ర+అశ్వవర్షంబును, మేరువునకున్+తూర్పున; మందర పర్వతంబును; దక్షిణంబునన్; మేరుమందర పర్వతంబులును; పడమటి పార్శ్వంబులన్= పడమటి దిక్కున; ఉత్తరమునన్= ఉత్తరపు దిక్కున; కుముద

పర్వతంబులున్+అను; నామంబులున్+కలిగి= పేర్లు గలిగి; అయుత యోజన+ఉన్నతంబులు+అయి= పదివేల యోజనాల ఎత్తుకలవై; మేరునగంబు+అను; మధ్య+ఉన్నత మేధిస్తంభంబునకున్= నడిమి భాగమునగల ఉన్నతమయిన (ఎత్తయిన) పశువును గట్టు కొయ్యస్తంభమునకు (యూపస్తంభానికి); చతుర్ముఖంబులన్= నాలుగువైపుల; హ్రస్వస్తంభంబులున్+పోలి+ ఉండున్= కురుచ కంబాలవలె ఉంటాయి; ఆ చతుర్+స్తంభంబుల+అందును= ఆ నాలుగు స్తంభంబులయందును; పర్వత శిఖరంబులన్= కొండ కొనలయందు; వెలుఁగు+ఒందు= ప్రకాశించు; కేతువులునున్+పోలెన్= పతాకాలవలె, చూత, జంబూ, కదంబ; న్యగ్రోధంబులు+అను= మామిడి, నేరేడు, కడిమి, మఱ్ఱిఅనే; వృక్షరాజంబులు= వృక్ష శ్రేష్ఠములు, క్రమంబునన్; ఒండు+ఒంటికిన్, ఏకాదశశత యోజన+ఆయతంబును= పదకొండు వందల యోజనాల పొడవూ; శతయోజన విస్తారంబును= నూరు యోజనముల విస్తృతియు; కలిగి+ఉండున్; మఱియున్; ఆ పర్వతశిఖరంబులన్= ఆ కొండకొనలయందు; క్రమంబునన్; పయస్, మధు+ఇక్షురస, మృష్టజలంబులు+కలిగి= క్షీరసరస్సు, మధుసరస్సు, ఇక్షురస సరస్సు, నిర్మల జల సరస్సులు కలిగి; శతయోజన విస్తారంబులు+ఐన; సరోవరంబులు+ తేజరిల్లున్= కొలకులు ప్రకాశిస్తాయి; అందున్= ఆ సరోవరములలో; సుస్నాతులు+అగువారలకున్= బాగుగా స్నానం చేసేవారికి; యోగ+ఐశ్వర్యంబులు= యోగ నిష్ఠ, అణిమాది సిద్ధులు; స్వభావంబునన్+కలుగున్= తత్ స్నాన అనుభవముచేతనే సిద్ధించును, మఱియున్; నందన చైత్రరథ, వైభ్రాజిక, సర్వతోభద్రంబులు+అను; నామంబులు+కల= పేర్లుగల; దేవ+ఉద్యానంబులు; ఆ పర్వత శిఖరంబులన్= ఆ కొండకొనల; వెలుఁగొందుచుండున్; అందున్; దేవతాగణంబులు; దేవ+అంగనలన్+కూడి; గంధర్వుల గీత నృత్యంబులు+కనుంకొనుచున్= గంధర్వుల ఆటపాటలను విలోకించుచు; విహరింతురు= విహరిస్తారు; అంతన్= అంతట.

**తా :** తూరుపు పడమరలలో ఉప్పునీటి సముద్రంవరకూ ఉన్న సరిహద్దు పర్వతాలలో నీలశ్వేత శృంగవత్పర్వతాలు క్రమంగా ఒకదానికంటె ఒకటి పది యోజనాల తక్కువ పొడవు కలిగి ఉంటాయి. ఈ మూడు పర్వతాల నడిమి ప్రదేశంలో రమ్యక, హిరణ్మయ, కురు నామాలుగల మూడువర్షాలు ఉన్నాయి. అవి ఒక్కొక్కటి తొమ్మిదివేల యోజనాల విస్తృతి కలిగి ఉన్నాయి. అవన్నీ సముద్రందాక వ్యాపించి ఉన్నాయి. ఆ మూడు వర్షాల పొడవు నీలశ్వేత శృంగవత్పర్వతాల పొడవుతో సమానంగా ఉంటుంది.

ఇలావృతవర్షానికి దక్షిణంగా మూడు సరిహద్దు పర్వతాలు ఉన్నాయి. అవే నిషధ పర్వతం, హేమకూట పర్వతం, హిమవత్పర్వతం. ఇవి తూర్పునుండి పడమటి వరకూ పొడవూ, ఉత్తరంనుండి దక్షిణం వరకూ వెడల్పూ కలిగి ఉన్నాయి. వీటి నిడివి నీలశ్వేత శృంగవత్ పర్వతాలతో సమానంగా ఉంటుంది. ఈ మూడు కొండల నడుమ మూడు భూప్రదేశాలున్నాయి. అవే హరివర్షం, కింపురుషం, భారతవర్షం అనేవి.

ఇలావృతవర్షానికి పశ్చిమంలో మాల్యవంతం. తూర్పున గంధమాదనం అనే సరిహద్దు పర్వతాలున్నాయి. అవి తూర్పు పడమరలకు పొడవూ, ఉత్తర దక్షిణాలకు వెడల్పూ కలిగి నీలపర్వత నిషధ పర్వతాలను ఆనుకొని ఉన్నాయి. వాటి విస్తృతి రెండువేల యోజనాలు. మాల్యవంతం, గంధమాదనం అనే ఈ రెండూ కేతుమాల భద్రాశ్వవర్షాలకు సరిహద్దు పర్వతాలుగా ఉన్నాయి. సుమేరు పర్వతానికి తూర్పున మందర పర్వతం, దక్షిణాన మేరుమందర పర్వతం, పడమట సుపార్శ్వపర్వతం, ఉత్తరాన కుముద పర్వతం ఉన్నాయి. ఈ నాలుగు పర్వతాలు పదివేల యోజనాల ఎత్తు కలిగి ఉన్నవి.

ఇన్నిటికీ నడుమ మేరుపర్వతం ఎత్తుగా పొడుగైన స్తంభం లాగా ఉంటే మిగిలిన పర్వతాలు నాలుగు పక్కల నాటిన పొట్టిగుంజలలాగున ఉన్నాయి.

ఈ నాలుగు పర్వత శిఖరాలమీద పతాకాల లాగున క్రమంగా పెద్ద పెద్ద మామిడిచెట్లు, నేరేడు చెట్లు, కడిమి చెట్లు, మర్రిచెట్లు ఉన్నాయి. ఈ వృక్షరాజాలు ఒక్కొక్కటీ పదకొండు వందల యోజనాల పొడవూ, నూరు యోజనాల వెడల్పు కలిగి ఉన్నాయి. ఇంతేగాక ఆ నాలుగు పర్వత శిఖరాల మీద శతయోజన విస్తీర్ణములయిన నాలుగు పెద్ద పెద్ద సరోవరాలు ఉన్నాయి. క్రమంగా వానిపేర్లు క్షీర సరస్సు, మధుసరస్సు, ఇక్షురస సరస్సు, నిర్మల జలసరస్సు. ఆ సరస్సులలో స్నానం చేసేవారికి స్వభావం చేతనే యోగనిష్ఠా, అణిమాదిసిద్ధులూ సిద్ధిస్తాయి. ఇంకా ఆ పర్వత శిఖరాలపైన నందనం, చైత్రరథం, వైభ్రాజకం, సర్వతోభద్రం అనే దేవోద్యానాలు ఉన్నాయి. ఆ ఉద్యానవనాలలో దేవతలు దేవకాంతలతోకూడి గంధర్వుల ఆటపాటలను ఆలకిస్తూ ఆలోకిస్తూ ఆనందంగా విహరిస్తారు.

**ఉ. మందరపర్వతంబు తుది మామిడి పం డ్లమృతోపమానమై**
**మందరశైలశృంగకసమానములై గిరిమీఁద రాల మా**
**కందఫలామృతంబు గలఁగంబడి జాతి మహాప్రవాహమై**
**యం దరుణోదనామమున నద్భుతమై విలసిల్లు నెంతయున్. 21**

**ప్రతి :** మందరపర్వతంబు తుదిన్= మందర నామకమయిన కొండశిఖరానగల; మామిడిపండ్లు= చూతఫలాలు; అమృత+ఉపమానము+ఐ= అమృతంతో సమానమై; మందరశైల శృంగక సమానములు+ఐ= మందరపర్వత శిఖరాలతో తులతూగేవిగా; గిరి మీఁదన్= కొండపై; రాలన్= పరిపక్వత చెందడంవల్ల రాలిపడిపోతుండగా; మాకందఫల+అమృతంబు+కలఁగన్= అమృతంవంటి తియ్యమామిడిగుజ్జుతో కలిసి, పడి; జాతి; మహాప్రవాహము+ఐ= పెనుప్రవాహమై; అందున్= అచట; అరుణోద నామమునన్= అరుణోదమనే పేరుతో; ఎంతయున్= మిక్కిలి; అద్భుతము+ఐ= వింతయై; విలసిల్లున్= ప్రకాశవంతంగా; ప్రవహిస్తుంది.

**తా :** మందరపర్వతంమీద మామిడిచెట్లున్నాయి. ఆ చెట్లఫలాలు పర్వత శిఖరాలంత పెద్దవి. ఆ పండ్లరుచి అమృతంవలె ఉంటుంది. బాగా మాగిన పండ్లు చెట్లనుండి రాలుతాయి. ఆ పండ్లు పడి పగిలినపుడు ఆ పండ్లరసం అచ్చెరువు గొల్పేవిధంగా మహాప్రవాహమై 'అరుణోద'ము అనే పేరుతో ప్రవహిస్తుంది.

**చ. కడు మధురంబునన్ సురభిగంధముచే నరుణ ప్రకాశతన్**
**వడిగొని మందరాచలము వంతల చెంతల జాతి యంతలోఁ**
**దొడితొడి నాయిలావృతముఁదోఁచుచు వింతగఁబూర్వవాహియై**
**యదరుఁదరంగసంతతుల నందఱి నచ్చటఁజేయు ధన్యులన్. 22**

**ప్రతి :** కడున్= మిక్కిలి; మధురంబునన్= తియ్యదనంతో; సురభి గంధముచేన్= సుగంధంతో కూడిన; అరుణప్రకాశతన్= ఎర్రని రంగుతో; వడిగొని= వేగం పుంజుకొని; మందర+అచలము= మందర పర్వతం; వంతల చెంతలన్= సమీపంలో, జాతి; అంతలోన్; తొడితొడి= వెంటవెంటనే; పూర్వవాహి+ఐ= తూర్పువైపుగా ప్రవహించునదై; ఆ+ఇలావృతమున్= ఆ ఇలావృత వర్షాన్ని; తోఁచుచున్= ఒరుసుకొంటూ; అదరున్= వర్ధిల్లును వింతగన్= ఆశ్చర్యకరంగా; తరంగ సంతతులన్= అలలసముదాయంతో; అచ్చటన్= అచ్చట; అందఱిన్= అందఱిని; ధన్యులన్+చేయున్= పవిత్రులుగా చేస్తుంది.

**తా :** ఆ నదీజలాలు చాలా తియ్యనివి. సుగంధంతో కూడినవి. ఎర్రనిరంగు కలవి. ఆ నది మందరాచలం నుండి బయల్వెడలి తూర్పువైపుగా ఇలావృతవర్షాన్ని ఒరుసుకొంటూ సాగిపోతుంది. ఆ నదీతరంగాలు అందరినీ పవిత్రం చేస్తుంటాయి.

ఆ. ఆ నదీజలంబు లాడిన యచ్చటి, యంబికానుచరుల యంగగంధ
మంది పవనుఁడంత మనుజేశ! పదియోజ, నములు సుట్టుఁబరిమళముల నింపు. 23

**ప్రతి :** మనుజ+ఈశ= నరాధిపా!; పవనుఁడు= వాయువు; ఆ నదీ జలంబులు+ఆడిన= అరుణోద ప్రవాహంలో జలకేళి సల్పిన, అచ్చటి; అంబికా+అనుచరుల= పార్వతీదేవి చెలికత్తెల; అంగగంధము+అంది= శరీర దివ్యపరిమళాన్ని జోడించుకొని; అంతన్= పిదప; పదియోజనములు+చుట్టున్= పది ఆమడల పర్యంతమును; పరిమళములన్= సుగంధమును; నింపున్= వెదజల్లుతుంది.

**తా :** ఓ రాజా! ఆ నదీజలాలలో పార్వతీదేవి చెలికత్తెలు స్నానం చేస్తారు. వారి శరీరాలలోని సహజ దివ్యపరిమళాన్ని గ్రహించి, వాయువు పది యోజనాల పర్యంతం సుగంధాలు వెదజల్లుతుంది.

ఆ. మేరుమందరములమీఁద జంబూఫలం, బులు మహాగజోపములుగ వ్రాలి
యవిసి యంతఁదద్రసామృతం బల్లన, య మ్మహానగంబునందుఁబొడమి. 24

**ప్రతి :** మేరు మందరముల మీఁదన్; జంబూఫలంబులు= నేరేడు పండ్లు; మహా+గజ+ఉపములుగన్= పెనుగజములతో పోల్చదగినవై; వ్రాలి= రాలిపడి; అవిసి= పగిలి; అంతన్= పిమ్మట; తద్+రస+అమృతంబు+అల్లనన్= ఆ నేరేడు పండ్ల అమృతరసంవంటి రసం, మెల్లమెల్లన; ఆ+మహానగంబు+అందున్= ఆ పెనుగొండయందు, పొడమి= పుట్టి...

**తా :** మేరుమందరపర్వతాలమీద నేరేడు పండ్లున్నాయి. ఆ పండ్లు పెద్ద ఏనుగులంత పరిమాణంగలవి. చెట్లనుండి అవి రాలిపడి పగులగా ఆ పగిలిన పండ్లరసమే ప్రవాహంగా ఆ కొండమీద జాలువారుతున్నది.

క. అనుపమ మగు జంబూనది, యను పేరను వెలసి లీల నరుగుచు నంతన్
ఘనత నిలావృతవర్షము, పనుపడఁదడుపుచును ధరణిఁబ్రవహించుఁదగన్. 25

**ప్రతి :** అనుపమము+అగు= పోల్చుటకు వీలుకానిదైన; జంబూనది+అనుపేరను= జంబూనది అనుపేరుతో; వెలసి= ప్రసిద్ధమై; లీలన్+అరుగుచున్= విలాసంతో ప్రవహిస్తూ; అంతన్= అంత; ఘనతన్= గొప్పతనంతో; ఇలావృతవర్షమున్= ఇలావృత వర్షప్రదేశమును; పనుపడన్= విభాగమేర్పడునట్లుగా; తడుపుచును= జలప్రవాహంచే తడుపుతూ; ధరణిన్= భూభాగమున; తగన్= చక్కగా; ప్రవహించున్= ప్రవహిస్తుంది.

**తా :** ఆ నేరేడు పండ్లరసం నదిగా ప్రవహిస్తున్నది. ఆ నదిపేరు జంబూనది. ఆ నది సాటిలేనిది. ఆ నది ఇలావృత వర్షాన్ని తడుపుతూ భూభాగంమీద ప్రవహిస్తున్నది.

ఉ. ఆ నదినీటఁదోఁగి పదనై యటు మృత్తనిలార్కసంగతిం
బూని కడున్ విపాకమునఁబొందుచు శుద్ధసువర్ణజాతి జాం
బూనద నామమొంది సురముఖ్యుల కెల్లను భూషణార్హమై
మానుగ వన్నె మించి కడు మంచిదియై విలసిల్లు నెంతయున్. 26

**ప్రతి :** ఆ నదినీటన్= ఆ జంబూనదీ జలాల్లో; తోఁగి= పూర్తిగా మునిగి; పదను+ఐ= నానినదై; అటు; మృత్తు= మట్టి; అనిల+అర్కసంగతిన్= వాయు, సూర్య సంపర్కంవల్ల; పూని= ప్రయత్నించి; కడున్= మిక్కిలి; విపాకమునన్+ పొందుచున్=

పరిణామం పొంది; శుద్ధ= అచ్చమైన; సువర్ణజాతి= మంచివన్నెగల బంగారు జాతిదయిన; జాంబూనదనామమున్= జాంబూనదమనే పేరును; ఒంది= పొంది; సురముఖ్యులకున్+ఎల్లనున్= ఎల్లదేవతాప్రముఖులకు, అందరకు; భూషణ+అర్హము+ఐ= నగలు చేయించుకొనుటకు తగినదై; వన్నెమించి= వర్ణంతో ప్రకాశించి; కడుమంచిది+ఐ= మిక్కిలి శుభప్రదమై; ఎంతయున్= ఎంతో; విలసిల్లున్= ప్రకాశించును.

**తా :** ఆ జంబూనదీజలంతో బాగా నానిన మట్టి, గాలి, సూర్యకిరణాల సంపర్కంతో పరిపక్వమై బంగారంలా మారిపోతుంది. ఆ కారణంగా బంగారానికి జాంబూనదం అనే పేరు వచ్చింది. మంచివన్నెగల ఆ శుద్ధ సువర్ణంతో దేవతలు నగలు చేయించుకొని అలంకరించుకొంటారు.

**విశే : హాటకోత్పత్తి కథనం :** బంగారు ఉత్పత్తి అయ్యే విధం పంచమస్కంధం – ద్వితీయాశ్వాసంలోనే రెండు విధాలుగా చెప్పబడింది. 1) 5-2-26 - జాంబూనదము = బంగారు

2) 5-2-111 - హాటకము = బంగారు

దేవతలు ధరించే బంగారం – జాంబూనదము. 'వితలం' (అధోలోకాలలో ఒకటి) లోని ప్రజలు ధరించే బంగారం హాటకము. మూలంలో ఏయే నగలుగా మార్చుకొంటారో, అలంకరించుకొంటారో వివరణ ఉంది. **'ముకుట, కటక, కటిసూత్ర ఆది ఆభరణ రూపేణ ఖలు ధారయన్తి'** (16-21) కిరీటాలు, కంకణాలు, మొల నూలులాంటి నగలని గ్రహించవచ్చు.

**వ. మఱియు సుపార్శ్వ నగాగ్రంబునందుఁ బంచవ్యామపరీణాహ బంధురంబులగు నైదు మధుధారా ప్రవాహంబులు పంచముఖంబుల వెడలి సుపార్శ్వనగ శృంగంబులం బడి యిలావృత వర్షంబు పశ్చిమభాగంబుఁ దడుపుచుం బ్రవహించు, నా తేనియ ననుభవించువారల ముఖమారుత సుగంధంబు శతయోజనపర్యంతంబు పరిమళించు. 27**

**ప్రతి :** మఱియున్= అంతేగాక; సుపార్శ్వనగ+అగ్రంబు+అందున్= సుపార్శ్వమనే కొండ శిఖరంమీద; పంచవ్యామపరీణాహ బంధురంబులు+అగు= ఐదు బారల పొడవు వెడల్పులతో, నిండినవియు అయిన; ఐదు మధుధారాప్రవాహంబులు= ఐదు తేనెధారల వెల్లువలు; పంచముఖంబులన్= ఐదు దిక్కుల, వెడలి; సుపార్శ్వ నగశృంగంబులన్+పడి= సుపార్శ్వ పర్వతశిఖరం మీదనుండి క్రిందికి ప్రవహిస్తూ; ఇలావృత వర్షంబు= ఇలావృత భూభాగం; పశ్చిమభాగంబున్= పడమటి ప్రదేశాన్ని; తడుపుచున్= తడుపుచు; ప్రవహించున్= ప్రవహించును ఆ తేనియన్; అనుభవించువారల; ముఖమారుత సుగంధంబు= ముఖాలనుండి వెలువడిన పరిమళం; శతయోజనపర్యంతంబు= నూరు యోజనాల మేర; పరిమళించున్= వ్యాపిస్తుంది.

**తా :** సుపార్శ్వమనే కొండ పైభాగంలో ఐదు తేనెప్రవాహాలు. ఒక్కొక్క ప్రవాహం ఐదుబారల వెడల్పు కలది. అవి ఐదుముఖాలుగా ఐదుశిఖరాలనుండి క్రిందికి ప్రవహిస్తూ ఇలావృత వర్షం పడమటిభాగాన్ని తడుపుతుంటాయి. ఆ ఐదు తేనెప్రవాహాలనూ ఆస్వాదించినవారి ముఖాలనుండి వెలువడిన పరిమళం నూరు యోజనాల పర్యంతం వ్యాపిస్తుంది.

**విశే :** వ్యామము అంటే రెండు చేతులు చాస్తే వాని నడుమగల పరిమాణం. దాదాపు 8 అడుగులు. ఒక్కొక్కధార 40 అడుగుల వెడల్పు కలదని భావించాలి.

**సీ. కుముదపర్వతశిఖాగ్రమున నుత్పన్నమై కనుపట్టు వటతరుస్కంధమునను**
**నుదయించునట్టి పయో దధి ఘృత మధు గుడ విశిష్టాన్నంబు లుడుగ కెపుడు**
**నంబరశయ్యాసనాభరణాదివస్తువులు గోరికలు దీర్చుచును గుముద**
**పర్వతాగ్రంబునఁబడి యిలావృతవర్షమున జనులకు నెల్ల భోగ్యములను**

**ఆ. వదల కొసఁగు, వారి వళిపలితంబులు, దలఁగు దుష్టగంధములును బాయు**
**మరణభయము ముదిమి పొరయ దెన్నఁడును శీ, తోష్ణబాధ సెందకుండు నధిప! 28**

**ప్రతి :** అధిప= రాజా!; కుముద పర్వతశిఖా+అగ్రమునన్= కుముదనామక పర్వతం కొననుండి; ఉత్పన్నము+ఐ= బాగుగా మొలిచి పెరిగినదయి; కనుపట్టు= గోచరించు; వటతరు స్కంధమునను=మఱ్ఱిచెట్టుయొక్క బోదెయందు; ఉదయించునట్టి= పుట్టినట్టి, జన్మించునట్టి; పయస్= పాలు; దధి= పెరుగు; ఘృత= నేయి; మధు= తేనె; గుడ= బెల్లం; విశిష్ట+అన్నంబులు= శ్రేష్ఠమయిన అన్న విశేషాలు; ఉడుగక+ఎపుడు= సతతం ఉత్పన్నమవుతూ; అంబర= వస్త్రాలు; శయ్యా= పాన్పులు; ఆసన= కూర్చోవడానికి పీఠములు; ఆభరణ+ఆదివస్తువులు= నగలు మొదలయిన వస్తువులు; కోరికలు+తీర్చుచును= కాంక్షలను నెరవేరుస్తూ; కుముద పర్వత+అగ్రంబునన్+పడి= కుముద నామకమగు కొండ కొనలనుండి పడుతూ; ఇలావృతవర్షమునన్= ఇలావృతమను పేరుగల వర్షభూభాగమందలి; జనులకున్= ప్రజలకు; ఎల్లభోగ్యములను= అన్నిరకాలయిన అనుభవాలను; వదలక+ఒసఁగున్= విడువక ప్రసాదించును; వారి= ఆ జనుల; వళిపలితంబులు= చర్మపు ముడుతలు, నెరసిన తలవెంద్రుకలు; తలఁగున్= తప్పును; దుష్టగంధములును+పాయున్= దుర్వాసనలును వదలిపోవును; ఎన్నడునున్= ఏనాడును; మరణభయము= చావువలన కలిగే భీతి; ముదిమి= ముసలితనము; పొరయదు= కలుగదు; శీత+ఉష్ణబాధ= చలివేడుముల బాధలు; చెందక+ఉండున్= చెందకుండును.

**తా :** ఓ రాజా! కుముద పర్వతం శిఖరంమీద దృఢమయిన మఱ్ఱిచెట్టు ఉన్నది. ఆ మఱ్ఱిమాను బోదెనుండి పాలు, పెరుగు, నేయి, తేనె, బెల్లం ఇంకా రకరకాల రుచులు కలిగిన ఆహారపదార్థాలు ఎప్పుడూ పుడుతూ ఉంటాయి. వస్త్రాలు, పాన్పులు, ఆసనాలు, నగలు మొదలయిన వస్తువులను ఆ వటవృక్షం ప్రసాదిస్తుంది. ఆ మఱ్ఱిమాను కోరిన కోరికలు తీరుస్తూ ఇలావృత వర్షంలో నివసించే ప్రజల కందరికి సమస్త విధములయిన సుఖసంపత్తిని ప్రసాదిస్తుంది. అక్కడ ఎవరికీ ముసలితనం రాదు. చర్మం ముడుతలు పడదు. జుట్టు నెరిసిపోదు. శరీరానికి దుర్గంధం ఉండదు. మరణభయం అసలుండదు. చలి, ఎండల బాధలసలు ఉండనే ఉండవు.

**ఆ. దేవదానవులును దివ్యమునీంద్ర గం, ధర్వు లాదిగాఁగఁదగిలి యాశ్ర**
**యించి యుందు రా గిరీంద్ర మూలమునందు, హర్షమంది ఘనవిహారలీల. 29**

**ప్రతి :** దేవదానవులును= దేవతలు, రాక్షసులును; దివ్యముని+ఇంద్ర గంధర్వులు+ఆది+కాఁగన్= దేవర్షులు గంధర్వులు మొదలైనవారు; తగిలి= ఆసక్తి కలిగి; ఆ గిరి+ఇంద్రమూలము+అందున్= ఆ శ్రేష్ఠపర్వతం అడుగుభాగాన; ఘనవిహారలీలన్= గొప్పదయిన స్వేచ్ఛా విహారవిలాసాలతో; హర్షము+అంది= సంతోషమంది; ఆశ్రయించి+ఉందురు= ఆశ్రయించి ఉంటారు.

**తా :** దేవతలు, రాక్షసులు, దివ్యమునీంద్రులు, గంధర్వులు మొదలయిన వారందరూ ఈ కుముద పర్వతాన్ని ఆశ్రయించి పట్టరాని సంతోషంతో విహరిస్తుంటారు.

విశే : మూలంలో '**కుముదనిరూఢో యశ్శతవల్శో నామ వటః**' 16-24 అని మఱ్ఱిచెట్టు పేరు '**శతవల్శము**'గా చెప్పబడింది.

**వ. నరేంద్రా! కురంగ కురర కుసుంభ వైకంకత త్రికూట శిశిర పతంగ రుచక నిషధ శితివాస కపిల శంఖాదులయిన పర్వతంబులు మేరుపర్వతకర్ణికకుఁ గేసరంబులయి పరివేష్టించి యుండు, నామేరు నగేంద్రంబునకుఁ బూర్వభాగంబున జఠర దేవకూటంబులును, బశ్చిమంబునం బవనపారియాత్రంబులు నను పర్వతంబులు నాలుగు, నొండొంటికి దక్షిణోత్తరంబుల నష్టాదశ సహస్ర యోజనంబుల నిడుపును బూర్వ పశ్చిమంబుల ద్విసహస్ర యోజనంబుల వెడల్పును నగుచు దక్షిణంబునఁ గైలాస కరవీరంబులును, నుత్తరంబునఁ ద్రిశృంగమకరంబులను నామంబులు గల పర్వతంబులు నాలుగును, బూర్వపశ్చిమంబుల నష్టాదశసహస్ర యోజనంబుల నిడుపును, దక్షిణోత్తరంబుల ద్విసహస్రయోజనంబుల వెడల్పును నగుచు నగ్నిపురుషునకుం బ్రదక్షిణం బగుచున్న పరిస్తరణంబుల చందంబున మేరువునకుం బ్రదక్షిణంబుగా నష్ట నగంబులు నిలిచియుండు, మేరు శిఖరంబున దశసహస్ర యోజనంబుల నిడుపు నంతియ విస్తారంబు నగుచు సువర్ణమయంబయిన బ్రహ్మపురంబు తేజరిల్లుచుండు, నా పట్టణంబునకు నష్టదిక్కుల యందును లోకపాలుర పురంబు లుండు. 30**

**ప్రతి :** నర+ఇంద్రా!; రాజా; కురంగ; కురర; కుసుంభ; వైకంకత; త్రికూట; శిశిర; పతంగ; రుచక; నిషధ; శితివాస; కపిల; శంఖ+ఆదులయిన= శంఖాదులనే నామాలతో; పర్వతంబులు= కొండలు; మేరుపర్వత కర్ణికకున్= మేరుపర్వతమనే దుద్దుకు; కేసరంబులు+అయి= కింజల్కములై, అకరువులై; పరివేష్టించి+ఉండున్= చుట్టి ఉండును; ఆ మేరునగ+ఇంద్రంబునకున్= పర్వత శ్రేష్ఠమయిన మేరు పర్వతానికి; పూర్వ భాగంబునన్= తూర్పుభాగంలో; జఠరదేవకూటంబులును= జఠరగిరి; దేవకూటం అనే కొండలును; పశ్చిమంబునన్= పడమటిదిక్కున; పవన పారియాత్రంబులున్+అను= పవనగిరి, పారి యాత్రములనే పేళ్ళుగల; పర్వతములు నాలుగు= కొండలు నాలుగు; ఒండు+ఒంటికిన్= పరస్పరం; దక్షిణ+ఉత్తరంబులన్= దక్షిణంనుంచి ఉత్తరం వరకు; అష్టాదశసహస్రయోజనంబుల నిడుపును= పద్దెనిమిది యోజనాల పొడవును; పూర్వపశ్చిమంబులన్= తూర్పు నుండి పడమటివరకు; ద్విసహస్రయోజనంబుల వెడల్పును+అగుచున్= రెండువేల యోజనాల వెడల్పు కలిగి ఉండి; దక్షిణంబునన్= దక్షిణంవైపు; కైలాస కరవీరంబులును= కైలాసం కరవీరం అనే కొండలును; ఉత్తరంబునన్= ఉత్తరంవైపు; త్రిశృంగ మకరంబులు+అను నామకంబులు+కల= త్రిశంగం, మకరం అను పేరుగల; పర్వతంబులు నాలుగును= కొండలు నాలుగును; పూర్వపశ్చిమంబులన్= తూర్పునుండి పడమటిదాక; అష్టాదశ సహస్రయోజనంబుల నిడుపును= పదునెనిమిది సహస్ర యోజనాల నిడుపును; దక్షిణ+ఉత్తరంబులన్= దక్షిణంనుండి ఉత్తరానికి; ద్విసహస్ర యోజనంబుల= రెండువేల యోజనాల, వెడల్పును; అగుచున్= కలిగినదగుచు; అగ్నిపురుషునకున్= అగ్నిహోత్రునికి; ప్రదక్షిణంబు+అగుచున్న= ప్రదక్షిణం చేస్తున్న; పరిస్తరణంబుల చందంబునన్, చుట్టూ పరచబడిన దర్భలలాగున, మేరువునకున్; ప్రదక్షిణంబుగాన్= ప్రదక్షిణంగా; అష్టనగంబులు= ఎనిమిది కొండలు; నిలిచియుండున్= నిలిచి ఉన్నాయి; మేరుశిఖరంబునన్= మేరుశిఖరంపై; దశసహస్ర యోజనంబుల నిడుపును= పది వేల యోజనాల పొడవును; అంతియ విస్తారంబున్+అగుచున్= అంతే విస్తారంగల; సువర్ణమయంబు+అయిన= బంగారుమయమైన; బ్రహ్మపురంబు= బ్రహ్మ పట్టణము; తేజరిల్లుచున్+ఉండున్= ప్రకాశించుచుండును; ఆ+పట్టణంబునకున్= ఆ నగరానికి; అష్టదిక్కుల+అందును= ఎనిమిది దిక్కులయందును; లోకపాలురపురంబులు+ఉండున్= లోకపాలకుల పట్టణాలు ఉన్నాయి.

**తా :** నరేంద్రా! మేరుపర్వతం తామరదుద్దు. దానిచుట్టూ కురంగం, కురరం, కుసుంభం, వైకంకతం, త్రికూటం, శిశిరం, పతంగం, రుచకం, నిషధం, శితివాసం, కపిలం, శంఖం మొదలయిన పర్వతాలు కేసరాలుగా ఉన్నాయి. ఆ మేరుపర్వతానికి తూర్పుభాగంలో జఠరగిరి, దేవకూటం అనే కొండలున్నాయి. పడమట పవనగిరి, పారియాత్రం అనే పర్వతాలున్నాయి. ఈ నాలుగు పర్వతాలు ఒక్కొక్కటి దక్షిణం నుంచి ఉత్తరం వరకు పద్దెనిమిది వేల యోజనాల పొడవూ, తూర్పునుండి పడమటివరకూ రెండువేల యోజనాల వెడల్పూ కలిగి ఉంటాయి. ఆ కొండల కావల దక్షిణంలో కైలాసం, కరవీరం అనే కొండలున్నాయి. ఆ కొండలు ఒక్కొక్కటీ తూర్పునుండి పడమటి దిక్కుదాక పద్దెనిమిది యోజనాల పొడవూ, దక్షిణం నుంచి ఉత్తరం దాకా రెండువేల యోజనాల వెడల్పూ కలిగి ఉంటాయి. మేరువు చుట్టూ ఉన్న ఎనిమిది కొండలు అగ్నిహోత్రునికి ప్రదక్షిణంగా పరచిన దర్భల లాగున నిలిచి ఉన్నాయి. మేరుపర్వత శిఖరంలో 'బ్రహ్మపురం' ఉన్నది. అది పదివేల యోజనాల పొడవూ, అంతే వెడల్పు కల ప్రదేశం. అదంతా సువర్ణభూమి. ఆ బ్రహ్మపురానికి ఎనిమిది దిక్కులలోనూ అష్టదిక్పాలకుల పట్టణాలున్నాయి.

**విశే :** (అష్టాగ్నులు – అగ్ని, జాతవేదుడు, సహోజుడు, అజరాప్రభుడు, వైశ్వానరుడు, నర్యావసుడు, విస్ఫురుడు, పంక్తిరథుడు.)

**అష్టదిక్పాలకులు :** ఇంద్రుడు, అగ్ని, యముడు, నిరృతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశానుడు.

**దిక్పాలుర పట్టణాలు :** అమరావతి, తేజోవతి, సంయమని, కృష్ణాంగన, శ్రద్ధావతి, గంధవతి, అలక, యశోవతి.

**అష్టదిక్కులు :** తూర్పు, ఆగ్నేయం, దక్షిణం, నైఋతి, పడమర, వాయవ్యం, ఉత్తరం, ఈశాన్యం.

**క. పరమేష్ఠి పట్టణంబున, హరి మున్ను త్రివిక్రమణము లందన్ సర్వే**
**శ్వర చరణాగ్రనఖాహతిఁ, బరువడి నూర్ధ్వాండ మంతఁబగిలె నరేంద్రా! 31**

**ప్రతి :** నరేంద్రా!= ఓ రాజా!; పరమేష్ఠి పట్టణంబునన్= బ్రహ్మ పట్టణంలో; హరి= నారాయణుడు; మున్ను= మునుపు; త్రివిక్రమణములు+అందన్= త్రివిక్రమత్వాన్ని ప్రదర్శించగా; సర్వ+ఈశ్వర చరణ+అగ్రనఖ+ఆహతిన్= ఆ సర్వేశ్వరుడయిన హరి కాలిగోటి దెబ్బకు; పరువడిన్= అతిశయంగా; ఊర్ధ్వ+అండము= బ్రహ్మాండం పైభాగం; అంతన్= అంత; పగిలెన్= పగిలిపోయింది.

**తా :** ఓ రాజా! బ్రహ్మపట్టణంలో నారాయణుడు త్రివిక్రమత్వాన్ని ప్రదర్శించినప్పుడు ఆయన కాలిగోటి దెబ్బకు బ్రహ్మాండం పైభాగం బ్రద్దలయింది.

**విశే :** మూలంలో 'బ్రహ్మపురి' కి సంబంధించిన కొన్ని అంశాల వర్ణనలున్నాయి. మేరుపర్వత శిఖరంపై మధ్యలో బంగారంతో నిర్మించిన నగరం బ్రహ్మపురి. ఇది సమచతురస్రాకారం గలది. కోటియోజనాల నిడివి కలది. **'యజ్ఞలింగస్య విష్ణోర్విక్రమతో వామపాదాంగుష్ఠ నఖనిర్భిన్నోర్ధ్వాండ కటాహవివరేణ'** (17-1) అని వర్ణన. యజ్ఞంనందు వామనాకృతి గలిగి మూడు అడుగులు వేయుచున్న విష్ణువు ఎడమకాలి బొటనవ్రేలియొక్క గోటిచే పగులగొట్టబడిన పైభాగంగల గంగాళంవంటి బ్రహ్మాండం యొక్క రంధ్రం అని వివరణ కనిపిస్తుంది.

**వ. ఇట్లు చరణనఖస్పర్శంజేసి భేదింపంబడ్డ యూర్ధ్వకటాహ వివరంబు వలన నంతః ప్రవేశంబు సేయుచున్న బాహ్యజలధార శ్రీహరిపాదస్పర్శం జేయుచుఁ, జనుదెంచి సకలలోకజనంబుల దురితంబులు**

**వాపుచు భగవత్పాది యనుపేరం దేజరిల్లుచు దీర్ఘ కాలంబు స్వర్గంబున విహరించుచు, విష్ణుపదంబున నుత్తానపాద పుత్త్రుండును బరమభాగవతుండునైన ధ్రువుండు తన కులదేవతయైన శ్రీహరి పాదోదకంబుఁ బ్రతిదినంబును భక్తియోగంబున నిమీలితనేత్రుండై యానందబాష్పంబుల రోమాంచితగాత్రుండై యత్యాదరంబున నేఁడును శిరంబున ధరియించుచున్నవాఁ; డతనికి నధోభాగంబున నుండు మండలాధిపతులైన సప్తర్షులును హరిపాదోదక ప్రభావంబు నెఱింగి తాము పొందు తపస్సిద్ధి యాకాశగంగాజలంబుల స్నాతు లగుటయే యని సర్వభూతాంతర్యామి యగు నీశ్వరునియందు భక్తి సలిపి యితరపదార్థాపేక్ష సేయక మోక్షార్థి ముక్తిమార్గంబు బహుమానంబు సేయు తెఱంగున బహుమానయుక్తంబుగాఁ దమ జటాజూటంబులయందు నేఁడును ధరియించుచుండుదురు. 32**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; చరణనఖస్పర్శన్+చేసి= వామపాదనఖంయొక్క స్పర్శచేత; భేదింపన్+పడ్డ= బ్రద్దలయిన; ఊర్ధ్వకటాహ వివరంబు వలనన్= బ్రహ్మాండపు పైకప్పు రంధ్రంనుండి; అంతఃప్రవేశంబు+చేయుచున్న= లోపలికి ప్రవేశిస్తున్న; బాహ్యజలధార= వెలుపలి జలధార; శ్రీహరిపాద స్పర్శన్+చేయుచున్= త్రివిక్రమ దేవుని పాదాన్ని స్పృశిస్తూ; చనుదెంచి= ప్రవహించి; సకల లోకజనంబుల దురితంబులు= అన్ని లోకాలలోని జనుల పాపములను; పాపుచున్= పరిహరిస్తూ; భగవత్పాది+అనుపేరన్= భగవత్పాది అనుపేరుతో; తేజరిల్లుచున్= ప్రకాశిస్తూ; దీర్ఘకాలంబు= ఎక్కువకాలం; స్వర్గంబున విహరించుచున్= స్వర్గంలో విహరిస్తూ, విష్ణుపదంబునన్; ఉత్తానపాద పుత్రుండును= ఉత్తానపాదుని కుమారుడును; పరమభాగవతుండును+ఐన= భాగవతులలో అగ్రేసరుడూ అయిన; ధ్రువుండు= ధ్రువుడు; తనకులదేవత+ఐన= తన ఇలవేల్పు ఐన; శ్రీహరిపాద+ఉదకంబున్= సమస్త పాపములను హరించు శ్రీమహావిష్ణువు పాదమునుండి ఉద్భవించిన జలమును; ప్రతిదినంబును= ప్రతిరోజు; భక్తియోగంబునన్; నిమీలిత నేత్రుండు+ఐ= అరమోడ్పు కన్నులుగలవాడై; ఆనంద బాష్పంబులన్; రోమ+అంచిత గాత్రుండు+ఐ= పులకించిన దేహంతో; అతి+ఆదరంబునన్= మిక్కిలి గౌరవంతో, నేఁడును; శిరంబునన్= తలపై, ధరియించుచున్నవాఁడు; అతనికిన్, అధోభాగంబునన్+ఉండు= దిగువ భాగమున నుండే; మండల+అధిపతులు+ఐన= ఆయా మండలాలకు అధిపతి అయిన; సప్త+ఋషులును; హరిపాద+ఉదక ప్రభావంబున్= మహావిష్ణు పాదోదక ప్రభావమును; ఎఱింగి= తెలుసుకొన్నవారై, తాము; పొందు; తపస్+సిద్ధి= తపః ఫలం; ఆకాశగంగా జలంబులన్; స్నాతులు+అగుటయే+అని= స్నానం చేయడమే అని; సర్వభూత+అంతర్యామి+అగు= అఖిల భూతములలో అంతర్యామి అయిన; ఈశ్వరుని+అందున్= నారాయణునందు భక్తి, సలిపి; ఇతర పద+అర్థ+ అపేక్ష+చేయక= వేరే ప్రాపంచికమయిన వస్తువులపై అపేక్ష లేకుండా; మోక్ష+అర్థి= మోక్షము కోరువాడు; ముక్తి మార్గంబున్; బహుమానంబు+చేయు తెఱంగునన్= గౌరవించునట్లు; బహుమాన యుక్తంబు+కాన్= భక్తిగౌరవాలతో; తమ జటాజూటంబుల+అందున్= తమయొక్క తలవెంద్రుకలయందు, సిగముడులందు; నేఁడునున్; ధరియించు చుండుదురు= ధరిస్తూ ఉంటారు.

**తా :** త్రివిక్రమావతారం ప్రదర్శించిన శ్రీమన్నారాయణుని కాలిగోరు తగలడంచేత బ్రహ్మాండం పై కప్పు బద్దలుకాగా ఒక రంధ్రం ఏర్పడింది. అప్పుడు అంతవరకు వెలుపలివైపు ప్రవహిస్తున్న జలధార పైకప్పు రంధ్రం ద్వారా అంతర్వాహినియై త్రివిక్రమదేవుని పాదాన్ని స్పృశిస్తూ ప్రవహించింది. ఆ ప్రవాహమే **'భగవత్పాది'** అనే పేరుతో సకల లోకాల పాపాలను పరిహరిస్తూ చాలకాలం స్వర్గంలో విహరించింది. ఉత్తానపాదుని కుమారుడూ, భాగవతులలో అగ్రేసరుడూ అయిన

ధ్రువుడు తన ఇలువేల్పయిన శ్రీహరి పాదోదకాన్ని ప్రతిదినం నిమీలిత నేత్రుడై భక్తితో స్వీకరిస్తూ, ఆనందబాష్పాలతో, పులకించిన దేహంతో, ఎంతో ఆదరంతో నేటికీ తలపై చల్లుకొంటున్నాడు. ఆ ధ్రువునికి దిగువ భాగంలోనే మండలాధిపతులయిన సప్తర్షులున్నారు. వారు శ్రీమన్నారాయణుని పాదోదక ప్రభావం తెలుసుకొని ఆకాశగంగలో స్నానం చేయడమే తమ తపస్సిద్ధి అని భావిస్తారు. అఖిల జగత్తులో అంతర్యామిగా ఉన్న శ్రీమన్నారాయణునిపై భక్తి దృఢంగా నిలిపి, వేరే ప్రాపంచికమయిన వస్తువులపై అపేక్ష లేకుండా, మోక్షం కోరేవ్యక్తి, ముక్తిమార్గాన్ని గౌరవించినట్లు భక్తిగౌరవాలతో సప్తమహర్షులు ఆ ఆకాశగంగాజలాన్ని తమ జటాజూటాలలో ఈనాటికీ ధరిస్తుంటారు.

**విశే :** ధ్రువమండలానికి విష్ణుపదం అని ప్రసిద్ధి.

**వారాహే వామపాదం తు తదన్యేషు తు దక్షిణమ్ ।**
**పాదం కల్పేషు భగవాన్ ఉజ్జహార త్రివిక్రమః ॥**

కుడిపాదంపై నిలిచి, ఎడమ పాదాన్ని విశ్వం యొక్క అంచువరకు చాచి వామనమూర్తి త్రివిక్రముడుగా ప్రసిద్ధి చెందాడు. **సప్తర్షులు –** ఆయామనువుల కాలంలో విభిన్న ఋషులు సప్తర్షులు. వైవస్వత మనువు కాలంలో వసిష్ఠ, అత్రి, గౌతమ, కశ్యప, భరద్వాజ, జమదగ్ని, విశ్వామిత్రులు సప్తర్షులు.

**సీ. అంత నసంఖ్యంబులైన దివ్యవిమానసంకులంబుల సువిశాలమైన**
**దేవమార్గంబున దిగి వచ్చి చంద్రమండలముఁదోఁచుచు మేరునగశిఖాగ్ర**
**మునను నా బ్రహ్మదేవుని పట్టణమునకు వచ్చి యందులఁజతుర్ద్వారములను**
**వరుసతో దీర్ఘప్రవాహంబు లగుచును బ్రవహించి యమలప్రభావములను**

**ఆ. నరుగు లవణసాగరాంతంబులుగ నాల్గు, మోములందు నాల్గు నామములను**
**దన్నుఁగన్నవారిఁదన వారిఁదోఁగిన, వారికెల్ల నమృతవారి యగుచు. 33**

**ప్రతి :** అంతన్= అంత; అసంఖ్యంబులు+ఐన= గణించడానికి వీలుకాని; దివ్యవిమానసంకులంబులన్= దివ్యవిమానాలతో సందడిగలిగి నిండినదయి; సువిశాలము+ఐన= మిక్కిలి విశాలమయిన, దేవమార్గంబునన్, దిగివచ్చి; చంద్రమండలమున్; తోఁచుచున్= ఒరుసుకొంటూ; మేరునగశిఖా+అగ్రమునను= మేరుపర్వత శిఖరంయొక్క పైభాగమున నున్న ఆ బ్రహ్మదేవుని పట్టణమునకున్, వచ్చి, అందులన్; చతుర్+ద్వారములను= నాలుగు ద్వారాల గుండా, వరుసతోన్; దీర్ఘప్రవాహంబులు+ అగుచును= సుదూర ప్రవాహరూపాలను ధరిస్తూ; ప్రవహించి= పారి; అమలప్రభావములను= మాలిన్యరహిత ప్రభావము కలదగుచు, అరుగు; లవణ సాగర+అంతంబులు+కన్= ఉప్పునీటి సముద్రమే అంతంగా; నాల్గు మోములు+అందున్= నాలుగు విధాలుగా; నాలుగు నామములను= నాలుగు పేర్లతో; తన్నున్= తనను; కన్నవారిన్= దర్శించినవారిని; తనవారిన్+ తోఁగిన వారికిన్+ఎల్లన్= తనలో స్నానం చేసినవారికిని; అమృతవారి+అగుచున్= అమృతత్వం ప్రసాదించే నీరవుతుంది.

**తా :** విష్ణుమూర్తి పాదాలనుండి వినిర్గతమైన ఆకాశగంగ లెక్కలేనన్ని దివ్యవిమానాలతో నిండి సువిశాలమయిన దేవమార్గం గుండావచ్చి చంద్రమండలాన్ని ఒరుసుకొంటూ మేరుపర్వత శిఖరాగ్రానికి చేరుకొంటుంది. అక్కడి ఆ బ్రహ్మపట్టణం నాలుగుద్వారాలగుండా సీత, చక్షువు, భద్ర, అలకనంద అనే నామములతో నాలుగు విధాలుగా ప్రవహించి చివరకు

లవణ సముద్రంలో కలిసిపోతుంది. ఆ గంగాజలాలు తమను దర్శించేవారికీ, తమలో స్నానం చేసేవారికీ అమృతత్వం ప్రసాదిస్తూ ఉంటాయి.

**వ. ఇట్లు సీత యను పేర వినుతి నొందిన యమ్మహానదీప్రవాహంబు బ్రహ్మసదన పూర్వ ద్వారంబున వెడలి కేసరావలయంబుం దడుపుచు గంధమాదనాద్రికిం జని భద్రాశ్వవర్షంబుం బావనంబు సేయుచుఁ బూర్వ లవణసాగరంబునం బ్రవేశించుఁ; జక్షు వనుపేరం దేజరిల్లెడు దీర్ఘ ప్రవాహంబు పశ్చిమద్వారంబున వెడలి మాల్యవత్పర్వతంబు నుత్తరించి కేతుమాలవర్షంబుం బవిత్రంబు సేయుచుఁ బశ్చిమ లవణార్ణవంబునం గలియు, భద్ర యను పేర వెలుఁగొందిన యతుల ప్రవాహం బుత్తర ద్వారంబున వెడలి కుముదనీల శ్వేతాఖ్య పర్వత శిఖరంబులం గ్రమంబునం బ్రవహించుచు శృంగనగంబునకుం జని మానసోత్తరంబు లగు నుత్తర కురుభూములఁ బవిత్రంబు సేయుచు నుత్తర లవణ సాగరంబుఁ జేరు, నలకనంద యనం బ్రఖ్యాతిఁ గాంచిన యమ్మహానదీ ప్రవాహంబు బ్రహ్మసదన దక్షిణద్వారంబున వెడలి యత్యంత దుర్గమంబు లైన భూధరంబులఁ గడచి హేమకూట హిమకూట నగంబుల నుత్తరించి యతివేగంబునఁ గర్మక్షేత్రంబగు భారత వర్షంబుఁబావనంబు సేయుచు దక్షిణలవణాంబుధింగలయు నంత. 34**

**ప్రతి :** ఇట్లు; సీత+అనుపేరన్; వినుతిన్+ఒందిన= ఖ్యాతిగాంచిన; ఆ+మహానదీ ప్రవాహము= ఆ గొప్పనదియొక్క ప్రవాహం; బ్రహ్మసదనపూర్వ ద్వారంబునన్+వెడలి= బ్రహ్మపురం తూర్పు ద్వారంనుంచి ప్రవహించి; కేసర+ఆవలయంబున్+తడుపుచున్= కేసరగిరి శిఖరాలను తడుపుచు; గంధమాదన+అద్రికిన్+చని= గంధమాదన పర్వతం మీదుగా సాగి; భద్ర+అశ్వవర్షంబున్= భద్రాశ్వ వర్షాన్ని; పావనంబు+చేయుచున్= పవిత్రంచేస్తూ; పూర్వ లవణ సాగరంబునన్= తూర్పువైపున లవణ సముద్రంలో; ప్రవేశించున్= ప్రవేశిస్తుంది; చక్షువు+అనుపేరన్; తేజరిల్లెడు= ప్రకాశిస్తున్న; దీర్ఘప్రవాహంబు= నిడుపైన ప్రవాహం, పశ్చిమ ద్వారంబునన్, వెడలి, మాల్యవత్+పర్వతంబున్+ఉత్తరించి= మాల్యవంతమనే పర్వతాన్ని దాటి; కేతుమాల వర్షంబున్= కేతుమాల వర్షభూభాగాన్ని; పవిత్రంబు+చేయుచున్= పావనమొనర్చుచు; పశ్చిమలవణ+అర్ణవంబునన్= పడమటి సముద్రంలో; కలియున్= కలియును; భద్ర+అనుపేరన్, వెలుఁగు+ఒందిన= ప్రకాశించిన; అతులప్రవాహంబు= సాటిలేని ప్రవాహం; ఉత్తర ద్వారంబున వెడలి; కుముదనీలశ్వేత+ఆఖ్యశిఖరంబులన్= కుముద, నీల, శ్వేతములనబడే కొండల అగ్రభాగములనుండి; క్రమంబునన్= వరుసగా; ప్రవహించుచున్; శృంగ నగంబునకున్+చని= శృంగపర్వతానికి వెళ్ళి; మానస+ఉత్తరంబులు+అగు= మానససరోవరానికి ఉత్తరంలో గల; ఉత్తరకురుభూములన్; పవిత్రంబు+చేయుచున్; ఉత్తరలవణ సాగరంబున్+చేరున్= ఉత్తరంలోని ఉప్పుసముద్రమును చేరును; అలకనంద+అనన్= అలకనంద అనే పేరుతో; ప్రఖ్యాతిన్+కాంచిన= ప్రసిద్ధి వడసిన; ఆ+మహానదీ ప్రవాహంబు; బ్రహ్మ సదన దక్షిణ ద్వారంబునన్= బ్రహ్మపురి దక్షిణపు దిక్కుగుండా; వెడలి; అతి+అంత+దుర్గమంబులు+ఐన= మిక్కిలి ప్రవేశించుటకు వీలుకాని; భూధరంబులన్= కొండలను; కడచి= దాటి; హేమకూట హిమకూట నగంబులన్+ఉత్తరించి= హేమకూటం, హిమకూటం అనే పర్వత ప్రాంతాలను దాటి; అతి వేగంబునన్= చాల ఉరవడితో; కర్మక్షేత్రంబు+అగు= కర్మ క్షేత్రమయిన, భారతవర్షంబున్; పావనంబు+చేయుచున్= పవిత్రం చేస్తూ; దక్షిణ లవణ+అంబుధిన్= దక్షిణపు ఉప్పు సముద్రమున; కలయున్= కలిసిపోవును; అంతన్= అంత.

**తా :** సీత అనే పేరుతో ప్రఖ్యాతమయిన నదీప్రవాహం బ్రహ్మపురం తూర్పుద్వారం నుంచి ప్రవహించి కేసరగిరి శిఖరాలను తడుపుతూ గంధమాదన పర్వతం మీదుగా సాగి భద్రాశ్వవర్షాన్ని పవిత్రం చేస్తూ తూర్పువైపున లవణసముద్రంలో ప్రవేశిస్తుంది. బ్రహ్మపురం పడమటి ద్వారం నుండి వెలువడిన ప్రవాహం పేరు చక్షువు, ఆ ప్రవాహం మాల్యవంతమనే పర్వతాన్ని దాటి కేతుమాల వర్షాన్ని పవిత్రం చేస్తూ పడమటి లవణసముద్రంలో సంగమిస్తుంది. బ్రహ్మపట్టణం ఉత్తరద్వారం గుండా వెలువడిన ప్రవాహం పేరు భద్ర. అది కుముదం, నీలం, శ్వేతం అనే పర్వత శిఖరాల మీదుగా ప్రవహిస్తూ, శృంగ నగం చేరుకొని, అక్కడనుండి మానసోత్తరాలైన కురుభూముల్ని పవిత్రం చేస్తూ ఉత్తర లవణసముద్రంలో కలుస్తుంది.

బ్రహ్మనగరం దక్షిణ ద్వారం నుండి వెలువడే నది పేరు 'అలకనంద'. అది మిక్కిలి దుర్గమాలైన పర్వత పంక్తుల గుండా ప్రవహించి హేమకూటం, హిమకూటం అనే పర్వత ప్రాంతాలను దాటివచ్చి చాల ఉరవడితో కర్మ క్షేత్రమయిన భారతవర్షాన్ని పవిత్రం చేస్తుంది. ఆ తరువాత దక్షిణ లవణసముద్రంలో కలిసిపోతుంది.

**సీ.** **జగతిలో మేరు వాదిగఁబర్వతములకుఁ బుత్త్రిక లైనట్టి పుణ్యతీర్థ**
**ములు వేల సంఖ్యలు గలవు; జంబూద్వీప మందు భారతవర్ష మరయఁ గర్మ**
**భూమి; తక్కిన వర్షముల దివంబుననుండి భువికి వచ్చినవారు పుణ్యశేష**
**ములు భుజించుచు నుంద్రు; భూస్వర్గ మనఁదగు నా వర్షముల నుండునట్టి వార**

**ఆ.** **లయుతసంఖ్య వత్సరాయువు లయుత మా, తంగబలులు దేవతాసమాను**
**లతులవజ్రదేహు లధిక ప్రమోదితు, లప్రమత్తు లార్యు లనఘు లధిప!** **35**

**ప్రతి :** అధిప= ఓ రాజా!; జగతిలోన్= ప్రపంచంలో; మేరువు+ఆదిగన్= మేరువు మొదలుకొని ఉన్న; పర్వతములకున్= కొండలకు; పుత్రికలు+ఐన+అట్టి= పుత్రికలేమో అనునట్టి, పుణ్యతీర్థములు; వేలసంఖ్యలున్+కలవు; జంబూద్వీపము+అందున్, అరయన్= పరిశీలింపగా; భారతవర్షము; కర్మభూమి; తక్కిన వర్షములన్= మిగిలిన భూభాగాలలో; దివంబునన్+ఉండి= స్వర్గలోకంనుండి; భువికిన్= భూలోకానికి, వచ్చినవారు; పుణ్యశేషములు= పుణ్యఫలాలు; భుజియించుచున్+ఉంద్రు= అనుభవిస్తుంటారు ; భూస్వర్గము+అనన్= భూలోక స్వర్గమనడానికి; తగిన= అర్హమైన; ఆ వర్షములన్+ఉండునట్టివారలు= ఆ భూభాగంలోనివారు; అయుతసంఖ్య వత్సర+ఆయువులు= పదివేల సంవత్సరాల ఆయుర్దాయం కలవారు; అయుతమాతంగబలులు= పదివేల ఏనుగుల బలం కలవారు; దేవతాసమానులు= దేవతలతో తుల్యులయి ఉంటారు; అతుల వజ్రదేహులు= సాటిలేని వజ్రాలవంటి దేహం కలవారు; అధిక ప్రమోదితులు= ఎంతో సంతోషంతో జీవించేవారయి ఉంటారు; అప్రమత్తులు= జాగరూకత కలవారు; ఆర్యులు= పూజ్యులు; అనఘులు= పుణ్యాత్ములు.

**తా :** ఓ అధిపా! ప్రపంచంలో మేరువు మున్నగు పర్వతాలకు పుత్రికలైన పుణ్యతీర్థాలు వేలసంఖ్యలో ఉన్నాయి. జంబూద్వీపంలో భారతవర్షం కర్మభూమి. తక్కిన వర్షాలు భోగభూములు, స్వర్గంనుండి భూమికి దిగివచ్చినవారు అక్కడ పుణ్యశేషఫలాలు అనుభవిస్తుంటారు. భూలోక స్వర్గంవంటి ఆ వర్షాలలో జీవించేవారు పదివేల సంవత్సరాల ఆయుర్దాయం కలిగి ఉంటారు. పదివేల ఏనుగుల బలం కలిగి ఉంటారు. దేవతలతో సమానులుగా ఉంటారు. వజ్రదేహులై ఉంటారు. ఎంతో సంతోషంతో జీవిస్తారు. వారి ప్రవర్తనలో ఎటువంటి పొరపాట్లు ఉండవు. వారు పూజ్యులు. అంతేకాదు. పుణ్యాత్ములు.

**వ. మఱియు సురతసుఖానందంబున మోక్షంబునైనం గైకొనక సకృత్ప్రసూతు లగుచు ననవరతంబును త్రేతాయుగ కాలంబు గలిగి ప్రవర్తింతు; రీ యష్టవర్షంబులయందు దేవతాగణంబులు దమ భృత్యవర్గంబు లత్యుపచారంబులు సేయుచుండ నెల్ల ఋతువుల యందుం గిసలయ కుసుమ ఫల భరితంబులైన లతాదుల శోభితంబు లగు వనంబులు గల వర్షనిధిగిరి ద్రోణుల యందును, వికచ వివిధ నవకమలామోద ముదిత రాజహంస కలహంసలు గల సరోవరంబుల యందును జలకుక్కుట కారండవ సారస చక్రవాకాది వినోదంబులు గలిగి మత్తాళిఝుంకృతి మనోహరంబులై నానా విధంబులైన కొలంకులయందును దేవాంగనల కామోద్రేకజంబు లయిన విలాస హాస లీలావలోకనంబులం దివియంబడిన మనోదృష్టులు గలిగి విచిత్ర వినోదంబులందగిలి యిచ్ఛావిహారంబులు సలుపుచుండుదురు. 36**

**ప్రతి :** మఱియున్= అంతేగాక; సురతసుఖ+ఆనందంబునన్= మైథునమువల్ల కలిగే ఆనందంతో; మోక్షంబును+ఐనన్+కైకొనక= ముక్తినిసైతం స్వీకరించక; సకృత్ప్రసూతులు+అగుచున్= ఒక పర్యాయం మాత్రం బిడ్డలను కన్నవారై; అనవరతంబును= ఎల్లప్పుడును; త్రేతాయుగ కాలంబున్+కలిగి= త్రేతాయుగ ఆయుఃప్రమాణంబు కలిగి; ప్రవర్తింతురు= జీవింతురు; ఈ అష్టవర్షంబుల+అందున్= ఈ ఎనిమిది వర్షాలలోను; దేవతా గణంబులు= వేల్పుల సమూహములు; తమ భృత్యవర్గంబులు= తమ సేవకగణములు; అతి+ఉపచారంబులు చేయుచున్+ఉండన్= మిక్కిలి సంప్రీతితో పరిచర్యలు చేస్తుండగా; ఎల్ల ఋతువుల+అందున్= సమస్త ఋతువులలో; కిసలయ= చివుళ్ళు; కుసుమ= పూలు; ఫల= పండ్లతో; భరితంబులు+ఐన= నిండినవైన; లతా+ఆదుల శోభితంబులగువనంబులు+అగు= తీగెలు మొదలయినవానితో శోభాయమానాలైన; వనంబులు+కల= తోటలుగల; వర్షనిధి గిరిద్రోణుల+అందును= సకాలవర్షం కారణంగా నిలిచిన లోయలు కొండలు సరస్సులందు; వివిధ= అనేక విధాలైన; నవ= కొత్తవయిన; కమల+ఆమోద= పద్మాల సుగంధాలతో; ముదిత= సంతోషపడిన; రాజహంస కలహంసలు+కల= రాజహంసలు, కలహంసలు గల; సరోవరంబుల+అందునున్= కొలనులందు; జలకుక్కుట= నీటికోళ్ళు; కారండవ= కొక్కెరలు; సారస= బెగ్గురుపక్షులు; చక్రవాక= జక్కవలు; ఆది= మొదలయిన; వినోదంబులున్+కలిగి; మత్త+అళిఝుంకృతి మనోహరంబులు+ఐ= మదించిన తుమ్మెదల ఝుంకారాలతో మనస్సును హరించునవి అగుచు; నానావిధంబులు+ఐన= పలు రకాలయిన; కొలంకుల+అందును= సరోవరముల అందును; దేవ+అంగనల= దేవతాస్త్రీల; కామ+ఉద్రేకజంబులు+అయిన= కామోద్రేకంవల్ల కలిగిన, విలాస, హాస; లీలా+అవలోకనంబులన్= విలాసాలతో, నవ్వులతో, ఆటపాటలతో, వాలుచూపులతో; తివియన్+పడిన= లాగబడిన; మనస్+దృష్టులు+కలిగి= మానసిక ఉల్లాసం కలిగించే చూపులుగలిగి; విచిత్రవినోదంబులన్+తగిలి= చిత్రవిచిత్రాలయిన వినోదం కలిగించే ఆటలపట్ల అనురక్తులై; ఇచ్ఛావిహారంబులు= యథేచ్ఛావిహారాలు; సలుపుచుండుదురు= చేస్తుంటారు.

**తా :** ఈ ఎనిమిది వర్షాలలో ఉన్నవారు కామ సుఖానంద పరవశులై మోక్షాన్ని సైతం కోరరు. అక్కడి స్త్రీలు ఒక్క పర్యాయం మాత్రం బిడ్డలను కంటారు. అక్కడ ఎల్లప్పుడూ త్రేతాయుగకాలం ప్రవర్తిస్తుంది. ఈ ఎనిమిది వర్షాలలోనూ దేవతలు తమ సేవకులు చేసే ఉపచారాలు గ్రహిస్తూ విహరిస్తుంటారు. అన్ని ఋతువులందూ చివుళ్ళతో పువ్వులతో ఫలాలతో నిండిన తీగెలు, వృక్షాలు గల వనాలు అక్కడే ఉంటాయి. సరోవరాలలో వికసించిన పద్మాలు ఉంటాయి. ఆ పద్మాల పరిమళం ఆఘ్రాణిస్తూ రాజహంసలు, కలహంసలు విహరిస్తుంటాయి. నీటికోళ్ళు, కొక్కెరలు, బెగ్గురుపక్షులు, జక్కవలు, కొలకులలో ఈదులాడుతుంటాయి. మత్తెక్కిన తుమ్మెదలు ఝుంకారాలు చేస్తుంటాయి. అటువంటి వనాలలో, సరస్సులలో, కొండలలో,

కోనలలో దేవతాస్త్రీలు విహరిస్తూ విలాసంగా ఆడుతూ పాడుతూ, పకపక నవ్వుతూ పక్కచూపులు చూస్తూ కామోద్రేకం కలిగిస్తూ సంచరిస్తుంటారు. వారి విలాస చేష్టలకు ఆకర్షితులయిన పురుషులు అక్కడ స్వేచ్ఛావిహారాలు చేస్తుంటారు.

**క. ఈ నవవర్షంబులయం, దా నారాయణుఁడు వచ్చి యనవరతము లో**
**కానుగ్రహమునకై సు, జ్ఞానం బీఁదలఁచి లీలఁజరియించుఁదగన్. 37**

**ప్రతి :** ఈ నవవర్షంబుల+అందున్= ఈ తొమ్మిది వర్షాలలోను; ఆ నారాయణుఁడు, వచ్చి, అనవరతమున్= ఎల్లప్పుడూ; లోక+అనుగ్రహమునకై= జీవులకు జ్ఞానం ప్రసాదించడంకోసం; సుజ్ఞానంబు+ఈన్+తలఁచి= మంచి జ్ఞానబుద్ధిని ప్రసాదింప నెంచి; లీలన్= విలాసంతో; తగన్= చక్కగా; చరియించున్= సంచరిస్తుంటాడు.

**తా :** ఈ తొమ్మిది వర్షాలలోనూ జీవులకు సరయిన జ్ఞానం అనుగ్రహించడానికి నారాయణుడు అనేకరీతుల తన లీలావిలాసాలను ప్రదర్శిస్తూ సంచరిస్తుంటాడు.

**సీ. వసుధ నిలావృతవర్షాధిపతియైన పురహరుం డా వర్షమున వనంబు**
**నందు నుండుటకు నా యంబికాశాప వశంబును నా వనస్థలములందు**
**నెవ్వరు వచ్చిన నింతులై యుందు రా వనమందుఁబార్వతి యనుదినంబు**
**నంగనాజనసహస్రార్బుదంబులతోడ నసమలోచనుఁగొల్చు నతులభక్తి**

**ఆ. నట్టి శివునిఁగోరి యా యిలావృతవర్షమునఁ జరించు జనులు మోదమునను**
**గదిసి తత్ప్రకాశకములైన మంత్ర తం, త్రములఁబూజఁజేసి తలఁతు రెపుడు. 38**

**ప్రతి :** వసుధన్= భూమియందు; ఇలావృతవర్ష+అధిపతి+ఐన= ఇలావృతమను పేరుగల వర్షానికి అధిపతియైన; పురహరుండు= త్రిపురాలను భస్మము గావించిన శివుడు; ఆ వర్షమునన్= ఆ ఇలావృత వర్షంలో; వనంబు+అందున్+ఉండుటకున్= ఆ పార్వతీదేవి వనంలో ఉండడానికి; ఆ+అంబికాశాపవశంబునన్= ఆ పార్వతీదేవి శాపం కారణంగా; ఆ వనస్థలముల+అందున్= ఆ వనప్రదేశాలలో; ఎవ్వరు వచ్చినన్, ఇంతులు+ఐ= స్త్రీలయి, ఉందురు, ఆ వనము+అందున్, పార్వతి, అనుదినంబున్= ప్రతిరోజు; అంగనా జనసహస్ర+అర్బుదంబులతోడన్= వెయ్యికోట్ల చెలికత్తెలతో; అతులభక్తిన్= సాటిలేని భక్తితో; అసమలోచనున్= బేసి కన్నులు కలవానిని, త్రినేత్రుని; కొల్చున్= సేవించును; అట్టి, శివునిన్+కోరి= పరమశివుని అపేక్షించి; ఆ+ఇలా+ఆవృత వర్షమునన్; చరించు= సంచారంచేసే జనులు; మోదమునను+కదిసి= సంతోషంతో సమీపించి; తత్+ప్రకాశకములు+ఐన= ఆ పరమశివుని అనుగ్రహాన్ని వెల్లడించునట్టి; మంత్రతంత్రములన్= మంత్రతంత్రాలతో; పూజన్+చేసి= పూజించి; ఎపుడు= సంతతము; తలఁతురు= స్మరిస్తారు.

**తా :** ఇలావృత వర్షానికి త్రిపురాసుర సంహారకుడయిన శివుడు అధిదేవత. ఆ ఇలావృతవర్షంలో పార్వతీదేవి విహరించే ఉద్యానవనం ఉంది. ఆ వనంలోనికి పురుషులు ఎవరయినా ప్రవేశిస్తే వారందరు స్త్రీలవుతారని జగజ్జనని శాపం. అక్కడ పార్వతీదేవి వెయ్యికోట్ల చెలికత్తెలతో వచ్చి ప్రతినిత్యమూ పరమశివుని పరమభక్తితో సేవిస్తుంటుంది. ఆ ఇలావృత వర్షంలోని జనులు ఎంతో సంతోషంతో ఆయా మంత్రతంత్రాలతో పరమేశ్వరుని పూజించి సదా స్మరిస్తుంటారు.

క. భద్రాశ్వవర్షమందుల, భద్రశ్రవుఁ డనెడి పేరఁబరఁగుచుఁదపనీ
యాద్రి సమధైర్యుఁడగుచు స, ముద్రాంతంబైన జగతిఁబొలుపుగ నేలున్. **39**

**ప్రతి :** భద్ర+అశ్వవర్షము+అందులన్= భద్రాశ్వమనే పేరుగల భూభాగాన; భద్రశ్రవుఁడు+అనెడిపేరన్= భద్రశ్రవుడు అనే పేరుతో; పరఁగుచున్= ఒప్పుతూ; తపనీయ+అద్రి సమధైర్యుఁడు+అగుచున్= మేరుపర్వతంతో సమానమయిన ధైర్యం కలవాడగుచు; సముద్ర+అంతంబు+ఐన= సముద్రమే ఎల్లలుగా కలిగిన; జగతిన్= లోకమును; పొలుపుగన్= అందముగా; ఏలున్= పాలించును.

**తా :** భద్రాశ్వవర్షానికి భద్రశ్రవుడు అధిపతి. అతడు మేరుపర్వతం వంటి ధైర్యం కలవాడు. అతడు సముద్రాలు హద్దుగా కలిగిన భూమిని పరిపాలించాడు.

క. ఆ నరవరునకుఁబ్రియతముఁ, డైన హయగ్రీవమూర్తి ననవరతంబున్
ధ్యానస్తోత్రజపాను, ష్ఠానాదులఁబూజసేసి సజ్జను లంతన్. **40**

**ప్రతి :** ఆ నరవరునకున్= ఆ భద్రశ్రవునికి; ప్రియతముఁడు+ఐన= మిక్కిలి ప్రీతిపాత్రుడయిన, హయగ్రీవమూర్తిన్= హయగ్రీవుని రూపాన్ని; అనవరతంబున్= ఎల్లప్పుడు; ధ్యాన, స్తోత్ర, జప, అనుష్ఠాన+ఆదులన్= ధ్యానంతో, జపంతో, స్తోత్రాలతో, అనుష్ఠానం మొదలయిన వానితో; సత్+జనులు= సత్పురుషులు, పూజ+చేసి= అర్చించి; అంతన్= ఆ మీద.

**తా :** ఆ భద్రశ్రవునికి హయగ్రీవుడు ఇష్టదైవం. ఆ హయగ్రీవ మూర్తిని ధ్యానంతో, జపంతో, స్తుతులతో, అనుష్ఠానాలతో సత్పురుషులు పూజించి తరిస్తుంటారు.

ఆ. తత్ప్రకాశకృ త్ప్రధాన మంత్రార్థ సం, సిద్ధిఁజేసి ముక్తిఁజెంది రప్పు
డట్టి వర్షమందు నా హయగ్రీవునిఁ, దలఁచి కొలిచి మిగుల ధన్యు లగుచు. **41**

**ప్రతి :** తద్= ఆ హయగ్రీవమూర్తి తత్త్వాన్ని; ప్రకాశకృత్= ప్రకాశింపజేసే; ప్రధానమంత్ర+అర్థసంసిద్ధిన్+చేసి= ప్రధానమంత్రాల అర్థఫలసిద్ధి వలన; ముక్తిన్+చెందిరి= ముక్తిని పొందారు; అప్పుడు+అట్టి, వర్షమందున్= భూభాగాన; ఆ హయగ్రీవునిన్= ఆ హయగ్రీవమూర్తిని; తలఁచి కొలిచి మిగులన్; ధన్యులు+అగుచున్= ధన్యులయినవారలై.

**తా :** ఆ హయగ్రీవ తత్త్వాన్ని ప్రకాశింపజేసే ప్రధాన మంత్రాలు ఉన్నాయి. ఆ మంత్రాల సిద్ధివలన ఆ వర్షంలోనివారు హయగ్రీవుని అర్చించి, స్తుతించి, ధ్యానించి ముక్తి పొందుతున్నారు.

సీ. హరివర్షపతియైన నరహరి ననిశంబు నందున్న జనులు మహాత్ములయిన
దైత్యదానవ కులోత్తములు ప్రహ్లాదాది వృద్ధులఁగూడి సంప్రీతితోడ
సుస్నాతులై భక్తిఁజూచుచు నుందురు రమ్యదుకూలాంబరములు దాల్చి
తత్ప్రకాశకమంత్రతంత్రజపస్తోత్ర పఠన సుధ్యానతపఃప్రధాన

గీ. మైన సత్పూజలను జేసి యచలబుద్ధి, శ్రీ నృసింహునిఁజేరి పూజించి యతని
కరుణ నొందుచు నతులప్రకాశు లగుచు, భుక్తిముక్తులఁగైకొంద్రు భూపవర్య! **42**

**ప్రతి :** భూపవర్య= భూమిని పాలించురాజులలో శ్రేష్ఠుడా!; హరివర్షపతి+ఐన= హరివర్షానికి ప్రభువైన; నరహరిన్= నృసింహుని; అనిశంబున్= ఎల్లప్పుడు, అందున్న జనులు; మహా+ఆత్ములు+అయిన, దైత్య, దానవకుల+ఉత్తములు= దైత్యకులంలోను దానవ కులంలోను శ్రేష్ఠులయినవారు; ప్రహ్లాద+ఆది వృద్ధులన్+కూడి= ప్రహ్లాదుడు మొదలయిన పెద్దలైన భక్తులతోగూడి; సంప్రీతితోడన్= మిక్కిలి, హర్షముతో; సుస్నాతులు+ఐ= స్నానంతో పవిత్రులయిన వారలయి; భక్తిన్= భక్తితో; చూచుచున్+ఉందురు= సేవిస్తుంటారు; రమ్యదుకూల+అంబరములు= రమణీయాలైన పట్టుబట్టల, ధరించి; తత్= ఆ నరసింహుని; ప్రకాశక= ప్రకాశింపజేసే; మంత్రతంత్ర జప స్తోత్రపఠన సుధ్యాన తపస్+ప్రధానము+ఐన= మంత్రము, మంత్రానికి సంబంధించిన తంత్రాలతో, జపాలతో, స్తోత్రపాఠాలతో, ధ్యానంతో, తపః ప్రాధాన్యంతో కూడిన; సత్+పూజలను+చేసి= మంచి పూజలను గావించి; అచల బుద్ధిన్= చలించని బుద్ధితో; శ్రీ నృసింహునిన్+చేరి= శ్రీ నరసింహస్వామిని చేరి; పూజించి= అర్చించి; అతని కరుణన్+ఒందుచున్= ఆ నృసింహుని కృపను పొందుచు; అతుల= సాటిలేని; ప్రకాశులు+అగుచున్= వెలుగును పొందినవారలవుతూ; భుక్తి ముక్తులన్= ఇహపర సుఖాలను; కైకొంద్రు= అనుభవిస్తూ ఉంటారు.

**తా :** ఓ రాజా! హరివర్షానికి అధిదేవత నరసింహస్వామి. అక్కడున్న జనులు దైత్య, దానవ వంశాలలో ఉత్తములయినవారు. వారు ప్రహ్లాదుడు మొదలయిన పెద్దలతో కలిసి స్నానంచేసి శుచులై నరసింహుని సేవిస్తుంటారు. రమణీయాలైన పట్టుబట్టలు కట్టుకొని ఆ నరసింహతత్త్వాన్ని ప్రకాశింపజేసే మంత్రం జపిస్తూ, ఆ మంత్రానికి సంబంధించిన తంత్ర కార్యాలను నిర్వహిస్తూ, నరసింహునికి ప్రీతిపాత్రమయిన ధ్యానం, జపాలు, తపాలు, స్తోత్రాలు చేస్తూ నిలుకడగల బుద్ధితో స్వామిని సేవిస్తుంటారు. ఆ స్వామి కరుణకు పాత్రులై భుక్తిముక్తులను అనుభవిస్తుంటారు.

**వ. మఱియుఁ గేతుమాల వర్షంబునందు భగవంతుండు శ్రీదేవికి సంతోషంబు నొసంగుటకుఁ గామ దేవరూపంబున నుండు; నమ్మహాపురుషుని యస్త్రతేజః ప్రకాశంబునఁ బ్రజాపతి దుహితలగు రాత్ర్యధి దేవతల గర్భంబులు సంవత్సరాంతంబున నిర్జీవంబులై స్రవించు, నా కామదేవుండును దన గతి విలాసలీలావిలోకన సుందర భ్రూమండల సుభగ వదనారవింద కాంతులం జేసి శ్రీరమాదేవిని రమింపంజేయు; భగవన్మాయారూపిణి యగు శ్రీదేవియుఁ బ్రజాపతి పుత్త్రికలును బుత్త్రులునైన రాత్రులం బగల్లంగూడి కామదేవుని స్తోత్రపఠనపూజాధ్యానాదులంబూజించుచుండు; మఱియును. 43**

**ప్రతి :** మఱియున్= అంతేగాక; కేతుమాల వర్షంబు+అందున్= కేతుమాల నామక వర్షభూభాగంలో; భగవంతుండు= భగవానుడయిన శ్రీహరి; శ్రీదేవికిన్= శ్రీదేవికి (లక్ష్మికి); సంతోషంబున్ ఒసంగుటకున్= ఆనందం కలగజేయడానికి; కామదేవరూపంబునన్+ఉండున్= మన్మథరూపంలో ఉంటాడు; ఆ+మహాపురుషుని= ఆ కామదేవుని; అస్త్రతేజః ప్రకాశంబునన్= అస్త్రముల తేజస్సుయొక్క ప్రభావంవల్ల; ప్రజాపతి దుహితలు+అగు= ప్రజాపతి కొమార్తెలయిన; రాత్రి+అధిదేవతల గర్భంబులు= రాత్రిదేవతల గర్భములు; సంవత్సర+అంతంబునన్= ఏడాది చివర; నిర్జీవంబులు+ఐ= జీవము లేనివై; స్రవించున్= స్రవిస్తాయి; ఆ కామదేవుండును= ఆ మన్మథుడును, తనగతి= తన గమనము; విలాస= విలాసమైన; లీలా= క్రీడను; విలోకన= ఆలోచిస్తూ; సుందర= అందమయిన; భ్రూమండల= కనుబొమలతో; సుభగవదన+ అరవింద కాంతులన్+చేసి= శోభాయమానమయిన పద్మాలవంటి మొగముయొక్క మనోహర కాంతులతో; శ్రీరమాదేవినిన్= శ్రీమహాలక్ష్మిని; రమింపన్+చేయున్= సంతోషపెడతాడు; భగవత్+మాయారూపిణి+అగు= భగవంతుని మాయకు

ప్రతిరూపమయిన; శ్రీదేవియున్= శ్రీలక్ష్మియు; ప్రజాపతిపుత్రికలును= బ్రహ్మపుత్రికలును; పుత్రులును+ఐన= కుమారులయిన; రాత్రులన్+పగళ్ళన్+కూడి= అహోరాత్రాలతోకూడి; కామదేవుని= మన్మథదేవునియొక్క; స్తోత్రపఠన= స్తుతులను చదవడం; పూజాధ్యాన+ఆదులన్= పూజలతో, ధ్యానాదులతో; పూజించుచున్+ఉండున్= ఆరాధిస్తూ ఉంటుంది; మఱియును= ఇంకనూ

**తా :** కేతుమాల వర్షంలో భగవంతుడు శ్రీదేవిని సంతోషపెట్టడంకోసం మన్మథరూపంలో సాక్షాత్కరిస్తాడు. ఆ కామదేవుని అస్త్రతేజః ప్రకాశంవలన రాత్రీదేవతల గర్భాలు సంవత్సరం చివరన నిర్జీవాలై స్రవిస్తాయి. తన నడకల సొగసులతో, విలాస వీక్షణాలతో, అందమైన కనుబొమలతో, పద్మాలవంటి మనోహర ముఖకాంతులతో ఆ కామదేవుని రూపంలో ఉన్న శ్రీహరి రమాదేవిని సంతోషపెడతాడు. భగవంతుని మాయకు ప్రతిరూపమయిన ఆ శ్రీదేవికూడా ప్రజాపతి పుత్రికలూ, పుత్రులూ అయిన రాత్రులతో, పగళ్ళతో కలిసి కామదేవుని స్తుతిస్తూ పూజలు చేస్తూ ధ్యానిస్తూ ఆరాధిస్తూ ఉంటుంది.

**క. విమలమతిఁజిత్తగింపుము, రమణీయంబైన విమలరమ్యక మను వ**
**ర్షమునకు నధిదేవత దా, నమరంగా మత్స్యరూపుఁడగు హరి దలఁపన్. 44**

**ప్రతి :** విమలమతిన్= శుద్ధమయిన మనసుతో; చిత్తగింపుము= శ్రద్ధగా విను; రమణీయంబు+ఐన= మనోహరమైన; విమల రమ్యకము+అను= మాలిన్యరహితమయిన రమ్యకమనే; వర్షమునకున్= భూభాగానికి; తలఁపన్= భావించగా; మత్స్యరూపుఁడు+అగు= మత్స్యాకారం ధరించినవాడగు; హరి= నారాయణుడు; తాన్= తాను; అమరన్+కాన్= యుక్తంగా; అధిదేవత= రమ్యకవర్షాధిదేవత.

**తా :** ఓ రాజా! పరిశుద్ధమయిన మనసుతో శ్రద్ధగా విను. రమణీయమయిన రమ్యకమనే వర్షానికి మత్స్యరూపుడయిన హరియే అధిదేవత.

**ఆ. అట్టి వర్షమునకు నధిపతి యగుచున్న, మనువు పుత్త్రపౌత్త్రమంత్రివరులఁ**
**గూడి మత్స్యమైన కుంభినీధరుఁజిత్త, మతుల భక్తియుక్తి హత్తఁగొలుచు. 45**

**ప్రతి :** అట్టి; వర్షమునకున్; అధిపతి+అగుచున్న= నాయకుడగుచున్న; మనువు; పుత్త్ర= కొడుకులతో; పౌత్త్ర= మనుమలు; మంత్రివరులన్+కూడి= శ్రేష్ఠులయిన మంత్రులతోకూడి; మత్స్యము+ఐన= మీనమైన; కుంభినీధరున్= భూమిని ధరించిన మహావిష్ణువును; చిత్తము= మనస్సు; అతులభక్తి యుక్తి= సాటిలేని భక్తి సంబంధంతో; హత్తన్= లగ్నమగునట్లు; కొలుచున్= సేవిస్తాడు.

**తా :** ఆ రమ్యక వర్షానికి మనువు అధిపతి. అతడు కొడుకులతో, మనుమలతో, మంత్రివరులతో మత్స్యరూపుడయిన శ్రీహరిని అనుపమానమయిన భక్తితో ఆరాధిస్తుంటాడు.

**ఆ. తత్ప్రకాశకృత్ప్రధానమంత్రస్తోత్ర, ములను ధర్మకర్మములను హోమ**
**ములను జనులు సేసి పుణ్యులై భుక్తి ము, క్తులను బొందుచుందు రెలమితోడ. 46**

**ప్రతి :** తత్+ప్రకాశకృత్+ప్రధానమంత్ర స్తోత్రములను= దానిని ప్రకాశింపజేయునట్టి ప్రధానమంత్ర స్తోత్రాలను; ధర్మకర్మలను= స్వధర్మములు, స్వసత్కర్మలను; హోమములను= హోమాదులతోను; జనులు+చేసి= నరులాచరించి;

పుణ్యులు+ఐ= పవిత్రులై; ఎలమితోడన్= ప్రీతితోడ; భుక్తిముక్తులను= ఇహపరఫలాలను; పొందుచుందురు= గడిస్తూ ఉంటారు.

**తా :** ఆ రమ్యక వర్షంలోనివారు అధిపతి అయిన మత్స్యమూర్తిని ప్రకాశింపజేసే మంత్రాలతో, స్తోత్రాలతో, అర్చిస్తూ ధర్మకార్యాలు నిర్వహిస్తూ, అగ్నికార్యాలు నెరవేరుస్తూ పుణ్యాత్ములై భుక్తిముక్తులను ఆనందంగా అనుభవిస్తారు.

**క. వినుము; హిరణ్మయ వర్షం, బునకుంగూర్మావతారమును దాల్చిన యా**
**వనజోదరుఁడధిదేవత, యనఘుఁడు పితృపతి మహాత్ముఁడర్యముఁడు నృపా! 47**

**ప్రతి :** వినుము= వినవయ్యా!; నృపా!= ఓ రాజా!; హిరణ్మయ వర్షంబునకున్; కూర్మ+అవతారమును+తాల్చిన= కమఠరూపాన్ని ధరించిన, తాబేలు రూపుదాల్చిన; ఆ వనజ+ఉదరుఁడు= పద్మాన్ని నాభియందుగలవాడు; అధిదేవత= అధినాయకుడు; అనఘుఁడు= పాపరహితుడును; పితృపతి= పితృదేవతలకు అధిపతియైనవాడును; మహా+ఆత్ముఁడు; అర్యముఁడు= అర్యమ నామాంకితుడు.

**తా :** ఓ రాజా! వినుము. కూర్మావతారం తాల్చిన విష్ణువు హిరణ్మయవర్షానికి అధిదేవత. పితృదేవతలకు అధిపతియైన మహాత్ముడైన అర్యముడు...

**విశే :** అమూలంలోని అర్యముని మంత్రం – **ఓం నమో భగవతే అకూపారాయ సర్వ సత్త్వగుణ విశేషణాయానుప లక్షిత స్థానాయ, నమో వర్ష్మణే నమో భూమ్నే నమో నమోఽవస్థానాయ నమస్తే ॥**

**క. ఆ వర్షమందు నర్యముఁ, డా వర్షజనంబుఁగూడి హరిఁజిత్తములో**
**భావించి సంస్తవంబులు, గావించుచు భుక్తి ముక్తి గాంచుఁ గడంకన్. 48**

**ప్రతి :** ఆ వర్షమందున్= ఆ హిరణ్మయ వర్షంలో; అర్యముఁడు= అర్యమనామధేయుడు; ఆ వర్షజనంబున్+కూడి= ఆ హిరణ్మయ వర్షంలోని జనులతోకూడి; హరిన్= శ్రీహరిని; చిత్తములోన్= మనసులో; భావించి= తలంచి; సంస్తవంబులు+కావించుచున్= స్తోత్రములు చేస్తూ; కడఁకన్= ప్రయత్నంతో; భుక్తిముక్తిన్= భక్తిని, ముక్తిని, ఇహపరాలను; కాంచున్= పొందుతాడు.

**తా :** హిరణ్మయ వర్షంలోని జనులందరితోకూడి కూర్మరూపుడయిన శ్రీహరిని మనసులో ధ్యానిస్తూ స్తోత్రాలతో సంస్తుతిస్తూ భుక్తిముక్తులనందుకొంటాడు.

**క. ఉత్తరకురుభూములఁదను, హత్తుకొని వరాహదేవుఁడధిపతియైనన్**
**సత్తుగ భూసతి యతనిం, జిత్తములో నిలిపి పూజ సేయుచు నుండున్. 49**

**ప్రతి :** ఉత్తరకురుభూములన్; తనున్ హత్తుకొని= తన్ను సమీపానికి చేర్చుకొని; వరాహదేవుఁడు; అధిపతి+ఐనన్; సత్తుగన్= బలిష్ఠంగా; భూసతి= భూదేవి; అతనిన్= ఆ మూర్తిని, చిత్తములోన్ నిలిపి= మనసులోనిలిపి; పూజ+చేయుచున్+ఉండున్= పూజిస్తూ ఉంటుంది.

**తా :** ఉత్తర కురు వర్షానికి వరాహదేవుడు అధిపతి. అక్కడ భూదేవి ఆ హరిని మనసులో నిలుపుకొని పూజలు చేస్తుంటుంది.

**క. ఆ వర్షమందులను బ్రజ, లా విపులవరాహమూర్తి ననవరతంబున్**
**సేవించి కొలిచి సంస్తుతిఁ, గావించుచుఁగాంతు రంతఁగైవల్యంబున్. 50**

**ప్రతి :** ఆ వర్షము+అందులను= ఆ వర్షంలోని; ప్రజలు; ఆ విపులవరాహమూర్తిన్= విశాలమైన ఆ వరాహ స్వరూపాన్ని; అనవరతంబున్= ఎల్లప్పుడు; సేవించి= నమస్కరించి; కొలిచి= పూజించి; సంస్తుతిన్+ కావించుచున్= స్తోత్రాలను చేస్తూ; కైవల్యంబున్= ముక్తిని, అంతన్= అంత; కాంతురు= పొందుతారు.

**తా :** ఆ ఉత్తర కురువర్షంలోని ప్రజలు వరాహమూర్తిని అనుదినమూ సేవిస్తూ, సంభావిస్తూ, సంస్తుతులు కావిస్తూ మోక్షాన్ని పొందుతారు.

**క. అరయఁగ సీతాలక్ష్మణ, పరివృతుఁడై వచ్చి రామభద్రుఁడు గడిమిం**
**బరఁగు నధిదేవతగఁ గిం, పురుష మహావర్షమునకు భూపవరేణ్యా! 51**

**ప్రతి :** భూపవరేణ్యా!= రాజులలో శ్రేష్ఠుడా!; అరయఁగన్= పరిశీలింపగా; సీతాలక్ష్మణ పరివృతుఁడు+ఐ= సీతాలక్ష్మణులతో కూడినవాడై; వచ్చి= ఏగుదెంచి; రామభద్రుఁడు= శ్రీరామచంద్రుడు; కడిమిన్= పరాక్రమంతో; కింపురుష మహావర్షమునకున్; అధిదేవతగన్= అధిదేవతగా ఒప్పును.

**తా :** పరీక్షిన్మహారాజా! కింపురుష వర్షానికి సీతాలక్ష్మణసమేతుడయిన శ్రీరామభద్రుడు అధిదేవత.

**ఆ. అట్టి రామభద్రు నంజనీసుతుఁడు గిం, పురుషగణముఁగూడి పూజ సేసి**
**తత్ప్రకాశకృత్ప్రధానమంత్ర స్తోత్ర, పఠనములను దగ నుపాస్తి సేయు. 52**

**ప్రతి :** అట్టి= అలాంటి; రామభద్రున్= భద్రము కలిగించే శ్రీరాముని; అంజనీసుతుఁడు= అంజనీదేవి కుమారుడయిన ఆంజనేయుడు; కింపురుషగణమున్+కూడి= కింపురుషులనే దేవతా సమూహముతోచేరి; తత్+ప్రకాశకృత్+ప్రధానమంత్ర స్తోత్రపఠనములను= ఆయనను ప్రత్యక్షమొనరించు మంత్ర స్తోత్రాదులతో; పూజ+చేసి= పూజలు గావించి; తగన్= తగిన రీతిలో; ఉపాస్తి+చేయున్= ఉపాసన చేస్తాడు, ఆరాధిస్తాడు.

**తా :** ఆ కింపురుష వర్షంలో అంజనాదేవి కుమారుడయిన ఆంజనేయుడు కింపురుష గణాలతో కూడి శ్రీరామచంద్రుని ప్రత్యక్షం చేసే మంత్ర స్తోత్రాదులతో శ్రీరామచంద్రుని ఆరాధిస్తుంటారు.

**సీ. భారతవర్షాధిపతియగు బదరికాశ్రమమున నున్న నారాయణుండు**
**భూనాథ! యా మహాత్ముని నారదాదులు భారతవర్షంబు ప్రజలఁబ్రేమఁ**
**బాయక చేరి యుపాస్తి సేయుచు సాంఖ్య యోగంబు నుపదేశ ముచితవృత్తి**
**నంది యందఱును గృతార్థులై యట్టి నారాయణదేవు నారాధనంబు**

**ఆ. సేసి యాత్మఁజాలఁజింతించి తత్ప్రకా, శకము లయిన మంత్రసంస్తవములఁ**
**బూజసేసి ముక్తిఁబొందుచు నుండుదు, రచలమైన భక్తి ననుదినంబు. 53**

**ప్రతి :** భూనాథ= భూపతీ!; బదరికా+ఆశ్రమమునన్+ఉన్న= బదరిక అను ఆశ్రమంలో వాసమేర్పరచుకొన్న; నారాయణుండు= శ్రీమన్నారాయణుడు; భారతవర్ష+అధిపతి+అగున్= భారతవర్షానికి అధినాయకుడవుతాడు; ఆ+మహా+ఆత్ముని; నారద+ఆదులు= నారదుడు మొదలగు దేవర్షులు; భారతవర్షంబు= భారతవర్షంలోని; ప్రజలన్; ప్రేమన్+పాయక= ప్రేమతో వదలిపెట్టక; చేరి= కూడి; ఉపాస్తి చేయుచున్= ఉపాసన చేస్తూ, ఆరాధిస్తూ; సాంఖ్య యోగంబు= సాంఖ్యయోగం యొక్క; ఉపదేశమున్= బోధను; ఉచితవృత్తిన్+అంది= తగిన రీతిలో పొంది; అందఱును= అందరు; కృత+అర్థులు+ఐ= జన్మసార్థక్యం పొందిన వారలయి; అట్టి= అటువంటి; నారాయణదేవున్= శ్రీమన్నారాయణుని; ఆరాధనంబు+చేసి= అర్చించి; ఆత్మన్= మనసులో; చాల చింతించి= మిక్కిలి ధ్యానించి; తద్+ప్రకాశకములు+అయిన= ఆ మహాస్వామి మహిమలను చాటే; మంత్ర సంస్తవములన్= మంత్రములతో స్తోత్రాదులతో; పూజ+చేసి= అర్చించి; అనుదినంబు= ప్రతిదినం; అచలము+ఐన భక్తిన్; చలించని భక్తితో; ముక్తిన్+పొందుచున్+ఉందురు= ముక్తిని దక్కించుకొంటారు.

**తా :** రాజా! భారత వర్షానికి బదరికాశ్రమవాసియైన నారాయణుడు అధిపతి. ఆ భారతవర్షంలోనివారు మహాత్ములయిన నారదాది మునుల సాంగత్యంతో సాంఖ్యయోగాన్ని ఉపదేశంగా పొంది తన జన్మలను సార్థకం చేసుకొంటారు. నారాయణదేవుని ఆరాధించి ఆ దేవునికి ప్రియమయిన మంత్రస్తోత్రాదులతో పూజలు చేస్తారు. భక్తితో మొక్కి ముక్తిని దక్కించుకొంటారు.

**క. భారతవర్షమునందుల, సారాంశములైన పుణ్యశైలంబులు గం**
**భీరప్రవాహములుఁగల, వారయ నెఱిఁగింతు వాని నవనీనాథా! 54**

**ప్రతి :** అవనీనాథా= భూపతీ! భారతవర్షము+అందులన్= భారత వర్షంలో; సార+అంశములు+ఐన= ఉత్కృష్టములయిన; పుణ్య శైలంబులు= పుణ్యపర్వతాలు; గంభీరప్రవాహములున్+కలవు= లోతయిన నదీప్రవాహాలు కూడా ఉన్నాయి; ఆరయన్= తెలియగా; వానిన్= వాటిని; ఎఱిఁగింతున్= తెలుపుతాను.

**తా :** ఓ రాజా! భారతవర్షంలో లెక్కలేనన్ని పుణ్యపర్వతాలున్నాయి. అంతేగాకుండా, లోతయిన నదీప్రవాహాలు కూడా ఉన్నాయి. వాటి విశేషాలను నేను వినిపిస్తాను.

**వ. మలయపర్వతంబును, మంగళ ప్రస్థంబును, మైనాకంబును, త్రికూటంబును, ఋషభపర్వతంబును, గూటరంబును, గోల్లంబును, సహ్యపర్వతంబును, వేదగిరియు, ఋష్యమూక పర్వతంబును, శ్రీశైలంబును, వేంకటాద్రియును, మహేంద్రంబును, వారిధరంబును, వింధ్య పర్వతంబును, శుక్తి మత్పర్వతంబును, ఋక్షగిరియును, బారియాత్రంబును, ద్రోణపర్వతంబును, జిత్రకూటంబును గోవర్ధనాద్రియును, రైవతకంబును, గుకుంభంబును, నీలగిరియును, గాకముఖంబును, నింద్రకీలంబును, రామగిరియు నాదిగాఁ గల పుణ్యపర్వతంబు లనేకంబులుగల, వా పర్వతపుత్త్రికలైన చంద్రపటయుఁ, దామ్రపర్ణియు, నవటోదయుఁ, గృతమాలయు, వైహాయసియుఁ, గావేరియు, వేణియుఁ, బయస్వినియుఁ, బయోదయు, శర్కరావర్తయుఁ, దుంగభద్రయుఁ, గృష్ణవేణియు, భీమరథియు, గోదావరియు, నిర్వింధ్యయుఁ బయోష్ణియుఁ, దాపియు, రేవానదియు, శిలానదియు, సురసయుఁ, జర్మణ్వతియు, వేదస్మృతియు, ఋషితుల్యయుఁ, ద్రిసమయుఁ**

**గౌశికియు, మందాకినియు, యమునయు, సరస్వతియు, దృషద్వతియు, గోమతియు, సరయువును, భోగవతియు, సుషమయు, శతద్రువును, జంద్రభాగయు, మరుద్వృథయు, వితస్తయు, నసిక్నియు, విశ్వయు నను నీ మహానదులును; నర్మద, సింధువు, శోణయను నదంబులును నైన మహాప్రవాహంబు లీ భారత వర్షంబునం గల; వందు సుస్నాతులైన మానవులు ముక్తిం జెందుదురు; మఱియు నీ భారత వర్షంబున జన్మించిన పురుషులు శుక్ల లోహిత కృష్ణవర్ణ రూపంబులగు త్రివిధ కర్మంబులంజేసి క్రమంబుగ దేవ మనుష్య నరకగతులను త్రివిధ గతులం బొందుదురు; వినుము; రాగద్వేషాది శూన్యుండును నవాఙ్మానసగోచరుండును, ననాధారుండునగు శ్రీవాసుదేవమూర్తి యందుఁ జిత్తంబు నిలిపి భక్తియోగంబున నారాధించెడు మహాత్ము లవిద్యాగ్రంథి దహనంబు గావించుటం జేసి పరమభాగవతోత్తములు పొందెడు నుత్తమగతిం జెందుదురు; కావున భారతవర్షంబు మిగుల నుత్తమం బని మహాపురుషు లిట్లు స్తుతింపుచుండుదురు. 55**

**ప్రతి :** మలయపర్వతంబును; మంగళప్రస్థంబును; మైనాకంబును; త్రికూటంబును; ఋషభపర్వతంబును; కూటరంబును; కోల్లంబును; సహ్య పర్వతంబును; వేదగిరియు; ఋష్యమూక పర్వతంబును; శ్రీశైలంబును; వేంకటాద్రియును; మహేంద్రంబును; వారిధరంబును; వింధ్యపర్వతంబును; శుక్తిమత్పర్వతంబును; ఋక్షగిరియును; పారియాత్రంబును; ద్రోణపర్వతంబును; చిత్రకూటంబును; గోవర్ధనాద్రియును; రైవతకంబును; కుకుంభంబును; నీలగిరియును; కాకముఖంబును; ఇంద్రకీలంబును; రామగిరియును; ఆదిగాన్+కల= మొదలైన; పుణ్యపర్వతంబులు+అనేకంబులు+కలవు; ఆ పర్వత పుత్రికలు+ఐన= ఆ పర్వతాలకు కొమార్తెలో అనదగిన; చంద్రపటయున్; తామ్రపర్ణియున్; అవటోదయున్; కృతమాలయున్; వైహాయసియున్; కావేరియున్; వేణియున్; పయస్వినియున్; పయోదయున్; శర్కరావర్తయున్; తుంగభద్రయున్; కృష్ణవేణియున్; భీమరథియున్; గోదావరియున్; నిర్వింధ్యయున్; పయోష్ణయున్; తాపియున్; రేవానదియున్; శిలానదియున్; సురసయున్; చర్మణ్వతియున్; వేదస్మృతియున్; ఋషికుల్యయున్; త్రిసమయున్; కౌశికియున్; మందాకినియున్; యమునయున్; సరస్వతియున్; దృషద్వతియున్; గోమతియున్; సరయువును; భోగవతియున్; సుషమయున్; శతద్రువును; చంద్రభాగయున్; మరుద్వృథయున్; వితస్తయున్; అసిక్నియున్; విశ్వయున్+అను; ఈ మహానదులును; నర్మద, సింధువు, శోణ+అను నదంబులును+ఐన= తూర్పునుంచి పడమటికి ప్రవహించే నదులైన; మహాప్రవాహాలు ఈ భారతవర్షంబునన్+కలవు; అందున్; సుస్నాతులు+ఐన= పవిత్ర స్నానం కావించిన; మానవులు; ముక్తిన్+చెందుదురు; మఱియున్; ఈ భారతవర్షంబునన్; జన్మించిన పురుషులు; శుక్ల= తెల్లని; లోహిత= ఎఱ్ఱని; కృష్ణ= నల్లని; వర్ణరూపంబులు+అగు= వన్నియలతోకూడిన రూపాలతో; త్రివిధ కర్మంబులన్+చేసి= మూడురకాలయిన కర్మలవలన; క్రమంబుగన్= వరుసగా; దేవమనుష్యనరక గతులు+అను= దేవగతి, మనుష్యగతి, నరకగతి అనే; త్రివిధ గతులన్= మూడుగతుల్ని; పొందుదురు= చెందుతారు; వినుము; రాగద్వేష+ఆదిశూన్యుండును= సంప్రీతి, ద్వేషం మొదలయినవి ఏవియు లేనివాడును; అవాక్+మానస గోచరుండును= వాక్కునకుగాని, మనసునకుగాని గోచరం కానివాడును; అనాధారుండును+అగు= ఆధారం లేనివాడును అగు; శ్రీ వాసుదేవమూర్తి+అందున్; చిత్తంబున్; నిలిపి; భక్తియోగంబునన్; ఆరాధించెడు; మహాత్ములు; అవిద్యాగ్రంథిన్= అజ్ఞానమనే ముడిని; దహనంబు+కావించుటన్‌చేసి= కాల్చుట వలన; పరమభాగవత+ఉత్తములు= ఉత్కృష్టులయిన భగవద్భక్తులలో ఉత్తములు అయినవారు; పొందెడు= చేరుకొనెడి; ఉత్తమగతిన్+చెందుదురు= శ్రేష్ఠమయిన మార్గాన్ని చేరుతారు; కావునన్= అందువల్ల; భారతవర్షంబు= భారతనామక వర్షభూభాగము; మిగులన్= మిక్కిలి; ఉత్తమంబు+అని= సర్వశ్రేష్ఠమని; మహాపురుషులు= గొప్పవారు; ఇట్లు= ఈ విధంగా; స్తుతింపుచుండుదురు= స్తోత్రం చేస్తుంటారు.

**తా :** భారతవర్షంలోని పుణ్యపర్వతాలలో మలయం, మంగళప్రస్థం, మైనాకం, త్రికూటం, ఋషభం, కూటరం, గోల్లం, సహ్యాద్రి, వేదాద్రి, ఋశ్యమూకం, శ్రీశైలం, వేంకటాద్రి, మహేంద్రగిరి, వారిధరపర్వతం, వింధ్యపర్వతం, శుక్తిమంతం, ఋక్షగిరి, పారియాత్రం, ద్రోణగిరి, చిత్రకూటం, గోవర్ధనం, రైవతకం, కుకుంభం, నీలగిరి, కాకముఖం, ఇంద్రకీలాద్రి, రామగిరి మొదలయినవి ప్రసిద్ధ పర్వతాలు.

ఈ పర్వతాలకు పుత్రికలైన చంద్రవట, తామ్రపర్ణి, అవటోద, కృతమాల, వైహాయసి, కావేరి, వేణి, పయస్విని, పయోద, శర్కరావర్త, తుంగభద్ర, కృష్ణవేణి, భీమరథి, గోదావరి, నిర్వింధ్య, పయోష్ణ, తాపి, రేవానది, శిలానది, సురస, చర్మణ్వతి, వేదస్మృతి, ఋషికుల్య, త్రిసమ, కౌశికి, మందాకిని, యమున, సరస్వతి, దృషద్వతి, గోమతి, సరయువు, భోగవతి, సుషమ, శతద్రువు, చంద్రభాగ, మరుద్వృధ, వితస్త, అసిక్ని, విశ్వ మొదలయినవి ప్రధానమైన నదులు. నర్మద, సింధు, శోణ అనునవి నదములు. ఇట్టి మహానదులు భారతవర్షంలో ఎన్నో ఉన్నాయి. వీటిలో స్నానం చేసిన మానవులకు ముక్తి కరతలామలకం.

ఈ భారతవర్షంలో పుట్టిన మానవులు మూడువిధాలైన కర్మలు చేస్తుంటారు. కొన్ని తెల్లనివి. కొన్ని ఎర్రనివి, కొన్ని నల్లనివి. తెల్లనివి సత్త్వగుణ ప్రధానమయిన కర్మలు. ఎర్రనివి రజోగుణ ప్రధానమయిన కర్మలు. నల్లనివి తమోగుణ ప్రధానమైన కర్మలు. ఇట్టి కర్మల కారణంగా భారతవర్షంలో పుట్టిన ప్రజలు క్రమంగా దేవలోకం, మానవలోకం, నరకలోకం చేరుకొంటారు.

రాగం, ద్వేషం మొదలైనవి లేనివాడూ, వాక్కులనుగాని, మనసునకుగాని అందనివాడూ, అన్నిటికీ తానే ఆధారమైనవాడూ అయిన శ్రీ వాసుదేవమూర్తి యందు హృదయం పదిలంగా నిలుపుకొని భక్తితో ఆరాధించేవారు ఉత్తమగతి తప్పక పొందుతారు. అటువంటి మహాత్ములు అజ్ఞానం రూపుమాసిపోగా పరమభాగవతులు పొందే పుణ్యలోకాలకు యోగ్యులవుతారు. అందువలన, మహాపురుషులు 'భారతవర్షం' ఉత్తమోత్తమమైనదిగా కొనియాడుతుంటారు. వారి ప్రస్తుతి ఈ రీతిగా ఉంటుంది.

**ఉ. భారతవర్ష జంతువుల భాగ్యము లేమని చెప్పవచ్చు? నీ**
**భారతవర్షమందు హరి పల్మఱుఁబుట్టుచు జీవకోటికిన్**
**ధీరతతోడఁదత్త్వ ముపదేశము సేయుచుఁజెల్మి సేయుచు**
**న్నారయ బాంధవాకృతిఁగృతార్థులఁ జేయుచు నుండు నెంతయున్. 56**

**ప్రతి :** భారతవర్ష జంతువుల భాగ్యములు= భారతవర్షంలో జనించిన జీవుల అదృష్టాలు; ఏమని చెప్పవచ్చున్= ఏమని చెప్పాలి?; ఈ భారతవర్షము+అందున్= ఈ భారతవర్షంలో; హరి= మహావిష్ణువు; పలు+మఱు= పెక్కుమారులు; పుట్టుచున్= అవతరిస్తూ; జీవకోటికిన్= జంతుజాలానికి; ధీరతతోడన్= ధైర్యంతో; తత్త్వము+ఉపదేశము+చేయుచున్= తత్త్వాన్ని ఉపదేశం చేస్తూ; చెల్మి చేయుచున్= స్నేహం చేస్తూ; ఆరయన్= పరిశీలింపగా; బాంధవ+ఆకృతిన్= చుట్టంలాగా; ఎంతయున్= ఎంతో; కృత+అర్థులన్+చేయుచున్+ఉండున్= ధన్యులను చేస్తూ ఉంటాడు.

**తా :** భారతవర్షంలో పుట్టిన జీవుల అదృష్టమే అదృష్టం. ఈ భారతవర్షంలోనే శ్రీమన్నారాయణుడు ఎన్నో అవతారాలు ఎత్తాడు. ఇక్కడి మానవులకు తత్త్వం ఉపదేశించాడు. వారితో స్నేహం చేశాడు. ఆత్మబంధువులాగున జీవులు కష్టసుఖాలలో భాగం పంచుకొని వారిని కృతార్థులను చేశాడు.

**విశే :** భారతీయ వేదాంత పరిభాషలో 'జీవులను' 'జంతువు'లనడం పరిపాటి.

**క. తన జన్మకర్మములనుం, గొనియాడెడి వారికెల్లఁగోరిన వెల్లం**
**దనియఁగ నొసఁగుచు మోక్షం, బనయముఁగృపసేయుఁగృష్ణుఁడవనీనాథా! 57**

**ప్రతి :** అవనీనాథా= భూపతీ!; కృష్ణుఁడు; తన జన్మకర్మములనున్= తన అవతారాలను, లీలావిలాసాలను; కొని+ఆడెడి వారికిన్+ఎల్లన్= పొగిడే వారికందరికి; కోరినవి+ఎల్లన్= కోరిన వరాలన్నిటిని; తనియన్+కన్= సంతృప్తిపడేలాగున; ఒసంగుచున్= ప్రసాదిస్తూ; మోక్షంబు= ముక్తిని; అనయమున్= ఎల్లప్పుడు; కృప+చేయున్= అనుగ్రహించును.

**తా :** ఓ రాజా! కృషుడు తన అవతారాలను, లీలావిలాసాలను కొనియాడే వారికందరికి కోరిన వరాలను ప్రసాదిస్తాడు. అంతేకాదు, మోక్షం కూడా అనుగ్రహిస్తాడు.

**వ. ఇట్లు భారత వర్షంబునందుల జనంబులకు నెద్దియు నసాధ్యంబు లేదు. నారాయణ స్మరణంబు సకల దురితంబుల నడంచుఁ; దన్నామస్మరణ రహితంబులైన యజ్ఞ తపో దానాదులు దురితంబుల నడంపలేవు, బ్రహ్మకల్పాంతంబు బ్రతికెడి యితర స్థానంబునం బునర్జన్మ భయంబున భీతిల్లుచు నుండుటకన్న భారత వర్షంబునందు క్షణమాత్రంబు మనంబున సర్వసంగ పరిత్యాగంబు సేసిన పురుషశ్రేష్ఠునకు శ్రీమన్నారాయణ పదప్రాప్తి యతిసులభంబుగ సంభవించుం; గావున నట్టి యుత్తమంబగు నీ భారత వర్షంబె కోరుచుండుదురు; మఱియు నెక్కడ వైకుంఠుని కథావాసన లేకుండు, నే దేశంబున సత్పురుషులైన పరమభాగవతులు లేకుండుదు, రే భూమిని యజ్ఞేశ్వరుని మహోత్సవంబులు లేక యుండు, నది సురేంద్రలోకంబైన నుండందగదు; జ్ఞానానుష్ఠాన ద్రవ్యకలాపంబుచేత మనుష్యజాతిం బొంది తపంబున ముక్తిం బొందకుండెనేని మృగంబుల మాడ్కి నతండు దనకుం దానె బంధనంబు నొందు; భారతవర్షంబునందుఁ బ్రజలచేత శ్రద్ధాయుక్తంబుగా ననుష్ఠింపంబడిన యజ్ఞములయందు వేల్వంబడు హవిస్సులను బెక్కునామంబులం బుండరీకాక్షుం దంది తనమీఁది భక్తి యధికంబుగాఁ జేయు; నట్టి భారతవర్షంబు నందలి ప్రజలమీఁదం గరుణించి సర్వేశ్వరుం డిహపర సౌఖ్యంబుల నొసంగుచుండు; జంబూద్వీపంబున సగరాత్మజు లశ్వమేధాశ్వంబు నన్వేషింపంబూని భూఖననంబు సేయుటం జేసి స్వర్ణప్రస్థ చంద్రశుక్లావర్తన రమణక మందేహారుణ పాంచజన్య సింహళ లంకాద్వీపంబులను నెనిమిది యుపద్వీపంబులు గలిగె. 58**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; భారతవర్షంబు+అందుల జనంబులకున్= భారతవర్షంలోని మానవులకు; ఎద్దియున్= ఏదిగాని; అసాధ్యంబులేదు= సాధ్యం కానిదిలేదు; నారాయణ స్మరణంబు; సకలదురితంబులన్+అడంచున్= సమస్త పాపాలను అణచును; తద్+నామస్మరణరహితంబులు+ఐన= ఆ శ్రీహరి నామస్మరణంలేని; యజ్ఞతపస్+దాన+ఆదులు= యజ్ఞం, తపం, దానం మొదలయినవి; దురితంబులన్= పాపాలను; అడంపన్‌లేవు= అణచలేవు; బ్రహ్మకల్ప+అంతంబు= బ్రహ్మ ఏలుబడి కాలం చివరిదాక; బ్రతికెడి= జీవించెడి; ఇతర స్థానంబునన్= మరోచోట; పునస్+జన్మ భయంబునన్= మరల కలిగే జన్మ భయంతో; భీతిల్లుచున్+ఉండుటకంటెన్= భయపడుతూ ఉండటంకంటె; భారతవర్షంబు+అందున్; క్షణమాత్రంబు= ఒక క్షణకాలమేని; మనంబునన్= మనసులో; సర్వసంగ పరిత్యాగంబు+చేసిన= అన్నింటినీ వదలిపెట్టటం గావించిన; పురుషశ్రేష్ఠునకున్= పురుషులలో సర్వశ్రేష్ఠుడయిన వానికి; శ్రీమత్+నారాయణపదప్రాప్తి= శ్రీమన్నారాయణుని స్థానం పొందడం; అతిసులభంబు+గన్= మిక్కిలి తేలికగా; సంభవించున్= సిద్ధించును; కావునన్; అట్టి+ఉత్తమంబు+అగు=

అటువంటి శ్రేష్ఠమైన ఈ భారతవర్షంబు+ఎ= ఈ భారత వర్షాన్నే; కోరుచుండుదురు= వాంఛిస్తారు; మఱియున్; ఎక్కడ; వైకుంఠుని= వైకుంఠవాసుడయిన శ్రీమహావిష్ణువుయొక్క; కథావాసన లేకుండున్= లేకపోవునో, ఏ దేశంబునన్; సత్పురుషులు+ఐన= సజ్జనులయిన; పరమభాగవతులు= శ్రేష్ఠులైన భగవద్భక్తులు; లేకుందుర= లేకపోతారో; ఏ భూమినిన్= ఏ ప్రదేశంలో; యజ్ఞ+ఈశ్వరుని= యజ్ఞాలకు ఫలప్రదాత అయిన దేవుని; మహా+ఉత్సవంబులు= గొప్పవగు ఉత్సవాలు; లేక+ఉండున్= ఉండవో; అది= ఆ లోకం; సురేంద్రలోకంబు+ఐనన్= దేవేంద్రలోకమయినా; ఉండన్+తగదు= నివసించుటకు తగదు; జ్ఞాన+అనుష్ఠాన ద్రవ్యకలాపంబు చేతన్= జ్ఞానమూ, అనుష్ఠానమూ, ద్రవ్యసంపత్తులచేత; మనుష్యజాతిన్+పొంది= మానవజన్మాన్ని పొంది; తపంబునన్= తపంచేత; ముక్తిన్+పొందకుండెన్+ఏని= మోక్షాన్ని పొందకున్నచో; మృగంబుల మాడ్కిన్= జంతువుల్లా; అతండు; తనకున్; తాను+ఎ= తానే, బంధనంబున్ ఒందున్; భారతవర్షంబు+అందున్; ప్రజలచేతన్; శ్రద్ధాయుక్తంబుగాన్= శ్రద్ధతో; అనుష్ఠింపన్+పడిన= ఆచరింపబడిన; యజ్ఞముల+అందున్; వేల్వన్+పడు= అర్పింపబడు= హోమంకావింపబడే; హవిస్సులను= హోమద్రవ్యాలను, నెయ్యి మొదలైనవాటిని; పెక్కునామంబులన్= అనేక పేర్లతో; పుండరీక+అక్షుండు= పద్మాలవంటి కన్నులు కలవాడగు విష్ణువు; అంది= స్వీకరించి; తనమీఁది భక్తిన్= తనపట్ల భక్తిని; అధికంబుగాన్+చేయున్; అట్టి; భారత వర్షంబునందలి ప్రజలఁమీదన్; కరుణించి= దయజూపి; సర్వ+ఈశ్వరుండు; ఇహపరసౌఖ్యంబులన్= ఈలోక, పరలోక సుఖాలను; ఒసంగుచుండున్; జంబూద్వీపంబునన్; సగర+ఆత్మజులు= సగరుని పుత్రులు; అశ్వమేధ+అశ్వంబున్; అన్వేషింపన్+పూని= వెదకడానికి ప్రయత్నించి; భూఖననంబు= భూమిని త్రవ్వటు; చేయుటన్+చేసి= చేయడంవల్ల; స్వర్ణప్రస్థ; చంద్ర; శుక్ల+ఆవర్తన; రమణక; మందేహారుణ; పాంచజన్య; సింహళ; లంకాద్వీపంబులను; ఎనిమిది; ఉపద్వీపంబులు+కలిగెన్= ఉపద్వీపాలు పుట్టాయి.

**తా :** భారతవర్షంలో పుట్టిన జనులకు సాధ్యం కానిదంటూ ఏదీ లేదు. శ్రీమన్నారాయణుని సంస్మరణం సమస్తపాపాలను పటాపంచలు చేస్తుంది. ఆ శ్రీమన్నారాయణుని స్మరణంలేని యజ్ఞాలు, తపస్సులు, దానాలు నిరర్థకాలు. వాటివల్ల పాపాలు పోవు. పునర్జన్మ మరల వస్తుందేమో అన్న భయంతో ఇతర ప్రదేశాలలో బ్రహ్మకల్పం చివరిదాకా జీవించడంకంటె భారతవర్షంలో క్షణకాలం జీవించి సర్వసంగపరిత్యాగం చేసినట్లయితే అటువంటి పురుషశ్రేష్ఠునికి శ్రీమన్నారాయణ పదప్రాప్తి చాల సులభంగా దక్కుతుంది. అందుచేత, అందరూ భారతవర్షంలో జన్మించాలని కోరుకొంటారు. అదీగాక ఏ స్థలంలో వైకుంఠనిలయుని పుణ్యకథలవాసన ఆవంతయినా ఉండదో, ఏ ప్రదేశంలో పుణ్యపురుషులయిన భాగవతోత్తములు ఉండరో, ఏ స్థలంలో యజ్ఞేశ్వరుని ఉత్సవాలు జరుగవో అటువంటి ప్రదేశం దేవేంద్రలోకమైనా ఆ చోట నివసింపరాదు. మానవజన్మ ఎత్తి జ్ఞానమూ, సదనుష్ఠానమూ, ద్రవ్యసంపత్తిచే మానవజన్మ పొందికూడా తపస్సుద్వారా ముక్తి అందుకోలేని మానవులు పశువులవలె తమకు తామే బంధనాల పాలవుతారు. భారతవర్షంలోని ప్రజలు శ్రద్ధతో యజ్ఞాలు నిర్వహించినట్లయితే, ఆ హోమాలలోని హవిస్సును అనేక నామాలతో ఆ పుండరీకాక్షుడు అందుకొని ప్రసన్నుడై వారికి తనమీది భక్తిని అతిశయింపజేస్తాడు. భారతవర్షంలోని ప్రజలమీద అపరిమితమయిన అనుగ్రహం ప్రకటిస్తూ ఆ భగవంతుడు ఇహలోక సౌఖ్యాన్ని, పరలోక సౌఖ్యాన్ని వారికి ప్రసాదిస్తాడు. జంబూద్వీపంలోని సగరుని కుమారులు అపహరింపబడిన అశ్వమేధాశ్వాన్ని అన్వేషిస్తూ పలువైపులా భూమిని త్రవ్వినపుడు ఎనిమిది ఉపద్వీపాలు ఏర్పడ్డాయి. అవే స్వర్ణప్రస్థం, చంద్రశుక్లం, ఆవర్తనం, రమణకం, మందేహారుణం, పాంచజన్యం, సింహళం, లంక అనబడేవి.

**సీ. లక్షయోజనముల లవణాబ్ధిపరివృత మగుచు జంబూద్వీప మతిశయిల్లు;**
**విను రెండు లక్షలు విస్తృతముగను బ్లక్షద్వీపముండు నా క్షార సాగ**

**రముఁ జుట్టి, యందుల రమ్యమై యొప్పెడు వృక్షంబు ప్లక్షంబు విదితముగను;**
**దనరు నా ద్వీపంబు తరునామ మహిమచే మిగులఁబ్లక్షం బన మించి రహిని;**

**ఆ. నందు సంచరించు నట్టి వారల కగ్ని, దేవుఁ డమరు నాదిదేవతయుఁగ,**
**నందులోన నా ప్రియవ్రతసుతుఁడగు, నిధ్మజిహ్వుఁడను మహీవరుండు. 59**

**ప్రతి :** జంబూద్వీపం; లక్షయోజనములన్= లక్ష యోజనములతో; లవణ+అబ్ధి పరివృతము+అగుచున్= ఉప్పుసముద్రంతో చుట్టుకొనబడినదై; అతిశయిల్లున్= పెంపొందును; విను= వినుము; రెండులక్షల విస్తృతముగను= రెండు లక్షల విస్తృతి కలదై; ఆ క్షారసాగరమున్+చుట్టి= ఆ ఉప్పు సముద్రాన్నిచుట్టి; ప్లక్షద్వీపము+ఉండున్= ప్లక్షనామక ద్వీపముంది; అందులన్= అక్కడ; రమ్యము+ఐ= రమణీయమై; విదితమగును= అందరికి తెలిసినదై; ఒప్పెడు= ప్రకాశించునట్టి; వృక్షంబు= తరువు; ప్లక్షంబు= ప్లక్షము అను పేరుగలది, ఆ ద్వీపంబు; తరునామ మహిమచేన్= చెట్టుపేరు యొక్క గొప్పతనంతో; మిగులన్= మిక్కిలి; ప్లక్షంబు+అనన్= ప్లక్షమనగా; మించి= అతిశయించి; రహిన్= ఆనందంతో; తనరున్= ఒప్పును; అందున్= అక్కడ; సంచరించు+అట్టివారలకున్= సంచారము చేసేవారికి; ఆదిదేవతయున్+కన్= ఆదిదేవతగా; అగ్నిదేవుఁడు= అగ్నిదేవుడు; అమరున్= ఒప్పును; అందులోనన్= ఆ ప్లక్షద్వీపంలో; ఆ ప్రియవ్రతసుతుఁడు+అగు= ఆ ప్రియవ్రతుని కుమారుడగు; ఇధ్మజిహ్వుఁడు+అను= ఇధ్మజిహ్వుడు అను పేరుగల; మహీవరుండు= రాజు (ఒప్పున్).

**తా :** రాజా! జంబూద్వీపం లక్షయోజనాల వైశాల్యం గలిగి ఉంది. దానిచుట్టూ అంతే ప్రమాణంగల లవణ సముద్రం ఉంది. ఆ తర్వాత దానినిచుట్టి ప్లక్షద్వీపం రెండులక్షల యోజనాల విస్తృతి కలిగి ఉంది.

ఆ ప్లక్ష ద్వీపం నట్టనడుమ ఒక పెద్ద జువ్వి చెట్టున్నది. ఆ కారణంగానే ఆ ద్వీపానికి ప్లక్ష ద్వీపమనే పేరు వచ్చింది. ఆ ద్వీపంలో నివసించే వారికి అగ్నిదేవుడు ఆదిదేవత. ఆ ద్వీపాన్ని ఇధ్మజిహ్వుడు పరిపాలిస్తున్నాడు. అతడు ప్రియవ్రతుని కుమారుడు.

**వ. నరేంద్రా! యా యిధ్మజిహ్వుం డా ప్లక్షద్వీపంబు నేడు వర్షంబులుగ విభజించి యందు నా వర్ష నామధారులుగ నుండు తన పుత్త్రులగు శివ యశస్య సుభద్ర శాంత క్షేమాభయామృతు లనియెడు నేడుగుర నేడు వర్షంబుల కధిపతులం గావించి తపంబునకుం జనియె, నా వర్షంబులయందు మణికూట వజ్రకూటేంద్ర సేన జ్యోతిష్మద్ధూమ్రవర్ణ హిరణ్యగ్రీవ మేఘమాలలను నామంబులు గల సప్త కులపర్వతంబులను, నరుణయు నృమణయు నంగిరసయు సావిత్రియు సుప్రభాతయు ఋతంభరయు సత్యంభరయు నన సప్త మహానదులును, నా నదుల యందు సుస్నాతు లగుచు గత పాపులైన హంసపతం గోర్ధ్వాయన సత్యాంగులను నామంబులుగల చాతుర్వర్ణ్యంబును గలిగి యుండు, నందుఁ బురుషులు సహస్ర వత్సర జీవులును దేవతాసములును దృష్టిమాత్రంబునం గ్లమస్వేదాది రహితంబగు నపత్యోత్పాదనంబు గలవార లగుచు వేదత్రయాత్మకుండును, స్వర్గద్వారభూతుండును, భగవత్స్వరూపియు నగు సూర్యుని వేదత్రయమున సేవింపుదురు; ప్లక్షద్వీపం బాదిగా మీఁదటి ద్వీపపంచకంబు నందలి పురుషులకు నాయు రింద్రియ పటుత్వంబులును దేజోబలంబులును దోడనే జనియించుచుండు. 60**

**ప్రతి :** నర+ఇంద్రా= భూపతీ!; ఆ+ఇధ్మజిహ్వుండు; ఆ ప్లక్ష ద్వీపంబున్; ఏఁడు వర్షంబులుగన్; విభజించి= విభాగంచేసి; అందున్; ఆ వర్షనామధారులుగన్+ఉండు= ఆ వర్షభూభాగముల పేర్లు గల; తనపుత్రులు+అగు= తన కుమారులగు; శివ, యశస్య, సుభద్ర, శాంత, క్షేమ, అభయ, అమృతులు+అనియెడి; ఏడుగురన్= ఏడుమందిని; ఏడు వర్షంబులకున్+ అధిపతులన్+కావించి= సప్తవర్షంబులపై ఆధిపత్యము కలవారిగా చేసి; తపంబునకున్+చనియెన్= తపం చేయడానికి వెళ్ళాడు; ఆ వర్షంబుల+అందున్= ఆ వర్షభూభాగప్రదేశాలలో; మణికూట, వజ్రకూట, ఇంద్రసేన, జ్యోతిష్మత్ ధూమ్రవర్ణ హిరణ్యగ్రీవ మేఘమాలలు+అను నామంబులు+కల= పేర్లుగల; సప్తకుల పర్వతంబులును= ఏడు కులపర్వతాలను; అరుణయును, నృమణయును, అంగిరసయును, సావిత్రియును, సుప్రభాతయును, ఋతంభరయును= సత్యంభరయును; అనన్= అనునట్టి సప్తమహానదులును; ఆ నదుల+అందున్; సుస్నాతులు+అగుచున్= పవిత్రస్నానం చేసిన వారగుచు; గతపాపులు+ఐన= పాపం పోగొట్టుకొన్నవారయిన; హంస, పతంగ+ఊర్ధ్వాయన; సత్యాంగులు+అను; నామంబులు+కల చాతుర్వర్ణ్యంబును= నాల్గు కులాలను; కలిగియుండున్= కలిగియుందురు; అందున్= అక్కడ; పురుషులు= నరులు; సహస్రవత్సర జీవులును= వేయి సంవత్సరాలు బ్రతికేవారును; దేవతాసములును= దేవతలతో సమానమైనవారును; దృష్టిమాత్రంబునన్= వీక్షణమాత్రాన; క్లమస్వేద+ఆదిరహితంబు+అగు= బడలిక, చెమట మొదలగునవి లేనట్టి; అపత్య+ ఉత్పాదనంబు+కలవారలు+అగుచున్= సంతానం పుట్టించు సామర్థ్యం కలవారవుతూ; వేదత్రయ+ఆత్మకుండును= త్రివేదస్వరూపుడును; స్వర్గద్వారభూతుండును= స్వర్గప్రవేశానికి వాకిలిగనున్నవాడును; భగవత్+స్వరూపియును+అగు= భగవంతుని ప్రత్యక్ష స్వరూపమైన; సూర్యునిన్= సూర్యుని; వేదత్రయమ్మునన్; ఋక్, యజుస్సామవేద మంత్రాలతో; సేవింపుదురు= సేవిస్తారు; ప్లక్షద్వీపంబు+ఆదిగాన్= ప్లక్షద్వీపం మొదలయిన; మీఁదటి= ముందు చెప్పబోయే; ద్వీపపంచకంబునందలి= ఐదు ద్వీపాలలోని; పురుషులకున్= పురుషులకున్; ఆయుస్+ఇంద్రియ పటుత్వంబులును= ఆయుర్బలము; ఇంద్రియపటుత్వములును; తేజస్+బలంబులును= తేజోబలములును; తోడనే= వెనువెంటనే; జనియించుచుండున్= సంక్రమిస్తుంటాయి.

**తా :** పరీక్షిన్నరేంద్రా! ఇధ్మజిహ్వుడు ప్లక్షద్వీపాన్ని ఏడు వర్షాలుగా విభజించాడు. ఆ వర్షముల పేర్లుగల తన కుమారులు ఏడుగురిని శివుడు, యశస్యుడు, సుభద్రుడు, శాంతుడు, క్షేముడు, అభయుడు, అమృతుడు అనేవారిని ఆ ఏడు వర్షాలకు అధిపతులను చేశాడు. ఆ తరువాత ఇధ్మజిహ్వుడు నిస్సంగుడై తపస్సు చేసుకోవడానికోసం అడవికి వెళ్ళిపోయాడు. విభజింపబడిన ఒక్కొక్కవర్షంలో ఒక్కొక్క కులపర్వతమూ, ఒక్కొక్క మహానది ఉన్నాయి. ఆ విధంగా ఆ సప్తవర్షాలలో వరుసగా మణికూటం, వజ్రకూటం, ఇంద్రసేనం, జ్యోతిష్మంతం, ధూమ్రవర్ణం, హిరణ్యగ్రీవం, మేఘమాలం అనే ఏడు కులపర్వతాలు ఉన్నాయి. అరుణ, నృమణ, అంగిరస, సావిత్రి, సుప్రభాత, ఋతంభర, సత్యంభర అనే పేర్లుగల ఏడు మహానదులున్నాయి. ఆ నదులలో స్నానంచేసి నాలుగువర్ణాల వారును పాపం పోగొట్టుకొంటారు. ఆ నాలుగు వర్ణాలవారు హంసులు, పతంగులు, ఊర్ధ్వాయనులు, సత్యాంగులు అని వ్యవహరింపబడుతారు. ప్లక్షద్వీపంలో నివసించే పురుషుల ఆయుర్దాయం వేయి సంవత్సరాలు. వారు దేవతలతో సమానమయినవారు. కేవలం చూపుతోనే శ్రమ స్వేదాదులు లేని సంతానాన్ని అనుగ్రహింపగలవారు. వేదస్వరూపుడూ, స్వర్గానికి ద్వారమైనవాడూ, భగవంతుడూ అయిన సూర్యుని వారు ఋగ్యజుస్సామవేదమంత్రాలతో సేవిస్తుంటారు. ప్లక్షద్వీపం మొదలయిన ముందు చెప్పబడే ఐదు ద్వీపాలలోని పురుషులకూ ఆయుర్బలం. ఇంద్రియపటుత్వం, తేజోబలం పుట్టుకతోనే సంక్రమిస్తాయి.

క. ప్లక్షద్వీపము, ద్విగుణిత, లక్షేక్షురసాబ్ధి సుట్టిరా విలసిల్లు;
న్నిక్షురసోదద్విగుణం, బక్షయముగ శాల్మలీమహాద్వీప మిలన్. **61**

**ప్రతి :** ప్లక్షద్వీపము= ప్లక్షనామకమైన ద్వీపం; ద్విగుణిత లక్ష+ఇక్షురస+అబ్ధి= రెండు లక్షల యోజనాల వైశాల్యంగల చెరకురసపు సముద్రం; చుట్టిరాన్= తన్ను పరివేష్టించగా; విలసిల్లున్= ప్రకాశిస్తోంది; ఇక్షురస+ఉదద్విగుణంబు= ఆ చెరకురససాగరానికి రెండురెట్లు; ఇలన్= పుడమిలో; శాల్మలీమహాద్వీపము= శాల్మలి అనే గొప్ప దీవి; అక్షయముగన్= నాశం లేకుండా; విలసిల్లున్= ఒప్పారును.

**తా :** ప్లక్ష ద్వీపంచుట్టూ రెండు లక్షల యోజనాల విస్తృతి గల చెరకు రససముద్రం ఉంది. దీనికి రెట్టింపు విస్తృతితో శాల్మలీ ద్వీపం ఉంది.

**వ. అందు శాల్మలీ వృక్షంబు ప్లక్షాయామంబై తేజరిల్లు; నా వృక్షరాజంబునకు నధోభాగంబునం బతత్త్రిరాజుగా నుండు గరుత్మంతుండు నిలుకడగా వసించు; నా శాల్మలీ వృక్షంబు పేర నా ద్వీపంబు శాల్మలీ ద్వీపంబన విలసిల్లు; నా ద్వీపపతియైన ప్రియవ్రతాత్మజుండగు యజ్ఞబాహువు తన పుత్రులగు సురోచన సౌమనస్య రమణక దేవబర్హ పారిబర్హాప్యాయ నాభిజ్ఞాతు లనియెడు వారిపేర నేడు వర్షంబుల నేర్పఱచి యా వర్షంబులయం దేడ్వురఁ గుమారుల నభిషిక్తులంజేసె; నా వర్షంబులయందు స్వరస, శతశృంగ, వామదేవ, కుముద, ముకుంద, పుష్పవర్ష, శతశ్రుతులను పర్వత సప్తకంబును ననుమతియు, సినీవాలియు, సరస్వతియుఁ, గుహువును, రజనియు, నందయు, రాకయునను సప్తమహానదులును గల; వందు శ్రుతధర, విద్యాధర, వసుంధ, రేధ్మధర, సంజ్ఞలగు నా వర్ష పురుషులు భగవత్స్వరూపుండును, వేదమయుండు, నాత్మ స్వరూపుండునగు సోముని వేదమంత్రంబులచే నారాధింపుదు; రాద్వీపంబు లక్షచతుష్టయ పరిమిత యోజన విస్తృతం బయిన సురాసముద్రంబుచే నావృతంబై తేజరిల్లు; నందు. 62**

**ప్రతి :** అందున్= ఆ శాల్మలీ ద్వీపంలో ఉన్న; శాల్మలీ వృక్షంబు= బూరుగుచెట్టు; ప్లక్షాయామంబు+ఐ= ప్లక్షద్వీపంలోని జువ్విచెట్టంతదై; తేజరిల్లున్= ప్రకాశిస్తున్నది; ఆ వృక్షరాజంబునకున్= ఆ బూరుగు చెట్టునకు; అధోభాగంబునన్= దిగువ భాగంలో; పతత్త్రిరాజుగాన్+ఉండు= పక్షులకు రాజుగానున్న; గరుత్మంతుఁడు= గరుడుడు; నిలుకడగాన్= స్థిరంగా; వసించున్= నివసిస్తున్నాడు; ఆ శాల్మలీ వృక్షంబుపేరన్= ఆ శాల్మలీ వృక్షం పేరుతో; ఆ ద్వీపంబు= ఆ దీవి; శాల్మలీద్వీపంబు+ అనన్= శాల్మలీద్వీపము అనుపేర; విలసిల్లున్= ప్రకాశిస్తుంది; ఆ ద్వీపపతి+ఐన= ఆ ద్వీపానికి అధిపతి అయిన; ప్రియవ్రత+ఆత్మజుండు+అగు= ప్రియవ్రతుని కుమారుడయిన; యజ్ఞబాహువు; తన పుత్రులు+అగు= తన కుమారులైన; సురోచన; సౌమనస్య; రమణక; దేవబర్హ; పారిబర్హ; ఆప్యాయన; అభిజ్ఞాతులు+అనియెడు; వారి పేరన్= వారి పేర్లతో; ఏడు వర్షంబులన్= ఏడు వర్షభూభాగాలను; ఏర్పరచి; ఆ వర్షంబుల+అందున్; స్వరస, శతశృంగ, వామదేవ, కుముద, ముకుంద, పుష్పవర్ష, శతశ్రుతులు+అను, పర్వత సప్తకంబును= ఏడు పర్వతములను; అనుమతియున్; సినీవాలియున్; సరస్వతియున్; కుహువును; రజనియున్; నందయున్; రాకయు+అను; సప్తమహానదులును కలవు= ఏడు గొప్పనదులు ఉన్నాయి; అందు శ్రుతధర; విద్యాధర; వసుంధర; ఇధ్మధర; సంజ్ఞలు+అను పేరుగల; ఆవర్ష పురుషులు= ఆ వర్షాధిపులు; భగవత్+స్వరూపుండును= వేదమయుండును; ఆత్మస్వరూపుండును+అగు; సోముని= చంద్రుని; వేదమంత్రంబులచేన్;

ఆరాధింపుదురు= పూజింతురు; ఆ ద్వీపంబు; లక్షచతుష్టయ పరిమిత యోజనవిస్తృతంబు+అయిన= నాలుగు లక్షల యోజనాల విస్తృతిగల; సురాసముద్రంబుచేన్= కల్లు కడలితో; ఆవృతంబు+ఐ= చుట్టుకొనబడినదై; తేజరిల్లున్= ప్రకాశించును; అందున్= అందు.

**తా :** ఆ ద్వీపంలో ఉన్న శాల్మలీవృక్షంవల్లనే దీనికి శాల్మలీ ద్వీపమనే పేరు వచ్చింది. ఆ శాల్మలీవృక్షం (బూరుగుచెట్టు) కూడా ప్లక్షద్వీపంలోని జువ్వి చెట్టంత ఉంది. ఆ బూరుగుచెట్టు దిగువభాగంలో పక్షులకు రాజయిన గరుత్మంతుడు స్థిరనివాసం చేస్తుంటాడు. ఈ ద్వీపాన్ని పరిపాలించేవాడు ప్రియవ్రతుని పుత్రుడయిన యజ్ఞబాహువు. అతడు తాను పాలించే భూభాగాన్ని ఏడువర్షాలుగా విభజించాడు. ఒక్కొక్క వర్షంలో ఒక్కొక్క పర్వతమూ, ఒక్కొక్క నదీ ఉన్నాయి. ఆ వర్షాలకు తన ఏడుగురు కుమారులను అభిషిక్తులను చేశాడు. వారి పేర్లతోనే ఆ వర్షాలు వ్యవహరింపబడుతున్నాయి. వారి పేర్లు సురోచనుడు, సౌమనస్యుడు, రమణకుడు, దేవబర్హుడు, పారిబర్హుడు, ఆప్యాయనుడు, అభిజ్ఞాతుడు.

ఈ ఏడువర్షాలలో స్వరసం, శతశృంగం, వామదేవం, కుముదం, ముకుందం, పుష్పవర్షం, శతశ్రుతి అనే పర్వతాలున్నాయి. వరుసగా అనుమతి, సినీవాలి, సరస్వతి, కుహువు, రజని, నంద, రాక అనే ఏడు మహానదులున్నాయి. ఆ వర్షంలోని పురుషులు శ్రుతధరులు, విద్యాధరులు, వసుంధరులు, ఇధ్మధరులు అని పిలువబడతారు. వారు భగవత్ స్వరూపుడూ, వేదమయుడూ, ఆత్మస్వరూపుడూ అయిన సోముణ్ణి వేదమంత్రాలతో ఆరాధిస్తారు. ఆ ద్వీపంచుట్టూ నాలుగు లక్షల యోజనాల విస్తృతి కలిగిన సురాసముద్రం ఉంది.

**విశే : సినీవాలి :** ప్రాతఃకాలంలో చంద్రకళ కనబడే అమావాస్యను సినీవాలి అంటారు.

**సీ. భూనాథ! యా సురాంభోధికిఁజుట్టుగా నుండు కుశద్వీప మర్వీమీఁదఁ;**
**దోరమై తా ద్విచతుర్లక్ష యోజనంబులను విస్తారమై పొలుపు మిగులు;**
**నందుఁ గుశస్తంబ మనిశంబు దేవతా కల్పితం బైనట్టి కాంతిచేత**
**దిక్కులు వెలిఁగించు ద్వీపంబునకుఁ దన పేరను సత్కీర్తి పెంపుసేయు;**

**తే. నట్టి దీవికి నధిపతి యగు ప్రియవ్ర, త తనయుండు హిరణ్య రేతసుఁ దనం ద**
**నరెడి భూపతి తన సుతనామములను, వర్షములు సేసె నత్యంతహర్షమునను. 63**

**ప్రతి :** భూనాథ= భూపతీ!; ఆ సుర+అంభోధికిన్= ఆ కల్లు కడలికి; చుట్టుగాన్= చుట్టుగా (ఆవల); ఉర్వీమీఁదన్= భూమిపై; కుశద్వీపము= కుశనామకద్వీపం; ఉండన్= ఉండును; అది; తోరమై= గొప్పదై; తాన్= అది; ద్విచతుర్లక్ష యోజనంబులను= ఎనిమిది లక్షల యోజనాలు; విస్తారము+ఐ= విస్తరించినదై; పొలుపు మిగులున్= అందచందాలతో అలరారును; అందున్= అందు; కుశస్తంబము= దర్భదుబ్బు; అనిశంబున్= ఎల్లప్పుడు; దేవతా కల్పితంబున్+ఐన+అట్టి= దేవతలచేత కల్పితమయినట్టి; కాంతిచేతన్= వెలుగుచేత; దిక్కులు= దిశలు; వెలిఁగించు= ప్రకాశింపజేయు; ద్వీపంబునకున్= ద్వీపానికి; తన పేరును= తనకు గల; కుశ ద్వీపనామాన్ని; సత్కీర్తి= మంచికీర్తిని; పెంపు+చేయున్= అధికం చేస్తుంది; అట్టి దీవికిన్= అటువంటి కుశమనుదీవికి; అధిపతి+అగు= రాజగు; ప్రియవ్రత తనయుండు; హిరణ్యరేతసుండు+అనన్; తనరెడు= ఒప్పెడు; భూపతి= రాజు; తన సుత నామములను= తన కుమారుల పేర్లను; అత్యంత హర్షమునను= మిక్కిలి సంతోషంతో; వర్షములు+చేసెన్= భూభాగాలను చేశాడు.

**తా :** ఓ రాజా! ఆ సురాసముద్రం ఆవల కుశద్వీపముంది. అది ఎనిమిదిలక్షల యోజనాల విస్తృతి కలిగింది. ఆ ద్వీపం మధ్య ఒక పెద్ద కుశస్తంభం (దర్భదుబ్బు) మొలిచి ఎత్తుగా పెరిగి ఉంది. అది దివ్యకాంతులతో జిగేలుమంటూ దిక్కులను వెలిగింప చేస్తుంది. ఈ కారణంవల్లనే దీనికి కుశద్వీపమనే పేరు కలిగింది. అలాంటి దీవికి అధిపతి ప్రియవ్రత తనయుడు హిరణ్యరేతసుడు. అతడు తన కుమారుల పేర్లతో భూభాగాలను ఏర్పాటు చేశాడు.

**వ. ఇట్లు హిరణ్యరేతసుండు వసుదాన దృఢరుచి నాభి గుప్త సత్యవ్రత విప్ర వామదేవులను నామంబులు గల పుత్త్రుల నామంబుల సప్తవర్షంబులం గావించి యా కుమారుల నందు నిలిపి తాను దపంబునకుం జనియె; నా వర్షంబునందు బభ్రు చతుశ్శృంగ కపిల చిత్రకూట దేవానీకోర్ధ్వరోమ ద్రవిణంబులను నామంబులు గల సప్తగిరులును; రసకుల్యయు, మధుకుల్యయు, శ్రుతవిందయు, మిత్రవిందయు, దేవగర్భయు, ఘృతచ్యుతయు, మంత్రమాలయు నను సప్త మహానదులును గల; వా నదీ జలంబులఁ గృతమజ్జను లగుచు భగవంతుండగు యజ్ఞపురుషునిఁ గుశల కోవిదాభియుక్తకులక సంజ్ఞలు గల వర్షపురుషు లారాధించు చుందురు. 64**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; హిరణ్యరేతసుండు= ప్రియవ్రతుని కుమారుడయిన హిరణ్యరేతసుడు; వసుదాన, దృఢరుచి, నాభిగుప్త సత్యవ్రత విప్ర వాసుదేవులు+అను= నామంబులుగల; పుత్రుల= కుమారులయొక్క; నామంబులన్= పేర్లతో; సప్తవర్షంబులన్+కావించి= ఏడు వర్షభూభాగముల గావించి; ఆ కుమారులన్; అందున్; నిలిపి; తాను= ఆ హిరణ్యరేతసుడు; తపంబునకున్+చనియెన్= తపస్సు చేయడానికి వెళ్ళాడు; ఆ వర్షంబు+అందున్; బభ్రు చతుశ్శృంగ కపిల చిత్రకూట దేవానీక ఊర్ధ్వరోమ ద్రవిణంబులు+అను; నామంబులుగల= పేర్లుగల; సప్తగిరులును= ఏడు పర్వతాలను; రసకుల్యయున్; మధుకుల్యయున్; శ్రుతవిందయున్; మిత్రవిందయున్; దేవగర్భయున్; ఘృతచ్యుతయున్; మంత్రమాలయున్; అను సప్తమహానదులును; కలవు; ఆ నదీజలంబులన్; కృత మజ్జనులు+అగుచున్; స్నానం చేసిన వారవుతూ; భగవంతుండు+అగు; యజ్ఞ పురుషునిన్= యజ్ఞానికి ప్రధానుడయిన పురుషుని; కుశల, కోవిద, అభియుక్త, కులక; సంజ్ఞలు గల= పేర్లుగల; వర్షపురుషులు= ఆ యా వర్షాలలోని భూభాగమందలి మనుజశ్రేష్ఠులు; ఆరాధించుచుందురు= ఆరాధిస్తుంటారు.

**తా :** ఈ కుశద్వీపానికి ప్రియవ్రత కుమారుడైన హిరణ్యరేతసుడు అధిపతి. వసుదానుడు, దృఢరుచి, నాభి గుప్తుడు, సత్యవ్రతుడు, విప్రుడు, వామదేవుడు అనువారు హిరణ్యరేతసుని కుమారులు. తండ్రి అయిన హిరణ్యరేతసుడు తన తనయుల పేర్లతో విభజించిన కుశద్వీపంలోని ఏడు వర్షాలలో ఏడుగురు కుమారులను నియమించాడు. అనంతరం తపస్సు చేయడానికి అడవికి వెళ్ళాడు. ఆ కుశవర్షంలో బభ్రువు, చతుశ్శృంగం, కపిలం, చిత్రకూటం, దేవానీకం, ఊర్ధ్వరోమం, ద్రవిణం అనే పేర్లుగల ఏడు పర్వతాలున్నాయి. అలాగే రసకుల్య, మధుకుల్య, శ్రుతవింద, మిత్రవింద, దేవగర్భ, ఘృతచ్యుత, మంత్రమాల అనే పేర్లుగల మహానదులున్నాయి. కుశలులు, కోవిదులు, అభియుక్తులు, కులకులు అను పేర్లుగల నలుగురు వర్షపురుషులు ఆ పవిత్ర నదీజలాలలో స్నానంచేసి పవిత్రులై భగవంతుడయిన యజ్ఞపురుషుని ఆరాధిస్తుంటారు.

**సీ. ఆ కుశద్వీపంబు నరికట్టుకొని యుండు నెనిమిది లక్షల ఘనఘృతాబ్ధి;**
**యా ఘృతసాగరంబవ్వల షోడశలక్షయోజనముల లలిత మగుచు**

**నుండుఁగ్రౌంచద్వీప, ముర్వీశ! యందు మధ్యప్రదేశంబున నట్టి దీవి**
**పేరుగాఁదన పేరఁబెద్దగాఁజేసిన క్రౌంచాద్రి గల; దా నగంబు మున్ను**

**ఆ. షణ్ముఖుండు దివ్యశరమున ఘననితం, బంబు దూయ నేయఁబాలవెల్లి**
**గరిమఁదడుపుచుండు వరుణుండు రక్షింప, నందు మిగుల భయము నొందకుండె. 65**

**ప్రతి :** ఆ కుశద్వీపంబున్= ఆ కుశద్వీపాన్ని; ఎనిమిది లక్షల ఘనఘృత+అబ్ధి; ఎనిమిది లక్షల యోజనాల విస్తృతి గల నేతిసముద్రం; అరికట్టుకొనియుండున్= చుట్టుకొని ఉన్నది; ఆ ఘృతసాగరంబు+అవ్వల= ఆ నేతి సముద్రం ఆ వైపు; షోడశలక్షయోజనముల= పదునారు లక్షల యోజనాల విస్తృతిగల; క్రౌంచద్వీపము= క్రౌంచద్వీపం; లలితము+అగుచున్+ ఉండున్= లాలిత్యవంతమై ఉంటుంది; అందున్; మధ్యప్రదేశంబునన్= మధ్యభాగంలోనే; అట్టిదీవి పేరుగాన్= ఆ దీవి పేరుగానే; తనపేరన్= తన పేర; పెద్దగాన్ చేసిన= పెద్దదిగా ఒప్పారు; క్రౌంచ+అద్రి= క్రౌంచగిరి, కలదు; ఆ నగంబు= ఆ కొండ; మున్ను= మునుపు; షణ్ముఖుండు= ఆరుమొగాలు గల స్వామి; దివ్యశరమునన్= దివ్యమయిన బాణంతో; ఘననితంబంబు= గొప్పపిరుదును, దూయన్+ఏయన్= దూసుకొని పోవునట్లు ప్రయోగించగా; పాలవెల్లి= పాలసముద్రం; గరిమన్= గొప్పతనంతో; తడుపుచుండున్= వెలువడుతుంది; వరుణుండు= వరుణ భగవానుడు; రక్షింపన్= కాపాడగా; అందున్= అక్కడ; మిగుల భయమున్= ఎంతో భయాన్ని; ఒందకుండెన్= ఒందకుండగా కాపాడుతుంటాడని అన్వయం.

**తా :** ఆ కుశద్వీపం చుట్టూ ఎనిమిదిలక్షల యోజనాల వైశాల్యం కలిగిన నేతికడలి ఉన్నది. ఆ నేతికడలి ఆవల పదునారు లక్షల యోజనాల విస్తృతి కలిగిన అందమయిన క్రౌంచద్వీపం ఉన్నది. ఆ ద్వీపం మధ్యభాగంలోనే క్రౌంచాద్రి ఉన్నది. ఆ పర్వతం మూలంగానే ఆ ద్వీపానికి ఆ పేరు వచ్చింది. ఒకసారి ఆరు మొగాలుగల కుమారస్వామి దివ్యశరం ప్రయోగించగా అది ఆ క్రౌంచపర్వతానికి కన్నంవేస్తూ దూసుకుపోయింది. ఆ కన్నంగుండా పాలవెల్లి ప్రవాహం వెలువడినది. ఆ ప్రవాహమే ఆ క్రౌంచద్వీపాన్ని తడుపుతూ ఉంది. వరుణదేవుడు ఆ ప్రదేశాన్ని కాపాడుతూ ఏమాత్రం ఎవరికీ భయం లేకుండేటట్లు చూస్తుంటాడు.

**వ. నరేంద్రా! యా క్రౌంచద్వీపపతియగు ఘృతపృష్ఠుండు దన కుమారుల నాపేళ్ళు గల యామోద మధువహ మేఘపృష్ఠ సుదామ ఋషిజ్య లోహితార్ణ వనస్పతులను వర్షంబుల కభిషిక్తులం జేసి, పరమకల్యాణగుణ యుక్తుండయిన శ్రీహరి చరణారవిందంబుల సేవించుచుం దపంబునకుం జనియె, నా వర్షంబులయందు శుక్ల వర్ధమాన భోజనోపబర్హణానంద నందన సర్వతోభద్రంబులను సప్త సీమాపర్వతంబులును నభయయు నమృతౌఘయు నార్యకయుఁ దీర్ఘవతియుఁ, దృప్తిరూపయుఁ బవిత్రవతియు, శుక్లయు నను సప్తనదులును గల, వందుల పవిత్రోదకంబు లనుభవించుచు గురు ఋషభ ద్రవిణక దేవక సంజ్ఞలు గలిగి వరుణ దేవుని నుదకాంజలులం బూజించుచున్న చాతుర్వర్ణ్యంబుండు. 66**

**ప్రతి :** నర+ఇంద్రా!= ఓ రాజా!; ఆ క్రౌంచద్వీపపతి+అగు= ఆ క్రౌంచద్వీపానికి అధిపతి అయిన; ఘృతపృష్ఠుండు; తనకుమారుల్ని; ఆ పేళ్ళుగల= ఆ పేర్లతో వ్యవహరించే; ఆమోద; మధువహ; మేఘవృష్ఠ; సుదామ; ఋషిజ్య; లోహితార్ణ; వనస్పతులు+అను; వర్షంబులకున్= ఆమోదాది ఏడు భూభాగాలకు; అభిషిక్తులన్+చేసి= పట్టాభిషిక్తులనుజేసి; పరమకల్యాణ గుణయుక్తుండు+అయిన= గొప్పమంగళకరాలైన గుణాలతో కూడినట్టి; శ్రీహరిచరణ+అరవిందంబులన్= పద్మాలవంటి

శ్రీహరి పాదాలను; సేవించుచున్= కొలుస్తూ; తపంబునకున్= తపానికి; చనియెన్= వెళ్ళెను; ఆ వర్షంబుల+అందున్; శుక్ల; వర్ధమాన; భోజన+ఉపబర్హణ+ఆనంద నందన సర్వతోభద్రంబులు+అను= శుక్లాది నామంబులుగల; సప్తసీమాపర్వతంబులును= ఏడు పర్వతాలు హద్దుగాగల; అభయయున్= అభయ సంజ్ఞకమును; అమృత+ఓఘయున్= అమృతనామకమగు= ప్రవాహంగలదియు; ఆర్యకయున్= ఆర్యక అభిఖ్య కలదియు; తీర్థవతియున్= తీర్థవతి పేరు గలదియు; తృప్తిరూపమున్= తృప్తిరూప నామకమును; పవిత్రవతియున్= పవిత్రవతి పేరు కలదియు; శుక్లయున్+అను= శుక్ల అను పేరుగల; సప్తనదులును+కలవు= ఏడు నదులున్నాయి; అందుల= అక్కడి; పవిత్ర+ఉదకంబులు+అనుభవించుచున్= పవిత్రజలములను అనేక రీతుల వాడుకొనుచు; గురు; ఋషభ; ద్రవిణక; దేవక; సంజ్ఞలు+కలిగి= పేర్లు కలిగి; వరుణదేవునిన్; ఉదక+అంజలులన్= నీరు నించిన దోసిళ్ళతో; పూజించుచున్= పూజించే; చాతుర్వర్ణ్యంబు+ఉండున్= నాలుగు వర్ణములుంటాయి.

**తా :** నరేంద్రా! క్రౌంచ ద్వీపానికి అధిపతి ప్రియవ్రతుని కుమారుడైన ఘృతపృష్ఠుడు. అతనికి ఏడుగురు కొడుకులు. వారే ఆమోదుడు, మధువహుడు, మేఘపృష్ఠుడు, సుదాముడు, ఋషిజ్యుడు, లోహితార్ణుడు, వనస్పతి అనువారు. తన కుమారుల పేరుమీదుగా క్రౌంచ ద్వీపాన్ని ఘృతపృష్ఠుడు ఏడు వర్షాలుగా విభాగంచేసి ఒక్కొక్క భూమికి ఒక్కొక్క కుమారుని రాజుగా నియమించాడు. తాను మంగళగుణయుతుడయిన శ్రీహరి పాదపద్మాలను స్మరిస్తూ తపస్సు చేయడానికి వెళ్లాడు. ఆ క్రౌంచద్వీపంలోని ఏడు వర్షాలలో శుక్లం, వర్ధమానం, భోజనం, ఉపబర్హణం, ఆనందం, నందనం, సర్వతోభద్రం అనే ఏడుకొండలు, వరుసగా అభయ, అమృతోఘ, ఆర్యక, తీర్థవతి, తృప్తి, పవిత్రవతి, శుక్ల అనే ఏడు నదులూ ఉన్నాయి. ఆ నదీజలాలలో స్నానంచేసి గురువులు, ఋషభులు, ద్రవిణకులు, దేవకులులు అనే నాలుగు వర్ణాలవారు జలాంజలులు సమర్పిస్తూ వరుణదేవుని సేవిస్తుంటారు.

**సీ.** **జగతీశ! వినుము క్రౌంచద్వీపమును జుట్టి యుండు షోడశలక్షయోజనముల**
**విస్తారమై పాలవెల్లి, యందునను శాకద్వీప మతులప్రకాశ మొందు,**
**దండిమై ముప్పదిరెండు లక్షల యోజనముల విస్తారమై యమరియుండు,**
**నందుల శాకవృక్షామోద మా ద్వీపమును సుగంధంబునఁబెనఁగఁజేసి**

**తే.** **యంతఁదన పేర దీవి ప్రఖ్యాత మగుటఁ, జేసి యందుల మిగులఁబ్రసిద్ధి కెక్కె;**
**నందు మేధాతిథియుఁ గర్త యగుచునుండెఁ, దవిలి వేడుకఁదనదు నందనులఁజూచి.** **67**

**ప్రతి :** జగతీ+ఈశ= అన్ని జగాల కధిపతీ!; వినుము; క్రౌంచద్వీపాన్ని; చుట్టియుండు; షోడశలక్షయోజనముల= పదహారు లక్షల యోజనాల; విస్తారము+ఐ= విస్తృతి కలిగినదై; పాలవెల్లి= పాలసముద్రం; చుట్టి+ఉండున్= చుట్టి ఉన్నది; అందునను= ఆ పాలసముద్రంలో; శాకద్వీపము= శాకం అను పేరుగల ద్వీపం; అతులప్రకాశము+ఒందున్= సమృద్ధితో మిక్కిలి తేజోవంతమై ఉన్నది అది; దండిమైన్= దిట్టతనంతో; ముప్పది రెండు లక్షల యోజనముల; విస్తారము+ఐ= విస్తృతి కలదై; అమరి+ఉండున్= ఇమిడి ఉన్నది; అందులన్= అక్కడ; శాకవృక్ష+ఆమోదము= శాకమనే పేరుగల వృక్షముయొక్క పరిమళము; ఆ ద్వీపమును= ఆ ద్వీపాన్ని; సుగంధంబునన్= సువాసనతో; పెనఁగన్+చేసి= కూడియుండినట్లు చేసి; అంతన్= అంతట; తన పేరన్= తన పేరుతో; దీవి= ద్వీపము; ప్రఖ్యాతము+అగుటన్+చేసి= ప్రసిద్ధి పొందడంవలన;

అందులన్= అక్కడ; మిగులన్= మిక్కిలి; ప్రసిద్ధికిన్+ఎక్కెన్= విఖ్యాతమైయింది; అందున్= అక్కడ; మేధాతిథియున్= మేధాతిథి అనే పేరు కల్గిన ప్రియవ్రత నందనుడు; కర్త+అగుచున్+ఉండెన్; తవిలి= అనురాగబంధంతో; వేడుకన్= వేడ్కతో; తనదు= తనయొక్క నందనులన్+చూచి= కుమారులను కనుగొని...

**తా :** పరీక్షిన్నరేంద్రా! విను. క్రౌంచద్వీపం చుట్టూ పదహారు వేల యోజనాల విస్తృతిలో పాలసముద్రం ఉంది. ఆ పాల సముద్రంలో శాకద్వీపం ప్రసిద్ధి పొందిన ద్వీపం. ఆ ద్వీపం ముప్పదిరెండు లక్షల యోజనాల విస్తృతి కలిగింది. ఆ ద్వీపంలో ఒక పెద్ద శాకవృక్షం ఉన్నది. దాని సుగంధంవల్ల ఆ ద్వీపమంతా పరిమళవంతంగా ఉంటుంది. ఆ కారణంగానే ఆ ద్వీపానికి శాకద్వీపమని పేరు. ఆ ద్వీపానికి ప్రియవ్రత నందనుడయిన మేధాతిథి కర్త. అతడు తన పుత్రులను ప్రేమతో చూచి...

**వ. మఱియు నా ప్రియవ్రతపుత్త్రుం డయిన మేధాతిథి దన పుత్రుల పేరంగల పురోజన మనోజన వేపమాన ధూమ్రానీక చిత్రరథ బహురూప విశ్వచారములను సంజ్ఞలు గల సప్తవర్షంబులయందు వారలకుఁ బట్టంబు గట్టి శ్రీహరి పాదసేవ సేయుచుఁ దపోవనంబుకుఁ జనియె, నా శాకద్వీపంబునందు నీశానోరుశృంగ బలభద్ర శతకేసర సహస్రస్రోతో దేవపాల మహానస నామంబులు గల సీమాగిరులును, ననఘాయుర్ధోభయ సృష్ట్యపరాజిత పంచపరి సహస్రస్మృతి నిజధృతులను సప్తనదులును గల, వా నదీ జలంబు లుపయోగించి యచ్చటి వారలు ప్రాణాయామంబు సేసి విధ్వస్త రజస్తమోగుణులయి పరమ సమాధిని వాయురూపంబైన భగవంతుని సేవింతురు; ఋతవ్రత సత్యవ్రత దానవ్రత సువ్రత నామంబులుగల చాతుర్వర్ణ్యం బందుఁ గలిగియుండు. 68**

**ప్రతి :** మఱియున్= అంతేగాక; ఆ ప్రియవ్రతపుత్రుండు+అయిన; మేధాతిథి; తన పుత్రులపేరన్+కల= తన కుమారుల పేర్లతో వ్యవహరింపబడే; పురోజన; మనోజన; వేపమాన; ధూమ్రానీక; చిత్రరథ; బహురూప; విశ్వచారములు+అను= పురోజన మొదలయిన సంజ్ఞలు కల= పేర్లుగల; సప్తవర్షంబుల+అందువారలకున్= ఏడు భూభాగాలలో ఉన్నవారికి; పట్టంబున్+కట్టి= పట్టంకట్టి; శ్రీహరిపాదసేవ+చేయుచున్= శ్రీహరి పాదాలకు భక్తితో సేవచేస్తూ; తపోవనంబునకున్+ చనియెన్= వనభూములకు వెళ్లాడు; ఆ శాకద్వీపంబు+అందున్= ఆ శాకమనే పేరుగల దీవిలో; ఈశాన+ఉరుశృంగ; బలభద్ర; శతకేసర; సహస్రస్రోతస్; దేవపాల; మహానస నామంబులు+కల= ఈశానాది పేర్లుగల; సీమాగిరులును= హద్దుగాగల పర్వతాలను; అనఘ+ఆయుర్ద+ఉభయ సృష్టి+అపరాజిత; పంచపరి; సహస్రస్మృతి; నిజధృతులు+అను= అనఘాది పేర్లతో వ్యవహరింపబడే; సప్తనదులును+కలవు= ఏడు నదులున్నాయి; ఆ నదీజలంబులు= ఆ నదుల నీటిని; ఉపయోగించి= వాడుకొని; అచ్చటివారలు= ఆ నదీ తీరవాసులు; ప్రాణాయామంబు+చేసి= ప్రాణాయామం చేస్తూ; విధ్వస్తరజస్+తమస్+గుణులు+అయి= నశింపజేసుకొన్న రజోగుణం, తమోగుణం కలవారలయి; పరమసమాధిని= ఉత్కృష్ట సమాధి స్థితిలో; వాయురూపంబు+ఐన= వాయురూపుడయిన; భగవంతుని; సేవింతురు= సేవిస్తారు; ఋతవ్రత; సత్యవ్రత; దానవ్రత; సువ్రత; నామంబులు+కల= ఋతవ్రత మొదలయిన పేరులుగల; చాతుర్వర్ణ్యంబు+అందున్+ కలిగి+ఉండున్= నాలుగువర్ణాల వారున్నారు.

**తా :** మేధాతిథికి పురోజనుడు, మనోజనుడు, వేపమానుడు, ధూమ్రానీకుడు, చిత్రరథుడు, బహురూపుడు, విశ్వచారుడు అనే కొడుకులున్నారు. వారికి వారి పేర్లతో ప్రసిద్ధములయిన శాకద్వీపంలోని ఏడు భూభాగములు పంచియిచ్చి పట్టంగట్టి

మేధాతిథి శ్రీహరి పాదసేవచేస్తూ తపోవనానికి వెళ్ళాడు. ఆ ఏడు వర్షాలలో క్రమంగా ఈశానం, ఉరుశృంగం, బలభద్రం, శతకేసరం, సహస్రస్రోతం, దేవపాలం, మహానసం అనే సరిహద్దు పర్వతాలు, అనఘ, ఆయుర్ద, ఉభయస్పృష్టి, అపరాజిత, పంచపది, సహస్ర స్రుతి, నిజధృతి అనే ఏడునదులూ ఉన్నాయి. ఆ ద్వీపవాసులు ఆ నదీజలాలు సేవిస్తూ ప్రాణాయామం చేస్తూ రజోగుణ, తమోగుణాలను వశింపజేసుకొని సమాధినిష్ఠులయి వాయురూపుడయిన భగవంతుని ఆరాధిస్తారు. **అక్కడ ఋతవ్రతులు, సత్యవ్రతులు, దానవ్రతులు, సువ్రతులు అనే నాలుగు వర్ణాలవారున్నారు.**

**సీ. అట్టి శాకద్వీప మరికట్టి తత్ప్రమాణంబున దధిసముద్రంబు వెలుఁగు,**
**నందుకుఁబరివృతంబై పుష్కరద్వీప మిలఁజతుష్షష్టిలక్షల విశాల;**
**మ మ్మహాద్వీపమం దయుతకాంచనపత్త్రములు గల్గి కమలగర్భునకు నాస**
**నంబగు పంకేరుహంబుండు, నా ద్వీపమధ్యంబునను నొక్కమానసోత్త**

**ఆ. రం బనంగఁబర్వతం బుండుఁ; దనకుఁ బూ, ర్వాపరముల నుండునట్టి వర్ష**
**ములకు రెంటి కిట్లు నిలిచిన మర్యాద, నగ మనంగఁజాలఁబొగడ నెగడు. 69**

**ప్రతి :** అట్టి= అటువంటి; శాకద్వీపము+అరికట్టి= శాకద్వీపాన్ని చుట్టి; తత్+ప్రమాణంబునన్= అంతే పరిమాణంగల; దధిసముద్రంబు= పెరుగు కడలి; వెలుఁగున్= ప్రకాశిస్తుంది; అందుకున్= దానికి; పరివృతంబు+ఐ= చుట్టూ కూడినదై; పుష్కరద్వీపము= పుష్కరమనే పేరుగల ద్వీపం; ఇలన్= భూమిలో; చతుష్షష్టి లక్షల విశాలము= అరవైనాల్గు లక్షల యోజనాల విస్తారంకలది; ఆ+మహాద్వీపము+అందున్; అయుతకాంచన పత్రములు+కల్గి= పదివేల బంగారు రేకులు కలిగి; కమల గర్భునకున్= బ్రహ్మదేవునికి; ఆసనంబు+అగు= పీఠమయిన; పంకరుహంబు+ఉండున్= పద్మం ఉన్నది; ఆ ద్వీపమధ్యంబునను= ఆ దీవియొక్క నడుమ; ఒక్క; మానస+ఉత్తరంబు+అనన్+కన్= మానసోత్తరమని పిలువబడే; పర్వతంబున్= కొండ కలదు; చాలన్= మిక్కిలి; పొగడన్= పొగడ్తకు తగినదై; నెగడు= ఒప్పిదమైన; పూర్వ+అపరములన్= తూర్పు పడమరలలో; ఉండు+అట్టి= ఉన్నటువంటి; వర్షములకున్= భూభాగాలకు; రెంటికిన్= రెంటికి; ఇట్లు+నిలిచిన; మర్యాదనగము+అనంగన్= సరిహద్దు కొండయేమో అన్నట్లు; ఉండున్= ఉంటుంది.

**తా :** శాకద్వీపం చుట్టూ అంతే పరిమాణం కలిగిన దధిసముద్రం ఉంది. దాని చుట్టూ అరవై నాలుగు లక్షల యోజనాల విస్తారం కలిగిన పుష్కరద్వీపం ఉంది.ఆ మహాద్వీపంలో పదివేల బంగారు రేకులు కలిగి బ్రహ్మదేవుని ఆసనమయిన పద్మం ఉన్నది. ఈ ద్వీపం నడుమ మానసోత్తరమనే పెద్ద పర్వతం ఉంది. తూర్పు పడమరలలోగల వర్షాల రెండింటికి ఆ మానసోత్తరం సరిహద్దు కొండ.

**వ. ఇట్లు దనకు లోపలి వెలుపలి వర్షంబులు రెంటికి మర్యాదాచలంబునుంబోలె నున్న మానసోత్తర పర్వతం బయుత యోజన విస్తారంబును, నంతియ యౌన్నత్యంబును గలిగి యుండు, నా నగంబునకు నలుదిక్కులయందు నాలుగు లోకపాలుర పురంబు లుండు, నా మానసోత్తరపర్వతంబు తుద సూర్యరథ చక్రంబు సంవత్సరాత్మకంబయి యహోరాత్రంబులయందు మేరుప్రదక్షిణంబు సేయు, నందు నా పుష్కరద్వీపాధిపతి యగు వీతిహోత్రుండు రమణక ధాతకనామంబులు గల పుత్త్రుల నిరువుర**

**వర్షద్వయంబునందు నభిషిక్తులం జేసి తాను బూర్వజు లేగిన తెఱంగున భగవత్కర్మశీలుం డగుచుఁ దపంబునకుం జనియె; నంత 70**

**ప్రతి :** ఇట్లు+తనకున్; లోపలి వెలుపలి వర్షంబులు; రెంటికిన్= రెండింటికిని; మర్యాదా+అచలంబునున్+పోలెన్+ఉన్న= సరిహద్దు కొండయో అనేటట్లు; మానస+ఉత్తర పర్వతంబు= మానసోత్తరమనే పేరుగల కొండ; అయుత యోజన విస్తారంబును= పదివేల యోజనముల వైశాల్యమును; అంతియ= అంతే; ఔన్నత్యంబును+కలిగి+ఉండున్= ఎత్తూ కలిగి ఉన్నది; ఆ నగంబునకున్= ఆ పర్వతానికి; నలుదిక్కుల+అందున్; నాలుగు లోకపాలుర పురంబులు+ఉండున్; ఆ మానస+ఉత్తర పర్వతంబు తుదన్= ఆ మానసోత్తర పర్వతం చివర; సూర్యరథచక్రము= సంవత్సరాత్మకమయిన రవిరథచక్రం; అహోరాత్రంబుల+అందున్= రాత్రింబగళ్ళలో; మేరుప్రదక్షిణంబు+చేయున్= మేరువునకు ప్రదక్షిణం చేస్తుంటుంది; అందున్; ఆ పుష్కరద్వీప+అధిపతి+అగు= ఆ పుష్కరద్వీపంపై ఆధిపత్యం కలిగినటువంటి; వీతిహోత్రుండు; అగ్ని రమణక+ధాతక నామంబులు+కల= రమణకుడు, ధాతకుడు అను పేర్లు కలిగిన; పుత్రులన్+ఇరువురన్= కుమారుల నిద్దరిని; వర్షద్వయంబు+అందున్= రెండు భూభాగాలలో; అభిషిక్తులన్+చేసి= పట్టాభిషిక్తులను చేసి; తాను; పూర్వజులు+ఏగిన= అన్నలు చనినట్టి; తెఱంగునన్= విధమున; భగవత్ కర్మశీలుండు+అగుచున్= భగవంతుని సంప్రీతుణ్ణి చేసే కర్మలు ఆచరించే స్వభావం కలవాడై; తపంబునకున్+చనియెన్= తపస్సు చేయడానికి వెళ్లాడు; అంతన్= ఆ మీద.

**తా :** ఈ విధంగా లోపల వెలుపల ఉన్న వర్షాలకు సరిహద్దుగా ఉన్న మానసోత్తరపర్వతం పదివేల యోజనాల విస్తీర్ణమూ. అంతే ఎత్తూ కలది. ఆ పర్వతానికి నాలుగు దిక్కులలోనూ నలుగురు లోకపాలకుల పట్టణాలున్నాయి. ఆ మానసోత్తర పర్వతశిఖరాన సంవత్సరాత్మకమయిన సూర్యరథచక్రం తిరుగుతూ రాత్రింబగళ్ళు మేరువునకు ప్రదక్షిణం చేస్తున్నది. ఆ పుష్కరద్వీపాధిపతి వీతిహోత్రుడు. అతనికి రమణకుడు, ధాతకుడు అనువారు కుమారులు. వీతిహోత్రుడు పుష్కరద్వీపాన్ని రెండు వర్షాలుగా విభజించి, ఆ భూభాగాలకు తన కొడుకులను రాజులను చేశాడు. తన అన్నల అడుగుజాడలలో వీతిహోత్రుడు భగవత్ప్రీతికరాలైన కర్మలు ఆచరిస్తూ తపోవనానికి వెళ్ళిపోయాడు.

**క. మనుజేశ్వర! యా వర్షం, బున నప్పుడు సంచరించు పురుషులు పద్మా**
**సనుఁదగ సకర్మకారా, ధన సేయుదు రచలబుద్ధితాత్పర్యమునన్. 71**

**ప్రతి :** మనుజ+ఈశ్వర= నరులకు అధిపతి అయిన రాజా!; ఆ వర్షంబునన్, అప్పుడు; సంచరించు; పురుషులు; పద్మ+ఆసనున్= పద్మాన్ని ఆసనంగాగల బ్రహ్మను; తగన్; సకర్మక+ఆరాధన= కర్మలతో కూడిన పూజలను; అచల= నిశ్చలమయిన; బుద్ధి తాత్పర్యమునన్= బుద్ధియొక్క తత్పరతతో; చేయుదురు= కొనసాగిస్తారు.

**తా :** రాజా! ఈ పుష్కరద్వీపంలో సంచరించేవారు వేదోక్తకర్మలను ఆచరిస్తూ చతుర్ముఖుణ్ణి నిశ్చలమయిన బుద్ధిబలంతో, తత్పరతతో కొలుస్తుంటారు.

**క. ధరణీవల్లభ! విను పు, ష్కర మను ద్వీపమున లేరు చాతుర్వర్ణ్యుల్,**
**పరగఁగ భేదము లేకే, సరసత సము లగుదు రందు సకలజనంబుల్. 72**

**ప్రతి :** ధరణీవల్లభ= భూపతీ; విను= వినవయ్యా!; పుష్కరము+అను ద్వీపమునన్= పుష్కరం అను పేరుగల ద్వీపంలో; చాతుర్వర్ణ్యుల్= నాలుగు వర్ణాలవారు; లేరు; అందున్= ఆ పుష్కర ద్వీపంలో; సకల జనంబుల్= సమస్త జనులు;

పరఁగగన్= ఒప్పిదంగా; భేదములేక+ఏ= విభేదాలు లేకుండగా; సరసతన్= కలసిమెలసి; సములు+అగుదురు= సమభావంతో సంచరిస్తారు.

**తా :** ధరణీనాథా! పుష్కరమనే ద్వీపంలో నాలుగువర్ణాల విభాగం లేదు. అక్కడి వారందరూ భేదభావం లేకుండా సమభావంతో కలసిమెలసి సంచరిస్తారు.

**వ. మఱియు బుష్కరద్వీపంబు చతుష్షష్టి లక్షయోజన విస్తారంబైన శుద్ధోదక సముద్రముద్రితం బగుచుండు, నవ్వల లోకాలోక పర్వతంబుండు, శుద్ధోదక సముద్ర లోకాలోకపర్వతంబుల నడుమ రెండుకోట్ల యోజన విస్తారంబయిన నిర్జనభూమి దర్పణోదరసమానంబై దేవతావాసయోగ్యంబుగా నుండు, నా భూమిం జేరిన పదార్థంబు మరలఁ బొంద నశక్యంబుగ నుండు; నట మీఁద లోకాలోకపర్వతం బెనిమిది కోట్ల యోజనంబులు సువర్ణభూమియు సూర్యాదిధ్రువాంతంబు లగు జ్యోతిర్గణంబులు మధ్యంబున నుండుటం జేసి లోకాలోక పర్వతం బనందగి యుండుఁ; బంచాశత్కోటియోజన విస్తృతంబగు భూమండల మానంబునకుఁ దురీయాంశ ప్రమాణంబు గల యా లోకాలోకపర్వతంబు మీఁద నఖిల జగద్గురువగు బ్రహ్మచేతఁ జతుర్దిశలయందు ఋషభ పుష్కరచూడ వామ నాపరాజిత సంజ్ఞలు గల దిగ్గజంబులు నాలుగును లోకరక్షణార్థంబు నిర్మితంబై యుండు; మఱియును. 73**

**ప్రతి :** మఱియున్= ఇంతేగాక; పుష్కరద్వీపంబు= పుష్కరమనే పేరుగల ద్వీపం; చతుష్షష్టి లక్షయోజన విస్తారంబు+ఐన= అరవై నాలుగు లక్షల యోజనాల విస్తారంబుగలదయిన; శుద్ధ+ఉదక సముద్ర ముద్రితంబు+అగుచుండున్= పరిశుద్ధమయిన జలంతో నిండిన సముద్రం కలిగి ఉంటుంది; ఆ+వలన్= ఆ సముద్రానికి అవతల; లోక+ఆలోకపర్వతంబు+ఉండున్= లోకాలోక పర్వతముంది; శుద్ధోదక సముద్ర లోకాలోక పర్వంబులనడుమన్; రెండుకోట్ల యోజన విస్తారంబు+ఐన; నిర్జన= జనసంచారంలేనిభూమి; దర్పణ+ఉదర సమానంబు+ఐ= అద్దం మధ్యభాగంతో సమానమయిన దగుచు; దేవతావాస యోగ్యంబు+కాన్+ఉండున్= దేవతలు నివసించడానికి అనువైన ప్రదేశంగా ఉంటుంది; ఆ భూమికిన్+చేరిన= ఆ భూమిలో పడవేసిన; పదార్థంబు మరలన్= తిరిగి పొందన్; అశక్యంబు+కన్+ఉండున్= సాధ్యం కాకుండా ఉంటుంది; అట మీఁదన్= అటు తరువాత; లోకాలోక పర్వతంబు; ఎనిమిది కోట్ల యోజనంబులు; సువర్ణభూమియున్= బంగారు భూమిగా; సూర్య+ఆది ధ్రువ+అంతంబులు+అగు= సూర్యుని నుండి ధ్రువతార వరకు వ్యాపించిన; జ్యోతిర్+గణంబులు= జ్యోతిర్గణం; మధ్యంబునన్+ఉండుటన్+చేసి; మధ్య ఉన్నందువలన; లోకాలోక పర్వతంబు+అనన్+తగి+ఉండున్; పంచాశత్కోటి యోజన విస్తృతంబు+అగు= ఏబది కోట్ల యోజనాల విస్తృతి కలిగిన; భూమండల మానంబునకున్= భూమండలముయొక్క కొలతకు; తురీయ+అంశ ప్రమాణంబుగల= నాలుగవ వంతు ప్రమాణంగల; ఆ లోకాలోక పర్వతంబు మీఁదన్; అఖిల జగద్గురువు+అగు= సకల లోకగురువయిన; బ్రహ్మచేతన్; చతుర్+దిశల+అందున్= నాలుగు దిక్కులందు; ఋషభ; పుష్కరచూడ; వామన+అపరాజిత సంజ్ఞలుగల= ఋషభాది పేర్లుగల; దిక్+గజంబులు= దిగ్గజాలు; నాలుగును; లోకరక్షణ+అర్థంబు= జగాలను కాపాడుటకొరకై; నిర్మితంబు+ఐ+ఉండున్= నిలిపి ఉంచబడ్డాయి; మఱియును.

**తా :** ఆ పుష్కర ద్వీపం చుట్టూ అరవైనాలుగు లక్షల యోజనాల విస్తృతి కలిగి పరిశుద్ధమయిన జలంతో నిండిన సముద్రం ఉంది. ఆ సముద్రానికి ఆవల లోకాలోక పర్వతముంది. సముద్రానికీ, ఆ పర్వతానికీ మధ్యగల ప్రదేశం రెండుకోట్ల యోజనాల విస్తీర్ణం కలిగి ఉంటుంది. అక్కడ మానవ సంచారం లేదు. ఆ భూమి అద్దంలాగా స్వచ్ఛంగా నున్నగా

ఉంటుంది. అది దేవతలు నివసించడానికి అనువయిన ప్రదేశం. ఆ భూమిలో పడవేసిన పదార్థం మరల ఎంత ప్రయత్నించినా చేతికందదు. ఆపైన ఎనిమిది కోట్ల యోజనాల ప్రదేశం బంగారు భూమిలాగా ప్రకాశిస్తుంటుంది. సూర్యునినుండి ధ్రువతార వరకు వ్యాపించిన జ్యోతిర్గణం మధ్య ఉండడంవల్ల ఆ పర్వతానికి లోకాలోక పర్వతమనే పేరు సార్థకం అవుతున్నది. ఈ భూమండలమంతా యాభైకోట్ల యోజనాల విస్తృతి కలిగింది. అందులో నాల్గవవంతు లోకాలోక పర్వతం. ఆ పర్వతం మీద సకల లోకగురుడైన బ్రహ్మదేవుడు, ఋషభం, పుష్కర చూడం. వామనం, అపరాజితం అనే దిగ్గజాలను లోకరక్షణార్థం నిలిపి ఉంచాడు.

**సీ. తనదు విభూతులై తనరిన యా దేవబృందతేజశ్శౌర్యబృంహణార్థ**
**మై భగవంతుండు నాదిదేవుండును నైన జగద్గురుండచ్యుతుండు**
**సరిలేని ధర్మవిజ్ఞాన వైరాగ్యాదు లయిన విభూతుల నలరి యున్న**
**యట్టి విష్వక్సేనుఁడాదిగాఁగలుగు పార్షదులతోఁగూడి ప్రశస్తమైన**

**గీ. నిజవరాయుధ దోర్దండనిత్యసత్త్వుఁ, దగుచు నా పర్వతంబుపై నఖిలలోక**
**రక్షణార్థంబు కల్పపర్యంత మతఁడు, యోగమాయాపరీతుఁడై యొప్పుచుండు. 74**

**ప్రతి :** ఆ పర్వతంబుపైన్= ఆ లోకాలోక పర్వతంమీద; భగవంతుఁడున్; ఆదిదేవుండును+ఐన, జగద్గురుండు; అచ్యుతుండు= చ్యుతిలేని స్వామి; అఖిలలోక రక్షణ+అర్థంబు= సకల లోకాలను రక్షించడానికోసం; యోగమాయాపరీతుఁడు+ఐ= యోగమాయాసహితుడై; కల్పపర్యంతము= కల్పాంతందాకా; ఒప్పుచుండున్; తనదు= తనయొక్క; విభూతులు+ఐ= తనయొక్క వైభవ స్వరూపములై; తనరిన= ఒప్పిన; ఆ దేవబృంద= ఆ దేవతల సమూహమునకు; తేజస్+శౌర్య బృంహణ+ అర్థము+ఐ= తేజస్సు, పరాక్రమం విస్తరింప చేయడానికోసం; అతఁడు; ధర్మ, విజ్ఞాన, వైరాగ్య+ఆదులు+అయిన విభూతులన్= ధర్మం, జ్ఞానం, వైరాగ్యం అనే విభూతులతో; అలరి+ఉన్న+అట్టి= ప్రకాశించుచున్నట్టి; విష్వక్సేనుఁడు+ఆదిగాన్+కలుగు= విష్వక్సేనుడు మొదలుగాగల; పార్షదులతోన్+కూడి= పార్షదులతో చేరి; ప్రశస్తము+ఐన= శ్రేష్ఠమయిన; నిజ= తనయొక్క; వర= శ్రేష్ఠమయిన; ఆయుధ= ఆయుధములను; దోస్+దండ= భుజములపై ధరించి; నిత్యసత్త్వుఁడు+అగుచున్= శాశ్వతమైన శక్తిమంతుడవుతూ; ఒప్పుచుండున్= తేజరిల్లుచుండును.

**తా :** ఆ లోకాలోక పర్వతంమీద ఆదిదేవుడూ, జగద్గురుడూ, భగవంతుడూ అయిన శ్రీమన్నారాయణుడు లోకాలను రక్షించడంకోసం, యోగమాయాసహితుడై కల్పాంతంవరకూ ఉంటాడు. దేవతల సమూహమంతా శ్రీమన్నారాయణుని వైభవ స్వరూపమే, ఆ దేవతల తేజస్సు, పరాక్రమమూ విస్తరింపజేయడానికోసం విష్ణుభగవానుడు ధర్మం, జ్ఞానం, వైరాగ్యం అనే విభూతులతో ప్రకాశించే విష్వక్సేనుడు మొదలయిన పార్షదులతో కూడి చతుర్బాహువులలో శ్రేష్ఠమయిన ఆయుధాలు ధరించి ఆ పర్వతంమీద ప్రకాశిస్తాడు.

**విశే :** విష్వక్సేనుడు విష్ణుసేనాధిపతి. శైవంలో విఘ్నేశ్వరుని వంటివాడు. వైష్ణవులకు విఘ్ననివారకుడయిన స్వామి. సూత్రవతీదేవి విష్వక్సేనుని భార్య. 'సేన మొదలారి' అని వైష్ణవులు ఆయనను కీర్తిస్తారు. విష్వక్సేనుని ధ్యాన శ్లోకం –

**శ్లో. యస్యద్విరద వక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతమ్ ।**
**విఘ్నం నిఘ్నంతి సతతం విష్వక్సేనం తమాశ్రయే ॥**

**వ. ఇట్లు వివిధమంత్ర గోపనార్థం బా నగాగ్రంబున నున్న భగవంతుండు దక్క లోకాలోక పర్వతంబునకు నవ్వల నొరులకు సంచరింప నశక్యంబయి యుండు; బ్రహ్మాండంబునకు సూర్యుండు మధ్యగతుండై యుండ; నా సూర్యునకు నుభయ పక్షంబుల యందు నిరువదేనుకోట్ల యోజనపరిమాణంబున నండకటాహం బుండు; నట్టి సూర్యుని చేత నాకాశదిక్స్వర్గాపవర్గంబులును నరకంబులును నిర్ణయింపంబడు; దేవతిర్య ఙ్మనుష్య నాగ పక్షి తృణగుల్మలతాది సర్వజీవులకును సూర్యుండాత్మ యగుచు నుండు. 75**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; వివిధ మంత్రగోపన+అర్థంబు= వివిధ మంత్రాల రహస్య రక్షణార్థం; ఆ నగ+అగ్రంబునన్+ఉన్న= ఆ లోకాలోక పర్వత శిఖరాలనున్న; భగవంతుండు+తక్కన్= భగవానుడు తప్ప; లోక+ఆలోకపర్వతంబునకున్; ఆ+వలన్= అటువైపు; ఒరులకున్= ఇతరులకు; సంచరింపన్= తిరగటానికి; అశక్యంబు+అయి+ఉండున్= సాధ్యము కానిదై ఉంటుంది; బ్రహ్మ+అండంబునకున్; సూర్యుండు; మధ్యగతుండు+ఐ= మధ్యభాగంలో; ఉండును; ఆ సూర్యునకున్; ఉభయపక్షంబుల+ అందున్= ఇరువంకల; ఇరువది+ఏనుకోట్ల యోజనపరిమాణంబునన్= ఇరువదైదు కోట్ల యోజనాల పరిమాణంతో; అండకటాహంబు+ఉండున్= బ్రహ్మాండ కటాహం ఉంది; అట్టి సూర్యుని చేతన్; ఆకాశ దిక్ స్వర్గ అపవర్గంబులును= ఆకాశము దిక్కులు, స్వర్గనరకాలు, ముక్తిస్థానమును; నిర్ణయింపన్+పడున్= నిర్ణయింపబడుతుంది; దేవ= దేవతలకు; తిర్యక్= పశుపక్ష్యాదులకు; మనుష్య= మానవులకు; నాగ= సర్పాలకూ; పక్షి= పక్షులకు; తృణ= గడ్డి; గుల్మ= పొదలు; లతా+ఆది= తీగెలు మొదలయినవానికి; సర్వజీవులకును= సమస్త జీవరాసులకూ; సూర్యుండు= ఆత్మ+అగుచున్+ఉండున్= ఆత్మగా ఉంటుంది.

**తా :** ఆ లోకాలోక పర్వతంమీద భగవంతుడు వివిధ మంత్రాలను రహస్యంగా రక్షిస్తుంటాడు. ఆ భగవంతునికి తప్ప ఆ లోకాలోకపర్వతానికి ఆవల ఎవరికిగాని సంచరించడానికి శక్యంకాదు. బ్రహ్మాండానికి మధ్యభాగంలో సూర్యుడు ఉన్నాడు. ఆ సూర్యునికి ఇరువైపులా ఇరవైఅయిదు కోట్ల యోజనాలదూరంలో బ్రహ్మాండ కటాహం ఉంది. ఆ సూర్యభగవానుడే ఆకాశం, దిక్కులూ, స్వర్గనరకాలు, మోక్షం అనేవాటిని నిర్దేశిస్తాడు. దేవతలకూ, మనుష్యులకూ, జంతువులకూ, సర్పాలకూ, పక్షులకూ, గడ్డిపోచలకూ, తీగెలకూ, పొదలకూ, సర్వజీవరాసులకూ సూర్యుడే ఆత్మ.

**విశే :** లోకమంటే సూర్యకాంతిగల దేశం. అలోకం అంటే సూర్యకాంతి లేని దేశం.

**క. కరమనురాగంబున నీ, ధరణీమండలముసంవిధానంబెల్లన్**
**నరవర! యెఱుఁగంజెప్పితి, మఱి చెప్పెద వినుము దివ్యమానమ్మెల్లన్. 76**

**ప్రతి :** నరవర= నరులలో శ్రేష్ఠుడయినవాడా!; కరము= మిక్కిలి; అనురాగంబునన్= ప్రేమతో; ఈ ధరణీ మండలాలు; సంవిధానంబు+ఎల్లన్= ఈ భూమండలానికి సంబంధించిన విశేషాలన్నీ; ఎఱుఁగన్+చెప్పితిన్= తెలియజేశాను; మఱి= ఆపై; దివ్యమానమ్ము+ఎల్లన్= దివ్యమానాన్ని అంతనూ; చెప్పెదన్= చెప్పెదను; వినుము= ఆలకింపుము.

**తా :** ఓ రాజా! నీవంటే నాకున్న ప్రీతి కారణంగా భూమండల నిర్మాణానికి సంబంధించిన విశేషాలన్నీ తెలియజేశాను. ఇంతేకాదు. ఇపుడు నీకు దివ్యమానాన్నంతా కూడా చెబుతాను. విను.

## a⸺భగణ విషయము⸺a

**ఆ. కమలజాండమధ్యగతుఁడైన సూర్యుండు, భరితమైన యాతపంబుచేత**
**మూఁడు లోకములను ముంచి తపింపంగఁ, జేసి కాంతి నొందఁజేయుచుండు. 77**

**ప్రతి :** కమలజ+అండమధ్యగతుఁడు+ఐన= బ్రహ్మాండం మధ్యభాగాన్ని చేరినవాడైన; సూర్యుండు= భాస్కరుడు; భరితము+ఐన= నిండినదైన; ఆతపంబు చేతన్= వేడిమి కారణంగా; మూఁడు లోకాలను; ముంచి; తపింపంగన్+చేసి; కాంతిన్+ఒందన్+చేయుచున్+ఉండున్= కాంతి ప్రకాశించే విధంగా చేస్తూ ఉంటుంది.

**తా :** బ్రహ్మాండం మధ్యలో ప్రకాశించే సూర్యుడు తన వెలుగుతో, వేడిమితో ముల్లోకాలనూ ముంచెత్తుతూ ప్రకాశింపజేస్తాడు.

**వ. అట్టి భాస్కరుం డుత్తరాయణ దక్షిణాయన విషువులను నామంబులు గల మాంద్య తీవ్ర సమానగతుల నారోహణావరోహణస్థానంబులయందు దీర్ఘహ్రస్వసమానంబులుగాఁజేయుచుండు. 78**

**ప్రతి :** అట్టి; భాస్కరుండు= సూర్యుడు; ఉత్తరాయణ, దక్షిణాయన; విషువులు+అను; నామంబులు+కల; మాంద్య, తీవ్ర, సమానగతులన్= మందకొడి, తీవ్రత్వం, సమానమనే సంచారాలను; ఆరోహణ, అవరోహణ= ఎక్కటం, దిగటంఅనే; స్థానంబుల+అందున్= స్థానాలలో; దీర్ఘ హ్రస్వ సమానంబులు+కాన్= దీర్ఘములుగా హ్రస్వములుగా, సమానములుగా; చేయుచున్+ఉండున్.

**తా :** సూర్యునికి ఉత్తరాయణం, దక్షిణాయనం, విషువత్తులనే మూడు గమనాలు ఉన్నాయి. ఉత్తరాయణంలో ఆగమనం మందకొడిగా, దక్షిణాయనంలో తీవ్రంగా, విషువత్తులలో సమానంగా ఉంటుంది. సూర్యుని ఈ మూడు గమనాలను అనుసరించి ఆరోహణ, అవరోహణ సమస్థానాలలో రాత్రింబవళ్ళు దీర్ఘాలుగా హ్రస్వాలుగా సమానాలుగా మారుతుంటాయి.

**విశే :** రాత్రి, పగలు సమానంగా ఉన్న దినాలకు విషువు / విషువత్తులు అని పేరు= మేష, తుల సంక్రమణములు.

**ఆ. మేషతులలయందు మిహిరుం డహోరాత్రు, లందుఁదిరుగు సమవిహారములను,**
**బరఁగఁగ వృషభాదిపంచరాసులను, నొక్కొక్క గడియ రాత్రి దక్కి నడచు. 79**

**ప్రతి :** మేషతులల+అందున్= మేషరాశిలోనూ, తులారాశిలోనూ; మిహిరుండు= సూర్యుండు; అహోరాత్రులు+అందున్= పగలు, రాత్రులలో; సమవిహారములను= సమగమనంతో; తిరుగున్= తిరుగుతాడు; వృషభ+ఆది+పంచరాసులను= వృషభం, మిథునం, కర్కాటకం, సింహం, కన్యా రాసులందు; ఒక్కొక్కగడియ; రాత్రి; దక్కి= తగ్గుతూ; నడచున్= నడచును.

**తా :** మేషరాశిలోనూ, తులారాశిలోనూ సూర్యుడు సంచరించేవేళ పగలు, రాత్రి సమానంగా ఉంటాయి. వృషభం, మిథునం, కర్కాటకం, సింహం, కన్య ఈ ఐదు రాసులలో సంచరించే సమయాలలో ఒక్కొక్క గడియ ప్రకారం రాత్రి కాలం తగ్గుతూ వస్తుంది. పగలు పెరుగుతూ ఉంటుంది.

**ఆ. మించి వృశ్చికాదిపంచరాసులను నొ, క్కొక్క గడియ రాత్రి నిక్కి నడచు,**
**దివములందు నెల్ల దిగజాఱు నొక్కొక్క, గడియ నెలకుఁదత్ప్రకారమునను. 80**

ప్రతి : మించి= అతిశయించి; వృశ్చిక+ఆది పంచరాసులను= వృశ్చికం, ధనుస్సు, మకరం, కుంభం, మీనం అనే ఐదు రాసులలోను సూర్యుడు ఉండగా; ఒక్కొక్క గడియ; రాత్రి= రాత్రి; నిక్కి నడచున్= పెరుగుతుంది; దివములందున్+ఎల్లన్= పగటి వేళలందు; ఒక్కొక్క గడియ; నెలకున్= మాసమునకు; తత్+ప్రకారమునను= అదేప్రకారం; దిగజాఱున్= తగ్గిపోతుంది.

తా : ఆలాగే సూర్యుడు వృశ్చికం, ధనుస్సు, మకరం, కుంభం, మీనం అనే ఐదు రాసులలో ఉన్నప్పుడు ఒక్కొక్క గడియ ప్రకారం రాత్రి పెరుగుతుంటుంది. పగటికాలం తగ్గిపోతుంది.

**వ. మఱియు ని వ్విధంబున దివసంబు లుత్తరాయణ దక్షిణాయనంబుల వృద్ధిక్షయంబుల నొంద నొక్క యహోరాత్రంబున నేకపంచాశదుత్తర నవకోటియోజనంబుల పరిమాణంబు గల మానసోత్తర పర్వతంబునందుఁ సూర్యరథంబు దిరుగుచుండు ఆ మానసోత్తర పర్వతంబునందు దూర్పున దేవధాని యను నింద్రపురంబును, దక్షిణంబున సంయమని యను యమనగరంబును, బశ్చిమంబున నిమ్లోచని యను వరుణ పట్టణంబును, నుత్తరంబున విభావరి యను సోముని పుటభేదనంబును దేజరిల్లుచుండు; నా పట్టణంబుల యందు నుదయ మధ్యాహ్నాస్తమయనిశీథంబు లనియెడు కాలభేదంబులను భూతప్రవృత్తి నివృత్తి నిమిత్తం బచ్చటి జనులకుఁ బుట్టించుచుండు, సూర్యుం డెపుడింద్ర నగరంబున నుండి గమనించు నది యాదిగాఁ బదియేను గడియలను రెండుకోట్ల ముప్పదియేడు లక్షల డెబ్బదియైదువేల యోజనంబులు నడుచు, ని వ్విధంబున నింద్ర యమ వరుణ సోమపురంబుల మీఁదఁ జంద్రాది గ్రహ నక్షత్రంబులంగూడి సంచరించుచుఁ బంద్రెండంచులు, నాఱు కమ్ములును, మూడుఁ దొలులుం గలిగి సంవత్సరాత్మకంబయి యేకచక్రం బయిన సూర్యుని రథంబు ముహూర్తమాత్రంబున ముప్పదినాలుగులక్షలయెనమన్నూఱు యోజనంబులు సంచరించు. 81**

ప్రతి : మఱియున్= అంతేగాక; ఈ విధంబునన్; దివసంబులు= పగళ్ళు; ఉత్తరాయణ దక్షిణాయనంబులన్; వృద్ధి క్షయంబులన్+ఒందన్= పెరుగుదల, తగ్గుదలలు ఒందగా; ఒక్క అహోరాత్రంబునన్= ఒక పగలు, రాత్రి పరిమితితో; ఏకపంచాశత్+ఉత్తర నవకోటి యోజనంబుల పరిమాణంబు+కల= తొమ్మిది కోట్ల యాభై ఒక్క లక్షల యోజనాల దూరముగల; మానస+ఉత్తర పర్వతంబు+అందున్= మానసోత్తర పర్వతమందు; సూర్యరథంబు= సూర్యుని రథము; తిరుగుచుండు= తిరుగుతూ ఉంటుంది; ఆ మానస+ఉత్తర పర్వతంబు+అందు= ఆ మానసోత్తర పర్వతములో తూర్పునన్; దేవధాని అను; ఇంద్రపురంబును; దక్షిణంబునన్= దక్షిణంవైపు; సంయమని+అను యమనగరంబును= సంయమని పేరుగల యముని పత్తనంబును; పశ్చిమంబునన్; నిమ్లోచని+అను; వరుణ పట్టణంబును; ఉత్తరంబునన్; విభావరి+అను; సోముని= చంద్రుని; పుట భేదనంబును= పట్టణాన్ని; తేజరిల్లుచుండున్= ప్రకాశిస్తూ ఉంటుంది; ఆ పట్టణంబుల+అందున్; ఉదయ= ప్రాతఃకాలం; మధ్యాహ్న+అస్తమయ= మిట్ట మధ్యాహ్నం, అస్తమయం; నిశీథంబులు+అనియెడు= రాత్రులు అనెడు, కాలభేదంబులను; భూతప్రవృత్తి నివృత్తి నిమిత్తంబు= ఆయా జీవుల ప్రవృత్తి నివృత్తుల కారణంగా; అచ్చటి జనులకున్; పుట్టించుచుండున్= కల్గించును; సూర్యుండు; ఎపుడు; ఇంద్రనగరంబుననుండి= ఇంద్రుని పట్టణమైన అమరావతి నుండి; గమనించున్= పయనమగునో; అది+ఆది+కాన్= అప్పటినుండి; పదియేను గడియలను= 15 గడియలలో; రెండు కోట్ల ముప్పది యేడులక్షల డెబ్బది యైదు వేల యోజనంబులు; నడచున్= అతిక్రమించును; ఈ విధంబునన్= ఈ రకంగా; ఇంద్ర యమ వరుణ సోమపురంబులమీఁదన్= అమరావతి, సంయమని, నిమ్లోచని, విభావరి పట్టణాలమీద;

చంద్ర+ఆది గ్రహ నక్షత్రంబులన్+ కూడి; సంచరించుచున్= పయనం చేస్తూ; పంద్రెండు అంచులు= పంద్రెండు ఆకులు; ఆఱు కమ్ములును; మూఁడు తొలులున్= మూడుకుండలు (నాభి ప్రదేశాలు) కలిగి; సంవత్సర+ఆత్మకంబు+అయి; ఏకచక్రంబు+అయిన= ఒకే చక్రంగల; సూర్యుని రథంబు; ముహూర్తమాత్రంబునన్= ఒక ముహూర్తకాలంలో; ముప్పది నాలుగు లక్షల ఎనమన్నూఱు యోజనంబులు; సంచరించున్= సంచరిస్తుంది.

**తా :** ఈ ప్రకారంగా అహోరాత్రాలను ఉత్తరాయణ, దక్షిణాయనాలలో పెంచుతూ తగ్గించుచూ ఒక్కొక్క దినంలో తొమ్మిదికోట్ల యాభై ఒక్క లక్షల యోజనాల పరిమాణం కలిగిన దూరం మానసోత్తర పర్వతం పలువైపులా సూర్యరథం తిరుగుతుంటుంది. ఆ పర్వతం తూర్పున దేవధాని అనే ఇంద్రుని పట్టణం. దక్షిణంలో సంయమని అనే యముని పట్టణం, పశ్చిమంలో నిమ్లోచని అనే వరుణుని పట్టణం, ఉత్తరంలో విభావరి అనే సోముని పట్టణం ఉన్నాయి. ఈ నాలుగు పట్టణాలలోనూ సూర్యుడు క్రమంగా ఉదయం, మధ్యాహ్నం, అస్తమయం, అర్ధరాత్రం అనే కాలభేదాలను కల్పిస్తుంటాడు. ఈ ఉదయాదులు అచ్చటి జీవుల ప్రవృత్తినివృత్తులకు కారణాలవుతుంటాయి. సూర్యుడు ఇంద్రనగరం నుండి పయనించేటప్పుడు పదునైదు గడియలలో రెండుకోట్ల ముప్పది ఏడు లక్షల డెబ్బది ఐదువేల యోజనాలు అతిక్రమించి యమనగరానికీ, ఇదేవిధంగా అక్కడనుంచి వరుణ, సోమ నగరాలకూ, చంద్రాది గ్రహాలతో నక్షత్రాలతో సంచరిస్తాడు. పన్నెండు ఆకులూ, ఆరు కమ్ములూ, మూడు కుండలు (నాభి ప్రదేశాలు) కలిగి ఏకచక్రంతో కూడి సంవత్సరాత్మకమైన సూర్యునిరథం ఒక ముహూర్తకాలంలో ముప్పది నాలుగు లక్షల ఎనిమిది వందల యోజనాలు ప్రయాణం చేస్తుంది.

**విశే :** సూర్యుని రథం వేదాత్మకం. ఇరుసునకు అమర్చబడిన సూర్యుని రథం **'తైలయంత్రచక్రవత్'** 21-13 తిరుగుతుందని మూలంలో వర్ణన. మూలంలో ఇంద్రనగరం పేరు దేవధాని. సూర్యుడు నెలకు ఒక్కొక్క గడియ= 24 నిమిషాల చొప్పున సమయం పెరగగా రాసులలో సంచరిస్తాడు. 'దేవధాని' నే 'అమరావతి' అనికూడ అంటారు.

**సీ.** **ఇనురథంబున నున్న యిరుసొక్కటియ మేరు శిఖరంబునందును జేరియుండు;**
**నొనరఁజక్రము మానసోత్తరపర్వతం బందులఁదిరిగెడు నా రథంబు**
**నిరుసున నున్న రెం డిరుసులు దగులంగఁ బవనపాశంబుల బద్ధ మగుచు**
**ధ్రువమండలంబునందుల నంటి యుండఁగా సంచరించుచునుండు సంతతంబు;**

**గీ.** **నట్టి యరదంబు ముప్పది యాఱులక్ష, లందు నంటిన కాఁడియు నన్ని యోజ**
**నముల విస్తారమై తురంగముల కంధ, రములఁదగులుచు వెలుఁగొందు రమణతోడ. 82**

**ప్రతి :** ఇనురథంబునన్+ఉన్న= సూర్యరథమునకున్న; ఇరుసు+ఒక్కటి+అ= ఒక్క ఇరుసు; మేరుశిఖరంబు+అందును= మేరుపర్వత శిఖరం పైన; చేరి+ఉండున్; చక్రము= సూర్యరథ చక్రం; ఒనరన్= ఒప్పుగా; మానస+ఉత్తర పర్వతంబు+ అందులన్= మానసోత్తర పర్వతంపైన; తిరిగెడున్= పరిభ్రమిస్తుంది; ఆ రథంబు= ఆ సూర్యరథంయొక్క; ఇరుసునన్+ఉన్న= ఇరుసులో వున్న; రెండు+ఇరుసులు+తగులంగన్= రెండిరుసులును కలిపి; పవన పాశంబులన్= వాయుపాశాలతో; బద్ధము+అగుచున్= కట్టబడుచు; ధ్రువమండలంబు+అందులన్= ధ్రువలోకానికి; అంటియుండన్+కాన్= అంటుకొనివుండి; సంతతంబున్= ఎల్లప్పుడు; సంచరించుచున్+ఉండున్; అట్టి+అరదంబు= అట్టి రథం; ముప్పదియాఱు లక్షలు+అందున్; అంటిన+కాఁడియున్; 36 లక్షల యోజనాల పొడవుగల కాడియు; అన్ని యోజనముల విస్తారము+ఐ; తురంగముల= గుర్రాల; కంధరములన్= మెడలను; తగులుచున్= మోపబడుచు; రమణతోడన్; వెలుఁగొందున్= ప్రకాశిస్తుంది.

**తా :** సూర్యరథ చక్రానికి ఒక ఇరుసు అమర్చబడి ఉన్నది. ఆ ఇరుసు మేరుపర్వతంలో చేరిఉంటుంది. దానిచక్రం మానసోత్తరపర్వతంపై తిరుగుతుంది. రథం ఇరుసలో వున్న ఇరుసులు రెండూ వాయుపాశాలతో గట్టిగా బిగింపబడి ఉన్నాయి. ఇవి ధ్రువమండలాన్ని అంటుకొని సంచరిస్తూవుంటాయి. అటువంటి సూర్యరథానికి అమర్చబడిన కాడి ముప్పయి ఆరు లక్షల యోజనాల పొడవు ఉంటుంది. ఆ కాడి సూర్యరథానికి కట్టిన గుర్రాల మెడలపై మోపబడి ఉంటుంది.

**వ. ఆ రథంబునకు గాయత్రీచ్ఛందం బాదిగా సప్తచ్ఛందంబులు నశ్వంబులై సంచరించు, భాస్కరునకు నగ్రభాగంబున నరుణుండు నియుక్తుండై రథంబు గడపుచుండు; వెండియు నంగుష్ఠపర్వమాత్ర శరీరంబులు గల యఱువదివేల వాలఖిల్యాఖ్యులగు ఋషివరులు సూర్యుని ముందట సౌరసూక్తంబుల స్తుతియింప, మఱియు ననేక మునులును గంధర్వ కిన్నర కింపురుష నాగాప్సరః పతంగాదులును నెలనెల వరుసక్రమంబున సేవింపం దొమ్మిదికోట్లు నేఁబదియొక లక్షయోజనంబుల పరిమాణంబు గల భూమండలంబునందొక క్షణంబున సూర్యుండు రెండువేల యేఁబది యోజనంబులు సంచరించుచు, నొక యహోరాత్రంబునందె యీ భూమండలంబంతయు సంచరించు, ననిన శుకయోగీంద్రునకుఁబరీక్షిన్నరేంద్రుం డిట్లనియె. 83**

**ప్రతి :** ఆ రథంబునకున్= ఆ సూర్యరథానికి; గాయత్రీ+ఛందంబు+ఆది+కాన్= గాయత్రి ఛందంబు మొదలుగా; సప్త+ఛందంబులు= ఏడు ఛందోరీతులును; అశ్వంబులు+ఐ= గుర్రములయి; సంచరించున్; భాస్కరునకున్= సూర్యునికి; అగ్రభాగంబునన్= ముందుభాగంలో; అరుణుండు= అనూరుడయిన అరుణవర్ణుడు; నియుక్తుండు+ఐ= నియమింపబడినవాడై; రథంబున్= అరదాన్ని; కడపుచున్+ఉండున్= నడిపిస్తూ ఉంటాడు; వెండియున్= అంతేగాక; అంగుష్ఠ పర్వమాత్ర శరీరంబులు+కల= బొటనవ్రేలంత దేహంగల; అఱువదివేల వాలఖిల్య+ఆఖ్యులు+అగు= అరవై వేల వాలఖిల్యులనే పేరుకల్గిన; ఋషివరులు= శ్రేష్ఠులయిన ఋషులు; సూర్యుని ముందటన్; సౌరసూక్తంబులన్ స్తుతియింపన్= సూర్య సంబంధి సూక్తాలతో నుతియించుచుండగా; మఱియును; అనేక మునులును; గంధర్వ, కిన్నర, కింపురుష, నాగ, అప్సరస్+పతంగ+ఆదులును= గంధర్వులు, గరుడులు మున్నగు దేవతానీకం; నెలనెల వరుసక్రమంబునన్; సేవింపన్= కొలువగా; తొమ్మిదికోట్లు నేఁబది యొక లక్షయోజనంబుల పరిమాణంబు+కల= భూమండలంబు+అందున్; ఒక క్షణంబునన్; సూర్యుండు; రెండువేల యేబది యోజనంబులు; సంచరించుచున్; ఒక+అహోరాత్రంబునందు+ఎ= ఒక పగలు రాత్రియందే; ఈ భూమండలంబు+అంతయున్; సంచరించున్= సంచరించును; అనినన్= అని చెప్పగా; శుకయోగి+ఇంద్రునకున్= యోగులలో శ్రేష్ఠుడయిన శుకునితో; పరీక్షిత్+నర+ఇంద్రుండు= నరులలో సర్వశ్రేష్ఠుడయిన పరీక్షిత్తు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** ఆ సూర్య రథానికి గాయత్రి, బృహతి, ఉష్ణిక్, జగతి, త్రిష్టుప్, అనుష్టుప్, పంక్తి అనబడే ఏడు ఛందస్సులు గుర్రాలుగా ఉన్నాయి. సూర్యునికి అరుణుడు సారథి. అతడు సూర్యుని ముందుభాగంలో కూర్చుండి రథాన్ని నడుపుతుంటాడు. బొటనవ్రేలి కణుపు పరిమాణ దేహం కలిగిన వాలఖిల్యులనే ఋషిపుంగవులు అరవై వేలమంది జ్యోతిర్మయ స్వరూపాలు ధరించినవారు సూర్యునికి ముందుండి సౌరసూక్తాలతో స్తోత్రం చేస్తుంటారు. ఎందరో మునులు, గంధర్వులు, కింపురుషులు, నాగులు, అప్సరసలు, గరుడులు మొదలయిన వారు క్రమం తప్పకుండా నెల నెలా వంతులవారీగా సూర్యుణ్ణి సేవిస్తుంటారు. తొమ్మిది కోట్ల యాభై ఒక్క లక్షల యోజనాల పరిమాణం కలిగిన భూమండలం చుట్టూ సూర్యుడు క్షణానికి రెండువేల

యాభై యోజనాల చొప్పున అహోరాత్రంలో భూమండలమంతా సంచరిస్తుంటాడు అని చెప్పిన శుకయోగీంద్రుని చూచి పరీక్షిత్తు ఈ విధంగా ప్రశ్నించాడు.

**క. మునివర! మేరుధ్రువులకు, నొనరఁ బ్రదక్షిణము దిరుగుచుండెడు నజుఁ డా**
**యినుఁడభిముఖుఁడై రాసుల, కనుకూలత నేగునంటి; వది యెట్లొప్పున్? 84**

**ప్రతి :** మునివర= మునులలో శ్రేష్ఠుడయినవాడా!; మేరుధ్రువులకున్= మేరువునకు, ధ్రువునకు; ఒనరన్= తగినట్లు; ప్రదక్షిణము= ప్రదక్షిణం; తిరుగుచున్+ఉండెడి= తిరుగుతూ ఉండే; అజుఁడు= బ్రహ్మ స్వరూపుడయిన; ఆ+ఇనుఁడు= ఆ సూర్యుడు; అభిముఖుఁడు+ఐ= పన్నెండు రాసులలో ఎదురుగా నిలబడినవాడై; రాసులకున్; అనుకూలతన్= అనుకూలంగా; ఏగున్+అంటివి= వెళతాడని అన్నావు; అది+ఎట్లు+ఒప్పున్= అదెలా పొసగుతుంది?

**తా :** మునీంద్రా! సూర్యుడు మేరువుకూ, ధ్రువునికీ ప్రదక్షిణంగా తిరుగుతుంటాడని చెప్పావు గదా! బ్రహ్మ స్వరూపుడయిన సూర్యుడు పన్నెండు రాసులలోనూ అభిముఖుడై తిరుగుతాడని కూడా అన్నావు. ఇది ఎలా పొసగుతుంది? నా సందేహాన్ని తీర్చు.

**క. అని పలికిన భూవరునిం, గనుఁగొని శుకయోగి మిగులఁగరుణాన్వితుఁడై**
**మనమున శ్రీహరిఁదలఁచుచు, విను మని క్రమ్మఱఁగ నిట్లు వినిపించెఁదగన్. 85**

**ప్రతి :** అని= ఈ విధంగా; పలికిన= మాటలాడిన; భూవరునిన్+కనుఁగొని= రాజును; శుకయోగి; మిగులన్= మిక్కిలి; కరుణా+అన్వితుఁడు+ఐ= దయగలవాడై; మనమునన్; శ్రీహరిన్ తలఁచుచున్; వినుము+అని= ఆలకించుమని; క్రమ్మఱఁగన్+మరల; ఇట్లు; తగన్= తగిన రీతిలో; వినిపించెన్.

**తా :** పరీక్షిత్తు కుతూహలంతో కూడిన సందేహాన్ని విన్న శుకయోగి ఒకమారు కళ్ళు మూసుకొని శ్రీహరిని తలచుకొని ఈ విధంగా సమాధానం చెప్పాడు.

**వ. నరేంద్రా! యతివేగంబునం దిరుగుచుండు కులాల చక్రంబునందుఁ జక్రభ్రమణంబునకు వేఱైన గతి నొంది బంతిసాగి తిరిగెడు పిపీలికాదుల చందంబున నక్షత్రరాసులతోడం గూడిన కాలచక్రంబు ధ్రువమేరువులం బ్రదక్షిణంబు దిరుగునపు డా కాలచక్రంబు వెంట సంచరించు సూర్యాదిగ్రహంబులకు నక్షత్రాంతరంబులయందును రాశ్యంతరంబులయందును నునికి గలుగుటం జేసి సూర్యాది గ్రహంబులకుఁ జక్రగతి స్వగతులవలన గతిద్వయంబు గలుగుచుండు; మఱియు నా సూర్యుండాదినారాయణమూర్తి యగుచు లోకంబుల యోగక్షేమంబులకు వేదత్రయాత్మకంబై కర్మసిద్ధి నిమిత్తంబై దేవర్షి గణంబులచే వేదాంతార్థంబుల ననవరతంబు వితర్క్యమానం బగుచున్న తన స్వరూపంబును ద్వాదశవిధంబులుగ విభజించి వసంతాది ఋతువుల నా యా కాలవిశేషంబులయందుఁ గలుగఁ జేయుచుండు; నట్టి పరమపురుషుని మహిమ నీ లోకంబున మహాత్ములగు పురుషులు దమ తమ వర్ణాశ్రమాచారంబుల చొప్పున వేదోక్త ప్రకారంబుగా భక్త్యతిశయంబున నారాధించుచు క్షేమంబు నొందుచుండు; రట్టి యాదినారాయణమూర్తి జ్యోతిశ్చక్రాంతర్వర్తియై స్వకీయతేజః పుంజదీపితాఖిల జ్యోతిర్గణంబులు గలవాఁడై ద్వాదశరాసులయందు**

**నొక సంవత్సరంబున సంచరించుచుండు; నట్టి యాదిపురుషుని గమన విశేషకాలంబును లోకు లయన ఋతు మాస పక్ష తిథ్యాదులచే వ్యవహరించు చుందురు; మఱియు నప్పరమపురుషుం డా రాసులయందు షష్ఠాంశసంచారంబు నొందిన సమయంబును ఋతువని వ్యవహరింపుదు; రా రాసులయందు నర్ధాంశ సంచారమ్మున రాశిషట్క భోగం బొందిన తఱి యయనం బని చెప్పుదురు; సమగ్రంబుగా రాసుల యందు సంచార మొందినయెడల నట్టి కాలంబును సంవత్సరం బని నిర్ణయింపుదు; రిట్టి సమగ్రరాశి సంచారంబునందు శీఘ్రగతి మందగతి సమగతు లనియెడు త్రివిధగతి విశేషంబుల వలన వేఱుపడెడు నా వత్సరంబును సంవత్సరంబు పరివత్సరం బిడావత్సరం బనువత్సరం బిద్వత్సరంబని బంచవిధంబులఁ జెప్పుదురు, చంద్రుండు నీ తెఱంగున నా సూర్యమండలంబు మీఁద లక్షయోజనంబుల నుండి సంవత్సర పక్ష రాశి నక్షత్ర భుక్తులు గ్రహించుచు నగ్రచారియై శీఘ్రగతిం జరించునంత వృద్ధిక్షయ రూపంబునం బితృగణంబులకుఁ బూర్వపక్షాపరపక్షంబులచే నహోరాత్రంబుఁ గలుగఁ జేయుచు సకల జీవ ప్రాణంబై యొక్క నక్షత్రంబు త్రింశన్ముహూర్తంబు లనుభవించుచు షోడశకళలు గలిగి మనోమయాన్నమ యామృతమయ దేహుండై దేవ పితృ మనుష్య భూత పశు పక్షి సరీసృప వీరుత్ప్రభృతులకుఁ బ్రాణాప్యాయన శీలుండగుటంజేసి సర్వసముం డనంబడు.** **86**

**ప్రతి :** నరేంద్రా!= నరులకు రాజా!; అతివేగంబునన్; తిరుగుచుండు; కులాల చక్రంబు+అందున్= కుమ్మరిసారెలో; చక్రభ్రమణంబునకున్= చక్రం తిరుగుడులకు; వేఱైనగతిన్= భిన్నమైన గమనం; ఒంది= పొంది; బంతిసాగి; తిరిగెడు; పిపీలికా+ఆదుల చందంబునన్= చీమల బారుల విధంగా; నక్షత్రరాసుల తోడన్+కూడిన; కాలచక్రంబు; ధ్రువమేరువులన్= ధ్రువ మేరువులందు; ప్రదక్షిణంబు= ప్రదక్షిణంగా; తిరుగునపుడు= పరిభ్రమించేవేళ; కాలచక్రంబు వెంటన్; సంచరించు; సూర్య+ఆది గ్రహంబులకున్; నక్షత్ర+అంతరంబుల+అందును; రాశి+ఆదిగ్రహంబుల+అందును; ఉనికి= నిలయం; కలుగుటన్+చేసి; సూర్య+ఆది గ్రహంబులకున్; చక్రగతి= కాలచక్రగమనము; స్వగతుల వలనన్= స్వగమనం వలన; గతిద్వయంబు= రెండుగతులు; కలుగుచుందున్; మఱియున్; ఆ సూర్యుండు; ఆదినారాయణమూర్తి+అగుచున్= ఆదినారాయణ మూర్తి స్వరూపుడగుచు; లోకంబుల= లోకాలయొక్క; యోగక్షేమంబులకున్= యోగానికి, క్షేమానికి; వేదత్రయ+ఆత్మకంబు+ఐ= మూడువేదాల సమాకృతియై; కర్మసిద్ధి నిమిత్తంబు+ఐ= ఫలసిద్ధికి కారణమై; దేవ+ఋషి గణంబులచేన్; వేద+అంత+అర్థంబులన్= వేదాల చివరగల ఉపనిషత్ అర్థాలతో; అనవరతంబున్; వితర్క్య మానంబు+అగుచున్న= ప్రతిపాదింపబడుచున్న; తన స్వరూపంబును= తన స్వరూపాన్ని; ద్వాదశవిధంబులుగన్= పన్నెండు విధాలుగా; విభజించి; వసంత+ఆది+ఋతువులన్= వసంత, గ్రీష్మాది ఋతువులను; ఆ+ఆ+కాలవిశేషంబుల+అందున్; కలుగన్ చేయుచున్+ఉందున్; అట్టి పరమపురుషుని మహిమన్= పరమ పురుషుని మహిమను; ఈ లోకంబునన్; మహా+ఆత్ములు+అగు= గొప్పవారగు; పురుషులు= మానవులు; తమ తమ వర్ణ+ఆశ్రమ ఆచారంబుల చొప్పునన్= తమ తమ వర్ణాశ్రమాచారముల ప్రకారం; వేద+ఉక్తప్రకారంబు+గాన్= వేదాలలో చెప్పబడినట్టు; భక్తి+అతిశయంబునన్= అతిశయించిన భక్తితో; ఆరాధించుచున్; క్షేమంబున్= కుశలమును; ఒందుచుందురు= పొందుచుందురు; అట్టి; ఆదినారాయణమూర్తి; జ్యోతిస్+చక్ర+అంతస్+వర్తి+ఐ= తేజోరూపమయిన చక్రమధ్యమందున్నవాడై; స్వకీయ తేజః పుంజదీపిత+అఖిల+ జ్యోతిస్+గణంబులు

కలవాఁడు+ఐ= తన తేజోరాశితో ప్రకాశింపజేయబడిన జ్యోతిర్గణములు కలవాడై; ద్వాదశరాసుల+అందున్= పన్నెండు రాసుల యందును; ఒక సంవత్సరంబునన్= ఒక సంవత్సర కాలంలో; సంచరించుచున్+ఉండున్; అట్టి; ఆదిపురుషుని; గమన విశేషకాలంబును= గమన విశేషకాలాన్ని; లోకులు; అయన; ఋతు; మాస; పక్ష; తిథి+ఆదులచేతన్; వ్యవహరించుచుందురు; మఱియున్; ఆ+పరమపురుషుండు; ఆ రాసుల+అందున్; షష్ఠ+అంశసంచారంబున్+ఒందిన= ఆరవ భాగాన్ని పొందిన; సమయంబును= కాలాన్ని; ఋతువు+అని= ఋతువుగా; వ్యవహరింపుదురు= లోకంలో అందరికీ తెలిసిన విషయం; ఆ రాసుల+అందున్; అర్ధ+అంశ సంచారమ్మునన్= సగ భాగసంచారంలో; రాశిషట్కభోగంబు+ ఒందిన= ఆరవభాగం పొందిన; తతి= సమయాన్ని; అయనంబు+అని, చెప్పుదురు; సమగ్రంబుగాన్= పూర్తిగా; రాసుల+ అందున్= రాసులలో; సంచారము+ఒందినయెడలన్; సంచారం చేసినట్లయితే; అట్టి కాలంబును; సంవత్సరంబు+ అని= సంవత్సర కాలమని; నిర్ణయింపుదురు= నిర్ణయిస్తారు; ఇట్టి; సమగ్రరాశి సంచారంబు+అందున్; శీఘ్రగతి= త్వరిత గమనం; మందగతి= నెమ్మదిగాయైన గమనం; సమగతులు+అనియెదు; త్రివిధగతి విశేషంబు వలనన్= మూడు విధాలయిన గమన విశేషాలవలన; వేఱుపడెడు= భిన్నమయిన; ఆ వత్సరంబును= ఆ సంవత్సర కాలాన్ని; సంవత్సరంబు; పరివత్సరంబు; ఇడావత్సరంబు; అనువత్సరంబు+ఇద్వత్సరంబు అని; పంచవిధంబులన్= ఐదు విధాలుగా; చెప్పుదురు= చెబుతారు; చంద్రుండున్; ఈ తెఱంగునన్; ఆ సూర్యమండలంబు మీఁదన్; లక్ష యోజనంబుల నుండి; సంవత్సర, పక్షరాశి నక్షత్రభుక్తులు; గ్రహించుచున్; అగ్రచారి+ఐ= ముందు నడచుచు; శీఘ్రగతిన్= త్వరితగతిని; చరించునంతన్= సంచరించడంతో; వృద్ధి క్షయరూపంబునన్= పెరుగుదల, తరుగుదల రూపాలలో; పితృగణంబులకున్; పూర్వపక్ష+అపరపక్షంబులచేన్= పూర్వపక్షం, అపరపక్షంబులచేత; అహోరాత్రంబు+కలుగన్+చేయుచున్= పగలు, రాత్రులు కలుగజేయుచు; సకల జీవప్రాణంబు+ఐ= సమస్త జీవులకు ప్రాణమై; ఒక్క నక్షత్రంబు; త్రిశంత్ ముహూర్తంబులున్= ముప్పది ముహూర్తములు; అనుభవించుచున్; షోడశకళలు+కలిగి= పదహారు కళలు కలిగి; మనోమయ; అన్నమయ; అమృతమయ దేహుండు+ఐ= మనోమయము, అన్నమయము, అమృతమయ దేహము కలవాడయి; దేవ= దేవతలకూ; పితృ= పితరులకు; మనుష్య= మానవులకు; భూత= భూతాలకు; పశు= జంతువులకు; పక్షి= పక్షులకు; సరీసృపవీరుత్ ప్రభృతులకున్= పొట్టతో ప్రాకునట్టి జీవములకు తీగలు మొదలైనవానికి; ప్రాణ+ఆప్యాయనశీలుండు+అగుటన్+చేసి= ప్రాణాలకు తృప్తిని కలిగించు స్వభావం కలవాడగుటవలన; సర్వసముండు+అనంబడున్= సర్వసముడని అనబడతాడు.

**తా :** ఓ రాజా! కుమ్మరిసారె వేగంగా తిరుగుతుంటుంది. ఆ సారెమీద చీమల బారులు తిరుగుతుంటాయి. అయితే వాటి గమనం ఆ చక్రభ్రమణానికి భిన్నంగా ఉంటుంది. అదేవిధంగా నక్షత్రాలతో రాసులతో నిండిన కూడిన కాలచక్రం తిరుగుతున్నది. ఆ కాలచక్రం ధ్రువమేరువుల్ని ప్రదక్షిణం చేస్తూ తిరిగేటప్పుడు ఆ కాలచక్రం వెంట తిరిగే సూర్యాదిగ్రహాలు నక్షత్రాలతోను, రాసులలోనూ సంచరిస్తుంటాయి. అందువల్ల సూర్యాది గ్రహాలకు కాలచక్రగమనమూ, స్వగమనమూ అనే రెండు రకాల గమనాలు కలుగుతున్నాయి. అంటే తమంత తాము తిరగడమున్నూ, కాలచక్రగమనంతోపాటు తిరగడమున్నూ. ఆదినారాయణుడే సూర్యుడుగా ప్రకాశిస్తున్నాడు. ఆ సూర్యభగవానుడు సమస్త లోకవాసుల యోగక్షేమాలు కోరేవాడు. అతడు ఋగ్యజుస్సామ వేదస్వరూపుడు. మానవులు నిర్వహించే కర్మలకు సిద్ధిప్రదాత. ఆ దేవుని స్వరూపాన్ని దేవర్షిగణాలు వేదాంత పరంగా భావించి సంభావిస్తుంటారు. అటువంటి సూర్యుడు తన స్వరూపాన్ని పన్నెండు విధాలుగా విభజించి వసంతం, గ్రీష్మం మొదలయిన ఋతువులను ఆయా కాలాలలో కలుగజేస్తుంటాడు. అటువంటి పరమపురుషుని మహిమను

అర్థం చేసుకొన్న మహాత్ములు వర్ణాశ్రమాచారాలు పాటిస్తూ వేదాలలో చెప్పబడ్డట్టు. అతిశయమయిన భక్తితో ఆయనను ఆరాధిస్తూ క్షేమంగా ఉంటారు.

సూర్యరూపుడయిన ఆదినారాయణమూర్తి జ్యోతిశ్చక్రంలో తిరుగుతూ తన తేజస్సుతో గ్రహగోళాదులను వెలిగిస్తూ ద్వాదశరాసులలో ఒక సంవత్సరకాలంలో సంచరిస్తుంటాడు. ఆ ఆదిపురుషుని గమన విశేషాన్ని లోకులు అయనాలు, ఋతువులు, మాసాలు, పక్షాలు, తిథులు అనే పేర్లతో వ్యవహరిస్తుంటారు. రాసులలో ఆరవభాగం సంచారం చేసే కాలాన్ని ఋతువని వ్యవహరిస్తారు. ఆ రాసులలో సగభాగం సంచరిస్తూ ఆరు రాసులలో తిరిగే కాలాన్ని అయనమంటారు. రాసులన్నిటిలోనూ పూర్తిగా తిరిగే కాలాన్ని సంవత్సరమని నిర్ణయిస్తారు. ఆ సమగ్రరాశి సంచారంలో మూడురకాలయిన గమనాలు ఉంటాయి. మొదటిది శీఘ్రగతి. రెండవది మందగతి. మూడవది సమగతి. ఈ గతులు కారణంగా సంవత్సరంలో కలిగిన మార్పులను వరుసగా వత్సరం, పరివత్సరం, ఇడావత్సరం, అనువత్సరం, ఇద్వత్సరం అని ఐదువిధాలుగా చెబుతారు. ఇదే పద్ధతిలో చంద్రుడు సూర్యమండలం మీద లక్ష యోజనాల దూరంనుండి సంవత్సరం, పక్షాలు, రాసులు, నక్షత్రాలు భుక్తులను గ్రహిస్తూ ముందుండి వేగంగా సంచరిస్తుంటాడు. చంద్రుని వృద్ధి క్షయాలవల్ల పితృగణాలకు పూర్వపక్షం, అపరపక్షం అనేవి ఏర్పడతాయి. వీటివల్లనే వారికి పగలు, రాత్రి ఏర్పడతాయి. చంద్రుడు ఒక్కొక్క నక్షత్రంలో ముప్పది సుముహూర్తాల కాలం సంచరిస్తాడు. పదునారు కళలతో మనోమయ, అన్నమయ, అమృతమయ దేహంతో ఒప్పుతుంటాడు. దేవతలకూ, పితృగణానికీ, మానవులకూ, భూతాలకూ, జంతువులకూ, పక్షులకూ పాములు మొదలయిన వాటికీ, తీగలకు, పొదలకూ, ప్రాణప్రదమయిన తాపస్పర్శవల్ల ప్రాణాలకు సంతృప్తి కలిగిస్తూ చంద్రుడు సర్వసముడుగా ప్రకాశిస్తాడు.

**క. చందురునకు మీఁదై యా, నందంబున లక్షయోజనంబులఁదారల్**
**గ్రందుకొని మేరుశైలం, బంది ప్రదక్షిణము దిరుగు నభిజిద్భముతోన్. 87**

**ప్రతి :** చందురునకున్; మీఁదు+ఐ; ఆనందంబునన్; లక్షయోజనంబులన్= లక్ష యోజనాల ఎత్తులో; తారల్= నక్షత్రాలు; క్రందుకొని= గుమికూడి; మేరుశైలంబు+అంది= మేరుపర్వతం అందునట్లుగా; అభిజిత్+భముతోన్= అభిజిత్తు అనే తారతో; ప్రదక్షిణము+తిరుగున్= ప్రదక్షిణం చేస్తుంటాయి.

**తా :** చంద్రునికి పైన లక్ష యోజనాల ఎత్తు ప్రదేశంలో నక్షత్రమండలం ఉంది. అందలి నక్షత్రాలన్నీ అభిజిత్తుతో కూడా కలిసి మేరుశైలానికి ప్రదక్షిణం చేస్తుంటాయి.

**సీ. అటమీఁదఁదారల కన్నిటి కుపరియై రెండు లక్షల శుక్రుఁడుండి భాస్క**
**రుని ముందఱంబిఱుందను సౌమ్యమృదు శీఘ్రసంచారములను భాస్కరుని మాడ్కిఁ**
**జరియించుచుండును జనులకు ననుకూలుఁ డై వృష్టి నొసఁగుచు నంతనంతఁ**
**జతురత వృష్టివిష్కంభకగ్రహశాంతి నొనరించువారల కొసఁగు శుభము.**

**తే. బుండు నామీఁద సౌమ్యుండు రెండు లక్ష, లను జరించుచు రవిమండలంబుఁబాసి**
**కానఁబడినను జనులకు క్షామ డాంబ, రాదిభయములఁబుట్టించు నతులమహిమ. 88**

**ప్రతి :** అటమీఁదన్= ఆపైన; తారలకున్+అన్నిటికిన్= నక్షత్రాలకన్నిటికి; ఉపరి+ఐ= పై భాగంలో; రెండులక్షలన్= రెండులక్షల యోజన దూరంలో; శుక్రుఁడు+ఉండి= శుక్రగ్రహం ఉండి; భాస్కరుని ముందఱన్; పిఱుందను= వెనుక;

సౌమ్య మృదుశీఘ్ర సంచారములను= మెల్లగా, మృదువుగా, తొందరగా సాగే సంచారాలతో; భాస్కరుని మాడ్కిన్= దినకరుని లాగా; చరియించుచుండును= సంచారం చేస్తూ ఉంటుంది; జనులకున్= ప్రజలకు; అనుకూలుండు+ఐ; వృష్టిన్+ఒసంగుచున్= వర్షం కురిపిస్తూ; అంతన్+అంతన్; చతురతన్= నేర్పరితనంతో; వృష్టి విష్కంభక గ్రహశాంతిన్= వర్షాలకు ఆటంకం కలిగించే గ్రహాలకు శాంతిని; ఒనరించు వారలకున్; శుభములు= మేళ్ళను; ఒసంగున్= కలిగిస్తుంది; ఆ మీఁదన్; సౌమ్యుండు= బుధుడు; ఉండున్= ఉంటాడు; రెండు లక్షలను= రెండు లక్షల యోజనదూరంలో; చరించుచున్; రవిమండలంబున్+పాసి= సూర్య మండలాన్ని వదలిపెట్టి; కానఁ+బడినను= కనిపిస్తే కూడ; జనులకున్; క్షామ, డాంబర+ఆదిభయములన్= కరువు కాటకాలు; దోపిడీల భయాలను; అతులమహిమన్= సాటిలేని ప్రభావంతో; పుట్టించున్= కలిగిస్తుంది.

**తా :** నక్షత్ర మండలానికి రెండు లక్షల యోజనాల ఎత్తున శుక్రుడు సంచరిస్తుంటాడు. ఈతడు సూర్యునికి ముందూ, వెనకా ఉదయిస్తూ సూర్యునివలె సంచారం చేస్తాడు. ఈతని గమనం కొన్నిసార్లు మెల్లగా, కొన్నిసార్లు మృదువుగా మరికొన్నిసార్లు తొందరగా సాగుతుంటుంది. ఈ శుక్రుడు ప్రజలకందరికి అనుకూలుడై వర్షం కురిపిస్తాడు. వర్షాలకు ఆటంకం కలిగించే గ్రహాలకు శాంతి చేసినట్లయితే శుక్రుడు సంతుష్టి పొంది శుభం కలుగజేస్తాడు. శుక్రునికంటె పైన రెండు లక్షల యోజనాల దూరంలో బుధుడు తిరుగుతుంటాడు. అతడు సూర్యమండలాన్ని వదలి దూరంగా కనిపించినా ప్రజలకందరికి కరువు కాటకాలు, దోపిడీల భయం కలిగిస్తాడు.

**విశే :** మూలంలో అతివాత, అభ్రప్రాయ, అనావృష్టి, ఆదిభయమ్ - పెనుగాలి, మేఘములతోనిండిన ఆకాశం మరియు అనావృష్టి మొదలగువాని వలన భయములు చెప్పబడ్డాయి. ఏ కాలమందయితే సూర్యునికంటె బుధుడు దాటి ముందుకు పోవునో అపుడు ఈ అశుభాలని వర్ణితం (22-13). డామరమునకు రూపాంతరం డాంబరం.

**సీ. ధరణీతనూజుఁడంతటిమీఁద రెండు లక్షల నుండు మూఁడు పక్షముల నొక్క**
**రాశి దాఁటుచు నుండుఁ; గ్రమమున ద్వాదశరాసులు భుజియించు రాజసమున;**
**వక్రించియైన నవక్రత నైనను దఱచుగాఁ బీడలు నరుల కొసఁగు;**
**నంగారకుని టెంకి కావల రెండులక్షల యోజనంబుల ఘనత మించి**

**ఆ. యొక్క రాశినుండి యొక్కొక్క వత్సరం, బనుభవించుచుండు నమరగురుఁడు**
**వక్రమందునైన వసుధామరులకును, శుభము నొసఁగు నెపుడు నభినవముగ. 89**

**ప్రతి :** ధరణీతనూజుఁడు= భూదేవి కుమారుడయిన కుజుడు; అంతటిమీఁదన్; రెండులక్షల నుండి= రెండు లక్షల యోజనాల నుండి; మూఁడు పక్షములన్= మూడు పక్షాల కాలంలో; ఒక్కరాశిన్= ఒక్కొక్కరాశిని; దాఁటుచున్+ఉండున్; క్రమమునన్; ద్వాదశరాసులు; రాజసమునన్= రాజసంతో; భుజియించున్= సంచారం చేస్తుంటాడు; వక్రించి+ఐనన్= వక్రగతిలోగాని; అవక్రత+ఐనను= వక్రగతిలో లేకున్నా; తఱచుగాన్= అధికంగా; పీడలు= రకరకాల పీడలను; నరులకున్= మనుజమాత్రులకు; ఒసఁగున్= కలిగించును; అమరగురుఁడు= దేవతలకు గురువు (బృహస్పతి); అంగారకుని టెంకికిన్+ఆవలన్= అంగారకుని స్థిర స్థానానికి ఆవలివైపు; రెండులక్షల యోజనంబులన్= రెండు లక్షల యోజన దూరంలో; ఘనతమించి= గొప్పతనం అతిశయించగా; ఒక్కరాశినుండి= ఒక్కొక్క రాశినుండి; ఒక్క+ఒక్క వత్సరంబు=

ప్రతియొక్క ఏడు; అనుభవించుచుందున్; వక్రమందున్+ఐనన్= వక్రగతిలో ఉన్నా; వసుధా+అమరులకును= బ్రాహ్మణులకు; అభినవముగన్= క్రొత్తగా; ఎపుడు; శుభమున్+ఒసఁగున్= శుభాలే కలిగిస్తాడు.

**తా :** బుధునికన్న పైన రెండు లక్షల యోజనాల దూరంలో అంగారకుడు ఉన్నాడు. అతడు మూడుపక్షాలకాలంలో ఒక్కొక్క రాశి దాటుతూ సంచారం చేస్తాడు. ఆ విధంగా అంగారకుడు పండ్రెండు రాసులలోను రాజసంతో సంచరిస్తాడు. వక్రగతిలోగాని, వక్రగతిలో లేనప్పుడుగాని అంగారకుడు ప్రజలకు పీడలే కలిగిస్తాడు. అతనికి రెండులక్షల యోజనాల దూరంలో బృహస్పతి సంచరిస్తుంటాడు. ఆ అమరగురువు ప్రతి ఒక్కరాశిలో ఒక్కొక్క సంవత్సరం చరిస్తుంటాడు. ఈ గురువు వక్రగతిలో ఉన్నా బ్రాహ్మణులకు ఎప్పటికప్పుడు శుభపరంపరలను ప్రసాదిస్తుంటాడు.

**క. సురగురునకు మీఁదై భా, స్కరసుతుఁ డిరులక్షలను జగములకుఁబీడల్**
**జరపుచుఁ ద్రింశన్మాసము, లరుదుగ నొక్కొక్క రాశియందు వసించున్. 90**

**ప్రతి :** సురగురునకున్= బృహస్పతికన్న; మీఁదై= పయిని; భాస్కరసుతుఁడు= సూర్యుని కుమారుడయిన శని; ఇరులక్షలను= రెండు లక్షల యోజనాలకు పయిని; జగములకున్= లోకాలకు; పీడల్= బాధలు; జరుపుచున్= కలిగిస్తూ; త్రింశత్+ మాసములు= ముప్పై నెలలు; అరుదుగన్= దుర్లభంగా; ఒక్క+ఒక్క; రాశి+అందున్; వసించున్= నివసిస్తాడు.

**తా :** బృహస్పతికన్న రెండు లక్షల యోజనాలకుపైన శని తిరుగుతుంటాడు. అతడు ప్రతి రాశిలోనూ ముప్పయి మాసాలు చరిస్తాడు. ఈ ముప్పయి మాసాలలోను శని ప్రజలకు కష్టాలే కలిగిస్తాడు.

**క. ప్రాకటముగ రవిసుతునకు, నేకాదశలక్షలను మహీసురులకు నీ**
**లోకులకు మేలు గోరుచు, జోకగ మునిసప్తకంబు సొంపు వహించెన్. 91**

**ప్రతి :** ప్రాకటముగన్= విశదంగా; రవిసుతునకున్= సూర్యసుతుడయిన శనికి; ఏకాదశ లక్షలను= పదకొండు లక్షల యోజనాల దూరంలో; మహీసురులకున్= బ్రాహ్మణులకును; ఈ లోకులకున్= ఈ ప్రజలకు; మేలు+కోరుచున్= శుభాలు కోరుచు; జోకగన్= ఉత్సాహంగా; ముని సప్తకంబు= సప్తర్షులు; సొంపు వహించెన్= మేలు కోరుతారు.

**తా :** శనికి పదునొకండు లక్షల యోజనాల దూరంలో సప్తర్షి మండలం ఉంది. ఆ మండలంలోని ఋషులు బ్రాహ్మణులకూ, ప్రజలకూ ఉత్సాహంతో మేలు కోరుతుంటారు.

**క. మునిసప్తకమున కెగువం, దనరుచు నా మీఁదఁద్రియుతదశలక్షలఁ బెం**
**పున శింశుమారచక్రం, బనఁగా నిన్నిటికి నుపరి యగుచుండు నృపా! 92**

**ప్రతి :** నృపా= రాజా!; మునిసప్తకమునకున్= సప్తఋషి మండలానికి; ఎగువన్+తనరుచున్= పై భాగాన నొప్పుచు; ఆ మీఁదన్= దానిమీద; త్రియుతదశలక్షలన్= పదమూడు లక్షల యోజనాల; పెంపునన్= అతిశయంతో; శింశుమార చక్రంబు+అనఁగాన్= శింశుమార చక్రం అనే పేరుతో; ఇన్నిటికిన్= ఈ అన్నిటికన్నా; ఉపరి+అగుచుండున్= పైన ఉన్నది.

**తా :** రాజా! సప్తఋషి మండలానికి పదుమూడు లక్షల యోజనాల ఎత్తులో శింశుమార చక్రం ఉంది. ఇదే ఆకాశంలో అన్నిటికన్నా పైన ఉన్న చక్రం.

**సీ. ఆ శింశుమారాఖ్యమగు చక్రమున భాగవతుఁడైన ధ్రువుఁడింద్రవరుణకశ్య**
**ప ప్రజాపతి యమ ప్రముఖులతోఁగూడి బహుమానముగ విష్ణుపదముఁజేరి**
**కణఁక నిచ్చలుఁ బ్రదక్షిణముగాఁ దిరుగుచుఁ జెలఁగియుండును గల్పజీవి యగుచు;**
**ననఘుఁడుత్తాన పాదాత్మజుఁడార్యుఁడు నయిన యా ధ్రువుని మహత్త్వమెల్లఁ**

**తే. దెలిసి వర్ణింప బ్రహ్మకు నలవిగాదు, నే నెఱింగిన యంతయు నీకు మున్న**
**తెలియఁబలికితిఁ; గ్రమ్మఱఁదలఁచికొనుము, జితరిపువ్రాత! శ్రీపరీక్షిన్నరేంద్ర! 93**

**ప్రతి :** శ్రీ పరీక్షిత్+నర+ఇంద్ర= శ్రీ పరీక్షిన్మహారాజా!; జితరిపువ్రాత= జయింపబడిన విరోధి సమూహం కలవాడా!; ఆ శింశుమార+ఆఖ్యము+అగు= శింశుమారం అనే పేరుగలిగిన; చక్రమునన్= చక్రంలో; భాగవతుఁడు+ఐన= భగవంతుని భక్తుడయిన; ధ్రువుఁడు= ఉత్తానపాదుని కుమారుడు; ఇంద్రవరుణకశ్యపప్రజాపతియమ= ఇంద్రుడు, వరుణుడు, కశ్యపుడు, యమ అనే పేర్లుగల; ప్రముఖులతోన్+కూడి= గొప్పవారితోచేరి; బహుమానముగన్= గౌరవంతో; విష్ణుపదమున్+చేరి; కణఁకన్= ప్రయత్నంతో; నిచ్చలు= ఎల్లప్పుడు; ప్రదక్షిణముగాన్; తిరుగుచున్; కల్పజీవి+అగుచున్= కల్పాంతం దాకా బ్రతుకుచు; చెలఁగి+ఉండును= ప్రకాశిస్తూ ఉంటాడు; అనఘుఁడు= పాపరహితుడయినవాఁడు; ఉత్తానపాద+ఆత్మజుఁడు= ఉత్తానపాదుని కుమారుడయినవాడు; ఆర్యుఁడున్= పూజ్యుడు; అయిన; ఆ ధ్రువుని= ఆ సునీతి కుమారుడయిన ధ్రువునియొక్క; మహత్త్వమున్+ఎల్లన్= మాహాత్మ్యమంతా; తెలిసి వర్ణింపన్; బ్రహ్మకున్= బ్రహ్మదేవునికి కూడా; అలవి+కాదు= సాధ్యం కాదు; నేను+ఎఱింగిన+అంతయున్= నాకు తెలిసినదంతయు; నీకున్= నీకు; మున్ను+అ= ముందే; తెలియన్+పలికితిన్= తెలియజెప్పాను; క్రమ్మఱన్= మఱల; తలఁచుకొనుము= గుర్తుంచుకో!

**తా :** ఆ శింశుమార చక్రంలో పరమభక్తాగ్రేసరుడయిన ధ్రువుడు ఉన్నాడు. అతడు ఇంద్రుడు, వరుణుడు, కశ్యపుడు, యముడు మొదలయిన దేవతలతో, ప్రజాపతులతో విష్ణుపదానికి ప్రతినిత్యం ప్రదక్షిణం చేస్తుంటాడు. అతడు కల్పం చివరిదాకా జీవిస్తాడు. ఉత్తానపాదుని కుమారుడయిన ఆ ధ్రువుడు పూజ్యుడు, మహాత్ముడు. ఆయన మహిమలను బ్రహ్మకూడా వర్ణించలేడు. నాకు తెలిసిన విశేషాలన్నీ ముందే నీకు తెలియజేశాను. ఒకసారి ఆ కథలన్నీ గుర్తుకు తెచ్చుకో.

**వ. మఱియు నా ధ్రువుండు కాలంబుచేత నిమిషమాత్రం బెడ లేక సంచరించు జ్యోతిర్గ్రహ నక్షత్రంబులకు నీశ్వరునిచేత ధాన్యాక్రమణంబునఁ బశువులకై యేర్పఱచిన మేధిస్తంభంబు తెఱంగున మేటిగాఁ గల్పింపంబడి ప్రకాశించుచుండు; గగనంబు నందు మేఘంబులును శ్యేనాదిపక్షులును వాయువశంబునం గర్మ సారథులై చరించు తెఱంగున జ్యోతిర్గణంబులును బ్రకృతిపురుష యోగ గృహీతాశులై కర్మ నిమిత్తగతి గలిగి వసుంధరం బడకుందురు. 94**

**ప్రతి :** మఱియున్; ఆ ధ్రువుండు; కాలంబుచేతన్= కాలగతి నిర్ణయం ప్రకారం; నిమిషమాత్రంబు+ఎడలేక= నిముసమయినా తీరికలేక; సంచరించు; జ్యోతిస్+గ్రహ+నక్షత్రంబులకున్= ప్రకాశవంతమయిన గ్రహాలకు, నక్షత్రాలకు; ఈశ్వరునిచేతన్= రక్షకునిచేత; ధాన్య+ఆక్రమణంబునన్= ధాన్యం నూర్చే కళ్ళంలో; పశువులకు+ఐ= గొడ్లకై; ఏర్పఱచిన= ఏర్పాటు చేసిన; మేధిస్తంభంబు తెఱంగునన్= గుంజ విధాన; మేటిగాన్; కల్పింపన్+పడి; ప్రకాశించుచుండున్; గగనంబు+అందున్; మేఘంబులును; శ్యేన+ఆదిపక్షులును= డేగలు మొదలయిన పక్షులును; వాయువశంబునన్= గాలి వాలు ప్రకారం;

కర్మసారథులు+ఐ= సారథిరూపంలో కర్మలు నడిపించేవి కాగా; జ్యోతిర్+గణంబులును; ప్రకృతి, పురుష యోగ గృహీత+ఆశులు+ఐ= ప్రకృతి పురుషుల సంబంధం చేత గ్రహింపబడిన ఆశయం కలవారలై; కర్మ నిమిత్తగతిన్= కర్మానుసారంగా; వసుంధరన్= నేలమీద; పడకుందురు= పతనంచెందకుండా ఉంటారు.

**తా :** ధాన్యం నూర్చే కళ్లంలో పశువులను కట్టడంకోసం మధ్య పాతిన గుంజ లాగున ధ్రువుడు ఆ శింశుమార చక్రం నడుమ ప్రకాశిస్తూ ఉన్నాడు. అతనిచుట్టూ గ్రహాలు, నక్షత్రాలు ఉన్నాయి. అవన్నీ కాలవిభాగాలలో నిమేషమాత్రం కూడా ఏమరుపాటులేక ధ్రువుని చుట్టూ ప్రదక్షిణంగా తిరుగుతుంటాయి. ఆకాశంలో మేఘాలు, డేగలు మొదలయిన పక్షులు కర్మానుసారంగా గాలికి లోబడి ఆకాశంలో ఎలా పరిభ్రమిస్తున్నాయో అలాగే జ్యోతిర్గణాలు కర్మను అవలంబించి ప్రకృతి పురుషులకు లోబడి గగనాన తిరుగుతూ ఉంటాయి. ఈ కారణంవల్లనే గ్రహాలు నేలమీద పడడం లేదు.

**క. పొందుగ జ్యోతిర్గణముల, నందఱ నా శింశుమారమందుల నుండం**
**గొందఱు దఱచుగఁజెప్పుచు, నుందురు; వినిపింతు, విను మనూనచరిత్రా! 95**

**ప్రతి :** న+ఊనచరిత్రా= సచ్చరితుడయిన రాజా!; విను= వినవయ్యా!; పొందుగన్= యుక్తంగా; జ్యోతిర్+గణంబులను; అందఱన్; ఆ శింశుమారము+అందులన్+ఉండన్= ఆ శింశుమార చక్రంలో ఉన్నాయని; కొందఱు; తఱచుగన్= మాటల సందర్భంలో; చెప్పుచున్+ఉందురు= చెబుతుంటారు; వినిపింతున్= ఆ విశేషాలను వినిపిస్తాను.

**తా :** సచ్చరిత్రుడవయిన రాజా! జ్యోతిర్గణాలన్నీ శింశుమార చక్రంలో ఉన్నాయని కొందరు చెబుతుంటారు; ఆ శింశుమారచక్రస్వరూపం నీకు వివరిస్తాను విను.

**క. తలక్రిందై వట్రువయై, సలలితమగు శింశుమారచక్రము నందున్**
**నెలకొని పుచ్ఛాగ్రంబున, నిలిచి ధ్రువుం డుండు నెపుడు నిర్మలచరితా! 96**

**ప్రతి :** నిర్మలచరితా!= మాలిన్యం లేని నడవడి కలవాడా!; తలక్రిందు+ఐ= తలక్రిందుగా; వట్రువ+ఐ= గుండ్రంగా; సలలితము+అగు= అందంగా ఉండే; శింశుమారచక్రము; అందున్= ఆ శింశుమార చక్రంలో; నెలకొని= తిరమై; పుచ్ఛ+అగ్రంబునన్= తోక చివర; నిలిచి= నిలిచినవాడై; ధ్రువుఁడు= ధ్రువుడు; ఎపుడున్ ఉండున్ = ఎప్పుడూ ఉంటాడు.

**తా :** నిర్మల చరితా! శింశుమార చక్రం తలక్రిందుగా గుండ్రంగా అందంగా ఉంటుంది. ఆ చక్రం తోకచివర ధ్రువుడు సర్వదా ప్రకాశిస్తూ ఉంటాడు.

**విశే :** మూలంలో నక్షత్ర మండలం నీటికోతి రూపంలో నిలబెట్టబడియున్నదని వర్ణితం. ఇది కూడా వాసుదేవభగవానుని యోగధారణచే అని ఉల్లేఖితం.

**వ. మఱియు నా శింశుమార చక్రపుచ్ఛంబునఁ బ్రజాపతియు నగ్నీంద్ర ధర్ములును, బుచ్ఛమూలంబున ధాతృవిధాతలును, గటి ప్రదేశంబున ఋషి సప్తకంబును, దక్షిణావర్త కుండలీభూత శరీరంబునకు నుదగయన నక్షత్రంబులును, దక్షిణపార్శ్వంబున దక్షిణాయన నక్షత్రంబులును, బృష్ఠంబున దేవమార్గంబును, నాకాశగంగయు, నుత్తరభాగంబునఁ బునర్వసు పుష్యంబులును, దక్షిణాయనంబున నార్ద్రాశ్లేషలును, దక్షిణ వామపాదంబుల నభిజి దుత్తరాషాఢలును, దక్షిణ వామ నాసారంధ్రంబుల శ్రవణ పూర్వాషాఢలును, దక్షిణ**

**వామలోచనంబుల ధనిష్ఠామూలలును, దక్షిణ వామకర్ణంబుల మఘాద్యష్ట నక్షత్రంబులును, వామపార్శ్వంబున దక్షిణాయనంబును, దక్షిణపార్శ్వంబునఁ గృత్తికాది నక్షత్ర త్రయంబును, నుత్తరాయణంబును. వామదక్షిణ స్కంధంబుల శతభిషగ్జ్యేష్ఠలును, నుత్తరహనువున నగస్త్యుండును, నపర హనువున యముండును, ముఖంబున నంగారకుండును, గుహ్యంబున శనైశ్చరుండును, మేఢ్రంబున బృహస్పతియును, వక్షంబున నాదిత్యుండును, నాభిని శుక్రుండును, మనంబునం జంద్రుండును, స్తనంబుల నశ్వినులును, బ్రాణాపానంబుల బుధుండును, గళంబున రాహువును, సర్వాంగంబులఁ గేతుగ్రహంబును, రోమంబులఁ దారలును నుండు; నది సర్వదేవతామయంబైన పుండరీకాక్షుని దివ్యదేహంబు ధ్రువునింగా నెఱుంగుము. 97**

**ప్రతి :** మఱియున్= అంతేగాక; ఆ శింశుమార చక్ర పుచ్ఛంబునన్= ఆ శింశుమార చక్రం తోకభాగంలో; ప్రజాపతియున్; అగ్ని+ఇంద్ర ధర్ములును; పుచ్ఛమూలంబునన్= తోకముందు భాగంలో; ధాతృవిధాతలును; కటిప్రదేశంబునన్= నడుముభాగంలో; ఋషిసప్తకంబును= సప్త ఋషులును; దక్షిణ+ఆవర్త కుండలీభూత శరీరంబునకున్= కుడివైపుకు చుట్టుకొని కుండలీ భూతంగా ఉన్నదానికి; ఉదగయన నక్షత్రంబులును= ఉత్తరభాగంలో ఉత్తరాయణ నక్షత్రాలును; దక్షిణ పార్శ్వంబునన్= దక్షిణ భాగంలో; దక్షిణ+అయన నక్షత్రంబులును= దక్షిణాయన నక్షత్రాలు; పృష్ఠంబునన్= వీపున; దేవమార్గంబును= దేవమార్గమనబడే తారకల సముదాయము; ఆకాశగంగయున్= అక్కడే వియద్గంగయు; ఉత్తర భాగంబునన్; పునర్వసు పుష్యంబులును= పునర్వసు పుష్యనక్షత్రాలను; దక్షిణ+అయనంబునన్; ఆర్ద్రాశ్లేషలును; దక్షిణవామపాదంబులన్= కుడిపాదంలో, ఎడమపాదంలో; అభిజిత్+ఉత్తరాషాఢలును= అభిజిత్తు, ఉత్తరాషాఢా నక్షత్రములును; దక్షిణ వామనాసా రంధ్రంబులన్= కుడిఎడమవైపు ముక్కుపుటాలలో; శ్రవణ పూర్వాషాఢలును, దక్షిణ వామలోచనంబులన్= కుడిఎడమ నేత్రాలలో ధనిష్ఠామూలలును; దక్షిణ వామకర్ణంబులన్= కుడి ఎడమచెవులలో; మఘ+ఆది+అష్టనక్షత్రంబులును= మఘ, పుబ్బ, ఉత్తర, హస్త, చిత్త, స్వాతి, విశాఖ, అనురాధ అనే నక్షత్రాలును; వామపార్శ్వంబునన్= ఎడమపక్క; దక్షిణ+అయనంబును; దక్షిణ పార్శ్వంబునన్= కుడిప్రక్క; కృత్తికా+ఆది నక్షత్ర త్రయంబును= కృత్తిక, రోహిణి, మృగశిర అనే మూడు నక్షత్రాలును; ఉత్తరాయణంబును; వామ దక్షిణ స్కంధంబులన్= ఎడమ కుడివైపు మూపులయందు; శతభిషక్ జ్యేష్ఠలును; ఉత్తరహనువునన్= పై దౌడ ప్రదేశముల అగస్త్యుండును; అపరహనువునన్; క్రింది దౌడస్థానంలో; యముండును; ముఖంబునన్; అంగారకుండును; గుహ్యంబునన్= మర్మావయవ స్థానంలో; శనైస్+చరుండును= శనియు; మేఢ్రంబునన్= పురుషాంగమున; బృహస్పతిని; వక్షంబునన్= ఉరంబున; ఆదిత్యుండును= సూర్యుడును; నాభినిన్= నాభిలో; శుక్రుండును; మనంబునన్= మనసులో; చంద్రుండును; స్తనంబులన్= చనులయందు; అశ్వినులును; ప్రాణ+అపానంబులన్= ప్రాణాపానములందు; బుధుండును; గళంబునన్= కంఠభాగంలో; రాహువును; సర్వ+అంగంబులన్= అన్ని అవయవములందు; కేతుగ్రహంబును; రోమంబులన్= వెంట్రుకలయందు; తారలును= నక్షత్రములును; ఉండున్; అది= అద్దానిని; సర్వదేవతామయంబు+ఐన= సమస్త దేవతల స్వరూపమయిన; పుండరీక+అక్షుని= పద్మాలవంటి కన్నులుగల నారాయణుని; దివ్యదేహంబు= దివ్యశరీరం; ధ్రువునింగాన్= ధ్రువునిగా; ఎఱుంగుము= తెలిసికోవయ్యా!

**తా :** ఆ శింశుమార చక్రం తోకభాగంలో ప్రజాపతి అగ్ని, ఇంద్రుడు, ధర్ముడు అను వారుంటారు. తోకముందు భాగంలో ధాత, విధాత ఉన్నారు. నడుముభాగంలో సప్తర్షులున్నారు. దక్షిణావర్తమై కుడివైపుకు చుట్టుకొని, కుండలీభూతంగా

ఉన్నదానికి ఉత్తరభాగంలో ఉత్తరాయణ నక్షత్రాలు, దక్షిణభాగంలో దక్షిణాయన నక్షత్రాలు, వీపుమీద దేవమార్గం అనబడే తారకాసముదాయమూ, అక్కడే ఆకాశగంగ కూడా ఉన్నాయి. ఉత్తరభాగంలో పునర్వసు, పుష్యమి నక్షత్రాలు, దక్షిణభాగంలో ఆర్ద్ర ఆశ్లేషలు, కుడిపాదంలో అభిజిత్తు, ఎడమపాదంలో ఉత్తరాషాఢ, కుడివైపు ముకుపుటంలో శ్రవణం, ఎడమవైపున పూర్వాషాఢ ఉన్నాయి. కుడి ఎడమ నేత్రాలలో ధనిష్ఠ, మూల నక్షత్రాలున్నాయి. కుడి ఎడమ చెవులలో మఘ, పుబ్బ, ఉత్తర, హస్త, చిత్త, స్వాతి, విశాఖ, అనురాధ నక్షత్రాలు ఉన్నాయి. ఎడమప్రక్క దక్షిణాయన నక్షత్రాలు, కుడిప్రక్క కృత్తిక, రోహిణి, మృగశిర అనే మూడు నక్షత్రాలు ఉన్నాయి. ఇవి గాక ఉత్తరాయణ నక్షత్రాలు కూడా అక్కడే ఉన్నాయి. ఎడమ కుడివైపు మూపులయందు శతభిషం, జ్యేష్ఠ నక్షత్రాలున్నాయి. పై దవడ ప్రదేశంలో అగస్త్యుడు, క్రింది దవడ స్థానంలో యముడు, ముఖమందు అంగారకుడు, మర్మావయవ స్థానంలో శని, పురుషాంగంగా బృహస్పతి ఉన్నారు. వక్షోభాగంలో సూర్యుడు, నాభిలో శుక్రుడు, మనసులో చంద్రుడు, స్తనాలయందు అశ్వినులు, ప్రాణాపానములందు బుధుడు, కంఠభాగంలో రాహువు ఉన్నారు. అయితే కేతువు మాత్రం అన్ని అవయవములను ఆవరించి ఉంటాడు. ఈ శింశుమార చక్రానికి రోమాలుగా ఇంకా ఎన్నో నక్షత్రాలున్నాయి. దీనిని సర్వదేవతామయమయిన నారాయణుని దివ్యస్వరూపం అయిన ధ్రువునిగా తెలుసుకొనుము.

**సీ. ఇట్టి దివ్యశరీర మెవ్వఁడు ప్రతిదినం బందు సంధ్యాకాల మతులభక్తి**
**మనమందు నిలిపి యేమఱక మిక్కిలి ప్రయత్నంబున నియతుఁడై తత్త్వబుద్ధి**
**మౌనవ్రతంబునఁబూని వీక్షించుచు నీ సంస్తవంబు దానెంతొ ప్రేమ**
**జపియించి కడుఁబ్రశస్తమును మునీంద్ర సేవ్యమును జ్యోతిస్స్వరూపమున వెలుఁగు**

**ఆ. విపులశింశుమారవిగ్రహంబునకు వం, దనము వందనంబు లనుచు నిలిచి**
**సన్నుతించెనేని సకలార్థసిద్ధులఁ, బొందు మీఁద ముక్తిఁజెందు నధిప! 98**

**ప్రతి :** అధిప= ఓ రాజా!; ఇట్టి= ఇలాంటి; దివ్యశరీరమున్= దివ్యస్వరూపాన్ని; ఎవ్వఁడు; ప్రతిదినంబు+అందున్= ప్రతిరోజు; సంధ్యాకాలము= సంధ్యవేళల; అతుల భక్తిన్= సాటిలేని భక్తితో; మనము+అందున్; నిలిపి; ఏమఱక= నియమంతో; మిక్కిలి ప్రయత్నంబునన్; నియతుఁడు+ఐ= దీక్ష కలవాడై, తత్త్వబుద్ధిన్= నిజస్వరూప నియమవంతుడై తత్త్వం గ్రహించే బుద్ధితో; మౌనవ్రతంబునన్= మాటలకందని తత్త్వావగాహన కోసం మౌనవ్రతాన్ని పాటించి; పూని= చేపట్టి; వీక్షించుచున్= దర్శిస్తూ; ఈ సంస్తవంబున్= ఈ స్తోత్రాన్ని; తాను+ఎంతొ= తానుమిక్కిలి; ప్రేమన్= సంప్రీతితో; జపియించి; కడున్= మిక్కిలి; ప్రశస్తమును= శ్రేష్ఠమును; మునీంద్ర సేవ్యమును= మునిశ్రేష్ఠులచే సేవింపబడునదియు; జ్యోతిస్స్వరూపమునన్= జ్యోతి స్స్వరూపంతో; వెలుఁగు= ప్రకాశించు; విపుల శింశుమార విగ్రహంబునకున్= విస్తారమగు శింశుమార చక్రమునకు; వందనము; వందనంబులు+అనుచున్; నిలిచి= నిలబడి; సన్నుతించెన్+ఏని= పొగడినట్లయితే; సకల+అర్థ సిద్ధులన్= సకలమయిన కోరికల సంసిద్ధిని; పొందున్= పొందును; మీఁదన్= ఆపై; ముక్తిన్+చెందున్= మోక్షాన్ని పొందుతాడు.

**తా :** రాజేంద్రా! ఈ శింశుమార చక్రం శ్రీమన్నారాయణుని దివ్యశరీరం. ఎవరు ప్రతిదినమూ సంధ్యాకాలంలో ఈ దివ్యశరీరాన్ని మనసులో నింపుకొని దీక్షతో, నియమంతో భక్తితో స్మరిస్తారో, తత్త్వాన్ని గ్రహించి మౌనవ్రతం చేబట్టి ఈ చక్రదర్శనం చేస్తూ ఎవరు ఈ స్తోత్రాన్ని ప్రీతితో జపియించి నమస్కరిస్తారో, ఎవరు ప్రశస్తమూ, మునీంద్రసేవ్యము,

జ్యోతిస్స్వరూపము అయిన శింశుమార చక్రానికి వందనం వందనం అంటూ మ్రొక్కులు చెల్లిస్తారో అటువంటి వారికి ఇహలోకంలో సకల సిద్ధులూ లభిస్తాయి. పరలోకంలో ముక్తి ప్రాప్తిస్తుంది.

**క. ఇనమండలంబునకుఁ గ్రిం, దను దశసాహస్రయోజనంబుల స్వర్భా**
**నుని మండలంబు గ్రహమై, ఘనముగ నపసవ్యమార్గగతి నుండు నృపా! 99**

**ప్రతి :** నృపా!= ఓ రాజా!; ఇనమండలంబునకున్= సూర్య మండలానికి; క్రిందను= దిగువను; దశసాహస్ర యోజనంబులన్= పదివేల యోజనాల దూరంలో; స్వర్భానుని మండలంబు= రాహుమండలం; గ్రహము+ఐ= గ్రహమై; ఘనముగన్= గొప్పగా; అపసవ్యమార్గగతిన్+ఉండున్= అపసవ్యంగా, ఎడమనుంచి కుడిగా ఉంటుంది.

**తా :** ఓ రాజా! సూర్యమండలానికి దిగువ పదివేల యోజనాల దూరంలో రాహుమండలం ఉన్నది. ఈ రాహువు అపసవ్యంగా నడుస్తుంటాడు.

**క. అసురాధముఁడగు రాహువు, బిసరుహసంభవుని వరము పెంపున నెంతో**
**పసయగు నమరత్వంబున, నసమానంబైన గ్రహవిహారముఁ బొందెన్. 100**

**ప్రతి :** అసుర+అధముఁడు+అగు= రాక్షసులలో అధముడయిన రాహువు; బిసరుహసంభవుని వరము పెంపునన్= బ్రహ్మదేవుని వర ప్రభావం కారణంగా; ఎంతోపస+అగు= ఎంతో శ్రేష్ఠమయిన; అమరత్వంబునన్= దివ్యత్వమున; అసమానంబు+ఐన= సాటిలేనట్టి; గ్రహవిహారమున్= ఇతర గ్రహాలతోపాటు కలిసి విహరించే యోగ్యత; పొందెను= పొందెను.

**తా :** రాహువు రాక్షసులలో అధముడు. అయితే అతనికి బ్రహ్మదేవుని వరం ఉంది. ఆ వరం కారణంగా అతడు అమరత్వం పొంది గ్రహాలతోపాటు తానొక గ్రహమై విహరిస్తుంటాడు.

**సీ. జననాథ! రాహువు జన్మకర్మంబులు వినిపింతు ముందఱ విస్తరించి**
**యయుతయోజనవిస్తృతార్కమండలము ద్వి షట్సహస్రవిశాలచంద్రమండ**
**లముఁ బర్వకాలంబులను త్రయోదశసహస్రవిశాలమై మీఁద రాహుఁగప్పు**
**నది చూచి యుపరాగమనుచును బలుకుదు రెల్ల వారును స్వధర్మేచ్ఛు లగుచు.**

**ఆ. నంతలోన నినశశాంకమండలములఁ, గరుణఁబ్రోవఁదలఁచి హరిసుదర్శ**
**నంబు వచ్చునను భయంబున నైదాఱు, గడియలకును రాహు నడిఁకి తొలఁగు. 101**

**ప్రతి :** జననాథ= ప్రజలకు అధిపతి అయినవాడా!; రాహువు= రాహువుయొక్క; జన్మకర్మంబులు= (జన్మ= పుట్టుక, కర్మ= స్వభావం) జన్మను గురించి కర్మను గురించి; ముందఱన్= ముందు; విస్తరించి= విస్తారంగా; వినిపింతున్= వినిపిస్తాను; అయుత యోజన విస్తృత= పదివేల యోజనాల విస్తృతి కలిగిన; అర్కమండలము= సూర్యమండలము; ద్విషట్ సహస్ర విశాల చంద్రమండలమున్= పన్నెండు వేల యోజనాల విస్తృతి కలిగిన చంద్రమండలాన్ని; పర్వకాలంబులను= పూర్ణిమా /అమావాస్య పర్వదినాలలో; త్రయోదశ సహస్ర విశాలము+ఐ= పదమూడు వేల యోజనాల విస్తీర్ణం కలదై; మీఁదన్= ఆపై; రాహున్= రాహుగ్రహమును; కప్పున్= కప్పివేస్తాడు; అది చూచి; ఉపరాగము+అనుచును= గ్రహణ కాలమని;

ఎల్లవారును= అందరు; స్వధర్మ+ఇచ్ఛులు+అగుచున్= తమ తమ ధర్మాచరణంలో కోరిక కలవారగుచు; పలుకుదురు= పలుకుతారు; అంతలోనన్= ఆలోగా; ఇనశశాంక మండలములన్= సూర్యచంద్ర మండలములను; కరుణన్= కరుణతో; ప్రోవన్+ తలంచి= కాపాడనెంచి; హరిసుదర్శనంబు= మహావిష్ణువు పంచాయుధాలలో నొకటయిన సుదర్శన చక్రము; వచ్చున్+అను= వచ్చుచున్నదేమో అను; భయంబునన్= వెరపుతో; ఐదాఱు గడియలకును= ఐదాఱు గడియలలోనే; రాహు= రాహువు; నడికి= జంకి; తొలఁగున్= తొలగిపోతాడు.

**తా :** రాజా! రాహువు యొక్క జన్మ కర్మలను గూర్చి సవిస్తరంగా చెబుతాను. పదివేల యోజనాల విస్తృతి కలిగిన సూర్యమండలాన్ని, పండ్రెండువేల యోజనాల విస్తృతి కలిగిన చంద్రమండలాన్ని రాహువు కప్పేస్తాడు. రాహుమండలం పదమూడు వేల యోజనాల వైశాల్యం కలిగి ఉంది. పూర్ణిమ పర్వదినంలో చంద్రుని, అమావాస్య పర్వదినంలో సూర్యుని రాహువు మాటు పరుస్తాడు. దీనినే గ్రహణం అంటారు. ఆ గ్రహణకాలంలో జనులందరు తమ తమ జపతపోరూపాలయిన ధర్మాలను చక్కగా ఆచరించుకొంటారు. అయితే దయామయుడైన శ్రీహరి సుదర్శన చక్రం సూర్యచంద్ర మండలాలను రక్షించడానికి వస్తుందేమో అనే భయంతో ఐదారు గడియలలోనే రాహువు జంకి తొలగిపోతాడు.

**క. నరవర! యా రాహువునకు, సరసత నా క్రింద సిద్ధచారణవిద్యా**
**ధరు లయుతయోజనంబులఁ, దిరముగ వసియించి లీలఁదిరుగుదు రచటన్. 102**

**ప్రతి :** నరవర= నరులలో శ్రేష్ఠమయినవాడా; ఆ రాహువునకున్; సరసతన్= మనోహరంగా; ఆక్రిందన్= ఆ దిగువన; సిద్ధచారణ విద్యాధరులు= సిద్ధులు, చారణులు, విద్యాధరులు; అయుత యోజనంబులన్= పదివేల యోజనాల దూరంలో; తిరముగన్= స్థిరంగా; వసియించి= నివాసం ఏర్పాటు చేసుకొని; అచటన్= అక్కడ; లీలన్= విలాసంగా; తిరుగుదురు= సంచరిస్తుంటారు.

**తా :** పరీక్షిన్మహారాజా! ఆ రాహుగ్రహానికి కిందివైపున సిద్ధులు, చారణులు, విద్యాధరులు అను దేవయోనులవారు పదివేల ఆమడల దూరంలో స్థిరంగా నివసిస్తూ సవిలాసంగా అక్కడ సంచరిస్తుంటారు.

**క. పరికింప సిద్ధ విద్యా, ధరులకుఁబదివేలు క్రిందఁదరలక యక్షుల్**
**మఱియును భూతప్రేతలు, చరియింతురు రాక్షసులు పిశాచులు గొలువన్. 103**

**ప్రతి :** పరికింపన్= పరిశీలింపగా; సిద్ధవిద్యాధరులకున్; పదివేలు క్రిందన్; పదివేల యోజనాలక్రింద; తరలక= తొలగక; యక్షుల్= యక్షులు; మఱియును= ఇంకనూ; భూతప్రేతలు= భూతములు, ప్రేతాలు, రాక్షసులు; పిశాచులున్+ కొలువన్= రాక్షసులు, పిశాచములు తమ్ము సేవింపగా; చరియింతురు= తిరుగుతుంటారు.

**తా :** సిద్ధ విద్యాధరుల నివాసస్థానానికి కింద పదివేల యోజనాల దూరంలో రాక్షసులు. పిశాచులు సేవిస్తుంటే యక్షులూ, భూతప్రేతాలూ తిరుగుతుంటారు.

**ఆ. వారిక్రిందఁదగిలి వాయువశంబున మలయుచుండు మేఘమండలంబు;**
**మేఘమండలంబు మీఁ దగుచుండు భూ మండలంబు క్రిందనుండు నధిప! 104**

**ప్రతి :** అధిప= ఓ రాజా!; వారిక్రిందన్= యక్షభూత ప్రేత విహారస్థలిక్రింద; తగిలి= అంటుకొని; వాయువశంబునన్= గాలివీవడం కారణంగా; మేఘమండలంబు; మలయుచుండున్= చలించుచుండును మేఘమండలంబు; మీఁదు+ అగుచున్+ఉండున్; భూమండలంబు; క్రిందన్+ఉండున్= కింద ఉంటుంది.

**తా :** వారి కింద మేఘమండలం ఉంది. ఆ మబ్బులన్నీ గాలికి చలిస్తూ ఉంటాయి. మేఘమండలం పై భాగంలో ఉంటే దానికి కింది భాగంలో భూమండలం ఉన్నది. (వారికింద అంటే భూతప్రేతయక్షనివాసాల కిందట అని అభిప్రాయం.)

**వ. అట్టి భూమండలంబు క్రింద యోజనాయుతాంతరంబున నండ కటాహాయామంబు గలిగి క్రమంబున నొండొంటికిఁ గ్రిందగుచు నతల వితల సుతల రసాతల తలాతల మహాతల పాతాళ లోకంబు లుండు; నట్టి బిల స్వర్గంబులయందు నుపరి స్వర్గంబున కధికంబైన కామభోగంబుల నైశ్వర్యానందంబులను సుసమృద్ధ వనోద్యాన క్రీడా విహారస్థానంబుల ననుభవించుచు దైత్యదానవ కాద్రవేయాది దేవయోనులు నిత్య ప్రముదితానురక్తు లగుచుఁ గళత్రాపత్య సుహృద్బంధు దాసీదాస పరిజనులతోఁ జేరుకొని మణిగణఖచితంబులగు నతిరమణీయగృహంబులయందు నీశ్వరుని వలనం జేటులేని కాయంబులు గలిగి వివిధ మాయా విశేష వినిర్మిత నూతన కేళీసదన విహరణ మండప విచిత్రోద్యానాదులయందుఁ గేళీవినోదంబులు సలుపుచుఁజరియింతు; రంత. 105**

**ప్రతి :** అట్టి; భూమండలంబు క్రిందన్; యోజన+అయుత+అంతరంబునన్= పదివేల యోజనాల దూరాన; అండకటాహ+ ఆయామంబు కలిగి= గుడ్డు డిప్పవలె వ్యాప్తి చెందిన స్థితి కలిగినదై; క్రమంబునన్; ఒండు+ఒంటికిన్; క్రిందు+అగుచున్; అతల, వితల, సుతల, తలాతల, మహాతల, రసాతల; పాతాళ లోకంబులు+ఉండున్; అట్టి; బిలస్వర్గంబుల+ అందున్= బిలరూపమయిన అధోలోక స్వర్గములందు; ఉపరిస్వర్గంబునకున్= మీదనున్న స్వర్గానికి; అధికంబు+ఐన; కామభోగంబులన్= కోరిన భోగములను; ఐశ్వర్య+ఆనందంబులను= ఐశ్వర్యంవల్ల సంక్రమించిన ఆనందానుభవంతో; సుసమృద్ధ= లెస్సగా సమృద్ధి చెందిన; వన+ఉద్యాన= అడవులు, తోటలు; క్రీడావిహార స్థానంబులన్= ఆడుకొనుటకు తిరుగుటకు గల స్థానములను; అనుభవించుచున్; దైత్య= దైత్యులూ; దానవ= దానవులూ; కాద్రవేయ+ఆది= నాగులు మొదలగు; దేవయోనులు= దేవతల నుండి పుట్టినవారు; నిత్య ప్రముదిత+అనురక్తులు+అగుచున్= ప్రతిదినము సంతోషంతో అనురాగంతో ఉన్నవారగుచు; కళత్ర+అపత్య= పెండ్లము, బిడ్డలు; సుహృద్+బంధు= స్నేహితులు, చుట్టములు; దాసీదాస పరిజనులతోన్; చేరుకొని= కలుసుకొని; మణిగణఖచితంబులు+అగు= రత్నాల మొత్తం తాపినవగు; అతిరమణీయ గృహంబుల+అందున్= మిక్కిలి అందమైన గృహాలలో; ఈశ్వరుని వలనన్= ఈశ్వరుని కరుణవల్ల; చేటులేని= వినాశం కలుగని; కాయంబులున్+కలిగి; వివిధ= పలురకాలయిన; మాయావిశేష= విశేష మాయలతో; వినిర్మిత= నిర్మాణము చేయబడిన; నూతన కేళీసదన= కొత్తగా కట్టిన విహార గృహములు; విహరణ మండప= విహార మండపాలలో; విచిత్ర+ఉద్యాన+ఆదుల+అందున్= విచిత్రములయిన ఉద్యానవనములలో; కేళీ వినోదంబులు= క్రీడలు, వినోదములు; సలుపుచున్= చేయుచు; చరియింతురు= విహరించుచుందురు; అంతన్= అంత.

**తా :** ఈ భూమండలం కింద ఒకదానికొకటి కిందుగా అతలం, వితలం, సుతలం, తలాతలం, రసాతలం, మహాతలం, పాతాళం అనే లోకాలున్నాయి. ఆ లోకాలలో ఒక్కొక్కదానికి మధ్య పదివేల యోజనాల దూరం ఉంటుంది. ఇవి కింద ఉన్నా స్వర్గం వంటివే. నిజం చెప్పాలంటే ఈ కింది స్వర్గాలు పైనున్న స్వర్గాలకంటే ఎంతో గొప్పవి. ఇక్కడ దైత్యులూ,

దానవులూ, నాగులూ మొదలయినవారు దేవజాతికి చెందినవారు ఉంటారు. వారందరూ ఐశ్వర్యంవల్ల సంక్రమించిన ఆనందానుభవంతో సుఖభోగాదులతో తులతూగుతూ జీవిస్తారు. సర్వాంగసుందరాలయిన ఉద్యానవనాలలో, క్రీడాప్రదేశాలలో విహరిస్తుంటారు. దైత్యులు, దానవులూ, నాగులూ మొదలైన దేవజాతి విశేషాలు భార్యలతో, బిడ్డలతో, చెలికాండ్రతో, చుట్టాలతో, దాసదాసీజనంతో మణులు చెక్కిన రమణీయమయిన గృహాలలో సర్వదా సంతోషం అనుభవిస్తుంటారు. ఈశ్వరుని కరుణవల్ల వారికి దైహికమయిన ఎటువంటి వ్యాధులు లేవు. మాయతో నిర్మింపబడిన కొంగొత్త కేళీగృహాలలో, విహార మండపాలలో చిత్రవిచిత్రమయిన ఉద్యానవనాలలో క్రీడావినోదాలతో విహరిస్తుంటారు.

**సీ. అట్టి పాతాళంబులందును మయకల్పితములగు పుటభేదనములయందు**
**బహురత్ననిర్మితప్రాకార భవనగోపుర సభాచైత్యచత్వరవిశేష**
**ములయందు నాగాసురుల మిథునములచే శుకపికశారికానికరసంకు**
**లముల శోభిల్లు కృత్రిమభూములను గల గృహములచే నలంకృతము లగుచుఁ**

**ఆ. గుసుమచయసుగంధి కిసలయస్తబక సం, తతులచేత ఫలవితతులచేత**
**నతులరుచిరనవలతాంగనాలింగిత, విటపములను గలుగు విభవములను. 106**

**ప్రతి :** అట్టి= అటువంటి; పాతాళంబులందును= పాతాళ లోకాలలో కూడ; మయకల్పితములు+అగు= మయునిచే సృష్టింపబడిన; పుట భేదనముల+అందున్= పట్టణాలయందు; బహురత్న నిర్మిత= నానావిధ రత్నాలతో నిర్మితమయిన; ప్రాకారభవన= చుట్టుగోడలు భవనాలు; గోపుర= గోపురాలు; సభా= దర్బారు మందిరాలు; చైత్య= గుడి మొదలైన కట్టడాలు; చత్వర విశేషముల+అందున్= నాలుగు బాటల నడుమనున్న ప్రదేశాలలో; నాగ+అసుర మిథునములచేన్= నాగదానవ దంపతులచేత; శుక= చిలుకలు; పిక= కోకిలలు; శారిక= గోరువంకలు అనువాని; నికర సంకులములన్= సమూహాల కిలకిలారావములతో; శోభిల్లు= ప్రకాశించు; కృత్రిమ భూములనుగల= మాయచే కల్పింపబడిన ప్రదేశములందున్న; గృహములచేన్= గృహాలతో; అలంకృతములు+అగుచున్= అలంకరింపబడినవై; కుసుమచయసుగంధి= పువ్వుల సమూహాల సువాసనలు; కిసలయస్తబక= చిగురుటాకుల గుత్తుల; సంతతులచేన్= సమూహాలచేత; ఫలవితతుల చేతన్= ఫలాల సమూహాలతో; అతులరుచిర= సాటిలేని కాంతిగల; నవలతా+అంగనా+ఆలింగితవిటపములను= సరికొత్తవగు లతాసుందరులు పెనవేసుకొన్న తరుశాఖలచేత; కలుగు= కలిగే; విభవములను= ఐశ్వర్యాలను, శోభలను...

**తా :** అటువంటి పాతాళలోకంలో మయుడు సృష్టించిన పట్టణాలు ఎన్నో ఉన్నాయి. ఆ పట్టణాలలో నానావిధ రత్నాలతో నిర్మించిన ప్రాకారాలూ, గోపురాలూ, సౌధాలూ, విశాలమయిన సభాసమావేశ స్థలాలు, చైత్యాలూ ఉన్నాయి. వాటియందూ నాలుగుబాటలు కలిసే చత్వరప్రదేశాలయందూ, నాగ అసుర దంపతులు విహరిస్తుంటారు. వారు నిర్మించుకొన్న విహారప్రదేశాలలో చిలుకలూ, కోకిలలూ, గోరువంకలూ కిలకిలారావాలు చేస్తుంటాయి. పూలవాసనలు, చిగురుటాకుల గుత్తుల బొత్తులు, రకరకాల ఫలసమృద్ధిగల ఆ ఉద్యానవనాలలో లతాసుందరులు పెనవేసుకొన్న తరుశాఖలు కన్నుల పండువు చేస్తుంటాయి.

**వ. మఱియు మానసేంద్రియంబుల కానందకరంబులైన నానావిధ జలవిహంగమ మిథునంబులు గలిగి నిర్మల జలపూరితంబులై మత్స్యకుల సంచార క్షుభితంబులైన కుముదకువలయ కహ్లార లోహిత**

**శతపత్త్రాదికంబులం దేజరిల్లెడు సరోవరంబులు గల యుద్యాన వనంబుల యందుఁ గృతనికేతనులై స్వర్గభూముల నతిశయించిన వివిధ విహారంబులు గలిగి యహోరాత్రాది కాల విభాగ భయంబులు లేక మహాహిప్రవరులయిన శేషాదుల శిరోమణి దీధితులచే నంధకారోపద్రవంబు లేక యెల్లప్పుడు దివసాయమానంబుగా నుండు; నా లోకంబునందు నఖిల జనులు దివ్యౌషధి రస రసాయనంబుల ననవరతంబు నన్నపానంబులుగా సేవించుటం జేసి యచ్చటివారలకు నాధివ్యాధులును, వలిత పలితంబులును, జరారోగంబులును, శరీర వైవర్ణ్యంబులును, స్వేదదౌర్గంధ్యంబులును గలుగక పరమకల్యాణ మూర్తు లగుచు హరిచక్రభయంబు దక్క నన్యంబగు మృత్యుభయంబు నొందక యుందు; రదియునుంగాక.**

**107**

**ప్రతి :** మఱియున్= ఇంతేకాక; మానస+ఇంద్రియంబులకున్= మనసుకూ, ఇంద్రియాలకూ; ఆనందకరంబులు+ఐన= ఆహ్లాదం కలిగించే; నానావిధ జలవిహంగమ మిథునంబులు+కలిగి= రకరకాలయిన నీటిపక్షుల జంటలు కలిగి; నిర్మలజలపూరితంబులు+ఐ= స్వచ్ఛమయిన నీళ్ళతో నిండినవై; మత్స్యకుల సంచారక్షుభితంబులు+ఐన= చేపల సంచారంచేత కలత పడినవయిన; కుముద= తెల్ల కలువలు; కువలయ= నల్ల కలువలు; కల్హార= ఎఱ్ఱ కలువలు; లోహితశతపత్ర+ ఆదికంబులన్= ఎఱ్ఱని తామరపూలతో; తేజరిల్లెడు= ప్రకాశించెడు; సరోవరంబులు+కల= సరస్సులుగల; ఉద్యానవనంబుల+ అందున్= ఉద్యానవనాలలో; కృతనికేతనులు+ఐ= ఏర్పరచుకొన్న ఇళ్ళు కలవారయి; స్వర్గ భూములన్= స్వర్గ ప్రదేశాలను; అతిశయించిన= మించిన; వివిధ విహారంబులు+కలిగి= రకరకాలయిన విహారాలు కలిగి; అహోరాత్ర+ఆది= పగలు, రాత్రి మొదలయిన; కాలవిభాగభయంబులున్ లేక= కాల భేదాలు లేక; మహా+అహిప్రవరులు+అయిన= గొప్ప సర్పశ్రేష్ఠులయిన; శేష+ఆదుల= శేషుడు మొదలయిన వారియొక్క; శిరోమణి దీధితులచేన్= పడగల మీది మణుల కాంతులచే; అంధకార+ఉపద్రవంబులు+లేక= చీకటి అనే ఉపద్రవం లేకుండా; ఎల్లప్పుడున్; దివసాయమానంబుగాన్= పట్టపగలుగా ఉండును; ఆ లోకంబు+అందున్= ఆ లోకంలో; అఖిల జనులు; దివ్య+ఓషధి రసరసాయనంబులన్= దివ్యమయిన మూలికల; రసరసాయనములను; అనవరతంబున్= ఎల్లప్పుడు; అన్నపానంబులు+కాన్; సేవించుటన్+చేసి= తినుట త్రాగుట వలన; అచ్చటి వారలకున్; ఆధివ్యాధులును= శారీరక, మానసిక రోగాలు; వలితపలితంబులును= చర్మపు ముడతలు, తల వెంట్రుకలు నెరవడం; జరారోగంబులును= ముసలితనమును రోగాలును; శరీర వైవర్ణ్యంబులును= దేహము పాలిపోవడం; స్వేదదౌర్గంధ్యంబులును= చెమటయొక్క దుర్వాసనయును; కలుగక; పరమ కల్యాణమూర్తులు+ అగుచున్= మిక్కిలి మంగళకరాలైన ఆకారాలు కలవారవుతూ; హరిచక్రభయంబు+తక్కన్= సుదర్శన చక్రం వలని భయం దప్ప; అన్యంబు+అగు= ఇతరమయిన; మృత్యుభయంబున్+ఒందక= మరణ భయంలేక; ఉందురు; అదియునున్+ కాక= అంతేగాక.

**తా :** మనసుకూ, ఇంద్రియాలకూ ఆహ్లాదం కలిగించే సరస్సులు కూడా అక్కడే ఉన్నాయి. ఆ సరోవరాలలో రకరకాలయిన నీటిపక్షుల జంటలు విహరిస్తుంటాయి. అక్కడ నీరు నిర్మలంగా ఉంటుంది. చేపలు ఈదుతూ కోనేటిలో కదలికలు కలిగిస్తాయి. ఆ సరోవరాలలో తెల్లకలువలూ, నల్లకలువలూ, ఎఱ్ఱకలువలూ, ఎఱ్ఱతామరపూవులూ ఉన్నాయి. అటువంటి సరస్సులు కలిగిన ఉద్యానవనాలలో వారు ఇళ్ళు ఏర్పరచుకొంటారు. స్వర్గ భూములను మించిన తావులలో వారు విహరిస్తుంటారు. వారికి పగలూ, రాత్రి అనే కాలభేదాల భయాలు ఉండవు. శేషుడు మొదలయిన సర్పరాజుల పడగల

మీద ఉన్న మణుల కాంతులవల్ల వారికి చీకట్లు ఉండవు. అక్కడ ఎప్పుడూ పట్టపగలులాగే ఉంటుంది. అక్కడివారు దివ్యమయిన మూలికల రసాలను, రసాయనాలను ఆహారంగా స్వీకరించడం వల్ల దేహవ్యాధులుగానీ, మనోవ్యాధులు గానీ వారికి ఉండవు. దేహం పాలిపోదు. ముడుతలు పడదు. జుట్టు నెరిసిపోదు. ముసలితనం రాదు. రోగాలు లేవు. చెమట దుర్వాసనలు ఉండవు. ఆకర్షణీయమయిన ఆకారాలు కలిగి ఉంటారు. వారికి సుదర్శనచక్ర భయం తప్ప మరే మృత్యుభయమూ ఉండదు.

**తే. అట్టి పాతాళలోకంబునందు విష్ణు, చక్ర మెప్పుడేనియుఁబ్రవేశంబు నొందు**
**నప్పు డెల్లను దైత్యకులాంగనలకు, గర్భసంపద లందంద కరఁగుచుండు. 108**

**ప్రతి :** అట్టి; పాతాళలోకంబు+అందున్; విష్ణుచక్రము= సుదర్శన చక్రము; ఎప్పుడు+ఏనియున్= ఎపుడయినా; ప్రవేశంబున్; ఒందున్= ప్రవేశించునో; అప్పుడు= ఆ సమయాన; ఎల్లను= సమస్తమైన; దైత్యకుల+అంగనలకున్= రాక్షస స్త్రీలకు; గర్భ సంపదలు= గర్భదోహదక్రియలు, అభివృద్ధి యెంత ఉన్నా; అందు+అందన్= తత్క్షణమే; కరఁగుచున్+ఉండున్= గర్భస్రావం జరుగుతుంది.

**తా :** అటువంటి పాతాళలోకంలో విష్ణుభగవానుని సుదర్శనచక్రం ఎపుడు ప్రవేశిస్తుందో అపుడే రాక్షస స్త్రీలకు గర్భస్రావం కలుగుతుంటుంది.

**చ. అతలమునందు నమ్మయునియాత్మజుఁడైన బలాసురుండు స**
**మ్మతిఁ జరియించు షణ్ణవతిమాయలఁ గూడి వినోద మందుచుం**
**గుతలములందు నేఁడు నొక కొందఱు నచ్చటి మాయఁజెంది సం**
**తతముఁజరించుచుండుదురు దప్పక మోహనిబద్ధచిత్తులై. 109**

**ప్రతి :** అతలము+అందున్= అతలమనే లోకంలో; ఆ+మయుని= ఆ మయాసురుని; ఆత్మజుఁడు+ఐన= కుమారుడైన; బల+అసురుండు= బలనామధేయుడయిన రాక్షసుడు; సమ్మతిన్= స్వేచ్ఛగా; షట్+నవతి+మాయలన్+కూడి= తొంభై ఆరు విధాలయిన మాయలతో కూడి; వినోదము+అందుచున్= వినోదిస్తూ; చరియించున్= విహరిస్తాడు; కుతలములు+ అందున్= భూలోకంలోనివారు; నేఁడు= ప్రస్తుతం; ఒక కొందఱున్= అనామకులయిన కొందఱు; అచ్చటి మాయన్+చెంది= ఆ మాయలకు లొంగిపోయి; సంతతమున్= సదా; తప్పక= మానక; మోహనిబద్ధ చిత్తులు+ఐ= సమ్మోహితాత్ములై; చరించుచుండుదురు= చరిస్తుంటారు.

**తా :** అతలమనే లోకంలో మయుని కుమారుడయిన బలాసురుడు స్వేచ్ఛగా విహరిస్తుంటాడు. అతడు తొంభైఆరు విధాలయిన మాయలతో వినోదిస్తుంటాడు. ఆ మాయలకు భూలోకంలోని వారు కొందరు లొంగిపోయి సమ్మోహితాత్ములై చరిస్తుంటారు.

**వ. అట్టి బలుని యావలింతలను స్వైరిణులు కామినులు పుంశ్చలు లను స్త్రీ గణంబులు జనియించి; రా కామినీ జనంబులు పాతాళంబుఁ బ్రవేశించిన పురుషునికి హాటక రసం బనియెడు సిద్ధరసఘుటిక నిచ్చి రససిద్ధునిం గావించి యతని యందు స్వవిలాసావలోకనానురాగస్మితసల్లాపోపగూహనాదుల నిచ్ఛా**

**విహారంబులు సలుపుచుండ నా పురుషుండు మదాంధుండై తానే సిద్ధుండ ననియును నాగాయుత బలుండ ననియును దలంచి నానావిధరతిక్రీడలఁబరమానందంబు నొందుచుండు. 110**

**ప్రతి :** అట్టి; బలుని; ఆవలింతలను= ఆవలింతలచేత; స్వైరిణులు= యథేచ్ఛగా చరించువారు; కామినులు= కామాధిక్యం కలవారు; పుంశ్చలులు+అను= కులటలు అనునట్టి; స్త్రీగణంబులు= స్త్రీల సమూహాలు; జనియించిరి= పుట్టారు; ఆ కామినీ జనంబులు= కాముకులయిన ఆ స్త్రీగణం; పాతాళంబున్= పాతాళమునందు; ప్రవేశించిన; పురుషునికిన్; హాటకరసంబు+అనియెడు= హాటకరసమను పేరుగల; సిద్ధరసఘుటికన్+ఇచ్చి= సిద్ధరస వైద్య సంప్రదాయానికి సంబంధించి తయారుచేసిన మాత్రను ఇచ్చి; రససిద్ధునిన్+కావించి= రససిద్ధిలో పరిపూర్ణుని గావించి; అతని+అందున్= అతనిలో; స్వవిలాస= తమదయిన తళుకుబెళుకులతో కూడిన; అవలోకన= చూపులతో; అనురాగ= అనురాగంతో; స్మిత= చిరునవ్వులతో; సల్లాప= సరసములైన ముచ్చటలతో; ఉపగూహన+ఆదులన్= కౌగిలింత మొదలయినవానితో; ఇచ్ఛావిహారంబులు సలుపుచుండన్= తమకు నచ్చినవిధంగా ఆ పురుషునితో విహారాలు చేస్తుండగా; ఆ పురుషుండు= ఆ మగవాడు; మద+అంధుండు+ఐ= పొగరుతో కనులు కాననివాడయి (గర్విష్ఠియై); తానే సిద్ధుండన్+అనియును= తానే సిద్ధపురుషుడనియు; నాగ+అయుత బలుండన్+అనియును= పదివేల ఏనుగుల సత్తువ కలవాడననియు; తలంచి; నానావిధరతిక్రీడలన్= వివిధరీతుల సురత క్రీడలతో; పరమ+ఆనందంబున్+ఒందుచున్+ఉండున్= మిక్కిలి ఆనందమును అనుభవిస్తూ ఉంటాడు.

**తా :** బలాసురుని ఆవులింతలనుండి స్వైరిణులు, కామినులు, కులటలు అనే స్త్రీసమూహాలు పుట్టారు. ఆ స్త్రీలు పాతాళంలో ప్రవేశించిన పురుషునికి హాటకరసమనే సిద్ధ ఘుటికను ఇచ్చి అతనిని రససిద్ధుని చేస్తారు. తమ తళుకుబెళుకు చూపులతో, హావభావ ప్రదర్శనలతో, చిరునవ్వులతో, సరససల్లాపాలతో, కౌగిలింతలతో అతనిని లోబరచుకొంటారు. తమకు నచ్చిన రీతిలో ఆ పురుషునితో విహారం సాగిస్తారు. పాతాళం ప్రవేశించిన ఆ పురుషుడు తానే సిద్ధపురుషుడనని భావిస్తాడు. దర్పంతో అతని కళ్ళు నెత్తికెక్కుతాయి. తాను పదివేల ఏనుగుల బలం కలవాడనని భావించుకొని రకరకాల రతిక్రీడలతో పరమానందం అనుభవిస్తుంటాడు.

**సీ. హాటకేశ్వరుఁడైన యంబికాధీశుండు వితలంబునందున వేడ్క నిలిచి**
**తనదు పార్షదభూతతతులతో బ్రహ్మ సర్గోపబృంహణమున నొక్కచోటఁ**
**బార్వతీ సంభోగపరుఁడగుచుండఁగా వారల వీర్యంబువలనఁబుట్టి**
**నట్టిది హాటకి యనియెడు నది యనిలాగ్నులు భక్షించి యంత నుమియ**

**తే. నదియు హాటక మనుపేర నతిశయిల్లి, వన్నె మీఱుచు శుద్ధసువర్ణమయ్యె**
**నా సువర్ణంబు నాలోకమందు నున్న, జనులకెల్లను వినుతభూషణము లయ్యె. 111**

**ప్రతి :** వితలంబునందునన్= వితలమనే లోకంలో; హాటక+ఈశ్వరుఁడు+ఐన= హాటకేశ్వర నామధేయుడయిన; అంబికా+ అధీశుండు= పార్వతీనాథుడు; తన; పార్షద భూతతతులతోన్= పరిజనమైన భూతగణాలతో; వేడ్కన్ నిలిచి= వేడుకతో నిలిచినవాడై; బ్రహ్మసర్గ+ఉపబృంహణమునన్= బ్రహ్మసృష్టిని వృద్ధిని పొందించటంకోసం; ఒక్కచోటన్; పార్వతీసంభోగ పరుఁడు+అగుచుండఁగాన్= పార్వతీదేవితో సురతక్రీడా క్రియయందు లగ్నం అగుచుండగా; వారల; వీర్యంబువలనన్; పుట్టినట్టిది= జనించినది; హాటకి+అనియెడు= హాటకి అను పేరుగల; నది; అంతన్= అటుపిమ్మట, దానిని; అనిల+అగ్నులు=

వాయువు అగ్ని; భక్షించి; ఉమియన్; అదియున్; హాటకము+అనుపేరన్= హాటకమనే పేరుతో; అతిశయిల్లి= పెంపొంది; వన్నె మీఱుచున్= శోభిల్లుతూ; శుద్ధ సువర్ణము+అయ్యెన్= పరిశుద్ధమయిన బంగారమయింది; ఆ సువర్ణంబున్= ఆ బంగారం; ఆ లోకము+అందున్+ఉన్న= ఆ వితల లోకంలో నివసించు; జనులకున్+ఎల్లను= జనులకంతా; వినుత భూషణములు+అయ్యెన్= కొనియాడదగిన సొమ్ములయినాయి.

**తా :** వితలమనే లోకంలో హాటకేశ్వరుడనే పేరు గలవాడూ, పార్వతీపతీ అయిన శివుడు భూతగణసమేతుడై ఉన్నాడు. శివుడు బ్రహ్మసృష్టిని వృద్ధి పొందించటంకోసం పార్వతీ సంభోగపరుడు కాగా వారి వీర్యంనుండి హాటకి అనే నది పుట్టింది. ఆ నదిలోని జలరూపమయిన వీర్యాన్ని వాయువుతోకూడా అగ్ని ఆహారంగా తీసుకొని ఉమియగా హాటకం అనే పరిశుద్ధమయిన బంగారం పుట్టింది. ఆ వితలంలోని వారికందరికిని ఆభరణరూపంలో ఆ కనకం ఉపయోగపడుతున్నది.

**సీ.** **ఆ క్రింద సుతలంబు నందు మహాపుణ్యుఁ డగు విరోచనపుత్త్రుఁడైన యట్టి**
**బలిచక్రవర్తి యా పాకశాసనునకు ముద మొసంగఁగఁగోరి, యదితిగర్భ**
**మున వామనాకృతిఁబుట్టి యంతటఁ ద్రివిక్రమ రూపమునను లోకత్రయంబు**
**నాక్రమించిన దానవారాతిచేత ముందటన యీఁబడిన యింద్రత్వ మిట్లు**

**ఆ.** **గలుగువాఁడు పుణ్యకర్మసంధానుండు, హరిపదాంబుజార్చనాభిలాషుఁ**
**దగుచు శ్రీరమేశు నారాధనము సేయు, చుండు నెపుడు నతిమహోత్సవమున.** **112**

**ప్రతి :** ఆ క్రిందన్= ఆ వితలంక్రిందగల; సుతలంబు+అందున్= సుతలలోకంలో; మహాపుణ్యుఁడు+అగు= గొప్ప పుణ్యాలు చేసినవాడయిన; విరోచనపుత్రుఁడు+ఐన= విరోచనుని కుమారుడైనట్టి; బలిచక్రవర్తి; ఆ పాకశాసనునకున్= పాకుడనే రాక్షసుని శాసించిన దేవేంద్రునకు; ముదము+ఒసంగఁగన్+కోరి= సంతోషపెట్టాలని; అదితిగర్భమునన్; వామన+ఆకృతిన్+పుట్టి= వామనాకారంతో జనించి; అంతటన్= ఆ పిదప; త్రివిక్రమ రూపమునను= త్రివిక్రమ స్వరూపంతో; లోకత్రయంబున్= ముల్లోకాలను ఆక్రమించిన; దానవ+అరాతిచేతన్= దానవులకు విరోధియైనవానిచేత; ముందటన్= ముందట; ఈన్+పడిన= ఇవ్వబడిన; ఇంద్రత్వం= స్వర్లోకాధిపత్యం; ఇట్లు; కలుగువాఁడు= ఈ విధంగా లభించినవాడు; పుణ్యకర్మ సంధానుండు= పుణ్యకర్మలు చేసినవాడు; హరిపద+అంబుజ+అర్చన+అభిలాషుఁడు= శ్రీహరి పాదపద్మాలను సేవించాలనే అభిలాష కలవాడు; అగుచున్; శ్రీరమా+ఈశున్= లక్ష్మీనాథుని; అతిమహా+ఉత్సవమునన్= మిక్కిలి సంబరంతో; ఆరాధనము+చేయుచుండున్= ఆరాధన చేస్తుంటాడు.

**తా :** వితలం కింద సుతలం ఉంది. సుతలంలో పుణ్యాత్ముడైన బలిచక్రవర్తి ఉన్నాడు. అతడు విరోచనుని కుమారుడు. శ్రీమన్నారాయణుడు ఇంద్రుని సంతోషపెట్టాలనుకొని అదితిగర్భంలో వామనుడై పుట్టాడు. త్రివిక్రమ రూపం ధరించి ముల్లోకాలను ఆక్రమించాడు. చివరకు విష్ణువు బలిచక్రవర్తికి సుతలంలో ఇంద్రత్వం అనుగ్రహించాడు. ఆ బలిచక్రవర్తి ఎన్నో పుణ్యకర్మలు చేశాడు. శ్రీహరి పాదపద్మాలను సేవించవలెననే అభిలాష కలవాడు. అతడు ఎంతో ఉత్సాహంతో లక్ష్మీశుడయిన శ్రీమన్నారాయణుని ఆరాధిస్తుంటాడు.

**వ.** **నరేంద్రా! సకల భూతాంతర్యామియుఁ దీర్ఘభూతుండును నయిన వాసుదేవుని యందుఁ జిత్తంబు గలిగి యిచ్చిన భూదానంబునకు సాక్షాత్కరించిన మోక్షంబు ఫలం బగుం; గాని పాతాళ స్వర్గరాజ్యంబులు**

**ఫలంబులు గానేర వయిన నెవ్వరికిని మోక్షంబు సాక్షాత్కృతంబు గాకుండుటంజేసి లోక ప్రదర్శనార్థంబు పాతాళ స్వర్గరాజ్యంబుల నిచ్చె; క్షుత పతన ప్రస్ఖల నాదులందును వివశుండైన యెడల నామస్మరణంబు సేయు పురుషుండు గర్మబంధంబు వలన విముక్తుం డగుచు సుజ్ఞానంబునం బొందు; నట్టి వాసుదేవుం డాత్మజ్ఞాన ప్రమోషణంబు సేయు మాయామయంబు లయిన భోగైశ్వర్యంబుల నెల్ల నెట్లొసంగు ననవలదు; భగవంతుండు యాచనచేసి సకల సంపదలఁ జేకొని శరీరమాత్రావశిష్టునిం జేసి వారుణపాశంబులం గట్టి విడిచినప్పుడు బలీంద్రు డిట్లనియె. 113**

**ప్రతి :** నర+ఇంద్రా= నరులలో శ్రేష్ఠుడయిన ఓ రాజా!; సకలభూత+అంతర్యామియున్= అన్ని ప్రాణులలో అంతర్యామిగా ఉండేవాడును; తీర్థభూతుండును= పుణ్యతీర్థంలాగున పవిత్రుడును అయిన; వాసుదేవుని+అందున్= నారాయణునియందు; చిత్తంబు+కలిగి= మనసు నిలుపుకొని; ఇచ్చిన; భూదానంబునకున్ మూడడుగుల భూదానంబునకు; సాక్షాత్కరించిన= త్రివిక్రమ స్వరూపంతో దర్శనమిచ్చినందుకు; మోక్షంబు= మోక్షమే; ఫలంబు+అగున్= ఫలమగును; కాని; పాతాళ స్వర్గరాజ్యంబులు= స్వర్గ రాజ్యంగాని, పాతాళ రాజ్యంగాని; ఫలంబులు+కానేరవు= ఫలాలు కావు; అయినన్; ఎవ్వరికిని; మోక్షంబు= ముక్తి; సాక్షాత్ కృతంబు+కాకుండుటన్+చేసి= కనిపించేది కాకుండుట వలన; లోకప్రదర్శన+అర్థంబు= ఇహలోకం వారికి ప్రదర్శించడానికోసం; పాతాళ స్వర్గరాజ్యంబులన్+ఇచ్చెన్= పాతాళ స్వర్గరాజ్యాలు ఇచ్చాడు; క్షుతపతన ప్రస్ఖలన+ఆదులందును= తుమ్మినపుడు, పడినప్పుడు కాలు జారినపుడు మొదలయినవేళల; వివశుండు+ఐన+ఎడలన్= ఒడలు మరచినవేళ; నామస్మరణంబు+చేయు= శ్రీమన్నారాయణుని పవిత్ర నామం స్మరించే; పురుషుండు= మనుజుడు; కర్మబంధంబువలనన్= రకరకాల కర్మబంధనాల నుండి; విముక్తుండు+అగుచున్= విముక్తిని పొందినవాడై; సుజ్ఞానంబునన్+పొందున్= మంచి జ్ఞానాన్ని పొందుతాడు; అట్టి; వాసుదేవుండు; ఆత్మజ్ఞాన ప్రమోషణంబు+చేయు= ఆత్మజ్ఞానాన్ని హరించునట్టి; మాయామయంబులు+అయిన= మాయామయమయిన; భోగ+ఐశ్వర్యంబులన్+ఎల్లన్= ఇహలోక భోగాలనన్నింటిని; ఎట్లు+ఒసంగున్+అనన్వలదు= ఎలా ప్రసాదిస్తాడు అనవద్దు; భగవంతుండు= పరమాత్ముడు; యాచనచేసి= యాచన నెపంతో; సకల సంపదలన్+చేకొని= అన్నిరకాలయిన సంపదలను; హరించి; శరీరమాత్ర+అవశిష్టునిన్+చేసి= దేహంమాత్రం మిగిలినవానిగా చేసి; వారుణ పాశంబులన్= వరుణ పాశాలతో; కట్టి= బంధించి; విడిచినప్పుడు; బలి+ఇంద్రుండు= ఇంద్రునివంటి బలిచక్రవర్తి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

**తా :** ఓ రాజా! వాసుదేవుడు అన్ని ప్రాణులలోనూ అంతర్యామిగా ఉండేవాడు. పైగా పుణ్యతీర్థంలాగున పవిత్రుడు. అటువంటి వాసుదేవుని మనసులో నిలుపుకొని బలిచక్రవర్తి భూదానం చేశాడు. అటువంటి భూదానానికి శ్రీమన్నారాయణుడు మెచ్చుకొని సాక్షాత్కరించాడు. ఆ సాక్షాత్కారానికి మోక్షమే ఫలం. అంతేగాని, స్వర్గ రాజ్యంగాని పాతాళ రాజ్యంగాని ఫలాలు కావు. అయితే ముక్తి అన్నది ఎవరికీ కనిపించేది కాదు. అందువల్ల, శ్రీహరి బలిచక్రవర్తికి లోకప్రదర్శనార్థం పాతాళస్వర్గ రాజ్యాలు ఇచ్చాడు.

తుమ్మినపుడూ, పడినప్పుడూ, కాలు జారినపుడూ, తెలివి తప్పినపుడూ శ్రీమన్నారాయణుని నామస్మరణంచేసే పురుషునికి కర్మబంధాలు ఉండవు. ఆ బంధాలనుండి విముక్తి పొంది సుజ్ఞానవంతుడవుతాడు. ఆత్మజ్ఞానం అనుగ్రహించే వాసుదేవుడు మాయామయమయిన ఇహలోక సుఖభోగాలనూ, అనశ్వరమయిన ఐశ్వర్యాలను ఏ విధంగా ప్రసాదిస్తాడనే

సందేహం వద్దు. శ్రీహరి యాచన నెపంతో బలిచక్రవర్తి సర్వసంపదలను హరించాడు. బలిని కేవలం శరీరమాత్రావశిష్టుని చేశాడు. వారుణ పాశాలతో బంధించి చివరకు వదలిపెట్టినపుడు బలిచక్రవర్తి ఈ విధంగా అన్నాడు.

**సీ. పరమేశ్వరునకు నెప్పటి పదార్థములందుఁదృష్ణ లేకుండుట దెలిసినాఁడ**
**నింద్రాదులెల్ల నుపేంద్రునిఁ బ్రార్థించి యడిగిరి గాని శ్రీహరికిఁగోరి**
**కలు లేవు; మిక్కిలి గంభీరమగు మహాకాలస్వభావంబు గలుగుచుండు**
**నరయంగ మన్వంతరాధిపత్యమును లోకత్రయంబును నెంత గానఁదలఁప**

**ఆ. మత్పితామహుండు మానవంతుండు ప్ర, హ్లాదవిభునిఁజూచి హర్షమంది**
**యెద్దియైనఁగోరు మిచ్చెద ననుటకు, నంతలోన నీశ్వరాజ్ఞఁదెలిసి. 114**

**ప్రతి :** పరమేశ్వరునకున్= భగవంతునికి; ఎప్పటి పదార్థములు+అందున్; తృష్ణలేకుండుట= ఆశ లేకుండుటను; తెలిసినాఁడన్= తెలిసినవాడను; ఇంద్రాదులు+ఎల్లన్= ఇంద్రుడు మొదలయిన దేవతలు; ఉపేంద్రునిన్+ప్రార్థించి; అడిగిరి+కాని; శ్రీహరికిన్; కోరికలు లేవు= కాంక్షలు లేవు; మను+అంతర+ఆధిపత్యమును= మన్వంతర కాలందాక ఆధిపత్యం; లోకత్రయంబును= ముల్లోకాలూ; అరయన్+కన్= పరిశీలించగా; మిక్కిలి గంభీరము+అగు= బాగా లోతైన; మహాకాలస్వభావంబు= మహాకాలంలో లీనమయిపోవుట; కలుగుచున్+ఉండున్= కలిగి ఉంటాయి; కానన్= అందువలన; తలఁపన్= ఆలోచింపగా; ఎంత= మన్వంతరాధిపత్యంకాని, ముల్లోకాలుకాని ఎంతటివి; మత్+పితామహుండు= మా తాత; మానవంతుండు= అభిమానం కలవాడగు; ప్రహ్లాదవిభునిన్+చూచి= ప్రహ్లాద ప్రభువుని గాంచి; హర్షము+అంది= సంతోషపడి; ఎద్ది+ఐనన్+కోరుము+ఇచ్చెదన్= ఏది అయిన కోరుము ప్రసాదింతును; అనుటకున్= స్వామి చెప్పడంలోని ఆంతర్యం గ్రహించిన ప్రహ్లాదుడు; అంతలోనన్; ఈశ్వర+ఆజ్ఞన్= ఈశ్వర ఆజ్ఞలోని ఆంతర్యం; తెలిసి= గ్రహించి.

**తా :** భగవంతునికి ఎటువంటి పదార్థాలపైన కూడా కాంక్షలేదని తెలుసు. ఇంద్రుడు మొదలయిన దేవతలు ఉపేంద్రుని ప్రార్థించడంవల్ల ఆ స్వామివచ్చి నిన్ను యాచించాడు. అంతేకాని అసలు శ్రీహరికి కోరికలనేవి లేవు. అన్నీ మహాకాలంలో లీనమైపోతాయి. ఈ దృష్టి ఉన్నవారికి మన్వంతరాధిపత్యమెంత? త్రిలోకాధిపత్యమెంత? మా పితామహుడు ప్రహ్లాదుడు అభిమానవంతుడు. నరసింహావతారంలో ఆ స్వామి ఎంతో సంతోషంతో మా తాతనుచూచి ఏది అడిగితే అది ఇస్తానని అన్నాడు. అప్పుడు మహానుభావుడైన ప్రహ్లాదుడు ఈశ్వరాజ్ఞలోని అంతరార్థం తెలుసుకొన్నాడు.

**వ. ఇట్లకుతోభయంబు, పిత్ర్యంబయిన రాజ్యంబు నొల్లక పరమేశ్వరు దాస్యంబ కోరె, నా ప్రహ్లాద చరిత్ర కథనావసరమ్మున నీ తండ్రికిని నీకును విశేషంబుగా నే పురుషుండు భగవదనుగ్రహంబుఁ బొంద నోపు నని పుండరీకాక్షుం డానతిచ్చిన వాక్యంబులు వక్ష్యమాణగ్రంథంబున విస్తరించెద! నా బలిచక్రవర్తి గృహద్వారంబున నఖిల లోకగురుండైన శ్రీమన్నారాయణుండు గదాపాణియును నిజజనానుకంపితుండును శంఖచక్రాద్యాయుధ ధరుండును నగుచు నిప్పుడును దేజరిల్లుచుండు; నట్టి బలిద్వారంబున నున్న గరుడధ్వజుండు లోకంబుల గెలువ నిచ్చుగొన్న దశగ్రీవుం డుల్లంఘిత శాసనుండై ప్రవేశంబు గావింపఁ దన పాదాంగుష్ఠంబున యోజనాయుతాయుతంబులం బాఱఁజిమ్మె, వినుము. 115**

**ప్రతి :** ఇట్లు= ఈ రకంగా; అకుతోభయంబు= ఎవరివల్లా భయంలేని; పిత్ర్యంబు+అయిన= తన తండ్రిదయిన; రాజ్యంబున్+ ఒల్లక= రాజ్యం కావాలని కోరక; పరమేశ్వరు దాస్యంబు+అ= పరమేశ్వరునకు దాసుడుగా ఉండడాన్నే; కోరెన్= కోరెను; ఆ ప్రహ్లాద చరిత్ర కథన+అవసరమ్మునన్= ఆ ప్రహ్లాదుని కథను చెప్పే సందర్భంలో; నీ తండ్రికినిన్; నీకునున్; విశేషంబు+కాన్; ఏ పురుషుండు; భగవత్+అనుగ్రహంబున్+పొందన్+ఓపున్+అని= పొందజాలునని; పుండరీక+అక్షుండు= పద్మాల వంటి కన్నులుగల విష్ణువు; ఆనతి+ఇచ్చిన= సెలవిచ్చిన; వాక్యంబులు; వక్ష్యమాణ గ్రంథంబునన్= ముందు చెప్పబోయే గ్రంథాలలో; విస్తరించెదన్= విపులీకరిస్తాను; ఆ బలిచక్రవర్తి; గృహద్వారంబునన్= ఇంటివాకిట; అఖిల లోకగురుండు+ఐన= సమస్త లోకములకు గురువయిన; శ్రీమత్+నారాయణుండు= శ్రీ మహావిష్ణువు; గదాపాణియును= గదను ధరించినవాడును; నిజజన+అనుకంపితుండును= స్వజనులపట్ల విశేషమయిన దయకలవాడును; శంఖచక్ర+ఆది ఆయుధధరుండును= పాంచజన్య శంఖం, సుదర్శన చక్రం మొదలగు ఆయుధాలను ధరించినవాడును; అగుచున్; ఇప్పుడున్; తేజరిల్లుచుండున్= ప్రకాశిస్తూ ఉంటాడు; అట్టి బలి ద్వారంబునన్= అట్టి బలిచక్రవర్తి వాకిట; ఉన్న= ఉన్నటువంటి; గరుడధ్వజుండు= శ్రీమహావిష్ణువు; లోకంబులన్; గెలువన్= గెలువడానికి; ఇచ్ఛన్+కొన్న= కోరికగల; దశగ్రీవుండు= పదితలలుగల రావణుడు; ఉత్+లంఘితశాసనుండు+ఐ= అతిక్రమించిన మర్యాదలు కలవాడై; ప్రవేశంబున్+కావింపన్= చొరబడడానికి ప్రయత్నించగా; తనపాద+అంగుష్ఠంబునన్= తన కాలి బొటనవ్రేలితో; యోజన+అయుత+అయుతంబులన్= పదికోట్ల యోజనాల దూరంలో; పాఱన్ చిమ్మెన్= పడేటట్లు చిమ్మివేశాడు; విను= ఆలకించుము.

**తా :** అందువల్ల ఆయన ఎవరివల్లా భయంలేని తన తండ్రి రాజ్యం కావాలని కోరలేదు. పరమేశ్వరుని దాస్యాన్నే కోరాడు. అప్పుడు 'నీ తండ్రికంటె నీకంటె విశేషంగా ఏ పురుషుడు భగవదనుగ్రహం పొందగలుగుతాడు' అంటూ ఆ పుండరీకాక్షుడు పలికిన పలుకుల సారాన్ని తరువాతిభాగంలో (సప్తమ స్కంధంలో) విస్తరించి చెబుతాను. సకల సద్గురుడైన శ్రీమన్నారాయణుడు తనవారిపట్ల దయ కలిగినవాడై శంఖం చక్రం మొదలయిన ఆయుధాలతో గదను ధరించి ఆ బలిచక్రవర్తి గృహద్వారంలో ఇప్పటికి కూడా కాపలా కాస్తున్నాడు. అటువంటి బలిచక్రవర్తి ఉండే సుతల లోకాన్ని జయించాలనే వాంఛగొన్న రావణుడు అనుజ్ఞలేకుండా సుతలంలోనికి ప్రవేశించినపుడు ఆ శ్రీమన్నారాయణుండు తన కాలి బొటనవ్రేలితో లంకేశ్వరుణ్ణి పదికోట్ల యోజనాలదూరంలో పడేటట్లు చిమ్మివేశాడు.

**క. ఆ సుతలమునకుఁగ్రిందై, భాసిల్లుఁదలాతలంబు; ప్రభువందు మయుం**
**దాసురపుర నిర్మాతగ, వాసిగఁబొగడంది యేలు వసుధాధీశా! 116**

**ప్రతి :** వసుధా+అధీశా!= రాజా!; ఆ సుతలమునకున్= ఆ సుతల లోకానికి; క్రిందు+ఐ= కిందిభాగంలో; తలాతలంబు= తలాతలమనే పేరు గల లోకం; భాసిల్లున్= ప్రకాశించును; అందున్ ప్రభువు= ఆ తలాతల లోకానికి రాజు మయుడు; ఆసురపుర నిర్మాతగన్= రాక్షసుల పట్టణాలు నిర్మించిన మహాశిల్పిగ; వాసిగన్= ప్రశస్తముగ; పొగడు+అంది= పొగడ్తల గన్నవాడై; ఏలున్= పాలించును.

**తా :** రాజా! ఆ సుతలానికి కిందిభాగంలో తలాతలం ఉంది. ఆ తలాతలానికి మయుడు ప్రభువు. రాక్షసుల పట్టణాలు నిర్మించిన మహాశిల్పిగా ప్రసిద్ధుడయిన మయుడు తలాతలాన్ని పాలిస్తుంటాడు.

**చ. పురహరుచే రమేశ్వరుఁడు భూతహితార్థముగాఁబురత్రయం**
**బరుదుగ నీఱుసేసె; శరణాగతు నా మయుఁగాఁచి యెంతయుం**

**గరుణఁదలాతలంబునకుఁగర్తఁగ నిల్పిన నున్నవాఁడు శ్రీ**
**ధరుని సుదర్శనంబునకుఁదప్పి విముక్తభయుండుఁగాఁదగన్. 117**

**ప్రతి :** రమా+ఈశ్వరుఁడు= లక్ష్మీపతి; భూతహిత+అర్థము+కాన్= ప్రాణికోటికి హితం కలిగించడానికోసం; పురహరుచేన్= పురాలను బూడిద చేసిన శివునిచే; పురత్రయంబు= మూడు పట్టణాలను; అరుదు+కన్= ఆశ్చర్యంగా; నీఱు+చేసెన్= బూడిద చేశాడు; శరణ+ఆగతున్= శరణు జొచ్చినట్టి; ఆ మయున్= ఆ మయ అనే పేరుగల రాక్షసుని; కాచి= కాపాడి; ఎంతయున్= మిక్కిలి; కరుణన్= దయతో; తలాతలంబునకున్; కర్తఁగన్; నిల్పినన్= నిలుపగా; శ్రీధరుని= లక్ష్మీపతియొక్క; సుదర్శనంబునకున్= సుదర్శనాయుధానికి; తప్పి= తొలగి; విముక్తభయుండున్+కాన్= ప్రాణభయం నుండి బయటపడినవాడై; ఉన్నవాఁడు= ఉంటున్నాడు.

**తా :** శ్రీ మహావిష్ణువు జీవులకు హితం కలిగించడంకోసం శివునిచేత త్రిపురాలను బూడిద చేయించాడు. అప్పుడు మయుడు విష్ణువును శరణు పొందాడు. శ్రీహరి మయుని కరుణించి తలాతలానికి రాజుగా చేశాడు. అతనికి విష్ణుదేవుని సుదర్శనచక్రంవల్ల తప్ప మరి దేనివల్లనూ మరణభయం లేదు.

**క. తలఁపఁగ నా క్రింద మహా, తలమునఁగద్రువవధూటి తనయులు సర్పం**
**బులు గలవు పెక్కు శిరములు, నలరంగాఁ గ్రోధవశగణావళి యనఁగన్. 118**

**ప్రతి :** తలఁపఁగన్= తలంపగా; ఆ క్రిందన్= ఆ తలాతలానికి కింద; మహాతలమునన్= మహాతలంలో; కద్రువ వధూటి తనయులు= కద్రువ కొడుకులు; సర్పంబులు= పాములు; పెక్కుశిరములు= అనేకములైన తలలు; అలరంగాన్= ఒప్పగా; క్రోధవశగణ+ఆవళి= కోపంతో నిండిన గుంపులు; అనఁగన్= అని చెప్పదగినవి; కలవు= ఉన్నాయి.

**తా :** తలాతలానికి కింద మహాతలం ఉంది. ఆ మహాతలంలో కద్రువ కొడుకులయిన సర్పరాజులు ఉన్నారు. వారికి ఒక్కొక్కరికి పెక్కు తలలున్నాయి. ఆ సర్పగణం క్రోధవశమై ఉంటుంది.

**వ. మఱియును గుహక తక్షక కాళియ సుషేణాది ప్రధాను లయినవార లతులశరీరంబులు గలిగి యాదిపురుషుని వాహనంబైన పతగరాజభయంబున ననవరతంబు నుద్వేజితు లగుచు స్వకళ త్రాపత్య సుహృద్బాంధవ సమేతు లయి యుండుదు; రా క్రింద రసాతలంబున దైత్యులు దానవులు నగు నివాతకవచ కాలకేయులను హిరణ్యపుర నివాసులగు దేవతాశత్రువులు మహాసాహసులును దేజోఽధికులును నగుచు సకల లోకాధీశ్వరుండైన శ్రీహరితేజంబునం బ్రతిహతులై వల్మీకంబులందు నడంగియున్న సర్పంబుల చందంబున నింద్రదూతి యగు సరమచేఁ జెప్పఁబడెడు మంత్రాత్మక వాక్యంబులకు భయంబు నొందు చుండుదురు. 119**

**ప్రతి :** మఱియును= అంతేగాక; కుహక; తక్షక; కాళియ; సుషేణ+ఆది ప్రధానులయినవారలు= ముఖ్యులైనవారు; అతుల శరీరంబులున్+కలిగి= సాటిలేని మేటి దేహాలు కలిగినవారయి; ఆదిమపురుషుని వాహనంబు+ఐన= ఆదిపురుషుడయిన నారాయణుని వాహనమయిన; పతగ రాజభయంబునన్= గరుత్మంతుని భయంవల్ల; అనవరతంబున్= ఎల్లప్పుడు; ఉద్వేజితులు+అగుచున్= కలవరపడుచు; స్వకళత్ర= తమ భార్యలతో; అపత్య= సంతానంతో; సుహృద్= మిత్రులతో;

బాంధవ సమేతులు+ఐ= బంధువులతో కూడినవారై; ఉండుదురు; ఆ క్రిందన్= ఆ మహాతలంకింద; రసాతలంబునన్; దైత్యులు దానవులును+అగు; నివాతకవచ కాలకేయులు+అను= నివాతకవచులు, కాలకేయులు అను; హిరణ్యపుర నివాసులు+అగు= హిరణ్యపురంలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకొన్నవారగు; దేవతాశత్రువులు= దేవతలకు విరోధులైనవారూ; మహాసాహసులును= గొప్ప సాహసం కలవారును; తేజస్+అధికులును అగుచున్= తేజస్సుచే గొప్పవారగుచు; సకలలోక+ అధీశ్వరుండు+ఐన= సమస్త లోకాలకు ప్రభువయిన; శ్రీహరి తేజంబునన్= శ్రీహరి తేజముచేత; ప్రతిహతులు+ఐ= కొట్టబడిన వారలయి అణచబడినవారై; వల్మీకంబులు+అందున్= పుట్టలలో; అడంగి+ఉన్న= అణగియున్న; సర్పంబుల చందంబునన్= పాములవలె; ఇంద్రదూతి+అగు= ఇంద్రుని దూతి అయిన సరమచే; చెప్పన్+పడెడు= ఉచ్చరింపబడే; మంత్ర+ఆత్మక వాక్యంబులకున్= మంత్ర స్వరూపమైన వాక్యాలకు; భయంబున్+ఒందుచున్= దిగులు పడుచు; ఉండుదురు= ఉంటారు.

**తా :** ఆ మహాతలంలో కుహకుడు - తక్షకుడు, కాళియుడు, సుషేణుడు మొదలయిన సర్పముఖ్యులున్నారు. వారు సాటిలేని మేటిరూపం కలవారు. ఆదిపురుషుడయిన నారాయణుని వాహనమయిన గరుత్మంతుని భయంవల్ల ఎల్లప్పుడూ కలవరపడుతూ భార్యలతో, బిడ్డలతో, మిత్రులతో, బాంధవులతో కలిసి ఉంటారు. మహాతలం కింద రసాతలం ఉన్నది. ఆ రసాతలంలో దైత్యులు, దానవులూ అయిన హిరణ్యపురవాసులు, నివాతకవచులు, కాలకేయులు అనువారు నివాసం చేస్తుంటారు. వారు దేవతలపట్ల శత్రుత్వం వహించి ఉంటారు. మహాసాహసవంతులు, తేజస్సు కలవారు అయినా అన్ని లోకాలకూ ప్రభువయిన శ్రీహరి తేజస్సుకు లొంగిపోయి పుట్టలలో దాగిన సర్పాల మాదిరిగా ఇంద్రుని దూతి అయిన సరమ ఉచ్చరించే మంత్రాలకు బద్ధులై భయంతో బతుకుతుంటారు.

**క. ఇందుకులోద్భవ! వినుమా, క్రిందటి పాతాళమునను గ్రీడించుచు నా**
**నందము నొందుచు నుండును, సందడిఁబడి నాగకులము చతురతతోడన్. 120**

**ప్రతి :** ఇందుకుల+ఉద్భవ= చంద్రవంశంలో పుట్టినవాడా!; వినుము; ఆ క్రిందటి= అన్నిటికన్న కిందగల; పాతాళమునను= పాతాళలోకంలో; నాగకులము= నాగజాతి; చతురత తోడన్= చాతుర్యంతో; సందడిన్+పడి= సందడిలో మునిగి తేలినదై; క్రీడించుచున్= స్వేచ్ఛామయ క్రీడలలో పాల్గొనుచు; ఆనందమున్ ఒందుచున్+ఉండును= ఆనందమును అనుభవిస్తూ ఉంటుంది.

**తా :** చంద్రవంశంలో పుట్టిన మహారాజా! విను. అన్నిటికన్నా దిగువ పాతాళలోకముంది. ఆ పాతాళలోకంలోని నాగజాతివారు ఎంతో తెలివిగలవారయి ఎంతో ఉత్సాహంగా తిరుగుతుంటారు.

**వ. ఇట్లు వాసుకి ప్రముఖులైన శంఖ కుళిక మహాశంఖ శ్వేత ధనంజయ ధృతరాష్ట్ర శంఖచూడ కంబళాశ్వతర దేవదత్తాదు లయిన మహానాగంబు లై దాతేదు పదియు నూఱు వేయు శిరంబులు గలిగి ఫణామణికాంతులం జేసి పాతాళతిమిరంబును బాపుచుండుదురు. 121**

**ప్రతి :** ఇట్లు; వాసుకి ప్రముఖులు+ఐన= వాసుకి మొదలయిన, వాసుకి అంతటి ప్రాముఖ్యం కలవారయిన; శంఖ; కుళిక; మహాశంఖ; శ్వేత; ధనంజయ; ధృతరాష్ట్ర; శంఖ చూడ; కంబళ; అశ్వతర; దేవదత్త+ఆదులు+అయిన= శంఖాది నామములుగల; మహానాగంబులు= గొప్ప సర్పాలు; ఐదు; ఆఱు; ఏడు; పదియు; నూఱు; వేయు; శిరంబులు+కలిగి=

తలలు గల్గి; ఫణామణి కాంతులన్+చేసి= తమ పడగలమీది మణులకాంతులతో; పాతాళ తిమిరంబును= పాతాళంలోని చీకట్లను; పాపుచుండుదురు= పారదోలుతుంటారు.

**తా :** వాసుకి, శంఖుడు, కుళికుడు, మహాశంఖుడు, శ్వేతుడు, ధనంజయుడు, ధృతరాష్ట్రుడు, శంఖచూడుడు, కంబళుడు, అశ్వతరుడు, దేవదత్తుడు మొదలైన మహానాగులు. వారిలో కొందరు ఐదుతలలవారు. కొందరు ఆరు తలలవారు. మఱికొందరు పది తలలవారు. ఇంకా కొందరు నూరు తలలవారు, వేయితలలవారు కూడా ఉన్నారు. వారి పడగలమీద మణులు మెరుస్తుంటాయి. ఆ మణుల కాంతులు పాతాళంలోని చీకట్లను పారదోలుతుంటాయి.

**సీ. పాతాళలోకంబు పాఁతున శేషుండు వెలయంగ ముప్పదివేల యోజ**
**నంబుల వెడలుపునను దోఁకఁజుట్టఁగాఁ జుట్టుకయుండు; విష్ణుని మహోగ్ర**
**మైన శరీరంబు; దానై యనంతాఖ్య సంకర్షణుండుండు సంతతంబు,**
**నట్టి యనంతనామాభిధానుని మస్తకమున సిద్ధార్థంబుకరణి ధరణి**

**ఆ. యంత నా విభుండు నఖిలలోకంబుల, సంహరింపఁగోరి చండకోప**
**వశత సృజనఁజేయు వరుస నేకాదశరుద్రమూర్తు లనెడు రౌద్రమతుల. 122**

**ప్రతి :** పాతాళలోకంబు= పాతాళలోకానికి; పాఁతునన్= అడుగున; శేషుండు= ఆదిశేషుడు; వెలయంగన్= ఒప్పగా; ముప్పదివేల యోజనంబుల వెడలుపునను= ముప్ఫైవేల యోజనాల వెడల్పున; తోఁకన్= తోకను; చుట్టఁగాన్+చుట్టుక+ఉండున్= చుట్టగా చుట్టుకొని ఉంటుంది; విష్ణుని= విష్ణుదేవునియొక్క; మహా+ఉగ్రము+ఐన శరీరంబు= ఎంతో భయంకరమయిన శరీరం; తాను+ఐ= తానుగా; సంతతంబున్= ఎల్లప్పుడు; అనంత+ఆఖ్యసంకర్షణుండు= అనంతుడు, సంకర్షణుడు అను పేర్లతో నుండును; అట్టి= అటువంటి; అనంతనామ+అభిధానుని= అనంతుడు అనే పేరుగల వాని; మస్తకమునన్= తలమీద; ధరణి= భూమి; సిద్ధార్థంబు+కరణి= ఆవగింజలాగున ఉన్నది; అంతన్; ఆ విభుండు= ఆ ఆదిశేషుడు; అఖిలలోకంబులన్= సకల లోకాలను; సంహరింపన్+కోరి= సంహరించే నిమిత్తం; చండకోపవశతన్= భయంకరమయిన కోపంతో; ఏకాదశ రుద్రమూర్తులు+అనెడు= పదకొండు మంది రుద్ర మూర్తులనేవారిని; రౌద్రమతులన్= భీతిగొలిపే మనస్సు గలవారిని; సృజన+చేయున్= సృష్టిస్తాడు.

**తా :** పాతాళలోకం అడుగున ఆదిశేషుడు ఉన్నాడు. అతడు ముప్పదివేల యోజనాల వెడల్పున తన శరీరాన్ని చుట్ట చుట్టుకొని ఉంటాడు. విష్ణుమహాదేవుని మహోగ్రశరీరమయిన ఆదిశేషునికే అనంతుడు, సంకర్షణుడు అని పేర్లు. అనంతుడని పేరు గల ఆదిశేషుని తలమీద ఆవగింజలాగున ఈ భూమండలం ఉన్నది. ప్రళయకాలంలో లోకాలను సంహరించే నిమిత్తం ఈ ఆదిశేషుడు ప్రచండమయిన కోపంతో పదునొకండు మంది రుద్రులను సృష్టిస్తాడు.

**ఆ. అట్టి రుద్రమూర్తు లతులత్రినేత్రులు, నఖిలశూలహస్తులగుచునుందు;**
**రందు నున్న ఫణికులాధిపుల్ శేషుని, పాదపంకజముల భక్తిఁజేరి. 123**

**ప్రతి :** అట్టి= అలాంటి; రుద్రమూర్తులు; అతుల= సాటిలేని; త్రినేత్రులు= మూడు కన్నులు కలవారు; అఖిల శూలహస్తులు+అగుచున్+ఉందురు= సమస్తములైన త్రిశూలాల చేతబట్టినవారుగా నుందురు; అందున్+ఉన్న= అక్కడున్న; ఫణికుల+అధిపుల్=

సర్పకులాధిపతులు; శేషుని= ఆదిశేషుని; పాదపంకజములన్= పద్మాల వంటి పాదాలను; భక్తిన్+చేరి= భక్తితో సమీపించినవారలయి...

**తా :** ఆ రుద్రమూర్తులందరూ మూడుకన్నులు కలవారు. త్రిశూలధరులు. ఆ లోకంలోని సర్పరాజగణం శేషుని పాదపద్మాలను భక్తితో సేవిస్తూ ఉంటుంది.

**ఆ. నమ్రు లగుచు ననుదినంబును మౌళి ర, త్నములచేతఁగడు ముదంబు నొంది**
**కోరికలు దలిర్ప నీరాజనంబుల, నిచ్చుచుందు రెపుడు మచ్చికలను. 124**

**ప్రతి :** నమ్రులు+అగుచున్= వినమ్రత కలవారగుచు; అనుదినంబును= ప్రతిరోజు; మౌళిరత్నములచేతన్= పడగలమీది రత్నకాంతులతో; కడున్= మిక్కిలి; ముదంబున్+ఒంది= సంతోషమంది; కోరికలు+తలిర్పన్= కాంక్షలు చిగురింప; నీరాజనంబులన్= ఆరతులను; ఎపుడున్= ఎల్లప్పుడు; మచ్చికలను= ఆసక్తితో; ఇచ్చుచుందురు= ఇస్తుంటారు.

**తా :** అణకువగలవారై, ప్రతిరోజు మిక్కిలి సంతోషంతో, తమ కోరికలీడేరగా, పడగలమీదనున్న మణులతో నిరంతరం ఆసక్తితో హారతులిస్తుంటారు.

**వ. మఱియు నా సంకర్షణమూర్తిం జేరి నాగకన్యకలు కోరికలు గలవార లగుచు నొప్పెడి శరీర విలాసంబులంజేసి యగురు చందన కుంకుమ పంకంబు లనులేపనంబులు సేయుచు, సంకర్షణ మూర్తి దర్శన స్పర్శనాదుల నుద్బోధిత మకరధ్వజావేశిత చిత్తంబులు గలిగి చిఱునవ్వు లొలయ నధికాభిలాషం జేసి స్మితావలోకనంబుల సవ్రీడితలై యవలోకించుచుండ ననంత గుణంబులు గల యనంత దేవుం డుపసంహరింపఁ బడిన క్రోధంబు గలిగి లోకంబులకు క్షేమంబు గోరుచు సురాసుర సిద్ధ గంధర్వ విద్యాధర మునిగణంబు లనవరతంబు ధ్యానంబు సేయ సంతత సంతోషాతిశయంబున మ్రాఁగన్ను వెట్టుచు, సలలిత గీతావాద్యంబుల నానందంబు నొందుచుఁ, దన పరిజనంబుల నతిస్నేహంబున నవలోకించుచు, నవతులసీగంధ పుష్పరసామోదిత మధుకర వ్రాత మధుర గీతంబులు గల వైజయంతీ వనమాలికల ధరియించుచు నీలాంబరధరుండును, హలధరుండును నగుచు నితండు మహేంద్రుఁడొ హరుండొ యనుచు జనంబులు వలుకుచుండఁ గాంచనాంబరధరుండై ముముక్షువులు ధ్యానంబులు సేయ నధ్యాత్మ విద్యాయుక్తంబయిన యానంద హృదయ గ్రంథిని భేదించు నట్టి శేషుని స్వాయంభువుండగు నారదుండు తుంబురు ప్రభృతులగు ఋషి శ్రేష్ఠులతోఁజేరుకొని కమలాసనుని సభాస్థానంబునందు నిట్లు స్తుతియించుచుండు. 125**

**ప్రతి :** మఱియున్; ఆ సంకర్షణమూర్తిన్+చేరి= వ్యూహరూపమయిన సంకర్షణుని చేరి; నాగకన్యకలు= నాగలోకం లోని పెండ్లికాని కన్యలు; కోరికలు+కలవారలు+అగుచున్= కాంక్షలు కలవారగుచు; ఒప్పెడి= ప్రకాశించెడి; శరీర విలాసంబులన్+చేసి= దేహసంబంధమైన వివిధ విలాసాలను ప్రదర్శించి; అగురు= అగురు; చందన= శ్రీగంధం; కుంకుమపంకంబులు= కాశ్మీర పంకంబుల; అనులేపనంబులు+చేయుచున్= పూతలు పూయుచు; సంకర్షణమూర్తి= ఆ అనంతమూర్తి; దర్శన స్పర్శన+ఆదులన్= చూడడం, తాకడం మొదలైన వానిచే; ఉద్బోధిత= మేల్కొల్పబడిన; మకర

ధ్వజ+ఆవేశిత చిత్తంబులు+కలిగి= మన్మథునిచేత ఆవేశింపబడిన చిత్తాలు కలిగి; చిరునవ్వులు+ఒలయన్= చిరునవ్వులు చిందిస్తూ; అధిక+అభిలాషన్+చేసి= అణచుకోవడానికి వీలు లేనంత కోరికలవలన; స్మిత+అవలోకనంబులన్= చిరునవ్వుతోకూడిన చూపులతో; సవ్రీడితలు+ఐ= సిగ్గులు కలవారయి; అవలోకించుచుండన్= చూస్తుండగా; అనంతగుణంబులు+కల= అసంఖ్యాక కల్యాణ గుణాలుగల; అనంతదేవుండు= అనంతుడనే పేరుగల దేవుడు; ఉపసంహరింపన్+పడిన= శమింప చేయబడిన, అణచుకొనిన; క్రోధంబు+కలిగి= కోపం కలిగి; లోకంబులకున్= సర్వలోకాలకు; క్షేమంబు+కోరుచున్= కుశలాన్ని వాంఛిస్తూ; సుర+అసుర, సిద్ధ, గంధర్వ, విద్యాధర మునిగణంబులు= సురలు, అసురులు, సిద్ధులు, గంధర్వులు, విద్యాధరులు, మునుల సమూహాలు; అనవరతంబు= ఎడతెగకుండ; ధ్యానంబు+చేయన్= ధ్యానం చేయగా; సంతత సంతోష+అతిశయంబునన్= ఎల్లప్పుడు కలిగిన సంతోషంయొక్క ఆధిక్యంతో; మ్రాఁగన్ను పెట్టుచున్= అరమోడ్పు కనులతో; సలలితగీతా వాద్యంబులన్= లలిత గీతాలతో, వాద్యాలతో; ఆనందంబున్= సంతోషాన్ని; ఒందుచున్= పొందుతూ; తన పరిజనంబులన్= తనతోడి పరిజనాన్ని; అతిస్నేహంబునన్= మిక్కిలి ప్రేమతో; అవలోకించుచున్= చూస్తూ; నవతులసీ= అపుడే కొత్తగా కట్టిన తులసీదళాలయొక్క; గంధ= సువాసనచే; పుష్పరస+ఆమోదిత= మకరందంచే సంతోషితమైన; మధుకరవ్రాత= తుమ్మెదల సమూహంయొక్క; మధురగీతంబులుగల= ఇంపయిన పాటలుగల; వైజయంతీ వనమాలికలన్; ధరియించుచున్= మెడనుండి పాదాలవరకు వ్రేలాడు తోమాలం ధరిస్తే; నీల+అంబరధరుండును= నల్లని వస్త్రాలు ధరించిన వాడును; హలధరుండును= నాగేటిని ధరించినవాడును; అగుచున్; ఇతండు; మహా+ఇంద్రుండు+ఒ= అమరావతి ప్రభువో; హరుండు+ఒ= ఈశ్వరుడో; అనుచున్; జనంబులు; పలుకుచుండన్= సంభావించుచుండగా; కాంచన+ అంబరధరుండు+ఐ= బంగారు వస్త్రాలు ధరించినవాడై; ముముక్షువులు= ముక్తిని కోరువారు; ధ్యానంబులు+చేయన్= ధ్యానం కొనసాగించగా; అధ్యాత్మ విద్యాయుక్తంబు+అయిన= మోక్షసంబంధి విద్యకు తగిన; ఆనంద హృదయగ్రంథిని= ఆనందమయమయిన హృదయపు ముడిని; భేదించునట్టి; శేషునిన్= ఆదిశేషుని; స్వాయంభువుండు+అగు= తనంత తాను జన్మించిన; నారదుండు= నారదమహర్షి; తుంబురు ప్రభృతులు+అగు= తుంబురుడు మొదలయిన; ఋషిశ్రేష్ఠులతోన్= ఋషిపుంగవులతో; చేరుకొని= కూడి; కమల+ఆసనుని= బ్రహ్మదేవుని; సభాస్థానంబు+అందున్= పేరోలగంలో; ఇట్లు; స్తుతియించుచుండున్= స్తోత్రం చేస్తుంటాడు.

**తా :** సంకర్షణ మూర్తి అయిన ఆ ఆదిశేషుని దగ్గరికి తమ కోరికలు తీర్చుకోవడానికి నాగకన్యకలు వస్తుంటారు. ఆయన సమక్షంలో తమ శరీరవిలాసాలు ప్రదర్శిస్తుంటారు. అగరు, చందనం, కుంకుమపువ్వుతో కలిపి మెత్తని ముద్దగా తయారు చేసిన సుగంధ లేపనాలతో ఆయనను అర్చిస్తారు. ఆ తరువాత ఆ అనంతుని అపురూపమయిన రూపాన్ని తనివితీరా చూడడంవల్లనూ, ఆ మూర్తిని తాకడంవల్లనూ కామోద్రేకం కలిగిన వారవుతారు. ఆ కారణంగా చిరునవ్వులు చిందిస్తూ సిగ్గు లొలకబోస్తూ, క్రీగంటి చూపులు ప్రసరింపజేస్తూ ఆయన వంక చూస్తుంటారు. అప్పుడు అనంతగుణ సంపన్నుడయిన అనంతుడు తన సహజ కోపాన్ని వదలిపెట్టి శాంతుడవుతాడు. లోకాలన్నిటికి క్షేమాన్ని కాంక్షిస్తాడు. దేవతలు, అసురులు, సిద్ధులు, గంధర్వులు, విద్యాధరులు, మునులు, అనంతుని సదా ధ్యానం చేస్తుంటారు. అపుడు అనంతుడు సంతోషంతో అరగన్ను మోడ్పులతో, లలితగీతాలతో కూడిన మనోహరమయిన వాద్యధ్వనులకు ఆనందిస్తుంటాడు. తన పరిజనాన్ని ప్రీతితో తిలకిస్తుంటాడు. వైజయంతీ మాలికలను ధరిస్తుంటాడు. ఆ మాలికలు అపుడే కూర్చిన తులసీమంజరులతో కూడినవై ఉంటాయి. ఆ మంజరుల మకరంద సుగంధాలకు క్రమ్ముకొన్న తుమ్మెదలు జుమ్ముజుమ్మని పాటలు పాడుతుంటాయి. అతడెప్పుడూ నల్లని వస్త్రాలు ధరించి నాగలిని ఆయుధంగా పట్టుకొని ఉంటాడు. అతణ్ణి మహేంద్రుడో, శివుడో అని

అసలు జనులు భావిస్తుంటారు. ఆయన ఒక్కొక్కసారి బంగారు వస్త్రాలతో ప్రకాశిస్తుంటాడు. ఆ శేషుడు మోక్షార్థులై తనను ధ్యానించేవారి హృదయగ్రంథిని తొలగించి అధ్యాత్మ విద్యతో కూడిన ఆనందాన్ని కలిగిస్తాడు. అందువల్లనే ముక్తిని కోరేవారు అనంతుని భక్తితో ఆరాధిస్తుంటారు. ఇన్ని మహిమలు కలిగినవాడు కావడం వల్లనే బ్రహ్మమానసపుత్రుడయిన నారదుడు, తుంబురుడు మొదలయిన ఋషిపుంగవులతో కూడి బ్రహ్మదేవుని పేరోలగంలో అనంతుణ్ణి ఈ విధంగా స్తుతిస్తుంటాడు.

**సీ. ఓలిమై నెవ్వని లీలా వినోదముల్ జన్మసంరక్షణక్షయములకును**
**హేతువు లగుచుండు, నెవ్వని చూపుల జనియించె సత్త్వరజస్తమంబు,**
**లెవ్వని రూపంబు లేకమై బహువిధంబులను జగత్తులఁ బ్రోచుచుండు,**
**నెవ్వని నామంబు లెఱుగఁక తలఁచిన యంతన దురితంబు లడఁగుచుండు**

**తే. నట్టి సంకర్షణాఖ్యుండు నవ్యయుండు, నైన శేషుని వినుతి సేయంగఁదరమె?**
**తలఁప నెప్పుడు వాఙ్మనంబులకు నింక, మూఁడు లోకంబులందును భూతతతికి. 126**

**ప్రతి :** ఓలిమైన్= వరుసగా; ఎవ్వని లీలావినోదముల్= ఏ అనంతుని లీలావినోదాలు; జన్మ సంరక్షణ క్షయములకును= పుట్టుక, పెరగడం, మరణం మొదలయిన వానికి; హేతువులు+అగుచుండున్= కారణాలవుతాయో; ఎవ్వని= ఎవనియొక్క; చూపులన్= వీక్షణాలవల్ల; సత్త్వరజస్తమంబులు= సత్వగుణం, రజోగుణం, తమోగుణాలు; జనియించెన్= పుట్టెనో; ఎవ్వని రూపంబులు= ఎవనియొక్క ఆకారాలు; ఏకము+ఐ= ఒకటై; బహువిధంబులను= అనేక రీతులను; జగత్తులన్= లోకాలను; ప్రోచుచుండున్= కాపాడునో; ఎవ్వని నామంబులు= ఎవరిపేర్లు; ఎఱుఁగక= తెలిసికొనక; తలఁచిన+అంతన= స్మరించిన మాత్రాన; దురితంబులు= పాపాలు; అడంగుచుండున్= అణగిపోవునో; అట్టి; సంకర్షణ+ఆఖ్యుండున్= సంకర్షణుడనే పేరుగలవాడును; అవ్యయుండును+ఐన= నాశం లేనివాడయిన; శేషునిన్= ఆదిశేషుని; తలఁపన్= భావించగా; ఎప్పుడున్= ఏ సమయంలోనూ; వాక్+మనంబులకున్= వాక్కునకూ, మనస్సునకూ; ఇంకన్= మరియు; మూఁడు లోకంబులందును= ముజ్జగాలలోని; భూతతతికిన్= ప్రాణిసమూహానికి; వినుతి+చేయఁగన్+తరము+ఎ= పొగడడం సాధ్యమా?

**తా :** ఎవని లీలావినోదాలు సృష్టి స్థితి సంహారాలకు హేతువులవుతాయో, ఎవని చూపులవల్ల సత్త్వరజస్తమోగుణాలు పుట్టాయో, ఎవని రూపాలొకటై లోకాలను అనేక విధాలుగా కాపాడుతుంటుందో, ఎవని పేరును తెలియకపోయినా స్మరించిన మాత్రాన పాపాలు పటాపంచలవుతాయో అటువంటి సంకర్షణుడూ అవ్యయుడూ అయిన ఆదిశేషుని పొగడడం ఎవరికీ సాధ్యం కాని పని. ఆ అనంతుడు వాక్కుకూ, మనస్సుకూ అందనివాడు. ముల్లోకాలవారికి అంతు చిక్కనివాడు.

**ఆ. మఱియుఁబెక్కు గతుల మాబోఁటి వారలఁ, బ్రోవఁదలఁచి శేషమూర్తి సాత్త్వి**
**క స్వభావ మొందెఁగడఁకతో నట్టి శే, షునకు మ్రొక్కుచుందు ననుదినంబు. 127**

**ప్రతి :** మఱియున్= అంతేగాక; పెక్కుగతులన్= అనేక రీతుల; మాబోఁటివారలన్= మావంటివారిని; ప్రోవన్+తలఁచి= కాపాడనెంచి; శేషమూర్తి= ఆదిశేషుడు; సాత్త్విక స్వభావము+ఒందెన్= సత్త్వగుణశీలుడై ఉన్నాడు; కడఁకతోన్= పూనికతో; అట్టి శేషునకున్; అనుదినంబున్= ప్రతిదినం; మ్రొక్కుచుందున్= నమస్కరిస్తాను.

**తా :** మావంటివారిని కాపాడడంకోసం ఆ ఆదిశేషుడు సత్త్వగుణస్వభావుడై ఉన్నాడు. అటువంటి అనంతునికి ప్రతిదినం నమస్కరిస్తాను.

**వ. మఱియు నా శేషుని నెవ్వండేనియు నాకస్మికంబుగ నయినను నార్తుండగుచు నయినను స్మరించిన మాత్రమున నఖిలపాపంబులం బాసి సకల శ్రేయస్సులం బొందు, నట్టి శేషుని నే ముముక్షువు లాశ్రయించి ధ్యానం బొనర్చి భవబంధ నిర్ముక్తు లగుదు, రతని ఫణంబుల యందు భూగోళం బణుమాత్రం బగుచు నుండు; నతని మహామహిమలు గణుతింప సహస్ర జిహ్వలు గల పురుషుండైన నోపండని పలుకుచుందు; రా యనంతుండు పాతాళంబున నుండి సకలలోకహితార్థంబు భూమిని ధరియించునని లోకతిర్యఙ్మనుష్య గతులను లోకస్థితియును శుకయోగీంద్రుండు వినిపించి యింకనేమి వినిపింతు నెఱింగింపు మనినం బరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రున కిట్లనియె. 128**

**ప్రతి :** మఱియున్= ఇంతేగాక; ఆ శేషునిన్= ఆ ఆదిశేషుని; ఎవ్వండున్+ఏనియున్= ఎవడేని; ఆకస్మికంబుగన్+అయినను‌న్= తలవని తలంపుగా అయినా; ఆర్తుండున్+అగుచున్+అయినను= బాధలలో చిక్కుకొని అయినా; స్మరించిన మాత్రమునన్= తలచుకొన్న మాత్రాన; అఖిల పాపంబులన్+పాసి= సమస్త పాపాలను పోగొట్టుకొని; సకల శ్రేయస్సులన్+పొందున్= అన్ని రకాలయిన క్షేమాలను పొందును; అట్టి; శేషునిన్= ఆదిశేషుని; ముముక్షువులు+ఆశ్రయించి= ముక్తిని కోరువారు ఆశ్రయించి; ధ్యానంబు+ఒనర్చి= ధ్యానంచేసి; భవబంధ నిర్ముక్తులు+అగుదురు= భవబంధాలనుండి విడుదలను పొందిన వారగుచున్నారు; అతని ఫణంబుల+అందున్= అతని పడగలయందు; భూగోళంబు= భూమండలం; అణుమాత్రంబు+ అగుచున్+ఉండున్= అణుమాత్రంగా నిలిచి ఉండును; అతని మహామహిమలు= ఆ అనంతుని మహిమలు; గణుతింపన్= లెక్కపెట్టగా; సహస్రజిహ్వలు+కల= వేయినాల్కలు గల; పురుషుండు+ఐనన్= పురుషుడయినా; ఓపండు+అని= సమర్థుడు కాదు అని; పలుకుచుందురు= చెపుతారు; ఆ+అనంతుండు; పాతాళంబునన్+ఉండి= పాతాళలోకంలో ఉండి; సకలలోకహిత+ అర్థంబు= అన్ని లోకాలకు మేలు కోరువాడై; భూమిని; ధరియించున్+అని; లోకతిర్యక్ మనుష్య గతులను= లోకస్వరూపాలు, జంతువుల స్వభావాలు, మానవులనైజాలను; లోకస్థితియును= వర్తమాన లోకగమనాన్ని; శుకయోగి+ఇంద్రుండు= యోగులలో శ్రేష్ఠుడయిన శుకుడు; వినిపించి= చెప్పి; ఇంకన్; ఏమి వినిపింతున్= ఏమి చెప్పవలెనో; ఎఱింగింపుము= తెలియజేయవయ్యా; అనినన్= అనగా; పరీక్షిత్+నర+ఇంద్రుండు= పరీక్షిన్నరేంద్రుడు; శుకయోగి+ఇంద్రునకున్= శ్రేష్ఠుడయిన శుక మహర్షికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తా :** ఆ ఆదిశేషుణ్ణి ఎవరయినా సరే హఠాత్తుగా తలచుకొన్నా, బాధలలో చిక్కుకొని స్మరించినా అటువంటి వ్యక్తుల పాపాలను పోగొడతాడు. సకల శ్రేయస్సులూ ప్రసాదిస్తాడు. అందువలన ముక్తి కోరేవారు అనంతుని ఆశ్రయించి ధ్యానించి భవబంధాలనుండి విముక్తులవుతారు. అతని పడగలమీద భూగోళం అణుమాత్రమై నిలిచి ఉంటుంది. ఆ అనంతుని మహిమలు లెక్కించడం వేయినాలుకలున్న వానికి కూడ అలవి గాని పని. ఆ అనంతుడు పాతాళంలో నివసిస్తూ అన్ని లోకాలకూ మేలు కోరువాడై భూమిని ధరిస్తాడు. అంటూ లోకాల స్వరూపాలూ, జంతువుల స్వభావములూ, మానవుల నైజాలను శుకుడు పరీక్షిత్తుకు విశదంగా వినిపించి, ఇంకా ఏమేమి వినదలచుకొన్నావో అడుగవలసిందని పలికాడు. అప్పుడు పరీక్షిన్నరేంద్రుడు శుకయోగీంద్రునితో ఈ విధంగా అన్నాడు.

**క. మునివర! లోకచరిత్రం, బనుపమము మహావిచిత్ర మగునట్లుగ నా**
**కును వినిపించితి వంతయుఁ, బనుపడి నా చిత్తమందుఁబాయక నిలిచెన్. 129**

**ప్రతి :** మునివర= మునులలో శ్రేష్ఠుడయినవాడా!; లోకచరిత్రంబు= అఖిల లోకాల స్వరూపం; అనుపమము= సాటిలేనిది; మహావిచిత్రము+అగునట్లు+కన్= అద్భుతావహముగా; నాకునున్= నాకు; అంతయున్= సమస్తం; వినిపించితివి= వినిపించావు; పనుపడి= నాటుకొని; నా చిత్తము+అందున్= నా మనసులో; పాయక= వదలక; నిలిచెన్= నెలకొన్నాయి.

**తా :** మునీంద్రా! అతలవితలాది లోకాల స్వరూప స్వభావాలను నా మనసులో నాటేవిధంగా నీవు విశదీకరించావు. ఆ లోకాల చరిత్రలు ఒకదానికొకటి సాటిలేనివి. పైగా చాలా చిత్రమయినవి.

**వ. అనిన శుకయోగీంద్రుండిట్లనియె. 130**

**ప్రతి :** అనినన్= అని చెప్పగా; శుకయోగి+ఇంద్రుండు= శుకమహర్షి; మరల; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

**తా :** పరీక్షిత్తు ఈ విధంగా పలుకగా శుకమహర్షి ఇలా అన్నాడు.

**ఆ. జంతుజాలములకు శ్రద్ధలు త్రిగుణాత్మ, కములు గాన వారి కర్మగతుల**
**తారతమ్యములును దగిలి యిన్నియు వివి, ధంబు లగుచు సంతతంబు నుండు. 131**

**ప్రతి :** జంతుజాలములకున్= ఈ లోకంలోని జంతు సమూహానికి; శ్రద్ధలు= ఆసక్తులు; త్రిగుణ+ఆత్మకములు= సత్వరజస్తమోగుణాలననుసరించి ఉంటాయి; కానన్= కాబట్టి; వారి= వారివారి; కర్మగతుల= కర్మలననుసరించి; తారతమ్యములు= తేడాలు; తగిలి= అంటుకొని; ఇన్నియున్= అన్నియును; వివిధంబులు+అగుచున్= వైవిధ్యంతో కూడినవై; సంతతంబున్+ఉండున్= ఎల్లప్పుడును ఉంటాయి.

**తా :** ఓ రాజా! ఈ లోకంలోని జీవులకు సత్వరజస్తమోగుణాలను అనుసరించి ఆసక్తులు వేరువేరుగా ఉంటాయి. సాత్విక శ్రద్ధ, రాజసశ్రద్ధ, తామసశ్రద్ధ అనేవానికి అనుగుణంగా వారి కార్యకలాపాలు కూడా వివిధంగా ఉంటాయి. ఈ తారతమ్యాలు ఎల్లప్పుడూ ఉంటూనే ఉంటాయి.

**వ. నరేంద్రా! ప్రతిషిద్ధలక్షణంబగు నధర్మం బాచరించు నరుని శ్రద్ధ విపరీతంబుగాఁ బ్రవర్తిల్లు నట్టి వానికిఁ గలిగెడి కర్మఫలంబును విపరీతంబుగానె యుండుం గావున ననాద్యవిద్యాకామ ప్రవర్తనల వలనఁ బెక్కు తెఱంగులఁ గలిగెడి కర్మగతుల సంగ్రహంబుగ నెఱింగించెద ననిన శుకునితోఁ బరీక్షిన్నరేంద్రుం డిట్లనియె. 132**

**ప్రతి :** నర+ఇంద్రా= నరులలో శ్రేష్ఠుడయిన పరీక్షిన్మహారాజా!; ప్రతిషిద్ధ లక్షణంబు+అగు= తగదని చెప్పడమనే లక్షణంగా గల్గిన; అధర్మంబు= అధర్మమును; ఆచరించు= సలుపునట్టి; నరుని= మానవమాత్రునియొక్క; శ్రద్ధ= ఆసక్తి; విపరీతంబుగాన్= విపరీత ధోరణులుగా; ప్రవర్తిల్లున్= నడచును; అట్టివానికిన్; కలిగెడి= సంభవించెడు; కర్మఫలంబును= ఆ యా కర్మల ఫలవిశేషాలును; విపరీతంబుగానె+ఉండున్= భిన్నంగానే ఉంటాయి; కావునన్= అందువలన; అనాది= అనాదియైన; అవిద్యా= అజ్ఞానంవల్ల కలిగే; కామప్రవర్తనలవలనన్= కాంక్షాప్రవృత్తులవల్ల కలిగే; పెక్కు తెఱంగులన్= అనేక విధముల;

కలిగెడు= సంభవించు; కర్మగతులన్; సంగ్రహంబుగన్= క్లుప్తంగా; ఎఱింగించెదను; అనినన్; శుకునితోన్; పరీక్షిత్+నర+ఇంద్రుండు; ఇట్లు+అనియెన్.

**తా :** నరేంద్రా! వేదం ఏ పనులను చేయవద్దని చెప్తుందో ఆ పనులు అధర్మాలు. అటువంటి ప్రతిషిద్ధ లక్షణమయిన అధర్మాన్ని ఆచరించే మానవుని శ్రద్ధ విపరీతంగా ఉంటుంది. శ్రద్ధయే భిన్నంగా ఉండడంవల్ల కర్మఫలాలు కూడా భిన్నంగా ఉంటాయి. అందువల్ల అనాదినుండి ఉన్నవి, అజ్ఞానంవల్ల ఏర్పడేవి, స్వేచ్ఛాప్రవర్తనలవల్ల కలిగేవి, అయిన నానావిధ కర్మగతులను సంగ్రహంగా చెబుతాను. విను. అనగానే పరీక్షిత్తు శుకునితో ఈ విధంగా అన్నాడు.

**ఆ. మునివరేణ్య! నరకములు ముజ్జగంబుల, యందొ యంతరాళమందొ వెలినొ**
**యదియుఁగాక దేశమందుండు భూవిశే, షములయందొ తెలుపు సంతసమున. 133**

**ప్రతి :** మునివరేణ్యా= మునులలో శ్రేష్ఠుడా!; నరకములు= దుర్గతులు; మూడు+జగంబుల+అందున్+ఒ= త్రిలోకాలలోనా?; అంతరాళమందున్+ఒ= వాటి నడుమనో?; వెలిని+ఒ= ఈ రెండూగాక వెలుపలి ప్రాంతంలోనో; అదియున్+కాక= అంతేగాక; దేశమందున్+ఉండు= దేశంలో ఉన్న; భూవిశేషముల+అందున్+ఒ= భూప్రదేశాలలోనా?; సంతసమునన్= సంతోషంతో; తెలుపు= తెలియజేయవలసింది.

**తా :** మునులలో శ్రేష్ఠుడవయిన శుకయోగీంద్రా! నరకాలు ఉన్నాయని అంటారు. అవి ఎక్కడ ఉన్నాయి. ముల్లోకాలలోనా? లేక రెండు లోకాల నడుమనా? ఈ రెండూగాక వెలుపల వేరే ప్రదేశంలోనా? ఎక్కడ ఉన్నాయి? నాకు వివరించి చెప్పు.

**వ. అనిన శుకయోగీంద్రుండిట్లనియె. 134**

**ప్రతి :** అనినన్= అనగా; శుకయోగి+ఇంద్రుండు= యోగులలో సర్వశ్రేష్ఠుడయిన శుకమహర్షి; ఇట్లు+అనియెన్= పరీక్షిత్తుకు ఈ విధంగా చెప్పాడు.

**తా :** పరీక్షిన్మహారాజు ప్రశ్నలు విని శుకమహర్షి ఈ విధంగా అన్నాడు.

## a=శుకయోగి పరీక్షిత్తునకుఁ దెలిపెడి నరకలోక వర్ణనము=a

**క. ఎడతెగక ముజ్జగంబుల, కడపల నయ్యామ్యదిశను గదలక నిలుచుం**
**గడు ఘోరములుగ నరకము, లడరంగా నంతరాళమందుల నధిపా! 135**

**ప్రతి :** అధిపా!= ఓ రాజా!; ఎడతెగక= సంబంధం కోల్పోక; మూడు+జగంబుల కడపలన్= ముల్లోకాలకు ఆవల; ఆ+యామ్యదిశను= ఆ దక్షిణదిక్కులో; కదలక= చలింపక; కడుఘోరములుగన్= మిక్కిలి భయంకరాలుగా; అంతరాళము+అందులన్= భూమ్యాకాశాల నడుమ; అడరంగాన్= అతిశయిస్తూ; నరకములు= నరకాలు; నిలుచున్= స్థిరంగా ఉంటాయి.

**తా :** మూడులోకాలకు ఆవల దక్షిణదిశలో మిక్కిలి భయంకరాలై, భూమ్యాకాశాల నడుమ విజృంభణంగా నెలకొని నరక లోకాలున్నాయి.

**వ. మఱియును దక్షిణంబున నగ్నిష్వాత్తాది పితృగణంబులు తమ గోత్రజులకు మేలు గలుగుట కొఱకు సత్యంబులగు నాశీర్వాదంబుల నొసంగుచుండుదు; రచ్చటి పితృపతియగు శమనుండు తన లోకంబునకుం**

**జనుదెంచు జంతువుల కర్మంబులకుం దగిన ఫలంబుల నిచ్చి శిక్షించుచునుండు; నందుఁ దామిస్రంబును నంధతామిస్రంబును రౌరవంబును మహారౌరవంబును గుంభీపాకంబును గాలసూత్రంబును నసిపత్రవనంబును సూకరముఖంబును నంధకూపంబును గ్రిమిభోజనంబును సందంశంబును దప్తోర్మియు వజ్రకంటకశాల్మలియు వైతరణియుఁ బూయోదంబును బ్రాణరోధంబును విశసనంబును లాలాభక్షణంబును సారమేయాదనంబును నవీచిరయంబును రేతః పానంబును నను నేకవింశతి మహా నరకంబులును, మఱియును క్షారకర్దమంబును రక్షోగణ భోజనంబును శూలప్రోతంబును దందశూకంబును నవట నిరోధనంబును నపర్యావర్తనంబును సూచీముఖంబు నన సప్త విధ నరకంబుల తోడఁ గూడి యష్టావింశతి నరకంబులు గల వని కొందఱు నొడువుదు, రందు. 136**

ప్రతి : మఱియును= అంతేగాక; దక్షిణంబునన్= దక్షిణపుదిక్కున; అగ్నిష్వాత్త+ఆది= అగ్నిష్వాత్తులు మొదలయిన; పితృగణంబులు= పితృదేవతలు కూడా; తమ గోత్రజులకున్= స్వగోత్రజులకు; మేలు+కలుగుట కొఱకున్= శుభం కలిగించడానికోసం; సత్యంబులు+అగు= నిజమయిన; ఆశీర్వాదంబులన్= ఆశీస్సులను; ఒసంగుచుండుదురు= ప్రసాదిస్తుంటారు; అచ్చటి; పితృపతి+అగు= పితృదేవతలకు అధిపతి అయిన; శమనుండు= యముడు; తనలోకంబునకున్; చనుదెంచు= వచ్చునట్టి; జంతువుల కర్మంబులకున్= జంతువులచే చేయబడిన కర్మలకు; తగిన ఫలంబులన్+ఇచ్చి= తగిన ఫలితాలను ఇచ్చి; శిక్షించుచునుండున్; అందున్= వానిలో; తామిస్రంబును= తమస్సు (చీకటి)చే ఆవరింపబడినది, దట్టమైనది చీకటి; అంధతామిస్రంబును= కళ్లు పొడుచుకున్నా కానరాని కటిక చీకటి; రౌరవంబును= 'రురువు' అంటే నల్లచారల దుప్పి. రురువుగా పుట్టిన పాపాత్ములు పొందే నరకం పేరు రౌరవం; మహారౌరవంబును= రౌరవ నరకంలో పాపాత్ములను మహాక్రూరంగా హింసింపబడుతారు; కుంభీపాకంబును= ఎలుకల కన్నాలు మూసి చంపినవాని సలసల కాగుతున్న పెద్ద బానలోవేసి పాకంగా వండడం; కాలసూత్రంబును= ఇనుప తంతువులుగల నరక విశేషము; అసిపత్ర వనంబును= సానబెట్టిన వాడి కత్తులు గుంపులు గుంపులుగా నిలబెట్టి దానిపై పాపులను కుదవేయడం; సూకరముఖంబును= పెద్ద పెద్ద కోరలుగల పందులకు ఆహారంగా విసిరివేయడం; అంధకూపంబును= పాడుబడిన బావిలో పడవేసి పాపులను శిక్షించుట; క్రిమిభోజనంబును= పురుగులను వండి వడ్డించడం; సందంశంబును= పట్టుకాఱు / అడకత్తెఱ. పాపాత్ముల మెడకు పట్టుకాఱుతోనో లేక అడకత్తెఱతోనో నొక్కిపట్టి శిక్ష వేయడానికి తెస్తారు; తప్తోర్మియు= సెగలు కక్కుతూ కాలుతున్న మంటల్లో శిక్షించడం; వజ్రకంటక శాల్మలియు= బూరుగచెట్లకు పాపులను కట్టి వజ్రాల్లా కఠినమైన ముండ్లను శరీరంలో దింపుట; వైతరణియు= నరకలోకంలోని నిప్పుల యేఱు; పూయోదంబును= చీము కలిసిన నీళ్లలో పాపిని ముంచుట; ప్రాణరోధంబును= ఊపిరి సలుపకుండా గొంతు నొక్కడం; విశసనంబును= వధ చేయుట, చంపుట; లాలాభక్షణంబును= చొంగ లేక జొల్లును పాత్రలో పోసి తాగేట్లు చేయడం; సారమేయాదనంబును= కుక్కలకు ఆహారంగా వేయడం; అవీచిరయంబును= అలలులేని సముద్రంలో ముంచెత్తుట; రేతః పానంబును= వివిధ జీవుల రేతస్సులను కలిపి తాగేటట్లు చేయడం; అను ఏకవింశతి మహానరకంబులును= ఇరువదియొక్క నరకాలుగల; మఱియును= ఇంకను; క్షారకర్దమంబును= ఉప్పునీళ్లతో కలిసిన బురదలో ముంచి ముంచి ఎత్తడం; రక్షోగణభోజనంబును= రాక్షసుల గుంపులకు ఆహారంగా వేయడం; శూలప్రోతంబును= ఇనుపకమ్మి పైభాగం వాడిగా తయారు చేసి దానిలో పాపం చేసిన వానిని గుదభాగం ద్వారా దింపడం; దంద శూకంబును= పాములచేత, తేళ్లచేత కఱిపింపజేయడం; అవటనిరోధనంబును= లోతైన నూతుల్లో

వేసి పైకి రాకుండా నిర్బంధించడం; అపర్యావర్తనంబును= అప్రదక్షిణంగా గిరగిర త్రిప్పుతూ హింసించడం; సూచీముఖంబును= వాడి బాణాలువేసి హింసించడం (లేదా) సూదులతో గుచ్చి గుచ్చి హింసించడం; అను; సప్తవిధనరకంబులతోడన్+కూడి; ఏడు విధాలైన నరకాలతోకూడి; అష్టావింశతి నరకంబులు= 28 నరకములు; కలవు+అని= ఉన్నాయని; కొందఱు; నొడువుదురు= చెప్పెదరు; అందున్= అందు.

**తా :** అంతేగాకుండా దక్షిణంలోనే ఉన్న అగ్నిష్వాత్తులు మొదలయిన పితృదేవతలు కూడా తమతమ గోత్రాలలో పుట్టినవారికి శుభం కలగడంకోసం సత్యమయిన దీవనలు ఇస్తుంటారు. అక్కడ పితృపతి అయిన యముడు కూడా తన లోకం చేరుకొనే జీవులకు జీవితకాలంలో వారు వారు చేసిన కర్మలకు తగినట్లు ఫలం ప్రసాదిస్తూ శిక్షిస్తుంటాడు. ఆ యమలోకంలో తామిస్రం, అంధతామిస్రం, రౌరవం, మహారౌరవం, కుంభీపాకం, కాలసూత్రం, అసిపత్రవనం, సూకరముఖం, అంధకూపం, క్రిమిభోజనం, సందంశం, తప్తోర్మి, వజ్రకంటక శాల్మలి, వైతరణి, పూయోదం, ప్రాణరోధం, విశసనం, లాలాభక్షణం, సారమేయాదనం, అవీచిరయం, రేతఃపానం అనే ఇరువదొక్క నరకాలున్నాయి. అవేగాకుండా క్షారకర్దమం, రక్షోగణ భోజనం, శూలప్రోతం, దందశూకం, అవటనిరోధనం, అపర్యావర్తనం, సూచీముఖం అనే మరి ఏడు నరకాలున్నాయి. వెరసి దక్షిణంలో ఇరవై ఎన్మిది నరకాలున్నాయని కొందరు చెబుతారు.

**క. పరపుత్త్రకళత్రంబులఁ, బరికింపక యపహసించు పాపాత్ముఁడు దు**
**ష్కరపాశబద్ధుఁడై యమ, పురుషులచే నధికబాధఁబొందుచు నుండున్. 137**

**ప్రతి :** పరపుత్త్ర కళత్రంబులన్= ఇతరుల బిడ్డలు, భార్యలు అనుటను; పరికింపక= లెక్కపెట్టక; అపహసించు= అపహాస్యం చేసే; పాపాత్ముఁడు; దుష్కర పాశబద్ధుఁడు+ఐ= మిక్కిలి కఠినాలైన త్రాళ్ళతో కట్టబడినవాడై; యమపురుషులచేన్= యమకింకరులచేత; అధికబాధన్= ఎక్కువ బాధలను; పొందుచున్+ఉండున్= అనుభవిస్తూ ఉండును.

**తా :** ఇతరుల బిడ్డలూ, భార్యలూ అనే ఆదరభావం ఏమాత్రం లేకుండా అకారణంగా వారిని అపహసించే పాపాత్ముణ్ణి యమకింకరులు తాళ్ళతో బంధించి పరిపరివిధాల బాధిస్తారు.

**వ. మఱియు నవ్విధంబున బాధితుం డగుచుఁ దామిస్ర నరకంబునంబడి యనశనాద్రిపాతన దండతాడన తర్జనాది బాధలంజెంది కడు భయంబున మూర్ఛలంబొందుచుండు. 138**

**ప్రతి :** మఱియున్; ఆ+విధంబునన్; బాధితుండు+అగుచున్= బాధింపబడుతూ; తామిస్రనరకంబునన్+పడి= చీకటి నరకంలోపడి; అనశన= అశనంలేక (తిండిలేక); అద్రిపాతన= కొండ పైనుండి క్రిందికి తోయబడడం; దండతాడన= దుడ్డు కర్రలతో చావగొట్టడం; తర్జన+ఆది= బెదిరింపులు మొదలయిన; బాధలన్+చెంది= బాధలు పడుతూ; కడుభయంబునన్; మూర్ఛలన్; పొందుచున్+ఉండున్.

**తా :** ఆవిధంగా బాధలనుభవిస్తూవాడు తామిస్రమనే నరకంలో పడతాడు. అన్నం పెట్టక, కొండపై నుండి తోసివేస్తూ, కర్రలతో చావబాదుతూ, బెదరిస్తూ యమకింకరులు వారిని నానావిధాలుగా శిక్షిస్తారు. ఆ బాధలకు తాళలేక జీవులు భయకంపితులై మూర్ఛపోతుంటారు.

**క. పరకాంత నెవ్వఁడేనిం, బురుషుండుండంగ మొఱఁగి పొందిన యమ కిం**
**కరు లతనిఁబట్టి వడిఁ ద, త్తరమునఁబడవైతు రంధతామిస్రమునన్. 139**

**ప్రతి :** పురుషుండు+ఉండన్+కన్= మగడు ఉండగనే; మొఱఁగి= మోసగించి; ఎవ్వఁడు+ఏనిన్= ఎవడయినా; పరకాంతన్= పరుల భార్యను; పొందినన్= అనుభవిస్తే; యమకింకరులు; అతనిన్+పట్టి; వడిన్= వేగంతో, వెనువెంటనే; అంధతామిస్రమునన్= కళ్లు పొడుచుకున్నా కానరాని కటిక చీకటి నరకంలో; తత్తరమునన్= పట్టరానికోపంతో; పడవైతురు= పడవేస్తారు.

**తా :** మగడు ఉండగానే అతణ్ణి మోసగించి అతని ఇల్లాలిని కామించి అనుభవించినవాణ్ణి పట్టుకొని యమకింకరులు సంకోచం లేకుండా అతణ్ణి పట్టరాని కోపంతో అంధతామిస్రం అనే నరకంలో తోస్తారు.

**వ. నరేంద్రా! యెవ్వఁడేనిం గుటుంబ పోషణార్థంబు పరులకు ద్రోహంబు సేయు, నా నరుండు రౌరవ నరకంబునం బడు; నెవ్వం డిహలోకంబునందు స్వేచ్ఛా విహారంబున సంచరించుచుఁ బరోపద్రవ పరాఙ్ముఖంబు లయియుండు పశుపక్షి మృగాదుల బాధించు, నా యామృగంబులు రురురూపంబులఁ దాల్చి యట్టి పాపజనుల నానా విధ యాతనల బాధించుటం జేసి రౌరవ మహా రౌరవ నరకంబులం బడు; నెవ్వండేని దేహపోషణార్థంబు మూషకాదుల బిలనిరోధంబు సేసి వధించు, నా నిష్కరుణుండైన పురుషుని గుంభీపాక నరకంబుల యందుఁ గల తప్తతైలంబులంబెక్కు బాధలంబొందింతురు. 140**

**ప్రతి :** నర+ఇంద్రా= రాజా!; ఎవ్వఁడు+ఏనిన్; కుటుంబపోషణ+అర్థంబు= తన కుటుంబాన్ని పోషించడంకోసం; పరులకున్= ఇతరులకు; ద్రోహంబు+చేయున్= ద్రోహం చేస్తాడో; ఆ నరుండు; రౌరవనరకంబునన్+పడున్; ఎవ్వండు; ఇహలోకంబు+ అందున్= ఈ భూలోకంలో; స్వేచ్ఛా విహారంబునన్= యథేచ్ఛావిహారంబుతో; సంచరించుచున్; పర+ఉపద్రవ పరాక్+ ముఖంబులు+అయి+ఉండు= ఇతరులకు ఎలాంటి ఉపద్రవాలు కలిగించనవిగా నుండు; పశుపక్షి మృగ+ఆదులన్= పశువులు, పక్షులు, మృగాలు మొదలయిన వానిని; బాధించున్= బాధించునో; ఆ+ఆ+మృగంబులు= బాధనొందిన ఆ మృగములు; రురురూపంబులన్+తాల్చి= రురువుల రూపాలను ధరించి; అట్టి; పాపజనులన్; నానావిధయాతనలన్; బాధించుటన్+చేసి; రౌరవ, మహారౌరవనరకంబులన్+పడున్= రౌరవమహారౌరవ నరకములలో కూలును; ఎవ్వండు+ఏనిన్= ఎవ్వడేని; దేహపోషణ+అర్థంబు= శరీర పోషణార్థం; మూషక+ఆదులన్= ఎలుకలు మొదలయినవానిని; బిలనిరోధంబు+ చేసి= కలుగుల్ని మూసి; వధించున్= చంపునో; ఆ నిస్+కరుణుండు+ఐన= అలాంటి దయలేని; పురుషునిన్= మానవుని; కుంభీపాకనరకంబుల+అందున్+కల= కుంభీపాకమనే పేరుగల నరకముల యందున్న; తప్త తైలంబులన్= కాచిన నూనెలచేత; పెక్కు బాధలన్= అనేక బాధలు; పొందింతురు= అనుభవింప చేస్తారు.

**తా :** ఓ రాజా! ఎవరయితే తన కుటుంబ పోషణకోసం ఇతరులకు ద్రోహం చేస్తారో అటువంటివారు రౌరవ నరకంలో పడతారు. ఎవరయితే ఈ లోకంలో ఇష్టం వచ్చినట్టు తిరుగుతూ ఇతరులకు ఏ మాత్రం అపకారం తలపెట్టని పశుపక్షి మృగాదులను బాధిస్తారో అటువంటి పాపాత్ములను ఆయా మృగాలు రురు రూపాలతో నానాబాధలు పెడతాయి. అటువంటి వారు రౌరవ మహారౌరవ నరకాలంలో పడతారు. ఎవరయితే తమ కడుపు నింపుకోవడం కోసం ఎలుకల కన్నాలు మూసి వాటిని చంపుతారో అటువంటి నిర్దయులను కుంభీపాక నరకంలో కాగిన నూనెలతో అనేక విధాలుగా హింసిస్తారు.

**విశే :** రురువు అనగా పాముకంటె మిక్కిలి క్రూరమైన జంతువు. "రురురితి సర్పాగతి క్రూరసత్త్వ స్యాపదేశః" ఇతి. సం.భాగవతం - 5 స్కం - 26 అ - 11

**సీ.** **తల్లిదండ్రులకును ధరణీసురులకును నహితంబు సేసినయట్టివాఁడు**
**కాలసూత్రంబను కడుఁదీవ్రనరకంబు నందును నందంద యయుత యోజ**
**నాయతపాత్రాదులందుల సూర్యుఁ డా మీఁద గ్రిందను వహ్ని మిగుల మండ**
**నత్యంత క్షుత్పిపాసాదులచేతను బాధితుం డగుచుండుఁబాయ కెపుడుఁ**

**ఆ.** **బరువు వెట్టుచున్నఁబడియున్న నిలిచినఁ, గదలకున్నఁజాల నొదిఁగియున్న**
**బాధఁబొందుచుండుఁబశురోమముల లెక్క, వరుస నపరిమేయవత్సరములు.** **141**

**ప్రతి :** తల్లిదండ్రులకును= మాతాపితరులకును; ధరణీ సురులకును= భూమిపై దేవతలవంటి బ్రాహ్మణులకును; అహితంబు+ చేసిన+అట్టివాఁడు= కీడు తలపెట్టేవాడు; కాలసూత్రంబు+అను= మరణాసన్నవేళను కాలం అంటారు. రెండవ అర్థంలో, అవసాన కాలాన్ని నిర్ణయించే కాలుడు యముడు. సూత్రమంటే నియమం. అవసానదశ అనేదొక నియమానికి కట్టుబడి ఉంటుంది. అదే 'కాలసూత్రం'; కడున్+తీవ్ర నరకంబునందును= కడుతీవ్ర నరకమును పొందును; అందు+అంద= అక్కడక్కడ; అయుత యోజన+ఆయతపాత్ర+ఆదులందులన్= పదివేల యోజనాల పొడవుగల లోహపాత్రలలో; సూర్యుడును; ఆ మీఁదన్= ఆపైన; క్రిందను= క్రింద; వహ్ని= అగ్ని; మిగులన్ మండన్= మిక్కిలి మండుచుండగా; అతి+అంత+క్షుత్+ పిపాసా+ఆదుల చేతను= మిక్కిలి ఆకలితో దప్పిక మొదలగు వానితో; పాయక= మానక; ఎపుడున్= ఎల్లవేళల; బాధితుండు= పీడితుడు; అగుచు+ఉండున్= అవుతాడు; పరువు+పెట్టుచున్నన్= పరుగులెత్తుతున్నా; పడి+ఉన్నన్= క్రిందపడి ఉన్నా; నిలిచినన్= నిలబడి ఉన్నా; కదలక+ఉన్నన్= కదలక ఉన్నను; చాలన్+ఒదిగి+ఉన్నన్= బాగా పక్కకు తప్పుకొని ఉన్నా; పశురోమముల లెక్కవరుసన్= ఆవు ఒంటిమీద ఎన్ని రోమాలున్నాయో అన్ని రోమముల సంఖ్యల వరుసతో; అపరిమేయ వత్సరములు= లెక్కలేనన్ని సంవత్సరాలు; బాధన్ పొందుచున్+ఉండున్= బాధలు అనుభవించుచుండును.

**తా :** తల్లిదండ్రులకూ, బ్రాహ్మణులకూ కీడు చేసినవాడు, కాలసూత్రమనే భయంకర నరకంలో పడతాడు. అక్కడ పదివేల యోజనాల పొడవుగల లోహపాత్రలలో అతణ్ణి పడవేస్తారు. పైన ఎండ మండిపోతుంటుంది. కింద మంటలు భగ భగ మండుతుంటాయి. అతడు పరుగెత్తుతూ ఉన్నా పడుతూ ఉన్నా, లేస్తూ ఉన్నా, నిలబడుతూ ఉన్నా, పక్కకు తప్పుకొంటూ ఉన్నా ఆకలితో  దప్పికతో అలమటిస్తుంటాడు. ఆవు ఒంటిమీద ఎన్ని రోమాలున్నాయో అన్ని సంవత్సరాలు అక్కడ యమకింకరులు వాణ్ణి బాధిస్తారు.

**వ.** **మఱియు వేదమార్గంబు విడిచి పాషండమార్గంబు లాచరించు పురుషుని నసిపత్త్రవనంబునందు యమకింకరులు తఱట్ల నడచుచుఁ బరిహసించుచుం దోలు నెడ యసిపత్త్రంబు లిరుగెలంకుల శరీరంబుం ద్రెంచుచుండ నడుగడుగున బిట్టు మొఱవెట్టుచుండ బాధించుచుండుదురు.** **142**

**ప్రతి :** మఱియున్; వేదమార్గంబున్; విడిచి; పాషండ మార్గంబులు; ఆచరించు; పురుషుని; అసిపత్త్ర వనంబు+అందున్= అసి= కత్తివంటి; పత్ర= ఆకులు కల; వనం= అడవిలో; యమకింకరులు; తఱట్లన్+అడచుచున్= కొరడాలతో కొడుతూ;

పరిహసించుచున్= గేలి సేయుచు; తోలు+ఎడన్= దయలేక జంతువులను తోలేలాగున తోలుతుంటే, తరుముతుంటే; ఆ+అసిపత్త్రంబులు= ఆ కత్తులవంటి ఆకులు; ఇరు కెలఁకులన్= రెండువైపులను; శరీరంబున్; త్రెంచుచున్+ఉండన్= కోస్తుంటే; అడుగడుగునన్; బిట్టు= అత్యధికంగా; మొఱ+పెట్టుచుండన్= ఆక్రందించుచుండగా; బాధించుచుండుదురు= వేధిస్తుంటారు.

**తా :** వేదమార్గాన్ని వదలిపెట్టి పాషండమార్గం అవలంబించే పురుషుని అసిపత్రవనమనే నరకంలో పడవేస్తారు. అక్కడ కత్తులవంటి ఆకులు గల ఆ చెట్ల నడుమ పరుగెత్తుమని ఆదేశిస్తూ పరిహాసం చేస్తూ కొరడాలతో కొడుతుంటారు. ఇరుప్రక్కల కత్తులవంటి చెట్ల ఆకులు తగిలి శరీర భాగాలు తెగిపోతుంటాయి. అపుడా జీవుడు అడుగడుగునా మొరపెడుతున్నా యమకింకరులు వాణ్ణి వేధిస్తుంటారు.

**క. దండింపఁదగనివారల, దండించిన విప్రవరుల తనువులు ముట్టం**
**దండించిన దుర్మతులం, దండింతురు కాలసూత్రనరకములందున్. 143**

**ప్రతి :** దండింపన్= దండించడానికి; తగనివారలన్= అర్హులు కానివారిని; దండించినన్= దండించినా; విప్రవరుల తనువులు= బ్రాహ్మణశ్రేష్ఠుల దేహాలను; ముట్టన్+దండించిన= హింసించిన; దుర్మతులన్= చెడుబుద్ధి కలవారిని; కాలసూత్రనరకములు+అందున్= కాలసూత్రమనే పేరు గల నరకాలలో పడవేసి; దండింతురు= శిక్షిస్తారు.

**తా :** దండించ తగని సాధువులను దండించినా, బ్రాహ్మణశ్రేష్ఠులను శారీరకంగా హింసించినా అటువంటి దుర్మార్గుల్ని కాలసూత్రనరకంలో పడవేసి కఠినంగా దండిస్తారు.

**ఆ. మఱియు నట్టి దుష్టమానవుఁగింకరుల్, విఱిచి చెఱకుఁగోల విఱచినట్లు**
**బాధపెట్టుచుండఁబడి మూర్ఛఁజెందుచు, మొఱలువెట్టుచుండు భూపవర్య! 144**

**ప్రతి :** భూపవర్య= రాజులలో శ్రేష్ఠుడా!; మఱియున్; అట్టి; దుష్టమానవున్= చెడు మనుష్యుణ్ణి; కింకరుల్= యమభటులు; చెఱకుఁగోలన్= చెఱకు గడను; విఱిచినట్లు; విఱిచి= నడిమికి విఱిచి; బాధ పెట్టుచుండన్= బాధపెడుతుంటే; పడి= నేల బడి; మూర్ఛన్+చెందుచున్= మూర్ఛపోతూ; మొఱలు+పెట్టుచున్+ఉండున్= కుయ్యో, మొర్రోయని మొరపెడుతూ ఉంటాడు.

**తా :** రాజా! అక్కడ ఆ దుర్మార్గుణ్ణి పట్టుకొని యమభటులు చెఱకుగడ విరిచినట్టుగా విరిచి హింసిస్తుంటే వాడు అరుస్తూ, ఆక్రోశిస్తూ, మూర్ఛపోతూ, మొరపెడుతూ ఉంటాడు.

**వ. నరేంద్రా! యెవ్వండేని నీశ్వరకల్పితవృత్తి గల జంతువుల హింసించు నట్టివాని నంధకూపంబను నరకంబునఁ బడవైచిన నందు నతండు దొల్లి తాను జేసిన భూత ద్రోహంబున నచ్చట వివిధక్రూర పక్షి మృగ పశు సర్ప మశక మత్కుణ మక్షికాదులచేత హింసం బొందుచు, మహాంధకారంబునందు నిద్రానుభవసుఖ లేశంబును లేక కుశరీరంబు నందుల జీవుండునుంబోలె మృతప్రాయుండై యుండు; నంత. 145**

**ప్రతి :** నర+ఇంద్రా= పరీక్షిన్మహారాజా!; ఎవ్వండు+ఏనిన్= ఎవడయినా; ఈశ్వర కల్పిత వృత్తిగల జంతువులన్= భగవంతునిచేత కల్పింపబడిన విధంగా తమ బతుకు తాము గడుపుతున్న జంతువులను; హింసించునట్టివానిన్= బాధ పెట్టేవానిని; అంధకూపంబను నరకంబునన్= చీకటి బావి అను పేరుగల నరకంలో; పడవైచినన్= పడవేయగా; అందున్=

ఆ నరకంలో; అతండు= ఆ జంతువులను హింసించినవాడు; తొల్లి= మునుపు; తాను+చేసిన; భూతద్రోహంబునన్= ప్రాణులకు చేసిన ద్రోహం కారణంగా; అచ్చటన్= ఆ నరకంలో; వివిధ= పలు రకాలయిన; క్రూర= భయంకరమయిన; పక్షి, మృగ, పశు, సర్ప, మశక, మత్కుణ, మక్షిక+ఆదులచేతన్= పక్షులు, మృగాలు, పశువులు, పాములు, దోమలు, నల్లులు, ఈగలు మొదలయిన వానిచేత; హింసన్+పొందుచున్= హింసను అనుభవిస్తూ; మహా+అంధకారంబు+అందున్= గొప్ప కటిక చీకటిలో; నిద్రా+అనుభవ సుఖలేశంబునులేక= నిదురకు సంబంధించిన సుఖానుభవం ఏ కొంచెమైనా లేక; కుశరీరంబు+అందుల= కుత్సిత శరీరంలోని; జీవుండునున్+పోలెన్= జీవునివలె; మృతప్రాయుండు+ఐ= మరణించిన వానివలె; ఉండున్= ఉండును; అంతన్= అంత.

**తా :** నరేంద్రా! విధి నియమించిన విధంగా తమ బతుకు తాము గడుపుతున్న జంతువులను హింసించేవాణ్ణి అంధకూప నరకంలో పడతోస్తారు. ఆ నరకకూపంలోని క్రూరాలైన ఆ పక్షులు, మృగాలు, పశువులు, పాములు, దోమలు, నల్లులు, ఈగలు ప్రాణులకు ద్రోహం చేసినవాణ్ణి పీక్కుతింటాయి. కటికచీకటిలో నిదురకు నోచుకోక తిండికి మొగం వాచి కుత్సిత శరీరంలోని జీవునిలాగా మృతప్రాయుడై ఉంటాడు.

**క. తన కలిమి నెవ్వఁడేనియుఁ, దన బాంధవవరులఁగూడి తగఁ గుడువక తా**
**నును వాయసంబు భక్షిం, చిన మాడ్కిందిన్న వాఁడు శీఘ్రమె యచటన్. 146**

**ప్రతి :** తన కలిమిన్= తాను కూడబెట్టిన సంపదలో; ఎవ్వఁడు+ఏనియున్= ఎవ్వడైనా; తన బాంధవ వరులన్+కూడి= తన బంధుగణంతోకూడి; తగన్= తగినరీతిలో; కుడువక= ఆరగించక, తానును= తానొక్కడే; వాయసంబు భక్షించిన మాడ్కిన్= కాకి కుడిచిన రీతిలో; తిన్నవాఁడు= తినినవాడు; శీఘ్రము+ఎ= వెనువెంటనే; అచటన్= అక్కడ...

**తా :** తాను కూడబెట్టిన సంపదను ఎవ్వడైనా తన బంధుగణంతోకూడి తగిన రీతిలో ఆరగించకుండా, తానొక్కడే కాకి తినేవిధంగా తినేవాడు వెంటనే అక్కడి

**క. క్రిమిభోజన మనియెడి నర, కమునంబడి క్రిములె కూడుగాఁగుడుచుచుఁ దాఁ**
**గ్రిమి యగుచు లక్షపరిమా, ణము గల క్రిమికుండమందు నాటుకయుండున్. 147**

**ప్రతి :** క్రిమి భోజనము+అనియెడి; నరకమునన్+పడి; క్రిములు+ఎ; కూడు+కాన్= ఆహారంగా; కుడుచుచున్= ఆరగిస్తూ; తాన్+క్రిమి+అగుచున్= తాను పురుగు అగుచు; లక్షపరిమాణము+కల= లక్ష యోజనాల విస్తీర్ణంగల; క్రిమికుండము+ అందున్= క్రిమికుండంలో; నాటుక+ఉండున్= కదలనివాడై ఉంటాడు.

**తా :** క్రిమి భోజనమనే నరకంలో పడతాడు. అక్కడ వాడు పురుగై సుమారు లక్ష యోజనాల విస్తీర్ణం కలిగిన పురుగుల గుంటలో కూరుకుపోయి పురుగులను ఆహారంగా తింటూ ఉంటాడు.

**వ. మఱియు నీ భూలోకంబున నెవ్వఁడేనియు నవిపన్నుండై చౌర్యవృత్తిచే బ్రాహ్మణాదుల హిరణ్య రత్నాది ద్రవ్యంబుల నపహరించు, నట్టి పురుషుని నగ్నివర్ణంబులగు నయఃపిండంబుల నగ్నితప్తంబులగు శూలంబుల నతని శరీరంబునం దివియుచుండుదురు; మఱియును మదనాతురు లగుచు స్త్రీపురుష లగమ్యగమనంబులు**

**సేసిరేని నట్టివారిని యమలోకంబున నతితీక్ష్ణ కశాతాడితులంజేసి యగ్నిమయంబు లయిన యుక్కు ప్రతిమల నాలింగనంబు సేయింతురు. 148**

**ప్రతి :** మఱియున్= అంతేగాక; ఈ భూలోకంబునన్; ఎవ్వఁడు+ఏనియున్= ఎవడయినగాని; అవిపన్నుండు+ఐ= ఆపదలేనివాడై; చౌర్యవృత్తిచేన్= దొంగతనం చేత; బ్రాహ్మణ+ఆదుల= విప్రులు మొదలయినవారి; హిరణ్యరత్న+ఆదిద్రవ్యంబులన్= బంగారం, రత్నాలు మొదలయిన ద్రవ్యాలను; అపహరించున్= అపహరించునో; అట్టి పురుషుని; అగ్నివర్ణంబులు+అగు= నిప్పురంగుతో సమానమయిన; అయస్ పిండంబులన్= ఇనుప గుండ్లతో; అగ్నితప్తంబులు+అగు= నిప్పులతో బాగుగా కాచబడిన; శూలంబులన్= శూలములతో; అతని శరీరంబునన్; తివియుచున్+ఉండుదురు= గ్రుచ్చుతుంటారు; మఱియునున్; మదన+ఆతురులు+అగుచున్= సంభోగేచ్ఛతో తహతహలాడుతూ; స్త్రీ పురుషులు; అగమ్య+గమనంబులు= వావివరుసలు లేకుండా; చేసిరి+ఏని= ప్రవర్తించినట్లయితే; అట్టివారిని= అటువంటివారిని; యమలోకంబునన్= సంయమని రాజధానిగా గల యమలోకంలో; అతితీక్ష్ణకశాతాడితులన్+చేసి= మిక్కిలి పదునయిన కొరడాలతో బాధితులనుజేసి; అగ్నిమయంబులు+అయిన= నిప్పుతో నిండిన; ఉక్కు ప్రతిమలన్= ఉక్కు బొమ్మలను; ఆలింగనంబు+చేయింతురు= కౌగిలించుకొనేటట్లు చేస్తారు.

**తా :** ఈ భూలోకంలో ఎవడయితే తనకు ఎటువంటి కష్టమూ లేకపోయినా దొంగతనంగా బ్రాహ్మణాదుల బంగారాన్ని, రత్నాలు మొదలైన విలువ గల వస్తువులను అపహరిస్తాడో అటువంటివాణ్ణి అగ్నితప్తనరకంలో పడవేస్తారు. మండుతున్న ఇనుపగుండ్లను అతని శరీరంపై విసరివేస్తారు. ఎర్రగా కాలిన ఇనుపచువ్వలు గుచ్చుతారు. మోహంతో కామంతో కళ్ళు కనబడక వావివరుసలు లేకుండా ప్రవర్తించిన స్త్రీ పురుషులను యమలోకంలో తీవ్రమయిన కొరడాలతో కొట్టి గనగన కాలుతున్న ఉక్కుబొమ్మల్ని కౌగిలించుకొనేటట్లు చేస్తారు.

**ఆ. సర్వజంతుజాలసంగమ మొందెడు, వానిఁబట్టి కట్టి వజ్రదంష్ట్ర**
**కములు గలుగునట్టి ఘనతరశాల్మలీ, తరువులందుఁజేర్చి దంతు రెపుడు. 149**

**ప్రతి :** సర్వ జంతుజాల సంగమము+ఒందెడువానిన్= ఈ జంతువు, ఆ జంతువు అనే తేడా లేకుండా వానితో సంభోగ కార్యక్రమాలు కొనసాగించేవానిని; పట్టి= పట్టుకొని; కట్టి= బంధించి; వజ్రదంష్ట్రకములు+కలుగునట్టి= వజ్రాలవంటి మేకులు గల; ఘనతర శాల్మలీ తరువులు+అందున్= గొప్పవయిన బూరుగు చెట్లకు; చేర్చి= బంధించి; ఎపుడున్= వదలిపెట్టక; దంతురు= చితకగొడతారు.

**తా :** జంతువులతో సంగమం చేసినవాణ్ణి పట్టుకొని వజ్రాల మేకులుగల బూరుగు చెట్లకు కట్టి చితక గొడతారు.

**ఆ. పార్థివేంద్ర! నరుఁడు పాషండదర్శనుఁ, డగుచు ధర్మమార్గ మడఁచెనేని**
**వాఁడు నరకమందు వైతరణీనది, నుడుగ కెపుడుఁ బొరలి పడుచునుండు. 150**

**ప్రతి :** పార్థివ+ఇంద్ర= భూపతీ!; నరుఁడు= మనుజుడయినవాడు; పాషండదర్శనుఁడు+అగుచున్= పాషండ మతంపట్ల అనురక్తి పెంచుకొన్నవాడగుచు; ధర్మమార్గము+అడఁచెన్+ఏనిన్= ధార్మిక పథాన్ని పరిత్యజిస్తే; వాఁడు= ఆలాంటివాడు; నరకము+అందున్= నరకంలో; వైతరణీ నదిన్= వైతరణి అనే నదిలో; ఉడుగక= వదలిపెట్టక, మానక; ఎపుడున్= ఎల్లప్పుడు; పొరలిపడుచున్+ఉండున్= పొరలుతుంటాడు.

**తా :** ఓ రాజేంద్రా! ఎవడయితే పాషండదర్శనంపట్ల ఆసక్తి పెంచుకొని ధర్మమార్గాన్ని పరిత్యజిస్తాడో అటువంటివాడు నరకలోకంలో వైతరణీ నదిలో పొరలుతుంటాడు.

**వ. మఱియు నట్టి వైతరణీనది యందు జలగ్రాహంబులు దిగిచి భక్షింపం బ్రాణంబులు నిర్గమింపఁ దన పాపంబు లుచ్చరించుచు విణ్మూత్రపూయ శోణిత కేశ నఖాస్థి మేదోమాంస వసావాహిని యందుఁ దప్తుం డగుచు నుండు; విప్రుండు శూద్రకామినులం బొంది శౌచాచారంబులం బాసి గతలజ్జుండై పశువుంబోలెఁ జరియించెనేని నతండు నరకంబునుం బొంది యందుఁ బూయ విణ్మూత్రలాలాశ్లేష్మ పూర్ణార్ణవమందు ద్రొబ్బంబడి యతిబీభత్సితంబులగు నా ద్రవ్యంబుల భుజియించుచుండు. 151**

**ప్రతి :** మఱియున్; అట్టి; వైతరణి నది+అందున్= వైతరణి నదిలో; జలగ్రాహంబులు దిగిచి= మొసళ్ళు లాగి; భక్షింపన్= తినగా; ప్రాణంబులున్= ప్రాణాలు; నిర్గమింపన్= పోగా; తన పాపంబులు; ఉచ్చరించుచున్= అడుగడుగునా చెప్పుకొంటూ; విట్+మూత్ర= మలమూత్రాలు; పూయ= చీము; శోణిత= నెత్తురు; కేశ= వెంద్రుకలు; నఖ= గోళ్ళు; అస్థి= ఎముకలు; మేదో మాంసవసా వాహిని+అందున్= క్రొవ్వు, మాంసం, మూలుగు వీటియొక్క ప్రవాహంలో; తప్తుండు+అగుచున్+ఉండున్= మునుగుతూ తేలుతూ పడి కొట్టుకుంటూ ఉంటాడు; విప్రుండు= బ్రాహ్మణుడు; శూద్రకామినులన్+పొంది= శూద్ర స్త్రీల సహవాసములు చేసి; శౌచ+ఆచారంబులన్+పాసి= శుచికి సంబంధించిన ఆచారాలను వదలిపెట్టి; గతలజ్జుండు+ఐ= సిగ్గు వీడినవాడై; పశువున్+పోలెన్= పశువులాగా; చరియించెన్+ఏనిన్= సంచరించినట్లయితే; అతండు; నరకంబునున్+ పొంది= నరకవాసం పొంది; అందున్= అందు; పూయవిట్+మూత్ర= చీము, మలమూత్రాలు; లాలా= జొల్లు; శ్లేష్మపూర్ణ= కఫంతో నిండిన; అర్ణవము+అందున్= సముద్రంలో; ద్రొబ్బన్+పడి= త్రోయబడి; అతిబీభత్సి తంబులున్+అగు= మిక్కిలి అసహ్యకరమయిన; ఆ ద్రవ్యంబులన్=ఆ వస్తువులనే; భుజియించుచుండున్= భుజిస్తూ ఉంటాడు.

**తా :** ఆ వైతరణీ నదిలోని మొసళ్ళు పాషండమతంపట్ల మోజు పెంచుకొన్నవాణ్ణి పీక్కుతింటాయి. అటువంటి పాషండులు ప్రాణాలు పోతుంటే తాము చేసిన తప్పుల్ని తలచుకొంటూ మలమూత్రాలు, చీమూ నెత్తురు, వెంట్రుకలూ, గోళ్లు, ఎముకలు, కొవ్వు, మాంసం, మూలుగు కలిసిన ప్రవాహంలో మునిగి తేలుతూ పడికొట్టుకొంటుంటారు. ఎవడయితే బ్రాహ్మణుడయి యుండి కూడా శుచిత్వం. సదాచారం వదలిపెట్టి సిగ్గు బిడియం లేకుండా శూద్రస్త్రీలతో పశువువలె ప్రవర్తిస్తాడో అటువంటివాడు నరకలోకంలో మలమూత్రాలు, లాలాజలం, కఫంతో కూడిన సముద్రంలో త్రోయబడి అసహ్యకరమైన ఆ వస్తువులనే భుజిస్తూ కాలం గడుపుతాడు.

**క. శునకములఁ బెంచి యెవ్వం, డనయంబును వేఁట సలిపి యాత్మార్థముగా**
**వనమృగములఁ జంపును నా, మనుజాధము నస్త్రములను మర్దింతు రొగిన్. 152**

**ప్రతి :** శునకములన్+పెంచి= కుక్కలను పెంచి; ఎవ్వండు+అనయంబును= ఎవడయితే ఎల్లప్పుడు; వేఁట సలిపి= వేటాడి; ఆత్మ+అర్థము+కాన్= తనకోసం; వనమృగములన్= అడవిలోని జంతువులను; చంపును= సంహరించునో; ఆ మనుజ+అధమున్= ఆ మానవాధముని; ఒగిన్= పట్టుదలతో; అస్త్రములను= అస్త్రాలతో; మర్దింతురు= నలగ పొడుస్తారు.

**తా :** ఎవడయితే వేటకుక్కల్ని పెంచి ఎప్పుడు పడితే అపుడు వేటకు పోతూ తనకోసం అడవిలోని మృగాలను వధిస్తాడో, అటువంటి నీచుణ్ణి యమలోకంలో పదునైన ఆయుధాలతో నలిగిపోయేట్లుగా పొడుస్తారు.

**ఆ. జృంభణమున నెవఁడు దంభార్థమై పశు, వులను జంపి జన్నములను జేయు**
**వానిఁబట్టి యమునివారలు గోయుచు, నుందు రెపుడు మిగుల సందడిలుచు. 153**

**ప్రతి :** ఎవఁడు; దంభ+అర్థము+ఐ= డాబు దర్పంకోసం; పశువులను+చంపి= పశువులను సంహరించి; జృంభణమునన్= ఆడంబరంగా; జన్నములను+చేయున్= యాగాలు చేస్తాడో; వానిన్+పట్టి= ఆ యాగ యజమానుణ్ణి పట్టి; యమునివారలు= యమకింకరులు; మిగులన్= మిక్కిలి; సందడిలుచున్= పొలికేకలు వేస్తూ; ఎపుడున్= ఎల్లప్పుడు; కోయుచున్+ఉందురు= పరపర కోస్తుంటారు.

**తా :** ఎవడయితే డాబు దర్పంకోసం పశువుల్ని చంపి ఆడంబరంగా యాగాలు నిర్వహిస్తాడో, అటువంటివాణ్ణి యమకింకరులు పొలికేకలు వేస్తూ అంపాలతో పరపర కోస్తుంటారు.

**వ. కామమోహితుండై యెవ్వండేనియుఁ దన భార్యచేత రేతఃపానంబు సేయించు నా పాపాత్ముని రేతోహ్రదంబునం ద్రోచి యా రేతంబునే పానంబు సేయించుదురు; రాజభటులైనను జోరులైనను ధనికుల గ్రామంబులపైఁ బడి యందు గృహదాహంబు సేయువారలను, విషాదుల వలన నన్యులఁ జంపెడు వారలను, వజ్ర దంష్ట్రలు గల వింశత్యుత్తర సప్త శతశునకంబు లెడతెగక తిగిచి భక్షించుచుండు. 154**

**ప్రతి :** కామమోహితుండు+ఐ= కామమోహములు కలిగిన వాడయి; ఎవ్వండు+ఏనియున్= ఎవడయిన; తన భార్యచేతన్= తన ఇల్లాలిచేత; రేతః పానంబు+చేయించున్= బలవంతంగా వీర్యపానం చేయిస్తాడో; ఆ పాపాత్మునిన్; రేతస్ హ్రదంబునన్= రేతస్సుతో కూడిన మడుగులో త్రోచి; ఆ రేతంబున్+ఏ= ఆ వీర్యమునే; పానంబు+చేయించుదురు= త్రాగేటట్లుగా చేస్తారు; రాజభటులు+ఐనను= రాజసేవకులయినా; చోరులు+ఐననున్= దొంగలయినా; ధనికుల గ్రామంబులపైన్+పడి= శ్రీమంతులుండే గ్రామాలపై పడి; అందున్= ఆ గ్రామంలో; గృహదాహంబు చేయువారలను= ఇళ్ళు కాల్చేవారిని; విష+ఆదులవలనన్= మందు, మాకు, విషం మొదలయినవానితో; అన్యులన్= ఇతరులను; చంపెడువారలను= చంపేవారిని; వజ్రదంష్ట్రలుగల= వజ్రాలకోరలున్న; వింశతి+ఉత్తర సప్తశత శునకంబులు= ఏడువందల ఇరవై కుక్కలు; ఎడతెగక= వదలిపెట్టక; ప్రతిదినము; తిగిచి= చుట్టుముట్టి, లాగి; భక్షించుచుండున్= పీక్కొనితింటాయి.

**తా :** ఎవడయితే కామంతో కళ్ళు మూసుకుపోయి తన భార్యచేత రేతఃపానం చేయిస్తాడో ఆ పాపాత్ముని రేతస్సుతో నిండిన మడుగులో ద్రోసి ఆ రేతస్సునే వానిచేత త్రాగిస్తారు. రాజభటులయినా, దొంగలయినా గ్రామాలపై పడి ఇళ్ళకు నిప్పు అంటించేవారిని, విషం మొదలైనవి పెట్టి ఇతరుల్ని చంపేవారిని, వజ్రాల కోరలున్న ఏడువందల ఇరవై కుక్కలు ప్రతిదినమూ చుట్టుముట్టి పీక్కుతింటాయి.

**సీ. లంచంబుఁ గొని సాక్షి వంచించి యనృతంబు పలికెడు పాపాత్ముఁ బట్టి కట్టి**
**యంత మాన కవీచి యను నరకమునందు శతయోజనోన్నత శైల శిఖర**
**మునఁ దలక్రిందుగా నునిచి యధోముఖంబుగఁ బడద్రొబ్బిన బొబ్బలిడుచుఁ**
**గల్లోలములు లేని కమలాకరముఁబోలెఁ జదరమైయున్న పాషాణమందుఁ**

**తే. బడిన యంతన దేహంబు పగిలి పెక్కు, తునుకలై పాసి యది గూడికొనుచు నుండ**
**దండి యాకులతను బొందుచుండుఁగాని, చావు లేకుండు నా దుష్టజంతువునకు. 155**

**ప్రతి :** లంచంబున్+కొని= లంచం పుచ్చుకొని; సాక్షిన్ వంచించి= సాక్షిని వంచించి; అనృతంబు= అసత్యాన్ని; పలికెడు= మాటాడునట్టి; పాపాత్మున్+పట్టి= పాపాత్ముని పట్టుకొని; కట్టి= బంధించి; అంతమానక= అంతటితో విడిచిపెట్టక; అవీచి+అను నరకమునందున్= గాలియాడని, ఊపిరి సలుపడానికి వీలులేని నరకకూపంలో (న+వీచి= అవీచి); శతయోజన+ఉన్నత శైలశిఖరమునన్= నూరు యోజనాల కొండ శిఖరం నుండి; తలక్రిందు+కాన్ ఉనిచి= తలక్రిందుగా ఉంచి; అధోముఖంబుగన్= ముఖంకింద ఉండేలా; పడ ద్రొబ్బినన్= పడేవిధంగా విసరి వైచిన; బొబ్బలు+ఇడుచున్= పెడబొబ్బలు పెడుతూ; కల్లోలములులేని= అలజడిలేని, నిస్తరంగమైన; కమల+ఆకరమున్+పోలెన్= పూచిన తామరపూల కొలనువలె; చదరము+ఐ+ఉన్న= చదరంగా ఉన్న; పాషాణము+అందున్+పడిన+అంతన= రాతిపై పడగానే; దేహంబు+పగిలి= దేహం ఏకాకృతిని కోల్పోయి; పెక్కుతునుకలై= పలుముక్కలై; పాసి= విడివిడిగా వేరయి; అది= ఆ ముక్క; కూడికొనుచున్+ ఉండన్= కలుసుకొంటుండగా; దండి= అధికమయిన; ఆకులతను= కలతను; పొందుచుండున్+కాని= అనుభవిస్తుంటాడు గాని; ఆ దుష్టజంతువునకున్= ఆ దుష్ట మానవునకు; చావు= మరణం; లేకుండున్= ఉండదు.

**తా :** లంచం పుచ్చుకొని దొంగ సాక్ష్యం చెప్పి ఎదుటివారిని మోసగించిన పాపాత్ముని అవీచి అనే నరకంలో పడవేస్తారు. అక్కడ వానిని పట్టుకొని బంధించి నూరు యోజనాల ఎత్తయిన కొండ శిఖరంనుండి తలక్రిందుగా క్రిందికి విసరివేస్తారు. అపుడు వాడు పెడబొబ్బలు పెడుతూ అలలు లేని కొలనువలె నున్నగానున్న చట్రాతిమీద పడిపోతాడు. అట్లాపడి శరీరం ముక్కలు ముక్కలై మరల అవి కలుసుకొంటూవుంటే చావురాక బ్రతుక లేక ఆకులపాటుతో అవస్థపడుతుంటాడు.

**విశే :** అవీచి – తరంగములు లేని జలంలో ముంచెత్తడం – 'అవీచి నామక నరకం'. భృగుపతనం / శైలపతనం మాటిమాటికి పర్వత శిఖరం మీదికి ఎక్కించి మరల పడతోయుట. గాలియాడని, ఊపిరి సలుపడానికి వీలులేని దిగ్బంధనాన్ని కూడ 'అవీచి' అంటారు.

**ఆ. సోమయాజిభార్యఁగామించి పొందిన, వానిఁగపటమద్యపాన సోమ**
**పాన మనుదినంబుఁబానంబు సేయు విట్, క్షత్త్రియులను బట్టి సంభ్రమమున. 156**

**ప్రతి :** సోమయాజి భార్యన్= సోమయాగం చేసి సోమయాజిగా విఖ్యాతుడయిన వాని భార్యను; కామించి; పొందినవానిన్; అనుదినంబున్= ప్రతిదినము; కపట మద్యపాన సోమపానము= కపట మద్యపానమును; సోమపానమని; పానంబు+ చేయు= పానంచేసే; విట్+క్షత్రియులను= వైశ్యులను, క్షత్రియులను; సంభ్రమమునన్= తొట్రుపాటుతో; పట్టి= బంధించి...

**తా :** సోమయాజి పెళ్ళాన్ని కామించి అనుభవించినవాణ్ణి, సోమపానమంటూ దొంగచాటుగా మద్యపానం చేసే వైశ్యులను, క్షత్రియులను, పట్టుకొని –

**ఆ. రొమ్ముఁద్రొక్కి మోము రిమ్మవట్టఁగ మోఁది, యనలముఖమునందు నగ్నివర్ణ**
**ముగను గాఁచి వక్త్రమున నిండఁగా నుక్కు, నీరు వోతు రేచి నిష్ఠురముగ. 157**

**ప్రతి :** రొమ్మున్+త్రొక్కి= గుండెపై కాలితో గట్టిగా తొక్కిపట్టి; మోము= మొగము; రిమ్మవట్టఁగన్= ఉన్మాదం కలిగేటట్లు; మోది= బాది; అనలముఖము+అందున్= అగ్నిలో; అగ్నివర్ణముగను= ఎర్రటి రంగు వచ్చేలా; కాచి= కాగబెట్టి; వక్త్రమునన్=

నోటిలో; నిండఁగాన్= నిండునట్లుగా; ఏచి= విజృంభించి; నిష్ఠురముగన్= దయలేక; ఉక్కునీరు+పోతురు= ఇనుప ద్రవమును పోస్తారు.

**తా :** గుండెలపై కాలుమోపి తొక్కుతారు. దిమ్మ తిరిగే లాగున ముఖంమీద మొత్తుతారు. స్పృహరాగానే ఎర్రగా సలసల కాగే ఉక్కుద్రవాన్ని నిర్దాక్షిణ్యంగా నోటినిండా పోస్తారు.

**వ. మఱియు నీచవర్ణుండు నిష్ఠ సలుపుచుం దపో దాన విద్యాచారంబులఁ బెద్దల కవమానంబు సేయు వాఁడు క్షారకర్దమంబను నరకంబునందు నధోముఖుం డగుచు బాధలం బొందు; స్త్రీ పురుషు లెవ్వరేని శరీర రక్షణార్థంబు పశువుల మానవుల బలి యిచ్చి రేని వారలను నిరయంబునందు యమకింకరులు సురియలం దునిమి తద్రక్తంబు పానంబు సేయుచుం బాఱాడుచుందురు; గ్రామారణ్యంబులయందు జంతువుల శూలప్రోతంబులఁ గావించి హింసించుచు హర్షించుచున్న వారలను శూలప్రోతంబను నరకంబునందు శూలప్రోతుల జేసిన క్షుత్పిపాసాపరు లగుచుండఁ గంకగృధ్రాదులు తీక్ష్ణతుండాగ్రంబులం దిగిచి భక్షించుచుండు; మఱియు ధూర్త స్వభావంబునం జంతుపీడనంబుఁ గావించెడు పాపాత్ముల దందశూకంబను నరకంబునందు వైవ నైదు నేడు ముఖంబుల సర్పంబులు గఱచుచుండు. 158**

**ప్రతి :** మఱియున్= ఇంతేగాక; నీచవర్ణుండు= తక్కువ కులంవాడు; నిష్ఠసలుపుచున్= నిష్ఠగా ఉంటూ; తపస్సు; దానం; విద్య; ఆచారవ్యవహారాలతో; పెద్దలకున్= పూజ్యులకు; అవమానంబు+చేయువాఁడు= అవమానం చేసేవాడు; క్షారకర్దమంబు+ అను నరకంబు+అందున్= ఉప్పు బురద అనే నరకంలో; అధోముఖుండు+అగుచున్= తలక్రిందులుగా; బాధలన్+పొందున్; స్త్రీ పురుషులు+ఎవ్వరు+ఏనిన్= స్త్రీలుకాని పురుషులుకాని; శరీరరక్షణ+అర్థంబు= శరీర రక్షణకోసం; పశువులన్, మానవులన్; బలి+ఇచ్చిరి+ఏనిన్= వారలను; నిరయంబు+అందున్= నరకమునందు; యమకింకరులు; సురియలన్+తునిమి= చురకత్తులతో ఖండించి; తద్+రక్తంబున్= వారి రక్తాన్ని; పానంబు+చేయుచున్= పానము చేయుచు; పాఱాడు చుందురు= తచ్చాడుతుంటారు; గ్రామ+అరణ్యంబుల+అందున్= గ్రామాలలోనూ, అరణ్యాలలోనూ; జంతువులన్; శూలప్రోతంబులన్+ కావించి= శూలాలతో గ్రుచ్చి; హింసించుచున్; హర్షించుచున్నవారలను= సంతోషించేవారిని; శూలప్రోతంబు+అను; నరకంబు+అందున్; శూలప్రోతులన్+చేసినన్= శూలాలతో గ్రుచ్చగా; క్షుత్ పిపాసాపరులు+అగుచుండన్= ఆకలితో, దప్పికతో నకనకలాడుచుండగా; కంక గృధ్ర+ఆదులు= రాబందులు, గ్రద్దలు; దీర్ఘతుండ+అగ్రంబులన్= పొడవైన ముక్కుల కొనలతో; తిగిచి= లాగి; భక్షించుచుండున్; మఱియున్; ధూర్త స్వభావంబునన్= మోసపు తలంపుతో; జంతుపీడనంబున్= జంతువులను బాధించడం; కావించెడు= చేసే; పాప+ఆత్ములన్= పాపులను; దందశూకంబు+అను= దందశూకము అనే; నరకంబు+అందున్; వైవన్= వేయగా; ఐదు+ఏడుముఖంబుల= ఐదు, ఏడు మొగాలయిన; సర్పంబులు= పాములు; కఱచుచుండున్= కరుస్తుంటాయి.

**తా :** తక్కువ కులంవారు ఆడంబరంతో కూడిన నిష్ఠలతో తపస్సు, దానం, విద్య, ఆచార వ్యవహారాలతో అహంకరించి పెద్దలను అవమానించినట్లయితే అటువంటి వారిని క్షారకర్దమం అనే నరకంలో తలకిందుగా వేలాడదీసి బాధలు పెడతారు. ఆడవారుగాని, మగవారుగాని తమ ప్రాణాలు కాపాడుకోవడానికి జంతువులనుగాని, మనుష్యులనుగాని బలి ఇస్తే అటువంటి దుర్మార్గులను యమకింకరులు చురకత్తులతో పొడిచి రక్తం తాగుతారు. ఊళ్ళలోనూ, అడవులలోను ఉండే జంతువుల కడుపులలో శూలాలు గ్రుచ్చి హింసిస్తూ సంతోషించేవారిని యమకింకరులు శూలప్రోతమనే నరకంలో త్రోసి శూలంతో

గ్రుచ్చుతారు. అక్కడివారు ఆకలిదప్పులతో నకనకలాడుతుంటే రాబందులూ, గ్రద్దలూ పదునైన ముక్కులతో వారి దేహాలను పొడుచుకొని తింటాయి. ఇంతేగాక మోసగించే స్వభావంతో జంతువుల్ని పీడించే పాపాత్ములను దందశూకమనే నరకంలో పడవేస్తారు. అక్కడ ఐదు తలలూ, ఏడు తలలూగల సర్పాలు వాళ్ళను కరుస్తుంటాయి.

**ఆ. ఎనయ దొడ్లలోన నిండ్లలో నైనను, బశుపతంగహరిణపంక్తినెల్లఁ**
**బట్టి హింససేయు పాపాత్ము విషవహ్ని, ధూమశిఖల ద్రొబ్బుదురు నృపాల! 159**

**ప్రతి :** నృపాల= నరులను పాలించేవాడా!; దొడ్లలోనన్= పెరటి దొడ్లలోగాని; ఇండ్లలోన్+ఐననున్= ఇళ్ళలోగాని; పశుపతంగ హరిణపంక్తిన్+ఎల్లన్+పట్టి= పశువులు, పక్షులు, జింకల సమూహములు మొదలయినవానిని బంధించి; హింస+చేయు= హింసించే; పాప+ఆత్మున్= పాపపు బుద్ధిగలవానిని; విష, వహ్ని, ధూమ శిఖలన్= విషంలో, అగ్ని జ్వాలల, పొగలసెగలయందు; ద్రొబ్బుదురు= పడవేస్తారు.

**తా :** నరేంద్రా! ఇళ్ళలోగాని, పెరళ్ళల్లోగాని తిరిగే పశువుల్ని, పక్షుల్ని, జింకలను ఒప్పుగా పట్టి హింసించే పాపాత్ములను నిప్పులలోనూ, విషంలోనూ, పొగలసెగలలోను విసరివేస్తారు.

**క. తన యింటికి వచ్చిన మను, జుని నతిథిం గ్రోధదృష్టిఁజూచినవానిం**
**గనుఁగవల వజ్రదంష్ట్రలఁ, దనరిన యా కంకగృధ్రతతి భక్షించున్. 160**

**ప్రతి :** తన+ఇంటికిన్= తన గృహానికి; వచ్చిన మనుజునిన్; అతిథిన్= తిథి నియమం లేక వచ్చినవానిని; క్రోధదృష్టిన్= కోపంతో కూడిన చూపుతో; చూచినవానిన్= కనుగొన్నవానిని; కను+కవలన్= రెండు కన్నులను; వజ్రదంష్ట్రలన్+తనరిన= వజ్రాల కోరలుగల; ఆ కంక గృధ్రతతి= రాబందులు, గద్దలు-వీటి సమూహము; భక్షించున్= తింటాయి.

**తా :** తన ఇంటికి అతిథిగా అరుదెంచిన మానవుని కోపోద్రేకంతో చూచిన దుర్మార్గుల కన్నులను వజ్రాల కోరలుగల రాబందులు గ్రద్దలు తింటాయి.

**మ. ధనవంతుండగు మానవుండు గడఁకన్ ధర్మోపకారంబులన్**
**ఘనతంజేయక యుండెనేని యమలోకంబందు సూచీముఖం**
**బను నా దుర్గతిఁబట్టి త్రోచి నిధి కాపై యున్న భూతం బటం**
**చును బాశంబులఁబట్టి కట్టి వడితో నొప్పింతు రత్యుగ్రులై. 161**

**ప్రతి :** ధనవంతుండు+అగు= సంపద గలిగినవాడగు; మానవుండు= నరుడు; కడఁకన్= పూనికతో; ధర్మ+ఉపకారంబులన్= ధర్మకార్యాలను; ఘనతన్+చేయక+ఉండెన్+ఏనిన్= గొప్పతనంతో చేయక ఉన్నట్టయితే; యమలోకంబు+అందున్= యమలోకంలో; సూచీముఖంబు+అను= ఆ పేరుగల్గిన; ఆ దుర్గతిన్= ఆ నరకంలో; పట్టి= బంధించి; త్రోచి= బలవంతంగా నెట్టి; నిధికి; కాపు+ఐ+ఉన్న= నిధికి కాపలాగా ఉన్న; భూతంబు+అట+అంచును= భూతమని; పాశంబులన్+పట్టి; కట్టి= బంధించి; వడితోన్= వేగంగా; అతి+ఉగ్రులు+ఐ= మిక్కిలి భయంకరులై; నొప్పింతురు= బాధలు పెడతారు.

**తా :** రాజా! ధనరాసులున్న భాగ్యవంతుడు ధర్మకార్యాలు చేయకుండా ఇతరులకు ఏమాత్రం ఉపకారం చేయకుండా ధనం కూడబెట్టడమే ధ్యేయంగా భావించినవాడు చనిపోతే వాణ్ణి యమభటులు 'సూచీముఖ' మనే నరకంలో పడతోస్తారు.

అక్కడ భయంకరులయిన యమకింకరులు 'డబ్బుకు కాపలా ఉన్న దయ్యమా' అంటూ వాణ్ణి పట్టి తాళ్ళతో కట్టి నానా బాధలు పెడతారు.

**ఆ. నరవరేణ్య! యిట్టి నరకముల్ యమలోక, మందుఁగలవు మఱి సహస్రసంఖ్య,**
**లందు శమనదూత లనిశంబు బాధింతు, రవని ధర్మదూరులయిన నరుల. 162**

**ప్రతి :** నరవరేణ్య= నరులలో శ్రేష్ఠుడయినవాడా!; ఇట్టి నరకముల్; యమలోకము+అందున్; మఱి సహస్ర సంఖ్యలు; వేలు; కలవు= ఉన్నాయి; అందున్= అక్కడ; శమన దూతలు= యమదూతలు; అనిశంబున్= ఎల్లప్పుడు; అవనిన్= ఇలలో; ధర్మదూరులు+అయిన= ధర్మానుసరణమునకు దూరమయిన; నరులన్= మనుజులను; బాధింతురు= బాధపెడతారు.

**తా :** నరులలో శ్రేష్ఠుడయినవాడా! ఇటువంటి నరకాలు యమలోకంలో వేలసంఖ్యలో ఉన్నాయి. ఆ నరకాలలో యమదూతలు అధర్మపరులను ఎల్లప్పుడూ బాధిస్తుంటారు.

**ఆ. ధర్మవంతులెల్లఁదప్పక స్వర్గంబు, నందు భోగసమితిఁబొందుచుందు;**
**రెలమిఁబుణ్యపాపముల శేషమువల్లఁ, బుట్టుచుందు రవనిఁబుణ్యచరిత. 163**

**ప్రతి :** పుణ్యచరిత= పుణ్యమయిన నడవడిక కలవాడా!; ధర్మవంతులు+ఎల్లన్= ధర్మపరులయిన వారందరు; తప్పక= ఏమాత్రం సందియంలేక; భోగసమితిన్= సుఖముల సమూహాలను; స్వర్గంబు+అందున్= స్వర్గలోకంలో; ఎలమిన్= ప్రీతితో; పొందుచుందురు= అనుభవిస్తారు; పుణ్యపాపముల శేషములవల్లన్= పుణ్యపాపాల శేషంవల్ల; అవనిన్= ఈ లోకంలో; పుట్టుచుందురు= జన్మిస్తుంటారు.

**తా :** పుణ్యచరితా! ధర్మపరులయిన మానవులందరు స్వర్గంలో సుఖభోగాలు అనుభవిస్తారు. అక్కడ వారు వారు అనుభవించగా మిగిలిన పుణ్యపాపాలను బట్టి వాటిని అనుభవించడానికై భూలోకంలో పుడుతూ ఉంటారు.

**వ. నరేంద్రా! మోక్షమార్గంబు మున్నె వినిపించితి; నిప్పుడు నీ కెఱింగించిన వెల్లను బ్రహ్మాండ కోశంబునం జతుర్దశ కోశంబులు గలవని పురాణంబులు పలుకుచుండు; నట్టి బ్రహ్మాండంబు శ్రీమన్నారాయణుని స్థూలశరీరం బగుటం జేసి బ్రహ్మాండం బెవ్వరు వర్ణింతు రెవ్వరు విందురు వారలకు సకల శ్రేయస్సులుం గలుగు; నీశ్వర స్థూలశరీరంబుఁ దెలిసినవారికి శ్రద్ధాభక్తులం జేసి సూక్ష్మదేహంబు నెఱుంగ వచ్చు; భూద్వీప వర్ష సరి దద్రి నభస్సముద్ర పాతాళ దిఙ్నరక తారాగణ లోకసంస్థితం బయిన సకల జీవనికాయంబై యద్భుతంబైన శ్రీహరి స్థూలశరీరప్రకారంబు వినిపించితిని. 164**

**ప్రతి :** నరేంద్రా!= రాజా!; మోక్షమార్గంబున్; మున్నె= ఇంతకుముందే; వినిపించితిన్; ఇప్పుడు; నీకున్; ఎఱింగించినవి+ ఎల్లను; బ్రహ్మాండకోశంబునన్; బ్రహ్మాండమను మొగ్గలో; చతుర్దశ కోశంబులు+కలవు+అని= పధ్నాలుగు లోకాల పొరలు ఉన్నాయని; పురాణంబులు; పలుకుచుందున్; అట్టి బ్రహ్మాండంబు; శ్రీమత్+నారాయణుని స్థూలశరీరంబు+అగుటన్+చేసి= విరాట్పురుషుడయిన నారాయణుని స్థూలశరీరము అగుటవలన; బ్రహ్మాండంబున్= ఈ బ్రహ్మాండాన్ని; ఎవ్వరు; వర్ణింతురు= వర్ణింతురో; ఎవ్వరు విందురో= ఎవరు వింటారో; వారలకున్= వారికి; సకల శ్రేయస్సులున్+కలుగున్= సమస్త శ్రేయాలు కలుగుతాయి; ఈశ్వర స్థూల శరీరంబున్= ఈశ్వరుని స్థూల శరీరం; తెలిసిన వారికిన్; శ్రద్ధాభక్తులన్+చేసి= శ్రద్ధవల్లనయితేనేం,

భక్తివల్లనయితేనేం, సూక్ష్మదేహంబున్= సూక్ష్మదేహం; ఎఱుంగన్‌వచ్చున్= తెలియవచ్చును; భూ= భూలోకంలోని; ద్వీప= ద్వీపాలు; వర్ష= తొమ్మిది వర్షాలు; సరిత్= నదులు; అద్రి= కొండలు; నభస్= ఆకాశం; సముద్ర= సముద్రం; పాతాళ= పాతాళలోకం; దిక్+నరక= దిక్కులు, నరకం; తారాగణ లోక సంస్థితంబు+అయిన= నక్షత్ర సముదాయంతో కూడిన లోకాల్లో నెలకొని ఉన్న; సకల జీవనికాయంబు+ఐ= సకల జీవరాసుల సమూహంగలదై; అద్భుతంబు+ఐన= ఎంతో వింతగా కనబడే; స్థూలశరీర ప్రకారంబున్= స్థూల శరీరస్వరూపాన్ని; వినిపించితిని+అని= వినిపించాను అని...

**తా :** ఓ రాజా! మోక్షమార్గం నీకు ముందే వినిపించాను. ఈ బ్రహ్మాండంలో పద్నాలుగు లోకాలున్నాయని పురాణాలు చెబుతున్నాయి. అటువంటి బ్రహ్మాండం శ్రీమన్నారాయణుని స్థూలశరీరం. అందువల్ల బ్రహ్మాండ వర్ణన చేసేవారూ, అది విన్నవారూ అన్నిరకాల శుభాలను అనుభవిస్తారు. ఈశ్వరుని స్థూలశరీరం తెలిసినవారికి శ్రద్ధవల్లనయితేనేం, భక్తివల్ల నయితేనేం భగవానుని సూక్ష్మరూపం తెలుసుకోవడానికి వీలుంది. భూగోళమందలి సప్తద్వీపాలు, తొమ్మిది వర్షాలు, వాటిలోని నదులు, పర్వతాలు, ఆకాశం, సముద్రం, పాతాళం, దిక్కులు, నరకం, నక్షత్ర సముదాయం మొదలైన వాటితోకూడిన లోకాలలో ఉన్న సకల జీవరాసులతోకూడి అద్భుతమైన శ్రీమన్నారాయణుని స్థూలశరీర స్వరూపాన్ని నీకు వినిపించాను.

**విశే :** మూలంలో చివర 'యతనశీలుడయిన సాధకుడు భగవానుని స్థూల రూపాన్ని గురించి, సూక్ష్మమైన స్వరూపాన్ని గురించి శ్రవణం చేసి, స్థూలరూపంలో మనస్సును ఏకాగ్రంచేసి మెల్లగా బుద్ధితో మనస్సును సూక్ష్మమైన స్వరూపం (ఆత్మ)లో విలీనం చేయాలి' అని వివరణ ఇవ్వబడింది.

**చ. జలజభవాదిదేవమునిసన్నుతతీర్థపదాంబుజాత! ని**
**ర్మలనవరత్ననూపురవిరాజిత! కౌస్తుభభూషణాంగ! యు**
**జ్జ్వలతులసీకురంగమదవాసనవాసితదివ్యదేహ! శ్రీ**
**నిలయశరీర! కృష్ణ! ధరణీధర! భానుశశాంకలోచనా! 165**

**ప్రతి :** జలజభవ+ఆదిదేవ మునిసన్నుత= బ్రహ్మ మొదలైన ఆదిదేవతలు మునులచే స్తుతింపబడిన; తీర్థపద+అంబుజాత= పుణ్యతీర్థాలవలె పవిత్రమయిన పాదపద్మాలు కలవాడా!; నిర్మల= మలినరహితమయిన; నవరత్న= నవరత్నాలతో కూడిన; నూపుర విరాజిత= కాలి అందెలచే ప్రకాశించేవాడా!; కౌస్తుభ భూషణ+అంగ= కౌస్తుభ మణిని భూషణంగా కలవాడా!; ఉజ్జ్వల= మిక్కిలి ప్రకాశించే; తులసీ= తులసీదళాల యొక్కయు; కురంగమద= కస్తూరియొక్కయు; వాసన= సుగంధాలచే; వాసిత= గుబాళించే; దివ్యదేహ= దివ్యమయిన శరీరం కలవాడా!; శ్రీనిలయశరీర= లక్ష్మీదేవికి నిలయమయిన తనువు కలవాడా!; కృష్ణ= శ్రీకృష్ణ; ధరణీధర= భూభారాన్ని వహించువాడా!; భానుశశాంకలోచనా= సూర్యచంద్రులను కన్నులుగా కలవాడా!

**తా :** బ్రహ్మ మొదలయిన దేవతలూ, ఋషులూ స్తుతించేవి పుణ్యతీర్థాలవలె పవిత్రమయినవి అయిన పాదపద్మాలు కలవాడా, నవరత్నాలతో ప్రకాశించే కాలిఅందెలు కలవాడా, కౌస్తుభమణిని భూషణంగా ధరించినవాడా, వెల్లివిరిసే తులసీదళాల పరిమళాలూ, కస్తూరీ సుగంధాలూ గుబాళించే దివ్యదేహం కలవాడా, లక్ష్మీదేవికి నివాసమయిన వక్షఃస్థలం కలవాడా, భూభారాన్ని వహించేవాడా, సూర్యచంద్రులే కన్నులుగా కలవాడా!

**క. శ్రీతరుణీహృదయస్థిత!, పాతకహర! సర్వలోకపావన! భువనా**
**తీతగుణాశ్రయ! యతివి, ఖ్యాత! సురార్చితపదాబ్జ! కంసవిదారీ! 166**

**ప్రతి :** శ్రీతరుణీ= లక్ష్మీదేవియొక్క; హృదయస్థిత= హృదయంలో నిలిచినవాడా!; పాతకహర= పాపాలను హరించేవాడా!; సర్వలోకపావన= లోకాలన్నిటిని పవిత్రం చేసేవాడా!; భువన+అతీతగుణాశ్రయ= లోకాలకు అతీతమయిన అలౌకిక గుణాలకు ఆశ్రయమయినవాడా!; అతివిఖ్యాత= మిక్కిలి ప్రసిద్ధుడా!; సుర+అర్చితపద+అబ్జ= దేవతలచే అర్చింపబడే పాదపద్మాలు కలవాడా!; కంసవిదారీ= కంసుని సంహరించినవాడా!

**తా :** లక్ష్మీదేవి హృదయంలో నివసిస్తూ నిత్యం జీవుల పాపాలను హరిస్తూ లోకాలన్నిటిని పవిత్రం చేస్తూ అలౌకిక గుణాలకు ఆశ్రయమయినవాడవై ప్రసిద్ధి గలవాడా, దేవతలచేత అర్చింపబడే పాదపద్మాలు కలవాడా కంసుని సంహరించిన వాడా!

**మత్తకోకిలము.**

**దండితారిసమూహ! భక్తనిధాన! దానవిహార! మా**
**ర్తాండమండలమధ్యసంస్థిత! తత్త్వరూప! గదాసి కో**
**దండశంఖసుదర్శనాంక! సుధాకరార్కసునేత్ర! భూ**
**మండలోద్ధరణార్తపోషణ! మత్తదైత్యనివారణా! 167**

**ప్రతి :** దండిత+అరిసమూహ= దండింపబడిన విరోధి సమూహం కలవాడా!; భక్తనిధాన= భక్తుల పాలిటి పెన్నిధీ; దానవిహార= దానశీలా; మార్తాండ మండల మధ్య సంస్థిత= సూర్యమండలం మధ్య ప్రకాశించేవాడా!; తత్త్వరూప= సత్యస్వరూప; గదా+అసి+కోదండ శంఖ సుదర్శన+అంక= గద, ఖడ్గం, ధనుస్సు, శంఖం, చక్రం అనే పంచాయుధాలు చిహ్నంగా కలవాడా!; సుధాకర+అర్క సునేత్ర= సూర్యచంద్రులు మంచి కన్నులుగా కలవాడా!; భూమండల+ఉద్ధరణ+ ఆర్తపోషణ= భూమండలాన్ని ఉద్ధరించినవాడా!; ఆర్తులను ఆదుకొన్నవాడా!; మత్తదైత్య నివారణా!= మదోన్మత్తులయిన రాక్షసులను అణగద్రొక్కినవాడా!

**తా :** శత్రు బృందాలను రూపుమాపేవాడా. భక్తుల పాలిటి పెన్నిధీ, దానశీలుడా, సూర్యమండలం మధ్యలో ప్రకాశించువాడా, సత్యస్వరూపుడా, గద, ఖడ్గం, ధనుస్సు, శంఖం, చక్రం అనే పంచాయుధాలు ధరించినవాడవూ, భూమండలాన్ని ఉద్ధరించినవాడవూ, ఆర్తులను ఆదుకొనేవాడా, మదోన్మత్తులయిన రాక్షసులను అణగదొక్కువాడా!

**గద్యము**

**ఇది శ్రీ సకల సుకవిజనానందకర బొప్పనామాత్యపుత్ర గంగనార్య ప్రణీతంబైన శ్రీమద్భాగవత మహాపురాణంబునందు భరతాత్మజుండయిన సుమతికి రాజ్యాభిషేకంబును, బాషండ దర్శనంబును, సుమతి పుత్త్ర జన్మ విస్తారంబును, గయుని చరిత్రంబును, గయుని సంస్తుతియు, భూద్వీప వర్ష సరిదద్రి నభస్సముద్ర పాతాళ దిఙ్నరక తారకాగణ సంస్థితియు నను కథలు గల పంచమస్కంధంబునందు ద్వితీయాశ్వాసము.**

**ప్రతి :** ఇది= పంచమస్కంధంలోని ద్వితీయాశ్వాసమైన ఈ గ్రంథం; శ్రీ సకల సుకవిజన+ఆనందకర= లక్ష్మీకళలతో కూడుకొన్న మంచి కవులందరికీ సంతోషాన్ని కల్గించేదీ; బొప్పన+అమాత్ర పుత్ర= బొప్పన అనే పేరు కలిగిన మంత్రి కుమారుడును; గంగన+ఆర్య ప్రణీతంబైన= గంగన అనే పేరుతో ప్రసిద్ధుడైన కవిచే రచింపబడిన; శ్రీమత్+భాగవత మహాపురాణంబునందున్= శ్రీమంతమైన భాగవతమనే పేరుగల గొప్ప పురాణంలో; భరత+ఆత్మజుండు+ఐన= భరతుని కుమారుడైన సుమతికి; రాజ్య+అభిషేకంబును= రాజ్యసింహాసన స్వీకార సందర్భంలో చేసే పట్టాభిషేక మహోత్సవాన్ని; పాషండ దర్శనంబును= విష్ణుమూర్తిని సామాన్య దేవతగా చూచే పాషండులనబడే వారిని గురించీ; సుమతి= సుమతి మహారాజుయొక్క; పుత్ర జన్మ విస్తారంబును= తామరతంపరగా అల్లుకొన్న బహుళ సంఖ్యగల కుమారులను; గయుని చరిత్రంబును= గయుడనే పేరుగల రాజుయొక్క చరిత్రను; గయుని సంస్తుతియున్= గయరాజు చేసిన స్తోత్రాన్ని; భూద్వీప వర్షసరిత్+అద్రి, నభస్+సముద్ర పాతాళ దిక్+నరకతారకా+గణ సంస్థితియున్= భూమి, దిబ్బలును, వర్షాలును, నదులును, కొండలును, ఆకాశం, సముద్రం, పాతాళం, దిక్కులు, వివిధ నరక లోకాలు, నక్షత్రాల సమూహాలు గలవీ అనే కథల కథనంగల; పంచమ స్కంధంబునందున్= ఐదవ స్కంధంలో; ద్వితీయ+ఆశ్వాసము= రెండవ ఆశ్వాసం.

**తా :** ఇది లక్ష్మీకరమైన కళలతో కూడుకొన్నదీ, సత్కవులకందరికీ సంతోషాన్ని కల్గించేదీ, బొప్పన అనే మంత్రి కుమారుడైన గంగన అనే సత్కవిచే రచింపబడిన శ్రీమంతమైన భగవద్భక్తుల చరిత్రయైన భాగవత పురాణంలో భరతుని కుమారుడైన సుమతికి, రాజ్య పట్టాభిషేక మహోత్సవాన్ని, నాస్తికులైన పాషండుల వృత్తాంతాన్ని, సుమతి మహారాజుగారి బహుళ సంతానవృక్షాన్ని, గయుని చరిత్ర, గయుని స్తోత్రం, భూమి, ద్వీపాలు, వర్షాలు, నదులు, కొండలు, ఆకాశం, సముద్రం, పాతాళం, దిక్కులు, వివిధ నరక లోకాలు, నక్షత్ర సమూహాలు గురించి చెప్పే కథల కథనం గలిగిన (ఈ రచన) ఐదవస్కంధంలోని రెండవ ఆశ్వాసంగా పూర్తి చేయబడింది.

*:: శ్రీకృష్ణార్పణమస్తు ::*

# పద్యగద్యసూచి

## చతుర్థస్కంధము


| | |
|---|---|
| అంగనా నివాసంబుల యందు | 4-881 |
| అంగప్రధానక యాగంబులను జేసి | 4-210 |
| అంగిరసుఁ డనెడు మునికిఁ | 4-24 |
| అంచిత వామపాదాంభోరుహము దక్షిణోరుతలంబున | 4-140 |
| అంత | 4-363 |
| అంత | 4-437 |
| అంత | 4-638 |
| అంత | 4-736 |
| అంత | 4-785 |
| అంత | 4-798 |
| అంత దాక్షాయణి యయిన | 4-211 |
| అంత ధ్రువుఁడునుఁ బంకేరుహాక్ష | 4-292 |
| అంత నక్కడ నా ధ్రువుండు | 4-268 |
| అంత నచటి జనంబు | 4-536 |
| అంత నతండు | 4-410 |
| అంత నా ధ్రువుండు | 4-297 |
| అంత నా పృథుని | 4-655 |
| అంత నా సజ్జనాగ్రణి | 4-310 |
| అంత నా సునీతి | 4-227 |
| అంత నొక్కనాఁడు | 4-430 |
| అంత రుద్రానువర్తులైనట్టి సిద్ధ, | 4-144 |
| అంత విజితాశ్వుండు పరలోకగతుం | 4-679 |
| అంత శ్వశురుండగు దక్షునకు | 4-54 |
| అంత స్వకీయ ప్రాణవల్లభ | 4-776 |
| అంత హతశేషులు | 4-338 |
| అంతఁ జాక్షుషమన్వంతరంబున దైవచోదితుండై | 4-945 |
| అంతఁ దద్వృత్తాంతం బంతయు | 4-408 |
| అంతఁ బృథుచక్రవర్తియు నింద్రియాగోచరుం | 4-558 |

| | |
|---|---|
| అందంద కురియించి రమరులు | 4-436 |
| అందు లోకరక్షణార్థంబుగా నారాయణాంశంబున | 4-435 |
| అక్కడక్కడఁ బూర్వంబునందు లేని, | 4-506 |
| అగ్నిదేవుం డిట్లనియె | 4-196 |
| అట్టి దేవునిఁ ద్రిపుర | 4-117 |
| అట్టి నీవు | 4-479 |
| అట్టి భూతదయా సమేతులును | 4-717 |
| అట్టి యధ్వర కర్మమందు | 4-509 |
| అట్టి యపవర్గ సాధన | 4-664 |
| అట్టి యుత్తమబాలు | 4-262 |
| అట్టి శార్ఙ్గపాణి యఖిల | 4-373 |
| అట్టి సమయంబున ధ్రువుండు | 4-376 |
| అట్టి సౌందర్యఖనియు సముద్రపుత్త్రియు | 4-684 |
| అట్లగుటం దత్కర్మంబు లొకానొకనికి | 4-148 |
| అట్లయి యుండ | 4-481 |
| అట్లయ్యును | 4-153 |
| అట్లరిగి నారాయణు నుద్దేశించి | 4-275 |
| అట్లు కృత ప్రణాములైన | 4-168 |
| అట్లు గని డాయంజని | 4-270 |
| అట్లు గురియించిన నతండు | 4-328 |
| అట్లు దోఁచిన | 4-333 |
| అట్లు నారదుండు సనిన | 4-966 |
| అట్లు పలికి వారల | 4-942 |
| అట్లు పురంబు దహ్యామానంబగుచుండ | 4-821 |
| అట్లు పురంబున కరుగుట | 4-342 |
| అట్లు మునీంద్రు నాశ్రమంబు | 4-15 |
| అట్లు యోగనిద్రా పరవశుండ | 4-288 |
| అట్లు వివాహంబులు గావించి | 4-806 |
| అట్లు వివాహంబైన రుచిప్రజాపతి | 4-4 |
| అట్లు సని చని | 4-514 |
| అట్లు సనినం బశువుం | 4-523 |
| అట్లు సనునప్పుడు | 4-512 |

| | |
|---|---|
| అట్లెఱింగించి వెండియు నిట్లనియె, | 4-561 |
| అట్లేసిన | 4-350 |
| అతఁ డా కన్యక | 4-831 |
| అతఁ డాత్మదర్శనుం డయి, | 4-678 |
| అతఁడు ననన్యదృష్టిని జరాచర | 4-273 |
| అతఁడు నభస్వతి యనియెడి, | 4-675 |
| అతండు మఱియు నగ్ని | 4-642 |
| అతని నున్మత్తునిం గాఁ | 4-390 |
| అతిఘోరం బయిన | 4-649 |
| అతివిశ్రీతులు సులజ్జా, న్వితులు | 4-447 |
| అతుల దర్పోద్ధతుండై వీరభద్రుండు | 4-122 |
| అది గనుఁగొన హాహాధ్వని, | 4-99 |
| అది గాక మీరు | 4-428 |
| అది గాక వినుము | 4-533 |
| అది గాన నీ వధోక్షజు | 4-220 |
| అది గాన పద్మలోచన!, | 4-551 |
| అది గావున | 4-91 |
| అది గావున యజ్ఞభాగార్హుండ | 4-151 |
| అది మఱియు నిజకాంతిచేతం | 4-379 |
| అది మఱియును మందార | 4-135 |
| అది యెట్టి దనిన | 4-707 |
| అది యెట్టి దనిన | 4-290 |
| అది యెట్టిదనిన | 4-719 |
| అది యెట్లంటిరేని | 4-913 |
| అది యెట్లంటేని | 4-873 |
| అది యెట్లనిన | 4-620 |
| అది యెట్లనిన | 4-727 |
| అది యెట్లనిన | 4-962 |
| అది యెట్లనిన | 4-887 |
| అది యెట్లు బ్రాహ్మణాధీనం | 4-636 |
| అదిగాక యీ వేనుండు | 4-419 |
| అదియునుం గాక | 4-265 |

| | |
|---|---|
| అదియునుం గాక | 4–417 |
| అదియునుం గాక | 4–483 |
| అదియునుం గాక | 4–590 |
| అదియునుం గాక | 4–609 |
| అదియునుం గాక | 4–779 |
| అదియునుం గాక | 4–955 |
| అదియునుం గాక “ఆత్మనస్తు | 4–624 |
| అదియునుం గాక దారుస్థితంబైన | 4–584 |
| అదియునుం గాక దేవతల | 4–93 |
| అదియునుం గాక దేహాభిమానంబునం | 4–355 |
| అదియునుం గాక | 4–76 |
| అదియునుం గాక యాచరితంబైన | 4–885 |
| అదియునుం గాక యీజగద్వైచిత్ర్యంబు | 4–573 |
| అదియునుం గాక సంతానార్థంబు | 4–19 |
| అదియునుంగాక | 4–423 |
| అదియునుంగాక | 4–580 |
| అదియునుంగాక యీ హరద్వేషులై | 4–49 |
| అదియునుంగాక యే బుద్ధింజేసి | 4–366 |
| అదియునుంగాక! దేవా! మహాశ్చర్యకరంబై | 4–64 |
| అదియె ట్లతనిచేత భవత్సంబంధంబునం | 4–74 |
| అన విని వారికి | 4–572 |
| అన సూత వందిమాగధ | 4–449 |
| అనఘ చరితులార! యాహూతు | 4–396 |
| అనఘ! జితేంద్రియుల్ సుమహితాత్ములు | 4–298 |
| అనఘ! నీ చేత | 4–537 |
| అనఘ! నీదు సహోదరహంత | 4–361 |
| అనఘ! పినతల్లి దన్నుఁ | 4–296 |
| అనఘ! మహాత్మ! వాగ్గళితమైన | 4–552 |
| అనఘ! మహాత్ముం డగు | 4–143 |
| అనఘ! మునీంద్ర చంద్ర! | 4–949 |
| అనఘ! మునీంద్ర! మహాభాగ! | 4–739 |
| అనఘ! యట్టి రిక్తహారుల | 4–808 |

| | |
|---|---|
| అనఘ! యీ సంసార | 4–625 |
| అనఘ! యెంతయు మమతాకుల | 4–818 |
| అనఘ! లోకంబులయందు వర్ణాశ్రమ | 4–147 |
| అనఘ! సకలేంద్రియగుణాం, జనమును | 4–708 |
| అనఘ! సాక్షాత్కార మగు | 4–619 |
| అనఘ! స్వకీయంబునై యతర్కితమునై | 4–484 |
| అనఘతపోభిరాముఁడగు నత్రిమునీంద్రుఁడు గాంచెఁ | 4–16 |
| అనఘా! దేవ! భవత్పద, | 4–706 |
| అనఘా! భయనామాగ్రజుఁ, డనఁగల | 4–820 |
| అనఘా! మనుకులమున కిది, | 4–354 |
| అనఘా! మాధవ! నీవు | 4–185 |
| అనఘా! యీ దుఃఖమునకుఁ, | 4–228 |
| అనఘా! యేనును బ్రహ్మయు | 4–207 |
| అనఘా! విను లోకంబుల, | 4–66 |
| అనఘాత్మ! తగ నీవు | 4–160 |
| అనఘాత్మ! నారద మునిపతి | 4–385 |
| అనఘాత్మ! నీవు పంచాబ్ద | 4–358 |
| ‘అనఘాత్మ! భగవంతులైన కేశవ | 4–951 |
| అనఘాత్మ! మఱినీవు యజ్ఞరూపుం | 4–291 |
| అనఘాత్మ! యే యజ్ఞమందు | 4–53 |
| అనఘాత్మ! యేమిటి యందు | 4–884 |
| అనఘాత్మ! యోగీంద్రు లనయంబు | 4–240 |
| అనఘాత్మ! రాజర్షి యైన | 4–812 |
| అనఘాత్మ! రాజర్షి యైనట్టి | 4–394 |
| అనఘాత్మ! లోకు లెవ్వని | 4–347 |
| అనఘాత్మ! వినుము జాయాత్మజులును | 4–854 |
| అనఘాత్మక! లోకత్రయ, మున | 4–643 |
| అనఘాత్ము లతిథి రూపం, | 4–600 |
| అనఘాత్ములారా! యభిన్న ధర్మశీలు | 4–911 |
| అనఘుఁడు రుద్రుఁ జేరి | 4–111 |
| అనఘుం డత్రిమహాముని,యనసూయా దేవివలన | 4–8 |
| అనఘుండగు నత్రి మహా, ముని | 4–513 |

| | |
|---|---|
| అనయ మా నృపనందనుల్ | 4–937 |
| అనయంబు లుప్తక్రియా కలాపుఁడు | 4–43 |
| అనయంబు "శివ" యను | 4–87 |
| అనయంబుఁ గాల పుత్రిక, | 4–811 |
| అనయంబుం దనమానసంబున నవిద్యల్ | 4–48 |
| అనయంబును నయ్యక్షుల, ఘనమాయ | 4–345 |
| అనయంబున్ ధ్రువుమీఁద దైత్యకృతమాయాజాల | 4–343 |
| అనయము నా కొక | 4–496 |
| అనయము నిట్టి కుపుత్త్రునిఁ, | 4–404 |
| అనయము నిట్లు శోకవిపులాశ్రుపయః | 4–842 |
| అనయముఁ బిలువక యుండం, | 4–67 |
| అనయమును మీ మనోరథ, | 4–907 |
| అనవుఁడు నతనికి నతఁ | 4–740 |
| అనవుడు విదురుఁడు మైత్రే, | 4–9 |
| అనవుడు విదురున కమ్ముని, | 4–687 |
| అనవుడు విని (యక్కాంతలు) | 4–783 |
| అని కుపిత చిత్తుండై | 4–110 |
| అని చతురాననుండు వినయంబున | 4–152 |
| అని చింతించు సమయంబున | 4–331 |
| అని చెప్పి మునినాథుఁడైన | 4–508 |
| అని చెప్పి సుర | 4–127 |
| అని తన్ను సకల | 4–205 |
| అని దగ్ధశీర్షుండయిన దక్షుం | 4–155 |
| అని దేవతలు విన్నవించిన | 4–277 |
| అని నారదుండు పలికిన, | 4–267 |
| అని పలికి వీరవర్యుం, | 4–596 |
| అని పలికి వెండియు | 4–611 |
| అని పలుకు సమయంబున | 4–538 |
| అని పాడె ననుచు | 4–381 |
| అని పృథుని వారించి | 4–530 |
| అని ప్రశంసించి, రట్లు | 4–314 |
| అని మఱియు ననఘాత్ములార! | 4–607 |

| | |
|---|---|
| అని మఱియు నిట్లనియె | 4–129 |
| అని మఱియు నిట్లనియె | 4–859 |
| అని మఱియు నిట్లనియె, | 4–964 |
| అని మఱియు నిట్లనియె; | 4–68 |
| అని మఱియు నిట్లనియె; | 4–132 |
| అని మఱియు నిట్లనియె; | 4–534 |
| అని మఱియు నిట్లనియె; | 4–425 |
| అని మఱియు నిట్లనిరి | 4–950 |
| అని మఱియు మహి | 4–491 |
| అని మఱియు సముండవు, | 4–936 |
| అని మఱియుఁ బ్రద్యుమ్నుం | 4–705 |
| అని మునిచంద్రుఁడు తన | 4–22 |
| అని మైత్రేయ మహాముని, | 4–560 |
| అని మైత్రేయుఁడు | 4–293 |
| అని మైత్రేయుండు విదురున | 4–968 |
| అని యడిగి వెండియును | 4–847 |
| అని యడిగిన నవ్విదురునిఁ, | 4–37 |
| అని యడిగిన విదురునిఁ | 4–387 |
| అని యభినందించి మోక్షసాధనోపదేశ | 4–616 |
| అని యి వ్విధంబున | 4–756 |
| అని యి వ్విధంబున | 4–118 |
| అని యి వ్విధమున | 4–499 |
| అని యి వ్విధమునఁ | 4–827 |
| అని యిట్టుల ప్రతికూల | 4–45 |
| అని యిట్టుల భేరీరవ, | 4–414 |
| అని యిట్లు చింతించె | 4–301 |
| అని యిట్లు దేవగణములు, | 4–32 |
| అని యిట్లు పలుకుచున్న | 4–916 |
| అని యిట్లు యజ్ఞ | 4–96 |
| అని యిట్లు రుద్ర | 4–162 |
| అని యివ్విధమున నారద, | 4–965 |
| అని యీ గతి | 4–735 |

| | |
|---|---|
| అని యీ గతి | 4-893 |
| అని యీ గతిఁ | 4-632 |
| అని యీ గతిఁ | 4-763 |
| అని యీ రీతి | 4-221 |
| అని వారలు | 4-665 |
| అని వినుతించి | 4-921 |
| అని విలపించుచున్ సరసిజాక్షి | 4-844 |
| అని విశ్వసింపకుండియు, మనమున | 4-304 |
| అని వెండియు | 4-605 |
| అని వెండియు నిట్ల | 4-452 |
| అని వెండియు నిట్లనియె | 4-213 |
| అని వెండియు నిట్లనియె | 4-405 |
| అని వెండియు నిట్లనియె. | 4-889 |
| అని వెండియు నిట్లనియె. | 4-790 |
| అని వెండియుఁ బ్రవేశ | 4-457 |
| అని శుకయోగి పరీక్షి, | 4-973 |
| అని శుకుఁడు పరీక్షిత్తున, | 4-972 |
| అని హరి నుద్దేశించి | 4-701 |
| అనిన నాతండు సంతానార్థంబు | 4-400 |
| అనిన యోగీంద్రుండు రాజేంద్రున | 4-853 |
| అనిశము నస్మదీయగురుఁడైన సరోరుహ | 4-730 |
| అనుచర వర్గంబు భృశాతురులును | 4-829 |
| అనుచుం దదీయ విభ్రమ | 4-796 |
| అనుపమ బ్రహ్మవాదు లగు | 4-914 |
| అనుపమ భక్తి నెవ్వని | 4-578 |
| అనుపమ మఖ కర్మ | 4-493 |
| అనుపమ శాంతము లగు | 4-901 |
| అనుపమ సుస్థిర నియమా, | 4-840 |
| అప్పుడు రాక్షసమాయలు, గప్పిన | 4-340 |
| అప్రమత్తుండ వగుచుఁ బద్మాక్షి! | 4-729 |
| అభ్రంలిహోదభ్ర విభ్ర మాభ్ర | 4-107 |
| అమర సమస్తదేశములందు నఖిల | 4-150 |

| | |
|---|---|
| అమరవరేణ్యుఁ బోలి యనయంబు | 4-462 |
| అమరేంద్రుఁడు ఘనరోషో, ద్గముఁడై | 4-511 |
| అమృతోపమానంబు లయిన మధుర | 4-450 |
| అయి చాల ఘుర ఘుర | 4-823 |
| అయిన పురుషోత్తముం బూజించుచు | 4-253 |
| అయినను విను సరోజాయత | 4-925 |
| అయ్యవసరంబున | 4-336 |
| అయ్యవసరంబున నచ్చట నున్న | 4-519 |
| అయ్యవసరంబునఁ దదుత్సవ దర్శన | 4-57 |
| అరదము డిగ్గి ప్రేమ | 4-307 |
| అరయ గృహస్థు లయ్యును | 4-912 |
| అరయ ధరిత్రి నెవ్వనిగృహంబు | 4-608 |
| అరయ నరాజకంబగు మహాభయముం | 4-416 |
| అరయఁగ క్షుద్రభూత హృదయంబుల | 4-924 |
| అరయఁగ నే ధరామర | 4-586 |
| అరయఁగ నేము బుభుక్షా, | 4-469 |
| అరయఁగ వైన్యుని దక్షిణహస్తము | 4-438 |
| అరయంగ నేమిటి యందు | 4-720 |
| అరవిందోదర! తావకీన ఘన | 4-177 |
| అరవిందోదర! తావకీన చరణ | 4-283 |
| అరసి సునీథయు శోకా, | 4-429 |
| అరి దుఃఖావహమైన కార్ముకము | 4-334 |
| అరిషడ్వర్గ మహోర్మినక్ర నికర | 4-630 |
| అరుదౌ నభ్ర తమఃప్ర | 4-958 |
| అలఘు చరిత్రుఁ డమ్మనుకులాగ్రణిచే | 4-337 |
| అలఘుని నభవుని యోగీం, | 4-141 |
| అలవడ నే సతీమణి | 4-682 |
| అళికులోపమ లసదలక శోభిత | 4-710 |
| అవనీపతి! భయనామక, యవనకులాధీశ్వరుండ | 4-814 |
| అవనీశ! యీ విధంబున, | 4-879 |
| అవనీశ! వీర్యపణాత్త యైనట్టి | 4-830 |
| అవనీశ్వరో త్తమ! | 4-767 |

| | |
|---|---|
| అవశిష్ట ధరణీరుహంబులు భయ | 4-943 |
| ఆ నలినాయతాక్షుని యనంత | 4-169 |
| ఆ మునిచే నా | 4-971 |
| ఆ మ్మహాదేవి నెయ్యంబున | 4-799 |
| ఆ యజ్ఞముఁ గనుఁగొనఁగా, | 4-61 |
| ఆ యమునా తటినీ | 4-247 |
| ఆ రథికోత్తముం దొడరి | 4-327 |
| ఆ రవ మపుడీక్షించి | 4-103 |
| ఆ వృక్షమూల తలంబున | 4-137 |
| ఆ శిశు వపుడు | 4-910 |
| ఆ సమయంబున బ్రహ్మాది | 4-30 |
| ఆ సుచరిత్ర దంపతు లుదంచిత | 4-23 |
| ఆత్మకుఁ బరిశుద్ధి నర్థించు | 4-712 |
| ఆది వరాహంబ వగుచు | 4-486 |
| ఆద్యుం డుగ్రుఁడు నీలకంఠుఁ | 4-105 |
| ఆలోకభయంకరమగు, నా లోకమహావిపద్దశాలోకనులై | 4-274 |
| ఆశ్రిత సత్ప్రసాదాభి ముఖుండును | 4-249 |
| ఇంతయును మున్ను మనమున | 4-126 |
| ఇందీవరేక్షణ! యే నెందు | 4-794 |
| ఇంద్రియేశుఁడు గంధాదికేష్ట గుణము, | 4-602 |
| ఇంద్రుం డిట్లనియె | 4-180 |
| ఇట్టి జగత్సర్జకుండవైన నీవు | 4-724 |
| ఇట్టి నన్నుఁ గృపామతి | 4-476 |
| ఇట్టి నీ పాదమూలంబు | 4-714 |
| ఇట్టి లోకోపద్రవం బెఱింగి | 4-432 |
| ఇట్టి విద్వ దనుభవంబున | 4-575 |
| ఇట్టు లవ్యక్తరూపుండును, నప్రమేయుండును, | 4-357 |
| ఇట్లగుటం జేసి సత్పురుష | 4-556 |
| ఇట్లతి ఘోరంబైన తపంబు | 4-12 |
| ఇట్లతిశీఘ్రగమనంబున | 4-78 |
| ఇట్లధ్యాత్మయోగనిష్ఠుండై కర్మంబుల నాచరించుచు | 4-640 |
| ఇట్లనియె | 4-258 |

| | |
|---|---|
| ఇట్లనిరి | 4-463 |
| ఇట్లనిరి! నరేంద్రా! | 4-421 |
| ఇట్లను, మునీంద్రా! | 4-813 |
| ఇట్లన్యోన్యంబును శాపంబులం బొందియు | 4-52 |
| ఇట్లాత్మహితంబు లైన కర్మంబులయం | 4-810 |
| ఇట్లావిర్భవించిన కన్యకలందు శ్రద్ధయు | 4-28 |
| ఇట్లు గనుంగొని యజ్ఞశాలం | 4-82 |
| ఇట్లు గనుంగొని యనంతరంబ | 4-745 |
| ఇట్లు గౌఁగిటం జేర్చి | 4-546 |
| ఇట్లు తండ్రిచే నాదరింపబడనిదై | 4-86 |
| ఇట్లు దండప్రణామంబు లాచరించి | 4-280 |
| ఇట్లు దక్షిణాగ్ని యందు | 4-104 |
| ఇట్లు దక్షుండు పల్కిన | 4-47 |
| ఇట్లు దనమీఁది యనుగ్రహంబునం | 4-548 |
| ఇట్లు దొడిగిన | 4-472 |
| ఇట్లు ధరణి వాఱిన | 4-474 |
| ఇట్లు ధరియించి గత | 4-98 |
| ఇట్లు ధర్మపత్ని వెంట | 4-834 |
| ఇట్లు పుత్ర పుత్రికా | 4-803 |
| ఇట్లు పెఱికివైచిన రుద్రుని | 4-106 |
| ఇట్లు ప్రజలను ధర్మంబులయందు | 4-570 |
| ఇట్లు ప్రవేశించిన రాజర్షియైన | 4-322 |
| ఇట్లు భవదీయ సేవాతత్పరులమైన | 4-554 |
| ఇట్లు మాతామహ దోషంబునం | 4-403 |
| ఇట్లు లేచి నిలిచి | 4-158 |
| ఇట్లు వర్తించుచు | 4-647 |
| ఇట్లు వసియించి కతిపయ | 4-766 |
| ఇట్లు వాత్సల్యంబునం జల్లుచు | 4-318 |
| ఇట్లు విడిచి | 4-677 |
| ఇట్లు విపాటిత విరోధి | 4-466 |
| ఇట్లు వీరభద్రుండు దక్షునియాగంబు | 4-123 |
| ఇట్లు వెడలి | 4-324 |

| | |
|---|---|
| ఇట్లు వెడలివచ్చిన | 4–694 |
| ఇట్లు సనుదెంచి | 4–599 |
| ఇట్లు సుశీల సంపన్నుండును, | 4–368 |
| ఇతఁ డింద్రోపేంద్రపరీ, వృతుఁడై | 4–46 |
| ఇతండు నారాయణాంశ సంభూతుండు | 4–439 |
| ఇతనికి సన్మత్తనూజను విధిప్రేరితుండనై | 4–44 |
| ఇతి కర్తవ్య విచారక, | 4–728 |
| ఇది శ్రీ పరమేశ్వర | 4–977 |
| ఇదియునుం గాక | 4–926 |
| ఇద్ధ సనందాది సిద్ధ | 4–138 |
| ఇవ్విధంబున | 4–542 |
| ఇవ్విధంబున నతండు మహిషీ | 4–770 |
| ఇవ్విధంబున నా చిత్రరథుండగు | 4–353 |
| ఈ ధూళి పుట్టుట | 4–113 |
| ఈ నృపతి ధరాచక్రము, | 4–461 |
| ఈ ముల్లోకము లందును, | 4–793 |
| ఈ యాఖ్యానముఁ జదివిన, | 4–212 |
| ఈ లోకంబునం బురుషులకు | 4–670 |
| ఈ వైన్యుఁ డఖిలలోకావళి | 4–454 |
| ఉజ్జ్వలంబయి శతయోజనంబుల పొడ | 4–136 |
| ఉత్తమశ్లోకుండగు పుండరీకాక్షుండు నిజమాయాస్వేచ్ఛావతార | 4–256 |
| ఉదయాద్రి పర్యంత ముర్వీతలం | 4–460 |
| ఉన్నత సంతోష ముప్పతిల్లఁగఁ | 4–313 |
| ఉన్నతోన్నతుఁడు సముత్తుంగ భుజుఁడు | 4–566 |
| ఋత్విక్పుత్రు లిట్లనిరి | 4–182 |
| ఋషు లిట్లనిరి | 4–184 |
| ఎనయఁగ జారకామిని నిజేశుని | 4–424 |
| ఎనయఁగ బాల్యమందుఁ దన | 4–402 |
| ఎనయన్ క్షుత్పరిపీడఁ గుంది | 4–860 |
| ఎనసిన భక్తి యోగమున | 4–713 |
| 'ఎవ్వరి దానవు? జనకుం, డెవ్వడు? | 4–749 |
| ఏ నీ కిప్పుడు | 4–667 |

| | |
|---|---|
| ఏ వసుధామర సేవను | 4-587 |
| ఏ విభుఁడు జగదధీశ్వరుఁ, | 4-13 |
| ఏ వేదమందేని | 4-591 |
| ఏకాగ్రచిత్తులును సు, శ్లోకులునై | 4-734 |
| ఏను నీ లోకవితానంబు | 4-569 |
| ఏను షణ్మాసంబులు భజియించి | 4-299 |
| ఏమి కతమున నున్నదో | 4-784 |
| ఏమి నిమిత్తం బత్రి | 4-10 |
| ఏమి నిమిత్తమై భూమి | 4-467 |
| ఒకనాఁడు నిజమందిరోపాంత వనముకుఁ | 4-465 |
| ఒకనాఁడు సుఖలీల నుత్తానపాదుండు | 4-219 |
| ఒనరఁ బ్రచేతసు లుత్పన్న | 4-946 |
| ఒప్పునట్టి సరోవరంబుఁ బొడగని | 4-692 |
| ఓ నాథ! పరమపురుషుఁడ, | 4-478 |
| ఓ నృప! నీకు | 4-372 |
| కంజాతపత్ర నేత్రపు, రంజను | 4-797 |
| కందమూల ఫలాశియై బహుకాల | 4-646 |
| కడఁగ గృహములు నఖిల | 4-833 |
| కడఁగి గుహ్యక మాయాంధకార | 4-348 |
| కడఁగి భవత్పదార్చనకుఁ గా | 4-183 |
| కడఁగి మఱివారు యాదృచ్ఛికమునఁ | 4-897 |
| కని కృపాయత్తు లగుచు | 4-415 |
| కని రా తాపసపుంగవుల్ | 4-695 |
| కని లోకపాలురును ముని, | 4-142 |
| కని వా రనపత్యుం | 4-434 |
| కని వారలు దమ | 4-696 |
| కమలదళాక్ష! దుఃఖలయ కారణమై | 4-922 |
| కమలదళాక్షి పాయసము గౌతుక | 4-401 |
| కమలలోచన నిఖిలభోగముల దొఱఁగి, | 4-837 |
| కమలాధీశ్వర! తావకీన వర | 4-929 |
| కమలాధీశ్వరుఁ బూజ సేయుట | 4-954 |
| కమలానన! బాంధవ కృ, త్యము | 4-789 |

| | |
|---|---|
| కర చరణాదికాంగముల గల్గియు | 4-189 |
| కర మనురక్తి | 4-55 |
| కర మనురక్తిని మోము | 4-225 |
| కర మొప్పఁగ నీ | 4-752 |
| కరతల గృహీత లీలాం, | 4-235 |
| కరము మహారథుండు భుజగర్వ | 4-325 |
| కరమొప్పు నానంద గద్గద | 4-311 |
| కరసరసీరుహంబు లెసకం బెసఁగన్ | 4-917 |
| కరుణారస పరిపూర్ణ, స్ఫురిత | 4-762 |
| కరుణావలోకనంబులు, నిరవొంద నృపాలసుతుల | 4-905 |
| కర్మంబులను యథాకాల దేశోచిత | 4-639 |
| కర్మవశంబునన్ జగము గల్గును | 4-581 |
| కలదే జగతిం బదురు | 4-944 |
| కలుగు మత్కామితంబు వృథ | 4-815 |
| కల్యాణి! నీ మాట | 4-69 |
| కాంచన మయ మరకత | 4-319 |
| కాన పతివ్రతలకు నసాధ్యం | 4-662 |
| కాన మనమునఁ దద్వివేకంబు | 4-238 |
| కావున | 4-229 |
| కావున | 4-245 |
| కావున | 4-754 |
| కావున | 4-781 |
| కావున | 4-932 |
| కావున న మ్మహాత్ముఁడు | 4-264 |
| కావున నట్టి విప్రపాద | 4-592 |
| కావున నది తత్కథాకర్ణన | 4-867 |
| కావున నయ్యజ్ఞమునకు, నీ | 4-60 |
| కావున నాకును సూరి | 4-731 |
| కావున నిట్టి భాగవత | 4-871 |
| కావున నితని క్షమింపుము, | 4-540 |
| కావున నీ | 4-527 |
| కావున నీవును నేనునుం | 4-849 |

| | |
|---|---|
| కావున నీశ్వరగుణ సర్గరూపంబైన | 4-487 |
| కావున నుత్తముండును ధ్రువుండును | 4-312 |
| కావున నేను జ్ఞానదృష్టిం | 4-817 |
| కావున భగవంతుండును, దేవాధీశుండు | 4-686 |
| కావున మీర ల | 4-582 |
| కావున రాజేంద్ర! నీవును | 4-877 |
| కావున వివేకంబు గల | 4-239 |
| కావున శ్రద్ధయు భగవద్ధర్మ | 4-618 |
| కావునం బశువ్రాతంబులు త్వదీయవైశసంబును | 4-741 |
| కావునం బినతల్లియైన యా | 4-232 |
| కావునం 'బుత్రేణ లోకాన్ | 4-594 |
| కావునం బ్రాగగ్రంబులైన దర్భలచేత | 4-878 |
| కుటిలబుద్ధు లయిన కుజనుల | 4-71 |
| కుపితుఁడై నాఁడు భవుని | 4-120 |
| కేశవ! సంతత క్లేశనాశనుఁడవు | 4-918 |
| కైకొని యపుడు లోకం | 4-392 |
| కైకొని శుద్ధంబు గతమత్సరంబును | 4-359 |
| కొందఱు స్వభావ మందురు, | 4-356 |
| కోరి మడమలచే గుదపీడనము | 4-653 |
| క్రతుభాగార్హుం డగు పశు, | 4-130 |
| క్రమమున నిటు పృథ్వ్యాదులు, | 4-503 |
| క్రమ్మఱ నత్రిచేఁ దెలుపఁగాఁబడి | 4-522 |
| క్లేశనాశంబును మహాప్రకాశంబును నైన | 4-384 |
| క్షితి నుభయేంద్రియ కర్మ, | 4-886 |
| క్షితినాథోత్తముఁ డాత్మనందనుని దుశ్శీలంబు | 4-391 |
| క్ష్మాతలం బెల్ల నిజతనూజాతులకును, | 4-832 |
| ఖద్యోతయు హవిర్ముఖియు నను | 4-768 |
| ఖర నిశిత ప్రదీప్తఘన | 4-351 |
| గంధర్వు లిట్లనిరి | 4-200 |
| గంధవాహుఁడు మందగతి ననుకూలుఁడై | 4-29 |
| గగనస్థలిం దోఁచు గంధర్వనగరాది | 4-31 |
| గణుతింప భూరిదక్షిణలచే ఁగడునొప్పు | 4-367 |

| | |
|---|---|
| గురు శీలౌదార్య గుణో, | 4-802 |
| గురుభుజశౌర్య! భూరిరణకోవిద! మద్భటకోటి | 4-109 |
| గొనకొని యిట్టి దుఃఖములకుం | 4-861 |
| ఘన కాక కృష్ణ | 4-433 |
| ఘన తేజోనిధి పురుషం, | 4-128 |
| ఘన దుఃఖ హేతుకర్మం, | 4-862 |
| ఘన పురుషార్థభూత మనఁగాఁ | 4-865 |
| ఘన మగు దేవ! | 4-550 |
| ఘన సమవిన్యస్త కర్ణ | 4-746 |
| ఘనకర్మాసక్త చిత్తుండై యున్న | 4-738 |
| ఘనకుపితాత్ములై విలయకాల భయంకర | 4-940 |
| ఘనగౌరవమున న మ్మని, | 4-603 |
| ఘనమేరు శృంగ సంగత | 4-902 |
| ఘనరుచి నట్లు వచ్చిన | 4-167 |
| ఘనరోదనంబు సేయుచుఁ, గనుఁగవలను | 4-223 |
| ఘనవిస్తార మపార మద్వయ | 4-874 |
| ఘనశౌర్యోన్నతి తోడ సర్వ | 4-323 |
| ఘనుఁడౌ మరీచికిఁ గర్దమాత్మజయగు | 4-7 |
| చండ దోర్దండలీల భూమండలంబు, | 4-505 |
| చచ్చిన వారలు గ్రమ్మఱ, | 4-303 |
| చతురత నట్టి యీశ్వరుఁడు | 4-960 |
| చతురాత్మ! దుహితృవత్సలుఁడైన దక్షుండు | 4-36 |
| చతురాత్మ! సత్త్వరజస్తమోగుణములు వరుస | 4-723 |
| చతురుఁ డాజన్మ ప్రశాంతుండు | 4-388 |
| చని చని వెస | 4-378 |
| చని ముందటఁ గనుఁగొనె | 4-269 |
| చని యుగ్రాటవిఁ జొచ్చి | 4-261 |
| చనుచున్న సమయంబున హిమవత్పర్వత | 4-743 |
| చనుదెంచి నిర్జితప్రాణ మనో | 4-947 |
| చనుదెంచి య త్తలోదరి, | 4-846 |
| చనుదెంచి యాధ్రువుం గని | 4-346 |
| చనుదెంచి వెసఁ గృతాంజలియైన | 4-365 |

| | |
|---|---|
| చనుదెంచిన నారదమునిఁ, గనుఁగొని | 4-948 |
| చనుదెంచిన య మ్మగువను, | 4-83 |
| చనుదెంచిన యా దక్షుఁడు, | 4-39 |
| చనుదెంచెను భయనాముం, డనువాఁ | 4-828 |
| చర్చింప నరుల కే | 4-952 |
| చర్చింప నిట్టి యాశ్చర్య | 4-661 |
| చారు బహువిధ వస్తువిస్తార | 4-321 |
| జగదీశ! దేవ! యుష్మత్పద | 4-555 |
| జగములకు నెల్ల యోనిబీజంబులైన, | 4-145 |
| జనకుం డవమానించుట, యును | 4-85 |
| జనకుని మఖమున కర్థిం, | 4-62 |
| జనకుని యాశీర్వచనము, లనయముఁ | 4-309 |
| జననాథ! విను విదురునకును | 4-3 |
| జననాథచంద్ర! యీ భూ, | 4-475 |
| జననాయక! ప్రజ లిర | 4-571 |
| జననాయక! యజ్ఞములం, దనుపమ | 4-526 |
| జనని సునీతిని మును | 4-377 |
| జనపతి మునిఁ బొగడి | 4-633 |
| జనపాల! వీర్యవంతము, లనఁదగు | 4-528 |
| జనవర! భవదీయంబై, జననుతమగు | 4-539 |
| జనవినుత! భూమివలనను, ధనముల | 4-641 |
| జనుఁ డజ్ఞానమునన్ భుజించిన | 4-92 |
| జనులకు దుష్పుత్రకునిచేత నపకీర్తి | 4-406 |
| జనులకు ననురక్తుఁడవై, జననాయక! | 4-543 |
| జలజనేత్ర! ప్రణయ సంజాత | 4-786 |
| జలరుహగర్భుచేత మును చాల | 4-492 |
| తగవేది దక్షుఁ డా | 4-121 |
| తగు సుమహైశ్వర్యోదయ, మగు | 4-407 |
| తదనంతరంబ ప్రచేతసులు భగవదాజ్ఞ | 4-938 |
| తదీయ చిహ్నంబులు పారంపర్యంబుగా | 4-525 |
| తన కూఁతులు సూడఁగ | 4-114 |
| తన పాదములకు భక్తిన్, | 4-545 |

| | |
|---|---|
| తన పుత్త్రులుఁ దన | 4-826 |
| తన మనమున నే | 4-656 |
| తన సుతుని రాక | 4-305 |
| తనకంటె నితర మొక | 4-389 |
| తనరారు నవరత్న తాటంక | 4-58 |
| తను నట్లుపేక్ష సేసిన, | 4-222 |
| తన్నుఁ బొడగని సభ్యు | 4-40 |
| తము ధూర్జటి సైనికు | 4-125 |
| తరమిడి ప్రేమోద్గమమై, మరువిండ్లం | 4-748 |
| తరమిడి యచ్చర లాడిరి, | 4-659 |
| తరళాక్షి! పతి యగు | 4-751 |
| తరుణి! సుతారలోచన యుతంబును | 4-755 |
| తల పోయఁగ భువి | 4-341 |
| తలకొని నాకుఁ దాననుపదంబును | 4-782 |
| తలపోయ నవిదిత తత్త్వవిజ్ఞానుండ | 4-161 |
| తలపోయ బ్రహ్మవిద్యానిష్ఠ జనముల | 4-458 |
| తవిలి పదార్థభేద గ్రాహకములైన | 4-179 |
| తా ననుగమనము సేయం, | 4-845 |
| తా మాతని గెలిచితి | 4-332 |
| తాపసోత్తమ! ప్రచేతసులకు నా | 4-685 |
| తాపసోత్తములగు ప్రచేతసులు! వేడ్క, | 4-906 |
| తిరమగు నిష్ఠతో నతఁడు | 4-809 |
| తివిరి యప్పురుషుండు దేహంబుననుజేసి, | 4-890 |
| తివుట వారలు రుద్రోపదిష్టమైన, | 4-737 |
| తెలియుదు మని వెండియు | 4-722 |
| తొడలపై నిడికొని | 4-224 |
| తోయరుహోదరాయ! భవదుఃఖహరాయ! నమో | 4-920 |
| దక్షతనయ సతీదేవి దవిలి | 4-56 |
| దక్షప్రజాపతి తనయ యా | 4-35 |
| దవశిఖియుత తరుకోటర, నివసిత | 4-822 |
| దానంజేసి యతండు సంఛిన్న | 4-652 |
| దామోదరుండు సుదర్శన చక్రంబు | 4-443 |

| | |
|---|---|
| దితి సంతాన వినాశ | 4-181 |
| దివ్యులు వెఱఁగందఁగఁ | 4-413 |
| దురిత వినాశక పదపం, కరుహ! | 4-716 |
| దూర్వాంకురంబుల దూర్వాంకురశ్యాము జలజంబులను | 4-254 |
| దేవత లిట్లనిరి | 4-198 |
| దేవా! మదీయ స్వాధ్యాయాధ్యయనంబులును, | 4-934 |
| దేవాదిదేవ! యీ దృశ్యరూపంబు | 4-191 |
| దేహము విడిచిన సతిఁ | 4-102 |
| ద్వాదశిని పద్మ బాంధవ | 4-383 |
| ధనహీనుండు నృపాలుఁ జేరి | 4-300 |
| ధర విరులు గందకుండఁగ, | 4-489 |
| ధర సాధులు విమలాంతః, | 4-868 |
| ధరణి సజ్జన సంగంబు | 4-615 |
| ధరణిఁ జరాచర భూతము, | 4-957 |
| ధరణీభర ముడుపుట కా, | 4-33 |
| ధరణీశ! మధునిషూదనుఁ డైనయట్టి | 4-617 |
| ధరణీశోత్తమ! నీవు కేవలసముద్యద్భక్తి | 4-631 |
| ధరణీశోత్తమ! సర్వభూతహిత చేతస్కుండవై | 4-614 |
| ధరిత్రీ! మదీయాజ్ఞోల్లంఘనంబు సేయు | 4-477 |
| ధాతు విచిత్రితోదాత్త రత్న | 4-134 |
| ధీమహిత! యంతవారల, యామాఖ్యులు | 4-5 |
| ధీరత నీ లోకవ్యవ, | 4-876 |
| ధీరవ్రత! రాజన్యకు, మారక! | 4-289 |
| ధృత చిత్తుఁడు శాంతుండు | 4-255 |
| ధృతి నొప్పుచున్న సాత్త్విక | 4-858 |
| ధృతి సెదరఁ బట్టి | 4-529 |
| న న్నెఱుఁగు దేని | 4-848 |
| నతి నుతులచేత నీ | 4-362 |
| నను నుద్యతాయుధుఁడవై, మనుజేంద్ర! | 4-482 |
| నను సకల జీవతతికిని, | 4-480 |
| నయనముల విభు మూర్తిఁ | 4-279 |
| నర సిద్ధ చారణ | 4-557 |

| | |
|---|---|
| నరదేవతనయులారా!, పురుషాధీశుండుఁ బరమపురుషుఁడు | 4–733 |
| నరనాథ! యిదియు నిప్పుడు, | 4–397 |
| నరనాథ! వినుము స్వప్నంబు | 4–864 |
| నరనాథుఁ డాడు బిడ్డల, | 4–805 |
| నరనాథుఁడు లోకభయం, కరగతి | 4–765 |
| నరపాలక! నీ కాయువు, | 4–420 |
| నరలోకోత్తర భగవ, త్పరిచర్యారాధనమునఁ | 4–650 |
| నరవర నందనుల్ గడఁక | 4–967 |
| నరవరోత్తమ! యట్లు గాన | 4–891 |
| నలినభవుఁ డా మహీజ, | 4–941 |
| నలినాక్ష! విను భవన్మాయా | 4–203 |
| నా విని నారదుండు | 4–263 |
| నాకిపు డెఱిఁగింపుము సుశ్లోకుని | 4–386 |
| నాతోడను స్నేహము గల, | 4–63 |
| నారదుఁ డిట్లను ననఘ! | 4–242 |
| నారాయణుండు జగదా, ధారుండగు | 4–579 |
| నావుడు విని మైత్రేయుం, | 4–563 |
| నిజధర్మపరిశోభితంబైన యేకాగ్రచిత్తంబున నిలిపి | 4–236 |
| నిటలతట ఘటిత కరపుటులై | 4–170 |
| నిను నాడిన యా | 4–231 |
| నిరతంబు నాయందు నిష్పాదితములగు | 4–635 |
| నిరతముఁ దావకీన భజనీయ | 4–285 |
| నిరహంకార నిరస్తపాప సుజనానింద్యోల్లస | 4–75 |
| నీ కీర్తియు జగముల | 4–266 |
| నీ వింతవాఁడ వయ్యును, | 4–398 |
| నీలగళాపరాధి యగు నీకుఁ | 4–94 |
| నీవు నమ్మహాత్ముని నజస్రధ్యాన | 4–243 |
| నీవు వై దర్భివి | 4–850 |
| నెఱిఁ దల్లియుఁ బినతల్లులుఁ, | 4–84 |
| నెలకొని ధర్మపాలన వినిర్మలు | 4–90 |
| నేనే నీవు గాని | 4–851 |
| పంకజనాభాయ సంకర్షణాయ శాం, | 4–702 |

| | |
|---|---|
| పంచాస్య యుక్తంబుఁ బంచ | 4-771 |
| పడఁతి యే ముని | 4-825 |
| పతిదైవత శీల సమం, | 4-836 |
| పతియె దైవంబుగా భావంబులోపలఁ | 4-380 |
| పదివే లేఁడులు నిష్ఠను, | 4-900 |
| పద్మభవ సూనుఁ డుత్తానపాదుకడుకు, | 4-257 |
| పద్మసంభవుఁడును భవుఁడును మనుకుల | 4-872 |
| పరఁగ నభీప్సితములు బల, | 4-497 |
| పరఁగఁ జితాస్థిభస్మ నృకపాలజటాధరుఁడుం | 4-89 |
| పరమ పావనులార! బాల్యంబునందుండి, | 4-612 |
| పరమాత్మ! మర్త్య సుపర్వ | 4-286 |
| పరమోత్కంఠను న మ్మం, | 4-658 |
| పరికించి నను భుజింపుఁడు, | 4-427 |
| పరికింప నితఁడు దిక్పాలయశోహాని | 4-42 |
| పరికింప నీ విశ్వపరిపాలనమునకై | 4-233 |
| పరికింపఁగ నే మనుజుఁడు, | 4-663 |
| పరిపూర్ణంబగు భక్తిని, గర | 4-651 |
| పరుపడి నష్ట లోకపరిపాలక | 4-411 |
| పానంబు సేసినఁ దానుఁ | 4-769 |
| పార్థివోత్తములకుఁ బ్రజల రక్షించుట | 4-541 |
| పుత్రకామేష్టిఁ గావించి పుత్రుఁ | 4-399 |
| పురంబు వెడలి పంచప్రస్థంబను | 4-772 |
| పురము వెల్వడి చని | 4-370 |
| పురుషవర! నాకు నీకును, | 4-757 |
| పురుషవరేణ్య! హేమకశిపుండు రమా | 4-595 |
| పురుషుఁడు దవిలి చతుర్విధ, | 4-244 |
| పురుషుఁడు నిజప్రకాశతఁ, బరఁగియు | 4-856 |
| పురుషుఁడు నిద్రవోఁ గలలఁ | 4-621 |
| పూని ప్రియవ్రతోత్తానపాద ధ్రువ | 4-574 |
| పూని భవత్పదాంబురుహ మూల | 4-927 |
| పూని యర్ఘ్యాసనాసీనులఁ గావించి | 4-604 |
| పూని యే దేవుని | 4-131 |

| | |
|---|---|
| పూనిన తద్భక్తి సమీ, | 4-866 |
| పృథునకు నర్చికిఁ బుట్టిన, | 4-671 |
| పెంపతి యుండెను ధారా, | 4-329 |
| పెక్కు జన్మంబులం గాని | 4-295 |
| పెనిమిటి చేతను బెండ్లా, | 4-230 |
| పెను పగు వర్షాకాలం, | 4-956 |
| పొగ డొందు జనని | 4-780 |
| పొలఁతుకఁ దన యుత్సంగం, | 4-787 |
| ప్రతి కల్పమందు సర్వప్రపంచోద్భవ | 4-18 |
| ప్రవేశించి రాజమార్గంబునఁ జనుదెంచు | 4-316 |
| బలసి ఋషుల్ బృహస్పతి | 4-501 |
| బలియుర దండించుట | 4-154 |
| బిగియఁ గౌఁగిటఁ జేర్చి | 4-308 |
| బ్రహ్మ యిట్లనియె | 4-178 |
| బ్రాహ్మణ జనంబు లిట్లనిరి | 4-204 |
| బ్రాహ్మణుం డంచిత భక్తిఁ | 4-669 |
| భగవంతుండును నఖిల ధర్మజ్ఞుండును | 4-697 |
| భగవంతుండును విశ్వరూపకుఁడునై భాసిల్లు | 4-547 |
| భవదీయ పురస్సరుఁ డగు, | 4-750 |
| భవదీయ యజ్ఞహననార్థం బశ్వహరణుండైన | 4-532 |
| భాసురలీలఁ గాంచిరి సుపర్వులు | 4-133 |
| భువి నెవ్వని యెడ | 4-606 |
| భువి విషయా కృష్ట | 4-623 |
| భూత గణంబుల చేతనె, | 4-725 |
| భూనాయక! నీ విపు | 4-259 |
| భూమీశ! విను మయ్య | 4-742 |
| భూరి తపోభిరామ ముని | 4-576 |
| భూరి శివేతరాపహవిభూతి సమేత! | 4-923 |
| భూరి సమున్నతి నాక, | 4-939 |
| భూవర! యే మహాపురుష | 4-627 |
| భూవర! యోగ తపో | 4-544 |
| భృగుం డిట్లనియె | 4-176 |

| | |
|---|---|
| భ్రాతృజన సౌహృదంబును, భూతదయాగుణము | 4-908 |
| మన మలరఁగ శ్రోత్రాంజలు, | 4-870 |
| మనమున నిట్లని తలంచె | 4-302 |
| మనమున మోదమందుచు నుమా | 4-81 |
| మను పద్మాసన ధూర్జటి | 4-935 |
| మనుజ నాయక! నీవు | 4-760 |
| మనుజవరేణ్య! యేను విషమస్థలినై | 4-498 |
| మనుజేంద్ర! నీ కతంబున, | 4-593 |
| మనుజేంద్ర! మోక్షధర్మము నెఱింగిన | 4-531 |
| మనునిభుఁ దంత భృత్యజనమంత్రి | 4-369 |
| మనువును దూడఁ జేసి | 4-500 |
| మరలఁ మరలఁ బెక్కుమాఱు | 4-721 |
| మఱి భేదబుద్ధిఁ గర్మప్రవర్తనముల | 4-149 |
| మఱి యపు డమ్మహాత్ముఁ | 4-335 |
| మఱియు | 4-577 |
| మఱియు | 4-588 |
| మఱియు గుణాఢ్యుం డగువానిం | 4-241 |
| మఱియు న మ్మహాత్ముండు | 4-645 |
| మఱియు నగ్నిదేవునకు దక్షపుత్రియైన | 4-34 |
| మఱియు నతం దున్నద్ధమదుండును | 4-800 |
| మఱియు నతండు | 4-681 |
| మఱియు నతండు భూగగనమార్గములం | 4-412 |
| మఱియు నధర్మునకు "మృష" | 4-215 |
| 'మఱియు నరదం బన | 4-855 |
| మఱియు నిట్లని తలంచు | 4-824 |
| మఱియు నిట్లనిరి | 4-100 |
| మఱియు నిట్లనిరి | 4-660 |
| మఱియు నియమ నిమిత్తంబునం | 4-567 |
| మఱియు బాలుండ వగుటంజేసి | 4-248 |
| మఱియు భగవద్భక్త సంగంబుల | 4-930 |
| మఱియు భూమి నుదకంబునందును, | 4-654 |
| మఱియు మత్తగజ సింహవ్యాఘ్ర | 4-344 |

| | |
|---|---|
| మఱియు మహాత్ముల గుణంబులు | 4-446 |
| మఱియు మహాభూతేంద్రియకారక చేతనాహంకారంబులను | 4-485 |
| మఱియు రతిజ్ఞాన విహీనుండు | 4-761 |
| మఱియు రుద్రగీతం బయిన | 4-909 |
| మఱియు విగతక్లేశుండును, ముక్తలింగుండునునై, | 4-371 |
| మఱియు హరి విరహితంబైన | 4-953 |
| మఱియుఁ గాలకన్యాగ్రస్తుం డయిన | 4-819 |
| మఱియుఁ గృపావలోకన మందహాస | 4-17 |
| మఱియుఁ బరబ్రహ్మంబును భగవంతుండును | 4-468 |
| మఱియుం ద్రష్టధీశుండు గూటస్థుఁడుఁ | 4-459 |
| మఱియుం బరమ భాగవత | 4-510 |
| మఱియును | 4-139 |
| మఱియును | 4-209 |
| మఱియును | 4-234 |
| మఱియును | 4-250 |
| మఱియును | 4-320 |
| మఱియును | 4-455 |
| మఱియును | 4-709 |
| మఱియును | 4-919 |
| మఱియును దేవతాపతి తమః | 4-520 |
| మఱియును ద్రష్టయైన యాత్మయు | 4-622 |
| మఱియును న మ్మహితాత్ముని, | 4-88 |
| మఱియును బాలయు సుదతియు | 4-747 |
| మఱియును రాజహంస రుచిమద్భమణీకృత | 4-166 |
| మఱియును సమస్త దేహులకు | 4-959 |
| మహనీయగుణగరిష్ఠులగు నమ్మునిశ్రేష్ఠులకు నిఖిల | 4-2 |
| మహితసత్పురుష సమ్మతమును ధన్యంబు | 4-382 |
| మహితాత్మ! మఱి జన్మమరణ | 4-282 |
| మహిపతి నప్పుడు గనుఁగొని, | 4-473 |
| మా ముప్పుర యంశంబుల, | 4-21 |
| మాధుర్య సౌందర్య సహిత | 4-502 |
| మానిత మందర సానుప్రదేశంబు | 4-657 |

| | |
|---|---|
| మానిత శ్యామాయమాన శరీర | 4–163 |
| మానిని చనుచుండ మణిమన్మదాది | 4–79 |
| మీర లాత్మారాము లగుటం | 4–613 |
| ముందట | 4–80 |
| ముదమునఁ దన్మఖోద్భవ విభూతిఁ | 4–65 |
| ముని నాయక! విను | 4–294 |
| మునినాథ చంద్ర! కరుణా, | 4–970 |
| మునినాథ! ప్రచేతసు లా, | 4–896 |
| మునినాథ! విను పృథు | 4–562 |
| మునివర! భగవంతుండవు, ననుపమ | 4–882 |
| మునివర! వివేకశాలియు, ననఘుఁడు | 4–260 |
| మునివరుఁడగు మైత్రేయుఁడు, వినయంబున | 4–666 |
| మునివరేణ్యులు భక్తి దనర | 4–431 |
| మును కల్పాంతమునందుఁ గుక్షి | 4–199 |
| మును దక్షుఁ డభవుఁ | 4–119 |
| మునుకొని యత్తపోధనుని మూర్ధజమైన | 4–14 |
| మునుకొని సునీథ గర్భం, | 4–418 |
| మునులారా! మీర లిప్పుడు, | 4–422 |
| మెండుగా మిటమిట మండు | 4–648 |
| మొనసి యదభ్రకర్ముఁడ నైన | 4–753 |
| మోక్షంబె పరమ పురుషార్థం | 4–626 |
| యక్షచారణసిద్ధ విద్యాధరాది, జనగణస్తూయమానుఁడై | 4–364 |
| యజమాని యగు ప్రసూతి | 4–188 |
| యజ్ఞ సాధన పశుహరణుని | 4–515 |
| యోగీశ్వరు లిట్లనిరి | 4–192 |
| రంగ దుత్తుంగ తరంగ | 4–564 |
| రక్తోత్ప లేందీవరప్రఫుల్లాంభోజ కమనీయ | 4–689 |
| రమణిరో! భృత్యులందు నపరాధము | 4–788 |
| రాజఋషి దేవఋషి పితృ | 4–565 |
| రాజరా జాపృథురాజుకు హేమమయంబైన | 4–442 |
| రాజర్షి యైనట్టి ప్రాచీనబర్హి | 4–894 |
| రామాజన సంఘము లా, | 4–777 |

| | |
|---|---|
| రుద్రుం డిట్లనియె | 4-174 |
| రుద్రుండు ప్రచేతసుల కెఱింగించి | 4-732 |
| రూఢి న మ్మనువుకు | 4-217 |
| రూఢి నీశ్వరుఁడు స్వరూపంబునం | 4-583 |
| రూఢిఁ దత్తత్క్రియాలబ్ధ రూపుఁ | 4-726 |
| లలి సుమనో వాటికల | 4-880 |
| లలితాయతాష్ట భుజ మం, | 4-903 |
| లోకపాలకు లిట్లనిరి | 4-190 |
| వంది జనంబులు లోకము, | 4-448 |
| వందిమాగధ సూతవరులార! | 4-445 |
| వచ్చితిమి; యే పదంబునేని | 4-374 |
| వధియించి మఱియును | 4-774 |
| వనజజునివలన | 4-27 |
| వనజాసనుఁ డాత్మజు లగు, | 4-700 |
| వనముల ముక్తసంగు లగువారు | 4-931 |
| వనరుహ పత్త్రలోచన! భవత్సఖుఁడైన | 4-933 |
| వనితాజన పరవశుఁడై, మనసిజ | 4-795 |
| వర చిత్ర పక్ష | 4-773 |
| వర యమునానదితటమున, హరి | 4-246 |
| వరద! నిరీహ యోగిజన | 4-175 |
| వరదా! యీశ్వర నిను | 4-549 |
| వరనవ ద్వార కవాట | 4-744 |
| వరనారాయణ దైవతోస్త్ర భవదుర్వార | 4-349 |
| వరబలుఁడగు మను మనుమని, | 4-339 |
| వరమతి నార్తబాంధవ! భవద్ఘన | 4-281 |
| వరమతులార! యెవ్వని నివాసముఁ | 4-610 |
| వరవృషకేతనుండు భగవంతుఁడు నైన | 4-95 |
| వరసంప ద్విభవ ప్రతాప | 4-585 |
| వరుస మేధ్యామేధ్య వనమృగంబుల | 4-775 |
| వరుసఁ బ్రాణాపాన వాయునిరోధంబు | 4-97 |
| వలను మీఱిన సైంధవంబులఁ | 4-306 |
| వలనొప్పఁ దను ననువర్తించు | 4-963 |

| | |
|---|---|
| వసుధ నెవ్వారు ధూర్జటివ్రతులు | 4-50 |
| వసుమతీతల మర్ధము వంగఁజొచ్చె, | 4-272 |
| వసుమతీనాథ! యెవ్వని పాదపద్మ | 4-629 |
| వామదేవుని శాపవశమునఁ జేసి | 4-171 |
| వార లెవ్వ రనిన | 4-26 |
| వారలఁ జండతీవ్ర శరవర్గము | 4-352 |
| వారలు పావకుండుఁ బవమానుండు | 4-674 |
| వారు తోషుండును బ్రతోషుండును | 4-6 |
| వారు లలాటముల్ వగిలి | 4-326 |
| వారు సినీవాలి యునుఁ | 4-25 |
| వారును భయవిరహితులై, బోరనఁ | 4-507 |
| విజ్ఞాన ఘనుఁడన వెలయు | 4-589 |
| విద్యాధరు లిట్లనిరి | 4-202 |
| విన భూమీశుఁడు నారద, | 4-852 |
| వినఁబడు వచన న్యాయం, | 4-601 |
| వినవయ్య! తత్త్వదర్శనులైన యట్టి | 4-490 |
| విని దానికి సదుపాయము, | 4-471 |
| విని పృథు భూవర | 4-521 |
| విని విదురుం డా | 4-969 |
| విని విష్ణు దేవతాకం, | 4-208 |
| వినినఁ బఠించిన వ్రాసిన, | 4-668 |
| విను జనకాదేశము ముద, | 4-899 |
| విను తరణి! యాచ్యమానం, | 4-816 |
| విను దక్షు నంత | 4-157 |
| విను పుత్తక! బాలుఁడవై, | 4-237 |
| విను మంతర్ధానగతిం, దనరు | 4-672 |
| విను మఖిల భువన | 4-216 |
| విను మది గాన | 4-892 |
| విను మహాత్మ, ముఖ్యుఁడన | 4-637 |
| విను మాతని యాయువులో, | 4-804 |
| విను మాత్మ భావింతు | 4-875 |
| విను మితఁడు యజ్ఞహంతయు, | 4-516 |

| | |
|---|---|
| విను మూష్మత లేకున్నను, | 4-841 |
| విను మెపుడు దగులు | 4-857 |
| విను మేము ముగుర | 4-20 |
| విను రోషహృదయుచేతను, ననయము | 4-360 |
| విను లోకోత్కృష్టుఁడు | 4-73 |
| విను వాని నొక | 4-495 |
| విను వీథిం జను | 4-517 |
| విను వీరపత్ని నీ | 4-792 |
| విను సనకాదులు నారదుఁ, | 4-214 |
| విను! నీ కపరాధుఁడ | 4-159 |
| విను, తత్సుతు లొక్కొకనికి, | 4-807 |
| విను; మట్టి కుటిలు | 4-70 |
| వినుఁ డట్టి యనుగ్రహ | 4-634 |
| వినుఁడీ సభ్యులు ధర్మము, | 4-568 |
| వినుఁడు నృపాల నందనులార! | 4-698 |
| వినుఁడు మీరలు రొదమాని | 4-41 |
| వినుత మంగళ యశోవిభవ! | 4-553 |
| వినుము సునీతియు సురుచియు, | 4-218 |
| వినువీథినుండి మెల్లన, చనుదెంచిరి | 4-598 |
| విమనస్కుం దగుచుఁ బురంబు | 4-393 |
| విమలమతి నిజేశు | 4-838 |
| విమలాత్మ! కరాదానము, దమశుల్కాదికము | 4-676 |
| విమలాత్మ! నాకు నభయము, | 4-488 |
| విశద యశోజలనిధి | 4-801 |
| విశ్వాత్మ! నీయందు వేఱుగా | 4-193 |
| వీరభద్రుండు విహత విద్వేషి | 4-108 |
| వీరుఁడు పృథు భూపాల | 4-518 |
| వీరుల నా సఖు | 4-758 |
| వెండియు నిట్లనియె | 4-759 |
| వెండియు నిట్లనియె, నిట్లు | 4-895 |
| వెండియు నిట్లనిరి, దేవా! | 4-597 |
| వెండియు నిట్లనిరి: కుపితాత్ముండైన | 4-115 |

| | |
|---|---|
| వెండియు శంఖ చక్ర | 4-711 |
| వెండియుం బ్రతిదివసంబు నాకాశంబు | 4-444 |
| వేనాంగ సంభవుండవు, శ్రీనాథ | 4-451 |
| శతసమకాల మప్పురి నజస్రము | 4-764 |
| శబ్ద బ్రహ్మ యిట్లనియె | 4-194 |
| శర విదళిత సారంగా!, | 4-975 |
| శరణ శరణ్యుఁడ వగు | 4-470 |
| శర్వుని యోగ క్రమమున, | 4-156 |
| శశికరంబులుఁ బోలి విశదము | 4-691 |
| శిరమున వహించి పదమటి, | 4-688 |
| శోకదావాగ్ని శిఖాకులితంబు పృథు | 4-173 |
| శ్రద్ధాయుక్తులై ధృత వ్రతులైన | 4-395 |
| శ్రీవిలసితధరణీతన | 4-1 |
| శ్రుత ధన కుల | 4-961 |
| శ్రుతంబును విచారితంబును నయ్యెఁ, | 4-883 |
| శ్లాఘ్యంబులైన భవదీయచరిత్రంబుల స్తుతియించెద | 4-453 |
| సంతత సవన దీక్షాశాలి | 4-680 |
| సకల చరాచర జనకుఁడై | 4-101 |
| సకల భూతేంద్రి యాశయ | 4-271 |
| సకల వర్ణాశ్రమాచార హేతువు | 4-51 |
| సకలజగన్నుతుం డితఁడు చారుయశోనిధి | 4-464 |
| సకలాత్ముఁడు దా నగుటను, | 4-206 |
| సజ్జనుని హృదయముఁ బోలి | 4-690 |
| సతి దన పతి | 4-59 |
| సతి దన ప్రాణేశ్వరుఁ | 4-839 |
| సతి సుహృద్దర్శనేచ్ఛాప్రతికూల దుఃఖస్వాంత | 4-77 |
| సదస్యు లిట్లనిరి | 4-172 |
| సమత నది గాక | 4-146 |
| సమద రిపుప్రయుక్త పటుసాయక | 4-72 |
| సమదశ్రీక మృదంగ వేణుముఖ | 4-693 |
| సమధిక బ్రహ్మనిష్ఠాతిగరిష్ఠులౌ భృగ్వాది | 4-409 |
| సమధికఖ్యాతి నా పృథు | 4-441 |

| | |
|---|---|
| సమధికమతిఁ బౌరజన జానపదులచేఁ | 4-559 |
| సముచితానందమును బొంది సర్వకామ, | 4-504 |
| సరభసవృత్తి నట్లరుగు సైన్యపదాహత | 4-112 |
| సరస వచో విలాస! | 4-974 |
| సరస వచోఽర్థ సత్పురుష | 4-644 |
| సరసమనోలోచన ము, త్కరుఁడును | 4-252 |
| సరసిజగర్భ యోగిజన సర్వ | 4-38 |
| సరసిజనాభ! సత్పురుష సంగసమంచిత | 4-718 |
| సరసుఁడ నగు ననుఁ | 4-915 |
| సరసోదార మహాత్మము, ఖరితము | 4-869 |
| సరసోదార సమంచిత, దరహాస | 4-165 |
| సరసోదార సుధా రసోపమ | 4-791 |
| సరిదంభోనిధి ఖగమృగ, ధరణీ | 4-440 |
| సర్వ సత్తాయ దేవాయ | 4-704 |
| సర్వభూతములకు సముఁడును బర్యతిక్రమమున | 4-456 |
| సర్వేశ! కల్పాంత సమయంబు | 4-287 |
| సలలిత శంఖచక్ర జలజాత | 4-164 |
| సవతి యాడిన మాటలు | 4-226 |
| సవనాది సిద్ధి కొఱకై, | 4-494 |
| సవాసనోచ్ఛేదకంబు గా దని | 4-863 |
| సాక్షాత్కృతుండును సర్వేశ్వరుండును భగవంతుఁడును | 4-835 |
| సార వివేకలారా! గృహసంపద | 4-778 |
| సిద్ధు లిట్లనిరి | 4-186 |
| సుచరిత్ర! విను విధిచోదితుండై | 4-11 |
| సుమహిత నిత్యముక్త పరిశుద్ధ | 4-628 |
| సుమహిత నిశిత త్రిశూలాగ్ర | 4-116 |
| సుమహిత శుద్ధ సత్త్వగుణ | 4-888 |
| సుర విమత విదారీ! | 4-976 |
| సురగరుడ యక్షకిన్నర, నిరుపమ | 4-904 |
| సురదుందుభి పణ వానక, | 4-375 |
| సురుచిర భంగి నా | 4-683 |
| సురుచిర లబ్ధ దక్షిణల | 4-535 |

| | |
|---|---|
| స్థిరమతి రాజ్యాభిషిక్తుఁడై య | 4-673 |
| స్వధర్మ నిరతుండైన పురుషం | 4-699 |
| స్వర్గాపవర్గ సుద్వారాయ సర్వ | 4-703 |
| స్వర్ణ పరిచ్ఛద స్వచ్ఛ | 4-315 |
| హరపంకేజభవామరాదులు మరీచ్యాది ప్రజానాథు | 4-201 |
| హరభటకోటిచేత నిశి తాసి | 4-124 |
| హరి దర్శన పూర్వం | 4-898 |
| హరి భవదీయ తత్త్వము | 4-195 |
| హరి యీశ్వరుండు విహంగ | 4-278 |
| హరి హర హిరణ్యగర్భ, | 4-426 |
| హరి! నీ భక్త | 4-715 |
| హరి! పరమాత్మ! కేశవ! | 4-276 |
| హరి! భజనీయ మార్గనియతాత్మకులై | 4-284 |
| హరి! భవ దుఃఖ | 4-187 |
| హరి! భవదీయమాయ ననయంబును | 4-928 |
| హరిమధ్యల్ పురకామినీ తతులు | 4-317 |
| హరిహయుం డధ్వర హయ | 4-524 |
| హవరక్షా చరణుండ వై | 4-197 |
| హా! నరనాథ! హా! | 4-843 |
| హార కిరీట కేయూర | 4-251 |
| హాహాకారము లెసఁగఁగ, నోహో | 4-330 |


## పంచమస్కంధము


| | |
|---|---|
| అంగజుఁ డెక్కుడించిన శరాసనమున్ | 5.1-28 |
| అంత | 5.1-62 |
| అంత నాభరతుం డొక్కనాఁ | 5.1-101 |
| అంత నావిష్కృత కాంత | 5.1-43 |
| అంత విముక్తలింగుండు భగవంతుండునగు | 5.1-89 |
| అంతఁ గొందఱల్ల నన్యోన్య | 5.1-173 |
| అంతటఁ గొన్ని హాయనములు | 5.1-139 |
| అందియల వెలయు రత్నము, | 5.1-31 |
| అక్కట! తల్లిఁ బాసి | 5.1-103 |

| | |
|---|---|
| అక్కట! యే నింద్రియములచేఁ | 5.1-21 |
| అక్కట, మానుష జన్మము, | 5.1-176 |
| అచ్చట విప్రసూనుఁడు | 5.1-137 |
| అట్టి ద్వీపంబుల యందుఁ | 5.1-20 |
| అతుల మృష్టాన్నమైనఁ గదన్నమైన, | 5.1-128 |
| అది యెఱింగి ఋషభుఁ | 5.1-59 |
| అదిగాన నెన్నఁడు నైశ్వర్యములను | 5.1-88 |
| అదియునుంగాక భూసురోత్తములు | 5.1-54 |
| అని పలికి శుకుండు | 5.1-24 |
| అని యడిగిన యా | 5.1-159 |
| అని యిట్లు హరిణపోతంబుం | 5.1-105 |
| అనిన శుకుం డిట్లనియె | 5.1-84 |
| అనుచు ధారుణీసురాత్మజుఁ డీ | 5.1-150 |
| అప్పు డావిప్రవరుండు దనకుం | 5.1-144 |
| అరయఁ గర్మరూప మగు | 5.1-70 |
| అరయఁగ మక్షికంబు వినతాత్మజుఁ | 5.1-179 |
| అరయఁగ సంసారాటవిఁ, దరలక | 5.1-165 |
| అరసి కానలేక | 5.1-131 |
| అలసితి, వెంతయున్ ముసలి, | 5.1-143 |
| అల్పధనుఁడు విశ్రమాస్థానములఁ దృప్తిఁ, | 5.1-172 |
| అవధూత వేషమున | 5.1-80 |
| ఆ ఋషభుండు రాజ్యంబు | 5.1-66 |
| ఆ మహాభారతవర్షంబునందుఁ దమతమ | 5.1-64 |
| ఆ రీతిని భూసురవరు, | 5.1-132 |
| ఇట్లభ్యంజనాది కృత్యంబులు దీర్చి | 5.1-133 |
| ఇట్లాంగిరసుండు ప్రథమభార్యయందుఁ బుత్రనవకంబును, | 5.1-120 |
| ఇట్లాగ్నీధ్రుండు రాజ్యంబు సేయుచు | 5.1-26 |
| ఇట్లు ఋషభుండు పురందరుండు | 5.1-60 |
| ఇట్లు గృహకర్మ ప్రవర్తనుం | 5.1-127 |
| ఇట్లు దన రథమార్గంబులు | 5.1-22 |
| ఇట్లు ప్రత్యక్ష మగు | 5.1-44 |
| ఇట్లు ప్రియవ్రతుం డేకాదశార్బుద | 5.1-18 |

| | |
|---|---|
| ఇట్లు ప్రియవ్రతుండు రాజ్యంబు | 5.1-16 |
| ఇట్లు బీభత్సరూపంబున వసుంధరం | 5.1-82 |
| ఇట్లు బ్రాహ్మణకుమారుండు గర్మంబులయందు | 5.1-122 |
| ఇట్లు బ్రాహ్మణకుమారుని సవతితల్లి | 5.1-125 |
| ఇట్లు భరతుండు మృగవియోగ | 5.1-114 |
| ఇట్లు భరతుండు హరిణకుణక | 5.1-112 |
| ఇట్లు భరతుండు హరిణీగర్భంబునం | 5.1-116 |
| ఇట్లు వివాహితుండై యా | 5.1-93 |
| ఇట్లు శ్రీహరి శ్రవణ | 5.1-118 |
| ఇట్లు సదాచారు లగు | 5.1-78 |
| ఇట్లు స్వాయంభువ మనువు | 5.1-14 |
| ఇది సకల కవిజనానందకర | 5.1-184 |
| ఇపుడు మేము నీకు | 5.1-49 |
| ఈ తెఱఁగు దెలిసి | 5.1-77 |
| ఈ రీతిఁ గర్మసిద్ధుల, | 5.1-96 |
| ఈ రీతిని గొడుకున | 5.1-123 |
| ఏ మిపుడు సేయు | 5.1-46 |
| ఏ యాశ్రమంబున నిందిరాధీశ్వరుఁ | 5.1-98 |
| ఏ లోకంబున నుండి | 5.1-35 |
| ఒనర నిట్లు యోగయుక్తుండు | 5.1-71 |
| ఓరి దుర్మద! విన | 5.1-145 |
| కందులేని యిందుకళ మించి | 5.1-37 |
| కట్టా! యీ యాశ్రమమునఁ, | 5.1-111 |
| కదువేడ్క నీ వవిద్వాం, సుడవై | 5.1-152 |
| కరువలిఁ బాయువస్త్రమును గట్ట | 5.1-39 |
| కర్మఫలంబులఁ గడఁక నిచ్చుచు | 5.1-100 |
| కానవచ్చిన ఫలములు కర్మమూల, | 5.1-160 |
| కామక్రోధాదికముల్, భూమీశ్వర! కర్మబంధములు | 5.1-87 |
| కారణ విగ్రహంబు నురుకాయము | 5.1-156 |
| కోరి వేడ్క నీవు | 5.1-10 |
| గరిమ నీ రీతి | 5.1-107 |
| గురువులు వాటి బిట్టుటికి | 5.1-106 |

ఘనతపము చలన మొందుట, 5.1-102
చిరకాల తపము నైనను, 5.1-86
చెదరcగ వేదముల్ సదువు 5.1-30
జనకుండాంగిరసుండు నాత్మజుని వాత్సల్యంబునం 5.1-121
జననాథ! మున్ను మోక్షవిరోధ 5.1-113
జనవర! ఋషభుని రాజ్యం, 5.1-65
జనుకుం డిట్లు విరక్తుc 5.1-25
జనుల కిట్లు యోగసంచార 5.1-81
జనులెల్ల నర్థ వాంఛలc 5.1-72
జ్వరితార్తుండగు రోగి కౌషధ 5.1-157
తన మనసు కొలcది 5.1-140
తనయులార! వినుcడు ధరలోనc 5.1-67
తల్లి చచ్చిన హరిణపోతంబు 5.1-110
తల్లి తండ్రితోడc దా 5.1-124
దానం జేసి విగత 5.1-99
దీక్షితుండై ధరిత్రీపాలనముc దండ్రి 5.1-7
దేవా! యీ విషమగమనంబు 5.1-142
ధరణీవల్లభ! నీదు వాక్యములు 5.1-85
ధరణీవల్లభ! విను మా, 5.1-6
ధరణీవల్లభుc డా ప్రియవ్రతుcడు 5.1-15
ధరణీశ! మాయచేతను దాcటcగా 5.1-164
ధరణీసురవర! నీ శ్రీ, 5.1-177
ధరణీసురులలోనc దలcప నెవ్వcడవు 5.1-147
ధరణీసురులును మంత్రులుc, బరివారము 5.1-57
ధరణీసురోత్తముcడు దా, నరుదుగc 5.1-126
ధరలోన నెవ్వరేనియు, ధరణీసురవరుల 5.1-135
ధరలోన బ్రహ్మంబుc దపమున 5.1-162
ధవళ కాంతియుక్తిc దనరు 5.1-56
ధూళిచేత మిగుల ధూసరితంబునై, 5.1-79
నరదేవాసుర యక్షరాక్షస మునీంద్రస్తుత్య! 5.1-181
నరవరేణ్యుcడైన నాభి సంతానార్థ, 5.1-41
నరులకు నే తపంబున 5.1-68

| | |
|---|---|
| నరేంద్రా! నీవు సెప్పినది | 5.1-146 |
| నరేంద్రా! భరతుండు సుతదారరాజ్యాదులను | 5.1-180 |
| నరేంద్రా! యేను పూర్వంబున | 5.1-163 |
| నాకాది లోకములలో, నాకున్ | 5.1-53 |
| నిత్యానుభూతమౌ నిజరూపలాభ నివృత్తమై | 5.1-91 |
| నిరతము నీ తనుమధ్యముఁ, | 5.1-33 |
| పటుతాటంక రథాంగ యుగ్మమునకుం | 5.1-38 |
| పరఁగఁ బెద్ద లీ | 5.1-153 |
| పరమపదవాస! దుష్కృత, హర!కరుణాకర! | 5.1-182 |
| పరిపూర్ణుఁ డవై యుండియు, | 5.1-45 |
| పాయక కదంబ పుష్ప, | 5.1-32 |
| పావన శిఖలచే భాండంబు | 5.1-149 |
| పురిలోన వృషలపతి దా, | 5.1-130 |
| పురుహూతుఁ డతని మహిమలు, | 5.1-58 |
| పొంకములగు కుచములపైఁ, గుంకుమ | 5.1-34 |
| పొలుపగుచున్న విలాసం, బుల | 5.1-29 |
| బహుకుటుంబి యగుచు బహుధనా | 5.1-169 |
| బాలిశుల మగుచు మిక్కిలి, | 5.1-48 |
| భగవంతుఁడగు జగద్భరితు నల్పంబులు | 5.1-95 |
| భరతుఁడు నిజపిత లేలిన, | 5.1-94 |
| భరతుం డంత ధరాతలంబుఁ | 5.1-92 |
| భరతుం డల్లన నంత్యకాలము | 5.1-115 |
| భరతుండంతం దన్మృగశాబకంబు గానంబడమికి | 5.1-108 |
| భూ నాథుఁ దుత్తరాత్మజుఁ, | 5.1-3 |
| భూతజాలములందు భూజముల్ వర్యముల్ | 5.1-74 |
| భూవరుఁ డగు ఋషభుఁడు | 5.1-63 |
| భూసురులకు సరిదైవం, బీ | 5.1-75 |
| మంగళం బైన బ్రహ్మస్వరూపంబును | 5.1-76 |
| మరగి కాననమునఁ గౌఱవిదయ్యముఁ | 5.1-168 |
| మఱియు ధర్మాధర్మ వాసనాయుక్తంబు | 5.1-155 |
| మఱియు నంగనాసక్తులగు కాముకుల | 5.1-69 |
| మఱియు నయ్యై మార్గంబులయందు | 5.1-8 |

| | |
|---|---|
| మఱియు నా భరతుడు | 5.1-97 |
| మఱియు నా విప్రవరుండు | 5.1-138 |
| మఱియు నా విప్రుం | 5.1-129 |
| మఱియు నిట్లనుఁ దపోధనులగు | 5.1-40 |
| మఱియు నిస్సంగుండవయి జడుడుంబోలె | 5.1-148 |
| మఱియు నిస్సంగులై నిశితజ్ఞానంబునం | 5.1-51 |
| మఱియు నీ గృహస్థమార్గంబునం | 5.1-167 |
| మఱియు నీ వసుంధర | 5.1-161 |
| మఱియు నీవు సంసారాసక్త | 5.1-47 |
| మఱియు నొక్క చోట | 5.1-170 |
| మఱియు నొక్కచోట నులూక | 5.1-171 |
| మఱియు విప్రవరులయందు యోగేశ్వరు | 5.1-178 |
| మఱియు శ్రీహరి యాజ్ఞను | 5.1-11 |
| మఱియుఁ బితృ గురుజననీ | 5.1-73 |
| మఱియుం గాలచక్రనియంత్రితుండై చక్రాయుధునిం | 5.1-175 |
| మఱియుం బ్రవర్గ్యసంజ్ఞికంబు లగు | 5.1-42 |
| మఱియును | 5.1-136 |
| మలసి సంసృతి ఘోరకానన | 5.1-166 |
| మహాత్మా! నేను రాజు | 5.1-151 |
| మీర లిప్పు డిచటఁ | 5.1-141 |
| మునివర! యోగజ్ఞానం, బునఁ | 5.1-83 |
| మునీంద్రా! పరమభాగవతుండు | 5.1-4 |
| మునులార! వేదవాక్యము, లను | 5.1-52 |
| మేరుదేవియందు మేరుధీరుం డగు, | 5.1-55 |
| యజ్ఞాదికములందు నామ్నాయములయందుఁ దఱచుగాఁ | 5.1-154 |
| యాదవులకు మీకు నత్యంత | 5.1-90 |
| రాజులు ప్రస్తుతింప సురరాజసమానుఁడనై | 5.1-117 |
| వర మీయఁ దలఁచి | 5.1-50 |
| వసుధేశ! యా ప్రియవ్రతుఁ | 5.1-17 |
| విప్రవర్య! నేను వేడ్కతో | 5.1-158 |
| శరణని వచ్చిన జంతువుఁ, | 5.1-104 |
| శ్రీకర కరుణా సాగర!, | 5.1-1 |

| | |
|---|---|
| సంసారమార్గ సంచారుఁడై యధిక | 5.1-174 |
| సకల పురాణార్థజ్ఞాన విఖ్యాతుండగు | 5.1-2 |
| సతి! నీ వెవ్వతె | 5.1-27 |
| సత్యసంధుఁడైన స్వాయంభువుం డను, | 5.1-13 |
| సరస జంబూప్లక్ష శాల్మలిద్వీప | 5.1-19 |
| సరస హృదయవాసా! చారులక్ష్మీ | 5.1-183 |
| సరసత నే నృపాలకుని | 5.1-61 |
| సరసిజాసనుండు స్వాయంభువుని చేత, | 5.1-12 |
| సర్వభూతములకు సఖుఁడును బ్రహ్మభూతాత్ముఁడు | 5.1-134 |
| హరి నా ముఖమున | 5.1-9 |
| హరిచరణాంబుజ మకరం, ద | 5.1-5 |
| హరిణ దేహముఁ బాసి | 5.1-119 |
| హరిణపోతంబ! నీకు వనాంతమందుఁ, | 5.1-109 |
| హరిసేవనాప్రియవ్రతుఁ, డరయఁగఁ గైవల్యపదవి | 5.1-23 |
| హాసావలోకనంబుల, భాసిల్లెడు నీ | 5.1-36 |
| అంత నసంఖ్యంబులైన దివ్య | 5.2-33 |
| అందు శాల్మలీ వృక్షంబు | 5.2-62 |
| అట మీఁదఁ దారల | 5.2-88 |
| అట్టి గయునివలన నఖిల | 5.2-7 |
| అట్టి పాతాళంబులందును మయకల్పితములగు | 5.2-106 |
| అట్టి పాతాళలోకంబునందు విష్ణు, | 5.2-108 |
| అట్టి బలుని యావలింతలను | 5.2-110 |
| అట్టి భాస్కరుం డుత్తరాయణ | 5.2-78 |
| అట్టి భూమండలంబు క్రింద | 5.2-105 |
| అట్టి మహాపురుషగుణగణ పరిపూర్ణుండగు | 5.2-10 |
| అట్టి రామభద్రు నంజనీసుతుఁడు | 5.2-52 |
| అట్టి రుద్రమూర్తు లతులత్రినేత్రులు, | 5.2-123 |
| అట్టి వర్షమునకు నధిపతి | 5.2-45 |
| అట్టి శాకద్వీప మరికట్టి | 5.2-69 |
| అతలమునందు నమ్మయుని యాత్మజుఁడైన | 5.2-109 |
| అని పలికిన భూవరునిం, | 5.2-85 |
| అని పలికిన శుకయోగిం, | 5.2-13 |

| | |
|---|---|
| అనిన శుకయోగీంద్రుం డిట్లనియె | 5.2-130 |
| అనిన శుకయోగీంద్రుం డిట్లనియె | 5.2-134 |
| అనుపమ మగు జంబూనది, | 5.2-25 |
| అరయఁగ సీతాలక్ష్మణ, పరివృతుఁడై | 5.2-51 |
| అసురాధముఁడగు రాహువు, బిసరుహసంభవుని | 5.2-100 |
| ఆ కుశద్వీపంబు నరికట్టుకొని | 5.2-65 |
| ఆ క్రింద సుతలంబు | 5.2-112 |
| ఆ నదినీటఁ దోఁగి | 5.2-26 |
| ఆ నదీజలంబు లాడిన | 5.2-23 |
| ఆ నరవరునకుఁ బ్రియతముఁ, | 5.2-40 |
| ఆ రథంబునకు గాయత్రీచ్ఛందం | 5.2-83 |
| ఆ వర్షమందు నర్యముఁ, | 5.2-48 |
| ఆ వర్షమందులను బ్రజ, | 5.2-50 |
| ఆ విరజున కుదయించిరి, | 5.2-11 |
| ఆ శింశు మారాఖ్యమగు | 5.2-93 |
| ఆ సుతలమునకుఁ గ్రిందై, | 5.2-116 |
| ఇందుకులోద్భవ! వినుమా, క్రిందటి | 5.2-120 |
| ఇట్టి దివ్యశరీర మెవ్వఁడు | 5.2-98 |
| ఇట్టి మహనీయ సుగుణాకరుండగు | 5.2-8 |
| ఇట్లకుతోభయంబు, పిత్ర్యంబయిన రాజ్యంబు | 5.2-115 |
| ఇట్లు చరణనఖస్పర్శంజేసి భేదింపంబడ్డ | 5.2-32 |
| ఇట్లు దనకు లోపలి | 5.2-70 |
| ఇట్లు పాషండబోధితుండైన సుమతికి | 5.2-6 |
| ఇట్లు పూర్వపశ్చిమంబులు లవణ | 5.2-20 |
| ఇట్లు భారత వర్షంబునందుల | 5.2-58 |
| ఇట్లు వాసుకి ప్రముఖులైన | 5.2-121 |
| ఇట్లు వివిధమంత్ర గోపనార్థం | 5.2-75 |
| ఇట్లు సీత యను | 5.2-34 |
| ఇట్లు హిరణ్యరేతుసుండు వసుదాన | 5.2-64 |
| ఇది శ్రీ సకల | 5.2-168 |
| ఇనమండలంబునకుఁ గ్రిం, దను | 5.2-99 |
| ఇనురథంబున నున్న యిరుసొక్కటియ | 5.2-82 |

| | |
|---|---|
| ఈ నవవర్షంబులయం, దా | 5.2-37 |
| ఉత్తర కురుభూములఁ దను, | 5.2-49 |
| ఎడతెగక ముజ్జగంబుల, కడపల | 5.2-135 |
| ఎనయ దొడ్లలోన నిండ్లలో | 5.2-159 |
| ఓలిమై నెవ్వని లీలా | 5.2-126 |
| కడు మధురంబునన్ సురభిగంధముచే | 5.2-22 |
| కమలజాండ మధ్యగతుఁడైన సూర్యుండు, | 5.2-77 |
| కరమనురాగంబున నీ, ధరణీమండలము | 5.2-76 |
| కామమోహితుండై యెవ్వండేనియుఁ దన | 5.2-154 |
| కుముద పర్వత శిఖాగ్రమున | 5.2-28 |
| క్రిమిభోజన మనియెడి నర, | 5.2-147 |
| ఘనుఁడు ప్రియవ్రతు వంశం, | 5.2-12 |
| చందురునకు మీఁదై యా, | 5.2-87 |
| జంతుజాలములకు శ్రద్ధలు త్రిగుణాత్మ, | 5.2-131 |
| జగతిలో మేరు వాదిగఁ | 5.2-35 |
| జగతీశ! వినుము క్రౌంచద్వీపమును | 5.2-67 |
| జననాథ! రాహువు జన్మకర్మంబులు | 5.2-101 |
| జలజభవాదిదేవ మునిసన్నుత తీర్థపదాంబుజాత! | 5.2-165 |
| జృంభణమున నెవఁడు దంభార్థమై | 5.2-153 |
| తత్ప్రకాశ కృత్ప్రధాన మంత్రస్తోత్ర, | 5.2-46 |
| తత్ప్రకాశకృత్ప్రధాన మంత్రార్థ | 5.2-41 |
| తన కలిమి నెవ్వఁడేనియుఁ, | 5.2-146 |
| తన జన్మ కర్మములనుం, | 5.2-57 |
| తన యింటికి వచ్చిన | 5.2-160 |
| తనదు విభూతులై తనరిన | 5.2-74 |
| తలఁపఁగ నా క్రింద | 5.2-118 |
| తలక్రిందై వ్రటువయై, సలలితమగు | 5.2-96 |
| తల్లిదండ్రులకును ధరణీ సురులకును | 5.2-141 |
| తెలిసినంత వట్టు దెలిపెద | 5.2-16 |
| దండింపఁ దగని వారల, | 5.2-143 |
| దండితారిసమూహ! భక్తినిధాన! దానవిహార! | 5.2-167 |
| దేవదానవులును దివ్యమునీంద్ర గం, | 5.2-29 |

| | |
|---|---|
| ధనవంతుండగు మానవుండు గడcకన్ | 5.2-161 |
| ధరణీ వల్లభ! విను | 5.2-15 |
| ధరణీతనూజుc దంతటిమీcద రెండు | 5.2-89 |
| ధరణీవల్లభ! నిన్నును, నిరతంబును | 5.2-5 |
| ధరణీవల్లభ! విను పు, | 5.2-72 |
| ధర్మమార్గంబున ధారుణీ జనులను | 5.2-9 |
| ధర్మవంతులెల్లc దప్పక స్వర్గంబునందు | 5.2-163 |
| నమ్రు లగుచు ననుదినంబును | 5.2-124 |
| నరవర! యా రాహువునకు, | 5.2-102 |
| నరవరేణ్య! యిట్టి నరకముల్ | 5.2-162 |
| నరేంద్రా! కురంగ కురర | 5.2-30 |
| నరేంద్రా! జంబూద్వీపంబు భూపద్మంబునకు | 5.2-17 |
| నరేంద్రా! ప్రతిషిద్ధలక్షణంబగు నధర్మం | 5.2-132 |
| నరేంద్రా! మోక్షమార్గంబు మున్నె | 5.2-164 |
| నరేంద్రా! యతివేగంబునం దిరుగుచుండు | 5.2-86 |
| నరేంద్రా! యా క్రౌంచద్వీపపతియగు | 5.2-66 |
| నరేంద్రా! యా యిధ్మజిహ్వుం | 5.2-60 |
| నరేంద్రా! యెవ్వcడేనిం గుటుంబ | 5.2-140 |
| నరేంద్రా! యెవ్వండేని నీశ్వరకల్పితవృత్తి | 5.2-145 |
| నరేంద్రా! సకల భూతాంతర్యామియుc | 5.2-113 |
| పరకాంత నెవ్వcడేనిం, బురుషుం | 5.2-139 |
| పరపుత్త్ర కళత్రంబులc బరికింపక | 5.2-137 |
| పరమేశ్వరునకు నెప్పటి పదార్థములందు | 5.2-114 |
| పరమేష్ఠి పట్టణంబున, హరి | 5.2-31 |
| పరికింప సిద్ధ విద్యా, | 5.2-103 |
| పాతాళలోకంబు పాcతున శేషుండు | 5.2-122 |
| పార్థివేంద్ర! నరుcడు పాషండదర్మనుc, | 5.2-150 |
| పార్థివేంద్ర! యట్లు భరతాత్మజుండైన, | 5.2-4 |
| పురహరుచే రమేశ్వరుcడు భూతహితార్థముగాc | 5.2-117 |
| పొందుగ జ్యోతిర్గణముల, నందఱ | 5.2-95 |
| ప్రాకటముగ రవి సుతునకు, | 5.2-91 |
| ప్లక్షద్వీపము, ద్విగుణిత, లక్షేక్షురసాబ్ధి | 5.2-61 |

| | |
|---|---|
| భద్రాశ్వవర్షమందుల, భద్రశ్రవుఁ డనెడి | 5.2-39 |
| భారతవర్ష జంతువుల భాగ్యము | 5.2-56 |
| భారతవర్షమునందుల, సారాంశములైన పుణ్యశైలంబులు | 5.2-54 |
| భారతవర్షాధిపతియైన బదరికాశ్రమమున నున్న | 5.2-53 |
| భూనాథ! యా సురాంభోధికిఁ | 5.2-63 |
| భూపద్మమునకు మేరువు, దీపించుచుఁ | 5.2-18 |
| మందరపర్వతంబు తుది మామిడి | 5.2-21 |
| మనుజేశ్వర! యా వర్షం, | 5.2-71 |
| మఱియు నట్టి దుష్టమానవుఁ | 5.2-144 |
| మఱియు నట్టి వైతరణీనది | 5.2-151 |
| మఱియు నవ్విధంబున బాధితుం | 5.2-138 |
| మఱియు నా ధ్రువుండు | 5.2-94 |
| మఱియు నా ప్రియవ్రతపుత్త్రుం | 5.2-68 |
| మఱియు నా శింశుమార | 5.2-97 |
| మఱియు నా శేషుని | 5.2-128 |
| మఱియు నా సంకర్షణమూర్తిం | 5.2-125 |
| మఱియు ని వ్విధంబున | 5.2-81 |
| మఱియు నీ భూలోకంబున | 5.2-148 |
| మఱియు నీచవర్ణుండు నిష్ఠ | 5.2-158 |
| మఱియు పుష్కరద్వీపంబు చతుష్షష్టి | 5.2-73 |
| మఱియు మానసేంద్రియంబుల కానందకరంబులైన | 5.2-107 |
| మఱియు వేదమార్గంబు విడిచి | 5.2-142 |
| మఱియు సుపార్శ్వ నగాగ్రంబునందుఁ | 5.2-27 |
| మఱియు సురతసుఖానందంబున మోక్షంబునైనం | 5.2-36 |
| మఱియుఁ గేతుమాల వర్షంబునందు | 5.2-43 |
| మఱియుఁ బెక్కు గతుల | 5.2-127 |
| మఱియును గుహక తక్షక | 5.2-119 |
| మఱియును దక్షిణంబున నగ్నిష్వాత్తాది | 5.2-136 |
| మఱియును నా మేరుగిరి | 5.2-19 |
| మలయపర్వతంబును, మంగళ ప్రస్థంబును, | 5.2-55 |
| మించి వృశ్చికాది పంచరాసులను | 5.2-80 |
| మునివర! మేరుధ్రువులకు, నొనరఁ | 5.2-84 |

| | |
|---|---|
| మునివర! లోక చరిత్రం, | 5.2-129 |
| మునివరేణ్య! నరకములు ముజ్జగంబుల, | 5.2-133 |
| మునిసప్తకమున కెగువం, దనరుచు | 5.2-92 |
| మునీంద్రా! సూర్యరశ్మి యెందాఁకం | 5.2-14 |
| మునులార! బాదరాయణి, యనఘాత్మకుఁడైన | 5.2-3 |
| మేరు మందరముల మీఁద | 5.2-24 |
| మేషతులలయందు మిహిరుం డహోరాత్రు, | 5.2-79 |
| ఱొమ్ముఁ ద్రొక్కి మోము | 5.2-157 |
| లంచంబుఁ గొని సాక్షి | 5.2-155 |
| లక్షయోజనములు లవణాబ్ధి పరివృత | 5.2-59 |
| వసుధ నిలావృత వర్షాధిపతియైన | 5.2-38 |
| వారిక్రిందఁ దగిలి వాయువశంబున, | 5.2-104 |
| వినుము; హిరణ్మయ వర్షం, | 5.2-47 |
| విమలమతిఁ జిత్తగింపుము, రమణీయంబైన | 5.2-44 |
| శునకములఁ బెంచి యెవ్వం, | 5.2-152 |
| శ్రీ తరుణీ హృదయస్థిత!, | 5.2-166 |
| శ్రీకాంతాహృదయప్రియ! లోకాలోకప్రచార! లోకేశ్వర | 5.2-1 |
| సకల పురాణార్థ జ్ఞాన | 5.2-2 |
| సర్వజంతుజాల సంగమ మొందెదు, | 5.2-149 |
| సురగురునకు మీఁదై భా, | 5.2-90 |
| సోమయాజిభార్యఁ గామించి పొందిన, | 5.2-156 |
| హరివర్ష పతియైన నరహరి | 5.2-42 |
| హాటకేశ్వరుఁడైన యంబికాధీశుండు వితలంబునందున | 5.2-111 |


❋ ❋ ❋